# శ్రీమద్వాల్మీకి రామాయణతరంగిణి


సంపాదకులు

**డా॥ ఆకెళ్ల విభీషణ శర్మ**

ఎమ్.ఎ.(సంస్కృతం), ఎమ్.ఎ.(తెలుగు), పిహెచ్.డి.,

ప్రత్యేకాధికారి

**పురాణ ఇతిహాస ప్రాజెక్టు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



**ప్రచురణ**

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2025**

# SRIMADVALMIKI RAMAYANATARANGINI

Editor:
**Dr. Akella Vibhishana Sharma**
**M.A.(Sanskrit) M.A.(Telugu) Ph.D.,**
**Special Officer, Purana Itihasa Project**
**T.T.Devasthanams, Tirupati.**

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved

First Print : 2025

Copies: 500

*Published by:*
**J.Syamala Rao,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Cover Design & D.T.P. Type Setting:*
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు          శ్రీవేంకటేశ్వరస్వామివారు

ఈశానాం జగతోఽస్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షఃస్థలనిత్యవాసరసికాం తత్క్షాంతిసంవర్ధినీమ్ ।
పద్మాలంకృతపాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్ ॥



శ్రీ వాల్మీకిమహర్షి

# తిరుమల తిరుపతి దేవస్థానములు
## పురాణ ఇతిహాస ప్రాజెక్టు
## పండితపరిషత్తు - సలహామండలి

**అధ్యక్షులు**

**శ్రీ జె. శ్యామల రావు** గారు ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**సభ్యులు**

**శ్రీ వి. వీరబ్రహ్మం** గారు ఐ.ఏ.ఎస్.,
సంయుక్త కార్యనిర్వహణాధికారి,
తి.తి.దే., తిరుపతి.

**శ్రీమద్వాల్మీకి రామాయణతరంగిణి – సమీక్షకులు**

| | | |
|---|---|---|
| బాలకాండ | - | డా॥ మైలవరపు శ్రీనివాసరావు గారు |
| అయోధ్యాకాండ | - | డా॥ బి.నరసింహాచార్యులు గారు |
| అరణ్యకాండ | - | డా॥ కందాడై రామానుజాచార్యులు గారు |
| కిష్కింధకాండ | - | డా॥ యస్.వి.రంగరామానుజాచార్యులు గారు |
| సుందరకాండ | - | డా॥ శలాక రఘునాథశర్మ గారు |
| యుద్ధకాండ | - | డా॥ ముదిగొండ శంకరశర్మ గారు |
| ఉత్తరకాండ | - | డా॥ దోర్బల ప్రభాకరశర్మ గారు |

సంచాలకులు

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు**
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీమద్వాల్మీకి రామాయణతరంగిణి - విషయానుక్రమణిక

| విషయం | పుటసంఖ్య |
|---|---|


1. తొలిపలుకు ........................................................................i
2. నివేదన ........................................................................ii-xvi
3. బాలకాండ సారాంశం - డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ ........................................1-5
4. బాలకాండ సమీక్ష - డా॥ మైలవరపు శ్రీనివాసరావు ........................................6-72
5. అయోధ్యాకాండ సారాంశం - డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ ................................73-78
6. అయోధ్యాకాండ సమీక్ష - డా॥ బి.నరసింహాచార్యులు ................................79-143
7. అరణ్యకాండ సారాంశం - డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ ................................144-149
8. అరణ్యకాండ సమీక్ష - కందాడై రామానుజాచార్యులు ................................150-244
9. కిష్కింధాకాండ సారాంశం - డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ ................................245-250
10. కిష్కింధాకాండ సమీక్ష - డా॥ యస్.వి.రంగరామానుజాచార్యులు ......................251-328
11. సుందరకాండ సారాంశం - డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ ................................329-333
12. సుందరకాండ సమీక్ష - డా॥ శలాక రఘునాథశర్మ ........................................334-424
13. యుద్ధకాండ సారాంశం - డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ ....................................425-434
14. యుద్ధకాండ సమీక్ష - డా॥ ముదిగొండ శంకరశర్మ ........................................435-625
15. ఉత్తరకాండ సారాంశం - డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ ....................................626-635
16. ఉత్తరకాండ సమీక్ష - డా॥ దోర్బల ప్రభాకరశర్మ ........................................636-718



# తొలిపలుకు

**"ఓం నమో వేంకటేశాయ"**

**శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,**
**కార్యనిర్వహణాధికారి,**
తిరుమల తిరుపతి దేవస్థానములు.

రామాయణ, భారత, భాగవతాలు భారతీయ సంస్కృతికి మూలస్తంభాలు. ఒక్క భరతజాతికే కాక ప్రపంచంలోని మానవులందరికీ ధర్మాన్ని ఉదాత్తంగా బోధించిన ఉద్గ్రంథాలు. అందులో రామాయణం ఆదికావ్యంగా ప్రసిద్ధి చెందింది. 24వేల శ్లోకాలతో సాగిన రామాయణం సకల వేద, వేదాంగాల సారం. కనుక ప్రాచీన ధర్మరక్షణకై ఎన్నో సంస్థలు రామాయణాన్ని అనేక భాషలలో ప్రచురించాయి. రామాయణంలోని ఎన్నో ధర్మసందేహాలకు వ్యాఖ్యానం అవసరమని, పూర్వమే కొందరు మహాపండితులు వ్యాఖ్యానాలు రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం – 'పురాణ ఇతిహాస ప్రాజెక్టు' అనే పేరుతో వాల్మీకి రామాయణాన్ని 'గోవిందరాజీయం', 'మహేశతీర్థీయం' అనే రెండు ప్రసిద్ధ వ్యాఖ్యానాలను ఆధారంగా చేసుకొని వాల్మీకి రామాయణాన్ని సంపూర్ణంగా ప్రచురించింది. శ్రీమద్రామాయణానికున్న వ్యాఖ్యానాలలో లోతైన అర్థాలున్న ధార్మికసన్నివేశాలను సరళంగా పండితమండలితో వ్రాయించి, ప్రచురించడానికి రూపకల్పనే ఈ 'రామాయణ తరంగిణి'. ప్రధాన ధార్మిక రామాయణ కాండల్లోని వ్యాఖ్యానాల సమీక్ష నేటి యువతరానికి చక్కగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా పురాణ పండితులకు కరతలామలకం అవుతుంది. ఈ గ్రంథంలో రామాయణంలోని ఏడుకాండలకున్న ప్రాచీన వ్యాఖ్యానాలను సమీక్షించిన పండితులు–

1.బాలకాండ డా॥ శ్రీ మైలవరపు శ్రీనివాసరావుగారు 2.అయోధ్యాకాండ డా॥ శ్రీ బి.నరసింహాచార్యులుగారు 3.అరణ్యకాండ డా॥ శ్రీ కందాడై రామానుజాచార్యులుగారు 4.కిష్కింధాకాండ డా॥ శ్రీ యస్.వి.రంగరామానుజా చార్యులుగారు 5.సుందరకాండ డా॥ శ్రీ శలాక రఘునాథశర్మగారు 6.యుద్ధకాండ డా॥ శ్రీ ముదిగొండ శంకరశర్మగారు 7.ఉత్తరకాండ డా॥ శ్రీ దోర్బల ప్రభాకరశర్మగారు–వీరందరి కృషి అభినందనీయం.

ఈ 'రామాయణతరంగిణి' వ్యాఖ్యానసమాహారానికి ప్రతి కాండకు ముందు సంగ్రహంగా ప్రధానకథను అందించి, ఈ గ్రంథాన్ని ప్రచురణార్హంగా తీర్చిదిద్దిన డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు, ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టువారికి నా శుభాభినందనలు.

**సదా శ్రీవారిసేవలో....**



**జె.శ్యామలరావు ఐ.ఏ.ఎస్.,**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదన

ప్రపంచంలోని భాషలలో సంస్కృతం అతి ప్రాచీనం. ఈ భాషలోని ఇతిహాస వాఙ్మయంలో శ్రీమద్రామాయణం మొదటిది. వాల్మీకి రచితమయిన రామాయణం భారతీయభాషలలో మాత్రమే కాదు, ప్రపంచభాషలన్నిటిలోను వ్యాప్తి చెందిన మహాకావ్యం. కేవలం కవితారూపంలోనే కాకుండా సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, నృత్యాదికళలలో అనంతరూపాలుగా విస్తరించింది.

భారతదేశంలో ప్రత్యేకించి ఆంధ్రులకు రామాయణంతో అనుబంధం ప్రగాఢమయింది. సీతారామలక్ష్మణుల వనవాసజీవితం ఆంధ్రప్రాంతంలోనే గడిచింది. తెలుగువారికి రామమందిరాలు, సీతారామకళ్యాణోత్సవాలు, రామకోటిపారాయణ ఇవన్నీగాక, రామాయణకాలం నాటి భౌగోళిక ప్రదేశాల సందర్శన అలవాటుగా ఉన్నాయి. తెలుగులో వర్ధిల్లిన వాఙ్మయంలో 'రామాయణవాఙ్మయమ్' చాలా ఎక్కువ. అలాంటి శ్రీమద్రామాయణానికి ఎన్నో వ్యాఖ్యలు వెలువడ్డాయి. వాటిలో సుప్రసిద్ధమయినది గోవిందరాజీయవ్యాఖ్యానం. ఇది తిరుమల బేడి ఆంజనేయస్వామి సన్నిధిలో రచితమని పండితులంటారు. ఇదేగాక శ్రీమద్రామాయణవ్యాఖ్యలలో శ్రీమహేశతీర్థీయ వ్యాఖ్య కూడా ప్రసిద్ధమే. ఈ రెండు వ్యాఖ్యలను ప్రధానంగా చేసుకుని శ్రీమద్రామాయణంలోని ఏడుకాండలలోని ప్రత్యేకతను, విశిష్టార్థాలను జోడించి సుప్రసిద్ధులయిన ఏడుగురు రామాయణ రహస్య కోవిదులు వాల్మీకి హృదయావిష్కరణ చేయడానికి పూనుకోవడం అభినందించదగ్గ అంశం.

శ్రీమద్రామాయణాన్ని పారాయణం చేయడం, అలాగే ఒకటి రెండు కాండలను వ్రతదీక్షతో చదవడం ఆంధ్రులలో ఒక సంప్రదాయంగా నిలిచివుంది. అయినా శ్రీమద్రామాయణంలోని విశేషార్థాలు తెలియాలంటే 'పాలనుండి నెయ్యి తీసినట్లు' విశేష వ్యాఖ్యానం అవసరం. ఇలాంటి వ్యాఖ్యానం వలన రామాయణ సన్నివేశాలకు సంబంధించిన విమర్శలలోని సత్యాలు బహిర్గతమౌతాయి. అద్దానికున్న మసిని తుడిచివేస్తే అద్దం ప్రకాశవంతంగా ఉంటుంది. అలాగే రామాయణంలోని కొన్ని గూఢమైన విషయాలను వ్యాఖ్యానిస్తే కావ్యవైభవం మరింతగా ప్రకాశించబడుతుంది.

దశావతారాలలో శ్రీరామావతారం త్రేతాయుగం నాటిది. భగవంతుడు మానవరూపంలో, మానవవర్తనంలో నడయాడుతూ ధార్మిక జీవనం గడిపిన మాయామానుషవిగ్రహుడు. లోకధర్మాన్ని, సృష్టిధర్మాన్ని సమన్వయించుకొని ధార్మికజీవనం గడిపిన మహోన్నతుడు. ఈ రెండూ తెలిసినా మూర్ఖుడై తనకు తాను కీడు తెచ్చుకొన్నవాడు రావణుడు. కనుకనే పెద్దలు రావణుడు తెలిసిన మూర్ఖుడు, దుర్యోధనుడు తెలియని మూర్ఖుడని తేల్చిచెప్పారు. రావణాసురునిలాగే అతని అనుచరులు కుమార్గంలో నడచి కూలిపోయారు. అలాంటి వారి ఆలోచనల్ని ఏవగించుకొంటూ ఉపదేశమిచ్చిన వారిలో సీతమ్మ, విభీషణ, హనుమదాదులు వందనీయులయ్యారు, ఆదర్శవంతులయినారు.

ఇందులో బాలకాండకు వ్యాఖ్యానాలను సంకలనం చేసిన శ్రీ మైలవరపు శ్రీనివాసరావుగారు నేటి సమాజానికి అవసరమైన అంశాలకే పెద్దపీట వేశారు.

బ్రహ్మ వందకోట్లశ్లోకాలతో రామకథను వ్రాసాడు. అది దివ్యలోకాలలో ప్రచారం పొందింది. మానవలోకంలో కూడా జనులను ఉద్ధరించడం కోసం రామకథను అందించాలని బ్రహ్మ సంకల్పించాడు. తానే వాల్మీకిగా అవతరించి రామాయణాన్ని రచించాడు. ఇది సాంప్రదాయికుల మాట. వాల్మీకి నారదుని ద్వారా రామకథను శ్రద్ధగా విని రామాయణం రచించాడు.

అయితే "వందకోట్లశ్లోకాలతో రామాయణాన్ని వ్రాసిన బ్రహ్మయే, వాల్మీకిగా అవతరించినపుడు నారదుడి నుంచి రామకథను తెల్సుకోవలసిన అవసరం ఏముంది" అనే సందేహం కలుగుతుంది. దీనికి సమాధానం మహేశతీర్థుల వ్యాఖ్యలో చెప్పింది ఏమంటే రామాయణం ఒక మహామంత్రం. మంత్రం గురువుల నుండి ఉపదేశం పొందినపుడే అది మంత్రం. ఇది మంత్రశాస్త్ర సంప్రదాయం. కనుక వాల్మీకి నారదుని ద్వారా ఉపదేశం పొంది రామాయణరచన చేశాడు. ఆ విధంగా శాస్త్రసంప్రదాయరక్షణ చేసాడు. అంటే ఎంతటివానికైనా సరే గురువు యొక్క ఆవశ్యకత ఉందని బోధించాడు.

వాల్మీకి మహర్షి యొక్క నామధేయాలను గురించిన చర్చ ఉన్నది. వాల్మీకిని ఒకచోట "వాల్మీకి" అని మరోచోట "భార్గవుడ"ని, మరోచోట "ప్రాచేతసుడ"నీ, మరొకచోట "ఋక్షుడ"నీ సంప్రదాయజ్ఞులు పేర్కొంటున్నారు. వీటిలో ఏది వాల్మీకిపేరు అనేదానికి సమాధానంగా ఇలా వివరించారు. ఎలాగంటే-

1. వాల్మీకి మహర్షి అసలుపేరు ఋక్షుడు.
2. భృగువంశంలో పుట్టాడు అందువలన భార్గవుడు.
3. ప్రచేతసుడంటే వరుణుడు. (జలాధిపతి) వరుణవర్షం వలన పుట్టకరిగి బయటకు వచ్చాడు. కనుక ప్రాచేతసుడు.
4. వల్మీకమంటే పుట్ట. ఋక్షుడే తపస్సు చేస్తుంటే ఆయనమీద పుట్టలు పెరిగాయి. ఆ పుట్టలు వర్షానికి కరగగా పుట్ట నుంచి (వల్మీకం నుంచి) వెలువడ్డాడు కనుక వాల్మీకి.

ఇలా ఈ నాల్గుపేర్లు వాల్మీకికి చెందినవే.

అలాగే రామాయణంలోని శబరి ఎవరు? క్షత్రియులకు వైశ్యస్త్రీ యందు పుట్టినవారు శబరులు. వారి వృత్తి తేనె అమ్మకం. ఈ శబరి గురుశుశ్రూషాపరురాలు, ధర్మాచరణశీలురాలూ, అతిథి సత్కారధర్మాన్ని తెలిసినది కూడా. అందుకే ఈమె శ్రమణి అంటే సన్యాసాశ్రమస్వీకారం చేసిన పరివ్రాజిక. ఇక్కడ రామాయణంలో ఈమె చేత రాముడు పూజితస్సమ్యక్=చక్కగా పూజింపబడ్డాడు అని ఒక మాట ఉంది. దీని అర్థాన్ని వివరిస్తూ వ్యాఖ్యాతలు - అరవైవేల సంవత్సరాలు ఎదురుచూసి తనను పుత్రునిగా పొందిన దశరథుని ఆలనాపాలనలో ఎంతో ప్రేమగా అందించిన షడ్రసోపేత భోజనం కంటే, శబరి ఇచ్చిన పండీపండని పండ్లే రామునికి రుచి అనిపించాయట. అంటే రామునకు శబరిచేసిన పూజ అంతగా నచ్చిందన్నమాట. పైగా ఎంత ఆదరంతో ఫలాలను సమర్పించింది. అందుకే అది సమ్యక్ పూజ అనడం జరిగింది. రామునికి శరభంగమహర్షినుంచీ అగస్త్యుని వరకూ చేసింది పూజ మాత్రమే. శబరి చేసినది సమ్యక్పూజ.

శివధనుస్సును చూపించి దాని గొప్పతనాన్ని వివరించే సందర్భంలో జనకుడు విశ్వామిత్రునితో పలికిన పలుకులలో అన్ని పదాలకు చక్కని వివరణం అందించారు వ్యాఖ్యాతలు –

**క్వ గతిర్మానుషాణాం చ ధనుషో౽స్య ప్రపూరణే**
**ఆరోపణే సమాయోగే వేపనే తోలనే౽పి వా (బా.కాం.67సర్గ. 10శ్లో.)**

1. ప్రపూరణం అంటే నిలబడిన ధానుష్కుడు పెట్టెలోని ధనుస్సుని పైకి తీసి చెవివరకూ వచ్చేలా వింటిని నేలమీద ఆధారపరిచి పట్టుకోవడం.
2. ఆరోపణం అంటే వింటినారిని దానిలో బిగించడం
3. సమాయోగః –బాణాన్ని తొడగడం
4. వేపనమ్ – వింటినారిని బలంగా బాణంతో సహా తనవైపుకి లాగడం
5. తోలనమ్ – అంటే వింటిబరువునీ బలాన్నీ పరీక్షించడానికి ఇటూఅటూ తిప్పడం, వీటిలో ఏపనీ సాధారణ మనుష్యమాత్రుడు చెయ్యలేడు అని శ్లోకానికి అర్థం. అలాగే సీతావివాహసందర్భంలో జనకుని నోటి నుండి వెలువడిన మాట ఉంది.

**ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ ।**
**ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా – అని (బా.కాం.73–26)**

ఇక్కడ "పాణిం గృహ్ణీష్వ పాణినా" అనే మాటను వ్యాఖ్యానిస్తూ వ్యాఖ్యాతలు – సంశయాన్ని వెలువరించి సమాధానించిన తీరు అందరూ తెలుసుకోదగ్గది–

బ్రాహ్మణవివాహాల్లో వరుడు చేతితో వధువుచేతిని పట్టుకోవాలి కాని క్షత్త్రియవివాహంలో క్షత్త్రియత్వ సూచకమైన బాణాన్ని కదా పట్టుకోవాలి. మరి అన్నీ తెలిసిన జనకుడు రామా! నీచేతితో సీత చేతిని పట్టుకో అని ఎలా అన్నాడు అని సంశయాన్ని వెలువరించి, వ్యాఖ్యాతలు ఇలా సమాధానించారు–

అసమానవర్ణవివాహాల్లో అంటే బ్రాహ్మణుడు క్షత్త్రియస్త్రీని వివాహమాడే సందర్భంలో అయితే వరుడు వధువు చేతికి బదులుగా బాణాన్ని పట్టుకోవాలి. సమానవర్ణ వివాహంలో అంటే క్షత్త్రియుడు క్షత్త్రియస్త్రీని వివాహమాడే సందర్భంలో వరుడు తన చేతితో వధువు చేతినే పట్టుకోవాలి. ఇది చక్కని సమాధానం కదా! పరశురామగర్వభంగ సందర్భంగా శ్రీరాముడు పరశురామునితో మహానుభావా! నువ్వు బ్రాహ్మణుడవు మాకు పూజ్యుడవు. అంతేకాక విశ్వామిత్రునికి సంబంధించినవాడవు. కనుక నీ ప్రాణాలు తీసే బాణాన్ని నీమీద ప్రయోగించలేకున్నాను అంటాడు. ఇక్కడ పరశురామునికి విశ్వామిత్రునితో సంబంధం ఏమిటో వ్యాఖ్యాతలు వివరించారు.

**బ్రాహ్మణో౽సీతి పూజ్యో మే విశ్వామిత్రకృతేన చ ।**
**తస్మాచ్ఛక్తో న తే రామ మోక్తుం ప్రాణహరం శరమ్ ।। (76–6)**

విశ్వామిత్రుని సోదరి సత్యవతి. ఆమె భర్త ఋచీకుడు. వారి పుత్రుడు జమదగ్ని. అతని పుత్రుడు పరశురాముడు అని – ఇదీ విశ్వామిత్రునికి పరశురామునకూ ఉన్న సంబంధం.

శ్రీ బి.వి.నరసింహాచార్యులుగారు అయోధ్యాకాండలో తన రచనలో ఎంపిక చేసుకొన్న అంశాలన్నీ ఎంతో ముఖ్యమైనవి. రామాయణం లోతును గొప్పదనాన్ని తెలియజేసేవి. ఉదాహరణకు – రావణవధను కోరుకుంటున్న దేవతలు మంథరను ఆవేశించారు. కనుక మంథర కైకేయికి దుర్బుద్ధి నూరిపోసింది. దేవతలు తమ పని నెరవేరడం కోసమే కైకేయిమనసు విరిచి, అభిషేకం ఆపించడానికి భూలోకానికి మంథరను పంపారు. అందువల్లనే మంథర ఎక్కడ పుట్టింది? తల్లిదండ్రులెవరు? అనే విషయాన్ని మహర్షి వాల్మీకి పేర్కొనలేదు. 7వ సర్గలో మొదటిశ్లోకంలో "జ్ఞాతిదాసీ యతో జాతా కైకేయ్యా తు సహోషితా" అని మంథరను గురించి యతో జాతా=ఎక్కడ పుట్టినదో అని అన్నారని వ్యాఖ్యాతల వివరణ. యతో జాతా అనడంలో ఇంత రహస్యం దాగి ఉందని గ్రహించాలి.

అలాగే రామగుణాల్ని వర్ణిస్తూ వాల్మీకి మహర్షి–

**కథంచి దుపకారేణ కృతే నైకేన తుష్యతి ।**
**న స్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా ॥ 1–2**

అన్నారు. మంచిమనస్సు కలవాడు కనుక ఎవరైనా ఏదో విధంగానైనా తమకు ఒక్క ఉపకారం చేసినా మనస్సులో ఎంతో సంతోషించేవాడు. వంద అపకారాలు చేసినా వాటిని ఎంతమాత్రమూ మనస్సులో అట్టేపెట్టు కొనేవాడు కాదు అని దాని భావం.

ఇక్కడ కథంచిత్ = ఎట్లైనా అనేదానికి వ్యాఖ్యాతలు –

1. ఏదో విధంగా చేసినా 2. కొంత తననుండి ఫలమాశించి చేసినా 3. హృదయపూర్వకంగా కాకపోయినా 4. అనుకోకుండా చేసినా 5. పత్రపుష్పాదులలో ఏ ఒక్కదానితో చేసినా 6. పరిహాసంగా కాని నిందాపూర్వకంగా కాని చేసినా అని వ్యాఖ్యానించడంలో విశేషణాశక్తి స్పష్టమౌతోంది. ఇక 8వ సర్గలో 12 శ్లోకంలో కైకేయిని గురించి మంథరమాటలలో

**హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమాః స్త్రియః ।**
**అప్రహృష్టా భవిష్యంతి స్నుషాస్తే భరతక్షయే ॥ 8–12**

అదేవిధంగా దశరథప్రవిలాపంలో –

**యత్సుఖేషూపధానేషు శేతే చందనరూషితః ।**
**వీజ్యమానో మహార్హాభిస్త్రీభిర్మమ సుతోత్తమః ॥ – (అయో. 42–15)**

సీతమాటలలో –

**పితుర్నిదేశం నియమేన కృత్వా వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ ।**
**స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభి స్త్వం రంస్యసే వీతభయః కృతార్థః ॥ (సుం–27)**

**మణికాంచనకేయూర ముక్తాప్రవరభూషణైః ।**
**భుజైః పరమనారీణాం మభిమృష్టమనేకధా ॥ (యుద్ధ – 21–3)**

శ్రీరామచంద్రుడు -

**మాతరశ్చైవ సర్వా మే కుమారా స్త్రీగణాని చ ।**
**అగ్రతో భరతం కృత్వా గచ్ఛంత్వగ్రే సమాహితాః ॥ (93-23)**

ఈ శ్లోకాలన్నీ రామునికి అనేక భార్యలున్నారు అనే అర్థాన్నిస్తున్నాయని కొందరు భావిస్తారు. ఈ పూర్వపక్షానికి ఉపోద్బలకంగా చూపిస్తూ చివరకు పైశ్లోకాలలో ఎక్కడెక్కడ "పరమస్త్రీలు" అని, "ఉత్తమస్త్రీలయొక్క" అని, "స్త్రీలచేత" అని ఉన్నదో అక్కడక్కడల్లా ఆ స్త్రీలు ఇతరులకు సంబంధించినవారే. అంతేకాని రాముని భార్యలు కాదని, కాబట్టి రాముని ఏకపత్నీవ్రతమునకెట్టి భంగము రాలేదు, రాదు, రాబోదు అని ముగించారు. ఈ అంశం ఇప్పటి యువతకు స్పష్టంగా తెలియవలసిన అంశం కదా!

అయోధ్యాకాండలో 34వ సర్గలో 60 శ్లోకం ఇట్లా ఉంది -

**ఏవం స రాజా వ్యసనాభిపన్నః శోకేన దుఃఖేన చ తామ్యమానః ।**
**ఆలింగ్య పుత్రం సువినష్టసంజ్ఞః మోహం గతో నైవ చిచేష్ట కించిత్ ॥**

దశరథమహారాజు మనోవ్యథతోనూ దుఃఖంతోనూ బాధపడుతూ, కుమారుణ్ణి కౌగిలించుకుని స్మృతి తప్పి మూర్ఛపోయి చేష్టారహితుడయ్యేడు అని దీని అర్థం.

ఈ శ్లోకంలో శోకమని, దుఃఖమనీ రెండుపదాలున్నాయి. వాటికి అర్థం ఒకటే కదా భేదమేమిటి అంటే గో.రా.తీ అనుసరించి త్వగ్దాహోత్పాదకము శోకము = శరీరానికి చర్మానికి మంటపుట్టించేది. దుఃఖమంటే మనస్సులో మంటపుట్టించేది అని వాటికి భేదం అని చక్కగా వివరించారు.

శ్రీమద్రామాయణంలోని అరణ్యకాండలోని అంశాలను డా॥ కందాడై రామానుజాచార్యులుగారు కొన్ని ప్రధాన అంశాలను చక్కగా విశ్లేషించారు. అరణ్యకాండలో మొట్టమొదటి శ్లోకవ్యాఖ్యానాన్ని ఎంచుకొని ఎంతో చక్కగా వివరించారు.

**ప్రవిశ్య తు మహారణ్యం దండకారణ్యమాత్మవాన్ ।**
**రామో దదర్శ దుర్ధర్ష స్తాపసాశ్రమమండలమ్ ॥ అర.1-1.**

ఈ శ్లోకంలో రామునకు "ఆత్మవాన్" అనే విశేషణం వేసారు వాల్మీకి మహర్షి. ఇది సాభిప్రాయకమే ఈ విశ్లేషణం. ఎందుకంటే దండకారణ్యం రాక్షసులతో నిండిన మహారణ్యం. దానిలో ప్రవేశించాలంటే ఎంతో ధైర్యం కావాలి. అటువంటి ధైర్యం కలవాడు రాముడు అందుకే ఆత్మవాన్ అనే విశేషణం అవసరమయ్యింది. తాపసాశ్రమమండలాన్ని "**యథా ప్రదీప్తం దుర్దర్శం గగనే సూర్యమండలమ్**" అని మధ్యాహ్నసూర్యమండలంతో పోల్చారు. దాని ఉద్దేశ్యం ఇది. సూర్యుణ్ణి ఉదయసంధ్యల్లోనూ, సాయంసంధ్యల్లోనూ మందేహులనే రాక్షసులు ఆక్రమింపచూస్తారు. మధ్యాహ్నసూర్యుణ్ణి వాళ్ళు సమీపించలేరు. అట్లే మధ్యాహ్నసూర్యుని వంటి తాపసాశ్రమ మండలాన్ని రాక్షసులు సమీపింపలేరని చక్కగా వివరించారు.

రాముడు తాపసాశ్రమంలోకి 'విజ్యం కృత్వా మహద్ధనుః= వింటినారిని ధనుస్సునుండి విప్పి ప్రవేశించాడు. ఎందుకని అంటే వినయాన్ని వ్యక్తం చేయడం కోసం. అంతేకాక ఆశ్రమ మృగాలకు భయం కల్గకూడదని రాముడు ఇలా చేశాడు.

**దివ్యజ్ఞానోపపన్నాస్తే రామం దృష్ట్వా మహర్షయః ।**
**అభిజగ్ముస్తదా ప్రీతా వైదేహీం చ యశస్వినీమ్ ॥ అర.1-10**

ఈ శ్లోకంలో అచ్చటి ఋషులు "దివ్యజ్ఞానోపపన్నాః" అని చెప్పబడ్డారు. అనగా వారికి రామావతార రహస్యం తెలుసు. కనుకనే సీతను "యశస్వినీమ్" అన్నారు. అంటే గొప్ప పాతివ్రత్యకీర్తి కల్గినదని మాత్రమే కాక, రావణసంహారానికి ఆమె కారణభూతురాలనే సత్యాన్ని కూడా తెలియజేస్తోంది.

కిష్కింధాకాండలో యస్వీ. రంగరామానుజాచార్యులుగారు సంప్రదాయవిషయాల్లోని ఎన్నో లోతుల్ని సరళంగా తెలియజేశారు.

**కపిరూపం పరిత్యజ్య హనుమాన్ మారుతాత్మజః ।**
**భిక్షురూపం తతో భేజే శఠబుద్ధితయా కపిః ॥ కిష్కింధ.3-2**

ఈ శ్లోకంలో హనుమంతుడు ఋశ్యమూకపర్వతంనుండి రామలక్ష్మణులున్నచోటికి వచ్చేటపుడు కోతిరూపాన్ని విడిచి భిక్షురూపం ధరించి వచ్చాడని చెప్పబడింది. ఇక్కడ చెప్పబడిన భిక్షురూపం అంటే సంన్యాసి రూపమా? లేక బ్రహ్మచారి రూపమా? అని ప్రశ్న. ఒక్కోవ్యాఖ్య ఒక్కో విధంగా వ్యాఖ్యానించింది. ఇక్కడ హనుమంతుడు రామలక్ష్మణులకు నమస్కరించినట్లుగా కూడా తరువాతి శ్లోకంలో ఉంది. మరి సంన్యాసి ఇతరులకు నమస్కరించ వచ్చునా? కూడదు కదా. ఏదో విధంగా ఈ నమస్కారాన్ని సమర్థించడం కంటే హనుమ మనుష్యబ్రహ్మచారి రూపం ధరించి వచ్చాడనే ఆచార్యులవారి అభిప్రాయం.

**సముద్రాత్పశ్చిమాత్పూర్వం దక్షిణాదపి చోత్తరమ్ ।**
**క్రామత్యనుదితే సూర్యే వాలీ వ్యపగతక్లమః ॥ కిష్కింధ.11-4**

**చతుర్భ్యోఽపి సముద్రేభ్యః సంధ్యామన్వాస్య రావణ ।**
**ఇమం ముహూర్తమాయాతి వాలీ తిష్ఠ ముహూర్తకమ్ ॥ (ఉ.కా.స.34-శ్లో6)**

వాలి బ్రాహ్మముహూర్తంలోనే లేచి సూర్యోదయాత్ పూర్వమే నాల్గు సముద్రాలలోనూ సంధ్యవార్చేవాడు అని పైశ్లోకాల భావం.

ఈ విషయంలో సందేహం ఏమిటంటే నాల్గు సముద్రాలలోనూ సంధ్యావందనం చెయ్యడం ఎలా కుదురుతుంది అని. దీనికి సమాధానంగా గోవిందరాజీయం చెప్పిన మాటల్ని ఇలా వివరించారు. ఎలాగైతే ఒక తటాకంలో నాల్గుపార్శ్వాలున్నట్లుగా నాల్గుతీరాల్లోనూ సంధ్యవార్చడం కుదిరినట్లుగా నాల్గుసముద్రాల్లో స్నానం, ఆచమనం, అర్ఘ్యప్రదానం, జపం అనే నాల్గు సంధ్యాకృత్యాలు చేయడంలో అభ్యంతరం లేదు అని. అలాగే వాలి దుందుభుల యుద్ధసందర్భంలో –

**తమేవముక్త్వా సంక్రుద్ధో మాలాముత్క్షిప్య కాంచనీమ్ ।**
**పిత్రా దత్తాం మహేంద్రేణ యుద్ధాయ వ్యవతిష్ఠత ॥ (కిష్కి.11-39)**

అనే శ్లోకం ఉంది. మాలాముత్క్షిప్య కాంచనీమ్ । అంటే ఇంద్రుడిచ్చిన బంగారుమాలను ధరించి వాలి యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు అని అర్థం.

ఈ సందర్భంలో గోవిందరాజీయంలో ఉన్న మాలామహాత్మ్యాన్ని గురించిన సందర్భంలో "ఎవ్వడైనా ఆ మాలను ధరించినపుడు ఎదురుగావస్తే ఎదుటివాని బలం అంతా వాలికే సంక్రమిస్తుందని" చెప్పినమాటలను చక్కగా ఉటంకించారు.

కంఠమాలతో కూడిన సుగ్రీవుణ్ణి వర్ణిస్తూ వాల్మీకి మహర్షి-

**శోభసేహ్యధికం వీర లతయా కంఠసక్తయా ।**
**విపరీత ఇవాకాశే సూర్యో నక్షత్రమాలయా ॥**

అన్నారు. కంఠంలో ఉన్న లతతో సుగ్రీవుడు నక్షత్రమాలతో కూడిన సూర్యునిలా ఉన్నాడు అని శ్లోకభావం. ఇక్కడ సూర్యుడు నక్షత్రమాలతో ఉండటమేమిటి? సూర్యుడుండేది పగలు కదా? నక్షత్రాలేమో రాత్రి కదా ఉంటాయి అనే ప్రశ్న ఉదయిస్తుంది. కనుక కొందరు దీన్ని ("అభూతోపమ") అని వ్యాఖానించారు. దానికి సమాధానంగా తీర్థీయవ్యాఖ్య నుదాహరించారు-

"విపరీతం తు శర్వరీ" అనే శాస్త్రకార వచనాన్ని బట్టి విపరీత శబ్దానికి పూర్ణిమారాత్రి అని అర్థం.

**పరీతం తు దివా ప్రోక్తం విపరీతం తు శర్వరీ ।**
**పౌర్ణమాసే గతశ్చంద్రః, సూర్య ఇత్యభిధీయతే ॥**

పూర్ణిమయందలి చంద్రుడు సూర్యుడనబడుతాడు అని. అందువలన సుగ్రీవుడు కంఠమాలతో ఉండి నక్షత్రాలతో కూడిన పున్నమచంద్రునిలా ఉన్నాడు అని తాత్పర్యం. అంతేకాకుండా మరోవ్యాఖ్యానం కూడా ఉటంకించారు. ఈ వ్యాఖ్యానమే మిగిలిన వాటికంటే యోగ్యమనిపిస్తుంది. అదేమిటంటే విపరీతశబ్దానికి విశేషంగా పరీతమైన కాలం అంటే ప్రళయకాలం అని అర్థం. ఈ కాలంలో మధ్యాహ్నసమయంలోనే నక్షత్రాలు విస్పష్టంగా గోచరిస్తాయి. సుగ్రీవుడు నక్షత్రాలతో కూడిన ప్రళయకాలపు సూర్యుడిలా ఉన్నాడని శ్లోకాభిప్రాయం. రాత్రి సమయంలో ఇంద్రధనుస్సు కనిపించడం, పగటిసమయంలో నక్షత్రాలు కనిపించడం రాజ్యాధిపతి వినాశనానికి నిదర్శనం.

**రాత్రావింద్రధనుర్దర్శే దివా నక్షత్రదర్శనే ।**
**తద్రాష్ట్రనాథనాశః స్యాదితి గర్గస్య భాషితమ్ ॥**

గర్గవచనం ప్రమాణం. జరగబోయే వాలివధకు సుగ్రీవునకు వేసిన ఉపమానం సూచకం.

అలాగే రాముడు వాలిని ఒక బాణంతో చంపాడా? లేక అనేక బాణాలు ప్రయోగించాడా అని సందేహం. ఈ సందేహం ఎందుకు కల్గిందంటే 16 సర్గలో 38 శ్లోకం ఇలా ఉంది-

**నరోత్తమః కాలయుగాన్తకోపమం, శరోత్తమం కాంచనరూప్యభాసితమ్ ।**
**ససర్జ దీప్తం తమమిత్రమర్దనం, సధూమమగ్నిం ముఖతో యథా హరః ॥**

ఇందులో శరోత్తమం అని ఏకవచనం ఉంది, కనుక ఒక బాణంతోనే రాముడు వాలిని చంపాడు అని అర్థం వస్తున్నా ఉత్తరకాండలో తార "రామేణ ప్రహితై రౌద్రైర్మార్గణైర్దూరపాతిభిః" అని మార్గణైః అంటే బాణములతో అని బహువచనం ప్రయోగించింది, కదా! ఇందులో ఏది నిజం అంటే ఒక బాణంతోనే చంపాడనేదే వాస్తవం. అది తారక్కూడ తెలుసు. అయినా దుఃఖవివశయై బహువచనం ప్రయోగించిందని వ్యాఖ్యానం.

రాముడు చెట్టుచాటున ఉండి వాలిని చంపాడన్నది నిజమేనా? అయితే అలా ఎందుకు చేసాడు అనే ప్రశ్న సర్వసాధారణం అందరిలో కలిగే సంశయం- ఇందుకు సమాధానం 17సర్గ కిష్కింధాకాండ - 47వ శ్లోకంలో ఇలా ఉంది.

త్వయాఽదృశ్యేన తు రణే, నిహతోఽహం దురాసదః" అని ఇది వాలిమాట. నువ్వు అదృశ్యుడవై నన్ను చంపావు అని దీని అర్థం. అందువలన రాముడు చాటుగా ఉండి చంపాడనేది వాల్మీకమే. ఆ విధంగా ఎందుకు చంపాడంటే వాలితో ప్రత్యక్షయుద్ధం చేయడం కుదరదు కనుక - రాజులకు వేటాడుట ధర్మము మృగములను చాటుగా నుండి వేటాడుట నియమమే. అందువల్లనే నిన్ను నేను చాటుగా నుండి వధించినాను.

ఇక్కడ పురాణవచనం ప్రమాణం-

**ఆహూయ వాలినం బ్రహ్మా దదౌ వరమనుత్తమమ్ ।**
**ప్రతీపవర్తినో భూయాద్బలమర్ధమరిందమ ॥**

ఇది వాలికి బ్రహ్మ ఇచ్చిన వరం. వాలికెదురుపడి యుద్ధం చేసేవాడి బలం క్షీణించిపోతుందనేదే ఆ వరం.

రాముడు సీతాన్వేషణం కోసం సుగ్రీవుని కంటే బలవంతుడైన వాలినే ఆశ్రయించవచ్చును కదా మరి సుగ్రీవుణ్ణి ఎందుకాశ్రయించినట్లు? అంటే వాలి సీతను తెచ్చియిచ్చినా, లేక రావణుడు కూడా వాలిద్వారా వచ్చి శరణువేడినా రావణవధకై రామావతారప్రయోజనం సిద్ధించదు. అంతేకాదు వాలి అధర్మపరుడు. సుగ్రీవుడు ధర్మాత్ముడు. కనుక రాముడు సుగ్రీవుణ్ణి ఆశ్రయించాడు.

ఇక సుందరకాండ వ్యాఖ్యానంలో శ్రీ శలాక రఘునాథశర్మగారు సందేహాలు కలిగే అంశాలను సంగ్రహంగా, సరళంగా సమీక్షించారు.

**దర్శయన్తో మహావిద్యాం విద్యాధరమహర్షయః (సుం. 1-27)**

విద్యాధర మహర్షయః అంటే మహర్షులవంటి విద్యాధరులని అర్థం.

మహావిద్యాం = అణిమాద్యష్టైశ్వర్య విద్యలను అని అర్థం.

**రామార్థం వానరార్థం చ చికీర్షన్ కర్మ దుష్కరమ్ (సుం.1-30)**

హనుమంతుడు రామునికొఱకు అట్లే వానరుల కొఱకు దుష్కరమైన పనిని చేయతలచాడు అని దీని అర్థం. అయితే సీతాన్వేషణం కదా హనుమ చేసేది అది రాముని కొఱకు అంటే బాగానే ఉంది. వానరుల కొఱకు ఎట్లవుతుంది? అని ప్రశ్న. వానరులకు రామకార్యమందు అది తమ పనే అన్నంత అభిమానం ఉంది కనుక వానరార్థం అన్నారు అని సమాధానం.

**దశయోజనవిస్తీర్ణా త్రింశద్యోజనమాయతా ।**
**ఛాయా వానరసింహస్య జలే చారుతరాఽభవత్ ॥ (సుం.1-75)**

సముద్రంపై ఎగురుతున్నపుడు హనుమనీడ పదియోజనాల పొడవు 30 యోజనాల వెడల్పు ఉంది అని దీని అర్థం. దీనర్థం ఏమిటి అంటే ఉదయాన్నే సూర్యుని కభిముఖంగా ఉన్నపుడు అంతనీడపడడంలో అభ్యంతరం లేదు కదా అందువలన హనుమ ఉదయాన్నే లంకకు బయలుదేరాడు అని దీని భావం. సంధ్యాకాల సూర్యకాంతి నీడ పొడవు కంటే, వెడల్పు ఎక్కువగా ఉంటుంది కదా!

సుందరకాండలో 5వసర్గలో 22వశ్లోకంలో హనుమ రాక్షసస్త్రీల ముఖాలను కన్నులను ఆభరణాలను పరిశీలనగా చూసాడు అని ఉంది. అలా ఎందుకు చూసాడంటే వీళ్ళు మానవస్త్రీలా లేక రాక్షసస్త్రీలా అని తెలుసు కోవడానికి వారి నగలు పరిశీలించడం, అంతేకాక సీతనగల్లా ఉన్నాయేమో అని నిర్ధారించుకోవడానికని అర్థం.

9వ సర్గలో 72వ శ్లోకం రావణునితో కలిసి సుఖిస్తున్న రాక్షసస్త్రీలను చూచిన హనుమ ఈ రాక్షస రాజభార్యలున్నట్లుగా రాఘవధర్మపత్ని (సీత) ఉండి వుంటే ఈ రావణుని పుట్టుక ధన్యమయ్యేది కదా! అని చెప్తోంది. ఇక్కడ అనేక దురర్థాలు వచ్చే అవకాశం ఉంది. తిలకవ్యాఖ్యానం ఒక మంచి అర్థాన్ని చెప్పింది. ఈ రాక్షసస్త్రీలు రావణునితో సుఖిస్తున్నట్లుగా సీత తన భర్తయైన రాఘవునితో సుఖించేట్లు ఈ రావణుడు చేసి ఉండాలి. అంటే సీతను అపహరించకుండా ఉండి ఉన్నా, సీతను రామునకప్పగించినా ఈ రావణుని జన్మ ధన్యమయ్యేది కదా అని.

ఇది కాకుండా దీపిక, తిలక వ్యాఖ్యాభావాలను అందిపుచ్చుకుని అవేకాక మరొక ఏడు విధాలైన సమన్వయాలను చూపిందని వాటిని వివరంగా ఆచార్య శలాకవారు తమ వివరణలో పేజీ.నెం.26లో అందించారు.

సుందరకాండలో 13వ సర్గలో 44 శ్లోకం హనుమమాటలు ఇలా ఉన్నాయి-

**సుజాతమూలా సుభగా కీర్తిమాలా యశస్వినీ ।**
**ప్రభగ్నా చిరరాత్రీయం మమ సీతామపశ్యతః ॥ అని.**

రాత్రికి వేసిన ఈ విశేషణాలకు తిలకం చేసిన వివరణ చూడండి.

1. సుజాతమూలా = మంచి ఆరంభం కలది. ఈ రాత్రి ఆరంభం బావుంది. ఎందుకంటే లంకాధిదేవతను జయించడంచేత, ఆమె చెప్పిన శుభవాక్కులను వినడం చేత.

2. సుభగా = అందమైనది. రాత్రి చంద్రుని వెన్నెల చేత అందంగా ఉంది.

3.కీర్తిమాలా = కీర్తి కలది. నాకు కీర్తిని తెచ్చి పెట్టేది.

4.యశస్వినీ = కీర్తి కలది. ఈ రాత్రే కదా హనుమ లంకలో ప్రవేశించేడు అని కీర్తిని పొందినది.

5.చిరరాత్రి = దీర్ఘమైన రాత్రి. రాత్రంతా మెలకువగా ఉండడం చేత ఎంతసేపటికీ తెల్లవారనిది.

6.ప్రభగ్నా = వ్యర్థమైనది. సీత కన్పడకపోవడం చేత నిష్ఫలమైపోయినది.

55వ సర్గలో ఏకవేణీధరా అని సీతకు విశేషణం. దీని అర్థం తిలకవ్యాఖ్యలో ఇలా ఉంది. మూడుగా విభాగాలు లేక మూడు పాయలుగా చుట్టబడిన కేశపాశమును ఏకవేణి అంటారు అని అర్థం.

62వ సర్గలో-

**హనూమతా దత్తవరై ర్హతం మధువనం బలాత్ ।**
**వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః ॥**

హనుమంతుడు వరమీయగా కోతులన్నీ మధువనాన్ని తుక్కుదూగరగా కొట్టాయి. మానుల్ని మోకాళ్ళతో గుంజుకుంటూ పోయాయి. మాకు దేవమార్గాన్ని చూపాయి అని శ్లోకార్థం.

ఈ శ్లోకంలో దేవమార్గం అంటే తిలకవ్యాఖ్యానం ఇలా వివరించింది. దేవమార్గం అంటే అపానద్వారం దేవశబ్దం వాయువాచకం. ఉపనిషత్తులో వాయులోకవిషయకంగా దేవలోక శబ్దప్రయోగం ఉండటం వలన ఈ అర్థం సిద్ధిస్తుంది.

58 సర్గ 75వ శ్లోకం

**స్త్రీణాం మధ్యాత్సముత్పత్య తస్య భార్యా దురాత్మనః ।**
**వరా మందోదరీ నామ తయా స ప్రతిషేధితః ॥76॥**

మందోదరీ = మందమైన (అలంకారమైన) నడుము కలది. మందోదరి= అల్పమైన=సన్ననైన నడుము కలది, మందా=చిన్నచీమ. అంటే చీమ వంటి నడుము కలది.- ఇలా మందోదరి శబ్దాన్ని తెలియజేశారు.

పూర్వపు సర్గలో సీతను చంపనుంకించిన రావణుని వారించింది ధాన్యమాలిని అని ఉండగా ఇక్కడ ఆ విధంగా వారించినది మందోదరి అని ఉంది. ఈ భేదం ఏమిటి? అనే సందేహం కలుగుతుంది. "ఇద్దరూ వారించారని కాని, లేదా వారిపేర్లు హనుమకు సుపరిచితములు కావు కనుక అలా చెప్పి ఉండవచ్చు అని భావించాలి".

యుద్ధకాండలోని అనేక విశేషాంశాలలో ప్రధానమైన వాటిని ఎంపికచేసి వైజ్ఞానిక విశ్లేషణ చేశారు డా॥ ముదిగొండ శంకరశర్మగారు. రాముడు ఎంతో కోపించి శరసంధానం చేసే వఱకూ సముద్రుడు ప్రసన్నుడు కాలేదు కదా! ఇక్కడొక సందేహం వస్తుంది. రామకార్యంపై ఆంజనేయునికి మైనాకుని ద్వారా ఆతిథ్యం ఇవ్వడానికి ప్రయత్నించిన సముద్రుడు, సాక్షాత్తూ రాముడే వచ్చినపుడు ముందుగనే సేతునిర్మాణోపాయం చెప్పవచ్చుకదా! అలా ఎందుకు చేయలేదు. ఇందుకు వెనుక ఉన్న బలమైన కారణం సముద్రుడు అలాచేసి ఉండకపోతే, రామునకు

కోపం రాదు శరసంధానం చేయడు. చేయకపోతే సముద్రుని కోరిక– సముద్రానికి ఉత్తరభాగాన ద్రుమకుల్యమనే ప్రదేశంలో ఉన్న దుర్మార్గులైన జలచోరులను సంహరింపచేయడం జరగదు. అదే రామునకు కోపం వచ్చి శరసంధానం చేసాక ప్రత్యక్షమైన సముద్రుడు రాముడడిగిన "నాబాణం వ్యర్థం కాదు. ఏం చేయమంటావీ బాణాన్ని" అని అడిగినపుడు తన కభీష్టమైన చోట రామబాణాన్ని ప్రయోగింపచేసాడు.

ఇక్కడ మరొక ప్రశ్న. రాముడు సముద్రునికి పశువులకు సుఖప్రదమగు పచ్చగడ్డి కలిగియుండుగాక. వ్యాధులు ప్రారంభకాలమందే నశించుగాక. తేనె, నెయ్యి బహుక్షీరప్రదములగు పశువులు, సుగంధయుక్త సమస్తౌషధులు వీటితో ఈ ప్రదేశం నిండియుండుగాక అని మరుకాంతారాన్ని గూర్చి వరాలు ఇచ్చినట్లుంది. అది యుక్తమా? రాముడు తనను మానవమాత్రునిగానే తలుస్తున్నాడు కదా అంటే – దానికి సమాధానం ఏమంటే రాముడు సత్యంచే లోకాలను జయించినవాడు కనుక వరప్రదానం యుక్తమే అని మనం గ్రహించాలి.

వానరసహాయంతో సముద్రం మీద మొదటి రోజు 14 ఆమడల పొడవు, రెండో రోజున 20 ఆమడల పొడవు, మూడో రోజున 21 ఆమడల పొడవు, నాలుగవ రోజు 22 ఆమడల పొడవు, ఐదవ రోజున 23 ఆమడల పొడవు సేతునిర్మాణం జరిగింది. వంద యోజనాల సముద్రంపై సేతునిర్మాణంలోని వైజ్ఞానికతను చక్కగా, శాస్త్రీయంగా మనం తెలుసుకోవాలి. ఇందువల్ల శ్రీరామజయాన్ని ఆధిభౌతిక ప్రయోజనం సిద్ధించింది.

సాయంకాలం మూడు మండలాలుగా మూడు వర్ణాలతో పరివేషం ఏర్పడడం రాజుల నాశనాన్ని సూచిస్తుంది. "నృపఘ్నోయస్త్రిమండలం" "దినకరపరివేష స్సర్వనాశశ్చతుర్థే" 'చంద్రార్కమండలచ్ఛిద్రం దృష్ట్వా జనపదక్షయః' అని శాస్త్రం. రాముడు లంకమీద దండెత్తినపుడు కనపడిన శకునాలివి. రావణ, రాక్షస నాశనసూచకాలు.

అశోకవనంలో ఉన్న సీతకు రావణుడు రాముని శిరస్సును, ధనుస్సును చూపించి రాత్రి రామాదులు నిద్రిస్తుండగా వానరసైన్యాన్ని చంపి రాముని శిరస్సు ఖండించినట్లుగా చెప్పాడు. సీతమ్మ రాముని శిరస్సుచూసి దుఃఖించింది. ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. అదేమిటంటే– సీతసామాన్యస్త్రీవలె భర్త ఖండితశిరస్సు చూచికూడా చాలాకాలం రోదించి ఎలా జీవించింది? వెంటనే ప్రాణవియుక్తకావాలి కదా! అని. ఇక్కడ వ్యాఖ్యాతలిలా చెప్పారు. సీతారాములు దివ్యదంపతులు. రాముడు నిజానికి జీవించే ఉన్నాడు కనుక సీతకూడా జీవించే ఉంది. దీన్ని వాల్మీకి కావ్యపరిభాషలో ప్రతిపాదన చేశాడు.

నిత్యమంగళ– మంచినవ్వు, మంచిచూపు, చిన్నరంధ్రాలు కల సమమగు నాసిక నిత్యమంగళయగువారి లక్షణములని సాముద్రిక శాస్త్రం తెలియజేస్తోంది. పాదాల వేళ్ళు– ఒకవేలు మీదకు ఒకవేలు ఎక్కినట్లుండుట కాలిచిటికెనవ్రేలు నడచునపుడు నేలకు తాకకుండుట వైధవ్యహేతువులు. రోమాలు లేక గుండ్రంగా స్నిగ్ధంగా ఉన్న పిక్కలుగల స్త్రీ రాజపత్నికాగలదు. ఇలాంటి అంశాలను ఆదికావ్యంలో వాల్మీకి చక్కగా ప్రతిపాదించాడు. అంతేకాదు

48వ సర్గలో

రామలక్ష్మణులు యుద్ధభూమిలో నేలమీద దుమ్ములో పొర్లి ఉండటం చూచి సీత దుఃఖిస్తూ ఇలా అనుకుంటుంది. నా లలాట పార్శ్వభాగాలు, నేత్రాలు, చేతులు, కాళ్ళు, తొడలు, చీలవ ఎత్తుగా ఉన్నాయి. హస్త

పాదాంగుళులు గుండ్రనిగోళ్ళతో స్నిగ్ధంగా ఉన్నాయి. స్తనాలు సందులేక పీనములై కొద్దిగా పల్లంగా ఉండే చనుమొనలు కలిగినవై ఉన్నాయి. నా బొడ్డు లోతుగా, ఉన్నతమైన ప్రక్కభాగం కలదిగా ఉంది. నా శరీరచ్ఛాయ మణిచ్ఛాయవలె స్నిగ్ధంగా ఉంది. అంగాలు మృదువుగా ఉన్నాయి. పది పాదాంగుళులు అరికాళ్ళు సంపూర్ణంగా నేలను తాకుతున్నాయి. ఇవి శుభలక్షణాలే కదా! మరి నాకీ దుఃఖం ఎందుకు కల్గింది అనుకుంటుంది. అంటే సీతమ్మవారు పరోక్షంగా సాముద్రిక శాస్త్రరహస్యాల ఆధారంగా రామలక్ష్మణులకు కష్టం వాటిల్లలేదని మనస్సులో దృఢపరుచుకొంది.

నాగాస్త్రంచే బంధింపబడిన రామలక్ష్మణులను గరుత్మంతుడు నాగపాశవిముక్తుణ్ణి చేసాడు. అప్పుడు రామలక్ష్మణులు మునుపటికంటే అధికమైన తేజస్సు, వీర్యం, ఓజస్సు, దర్శనం, ఉత్సాహం, బుద్ధి, స్మృతితో ప్రకాశించారు అని మూలం.

ఇక్కడ వ్యాఖ్యాతలు ఇలా వివరించారు.

తేజః –ఎదుటివారిని పరిభవించే సామర్థ్యం లేక ఎదుటివారి దెబ్బను సహించే శక్తి కలిగి ఉండటం,

వీర్యం – పరాక్రమం కలిగి ఉండటం,

ఓజస్సు– కాంతితో వెలుగొందడం,

ఉత్సాహము – లోకోత్తర కార్యాలలో స్థిరప్రయత్నం కలిగి ఉండటం,

దర్శనం – సూక్ష్మార్థ పరిజ్ఞానం కలిగి ఉండటం,

బుద్ధిః – వివేకంతో విరాజిల్లడం,

స్మృతిః – అనుభవించినవి మరువకుండా కౌశలాన్ని పెంపొందించుకోవడమని తెలియజేశారు.

యుద్ధసందర్భంలో రావణుడు ధూమ్రాక్షునితో "త్వం వధాయాభినిర్యాహి" అంటాడు. అంటే రామలక్ష్మణులను వధించడానికి నీవు వెళ్ళు అని రావణుని అభిప్రాయం. కాని ఇందులో నీవు మరణించడానికి వెళ్ళు అనే అమంగళార్థం దాగి ఉంది. ఇది వాల్మీకి మహర్షి కావ్యనిర్మాణకౌశలంగా తెలుసుకోవాలి.

యుద్ధసందర్భంలో రాక్షసులు పట్టిసం, పరిఘ, భిండిపాలము, భల్లము, ప్రాసము, పరశ్వధము మున్నగు ఆయుధాలతో యుద్ధం చేసినట్లు మూలంలో ఉంది. అయితే ఈ ఆయుధాలేమిటో వ్యాఖ్యాతలు వివరించారు. 1.పట్టసం – అడ్డకత్తి, పరిఘము–ఇనుపకట్ల గుదియ, భిండిపాలము–హస్తప్రమాణమగు గుదియ, భల్లము= ఇనుపబాణం, ప్రాసము= ఈటె, పరశ్వధః= గండ్రగొడ్డలి. ఆ కాలం నాటి ఆయుధవిశేషాలు మనం తెలుసుకోవచ్చు.

ఓషధిపర్వతం నుండి హనుమ మృతసంజీవని, విశల్యకరణి, సావర్ణ్యకరణి, సంధానకరణి అనే ఓషధులను తెచ్చాడు అని వాల్మీకి మహర్షి ప్రబోధించారు.

వాటిలో–

1. మృతసంజీవని, చచ్చిన వానిని బ్రతికిస్తుంది.

2. విశల్యకరణి, బ్రదికిన పిమ్మట సంచారయోగ్యతను కలిగించుటకు శల్యములను తొలగిస్తుంది.

3. సంధానకరణి, శల్యములు తీయబడిన పిమ్మట చర్మము అతుక్కునేటట్లు చేస్తుంది.

4. సావర్ణ్యకరణి, చర్మమతుక్కొన్న తరువాత మిగిలిన భాగాలతో సమానమైన రంగు కల్గేలా చేస్తుంది.

ఇలా వ్యాఖ్యాత వాటి శక్తిని మనకు వివరించారు.

తాను తలచిన పని నిర్విఘ్నంగా నెరవేరుటకు అభీష్టదైవమగు శ్రీరాముని నమస్కరించి తోకపైకెత్తి, వీపువంచి, చెవులను వంచి, నోరు తెరిచి మహావేగంతో ఆకసానికెగిరాడు అని మూలం - ఇక్కడ వ్యాఖ్యానం చూడండి. తోక ఎత్తుట వలన ఉత్సాహాతిరేకమున్నూ, వీపు వంచుట వలన ఆకసమందు ప్రయాణించుట కనుకూలమయిన ప్రాణవాయునిరోధం, చెవులను వంచుట వలన బలోద్దీపనం, నోరు తెరుచుట వలన అభినివేశం చెప్పబడినాయి అని వ్యాఖ్యాత చాలా వైజ్ఞానికంగా విశ్లేషించారు.

ఓషధిపర్వతాన్ని తేవడానికి హనుమ మేరుపర్వతాభిముఖంగా వెళ్ళాడు అని మూలం. హనుమంతుడు హిమవత్పర్వతంలోని ఓషధిపర్వతాన్ని తీసుకురావడానికి బయల్దేరాడు. మరి మూలంలో మేరుపర్వతాభిముఖంగా అంటుందేమిటి మూలంలో అంటే? మేరుపర్వతం హిమవత్పర్వతంలో ఉండే ఒక పర్వతం. అంతేకాని సుప్రసిద్ధమైన సుమేరుపర్వతం కాదు అని వ్యాఖ్యాతలు మనకు సందేహనివృత్తి చేశారు.

ఆదిత్యహృదయస్తోత్రం అగస్త్యునిచే రామునకీయబడింది. అందులో-

**ఆదిత్యస్సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణసదృశో భానుర్హిరణ్యరేతా దివాకరః 107-10**

ఈ ఆదిత్యహృదయాన్ని పఠించేటప్పుడు త్వం ఆదిత్యః, త్వం సవితా ఇత్యాదిరీత్యా త్వం అనే పదాన్ని ప్రతినామానికి ముందు చేర్చుకోవాలి అని తెలియజేసి వ్యాఖ్యాతలు ప్రతినామానికి చక్కని వివరణ అందించారు.

ఫాల్గుణామావాస్యయందు లేక ప్రతిపద్యుక్తామావాస్యయందు రావణవధ జరిగింది అన్న వివరణ ఇక రావణవధానంతరం, చాలా శాస్త్రీయమైన అంశం. లంకనుండి సీతను సర్వాభరణభూషితురాలిని చేసి తనయొద్దకు తెమ్మన్నప్పటినుంచీ సీత అగ్నిప్రవేశం చేసి తన పరిశుద్ధతను నిరూపించుకొనే పర్యంతం జరిగిన సంభాషణలకు సంఘటనలకూ వాస్తవతాత్పర్యం తెలియాలంటే వ్యాఖ్యానం చదువవల్సిందే. దీన్ని చదవడం ఒక ఎత్తైతే, వ్యాఖ్యానం వల్ల మనకు ఎన్నో ధార్మికాంశాలు స్పష్టంగా తెలుస్తున్నాయి.

సీతారాములకు సర్వనేత్రానందంగా పట్టాభిషేకం జరిగింది. రామరాజ్యం సమస్త కళ్యాణ గుణప్రపూర్ణంగా సాగింది. రామోరామోరామ ఇతి ప్రజానామభవన్ కథాః

రామచంద్రుణ్ణి అభినందించడానికి ఋషుల రాకతో ఉత్తరకాండ ఆరంభమయ్యింది. ఈ ఉత్తరకాండలోని వ్యాఖ్యానాలను సమీక్షించినవారు డా॥ దోర్బల ప్రభాకరశర్మ. మూలంలో ఋషులు రావడం రాఘవుణ్ణి

అభినందించడానికి అని ఉంటే వ్యాఖ్యాతలు రాఘవ శబ్దానికి ఇక్కడ లక్ష్మణుడే అర్థమని చెప్పారు. ఇక అభినందించడమంటే స్తుతించడమే అని, రావణునికంటే ఇంద్రజిత్తే బలవంతుడని అందువలన లక్ష్మణుడే అభినందనీయుడు అని కూడా వ్యాఖ్యానించారు. అభినందించడానికి వచ్చిన ఋషులలో వసిష్ఠుడున్నాడు. ఇక్కడ వ్యాఖ్యాతలు వచ్చిన వసిష్ఠుడు అయోధ్యావసిష్ఠుడు కాదని, జ్యోతిర్మండలంలో ఉన్న వేఱొక వసిష్ఠుడని కూడా చక్కగా ప్రతిపాదించారు.

నగరంలో రచ్చబండలదగ్గర, నాల్గు వీధుల మొగలలో ఎక్కడపడితే అక్కడ జనులందరు సీతారాములను గురించి తేలికగా మాటలాడుకోవడం గూఢచారిద్వారా రాముని చెవికి చేరింది. రామచంద్రమూర్తి భరించలేక సీతను వాల్మీక్యాశ్రమం దగ్గరగా విడిచిరమ్మని లక్ష్మణుణ్ణి ఆజ్ఞాపించాడు. లక్ష్మణుడు రామాజ్ఞను పాలించాడు. వాల్మీక్యాశ్రమసమీపంలో ఉన్న సీతను మునిబాలకులు వాల్మీకికి తెలియచేసారు. మహర్షి స్వయంగా వచ్చి ఆమెను మునికన్యల ఆలనాపాలనలో ఉంచి రక్షించాడు. ఇక్కడ సీతాపరిత్యాగంలో రాముని ధర్మదీక్ష ద్యోతకమౌతుంది.

ఇక రామచంద్రుడు అశ్వమేధయాగం చేసాడు. అక్కడ లవకుశులు రామాయణగానం చేసారు. ఆ యాగానికి వాల్మీకి మహర్షి వచ్చారు. యాగం పూర్తయ్యాక రాముడు వాల్మీకి మహర్షితో ఈ సభలోకి సీతవచ్చి, తన పవిత్రతను నిరూపించుకోవాలి అని చెప్పాడు. మహర్షి సీతతో బాటు ఆ సభలో ప్రవేశించాడు. సీత తను పవిత్రురాలనైతే భూదేవి, తనను తనతో తీసుకుపోవాలని కోరింది. ఆమె పవిత్రతను నిరూపిస్తూ ఆమె కోరినట్లుగా భూమి బ్రద్దలయి దానినుండి రత్నసింహాసనంపై భూదేవి వచ్చి సీతను తనతో తీసుకునిపోయింది. అయితే రామునకు సీతదక్కలేదు కదా మఱి ఎందుకు రాముడు సీతను తన పవిత్రతను నిరూపించుకోమన్నాడు అంటే ఇక్కడ సత్యతీర్థీయవ్యాఖ్య ఇలా వివరించింది– సీత తన అపవాదాన్ని పోగొట్టుకోవాలని తన కంటే ముందుగా వైకుంఠానికి సీత చేరాలని రాముని కోరిక అందుకనే ఈ ఏర్పాటు అని అమోఘంగా విశదపరిచారు.

కాలుడు బ్రహ్మదేవుని దూతగా రాముని కలవాలని వచ్చాడు. రామునితో తాను మాట్లాడుతూ ఉండగా మరెవ్వరూ రారాదని, వారి మాటలు వినరాదని ఒక నియమం పెట్టాడు. రాముడు లక్ష్మణుణ్ణి ద్వారం దగ్గర ఉంచి ఎవరినీ లోపలకు రానివ్వవద్దని తన ఆజ్ఞను ఉల్లంఘిస్తే దానికి మరణదండనమే అని ఆజ్ఞాపించాడు. ఇలా ఉండగా దుర్వాసమహర్షి వచ్చాడు, తనను లోపలకు రాముని దగ్గరకు వెళ్ళనివ్వాలని లక్ష్మణుణ్ణి అడిగాడు. లక్ష్మణుడు రామాజ్ఞను మహర్షికి విన్నవించాడు. మహర్షి తనను లోపలకు పంపించకపోతే, అయోధ్యానగరప్రజలను రాజవంశాన్ని సర్వనాశనమయ్యేట్లా శపిస్తానని అన్నాడు. అపుడు లక్ష్మణుడు రామాజ్ఞను ఉల్లంఘిస్తే తనకొక్కనికే మరణశిక్ష పడుతుంది. దుర్వాసుణ్ణి లోపలకు పంపించకపోతే సర్వనాశనం అవుతుంది కనుక తానొక్కడే శిక్ష అనుభవించడం మంచిదని నిర్ణయించుకొన్నాడు. దుర్వాసుణ్ణి లోపలకు పంపించాడు. దుర్వాసుని రాకతో కాలపురుషుడు అంతర్ధానమైపోతాడు. ఈ సంఘటనల కారణంగా లక్ష్మణుణ్ణి రాముడు పరిత్యజిస్తాడు. లక్ష్మణుడు దుఃఖంతో సరయూనదీతీరానికి వెళ్ళి ఆచమించి, నవరంధ్రములను బంధించుకొని ఉచ్ఛ్వాస నిఃశ్వాసములు లేకుండగా యోగసమాధిలో ఉండగా ఇంద్రుడు లక్ష్మణుణ్ణి సశరీరంగా స్వర్గానికి తీసుకొని వెళ్ళాడు. లక్ష్మణవిరహాన్ని సహించలేని రాముడు, రాముణ్ణి విడిచిఉండలేని అయోధ్యానగరజనులు, గుంపులు గుంపులుగా వచ్చిన వానరులు,

భల్లూకములు, రాక్షసులు వెంటరాగా సరయూ నదీజలాలకు అభిముఖంగా నడిచారు. అయితే హనుమ, విభీషణుడు, జాంబవంతుడు, మైందుడు,ద్వివిదుడు రామాజ్ఞననుసరించి భూలోకంలోనే ఉండిపోయారు. చెట్లూచేమలూ కూడా రామునితో స్వర్గానికి చేరడానికి రాముణ్ణనుసరించాయి. రాముడు సరయూనదికి అభిముఖంగా బయలుదేరిన తరువాత మౌనాన్ని పాటించి నడిచాడు. బాణాలు, ధనుస్సు కూడా పురుషరూపాన్ని ధరించి రాముని అనుసరించాయి. నదీజలాలవైపు నడిచిన రాముడు బ్రహ్మదేవుని మాటననుసరించి తమ్ముళ్ళతో బాటు సశరీరంగా వైష్ణవతేజస్సులోకి ప్రవేశించాడు. రాముని మాటననుసరించి సర్వలోకపితామహుడైన బ్రహ్మదేవుడు రామునితో వచ్చిన సమస్తానికి సాంతానికములనే లోకాలననుగ్రహించాడు. ఉత్తరకాండను కూడా లోతైన రహస్యాలను తెలుపుతూ ముగించారు.

శ్రీమద్రామాయణంలోని కొన్ని సన్నివేశాల్లో నిగూఢ ధర్మసూక్ష్మాలున్నాయి. వాటిని ఋషితుల్యులైన వారి వ్యాఖ్యల ద్వారా తెలుసుకోవాలి. అప్పుడే శ్రీమద్రామాయణంలోని పాత్రలలోని వైశిష్ట్యం స్పష్టమౌతుంది. అలాగే వితండవాదులు చదువక, అర్థం చేసుకోక వాగే విమర్శలకు సరియైన సమాధానాలు తెలుస్తాయి.

ఇలాంటి సందర్భంలో శ్రీమద్రామాయణంలోని ఏడుకాండలలోని అంతరార్థాలను, రత్నాలకు సానబెట్టిన రీతిగా ప్రమాణాలతో విశేషార్థం వ్రాసిన పండితశ్రేణిని మనసార అభినందిస్తున్నాను.

నదులకున్న పేర్లలో 'తరంగిణి' ఒకటి. ఈ గ్రంథానికి పెట్టిన పేరు 'రామాయణతరంగిణి'. శ్రీమద్రామాయణ రచనావేశం 'తమసా' నదీతీరంలోనే పుట్టింది. రామావతారం సరయూతీరంలోనే సంభవించింది. అలాగే ప్రధానమయిన శ్రీరామవనవాసదీక్ష గోదావరితీరంలోనే జరిగింది. అలలతో కదలుతూ తీరాన్ని తాకే నదిలా, ఈ పుస్తకంలోని అనేకాంశాలు జిజ్ఞాసువులకు ప్రబోధాత్మకంగా ఉన్నాయి. ఈ గ్రంథం వేంకటాద్రిరాముని భక్తాదులకు చింతామణిగా భావిస్తున్నాను. రచయితలకు, పండితలోకానికి శ్రీరామానుగ్రహం సంపూర్ణంగా సిద్ధించాలని ఆకాంక్షిస్తున్నాను.

ఈ రామాయణతరంగిణి ప్రచురణ జరగాలని తీర్మానించిన తి.తి.దే అధికారులకు, రూపకల్పన చేసిన ''మహామహోపాధ్యాయ'' సముద్రాల లక్ష్మణయ్యగారికి, వైజ్ఞానికంగా సమీక్షణ చేసిన పండితులకు నా కృతజ్ఞతాంజలులు ఘటిస్తున్నాను.

శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ**

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు

ఓం శ్రీనివాస పరబ్రహ్మణే నమః
శ్రీవేదవ్యాస వాల్మీకి

# శ్రీమద్వాల్మీకి రామాయణతరంగిణి
# శ్రీమద్వాల్మీకి రామాయణ వ్యాఖ్యాసారాంశం
# బాలకాండ సారాంశం

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ**

సంస్కృత వాఙ్మయంలో ఆదికావ్యం రామాయణం. మహర్షి వాల్మీకి ముఖం నుండి జాలువారిన గ్రంథమిది. గాయత్రీమంత్రంలోని ఇరవైనాలుగు అక్షరాలను నిక్షిప్తంచేసి, వేయిశ్లోకాలకు ఒక్కొక్క అక్షరం చొప్పున వేద సమ్మితంగా వాల్మీకి రచించిన మహాకావ్యమిది. రాముడు అవతరించడానికి పూర్వమే బ్రహ్మ రామపరతత్త్వాన్ని నిరూపిస్తూ, నూరుకోట్ల శ్లోకాలతో దీనిని రచించడం జరిగింది. రాముడు రాజ్యపరిపాలన చేస్తూ ఉండగా బ్రహ్మ ఆదేశంతో నారదుడు వచ్చి ఉపదేశింపగా వాల్మీకి దీనిని సంక్షిప్తంగా వ్రాశాడు.

శ్రీరాముడు పదకొండువేల సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. అందు పదివేల సంవత్సరాల పాలన పూర్తి అయిన తరువాత ఆయన సీతాదేవిని పరిత్యజించడం జరిగింది. ఆమె వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఉండి లవకుశులనే కుమారులను కన్నది. అప్పుడు ఈ రామాయణరచన సాగింది. తనయులు పండ్రెండేండ్ల వయస్సు కలవారయ్యారు. రాముడు అప్పుడు అశ్వమేధయాగం చేయనారంభించాడు. వాల్మీకి ద్వారా రామాయణాన్ని అంతా పఠనం చేసిన లవకుశులు యాగమండపంలో రోజుకు 20 సర్గలు చొప్పున దీనిని వినిపించారు.

ముందుగా ఇక్ష్వాకు వంశజులను సగర చక్రవర్తిని కీర్తించి లవకుశులు రామాయణగానారంభం చేశారు. అయోధ్యానగరాన్ని పండ్రెండు యోజనాల పొడవు, మూడు యోజనాల వెడల్పుతో సరయూనదీతీరంలో మానవేంద్రుడైన మనువు నిర్మించాడట. ఆ నగరంలో నాస్తికుడన్నవాడు కాని అధార్మికుడైనవాడుకాని లేరు. అతిరథుడైన దశరథుడు దానిని పాలించాడు. అతడు దీర్ఘదర్శి. అందరిని తనవశంలో ఉంచుకొన్నవాడు. ఆ నగరంలోని వారందరూ సంతృప్తిపరులు, శమదమసద్గుణాన్వితులు. గోధనం, అశ్వధనం అధికంగా కలవారు.

అంత మహాత్ముడైన దశరథుడు సంతానం లేనివాడై పరితపించాడు. ఆయన సంతానప్రాప్తికై అశ్వమేధయాగం చేయసంకల్పించాడు. మంత్రులను, వసిష్ఠవామదేవులను, ద్విజసత్తములను ఆహ్వానించి సభను ఏర్పాటుచేశాడు. తన కోరికను వారిముందు వెల్లడించాడు. వసిష్ఠాదులు రాజుసంకల్పానికి సంతోషించి ఆమోదముద్ర వేశారు. ఆ రాజు తన రాణులవద్దకేగి ఈ విషయాన్ని వివరించగా మంచు తొలగిన పిమ్మట విలసిల్లే కమలాలవలె వారి ముఖాలు వికసించాయి.

అంత సుమంత్రుడు ఏకాంతంగా రాజును కలసి సనత్కుమారుని మాటలను తెలియజేశాడు. ఋషుల సమక్షంలో ఆయన భవిష్యత్తులో దశరథుడు ఋష్యశృంగుని ద్వారా పుత్రకామేష్టి నిర్వహిస్తాడని, నలుగురు కుమారులు రాజుకు ఉద్భవిస్తారని చెప్పాడు. అప్పుడు ఆ నరేంద్రుడు సనత్కుమారవచనాలను సుమంత్రుని ముఖతః విని

రోమపాద చక్రవర్తి యొక్క అంగరాజ్యానికేగి, భార్యాసహితంగా ఋష్యశృంగుని అయోధ్యకు తీసుకుని వచ్చాడు. అనంతరం ఆ మహామునిని యజ్ఞనిర్వహణార్థం యాచించాడు. సరయూనదికి ఉత్తరభూమిలో యజ్ఞభూమిని ఏర్పాటు చేయించాడు. వసిష్ఠాదుల ఆశీర్వచనాలను పొంది యాగదీక్ష వహించాడు. వసిష్ఠునికి యాగబాధ్యతలన్నీ అప్పగించాడు దశరథుడు.

యజ్ఞాశ్వం అన్ని ప్రాంతాలలో సంచరించి, సంవత్సర కాలానికి తిరిగి వచ్చింది. దశరథుడు అశ్వమేధ క్రతువు పూర్తి చేసి భూమండలాన్నంతా వసిష్ఠాదులకు దానం చేశాడు. వారు దానికి మారుగా గోవులను, బంగారాన్ని స్వీకరించారు. అనంతరం పుత్రకామేష్టిని నిర్వహించమని దశరథుడు ఋష్యశృంగుని మళ్ళీ అభ్యర్థించాడు. అతడు యాగం ప్రారంభించాడు. బ్రహ్మాదులందరు హవిర్భాగస్వీకరణకై యజ్ఞమంటపోపరిభాగానికి విచ్చేశారు. దేవతలు బ్రహ్మను గాంచి రావణుని ఆగడాలను విన్నవించారు.

**"ఏతస్మిన్నంతరే విష్ణురుపయాతో మహాద్యుతిః ।**
**శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః ॥**

దేవతలందరు ఆలస్యం చేయక జగన్నాథుని ప్రార్థించారు. దశరథుని హ్రీ, శ్రీ, కీర్తి అను వారితో సమానమైన ముగ్గురు భార్యలయందు నలుగురు కుమారులుగా మానవరూపంలో అవతరించి లోకకంటకుడైన రావణుని వధించమని అభ్యర్థించారు. మహావిష్ణువు వారి కోరికను మన్నించి పదకొండువేల సంవత్సరాలు భూమండలంలో వసించి పృథివిని పరిపాలించి పిమ్మట స్వస్థానానికి చేరుతానన్నాడు.

దశరథుని యజ్ఞకుండంనుండి ఒక దివ్య పురుషుడు ఆవిర్భవించాడు. ఆయన రాజుకు బంగారు పాయస పాత్రను అందించాడు. అందు విష్ణుతేజం ప్రవేశించింది. రాజు పాత్ర నందుకొని అందలి పాయసాన్ని ముగ్గురు భార్యలకు ఈవిధంగా పంచాడు.

**కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా ।**
**అర్ధాదర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః ॥**

**కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థకారణాత్ ।**
**ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమమ్ ।**

**అనుచింత్య సుమిత్రాయై పునరేవ మహీపతిః" ।**

దశరథుడు ముందుగా పాయసంలో సగభాగం కౌసల్యకు ఇచ్చాడు. మిగిలిన సగంలో సగ భాగాన్ని తరువాత సుమిత్రకు ఇచ్చాడు. మిగిలిన సగంలో సగంభాగాన్ని అటు పిమ్మట కైకేయికి ఇచ్చాడు. ఇక తన చేతిలో మిగిలిన భాగాన్ని మళ్ళీ సుమిత్రకు ఇచ్చాడు. అనగా కౌసల్యకు 4 భాగాలు. సుమిత్రకు (2+1) = 3 భాగాలు కైకేయికి ఒక భాగం లభించాయి. అందువల్ల విష్ణుతేజంలోని 8 అంశాలలో నాలుగు అంశాలవల్ల రాముడు, రెండు అంశాల వల్ల లక్ష్మణుడు, ఒక అంశం వల్ల భరతుడు, మరొక అంశం వల్ల శత్రుఘ్నుడు జన్మించారు.

యజ్ఞభాగస్వీకరణలో కౌసల్యకు ప్రథమ భాగం లభించడం వల్ల రాముడు ముందు జన్మించాడు. తరువాత లక్ష్మణుడు జన్మించవలసినప్పటికి సుమిత్రకు 2 మార్లు పాయసం లభించడం వల్ల అలా జరగలేదు. అందువల్ల అనంతరం కైకేయికే భరతుడు కలిగాడు. తదనంతరం సుమిత్రకు శత్రుఘ్న లక్ష్మణులు జన్మించారు. కవలలో ముందు పుట్టినవాడు శత్రుఘ్నుడు తరువాత పుట్టినవాడు లక్ష్మణుడు. అనగా రామభరత శత్రుఘ్న లక్ష్మణులు జన్మించారని భావం. వీరు శుక్లశోణిత సంయోగంవల్ల కల్గినవారు కారు. పాయసాన్న ప్రభావ సంజనితులు. అందువల్ల రామలక్ష్మణ భరత శత్రుఘ్నులనే క్రమం సిద్ధించింది. దేవతలందరూ తమ తమ అంశములతో వానర భల్లూకవీరులను ప్రభవింపజేశారు.

రాముడు పునర్వసునక్షత్రంలోను, భరతుడు పుష్యమీనక్షత్రంలోను, లక్ష్మణ శత్రుఘ్నులు ఆశ్లేషా నక్షత్రంలోను ప్రభవించారు. బాల్యం గడిచింది. పంద్రెండేండ్ల వయస్సు కలవారయ్యారు. అప్పటికే వారి సమస్త వేదాభ్యాసం ముగిసింది. పూర్వం విద్యాభ్యాసం పూర్తి అయిన పిమ్మటే బాలురకు వివాహం చేసేవారు. అలాగే దశరథుడు కూడ

**"అథ రాజా దశరథస్తేషాం దారక్రియాం ప్రతి ।**
**చింతయామాస ధర్మాత్మా సోపాధ్యాయః సబాంధవః" ॥**

కుమారులకు వివాహం చేయ సంకల్పించి ఉపాధ్యాయులతోను, బంధువులతోను ఆలోచిస్తూ ఉండగా విశ్వామిత్రుడు ప్రవేశించాడు. బ్రహ్మకు వాసవుడు ఎదురు వెళ్లి సత్కరించినట్లుగా దశరథుడు ఆ ఋషికి ఎదురువెళ్ళి స్వాగతం పలికాడు. కుశలప్రశ్నానంతరం ఆగమనకారణాన్ని ఋషిని అడిగాడు దశరథుడు.

**"అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్ ।**
**వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః ॥**

అని రాముని మహత్త్వం తనకు తెలుసునని, కాకపక్షధరుడైన రాముని యజ్ఞసంరక్షణార్థం పంపమని కోరాడు. కాకపక్షధరుడనే చోట జులపాలజుట్టు కలవాడని సామాన్యార్థం. యుద్ధనిర్వహణయోగ్యత ఉంది. కాన కాకపక్షయుక్తమైన శిరస్త్రాణాన్ని ధరించినవాడని విశేషార్థం. ఊనషోడశవర్షుడైన తన రాముని పంపలేనంటాడు దశరథుడు. ఊనషోడశవర్షుడనేదానికి పదునారేండ్ల వయస్సు కన్న తక్కువ వాడని కొందరి భావం. కాదు అప్పటికిరాముని వయస్సు పన్నెండు ఏండ్లే అని మరికొందరి నిర్ణయం. వసిష్ఠుని ఉపదేశంపై లక్ష్మణుని తోడిచ్చి రాముని ముని వెంట పంపాడు రాజు.

వారు మొదటి రోజు సాయంకాలానికి సరయూనది దక్షిణతీరం చేరారు. విశ్వామిత్రుడు వారికి అప్పుడు ఆకలిబాధలు తీర్చే బల, అతిబల అనే విద్యలను ఉపదేశించాడు. తెల్లవారుతూ ఉండగా విశ్వామిత్రుడు

**కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే ।**
**ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికమ్" ॥**

అని నిద్రలేపాడు. ఇక్కడ రామా! అనే సంబోధించినా అది లక్ష్మణునికి ఉపలక్షణమని సామాన్యార్థం. కాని రాత్రి గడ్డిపై పరున్న అన్నకు లక్ష్మణుడు స్వస్వరూపంతో ఆదిశేషుడుగా మారి శయనంగా ఉన్న కారణంచే మునికి ముందు రాముడే కనబడ్డాడు కాబట్టి రామా! అని మాత్రమే సంబోధించాడని విశేషార్థం. రెండో రాజు సాయంకాలానికి కామాశ్రమం చేరారు. మూడోరోజు తాటకావనం ప్రవేశించారు. అక్కడ మునికోరికపై లక్ష్మణుడు ముందు తాటక ముక్కు చెవులు కోయగా, రాముడు తాటకను శబ్దవేధి విద్యను ప్రదర్శించి సంహరించాడు. అంత మహర్షి వారికి బాణప్రయోగోపసంహారవిద్యలు ఉపదేశించాడు. నాలుగోరోజు సిద్ధాశ్రమానికి చేరారు. అక్కడ ఆరు రోజులు తపోవనాన్ని రక్షించారు రామలక్ష్మణులు. యజ్ఞవిఘ్నకారకులైన వారిలో మారీచుని మానవాస్త్రంతో పారద్రోలాడు రాముడు. సుబాహుని ఆగ్నేయాస్త్రంతోను మిగిలిన రాక్షసులను వాయవ్యాస్త్రంతోను రాముడు సంహరించడం జరిగింది. యజ్ఞసంరక్షణ పూర్తి అయింది.

విశ్వామిత్రుడు సంతసించి మిథిలానగర ప్రయాణాన్ని వివరిస్తూ “అద్భుతం ధనూరత్నం చ తత స్త్రద్రష్టుమర్హసి” అని రామునితో అంటాడు. “చ” కార ప్రయోగం వల్ల స్త్రీరత్నాన్ని కూడ చూడవచ్చని భావం. అందరూ ప్రయాణం సాగించారు. మార్గమధ్యంలో రాముని కోరికపై కుశనాభ బ్రహ్మదత్త, విశ్వామిత్రజన్మవృత్తాంత, పార్వతీవృత్తాంత, గంగావతరణవృత్తాంతాలను ముని వివరిస్తాడు. మార్గమధ్యంలో రాజైన సుమతిని, గౌతమాశ్రమాన్ని సందర్శించడం జరుగుతుంది. గౌతమాశ్రమంలో ఎవరికి కనబడకుండా తపస్సు చేసే అహల్యకు శాపవిముక్తిని కలిగించాడు రాముడు. రాయివలె ఆమె పడియుండడమనేది అన్యపురాణవిషయం.

అందరూ మిథిలకు చేరుకొంటారు. శతానందుడు విశ్వామిత్రుని పూర్వచరిత్రనంతా రామునకు తెలియజేశాడు. అనంతరం మహర్షి జనకునితో శివధనుస్సును చూపించమంటాడు. ఆ వింటిని చూచిన రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు “వత్స! రామ!ధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్” అని అంటాడు. ఇది వాల్మీకికవితాప్రతిభకు ఒక మచ్చు తునక. లక్ష్మణునితో వత్స = నాయనా! రామధనుః = రామునికి సంబంధించిన ధనుస్సును, పశ్య = చూడుము అని, రామునితో “వత్స నాయనా! రామ = రామచంద్రా! ధనుః = ఆ ధనుస్సు విషయాన్ని, పశ్య = తిలకించు, అని ఉభయులతో అన్నట్లుగా ఒక శ్లోకపాదాన్ని ఇరువురకు వర్తించినట్లు వ్రాసిన వాల్మీకికి జోహారులు. రాముడు జనకుని ఆజ్ఞపై దానిని ఆరోపణ చేసాడు. అనగా ఎక్కుపెట్టాడు. అది స్తంభీభూతమైన ధనుస్సు. కావున విరిగిపోయింది. ఏమైనా రాముడు విల్లు విరగడానికి కారణభూతుడయ్యాడు. అనంతరం జనకుడు సందేశం పంపగా దశరథాదులు మిథిలకు ఏతెంచారు. రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల వివాహాలు సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తితో జరిగాయి. ఏకకాలంలో అన్నదమ్ముల వివాహాలు ఎలా జరిగాయని సందేహం రావచ్చు. అందరికీ తండ్రి దశరథుడు, కుశధ్వజుడు అయినా తల్లులు వేరు. రాముని తండ్రి దశరథుడు. తల్లి కౌసల్య. లక్ష్మణుని తండ్రి దశరథుడు, తల్లి సుమిత్ర. మాండవి తండ్రి కుశధ్వజుడు. తల్లి కైకేయి శ్రుతకీర్తి తండ్రి కుశధ్వజుడు. తల్లి సుమిత్ర ఈ విధమైన భేదం ఉండడం వల్ల ఇది అంగీకార్యమే. అందరికీ ఉత్తరానక్షత్రంలో వివాహమయింది. రామునికి అది సాధనతార భరతునికి అది ప్రత్యక్తార. “వివాహే ప్రత్యగుత్తమం” అని అంటారు కదా! లక్ష్మణ శత్రుఘ్నులకు అది క్షేమతార. కాబట్టి ఒకే నక్షత్రంలో వారి వివాహమయ్యింది.

వివాహానంతరం అందరూ అయోధ్యకు తరలారు. మార్గమధ్యలో రాముడు పరశురాముని నిగ్రహించి వైష్ణవధనుస్సును స్వీకరించాడు. అయోధ్య చేరుకొన్నారు అందరు. భరత శత్రుఘ్నులు యుధాజిత్తుకోరికపై కేకయ రాజ్యానికి వెళ్లారు. రామలక్ష్మణులు అయోధ్యలో ఉన్నారు.

“రామస్తు సీతయా సార్థం విజహార బహూన్ ఋతూన్” అని వాల్మీకి వ్రాస్తారు. మున్ముందు చెప్పబోయే విషయాలను బట్టి చూడగా పండ్రెండేండ్లు సీతారాములు అయోధ్యలో కలిసి విహరించారని అవగతమవుతుంది.

ఇవి బాలకాండలోని ముఖ్యాంశాలు.

# శ్రీమద్వాల్మీకి రామాయణం – బాలకాండ సమీక్ష

**వ్యాఖ్యాత – డా॥ మైలవరపు శ్రీనివాసరావు**

## శ్రీ రామానుజులూ మొదలైన అందరి వ్యాఖ్యానాల్లోని విశేషాలతో కూడిన శ్రీగోవిందరాజీయవ్యాఖ్య(గో.రా)

పూజ్య గురువులైన శఠకోపదేశికులకీ, ఆ మీదటి ఆచార్యపరంపరకీ, వాల్మీకి/నారద/బ్రహ్మ/లక్ష్మణ ఆంజనేయులతో కూడిన సీతారాములకీ నా ప్రణామాలు. నా కులగురువైన ఆ కోదండపాణి, నా నాలుక అనే సింహాసనం మీద కొలువై ఉండి, నా శఠారి గురువులు ఉపదేశించిన సంప్రదాయమార్గం చెడకుండా 'గోవిందరా'జనే పేరుగల నా చేత ఈ వ్యాఖ్యని వెలయింపజేశాడు తప్ప, ఎక్కడి శ్రీమద్రామాయణం? ఎక్కడి వ్యాఖ్యాన రచనా భారం? ఎక్కడి మందమతినైన నేను? నా వల్ల అయ్యే పనేనా ఇది?

లోకానికంతకీ శ్రీ మద్రామాయణపు గొప్పదనం తెలియజేయాలనే ఉద్దేశ్యంతో – ఒక్కోచోట పదాలకి అర్థాన్నీ – మరోచోట పదానికీ పదానికీ మధ్య ఉండాల్సిన సమన్వయాన్నీ– ఇంకోచోట, కలిసి ఉన్న రెండు పదాల్ని విడగొడితే కన్పించే సౌందర్యాన్నీ – ఇక అన్ని చోట్లా దాగున్న రహస్యార్థాలనీ నాకు తెలిసినంతలో మీ ముందుంచుతాను! స్వీకరించండి!!

## తిలకమూ మొదలైన వ్యాఖ్యానాల్లోని విశేషాలతో కూడిన శ్రీమహేశతీర్థీయవ్యాఖ్య(మ.తీ)

జ్ఞానశక్తియైన సరస్వతిని స్తుతించి, రామపాదాలకి నమస్కరించి, గురుదేవులైన నారాయణతీర్థదేశికులకి ప్రణమిల్లి, 'రామాయణతత్త్వదీపిక' అనే ఈ వ్యాఖ్యని 'మహేశ్వరతీర్థ'దని పేరున్న నేను తమ ముందుంచుతున్నాను. వ్యాఖ్యానం పెరిగిపోతుందనే భయంతో – ఒక్కోచోట పదాలకి అర్థం – కొన్నిచోట్ల నిఘంటువిశేషాలూ విశేషించి విరాధుడు, ఖరుడు, రావణుడు మొదలైనవాళ్లు రాముణ్ణి నిందించిన సందర్భాల్లో, ఆ నిందలకి సరైన అర్థాన్నీ యథాశక్తి అందిస్తాను. పై నిందల్లో నింద లేదనే విషయాన్ని వ్రాయదలిచాను.

**అవతారిక**

**గో.రా :–** ఏదో పుట్టేసి ఎలాగో జీవించి ఎప్పుడో మరణించి మళ్లీ పుట్టి......ఇలా సంసారచక్రంలో తిరుగాడుతున్న జీవుల్ని చూసి జాలిపడిన శ్రీహరి 'ఏది మంచి? ఏది చెడు? ఎలా జీవించా'లనేందుకు 'వేదం' అనే ఒక శాసనాన్ని జీవులకందించాడు. దాన్ని అతిక్రమించి కొందరూ దాన్ని తమకి సరిపోయేలా సవరించుకొని కొందరూ, ఏమీ తెలియక కొందరూ....... ఇలా మొత్తానికి వేదానికి విరుద్ధంగా దాదాపు అందరూ నడుస్తున్న తరుణంలో, తానే ఈ లోకానికి వచ్చి జనులకి జీవనవిధానాన్ని నేర్పాలని నిర్ణయించుకుని ఎంతో కాలంగా తనని ఆరాధిస్తున్న ఇక్ష్వాకుకులంలోని దశరథునికి – తానొక్కడే అయినా నలుగురిగా – అవతరించాడు భూలోకంలో. రామరూపంలో అవతారప్రయోజనం కోసం రావణవధ చేశాడు. 'పితృవాక్యాన్ని పరిపాలించా'లనే నియమాన్ని మనకోసం పాటించి చూపాడు. లక్ష్మణరూపంలో పై విధంగానే ఇంద్రజిత్తుని వధించాడు. 'భగవంతునికి దాసునిగా జీవించడం ఉత్తమ' మని మన కోసం నిరూపించి చూపాడు. అదేవిధంగా భరతరూపంలో గంధర్వవధ చేసి –

భగవంతుని వశంలోనే ఉంటూ దైవపరతంత్రతతో జీవించడం ఉత్తమ మన్నాడు. శత్రుఘ్నరూపంలో లవణాసురవధని చేసి భగవద్భక్తుడైన భాగవతసేవ కూడ భగవత్సేవతో సమానమే అని ప్రకటించాడు.

ఈ చరిత్రమంతా కాలగర్భంలో కలిసిపోరాదనే సంకల్పంతో రాముని యథార్థచరిత్రాన్ని నూరుకోట్ల శ్లోకాల్లో రచించాడు బ్రహ్మ. దాన్ని నారదాది మహర్షులద్వారా చదివించి, ఈ చరిత్రకి వ్యాప్తికోసం రామమంత్రోపాసన పరుడైన వాల్మీకి వద్దకి నారదుణ్ణి పంపాడు. ఈ విషయమే మత్స్యపురాణంలో చెప్పబడింది. సరే! వాల్మీకి కూడ నారదుడు రాగానే రామకథకి సరిపోయే ప్రశ్నలే వేసాడు. దాంతో నారదుడు నూరుకోట్ల శ్లోకాలసారాంశాన్నీ వాల్మీకికి చెప్పాడు. వాల్మీకి ఆ ఇతిహాసాన్నే (ఇతి + హ + ఆస = జరిగింది జరిగినట్లు చెప్పిన విషయం)– భగవంతుని ఆలోచనకి అనుగుణంగా వేదార్థాన్ని వివరిస్తూ, రామకథని ఓ కావ్యంగానూ/ పురాణంగానూ/ లోకానికి అందించాడు. వినయంతో నమస్కరించి ప్రశ్నించాలి కాబట్టి (అలాంటి వేదాంతపరిప్రశ్నని) వాల్మీకి అడగ్గానే అడక్కుండా చెప్పరాదు కాబట్టి అడిగించుకుని చెప్పాడు నారదుడు.

**మ.తీ :–** బ్రహ్మలోకంలో బాగా ప్రసిద్ధమైన నూరుకోట్లశ్లోకాల రామకథని, భూలోకంలోని నాలుగు వర్ణాలవారి తాపత్రయాన్నీ తొలగించేందుకై సంక్షేపించి రచియించాలని భావించిన ఆ బ్రహ్మయే భూలోకంలో వాల్మీకిగా జన్మించాడు. స్కాందపురాణంలో శివుడు పార్వతికి ఈ విషయాన్నే చెప్తాడు. బ్రహ్మ అంశలో పుట్టినా కూడ, గురుముఖంగా వినాల్సి ఉంది కాబట్టి నారదుని రాకకి ఎదురుచూస్తూ ఉండిపోయాడు వాల్మీకి. తర్వాత నారదునిరాకా– వాల్మీకి 'ఉత్తమ పురుషుడెవ'రని ప్రశ్నించడం, నారదుడు రామకథని చెప్పడం, వాల్మీకి తమసానదికి వెళ్లడం – క్రౌంచవృత్తాంతం – కవిత్వం పుట్టడం – 'ఇది నా అనుగ్రహమే' అని బ్రహ్మ తెల్పడం రామాయణాన్ని రచించవలసిందని ఆజ్ఞచేసి వెళ్లడం జరిగింది.

24 వేల శ్లోకాల రామాయణంలో ప్రతి వేయి శ్లోకాలకీ ఒకటి చొప్పున గాయత్రీ బీజాక్షరాలు 24టినీ నిక్షేపించాడు వాల్మీకి. 'బాలకాండ'లో3, 'అయోధ్య'లో 4, 'అరణ్య'లో2, 'కిష్కింధ'లో2, 'సుందర'లో 3, 'యుద్ధ'లో 6, 'ఉత్తరకాండ'లో 4చొప్పున ఏడు కాండల్లోనూ ఉంచాడు. ఉత్తరకాండతో మాత్రమే 24 వేలశ్లోకాలూ 24 బీజాక్షరాలూ ఉండడం సాధ్యం కాబట్టి, ఉత్తరకాండ కూడ వాల్మీకి రచనమే నిస్సంశయంగా.

**గో.రా :–** తపస్స్వాధ్యాయ నిరతుడు – తపస్సూ, స్వాధ్యాయమూ అనే రెంటిలో నిపుణుడు. కల్మషాన్ని తొలగించేది తపస్సు. జ్ఞానాభివృద్ధిని చేసేది స్వాధ్యాయం. ఒకటి కొకటి అభివృద్ధిని కల్గించుకొనేవి ఈ రెండున్నూ. తపస్సంటే వ్యాకరణం. వ్యాకరణమనేది, మిగిలిన శిక్ష–ఛందం–నిరుక్తం–జ్యోతిషం–కల్పమనే ఆఱిటికీ ఉపలక్షణం. కాబట్టి షడంగాలూ ప్రధానమైన స్వాధ్యాయం తపస్సూ అనేవే స్వం(తనది)గా కలవాడు తపస్స్వుడు. అలాంటి తపస్స్వ+అధ్యాయం తపస్స్వాధ్యాయం. స్వ (శాఖని) అధ్యయనం చేయడం స్వాధ్యాయం. భగవంతునికి 'సామ' ఇష్టం కాబట్టి సామగానలోలుడనవచ్చు.

**మ.తీ :–** మనఃప్రసాదాన్ని కల్గించే వ్రత నియమ ఉపవాసాలు తపస్సు. అర్థం ఒంటబట్టేంతవరకూ చదవాల్సింది స్వాధ్యాయం. పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానం నిండింది తపస్సు. తపస్సూ జ్ఞానం దాదాపు ఒకటే కాబట్టి ప్రారంభంలో మంగళాచరణాన్ని చేసినట్లే.

**గో.రా :-** వాగ్విదాం వరుదు – 'వాక్' వేదం, వ్యాకరణం (షడంగాలు ) వేదవ్యతిరిక్తశాస్త్రాలు (చతుర్దశ విద్యలున్నూ), బ్రహ్మ–దేవ– భూత–క్షత్ర–నక్షత్ర–సర్ప అనే దేవవిద్యలు, సరస్వతి, వీటిని గురించి తెలిసినవారిలో శ్రేష్ఠుడు. 'తపస్స్వాధ్యాయనిరతమ్' విశేషణం ద్వారా వేదార్థశ్రవణం, 'వాగ్విదాం వరమ్' ద్వారా మననం, 'మునిపుంగవమ్' ద్వారా నిదిధ్యాసనం. నారద – నరులకి సంబంధించిన జ్ఞానం నారం. దాన్ని ఖండించేవాడు నారదుడు – నారం (జ్ఞానం) ప్రసాదించేవాడు కూడ. (మ.తీ) 'నర' అంటే పరమాత్మ. ఆ జ్ఞానాన్ని సర్వలోకాలు తిరుగుతూ అందించేవాడు నారదుడు. ప్రశస్తమైన తపస్సు కలవాడు తపస్వి. వల్మీకం నించి పుట్టడంచేత 'వాల్మీకి'. (గో.రా) తపస్వి – తపస్సు ద్వారా బ్రహ్మని తెలుసుకోవాలి కాబట్టి బ్రహ్మజ్ఞాని – నిర్వేదం కలవాడు – మోక్షాభిలాషి – శరణాగతి ధర్మం కలవాడున్నూ. భృగుపుత్రుడే అయినా తపస్సు కారణంగా పుట్టలు పెరగగా వరుణవర్షానికి పుట్ట పెరిగి బయటపడి 'వాల్మీకి' అయ్యాడు. బ్రహ్మవైవర్తపురాణం ఈ విషయాన్నే చెప్పింది. భృగువంశంలో పుట్టి భార్గవుడు, ప్రచేతసునికి పుట్టి ప్రాచేతసుడు, వల్మీకం కారణంగా వాల్మీకి. అసలు పేరు ఋక్షుడు. వాల్మీకినామం అతని తపస్సుకీ జ్ఞానశమదమాదులకీ సూచకం. ఇది బిరుదే. తపస్వీ – విద్వాంసుడూ బ్రహ్మనిష్ఠుడూ గురువూ అయిన పురుషుణ్ణి ప్రశ్నించాలి కాబట్టి వాల్మీకి ఆ నాలుగు లక్షణాలూ ఉన్న నారదుణ్ణి (4 విశేషణాలు నారదునికి) ఆశ్రయించాడు. పరికరాలంకారం. కావ్యలింగం. వస్తుధ్వని.

గ్రంథ ప్రారంభంలో 'తప'శ్శబ్దం మంగళప్రదం. 'త' కారం సౌఖ్యదాయకం – విఘ్ననాశకం కూడ. వర్ణాలన్నీ పంచభూతాత్మకాలే. త కారం 'జల'బీజం. అక్షరాలకి అధిపతులున్నారు. అచ్చులకి రవీ – 'క'వర్గానికి కుజుడూ–'చ'వర్గానికి శుక్రుడూ – 'ట' వర్గానికి బుధుడూ–'త'వర్గానికి గురుడూ – 'ప' వర్గానికి శనీ – యరలవసహళలకి చంద్రుడూ అధిపతులు. 'త' వర్ణం గురుగ్రహాధీనం. యగణంతో రామాయణం ప్రారంభమైంది. 'య' వాయుదేవతాకం. ఈ యుగంలో అందునా ప్రస్తుతం (అస్మిన్ సాంప్రతమ్) అంటున్న కారణంగా నృసింహాద్యవతారాల విషయం కాదని అర్థం. ఆశ్రితులతో అనుసంధానించడం గుణం. దాన్నే సౌశీల్యమంటారు. గుణిని బట్టి గుణాలకి గొప్పదనం కల్గిందిక్కడ. (మ.తీ) కన్పించనివేవో అవి గుణాలు. అలాంటి ప్రశస్త గుణవంతుదు ఎవరు? (గో.రా) వికారహేతువులున్నా తాను వికారం పొందకపోవడం ఎదుటివారికి వికారాన్ని కల్గించడం వీర్యం. అది కలవాడు 'వీర్యవాన్'. (మ.తీ) తాను గాయపడకుండా దెబ్బతినకుండా నష్టపోకుండా జయాన్ని సాధించడం వీర్యం. (గో.రా) లౌకిక, అలౌకిక ఉభయధర్మాలూ తెలిసినవాడు ధర్మజ్ఞుడు – (మ.తీ)సామాన్య విశేషధర్మాలు రెండూ తెలిసినవాడు కూడ. (గో.రా.) చిన్న ఉపకారాన్ని పెద్దగా భావించేవాడు కృతజ్ఞుడు. అపకారాన్ని గుర్తుంచుకోకపోవడం కూడ కృతజ్ఞతే. ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లోనైనా నిజం చెప్పడం–'సత్యవాక్యః'. (మ.తీ) చూసిందేదో దాన్ని దాచకుండా చెప్పడం. దృఢవ్రతః రెండుమాటలు లేకపోవడమనేది వ్రతం. (మ.తీ) తాను కష్టంలో ఉన్నా మాట తప్పకపోవడం రక్షించడం వ్రతం. పుట్టుకతో రెండో అంతరాత్మ లక్ష్మణుణ్ణీ – పెళ్లి కారణంగా (అర్థోవా ఏష ఆత్మనో యత్పత్నీ) తనలో సగమైన సీతనీ కూడ అవసరమైతే విడుస్తాననేది 'దృఢవ్రతం' (అపరాధం చేసినవాళ్ల విషయంలో కూడ ఎంతో కొంత హితాన్ని చేయడంకూడ) సమర్థః సర్వశాస్త్రజ్ఞుడూ సర్వకార్యసాధకుడూ (మ.తీ) లౌకికవ్యవహారాల్లో ప్రజల్ని ఆనందింపచేసే చాతుర్యం కలవాడు. ఏక ప్రియదర్శనః– ఒకసారి ఒక్కొకని దర్శనం

ప్రియంగా మరోమారు అప్రియంగా ఉండవచ్చు. రాముని విషయంలో అలా కాదు. ఎప్పటికప్పుడే కొత్తకొత్తగా ఉండే దర్శనం (మ.తీ) కామాధిక సౌందర్యం కలిగిఉండడం కాదు. ఎవరో ఒక్కరికే ప్రియాన్నిచ్చే దర్శనమూ కాదు (అందరికీను). ఆత్మవాన్ ధైర్యవంతుడు. జితక్రోధః కోపాన్ని ఓడించినవాడు – కోపమే కాదు పట్టుదలని కూడ.

**మ.తీ :–** అరిషడ్వర్గాలనీ జయించినవాడు, నింద, హింస చేయని వాడు. గుణాల్లో దోషాన్ని ఆరోపించడం అసూయ. అది లేనివాడు 'అనసూయకః' (మ.తీ) విద్య – ఐశ్వర్యాదుల్లో తనకంటె గొప్పదనాన్ని సహించకపోవడం అసూయ. ఎప్పుడూ చూడాలన్నంత చక్కని దేహకాంతి కలవాడు. 'ద్యుతిమాన్'. 'యస్య బిభ్యతి.....' శత్రువుల మీద కోపంతో ఉన్నప్పుడు ఆత్మీయులైన దేవతలకుకూడ భయాన్ని కల్గించేవాడు. ఏతత్ ఇలాంటివాడు పురుషుల్లో దుస్సాధ్యం కాబట్టి ఏ వస్తువైనా నరరూపంలో ఉందా?

అలౌకిక విషయాలని దర్శించేవాడు ఋషి. వాల్మీకినైన నేను ఋషిని, నువ్వు మహా ఋషి మహర్షివి. మహర్లోకపర్యంతం కృతకలోకం. జనోలోకపర్యంతం కృతకాకృతకం. సత్యలోకపర్యంతం అకృతకం. ఈ త్రిలోకాలూ తిరిగేవాడివి. కాబట్టి అడుగుతున్నాను. రామునిగా అవతరించిన విష్ణువే లోకంలో కొనియాడబడుతుంటే సర్వలోక సంచారి నారదుడు కూడ ఈయన్నే చెప్తాడా? లేదా? అని ప్రశ్నించడం దీని భావం. 'అహం బుద్ధ్వా'... రామవృత్తాంతం తెలియడం చేత మరచిన మేను ఉన్న నేను, నేనుగా మారి చెప్తాను. క్షణం ఆగు! ఒక్కొక్కరిలో ఒక్కొక్కటి కన్పిస్తోంది గాని అన్నీ ఉన్నవాడెవరా? అని క్షణం సందేహిస్తున్నాను. ఇలాంటి ప్రశ్నకి ఎవరూ అధికారి కాదు. వాల్మీకీ! మునివైన నీవే అర్హుడివి. ఇక్ష్వాకువే చిరకాలం రంగనాథుణ్ణి సేవించడం చేత ఆ వంశంలోనే రామజన్మ. రామః అందర్నీ గుణాలతో రమింప (ఆనందింప) జేసేవాడు – ఇతనిలో అందరూ ఆనందాన్ని పొందేవారు. యోగిజనం కూడ ఇతనిలో ఆనందాన్ని పొందేవారు (పరబ్రహ్మ). తాటక సుబాహు వాలివధలూ, విశ్వామిత్రయాగరక్షణ అహల్యాశాపవిమోచన శివధనుర్భంగ పరశురామగర్వభంగ సప్తసాలభేదన సేతుబంధనాదుల ద్వారా నారాయణుడే అని తెలియాలి. నియతాత్మా – కష్టానికి కుంగడం సుఖానికి పొంగడం లేనివాడు. (మ.తీ) మనసుని లోబరచుకున్నవాడు. ప్రభవః – వంశంలోని ఇటు అటు వారు రామజననం చేత తరించారు. ఇది 'భవం' (పుట్టడం)కాదు 'ప్ర'భవం. నియతాత్మా – అసాధారణ దివ్య మంగళవిగ్రహుడు. ద్యుతిమాన్ – మంత్రపుష్పం (మహానారాయణసూక్తం)లోని విద్యుల్లేఖలా ప్రకాశించేవాడు. వశీ – గుణాలచేత జనుల్ని వశపరచుకున్నవాడు. నీతిమాన్ – హద్దు కలవాడు. వాగ్మీ – వేదానికనుగుణంగా ప్రవర్తించేలా చెప్పి ఒప్పించగల మాటనేర్పరితనం కలవాడు. శ్రీమాన్ – కీర్తీ సంపదా అనే రెండూ కలవాడు.

**మ.తీ :–** బుద్ధిమాన్ – శుశ్రూష శ్రవణం గ్రహణం ధారణం ఊహ అపోహ తత్త్వజ్ఞానం కలిగి ఉన్నవాడు. 'విపులాంసః' సాముద్రికం ప్రకారం మహాపురుషునికుండాల్సిన భౌతిక లక్షణాలతో విశాలభుజాలున్నవాడు.

**మ.తీ :–** సులలాటః – నుదుటి మీద 4,3,2,1 రేఖలుంటే క్రమంగా 200, 100, 60, 20 సంవత్సరాల ఆయుష్యం.

**గో.రా :-** అర్ధచంద్రాకారలలాటం, సింహం/గజం/వ్యాఘ్రంలాటి నడక, “96” ఎత్తు, కనుబొమ్మలు, ముకుపుటాలు, కళ్లు, చెవులు, పెదవులు, చూచుకాలు, మోచేతులు, మణికట్టులు, మోకాళ్లు, వృషణాలు, కటి, హస్తపాదాలు, చీలమండలూ ఎవనికి సమదైర్ఘ్యం (కొలతలు)తో ఉంటే అతడు ‘భూపతే’ లక్ష్మీవాన్.

**(మ.తీ)** సాముద్రికశాస్త్రం ప్రకారం సర్వలక్షణాలూ ఉన్నవాడూ సీతారూపలక్ష్మి కలవాడున్నూ.

**యశస్వీ :-** (గో.రా) ఆశ్రితుల్ని రక్షించడమనే కీర్తి కలవాడు (మ.తీ) రావణ వధ – జటాయువుకి అడక్కుండానే ఉత్తమ లోకప్రదానం, జ్ఞానసంపన్నత కలవాడు సమాధిమాన్ – నిత్యం సమాధిస్థితికి పోగలవాడు.

**(గో.రా)** ఆశ్రితుల్ని రక్షించడమెలా? అనే చింత కలవాడు. ధాతా–ధరించి పోషించేవాడు. రక్షితా – తన రాజ్యప్రజల్నే సార్వభౌముడు రక్షిస్తాడు. అలా కాక సర్వలోక సర్వజీవ రక్షకుడు. (మ.తీ) లోకజనానికి అమంగళాన్ని తొలగించి శుభాలనిచ్చేవాడు. అలాగని అందరికీ ఇలా చెయ్యడు. ధర్మాన్ని రక్షించేవాళ్లని ధర్మబద్ధంగా రక్షించి ధర్మరక్షణని చేస్తాడు. ధర్మాన్ని గూర్చి చెప్పడంలో అంతా పండితులేనట. ఆచరణలో పామరులట. అలాంటివాడు కాదు. కొందరు లోకాన్ని రక్షిస్తూ ఆత్మీయుల్ని బాధిస్తారు. అలాంటివాడూ కాదు రాముడు. ధర్మస్య – ‘ధర్మ’ శబ్దానికి విల్లు అని అర్థం. వింటి ద్వారా ధర్మరక్షకుడు. తన యోగక్షేమాలని తానులా సర్వుల యోగక్షేమరక్షణమూ చేస్తాడు. ధర్మాదులైన విశేషాలు (విద్) తెలుసుకోదగింది వేదం. దానికి ఆరు అంగాలు 1.శిక్ష (అక్షరాలకున్న స్థానకరణ ప్రయత్నాలని చెప్తుంది. 2. వ్యాకరణం – సాధు అసాధు శబ్దాలని ఏరి పెట్టడం. 3. నిరుక్తం – ప్రతి పదానికీ తగిన వ్యుత్పత్తి చెప్తుంది. 4. జ్యోతిషం–ఆకాశంలోని జ్యోతిస్సు (నక్షత్రం – చంద్రుడూ........ఇలా)ల ద్వారా తెలిసే విషయాలు 5. ఛందః–పద్య (శ్లోక) రచనకి పనికొస్తుంది. 6. కల్పం – యాగం ఎలా చెయ్యాలో ఆ విశేషాలని చెప్పేది. ధనుర్వేదమేకాక, ఆయుర్వేదం (బాహటుడు) గాంధర్వవేదం (భరతముని) నీతివేదం (చాణక్యుడు)......ఇలా అన్ని వేదాలనీ శాస్త్రాలనీ రహస్యార్థాలతో చదివినవాడు. ప్రతిభానం – సరైన సమయంలో సరైన విషయం గుర్తుకు తెచ్చుకునేవాడు.

**మ.తీ :-** సర్వలోక ప్రియః – అన్ని లోకాలూ ఎవనికి ప్రియమో అతడు – మరియు సర్వలోకాలకీ ఇష్టుడున్నూ. సాధుః–అపకారులకుకూడ ఉపకారాన్ని చేసేవాడు. మృదు–మధురస్వభావి. అదీనాత్మా–గంభీర స్వభావం కలవాడు, దైన్యం లేనివాడు. విచక్షణః– యుక్తాయుక్తజ్ఞానాన్ని వినియోగించేవాడు.

**గో.రా :-** దేన్నైనా చెప్పగల శక్తి ఉన్నవాడు.

**మ.తీ :-** వైదిక లౌకిక క్రియలన్నిటా నేర్పరి. సర్వదా–అభిగతః.

**గో.రా :-** ఇది సమయం ఇది అసమయమనే భేదం లేక ఎప్పుడూ జనం చేత చుట్టబడి ‘రాముడు ఏం చెప్తాడా?’ అని ఎదురుచూసే అభిమానులున్నవాడు. నదులకీ సముద్రానికీ కాలనియమం లేనట్టు భగవత్సేవకీ (రామసేవకీ) కాలనియమం లేదు. సర్వసమః – జాతి గుణాది భేదరహితుడై అందరినీ ఒకేలా చూసేవాడు. జాబాలి వంటివాళ్లు నాస్తికవాదం చేసినా సముద్రంలా గంభీరుడు. సముద్రంలో రత్నాలున్నా ఎలా సముద్రుడు గంభీరుడై కన్పించనీయడో అలాంటి సద్గుణాలున్న గంభీరుడే రాముడు. (తన దైవత్వాన్ని ప్రకటించడు) వర్షం

నిరంతరం కురుస్తున్నా పర్వతం చలించనట్టు శోకహేతువులున్నా శోకించనివాడు. మరొకరిపోలిక లేని కారణంగా వీర్యంలో విష్ణువే (అనన్వయం). చంద్రునిలా, శోకానికి వ్యతిరేకదిశలో ఆహ్లాదకరుడు. తన విషయంలో అపరాధాన్ని సహిస్తాడు గాని తన ఆశ్రితుల విషయంలో అపకారాన్ని సహించడు. కాలాగ్నిసముడు. జాలి విషయంలో అచేతనమైన పృథివిలా ఎంత అపకారాన్నైనా లెక్కించడు. దయచూపిస్తాడు

**మ.తీ :-** అన్ని అపరాధాలనీ సహిస్తాడు భూదేవిలా. కుబేరునిలా ఎంత ఇచ్చినా తరగని ధనకోశం ఈయన సొత్తు. దశరథః – పది దిక్కులలో రథాలని పంపగల శక్తి ఉన్నవాడు. జ్యేష్ఠమ్ – సుతమ్ – పుట్టుకతోనే రాజ్యార్హుడైన వానిని (కేవలం జనులకీ మంత్రులకీ విలువనిచ్చి వాళ్లకి ఇష్టం చేద్దామనే కోరికతోనే) రాజు చేయదలిచాడు. యువకుడూ రాజూ యువరాజు (తండ్రి జీవించి ఉన్నప్పుడే) ఔతాడు. కేకయ దేశరాజు కైకయ. అతని కూతురు కైకయి.

**మ.తీ :-** కేకయ – అఞ్–యాదేశం – గుణాదివృద్ధులు – జీప్ –అలోపం. కైకేయీ అనేది సరి. 'కైకయీ' అనే పదాన్ని మాత్రం ఇక తప్పదంటూ ఒప్పుకోవాల్సిందే. పితుర్వచననిర్దేశాత్ – తల్లి తండ్రి కలిపి (పితరౌ) పితరులు. వాళ్లమాటే ఓ ఆదేశం(మ.తీ) తల్లిదండ్రుల మాటని పాటించడమే పుత్రధర్మం.

**(గో.రా)**లక్ష్మీ–అ+న కైంకర్య లక్ష్మీసంపన్నుడు లక్ష్మణుడు. దయిత (మనోహరురాలు) భార్య హృదయంలో నిరంతరం భరింపబడుతూ ఉండేది. దేవమాయా విష్ణువునే ఆశ్చర్యపరిచేంత శక్తి ఉన్న స్త్రీ. సౌందర్యపరాకాష్ఠ.

**(మ.తీ)** సుందోపసుందనాశనానికై తిలోత్తమలా, అమృత వినియోగకాలంలో స్త్రీయైన తనలా, ఒక పక్క అయోనిజగా పుట్టి దేవకార్యం కోసం ఆవిర్భవించిన స్త్రీ. చంద్రుణ్ణి దర్శించక రోహిణి ఉండలేదు. అలాంటిది సీత. అయోధ్యాపురవాసమే రామభక్తి హేతువు. అక్కడి వాళ్లే పౌరులు. శృంగి – నల్లజింకలయొక్క, బేర – కృత్రిమ ఆకారాలతో వంచించి యథార్థమైన నల్లజింకలని పట్టుకునే గ్రామం శృంగిబేరపురం.

**(మ.తీ)** తిలోత్తమలా వంచనకి పుట్టింది కాదు, దేవమాయ భగవత్సాహాయ్యానికై సహజశక్తి కలిగి పుట్టిన ఉత్తమురాలు. ఇప్పుడు పుట్టిన లేగదూడ మీది ఎక్కువవాత్సల్యంతో అంతకు ముందు పుట్టినదూడని కొద్దిగా వెనక్కి నెట్టడం 'గుహుడు – సుమంత్రు'డనే ఇద్దరి విషయంలో జరిగింది. గుహుణ్ణి కౌగిలించుకుని సుమంత్రుణ్ణి వెనక్కి పంపించేశాడు రాముడు. తే వనేన వనమ్ – తే – అవనేన – అన్యోన్యరక్షణతో, పితృవాక్పాలన హేతువుతో నదీః – ఏ ఉపపదమూ లేకపోతే 'నది' అంటే గంగానదే. బహువచనం పూజార్థకం. ముందు నదిని దాటి పిమ్మట వనానికెళ్లారు. (అగ్నిని వెలిగించాడన్నట్లు). 'గంగ–యమున–మందాకిని' మూటికీ పేరు 'నదీః'. వాజం అంటే సంతానం. సంతానాన్ని భరించేవాడు (అందర్నీ తన సంతానంగా భావించేవాడు. భరత్ – వాజుడు – భరద్వాజుడు 'వాజం' అంటే 'రేతస్సు' నష్టపరచకుండా ధరించేవాడు భరద్వాజుడు (నిత్య బ్రహ్మచారి). చిత్రమైన ఆశ్చర్యాన్ని కలిగించే కూటాలు (శిఖరాలు) కలది చిత్రకూటం. ఆవసథమ్ – పర్ణాలతో కప్పబడిన శాలాగృహం (ఏకశేష సమాసం) గానాన్ని ధరించేవాడు గంధర్వుడు (సీతారామలక్ష్మణులు). దేవ గంధర్వులు, మనుష్యలోక సంచారులైన గంధర్వులకంటె ఆనందాన్నిస్తారు. మహాబలః–రాజ్యాన్ని భరించగల దిట్ట.

**మ.తీ :-** బలం లేక కాదు – తమ్ముడు గదా! అని 'వ'ద్దన్నాడు. వీర్యం – అంతశ్శత్రువులైన రాగాదుల్ని జయించడం. న ఐచ్ఛత్ అనకుండా 'చ' శబ్దాన్ని కలపడం – తండ్రి జీవించినప్పుడు అంగీకరించలేదనీ, పితృమరణానంతరం ఎట్టకేలకు వన్యాలకి రాజుగా అంగీకరించాడని చెప్పడం కోసం. రాజ్యం చేసేవి రామపాదుకలే తాను పరిచారకుడిననేది భరతాభిప్రాయం. పునః పునః – రామవిరహాన్ని సర్వథా భరించలేనితనాన్ని చెప్తోంది. పాదౌ – పాదుకలే.

**మ.తీ :-** అని పాదుకే అహల్య స్పృశించిన పాదాలని న్యాసంగా ఇచ్చాడు. అస్య–రాజ్యాన్ని పూర్తిగా ఇచ్చివేయడం (త్యాగోద్దేశం సంప్రదానం కాదు కాబట్టి షష్ఠీవిభక్తి వాడకం, 38. శ్రీమాన్–ప్రతిజ్ఞాభంగం కాలేదనే ఆనందంతో కన్పించిన ముఖకాంతి కలవాడు. సత్యసంధః – భరతుడు నిర్బంధించినా ప్రతిజ్ఞ తప్పనివాడు. జితేంద్రియః– రాజ్యం భోగం రాజ్యభోగం అనే వాటిలో ఆసక్తి లేనివాడు. 40. దండకాన్ –దండకుడనే రాజు పట్టణం దండకం. శుక్రశాపం వల్ల అరణ్యంగా మారింది. శేషి అయిన రాముని విషయంలో కైంకర్యవిధానం ప్రపన్నుని విషయంలో భగవత్పరతంత్రత అయోధ్యాకాండ కథలో విశేషం.

**మ.తీ :-** దండకాన్ – ఈ అరణ్యంలో ఇంకా ఎన్నో వనాలు కలిసున్నాయి. అందుకే బహువచనం. 41. రాజీవలోచనః – అనుకున్న మాట ప్రకారం వనానికొచ్చాననే ఆనందంతో విప్పారిన కళ్లు కలవాడు

**మ.తీ :-** మహావనంలోకి వచ్చిన కారణంగా రాక్షసయుద్ధం చేయబోతాననే ఆనందం కల కళ్లు కలవాడు. చ – అగస్త్యభ్రాతరమ్ – వాక్యంలో సంధి అక్కర్లేదు. విరాధుణ్ణి చంపి శరభంగదర్శనం చేయడమనేది 'వట్టి చేతులతో గురుదర్శనం చేయరా'దని 42. వచనాత్ – అగస్త్యుని మాట ఆజ్ఞతో గ్రహించాడు. అగస్త్యుడు స్పృశించలేదు ఖడ్గాన్ని. ఇంద్రమ్ ఇంద్రుడే విష్ణువు. అతనికి (తనకి) సంబంధించిన ఆయుధం తనకే లభించిందని ఆనందం (పరమప్రీతః) 43. అసుర రక్షసామ్ – రాక్షసులై అసువులని (ప్రాణాలని) తీసేవాళ్లు అసురరక్షస్సులు (కబంధుడు....) రాక్షసజాతిలో పుట్టి ప్రాణాలని తీయని వాళ్లూ ఉన్నారు విభీషణాదులు. అగ్ని కల్పానామ్ – దాదాపు అగ్నితో సమానులు. శూర్పణఖా – వ్రేళ్లని వెనక్కి తిప్పినప్పుడు చేటల్లా కన్పించే గోళ్లు కలది. కామరూపిణీ – లో భావానికి అనుగుణమైన రూపాన్ని అప్పటికప్పుడు ధరించగలది.

'జనస్థాన' నివాసినామ్ – రాక్షసులకి గట్టి చోటు జనస్థానం (అలాంటిచోటులోని 14 వేలమంది) నిహతాని – నిశ్శేషంగా ఒకేవేటులో (ఒకే యుద్ధకాలంలో చంపబడ్డారు. రావణః – పెద్దగా అరిచేవాడూ/శోకంతో భయంతో అరిపించేవాడూను (రౌతి రావయతీతి వా) – అపవాహ్య నృపాత్మజౌ – రాముణ్ణీ, రాముని కంఠధ్వనితో పోలిన కంఠధ్వనికల లక్ష్మణుణ్ణీ దూరంగా తొలగేలా చేసి భార్యాం రామస్య – కాలచోదితుడైన కారణంగా (మృత్యు చోదితుడు)– రాముణ్ణి ఏనాడూ విడువక భార్యగా ఉన్న సీతని ఎత్తుకుపోయాడు రావణుడు. జహార .......హత్వా – నోరు తెరుచుకుని నిద్రపోయాడంటే ముందు నిద్రపోవడం తరువాత నోరు తెరుచుకుని ఉండడం జరిగేటట్టే, ఇక్కడ కూడ సీతని అపహరించి జటాయువధ జరిగిందంటే జటాయువధానంతరం సీతాపహరణమని భావన. ఇక్కడ మాయ సీత మాత్రమే అపహరింపబడి రామకథ చివర్లో అగ్నిపరీక్షా కాలంలో యథార్థసీత పైకొచ్చిందనీ లోకాపవాదం వల్ల నిజసీతే మళ్లీ విడువబడిందనీ అర్థం చేసుకోవాలి. మైథిలీమ్.....రాఘవః ఈ సీతాపహరణమనేది

మిథిలా రఘువంశాలు రెంటికీ అవమానకరం అని చెప్పడానికే మైథిలీ రాఘవపదాలున్నాయి. విష్ణ్వవతారమైతే రామునికి దుఃఖమెందుకు? ఎవరికి కష్టం వచ్చినా తీవ్రంగా బాధపడడమనేది రామలక్షణం. 54.

**మ.తీ :–** ఆకులేంద్రియః – శోకపరవశమైన దశేంద్రియాలూ కలవాడు. దగ్ధ్వా జటాయుషమ్ – తన కోసం ప్రాణాలనిచ్చిన జటాయువు వలననైన శోకం సీతాపహరణశోకం కంటె గొప్పది. జటాయువు తన తండ్రికి స్నేహితుడు. శేషభూతుడై శేషికార్యానికి స్వశరీరాన్ని త్యాగం చేసినవాడు కూడ. విష్ణుకార్యంకోసం శరీరత్యాగం చేసినవానికి వైకుంఠప్రాప్తీ తత్కారణంగా ముక్తీ లభిస్తాయని అగ్నినృసింహపురాణాలు. యుద్ధంలో పలాయనం లేకపోవడం, పక్షికి యజ్ఞాధికారం లేకపోవడం, ఏ యజ్ఞదానాదులకి ఫలం ముక్తియో ఆ ముక్తి అనేది జటాయువుకి రామానుగ్రహకారణంగా సాధ్యమయింది కాబట్టే రాముడు జటాయువుకి దహనమూ అనంతర సంస్కారాలూ చేశాడు. నన్ను మనిషిగానే భావిస్తా'ననే రాముని అమానుష దైవకృత్యం ఈ ముక్తిదానంలో తెలుస్తోందిగా! అన వీలులేదు. 'సత్యేన లోకాన్ జయతి' అని కదా వచనం. ఉదరంలో నిక్షిప్తం చేయబడిన తల కలవాడు కబంధుడు. సీతని అన్వేషిస్తుంటే ఇతని దర్శనం అమృతాన్వేషణంలో కాలకూటంలాంటిది. కబంధుణ్ణి దహించిన కారణంగా వాడు స్వర్గాన్ని పొందాడు.

**మ.తీ :–** కబంధుడు స్వర్గానికి వెళ్లేందుకు యోగ్యమైన గంధర్వరూపాన్ని పొందాడు. శబరీమ్ – క్షత్రియులకి వైశ్యస్త్రీవల్ల పుట్టిన వాళ్లు శబరులు. తేనె అమ్మకం వృత్తి. ఈ 'శబరి' గురుశుశ్రూషాపరురాలూ, ధర్మాచరణ శీలురాలూ, అతిథిసత్కార ధర్మాన్ని తెలిసినది కూడ. అందుకే ఈమె 'శ్రమణి' – అంటే – సంన్యాసాశ్రమ స్వీకారం చేసిన పరివ్రాజిక. పూజిత స్సమ్యక్ – అరవైవేల సంవత్సరాలు ఎదురుచూసి చూసి ఉన్న దశరథుని భోజనం కంటె ఈమె అతిథి పూజ నచ్చింది రామునికి. ఎంతో శ్రమించి తెచ్చి వండిన పదార్థాలకంటె అప్పుడు తెచ్చిన వండబడని ఫలాలు నచ్చాయి రామునికి శరభంగమహర్షి దగ్గర్నించి అగస్త్యుని వరకూ మహర్షులు చేసింది పూజ మాత్రమే. శబరి చేసినది సమ్యక్ పూజ.

**మ.తీ :–** తురీయాశ్రమాన్ని పొందినదీ, మోక్షమనే స్థితికి తగిన ఉపచారంతో కూడినదీ కాబట్టి శబరీ పూజ సమ్యక్పూజ. అర్ఘ్యం దగ్గర్నుంచి ఫలప్రదానం వరకు లోపం లేక చేసిన పూజ ఇది. హనుమతా – ప్రశస్తమైన హనువులు (స్పష్టమైన ఉచ్చారణనీయగల దౌడలు) కలవానిచేత వానరేణ – రావణునిలా మారువేషంలో కాక స్వవేషంతో వచ్చిన వానరునిచేత, 'ఏం చెయ్యాలా?' అని దిక్కు తోచనివేళ విజయచిహ్నాలు కన్పిస్తున్న ముఖంతో ఉన్న వానరునిచేత (పురుషకారలాభం) సఖ్యమ్– హీనజాతి మనుష్యుడైన గుహునితో సఖ్యం సౌశీల్యం. శబరి ఉన్నచోటుకి పోయి నిషాద స్త్రీ అయిన ఆమెతో స్నేహం అతిసౌశీల్యం. వానరజాతి సుగ్రీవుని వద్దకి వెళ్లి స్నేహాన్ని కోరడం అత్యంత సౌశీల్యం, వానితో సఖ్యమే కాక అతని దుఃఖాన్ని వింటూ కన్నీళ్లని విడవడం అత్యంతాత్యంత సౌశీల్యం. అగ్నిసాక్షికమ్ – అగ్నిదేవుడు సాక్షి. ఆయన చూస్తూండగా చేసుకున్న సఖ్యం. తానొక్కడే సర్వకార్యాలనీ నిర్వహించుకోగలిగినా లోకరీతి ప్రకారం సుగ్రీవసహాయాన్ని కోరాడు రాముడు. వైరానుకథనమ్ – ప్రశ్నకి సరైన సమాధానం చెప్తూ విషయాన్ని (చెప్పాలనే అనుకూలబుద్ధితో) చెప్పడం నిత్యమ్ – రాముడు కన్పించిన దగ్గర్నించి చెట్లని కొట్టే సంఘటన వరకూ ఎప్పుడూ అనుమానిస్తూనే ఉండడం (సూర్యుడు ఉదయించి అస్తమించేలోగా

పడమరసముద్రంనుంచి తూర్పుకీ దక్షిణం నించి ఉత్తరానికీ ఎగరగలిగి ఎగురుతూండే వాలిని వధించగలడా? అని సంశయం.

**మ.తీ :–** ఉత్ స్మయిత్వా – వేలికొనతో పిశాచ దానవయక్షరాక్షసులందర్నీ చంపగల శౌర్యం ఉన్న రాముడు దుందుభి కళేబరపరీక్షని వినీ – అడవికోతి కాబట్టి ఇలా ప్రశ్నించిందనీ – జ్ఞానులైనవాళ్లే తనని చూసి భ్రాంతి చెందుతుంటే కోతి ఇలా సంశయించడం సరే అనుకుంటూ అదోలా నవ్వాడు రాముడు. గుహామ్ – పర్వతమధ్యంలో గుహలా ఉన్న కిష్కింధను అనుమాన్య – నిరపరాధినైన నన్ను రాముడెందుకు వధిస్తా?డనే ఓదార్పు ధైర్యమూ వాలికోసం రెండో బాణాన్ని గాని ప్రయోగిస్తే అతను ఎదురుబడతాడు. ఆ కారణంగా వధించడం దుర్లభమని రాముని భావన. తోరణమ్ – బహిర్ద్వారం. 77.

**మ.తీ :–** బ్రహ్మాస్త్రం పంచఘటికా కాలపర్యంతం బంధిస్తుంది. వెంటనే తానే విడిపోతుందనేది వరం. మహాకపిః – ఎందర్నో రాక్షసుల్ని తాను గాయపడక వధించాడు కాబట్టి మామూలు 'కపి' కాదు. దృష్ట్వా సీతా – ఆత్రుతతో ఎదురుచూస్తున్న రామునికి 'సీత కన్పించింది. – జీవించే ఉం'దని తెలియడం కోసం 'దృష్టా' అనేది ముందుగా వాడబడింది. క్షోభయామాస – పాతాలం వరకూ కల్లోలపరిచాడు. 81. అను ప్రాప్య పరాం వ్రీడామ్ – సీతని పొంది (ప్రాప్య), అను – ఆ మీదట పరాం వ్రీడామ్ రావణలంకలో చిరకాలమున్న స్త్రీని ఎలా పరిగ్రహించాలి? అనే సిగ్గును.

**మ.తీ :–** లోకాపవాదశంకతో సిగ్గును. సదేవర్షిగణమ్ –

**మ.తీ :–** దేవగణం ఇంద్రాదులు. ఋషిగణం విశ్వామిత్రాదులు. సచరాచరమ్. చర జీవించడం తినడం ప్రధానమైనవి. ఐరావతం మొదలైన పశుజాతులు ఇతర పక్షిజాతులున్నూ. విభీషణమ్ – శత్రువులని భయపెట్టే శక్తి ఉన్నవానిని. అభిషిచ్య – ప్రధానంగా మోక్షాన్నిచ్చి లౌకికంగా రాజ్యంలో అభిషేకించి విజ్వరః – భరతుడు రాజ్యాన్ని ఎలా తిరస్కరించాడో అలా విభీషణుడు కూడ రాజ్యాన్ని కాదంటే ఎలాగా? అని జ్వరుడూ, విభీషణుడు అంగీకరించాక విజ్వరుడూను. యుద్ధంలో నాగపాశబద్ధుడైనప్పుడు విభీషణునికి పట్టం కట్టాను, రాజ్యాన్ని ఇప్పించని పక్షంలో అసత్య ప్రతిజ్ఞుడనౌతానని జ్వరుడూ, పాశవిముక్తుడయ్యాక విజ్వరుడున్నూ. 'హనూ' అనే ఊకారాంతశబ్దం ఉంది. దానిమీది ద్వితీయాంతపదం హనూమంతమ్.. నిరామయః అరోగః – శరీరరోగం ఆమయం. అది లేకపోవడం నిరామయం.

**మ.తీ :–** ఆమయమంటే మనోవ్యాధి. రోగమంటే శరీరవ్యాధి. దుర్భిక్షమంటే అసమృద్ధి. అవిధవాః + (వివిధ) అనేక భర్తలు కల స్త్రీలు వి + ధవలు (వ్యభిచారిణులు) భర్తృహీనులైన కౌసల్యాదులు తల్లులైనందున, వృద్ధురాళ్లైనందున, విధవలు కారు. జంతు మరణం రోగ క్షుద్బాధలు – తస్కర (దొంగ) భయాలు లేకపోవడం క్రమంగా ఆధి దైవిక ఆధ్యాత్మిక – ఆధి భౌతిక నివృత్తుల కుదాహరణాలు. 92. బాధలు లేవని చెప్పి సుఖాలని వివరిస్తున్నాడు. అశ్వమేధశతైః – రావణవధ కారణంగా జరిగిన పాపం తొలగడానికి ఈ యాగాలు. ఈ యజ్ఞం క్షత్రియుడు మాత్రమే చేయదగినది. ప్రతికృతి (భార్య విగ్రహం) తో యజ్ఞనిర్వహణం సరైనదే.

**మ.తీ :–** 'శత' మనే పదం అనేకమనే అర్థాన్ని చెప్తుంది. శతకవ్యాఖ్య ఈ యజ్ఞాన్ని బ్రహ్మలోకప్రాప్తికి హేతువని పేర్కొంది. అయితే అది సరికాదు. భగవదవతారాలకి పుణ్యపాపప్రసక్తి సరికాదు. లోకానికి ఇది సరైన యజ్ఞమని ఉపదేశించడానికి ఈ యజ్ఞం గూర్చి చెప్పడం. రామాయణమ్ రాముడు దేని ద్వారా తెలియబడతాడో పొందవీలౌతాడో అది, రాముడు దేని ద్వారా ప్రతిపాదింపబడుతున్నాడో అది కూడ. పఠన్ – శాస్త్రోక్తనియమం లేక చదివినా, ఒక కొంత చదివిఉన్నా వాడికి ఎనలేని ప్రతిభాపాండిత్యాలు అబ్బుతాయి. ఇదే తీరుగా భూమి లేకున్నా ఒక కొంత భూమి కలవాడైనా రామాయణపఠనం వల్ల భూమిపతి ఔతాడు. పఠనమే కాదు శ్రవణం వల్ల కూడ ఉత్తమత్వం సాధ్యమే.

## రెండవ సర్గము

1. వక్తృవైలక్షణ్యం ప్రబంధవైలక్షణ్యం ప్రతిపాద్యవైలక్షణ్యమనే మూటిలో వక్తృవైలక్షణ్యం చెప్పబడుతోంది. దేవర్షిః–దేవుడూ ఋషీ అయినవాడూ, ధర్మాత్మా – ధర్మమందే ఆత్మా బుద్ధి కలవాడూ, అభ్యనుజ్ఞాతః యథావిధిగా పూజింపబడ్డాక అనుమతించబడినవాడూ

**మ.తీ :–** నీ ఇష్టాన్ని బట్టి సుఖంగా విహరించవచ్చునని అనుమతించబడినవాడు. ప్రసన్నాంబు అడుగున బురద ఉన్నా స్వచ్ఛజలం ఉండవచ్చు. బురద లేకున్నా స్వచ్ఛజలం ఉండవచ్చు. సన్మనుష్యమనస్సు ఇలాంటిది మాత్రం కాదు.

**మ.తీ :–** కామాది దోష రాహిత్య కారణంగానూ, నిత్య ప్రసన్నత కారణంగానూ ప్రసన్నాంబువులతో సన్మనుష్యమనసుకి సామ్యం. 6. ఇదమేవ – మధ్యాహ్నస్నానకాలం దాటుతోంది కాబట్టీ గంగాసమీపంలో ఉంది కాబట్టీ ఈ తమసలోనే – ఇప్పుడే – బురదలేని కారణం ప్రకారం గానూ – స్నానం చేద్దాం. 8. అభ్యాశే – సమీపంలో చారు నిస్వనమ్ – రతికాలిక స్వరం కారణంగా మనోహర ధ్వని కలది.

**మ.తీ :–** పక్షి అయినా క్రౌంచశబ్దానికి పుంలింగత ఋషి ఆలోచనానుగుణం. 9.

**మ.తీ :–** వైరనిలయః – అపకారం చేయని ప్రాణుల విషయంలోనూ అకారణ వైరం కలిగి ఉండడం. పాపనిశ్చయః – రతికాలంలో కూడ చంపడం కారణంగానూ. సర్వ జంతువులూ పక్షులూ తనకి శత్రువులే అనే సహజభావం కారణంగానూ పుమాంసమ్ – జంటలో అవయవమైన వానిని. నిశామ్య – చూచి నిషాదుడా! కామమోహితమిథునం నుండి ఒక అవయవాన్ని చంపావో ఆ కారణంగా ప్రతిష్ఠని శాశ్వతంగా పొందకుము! ఇది శాపం కాదు మంగళాశాసనమే. మా (లక్ష్మి) ని+సాద (ఎవనివద్ద నిత్యం ఉంటుందో) అలాంటి శ్రీహరీ! క్రౌంచమిథునమైన రావణమందోదరీ దంపతినుండి సీతావిషయంలో కామమోహితుడైన రావణుణ్ణి చంపిన కారణంగా శాశ్వత విజయాన్ని సాధించు! ఇది మంగళప్రదమైన ఇష్ట దైవ ప్రార్థన శ్లోకమని చెప్పాలి. మానిషాద = 'లక్ష్మీ భర్తా!' అనేది సీతావివాహపర్యంతం కథ ఉన్న బాలకాండనీ, ప్రతిష్ఠాం త్వ మగమః = పితృవాక్పరిపాలన కథ ఉన్న అయోధ్యాకాండనీ, శాశ్వతీస్సమాః = ఋషులకు చేసిన ప్రతిజ్ఞా నిర్వహణకై అనేక సంవత్సరాలు అరణ్యంలో తిరిగిన ఆరణ్యకాండనీ, క్రౌంచమిథునాత్ అల్పప్రాణులైన తారా వాలి దంపతులలో సుగ్రీవభార్య

రుమని అపహరించిన వాలిని చంపిన కిష్కింధాకాండ కథనీ, క్రౌంచపక్షుల్లాగా ఒకరికొకరు దుఃఖించిన సుందరకాండ కథనీ, సీతావిషయంలో కామపీడితుడైన రావణవధ కారణంగా యుద్ధకాండ కథనీ, ఋషిపత్నీ దర్శనాభిలాష కారణంగా ఉత్తరకాండ కథనీ చెప్తోంది ఈ శ్లోకంలోని ప్రతిపదమూ. మనుష్యులు పశుపక్ష్యాదుల్ని మాంసాహారం కోసం చంపడం తప్పు కాదని రాముడే వాలివధకాలంలో అన్నాడు. అయితే ఇక్కడి పక్షివధ మాత్రం రతికాలంలో జరగడం వల్ల తప్పే అనేది ముని ఆశయం. అందుకే శాపం.

రాబోయే కథని సూచించడమనే పద్ధతిని 'కావ్యార్థసూచన' మంటారు. 'అకర్దమమ్' అనే మాట ద్వారా సముద్రం సేతువూ, 'అభ్యాశే' అనే మాట ద్వారా ఆ సముద్రతీరంలో మందోదరితో కలిసి ఉండే రావణుడూ, 'చారునిస్వనమ్' అనే మాట ద్వారా రమ్యవీణానినాదం. 'క్రౌంచ మిథున' పదం ద్వారా రావణదంపతి, 'పాపనిశ్చయః' పదం ద్వారా సీతాపహర్త అయిన రావణుడూ, 'వైరనిలయః' పదం ద్వారా హిరణ్యకశిపు రావణ – శిశుపాల రూపంగా జన్మత్రయశత్రుత్వం, 'నిషాద' పదం ద్వారా సర్వ జగాలూ ఏ విష్ణువులో లీనమైపోతాయో ఆ శ్రీహరీ, భార్యాపదం ద్వారా మందోదరీ, 'ద్విజ' పదం ద్వారా పులస్త్య బ్రహ్మ, 'జఘాన' ద్వారా రావణ వధ సూచింపబడ్డాయి.

**తని శ్లోకీ :–** అకర్దమమ్ (గోదావరి జలం) అభ్యాశే (సమీపంలోని పంచవటి) క్రౌంచమిథునం (సీతారామదంపతి) అని తెలుస్తాయి. మరో అర్థం. రావణుడా! భార్యాసహితుడివై ఒకచోట ఉంటూ సాంసారిక సుఖాన్ని అనుభవించనివాడివి నువ్వు. నిత్యం ఆయనతో సన్నిహితంగా ఉండేది సీత. భర్తకి దూరంగా ఉండాల్సిన ఈ జీవితం కంటె మరణమే శ్రేయమనుకున్నది ఆమె. ఇంకొక అర్థం.

**మ.తీ :–** రావణుడా! సీత ఎలా తన భర్తని నీ కారణంగా వీడిందో అలా నువ్వూ నీ భార్యకి దూరం అయిపోదువు గాక! ఇక పద్మపురాణంలో పార్వతీపరమేశ్వరసంభాషణలో రాముడే 'భృగుమహర్షి శాపకారణంగా సీతని విడుస్తున్నాను తప్ప లోకనింద కారణం కా' దన్నట్లు స్పష్టంగా ఉంది. 17.

**మ.తీ :–** చింతయన్ – ఈ క్రౌంచకారణంగా వచ్చిన 'మానిషాద'ని శ్లోకమని నామకరణం చేయాలని మహర్షి నిశ్చయించాడు. తంత్రితో వాద్యాలని చేర్చి పాడేందుకు వీలుగా ప్రతిపాదమూ ఎనిమిదక్షరాలతో ఉంది. శ్లోకః – ఇది యశస్సునిచ్చునట్టి దగుగాక! శ్లోకపదానికి కీర్తికూడ ఒక అర్థమే. 20. అభిషేకమ్ – ఒక పరిమాణం మట్టితో శిరస్సు, రెంటితో నాభిపైభాగం, నాలుగింటితో నాభికింది భాగం, ఆరిటితో పాదాలనీ తోముకోవాలి. స్నానానికి వెళ్లేప్పుడు మట్టినీ, పుష్పఅక్షత తిలలనీ, దర్భ గంధాన్నీ, గోమయాన్నీ వెంట తీసుకెళ్లాలి. స్నానం చేసాక వారుణమంత్రాలని పఠించాలి. నారాయణస్మరణం ఓంకారంతో కూడిన ఆదిత్యస్మరణం ఆ మీదట ముమ్మారు మునగడం ఆ మీదట ఋక్ యజుస్సామమంత్రాలతో తద్రూపుడైన ఆదిత్యుణ్ణి సేవించాలి. 24. సహసా ఉత్థాయ – తన కంటె వృద్ధులొచ్చిన వేళ వయసు తక్కువవాళ్ల ప్రాణాలు పైకి వెళ్లబోతాయి. లేచి నమస్కరించి వాటిని తిరిగి తెచ్చుకోవాలి. (ఆయుఃక్షీణతని తొలగింపజేసుకోవాలి) 26. ప్రణమ్య విధివత్ – మనస్సు బుద్ధి అభిమానాలతో నేలమీద శరీరాన్నుంచి తాబేలులా తలని ముందుకు వంచి పాదాలని మడిచి నమస్కరించి (మనోబుద్ధ్యహంకారాలు(3) పాదాలు (2) శిరస్సు(1) చేతులు (2)తో సాష్టాంగంగా భావించి) గురువుకి ఎదురుగా కూర్చోవాలి. ఇది ప్రణామవిధానం 29. ప్రహసన్ – ఈ క్రౌంచవధ, శ్లోకాగమనం, శ్రీరామాయణ రచన పూర్వక భగవదనుగ్రహాన్ని వాల్మీకి గుర్తించలేకపోతున్నాడని అర్థవంతంగా నవ్విన జాలితో కూడిన నవ్వు.

**మ.తీ :–** నా ఆజ్ఞకారణంగా తనలోకి సరస్వతి ప్రవేశించిందని వాల్మీకి తెలియలేకపోతున్నాడని నవ్విన చిరునవ్వు. 31. కురు త్వమ్ – సరస్సు అనర్గలప్రవాహరూపమైన సర్వతోముఖత్వం నీకుంది. కారణం సరస్వతి నీలో ఉంది కాబట్టి. రసభావ అలంకార ధ్వని విశేషాలన్నింటితో (వేల జన్మల తపోనుష్ఠానకారణంగా వచ్చిన జ్ఞానంతో నిండినవాడవు కాబట్టి రామావతార రహస్యం తెలిసిన నువ్వు) నువ్వుమాత్రమే ఈ రచన చేయగలవు.

**మ.తీ :–** శాంతస్వభావం కలిగిన ఋషినైన నాకు ఈ తీరుకోపం దాని మీద శాపం...వంటివనుచితం కదా! అని అనుకోకుండా బ్రహ్మ 'మచ్ఛందాత్' (నా కారణంగానే) ఇదంతా జరిగిందని ఓదార్చాడు వాల్మీకిని. ధీరస్య – బుద్ధిని ప్రేరేపించేది ధీరత. 36. యావత్...... తావత్– రామకథసాగినంత కాలం వాల్మీకీ! నీకీర్తి నిలబడుతుంది.

**మ.తీ :–** సర్వలోకాల్లోనూ అడ్డులేక సంచరిస్తూ మీదట ముక్తిని పొందుతావు. శపించినా క్రోధవశుడివే అయినా అధోగమనం లేదు నీకు. అందరికంటె ఉత్తమలోకాలని పొందుతావు. 39. అను వ్యాహరణాత్ – శోకం వచ్చిన మీదట అనడం బట్టి శోకం శ్లోకంగా అయింది. ఇయం జాతా – మా నిషాద శ్లోకం లాగా ఇలా అర్థవంతమైన శ్లోకాలతో కావ్యమంతా నింపాలనే బుద్ధి పుట్టింది.

**మ.తీ :–** మరణించిన క్రౌంచం ఆలంబనం, పట్టరాని కోపం కల్గడం అనుభావం, శాపం వ్యభిచారి, శోకం స్థాయి, కరుణం రసం 43. దశశిరసశ్చ వధమ్ రావణవధ ఉన్న యుద్ధకాండ వరకే కాక (చ) ఉత్తరకాండ కూడ.

**మ.తీ :–** భారతానికి హరివంశంలా దీనికి ఉత్తరకాండ.

## మూడవ సర్గము

2.ఉపస్పృశ్య – ఆచమించి 4.సంప్రపశ్యతి – బ్రహ్మ ఇచ్చిన వరప్రసాద శక్తి కారణంగా ఉన్నదున్నట్లు యోగమార్గం ద్వారా చూడగలడు. 5.

**మ.తీ :–** తత్ సర్వం చ – ఉత్తరకాండ కథ కూడ. స్వప్నదర్శనం లాంటిది కాదు. యథార్థదర్శనమే 10.సుమహత్ – దశరథుని తపోబలం ద్వారా పుట్టడం యాగవిధి, విష్ణ్వవతారం కావడం వీర్యమ్ – తాటక సుబాహువధ మారీచుణ్ణి కొట్టడం తర్వాతికాలంలో చంపడం.

**మ.తీ :–** తాను గాయపడకుండా ఎదుటివారినోడించడం 26. ప్రాయోపవేశనమ్ – ప్రాయమంటే మరణం. దానికోసం పడి ఉండడం ఆమరణదీక్ష.

**మ.తీ :–** 32. లంకాదాహాభిగర్జనమ్ – లంకని దహించిన కారణంగా అక్కడి వాళ్ల ఆక్రందన – లేదా – లంకాదహనకాలంలో హనుమద్గర్జనం 38. అనాగతమ్ – రాబోయే ఉత్తరకాండలో బ్రాహ్మణపుత్ర జీవనం – అశ్వమేధం యత్కించిత్ – సీతాపరిత్యాగానికి ముందరి కథ చాల పెద్దది. తరువాతి కథ ఎంతో చిన్నది.

**మ.తీ :–** పై వ్యాఖ్యా కర్తతో సమానమే.

## నాలుగవ సర్గము

1. భగవాన్ – బ్రహ్మప్రసాద కారణంగా దివ్యజ్ఞానాన్ని పొందినవాడు. 'ప్రాప్తరాజ్యస్య' అని ఉన్నందున రావణవధానంతరం రామరాజ్యకాలంలో రామాయణరచన జరిగింది.

**మ.తీ :–** 2. క్రమంగా శ్లోకసంఖ్య బాలకాండ 2280–అయోధ్య 4415 అరణ్య 2732 – కిష్కింధ 2620 – సుందర 3006 యుద్ధ 5990 – ఉత్తర 3277 మొత్తమ్మీద 24 వేలకి దాటడానిక్కారణం త్రిష్టుప్ జగతి మొదలైన ఛందస్సుల్లో ఉన్న అక్షరాల ఎక్కువదనమే. అన్ని కాండల్లోనూ రామపరతత్త్వాన్ని గూర్చి చెప్పబడి ఉన్నా కోసల జనులందరికీ రామునితో సహ ఉత్తరలోకప్రాప్తి కల్గిన కారణంగా చివరిది ఉత్తరకాండ అయింది. కతకవ్యాఖ్య మాత్రం శ్లోక సర్గల సంఖ్య ఎక్కువగా ఉండడానికి కారణం ఉత్తరకాండలోని శ్లోకాల్లో ప్రక్షిప్తాలు ఎక్కువ అంది.

**గో.రా :–** సర్గల సంఖ్య బాలకాండ 77, అయోధ్య 119, అరణ్య 75, కిష్కింధ 67, సుందర 68, యుద్ధ 131, ఉత్తర 110, మొదటి ఆరు కాండల సర్గసంఖ్య 500 అనేది మహర్షి అభిప్రాయం. సంకల్పదశలో 50 సర్గలూ 24 వేల శ్లోకాలూ అని మహర్షి భావించినా (కర్తు ముద్యతః) రచనాదశలో పెరిగి ఉండవచ్చు. ఇది దోషం కాబోదు. వరుసగా వేయి శ్లోకాలూ చివరిశ్లోకాలని ప్రతి వేయిటికీ పరిశీలిస్తే మొదటి వెయ్యవశ్లోకం 'స తేన పరమాస్త్రేణ –––(బాల. 30 సర్గ) 2000వ శ్లోకం విశ్వామిత్రో మహాతేజాః (బాల. 63) సర్గ. 3000 – చతురశ్వోరథః ... (అ. 14) 4000 వర్తతే చోత్తమామ్. (44) 5000 – ద్వారేణ వైజయంతేన (71) 6000 – ఉటజే రామమా సీనమ్. (99) 7000–తే వయమ్. (ఆరణ్య 12) 8000 మమ భర్తా మహాతేజాః (ఆరణ్య 47) 9000– తతః పరమ సంతుష్టః ...(కి4) 10,000 నరేంద్రసూనుర్నరదేవపుత్రమ్ (31) 11,000– తతో రావణ నీతాయాః... సుందర. ప్రారంభం–12,000– తతస్తస్య నగస్యాగ్రే(27) .... 13,000–నావమాన్యో భవద్భిశ్చ (సుందర. 46) – 14,000 – సుందరసమాప్తి. 15,000–రక్షోగుణ.....(యుద్ధ 28) 16,000– ప్రదర్శనం చ (50) 17,000 – కుంభకర్ణం హతమ్ .....(66) 18,000 – మరణాంతాని వైరాణి......(112) 19,000 – యుద్ధసమాప్తి 20,000 – తతః ప్రచోదయన్ సూతః (ఉత్తర 22) – 21000 – 40వ సర్గ పూర్తి. 22000 తత్రైనాం విజనే దేశే (45) 23000 – బ్రాహ్మణస్య చ ధర్మేణ (67) రామాయణసమాప్తితో 24000'.

**మ.తీ :–** 2. ప్రయుంజీయాత్ – పఠించగల సమర్థుడౌతాడు.

**గో.రా :–** తన వాగ్వశంలోనికి తెచ్చుకుంటాడు. 4. కు'శీ'లవౌ – కుశలవులు. ఈ కారం వైదికచ్ఛందస్సు ప్రకారం సాధువు. రాముడు రాజ్యం చేస్తుండగా రామాయణరచనం అని తొలుత చెప్పబడింది. ఇప్పుడు కుశీలవుల వృత్తాంతం. సీత రామునిచేత వాల్మీకి ఆశ్రమానికి పంపబడడమంతా తెలిసి చేసినదే. పంపబడడాన్నే లోకం 'విడవడం' అని అపోహపడింది. 7. వేదోపబృంహార్థాయ – వేదంలో ఉన్న అనేక శాఖలకి తదనుగుణంగా అర్థాన్ని వివరించి ప్రతిపాదించడానికి.

**మ.తీ :–** వేదతాత్పర్యరూపమైన విషయార్థాన్ని ప్రతిపాదించి ప్రామాణ్యాన్ని నిరూపించడానికి రామః ఆనందింపచేసేవాడూ, ఆనందపడేవాడూ రాముడు. సర్వజనులూ ఎవనియందానందాన్ని పొందుతారో అతడూ రాముడే. ఉపాయం పురుషకారమనే రెంటిలో ఉపాయాన్ని భారతం చెప్తే, పురుషకారాన్ని రామాయణం చెప్పింది.

**మ.తీ :-** రామచరిత ఉన్న గ్రంథానికి పౌలస్త్యవధ మనే పేరుని పెట్టడం కృష్ణచరితవర్ణనమున్న కావ్యానికి శిశుపాలవధ మన్నట్లే. విష్ణ్వవతరణం సీతాపరిణయం బీజం, కైకావరాలద్వారా అభిషేకం చెడి వనవాసగమనం బిందువు, సుగ్రీవవృత్తాంతం పతాక, విభీషణవృత్తాంతం ప్రకరి, రావణవధ ఫలయోగం. పౌలస్త్యవధకి ఇవి అంగాలు. రమకి సంబంధించింది రామం. అతని చరితం రామాయణం. ఆ కారణంగా లక్ష్మీరూపమైన సీత చరిత్ర కాబట్టి 'సీతాయా శ్చరితం' అనవచ్చు 11. మధురస్వరభాషిణౌ – మాటాడితేనే మధుర కంఠస్వరముంటే, ఇక పాడితే చెప్పాలా? పైగా ఇద్దరికీ ఒకే కంఠస్వరం ఉంటే ఆ మాధుర్యం ఊహకి అందుతుందా? 13. తత్త్వజ్ఞౌ – పాఠశుద్ధి తెలిసినవాళ్లు.

**మ.తీ :-** కావ్యవిషయంలో గానవిషయంలో 18. సుష్ఠు – కవి అభిప్రాయాన్ని గమనించి మనసులో నింపుకుని (పాడారు). 19. తపఃశ్లాఘ్యైః – శ్లాఘ్య తపస్సు కలవాళ్ల చేత 30. మహానుభావం చరితమ్ రాక్షసుల్ని చంపిన రామునికంటే తనని బాధించిన రాక్షసస్త్రీలని చంపవద్దన్న సీతమ్మ చరిత్రం కలది – ఏ తప్పున్నా రక్షిస్తానన్న రామునికంటె తప్పు చేయనివారెవరుంటారన్న సీతాచరిత్రం కలది – తాను స్వయంగా కష్టాన్ని పడుతూ దేవతాస్త్రీల బాధలని తొలగిస్తూ నాకంటె గట్టిగా ఆశ్రితరక్షణాన్ని చేసిన సీతాచరిత్రం కలది. తండ్రి మీది ఇష్టంతో తప్పుచేసిన నా విషయంలో తల్లిలా వాత్సల్యబుద్ధితో నన్ను మించిన సీతాచరిత్రం కలది.

**తని శ్లోకీ :-** మనన శీలురు మునులు – అసాధారణావయవ సంస్థానవిశేషాలతో కూడుకున్నవాళ్లు – పైగా వీళ్లు గాయకులు – అందునా అతి బాలురు – మునిత్వం ఎక్కడ? రాజ్యార్హత ఎక్కడ? మహాతపస్వి తత్త్వ విధాన మెక్కడ? నాయకత్వ మెక్కడ? పైగా గాయకులై తపస్సుని ఆపనివారా? వంశపరంపరాగత గానవిశేషం ద్వారా అహంకారవిధానం లేక ఉండడం........ఇదంతా ఈశ్వరప్రసాదసిద్ధికారణమే. ఇది కూడ మహానుభావమే.

**మ.తీ :-** భూతికరమ్ – ఇహ – పరలోక – అభ్యుదయకరం. లక్ష్మణుని దృష్టిలో భూతికరమ్మంటే భుక్తి ముక్తిదమని అర్థం.

## అయిదవ సర్గము

వేదప్రతిపాదితమైన పరబ్రహ్మ స్వరూపమే రాముడు. అతని కథని వివరించడమంటే వేదోపబృంహణమే. వేదాంతవేద్యుడైన పరబ్రహ్మం రాముడనే విషయం ఉపక్రమ ఉపసంహారాలద్వారా స్పష్టంగా తెలుస్తుంది మనకి. 'కో న్వస్మి?'న్నంటూ వాల్మీకి వేసిన ప్రశ్నకి 'ఇక్ష్వాకువంశప్రభవుడైన రాము'డంటూ చెప్పడం ఆరంభంలో ఉంటే, భవాన్నారాయణో దేవః.....అంటూ చివర్లో కన్పిస్తుంది. "వేదాహమేతం పురుషమ్మ"నే వేదవాక్యానికి అహం వేద్మి మహాత్మానమ్మని చెప్పిన విశ్వామిత్రవచనం సాక్ష్యం. బాలకాండలో 'అవ్యక్తప్రభవో బ్రహ్మ....' అనే వాక్యం, అయోధ్యాకాండలోని 'స హి దేవైరుదీర్ణస్య', అరణ్యంలోని 'అప్రమేయం హి తత్తేజః'........, కిష్కింధలోని 'నివాసవృక్ష స్సాధూనామ్'.........., సుందరంలోని 'బ్రహ్మా స్వయంభూః', యుద్ధంలో 'హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే.........వ్యక్తమేష మహాయోగీ.......భవాన్నారాయణో దేవః..........వంటి'వన్నీ రాముడు పరబ్రహ్మ మని చెప్పేందుకు దర్పణాలు. బాలకాండలో ఇక్కడ పుట్టడానికి కారణాలు అయోధ్యలో ఆయన ఉండడం, అరణ్యంలో మోక్షప్రదానం, కిష్కింధలో ఆయన గుణసంపత్తి, సుందరలో రాక్షసవధాసక్తి, యుద్ధంలో వేదాంతవేద్యునిగా రాముణ్ణి చిత్రీకరించిన తీరు,

ఉత్తరంలో సృష్టించవలసిన అవసరం మొదలైన అన్నింటిద్వారా రాముడే పరబ్రహ్మమనీ, విష్ణు అవతారమనీ నిరూపింపబడింది. రామకథలో రావణవధని చూపాలనే దానికంటె కైంకర్యపు గొప్పదనాన్ని చెప్పడమే గ్రంథ లక్ష్యం ఒక తీరుగా ఆలోచిస్తే. అహం సర్వం కరిష్యామి (నేనంతా చూసుకుంటాను.....) అని లక్ష్మణుడనడం, భరతుడు పాదుకాస్వీకారపు వంకతో కైంకర్యం, దండకారణ్యవాసులందరికీ వాగ్రూపకైంకర్యం, సుగ్రీవ విభీషణాదులక్కూడ కైంకర్యఫలలాభం, ఇక ఆంజనేయుడు తన ప్రాణాలకి తెగించి కైంకర్యం చేయడం వంటి వెన్నో కన్పిస్తాయి. ఇక ప్రపత్తి విషయానికొస్తే విభీషణుడు, తన సర్వరాజ్యబంధుమిత్రాదుల్ని విడిచి వచ్చానన్నాడు. సముద్రుని మీద అస్త్రాన్ని వేయవలసివచ్చినప్పుడు ప్రపత్తి చేసి తనలోని అసురుల్ని ధ్వంసం చేయించుకున్నాడు. శరణాగతివిధానం కాకవృత్తాంతంలో విభీషణవృత్తాంతంలోనూ కన్పిస్తుంది. ఇక పారతంత్ర్య విషయానికొస్తే భరతుడు సభామధ్యంలో విలపించడం వంటివి ఉదాహర్యాలు. ఇక వేదాంతవిషయానికొస్తే లంక అనేదే శరీరం రావణ కుంభకర్ణులు అహంకార మమకారాలు. ఇంద్రజిత్తూ మొదలైన వాళ్లు కామక్రోధాదులు. విభీషణుడు వివేకం. లంకలో కట్టబడ్డ సీత చేతన. లంక వంటి శరీరాన్ని ఆచార్యుడైన హనుమంతుడు దగ్ధం చేసి ఆ లంకలో కట్టబడ్డ సీత చేతనని ఉద్ధరించడం భగవత్సాధ్యమని అంతరార్థం. రామాయణం దీర్ఘశరణాగతిని నిరూపించే గ్రంథం. బాలకాండద్వారా శ్రీమత్ పదం అయోధ్య ద్వారా నారాయణ శబ్దార్థం, అరణ్యం ద్వారా చరణ శబ్దార్థం, కిష్కింధ ద్వారా అలాగే సుందరం ద్వారా శరణ శబ్దార్థం, యుద్ధకాండ ద్వారా 'ప్రపద్యే' అనే శబ్దానికర్థం, ఉత్తరకాండ ద్వారా ముక్తిఫలకీర్తనం తెలుస్తాయి. బాలకాండ ద్వారా ప్రపంచపు పుట్టుకకి ఆధారమైన సవితృ శబ్దార్థం (తత్ సవితుః), అయోధ్య ద్వారా అలాగే కిష్కింధ ద్వారా వరేణ్య శబ్దార్థం, అరణ్యం ద్వారా భర్గశబ్దార్థం, సుందరం ద్వారా దేవశబ్దార్థం, యుద్ధం ద్వారా ధీమహి శబ్దార్థం, ఉత్తరం ద్వారా 'ధియో యో నః ప్రచోదయా'త్తనే మూడో పాదపు అర్థం వివరించబడి రామాయణం సదా జపింపబడవలసిందని నిరూపించేందుకు గాయత్రీ మంత్రార్థాన్ని ఇలా నిక్షిప్తం చేశాడు వాల్మీకి. అలా చేయించాడు పరమాత్మ. చార్వాక బౌద్ధాది వేదవిరుద్ధ నాస్తిక స్పర్శ చేయరాదని జాబాలి లక్ష్మణవాదం ద్వారా తెలుస్తుంది. ఆచార్యుని ద్వారానే విద్యని పొందాలి. అది మాత్రమే యథార్థమూ, కీర్తికరమూ అవుతుందనే వేదవాక్యం ప్రకారం నారదుడు (రాబోతున్నాడు) ఆచార్యుడు ఇక్కడ.

**మ.తీ :-** 2. షష్టిః పుత్రసహస్రాణి – 60చే గుణించబడిన వేయి పుత్రులు (60,000) 3. ఇక్ష్వాకూణామ్ –ఇక్ష్వాకువు ఒక్కడే అయినా వాళ్లవంశంలోని అందరికీ ఇక్ష్వాకుత్వం వస్తుంది, కాబట్టి బహువచనం 4. సర్వం నిఖిలమ్ – సర్వ రామాయణాన్నీ ఏ మాత్రపు తక్కువ దృష్టీ లేకుండా (అన్యూనమ్) అసూయలేక శ్రద్ధతో వినాల్సిందే. ఏదో రాసుకుని దాన్ని చదివేసుకోరాదు. బ్రహ్మనుండి పుట్టింది కాబట్టి అసూయ విడిచి భక్తితో వినాల్సిందే. ముందు కోసల దానికి సరయువు – ఆ నదీతీరం – అక్కడ అయోధ్య.

**మ.తీ :-** సూతమాగధసంబాధామ్ – క్షత్రియుని ద్వారా కల్గిన విప్రసుతులు సూతులు. రాజుని మేల్కొలిపే వాళ్లు మాగధులు. సూతులు ఎక్కువగా సారథ్యంలో ఉంటారు.

**మ.తీ :-** మాగధులంటే వంశపూర్వవృత్తాంతాన్నీ, రాజపరాక్రమాలనీ వివరిస్తూండే వాళ్లు. సంబాధ అంటే నిరంతర కథనమని భావం. 16. సర్వరత్న సమాకీర్ణామ్ పచ్చగా ఉండేది. ఎఱ్ఱనిది రోహితకం లేదా కెంపు,

పద్మరాగం ఎఱుపు మాత్రమే, పగడం, స్త్రీ సంకేతంగా వజ్రం, ఇంద్రనీలం పూర్తి నీలంగా, వైడూర్యం గండుబిల్లి, కురువిందాలు పెద్దగాలేవు (కురువిందాస్తు కల్మాషాః) శంఖం ఆకారంలో మాణిక్యం లభిస్తుంది. 20. శబ్దవేధ్యమ్ – శబ్దమే లక్ష్యంగా పెట్టుకుని వధించడం, (పరస్పరదర్శనం లేకుండా బాణాన్ని విడిచి చంపడం) లఘు హస్తాః అస్త్ర పాండిత్యం కలవాళ్లు 22. మహారథైః – తననీ సారథినీ అశ్వాలనీ కూడా రక్షించుకుంటూ యుద్ధం చేసేవాళ్ల చేత (నిండింది పురం). 23. అగ్నిమద్భిః యజ్ఞాలు చేసిన వారి చేత.

## ఆరవ సర్గము

అతిరథః – ఎందరో మహారథుల్ని ఓడించగల దిట్ట. వశీ – అందర్నీ తన వశంలో ఉంచుకున్న ఉంచుకోగల శక్తి ఉన్నవాడు. ధనైః స్వైః స్వైః తమ తమ ఆశ్రమాలకి తగినంతగా నిర్వహించేందుకు వీలైన ధనాన్ని మాత్రమే స్వీకరిస్తూ పరధనంలో ఇష్టపడనివాళ్లు అలాటివారిచేత 7. అల్పసన్నిచయః తక్కువ పరిమాణంలో ధనమున్నవాడు 8. కదర్యః పుత్రుణ్ణీ భార్యనీ లోభబుద్ధితో బాధించేవాడు

**మ.తీ :–** తనకోసమై వీళ్లని మోసగించే అతిలోభి. నాస్తికః – పరలోకం లేదని భావించేవాడు.

**మ.తీ :–** అమృష్టః–నిర్మలత లేని శరీరం కలవాడు. 12. క్షుద్రః – అల్పమైన విద్య, ఐశ్వర్యాలు కలవాడు. లెక్కలోకి రానివాడు. నిర్వృత్తసంకరః – పరక్షేత్రంలో బీజనిక్షేపాన్ని చేసినవాడు 13. అనృతకః – అనృతం కాయతి (వక్తి) అబద్ధాన్నే మాట్లాడేవాడు.

**మ.తీ :–** సంయతాః – సంకుచితులు. తనకూ తన భార్యకూ సరిపడేంత మాత్రమే స్వీకరించేవాడు. 15. అసహస్రదః–ఎక్కువగా విద్యనీ, ధనాన్నీ దానం చేయనివాడు. క్షిప్తచిత్తః–వ్యాకుల మనస్కుడు. అశ్రీమాన్ – కాంతి లేనివాడు. వ్యథితః–వ్యాధి మొదలైన వాటిచేత పీడింపబడేవాడు. 19. క్షత్రం బ్రహ్మముఖమ్–క్షత్రియజాతి మొత్తం బ్రాహ్మణుణ్ణి ప్రధానుణ్ణిగా చేసుకుని ఉండేది. (దేవతాపూజ చతుర్థవర్ణంలో తాంత్రికమంత్రాలతోనూ, అతిథిపూజ హిరణ్య (ధన) దానంతోనూ ఔతూండేది. బ్రాహ్మణులు అధ్యయన విషయంలో శౌర్యంతోనూ వాదవిషయంలో పరాక్రమంతోనూ ఉండేవారు) 22. నదీ సింధుదేశంలో పుట్టినవాటిచేత 24. పుండరీకమనే పేరుగల దిగ్గజం మహాపద్మం. వరుణునికి (పశ్చిమదిక్) సంబంధించినది వరుణం. యముని (దక్షిణదిక్)దిగ్గజం వామనం. ఏనుగులు 'భద్ర–మంద్ర–మృగ' జాతులు మూటితో ప్రసిద్ధం. వీటి సాంకర్యం వల్ల భద్రమంద్ర – మంద్రమృగ – భద్రమృగ జాతులు ఏర్పడ్డాయి. అంగప్రత్యంగాలలో దార్ఢ్య పవిత్రత భద్రగజలక్షణం. పెద్దగా ఉండడం ఎత్తూ లావులతో కన్పించడం మంద్రగజలక్షణం. శరీరదీర్ఘత ప్రత్యంగ దీర్ఘత మృగగజలక్షణం.

**మ.తీ :–** 5. హస్తాలు (మూరలు) అడుగుల ఎత్తు 14. అడుగుల బారు 16. అడుగుల చుట్టుకొలత ఉన్న గజం మృగం. దీనికంటె అన్ని కొలతల్లోనూ హస్తం (2 అడుగులు) పెద్దది మంద్రం. మంద్రం కంటె అన్నిటా 4. అడుగులు పెద్దది భద్రం.

## ఏడవ సర్గము

**మ.తీ :–** 1. ఇంగితజ్ఞాః – ముఖాన్ని బట్టీ ఇతర లక్షణాలని బట్టీ మాటల్లేకుండానే ఎదుటివాళ్ల అభిప్రాయాన్ని గమనించగలవాళ్లు. 2. శుచయః – ఏ విధంగానూ స్వామిద్రోహ చింత లేనివాళ్లు. 5. హ్రీమంతః – చెడ్డపని

విషయంలో సిగ్గు కలవాళ్లు. 6. ప్రణిహితాః – రాజకార్యాల్లో అప్రమత్తులు. 11. అహింసంతః – అపరాధం చేయని వాళ్ల ధనాన్ని అపహరించనివారై 12. **(మ.తీ)** సుతీక్ష్ణదండాః – దేశాన్ని కాలాన్నీ, వయస్సునీ శక్తినీ బట్టి దండించే లక్షణం ఉన్నవాళ్లు 16. శ్లక్ష్ణాః–పౌరుష్యం లేనివాళ్లు. (మ.తీ) 21. నాధ్యగచ్ఛత్ – తెలియనివాడయ్యెను.

## ఎనిమిదవ సర్గము

16. బ్రహ్మరాక్షసాః – (మ.తీ) యజ్ఞాల్లో చేసిన మంత్ర క్రియాలోపాలకారణంగా రాక్షసులైన బ్రాహ్మణులు (రాక్షసజాతిలో పుట్టి రాక్షసత్వాన్ని పొందినవారు) ఛిద్రం – అపరాధం లేదా రంధ్రం.

## తొమ్మిదవ సర్గము

7. వ్యతిక్రమాత్ – ధర్మోల్లంఘనం వలన 5. బ్రహ్మచర్యమనేది రెండు విధాలు. వివాహపూర్వం స్త్రీ స్పర్శ లేకుండడం వలన, వివాహానంతరం నియమిత కాలాల్లో భార్యాసంగమం వలన. 12. మహీపాల ఋశ్యశృంగమ్– ఇక్కడ గుణసంధి రావాల్సి ఉన్నా ప్రకృతిభావసంధి జరిగింది ఋత్యకః 19వ శ్లోకం కూడ తొమ్మిదవ సర్గంలో చూపబడినా 'అథ.......' అంటూ ప్రారంభమౌతోంది కాబట్టి ఇది లేఖకుని దోషంలా అన్పిస్తోంది.

## పదవ సర్గము

14. పితా విభండకః మహాభూతతటాక మనే పేరున్న సరస్సులో ఆచమిస్తున్న విభండకుడు ఊర్వశిని చూసి రేతఃస్ఖలనాన్ని చేస్తే దాన్ని ఓ మృగి నీటితో సహా తాగి గర్భిణియై పుత్రుణ్ణి కన్నది. ఋశ్యమృగానికుండే కొమ్ముతో సమానమైన కొమ్ము కలవాడైన కారణంగా నేను ఋశ్యశృంగుడినయ్యాననీ, మా తండ్రి విభండకుడనీ భావం.

**మ.తీ :–** 19. మా చిరమ్ – కోపిష్ఠియైన తండ్రి రాకుండా (ఆలస్యం చేయకుండా) హర్షసమన్వితాః – బాల బ్రహ్మచారి ఆలింగనాన్ని పొందినందుకూ, తమ కార్యం నెరవేరిన కారణంగానూ ఆనందపడ్డారు. 26. నిన్యుః – నావ నెక్కించారు. 29. ప్రహ్వాః

**మ.తీ :–** అంజలిస్తూ వినమ్రుడై

**మ.తీ :–** 31. ఏవమ్ – ఇలా వారస్త్రీల స్పర్శసుఖాన్ని పొందడం రావడం చేసిన కారణంగా ఋశ్యశృంగుని తపస్సు నష్టం కాలేదా? కాలేదు. 1. ఋశ్యశృంగునికి స్త్రీల గురించిన జ్ఞానమే లేదు. 'స్త్రీలు కాబట్టి.........' అనే ఉద్దేశ్యంతో కౌగిలించుకోలేదు. బ్రహ్మచర్యంతో బ్రహ్మజ్ఞానాన్ని ఉపాసిస్తున్న మహామునికి ఈ స్పర్శ దోషం కానే కాదు. రాబోయే శుభప్రయోజనం తెలిసిన కారణంగానే తండ్రి శపించలేదు. ఈ చేష్ట శుభాన్ని కల్గించబోతోంది. కాబట్టి దోషాన్ని అంటించేది కాదు.

## పదకొండవ సర్గము

సర్వపాపాలనీ బ్రహ్మహత్యాదోషముంటే దాన్ని కూడ తొలగించగలది అశ్వమేధం. రాజసార్వభౌముడు అశ్వమేధాన్ని విధిగా చేయాలని స్మృతి చెప్తోంది.

## పన్నెండవ సర్గము

1. వసంతే సమనుప్రాప్తే – మొదటగా ఋశ్యశృంగుణ్ణి వసంతకాలం వచ్చీరావడంతోటే బ్రహ్మగా వరించాడు. ఇక ఋత్విగ్వరణంలో ఉద్గాత, హెూత, అధ్వర్యువులు మిగిలారు. అమావాస్యనాడు ఈ అందరికీ ఋత్విగ్వరణని చేసారు. వైశాఖ పూర్ణిమనాడు పశువుకోసం ప్రయత్నం. ఆ మీదటి అమావాస్యనాడు ఉద్గాతని వరించారు. అలా మిగిలినవారినీ వరించి యథాశాస్త్రంగా అశ్వమేధాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని గమనించిన దశరథుడు తప్పక పుత్రుల్ని పొందగలనని ప్రకటించాడు. ముంజగడ్డితో పేనబడిన 12 మూరల పరిమాణం కల ఒక తాడూ (రశన), వర్షపు నీరు– నూతినీరు– నిలబడ్డనీరు– ప్రవాహపు నీరూ– ప్రత్యేక పాత్రలలో ఉంచి మరికొందరూ, సమర్థులైన నాలుగువందల యోధులు రక్షణ కోసం, సశాస్త్రీయంగా జరగడంకోసం నలుగురు ఋత్విక్కులూ, నాలుగువర్ణాల నించీ ఇష్టులైన నూర్గురు చొప్పున తోడుచేసి గుఱ్ఱాన్ని విడిచారు. సరిగ్గా సంవత్సరకాలం ఉండే ఈ దీక్ష, వసంతం రాబోతోందనగానే ముగింపబడుతోంది (దీక్షాప్రవృత్తి).

## పదమూడవ సర్గము

19. పూర్వ సంబంధినం జ్ఞాత్వా – యోగబలం కారణంగానూ, నిత్యం యజ్ఞయాగాదుల్ని చేసేవాడు కాబట్టీ – రాబోయే విషయాన్ని ముందుగా గ్రహించగల జనకుణ్ణి తొలుతగా ఆహ్వానించవలసిందన్నాడు దశరథుడు. 29. అవజ్ఞయా లీలయా – ఈ యాగం వల్ల పిల్లలు పుడతారా? అని అవమానిస్తూ అలాగే ఇదేదో వినోదభరితంగా ఉందనే బుద్ధితో విలాసంగానూ బహూకరించకూడదు. అది బంధువులకే కావచ్చు. ఋత్విజులకి కావచ్చు అగ్నిహెూత్రునికే కావచ్చు అలా నిరాదరణ పనికిరాదు సరికాదు. 35. శుభే దివస నక్షత్రే – శుభమైన సోమ బుధవారాల్లో రోహిణీ మొదలైన నక్షత్రాల్లో. పాల్గున అమావాస్య నాడు అగ్నిశాలాప్రవేశం అశ్వమేధారంభమున్నూ.

## పద్నాల్గవ సర్గము

2. విధివత్ – శుద్ధపాడ్యమి నుండి ఏడు రోజులపాటు రోజుకి మూడు వైశ్వదేవాలచొప్పున 21 హెూమాలూ చివరికి పూర్ణాహుతీ చేశారు. సోమలతని సన్నెకల్లు (రాయి) మీద ఉంచి దక్షిణాన బ్రహ్మ, పడమరన అధ్వర్యుడు, ఉత్తరాన హెూత, తూర్పున ఉద్గాత నిలబడి రాతితో బాగా దంచాలి లేదా చితక గొట్టాలి.

**మ.తీ :–** 10. న తృప్తిః–ఎంత తింటున్నా ఆ ఆహారరుచి కారణంగా ఇంకా తినాలనే ఆనందం ఆత్రుతతో తృప్తి లేదు... ప్రజకి.

**మ.తీ :–** ఇందరు ఇంత ఆనందంగా తింటున్నా దశరథునికి తృప్తిగా అన్పించలేదు. 'ఇంకా ఇంకా తినా'లనేది ఆయన ఆశ. 16. హేతువాదాన్ – యాగాంతంలో జరుగుతున్న మంత్రభాగంలో హెూత బ్రహ్మనీ, బ్రహ్మ హెూతనీ ప్రశ్నలడుగుతూ సమాధానాలు రాబట్టుకుంటూ (ఈ వైదిక కర్మ ఇక్కడే ఎందుకు ఇలాగే ఎందుకు వంటి ప్రశ్నలు) చేసుకునే హేతువు కోసమైన వాదాలు 22. అరత్ని –

**మ.తీ :–** 24. అంగుళాలు 25. శుల్బ కర్మణి– సన్నని ఒంటిపొర తాడు శుల్బం. (యజ్ఞవేదీ నిర్మాణం మొత్తం శుల్బంతోనే జరుగుతుంది కాబట్టి) ఈ 'శుల్బకర్మతో'అని అర్థం. 29. శామిత్రే – అశ్వమేధంలో ఉన్న

గుఱ్ఱం, ఇంకా జలచరాలైన కూర్మాదులు, ఇవి కాక ఇంకా పశువులూ....ఇలా ఇన్నింటినీ మంత్రాలతో వధించడాన్ని 'విశసనం' అంటారు. ఆ విశసనకర్మకి 'శామిత్రం' అని పేరు. ఆ కర్మలో32 ధర్మకామ్యయా–చంపబడిన గుఱ్ఱం వద్ద రాత్రి రాత్రంతా శవం పక్కన ఉన్నాననే అసహ్యాన్ని ఏ మాత్రమూ పొందనట్టి కౌసల్య చేత మహిష్యా పరివృత్యా వావాతామ్–రాజుకి పట్టపురాణి మహిషి. దాసస్త్రీ వంటిది పరివృత్తి. భోగం కోసం ఉన్న స్త్రీత వావాత. ఇలాంటి ముగ్గురి చేతా (కౌసల్య సుమిత్ర కైకమ్మ.)

**మ.తీ :–** రాజుకున్న ముగ్గురు భార్యల్లో ఉత్తమ క్షత్రియస్త్రీ మహిషి. మధ్యమజాతి వావాత (వైశ్య) అధమ జాతి స్త్రీ పరివృత్తి (చతుర్థ) రాత్రి రాత్రంతా మృతాశ్వం పక్కనే ఉండాలి మహిషి. 'అంబే అంబాల్యంబికే' .....అంటే జపిస్తూ ఉంటే తెల్లని వస్త్రంతో అధ్వర్యుడు గుఱ్ఱాన్నీ మహిషినీ కప్పేస్తాడు 'వృషావాగ్ం రేతో ధారేత్ దధాతు....' అనే మంత్రాలని చదువుతూ యజమానుణ్ణి రాత్రంతా మెలకువతో

**మ.తీ :–** 6.ఉంచుతారు. నిజానికి పుత్రకామేష్టి వల్లనే పుత్రులు పుడతారు. అయినా తపోరతుడూ వైశ్యుడైన శ్రమణుణ్ణి బాణంతో కొట్టి వధించిన కారణంగానూ, ఆ పుత్రమరణానికి తట్టుకోలేక మరణించిన వాని మాతాపితరుల పరోక్షవధ కారణంగానూ

**గో.రా :–** 39. బ్రహ్మవధతో సమానమైన పాపం దశరథునికి వచ్చింది. దానికి ప్రాయశ్చిత్తంగా అశ్వమేధం జరిగిందిక్కడ. 'చయనం – యూపోఛ్ఛ్రాయం – పశునియోజనం – వపాహోమం – చతుష్టోమం – సవన' మనేది సరైన వరస. లేఖకప్రమాదమో లేక వాల్మీకిమహర్షే క్రమం పాటించక ఇలా రాసాడో మరి తెలియదు.

## పదిహేనవ సర్గము

1. మేధావీ – ఋశ్యశృంగుడు (అశ్వమేధం వల్ల బ్రహ్మహత్యాదోషం తొలగి పుత్రోత్పత్తికి ఏం చేయాలా? అని క్షణం పాటు పరమేశ్వరుణ్ణి గూర్చి ఆలోచించి అంతలోనే తెలివి వచ్చినవాడయ్యాడు. పుత్రకామేష్టిని చేయించాలనేది తగినపని. దీని కారణంగా పరమేశ్వరునికి పుత్రులుగా పుట్టే అవకాశం వస్తుంది గదా! 15. ఉపయాతః విష్ణుః – అన్ని చోట్లా వ్యాప్తమైన ఆయన సర్వాయుధాలతో (శ్రీరంగనాయకుడే వచ్చాడు. పూర్వమే అక్కడున్నా ఇప్పుడు దివ్యమంగళరూపంతో వచ్చాడు. ఆశ్రితునికి రక్ష చెయ్యాలనే ఉద్దేశ్యంతో వచ్చాడు. విష్ణువు వచ్చాడనగానే శివుడూ మొదలైన దేవతలకి రావణుడు అవమానిస్తాడనే భయం అలాగే ఇంద్రాదులక్కూడా రావణభయం తొలిగిపోయింది.

**మ.తీ :–** భూ భారాన్ని సదా ఉద్ధరిస్తూండేవాడు. 18. చతుర్విధమ్ – రావణ రావణి (ఇంద్రజిత్) లవణ గంధర్వుల్ని చంపడానికి నలుగురుగా అయి (పుట్టు). హ్రీ శ్రీ కీర్తులు దక్షకన్యలు.

**మ.తీ :–** పాంచజన్యం భరతుడు. అనంతుడు లక్ష్మణుడు. సుదర్శనం శత్రుఘ్నుడు. ఇన్నిటితో కూడిన రాముడు విష్ణువు. పాంచజన్యం శబ్దమాత్రం చేత సకలజగత్తునీ వ్యాకులపరిచేలా భగవంతుడు హూంకరిస్తే చాలు ప్రపంచమంతా తాననుకున్నట్టుగా అయిపోతుంది. 29. రోచయామాస–తండ్రిగా దశరథుణ్ణి చేసుకోవాలను కున్నాడు. పుట్టినవాళ్లకి మరణం ఉంటుందో తప్పదో అలా కాక మరణమే లేనివాడు పుట్టాలని భావించాడు. ప్రతి

తండ్రీ తనకి పుత్రుడు పుట్టినప్పుడే తండ్రి అన్పించుకుంటాడు. 32. తమేవ – రావణుణ్ణి మాత్రమే (విభీషణుణ్ణి కాదు) ఆగచ్ఛ తిరిగి వైకుంఠానికి రమ్మని భావం. కాబట్టి వైకుంఠం నించి అవతారంగా దిగి రావడం కన్పిస్తోందిక్కడ. అంతరిక్షంకంటె పైనున్న లోకాన్ని స్వర్గమన్నారు. అందుకే బ్రహ్మాదిలోకాల్లో కూడ స్వర్గపదాన్ని ప్రయోగిస్తూంటారు. స్వర్గమనేది పరమపద స్థానం. బ్రహ్మాదిలోకాల కంటే వేరైనది. ఇది 'సురేంద్ర గుప్తం' అంటే 'విష్వక్సేన రక్షితం' అన్నమాట

**మ.తీ :–** 'సురేంద్ర' అంటే 'ఉపేంద్రు'డని అర్థం.

## పదహారవ సర్గము

1. నారాయణః – నశించనివాళ్లు నరులు (న నరిష్యంతి – నశ్యంతి) అలాంటి నరుల సమూహం నారం. ఆ నారమే అయనం (నివాసస్థానం) గా కలవాడెవడో ఆయన నారాయణుడు (సర్వాంతర్యామి) దేవతలందరికంటె ఉత్తముడే అయినా దేవతలచేతనే ఆజ్ఞాపింపబడి నియుక్తుడైనవాడు కాబట్టి విష్ణుని ఆశ్రితపారతంత్ర్యం తెలుస్తోంది 15. ప్రాజాపత్యమ్ – ప్రజాపతి నుండి వచ్చిన

**మ.తీ :–** పురుషునిగా, శ్రీహరే అకస్మాత్తుగా అంతర్హితుడై అంతలోనే ఈ రూపంతో వచ్చాడు. శ్రీహరే అని చెప్పగలగడానిక్కారణం ఇంతటి కాంతీ శక్తీ మరొకరికి లేదు పైగా ఆ తేజస్సునీ శక్తినీ భరించగలవారు మరొకరు లేరు కూడ. ప్రజాపతి వలన వస్తూ (ప్రజాపాలకుడినించి) విష్ణువుకి చెందిన రూపం 18. ధన్యమ్ – ధనకరం 28. రాముడు విష్ణువులో అర్ధం. లక్ష్మణుడు పాదం(1/4) భరతశత్రుఘ్నులు పాదార్ధాంశులు (1/8–1/8) మఱి ఒకచోట 'సాక్షా ద్విష్ణోః చతుర్భాగః' అనడం కన్పిస్తోంది. ఇదెలా? అనుకోకూడదు. విష్ణువే (1) రామునిగా(1/2) అయ్యాడు కాబట్టి ఆ రామునిలో (1/2) నాలుగోవంతు (1/8) అని అర్థం చేసుకోవాలి. పాయసాన్ని ప్రాశనం (తినడం/ తాగడం చేసిన వాళ్లలో ముందు కైకమ్మే ఉంది. దీనిక్కారణం సుమిత్రకి మరో భాగం కూడ రాబోతోందని తెలిసి ప్రాశన చేయకుండా ఆగిపోవడమే. మనుష్యగర్భంనించి పుట్టడం వల్ల కలిగే దేహం పరమాత్మకి ఉండదు. అందుకే శుక్లశోణిత పరిణామ గర్భాలు కావివి. యజ్ఞపాయస దత్తాలుమొత్తం వచ్చిన భాగాలు కౌసల్యకి 1/2, కైకమ్మకి 1/8, సుమిత్రకి 1/4 1/8. వీళ్లే రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులయ్యారు. కాబట్టి విష్ణువు అర్ధభాగం రాముణ్ణి పుట్టించింది……ఇలా అర్థం చేసుకోవాలి. 30. ఉత్తమ పాయసమ్ – పయస్సుతో ఏర్పాటు చేయబడేది

**మ.తీ :–** పాయసం. దీనిలో విష్ణుతేజస్సున్న కారణంగా ఉత్తమపాయసం అయింది.

## పదిహేడవ సర్గము

4. ఒకప్పుడు నంది (నందికేశ్వరుడు)రావణుణ్ణి శపిస్తూ కోతిముఖం వాడివని నన్ను వేళాకోళం చేసిన కారణంగా 'నిన్నూ నీ కులాన్నీ ఆ కోతులే మట్టుపెట్టడానికి వస్తాయి' అన్నాడు. దాని కనుగుణంగానే బ్రహ్మ ఆవులింత నించి జాంబవంతుడు పుట్టాడు. తమనించి పిల్లల్ని కనగల శక్తి లేని (పార్వతీశాపం కారణం) అప్సరఃస్త్రీలంతా వానరాల జన్మనీయడానికి పరమేశ్వరుని ఇచ్ఛమీద అంగీకరించారు. అప్సరఃకాంతలంటే ఏమేమో అనుకోకూడదు. రాక్షసవధ కోసం వాళ్లు సంతానాన్ని కని రామరావణయుద్ధానికి పంపినవాళ్లుగా గుర్తించగలగాలి.

వాలి లేకున్నట్లైతే వానరాలకి సహాయవిధానమే ఉండేది కాదు. వీనికి సుగ్రీవవిరోధమే లేకుంటే తనకి తానే క్షణంలో సీతమ్మని రామునికిచ్చేసేవాడే. 15. సృష్టాః – అగ్ని – అశ్వినులు – వాయువు........ఇలా అందరూ వానరాల్ని సృష్టిస్తూ ఉన్నా బ్రహ్మ ఆజ్ఞ తనకి ఉన్నా కూడా రాక్షసపక్షపాతిత్వంతో రుద్రుడు ఏ ఒక్కరినీ సృష్టించలేదు.

**మ.తీ :–** ఇక్కడ చెప్పిన జన్మప్రకారమే వాస్తవమైనది. వరుణుని పుత్రుడైన సుషేణుణ్ణి యుద్ధకాండలో ధర్మరాజు పుత్రుడని చెప్పడం సరికాదు. ప్రధాన వానరసృష్టిని చెప్పాక ఆ మీదట సామాన్య వానరసృష్టిని గూర్చి చెప్తున్నాడు ఋషి 35. పర్జన్యుని పుత్రునిగా శరభుణ్ణి ఇక్కడ చెప్పిన వాల్మీకి తన యుద్ధకాండలో అదే శరభుడు 'వైవస్వతపుత్రు'డని ఎలా చెప్పాడు? బ్రహ్మవరప్రసాదకారణంగా వాల్మీకి చెప్పినదాంట్లో ఏ కించిదసత్యమూ ఉండదు – ఉండలేదు ఉండబోదు. అయితే రక్తం కారుతూ శరీరమంతా రక్తసిక్తమై విహ్వలుడై చలితేంద్రియుడైన శరభుడు 'తాను వైవస్వతపుత్రుడి'నని ప్రకటించడానిక్కారణం యుద్ధంలో క్షతగాత్రుడై బుద్ధిని కోల్పోయి భ్రాంతుడు కావడమే 35. సమావృతారామసహాయహేతోః – మైంద ద్వివిదులనేవాళ్లు అమృతపానం చేసినవాళ్లు. అమృత మథనకాలంలో ఉన్నారు వీళ్లు. ఋశ్యమూక సంచారవిరోధం బట్టి ఒకప్పుడు వాలిసుగ్రీవులు ఒకేచోటూ ఒకే ప్రాంత మన్నట్లు ఉన్నారనీ విరోధాన్ని బట్టి వ్యతిరేకులయ్యారనీ భావం. కాబట్టి వాలిసుగ్రీవులు ఏకకాలంవాళ్లే. రామావతారకాలంలోనే వాలి కూడ ఉన్నాడు కాబట్టి మరీ ప్రాచీనుడేమీ కాదు.

**మ.తీ :–** రామునికి 41 ఏళ్ల వయసులో రావణవధ జరుగుతోంది. ఈ వయసుకి లోగానే వాలివధ సాగిందంటే అది 'అయథార్థ' మన్పిస్తోంది. దీనిక్కారణం వాలీసుగ్రీవులు అమృతమథనకాలంలోనూ ఉన్నారని కొన్ని పురాణాల్లో కన్పిస్తోంది కాబట్టి.

## పద్దెనిమిదవ సర్గము

8. పంచసు – ఒకగ్రహం ఉచ్చలో ఉంటే సర్వారిష్టాలూ తొలగుతాయి. రెండైతే సామంతుడు, మూడైతే రాజు, నాలుగైతే సమ్రాట్టూ, ఇక ఐదు గ్రహాలూ ఉచ్చలో ఉంటే లోకనాయకుడౌతాడు. సూర్యుడు మాత్రమే ఉచ్చలో ఉంటే సేనాపత్యం, బుధుడుంటే వనరాజూ, గురువుంటే ధనం కలవాడూ రాజ్యాధిపతీ, శుక్రుడుంటే రాజ్యసంపదా, రాజ్యాధిపునితో సమానబలం కలవాడూ ఔతాడు. చైత్రంలో పుట్టడం వల్ల మధురభాషి, నవమినాడు పుట్టడం వల్ల దీర్ఘవైరం కలవాడూ శూరుడూ పండితుడూ అందర్నీ తనకి వశులుగా చేసుకోగలవాడూ, సర్వభూతాల విషయంలో భయంలేనివాడూ ఔతాడు. పునర్వసులో పుట్టడం వల్ల బాధకి తట్టుకోగలవాడూ, అల్ప సంతోషీ ఔతాడు. నాల్గవ పాదంలో పుట్టడం వల్ల మనోహరుడూ స్ఫురద్రూపీ మృదుస్వభావుడూ ప్రియదర్శనుడూ లక్ష్మీవంతుడూ ప్రియాన్ని పలికేవాడూ ఔతాడు. ఇలాగే లగ్నం – గ్రహ వీక్షణ యోగఫలాలు ఉంటాయి. రామావతారం యజ్ఞం వల్ల కలిగింది కాదు. కౌసల్యాతపస్సు వల్ల కలిగింది. 9. విష్ణోరర్ధమ్ విష్ణువుకంటె కొంచెం తగ్గింది.

**మ.తీ :–** శంఖచక్రాదులు లేకపోవడమే ఆ తగ్గుదల 10. అదితిః వజ్రపాణినా – దేవతల తల్లి అదితి ఎలా ఇంద్రుణ్ణి కన్నదో అలా కౌసల్య కూడ వజ్రరేఖలు హస్తంలో ఉన్న రాముణ్ణి విష్ణుస్వరూపుణ్ణి కన్నది. మాతృకారకుడైన చంద్రుడు గురువుతో ఇతని జాతకంలో కలిసి ఉన్నందువల్ల తల్లికి గౌరవం (అందుకే పేరుకి దశరథుడు తండ్రి గర్భం మాత్రం కౌసల్యది) 11. జజ్ఞే–రాముడు పుట్టీ పుట్టగానే కైకమ్మకి భరతుడు వ్యవధానం లేకుండా పుట్టాడు.

12. సుతౌ – సుమిత్రకి ఇద్దరు పుట్టారనడం చేత లక్ష్మణ శత్రుఘ్నులు కవలలు. రామునిది పునర్వసూ నక్షత్రం నవమి మధ్యాహ్నకాలం. భరతునిది దశమి పుష్యమీ నక్షత్రం. కవలలది దశమీ ఆశ్లేష. 14. ప్రోష్ఠపదోపమాః–ఆవుకి ఉండే నాలుగు పాదాలవంటి వారు. రామునికి ధర్మబుద్ధి –లక్ష్మణునికి కైంకర్యబుద్ధి – భరతునికి భగవత్పారతంత్ర్య బుద్ధి – శత్రుఘ్నునిది భాగవత పారతంత్ర్యబుద్ధి – ఈ నాలుగూ నాలుగు పాదాలు. 19.ఏకాదశాహం తు రాజులకి (క్షత్రియులకి) 13వ రోజున నామకరణమని చెప్తుంటే, 11వ రోజున నామకరణమెలాగ? లక్ష్మణునికి (చివరగా పుట్టిన వానికి) 11వ రోజున అని అర్థం. 19. అందర్నీ తన గుణాలతో ఎవడు రమింపజేస్తాడో అతడు రాముడు. తండ్రీ రాజూ అయిన దశరథుడు మరణించినా, రాజ్యాధికారి అన్న అరణ్యానికి వెళ్లి ఉన్నా, తనకిష్టంలేక 'అరాజక' భయంతో రాజ్యాన్ని భరించినవాడు కాబట్టి భరతుడు. రామకైంకర్యలక్ష్మణ లక్ష్మీపరుడు లక్ష్మణుడు. శత్రుహంత శత్రుఘ్నుడు. 'రాజు' స్వయంగా నామకరణం చేయరాదు గదా! "అన్నప్పుడు" వసిష్ఠునిచేత గదా చేయించాడనేది సమాధానం. 32. హ్రీమంతః–పొరపాటున ఏదైనా చేయరాని పని చేయాలనే తలంపు కలిగితే సిగ్గుపడేవాళ్లు. దీర్ఘదర్శినః–రాబోయే కాలంలో ఏం జరగబోతోందో తెలుసుకోగల ఆలోచనాపరులు. 36. ఇంతవరకూ భగవదవతారం చూపబడింది. ఇక ఆ అవతారప్రయోజనాలైన సాధుపరిత్రాణం (సస్యాన్ని కర్షకుడు రక్షించినట్లు) దుష్కృత వినాశనం (గడ్డిమొక్కల్ని తొలగించినట్లు) గూర్చి చెప్పబోతున్నాడు. స్వయంగా విశ్వామిత్రునికి మారీచసుబాహువుల్నీ అలాగే తాటకనీ కూడ చంపగల శక్తి ఉన్నా మునిగొప్పదనాన్ని లోకానికి చాటడానికి ఆయన వెళ్లాడు రాముణ్ణి తోడ్కొని. 40. సుపురోధాః పురోహితసహితుడై 42. కుశలం చ వ్యయం చ–అపూర్వమైనది ఏదో కొత్తగా లభించడం (యోగం) కుశలం. ఎప్పటినించో ఉన్నదానికి క్షయం లేకపోవడం అవ్యయం (క్షేమం) రక్షించుకోవడం అన్నమాట.

**మ.తీ :–** రాజ్యాంగక్షేమం 44. దైవం చ మానుషం చాపి– దైవకర్మ యజ్ఞాదికం. మానుషం అతిథిపూజ సత్కారాదికం 53. శుభక్షేత్ర గతః–సకల శుభసాధనకీ యోగ్యమైన పుణ్యప్రద పుణ్యవత్ దేహాన్ని పొందాను (ఇదం శరీరం కౌంతేయ క్షేత్ర మితి.....) 57. ప్రథిత గుణ యశాః త్రిశంకు స్వర్గారోహణ, నూతన స్వర్గసృష్టి, బ్రహ్మర్షిత్వ ప్రాప్తి, నాలుగుదిక్కులా తపస్సు చేసి సాధించిన తపశ్శక్తి.....వంటివన్నీ ప్రసిద్ధ గుణాల కారణంగా పొందినయశస్సు.

## పంతొమ్మిదవ సర్గము

9. శ్రేయశ్చ – విశ్వామిత్రయాగరక్షకుడూ, అహల్యాశాపవిమోచనుడూ, హరధనుర్భంజకుడూ...... మొదలైన ఈ తీరు కీర్తిని 13. అహం వేద్మి – అనేక గురూపాసనల వల్ల పొందిన జ్ఞానం కలవాణ్ణి నేను, యోగబలం వల్ల సాధించిన కర్మఠుడివి నువ్వు. సాత్త్వికుణ్ణి నేను. నువ్వు రాజసుడివి. జడల్నీ నారబట్టల్నీ ధరించిన వాణ్ణి నేను. రాగద్వేషధారివి నువ్వు. మేమంతా (తపోధనులం) రాముని గర్భంలో ఉండేవాళ్లం (రక్షింపబడుతూ ఉండేవాళ్లం) రాముణ్ణి కన్నాననే ఆలోచనతో ఉన్నవాడివి నువ్వు. మోక్షకామిని నేను. అర్థకామపరుడివి నువ్వు. నీకెలా తెలిసిందంటావా? శ్రుతి చెప్పింది రాముణ్ణి గురించి. అవతారకారణంగా మహాస్వభావం కలవాడు కాబట్టి మహాత్ముడాయన. సత్యమే పరాక్రమంగా కలవాడు. సత్యం వలన పరలోకాన్ని కూడ ఆక్రమించగలిగినవాడు. నేనేదో పని ఉండి పొగడుతున్నానని అనుకోకు. నీ ఆస్థానంలోని వసిష్ఠుణ్ణి అడుగు చెప్తాడు. అవతార రహస్యాన్ని

తెలిసినవాళ్లకి అంటే తపోధనులకి బాగా తెలుసు రాముడెవరో ఆ దైవస్వరూపాన్ని ధీరులు (ధ్యై చింతాయామ్) తెలుసుకోగలరట (తస్య ధీరాః పరిజానన్తి పులస్త్య, అగస్త్య వామదేవ మార్కండేయాదులైన వాళ్లంతా దేహానికి సంబంధించిన పనుల్ని విడిచి తపస్సులోనే నిమగ్నమైయున్నారు. తపస్సంటే ఆలోచన కాబట్టి ఆయన గూర్చిన చింతలోనే ఉండేవాళ్లకి తెలుసు(తనిశ్లోకీ).

## ఇరవైయవ సర్గము

1. ఊన షోడశవర్షః – 'పదహారేళ్లు నిండితే యుద్ధానికి తట్టుకోగలడు గాని పన్నెండేళ్లకే యుద్ధమా?' అందునా రాక్షసులతోనా? అనేది

**మ.తీ :–** దశరథాలోచనం పదహారేళ్లున్నవాడే కవచాన్ని ధరించి యుద్ధానికర్హుడని శాస్త్రం చెప్తోందంటూ కతకవ్యాఖ్య చెప్పింది. పదహారేళ్లవాడని రాముణ్ణి గూర్చి మారీచుడు రావణునితో అరణ్యకాండలో చెప్పడం – అంతటి చిన్నవయసువాని బాణానికి అంత గట్టి దెబ్బ తగిలిందా?' అని ఊహించుకుని రావణునిలో భయాన్ని పెంచడానికి మాత్రమే. నిజానికి రాముడు ఇంకా తక్కువ పన్నెండేళ్లవాడే. విశ్వామిత్రుడు రాముణ్ణి తీసుకుపోయేనాటికి రాముని వయసు పన్నెండు మాత్రమే. ఒక సంవత్సరం ఆయనవెంట వెళ్లాడు. పన్నెండేళ్ళు సీతారాములు అయోధ్యలో ఉన్నారు. వనవాసానికి వెళ్లేనాటికి సీతవయసు 18 రామునిది 25. కౌసల్య విలపిస్తూ 'పదిహేడేళ్లవాడి' వనడం రామునికి ఉపనయనం అయిన తర్వాత వయస్సుని చెప్తూ ఉపనయనానికి రాముని వయసు 8 ఏళ్లు. మతి ఈ ప్రకారం పదమూడేళ్లకే రామునికి వివాహమయింది కదా! రాముడు సీతతో సర్వోపభోగాలనీ అనుభవించాడని (విజహార బహూ నృతూన్...)కనిపిస్తూంటే, పదమూడేళ్లవాడి కది సాధ్యమా? సంభవమే. దేవతా స్త్రీలకి ఆరవ ఏటనే యౌవనారంభమంటోంది తని శ్లోకీ. 2.అక్షౌహిణీ – 1. రథం 1. ఏనుగు 5 గురు మనుష్యులు (కాల్బలం)మూడు గుఱ్ఱాలు ఉంటే ఆ సైన్యాన్ని పత్తి అంటారు. 3 పత్తులు సేనాముఖం. దీనికి 3 రెట్లు గుల్మం, 3 గుల్మాలు 1 గణం. 3 గణాలు 1 వాహిని. 3 వాహినులు పృతన. 3 పృతనలు చమువు. 3 చమువులు అనీకిని. దీనికి 10 రెట్లుఅక్షౌహిణి.

**మ.తీ :–** 12 ఏళ్ల బాలుడు. ఇదొక అభ్యంతరం. పుత్రవాత్సల్యం మరో అభ్యంతరం 20. అల్పభాగ్యస్య మమ – నువ్వు అడిగిన కోర్కెని తీర్చలేకపోతున్నందున మందభాగ్యుణ్ణైన నాకు (నువ్వే దేవుడివి). మనవెవరూ ఏం చేయలే' రనే ధైర్యంతోనూ, ఒక్కోసారి అలక్ష్య బుద్ధితోనూ తాను యజ్ఞవిఘ్నుకార్యక్రమానికి రాడు రావణుడు. అలాంటి సందర్భాల్లో మారీచ సుబాహువులు వస్తూంటారు. 23 సుందుని పుత్రుడు మారీచుడు. ఉపసుందుని పుత్రుడు సుబాహువు. ఈ ఇద్దరూ ఒక తల్లి బిడ్డలు కారు. 26. మహర్షివిప్రాః– మహర్షి శ్రేష్ఠుడు.

## ఇరవైఒకటవ సర్గము

1. స్నేహపర్యాకులాక్షరమ్ – పుత్రవాత్సల్యకారణంగా తడబడుతున్న అక్షరాలు కల దశరథుణ్ణి.

**మ.తీ :–** విపర్యయః ప్రతిజ్ఞ చేసి దాన్ని దాటడం. సుఖీభవ! 'సుఖంగా ఉండు' అనేది నిజమైన అర్థమైనా వెటకారంగా కోపంగా అన్న వ్యంగ్యోక్తి. ఇది ('ఖీ' అనేచోట). 6. ధర్మాత్మా ఇతి అనేచోట గుణసంధి లేక పోవడమనేది వాక్యంలో సంహిత అనిత్యమని చెప్పడానికి. 7. ఇష్టాపూర్తవధః అశ్వమేధం పుత్రకామేష్టి అనే వాటికి ఇష్టం అని

పేరైతే ఈ యాగం చివర్లో తవ్వబడిన దిగుడు బావులు నూతులు మొదలైన లోకోపయోగ కార్యక్రమాలు పూర్తములు.. ఈ ఇష్టం ఆ పూర్తమనే రెండు ప్రతిజ్ఞాభంగం చేసినప్పుడు వ్యర్థాలే అయి ఫలితాన్నియ్యవు.

**మ.తీ :-** ఇష్టమంటే యాగదేవతార్చనం. 8. జ్వలనేన అమృతం యథా–అమృతాన్ని అగ్నిచక్రం రక్షిస్తూ ఉన్నట్లుగా

## ఇరవైరెండవ సర్గము

1. సలక్ష్మణమ్ – రామలక్ష్మణుల అవినాభావత తెలిసిన దశరథుడు లక్ష్మణునితో సహా రాముణ్ణి పిలిచాడు. 3.ప్రయాణంలో శుభశకునాలని చూపడానికి కారణం అవతారప్రయోజనం ప్రారంభమయింది గదా! అని19. రామః నీటిని ఆచమించి విద్యని రాముడు స్వీకరించాడంటే అది లక్ష్మణునిక్కూడ సంప్రాప్తించిందనే అర్థం. ఒకవేళ రామునికే మహర్షి ఇచ్చినా అది లక్ష్మణునికి కూడ రాముని ద్వారా సంక్రమించి తీరుతుంది.

## ఇరవైమూడవ సర్గము

పూర్వం తృణశయనమని ఇక్కడ పర్ణశయనం (ఆకులతోనైన శయ్య) అంటున్నాడు కాబట్టి 'చెట్ల ఆకులతోనూ మెత్తని గడ్డితోనూ చేయబడిన శయ్య' అని అర్థం చేసుకోవాలి. రాముడు నిద్రలేచినప్పటి ఆ శ్రీహరిరూపాన్ని చూడాలనే ఆసక్తి ఆత్రుతలలో తానొచ్చిన పనిని మరిచి ఇలాంటి రాముణ్ణి కన్న తల్లి ఎంత గొప్ప తపస్సు చేసిందో అంటూ కీర్తిస్తున్నాడు .'కౌసల్యా సుప్రజా రామ!.....' అనే శ్లోకంలో సుప్రజాః ఎంత మంచి సంతానాన్ని కన్న తల్లి నీ తల్లి! కౌసల్యా సత్సంతానమైన రాముడా! 'పరశురాముడు కాదని' చెప్పడానికి (కౌసల్యా సుప్రజాః) 'కౌసల్యాపుత్రుడవైన' అంటున్నాడు ముని. కౌసల్యాదశరథుల పుత్రుడైతే 'కౌసల్యా పుత్రుడి వనడం సముచితమా? అంటే 'మాతృదేవో భవ.....' గౌరవం తల్లిదే ముందుగా. తల్లి తన పుత్రునికోసం ఎన్నెన్నో చేస్తుంది కాబట్టి ఈమే గొప్పది. దశరథుడు ఏమేమో సాకులు చెప్తూ పుత్రుణ్ణి పంపనిష్టపడక పోతూంటే ఈమె వసిష్ఠుని మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించి తత్క్షణం పంపించింది. దశరథుడు 'పంపలే' నన్నప్పుడు ఆగిపోవడంతో తండ్రిమాటనీ, పంపించుతానని తల్లి అన్నప్పుడు బయల్దేరడంతో తల్లిమాటనీ కూడ పాటించిన రాముని చూపిస్తూ ఇలా తల్లిదండ్రులిద్దరి మాటల్నీ గౌరవించాలనే విషయాన్ని లోకానికి రాముడు ద్వారానే చెప్పించాడు ముని (పరోక్షంగా). 'రామ' అనే మాటతో నిద్రించినప్పటి రాముని సౌందర్యం చెప్పబడుతోంది. తూర్పు సంధ్య సూర్యుణ్ణి, నీ తల్లి నిన్నులా కనబోతోంది. సూర్యుడు ఉదయించబోతూంటే ఎలా మందేహులనే రాక్షసులు అడ్డుపడతారో అలాగే నీకు కూడ రాక్షసనిరసన సమయమిది. నేటి వరకూ ఉన్న అజ్ఞానాంధకారం మొత్తం నీ భగవత్సాక్షాత్కారంతో పోయి నిజంగా తెల్లవారింది నా జీవితానికి. ఇది నా జీవితానికే జన్మకే సుప్రభాతం. నువ్వు నరశ్రేష్ఠుడివే అయినా తప్పక సంధ్యావందనాన్ని చేయవలసిందే. 'యద్యదాచరతి శ్రేష్ఠః......' అని కదా శాస్త్రం చెప్తోంది! నువ్వు చేస్తే అందరూ నిన్ననుసరిస్తారు. భగవంతుడివైన నీచేత ఒకప్పుడు ఆజ్ఞాపింపబడిన కర్మ (దైవమ్)నాచేత చేయబడాల్సి ఉంది. దానిలో భాగంగానే ఇప్పుడు నిన్ను నిద్రలేపుతున్నాను. ఆ నా ఆజ్ఞని పాటించు! ఈ రోజు చేయాల్సిన (ఆహ్నికమ్) యజ్ఞాత్మక కర్మని చేయవలసి ఉంది! పరమం జపమ్ 'న సావిత్ర్యాః పరం జప్యమ్' గాయత్రి కంటె గొప్ప జపం లేదనడం బట్టి పరమజపమంటే గాయత్రీజపమే. 8. ప్రహస్య – కేవలం తన వెంట రావడమే కాక

ఈ ఆశ్రమం ఎవరి?దంటూ ప్రశ్నించిన ఆ ఆనందానికీ నవ్వి (విశ్వామిత్రుడు) 9. సమర్గుదణమ్ – మరుద్గణంతో సహా (వెళ్తున్న శివుణ్ణి)

**(మ.తీ)** సః – మరుద్గణమ్మని పదవిభాగం. సః – ఆ మన్మథుడు, పంచవాయువులలో కొన్నింటిని బయటికి పంపుతూ కొన్నిటిని లోనికి తెస్తూ నియమిత విధానంతో నియుక్తకాల పద్ధతితో శ్వాసనిరోధాన్ని చేస్తూ తపస్సు చేస్తున్న శంకరుణ్ణి, కృత+ ఉద్వాహమ్ అభివృద్ధిని సాధించిన శంకరుణ్ణి మన్మథుడు చలింపచేశాడు. లేదా పార్వతీ విషయంలో పరిణయాలోచన కలిగిన శంకరుణ్ణి – లేదా – తపస్సుని చేస్తున్నా సమాధిరహితంగా (న సమాహితమ్) ఉన్న శంకరుణ్ణి చలింపచేశాడు మన్మథుడు.

## ఇరవైనాల్గవ సర్గము

1. ఉపస్థాప్య – తెచ్చి. 8. సరయూః – సరసః యౌతి/సరసః యాతి–బ్రహ్మ తన మనసుకి నచ్చిన విధంగా ఓ సరస్సుని సృష్టిస్తే అది 'మానస' సరం లేదా బ్రహ్మసరం లేదా బ్రహ్మమానససరం అని పిలువబడింది. ఆ సరస్సునుండి వచ్చింది కాబట్టి ఇది సర–యువు అయింది. 31. ఉత్సాదితమ్ – నిర్జనంగా చేయబడింది. జనుల్ని తొలగించి పంపించివేసింది.

## ఇరవైయైదవ సర్గము

8.ప్రధర్షయితుమ్ – చంపడానికై 9. జాత సంరంభా – భర్తృవధ కారణంగా కోపం కలదై 19. కావ్య మాతా నిషూదితా – మత్స్యపురాణంలో ఉంది ఈ వృత్తాంతం. ఒకప్పుడు కావ్యుడు (శుక్రుడు) రుద్రుని దగ్గర తపస్సు చేస్తూండగా రాక్షసులంతా దేవతలబాధకి తట్టుకోలేక శుక్రుని తల్లిని శరణువేడారు. ఆమె రాక్షసరక్షణకోసం దేవతల్ని మట్టుబెట్టాలని సిద్ధపడింది. అంతలో ఇంద్రుడు ఆమె తలని నరికి చంపవలసిందిగా విష్ణువుని ప్రార్థిస్తే – విష్ణువు అలాగే చేశాడు లోకరక్షణ కోసం.

## ఇరవైయారవ సర్గము

11. గతిమ్ – 'తాటక గమనాన్ని నరికేస్తా' నంటే చేతుల్నీ కాళ్లనీ నరికేసి ఎటూ పోకుండా చేస్తానని అర్థం. నేలమీద గతి లేకుండా చెయ్యాలంటే పాదాలనీ, ఆకాశంలో గతి లేకుండా చెయ్యాలంటే హస్తాలనీ నరికెయ్యాలని అర్థం. 13. స్వస్తి రాఘవయోః జయం చ – రాముని అనన్య సాధారణ అతిమానుషశక్తి తనకి తెలిసినా తాటకకున్న బలానికీ క్రౌర్యాతిశయానికీ భయపడి కొద్దిగా శంకించిన ముని రామలక్ష్మణులకి మంగళాన్నీ జయాన్నీ ఆశీఃపూర్వకంగా ఇస్తున్నాడు. (ఇలా మంగలాశాసనం చెయ్యడమంటే తపశ్శక్తిని రక్షణకోసం వాగ్రూపంగా పంపడమే) 22. శబ్దవేధిత్వమ్ – శబ్దం ఎటునించి వినపడిందో అటువైపుకి బాణాన్ని వేసి కొట్టడం.

## ఇరవైయేడవ సర్గము

7 వారుణమ్ – కాకాక్షిన్యాయం ప్రకారం వారుణపాశం వారుణాస్త్రం (పాశం వేస్తే అస్త్రమూ, అస్త్రంగా మారిస్తే పాశం పనిచేయవు). 20. మంత్రగ్రామమ్ – మంత్రసమూహం. అస్త్రాలన్నీ మంత్రమూర్తులు కాబట్టి

అన్ని మంత్రాలనీ ఇచ్చి ఉండలేదు. అప్పటి అవసరాన్ని బట్టి ఆయా మంత్రాలని మాత్రం ఇచ్చాడు(కతకం) బలాతిబల విద్యల్ని మాత్రమే అప్పుడిచ్చాడు. ఇప్పుడు మిగిలిన వాటిని కూడ ఇచ్చాడు. 21. సర్వసంగ్రహణమ్-

**మ.తీ :-** అన్ని దివ్యాస్త్రాలనీ ధరించడమనేది దేవతలక్కూడ దుర్లభం దుష్కరం కూడ. నిజానికి దేవతలు కూడ సర్వాస్త్రాలనీ ఎరగరు. అయితే అన్ని అస్త్రాలనీ రాఘవునికి (రామలక్ష్మణులిద్దరికీ) విశ్వామిత్రుడిచ్చాడు. ఉపదేశం కూడ ఇద్దరికీ ఒకేమారు జరిగింది. 24. సమాలభ్య - స్పృశించి.

**మ.తీ :-** నిజానికి పరమేశ్వర స్వరూపుడైన రామునికి అన్ని మంత్రాలూ తెలిసినా మంత్రవిద్య అనేది గురూపదేశం ద్వారా స్వీకరించినప్పుడే ఫలప్రదాయిని అవుతుందనే యథార్థాన్ని లోకానికి చెప్పడం కోసం విశ్వామిత్రుణ్ణించే తీసుకున్నాడు రాముడు. మానసాః - ఈ విద్యలన్నీ తన మనస్సుకి అనుగుణంగా అనుసరించి పనిచేస్తాయి.

## ఇరవైయెనిమిదవ సర్గము

10. అబ్రువన్ - మంత్రాన్ని ప్రయోగించడం అలాగే ఉపసంహరించడమనే రెంటినీ తెలుసుకున్నాక, ఆ మంత్రాలకి సంబంధించిన దేవతామూర్తులు స్వయంగా సాక్షాత్కరించి తమని తాము రామునికి చూపించుకున్నారు. 18. రోమహర్షణాత్ - ఒళ్లు గగుర్పొడిచేంతటి భయంకరస్థితి కల తాటకావనం నుండి 16. కిన్ను ఆశ్చర్యం అద్భుతం అయినది ఏది?

## ఇరవైతొమ్మిదవ సర్గము

1. సిద్ధాశ్రమః ఇతి. ఈ శ్లోకంతో పాటు మొత్తం 2 1/2 పాదాల శ్లోకం ఇది. తపస్సు చేసుకోడానికీ, తపఃఫలసిద్ధికీ, తపస్సుకీ యోగానికీ కూడ ఈ వనం అనుకూలమైనది. ఇక్కడే శ్రీహరి తపస్సు చేయడానికి కారణం లోకంలో తపః ప్రాముఖ్యాన్ని చెప్పడానికే. నారాయణునికి బదరికాశ్రమం లాగా ఈయనకి (రామునికి) సిద్ధాశ్రమవాసం కుదిరింది. నిత్యం శ్రీహరి దీనిలో ఉండే కారణంగా సిద్ధాశ్రమానికి దివ్యదేశత్వ స్థితీ, ఈ కారణంగా ఇక్కడ నివసించిన పూర్వులందరికీ తపస్సిద్ధీ అనే వాటిని గమనించి ఎందరెందరో ఇక్కడే నివసించాలనే ఆలోచనని పొందారు. ఈ విషయాన్నే ప్రతిపాదిస్తూ ఈ ప్రదేశానికి స్థాణ్వాశ్రమం కంటె ఉన్న విలక్షణతని చూపిస్తున్నాడు మహర్షి. ఈ సర్గలోఒకప్పుడు విష్ణురూపంతో మళ్లీ వామనరూపంతోనూ ఇలా రెండు అవతారమూర్తులతోనూ తపస్సుని ఇక్కడే చెయ్యడం విశేషం

**మ.తీ :-** ఇహ తపశ్చరణమంటే తపోఽనుష్ఠానం అని అర్థం. తపశ్చరణ యోగమంటే తపోఽనుష్ఠానం తో కూడిన అష్టాంగయోగం. ఈ రెండూ ఇక్కడే సిద్ధించాలనే ఉద్దేశ్యంతో ఇక్కడే ఉండిపోయాడు. ఆ విషయమే చిన్న మాట 'ఇహ' అనే దాని ద్వారా వివరించాడు మహర్షి. వామనావతారంతో బలిని జయించడం, ఇంద్రుడు పోగొట్టుకున్న ఆ సంపదని తిరిగి ఇయ్యడమనే సర్వకార్యసిద్ధినీ ఇక్కడే పొందాడు శ్రీహరి. కాబట్టి సిద్ధాశ్రమమంటే తపస్సిద్ధిని సాధించిన ఆశ్రమమనే అర్థం. దీనికి అర్థాన్ని మరో పద్ధతిలో కూడ చెప్పవచ్చు. అష్టాంగయోగసిద్ధికోసం ఏ మహర్షులంతా ఇక్కడ ఆశ్రమంలో ఉన్నారో వాళ్లంతా శ్రీ విష్ణుసన్నిధానం ఇక్కడే ఉన్న కారణంగా సిద్ధులయ్యారు

సరే. అయితే కొద్దికాలానికి విష్ణువు వామనరూపాన్ని పొంది వెళ్లిపోయాడు. మళ్లీ విఘ్నం కలిగినట్టేకదా! తిరిగి మళ్లీ శ్రీహరి వచ్చిన కారణంగానూ, కాశ్యపుడు మహాతపస్సు చేసిన కారణంగానూ ఆయన పూర్వుల్లా సిద్ధుడయ్యాడు. అందుకని కూడ ఇది సిద్ధాశ్రమమే.

రాక్షసుడైన బలి యాగాన్ని చేయడమా? రాక్షసునికి యజ్ఞానుష్ఠానం సరైనదేనా? అని అంటే వేదమే ఆ విషయాన్ని అంగీకరిస్తూ రాక్షసుడే అయినా కూడా యాగం చేయవచ్చని చెప్పింది. ఏయే దేవతకి వషట్కారాన్ని మంత్రరూపంగా జపిస్తూ హవిస్సుని వేస్తామో ఆ యా దేవతని ధ్యానిస్తూ ఆ యా మంత్రపూర్వకంగా ఆ యా దేవతని ఉద్దేశిస్తూ చేయబడే యాగం విషయంలో దేవతలూ రాక్షసులనే భేదమే లేదు. ఇక్కడ ప్రధానమైనది క్రియ మాత్రమే. అది సక్రమంగా సాగితే ఫలప్రదాయకమే అవుతుంది. 7. కల్యాణమ్ – వామన రూపాన్ని లేదా వేషాన్ని పొంది మా దేవతాకార్యాన్ని సాధించి పెట్టు. కల్యాణమంటే దేవతాకార్యమే! ఇక్కడ ఔదార్యమనే మహాగుణం ఉంది. శ్రీ మహావిష్ణువంతటివాణ్ణి 'యాచన చేసి రాజ్యాన్ని అపహరించి తమకి ఈయవలసింది'గా ప్రార్థించారు దేవతలు. 9. ఇదే సమయంలో కాశ్యపుడు అదితితో సహా వ్రతాన్ని ముగించి 'వరదు'డైన విష్ణువుని సంతృప్తిపరిచాడు. ఈ శ్లోకంలో 'అదిత్యా సహితః' అదితితో కూడినవాడైన కశ్యపుడు అలాగే 'దేవీ సహాయః' తన భార్యతో కూడినవాడైన కశ్యపుడు అంటూ దేవీపదాన్ని రెండుమార్లు ప్రయోగించాడు. ఆమె (అదితి) ఆయనతో కలిసి తపస్సు చేసిందనే విషయాన్ని చెప్పడానికే ఈ తీరు రచన. అలాగే ఈ శ్లోకంలోనే రామపదం కూడ సంబోధనపరంగా (ఓ! రామా!) రెండు మార్లు వాడబడింది. ఒకటి రూఢ్యర్థంలో (యోగులూ మహర్షులూ అయిన జనమంతా ఎవనిలో ఆనందాన్ని అనుభవిస్తారో అలాంటివాడు రాముడు) మరొకటి యోగార్థంలో (వట్టి సంబోధన)

**మ.తీ :–** అదిత్యా సహితః అంటే అదితితో కూడినవాడై వ్రతాన్ని ముగించి ఆమెతో కలిసే స్తుతించి తృప్తిని పొందించాడనే అర్థం. అదితికి హితుడై తాను స్తుతించి సంతృప్తిని పొందించాడనేది మరో అర్థం. అప్పటి పదవిభాగం 'అదిత్యాః హితః సః తుష్టావ' అనేది. 12. శరీరే తవ పశ్యామి – ఈ చేతనాచేతనాత్మక సర్వజగత్తునీ నీ శరీరంలోనే చూస్తున్నాను అని భావం. గీతాచార్యుడు కూడ 'పశ్యామి దేవాం స్తవ దేవ దేహే',.....అంటూ సర్వభూతప్రాణి సంఘాన్నీ బ్రహ్మనీ శంకరుణ్ణీ సర్వఋషులనీ దివ్యమూర్తుల్నీ ఉరగాల్ని కూడ ఉన్నదున్నట్టుగా చూడగలుగుతున్నానని అర్జునునితో అన్పించాడు. ప్రపంచమంతా నీ శరీరమే అన్నావు కాబట్టి ఈ ప్రపంచాన్నంతటినీ ఒక శరీరంగానే భావిస్తున్నాననేది అర్థం అనాదిః. ఇక్కడ పుట్టావని తెలిపే ఆధారం లేనివాడు. అనిర్దేశ్యః – ఈ పరిమాణంలో ఇలా ఉంటాడని చెప్పే వీలుకూడ లేనివాడు. 14. మారీచః – మరీచి పుత్రుడు మారీచుడు.

15. యవీయాన్ **మ.తీ :–** కనిష్ఠుడు. 19. మానదః అభిమానాన్ని తొలగించుకున్నవాడు (నిరభిమాని) ఆ కారణంగానే బలిని మూడడుగుల నేలకై యాచించాడు. 21 మయాఽపి భక్త్యా – దగ్గరలో ఉన్న స్థాణ్వాశ్రమాన్ని విడిచి నేను ఇక్కడే ఉండడానిక్కారణం, ఇతర దేవతలు ఎవరిలోనూ పరత్వబుద్ధి లేకపోవడం, భక్తి అనేది ఉంటే అది శ్రీహరియందలి భక్తి మాత్రమే (విష్ణుభక్తి) అనే బుద్ధి కలిగి ఉండడం మాత్రమే. కాబట్టి 'భక్తిచేత' అంటే 'విష్ణుభక్తిచేత మాత్రమే' అనేదే అర్థం విశ్వామిత్రుని అభిప్రాయంలో.

30. కుమారౌ **మ.తీ :–** స్కంద విశాఖులలాగా శుచీ 'స్పృష్టోదకౌ శుచీ జప్యమ్' అని ఒక పాఠం అయితే 'ప్రశుచీ పరమం జప్యమ్' అని ఒక పాఠం. అవతారమూర్తి అయిన కారణంగానూ అశుచిత్వ ఆలోచన ఏ

మాత్రమూ లేని కారణంగానూ మిక్కిలి శుచి అయినవాడు ప్రశుచి. 31.హుతాగ్నిహోత్రమ్ అగ్నిలో హుతం చేయడమనేది ఏదుందో అది హోమం. ఔపాసన హోమం. ఇక్కడ విశ్వామిత్రుడు దీక్షలో ఉన్నాడు గాబట్టి 'దీక్షామధ్యేన అగ్నిహోత్రం న దర్శపూర్ణమాసాభ్యాం యజతే' దీక్షామధ్యంలో అగ్నిహోత్రాన్ని చేయరాదనే నియమం ఉండగా ఎలా హోమం చేశాడు విశ్వామిత్రుడనేది ప్రశ్న. మానసికమైన అగ్నిహోత్రాన్నే చేశాడని కొందరన్నారు.

## ముప్పైయవ సర్గము

1. సంరక్షణీయౌ నివారింపబడవలసిన ఇద్దరు ఎవరో వాళ్లు

**మ.తీ :–** ఏ కాలంలో రాక్షసుల్ని అడ్డగింపవలసిందో ఆ అడ్డగింపు ఈ ఇద్దరివిషయంలో ఏ సమయంలో జరగాలో వివరించు!. రాముడు విశ్వామిత్రునితో అన్నాడు నాతివర్తేత – మనకి తెలియకుండా ఆ కాలం దాటిపోకూడదు. 4.షడహోరాత్రమ్ – ఆరు పగళ్లూ ఆరు రాత్రులూ కలిసిన ఆరు రోజుల భాగం. దేనికి దానికి ఒక్కొక్క రోజు చొప్పున ఆరు రోజులు కాదు. ఆరు రోజులూ కలిపి ఒకటైన భాగం. కిందటి రోజున దీక్షలో ప్రవేశించి అప్పటినుండి ఆరు రోజులపాటు తపోవనాన్ని రక్షించారు సుమా! అంటూండడం బట్టి ఈ యాగం ఏడు రోజులపాటు జరిగేదని అర్థమౌతుంది. 9. యథా న్యాయమ్ – రాక్షసుల్ని చంపేందుకూ వారి పీడ తొలగేందుకూ యాగాన్ని తలపెడుతూంటేనూ అది యథాశాస్త్రం జరుగుతోందంటేనూ మరి రాక్షసులు ఎలా ఈ యజ్ఞదీక్షా ప్రదేశానికి రాగలిగారు? అనేది ప్రశ్న. నిజమే! ఈ రక్షోఘ్న (రాక్షసనాశనం) మంత్రజపాన్ని చేస్తూండడం బట్టే ఇక్కడ కాక, ఆకాశంలోనే దూరంగా నిలబడి మేఘాల్లాగా రక్తాన్ని వర్షించారు రాక్షసులు. జజ్వాల – ఒకప్పటిలా వెలిగించడం వల్ల కాక, తమంత తాముగా, వేదికలు వెలగ్గానే అది రాక్షసాగమసూచకంగా భావించారు. 13. మానవాస్త్ర మెప్పుడూ ఒక వ్యక్తిని దూరంగా ఎగిరిపడేలా చేసేందుకు పనిచేస్తుంది. (విధూనన + అర్థమ్) 15. మారీచోరసి – సర్వరాక్షసులమీదా అస్త్రప్రయోగాన్ని చేయవలసిన రాముడు, అలా చంపుతానని ప్రతిజ్ఞ చేసిన రాముడు కేవలం మారీచుని వక్షః స్థలంలోనే బాణాన్ని వేయడమెందుకు? అంటే ఇంతకు పై శ్లోకంలో రాక్షసశబ్దానికి మారీచుడు మాత్రమే లక్ష్యం (అర్థం)కాబట్టి. 17. శీతేషు వనే శబ్దం అవయవవృత్తి ప్రకారం మానవాస్త్రంలో ఉంది. ఇక శీతేషు వనే మానవాస్త్రంతో మారీచుణ్ణి మాత్రమే కొట్టడం, రాబోయే కాలంలో ఇతని ద్వారా పనిని సాధించాల్సి ఉంది కాబట్టి. ఇతని ప్రాణాలని రామబాణమే అయినా రక్షించి విడిచి వెయ్యడానిక్కూడ కారణం. భావికార్యాంతర సాధనం ఇతని ద్వారానే జరగాల్సి ఉంది కాబట్టి.

**మ.తీ :–** శీతేషు వనే అస్త్రానికి మరోపేరు మానవాస్త్రమని 16. స తేన పరమాస్త్రేణ .......అనే శ్లోకం లోని మొదటి అక్షరమైన 'స' అనేది గాయత్రీ మంత్ర బీజాక్షరాల్లో రెండవది. 19. వాయవ్యమ్–

**మ.తీ :–** శత్రువుని దూరానికి తరలిపోయేటట్లు చేసి వాణ్ణి మట్టుబెట్టడమనేది వాయవ్యాస్త్రానికి ఫలం. 22. నిరీతికాః – బాధలేమీ లేకుండా

**మ.తీ :–** ఉపద్రవాలేమీ లేకుండా (నిర్ + ఈతికాః – నిరీతికాః) 23. కృతార్థః– నీతండ్రిమాటనీ నీ గురువైన నా మాటనీ నువ్వు ఆమోదించి ఆచరించినందుకు నీ కారణంగా నేను కృతార్థుణ్ణి (నా రాకకి తగిన ప్రయోజనాన్ని పొందినవాణ్ణి) అయ్యాను.

## ముప్పైయొకటవ సర్గము

ఇలా కృతార్థుడైన విశ్వామిత్రమహర్షి, జనకమహారాజపుత్రికగా అవతరించిన ఆ లక్ష్మీస్వరూపిణియైన సీతమ్మని రామునితో కలపాలనే వంకతో మిథిలానగరానికి బయల్దేరాలని భావించి మిథిలానగరమూ, ఆ విశేషాలూ మొదలైనవాటిని స్తుతించ ప్రారంభిస్తున్నాడు. 1. కృతార్థౌ – విశ్వామిత్రుడు ఏ ప్రయోజనాన్ని అపేక్షించి తమని తీసుకొచ్చాడో ఆ ప్రయోజనం విశ్వామిత్రునికి చేకూర్చేలా (నెరవేరేలా) చేసిన రామలక్ష్మణులు కూడ కృతార్థులే. సహితౌ – ఒకరినుండి మరొకరు వేరు కాకుండా జంటగా కలిసి మాత్రమే. 3. మునిశార్దూల! బ్రహ్మపదార్థాన్ని గూర్చి ధ్యానించేవారిలో శ్రేష్ఠుడైనవాడా! ఈ సంబోధనం ద్వారా చెప్పలేనంత భక్తిమత్త్వం తెలుస్తోంది. కింకరౌ – 'భక్తిక్రీతో జనార్దనః' భక్తిచేత కొనబడేవాడు జనార్దనుడన్నట్లు నీ చేత మేమిద్దరం (జనార్దనుని రెండు రూపాలుగా కన్పిస్తున్నవాళ్లం) కొనబడ్డాం. ఈ ఇద్దరం నీ ఆజ్ఞని ఎదురుచూస్తూ ఇక్కడే నిలబడి ఉన్నాం సిద్ధంగా. భక్తుడివైన నువ్వు మమ్మల్ని కొన్న కారణంగా నిన్ను విడిచి ఒక క్షణకాలమైనా ఉండలేం. 5. పరమధర్మిష్ఠః – మిక్కిలి (అతిశయించిన) ధర్మం కలవాడు.

**మ.తీ :–** విశ్వామిత్రుడు తన యజ్ఞానికి విఘ్నం లేకుండా చేసుకోవడం తత్కారణంగా సర్వాస్త్రాలనీ రామలక్ష్మణులకి అనుగ్రహించడం అనే వీటిని నిర్వర్తించి ఆ మీదట ఈ ఇద్దరికీ సహజ లక్ష్మీశక్తి సంబంధమైన అనుగ్రహం కలగాలని ప్రయత్నిస్తున్నాడు.

**మ.తీ :–** పరా (అతిశయించిన) మా (లక్ష్మీదేవి లేదా – సంపద) ఎవనియందుందో అతడు పరముడు (రాముడు) అలాంటి పరముడూ, ధర్మిష్ఠుడూ ఐనవాడు పరమధర్మిష్ఠుడు. (పరమశ్చ అసౌ ధర్మిష్ఠః చ) 6. ధనురత్నమ్ – 'ధనుస్ + రత్నమ్' అనే పదవిభాగంలో 'ధనూరత్నమ్' అని వ్యాకరణం ప్రకారం కావాలి. ఇక్కడ దీర్ఘం లేకుండా 'ధనురత్నమ్' అని ప్రయోగించడం – ఋషిప్రయోగం కాబట్టి సాధువని గ్రహించడానికే 8. ఆరోపణమ్ – వింటినారిని కట్టడం. విల్లు వింటినారికంటె పొడుగ్గా ఉంటుంది. ధానుష్కుడైనవాడు వింటిని చేతితో ఎత్తిపట్టుకుని (ఒకవైపున వింటికొనకి వింటినారి ఎలాగూ ముడివేయబడి ఉంటుంది కాబట్టి) రెండోవైపు వింటికొనని బలంగా వంచి ఆ కొనకి వింటినారిని ముడివెయ్యాలి. దీన్నే జ్యా ఆరోపణ మంటారు.

**మ.తీ :–** బాణాన్ని ఎక్కుపెట్టడానికి వీలైన వింటినారిని బిగించడం. న కథంచన – దేవతలు గంధర్వులు అసురులు రాక్షసులు జ్యారోపణాన్ని చేయలేకపోతే ఇక మనుష్యులు చేయగలరా? ఏ విధంగానూ చెయ్యలేరు. 10.యజ్ఞం చ. ఆ యజ్ఞాన్నీ యజ్ఞంతో పాటు ధనుస్సునీ కూడ(చ) చూడగలవు.

**మ.తీ :–** యజ్ఞంతోపాటు (చ) జానకిని పరిగ్రహించగలవు కూడ. 12. ఆయాగ భూతమ్ ధనుస్సుకి సంబంధించిన ఉత్సవంలో ధనుస్సుని గూర్చి "ప్రీతశ్చ భగవానీశ స్త్రిశూలీ నీలలోహితః – ప్రదదౌ శత్రునాశార్థం జనకాయాద్భుతం ధనుః" అని కన్పిస్తుంది. భగవంతుడైన శంకరుడు తనకి తాను తృప్తుడైనవాడై శత్రువుల్ని నశింపచేయడానికి సమర్థమైన ఒక (ఈ) ధనువుని జనకునికి ఇచ్చేశాడు 14. హిమవంతమ్ – మనందరం హిమాలయాలకి వెడదాం (సిద్ధాశ్రమంలో ఉన్న రామలక్ష్మణులు విశ్వామిత్ర సహితంగా హిమవత్పర్వతాలకి వెళ్లాలంటే

మిథిలానగరమార్గంలోనే పోవాలి. అందుకని 'ఆ నడుమ ఉన్న మిథిలకి వెడదా' మన్నట్టుగా విశ్వామిత్రుడు సూచించాడు రామలక్ష్మణులకి. 16. శకటీ శతమాత్రమ్ – వంద బండ్లు ఒకదానివెంట ఒకటి చొప్పున ఉండగానూ ఆ నూరిటిలోనూ యజ్ఞానికి సంబంధించిన అగ్నిహోత్ర సంభారాలన్నీ నింపగానూ కన్పించే తీరు.

## ముప్పైరెండవ సర్గము

రామచంద్రుడు కుతూహలంతో ఆ దేశాన్ని గూర్చిన ప్రశ్నని వెయ్యగానే ఈ దేశం నా వంశీయులదనే వివక్షతో తన వంశాన్ని గూర్చి విశ్వామిత్రుడు ఈ సర్గలో చెప్పబోతున్నాడు. 1. బ్రహ్మయోనిః ఏ బ్రహ్మ మాత్రమే తన పుట్టుకకి కారణమయ్యాడో అలాంటివాడు బ్రహ్మయోని అంటే అయోనిజుడని అర్థం. అంతేకాదు. జ్ఞానం, శౌర్యం మొదలైన గుణాల కారణంగా బ్రహ్మపుత్రులైన ఎందరికంటెనో విలక్షణంగా ఉండేవాడున్నూ. కుశో నామ బ్రహ్మపుత్రులైన నారదాది మహర్షుల్లాగానే ఈయన కూడ బ్రహ్మలోకంలోనే ఉండిపోకుండా ప్రజలని పరిపాలించడంలో ఎంతో ఇష్టమున్న కారణంగా భూలోకానికి వచ్చేశాడు. 'కౌ (భూలోకమందే) శేతే (నిద్రించేవాడు – ఎల్లప్పుడూ ఉండేవాడు) ఇతి కుశః'. భూప్రజారక్షణమే తన ధ్యేయం కాబట్టి, ఈయన తన పరిపాలన కారణంగా క్షత్రియుడే అయ్యాడు కూడ. అయితే ఏనాడూ ఈయన తన వ్రతాన్ని భంగం చేసుకున్నవాడు కాదు. అలాగే ధర్మజ్ఞుడున్నూ. 9. పూర్వాభిచరితా – తూర్పునుండి పశ్చిమానికి ప్రవహించే నది. (మ.తీ) తూర్పుదిక్కున ప్రవహించే నది. 10. ఘృతాచీ – పురుషుణ్ణి నేతిలా కరిగించేయగల శక్తి ఉన్నది (ఘృతవత్ పురుషం కృత్వా అంచతీతి ఘృతాచీ 20. మాభూత్ స కాలః – మా తండ్రి అయిన కుశనాభుడు నీకు మృత్యువు కాకుండుగాక! స్వయం వర ముపాస్మహే వరమ్ = వరుణ్ణి, స్వయమ్ = స్వయముగా (మేం మా తండ్రికి సంబంధించిన 'స్వమ్' (ఆస్తి) కాబట్టి ఆయన ఇష్టానికి అనుగుణంగా) ఉపాస్మహే – ఎదురుచూస్తున్నాం. (మ.తీ) మా తండ్రి అయిన కుశనాభుణ్ణి అవమానించి మా స్వధర్మమైన కామంతో స్వయంవరంలో స్వతంత్రంగా పతిని వరించడమనేది ఏదుందో ఆ పద్ధతీ ఆ విధానమూ ఎప్పుడూ ఎక్కడా కూడ ఉండకుండు గాక! (హే దుర్మేధః! సత్యవాదినం పితరమ్ అవమాన్య స్వధర్మేణ స్వయం వరమ్ ఉపాస్మహే స కాలః మా భూత్) 'పితరం సత్యవాదినం నావమన్య' అనే చోట 'నావమన్య' అనే పాఠం అపపాఠమే. ఒకవేళ 'నావమన్య' అనే పాఠమే ఉండేటట్లయితే 'నః – అవమన్య' అని పదవిభాగాన్ని చెయ్యాలి. ఆ దశలో 'నోఽవమన్య' అని అవుతుంది. అక్కడ 'నావమన్య' అని సవర్ణదీర్ఘం రావడమనేది ఛాందసదీర్ఘమనాలి. అప్పటి అర్థం 'నః– మాకు, ఇలా సొంతంగా భర్తని వరించుకునే తీరు గల, సః కాలః మా భూత్ – ఆ కాలం ఉండకుండుగాక' అనేది.

కుశనాభ పుత్రికలైన తమ విషయంలో చెప్పలేని అభిలాషతోనూ, ఎంతో ఆకర్షణీయమైన హృదయంతోనూ ఉండి తమని బతిమలాడుతున్న వాయువుని గూర్చి ఆ పుత్రికలు అన్నమాట 'మాభూత్' అని. దీనికి మరోలా అర్థాన్ని కూడ చెప్పవచ్చు. హే! దుర్మేధః – ఓ దుష్టబుద్ధీ! వాయో – వాయుదేవుడా! ధర్మేణ – గాంధర్వమనే పేరున్న ఎనిమిది విధాల వివాహాల్లో ఒకటైన ఆ ధర్మం ద్వారా, స్వయమ్ – మా అంత మేముగా మా తండ్రి అయిన కుశనాభుడు జీవించి ఉండగా ఆయన జీవించిలేడన్నట్లుగా స్వతంత్రులమై, వరమ్–భర్తని, ఉపాస్మహే – ఎప్పుడు ఎలా స్వీకరించాల్సి వస్తుందో, సః కాలఃఅలాంటి దురదృష్టకాలము, మా భూత్–ఎప్పుడూ మాకు దాపురించకుండుగాక!

తేన–ఈ తీరుగా మమ్మల్ని ప్రార్థించడం, ఒప్పుకోవలసిందిగా బలాత్కరించడం ద్వారా సత్యవాదినం పితరం న – అవమన్యస్వ – మా తండ్రికి అవమానాన్ని ఆచరించకండి. సః తే కాలః మాభూత్ – ఇలా అవమానాన్ని కల్గించారన్న కోపంతో కూడ మా తండ్రి నీకు యమునివంటివాడు కాకుండుగాక! ఆయన యమునిగా అయిపోగలడు కాబట్టైనా మా తండ్రిని అవమానించకుందువు గాక! మేమంతా పితృరక్షణలో ఉన్న పితృమతులం (తండ్రి జీవించి ఉన్నవాళ్లం) స్వచ్ఛందలం కాము. అందుకనే ధర్మేణ–తండ్రి జీవించి ఉన్న ఆడపిల్లలు ఏ విధమైన అభ్యంతరాన్ని చెప్పాలో అలాంటి అభ్యంతరాన్ని చెప్పడమనే ధర్మం ద్వారా, స్వయంవరాన్ని ఎదురు చూస్తున్నాం. 22. బభంజ–మఱుగుజ్జులుగా చేసేశాడు. 23. సలజ్జాః–తమ శరీరాలు మరో తీరుగా మారిపోయిన కారణంగా సిగ్గు కల్గినవాళ్లై 26. సమాధిం సందధే మఱుగుజ్జులూ ఆడపిల్లలైన తన పుత్రికలంతా ఏం చెప్తారా? అనీ వాళ్ల మాటలని వినాలన్న ఆలోచననీ కలిగినవాడై ఉండిపోయాడు. **(మ.తీ)** సమాధి అనేది మనోవ్యథ పొందిన మనస్సుకి ఊరటని కల్గించే స్థితి.

## ముప్పైమూడవ సర్గము

కన్యలందరి మాటా విన్న కుశనాభుడు, ఓర్పులో ఉన్న గొప్పదనాన్ని చెప్తున్నాడు ఈ సర్గలో 1. ఇచ్ఛతి నిజానికి వాయుదేవుడు కన్యాశతాన్నీ బలాత్కరించడమనేది జరిగిపోయింది కాబట్టి భూతకాలిక క్రియాపదం 'ఐచ్ఛత్' అనేదే శ్లోకంలో ఉండాల్సి ఉన్నా వర్తమాన సామీప్యం (ఇప్పుడే ఇంతకు ముందే జరిగింది) కాబట్టి 'లట్' ధాతురూప ప్రయోగాన్నే చేశాడు.

**మ.తీ :–** ఇచ్ఛతి కోరాడు. ఇలాగే మరికొన్ని చోటుల్లోనూ చూసుకోవాలి. (ప్రత్యవేక్షతే ప్రత్యవైక్షత అశుభం మార్గమ్, బలాత్కార రూపమైన విధానాన్ని.

5. సుమహత్ – సాక్షాత్తు దేవతలలో ఒకడైన వాయుదేవుడు మిమ్మల్ని ప్రార్థిస్తూ బలాత్కరిస్తూ ఉన్నా ఏ విధమైన వికారానికీ లోను కాకపోవడం, శరీరం మండిపోతున్నప్పటికీ క్రోధానికి వశులు కాకుండా ఉండడం అనేది చాల గొప్పది దుష్కరంకూడ. కులం చ – మన కులానికి తగిన పని మీ చేత గుర్తింపబడి చక్కని ఓర్పు పాటింపబడింది. కులాచారకర్మ చేయబడింది.

**మ.తీ :–** క్షాంతమ్, ఓర్పుకలవాళ్లు ప్రదర్శించే గొప్ప ఓర్పు 'ధైర్యం' మీ చేత చూపబడింది. 6 క్షమా – అపరాధాన్ని ఎవరైనా తమ విషయంలో చేస్తే దాన్ని తట్టుకోగలగడం (అపరాధ సహిష్ణుత్వం) దుష్కరమ్ – అంత ఓర్పుగా ఉండడమనేది మరింత అశక్యం. ఎంతటి ఓర్పూ ధైర్యమూనో మీరు చూపింది! దేవతల విషయంలో ఈ ఓర్పుని చూపడం మరింత దుష్కరం. దానిక్కారణం ఆ యా దేవతల శారీరకరూపమూ, మనో గుణాల ఆధిక్యమున్నూ. ఓర్పు అనే అలాంటిదాన్ని మీరు చేయగలిగారు. అపరాధం చేసిన వాని విషయంలో సహించి ఊరుకోవడం 'క్షమ' అయినప్పటికీ ఏదో ఓ శాపాన్ని ఇయ్యడం వంటిది లేకుండా చిత్తసంయమనాన్ని పాటించడమనేది నిజమైన క్షమ. దాన్ని చేశారు మీరు. (స్థానాచ్చ్యావయితుం దేవం రక్షామస్తు తపో వయమ్ – సర్గ 32/శ్లో 20) కుశనాభ పుత్రికలైన వీళ్లకి వాయుదేవుడంతటివాణ్ణైనా శపించగలిగిన సామర్థ్యముందని పై శ్లోకం చెప్తోంది.

అయినా వాళ్లు శపించకపోవడం నిజమైన క్షమ. ఈ క్షమని సర్వత్ర ప్రదర్శించాలి. దేవతల విషయంలో మరింతగా ఆచరించాలి. అలాంటి పనిని కుశనాభపుత్రికలు చేసారు.

**గో.రా :-** రూపం ఐశ్వర్యం నిండిన దేవతల విషయంలో మరో ఆలోచన రాకుండానూ, అలాగని శపించకుండానూ ఉండకుండా అందునా నూరుగురిలో ఏ ఒక్కరూ కూడ ఓర్పుని వ్యతిరేకించకుండానూ ఉండడం నిజమైన క్షమ. ఇది దుష్కరం.

7. దానమ్ – దానం చేస్తే ఏ ఫలం వస్తుందో అది ఓర్పు ద్వారా లభిస్తుంది. తటాక ఆరామాది నిర్మాణమనేది ఏ ధర్మవిధానం క్రిందికొస్తుందో అలా ఓర్పుగా ఉండడమనేది ధర్మాచరణంతో సమానం. ఇదే రీతిగా శ్లోకం చివరివరకూ అన్వయించుకోవాలి. భూమికి సంబంధించిన జగత్తులోని చరాలు అచరాలన్నీ కూడ ఓర్పుతో ఉండడం బట్టే ప్రపంచం నడుస్తోంది. ఏది ఓర్పుని కోల్పోయినా వ్యవస్థ తలకిందౌతుంది.

10. బ్రాహ్మం తపః – బ్రహ్మని ఉద్దేశించి చేసే వైదికమైన తపస్సు

**మ.తీ :-** బ్రహ్మపదార్థవిషయంలో చిత్తైకాగ్రత కలిగి ఉండడమే బ్రాహ్మం. 'మనస్సుకీ ఇంద్రియాలకీ ఏకానుసంధానతని కలిగించి ఏకాగ్రత కలిగి ఉండడమే గొప్పతపస్సు' అని స్మృతి చెప్తోంది. 13.కాలయోగేన– శుశ్రూష సంతృప్తిపూర్వకంగా ముగిసిన కాల సంబంధంతో

**మ.తీ :-** అనుగ్రహింపబడదలిచిన కాలం ప్రాప్తించిన కారణంగా 16.అపతిః – భర్తపోయిన భార్యకూడ 'అపతి' (భర్తలేనిది)కావచ్చు కాబట్టి ఎవనికీ భార్యని కాలేదని ఈ మాట పిమ్మటి వాక్యంలో చెప్పింది. ఆ కారణంగా 'అపతిః' అంటే వివాహం ఇంకా కానిదనేదే ఇక్కడి అర్థం.

**మ.తీ :-** ఒకప్పుడు భర్త ఉన్నదానిని కాను. ఇప్పుడు కూడ ఎవనికీ భార్యని అయ్యుండలేదు. మొత్తమ్మీద నైష్ఠిక బ్రహ్మచారిణినే. (ఆ కారణంగానే ధర్మబద్ధంగా నిన్ను యాచిస్తున్నాను నీ వంటి తపోమహిమ కల పుత్రుణ్ణి ఈయవలసిందని) 17.బ్రహ్మ దత్త ఇతి–తపోయోగ కారణంగా (బ్రహ్మ) ఈయబడిన వాడు (దత్తః) కాబట్టి బ్రహ్మదత్తుడు మానసమ్ – మనస్సుతో సంకల్పించగా ఆ సంకల్పమాత్రంతోనే కలిగిన పుత్రుడు మానసుడు. 20. రాజా – లోకాన్ని (ప్రజని) రంజింపచేసేవాడు. 22.పాణౌ 'నూరుగురు కన్యల చేతులనీ స్పృశించగానే' (పాణిగ్రహణం చేయగానే) అనేదే అర్థమైనా 'పాణౌ' అని ఏకవచనాంతాన్ని ప్రయోగించడం జాత్యైకవచనం. వికుబ్జాః – (పోయిన) విగత ముఱుగుజ్జుతనం (కుబ్జ) కలవాళ్లై

**మ.తీ :-** బ్రహ్మదత్తుని బ్రహ్మతేజస్సంపద ఏదుందో అదే ఈ వికుబ్జత్వానికి కారణం. అంతేకాదు. చూళిపుత్రుడైన బ్రహ్మదత్తుని స్పర్శకారణంగా తమలో ప్రవేశించిన తపశ్శక్తి ద్వారా కుబ్జాత్వం తొలగిపోవడమే కాక నూతన శరీరకాంతి కూడ నూర్గురికీ లభించింది. అందుకే వాళ్లంతా 'బభుః పరమయా లక్ష్మ్యా' అతిశయించిన కాంతితో ప్రకాశించారు. శాపం వల్ల నష్టపోయిందేమీ లేదు.

21. పరమప్రీతః – కుబ్జాత్వం ఏ ఒక్కరికో కాక అందరికీ తొలగిపోయింది. అనుకూలవరుడు లభించాడు. కన్యలందరి దుఃఖం ఒక్కమాటు పటాపంచలయింది. వాయుదేవునికి గర్వభంగంతో పాటు పాఠం తెలిపినట్లైంది.

బ్రహ్మదత్తుని తపఃకారణంగా కన్యలకి పూర్వకాంతికంటె ఎక్కువ శరీరకాంతి లభించింది. క్షమలోని గొప్పదనం తన పిల్లలకీ లోకానికీ తెలిసింది. తన మనోవ్యథ తీరింది. అందుకని పరమప్రీతుడై మానసికానందాన్ని తిరిగి తిరిగి (పునఃపునః) పొందాడు.

## ముప్పైనాల్గవ సర్గము

మధ్యలో వచ్చిన కథని ముగించి ప్రస్తుతకథలో మిగిలిన అంశాన్ని పూర్తిచేస్తున్నాడు మహర్షి ఈ సర్గలో 7. భర్తార మనువర్తినీ – భర్తని అనుసరించడమనే ధర్మానికి కట్టుబడిన కారణంగా ఆ ధర్మప్రభావం వల్ల ఆమె స్వర్గానికి వెళ్లనూ వెళ్లగలిగింది. మహానదిగా కానూ కాగల్గింది. 10. నియమాత్ – యాగానికుండే నియమాల కారణంగా 13. గతోఽర్ధరాత్రః–రాత్రిభాగంలో ఎంతసేపు మేలుకోవచ్చునో ఆ కాలం దాటింది. అయితే మాత్రం జాగరణం కూడదా? అంటే రేపటి రోజున వెళ్లవలసిన మార్గ ప్రయాణంలో నేటికాలపు నిద్రాభంగకారణంగా నైన శ్రమా, దానివలన విఘ్నమూ ఉండకూడదు కాబట్టి నిద్రపోవలసిందే.

14. నిష్పందాః – పక్షిసంచారం లేని కారణంగా చెట్ల కదలిక లేదు. నిలీనాః – నిద్రలోకి జారుకున్నాయి (మృగాలూ పక్షులూ) నైశేన తమసా – రాత్రికి సంబంధించిన చిరుచీకటి ప్రారంభంతో పూర్ణిమనాడు యజ్ఞాన్ని ముగించి ఆ మీదటి విదియనాడు ప్రయాణమంటూ నాలుగు గడియకాలంలో చంద్రోదయమని చెప్తున్న కారణంగా అర్ధరాత్రశబ్దం ఇక్కడ ప్రదోషకాలాన్ని చెప్పేది మాత్రమే.

**మ.తీ :–** అర్ధరాత్రమనే ఇక్కడి పదానికి ప్రదోషకాలమే అర్థం. కానినాడు 'శనైర్వియుజ్యతే సంధ్యా.....' అనే తరువాతి వాక్యం దెబ్బతింటుంది. 19. బ్రహ్మోపమాః – చతుర్ముఖుడైన బ్రహ్మతో సమానులు.

**మ.తీ :–** బ్రహ్మర్షులతో సమానులు. 21. శ్రీమాన్ – తన చరిత్రని విన్న మహర్షులందరూ ఆనందపడి ప్రశంసించిన కారణంగా కల్గిన హర్షం వల్ల పుట్టిన కాంతిగలవాడు. 22.

**మ.తీ :–** హే మహాయశః! – ఓ మహాకీర్తిమంతుడా! విశ్వామిత్రా! నీవే మహాత్ముడివి. దానిక్కారణం బ్రహ్మర్షిత్వాన్ని పొందగలిగావు కాబట్టి. పైగా నీ సోదరి కులద్యోతకరి (కులాన్ని ఉద్ధరించగలిగిన ఉత్తమురాలు) కాగలిగింది కూడ. కాబట్టి మీ యిరువురూ ఉన్నతులే. మీ కుశికవంశమే గొప్పది.

కించిదాగత విస్మయః – నిద్రా పారవశ్యం కారణంగా కొంతమాత్రమే ఆశ్చర్యాన్ని ప్రకటించాడు రాముడు. నిద్రాం సముపసేవతే – ఎంతో దూరం నడిచి నడిచి ఉన్న కారణంగా ఆ శ్రమతో చక్కగా నిద్రపోయాడు. (నిజానికిది భూతకాలమే అయినా ఇక్కడ ఆత్మనేపదికి సంబంధించిన లట్‌రూపప్రదర్శనం జరిగింది.

## ముప్పైయైదవ సర్గము

తన పాదం నించి పుట్టిన గంగావైభవాన్ని లోకానికి చాటేందుకై రాముడు విశ్వామిత్రుణ్ణి ప్రశ్నిస్తున్నాడు. గంగకథని గూర్చి. 3. గాధః – నీళ్లు తక్కువగా కలిగి ఉన్నది ఆ కారణంగా ఇసుకమేటలతో కూడి కన్పిస్తున్నది (పులిన మండితః). (మ.తీ) శుభజలః = అగాధః – ఈ శోణదేశం చక్కని నీటితో పవిత్రమైన జలాలతో నిండినది. ఇక ఈ గంగని గూర్చి నువ్వడిగిన ఈ ప్రశ్నబీజం మరింత అగాధమైనది కూడ.

1. ఉపాస్య రాత్రి శేషం తు ..........నిశాయామ్ – (నిశాయామ్) రాత్రి యందు, (రాత్రి శేషమ్ తు) రాత్రిలో మిగిలిన భాగాన్ని (ఉపాస్య) నిద్రతో గడిపి (తెలవారు జామున విశ్వామిత్రుడు మాట్లాడ ప్రారంభించాడు.) రాత్రి శేషమ్ – ప్రతినాటి రాత్రికీ మిగులుభాగమైన బ్రాహ్మముహూర్త కాలంలో ఉపాస్య – పరమాత్మని ఉపాసించిన (విశ్వామిత్రుడు ఇలా మాట్లాడ ప్రారంభించాడు. బ్రాహ్మముహూర్తకాలంలో నిద్రలేచి పరమేశ్వరుణ్ణి సేవించాలనేది స్మృతి కాబట్టి తదనుగుణంగా విశ్వామిత్రుడు చేశాడు. ఆ మీదట మాటలాడ ప్రారంభించాడు. శోణప్రదేశంలోని నది నీళ్లు లేక స్వల్పజలంతో ఉన్న కారణంగా రామలక్ష్మణులకి నావనెక్కాల్సిన అవసరం లేకపోయింది.

**మ.తీ :–** రాత్రి శేషమ్ మిగిలిన రాత్రి భాగాన్ని నిద్రతో గడిపి (నిద్రామ్ ఉపగమ్య), అనేది ఒకర్థం. రాత్రిశేషమ్ – రాత్రికి మిగులు భాగమైన ప్రాతస్సంధ్యాకాలంలో, ఉపాస్య – వచ్చే నిద్రని దూరంగా తొలగించి (మేల్కొని) సుప్రభాతకాలంలో (తెల్లగా తెల్లారిన తర్వాత) విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో ఇలా అన్నాడనేది శ్రుతి దానికనుకరణమే స్మృతి. 7. ఆవాస పరిగ్రహమ్ – చీపురు మొదలైన వాటితో నేలని తుడిచి పరిశుభ్రం చేసి ఉండడానికి వీలైనదిగా ఆ భూమిని చేశారు రామలక్ష్మణులు ఋషులు. 8. యథా న్యాయమ్ – స్నానం చేసే సందర్భంలో ఏ అఘమర్షణ సూక్తమూ మొదలైన వాటిని పఠించాలో జపపూర్వకంగా ఏ సూక్తాన్ని సేవించాలో అలా చెయ్యడం. సంతర్ప్య పితృదేవతాః – పితృదేవతలని కూడ తృప్తిపఱచి (ఋషులెందరున్నారో వాళ్లకి కూడ ఈ మాట ఉపలక్షణం – అంటే – సూచకం అన్నమాట) అగ్నిహోత్రాణి – పంచ మహాయజ్ఞాలనీ యజ్ఞంలో ఏ అగ్నిలో ఏ హోమద్రవ్యాలని వేసి హుతం చెయ్యాలో ఆ పిమ్మట అమృతంతో సమానమైన ఏ హవిస్సుని (యజ్ఞంలో వేయగా మిగిలిన అన్నం) స్వీకరించాలో అలా చేసారు రామలక్ష్మణులు. యజ్ఞంలో హోమం చెయ్యగా మిగిలిన ద్రవ్యం అమృతంతో సమానం కాబట్టి అలాటి యజ్ఞశిష్టామృతాన్ని స్వీకరించిన వాళ్లు సనాతనమైన బ్రహ్మని చేరతారని స్మృతి చెప్తోంది.

**మ.తీ :–** అమృతవత్ – 'అమృతంతో సమానమైన, పంచయజ్ఞాలూ ముగించగా మిగిలిన అన్నాన్ని అమృతంతో సమానమైన గంగాజలాన్నీ హవిస్సునీ స్వీకరించి' అని అర్థం. 13. ధాతూనామ్–ఇనుము రాగి మొదలైన లోహాలక్కాడ,

**మ.తీ :–** బంగారమూ మొదలైన ధాతువుల క్కాడ (హిమాలయ పర్వతము నిలయము) 16. దేవతార్థ చికీర్షయా – దేవతలకి ప్రయోజనాన్ని చేకూర్చాలనే ఉద్దేశ్యంతో (అది స్నానపానాది ప్రయోజనం కావచ్చు దానితోపాటు రాబోయే కుమారస్వామి – దేవసేనాపతి – జననం కావచ్చు. ఇవన్నీ ఇలా ఉండగా పరమదేవతార్చనం కోసమూ కావచ్చు. త్రిపథగామ్

**మ.తీ :–** స్వర్గం – భూమి – పాతాళ మార్గాల్లో ప్రవహించిన గంగను 17. స్వచ్ఛంద పథగామ్ – ఆకాశంలో గంగ ఎలా ప్రవహిస్తుంది? అన్నదానికి సమాధానంగా చెప్పబడుతున్న మాట ఇది. తన ఇచ్ఛకి అనుగుణంగా తన ప్రవాహదిశను ఓ మార్గంగా చేసుకుని వెళ్లిన గంగ – అని అర్థం. మేఘజలంలాగా ఇక్కడికీ అక్కడికీ తరలివెళ్లి ఆకాశంలో స్వేచ్ఛాగమనం కలదయింది.

**మ.తీ :-** తాను ప్రవహించిన త్రోవయే తనకు మార్గంగా కలిగినది. అడ్డూ ఆపూ లేనిది, ఈ త్రోవలోనే ప్రయాణించాలనే నియమం తన విషయంలో చేయబడనిదీ లొంగనిదీ. ధర్మేణ తాను చేసుకున్న సుకృతం కారణంగా 19. కన్యా – భర్తని ఇంకా పొందని ఆడుది. 20. అప్రతిరూపాయ – తన కూతురైన ఉమ ఆలోచనలకి ప్రతిరూపం (వ్యతిరేకం) కాక అనుకూలుడైనవానికై 23. విపాపా – లోకాల్లో ఉండే జనులందరి పాపాలనీ తొలగించేదౌతూ (లోకంలోని జనుల పాపాలని తొలగించేదౌతుంటే ఇక తన పాపాల పరిస్థితి గురించి చెప్పాలా? అసలు ఆమెకి పాపాలనేవి ఎలా ఉంటాయి?)

## ముప్పైయారవ సర్గము

1. దివ్యమానుష సంభవమ్ – దేవలోకంలోనూ మానవలోకంలోనూ కూడ పుట్టడం (ఒకే ఆమె రెండు లోకాల్లో పుట్టడం ఎలా సాధ్యం?) 3. నిఖిలేన – (మ.తీ) కుతూహలాతిశయంతో వివరంగా ప్రశ్నించిన రామలక్ష్మణులకి విస్తరంగా కాకుత్స్థ అనే పదం రామునికే కాక లక్ష్మణుని క్కూడ ఉపలక్షకం. 5. స్పృహయా – మహాతపోనిష్ఠలో ఉన్నప్పటికీ మన్మథబాణవశం కారణంగా 6. తనయః – తనయుణ్ణి పుట్టించడానికి అవసరమైన రేతః విసర్జనం 8. ప్రణిపాతేన – పాదములయందు పడడం చేత (శిరసువంచి పాదనమస్కారం చేయడం చేత) 10. తేజః తేజసి – రేతస్సుని తేజోమయ నిజశరీరంలో (ధరించు) 14. ధరా – అన్నింటినీ తనలో ధరించగల శక్తి కలిగినది (కాబట్టే తేజస్సుని ధరించవలసిందిగా ప్రార్థన). 16. తతః – (పృథివిలో ఆ తేజస్సు వ్యాపించిన పక్షంలో ఎక్కడ నేల పగిలిపోతుందోననే భయంతో) ఆ మీదట 16. పునః ఊచుః – మళ్లీ దేవతలు చెప్పారు (అగ్నికి కూడా భయం కలిగిన కారణంగా నచ్చజెప్పేందుకై తిరిగి హెచ్చరించారు). 17. శరవణమ్ – (శర–వనమ్) రెల్లుతో బాగా నిండిన వనం కార్తికేయః – కృత్తికలైన ఆరింటికీ సంతానమైనవాడు. స్తన్యాన్ని ఈయడం ద్వారా కృత్తికాపుత్రత్వం, అగ్నిచేత కొంతసేపు ధరించబడి విడువబడ్డ కారణంగా అగ్నిసంభవుడు. ఈ అన్నీ కార్తికేయుని పేర్లే. 20. సంగతిః–భర్తతో సంయోగించడం (మైథునం) 22. నైకరూపా (న–ఏకరూపా) ఒక్క రూపంతో మాత్రమే ఉండకుండా చవిటినేల, మాగాణి నేల, ఇసుకనేల, గంద్రనేల......అని ఈ తీరుగా అనేక విధాలుగా ఉండుట. 26. హిమాలయుని జ్యేష్ఠపుత్రిక అయిన గంగాదేవీవృత్తాంతాన్ని మాత్రమే చెప్పవలసిందని అడిగితే ఆ వృత్తాంతాన్ని విడిచి ఆయన ద్వితీయపుత్రిక అయిన పార్వతీవృత్తాంతాన్ని ఎందుకు చెప్తున్నారనే రామునిలో అనుమానాన్ని నివారణ చేస్తూ, రాబోయే గంగావైభవకథకి ఇది ఉపయోగపడుతుందనే అభిప్రాయంతోనే పార్వతీవృత్తాంతం చెప్పబడిందని చెప్తున్నాడు. ప్రభవమ్ – ప్రభవమ్.

**మ.తీ :-** ప్రభవ శబ్దానికి ప్రభావమనే అర్థం నిజానికి రాదు. ప్రభావమనే పదంలోని దీర్ఘం లేక 'ప్రభవ' మనే ఉచ్చరించడానిక్కారణం వైదికచ్ఛందః ప్రకారం చేయబడిన హ్రస్వతయే. గంగాయాః ప్రభావమ్ – ఈశ్వరుని తేజస్సుని తనలో ఆ గంగ ధరించిన కారణంగా ఏర్పడిన ప్రభావము.

## ముప్పైయేడవ సర్గము

కుమారస్వామియొక్క పుట్టుకకి సంబంధించిన 'దివ్యసంభవవైభవం' ఈ ముప్పది యేడవ సర్గలో చెప్పబడుతోంది.

**మ.తీ :-** 1. తతోఽబ్రువన్ సురాస్సర్వే....అనే చోట 'సురా స్సర్వే.....' అని ఉండడం పునరుక్తిగా కన్పిస్తోంది. దీనికి మరోపాఠం ఉండాల్సిందే. 'సురా రామ!' అని ఉండడం సబబు. 'రామ!' అనేది సంబోధన వాచక శబ్దం. 5. అక్లిష్టమ్ – అమోఘం. 6. మానయిష్యతి – బహుమతి పూర్వకంగా కలిగిస్తుంది. 9. దైవతాః – దైవతశబ్దం నపుంసకలింగం గానే (దైవతాని) కాక పుంలింగం గానూ ఉంది. 15. సర్వ దేవ హుతాశనః – యజ్ఞాదుల్లో సర్వదేవతల తృప్తికై ఏది హెూమం చేయబడిందో దాన్ని స్వీకరించేవాడు (హుతమ్ హెూమం చేయబడిన దానిని, అశనః–ఆహారంగా స్వీకరించేవాడు) 17. హిరణ్య మమలమ్ – స్వచ్ఛమూ శుభమూ అయిన బంగారమూ వెండి. ('స్వచ్ఛమైన' అనే విశేషణం కూడ కావచ్చు 'అమలమ్' అనే పదం) 18. కార్ష్ణాయసమ్ – కృష్ణాయసమే కార్ష్ణాయసం త్రపు – తగరం సీసమ్ – సీసం 21. జాతరూపమ్ – (జాతం రూపం యస్య) పుట్టిన తోడనే అగ్నితో సమానమైన కాంతిని పొందడం, నిక్షిప్తమాత్రం చేతనే ఆ తేజస్సుతో వనం వనమంతా సువర్ణమయం కావడంతో జాతరూపమంటే బంగారం అయింది. 28. అజయత్ – ఒక్క రోజున మాత్రమే ఆరు కృత్తికలకీ పుట్టిన స్తన్యాన్ని (చనుబాలని) తాగి సుకుమారశరీరం కలిగినవాడైనప్పటికీ రాక్షసగణాన్ని జయించాడు.

**మ.తీ :-** ఆరు ముఖాలతోనూ రాక్షసగణాన్ని జయించడానికి ఎంత క్షీరం అవసరమో అంతా ఒక్కరోజులోనే గ్రహించిన కారణంగానూ ఆత్మతేజస్సుతోనూ జయించాడు కార్తికేయుడు 31. ధన్యః, పుణ్యః, సాలోక్యమ్ – గంగాకథని చెప్పాను ఇది ధన్యమూ, పుణ్యమూ, అంటే దీనిని వినడం వల్ల ధన్యతా, పుణ్యమూ కల్గుతాయని భావం. ఆ ధన్యత్వపుణ్యత్వాలు సాలోక్యం వల్ల కల్గుతాయి. సలోకమే సాలోక్యం సమాన లోకం సలోకం. స్కందునితో సమానలోకత సాలోక్యం.

**మ.తీ :-** దేహత్యాగం ద్వారా.

## ముప్పైయెనిమిదవ సర్గము

1. అప్రజః – సంతానం అప్పటి వరకూ లేనివాడు.

**మ.తీ :-** గంగమ్మ మూడు త్రోవలుగా ఎలా వెళ్లిందన్న ప్రశ్నకి సమాధానం చెప్పనారంభించాడు. 7.

**మ.తీ :-** వంశకరమ్ – కులాన్ని అవిచ్ఛేదంగా చేయగలవానిని 16. గర్భతుంబమ్ – వృత్తాకారమైన గర్భపిండం. పిల్లలు ఎలా కలిగారనే దానికి సమాధానంగా 'ఆ తుంబం పగలడం వలన' అని చెప్పాడు. దీన్ని బట్టి గాంధారికి కలిగిన మాంసపేశలాన్ని విభజించినట్టే పిమ్మట కాలంలో విభజించాల్సి ఉందని గమనించాలి. 19. జ్యేష్ఠుడు అసమంజుడు.

**మ.తీ :-** ఈ అర్థాన్ని చెప్పే అసమంజశబ్దం అదంతమూ – సాంతమున్నూ అని తెలుసుకోవాలి.

## ముప్పైతొమ్మిదవ సర్గము

2. ప్రహసన్నివ – (తనకి కావలసిన విషయాన్నే అడిగాననీ, ఆ విషయాన్నే విశ్వామిత్రుడు చెప్పబోతున్నాడనీ తెలిసి ప్రసన్నవదనుడై, తనకి తెలిసిన విషయమే అయినా తెలియనివానిలా అడిగినందుకూ, విశ్వామిత్రుడు

చెప్పబోతున్నందుకూ) నవ్వుతున్నట్లు తెలియని నవ్వుని నవ్వాడు రాముడు. 3.నిరీక్షేతే – వింధ్యపర్వతమూ అలాగే హిమాలయమూ అనే రెండు పర్వతాలకీ నడుమ ఏమీ అడ్డులేని కారణంగా పరస్పరం ఎదురుబదురుగా చూస్తూ ఉండిపోయాయి. వింధ్య హిమాలయాల మధ్య భూమిని 'ఆర్యావర్త' మంటారు. (ఆర్యావర్తః పుణ్యభూమి ర్మధ్యే వింధ్య హిమాగయోః). అందుకే ఆ ప్రదేశంలోనే యజ్ఞం చేయాలని తలపెట్టి అక్కడే చేసారు. 2. ప్రహసన్నివ–

**మ.తీ :–** తన పూర్వుల వృత్తాంతం కాబట్టి మిక్కిలి కుతూహలంతో తానడగగానే విశ్వామిత్రుడు కూడ విస్తరంగా చెప్పబోతున్నాడనే ఆనందంతో నవ్విన నవ్వులాంటి నవ్వు. 3. నిరీక్షేతే – యజ్ఞకర్మల్ని నిర్వర్తించేంత గొప్పదనం కలవాళ్ల మనే అభిప్రాయంతోనూ, తమ మధ్య ఏ అడ్డూ లేని కారణంగానూ ఆ ఔన్నత్యాతిశయంతో వింధ్య హిమాచలాలు రెండూ పరస్పరం తమ ఉచ్ఛస్థితితో సమత్వాన్ని పొంది చూసుకుంటున్నాయి. 10. ఉపాధ్యాయ వచః –

**మ.తీ :–** ఉపాధ్యాయులతో కూడిన ఋత్విగ్గణం. 9. యజ్ఞచ్ఛిద్రమ్ – యజ్ఞానుష్ఠానంలో లోపం లేదా యజ్ఞాపరాధం (వైజయంతీ నిఘంటుప్రకారం ఛిద్రపదానికి రంధ్రం అపరాధమని అర్థాలు) 12. గతిం న పశ్యామి– మంత్రపూర్వక అనుష్ఠానకారణంగా రాక్షసుల రాకకి అవకాశమే లేదు. వారి రాక ప్రసక్తే లేదు. నేను కర్మవ్యగ్రుడిని కాబట్టి నేను ఈ ప్రదేశాన్ని విడిచిపోలేక, అశ్వాన్ని అపహరించిన రాక్షసుల నివాసాన్నీ లేదా రాక్షసులు వెళ్లిన ప్రదేశాన్నీ తెలుసుకోలేకపోతున్నాను.

**మ.తీ :–** రాక్షసమాయ కారణంగా యజ్ఞం భంగమైతే నాకు ఏ గతో అర్థం చేసుకోలేకపోతున్నాను (ఊహించలేకపోతున్నాను). రాక్షసులు రాలేరు – రారు కాబట్టి ఏ దేవునిచేతనైనా అపహరింపబడిందేమో వెతకండి. 12. సముద్రమాలినీమ్ – సముద్రమే మాల (ఆవరణం అంతం) గా కలది ఏదో అది, దానిని 16. ఆయామః – పొడుగూ, విస్తారః – వెడల్పూ. యోజనా యామ విస్తారమ్ – ఒక్కొక్క యోజనం పొడుగూ వెడల్పూ కల భూమిని (ఈ కారణంగానే వాళ్లు అరవైవేలమంది కాబట్టి అరవైవేల యోజన చతురస్రపరిమాణ భూమిని తవ్వాల్సి వచ్చి తవ్వగలిగారు. యోజనానాం సహస్రాణి షష్టిం తు......19వ శ్లోకం ఈ విషయాన్నే చెప్తోంది). 18. దుర్ధర్షః – దుర్భరమైన.

## నలభైయవ సర్గము

1. కృతాంత బల మోహితాన్ – జననాశాన్ని ఎవరు చేశారో వాళ్లు కృతాంతులు (కృతాంతులు (కృతః అంతః జననాశః యైః తే సగరపుత్రాః) తద్బలమోహితులను

**మ.తీ :–** దైవబల మోహితులను 2. వినాశోఽదీర్ఘ జీవినామ్ – వినాశః అదీర్ఘ జీవినామ్ – ఎక్కువకాలం జీవించని ఆ పుత్రుల యొక్క వినాశము (మరణము) 3 త్రయస్త్రింశత్ – ఎనమండుగురు వసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశ ఆదిత్యులు, అశ్వినీదేవతలు (8+ 11+ 12+ 2) – 33. గంధర్వాదులక్కూడా ఇది ఉపలక్షణం. 4. నిర్ఘాత సమ నిస్వనః

**మ.తీ :–** ఉత్పాతం (పిడుగుపాటు) పడేప్పటి ధ్వనితో సమానం 'నిర్ఘాతనిస్వనసమం' అన్నమాట 6. బుద్ధిః ఉపాయము 'కరిష్యామేతి' అన్నచోట 'కరిష్యామః ఇతి' అనే ఉండాలి నిజానికి. ఇక్కడ విసర్గలోపం ఆ మీదట గుణ

సంధి చెయ్యడం వైదికచ్ఛందస్సుకి అనుగుణంగానే. 8. సమన్యుః – గుఱ్ఱం దొరకలేదనే కారణంగా కల్గిన కోపం కలవాడు. 14. మానయంతః – పూజించుచున్నవారై. 17. దిశమ్ – దేశాన్ని 21. సమాలభ్య – స్పృశించి. 23. కపిలమ్ – కపిల అవతారమూర్తిని

**మ.తీ :–** కపిలునిగా వేషాన్ని వేసుకున్న వానిని 24. చరంతమ్ – గడ్డిని మేస్తున్న 26. జ్ఞాత్వా –

**మ.తీ :–** ఏ మాత్రపు ముందు వెనుక ఆలోచనలూ లేకుండా గుఱ్ఱాన్ని అపహరించినది ఇతడే అని అర్థం చేసుకుని (భ్రాంతిపడి)

## నలభైయొకటవ సర్గము

1. నప్తారమ్ – పుత్రునికి పుత్రుడైన పౌత్రుని (మనుమని) అపవాహితః దొంగిలించబడినది. మరొక ప్రదేశాన్ని పొందినది 2. అంతర్భౌమాని – భూమిలోపలి భాగంలో పుట్టినవి లేదా భూ బిలాన్ని ఆశ్రయించినవి 3. పారగః – అంతు చూడగలవాడు లేదా పూర్తి చేయగలవాడు 5. పితృభి ర్మార్గమ్ – తమ తండ్రులు తవ్విన భూమిలో ఉన్న మార్గాన్ని 10. వాక్యకోవిదైః – కాలాన్ని బట్టీ ప్రదేశాన్ని బట్టీ దానికి తగ్గట్టుగా మాట్లాడడం తెలిసిన వాళ్ల చేత – లేదా – తమంత తాముగా తగినట్లుగా మాట్లాడగల శక్తి ఉన్న వాళ్లచేత 10. అభిచోదితః – బోధింపబడ్డాడు. 19. స్వర్గలోకం నయిష్యతి – మనుస్మృతి మొదలైన స్మృతిగ్రంథాల అవసరమే లేదనే విషయం ఈ సందర్భంలో ఈ ఘట్టానికి మాత్రమే చెప్పబడుతోంది. ఎందుకని? నిజంగా జరుగరాని విధంగా మరణం పొందినవాళ్లకి ప్రాయశ్చిత్తం చేయవలసి ఉన్నా అలాటి పాపుల భస్మరాశులకి గంగాజలస్పర్శ కలిగినట్లైతే సర్వపాపప్రాయశ్చిత్తమౌతుందని దీని ఆంతర్యం. అంతేకాదు. ప్రాయశ్చిత్తాన్ని చేయించకుండా ఎవరినైనా అలా ఉంచేసి ఉండి ఉంటేనూ, మహా పాతకం చేసిన కారణంగా మహాపాతకులు అయ్యుంటేనూ కూడ (అలాంటివాళ్లకి ఏ విధమైన ఔర్ధ్వదైహిక క్రియలనీ చేయనవసరం లేని కారణంగా అలా పడి ఉన్నవాళ్లకీ) గంగాజలం గాని వాళ్ల భస్మరాశుల్ని ఒక్కసారి స్పృశించినట్లైతే ఏ విధమైన మరో ప్రాయశ్చిత్తమూ లేకుండానే వాళ్లంతా ఊర్ధ్వలోకాలకి వెళ్లే పుణ్యాన్ని సంపాదించుకున్న కారణంగా ఊర్ధ్వలోకాలకి వెళ్లే అర్హతని పొంది తప్పక వెళ్తారనే మహా విషయం ఇక్కడ సూచింపబడింది. 20. సంవర్తయితుమ్ – పూర్తి చేయడానికి 24. నిశ్చయమ్ – ఉపాయం.

## నలభైరెండవ సర్గము

1. కాలధర్మమ్ – పుట్టిన ప్రతివ్యక్తీ తన కాలం తీరబోయే వేళ పొందవలసిన (మరణ) ధర్మం ఏదో అది కాలధర్మం ప్రకృతీ జనాః – మంత్రులు. ఇక్కడ 'ప్రకృతి జనాః' అనే అనడం సరైనది. దీర్ఘం వైదికచ్ఛందోనుగుణమని గ్రహించాలి. రోచయామాసుః – (న్యాయపూర్వకంగా వచ్చింది కాబట్టి లోకులంతా అంగీకరించి ఇష్టపడి) కోరుకున్నారు. 4. దుఃఖోపహతయా బుద్ధ్యా – తన తండ్రి అంతటి తపస్సుని చేసినా కూడా పితరులకి గతి లేకపోయిందనే దుఃఖపూరిత ఆలోచనతో

**మ.తీ :–** 8. వ్యాధినా–తన పితరులని ఉద్ధరించలేకపోయాననే మానసిక దుఃఖంతో కూడిన మనోవ్యాధితో (మరణించాడు.) ఈ కారణంగా దిలీపవంశంలో రఘుమహారాజుకి తండ్రిగా ఉన్న దిలీపుడూ, ఈ అంశుమంతుని కొడుకైన దిలీపుడూ వేర్వేరని భావించాలి. దిలీపుని పుత్రుడు రఘువంటూ కాళిదాసు తన రఘువంశమహాకావ్యంలో

వివరంగా చెప్పాడు. 11. పంచతపా మాసాహారః – నాలుగు దిక్కులా నాలుగు అగ్నులూ, ఆ మధ్యలో ఆకాశంలో సూర్యుడూ కలిపి మొత్తం అయిదగ్నులూ పంచాగ్నులు. అక్కడ తపస్సు చేయడం పంచతపం. 'పంచ అగ్ని మధ్య తపం' అని దీని అర్థం. 'పంచ' అనేది పూర్వపదం. 'అగ్నిమధ్య' అనేది మధ్యమపదం. 'తపం' అనేది ఉత్తరపదం. సమాసం చేసినప్పుడు మధ్యమపదమైన 'అగ్నిమధ్య' అనేది ఓ వ్యాకరణ సూత్రం చేతలోపించే కారణంగా 'పంచతపం' అని ఔతుంది/సమస్తదశలో (సమాసం చేసినప్పుడు) లోపించిన పదం తన అర్థాన్ని పూర్వపదానికి అందించి ఆ మీదటే తాను లోపిస్తుంది కాబట్టి 'అగ్నిమధ్య' అనే పదం లోపించినా 'పంచతపం' అనే వ్యవహరిస్తున్నా, అర్థం చెప్పుకోవలసి వచ్చినపుడు మాత్రం 'పంచ అగ్నులమధ్య తపస్సుని చేసినవా' డనేదే అర్థం ఔతుంది. ఇలాంటిదే మాస+ఆహారః అనే సమాసం కూడ. మాసానికి ఒక్కసారి మాత్రమే ఆహారం ఎవడికి (ఉంటుందో వాడు మాసాహారుడు)

**మ.తీ :–** మాసం గడిచిన వెంట ఆహారాన్ని తినేవాడెవడో అతడు మాసాహారుడు. 16.మహాతేజాః – తపస్సు చేసిన కారణంగా లభించిన నిరవధిక తేజస్సు కలవాడు 17.యది మే భగవన్ ప్రీతః – (వేదాలే ప్రమాణమయ్యింటే ........అని ఒకప్పుడు (కుమారిలభట్టు) అన్నట్టు ఇక్కడ కూడ ఈ గంగాజలం అలా స్పృశించిన మాత్రం చేతనే మా పితరులంతా స్వర్గానికి వెళ్లారు. నిజంగా నా ఆరాధ్యదైవం ప్రీతుడైనట్లైతే ........అనే ఈ మాట సందేహం లేదని చెప్పడంలో సందేహాన్ని వ్యక్తీకరించేదౌతోంది. 18.అత్యంతమ్– అక్షయంగా 19.వరః పరః–

**మ.తీ :–** (ఇక్ష్వాకుకులంలో పుట్టిన నాకు ఇది) మరో వరం అగుగాక! (మూడవ వరాన్ని అడగను) మొత్తానికి భగీరథుని ఈ ప్రయత్నం వల్ల తన పితరులు స్వర్గానికి వెళ్లారు. తన తరవాత వంశం అడ్డూ ఆపూ లేకండా నిరంతరాయంగానూ వృద్ధిచెందుతుంది. ఇలా పూర్వ పర ఉపకారి భగీరథుడు. 23. నాన్యం పశ్యామి శూలినః–

**మ.తీ :–** (అన్నింటినీ ధరించగలిగిన శక్తి ఉన్నది కాబట్టే పృథివిని 'ధరా' అన్నారు. అలాంటి 'ధర' కూడ హిమవంతుని జ్యేష్ఠ పుత్రిక అయిన గంగని ధరించ శక్తురాలు కాదు కాబట్టి, పృథివీ స్థానంలో శంకరుణ్ణి నిలబెట్టవలసిందే) అతడు తప్ప మరొకరు సమర్థులని నేను భావించడం లేదు. దీన్ని బట్టి భూమి భరించలేనిదాన్ని కూడ శంకరుడు భరించగల శక్తి ఉన్నవాడని తెలుస్తోంది.

## నలభైమూడవ సర్గము

గంగానదీ జలంతో తడిసిన కారణంగా సగరపుత్రులంతా స్వర్గానికి వెళ్లడమనే వృత్తాంతం ఈ సర్గలో ఉంటుంది. 1. ఉపాసత–ఉపాసించాడు. (సంవత్సరకాలంపాటూ ఉపాసిస్తూనే ఉన్నాడు). 5. అవలేపనమ్ – గర్వం. 8. అబంభ్రమత్ – తిరిగి తిరిగి అక్కడే అక్కడే గిరగిరా సుడులు తిరిగింది. 10.సప్తస్రోతాంసి –త్రిపథగా హ్లాదినీ పావనీ నలినీ అనేవి తూర్పు దిక్కుగా ప్రవహించాయి. సుచక్షు సీతా సింధు అనేవి పశ్చిమదిక్కుగా ప్రయాణించాయి. ఇక ఏడవ ప్రవాహం భగీరథుణ్ణి అనుసరించి ప్రవహించింది. ఇలా మూడు దిక్కులకీ ప్రవహించిన కారణంగా 'త్రి–పథ–గ' అని మరికొందరన్నారు. స్వర్గ – ఆకాశ – భూ గమనాలవల్ల 'త్రి–పథ–గ' అని మరికొందరన్నారు. స్వర్గ – ఆకాశ భూ గమనాలవల్ల 'త్రి – పథ – గ' శింశుమారం – మొసలి 22. ఆయతమ్ – తిన్నగా ఋజుమార్గంలో ప్రవహించడం వినతమ్ – పల్లంలోకి నెమ్మదిగా వెళ్లి కుంచించుకుపోవడం

ఉద్భూతమ్ అడ్డుగా ఉన్న రాళ్లని కప్పేందుకై ఊర్ధ్వముఖంగా ప్రవహించడం 24. భవాంగ పతితం తోయం పవిత్రమ్ – (శంకరుని శిరసు మీద పడినా తరువాత భూమికి దిగి వచ్చినా నిర్మలమూ పాపాలని పోగొట్టేదీ (గత కల్మషమ్) అయిన గంగ) శంకరుని తలపై ధరింపబడిన కారణంగా పవిత్రమే. శంకరుని శరీరస్పర్శ కలిగిన కారణంగా గంగ పవిత్రీకరింపబడిందనడం చేత శంకరునికి పవిత్రతని కల్గించే లక్షణమూ శక్తీ ఉన్నది. భాగవత గ్రంథంలో 'పవిత్రమైన ఈ నదీజలాన్ని శిరసున ధరించడం వల్ల శివుడు శివుడయ్యా' డని ఉంది (యచ్ఛౌచ నిస్సృత ......) భారతంలో కూడ గంగాజలాన్ని పడుతున్న దాన్ని చూసి పవిత్రుణ్ణౌతాననే దృష్టితో తన జటలమధ్య శంకరుడు ఆ నదీజలాన్ని ధరించాడని కన్పిస్తోంది. (తదంబు పతితం దృష్ట్వా.....పావనార్థం జటామధ్యే.....) అయోధ్యాకాండలో కూడ విష్ణుపాదాలనుండి పుట్టిన అద్భుత పవిత్రనది గంగ' అని చెప్పబడింది. విష్ణుపాదోద్భవత కారణంగా కలిగిన పవిత్రత లేదా శివుని శరీరం నుండి (శిరస్సు) పడింది కాబట్టి ఆ కారణంగానైనా గంగకి పవిత్రత ఉంది. శంకరుడు ధరించిన కారణంగా మేం కూడ ధరించవలసిఉందనే అభిప్రాయంతో రామలక్ష్మణులు గంగని స్పృశించారు. శ్రీహరి పాదాలనుండి పుట్టిన కారణంగా అతిపవిత్రం అయితే శంకరుని శిరసునుండి పడిన కారణంగా పవిత్రమనే భావంతో స్నానం చెయ్యకుండా కేవలం స్పృశించడం మాత్రమే చేశారు వాళ్లు.

(మ.తీ) పస్పృశుః–స్నానం చేసారు. 37. శ్రోత్రాభ్యామ్ – (గంగ తనకి కూతురుగా లెక్కించబడినందు వల్లనూ, శరీరంలోని సర్వావయవాల్లోనూ చెవి అతి పవిత్రమైన కారణంగానూ జహ్నుమహర్షి) తన చెవులనుండే (గంగని విడిచివేశాడు) 39. భస్మకృతాన్ – భస్మరూపంగా చేయబడిన

(మ.తీ) గంగని జహ్నువుకి కూతురిగా లెక్కించినందువల్లనే ఆమెకి జహ్నుసుత జాహ్నవి అనే పేర్లు వచ్చాయి.

## నలభైనాల్గవ సర్గము

కిందటి సర్గలో సంక్షిప్తంగా చెప్పబడ్డ విషయమే ఇక్కడ విస్తృతంగా చెప్పబడుతోంది. 2.తారితాః – ప్రేతభావం నుండి విడిపింపబడ్డారు. 6.అపవర్జయ – గంగాజల స్పర్శచేత సగరపుత్రులందర్నీ తరింపచేయగలననే ప్రతిజ్ఞని ఇంతతో ముగించు (ముగించినట్టు భావించు) 12.ధర్మస్యాయతనం మహత్ – ధర్మానికి ప్రాప్యమైన స్థానము లేదా గొప్పదైన బ్రహ్మలోకం. 13.ప్లావయస్వ – స్నానం చేయవలసింది. మిగిలిన అన్ని నదులకీ రజోదోషం ఉన్న కారణంగా ఈ నదిలోనే స్నానం చెయ్యి.

**మ.తీ :–** సింహకర్కట లగ్నమధ్య కాలంలో కూడ స్నానాది వ్యవహారాలకి తగినదే అయినా భూమిమీద ప్రవహిస్తున్న కారణంగా భూమికి ఉన్న రజోదోషం ఈ ఇతరనదుల ప్రవాహోదకానికీ సంక్రమించినందువల్ల స్నానాదులకి అర్హమైంది కాదు. ఈ కారణంగా గంగ బ్రహ్మలోకాన్ని కల్గించగలిగిందని భావం. 20. ధన్యమ్ – ధనం మొదలైన వాటిని ఈయగలిగినది.

## నలభైయైదవ సర్గము

ఈ చెప్పబడిన విధంగా జరిగిన పదిసర్గలలోనూ గంగనీ గంగాపుత్రుడైన కుమారుని (కార్తికేయుని)పుట్టుకనీ వర్ణిస్తున్న నెపంతో గంగకున్న పవిత్రతాతిశయాన్నీ ఇతర దేవతలకంటె శ్రీహరి ఎక్కువదనంతో పాటు ఇతరదేవతల

తక్కువదనం చెప్పబడింది. ఇక మీద రాబోయే మూడు సర్గల్లో మహేంద్రుని తక్కువదనం ప్రతిపాదించబడుతోంది. 10.విశాలాం పరిపప్రచ్ఛ – విశాలాదేశపు విషయాన్ని గురించి అడిగారు. 13. శ్రూయతామ్ – ఈ దేశంలో ఏది జరిగిందో దాన్ని విను. దానికి అనుబంధంగా ఇంద్రుని కథని చెప్తున్నాను కాబట్టి దాన్నీ విను. 15. అమరాః–మరణవిధానం కలవాళ్లు మరులు. ఆ లక్షణం లేనివాళ్లు అమరులు. (మ్రియంతే ఇతి మరాః, న మరా అమరాః) 16. రసమ్ – పాలసముద్రాన్ని మథించగా వచ్చే రసమైన అమృతాన్ని. 17. యోక్త్రమ్ – చిలకడానికైన తాడుగా, మంథానమ్ – చిలకడానికైన కవ్వంగా

**మ.తీ :–** 18 వ శ్లోకంలోని 'అథ దేవా మహాదేవం శంకరం శరణార్థినః అనేదీ, అలాగే 'ప్రాదురాసీత్తతోఽత్రైవ శంఖచక్రధరో హరిః' అనేది ప్రత్యేకంగా (దేనికి దానికి) ఒక్కోవాక్యం. శ్లోకంలోని సగాలు కావు. రెండూ రెండు అర్ధశ్లోకాల వంటివి. 23. సురాః – సురను పరిగ్రహించడం చేత సురలు. అసురాః–సురను పరిగ్రహించని కారణంగా అసురులు. 24. వీర! – రాముని గూర్చిన సంబోధనం 29. అక్షయమ్ – ఉన్నది (అస్తి) జాయతే (పుట్టుతున్నది) పరిణామం చెందుతున్నది (పరిణమతే)పెరుగుతున్నది, (వివర్ధతే) క్రమంగా క్షీణించుచ్నుది (అపక్షీయతే) మరణించుచున్నది (వినశ్యతి) అనే ఈ తీరు ఆరింటినీ 'షడ్భావవికారా' లంది శాస్త్రం. ఈ ఆరింటికీ లొంగనివాడూ, ఆరింటిచేతనూ శూన్యుడూ ఎవరో ఆయన అక్షయుడు. అలాంటి అక్షయుని పురుషోత్తమమ్ – సర్వపురుషుల్లోనూ ఉత్తముడైన వానిని

**మ.తీ :–** క్షర అక్షర పురుషులకంటె ఉత్తముడైనవానిని సంపిష్టాః–యుద్ధంలో చూర్ణం చేయబడినవాళ్లు 'సంవిష్టాః' అనే పాఠాంతరం కూడ ఉంది. ఆ పాఠంలో 'ఆవిష్టు' లయ్యారని అర్థం. 31. నిహత్య దితిపుత్రాన్ చ – 'దితిపుత్రులైన రాక్షసులని చంపి' ఇక్కడ 'చ' కారం ఉన్న కారణంగా ఈ 'చ' శబ్దం తరవాతి 'రాజ్యం ప్రాప్య' అనే మాటలకి అన్వయించి 'రాజ్యమూ దానితో పాటు (చ) అమృతాన్ని కూడ పొంది' అనే అర్థాన్ని ఇస్తుంది. (తిలకం) 17వ శ్లోకం చివరి పదాలైన 'మమంథు రమితౌజసః'...అనే చోటి నుండి 31వ శ్లోకం చివరి వరకూ అంటే – ఈ సర్గ ముగింపు వరకూ ప్రక్షిప్తాలే ఈ 13 శ్లోకాలున్నూ. ఈ విషయాన్నే ఎందరో అంగీకరించారు కూడ.

## నలభైయారవ సర్గము

1. మారీచమ్ – నవబ్రహ్మల్లో ఒకడైన మరీచి బ్రహ్మ పుత్రుడైన మారీచుని, దీర్ఘ తపోర్జితమ్ – ఎక్కువకాలం పాటు తపస్సు చేసిన కారణంగా దృఢమైనవాడూ ప్రకాశవంతుడూ అయిన వాణ్ణి 2. అనుజ్ఞాతుమ్ – అనుజ్ఞనీయడానికి (భర్త యొక్క అనుజ్ఞ లేకండా తపస్సు చేయడానికి స్త్రీలకి స్వాతంత్ర్యం లేని కారణంగా) 5. మత్తః – నా అనుగ్రహం కారణంగా 12. యాచితేన (నిత్యం ఇంద్రుడు చేస్తున్న శుశ్రూష కారణంగా వైరాన్ని పూర్తిగా విడిచింది) ఆ కారణంగా యాచింపబడిన నీ తండ్రి చేత, పరిచచార –

**మ.తీ :–** (ఎప్పుడు అశుచిగా ఆమె దొరుకుతుందా? అనే ఎదురుచూపుతో) సేవని ఈ ఆ కాలమనకుండా సర్వకాలాల్లోనూ చేశాడు ఇంద్రుడు దితికి 15. పాదౌ కృత్వాఽథ శీర్షతః–ఏదో పడకపై నిద్రించినట్లుగా లేని కారణంగా తన ఆసనంలోనే తాను కూర్చుండి అంతలోనే నిద్రాపారవశ్యం కారణంగా తన తలకి పాదాలు తగిలే విధంగా కునుకు తీసిఉండవచ్చు దితి. ఇది సరికాదని భావించే పక్షంలో మధ్యాహ్నకాలంలో నిద్రించడమనేది

కూడ దోషమే కాబట్టి అప్పుడైనా దితి అశుచియే ఔతుంది. మంచం మీద పరుండకపోయినా కృష్ణాజినం మొదలైన ఆస్తరణాల మీద ఆమె తలవైపు పాదాలనీ, పాదాలవైపు తలనీ పెట్టి నిద్రించి ఉండవచ్చు. ఈ కారణమైనా ఆమె అశుచియే అని చెప్తుంది. తలకింద ఉండాల్సిన ఉపధానం (దిండు) మీద పాదాలని పెట్టి, పాదాలకింద ఉండాల్సిన ఉపధానం (దుప్పటిగా కప్పుకోదలిచిన వస్త్రం ) మీద శిరస్సునీ పెట్టి నిద్రించడం కూడ ఆమె అశు చిత్వానికి కారణం అయ్యుండవచ్చు.

**తిలకం :-** పగలు నిద్రించడమనే పాపం కారణంగానూ, శిరఃపాదాలు వ్యత్యస్తమయిన కారణంగానూ ఆమె అశుచి అని అర్థమౌతోంది. ఎక్కడైనా ఎప్పుడైనా పూజ్యమైన అవయవం శిరస్సుకి అపూజ్యావయవమైన పాదం తగిలితే అది అశుచి కిందే లెక్క. కొందరైతే (వ్యాఖ్యాతలు) ఆమె కూచునే నిద్రిస్తోందనీ ఆకారణంగానే శిరఃపాదాలు పరస్పరం స్పృశించుకున్నాయనీ చెప్పారు. భూమి మీద ఎవరైనా శయనించినప్పుడు తూర్పు దక్షిణ దిక్కులవైపే తలని ఉంచి నిద్రించాలని స్మృతిగ్రంథం చెప్తుంటే, దానికి విరుద్ధంగా నిద్రించడం కూడ అశుచిహేతువే అని శాస్త్రం చెప్తోంది. ఈ అశుచి దోషం – ఎందరున్నా ఆమెకి తప్పదని తెలిసిన కారణంగానే – వాళ్లని చూసి మరీ పరిహసించాడట. తపస్సు చేస్తున్న వాళ్లకి మంచాలంటూ ఏమీ ఉండే వీలు లేదు కాబట్టి, నేలమీదే దితి పరుండి పొరపాటున తన మోకాళ్లని శిరసుని తగిలేలా చేసుకుంది. ఇంద్రుని నవ్వు – తాను గెలిచాననే కారణంగానైన నవ్వు కాక, ఆమె, తనని చంపడానికి వేసిన పన్నాగమైన తపస్సు పూర్తిగా వ్యర్థమైందని తెలిసి.

## నలభైయేడవ సర్గము

1. విఫలీకృతః – ముక్కలు ముక్కలుగా అయింది. 2. మరుతాం సప్త –

**గగనః స్పర్శనో వాయు రనిలశ్చ తథాపరః,**
**ప్రాణః ప్రాణేశ్వరో జీవ ఇత్యేతే సప్త మారుతాః ।**

గగనం, స్పర్శనం, వాయువు, అనిలం, ప్రాణం, ప్రాణేశ్వరుడు, జీవుడనే ఏడుగురూ సప్త మరుత్తులు. విష్ణుపురాణం ప్రకారం, ఆవహ ప్రవహ సంవహ ఉద్వహ వివహ పరివహ పరావహమనే ఏడూ సప్తమరుత్తులు. (మ.తీ) మేఘం ఉల్కవర్షం మెరుపుతీగల్లో ఆవహ వాయువుంటుంది. అంటే వాటికి ఈ వాయుసహకారం ఉంటుంది. సూర్యమండలాన్ని వ్యాపించి ప్రవహం ఉంటుంది. ఇదే తీరుగా చంద్రమండలం నిండుగా సంవహం, నక్షత్ర మండలంలో ఉద్వహం, గ్రహమండలాన్ని వ్యాపించి వివహం, సప్తర్షిమండలం స్వర్గం భూమిలో పరివహం, ఇక ధ్రువమండలం నిండుగా పరావహమూ ఉంటాయి. ఈ విభాగమూ నివాసస్థానాలూ అన్నీ కూడ మహర్షుల చేత చెప్పబడినవే. 17. వైశాలికాః – విశాలా నగరమే ఎవరికి నివాసస్థానమో వాళ్లు.

## నలభైయెనిమిదవ సర్గము

రాముని పరమపావనత్వాన్ని ఈ సర్గలో చెప్పబోతున్నాడు ఋషి.

1. చతుర్గతిత్వం చెప్పబడుతోంది రామలక్ష్మణుల్లో. గంభీరంగా నడవడంలో ఏనుగుల్లాగానూ, శత్రువులని భయపెట్టి ఓడించడంలో సింహాల్లాగానూ (శత్రువుల్ని ఒక పట్టాన లెక్కపెట్టకుండడంలో), భయంకరమైన నడవడితో

ముందడుగు వేయడంలో వ్యాఘ్రాల్లాగానూ, గర్వంతో కూడిన ఓ చిత్రమైన నడివడికతో బలిసిన వృషభాల్లానూ కనిపిస్తున్నారు. ఈ ఇద్దరూ వీరౌ – విశేషించి శత్రువుల్ని అరిచేలా (భయంతో ఓడిపోయిన దశలో చేయగల తనం చేత వీరులు కూడ ఈ ఇద్దరూ చూచేవాళ్లకి ఆకర్షణీయమైన అవయవాలు కలిగి పద్మపత్రవిశాలాక్షులుగా ఉన్నారు. ఆయుధ సమూహాలనే ఆభరణ సమూహాలుగా ధరించి ఖడ్గతూణీ (అమ్ములపొది) ధనుర్ధారులై ఉన్నారు. రూపవంతుల్లో అశ్వినీదేవతలు ప్రసిద్ధులు కాబట్టి అశ్వినీదేవతల్లానే కన్పిస్తున్నారు. ఈ తేజో విశేషం ఇద్దరిలోనూ ఒకే తీరుగా ఉన్న కారణంగా వీళ్లు మర్త్యలోకంలో కనిపిస్తూ మనతో ఉన్నా, అమర్త్యులుగానే ఊహించాలి. ఇంతటి సుకుమారయుగళం ఈ అడవికి ఎలా రాగలిగారంటూ సుమతి అడిగాడు విశ్వామిత్రుణ్ణి. అంతేకాదు. ఈ ఇద్దర్నీ చూడగానే 'మా కడుపు నిండిపోయిందనుకుంటూ ఉదరాన్ని స్పృశించుకోసాగాడు సుమతి.

సూర్యచంద్రులు ఎలా లోకానికి క్రమంగా ఉష్ణతనీ, చల్లదనాన్నీ సానందంగా పంచుతున్నారో ఆ కారణంగా ఈ ఇద్దరూ కూడ శైత్యప్రతాపాలని (చంద్రసూర్యుల్లా) వెదజల్లుతూ సూర్యాచంద్రమసులుగా అన్పిస్తున్నారు. ఇప్పుడు ఈ లోకం సాక్షాత్తు విష్ణుపదంగా మారిపోయింది. ఇదంతా రాముని తేజః కారణంగానే.

ప్రమాణ – ఇంగిత – చేష్టితైః – శరీరానికున్న ఔన్నత్యాదులేవున్నాయో అవి ప్రమాణాలు. మనసులో దాగి ఉన్న భావాన్ని సూచించే చిరునవ్వు మొదలైనది ఇంగితం. నడక తీరు, మాట్లాడే పద్ధతీ, చూసే విధానం మొదలైన ఇవన్నీ చేష్టితం. పూర్వం ఒకప్పుడు ఈ ఇద్దరికీ ఆభరణాలుండేవి కదా! ఆ ఆభరణాలే ఇప్పుడు ఆయుధాలుగా కన్పడుతున్నాయి.

**మ.తీ :–** దేవతుల్య పరాక్రములంటే ఇంద్ర సమానపరాక్రములు. సింహాల్లా వెనుదిరిగి చూడని పరాక్రమం కలిగి ఎవరన్నా అడ్డూ ఆపూ లేనివాళ్లు. పద్మపత్రవిశాలాక్షులు కాబట్టి మహాభాగ్యం కలవాళ్లు. చేష్టల విషయాని కొస్తే కూడ హర్షం కలిగినా అమర్షం (క్రోధం) కలిగినా ముఖంలో ఆ భావాన్ని ప్రకటించనివాళ్లు. పోలికని పరిశీలిస్తే ఆ యిద్దరిలో ఆ యిద్దరికే పోలిక తప్ప మరెవరినీ వీళ్లతో పోల్చ వీలు లేకుండా కన్పిస్తున్నారు ఈ ఇద్దరూ. 11. ఆశ్రమ సంకాశమ్ – ఆశ్రమంలా ప్రకాశిస్తూ కన్పిస్తున్న 13. హంత! అహల్యా పతివ్రతకి అనుగ్రహాన్ని ఇయ్యబోయే కాలం సంప్రాప్తమయిందనే ఆనందం తనలో కల్గిన కారణంగా విశ్వామిత్రుడు పల్కిన ఆశ్చర్యాద్భుతార్థకపదం ఇది. 16. తస్యాంతరమ్ – మునియైన గౌతముడు లేని కాలం. 17. ఋతుకాలమ్. అర్థినః – భోగాన్ని కోరుకునే వాళ్లు

**మ.తీ :–** పుత్రుల్ని కోరుకునేవాళ్లు ప్రతీయంతే న – లక్ష్యపెట్టరు గదా! (ఈ మాటని గౌతమవేషధారి అయిన ఇంద్రుడంటున్న కారణంగా అహల్య ఈ ఇంద్రుణ్ణి ఈ కారణంతో నిరోధించి ఉండవచ్చు) సుసమాహితే – చక్కగా బ్రహ్మచేత సృష్టింపబడినదానా! (సుందరీ!)

**మ.తీ :–** ఓ! సుందరీ! 18. సహస్రాక్షం విజ్ఞాయ – ఇంద్రుణ్ణిగా గ్రహించి (ఎప్పుడూ కూడ అహల్య అయిన తనని తన భర్త గౌతముడు ఈ తీరుగా అభ్యర్థించి ఉండలేదు–కాబట్టీ, మరొక్కరెవరూ తన ఆశ్రమంలోనికి ఇలా ప్రవేశించగల శక్తి ఉన్నవారు కానేకారు కాబట్టీ, ఇంద్రునికి తన మీద ఎంతో కాలం నుండి ఈ తీరు అభిలాష ఉందనే విషయాన్ని తాను విని ఉండడాన్ని బట్టీ) కృతార్థేన – సంతుష్టపడిన రక్ష! – (ఎవరికీ తెలియకుండా ఎవరి

కంటా పడకుండా వెళ్తూ) రక్షించు నన్ను అలాగే నిన్ను కూడ రక్షించుకో! 22. సంభ్రమాత్ – భయంతో 24. తత్ర–ఇంద్రుడు గౌతమవేషధారియై ఆశ్రమానికి వచ్చి అహల్యతో మాట్లాడి ఆశ్రమం నుండి వెడుతున్న ఆ క్షణంలోనే తీర్థోదక పరిక్లిన్నమ్–(పవిత్రజలాల్లో) స్నానం చేసిన (ఆశ్రమాని కొచ్చిన) (అప్పుడే ప్రవేశిస్తున్న) 26. అకర్తవ్యమ్ – చేయరాని పనిని (తన భార్యా విషయికమైన దుస్సంగమ విశేషాన్ని తాను నోటితో చెప్పలేని గౌతముడన్న మాట ఇది) ఆశ్రమేఽ నస్మిన్నివత్స్యసి ఈ ఆశ్రమంలోనే ఉండిపోతావు. గౌతముని భార్యగా అహల్య ఘోరమైన తప్పిదాన్ని చేస్తే దానికి గౌతముడిచ్చిన శాపం 'ఇక్కడే ఉండిపోవలసిందనేదా? ఇది శాపం ఎలా అవుతుంది? బుద్ధి పూర్వకంగా వ్యభిచరించిన వ్యక్తికి విధించిన ప్రాయశ్చిత్త మేదుందో అది శాపరూపంగా వాల్మీకంలో ఇంత స్పష్టంగా కన్పిస్తున్నా 'అహల్యను బండరాతిగా శపించడం రాముని పాదస్పర్శవల్ల యథార్థరూపాన్ని పొందడ మనే ఇదంతా పురాణకథ. కల్పాంతరంలో ఇలా జరిగిందన్న దాన్ని అనుసరించి అలా రాయబడిందని గ్రహించాలి. 30.ఘోరమ్ –

**మ.తీ :–** ఈ వనం మొత్తం, మునులనే ఎవరూ లేకుండా ఉండాలనేది గౌతమశాపంగా భావిస్తూ ఆ కారణంగా ఘోరమని భావించాలి. పూతా భవిష్యసి–శ్రీరామచంద్ర పాదారవింద ధూళి స్పర్శ కారణంగా

**గో.రా :–** ఎన్ని సంవత్సరాల పాటు ప్రాయశ్చిత్తాన్ని చేసినా భగవంతుని పాదరేణుస్పర్శతో సమం కాదు. 31. పూతా – పవిత్రురాలివిగా (పూర్వరూప ప్రాప్తిమాత్రం) పరమేశ్వర పాదపూజని చేయనిదే లభించదు.

**మ.తీ :–** 'నీ శరీరాన్ని తిరిగి నువ్వు పొందగల' వని గౌతముడు అహల్యని శపించడం బట్టి పద్మపురాణం చెప్పిన పాషాణావస్థ సూచింపబడుతోంది. శాపం ప్రకారం అహల్య పాషాణత్వాన్ని పొందింది. ఇదే విషయాన్ని పద్మపురాణం చెప్పింది.

**గో.రా :–** ఈ సర్గలోని చివరి రెండు శ్లోకాలూ ప్రక్షిప్తమని కొందరు అన్నారు గాని అది సరికాదు ('గౌతముని శాపాన్నే తలుచుకుంటూ.....' అని రాబోయే సర్గలో ఉంది కాబట్టి). 32 తపస్తేపే –గౌతముడు తిరిగి తపస్సు చేశాడు (తానిచ్చిన శాపం కారణంగా వచ్చిన పాపాన్ని పోగొట్టుకోడానికి)

## నలభైతొమ్మిదవ సర్గము

**మ.తీ :–** ఒక్క మేకకి సబంధించిన అండాలని ఇంద్రుడు దేవతల అనుజ్ఞ మీద స్వీకరించిన కారణంగా మేష జాతి కంతకీ యజ్ఞాల్లో తమ తమ అవయవాల్ని హోమం ద్వారా ఇచ్చుకునే శక్తి లభించింది. బీజాల్లేని మేషమాంసాన్ని తాము స్వీకరించి యజ్ఞాలని చేసినా యజ్ఞఫలం లభించసాగింది. 19. యోగబలం ద్వారా రామచంద్రుడు ఎప్పుడొస్తాడో తెలిసిన గౌతముడు రామాగమనకాలంలోనే ఈ ఆశ్రమానికి వచ్చాడనీ, ఆ కారణంగానే ఈ అహల్య 'గౌతమస్య వశానుగా' అయిందనీ భావం.

## యాభైయవ సర్గము

1. ప్రాగుత్తరామ్ – తూర్పు ఉత్తరాల నడుమదైన ఈశాన్యాన్ని, 3. ఋషివాటాః – ఋషుల నివాసస్థానాలు (తిలకం) యజ్ఞం చేయడం చేయించడం చూడడం కోసం తమ తమ నిత్యాగ్నిహోత్రాలతో వచ్చిన ఋషులందరి నివాసస్థానాలూ 16. పద్భ్యామ్ – పద్మపత్రాల్లా కోమలంగా ఉండే పాదాలతో వాహనం లేకుండానే రామలక్ష్మణులు ఇంత దూరం రాగలిగారా? వచ్చారా? అని మహర్షులాశ్చర్యపడ్డారు. పురుషకారాన్ని సాధించడానికే వచ్చారనేది సమాధానం. ధనుషి జిజ్ఞాసామ్–ధనుస్సులో ఏముందని తెలుసుకోడానికి

**తిలకం :-** రాముని దర్శనాన్ని జనకునికి ఇప్పించవచ్చు. రాముడు ధనుస్సులోని శక్తిని చూడవచ్చు. నారిని బిగించడం, శరాన్ని సంధించడం మొదలైన వాటిని గమనించవచ్చు.

**గో.రా :-** ధనుస్సులోని బలాబలపరీక్ష చేయవచ్చు.

## యాభైయొకటవ సర్గము

ఆచార్య వైభవం గురించి తెలియజెప్పేందుకు వాల్మీకి మహర్షి విశ్వామిత్రచరిత్రాన్ని చెప్పబోతున్నాడు. 1.హృష్టరోమాః -

**మ.తీ :-** తన తల్లికున్న శాపాన్నించి ఉద్ధరించిన వార్తని వినడం ఆ ఉద్ధర్తని చూడడంవల్ల కల్గిన ఆనందంతో రోమాంచితుడై 2. విస్మయమాగతః - రామునిమహిమ ఎంత గొప్పది? నా తల్లి కృతార్థురాలైందని ఆశ్చర్యపడినవాడై 2. నిషణ్ణౌ - సుఖాసీనులై 3. తపోదీర్ఘముపాగతా - దీర్ఘమైన కఠినమైన తపస్సుని పొందిన (ఇలా అనడం చేత అహల్యకి పాషాణశాపం లేదనీ ఆమె పాషాణ రూపాన్ని దాల్చలేదనీ తపోలక్షణంతోనే ఉందని భావం) 3. దురనుష్ఠితమ్-

**తిలకం :-** గౌతమవేషధారిగా వచ్చి చేయకూడని దానిని చేసిన ఇంద్రుని దురనుష్ఠానాన్ని (ఇంద్రునిది తప్పే అంటున్నాడు శతానందుడు) 4. సర్వదేహినామ్ - దేహధారులైన అందరికీ అనడంవల్ల రాముని పరత్వం చెప్పబడుతోంది. 26. అబ్భక్షైః-

**మ.తీ :-** భక్ష్యంగా తినవలసిన దాని స్థానంలో నీటిని మాత్రమే భక్ష్యంగా చేసుకుని మరో ఆహరమే లేక జీవించేవారి చేత వరూథినీ - చతురంగబలం, వాలఖిల్యాః - బ్రహ్మవాలం నించి పుట్టినవాళ్లు వైఖానసాః- బ్రహ్మనఖాల నించి పుట్టినవాళ్లు, (విఖనశ్శబ్దము బ్రహ్మపర్యాయము)

## యాభైరెండవ సర్గము

విశ్వామిత్రుణ్ణి గౌరవించడం దీనిలో కన్పిస్తుంది. 6. రాజవృత్తేన-నాలుగు తీరులైన విధానంతో (ధర్మబద్ధంగా ధనాన్ని సంపాదించడం, సంపాదించిన ద్రవ్యాన్ని పెంపు చేయడం ఇలా రెండు విధాలుగా వచ్చిన ధనాన్ని రక్షించడం సద్వినియోగం చేయడం) 9. వసిష్ఠమ్-మిక్కిలి అయిన వసువు (తపోధనం) కలిగినవానిని (వసిష్ఠుని) 11. ప్రహసన్నివ-

**మ.తీ :-** ఇంతటి మహాతిథి దొరికాడు నేటికనే పరమానందంతో 17. న్యమంత్రయత-భోజనం చేసి పోవలసిందిగా మరీ మరీ ప్రార్థించాడు. 22. రసేనాన్నేన పానేన లేహ్య చోష్యేణ సంయుతమ్-ఎన్నెన్నో భిన్న భిన్న రుచులు కలిగిన వివిధ అన్నాలతో,

**మ.తీ :-** ఎంతో రుచితో పాటు చక్కని నీటిని పీల్చిన రసవంతమైన అన్నంతో, పానకం మొదలైన తాగవీలైనవాటితో పానేన), నాలుకతో రుచిని గ్రహింపవీలైన తేనె మొదలైన వానితో (లేహ్య), పెదవుల ద్వారా గ్రహించవీలైన పెరుగుతో (చోష్యేణ) కూడిన శాల్యన్నంతో కూడిన భోజనాన్ని

**గో.రా :–** భక్ష్య భోజ్య లేహ్య చోష్య పేయ ఖాద్యరూపమైన ఆరు విధాలు చెప్పబడ్డాయి. సర్వమ్–ఇలా అనేక విధాలుగా ఉన్న ఆహారపదార్థాలని అనేకానేక రాశులుగా (సృజింపుము)

## యాభైమూడవ సర్గము

1. మైరేయాః – మద్య భేదాలు. 3. షాడబానాం….భాజనాని

**మ.తీ :–** ఆరు విధాలైన రుచులూ కలిసిన భక్ష్య విశేషాలున్న పాత్రలు. గౌడాని–బెల్లంతో చేయబడినవి (తిలకం) వెండితో చేయబడినవి (కతకం) తమలో ప్రతిబింబిస్తున్న పదార్థాలు కలిగి పరిశుభ్రమైన తెల్లనిదనంతో ఉన్న పాత్రలు. 4. (హృష్ట) పుష్ట జనాయుతమ్ –

**తిలకం :–** మానసిక సంతోషమైన హర్షంతో కూడి (హృష్ట) దేహపుష్టితో కూడి (పుషలు) ఉన్న జనులతో నిండిన 5. హృష్టః పుష్టః – ఆదరణ కారణంగా హృష్టుడు. భోజనప్రదానం చేత పుష్టుడు 7. పూజితః–

**మ.తీ :–** ఆతిథ్యంతో చక్కగా సత్కరింపబడినవాడు 8.రత్నహారీ – ఏ జాతిలో ఏది శ్రేష్ఠమో దాన్ని రత్నం అంటారు శాస్త్రభాషలో ఆ రత్నాలన్నింటికీ అధికారి 'రాజు' మాత్రమే 9. ఆయత్తమ్ అత్ర–

**మ.తీ :–** ఈ గోవు (శబల) అధీనంలోనే ఇవన్నీ ఉన్నాయి. దేవతలకి కావలసిన హవ్యాలు, పితరులకి కావలసిన కవ్యాలు, ప్రతిరోజూ ఉదయాస్తమయాల్లో చేయాల్సిన వివిధహోమాలు, భూతాలకిస్తూండే బలులు, దర్శపూర్ణమాసాది హోమాలు, స్వాహా అనే మంత్రం, వషట్ అనే మంత్రం, ఎన్నో దివ్యవిద్యలు, వేదత్రయం, హవ్యకవ్యాదులక్కావలసిన పాలు పెరుగు నేతులు, వీటిని వినియోగించి చేసే కర్మలు, ఆ కర్మల్లో ఉచ్చరించే మంత్రాలు …..ఇవన్నీ ఈ గో అధీనములే. యథార్థం చెప్తున్నాను. ఇంకా చెప్పబడవలసినవెన్నో ఉన్నాయి చెప్పినవి కాక. 22. ఆప్త దక్షిణాః–

**మ.తీ :–** హవ్యకవ్యాదుల్లాగా ఈయవలసిన దక్షిణలన్నీ కూడ ఈమె అధీనములే కామదోహినీమ్ – కోరికలని పిండుకున్నంతమాత్రాన ఇయ్యడమే స్వభావంగా కలిగినదానిని

**మ.తీ :–** ఏ కోరిక అడిగితే ఆ కోరికని తీర్చడమే స్వభావంగా కలదానిని.

## యాభైనాల్గవ సర్గము

**తిలకం :–** ఇక దండోపాయాన్ని ఆశ్రయించిన తీరుని చెప్పబోతున్నాడు మహర్షి.

**గో.రా :–** బలాత్కరిస్తూ తనని తీసుకుపోతుంటే ఆగ్రహించిన వసిష్ఠధేనువైన శబల చేసిన సృష్టి గురించి చెప్పబోతున్నాడు మహర్షి 1. అన్వకర్షత – బలాత్కారంగా లాక్కుని పోయాడు. 7. రాజా–తపోబలం నాకున్నా దండింపదగనివాడు

**మ.తీ :–** కిష్కింధాకాండలో కూడ ఇదే విషయం స్పష్టంగా చెప్పబడింది. ధర్మాన్నీ, మంచి జీవితాన్నీ, శుభాన్నీ కల్గించే రాజులు నడిచే దైవాలవంటి వాళ్లు. వాళ్లకి అప్రియాన్ని కల్గించరాదు. హింసించకూడదు. వాదులాడకూడదు

**తిలకం :-** బలీ - బలవంతుడు కాబట్టి యుద్ధంలో జయింపవీలు కానివాడు. రాజైన కారణంగా చంపినా, చంపించినా మహాపాతకం చుట్టుకుంటుంది. విశేషతః అద్య-ఈ రోజే (ఇప్పుడే) ఆతిథ్యాన్ని ఇచ్చిన కారణంగా విశేషించి (చంపరాదు). పట్టస - కత్తిలాగానే మారణాయుధమై కత్తికంటె వేరు రూపంతో ఉండేది.

## యాభైయైదవ సర్గము

8. ఉపరక్తః-రాహువుచే పట్టుబడ్డవాడు. 5. భస్మీకృతాః - **తిలకం :-** రాజైన కారణంగా విశ్వామిత్రుణ్ణి వధించకూడదని నిర్ణయించుకున్నా శబలని ఈడ్చుకుపోతున్న విశ్వామిత్రపుత్రుల్ని చూసిన క్షణంలో తట్టుకోలేకపోయాడు వసిష్ఠుడు. క్షత్రియజాతికి చెందినవాడే అయినా రాచఠీకంలో లేదు గదా! అనే ఉద్దేశ్యంతోనూ, అల్పప్రాయశ్చిత్తాన్ని చేసుకుందామనే ఊహతోనూ, మౌనంగా కూచుంటే ఇంకా ఏం కాబోతుందో ననే భయంతోనూ వసిష్ఠుడు విశ్వామిత్రుని నూరుగురు పుత్రుల్నీ బూడిద చేసేశాడు. 15. సాంగోపాంగోపనిషదస్సరహస్యః - సమీపంలో ఉన్నవాణ్ణి కొట్టేది అంగము. దూరంలో ఉన్నవాణ్ణి కొట్టగలిగేది ఉపాంగము. సరహస్యంగా ఉపదేశం ద్వారా పొందదగినది ఉపనిషత్ సరహస్యం. 21. ఇరిణ సన్నిభమ్ - చవిటినేలతో సమానమై (చెట్టు యొక్క తీగలేనిదై)

## యాభైయారవ సర్గము

15. బ్రాహ్మేణ తేజసా - బ్రహ్మవిద్యాభ్యాసం కారణంగా పుట్టిన తేజస్సుతో పూర్తిగా నిండిన. 17. మరీచ్యః-నిప్పుకణాలు 22. ధిక్-నింద్యము వ్యర్థము. బ్రహ్మతేజోబలమ్ - బ్రాహ్మణునకు తపస్సుచే కలిగిన తేజోబలం బ్రహ్మత్వ కారణమ్ - బ్రాహ్మణ్యాన్ని ఆపాదించగల ప్రసన్నేంద్రియమనోవిధానం అవలంబిస్తూ క్షత్రియరోషాన్ని విడవడం.

## యాభైయేడవ సర్గము

1. కృతవైరో మహాత్మనా - వసిష్ఠునితో విరోధించుట చేత (తన అస్త్ర శస్త్ర తపస్సులన్నీ వ్యర్థం కావడానికైన కారణమేదో విశ్వామిత్రునికి తెలిసింది. బ్రహ్మవేత్తకి అపచారాన్ని చేయడం సర్వశ్రేయస్సులనీ నశింపచేస్తుందని అర్థమయింది) మహిష్యా సహ-బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ సన్న్యాసాలు నాల్గింటిలోనూ క్షత్రియులు సన్న్యాసానికి మాత్రం అధికారులు కాకపోవడం చేత, విశ్వామిత్రుడు తన భార్యతో ఉండడం చేత వానప్రస్థాశ్రమంలో ఉన్నాడు. 5. త్రివిష్టపం బ్రహ్మలోకమ్- స్వర్గానికి వెళ్లి ఆ మీదట బ్రహ్మలోకానికి (వెళ్లాడు). 11. చింతితమ్ - అశక్యమ్ - శరీరంతో స్వర్గానికి పోవడానికి చేయవలసిన యజ్ఞం చింతితం. అలాంటి యజ్ఞాన్ని చేయడం అశక్యం. ఋషికి ఇలాంటియజ్ఞం చేయడం రాదనేది కారణం కాదు. అలాంటి యజ్ఞం ఎక్కడా లేదనేది కూడ కాదు ('సశరీర ఏవ స్వర్గం లోకమేతి' (శరీరంతోనే స్వర్గలోకాన్ని పొందగలడు) అని వేదంలోనే ఉంది) అయితే పూర్వకల్పంలో జరిగిన విశేషాన్ని గమనించి త్రిశంకునికి అలాంటి అవకాశం లేదని ఋషి భావించాడని భావం. అందుకే ఆ విషయాన్నే వసిష్ఠుడు చెప్పాడు త్రిశంకునికి (ఉక్తః). 13. శతమ్ - ఎక్కువ మంది అనే అర్థంలో వాడబడిన పదం. 20. పురోధాః - పురోహితుడైన వసిష్ఠుడు.

## యాభైయెనిమిదవ సర్గము

గురువుని విడిచేస్తే కలిగే ఫలాన్ని చెప్తున్నాడు మహర్షి ఈ సర్గలో. ఋషిపుత్రశతమ్–

**మ.తీ :–** నూర్గురైన వసిష్ఠపుత్రులు. శాఖాంతరమ్–ఆశ్రయాన్నీయగల మరొకరిని. 7. ఘోరాభిసంహితమ్ – ఇక్ష్వాకు కులగురువైన బ్రహ్మపుత్రుడైన వసిష్ఠుణ్ణి కాదని మరొకరిని ఆశ్రయించదలిచాననే ఘోరాభిప్రాయంతో కూడిన (వాక్యాన్ని) 8. చండాలతాం గతః–వక్షం మీది జందెం ఇనుపకమ్ములయింది. కట్టుకున్న పచ్చని పట్టువస్త్రం నీలిరంగుకి మారింది. రాజతేజస్సు మొత్తం తొలిగి నీలిశరీరం అయింది. చిత్యమాల్యానులేపః–'చితా' అంటే శ్మశానం కాబట్టి అక్కడ కన్పించే రూపం చెడిన పుష్పమాలికలు అక్కడ దొరికే భస్మం తో మైపూత పూయబడిన శరీరం కలవాడు. 12. విఫలీకృతమ్ – వసిష్ఠుడూ వాని పుత్రులయిన వాసిష్ఠులూ అనే వీళ్ల చేత నాశనం చేయబడిన ఐహిక ఆముష్మిక సాధనం కలవాణ్ణి. 16. విపర్యయః– ప్రయోజనం తలకిందైంది. 19. శీలవృత్తేన శీలం సద్గుణం.

**మ.తీ :–** (జాతిభ్రంశత కూడ కలిగింది). వృత్తం ఆచారం. ఈ ఆచారంతో కూడిన సద్గుణం ఏదుందో దానితో 21. దైవమేవ పరమ్–ప్రారబ్ధఫలమైన అదృష్టం ఏదుందో ఆ దైవమే శ్రేష్ఠమౌతూ బలమౌతూ వ్యక్తికి హితాన్ని గాని అహితాన్ని గాని కలగజేస్తోంది. పౌరుషమ్ – ఇప్పుడు చేస్తున్న ధర్మానుష్ఠానం మొత్తం (అసత్యాన్ని ఆడలేదు. కష్టసమయాల్లోనూ ధర్మాన్ని వీడలేదు. అబద్ధాన్ని ఆడే ఉద్దేశ్యమూ మీది కాలంలో లేదు. నా క్షత్రియత్వం మీద ఒట్టు) ప్రారబ్ధకర్మని దాటి ప్రవర్తించేది కానే కావడం లేదు. 23. పురుషకారేణ–నీ అనుగ్రహరూపమైన ఆనుకూల్యాన్ని చూపడం ద్వారా.

**మ.తీ :–** యజ్ఞమనేది (యజ్ఞఫలం) అనృత మాడిన పక్షంలో నశిస్తుందనే ప్రామాణికవచనాధారంగా యజ్ఞధ్వంసకారి అయిన అసత్యాన్ని ఆపత్సమయంలో కూడ ఆడి ఉండలేదు. పరమాగతిః – దైవమే ప్రధానకారణంగా అన్పిస్తున్నాడు.

## యాభైతొమ్మిదవ సర్గము

జాతి చండాలునికైతే భావనివృత్తి సాధ్యమౌతుంది తప్ప కర్మచండాలుని విషయంలో ఇది అసాధ్యమనే విషయాన్ని చెప్తున్నాడు మహర్షి. 1. సశరీరో గమిష్యసి – ఋషిశాపం కారణంగా వచ్చిన చండాల రూపం ఏదుందో ఆ రూపంతోనే, బ్రహ్మంతటివానిక్కూడ మార్చడం అసాధ్యమైన అదే శరీరంతో జాతిచేత చండాలుడివి కానివాడివి కాబట్టి ఈ రూపంతోనే, నా తపోమహిమాతిశయం కారణంగా చేయబడే యజ్ఞంద్వారా నువ్వు సశరీరుడివై మాత్రమే స్వర్గానికి వెళ్లగలవు. ఈ కర్మసాధన నీ హస్తగతమైందని భావించు!

**మ.తీ :–** అనాయాసంగా సాధ్యమైంది. ఆకారణంగా సశరీరంగా స్వర్గానికి వెళ్లగలవు. 7. అనాదృతమ్ – (నా మాటమీద పిలువబడుతున్న ఎవరైనా) చండాలునితో యాగమా? అనే ఈ తీరు అనాదరణీయమైన వాక్యాన్ని 10. వర్జయిత్వా మహోదయమ్ – మహోదయుడనే పేరున్న ఋషి కాక, 11. కథమ్? బ్రాహ్మణునికి మాత్రమే యజ్ఞం చేయించగల అధికారం ఉండగా, చండాలునికి యజ్ఞం చేయించే అధికారం లేని కారణంగా ఎలా హవిస్సుని దేవతలు స్వీకరిస్తారు? స్వీకరింప వచ్చిన ఋషులు ఎలా శిష్టులౌతారు?

**మ.తీ :–** యజ్ఞంలో హవిస్సుని స్వీకరించవలసిన వాళ్లు సురలూ ఋషులూను. సురులు దేవతాస్థానంలో కూచుండి భోక్తలు కావాలి. ఋషులు ఇష్టశిష్టవిభాగస్థానంలో కూచుండి భోక్తలు కావాలి. ఈ రెండూ ఎలా సాధ్యం? 13. పాలితాః–యాగం చేయించవీలులేని పద్ధతిలో యాజకులౌతున్న ఋషులు ఎలా స్వర్గానికి పంపించగలుగుతారు? (మ.తీ) లోక/శాస్త్ర నిందాపాత్రమైన ఇలాంటి పనిని చేయనే చేయరాదు గదా! 16. అదుష్టం మామ్ – ఉగ్రమైన తపశ్శక్తి కలిగినవాడినై దోషంలేని దోషం చేయని దోషకృత్యానికి పాల్పడని నన్ను (తేషాం తేజోవిశేషేణ ప్రత్యవాయో న విద్యతే) మహాత్ములైన మహర్షుల తపఃతేజో విశేషం కారణంగా ఏ విధమైన విఘ్నమూ దోషమూ కలుగదనే న్యాయమున్న కారణంగా చండాలునితో యాగాన్ని చేయించడమనేది దోషం కానే కాబోదనే విషయాన్ని తెలియక ఎవరు దూషిస్తున్నారో వాళ్లంతా నా అదోషవిధానాన్ని గమనించలేకపోతున్నారు. 17. మృతపాః – శవాలని భక్షించేవాళ్లు

**మ.తీ :–** శవమాంసభక్షకులూ శవదాహకులూ 19. ప్రాణాతి పాతనిరతః– బలాత్కారంగా తమ ప్రాణాలని తీసేసుకోవడంలో (ఆత్మహత్యలకు పాల్పడడం) ఆసక్తులు

**మ.తీ :–** ప్రాణాలని కావాలని నశింపచేసుకోవడం బుద్ధి కలవాళ్లు. ముష్టికాః–హీనజాతికి చెందిన వాళ్లు. నిరనుక్రోశతామ్ – ఏ మాత్రపు జాలీ లేనివాళ్లుగా ఉండే స్వభావాన్ని (పొందుతారు).

## అరవైయవ సర్గము

సశరీరంగా ఉన్న త్రిశంకునికి స్వర్గాన్ని పొందించడాన్ని చెప్పబోతున్నాడు ఈ సర్గలో మహర్షి.

1. ఇక్ష్వాకు దాయాదః – (దాయమ్ అత్తీతి దాయాదః) తన పూర్వుల సంపదని 'దాయం' అంటారు. దాన్ని తినేవాడు (అనుభవించగల అర్హత కలవాడు) దాయాదుడు. ఇక్ష్వాకు రాజ్య సంపదని అనుభవించ అర్హుడు ఇక్ష్వాకు దాయాదుడు. (త్రిశంకువు) 2. ధర్మిష్ఠశ్చ వదాన్యశ్చ – ధర్మబద్ధవర్తనుడూ మహాదాత కూడ

**మ.తీ :–** (అందుకే యాగానికి అధికారిగా నేను నిశ్చయించాననేది విశ్వామిత్రుని మాట). 4. సమధితిష్ఠత – ప్రారంభించవలసింది! (ప్రారంభింపబడుగాక! 9. కాలేన మహతా – చాలసేపటికి (ముఖ్యకల్పానికి అనుగుణంగానూ యథావిధిగానూ మంత్రాలని రెండు మూడు మార్లు ఆవృత్తి చేసేసరికి కాలం కొద్ది ఎక్కువ పట్టింది) 10. నాభ్యాగమన్ – అధికారం లేని అనధికారి న్యాయబద్ధం కాని విధంగా చేయరాని పద్ధతిలో యాగాన్ని చేస్తూ చేయిస్తున్నాడనే అభిప్రాయంతో ఎవరూ రాలేదు. 16. స్వర్గ కృతాలయః – స్వర్గంలో ఉండడానికి యోగ్యత లేనివాడు 20. అసృజత్–సృష్టిచేశాడు. మునులందరి మధ్యలో నిలబడి దక్షిణపు దిక్కుని ఆధారంగా చేసుకుని ఇరవైయేడు నక్షత్రమాలనీ సృష్టించాడు. ఉత్తరపుదిక్కున ఏ ధ్రువమండలం ఉంటుందో శాశ్వతంగానూ చలనరహితంగానూ అలా త్రిశంకుడు ఉండుగాక! దాని చుట్టూ ఎలా సప్తర్షి మండలం తిరుగుతూ కన్పిస్తుందో ఇక్కడ కూడ అలాగే జరుగుగాక! ఇక ఈ లోకానికంతకీ ఏ ఇంద్రుడు ఉన్నాడో అలాగే కన్పిస్తున్న ఈ లోకానికి మరో ఇంద్రుణ్ణి సిద్ధం చేస్తాను లేదా లోకం అసలు ఇంద్రుడనేవాడే లేకుండా పోవును గాక! ఈ కారణం చేతనే వేదాంతాచార్యులన్నారు – మరో ఇంద్రుడు అధికారిగా ఉండే భువనాన్ని సృష్టించడానిక్కానీ, అసలు ఇంద్రుడే లేని

భువనాన్ని సృష్టించడానిక్కానీ సమర్థుడు కుశికవంశంలోని విశ్వామిత్రుడు మాత్రమే అని. ఇంద్రుణ్ణి నశింపచేయడం దీనిలోని అభిప్రాయం కానేకాదు.

**మ.తీ :–** మరో నక్షత్రచక్రం మరో స్వర్గం ఇలా సృష్టిచేయడం విశ్వామిత్రుని లక్ష్యం. అలా సృష్టిస్తున్న తన సృష్టికి ఇంద్రుడు గనుక విఘ్నాన్ని చేయదలిచినా తలపెట్టినా 'అతణ్ణి కూడ తన తపశ్శక్తి సామర్థ్యంతో స్వర్గ భ్రష్టుణ్ణి చేయగల' నని విశ్వామిత్రుని మాటలోని భావం. సృష్టింపబడే స్వర్గం ఇంద్రుడు లేకుండానైనా ఉండుగాక లేదా త్రిశంకుడే అక్కడ ఇంద్రుడుగా ఉండుగాక! ఇలా త్రిశంకుణ్ణే ఇంద్రుని స్థానంలో ప్రతిష్ఠించి అతనికి పరివారదేవతలుగా మరి కొందర్ని సృష్టించడానికి ప్రారంభించాడు విశ్వామిత్రుడు. 23. పరమసంభ్రాంతాః– విశ్వామిత్రుడు చేస్తున్న (సృష్టికి) ప్రతిసృష్టి అతి దుస్సహం కాబట్టి అందరూ ఎంతో భయాశ్చర్యాలని పొందారు. 32 బాఢమ్ ఇత్యాహ – (దేవతలు అంగీకరించినందుకూ తన పట్టు నెగ్గిందన్నందుకూ విశ్వామిత్రుడు యజ్ఞాన్ని ఆపాడు. దేవతలు కూడ తమ తమ భాగాలని స్వీకరించి వెళ్లారు). అంగీకార సూచకమైన మాట 'బాఢమ్' అనేది.

## అరవైయొకటవ సర్గము

తనని శరణుకోరి వచ్చిన శునశ్శేపుణ్ణి రక్షించడానికి – అంటే శరణాగత ధర్మాన్ని రక్షించడానికి విశ్వామిత్రుడు చేసిన మరో తపస్సుని గూర్చి చెప్తున్నాడు మహర్షి ఈ సర్గలో.

1. (తిలకం) విశ్వామిత్రో మహాత్మాథ (మహాతేజాః అని ఉండాలి)........వనవాసినః (వినయాన్వితాన్ అని ఉండాలి). 6. దుర్నయాత్ – నీ అశ్రద్ధ వల్ల

**మ.తీ :–** నీ పొరపాటు కారణంగా 7. ప్రాయశ్చిత్తమ్ – (ఈ పశునాశక నిమిత్తమైన కష్టానికి) ప్రాయశ్చిత్తంగా ఎత్తుకుపోబడిన పశువునైనా వెదికి తీసుకురా – లేదా – దానికి బదులుగా ఎవరైనా ఒక వ్యక్తిని పశుప్రతినిధిగా పట్టుకురా! 14.జ్యేష్ఠమ్

**మ.తీ :–** జ్యేష్ఠుణ్ణి (అమ్మననడంతో మిగిలిన వాళ్ల విషయంలో అభ్యంతరం లేదని అర్థం. వ్యతిరేకించనిది అనుమతించినట్లే. (అప్రతిషిద్ధ మనుమతం భవతి) 16. సంతానాన్ని దానంగా ఇయ్యడం లేదా విక్రయించడమనేది శాస్త్రం ప్రకారం దోషం ఔతుంటే ఇక్కడి వృత్తాంతంలో అమ్మకానికి అడగడం, విక్రయించడం వంటిదంతా దోషం కాదా? అంటే, ధర్మపరిరక్షణకోసం అపత్యాన్ని దానం చెయ్యడం ఎలా దోషం కాదో అలా యజ్ఞనిర్వహణం పరిసమాప్తి కోసం సంతానాన్ని దానం చెయ్యడం లేదా విక్రయించడం దోషం కానే కాదు.

## అరవైరెండవ సర్గము

శునశ్శేపునికి శరణాగతిని చెప్తున్నాడు మహర్షి ఈ సర్గలో. 2. తృష్ణయా చ శ్రమేణ చ – ఎంతో దూరం నడిచి వచ్చిన కారణంగా దప్పికవలన గాని, మార్గాయాసం వలన గాని 3. న మే – నాకు తల్లి గాని, తండ్రి గాని జ్ఞాతులు గాని, బాంధవులు గాని లేరనడానిక్కారణం ఇందరూ ఉన్నారు గాని నన్ను అవసర సమయంలో రక్షించ (లే)నపుడు వాళ్లు ఉండీ లేనట్లే అనేది శునశ్శేపుని అభిప్రాయం. 4. భావనః–హితాన్ని కల్గించేవాడివి. 5. కృతకార్యః – అంబరీషుడు ఎలా నా కారణంగా కృతకృత్యుడు కాగలడో అలాగే నాకూ దీర్ఘాయుష్యం స్వర్గలోకస్థితీ కలిగి

కృతకృత్యుణ్ణి అయ్యేలా చేయవలసింది. 8. యత్కృతే – తల్లిదండ్రులు ఏ ప్రయోజనాన్ని ఆశించి (తల్లిదండ్రులు జీవించి ఉండగా వాళ్లు చెప్పిన మాట ప్రకారమే నడుచుకోవడం, వాళ్లు మరణించిన వెంట వాళ్ల పేరుని తలుచుకుని ప్రతిసంవత్సరం అన్నదానం చేయడం, గయలో పిండాన్ని పెట్టడం అనే మూడు సత్కార్యాలనీ చేయడం చేత పుత్రుడు పుత్రుడనిపించుకుంటాడు. ఇలాంటి ప్రయోజనాన్ని ఆశించే తల్లిదండ్రులు పుత్రుల్ని కంటారు. కాలోఽయమాగతః – సరైన సమయం వచ్చింది. ఏ పుత్రుని పుట్టుకకి ప్రయోజనాలని అనుకున్నామో అలాంటి పుత్రుని అవసరం (తల్లిదండ్రులు జీవించి ఉండగా వాళ్లు చెప్పిన ప్రకారం ధర్మరక్షణ కోసం వినడమనే ఆ పుత్రధర్మనిర్వహణం కోసం సరైన కాలం (అవకాశం) ఇప్పుడొచ్చింది. 9. శరణమ్–రక్షణాన్ని

**మ.తీ :–** నాకూ నా సంతానమైన మీకూ పరలోక సుఖాన్ని పొందేందుకూ పరలోకమే హితమైన ప్రయోజనమౌతుంటే అలాంటి ప్రయోజనం ఎవనికి కావాలో ఆ ధర్మం నిర్వహించేందుకు సరైన కాలం వచ్చింది. 12. సాభిమానమ్ – గర్వంతో కూడినతనంతో, సలీలమ్ – పరిహాసం కూడిన విధంతోనూ (తక్కువ చేస్తూ) 17. నిరామయం

**మ.తీ :–** ఏ విధమైన భయమూ లేనివానిగా (మంత్రంతో మంత్రించబడి విభూతిని పూయుట లేదా – రక్షను కట్టుటవంటివాటి ద్వారా భయాన్ని తొలగించి) 18. పవిత్రపాశైః–దర్భాదులతో కట్టబడి యూపస్తంభానికి నిన్ను కట్టివేసినపుడు అగ్నికి ఎదురుగా నిలబడి ఇంద్రుణ్ణీ ఉపేంద్రుణ్ణీ కూడ స్తుతించు. ఈ యూపమే వైష్ణవ'మను అర్థం కల శ్రుతిమంత్రం విష్ణుసంబంధమైనది వైష్ణవో వా దేవతయా యూప' అనేదాన్ని పఠిస్తూ ఉండు. అంతేకాదు. అగ్నిదేవునికి సంబంధించిన ఏ సూక్తాలు ఋగ్వేదంలో ఉన్నాయో వాటిని కూడ చదువుతూ అగ్నిదేవుణ్ణి స్తుతించు (ఇమ మ్మే వరుణ శ్రుధీ.......) 19. గాథే– ఇంద్రుణ్ణీ ఉపేంద్రుణ్ణీ ప్రసన్నం చేసే రహస్యాలు. దీని ద్వారా జీవిత సిద్ధి లభిస్తుంది. 24. సః–పశుభోక్త అయిన ఇంద్రదేవుణ్ణీ, ఇంద్రానుజుడైన యూపదేవుణ్ణీ (ఉపేంద్రుడు) పురుషకారంతో ఫలప్రదమౌతుందనే భావంతో స్తుతించాడు. 25. ప్రీతః – ఇంద్రుడైన తనని స్తుతించిన కారణంగానూ, రహస్యస్తుతితో మిక్కిలి సంతృప్తి పరిచిన కారణంగానూ, తనకి కూడ రక్షకుడైన విష్ణు రహస్యస్తోత్ర స్తుతిచేత ఇంకనూ ఆనందపడినవాడై యజ్ఞఫలాన్నిచ్చేశాడు ఇంద్రుడు. 26. ఇతిహాసంలో హరిశ్చంద్రుడనే రాజు శునశ్శేఫుణ్ణి తీసుకెళ్లినట్లుగా ఉంటే, ఇక్కడ అంబరీషుడనే రాజుతో ఈ కథ నడిచింది గదా! ఇదెలా సాధ్యం! ఏది సరైనదనే అనుమానం వచ్చిన వేళ సమాధాన మొక్కటే. 'అంబరీషుడికే హరిశ్చంద్రు'డనే మరో పేరు ఉంది కాబట్టి.

## అరవైమూడవ సర్గము

కన్న పుత్రులకే క్రూరశాపాన్ని ఇచ్చిన కారణంగానూ, క్రోధాన్ని ఏ మాత్రమూ జయించని కారణంగానూ నీకు బ్రహ్మర్షిత్వ సిద్ధి కలగలేదని విశ్వామిత్రుని విషయంలో చెప్పబోతోంది 63వ సర్గకథ. 1. తపఃఫలచికీర్షవః– తపఃఫలాన్ని ఈయనిష్టపడినవాళ్లు. ఋషిః త్వమసి–పూర్వం చేసిన తపస్సుతో రాజర్షివే అయినా ఇప్పటి నీ తపః స్థితి ఋషి సమానమే 2. 'విశ్వామిత్రో మహాతేజా భూయస్తేపే మహాతపాః ........' అనే ఈ పాదంలోని విశ్వామిత్ర పదగతమైన 'వి' అనేది గాయత్రీ మంత్ర బీజాక్షరాల్లో 3వది 3. విశ్వామిత్రునికి జితేంద్రియత్వం లేదని చెప్పేందుకు మరో కథ ప్రారంభమౌతోంది. 5. అప్సరశ్శబ్దం ఏకవచనాంతంగా కూడ ఉంది. ఈమె దేవతలు పన్నిన పన్నాగం ద్వారా

వచ్చిందే తప్ప తనంత తానుగా వచ్చినది కాదు. 7. పంచపంచ – 5+5 – 10 సంవత్సరాలు 9. అహోరాత్రాపదేశేన – పది సంవత్సరాలూ అయిన పిమ్మట చూసుకుంటే తాను మేనకతో గడిపినదంతా ఒక రాత్రీ ఒక పగలూ మాత్రమే అంటే ఒక రోజన్నట్టుగా తోచింది. 11. మధురై ర్వాక్యైః – మధురమైన మాటలతో (మేనకా! ఇలా ఇన్ని సంవత్సరాలు తపస్సు లేకుండా గడిచిపోవడంలో నీ తప్పు ఏముంది? కామపరతంత్రుడినైన కారణంగా ఆ తప్పు నాదే అని ఈ తీరుగా ఆమె భయాన్ని పోగొడుతూ మాట్లాడిన మాటలతో 12. ఉత్తరం పర్వతమ్–ఉత్తర దిక్కున ఉన్న పర్వతమైన హిమాలయాన్ని 13.నైష్ఠికీం బుద్ధిమ్ – తాననుకున్న వ్రతం పూర్తయ్యేంతవరకూ నిశ్చలమైన బుద్ధినాశ్రయించి (ఇంద్రియజయం చెయ్యాలనే లక్ష్యంతో) 17. మహర్షిత్వమ్– ఋషులలో మాత్రం శ్రేష్ఠుడివనే స్థాయిని తెలియచేసే ఋషిముఖ్యత్వాన్ని 20. యది – మహర్షివని ప్రకటించిన కారణంగా నేను విజితేంద్రియుడిని ఐనట్లే కదా? (మహర్షిత్వానికీ, విజితేంద్రియత్వానికీ భేదం ఉంది. మహర్షి అయినంత మాత్రాన విజితేంద్రియుడు కాదన్నమాట) 21. న తావత్ త్వమ్ – నిన్ను కలవరపరిచి నీ బుద్ధిని పెడత్రోవ పట్టించగల సందర్భాలు ఉన్నప్పటికీ ఎప్పుడు నీ బుద్ధి చలించక నిశ్చలంగా ఉంటుందో అప్పటి వరకూ నీవు జితేంద్రియుడివి కావు (వికారహేతు సన్నిధానేఽపి యావన్న వికరోషి) 22. ఆకాశసంశ్రయః

**మ.తీ :–** ఏ విధమైన ఆవరణమూ ఆచ్ఛాదనమూ లేక ఆకాశమే తనకి ఆచ్ఛాదనంగా ఉండే చోటులో (ఆరుబయలులో) 24. సంభ్రమః–భయంతో కూడిన అనుమానం (విశ్వామిత్రుడు తన ఇంద్రపదవిని గాని పొందాలని ఆశిస్తున్నాడా? అనే సంభ్రమం) 25. అహితం కౌశికస్య–విశ్వామిత్రునికి కీడు కల్గించే వాక్యాన్ని (తన ఇంద్రపదవిని విశ్వామిత్రుడు పొందదలిచాడనే భయం అనుమానం కల ఇంద్రుడు ఆ విషయం గురించిన వైరాన్ని తొలగించుకోదలిచి రంభతో తనకి ఇష్టమూ, విశ్వామిత్రునికి కీడూ కల్గించే వాక్యాన్ని పలకబోతున్నాడు)

## అరవైనాల్గవ సర్గము

రంభ కారణంగా తపస్సుకి కల్గిన విఘ్నవిషయాన్ని వివరించబోతోంది ఈ సర్గం. కామజనితమైన మోహం గుడ్డితనం విశ్వామిత్రునికి కలిగేలా చేయడం సురకార్యమే సుమా! దీన్ని నువ్వే చేయాలంటూ రంభతో ఇంద్రుడు చెప్పాడు (ఆజ్ఞాపించాడు) 4. మా భైషి – ఏ విధమైన భయాన్నీ పొందకు! 'మా భైషీః' అని ఉండాల్సి ఉంది గాని ఇక్కడ 'భైషి' అని మాత్రమే ప్రయోగింపబడడం ఆర్షం. (ఋషిప్రయుక్తం కాబట్టి ఇక్కడివరకే సాధువు) 6. బహుగుణమ్ – శృంగార చేష్టలతో కూడిన ఎన్నెన్ని రూపాలున్నాయో అలాంటి గుణాలున్నదానివై (మ.తీ) లోకోత్తరమైన. భేదయస్వ – విశ్వామిత్రుణ్ణి చలించిన చిత్తునిగా చేయవలసినది

**మ.తీ :–** ప్రలోభపెట్టుము. 9. సందేహ మాగతః–సంశయం కలిగింది (ఒక ప్రక్క కోకిల రవం ద్వారా కలిగిన సంతోషం మరోప్రక్క (లలితా) సుందరియైన రంభాసంగీతం......చూడగానే ఇది ఇంద్రుని పన్నాగమే) 11. దుర్భగే–(చక్కని తపస్సుని నేను చేస్తుంటే చెడగొట్టే తలంపుతో) దుష్టప్రయత్నాన్ని చేస్తున్నదానా! భగ శబ్దానికి సంపద, కోరిక, మాహాత్మ్యము, పరాక్రమము, ప్రయత్నము, సూర్యుడు, కీర్తి అనే అర్థాలున్నాయని అమరం చెప్తోంది. 12. ఉద్ధరిష్యతి – (స్వామి పరతంత్రురాలినైన నాకు శాపమా? ఇదేమి ధర్మ మని దుఃఖిస్తూ నిలబడిన

రంభని చూచిన విశ్వామిత్రుడు) పశ్చాత్తాప పడినవాడై నిన్ను బ్రాహ్మణుడు మహాతేజుడు ఉద్ధరించగలడని శాపానికి అనుగ్రహాన్ని చెప్పాడు. బ్రాహ్మణః – బ్రహ్మపుత్రుడైన వసిష్ఠుడు 13. సంతాపమ్ – శాపాన్నిచ్చిన కారణంగా పశ్చాత్తాపానికి లోనయ్యాడు 19. మూర్తయః – అవయవాలు.

## అరవైయైదవ సర్గము

విశ్వామిత్రునికి బ్రహ్మర్షిత్వప్రాప్తిని చెప్తోంది ఈ సర్గం. 1. హైమవతీమ్ – హిమవత్పర్వతమున్న ఉత్తర దిక్కుని, మౌనం వర్షసహస్రస్య – ఏ విధమైన విభాగమూలేక వేయి సంవత్సరాలూ దీక్షాకాలమే అయిన వేయిసంవత్సరాల మౌనవ్రత దీక్షను

**మ.తీ :–** వేయిసంవత్సరాలకు సంబంధించిన మౌనంగా ఉంటూ సాధింపదగిన దీక్షను (తిలకం) మౌనరూపమైన వ్రతాన్ని 2. క్రోధో న అంతరమ్ ఆవిశత్ – కోపమనేది అతని దృఢాంతఃకరణంలో ప్రవేశించనేలేదు. లేదా – ఆ విశ్వామిత్రుని విషయంలో కోపమనేది ప్రవేశించడానికి అవకాశాన్ని పొందలేకపోయింది.

**మ.తీ :–** గట్టి గుండె కలిగినవాడు కావడంచేత కోపాన్ని దరిచేయనియ్యలేదు. ధీరుడైన ఆ ముని అంతరం

**తిలకవ్యాఖ్య :–** అంతఃకరణం కోపాన్ని రానియ్యలేదు 7. ధూమః –

**తిలకం :–** ధూమకేతువు (అగ్ని అని అర్థం). 5. నిశ్చితః – తపస్సిద్ధికోసం తప్పక తాను తినబోయే మొత్తం అన్నాన్ని ఇచ్చెయ్యాలని నిశ్చయించుకున్నాడు లేదా ఏ సంశయమూ, వెనుకబాటుతనమూ కూడ లేకుండా నిశ్చయించుకున్నాడు. 'నిశ్శేషితేఽన్నే – ఏమీ మిగలకుండా' అని కన్పిస్తూండడం చేత ఇంద్రుడే అన్నాన్ని అది కూడ 'ఉన్న మొత్తం అన్నాన్ని' యాచించాడని భావం. అభుక్త్వైవ తిరిగి వండుకోవాలంటే అన్నానికి కావలసిన బియ్యం సంపాదించుకోగల వీలు లేని కారణంగా అన్నం లేకనే 7. ఆదీపితమ్ – తపింపజేయబడింది. ఈ వేడి కేవలం శుద్ధ సత్త్వ గుణం నించి పుట్టిన అగ్నికి సంబంధించింది కావడంతో రజస్తమోగుణాలతో కూడిన సత్త్వ గుణంతో నిండిన దేవతలకి కూడ ఇది తాపాన్ని కలిగించేదిగా అయింది. ఒంటికి నిప్పు అంటుకున్న వ్యక్తి ఎలా భయంతో వ్యాకులుడు అవుతాడో అలా ముల్లోకాలూ కూడ భయపడి పోయాయన్నమాట. 9.కశ్మలమ్ – దుఃఖము, లోభితః–రంభాదర్శనం కారణంచేత ప్రలోభింపపెట్టబడ్డాడు (లొంగకపోయినా) క్రోధితః – వేయిసంవత్సరాల పాటు దీక్ష పెట్టుకుని వ్రతం ముగిసిన క్షణంలో అన్నయాచన కారణంగా కోపింపజేయబడ్డాడు (కోపం తెచ్చుకోకపోయినా) వృజినమ్ – రాగద్వేషాది లక్షణం. 11. వినాశయతి – నశింపజేసితీరుతాడు (అంతటి శక్తిమంతుడు) అవశ్యం లేదా – ఆ తపోగ్నిధూమం నశింపజేసి తీరుతుంది.

**తిలకం :–** వినాశయతి త్రైలోక్య మన్నచోట ఛందోభంగంలేదు. 12. న ప్రతిజానీమః – మాకు (దీనికి విరుగుడు – ప్రతిక్రియ ఏమిటో) బోధపడడం లేదు. ఏది చేయవచ్చో ఏది చేయరానిదో తెలియని కారణంగానూ వివేకాన్ని ఈ సంక్షోభకాలంలో కోల్పోయిన కారణంగానూ దీనికి ప్రతీకారమేమిటో తెలియడం లేదు) నాస్తికః – (ఈ సంక్షోభం కారణంగా) కర్మానుష్ఠాన శూన్యుడుగా (ప్రతివ్యక్తీ కావలసివచ్చాడు).

**మ.తీ :–** పరలోకం ఏ మాత్రమూ లేదని నమ్మేవాడుగా

**మ.తీ :-** 16. పూర్వం....దహ్యతే-ఒకప్పుడు కాలాగ్ని కారణంగా త్రైలోక్యమంతా ఎలా తగులబెట్టబడిందో అదే విధంగా ఇప్పుడు ఈయన కారణంగా ముల్లోకములూ దహింపబడుతున్నాయి. దాహం (మండుట) ఒక లాగానే ఉంది గాని కారణాలు వేరు. 22. వసిష్ఠః - వసిష్ఠుడు అయితే ఎలాటివాడాయన? క్షత్రియవేదమై శాంతిక పౌష్టిక ప్రయోజనాలున్న అథర్వణ వేదంలో నిపుణుడు. దీనిక్కారణం ఆయన - పుట్టుకకి బ్రాహ్మణుడే అయినా క్షత్రియులైన సూర్యవంశీయులకి ఎప్పటినుండో పురోహితపదవిలో ఉండడం. ఇక బ్రహ్మతత్త్వాన్ని ప్రతిపాదించేవి బ్రహ్మవేదాలు. వేదాంతాలు లేదా - బ్రాహ్మణులచేత మాత్రమే చెప్పబడదగినవి. ఈ క్షత్రవేదాలూ ఆ బ్రహ్మవేదాలూ రెండూ తెలిసిన వాళ్లు చాల తక్కువ. ఆ కొద్దిమందిలో శ్రేష్ఠుడు.

**మ.తీ :-** క్షత్రవేదం అథర్వణ వేదం బ్రహ్మవేదాలంటే ఆ మిగిలిన వేదాలన్నీను. మాం వరయంతు - స్వయంగా నన్ను వరించును గాక! అంటే నా ప్రయత్నం లేకుండా నాకు వశమగును గాక! 24. సర్వం బ్రాహ్మణ్యమ్ -యజ్ఞం చేయించే అధికారం, వేదాన్ని ఇతరులకి బోధించే అధికారం అలాగే బ్రాహ్మణులకున్న సకల సౌకర్యములున్నూ, 25. తపః-సకారాంతమైతే 'తపాః' అని ఉండాలి. అకారాంత పుంలింగ శబ్దంగా ఇక్కడ తపశ్శబ్దం ఉంది. ఇది ఆర్షప్రయోగం. 31. సదస్యైః- (సద్యః ప్రాప్య స్థితైః) అప్పటికప్పుడు సదస్సులోనికి వచ్చి కూర్చున్న వారి చేత.

## అరవైయారవ సర్గము

తన తల్లియైన అహల్యకున్న శాపాన్ని తొలగించి శాపమోక్షాన్నిచ్చిన ఆ ఉపకారాన్ని తలుచుకుంటూ శతానంద మహర్షి ప్రసంగవశంగా విశ్వామిత్రచరిత్రాన్ని ప్రారంభించాడు. ఈ చరిత్ర ద్వారా మనకి ప్రయోజనాన్ని చేకూర్చే గురువైభవాన్ని మళ్లీ చెప్పుకోవడం జరుగుతోంది. కామం క్రోధం అనే రెండూ ఎప్పుడూ అడ్డుకోలేనివే. కామాన్నీ అలాగే క్రోధాన్నీ కూడ జయించినవాడు బ్రాహ్మణోత్తముడే. అలాంటి బ్రాహ్మణునికుండే బ్రాహ్మణ్యమనేది సులభసాధ్యమైన పని కాదు. బ్రహ్మవేత్తకి అపచారాన్ని తలపెట్టడం చేయడమనేది అన్నింటి ప్రారంభాన్నీ ఆదిలోనే తుంచి వేస్తుంది. కొనసాగనియ్యదు. భగవంతుడైన శ్రీహరే స్వయంగా సమస్తజనుల్నీ రక్షించడంలో ఉన్న అవసరాన్ని గుర్తించి, ఎలా ఎప్పుడు రక్షించాలా? అనే ఎదురుచూపుతో దేవతలంతా తనని శరణు వేడారనే ఓ చిన్న వంకని పెట్టుకుని తానై రావణుణ్ణి వధించాలనే అభిప్రాయంతో కర్తవ్యంతో భూమికి దిగాలనుకున్నాడు అవతారమూర్తిగా. అంతతో ఊరుకోకుండా తన ప్రయత్నానికి సహాయకురాలిగా వేదవతీ అవతారంలో రావాలని తనంతతానుగా సంకల్పించుకున్న లక్ష్మీదేవిని అడ్డచెప్పకుండా రప్పించాడు తనకుముందుగా భూలోకానికి. ఇలాంటి తుల్యమైన శీలసంపద వయస్సు, నడవడిక, ఆభిజాత్యం (సత్కులీనత) కల కన్య మాత్రమే వరించాలనే అభిప్రాయాన్ని లోకానికి తెలియజేయదలిచి ఆ విషయాన్ని వ్యాప్తి చేయదలిచి జనకకులంలో ఆమెని మళ్లీ పుట్టింపజేసి ఆ కన్యని పరిణయం చేసుకోవడానికి ఓ మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం ఒట్టిగా వచ్చేయకుండా దుర్మార్గరాక్షసులైన తాటకనీ తాటకాపుత్రుడైన మారీచుణ్ణీ, [1]వాని స్నేహితుడు సుబాహువునీ చంపి విశ్వామిత్రుని యాగాన్ని రక్షించి

1.తదనంతకాలంలో జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని చెప్పినది. ఈ కుండలీకరణను పారదీపికలో చూపించాలి.

అహల్యకి శాపమోక్షాన్ని ప్రసాదించి శిష్టులైన అందరి రక్షణాన్నీ చేస్తూ సీతని ఎలా భార్యగా పొందాలా? అనే అభిప్రాయంతో స్థిరచిత్తంతో ప్రయత్నిస్తున్నాడనే ఈ విషయాన్ని (మిగిలినదంతా అయిపోగా ముఖ్యమైన కథావిషయాన్ని) గూర్చి చెప్పబోతోంది రాబోయే రెండు సర్గల కథ.

1. కర్మణా – రోజూ చేయవలసిన నిత్య కర్మానుష్ఠానమైన అర్ఘ్యమీయడం మొదలుకుని ఉన్న కర్మల చేత 5.కృతకామౌ – ఈ వింటిని చూడడం చేతనే తాము వచ్చిన పని అయిందని భావించినవారై

**మ.తీ :–** పొందబడిన కోరిక కలవారై శ్రూయతామ్ – ధనుస్సూ దాని ప్రయోజనం వంటివాటిని దయచేసి విందురు గాక!

**మ.తీ :–** ఏ మీకోసమే ఉందో ఆ ప్రయోజనాన్ని 7. నిమేః – జనకుని వంశంలో ఉన్న, ఆయమ్య – వింటిని ఎక్కు పెట్టి (శరసంధానం చేసి) 8.భాగార్థినః – యజ్ఞం చేసిన సందర్భంలో దేవతలకీయబడే యజ్ఞభాగాలకి అర్హులైన కారణంగా స్వీకరించే యజ్ఞభాగార్థులు (మా యజ్ఞ భాగమేది? అంటూ ఆనందంగానూ అది ఒక గౌరవసూచకంగానూ స్వీకరించే దేవతలు) 'స్విష్టకృత్' మొదలైన భాగాలని కోరుకునేవాళ్లు 9. వరాంగాణి – శరీరంలో ఉన్న అవయవాల్లో శ్రేష్ఠమైన తలలని శాతయామి – బలిపెడతాను 10. విమనసః–(యజ్ఞాన్ని చూడడానికీ భాగాన్ని స్వీకరించడానికీ వస్తే ఈ హఠాత్పరిణామమేమిటా? అని) దీనులై 12.లాంగలాత్ – నాగటి చాలు నుండి (యజ్ఞాన్ని చేయదలిచిన భూమిని ఒక కాడికి రెండెద్దులు చొప్పున రెండు కాడులతో అంటే నాలుగెద్దులతో దున్నించాలి. ఒక కాడికి 'లాంగల'మనీ మరొకకాడికి 'పవీరవ' మనీ పేర్లు. 'లాంగలం పవీరవ' మనే రెంటితోనూ ('ద్వాభ్యామృషభేణ కృషతి' అనే శాస్త్రం ప్రకారం) దున్నించగా ఆ రెంటిలోనూ ఒకటైన) లాంగలపద్ధతి నుండి – అంటే నాగేటి చాలు – నుండి పుట్టింది ఈమె. సీతేతి – 'సీతా' అంటే నాగేటిచాలు కాబట్టి దాని నుండి పుట్టిన ఈమెకి పేరు 'సీత' యే అయింది. 13. వీర్యశుల్కా – వీర్యమే (ధనుస్సుకి ఒకవైపున అల్లెతాడు బిగింపబడి ఉండగా రెండవవైపున బిగింపబడి ఉండదు. వింటిని బలంగా వంచి రెండవవైపు కొనకి అల్లెతాడుని (వింటినారిని) బిగించడం (కట్టడం) అనే దాన్ని విల్లు మోపెట్టడం అంటారు. ఇదే 'వీర్య' మంటే. సంస్కృతంలో దీనికి 'ధనురారోపణ' మని పేరు) శుల్కమ్ (క్షత్రియుడైనవాడు వట్టిగా రారాదు కాబట్టి తాను పెళ్లాడబోయే స్త్రీ (కన్య) కియ్యబోయే మూల్యం శుల్కం. అలాంటి ధనురారోపణమే కన్యాశుల్కంగా ఉన్న కన్య ఎవరో ఆమె 'వీర్యశుల్క' (ఈ నియమం ఉన్న కారణంగానే జనకుడు సీత కలిగిన వెంటనే ఫలానివానికి భార్యగా ఇయ్యదలిచానని భావించనే లేదు. 17. వీర్య జిజ్ఞాసవః– ఆ వింటియొక్క బలిష్ఠవిధానాన్ని తెలుసుకోదలిచినవాళ్లై, గ్రహణే – విల్లుని పట్టుకుని చూడడంలోనూ, తోలనే– ఆ వింటి బరువెంతో పరీక్షించడం కోసమని ఒకటికి రెండు మార్లు దాన్ని పైకెత్తి చూడడం అనే ఈ విషయంలోనూ 19. తన్నిబోధ – ఈ జరిగిన వృత్తాంతాన్ని బట్టి అర్థం చేసుకో! 21. సాధనాని – నా దుర్గాన్ని రక్షించుకునేందుకు కావలసిన అన్ని సాధనములున్నూ.

## అరవైయేడవ సర్గము

విల్లువిరవడమనే కథా విశేషం చెప్పబడుతోంది ఈ సర్గలో 1. దర్శయ

**మ.తీ :–** చూపించు (ఎక్కుపెట్టగలుగుతాడు సీతమ్మని స్వీకరించగలుగుతాడు కూడ. సచివాన్–సమీపంలో ఉన్నవాళ్లని 3. శతాని పంచాశత్ – వందలైన ఏబదులు (100X50= 5000 మంది) వ్యాయతానామ్ – చాల పెద్దవైన బలిష్ఠమైన దీర్ఘమైన శరీరాలు కల సమూహః – (5000 మందిలో ఏ కొందరో కాక అందరూ ఒక్కుమ్మడిగా ప్రయత్నంతో) బలంగా ఈడ్చుకొచ్చారు. 4. ఆయసీమ్ – (తిలకం) ఎనిమిది లోహాలతో నిర్మితమైన 9. ప్రపూరణే – ఈ శ్లోకంలోని ఈ పదాలన్నిటికీ తుమున్నర్థకార్థం చెప్పుకోవాలి. ప్రపూరణే – నమ్రంగా చేయుటకు (రెండవవైపున్న వింటికొప్పుని పట్టి వంచుటకు) ఆరోపణే – వింటినారిని ఆ కొప్పుకి తగిలించుటకు, సమాయోగే – బాణాన్ని దానిలో తొడుగుటకు, వేపనే – వింటినారిని బలంగా తనవైపుకు లాగి పట్టుకొనుటకు, తోలనే–వింటి బరువుని పరీక్షించేందుకై అటు ఇటు వింటిని (శత్రువుని లక్ష్యం చేసుకుని శత్రువువైపుకి వింటిని తిప్పడం కోసం) చలింపచేయడానికి దేవాదులే ఈ పనుల్ని చేయడానికి శక్తులు కాకపోతుంటే మనుష్యులు ఒక లెక్కా?

**మ.తీ :–** కనీసం వింటిని నారిని కూడ బిగించే శక్తి మానుషజాతికి ఉండదు.

**తిలకం :–** ఈ ధనుస్సుని దేవతలూ మొదలైన వాళ్లే చూచి ప్రయత్నించడానికి సమర్థులు కాలేదు. ప్రపూరణమ్–

**తిలకం :–** నిలబడిన ధానుష్కుడు పెట్టెలో పై ఉన్న ధనుస్సుని తీసి తన చెవివరకూ వచ్చేలా వింటిని నేలమీద ఆధారపరిచి పట్టుకోవడం ప్రపూరణం. ఆరోపణమ్– వింటినారిని దానిలో బిగించడం సమయోగః – బాణాన్ని తొడగడం. వేపనమ్–వింటినారిని బలంగా బాణంతో సహా తనవైపుకి లాగడం. తోలనమ్–వింటి బరువునీ బలాన్నీ పరీక్షించడానికి అటూ ఇటూ తిప్పడం 12. అపావృత్య–వింటి మీద ఉన్న గుడ్డ వంటి దానిని తొలగించి

**మ.తీ :–** విల్లు కన్పించేలా చేసుకుని

15. పూరయామాస – వింటి మధ్యని పట్టుకున్నాడు. (అంత పెద్దదీ బరువైనదీ ఎత్తైనదీ అయిన ధనుస్సుని బాలుడు (13ఏండ్ల వాడు) ఎలా ఎత్తగలిగాడని అన్పిస్తుంది. అంతటి చిన్నవాడు ఆ వింటి మరొకకొనని ముట్టుకోకుండానే ఎలా కార్యసాధన చేయగలడని అన్పిస్తుంది. ఆశ్చర్యకరమైన శక్తి కల రామచంద్రుని చేయి తగిలినంతనే ఆ శిరస్సు తనంత తానుగానే తలవంచి రాముని చేతికి వశురాలయింది.

16. నిర్ఘాత సమ నిస్వనః–పిడుగుపాటు శబ్దముతో సమానమైన ధ్వని (నిర్ఘాత నిస్వన సమము). జ్యోతిశ్శాస్త్రంలో చెప్పబడింది. నిర్ఘాతపదానికి అర్థం. (వాయునాభిహతో వాయు ర్గగనా త్పతతి క్షితౌ, యదా దీప్తః.........) భూమి నుండి పైకి వెళ్తుండే వాయువూ ఆకాశం నుండి వస్తూన్న వాయువూ వేగంగానూ బలంగానూ ఒకదానికొకటి తాకినప్పుడు పైనుండి వచ్చే వాయువేగపు రాపిడికి అగ్ని పుట్టి ఒక నిప్పుముద్దలా మారి చెప్పలేనంతగా ధ్వనిస్తూ ప్రకాశిస్తూ వాయువేగంతో బలంగా నేలమీదికి పడడం ఏదుందో దాన్ని 'నిర్ఘాత' మంటారు. దీనికి సరైన

పదంగా 'పిడుగు' ని మనం భావిస్తున్నాం గాని నిర్ఘాతం పిడుగుకంటె బలమైనదీ తీవ్రమైన దోషాన్ని (వాతావరణానికీ వ్యక్తులకీ) కలిగించేదీను.

17. విగత సాధ్వసః – (తన కూతురిపెళ్లికి బలపరీక్షగా నిలిచిన వింటినెవరైనా ఎక్కుపెట్టడం మాట అటుంచి కనీసం ఎత్తనైనా ఎత్తగలరా? అని పూర్వం భయమూ తత్తరపాటూ పడ్డాడు కాబట్టి) ఆ భయం జనకునికి తొలగింది. 19. అచింత్యమ్ – (మనుష్యుల విషయంలో ఇది అసాధ్యమనే అభిప్రాయంతో ఈ విల్లు విరవడం) ఊహకి అతీతమై చింతించ వీలులేనిది. అత్యద్భుతమ్–(ఏదో ధనుస్సు కాకుండా సాక్షాత్తు రుద్రుని వింటిని విరవడం) చెప్పలేనంతటి అద్భుతావహమైన అంశం. 20. కీర్తిమ్ – 'నాకు కల ధనానికి మితి లేదు గాని ఆ ధనంలో నాదంటూ ఏ మాత్రమూ లేదు. కాలిపోయే మిథిలలో నాదేదీ కాలిపోనేలేదు. అనే విధంగా మాట్లాడుతూ ఆత్మవస్తుసంబంధాన్ని పరామర్శించే జనకుడు తన వంశానికి తనవల్ల వచ్చిన కీర్తికంటె సీతవల్ల వచ్చినదే ఎక్కువ అంటున్నాడు. శీలవతియైన కూతురు సత్కులంలో పుట్టి ఇరవై యొక్క తరాల వారి నుద్ధరిస్తుంది. కాబట్టి ఈ సీత వల్ల మా వంశమంతా తరించింది అన్నాడు జనకుడు. కొడుకైతే తన వల్ల సంపాదింపబడిన కీర్తినే కలిగి ఉంటాడు. అదే మరి ఆడపిల్ల అయినట్లయితే జన్మప్రయుక్తాతిశయానికి నోచుకుంటుంది. అంతేకాదు ఆమెకి భర్తవైపునుండి కూడ గౌరవాతిశయాలు లభిస్తాయి. లోకంలో ఎక్కడైనా కన్య, భర్తయొక్క రూపాన్ని కోరుకుంటుంది. ధనాన్ని గురించి ఆలోచిస్తుంది తల్లి. సంప్రదాయము విద్య గురించి చూస్తాడు తండ్రి. బంధువులంతా స్వకులమా? కులాంతరమా? అని ఆలోచిస్తారు. ఇక ఈ దేనికీ సంబంధించని స్నేహం ఉన్నవాళ్లంతా 'రుచికరభోజనాన్ని' కోరతారు. ఇలా అందరూ తలా ఒక విషయాన్ని చూసేవాళ్లౌతుంటే సీతమ్మ, రాముణ్ణి వరించిన కారణంగా, అన్ని తీరుల ఔన్నత్యాన్నీ పొందినట్లు ఔతూ అందరికీ సంతోషకారణమయింది. 23.ప్రశ్రితైః–వినయపూర్వకమైన వాక్యాలతో 25. ఆభాష్య–ఆహ్వానించి. కృత శాసనాన్ – వివాహ విషయికమైన సందేశపత్రికలని ఇచ్చి (నా కూతురు వీర్యశుల్క' అని నేను చేసిన ప్రతిజ్ఞ ఫలించింది. నా మాట ప్రకారం నాకంటె నా ప్రాణాల కంటె గొప్పదైన సీతని ఉత్తమ గుణాలున్న రామచంద్రునికి ఇచ్చి తీరతాను).

## అరవైయెనిమిదవ సర్గము

జానకీవివాహం కోసం దశరథమహారాజుని ఆహ్వానించడం ఈ సర్గలో కన్పిస్తుంది.

1. త్రిరాత్రమ్ – ఒక క్రమంగా ఉన్న మూడు రాత్రులపాటు, రాజవచనాత్ – జనకమహారాజు మమ్మల్ని పంపించాడనే వార్త చెప్తూ 2. విగత సాధ్వసాః – (దశరథుడంతటివాడు దూతలైన తమని ఇంతగా ఆదరిస్తున్నాడనే ఆనందంతో) ఏ మాత్రపు భయమూ తత్తరపాటూ లేనివాళ్లై 6. నిర్వీర్యాః–వింటిని ఎక్కుపెట్టడానికి సమర్థులు కానివాళ్లై 7. వీరైః పుత్రకైః –

**మ.తీ :–** నిజానికి విల్లుని ఎక్కుపెట్టబోతూ విరిచినవాడు రాముడు ఒక్కడే అయినా 'వీరైః పుత్రకైః' అని రెండు చోట్లా బహువచనమే వాడబడడానికి కారణం – పూజ్యార్థం (ఒకరిని గౌరవించదలిచి పిలిచేప్పుడు 'మీరు' అన్నట్టు) లేదా వింటి పరీక్షలో నెగ్గి అల్లునిగా కావడానికి అర్హతని సంపాదించిన కారణంగా గౌరవించదలచడం

లేదా మహారాజ పుత్రుడు గదా! అందుకైనా మన్నన చేయవచ్చునని భావించడం. నిజంగా ఆలోచిస్తే ఇక్కడ ఉన్నవాళ్లు రామలక్ష్మణులిద్దరే కాబట్టి 'వీరాభ్యాం పుత్రకాభ్యామ్' అని ద్వివచనాంతంగా కదా ఉండాలి! కాబట్టి ఇక్కడి బహువచనప్రయోగం నిశ్చయంగా పూజ్యవాచకమే.

**గో.రా :-** పుత్రులచేత అనకుండా పుత్రకులచేత అని కప్రత్యయాంతత (బాల–క)తో ప్రయోగించడానికి కారణం ఆ రామునిలో కన్పిస్తున్న పసితనం పిల్లజుట్టు కలిగిన తనం.

**మ.తీ :-** లోకంలో ఎక్కడ విన్నా అన్నదమ్ములతనంలో ఈ ఇద్దర్నీ వేరువేరుగా చెప్పడమనేది ఎక్కడా లేని కారణంగా ఏ ఒక్కరు ఏ పనిని చేసినా దాన్ని ఇద్దరూ చేసినట్లే. అంతేకాదు. నలుగురు అన్నదమ్ముల విజయమే. ఇలా భావించడం సౌభ్రాత్ర (చక్కని అన్నదమ్ములతనానికి) విధానానికి సంప్రదాయపరమైన పద్ధతి

**మ.తీ :-** శంకర శరాసనాన్ని ఎవరూ విరువలేకపోతుంటే విరువగలిగినవాడు ఒకే ఒక్కడు సుమా! అనీ, అతడు ఇతడేననీ అతణ్ణి ప్రత్యక్షంగా చూస్తూ అందునా చిన్నవయసు వానిగా చూస్తూ – 'వీరైః పుత్రకైః' అని అమానుష పౌరుష కారణంగా పుట్టిన ఆనందంతో కూడిన గౌరవంతో పలికాడన్నమాట 8. తచ్చ – ఆ విల్లుకూడ సామాన్యమైనది గాక దేవరాతుని దగ్గర్నించి వచ్చిన ఈశ్వరసంబంధమైన (ఐశ్వరధనువు) ధనుస్సు 9. మహత్యాం జనసంసది – గొప్పదైన (నిండుగా ఉన్న పెద్దలంతా ఉన్న) జన సభలో (విల్లుని విరవడం రహస్యంగాని ఐంద్రజాలిక విద్యతో గాని జరగలేదు. ఏదో రామునిమీద పక్షపాత బుద్ధితో చెప్పే మాట కూడ కాదు) ప్రత్యక్షంగా జరిగింది. ఆ విరిగిన విల్లు కూడ సామాన్యమైనది కాదు. పూర్వం

**మ.తీ :-** దక్షుని యాగాన్ని ధ్వంసం చేసిన సందర్భంలో ఇంద్రాది దేవతలనందర్నీ కూడ భయపెట్టి పారిపోయేలా చేసినది. కాబట్టే నిండుసభలో విల్లువిరగడం బాగుంది. 11. పుత్రయోః ప్రీతిమ్–ఆ ఇరువురు పుత్రుల విషయమైన (నా పుత్రిక సీత నీ పుత్రుడు రాముడు అనే ఈ ఇద్దరికీ సంబంధించిన కల్యాణ దర్శన ప్రీతిని, లేదా, కోడలు కూడ పుత్రికతోనే సమానం. అలా పిలువబడుతూ ఉంటుంది కూడ. ఆ కారణంగానూ (పుత్రుడూ పుత్రికా కలిపి పుత్రులు అని ఏకశేషసమాసవిధానం ప్రకారం ఔతుంది కాబట్టి) ఈ ఇద్దరి కల్యాణ దర్శనప్రీతిని లేదా లక్ష్మణునికీ ఊర్మిళకీ కూడ వివాహం సిద్ధమయింది కాబట్టి ఇద్దరు పుత్రులకీ ఒకేసారి జరగబోయే కల్యాణ దర్శన ప్రీతిని 12. విదేహేషు – విదేహునికి సంబంధించిన నివాసప్రదేశంలో.

## అరవైతొమ్మిదవ సర్గము

దశరథుడు మిథిలానగరానికి రావడం ఈ సర్గలో చెప్పబడుతోంది 1. సువిహితాః – పెళ్లిళ్లకోసం కావలసిన అన్ని పనులనీ చక్కగా నెరవేర్చుకున్నవాళ్లై

**మ.తీ :-** మంచి రక్షణతో కూడుకున్నవాళ్లై 2. యానయుగ్యమ్ – (యానం) పల్లకీ దానితో పాటు అందలము (ఏ విధమైన కప్పు లేక కుర్చీ వలె ఉండి బోయీలచే మోయబడు అధికారయాన పాత్రము) మొదలైన వాటిని, యుగ్యమ్ – రథములు మొదలైన వానిని

**మ.తీ :–** వాహనాదులను 6. చతురహమ్ – క్రమంగా నాల్గురోజుల పాటు

**తిలకం :–** మిథిలా నగరం నుండి దూతలు మూడు రోజుల్లో రాగా ఇటునుండి వీరికి నాలుగురోజులు ప్రయాణమెట్లు? అనే అనుమానం అవసరం లేదు. చతురంగబలాలతో దశరథుడు వెళ్తున్న కారణంగా మూడు రోజుల మార్గ ప్రయాణం మరో రోజు ఎక్కువ అయింది. 7. ముదితో హర్షం యయౌ – మిథిలా నగరాధిపతి జనకుడు దశరథుణ్ణి చూసి ఆనందపడ్డవాడై తన కూతుళ్లకి పెళ్లిళ్లు జరిగిపోబోతున్నాయి గదా! అనే ఆనందంతో హర్షాన్ని పొందాడు.

**తిలకం :–** 'మోద' మనే ఆ ఆనందపు స్థాయికి పైదే 'హర్ష'ం. 10. విఘ్నాః

**మ.తీ :–** శ్రేయస్సుకి ప్రతిబంధకములైనవి

**గో.రా :–** కన్యాదానానికి అడ్డుగా ఉన్నవి 11. నిర్వర్తయితుమ్ –

**మ.తీ :–** వివాహనిశ్చయానికి ఉపయోగపడే ప్రసంగం (పెళ్లిమాటలు) ఇచ్చిపుచ్చుకోవడాలని భావం. వివాహం ఋషి సమ్మతమ్–నాలుగురోజుల తర్వాత బ్రాహ్మ వివాహాన్ని (చెయ్యాల్సి ఉంది). 13. ప్రతిగ్రహో దాతృవశః – కన్యలూ గోవులూ మొదలైన వాటిని తీసుకునే వ్యక్తి, తనకిస్తున్న దాత ఇచ్చేదాన్ని బట్టి కదా తీసుకోగలడు! నా పుత్రుడు వీర్యాన్ని శుల్కంగా ఇయ్యడం నువ్వు కన్యని ఇయ్యదలచడం మొదలైన వృత్తాంతమంతనీ విన్నాను. ఇప్పుడు నువ్వు కన్యాదాతవి కాబట్టి ఎలా చెప్తే అలా మేం చేయగలం! చేస్తాం! (అంగీకరించదలిచాం) 17.క్రియామ్ – వివాహానికి ముందుగా చేయవలసిన అంకురార్పణాది వైదికకర్మలని.

## డెబ్బైయవ సర్గము

ఇక్ష్వాకు వంశక్రమాన్ని చెప్పడం ఈ సర్గలో కన్పిస్తుంది. 1.కృతకర్మా – యజ్ఞాదిక్రియలన్నీ ముగించుకున్న వాడు

**మ.తీ :–** ప్రాతస్సవనం మొదలుగా గల అనుష్ఠానాలన్నింటినీ పూర్తి చేసినవాడు శతానందునికి కుశధ్వజుని నగరం గురించి తెలిసినా దశరథునికి తెలియజేయడంకోసం జనకుడే చెప్ప ప్రారంభించాడు. పుణ్యసంకాశామ్– నగరం అయిన తన యందు నివసించే వారికి తనంత తానుగానే అభీష్టసిద్ధిని కలిగించగల పురిని.

**మ.తీ :–** పుణ్యశబ్దం దానికి ఫలమైన స్వర్గాన్ని చెప్తుంది కాబట్టి స్వర్గంతో పోల్చదగిన 3. ఇమామ్ జానకీ పరిణయాన్ని చూడడం వల్ల కలిగిన (ప్రీతి) దానిని 14. విశ్వామిత్రాభ్యనుజ్ఞాతః (విశ్వామిత్రునికి ఆగ్రహం కలగకుండా ఉండేందుకు పల్కిన మాట ఇది) విశ్వామిత్రునితో పాటు ఇక్కడ ఉన్న ఋషుల) అనుమతితో 16. అవ్యక్త ప్రభవః– ప్రత్యక్షము మొదలైన ప్రమాణాలకి గోచరింపని వస్తువేదికలదో దాని పుట్టుకకి కారణభూతుడు 'ఆకాశప్రభవో బ్రహ్మ' అని ఈ వసిష్ఠుడే అయోధ్యాకాండలో (110 సర్గము) చెప్పిన కారణంగా అవ్యక్తమన్నా ఆకాశమన్నా వస్తువు ఒకటే. అయితే ఆకాశమంటే ఎవరు? దాన్ని ఉత్తరకాండలో బ్రహ్మదేవుడే చెప్పాడు "ఒకప్పుడు స్వయంగా లోకాలన్నింటినీ మాయతో నాశనం చేసి పెద్ద జలరాశిలో పైపైన తేలుతూ పవళించి ఉండి 'నన్నే నీటిలో సృష్టించా'

వని. అంతేకాదు. గొప్పదై కొత్త కాంతి ఉన్న పద్మంలో అది కూడ నీ బొడ్డు నుండి ప్రభవింపగా దానిలో నుండి నన్ను పుట్టించి ప్రాజాపత్య కర్మం చేయవలసిందిగా నన్ను ఆజ్ఞాపించావు కూడ". కాబట్టి అవ్యయ ఆకాశ పదాలకి అర్థం నారాయణుడే. శాశ్వతుడంటే బహుకాలం ఉండేవాడు. అవ్యయుడంటే ప్రవాహరూపంగా ఎడతెగక ప్రతికల్పంలోనూ ఉండేవాడు. నిత్యుడంటే ద్విపరార్థ కాలం పాటు నాశనం లేనివాడు. 21. దుందుమారః – వీనికే యువనాశ్వుడని కూడ పేరు (రామానుజీయం) 25. ప్రతియుధ్యన్–ప్రతిపక్షులుగా ఉన్న కారణంగా యుద్ధం చేస్తూ 35 కల్మాషపాదః–వసిష్ఠ మహర్షి శాపకారణంగా ప్రవృద్ధుడనేవాడు మనుష్యులని భక్షిస్తూ 'పురుషాదు'డయ్యాడు. తనని శపించిన వసిష్ఠుణ్ణి తిరిగి శపించాలని దోసిట జలాన్ని తీసుకోగానే అతని భార్య మదయంతి భర్త కోపాన్ని ఉపశమింపజేసింది. దాంతో ప్రవృద్ధుడు ఆ శాపమీయబోయిన జలాన్ని నేలమీద విడువరాదు కాబట్టి, తన పాదాలమీదే పోసుకున్నాడు. ఆయన పాదాలు ఈ కారణంగా కమిలిపోతే ఆయన 'కల్మాషపాదు' దయ్యాడు. 38. చంద్రవంశంలో కన్పించే నహుష యయాతులు వేరు.

## డెబ్బైయొకటవ సర్గము

పై విధంగా వసిష్ఠుడు వంశకీర్తనాన్ని చేసి వధూవరణాన్ని (మా రామునికి వధువు కావలెను. ఆమె మీ పుత్రిక సీత అని చెప్పడం) చేయగా, జనకుడు కూడ తమ వంశపు పరిశుద్ధతని చెప్తూ కన్యాదానాన్ని (మా అమ్మాయిని మీ రామునికి ఈయదలిచానని చెప్పడం) చేయదలిచి తమ వంశాన్ని వివరిస్తున్నాడు. 4. సుకేతుః –

**తిలకం :–** పేరుని బట్టి సుకేతువని అర్థం. 20. వీర్యశుల్కామ్ – కాబోయే భర్త పరాక్రమమే ఓలి (శుల్కం) గా కలిగినదనే అర్థమున్న వీర్యశుల్కమ్మనే ఈ విశేషణం ఊర్మిళకి వేయబడింది. నిజానికి రాముడు మాత్రమే ధనుర్భంగాన్ని చేసి తనకి కాబోయే సీతవిషయంలో ఆమెని వీర్యశుల్కగా చేసాడు. ఇంతటి శక్తీ లక్ష్మణునిక్కూడా ఉందనే అభిప్రాయంతో జనకుని ఔరసపుత్రి అయిన ఊర్మిళ కూడ వీర్యశుల్కే అవుతోంది. 21. గోదానమ్ – వివాహానికి ముందు చేయవలసిన కర్మ ఇది. 'గో' అంటే 'కేశము' అని అర్థం. దోః పాదమూల కేశాలని తొలగించడమే సమావర్తనకర్మం. 22. మఖా హి అద్య – ఈ రోజు మఖ. మూడవ రోజుకి అంటే నేటికీ ఎల్లుండినాడు ఉత్తరా ఫల్గుని (ఉత్తర) అవుతుంది. ఆ రోజున వివాహం చేయిస్తే శుభం కలుగుతుంది. రామునికి ఈ నక్షత్రం ఆయన జన్మనక్షత్రం ప్రకారం శుభకరమే (వివాహే ప్రత్యగుత్తమమ్) అయితే సీతకి జన్మనక్షత్రమౌతుంది. కన్యాదానానికి ఉత్తరాఫల్గుని సరైనదే కాక ప్రశస్తమంటూ జ్యోతిశ్శాస్త్రం చెప్తోంది. (త్రీణ్యుత్తరాణ్యపి ........భాన్యుదూని) త్రీణి మూడైన, ఉత్తరాణి – 'ఉత్తర' అనే పేర్లున్న ఉత్తరాఫల్గుని ఉత్తరాషాఢ ఉత్తరాభాద్ర అనేవి.

**మ.తీ :–** ఉత్తరాఫల్గునీ నక్షత్రం సీతకి జన్మనక్షత్రమే అయినా ఆ నక్షత్రంలోని మొదటి పాదాన్ని విడిస్తే ఆమెది కన్యారాశి అవుతోంది. ఆ కారణంగా తృతీయ – ఏకాదశరూప భకూట (నక్షత్రకూట) శుద్ధి ఉంది కాబట్టి నక్షత్రదోషం లేనే లేదు. (భ కూట శుద్ధౌ తన్న దోషమ్) అయినప్పటికీ భార్యాభర్తల ఇరువురికీ నాడి ఒకటే అయిన పక్షంలో ఎడబాటు తప్పదు కాబట్టి ఈ దంపతులకి వియోగం ఉంటుందని తెలుసుకోవాలి. ఉత్తరాఫల్గుని అనే దాన్ని (ఉత్తరా చ సా ఫల్గునీ చ) ఉత్తరా – శ్రేష్ఠమైన, ఫల్గునీ – పూర్వ ఫల్గుని అని కొందరు వ్యాఖ్యానించారు.

ఏదోలా సమన్వయం చేయాలనే ఆలోచనతో అయితే అలా వ్యాఖ్యానం చేసిన పక్షంలో కూడ చంద్రుడు పన్నెండవ యింట ఉంటాడు. కాబట్టి అప్పుడు చేసిన వివాహం కూడ శాస్త్రసమ్మతం కాదు. అనుచితమే అవుతుంది.

## డెబ్బైరెండవ సర్గము

భరత శత్రుఘ్నులిద్దరికోసం విశ్వామిత్రుడు కుశధ్వజుని పుత్రికలని వరించడం (వివాహానికి అంగీకరించ వలసిందిగా అడగడం) ఈ సర్గలో చెప్పబడుతోంది. 7.అవ్యగ్రమ్. ఏ దోషమూ లేని 10. సహితౌ – ఎప్పుడూ సహచరులుగా ఉంటూ 11. ఏకాహ్నే–నలుగురు పిల్లలకీ ఒకే రోజులోనే అంటే ఒక్కనాడే ఇందరికీ (వివాహం చేయించవలసింది)

జ్యోతిశ్శాస్త్రాన్ని పరిశీలిస్తే ఈ సందర్భంలో కొన్ని విశేషాలు కన్పిస్తాయి. ఒక ఇంట్లో ఒక శుభకార్యాన్నే చేయాలని ఉంది. (ఏకస్మింస్తు..........శుభ క్రియామ్) అంతేకాదు. ఎవరైతే ఒకటికి మించి చేస్తారో వాళ్లు ఇబ్బందులు పడతారు (స నాశ మధిగచ్ఛతి) అని కూడ ఉంది. అయితే అదే గ్రంథంలో ఒకే కడుపున పుట్టిన ఇద్దరు పిల్లలకి ఒకే యింట్లో ఒక్కటే వివాహం చేయవచ్చని ఉంది. మరో కడుపున పుట్టిన ఇద్దరికి వివాహం చేయవలసి వస్తే (ఒకరు ఈ తల్లికీ మరొకరు మరొక తల్లికీ పుట్టినవారైతే) వివాహ వేదికని వేరు వేరుగా చేసి ఒకే యింట్లో వివాహం చేయవచ్చని కూడ శాస్త్రం అంగీకరించింది. అయితే లక్ష్మణ శత్రుఘ్నులిద్దరూ ఒక తల్లి బిడ్డలే కదా! మరి వాళ్లకి ఎలా వివాహం చేయబడిందనే అనుమానం కల్గుతుంది. ఒక తల్లి సంతానమైన ఇద్దరికీ ఒకే సంవత్సరంలో వివాహం మౌంజీబంధం (ఉపనయనం) చూడాకర్మ (చెవులు కుట్టించడం)ఇలా అనేక శుభక్రియలు ఒక్కమారే చెయ్యరాదని శాస్త్రప్రమాణం ఉన్నప్పటికీ కవలలైన పక్షంలో దోషంలేదని చెప్పబడింది. పైగా నిత్యం కర్మానుష్ఠానమే తన జీవనంగానూ లక్ష్యంగానూ కల కర్మరుడైన జనకుడూ వసిష్ఠుడూ కలిసి ముహూర్తాన్ని నిర్ణయించుకుని పరస్పరాంగీకారాలతో చేసిన ఈ వివాహాల్లో దోషాలు ఉండనే ఉండవు. 14. పరో ధర్మః–కన్యాదాన రూపమైన ధర్మం 20. కాల్యమ్ – సరైన కాలంలో చేయవలసిన గోదానం సమావర్తనం –

**తిలకం :–** చెవులు కుట్టించడం ఎలా వైదికంగా చేస్తారో అదే పద్ధతిలో పదునారవ సంవత్సరంలో గోదానాన్ని చెయ్యాలి. తొడమీద కూచోబెట్టుకోవడం ఉండదు. అయితే మీసాలనీ గడ్డాలన్నీ తీయించివెయ్యాలి. స్నానం చేసిందగ్గర్నించి మౌనాన్ని పాటిస్తూ సూర్యాస్తమయం వరకూ గడిపి సూర్యాస్తమయం కాగానే గురువు సమక్షంలో మౌనాన్ని వీడాలి. గురుదక్షిణగా ఆవులజతని సమర్పించుకోవాలి. ఇదంతా ఆశ్వలాయన కారికలో సమావర్తన పూర్వాంగంగా చెప్పబడింది. వేదాన్నిగాని వ్రతాన్ని గాని లేదా ఈ రెంటినీ గాని పూర్తి చేసిన మీదట గురువుకి గురుదక్షిణని సమర్పించుకుని ఆ మీదట ఆ గురువు అనుజ్ఞని తీసుకున్నట్లు భావిస్తూ స్నానాన్ని చెయ్యాలనేది యాజ్ఞవల్క్యస్మృతి చెప్పిన విషయం.

## డెబ్బైమూడవ సర్గము

సీతావివాహం చెప్పబడుతోంది ఈ సర్గలో. 1. సాక్షాత్–సొంత తల్లికి సొంత సోదరుడు (ఒకే కడుపున పుట్టినవాడు) స+ఉదరుడు ఈ సాక్షాత్పదప్రయోగం కారణంగా 'భిన్నోదరమాతులుడు' కాదని భావం. 2. స్నేహాత్

– తానూ రాజైన కారణంగా ఏ భయంతోనో కాదు. స్నేహంతోనే (కుశల మడిగాడు) 3. స్వస్రీయమ్ – సోదరి సంతానం 6. యజ్ఞవాటమ్ – ఉత్సవశాల (ఇంతకు ముందు యజ్ఞసమాప్తి అయిందని చెప్పడం బట్టి)

**తిలకం :–** యజ్ఞవాటికా సమీపానికి (ఆయన ప్రవేశించాడని మీద చెప్పబోతున్నాడు కాబట్టి 8. విజయే ముహూర్తే–ముహూర్తమనే పదానికి రెండు గడియలనే అర్థాన్ని చెప్పుకుంటే విజయముహూర్తం పూర్వాహ్ణంలోనే ఔతుంది. (కౌతుకమంటే హస్తసూత్రం (చేతికి కట్టుకునే మంగళతోరం) అని అమరం. 18. ప్రపామధ్యే–లేలేత కొబ్బరి ఆకులతో అందంగా కట్టబడిన మండపం మధ్యభాగంలో

**కతకం :–** యజ్ఞశాలామధ్యంలో ప్రపామండపంలో అని మరికొందరన్నారు. పానీయశాలిక (చలువమందిరం) అని గోవిందరాజీయం.

25. **ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ ।**
**ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ॥**

ఇయమ్ – సౌందర్యం సౌకుమార్యం లావణ్యం ఇవన్నీ ప్రత్యక్షంగా కన్పిస్తున్నాయి గదా! ఈ అన్నిటిచేతా ఆలోచించి చూస్తే ఆమె అయోనిజ అయ్యుంటుందని తోస్తుంది గదా! అందుకే అంటున్నాడు సీతా – నాగేటి చాలునుండి పుట్టింది సుమా! అంతేకాదు రామచంద్రా! ఏ నీ సిద్ధాశ్రమ ప్రయాణం నుండి ధనుర్భంగఘట్టం వరకూ కుతూహలాన్ని పెంచుతూ వచ్చిందో ఆ సీత ఈమెయే. సీతని దర్శించిన సమయంలో మెరుపు మెరిసినట్లు అనిపించడంతో (అవయవంలా మెరుపుంది. మరి) అవయవి లేదని భావించవలదంటూ రామునితో అన్నాడు జనకుడు 'సీత' ఇదిగో అని నిత్యం ఆమెనే నువ్వు తలపోస్తూ రాజభవనంలోనూ ప్రతి మార్గంలోనూ ముందూ వెనకల్లోనూ కూడ ఆమెనే ధ్యానిస్తూ చూడడానికి తహతహలాడుతున్నావు కాబట్టి 'ఇదుగో సీత' అన్నాడు. ఎలా రాముడివైన నువ్వు నన్ను నేను మనుష్యుని గానే భావిస్తూ ఉంటా (ఆత్మానం మానుషం మన్యే) నని అనుకుంటుంటావో అలాగే ఈ సీతకూడ రాఘవుడు రాముడైనప్పుడు తాను సీత ఔతుంది కాబట్టి మనుష్యజాతి కాంతయే నంటూ ఇదుగో సీత! అన్నాడు కేవలం శరీరసౌందర్యమే కాదు, ఆభిజాత్యం కూడ కావాలిగా! ఇదుగో సీత! ఆచారమే ప్రధానంగా ఉండే జనకుని కులంలో పుట్టిన ఈమె ఆభిజాత్యాన్ని గురించి చెప్పాలా? 'ఎంతో తపస్సు చేసి నిన్ను కన్నా' (మహతా తపసా రామ!........) నని నీ తండ్రి చెప్పినట్టుగా నేను కూడ నీకియ్యాలనే ఆలోచనతో అనేక వ్రతాలని ఉపవాసాలని చేసి కన్నాను ఈమెని. అలాంటి సీత ఇదుగో! ఈమె. సుందరి కాబట్టి భోగార్హురాలే అయినప్పటికీ ధర్మం కూడ ఈమెతో మాత్రమే ఆచరింపబడాలి సుమా! అంటూ సహధర్మచరీ తవ అన్నాడు. సహధర్మచరీ – సమానమైన ధర్మం సహధర్మం. దాన్ని ఆచరించేది సహధర్మచరి. 'ఏ తప్పున్నప్పటికీ శరణన్నవాడికి ఆశ్రయమిస్తా' (దోషో యద్యపి తస్య స్యాత్)ననేది ఆయన మాట అయితే, తప్పు చేయకుండా ఎవరుంటా రనేది (న కశ్చిన్నాపరాధ్యతి) ఈమె మాట కాబట్టి మీ యిరువురూ సహధర్మచరులే. ఇంత సరిపోయినా 'జనకా! నువ్వనుమతించనిదే నేనెలా వివాహమాడేది?' అంటావేమో ప్రతీచ్ఛ చ ఏనామ్ – రాముడు తప్ప మరొకరి భార్యగా ఉండలేని ఈమెని, మరొకరు అర్హుడైన పతి కానేకాడనే అభిప్రాయంతో ఆమెని మరొకరు పరిగ్రహించడానికి

నువ్వు తప్ప అందరూ అనర్హులే అనే దృఢనిశ్చయంతో అంటున్నాను. 'ఈమెని స్వీకరించు' అని భద్రం తే! 'స్వతస్సిద్ధురాలైన ఈమెని దానం చేయడానికి నీ అధికార మెంత?' అని రాముడు కోపించవచ్చుననే భావంతో ఆయనని చల్లబరుస్తూ అన్నాడు 'శుభమగుగాక!' నిరతిశయమైన కన్యాలక్షణాలన్నీ ఉన్న ఈమెని స్వీకరిస్తే నీకు సర్వమంగళాలూ లభిస్తాయి. ఒకరికొకరు తగిన వధూవరులు లభించిన సందర్భంలో దృష్టిదోషం (దిష్టి) తగలవచ్చనే అభిప్రాయంతో మంగళాశాసనం చేస్తున్నాడు.

పాణిం గృహ్ణీష్వ – 'ఇలా వివాహం చేసుకో!' అని నేననుమతిస్తే ఎక్కడ గాంధర్వ రాక్షస వివాహాలని చేసుకుంటాడోననే భయంతో చేతిని చేతితో పట్టుకో! అన్నాడు జనకుడు. స్త్రీ సంతానమే కావాలనే అభిప్రాయ మున్నవాడు చేతివ్రేళ్లనే ఎలా పట్టుకుంటాడో (యది స్త్రీ రేవ జనయేయ మిత్యంగులీ రేవ గృహ్ణీయాత్) అలా పట్టుకుంటాడేమోనని చేతిని పట్టుకొమ్మన్నాడు. ప్రణయవేళలో పాదాలని పట్టుకోవచ్చుగాక! ఇప్పుడు పాణినే పట్టుకో. బ్రాహ్మణ వివాహాల్లో చేతిని చేతితో పట్టుకోవాలి గాని క్షత్రియుల వివాహాల్లో క్షత్రియత్వసంసూచకమైన బాణాన్ని పట్టుకోవాలి గదా! ఎలా పాణిని పట్టుకోవలసిందన్నాడనే అనుమానం వస్తుంది. అస(మాన) వర్ణవివాహాల్లో అంటే బ్రాహ్మణుడు క్షత్రియస్త్రీని వివాహమాడాల్సి వస్తే అక్కడ బాణాన్ని పట్టుకుని వివాహమాడాలి. అలా కాక స(మాన) వర్ణవివాహమే అయినప్పుడు క్షత్రియులు చేతిని చేతితోనే పట్టుకోవాలి.

**తనిశ్లోకీ :**–ఇయమ్ – ఈమె నిరతిశయ సౌందర్యవతి. సీతా–అయోనిజయై పరిశుద్ధ జన్మకలది. సహధర్మచారిణి' అని నువ్వే అంగీకరించాక ఈ 'దానమేమిటని అడగవద్దనీ కోపం వలదంటూనూ అనుగ్రహాన్ని కోరుతున్నాడు. మాసోత్సవాల్లో అర్చావిగ్రహాలకి వివాహంలాగా అవతారానికి అనుగుణమైన ఈ వివాహాన్ని తిరస్కరించడం లేదు రాముడు. నాకంటె నీకే ఎక్కువ ప్రేమ ఉందని తెలియజేస్తూ దృష్టిదోషం తొలిగేందుకై వాక్కుతో రక్ష చేస్తూ 'భద్రం తే!' అంటున్నాడు జనకుడు. నీ చేతిని ఆమె చేతితో గాని పట్టుకున్నట్లైతే ఆ దర్శనంచేత కళ్లున్నందుకు ఆనందాన్నీ సఫలతనీ పొందుతాం.

(ఆచార్యవర్యులు) రూప ఔదార్య గుణాలవిషయంలో నేనే గొప్పవాడినని ఓ రామా! భావించకు! ఈమె కూడ నీతో సమానమైన శీలం, వయస్సు, నడవడిక కలిగినదే (తుల్య శీలవయో వృత్తామ్..........) అందుకని నీకు అర్హురాలే! ఇక నీకంటే ఎక్కువదనాలు ఈమెలో ఉన్నాయి. అవి ఆభిజాత్యం – అయోనిజత్వ మనేవి (తుల్యాభిజనలక్షణామ్) భూమిలో పుట్టడం తీగలక్షణం. ఈమె భూజాత అని అనుకోవద్దు. ఈమె 'హిరణ్యవర్ణ'. గమనించు! జనకులకులంలో చెప్పలేనంత కీర్తిని తెచ్చిపెడుతుంది. ఈమె (జనకానాం కులే కీర్తిః ఆహరిష్యతి మే సుతా!) అంతేకాదు. నువ్వాచరించదలిచిన ఆచరించిన ధర్మాలని ప్రవర్తింపచేస్తుంది. ఆ కారణంగా అత్యాదరంతో గ్రహించు తప్ప నా కంటె సీత తక్కువదే అనే ఆలోచనతో వద్దే వద్దు. (మరికొందరి వ్యాఖ్య) రామునితో మాత్రమే ఉండే లక్షణం సీతది. ఆ రామునితో ఈ పతివ్రత అయిన స్త్రీకి విరహం కలిగితే జీవితం దుర్భరం ఆమెది. భర్త ఆర్తితో ఉన్నప్పుడు, సంతోషిస్తున్నప్పుడు, అలాగే హర్షంతో ఉన్నప్పుడు అదే విధంగా ఉండే స్త్రీ పతివ్రత. భర్త మరొకచోటికి పోయినప్పుడు మలినురాలై (జీర్ణవస్త్రధారిణియై కాంతి హీనయై) కృశించి భర్త మరణించిన దశలో ఏ స్త్రీ కూడ మరణిస్తుందో ఆమె పతివ్రత. ఇలాంటి పతివ్రతాలక్షణమున్న స్త్రీలకంటె ఉత్తమురాలు ఈమె. మరో

మాటగా చెప్తే నీకు శరీరం వంటిదీ – ఆత్మ వంటిదీ కూడ. సీత విషయంలో ఏదైనా తక్కువ దనముందని నువ్వు భావిస్తే 'ఏ నీడ ఆ చెట్టుదే అయినట్లు' ఆ తక్కువదనం నీదికూడ అవుతుంది. 'తల్లినే ఆడు పిల్లలు అనుసరిస్తా' (సుతా మాతర మంగనాః) రన్నట్టు ఈమె తల్లియైన భూమి చెప్పలేని గంధగుణంతోనూ, ఎంతటి భారాన్నైనా మోయగల సారగుణంతోనూ, ఏ కష్టాన్నైనా సహించగల క్షమాది గుణాలతోనూ ఉంటుంది కాబట్టి ఈ నా కూతురు రాజకుమారి అయినప్పటికీ భోగాలని విడవడమే కాక, ఆశ్రితుడైన వానికి అనుగుణంగా విశేషంగా కూడ భోగదానాన్ని చేయగలదు. ఇలాంటి వ్రతనియమాలతో ఉన్న పెరిగిన ఈమె నీదే. ఈమె వ్రతాల నియమాల సాఫల్యం మొత్తం నీదే. భోగింపదగిన వస్తువు విశేషం మొత్తం భోక్తదే కదా! సిగ్గుతో ఉండే లక్షణం కన్యది కాబట్టి, ఆమె తన చేతిని చాచి నీ చేతిని పట్టుకోలేదు కాబట్టి నువ్వే ఆమె చేతిని (నీ చేతిని చాపి) పట్టుకో! ఏ లోకాలన్నీ ఎవని చేనీడలో జీవిస్తున్నాయో ఆ హస్తంతో ఈమె పాణిని గ్రహించు.

29. ఊర్మిలామ్ – ఊర్మిలను (లక్ష్మణా! పాణిగ్రహణం చేయవలసింది) లక్ష్మణుని కంటె భరతుడు పుట్టుకలో ముందువాడై జ్యేష్ఠుడౌతుంటే లక్ష్మణునికి భరతునికంటె ముందు వివాహం 'పరివేద' మనే దోషానికి కారణం కాదా? కానే కాదు. లక్ష్మణుడూ భరతుడూ ఒక తల్లి బిడ్డలు కారు. పినతండ్రి పిల్లలు, సవతిపిల్లలు, ఇతర స్త్రీ పుత్రులనే వీరి విషయంలో వివాహం – దానం – యజ్ఞం అనేవి జరిగినట్లైతే ఈ జ్యేష్ఠకనిష్ఠనియమం అక్కరలేదు. దోషం కాదు. 34 అగ్నిం ప్రదక్షిణీకృత్య – అగ్నికి ప్రదక్షిణం చేసి (ఒకే వేదికలో ఒకే అగ్నిని వసిష్ఠుడు ప్రజ్వలింపచేస్తే ఆ అగ్నికే నలుగురూ భార్యలతో కూడి ప్రదక్షిణం చేశారు) ఇది పాణిగ్రహణహోమం. ఇక పాణిగ్రహణమయ్యాక అగ్ని – బ్రాహ్మణ కన్యాదాతలకు ప్రదక్షిణాలు చేసి ఏ జంటకి ఆ జంట వేర్వేరుగా అగ్నిని ఏర్పాటు చేసుకుని వివాహహోమాన్ని చేసుకున్నారు. 36. పుష్పవృష్టిః–

**మ.తీ :–** పూలవాన. మా కోరిక (రావణవధకోసం సీతారామవివాహం లక్ష్మీనారాయణావతార విధానం) నెరవేరింది ఫలోన్ముఖమయిందంటూ కురిపించారు.

## డెబ్బైనాల్గవ సర్గము

అందరూ అయోధ్యకి వెడుతుంటే పరశురాముని రాక గురించి చెప్పబోతోంది ఈ సర్గం. 3. క్షౌమ కోట్యంబరాణి బంగారపురంగు పట్టువస్త్రాలు అనేకం లేదా కోటి ఉత్కృష్టవస్త్రాలు 7. సబల + అనుగః చతురంగ బలాలూ కింకరులతో 8. భౌమాః –

**మ.తీ :–** భూమి మీద సంచరించే (భూ సంచారం చేసే మృగాల ప్రదక్షిణం శుభసూచక మనడం చేత అంతరిక్ష పక్షిసంచారం అశుభ సూచకమని తెలుస్తోంది. అయినా 'ఘోరాః వ్యాహరంతి' అనడం వల్ల మరింత స్పష్టత.)

## డెబ్బైయైదవ సర్గము

ప్రారంభంలో అవతార ప్రస్తావంలో విష్ణువు పరతత్త్వం చెప్పబడింది. 'అహం వేద్మి మహాత్మాన' మ్మంటూ విశ్వామిత్రుడు దశరథునితో అన్నమాటల్లో పురుషసూక్తం ప్రమాణంగా చూపబడింది. 'నీ శరీరంలో సర్వ జగత్తునీ

చూస్తున్నాను. అనాదివి. అనిర్దేశ్యుడి' వంటూ చేసిన కాశ్యపస్తుతిలో సర్వజగత్కారణత్వం చెప్పబడింది. గంగని తల మీద ధరించడం విడిచి పెట్టడం ద్వారా అపరత్వం సూచింపబడింది. ఇప్పుడు మరో తీరున అల్పశక్తిమత్త్వం కల పరశురామావతారం ద్వారా అపరత్వాన్ని చూపించబోతున్నాడు ఈ సర్గలో మహర్షి. 1. రామ.....రామ! పరశురాముని కోపాతిశయం తెలుస్తోంది. రెండు మార్లు రామ పదాన్ని (సంబోధిస్తూ) ఉచ్చరించడంలో చ – తాటకాది వధ 5. అభయం దాతుమర్హసి–రాముడు చేసిన తాటక సుబాహువధలని తెలిసినవాడే అయినా, స్థానం కాని స్థానంలో భయశంకితుడైన దశరథుడు రామునిమీది ప్రేమభారంతో ఇలా ప్రార్థిస్తున్నాడు అభయాన్నిప్పించ వలసిందని 10. సుకృతే మంచి ప్రయత్నంతో (పట్టుదల) నిర్మించబడినవి (విండ్లు) 12. సమానసారమ్ –

**మ.తీ :–** రెండూ విళ్లూ సమానబలాలే కలవి అయినా ధనుర్భంగ కారణంగా రౌద్ర (శివ) ధనువు తక్కువబలం కలదయ్యింది. 14. విరోధం జనయామాస. శివ కేశవులకి విరోధాన్ని పుట్టించాడు (త్రిపురదహనం కారణంగా శివుడే బలవంతుడని తేలాక, విష్ణువా శివుడా బలవంతుడని చర్చ జరిగితే, ఎవరు చెప్పినా పరోక్షంలో ఆ ఇరువురూ మేమంటే మేమే బలవంతులమనుకుంటూ ఉంటే, మాటలతో కాని పనికి క్రియయే మంచిదని భావించి విరోధాన్ని పుట్టించాడు బ్రహ్మ) 16. హుంకారేణ–విష్ణుహుంకారముచేతనే జృంభితం–(విల్లు) చిట్లెను

**మ.తీ :–** జడభూతమై స్తంభించెను (అభిమంత్రించిన బాణంతో కాదు విష్ణు హుంకారంతోనే)

**తనిశ్లోకీ :–** త్రిలోచనుని మూడో కన్ను కూడ వ్యర్థమయింది.

**గో.రా :–** నేతి బీరకాయ లాగా (మహాదేవ శబ్దంలోని) మహచ్ఛబ్దం అయింది. 'ఏక ఏవ రుద్రో న ద్వితీయా తస్థే' అనే శ్రుతివాక్యం 'శివుడొక్కడే మరొకడు లే' దని చెప్తుంటే 'ఏకో హ వై నారాయణ ఆసీత్' అనే శ్రుతివాక్యం నారాయణుడే దైవమని చెప్తోంది. ఇంద్రజిత్తు రాముణ్ణి తాత్కాలికంగా ఓడించినంత మాత్రాన రాముని కంటె బలవంతుడౌతాడా? అంటే, ఇంద్రజిత్తుది అదృశ్యయుద్ధం. అది అధర్మయుద్ధం కూడ. అలాంటి పరోక్ష అదృశ్య యుద్ధంలో విష్ణువు ఓడాడేమో గాని, ప్రత్యక్షయుద్ధంలో వింటితో అవమానపడ్డాడు శంకరుడు. ధనుర్విషయాన్ని చూస్తే, ఒక్కొక్కచోట ఒక్కొకరు ఒక్కొక్కవిధంగా చెప్పారు. ఇదంతా సమంజసమైన కథే. మొత్తమ్మీద సమన్వయం ఏమంటే విశ్వకర్మతో ఒక అద్భుతధనువుని నిర్మింపజేసిన దేవతలు మహాదేవునికి (శివునికి) ఇచ్చారు. దాంతో దక్షయజ్ఞధ్వంసం ముగించిన మహా శివుడు విష్ణువుతో విభేదించి యుద్ధంలో పాల్గొన్నాడు. (మనం ఇప్పుడనుకున్న కథ ఇదే) విష్ణుహుంకారం కారణంగా ధనుస్సు చిట్లింది. ఈ ధనుస్సుని శివుడు దేవరాతునికి ఇచ్చాడు. అప్పటినుండి న్యాసరూపంగా ఉన్న ఆ విల్లు (ఎప్పుడు కావలసివస్తే అప్పుడు తీసుకుపోవడం) మిథిలలోనే ఉంటూ పూజలందుకోసాగింది. అలా ఉన్న కాలంలో దేవతలంతా వరుణుణ్ణి ప్రార్థించి జనకుని యింట దాచి ఉంచవలసిందన్నారు. ఆ విల్లే వివాహంలో విరువబడిన శివధనుస్సు. సరే! ఇక విష్ణువుకి సంబంధించిన వైష్ణవధనువుని (దీన్నీ విశ్వకర్మ చేతనే దేవతలంతా చేయించి శ్రీహరికిచ్చారు) భృగువంశంవాడైన ఋచీకునికిచ్చాడు న్యాసరూపంగా విష్ణువు. ఆ ఋచీకమహర్షి నా (పరశురాముని) తండ్రి అయిన జమదగ్ని కిచ్చాడు. నా తండ్రిని కార్తవీర్యార్జునుడు చంపాడని తెలిసినంతనే సకలరాజవంశాల్నీ చంపి భూమి మొత్తాన్ని కాశ్యపునికే ఇచ్చేసి ఇదిగో

వైష్ణవధనువుతో నీ ముందు కొచ్చానన్నాడు పరశురాముడు. 27. యది శక్నోషి-సమర్థుడివే అయినట్లైతే (ఈ ధనుస్సుని పట్టుకో ఊరికే పట్టుకున్నప్పటికీ విడవను. నీ బలపరీక్షకోసం ద్వంద్వయుద్ధాన్ని చేసి తీరతాను.

## డెబ్బైయారవ సర్గము

పరశురాముని గర్వభంగం ఈ సర్గలో ఉంటుంది. 5. విశ్వామిత్ర కృతేన – విశ్వామిత్రుని సోదరి సత్యవతి. ఆమె భర్త ఋచీకుడు. వీరి పుత్రుడు జమదగ్ని ఆయన కొడుకు పరశురాము'డనే విశ్వామిత్రసంబంధంతో 16. జానామి

**తిలకం :–** 'ఉతామృతత్వస్యేశానః' అని వేదం చెప్పినట్లు శ్రుతి ప్రసిద్ధ బ్రహ్మము నీవే. 19. శరమోక్షే –

**మ.తీ :–** బాణాన్ని విడిచినట్లైతే (తపస్సు చేత పాపాలు తగులబడి నీ శరం ద్వారా మోక్షం లభించి జీవన్ముక్తుణ్ణి కాగలను).

## డెబ్బైయేడవ సర్గము

అయోధ్యకి అందరూ రాగా సీతారాములు సుఖంగా ఉన్నారని చెప్తుంది ఈ సర్గ. 1.విహ్వాలమ్ – అవయవస్వాధీనము తప్పిన (పరశురామభయంచేత – ధనుర్దానవృత్తాంతమంతా మాయచేత తెలియకున్నా) శ్రీమద్భిః –

**తిలకం :–** భార్యా పరిగ్రహకారణంగా అధిక లక్ష్మీవంతులైన వారిచేత 9. వధూపరిగ్రహే–కోడండ్రను తేవడంలో (వధూర్జాయా స్నుషా – అమరం) 18. అక్లిష్టకారిణమ్–ఎవరికీ ఏవిధంగానూ దుఃఖం కలగదో అలా చేయడమే తన స్వభావంగా కలిగినవానిని 20. ప్రియాణి..హితాని – ఇష్టప్రాప్తి ప్రియం, అనిష్టనివృత్తి హితం. అలాంటి వానిని 22. నైగమాః–వణిజులు

**మ.తీ :–** పౌరులూ దశరథుడూ మొదలైన వాళ్లు. 24. బహూన్ ఋతూన్ –

**మ.తీ, తిలకం :–** పన్నెండు సంవత్సరాలని ఎందరో చెప్పారు.

**గో.రా :–** ఆయా ఋతువులకి తగినట్లుగా (భోగించారు. అందుకే బహూన్ వత్సరాన్ అనలేదు.) 25. ప్రీతిః రామునిలో ఉన్న గుణాలు ఆమెలోనూ ఉన్నాయి. అయితే సీతలో రామునికంటె మించిన సద్గుణాలున్నాయి. (సౌందర్య సౌశీల్య సౌజన్యసౌభాగ్యాదులు) అది కాక పితృకృత భార్యాత్వం. సీతకి రాముని యందలి భక్తి మాత్రమే ప్రీతికి కారణమైతే రామునికి సీతమీది ప్రీతికి కారణాలు పైనున్న అన్నీను. 26. తస్యాశ్చ – రాముడు తన హృదయాన్ని గ్రహించడం కంటె ఎక్కువగా ఆమె అతని హృదయాన్ని గ్రహించగలిగేది. హృదయంలో అభిప్రాయం పుట్టాక గ్రహించేవాడు రాముడు. 'ఈ అభిప్రాయం కలగబోతోం'దని గ్రహించగలిగింది సీత.

**తిలకం :–** మహాయోగి మహాజ్ఞాని అయిన జనకుని కూతురు గదా మరి! సాక్షాల్లక్ష్మి కాబట్టి (దేవతాసమాన హేతువు) తద్ద్వారా తెలుసుకోగలిగేది సీత! 28. తయా సరాజర్షి సుతః – ఆమెతో అతడు పాలలో పటికబెల్లంలా

కరిగిపోతూ, స్ఫటికంలో దాసానిపూవులా ప్రతిబింబిస్తూ, కాగితం మీద రూపాన్ని లిఖించినట్టూ, మన్మథుడు తన ఐదు బాణాలనీ మేకులుగా చేసి కొట్టినట్లూ, ఆ ఇరువురికీ ఒకరికొకరి మనసూ లగ్నమైంది. అతడు రాముడు ఆమె అభిరామ. అతడు, రాజసుతుడు. ఆమె ఉత్తమ రాజకన్య. అతడు రాజితకాముడు. ఆమె అనంతకామ. కన్యకి ఈడు రాకున్నా యోగ్యుడు లభిస్తే చేసి తీరాలి. దోషం కాదు.

– సమాప్తం –

## అయోధ్యాకాండ సారాంశం

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

**గచ్ఛతా మాతులకులం భరతేన తదానఘః ।**
**శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నో నీతః ప్రీతిపురస్కృతః ॥**

అనే శ్లోకంతో అయోధ్యాకాండ ప్రారంభించబడింది. పుణ్యపురుషుడు జితేంద్రియుడు అయిన శత్రుఘ్నుని పరమప్రీతితో భరతుడు మేనమామగారి ఇంటికి వెళుతూ తనవెంట తీసికొనివెళ్లాడు. రామలక్ష్మణుల అవినాభావ సంబంధంలాగే భరతశత్రుఘ్నుల సంబంధం. ఈ విషయం "గచ్ఛతా" అనే పదం ద్వారా తెలియజేయబడింది. దశరథునికి (విష్ణువుకు) తన శరీరం నుంచి ఉత్పన్నాలయిన నాలుగు చేతులవలె నల్గురు కుమారులు ఇష్టులే. అయినా రాముడు సమస్త భూతాలలో (జీవకోటిలో) బ్రహ్మ ఇష్టుడైనట్లు దశరథునికి మరింత ప్రీతిపాత్రుడయ్యాడు. రాముడు బుద్ధిమంతుడు, మధురభాషి, పూర్వభాషి, ప్రియంవదుడు, జితక్రోధుడు. రాముని గుణగణాలు ఎన్నో ఇందు వివరించబడినాయి. వీర్యంలో యమశక్రసముడు. బుద్ధియందు బృహస్పతి. అటువంటి రాముని వీక్షించి ఆయనను యువరాజును చేయుటకై మంత్రులతో కలసి ఆలోచించి నిశ్చయించాడు. అంతే కాదు. ఆకాశోత్పాతాలు, అంతరిక్షోత్పాతాలు, భూమ్యుత్పాతాలు ఊహించి, తన ముసలితనాన్ని కూడ సమీక్షించుకొన్నాడు. వెంటనే నానా నగర నివాసులను, జానపదులను రప్పించాడు.

**"న తు కేకయరాజానం జనకం వా నరాధిపః"**

కేకయరాజును జనకమహారాజును మాత్రం ఆహ్వానించలేదు.

ఆ రాజ్యాలు అయోధ్యకు చాలా దూరంలో ఉన్నాయని వ్యాఖ్యాతల అభిప్రాయాలు. రాజనీతిజ్ఞుడు, దీర్ఘదర్శి అయిన దశరథుడు వారిని ఆహ్వానించకపోవడంతో ఏదో ఆలోచన వేరే ఉండి ఉండవచ్చు. వారి ముందు తన సంకల్పాన్ని వెల్లడించాడు. వెంటనే వారు తమ ఆమోదముద్రవేశారు. అందరూ ఏకకంఠంతో సరే అనగానే రాజుకు సంతోషం కలిగినా తెలియవానిలా నా పరిపాలనలో ఏదైనాలోపం జరిగిందాయని ప్రశ్నించాడు. పౌరజానపదులందరు శ్రీరాముని ఇక్ష్వాకు వంశస్థులందరిలో మిన్నయని ప్రశంసించారు. సుమంత్రుడు రాజాజ్ఞపై రాముని సభాస్థలికి తీసుకొని వచ్చాడు. గంధర్వరాజ ప్రతిముడు, లోకవిఖ్యాత పౌరుషుడు, దీర్ఘబాహుడు, మహాసత్త్వుడు మత్తగజతుల్యగమనుడు, చంద్రుని కన్న అందమైన ముఖం కలవాడు. మిక్కిలి ప్రియదర్శనుడు, రూపంలో పురుషచిత్తాపహారకుడు అయిన కుమారుని చూచి

**"న తతర్ప సమాయాంతం పశ్యమానో నరాధిపః"**

అదే పనిగా రెప్పలార్చక ఎంతగా చూస్తున్నా, తనివితీరలేకపోయాడు.

ఇక్కడ ఒక విషయాన్ని ఆలోచించవలసి ఉంది. రాజు తన పెద్ద కుమారునికి యౌవరాజ్యాభిషేకం చేయడానికి ఎవరి అంగీకారం అక్కరలేదు. అది సార్వభౌమాధికారం. కాని దశరథుడు ప్రజాభిప్రాయ ప్రకారంగా రాముని

రాజుగా చేయదలచుకొన్నాడు. ఇది ఆయన ముందు చూపునకు ఒక ఉదాహరణం. మహారాజు రామునితో నాకు జ్యేష్ఠపత్నియందు ఉద్భవించిన కారణంచేత, నీవు గుణశ్రేష్ఠుడవు కావడంచేత, ప్రజాంగీకారం చేత నిన్ను యువరాజుగా చేయదలచుకొన్నానన్నాడు. కాని రాముడు ఇది జరిగేది కాదనుకొన్నాడేమో! ప్రత్యుత్తరం ఏమీ ఈయలేదు. రేపే పుష్యమీ నక్షత్రమని, రేపే రామునకు యౌవరాజ్యాభిషేకమని, అన్నీ సిద్ధం చేయాలని, అందరినీ ఆజ్ఞాపించాడు.

రాజు అంతఃపురం ప్రవేశించి రాముని మళ్లీ తన దగ్గరకు తీసుకురావలసిందని సుమంత్రుని ఆజ్ఞాపించాడు. రాముడు వచ్చిన తరువాత రాజు తన జన్మనక్షత్రాన్ని క్రూర గ్రహాలు చేరియున్నాయని, ఇటువంటి సమయంలో రాజు మరణించడమో, ఆపదలపాలు కావడమో జరుగుతుందని, భరతుడు లేకుండా అభిషేకమేమిటని భావించవద్దని, భరతుడు జ్యేష్ఠానువర్తియైన ధర్మాత్ముడని పలికాడు. అప్పుడు కూడా రాముడేమో మాట్లాడలేదు.

తెల్లవారబోతోంది. మంథర యాదృచ్ఛికంగా ప్రవేశించింది. యాదృచ్ఛికంగా అనే పదానికి దైవవశాత్తు అనే అర్థం చెప్పుకోవచ్చు. విషయాన్ని అంతా గ్రహించింది. అభిషేకానికి భంగం చేయాలని మంథర కైకను ప్రేరేపించింది. కైకేయీపుత్రునికీ రాజ్యం ఇస్తానని రాజు ఆమె మాతామహునికి మాట ఇచ్చాడు (అ–107–3). కాని మంథర ఆ విషయాన్ని ప్రస్తావించడంలేదు. ఆ మాట ద్వారా భరతునికే రాజ్యం ఈయాలి. అది ప్రస్తుతం నిరుపయోగం ఎందువల్లనంటే రామాదులు పాయాసాన్న సంభూతులు కాబట్టి అందువల్ల మంథర సత్యసంధుడైనరాజు పూర్వం కైకేయికి ఇచ్చిన రెండు వరాలను కోరమంది. ఒకటి రామునికి 14 ఏండ్లు వనవాసం. రెండోది భరతపట్టాభిషేకం. కైక మంథరబోధలకు తల ఊపింది. రాజు ప్రయత్నం భంగమయ్యింది. రాముడు వనాలకు వెళ్లవలసివచ్చింది.

ఇక్కడ మంథర కైకతో

"హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమస్త్రియః" అని అంటుంది. దీనిని బట్టి రాముడు ఏకపత్నీవ్రతుడగునా? కాదా? అనే శంక ఉదయిస్తుంది. విదేశపరిశోధకులు కూడ దీనిని ఉటంకిస్తారు. కాని ఒక్క సంగతి గుర్తు ఉంచుకోవాలి. ఇది రాముని 25వ ఏట జరిగిన సంఘటన. రాజులు ఎంతమంది స్త్రీలనయినా వివాహమాడవచ్చు కాన ఆమె అట్లని ఉండవచ్చు. కాని రాముడు వేరెవరినీ వివాహమాడలేదు. ఇది రాముని ఏకపత్నీవ్రతత్వాన్ని భంగపరచేవాక్యం కాదు.

ఇక్కడ మరొక్క విచారణ కూడ ఉంది. 14 ఏండ్లు మాత్రమే రామునికి వనవాసం ఎందుకు కోరబడిందని మరో శంక. కృతయుగంలో 16 ఏండ్లు, త్రేతాయుగంలో 14 ఏండ్లు, ద్వాపరంలో 13 ఏండ్లు, కలిలో 12 ఏండ్లు ఒక చోటు వదలి వెళ్లిపోతే హక్కు కోల్పోవలసివస్తుందని ఒక సమాధానం. కాదు. అప్పటికి రావణుని ఆయుష్షు ఇంక 14 ఏండ్లు మాత్రమే మిగిలి ఉంది. కాబట్టి ఆమె అలా బోధచేసి ఉండవచ్చని మరో సమాధానం.

రాముడు తన వనవాసవార్తను కౌసల్యామాతకు చెప్పగా ఆమె మిగుల దుఃఖించింది. అంత లక్ష్మణుడు కౌసల్యను ఊరడించుటకై తత్కాలసదృశవాక్యాలను పలుకుతాడు. చివరకు కౌసల్య రామునితో తాను కూడ వనాలకు వస్తానంటుంది. అంత రాముడు

కథం స్విదన్యా విధవేవ నారీ (అ–21–60) అని భర్త బ్రతికిఉండగా భార్య ఆయనను విడిచి పెట్టిరావడం సాధారణ విధవా నారీకృత్యం అంటాడు. ఇది రాముని ధర్మనిర్వహణ. ఎంత సూక్ష్మమైన పదును గల్గిన దృష్టి రామునిదో మనకు అవగతమవుతుంది. చివరకు ఆమె ఎన్నో మంగళాశాసనాలు చేసి "విశల్యకరణి" అనే ఓషధితో రక్షా బంధనం కడుతుంది.

రాముడు సీతతో వనవాసవృత్తాంతాన్ని చెప్పగా సీత తాను కూడా వస్తాననగా రాముడు తృణీకరిస్తాడు. కాని ఆమె ప్రణయంతో కూడిన చనవుతో

**కిం త్వా౽ మన్యత వైదేహః పితా మే మిథిలాధిపః ।**

**రామ! జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహమ్ ॥** అని అంటుంది. నా అల్లుడు ఆకారంలో పురుషుడైనా, స్వభావంచే స్త్రీ అని నిన్ను గూర్చి నా తండ్రి తలచునేమో! అని తనపని సాధించుకోవడానికై గడుసుతనంతో పలికింది. అంతేకాదు "అగ్రతస్తే గమిష్యామి మృద్నంతీ కుశకంటకాన్" అని అంటుంది. నీ దారిలో దర్భలను, ముండ్లను పొడిపొడిగా చేస్తాను అని అంటుంది. ఇందు మరో విషయం కూడ దాగియుంది. "కుశకంటకాన్" అనే చోట భూమికి సుఖం కల్గచేయడానికై కంటకప్రాయులను ఏరిపారవేయడానికై నీకన్న ముందు ఉంటాననే భావం నిక్షిప్తమై ఉంది. ఇక రాముడు కాదనలేకపోయాడు. లక్ష్మణుడు రామునికి పాదాభివందనం చేసి తాను కూడ వనాలకు వస్తానంటాడు. సీతారామలక్ష్మణులు వనవాసానికి బయలుదేరారు.

వారు తండ్రి (రాజు) అనుమతికోసమై సభాస్థలికి వచ్చారు. అప్పుడు దశరథుడు రామునితో "అయోధ్యా యాస్త్వమే వాద్య భవ రాజా నిగృహ్య మామ్" నన్ను నిగ్రహించి అయోధ్యాధిపత్యాన్ని స్వీకరించుమన్నాడు.

ఇప్పటికి రాజు మూడుసార్లు రాముని ఆజ్ఞాపించాడు. ఇందు ఏది గ్రహించినా పితృవాక్యపాలనయే. మొదట పట్టాభిషేకమన్నాడు. పిమ్మట కైక ద్వారా వనవాసవిధిని వాక్రుచ్చాడు. "అటు పిమ్మట మూడోసారి తనను నిగ్రహించి రాజ్యస్వీకారం చేయమన్నాడు. ఇందు ఏది చేసినా పితృవాక్యపాలనమే. ఉత్తరోత్తరం బలీయమైనదని న్యాయంచే మూడోదానికే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అయినా రాముడు పితృవాక్యపాలనతో బాటుగా సత్యవాక్యపాలన మరీ ముఖ్యమని అడవులకు బయలుదేరాడు. తన తండ్రిని సత్యప్రతిజ్ఞుని చేయడం కోసమై రాముడు వనవాసానికి సిద్ధమయ్యాడు.

దశరథుని ఆజ్ఞపై సీతాదేవి ఆభరణాలతో బయలుదేరింది. సుమిత్ర లక్ష్మణుని ఆశీర్వదించింది. రామం దశరథం విద్ధి" అని రాముని తండ్రిగా, విష్ణువుగా గ్రహించమని ఉపదేశిస్తుంది. రథం సిద్ధమయింది.

**తిష్ఠేతి రాజా చుక్రోశ యాహి యాహీతి రాఘవః**
**సుమంత్రస్య బభూవాత్మా చక్రయోరివ చాంతరా ।**

**నాశ్రౌషమితి రాజానముపాలబ్ధో౽పి వక్ష్యసి ।**
**చిరం దుఃఖస్య పాపిష్ఠ మితి రామ స్తమబ్రవీత్ ॥ (అ–40–46,47)**

రాజు రథం నిలపమన్నాడు. రాముడు రథాన్ని పోనీయమన్నాడు. చక్రాల మధ్య చిక్కుకొన్న వానిలా సుమంత్రుడు అయ్యాడు. రాజు ఎందుకు నా మాటలు వినలేదని అడిగితే "నేను వినలేదు" అని నీవు చెప్పవచ్చు.

దుఃఖస్థితిలో ఉన్నప్పుడు ఎక్కువ కాలం వేచి ఉండడం ఉచితం కాదు. అని అంటాడు రాముడు. ఇది శ్రీరాముడు అసత్యం పలకమని చెప్పినట్లు కాదా? అని ఒక పెద్ద శంక. ఒక్కొక్కప్పుడు వినక పోవడమంటే ఏమిటి? విన్నా ఆచరించలేకపోవడమని అర్థం. సుమంత్రుడు రాజాజ్ఞ కన్న రామాజ్ఞకే ఎక్కువ విలువ ఇచ్చి రథాన్ని పోనిచ్చాడు. మొదటిరోజు తమసానదీతీరం చేరుకొన్నారు. రాముడు తన పౌరులను కష్టపెట్టడం ఇష్టంలేక రాత్రి వారిని మోహపరచేలా చేసి రథాన్ని నడపమని సుమంత్రునికి ఆజ్ఞాపించాడు. రెండో రోజు శృంగిబేరం చేరాడు. మరునాడు గంగను దాటి గుహునితో మూడో రోజు అడవులలోనికి ప్రవేశించాడు. అక్కడే నాలుగు మృగాలను వేటాడి భుజించారు.

రాముడు తల్లితో "కందమూలఫలైర్జీవన్ హిత్వా మునివదామిషమ్" వనవాస గమన ప్రస్తావన చేస్తూ అంటాడు. తాను ఆమిషమును విడిచి పెట్టాలన్నాడు. ఆమిషమనగా మాంసం. ఇక్కడ రాముడు మాంసభక్షణం చేసినట్లు ఉంది. అందువల్ల వ్యాఖ్యాతలు ఎవరి అభిప్రాయానుసారంగా వారు వ్యాఖ్యానం చేసారు. "ఆమిషం హిత్వా = రాజ్యభోగాలను త్యజించి" అని కొందరి "వ్యాఖ్యానం" సుగంధ ద్రవ్యాలతో కలిపి వండిన మాంసాన్ని "త్యజించి" అని కొందరి భావన. క్షత్రియధర్మాన్ని అనుసరించి భక్షించాడంటే ఏ ప్రతిబంధకం ఉండదు.

మూడో రోజు రాత్రి గంగకు ఆవలి తీరంలో న్యగ్రోధవృక్షం క్రింద పరున్నారు. నాల్గో రోజు భరద్వాజాశ్రమం చేరారు. ఐదో రోజు నల్లని మర్రిచెట్టు వద్దకు చేరి విశ్రమించారు. ఆరో రోజు చిత్రకూటం చేరారు. అచట వాల్మీకి మహర్షిని సందర్శించి ఆయనకు అభివాదం చేసి పర్ణశాలను నిర్మించుకొని వనవాసం ప్రారంభించారు. భరద్వాజాశ్రమంలో జరిగిన సంభాషణను గూఢచారులద్వారా తెలుసుకొనిన సుమంత్రుడు అయిదో రోజు అయోధ్యకు బయలుదేరాడు. ఆరో రోజు దశరథుని సన్నిధికి చేరాడు. రామాదుల చిత్రకూటగమనాన్ని ఆయనకు వివరించాడు. ఆ రోజు రాత్రి దశరథుడు మరణించాడు. ఆయన శరీరాన్ని తైలద్రోణి యందు భద్రపరచి, అందరూ తనను రాజుగా ఉండమని కోరినా, వసిష్ఠుడు, అంగీకరింపక వార్తాహరుల ద్వారా భరతునికి వర్తమానం పంపించాడు.

ఇక్కడ విషయాలు అక్కడ తెలియజేయవద్దని తన మాటలుగా భరతునికి ఇలా చెప్పండని వసిష్ఠుడు వారికి ఆజ్ఞాపించాడు.

**"పురోహితస్త్వాం కుశలం ప్రాహ సర్వే చ మంత్రిణః ।**
**త్వరమాణశ్చ నిర్యాహి కృత్యమాత్యయికం త్వయా" ॥**

అని భరతునికి సందేహం కలగకుండా చెప్పమన్నాడు. ఎన్నో కానుకలను పంపించాడు. పురోహితుడు, సమస్త మంత్రులు నీ కుశలం అడిగారని, నీవు ఆత్యయికపరిస్థితిని నిర్వహించవలసియున్నదని, వెంటనే బయలు దేరమని చెప్పమన్నాడు. భరతునకు కూడ ఒక దుఃస్వప్నం సంభవించింది. అతడు కీడును శంకించాడు. వెంటనే ప్రయాణానికి సిద్ధమయ్యాడు. శత్రుఘ్నుడు కూడ వెంబడించాడు. భరతుడు ఏడు దినాలు పయనించి ఎనిమిదోనాడు అయోధ్యచేరాడు. దూతలు ఆరు దినాలు పయనించి ఏడోరోజున కేకయరాజ్యం చేరారు. అప్పటికి దశరథుడు మరణించి 15 రోజులు అయ్యింది. రాముని వనవాసం 21 రోజులు పూర్తి అయ్యింది. అయోధ్యను వీక్షించిన భరతుని గుండె కకావికలయ్యింది. గుండెనిబ్బరంతో నగరంలో అడుగు పెట్టాడు.

తండ్రి మందిరంలో ప్రవేశించి ఆయన కనబడకపోవడంచే తల్లి అంతఃపురానికి వెళ్లాడు భరతుడు. కైక భరతునితో

**“యా గతిస్సర్వభూతానాం తాం గతిం తే పితా గతః ।**
**రాజా మహాత్మా తేజస్వీ యాయజూకః సతాం గతిః” ॥**

అని సాధారణ వార్త చెప్పినట్లుగా భర్త మరణాన్ని తెలియజేసింది. అవసాన దశలో తండ్రి ఏమన్నాడని ప్రశ్నించాడు ఆతడు. రామా! సీతా! లక్ష్మణా! అంటూ ప్రాణాలు విడిచాడంది ఆమె. వారిక్కడ లేరా అని ప్రశ్నించాడు మరల ఆతడు అరణ్యాలకు వెళ్లారని బదులిచ్చింది ఆమె. అడవులకు వెళ్లే తప్పు ఏమి చేశాడు రాముడు? అని మళ్లీ ప్రశ్నించాడు ఆతడు అప్పుడు కైక ఇలా అంటుంది.

**“న రామః పరదారాంశ్చ చక్షుర్భ్యామపి పశ్యతి”** అని రాముని పట్ల తనకున్న విశ్వాసాన్ని వ్యక్తపరచింది ఆమె. మరి ఎందుకు అడవులకు వెళ్లాడని మళ్లీ ప్రశ్నించాడు భరతుడు.

అంత కైక తాను కోరిన రెండు వరాలను వివరించింది. భరతుడు వెంటనే దుఃఖంతో కుమిలిపోయాడు. రామపట్టాభిషేకవార్త అది భంగమైన విషయం తనకు తెలియదని కౌసల్యముందు ఎన్నో శపథాలు చేశాడు. ఇందు భరతుని ధర్మతత్పరత వ్యక్తమవుతుంది. పిమ్మట వసిష్ఠుని ఆదేశానుసారం తండ్రికి అంత్యక్రియలు నిర్వహించాడు. కొన్ని రామాయణాలు కంబ రామాయణం వంటివి అంత్యేష్టి శత్రుఘ్నుడు నిర్వహించాడని వచించాయి. దశరథుడు కూడ కైకతో “నీలా భరతునికి కూడ రామయౌవరాజ్య పట్టాభిషేకభంగం ఇష్టమయితే, అతడు నా అంత్యక్రియలు చేయకుందుగాక!” అని అంటాడు. అందువల్ల భరతుడే అంత్యసంస్కారాలు నిర్వహించాడని చెప్పాలి. పండ్రెండు రోజులలో అశుచి పూర్తి అయ్యింది. అప్పటికి రాముని వనవాసం 33 రోజులు పూర్తి అయ్యింది.

మంత్రులు, పౌర ముఖ్యులు అందరూ భరతుని రాజ్యాధికారం చేపట్టమని కోరారు. కాని భరతుడు ఈ రాజ్యానికి రాముడే ప్రభువని ప్రకటించాడు. అతని ఆదేశానుసారం సచివులు చిత్రకూటం వరకూ వెళ్లడానికి చక్కని మార్గాన్ని ఏర్పాటు చేయించారు. భరతుని ఆదేశానుసారం రాణులు, పౌరముఖ్యులు, మంత్రులు, సేనాధిపతులు అందరూ రాజలాంఛనాలతో చిత్రకూటం బయలుదేరారు. మొదటిరోజునే వారు శృంగబేరపురం చేరారు. భరతునిరాక గుహునికి ముందు సందేహాన్ని కలగజేసింది. తరువాత ఆతని నిష్కలంక చిత్తవృత్తిని గ్రహించి గంగ దాటించాడు. రెండో రోజు భరద్వాజాశ్రమం చేరారు. ఆ రోజు ఆ ముని వారికందరికీ విందు ఏర్పాటు చేసాడు. భరతుడు మాత్రం రామభక్తిని ప్రకటిస్తూ నిర్లిప్తతతో ఉండిపోయాడు.

అప్పుడు భరతునితో భరద్వాజుడు

“న దోషేణావగంతవ్యా కైకేయీ భరత! త్వయా”

అని కైకేయిని నిందించవద్దని రాముని వనవాసం అందరికీ సుఖశాంతిని వర్ధిల్లచేస్తుందని చెప్పాడు. అక్కడ నుండి అందరూ చిత్రకూటం బయలుదేరారు. ఆ సందడిని, అలజడిని చూచిన రాముడు హేతువేమిటో తెలుసు కొమ్మని లక్ష్మణుని ఆదేశిస్తాడు. లక్ష్మణుడు సాలవృక్షాన్ని అధిరోహించి, కోవిదారధ్వజమున్న రథాన్ని చూచి

భరతునిపై కారాలూ, మిరియాలూ నూరాడు. అపుడు రాముడు అతనిని చల్లబరచాడు. అటుపై సౌమిత్రి ఇంక భరతుని నిందించలేదు. భరతుడు రాముని సందర్శించి ఆయన పాదాలను చేరక మునుపే ఏడుస్తూ నేలపై పడిపోయాడు. శత్రుఘ్నుడు కూడ ఏడుస్తూ అన్నపాదాల వద్దకు చేరి ప్రణమిల్లాడు.

పిమ్మట రాముడు కుశల ప్రశ్నల రూపంలో భరతునికి రాజనీతిధర్మాలు బోధించాడు. తండ్రి స్వర్గస్థుడైనట్లు భరతుడు తెలియజేయగా రాముడు గారపిండి ముద్దతో పిండప్రదానం చేసాడు. అయోధ్యకు విచ్చేసి రాజ్యపాలనం స్వీకరించమని రాముని అభ్యర్థించాడు. తండ్రి ఆజ్ఞను పాలించి పదునాలుగేండ్లూ వనవాసం చేయడమే తన కర్తవ్యమని రాముడు వివరించాడు. భరతుడు తాను రాముని దాసుడనని, రాజ్యపరిపాలనకు తాను అనర్హుడనని చెప్పి వాపోయాడు. ఎన్నో విధాలుగా రాముని శరణాగతి చేశాడు. అది వెంటనే నెరవేరలేదు. భరతుని శరణాగతి కాలవిలంబనతో కూడుకొన్నది. దానికి అనుగుణంగానే అతని నోటివెంట మాటలు ఇలా వచ్చాయి.

అతడు రాజ్యాన్ని స్వీకరించమని రాముని కోరేటప్పుడు

**“సాన్త్వితా మామికా మాతా, దత్తం రాజ్యమిదం మమ ।**
**తద్దదామి తవైవాహం, భుజక్ష్వ రాజ్యమకంటకమ్” ॥**

అని వచించాడు. “నా తల్లి చేసింది సరైనది కాదని నేను ఆమెకు నచ్చచెప్పాను. ఆమె కూడ నీవు అయోధ్య రావడానికి అంగీకరించింది. రాజ్యం నాకు అధర్మమార్గంతో దత్తమయింది. దాన్ని నేను మీకు ఇవ్వడానికై వచ్చాను” అన్నాడు. ఇటువంటి సమయంలో షష్ఠీవిభక్తి వాడరాదు. “నీకు” అని కాకుండా “నీ కొఱకు” అని చతుర్థీవిభక్తి వాడాలి. “తుభ్యం సంప్రదదే న మమ.” అని అనడమే సంప్రదాయం. షష్ఠీవిభక్తి ప్రయోగిస్తే పునస్స్వీకరణయోగ్యత్వం ఉంటుంది. చతుర్థీ విభక్తి ఉపయోగిస్తే దానిపై ఇక తనకు ఎట్టి స్వాతంత్ర్యం లేదనే అర్థం వస్తుంది. ఇదే శ్లోకం యుద్ధకాండలో కొద్దిమార్పుతో మళ్లీ వస్తుంది. అక్కడ “తుభ్యం” అనే పదప్రయోగంతో ఉపయోగింపబడుతుంది.

తండ్రి మరణానికై చింతిస్తున్న భరతుని జననమరణాలు అనివార్యములని రాముడు పలికి ఓదార్చాడు. ఆ సమయంలో వసిష్ఠుడు ఇక్ష్వాకువంశక్రమాన్ని వివరించి, రాముని రాజ్యం చేయమని వచించాడు. కాని రాముడు తండ్రి తనకు ఇచ్చిన ఆదేశం వమ్ముకాకూడదని పలికాడు. రామభరతసమాగమాన్ని వీక్షించిన ఋషులు రావణవధ కోరుకొన్నవారై దశరథవాక్యం శిరోధార్యమని పలుకుతారు. చివరకు భరతునికి పాదుకలే శరణ్యాలయ్యాయి. అవి రాజలాంఛనాతో కూడినవి. వాటిని ఒక్కసారి తొడిగి కొని తిరిగి ఇమ్మన్నాడు. రాముడు అలాగే చేసాడు భరతుడు సపరివారంగా బయలుదేరి మార్గమధ్యంలో భరద్వాజుని ఆశీర్వాదాలు పొంది అయోధ్య ప్రవేశించి, నందిగ్రామం చేరి పాదుకలకు పట్టాభిషేకం చేసాడు.

రాముడు చిత్రకూటం విడిచి ముందుకేగుతూ అత్రిమహామునిని సందర్శించాడు. సీత అనసూయ ఇచ్చిన అంగరాగాదులను స్వీకరించింది. మునీశ్వరుల ఆశీర్వాదాలను పొంది సీతారామలక్ష్మణులు మువ్వురూ దండకారణ్యంలో ప్రవేశించారు.

ఇవి అయోధ్యాకాండలోని విశేషాలు.

# శ్రీమద్వాల్మీకి రామాయణం - అయోధ్యాకాండ సమీక్ష

**వ్యాఖ్యాత - డా॥ బి. నరసింహాచార్యులు**

**శ్లో ॥ సకల సుగుణధామ( శాలీ) సర్వలోకాభిరామః**
**ప్రణత మనుజ రక్షాదీక్షిత శ్శౌర్యభీమః ।**
**జనక వచన మాత్రాత్ సర్వరాజ్యం వ్యహాసీత్**
**దనుజ బల విరామః పాతు నో రామచంద్రః ॥**

భగవద్వాల్మీకి మహాముని బాలకాండలో విష్ణువునకు గల, జగత్కారణత్వము, మహాపురుషత్వము, అచింత్యవైభవత్వము అను గుణములు రామునిలో గలవని, వాటివలన రామునకు 'పరత్వము', ఇతర దేవతలకు అపరత్వము గలిగినవని నిరూపించాడు. వీటితోబాటు మహాకుల ప్రసూతత్వము, మహాగురు కృపాలబ్ధ, ధనుర్విద్యా రహస్యజ్ఞత్వము, తదుదాహరణ భూతమయిన అసురవధ కర్తృత్వము, హరధనుర్భంగము, వైష్ణవ చాపగ్రహణము మొదలయిన గుణాలను సహధర్మచారిణీయోగము, లక్ష్మీయోగము, లక్ష్మీవిశిష్ట ప్రాప్య స్వరూపము మొదలయిన వాటిని వర్ణించాడు.

ఇక అయోధ్యాకాండలో శ్రీమహావిష్ణువునకు గల హేయగుణాభావత్వము, సకల కల్యాణ గుణైకతానత్వము, శ్రీరామునిలో గలవని, శ్రీరాముడు అనుష్ఠించిన పితృవాక్యపరిపాలనాది సామాన్య ధర్మములను, భగవచ్ఛేషత్వము, భగవత్పారతంత్ర్యము, భాగవతాభిమాననిష్ఠ మొదలయిన విశేష ధర్మములను, భగవంతుని సౌలభ్యము, ప్రాప్యరూప జీవస్వరూపము నిరూపింపబోతున్నాడు వాల్మీకి అని అంటారు గోవిందరాజులవారు.

మొదట భాగవతనిష్ఠను శత్రుఘ్నుని వృత్తాన్తము ద్వారా తెలుపగోరాడు. కత్తిని దాచే ఒరలాంటివాడు శత్రుఘ్నుడు. ఖడ్గాన్ని చుట్టిన బట్టలాంటివాడు. ఖడ్గాన్ని తీసుకొని వెళ్ళారంటే, బట్టను కూడ తీసుకొని వెళ్ళినట్టు భరతుడు ఖడ్గం, శత్రుఘ్నుడు బట్ట. భరతుడు వెళ్ళిన దగ్గరికి వెళ్ళడమంటే తదేక పారతంత్ర్యము శేష్యుద్దేశ్యోద్దేశ్యకత్వ పారతంత్ర్యము. భాగవతత్వమనగా భగవత్పారతంత్ర్యరూపమే.

ఈ ప్రకరణములో అఘశబ్దానికి కేవల రామభక్తియని అర్థము. తనకు శేషి అయిన భరతునికి ఉద్దేశ్యము అగునట్లుగా శత్రుఘ్నునకు రామభక్తి ఉద్దేశ్యము. మనకు అనిష్టము కలిగించుదానికే పాపమని పేరు. తన శేషి అయిన భరతునికి ఉద్దేశ్యముకాని రామభక్తి అనిష్టమే గనుక, దానికి అఘమని పేరు సరిపోతుంది. మోక్షంగోరే వానికి సుకృతం గూడ అనిష్టమే గనుక పాపమని అంటుంది శ్రుతి. నిత్యశత్రువులను చంపేవాడు– నియంత్రించుకునే వాడు కనుక అన్వర్థనాముడు శత్రుఘ్నుడు 'పుంసాం మోహన రూపాయ' అనునంతటి రాముని పైనుండి దృష్టిని మరల్చుకొన్నవాడు. తన అధికారానికి రామవిషయభక్తి తగదని దానిని మరల్చుకొన్నాడు. అందుకే నీతః అని 'అచిత్తు' నకు వలె పారతంత్ర్యము సూచించాడు వాల్మీకిముని. గత్యంతరము లేక భరతునితో వెళ్ళడం విధివశంతో

అయినది కాదు ప్రీతితో వెళ్ళాడు అని చెప్పాడు. దీనితో అచిత్ లాగ కాదని భేదము. చిత్తు, అచిత్తు రెండు కూడ భగవంతుని పారతంత్ర్యములోనే ఉంటాయి. చేతనా చేతనములు భగవంతుని ఆధీనంలో ఉండటం సాధారణమే అయినప్పటికి మిక్కిలి తెలిసినవాడు మాత్రం శత్రుఘ్నునివలె భాగవత పారతంత్ర్యములోనే ఉండాలి అని ధ్వనితము. మహాకావ్యమనగా వ్యంజనావృత్తితో అర్థమును తెలుపునదే గద! 'గచ్ఛతా' అను మొదటి శ్లోకానికి శ్రీగోవిందరాజు భూషణమిది.

ఇక తిలకము. బలవంతుడయిన రాముని లక్ష్మణు డాశ్రయించినందుకు ఈర్ష్య లేనివాడు అని అనఘ శబ్దార్థాన్ని చెపుతుంది. మేనమామ గారి ఇంట్లో భోగభాగ్యాలు ఇతడు లేకుండ అనుభవించడం, అనుభవించనట్టే అని శత్రుఘ్నుని భరతుడు తీసుకు వెళ్ళాడు. ప్రీతితో ముందుంచుకొన్నాడు అనడంతో నిర్బంధం కాని, పరస్పరానురాగాన్ని సూచిస్తుంది.

తిలకము చాలా విషయాలను, శేషం తీర్థీయవత్–మిగిలినది తీర్థీయ వ్యాఖ్యవలె, అని చెప్పుతుంది. ముని భావప్రకాశికా– అనఘ పదాన్ని, పుట్టినది మొదలు లక్ష్మణుడు రాముని ఎడబాయక ఉన్నట్లు, భరతుని వెంటనంటి ఉంటూ, తలిదండ్రుల, సోదరుల ఎడబాటు తెలియనివాడు అని వ్యాఖ్యానిస్తుంది. నిత్యశత్రువు లయిన ఇంద్రియాలను జయించినాడు, తన నుండి చూపు మరల్చనీయని రాముని యందు నిలచిన కళ్ళను కట్టిపడేసి భరతునితో వెళ్ళడమే జితేంద్రియుడు శత్రుఘ్నుడనడానికి ప్రత్యక్షనిదర్శనము.

గోవిందరాజీయము– రామభక్తుడయిన భరతుడు, మేనమామ ఇంట్లో ఎలా ఉన్నాడు రాముని వదిలిపెట్టి అంటే రాముని అభిమానానికి పాత్రుడయిన శత్రుఘ్నుని సహవాసంతో అని జవాబు. భ్రాత్రా సహ అన్నదానిని రామునితో కూడా –ఎల్లప్పుడు రాముని తలుస్తుండడం వలన రామునితో ఉన్నట్లుగా ఉన్నాడట, అని వ్యాఖ్యానిస్తాడు. తండ్రి ముసలివాడయ్యాడు, రాజ్యభారం మోయలేకున్నాడు, ఇప్పుడయినా రామునికి అభిషేకం చేస్తుండవచ్చునని ఆలోచిస్తుండేవారు భరతశత్రుఘ్నులు. రాజు వాళ్ళిద్దరినీ, మహేంద్రవరుణుల వంటి స్నేహంగలవారని స్మరిస్తుండెను. తన శరీరం నుండి వచ్చిన నాల్గు భుజాలను సమంగా ప్రేమతో జూసినట్లు రాజు నలుగురిని సమప్రేమతో జూశాడు. అయినా వారికంటె ఎక్కువ గుణాలున్నందున రాముడు ఎక్కువ ఆనందాన్ని కలిగించిన వాడయ్యాడు. దీనిక్కారణమే మంటే కన్నుగానని గర్వంతో జగత్కంటకుడయిన రావణుని చంపాలని దేవతలు ప్రార్థించడంతో విష్ణువు రామునిగా అవతారమెత్తాడు గనుక. ఇక్కడ చాలా విశేషాలున్నాయి గోవిందరాజీయంలో– విష్ణువు యొక్క ప్రధాన (సంపూర్ణ) అవతారం కనుక, మేమే ప్రభువులం, సుఖపరులము, అనే దురభిమానం ఉన్న దేవతలతో, నరకాసురవధ చేసిన, తమ పని చేసిపెట్టిన కృష్ణునితోనే పారిజాతం కొరకు యుద్ధం చేయమొదలు పెట్టబోయిన దేవతలతో, అవతారం ఎత్తమని బతిమిలాడినందువలన బుట్టిన వాడయినందున, తనకు వరమిచ్చిన దేవతలనే వెళ్ళగొట్టేంతటి సహజ గర్వం ఉట్టిపడే రావణుని చంపడానికి, ఒక్కణ్ణి చంపినంత అందరు సుఖంగా ఉండగలరని దేవతలు ప్రపత్తి చేసినవాడు కనుక, హవిస్సును కూడా యోజనం దూరంనుండి తీసుకునే దేవతలు కోరగా, మానుష లోకంలో పుట్టాడు అన్నందున ఆయన ఎంతో సులభుడు అని జజ్ఞే–నృసింహునిలాగ బయల్వెడలక, పదినెలలు పన్నెండు నెలల తల్లి గర్భంలో ఉండి పుట్టాడు. అంతట వ్యాపించి ఉండే 'విష్ణువు', అట్లా వ్యాపించిన

విశ్వంలో ఒక తల్లికి తనయుడుగా పుట్టాడు తాను సనాతనుడు-నిత్యము అయినా, అనిత్యముగా చేసుకుని (అయిపోయి అని అర్థము) జన్మించాడు.

ఇక తిలకము. తీర్థవ్యాఖ్యానంలో ఈ విశేషాలు - నలుగురు గుణవంతులే. రాముడు వారికంటే ఎక్కువ గుణములు కలవాడు. తండ్రియయిన విష్ణువునకు ప్రాణులన్నిటిలో, దేవాదులలో, వాటి కంటె గుణవత్తరుడయిన బ్రహ్మ ప్రీతి పాత్రుడయినట్లు రాముడు దశరథునకు ప్రేమాస్పదుడయ్యాడు. బ్రహ్మ జ్యేష్ఠపుత్రుడు. రాముడూ జ్యేష్ఠుడేగద లేదా రాముడు తండ్రికి, సోదరులకు కూడ ప్రీతిపాత్రుడయ్యాడట. స్వయంభువు తండ్రియయిన విష్ణువునకు సర్వప్రాణులకు ప్రీతికరుడయినట్లు గానట. దీనికి శ్రుతి, మహాభారత ప్రమాణాలుండనే ఉన్నాయి. విష్ణువే రాముడుగా అవతరించినందున చెప్పబోయే గుణాలన్ని అతనిలో తప్పక ఉంటాయి అని భావము

గోవిందరాజీయము - అతడు కేవలం తండ్రికే గాదు తల్లికి గూడ ఆనందదాయకుడే. ఇంద్రుని బడసిన అదితివలె కౌసల్య ఆనందం పొందింది. తిలకం- కొందరు వామనునితో అదితివలే అని అర్థం చెప్పారు. రాముడెట్లా గుణవత్తరుడు? ఈ గుణాల వల్ల? ఏవి అవి?అవి ఇవి - సౌందర్యము కలవాడు, రూపం, ఔదార్యము మొదలయిన గుణాలు 'చ'కారముతో చెప్పినట్టులయినది. మృగనాభి గంధము స్వయంగా ఏమి వికారము చెందకుండా ఇతరులకే వికారం కలిగిస్తుంది. అట్లా వీర్యవంతుడు. ఇతరుల గుణములందు దోషాలు ఎత్తిచూపడం- అసూయ. అది లేనివాడు. భూమ్మీదనే అట్లాటి కొడుకేలేడు ఒక్క కౌసల్యకుదప్ప. (ఆకాశం) స్వర్గంలో అయితే అదితికి ఇంద్రుడున్నాడు ఆకారము-రూపురేఖా విలాసములు, ఇంగితము - మనస్సులోని భావము, చేష్ట-నడవడి-పనిపాటలు, ఈ మూడింటితో దశరథుని బోలినవాడు. దీపము నుండి మరో దీపంలాగ (ఈ భావాన్ని కాళిదాసు కూడ రఘువంశములో ఇలా చెప్పాడు -

**రూపం తదోజస్వి తదేవ వీర్యం తదేవ నైసర్గిక మున్నతత్త్వమ్ ।**
**న కారణాత్స్వాత్ బిభిదే కుమారః ప్రవర్తితో దీప ఇవ ప్రదీపాత్ ॥ రఘువంశం -**

ఇక దశరథునిలో లేని గుణాలు ఏవి రామునిలో ఉన్నాయంటే- ఎవరు నిష్ఠూరాలు ఆడినా ఎదురు చెప్పడు, తొణకడు బెణకడు, ఈ విషయాలు 'అపి' అనే పదంతో తెలుస్తున్నాయి. వాటి ప్రసక్తేలేదని దానిక్కారణం ఎల్లప్పుడు శాంతంగా ఉంటాడు, అంతేగాక నిష్ఠూరాలు మాట్లాడినవారితో నెమ్మదిగా మాట్లాడుతాడు. ఓదార్పుగా మాట్లాడుతాడు అని కూడా 'అపి' కి అర్థం. తనను ఆశ్రయించిన వారివిరోధులను దునుమాడువాడని కూడ వీర్యవాన్ పదానికర్థం. అందరిలో అరుదుగా ఉండే కృతజ్ఞతాగుణం రామునిలో అధికంగా ఉంది. ఈ సందర్భంలో 'కథంచిద్' అను దానికి ఏడు విధాల అర్థాలు ఇలా చెపుతుంది గోవిందరాజీయం-1. ఏదో ఒకవిధంగా గాని చేసినదానికి, 2. కొంత తన నుండి ఫలమాశించి చేసినదానికి, 3.మరియొక ప్రయోజనపరంగా చేసినదానికి, 4.అనగా హృదయపూర్వకంగా కాకుండ చేసిన దానికి 5. అనుకొనకుండ యాదృచ్ఛికంగా చేసినదానికి, 6. పత్రపుష్పాదులలో ఒకదానితో చేసిన దానికి 7. పరిహాసానికి, నిందా పూర్వకంగా గాని, హేళన పూర్వకంగా గాని చేసిన ఉపకారానికి - గోరంతను కొండంతగా తలచేవాడు, ఒక్క ఉపకారంతో ఎల్లప్పుడు సంతోషించేవాడు. పరులు చేసిన

ఉపకారాన్ని ఎన్నటికి మరువనివాడు. మరిక అపకారం చేస్తే కోపిస్తాడా? ససేమిరా కాదు. ఇతరులు ఎన్ని అపకారాలు చేసినా తలచనే తలవడు, మరచిపోతాడు. శ్లోకంలోని 'శతం' అనంతమని నిఘంటువు ఉదహరిస్తాడు ఉపకారం మరవకపోవడానికి, అపకారం మరవడానికి మనస్సును తన వశంలో పెట్టుకోవడమే కారణం అని ఆత్మవాన్- ఆత్మవత్త్వము పదములు తెలుపుతున్నాయంటాయి వ్యాఖ్యానాలు. గోవిందరాజీయము ఐతే 'అందరూ ఉదారులే' 'అపరాధం చేయనివాడెవడు' అని రామాయణంలోని శ్లోకాలు ఉదహరిస్తూ, జ్ఞానం చేత పైరెండుగుణాలున్నా యంటాడు. సదాచారంతో తలలు పండిన సజ్జనులతో, ఆచారసూక్ష్మాలను చర్చించేవాడు మోక్షవిషయచర్చలతో జీవితం వెళ్ళబుచ్చిన సజ్జనులతో వేదాంతరహస్యములను విచారిస్తూ, విడమరచి చెప్పేవాడు, అనుభవం రంగరించు కొన్న పెద్దలతో సంప్రదాయ విశేషాలను ముచ్చటించేవాడు. ఇక్కడ 'సజ్జన' అను పదంతో గ్రామకులాది తారతమ్యం పట్టించుకునే వాడుకాదని స్పష్టం. 'వారితో' అనడంతో, (సంస్కృతంలో అప్రధానమైన దానికి చెప్పేప్పుడు తృతీయా విభక్తివస్తుంది) రాముడే వారికి స్వయంగా నిగూఢ రహస్యార్థాలను తెలిపేవాడు అని సూచితము. 'నిత్యం' అనే పదము ఎల్లప్పుడు అని తెలుపుతున్నది. అస్త్రయోగ్యాంతరము- అస్త్రాభ్యాసము ఇప్పటి మన వ్యాయామశాలలో వ్యాయామాభ్యాసము వంటిది. అంతరము అనగా ధనుర్విద్యాభ్యాసము- ఖడ్గ విద్యాభ్యాసము మొదలగు వాటిలో ఒకదానికి మరొక దానికి మధ్యన ఉండే విరామ సమయం అన్నమాట. విరామ సమయాన్ని వదలక చర్చిస్తుండేవాడు. 'అపి' కూడా అనుదానితో ఇతర సమయాలలో చేస్తాడని చెప్పకయే తెలుస్తున్నది అని భావం. దీన్ని బట్టి 'సత్సంగతి' లేక ఒక్క క్షణమయినా గడిపేవాడు కాదని విశదమవుతున్నది.

ఇక తీర్థీయం- సజ్జనులతో, అస్త్రాభ్యాసవిరామ సమయాల్లో, శాస్త్రరహస్యమును చర్చిస్తున్నాడు. అపి శబ్దంతో సజ్జన సల్లాపాలకు తగని సమయంలో కూడా చర్చలు చేస్తున్నాడంటే, చర్చలు- సజ్జన సల్లాపాలు. సార్వకాలికములు అని వ్యంగ్యము అవుతున్నది.

ఆయన పనులన్నీ పరులమేలు కొఱకే అని తెలుపుతున్నాడు. బుద్ధిమానిత్యాది. గోవిందరాజీయము - ఎల్లరు ఎట్లా సుఖంగా ఉండగలరు అని లోకసంరక్షణచింతలో మునిగినవాడు. బుద్ధిమాన్ ప్రశస్తబుద్ధి. తియ్యగా మాట్లాడువాడు. అతితక్కువ వానితో గూడ తానే మొదట మాట్లాడేవాడు, ప్రియంగా మాట్లాడు స్వభావం గలవాడు. శత్రువుల విషయంలో గూడ ప్రియమే మాట్లాడువాడు, ఇక్కడ వీర్యవంతుడు అన్న దానికి తన్ను ఆశ్రయించిన వారి శత్రువులను నిరసించువాడు అనడంతో మొదట 'వీర్యవాన్' అని ఉన్నందున చెప్పింది మళ్ళీ చెప్పడం కానేరదు. అర్థాలు వేరువేరు అయినందున ఆశ్రితుల శత్రువులనందరిని సంహరించి గొప్ప పని చేసినను తన పరాక్రమానికి ఇసుమంత కూడా గర్వపడనివాడు. ఏం చేశాను? ఇంకా చేయాలని భావించేవాడు. అసత్యపు భాషణలను చేయువాడు కాదు. కల్పితమైన ఇతివృత్తము (కథలు) గలిగిన అసత్కావ్యాలాపము చేయనివాడు. ఇది, అవి తెలియక కాదు, అవి వదలిపెట్టదగినవి అను జ్ఞానంతో. శీలజ్ఞానవయోవృద్ధులను చూచినంతనే ఎదుర్కొని వెళ్ళి పూజించేవాడు. ప్రజలను రంజింపజేసేవాడు, వారితో ప్రేమింపబడేవాడు- అనురక్తుడు అయ్యాడు. ఇతరుల దుఃఖమును జూచి తాళలేకపోయేంతటి దయాగుణము గలవాడు. కోపాన్ని జయించినవాడు. అవసరం పడినప్పుడు కోపించువాడు మాత్రమేగాని వశం దప్పి కోపించువాడు కాదు. దీనుడు కనబడ్డచోట అతనికి కావలసినవి

ఇచ్చి (దాన మానములు మొదలయినవి) కష్టాలు దీర్చేవాడు, సామాన్య విశేష ధర్మములు బాగుగ దెలిసినవాడు, నియమవంతుడు. ఇతరుల ధనమును కోరనంతటి 'శుచి' యైనవాడు. ఇక్ష్వాకు వంశమునకు తగినట్టి దయా దాక్షిణ్యములు, శరణాగత రక్షకత్వము మొదలయిన గుణములు గలవాడు. దుష్టులను అదుపాజ్ఞలలో పెట్టి ప్రజాపాలనను చేయునట్టి క్షాత్రధర్మమును గౌరవించువాడు 'శ్రేయాన్ స్వధర్మః' అని అన్నట్లు అందరికంటే పరత్వము. ఆధిక్యము కలిగిన ధర్మములతో బుట్టినప్పటికీ క్షత్రధర్మమునే గొప్పదిగా భావించేవాడు. క్షత్రియ ధర్మమును బాగా పాటిస్తే గొప్పకీర్తి స్వర్గ ఫలమును కలిగించేది వస్తుందని, తన ధర్మాన్ని చాలా బాగా ఆచరించేవాడు. నిష్ఫలములయిన కర్మలను చేసేవాడుకాదు. ఎప్పుడయిన ఆట పాటల్లోమునిగేవాడు. జూదము మొదలయిన వాటియందనాసక్తుడు. దాని క్కారణము అతడు 'విద్వాన్' అగుటయే. ధర్మవిరుద్ధమయిన, పామరుల మాటలయందు ఇష్టము లేనివాడు. కాని లౌకికవైదికవిషయాలను గూర్చి ఎంతో బాగా యుక్తి యుక్తంగా మాట్లాడటంలో దిట్ట–బృహస్పతి వంటివాడు. రోగము లేనివాడనుటచే– ఆశిష్ఠః అని, యువకుడనుటచే 'యువా' అని, బాగుగా మాట్లాడువాడనుటచే 'అధ్యాయకుడని', మంచి శరీరం కలవాడనుటతో 'బలిష్ఠః' అని, దేశ కాలములు తెలిసినవాడనుటచే 'సాధు' వని తైత్తిరీయోపనిషత్తులోని 'యువా స్యాత్సాధుయువాధ్యాయకః ఆశిష్ఠోద్రఢిష్ఠో బలిష్ఠః' అను దానిని చెప్పినట్లయినది. ఒక్కసారి చూచినంతనే మనషుల హృదయమును తెలుసుకునేవాడు, అద్వితీయుడయిన సాధువు అనడంతో అపకారుల యెడ కూడ ఉపకారం చేయువాడను సాధుత్వము గలవాడని విశేష సూచన.

శ్రేష్ఠములయిన ఈ గుణములతో మరియు ఇతర గుణములతో విరాజిల్లే ఆ రాముడు ప్రజలందరికీ బయట తిరుగుతున్న తమ ప్రాణమా అన్నట్లు ప్రేమపాత్రుడయ్యాడు. కొందరు విద్యనే నేర్చుకొని స్నాతకులు అవుతారు. మరి కొందరేమో వ్రతములు ఆచరించి స్నాతకులవుతారు. రాముడు మాత్రము విద్యలు చదివి వ్రతములు ఆచరించి స్నాతకుడయ్యాడు. ఆఱు అంగములతో గూడిన వేదార్థము తెలిసినవాడు, అని మళ్ళీ చెప్పడంతో "అధ్యయనం" అంటే అక్షరశః చదువుకున్నాడని అర్థము. దశరథుని మించిన విలుకాండ్రు లేరు పూర్వము, ఇప్పుడు రాముడు తండ్రిని మించిన తనయుడయ్యాడు ధనుర్విద్యాదులలో. ఇషువులనగా మంత్రములు లేకుండా ప్రయోగించేవి. మంత్రముతో బాటు వేసేవి అస్త్రములు. తల్లీ, తండ్రి వైపున మంచివంశములు అయినందున దోషములు లేని సాధువు. క్షోభగలిగించే పరిస్థితుల్లో గూడ మనస్సు క్షోభపడనివాడు అదీనుడు. ఎంత కష్టంవచ్చినా సత్యం మాట్లాడేవాడు, ఋజువు అయినవాడు. ఇక్కడ మనం ఆళవందారు 'వశీ వదాన్యో గుణవానృజుః శుచిః' మొదలయిన శ్లోకం గుర్తు చేసుకోవాలి. ధర్మార్థములు తెలిసినవారిచే సుశిక్షితుడయ్యాడు. స్మృతుల్లో చెప్పినట్టు, ఉదయం, మధ్యాహ్నం సాయంకాలాలను వృథా పుచ్చనివాడు. అన్ని విషయాలు మరవనివాడు, ఎల్లప్పుడు మంచి బుద్ధి స్ఫురణగలవాడు, లౌకికము అయిన, సాంకేతికమయిన ఆచార సంప్రదాయములు పాటించడంలో సిద్ధహస్తుడు, మనసులోని అభిప్రాయాన్ని తన ఇంగితముతో ఆకార చేష్టలతో బయటపడ నీయనివాడు, గొప్ప వినయశీలి, రహస్యం బయట పొక్కనీయని మంత్రులు సహాయపడువాడు, పని జరిగేంత వరకు ఉండే కోపం, సంతోషం గలవాడు, వస్తువులను సమకూర్చుకొనే కాలం, వదలి పెట్టేకాలం తెలిసినవాడు, గురువుల యందు దేవతలందు, అచంచలమయిన భక్తిగలవాడు, స్థితప్రజ్ఞుడు, కనుకనే చెడును చేరదీసేవాడు కాదు, చెడుచేయు అసజ్జనులను గానీ తన దరిదాపులకు రానిచ్చేవాడు కాదు. నిష్ఠూరాలు మాట్లాడడు. సోమరితనం లేనివాడు. ఎల్లప్పుడు శాస్త్ర

పరిశీలన చేయువాడు, కనుకనే జాగరూకతతో మెలగుతూ, ఇతరుల తప్పులను, తన తప్పులను తెలుసుకునేవాడు. ముందర భరతునితో తన తప్పును చెప్పుతాడు కూడ. సాంగవేదములతో బాటు ఇతర శాస్త్రములు దెలిసినవాడు, కృతజ్ఞ శబ్దముతో సిద్ధాన్తములు తెలిసినవాడు అన్నందున పూర్వముతో పునరుక్తి దోషం రాదు. పురుషుల్లో మంచివారిని చెడువారిని తెలుసుకున్నవాడు. యథాశాస్త్రముగా మిత్రులను చేసికొని, వారిని బాగా చూసేవాడు. సత్పురుషులను ఆదరించి రక్షించేవాడు. దుష్టులను నిగ్రహించేవాడు. కష్టం కలిగించకుండ ప్రజలనుండి ధనాన్ని పన్నురూపంగా, తుమ్మెదలు పూలను పీడించకుండ మకరందాన్ని తీసుకున్నట్టు, వసూలు చేయువాడు. ఆదాయంలో రెండోవంతునుగాని లేదా నాలుగోవంతును గాని వ్యయపరచువాడు. శాస్త్రాల్లో లాగ సంస్కృత కావ్య నాటకాలంకారాదుల్లో పాటవం సంపాదించాడు అర్థధర్మములను సేవిస్తూ సుఖముపై ఆసక్తి కనబరచేవాడు, అలసుడు ఎన్నడు కాడు. సంగీతము, చిత్రకళలు, ఏనుగు-గుఱ్ఱాలు స్వారి చేయగలవాడు, డబ్బులు ఐదు విధాలుగా ఖర్చు పెట్టేవాడు. యుద్ధవిద్యల్లో ఆరితేరినవాడు, శత్రువులనెదురొడ్డి జయము సంపాదించేవాడు, తనసేనను బాగా కాపాడుకునేవాడు, యుద్ధాల్లో సురాసురుల నయినా ఎదుర్కొనే శక్తియుతుడు, అపరాజితుడు, ఒక్క నమస్కార బాణంతో మాత్రము జయింపదగినవాడు. సురులు, అసురులు, కోపించి కలసి వచ్చినా యుద్ధములో అతణ్ణి జయించలేరు.

ఇంత వరకు కళ్యాణ గుణములు ఎట్లా రాముడిలో నిండి ఉన్నాయో చెప్పి ఇప్పుడు హేయములు వదలి పెట్టదగినవి అతడిలో ఎట్లా లేవో తెలుపుతున్నాడు. అసూయ లేదు, కోపం రాదు, గర్వపడడు, ఇతరుల సంపద అంటే ద్వేషం లేదు. ఎవరినీ అవమానపరచడు, ఎల్లప్పుడు సాత్త్వికుడుగా ఉంటాడు. ఇట్లా రాముడు శ్రేష్ఠ గుణాలతో ముల్లోకాల్లో పూజింపబడుతున్నవాడు. క్షమా గుణములో భూమికి, బుద్ధిలో బృహస్పతికి, పరాక్రమంతో ఇంద్రునికి సాటి. స్త్రీ బాల యువవృద్ధులయిన ప్రజలందరికి, తండ్రి వలే అందరికిష్టుడయి, తన కిరణములతో వెలుగొందు సూర్యునివలె ప్రకాశించాడు.

మిగతా వ్యాఖ్యానములోని విశేషాలు - తన పరాక్రమము ఇతరులకు ఆశ్చర్యము కలిగిస్తున్నను తాను మాత్రం విస్మితుడు. ఆశ్చర్యపడ్డవాడు, గర్వపడినవాడు కాలేదు. సాధువంటే క్షీణదోషుడనర్థము. ప్రాణం అని చెప్పడంతో, ప్రజలకు రామభద్రున కంటే ఎక్కువ ఇష్టమయినది లేదని ధ్వనితము. సాధువు అంటే వేదప్రామాణ్యాన్ని ఒప్పుకునేవాడు. ఋజువు త్రికరణ శుద్ధిగలవాడు. త్యాగము-తగినవారికి దానంచేయుట, స్థిరము-మరచిపోని ప్రజ్ఞకలవాడు. దోషం-రంధ్ర మంటే లోటుపాట్లు. అంతరం-అభిప్రాయమని కూడ అర్థం. ఆవులిస్తే ప్రేగులు లెక్కపెట్టేవాడని భావం.

మునిభావప్రకాశికా-ప్రగ్రహం-శరణాగతుని మొట్టమొదటిసారి అభయమివ్వడం- అనుగ్రహం- అభయమిచ్చిన వానిని రక్షించుట సత్సంగ్రహము, సదాచారము దానియందు ప్రగ్రహణం. అను గ్రహమునందు నిగ్రహము- దుష్టనిగ్రహమందు యోగ్యమయినది తెలిసినవాడు. లేదా ప్రగ్రహము - పన్ను వసూలు, తప్పు చేసిన వారి తప్పుననుసరించి బంధించుట, వదలిపెట్టుట యందు నిపుణుడు. సతాం- దూరంగా ఉన్నవారికి పొలాలు, మాన్యాలు ఇచ్చి స్థితి కల్పించుటలో, వారిని బాగా చూచుటలో నిపుణుడని అర్థం.

ఆలస్యం–చేయాల్సిన పనులలో నిరుత్సాహంగా ఉండడం– అది లేనివాడు. ఉపాయజ్ఞుడు. ఆనకట్టలు కట్టించి, వ్యవసాయం చేయించి న్యాయంగా ధనం సంపాదించే ఉపాయం తెలిసినవాడు. స్వారి చేయడమే కాకుండ వాటికి 'గతులు' నేర్పడంలో కూడ నేర్పరి అని 'వినయ' పదం సూచిస్తున్నది. సేనా వ్యూహాలు– చక్ర పద్మవ్యూహాదులు పన్నడంలో మేటి. కాలుని వశంకానివాడు. పదకొండువేల ఏళ్ళు మనష్యలోకంలో పాలిస్తూ ఉంటానని స్వయంగా చెప్పాడు. మేదినీ– భూమి పైన ఉన్న జనులు, లేదా భూదేవత కోరినది. అంటే సుజనాను గ్రహము దుర్జన నిగ్రహము భూదేవతకు ఇష్టము గద!

గోవిందరాజీయము– సమస్త లోకములు రామునియందే ఆసక్తితో ఉన్నాయని తెలుపుతున్నాడు. వ్రతము కలవాడు ఏమిటా వ్రతము? ఆశ్రితులను సంరక్షించుట, అకుంఠిత పరాక్రమము కలవాడు, లోకపాలురందరికి సాటివచ్చువాడు. అతణ్ణి మేదినినాథునిగా వరించింది. లేదా సీతతో కూడినవాడిని క్రీడారసముతో కూడినవాడిని, విరోధులను తొలగించి తనతో బాటు సుఖము అనుభవింపజేయువానిని, సమస్త సుఖోపభోగసాధనములు గలవాడిని, అని లోకపాలశబ్దముతో తెలుపుతున్నాడు. ఇక్కడ గోవిందరాజులవారు చమత్కారంగా, సయుక్తికంగా ఇలా చెప్తుతారు– ఉప– సమీపములో మా సీతారూపమయిన లక్ష్మి కలవాడని– లోకపాలశ్చ అసౌ ఉపమశ్చ అని సమాసం. అట్లా లక్ష్మితో భోగాలననుభవించే రాముణ్ణి మేదిని కూడ స్వయంవరంలో, మెడలో మాలవేసి పొందాలని కోరిందట.

'చింత'ను మనోరథ మంటారు గోవిందరాజీయములో, తీర్థీయములో–ప్రీతి, అనగా ప్రీయతే అనయా చింతయా అని వ్యాఖ్యానమున్నది. కథం– ఎట్లు అను శబ్దంతో దశరథుని మనస్సులో కైకేయి కిచ్చిన వరముల వలన విఘ్నం రావచ్చుననే శంక కలిగినందున అంటుంది గోవిందరాజీయము. ఇక దశరథుడు చెప్పిన రాముని గుణములు– అపూర్వమయిన ఐశ్వర్యాన్ని లోకానికి ఇయ్యగలవాడు, ప్రాణులన్నిటి యెడల దయగలవాడు. పోయిన సంపదలను తిరిగి సాధించగలవాడు. నాకన్న ఎక్కువగా లోకానికిష్టుడయినవాడు, మేఘమువలె, దానం చేయుటయందు, సంతాపము హరించుట యందు గొప్పవాడు. ఒక్కయమునితో పోల్చరాదు కనుక యమశక్రులతో సముడు అనడం పరాక్రమ విషయంలో, కొండవలె ధైర్యవంతుడు, ఇంతటి గుణవంతుని రాజుగా చేసి, రామ సౌందర్యానుభవరూపమయిన స్వర్గాన్ని చూడాలనుకుంటున్నాను. పైన చెప్పినవేగాకుండ, లెక్కకు మిక్కిలి సౌశీల్యాది గుణములు, లోకంలో ఎక్కడా కనరాని గుణాలు, స్వాభావికంగానే కలవాడు రాముడు యువరాజు కావాలని దశరథుడు నిశ్చయించుకొని మంత్రులు, పౌరముఖ్యులు, జానపదులు, ప్రజలతో చెప్పాడు వారి అనుమతికూడా కావాలని. తాను ముసలివాడవడము ఓ కారణము. దానికంటే ప్రధానమయినది. కొన్ని ఉత్పాతాలను– అశుభమును సూచించే వాటిని చూచానన్నాడు. అవి, దివిలో జరిగినవి–రాహుకేతు, నక్షత్ర, గ్రహ, తారా, అర్క, చంద్రుల వలన గలిగినట్టివి, అంతరిక్షంలో గాలి, మేఘములు, సంధ్య, దిక్కులు, మంటలు, గ్రహణాలు, చీకట్లచే గలిగినట్టివి, భూమి మీద స్థావరములు జంగమములచే గలిగినట్టివి. మాహేశ్వర తీర్థీయము స్థావరవికారము అనగా భూకంపము, రాళ్ళు పడటం, వృక్షమున నుండి రక్తము కారడం అని, జంగమ వికారం అనగా మనుష్యుల వంటి పశుపక్షులు మొదలయినవి పుట్టడం అని వివరిస్తుంది. ప్రాప్తకాలము–తనకు ముసలితనం రావడము,

రామునికి యౌవనం రావడము మరియు అప్పటి సందర్భంలోని వసంతకాలము అని గోవిందరాజీయము వివరిస్తుంది. భూమ్మీది ప్రధాన రాజులందరినీ, నానానగర వాస్తవ్యులను, వేరువేరు జానపదులను రప్పించాడు. తొందరలో కేకయరాజును జనకుని రప్పించలేదు. వారికి తర్వాత శుభవార్త చెప్పవచ్చని అంటారు భగవద్వాల్మీకి మహాముని. తనమామను, కొడుకుమామను ఏకార్యానికైన తప్పక పిలవడం మనం చూస్తుంటాము, పిలుస్తాము కూడ. వీరు ఆత్మబంధువులు. కారణము అతికినట్టు లేదు. చాలా అసంభావ్యముగా ఉన్నది. మనసులో ఏదో ఉందనిపిస్తుంది. త్వరయా – వాళ్ళు దూరంగా ఉన్నందున. అని గోవిందరాజీయము. తత్త్వదీపిక ఏమో 'త్వరయా' రేపే అభిషేకం చేస్తాను అనే తొందర– సంబరంతో అంటుంది.

గోవిందరాజీయము – నాకంటే గుణవత్తరుడు అని, లోకోత్తర గుణయుక్తుడు అని చెప్పి దశరథుడు, అన్నీ నాగుణములు పుణికి పుచ్చుకున్నవాడు రాముడు అని చెప్పడం భావ్యమా అని ప్రశ్నవేసుకొని పౌరుల ద్వారా రాముడు లోకోత్తర గుణవంతుడు అని చెప్పించడంకోసం ఇలా అన్నాడు అని జవాబు ఇస్తుంది.

పుష్యమీ నక్షత్ర యుక్తంగ చంద్రుడు ప్రకాశించినట్లు చెప్పడంతో రాముడు అతిమానుషశక్తి కలవాడని ప్రకటిస్తున్నాడు అంటుంది తత్త్వ దీపిక. ఇక గోవిందరాజీయమేమో అత్యుజ్జ్వలుడు అనే అర్థంతో పాటు పుష్యమి నక్షత్రంలో అభిషేకం చేయడంతో అని, చంద్రుని వలె ఉన్న రాముని రేపు పుష్యమి నక్షత్రంలో అభిషిక్తుణ్ణి చేస్తాను అని కూడ వివరిస్తుంది.

అనురూపః అను రెండవ సర్గలోని పదమూడవ శ్లోక వ్యాఖ్యానము గోవిందరాజీయములో విశేషముగా వివిధముగా, సయుక్తికముగా సవివరణముగా ఉన్నది. తత్త్వజ్ఞుడు వాల్మీకి దశరథుని మాటను బలపరుస్తున్నాడు కొనియాడుతున్నాడు. లోకానికి అనుగుణమయిన నాథుడు, దానిక్కారణము లక్ష్మీవంతుడు. ఇంతింతనరాని తేజస్సు గలవాడు, దానికి కారణము లక్ష్మణునకు అన్న కావడమే. లక్ష్మణుడు లక్ష్మివర్ధనుడని చెప్పాడు గద! సరియయిన నాథుడనడానికి కారణము లక్ష్మణాగ్రజుడవడమే. తనను ఆశ్రయించిన అందరియందు లక్ష్మణునిలాగ ప్రేమగలవాడని అర్థము లేదా అనురూపుడయిన నాథుడు ఎట్లా అంటే ఎప్పుడు తనను బాయని లక్ష్మితో కూడినవాడయి, అందరికి–రాజు నుండి పరిజనుల వరకును నిరుపాధికుడయిన నాథుడు. దశరథుడేమో రాజ్యపాలనము అనెడి ఉపాధితోనే నాథుడు ఉపాధి– మధ్యన వచ్చేది మళ్ళీపోయేది అని క్లుప్తంగా చెప్పుకోవచ్చును. శ్రుతి కూడ 'దాస భూతాః' అనునది ప్రమాణము. రామునిలో ఈ ఉపాధి లేని రక్షకత్వము ఉన్నది మూడు లోకాలు కూడ అతడు రక్షకుడయితే మంచి రక్షకుడు కలిగినవి అవుతాయి. లేదా ఆయనకు వీటిని రక్షించడం ఓలెక్కా అని భావం. ఇది ఎంత మాత్రము?

ఈ శ్లోకంతో రామునకు గల పరత్వమును– ఆధిక్యమును, శ్రేష్ఠత్వమును, మహత్త్వమును నిరూపిస్తున్నాడు. ఆ రాముడు జగత్తుకు సహజమయిన రక్షకుడు. ఇతరులు, పనిని బట్టి రక్షకులయినవారు. లేదా సమ విభక్తములయిన అవయములు గలవాడు, చంద్రకాంతాననుడు అనడంతో నిరుపమ సౌందర్యము గలిగిన దివ్యమంగళవిగ్రహం గలిగినవాడు, (అందుకే పురుషులను మోహింపజేసే అందం గలవాడు) ఉపనిషత్తులో చెప్పినట్టు, నూరు

నూరింతలయిన, ఆనన్ద రూపముగా ఉపాసింపబడేవాడు (తై.ఉ.తేయే శతం మానుషా ఆనందాః మొ) ఆనందో బ్రహ్మేతి) అనుస్యూతమయిన- ఒకదానితో ఒక్కటి కలిసిన (కుట్టబడిన అని కూడ అర్థము) పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారములు అను అయిదు రూపములతో అనేకావతారములు గలిగినవాడు, అనుగతము అయిన రూపము గలిగినవాడు అనగా సర్వవ్యాపి అని అర్థము. చరాచరాదికములు ఆయనలో ప్రవేశించి ఉన్నాయి. సర్వ శరీరః- అని అనుప్రవిష్ట చరాచరాదిక శరీరః. పుండరీకాక్షుడు కనుక విరూపాక్షుడయిన రుద్రుని రూపము కంటె విలక్షణమయిన రూపం కలవాడు ఉః-శివుడు. ఓఃరూపం- ఉరూపం, న ఉరూపం అనురూపం అని నఞ్ సమాసము చేసుకోవాలన్న మాట. (కుమారసంభవంలో చెప్పిన 'వపుర్విరూపాక్షం' మొదలయినది ప్రమాణంగా ఉదాహరిస్తుంది గోవిందరాజీయము) విరూపాక్షత్వం గాకుండ విలక్షణమయిన పుండరీకాక్షత్వము కలిగినవాడు అనడంతో త్రిమూర్తులతో సామ్యము తోసిపుచ్చడం అయినది. పక్షులరాజు వినాథుడు-హంస దానికి చెందినవాడు 'వైనాథుడు' హంసవాహనుడు బ్రహ్మ అతనితో గూడినవాడు. సవైనాథుడు నాభికమలములో చతుర్ముఖ బ్రహ్మ ఉన్నవాడు లేదా వైనాథుడు. గరుడవాహనుడు దానిక్కారణంగా లక్ష్మి కలవాడనుట. అలాగే పత్ని కలవాడేకాక పరిజనము కలవాడని 'లక్ష్మణాగ్రజః' అనుమాట ద్వారా తెలుపుతున్నాడు. ఈ పదము వలన సేవకులను అందరిని తెలుపనయినది. అగ్రజ పదంతో ఆశ్రితులకు అధీనుడని సూచన. ఈయనొక్కడే నాథుడనడం ఎట్లా బ్రహ్మరుద్రాదు లున్నారుగద అంటే త్రైలోక్యపదంతో సృష్టింపబడినది, సహజమయినది, కృతకాకృతకమయినది అను సమస్త జగత్తుకు నాథుడు కలదయింది అనడంతో ఇంద్రాదులు నాథులు కారనుట, నాథవత్తరం- తర శబ్దంతో బ్రహ్మరుద్రాదులు నాథులు కాదనడం జరిగింది, 'యుగకోటి సహస్రాణి, మహాదేవః సర్వమేధే' మొదలయిన స్మృతులు- పురాణాలు దీనికి ప్రమాణము. రక్షింపబడే దాని తొందర కంటే రక్షకునకే తొందర అధికమని సూచితము. రామాభిషేకము వలన భూమికి శ్రేయస్సు, నాకు విశ్రాంతి అనే రెండు ఫలితాలున్నాయి. దీనిని అనుమతించండి లేదా ఇంతకంటే మంచిది ఉంటే చెప్పండి రాగద్వేషాలు లేని మధ్యస్థులయిన మీరు చేసే విచారం, కేవలం నా విచారం కంటే బాగుంటుంది. ఎందుకంటే పూర్వ అపర పక్షముల చర్చల కారణంగా ఎక్కువ ప్రయోజనకారి అవుతుంది. నేనుండగా రామాభిషేక మెందుకంటే, మేము రక్షణ కొరకు రాముణ్ణి కోరడంలేదు, అతని సౌందర్య విశేషానుభవము కొరకు అని ఇచ్ఛామో అను శ్లోకతాత్పర్యము. ఈ శ్లోకానికి మిక్కిలి ప్రాధాన్యమున్నది.

గోవిందరాజీయములో చాలా విశేషాలున్నాయి - కోరుతున్నాము అని బహువచనంతో అందరి కోరిక, ఎవరికి ఈ విషయంలో వైషమ్యం లేదు అని, మహాబాహువు అనడంతో పొడవయిన గుండ్రని భుజములు గలవాడని, ఏనుగుపై స్వారీ చేసేప్పుడు అంకుశమునుపయోగించే విధము చెప్పినట్టు అయింది అని, అభిషేకానికి వేసుకొనే వేష భూషాదులతో అతణ్ణి చూడాలని కోరిక, మాది కోరిక వరకే, జరిపించడం మీ అధీనమే, మంచి పనులకు వేయి విఘ్నాలంటారు. ఈ శ్రేయస్సు మాకు కలుగుతుందా లేదా అభిషేకం జరగనీ జరగకపోనీ, సుందర వస్తుదర్శనేచ్ఛ మాత్రం ఎట్టి విఘ్నాలు లేనిది, అన్ని విధాల రక్షకుణ్ణిగా, మాటలతో ప్రార్థించలేక మనసుతో కోరుతున్నాము, మీఅభిప్రాయం తెలిశాక ఇప్పుడు చెపుతున్నాము కోరుతున్నామని, అందరము కోరుతున్నాము, రాజువు నీవు ఉండగనే మేదిని రాముని రాజుగ స్వయంగా వరించినది. లోకపాలోపముడు కనుక వరించినది,

మధుకైటభులను రాక్షసుల కొవ్వు గంధంతో కంపు గొడుతున్నదయి సర్వ గంధుడయిన రాముని సౌగంధ్యముతో సువాసితురాలుగావడానికి కోరినదేమో! కర్పూరము చందనము మొదలయిన సుగంధద్రవ్యములతో బాటు తాననుభవించే కోటిలో చేర్చుకున్నది. గాబోలు, శేషి అయినవాడే భోగి, సౌగంధ్యా సౌగంధ్యములు తానే అనుభవిస్తాడు. కనుక, తన అధీనుల చెడును తొలగించి ఆశ్రితులను రక్షించేవాడు, ఆయన బాహుబలానికిది లెక్కనే కాదు, ఒక్క కోసలరాజ్యమో, లంకారాజ్యమును, త్రైలోక్యమును కూడా రక్షించే శక్తికలవాడని, ఆయత, ఆజానుబాహువు వంటి మహాపురుష లక్షణాలతో తెలియడంలేదా ఈ విషయం, ఆయన నీడ చాలదా మారక్షణకు, బలముతో బాటు ధర్మముతో గూడ రక్షిస్తాడు, దీనులను దానముతో రక్షిస్తాడు, ఇతరులకు గూడ 'అహింసయే గొప్ప ధర్మం' అని చెప్పేంతవరకు రక్షణం చేయువాడు, 'ఆకలి గొన్నవాడు మరణిస్తే నీదేం పాపం లేదంటే, రఘుమహారాజు ఊరకున్నాడు. రాముడు మాత్రం' నేను జీవితాన్నైనా వదులుతా నన్నాడు, ప్రాణంపోయినా చేసిన ప్రతిజ్ఞను జవదాటక పోవడమే వ్రతముగా కలవాడు, నీవు ఇచ్చిన వస్త్రాలంకారాలతో కిరీటంతో శత్రుంజయ మనే ఏనుగు నెక్కి వస్తే చూడగోరుతున్నాము, మహావీథిలో వెళుతుంటే, ఒక్కరము గాకుండ, పుత్ర కళత్ర బంధుమిత్రాదులతో చూసి ఆనందిస్తాము, రాముని– సౌందర్య గుణాలతో అందరికీ మనోరంజకుడయినవాడిని, దిష్టితగలకుండ ఉండటానికి లోపలి ఛత్రముతో ముఖం కప్పబడిన వానిని, కొంత ముఖం కనబడి మరికొంత కనబడక, మొత్తంగా ముఖాన్ని చూడాలనిపించే అంత కోరిక రేకెత్తించేవాడిని, దగ్గరి మిత్రులు గాలి ఎండ సోకకుండ, వాడకుండ పట్టిన భూచక్రమను గొడుగుతో కప్పబడిన ముఖకమలము గలవాడిని, సాముద్రిక శాస్త్రంలో చెప్పినట్లు, సమానము, గుండ్రని, వెడద అవయవములను సూచించు, భూమ్మీది రాజులనందరిని వశం చేసుకొని వారినే ఒక వలయంగా మలచుకున్నాడా అన్నట్లుండే తెల్లని ఛత్రముతో మిక్కిలి ప్రకాశిస్తున్న ఇందీవరసదృశముఖం గలవాడని, వీర శబ్దముతో ఏనుగు స్కంధముపై కూర్చోదగినవాడని, మదించిన ఏనుగునయినా వశపరచుకుని వెళ్ళేవాడని, శత్రుంజయమను ఏనుగు నెక్కి వస్తుంటే చూడడం అనే అనుభవం కోరుతున్నాము, తన గాంభీర్యం సౌందర్యంతో ఏనుగుకే అలంకారముగా ఉన్నవాడిని, ఛత్రావరణముతో ముఖము దివ్యతేజస్సు మండలంగా అందంగా ఉన్నవాడిని, ఇవి మరి అభిషేకం తర్వాతను కలిగే విశేషణములతో, అభిషేకము తప్పక చేయలసినది అని వ్యంజనావృత్తితో ప్రార్థించారు.

అడగగానే వెంటనే అభిషేకం చేయమని చెప్పారు. ఇన్నేళ్ళు నేను బాగా పాలించలేదా అని సంశయం నాకు కలుగుతున్నది నిజం చెప్పండి అని, వారి మనసు తెలిసియుండి, వారినోట రాముని గుణగణాలు వినాలని కోరికతో రాజు అడిగాడు. ఈ సందర్భంలో గోవిందరాజీయం ఓమంచి విషయం చెప్పింది. భగవంతుని గుణాలు ఉపదేశించడానికి వీరు యోగ్యులు, వీరు కాదు అనే నియమం లేదని సామాన్య విశేష రూపములయిన అశేష ధర్మాలను తెలుసుకున్నవాడు, తన నాశ్రయించిన వారి ఎడబాటు కలుగుతుందేమో అని భయపడువాడు. మృదు స్వభావి, ఎన్ని కష్టాలు వచ్చిన ఆడినమాట తప్పని చిత్తస్థైర్యము కలవాడు, ప్రాణులం(న్నిటి)దరితో ప్రియం పలుకువాడు, సత్యము పలుకువాడు, ప్రియమయినా అసత్యాన్ని పలుకనివాడని 'చ' కారముతో నిర్ణయము, లేదా సత్యము– పరలోకహితము, అదృష్టమునకు విరుద్ధమయిన ప్రియము పలుకనివాడు, ఇలాటి గుణాలన్నీ జ్ఞానము

వలన వచ్చాయి. ఆ జ్ఞానము బహుశ్రుతులయిన గురువృద్ధులను ఉపాసించడం ద్వారా అబ్బినది. ఇక్కడ బహు శబ్దానికి-బహుభ్యః-చాలా మంది ఆచార్యుల నుండి, బహుభిః-చాలా శాస్త్రాలతో, బహుధా-అనేక విధాలుగా శ్రుతము- పాండిత్యము అని విశేషార్థమును వివరిస్తుంది గోవిందరాజీయము. ఇక రామాయణతత్త్వదీపిక అనసూయక పదము ఎట్లా పునరుక్తం కాదో వివరిస్తుంది. ఇతరుల విషయమై రామునికి అసూయలేదు, అలాగే ఇతరులు రామునిపై అసూయ గల్గిలేరు అని. మృదువు అంటే ఉపాసించుటకు సుకరుడు- సులభముగా ఉపాసింపబడేవాడు అని.

మళ్ళీ గోవిందరాజీయము - సత్పురుషుల్లో ఉండే గుణాలతో బాటు అసాధారణ గుణాలూ ఉన్నాయి. మనుష్య మాత్రుల కష్టాల్లో, వారి కష్టాలను పంచుకునేవాడు, ఈ దుఃఖం నా పరిపాలన బాగా లేనందుననే వచ్చింది గద అని మిక్కిలి బాధపడుతాడు. అన్ని పండగల్లో, ఉత్సవాల్లో, తోరణాలు కట్టి జరుపుకునే వాటిలో, తండ్రిలాగా సంతోషిస్తాడు. ఈ సంతోషం రెండువిధాలు-ఒకటేమో పామరులయిన వారికి కలిగే అర్థలాభంలాటి లౌకిక సహాయం కారణంగా కలిగేది, రెండవది పండితులైన తండ్రులకు నన్ను తరింపచేస్తాడు గద పుత్రుడు అనునట్టిది, ఈ రెండు పరితోషాలు గలిగినవాడు రాముడు. మరణం అంటే భయం లేకపోవడం శౌర్యం, తాను ఏం మార్పు చెందక (నష్టపోక) శత్రువులను పారదోలుట వీర్యం, చొరరాని చక్రవ్యూహము మొదలయినవి కలిగిన దేవతలను గాని, రాక్షసులను గాని ఉత్సాహంతో ఎదుర్కోవడం పరాక్రమం, ఇవన్ని గలవాడు. అన్నింటినిమించి యుద్ధానికి గాని, కార్యాంతరమున వెళ్ళిగాని తిరిగి వచ్చిన తర్వాత పౌరులందరినీ, తన వారనడిగినట్లు కుశలమును అడుగుతాడు. కొడుకులు, భార్యలు, భృత్యులు, శిష్యులు అందరి గురించి పేరు పేరున క్రమంగా క్షేమ సమాచారం కనుక్కుంటాడు. అందరు పట్టాభిషేకాన్ని కోరుతున్నారు. గంభీరంగా ఉండి తమ హృదయం విప్పి చెప్పనట్టి స్త్రీలు, ఇంద్రియపటుత్వము లేని, అన్ని విషయాల్లో అనాసక్తంగా ఉండేవారు అయిన వృద్ధరాండ్రు, యౌవన మదంతో వివేకంలేని తరుణీమణులు అందరు త్రిసంధ్యలలో రాముని పట్టాభిషేకానికై దేవుళ్ళకు మొక్కు కుంటున్నారు. తమప్రయోజనం అడ్డం అవుతుందని తమ గురించి ఏమి కోరుకోకుండ, రాముని ప్రయోజనం గురించియే దేవతాంతర నమస్కారము చేస్తున్నారు అన్నందున, ప్రేమ పారవశ్యంతో చేసినందున, ఇతర దేవతానమస్కారం గూడ రామప్రయోజనంతో పర్యవసిస్తున్నందున, మరొక దేవతను నమస్కరించడమనే అపకీర్తి లేదని వివరిస్తుంది గోవిందరాజీయము.

మనిషి పుట్టినంతనే మూడు రకాల వారికి అప్పుపడ్డ వాడవుతాడని శ్రుతి చెబుతుంది. వాల్మీకి ముని విప్రులకు, ఆత్మకు కూడ ఋణ పడిఉంటాడు అని చెప్పాడు. యజ్ఞాలు చేసి దేవఋణం నుండి, బ్రహ్మచర్యముతో ఋషి ఋణము నుండి, పిల్లలను కని పితౄణము నుండి విముక్తులు అవుతారు. పుట్టినవాడెందుకు వీరికి ఋణపడుతాడు? అంటే ఇంద్రియములకు అధిపతులు దేవతలు, వారు జితేన్ద్రియత్వానికి ఉపకారులవుతారు, అందువలన ఋషులు 'మాట'లాడటానికి ఉపకారకులు, పితరులు శరీరానికి ఉపకారకులు, కర్మలనెన్నిటినో చేయించి సంస్కారవంతులను చేయించి పాపనాశకు లయినందున విప్రులకు, శరీరములు ఇంద్రియముల కలయిక అయిన దానికి జ్ఞానమును కలిగించి ఉపయోగపడుతున్నందున ఆత్మకు ఋణపడి ఉంటారు. నిషిద్ధమైన సుఖములను

వదలనివాడు పశువుతో సమానము. ఉపకారము చేసిన వారికి ఉపకారము చేయకపోవడము ఋణమే అని గోవిందరాజీయము.

దశరథుడు, రామునితో భరతుడు వచ్చేలోపు అభిషేకం చేసుకో. భరతుడు సద్వర్తనము గలవాడే, ధర్మపరుడు, జ్యేష్ఠుని నిన్ను అనుసరించేవాడే, జితేంద్రియుడే, దయగలవాడే. సామాన్యంగా మానవుల చిత్తం అనిత్యం. ఎప్పుడూ ఒకలాగ ఉండదు, కాని సత్పురుషుల మనస్సు పరస్పరోపకారముతో శోభిస్తుంది. మారిపోదు. రఘువంశంలో పుట్టిన నీకు ఇది తెలియదా? ఇతరులు ఏమంటారంటే ధర్మనిరతుల చిత్తము, పరులు చెప్పిన మాటల వలన మిత్ర భేదం కలుగునట్టిదే. కృతశోభి. మరికొందరేమో సత్పురుషుల చిత్తము కృతేన కార్యముతో, చేసినదానితో శోభిస్తుంది గాని చేయబోయేదానితో గాదంటారు. జరిగిన పనిని ఒప్పుకుంటుంది జరపబోయే దానిని కాదు అని చెప్పాడని వివరిస్తుంది గోవిందరాజీయము.

ఇక మహేశ్వరతీర్థుల తత్త్వదీపిక- ఇలాంటి పనులకు చాలా విఘ్నాలుంటాయి. కేకయరాజుకు రాజ్య శుల్కము నిచ్చి కైకేయిని పెండ్లి చేసుకున్నది గుర్తుకు వచ్చి భరతుడు లేనప్పుడే అభిషేకము అన్నాడు. లేదా భరతుని మంచి నడవడిని తెలిసికూడ, రాముని మీద గల స్నేహముతో తన చిత్తమును శంకించుకొన్నాడో అట్లాగే భరతుని చిత్తాన్ని శంకించుకొని, అతడు వచ్చే లోపే అభిషేకం మంచిదన్నాడు. సద్గుణ విశిష్టుడైన భరతుని విషయంలో శంక పనిలేదుగాని మనుష్యులు చలచిత్తులు గనుక భరతునికి గూడ రాజ్యలోభము ఉండొచ్చునేమో అని నా అభిప్రాయం అంటాడు. మనుష్యులది మాత్రం చంచలం గావచ్చు సత్పురుషులది అట్లా కాదు. వారిచిత్తం కూడ శత్రువులు చెప్పే మాటలు వింటే చంచలం కావచ్చునంటాడు. కృత – ఇతరులు చేసిన మిత్రభేదముతో శోభి–ఒప్పేది, లేదా ఇప్పుడే రామాభిషేకం చేస్తే భరతుని చిత్తానికి గూడ హర్షం గలుగుతుంది, ఇప్పుడు చేయకుంటే రాజ్యంపై ఆశ భరతునికి కూడ కలుగ వచ్చునేమో అందుకని త్వరగా అభిషిక్తుడవు కావలసింది, అని.

ఆఱవ సర్గ మొదటి శ్లోకంలో, కాయశుద్ధి మనశ్శుద్ధి గలవాడై పూజాసామగ్రిని సమకూర్చునట్టి భార్యతో, నారాయణుని (మందిరమునకు) చేరబోయాడు. ఇక్కడ నారాయణుడనగా శ్రీరంగనాయకుడు. ముందు విభీషణునికి ఇయ్యబోయేది ఈయననే. రామవిగ్రహ దర్శనానందము కంటే శ్రీరంగ విగ్రహము మిక్కిలి ప్రియాస్పదమని భావము. ఇతర విశేషణములందు విశాలాక్షి అను పదము లక్ష్మీదేవి యందే రూఢి అయినది. అగమత్ మరియు ఉప అనుపదములు భగవన్మందిరానికి పోయి నివేదన వరకు గల భగవదారాధన చేసినట్లు తెలుస్తున్నది. ఇది రామానుజీయము. మిగిలింది గోవిందరాజీయంలాగా ఉంది కాని ఇది అంతయు గోవిందరాజీయమే.

అన్ని వ్యాఖ్యానాలు గూడ 'మహతే దైవతాయ' నారాయణునకే అని అర్థం చెప్పాయి. ఇక గోవిందరాజీయమైతే వివరంగా ఇలా తెలియజేస్తున్నది. నారాయణుని దగ్గరకు వెళ్ళెను అని మొదలు పెట్టి ముందరకూ 'నారాయణుని ధ్యానిస్తూ' అని చెబుతాడు కనుక 'మహాదేవుని' చెప్పుతుంది అని భ్రమించరాదు. యుక్తి ఏమనగా. విడివిడిగా ఉన్న, వేరు విభక్తులలో ఉన్నదానిని ఒక పదముగా తలచరాదు, ఆ అర్థాన్ని బోధించే శక్తిగాని దానికి లేదు 'మహాదేవ' అనే అఖండపదానికి 'శివుడు' అనే అర్థం చెప్పడంలో శక్తి ఉన్నప్పటికి, విడిగా ఉన్న రెండుపదములకు,

ప్రస్తుత పరదేవతార్థమును బోధించువానికి, అప్రస్తుతమైన ఇతరదేవతను బోధించే శక్తి కల్పించుట సబబు కాదు. తాను భగవంతుని అవతారము అయినను, శ్రీరంగవిగ్రహానికి ప్రాధాన్యము ఇవ్వడం, తను ఎత్తిన అవతారానికి తగిన క్షత్రియధర్మము. మాహేశ్వర తీర్థీయము. గృహములో అర్చించు విష్ణువు యొక్క ఆలయము అని చెపుతుంది.

సూతులు అనగా, సూతకులంలో పుట్టినవారు, పుణ్యశ్లోకులయిన దేవతలను కీర్తించువారు. మగధ దేశంలో పుట్టినవారు వంశావలిని చదివేవారు, కీర్తించేవారు. వందులుగా స్తోత్రము చేయువారు అని ముగ్గురికి భేదము. సూర్యాంతర్వర్తి అయిన నారాయణుడు మధుసూదనుడు. చైత్యము అంటే బౌద్ధాలయము అని గోవిందరాజీయము. అయితే మరి రాముని సమయానికి బౌద్ధాలయములు లేవు గదా అని పెద్ద సందేహం. ఏదయినా బొమ్మ, లేదా చిహ్నాంగలవి ధ్వజములు, చిహ్నములు లేనివి 'పతాక'లు నటులు-నటన అభినయం చేయువారు, నర్తకులు-కేవలం నృత్యం చేయువారు.

దీపవృక్షములను- వృక్షము ఆకారంలో ఉన్న దీపస్తంభములను పెట్టడానికి గోవిందరాజీయము ఇట్లా ప్రకాశకరణార్థం అను దానిని ఇట్లా వ్యాఖ్యానిస్తుంది. చాందినీలు, పోకచెట్లు, అరటిచెట్లు మొదలయినవి కట్టడంతో ఏర్పడ్డ చీకటిలోపడిన వస్తువులు కనబడడానికి, రాత్రి అవుతుందని, అభిషేకకాలంలో రాముడు ఏనుగు మీద వెళుతుంటే అలంకార ప్రదర్శనకు పెట్టారని.

రావణవధను కోరుతున్న దేవతలావేశించిన మంథరావాక్యంతో రామాభిషేక విఘ్నము ప్రతిపాదించుట జరిగింది అని ఏడవ సర్గ మొదట్లో గోవిందరాజీయము. క్రితం సర్గలో గడచిన దినం ఆరంభం నుండి అంతం దాకా, అభిషేకవ్రతానికి అవసరమయిన ఉపవాసాదులు చేసిన రాముని వృత్తాన్తము వర్ణించిన కవి, ప్రజల ఆనందోత్సాహాలను కూడ వర్ణించి, ఆరోజులో జరిగిన కైకేయీవృత్తాంతాన్ని ఈ సర్గలో చెప్తున్నాడు. మంథర తల్లిదండ్రులెవరో కూడ తెలియదు. కైకేయి బంధువుల ఇంట్లో పుట్టింది. దాసీల తలిదండ్రులు ఎక్కడైనా తెలుస్తారా? "దేవతలు తమ పని నెరవేరడం కోసమే కైకేయి మనసు విరిచి అభిషేకం ఆపించడానికి పంపినట్టిది మంథర" 'కనుక దేవరహస్యం బయట పడకుండడానికి' "యతో జాతాలాటి విశేషణాలు" అని సంప్రదాయజ్ఞులయిన ఆచార్యులు చెప్పారు అంటుంది గోవిందరాజీయము.

చెడు వారి సహవాసంతో మంచివారి, గొప్పవారి చిత్తం గూడ అప్పుడప్పుడు చెడిపోవచ్చుననే విషయాన్ని ఎనిమిదవ సర్గలో సూచిస్తున్నాడు వాల్మీకిముని అంటుంది గోవిందరాజీయము. ఈ సర్గలోని 'హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమాః స్త్రియః' అను 12వ శ్లోకం వివాదాలకు దారితీసింది. దీనిపై గోవిందరాజీయ వివరణం ఇట్లా ఉంది. రాముని రాణి మహిషి ఒక్కరే అయినను, పరమాః స్త్రియః అని బహువచనంలో చెప్పడం, పరిచారికలు అనే అభిప్రాయంతోనే. తర్వాతి సగంలో 'అప్రహృష్టా భవిష్యంతి స్నుషాస్తే భరతక్షయే', అన్నచోట 'కోడళ్ళ' గురించే కనుక స్త్రియః కూడా భార్యలనే తెలుపుతున్నది గద అని సందేహం. అంతేగాదు సీత సుందరకాండలో, తండ్రి ఆజ్ఞ చొప్పున వనవాసంచేసి అభిషేకం మొదలయిన వ్రతాలు చేసి నీవు స్త్రీలతో సుఖించగలవు, అని చెప్పించాడు వాల్మీకి. యుద్ధకాండలో దర్భశయనంపై రాముడు పడుకొనేటపుడు 'ఉత్తమ

స్త్రీల భుజములతో పెనవేసుకొన్న భుజములతో' అని వర్ణించాడు. భార్యలభుజాలతో దప్ప ఇతర స్త్రీల భుజాలను పెనవేసుకోవడం కుదరదు గద! ఉత్తరకాండలో అశ్వమేధం ఆరంభంలో 'నాతల్లులు, కొడుకులు, స్త్రీగణములు భరతుని వెంట నడవాలి అని రామునితో చెప్పించాడుగద! ఇక్కడ సీత కంటే వేరే భార్య లేకుంటే వీలుగాదు. ఇంకో ప్రమాణం కూడ ఉంది. అది శ్రుతార్థాపత్తి (బలిసిఉన్న దేవదత్తుడు పగటి పూట తినడు, తినకుండ ఎవరు బలిసి ఉండరు, కనుక దేవదత్తుడు తింటూ ఉండాలి. పగలు తినడు అని చెప్పాం కనుక ఇక మిగిలింది రాత్రి తినడం అనేది. అర్థాపత్తి అను దానిని మీమాంసకులు, వేదాంతులు ప్రమాణంగా ఒప్పుకుంటారు. తార్కికులు అనుమానంలోనే కలుపుతారు) భార్యలేనివాడు యజ్ఞం చేయలేడు. రాముడు యజ్ఞం చేశాడు. అంటే భార్యతోనే (సీత కాకుండ మరొకరితో నన్న మాట) చేశాడు. అనేది అర్థాపత్తి సుఖపడటానికి భార్యలేకపోవడంతో రామునికి ఏకపత్నీవ్రతం, మరియు భృగువు ఇచ్చిన శాపం అనుభవించడము కూడ. సీత విగ్రహాన్ని చేయించడం ఆమెపై స్నేహంతో అని కొందరి వాదన. దీనికి గోవిందరాజు సమాధానం. రాముని ఏకపత్నీ వ్రతం సర్వసిద్ధమయినది. మరో భార్య ఉండే పక్షంలో అది కుదరదు కనుక లేదు. యజ్ఞం ఎట్లా చేశాడు మరి? ఆమె విగ్రహం ప్రక్కన పెట్టుకునే. ఉత్తరకాండలో 'యజ్ఞకర్మను చేయదగిన బంగారుసీతను' అని దీక్షార్హత, పత్నీత్వము చెప్పడం జరిగింది. ఈ కాండలో ఇదే విషయం తరచు చెప్పాడు వాల్మీకి. ప్రతియజ్ఞంలో బంగారుసీతనే. దీనిలో వచనవిరోధం, న్యాయవిరోధం ఏదీలేదు. "దూరంలో భార్య ఉన్నవాడు, దగ్గరగా ఉన్నా అనుకూలత లేనివాడు దర్భపుంజీలతో (దర్భతో చేసిన) బొమ్మను చేసుకొని పార్వణం చేయవచ్చును" అని హేమాద్రిలో, భార్యకర్తవ్యాలను కర్మలను అధ్వర్యువు, యజమానికాని చేయవచ్చని చెప్పనైనది. సీతపై స్నేహంతో బొమ్మ చేయించాడనడం బాగలేదు. వదలిపెట్టిన భార్యమీద స్నేహం జూపడం ఏమిటి? స్త్రీ గణములు అని పైన అన్నచోట, నాతల్లులు, భరతాదుల కుమారులు స్త్రీలు అని అర్థం చెప్పుకోవాలి. వేరే భార్య ఉన్నప్పటికి ధర్మాచరణ కొరకే, సంతానము కొరకు కానందున రామునికి కుమారులు (యజ్ఞసమయంలో) లేనందున కుమారులు వారి వెంటఉండే స్త్రీలు భరతాదులకు చెందినవారే అనేది స్పష్టము, పరమ స్త్రీలు, ఉత్తమస్త్రీలయొక్క స్త్రీలచేత అని వచ్చిన చోట్లలో భోగప్రసక్తి ఉన్నందున ధర్మపత్నీత్వముండదు, సాధారణాది స్త్రీశంకకు అవకాశం లేనందున, ఆ స్త్రీలు ఇతరులకు సంబంధించిన వారనుట నిశ్చయము. ఈ శ్లోకంలో పరిచారికలుగా, స్త్రీలచేత, అని సీత చెప్పినది. ఒకవేళ తాను చనిపోతే, ఇతరస్త్రీలచేత, అని కవి చెప్పించిన మాట గనుక, లక్ష్మీ, భూమిలను గురించి చెప్పినదే కాబట్టి ఏకపత్నీవ్రతమున కెట్టి భంగము రాలేదు, రాదు, రాబోదు.

ఇంత పెద్ద విషయాన్ని, మిగతా వ్యాఖ్యలు 'బహువచనంతో సీతాసఖులని, కోడళ్ళు అన్నప్పుడు ఇలానే' అని అర్థం చెప్పి చేతులు దులుపుకున్నాయి. మంథర మాటలను మొదటతోసి (రాజని)న కైకేయి, తర్వాత ఆమె తెలివితేటలను మెచ్చుకుంటూ, కుబ్జలందరిలోకి బుద్ధిమంతురాలవు అంటుంది. దానికి గోవిందరాజీయము వంతపాడుతూ, తరచుగా 'పొట్టివారికి పుట్టెడు బుద్ధులు' అని సూచించాడంటుంది. కోపంతో కోపాగారంలో పడుకున్న కైకేయిని వర్ణించిన చోట గోవిందరాజీయము ఉపమానముల మూలమున భూమిపై పడిన లతవలె, దివినుండి పడిన దేవిని వలె, ఇతరులను వశపరచుకొనే మాయను వలె, వలలో చిక్కిన లేడిని వలె, వేటగాని

విషపూరిత బాణముతో కిందపడిన కరిణిని వలె అని వర్ణించడంతో ఆమె భూమిపై పూర్తిగా పడిపోవుట, ఆశ్చర్యమును కలిగించుట, దయనీయస్థితి, అయినా దర్శనీయగా ఉండటం, రంగు పాలిపోవుట, చేష్టలుడుగుట బాధ పడు తుండడం. వరుసగా తెలుస్తున్నాయంటుంది. కైకేయి మాటలు విని మూర్ఛబోయి, తేరుకుని రాజు తనకు కలిగినది కలా? చిత్తమోహమా? మానసికరోగమా? అనుభూతోప సర్గమా? అంటాడు. 'జన్మాంతరాలలో అనుభవించిన విషయాల భావన లేదా స్మరణము' అంటుంది గోవిందరాజీయ వ్యాఖ్య. కాని తీర్థీయములో అనుభవించిన విషయాల నాశము అనగా సుషుప్తి అంటుంది. ఇది తేడా.

అడవికి పంపడం సముచితం గాదు అని రాముని గుణగణములు దశరథుడు ఏకరువు పెట్టేప్పుడు గోవిందరాజీయము 'మనోవాక్కాయములతో జనరంజకత్వము' చెప్పాడంటుంది. అట్లాగే వీర శబ్దముతో దయా, త్యాగ, విద్యా పరాక్రమవీరాలు తెలుపుతున్నాడు కవి. (ఇక్కడ ఒక చారిత్రిక ఘటనను ఉటంకిస్తుంది కూడ– చోళరాజు దగ్గర ఉన్న పండితునితో 'ఆత్మానం మానుషం మన్యే' అంటూనే రాముడు జటాయువునకు మోక్షం ఎట్లా ఇచ్చాడయ్యా! అని ప్రశ్నించాడు ఆ పండితుడు. 'సత్యేన లోకాన్ జయతి' అనే శ్లోకభావం చెప్పి గొప్ప బహుమానాన్ని పొందాడు అని ఆ కథ).

కైకేయివరాన్ని పరమ్– అశోభనం అని విడదీస్తుంది మాహేశ్వరీయము. సత్యమే ఏకపదమైన బ్రహ్మ. ముఖ్యమైనది అని 'ఏక' శబ్దార్థము పొందదగినది పదము. పరమప్రాప్యమైన బ్రహ్మ అని. లేదా ఓం అనునట్టి బ్రహ్మరూపము అని గోవిందరాజీయము. అక్షయవేదములు ప్రతిపాదించునదీ సత్యమునే అని కూడ. ఇక్కడ 34వ శ్లోకంలో (14వసర్గ) చతురశ్వోలోని 'తు' అనే అక్షరం గాయత్రీమంత్రములోని 'తత్సవితు' అనే నాలుగవ అక్షరం అని గోవిందరాజీయం తెలుపుతుంది. 'భాసః కరోతి' అను వ్యుత్పత్తిచే, చంద్రుడు అంటాయి వ్యాఖ్యానాలు, సముద్రం ఉప్పొంగింది అని చెప్పడానికి. యోగార్థము కంటె రూఢి అర్థము బలవత్తరమని గదా న్యాయము!

కైకేయి పంపగా వెళ్ళిన సూతుడు రాముని మందిరానికి వెళ్తూ మందిరాన్ని చూచాడు అని 15వ సర్గ 31వ శ్లోకంలో చెప్పుతాడు. మందిరవర్ణన కొంత అయిపోయాక, 38శ్లోకం లో మళ్ళీ చూచాడు అని చెప్పుతాడు. ఇది పునరుక్తం కాదు సామాన్యంగా చెప్పినదాన్ని విశేషంగా చెప్పాడు. ఇది పూజ్యుడయిన వాల్మీకి ముని శైలి అని గోవిందరాజీయము సమర్థిస్తుంది.

పదహారవ సర్గలోని ఏడునుండి పదివరకు శ్లోకాలను గోవిందరాజీయము చాలా విపులముగా వ్యాఖ్యా నించినది–కుబేరుని ముఖమువలె మహదైశ్వర్యము గలవాడు, కుబేరుడు దానము చేసినట్లు, తన చుట్టూ ఉన్నవారికి తన సౌందర్యం అనుభవించేట్టుగా ఇచ్చేవాడు, భగవద్ధ్యానంలో కూచున్నవాడు, ధ్యానానుకూలమైన అంజలితో నున్నవాడు, లేదా మంచి దివ్యమాలాలంకృతుడు, అట్టి ఉత్కర్ష పరాకాష్ఠ అయిన వాడిని నికర్షకు హద్దు అయినట్టి సూతుడు చూశాడు. ఆహా ఏమి ఈతని భాగ్య విశేషము అని భావము. అంతటి ఐశ్వర్యానికి తగిన, నానారత్న భూషితమయిన, పైన సుతిమెత్తని ఆస్తరణములు కప్పబడిన, అపూర్వదారు శిల్పకళప్రతిమలు చెక్కబడిన పర్యంకము పై కూర్చొన్నాడు. బంగారు పర్యంకం మీద కూర్చుంటే, బంగారుకొండ కారుమబ్బును

వలె, ఆ సోఫా రాముని వెలిగింపజేస్తున్నది. దాని మీద పరచిన వస్త్రాలు రాముని నగవువలె తెల్లగా ఉన్నవి. అతని సుకుమార దేహానికి అనుగుణంగానూ ఉన్నవి. ఈ విషయాలన్నీ పర్యంకవిద్యలో చెప్పడం జరిగింది. ముక్తులు మాత్రమే అనుభవింపదగిన దివ్యవేషమును సూతుడు చూచాడు. ఆహా ఏమి అతని భాగ్యము. రామునిదేమి సౌశీల్యము! ఇక చందనము సంగతి. చాలా ఎర్రనయిన వరాహరక్తము వలె ఉంది. కుంకుమ మిశ్రమముతో వచ్చినది ఆ రంగు సీత స్వకరకమలములతో అలదినది కనుక ఆమె చేతిరంగు దానిలో కలిసినది. ఆ చేతులతో పూతమై చాలా చల్లగా కూడ ఉన్నది. ఆ చందనము సుగంధి అను పదముతో, సీతాదేవి కరస్పర్శతో కలిగిన నిరవధిక గంధముతో, అని అర్థము. ఆమె పూసుకొనిన పిదప పూసినదనుటతో శ్రేష్ఠమయినది అర్థము. పరంతప అనుటతో ఇంతటి ఇలాటి ఆనందానుభవానికి విరోధులను తొలగించగలిగిన అని అర్థము. సీతప్రాకృత స్త్రీ కాదు అను దానిని ఆమెను చిత్రా నక్షత్రముతో పోల్చడం వలన స్పష్టమవుతున్నది. కాంతుని చందనానులిప్తగాత్రుని చేసి, వీవనగర్ర చేత బూని విసరుతూ, వెనక ఉన్నది, చంద్రుని వెంటనే ఉన్న చిత్రానక్షత్రము వలె వినయముతో వింజామరవీచి, తన రూపరేఖాలావణ్య విశేషంతో గట్టిగా రాముణ్ణి కౌగలించినట్టుంది. చైత్రపున్నమినాడు, చిత్రానక్షత్రంతో పాటు ఉన్న (ఉదయించినవాడు) చంద్రుని వంటివాడు రామచంద్రుడు. చిత్ర అనే పదంతో ఆ యోగంలోని అతిశయము తెలుస్తున్నది. ఉపేత పదంతో (అను) రాగం తెలుస్తున్నది. శశినం- అనడంతో సీతాలింగనోత్కృష్ట చందనము గల్గిన వక్షమువాడని చెప్పనయినది. ఇలాంటివాణ్ణి చూశాడని చెప్పడంతో దృష్టి సాఫల్యం కలిగింది, నమస్కరించాడు అని శిరస్సాఫల్యము, మాట్లాడాడు, విన్నవించాడు అని వాక్సాఫల్యాన్ని కూడ పొందాడని వర్ణించారు భక్తి పారవశ్యంతో (లో) శ్రీగోవిందరాజులవారు. ఇంకా కేవలం సూర్యుని వలె అన్నా కూడ చెప్పదలచినది పూర్తవుతున్నప్పటికి 'తపంతం' అను విశేషణం వలన ఒకేసారి ఉదయించిన వేయి సూర్యుల తేజః పుంజమువలె వెలుగుచున్న అని, ఒక అభూతోపమ వ్యంగ్యమవుతున్నది. స్వతేజస్సుతో- స్వాభావికమైన. ఇతరులకు లేనట్టి కాంతితో, ఇతరుల వలన వచ్చిన కాంతికాదు, ఇతరులకు కూడా సాధారణమైన కాంతికాదు. వెలుగుతున్న సూర్యుని వలె కాంతితో గూడినవాడని అన్వయము. ఆయన ఇందీవరశ్యాముడు, స్వభావంతో నీలవర్ణుడు అట్టి వానికి సూర్యకాంతిమత్త్వము చెప్పడంతో, దీపంలో వత్తిలోఉన్న నీలపదార్థమువలె, చుట్టూ ప్రసరించిన తెల్లని కాంతిపుంజము వంటి వర్ణము గలవాడని తెలుస్తున్నది. ఆయన శరీరం నీలంరంగు, ప్రసరించేది బంగరుకాంతి. ఇదంతయు ధ్యానించతగిన శుభాశ్రయాకారవిశేషాన్ని తెలుపుతున్నది. ఇతర వ్యాఖ్యానాలు ప్రత్యేకంగా ఏమీ వివరించలేదు. రాజుగారు రమ్మంటున్నారు అని సుమంత్రుడు చెప్పగానే, రాముడు సీతకు చెప్పి. తను మెడలో వేసుకున్న ముత్యాల హారాన్ని ఇచ్చి వెళ్ళుతున్నందుకు, పాదపల్లవ సంస్పర్శ పూర్వకంగా సాంత్వన చేసి (ఇది భట్టారకుల అభిప్రాయమని, దానికి ప్రమాణంగా ఆమె యోగ్యతను) నాగేటి చాలులో పుట్టి అయోనిజ కావడంతో, తన కన్న విలక్షణమైనదని, అందువలన అంతటి ప్రీతి ఉచితమని గోవిందరాజీయం వ్యాఖ్యానిస్తుంది. భావుకుడైన భక్తుడైన వ్యాఖ్యాత శ్రీగోవిందరాజులు రాముడు మాల ఇస్తే ఈమె నేత్రాలతో కువలయమాలను ఇచ్చింది. ఎల్లప్పుడూ తననే గుండెల్లో దాచుకునే రాముని ఎడబాటును తాళలేక, పోదగినంత దూరం, రామునితో వెళ్ళి సాగనంపింది అని కూడ వ్యాఖ్యానిస్తాడు శ్రీగోవిందరాజులు.

'స్వస్తికులు' అనగా జయజయ అని మంగళం పలికేవారు. వీరికే 'వందిన్' అని కూడ పేరు. రథముతోలడం, స్తుతిని చేసేవారు సూతులు, రాజులను మేలుకొలుపువారు, అని అన్నివ్యాఖ్యలు తెలుపుతున్నాయి. పతాకా –పేరు లేని జెండాలు, పేర్లు కలవి ధ్వజములు. ప్రతిజ్ఞ లేకుండ రాముడు రెండోమాట మాట్లాడడు, అనే గోవిందరాజీయము కంటె, మొదట చెప్పినమాటను కాదనడు, అనే తీర్థీయము బాగున్నది.

కైకేయిమాటలకు రాముడెట్టి వికారం చెందలేదు. అది చూచి దశరథుడు ఇంకా చాలా బాధపడ్డాడు అంటాడు శ్రీగోవిందరాజులు. లక్ష్మణుడు మాత్రం చాలా కోపించాడు. దీనికి తీర్థులవారు లక్ష్మణునిలో మనోవిక్షేపం (వికారం) కలిగించే అవిద్య ఉందన్నట్టు చూపాడు కవి అంటారు. తన వారికి కలిగిన దుఃఖానికి, రామునికి దుఃఖము కలిగింది, కాని ఆయన ముఖంలో కాంతి తరగలేదు, మనసులో చింతలేదు, కనుకనే అతడు ధీరాత్ముడు. మిత్రులు, తనకు వచ్చిన విపత్తిని చూసి తాను బాధపడితే, వారు ప్రాణాల మీదకు తెచ్చుకుంటారని తాను వికారం పొందలేదు, చూపలేదు. వ్యాఖ్యలు సమమే. విష్టరమనగా 25 దర్భలతో కొనలు తెగనివానితో చేసినది. తాపసులు కూచునే ఆసనము. గోవిందరాజీయం, స్మృతి వ్యాక్యాన్ని ఉదహరిస్తూ 50దర్భలతో చేసినదాని పేరు 'బ్రహ్మ' అని కూడ తెలుపుతుంది. తన వనవాసం గూర్చి తెలిసి అనుమతి కోరగా, కౌసల్య, నాయనా! నీవు పుట్టకుండా వుంటే, నేను గొడ్రాలు అనే మానసిక దుఃఖం మాత్రమే ఉండేది, ఇప్పుడేమో ఎడబాటు, దుఃఖమూ కలుగుతున్నది అంటుంది. నీవు పుట్టాక అయినా, పెద్ద భార్యగా సుఖము అనుభవించ వచ్చునుకున్నాను. ఇప్పుడదీ కరవవుతుంది అని విలపిస్తుంది. వ్యాఖ్యలు సమానమే. నీవు వెళితే నన్ను లెక్కచేయరు అని 'అతంత్రితా' పదంతో సూచన అని గోవిందరాజీయం.

ఇదే సందర్భంలో కౌసల్య నీవు పుట్టినప్పటి నుండి 17సంవత్సరాలు, నా దుఃఖం ఎప్పుడు తొలగిపోతుందా అని ఎదురు చూస్తున్నాను అని అంటుంది. రాముని వయసు గురించి గోవిందరాజీయం విపులంగా చర్చిస్తుంది. దాని సారాంశం.

యాగరక్షణార్థం రాముని తన వెంట పంపమన్న విశ్వామిత్రునితో పదహారు సంవత్సరాల కంటె (ఒకటి) తక్కువ వాడు అని చెప్పాడు దశరథుడు. సీతముందు (వనవాసానికి వెళ్ళడానికి) 12ఏళ్ళు ఇక్ష్వాకుల ఇంట్లో ఉన్నాను అనబోతుంది. దీంతో రాముడికి 28ఏళ్ళు కదా ఉన్నాయి. తల్లి 17ఏళ్ళు రామునికి అని అనడం తప్పు కదా అని ప్రశ్న? తప్పు కాదు. కౌసల్య, నీవు పుట్టాక అనేది రెండవ జన్మను బట్టుకొని క్షత్రియునకు పుట్టినప్పటి నుండి 9వ ఏడు మొదలు 11వ ఏడు వరకు ఉపనయనము చేయవచ్చుననడంతో, సీత కూడ 25ఏళ్ళవాడు రాముడు అని తెలుపడంతో తొలగిపోతుంది విరోధం. వివరాలకు బాలకాండలో విశ్వామిత్రునితో దశరథుడు అన్న 'ఊనషోడశ వర్షో మే' అను శ్లోక వ్యాఖ్యానం చూడండి.

ఇక తీర్థీయం ఏం తీసిపోలేదు ఈ విషయంలో, యాజ్ఞవల్క్యస్మృతి ప్రమాణంతో ద్విజాతిత్వం బలపరుస్తుంది. దానితో 28సరిపోతుంది. లేదా నీ ఉపనయనానంతరం 17ఏళ్ళు దుఃఖక్షయం కొరకు ఎదురుచూస్తూ కూచున్నాను, ఉపనయనంతో పిల్లలు పెద్దవాళ్ళుగా మారుతారు అని తల్లులు ఆశపడుతారు. రామునకు గర్భనవమంలో అంటె కడుపులో పడ్డప్పటి నుంచి తొమ్మిదవ ఏడులో అని, పుట్టినప్పటినుండి ఎనిమిదవ ఏడులోనే- శుద్ధాష్టమంలో ఉపనయనం జరిగింది, ఉపనయనం తరువాత 17 ఏళ్ళు గడిచాయి, పెళ్ళికి ముందు 12 పెళ్ళి తర్వాత 12

వెరసి 25వ ఏట వనానికి వెళ్ళడం అనగా 12ఏళ్ళే అని, బాలుడు 12ఏళ్ళవాడు అస్త్ర శస్త్ర విద్యలు తెలియనివాడు అని చెప్పాడు గనుక. మారీచుడు రావణునికి, పెళ్ళి సమయంలో రాముడు 12ఏళ్ళవాడు అని చెప్పాడు. సన్న్యాసిగా వచ్చిన రావణునికి సీత 12ఏళ్ళు అత్తగారింట్లో ఉండి వచ్చాను అంటుంది. అదే సందర్భంలో "13వ ఏట పెళ్ళిమాటలు జరిపారు", ఆమెనే 'నాభర్త 25వ ఏట వనవాసానికి' బయలు దేరాడు అని చెప్పడంతో 25వ ఏట రాముడు వనవాసానికి వెళ్ళాడు అనుటలో ఎట్టి తప్పులేదు. తీర్థీయంలో కొన్ని కొత్త విషయాలు చర్చకు వచ్చాయి.

ఇరవయి ఒకటవ సర్గలో రాముడు వనవాసానికి వెళ్ళడానికి, తండ్రి మాటను పాటించడానికి గట్టిగా నిలబడ్డాడని నిరూపితం అంటుంది గోవిందరాజీయం, సర్గ ఆరంభములో లక్ష్మణుని మాటలు కౌసల్యను ఓదార్చడానికి ఉద్దేశించినవే గాని హృదయపూర్వకమైనవి కావని అంటుంది. ఇవి తీర్థీయంలో లేవు. వనవాసంనుండి రాముణ్ణి వారించడానికి రెండు విషయాలు చెప్తుతుంది. ఒకటి – కశ్యప పుత్రులలో ఒకడు ఇంటిలోనే ఉంటూ తల్లిని సేవించుట అనే మహాతపస్సుతోనే స్వర్గమును పొందాడు. రెండవది – నీవు నన్ను వదలి వెళ్ళితే నేను ప్రాయోపవేశం చేస్తాను, అది నీకు బ్రహ్మహత్యాసదృశము. పూర్వము తల్లికి దుఃఖము కలిగించడం అనే అధర్మముతో సముద్రుడు బ్రహ్మహత్యను చేసిన అనగా బ్రహ్మహత్య చేస్తే వచ్చే పాపముతో పొందేనరకాలను అనుభవించాడు అని. ఈరెండు పురాణకథలు. అయితే రెండవ కథ పురాణాల్లో లేనందున ఇట్లా వ్యాఖ్యానించా మంటారు.గోవిందులు తీర్థులూను. ఈ మాటలకు కరగక రాముడు, తండ్రిమాట జవదాటడానికి నాకు చేతకాదు ఆజ్ఞ ఇమ్మంటాడు. తండ్రి మొదట ఆజ్ఞాపించాడు నీవు తరవాత అంతేగాక మన పూర్వీకుల్లో తండ్రిమాటతో గోహత్య చేశారు, సగరుని ఆజ్ఞతో భూమినే తవ్వారు. ఈ మాటలతో తండ్రి ఆజ్ఞ పాటించడంతో నాకు దుఃఖం మాత్రమే కలుగుతుంది అని తీర్థీయం విశేషం చెబుతున్నది. గోవిందరాజులు ఇక్కడొక విశేషం తెలిపారు. దేవసములయిన పూర్వీకులు చేసినట్టి దానిని, పూర్వము ఆచరించిన దానిని, అందరు అంగీకరించిన దానినే చేస్తున్నాను. నీకు ప్రతికూలంగా ఏం చెయ్యడంలేదు. దీనితో చంద్రుడు చేసిన తారను కలువడం మొదలయినవి తొలగిపోయినాయి. అవును పూర్వీకులు ధర్మవ్యతిరేకమూ, సాహసమూ అయిన పనిని చేశారు, మాతృవధ మొదలయినవి సాహసమని నిందించారు గద అని అంటావేమో! సాహసము తండ్రి చెప్పిన దానికంటె విరుద్ధమయినది కనుక నిందితం. వ్యాఖ్యాతలు దానిని ఉదాహరించడం తెలివి తక్కువ పనే. సేవ గురించి చెప్తుతూ 'తల్లి తండ్రికంటె నూరు రెట్లు ఎక్కువ' అన్నారు, కాని వారు చెప్పినది చేయడంలో గాదు, తల్లి ఓ సంచి – బస్తా, ఎవడికి పుట్టాడో అతడే అతడు అనే దానిక్కూడ విరోధం రాదు. ఈ విషయాలు ఎక్కువగా ఉన్నవి గోవిందరాజీయంలో.

లక్ష్మణుని రాముడు మందలిస్తాడు. నీకు ధర్మరహస్యం సత్యం అంటే ఏమిటో తెలియదా అని. లోకంలో ధర్మం గొప్పది. ఆ ధర్మంలో సత్యం ప్రతిష్ఠితమైంది. తండ్రి చెప్పిన మాట ధర్మయుక్తమూ, ఉత్తమమూను. మాట ఇచ్చి తప్పడం, ఆమాట తల్లి, తండ్రి, బ్రాహ్మణున కిచ్చినదైనా కావచ్చును, అధర్మమే. నేను దాన్ని అనుసరించను. నీవు కూడ కేవలశూర ధర్మాన్ని, రౌద్ర, శాఠ్యసహిత క్షత్రియ ధర్మాన్ని– కైకేయిని, తండ్రిని చంపి రాజ్యం నాకిప్పించడం లాంటి పిచ్చి పనిని, చేయవద్దు. 3 గూడ అంటున్నది ఇకపైన, క్రౌర్యం దాల్చకు, నాబుద్ధిని అనుసరించు. ఓర్పును అలవాటు చేసుకో! లోకాయతులకు మాత్రమే అభిమతమయిన నీతిని వదలిపెట్టు. ధర్మమును ఆశ్రయించిన నీతిని పాటించు! ఈ శాస్త్రములో ధర్మస్థాపన ముంటుంది. ధర్మంతో పనిలేకుండ కేవలం 'నీతి' యే అర్థసాధనము

అనేది లోకాయత నీతి. దానిని తీసివేసి మెలగుము! అక్కడక్కడ లక్ష్మణుని ద్వారా లోకాయత మతం ప్రసక్తి వస్తే, దానిని నిరసించి రాముడు ధర్మమును స్థాపించాడు, బలపరిచాడు అనే రహస్యాన్ని గోవిందరాజీయం స్పష్టపరిచింది.

లోకంలో ధర్మం యొక్క ఫలము సుఖము, ఆ సుఖం పొందాలంటే ధర్మార్థకామములు ఉపాయములు, సాధనములు. అవి అన్నీ ధర్మంలోనే ఉంటాయి, ఉన్నాయి. ధర్మము ఆచరిస్తేనే సౌఖ్యాతిశయప్రదాన స్వభావం గల అన్ని పురుషార్థాలు సిద్ధిస్తాయి. ఈ విషయంలో ఎట్టిసందేహం నాకు లేదు.ఎట్లాగంటే భార్యవలె, ఆమె వశ్య అనుకూలవతి అయితే ధర్మం కలిగిస్తుంది, ఇష్టమైనదై కామమును తీరుస్తుంది, సుపుత్ర అయి అర్థమును కూరుస్తుంది. సులక్షణ, సులగ్న, ప్రయోజక పుత్రుడు పుడితే తండ్రికి అన్ని అర్థాలు సిద్ధిస్తాయి. అట్లానే అన్ని పురుషార్థాలకు ధర్మమే మూలము. ధర్మమే ధర్మానికి కారణము, అర్థానికి హేతువు, కోరుకుంటున్న స్రక్చందన వనితాదులకు నిమిత్తమూను. కావున ధర్మమే ఆశ్రయణీయము, ఆచరణీయము.

మరియొక విధంగా వ్యాఖ్యానం – లోకంలో శాస్త్రాలతో, ఫలసాధనములుగా తెలుపబడినవన్నీ, ఫలాలు కలిగించడంలో సమర్థములే, నాకు సంశయంలేదు. వశ్య, అభిమత, సుపుత్ర అయిన భార్యలాగ ఇట్లా చెప్పుకుంటే అధ్యాహారం అనవసరము. ముందు చెప్పబోవు శ్లోకానికి అనురూపం గూడ ఏపనిలో అయితే ధర్మార్థకామాలు ఉండవో ఆ పనిని చేయగూడదు. ఏపని వలన ధర్మం సిద్ధిస్తుందో ఆ పనిని మొదలు పెట్టాలి, చెయ్యాలికూడ. ఎందుకంటే కేవలం అర్థపరుణ్ణి లోకులు ద్వేషిస్తారు. కేవలం కామపరత్వం అప్రశస్తమయింది. పెద్దవాడు, రాజు, తండ్రి, వృద్ధుడు అయిన దశరథుడు కోపంతోగాని, సంతోషంతోగాని, కామంతో నైనాగాని ఏది ఆజ్ఞాపిస్తే దానిని క్రూరుడు కానివాడు తప్పక చెయ్యాలి. చెయ్యనివాడు నృశంసుడన్నట్లే. నేను నృశంసుణ్ణి కాదు గనుక తప్పక చేస్తాను, తండ్రి మాటను పాటిస్తాను. అతడు (మన) ఇద్దరికీ తండ్రి, పెద్దవాడు (నాకు భరతునికి) ఆజ్ఞాపించే ప్రభువు. కౌసల్యకు భర్త. ఆమె ఆయనమాట జవదాట కూడదు. అంతేగాదు ఇది అందరికినీ ధర్మము, అలౌకిక శ్రేయస్సాధనము. భర్త బ్రతికుండగ, ఆయన పూర్వరాజుల కన్న మిన్నగ ధర్మమార్గంలో నడుస్తుండగ, కౌసల్యాదేవి నాతో అడవికి వెళ్ళకూడదు. కనుక నీవు వెళ్ళడానికి అనుమతించు. మేము వెళ్ళడానికి ఏర్పాట్లు చేయి అని రాముడు తల్లి కౌసల్యతో చెప్పుతాడు. ఇక్కడ, నః మమ్ములను. ఇంకా సీత అభిప్రాయం తెలియనందున మా ఇద్దరి యొక్క అని తీసికోవాలని గోవిందరాజీయము తెలుపుతుంది, ద్వివచనంలో బహువచనాదేశము అని. స్వర్గం నుండి పడిపోయిన యయాతి సత్యవచనంతో మళ్ళీ స్వర్గానికి వెళ్ళినట్టు, నేను 14ఏళ్ళు అయ్యాక బాగా తిరిగిరావాలని స్వస్త్యయనము చేయమంటాడు. అధర్మంతో సమానమైన రాజ్యాన్ని నేను కోరను, కేవలం రాజ్యం కొరకు కీర్తిని మహోదయాన్ని వదలుకోలేను. లోకప్రసిద్ధమైనవి మూడు పురుషార్థాలు ధర్మ అర్థకామాలు. వాటిలో అన్నిటికీ మూలమైనందున, అర్థకామాలు నశ్వరములు కనుక ధర్మమే ఆచరణీయము అని స్థాపించింది అని గోవిందరాజీయం విశేషమయిన వ్యాఖ్యానాన్ని చేస్తుంది. తీర్థీయం ఒక్కమాటలో దర్శనం. స్వమతం ధర్మరహస్యం అని చెప్పుతుంది.

ప్రతిసర్గ మొదట్లో సర్గ వృత్తాంతాన్ని ఒక వాక్యంలో చెప్పటం గోవిందరాజీయంలోని విశేషం,22వ సర్గ మొదట, రాముడు లక్ష్మణునికి, కైకేయికి ఉన్న కోపాన్ని శాంతింప జేస్తున్నాడంటుంది. దైవమే ఇట్లా చేయిస్తున్నది, ఇందులో కైకేయి తప్పు ఏంలేదు అని. పూర్వాపర సందర్భాన్ని బట్టి 'భయ' శబ్దానికి శాంతి అని అర్థం చెబుతుంది

గోవిందరాజీయము. తీర్థీయం దైవం ప్రబలం, పౌరుషం కాకతాళీయం అని వివరిస్తుంది. దైవం కార్యైకానుమేయం అని (ఫలితం పనిని చూసే దైవమును తెలుసుకోవచ్చును) గోవిందరాజీయం అంటే, తీర్థీయం, దైవం నిత్యానుమేయం (ఎల్లప్పుడు అనుమానించదగినదే) అని అంటుంది.

ఎప్పటిలాగే, 23వ సర్గ మొదట విమర్శ బాగున్నది. దైవం ప్రబలము గనుక రాజ్యం పోయినందుకు చింతపడవద్దు. ధర్మమే సర్వ శ్రేయస్సాధనము. దానికి మూలం తప్పక ఆచరించదగినది. తండ్రిమాట తల్లి తర్వాత అడిగినది కనుక తర్వాతనే (తండ్రిమాట నెరవేర్చిన పిదపనే) చేయతగినది అనే విషయాలు యుక్తియుక్తంగా చెప్పాడు. ముందర లక్ష్మణుడు చేయబోయే విప్రతిపత్తి పూర్వపక్షం – పౌరుషమే గొప్పది – బలీయం, దైవం దుర్బలం – బలహీనులు ఆశ్రయించేది అనేదానికి జవాబు చెప్పబోతూ, లక్ష్మణునితో పూర్వపక్షం విస్తరంగా చెప్పిస్తున్నాడు వాల్మీకి ముని అంటుంది గోవిందరాజీయము. ఇంకా, తన అనంగీకారం తెలుపడానికి తలకిందకు వాల్చుకొన్నాడు, ధర్మమునందే రాముడు గట్టిగా నిలబడ్డాడని హర్షాన్ని, రాజ్యం వదలి పెడుతున్నాడని దుఃఖాన్ని పొందుతూ లక్ష్మణుడు దుఃఖ హర్షాలమధ్య కొట్టుమిట్టాడాడు మనస్సులోనే, మాటల్లో మాత్రము ఇవి కనబడనీయలేదు అని. వెంటనే లక్ష్మణుడు రామునితో – తండ్రి మాట పాటింపకపోవుట అనే అధర్మప్రసక్తితో, నేను ధర్మం ఆచరించకపోతే లోకం ధర్మం త్యజిస్తుంది అనే రెండు పనులకై అడవికి పోవాలనే తొందర నీకు పట్టుకున్నది. ఇది తగదు. నీవు సమర్థుడైన క్షత్రియుడవు, చాతగాని క్షత్రియునివలె దైవం బలీయమంటున్నావు. లేదా ధర్మహాని ప్రసక్తి చేతను, లోకం నన్ను అధర్మిష్ఠుడనని పూజింపదు అనే శంకచేతను నీకు గొప్పభ్రాంతి కలిగినదని కాని అర్థము చెప్పుకోవచ్చును. ఇది ఈ వ్యాఖ్యా విశేషము. తీర్థీయములో లోకం అనతిశంక– అనగా తండ్రిమాటనే పాటింపనివాడు మనల్ని ఎట్లా కాపాడుతాడో? అని శంకా, అది లేకపోవడమే అనతిశంకా రెంటిలో ఈ తేడాను మనం గమనించవచ్చును. పిరికివానివలె దైవంను బలీయమనరాదు. పాపిష్ఠుల మాటలను ఆచరించకపోయినను ధర్మహాని జరుగదు. ధర్మం ముసుగులో తమ పబ్బంగడుపుకునేవారు లోకంలో చాలామంది ఉంటారు. కాకుంటే ఆ వరము ముందే ఇచ్చియుండేవారు. "భరతునికి రాజ్యం తప్పక ఇయ్యాలి. రాముడు పెద్దవాడు గనుక అభిషేకం ఆరంభిస్తాము. అప్పుడు నీవు వరాలు అడగాలి. ఆ నెపంతో రాముణ్ణి అడవికి పంపాలి. అభిషేకం భరతునికి చెయ్యాలి అని కైకేయి దశరథులు మొదటే అనుకొని, ఇప్పుడు ఇట్లా చేస్తున్నారు. లేకుంటే మొదలే ఆమె ఎందుకు అడుగలేదు. అడగకున్నా నీతిజ్ఞుడైన రాజు మొదటే ఎందుకు చెప్పలేదు" అని గాని భావం అంటుంది గోవిందరాజీయము. వాటినన్నిటినీ తోసి పుచ్చి రాముడు పితృవాక్యపరిపాలన రూపమైన సన్మార్గాన్నే ఎంచుకున్నాను అని లక్ష్మణుని అనునయించి ఓదార్చి తన నిశ్చయం చెప్పుతాడు.

తల్లి కౌసల్య దుఃఖముతో అన్న మాటలు చెప్పుతూ తన మాటలకు అందనిది అని తెలిపాడంటుంది గోవిందరాజీయము. రోదిస్తున్న తల్లిని జూచి తనకు దుఃఖం పొంగివచ్చినను, తండ్రిమాటను పాటించడం అనే ధర్మానికి విఘ్నం కలుగుతుందనే భయంతో, ధైర్యంగా ఉన్నాడంటుంది గోవిందరాజీయము. 25వ సర్గలో తల్లి కౌసల్య రాముని సాగనంపేప్పుడు, పుత్రప్రేమపారవశ్యంతో అనేకం పునరుక్తులు చెప్పిందంటుంది తీర్థీయం. గోవిందరాజీయం పునరుక్తులు గాకుండ వ్యాఖ్యానిస్తుంది. వేది, స్థండిలము, ఆయతనము, వృక్షములు, క్షుపములు,

ధాతా, విధాతా, పూషా, భగుడు, అర్యముడు వీటి అర్థాలు వివరిస్తుంది గోవిందరాజీయము. తీర్థీయము – ధాతా – విరాడ్విష్ణువని, విధాతా – సృష్టికర్త అని తెలుపుతుంది. ఒక్క విషయం. (తీర్థీయము గోవిందరాజీయమున కన్న కాలంలో మొదటిది) ఇదే సందర్భంలో "కొందరు ఈప్రకరణములో, తరచు పునరుక్తులున్నాయి, వాటిక్కారణం పుత్రరక్షణ విషయ ప్రేమపారవశ్యమే" అని అన్నారని గోవిందరాజీయముదహరిస్తుంది. ఈ మాటలు తీర్థీయంలోనే ఉన్నవని పైననే తెలుసుకున్నాం గద!

అకారప్రశ్లేష లేదా అవగ్రహము "ఽ" లేకపోవడంతో తీర్థీయం "వాచా సంసజ్జమానయా", లోన దుఃఖముతో గద్గదమైన మాటతో అని వ్యాఖ్యానిస్తుంది. గోవిందరాజీయమేమో 'అసంసజ్జమానయా'. తొట్రుపడుతూ అని వ్యాఖ్యానిస్తుంది.

రాముడు సీతాభవనాన్ని సిగ్గుతో ప్రవేశించాడు, ఆ సిగ్గు గృహాలంకారాలను, జనుల సంతోషం చూస్తే కలిగినదంటుంది గోవిందరాజీయము. కాని తీర్థీయం, సీతకు ఈ అప్రియాన్ని ఎట్లా చెప్పాలి అని ముఖం కిందకు వాల్చుకొని,అని సమంజసముగా వివరిస్తుంది. తండ్రిమాట మీద తానడవికి వెళ్ళుతున్నట్టు, సీతను ఓ సామాన్య స్త్రీగా నియమ నిష్ఠలతో అత్తమామల సేవలతో ఉంటూ, భరతుని ఎదుట తనను గురించి పొగడవద్దని, తమ్ముళ్ళను, కొడుకులను చూసినట్లు భరత శత్రుఘ్నులను చూడాలని, భరతునికి ఇష్టం లేనిది చెయ్యవద్దని చాలా హితబోధచేస్తాడు.

రాముని కర్తవ్యము, సామాన్య ధర్మములు ఎట్లా ఆచరించాలో చెప్పి ఈ 27వ సర్గలో సీత ఆచరించాల్సిన పాతివ్రత్య ధర్మములను సంక్షేపంగా ప్రస్తావిస్తున్నా దంటుంది గోవిందరాజీయము. తీర్థీయము – రాముడు ఇంటిలో ఉండాలి అని చెప్తే, నాకు కూడ ధర్మంగా వనవాసమే ప్రాప్తిస్తుంది అని సీత అంటుంది అని మొదలు పెడుతుంది వ్యాఖ్యానం. సీతవాదమును బాగా విమర్శించి గోవిందరాజీయము సమానభాగ్యత్వము, తదేక గతిత్వము, సహాయకారిత్వము, నిశ్శంకనేయత్వము అను యుక్తులతో తననూ వనవాసానికి తీసికొని పొమ్మన్నదని చెపుతుంది. ఇక్కడ ఓ విషయం గమనించాలి. అడవిలో మారీచ మృగం రాగలదు, దాని ద్వారా మన ఇద్దరికి ఎడబాటు జరుగవచ్చు. అప్పుడు మనల్ని మళ్ళీ కలిపేవాడు ఎవడు? నేను లేకుండా నీవు ఎట్లా వుండగలవు? అని ఆలోచిస్తుండే రామునికి సీత, వానరశ్రేష్ఠులతో కలుపబడడము అనిన్ని, 'వనం' పదం రెండు సార్లనడంతో రెండవది అశోకవనము సూచిత మనిన్ని, మళ్ళీ నీపాదాలు సేవిస్తూనే ఉండగలనని చెప్పినట్లయిందని, 20వ శ్లోకవ్యాఖ్యానం చేస్తుంది గోవిందరాజీయము. 21వ శ్లోకం పరమార్థం రావణుడు ఎత్తుకపోయినను నీపైనే చిత్తం కలిగి ఉండేదానిని, జడను ఉరితాడుగా చేసుకొని మరణించ నిశ్చయించుకోబోయే దానిని, హనుమంతుని దూతగా పంపడం మొదలయిన వాటితో తీసికొనిపో! యాచనను–దేవతలు చేసిన రావణవధ అభ్యర్థనను నిజము చేయి! అందువలన నేను వెంట రావడం వలన నీకు ఏం బరువుకాదు అని వివరిస్తుంది, తనను అడవికి తీసికొని వెళ్లమని సీతాదేవి, అని తెలుపుతుంది గోవిందరాజీయమ్. తామ్రోష్ఠి గనుక, సాంత్వనము, మంచిమాటలు మొదలయిన వాటితో రాముని వదలి ఉండలేనిది సీత అని తెలుస్తున్నదంటుంది గోవిందరాజీయము.

స్నేహంతో, కోపంతో అంటే ప్రణయకోపంతో సీత రాముని ఇట్లా అన్నది. నన్ను వదలిపెట్టిన నీవు అడవికి వెళ్ళినట్టు తెలిస్తే నాతండ్రి నిన్ను ఆడదే ఒకడు పురుషుని వేషం ధరించి నాపిల్లను పెళ్ళి చేసుకున్నది అని

తలచును. ఓరామ! కేవలం అందంతో ఇతరులను మభ్యపెట్టేవాడా! వైదేహుడు– విదేహవంశములో బుట్టిన జనకుడు, కర్మయోగానికి పేరు మోసినవాడు, భార్యావియోగమును ఎన్నడూ ఎరుగనివాడు, సైచనివాడు, నాతండ్రి, భార్యనయిన నన్ను కాపాడలేక వదలి వెళ్ళిన నిన్ను తెలుసుకొని, పొంది, లోన స్త్రీ స్వభావం గలవాడినిగా పైన పురుష వేషం గల్గిన అల్లుడు అనుకున్నాడా? అట్లానే అనుకున్నాడు అని అర్థం. పురుషవిగ్రహమ్ అనడంతో పురుషుడయినా, మోహినీరూప భ్రమ కలిగించువాడని, పూర్వం జరిగిన సంగతి సూచిస్తున్నది. ఇది గోవిందరాజీయము.

ఇక తీర్థీయం – నాతండ్రి నీతత్త్వమును బాగా తెలుసుకోలేదు. తెలుసుకుంటే నీకిచ్చేవాడు కాదని ఆక్షేపము. లేదా వాసుదేవుడే పురుషుడు, బ్రహ్మ మొదలుకొని జగత్తంతయు స్త్రీప్రాయమే అని విష్ణుపురాణంలో ఉంది. వైదేహుడైన నాతండ్రి నిన్ను అల్లుణ్ణిగా పొంది, నిన్ను తప్ప పురుషులనందరిని స్త్రీలనుకున్నాడా ఏమి? ఇంత పిరికివాడవైన నిన్ను అలా అనుకొని భ్రమపడ్డాడు, లేదా రామజ– అందరిని ఆడించడానికి పుట్టినవాడ! అమాతరం. తల్లిగాని కైకేయిని (పొంది) ఉద్దేశించి, నాతండ్రి, విగ్రహం – కయ్యాన్ని అనుకున్నాడా ఏం? కైకేయితో ఇలాటి కలహం రాబోతుంది అని తెలుసుకోలేకపోయాడు. అట్లయినా నన్ను వదలి నీవు అడవికి పోవద్దు. లేదా ఆనంద రూపుడైన, అల్లుడవైన నిన్ను పొంది నాతండ్రి, తన ఆడువారిని అనగా పుత్రమిత్రకళత్రాదికమైన (ఇహమును) పరమును సత్యము అనుకున్నాడా? ఏమి. అంతయు తుచ్ఛమని తెలిసికొని, పరమానంద భరితుడయ్యాడు. ఇట్లా సర్వానందకరుడవైన నీవు నన్నెందుకు వ్యథ పెడుతున్నావు అని విశేషముగా వ్యాఖ్యానిస్తుంది[1]. ఈలోకం, సూర్యునిలాగ కాంతితో రాముడు తపింపజేయుచుండ, అజ్ఞానంతో, ఆలోచించకుండ కాంతిలేదనడం అసత్యము కానేకాదు. కనబడుట లేనందున అలాటి తేజస్సు లేనేలేదు. లేదా తెలియక ఇట్లా ఆక్షేపించాను అని, భయంతో లోకం అంటుంది అని, తన అపరాధాన్ని తొలగించుకున్నది. నన్ను తీసుకోకుండ, అడవికి వెళ్ళుతున్నావు, అప్పుడు లోకం, రామునిలో గొప్ప తేజస్సు లేదు అని అజ్ఞానంతో, అవివేకంతో అనబోతుంది గద. అది నేను సహించలేను అని సీత విచారంతో అన్నమాటలు అని తీర్థీయము.

సీతనిశ్చయం తెలుసుకున్న రాముడు, నీకు దుఃఖము కలిగించేదైతే స్వర్గాన్ని కూడ కోరుకోను, స్వయం భువునకు భయం లేనట్టు నాకు ఏ విషయంలోనూ ఎక్కడి నుండి భయంలేదు అంటాడు. స్వయంభువు అంటే, అందరి ఆయుష్యం, అదృష్టం వ్రాయను తుడిపేయను, కర్త అయిన బ్రహ్మకు వలె భయం లేదంటుంది తీర్థీయము. బ్రహ్మకు మధుకైటభులనుండి భయము కలిగింది గనుక 'నారాయణుడే' స్వయంభువంటుంది గోవిందరాజీయము

అర్ధశరీరమయిన సీత యొక్క వనగమనం కోరికను చాలా కష్టం మీద ఒప్పుకున్నాడు, నా కోరిక ఎట్లానో అని, ఎడబాటు దుఃఖాన్ని తాళజాలక లక్ష్మణుడు, తన కోరిక తీరడానికి సీతాశరణాగతి అమోఘోపాయమని

---

1. చూ.పుటలు – 51–57. రామాయణ తని శ్లోకి. ద్రావిడ వ్యాఖ్యాత. పెరియవాచ్చాంపిళ్ళై. తె.అనువాదము శ్రీచిలకపాటివేం. రామానుజశర్మ పు.ముద్రణము. శ్రీగోదాగ్రంథమాల ముసునూరు. కృష్ణాజిల్లా. 1979 అనేక సాంప్రదాయికార్థాలు వివరించడం జరిగినది.

భావించి, నాప్రార్థనను నీవు అంగీకరించి, పురుషకారయత్నంగా, నీవు అంగీకరింపజేయి శ్రీరామునితో అని అంటున్నాడు అని తీర్థీయము. గోవిందరాజీయం విపులంగా ఇలా వ్యాఖ్యానిస్తుంది – లక్ష్మణుడు తనూ వెంట వెళ్ళాలనే ప్రయోజనం గురించి, సీతద్వారా రాముని శరణు వేడుతున్నాడు. సీతాపురుషకారము దప్ప మరియొక్క ఉపాయం లేనివాడు, భ్రాత అనడం వదలిపెట్టరాని బాంధవ్యము కలవాడు కనుక శరణు బొందదగిన రాముని చరణములను పట్టుకొని, ఒత్తుతూ, శరణు జొచ్చాడు గట్టిగా అనడంతో లక్ష్మణునికి గల అచంచలవిశ్వాసము చెప్పడం జరిగింది, అతికీర్తిమంతుడనడంతో శరణాగతికి అనుకూలసంకల్పము గలవాడు, ప్రతికూల సంకల్ప వర్జితుడు అని సూచితము. మొదట సీతను పురుషకారము ఒప్పుకొని చెప్పాడు. తరువాత ఆ పురుషకార సహాయంతో, గురుతరవ్రతయుక్తుడయిన (శరణాగతి పొందిన వానిని వదలను ఇది వ్రతము అని ప్రతిజ్ఞ చేసినవాడు రాముడు) రామునితో, శరణాగతియే సర్వఫలప్రదం కనుక, స్వాభిమత ఫలమును విన్నవించాడు. 31వ సర్గలో రెండవ శ్లోకములో 'నిపీడ్య' వరకు ద్వయమంత్రములోని పూర్వ ఖండములోని శరణాగతి చెప్పబడినది. 'శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే' అనే భాగము అన్నమాట. 'రాఘవమువాచ' అనే దానితో 'శ్రీమతే నారాయణాయ నమః' అనేది చెప్పబడింది. లేదా 'సర్వ..... శరణం వ్రజ' మొదటి ఖండం, 'మోక్షయిష్యామి మా శుచః' అనేది రెండవ ఖండము కావచ్చును. సీతతో చెప్పాడు అన్నప్పుడు పురుషకారపరిగ్రహము రెండు చోట్ల చెప్పబడింది. "రాఘవమువాచ సీతామువాచ", అని. తదుపరి లక్ష్మణుడు సర్వదేశ సర్వకాల సర్వావస్థోచితమైన సర్వవిధ కైంకర్యం చేస్తానని ప్రార్థిస్తాడు. నీసేవ లేనట్టి మోక్షమైనా నాకు వద్దు, కోరను. పరమపద ప్రాప్తిని కోరను. త్రిలోకాధిపత్యమూ వేడను. కైవల్యమునూ ప్రార్థించను. దేవత్వం ఇంద్రత్వమునూ కోరను అని అర్థము చెప్పడం బాగులేదు. ఇదంతా గోవిందరాజీయమే. తీర్థీయంలో లేదు. ఇదే సందర్భంలో శేషత్వాన్ని, కైంకర్యాన్ని వివరిస్తుంది గోవిందరాజీయం.

ఓరామా! నన్ను దాసునిగా చేయదగు సేవ కలవానినిగా చేసుకో! సేవకునిగా స్వీకరింపుము! కురుష్వ అను ఆత్మనేపదప్రయోగముతో నీకే ప్రయోజనము, ఫలము కలుగుతుంది అని తెలుపనయినది. ఇక నన్ను సేవకునిగా చేసుకోవడంలో వైధర్మ్యం – నేను సేవకుడను, నీవు సేవ్యుడవు (సేవింపదగిన వాడవు) అను దానికి ఏమి వైరుధ్యము లేదనుట. నీవు స్వామివి, ప్రభుడవు, యజమానివి గనుక సేవ్యధర్మము నీలో చాలా ఉన్నది. నేను స్వాభావిక "శేషుడను" గాబట్టి నాలో సేవకధర్మం సహజంగనే ఉన్నదిగద? ఇలా వెంట వచ్చినందువలన, రావడానికి ఏమి ప్రయోజనమున్నది? అంటావేమో! ఏ శ్రమ లేకుండ నీకు ఫలమూలాద్యాహారము సిద్ధిస్తుంది. మీసేవాభాగ్యము గలిగినందున నాజన్మ ధన్యమౌతుంది. లేదా – సహజముగ సేవకుడనైన నన్ను నీసేవకునిగ చేసి స్వరూపాను రూపశేషవృత్తి గలవానిని చేయుము. నా యందు ఎట్టి వైధర్మ్యం సేవక వృత్తికి భిన్నమైన ఆచరణ ఏమీలేదు. దీనితో (లక్ష్మణుని) శేషత్వము సేవకత్వము స్వాభావికము అనియు. అట్టి జ్ఞానవంతులకు, కైంకర్యమే ఫలమనియు చెప్పనైనది. కైంకర్యం చేయకపోతే ఏమి నష్టం నీకు? ఏమి సేవచేయనివాడు సేవకుడెట్లా అవుతాడు? సేవచేసితేనే నాకు కృతార్థత కలుగుతుంది లేకున్న లేదు. ఈ కైంకర్యంతో, నీకే ప్రయోజనము. నీకేమో పరార్థకైంకర్యమే పురుషార్థము. "శేషత్వ అధ్యవసాయము" నేను సేవకుడను, అను దృఢనిశ్చయము, అనునదే "ఉపాయము", భగవంతుని పొందుటకు చేరుటకు మార్గము, సాధనము ఇక ఏమి ఫలం కోరకుండ శేషి (యజమాని, ప్రభువు,

సేవ్యుడు, భగవంతుడు) యొక్క కైంకర్యమే "ఉపేయము" పొందదగినది అని ఉపాయోపేయముల గురించి విస్పష్టముగా, నిష్కర్ష, లక్ష్మణశరణాగతితో చేయడం జరిగినదని పరమరహస్యము. "అన్న తండ్రితో సమానం, మన ఇద్దరికీ శ్రేయస్కరము ఇది అను విషయం కృతార్థపదముతో తెలుస్తున్నదని కొందరి వ్యాఖ్యానమని రామానుజీయము. ఇక కైంకర్యం వలన తనకు కృతార్థత ఎట్లాగ? ధనుస్సు, గొడ్డలి, గడ్డపార తీసుకొని వెంటవెళుతూ క్రూర మృగాల బారినుండి కాపాడుతూ, కందమూలాదులు ఇచ్చి, ఆకలి దప్పులు తీరుస్తూ తోవలో సేవచేస్తాను. నీవేమో సీతామతల్లితో గూడి, కొండకోనల్లో విహరించవచ్చును. ఎల్లవేళల, మెలుకువతోనున్నప్పుడు గానీ, నిదురిస్తుండగ గానీ, కాపలాగాస్తూ సేవచేస్తాను. దేవితో గూడిన శేషి యొక్క (భగవంతుడు, యజమాని, ప్రభువు) అన్ని చోట్ల, అన్ని సమయాల, అన్ని పరిస్థితుల, అన్ని విధముల కైంకర్యాన్ని శేషుడు అయినవాడు (సేవకుడు, అనుచరుడు, దాసుడు, జీవాత్మ) చేయవలయునని కర్తవ్యమని చూపబడినది.

తీర్థీయం చాలా క్లుప్తంగా. నేను నీవెంట వచ్చినంత మాత్రాన నీవు ఆనతిచ్చిన తల్లిపోషణ దాటటం అనే అధర్మం ఏం కలగదు, ఆమెకు చాలా ఉపజీవనం. జీవించుటకు అవసరమైన ధనము, పరిజనము ఉన్నది. లక్ష్మణుడు రాత్రి నిద్ర పోకుండా ఉండేవాడని 'స్వతః' అను దానివల్ల తెలుస్తుంది" వ్యాఖ్యానిస్తుంది.

లక్ష్మణుని ప్రార్థనను మన్నించి రాముడు, లక్ష్మణ! సరే వత్తువు గానీ! జనకుడు యజ్ఞసమయంలో వరుణుడు మనకిచ్చిన విల్లులను మనము, పూజించి ఆచార్యుని ఇంటిలో పెట్టిన వాటిని తీసికొని వేగిరం రావలసింది అంటాడు. బాలకాండలో చెప్పని ఈ సంగతి, ఇప్పుడు చెప్పినందువలన, ఇచ్చినట్టు అవుతుంది. సుందరకాండలో రాముడు ఈ మణిబంధము పెళ్ళిలో మా మామగారిచ్చారంటాడు! ఈ విషయం గూడ బాలకాండలో లేదు. అయోధ్యాకాండలో చెప్పని 'కాకి కథ' సుందరకాండలో చెప్తుతాడు. ఇట్లా చాలా విషయాలు మొదట చెప్పక తర్వాత చెప్పిన వాటిని గోవిందరాజీయము ఏకరువు పెడుతుంది.

కాని తీర్థీయం ఈ ప్రకరణంలో "ఇది వాల్మీకి భగవానుని చెప్పే విధానం. శైలీ ప్రస్తుతార్థ ప్రతిపాదన పారవశ్యం చేత, ఎక్కడో చెప్పవలసిన దానిని, చెప్పని దానిని తరువాత, ఏదో నెపంతో, పూర్వం జరిగినట్టు, చెప్పినట్టు, మళ్ళీ చెప్తుతాడు. పైమణి బంధము సుందరకాండలో చెప్పడం, అయోధ్యకాండలో చెప్పాల్సిన కాకాసుర వృత్తాంతాన్ని సుందరకాండలో చెప్పడం మొదలయినది" అని వాల్మీకిశైలీ వైచిత్ర్యాన్ని, వైశిష్ట్యాన్ని స్పష్టపరుస్తుంది. విషయాన్ని చెప్పాల్సిన చోట చెప్పక తర్వాత ఏదో నెపంతో, పూర్వమే జరిగినట్టు చెప్పడం ఒక శైలి.

32వ సర్గలో సీతాలక్ష్మణులతో కలిసి అడవికి పోవడం నిశ్చయమైన రాముడు 'యాత్రాదానము' చేయడం కవి వర్ణిస్తున్నాడు అని గోవిందరాజీయము. మోచేతికి పైన దాల్చేవి బాహుభూషణములు అంగదములు. తెలుగులో దండకడియములు. ఇక కేయూరములు అంటే భుజము నుండి శిరస్సు దాకా వ్యాపించే పాము ఆకారం వంటి శిఖరములు కొనలు గలిగిన బాహుభూషణములు. తెలుగులో కడియములు అని గోవిందరాజీయము. ఇక తీర్థీయము ప్రకారం. ఎత్తయిన ఆకారము కలిగి ఆకులు తీగలతో చిత్రితమయి బాహుమూలములో ధరించునది. కేయూరం-దాని కింద ధరించే వలయాకారభూషణము. గోవిందరాజీయం ఓమాట అంటుంది అంగదములు పెద్దవి, కేయూరములు చిన్నవి అయినా కావచ్చును.

తండ్రి దగ్గర అనుజ్ఞ ముందే తీసుకున్నప్పటికి, సీతాలక్ష్మణుల అనుజ్ఞకై రాముడు మళ్ళీ దశరథ సమీపమునకు వెళ్ళుతున్నాడని 33వ సర్గ వ్యాఖ్యానమును ఆరంభిస్తుంది గోవిందరాజీయము. ప్రాసాదము అనగా దేవతల యొక్క, రాజుల యొక్క ఆవాసము. హర్మ్యము అనగా ధనవంతుల మందిరములు.

త్వగ్దాహోత్పాదకము శోకము. అనగా శరీరానికి, చర్మానికి మంట పుట్టించేది. దుఃఖమేమో లోన వ్యథను కలిగించేది అని. రెండిటి స్వరూపంలో భేదము అని గోవిందరాజీయము. తీర్థీయము దీన్నే చెప్పింది.

సుమంత్రునికి కైకేయిపైన కోపాన్ని (అనుభావాన్ని – అనగా శరీరముతో మాటలతో చూపునది అను భావము. దీనికే సాత్త్వికభావమని రూపక పరిభాషలో పేరు) కవి వర్ణిస్తున్నాడీ 35వ సర్గలో అని గోవిందరాజీయము ఆరంభిస్తుంది.

కౌసల్య లోకరక్షణార్థం రాముణ్ణి కన్నట్టు, రామునియందు అనురక్తుడవయిన నిన్ను వనవాసం కొరకు (కన్నాను) పంపుతున్నాను. రాముడు వెళ్ళేప్పుడు జాగరూకుడవయి ఉండు. అశ్రద్ధ చేయవలదు. రామగమన సౌందర్యంచే ఆకర్షితుడవయి రక్షణకర్మలో అశ్రద్ధ వహించకు లేదా రాముడు అడవికి వెళ్ళుతుండగా నీవిక్కడే ఉండకుము అని భావం. నీవు ఏమి అపేక్షలేకుండగనే రామచరణాసక్తుడవు, నేను ప్రత్యేకంగా నీకు చెప్పాలా, సేవచేయమని. దాస్యం చేయడంలో నీవు శేషుని వంటివాడవు. రామునితో అడవికి వెళ్ళినట్టైతే, నాకు నీవు పుట్టిన ప్రయోజనం నెరవేరినట్టే. కేవలం మిత్రులయందే మంచి అనురాగం కలవాడవంటే, అందరికీ ఉపజీవ్యుడైన రాముని యందు అనురక్తుడవు కమ్మని వేరే చెప్పాలనా నీకు? లేదా సుహృజ్జనుడైన రాముని యందు నీకు చాలా ప్రీతి ఉందిగద! వెంట వెళ్ళుమని ఇప్పుడు నీకు నేను చెప్పవలెనా? అయినా కొంత జాగ్రత్త చెప్పాలి. రాముని విషయంలో ఎట్టి అజాగ్రత్త, అనవధానత కూడదు సుమా! రాముని నడకలోని గాంభీర్యానికి దృష్టి మరలి, రాముని రక్షణము గురించి ఏమరకుము. ఇదే ధర్మము కూడ. పెద్దన్న, కష్టాల్లో ఉన్నా, సుఖాల్లో ఉన్నా, తమ్ముడు అతడి అధీనంలో ఉండాలి. ఈ వంశంవారి ఆచారం గూడ ఇదే. దానం చేయడం, యాగాలు చేయడం, యుద్ధాల్లో జయించడం. లేదా తనువును వదలడం. తను త్యాగంతోనయినా సరే రాముణ్ణి కాపాడవలసినది. అతణ్ణి వెళ్ళు వెళ్ళు అని పురమాయిస్తూ, అడవిలో ఉండగా తల్లిదండ్రుల మీద ఇంటి మీద బెంగపెట్టు కోవద్దని అడవిలోనే తల్లి దండ్రులను, నగరమును చూసుకొమ్మని చెపుతున్నది సుమిత్ర సౌమిత్రితో. ఇది గోవిందరాజీయము. ఈ నలుబదవ సర్గలోని తొమ్మిదవ శ్లోకానికి అనేక విధములు వివరణము ఇచ్చినవి వ్యాఖ్యానములు.

తీర్థీయము – వనవాస సమయంలో మనసు, అయోధ్య మీదకు, తల్లిదండ్రుల మీదకు, గుంజుతుంది, దాని స్థిరత్వానికి అడవిలోనే వీటిని ఎట్లా అనుకోవచ్చో తెలుపుతున్నది. 1. రాముని తండ్రిలాగా అనుకో! సీతమ్మను అమ్మ అని భావించు! అడవినే అయోధ్య అని తలచుము! స్థిరంగా ఉండు! సుఖంగా వెళ్ళుము! 2. లేదా రాముని. విష్ణువుగా ఎంచుకొమ్ము, సీతమ్మను లక్ష్మీదేవిగా భావించుము, అడవిని విష్ణుపురి. వైకుంఠం అని తలచుకొనుము. 3. లేక, దశరథుని పోయినవానిగా భావించుము, భర్తలేనందున, నన్ను నాతండ్రి ఇంట ఉన్నదానినిగా ఎంచుము, రామునితో బాటు అందరు వెళ్ళిపోయి అయోధ్య అడవి అయిపోతుందని అనుకొనుము. 4. ఇంక– రాముని గుర్తించు, దశరథుని గుర్తించు. ఎవరికి సేవ చేయాల్నా బాగా గమనించుము, ఎవరి వెంట ఉండాలో నిర్ణయించుకో!

ఐహిక సుఖ రాజ్యభోగములకు నెలవయిన అయోధ్యను, పారలౌకిక జ్యేష్ఠానువర్తన ధర్మమునకు తావైన అడవిని, బాగుగా తెలుసుకొని రెండింటిలో గొప్పదాన్ని ఎన్నుకో! శ్లోకాల్లో ముందు వెనుకల గురించి. రామం.......... తర్వాత లక్ష్మణం త్వేవ ముక్త్వా అని. 8,9 కాని మూలంలో లక్ష్మణం..... రామం.......అని ఉన్నది.

తిలకం మనశ్చాంచల్యం కూడదని ధ్వనితము. రాముని తండ్రిని సేవించినట్లు సేవించడం, సీతయందు మాతృవద్భావము, అడవిని అయోధ్య అనుకోవడం. దానితో జంతువులు ఎట్టి ఉద్వేగాన్ని కలిగించవు అనే భావన వస్తుంది, అని దీనిలో గూడ లక్ష్మణం..... రామం దశ.... వరుసనే.

గోవిందరాజీయం – దీనిలో మొదట లక్ష్మణ అనే శ్లోకం, పిదప రామం,అను శ్లోకము. 1. ముఖ్యార్థమే 2. దశః గరుడుడు రథముగా గల విష్ణువు పేరు గల వైకుంఠముగా అనుకొనుము. 3. ఇద్దరిని తెలుసుకో, తారతమ్యం గుర్తెరుగు. మా ఇద్దరి గురించి విచారించు, నాకంటె సీతనే నీకు హితపరురాలు, ఈ నగరం కంటే, సేవకు ఎట్టి ఆటంకములు లేని అడవే ఉత్కృష్టమనీ అనుకొనుము. 4. లేదా దశరథుని గతించినవానిగా, నన్ను (తండ్రి) తల్లిగారింట్లో ఉన్న దానినిగా, అయోధ్యవలె అడవి నిర్జనమయిపోతుందని తెలుసుకో, ఈ విధంగా ఇతర తాత్పర్యాలు ఊహించుకోవాలి. ఇది తనిశ్లోకీ 5. ఆత్మకు శరీరము ఒక ఉపాధి, నిజము ఆత్మనే. అలాగే తండ్రి ఓ ఉపాధి, నిజమయిన తండ్రి ఆ పరమాత్ముడే. కనుక సోపాధిక జనకుడయిన దశరథుని యందు అతిస్నేహాన్ని వదలిపెట్టి, నిరుపాధిక జనకుడైన రాముని యందే ప్రీతిని గలిగియుండు! అలాగే నామీద కాకుండ సీతపై భక్తి శ్రద్ధలతో మెలగుము, అట్లాగే రాముడు నివసించుటచే, నిరుపాధికముగా పొందదగిన వనముపై ప్రీతిని వహించు.

6. ఇది సామాన్యార్థమే. పెద్దన్నను తండ్రిగా, వదినను తల్లిగా, అయోధ్యవంటిదిగా అడవిని భావించుకొనుము.

7. దశరథునితో పోలు గుణములు గలవానిగా రాముని, నన్ను వలె సీతను సేవింపదగిన యామెనుగా, రమణీయ వస్తు సంపన్నమైన అడవిని అయోధ్యను వలే భోగ్యమైనది (అనుభవింప దగినవి దానిని) గా తలచుము.

8. దశరథుని వలె స్త్రీవశునిగా, రాముని తెలుసుకొనుము (ఈ విషయం బంగారు జింక వెంట వెళ్ళేప్పుడు తెలుస్తుంది) ఇప్పుడు నేను, నిన్ను రాముని వెంట వెళ్ళు వెళ్ళు అంటున్నట్లు, అనే దానినిగా సీతను గుర్తెరుగుము, అడవిలో అడవిని వదలి ఎక్కడికి వెళ్ళినా జాగరూకతతో ఉండుము.

9. దశరథుని వలె రాముని అతిశూరునిగా తెలుసుకో (దేవాసుర యుద్ధంలో దశరథుని శౌర్యం ప్రసిద్ధమే గద!) నేను భర్తవిజయాన్ని అభినందించినట్టు సీత అభినందిస్తుంది కనుక ఆమెను నన్నుగా తలంచు, క్రూరమృగాలతో నిండిన అడవిగా అయోధ్యను భావించు.

10. దశరథుడు రాముని ఎడబాటును సహింపలేనట్టు, రాముడు నీఎడబాటును సైచలేడు,నేను నీ ఎడబాటును ఓర్వలేనట్టు సీత ఓర్వలేదు, రాముని ఎడబాటుతో అయోధ్య మనుష్యులు లేనిదై ఎలా అవస్థ పాలవుతుందో, అడవికూడ అలా చెట్లు మోడుబారడం ఎండిపోవడంలాంటి అవస్థలను పొందుతుంది. రాముని దశరథునిగా, నన్ను సీతనుగా అడవిని అయోధ్యనుగా భావించుము.

11. దశరథుడు సమ్రాట్టు అయినట్టు రాముడవుతాడని తెలుసుకో, నేను పట్టమహిషి అయినట్టు సీత గూడ అవుతుంది, అడవిలాగ అయోధ్య మూడుపువ్వులూ ఆరుకాయలుగా అభివృద్ధి చెందుతుంది.

12. రాముని కేవలం పదాతి, పాదచారి అనుకోకు. దశరథుని వలె, పది దిక్కులలో పుష్పకాది బహురథ సంచారిగా తెలుసుకొమ్ము. దేవాసురాది యుద్ధాల్లో నేను దశరథునితో తిరిగినట్లు తిరిగేదానినిగా సీతను తలచుము, ఇప్పుడు అడవిలో ఎట్లా తిరుగుతాడో, తర్వాత అయోధ్యలో గూడ నిత్యం తిరుగుతాడు.

13. నాకు మహారాజుపై పితృత్వబుద్ధి లేదు, నాకు అన్న, యజమాని, బంధువు అన్నీ రాముడే అని అన్నట్లు తండ్రి యందు అవమాన బుద్ధిని విడనాడి రామునికి దశరథునిపై ఉన్న పితృత్వబుద్ధి ననుసరించైనా, అట్టి బుద్ధిని కలిగి ఉండుము. దశరథుడు పెళ్ళి చేసుకున్నాడను దోషబుద్ధిని మనసులో తలచక, రాముని మారుటి తల్లి అనే గౌరవంతోనయినా, నాపై సీత మీద చూపినట్టు మాతృత్వబుద్ధిని కలిగియుండుము. రాముడు నడచినది అయోధ్య అన్నట్లుగా భావించు,గాని చిన్న చూపు అయోధ్యపైకూడదు. రాముని పాదుకలు ఉంటాయి కనుక అయోధ్యకూడ ప్రాప్యమే అని తలచాలి.

14. రాముని, గరుడరథునిగా, విష్ణువుగా, సీతను లక్ష్మిగా, అడవిని పరమ పదముగా తలచుము.

15. రామ దశరథుల ఇద్దరిలో ఎవరిని అనుసరించాల్నో బాగా వివేచించి చూడు. దాసీజనముతో గూడిన నన్ను, దాసీజనము లేని సీతను బాగా గమనించి ఎవరిని సేవించాల్నో నిర్ణయించుకో. దృష్ట ఫలముగల అయోధ్యను, రాముని సేవించుటచే (మోక్షరూప) అదృష్ట ఫలమును ఇయ్యబోయే అడవిని బాగా గమనించుము. ఇట్లా చాలా రెట్లు లాభం కలుగబోతుండగా తాత్కాలికంగా 'అడవిలో నివసించడము' అనే దానిని దుఃఖంగా భావించనే గూడదు. రాముడు ఏ దోవలో పోతే నీవు ఆ తోవనే, వెళ్ళు, కైంకర్యమును, సేవను చేయుము. పరమ పదంలో 'సామము పాడుతూ ఉంటాడు' అన్నట్టు ఒకచోటనే ఉండకుము. వెంట వెంటపోతూ సేవించుము భగవంతుని సేవ చేయబోతున్నాడను గౌరవముతో తాత! అని పిలచినది. నీ తల్లినయిన నేను, కైకేయిగాని అపకీర్తి పొందనట్లు నన్ను తరింపజేయుము.

41వ సర్గలో తిలకం 5వ శ్లోకం వ్యాఖ్యానిస్తూ "జగత్తును కాపాడువాడు అయినప్పుడు, ఈ జనమును కాపాడువాడని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని ఏమిటి? అని భగవత్స్వరూపము తెలిసిన ఒకామె మాటలు" అంటుంది, రాముని వనవాసదుఃఖముతో సూర్యుడు నిస్తేజస్కుడు అయ్యాడు. అహస్సు మిగిలి ఉన్నప్పటికినీ ఏనుగులు తాము తినేదాన్ని వదలిపెట్టాయి. ఆవులు దూడలకు పాలు చేపలేదు, మొదటి కొడుకు గల్గిన తల్లి కూడ సంతోష పడలేదు. ఇవి అన్ని వ్యాఖ్యలలో సమమే. ఒక విశేషము తీర్థీయములో "రాముడు అందరి (ఆత్మల) కి కూడ ఆత్మ అయినవాడు, అతనికి దుఃఖము కలిగితే ప్రతివాడికి (దానికి) దుఃఖము కలుగుతుంది, అందుకే రామాయణంలో ప్రతిపాదితమయినదంతయు వాస్తవమనియే తెలుసుకొనవలెను" అనునది.

అంగారకుడు, బుధుడు, బృహస్పతి దారుణంగా కలిసిపోయారు. త్రిశంకువు గ్రహం కాకున్న, ఇక్ష్వాకు కుల కూటస్థుడు కనుక, ఛత్రిన్యాయముతో చెప్పాడు (ఓ పదుగురు వెళ్ళుతుంటే వారికి అనగా ఎనిమిది తొమ్మిది

మందికే ఛత్రాలు ఉండి ఒకరిద్దరికి లేకపోయినా అలా "గొడుగులు పట్టుకున్న వారు వెళుతున్నారని"). ఇచట గోవిందరాజీయము జ్యోతిషవిషయం వివరిస్తుంది. అభిషేకం, పంచమినాడు గద! ఆనాడు పుష్యయోగం కూడ జరుగబోతుందన్నాడు, అదేనాడు అడవికి బయలుదేరాడు మరి అది చెడురోజు ఎట్లయింది? చంద్రుడు కర్కాటకంలో ఉండగా బుధుడు ఎట్లా కలిసి ఉంటాడు అతనితో అని ప్రశ్న? ఎందుకంటే బుధుడు సూర్యునికి దగ్గరగా ఉంటాడు అప్పుడు జవాబు ప్రాప్తి అనే పదానికి ఒక రాశిలోనే ఉండటం అర్థం కాదు, దృష్టి అని కూడ అర్థం, ఇక్కడ దృష్టి అని అర్థం కనుక తప్పు లేదు. వక్రగతితో సమాగమము అని చెప్పారు.

42వ సర్గలో తిలకం 13వ శ్లోక వ్యాఖ్యానంలో 'కతకః' అను వ్యాఖ్యాతను పేర్కొంటుంది. రాముని సాగనంపి వచ్చేప్పుడు, దశరథుడు అపస్నాతుడు సూతికాగృహంప్రవేశించినట్లు దశరథుడు పురంలోనికి వచ్చాడు అని వర్ణించడం ఏమన్నా బాగున్నదా? అశ్లీలముగా అశుభముగా లేదా? అని గోవిందరాజీయము ప్రశ్నించుకొని ఇలా జవాబు చెబుతుంది. సాగనంపేప్పుడు దశరథుడు రామలక్ష్మణులు ఎట్లున్నా, సీతకు చాలా భయం వేస్తుంది అని సీతకు జరుగబోయే విపత్తిని శంకించుకున్నాడు. దాని ద్వారా రాముని విపత్తిని, దానితో తన మరణాన్ని కూడ శంకించుకున్నాడు. అందుకే సీతావిపత్తి ద్వారా రామవిపత్తి శంకతో కైకేయిని కోరిక తీరిన దానవు కమ్మన్నాడు, తన నాశంతో 'విధవ' రాజ్యం చేయు అని చెప్పాడు కనుక, రాజు బుద్ధి అనుసారం ఇది అశ్లీలమూ కాదు అశుభకరమూ కాదు ఓచోట తీర్థీయం 'అంతాః' అంటే మధ్యలోని ప్రదేశము అంటుంది.

ఇదే సర్గలోని 34వ శ్లోకానికి గోవిందరాజీయ వ్యాఖ్యానము చాలా విస్తరంగా ఉన్నది.

రాముని వెంట వెళ్ళిన, నాచూపు తిరిగిరాలేదు. సముద్రంలో కలిసినది (సముద్రం లాక్కున్నది) వెనక్కు వస్తుందా? అరవై వేల ఏళ్ళు ఉపవాసాదికం చేసి పొందిన రాముని పొందినది. దృష్టి అట్టివాణ్ణి చూడలేకున్నా అతని తల్లినైనా చూడవచ్చు గదా, కౌసల్య నీముఖం చూడాలనుంది. అది కూడ కుదరడంలేదు. కళ్ళు పన్జేయడం లేదు. సరే ఓ కౌసల్య నన్ను చేతితో తాకు! పనులు జరుగుతుంటేనే ఇంద్రియాలు ఉన్నాయని తెలుసుకోవస్తుంది (అనుమాన ప్రమాణంతో) కనబడనందున చక్షురింద్రియం పోయిందని తెలిసిందన్న మాట బాగుంది, కైకేయి చెప్పితే రాముణ్ణి అడవికి పంపి, ఇప్పుడేదో, నటిస్తున్నాడని అనుకునేవు సుమ! తెలియక ఈయన ఇలా చేశాడని, మనస్ఫూర్తిగా స్పృశించు! లేదా నన్ను నీచేతితో, రాముని తల్లివి గనుక నీ చేతి స్పర్శ రాముని స్పర్శ వంటిది అని భావము. పంచేంద్రియములకు ప్రత్యేకంగా రామునకు సేవచేయడం అనే శేషత్వం చెప్పటం జరిగింది. ఇక్కడ రాముడు గుణములకు సముద్రుడుగా చెప్పబడినాడు. గాంభీర్యంలో సముద్రం వంటివాడు రాముడు. సముద్రం గ్రహించింది మళ్ళీ తిరిగి వస్తుందా? లేదా నాచూపు రాముని వెంటనంటి పోయింది. చేతనాచేతనములన్నిటినీ ఆనందింపజేసే గుణం గలవాడు కనుకనే రాముడు రమింప జేయువారిలో మొదటివాడు. రూపాన్ని కళ్ళు గ్రహిస్తాయి గద! ఇక్కడ రామునియందు రూపాన్ని తెలుసుకునేది చక్షువే, పదార్థము వెనక వెళ్ళి ఆ పదార్థాన్ని గ్రహిస్తుంది. చేతనము చేయవలసిన పనిని అచేతనము చేస్తున్నది. పరమపదంలో చేయవలసిన, "వెంటనంటి పోవుట" అను దానిని సంసారచక్రంలో రాముని గూర్చి చేయడమన్న మాట లేదా దేవతలది మరియు మనుష్యులదీను. దేవమనుష్యాది దృష్టి వంటివాడు రాముడు, ముందు వెళుతున్నాడు. ఇక నేను ఇక్కడ ఉంటానా అంటూ వెంట

పోయినది. లేదా దృశిర్ ప్రేక్షణే అను ధాతువు నుండి ఏర్పడినది "దృష్టి" ఇది సారము ఇది అసారము అను వింగడించే వివేకం గల్గినది. రాముని వెంటపోయినది నాకు హితం జేసే దృష్టి తనకు హితాన్ని చేసుకోదా? అస్వతంత్రమైన నా దృష్టి ఎట్లా స్వతంత్రించి పని చేసినది శేషమునకు సేవ చేయడానికి శేషికి యజమానికి బాగా సేవచేయడమే తగినట్టిది లేదా నాచూపు, చాలా కాలంనుండి నాకు తెలిసిన, నాచూపు నన్నొదిలి రాముని వెంట అభిసారిక వలె వెళ్ళినది అని సమాధానము, లేదా నాదృష్టి కనుక ఇట్లా చేసింది, కైకేయీ మంథర మొదలైన వారిదైతే ఇట్లా చెయ్యదుగద. ఆయన్ను చూస్తూ సంతోషిస్తుంటాను అని చిరపరిచయం సంపాదించుకున్నాను, లేదా నాచూపు, అన్ని విషయాల్లో చపలుడయినట్టి నాయొక్క చూపు చాపల్యాన్ని పొందడం లేదు, వెళ్ళిపోయినట్టి దృష్టిని ఇంకా నాచూపు అని అనురాగాన్ని చూపుతున్నాను. తల్లిని వదలి భర్తవెంట పోయే కూతురును ఇంకా నాకూతురు అని అనుకున్నట్లు నా ఇంద్రియం అయితే నా వెంటనే ఉండాల్సినది, ఇతరుల వెంట ఎలా వెళుతుంది? ఆ ఇంద్రియం తనపదార్థము వెంటపోయింది, అది తప్పుగాదంటారేమో. ఇంకా నాదగ్గరికి తిరికి రావడంలేదు. రాముడు దాటి పోయినా కనబడకుండా పోయినా తిరిగి రావడంలేదు. కైకేయి ముఖాన్ని చూడాల్సొస్తుందని సిగ్గుతోనా ఏం? రావడం లేదు. లేదా (పరమాత్ముని పొందిన తర్వాత) మరల తిరిగిరాదు అన్నట్లు వెళ్ళినదా? రాకపోవడానికి యుక్తి చెప్పుతున్నాడు. నేను చూడను నిన్ను అని చెప్పాను గదా! వస్తే చూడాల్సి వస్తుంది. ఎదురుగా ఉన్నా నిన్ను చూడలేకున్నాను అని తల్లివయిన నీ ముఖం చూద్దామన్నా ఆకోరిక తీరలేదు. రాముని యందు లగ్నమయిన చూపు ఇతరులను తాకుతుందా? కళ్ళు కనబడకుండా పోయినను, మాటతో బ్రతికే ఉన్నాను అని, కౌసల్యా నన్నుతాకు అన్నాడు. రాముడు అభిషిక్తుడయితే నేను చచ్చినట్టే అన్న కైకేయికి పూర్తి విరుద్ధమయిన దానవు. రాముడు అడవికి వెళితే నాకు చావుతప్పదు అని లోకపాలకుని కన్నట్టి దానివి, నోములు వ్రతాలు చాలా చేసి లోకసంరక్షణార్థం కన్నావు, అది నీకు దుఃఖాన్ని కలిగించేది అయింది గద, లేదా కౌసల్య నిన్ను చూడలేకపోతున్నాను. చెడుచేసిన కైకేయిని చూస్తున్న చూపు ఆ దుఃఖంపోవడానికై నిన్ను చూడగోరుతున్నది. రామునితో ఎడబాటుతో కుంగిపోతున్న దానికి, దశరథునితో ఎడబాటు జరుగుబోతుంది అనే భయంతో దగ్గరకు వచ్చిన కౌసల్యను సాధు అని పిలిచాడు. నామొత్తం క్లేశం తొలగడానికై చేతితో నన్ను తడిమి, ఓదార్చుము. నీవు నాకు కనబడనందున నాచూపు పోయిందని నిర్ధారించుకున్నాను. నీ మాట వినవస్తుంది గనుక చెవులు వినబడుతున్నాయి అనుకుంటున్నాను. కౌసల్యా! అని పిలుస్తున్నందున మాట పడిపోలేదు అని నిశ్చయమే. వాసన గుర్తుపడుతులేనందున, నా ముక్కు (ఘ్రాణేంద్రియం) రాముని మూర్కొన పోయిందని పక్కా నిశ్చయము. గొప్పదానిని పొందినందువలన, ఇతర విషయములను పొందడం అతితుచ్ఛము గనుక తాకిడి జ్ఞానము (స్పర్శేంద్రియం) ఉన్నదా పోయిందా తెలుసుకోవాల్సి ఉంది. ఇది ఎట్లా ఉందంటే దొంగ ఇంటిని కొల్లగొట్టి పోయాక యజమాని చీకట్లో ఆయా వస్తువులను చేతితో తాకుతూ పెళ్ళాం పిల్లలను అడుగుతున్నాడు అది ఉందా ఇది ఉందా? ఇది పోయిందా అది పోయిందా అని. బాగా తాకు(శరీర) ప్రకృతికి చెందిన కాలుష్యం స్థిరమైనది కాదు. గట్టిగా ముట్టు అసహ్యపడకుండ, అగ్నిసాక్షిగా చేతిని తాకినట్టు తాకు. ప్రీతిపూర్వకముగా రాముని స్పర్శ ఉంటే జీవితం, రాముని స్పృశించ లేకుంటే చావు అన్నట్లున్న నన్ను, రాముని ప్రతినిధిగా (బదులుగా) అతని తల్లివైన నీవు నన్ను స్పృశించుము. భగవత్స్పర్శ లేకున్న, తత్సంబంధీకుల స్పర్శతోనైనా జీవించవచ్చును. ఇట్లా,

దశరథుడు, కౌసల్యకు శ్రీరాముని యందు పరత్వజ్ఞానము (అందరి కన్న అధికుడు, విష్ణువు) జన్మాంతర పుణ్యవశము చేత కలిగినదా? అని ప్రశ్నించుకొని ఋషియే దశరథాదుల మాటల ద్వారా మరల మరల, రాముని పరమాత్మగా చెప్పుతున్నాడు అనునది సంప్రదాయము, అని సమాధానము ఇస్తుంది గోవిందరాజీయవ్యాఖ్యానము.

ఇక తీర్థీయము. నా దృష్టి నేటికీ తిరిగి వస్తులేదు. ఎందుకు? రాముని వెంటపోయింది కదా? "చిద్రూపుడైన, అనంత సత్యానందుని యందు యోగులు క్రీడించుచున్నందున రామపదము నిష్పన్నము. రామపదముతో పరబ్రహ్మయే చెప్పబడుతున్నాడు" అని శ్రుతివాక్యము. కనుక ఇప్పటికీ రావడంలేదని సంబంధము. అసలు భావము. చక్షువులకు కేవలము రామదర్శనభాగ్యం లభించినట్టు, సర్వేంద్రియములకు అట్టి భాగ్యం కలిగితే నాకన్న ధన్యుడు ఎవడు లేడు అని మనసులో బాగా అనుకొని, అన్ని ఇంద్రియాలకు ఆ భాగ్యాన్ని కోరుతూ మొదట మాటను పరీక్షించుకుంటూ, నన్ను తాకు! అని కౌసల్యతో అంటున్నాడు.

44వ సర్గ మొదట, సుమిత్ర ద్వారా శ్రీరాముని పరత్వాన్ని, సర్వాధిక్యమును తెలుపుతున్నాడు అని అంటుంది గోవిందరాజీయము. గత జన్మలలో చేసుకున్న పుణ్య విశేషము చేత తార, మండోదరులకు ఉన్నట్టుగా, సుమిత్రకు కూడ పరత్వ జ్ఞానము కలదని, సంప్రదాయము "చెప్పే వారిని బట్టి కలిగే ఒక ధ్వని" ఇక్కడ ఉన్నది. దానిని ఆలంకారికులు ఒప్పుకున్నారు కూడ. సత్పురుషులు ఆచరించే ధర్మం ఆచరిస్తున్న, పురుషోత్తము డయిన రాముని చూసి సంతోషించాలిగాని, ఇలా విచారించగూడదు. ఓ కౌసల్యా! అని సుమిత్ర ఓదార్చినది. అతడు వేదాంత వేద్యుడు. ఇతరులకులేని, ఎనలేని, అవధులులేని కళ్యాణ గుణములు గలవాడు. శ్రీపతి పురుషోత్తముడని నిఘంటువు "అతడు" అను విశేషణము దగ్గరగా చెప్పబడిన పురుషోత్తమునకు విశేషణము గనుక వేదాంతప్రసిద్ధిని ధ్వనింప జేస్తున్నది. పుత్రమాత్రుడు అనుకొని విలపించకు అని భావము. పురుషోత్తము దయితే కర్మకు ఎట్లా బద్ధుడు మరి? శిష్టులు ఆచరించిన దానిని, లోకానుగ్రహం కొరకు ఆచరిస్తున్నాడు. ఇది ఆముష్మిక ఫలకారణము. శ్రేష్ఠులు ఆచరించేది ఇతరులు ఆచరించే మార్గము చూపుతుంది. పితృవాక్య పరిపాలకుడయిన రాముని విషయంలో విచారము కూడనట్లు స్వ స్వ ధర్మములను పాటిస్తున్న, సీతా లక్ష్మణుల విషయములో గూడ, విచారం పనికి రాదు, సంతోషించాలి. రాముడు శేషి యజమాని, లక్ష్మణుడు, శేషుడు - దాసుడు శేష స్వరూపానుగుణకైంకర్యం కలగబోతున్నందున లక్ష్మణుని గూర్చి విచారమే వద్దు. అరణ్యవాసంలో ఉండే దుఃఖం తెలిసిగూడ, రాముని వెంటపోతున్న సీత 'స్త్రీలకు భర్తయే దైవం' అనుదానిని దృఢపరచునట్టి సీతను గురించి, సంతోషపడాలి గాని బాధపడవద్దు, అని ఓదార్చింది సుమిత్ర. ఈ సర్గలోని 4వ శ్లోకం 'వర్తతే' అని మొదలవుతుంది. ఇది గాయత్రీ మంత్రంలోని 5వ అక్షరం అని చెపుతుంది గోవిందరాజీయము. "తత్సవితుః వ" అని.

తీర్థీయములో ఇవే విశేషాలున్నాయి - రాముడు పరమాత్మ కాబట్టి, సూర్యునకు సూర్యుడు, అగ్నికి అగ్ని, ప్రభువునకు ప్రభువు, లక్ష్మికి లక్ష్మీత్వము గలిగించువాడు, కీర్తికి కీర్తి, భూమికి భూమి, దేవతలకు దేవుడు, ఇవన్ని వాస్తవమనియే తెలుసుకోవాలి అంటుంది.

గోవిందరాజీయమైతే పై వాటికి శ్రుతి వాక్యములను ప్రమాణముగా చూపెడుతుంది.

45వ సర్గలో, జ్ఞానంతో, వయసుతో, బ్రహ్మతేజస్సుతో వృద్ధులయినవారు సాష్టాంగప్రణామం చేసి, వనవాసం నుండి విరమించుకోవలసిందని రాముని ప్రార్థించారు. ఈ సందర్భంలో వృద్ధబ్రాహ్మణులు క్షత్రియ కుమారునికి ప్రణామము చేయడం, రాముని యందు వారికి గల "పరత్వబుద్ధితోనే" అని చెపుతుంది, గోవిందరాజీయము. "అందరికి అన్నిటికీ అంతరాత్మ అయినందున పశుపక్ష్యాదులకు, స్థావరములకు కూడ ఖేదము కలిగినది" అంటుంది. "ఆత్మకు వైపరీత్యము కలిగితే శరీరమునకు వ్యథ(తప్పదు గద)ను మనం చూస్తుంటాము" అని కూడ.

46వ సర్గలో రాముడు ప్రజలను "తప్పుదోవ పట్టించడానికై, ప్రజలు లేవకముందే బయలుదేరమని, మొదట కొంచెం దూరం ఉత్తరం ముఖంగా రథమును తోలి మళ్ళీ వెనక్కు తీసుకరావలసిందని చెపుతాడు. ప్రజలను వంచించడానికి ఇలా చేయమన్నాడు. నిజమయిన వ్యాఖ్యానంలాగ అంటే "ఆక్షేపములకు సమాధానము చెప్పడం" అనే అయిదవ లక్షణానుగుణంగా గోవిందరాజీయము ఇలా వివరించినది. దయగల రాముడు, తన ఎడబాటును ఓర్వలేనట్టి, తన యందే నిరతిశయప్రేమ గలిగినట్టి వారిని వంచించటం తగునా? అని ఆక్షేపించుకొని ఇది మోసగించడం కానే కాదు, ఒక గాయంకు చికిత్స చేసినట్లుగా (ఈ రోజుల్లో అయితే అనస్థిషియా ఇచ్చి తెలియకుండ చేసి కోసినట్లు) పౌరులకు తన వెంట ఉండే ఆనందంతో, ఉనికినే కోలుపోతారని వెనక్కు పంపడము, వనవాసం నెపంతో ఎడబాటు కల్పించి దానితో మంచి ఆత్మానుభవం కలిగించాలనే దృష్టితో చేసిన మంచి పని గనుక, అది వంచన కానే కాదు. అట్లా కాకుంటే, రాముని అభిప్రాయం అది కానట్టయితే, అందరు ఎట్లా నిద్రపోయారు, సుమంత్రుడు లక్ష్మణుని లాగ ఒకరో ఇద్దరో అయినా నిద్రలేకుండా ఉండేవారు గద!

48వ సర్గలో 6వ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ తీర్థీయం "అయం భావః" అని మొదలు బెట్టి భావము నీ విధంగా వివరించింది. "అంతులేని దయతో, సకల జగత్తును సంసార సాగరము నుండి ఉద్ధరించడానికి, తమ దేశంలో, పట్టణంలో నరరూపంతో అవతరించి ఉన్న భగవంతుడైన శ్రీరాముని, పరమాదరముతో చూడక కేవలం భార్యా బిడ్డలతోనే సంతోషంతో గడిపే పాపిష్ఠులు మళ్ళీ మళ్ళీ పుట్టుతారు" అని. "వనంలో వెంట వెళుతూ సేవిస్తున్న లక్ష్మణుడు భాగ్యవంతుడు. సీత కూడ భాగ్యవంతురాలే. వారిద్దరి భాగ్యాన్ని ఎవరు కొనియాడగలరు?" తదుపరి కూడ ఇది భావము. రాముని పరమాత్ముడని తలచి, చెట్లు తమ పూలపై వాలిన తుమ్మెద ఝుంకార రూప మంత్రోచ్చారణతో, తమ కొమ్మలను చేతులను పైకి ఎత్తి పుష్పమంజరుల అంజలులతో, పూజించుచున్నవి. అని. 50వ సర్గలో శృంగి బేరపురంలో గుహుని రాముడు కలిసినప్పుడు, దానిని ఆక్షేపించి, "భగవద్భక్తులు శూద్రులు కారు, వారు విప్రులు, భాగవతులు. ఎవరు భక్తులు కారో వారే శూద్రులు, గుహుడు రామభక్తుడు, భగవత్ప్రియుడు, కలవడంలో తప్పులేదు" అని గోవిందరాజీయము సమాధానము చెప్పుతుంది. అతిథిసత్కారం చేసిన తరువాత లక్ష్మణునితో పాటు, గుహుడు కూడ ధనుర్ధరుడై రాముని రక్షణకై మేల్కొని ఉన్నాడు. "లక్ష్మణునిపై గుహునకు అతిశంక కనబడుతుంది" అంటుంది గోవిందరాజీయము.

52వ సర్గలో రాముడు వానప్రస్థ ధర్మమును ఆశ్రయించాడు అన్నప్పుడు ఆక్షేపము. మొత్తం వానప్రస్థ ధర్మమును అంగీకరించాడా? దానిలోని ఏదో ఒక ధర్మమునా? మొదటిది ఒప్పుకొన వీలవదు. అప్పుడు, వనవాసానంతరం తిరికి గృహస్థాశ్రమము తీసుకోవడం కుదరదు. రెండవది కూడ వీలుగాదు. గృహస్థుడయినవాడు

వనంలో ఉండేవాడి తీరుగా, జడలను ధరించడం మొదలయినవి చేయడం వలన శాఖా దోషం లాగ ఆశ్రమం తప్పిన దోషం వస్తుంది. జవాబు. తండ్రి ఆజ్ఞవలన, కల్పించుకున్న విశేషనియమం గనుక, తప్పులేదు. మనువు కూడ "మంచి సంకల్పం వల్ల గలిసిన కామమే (కోరిక అని అర్థం) ధర్మమూలము అని చెప్పాడు గద"! అని ఇదంతా గోవిందరాజీయమే.

మనస్విని అంటే భయం కలది, నిందయందు మతుప్ ప్రత్యయం అంటుంది గోవిందరాజీయము. ఒక విశేషము – రాముడు నదిని దాటి, పాడిపంటలు గలిగిన వత్సదేశమును చేరెను. కొన్నింటిలో మత్స్య అని ఉంది, అది వ్రాసేవారి తప్పు వలన గలిగింది. దేశాలు ఇట్లా ఉన్నాయి. గంగాయమునల మధ్యలో ఉన్న ప్రయాగ ప్రదేశము వత్సదేశము. దానికి పడమర భాగంలో పాంచాలము. యమునకు దక్షిణ తీరమున శూరసేన దేశము. దానికి పడమరగా ఉన్నది మత్స్య దేశము అని గోవిందరాజీయం వివరిస్తుంది.

53వ సర్గలో కూడ ఓ ఆక్షేపము. రాముడు లక్ష్మణునితో, రాత్రి ఇలా అంటాడు. "లక్ష్మణ! నేడు కైకేయి తన కోరిక నెరవేరినదవుతుంది. వచ్చిన భరతుని పట్టాభిషేకమునకై రాజు ప్రాణాలను తోడేస్తుంది. పాపం రాజు మాత్రం ఏం చేస్తాడు. కైకేయి చెప్పుచేతల్లో ఉన్నాడు. ఈ కష్టాన్ని, రాజుగారి కామ పురుషార్థ పరత్వంను చూస్తే నాకు 'ధర్మ, అర్థ' పురుషార్థాల కంటె కామమే ప్రభావ శాలి అనిపిస్తోంది". ఇంకా కైకేయి గురించి చాలా చెప్పుతాడు. రాముడే లక్ష్మణునితో 'కైకేయి గురించి ఏమి తప్పుగా మాట్లాడకు, నిందించకు! భరతుని గురించి చెప్పు'అన్నందున, కైకేయి నిందాప్రధాన మయిన ఇలాటి మాటలను, సర్వపురుషార్థనిస్పృహుడు, రాముడు మాట్లాడతగునా? అని. ఇదే సర్గలో "లక్ష్మణ నీవు ప్రాతఃకాలముననందే అయోధ్యకు తిరిగి పొమ్మ"ని చెప్పబోతున్నాడు. అతని అభిప్రాయమును చెప్పడానికి ఇలా చెప్పాడు అని సమాధానమునిస్తుంది గోవిందరాజీయము.

లక్ష్మణుడు తిరిగి వెళ్ళాలని రాముడు, తన తల్లిని భరతుని అధీనంలో ఉంచమని. తాను ఏ జన్మలో స్త్రీలనుండి పుత్రులను విడిపోయేట్టు చేసానో అని, అందువలన కౌసల్యను సేవించవలసిన కాలంలో విడిపోతున్నానని, ఆమెకు పెంచుకున్న పశుపక్ష్యాదులు చేసినంత కూడా తాను చేయలేకపోతున్నానని పరి పరి విధాల తనను తాను నిందించుకునే సందర్భం ఒకటుంది. అప్పుడు అంటాడు. "ఓ లక్ష్మణ! నాతల్లి పెంచుకున్న మైనా (శారిక) నీకు కూడ తెలుసు కద! అది నాకంటే కౌసల్య అంటే ఎక్కువ ప్రేమ కలది. ఆమెకు నాకన్న ఎక్కువ ప్రీతిని కలిగిస్తున్నది. ఆ మైనా, ఇంటికి శత్రువయిన పిల్లికాలు కొరకమని చిలుకతో చెప్పుతున్నట్టు అరుస్తుంది. ఆమాటను కౌసల్య వింటుంది. మైనా పిల్లిని ఏం చేయలేకున్నా, దాని కాలు కొరకమని చిలుకతో చెప్పుతుంది, నేను అంత మాత్రమయిన చేయడం లేదు నాతల్లికి" అని. శత్రువు అంటే కౌసల్య శత్రువు అని అర్థం. కాలు కరువు అని వినబడుతున్నది. ఇద్దరిని పోషించడంలో తల్లి ఏం తేడా చెయ్యలేదు. అయిన అది కొంతయిన సహాయపడింది. అంత మాత్రం గూడ మాట్లాడని నాజన్మ దండుగా. ఇక అసలు విషయం 'భగవంతుని భజించడం కంటె ఆచార్యుని సమాశ్రయించడమే' సులభమైన ఉపాయం అని చూపబడినది. 'పుణ్యతీర్థములు (నీళ్ళు), మట్టి, రాళ్ళతో చేసిన ప్రతిష్ఠింపబడిన విగ్రహములు కాని, చాలాకాలం సేవించడం తోనే పవిత్రం చేస్తాయి, సాధువులు

దర్శనంతోనే పవిత్రం చేస్తారు' అని చెప్పినందున. 'శారికా' అనడంతో జ్ఞానం అనేది ఓరెక్క, కర్మ అనేది ఓరెక్కగా కలిగిన 'ఆచార్యుడు' అని అర్థం వస్తున్నది. స్త్రీలింగము శారికా అనుటచే, భగవంతుడు తప్ప అంత స్త్రీ ప్రాయమని చెప్పబడిన భగవత్పారతంత్ర్యము భగవంతునిపై అధీనపడి ఉండడం తెలుస్తున్నది. మోక్షానందము కలిగించడంలో భగవంతుని కన్న ఆచార్యుడే మిక్కిలి సులువయిన ఉపాయమని అర్థము. 'పశువుగాని, మనుష్యుడుగాని, పక్షిగాని వైష్ణవుని ఆచార్యుని ఆశ్రయించినట్టయితే, అతనిలోనే విష్ణువు యొక్క పరమపదము పొందుతారని' చెప్పబడినది.

ఎవరు ఈ ఆచార్యుడు? ఎవరి వలన గురుపరంపరగా వచ్చిన వాక్యం-రహస్యమంత్రం, వినబడుతుందో ఆయన. ఏమిటా వాక్యం? ఓ చిలుక-చిలుక రంగుతో సరియగు రంగుగలిగిన ఓ భగవంతుడా? శత్రువు యొక్క- విరోధిభూతమైన సంసారము యొక్క పాదమును ఆధారమైనట్టి. సంసారబీజ భూతమైన అహంకార, మమ కారములను, (ఆత్మకాని దాని యందు ఆత్మ అనుభావన, తనది కాని దానియందు, తనది అను బుద్ధి ఈ రెండు కూడ అవిద్య అనే చెట్టు నుండి పుట్టిన విత్తనములు రెండు విధాలుగా ఉన్నది అని చెప్పబడినది) తొలగించుము. ఇట్లాంటి వాక్యము ఎవరి నుండి వినవస్తుందో ఆయనే, నాకన్న శ్రేష్ఠుడు. వర్ణించేదాన్ని బట్టికూడ ఈ అర్థం అభివ్యక్తమవుతున్నది. అయోధ్య అను వైకుంఠం నుండి బయలు వెడలి, విరజను దాటి, సంసారం అను అడవిలో కాలుబెట్టి, వేదాంతంలో చెప్పినట్టు శరీరమనే ఒక వృక్షంను జీవునితో సహా ఆశ్రయించి, కర్మఫలమును అనుభవింప జేస్తూ, సంసారంలో ఉంటూ, తన అనుభవము పొందని సూరి జనుల క్లేశముతో, తాను రావడం వలన ప్రయోజనం కలుగనందున శరణాగతిని పరమోపాయంగా నిశ్చయించుకొని ఇలా చెప్పాడు. అని విపులంగా వివరించింది గోవిందరాజీయం.

అధర్మం జరుగుతుందనే భయంతో నేను ఎదురు తిరిగి తల్లికష్టాలు తీర్చలేకపోతున్నాను. కేవలం పరాక్రమమే అన్నిటిని సాధించలేదు కద అని రాముడు ఇంకా చాలా కరుణంగా విలపించాడు అశ్రుపూర్ణముఖుడై. ఇంకా చాలా అనడంతో మాటలలో చెప్పరానిది అని గోవిందరాజీయమంటే, తీర్థీయం ఇట్లా వ్యాఖ్యానిస్తుంది. రాముడు పరమకరుణాశాలి, తనవారి దుఃఖాన్ని సైచలేడు కనుక కన్నీటి పర్యంతమయ్యాడు అని.

54వ సర్గలో రాముడు భరద్వాజ మహర్షితో, హే భగవన్! నేను మీ ఆశ్రమంలో ఉంటే, దగ్గర ఉన్నందున, మీ ఆశ్రమం అందరికి తెలిసినందున అందరు వస్తారు. నా వనవాసానికి, మీకు కూడ వ్రతభంగం కావచ్చును. కనుక మంచి ప్రదేశము ఎక్కడో చెప్పండి అక్కడికి వెళ్ళి ఉంటాము అని ప్రార్థిస్తాడు. తీర్థీయము ఇక్కడ ఒక రహస్యోపదేశమును చేస్తుంది. ఓ సర్వజ్ఞ! రావణుని వధ కొరకు, నేను రహస్యంగా అవతరించాను. నన్ను ఇట్లా మీ ఆశ్రమంలో ఉంచుకొని ప్రకటిస్తే, నన్ను సుదర్శునిగా విష్ణువుగా, సీతను లక్ష్మీదేవినిగా తెలిసికొని, మమ్మల్ని చూద్దామని ప్రతివారు వస్తారు. ఇంతటి 'బయలు ప్రదేశం ఇష్టం లేదు పరమానందానికి మూలభూతుడైన నాతో వైదేహి ఎక్కడ క్రీడించగలదో, పద్మహస్తయయిన శ్రీ ఇతరులచే వెదకబడుచున్నట్టిది అని చెప్పినట్టు అందరిచే ఆశ్రయింపదగినదీ, అయినప్పటికి అనవరతం అనుభవంలో ఉన్నప్పటికీ, ఈరోజు నుండి మొదలయె అనుభవంతో నిత్యం అనురక్తురాలు అవుతుందో, అట్టి ఆశ్రయించబడేది ఆశ్రమం అంటే జగత్, దానికి ఆధార భూతమును,

సర్వోత్తముడైన వానిని, స్వరూప, గుణ, వైభవములచే బ్రహ్మరుద్రాదుల కంటే శ్రేష్ఠతముని నన్ను, నాకు అతిప్రియుడవైన నీవు ఏకాంతములో చూడు! అంతేగాని రహస్యము కంటే రహస్యతమమైన నాస్వరూపాన్ని ప్రకటించకుము అని ఉపదేశము.

56వ సర్గలో సీతారామ లక్ష్మణులు చిత్రకూటం చేరుతారు. దానిలో మహాత్ములయిన మునులు వసిస్తూ ఉండిరి. వాల్మీకి ఆశ్రమం కూడ ఉండినది. ఒక ఆక్షేపము. బాలకాండములో తమసా నదీతీరంలో ఉన్నట్టు చెప్పారు. ఇప్పుడేమో చిత్రకూటములో అని, ఇది విరుద్ధము గద! సమాధానము. వారు వనవాసానికి వెళ్ళినప్పుడు చిత్రకూటము లోనే నివాసము. భరతుడు వచ్చి వెళ్ళాక, మునులు చిత్రకూటంనుండి వెళ్ళిపోయారని చెప్పారు, అప్పటి నుండి వాల్మీకి వాసము తమసాతీరంలో యని సమాధానము. “రాముడు తిరిగి రాజు అయ్యాక కావ్యం వ్రాసే సమయంలో తమసా తీరవాసము. అంతకు మునుపు చిత్రకూటాశ్రమములోనే నివాసము” అని. కనుక విరోధం లేదు. ఇది గోవిందరాజీయము.

ఇక తీర్థీయము – 57వ సర్గలో గుహుడు పంపిన వేగువాళ్ళు రాముడు ఎట్లెట్లా వెళ్ళాడో సుమంత్రునికి గుహునికి తెలిపారు. వారిద్దరు శృంగిబేరపురంలోనే (రామలక్ష్మణ సీతలను పడవలో ఎక్కించి పంపాక అన్నమాట) ఉన్నారు. మొదటి రోజు గంగను దాటి చెట్టు మొదట నివసించారు, రెండవ రోజు భరద్వాజాశ్రమంలో ఉన్నారు, మూడవ రోజు యమున ఒడ్డున వనంలో ఉన్నారు,నాలుగవ రోజు చిత్రకూటానికి బయలుదేరారు. వేగువారు తిరిగి వచ్చి 5వ రోజు ఈవిషయం చెప్పారు.

58వ సర్గలో తిరిగి వచ్చిన సుమంత్రుడు రాజుగారితో రాముడు, లక్ష్మణుడు సీతచెప్పిన మాటలు చెప్తూతూ లక్ష్మణుని మాటలను ఇలా వివరిస్తాడు. తన భావాన్ని ఏం మరుగు పరచక లక్ష్మణుడు కోపంతో ఇలా అన్నాడు. ఏ అపరాధంతో రాముని వనవాసానికి పంపాడు? ఇది చేయగూడని పనే. కైకేయి యొక్క తుచ్ఛమైన మాట కొరకు ఈ అకృత్యము చేశాడు. దీనితో మేము బాధపడుతున్నాము. లేదా రాజు కైకేయి మాట పట్టుకొని చేయగూడని పని చేశాడు, దానితో మేము బాధపడుతున్నాము. చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చడం అకృత్యం ఎట్లా అవుతుంది? రాముని అడవులకు పంపడం లోభకారణంగా చేయబడినది, వరదానమునకైగానీ, కైకేయీ వరదానమునకైగానీ అన్ని విధాల చెడ్డపనే చేశాడు. వరములు ఇచ్చేప్పుడు భరతాభిషేకం, రామవనవాసం అని చెప్పలేదు గద! రామునిలోభం కారణంగా కాని, వరదాన నిమిత్తంగా కాని, ఎట్లా వదలిపెట్టినా, దుష్కృత్యం చేశాడు. దశరథుడు నేను రాజ్యం ఇవ్వను అని ప్రతిజ్ఞ చేయవచ్చుగా, జ్యేష్ఠపుత్రుని ప్రవాసమునకు పంపడం అనుచితం గద “ఒక పుత్రుడున్నవాడు ఆ పుత్రుని, చాలా కొడుకులున్నవాడు మొదటి వాడిని ఇవ్వవద్దని స్మృతులు చెప్తున్నాయి. ఈపని ఇష్టంతో చేసినట్టు కనపడుతున్నది. లేదా విధిప్రేరణ వల్లనే, ధర్మం ఆలోచించకుండగనే చేయబడినది. వేరే కారణం నాకు కనపడటంలేదు. కారణాలుంటే వదలి పెట్టడం శాస్త్రీయం అయ్యేది. యథేష్టంగా చేశాడంటున్నావు. అట్లయితే రాజు పశ్చాత్తాపం ఎందుకు చెందుతున్నాడు? ఆలోచించక చేసినందుకు తాపాన్ని కలిగిస్తున్నది. తండ్రిగారిని నిందించొచ్చా ఇట్లాగా? కార్యాకార్యములు తెలియనట్టి, గర్వితుడైనట్టి, చెడు మార్గంలో వెళ్తున్నట్టి తండ్రినైనా వదలిపెట్టాలి” అని గదా స్మృతి వచనము. “నాకు రాఘవుడే తండ్రి,యజమాని, బంధువు” అన్నాడు. దీనితో

భగవంతుని యందే పరమభక్తి ప్రపత్తులు గలవారికి భగవంతుడు ఎట్టి ఉపాధిలేని తండ్రి, యజమాని, బంధువు, ప్రాకృతులైన, కేవలం జన్మను ఇచ్చినట్టి, కనుకనే ఉపాధికలిగినట్టి, తండ్రులు మొదలయినవారిని పరమభక్తులు వదలి వేయాలి అని చెప్పినట్టు అయినది. రాముడు సర్వలోక ప్రియుడు, రాముని వదలి సర్వలోకములకు అప్రియము చేసిన దశరథుని నేను పరిత్యజంచినాను. సర్వలోకములకు ఏ కారణము ఉపాధిలేకుండ బంధువైన రాముని వదలి సోపాధిక బంధువును తండ్రివైన నిన్ను ఎట్లు ఆశ్రయించాలి అని భావము. ఈ విషయము గోవిందరాజీయములో వివరముగా, తీర్థీయంలో సంక్షేపముగా ఉన్నది. రాముడు విషయం చెప్పి అశ్రుపూర్ణాకులేక్షణుడు అయ్యాడు. లక్ష్మణుడు కోపంతో నిట్టూరుస్తూ చెప్పాడు. సీత రామలక్ష్మణుల ముఖములను చూచి కిమ్మనకుండ కన్నీరు వదలింది. వారి ముఖాలను చూడడం వలన తనకు చెప్పే అర్హత లేదను జ్ఞానం, కన్నీరు పెట్టుకోవడం సూతుని ముఖం చూడడంతో అత్తను గూర్చి చెప్పగూడదని వ్యక్తమగుచున్నది.

60వ సర్గలో కౌసల్య తనను రాముడు, లక్ష్మణుడు సీతఉన్న దగ్గరికి తీసికొని పొమ్మంటే, సుమంత్రుడు వారు అడవిలో బాగానే ఉన్నారని, లక్ష్మణుడు రాముని సేవిస్తున్నాడని, సీత ఉద్యానవనములో విహరిస్తున్నట్టు వనంలో ఉందని చెప్తుతాడు. ఆమెలో ఎట్టి దుఃఖాన్ని విచారాన్ని నేను చూడలేదు. ఆమె దారిలోని చెట్ల పేర్లను, గ్రామాలపేర్లును అడుగుతూ, అయోధ్యకు క్రోసెడు దూరంలో విహారమునకు వెళ్ళినట్టున్నది. నాకింతే జ్ఞాపకం ఉన్నది. కైకేయి గురించి అన్నమాటలను మధ్యలో తుంచేశాడు. అయోధ్య నుండి వెళ్ళేప్పుడు కైకేయి గూర్చి సీత మాట్లాడిన నిష్ఠూరాలను కౌసల్యకు చెపితే (ఆమెకు) ఆనందం కలుగుతుంది. ఆమెకు చెప్పుదామనుకొని మధ్యలోనే మానివేసి సంతాపహేతువుకాని మంచిమాటలనే చెప్పాడు. కౌసల్యదుఃఖాన్ని చూసి చెప్పలేదన్న మాట.

“సీతను గురించి ఇంతే జ్ఞాపకమున్నది. గోప్యముగా ఉంచవలసినట్టు, కైకేయి గూర్చి సీత అన్నమాటలు, అజాగ్రత్తగా, చెప్పదొడగిన వాటిని, మధ్యలోనే ఆపి, కౌసల్యకు ఆహ్లాదం కలిగించే మధురవచనాలను (అంటే చెప్పబోతూ ఆపినవి కౌసల్యకు సంతాపహేతువులు, ఇప్పుడు చెప్పే మధురవచనాలు సంతాపహేతువులు కావన్నమాట) సుమంత్రుడు చెప్పెను అని 15వ శ్లోకము యొక్క పదయోజన అని గోవిందరాజీయము. ఇక అర్థ విశేషాలను చూద్దాము.

మరచిపోవడానిక్కారణాలు వేగంగా చెప్పడం, పూర్వాపరక్రమం లేకుండ చెప్పడమూను. కైకేయికి సంబంధించినది అని ప్రస్తుతాంశము. ఇంతనే జ్ఞాపకముంది అనడంలో మళ్ళీ గుర్తు తెచ్చుకోవడానికి వీలు చేసుకోవడము. మీదుఃఖాన్ని చూస్తుంటే నాకు గుర్తు రావడంలేదని, మధ్యలో తుంచివేయడం చెప్పబోయేది హ్లాదనం అనడంతో, చెప్తుతున్నది తాపహేతువు అని వ్యంగ్యం. కైకేయినిందే అయినప్పటికి, కౌసల్యతాపహేతువు గనుక తప్పక గోప్యంగానే ఉంచాలి. మరి ఆ వాక్యమేమి? అది సీత అన్నది అనడానికి ప్రమాణమేమి? చెపుతాను జాగ్రత్తగా విను! “ఇట్లా కార్యవశమున ఓచోట గోప్యంగా ఉంచినది, కవి వివరించకపోతే సర్వజ్ఞునికి కూడ “అది,” ఇది అని చెప్పడం సాధ్యం కాదు. ఇక్కడ నోరుజారి చెప్పబోయిన విషయం కైకేయికి సంబంధించినది, వృద్ధ దంపతులకు సంతాపం కలిగించేది ఆ వృత్తాంతాన్ని కవి ముందర (పైన) వ్యక్తీకరింపబోతాడు. యుద్ధకాండలో సీతను గురించి ‘కురరివలె ఏడుస్తూ కైకేయిని నిందించింది అని చెప్పి, సీత అన్నమాటను “కులనందనుడు”

హతుడయ్యాడు, ఓ కైకేయి! నీ కోరిక తీరింది సంతోషించు" అన్న దానిని చెప్పుతాడు కవి. ఇది సీత హృదయం. రాజ్యలాభంతోనే కైకేయి కోరినది సిద్ధించినట్లే, అయినా రాముని అడవికి బంపడంలో ఆంతర్యం ఏమంటే రాముని వనవాసానికి పంపిస్తే, భర్తవియోగం ఓర్వలేని సీత అతని వెంట తప్పక వెళుతుంది. ఆమె అతిలోక సుందరి, ఎవరైనా తప్పక ఎత్తుకుపోతారు, అప్పుడు రాముడు స్వయంగానే నశిస్తాడు, అప్పుడు నారాజ్యం సుప్రతిష్ఠితమవు తుంది, లేకుంటే రాజ్యం వచ్చి ఏం ప్రయోజనము? రాముని మంచితనం చూసి అందరు అతని విధేయులవుతారు. కనుక వినాశానికై రాముని అడవికి పంపాలి అని ఇదే సీత చెప్పిన విషయం అరణ్యకాండలో. రాముడు కూడ "పుత్రునికి కేవలం రాజ్యం వచ్చినంత మాత్రాన సంతోషించేది కాదు కైకేయి. ఇప్పుడు తన కోరిక తీరినదై సుఖంగా ఉంటుంది. ఆమె చాలా దూరదృష్టి కలది పుత్రుని విషయంలో" అంటాడు. మరో చోట కూడ "లక్ష్మణ! ఈనాడు కైకేయి అనుకున్నది నెరవేరినది. వరాలు కోరి సాధించినది. (సీతను ఎత్తుకు పోవడం) ఆమె అనుకున్నది జరిగినది" అంటాడు రాముడు. ఈ విషయాలనే క్రితం సర్గ చివర "సీత నిట్టూరుస్తూ, ఏదో ఆవేశించిన దానిలాగ, నవ్వుతూ, కూచున్నది. పూర్వం ఎండ కన్నెరుగనిది. ఏడుస్తూ నాతో ఏం చెప్పలేదు. పాలిపోయిన మోముతో రాముని చూస్తూ కన్నీళ్ళు పెట్టుకుంది" అనే శ్లోకాలతో సూచించాడు. 'అప్పుడు సీత చెప్పినది' తప్పిపోయి అని గోప్యంగా ఉంచాడు. ఇక్కడ తాను అన్నదానిని అనబోయే దానిని జ్ఞాపకం రావడం లేదనే నెపంతో చెప్పడం మానివేశాడు.

తీర్థీయంలో – సీత గురించి ఇంతే జ్ఞాపకం వస్తున్నది. కైకేయి గురించి సీతఅన్న వాక్యము ఇప్పుడు నాకు స్మరణకు రావడంలేదని, అజాగ్రత్తగా ఉండడం వల్ల వచ్చిన ఆమాటను ఆపివేసి, కౌసల్యకు ఆనందకరమైన మాటనే చెప్పాడని యోజన అని, ఉన్నది.

61వ సర్గలోని 11వశ్లోకంలో రాముడు 15వ ఏట ఒక వేళ తిరిగి వచ్చినా భరతుడు అనుభవించి ఇచ్చిన రాజ్యాన్ని వదిలిపెడుతాడు అని తాత్పర్యం ఉన్నది. 'ఉపభుజ్యతే' కు బదులు 'ఉపలక్ష్యతే' అని పాఠాన్ని తీర్థీయం, గోవిందరాజీయము ఒప్పుకుంటాయి. గోవిందరాజీయం– రాజ్యమును, ధనాన్ని భరతుడు వదలిపెడతాడని 'అనిపించదు' భరతుడిచ్చిన రాజ్యమును రాముడు తీసుకునేట్టు అనిపించదు. (అతడు ఇవ్వడు గనుక). లేదా రాముడు మళ్ళీ వస్తే భరతుడు రాజ్యాన్ని, కోశాన్ని ఇచ్చేట్టు కనపడుటలేదు, చేతిలో ఉన్న రాజ్యమును అప్పనంగా ఎవరు ఇస్తారు గనుక, అసంభవము రాజ్యమివ్వడము. 'భరతో యది భోక్ష్యతే' అని మరియొక పాఠంగూడ ఉన్నది. అనుభవించకపోవడానికి మూడుదాహరణాలు వాల్మీకి మహామునియే ఇచ్చాడు. 1లోకంలో కొందరు దక్షిణ దానాదులు తమవారికే దక్కాలనే ఉద్దేశంతో పుణ్యతిథులలో, అపర కర్మలలో,విద్యావయోగుణములతో విరాజిల్లు విప్రులను కాదని తమ వారినే పిలుస్తారు. మొదట భోజనం పెడతారు. పిదప ఆ విప్రులకు పెట్టినా, వారు తినరు. 2.పెద్దపులి కూడా వేరేజంతువు ముట్టని దానినే తింటుంది. 3.యజ్ఞయాగాదులలో వాడిన దర్భలను, యూపములను, పురోడాశమును మిగత హోమ ద్రవ్యములను మరియొక యజ్ఞంలో యాగంలో వాడరు. అవి యాతయామములు 'ఒకజాము' గడిచినవి. వాడకూడనివి అవుతవి.

67వ సర్గలో 31వశ్లోకాన్ని గోవిందరాజీయం ఇలా వ్యాఖ్యానించింది. “తమతమ జాతి వర్ణాశ్రమ మర్యాదలను ఉల్లంఘించిన (అందుకే పూర్వం రాజుండగా రాజు దండముతో శిక్షింపబడినట్టివారు) ఏ నాస్తికులున్నారో వారు ఇప్పుడు రాజు లేడు, శిక్ష పడదు అని నిశ్చయంతో బలం పుంజుకుంటారు. అందరి ప్రాణాలతో చెలగాట మాడతారు, సమర్థులవుతారు” అని.

ఇక దీనికి భిన్నంగా వ్యాఖ్యానిస్తుంది తీర్థీయము. ఇంతవరకు అరాజక మేర్పడితే కలిగే దోషాలను చెప్పి, ఇప్పుడు రాజు ఉంటే కలిగే గుణాలను చెప్పుతున్నాడు. మర్యాద తప్పినవారు, కృత్యా కృత్య విచారము లేనివారు. ఇలాటి వారందరు రాజు శిక్షతో భయపడినవారై (తప్పు చేస్తే శిక్షింపబడిన వారౌతారు గనుక) యోగ్యులు అవుతారు అని.

70వ సర్గలో భరతుడు, వచ్చిన దూతలతో తల్లిదండ్రుల కుశలము నడుగుతూ, తన తల్లిని అడుగునప్పుడు ఆత్మకామా అని అంటాడు. స్వప్రయోజనపరురాలు అనుటతోను, కోపిష్ఠి, ప్రాజ్ఞమానినిది అనడంతోను, కైకేయి ఏమైనా చేసియుండవచ్చునని భరతుడు అనుకొన్నట్టు పైమాటలు సూచిస్తున్నాయంటుంది గోవిందరాజీయము.

71వ సర్గలోని 33వ శ్లోకంలోని ‘రే’ అను అక్షరముతో గాయత్రీమంత్రములోని ఆఱవ అక్షరము చెప్పబడినది అని రెండువ్యాఖ్యలలో సమానమే. గోవిందరాజీయం మాత్రము ఇక్కడితో 5000వేలు శ్లోకాలు అయిపోయాయి అని అంటుంది.

75వ సర్గలో భరతుడు కౌసల్యతో, రాముని వనవాసం విషయం తన కేమీ తెలియదని, తెలిసియే రాముడు వెళ్ళితే, దానికి తన సమ్మతియే ఉంటే, గురువుగారి ద్వారా నేర్చుకున్న శాస్త్ర సంబంధమయిన బుద్ధిలేకుండు గాక! అని, ఇంకా చాలా ఒట్లు శపథాలు పెట్టుకుంటాడు, చేస్తాడు. సామాన్యంగా ఇలా చెప్పుటచే, తనకు కూడ జరుగనీ అని సూచిత మంటాయి వ్యాఖ్యానాలు. గోవిందరాజీయంలో విశేషం. “ముందు ముందుగా సామాన్యంగా చెప్పినవి కూడ భరతుని పరంగా యోజనచేసి చూసుకోవాలి, ఇక్కడ, సత్పురుషుల విషయంలో అపరాధం చేసినట్లయితే ఉన్న శాస్త్రజ్ఞాన మంతా నశిస్తుందని సూచితమయినది”

ఈ సర్గ వ్యాఖ్యానంలో తీర్థీయంలో ఓ ఆక్షేపం, దానికి సమాధానమూ ఉన్నాయి. భరతుడు కౌసల్యతో ఒట్టు పెట్టుకునే ఈప్రకరణంలో శ్లోకాలు ఒక క్రమంలో ఉన్నట్టు కనబడవు, కొంత పునరుక్తి (పెట్టుకున్న ఒట్టునే మళ్ళీ పెట్టుకోవడంలాటివి) ఉన్నది. ఈ పునరుక్తి శపథం విషయంలోది కనుక ఎట్టి తప్పులేదు అని.

76వ సర్గలో దహన సంస్కారములు బాగా వివరింపబడినవి. యజ్ఞకర్మచేయువారు ఋత్విక్కులు, శాంతి పౌష్టికకర్మలు చేయువారు పురోహితులు, ఉపనయనము చేసి వేదాదులను నేర్పువారు ఆచార్యులు. దశరథుని అగ్నులను యాజకులు బయటకు తెచ్చారు. రాజును పల్లకీలో ఎక్కించారు. మోసుకుపోతున్నారు. డబ్బును, బంగారు నాణాలను, బట్టలను వెదజల్లుతూ కొందరు ముందునడిచారు. కొందరు సుగంధ ద్రవ్యాలను పూలను చల్లుతూ వచ్చారు. చితిని పేర్చారు. దానిలో ఇరుపక్కల దేవదారు కఱ్ఱలను, గంధాలను, గంధపు చెక్కలను, పద్మములను పేర్చారు. చితిమధ్యలో రాజును ఋత్విజులుంచారు. భరతునితో నిప్పు పెట్టించి, వేదమంత్రాలను

పఠించారు ఋత్విజులు. పల్లకీల్లో, బండ్లలో అతని పత్నులు, అంతఃపురపు స్త్రీలు వచ్చారు. వారు ఎడమనుండి కుడికి ప్రదక్షిణము చేశారు. ఈప్రదక్షిణం నిప్పంటించడానికి ముందు చేశారు. అది కూడ 'శవం' శిబికలో (పల్లకిలో) ఉండగనే అన్నమాట. ఆయా దేశాలకు చెందిన ఆచారాలు వేరువేరుగా ఉంటాయి. సరయూతీరములో దిగి స్నానాదులు చేసి, అయోధ్యను చేరి పదిరోజులు 'శౌచమును' పాటించారు. స్త్రీలు ప్రేతప్రదక్షిణం చేయడం, నీళ్ళు వదలడాన్ని కొన్ని ధర్మసూత్రాలు విధించాయి. బోధాయన ప్రకారం బంధువులు కావలసిన వారు మార్గంలో కూడ ప్రదక్షిణం చేస్తారు, చితిపై పెట్టిన తర్వాత, శ్మశానంలోనే కొందరు చేస్తారు. ప్రేతతో బాటు అగ్ని తేవడం, చితారోపణం, మంత్రయుక్తంగా నిప్పుపెట్టడం, ప్రదక్షిణ చేయడం, నీళ్ళొదలడం, పదిరోజుల సూతకంలో నేలమీద పడుకొనడం,అను కర్మలు, దేశము, కులము, (ధర్మ) సూత్రములననుసరించి చేస్తారని చెప్పబడినది. ప్రధానంగా చెప్పడం అందరు గ్రహించాలని తెలుసుకోవాలి అని గోవిందరాజీయం విశేషంగా వ్యాఖ్యానించినది.

82వ సర్గలో 8వశ్లోకంలో 'కోట్యాపరాంతా' అనుదానిని వివరిస్తూ గోవిందరాజీయం- "కేవలురు- సింహాసనము మొదలైనవి లేనివారు అనునది అపరాంతులకు విశేషణము, అపరాంతులు అనగా అపరాంత దేశంలో నివసించేవారు యవనులు" అని వ్యాఖ్యానిస్తుంది. ఇక తీర్థీయమేమో. "కేవలురు-ప్రత్యేక సింహాసనాధీశ్వరులని అర్థము, కోట్యా పరాంతా అని పదచ్ఛేదము, కోటి తూర్పుదిక్కు చివరన నివసించేవారు" అని వ్యాఖ్యానిస్తుంది. బహుశా వీరికే సాముద్రాః సముద్రము, ద్వీపవాసులని రెండు వ్యాఖ్యానాలు చెపుతున్నాయి. మన ఆంధ్రదేశములో గూడ 'త్రిపురాంతకం, వగైరా ప్రాంతాలున్నాయి. అపరాంతకం కూడా ఉన్నట్టుంది.

రాముణ్ణి ఎడబాయగానే మరణించిన, దశరథుని వలన కలిగిన నేను రాముని రాజ్యాన్ని ఎట్లా అపహరిస్తాను? అతడు వదలిపెట్టిన రాజ్యాన్ని ఎలా తీసుకుంటాను? నా తాహతు, స్వరూపం గురించి ఆలోచించినా, నేను రాజ్యార్హుడిని కాను. ఒకరికి చెందిన ఆస్తిలో ఒక వస్తువు ఇంకోవస్తువు మీద ఎట్లా పెత్తనం చెలాయిస్తుంది? నేను రామునికి సంబంధించినవాడనే, రాజ్యమూ రామునకు చెందినదేగద! రెండు రామునకు శేషములు. సేవకులవంటివే. ఈవిషయంలో ధర్మం చెప్పండి పురోహితుల వారు. లోకంలో తండ్రులను బంధించికూడ రాజ్యం చేసేవారున్నారు. అది ఈ భరతుని విషయంలో కూడ జరగవచ్చునని అనుకోకండి! నాస్వభావం తెలుసుకొని, ధర్మము చెప్పండి. ఆధర్మము ఏమంటే, పాలకుడు ఎవడు? పాలింపబడేవాడు ఎవడు అనునది. ఇద్దరము, నేను, రాజ్యము రాముని వస్తువులే అయినప్పుడు ఒకడు పాలకుడు ఒకటి పాల్యము ఎట్లు వీలవుతుంది? ఒకవేళ అదే జరిగితే, రాజ్యమే నన్ను కాపాడాలి, అది కాదండి రత్నం, పెట్టె రెండు వస్తువులయినా (శేషములు అయినా) పెట్టె రత్నాన్ని కాపాడుతున్నది గద! అట్లా నువ్వు కాపాడవచ్చును గద. నిజమే యజమాని పెట్టెకు తాళం అదీవేసి పెట్టెను రత్నమునకు రక్షణగా పెట్టాడు కనుక అదివీలవుతున్నది. నేనట్లా రామునిచే వినియోగింపబడలేదు. తాను మాత్రం ధరించే రత్నాన్ని, అవసరము లేనప్పుడు పెట్టెలో పెట్టుకుంటాడు, అట్లాగే తానే పాలింపదగిన రాజ్యాన్ని, మనం ఆయనకు సమర్పించిన దానిని, అవసరంలేదని రాముడు అప్పగిస్తే అప్పుడు, రాముడిచ్చిన శక్తితో, పరతంత్రుడనయి, పెట్టె రత్నమును కాపాడినట్లు, రాముడు వచ్చేవరకు, రాజ్యాన్ని కాపాడుతాను, కనుక అన్ని విధాలా రాముని రాజ్యానికి తేవడానికే ప్రయత్నం చేస్తాను. మొదట రాముని వద్దకు వెళ్ళి, రాముని అడవులకు

బంపి రాజ్యమును స్వాయత్తం చేసుకునే ఆలోచనే తనకు రాలేదని, తనది కాదని, తెలుపుకోవాలి. అతని మనసునుండి ఆ భావనను తొలగించివేయాలి అని ఇంత దీర్ఘంగా వ్యాఖ్యానిస్తుంది గోవిందరాజీయం. ఇదే సర్గలో 12వ శ్లోకాన్ని. తీర్థీయం కిమ్మనదు.

రాముని రాజ్యానికి తీసికొని రావడానికి ససైన్యముగా వచ్చిన భరతుని జూచి, గుహుడు నీసైన్యం చూస్తే నాకు శంక కలిగిస్తున్నట్టుగా ఉన్నది అంటాడు. 85వ సర్గలో ఇవ శబ్దం ఆశంక చిన్నదే అని సూచిస్తున్నది అని గోవిందరాజీయము. ఆకాశమువలె నిర్మలుడైన భరతుడు అనడంతో దోషం ప్రసక్తే లేదు. ఆకాశంపైకి బురద చల్లితే అది అక్కడ అతకదు తగలదు, పైగా చల్లినవాని చేయికే బురద అవుతుంది అని కూడ వివరిస్తుంది తిలకము. ఆకాశము వలె అనే ఉపమానంతో జరిగిన, జరుగుతున్న, జరగబోవు మూడు కాలాల్లో కూడ మాలిన్య సంబంధము లేదు అని చూపబడినది. బహుశః దీన్నిబట్టె, భరతుని మనసులో, మూడు కాలాల్లో ద్రోహబుద్ధిలేదని మనము గ్రహించాలి.

86వ సర్గ మొదట గోవిందరాజీయము ఒక గొప్ప సూక్తిని చెప్పింది, గుహుడు లక్ష్మణుని గూర్చి చెప్పబోయే ముందు "భగవద్విషయ పరమైనట్టి ఉపదేశం విషయంలో, ఇది కొత్తగా చెప్పటం అనిగాని, ఇది పూర్వమే చెప్పింది అనిగాని విభాగముండనే ఉండదు. కొత్తపాతలు లేనేలేవు. ఆచార్యులు, వక్తలు, శ్రోతలు ఆదరంతో వింటూ ఉంటారు" అని తనకు తోచినంతనే చెప్పాడు, మొత్తంగా కాదు.

భరతుడు ససైన్యంగా గంగను దాటి ప్రయాగవనం ప్రవేశించి భరద్వాజాశ్రమాన్ని చూశాడు. అక్కడ "బ్రాహ్మణ శబ్దానికి గోవిందరాజీయము ఈవిధంగా అర్థాల్ని వివరిస్తుంది" 1. బహువేదములను జదివినవాడు, కాఠకములో, భరద్వాజుడు మూడు ఆయువుల ప్రమాణం గల్గిన కాలమంతా బ్రహ్మచర్యం చేసాడు. వేదాభ్యాసం చేశాడు. బ్రహ్మవేదము, అది చదివేవాడు బ్రాహ్మణుడు 2. బ్రహ్మ-పరమాత్మ తెలిసినవాడు, సమాధి బలముతో సమస్త వస్తువులను ఆహ్వానించి తెప్పించే సామర్థ్యము గలవాడు (ముందు సర్గలో ఈవిషయం స్పష్టమవుతుంది సైన్యానికి ఆతిథ్యమీయడంతో) 3. బ్రహ్మ-బృహస్పతి అను శ్రుతివలన బ్రహ్మ అయిన బృహస్పతి కుమారుడు గనుక బ్రాహ్మణుడు. ఇంకో విశేషం. భరద్వాజా! నీకు నాలుగవ ఆయుర్దాయం ఇస్తే ఏం చేస్తావు అంటే బ్రహ్మచర్యమునే చేస్తాను అని అన్నాడట భరద్వాజుడు అను శ్రుతిని ఉదహరిస్తుంది.

ఇక తీర్థీయం- బృహస్పతి పుత్రుడు గనుక దేవపురోహితుడని చెప్పటం జరిగింది. బృహస్పతి ఉతథ్యుని భార్య అయిన మమత యందు పుత్రుని కన్నాడు. భర్తకు భయపడి ఆగర్భాన్ని వదలి పెడుదామనుకున్న మమ తను దేవతలందరు, ఉతథ్యుని క్షేత్రజునిగా, బృహస్పతి ఔరసునిగా భరించుము అని చెప్పినందున భరద్వాజుడు అయ్యాడు, అని.

ఈ కథ భాగవతంలో ప్రసిద్ధము అంటుంది గోవిందరాజీయము.

91వ సర్గలో భరద్వాజుడు తన మహిమతో భరతునకు,అతని సైన్యమునకు గొప్ప అతిథిమర్యాద రంగ రంగవైభోగంగా చేశాడు అని మహాముని వాల్మీకి వర్ణిస్తాడు. ఆసందర్భంలో భరద్వాజుని ఆనతితో అప్సరసలు

అలంబుస, మిశ్రకేశీ, పుండరీకా, వామనా అనువారలు భరతుని ఎదుట, భరతునికై చాలా నృత్యం చేశారు. భరద్వాజుని ఆజ్ఞతో వారు నృత్యం చేశారనడంతో, భరతుని మనస్సును, ఆతిథ్యం నెపంతో భరద్వాజుడు పరీక్షించాడు అని తెలుస్తున్నది అంటుంది గోవిందరాజీయము. రాముని సేవకునిగానే ఉన్నాడుగాని, భోగలాలసుడయి కాదు అని కూడ వివరిస్తుంది. ఇదే సర్గలో లస్సీలాటి పానీయం చెప్పబడినది. వ్యాఖ్యానాల్లో ఇది బాగా వివరింపబడింది. పెరుగులో శొంఠి మొదలయినవి వేశారు. ఇక చల్లగురించి చిలికిన తరువాత ఒకజాము మాత్రం అయినట్టి వెలగ వాసన కలిగిన తక్రము, అట్లానే తెల్లని 'రసాలము' అనే చల్ల–శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు పొడిచేసి కలిపినది, ఏలకులు, లవంగములు,తక్కోలము, నాగపుష్పములు పొడి చేసి కలిపినట్టి, బెల్లము ఖండశర్కర అల్లము పొడిచేసి కలిపినట్టిది. దీనికే మజ్జిగ అని కూడ పేరు. అది బాగా పుల్లగా కాకుండ ఉన్నదిగా ఉండాలి. ఈ విశేషాలు అన్ని వ్యాఖ్యల్లో సమమే. తీర్థీయం శృంగిబేర, జీరక చూర్ణమును ఎక్కువగా చెపుతుంది. ఈ సర్గ నిండా భోగభాగ్యాలు బాగుగా వివరించడం జరిగినది.

భరద్వాజుడు రాముని నివాసమయిన చిత్రకూటము తన ఆశ్రమము నుండి సార్ధ తృతీయ యోజనముల దూరమున ఉన్నది అని భరతునికి తెలుపుతాడు. తీర్థీయము– ఈ దూరాన్ని మూడున్నర యోజనములు లేదా రెండున్నర యోజనముల దూరము గాని అని వివరిస్తుంది. గోవిందరాజీయము మాత్రము రెండున్నర యోజనములు అనియే నిశ్చయిస్తుంది.

సర్వజ్ఞుడయినను భరద్వాజుడు కైకేయికి నేర్పుదామనే ఆశయంతోనే, భరతుని తల్లిని గురించి విశేషము చెప్పమని అడుగుతాడంటుంది గోవిందరాజీయము. విశేషం. ఎవరు కౌసల్య ఎవరు సుమిత్ర ఎవరు కైకేయి అని పేరును తెలుసుకోవడం. నిందించిన భరతుని, వారిస్తూ, కైకేయిని నిందించకు, రాముని వనవాసము, దేవదానవులకు ఋషులకు హితమునే కలుగ చేయగలదు, దేవప్రేరితయై కైకేయి అట్లా చేసింది అని భరద్వాజుడు త్రికాలజ్ఞుడు గనుక చెప్పాడు అని గోవిందరాజీయము మాత్రమే వ్యాఖ్యానిస్తుంది.

"ఇట్లా ఇంతవరకు భరతుని కథను ప్రస్తుతించి, రాముడు చిత్రకూటము ప్రవేశించిన తరువాత గడచిన దినములలో రాముని వనవాసములో. విహారములో ఏతారతమ్యము లేనందున, భరతుడు వచ్చిన దినములో జరిగిన విహార విశేషాలను వర్ణిస్తున్నాడు" అని 94వ సర్గ వ్యాఖ్యానాన్ని మొదలు పెడుతుంది గోవిందరాజీయము. అప్పటికి రాముడు చిత్రకూటంలో నెలరోజులు గడిపాడు.

రాముడు చిత్రకూటాన్ని, అక్కడి చెట్లు చేమలను, విహరించే విద్యాధరులను, కిన్నరులను అందరిని వర్ణించి, పూలను సెలయేళ్ళను,మంచి గంధం మోసుకొచ్చే పిల్లతెమ్మెరలను అనుభవ పూర్వకంగా వివరిస్తూ, ఈ చిత్రకూటం మీదనే ఒకవేళ నీతో లక్ష్మణునితో చాలా ఏళ్ళున్నా నాకు దుఃఖం కలుగదు. చాలా సంతోషంగానే ఉంటుంది అంటాడు సీతతో. గోవిందరాజీయం ఇక్కడ 'ఒకవేళ' అనే పదంతో రాబోయే ఎడబాటు, చిత్రకూటం నుండి వెళ్ళిపోవడం సూచితమయినది అంటుంది. తీర్థీయంలో ఈ ఊసే లేదు.

పంచేంద్రియ ప్రీతికరమైన ఈ వనంలో నీతో ఉన్నందు వలన, ఎక్కువ ఆనందముగా ఉన్నది. వనవాసంతో కేవలం సుఖమే కాకుండ, తండ్రిగారి ఋణం తీర్చుకోవడం, భరతునికి ప్రియం చేకూర్చడం. భరతుడు తనకు చేయబోయే కైంకర్యం అంగీకరించడం ద్వారా రెండూ జరుగుతున్నవి. తీర్థీయం 14–17 వరకు వ్యాఖ్యానమే చేయలేదు. పై మాటలు గోవిందరాజీయములోనివి. తన సుఖం గురించి చెప్పాక సీతను అడుగుతున్నాడు రాముడు– భగవంతుడు భోగములను కేళిరూపముగా అనుభవించడానికి ఎత్తిన విశ్వరూపములకు తగిన అనుభావము కల నీవు, ఈ భోగ స్రోతస్సులో నిన్నే ప్రధానంగా చేసేవాణ్ణిగా నన్ను గుర్తించావా? ఇచట, సుఖం కలిగించు ప్రదేశము యొక్క సౌభాగ్యము మనసుకు మాటలకు అందనిదిగా తెలుసుకున్నావా? జనుల మనోవాక్కాయములను వశం జేసుకుని సుఖంగా ఉన్నావా? అను భావము తరువాత మలయానిల కోకిలాలాప భ్రమర ఝుంకారము మొదలైన ఉద్దీపన విభావములను చూస్తూ, అనుభవిస్తూ రమించుచున్నావా? లేదా భావములనగా కిన్నరుల యొక్క అందమయిన పశుపక్ష్యాదుల చేష్టలను తమకంతో గమనిస్తున్నావా? ఈ విశేషాలు తీర్థీయంలో కానరావు.

"రాజర్షులు వానప్రస్థాశ్రమానికి తగిన నియమాలతో గూడిన ఇట్టి వనవాసాన్నే అమృతం– మోక్షసాధనముగా చెప్పారు. మా ముత్తాతలు, ఈ దేహం వదలి దేవాదుల దేహం దాల్చడానికి అనువైనదిగా పేర్కొన్నారు" అంటుంది తీర్థీయము.

ఇక గోవిందరాజీయమేమో– ఈ వనవాసము కేవలం సౌఖ్యం కొరకే గాదు ఆముష్మికాన్ని సాధిస్తుంది, ఇది అమృతం. అమృతంవలె భోగ్యమైన వస్తువు. మాపూర్వీకులు ఈ ప్రారబ్ధ శరీరమును వదలి, సంసార వినాశం పొందడానికి ఉపయోగించుకున్నారు. చీకటిని పారదోలడానికేమో దీపమును వెలిగించడం, దానివల్ల వచ్చే పొగ వల్లనేమో దోమలను నివారించడంలాగా అన్నారు. లేదా అన్నీ తీర్థీయంలోని విషయాన్ని మళ్ళీ చెపుతుంది. "వనవాసము స్వర్గసాధనమూ మరియు అపవర్గసాధనము అని చెప్పారు అన్నట్లు" అయింది అని విశేషము చెప్పుట గోవిందరాజీయంలో సమీచీనంగా ఉన్నది.

95వ సర్గలో "నదులను చూపి ఆనందింప చేస్తున్నాడు రాముడు సీతను"అని ఆరంభిస్తుంది వ్యాఖ్యానాన్ని గోవిందరాజీయం. సీతాసౌందర్యమును, ఆమె ఉత్తమ స్త్రీత్వమును, తనతో సుఖముగా క్రీడించుట వలన, అడవిలోని గిరిప్రాంతములను చూచుట చేత విప్పారిన మోమును వర్ణించాడు. రాముడు చిత్రవిచిత్రముగా నున్న ఇసుక తిన్నెలు, బారులు తీరిన హంసలు చేయు అందెల సవ్వడుల వంటి రుతములు, కమలములు కలిగినది, రమ్యమైనది అను మందాకినీ వర్ణన రూపమైన వస్తువుతో, పృథుజఘనము కల, నూపుర సుందర పదములు, కరములు వదనము కలిగిన, నీవలె నది ఒప్పుచున్నది అని వస్తువుతో అలంకార ధ్వని ఉన్నది అను ఆలంకారిక విశేషమును వివరించినది గోవిందరాజీయము మాత్రమే. లోకంలో నృత్యం చేయబోవువాడు పుష్పాంజలి వెదజల్లి చేతులతో నృత్యం చేస్తాడో, అట్లా, గాలితో అల్లల్లాడు కొమ్మల నుండి పుష్పాలను రాలుస్తూ నర్తిస్తున్నట్టుగా ఉన్నది ఈ నది తనతీరం పై ఉన్న ఊగుతున్న శిఖరాలు గల చెట్లతో అని ఉత్ప్రేక్షించాడు మహాకవి అనికూడ ఉత్ప్రేక్షాలంకారమును విశ్లేషిస్తుంది ఈవ్యాఖ్యానమే. శైలి అద్భుతము కవి హృదయము నావిష్కరించడంలో మేటి. నదిలో ఋషులు

స్నానానంతరము తన వస్త్రాలనారవేసుకున్నారట. మిగతా భాగం తెల్లని నీరుతో నిండుగా ప్రవహిస్తోందట, మందాకిని నది. దీనితో తెల్లని వస్త్రము, పృథుజఘనము గలిగి కాముకావృతమయిన నారి, సూచిత మయినదని భావన. గాలితో ఒడ్డు పై చెల్లా చెదరయినట్టియు, వ్యాపించినట్టియు, నీళ్ళలో ఎగురుతూన్నట్టి పూలను గమనించితే ప్రియుడులాగిన ఆర్ద్రవసనము గల స్త్రీ వలె,నది కనపడుతున్నదని వ్యంగ్యము. ఈ విషయాలు కూడ తీర్థీయములో సున్న.

ఓ సీత! కేవలము సుఖాలకే తావు అయినట్టి ఈచిత్రకూటంలో నివాసము అయోధ్యాపురవాసము కంటే అధిక సుఖావహము. మందాకినీదర్శనము. ఉద్దీపనకరము గావున, నీ దర్శనము కంటె మిక్కిలి సుఖకరము. తపస్సు, దమము, శమముచే నలరారు, నిష్పాపులు, అయిన సిద్ధుల పాదధూళితో, వారి స్నానంతో ధన్యమైన మందాకినిలో, నాతో గూడ (అనడంతో నన్ను అప్రధానంగా జేసి అని తృతీయార్థము) జలక్రీడలో సుఖమునను భవింపుము. సఖితో గూడి జలకాలాడినట్లు జలకాలాడుము. ఎర్రని కమలాలను, తెల్లని కమలాలను ముంచుతూ నీ శరీరము తాకిడి చేత, లేదా నీముఖ కాంతి చేత ఓడినవై మునుగుతున్న వాటినిగా చేయుచున్నదానివిగా అని ఉత్ప్రేక్షా అలంకారము. శరీరము తాకిడికి మునుగుతున్న వాటిని, సీతాదేవి జయించి ముంచుతున్నదా అన్నట్టు అని హేతూత్ప్రేక్ష అని భావము. జంతువులను, పౌరజానపదులను చూసినట్లు, చూడుము. దీనితో మనుష్యులను చూడలేదన్న క్లేశము తొలగిపోతుంది. మంచి తమ్ముడు, అనుకూలవతి అయిన భార్య రెండు ఉండటం అంటే సౌఖ్యరసాయన మన్న మాటే (రసాయనము–మందు). ఈనదిలో స్నానం చేస్తూ, తేనెలు గ్రోలుతూ, కందమూల ములతింటూ, మీ ఇద్దరితో ఉంటూ అయోధ్యానివాసాన్ని గాని, రాజ్యాన్ని గాని కోరనే కోరను, నాతలపుకే రాదు. ఆశ్రమమాహాత్మ్యంతో జాతివైరమును విడనాడి కలసి మెలసి తిరుగుతున్న, ఏనుగులు, సింహములు, లేళ్ళ గుంపులు గలిగినట్టిది, పాపహరమగు జలముగలిగిన, ఉద్దీపకములగు పూలచెట్లతో నొప్పుచున్నట్టి ఈనదిలో స్నానము పానములచే సుఖం పొందనివాడే ఉండడు గద! ఇట్లా ప్రియాసహాయుడయిన రాముడు, నదిని గూర్చినవి, ప్రసక్తమయినట్టి, అప్రసక్తమయినట్టి ఎన్నో విశేషాలను తెలియజేస్తూ, కళ్ళకు బెట్టుకునే కాటుకవంటికాంతి గల చిత్రకూట పర్వతప్రాంతంలో సంచరించాడు. దీనితో మళ్ళీ పురనివాసంపై నిస్పృహగలవాడు రాముడు అని చెప్పడంతో రామునికి గల వనవాస ప్రీతి చెప్పడం జరిగినది. ఈవిషయాలు గోవిందరాజీయంలో చక్కగా వివరించడం జరిగినది. తీర్థీయంలో మాట వరుసకు మాత్రమే చెప్పడం జరిగినది, కొన్ని శ్లోకాలకు వ్యాఖ్యానము గూడలేదు.

"ఇట్లా ప్రాసంగిక విషయాన్ని చెప్పి, ప్రకృతమును కవి అనుసరిస్తున్నాడు" అని మాటలతో 96వ సర్గ వ్యాఖ్యానాన్ని మొదలు పెడుతుంది గోవిందరాజీయము. రాముడు అట్లా మాట్లాడుతున్నప్పుడే పెద్ద కలకలము, దుమ్ము మిన్నంటాయి. అదేమో కనుక్కోమని రాముడు పురమాయిస్తే లక్ష్మణుడు కనుక్కొని భరతుడు ససైన్యంగా మనల్ని చంపడానికి వస్తున్నాడు, ఇదివరకు యుద్ధాలు చేసి జయం పొంది బాణాలకు శత్రుకళేబరాలను బలి ఇచ్చి, వాటి ఋణం నుండి విముక్తుడనైనట్లు ఇప్పుడు భరతుణ్ణి, సైన్యముతో బాటు సంహరించి మళ్ళీ బాణాల ఋణం నుండి విముక్తుణ్ణవుతానంటాడు లక్ష్మణుడు. పూర్వం యుద్ధం ఎక్కడ జరిగి ఉండవచ్చును? జవాబు వనవాసాని కన్న పూర్వం శంబరుని కుమారునితో యుద్ధం, దాంట్లో జయం పొందాడు రాముడు అని చెప్పాడు

గద! లక్ష్మణుడుకూడ అతనితో ఉండి ఉంటాడు తప్పక, అట్లా యుద్ధాలలో లక్ష్మణుడు బాణముల ఋణము నుండి విముక్తుడయాడు అని. తీర్థీయములో ఈ విషయం ప్రస్తావనకే రాలేదు.

97వ సర్గను "కోపించిన లక్ష్మణుని చల్లబరచడం ఈ సర్గలో" అని మొదలవుతుంది గోవిందరాజీయ వ్యాఖ్యానము. రాముడు భరతునితో ఇలా అన్నాడు. "రాముడు దప్ప మరెవరు ఇలా అనలేరని భావము" అని గోవిందరాజీయము సమీచీనంగా చెప్పింది. ఆ మాటలు-భరతుడు, పురుషప్రేరణ లేక స్వయంగా వచ్చాడు అంటే ధనుర్బాణాలతో, ఖడ్గాది ఆయుధాలతో పనిలేదు. భరతుడు మహాప్రాజ్ఞుడు. తండ్రిగారికి మాట ఇచ్చి, వచ్చిన భరతుని చంపి, ఆరాజ్యం నేనెట్లా తీసుకుంటాను. బాంధవులకు, మిత్రులకు ప్రాణనష్టం కలిగించే విధంగా నేను ఏ ద్రవ్యాన్ని, విషంగలిసిన తినుబండారమును తీసుకోనట్లు తీసుకోను, లక్ష్మణ! తమ్ముళ్ళ సుఖార్థం, వారికి కావలసిన దానికొరకు, వారి వృద్ధి కొరకు, నేను రాజ్యాన్ని కూడ తాకను, కోరను అని ఆయుధం మీద ప్రమాణం చేసి చెప్పుచున్నాను. 1. తండ్రి మాటను తప్పను. 2. రాజ్యంకొరకు భరతునితో యుద్ధం చేయను. 3. తమ్ముళ్ల కొరకే నా ధర్మార్థకామపురుషార్థములు 4. వారిబాగోగులకే పని చేస్తాను, సుఖం కలిగిస్తాను. దీని కొరకు అనేకం ఇబ్బందులతో (బహుఛిద్రములతో) గూడినదైనప్పటికి, తీసుకోవడం నా కిష్టం లేనప్పటికి, రాజ్యం పేరుమీద, ఆయుధం పేరుమీద సత్యం చెప్పుతున్నాను. తీర్థీయం టూకీగా చెప్పింది.

"లక్ష్మణుని చిత్తంలో ఉన్నది కాదు అని పరిహరించి భరతుడు వచ్చిన అసలు విషయాన్ని చెప్పుతున్నాడు రాముడు" అని మళ్ళీ వ్యాఖ్యానాన్ని గోవిందరాజీయము వివరిస్తుంది. మేనమామ ఇంటినుండి వచ్చి, విషయాన్ని తెలుసుకొని ఉంటాడు. సోదరులపై ప్రేమగలవాడు గనుక, నాకు నాప్రాణాల కన్న మిన్నయైన భరతుడు చూడటానికి వచ్చి ఉంటాడు. మరేమి కాదు. నన్ను, నిన్ను, సీతను చూడటానికి వస్తున్నాడు. తల్లిని కోప్పడి, తండ్రిని ఒప్పించి, రాజ్యాన్ని నాకు ఇవ్వడానికి వస్తున్నాడు. ఇదీ అసలు సంగతి. పూర్వం భరతుడెప్పుడైనా నాకపకారం తలపెట్టాడా? ఇలా అనుమానపడతావు? భరతుణ్ణి గూర్చి నిష్ఠూరాలు ఆడకు, భరతునితో పుల్లవిరుపు మాటలు చెప్పకు. అట్లా చేస్తే నాతో నిష్ఠూరమాడినట్లు, నాకపకారం చేసినట్లు.

"తనను ఆశ్రయించిన వారి విషయంలో చేసినట్టి అపచారము, తనకు జరిగినట్టే అని భగవంతుని అభిప్రాయము" అనునది, దీంతో తెలుస్తున్నది అని గోవిందరాజీయ వ్యాఖ్యానము.

రాముని హితము గోరియే లక్ష్మణుడు, భయం చెంది అలా మాట్లాడాడు గాని స్వార్థబుద్ధితో కానే కాదు. రాముని మాటలకు లక్ష్మణుడు సిగ్గుతో కుంచించుకొని, మరోమాట చెప్పాడు. రాముడు భావజ్ఞుడు అంటుంది గోవిందరాజీయము.

98వ సర్గలో భరతుడు రాముని చేరుట అని వ్యాఖ్య మొదలవుతుంది గోవిందరాజీయములో. రామలక్ష్మణ సీతలను జూచునంతవరకు నామనసుకు శాంతి లేదంటాడు భరతుడు. తీర్థీయము చెప్పిన దుఃఖ శాంతితో బాటు, మంగళమును కూడ జోడిస్తుంది గోవిందరాజీయం. మహారాజలక్షణయుక్తములయిన రాముని పాదములను నాతలపై పెట్టుకొనేవరకు శాంతి లేదంటాడు భరతుడు. తనకు తగిన సింహాసనమునకు ప్రతినిధిగా, ధరించిన వాటిని (పాదుకలను) నాకు శ్రీ పాదములను మౌళిని ఇచ్చేంతవరకు మనశ్శాంతి లేదు. సీతాదేవి మహా

భాగ్యవంతురాలు, గొప్పకులంలో పుట్టినది, గొప్పతండ్రి కూతురు కనుకనే సాగరాంతము వ్యాపించిన పృథివీ భర్తను అనుసరిస్తున్నది. ఆమె కృతకృత్యురాలు! ఈ చిత్రకూట పర్వతము ఇతరప్రదేశముల కంటె అతిరమణీయము, అందరు కోరి, చేరదగినది. ఎందుకంటె నందనంలో కుబేరుడు నివసిస్తున్నట్లు రాముడిందు నివాసమున్నాడు. ఈ పర్వతము గిరిరాజోపమము. శ్రీనివాససాన్నిధ్యమునకు స్థానమైనట్టి వేంకటాచలము. రెండింటికీ కారణము రాముడు నివసించుట. తన ఇంటిని వదలి నందనములో విహరించు, కుబేరుడు ఉపమానము రాముడు అయోధ్యను విడచి చిత్రకూటములో విహరించుట అన్నమాట, ముందుకాండలో చెప్పబోతాడు "పర్వతములు, అడవులతో గూడిన ఈ భూమియంతయు ఇక్ష్వాకులదే" అని. ఈ శ్లోకానికి (12వ దానికి) మూడు విధాల అర్థం చెబుతుంది. గోవిందరాజీయము, అవి ఇవి. 1. తన దేశం వదలి అపరిచితమైన స్థానంలో నివసిస్తున్నాడు. దీనికి ఉపమానం. చైత్రరథములో ఉండదగినట్టి కుబేరుడు ఇంద్రుని నందనోద్యానంలో విహరించినట్టు 2. తన ఇల్లు వదలి, తన ఇంటి ఉద్యానంలో విహరించుతున్న కుబేరునివలె నివసిస్తున్నాడు, అని రామునకు చిత్రకూటమునందు చాలా భోగ్యంగా ఉన్నది. కాకుత్థ్సుడు తన కులమును కృతార్థము చేసినట్లు రాముడు స్వవాస స్థలమును కూడ కృతార్థము చేసినాడని భావము. 3. కు-అనగా భూమి, బేరం అనగా శరీరము. జగత్తు శరీరంగా గలవాడు పరమాత్మ. నందనవనంలో వైకుంఠంలో వలె అని తీర్థీయము. గిరిరాజోపమము. హిమవత్సదృశమునందు- నందనుడు కుబేరోద్యానమునందు అని చెప్పి విరమిస్తుంది.

పాములు మొదలయిన వాటితో గూడిన, జనులెవరు చొరరాని ఈ చిత్రకూటము, ఈ అడవి కూడ కృతార్థమయినది గదా! స్థలము, దాని స్వభావాన్ని బట్టి వాసయోగ్యం కాదు, రామవైభవము దృష్ట్యా కూడ, రామునకు వాసయోగ్యం కాదు. ఇది గోవిందరాజీయము. ఇక్కడ కృతార్థశబ్దమునకు తీర్థీయము బాగా వ్యాఖ్యానించింది. "తనకు గల స్థావరత్వమును తొలగించే రాముని పాదధూళి సోకినందున ధన్యము" అని.

"భరతుడు రాముని కలియుట 99వ సర్గలో" అని వ్యాఖ్యానారంభము చేస్తుంది గోవిందరాజీయము. రాముని ఆశ్రమపు గుర్తులు శత్రుఘ్నునకు చెప్పి, తాను త్వరగా వెళ్ళాడు భరతుడు. శత్రుఘ్నునకు తక్కువ ప్రేమనా రామునిపై, అందుకని వసిష్ఠునితో తల్లులను తీసుకు రమ్మని పురమాయించి శత్రుఘ్నుడు వెళ్ళాడు. సుమంత్రుడు కూడ వెంటనే శత్రుఘ్నుని వెంటనంటాడు. రాముని నివాసమును ఖచ్చితంగా తెలుసుకొని వచ్చి తల్లులను తీసుకుని వెళ్దామని, తల్లులను సేనల గుడారం వద్దనే ఉంచి, భరతుడు వెళ్ళాడని తెలుస్తున్నది. భరతుడు, వెనుక శత్రుఘ్నుడు, ఆ వెనుక సుమంత్రుడు వెళ్ళారు అని భావము. ఆశ్రమముల మధ్యన, తాపసుల ఆశ్రమంతో సమానంగా నిర్మించి ఉన్న రాముని పర్ణకుటీరమును భరతుడు చూశాడు. ఆశ్రమం ఎదుట, కొట్టిన కట్టెలను, పూలను చూశాడు. రాత్రి వెలుతురు కొరకు కట్టెలు, పూజకు పూలు ఉపయోగపడుతాయి. రాకపోకలు-జలాశయము నుండి ఆశ్రమానికి వెళ్ళే రాముడు గుర్తుకోసం ఉంచిన దర్భలను, చలికాచుకోవడంకోసం తెచ్చి గుట్టగా పోసిన ఏరుపిడకలను, చెట్లపై ఆరవేసిన నారచీరలను, ఆశ్రమచిహ్నాలుగా గుర్తించాడు. అకాలంలో కూడ, ఆశ్రమం గుర్తించి రావడానికి గుర్తులుగా లక్ష్మణుడు, రాముని, సీత యొక్క నారవస్త్రములను చెట్లకొమ్మలకు వ్రేలాడ దీశాడన్న మాట. మందాకినీ నది ఇక్కడికి కొద్ది దూరంలోనే ఉండవచ్చును, భరద్వాజముని చెప్పిన స్థలానికి వచ్చామనే అనుకుంటున్నాను అంటాడు భరతుడు. 'వచ్చాము' అని అనడానికి బదులు, "అని అనుకుంటున్నాను"

అనడంలో తాత్పర్యం ఏమంటే– కైకేయి చేత రాజ్యము నుండి వంచితుడయినట్టి, భాగ్యహీనుడయినట్టి నాకు ఆప్రదేశం దొరుకుతుందా? ఇదేదో అని కాలం గాని కాలంలో గుర్తు పట్టడానికి వీలుగా ఎత్తయిన చెట్టుకొమ్మల మీద లక్ష్మణుడు బట్టలు ఆరవేసాడు. మనము ఇదే దారిన ఆశ్రమానికి వెళ్దాము అని భరతుని అభిప్రాయము. ఇట్లా తోవగుర్తులు ఏర్పరచుకోవడానికి కారణము. ఏనుగులు తమ కాళ్ళతో తొక్కి తోవ కనపడకుండా చేయడమే నన్నమాట. ఈ సర్గలోని 12వ శ్లోకానికి గోవిందరాజీయము చాలా పెద్ద వ్యాఖ్యానం చేసింది, ఆక్షేపాలకు సమాధానాలు చెప్పింది. తీర్థీయంలో వీటి ప్రసక్తియే లేదు. వీలయినంత క్లుప్తంగా అది తెలుసుకుందాము.

"తాపసులు సాయం హోమము, ప్రాతర్హోమము చేయడానికి అగ్నిని ఎల్లప్పుడు (ఆరిపోకుండా) కాపాడుకొంటారు. అట్టి అగ్నినుండి విపరీతంగా పొగవస్తున్నది" అని శ్లోక తాత్పర్యము. ఇక ఆక్షేపము. వంటకుపయోగించే నిప్పుకాక హోమాగ్నియును కాకుండ ఎల్లకాలం నిలవ ఉండే గార్హపత్యాగ్ని అని తెలుపడానికి 'సంకుల' శబ్దం ప్రయోగించాడు. వండుకునే నిప్పులో మంటలు ఎక్కువగా ఉంటాయి, హోమాగ్నిలో గడ్డి, (శర) నిప్పులు పెట్టి మంట పెట్టినందున పెద్ద పొగ రాదు అని భావము. దీని వలన, అగ్న్యాధానము రామునికి లేక పోవడం చేత ఇక్కడ చెప్పిన అగ్ని శ్రౌతాగ్ని కాకుండ ధార్యమయిన స్మార్తాగ్నియే (బహుశ స్మృతి ధర్మశాస్త్రములలో, గృహ్య, ధర్మ సూత్రములలోనే చెప్పబడిన కర్మలకనుకూలమయిన అగ్ని అయి ఉండవచ్చును గాని శ్రౌత సూత్రములలో చెప్పబడిన కర్మలకనుకూలమయినది కాకపోవచ్చునేమో అని నా అభిప్రాయము). రామునకు త్రేతాగ్ని లేదు. ఉంటే చరమ యాత్రయందు "నెయ్యితో మండుతున్న అగ్నిహోత్రం ముందుగా వెళ్ళనీ", అని రాముడు పురోహితునికి చెప్పినట్టు ఉన్నది. అట్లాగే వనయాత్ర ముందు కూడ అట్లానే అగ్ని ముందుండేది. వెంట వచ్చే పౌరవృద్ధులు కూడ అగ్నితో సహ వచ్చినట్లు చెప్పబడేవారు. అదీగాక రాజ్యాభిషేకానికి ముందు పూర్వము యజ్ఞము చేసినట్టు కనబడదు కనుక ఈ అగ్ని గృహ్యాగ్నియే, దాన్ని తేవడం కూడ ఇంతకు ముందు చెప్పలేదు అని ఆక్షేపించగూడదు. ఎందుకంటే (జవాబు) ఆ అగ్నిని స్వయంగా కూడ సమారోపణముతో తెచ్చుకోవచ్చును. (ఆక్షే) ఆత్మ సమారోపణముతో తెచ్చుకోవడం వీలుగా వచ్చును కాని పొద్దున, మాపటికి చేసే హోమం చెప్పలేదు, పైగా తమసానదీతీరంలో, గంగఒడ్డు చెట్టు మొదట్లో, భరద్వాజాశ్రమంలో గూడ,యమున ఒడ్డు మీద గూడ కేవలం సంధ్యావందనం చేసినట్టు వర్ణించాడు వాల్మీకి ముని. ఈశ్లోకంలో గూడ "తాపస" "వన" పదాలు ప్రయోగించినందున చలిని తొలగించుకోవడానికి, వెలుతురు కోసం కందమూలాదులను ఉడికించడానికి, వండడానికి సాధనమైన సంగ్రహించుకునే అగ్నిని చెప్పాడు. ఆధానం అంటే సంగ్రహమే గద! కనుక ఈ శ్లోకంలో చెప్పింది వంటవార్పు గురించిన అగ్నినే కాని ధార్యమైన స్మార్తాగ్నిని కూడ కాదు అని. ఇక సమాధానము– ముందు ముందు "ఈశాన్య భాగమునకు వంగిన (తూర్పు ఉత్తరములకు పెరిగి) వేదిలో మండుతున్న అగ్ని" అని చెప్పబోతున్న దానికి విరోధము ఏర్పడుతుంది. అసంస్కృతాగ్నికి వేదితో సంబంధము ప్రసిద్ధము కాదు. అంటే మూడు విధములైన అగ్నికే– ఆహవనీయ, దాక్షిణాత్య, గార్హపత్యరూపము అయిన అగ్నులకే వేదితో సంబంధము శాస్త్రప్రసిద్ధము. (పూ.ప) మరి అయితే సాయంప్రాతర్హోమాల సంగతి ఏమిటి? వాటి గురించి చెప్పలేదు గద! (సమాధానం). సుతీక్ష్ణాశ్రమంలో అనుదిత హోమపక్షంగా, ఉదయానికి పూర్వము అగ్ని అని ఏకవచనం చెప్పడం చేత అగ్ని ఉపాసన రాముడు బాగా చేసినట్టు చెప్పడం జరిగినది. లేకుంటే వాల్మీకి ముని ఒక అగ్నినే మాటి మాటికి

చెప్పడం, రామునికి అగ్ని ఉపాసన లేకుంటే, ఏ ఫలం లేకుంటే వ్యర్థమే అవుతుంది. ఈ అగ్ని కార్యంలో రాముడు ప్రధాన కర్త, సీత సహభావము నందించినది, మరియు అగ్నిని తేవడంలో సహకరించినది. ఇక లక్ష్మణుడు ఏమో సమిధలు మొదలయినవి తేవడంలో సహకారం చేశాడు. అతి సంకట దేశంలో (స్థానంలో) గూడ రాముడు అనుష్ఠానం బాగా చేసేవాడని "అథ తేఽగ్నిం,.........తపస్వి శరణే వనే" అనే శ్లోకాల ద్వారా తెలిపాడు. కనుక వనవాసంలో ఉన్న పద్నాలుగు ఏళ్ళలో, సీతను అపహరించుకొని పోయేంత వరకు, చిత్రకూటములో పంచవటిలో ఉన్నప్పుడు, అది నెలలు, ఏళ్ళగా చాలా కాలం ఉన్నప్పుడు, కుటీరం వెలుపల వాకిటిలో స్మార్త నిత్యాగ్ని ధారణం ఉండింది. ఇతర చోట్లలో ఉన్నప్పుడు (ఆత్మలో) సమిధలో గాని అగ్నిని పెట్టి, హోమకాలములో బయటకు దీసి సాయం ప్రాతరౌపాసనము చేసెడివాడనుట సమంజసము. ఆ అగ్ని తాపసులు కూడ ఆధానం చేయునట్టిది అనుట వలన, కేవలం గుర్తుగానే గాకుండ, కుటీరమును పావనము చేయునది అని చెప్పినట్లయినది. "వీరాసనము అనగా యోగుల యొక్క ఆసనమని" తీర్థీయం.

"భూమి మీద కూచొని కుడిమోకాలు మీద పెట్టుకున్న ఎడమ కాలుతో ఉండటం" అని గోవిందరాజీయం. నా గురించి అడవులకు వచ్చిన రాముని కాళ్ళపై పడతాను, ప్రసన్నుని చేసుకుంటాను. చిన్నవాడైనా లక్ష్మణుని కాళ్ళ మీద గూడ పడతాను. పని గురించి రాముని నేను బ్రతిమాలుతుండగా, కైకేయి అపరాధం నాపై ఆరోపించి, రాముణ్ణి అయోధ్యకు రాకుండా ఆపినట్లయితే, కార్యగౌరవం చేత అతని కాళ్ళు పట్టుకుంటాను. రాముని ప్రసన్నం చేసుకునే పని సులభంగా వీలైనట్లయితే, చిన్నవాడి కాళ్ళ మీద పడటం తప్పు అని భరతుని హృదయంలో ఉన్నది. ఇక్కడ పాఠభేదం కూడ ఉంది. "సీతాయాశ్చ పునః పునః" లక్ష్మణుని పేరులేదు. "సీతాయా లక్ష్మణస్య చ", అని ఉన్న పాఠాన్ని రామభక్తులు వారిద్దరు కనుక వయస్సు గురించి పట్టింపులేదని సమర్థించవచ్చును. ఈ వివరణ తీర్థీయంలో కానరాదు.

ఈ 99వ సర్గలోని 24వ శ్లోకంలో చివరి అక్షరం 'ణం' అని గాయత్రిమంత్రంలోని ఏడవ అక్షరం 'తత్సవితుర్వ రేణ్యం' ఉన్నది అని రెండు వ్యాఖ్యానాలు. ఆరువేల శ్లోకాలు అయిపోయాయి అని గోవిందరాజీయంలో ఎక్కువగా ఉన్నది.

రాముని చూడటంలో ఉన్న విశేషాన్ని గోవిందరాజీయం బాగా వివరించింది. పూర్వము గొప్ప విలువైన వస్త్రములు ధరించువాడు ఇప్పుడు తద్విలక్షణముగా కృష్ణాజినము ధరించినవాడు. ఉత్తరీయముగా కృష్ణాజినము, ధోవతిగా నారచీరలను గట్టేవాడు, పూర్వం కంటె శోభకల్గినవాడు, వల్కములు గట్టినా రామణీయకత తరగనివాడు, ఆసనంమీద కూచుని ధ్యానించుచున్నవాడు. అగ్నిలా వెలుగుతున్నవాడు, తపస్సు చేత చుట్టూ దివ్యతేజస్సు గలవాడు, లేదా "కారుమబ్బుల మధ్య మెరుపు తీగవలె భాస్వరా" అని చెప్పబడినట్లు మెరుపులతో కూడిన కారుమొయిలు వలె ఉన్నవాడు, లేదా శత్రువులచే, విరోధులచే తిరస్కరింపబడనివాడు లేదా కుటీరంలో ఆసీనుడైనవాడు, అయోధ్యలోని సమాజం కంటె చిన్న కొలువే అయినా, ఈసభ గొప్పది అయింది అని భావమట. ఎందుకని? చుట్టూ అగ్నితో సమమైనవాడు, ఆ అయోధ్యాసభలో దగ్గరగా ఉండే తమ్మునికి గూడ, ఇక్కడ దగ్గరకు రావడానికి

శక్తిలేదు, చుట్టూ నిప్పు మండుతుండే వ్యక్తి సమీపానికి ఎవరికయినా వెళ్ళ రాదు కద! లేదా రాముడు శ్యాముడు, లేదా అగ్నితో సమానుడు, చూడనలవి కానివాడు. అందుకే వర్ణన మొదట క్షణంసేపు చూసి అని చెప్పాడు "వాల్మీకి మహాముని" అని వివరణ. బ్రహ్మదేవుని కన్న విలక్షణుడని 'శాశ్వత' మను విశేషణము తెలుపుతున్నది అని కూడా.

"రాముడు భరతుని చూసాడు, రాజ్యాన్ని పాలిస్తున్నాడని అనుకొని రాజ్యనీతిని అడుగుతున్నాడు ఈ నూరవ సర్గలో" అని గోవిందరాజీయము వ్యాఖ్యానాన్ని ఆరంభిస్తుంది.

"భరతుడు జడలను, నారచీరలను ధరించి ఉన్నాడు" ఇదెట్లా పొసగుతుంది. 88వ సర్గలో జడలను నారవస్త్రములను ధరించి ఉన్నాడు భరతుడు అని చెప్పాడు. 90వ సర్గలో భరద్వాజుని దర్శనసమయంలో భరతుడు పట్టు పుట్టములు కట్టుకున్నాడని వర్ణించాడు, ఇప్పుడేమో ఆయన జటావల్కలములను ధరించి ఉన్నాడని, ఇది వరకటినుండే దాన్ని చెపుతున్నట్లు చెప్పాడు అని ఆక్షేపించుకొని, తీర్థీయం ఇట్లా సమాధానం చెపుతుంది. గుహుని ఊళ్ళో రాత్రి ప్రతిజ్ఞ చేశాడు, మరుసటి రోజు భరద్వాజుని ఆశ్రమంలో అతణ్ణి చూశాక జటావల్కలధారణం చేస్తాననే అభిప్రాయంతో వచ్చాడు. ఆతిథ్యమివ్వడానికి భరద్వాజుడు పిలిచినందున, అప్పుడు అవకాశం లేకపోయింది. భరద్వాజుని ఆశ్రమం నుండి బయలుదేరాక జటావల్కలధారణం చేశాడు, కనుక అంత సమీచీనంగానే ఉన్నది.

ఇక గోవిందరాజీయం. మొదట రాజనీతిని అడుగుతున్నాడు అని అంటుంది. లేదా భగవంతుడైన రాముడు కుశలప్రశ్నల నెపంతో రాజ్యం ఎలా రక్షించాలో, రాజనీతి ఎలాటిదో నేర్పుతున్నాడు, ఎందుకంటె తరువాత దశరథుని మరణం వినడం, భరతుడు భూమిపై పడుకొనడం మొదలైన వాటితో నీతి గరిపే వీలుండదు గనుక. మంచి పూలమాల కనబడితే, ఇది భరతుని కొప్పుకు బాగుంటుంది అనేవాడు దశరథుడు, ఆ భరతుడే జటలను ధరించాడని రాముడు అచ్చెరువు చెందుతున్నాడు. మంచి పట్టుబట్టలు కనబడితే బాల భరతుడికి బాగా నప్పుతుంది అనేవాడు దశరథుడు, అట్టి భరతుడు వల్కలధారిగా ఉన్నాడని ఆశ్చర్యము. గోముగా తండ్రియాచనాపూర్వకంగా ఇచ్చినా తీసుకోనట్టి భరతుడు పబ్బము కట్టుకొని అడుగుతూ నిలబడ్డాడు. ఇంకా ఆశ్చర్యము పూలసెజ్జ (శయ్య-పానుపు) కూడ ఎక్కడ ఒత్తుకుంటుందో అని తండ్రి తన ఒడిలో పడుకోబెట్టుకునేవాడు భరతుణ్ణి. అలాటివాడు భూమ్మీద బోర్లాపడ్డాడని మిక్కిలి ఖేదపడ్డాడు. రాముడు భరతునిపై దృష్టి సారించాడు, దానిని గమనించకుండ ఉన్న వానిని, రాముని చూచుటకు యోగ్యుడుగా లేనివాడని అర్థము. లేదా అతనిని అట్లా జడలు, వల్కలములతో చూడడము అతని స్నేహితులకు కష్టంగా ఉన్నది. కష్టం మీద చూడదగిన వానిని, చాలా కష్టం మీద ఇతడు భరతుడు అని తెలుసుకోగలిగిన వానిని అన్నమాట. యుగాంతములోని సూర్యుని వలె అని ఉపమించినందున, కేవలం రామునికే కాకుండ ఎవరికైనా అతన్ని చూడడం కష్టంగా ఉందని భావము. లేదా యుగాంతంలో భూమిపైపడిన సూర్యుడివలె ఉన్నవాడిని అనడంతో, పూర్వములాగా గొప్ప తేజస్సు లేనివాడిని, అంతటి అవస్థకు తగనివాడని తాత్పర్యము. భరతుని జటావల్కల ధారణాన్ని తీర్థీయంలాగానే సమర్థిస్తుంది. పూర్వమే ఒకసారి ప్రతిపాదించడం జరిగిందంటుంది గోవిందరాజీయము. వివరణ సమీచీనంగా ఉన్నది.

పాలిపోయిన ముఖంగల భరతుని, రాముడు లేవనెత్తి, తలను మూర్కొని, కౌగలించుకొని, తొడపై కూచోబెట్టుకొని అడిగాడు. తండ్రిగారికేమయినది, నీవు అడవికి వచ్చావు? అంటే ఆయనకు నీవు సేవచేస్తుండ వలసిన వాడివి గద అని భావము. లేదా తండ్రి నీ ఎడబాటును సహించలేడు గద! దీనికి భరతుడు కిమ్మన లేదు అని, రాముడు వెంటనే మరోప్రశ్న వేయడాన్ని బట్టి తెలుస్తున్నది. చాలాకాలానికి కనబడుతున్నావు, దూరాన ఉన్న కేకయ నగరం నుండి వచ్చినందున, అలసటతో ఉన్న నిన్ను భరతుడు అని గుర్తించడమే కష్టము. అడవిలో నీకు ఏమి పని పడినది? ఆ పని రెండు విధాల ఉండవచ్చును. ఒకటి రాజు బ్రతికి ఉండి ఆయన ఆజ్ఞతో నన్ను దర్శించడానికి రావడం, రెండవది- ఆయన చనిపోతే, పిల్లవాడైన నీరాజ్యాన్ని ఎవరయినా హస్తగతం చేసుకుంటేనయినా రావడము. ఇట్లా అనేక విషయాలు గోవిందరాజీయంలో ఉన్నాయి. వీటి ప్రసక్తి తీర్థీయంలో లేదు. విద్యలు కలవారలు వైద్యులు కనుక విద్వాంసులని అర్థము వివరిస్తుంది వైద్యశబ్దానికి. అట్లాగా భరతునికి మాత్రమే ఉన్న పురోహితుడు సుయజ్ఞుడు, మంత్రము (రాజు మంత్రులతో గలిసి చేయు మంత్రాగము రాజ్యవిషయకమై అని భావము) విజయమూలము. దానిని బాగుగా రహస్యముగా ఉంచాలి. మళ్ళీ తరువాత, నీవు ఒక్కడివే నిర్ణయాలు తీసుకోవడం లేదు గద! ఏదయిన ఒక విషయముపై మక్కువతో, తీసుకునే నిర్ణయానికి చెందిన గుణములను అవగుణములను గ్రహించడం, ఉన్నదున్నట్లుగా తెలుసుకోవడం వీలుకాదు, పోనీ, చాలా మందితో మంత్రాంగం చేస్తే ఐకమత్యం మొదట వీలు కాదు, ఆవిచారము బయటకు పొక్కవచ్చు గూడ! మొదట చెప్పినప్పుడు విజయమూలముగా చెప్పినందున, ఇప్పుడు స్వతంత్రముగా మంత్రమును గురించి చెప్పినందువల్ల పునరుక్తి లేదు అని గోవిందరాజీయము. తీర్థీయం నుండి విషయాలను గ్రహించి, గోవిందరాజీయము ఎక్కువగా, సమీచీనముగ వివరిస్తున్నది.

వేగంగా పరులు చెప్పిన దానిని, భావాన్ని గ్రహించేవాడు మేధావి, స్థిరమయిన బుద్ధి గలవాడు శూరుడు, విచారము చేయ సమర్థుడు దక్షుడు, నీతి శాస్త్రమును అభ్యసించినవాడు విచక్షణుడు అని గోవిందరాజీయము వివరిస్తుంది.

గూఢచర్యం గురించి రెండు వ్యాఖ్యానాల్లో వివరంగా ఉన్నది. శత్రురాజులకు చెందిన 18 విభాగాల్లో, ఒక్కొక్కదాని విషయం తెలుసుకోడానికి ముగ్గురు చొప్పున వేగువారిని నియమించుకోవాలి. వారిలో వారికి ఎవరికీ ఒకరు వేగువారు అని తెలియకూడదు. ఆ18 విభాగాలు. వీటికే 'తీర్థము' అని పారిభాషిక పదము ఉపయోగిస్తారు.

అది ఇవి- 1.మంత్రులు, 2.పురోహితులు, 3. యువరాజు, 4.సేనాపతి 5.దౌవారికులు, 6.అంతర్వంశికులు, 7. కారాగారాధ్యక్షులు, 8. ధనాగారాధ్యక్షులు, 9. కార్యనియోజకులు, 10. న్యాయాధీశులు, 11. సేనా నాయకులు, 12.నగరాధ్యక్షులు, 13.పనివారల అధ్యక్షులు,14.సభ్యులు, 15.ధర్మాధ్యక్షులు, 16.దండపాలురు, 17.దుర్గపాలురు, 18. అంతపాలురు అని. ఇక తమ రాష్ట్రంలో కూడ మంత్రి, పురోహిత, యువరాజు అను మొదటి మూడింటిని వదలి పెట్టి మిగత 15 విభాగాల్లో పని ఎట్లా జరుగుతున్నదని వేగులవారి ద్వారా తెలుసుకుంటూ వారిపై ఓకన్ను వేసి ఉండాలి. దౌవారికుడు అంతఃపురం లోనికి, ప్రాసాదంలోకి వచ్చిపోయేవారిని నియంత్రించువాడు,

అంతర్వంశికుడు అంతఃపుర కార్యనిర్వాహకుడు, కార్యనియోజకుడు రాజాజ్ఞను చాటింపు వేయించువాడు, సభల నడుపువాడు కొలువు కూటములోనికి వచ్చువారిని నియంత్రించువాడు. అలంకరించువాడు, ఆసనాదులను సమకూర్చువాడు, హెచ్చరికలు చేయువాడు సభ్యుడు. వ్యవహారములను దీర్చువాడు ధర్మాధ్యక్షుడు, అపరాధులకు రాజాజ్ఞ చొప్పున వేసిన శిక్షలనమలు చేయువాడు దండపాలుడు, తమ దేశం యొక్క సరిహద్దు పొడవునా పరరాజు ఆక్రమణ కాకుండా ఎల్లప్పుడు కాపాడువాడు అంతపాలుడు. ఇట్లా అందరిని పరీక్షిస్తూ రాజ్యాన్ని కాపాడుకోవాలి. ఇక, తన మంత్రి, పురోహిత, యువరాజులు ఎల్లప్పుడు తనతో ఉండేవారే గనుక వారి పరీక్ష అవసరముండదు, వారిస్వభావం గురించి తనకు బాగా తెలియడం కూడ మరోకారణము వారిని పరీక్షించక పోవడానికి.

లోకాయతికులంటే చార్వాకులని ఒక్కమాటలో తీర్థీయం చెబుతుంది. గోవిందరాజీయం మాత్రం– లోకము అనగా ప్రత్యక్ష ప్రమాణము. దీనితో చూడబడుతున్నది అను వ్యుత్పత్త్యర్థము చేత లోకంలో ఆయతము విస్తృతము గనుక కూడ లోకాయతము ప్రత్యక్షము, దానిని ఒప్పుకునే వారు లేదా ఆ అంతటను వ్యాపించి ఉన్నదానిని, సమీపమున ఉన్నట్టిది అయిన ధూమాదులచే, నిప్పు మొదలయినవి తెలుసుకొనబడుతున్నందున, ఆయతము అనగా ‘ అనుమాన’ ప్రమాణమని అర్థము. అవి కలవారు లోకాయతికులు. బౌద్ధులు, చార్వాకులు, నాస్తికులు అని వివరిస్తుంది. వారు అనర్థకుశలురు. [1]తత్త్వార్థములలో ఉన్నదున్నట్లుగా తెలుసుకున్న వారు కాదు 2 లేదా అనర్థము అనగా శ్రద్ధగా ధర్మమును అనుష్ఠించకపోవడముచేత కలుగునట్టి, సజ్జనుల వలన బహిష్కారము, తద్వారా నరకము లోపడుట మొదలగునవి. అలాటి దుర్బోధన చేత అనర్థములను సంపాదించి పెట్టడంలో నేర్పరులు లోకాయతికులు. వారు తత్త్వజ్ఞానవిరుద్ధమైన జ్ఞానం కలవారు. అందుకని, అజ్ఞానం కలవారి కింద, బాలురకిందే లెక్క. తమను పండితులు కాకున్నా తాము పండితులమనుకునేవారు, అందుకని వారు అనర్థకుశలురు అని బాగుగా వివరిస్తుంది గోవిందరాజీయము. వేదమార్గవిపరీతబుద్ధికల ఆ లోకాయతులు, సాత్త్విక మహర్షి ప్రణీత తామసస్మృతి పురాణాదులలో బద్ధశ్రద్ధులై, విశేషంగా శుష్కతర్కము నాశ్రయించి, నిరర్థముగా ప్రవాదములు చేస్తుంటారు అని కూడ విపులీకరిస్తుంది, మనుస్మృతిలోని “ఆర్షం” ఇత్యాది శ్లోకమునుదాహరిస్తుంది కూడ. ఇట్లాగే సమాజ శబ్దాన్ని బాగా వివరిస్తుంది. ధర్మ నిర్ణయార్థ సభ (ఇప్పటి పంచాయతీ, రచ్చబండ లోక అదాలత్ లాటిది కావచ్చును) లేదా నదీతీరంలో, చెరువు ఒడ్డుపై ఉన్న చెట్ల కింద ఏదైన ఒక వారమునాడు అన్ని సరుకులు అమ్మకానికి కొనడానికి దొరికే స్థలము నేటికాలపు, సంత, అంగడి, బజారులాటిది. (ఇప్పుడు సూపర్ బజారులు, మాల్‌లు, మొదలయినవి వచ్చి,అవి కనబడకుండ పోతున్నవి, పోయినవి, పోతవి)

ప్రశ్నించడానికి ‘కచ్చిత్’ అని ప్రయోగిస్తారు సంస్కృతంలో. ఇది వాక్యం మొదట్లో రావచ్చును, చివర్లో రావచ్చును. ప్రజలకు భయంలేదు కద! సుఖంగా ఉన్నది. గద! తెలుగులో ‘ఆ’ చేరిస్తే ప్రశ్న అవుతుంది. “క్షేమంగా

---

1. ఒక స్త్రీ సగం శరీరంలో యవ్వనం కలది, సగంలో వృద్ధురాలు అన్నట్టు కచ్చిత్ వాక్యం మొదట, చివరనే ఉపయోగించాలి, మధ్యన కూడదు, అని అనరాదు.

ఉన్నావా? పోయిందా? వచ్చిందా మొదలయినవి. రెండు వ్యాఖ్యానాలు, కచ్చిత్ రెండు సార్లు ప్రయోగించడానిని సమర్థిస్తాయి. ఒకడుగు ముందుకు వేసి గోవిందరాజీయము ఇలా వివరిస్తుంది. ఒక్కొక్క విశేషణానిక్కూడ కచ్చిత్ ప్రయోగం దాని ద్వారా ప్రశ్న అని తెలుస్తున్నది. భక్తి పారవశ్యంలో రెండు శ్లోకాలు కూడ చెప్పి సమర్థిస్తుంది. ఆ శ్లోకాల భావం మొదట చివర ప్రయోగించిన ఈ కచ్చిత్ పదాన్ని, మధ్యన కూడ అన్వయింపవచ్చును. ప్రశ్న సమానమే అయినపుడు కచ్చిత్ మొదటే ఉండాలి తరువాత కూడదు అనడం బాగా లేదు. ఇక్కడ అర్ధ జరతీ న్యాయం పనికి రాదు. ఇట్లా మధ్యలో ప్రయోగించడం ద్వారా శ్రీమత్కోసల వంశంవారి (లేదా దేశం వారి) ఆదరాతిశయం తెలుస్తున్నది. దీనిని బట్టి రఘునాథుడు ప్రసాదించే ముక్తి పిపీలికం–చీమ వరకు అని స్ఫుటంగా తెలుస్తున్నది". అని.

రోజూ కొలువుదీరిగాని, రాజమార్గాలలో గాని బాగా అలంకృతుడవై ప్రజలకు దర్శన మిస్తున్నావా? అని రాముడు ప్రశ్నిస్తాడు. ఇక్కడ ఇలా వివరిస్తుంది గోవిందరాజీయము. అట్లా దర్శనమియ్యక పోతే రాజుగారి ఆరోగ్యం విషయంలో ప్రజలకు శంక కలుగుతుంది. ధర్మార్థకామములను వర్గమును బాగుగా ఒకటి మరొక దానిని బాధించకుండ సేవిస్తున్నావా? ఇక్కడ గోవిందరాజీయము విశదంగా వివరిస్తుంది. ధర్మాన్ని సంపాదించడానికి యోగ్యమయిన పూర్వాహ్ణంలో అర్థార్జన చేస్తూ ధర్మమును బాధించుట లేదు కద! అర్థార్జనకు తగిన మధ్యాహ్నం కాలంలో ధర్మాన్ని ఆర్జిస్తూ అర్థాన్ని కోల్పోతూ లేవుగద! సుఖాభిలాషతో (కామం కొరకై) సమయమంత గడిపి రెంటిని బాధించడంలేదు గద! లేదా అర్థం కారణంగా ధర్మమును, ధర్మం కారణంగా జీవయాత్రకవసరమయిన అర్థాన్ని, ధర్మార్థాలను కామం కారణంతో బాధించటం లేదు గద! వేశ్యాలోలుడైతే రెండు నశిస్తాయి. దీన్నే వివరంగా ఏ కాలంలో అది చేస్తున్నావా అని వివరిస్తున్నాడు. ప్రాతఃకాలము దానాది ధర్మకాలము, తదుపరి కొలువు కూటములో రాజ్యవిచారణమునకు మధ్యాహ్నము అర్థకాలము, రాత్రికాలము కామకాలము అని బాగా వేరు పరచి సేవిస్తున్నావా అని.

ఈ సర్గ నిండా రాజనీతిప్రశ్నలే ఉన్నాయి. వాటిని బాగా వివరించినది తీర్థీయము. దానిననుసరించినది గోవిందరాజీయము. గోవిందరాజీయము చాలా వరకు తీర్థీయము దారిలో నడుస్తుంది. కాని తత్త్వ విషయములను, విశిష్టాద్వైతతత్త్వవిషయాలను విపులముగా సభక్తికముగా వివరిస్తుంది.

101వ సర్గకు చాలా వైశిష్ట్యమున్నది. దీని ఆరంభమున గోవిందరాజీయమున చాలా చర్చ కలదు. వీలైనంత సంక్షిప్తంగా అదేమో, ఎంతవరకు సమీచీనమో తెలుసుకొన ప్రయత్నిద్దాము.

ఈ సర్గనే ఇక్కడ వ్రాయాలి, 101వ సర్గగా. "తం తు రామః" ఇత్యాది 104వ సర్గను లేఖకులు తప్పుగా 101వ సర్గగా వ్రాశారు. ఆ సర్గలో, నూరవ సర్గలో అడిగిన ప్రశ్నలకు జవాబులు లేకపోవడం ప్రధానంగా దానిని 104వ సర్గనే చేస్తుంది. ఈ 104వ సర్గలో భరతునితో చెప్పబోవు పితృమరణశ్రవణం తర్వాత రాముడు దుఃఖించినట్లుగా లేకపోవడం మరోకారణం, అది 101వ సర్గకాకపోవడానికి. ఆ 104వ సర్గ చివరలో వ్యాఖ్యానిస్తూ, మహేశ్వరతీర్థులు, సర్గల ముందు వెనుకలు ఆలోచించక కొన్ని ఆక్షేపాలు, వాటికి సమాధానాలు చెప్పారు. అవి అన్నీ ఆ సర్గను 101వది అనుకోవడం వల్ల జరిగిన ప్రమాదాలే. వారు తాము చూచిన ఒకప్రతినే (కోశము

అంటారు. పుస్తకమును) ఆధారంగా, ప్రమాణంగా తీసుకొని అట్లా పప్పులో కాలువేశారు. ఆక్షేపమిది– “తండ్రిగారు మిమ్ములను వదలి పుత్రశోకంతో స్వర్గస్థులయ్యారు, ఈ ప్రజలందరు, విధవలైన తల్లులు తమ దగ్గరకు వచ్చారు, అని భరతుడు చెప్తాడు. అప్పుడు దుఃఖించక రాముడు, ఆ మాటనే దాటి, అభిషేక తిరస్కారమునే ఎందుకు చేశాడు? జవాబు– ఇది పెద్ద తప్పుగాదు. భరతుడు చెప్పిన వాక్యాల్లో తండ్రి మరణం అప్రధానంగా, రాజ్య స్వీకరణమే ప్రధానోద్దేశ్యముగా ఉన్నది. అందుకని రాముడిట్లా అనుకుంటున్నాడు. పుత్రశోకంతో తండ్రి చచ్చిన వాడిలాగా ఉన్నాడు, మళ్ళీ జీవించడు గనుక స్వర్గస్థుడయ్యాడు అని చెప్పాడు భరతుడు, విధవలతో సమాను రాళ్ళు కనుక విధవలు అన్నారు, నా అభిషేకాన్ని గూర్చే ముఖ్యంగా చెప్పుకొచ్చాడు అని తలుస్తూ, దుఃఖించకుండా, అభిషేకాన్ని తిరస్కరించాడు”. అయితే ఇట్లా దోషపరిహారం, ఆక్షేపసమాధానం యుక్తము కాదు. మృతకల్పుడు గనుక మృతుడు అని రాముడు తీసికొని ఉంటే ‘మహాతేజుడైన రాజు ఆదేశించి స్వర్గానికి పోయాడు’ అని చెప్పనే చెప్పడు. (అనువదించడు–భరతుడు చెప్పినది చెప్పడు) తన ఆశయాన్ని స్వయంగా ‘ఈ విధంగా అని చెప్పుతున్నాడు’. ఇట్లా గత్యంతరం ఉండగా, దానికి విరుద్ధంగా అభిప్రాయాన్ని ఎట్లా కల్పించడం? ఎందుకు కల్పించడం? కాబట్టి రాముడు తండ్రి చనిపోయాడు అనే గ్రహించాడనాలి. ఇంకో విషయం, ప్రజలు, తల్లులు రామునిదగ్గరకు రాకపూర్వమే వేలుతో చూపించి ఈ ప్రజలు, తల్లులు అనడం ఎట్లా కుదురుతుంది. ఈ కారణాల వలన “వసిష్ఠం పురతఃకృత్వా” అనే 103వ సర్గ తర్వాతనే “తం తు రామః”అను 104వ సర్గను వ్రాయాలి. అలానే చదవాలి. అట్లా అయితే సమీచీనంగా ఉంటుంది.

రామానుజీయం– రాజనీతిని ప్రతిపాదించు పూర్వపు సర్గ తదుపరి “రామస్య” ఇత్యాది ఈ సర్గయే ఉండాలి. అయితే కొన్ని ప్రతులలో “తం తు రామః” అనే (104వ) సర్గ కనబడుతున్నది. అది బాగాలేదు. పూర్వ సర్గలోని ప్రశ్నలకు జవాబు ఈసర్గలో (104)లేదు. పితృమరణశ్రవణం తర్వాత దుఃఖించినట్లుగా కూడ ఈ సర్గలో లేదు. ప్రజలను తల్లులను వేలుతో చూపెట్టడం కూడ అయుక్తమే అవుతుంది. వారింకా అక్కడికి చేరుకొనే లేదు కనుక. “తం తు రామః” ఇత్యాది సర్గస్థానము (సంఖ్య) ఎక్కడ మరి? “వసిష్ఠం పురతః కృత్వా” అను (103వ) సర్గ తర్వాతనే అని చెప్పుకోవాలి.

గోవిందరాజీయము రామానుజీయములు ఏకాభిప్రాయమును, సమంజసమయిన దానిని, కలిగి ఉన్నవి.

మాహేశ్వర తీర్థీయము (పైన పేర్కొన్నట్టుగా) మరియు కతకము 104వ సర్గను 101వ సర్గగా భావించినవి. “సంక్షేపముగా మొదట చెప్పి (ముందర) అనంతరం విస్తరముగా చెప్తాడు” “ఇదే తరచుగా కవి స్వభావము” అని కతకము చెపుతుంది.

రాముని ప్రశ్నలకు జవాబు చెప్పుతూ “ధర్మము దప్పిన నాకు రాజ ధర్మమెక్కడిది? ఏమిటి నేను తప్పిన ధర్మము? ఓ నరపుంగవ! మన వంశంలో జ్యేష్ఠుడుండగ చిన్నవాడు రాజు అవుతాడా? జ్యేష్ఠుడు రాజు అగుటయే మనవంశంలో శాశ్వతమైన ధర్మము” “దీనికి శాశ్వతః అంటే కులక్రమాగతము, అస్మాసు– మన పూర్వుల్లో” అని

మాత్రమే వివరించి తీర్థీయము ఊరుకుంది. గోవిందరాజీయము ధర్మము నుండి, రామకైంకర్యరూపమైన ఒకే ఒక ధర్మము, లేదా స్వస్వరూపాన్ని నిరూపించే శేషత్వ ధర్మము, సేవకత్వ ధర్మము దాని నుండి వైదొలగిన వాడికి, రాజధర్మము అనగా స్వస్వరూపము అయిన శేషత్వమునకు విరుద్ధమయిన సామాన్య ధర్మము, రాజుగా అవడము ఉంటుందా? ఉండదు. అస్మాసు అని బహువచనముతో శత్రుఘ్నుడు లక్ష్మణుడు కూడ రామకైంకర్యరూప పరమైకాంతి ధర్మమునకు కట్టుబడియే ఉన్నారనుట.

"ప్రజలు రాజును మనుష్యుడు అన్నారు కాని ఎవని ధర్మార్థ సహిత వృత్తము అమానుషమో అతడు దేవుడని నాకు సమ్మతము". దేవత్వము కలిగించు తపశ్చర్యను వదలి కేవలం మానుషత్వం కలిగించు రాజ్యాభిషేకముతో నాకేం పని? అని రాముడంటాడని జవాబుగా పైది భరతుడు చెప్పాడు. రాజును మనుష్యుడనే ప్రజలన్నప్పటికీ, నాకు దేవుడనే భావం ఎందుకు? రాజు వృత్తం– అమానుషం దేవత్వమును సంపాదించి పెట్టేది. తపస్సు చేస్తూ అష్ట కష్టాలు పడితేనే దేవత్వం సిద్ధిస్తుంది. రాజు అయి పాలనజేస్తూ భోగభాగ్యాలను అనుభవిస్తూ దేవత్వం పొందవచ్చును అను భావము అని వివరణ చేసింది తీర్థీయం.

గోవిందరాజీయం– రాజు గావడం అందరికీ సాధ్యం గాదు. పామరులు రాజును మనుష్యుడు అంటున్నారు. ఆ రాజు నాకు దేవుడు. రాజును మనుష్యుడు అన్నారు ప్రజలు, మనిషి రూపంలో ఉన్నను, మనుష్యుల కందని స్వభావము, నడవడి మొదలైన వాటిచేత, సర్వలోక సామ్యమును దాటిన (ఎవరితో పోల్చరాని వాడగుట వలన) నాకు నారాయణుడుగా సమ్మతుడు రాముడు అని అర్థమని వివరిస్తుంది.

తండ్రి జీవించి ఉండగా నాకేమి అభిషేకము, అధికారమెక్కడిది అని రాముడు అంటాడని ప్రశ్నించుకొని, నేను కేకయదేశంలో ఉండగనే తండ్రి మరణించాడంటాడు భరతుడు అని తీర్థీయము. నీవు పితృకార్యము చేశావు గద, చేసినది చేయడం ఏమిటి అంటే, నీవు దశరథున కిష్టుడవు, ఇష్టులు ఇచ్చిన తర్పణాదులు అక్షయ్యమవుతవి. మరియు నీవు జ్యేష్ఠుడవు, నిన్నే తలుస్తూ అసువులు బాశాడు అని వివరిస్తుంది తీర్థీయము. ఇక గోవిందరాజీయము నేను వెళ్ళి వచ్చాక ఎన్నిరోజులకు రాజు స్వర్గస్థుడయ్యాడు అని రాముడడిగితే నీవు వెళ్ళిన వెంటనే అని భరతుడు జవాబిస్తాడు. మీరిచ్చారుగ తిలోదకాలు నేను గూడ ఇయ్యాలా? ప్రియుడవు, జ్యేష్ఠుడవు, నిన్ను గురించే శోకిస్తూ, తలుస్తూ, ప్రాణాలు వదిలాడు, నీ శోకంతో మంచం పట్టాడు, నిన్ను స్మరిస్తూనే మరణించాడు గనుక అని భరతుడు సమాధానము అని తెలుపుతుంది.

102వ సర్గ 9వ శ్లోకం వివరిస్తూ గోవిందరాజీయం "తండ్రి మరణానికి కారణభూతుడనయ్యాను, ఆయన దహన సంస్కారాలకు నోచుకోని నేను పుట్టి ఏం ప్రయోజనమని రాముడు తనను నిందించుకొంటున్నాడు" అని వివరిస్తుంది గోవిందరాజీయము. తీర్థీయంలో శ్లోకవ్యాఖ్యానమే లేదు. "పుత్రుని అంత్యకర్మలో పరీక్షించాలి" అని చెప్పినట్లు పితృసంస్కారరూపకర్మ చేసి భరతుడు పాపరహితుడయ్యాడు, తానలాటి పాపం చేశానని భావము అని తర్వాతి శ్లోకాన్ని వ్యాఖ్యానించినది గోవిందరాజీయమయితే, యథాపూర్వం. తీర్థీయంలో దీనిముచ్చటే లేదు.

"స్త్రీలు కూడ నీళ్ళు వదులుతారు. అని శాస్త్రప్రసిద్ధమే. బురద లేనిచోట నదిలోకి దిగారు. 'ఓ తండ్రీ!' నీకు ఇదిగో ఉదకము" అని వదిలారు. స్నానము చేసి అని ఉదక దానమిచ్చారు అనే అర్థంతోనే చెప్పినట్లు అయింది.

లేదా సీత స్నానం మాత్రమే చేసింది వారితో కలసి చాలా దుఃఖముతో ఉన్నందున తొట్రుబడుతూ వెళ్ళారని సూచితము. నది పుణ్యతీర్థమని చెప్పడము 'సుతీర్థ' అనే పదంతో. నదీతీరానికి వచ్చాక గూడ కొంచెం కాలం రోదించారు అని ఆచారాన్ని చెప్పాడు కవి. 'యశస్వి' అనడంతో శాస్త్రములో విధించినట్లు ఉదకక్రియ చేశారని భావము. రమ్యమైనది అనడంతో దుఃఖమును శాంతింపజేయునది అని, పుష్పితకాననము కలది అనడంతో ఉదకదానం అయిపోయేంత వరకు నీడ ఉండింది అని, స్నానకాలంలో ప్రవాహానికి ఎదురుగా ఉండిరని 'శీఘ్ర స్రోతసం' తో తెలుపునది అని, శివం అంటే శుద్ధము, బురద లేనిది అని గోవిందరాజీయము విపులీకరించితే, తీర్థీయము పొడిమాటల్లో వ్యాఖ్యానించింది 24,25వ శ్లోకాలను.

ఉదక దానము చేసిన చోటునుండి కొంచెం దూరం వెళ్ళినాడు రాముడు, పిండప్రదానం చేశాడు అని చెప్పడం చేత సపిండీకరణమే చేశాడు అని తెలుస్తున్నది. పదిరోజులు దాటిన తర్వాత ఉదకదానం చేయకుండ పిండదానము చెప్పబడలేదు, లక్ష్మణుడు ఉదక దానం చేశాడని మాత్రమే చెప్పాడు, పిండదానం చేసినట్లు చెప్పలేదు అని కూడ వివరిస్తుంది గోవిందరాజీయము.

"సీతారామలక్ష్మణులు వేగంగా పారే నదిని చేరి, బురద లేని రేవున దిగి, 'తండ్రి! ఇది నీకు ఉదకము' అని చెప్పి రాజునకై నీళ్ళు వదిలారు. తదుపరి రాముడు తమ్ముళ్ళతో బాటు ఒడ్డుపైకి వెళ్ళి పిండప్రదానం చేశాడు అని అర్థము" అని వివరిస్తుంది తీర్థీయము.

ఇక రామ భరతుల సంవాదము ఈ 104వ సర్గలో అని గోవిందరాజీయము వ్యాఖ్యానాన్ని ఆరంభిస్తుంది– "ఓరామా! నాఒక్కని కన్నీరునే చూసి సహించలేని వాడివి, వీరి అశ్రుపాతమును ఎలా ఓర్చుకుంటావు అని తలచి యుద్ధానికి సన్నద్ధమైనట్లు, రథగజతురగపదాతులతో వచ్చాను. నేను యాచిస్తే తిరస్కరించవచ్చునేమో! మన రాజ్యం నిర్వహించే సచివులు యాచిస్తే ఎట్లా తిరస్కరించగలవు? వారిని అతిక్రమించ లేవుగద! నేను ఎదురుగా చేతులు కట్టుకొని నిలబడితేనే చాలు, యాచన చేస్తే ఇంక చెప్పాలా? అది కూడ శిరస్సువంచి తలవంచి అడిగిన వాని మాటను నేను పాటించలేదని నీహృదయం పశ్చాత్తాప పడుతుంది గద. ఇంత కాలం నీవే నన్ను అడిగి అడిగి నాకోర్కెలు పూరించిన వాడివి. అన్నను అడగాలా? నీతమ్ముడిని గదా? శిష్యుని అనుజుడనయిన నేను నీతో పాలుపంచుకునే వాడినవుతానా? దాసుడనైన నాకు మంత్ర సంబంధము కూడ నీతోనే జరిగినది, శిష్యుడైనందున నాపై నీకు సర్వహక్కులు క్రయవిక్రయాదులు ఉన్నవి గద! కనుక, నేను చెప్పిన, ఎదురు లేని ఈ కారణాల వలన, నా కోరికను తప్పక మన్నించుము" అని 12వ శ్లోకమును చాలా చక్కగా వ్యాఖ్యానించినది గోవిందరాజీయము. తీర్థీయములో ఈ చర్చే లేదు, అసలు వ్యాఖ్యానమే లేదు.

ఈ 104వ సర్గ పౌర్వాపర్యమును గూర్చి మొదటనే విపులముగా తెలుసుకున్నాము .తిలకము– పితృమరణ శ్రవణము తరువాత దుఃఖించడం మాని, అభిషేకాన్ని రాముడు తిరస్కరించాడు. దీనిలో రహస్యము ఏమిటంటే రాముడు రాజ్యాన్ని తీసుకుంటాడు అనే ఆశను దూరం చేయడానికి, లోకులు కైకేయిని గురించి చెడుగా తలచకుండా ఉండేందుకు, కైకేయి మరియు లోకులు ఇంకో విధంగా అనుకోకుండా ఉండేందుకు, దుఃఖ సమయంలో కూడ ధైర్యం అవలంబించి ఉండడం. లోకోపదేశం కోసరమే అని నాకు తోచుచున్నది. అని

"ఇక ఈ 105వ సర్గలో, కైకేయి నిర్బంధంతో పితృ ఆజ్ఞతో వచ్చిన రామునికి దాని పరిహారానికి తగిన మాటలతో భరతుని ప్రార్థన, తత్త్వోపదేశము చేస్తూ ఆ ప్రార్థనకు రామునిచే సమాధానము, సమాశ్వాసనము" అంటూ మొదలవుతుంది గోవిందరాజీయ వ్యాఖ్యానము. ఇచ్చిన రాజ్యాన్ని మళ్ళీ తీసుకోలేనంటాడేమో రాముడని, నాతల్లిని ఒప్పించానంటాడు. దాసుడనయిన నాయొక్క స్వం- ఆస్తి, నీదే అని ఇస్తున్నాడు భరతుడు రామునకు నీవే పాలించమంటావేమో. నేనింతరాజ్యాన్ని పాలించలేను. నీవు దప్ప ఇతరులు పాలించనేలేరు. గుఱ్ఱం వేగాన్ని, శక్తిని గాడిద అందుకోలేనట్లు, గరుత్మంతుని గమన శక్తిని మామూలు పక్షి అందుకోలేనట్లు, నేను రాజ్యపాలనశక్తిని పొందలేను. నీకు శక్తిలేకుంటే ఇంకెవరయినా పాలించని అని రాముడంటాడని, నీవు రక్షించడమే చాలా సమంజసమని ఉదాహరణలతో స్పష్టపరుస్తున్నాడు భరతుడు. ఇతరులే నీమీద ఆధారపడు నీకు కష్టము దుర్జీవము ఏదియు లేదు.

ఒకడు విత్తు నాటాడు, చెట్టును పెంచి పోషించాడు. పొట్టివాడు చెట్టు ఎక్కలేడు, క్రమంగా శాఖోప శాఖలు గట్టిపడ్డాయి, పుష్పించి ఫలించినా పండ్లను కనపడనీయదు. చెట్టు పెంచి పెద్దచేసినవాడు, ఏ ఫలాపేక్షతో మొక్కనాటాడో ఆప్రీతిని పొందలేదు. నీవు ప్రభువువు. నీవు ప్రభుడవు అయి మమ్మల్ని పాలించకపోవడానికి పైది ఉపమ. మొక్కనాటినవాడు, పెరిగిన వృక్షము పుష్పదర్శనం ఫలదర్శనం పోలిక దశరథుడు మొక్కనాటినవాడు, నీవు ఆ మహావృక్షము. పుష్పదర్శనము అభిషేకానికి సంసిద్ధత, ఫలము లనుభవించడం రాజ్యపాలనము. ఇది గోవిందరాజీయము!

ఇక తీర్థీయము. లోకరక్షణ కొరకు దశరథునిచే పెంచి పోషించబడిన నీవు సకలసద్గుణ సంపన్నుడవు, లోకరక్షణం చేయకుంటే లోకానికి దశరథునకు ప్రయోజనము లేదు. మిగత విషయము రెండు వ్యాఖ్యానాల్లో సమానమే.

ఓరామా! నీవు ప్రభువువై భృత్యులమైన మమ్ములను పరిపాలించుము. పాలించకుంటే పై ఉపమానము పురప్రముఖులు, పౌరులు అందరు ప్రార్థించారు. భరతుని ప్రార్థనను బలపరిచారు. అట్లా కన్నీరు మున్నీరు అయిన భరతుని, తను ఒప్పుకోకపోవడంతో ఇంకా దుఃఖితుడైన వానిని, తన కారణంగానే రామునికి వనవాసం ప్రాప్తించినది అని, తండ్రిచావుకు తానే నిమిత్తమని విలపిస్తున్న భరతుని దుఃఖాన్ని తొలగించడానికి రాముడు ఇట్లా ఓదార్పు మాటలను చెప్పుతున్నాడు – మనిషిగా పుట్టినవాడు తాను అనుకున్నది చేస్తున్నాను అనుకుంటాడు, కాని అట్లా అతని ఇష్టం వచ్చినట్లు చేయలేడు, అట్లా చేయడానికి అధికారం లేదు. అతడు దైవపరతంత్రుడేగాని, స్వతంత్రుడు కానే కాడు. దైవమే ఓ చోటునుండి మరోచోటుకు తరుముతుంది. ఇట్లా వస్తుస్వభావము వదిలించుకోరానిది. కనుక తండ్రిమరణంతో శోకం చెందవద్దు. కైకేయిప్రేరితుడైన రాజుగాని, నీవుగాని, నావనవాసానికి కారణం కానే కారు. నీవు ఆత్మన్యూనతాభావాన్ని చెందవద్దు. కూడ బెట్టిన సొమ్ము, దొంగలచేత, కోరికలచేత (ఖర్చుపెట్టడం కోరికలు దీరడానికి) లేదా రాజుల చేత (తీసుకొనబడి) నశిస్తుంది. అత్యున్నత పదవిలో ఉన్నవారైనా, బ్రహ్మేంద్రాదులు కూడ తమ పదవీకాలం ముగియగానే పదవుల నుండి తొలగుతారు. పుత్రమిత్ర కళత్రాది సంయోగము కూడ వియోగమునకు గురికాక తప్పనిదే. ఎంత గొప్ప జీవితమైనా మరణమునకు లొంగునదే.

నేను అడవికి రావడము విధి విలాసమే, స్వయంకృతము కాదు, దశరథుని మరణము కాలము వలననే జరిగినది (నేను) నీవు కారణము కాదు,

ఈ విషయాలన్నీ అన్యాపదేశముగా చెప్పడం జరిగినది. తద్వారా భరతుణ్ణి ఓదార్చడం, అతని మనస్సు నుండి దోషభావం తొలగించడానికి ప్రయత్నం జరిగినది. ఇంకా చాలా ఉదాహరణములతో మృత్యువు అపరిహార్యము అనే విషయము, శోకము మాని పరలోక చింతనము కర్తవ్యమని, బాగా వివరించడం జరిగినది అని గోవిందరాజీయము విపులముగా, తీర్థీయము క్లుప్తముగా వ్యాఖ్యానించినవి.

ప్రజలందరు సుఖాన్ని కోరుతారు, ఆ సుఖం ధర్మాచరణము వలన కలుగుతుంది. నీవు ఆ ధర్మాన్నే ఆచరించు. తండ్రి చెప్పినదే ధర్మము. మన తండ్రి ధర్మాత్ముడు, యజ్ఞయాగాదులు చేశాడు, వాటితో పాపములు తొలగిపోయాయి, ఆయన స్వర్గస్థుడయ్యాడు, సేవకులను బాగా పోషించాడు, ప్రజలను బాగా పాలించాడు, ధనం కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించాడు, ఇష్టా పూర్తములు ఒనరించాడు, చాలాకాలం జీవించాడు, మానవశరీరాన్ని వదలి దివ్యపదమును పొందాడు. ఇట్లాటి వాని గురించి ప్రాజ్ఞుడు ఎవడు విచారించడు. శోకము తగదు. ఓ భరత! నీవు చాలా తెలిసినవాడవు. ధీమంతుడు ఎలాటి శోకాలను చెందకూడదు. పుణ్యాత్ముడైన తండ్రిచే రాజ్యపాలనకై నీవు నియమించబడినావు, నీవు పాలించు, నేను వనవాసం చేయాలని ఆజ్ఞాపించాడు, నేను ఆ ఆనతిని అమలు చేస్తున్నాను. మనమిద్దరము ధర్మాత్ముడు కోరినది ఆదేశించినది ఆచరించాలి. తండ్రి అడుగుజాడలలో నడువు, వశవర్తివి ఆజ్ఞానువర్తివి అగుము. రాజువై పాలించుము అని రాముడు భరతుని ఓదార్చుచు అనునయించుచు చెప్పెను. అని రెండు వ్యాఖ్యలు సమమే.

ఇక ఈ 106వ సర్గలో "రామునకు భరతుడు చెప్పినట్టి, తగిన శ్లాఘ్యతరమైన జవాబు" అని వ్యాఖ్యను ఆరంభిస్తుంది గోవిందరాజీయము. ఈ సర్గలో శ్లోక వ్యత్యాసమున్నది. సర్గ భేదము కూడ ఉన్నది. రెండుని సరి చేస్తూ వ్యాఖ్య చేయడం జరిగినది.

ఏమి జవాబు చెప్పరాని విధంగా మాట్లాడిన రామునితో భరతుడు మరొక విధంగా జవాబు చెప్పుతున్నాడు కనుక కవి 'చిత్రం' గా చెప్పాడన్నాడు.

భరతుడంటాడు – ఓరామా! జ్ఞానం, అనుభవం, వయస్సుతో వృద్ధులైన వారికి నచ్చినవాడవు నీవు, అయినా సంశయాలను అడుగుతున్నావు. తండ్రి చనిపోయిన దుఃఖం పట్టలేక నేనిట్లా మాట్లాడానంటివి, నాకు అట్టి దుఃఖం యొక్క ప్రసక్తే లేదు. "చనిపోయినవాడు ద్వేషానికి గురికాడు. అట్లానే బ్రతికి ఉన్నవాడు కూడ. లేని వస్తువు విషయంలో రాగం లేనట్లే ఉన్న వస్తువు విషయంలో కూడ ప్రేమలేదు" అనే బుద్ధి ఎవనికయితే ఉంటుందో అతడు ఏ కారణంతోనయినా పరితపించడు. నీవు చెప్పిన ఈ విధంగా కూడ నాకు దుఃఖము ఇసుమంతైనా లేదు. అవును మరైతే అట్లా ఎందుకు మాట్లాడావు అన్న రాముని ప్రశ్నకు భరతుడు "నీవు పడుతున్న ఇక్కట్లను ఓర్వలేక అన్నాను" అంటాడు. అదీగాక, నీవు త్రికాలజ్ఞుడవు, లేదా ఇది ఆత్మ ఇది కాదు అని తెలుసుకున్నవాడవు, లేదా పరమాత్మ జీవాత్మల స్వరూపమును తెలుసుకున్నవాడవు. అలాటివాడు వ్యసనం– కష్టాన్ని పొంది కూడ బాధపడటానికి తగనివాడు, అలాగే నీవు కూడ. అయినప్పటికి, నీకు రాజ్యభ్రంశం అనే కష్టం కలుగడాన్ని, నీ ఎడబాటును నేను

ఎట్లా సహించేది? అని భావము. నీవు సత్త్వగుణసంపన్నుడవు. దేవసముడవు. ఆశ్రితులకు సత్త్వగుణ కార్యములందు తత్త్వజ్ఞానమునందు ప్రవృత్తి కలుగచేసెడివాడవు. మహాధైర్యము గలవాడివి గనుకనే చేసిన ప్రతిజ్ఞను సత్యముగా ఆచరించువాడవు. పై విశేషణములతో రాముడు భూతవర్తమాన భవిష్యత్ వస్తు విజ్ఞానము కలవాడని సూచితము. ఉత్పత్తి వినాశములు తెలిసినవాడవు, నీవు ఇట్టి గుణగణములు కలిగిన నీకు మాలాటి వారికి ఓర్వరాని సహింపరాని దుఃఖం– రాజ్యభ్రంశంలాటిది, వచ్చుటయా? నేను ధర్మపాశంతో కట్టబడి ఉన్నాను. శుద్ధమైన పుట్టుక, కర్మ గలిగిన దశరథునికి తనయుడుగా పుట్టాను. ధర్మం అంటే ఏమిటో తెలిసికూడ, లోకం నిందించే, అధర్మపు పనిని– రాజ్యాపహరణాన్ని ఎట్లా చేస్తాను? చెయ్యను. తండ్రి, పెద్ద దిక్కు, క్రియాశీలి, వృద్ధుడు, రాజు, చనిపోయిన వాడు, దైవతం అని తలచి అతనిని సభలో నిందించలేను 'వినాశకాలే విపరీత బుద్ధిః' అనే లోకశ్రుతిని మళ్ళీ నిజమని నిరూపించాడు. ధర్మార్థహీనమైన పాపపు పనిని, తన భార్యకు సంతోషం కలిగించడానికి చేశాడు. నేను కోరింది చేయకుంటే విషము తీసుకొని చస్తాను అన్న కైకేయి క్రోధం వలన, కైకేయిపైన గల మోహం వలన, ఆలోచించకుండా త్వరపడి సాహసం వలన చేసిన ధర్మాతిక్రమణాన్ని సాధువర్తనముగా మార్చవలసినది. తండ్రి అధర్మంలో, అధోలోకంలో పడకుండా చూచేవాడు అపత్యం అనబడతాడతడు. నీవు తండ్రిని అధర్మంలో పడకుండ చూడుము. అరణ్యవాస మెక్కడ? క్షాత్ర ధర్మ మెక్కడ? ఈ జడలు పెంచడం ఎక్కడ? రాజ్యం పాలించడమెక్కడ? ఇలాటి వ్యాహతమయిన (కొట్టబడిన– చెడు–దిక్కు మాలిన) పనిని నీవు చేయరాదు, కూడదు. అది కాదు, క్షత్రియులకు కూడ ఈ వానప్రస్థ ధర్మము ఉన్నది అంటావేమో, నిజమే ఉన్నది. అయితే రాజ్యపాలనము క్షత్రియులకు మొదటి ధర్మము, ప్రధానమైన ధర్మము, ప్రత్యక్షంగా ఫలము నిచ్చునది కూడ. ఇట్టి లక్షణమైన దీనిని వదలి పెట్టి, అప్రత్యక్షము, అలక్షణము, ఫలసిద్ధి సాధనలో సందిగ్ధము, నిరూపించ రానట్టిది, కాలాంతరంలో ఫలాన్నిచ్చేటిది, క్షత్రియుడు మొదట వనవాసాన్నే చేయాలని ఏ ప్రమాణంతో నిశ్చయింప బడనట్టిది, క్లేశకరమైనట్టి వానప్రస్థం నుండి మరలుము. చాతుర్వర్ణ్య పాలనము, ఆయా ధర్మ ప్రతిష్ఠాపనము మొదలైన రాజ్యపాలనతో గూడ నీవు క్లేశమును పొందవచ్చును గదా! నాలుగు ఆశ్రమాల్లో ప్రధానమైనట్టి, ఇతర ఆశ్రమాల ఉనికికి మూలమైనట్టి గృహస్థాశ్రమమును పాటించుము. తరువాత వానప్రస్థము. చదువుచేత, పుట్టుకచేత, రాజ్యము వచ్చే వరుసలో కూడ నేను బాలుణ్ణి. బుద్ధి గుణాలలో, వయస్సులో చిన్నవాణ్ణి, నీవు లేకుండ నేను ఉండనే ఉండను. అలాటిది రాజ్యమెట్లా చేస్తాను. ఇక్కడే ప్రజలు, ఋత్విక్కులు, వసిష్ఠాదులు మంత్రులు నీకు అభిషేకం చేస్తారు, రాజ్యాన్ని నిష్కంటకముగా, బంధువులతో గూడి పాలించుము. పితౄణము, దైవ ఋణము, ఋషి ఋణము అను మూడిటిని తొలగించుకొనుచు, దుష్టుల శత్రువుల శిక్షించుచు, శిష్టుల మిత్రుల రక్షించుచు నీవే రాజ్యమును పాలించుము. నాతల్లికి గల్గిన ఆక్రోశం– శాపమును, తండ్రికి గల్గిన కిల్బిషమును–పాపమును, తొలగించుమని తలను వంచి యాచిస్తున్నాను. నాయందు, బంధువుల పైన, అందరి యందు జాలిదలచుము. మహేశ్వరుడైన విష్ణువు సర్వభూతములందు దయను చూపుచున్నట్లు అని ఉపమానము.

ఇంతవరకు అన్ని వ్యాఖ్యానాలు ఇంచుమించు సమానంగానే ఉన్నాయి. ఇక్కడ గోవిందరాజీయ విశేషము ఇది మహేశ్వరుడు విష్ణువు "యద్వేదాదౌ.....మహేశ్వరః" అని అకారముచే చెప్పబడువాడు మహేశ్వరుడు. ఈ అకారము చెప్పదలుచుకున్న, దహర విద్యాకరణ మంత్రానికి, ప్రణవరూపమైన దానికి ప్రకృతి భూతమైనది

దహర విద్యచే ఉపాసింపదగిన వాడు అపహత పాప్మత్వము మొదలైన గుణములు గలిగిన పురుషోత్తముడే ఛాందోగ్యమున, స.....అతడు ఉత్తమ పురుషుడు, అని ఆ సమానప్రకరణములో ఉన్నది. ఈ అపహతపాప్మత్వం పాపములు తొలగిన తనము. రుద్రునకు లేదు. పాపములు తొలగనివాడినిగా నేనున్నాను, అని రుద్రుడే చెప్పాడు. భూతసంహారమునందే అధికారం గల రుద్రుడికి భూతములందు-ప్రాణులందు దయ గగనకుసుమము వంటిదే. (అసలే లేనిదని అర్థము) అందుకని, "అతడు ఒక్కడే ఆనందించడు..., దాని నుండి (దాని వలన) అసహ్యించుకొనడు, మొదలైన శ్రుతి, స్మృతి వాక్యములతో, అపారకరుణ, వాత్సల్యము మొదలైన గుణగణము కలవాడిగా సుప్రసిద్ధుడైన వాడు ఆ పురుషోత్తముడే, అతడే మహేశ్వరుడు అని సంక్షేపము,"అని.

ఇంత యాచించినను రాముడు ఒప్పుకొనలేదు. రాముని దృఢప్రతిజ్ఞకు సంతసించారు, అయోధ్యకు రానందుకు చింతించారు ప్రజలు, ఏక కాలంలో ఋత్విక్కులు, పౌరముఖ్యులు, తల్లులు అట్లా శిరసు వంచి కడు దీనముగా యాచించిన భరతుని పొగిడి, భరతునితో బాటుగా, దీనాశ్రువదనులై అయోధ్యకు రమ్మని రాముని ప్రార్థించారు.

107వ సర్గవ్యాఖ్యలలోని విశేషములు. రాముని ప్రార్థించే సందర్భంలో భరతుడు, తండ్రి కామమోహముతో అట్లా చేసాడని అంటే తండ్రిని నిందించడానికి వీలులేదని, మోహం కారణంగా చెప్పడం తగదని, పూర్వం రాజు కైకేయికి ఇచ్చిన రెండు వరాలను గుర్తు చేస్తున్నాడు రాముడు అంటుంది గోవిందరాజీయము. అంతేగాక వనవాసానికి భరతపట్టాభిషేకానికి, జవాబులేని, దొరకని మరోకారణం చెబుతున్నాడు అని కూడ వివరిస్తుంది. తీర్థీయం- ధర్మార్థములకు దూరమైన పనిని, ఆడుదానికి ప్రియం చేయాలనే ఉద్దేశ్యంతో కాముకుడైన తండ్రి ఆజ్ఞాపించినది కర్తవ్యముగాదన్న భరతునితో రాముడు, చెప్పినమాటలివి. పోనీ నీవు చెప్పినట్లే అనుకుందాం కొద్దిసేపటి వరకు. రాజు కాముకుడై ఆజ్ఞాపించాడని. కాని బాగా ఉన్నప్పుడు, ఎలాటి కామానికి మోహానికి లోనుగాకుండా ఉన్నప్పుడు రాజు చేసిందైతే తప్పక చేయాలి గద! అది తీసివేయరాని ప్రబలకారణమని వరముల వృత్తాంతాన్ని ఏకరువుపెట్టుతున్నాడు. ఓ భరత! నీతల్లిని పెండ్లాడేప్పుడు తండ్రిగారు, నీమాతామహునకు 'నీబిడ్డకు పుట్టిన వానికి రాజ్యము ఇస్తాను' అని రాజ్యశుల్కమును వరముగా ప్రతిజ్ఞ చేశాడు. దైవాసురసంగ్రామములో కైకేయి సహాయానికి మురిసి రాజుగారు ఆమెకు రెండు వరాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ రెండు వరములను నీకు పట్టాభిషేకమును, నాకు వనవాసమును కోరుకున్నది. అవును పెళ్ళి సమయంలో కైకేయికి ఇస్తానన్న రాజ్యమును, పట్టాభిషేకం చేసి రామునకు ఎట్లా కట్టబెడతాననుకున్నాడు దశరథుడు? అని ప్రశ్న. నిజమే 1."పెళ్ళికాలంలో 2. రతిసమయంలో, 3. ప్రాణాపాయ సంకటంలో, 4. సర్వస్వము ఎవరయినా ఎత్తుకు పోయే సమయంలో, 5. బ్రాహ్మణుని కాపాడుట కొరకు అసత్యం ఆడవచ్చును, ఈ అయిదు అసత్యాలు పాతకాలు కావు" అని చెప్పింది మనసులో ఉంచుకొని, తప్పు గాదని, రాజు అట్లా చేశాడు అందులో అతని తప్పేమి లేదు.

గోవిందరాజీయము నందలి విశేషాలు. అవును కైకేయి తన పెళ్ళి సమయంలో ముందు పుట్టబోయే భరతునికి రాజ్యాన్ని ఎట్లా అడిగింది? అని ప్రశ్న. అది బాల్యంతో జరిగినది, చాలా కాలం గడిచిపోయింది గనుక ఈ రెండు వరాలనే కోరింది కాన తప్పులేదు. తన కొడుకే రాజవుతాడనునది కన్యాశుల్కము, పెళ్ళి అప్పుడు

పొందినది. తరువాత దేవాసుర సంగ్రామంలో తాను చేసిన ఉపకృతికి, రాజు ఇచ్చినది వరద్వయము. మధ్యలో వచ్చిన వరద్వయాన్నయినా "కైకేయి రాజు ఇచ్చిన వరద్వయం మరిచిపోయావా" అని గుర్తుకు తెస్తే అడిగినది, చాలా కాలంక్రితం జరిగిన దానిని మరచిపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఐదు అసత్యాలు పాతకం కావని, దశరథుడు రామునికి రాజ్యం ఇస్తా అన్నాడు, అదీ తప్పుగాదు. రాముని గుణగణము విని ఆకర్షితుడై, కైకయ రాజు కూతురు కొడుకునకు రాజ్యము ఇమ్మని అడుగలేదు. రాముడు సుమంత్రాదుల వలన ఈ రహస్యము విన్నవాడు. అందుకనే,వారు (భరతుడు చెప్పినది) వింటూ గూడ అనుమతించి ఊరుకున్నారు. కేకయ రాజు రాజ్యము అడుగక పోవడం, మంత్రులు ఊరుకోవడం అనేవి రెండు కొత్తవి, ఈ విషయాలు గోవిందరాజీయంలో ఉన్నాయి. తండ్రిగారు వరదానముగా నాకు పదునాలుగేళ్ళ వనవాసం కల్పించారు. తండ్రిగారి మాట నిలబెట్టడానికి నేను సీతాలక్ష్మణులతో వనానికి వచ్చాను. నన్ను ఎవరు మరల్చలేరు. నీవు కూడ తండ్రిని 'సత్యవాదిని' చేయాలి, వెంటనే అభిషేకం చేసుకొనుము నాకొరకై, తండ్రిని ఋణము నుండి విముక్తుడిని గావింపుము. తల్లిని మంచిగా చూడుము. లేకున్నట్లైతే, రాజు పున్నామనరకంలో పడగలడు. అట్లా నరకంలో పడకుండా కాపాడేవాడు, స్వర్గము మొదలైన ఊర్ధ్వలోకాలను తండ్రికి కలగజేసి కాపాడువాడే 'పుత్రుడు' అని నిర్వచనము గద! చాలామంది పుత్రులను కనాలి, వారిలో ఒకడైనా గయకు వెళ్ళి పితృ ఋణము తీర్చుకుంటాడు. పూర్వపు రాజులు ఇట్లానే సత్యమును పాటించి, తండ్రులు చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టి ఋణము నుండి విముక్తులను చేసి తాము పుత్రులు అయ్యారు. నీవు వెంటనే అయోధ్యకు వెళ్ళి అభిషిక్తుడవై రాజువు కావలసినది. నేను వెంటనే దండకారణ్యంలోనికి, సీతా లక్ష్మణులతోబాటు వెళ్ళి, వన్య మృగములకు రాజరాజునవుతాను. నీవు నరపతివి అగుము. మృగ రాజరాట్. మృగములను రంజింప జేయువాడిని, శిక్షించు వానిని అవుతాను. (సంస్కృతంలో శిక్ష– నేర్చుకొనుట, నేర్పుట, దండించుట ద్వారా నేర్పుటలో, తెలుగులో దండించుట మాత్రం మిగిలింది అర్థంలో, నేర్చుకోవడం, నేర్పడం పోయింది)

"రాముడు చెప్పిన దానికి జవాబు దొరకక నిరుత్తరుడైన భరతుని జూచి, హితైషియైన జాబాలి మహర్షి, చార్వాక మతము నాశ్రయించి చెప్పిన జవాబు ఈ 108వ సర్గలో" అను ఆరంభ వాక్యాలతో వ్యాఖ్య మొదలవుతుంది గోవిందరాజీయములో. బాటసారి ప్రయాణం చేస్తూ తోవలోని సత్రంలో రాత్రి విశ్రమించి, తెల్లవారి మళ్ళీ పయనమవుతాడు. అప్పుడతనిని సత్రం స్మృతులు వెంటాడవు. అట్లాగే కలిసి ఉన్నంత వరకే తల్లి దండ్రులు, బంధుత్వాలూను, ఎడబాసినప్పుడు వారి స్మృతి గూడ విఫలమే గద! అలాంటప్పుడు వారి ప్రీతి కొరకు పని చేయడంలో అర్థం లేదు. ఈ విశేషము తీర్థీయమున కనరాదు. వైదికధర్మవిరుద్ధంగా జాబాలి ఈ క్రింది విషయాలను చెప్పాడు. బంధుత్వం అశాశ్వతము, తల్లి దండ్రులు అని లేరు, చనిపోయిన తండ్రి ప్రీతికై పనిచేయ పనిలేదు, తద్దినములు పెట్టవద్దు, ధర్మము, అర్థము మాత్రమే కోరువారిని చూసి విచారపడుతున్నా, శ్రాద్ధాదులలో ఫలము ప్రత్యక్షముగా కనపడనందున ఇతర వైదిక కర్మలు చేయడం వృథా. ఇతరుల డబ్బు దస్కం తీసుకోవడానికి మేధావులు చెప్పిన గ్రంథాలు, యజ్ఞము చేయి! దానమివ్వు! దీక్ష వహించు, తపస్సు ఆచరించు అని బోధిస్తున్నాయి. పరలోకం లేనే లేదు. ప్రత్యక్షమునే నమ్ము! ఇది అందరు ఒప్పుకున్నది. భరతుడు ఇచ్చిన రాజ్యమును తీసికో అను విషయాలు రెండువ్యాఖ్యలలో సమానమే.

ఒక రహస్యము – గోవిందరాజీయములో "బ్రాహ్మణోత్తముడు అని జాబాలిని అనడంలో చెప్పబోయే నాస్తిక వచనము అతని హృదయానికి సమ్మతం కాదు అని తెలుస్తున్నది" అని "తండ్రి మాటను పాటించాలని తలచే నీవు ఓరామా! పరలోకం లేదు అనే బుద్ధిని కలిగి ఉండుము! ప్రత్యక్ష సిద్ధమైన రాజ్యభోగాదికమును ఒప్పుకొనుము, అనుభవింపుము, పరోక్షంగా సుఖం కలిగించు తండ్రి మాటలను పాటించడం అనువాటిని పాటించకుము. ఇదియే సర్వజన సమ్మతమైనది" అని తీర్థీయము.

"ఇక జాబాలిమతాన్ని నిరసిస్తూ వైదికమతస్థాపనము 109వ సర్గలో" అంటూ ఆరంభ వాక్యాలతో మొదలవుతుంది గోవిందరాజీయము. సత్యబుద్ధి కలవారిలో శ్రేష్ఠుడైన రాముడు, వైదికధర్మమునందు శ్రద్ధ కలవాడై, జాబాలి మాటలకు కూడ చలించని బుద్ధితో ఇలా పలికెను.

"సత్యము నందే ఆసక్తి గలిగినట్టి, సత్యాత్ములకు శ్రేష్ఠుడు, విపత్తును పొందనట్టి అనగా ధర్మము దప్పనట్టి భక్తి" అని తీర్థీయము

"నీవు నాకు ప్రియము కూర్చాలని, పథ్యముగా కనబడే దానిని, అపథ్యమును, కార్యంగా అగుపించు దానిని అంటే చేయగూడని దానిని, దుఃఖమే ఫలముగా గల దానిని చెప్పావు ఓ జాబాలీ! అని రాముడన్నాడు అని గోవిందరాజీయం, మరియు తీర్థీయము. ఇట్లా వచనాన్ని– చెప్పినదానిని దూషించాడు. ఇప్పుడు వక్తను దూషిస్తున్నాడు అని గోవిందరాజీయంలో అధికము సమీచీనము గూడ.

మర్యాద లేనివాడు– చెడు మార్గంలో నడచువాడు, వేదవిహితాచారానికంటే భిన్నమైన ఆచారాన్ని ప్రతిపాదించే మత ప్రవర్తకుడు, అందరి (చే) పూజను పొందడు" అని తీర్థీయము, ఇక గోవిందరాజీయంలో వీటితో బాటు, పాపాచార సమన్వితుడు, దర్శనం. అనగా మతం పూజను పొందకపోవడమే కాకుండ నిందనే పొందుతాడు, అను విశేషాలు ఉన్నవి.

సజ్జన అసజ్జన స్వరూపం ఏ కారణంతో తెలుసుకోవచ్చును? అను ప్రశ్నకు జవాబును మూడు శ్లోకాల్లో చెప్పుతున్నాడు అని తీర్థీయము.

పాపము ఆచరిస్తున్నాడనడానికి ఏం ప్రమాణమంటే? వాడిమాటలే కారణము. అలా మాట్లాడు వాడు తనను అతిధీరుడు అనుకుంటాడు. అతని చారిత్రమే, నడవడియే అతని మంచిని, చెడును తెలుపుతుంది అని గోవిందరాజీయము.

ఆర్యుడను, శుచిని, లక్షణ్యుడను, శీలవంతుడను, ధర్మవంతుడను అయిన నేను ఆర్యుడు కానివానివలె, చెడుప్రవర్తన కలవానివలె, లక్షణహీనునివలె, శీలములేని వానివలె, అధర్మం ఆచరించువానివలె, విహిత శుభమును వదలి, వేదవిహితముగానట్టి, వైదికక్రియకు విరుద్ధమైన దానిని ఆచరిస్తే, ఆ నా దురాచారాన్ని ఏ జ్ఞానవంతుడు కార్యాకార్యము దెలిసినవాడు మన్నిస్తాడు? ఎవడూ మన్నించడని అర్థము, అని రెంటిలో సమమే.

మన్నన పొందకపోవడమే గాకుండ, పరలోకం కూడ నాకు లేకుండా పోతుంది. నేను వనవాసం వదలి పెట్టినట్లైతే, నీవు చెప్పినది ఇతరులకు ఎట్లా చెప్పేది, లేదా ఏ (వృత్తితో) విధంగా నేను స్వర్గాన్ని పొందగలను?

అనగా, నీవు చెప్పిన ప్రత్యక్షసుఖం, పరోక్షసుఖం రెండూ దూరమవుతాయి. నీవు చెప్పినట్లు నడిస్తే అందరికీ పరలోకం లేకుండపోతుంది. రెండు వ్యాఖ్యలలో సమానమే. "సత్యప్రశంసాపూర్వకంగా తనకు గల సత్యనిష్ఠను చూపెడుతూ, సత్యమును పాటించడమే తన అభిప్రాయము అని" రెండు వ్యాఖ్యలు సమమే. ఇక విశేషాలను చూద్దాము.

అష్టకోదాహరణముతో వైదికకర్మలు నిష్ఫలములు, చేయకూడదు అని జాబాలి చెప్పిన దానికి పరిహారము. ఇది కర్మభూమి, శుభమైన కర్మ చేయవలసిందే. దాని ఫలమును అనుభవించినవారు అగ్ని, వాయువు, సోముడు, కనుక ఫలవదనుష్ఠానము అనీ గోవిందరాజీయము, ఇక తీర్థీయంలో "జనులు శుభకర్మలను చేయవలసినదే. కర్మభూమియందు చేసిన తమ తమ కర్మల ఫలమును పొందినవారు అగ్నిత్వము మొదలైన వాటిని ఫలంగా పొందారు. అగ్ని మొదలైనవారు ఒక జన్మలో కర్మభూమిలో శుభకర్మలను చేసి, ఇప్పుడు ఈ జన్మలో అగ్నిత్వమును, వాయుత్వమును సోమత్వమును పొందినారు. అందుకని అందరూ శుభకర్మనే చేయాలి" అని భావము. చాలా స్పష్టంగా ఉన్నది.

నా ప్రతిజ్ఞ స్థిరమైనది. కైకేయి గూడ సంతసించింది ఆ ప్రతిజ్ఞకు. కనుక వనములో దొరికే ఆహారమును తీసికొంటూ పంచేంద్రియవర్గము పరితుష్టి నొందగా, పితృవాక్యపరిపాలనరూప లోకయాత్రను, స్వభావ సిద్ధముగానే చేస్తాను. సత్యం, ధర్మం, పరాక్రమం, భూతదయ, ప్రియవాదిత, ద్విజాతిపూజనం అనునవి పరలోకానికి తీసికొనిపోయే మార్గములు అని పెద్దలు చెప్పనే చెప్పారు అందరు దీనినే అనుసరిస్తున్నారు కూడ. ఎవడు, కేవలం ప్రత్యక్షమునే ప్రమాణంగా వాదించుచు, పరలోకం లేదనే బుద్ధితో ఉంటాడో అతడు నాస్తికుడు, అవైదికుడు. అలాటి వాడిని దేశం నుండి బహిష్కరించాలి. ఈ ధర్మము దానికి విరుద్ధమైనది, ఆస్తికమైనది, ఐహికాముష్మిక ఫలసాధనము, దీనిని జాబాలికంటే పూర్వులు, అధిక జ్ఞానం కలవారు ఆచరించారు. చాలా శుభకర్మలను చేశారు, వారు పరలోకాన్ని జయించారు. ఎల్లప్పుడూ ఉంటున్నారు. "ఈ నక్షత్రాలన్ని చేసిన సుకృత ఫలితములే" అని శ్రుతి వాక్యము గూడ ఉన్నది. శుభకర్మలు స్వస్తి వాచనము మొదలైనవి, హుతం-యజ్ఞయాగాదికములు, కృతం-తపస్సు, దానం మొదలైనవి చేశారు చేస్తున్నారు, చేస్తారు కూడ. ఇవి రెండు వ్యాఖ్యలలో సమమే.

ఇట్లాగా, ప్రత్యక్ష మొక్కటే ప్రమాణం కాదు, దానితో బాటు వేదాదులకు ప్రామాణ్యమున్నది, గొప్పవారు, చాలామంది ఆచరణమే దాన్ని బలపరుస్తున్నది. అది అపౌరుషేయము, అవిచ్ఛిన్నమైన సంప్రదాయము కలది, వైదికకర్మలు సఫలములు. అగ్ని, సూర్యుడు, సోముడు, నక్షత్రములు, ఇంద్రుడు మొదలైనవారు కర్మలతో ఫలములనునభవించిన విషయం ప్రత్యక్షమే. ఇతరులు చేసిన భోజనము దారిలో పోయేవారికి ఆహారము కాదు, అట్లా విధింపబడలేదు, అనుభవవిరుద్ధము కనుక అని జాబాలిమతాన్ని ఖండించుట ఎక్కువగా నున్నది.

గోవిందరాజీయములో ధర్మసంకటం దాపురించినప్పుడు, అన్ని మతములు తెలిసినవాడు, ఏదైనా ఒక మతం అవలంబించి, సంకటపరిహారాన్ని చేయాలి. పెద్దరాజ్యానికి రాజు లేకపోవుట అనే సంకటాన్ని తొలగించడానికి నేను నాస్తికమతాన్ని గూర్చి చెప్పాను. వాస్తవంగా నేను నాస్తికుడను కాను, పరలోకం ఉన్నది, కుతర్కవాదులు నాస్తికమతం ఉపన్యసిస్తే, దాన్ని పలుమార్లు, నీవు ఖండించినట్లే ఖండించినాను. ఇప్పుడు నాస్తికమతాన్ని

ఎందుకవలంబించానంటే ధర్మసంకటపరిహారము అవుతుందేమోనని, మళ్ళీ ధర్మసంకటం కల్గితే మళ్ళీ నాస్తికుడి మతం అవలంబించవచ్చు కూడ, ఈ ధర్మసంకటకాలం గురించి నాస్తికవాదము చేశాను, ఇప్పుడు ఆ సమయము వచ్చినది కనుక అట్లా మాట్లాడాను, నిన్ను రాజ్యానికి మరల్చుట ఒకప్రయోజనం, భరతునికి ఉత్సాహము గలిగించుట మరియొక కారణము అని జాబాలి చెప్పాడు. గోవిందరాజీయములో వివరణ విశదముగాను సమంజసముగాను ఉన్నది. తీర్థీయములో అవసర పూర్తిగనున్నది.

"జ్యేష్ఠునకే రాజ్యప్రాప్తి" అనే విషయాన్ని చెప్పడానికి, సృష్టి ఆరంభాన్ని, రాజపరంపరను చెప్పుతున్నాడు అని 110వ సర్గను తీర్థీయం మొదలు పెట్టినది. "జాబాలి మాటలలోని నిజాన్ని తెలిపి, అతనిపై రామునకు గల కోపాన్ని తొలగించి, జ్యేష్ఠునకే రాజ్యార్హత అను తన అభిప్రాయమైనట్టి, రాముడు తిరిగి రాజ్యానికి రావడానికి ఉపాయమును ప్రతిపాదిస్తున్నాడు" అని గోవిందరాజీయము వ్యాఖ్య మొదలవుతుంది.

ఇక్ష్వాకుల వంశంలో జ్యేష్ఠునకే రాజ్యాధికారం పరంపరగా వస్తున్నది. ఆ ధర్మాన్ని నీవు పాటించాలి, రాజ్యానికి తిరిగిరావాలి అని వసిష్ఠుడు చెప్పాడు. ఈసర్గలో ప్రత్యేకతలు ఏమిలేవు.

"రాముడు రాజ్యానికి మరలిపోయే ఉపాయములను మళ్ళీ కొన్నిటిని చెప్పి నిరసిస్తున్నాడు ఈ 111వ సర్గలో" అని గోవిందరాజీయము ఆరంభమవుతుంది.

"మన్వాదిరాజులనుండి ఇంతవరకు జ్యేష్ఠుడే రాజ్యమును పాలించాడు అని చెప్పిన దానిక్కూడ అంగీకరించ(నందున) దని తలచి, తండ్రిమాటను పాటించడం కంటె, నీకూ, నీతండ్రి గారికీ గురువునైన నామాటనే పాటించదగినది అని చెప్పి మొదలు పెడుతున్నాడు" అని 111వ సర్గను ఆరంభిస్తుంది మహేశ్వర తీర్థీయము.

"తల్లిదండ్రి శరీరమును ఇస్తారు. గురువు విద్యతో జన్మనిస్తాడు. ప్రజ్ఞను కలిగించుటలో గురువు తల్లిదండ్రుల కంటె శ్రేష్ఠుడు. అతడు చెప్పుతున్నాడు పరిషత్తులోనివారు, వ్యాపారులు, ద్విజులు రమ్మంటున్నారు. వీరి మాటలను పాటించితే ధర్మమార్గమును దాటినవాడవు గావు. ముదుసలి, ధర్మశీలయయిన తల్లిమాట ఆచరిస్తే సజ్జనుల మార్గం దాటినవాడవు కావు. ఆమెను నీవు సేవించాలి. ఆ తల్లి, తండ్రి కంటే నూరు రెట్లు ఎక్కువ అని కీర్తింపబడినది". ఇది రెంటిలో సమమే.

"నా తల్లిని ఒప్పించాను, సాంత్వన పరిచాను, నీవు తప్పక రాజ్యానికి రావాలి అని యాచించు భరతుని మాటలను పాటించినందున, నీ సత్యధర్మనిష్ఠకు ఎట్టి భంగం వాటిల్లదు" అనేది కూడ సమానమే.

గోవిందరాజీయములోని విశేషములను తెలుసుకుందాము ఆత్మను, అనగా ఆత్మభూతుడైన భరతుని కాదనకుము అని ఉదారుడు (అను వ్యాఖ్యాత లేదా ప్రవచనకర్త చెప్పాడని భావము. సత్యధర్మనిష్ఠాతత్త్వము అను స్వభావమును దాటవద్దు అని మరికొందరు. (ఈ మాట తీర్థీయములోనే ఉన్నది.వి.కర్త) "ఆశ్రితులకు అధీనుడుగా నుండుట అనునట్టి తన సాధారణ ధర్మమునుండి తొలగవద్దు" అని ఆచార్యులు చెప్పినారు. అదియే- ఆశ్రిత పరాధీనతయే, సర్వేశ్వరునకు స్వతస్సిద్ధమైన స్వభావము, దానికి దృష్టాంతముగా సత్యధర్మ పరాక్రమ అని సంబోధనము. సత్యవచనము ఎట్లా అతిక్రమించరానిదో, అట్లే ధర్మము, అదే విధంగా ఆశ్రిత పారతంత్ర్యము

కూడ అతిక్రమించరానిది. సత్యము మరియు ధర్మముల యొక్క "శరీరి ఉంటేనే ధర్మం ఆచరించాడా? లేదా?" అని ధర్మముల చర్చ జరుగుతుంది సర్వధర్మములను సంపాదించుటకు కారణము శరీరము. అట్టి శరీరమును కలిగించుట, అత్యంతాజ్ఞానదశలో సర్వప్రకారముల రక్షణ చేయుట, అనేక విధములుగా ఉపకారము చేయుట అను వానిచేత, ఆచార్యుని మాటకంటె తండ్రిమాటే తప్పక ఆచరింపదగినది అనునది రెండు వ్యాఖ్యలలో సమమే, అందుకనే, మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ అని చివరి భాగంలో ఆచార్యుని చెప్పారు అని గోవిందరాజీయములో అధికము.

"నను గన్న తండ్రి అనుటతో గౌణపిత– పెంచి పోషించి మిగతవి చేసినవాడు మాత్రమే గాదనుట. మొదట ఆయనకు మాట ఇచ్చినందున, ఇప్పుడు తల్లిమాటను గాని, సోదరుని మాటనుగాని చేయలేను" అనునది గోవిందరాజీయములోని అధిక వివరణము.

"భరతుడు అది విని సారథితో దర్భలతో ఆసనము ఏర్పాటు చేయమంటాడు. దాని మీద కూచుని తాను ప్రాయోపవేశము తనువు చాలించుట చేస్తానన్నాడు. ఆహారం తీసుకోను, ఎవరిని దేనిని చూడను, వడ్డికి ధనాన్ని అప్పు ఇచ్చినవాడు, ఆ అప్పు వసూలు చేసుకోవడానికి పడిగాపులు పడినట్లు పడుకుంటాను రాముని ఎదుట, అని కూడ అన్నాడు. ఇది రెండింట సమమే. వడ్డి రావాలనే బుద్ధితో డబ్బు అప్పుకు ఇచ్చినవాడు ఉత్తమర్ణుడు, అప్పు తీసుకున్నవాడు. అధమర్ణుడు, ఇచ్చిన అప్పును వసూలు చేసుకోవడానికి అధమర్ణుడిని– అప్పుబడ్డవాడిని అటకాయించు ఉత్తమర్ణుడి (అప్పు ఇచ్చిన వాని) వలె, నా కోరిక తీర్చే వరకు ప్రాయోపవేశం నిద్రాహారాలు మాని, ముఖం కప్పుకుని చావుకు ఎదురు చూస్తుంటాను" అనునది తీర్థీయంలో స్పష్టంగా ఉన్నది.

నాయనా! ఏం అపకారం చేసానని ప్రాయోపవేశంతో నన్ను అడ్డగిస్తావు. తాము ఇచ్చినది వసూలు చేసుకోవడానికి, ఓవైపు పడుకొని అడ్డుకోవచ్చును గాని పట్టాభిషిక్తుడవగు, రాజన్యుడవగు నీకు ప్రాయోపవేశ నాధికారం లేనేలేదు. రాజులకు ఇట్లా నిర్బంధించుట యోగ్యము కాదు అనునది తీర్థీయములో స్పష్టముగా అధికముగా నున్నది.

కూచొని ఉండే భరతుడు పౌరజానపదులను, రాముని రాజ్యానికి రమ్మని శాసించమన్నాడు. వారు, రాముడు నిజం చెప్పాడు. తండ్రిమాట మీద ఉన్నాడు. మేము మాత్రం ఎలా చెప్పుతాము, అన్నారు. రాముడు ఇలా చెప్పాడు – మిత్రులు, ధర్మకోవిదులు చెప్పినది బాగా విను, అర్థం చేసుకో. రెండూ విని బాగా ఆలోచించు. నీళ్ళను తాకుము, నన్నుకూడ స్పృశించు. ఇక్కడ గోవిందరాజీయమంటుంది– ఇక ముందు ఇలాంటి అఘాయిత్యపు పనులు చేయను అని ఒట్టు పెట్టుకోవడానికి నీళ్ళను ముట్టి, నన్ను ముట్టు అని అన్నాడు రాముడు భరతునితో అని. అప్పుడు భరతుడు జలమును తాకి, రాముని తాకి ఇట్లా అన్నాడు. అందరు వినండి. నేను నాతండ్రిని రాజ్యాన్ని అడుగలేదు. తల్లిని అట్లా చేయమనీ అడుగలేదు. ఇప్పుడు రాముడు వనవాసం చేయడాన్ని ఒప్పుకోను. అడవిలో తప్పక నివసించాల్సిందే, తండ్రిమాట ఆచరించాల్సిందే అయితే, నేనే అడవిలో ఉంటాను రాముడే రాజ్యాన్ని పాలించనీ, ఇట్లా అయితే ఇద్దరం తండ్రిమాట జవదాటనట్లవుతుంది.

"నాకు వనవాసాన్ని ఇచ్చి దాని మూల్యముగా రాజ్యమును తీసుకున్నాడు, లేదా నాకు వనవాసాన్ని న్యాసముగా ఇచ్చి నీకు రాజ్యము నిప్పించాడు, అది లోపింపచేయడం వీలు కాదు అని రాముడు అన్నాడు అని గోవిందరాజీయము.

ద్రవ్యము తీసుకొని ఇచ్చినది విక్రీతము అంటారు. కాపాడమని ఇచ్చిన దానిని ఆధి లేదా న్యాసము అంటారు. ద్రవ్యం ఇచ్చి తీసుకున్న దానిని క్రీతం అంటారు. వనవాసవిషయంలో శక్తిగల నేను ఇంకో ప్రతినిధిని పెట్ట గూడదు" అని తీర్థీయము. అంటే భరతుడు వనవాసము చేయగూడదు. వెళ్ళిపోవాలని భావము.

"నీళ్ళతో స్నానం చేయ చేతగాని వానికే మంత్రములతో స్నానం విధించినట్లు, చేతనైన నేను ప్రతినిధిని పెట్టుకోగూడదు. అట్లా చేయడం హీనమని" విభవము ఉండగా, హీనమైన పద్ధతిని పాటించవద్దు" అని పెద్దలు కూడ చెప్పారు" అంటుంది గోవిందరాజీయము. "కైకయి మాత యుక్తియుక్తంగానే అడిగినది, తండ్రి బాగుగనే ఇచ్చాడు. నేను అది పాటించాను. నీవు కూడ పాటించి తండ్రిని అనృతం నుండి కాపాడుము" అని రాముడు భరతునితో చెప్పుట, రెండింట సమమే.

"ఈ 112వ సర్గలో భరతుని సమాధానపరచిపంపుట" అను మాటలతో గోవిందరాజీయము ఆరంభ మవుతుంది.

తన బుద్ధికుశలతతో చెప్పిన ఇతర ఉపాయాలు విఫలమయినది చూసి గత్యంతరము లేక భరతుడు రామునినే శరణు వేడుతూ పాదములపై పడ్డాడు అంటుంది గోవిందరాజీయము. "తనను శరణు వేడడం వ్యర్థం కాదు కనుక, పూర్వము దేవసంఘము చేసిన శరణాగతికి ఇచ్చే ఫలానికి తగినట్టి తండ్రి వాక్యమును పరిపాలించు పనిచే కొంత అవరోధం కలిగింది భరతుని మాట నెరవేర్చుటకు – ఆ జాగును ఎట్లాగో ఓర్చుకోమని చెప్పి ఓదార్చుట కొరకు, భరతుని రాముడు తన తొడ మీద కూచోపెట్టుకుంటున్నాడు" రాముని దివ్యదేహ సంస్పర్శతో భరతునకు అతిశయించిన పుష్టి కలిగింది, ఈవిషయాన్ని తెలుపడానికి భరతునికి 'శ్యాముడు, నలినపత్రాయతాక్షుడు, మత్త హంస స్వరము గలవాడు' అని విశేషణాలు.

నేను చెప్పినా, దేవర్షి సంఘములు చెప్పినా, మాటిమాటికి చెప్పినా, భరతుడు నన్ను రాజ్యానికి తీసికొనిపోయే కోర్కెను విరమించడని, ఆ కోర్కెను వదలింప జేయాలని స్వప్రతిజ్ఞ ఎంత దృఢమయినదో భరతునికి తెలుపడానికి "చంద్రుడు కాంతి దప్పనీ, హిమవంతుడు హిమాన్ని వదలి పెట్టనీ, సముద్రము చెలియలికట్టను దాటనీ, నేను తండ్రికి ఇచ్చిన మాట దాటను. విశేషము కృష్ణపక్షంలో చంద్రుడు కాంతివిహీనుడవుతాడు, వేసవిలో మంచు కరిగిపోతుంది, ప్రళయకాలంలో సముద్రము వేలాతిక్రమణం చేస్తుంది. కాని నేను అట్లా కాదు". ఇవి తీర్థీయములో కానరావు.

వసిష్ఠుని ఆనతితో భరతుడు రాముని పాదుకలను ప్రార్థిస్తాడు. వాటిని తీసుకుంటూ, "ఫలమూలాలను తింటూ నారచీరలు ధరించి, నీరాకకై ఎదురుచూస్తూ, పదునాలుగేండ్లు, పాదుకల ప్రతినిధిగా రాజ్యము ఏలుతాను. పదునాలుగేండ్లు నిండిన మరునాడే నిన్ను చూడకపోతే అగ్నిలో దూకుతాను", అని భరతుడు అంటాడు. ఇవి రెంటిలో సమమే.

"113వ సర్గలో భరతుడు అయోధ్యలో ప్రవేశించుట" అంటూ మొదలవుతుంది గోవిందరాజీయము. మొదట ఏనుగు మీదనుంచి కొద్ది దూరము ఊరేగించిన పాదుకలను తన శిరస్సున పెట్టుకున్నాడు భరతుడు. "నెత్తిని పెట్టుకొని మురిసాడు. తన కోరికకు తగిన కిరీటమును ధరించి (అసలు కిరీటమునకు బదులు పాదుకలను నెత్తిపై కిరీటము లాగా పెట్టుకున్నాడని అర్థము) సంతసించాడు. ఇంతకు ముందు స్వాతంత్ర్యముతో భయపడ్డాడు. ఇప్పుడు పాదుకాప్రాప్తికి హర్షించాడు" అని గోవిందరాజీయములో మాత్రమే ఉన్నది.

ఈ 116వ సర్గలో రాముడు చిత్రకూటమును విడిచి వెళ్ళుట అను మాటలతో గోవిందరాజీయ వ్యాఖ్యానం ఆరంభం అవుతుంది.

చిత్రకూటములోని తాపసాశ్రమములో నివసించు మునులందరు తనను చూసి, భయముతో ఉన్నట్లు వేరే ఆశ్రమానికి పోతల్చుకున్నట్లు, వారు మాట్లాడుకునే మాటలు, ఆకార చేష్టలతో రాముడు తెలుసుకున్నాడు.

ఈ సందర్భంలో తిలకంలో క్రింది చర్చ ఉన్నది. జ్యేష్ఠమాసంలో భరతుడు చిత్రకూటానికి బయలుదేరడం, వర్షర్తువు ముందు ఉండడంతో కార్తికమాసాంతం రాముడు చిత్రకూటంలో గడపడం, తదుపరి మునులు ఆశ్రమం వదలి వెళ్ళాలనుకుంటున్నారని చెప్పడం. అంతేగాని భరతుడు అలా వెళ్ళాడో లేదో ఇలా చిత్రకూటం ఖాళీ చేసి వెళ్ళడం కాదు. అందుకే పాద్మపురాణంలో "భరతుడు అయోధ్యకు వెళ్ళాక, రాముడు తమ్ముడు, భార్యసీతతో చిత్రకూట పర్వతముపై నివసిస్తుండెను. ఒకనాడు క్రీడించి అలసి సీత ఒడిలో తలబెట్టుకొని నిద్రిస్తుండగ, ఇంద్రుని సుతుడైన కాకి వచ్చి సీతను జూసి కాముకుడయి. మొదలయిన గ్రంథ సందర్భముతో రాముడు చిత్రకూటముపై చాలాకాలమే నివసించాడని చెప్పడం జరిగింది" అని ఈ విషయం మరి ఏ వ్యాఖ్యానంలోనూ లేనే లేదు.

వారి ప్రవర్తనతో తన పైన అనుమానం కలిగి తాపసులను, తనది, తమ్ముడిది, సీతది కాని ఏదయినా తప్పున్నదా? అని అడగనే అడిగాడు రాముడు. దానికి ఓ ముదుసలి తపస్వి ఇలా బదులు చెప్పాడు. "రావణుని తమ్ముడు ఖరుడు, అతడు యుద్ధాలలో జయము పొందినవాడు, నీవు ఇక్కడ నివసిస్తున్నది సహించలేక తాపసులను అందరిని హింసిస్తూ, ఈ చోటు వదలి వెళ్ళేలా చేస్తున్నాడు. అతడు నరభక్షకుడు కూడ. నీవంటే అసలు గిట్టదు. నీవు ఈ ఆశ్రమంలో ఉన్నప్పటి నుండి నానాబీభత్సం సృష్టిస్తున్నాడు. యజ్ఞయాగాలకు అడ్డంకులు కలిగిస్తున్నాడు. అపవిత్రం చేస్తున్నాడు. కనబడకుండ విహరిస్తూ తాపసులను గేలిచేస్తూ హింసిస్తున్నాడు. అందుకే అందరం అలా మాట్లాడుకోవడం, చిత్రకూటాశ్రమం వదలి వెళ్ళాలనుకోవడం, ఖరుడు నీ విషయంలో కూడ ఏదయినా అపకారం తలపెట్టవచ్చును. నీవు సమర్థుడవే అయినా భార్యతో ఇక్కడ ఉండడం భావ్యం కాదు. ఇష్టమైతే మాతో పాటు రావలసింది ఓ రామ!" అని.

"117వ సర్గలో రామసీతాలక్ష్మణులు అత్ర్యాశ్రమమును చేరుట" అని గోవిందరాజీయము మొదలు. "అసూయ లేనిది అనసూయ. ఇతరులకు చేయరాని పనులను జేసి, ఇతరులకు సహాయపడడంకోసం తపస్సు చేసి అసూయ లేనిది అనసూయ అని లోకఖ్యాతిని గాంచినది. లేదా పాతివ్రత్యమును పెంపొందించు నట్టి, ఇతరులు చేయలేనట్టి పతిరక్షణ మొదలయిన పనులచేత, పోటీపడరానట్టి మాహాత్మ్యము కలది, అసూయ చెందుటకు వీలుగానిదని లోకములో ఖ్యాతిని పొందినది", అని వివరణ. ఇంతగ తీర్థీయములో లేదు.

118వ సర్గలో సీతా అనసూయల సంవాదము అను మాటలతో గోవిందరాజీయము ఆరంభమవుతుంది. సీతాదేవి అనసూయకు తన కథ చెప్పు సందర్భంలో జనకుడు యాగస్థానమునకై, దున్నుతుండగ తాను లభించానని చెప్పింది. గోవిందరాజీయము జనకుడు ఆరు ఎద్దులు కట్టిన కాడితో దున్నినట్లు తెలుపుతుంది. దక్షయజ్ఞంలో శివునిచే పీడింపబడిన దేవతలు, శివుని ప్రార్థించి ధనుస్సు ఇమ్మని అడిగితే, దేవతలకు ధనుస్సు ఇచ్చి దేవరాతునకు (జనకుని పూర్వీకునకు) ఇమ్మన్నాడు. ఇక్కడ తీర్థీయంలో అందరిచే వరించబడేవాడు అను వ్యుత్పత్తిచేత వరుణుడు శివుడే అంటుంది. ఇది గోవిందరాజీయములో లేదు. మొత్తం తన స్వయంవరవృత్తాంతాన్ని వర్ణించి చెప్పినది సీతాదేవి.

"అత్ర్యాశ్రమములో రాత్రి నివసించి ఉదయం వెళ్ళిపోవుట అని 119వ (అయోధ్యాకాండలో చివరి సర్గ) సర్గ వ్యాఖ్యారంభము" గోవిందరాజీయములో. రాత్రిని వర్ణిస్తూ, ఆకాశంలో నక్షత్రాలు వెన్నెలలతో చంద్రుడు అగుపిస్తున్నాడు అని ఉంది. ఇక్కడి తిలకములో కార్తికం తర్వాతి ప్రతిపదంలో ప్రయాణము సూచితము అని విశేషమున్నది.

ఆశ్రమము నుండి వెళ్లునప్పుడు మునులు రామునితో "రామ! అడవిలో రాక్షసులు, క్రూరహింస మృగములు తిరుగుతున్నవి. జాగ్రత్తగా వెళ్ళండి. ఈ అడవిలో నరభక్షకులు, రక్తభక్షకులు అయిన రాక్షసులున్నారు. వారిని తొలగించుము. మహర్షులు పండ్లు మూలాలు తెచ్చుకొను ఈ మార్గం వెంట క్షేమంగా వెళ్ళి వస్తుంటారు. నీవు కూడ ఇదే తోవపట్టు", అని ప్రాంజలులై మంగళాశీర్వాదములతో సాగనంపగా రాముడు అరణ్యములోనికి ప్రవేశించాడు.

శ్రీమచ్ఛఠారి గురుశిష్యుడు, నిరుపమ ధిషణుడు, కౌశికసగోత్రుడు, ప్రతికథకగజ పంచాస్యుడు అయిన శ్రీ గోవిందరాజార్యుడు వెలయించిన శ్రీరామాయణభూషణమయిన పీతాంబరమను రామాయణవ్యాఖ్యయందు అయోధ్యాకాండ సమాప్తము.

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య నారాయణతీర్థశిష్య శ్రీమహేశ్వరతీర్థవిరచిత శ్రీరామాయణతత్త్వదీపిక యందు అయోధ్యాకాండ సమాప్తము.

రామానుజీయము గోవిందరాజీయాంతర్గతమే. తిలకము తత్త్వదీపికాంతర్గతమే.

---

శ్రీ విరోధి శ్రావణ శుద్ధదశమి వరలక్ష్మీ వ్రతదినము.

# అరణ్యకాండ సారాంశం

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

అరణ్యకాండలో రాముడు (మోక్షప్రదాత అనే విషయం అభివ్యక్తమై, ఆయన) మోక్షప్రదాతయైన మహావిష్ణువేయని వెల్లడవుతుంది. రాముడు సీతాలక్ష్మణసమేతుడై దండకారణ్యంలో పెక్కు తాపసాశ్రమాలను సందర్శించాడు. దర్భలతోను, నారచీరలతోను బ్రాహ్మీలక్ష్మితో అవి ప్రకాశించాయి. మధ్యాహ్నకాలంలో తాపసాశ్రమ మండలం సూర్యమండలంలా దుర్నిరీక్ష్యమై ఉంటుంది. కావున రాక్షసాదులు ప్రవేశింపలేరు. రాముడు అల్లెత్రాడును ధనుస్సు నుండి వేరుచేసి అందు ప్రవేశించాడు. మహర్షులు రాముని ఉదయిస్తున్న చంద్రునిలా ఆహ్లాదకారుడైన వానిగా దర్శించారు. ఇక్కడ వాల్మీకి “సోమం” అనే పదం ఉపయోగించారు. ఉమాసహితుడైన ఈశ్వరునిలా ఉన్నవాడనే అర్థం కూడ స్ఫురిస్తుంది. నీవు నగరంలో ఉన్నా, వనంలో ఉన్నా మాకు రాజువే అని వారు వచించారు. గర్భస్థ శిశువును తల్లి కాపాడినట్లుగా మమ్మల్ని నీవే కాపాడాలని వారు ప్రార్థించారు.

అరణ్యాలలో ప్రవేశించడంతోనే విరాధుడు సీతను అపహరించాడు. అంత రాముడు

**“పరస్పర్శాత్తు వైదేహ్యా న దుఃఖతరమస్తి మే ।**
**పితుర్వియోగాత్ సౌమిత్రే స్వరాజ్యహరణాత్తథా” ॥**

రాజ్యాధికారం పోయినా, పితృవియోగం కుదిపివేసినా వాటికంటె కలిగిన బాధ వైదేహి పరస్పర్శకు లోనుకావడం వల్ల తనకు కలిగిందని వాపోయాడు. (బాధాకరంగా ఉందని వాపోయాడు.) ఇరువురు కర్తవ్య పరాయణులై విరాధుని దక్షిణ, వామహస్తాలను ఖండించారు. వాని కోరికపై ఒక పెద్దగోతిలో వాని శరీరాన్ని పాతిపెట్టారు. మరణించే రాక్షసులను ఇలా సమాధి చేయడం ఒక పారంపర్యాచారమే, విరాధునికి శాపవిమోచనం కల్గించి రాముడు అతనికి ముక్తి కలిగించాడు.

పిమ్మట శరభంగుని ఆశ్రమంలో ప్రవేశించారు. ఆకుపచ్చని గుఱ్ఱాలు కలిగి అంతరిక్షంలో భాసిస్తున్న ఇంద్రుని రథాన్ని వీక్షించాడు అక్కడ రాముడు. బ్రహ్మ ఆజ్ఞపై శరభంగుని బ్రహ్మలోకానికి ఆహ్వానించడానికి వచ్చాడు ఇంద్రుడు. కాని ఆ మహర్షి రామసందర్శనం చేసిన పిమ్మటనే వస్తాననడంతో దేవరాజు వెళ్లిపోయాడు. వారు ముగ్గురు అంత శరభంగుని వీక్షించి పాదాభివందనం చేసారు. శరభంగుడు తాను సంపాదించిన లోకాలను రామునికి సమర్పించాడు. అంత ఆ రాముడు వాటిని నా ప్రభావంతోనే పొందగలనంటాడు.

శరభంగుడు సుతీక్ష్ణుని దర్శించమని చెప్పి, తన శరీరాన్ని అగ్నికి ఆహుతి చేసి బ్రహ్మలోకం చేరుకొన్నాడు. బ్రహ్మ శరభంగునకు స్వాగతం కూడ పలికాడు. “విరాధం హత్వా శరభంగం దదర్శ హ” అని విరాధవధరూపమైన ఫలాన్ని అర్పించాడు. మునీశ్వరులు రాక్షసులు పెట్టే బాధలను తొలగించమని రాముని ప్రార్థించారు. జ్ఞాననిష్ఠులైన వారు భగవంతుని ఏమీ కోరరు. కాని ఇక్కడ ఋషులు రాముని అర్థించడం జరిగింది. అంత శ్రీరాముడు

మహర్షులారా! మీరు నన్ను ప్రార్థించడం తగదు. నన్ను ఆజ్ఞాపించండి. రాక్షసులను రూపుమాపడం నా కర్తవ్యం. అందుకే పితృవాక్యపాలన అనే నెపంతో వనాలలో ప్రవేశించాను. ఇది దైవికము.

**"తపస్వినాం రణే శత్రూన్ హంతుమిచ్ఛామి రాక్షసాన్ ।**
**పశ్యంతు వీర్యం ఋషయః సభ్రాతుర్మే తపోధనాః" ॥**

అని వారికి అభయప్రదానం చేశాడు.

శరభంగుని ఆజ్ఞానుసారంగా రాముడు సుతీక్ష్ణుని ఆశ్రమం చేరాడు. ఆయన దూరం నుండే రాముని చూచి ఎదురు వెళ్లి కౌగిలించుకొన్నాడు. ఇది ఆయన పరమభక్తికి ఉత్కృష్టనిదర్శనం. నీవు ఇలా వస్తున్నావని తెలిసి దేవలోకం కూడ వెళ్లక నీ కోసమే వేచి ఉన్నానని సుతీక్ష్ణమహర్షి రామునితో అన్నాడు. అంటే స్వర్గలోకప్రాప్తి కంటే రామదర్శనమే శ్రేష్ఠమని ఆయన దృఢవిశ్వాసం. ఆ లోకాలన్నీ పునరావృత్తి కలవే. రాముడే మోక్షప్రదాతయని ఆయన నిర్ణయం.

వారు మళ్లీ అక్కడ నుండి ప్రయాణం సాగించారు. అప్పుడు సీత ధనుర్బాణాలను రామలక్ష్మణుల కిచ్చిందంటారు వాల్మీకి. వారు సుతీక్ష్ణదర్శనార్థం వెళ్లేటప్పుడు ఒకచోట భద్రంగా వాటిని ఉంచి యుండవచ్చు. వాటిని సీత రామలక్ష్మణులకు ఇచ్చి ఉండవచ్చు. దీనివల్ల వాటిలో లోకసంహారశక్తి ప్రవేశించిందని చెప్పవచ్చు.

మార్గమధ్యంలో సీత చనువుగా రామునితో మానవులకు మిథ్యావాక్యం, పరదారాభిగమనం, వైరం లేకున్నా ప్రాణిహింసచేయడం అనే మూడూ ఆపదలకు కారణాలవుతాయని, మునులకు అభయప్రదానం ఎందుకు చేసారని ప్రశ్నిస్తుంది. రాముని సత్యప్రతిజ్ఞుని చేయడం కోసమే ఆమె అలా అని ఉండవచ్చు. రాముడంత

**"అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణామ్ ।**
**న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః" ॥**

అని తననిర్ణయాన్ని ప్రకటిస్తాడు. బ్రహ్మజ్ఞానులైన బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను మరువలేనంటాడు. అన్నట్లుగానే రాముడు ముందు సీతను, పిమ్మట లక్ష్మణుని కూడ పరిత్యజించవలసివచ్చింది.

వారు ముగ్గురూ పది సంవత్సరాలు మున్యాశ్రమాలలో గడిపి సుతీక్ష్ణుని వచనానుసారంగా మళ్లీ ఆయన ఆశ్రమానికి వెళ్లి, ఆయన ఆజ్ఞానుసారంగా అగస్త్యుని సోదరుని సందర్శించి, అగస్త్యాశ్రమం చేరారు. అగస్త్యుని దేవతాగృహాన్ని వీక్షించారు. అక్కడ 17 స్థానాలు దేవతాస్థానాలుగా పూజించబడడం వారు చూశారు. అందు రుద్ర (శివ) స్థానం చెప్పబడలేదు. "యో వై సప్తదశం" అనే అనువాకంలో చెప్పబడిన 17 మంది దేవతలు ఇందు ప్రకటింపబడడం జరిగింది. ఇక్కడ రుద్రుడు చెప్పబడలేదు కావున రుద్రుడు అపూజ్యుడని, ఆయన తామసాచారంగా పూజింపబడుతున్నాడని వ్యాఖ్యాతల అభిప్రాయం. కాని రుద్రుని సోఽహంభావంతో అర్చిస్తున్నప్పుడు వేరే రుద్రస్థానాన్ని గూర్చి చెప్పవలసిన అవసరం లేదు.

అప్పుడు అగస్త్యుడు వైష్ణవధనుస్సును రాముని కీయడం జరుగుతుంది. అది పరశురాముని నుండి గ్రహించి వరుణునికీయగా ఖరదూషణాది వధ సమీపిస్తున్నదని వరుణుడు ఇంద్రునికి సమర్పించగా అతడు అగస్త్యునికీయగా, అగస్త్యుడు రామునికిచ్చాడని వ్యాఖ్యాతల అభిప్రాయం. అగస్త్యహస్త సంస్పర్శవల్ల అది మరింత తేజస్వంతమయ్యింది. అగస్త్యుడు ఆదిత్యహృదయం ఉపదేశించడం వల్ల మానవునిగా ఉన్న రాముడు రావణవధ చేయడం సులభమయ్యింది.

అగస్త్యుడు రామునితో "యథైషా రమతే రామ ఇహ సీతా తథా కురు" అని సీత నీ వెంటరావడం ఒక సాహసకృత్యమని. ఆమెకు ఏది సంతోషమయ్యిందో, అలా చేయమని అంటాడు. అందువల్లనే రాముడు సీత మాయలేడి కావాలని కోరినా కాదనలేకపోయాడు. ఆయన ఆజ్ఞానుసారంగా పంచవటికి వారు ముప్పరూ బయలుదేరారు. మార్గమధ్యంలో జటాయువు వారిని వీక్షించాడు. తాను శంబరాసురయుద్ధంలో దశరథుని మిత్రుడనని తెలియజేసాడు. అందువల్లనే మిత్రత్వం సంభవించియుండవచ్చు. రక్షిష్యే త్వయి యాతే సలక్ష్మణే" అని రామా! లక్ష్మణ సహితంగా నీవు దూరంగా వెళ్లినప్పుడు సీతాదేవిని రక్షిస్తానని మాట కూడ ఇచ్చాడు.

పంచవటిలో రాముడు సరియైన ప్రదేశంలో పర్ణశాల నిర్మించమని లక్ష్మణుని ఆదేశిస్తాడు. కాని సౌమిత్రి తాను ఎప్పుడూ సేవకుడనే (పారతంత్ర్యబుద్ధి కల్గినవాడనే) అని నీకు నచ్చిన ప్రదేశమేదో సెలవీయమంటాడు. ఇది లక్ష్మణుని సూక్ష్మబుద్ధికి పరమోదాహరణం. ఇక్కడ నుండే సీతాపహరణం జరగబోతోంది. తాను నిందల పాలు కావలసివస్తుందేమోఅని ఆయన అనుమానం అయి ఉండవచ్చు. అక్కడ గోదావరిలో సీతాలక్ష్మణసమేతుడై స్నానం చేసిన రాముడు గంగాజలాలలో పార్వతితోను, నందితోను, కలిసి స్నానంచేసిన పరమశివునిలా ఉన్నాడంటారు వాల్మీకి.

పిమ్మట శూర్పణఖ రంగప్రవేశం చేసింది. ఆమె పది ఇంద్రియాలు రాముని చూడగానే కామ పరవశాలయ్యా యన్నట్లుగా పది ఉపమానాలు వాడారు మహర్షి. నీవెవరవని ప్రశ్నిస్తుంది. ఆమె శ్రీరాముని

**"అనృతం నహి రామస్య కదాచిదపి సమ్మతమ్ ।**
**విశేషేణాఽశ్రమస్థస్య సమీపే స్త్రీజనస్య చ" ॥**

రాముడు సత్యవచనుడు కాన తాను దశరథపుత్రుడనని తన వృత్తాంతాన్ని తెలియజేశాడు. శూర్పణఖ కూడ తన ఉదంతాన్ని వివరించి తన్ను వివాహమాడమని కోరింది. అంత రాముడు మృదు మధుర పరిహాస పూర్వకంగా తాను వివాహితుడనని (కృతదారుడనని) లక్ష్మణుడుకూడ కృతదారుడయినా భార్యకు దూరంగా ఉన్నాడని ఆతనిని ఆశ్రయించమన్నాడు. నిజంగా ఆమె రామునిపై ప్రియం కల్గినదయిఉంటే, నిన్నే వరిస్తానని పలకాలి. కాని రాముని మాటలపై ఆమె లక్ష్మణుని చేరి మోహబుద్ధి ప్రకటించింది. దానికి ఫలితంగా ముక్కు, చెవులూ పోగొట్టుకొంది. తత్ఫలితంగా ఖరదూషణాదులు చతుర్దశసహస్రరాక్షససమేతంగా హతులయ్యారు. ఈ మహాకార్యానికి సంతోషించిన ఋషులందరూ రాముణ్ణి అభినందించి పూజించగా లక్ష్మణుడుకూడా రాముణ్ణి పూజించాడు.

అప్పుడు సీత.

**"తం దృష్ట్వా శత్రుహంతారం మహర్షీణాం సుఖావహమ్**
**బభూవ హృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే"** అని పట్టరాని సంతోషంతో తన ప్రాణేశ్వరుని కౌగిలించుకొంది. రాముని గాయాలబాధ శాంతించుటకై కాబోలు మరోసారి కౌగిలించుకొందంటారు. సీతారామతత్త్వం తెలిసిన బుధావతంసులు.

రామరాక్షసయుద్ధంలో చావుదప్పికన్ను లొట్టబోయిన సామెతగా తప్పించుకొన్న అకంపనుడు రావణుని వద్దకు వెళ్లి ఖరదూషణాది వధను తెలియజేశాడు. అతడే సీతను అపహరించమని రావణుని పురిగొల్పుతాడు.

**తస్యాపహర భార్యాం త్వం ప్రమథ్య తు మహావనే ।**
**సీతయా రహితః కామీ రామో హాస్యతి జీవితమ్ ॥ ఆరణ్య-31స. 31శ్లో**

నీవు సీతను అపహరిస్తే భార్యావియోగదుఃఖాన్ని తట్టుకొనలేక రాముడు జీవితం చాలిస్తాడని హితవు పలికాడు. రావణుడు మారీచుని వద్దకు వెళ్ళి కర్తవ్యాన్ని ఉపదేశించ మంటాడు. అతడు రామునితో విరోధం వద్దని హితం పలుకగా, రావణుడు తిరిగి వచ్చేసాడు. అంత శూర్పణఖ రాజసభకు వచ్చి తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చమంది. మళ్ళీ రావణుడు మారీచాశ్రమానికి వెళతాడు.

"రామో విగ్రహవాన్ ధర్మః" అని మారీచుడు చెప్పి రామునితో విరోధం సర్వరాక్షససంహారానికి కారణ మవుతుందంటాడు. అయినా రావణుడు వినలేదు. బంగారపు లేడిగా అతడు మారి పర్ణశాల ముందు తిరుగాడ సాగాడు. సీతాదేవిని అపహరిస్తే నీవు సపరివారంగా నశించడం తథ్యమని మారీచుడు చెప్పినా వినక రావణుడు ఆతనిని వెంబడించాడు.

లేడిగా వచ్చినవాడు మారీచుడేయని లక్ష్మణుడు ముందే గ్రహించాడు. ఆ విషయాన్ని సీతారాముల ముందు ప్రస్తావించాడు. అయినా సీత "కామవృత్తమిదం రౌద్రం స్త్రీణామసదృశం మహత్" అంటూ ఈ ఘోరమైన కార్యానికి పతులను పురికొల్పడం ఉత్తమస్త్రీలకు ఉచితం కాదు. అయినా నాకు దీనియందు కోరిక పుట్టింది అని వచించింది. దీనిని బట్టి సీతకు కూడ వాస్తవమేమిటో తెలియకుండా అయిందని చెప్పడం ఉచితం కాదు. ఆమె కావాలనే ఆ లేడిని కోరిందని చెప్పాలి.

రాముని బాణాఘాతానికి మారీచుడు హతుడయ్యాడు. హా సీతా! హా లక్ష్మణా! అని గట్టిగా అరచాడు వాడు చనిపోతూ. సీత లక్ష్మణుని తూలనాడి రామసంరక్షణార్థం పంపించింది. అంత రావణుడు కపటయతి వేషంతో సీతాపహారణార్థమై అచ్చటకు వచ్చాడు. రావణునిలో రెండు లక్షణాలు గోచరిస్తాయి. మొదటిది రాక్షసలక్షణం. రెండవది జయవిజయులలో ఒకడైన తన జీవలక్షణం. అందువల్ల ఆమెను చూచిన వెంటనే ముందు కామప్రవృత్తి అతనిలో విజృంభిస్తుంది. అంతలోనే అతని జీవలక్షణం స్మరణకు వస్తుంది. సీతవద్ద అనాలోచితంగా ముందు మాట్లాడినా అపహరించే సమయంలో ఆమెను తల్లిగా భావన చేసి స్పృశించాడు. పాదాలను కుడిచేతితో పట్టుకొని, ఎడమచేతిలో ఆమె జుట్టుపట్టుకొన్నాడు. "జగ్రాహ రావణః సీతాం బుధః ఖే రోహిణీమివ" అని అంటారు వాల్మీకి మహర్షి. బుధుడు చంద్రుని కుమారుడు. చంద్రుని భార్య రోహిణి. అందువలన మాతృభావనతో స్పృశించాడని

చెప్పక తప్పదు. లేకపోతే బ్రహ్మశాపంవల్ల రావణుని తలలు వేయి ముక్కలు కావాలి. **జహారాత్మవినాశాయ దశగ్రీవో మనస్వినీం** అని అంటారు వాల్మీకి. కాబట్టి తన వినాశం కొఱకే రావణుడు సీతను అపహరించాడని చెప్పక తప్పదు.

మార్గమధ్యంలో జటాయువు సీతను రక్షించడానికై వచ్చాడు. రామలక్ష్మణులు పర్ణశాలవద్ద లేని సమయంలో సీతను రక్షిస్తానని ముందే మాట ఇచ్చాడు. కావున రావణునితో ద్వంద్వయుద్ధం చేశాడు. ఆ పక్షి ధాటికి రావణుని రథం ముక్కలైపోయింది. రావణుని దెబ్బకు జటాయువు రెక్కలు తెగిపోయాయి. క్రిందపడిన రావణుడు మరల సీతను పట్టుకొని ఆకాశమార్గంలో ఎగిరి పయనించాడు. వారికి జరిగిన పెనుగులాటలో ఆమె (ఎడమ) కాలిఅందె జారినేలపై పడిపోయింది. సీత క్రిందకు చూడగా ఒక గిరిశృంగంపై ఐదుగురు వానరులు కనపడ్డారు. అపుడామె తన ఉత్తరీయంలో కొన్ని నగలను కట్టి వారి మధ్య జారవిడిచింది. తన అపహరణవార్తను వారేమైనా తెలియ జేయవచ్చని ఆమె అలా చేసింది. రావణుడు ఆ సంగతిని గ్రహించలేకపోయాడు.

ఇక్కడ స్కందపురాణం ఒక విషయాన్ని వివరించింది. సర్వవిద్యావిశారదుడైన రావణుడు సీతయొక్క జానుకేశాదిచ్ఛాయనే గ్రహించాడని, సాక్షాత్తుగా స్పృశించలేదని పేర్కొంది. కొన్ని ఇతర గ్రంథాలయితే, అగ్నిదేవుడు సీతాపహరణ సమయంలో ఛాయాసీతనక్కడ ఉంచి నిజమైన సీతను తన వెంటతీసుకొనివెళ్లాడని, అగ్ని ప్రవేశ సమయంలో నిజమైన సీతను రామునికి సమర్పించాడని వ్రాక్రుచ్చాయి.

రావణుడు మొదట సీతను తన అంతఃపురానికే తీసుకొని వెళ్లాడు. అక్కడ మృదువైన ఆమె పాదాలకు తాను తలలు వంచి నమస్కరిస్తానన్నాడు. ఆమె గడ్డిపోచనొకదానిని అడ్డుగా ఉంచి రావణుని నిందించి తృణీకరించింది. అప్పుడు అశోకవనంలో ఆమెను ఉంచి రాక్షసకాంతలను కాపలా పెట్టడం జరిగింది. బ్రహ్మ ఆదేశానుసారంగా దేవేంద్రుడు లంకకు వెళ్లి సీతకు పాయసాన్ని అర్పిస్తాడు. ఇది ప్రక్షిప్తమని కొందరి భావన.

మారీచుని చంపి ఆశ్రమానికి బయలుదేరిన రామునికి ఎన్నో అపశకునాలు ఎదురయ్యాయి. మధ్యలో తారసపడిన లక్ష్మణుని రాముడు తన మాట పాటించక వచ్చేసినందులకు మందలించాడు. ఆశ్రమానికి తిరిగి వచ్చిన శ్రీరాముడు సీతకై పలుచోట్ల గాలించాడు. చెట్టనక పుట్టనక తిరుగాడాడు. సీత కానరాకపోయినందులకు పరమకోపోద్రిక్తుడయ్యాడు. మృగసంకేతం ద్వారా దక్షిణదిశగా పయనించి అన్వేషించాడు. ఒకచోట క్రిందపడియున్న సీతాదేవి ఆభరణాలను యుద్ధసాధనాలను చూచి ముల్లోకాలను భస్మీపటలం చేయబోయాడు. లక్ష్మణుడు తన మృదువచనాలతో ఆయనను శాంతపరచాడు. మార్గమధ్యంలో అవసానదశలో నున్న జటాయువును వారు చూడడం జరిగింది. సీతాపహరణ వృత్తాంతాన్ని ఆ పక్షి తెలియజేస్తూ **"పుత్రో విశ్రవసః సాక్షాత్ భ్రాతా వైశ్రవణస్య చ"** అని కొంతభాగాన్ని మాత్రమే చెప్పగలిగాడు. ఈ శ్లోకంలోని రెండవ పాదాన్ని కిష్కింధాకాండలో సంపాతి పూర్తిచేస్తాడు. **"ఇత్యుక్త్వా దుర్లభాన్ ప్రాణాన్ ముమోచ పతగేశ్వరః"** అని వాల్మీకి వ్రాస్తూ.

**"బ్రూహి బ్రూహీతి రామస్య బ్రువాణస్య కృతాంజలేః ।**
**త్యక్త్వా శరీరం గృధ్రస్య జగ్మః ప్రాణా విహాయసమ్" ॥ అని అంటారు.**

వాల్మీకి మహర్షి. అది ప్రాణాలను పూర్తిగా చెప్పకుండా విడిచి పెడితే, దానికి కృతఘ్నుతా దోషం, అసత్యదోషం వస్తాయి. కాబట్టి పక్షి శరీరాన్ని విడిచి ప్రాణాలు తమంతటతామే వెళ్లిపోయాయట. ఆ పక్షిరాజుకు రామలక్ష్మణులు స్వయంగా ప్రేత కృత్యాలు నిర్వహించారు. దానికి రాముడు మోక్షాన్ని ప్రసాదించాడు.

మార్గమధ్యంలో అయోముఖి తారసిల్లింది. సౌమిత్రి ఆమె ముక్కూ, చెవులూ కోయడం జరిగింది. తరువాత కబంధునితో వారికి సమాగమం జరిగింది. ఆ రాక్షసునికి శాపవిమోచనం కలిగించి, తదాదేశానుసారంగా ఋశ్యమూకం బయలుదేరారు. దారిలో శబరి ఆశ్రమాన్ని సందర్శించారు. శబరి వారికి ఎంగిలి పండ్లను సమర్పించిందనడం అవాల్మీకం. ఏ పండ్లు రుచి కలిగి ఉంటాయో, ఏవి ఉండవో ఆమెకు ముందే పరిచితాలు. వాటిని సమర్పించింది ఆమె, ఆమె రాముని సందర్శించి గురువులుండే దివ్యధామానికి చేరుకొంది. పిమ్మట వారు పంపాసరోవరతీరం వెంట పయనించి ఋశ్యమూకం చేరుకొన్నారు.

ఇవి అరణ్యకాండలోని ముఖ్యవిశేషాలు

# శ్రీమద్వాల్మీకి రామాయణం - అరణ్యకాండ సమీక్ష

**వ్యాఖ్యాత - కందాడై రామానుజాచార్యులు**

అరణ్యకాండకు ముందున్న అయోధ్యకాండలో సకల జగత్సృష్టిస్థితిలయకారణము, వేదాంతవేద్యుడగు పరబ్రహ్మ సకలవిద్యలను తొలగించుటను, నిత్యానందపరిపూర్ణుడుగానుండుటను, సకలాంతర్యామిత్వాన్ని, సాటిలేని ఔజ్జ్వల్యాన్నీ, పోలిక లేని ధర్మప్రవర్తకత్వాన్నీ ఇంకా అనేకములు అనంతములగు కల్యాణగుణాలను వర్ణించారు. ఇక ఇపుడు ఈ అరణ్యకాండలో సజ్జనసంరక్షణరూపమగు ధర్మవిశేషాన్ని చెప్పబోతున్నారు.

లేదా అయోధ్యాకాండలో సజ్జనులు పితృవచనపరిపాలనమనే ధర్మాన్ని ఆచరించవలెనని ప్రధానముగా చూపారు. ఇక ఇందులో సజ్జనసంరక్షణరూపమగు ధర్మాన్ని ప్రతిపాదిస్తున్నారు.

'ఇక్ష్వాకువంశప్రభవో రామో' అన్నది మొదలు 'దండకాన్ ప్రవివేశ హ' అను వరకు సంక్షేపంగా నారద భగవానులు చెప్పిన శ్రీరామచరిత్రాన్ని సర్వలోకోపకారకంగా మహాప్రబంధరూపంగా తెలిపి ఇపుడు అరణ్యకాండలో శ్రీరామచంద్రునకు దండకారణ్యమున సంచరించినపుడు జరిగిన అద్భుతపరాక్రమవిశేషాలను విస్తరంగా చెప్పడానికి ప్రారంభిస్తున్నారు.

శ్రీరామచంద్రుడు దండకారణ్యంలో ప్రవేశించాడు. ఇచట దండకుడనే మహారాజుకు సంబంధించిన రాజ్యము శుక్రాచార్యశాపంవల్ల అరణ్యత్వమును పొందిన గాథను స్మరించాలి. ఈగాథను విశేషముగా ఉత్తరకాండలో వివరిస్తారు. దండకారణ్యం బహు భయంకరులగు రాక్షసులతో కూడియున్నందువల్ల సామాన్యులకు ప్రవేశింప శక్యము కానిది. అయిననూ శ్రీరామచంద్రుడు ఏ మాత్రం భయం చెందక ధైర్యముతో ప్రవేశించాడు అని 'ఆత్మవాన్' అను పదప్రయోగముతో వాల్మీకి భగవానులు బోధించారు. ఇచట 'ఆత్మవాన్' అను పదము ధైర్యాన్ని మాత్రమే కాక మనసును అదుపులో నుంచుకొనినవాడని కూడా బోధపరుస్తున్నారు. ఈ దండకారణ్యమును ప్రవేశించిన శ్రీరామచంద్రుడు తాపసాశ్రమమండలానికి బయలుదేరాడు. తాపసాశ్రమమండలము ఋషులు నిరంతరము జరుపు వేదాధ్యయనముతో, వేదార్థానుష్ఠానముతో, కలిగిన విలక్షణమైన తేజఃపుంజముతో కూడియున్నది. ఆకాశమధ్యంలో ఉన్న సూర్యమండలంలాగా ప్రజ్వరిల్లుతున్నది. సూర్యమండలంలో రాక్షసులు క్రమ్ముకొనజాలరు. దండకారణ్యములోని తాపసాశ్రమ మండలాన్ని రాక్షసులు క్రమ్ముకొనజాలరు. మందేహు లను రాక్షసులు ఉదయాస్తమయసమయములలో సూర్యమండలము నాక్రమింపజూస్తారు కాని మధ్యాహ్నకాలమున కాదు కదా! అందుకే వాల్మీకి మధ్యాహ్నకాలము సూర్యమండలముతో పోలిక చెప్పి రాక్షసులకు ప్రవేశింపశక్యము కానిదని తెలిపియున్నారు.

ఈ తాపసాశ్రమమండలం సర్వపాలకులకూ నివాసభూతంగా, రక్షకంగా నున్నది. ఇచట సహజవైరము కల జంతువులు కూడా ఒకదానినొకటి చంపుకొనవు. కావున మిత్రభూతాలకు శత్రుభూతాలకు తాపసాశ్రమ

మండలం నివాసం. రాక్షసులవలన భయపడినవారుకూడా ఇచట తలదాచుకొంటారు. తాపసాశ్రమమండలం అతిరమణీయ ప్రదేశం కావున దేవతలు, అప్సరసలు చక్కగా పూజించి నృత్యం చేసే ప్రదేశం.

ఈ దండకారణ్యం రాముడు సంచరించిన ప్రదేశం మహారాష్ట్రదేశం కాబోలునని తీర్థీయుల అభిప్రాయము.

ఇచట తాపసాశ్రమ మండలము వైశ్వదేవాది హోమాలచే చక్కగా అర్చించబడింది. వేదఘోషలతో ప్రతిధ్వనించబడింది. ఇచట ఋషులలో తారతమ్యాన్ని సూచించడానికి కొందరు ఋషులు సూర్యతేజస్కులు, మరికొందరు అగ్నితేజస్కులు, ఇంకొందరు అతివృద్ధులు అని చెపుతున్నారు. ఇట్టి వారున్న ఈ ఆశ్రమమండలం బ్రహ్మలోకతుల్యం. అంతటా వేదఘోష కలది. బ్రహ్మజ్ఞానం కలవారిచే అనగా బ్రహ్మైక్యజ్ఞానం కలవారిచే కూడియున్నది కావున ఇది బ్రహ్మలోకాన్ని తలపిస్తున్నది అని తాత్పర్యము.

ఇట్టి తాపసాశ్రమ మండలాన్ని వినయముతో, భక్తిశ్రద్ధలతో ప్రవేశించాలి కాన శ్రీరామచంద్రుడు ధనువునకు కట్టియున్న అల్లెత్రాడును విప్పి ప్రవేశించాడు. ఎక్కుపెట్టిన ధనువుతో ప్రవేశిస్తే ఆశ్రమములలోని మృగపక్షులు కూడా భయపడతాయి కదా. వాటి భయమును తొలగించుటకు అల్లెత్రాడును విప్పారు. అచటి ఋషిమండల మునకు అభిముఖంగా వెళ్ళారు. ఆ యాశ్రమమండలములోని ఋషులు దివ్యజ్ఞానం కలవారు. దివ్యమనగా లోకవిలక్షణమైనది. జరిగినది జరుగబోవునది తెలిసినవారు. ఈ శ్రీరామచంద్రుడు రావణాసురుని వధించడానికి అవతరించినవాడు. సీతాదేవి లక్ష్మి, లక్ష్మణుడు కూడా నారాయణాంశ అని వారి అవతారరహస్యజ్ఞానం కలవారు అని తాత్పర్యము. అవతారరహస్యరూపమగు దివ్యజ్ఞానము కలవారు. శ్రీమన్నారాయణుని అవతారరహస్యజ్ఞానం కూడా మోక్షమును ప్రసాదించునని, పునర్జన్మ కలుగదని– "జన్మ కర్మ చ మే దివ్యం ఏవం యో వేత్తి తత్త్వతః" ఇత్యాది స్మృతి ప్రమాణముల వల్ల తెలుస్తున్నది. ఇట్లు అలౌకికతత్త్వసాక్షాత్కార సమర్థులైన ఋషులు భక్తిప్రేరితులై శ్రీరామచంద్రునకు ప్రత్యుత్థానాదులాచరించారు. వారు శ్రీరామచంద్రుడే తారకబ్రహ్మ అని జ్ఞానం కలవారు కదా.

ఇట్లు త్రికాలజ్ఞులగు ఋషులు రాక్షససంహారానికి అవతరించిన రామచంద్రుని ఉదయిస్తున్న చంద్రుని వలె అనగా అంధకారాన్ని తొలగించడానికి ప్రవర్తించు చంద్రునివలె, ప్రీతికలిగించు దర్శనము కలవాడు. ప్రతిపచ్చంద్రుని వలె అర్చింపదగినవానిగా సకలజగదానందకరుడగు రామచంద్రునే స్వేష్టదేవతగా స్వీకరించారు. "తస్మాత్ సోమ రాజానో బ్రాహ్మణాః" అను శ్రుతి ప్రమాణముగా బ్రాహ్మణులకు చంద్రుడే రాజు కదా. స్వకులరక్షకుడగు చంద్రునివలె స్వరక్షకుడు, ధర్మచారియైన శ్రీరామచంద్రుని చూచారు. వనరాజిలో ప్రాదుర్భవించుటవల్ల మేఘాలచే ఆవరించ బడియున్న చంద్రుని వలె ఉన్నవానిని, శ్రీరామచంద్రుని ధర్మమును ఆచరించు ఋషులు తామాచరించు ధర్మముతో ఆరాధించబడు శ్రీరాముని సాక్షాత్కరించుకొన్నారు. ఇంతవరకు శ్రీరామచంద్రుని లేదా శ్రీరామచంద్రునిగా అవతరించిన శ్రీమన్నారాయణుని ధర్మవీర్యంతో ధర్మప్రభావంతో సాక్షాత్కరించుకొనెడివారు. ఇపుడు నేత్రాలతో సాక్షాత్కరించుకొంటున్నారని అభిప్రాయము.

ఇట్లు సాక్షాత్కరించుకొనిన ఋషులు తాము కోరుతున్న రక్షణను ప్రార్థించక ముందే మంగళాశాసనమును గావించారు. శ్రీరామచంద్రుని సౌందర్యసౌకుమార్యాదికాన్ని చూచి రాక్షసులు ఎక్కువగానున్న ఈ అరణ్యమున

శ్రీరామునకు ఏమి ఆపద సంభవించునో అను వ్యాకులమనస్సుకలవారై శ్రీరామచంద్రుని విరోధులు తొలగిపోవలయునని మంగళాశాసనం గావించారు. ఈ ఋషులు దృఢవ్రతులు. అనగా శ్రీరామచంద్రుని చేతనే రక్షింపదగినవారమనే వ్రతము సడలనివారు. కావుననే ఋషిమండలము పాతివ్రత్యయశస్సు కల సీతాదేవిని కూడా చూచారు. అనగా రాక్షసకులసంహారహేతువు ఈ సీతయే అను యశస్సు కలది అని కూడా అర్థము. సీతాదేవిని చూచిన తరువాతనే తమను రక్షించమని శ్రీరామచంద్రుని ప్రార్థించడం కుదురుతుంది. తరువాత ప్రత్యుత్థాన ఫలప్రదానాద్యుపచారములను ఆచరించారు. ఇచట ప్రతిగ్రహణమనగా ఆత్మీయతాకరణమని తెలియాలి. ఋషులు ఆచరించిన మంగళాశాసనమునకు నిమిత్తమైన శ్రీరామచంద్రుని సౌందర్యసౌకుమార్యాదికములను వివరిస్తున్నారు. 'రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతాం' అని. ఇచట రూపసంహననమనగా శరీరావయవ సంస్థాన విశేషమని భావము. ఇక రూపమనగా ఇట్లే భూషణాలు ధరించకున్నా భూషణాలు ధరించినట్లు శోభావహత్వము రూపమని లక్షణము.

**అంగాన్యభూషితాన్యేవ ప్రేక్షణీయైర్విభూషణైః ।**
**యేన భూషితవద్భాతి తద్రూపమితి చోచ్యతే ॥**

అనునది ప్రమాణం. సంహననమనగా అవయవసంశ్లేష సంధిబంధరూపమగు సౌందర్యం.

**అంగప్రత్యంగకానాం యస్సన్నివేశో యథోచితమ్ ।**
**సుశ్లిష్టసంధి బంధస్తత్సౌందర్యమితి చోచ్యతే ॥**

అని సౌందర్యలక్షణము. ఇక లక్ష్మీ అనగా సముదాయశోభ. అనగా కాంతి. దీనినే లావణ్య మందురు. లావణ్యమనగా

**ముక్తాఫలేషు ఛాయాయాస్తరలత్వమివాంతరా ।**
**ప్రతిభాతి యదంగేషు లావణ్యం తన్నిగద్యతే ॥**

ముత్యములలో ఛాయా చలనమువలె శరీరమున గోచరించు కాంతి విశేషము సౌందర్యము అని అర్థము. సౌకుమార్యమనగా పుష్పహాసతుల్యకోమలత్వము. అనగా మార్దవం. ఇట్లే సువేషత్వం ఉచితశృంగార సంపన్నత. ఇట్లు శ్రీరామచంద్రుని అవయవ సంస్థానవిశేషాన్నీ, సముదాయశోభను, సౌకుమార్యాన్నీ, శోభనలావణ్యాన్నీ మార్దవాన్నీ, ఉచిత శృంగారవేషాన్నీ, ఇట్లే సీతాదేవిని, లక్ష్మణస్వామిని కూడా విస్మితావారము కలవారై అనగా అద్భుతమగు వస్తువును చూచిన వెంటనే కలిగిన ఆవారము అట్టి ఆశ్చర్యమును ప్రకటింపచేయు ప్రసన్నముఖము విప్పారిన నేత్రములు మొదలగు చిహ్నములు కలవారై చూచారు. ఒక ఋషులేకాదు. వనచారులందరూ ఇదివరకెన్నడూ చూడనందువల్ల పరమాశ్చర్యం కలిగించే సీతాలక్ష్మణ రామచంద్రులను వారి దివ్యరూపాన్ని దర్శించుట వలన కలిగిన ఆనందమునకు భంగము కలుగునేమో అను భీతిచే ఆశ్చర్యముతో నేత్రము విప్పారుట వలన రెప్పవేయని కన్నులతో నున్న తమను ఇతరులకు చూపుతూ తాము చూచారు. సకలజగత్తును మోహింప చేయు దివ్యమంగళవిగ్రహమును దర్శించుట వలన కలిగిన ఆనందమును భంగము చేయు రెప్పపాటును కూడా వేయని

కన్నులతో చూచారు. వనచారులనగా పశుపక్షిమృగాదులు కూడా అని తాత్పర్యము. బ్రహ్మాదిదేవతలకు కూడా దర్శింపశక్యము కాని భగవానుడు సీతాలక్ష్మణులతో కుంటివానిమీద గంగప్రవహించినట్లు మాముందర ఆవిర్భవించాడు అని తలచి సకల జగన్మోహనదివ్యమంగళవిగ్రహదర్శనానందము భంగము కాగలదన్న భయంతో రెప్పలు వేయని నేత్రాలతో మృగపక్ష్యాదులు కూడా ఆశ్చర్యమును పొంది చూచాయి.

ఇట్లు ఆ యాశ్రమమండలంలో ఎంతో గొప్ప అదృష్టం కలిగియున్న మహర్షులు సర్వభూతములకు హితమును చేకూర్చుటలో ఆసక్తి కలిగియున్న అతిథిని, న్యాయముగా పూజార్హుని, తమతమ పర్ణశాలలలో గొనివచ్చి వేంచేపు చేసుకొన్నారు. ఆ తరువాత పరమపురుషులైన తమ దర్శనముతో మేము మిక్కిలి ధన్యులమైతిమి ఇత్యాది ప్రియవచనములతో రాముని సత్కరించారు. సలిలాది పూజాద్రవ్యాలను గొని తెచ్చి పూజించారు.

ఇచట సత్కరించిన ఋషులు పాపకోపములు అని చెప్పుటచే అట్టివారిచే సత్కరింపబడిన శ్రీరామచంద్రుడు పవిత్రులకంటే పవిత్రుడని తెలియాలి. ఋషులను ధర్మచారులు అని చెప్పుటచే ధర్మాచరణఫలము శ్రీరాముని సత్కరించుట అని సూచితము. ఇచట ఋషులు మహాభాగులు అనగా ఇది వారి సుకృతపరిపాకము. ఈ ఋషులు శేషియందు శేషవృత్తిధర్మమును చక్కగా తెలిసినవారు. మహానుభావులగు ఋషులు శేషియయిన శ్రీరామచంద్రునికి వన్యములైన కందమూలఫలాదికాలనర్పించి వాటితో పాటు ఆశ్రమమును కూడా సమర్పించి ఇవన్నీ తమవే. ఇచ్ఛానుసారముగా వినియోగించుకోండి అని నివేదించారు. తాము మహాపురుషులు. తమ దర్శనముతో మేము అతిధన్యులము అని ప్రియవచనాలతో సత్కరించి సలిలాది, పూజాద్రవ్యాలతో శ్రీరామచంద్రుని పూజించారు. ఈ శ్రీరామచంద్రుడే ఆదిపురుషుడు అను నిశ్చయబుద్ధితో పెల్లుబికిన భక్తిరసంతో నమ్రులై భగవంతుడగు శ్రీరామచంద్రునితో ఇట్లు పలికారు.

శ్రీరామా! తాము వర్ణాశ్రమధర్మపాలకులు. ఆర్తులగు ఈ మునిజనులకు, సర్వలోకములకు రక్షకులు. దేవతాబుద్ధితో పూజించదగినవారు. దుష్టులను నిగ్రహించువారు. భగవదవతారరూపములో గురువులు. రాజుగా గౌరవించదగినవారు. రాజైన వారు అష్టదిక్పాలకుల అంశలు కలిగియుంటారు. నీచేత నియమించబడు ఇంద్రుని నాలుగవ అంశము రాజు కూడా ప్రజలను రక్షిస్తుంటాడు. అట్లు రక్షించి ఉత్తమములైన భోగాలను అనుభవిస్తాడు. సామాన్యరాజునకే ఇంతటి ప్రభావముండగా ఇక సకలజగద్రక్షణకొరకు అవతరించిన పరమాత్మవైన తమకు ధర్మపాలకత్వము, శరణ్యత్వాదికములున్నవని విడిగా చెప్పవలయునా! అని అభిప్రాయము.

ఇచట ఇంద్ర శబ్దమునకు అర్థము పరమాత్మ. "ఇది పరమైశ్వర్యే" అను ధాతువుతో ఏర్పడిన పదము ఇంద్ర అనునది పరమాత్మనే బోధించును 'ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే' అని శ్రుతిప్రమాణము. ఇట్లు పరమాత్మలో నాలుగవ భాగంగానున్న తాము సకలభోగాలను అనుభవించవలసినవారు. పరమాత్మకానివానికి ఋషులు అంజలిబద్ధులు కాజాలరు కదా. తమ ఆశ్రమాన్ని నివేదించజాలరు. తమచే మేము రక్షించదగిన వారము, మేము తమపాలనలోని భూభాగములో నివసించువారము. అంతేకాని రక్ష్యమగుటకు ఉపాసనాదికము కారణము కాజాలదు. ఆర్తరక్షణదీక్షితులైన తమచే ఆర్యులమైన మేము రక్షించదగినవారము.

ఒకవేళ తాము నగరాన్ని విడిచి చతురంగబలాలను విడిచి అరణ్యములో నుండు నేను మిమ్ముల నెట్లు కాపాడగలను? నేను రాజ్యపాలనలో నున్నపుడు కాపాడగలను అనరాదు. తాము నగరములోనున్నా అరణ్యములోనున్నా మాకు తామే రాజు. తామొక్కరే రక్షణగా గల మేము కరుణాపరుడవైన తమచే రక్షించ దగినవారము. తాము స్వతస్సిద్ధసర్వశక్తుడవు. నిరుపాధిక సర్వశేషివి. కావున తాము రక్షించవలయును. ఇచట రక్షించుట అనగా అనంతకళ్యాణగుణైకనిలయము. జగన్మోహక దివ్యమంగళులైన తమ మూర్తిని ధ్యానిస్తూ పొందే ఆనందానుభవానికి అంతరాయముగానున్న రాక్షసులను నివారించుటయే. ప్రపత్తినిరపేక్షమే రక్షణమని ఒకపక్షము. ఈ శ్లోకానికి ముందు వెనుకలనున్న శ్లోకాలను చక్కగా పర్యాలోచిస్తే రక్షణం ప్రపత్తి ద్వారకమని మరికొందరి పక్షము. ఇంతకుమునుపే ఆత్మీయ రక్షాభర సమర్పణము చేశారు కదా. మరల ఇపుడు మీరాజ్యములో నివసించేవారమని చెప్పుట వ్యర్థము కాదా అని శంకించగా రక్షకుడు చూస్తుండగా రక్షకుని సన్నిధిలో రక్షించదగినవారు నశించుట అధికదోషమని సూచించుటకని తెలుసుకోవాలి. రాజ్యములో ఉండుట ఇతర కారణములను అపేక్షించని హేతువు అగుట తప్పని సరియైనను మోక్షమునకు అతిరిక్తమైన రక్షణోపాయమును విరోధము కాదు గదా! ఇచట మహర్షులు మోక్షాపేక్షతో ప్రపత్తి చేయలేదు కదా. కేవలము దుష్టరాక్షసులను సంహరించమని మాత్రమే ప్రపత్తిని ఆచరించారు.

మీరు మారాజ్యములో నున్నా నేను ఇపుడు నగరములో లేను కదా అని తాము మా రక్షణనుపేక్షించరాదు. ఇతర రాజులు పట్టాభిషేకం చేసుకొన్నవారు బుద్ధిబలముతో, చతురంగబలముతో తమ రాజ్యమును మాత్రమే రక్షించ కలుగుతారు. సకల లోకరక్షణ ధురంధరులు, అసహాయశూరులైన తమకు నగరవాసము బలమును పెంచునా? స్వాభావిక నిత్యనిరతిశయ జ్ఞానసంపన్నులైన తమకు వనవాసమున బలము క్షీణించునా? కావున తామెక్కడున్ననూ తమకసాధ్యమైనదేదీలేదు కదా. ఏదో ఒక రాజ్యానికి, మండలానికి, నగరానికి అధిపతియైన వారికి ఆప్రదేశములోని వారినే రక్షించుట. వారికి ఆ అవధులు మర్యాదలు ఉంటాయి. తాము నిరుపాధిక శేషివి అనగా అనంతకోటి బ్రహ్మాండనాయకుడవు. తమ శేషిత్వమునకు ఇంత అని అవధి లేదు కాన మేమెక్కడున్ననూ, తామెక్కడున్ననూ తాము మాకు రక్షకులే అని రాజశబ్దముతో సూచించియున్నారు.

తామే తపః ప్రభావముతో తమను రక్షించుకొనవచ్చును కదా? నా రక్షణమెందుకు అని శంకించరాదు. ఇపుడు మేము న్యస్తదండులము. అనగా దండనను విడిచిపెట్టినవారము. అనగా శాపంతో విరోధులను శాసించుటను విడిచినవారము. రాక్షసులనందరినీ శిక్షించే భారాన్ని తమయందే ఉంచినవారము. చేసిన తపస్సు వ్యయమవుతుందనే భయంలో కోపం విడిచినవారము. కోపాన్ని జయించడానికి కావలసిన ఇంద్రియజయం పొందినవారము. ఇంద్రియాలను జయించుట వల్ల కోరికలు కలుగవు. కోరికలు కలుగవు కావున కోపం రాదు. అట్లే మాకు రక్షించుకొను సామర్థ్యము ఉన్ననూ మమ్ములను మేము రక్షించుకొనుట మా స్వరూపానికి విరోధము, కావున తామే రక్షించవలయును. మాకు తమ కన్నా ఇతర రక్షకులు లేరు. మేము ఆకారత్రయం కలవారము. అందులో మొదటిదైన అనన్యార్హ శరణత్వాన్ని చెప్పారు.

దీనిని బలపరుచుకోవడానికి మేము నీకు గర్భభూతులము అని చెబుతున్నారు. మీసంతానము వంటి వారము. అదికూడ గర్భములో నున్న సంతానము. పుట్టిన తరువాత ఏ కొంచమో తమ రక్షణ ప్రయత్నము

తాము చేసుకొనవచ్చును. కాని గర్భములో నున్నపుడు తల్లియే పూర్తి ప్రయత్నముతో గర్భమును కాపాడుకొంటుంది. అట్లే మమ్ములను తామే కాపాడాలి. ఇట్లు చెప్పుట వల్ల రెండవ ఆకారమైన అనన్యార్హ శేషత్వము చెప్పబడినది. అనగా తమకు మాత్రమే మేము శేషభూతులము అని అర్థము. ఈ అనన్యార్హశరణత్వము, అనన్యార్హశేషత్వము స్వాభావికములే. అట్లైననూ నేను రక్షించుటకు తామేదైనా చేయాలి కదా! సాధనము లేకుండగా రక్షించ జాలముకదా! అలా రక్షించవలసివస్తే అందరినీ రక్షించవలసివస్తుంది. అనగా మేము తపోధనులమని చెబుతున్నారు. ఇచట తపమనగా భరన్యాసమని గ్రహించాలి. "తస్మాన్న్యాసమేషాం తపసామతిరిక్త మాహుః" అని శ్రుతివాక్యము ఈవిషయమున ప్రమాణము. మాధనము ఒక ప్రపత్తియే. మేము చేసిన ప్రపత్తి సాకుగాకొని మమ్ములను కాపాడుము. ఇచట మాత్రము రక్షణమనగా మోక్షమునకు చేర్చుటయే స్వీకరించాలి. ఖరాదిరాక్షసులనుండి కాపాడుటకు శరభంగాశ్రమవాసులు కోరుతారు. ఇచట మునులు మోక్షమును మాత్రమే అపేక్షించువారు.

ఇట్లు ప్రపన్నులైన మహర్షులు యథోచితకైంకర్యమును చేసిరని వివరిస్తున్నారు. ఇలా పలికిన ఋషులు లక్ష్మణునితో, సీతతోకూడియున్న శ్రీరామచంద్రుని వన్యములగు పుష్పఫలాదులతో పూజించారు. సీతారాములను కాంతికాంతిమత్తులవలె విడదీయజాలము గావున మిథునశేషత్వమే తమస్వరూపము గావున సీతారాములను అర్చించారు అని చెబుతున్నారు.

ఇట్లు ఈ ఋషులు న్యాయానుగుణవ్యాపారము కలవారలు అనగా స్వరూపానురూపకైంకర్యవృత్తి కలవారు. భగవదుపాసనాదిరూప ధర్మము కలవారు. అట్లే విరోధులచే స్పృశింప శక్యము కానివారు. అనగా స్వరూపమునకు విరుద్ధమైన నిషిద్ధకామ్యకర్మలు త్యజించినవారు. ఇతరులకంటే విలక్షణులు. తాపసులు కాయికకైంకర్యమును చేయజాలనివారు పరమశేషియైన శ్రీరామచంద్రుని యథోచిత స్తుతిప్రణామాదులతో సంతోషింప జేశారు.

ఇలా మొదటిసర్గలో భగవంతుడే ఉపాయమని నమ్మిక గలవారు, సిద్ధసాధనిష్ఠులు మోక్షమును కోరారు. మునులు ఆచరించు భాగవతోత్తముల వరకు విశిష్ట విషయమైన కైంకర్యమును ప్రతిపాదించి ఖరదూషణాదులను వధించమని కోరు మునుల శరణాగతిని చెప్పబోతూ శరణుకోరిన వారికి ఉపయోగించకలిగిన సామర్థ్యము శ్రీరామచంద్రునకు కలదని విరాధవధద్వారా బోధిస్తున్నాడు. ఇచట విరాధవధ ఋషులు శ్రీరాముని సామర్థ్యమును తెలియుట కుపయోగిస్తుంది కావుననే సంక్షేప రామాయణమున "విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ" అను చోట విరాధవధను ఉపహారముగా (కానుకగా) శరభంగ మహర్షిని దర్శించెను అని వ్యాఖ్యానము చేయబడింది.

ఇచట 'కృతాతిథ్యోఽథ రామస్తు' అనుచోట తు అనుశబ్దముతో అత్ర్యాదు లిచ్చిన ఆతిథ్యముకంటె విలక్షణమైన ఆతిథ్యమునిచ్చారని సూచించారు. ఇతరప్రయోజనాన్ని ఆశించకుండగా ఇచ్చిన ఆతిథ్యము భగవంతునకు పరమభోగ్యముగా నుంటుంది కదా! 'పత్రం పుష్పం ఫలం తోయం' ఇత్యాదిగా భక్తితో అర్పించినది, భక్తులతో అర్పించబడినది ఎంత కొంచెమైననూ అది సర్వవిధ ఆతిథ్యముగా భగవంతుడు స్వీకరిస్తాడుకదా. ఇట్లు శ్రీరామచంద్రుడు ప్రాతఃకాలికస్నానాది కృత్యాలనాచరించి, వనములోనికి ప్రవేశించాడు. కాని అచట ఆ ఋషుల ఆశ్రమాలలో నుండ నిచ్చగించలేదు.

రామచంద్రుడు ప్రవేశించిన అరణ్యములో ఉన్నతమైన కఠినమైన విరాధుని దేహసంపర్కము వలన వృక్షలతా గుల్మములు ధ్వంసమైనవి. విరాధసంచారమువల్ల చూడ శక్యము కానట్లుగా సలిలాశయములున్నవి. ఎంతో దూరము ఎగరకలిగిన పక్షులు కూడా విరాధరాక్షసభయముతో నిశ్శబ్దముగా చెట్లకొమ్మలలో రెమ్మలలో దాగియున్నవి. ఒక కీచురాళ్ళుమాత్రము చూడజాలము కావున ఎపుడూ ధ్వనిస్తున్నవి.

ఇచట శ్రీరామచంద్రుడు విరాధుడనే మహాభయంకరుడైన రాక్షసుని దర్శించాడు. అతను మాంసరుధిర లిప్త శరీరము కలిగి, ఎక్కువ తక్కువలుగా నున్న శరీరావయవములతో వికృత వేషుడు, ఘోరదర్శనుడు, రక్తసిక్తుడుగా నున్నాడు. సంహారకాలమున ప్రజలనుద్దేశించి అంతకుడు పరుగెత్తునట్లు సీతారామలక్ష్మణుల వైపు పరుగెత్తుకొని వచ్చాడు.

అంతట ఆ విరాధుడు సీతాదేవిని ఎత్తుకొని వారితో ఇలా మాటలాడాడు. ఇచట సీతాదేవిని అపహరించడం తనపాపరాశిని తొలగించుకొనుటకే కాని ఆమెయందు దారాబుద్ధితో కాదు. ఈ విషయము స్కాందపురాణమున ఇలా చెప్పబడింది.

**సోఽపి తాం జానకీం దృష్ట్వా శీఘ్రం సంజాతవిక్రమః ।**
**ఇయం పరా మహాశక్తిః సేయం సర్గస్య కారణమ్ ॥**

**అస్యా విబోధో మోక్షేఽపి కారణం బంధనేఽపి చ ।**
**తస్మాదిమాం భజిష్యామి దిష్ట్యా ప్రాప్తం హి దర్శనమ్ ॥**

**ఇతి దర్శనమాత్రేణ విముక్తాఘౌఘపంజరః ।**
**భక్తియుక్తో జహారైనాం సీతాం చైతన్యరూపిణీమ్ ॥**

ఆ విరాధుడు కూడా జానకిని చూచి అడుగుల వడినిపెంచి ఈమె పరాశక్తి. ఈమెయే మహాశక్తి, ఈమెయే ముక్తిహేతువు. ఈమెను గురించి తెలియుట ఈమెను బంధించుటకూడా మోక్షకారణమే. నా అదృష్టవశమున దర్శనం లభించింది. కావున ఈమెను సేవిస్తాను. ఇట్లు దర్శనమాత్రముతోనే సకలపాపరాశిపంజరము తొలగి భక్తి కలవాడై చైతన్యరూపిణియైన సీతాదేవిని హరించాడు. అని పై శ్లోకములకు తాత్పర్యము.

విరాధుని వాక్యములు "తాము మునివేషం ధరించియున్నారు. మునివేషమునకు విరుద్ధమైన శర చాపాసిరూప ఆయుధాలను ధరించియున్నారు. స్త్రీతో కలిసి ఉన్నారు. కావున మీరు పాపాచారులు". ఇట్లు పలుకగా శ్రీరాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. మన విషయమున కైక వనవాసమున విచారింపవలసిన దుఃఖమును సంకల్పించినదా, వరమను సాకుతో కోరినప్రియము కూడా ఈనాడు సుసంపన్నమైనది. చాలాదూరపు చూపు కల కైక మనకు కష్టములు కలుగవలయునని సంకల్పించకున్నచో తనకుమారుని కొరకు రాజ్యమును మాత్రమే వరముగా కోరియుండెడిది. నా వనవాసమును కోరియుండెడిది కాదు. నా వనవాసమును కోరిన కైకేయి రాముడు అరణ్యమునకు వెళ్ళినచో సీత రాక్షసాదులచే అపహరించబడును. దానితో రాముడు కూడా ఆపదను పొందును.

అంతట నాకుమారునికి రాజ్యము నిష్కంటక మగును అని తప్పక తలచియే యుండును. కైకేయికి ఆ కోరిక నెరవేరినది.

విరాధుడు సీతను అపహరించినంతనే వచ్చిన పెద్ద ఆపద యేమిటి? అనగా సీతను పరపురుషుడు స్పృశించినందువల్ల కలిగిన దుఃఖం పితృవియోగంతో రాజ్యహరణంతో కూడా కలుగలేదు. అపుడు లక్ష్మణుడు కోపించిన నాగువలె బుసలు కొట్టుచు లేదా మన్త్రసమూహంతో బంధించబడిన సమూహమువలె నిట్టూర్చుచు రామునితో ఇలా పలికాడు. ఇంద్రునివలె సకలప్రాణులకు రక్షకుడవై ఇంకనూ నావలె సేవకునివలె ఉండి కూడా ఎందుకిట్లు విలపించుచున్నావు? సకలలోకములకు రక్షకుడవైన నీవు ఇంద్రునికి ఉపమానముగా చెప్పబడుదువు. ఇతర పాలకులవలె ఆపదకలిగినపుడు ఏల విలపించెదవు.

మహానుభావులు శ్రీరామతత్త్వాన్ని ఇట్లే చెబుతారు. విశ్వామిత్రుడు యజ్ఞరక్షణకు రాముని తనవెంట పంపమని దశరథుని కోరగా రామతత్త్వం తెలియని దశరథుడు అతని వెంట పంపుటకు వెనుకాడినపుడు

"అహం వేద్మి మహాత్మానం రామం దశరథాత్మజమ్" అని రాముని మహానుభావునిగా పేర్కొనెను. ఇట్లే సీతా కళ్యాణం తరువాత వచ్చిన పరశురాముడు రాముని పరాక్రమంతో తేజోహీనుడై, "త్వయా త్రైలోక్యనాథేన యదహం విముఖీకృతః" అని రాముని త్రిలోకనాథునిగా స్తుతించాడు. ఇట్లే ఋషులు కూడా రామచంద్రుని "నగరస్థో వనస్థోవా త్వం నో రాజా జనేశ్వర" అని చెప్పియున్నారు. కావున శ్రీరామచంద్రుడు లోకనాథుడే.

కైకేయీభరతులు అజ్ఞానముతో శ్రీరామచంద్రుని అరణ్యానికి పంపారు. చేసిన తప్పును తెలుసుకొని మరల అయోధ్యకు వచ్చి రాజ్యమును స్వీకరించమని, తప్పులను క్షమించమని కూడా భరతుడు ప్రార్థించాడు. అయిననూ రామలక్ష్మణులు వారిని రాజ్యాపహారకులుగా ఎందుకు భావించిరి అను శంకకు ఇట్లు సమాధానము చెప్పవచ్చు. తరువాత తప్పు తెలుసుకొని ప్రవర్తించిననూ అది కేవలము భరతుని ప్రవృత్తి మాత్రమే. కైకేయి మాత్రము "భరతః ప్రాప్నుయాత్ రాజ్యం న తు రామః కథంచన" అని కంఠోక్తితో రామరాజ్య అపహరణ బుద్ధి ప్రకటించినందున దానిని తలచుట సహజమే. రాజ్యం భరతునికి కావాలని కైక కోరినందున భరతుడు కూడా రాజ్యకాముకునిగా పరిగణించబడతాడు. దుఃఖం కలిగినపుడు ఇట్టి దుఃఖం కలుగుటకు కారణభూతులైన వారి దోషాన్ని స్మరించడం అనుచితము కాదు గదా!

అయిననూ కష్టకాలమున పరదోషాలను ఉటంకించుట సత్పురుషులకు తగని పని. రాముని స్వభావమునకు విరుద్ధము కూడా. సత్ పురుషులు మహానుభావులు ఎటువంటి సమయములోనైనా తమ మనసులోని భావమును ఎవరికి ఏరూపములోనూ తెలుపరు. మనసులో దాచుకున్న భావమును సామాన్యంగా "సుప్తప్రమత్తకుపితానాం భావజ్ఞానం దృష్టం" అను న్యాయముననుసరించి నిద్రలో కలవరించుటలో, మదించి ఉన్న సమయమున, కోపములోను ప్రకటింతురని చెప్పబడుటతో దోషాన్ని ఉద్ఘాటించుట కూడా దోషమే కదా? అపుడు రాముని మనసులో వున్న అసలు భావమిది. ఎవరి మీదా కోపతాపాదులు లేవని చెప్పినవి వ్యవహరించినవి. అభినయము కావలసి వచ్చును. అనగా శ్రీరామ అవతారము లోకమున మానవులు ఎలా ప్రవర్తించాలో వ్యవహరించాలో తాను

స్వయంగా ఆచరించి చూపుటకని సర్వసమ్మతము. ఆపదలు వచ్చినపుడు లోకులు చెప్పవలసినవాటిని చెప్పకూడని వాటిని తెలియు స్థితిలో ఉండరని తెలుపుటకే శ్రీరామచంద్రుడు ఇట్లు చెప్పియుండెను అని గ్రహించాలి.

ఇక మూడవ సర్గలో విరాధుని అనుగ్రహించడానికి అతనిని ఆక్రమించడం వివరించబడుతుంది. విరాధుడు తమ నడిగిన ప్రశ్నకు రామలక్ష్మణులు మేము "ఇక్ష్వాకువంశమువారము. దశరథపుత్రులము, పితృవచనముతో వనానికి వచ్చాము. మేము క్షత్రియులము. సత్‌చరిత్ర కలవారము" అని చెప్పిన సమాధానములో మీరు అధర్మమును ఆచరించువారు. పాపస్వభావులు అను విరాధుని వచనములకు సమాధానముగా చెప్పారు. ఇట్లు తమ వృత్తాంతమును చెప్పి "నీవెవరు? దండకారణ్యమున ఎందుకు సంచరించుచున్నావు? నీవెవరి పుత్రుడవు?" అని విరాధుని ప్రశ్నించారు. "నాపేరు విరాధుడు. నేను జయుని పుత్రుడను. నా తల్లి శతహ్రద. నేను తపమాచరించి బ్రహ్మవలన ఏ శస్త్రము వలన వధింపబడకుండునట్లు వరము పొందితిని. నన్ను విరాధుడని భూమండలములో నున్న రాక్షసులందరూ అంటారు". అని చెప్పుట వలన ఈ పేరు నా తల్లిదండ్రులు పెట్టినది గాదని విగత ఆరాధన దురారాధ్యుడు అని తోటి వారు పెట్టిన పేరు అని చెప్పినట్లైంది.

అంతట రామలక్ష్మణులు కాలాంతకయమోపముడైన విరాధునిపై శరవర్షం కురిపించారు. కాలాంతక యముడు అనగా కాలమున అంతము చేయు యముడు. ప్రళయకాలమున నశింపచేయు యముడు అని ఒక అర్థము. మరియు కాలుడు, అంతకుడు, యముడు ఈ ముగ్గురూ మారణాధికారులు. కాలుడు జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తాడు. అంతకుడు ప్రాణములనపహరిస్తాడు. యముడు పుణ్యాపాపములను పరిశీలిస్తాడు. రామలక్ష్మణులు ప్రయోగించిన బాణములు రాక్షసుని శరమును భేదించి బయటకు వెడలాయి. వరదానం వల్ల ప్రాణాలను తీయజాలక పోయాయి. బాణములు శరీరమున నిలవక బయటకు వెడలుట ఎందుకనగా ఇచట వాల్మీకి ప్రయోగము "కాయాత్ నిష్పేతురాశు గాః" అని ఆశుగ శబ్దము ఆశు గచ్ఛంతి వేగముగా వెళ్ళునవి కావున శరీరమున నిలువక బయటకు వెడలెను. విరాధుడు ఈశ్వరుని వరముతో సురాసురులకు అవధ్యునిగా నిలిచాడు.

**విరాధో హాటకపురే విధివన్మామపూజయత్ ।**
**మదనుగ్రహవైశిష్ట్యాత్ అవధ్యః ససురాసురైః ॥**

అని స్కాందమున ఈశ్వరవాక్యం ఇచట ప్రమాణము.

తరువాత రామలక్ష్మణులను తమభుజములపై కూర్చుండబెట్టుకొని పరుగెత్తుతున్న విరాధుని చూచి రామచంద్రుడు "వహత్వయమలం తావత్ పథాఽనేన తు రాక్షసః, అయమేవ హి నః పంథా యేన యాతి నిశాచరః" అని రాక్షసులు మనను తీసుకొని వెళ్ళుతున్న దారియే మనము వెళ్ళవలసిన దారి. కావున కొంతదూరం ఇతను మనలను మోయనీ అని పలుకుటచే ఈ మూడవ సర్గలో సకల ప్రాణుల ప్రవృత్తి తన అధీనమని, మహాభయమును కలిగించుహేతువులున్నను భయరహితుని రాముని వైశిష్ట్యము చెప్పబడింది.

ఇక నాలుగవ సర్గలో విరాధుడు పరమపురుషుని శ్రీరామచంద్రుని, లక్ష్మణుని తన భుజముపై మోయుట వల్ల కలిగిన ఫలమును చెబుతున్నారు. ఇట్లు శ్రీరామచంద్రుని హరించి వెళ్ళుతున్న విరాధుని చూసి సీతాదేవి

ఆక్రోశించింది. శ్రీరామచంద్రుని అతిమానుషచరితము తెలిసియున్ననూ రామునిపై గల అనురాగాతిశయముతో ఆక్రోశించినదని తాత్పర్యము. ఇచట రామలక్ష్మణులు విరాధుని భుజములను ఖడ్గములతో ఛేదించిరి అని చెప్పారు. ఇచట విరాధుని విషయమున కబంధుని విషయమున కూడా లక్ష్మణుడు ఎడమ భుజమును శ్రీరాముడు కుడి భుజమును ఛేదించుటలో ఆంతర్యమేమైనా కలదా అనగా లక్ష్మణుడు ఎల్లవేళలా రామునికి దక్షణపార్శ్వమున ఉంటాడు. కావున వారిని గ్రహించు రాక్షసులు విరాధకబంధులు దక్షిణబాహువుతో శ్రీరాముని ఎడమ బాహువుతో లక్ష్మణుని గ్రహింతురు. కావున తమను గ్రహించిన బాహువును తాము ఛేదించారని తాత్పర్యము. ఇట్లు ఛేదించిననూ ఛేదించినా, ముష్టిఘాతాలు చేసినా మరణించనందున భూతలమున పడవేశారు.

ఇచట శ్రీరామచంద్రుడు భయేష్వభయదః తనపేరును కథానురూపంగా దర్శనశ్రవణకీర్తనాదులతో సకలభయములను తొలగించువాడు. విరాధుని శాపభయమును తొలగించి ముక్తిని ప్రసాదించుటకు ప్రసన్నుడైన వాడు.

ఈ రాక్షసుడు తపోబలసంపన్నుడు కావున శస్త్రాలతో వధించ శక్యంకాదు. ఇతనిని ఖననము చేతము అని నిర్ణయించిన వెంటనే విరాధుడు శ్రీరామపాదస్పర్శప్రభావముతో శ్రీరాముని గుర్తించి పలికాడు. నేను మోహముతో నీ స్వరూపమును తెలియజాలక పోయాను. అనగా సచ్చిదానంద జగన్మోహన శ్రీమూర్తి సంస్పర్శ భాగ్యము కలుగక ముందు నేను తెలియజాలక పోయాను. తాము నిరవధిక కరుణతో నా శాపవిమోచనము కొరకు అవతరించిన శ్రీరాములు మీరు అని నాకు ఇంతవరకు తెలియరాలేదు. సర్వలోక జనకుడవైన నీవు కౌసల్యాదేవి సంతానము. ఈమెకూడా సీతగా నాకు తెలిసినది. లక్ష్మణుడు కూడా నీ అంశభూతుడు. నిన్ను అనుసరించిన వానిగా కీర్తి పొందినవారు నాకింత వరకు తెలియక పోవుటకు నాశాపము కారణము. నాపేరు తుంబురుడను గాంధర్వుడు. రంభాసక్తుడనగు నేను యథాసమయములో అతనిని సేవించుటకు వెళ్ళనందున వైశ్రవణునిచే శపించబడ్డాను. అంతట రాక్షసుడనయ్యాను. కావున రాక్షసుడనైతిని. అతనిని ప్రార్థించగా రామలక్ష్మణులు వచ్చినపుడు వారిద్వారా శాపవిమోచనము జరుగుతుందని చెప్పాడు.

ఇట్లు విరాధుని అవటముననుంచడానికి కావలసిన అవటమును త్రవ్వుము అని లక్ష్మణునకు తెలిపి లక్ష్మణుడు త్రవ్వినంతసేపు శ్రీరాముడు విరాధుని కంఠమును ఆక్రమించి నిలిచెను. అపుడు రాక్షసుడు భయంకరముగా అరిచెను. శ్రీరామచంద్రునితో వధించబడుచున్న నేను పరమధన్యుడను అని ఆ నాదములో ధ్వనించెను అని తాత్పర్యము.

ఇట్టి విరాధవధను వినినందున కలుగు ఫలము స్కాందపురాణమున ఇలా చెప్పబడింది.

**యో విరాధవధం నిత్యం శృణోతి శ్రావయేత వా ।**
**తస్య పాపాని సర్వాణి వినష్టాని న సంశయః ॥**

ప్రతినిత్యము విరాధవధను వినిననూ వినిపించిననూ అన్ని పాపములు నశించును అని తాత్పర్యము.

ఇక అయిదవ సర్గలో విరాధుని వనములో నివసించు ముముక్షు మునిశరణాగతికి ఆనుషంగిక ఫలభూతమైన విరాధవధను చెప్పి ఖరాదివధమునకు ఫలభూతమగు శరభంగాశ్రమమున నివసించు మునిజనశరణాగతిని చూపుతూ శరణాగతికి తగిన సౌలభ్యమును చూపడానికి శరభంగాశ్రమవనగమనమును చెబుతున్నారు.

శరభంగాశ్రమసమీపమునకు వెళ్ళిన రామలక్ష్మణులు అచట రథమును, దివ్యపురుషులను చూచారు. శరభంగునితో మాటలాడుచున్న ఇంద్రుని చూచిన రాముడు లక్ష్మణునికి చూపుతూ పలికాడు. శరభంగుని వద్దకు వచ్చిన రామునితో శరభంగుడు ఇంద్రుడొచ్చి నన్ను బ్రహ్మలోకమున గొనిపోవ సంకల్పించాడు. కాని నేను నా యోగబలముతో నీవు దగ్గరలో నున్నావని ఎల్లపుడూ నామసులోనున్న నిన్ను తెలుసుకొని ప్రియాతిథివైన నిన్ను చూచి నీ అనుభవానందాన్ని పొందకుండగా 'ఆబ్రహ్మభువనా లోకాః పునరావర్తినః' అని చెప్పునట్లుగా పునరావృత్తి కలిగిన బ్రహ్మలోకమునకు వెళ్ళదలచలేదు. అయితే ఎట్లు ఏ లోకమునకు వెళ్ళెదవనగా ధర్మస్వరూపుడవు, సత్యసంకల్పుడవు అయిన నీ కటాక్షములను నాపై పడవేయించుకొని "యత్ర పుణ్యే సాధ్యాస్సంతి దేవాః" అను రీతిగా నిత్యసూరులు సేవించు త్రిపాద్విభూతిని బ్రహ్మలోకము కంటె ఉత్కృష్టమైన దానిని చేరుతాను. ఇచట 'బ్రహ్మలోకం గచ్ఛామి త్రిదివం గమిష్యామి' అను వాక్యములతో ఈ అర్థము సూచితము, త్రిపాద్విభూతిప్రాప్తి ఒక వరుసలో కాని లభించదు. మొదట నీవు ఆర్జించిన కర్మఫలములను అనుభవించుము అనగా చెప్పుచున్నారు. బ్రహ్మలోకభవములు స్వర్గలోకభవములు చిరకాలస్థాయులుగా భోగభూములు నాచే సంపాదించబడినవి తమ కర్పించబడుతున్నవి. దయతో ఆ లోకములను స్వీకరించు. ఇది కూడా అతిథిసత్కారములో ఒకభాగము. ఆచరించిన కర్మలను భగవంతున కర్పించుట అనగా ఫలత్యాగ సంగత్యాగ కర్తృత్వత్యాగపూర్వకముగా భగవంతునికి కైంకర్యమును అనుష్ఠించుట. తరువాతి భాగములో 'మత్ప్రసాదాత్స భార్యస్త్వం విహరస్వ సలక్ష్మణః' అనునది కూడా ఫల సమర్పణాభిప్రాయమే అని తెలియవలయును.

శరభంగుడు సమర్పించిన దానిని అంగీకరించుచునే శరభంగునికి వాచికకైంకర్యమును కూడా నియమిస్తున్నాడు. నీవు చెప్పిన లోకాలనన్నింటిని నేనే సంపాదించగలను. క్షత్రియులు ఈయవలయును కాని తీసుకొనరాదు కదా!. తాము నా నివాసానికి ఒక ప్రదేశమును నిర్దేశించగోరుతున్నాను. అనగా తాము ఇష్టపడిన ప్రదేశముననే నేనుందును. భగవంతునితో పాటు భక్తవర్యులు నివసించినది లేదా అభిమానించినదే పుణ్యప్రదేశము. ఇతరములు కావని తాత్పర్యము. ఇచట "సా కాశీతి న చాకశీతి భువి సా ఉ యోధ్యేతి నాధ్యాస్యతే" ఇత్యాది దివ్యదేశప్రభావసూచకశ్లోకములను అనుసంధానము చేసుకొనవలయును. ఈ విషయమున "ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం విశ్వం బిభర్తి భువనస్య నాభిః" అను శ్రుతివాక్యము ప్రమాణము. అందరికి ఫలముల నిచ్చువాడు పరమాత్మయే. "లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్" అను వాక్యము స్మరించవలయును.

శరభంగమహర్షి సుతీక్ష్ణాశ్రమమార్గమును చేతితో నిర్దేశించి తాను దేహమును త్యాగము చేయు సమయమున శ్రీరామచంద్రుని సన్నిధిని అపేక్షిస్తున్నాడు. శరభంగమహర్షిని మంత్రవిత్ అని చెప్పుటవలన బ్రహ్మమేధ మంత్రములను తెలిసినవాడు, అగ్నిని చక్కగా ఆధానమును చేసి పరిస్తరణాదులతో అలంకరించి బ్రహ్మమేధ మంత్రములతో హొమముగావించి అగ్నిలో ప్రవేశించెను. ఇచట విధి ఇట్లు చెప్పబడినది.

**యద్యుత్క్రంతా తదావాప్తౌ బ్రహ్మమేధానలం వ్రజేత్ ।**
**నాభివక్ర్తాత్మగానగ్నీనవరోఽ ప్యయథా స్థలమ్ ॥**

అనుప్రకారము బ్రహ్మమేధాగ్నినే ప్రవేశించెను. ఇచట శరభంగుడు శ్రీరామచంద్రుని తాతయని సంబోధించెను. తాత అనగా పిల్లలను వాత్సల్యముతో నాన్నా అని పిలుచుట ఒకటి, రెండవది శ్రీరామచంద్రుడు పరమాత్మకావున జగజ్జనకా! యని సంబోధన. జగజ్జనకా! ఇతను కృతార్థుడు కానిమ్ము అని కరుణాకటాక్షమును నాపై ప్రసరింప జేయుము అని ప్రార్థించాడు.

ఇచట అగ్నిప్రవేశము ఆత్మహత్యగా మహాపాపము కాదా? అని శంకించి ఇట్లు చెబుతున్నాడు.

**వృద్ధశ్శౌచక్రియాలుప్తః ప్రత్యాఖ్యాత భిషక్క్రియః ।**
**ఆత్మానం ఘాతయేద్యస్తు భృగ్వగ్న్యనశనాదిభిః ॥**

అని ధర్మశాస్త్రము. శౌచక్రియల నాచరించు శక్తి చాలని వృద్ధుడు, చికిత్స చెందుటకు వీలుకాని వ్యాధి కలవాడు, అగ్నిప్రవేశములు నిరాహారాదులతో ప్రాణములను విడువవచ్చును అని చెప్పుట వలన శరభంగాగ్ని ప్రవేశము సమంజసమే అని అభిప్రాయము. ఇక రాముడు శరభంగాశ్రమమును చేరుట అచటి సన్నివేశాలను చూచిన వారికి, వినిన వారికి మరుల్లోకప్రాప్తి ఫలమని స్కాన్దమున చెప్పబడింది. చూడండి.

**శరభఙ్గాశ్రమప్రాప్తి పురుహూత సమాగమమ్ ।**
**దర్శనం శరభఙ్గస్య రఘునాథస్య పూజనమ్ ।**
**శృణ్వన్తో మరుతాం లోకం ప్రాప్నువన్తి న సంశయః ।**

అని ఇట్లు అగ్నిప్రవేశం చేసిన శరభంగమహర్షి దేవయాన మార్గముతో బ్రహ్మలోకమును చేరడం వివరిస్తున్నారు. ఆ శరభంగమహర్షి అగ్నిలో ప్రవేశించిన వెంటనే అగ్ని సమతేజస్కుడై కుమారుడయ్యాడు. అగ్నిలోనుంచి పైకి లేచివచ్చి ప్రకాశించాడు. ఇచట కుమారుడనగా రత్నాకర గ్రంథములో ఇట్లు లక్షణము చెప్పబడినది "బాలోఽథ పంచదశభిః త్రింశద్భిస్తు కుమారకః" 15 సంవత్సరముల వరకు బాలుడు, 30 సంవత్సరముల వరకు కుమారుడు. ఇట్లు అగ్నిప్రవేశము చేసిన శరభంగుడు అగ్నిసమానతేజస్కుడై 30 సంవత్సరముల వయస్సు కలవానిగా భాసించాడు అని తాత్పర్యము.

ఇచట శరభంగమహర్షి అగ్నిప్రవేశం చేసి బ్రహ్మలోకానికి వెళ్ళాడు అని తెలుపుటతో వాల్మీకి మహర్షి అర్చిరాదిమార్గమును, శరభంగ బ్రహ్మలోకప్రాప్తిని సూచించాడు.

"తేఽర్చిషమభిసమ్భవన్తి అర్చిషోఽహః అహ్న ఆపూర్యమాణపక్షః ఆపూర్యమాణ పక్ష్యాద్యాన్ షడదఙ్ఞేతి మాసాంస్తాన్ మాసేభ్యస్సంవత్సరాదిత్యమాదిత్యాచ్చన్ద్రమసం చన్ద్రమసో విద్యుతం తత్పురుషోఽమానవస్సన్ ఏనాన్ బ్రహ్మ గమయతి" అని శ్రుతి. ఇది అర్చిరాది మార్గమున బ్రహ్మలోకప్రాప్తి.

మొదట తేజస్సులో, తేజస్సునుండి పగలులో, పగటినుండి శుక్లపక్షమున, శుక్లపక్షము నుండి మాసమున, మాసమునుండి ఉత్తరాయణమున, ఉత్తరాయణమునుండి సంవత్సరమున, సంవత్సరమునుండి సూర్యునిలో,

సూర్యునినుండి చంద్రునిలో, చంద్రునినుండి విద్యుత్తులో, అచటినుండి అమానవపురుషుడు ఇతనిని బ్రహ్మలోకానికి గొనిపోతాడు. అని పైశ్రుతి వాక్యముల కర్థము. ఇచట శరభంగమహర్షి ఈ రీతిలో బ్రహ్మలోకమును చేరినాడని సూచించియున్నాడు. అచట శరభంగమహర్షి బ్రహ్మలోకానికి పోయి అనుచరగణముతో నున్న పితామహుని దర్శించుకొన్నాడు అని చెప్పుటలో సాకారమైన పరమాత్మను దర్శించాడు అని సూచిస్తున్నాడు. ఇచట అర్చిరాది మార్గము బ్రహ్మసాక్షాత్కారము శరభంగమహర్షి తాను అగ్నిప్రవేశము చేసే వరకు శ్రీరామచంద్రుని తన సన్నిధిలో నుండుమని అర్థించుటచే తెలుస్తున్నది. శరభంగాశ్రమానికి వచ్చిన ఇంద్రసమాగమము శరభంగదర్శనము, రఘునాథపూజనమును వినిన వారికి మరుల్లోకప్రాప్తి అని స్కాందపురాణ వచనము.

ఇక ఆరవ సర్గలో ఖరదూషణసంహారమును కోరే మునులు చేసే శరణాగతిని తెలుపుటకు ఖరవధకు ఋషి శరణాగతికి కావలసిన సామర్థ్యమును, కారుణికత్వమును చెప్పి ఇక ఇపుడు శరణాగతిని ప్రారంభిస్తున్నాడు. శరభంగ మహర్షి బ్రహ్మలోకమునకు వెళ్ళిన తరువాత సుతీక్ష్ణాది ఋషులు ఒకచోట చేరారు. ఇచట వైఖానసా వాలఖిల్యాః, అని వైఖానసవాలఖిల్యాది ఋషులు అని  చెబుతున్నారు. యే నఖాః తే వైఖానసాః, యే వాలాః తే వాలఖిల్యాః అను వ్యుత్పత్తిచే భగవంతుని నఖములనుండి పుట్టినవారు వైఖానసులు, భగవంతుని రోమములనుండి పుట్టినవారు వాలఖిల్యులని తాత్పర్యము. మరికొందరు ఋషులు సంప్రక్షాళులు అనగా ఎపుడూ శరీరమును ప్రక్షాళనము చేసుకొనువారు. ఇక ఎపుడూ చంద్రకిరణాలను, సూర్యకిరణాలను పానము చేయువారు అనగా ఎపుడూ తమలోనికి కిరణములను ప్రవేశింప చేసుకొనేవారు తెరిచియున్నవారు అని అర్థము. ఇక కొందరు అశ్మకుట్టులు పత్రాహారులు, దన్తోలూఖలులు, ఉన్మజ్జకులు, గాత్రశయ్యులు, అశయ్యులు, అభ్రావకాశకులు, సలిలాహారులు, వాయుభక్షులు, ఆకాశానుయాయులు, స్థండిల శాయులు. అశ్మకుట్టులనగా రాళ్ళతో తమ శరీరములను కొట్టుకొనువారు, ఆకులు ఆహారముగా కలవారు పత్రాహారులు, దంతములే ఉలూఖలములు అనగా రోళ్ళు అనగా ధాన్యములకున్న పొట్టును దంతములతోనే తొలగించి తినేవారు. ఇక ఉన్మజ్జకులు అనగా ఒక శిరస్సును మాత్రమే బయటనుంచి మిగిలిన శరీరమును నీటిలోనే ఉంచి తపము చేయువారు. ఇక తమ శరీరమే శయ్యగా కలవారు తమ శిరమును భుజముల మీదనో శిరస్సు మీదనో ఉంచి పరుండువారు. అనగా వీరు భూమిమీద పరుండువారు కారు. భూమి మీద పరుండువారు స్థండిలశాయులు. కొందరు శరీరమును వంచనివారు. అభ్రావకాశకులు అనగా వానలోనూ, ఎండలోనూ, గాలిలోనూ, కప్పులేని ఆరు బయటనే ఉండువారు. కొందరు నీరును మాత్రమే ఆహారముగా గొనువారు. మరికొందరు వాయుభక్షకులు. ఆకాశమున అనగా వృక్షాగ్రభాగముననే నివసించువారు. దర్భలు పరిచిన భూమిపైపరుండువారు స్థండిలశాయులు. వ్రతోపవాసనిరతులు అనగా సర్వాహార శూన్యులు. ఎపుడూ తడిబట్టలనే  ధరించువారు, సజపులు అనగా ఎపుడూ జపించువారు. తపోనిత్యులు తపస్సనగా స్వాధ్యాయము. నిత్యము స్వాధ్యాయపరాయణులు. గ్రీష్మకాలమున పఞ్చాగ్నిమధ్యలో నుండువారు. బ్రహ్మవిద్యానుష్ఠానము వలన కలిగిన తేజస్సుతో నిండినవారు. పరిపక్వమైన యమనియమాద్యష్టాంగయోగము కలవారు దృఢయోగులు, సమాహితులు, యోగైకాగ్రచిత్తులు – ఇట్టివారు రాముని సమీపించారు.

ఇచట

1. వైఖానసులు 2. వాలఖిల్యులు 3. సంప్రక్షాళులు 4. మారీచిపులు 5. అశ్మకుట్టులు 6. పత్రాహారులు 7.దంతోలూఖలులు 8. ఉన్మజ్జకులు 9. గాత్రశయ్యులు 10. అశయ్యులు 11. అభ్రావకాశులు 12. సలిలాహారులు 13. వాయుభక్షులు 14. ఆకాశనిలయులు 15. స్థణ్డిలశాయులు 16. వ్రతోపవాసులు 17.దాంతులు 18. ఆర్ద్రపట వాససులు 19. సజపులు 20. తపోనిత్యులు 21. పఞ్చతపోన్వితులు 22. దృఢయోగులు 23. సమాహితులు 24. బ్రహ్మతేజస్సంపన్నులు ఇట్లు 24విధములుగా తపమును ఆచరించుచున్న మునులు ఋషులు శ్రీరాముని చేరారు. అని చెప్పుట వల్ల ఋషులలో తపములలో యెన్నివిధములుండునో వాల్మీకి మహర్షి ఇచట వివరించిరని గ్రహించాలి. అభిజగ్ముః అను దానిలో శరణాగతి చెప్పబడింది.

'అభ్యగచ్ఛన్త, కాకుత్థ్సం రామం జ్వలిత తేజసం' అని దివ్యమైన తేజస్సుతో ప్రజ్వలిస్తున్న కుతాన్థిస్వయలో సంజాతులు 'రమంతే యోగినోఽ నంతే సత్యానందే' ఇత్యాది శ్రుత్యుక్త ప్రకారముగా అన్నివిధములుగానున్న ఋషులు మునులు పరమాత్మను చేరారు.

స్వప్రకాశరూపుడైన పరబ్రహ్మయే కకుత్థ్సవంశంలో అవతరించి మా అదృష్టవశాన మా కనులకు కనిపిస్తున్నారు. కావున మేమింతకాలము ఆచరించిన తపోదానాదులు ఇపుడు ఫలించాయి అని రాముని దర్శించినందువలన కలిగిన ఆనందముతో తమను తాము కృతార్థులను చేసుకొనుటకు ధనహీనునికి ధనము లభించినపుడు వలె ఆనందము నిండిన మునిసంఘములు నానాదిక్కుల నుండి వచ్చిన ఋషులు తమ విషయం విజ్ఞాపన గావించడానికి రాముని చేరి శరణువేడారు.

ఇచట పైన చెప్పబడిన ఋషుల పేర్లలో మరొక వ్యాఖ్యానం కూడా ఉన్నది. విఖనస మహర్షి చెప్పిన సూత్రముల ననుసరించేవారిని వైఖానసులు అంటారు. ఇక వాలఖిల్యులనగా కొత్త ఆహారం లభించిన వెంటనే అంతకు మునుపు దాచుకొనిన ఆహారాన్ని విడుచువారు.

సంప్రక్షాళులంటే భగవంతుని పాదప్రక్షాళనం చేసినపుడు పుట్టినవారు. లేదా తాము బ్రతుకుటకు ఆరోజు సంపాదించిన దానిని మాత్రము ఆ రోజే వినియోగించేవారు. అనగా రేపటికి దాచుకొననివారు. మరీచిపులనగా వెన్నెలను పానము చేసేవారు. అశ్మకుట్టులనగా భక్షించుటకు ధాన్యమును రాళ్ళతోనే దంచువారు.

ఉన్మజ్జకులు  ఉన్మత్తకులు అనికూడా పాఠాన్తరము – ఉన్మత్తకులనగా మాత్సర్యం తొలగినవారు. అనగా పరమజ్ఞానులు. జ్ఞానులు బాలులవలె, ఉన్మత్తుల వలె, పిశాచముల వలె వ్యవహరించెదరని శాస్త్రము. భూమిమీద శయ్యలు వేరులేకుండగా అట్లే పడుకొనువారు గాత్రశయ్యులు. ఎపుడూ పడుకోనివారు అశయ్యులు.

అభ్రావకాశకాః, అభ్యవకాశినః, అని రెండు పాఠాలూ కలవు. అభ్యవకాశినః, అనగా ఎపుడూ మేలుకొనియే ఉండువారు. ఆకాశనిలయాః, వాయుధారణ బలంతో ఆకాశములోనే నివసించేవారు. ఇట్లు ఋషులందరూ అన్నివిధములవారూ కలిసి శ్రీరామచంద్రుడు జగద్రక్షణకవతరించినవాడు, మమ్ములను కూడా రక్షిస్తాడు అని తెలిసికూడా ఆర్తి నిలువనీయక లోకరీతిని అనుసరిస్తూ రాజధర్మాన్ని విజ్ఞాపన చేస్తున్నారు. ఇంతకంటె మొదట

రాముని స్తుతిస్తున్నారు. దేవతలకు ఇంద్రునివలె ఇక్ష్వాకుకులములో ముఖ్యుడవు, శక్రునికి దేవేంద్రుడనీ, నీకు రఘుపతియనీ ప్రసిద్ధి కలదు. ఈ భూమికి కూడా నీవే ప్రధానుడవు. మూడులోకాలలో విరాధుని నిగ్రహించిన పరాక్రమంతో శరభంగుని అనుగ్రహించిన కీర్తితో ప్రసిద్ధి చెందినాడవు. నీలో పితృభక్తి సమృద్ధంగా నున్నది. పితృవచనముతో లభించిన రాజ్యమును కూడా విడిచితివి కదా! అట్లే సత్యవ్రతము కూడా నీలో పుష్కలముగా నున్నది. భరతుడు వచ్చి ప్రార్థించినా చేసిన ప్రతిజ్ఞను విడుచుటకు ఇష్టపడలేదుకదా. ధర్మము కూడా నీలో పుష్కలంగానున్నది. శరభంగుని అనుగ్రహించితివి కదా!

ఇట్లు రామునిలో

1. పితృభక్తి – రాజ్యత్యాగం
2. సత్యవచనం – భరతప్రార్థనతో కూడా మాట తప్పకుండుట
3. ధర్మసమృద్ధి – శరభంగానుగ్రహం
4. అతులపరాక్రమం – విరాధనిరసనం

ఉన్న ఇన్ని కల్యాణ గుణాలను చూచి రాక్షసనిగ్రహరూపమైన విజ్ఞాపన చేయడానికి అనగా యాచించుటకు సాహసిస్తున్నాము. నీ వద్దకు చేరుటే కార్యసాధకమని తెలిసినా ఆర్తి అధికముగా నున్నందున విజ్ఞాపన కూడా చేస్తున్నాము క్షమించు. ఇలా చెప్పుటవల్ల భగవంతుడే ఉపాయము అను నిశ్చయమే కార్యసాధకం. అట్లు నిశ్చయించిన తరువాత మరల రక్షించమని ప్రార్థించరాదనియే సిద్ధాన్తమని తెలుపబడింది. అంతేకాదు. త్వరతోనో ఆర్తితోనో తొందరతోనో ప్రార్థిస్తే క్షమాపణ వేడాలి అని కూడా సూచించారు. తమను రక్షించుట రామునికి సహజ ధర్మం అనుదానిని నిరూపించడానికి మొదట లౌకికమైన రాజధర్మాన్నీ రాజులు రక్షించవలసిన విధినీ విజ్ఞాపన చేస్తున్నారు.

ప్రజలనుండి 6వభాగమును పన్నుగా తీసుకొని కూడా ప్రజలను రక్షించని రాజుకు గొప్ప అధర్మం సంప్రాప్తిస్తుంది. ఇట్లు రక్షించని రాజునకు కలుగు అధర్మాన్ని తెలిపి రక్షిస్తే కలుగు అభివృద్ధిని తెలుపుతున్నారు. ఇక ప్రజలను రక్షించుటలో నిత్యప్రయత్నశీలి. తన రాజ్యములో నున్న ప్రజలనందరిని తనప్రాణమువలె ప్రాణములకంటే అధికప్రీతిపాత్రులైన పుత్రులను వలె రక్షించే రాజు చాలాకాలము ఎపుడూ అనుసరిస్తూ ఉండే కీర్తిని పొందుతాడు. తరువాత అన్త్యకాలమున బ్రహ్మలోకానికి పోయి బ్రహ్మచేత కూడా పూజించబడతాడు.

పన్ను కట్టే ప్రజలను రక్షించడం ధర్మం కావచ్చు. మునులు ఋషులు పన్ను కట్టజాలరు కదా. అట్టి వారిని ఎందుకు రక్షించాలి అనగా రక్షించే రాజుకు ప్రజలనుండి 6 వ భాగం ధనరూపంగా పన్ను లభిస్తుంది. పన్ను కట్టజాలని మునిజనులు ఆచరించే ధర్మమునుండి నాలుగవ భాగము రక్షించే రాజుకు లభిస్తుంది అని చెబుతున్నారు.

రాజుకు లభించు భాగవిషయములో మతభేదం కనపడుతున్నది. ఒకచోట ఆరవ భాగం, ఇపుడు ఇచట నాలుగవ భాగం మరికొన్ని ప్రదేశాలలో రెండవ భాగమని కూడా చెప్పబడింది. ఇందులో ఏది సత్యం? దేనిని నమ్మాలి? అనగా ఇచట ధర్మనిర్ణయమిట్లా ఉన్నది.

ఉపవసిస్తూ భిక్షచే లభించే ఆహారం తీసుకొను జనులు ఆచరించు ధర్మంనుండి ఆరవ భాగము లభిస్తుంది. రాజు పరిపాలన కల రాజ్యభూమిలో పండిన ఫలాలను భుజిస్తున్న వారాచరించు ధర్మమునుండి నాలుగవ భాగము లభిస్తుంది. రాజుగారి అన్నపానీయాలతో పోషించబడువారు ఆచరించు ధర్మంనుండి రెండవ భాగము లభిస్తుందని అని ధర్మశాస్త్రం చెబుతున్నది చూడండి!

**యస్యాన్నపానపుష్టాఙ్గః కురుతే ధర్మసంచయమ్ ।**
**అన్నప్రదాతుస్తస్యార్ధం కర్తుశ్చార్ధం న సంశయః ॥**

అని స్మృతివాక్యం. ధర్మమునపేక్షించు రాజుకు కలుగు ఫలమును చెప్పారు. కాని రాముడు ధర్మానపేక్షుడు అనగా ధర్మఫలమునపేక్షించనివాడు అయినపుడు ఎందుకు రక్షించాలి అనగా ధర్మఫలమునపేక్షించని రాముని విషయంలో శరణాగతియే రక్షణహేతువంటున్నారు.అనగా ఇంతవరకు రాజసాధారణమైన ధర్మాధర్మములను వివరించి ఇక ఇపుడు తాము చెప్పదలుచుకున్న దానిని తెలుపుతున్నారు.

ఇచటనున్న వానప్రస్థగణం బ్రాహ్మణులు ఎక్కువగా నున్న గణం. అనగా వానప్రస్థులలో క్షత్రియులు, వైశ్యులు కూడా ఉన్నారని సూచన. బ్రాహ్మణశబ్దము ఇచట జాతివాచకము కాక జ్ఞానవాచకము. అనగా బ్రహ్మజ్ఞానము కలవారు. బ్రహ్మజ్ఞానమును బోధించు వేదశాస్త్ర పురాణములను అధ్యయనము చేసినవారు, చేస్తున్నవారు నీవు మాత్రమే రక్షకుడవని దృఢాధ్యవసాయం కలవారు. అనాథులవలె బాధించబడుతున్నారు. రాముడు మాత్రమే రక్షకుడు అని చెప్పుటవల్ల అనన్య శేషత్వరూపధర్మం బోధించబడింది. బ్రాహ్మణులనగా బ్రాహ్మణత్వాది పరమైకాన్తిక ధర్మనిష్ఠులు అని తాత్పర్యం. పరమాత్మయే నాథుడు అని త్వన్నాథా అని చెప్పుటవల్ల అనన్యశరణ్యత్వ అనన్యభోగ్యత్వ ధర్మాలు కూడా బోధించబడ్డాయి. ఇట్లు త్వన్నాథా అను ఒకపదముతో అనన్య శేషత్వ శరణ్యత్వ అనన్యభోగ్యత్వరూప అకారత్రయం బోధించబడింది. ఇట్టి అకారత్రయ భూయిష్ఠులు కాన వీరికి మహాన్ వానప్రస్థగణః అని మహచ్ఛబ్దము ప్రయోగించబడినది. ఇంతటి నిరతిశయ మహిమకలవారు అనగా ఆకారత్రయ సంవిష్టులైననూ అనాథులవలె వధించబడుచున్నారు. ఇట్టి మా పరాభవము నీకు తగినది కాదు. 'పరాభవో నాథ న తేఽనురూపః' అని యామునాచార్యులవారు చెప్పిన దానిని ఈ సందర్భమున స్మరించుకోవాలి. ఇట్టి భక్తులను రక్షించుటలో ఉపేక్ష తగదని యాచన.

శ్రీరామచన్ద్రా! రమ్ము! అని పరమాత్మను మననం చేసేవారు నిదిధ్యాసననిష్ఠులు. భావితాత్ములైన మునుల శరీరాలను అనగా రాక్షసుల చేత చంపబడిన ఛేదించబడిన భక్షించబడిన శరీరాలను చూడు. దూరము నుండి స్పష్టముగా కనపడనందున దగ్గరనుండి చూడడానికి రమ్ము అని పిలుస్తున్నారు. అట్లు చూడడంవల్ల కరుణ కలుగునని ఆహ్వానము. ఒక్కొక్క అవయవాలుగా ఖండఖండాలుగా ఛేదించబడిన శరీరాలు శస్త్రములచే భిన్నమైనవారి శరీరాలను చూడు అని చెబుతున్నారు. శరభంగాశ్రమప్రాంతంలో ప్రవహించు పంపానదీతీరమున నివసించేవారు, చిత్రకూటమున నివసించు మునులను హింసిస్తున్నారు. శరీరాలను అపేక్ష లేకుండగా తపస్సు చేసేవారికి హింస అంటే భయమెందుకని అడుగరాదు. మేము మా శరీరపీడవల్ల భయపడుట లేదు. గొప్పవారి విషయంలో జరిగే

హింసను సహించజాలమంటున్నారు. స్వపీడకన్నా స్వజనుల పీడ దుస్సహం కదా? కావున రక్షణ కొరకు సర్వలోకరక్షణ సమర్థుడగు నిన్ను ఆశ్రయిస్తున్నాము ఎపుడవతరించి మమ్ములను రక్షించెదవా అని ఎదురు చూచే మమ్ములను రక్షించు. ఇచట శరణ్యం అని మాత్రమే చెప్పినారు. దీనశరణ్యం లోకశరణ్యం అని ఎట్టి ఉపపదము చెప్పనందున సర్వలోకశరణ్యుడే కాని ఒక పరిమితిని అవధిని బట్టి రక్షించువాడు కాదు అని తెలుపుటకే ఇట్లు సకలలోకరక్షణకుపయోగించు స్వామిత్వ సర్వజ్ఞత్వాదులు ద్వయమంత్రములోని పూర్వఖండములో చెప్పబడినవాటిని ఇచట స్మరించారని గ్రహించాలి.

**ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్ ।**
**రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వ వరణం తథా ।**
**ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః ॥**

అని శరణాగతిశాస్త్రమున చెప్పబడినట్లు సకలాంగ సంపూర్ణంగా రక్షాభరన్యాసం చేశారని తాత్పర్యం. మమ్ము పరిపాలించు అని చెప్పుటవల్ల గోప్తృత్వ వరణం చెప్పబడింది. రాక్షసులచే వధించబడు మమ్ములను పరిపాలించు అని చెప్పుటవల్ల అనిష్టమును తొలగించమను ఫలప్రార్థన తెలియబడుతున్నది. మేము అనన్య గతికులమని అనగా ఇతో రక్షణమేదీ లేనివారము కావున నీవు మాత్రమే కాపాడాలి. నీకంటే వేరొకటి ఐహికాముష్మికసాధనమైన దేవతాంతరం లేదని అభిప్రాయము. ఇట్లు చెప్పుటవల్ల "నాన్యః పంథా అయనాయ విద్యతే" అను శ్రుత్యర్థము సూచించబడింది. "పరిపాలయ నస్సర్వాన్" అను ఉత్తరార్ధముతో ద్వయమంత్రములోని ఉత్తరఖండార్థం బోధించబడింది. 'తమేవం విద్వానమృత ఇహ భవతి' అను మంత్రార్థం సూచించబడింది. ఇట్లు విజ్ఞాపన చేసిన ఋషులతో శ్రీరామచంద్రుడిట్లు చెబుతున్నాడు. తాము శరణాగతి చేసినందుకే రక్షించుడని ఆజ్ఞాపించబడితిని, మరల విడిగా పరిపాలించుడని అడుగుటతో పనిలేదు. ఈ రక్షణకూడా మీకొరకు కాదు. ఇది నా ప్రయోజనమే. రాక్షసులు తమకు చేయు అపకారాన్ని నివారించుటకే నేను అడవిలో ప్రవేశించవలసియున్నది. ప్రవేశించాను కూడా. మీకు బాధను తొలగించుట నాప్రయోజనమే. శేషభూతులను రక్షించుట శేషిప్రయోజనమే కదా! తాపసులైన మీరు నన్నాజ్ఞాపించాలి కాని ప్రార్థించరాదని చెప్పుటతో స్వామిసౌలభ్యము ప్రకటింపబడింది. పితృవచనపరిపాలనవ్యాజంతో నా వనప్రవేశం దేవగతితో రాక్షసులు చేయు మీ హింసను నివారించుట కుపయోగించింది. అనగా ఇచట వనప్రవేశం దైవగతితోనే జరిగినది కాని కర్మవశమున కాదని అభిప్రాయము. మీపనిని పూర్తిచేయుటకే వనానికొచ్చిన నాకు వనవాసం మహాఫలప్రదము అనగా యుద్ధమున నేను శత్రువులను సంహరించుట కూడా మీ కొరకే. ఇచట మహాఫలమనగా అనిష్టనివారణ పూర్వకముగా ఇష్టప్రాప్తి. లోకంలో కొందరు అనిష్టాన్ని మాత్రమే తొలగించగలరు. మరికొందరు ఇష్టమును మాత్రమే ప్రసాదించగలరు. అట్లు చేయుట సామాన్యఫలము. రెండు కలిగించుట మహాఫలమని అభిప్రాయము. నేను భక్తపరాధీనుడను కాన తపస్వులకు నేను ఆజ్ఞాపించదగినవాడనే అనునది వాస్తవార్థం. ఇలా పలికి మునులకు ధైర్యం కలుగుటకు రాముడు ప్రతిజ్ఞ చేస్తున్నాడు. "ఇక ఇపుడు నేను తపస్వులకు శత్రువులగు రాక్షసులను చంపదలచాను. సోదరునితో కూడియున్న నాపరాక్రమాన్ని ఋషులు చూతురుగాక". ఇట్లు మునిజనులకు అభయమునొసంగి శ్రీరామచంద్రుడు మునిజనులతో

పూజించబడి ధర్మరక్షణ నిశ్చయముకలవాడై లక్ష్మణునితో కలిసి సుతీక్ష్ణాశ్రమమునకే బయలుదేరాడు. ఇట్లు ముని జనాభయప్రదానంతో ఆరవ సర్గ ముగిసింది.

ఇక సప్తమసర్గలో సుతీక్ష్ణాభ్యర్థనతో మృగరూప మారీచాది దుష్టరాక్షసనిరసనప్రారంభం ప్రతిపాదించ బడుతుంది. శరభంగుని మాటలలో సుతీక్ష్ణాశ్రమం సమీపములోనే కలదని తెలుపబడింది. ఆ వనమున ప్రవేశించిన రామలక్ష్మణులను ఇక్ష్వాకువరౌ రాఘవౌ అని రెండు సార్లు చెప్పుట ధైర్యము కలవారని సూచించుటకే.

అచట సుతీక్ష్ణాశ్రమంలో సుతీక్ష్ణ మహర్షిని రాముడు చూచాడు. ఆ మహర్షి మలపఙ్కజటాధరుడు. నిత్య నిశ్చలతపోయోగముతో కాని వార్ధక్యముతో కాని మలపఙ్కజటాధరుడు. మలమనగా ఉద్వర్త సంస్కారము లేనందున శరీరమువలన ఏర్పడేది. వనములో సంచరించుట వల్ల శరీరానికి అంటుకొన్నది పంకము, ఋషి కనులు మూసుకొని ఉన్నందున తాను చేసిన అభివాదము తెలియదుగాన రాముడను నేను అని మాటలాడుతున్నాడు. అభివాదం చేస్తున్న నన్ను ఆశీర్వదించు. సత్యవిక్రముడనగా అమోఘ తపస్సు కలవాడని అర్థం. రాముని మాటలు వినిన సుతీక్ష్ణుడు శ్రీరామచంద్రునకు స్వాగతం పలికాడు. నీవీ ఋషుల ఆశ్రమమున చేరినందున ఇపుడు ఆశ్రమాలకు రక్షణ కలిగింది. నిన్నెదురుచూస్తూ నేను స్వర్గానికి వెడలలేదు. అనగా రావణాసురుని వధించుటకవతరించిన నీవు రాజ్యభ్రష్టుడవగుట, చిత్రకూటమును చేరుట మొదలగు వృత్తాన్తమునంతయూ నేను విన్నాను. రావణాసురుని వధించుటకు నీవీ దారిలోనే రాగలవని నిన్ను ఎదురుచూస్తూ దేహం విడిచి స్వర్గమునకు వెళ్ళియుండలేదు. పరమ పురుషార్థమైన తమదర్శనానికి స్వర్గం అన్తరాయం కదా.

శరభంగుని ఆశ్రమమునుండి నా వద్దకు వచ్చిన ఇంద్రుడు నన్ను స్వర్గాని కాహ్వానించాడు. కాని నీదర్శనము ముందు స్వర్గము అత్యల్పఫలమని తెలిసి వెళ్ళలేదంటున్నాడు. అట్లే ఇంద్రుడు నాతో నేనాచరించిన తపఃప్రభావముతో అన్ని ఊర్ధ్వలోకాలను గెలిచానన్నాడు. అట్లు నేను తపస్సుతో జయించినపుడు లోకాలలో దేవతలు ఋషులు సేవించే ఆయాలోకాలలో నా అనుగ్రహంతో నీవు విహరించు. ఇది లోకరీతిలో అర్థము. వాస్తవంగా విహరస్వ అనగా విశేషేణ హర అను విభాగంతో నాయందు అనుగ్రహముతో స్వీకరించు. సకలకర్మఫలాలను భగవంతునకే అర్పించవలెను కదా. ఆ బుద్ధితోనే అర్పించాడని తెలుసుకోవాలి.

శ్రీరామచంద్రుడు నేనే వాటిని నాప్రభావంతో పొందగలను. ఇపుడు నాకీ అరణ్యములో ఆవాసం కావాలి. అరణ్యమున నీవు కుశలుడవు నేర్పరివి అని గౌతమవంశజుడైన శరభంగుడు చెప్పాడు అని బదులు పలికాడు. భక్తితో నీవర్పించిన లోకములను తప్పక స్వీకరిస్తాను అని వాస్తవార్థం. అందువలననే శ్రీరామచంద్రుడు మోక్షమును ప్రసాదించుటకు అనుగ్రహించాడని మహాసంతోషముతో పరమానన్దభరితుడైనాడు. నీవు ఈ ఆశ్రమములోనే ఉండు. ఇచట ఎపుడూ ఋషుల సంఘాలు సంచరిస్తుంటారు. అన్ని సమయాలలో మూలఫలకాలుంటాయి. ఇచట మృగసంఘములు కూడా నిర్భయంగా వచ్చి వెళ్ళుతుంటాయి. ఇచట మృగముల భయం తప్ప ఇంకొక దోషం లేదు. మృగములు అటునిటూ తిరుగుతూ చిత్ర విచిత్రములుగా అరుస్తూ సమాధిభంగం కలిగిస్తాయి. ఇది తప్ప ఇంకొక దోషము లేదు. మృగముల రూపము, కాంతి, గమనము, చేష్టలు మొదలగు వాటివలన సమాధిభంగము

కలుగుతుంది అని తాత్పర్యము. ఇంతియే కాక రాక్షసులు కూడా యథేచ్ఛగా నిరంతరాయంగా సంచరించవచ్చు అను అభిప్రాయములో మృగరూపములతో సంచరించుచుందురని అంతరార్థము.

సుతీక్ష్ణవాక్యమును వినిన రాముడు మహానుభావా! నాకంటికి మృగాలు కనపడిన వెంటనే వాటిని నేను చంపగలను. నా ధనువు నారి సారించి లాగి వధించగలను. కాని నేనెట్లు మృగాలను వధించుట తమ ఆశ్రమ మృగాలను చంపుటకు తాము సమ్మతించరు. కాన పరితాపం పొందుతారు. తమను వ్యథకు గురి చేయుట నాకిష్టము కాదు. కావున నీ ఈ ఆశ్రమమున నేనుండజాలను. మరొక చోటనుండి తమకు అప్రత్యక్షముగా మృగాలను వధించి తాము చెప్పిన ఆశ్రమదోషాన్ని తొలగించగలను అని పలికాడు. రాముని పలుకులకు సుతీక్ష్ణమహర్షి సమ్మతించాడు అని వరదుడైన మునికి నమస్కరించెను అనుమాటలో సూచించెను. ఇతర ప్రదేశమున శ్రీరామచంద్రుడు మృగాలను వధించుటను మారీచుడు రావణునితో చెప్పిన మృగవధతో తెలుసుకోవచ్చు.

శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో కలిసి సంధ్యావందనం ముగించుకొన్న తరువాత సుతీక్ష్ణమహర్షి భక్తితో సమర్పించుట వల్ల పరమపావనమైనది, తాపసులు భుజించు ఫలమూలాదులతో కూడియున్నది అగు భోజనమును స్వయముగా రాముడు పరమపురుషుడని తెలిసి అర్ఘ్యపాద్యాదులతో చక్కగా పూజించి రాత్రిపూట భోజనమునకు అనుగుణమైన వాటిని సమర్పించాడు. ఇచట రామలక్ష్మణులకు మహర్షి ఇచ్చాడు అని చెప్పాడు. సీతాదేవికిచ్చినట్లు తెలుపలేదు. అనగా రామభుక్తశేషమును సీతాదేవి భుజించినదని తాత్పర్యము. అందువలననే విడిగా సీతకిచ్చినట్లు వాల్మీకి మహర్షి వివరించలేదు.

ఇక 8వ సర్గలో సుతీక్ష్ణమహర్షి ఆజ్ఞానుసారంగా శ్రీరామచంద్రుడు మునిజనాశ్రమమండలంలో పర్యటించడం వర్ణించబడింది. ఇలా రాముడు సుతీక్ష్ణ ఆశ్రమంలో ఆ రాత్రి గడిపి ఉషఃకాలమున మేల్కొని సీతతో కలిసి స్నానం చేశాడు. వారు స్నానమాడిన జలం వేడినీరు కాదు. సుశీతేన అనగా చల్లని నీరు. ఉత్పలగన్ధి అని చెప్పడంలో తటాకస్నానం సూచించబడింది. అగ్నిని శ్రీమన్నారాయణుని యథావిధిగా ఆరాధించి తరువాత ఉదయిస్తున్న సూర్యభగవానుని ఆరాధించారు. ఇచట హోమం తరువాత సూర్యోపస్థానం చెప్పబడినందున ఇది అనుదిత హోమపక్షము కావున రాఘవుల అనుష్ఠానము కాత్యాయనసూత్రక్రమముగా జరిగినదని తెలియవలయును.

ఆశ్రమమండలానికి బయలుదేరుటకు ముందు సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణునకు అభివాదం చేసి అనుజ్ఞ వేడారు. తాము త్వరగా వెళ్ళుటకు కారణం ఋషులు తన్ను త్వరపెట్టుతున్నారు గాన. ఇట్లు చెప్పుట వలన చిత్రకూటమున బయలుదేరిననాటి నుండి దారిని చూపు మిషతో పంచవటీ ప్రదేశం వరకు మునులు రామునితో కలిసున్నారని కలిసి వెంటవచ్చారని సూచించబడింది. అచటి మునులు నిత్యధర్మపరులు, ఇంద్రియనిగ్రహం కలవారు. ఇన్ద్రియనిగ్రహమున్నపుడే తపస్సు చేయగలరు. తమ ప్రభావం బయలుపరచినవారు. ఇచట రామచంద్రుడు సాధుసమాగమంలేని దుష్టరాజు అన్యాయంగా లభించిన సంపదను దోచి సహించరాని తేజస్సు కలవాడైనట్లు సూర్యభగవానుడు తన కిరణములతో సహించరాని తేజస్సుకలవాడై మరీ ఆకాశములో పైకి రాకమునుపే బయలుదేరాలి అంటున్నాడు. ఇచట త్వరగా బయలుదేరగోరడం రావణాసురుని వధించుటలో త్వరగా తెలియాలి.

కావుననే సాధుసమాగమవర్జితునితో సూర్యభగవానుని పోల్చుట కూడా హీనోపమాదోషము కాదు. ఇచట సాధుసమాగమవర్జితుడై అన్యాయంగా సంపాదించిన ఐశ్వర్యంతో ఆవిషహ్యతేజస్సుగల రావణుని మదిలో నిడుకొని శ్రీరామచంద్రుడు పలికిన మాటగా గుర్తించాలి.

అంతట సుతీక్ష్ణమహర్షి రామచంద్రుని గాఢంగా ఆలింగనం చేసుకొని ప్రీతితో రామా! లక్ష్మణునితో కలిసి. అడ్డంకులు ఆపదలు లేని దారిలో వెళ్ళుమని సూచించడమైనది. దండకారణ్యవాసుల ఆశ్రమం చూడు. అని చెప్పటతో రావణాసురుని వధకు అనుమతినిచ్చినట్లు గ్రహించాలి. ఇట్లు సుతీక్ష్ణాశీర్వచనాలను చేకొన్న రామచంద్రుడు సీతాలక్ష్మణులతో మునికి ప్రదక్షిణమాచరించి బయలుదేరాడు. అంతట సీతాదేవి శుభతరములైన అమ్ముల పొదలను, ధనువులను, పరిశుద్ధములైన ఖడ్గములను రామలక్ష్మణుల కిచ్చింది. ఇట్లు చెప్పటవల్ల మునిజనుల ఆశ్రమంలో ఆయుధాలతో మాకు పనేమి అని భావించిన సీత ఆయుధాలను ఆయాశ్రమమున ఏదో ఒక మూలలో దాచియుంచినది. అన్యాయమార్గములో లభించిన సంపద కల దుష్టుని తేజస్సువలె అని రాముడు పలికిన మాటలకు 'అరిష్టం గచ్ఛ పంథానం' అని ముని ఆశీర్వచనములోని ఆంతర్యంను గ్రహించిన సీతాదేవి స్వయంగా తీసుకొని వచ్చి వారికిచ్చినది అని తెలుస్తున్నది. కావుననే తరువాతి సర్గలో సీతాదేవి రామునితో రాక్షససంహారము గురించి మాటలాడడం కుదురుతుంది.

ఇక తొమ్మిదవ సర్గలో వీరపత్నియగు సీత శరచాపాలను ధరించి యుద్ధసన్నద్ధుడగు భర్తను చూచి నీవు సాయుధునిగా రాక్షసులెక్కువగానుండే అరణ్యంలో ప్రవేశిస్తే వారితో విరోధ మేర్పడుతుంది. దానితో మనకు వియోగం కలుగవచ్చు. వియోగంతో నీకు చాలా కష్టాలు కలుగుతాయి. కావున ఆయుధాలను ఒక చోటనుంచి మనం అరణ్యానికి పోదము అని పలుకుతుంది. రావణవధకు అనుమతించిన రాముని చూచి సీతాదేవి యుక్తి యుక్తంగా హృదయంగమంగా స్నేహం ప్రదర్శించునట్లు రామునితో ఇలా పలికింది. ఇంతకు మునుపు శ్రీరామచంద్రుడు నేను కేవలము నాకార్యంగా అరణ్యంలో ప్రవేశించలేదు. రాక్షసులు తమకు చేసే అవమానాన్ని తొలగించుటకే వచ్చాను అని మునుల ముందు రాక్షసులను వధిస్తానని ప్రతిజ్ఞ చేసిన శ్రీరామచంద్రునితో సీతాదేవి 'అహింసా పరమో ధర్మః' అను న్యాయమును మనసులోనుంచుకొని హింసను నివారించుటకు లోకదృష్టాన్తముతో పలుకబోతున్నది. సీతాదేవి ఇట్లు పలుకుటకు స్నేహమే మూలం అని గ్రహించాలి. రామచంద్రుడు చేసిన ప్రతిజ్ఞను ఎవరూ మరలించలేరని చాలా మార్లు చూచినా రాక్షసులతో రామునికి విరోధం కలిగితే తనతో ఎడబాటు కలిగి రామునకు చాలా బాధ కలుగునని ప్రేమభావనతో గుడ్డిదైన సీత ఇట్లు పలుకుతున్నదని అభిప్రాయం.

నీవాచరించే ఈ ధర్మం అనగా మునిధర్మం చాలా సూక్ష్మవిచారంతో ఆచరణసాధ్యం. ధర్మం కోరేవారు శాస్త్రవిధిననుసరించే ఈ ధర్మం పొందగలరు. కామము వల్ల కలుగు వ్యసనములు లేనివాడు మాత్రమే ఈ మునిధర్మమును పొందగలడు. కామం వల్ల కలిగే వ్యసనాలు మూడు. అసత్యభాషణం అన్ని వ్యసనములకంటె పెద్దది. దీని కంటే పెద్దవ్యసనములు మరిరెండు. పరదారాభిగమనం, వైరం లేకుండగా హింసించుట. ఇచట 'అయం ధర్మస్సుసూక్ష్మేణ' అని కాక 'అధర్మం తు సుసూక్ష్మేణ' అను పాఠము కూడా కలదు. ఆ పాఠపక్షములో

తాము మహానుభావులైననూ అతిసూక్ష్మమార్గముగా పరిశీలిస్తే అధర్మమునే పొందుతావు. కామం వల్ల కలిగెడి వ్యసనాలను విడిచిన నీవు ఈ అధర్మమును పరిహరించుకొనవచ్చును అని అభిప్రాయం.

పరదారాభిలాష ధర్మనాశకం, అధర్మకరం. అబద్ధములాడుట కేవలం అధర్మమును మాత్రమే కలిగిస్తుంది. పరదారాభిలాష అధర్మం కలిగిస్తుంది. ధర్మమును నశింపచేస్తుంది. తమకు పరదారాభిలాషయే లేదు. ఇక పరదారాభిగమనమెలా ఉంటుంది? దానికి కారణం నీవు మనుష్యేన్ద్రుడవు కదా? నీకు పరదారాభిలాష ఇపుడు లేదు. ఇక ముందు ఉండదు. పరస్త్రీలు ఎంత సుందరులైనను నీకు సంకల్పమాత్రముగానైననూ అభిలాష లేదు. రాదు. ఇది కాలత్రయములో కూడా ఉండదు. నీకు పరదారాభిలాష, అసత్యవాక్యములు లేవు అనుటకు హేతువులు చెబుతున్నది. నీవు స్వదారనిరతుడవు. ధర్మిష్ఠుడవు. సత్యప్రతిజ్ఞుడవు. మహాధర్మాత్ముడవు, నిరవధికైశ్వర్యము కలవాడవు. అదియు గాక లక్ష్మణాగ్రజ అనుచున్నది. లక్ష్మణుని కంటే వైరాగ్యములో నీవే అధికుడవు. కావుననే ధర్మసత్యవైరాగ్యైశ్వర్యాదులు నీలో స్థిరంగా నిలచియున్నవి. ఇంద్రియనిగ్రహమున్నవారు మాత్రమే ధరించగల ధర్మిష్ఠత, సత్యసంధత, నీ ఇంద్రియనిగ్రహము నాకు అనుభవసిద్ధమే. ఇచట రాముని సీత 'శుభదర్శన!' అని సంబోధిస్తున్నది. నిన్ను చూచినంతమాత్రాననే అందరికీ ఈవిషయము తేటతెల్లమవుతుంది అని అభిప్రాయము. 'రూపమేవాస్యై తన్మహిమానమాచష్టే' అను శ్రుతివాక్యము ఇచట ప్రమాణము.

ఇట్లు రెండు వ్యసనాలూలేని నీవు మూడవ వ్యసనాన్ని కూడా పరిహరించాలి. లేకుంటే మూడవ వ్యసనంతో నీకు అధర్మం సంప్రాప్తిస్తుంది అని చెబుతున్నది. పరప్రాణాలను హింసించే రౌద్రమను పేరుకల గొప్ప వ్యసనాన్ని పామరులు ఆచరిస్తారు. అట్టిది ఇపుడు నీకు సంప్రాప్తిస్తున్నది. అట్టి క్రూరమైన దానిని నీవు చేయసమకట్టావు. అనగా రాక్షసులను వధించెదనని ప్రతిజ్ఞచేసితివి కదా. ప్రతిజ్ఞ చేసినంతనే అధర్మమెలా సంప్రాప్తిస్తుంది? అదికూడా ఋషులు ప్రార్థించినందున చేసితినని అనరాదు. తమరి సంకల్పం కూడా ఋషుల ప్రార్థన కంటే మునుపే యున్నది. తాము దండకారణ్యమున ప్రవేశించడం యుద్ధంలో రాక్షసులను వధించుటకే అని తామే చెప్పితిరి. రాక్షసులను దండించుటవల్లనే ఈ అరణ్యానికి 'దండకమని' ప్రసిద్ధి కలుగుతున్నది. ఆ జనపదానికి పూర్వం శుక్రశాపము వల్ల ఆపేరు వచ్చింది. అది కూడా దండనమే కదా అని అభిప్రాయం. రాక్షసవధకై బయలుదేరుట, రాక్షసులను వధిస్తానని ప్రతిజ్ఞ చేయుట నీవు సత్యప్రతిజ్ఞుడవగుటను చూచిన నేను పరలోకసుఖాన్ని ఇహలోక సుఖాన్ని గూర్చి ఆలోచిస్తున్న నాలో చాలా పరితాపం కలుగుతున్నది. నీవు సత్యప్రతిజ్ఞుడవు కాన రక్షోవధనుండి మరలవు. వైరం లేకుండగా పరహింస చేస్తున్నావు. ఏదైనా ఒకవైరం కలిగించే హింసిస్తాను అనగా అట్టి వైరానికి నేనే మూలం కావాలి. దానితో నాయెడబాటు తప్పదు. ఏకనారీవ్రతుడవగు నీకు నా విరహం సహించరానిదే యగును. కాన ఇదెట్లు అని నా చింతయని అభిప్రాయం.

మరిపుడు ఈ సమస్యకు నీకు తోచిన పరిష్కారమేమిటి అనగా రామా! నీ పక్షమే నా పక్షం కదా! ఆ పక్షాన్ని బలపరచడానికి మార్గాంతరాన్ని వివరిస్తున్నది. నీవు దండకారణ్యానికి వెళ్ళుట నాకిష్టం లేదు. కారణం విను. నీవు శరచాపాలు ధరించి తమ్మునితో కలిసి అరణ్యానికి వెళ్ళితే అచట వనచారులగు రాక్షసులను చూచి తప్పక శరవ్యయం

చేస్తావు అనగా అయితే శరవ్యయం చేయను అనగా క్షత్రియుల చేతిలో నుండే ధనువు తేజోరూపబలాన్ని వృద్ధి చేస్తుంది. అగ్ని వద్దనున్న సమిధలు తేజోబలం పెంచుతాయి. ఈ విషయమును నిరూపించుటకు ఒక ఇతిహాసాన్ని చెబుతున్నది.

సంతుష్ట మృగపక్షి సమాకులమైన వనంలో సత్యవాక్కు, శుచియగు తపస్వి ఒకడుండేవాడు. అతని తపస్సును భంగము చేయడానికి ఇంద్రుడు ఖడ్గపాణియై భటరూపముతో అటకొచ్చాడు. పవిత్రమైన తపస్సులోనున్న ఋషి వద్ద తన ఖడ్గమును న్యాసంగా నుంచాడు. న్యాసమనగా

**రాజచోరాదికభయాద్దాయాదానాం చ వఞ్చనాత్ ।**
**స్థాప్యతేఽన్యగృహే ద్రవ్యం న్యాసస్స పరికీర్తితః ॥**

రాజచోరాదుల భయమువల్ల జ్ఞాతి సమ్బన్ధిబాంధవుల మోసం తప్పించుకొనుటకు ఇతరుల గృహములో ద్రవ్యమునుంచడం న్యాసమనబడుతుంది. ఇట్లు న్యాసంగా నుంచిన ద్రవ్యమును కొంతకాలము తరువాత మరల తీసుకొనవచ్చు. అట్లు తీసుకొనడానికి తీసుకొనేవరకు రక్షించుటకుంచడమే న్యాసమని మరికొందరి లక్షణము.

ఇంద్రుడు అలా న్యాసంగా నుంచిన ఖడ్గాన్ని అతడు తనపైనుంచిన నమ్మకం కాపాడుకొనుటకు ఖడ్గాన్ని రక్షించుటకు, మూలఫలాలను తెచ్చుటకు అరణ్యానికి వెళ్ళిననూ ఆ ఖడ్గాన్ని గొనిపోతూ ఉండినాడు. ఇట్లు ఆ తపస్వి నిత్యం ఖడ్గాన్ని ధరిస్తున్నందున తపస్సును విడిచి హింసాపరాయణమగు బుద్ధిని ఏర్పరచుకొన్నాడు. ఇట్లు శస్త్రసంయోగం వల్ల ఆ తపస్వి నరకానికి పోయాడు. అందుకే అగ్నిసంయోగమువలె శస్త్రసంయోగము కూడా వికారహేతువవుతుంది.

ఈ విషయం నీకు తెలియనిది కాదు. నీపై నాకు స్నేహముతో నాపై నీకున్న మన్ననవలన నీకు తెలిసిన దానినే గుర్తు చేస్తున్నాను. కొత్తగా ఉపదేశించడం కాదు. కావున వైరం లేకుండగా నీవు ధనువు ధరించి రాక్షసులను హింసించరాదు. అపరాధం లేకుండగా చంపుట నేను సమర్థించను. రాక్షసులను వధించుట ప్రారంభించిన నీకు క్రమంగా అది ఇతర ప్రాణులను వధించుటకు దారి తీస్తుంది.

ఇచట సీతాదేవి నిరపరాధులైన రాక్షసులను వధించడాన్నే నిషేధిస్తున్నది కాని సాపరాధులను కాదు. కావున రాక్షసులు చేసిన అపరాధాన్ని ఆలోచించియే అది కూడా సామదానాదీతరోపాయాలతో సాధ్యము కానపుడు మాత్రమే చేయాలి. ముందు ముందు మారీచుడు రావణాసురునకుపదేశించే సందర్భంలో 'అకుర్వన్నపి పాపాని శుచయః పాపసంశ్రయాత్' అని తామే పాపాలను చేయకున్ననూ పాపాలు చేసినవారి సమ్బన్ధముతో పాపుల పాపముతో నిరపరాధులు కూడా నశించెదరని చెప్పబోవునట్లు ఒక్క అపరాధుని శిక్షించే ఉద్దేశ్యంతో అనపరాధులకు బాధ కలుగని విధంగా ఆచరించాలని అభిప్రాయము. ఆర్తులైన మునిజనులను రక్షించుటకు అనపరాధులుకూడా వధించబడవచ్చునేమో? ఇట్లాలోచిస్తూ కాలం గడిపితే క్షత్రియధర్మమగు ధనుర్ధారణం వ్యర్థం కావలసి వచ్చునేమో అనగా చెప్పుచున్నారు.

క్షత్రియ ధర్మానుకూలంగా శిష్టరక్షణకు పూనుకొన్నవారు తన సన్నిధిలో పీడించబడువారిని వనములోనే నివసించు మునులను రక్షించుటకు మాత్రమే రాక్షసులను భయపెట్టి మునిజనరక్షణ చేయాలి కాని హింసించి కాదు. వారిని రక్షించుటకు రాక్షసులను భయపెట్టుటకైనా ధనుర్ధారణ గావించాలి కదా అనగా అదికూడా ఇపుడు కాదు. నీవు రాజ్యం పాలించు సమయంలో మాత్రమే. క్షాత్రము, తపస్సు, శాస్త్రము, వనవాసము పరస్పర విరుద్ధాలు. శస్త్రం రాజ్యపాలకులగు క్షత్రియులు ధరించునది. రాజ్యం విడిచి ఇపుడు మనం ఆచరించేది వనవాసం. క్షత్రియకృత్యం హింస. తపస్వికృత్యం అహింస. ఈ రెండు పరస్పరవిరుద్ధాలు. కావున ఇపుడు మనమున్న దేశధర్మం తపోవనధర్మాలను మన్నించండి అనగా శస్త్రమును విడిచి వనవాసమును తపస్సును ఆచరించుడు అని తాత్పర్యము. వనవాసము చేస్తూ ధనుర్ధారణ చేస్తే వర్ణధర్మాలు లోపిస్తాయి. వనంలో నుండి తపము చేస్తే నాఅత్తమామలకు తరగని ప్రీతి కలుగుతుంది కావున క్షత్రధర్మాన్ని విడిచి మునివృత్తినే ఆశ్రయిస్తే నీకు పరిశు ద్ధమైన బుద్ధి కలుగుతుంది. వనంలో వనవాసోచిత ధర్మం ఆచరిస్తే మామగారికి స్వర్గం లభించుట వల్ల ప్రీతి, కుమారునికి యుద్ధాదిక్లేశరాహిత్యం వల్ల అత్తవారికి  సంతోషం కలుగుతుంది అని తాత్పర్యం. రాజ్యమును విడిచి పూర్తిగా వనవాస ధర్మమును ఆశ్రయిస్తే కైకకు అతులప్రీతి కలుగుతుంది. కేవల ధర్మాన్ని ఆచరించడం సర్వశ్రేయోమూలం. ధర్మమువల్ల అర్థం, సుఖం, ధర్మం వలననే అన్నీ లభిస్తాయి. మోక్షం కూడా జ్ఞానం ద్వారా లభిస్తుంది. ఇష్టమైన కార్యమును ఆచరించుట వల్ల  సుఖం లభించదు. ధర్మము వల్లనే సుఖం లభిస్తుంది. అట్టి ధర్మమును సంపాదించే ఉపాయము చాంద్రాయణాది వ్రతములతో శరీరమును కృశింపచేసి నిపుణులు పొందుతున్నారు. అయిననూ నీకు మూడులోకాలలో ఉన్న పురుషార్థసాధనకలాపమంతా తెలుసు. నేను స్త్రీచాపల్యముతో  దీనిని చెప్పాను. ఆలోచించి ఆచరించండి ఆలోచించడానికి ఆలసించకండి అని సీత పలికింది.

ఇలా రాముడు సత్యప్రతిజ్ఞుడు. వైరం లేనిదే రాక్షసవధ చేయడు, వైరము నా ఎడబాటుతోనే జరుగుతుంది. నా ఎడబాటును శ్రీరాముడు సహించజాలడు. ఇది పెద్ద చిక్కు కలుగుతున్నది అని కలత చెందిన సీతాదేవి పతిప్రేమతో అంధురాలై రాక్షసవధను నివారించడానికి ప్రారంభించింది. ఇక శ్రీరామచంద్రుడు సీతావిరహాన్ని సహించైనను  ఆ మూలముగా కలిగిన వైరంతో రాక్షసులను వధించి ప్రతిజ్ఞను నెరవేర్చాలి అని పదియవ సర్గలో సమాధానం చెబుతున్నాడు.

భర్తమీద గలప్రేమ పారవశ్యంతో సీత చెప్పింది కాని శ్రీరామచంద్రుడు ధర్మంలో నిలిచేవాడు కావున సీతావిరహబాధను అంగీకరించియైననూ  ప్రతిజ్ఞ నెరవేర్చుకొనునని 'ధర్మే స్థితః' అను పదం వల్ల తెలుస్తున్నది. దండకారణ్యంలో నివసించే మునులు అర్థించినది ఖరవధయైననూ, రాముడు కూడా ఖరవధనే ప్రతిజ్ఞ చేసియున్ననూ ఖరవధయే రావణవధకు మూలము. ఖరవధ ద్వారా రావణవధను కూడా మునులు అర్థించినట్లే భావించాలి. అందుకే సీతావాక్యం సముపపన్నమే. అనురాగం కల నీవు జనకవంశమనే మహాకులంలో జన్మించిన నీవు హితమును పలికావు. ధర్మం చక్కగా తెలిసినదానవు గాన ఇట్లు పలికావు. నేను కూడా నీవు చెప్పినరీతిలో ఆచరించవచ్చు. ఆచరిస్తాను కూడా. అయితే నీవే ఆర్తశబ్దము రాకూడదనియే క్షత్రియులు ధనువును ధరిస్తారని చెప్పావు. ఇపుడు ఇచట మునులు ఆర్తులు. కావున మునుల విరోధులను వధించాలి కదా? ఒకవేళ నీవు విరోధులను

తొలగించి ఆర్తులను రక్షించాలి కాని అపరాధం చేయనివారిని వధించరాదు కదా అనెదవో, మునిజనులు నన్ను శరణువేడి యున్నారు. కావున నాకు ప్రాణభూతులు. అట్టివారియెడ చేసిన అపరాధం నాకు చేసిన అపరాధమే కావున వధించాలి. ఇట్లు చెప్పుట వల్ల అనగా మునులు, ఆర్తులు, సంశితవ్రతులు, ధర్మనిరతులు, మూలఫలాశనులు క్రూరకర్ములైన రాక్షసులవలన శాంతిని పొందజాలకున్నారు. ఆయాకాలములలో ఆచరించవలసిన అన్ని నియమములనాచరిస్తున్న మునులను రాక్షసులు భక్షిస్తున్నారు. మమ్ములను కాపాడుమని నన్ను యాచిస్తున్నారు ఈ మాటలవల్ల రాముని శరణాగతపక్షపాతం స్ఫుటమవుతున్నది.

అపుడు నేను అపరాధమును క్షమించండి. నేను స్వయంగా వచ్చి మీ ఇబ్బందులను తెలియవలసి యుండగా మీ బాధలను చెప్పుకొనుటకు మీరే స్వయంగా వచ్చుట నాకు సిగ్గుగా యున్నది. ఇచట సిగ్గనగా స్తోత్రాదులతో మనస్సును చిన్నబుచ్చుటే కదా! 'వీతరాగస్య స్తోత్రాదినా చేతస్సంకోచనం వ్రీడా' అని లక్షణం చెప్పియున్నారు.

ఇచట రాక్షసులు మునులను పీడించుటే కాక యజ్ఞాలకు విఘ్నం కలిగిస్తున్నారు కదా. నేను యజ్ఞభుక్కును కదా! అనగా యజ్ఞమనగా నా భోజనమే కదా. యజ్ఞమును భంగం చేయుట యనగా నా భోజనానికి భంగం చేయుటయే కదా. ఇంతకన్నా వేరే అపరాధము కావలెనా? అగ్నిహోత్రకాలములలో దర్శపౌర్ణమాసాది యజ్ఞకాలములందు మామీదికి వస్తున్నారు. రక్షణను అన్వేషించుచున్న మాకు నీవే ఉత్తమగతివి. మా తపఃప్రభావంతో మేమే రాక్షసులను వధించగలం. కాని చిరకాలార్జితమైన తపమును వ్యయం చేయుట మాకు ఇష్టంలేదు. తపములు సహజంగా బహువిఘ్నకరములు. దుశ్చరములు కూడా. అట్టి తపమును వ్యయపరచజాలకనే రాక్షసులు భక్షిస్తున్ననూ శపించుట లేదు. మీరే మాకు పరమరక్షకులు అని ఇంత దీనముగా అనన్య గతికులమని అర్థించినందుననే సమగ్రరాక్షసవధను సంకల్పించాను. నన్నాశ్రయించిన వారి విరోధులు నా విరోధులేకదా! నా భోజనానికి భంగం కలిగించువారు కూడా. మునుల ముందు ప్రతిజ్ఞ చేసి దానిని మరియొక విధంగా మార్చుకొనజాలను. నాకు అత్యంతప్రియమైనది సత్యం. అట్లైనచో మన ఎడబాటు తప్పదు మరి, అనగా రాముడు చెబుతున్నాడు 'ఆత్మానం సర్వదా రక్షేద్దారైరపి ధనైరపి' అని భార్యాపుత్రాదులను ధనధాన్యములను విడిచియైనను తనను తాను తప్పక కాపాడుకొనవలెను అని ధర్మశాస్త్రం విధించిన నాజీవితమును కూడా విడుస్తాను. 'భ్రాతా స్వా మూర్తిరాత్మనః' అని చెప్పబడిన నాకు మారురూపుగా చెప్పుకొంటున్న తమ్ముని కూడా విడుస్తాను. 'అర్థో వా ఏష ఆత్మనః యత్పత్నీ' అని తనలో సగంగా చెప్పబడిన భార్యను కూడా విడుస్తాను. కాని ఏఒక్కనికి చేసిన ప్రతిజ్ఞను మాత్రం విడువజాలను. ఇక విశేషించి బ్రాహ్మణులకు, బ్రహ్మజ్ఞానులకు చేసిన ప్రతిజ్ఞను అసలు విడువజాలను, సీతలేనిది ఒక్కక్షణమైననూ బ్రతుకజాలను అని చెప్పిన సీతనైననూ, తనప్రాణములకంటే అధికప్రీతిపాత్రురాలైన సీతను కాని ఎడబాటును ఏ మాత్రము సహించజాలని లక్ష్మణుని కూడా విడిచెదనని చెప్పడంతో ఎట్టి పరిస్థితులలోనూ ప్రతిజ్ఞను విడువజాలను అని రాముడు స్పష్టీకరించాడు. పైన చెప్పిన రీత్యా రాక్షసులు నాకపరాధమును చేసిన వారుకాన అట్టివారిని వధించడం నా కర్తవ్యం అని అభిప్రాయము. ఇట్లు నాకు హితం పలికిన నీహృదయం కూడా నాకు తెలియును. నాయందు అత్యన్త స్నేహమున్నందువల్లనే ఇట్లు చెప్పాను. ఇష్టములేనివారిని హితమునకై శాసించజాలరు కదా. అనగా హితమునుపదేశించరని తాత్పర్యము.

ఇచట అనిష్టః అనిగాక 'అతుష్టః' అని కూడా కొన్ని గ్రంథాలలో కలదు. ఆ పక్షమున సంతోషము లేనివాడు అనగా ఇష్టమునకు విరోధి అనగా ఇష్టము లేనివాడు అనునది భావార్థము. నీవు చెప్పిన ఈమాట నీకు నీకులమునకు తగిన మాట. ధర్మమును ప్రధానంగా చేసుకొని బోధించిన మాట. నీ కులానురూపం 'కర్మణైవ హి సంసిద్ధిం ఆస్థితా జనకాదయః' ఇది నీ కులపద్ధతి, ధర్మాచరణ, ధర్మపాలన, అపరాధము చేసిన వారుకూడా నిరపరాధులే అని చెప్పుట నీకు తగిన మాట.

**పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవఙ్గమ ।**
**కార్యం కరుణమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి ॥**

అనునది నీ స్వభావము. అయిననూ నీవు నాకు ప్రాణముల కంటే మిక్కిలి ప్రీతిపాత్రురాలవైనను నాకు సహధర్మచారిణివి కద సహధర్మచారిణివి కమ్ము. అనగా నేను ధర్మముగా సంకల్పించినదానినే నీవు కూడా సంకల్పించాలి. ఇట్లు శ్రీరామచంద్రుడు ప్రియురాలు మైథిలి రాజపుత్రియగు సీతతో పలికి ధనువును ధరించిన రాముడు లక్ష్మణునితో కలిసి సుందరమైన తపోవనాలలో సంచరించాడు. ఇచట ప్రియాం మైథిలీం రాజపుత్రీం అను చెప్పుటతో సీతాదేవి తన ధర్మమును రామధర్మమును కూడా ఆచరించాలి అని సూచించారు.

ఇక పదనొకండవ సర్గలో అన్ని కర్మలు అపాయం కలిగించేవే. శ్రీరామసేవ ఒకటే నిరపాయం అని బోధించుటకు మాండకర్ణి వృత్తాన్తమును తెలుపుతూ సకల ముని జనసంచారం వర్ణించబడుతున్నది.

**అగ్రతః ప్రయయౌ రామః సీతా మధ్యే సుమధ్యమా ।**
**పృష్ఠతస్తు ధనుష్పాణిర్లక్ష్మణోఽనుజగామ హ ॥**

అనునది పదునొకండవ సర్గలో మొదటి శ్లోకం. ఇచట ముందు రాముడు, మధ్యలో సీత, వెనుక ధనుష్పాణియగు లక్ష్మణుడు అనుసరించాడు. ఎంత ఆశ్చర్యం అని సామాన్యార్థం. కాని ఇచట వాల్మీకి 'హ' అని తన ఆశ్చర్యప్రకటనతో ప్రణవ సాక్షాత్కారం ధ్వనిస్తున్నది. రాముడు పరమాత్మ, లక్ష్మణుడు జీవాత్మ, లక్ష్మి ఆ ఇద్దరిని ఒకచోట కూర్చు ఘటకురాలగు లక్ష్మి. పరమాత్మ అకారార్థం, జీవాత్మ మకారార్థం. ఘటకత్వాన్నీ అనన్యార్హత్వాన్నీ బోధించే లక్ష్మీదేవి ఉకారార్థం. ఇట్లు అ+ ఉ+మ్ అనునవి రామసీతాలక్ష్మణులని వారి కలయికయే ఓంకారమని ఇట్లా ఈ శ్లోకం ప్రణవాన్ని బోధిస్తున్నదని గోవిన్దరాజీయవ్యాఖ్య. ఇలా రామలక్ష్మణులు సీతాదేవితో కలిసి వివిధశైలాలను, వనాలను, నదులను, సారసములను, చక్రవాకాలను ఇత్యాది చరాచర జాతములను వర్ణించారు. గాన చరాచరములు నారపదార్థములు వాటితో నున్న రాముడు నారాయణుడు. ఇట్లు వారు చూచిన దానిని వర్ణించిన ఘట్టం నారాయణ పదార్థాన్ని వివరించినది. ఇక తరువాత చెప్పిన మాండకర్ణివృత్తాంతం నమః పదార్థాన్ని బోధిస్తున్నది. మాండకర్ణి మహర్షి దివ్యవత్సరాలు ఘోరతపము నాచరిస్తే దేవతలు అప్సరసలను పంపి తపోవిఘ్నం కావించారు. దేవతలు పంపిన అప్సరసలతో ఈనాటికి ఆ ఋషి సరోవరంలోని అంతర్భాగంలో విహరించసాగాడు. ఈ వృత్తాన్తముతో తనకు ఫలం కావలెనని చేయు కర్మలన్నీ సాన్తములే. భంగమనునవే. ఇది నాదికాదు, నాకు కాదు అనినవే అక్షయఫలములు అని బోధించుట వల్ల నమఃపదార్థమును బోధింపబడింది. ఇట్లు పదునొకండవ సర్గను సూక్ష్మంగా

పరిశీలిస్తే 'ఓం నమో నారాయణాయ' అను తిరుమంత్రార్థాన్ని బోధించిందని పెద్దల నిర్వాహం. గోవిన్దరాజీయ వ్యాఖ్యానసారం. దీనినే గోవిన్దరాజీయంలో ఇట్లు వ్యాఖ్యానించియున్నారు.

'అగ్రతః ప్రయయౌ రామః' అనునది అవర్ణమును సూచించింది. రామ అనునది సత్తాసంపాదన రక్షణాదులతో రమింపచేసేది. కారణత్వమున రక్షకత్వమున రమాసమ్బన్ధం కలదిగాన శ్రీశత్వం కూడా చెప్పబడుతున్నది. ఇక సుమధ్యమా అనుదానిలో ప్రణవములోని రెండవ వర్ణమైన ఉకారము చెప్పబడుచున్నది. ఉకారము రెండువర్ణముల మధ్యలో నుండుట వలన 'సీతా మధ్యే' అనుదానివలె సీత ఉకారార్థంగా బోధించబడుతున్నది. మధ్యలో అని చెప్పుట వల్ల లక్ష్మి పురుషకారభూతురాలని సూచించబడుతున్నది. ఇక లక్ష్మణ శబ్దమువలన మన జ్ఞానే అను ధాతువువలన బోధించబడిన మకారార్థమగు జీవుడు అసాధారణధర్మము జ్ఞానము అని, 'ధనుష్పాణిః' అనుదాని వల్ల నిరంతర కైంకర్యపరాయణత్వమే జీవలక్షణమని 'అనుజగామ' అని చెప్పుట వలన వెంట అనుసరించి వెళ్ళుట వలన తాను అనిగాని తనది అనికాని అనబడు అహంకారరాహిత్యము. ఇదంతా పృష్ఠతః అనుట వల్ల చివర మకారం కూడా సూచించబడింది. ఇట్లు సత్తాసంపాదనరక్షణాదులతో రమింపచేయువాడు అకారార్థమైన పరమాత్మ(రాముడు) అని, ఇకాధికారార్థమగు లక్ష్మి (సీత) కారణత్వమున రక్షకత్వమున మధ్యవర్తిగా నుండి పురుషకారభూతురాలని, ఇక చివరివర్ణమైన మకారార్థమైన జీవుడు జ్ఞానవత్వం, నిరంతరకైంకర్యవత్త్వం, అసాధారణ ధర్మములు అనుసరణముతో అహంకారమమకారవృత్తిస్వరూపమని మొదటిశ్లోకము చాలా స్పష్టముగా ప్రణవార్థమును బోధించింది గోవిన్దరాజీయ నిర్వాహము.

తరువాత సీతారామలక్ష్మణులు చూచినది నారాయణపదార్థము, మాండకర్ణివృత్తాన్తము నమఃపదార్థము వనాదులు విడిగా రామలక్ష్మణుల కంటే నిరూపించబడినందున ఆయపదార్థము, మాండకర్ణివృత్తాన్తము నమః పదార్థము వివరించింది. ఇట్లు ఏకాదశసర్గ అష్టాక్షరీమంత్రమని ఈ సర్గను పారాయణము ప్రతి నిత్యం చేసేవారికి అష్టాక్షరీ మన్త్రజపం చేసిన ఫలితము లభించునని సంప్రదాయజ్ఞుల సిద్ధాన్తము.

అచట వారు చూచినవి అన్నీ ఇంచుమించు జలపక్షులు, గజాలు, పద్మాలు, పుష్కరాలు, రాజహంసలు, కలహంసలు ఇట్లు అన్నీ జలనివాసములనే వర్ణించుట వల్ల నారాయణ (నార– జల, అయన–నివాస) శబ్దార్థమును వాల్మీకి వివరించాడని తాత్పర్యము.

ఇట్లు ఆ సరస్సులో వినవచ్చెడి గీత వాదిత్ర నిర్ఘోషం విని వాయించువాడు కానరానందున కారణమును తన వెంట వచ్చిన ఒక మునిని అడిగెనని తాత్పర్యం. అతను చెప్పిన సమాధానమే మాండకర్ణిగాథ. ఆ సరస్సు పేరు పంచాప్సరము. అయిదుగురు అప్సరసలు క్రీడించు సాధనముగాన ఇది పంచాప్సరము. దీనిని మాండకర్ణి మహర్షి నిర్మించాడు. మాండకర్ణి మహర్షి పదివేల సంత్సరములు వాయుభక్షుడు, జలాశయుడై తపం చేయగా అగ్నిని ముందుంచుకొన్న దేవతలందరూ కలతచెంది, అందరూ కలసి ఆలోచించి మనలో ఒకరిస్థానము నాశించున్నాడని తలంచి వారు అయిదుగురు అప్సరసలను అతని వద్దకు పంపారు. ముని జీవాత్మపరమాత్మవివేకం కలవాడైననూ కామపరవశుడై తపఃప్రభావంతో యౌవనం పొంది వారితో క్రీడిస్తున్నాడు. అట్లు క్రీడించే అప్సరసల

భూషణముల ధ్వని అది విని వివరించారు. ఇట్లు మాటలాడుతూ శ్రీరామచంద్రుడు బ్రహ్మతేజస్సుతో నిండియున్న మహర్షుల ఆశ్రమమండలాన్ని దర్శించాడు. ఆయాశ్రమవాసులందరూ తమతమ యాశ్రమములలో అర్ఘ్యపాద్యాదులతో శ్రీరాముని పూజించారు. అట్లు శ్రీరామచంద్రుడు ఆయా ఋషులతో పూజలనందుకొంటూ ఆయా ఆశ్రమములలో నుంటూ వెళ్ళిన ఆశ్రమములకే మళ్ళీ వెళ్ళాడు. ఆయా ఆశ్రమముల ప్రాంతములలో నుండు రాక్షసుల ఉపద్రవాన్ని నివారించడానికి మరల మరల వస్తూ ఉండినాడు. ఈ విషయం శ్రీరాముని మహాస్త్రవిత్ అని స్తుతించుటవల్ల సూచించబడుతున్నది. ముందు రావణాసురునితో మారీచుడు రాముడు మూడు శరములను విడిచాడు. రాముని పరాక్రమం తెలిసిన నేను భయంతో ముందే అటనుండి తొలిగాను, ఆ ఇద్దరు రాక్షసులు వధించబడ్డారు అని చెప్పును. ఈ రాక్షససంహారానికే రాముడిచటికి వచ్చుటకు సుతీక్ష్ణుడంగీకరించాడు. ఋషులు కూడా ఇందుకే ఆహ్వానించారు.

ఇట్లు శ్రీరామచంద్రుడు ఒక ఆశ్రమములో 13మాసములు, ఒకచోట ఒకసంవత్సరము, ఒక చోట నాలుగు మాసములు ఒకచో అయిదు ఒకచో ఆరు, ఏడు, ఎనిమిది, కొన్నిచోట్ల ఒకనెల కొన్నిచోట్లరెండు, కొన్నిచోట్ల ఇరువది రోజులు ఇట్లు ఆయా ఆశ్రమములలో నివసించుచున్న రామునకు ఆయాశ్రమమండలంలో పదిసంవత్సరాలు గడిచాయి. ఇట్లు అన్ని ఆశ్రమాలలో సంచరించిన రాముడు మరల సుతీక్ష్ణాశ్రమమునకే చేరాడు. అచట కూడా కొంతకాలము నివసించాడు. అపుడు శ్రీరామచంద్రుడు సుతీక్ష్ణమహర్షితో “మహర్షీ ఈయరణ్యములోనే అగస్త్యమహర్షి కూడా నివసించునని అందరూ చెప్పుకొంటుండగా విన్నాను. ఇది చాలా పెద్ద అరణ్యము కాన ఎచట ఉంటాడో తెలియజాలకున్నాను. తామనుగ్రహించి తెలిపితే సీతాలక్ష్మణులతో అచటికి వెళ్ళి అభివాదనం గావించాలని కోరిక చాలా బలీయంగా నున్న”దని తెలిపాడు.

అంతట సుతీక్ష్ణమహర్షి అగస్త్యాశ్రమమార్గం తెలిపాడు. ఇచటినుండి నాలుగు యోజనాల దూరంలో అగస్త్యభ్రాత ఆశ్రమమున్నది. అచట ఆరాత్రి గడిపి వనషండదక్షిణదిశకు ఒకయోజనం తరువాత అగస్త్యమహర్షి ఆశ్రమం చేరు అని ఆజ్ఞాపించగా రాముడు బయలుదేరాడు. అగస్త్యభ్రాత ఆశ్రమానికి పోయి అచట నుండి అగస్త్యాశ్రమానికి బయలుదేరి దారిలో అగస్త్యప్రభావం తెలిపే చరిత్రను చెప్పుకొన్నారు. ఇచట అగస్త్య శబ్దమునకు అగం స్తమ్నాయతి అను వ్యుత్పత్తితో పర్వతమును స్తంభింపచేయువాడు అని అర్థం బోధించుటకు విన్ధ్యపర్వతవృత్తాంతం తెలిపాడు. ఇట్లే అగస్త్యమహర్షి ఈదిక్కుకు రానంతవరకూ రాక్షసులు యథేచ్ఛగా మునిజనహింస చేసేవారు. అగస్త్యునిరాకతో రాక్షసుల ఉపద్రవం తగ్గింది. అనగా అశుచిగా ఉన్నపుడే ముని మాంసభక్షణ చేస్తున్నారు. నియమనిష్ఠాగరిష్ఠుల విషయానికి రాక్షసులు రాజాలకున్నారని అభిప్రాయము. అట్లే రాక్షసులు కూడా వైరముతో ప్రవర్తించుటకు అశక్తులయ్యారు. ప్రశాన్తచిత్తులవలె మెలుగుతున్నారు. కావుననే ఈ దక్షిణదిక్కుకు అగస్త్యదిక్కని ప్రసిద్ధి కలిగింది.

అగస్త్యశబ్దానికి చెప్పిన వ్యుత్పత్తిని వ్యాఖ్యానించటానికి విన్ధ్యపర్వతవృత్తాంతం వివరించియున్నారు. అగస్త్యమహర్షి నిత్యం ఉపాసించుచున్నందున బ్రహ్మాది దేవతలందరు ఇచట సన్నిహితులుగా ఉన్నారు. సీతతో నేనిచటికి వచ్చితినని మహర్షికి తెలుపుమని లక్ష్మణునితో శ్రీరాముడు చెప్పాడు. సీతతో వచ్చినట్లు తెలుపుటలో రావణవధకు సిద్ధమైతిమని

సూచించాడని తాత్పర్యము. అగస్త్యమహర్షి ఆదేశించిన రీతిలో మిగిలిన కాలము వనవాసం గడిపెదము అని తాత్పర్యము.

ఇక12వ సర్గలో శ్రీరామచంద్రుని తమ్ముడగు లక్ష్మణుడు అగస్త్యాశ్రమం ప్రవేశించి అగస్త్యశిష్యుని చేరి సీతారాములు అగస్త్యదర్శనానికి వచ్చిన విషయం నివేదించాడు, అచట నేను రాముని సోదరుడను, హితుడను, అనుకూలుడను, భక్తుడను అని చెప్పాడు. హితుడనగా శుభోదర్కమును చేయువాడు. అనుకూలుడనగా అతని ఇష్టమును ఆచరించేవాడు. భక్తుడనగా పూజ్యవిషయకానురాగం కలవాడు. పూజ్యునియందు ప్రీతి కలవాడు. తాను రామునితో సమానుడనుభావనను తొలగించుటకే రామునికి అగ్రజత్వాది విశేషణములను తెలుపుట. ఇచట 'తే వయం వనమత్యుగ్రం' అను శ్లోకమున 'యం' అనునది గాయత్రీ మన్త్రములోని 8వ అక్షరము. అనగా ఇంత వరకు గాయత్రీమన్త్రములోని 7అక్షరములను చెప్పారు. ఏడువేల శ్లోకములు గడిచినవి.

అంతట అగస్త్యమహర్షి మాకులదైవతము సీతాలక్ష్మణులతో కూడియున్న శ్రీరామచంద్రుడు ఇక్కడికి వచ్చాడనుట విని శ్రవణానందమును అనుభవించి దైవవశమున చాలా కాలమునకు నన్ను చూడడానికి వచ్చాడు. ఇతని రాకను నేను కూడా మనసా కాంక్షిస్తున్నాను. ఇది కథాపరమగు అర్థము. ఇక వాస్తవార్థము మాత్రము 'మయా అస్య ఆగమనం కాంక్షితం' అనుదానికి మా అనగా లక్ష్మీదేవి. లక్ష్మీదేవితో అస్య శ్రీమహావిష్ణువు యొక్క ఆగమనం జ్ఞానము నా మనసుతో కోరబడుతున్నది. ఇచట 'అకారార్థో విష్ణుః' అని కదా సిద్ధాన్తము. గత్యర్థములన్నీ జ్ఞానార్థాలే గాన ఆగమనమంటే జ్ఞానమని అర్థం.

'దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః' అని కదా శ్రుతి చెప్పుతున్నది. సర్వలోకైక శరణ్యుడగు శ్రీరామచంద్రుడు భయంకరరోగం గలవానికి వైద్యునివలె ఎంతో కాలమునుండి ఎదురుచూస్తున్న నాకు ఈరోజు దర్శనమునకై విచ్చేసెనని తాత్పర్యం. ఇది నా అదృష్టవిశేషం. ఎంతని వర్ణించెదము అని పలికి సీతారామలక్ష్మణులను ప్రవేశింప చేయుమని అగస్త్యమహర్షి ఆజ్ఞాపించగా శిష్యుడు వచ్చి వినయవచనములతో సత్కరించి మునిగృహం ప్రవేశింపచేశాడు. అగస్త్యాశ్రమమున శ్రీరామచంద్రుడు దేవపూజాగృహాలను దర్శించాడు. ఇచట బ్రహ్మాదిదేవతలను పూర్వసర్గలో కూడా చెప్పియున్నారు. మరల ఇచట చెబుతున్నారు. పూర్వసర్గలో ఫలప్రదులుగా చెప్పియున్నారు. ఇతరదేవతలు అగస్త్యోపాసకులుగా చెప్పబడియున్నారు. ఈ దేవతలు, బ్రహ్మ అగ్ని విష్ణు మహేన్ద్ర వివస్వత్ సోమ భగకుబేరధాతృవిధాతృవాయు అనన్త గాయత్రీ వసు వరుణ కార్తికేయ ధర్ములనబడు సప్తదశ దేవతలు 'యో వై సప్తదశం' అను అనువాకంలో చెప్పబడిన సప్తదశాక్షర దేవతలను యాయజూకముని పూజకొరకు ప్రతిష్ఠించాడు. అని గ్రహించాలి. ఇచట చెప్పబడిన 17మంది దేవతలలో రుద్రుడు చెప్పబడనందువలన రుద్రుడు అపూజ్యుడని సూచించబడింది. మరిపుడు చాలామంది పూజిస్తున్నారు కదా అంటే తామసశాస్త్రానుసారంగా పూజిస్తున్నారు. రామాయణం సాత్త్వికశాస్త్రం కాన ఇచట చెప్పబడలేదని తెలియవలెను.

కొన్ని పాఠములలో విష్ణోస్స్థానం మహేన్ద్రస్య అనుటకు బదులుగా 'మహేశస్య' అని యున్నది గాన రుద్రస్థానము చెప్పబడలేదనుట సరిగాదనరాదు 'అగస్త్యం నియతాహారం సతతం పర్యుపాసత' అని చెప్పుట వల్ల ఉపాస్య ఉపాసకుల నిర్దేశమున్నదని ఏ విరోధములేదు. ఇక ఉపాసన అనగా సమీపమున నుండుట ఉప-అసనము

మాత్రమే ఆరాధన కాదు. 'ధర్మమారాధయిష్ణవః' అనుచోట ఆరాధన యనగా పరిపాలనయే కదా! ఇచట కూడా అట్లే అన్వయం చెప్పాలి.

అగస్త్యమహర్షిని చూచిన శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో అగస్త్య భగవానుడితనే అని ఔదార్యంతో తెలియుచున్నాను. ఇతను తపోనిధానము. ఇచట ఔదార్యమనగా తేజోవిశేషం ఔన్నత్యం అని భావం. గాంభీర్యమని మహేశ్వర తీర్థవ్యాఖ్యానము. అంతట తనకు అభివాదం చేసిన శ్రీరామలక్ష్మణులను సీతాదేవిని అతిథులనుగా స్వీకరించి అర్ఘ్యపాద్య ఆచమనీయ పుష్పాదులతో పూజించి వానప్రస్థధర్మంతో సిద్ధమైన కందమూలాదిక భోజన మునిచ్చాడు. అతిథిపూజకు ముందుగా వైశ్వదేవం ఆచరించాడు.

ఇచట ఏ కోరికలులేని ఋషులు మునులు క్షత్రియుని పూజించవలసిన పనిలేదు కదా! నన్ను తామెందుకు పూజిస్తున్నారు. అను శంకకు ఇది వానప్రస్థధర్మంగా నేనిట్లు చేస్తున్నాను. ఇంకొక రీతిగా కాదు అని సమాధానం చెప్తూ రాముని ఉద్దేశ్యముగా చేసుకొని సీతాదేవికి వానప్రస్థధర్మమునుపదేశిస్తున్నాడు. రాముడు ధర్మకోవిదుడుగాన ఇది రామునికి బోధించవలసిన పనిలేదు. ఇట్లు సీతాదేవికి వానప్రస్థధర్మమును బోధించుట ముందు పంచవటిలోని రామాశ్రమానికి రానున్న రావణుని పూజించుటకే అని తెలియవలయును. అతిథులు విచ్చేసినపుడు మొదట వైశ్వదేవాగ్నిని హోమం చేసి, అర్ఘ్యమునిచ్చి అతిథులను పూజించాలి. ఇట్లు హోమం చేసి అతిథిసత్కారం చేయకుంటే కూటసాక్షివలె పరలోకమున తన మాంసమునే తాను భక్షించును. గాన అట్టి ప్రత్యవాయము కలుగకుండుటకు మిమ్ములను పూజిస్తున్నాను అని తాత్పర్యం.

ఇక రాముడు సర్వలోకములకు రాజు. అమితపరాక్రమశాలి. పూజనీయుడు మాన్యుడు కూడా. ఇచట అయోధ్యకు రాజు, కోసల రాజు, భూమండలానికి రాజు అనక 'సర్వలోకస్య' అని చెప్పుటతో మూడులోకాలకు లేదా పదునాలుగు లోకాలకు స్వామి అని 'పతిం విశ్వస్య' అను శ్రుతివాక్యమును వ్యాఖ్యానించారు అని తెలుసుకోవాలి. రాముడుగా నీవు ఒక్క నాకే కాదు సకలలోకానికి ఆరాధ్యుడవు. ఎట్లు ఆరాధించాలి. అనగా స్వస్వకర్మలతో ఆరాధించాలి. 'ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం విశ్వం బిభర్తి భువనస్య నాభిః' అని కదా శ్రుతి వాక్యము. ఇచట 'పూజనీయశ్చ మాన్యశ్చ' అని చెప్పెను. మాన్యః అనగా యోగులచే ముక్తి కొరకు చింతించదగిన వాడవు అని తాత్పర్యం. శ్రీరామచంద్రుడు లౌకికాతిథులకంటే విలక్షణుడు. ఇలా చెప్పి మూలఫలపుష్పాలను సీతాదేవికిచ్చి ఇట్లు పలికాడు.

ఇచట శ్రీరామచంద్రుడు సర్వలోకములకు రాజు అనగా బ్రహ్మాండ నాయకుడైనా లోకులకు నేర్పుటకు ధర్మములను ఆచరిస్తున్నాడు. అట్లే మహారథుడు అనగా మహాపరాక్రమశాలి అని లౌకికార్థము. మహాత్ముడగు గరుడుడు రథముగా కలవాడు, సత్కర్మలచే ఆరాధించదగినవాడు, మోక్షము కొరకు మననము చేయదగినవాడు అని తాత్పర్యం. ఇలా పలికి చక్కగా ఆరాధించిన అగస్త్యమహర్షి మరల శ్రీరామునితో ఇలా పలికాడు.

ఈ చాపము దివ్యం హేమరత్నవిభూషితం, విశ్వకర్మచే సృజించబడిన వైష్ణవధనువు, ఇట్లే అమోఘం సూర్యసంకాశం, బ్రహ్మదత్తమగు శరోత్తమం. అక్షయసాయకములుకల తూణీరాలు, బంగారుకోశముతో నున్న

ఖడ్గమిది. నాకు వీటిని మహేంద్రుడిచ్చాడు. పూర్వం ఈ ధనువుతో శ్రీమహావిష్ణువు మహారాక్షసులను వధించి దేవతలకు ఐశ్వర్యమును ప్రసాదించాడు. కావున అట్టి ధనువును, బాణమును, తూణీరములను, ఖడ్గమును జయం కొరకు ఇంద్రుడు వజ్రాయుధాన్ని గ్రహించునట్లు స్వీకరించు. అని పలికి ఆయుధజాతాన్ని అగస్త్యమహర్షి శ్రీరామచంద్రునకు ఇచ్చి మరల ఇట్లు అన్నాడు.

ఇచట వైష్ణవధనువని చెప్పుటతో పూర్వం నీవు పరశురాముని చేతినుండి తీసుకొని వరుణుని హస్తమున అర్పించినదే. ఆ వరుణుడు ఖరదూషణాదివధ సమీపించినదని మరల అగస్త్యహస్తంలో అర్పించాడు అని తెలుస్తున్నది. వజ్రాయుధాన్ని ఇంద్రునివలె అని చెప్పుటతో నీ ఆయుధాలను నీవే గ్రహించు అని సూచించబడింది. ఇచట వాస్తవంగా అగస్త్యరామసంభాషణ ఇంకా కొనసాగుతున్నది గాన సర్గ ముగియలేదని గోవిన్దరాజు అభిప్రాయం. అయిననూ ఇది 13వ సర్గగా పేర్కొనబడుచున్నది. ఖరదూషణాదులను వధించుటకు అనుజ్ఞ పొందిన శ్రీరామచంద్రుడు పంచవటికి బయలుదేరుట 13వ సర్గలో చెప్పబడుతున్నది. అగస్త్యమహర్షి మరల ఇలా పలికాడు.

శ్రీరామా! నీ విషయమున ప్రీతి చెందాను. నీకు శుభములు కలుగు గాక! రాముని ఆగమనమును తెలిపినందున లక్ష్మణా నీవిషయంలో సంతోషించాను. నన్ను నమస్కరించుటకు సీతతో కలిసి ఇటకు వచ్చారు. నడిచి వచ్చుట వల్ల అలసట మిమ్ము బాధిస్తున్నదా, జనకాత్మజయగు సీత అధిక శ్రమను పొందింది కాన విశ్రాన్తిని కోరుచున్నదా? పరమసుకుమారియగు సీత బహుదోషాలు కల అరణ్యమునకు వచ్చి దుఃఖాలచే ఉద్విగ్నురాలగుట లేదు. భర్తృస్నేహంతో ప్రేరేపించబడింది. ఇతరులకు చేయ శక్యము కాని అరణ్యావాసం చేస్తున్నది. కావున సీత సంతోషించునట్లు నీవు చేయాలి.

సృష్టి మొదలు స్త్రీలు చక్కగా సకల సంపదలతో నున్నవానిని ప్రేమిస్తారు. దుర్దశలో నున్నవారిని విడిచి వేస్తారు. మెరపుతీగలోని చంచలత్వాన్నీ, శస్త్రముల క్రౌర్యాన్నీ అనుసరిస్తారు. ఎంతో కాలం నుండి వచ్చెడి స్నేహాన్ని త్రుటిలో విచ్ఛిన్నం చేస్తారు. వాయుగరుడుల వేగాన్ని అనుసరిస్తారు. అనగా ఆలోచించకుండా సాహస కార్యాల నాచరిస్తారు. చంచల స్వభావులు కదా? ఇలా లౌకిక స్త్రీల దుష్టస్వభావమును తెలిపి సీతాదేవి యొక్క సద్వైలక్షణ్యమును చెబుతున్నారు. సీతాదేవి పైన చెప్పిన దోషాలు లేనిది మాత్రమే కాదు. సజ్జనుల చేత ప్రశంసించదగింది కూడా. పతివ్రతలలో అగ్రగణ్యురాలు కూడా. ఇచట ఇట్లు సీతాదేవిని ప్రశంసించడం లంకలోని దేవతాస్త్రీల బంధవిమోచన ప్రోత్సాహానికని తెలియాలి. ఇట్టి సీతాదేవితో లక్ష్మణునితో నీవు నివసించు ప్రదేశం చక్కగా శోభిస్తుంది. ఇప్పుడు నీ వున్న ఈయాశ్రమమే చక్కగా శోభిస్తున్నదనిన ఉండబోవు దానిగురించి ఇంకనేమి చెప్పాలి అని భావము. నీవున్నంత కాలం ఈ భూలోకమే చక్కని శోభలతో అలరారుతుంది. అనగా పదివేల వత్సరాలు పదినూర్ల వత్సరాలు అనగా పదునొకండు వేలసంత్సరాలు, శ్రీరామచంద్రుడు భూలోకంలో నివసిస్తాడు గాన అంతకాలం భూలోకం శోభాయుక్తమగునని భావం.

ఇలా పలికిన అగస్త్యమహర్షి వాక్యాలు విన్న శ్రీరామచంద్రుడు చేతులు జోడించి వినయంతో ప్రజ్వలించే అగ్నిహోత్రుని వలెనున్న మునితో ఇట్లు చెప్పాడు. వరదులైన తాము భార్యతో సోదరునితో కూడియున్న

నావిషయంలో సంతోషించితిరి గాన నేను ధన్యుడను. అనుగ్రహించబడినవాడను. కాన నేను నివసించు ప్రదేశం సూచించండి అని. ఆ మాటలకు అగస్త్యమహర్షి ముందు జరుగబోయే కార్యానికి అనుకూలంగా నుండుదానిని ఆలోచించి బుద్ధిమంతుడు కాన తాను నిశ్చయించిన కార్యానికి అనువైన ప్రదేశమును తలచి సునిశ్చిత వాక్యమును పలికాడు. ఇచట అగస్త్య మహర్షి ధ్యానంతో రాబోవు సీతావియోగం తెలిసినా అందరు కోరెడి రావణవధ మరల సీతావాప్తిరూపకార్యసిద్ధిని కూడా చూచుట వల్ల ధీరుడై పలికాడని అభిప్రాయం.

అయిదు మఱ్ఱిచెట్లు ఒక చోటనుండు ప్రదేశాన్ని పంచవటి యంటారు. ఆప్రదేశము ఇచటికి రెండు యోజనముల దూరంలో నున్నది. అది బహుమూలఫలోదకము. బహుమృగములు కలది. అక్కడికి వెళ్ళి లక్ష్మణునితో కలిసి ఆశ్రమం నిర్మించుకొని తండ్రి చెప్పిన మాటను పరిపాలిస్తూ ఆనందిస్తావు. దశరథ మహారాజు ఏర్పరచిన కాలపరిమితిని దాటి ప్రతిజ్ఞను పూర్తి చేసుకొని మరల రాజ్యంలో సుఖముగా ఉంటావు. నీ తండ్రి దశరథమహారాజు పెద్దకుమారుడవైన నీచే యయాతివలె తరింప చేయబడినవాడు గాన ధన్యుడు. దశరథునిపైగల స్నేహంతో తపః ప్రభావంతో నీ వృత్తాన్తమంతా నాకు తెలిసింది. అంతే కాదు. నీ మాటలతో నీ హృదయమున గల ఖరదూషణాది వధసంకల్పమును కూడా తెలుసుకొన్నాను. రాక్షసులను వధిస్తానని నీవు చేసిన ప్రతిజ్ఞను తెలిసికొన్నాను. కావుననే మొదట ఈ ఆశ్రమములో నాతో ఉండమని అనుమతించి మరల పంచవటికి వెళ్ళమని చెప్తున్నాను. నీవచట ఉండి మునిజనులను రక్షించగలవు. మొదట ఇటనుండి మధూకవనమునకు వెళ్ళు. ఆ వనానికి ఉత్తరంగా మఱ్ఱి చెట్టున్న వైపు వెళ్ళాలి. మఱ్ఱిచెట్లనుండి కొంచెము, ఉన్నతప్రాన్తమున అధిరోహించి పర్వతానికి సమీపములోనే పంచవటి అనే ప్రాంతమున్నది. ఆ పంచవటి నిత్యపుష్పిత కాననం కాన సులభంగా గుర్తించవచ్చు అని అభిప్రాయం.

ఇట్లు అగస్త్యమహర్షి ఆజ్ఞను పొంది అతనికి పాదాభివన్దనం గావించి సీతతో కలిసి వారు పంచవటికి బయలుదేరారు.

ఇక పదునాలుగవ సర్గలో గృధ్రరాజగు జటాయువుతో సమాగమం వర్ణిస్తారు. ఇట్లు పంచవటికి బయలుదేరిన రామచంద్రుడు మార్గమధ్యలోనున్న న్యగ్రోధవృక్షంలో ఉన్న భీమపరాక్రముడగు గృధ్రమును చూచాడు. అంతటి మహాకాయమును చూచి రాక్షసునిగా భావించి నీవెవరు అని అడిగాడు. ఆ పక్షి తనపేరును తన పుట్టుకను కూడా చెప్పబోతూ మొదటి సకల ప్రాణి సృష్టి ప్రకారం వివరించింది. అరిష్టనేమియన్నది కాశ్యపవిశేషణము. దక్షప్రజాపతి పుత్రికలలో 8 మందిని కాశ్యపుడు భార్యలుగా స్వీకరించాడు. ఇతర పురాణేతిహాసములలో ధర్మునికి పదిమందిని, కాశ్యపునికి 13 మందిని ఇచ్చాడని చెప్పబడింది. ఇచట 8 అని ఎలా కుదురుతుంది అనగా ఒకమారు 8మందిని తరువాత రెండవ సారి అయిదుగురిని అని చెప్పవచ్చు. లేదా ఇతర మన్వన్తరమున 13మందిని, వైవస్వత మన్వన్తరమున 8 మందిని అని కాని చెప్పుకొనవచ్చు, ఆ 8 మందిలో నలుగురు భర్తృ వాక్యంపై ఆదరముతో త్రైలోక్యపాలనాదక్షులగు పుత్రులను సృజించుటలో ప్రీతికలవారయ్యారు. మిగిలిన నలుగురు కాలేదని అభిప్రాయము. ఇలా భర్తృ వచనమును ఆదరించుటవల్ల ఆదరించకపోవుటవలన కలుగు ఫలమును వివరిస్తున్నారు.

అదితియందు ఆదిత్యులు 12 మంది, 8 మంది వసువులు, 11 మంది రుద్రులు, ఇద్దరు అశ్వినీ దేవతలు ఇలా 33 మంది దేవతలు కలిగారు.

నల్లని కేశాలతో స్త్రీలకేశాలకు సాయం చేయుటకుపయోగించు మృగాలు సృమరములు. తెల్లని కేశములతో దేవతలను వీచుటకుపయోగించేవి చమరమృగములు. ఇవి మహిషాకారముతో నుండునవి. బహుఫణములు కలవి నాగములు, ఫణములు లేని సర్పములు పన్నగములు. కాశ్యపపత్నియగు మనువు విషవృక్షనింబాది, ఔషధులను పుణ్యఫలములుగా లేదా సుందరములగు ఫలము కలవాటినిగా ప్రసవించాడు.

ఇట్లు ప్రాసంగిక వృత్తాన్తం తెలిపి తనకులమును తెలుపుతున్నారు. ఇచట కద్రూనామ గ్రహణము తమ ప్రతిపక్ష కులమగుట ఒకకారణము, సకల భూమండలాన్ని ధరించు శేషునికి తల్లిగావున గౌరవముతో కీర్తించుట అని కూడా తెలియవచ్చు. ఇచట చెప్పబడిన శ్యేని మొదట చెప్పబడిన శ్యేని కన్నా వేరని తెలియాలి. లేదా కాశ్యపసుతా అనగా శ్యేనీమాత. కాశ్యపునికి పంచమారుణుడు పిత. ఇచట కాశ్యప ప్రజాపతి కూటస్థుడు అని తెలుపుటకే స్వవంశ ప్రభావం తెలుపబడింది. తిర్యగ్జాతులలో విధినిషేధములుండవు గాన మాతృపుత్రులు ఒకే వంశ్యులు అగుట దోషం కాదు. ఇచట చెప్పబడిన సృష్టిక్రమం వైవస్వతమన్వన్తరానికి సంబంధించినదిగా తెలియాలి. కావున ఇతర పురాణాలతో విరోధమును శంకించరాదు.

ఇట్లు జటాయువు తన వంశ వృత్తాన్తం తెలిపి ఇపుడు ఇచట తానుచేసే పనిని కూడా చెబుతున్నాడు. ఇచట నేను నీ నివాసమునకు సహాయముగా నుంటాను. అది కూడా నీవు కోరిన మాత్రమే, ఈ అరణ్యం పరమదుర్గమం మృగరాక్షససేవితం. నీవు లక్ష్మణునితో కలిసి వేటకు వెళ్ళినపుడు నేను సీతను కాపాడుతుంటాను. ఇలా పలికిన జటాయువాక్యములను మన్నించి రాముడు జటాయువును ప్రీతితో కౌగిలించి నమస్కరించాడు. జటాయువు చెప్పిన తన తండ్రి మిత్రునిగా అతనిని ఆదరించి సీతను జటాయువశములో రక్షణగా నుంచి ఆ పక్షితో లక్ష్మణునితో కలిసి శత్రువులను మిడతలవలె దహింపగోరుతూ పంచవటికి వెళ్ళాడు. ఇచట సీతాం 'పరిదాయ' అనుదానికి అధీనము చేసి యని యర్థము, 'యమాయ త్వా పరిదదామి అసావన్తకాయ త్వా పరిదదామి' ఇత్యాది ప్రయోగాలలో ఈ అర్థమే చెప్పబడిందని తెలియాలి. మిడతల వలె అని చెప్పుట వలన శత్రునిర్మూలనం లీలగా చేయుట సూచించబడింది.

ఇక పదిహేనవ సర్గలో శేషభూతుడు చేయవలసినది శేషికైంకర్యమే అని చెబుతున్నారు. 'రామం దశరథం విద్ధి' అని అరణ్యమునకు బయలు దేరుటకు ముందు రాముని కైంకర్యమును చేయుమని సుమిత్రాదేవి ఆజ్ఞ ఇచ్చినందున రాముని కైంకర్యం చేయుటకు సంసిద్ధత వలన కలిగిన తేజస్సు కలవాడు లక్ష్మణుడు అని అభిప్రాయం. అనగా కైంకర్యం చేయుటకు తగిన ప్రదేశం లభించినందున సంతుష్టుడని తాత్పర్యం.

నీవు అరణ్యమునంతనూ చక్కగా నిశితంగా చూడు. నీవు ఆశ్రమం నిర్మించుటకు యోగ్యమగు ప్రదేశమును తెలియగల నేర్పరివి. మనందరికి సమ్మతమైన ప్రదేశమేది? సీతాదేవి నీవు నేను ఆనందించగల ప్రదేశం. అందరూ ఆనందించుటకు కావలసినది వనరామణ్యకము స్థలరామణ్యకము సన్నికృష్ట జలాశయము, సమిత్పుష్పకుశోదక సాన్నిధ్యము. వనరామణ్యకమనగా చూతపున్నాగ శోభితము, స్థలరామణ్యకమనగా ఎత్తు వంపులు లేకుండగా కోమలసికతామయత. ఇచట వనరామణ్యకము పుష్పముల నభిలషించే సీతకు సంతోషహేతువు, ఇక స్థల

రామణ్యకము సుఖశయనాదులను ఆకాంక్షించు రామునికి సంతోషహేతువు. సమిత్పుష్పకుశాదులు సమీపములో నుండడం లక్ష్మణసంతోషహేతువు. ఇట్లు ముగ్గురికీ సంతోషం సుఖం కలిగించు ప్రదేశమును చూడుమని రాముని మాటలలో తన సౌఖ్యమును కూడా చెప్పుటకు సహించజాలని సౌమిత్రి తమకు సీతకు రమణీయమగు ప్రదేశమును ఆజ్ఞాపించుడు.ఇందులో నా సౌకర్యముతో పనిలేదు అని తెలుపుటకు సీతాదేవి ముందే పలికెను అని తెలుపుటలో పురుషకార సాన్నిధ్యమును తెలిపారు.

నేను పరవానస్మి. అనగా పారతంత్ర్యం కలవాడను. నావాడను కాను నీవాడను నేను. పారతంత్ర్యము వాడను. నాలోనున్న ఈ పారతంత్ర్యం పరమపదమున పరత్వదశలోనే కాదు. అవతారదశలోకూడా అనువర్తిస్తుంది. ఈ పారతంత్ర్యం నీవున్నంతవరకు అనగా సార్వకాలికమని అభిప్రాయము. నాస్వరూపము పారతన్త్ర్యమే. కావున పారతంత్ర్యానుకూలముగా నీవు ఆజ్ఞాపించాలనే కాని నన్ను నిర్ణయించమని సెలవీయరాదు.

నీకు నచ్చిన ప్రదేశమున ఆశ్రమమును నిర్మించమని నన్నాజ్ఞాపింపుము అని పలికెను.

నీకు కూడా సౌకర్యం కలిగించు ప్రదేశంలో పర్ణశాల నిర్మించుమని లక్ష్మణునికి స్వాతంత్ర్యమును ఇచ్చి మాటలాడగానే నాకు స్వాతన్త్ర్యము నిచ్చెను అనగానే అపుడే శ్రీరాముడు నన్ను పరిత్యజించెను. ఇంత కాలము నా అజ్ఞానముతో స్వరూపహానిని చేసుకుంటిని. ఇక ఇప్పటినుండి నాకు స్వరూపమను నొకపదార్థముందునా అనేదే వుండవలయును. అనగా పారతంత్ర్యమే నాలక్షణము అని భావించి అంజలి ఘటించాడు. ఇక ఇపుడు శ్రీరామునికి ఘటించిన అంజలియే నాకు రక్షకం. అంజలి ఒక లక్ష్మణునికే కాదు సర్వాభిమతసాధకం అని తలచి అంజలి ఘటించి పురుషకారభూతురాలైన సీతాసమక్షంలో ఇలా పలకడాన్ని వాల్మీకి ప్రశంసిస్తున్నాడు. అంతేకాదు సీతా సమక్షం అని చెప్పుట వల్ల ద్వయమంత్రములోని ఉత్తరఖండములో చెప్పబడింది లక్ష్మీ విశిష్టుడైన నారాయణునకే కైంకర్యం కాని ఒక్క నారాయణునకు కాదని సూచింపబడిందని భావం. అందుకే నేను పరవానస్మి కాని మమాస్మికాదు, తాతవానస్మికాదు, తవాస్మి కాదు. ఇట్టి పారతంత్ర్యం ఎవ్వరూ అపేక్షించలేదు కావుననే నీవు ఈయనూ లేదు. ఇంతటి ఉత్తమమైన దానిని ఎవ్వరూ ఎందుకపేక్షించలేదు? అనగా లోకం భిన్నరుచి కదా. అందువలననే నేను మాత్రమే అపేక్షించిన దానిని నాకు ఇమ్ము. ఈ పారతంత్ర్యం అనంతకాలికం. లేదా సార్వకాలికం, నేను సర్వదా పరవానస్మి, అనగా సర్వావస్థలలో అనగా పరమపదమున పరత్వావస్థలో, లీలావిభూతిలో, అవతారావస్థలో కూడా పరవానస్మి, 'క్రియతామితి మాం వద' అని వద అని క్రియాప్రయోగము వలన సర్వవిధకైంకర్యాలకు నియోగించు. అనగా ద్వయమంత్రంలోని ఉత్తర ఖండంలో 'శ్రీమతే నారాయణాయ' అనుదానిలో చెప్పబడిన కైంకర్య ప్రార్థన ఇచట సూచింపబడింది.

లక్ష్మణుడు పలికిన మాటలతో ప్రీతి చెందిన రాముడు చక్కగా పర్యాలోచించి స్నేహాతిశయంవల్ల కలిగిన భావోత్కర్షతో లక్ష్మణుని హస్తాలను పట్టుకొని 'అయం దేశస్సమశ్శ్రీమాన్' ఇత్యాదిగా పలికాడు.

అక్కడ సుగంధం కల ఆదిత్యవికసితములగు పద్మములతో శోభించుచున్న సరస్సు కలదు అంటున్నాడు.

**తులసీకాననం యత్ర యత్ర పద్మవనాని చ ।**
**వసన్తి వైష్ణవా యత్ర తత్ర సన్నిహితో హరిః ॥**

అని చెప్పినట్లుగా శ్రీహరి ఎపుడు సన్నిహితముగా నుండుచోట అని తాత్పర్యం. పద్మములు కలది అని కాక 'సురభి గంధిభిః' అని సౌగన్ధ్యయుతమని చెప్పుటలో 'సర్వగంధస్సర్వరసః' అని సర్వగంధునిగా చెప్పబడిన శ్రీహరి సన్నిహితుడని తాత్పర్యం. 'అదూరే దృశ్యతే రమ్యా పద్మినీ పద్మశోభితా' అని చెప్పుటలో 'పద్మయా శోభితా' అను వ్యుత్పత్తితో లక్ష్మీశోభితా అని తాత్పర్యం. హరికి సాన్నిధ్యమున్నందున హరికి నిత్యానపాయినియగు లక్ష్మీదేవి కూడా సన్నిహితురాలు అని తాత్పర్యము. ఇట్లు లక్ష్మీనారాయణులు సన్నిహితులుగాన ఈ ప్రదేశం నివాసయోగ్యమని అభిప్రాయం.

అగస్త్యమహర్షి చెప్పిన విధంగానే ఇచట గోదావరీనది కనపడుతున్నది. ఈ పంచవటికి గోదావరీనది, పర్వతములు ఎక్కువ దూరంలో లేవు. మరీ దగ్గరగా లేవు. ఈ ప్రాన్తమున పర్ణశాలను నిర్మించమని శ్రీరామచంద్రుడు ఆనతిచ్చాడు. లక్ష్మణస్వామి వేణుమయస్తమ్భముల పైన అడ్డముగా వాసములు ఆయా కాష్ఠములనుంచి వాటిపై శమీశాఖలను పరిచి నారతో చక్కగా కట్టి కుశకాశశరాది తృణాలచే చక్కగా కప్పి శోభనంగా పర్ణశాలను నిర్మించాడు. ఆతరువాత లక్ష్మణుడు వాస్తుపూజను పుష్పాలతో, ఫలాలతో చక్కగా చేశాడు. వాస్తుకల్పానుసారంగా పుణ్యాహవాచనం చేశాడు. ఇంత చక్కగా పర్ణశాలను నిర్మించినందుకు శ్రీరామచంద్రుడు సంతోషం ప్రకటించాడు. స్నేహపూర్వకంగా గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు. సమర్థుడా! నీవు చాలా పెద్ద పని చేశావు. కావున నేను ప్రీతి చెందితిని. ఇంత చక్కని ఆశ్రమం నిర్మించిన నీకు గొప్పపారితోషికం ఈయవలసి యున్నది. దీనికి తగిన ఇంకొక పారితోషికం లేదు కావున ఆలింగనాన్నే పారితోషికంగా ఇస్తున్నాను.

లక్ష్మణుడు రాముని భావం అనగా అభిప్రాయం తెలుసుకొని నిర్మించాడు. సీతతో ఏకాన్తంగా గడుపుటకు అనుకూలంగా నిర్మించమని రాముడు లక్ష్మణునితో చెప్పజాలడు. కాని చెప్పకనే రాముని హృదయం తెలిసి అనుగుణంగా నిర్మించాడని అభిప్రాయం. కృతజ్ఞుడు అనగా గృహనిర్మాణాదులను చక్కగా తెలిసినవాడు, ధర్మజ్ఞుడు అనగా సేవాధర్మజ్ఞుడు. ఇంతటి చక్కటి రక్షకుడున్నందున మా నాన్నగారు గతించలేదు, జీవించే ఉన్నారు. అనగా తండ్రి తనకుమారుని ఎంత ప్రేమతో అనురాగంతో అన్ని సౌకర్యాలు కలిగిస్తూ పాలించునో అట్లు నీవు నన్ను జాగ్రత్తగా కాపాడుచున్నావని అభిప్రాయం. పుత్రులు లేని దశరథుడు తాము కలిగిన తరువాత తనమీది ప్రీత్యతిశయంతో తారాబలం చన్ద్రబలం ఇతర శుభవిశేషాలను పరికించి తనకు భవనమునెట్లు నిర్మించెనో ఆ విధానమును తెలిసిన నీవు అట్లే నిర్మించితివి అని కృతజ్ఞశబ్దమునకు తాత్పర్యం.

ఇక ధర్మజ్ఞుడనగా నీవు స్వయంగా రాజపుత్రుడవైనను రాజపుత్రునికి అనుగుణమైన ప్రదేశం ఏర్పరచుకొనక శ్రీరాముడు సంతోషించు విధంగా నే నుండవలయును అను ధర్మం తెలిసినవాడని అభిప్రాయం. ఇంతటి నీవంటి పుత్రునితో అనగా పుం అను నరకమును తొలగించువాడవు నీవే. రామునికి ఇష్టమైనదానిని అర్పించలేకుండడమే నరకమని నా నాన్నగారు దశరథ మహారాజు తలచారు. అతను తలచిన ఆ నరకమును నా ఇష్టమును సంపాదించి

తొలగించిన వాడవుగాన అట్టి పుత్రుడవగు నీతో మా నాన్నగారు నేటికీ జీవించియున్నవారే. నాన్నగారు స్వయంగా తాము జీవించియున్నంత కాలం నా ఇష్టమునే చేస్తూ తాను జీవితం ముగించు సమయంలో నా అభిమతం చేకూర్చుటకు నిన్ను ఏర్పరచారు. కొందరు తామున్నంత వరకు అందరికి మంచినీరు అందించి మరణించే ముందు చలివేంద్రం ఏర్పరచునట్లు నిన్నేర్పాటు చేశారు. కావున మానాన్నగారే నీరూపంతో నా అభిమతాలను పూరిస్తున్నారు. నీవు కూడా 'అహం సర్వం కరిష్యామి' అని చెప్పియున్నావు కూడా. ఇట్లు లక్ష్మణుని అభినందించి ఆ పర్ణశాలలో సుఖంగా సీతతో నివసించాడు.

ఇక 16వ సర్గలో రాబోవు శూర్పణఖా దర్శనాద్యనర్థసూచకంగా రాక్షసాది రాజస తామస ప్రకృతులకు కామోద్దీపకమయిన హేమన్తర్తువును వర్ణిస్తున్నారు. ఇష్టమైన హేమన్తర్తువు సంప్రాప్తించింది. తాపసులకు తపస్సాధనకు ఇష్టమైనది. శ్రీరామునకు ఖరదూషణాది రాక్షసవధరూపవిజయానికి మూలమగు శూర్పణఖ వచ్చుటకు కారణమైనందున ఇష్టమైనది.

ఈ హేమన్తర్తువులో నూతనధాన్యం వస్తుంది. అట్టి నూతనధాన్యం భుజించడానికి ముందు 'ఆగ్రయణమను' యజ్ఞం చేయాలి. ఆపస్తంబుడిలా చెప్పియున్నాడు . 'నానిష్ట్వాగ్రయణేనాహితాగ్నిః నవస్య ధాన్యస్యాశ్నీయా ద్వ్రీహీణాం యవానాం శ్యామాకానామగ్రే పాకస్య యజేత' అని ఆగ్రయణయజ్ఞములతో దేవతలను పితృదేవతలను పూజించకుండా తన ధాన్యమును భుజించరాదు అని అర్థం. ఇట్లు హేమన్త ఋతువులో కొత్తధాన్యం వస్తుంది. దానితో పితృదేవతలను ఆరాధిస్తారు. సామాన్య జనులు బహుళకామోద్రేకము కలవారై ప్రియులను సేవిస్తారు. రాజులు యుద్ధయాత్రకు సన్నద్ధులవుతారు.

హేమంతర్తువులో మంచుచే కప్పబడిన చంద్రుడు నిట్టూర్పుతో మలినమైన అద్దమువలె శోభించుట లేదు అని చెప్పుట వల్ల రావణాసురుడు సర్వస్వమును హరించిన ఇంద్రుని స్థితి సూచించబడింది. ఇట్లు తుషార మలినమైన రాత్రి పూర్ణిమనాడు కూడా ఆతపం చేత రంగుమారిన సీతవలె శోభించుట లేదు. ఇట్లు రాత్రిని సీతతో పోల్చుట వల్ల ముందు ముందు రావణాసురునిచే సీతకు పరితాపం దేవతాస్త్రీల బంధమోచనం చేయునది కావున అతిశయం సూచించబడుతున్నది. హేమన్తఋతువులో ప్రాతఃకాలంలో హిమవిద్ధమై ద్విగుణీకృతశీతలమైనది అని వర్ణించుటచే సహజముగా కరుణాశీలుడగు శ్రీమన్నారాయణుడు దేవతల ప్రార్థనతో వృద్ధిచెందిన దయ గలిగి రామునిగా అవతరించిన స్వామికి వన్యాశ్రమములలో మునుల స్థితిని చూచి రెట్టింపైన దయ కలిగి రాక్షస సంహారసంసిద్ధత సూచించబడింది. ప్రాతః కాలంలో కూపజలం నుండి బయలు వెడలు ధూమాకార బాష్పములను వర్ణించుటచే రామసమాగమం తరువాత జరుగబోయే మున్యాశ్రమాభివృద్ధి సూచించబడుతున్నది. ఇచట బాష్పశబ్దముతో శ్రీరాముని కృప చెప్పబడింది. 'యవగోధూమవంతి చ' యవ గోధుమ శబ్దములు యవగోధుమలు చక్కగా పండుట, తాపసుల తపస్సమృద్ధి సూచిస్తున్నది. 'నదద్భిః! క్రౌంచసారసైః' అని క్రౌంచసారసపక్షులు నదించుచున్నవని చెప్పుటచే ఆశ్రమములలోని వేదఘోష సూచించబడినది. ఇదంతా లక్ష్మణుడు శ్రీరామునితో చెప్పుతున్న మాటలు. ఖర్జూర పుష్పాకారములు కలిగి తండుల పూర్ణములైన వరిచేలు కనకప్రభలు కలవై ధాన్య భారముతో వంగిన తలలు కలవై శోభిస్తున్నవి అని వరిచేలను వర్ణించుట వల్ల వృద్ధులు కూడా జటాభార శిరస్సులతో

నిన్ను నమస్కరిస్తున్నారని సూచించబడింది. హిమనీహారములచే ఆవరించబడిన కిరణములతో నున్న సూర్యుడు చంద్రునివలె తోస్తున్నాడని చెప్పుటచే ఇంత కాలం ఋషులతో కలిసున్నందున రాక్షసుల ప్రభలతో కప్పిపుచ్చబడిన తేజస్సు కలిగి మృదుస్వభావిగా ఎందుకు ప్రవర్తిస్తున్నావు అని ప్రశ్నించుట సూచించబడుతున్నది.

హేమంతఋతువులోని ఆతపం ప్రాతఃకాలంలో కొద్దివేడి మధ్యాహ్నమున స్పర్శవలన సుఖమూ కొద్ది ఎరుపు, కొద్ది పాండువర్ణము కలిగి శోభిస్తున్నది, అని చెప్పుట వల్ల సూర్యుడు చండభానుడై కూడా ఇట్లు కొద్ది వేడిమి కలిగి ఉండుట తగదని రాక్షసులు మునిజనాశ్రమాల నాక్రమిస్తున్నా నీవు పరాక్రమించకుండుట తగదని సూచిస్తున్నారు. మంచుపడుటవల్ల కొద్దిగా తడిసిన పచ్చిక కలదై అరణ్యభూమి కొద్ది కొద్దిగా తాకుచున్న ఎండ వేడిమితో శోభిల్లుతున్నది, అని చెప్పుటచే ఇచట మంచువలన కలిగిన తడి రాక్షసులు పీడించుచున్నందున మునిజనుల రోదనము కొద్దిగా ఎండ తాకుట అనగా శ్రీరామచంద్రుని కృపాప్రవృత్తి సూచించబడుచున్నది. సూర్యుడు తీవ్రాతపం ప్రసరింపచేస్తే మంచు కరిగిపోవునట్లు శ్రీరాముడు పరాక్రమిస్తే మునిజనుల రోదనం కూడా కరిగిపోతుందని తాత్పర్యం.

అధికశైత్యమున్న జలాన్ని దప్పిగొన్న ఏనుగు త్రాగుటకు తొండం ముందుకు చాచి శైత్యమును సహించజాలక మరల వెనుకకు తీసుకొంటున్నది అని చెప్పుట వలన రాజ్యభోగాభిలాషయున్ననూ ఇంద్రుడు రావణభయంవల్ల భోగం అనుభవించుటకు వెనుకాడుతున్నాడని వ్యంగ్యము. జలములో సంచరించు పక్షులు ప్రావీణ్యంలేని యోధులు యుద్ధమున ప్రవేశించనట్లు జలములోనికి ప్రవేశించుట లేదు అనుటచే మునులకు కలుగు సమాధిభంగం సూచించబడుతున్నది. పూవులు లేని వృక్షాలను వర్ణించుటవల్ల మునులకనులు మూసుకొనినట్లు తెలుపబడుతున్నది. పర్వతశిఖరంపై పరిశుద్ధమైన శిలపైనున్న జలము రుచి కలదైనా విషము వలె గ్రహించ రాకుండగా నున్నది. దీనికి మూడు కారణములు చెప్పబడినవి “మంచు పడుచుండుట, సూర్యుడు మృదువుగా నుండుట, శైత్యము” అని. రాక్షసులు విజృంభిస్తున్నందున నీవు పరాక్రమించకున్నందున మునిజనుల మనములు దుఃఖిస్తున్నవి అని అభిప్రాయం.

ఇట్లు ఇంతవరకు రాక్షసులు మునిజనమును పీడిస్తున్నా శ్రీరామచంద్రుడు రాక్షసులను వధించుటకు ఉద్యుక్తుడు కాకపోవుట తెలిపి నీరాకకై ఎదురుచూస్తున్న భరతుని దర్శించుకాలము కూడా దగ్గరలోనే ఉన్నదని సూచిస్తున్నారు. ఈ హేమన్త ఋతువులో దుఃఖముతో నున్న భరతుడు నీపై భక్తితో రాజత్వమును, నేను రాజపుత్రుడను అను అభిమానమును, స్రక్చన్దనవసనాది భోగములను విడువదగని రాజభోగములనన్నింటిని విడిచి మునిజన చిహ్నములైన జటాదులను ధరించి ఫలమూలాదులను భుజిస్తూ పైన ఎట్టి ఆవరణం లేని మేనుపై ఖట్వాదులను కూడా విడిచి పడుకొంటున్నాడు. అట్టి భరతుడు కూడా ఈ సమయములో స్నానమాడటానికి నీపై గల భక్తిచే భరతుని యందు భక్తి కలిగిన ప్రజలతో కూడి వెళ్ళుతుంటాడు. భరతుడు అత్యంత సుఖసంవృద్ధుడు రాజుచేత నీచేత చక్కగా లాలించబడుటవల్ల సుఖంగా పెరిగినవాడు. నీ చూపును కూడా సహించనంతటి పరమసుకుమారుడు. నీతో కలిసి ఉండుటకు దగినవాడు. నీ ఎడబాటును ఏ మాత్రము సహించజాలనివాడు భరతుడు అపరరాత్రులలోనే సరయూనదిలో మునుగుతున్నాడు. ఇంతటి శైత్యమున్నా ఎట్లు మునుగుతున్నాడు అని ఆశ్చర్యము. అంతలో

అతనికి తనతో పోలిక సరిపడదు. తాను రాముని సన్నిధిలో నున్నందున నీరు చల్లగా నున్నది. కాని భరతునకు రామవిరహతాపముతో సలసల కాగుచున్న నీరులా ఉండును. గాన అపరరాత్రులలోనే నీటిలో మునుగుతాడు. ఇదియే కాదు కొత్తగా వైధవ్యము సంప్రాప్తించిన స్త్రీలు మనుష్యసంచారము మొదలు కాకమునుపే మనుష్యుల ముఖములను చూడకుండా మనుష్యులకు తమముఖములను చూపకుండగా అర్ధరాత్రి వెడలి స్నానమాడునట్లు భరతుడు కూడా ఇతని వలననే రాముడు అరణ్యములకు వెళ్ళినాడని జనులు తనను చూచి అనెదరని భయంతో నరులకు తన ముఖం చూపుటకు ఇష్టపడక అపరరాత్రులలోనే సరయూనదీజలాలలో మునుగుతాడు. సరయూనదీ ప్రవాహం అమితవేగంగానున్నా నిర్భయంగా మునుగుతున్నాడు. నిర్వేదాతిశయంతో, అట్లే నీట మునిగితే నరులచూపు ప్రసరించదని మరియొక అభిప్రాయం. ఇచట ప్రీత్యతిశయతో భరతుని సౌందర్యమును స్వభావమును ప్రశంసిస్తున్నాడు. హ్రీనిషేధుడు అనగా సిగ్గుతో అకృత్యములను ఆచరించనివాడు. నిషేధించబడిన కర్మలు జుగుప్సను కలిగిస్తాయి గాన పరనారీ విషయాదులలో చక్షురాదీన్ద్రియాలను నివర్తింపజేయువాడు. సకల భోగాలను విడిచి సర్వాత్మనా అనగా శ్రవణాది రూప నవవిధభక్తులతో బ్రహ్మాదులకు కూడా పూజ్యుడవగు నిన్ను ఆశ్రయించియున్నాడు. ఇట్లు మహానుభావుడైన భరతుడు అరణ్యమున నున్న నిన్ను తాపసకర్మతో అనుకరించుచున్నాడు గాన స్వర్గం గెలిచినవాడు. లేదా స్వర్గభోగములను తలపించు రాజ్యభోగాలనే తిరస్కరించినవాడు. నీయందలి భక్తితో స్వర్గమును కూడా తిరస్కరించియే యున్నాడు. నీభక్తికి స్వర్గం విఘ్నం కలిగించునది కదా!

నీవు ప్రతిజ్ఞ చేసిన విధంగా రాక్షససంహారం ఆలసిస్తే భరతుని క్లేశాలు అధికమవుతాయి. భరతుని బాధను తొలగించుటకు త్వరగా అటకు వెళ్ళాలి గాన రాక్షససంహారానికి త్వరపడు. త్వరపడిననూ 14 సంవత్సరములు కానిదే వెళ్ళజాలము కదా! అన్ని అనర్థములకు మూలము కైకయే అని చెప్పుతున్నాడు. లోకమున మానవులు పితృస్వభావాన్ని కాక మాతృస్వభావాన్ని అనుసరిస్తారనే లోకన్యాయమును భరతుడు తారుమారుచేశాడు. భర్త దశరథుడు, ఉత్తముడైన భరతుడు పుత్రుడు. మరి ఆ తల్లి కైక ఇంతటి క్రూరస్వభావురాలెట్లైనది అని అడుగుతున్నాడు.

ఇచట తెల్లవారుఝామున హేమన్తశైత్యజలములో సీతారాములు స్నానమాడుటవలన వారికి కలుగుచున్న బాధను చూచిన లక్ష్మణుడు దుఃఖిస్తూ కైకమీద కోపం కలిగి నిందించదలచినా మొదటే కైకను నిందిస్తే రాముడు కోపిస్తాడని మొదట హేమన్తఋతువును స్తుతించి ఆ ప్రసంగముతో భరతుని ప్రస్తుతించి ఆ వరుసలో కైకను నిందిస్తున్నాడని తాత్పర్యం.

ఇట్లు తన మీది స్నేహంతో కైకను నిందించుటను సహించని రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికాడు. మధ్యమాంబయగు కైకను నిందించరాదు. ఇక్ష్వాకునాథుడగు భరతుని కథనే తెలుపు. ఇచట భరతుని ఇక్ష్వాకు నాథునిగా శ్రీరాముడు చెప్పుటలో ఇక్ష్వాకురాజగు దశరథుడు స్వర్గస్థుడు కాగా మనం అరణ్యానికి రాగా పూర్వకాలము నుండియున్న మన కులమర్యాదను స్థాపించినవాడు స్థాపించుచున్నవాడు అని తాత్పర్యం. సత్పుత్రులు లభిస్తే పితరులు హర్షముతో నృత్యం చేస్తారని చెప్పబడినట్లు ఇక్ష్వాకు పూర్వరాజులతో ప్రస్తుతింపబడుచున్న ఉత్తమరూపము ఉత్తమగుణములుకల భరతుని కథనే చెప్పుము అంటున్నాడు. నేను వనవాసం చేయాలని దృఢంగా నిశ్చయించు కున్ననూ భరతునిపై స్నేహంతో భరతవిరహమును సహించజాలను. భరతుని ఎంత తొందరగా చూడగలనా అని

నా చిత్తం వనవాసకాలం ముగియకున్నా కుతూహలపడుతున్నది. భరతుని పలుకులు ప్రియములు, మధురములు, హృద్యములు, అమృత కల్పములు, మనస్సును ఆనందింపచేసేవి. కొందరు ప్రియములు పలికినా కర్ణకఠోరాలుగా ఉంటాయి. కాని భరతునివి ప్రియములు, మధురములు. ఒకసారి వింటే హృదయమునుండి తొలగిపోవు. అమృతకల్పములు అనగా శుభోదర్కములు ముందు శుభములను కలిగించునవి. ఇపుడు మనసును సంతోషింప చేయునవి అని తాత్పర్యం. సీతాలక్ష్మణులతో కలిసున్ననూ భరతుని ఎడబాటు రామునికి తాపం కలిగిస్తున్నది. అనగా శ్రీరామునికి భరతునిపై కల స్నేహాతిశయం సూచించబడుతున్నది. ప్రీతికలవారితో కొందరితో కలిసున్ననూ ప్రీతిపాత్రుడు ఒకడు దూరముగా నున్ననూ అందరికి దూరంగా ఉన్నట్లు ఆర్తి కలుగుతుంది. ఆ ఒక్కడూ కలిసినచో అపూర్వ సర్వసుహృజ్జనసమ్మేళనముతో వలె అత్యంత హర్షం కలుగుతుంది. అందుకే ఎదురుగానున్నా లక్ష్మణునితో నీతో కూడా ఎపుడు కలియుదును అనగా భరతునితో పాటు నీతో ఎపుడు కలిసుందును అని చెప్పుటచే భరతుని ఎడబాటు లక్ష్మణుని సాహచర్యాన్ని కూడా ఎడబాటు వలె తలపింపచేస్తున్నదని తాత్పర్యం.

ఇట్లు శ్రీరాముని తపోవిశేషాన్ని తెలియజేయుటకు మొదట వచ్చిన హేమంతర్తువును వర్ణించి ఆ తరువాత మూడు సంవత్సరములు గడిచిన తరువాత ఒక చైత్రమాసమున జరుగబోవు సకలరాక్షసవధకు మూలకారణమైన శూర్పణఖా వృత్తాన్తాన్ని 17వ సర్గలో చెబుతున్నాడు. ఇట్లు గోదావరీస్నానమాచరించి తమ ఆశ్రమమునకు వెళ్ళిన శ్రీరామచంద్రుడు పూర్వాహ్ణమున చేయవలసిన బ్రహ్మయజ్ఞాదులనాచరించి పర్ణశాలకు చేరాడు. పర్ణశాలకు వెలుపల చేయవలసిన కృత్యముల నాచరించి పర్ణశాలకు చేరాడని తాత్పర్యం.

ప్రఖ్యాత బలపరాక్రమాలు కల ఖరదూషణులు నా సోదరులు. ఇచట జనస్థానముననున్నవాడు అయిననూ నీకు భయము వలదు, నేను వారిని అతిక్రమించియే స్వచ్ఛన్దంగా సంచరించుచున్నదానను. ఈ ప్రపంచమున నున్న దేవదానవమానవులలో ఇంతటి రూపాన్ని ఇదివరకు చూడనందున నీపై భర్తృభావముతో సమీపించియున్నాను. నాకు భార్య సీత యుండగా నీతో పని ఏమిటి అనగా నేను స్వచ్ఛన్ద బలగామినిని. సీతను విరూప అని నిందించడం తనను రాముడు పరిగ్రహించుటకు అని గ్రహించాలి. సీతాసౌందర్యమును చూచి మోహమును చెందిననూ జగన్మోహన దివ్యమంగళవిగ్రహం కల శ్రీరామచంద్రుని దర్శించినందువలన కలిగిన కామంతో పీడితురాలై రాముడు తప్పక తనను గ్రహించియే తీరవలెనని అని సీతాదేవిని నిందిస్తున్నది.

ఇక 18వ సర్గలో ఖరునికి కోపము వచ్చుటకు కారణమైన శూర్పణఖా విరూపకరణాన్ని వర్ణిస్తున్నారు. శూర్పణఖా వాక్యములు వినిన శ్రీరాముడు ఇలా పలికాడు. “నేను వివాహితుడను. ఇష్టురాలైన భార్య ఈమె, నీలాంటి వారికి సవతి పోరుతగినది కాదు. నాతమ్మునికి భార్య దగ్గరలో లేదు. భార్యను అపేక్షించువాడు” అని ఇట్లు శ్రీరాముడు దయాళువుగాన తన మీది కామమోహముతో సమీపించిన దానిని వెంటనే తిరస్కరించిచో దుఃఖించునని తలచి పరిహాసపూర్వకంగా సంభాషించెనని తాత్పర్యం. రాముని వాక్యం వినిన శూర్పణఖ లక్ష్మణుని యాచించగా “నేను రామునికి దాసుడను. నాకు భార్యవగుచో దాసివి కావలయును. ఇది నీకు తగదు. రామునే భర్తగా పొందు. సీత యున్నదని సందేహించకు. నీలాంటి రూపము లభించిన తరువాత రాముడు సీతను విడిచి నిన్నే చేరగలడు” అని పరిహాసపూర్వకంగా సీతను వర్ణిస్తున్నాడు.

సీత విరూపా అనగా విశేషరూప. త్రిలోకసుందరి, అసతీ ఈమెతో సమానమైన ఇంకొకసతి లేదు అనగా పరమపతివ్రత. కరాళా అనగా ఉన్నత. నిర్ణతోదరి అనగా తనుమధ్య వృద్ధా జ్ఞానశీలగుణవృద్ధా అని తాత్పర్యం.

సీతకు హాని కలిగించడానికి ప్రవర్తించినందున శ్రీరాముడు లక్ష్మణునితో ఇంతవరకు అపరాధం చేయనందున ఊరుకున్నాము. ఇక ఇపుడు సీతాక్రమణరూపాపరాధం చేసినందున శిక్షించుమని తాత్పర్యం. ఇట్లు శ్రీరాముని యందు బద్ధభావయైననూ సీతాదేవికి అపచారము చేయుట వలన శిక్షించబడుట వలన భగవంతునియందు భక్తియున్నా భాగవతాపచారము చేస్తే భగవదాగ్రహమును పొందవలసి వచ్చునని సూచించారు.

సీతాకర్ణ నాసాపహారమును వినువారికి చదువువారికి రాముని దయతో ఎపుడూ గౌరవభంగం జరుగదని స్కాన్దపురాణమున ఫలమును తెలిపారు.

ఇక 19వ సర్గలో ఖరవధకు మూలమైన ఖరుని క్రోధం వివరించారు. నిన్నిట్లు ఎవరు విరూపురాలను చేశారు అని కోపంతో ఖరుడడుగగా శూర్పణఖ దశరథుని పుత్రులు, రామలక్ష్మణులు అని మాత్రమే చెప్పవలసి యుండగా "తరుణౌ రూపసంపన్నౌ" ఇత్యాది రామసౌందర్యాదులను వర్ణించుట ఏమిటి అనగా తనకు వైరూప్యము కలిగించినా వైరాగ్యం కలుగనందున కామమోహవశముతో భ్రాతృసన్నిధిలో కూడా హృదయగతభావమునే వివరిస్తున్నదని తెలియాలి. శ్రీరాముని చూచినవారు అనుకూలురైనను, ప్రతికూలురైననూ ఇదే స్వభావం కలిగియుంటారు. కావుననే సున్దరకాండలో సీతాదేవి 'యాని రామస్య చిహ్నాని' అని హనుమంతుని యడుగగా 'త్రిస్థిరః త్రిప్రలమ్బః' అని చెప్పవలసియుండగా 'రామః కమలపత్రాక్షః' 'సర్వసత్త్వ మనోహరః' అని చెప్పాడు. లేదా 'సుప్తప్రమత్త కుపితానాం భావజ్ఞానం దృష్టం' అనునది న్యాయము. అనగా నిదురించినవారికి, మత్తులో నున్నవారికి, కోపించిన వారికి మనసులో దాగియున్న భావము బయలుపడునని అర్థము. ఆరీతిగా కర్ణనాసికలను ఛేదించినందు వలన శూర్పణఖ ప్రమత్త, కుపితకూడా. కావున శూర్పణఖ తన మనసులోని మాటనే చెప్పసాగెనని తాత్పర్యం.

ఇందులో కూడా మొదట చెప్పినది తరుణౌయని. ఇట్లు చెప్పుటచే కామినులకు మొదటి యాకర్షణ యౌవనమే అని తెలుస్తున్నది. ఇచట ఒక రాముని గూర్చి తెలుపక రామలక్ష్మణులను తెలిపే ద్వివచనమెందుకు అని శంకరాగా రామలక్ష్మణులు ఇరువురూ పరిహాసవచనాలు పలికినందున శూర్పణఖకు ఇద్దరిపై భావబన్ధ మేర్పడింది గాన ద్వివచనం ప్రయోగించబడింది. శూర్పణఖ రామలక్ష్మణులను వర్ణించుటలో మరియొక ఉపపత్తి కూడా చూపబడు తున్నది.

**న తం పశ్యామ్యహం లోకే పరోక్షమపి వా నరః ।**
**స్వమిత్రోఽ పి నిరస్తోఽ పి యోఽ స్య దోషముదాహరేత్ ॥**

మిత్రుడైనా శత్రువైనా అవమానించబడినవాడైనా చాటుగానైనా రాముని దోషమును చూపువానిని నేనీలోకమున ఒక్కడిని కూడా చూడలేదు. చూడలేను అని అభిప్రాయము. కాన శ్రీరాముడు సర్వలోకములచే కోరబడువాడు. శ్రీరాముని దివ్యరూపాన్ని కళ్యాణగుణాలను కీర్తించుట శత్రువులకు మిత్రులకు కూడా సాధారణమే గాన అందరికీ

సమానముగా ఆనందమును పంచునదిగాన, అట్టి దివ్యరూపగుణాలకు వశమైన శూర్పణఖ కూడా ఆ మహానుభావుని రూపగుణాలను వర్ణించుటతోనైన సుఖానుభూతిని పొందాలన్న ఆలోచనతో వర్ణిస్తున్నది.

ఇద్దరూ సమానవయస్కులైననూ రూపంలో తారతమ్యముండవచ్చు కదా అనగా అది కూడా లేదు. ఇద్దరూ రూపసంపన్నులే. ఇచట సంపన్న శబ్దము వాడినందున రూపసంపద కలవారంటున్నది. సంపదకలవారిని చాలా మంది యాచింతురు. రూపవంతులుగా పేరు పొందిన కందర్పాదులు వీరినుండే రూపమున భిక్షమెత్తుకొని పొందినవారని సూచించబడుతున్నది. రూపసంపన్నౌ అనుదానికి సమ్పన్నరూపౌ అని తాత్పర్యం. అనగా రూపంతోనే పుట్టియున్నారని అర్థం. అనగా లోకంలో పుట్టిన ద్రవ్యం మొదటి క్షణంలో గుణరహితంగానే యుంటుంది. రెండవ క్షణముననే రూపాది గుణాలు ఏర్పడతాయి అనున్యాయమును కూడా అతిక్రమించి 'రూపదాక్షిణ్యసమ్పన్నః ప్రసూతః' అని హనుమంతుడు సీతకు చెప్పినట్లుగా రూపంతోనే పుట్టిన వారు కాని పుట్టిన తరువాత రూపం వచ్చి చేరలేదని తాత్పర్యం. ఇట్లు చక్కని వయస్సు, మనోహర రూపంకలవారైనా కఠినస్పర్శ కల దేహంకలవారైతే నిష్ప్రయోజనం. కాని వీరు రూపయౌవనాలతో బాటు పరమ సుకుమారులు అంటున్నారు. అతికఠినమైన మీ శరీరం వంటిది కాదు వీరి శరీరం. వీరి శరీరం పుష్పహాససుకుమారం. పరమసుకుమారులు కావున సంభోగ సమ్మర్దంలో అలిసి పోవుదురేమో అనగా కాదు మహాబలశాలులు. 'రామస్తు సీతయా సార్ధం విజహార బహూనృతూన్' అని చెప్పినట్లు అనేక ఋతువులలో విహరించిననూ శ్రమలేశం కూడా లేనివారు అని తాత్పర్యం. ఇట్లు అవయవసముదాయరూపంగా చెప్పబడే శరీరశోభాసంపన్నులైననూ కన్నో కాలో వికారంగా ఉంటే నిష్ఫలం కదా అని శంకించి 'పుండరీక విశాలాక్షౌ' అని అవయవశోభను చెబుతున్నారు. 'సంరక్తనయనా ఘోరా' అని చెప్పబడినట్లు నీ వంటి నేత్రాలు కావు రామలక్ష్మణులవి. 'పుండరీకం సితాంభోజం' అను కోశమునననుసరించి తెల్లని పద్మానికి పుండరీకమని పేరు. తెల్లని నేత్రములు రామలక్ష్మణులవి. తమోగుణోద్రేకముతో నిద్రాకషాయితాలు కావు. రజోగుణోద్రేకముతో సంరక్తాలు కావు. ఎపుడూ సత్త్వగుణంతో సుప్రసన్నధవళనేత్రసమ్పన్నులు వారు.

ఇట్లు సముదాయశోభ అవయవశోభయే కాదు. వాటికి తగిన వస్త్రశోభ కూడా కలవారు అని చీరకృష్ణాజినామ్బరౌ- నారవస్త్రాలు జింకచర్మం ధరించినవారు అని చెప్పుతూ ఇది శోభ యెలా అవుతుంది. అనగా, 'కిమివ హి మధురాణాం మండనం నాకృతీనాం' సహజ సుందరులకు ఏది అలంకారము కాదు అని. నారవస్త్రాలు ధరించినా అందంగానే యున్నారు అని తాత్పర్యం.

ఇచట ఇంకొక వ్యాఖ్యానం కూడా కలదు. నాసోదరివైన నిన్ను ఇట్లు అవమానించిన అంతటి మహాబల పరాక్రమవంతుడెవరు అని భయపడుతున్న ఖరునికి వారి దుర్బలత్వాన్ని వివరిస్తున్నది శూర్పణఖ అని చెప్పుకోవచ్చును. ఈ పక్షమున 'తరుణౌ' అనగా "ఊనషోడశ వర్షో మే రామో రాజీవలోచనః, న యుద్ధయోగ్యతా మస్య పశ్యామి సహ రాక్షసైః" అని చెప్పినట్లుగా యుద్ధం చేయటానికి తగిన వయస్సు లేనివారని అర్థము. "యౌవనే విషయైషిణాం" అని చెప్పిన రీతిగా విషయ ప్రావీణ్యముండువారుగాన యుద్ధానికి భయపడేవారు, 'రూపసంపన్నౌ' అనగా 'కన్యా కామయతే రూపమ్' అను రీతిగా వనితాజనమును వశం చేసుకొనుటకు శరీరసౌందర్యమును ప్రకాశింపచేసుకొనువారు కాని పౌరుషం కలవారు కారు. 'సుకుమారౌ' శ్రీమంతుల పుత్రులు

కావున సంపత్కు మారులే కాని మీ ఆయుధముల ప్రహారాలను సహించగల వారు కారు. 'మహాబలౌ' ఇది విపరీత లక్షణ. ఈ ఇద్దరు దుర్బలులు, సైన్యముతో కూడియున్న మీకు సరి పోరజాలరు. లేదా పరమసుకుమారులైన అబల (స్త్రీ) కలవారు. యుద్ధానికి విరోధియగు కళత్రంతో కూడియున్నందున యుద్ధానికి యోగ్యులు కారు. 'పుండరీక విశాలాక్షౌ' ఇది కూడా వారి యుద్ధ అసామర్థ్యమునే సూచించును. నన్ను విరూపురాలను చేసిన తరువాత ఏమి ప్రమాదం రాబోవునో యను భీతితో తెల్లబారిన కనులు కలవారు.

'చీర కృష్ణాజినామ్బరౌ' కట్టుకొనుటకు కావలసిన చక్కని వస్త్రమును కూడా సంపాదించుకోజాలనివారు అదికూడా ఒకే తీరుగా నుండు ఉత్తరీయం లేనివారు. కృష్ణాజినం ధరిస్తే చీరం ఉత్తరీయంగా, చీరం ధరిస్తే కృష్ణాజినం ఉత్తరీయంగా కలవారు. ధరించినట్టి దానినే ఉత్తరీయంగా సంపాదించుకో లేనివారు. ఇట్లు నారను జింకచర్మమును ధరించిన వారనగా స్థావరాలను తిర్యక్కులను యాచించి అవి ప్రసాదించిన (భిక్షగా పెట్టే) ధరించువారు. ఇట్లు ఖరునిలో అహంకారం మదం పెరుగుటకు చెప్పినమాట.

ఇక ఖరుని ప్రోత్సహించుటకు రామలక్ష్మణుల బలాన్ని ఔద్ధత్యాన్ని వర్ణించునది అని కూడా వ్యాఖ్యానం చెబుతున్నారు.

'తరుణౌ' అనగా జయం పొందుటకు తగిన ఉత్సాహం ప్రదర్శించుటకు కావలసిన యౌవనం కలవారు. 'రూపసంపన్నౌ' 'సింహోరస్కం మహాబాహుం' అని చెప్పిన రీతిగా యుద్ధం చేయకున్నా దర్శనమాత్రాననే శత్రువుల హృదయాలను కంపింపచేయగల ఆకారగాంభీర్యం కలవారు. 'సుకుమారౌ' అనాయాసముగా (లీలగా)సకల జగత్తును సంహరించే సామర్థ్యం గలవారు. 'మహాబలౌ' మనోబల బాహుబల బుద్ధి బలసంపన్నులు. 'పుణ్డరీక విశాలాక్షౌ' శత్రువుల యందు కూడా గౌరవబుద్ధి కలవారుగాన కాలుష్యము లేని పరిశుద్ధమైన నేత్రాలు కలవారు. ఇలా చెప్పుట వల్ల శత్రువులను చూచినందువల్ల బెదురులేని వారు అని తెలుస్తున్నది. చీర కృష్ణాజినామ్బరౌ ఎపుడూ వస్త్రాలను చక్కగా కట్టియున్నవారు గాన సదా యుద్ధసన్నద్ధులు.

ఎవరు నిన్ను విరూపను చేసినవారు అని అడిగినపుడు ఫలానావారి పుత్రులు, ఈపేరు కలవారు అని చెప్పవలసియుండగా రామలక్ష్మణుల సౌందర్యాన్ని వర్ణించుట శూర్పణఖ వైరూప్యం పొందినది గాని వైరాగ్యం పొందనందున కామమోహితురాలు కావున వశము తప్పి సోదరుని సన్నిధిలో కూడా చెప్పరానిదైననూ హృదయంలో నున్న దానినే చెప్పింది. విషయాభినివేశం కలవారు అనుకూలమా ప్రతికూలమా అని ఆలోచించకనే మొదట మనసున నాటిన దానినే వ్యక్తీకరిస్తారు. లేదా 'సర్వాణి రూపాణి విచిత్య ధీరః నామాని కృత్వా' అని చెప్పినట్లుగా మొదట రామలక్ష్మణుల రూపవైభవాన్ని వివరించింది. లేదా రాక్షసులు నివసించు మనప్రదేశమునకు వచ్చి నన్ను విరూపురాలను చేసిరి గాన వారు అతిబలసంపన్నులని భయపడకుము. వారు మృదుస్వభావులు. లేదా "యువా సువాసాః" ఇత్యాది వేదాన్తసిద్ధమగు అర్థమును రాక్షసునకు తెలియబరుస్తున్నదని కూడా చెబుతున్నారు. ముందు యుద్ధకాండలో మండోదరి 'వ్యక్తమేష మహాయోగీ' అని పరత్వాన్ని ప్రబోధించినట్లుగా శూర్పణఖ కూడా ప్రకటించియున్నదని తాత్పర్యం.

శ్రీరామ లక్ష్మణుల పరత్వమును, బలపరాక్రమాదులను చూచి ఇతని వైశిష్ట్యం తెలిసి దశరథాదులతో స్నేహం చేయాలి. ఆ విశేషమును వివరించకుండనీయనిది రామచంద్రుని సౌందర్యవైలక్షణ్యమహిమ అని కూడా తెలియాలి.

ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు. రూపసంపదవైభవములతో శ్రీరామునియందు మొదట భావాను బన్ధము కలిగినదని చెప్పవచ్చు. కాని తనకు వైరూప్యం కలిగించిన లక్ష్మణునిపై ద్వేషం కలుగవలె కదా! ఇద్దరికీ సమానప్రాధాన్యమును ఎట్లు ఇచ్చినది అని. తారుణ్యసౌందర్యాదులు పరస్పరం సమానంగా నున్నందున, రాముడు తిరస్కరించిన తరువాత లక్ష్మణుని పైకూడా భావబన్ధమేర్పడినందున, కర్ణనాసాచ్ఛేదనము చేయుటను రాముడు కూడా అంగీకరించినందున రామునియందు కూడా సమానద్వేషముండవచ్చును కాన ఇది దోషం కాదు అని అభిప్రాయం. వారిద్దరు కలిసి నాకీదశను కలిగించినారని ముందు చెప్పబోవును కూడా. ఒకే యువతికి ఇద్దరియందు ఒకేసారి భావబన్ధమెట్లు కలుగును అనగా జ్యేష్ఠుడు కనిష్ఠుడు అను భావమును అనుసంధానంచేసిననూ తారుణ్య సౌందర్యములలో వైషమ్యం లేదు గాన ఇద్దరియందు భావబన్ధము కలిగినదని చెప్పుకొనవచ్చును. తారుణ్యం ఒకటైనా రూపంలో భేదముంటే అన్యథా భావమేర్పడుతుంది. అది కూడాలేదు ఇద్దరిలో ఒకేవిధమైన రూపసంపన్నతే యున్నదని తెలుపుటకే రూపసంపన్నౌ అని చెప్పారు. వీరి సంపద ఎంతగొప్పది అనగా మన్మథాదులు కూడా వీరిని యాచించే రూపలావణ్యాలను పొందదగినంతటి రూపసంపద కలవారు. అంగప్రత్యంగ సౌష్ఠవలేశమును యాచించి పొందినందువల్లనే మన్మథుడు రూపవంతుడు అని చెప్పబడుతున్నాడు. లోకంలో అందరికీ పుట్టిన తరువాత వయోఽవస్థలతోపాటు రూపసంపద యేర్పడుతుంది. కాని రామలక్ష్మణులు 'రూపదాక్షిణ్య సమ్పన్నః ప్రసూతః' అని హనుమంతుడు చెప్పినట్లుగా రూపదాక్షిణ్యములతోనే పుట్టినవారు. అనగా సహజసిద్ధమైన రూపసంపదకలవారు కాని వయస్సుతో బాటు వచ్చెడి రూపవిలాసములు కలవారు కాదనిభావం.

సున్దరకాండలో 'రామేతి రామేతి సదైవ బుద్ధ్యా విచార్య వాచా బ్రువతీ తమేవ' అని ఎపుడూ బుద్ధిలో రామ రామ అని రాముని గురించే ఆలోచిస్తూ రామనామమునే ఉచ్చరించుచున్నందున అతని కథనే వింటున్నాను అని సీతాదేవి చెప్పినట్లుగా సీతాదేవియంతటి సౌందర్యరాశికే అంతటి వ్యామోహం కలిగించెడి రూపసమ్పన్నుడు అని తాత్పర్యం. ఇక సుకుమారులు అనగా ఆలింగనం చేసుకొనేటపుడు సౌకుమార్యమున్నందున కాఠిన్యస్పర్శ కలిగించని అవయవ సంపదకలవారు. పూలరాశిని ఆలింగనము చేసుకొనునపుడు కలిగెడు అనుభూతిని కలిగించువారు కావున సౌకుమార్యానికి శిరీషపుష్పసామ్యం చెప్పుట. సౌకుమార్యం వల్ల ఊహించెడు దౌర్బల్యాన్ని పరిహరిస్తున్నారు మహాబలౌ అని. ఇచట బలమనగా అనుభవసామర్థ్యం. కావుననే "రామస్తు సీతయా సార్థం విజహార బహూనృతూన్" అని నిరంతరము కాంతానుభవమున్ననూ బలహాని జరుగకపోవుట చెప్పబడింది. ఇట్లు చెప్పుట వల్ల రాక్షస జాతిప్రయుక్తమగు కఠినప్రకృతి కల తనతో కూడా సమంగా రతిప్రదానసామర్థ్యం కలవారు అని అభిప్రాయం. స్త్రీలు తమ అనుభవవిశేషంతో పురుషులను జయించాలని భావిస్తారు, అభిలషిస్తారు కూడా. అట్టివారి భావాన్ని, అనుభవసామర్థ్యాన్ని కూడా అతిక్రమించి తమ బలాధిక్యంతో క్రీడించుటలో స్త్రీని జయించగలిగినవాడే మహాబలుడు.

'పుండరీక విశాలాక్షౌ' ఇతరావయవాల సౌన్దర్యం దగ్గరికి చేరినపుడు మాత్రమే పరిస్ఫుటమవుతుంది. నేత్రాలు మాత్రం దూరం నుండే ప్రకాశిస్తాయి. అట్లే 'పుండరీకసితాంభోజం' అను కోశము ప్రకారము సత్త్వగుణప్రాచుర్యములో

ప్రసన్నదృష్టికలవారు అని చెబుతున్నారు. అంతేకాని మహాపురుషలక్షణంగా చెప్పబడిన నేత్రాంతరక్తిమ కనీనికలు నీలముగా నుండుటను నివారించుట అర్థము కాదు. శ్రీరాముడుగా, మానవుడుగా శ్రీమన్నారాయణుడు అవతరించి తన పరత్వమును కప్పిపుచ్చుకున్నా 'కప్యాసం పుణ్డరీకాక్షం' అని ఉపనిషత్తులలో ప్రతిపాదించబడిన పుణ్డరీకాక్షత్వాన్ని మాత్రం కప్పిపుచ్చుకొనజాలుట లేదు. అది ప్రకాశిస్తూనేయున్నదని తాత్పర్యం. క్షీరసముద్రం చూచినవారు దాని వైశాల్యం గాంభీర్యం నిశ్చితంగా తెలియజాలనట్లుగా నేత్రవైశాల్యగామ్భీర్యాలను కూడా ఎవ్వరూ తెలియజాలరని తాత్పర్యం. ఈ పుండరీకసామ్యం కూడా లోకరీత్యా చెప్పబడింది. వాస్తవంగా మంత్రం 'అదీర్ఘం అప్రేమదుఘం' ఇత్యాదిగా చెప్పబడినట్లుగా సామ్యంలేనిదే స్వామివారినేత్రసంపద మరియు నేత్రవైశాల్యమెంతటిది అనగా ఒకేసారి బద్ధముక్త నిత్యస్వరూపులగు త్రివిధ జీవకోటులుండు ఉభయవిభూతులనూ ఒకేసారి కటాక్షించగలిగినంతటిది అని తాత్పర్యం. మరియు 'మహాబలౌ పుండరీకాక్షౌ' అని చెప్పుటచేత భయమును జూపి 'జితం తే పుండరీకాక్ష' అని స్తోత్రము చేయించుకొనకలిగిన ప్రసన్ననేత్రాలు కలవాడని అని. 'సుకుమారౌ పుండరీక విశాలాక్షౌ' అని చెప్పుకొని నయన పుష్పబాణం కలవాడని తాత్పర్యము. అరవిందము మదనబాణమే కదా. ఇట్లు చెప్పుటవల్ల రామలక్ష్మణుల చూపుల తూపులు శూర్పణఖా మనస్సును చీల్చినవి అని అభిప్రాయం. ఇక 'చీర కృష్ణాజినాంబరౌ' అనగా ఆభరణములు లేకుండగనే నన్ను మన్మథపీడితురాలను చేసి వ్యథను కలిగించారు. 'ఇయమధిక మనోజ్ఞా వల్కలేనాపి తన్వీ కిమివ హి మధురాణాం మండనం నాకృతీనాం' అని కాళిదాసు చెప్పినట్లుగా చీరకృష్ణాజినములను ధరించినా వారిసౌందర్యం వన్నె తరుగదని. అంతేకాదు రాముని తారుణ్యసౌందర్యాదిగుణశోభ ఆ నారవస్త్రాలకు కూడా కలిగినది. రామశరీరసాన్నిధ్యంతో అన్నీ హృదయాకర్షకాలే అవుతాయి.

**రూపం సంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతామ్ ।**
**దదృశుర్విస్మితాకారా రామస్య వనవాసినః ॥**

అని స్వరూపధ్యానపరులకు కూడా ఇదే హృదయగ్రాహకమనిన ఇక ఇతరులకు ఏమి చెప్పాలి?

'మహాబలౌ' అనగా మరియొక పక్షమున అత్యన్త అబలౌ అని పదవిభాగం. స్త్రీనిమిత్తముగా రాజ్యత్యాగం చేయుటయే వారి బలమును తెలుపుతున్నది. లేదా 'మహతీ అబలా యయోస్తే' అను విగ్రహవాక్యముతో తప్పకుండగా రక్షించవలసిన స్త్రీ (సీత) కలవారు. ప్రతిబంధకముగానున్న అబల కలవారు. 'పుండరీక విశాలాక్షౌ' పద్మములు తమ నివాసమైన జలంలో చక్కగా వికసించి హృదయాకర్షకములైనా నీటినుండి బయటపడవేసిన తరువాత వాడిపోవునవి. అట్లే ఇతర ప్రదేశంలో అసామర్థ్యమును ప్రకటించే నేత్రాలు కలవారు. అనగా స్వయంగా శక్తి లేకున్ననూ ఐశ్వర్యాది సమ్పదలలో ప్రబలులుగా నుండువారని తాత్పర్యం చెప్పుకొనవచ్చునా అనగా అదికూడా కుదరదు. 'చీరకృష్ణాజినామ్బరౌ' ధరించుటకు వస్త్రాలు కూడా లేనందున దారుచర్మను మృగచర్మమును ధరిస్తున్నారు. అట్టివారు ద్రవ్యముతో సాధించదగిన సైన్యమును ఎట్లు సంపాదించగలరు? ఇంతేకాక వారి వస్త్రాలు కూడా ఒక తీరువి కావు. ఒక తీరువారు ఇచ్చినవి కావు. ఒకరు ఇచ్చినవి కావు. స్థావరం ఒక వస్త్రము నిచ్చింది. జంగమం నొక వస్త్రమునిచ్చింది.

ఇక ఈ శ్లోకానికి తృతీయవ్యాఖ్యాన మిలా ఉన్నది. తరుణౌ 'ఊనషోడశవర్షో' అని చెప్పిన రీతిగా అతి బాలులు కారు, అతి వృద్ధులు కారు, 'యౌవనే విజిగీషూణాం' అని చెప్పినట్లుగా యుద్ధంతో చేతిదురదను తొలగించు కొనగోరువారు, రూపసంపన్నౌ వీరరసము ఉట్టిపడజేయు అవయవసన్నివేశం కలవారు. 'సింహోరస్కం మహాబాహుం' అనినట్లు సన్నివేశం చూచినంతనే శత్రువులు పలాయనం చేతురు. 'రూప్యతే అనేన' అను వ్యుత్పత్తితో రూపశబ్దము అసాధారణ నిరతిశయరూపవిశేషాన్ని తెలియజేస్తుంది. 'నా విజిత్య నివర్తతే' 'యశసశ్చైక భాజనం' అని బాల్యం మొదలుకొని సుబాహుడు మొదలగు వారిని సంహరించుటవల్ల ఇంతవరకు ప్రసిద్ధమగు దివ్యమంగళ విగ్రహం కలవారు. అనాయాసముగా శత్రువులను నిరసించు పౌరుషం చూచినంతనే హృదయ గ్రాహియగుటవలన రూపసౌకుమార్యంలో కూడా హృదయగ్రాహిత్వము కలవాడు. 'మహాబలౌ', "సదేవ గంధర్వమనుష్యపన్నగం జగత్సశైలం పరివర్తయామ్యహమ్", "సాగరమేఖలాం మహీం దహతి కోపేన యుగాన్తాగ్నిరివోత్థితః" అని చెప్పినట్లుగా ప్రసిద్ధమైన బలపరాక్రమాలు కలవారు. బలశబ్దముతో యిచట బాహుబలం, మనోబలం, ఉపాయబలం గ్రహించాలి. పుణ్డరీక విశాలాక్షౌ అతిసంకట వనసంచారమున కూడా వాడని నేత్రసౌందర్యం కలవారు ఇట్లు చెప్పుటవలన యుద్ధమున అలసిపోనివారు అని తెలుస్తున్నది. ఇట్లే యుద్ధసమయాలలో కూడా శత్రువులయందు పెద్దగా ఆదరబుద్ధిలేనందువల్ల నేత్రములలో ఏమార్పులేనివారు. అట్లే "ప్రీతి విస్ఫురితేక్షణం" అని చెప్పినట్లుగా శత్రువులను చూచినా ఉత్తరోత్తర ఉత్సాహముతో బాగుగా విప్పారిన కన్నులు గలవారు.

"చీరకృష్ణాజినాంబరౌ" అన్ని వేళలా యుద్ధసన్నాహసూచకమైన వస్త్రబంధము కలవారు లేదా వేటాడు స్వభావము కలవారు కావున వేటకు తగిన కృష్ణాజినదారుపటకంచుకాలను ధరించినవారు. 'సత్యేన లోకాన్ జయతి' అని చెప్పినట్లుగా లోకవిజయానికి తగిన వేషవ్యాపారం కలవారు అని తాత్పర్యము. "మహాబలౌ" అని చెప్పుట వలన ఖరుడు పలుకు వీరాలాపాలను లెక్కించక దేవదానవాదులతో జయింపరానివాడు అని సూచించబడింది.

ఇంకనూ హృదయమున మెదలుచున్న వారి సౌందర్యాన్ని చెప్పుతున్నది. 'గంధర్వరాజప్రతిమౌ' ఇత్యాది వాక్యాలతో వారిరువురూ మానవులా దేవతలా అని ఊహించజాలకున్నాను. దశరథపుత్రులుగా వారి నుండే వినియున్ననూ వారిప్రభావం చూచినందున వారు దేవతలో మానవులో నిశ్చయించజాలకున్నాను అని భావం.

ఒక స్త్రీకొరకు వారిద్దరూ కలిసి అనగా ఐకమత్యమును పొంది ఈ దశకు గొనితేబడ్డాను. ఏ దిక్కులేని దానివలె, కులటవలె ఈ అవస్థను పొందాను. కుటిలమైన నడవడిగల ఆ స్త్రీరక్తాన్ని యుద్ధంలో మరణించిన వారిద్దరి రక్తమూ త్రాగగోరుతున్నాను అని చెప్పుట ఇంతవరకు శ్రీరామలక్ష్మణుల సౌందర్యాన్ని వర్ణించుటవల్ల వారిని తాను కామించినదను శంకను తొలగించుటకు అని తెలియాలి. ఇక సీతను కుటిలమైన నడవడిగలది అని చెప్పుటవలన సీత ప్రేరేపించుటవల్లనే వారిద్దరూ నన్ను విరూపురాలను చేశారని సూచించబడింది. వారిని ఆమెను తప్పక చంపవలయునని తెలుపుటకు మరల ఆవిషయమునే 'ఏష మే ప్రథమః కామః' అని తన అభిలాషగా చెప్పినారు. ప్రథమంగా చాలా ముఖ్యమైనది పెద్దదిగా అర్థము చెప్పవలయును కాని మొదటిది అని చెప్పరాదు. ఇట్లే రక్తపానం చేయుటలో తనకు కల ఉత్కటేచ్ఛ అభివ్యక్తమవుతున్నది.

శ్రీమద్రామాయణం వ్యంగ్య ప్రధానం కావున ఇచట అభివ్యక్తం చేయబడు వాస్తవార్థాన్ని మహేశ్వర తీర్థులు ఇట్లు చెప్పియున్నారు.

ఇచట తయోః అని ఉన్న షష్ఠీ విభక్తి తృతీయా విభక్త్యర్థంలో ప్రయోగించబడింది అని తెలియాలి. యుద్ధరంగంలో రామలక్ష్మణులచేత కుటిలనడవడిగల నీ చెల్లెలునైన నా చెవిముక్కులను ఖండించబడిన వాటిని చూడు. ఇంత జరిగిన తరువాత ఇంకా నేను నురుగుతోకూడిన రక్తం త్రాగగలనా? త్రాగవలయునని కోరగలనా? కోరజాలను అని అర్థము. ఇట్లు నా ముక్కు చెవులను కోసినతరువాత కూడా నీవిట్లే ఉపేక్షిస్తే నేను నిరాహారదీక్షతో ప్రాణాలు విడిచెదను అని కూడా చెప్పుతున్నది.

ఇలా శూర్పణఖ చెబుతుంటే ఖరుడు 14 మందిని మహాబలసంపన్నులను కోపించి ఆదేశించెను అని కథాపరమైన అర్థం. కాని ఇక్కడినుండి సర్గసమాప్తివరకు వాస్తవార్థము విడిగా వుంటుంది.

**తస్మాద్యః క్రూరరూపేణ దేహేన హరతామృతమ్ ।**
**విష్ణుర్దాశరథిర్భూత్వా మోక్షయిష్యతి సువ్రతః ॥**

అని శివశాపంవల్ల యాజ్ఞవల్క్యపుత్రులైన చంద్రకాంతమహామేధవిజయులనే బ్రాహ్మణోత్తములే ఖరదూషణ త్రిశిరులుగా పుట్టారని శేషధర్మమున భీష్మయుధిష్ఠిరసంవాదంలో ఇట్లు చెప్పబడుతున్నది.

**యాజ్ఞవల్క్యసుతా రాజన్ త్రయో వై లోకవిశ్రుతాః ।**
**చన్ద్రకాన్త మహామేధ విజయా బ్రాహ్మణోత్తమాః ॥**

**ఖరశ్చ దూషణశ్చేతి త్రిశిరా బ్రహ్మవిత్తమాః ।**
**ఆసన్ తేషాం చ శిష్యాశ్చ చతుర్దశ సహస్రధా ॥**

కావుననే శూర్పణఖ ముఖం నుండి రామవృత్తాన్తం విన్న వెంటనే శ్రీరాముని మహావిష్ణువుగా తెలిసి సైన్యంతో కూడియున్న తనను రాముడు సంహరించునని తెలిసి సోదరికి ప్రీతికలిగించవలెను కాన 14 మందిని ఇట్లు ఆదేశించినాడని తేలింది. కావుననే కథాపరంగా ఖరునివాక్యాలు పరుషోక్తివలె కనపడుచున్ననూ అంతరార్థము సౌమ్యములుగానే గ్రహించాలి.

ఓ రాక్షసులారా! ఈ నాసోదరి నారుధిరమును బలవంతముగా పానం చేయగలదు. కావున మీరు వారి వద్దకు వెడలి మీతేజస్సుతో రామలక్ష్మణులను, తెలియ శక్యముకాని ఇతరులచే ఆచరణ సాధ్యము కాని చక్కని ఆచారము కల సీతాదేవిని తెలుసుకొని తిరిగిరావాలి. ఇది నాసోదరి మనోరథము. ఇచట 'హత్వా' అను పదమునకు 'హనహింసాగత్యోః' అను ధాతువునకు గత్యర్థమున్నది కావున 'యే యే గత్యర్థా తే తే జ్ఞానార్థాః' అని న్యాయంగాన ఇచట జ్ఞానార్థం చెప్పుకొనవచ్చు.

ఇక ఇరువదవ సర్గలో 14 మంది రాక్షసులవధ చెప్పబడుచున్నది. శ్రీరామచంద్రుడు 14మందితో మేము దశరథ మహారాజు పుత్రులము. తండ్రి ఆజ్ఞతో దండకారణ్యంలో ప్రవేశించినవారము. ఇచటనే నివసిస్తున్నాము.

మీరు మునులనెందుకు హింసిస్తున్నారు? వారిని హింసిస్తే మీకేమిటి కష్టమనెదరా ఋషులచే నియమింపబడి మిమ్ము వధించుటకే ఇచటికి వచ్చాము. మీరు అతిదుష్టులు. కావున సమీపమునకు రావలదు. సమీపిస్తే వధిస్తాము.

అపుడు రాక్షసులు మా అధినాయకుడగు ఖరునికి కోపమును కలిగించి అతని చేత పంపబడిన మాచే కొట్టబడి ప్రాణాలు విడుస్తావు, ఒక్కడవైన నీకు మాముందు నిలబడే శక్తి ఎక్కడిది? ఇది కథాపరముగా అర్థము. ఖరునికి కోపమును కలిగించి అతనిచేత పంపబడిన మేము విడిచిన బాణాలతో ప్రాణాలను విడువజాలవు. యుద్ధరంగంలో నీ ఒక్కని ముందు నిలుచుటకు ఇంతమందిగానున్న మాకు శక్తి యెక్కడిది? నిలువజాలనపుడు యుద్ధమెలా చేయగలము అని ప్రాతీతికార్థము. ఖరుని నిర్బన్ధముచే వచ్చిన పరిఘహస్తులమైన మాప్రాణాలను బలపరాక్రమాలను విడిపించెదవు. ఇటనుండి నీపరాక్రమానికి భయపడి వెనుతిరిగి వెడలి ఖరుని చేతిలో మరణించడం కంటె నీ చేతిలో వధించబడుటే మేలు అని హార్దికాభిప్రాయం. శ్రీరామచంద్రుడు రాక్షసులతో ప్రాణములపై ఆశయున్నచో తిరిగి పొందు లేనిచోకూడా ప్రాణములు విడుతురు అన్న మాటలకు దీన్ని సమాధానంగా తెలియాలి.

21వ సర్గలో శూర్పణఖ ఖరుని ప్రోత్సహించుట తెలుపబడుతున్నది. శ్రీరాముని పరాక్రమకర్మను చూచిన నేను భీతిని చెందాను. అందుకే కలత చెందాను, వణుకుచున్నాను. కావుననే దుఃఖిస్తున్నాను. అంతట శ్రీరాముని చూచుట వలన అంతట భయం చూస్తున్నాను. కావున రాముని చంపు అని ప్రాతీతికార్థము సుస్పష్టము. వాస్తవముగా శూర్పణఖ ఖరునితో నీవు రాముని చంపజాలవు. చంపవద్దు కూడా. రాముని వధించుటకు నీకు శక్తి ఎక్కడిది? ఒకవేళ శక్తియున్నా రాముని వధించవద్దు అని చెప్పుతున్నది. లేనిచో నేను నీముందు ప్రాణాలను విడుస్తాను. అయిననూ రామునికి ఎదురుగా నిలుచుటకు నీకు శక్తి లేదనే నా ఆలోచన.

22వ సర్గలో ఖరుని యుద్ధప్రయత్నం వర్ణిస్తున్నారు. ఇట్లు శూర్పణఖచే అవమానించబడిన ఖరుడు తనలో రగిలిన కోపమును తనలో నిగ్రహించుకో జాలకపోయాడు. వ్రణంలో వేసిన ఉప్పునీరు ధ(భ)రించ జాలనట్లు అని పోలిక చెప్పుతున్నారు.

**అగ్రే నిర్యాతుమిచ్ఛామి పౌలస్త్యానాం మహాత్మనామ్ ।**
**వధార్థం దుర్వినీతస్య రామస్య రణకోవిదః ॥**

ఈ శ్లోకమున 'పౌలస్త్యానాం మహాత్మనాం వధార్థం' అని తనకు తెలియకుండగనే పౌలస్త్యవధ కొరకు అని అర్థం స్ఫురించే వాక్యాలను దైవవశాన పలికాడని గ్రహించాలి. యుద్ధానికి బయలుదేరిన ఖరుడు క్రోధంతో రథమధిరోహించెనని చెప్పుట దుర్నిమిత్తమే 'క్రోధః కార్యవిభంగాయ' అని శకునశాస్త్రం.

యుద్ధానికి బయలుదేరిన ఖరునికి ఎదురైన ఉత్పాతాలను 23వ సర్గలో వర్ణించియున్నారు. సూర్యుని సమీపాన శిరస్సులేని మనుష్యకాయం పరిఘమువలె భాసించింది. "సూర్యదృష్టకబన్ధాది రకస్మాన్మాధవాహన" అని కామందకీయమున చెప్పబడినది. ప్రతిపద్దర్శసన్ధిరూపమైన పర్వముకంటే భిన్నమైన కాలంలో రాహువు సూర్యుని గ్రహించాడు. ఇచట వరాహమిహిరుడు ఇట్లు చెప్పియున్నాడు.

'అపర్వణి తథా రాహుగ్రహణం చంద్రసూర్యయోః' అని వరాహమిహిరుడు చెప్పియున్నాడు. మేఘము వంటి అరుణ వర్ణముగల వీచికూచి శబ్దాకారము గలది శబ్దించుచున్నది. ఉల్కానిర్ఘాతాలు ఏర్పడ్డాయి.

**ఉల్కా శిరసి విశాలా నిపతంతీ వర్ధతే తనుప్రభయా ।**
**పవనాభిహతా గగనాదవనౌ చ యదా సమాపతతి ॥**
**భవతి తదా నిర్ఘాతస్స చ పాపో దీర్ఘరోగవిరుత ॥**

అని వరాహమిహిరుడు చెప్పియున్నాడు. రోమహర్షాలను కలిగించే ఉత్పాతాన్ని చూచుటవల్ల కలిగిన చిత్తవిక్షోభము త్రాసమనబడును అని సాహిత్యచిన్తామణిలో చెప్పియున్నారు.

**ఉల్కానిపాతనిర్ఘాత వ్యాళ వ్యాఘ్రాదిదర్శనైః**
**ఉత్పన్న స్సహసా చిత్తవిక్షోభ స్త్రాస ఇష్యతే ।**
**నేత్ర సమ్మీలనోత్కమ్పగాత్రసంకోచగద్గదైః**
**వైవర్ణ్య స్వేద రోమాంచ స్తమ్భాద్యైరనుభావ్యతే ॥**

ఇచట ఖరుడు ఇన్ని దుర్నిమిత్తాలను చూచి కూడా వెనుతిరగక పోగా ఇట్టి నిమిత్తాలను దుర్బలులు ఆలోచిస్తారు. నేనాలోచించను, అను దానినే గర్వమంటారు.

**కులరూప వయోవిద్యా బలైశ్వర్య ధనాదిభిః ।**
**యా భవేదాత్మనశ్శ్లాఘా స గర్వ ఇతి కథ్యతే ॥**

అని చింతామణిలో చెప్పబడింది. అట్లే ప్రతిజ్ఞ అవజ్ఞతో జరుగునని కూడా 'ఉద్గ్రీవావేక్షణా వజ్ఞా ప్రతి జ్ఞాతి ర్భవేత్' అని కూడా అచటనే చెప్పబడింది. శ్రీరామచంద్రుని అమానుషచరిత్ర తెలిసి యుద్ధానికి వెళ్ళుతున్న తాను అనేక దుర్నిమిత్తాలు చూచికూడా భయం చెందకుండా సంతోషంతో ఎందుకు ముందుకు సాగాడు. అనగా కథాపరంగా ఎట్టి ఉపపత్తిని చూపజాలము. పూర్వము శివునిచే శపించబడిన యాజ్ఞవల్క్యుని పుత్రులు మరల ఆ శివునిచేతనే అనుగ్రహించబడ్డారు. అలా రాక్షసత్వమును విడిపించదలచారు. ఆ యాజ్ఞవల్క్యపుత్రులే ఖరదూషణ త్రిశిరులుగా పుట్టిరి. వీరి శాపనివృత్తి కొరకు శివుడు త్రిగుణాత్మకుడగు రామునిలో ఖరాది వధకాలమున స్వాంశమును ప్రవేశింపచేశాడు. అట్టి రాముని నుండి తనకు లేదా తమకు శాపవిమోచనం జరుగుతుంది అను వాసనావశాన సంతోషం కలుగెనని తాత్పర్యం. శేషధర్మములో నున్న భీష్మ భాష్ఠయుధిష్ఠిర సంవాద కథను ఇచట అనుసంధానం చేయాలి. ఇలా రామునినుండి తన మరణం నిశ్చయించుకొనికూడా ఖరుడు యుద్ధం చేయగోరి తనసైన్యానికి ధైర్యం కలిగించు వాక్యాలు పలికాడు.

ఇక 24వ సర్గలో శ్రీరాముని యుద్ధసన్నాహమును వర్ణిస్తున్నారు. ఇచట శ్రీరామునికి ఎదురైన శకునాలు సర్వభూతాపహారసూచకాలు. అనగా సర్వరాక్షసాపహారసూచకాలు. అనగా సర్వరాక్షససంహారసూచకాలని తాత్పర్యం. ఇట్లు రాక్షసులకు దుర్నిమిత్తాలు తనకు జయసూచకములు. ఇచట శ్రీరామునిలో పెల్లుబుకుతున్న యుద్ధహర్షమును శరములందు ఉపచారంతో చెప్పుతున్నారు. యుద్ధమున గెలుచు లక్షణములు ఒక ఆయుధములందే కాక యుద్ధం

చేయువారి ముఖాదులందు కూడా గోచరిస్తాయి. తన ముఖంలోని చిహ్నాలను తాను చూచుకొనజాలడు గాన లక్ష్మణునిలో వాటిని చూచి చెబుతున్నాడు. ఇట్లు యుద్ధానికి సిద్ధమైన వారికి ఒకవేళ ఆయువు క్షయమైతే వారి ముఖం కాన్తిహీనమవుతుంది. నీముఖమట్లు కాలేదు. నా ముఖం కూడా. కావున మనం యుద్ధంలో గెలుచుట తథ్యం. ఇచట శ్రీరాముడు లక్ష్మణునితో సీతను తీసుకొని గుహకు వెళ్ళు. నేనే ఈ రాక్షసులను చంపదలచుచున్నాను. ఇట్లు ఋషిగణానికి మాట ఇచ్చి యున్నాను. నిన్ను గుహలోనికి పంపుట నీకు శక్తి లేదని కాదు. నేనే వీరిని వధించ వలయునని. ఖరరామయుద్ధాన్ని చూచుటకు ఒక చోట సమావేశమైన ఋషులు, చారణులు, బ్రహ్మర్షిసత్తములు అనగా భృగ్వాదులు లోకములకు హవిరాదిదానాలవల్ల ఆనుకూల్యం ఆచరించు బ్రాహ్మణులకు స్వస్తిని, రామునకు విజయాన్ని ఆశంసిస్తున్నారు. హవిర్ముఖముతో ఆనుకూల్యమనగా

**అగ్నౌ ప్రాస్తాహుతిస్సమ్యక్ ఆదిత్యముపతిష్ఠతే ।**
**ఆదిత్యా జ్జాయతే వృష్టిః వృష్టేరన్నం తతః ప్రజాః ॥**

అని కదా న్యాయము! ఇచట శ్రీరాముని రూపము జగత్సంహారమునకుద్యుక్తుడైన ప్రళయకాల రుద్రుని రూపంవలె ఖరాదివధోద్యుక్తమై యున్నదని తాత్పర్యము. స్కాన్దపురాణమున రుద్రతేజోవిలసితమైన శ్రీరాముని రూపాన్ని ఇలా వర్ణించియున్నారు.

**రుద్రతేజో విలసితం దృష్ట్వా రామకళేబరమ్ ।**
**శంఖం చక్రం చ శూలం చ పినాకం ఖేటమేవ చ ॥**

**ఖట్వాం ఘంటాం చ డమరుం బాణపాశాంకుశం తథా ।**
**చాపం వజ్రం చ ఖడ్గం చ పరశు త్రాసకారణమ్ ॥**

**జయశ్రియం చ గంధాం చ దదృశుస్సిద్ధచారణాః ।**

అని చెప్పియున్నారు. ఇచట శ్రీరాముడు కోపం తెచ్చుకొన్నాడు. "ఆహారయత్" అని చెప్పుటవలన సహజంగా కరుణామూర్తి అయిననూ ఆశ్రితుల కంటకాల నుద్ధరించుటకు క్రోధమునారోపించుకొన్నాడని తాత్పర్యం.

శ్రీరామఖరసైన్యాలకు జరిగిన భయంకర యుద్ధాన్ని 25వ సర్గలో చెబుతున్నారు. ఇచట శ్రీరాముని శైలేన్ద్రముగా చెప్పుటవల్ల ఖరరాక్షససైన్యమును చూచి భయపడనివాడని, రాక్షసుల ఆయుధప్రయోగమునకు దుఃఖించనివాడని అవగతమవుతున్నది. రాక్షసులచే ప్రయోగించబడిన ఆయుధములచే శరీరము చీల్చబడుచున్నా మండుచున్న పిడుగులతో పర్వతమువలె శ్రీరాముడు వ్యథ చెందలేదని 'వజ్రైరివాచలః' అని అచలోపమానం వల్ల శ్రీరామునికి రాక్షసుల వలన ఎపుడూ వ్యథ కలుగులేదు అని సూచించబడుచున్నది. రాక్షసులు శ్రీరాముని శరాదానాకర్షణ విమోచనాలను చూడజాలకపోయారు. తమ వధను మాత్రమే చూస్తూ వుండిపోయారు. శ్రీరాముడు గాంధర్వాస్త్రప్రయోగం చేసినందున జరుగు విచిత్రబాణపతనం ఇచట చెప్పబడుట లేదు. దాని తరువాత జరిగిన శరమోక్షణం ఇచట వర్ణించబడిందని తెలియాలి. బాణాలు బయలువెడలుట, రాక్షసులను తాకుట, రాక్షసులను

చీల్చుట, రాక్షసులు బాణములు భూమిపై బడుట ఒకేసారి జరుగుతున్నవి అని చెప్పుట వల్ల రాముని శరాకర్షణ వేగం లాఘవం సూచించబడినవి. ఆ బాణముల తాకిడితో కొందరు భూమిపై పడ్డారు. పిడుగుపాటుకు భయపడిన వారివలె భూమిపై పడినవారు, కొందరు కంఠగతప్రాణులు, కొందరు రెండుగా చీల్చబడినవారు అని హింసావైచిత్రి ఇచట వర్ణించబడింది. శిరోవేష్టనముతో కూడియున్న తలలు కొన్ని, కొన్ని కిరీటాది రహిత శిరస్సులు నానా భూషణములతో కూడియున్న శరీరాలతో యుద్ధభూమి నిండి అతి భయంకరంగా కనపడుతున్నది. ఈ వర్ణనతో శ్రీరామశరప్రభావాతిశయం వర్ణించబడింది.

ఇక 26వ సర్గలో దూషణుడు మొదలగు సర్వసైన్యనాశం వర్ణించబడుతున్నది. ఇచట దూషణుడు ఖరునికి సేనాధిపతి. పరమభయంకరులైన 14వేల మంది రాక్షసులను ఋజుమార్గం అవలంబించినవాడు, ఏ వాహనాలూ లేనివాడు నిస్సహాయుడైన ఒక్కరాముడు సంహరించాడు. వారందరూ వధించబడగా ఖరాదులు ఒకముగ్గురు మాత్రమే మిగిలియున్నారు. అనగా బ్రతికియున్నారు. హతులైన వారిని మహారథులని చెప్పుటవలన క్షుద్రులు కొందరు పిరికిపందలు మాత్రము మిగిలారని అనగా చంపబడలేదని తెలుస్తున్నది. త్రిశిరస్సంహారము 27వ సర్గలో వర్ణించబడుతున్నది. ఈ సర్గ ఆరంభములో గోవిందరాజీయమున త్రిశిరస్సంహారకుడైన శ్రీరామచంద్రుని ఈ శ్లోకముతో స్తుతిస్తూ ఫలశ్రుతిని వివరించారు.

**త్రిశిరశ్శిరసాం ఛేదం దృష్టాంతేన స్వసేవినామ్ ।**
**దుఃఖత్రయనిహన్తారం లక్ష్మణాగ్రజమాశ్రయే ॥**

అని త్రిశిరుని మూడు శిరస్సులను ఛేదించినది తనను సేవించువారి తాపత్రయాలన్నీ ఛేదిస్తాయి అనుటకు దృష్టాన్తంగా చూపిన లక్ష్మణాగ్రజుని ఆశ్రయిస్తున్నాను అని అర్థం. త్రిశిరుడు మూడు బాణాలతో శ్రీరాముని లలాటంలో కొట్టినపుడు శ్రీరాముడు నీ బాణములు ఇంత తేలికవా ఇదా నీ పరాక్రమం. పూలతో కొట్టబడినట్లున్నది కాని బాణాలతో కాదు. చివరికి పూలతో కొట్టినా కొంచెమైనా బాధ కలుగుతుంది. నీ బాణాలతో అది కూడా కలుగుట లేదు అని అభిప్రాయం.

ఇక 28వ సర్గను వినుట వల్ల కలిగే ఫలాన్నీ, ఖరుని చేతిలోని ఆయుధమును ధ్వంసము చేసిన శ్రీరాముని స్తుతిస్తున్నారు గోవిందరాజులు.

**మహామోహసహాయస్య దర్పస్యాశ్రయ నిగ్రహమ్ ।**
**వ్యఙ్క్తుం ఖరోపకరణం హంతారం రామమాశ్రయే ॥**

ఖరుని చేతిలోని ఆయుధధ్వంసం మహామోహానికి సహాయకంగా నుండు దర్పాశ్రయనిగ్రహమును సూచిస్తుంది. అట్టి శ్రీరాముని ఆశ్రయిస్తాను అని అర్థము. చనిపోయిన దూషణుని చూచి శ్రీరాముని పరాక్రమం చూచిన ఖరునికి కూడా భయం కలిగింది. 14వేల రాక్షసులు చనిపోయారు. వీరు ముఖ్యులు. అప్రధానమైన కొంతసైన్యం మిగిలింది. దీనిని చూచిన ఖరుడు గర్వము తొలగిన మనసు కలవాడయ్యాడు. ఇంతటి మహాసైన్యమును వధించుటవల్ల అలసిన రాముని కూడా ఖరుడు పౌరుషంతో నున్నవానినిగానే భావించాడు. పౌరుషం కలవాడైననూ

అలసిన రాముని చూచి అతని ధనువును ఖండించాడు. అలసటవల్ల కలిగిన అనవధానత వలన ధనుశ్ఛేదము చేయగలిగాడు.

29వ సర్గలో ఖరుని చేతిలోని గదను భేదించిన రాముడు అతిహీనుని అహంకారంగా వ్యక్తమైన శక్తిగా నున్న గదను భేదించిన రాముని ఆశ్రయించెదను అని శ్లోకం చెబుతున్నారు.

**అహంకారస్య హీనస్య వ్యక్తాం శక్తిమివ స్థితామ్ ।**
**గదాం ఖరస్య నిర్భిద్య రాజంతం రామమాశ్రయే ॥**

ఇచట గదను ధరించి నిలబడియున్న ఖరునితో రాముడు మృదుపూర్వంగా పరుషంగా మాటలాడాడు. అనుటలో తనసాధనాలన్నీ నశించిన ఖరుడు ప్రాతికూల్యం విడిచి ఆనుకూల్యం పొందియున్నాడేమో అని అతని మనసును పరీక్షించడానికి ఇలా పలికాడు అని తెలియాలి. ఇచట మృదుపూర్వమనగా న్యాయావలంబనంతో, పరుషమనగా మర్మోద్ఘాటనరూపంగా అని తాత్పర్యం. లోకాలను ఉద్వేగంపాలు చేసినవాడు ఘాతుకుడు, పాపకర్మలనాచరించువాడు ఈశ్వరుడైనా మనజాలడు, ఇక నీలాటి వాడి గురించి ఏమి చెప్పాలి. పాపాల నాచరించడానికి లోభం కామం కారణాలు. లోభమనగా లభించిన దానిని విడిచి ఉండజాలకుండటం. కామమనగా అపూర్వమైన దానిని పొందాలన్న కోరిక. ఇచట బ్రాహ్మణీ అనగా రక్తపుచ్ఛిక, కరకమనగా వడగండ్లు. వడగండ్లను భక్షించుట ఆ ప్రాణికి అలవాటు. కాని అదే విషమువలె పని చేసి దాన్ని చంపుతుంది. రక్తపుచ్ఛిక తనను చంపు పనిని తానే ఎలా చేస్తుందో అట్లే నీవు కూడా నీప్రాణాన్తకమైన కర్మనాచరిస్తున్నావని చెబుతున్నారు. ఇచట నీవు చేసిన పాపం దండకారణ్యంలో తపమునాచరించు మునులను చంపుట. చాలామంది పాపులు కూడా బ్రతుకుతున్నారు కదా అనగా కేవలం పాపం చేసిన వారు జన్మాన్తరమున ఫలం పొందుతారు. క్రూరులు మాత్రం పుణ్యలేశంతో ఐశ్వర్యం పొందినా ఆ ఐశ్వర్యముతో ఎక్కువ కాలం నిలువజాలరు. త్వరలోనే నశిస్తారు. అనగా కామలోభాలతో పాపముల నాచరించేవారు పాపఫలం తెలియజాలకున్నా కాలాన్తరంలో దేహం నుండి భ్రష్టులై కామలోభాలతో సంపాదించిన పాపఫలమును తప్పక అనుభవిస్తారు. తాను చేసిన పాపకర్మలఫలమును తనకు తెలియకుండునా అనగా రక్తపుచ్ఛికనుదాహరణగా చెప్పినారు. రక్తపుచ్ఛిక స్వశరీరానికి సుఖం కలిగిస్తుందని భావించి వడగండ్లను తిని దానితోనే మరణించునట్లు పాపి కూడా అని తాత్పర్యం. పాపము నాచరించిన ప్రాణి ఆయా ఋతువులు వచ్చినపుడు ఆయా పుష్పములు వికసించునట్లు ఆయా పాపఫలాన్ని తప్పక అనుభవిస్తాడు.

నాచే చంపబడిన నీవు నీచే భక్షింపబడిన ఋషులను అనుసరిస్తావు. అనగా వారు వెళ్ళిన లోకాలకు వెళ్ళ గలవు అంటున్నారు. పాపులైననూ తనచే వధించబడితే ఉత్తమలోకప్రాప్తి తప్పదని రాముడు సూచించినాడని గ్రహించాలి. ఈ విషయమునే స్కాన్దమున ఇట్లు చెప్పారు.

**రామ విద్ధా నిశిచరా బాణైర్మర్మసు తాడితాః ।**
**రామమాసాద్య సమరే సాయుజ్యం పదవీం గతాః ॥ అని.**

శ్రీరామచంద్రుని పలుకులను విన్న ఖరుడు ఇలా గర్వించుట ఉత్తమకులసంజాతులకు తగదు. మృత్యుకాలమున ఇట్టి అసందర్భప్రస్తావమునే చేస్తారు. ఇట్లు గర్వించుట వల్ల నీ లఘుత్వము ప్రదర్శించబడింది. దర్భకున్న అగ్ని బంగారము వలె తాత్కాలికంగా భాసించినా మరుక్షణమే చల్లారును కదా. అనగా అది ఎవరినీ దేనినీ మరోక్షణములో కాల్చజాలదు. ఇట్లే నీవు కూడా విఱ్ఱవీగుటచే వీరుని వలె భాసించినా మరోక్షణమున చిన్నవాడవవుతావు. కుశాగ్ని త్వరగా మండును. త్వరగా చల్లారును. ఇంకొక దానిని కాల్చజాలదు. విఱ్ఱవీగు పురుషుడు కూడా తాను మాటలాడిన దానికి అనుగుణంగా ఆచరించజాలడు.

'సువర్ణప్రతిరూపేణ' అను శ్లోకానికి మహేశ్వరతీర్థులు ఇలా వ్యాఖ్యానం చేస్తున్నారు. సువర్ణం వంటి అగ్నివర్ణంగల శిలతో కాల్చజాలము కదా. బంగారు రంగురాయిని చూచి ఇది నిప్పని స్తుతించినంత మాత్రాన ఆ శిల ఆ రాయి కాల్చనందున అది అగ్ని కాదని సామాన్యశిలయని చులకనభావం కలుగునట్లు నీవు నిన్ను వీరునిగా తలచి విఱ్ఱవీగుటతో నీవు వీరుడవు కాదని చులకన భావం ప్రదర్శించబడింది.

ఇట్లే సువర్ణాన్ని శోధించే అగ్నితో అనగా వరిపిడిరాయితో బంగారంవలె ఉండు ఇత్తడి ఎట్లు తన లఘుత్వమును బయలుపరుస్తుందో అట్లే నీ గర్విత వాక్యముతో నీ లఘుత్వం బయలుపరుస్తున్నావు. ఆత్మశ్లాఘ చేసుకొను నీ విషయమున చాలా చెప్పవలసియున్నది. కాని చెప్పను. ఇట్లు మాటలాడుచున్నచో కాలము హరించి సూర్యుడస్త మిస్తాడు. యుద్ధానికి విఘ్నం కలుగుతుంది. రాత్రి నాకు బలమును పెంచునదే అయిననూ రాత్రి పూటశక్తి హీనులైన మనుష్యులను చంపుట వల్ల నావంటి వీరులకు అపకీర్తికలుగుతుంది అని అభిప్రాయం.

ఇక 30వ సర్గలో

**నిరస్తనిఖిలాలమ్బ మహంకార మివ స్థితమ్ ।**
**ఖరం నిహత్య సాధూనాం సుఖావహమహం భజే ॥**

సకలాధారాలను తొలగించు అహంకారంవలె నున్న ఖరుని వధించి సాధుజనులకు సుఖం కలిగించు రాముని సేవిస్తున్నాను. అని ఖరునివధను వర్ణిస్తున్నారు.

ఇట్లు పలికి తనపై ప్రయోగించిన గదను తన బాణాలతో ఛేదించి ఖరుని పరిహసిస్తూ ఇలా పలికాడు అంటున్నారు. అనుచున్నారు. చేయజాలని పనులను చెప్పుకొని నీచత్వం ప్రకటించుకొన్న నీ విశ్వాసాన్ని నశింపచేసినది నీ గద. నీవు వధించబడిన తరువాత ఇంతవరకు నీ భయంతో నీవారల భయంతో ఋషులు పారిపోయినట్లు ఇపుడు నాభయంతో రాక్షసస్త్రీలు జనస్థానము నుండి పలాయనము చేస్తారు. ముఖ్యంగా నీ భార్యలు నీ వంటి పాపిని పతిగా పొందిన పాపానికి ఇంతవరకు శోకరసం తెలియనివారు, ఇపుడు శోకమును తెలుసుకొంటారు. ఋషులు అగ్నిలో హవిస్సును పడవేసేటపుడు కూడా దీనిని కూడా ఖరుడు హరిస్తాడో ఏమో అని శంకిస్తుంటారు. నీవు అంతటి నీచుడవు అనగా ఖరుడు రామునితో ఇట్లు పలికి గర్వించియున్నందున భయకారణములున్నా తెలియజాలుట లేదు. నిశ్చయముగా వాచ్యావాచ్యాలను తెలియజాలకున్నావు. ఇట్లు ఖరుడు నిస్సహాయుడైనను ఇందుకు రాముని నిందించుచున్నారనో కాలపాశ పరిక్షిప్తులగు పురుషులు మహాత్ములను

నిందిస్తారు కదా అని అనుచున్నారు. వాల్మీకి మహర్షి ఇట్లు పలుకుతున్నాడు. తన మీదికి వచ్చుచున్న ఖరుని చూచి శ్రీరాముడు కొద్దిగా వెనుకకు జరిగాడు. బాణమును ఎక్కుపెట్టియున్నందున దాన్ని విడుచుటకు కావలసిన అవకాశం కొరకు రక్తము పూసుకొనియున్నందున అట్టి వానిని స్పృశించుటకు వెనుకాడెనని తాత్పర్యం. యుద్ధమున శూరుడు వెనుకడుగు వేయుట తగని పనియే. కాని వేరేదారి లేకపోవుట అనగా తప్పనిసరి అన్నిటికంటే బలీయము కదా. వెనుకకు జరుగనిచో అతనిని వధించుట కుదరదు ఇది శత్రుసంహారముకొరకు వెనుకాడెను కాని తాను తప్పుకొనుటకు కాదని తెలియాలి. అందుకే ఖరుడు అతికోపంతో నున్నవాడు ఆయుధమును విడుచుటకు కూడా కావలసిన అవకాశం లేకుండగా మీదికి వస్తున్నాడు. అట్టివానిపై ఆయుధం విడుచుటకు తగిన అవకాశముకొరకు వడివడిగా అడుగులు వేయుచు కొంచెము వెనుకకు జరిగాడు. ఈవిషయాన్ని వేదాన్తదేశికులు ఇలా చెప్పియున్నారు.

“క్వచిదతిసంకట విషయే సుభటా నామభిమతోఽ యమపసర్పః” అని కొంతదూరము జరిగి బ్రహ్మదండ నిభమైన రామబాణమును ఖరుని వక్షస్థలంలో ప్రయోగించాడు. ఆ బాణంతో కొట్టబడిన ఖరుడు ఫేనముతో నముచివలె, వజ్రముతో వృత్రునివలె, అశనితో బాలునివలె పడి మరణించాడు. ఇంద్రుడు వృత్రాసురుని, నముచిని, బలుని ముగ్గురిని వధించాడు. వృత్రాసురుని వజ్రాయుధముతో వధించాడు. నముచి ఆర్ద్రశుష్కములతో మరణించడుగాన నురుగుతో వధించాడు. బలుని వజ్రాయుధంతోనే సంహరించాడు.

అంతట రాజర్షులు, పరమర్షులు రాముని పూజించి ఇట్లు పలికారు. రామా! ఇట్లు ఖరదూషణాదులను నీచే సంహరింప చేయుటకే మహేన్ద్రుడు పరమపావనమైన శరభంగాశ్రమానికి వచ్చాడు. శరభంగా! నీవు జనస్థానానికి దగ్గరగా నుండుటకు నీవు రాముని సుతీక్ష్ణాశ్రమమునకు పంపు. అటనుండి ఋషులు తమతమ ఆశ్రమాలను చూపు నెపంతో జనస్థానమునకు దగ్గరగా చేరుస్తారు. అని శరభంగునితో చెప్పుటకు అగస్త్యునికి రాముని కిచ్చుటకు ఆయుధములను అప్పగించుటకు ఇంద్రుడు వచ్చెను అని తాత్పర్యం. ఇట్లు దేవతలు ఋషులు స్తుతించి వెళ్ళిన తరువాత రామపరాక్రమమును చూచుట వలన కలిగిన సంతోషంతో లక్ష్మణుడు సీతను గైకొని గుహనుండి ఆశ్రమం ప్రవేశించాడు.

**తం దృష్ట్వా శత్రుహంతారం మహర్షీణాం సుఖావహమ్ ।**
**బభూవ హృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే ॥**

పదునాలుగు వేలమందిని రాక్షసులను ఇతను ఒంటిగా ఏమి చేయగలుగునా అని కలవరపడిన సీత రాముడు విజయం పొందగా వీరుల తారతమ్యం చక్కగా తెలియగల చాతుర్యమున్న సీత రాముని బహుమాన పురస్సరముగా ఆలింగనం చేసుకొన్నది అంటున్నారు. ఇంతకుముందు మరో సంగ్రామములో అదృశ్యంగా నున్న రాముని ఇపుడు చూచి వీరవ్రణములలో రక్తము స్రవిస్తుండగా రోమకూపాలనుండి బయలువెడలుతున్న స్వేదబిందువులతో

**“కోదణ్డదణ్డమవలమ్బ్య నినీయ వర్మ కిఞ్చిత్పరిశ్రమభృతం ప్రియమీక్షమాణా”**

అన్నట్లుగా చూచి, లతలచే చక్కగా కట్టబడిన జటామండలంతో గట్టిగా భుజములనుండి వీపుమీద వేలాడుచున్న అమ్ములపొదలతో రణావసానంలో చల్లారిన కోపంతో ప్రసన్న వదనంతో సీతాలక్ష్మణుల దారిని చూచుటచే రాక్షసులు మరల వత్తురేమో అని సావధానంగా నున్నవానిని చూచి, తం దృష్ట్వా – అతనిని చూచి ఇంతకు మునుపు వీరుడని వింటిమి. ఇపుడు వీరకృత్యం నిర్వర్తించిన వానిని చూచి, శత్రువులను చంపిన వానిని, వధించుట మాత్రమే చూడబడింది. కాని శరసంధానమోక్షణాదులు చూడబడలేదు. శత్రువులను వధించినవాడు అనుట వల్ల యుద్ధం చూచుటకు యుద్ధరంగానికి వచ్చిన దేవగంధర్వ యక్షకిన్నరాదులున్నా శత్రువులను మాత్రమే వధించినవానిని – ఇట్లు దుష్టనిగ్రహం చెప్పబడింది. ఇక ఇపుడు శిష్టపరిపాలనం చెప్పబడుతున్నది 'మహర్షీణాం సుఖావహం' అని మహర్షులు అనగా తాము చేసిన తపములోని అతి చిన్న అంశంతోనే రాక్షసులను వధించగల సామర్థ్యమున్ననూ రక్షకుని స్వరూపానికి రక్షించబడు తమస్వరూపానికి హాని కలుగరాదని కేవలం రక్షకుడైన రామచంద్రుని వ్యాపారానికై (ప్రయత్నమునకై) ఎదురుచూచువారు. రాముని ప్రతిజ్ఞనే అవలోకిస్తున్నవారు అనిఅర్థం.

'సుఖావహం' శ్రీరాముడు అరణ్యంలో తమ ఆశ్రమాలకు వచ్చినపుడు రామునితో "రమ్ము! రాక్షసులచే చంపబడిన మాశరీరాలను చూడుము" అని చెప్పిన దుఃఖాతిశయాన్ని తొలగించి ఆనందాన్ని మాత్రమే కలిగించిన వానిని అని అర్థము. 'బభూవ' అనగా 'భూ సత్తాయాం' అను ధాతువు వల్ల ఏర్పడిన రూపం కావున ఉనికిని పొందెను, అని అర్థము. ఇట్లు చెప్పుటలో మొదట చాలామంది శత్రువులు ఆక్రమించినందుచే శ్రీరాముడు ఒంటరి వాడు కావడం చూచిన సీత సత్తారహితురాలయింది. ఇపుడు రాముని విజయునిగా తిరిగి వచ్చుటను చూచినందువల్ల సత్తను పొందింది అని అభిప్రాయం. జగత్ప్రాణుడగు రాముడు సత్తను పొందుటవలన తాను కూడా సత్తను పొందింది. 'ఆత్మా వై పురుషస్య దారా' అని చెప్పబడుట వలన రామసత్తా లాభముతో తాను కూడా సత్తను పొందింది అని అర్థం.

'భూ' సత్తాయాం అను ధాతువువల్లనే కాక 'భూ ప్రాప్తౌ' అను ధాతువువలన ఏర్పడిన రూపంగా తీసుకొన్నపుడు చేరింది అని అర్థం. భర్త విజయుడై తిరిగివచ్చుటను చూచి వేగంగా గుహనుండి బయటికి వచ్చి రాముని చేరింది అని తాత్పర్యం.

'హృష్టా' సంతోషించింది ఆనందించింది అని అర్థం. ధర్మిలో ధర్మం కనపడుతుంది. గుణిలో గుణం కనపడుతుంది. ఆనందస్వరూపుడైన రాముని చూచుటవల్ల తాను అతని ధర్మమైన ఆనందాన్ని పొందిందని అభిప్రాయం. హృదయంలో కలిగిన ప్రీతికి అంకురములుగా భావించబడు పులకింతలు కలదయిందని అని భావము. ఇట్లు ఇంతటి శౌర్యం చూచుట వల్ల సంతోషించుటకు కారణమును చెబుతున్నారు. 'వైదేహీ' అని.

"మిథిలాధిపతిర్వీరః" అని చెప్పుటవల్ల సీత వీరకులమున పుట్టినందున రాముని వీరత్వమును చూచి ఆనందించిందని అభిప్రాయం.

'భర్తారం పరిషస్వజే' అంతటి నిరవధి ప్రేమ భారంనిండియుండుటవల్ల దాచుకొనజాలక స్వయంగా ఆలింగనం చేసుకొన్నది. ఇచట భర్త అనగా లోకభర్త. తాను లోకమాత కావున సకల సంతానాన్ని తన సంతానాన్ని

రక్షించుట చూచి ఆనందంతో ఆలింగనం చేసుకొన్నది. ఆయుధాలవల్ల కలిగిన గాయాలను సుఖకరమైన నులివెచ్చని స్తనాలతో స్పృశించింది. 'పరిషస్వజే', 'పర్యాప్తం సస్వజే' గాఢాలింగనం చేసుకొన్నది. అనగా వెనుక ప్రక్కలకు ముందు భాగము అంతటా స్పృశించింది అని తాత్పర్యం. శ్రీరామచంద్రుడు యుద్ధంలో పారిపోయినవాడు కాడుగాన వెనుక భాగమున గాయాలకు అవకాశమేలేదు గాన వెనుక భాగమున స్పృశించుట ఎందుకు? అని శంకించవచ్చు. కాని 14వేల మంది రాక్షసులు అన్నివైపులనుండి చుట్టుముట్టి ఆయుధాలను బాణాలను ప్రయోగించినపుడు వెనుక భాగమున కూడా గాయాలగుటకు అవకాశంలేకపోలేదు గాన అట్లు చెబుతున్నారు. చాలా వేగంగా బలంగా నాటిన బాణాలు వెనుకవైపుకు దిగవచ్చును కదా!

'మహర్షీణాం సుఖావహం పరిషస్వజే' తన పుత్రులకు భర్త చేసిన ఉపకారమునకు పుత్రులపైని వాత్సల్యంతో భర్తవిషయంలో సంతోషించిన భార్యవలె ఋషిజనులను రక్షించుటచే ప్రీతిచెందినదై ఆలింగనం చేసుకొన్నది. శ్రీరామచంద్రుడు లేకుండగా గుహలో చేరిన సీత గుహనుండి బయటకు వచ్చి సకల శత్రువులను హతమార్చిన రాముని ఆలింగనం చేసుకొనెను అని చెప్పుటవల్ల హృదయగుహలోని జీవుడు పరతంత్రుడుగాన ఆచార్యుల ద్వారా పరమ శేషియైన స్వామిని దర్శించి ఆ స్వామి సకల విరోధివర్గాన్ని నిర్మూలించగా హృదయగుహనుండి బయలువెడలి నిత్యసూరులచే పరివేష్టితుడై ఆసీనుడైయున్న పరమశేషిని పొంది ఆతనితో అపరిమిత భోగపరీవాహాన్ని అనుభవించింది అని అర్థము.

ఇచట 'తం దృష్ట్వా' అని తచ్ఛబ్దమును ప్రయోగించెను. 'రామం' అని చెప్పలేదు. ఇచట తచ్ఛబ్దమునకు "తే తు యావన్త ఏవాజౌ తావాంస్తు దదృశే స తైః" అని రాక్షసులు ఎంతమంది యున్నారో రాములు కూడా అంతమంది వారికి కనపడ్డారు అని చెప్పబడినట్లుగా తాత్కాలికంగా స్వేచ్ఛతో గ్రహించబడిన పదునాలుగువేల దివ్యమంగళ విగ్రహాలు కలవాడగుటచే ఒక్కొక్కరాక్షసునికి ఒక్కొక్కరామునిగా నుండి చూడబడినవాడు అని అర్థం చెప్పుకోవాలి. లేదా ఇంద్రాదిదేవతలందరూ కలిసి కూడా ఓడింపజాలని బలీయులగు పదునాలుగువేలమంది రాక్షసులను ఒక్కడే అర్ధాధికముహూర్తకాలంలో అనగా 72నిమిషాలలో తాను క్షీణించకుండగనే అనాయాసంగా సంహరించి తన ముందు నిలిచిన రాముని అని అర్థము. లేదా 'రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహం' అని అయోధ్యలో మగవాని వేషములోనున్న స్త్రీని అని తనచేత అధిక్షేపించబడినవానిని అని అర్థము.

**తైర్ధనూంషి ధ్వజాగ్రాణి వర్మాణి చ శిరాంసి చ ।**
**బాహూన్ సహస్తాభరణాన్ ఊరూన్కరికరోపమాన్**
**చిచ్ఛేద సమరే రామః.।**

అని చెప్పినట్లుగా శత్రువులను వధించిన శ్రీరాముని చూచి అని తాత్పర్యము. ఇంకనూ

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సమ్భవామి యుగే యుగే ॥**

అని చేసిన తన ప్రతిజ్ఞను నిలబెట్టుకొంటూ అవతరించి దుష్టులైన రాక్షసులను వధించి సజ్జనులైన ఋష్యాదులను జగన్మోహన దివ్యమంగళవిగ్రహం సాక్షాత్కరింపచేసి పరమానందం కలిగించి రక్షించిన వానిని

అని తెలుపుటకు 'మహర్షీణాం సుఖావహం' అని చెబుతున్నారని గ్రహించాలి. ఇట్టి రాముని చూచిన సీత 'బభూవ' సత్తకలదై అనగా స్వనిర్వాహరూప సత్తకలదై ఉండినది. శ్రీరాముడు శత్రువుల మధ్యలో నున్నందున అసత్ర్పాయు డగుట వల్ల తాను కూడా అసత్ర్పాయురాలు అని తలచింది. ఇచట 'వైదేహీ' అని వాల్మీకి మహర్షి ప్రయోగించి రాముడు యుద్ధానికి వెడలినపుడు తన దేహంపై ఆశధ్యాస లేని సీత రాముడు తిరిగి వచ్చుటచే మళ్ళీదేహమున్న దానినిగా భావన కలదాయెను అని తాత్పర్యం.

'ముదా పరమయా యుక్తా దృష్ట్వా రక్షో గణాన్ హతాన్' ఇత్యాది శ్లోకాలలో పైన చెప్పబడిన విషయాన్నే విశదంగా వివరిస్తున్నాడు. రాక్షసుల సమూహమును వధించినవాడు అని చెప్పుటవల్ల శ్రీరాముని వీర్యగుణాన్ని వివరించారు. రాముని అక్షతునిగా చూచుటవలన శత్రువులను సంహరించేటపుడు తనకు పెద్దగా అపాయం కలుగకుండగా చూచుకొనగలవాడే నిజమైన వీరుడు అని తాత్పర్యం.

ఖరదూషణాదులను శ్రీరాముడు జయించిన ఈ వృత్తాంతం వినిన వారు పొందు ఫలం స్కాన్దమున ఇట్లు చెప్పబడింది.

**శ్రుత్వా శ్రీరామవిజయం పాపబన్ధాత్ర్పముచ్యతే**
**తథైవ శృంఖలాబన్ధాత్ ఋణబన్ధాద్విముచ్యతే ।**
**శ్రుత్వా పుష్పవతీ నారీ తనయం వంశవర్ధనమ్**
**లభతే రాఘవేన్ద్రస్య ప్రసాదాత్కీర్తివర్ధనమ్ ॥**

అని శ్రీరామవిజయాన్ని విన్నవారు పాపబన్ధమునుండి, సంకెలలనుండి, ఋణబన్ధంనుండి విముక్తి పొందు తారు. రజస్వలయైన స్త్రీవినినచో శ్రీరామచంద్రుని అనుగ్రహంతో వంశవర్ధనుడు కీర్తివర్ధనుడైన పుత్రుని పొందుతుంది అని తాత్పర్యం.

శ్రీరామాయణమనగా శరణాగతిమంత్రానికి వ్యాఖ్యానరూపం అని సాంప్రదాయజ్ఞుల సిద్ధాంతం అట్టి రామాయణంలో ఇంతవరకు జరిగిన కథాభాగమువల్ల ఉత్తరఖండమైన 'శ్రీమతే నారాయణాయ నమః' అనుదాని అర్థం బోధించబడింది. అనుష్ఠానదశలో అనగా స్వామి చరణములను ఉపాయంగా స్వీకరించే సందర్భంలో ప్రథమఖండానికి ప్రాధాన్యం ఉంటుంది. ఇక వ్యుత్పత్తి దశలో ఉత్తరఖండార్థానికి ప్రాధాన్యముంటుంది. ఉపాయమున ఫలముననుసరించియే ప్రవర్తింతురు కదా! కావుననే ఇచట ద్వితీయఖండార్థం మొదట వివరించబడింది. మొదట బాలకాండలో ఉత్తరఖండంలోని ప్రథమపదమైన 'శ్రీమతే' అను దానిచే చెప్పబడు పురుషకారయోగం వివరించబడింది. అయోధ్యాకాండలో ద్వితీయ పదమైన నారాయణ శబ్దార్థరూపమైన సౌలభ్యం చెప్పబడింది. అరణ్యకాండలో శూర్పణఖ వచ్చుటకు ముందు జరిగిన వృత్తాంతంచే 'నారాయణాయ' లోని 'ఆయ' అను చతుర్థీ విభక్తికి అర్థమైన కింకరవృత్తి చెప్పబడింది. ఇక ఖరాదిరాక్షసవధవృత్తాన్తముతో 'నమః' పదార్థమైన విరోధినివృత్తి చెప్పబడింది.

ఇక ఇపుడు పూర్వఖండార్థం చెప్పబడుతున్నది. ఇక అరణ్యకాండలో మిగిలిన భాగంలో చెప్పబడిన సీతాపహరణవృత్తాన్తంతో విభీషణునకు పురుషకారసాన్నిధ్యం అనగా శ్రీమచ్ఛబ్దార్థం చెప్పబడుతుంది. కిష్కింధాకాండతో నారాయణపదార్థభూతమైన వాత్సల్యం, సుందరకాండతో చరణశబ్దార్థమైన దివ్యమంగళ విగ్రహవైశిష్ట్యం 'రామః కమలపత్రాక్షః' ఇత్యాదిగా చెప్పబడుతున్నది. యుద్ధకాండలో శరణాగతి, ఉత్తరకాండలో ప్రపన్నచర్య బోధించబడుతున్నదని తెలియాలి. ఇట్లు ఆనుషంగికమును జనశరణాగతిఫలమును దేవశరణాగతికి కార్యమైన రావణవధకు అంగంగా చెప్పి రావణవధకు నిమిత్తమైన సీతాపహరణరూపబీజాన్ని విత్తుతున్నారు. 31వ సర్గలో ఈ సర్గకు ప్రార్థనా శ్లోకం.

**సంహృత్య సకలం లోకం పునస్స్రష్టుం చ యః క్షమః ।**
**తమహం శిరసా వన్దే జానకీ ప్రాణనాయకమ్. ॥**

సకలలోకాలను సంహరించి మరల సృష్టించు సామర్థ్యం గల జానకీప్రాణనాథుని శిరసు వంచి నమస్కరిస్తున్నాను అని 31వ సర్గకు ప్రార్థన చేస్తున్నారు. ఇట్లు ఖరదూషణాది సంహారమును అచటనే ఉండి కనులారా చూచిన రావణచారుడైన అకంపనుడు శుర్పణఖ కన్నా ముందే త్వరత్వరగా రావణుని చేరి జరిగిన దంతా వివరించాడు. నేను ఎట్లో అట్లు అనగా స్త్రీవేషం ధరించి అచటి నుండి తప్పించుకొనగలిగాను అని భావం. ముందు శూర్పణఖ కూడా ఇట్లే చెప్పబోతుంది.

**ఏకా కథంచిన్ముక్తాఽహం పరిభూయ మహాత్మనా ।**
**స్త్రీవధం శంకమానేన రాఘవేణ మహాత్మనా ॥**

అని స్త్రీని వధించుటా? అని సందేహించిన రామునిచే నేనొక్కదానిని ఎట్లో విడువబడ్డాను అని అర్థము. లంకారాజ్యానికి జనస్థానం పురద్వారం వంటిది కదా! లంకారాజ్యమనగా లంకాద్వీపము తప్ప జనపదపుర గ్రామాదులు విడిగా ఏవీ లేవు. ఒక లంకానగరమే లంకారాజ్యం. దానిని రక్షించుకొనుటకు ఏర్పాటు చేసుకొన్నది ఒక్క జనస్థానమే. ఆ జనస్థానమును నశింపజేయడం వల్ల లంకాద్వారం తెరిచినట్లైనది. ఇది మహారాజా నీసత్తాకే హాని. రాక్షసులు నశిస్తే రావణుని రాజత్వం నశించినట్లేకదా? ఒకరిద్దరు నశించిననూ రాజునకు అవమానమే, అయినపుడు 14వేల మంది నశిస్తే రాజత్వమే నశిస్తుంది కదా! వారు వారుగా చావలేదు. చంపబడ్డారు. రాక్షసు లందరూ చంపబడుతున్నపుడు ఖరుడేమి చేస్తున్నాడనగా ఖరుడు దూషణత్రిశిరసులు కూడా వధించబడ్డారు. నేనొక్కడను స్త్రీవేషంతో అటనుండి తప్పించుకొన్నాను. ఇట్లు చెప్పిన మాటలను వినిన రావణుడు కోపించాడు. ఈ కోపం తెచ్చిపెట్టుకొనినది కాదు. సహజమైనదే అని తెలుపుటకు 'సంరక్తలోచనః' అని చెబుతున్నారు. ఒకరికొక్కరు సాయంగా నున్న సూర్యచంద్రులను కలిసున్నవారిని కూడా నా తేజస్సుతో దహిస్తానని పలికాడు.

సింహసంహననుడనగా వరాంగరూపంతో ప్రకాశించేవాడు. "వరాంగరూపోపేతో యస్సింహసంహననో హి సః" అని అమర కోశం. రాముడు దేవతలతో ఇంద్రునితో కలిసి అచటికి వచ్చాడా లేనిచో! ఒక్కనికి అంతటి సామర్థ్యం ఎట్లుంటుంది అని అభిప్రాయం. దానికి అకంపనుడు ఇట్లు చెప్పాడు. దేవతలు సాయమునకు రాలేదు.

రామునిచే ప్రయోగించబడిన శరాలు పంచముఖ సర్పాలై లేదా సింహములై రాక్షసులను భక్షిస్తున్నవి. రాక్షసులు భయం చెంది దాగుకొనుటకు వెళ్ళిన ప్రతిదారిలో రామునే చూచారు. ఇచట ప్రాణాలను కాపాడుకొనుటకు అని చెప్పుట వలన రామదర్శనం భయంవలన అని గ్రహించాలి. రాక్షసులు ఆయాదారిలో వెళ్ళి చెట్టులోనో గుట్టలోనో దాగుకొనదలచి వెళ్ళగా ఆయా వృక్షాదులలో రామునే చూస్తున్నారని తాత్పర్యం. లేదా వృక్షాదులు రామాకారముగానే కనపడుతున్నవి అని తాత్పర్యం. ఇట్లు ప్రతిమార్గంలో ప్రతివస్తువునందు, ప్రతిరాక్షసుడూ రామునే చూస్తున్నాడని చెప్పుటవల్ల రాముడు ప్రతిరాక్షసుడూ ఒక్కొక్క రామునిగా స్వేచ్ఛాగృహీతాభిమతోరుదేహుడని తెలుస్తున్నది.

శ్రీరాముడు ఇతరులచే నిగ్రహించ శక్యము కానివాడు. అతనాచరించిన అతిమానుషకర్మలను అతిక్రమించ జాలనందున ఇతిహాసపురాణోక్త వృత్తాన్తం వినుటవలన అతని పరాభిభవసామర్థ్యము, మహాపురుషకర్మ, మర్యాదను ఉల్లంఘించినవారి నిగ్రహించుట ఇత్యాదులచే రామునికి కోపము వచ్చుట తప్పనిసరి అని తెలుస్తున్నది. రాముడు పరాక్రమమునకు పరాక్రమిస్తే బ్రహ్మరుద్రేంద్రాదులు కూడ నివారించజాలరు. మహాయశాః అనగా లోకంలో వేదంలో కూడా ప్రసిద్ధమైన విభవం కలవాడని చెప్పుటచే త్రివిక్రమావతారం సూచించబడింది. కోపించిన శ్రీరామచంద్రుడు పూర్తిగా నిండి పొంగిపొరలుచున్న మహానదీవేగాన్ని కూడా నిలువరించగలడు అని చెప్పుటవల్ల రాబోవు కృష్ణావతారవృత్తాంతం సూచించబడింది.

'భయానకావర్త శతాకులానదీ మార్గం దదౌ సింధురివ శ్రియఃపతేః' అని శ్రీకృష్ణునికి యమునానది దారిచ్చినట్లు శ్రీమద్భాగవతంలో పేర్కొనబడింది. ఇక మహానదీవేగమును హరించుట మత్స్యావతారాన్ని కూడా సూచించునని మరి కొందరి అభిప్రాయం.

**'సతారగ్రహనక్షత్రం నభశ్చాప్యవసాదయేత్'** నవగ్రహములు, 27నక్షత్రములు, ఇతర జ్యోతిశ్చక్రం ఆకాశము దానికి అధిష్ఠానమైన బ్రహ్మాండకోశాన్ని కూడా నశింపచేస్తుంది అనుదానిచేత కూడా బ్రహ్మాండమును ఆక్రమించిన త్రివిక్రమావతారం సూచించబడుతున్నది.

"యో అస్కభాయ దుత్తరగ్ం సథస్థం విచక్రమాణస్త్రేధోరుగాయః" అని శ్రుతివాక్యం. తరువాత మునుగు తున్న భూమిని ఉద్ధరిస్తాడు. అనుదానిచేత వరాహావతారం సూచించబడుతున్నది. 'తాం వరాహో భూత్వా హరత్' అని శ్రుతి. ప్రతి అంశమున "శ్రీమాన్ అభ్యుద్ధరేత్, శ్రీమాన్ పరిహరేత్" అని అంతట లక్ష్మీ అనువృత్తి సూచించ బడుతున్నది."అన్యేషు చావతారేషు విష్ణోరేషాఽనపాయినీ" అనునది పరాశరవాక్యం. శ్రీమాన్ అని లక్ష్మీసమభివ్యాహార బలంతో సంసారంలో మునుగే చేతనుని ఉద్ధరించును. పరత్వాసాధారణ లింగమగు మోక్షప్రదత్వము సూచించబడు చున్నది. "శ్రీమాన్ మహీమభ్యుద్ధరేత్" అని భూదేవిని ఉద్ధరించుటకు లక్ష్మీదేవి సహకారము చెప్పబడుతున్నందున అమ్మవారికి సపత్నీద్వేషం లేమి సూచించబడింది. "భిత్త్వా వేలాన్సముద్రస్య లోకానాప్లావయేత్" అని చెప్పుటవల్ల సంహారకారణం కూడా శ్రీరాముడే అని సూచించబడుతున్నది. సముద్రవేలాభేదనము లోకాప్లావనముతో సంకర్షణావతారం ధ్వనించబడింది. సముద్రవేగాన్ని కూడా అరికట్టును అని చెప్పుటవల్ల రాముడు చేయబోయే సముద్రబన్ధనం సూచించబడుతున్నది. 'వాయుం వా విధమేత్' అని చెప్పుట వల్ల వాయువు చేత పృథివ్యాది

భూతములకుపలక్షణము. అనగా 'పృథివ్యప్సు ప్రలీయతే, ఆపస్తేజసి లీయన్తే' ఇత్యాదిగా చెప్పబడినట్లుగా ప్రళయం చేయువాడు అని సూచించబడుతున్నది. భూరాది లోకాలను మరల సంహరించి మరల సృజించును అని చెప్పుట ఈ ప్రజలను సంహరించి మరల సృజించగలడు అని చెప్పుట వలన రెండు చోట్ల మరల మరల అని చెప్పుటవల్ల పూర్వకల్పంలో చేసిన సృష్టి సంహారాలు కూడా ఇతను చేసినవే అని సూచించబడింది. లోకాన్ అని బహువచనమును చెప్పుటవలన బ్రహ్మాండములతో నిండినవి అని లోకాలు సూచించబడినవి. ఇచట విక్రమ మనగా సంకల్పమాత్రం.

"ఏతస్య వా అక్షరస్య గార్గి" ఇత్యాది శ్రుతి వాక్యార్థం సూచించబడింది. 'మహాయశాః' అనుటవల్ల షడ్గుణైశ్వర్యకృతప్రసిద్ధి వ్యక్తమవుతున్నది. అనన్తశక్తికలవాడు. 'పరాస్యశక్తిః వివిధైవ శ్రూయతే,' అని శ్రుతివాక్యం కదా. సృష్ట్యాది కర్తృత్వం, 'ఏకో హ వై నారాయణః' ఇత్యాది శ్రుతివాక్యం వల్ల శ్రీమన్నారాయణునకు ఉన్నట్లు తెలుస్తున్నది కాని శ్రీరాముని కెట్లుండును అనగా దానికి సమాధానంగానే 'స పురుషవ్యాఘ్రః' అని చెప్పియున్నారు. స పురుషవ్యాఘ్రః అనుదానితో 'స హి దేవైరుదీర్ణస్య రావణస్య వధార్థిభిః' ఇత్యాదిశ్లోకంలోని స అనుదానితో ఆ శ్రీమన్నారాయణుడే రామునిగా అవతరించెనని చెప్పబడుతున్నదని తెలియాలి.

**న హి రామో దశగ్రీవ! శక్యో జేతుం త్వయా యుధి।**
**రక్షసాం వాఽపి లోకేన స్వర్గః పాపజనైరివ ॥**

పాపులచే స్వర్గం గెలువరానట్లు నీవుకాని, రాక్షసలోకంకాని యుద్ధంలో రాముని గెలువజాలరు. ఇచట 'దశగ్రీవ!' అని పిలుచుటలోనే అభిప్రాయం వ్యక్తం చేయబడుతున్నది. ఇతరులకు లేని దశశిరస్కత్వమే నీ గర్వానికి కారణమైతే రామలక్ష్మణులు సహస్రశిరస్కులని మరువరాదు అని సూచించబడుతున్నది. నీవు అల్పశక్తివి, రాముడు అపరిమితానన్తశక్తి. ఒక్క నీవే కాదు రాక్షసులందరూ కలిసి కూడా అనగా నముచిహిరణ్యకశ్యప శంబరబలప్రభృతి రాక్షసలోకం కూడా రాముని గెలువజాలదు. 'కో మజ్జతో రణుకులాచలయోర్విశేషః' అనినట్లు అనగా సముద్రంలో మునుగుటలో అణువు, కులాచలం ఒకటే అయినట్లు రాముని గెలువలేకపోవుటలో నీవు ఇతర రాక్షసులు ఒకటే అని తెలుపుటకే 'లోకేన' అని ఏకవచనం ప్రయోగించబడింది. ఇంద్రుని జయించిన ఇంద్రజిదాదులు నాకు సాయంగా నుంటారు అను ఆశను కూడా హరిస్తున్నాడు. దేవాసురులు అనేకాక 'సర్వైర్దేవాసురైరపి' అని మరల సర్వశబ్దం ప్రయోగించినందున త్రికాలములలోని దేవదానవులందరూ గ్రహించబడతారు. దేవాసురులందరూ అతన్ని వధించజాలరని నేను తలస్తున్నాను. అని 'మన్యే' అని ప్రయోగించుటలో నేను కూడా రాక్షసజాతిలో పుట్టినా సుకృతపరిపాకవశంతో శ్రీరామ మహత్త్వ విషయ జ్ఞానం కలిగింది. అది నీకు మాత్రం 'ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని' అను గీతాశాస్త్రానుసారంగా దుష్కర్మవశాన నీకట్టి జ్ఞానము కలుగలేదని తాత్పర్యము.

మరి అకంపనునకు అట్టి జ్ఞానమెలా కలిగింది? అనగా సనత్కుమారాది మహర్షులు బోధించిన ఇతిహాస శ్రవణాదులవల్ల కాని, మాల్యవంతుడు మొదలగువారు చెప్పిన సుమాలి మాల వధాది వృత్తాన్తంతో కాని, విశ్వరూపాదిదర్శనంవలె 14వేల మంది రాక్షసులతో చేసిన యుద్ధంలో ప్రతిరాక్షసునికి ఒకొక్క రాముని విగ్రహమును చూచుట వలన కాని కలుగవచ్చు. లేదా ఒక ఋషి వాల్మీకియే అకంపనవేషంలో వచ్చి రాముని పరత్వమును

బోధించెనని కాని తెలియవస్తుంది. అకంపనుడు సూచించిన సీతాపహరణవృత్తాన్తం రావణాసురునకు చక్కగా నచ్చింది. అందుకే చక్కగా ఆలోచించి అనగా అకంపనుని వలన శ్రీరామవృత్తాన్తం పూర్తిగా వినిన తరువాత చక్కగా ఆలోచించి త్రేతాయుగంలో శ్రీరామునిగా అవతరిస్తాడని సనత్కుమారవాక్యమును తలచి శ్రీరాముని చేతిలో వధ కోరినవాడై అకంపనుని సీతాహరణోపాయవాక్యం నచ్చినవాడైనాడని తాత్పర్యం. ఈ విషయంలో ఉత్తరరామాయణంలో చెప్పబడిన సనత్కుమారరావణసంబంధి అగస్త్య రామసంవాదరూపమైన కథను స్మరించాలి. అచట శ్రీరామునితో అగస్త్య మహర్షి వాక్యమిలా ఉన్నది.

అథాపరాం కథాం దివ్యాం శృణు రాజన్ పురాతనీమ్
యదర్థం రామ వైదేహీ రావణేన హృతా పురా ।
పురా కృతయుగే రామ ప్రజాపతి సుతం ప్రభుమ్
సనత్కుమారమాసీనం రావణో వాక్యమబ్రవీత్ ॥

రావణః– దైత్యదానవరక్షాంసి యే హతా సమరేఽ రయః ।
కాం గతిం ప్రతిపద్యన్తే కేన తే హరిణా హతాః ॥

సనత్కుమారః– యే యే హతాశ్చక్రధరేణ రాజన్ త్రైలోక్యనాథేన జనార్దనేన
తే తే గతాస్తన్నిలయం నరేన్ద్రాః క్రోధోఽ పి దేవస్య వరేణ తుల్యః ।
శ్రుత్వా తతస్తద్వచనం నిశాచరః సనత్కుమారస్య ముఖాద్వినిర్గతమ్
తదా ప్రహృష్టస్స బభూవ విస్మితః కథం ను యాస్యామి హరిం మహాహవే ॥

మునిః– మనసశ్చేప్సితం యత్తద్భవిష్యతి తదాహవే ।
సుఖీభవ మహాబాహో కించిత్కాలం ప్రతీక్షయ ॥

అథవా రాక్షసేన్ద్రత్వం యదీదం ప్రష్టుమిచ్ఛసి ।
కథయిష్యామి తే సర్వం శ్రూయతాం యది రోచతే ॥

కృతేయుగే వ్యతీతే వై ముఖే త్రేతాయుగస్య తు ।
హితార్థం దేవమర్త్యానాం భవితా నృపరిగ్రహః ॥

ఇక్ష్వాకూణాం చ యో రాజా భావ్యో దశరథో భువి ।
తస్య సూనుర్మహాతేజా రామో నామ భవిష్యతి ॥

ఏవం శ్రుత్వా మహాబాహుః రాక్షసేన్ద్రః ప్రతాపవాన్ ।
త్వయా సహ విరోధేచ్ఛుః చిన్తయామాస రాఘవ! ॥

సనత్కుమారాత్తద్వాక్యం చిన్తయానో ముహుర్ముహుః ।
రావణో ముముదే మోహాత్ యుద్ధార్థీ విచచార హ ॥

**ఏతదర్థం మహాబాహో రావణేన దురాత్మనా ।**
**సుతా జనకరాజస్య హృతా రామ మహామతే ।**
**లంకామానీయ యత్నేన మాతేవ పరిరక్షితా ॥**

అని. సనత్కుమారుని రావణాసురుడు శ్రీమహావిష్ణువుచే వధింపబడిన దైత్యదానవ రాక్షసులు ఏగతిని పొందారని అడుగగా శ్రీహరిలోకమును శ్రీవైకుంఠము చేరారని సనత్కుమారుడు చెప్పాడు. శ్రీహరి కోపం కూడా వరమే అని పలికాడు. దానిని విన్న రావణాసురుడు శ్రీహరితో యుద్ధమెట్లు జరుగును అని ఆలోచించసాగాడు. అంతట సనత్కుమారుడు నీ కోరికనేరవేరుతుంది. కొద్దికాలం ఆగుము. కృతయుగము గడిచిన తరువాత త్రేతాయుగ ప్రారంభమున దేవమానవహితం కొరకు శ్రీహరి నరునిగా, దశరథునిపుత్రుని శ్రీరామునిగా అవతరించును అని తెలుపగా ప్రతాపవంతుడగు రావణుడు నీతో విరోధమును కోరి నీతో యుద్ధమునకై సంచరిస్తూ ఉండినాడు. ఇందుకే రావణుడు సీతను హరించి లంకకు గొనివచ్చి తల్లినివలె కాపాడాడు అని భావం.

అందుకే రావణుడు సీతతో మాట్లాడిన మాటలన్నీ బాహ్యమున దుర్భాషవలె కనిపించినా అంతరార్థం మాత్రం సీతారామభృత్యునిగా స్తుతిపరముగా అర్థము చేసుకోవాలి.

రావణాసురునితో మారీచుడిట్లంటున్నాడు.

సీతను హరించమని నీకు చెప్పిందెవరు? సామంతుల ద్వారా నీచే మన్నించబడుచు తృప్తిచెందని వాడెవడు? నీ చేత తిరస్కరించబడిన వాడెవడు? రాజ్యలక్ష్మీ సమ్పన్నుని నిన్ను చూచి సహించని వాడెవడు? అనగా నీ ఐశ్వర్యమును చూచి సహించక కపటమైత్రి కొనసాగిస్తున్నవాడెవడు? నీ తలపై కొట్టున్నవాడెవడు? నీకు ఘోర దుఃఖం కలిగిస్తున్న వాడెవడు? సింహాని కెదురుగా వెళ్లినా దైవవశాన క్షేమంగా తిరిగి రావచ్చు కాని రామునికి ఎదురుగా యుద్ధానికి వెళ్ళి తిరిగివచ్చుట అసంభవం.

**తపో బాహుబలోపేతం సర్వభూత భయంకరమ్ ।**
**యో హనిష్యతి దుర్బుద్ధిం రావణం సోఽస్తు మే ముదే ॥**

తపోబలంతో బాహుబలంతో కూడియున్న వానిని, సర్వభూత భయంకరుని, దుర్బుద్ధియైన రావణాసురుని చంపు రాముడు నాకు సంతోషమునిచ్చుగాక అని 32వ సర్గలో గోవిందరాజస్తుతి.

శూర్పణఖ శ్రీరాముని కృత్యం చూచి భీతిచెందినదై లంక చేరి రావణాసురుని చూచింది. ఆ రావణాసురుడు చాలా యుద్ధాలలో ఇంద్రుని వజ్రాయుధంచే గాయపడినవాడు అని చెప్పుటవలన ఇంద్రుని వజ్రాయుధంతో కూడా అవధ్యుడని సూచించబడింది. విష్ణుచక్రనిపాతములచే అని చెప్పుట వలన విష్ణుచక్రముతో కూడా అవధ్యుడని తెలుస్తున్నది. పరయజ్ఞధ్వంసకరుడు, సర్పనగరమును గెలిచి కుబేరుని ఓడించి కుబేరుని పుష్కరిణిని, నందనవనాన్ని, ఇతరదేవోద్యానాలను, ఇతర పూజోపకరణాలను బలాత్కారంగా హరించినవాడు. దేవదానవయక్ష కిన్నరాదులచే మృత్యుభయం లేనివాడు అగు రావణాసురుని చూచింది.

ఇట్లు 32వ సర్గలో రావణాసురుని గుణాలను వింటే భూమండలముననే అతివిశిష్టుడగును అని ఫలశ్రుతి స్కాన్దమున చెప్పబడుతున్నది.

"శ్రుత్వా దశగ్రీవగుణానువర్ణనం సర్గం విశిష్టో భవితా ధరిత్ర్యామ్" అని. 33వ సర్గలో గోవిందరాజు చేసిన శ్రీరామస్తుతి ఇట్లున్నది.

**అమర్యాదో భృశం మూర్ఖో వధ్యో యస్య నిశాచరః ।**
**తమహం నీతిసమ్పన్నం రఘునాథం సమాశ్రయే ॥**

అని మర్యాదారహితుడు, పరమమూర్ఖుడగు రావణాసురుని వధించిన పరమనీతి సంపన్నుని, రఘునాథుని ఆశ్రయిస్తున్నాను.

తాను ఇంత దీనంగా ముందుకు వెళ్ళగా చూచినా తన పరాభవం చూచినా నిశ్చలంగా నున్న అన్నను చూచి కోపించినది శూర్పణఖ. అట్లే అతికామప్రవృత్తునికి లోకంలో రాగల హానిని లోకరీతిలో బోధిస్తున్నది. గూఢచారులను నియమించనివాడు, ఉచితకాలమున ప్రజలకు దర్శనమీనివాడు, భార్యావిధేయుడు, ఇతరుల బుద్ధితో ఆలోచించేవాడు అయిన రాజును ప్రజలు విడుస్తారు. జనస్థానమున 14వేల మంది రాక్షసులను సంహరించుటకన్న పరమ దుస్సహమైన కార్యము ఋషులకు అభయము నిచ్చుటను తెలిపింది. చారులనుండి సమాచారం తెలియుట లేదనిన చారులు కోరిన దానిని నీవిచ్చుట లేదని అర్థము. దేశకాలవిభాగం తెలియనివాడవు. త్వరలో ఆపదను పొందుతావు.

'మారీచుడు రామునితో యుద్ధము' వద్దంటున్నాడు. శూర్పణఖ యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్నది. ఈ రెంటిలో దేనిని చేయాలని రావణాసురు డాలోచించసాగాడు.

**పరగోష్ఠీప్రసిద్ధానాం గుణానామాకరో మహాన్ ।**
**అనుజో యస్య సౌమిత్రి స్తమహం రామమాశ్రయే ॥**

ఇతర సభలలో కొనియాడబడు ఉత్తమగుణాలు కలవాడు, లక్ష్మణుడు తమ్మునిగా గలవాడగు శ్రీరామ చంద్రుని ఆశ్రయిస్తున్నాను ఇది 34వ సర్గకు ప్రార్థనాశ్లోకము. రామానుజపరవశహృదయురాలైనా శూర్పణఖ అతని అన్నచేత కల్గిన మహోన్మాదహేతుభూతమైన శ్రీరామలావణ్యాన్ని సంగ్రహంగా వివరిస్తున్నది.

**యద్వాహనస్య మాహాత్మ్యం సర్వేషాం విస్మయావహమ్ ।**
**అవతీర్ణం రఘోర్వంశే తమహం విష్ణుమాశ్రయే ॥**

ఏ మహానుభావుని వాహనమైన గరుడుని ప్రభావం అందరికీ ఆశ్చర్యం కలగించునో అట్టివాడు రఘువంశమున అవతరించిన శ్రీమహావిష్ణువును ఆశ్రయిస్తాను అని 35వ సర్గకు ప్రార్థనాశ్లోకమిది.

భయం కలిగించే శూర్పణఖావాక్యమును విని మంత్రులతో సంప్రతించి వారిని అనుమతించి తాను కూడా చక్కగా ఆలోచించి ఇదిట్లని నిశ్చయించి మరల కూడా దృఢత్వానికి గుణదోష ప్రాబల్యదౌర్బల్యాలను విచారించి

తాను చేయదలచుకున్న సీతాపహరణరూపకార్యాన్ని పౌరుషంతో చేయవలెనా? చౌర్యంతో చేయవలెనా? దేనిలో దోషా లెక్కువగా ఉన్నవి. దేనిలో గుణాలెక్కువగా నున్నవి. దేనిలో గుణములు తక్కువగా నున్నవి. ఖరాది యుద్ధమున రాముని పరాక్రమం తెలిసినదిగాన పౌరుషంతో చేయదగినది కాదు. ఉపాయంతో చౌర్యం చేసినచో తాత్కాలిక దోషములు కనపడుట లేదు. సీతావియోగమును పొందిన రాముడు ఎటువంటి హానీ చేయజాలడు. కావున ఈ చౌర్యమే యోగ్యము అని నిశ్చయించి ప్రవర్తించాడు. రహస్యంగా వాహనశాలకు వెళ్లాడు. బహిరంగంగా వెళ్ళినచో పెద్దలు, మందోదర్యాదులు వారింతురని తలచాడు. పౌరుషం విడిచి చౌర్యమార్గము నాశ్రయించుట సిగ్గును కలిగించునని ప్రచ్ఛన్నమార్గమును ఆశ్రయించుట. అపుడు సభలో నున్న వారిని విడిచి తాను చేయవలసిన దానిని నిశ్చయించుకొని అని. కావుననే మంత్రులతో ఆలోచించనందున దాగి అని చెప్పియున్నారు. కావున కుంభకర్ణుని లేపినపుడు లేచిన అతడు మంత్రులతో ఆలోచించకుండగా ఇపుడు ప్రతీకారం చేయమనుట తగదంటాడు.

సీతను అపహరించాలని నిశ్చయించుటకు కారణం సీతావియోగపరితప్తుడైన రాముడు తరువాత కూడా హాని చేయజాలడని భావించుట. ఇచట బయలుదేరిన రావణాసురుడు దర్శించిన సాగరానూపమును(సాగర తీరమును) ఇంత విస్తృతంగా వర్ణించుట ఇంతదూరం ఇంతప్రయాసతో వెళ్ళుట, మారీచోపదేశంతో తిరిగి రాకుండుటను సూచించుటకని తెలియజేయాలి. అనగా రావణాసురుని దృఢాధ్యవసాయాన్ని తెలుపుతుంది. ఆశ్రమసమీపంలో ఉన్న న్యగ్రోధమును వర్ణిస్తూ న్యగ్రోధ శాఖలు ఒక్కొక్క శతయోజనాయతములు, ఆశాఖపై గజకచ్ఛపాలను తీసుకొనివచ్చిన గరుడుడు, భుజించుటకు కూర్చొనగా ఆ కొమ్మలు విరిగినవని కథాప్రసంగమున గరుడుని ప్రభావాన్ని వర్ణించుట శ్రీ మహావిష్ణువాహన ప్రభావమే. అపరిచ్ఛేద్యమైతే అట్టి వాహనం కల శ్రీరామునితో విరోధించు రావణుడు మూర్ఖుడని సూచించడానికని గ్రహించాలి. అంత పెద్ద వృక్షశాఖ గరుడుని బరువుకు, అట్లే గజకచ్ఛపాల బరువుకే విరిగెను కాని గరుడుడు ప్రయత్నించి విరుగ గొట్టలేదని అభిప్రాయం. అచట గరుడుడు శాఖయొక్క క్రింది భాగంలోనున్న రవికిరణపానవ్రతులకు హోమధూమపానము చేయు మునులకు శాఖాపాతము వలన కలుగు బాధను తప్పించుటకు, వారిని అనుగ్రహించుటకు ఒకేపాదముతో ఆకొమ్మను తీసుకొని గజకచ్ఛపాలను అప్రయత్నంగా ఆయుధంగా లభించిన శాఖతో చంపి గజకచ్ఛపమాంసమును భక్షించి వైఖానస మరీచిప ధూమ్రులను నిషాదదేశస్థ బ్రాహ్మణులను రక్షించాడు. ఈ బ్రాహ్మణులను కాపాడుటకే వాటిని చంపుట అని తెలుసుకోవాలి. ఇంతటి శాఖయను ఆయుధము లభించుట వల్ల అపుడే మునులను బాధించే నిషాదులందరిని వధించి దుర్జనశిక్షణ, సజ్జనరక్షణ జరుగుటవలన ఆనందించాడు అని గరుడవృత్తాన్తము. తరువాత ఆయానందము తోనే స్వర్గానికి వెడలి అచట అయోనిర్మిత జాలములను ధ్వంసం చేసి దానిలోపలినున్న రత్నమయగృహాన్ని భేదించి దానిలో అతిగూఢంగా దాచియుంచిన అమృతాన్ని మహేన్ద్రభవనంనుండి అపహరించాడు. ఇట్టి గరుడుని పరాక్రమమునకు సూచకమైన న్యగ్రోధమును చూస్తూ రావణాసురుడు మారీచుని ఆశ్రమంలో కృష్ణాజినధరుని జటావల్కలధారియైన మారీచుని చూచాడు. కృష్ణాజినధారణము రామభక్తివలన కలిగిన వైరాగ్యచిహ్నాన్ని సూచిస్తుంది.

**మహాసమర మధ్యేఽపి గాంభీర్యం యస్య నిశ్చలమ్ ।**
**తమహం శిరసా వందే జానకీప్రాణవల్లభమ్ ॥**

మహాయుద్ధ రంగమున కూడా చలించని గాంభీర్యంకల జానకీవల్లభుని శిరసా నమస్కరిస్తున్నాను. అని 36వ సర్గ ప్రార్థనాశ్లోకము. రావణాసురుడు చేసిన రాముని అధిక్షేపవాక్యములకు మహేశ్వరతీర్థుల వ్యాఖ్యానమిట్లున్నది.

క్షత్రియపాంసనః– క్షత్రియాన్ పాతీతి క్షత్రియపః స చాసావంసనశ్చ అంస సమాఘాతే. అను ధాతువు.

క్షత్రియులను కాపాడువాడు, శత్రువులను సంహరించువాడు.

అశీలః– (దుశ్శీల) కిం అను ప్రశ్న సచ్ఛీలుడు.

కర్కశః– శత్రువుల విషయంలో కఠినుడు.

తీక్ష్ణః – కార్యములనాచరించడంలో యందు అలసుడు కాడు.

కావుననే అలుబ్ధ, తీక్ష్ణోఽమూర్ఖగోఽలుబ్ధః అను పాఠములో అకార ప్రశ్లేషతో అలుబ్ధుడు అమూర్ఖుడు అని పదవిభాగము అలుబ్ధుడనగా జితేంద్రియుడు. త్యక్త ధర్మః – విరుద్ధ ధర్మాలను విడిచినవాడు .కావుననే అధర్మాత్మా కిం అని కాకు. అనగా ధార్మికుడే. భూతానామహితే రతః అనుచోట అహితే అరతః అని అకార ప్రశ్లేషతో భూతములకు అహితం చేయగోరనివాడు, అనగా హితం చేయువాడు అని భావము. సర్వభూతదయాపరుడు అని తాత్పర్యము. సనత్కుమారుల మాటను అనుసరించి శ్రీమహావిష్ణువైన శ్రీరాముని వల్ల సంహారమును పొందుటకు అతని భార్యను తీసుకొని వస్తాను. ద్రోహబుద్ధితో కాదు, అని అభిప్రాయం.

**తతః పశ్చాత్సుఖం రామే భార్యాహరణకర్శితే ।**
**విస్రబ్ధః ప్రహరిష్యామి కృతార్థేనాన్తరాత్మనా ॥**

అను శ్లోకమునకు 'రామ ఇభ ఆర్యాహరణ కర్శితే' అని విభజించి రామగజభార్యను హరించుట వలన రాముడు నాశరీరాన్ని నశింపచేస్తే కృతార్థుడనై విస్రబ్ధం అనగా నిష్కలంకమగు సుఖాన్ని పరమానన్దరూప మోక్షాన్ని 'ప్రహరిష్యామి' ప్రకర్షేణ ఆహరిష్యామి. అను విభాగంతో పొందగలను అని అర్థం చెప్పబడింది. మహేశ్వర తీర్థీయములో.

**సీతాపతిత్వసమ్భూతమప్రమేయం వహన్మహః ।**
**సమస్తాపాయరహితో రామో జయతు మేధన(స)మ్ ॥**

సీతాపతిత్వం వల్ల కలిగిన తులతూచజాలని గొప్పతేజస్సు ధరించిన సకలాపాయశూన్యుడగు రాముడు నాధనమును జయించుగాక, 'మేధసం' అను పాఠమున నాబుద్ధిని గెలుచు గాక అని 37వ సర్గకు ధ్యానము.

రాజుకు ఆపద కలిగినా స్వామి హితాహితాలను ఆలోచించక కేవలము స్వప్రయోజనం కొరకు యథేచ్ఛావాదశీలులగు పురుషులు సులభులు. రాజునకు తత్కాలముగా వినుటకు కటువుగా అనిపించినా ముందు ముందు హితాన్నీ, శుభాన్నీ కలిగించే మాటను చెప్పు భృత్యుడు, పథ్యమును భుజించునట్లు ఇది నాకు హితము

అని గ్రహించి వినగలుగు రాజు కూడా దుర్లభుడే. కావున నేను చెప్పునది అప్రియంవలె అనిపించినా పరమ హితంగా గ్రహించుమని భావము.

సమర్థులైన గూఢచారులను నియమించకపోవుట వల్ల రాముని పరాక్రమాన్ని వాస్తవంగా తెలియుట లేదు. అని లేదా అహితమును ఉపదేశించు చారులను నియమించుట వల్ల కూడా వాస్తవము తెలియజాలవు. ఇంతకు క్రితమే వెళ్ళిన వాడవు మరల ఇంత త్వరలో వచ్చుట వల్లనే నామాట ఇతను వినడు అని నిశ్చయించుకొని మారీచుడు రావణుని చాపల్యంతో సంభవించే అనర్థాలను చెప్తున్నాడు. నీవిట్లు ఆచరిస్తే సజాతీయులగు రాక్షసులకు శుభం కలుగునా? నీ ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరించు మర్యాదారహితుడగు స్వామిని పొందిన లంక నశించకుండునా? నీప్రవృత్తి వలన రాముడు లోకాలను రాక్షసశూన్యంగా చేయడా? తప్పక చేస్తాడు.

'శ్రద్ధయా దేవో దేవత్వమశ్నుతే' అని శ్రుతివాక్యము చెప్పినట్లుగా సీతా సమ్బన్ధముతో రాముడు రామునికి అతిశయము లభించినదని చెప్పుచున్నాడు. వనమున రామలక్ష్మణులు సావధానంగా కాపాడుతున్నారు. సీత రామచాపమును ఆశ్రయించియున్నది అని చెప్పుట రామవైభవం సూచిస్తున్నది. ఆమె జనకాత్మజ గాన రామునివైభవం వల్ల జనకకులప్రభావము వల్ల కూడా హరించ శక్యము కానిది అని తాత్పర్యము.

**ఆబాల్యసిద్ధసహజ శౌర్యాది గుణసేవధిః ।**
**రఘునాథో మమ ప్రీత్యా పరిస్ఫురతు సర్వతః ॥**

బాల్యము నుండే సహజంగా ఏర్పడిన శౌర్యాది గుణాలకు నిలయుడైన రఘునాథుడు నాయందు ప్రీతితో అంతట స్ఫురించు గాక అని 38వ సర్గకు ప్రార్థనాశ్లోకం మారీచుడు శ్రీరాముని గుణగణాలను 'ఏవో కొన్ని యుక్తులను కల్పించి చెప్పునవి కావు. ఇది అనుభవసిద్ధము' అని తనకు కలిగిన అనుభవవృత్తాన్తాన్ని చెబుతున్నాడు. ఇచట మారీచవాక్యము 'బాలో ద్వాదశవర్షోఽ యం' అను చోట "ద్వాదశ వర్షః" అను మాట రావణునిలో భయం కలిగించటానికి చెప్పిన మాట "(అశీలో) ఊనషోడశ వర్షః" అనునది అని? కొందరు అంటున్నారు అని రావణాసురుని దుర్బుద్ధిని నివారించుటకే మారీచుడు ఇచట రామవైభవాన్ని వివరించాడని తెలియాలి. ఇచట మారీచుడు రాముని ఉదిత చంద్రునితో పోల్చుట విరోధి నిరసనకై సన్నద్ధుడు కావటం సూచిస్తుంది. శ్రీరాముని దివ్యమంగళవిగ్రహాన్ని వర్ణించుట ఆ దివ్యసౌందర్యం శత్రువులను కూడా ఆకర్షించునని తెలుపుటకే. 'ప్రజాతవ్యం జనశ్రీమాన్' అను శ్లోకమున శ్రీమాన్ అనగా శ్రీ తొలగనివాడు అని, 'పద్మపత్రనిభేక్షణః' అనగా రవికరవికసిత పుండరీక దళాయతేక్షణుడు అని, ధన్వీ అనగా బాల్యోచితప్రశస్త ధనువును ధరించినవాడు అని అర్థము. తన అసాధారణ తేజస్సుతో దండ కారణ్యాన్ని శోభింపజేస్తూ అనగా నెమలి కంఠముతో పోలు తన కాన్తిచే శ్యామారుణకాన్తిని పెంపొందింపజేస్తూ అని ఆచార్యులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంతటి తేజస్సు కలవాడైనా ఎదుటి వారికి ఉద్వేగం కలిగించని వాడు అని తెలుపుటకే బాలచంద్రుడు అని తెలిపినారు. నన్ను చంపుటకు ఇష్టము లేకనే సామాన్య బాణమే విడిచాడు. చంపు సామర్థ్యం కలవాడే కాని చంపదలచలేదని తాత్పర్యం. ఇట్లు చంపదలచకుండుట కృపామూలాననే అని అభిప్రాయం. అందువల్ల శతయోజనపర్యన్తంగానున్న సముద్రంలో పడవేయబడ్డాను.

**అపరాధవిహీనేషు నాపరాధం కరోతి యః ।**
**దయాళుం సర్వభూతేషు తమహం రామమాశ్రయే ॥**

అపరాధం చేయని వారిని దండించనివాడు సర్వప్రాణులను దయచూచెడు రాముని ఆశ్రయిస్తున్నాను అని 39వ సర్గలో ప్రార్థిస్తున్నారు. బాల్యావస్థలో జరిగిన సంఘటనను తెలిపి ప్రౌఢావస్థలో జరిగిన వృత్తాన్తాన్ని కూడా నేను చెప్పుదానికి బదులు చెప్పకుండగా వినుమని తెలుపుతున్నారు. ఇట్లు రామునిచే ప్రాణసంకటం పొంది కూడా 'అనిర్విణ్ణః' అనగా నిర్వేదము లేనివాడనై అని, నిర్వేదమనగా నిష్ఫలత్వబుద్ధి అనగా ఆ విషయప్రవృత్తిలో వైరాగ్యం కలగనివాడనై అని తాత్పర్యం. ఇదివరకు రాముని పరాక్రమాన్ని తెలిసి కూడా ఎట్లు రాముని పరాభవించ దలచితివి అనగా చెప్పుతున్నాడు. ఇతనిపుడు తాపసుడు. అనగా అహింసాపరుడుగా నుండునని తెలిసి ప్రవర్తించాను అనుచున్నాడు. నేనిదివరకు రాముని శరం రుచి చూచినవాడను. రామునిపరాక్రమం తెలిసినవాడను. కావున తడబడి త్వరపడి రామబాణాన్ని తప్పించుకొన్నాను. రామపరాక్రమం తెలియని ఆ రాక్షసులిరువురూ మరణించారని తెలుపుతున్నాడు. అప్పటినుండి నేను అన్ని దుష్ప్రవృత్తులూ విడిచాను. యోగ్యములైన కర్మలనాచరిస్తూ తపోనిష్ఠుడనై సావధానమనస్కుడనుగా నున్నాను. అప్పటి నుండి శ్రీరాముడు నాహృదయం విడిచిపోకున్ననూ అన్నిదిక్కులలో కనపడుతున్నాడు. "రామ భూతం జగదభూద్రామే రాజ్యం ప్రశాసతి" అనునట్లుగా శోకరాగభయాదుల వల్ల కలిగిన నిరంతరసంతాపంలో చింతాసక్తులకు సాక్షాత్కారం సమంజసమే. భయము ఉత్తరోత్తరవృద్ధిచెందును గాన దర్శనం కూడా ఉత్తరోత్తరదశలోనిది అనుచున్నారు. 'చీర కృష్ణాజినామ్బరం గృహీత ధనుషం' అనుట శుభాశ్రయాన్ని ధ్యానించునపుడు శంఖ చక్రాది యోగంవలె ఇచట జ్ఞానాలంబనయోగం తెలుస్తుంది. ఒకే రాముడు ప్రతివృక్షం వద్దకూ వెడలి కనపడుచున్నాడను శంకను తొలగించును. ప్రతివృక్షమేకాదు అన్ని చోట్లా అంటున్నాడు. ఇది రాముని మాయాప్రభావం కాదు. రాముడు లేని ప్రదేశం కూడా, అది కూడా మేలుకొనియున్నపుడే కాదు స్వప్నావస్థలో కూడా అంటున్నాడు. ఒక చూచునపుడే కాదు భయం వినిననూ భయము కలుగుతున్నది. రాముడంటేనే కాక ర అనునది మొదటి అక్షరముగా నున్న రత్నము, రథములు అన్నా, మొదట అక్షరమును వినినంతనే భయం చెందుతున్నాను. రెండవ అక్షరము వినిన తరువాత భయం తొలగుతున్నది అని అభిప్రాయము. రావణా ఒకవేళ నీవు పగతీర్చుకోవాలని భావిస్తే రాముని యుద్ధరంగంలో ఎదుర్కొను. లేదా ఖరాదుల వధను మౌనంగా సహించు. అంతేకాని చౌర్యము నీకు క్షేమకరం కాదు. అంతేకాని నాముందు రాముని ప్రసంగం నన్ను మరల చూడదలచితే చేయకు. మరల చూడదలుచుట అనగా బ్రతుకదలచినచో అని అర్థం.

సీతను అవమానించ బూనుకొని శూర్పణఖ విరూపం పొందింది. ఖరుడు అతిగా ప్రవర్తించి రామునిపై యుద్ధానికి వెడలి రామునిచే చంపబడ్డాడు. ఇందులో రాముని తప్పేమున్నది? నామాట విననిచో బంధువులతో కలిసి ప్రాణాలను విడుస్తావు అని ఉపదేశించాడు.

ఇట్లు రావణాసురునికి మారీచుడు చేసిన ఉపదేశం వినినవాడు ఉత్తమగురువును పొందుతాడు అని స్కాందమున 'మారీచోక్తిముపశ్రుత్య గురుమాన్ భవతి క్షితౌ' అని చెప్పియున్నారు.

**యస్య తత్త్వం సముద్దిష్టం నాభిజానన్తి దుర్జనాః ।**
**తమహం శిరసా వన్దే రఘునాథం గుణార్ణవమ్ ॥**

దుర్జనులచే తెలియ శక్యం కాని తత్త్వం కల గుణసాగరుడైన రఘునాథుని శిరసు వంచి నమస్కరిస్తున్నాను అని 40వ సర్గకు ప్రార్థనాశ్లోకం. మారీచుని వాక్యములకు రావణుడు ఇట్లు సమాధానం చెప్పాడు. సీతాపహరణం నివర్తింపచేసి రామునితో యుద్ధము చేయుటకు నన్ను ప్రవర్తింప చేయలేవు. రాముడు పాపశీలుడు మూర్ఖుడు. అందులోనూ మానవుడు. అట్టివానితో నేను యుద్ధం చేయుట ఏమిటి? అతని భార్యను అపహరించడమే అతనికి చేయవలసిన తగిన ప్రతీకారం. అడగని విషయం చెప్పుట నీకు తగదు. ఒక కార్యాన్ని నిశ్చయించునపుడు గుణాలేవి? దోషాలేవి? సాధించుటకుపాయాలేవి అని నిన్నడిగితే సమాధానం చెప్పాలి. నాకా విషయంలో తెలుసుకోవలసిందే లేనపుడు నీవిలా చెప్పుట తగదు అని అభిప్రాయము. రాజులను సేవించుట తెలిసినవాడు ప్రవర్తించవలసిన ఉపాయాన్ని రావణుడు బోధించాడు. హితం బోధించదలచినా గౌరవపురస్సరంగా చెప్పాలి. నేను చెప్పిన పని చేయుటకు నీ విచ్చగించకున్నా, నేను బలాత్కారంగా నీతో ఈ పని చేయిస్తాను అని అభిప్రాయం. మృగరూపంలో రాముని చేరికూడా దైవవశాన ప్రాణాలను దక్కించుకొనవచ్చును కాని నాతో విరోధం కల్గించుకొని జీవించజాలవు. కావున ఏది చేయవలెనో నీవే ఆలోచించి నిశ్చయించుకో అని అర్థం.

**యేన సర్వాత్మనాం వర్జ్యం ప్రాతికూల్యం హితైషిణామ్ ।**
**సర్వలోకానుకూలం తమాశ్రయే రఘునాయకమ్ ॥**

హితం కోరుకొనే వారందరూ ప్రాతికూల్యాన్ని విడిచిపెడతారు, సర్వలోకాలకు అనుకూలుడగు రఘునాయకుని ఆశ్రయిస్తాను. ఇది 41వ సర్గలో ప్రార్థనాశ్లోకం.

రామునికి ప్రతికూలంగా ప్రవర్తించుట ప్రారంభించినపుడే రావణుని రాజత్వం పోయిందని ముని ఆశయం. రామవిరోధంతో నీ నాశమును కోరువారెవరు? అని అభిప్రాయం. స్వామి దుర్గుణుడయితే ఒక అమాత్యులే నశించరు, ప్రజలు కూడా నశిస్తారు. ఇంతటి భయంకరకృత్యం నేను చేయవలసివచ్చుట నాకు విచారావహం కాదు. నేను ప్రమాదవశాన ఆపద పొందుతున్నాను. బుద్ధిపూర్వకంగా ఆపదను కొనితెచ్చుకొంటున్న నీ గురించే నా విచారము అని భావం. నీవు కూడా ఒకడవు కాక సైన్యంతో పాటుగా నశించుట కాకతాళీయంగా ఇంతటి ఘోరకృత్యానికి పాల్పడుతుంటివే అనియే నా బాధ. అయ్యో! దైవవశమున రాజుకు ఇంతటి అనర్థం సంభవిస్తున్నదే అని నేను విచారిస్తున్నాను, అని తాత్పర్యం. నీవు ఉండగా నాకు ఎట్టి ప్రమాదం సంభవిస్తుంది అనగా చెప్పుతున్నాడు. నన్ను వధించిన రాముడు ఆ వెంటనే నిన్ను కూడా వధించగలడు. నీకు శత్రువైన రామునితో మరణించుటవల్ల నేను కృతకృత్యుడనౌతాను. విశ్వామిత్రయాగరక్షణనుండి ఖరదూషణాదివధ వరకు అతిమానుషచరిత్రను తెలిసి తలచుచున్న నేను, అసాధారణ మహిమ కలవాడని తెలియుట వల్ల శ్రీరాముడు పరమపురుషుడు అని నిశ్చయించుకొన్న నేను అట్టి మహానుభావుని చేతిలో మరణించుట పరమపురుషార్థం. కావున నాకు సంతోషమే అని అభిప్రాయం. నృసింహపురాణమున ఇట్లు చెప్పబడింది.

**రామాదపి హి మర్తవ్యం మర్తవ్యం రావణాదపి ।**
**ఉభయోరపి మర్తవ్యే వరం రామాత్ న రావణాత్ ॥**

అని రామునితోనైనా రావణునితో నైనా మరణం తప్పనపుడు రామునితో మరణించుటే ఉత్తమం అని శ్లోకాభిప్రాయం. అకారణముగా నీతో మరణించుట కంటే శత్రుహస్తములో మరణించుట శ్రేయస్కరమని అభిప్రాయం.

**క్షణం క్షణార్ధమపి వా వియోగో యస్య దుఃఖదః ।**
**తమహం శిరసా వన్దే జానకీప్రాణవల్లభమ్ ॥**

క్షణకాలవియోగం కూడా దుస్సహమనిపించు సీతాప్రాణవల్లభుడగు శ్రీరాముని శిరసువంచి నమస్కరిస్తున్నాను అని 42వ సర్గలో ప్రార్థన. రావణాసురుడు మారీచునితో తన ప్రతిపాదనను అంగీకార పూర్వకంగా మాట్లాడుటవల్ల ఇపుడు నీవు మారీచుడను నామధేయానికి తగినరీతిగా మాటలాడావు. ఇంతవరకు నీవు దీనంగా భయంతో మాటలాడుటవల్ల రాక్షసాన్తర సామాన్యుడవు అని అభిప్రాయం.

పుష్పకవిమానము నధిరోహించి రావణమారీచులు నగరపట్టణాదులను చూస్తూ వెళ్ళుచుండినారు. నగరం అనగా 'నగాస్సన్తి ఏషు' అని వ్యుత్పత్తితో వృక్షములు చాలా ఉన్నవి, అనగా ఉద్యానములతో శోభించునవి నగరములు అని అభిప్రాయం. నగరపట్టణాది లక్షణములను వాస్తుశాస్త్రము ఇట్లు చెప్పబడింది.

**గ్రామశ్చ నగరం చైవ పట్టణం ఖర్వటం పురమ్ ।**
**ఖేటకం కుసుమం చైవ శిబిరం రాజవాసికమ్ ॥**

**సేనాముఖమితి త్వేవం దశధా కీర్తితం బుధైః ।**
**విప్రాణాం చ సభృత్యానాం వాసో గ్రామ ఇతీరితః ॥**

**స ఏవ విప్రైరాకీర్ణ స్త్వగ్రహార ఇతి స్మృతః ।**
**కుటుమ్బిభేదైరేకోనత్రింశద్భిశ్చ సమన్వితః ॥**

**అనేకనారీసమ్బద్ధం నానాశిల్ప జనైర్వృతమ్ ।**
**క్రయవిక్రయకైః కీర్ణం సర్వదేవైస్సమన్వితమ్ ॥**

**నగరం త్వితి విఖ్యాతం పట్టణం శృణు సామ్ప్రతమ్ ।**
**ద్వీపాంతరాగత ద్రవ్య క్రయవిక్రయకైర్యుతమ్ ॥**

**పట్టణం త్వబ్ధితీరే స్యాత్ తయోర్మిశ్రం తు ఖర్వటమ్ ।**
**క్రయవిక్రయకైర్యుక్తం నానాజాతిసమన్వితమ్ ॥**

**తంతు వాయసమాయుక్తం తత్పురం త్వితి కథ్యతే ।**
**ఏతైరధిష్ఠితం యత్తత్ ఖేటకం పరికీర్తితమ్ ॥**
**తేషామేవాన్తరేష్వేవ వాసః కుసుమముచ్యతే । ఇతి.**

గ్రామం, నగరం, పట్టణం, ఖర్వటం, పురం, ఖేటకం, కుసుమం, శిబిరం, రాజ వాసికం, సేనాముఖం అను నివాసాలను పది విధాలుగా పెద్దలు నిర్ణయించారు. సేవకుల బ్రాహ్మణుల నివాసం గ్రామమనబడుతుంది. కేవలం బ్రాహ్మణనివాసమయితే అగ్రహారమనబడుతుంది. కుటుంబ భేదములతో 29 కుటుంబాలతో అనేక నారీసంబద్ధమై నానాశిల్ప జనయుతమై క్రయవిక్రయసమాకీర్ణమై సర్వదేవతలతో కూడియుండేది నగరమన బడుతుంది. ఇక పట్టణమనగా ద్వీపాంతరముల నుండి వచ్చిన ద్రవ్యముల క్రయ విక్రయాలు కలది సముద్రతీరాన నున్నది పట్టణం. నగరపట్టణాల లక్షణాలు కలిసున్నది ఖర్వటం. ఇక క్రయ విక్రయాలు కలది, నానా జాతి సమన్వితం, తంతువాయ (సాలెవారు) సమన్వితం పురమనబడుతుంది. ఈ లక్షణాలన్నీ ఉన్నది ఖేటకమనబడుతుంది. వీటిలో కొన్ని మాత్రమే యున్నది కుసుమమనబడుతుంది.

శ్రీరాముని ఆశ్రమప్రాంతానికి వచ్చి రావణుడు మారీచునితో ఇచటికి వచ్చిన కార్యం సీతాపహరణాన్ని నిర్వహించగల మాయామృగరూపం పొందుమని ఆదేశించాడు. మారీచుడు మాయామృగరూపంతో సీతను చూడడానికి యోగ్యమైన స్థానం చేరాడు. అచట ఉన్న ఇతర మృగాలను ఆఘ్రాణిస్తూ తన రాక్షసభావం దాటుకొనుటకు అనగా మృగాలను వధించుట యందు కోరికయున్నా భక్షించకుండగా స్పృశిస్తూ మాత్రమే గడిపాడు. మాయా మృగమున్న ప్రాంతానికి పుష్పాలు కోస్తూ, వచ్చిన సీతను వాల్మీకి 'మదిరేక్షణా' 'రుచిరాననా' అను విశేషణాలతో వర్ణించడం చెప్పబోయే మృగానయనరూపకార్యానికి ఉపయోగించే ఉల్లాసం సూచించబడింది. ఇచట సీతను అరణ్యవాసానికి తగనిది అని చెప్పుట వనవాసవ్రతం త్వరలో ముగియనున్నదని త్వరగా ఈ మృగాన్ని పట్టుకోవాలన్న భావం సూచించబడింది.

**సీతాయాస్త్వేకనాథాయాః పూరయిష్యన్మనోరథమ్ ।**
**మాయామృగం యోఽనుయయౌ శ్రీరామం తముపాస్మహే ॥**

పతివ్రతయైన సీతమనోరథాన్ని నెరవేర్చడానికి మాయామృగాన్ని అనుసరించిన శ్రీరాముని ఆరాధిస్తాను అని 43వ సర్గలోని ధ్యాన శ్లోకం. మాయామృగాన్ని కొనితెమ్మని రాముని ప్రేరేపించిన సీత ఇట్లు తన ఇష్టపూర్తికి భర్తను ప్రేరేపించుట స్వేచ్ఛా వ్యాపారము, స్త్రీలకు తగని పని. ఇది చాలా అనర్థాలను తెస్తుంది. కైకేయి ప్రేరణవల్లే అని తెలిసినా ఈ మాయామృగానికి గల విలక్షణదేహాన్ని చూచి ఆశ్చర్యం కలిగి దీనిని దక్కించుకోవాలని నాకు కుతూహలం కలిగింది. మీకు కూడా ఇట్టి కుతూహలముంటే దీన్ని పట్టితెండు అని మొదట చేసిన ప్రేరణకు రూపం చెప్పుకొన్నదని తెలుసుకోవాలి. అందుకే రాముడు కూడా సీత ప్రేరేపించిందని కాక తనకు కూడా కుతూహలం కలిగిందని చెబుతున్నాడు. రాజులు మహావనంలో వేటతో వివిధ వస్తువులు సమాకూర్చుకొంటారు. వనంలో ధాతురూపాలుగా సంగ్రహించబడతాయి. ఆ ధనసారం నరులకు, నరపతులకు సంపదను పెంచేదిగా యుంటుంది. శుక్రుడు మనసులో ఆలోచించిన వస్తువులు ఎదుట సాక్షాత్కరించి సంపదను పెంచినట్లుగా అని భావం. లేదా మానవులు మనసులో ఊహించుకొన్న మనోరథార్థాలు ధనసంపదలు అన్నీ శుక్రుని ధనాగారాన్ని నింపునట్లుగా అని చెప్పవచ్చు. ఈ విషయమే మన భారతంలో ఉద్యోగపర్వంలో "మనుష్యేభ్యః సమాధత్తే, శుక్రశ్చిన్తార్జితమ్ ధనమ్" అని చెప్పబడింది. లేదా రాజు మొదలగు ధనవంతులకు ధనాగారాన్ని నింపే వన్యధనసారం శ్రేష్ఠంగా

పరిగణించబడుతుంది. గ్రామ పత్తనజనపదాదుల వల్ల లభించే ధనం కంటె వన్యధనం శ్రేష్ఠం అని భావం. అది అపూర్వం అగుటవల్ల శ్రేష్ఠం. కావున వనవాసం ముగించుకొన్న మనం ఈ వనంనుండి ఈ మృగాన్ని అపూర్వ మృగంగా అయోధ్యానగరానికి కొనిపోవాలని భావం. అయిననూ ఆలోచించి పనిచేయవలె కదా అంటే అందుబాటులో లేని అర్థాన్ని కోరేవాడు విచారించకనే ప్రవర్తిస్తాడు. సౌందర్యం వల్ల ఏర్పడిన ఉపకారలోపముతో మానవుడు అట్టి వస్తువును సాధించుటలోనే మనసు పడును అని నీతిశాస్త్రజ్ఞులు చెబుతారు అని భావం. ఒకవేళ యీ మృగం మారీచుని మాయయే అయితే అతణ్ణి వధించవలసినదే కదా? నేను మృగాన్ని కాని మృగచర్మాన్ని కాని తీసుకొని వచ్చేంతవరకు సావధానుడవై సీతను కాపాడు. మనం మన కర్తవ్యమంతా యీమెయందే ఆధారపడి యున్నది అనగా రావణవధాదికార్యాలు ఈమె మూలంగానే జరుగవలెనని భావం. ఈమెయే పూర్వం వేదవతిగా ఉండి రావణవధాదులను సంకల్పించిందని తాత్పర్యం.

**అజానన్నివ యో మాయాం మృగం కార్యాన్తరైకదృక్ ।**
**అనుసృత్య జఘానాశు తం లీలామానుషం భజే ॥**

ఏమీ తెలియని వానివలె రావణవధరూపకార్యాన్ని దృష్టిలో పెట్టుకొని మాయామృగాన్ని అనుసరించి వధించిన లీలామానుషరూపుడైన రాముని సేవిస్తాను అని 44వ సర్గలోని ధ్యాన శ్లోకం. మాయామృగం రాముని చాలాదూరం కొనిపోయి చిత్తమోహం కలిగించింది. దాని వల్ల కోపించి రాముడు బాణప్రయోగంతో మొదట మృగరూపశరీరాన్ని భేదించి తరువాత మారీచుని హృదయాన్ని దానిలోనున్న శరీరాన్ని భేదించాడు.

**అస్థానే భయశంకిన్యా జానక్యాపి సుహృజ్జనమ్ ।**
**ధిక్కృత్య చింతితం రామం నిత్యాపూర్వమహం భజే ॥**

అవకాశంలేని చోటకూడా ఆపదను శంకించిన సీత హితాన్ని ప్రియాన్నీ కోరి చేకూర్చు తన వారిని ధిక్కరించి చింతించిన రాముని నేను ఎల్లప్పుడు భజిస్తాను.

సీతాదేవి లక్ష్మణునితో రాముని విషయం తెలియటానికి వెళ్ళమని చెప్తూతూ శ్రీరాముని సేవయే ప్రధానంగా వచ్చిన నీవు రాముని ఆపదలో సహకరించాలి. రామునికి ప్రాణసంశయం కలిగితే ఈ ఆశ్రమంలో వుండి నేనేమి చేయాలి? రామునికి ఆపద కలిగిన తరువాత నన్ను రక్షించి కూడా ప్రయోజనం లేదని తాత్పర్యం. శ్రీరాముడు లేనిదే నేనొక క్షణం కూడా బ్రతుకజాలను అని అభిప్రాయం. సీతావాక్యములకు లక్ష్మణుడిట్లు బదులు పలికాడు. ఇది రాముని స్వరం కాదు. ఎవరో ఒకరు మాయతో చేసింది. ఇతరులు కూడా కాదు. ఇది మారీచుని మాయయే. ఈ మాయ గంధర్వనగరం వంటిది. గంధర్వనగరమనగా మేఘములయందారోపించబడిన భవనాదులుగా తెలుసుకోవాలి. అది ఒకసారి కనపడుతుంది. ఒకసారి కనపడదు. ఇట్లు వ్యామోహం కలిగిస్తుంది. ఇట్లు చిత్రవిచిత్ర వస్తురూపంగా కనపడుతూ వ్యామోహం కలిగించే ఒక శక్తియే మాయగా వ్యవహరించబడుతుంది. 'గంధర్వనగరం ప్రోక్తం ఇన్ద్రజాలం మనీషిభిః' అను నిఘంటు వాక్యము ఖరుని సంహరించినందువల్ల మనం రాక్షసులతో విరోధం కల్పించుకొన్నాము. కావున ఆ రాక్షసులు పలువిధాలుగా మాటలు పలుకుతుంటారు. మనల్ని మోహింపచేస్తారు.

అతిబలవంతులగు రాక్షసులు ఘోరయుద్ధం చేసికూడా గెలువజాలనందున మాయావులగు హింసావిహారులుగా నుండువారు ఇట్టి పలుకులు వినిపించి మోహింప చేస్తారు అని భావము.

అంత కఠినంగా మాట్లాడి విలపిస్తున్న సీతను లక్ష్మణుడు ఓదార్చలేదు. సీత కూడా లక్ష్మణునితో ఏమీ మాటలాడలేదు. ఓదార్పు మిషతో వెళ్ళుటకు ఆలోచించుకొని కోపంతోనూ ఏమీ మాటలాడలేదని అభిప్రాయం. అలా బయలుదేరిన లక్ష్మణుడు మాటిమాటికి సీతను చూస్తూ అనగా రాముడు లేకుండగా ఒంటిగా ఈమెను విడిచి ఎలా వెడలాలి అని చూస్తూండెనని తాత్పర్యం.

ఇక లక్ష్మణునితో పరుషంగా మాట్లాడుటవల్ల కలుగు ఫలమును పదుకొండు సర్గలలో చెప్పుచున్నారు. 46వ సర్గలో రావణప్రలోభాన్ని చెబుతున్నారు. ఇట్లు బయలుదేరిన లక్ష్మణునకు సీతను ఒంటిగా విడువజాలక అడుగులు వెనుకకు లాగుతున్నాయి. త్వరగా శ్రీరాముని చేరాలి అని ముందుకు పడుతున్నాయి. అని 'న చిరాదివ' అను చోట ఇవ శబ్దము సూచిస్తున్నది. ఈ అవకాశానికై ఎదురుచూస్తున్న రావణుడు యతిరూపధారణము చేసి వచ్చెను. ధర్మప్రధానమైన జనకకులమున ఉద్భవించిన సీతాదేవి విశ్వసించుటకు యతిరూపం ధరించాడని తెలియవలయును. ఆంగీరసస్మృతిలో యతిలక్షణమిట్లు చెప్పబడింది.

**యతేర్లింగం ప్రవక్ష్యామి యేనాసౌ లక్ష్యతే యతిః ।**
**బ్రహ్మసూత్రం త్రిదణ్డం చ వస్త్రం జన్తునివారణమ్ ॥**

**శిక్యం పాత్రం బృసీ చైవ కౌపీనం కటివేష్టనమ్ ।**
**యస్యైతద్విద్యతే లింగం స యతిర్నేతరో యతిః ॥**

అని చెప్పబడిన యతివేషంతో రావణుడొచ్చాడని గ్రహించాలి. ఇచట అంగారకుడు రోహిణిని చూచినట్లు అని పోలిక చెప్పుటవల్ల రోహిణీనక్షత్రాన్ని క్రూరగ్రహం చూచుట లోకానర్థకరమైనట్లు రావణుడు సీతాదేవిని చూచుట కూడా లోకానర్థకరమని అభిప్రాయం. ఇచట రావణుడు సీతను చేరిన క్రమాన్ని ఇలా చెప్పియున్నారు. మొదట సీతోద్దేశ్యంగా గమనం, తరువాత ఆశ్రమసమీపానికి గమనం, ఆ తరువాత సీతాదర్శనం, ఆ తరువాత సీతకు సమీపంగా వెళ్ళుట. ఇపుడు సీతకు ఎదురుగా వెళ్ళుట. రాముని ఆర్తనాదం వినుట వల్ల వెలుపల, లోపల దిగులుతో నున్నది సీతమ్మ.

సీతమ్మ కమలమాలను ధరించింది అని చెప్పుట పద్మాలను బోలిన ముఖనయనపాణిపాద విశిష్టురాలు గాన అని తెలియాలి. సీతను చూచిన రావణుడు ఆమె దివ్యరూపం చూచి ఇట్టి లోకోత్తర సౌందర్యవతి అరణ్యంలో ఎందుకున్నది అని ఆలోచన కూడా కలుగనంతగా ఉన్మత్తుడైనాడు అనుచున్నాడు. ఇచట సీతను రావణుడు నీవెవరు? అని ప్రశ్నించుట ఆమె ఎవరో తెలుసుకోవటానికి కాదు. ఏదో రీతిలో ప్రశస్తగుణాలు కల యువతితో మాటలాడడానికి ఒక వ్యాజమని తెలియాలి. సీతాదేవి జనకవంశజాత కావున ఆతిథ్యవిధానం చక్కగా తెలిసింది. కావున రావణుని కపటవేషం తెలిసినా సన్యాసివేషం ధరించియున్న వానిని ద్వేషించరాదని శాస్త్రం. "కాషాయ దణ్డమాత్రేణ యతిః పూజ్యో న సంశయ" అని చెప్పుటవల్ల ఆతిథ్యానికి ఆహ్వానించింది. 'యతీనాం పూజనం

కార్యం, స్త్రియా వా పురుషేణ వా' అని కూడా చెప్పబడియున్నది. కావున సీత యతివేషధారిని పూజించింది అని భావం.

ఇక సీతారావణసంవాదం వినుటవలన సకల పాపరాశి పీడ తొలగునని స్కాన్దమున ఫలశ్రుతి ఇట్లు వివరించబడినది.

**సీతారావణసంవాదం యే శృణ్వన్తి నరోత్తమాః ।**
**న తేషాం పాపరాశిభ్యః పీడా లోకే భవిష్యతి ॥**

అని. ఇక 47వ సర్గలో మైథిలి నిజాయితీతో కపటంలేకుండగా తనస్వరూపం తెలిపి రావణాసురుని కపటం తెలియుట వల్ల తన పాతివ్రత్యానికి తగిన రీతిలో రావణుని నిందిస్తున్నది. రావణాసురుడు కపటంతో అడిగిననూ యతిచిహ్నాలు చూచి తన యథార్థవృత్తాన్తం తెలిపిందని తెలియాలి. అయోధ్యలో 12సంవత్సరములు మానుషభోగాలననుభవించి అని సీత తెలిపినది. ఇచట మానుషభోగాలనగా మనుష్యునిగా అవతరించిన రామునిచేత ఏర్పరచబడిన భోగాలను అని అర్థం. లేదా 'భుంజానా మానుషాన్' అనునపుడు 'అమానుషాన్' అని అకార ప్రశ్లేషతో విభజించి దివ్యభోగాలను అని తెలుసుకోవాలి. మనుష్య దుర్లభాలైన భోగాలను అనికాని చెప్పుకొనవచ్చు. కైక రాజును వరములడిగినా నాభర్త వనవాసానికి తగినవాడు కాదు బాలుడు, సుగుణరాశి కావున అని తెలియవలయును.

ఇచట సీతాదేవి చెప్పిన వయస్సు అరణ్యానికి బయలుదేరు సమయంలో అని గ్రహించాలి.

రాముని వయస్సు – 25, నా వయస్సు – 18 రాముడు పుట్టిన తరువాత 12వ యేట విశ్వామిత్రుడు వచ్చుట యాగరక్షణం, ధనుర్భంగం సీతాకళ్యాణం.

ఆ తరువాత 12 సంవత్సరాలు సీతతో కలిసి అయోధ్యలో భోగానుభవం, 13వ యేట యౌవరాజ్యాభిషేక యత్నారంభం, వనగమనం. ఇట్లు వనవాస ప్రారంభసమయంలో రాముని వయస్సు 25. వనంలో ప్రవేశించి మునుల ఆశ్రమాలలో 10 సంవత్సరముల నివాసం. పంచవటిలో 3 సంవత్సరాలు నివాసము. 14వ యేట సీతాపహరణం.

ఇక భూమినుండి ఆవిర్భవించిన తరువాత ఆరేండ్లు మిథిలానగరంలో నివాసం. వివాహానన్తరం అయోధ్యలో 12సంవత్సరములు రామునితో భోగానుభవం. ఇట్లు వనవాసారంభమున సీతాదేవి వయస్సు 18 అని సీతావాక్యం. ఈ విషయమును బాలకాండలో 'ఊనషోడశవర్షో మే' అను దశరథవాక్యమున విస్తృతంగా వివరించాము. ఇక ఇపుడు రాముని వయస్సు 38. సీత వయస్సు 31 అని అభిప్రాయం. ఇచట సీతావాక్యంలో 'మమ భర్తా' అను శ్లోకంలో భకారము గాయత్రీమన్త్రములోని తొమ్మిదవ అక్షరంగా తెలియవలయును. అనగా ఇంతవరకు 8000 ల శ్లోకములు అయిపోయాయి. ఇది 8001వ శ్లోకమని తాత్పర్యం. ఇట్లు రాముని వయస్సు చెప్పుటతో చక్కని నవయౌవనంలోనున్నవాడు కాన వనవాసానికి తగినవాడు కాదు. అట్లే ఉత్తమగుణ భూయిష్ఠుడు కాన రాజ్యంనుండి

బయటకు పంప తగదు అని సీతమ్మ వివరించింది. ఇటువంటి వానిని ఎందుకు అడవికి పంపాడు అనగా దశరథుడు కామార్తుడు కావున కైకేయి అనుమతిలేనిదే అభిషేకించలేకపోయాడు. కైకేయికి ప్రియం చేయువాడనని ప్రతిజ్ఞచేశాడుగాన, చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చుటకు రాముని అరణ్యానికి పంపాడు. కైకకట్లు ప్రతిజ్ఞచేయడానికి కారణం కామార్తత్వమని తెలియాలి. కామార్తుడు కాన నీకు ప్రియమునే ఆచరిస్తానని ప్రతిజ్ఞ చేసి, ఆ కైక రామారణ్యవాసం కోరగా ప్రతిజ్ఞాభంగం చేయజాలక రామాభిషేకమును చేయజాలకపోయాడు అని అభిప్రాయం.

రాముడు అకుతోభయుడు. అనగా రాజ్యత్యాగానికి కాని వనవాసానికి కాని భయపడనివాడు అని అర్థం. రాముడు దృఢవ్రతుడు. అనగా తప్పక పరిపాలించవలసిన వ్రతాన్ని తెలుపుతున్నారు. దద్యాత్ ఈయవలెను అనగా యాచకులడిగినంత ఇచ్చువాడని, 'న ప్రతిగృహ్ణీయాత్' అనగా అవాప్తసమస్త కామత్వం సూచించబడింది. ఇట్లు తన విషయమంతా వివరించి రావణుని కులగోత్రాలను అడిగింది. సన్యాసిని కులగోత్రాలడుగుట తగునా? దండకారణ్యంలో ఒంటిగా ఎందుకు తిరుగుతున్నావు అని కూడా అడుగరాదు కదా! ఒంటిగా సంచరించడం యతిధర్మమే కదా! ఇట్లు అడుగుట అసంగతం కాదా అనగా చెబుతున్నారు. కులగోత్రనామాలు పూర్వాశ్రమానికి సంబంధించినవిగా తెలియాలి. భిక్షకొరకు గ్రామం ప్రవేశించాలి. అని శ్రుతి చెబుతున్నది గాన భిక్షువు గ్రామానికి సమీపంలో నున్న అరణ్యమున నివసించవలయును కాని గ్రామమన్న మాటేలేని దుర్గమారణ్యంలో భిక్షనిచ్చు జనులులేని అరణ్యంలో ఎందుకు సంచరిస్తున్నావని అడుగుట యుక్తమే అని సమాధానం. సీత ప్రశ్నించిన వెంటనే తనవైభవాన్ని ప్రకటించుకొనే అవసరం లభించినందున త్వరగా అను అర్థమున 'తీవ్రం' అని ప్రయోగించెను అని గ్రహించాలి.

హిరణ్యవర్ణ అయిన నిన్ను చూచిన నాకు నా దారలలో రతిని పొందలేకున్నాను అనునది కథాపరమైన అర్థం. వాస్తవముగా నా ఇష్టదేవతవైన నిన్ను చూచిన నేను నా దారాపుత్రమిత్రాదులలో ఇష్టం కోల్పోయాను. నీదర్శనముతో ఆనన్దపూర్ణుడైన నేను అన్నిటిని విడిచాను అని తాత్పర్యం.

సీతాదేవి రావణాసురుని వాక్యాలకు సమాధానంగా తాను రాముని అనుసరించి ఆశ్రయించియున్నదానను అని చెబుతూ రాముని 'న్యగ్రోధ పరిమండలం' అని చెప్పియున్నది. న్యగ్రోధమనగా వటవృక్షము. వటవృక్షం బహుశాఖలు ఊడలు వలె ఆశ్రయజనబాహుల్యం కలవాడని అందరిచేత ఆశ్రయించదగినవాడని లేదా

**కూపోదకం వటచ్ఛాయా యువతీనాం స్తనద్వయమ్ ।**
**శీతకాలే భవత్యుష్ణం ఉష్ణకాలే చ శీతలమ్ ॥**

అని చెప్పినట్లుగా అన్ని కాలాలలో అందరికీ అనుకూలుడైనవాడని తాత్పర్యం. నన్ను నీవు హరించినా నేను జీర్ణం కాను. నీకు మరణం సంభవిస్తుంది కూడా అని చెబుతున్నారు.

ఇలా పలుకుతున్న సీతను రావణాసురుడు ఛేదిస్తున్నాడు. 48వ సర్గలో. రాజపుత్రీ! నీవు నాతో పాటు లంకలో నివసించి మానుషభోగాలను దివ్యభోగాలను అనుభవిస్తూ రాముని స్మరించజాలవు అని చెప్పడం సీత చెప్పిన మానుషభోగాలకు సమాధానంగా తెలియాలి. ఇక రాముడు తనకంటే గొప్పవాడు అని చెప్పిన సీతావాక్యాలకు

సమాధానం చెబుతున్నాడు. ప్రియపుత్రుడగు భరతుని రాజ్యంలో స్థాపించి రాముని రాజ్యంనుండి అరణ్యానికి పంపుటవల్ల రాముడు పెద్దకుమారుడైనా అతని అల్పవీర్యత్వం స్ఫుటమవుతున్నది. అంతేకాదు 'గత చేతసా' అనగా కర్తవ్యాకర్తవ్యాలు నిశ్చయించజాలని మూఢుడని అర్థం. అందుకే తాపసుడు, 'భగ్నాః కృషేర్భాగవతా భవన్తి' అని చెప్పినట్లుగా శూరుడుకాని క్షత్రియుడు తాపసుడవుతాడు అని భావం. తాపసుడు అని చెప్పుటవల్ల ఇక ముందుకూడా రాజ్యం పొందగలడను ఆశ లేదు అని అభిప్రాయం. నేను సకల రాక్షసులకు ప్రభువును. నీవంటివారు ప్రార్థించవలసిన నేను స్వయంగా నిన్ను చేరాను. కామం వల్ల అర్థినయ్యాను. అట్టి నన్ను తిరస్కరించతగవు అని అంటున్నాడు.

'రామస్య మానుషస్య గతాయుషః' అను వాక్యానికి మహేశ్వరతీర్థవ్యాఖ్యానమిట్లు చెప్పబడింది. మానవ రూపంగా అవతరించినవాడు గతాయుషః అనగా 'గతం ప్రాప్తం అంగీకృతం' అని అంగీకరించిన 11వేల సంవత్సరాల ఆయుష్యం కలవాడు. రామస్య భగవంతుడగు శ్రీమన్నారాయణసంబన్ధి అని తాత్పర్యం. ఈ వ్యాఖ్యానంలో మందవీర్య పదం భరతాన్వయి. అట్లే స్థాపయిత్వా ప్రియం పుత్రం, అనుచోట అకారప్రశ్లేషతో 'అప్రియం పుత్రం' అని విభజించి అప్రియుడైనను భరతుని అంతర్యామిప్రేరణతో రాజ్యంలో నియమించి, ఆ అంతర్యామిప్రేరణతో 'జ్యేష్ఠం' అనగా శ్రీమన్నారాయణుని అని వ్యాఖ్యానం. 'జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః' అని సహస్ర నామాలలో జ్యేష్ఠనామం ప్రసిద్ధం కదా! సకల రాక్షసులను సంహరించుటకు వనానికి పంపాడు అని అర్థం. భ్రష్టరాజ్యేన అనగా 'భ్రష్టం అరీణాం రాజ్యం' అని వ్యాఖ్యానం. శత్రురాజ్యభ్రంశం గావించినవాడు గత చేతసా అనగా మాయోపాధిక ఈశ్వరుడు అని శ్రీరామునికి అనగా నారాయణునకు అంతఃకరణముండదు గాన గత చేతసుడు అంటున్నారు. "న తస్య కార్యం కరణం చ విద్యతే" అని కదా శ్రుతివాక్యం. తాపసేన అనగా 'తాపసానాం ఇనః తేన సహ తపస్వీ' తాపసభాస్కరుడగు శ్రీరాముడు నావాడుకదా! అతనితో నీవేమి చేస్తావు? అని తాత్పర్యం. నీకు భృత్యుడను కావలెనను కోరికతో నీవద్దకు వచ్చినవానిని మన్మథ శరావిష్ట జనుని వలె నా ఇష్టదేవతవైన నీవు ఇలా పలుకరాదు. ఊర్వశి శబ్దానికి 'ఉరూన్ వశీకరోతి' అను వ్యుత్పత్తితో గొప్ప గొప్పవారిని వశం చేసుకొనినది అని తాత్పర్యం. తనకు తానుగా ప్రార్థించిన పురూరవుని తిరస్కరించిన ఊర్వశి తరువాత పశ్చాత్తాపం పొందిందని పౌరాణిక గాథ. ఏకాన్తం రాగమును కలిగించడానికి యోగ్యమగు ప్రదేశం. అట్టి చోటకూడా పరుషంగా మాటలాడింది. ఆహా ఇది కదా సీతాదేవిపాతివ్రత్యము అని వాల్మీకి ఆశ్చర్యం చెందుతున్నాడు. పుణ్యాత్ముడవగు కుబేరునికి సోదరుడవై ఇట్టి పాపమునెలా చేస్తున్నావని భావం.

"అంగుళ్యా న సమో రామో మమ యుద్ధే స మానుషః" రాముడు లేకుండగా లంకకు వచ్చుటకు ఇష్టపడని సీతతో రావణుని మాట ఇది. యుద్ధే రాముని అంగుళితో సముడెవ్వడూ లేడు. అట్టి రాముడు శ్రీమన్నారాయణుడే, మానవునిగా అవతరించియున్నాడు. నా అదృష్టవశాన అచటికి చేరిన రాముని నీవు సేవించు అని అన్వయం. ఇక కథాపరమైన అర్థము. అంగుళబలముతో కూడా సముడు కాడు. కావున నేను అపహరించుకొని పోయిన నిన్ను మరల రాముడు వచ్చి తేగలడని భావించరాదని తాత్పర్యం.

నీవు వైశ్రవణుని సోదరునిగా చెప్పుకొంటూ ఇట్టి నీచమైన పనిచేయడం తగదు. అనగా నీవు నీవంశంగా పేర్కొన్నది అసత్యమని తాత్పర్యం. ఇట్టి రాజుంటే ప్రజలందరూ నశిస్తారు. ఇక నావంటి దానిని అపహరిస్తే సర్వజీవితచ్ఛేదమని అభిప్రాయం. 'పీతామృతస్యాపి తవాస్తి మోక్షః' అనగా నీవు అతిమలినాన్తఃకరణుడవుగాన జ్ఞానంతో మాత్రమే లభించే మోక్షం నీకు లభించదు అని భావం.

**యశ్చిన్తనీయస్సతత మాపత్సు పరమాసు చ ।**
**నాన్యోఽస్తి చిన్తనీయస్తం సీతాపతిముపాస్మహే ॥**

పరమాత్మలలో కూడా ఇతరు లెవ్వరూ కాక ఎపుడూ చింతించదగిన శ్రీ సీతాపతిని నేను ఉపాసిస్తానని 49వ సర్గలోని ధ్యానం.

మహాపుణ్యాత్ముడు పరమ భాగవతోత్తముడగు శ్రీహనుమంతుడు కూడా మరియొక రూపం స్వీకరించేటపుడు ఆగ్రహించుట చూడబడింది కాన ఆగ్రహం లేకుండగా క్రూరరూపం స్వీకరించడం తగదు గాన రావణుడు కూడా దేవీసమీపమున (ముందు)కపటం తగదుగాన సీతాదేవికి తన నిజరూపం చూపుటకు తన సామర్థ్యాన్ని ప్రశంసించుకొంటూ నిజరూపం స్వీకరిస్తున్నాడు.

మహిషాసురాదులు స్త్రీ చేతనే సంహరింపబడ్డారు. కావున నేను అపహరించే సమయంలో ఈమె కూడా క్రౌర్యాన్ని అవలంబించునో ఏమో ముందుగా తానే క్రూరరూపాన్ని మహారూపాన్ని స్వీకరిస్తానని భావం. కపటంగానైనా శాంతస్వభావం గల యతివేషం ధరించుటవల్ల రావణుడనైనా యతివేషం క్రూరస్వభావప్రతిబన్ధకం కాన తాను సీతాదేవిని హరించుటకే నిశ్చయించుకొనుటవల్ల స్వస్వరూపం గ్రహించుట అని తెలియవలయును. చేతిలో చేతితో కొట్టుట ఈ వేషం నాకు ప్రతిబన్ధకమని సూచించుటకే.

'స్వం రూపం కాలరూపాభం భేజే వైశ్రవణానుజః' ఇచట 'వైశ్రవణానుజః' అనుటవలన జన్మకారణము సమానమైనా ఇద్దరి స్వభావంలో ఎంతభేదము అను ఆశ్చర్యం వ్యక్తమవుతున్నది. రావణాసురుని వాక్యాలకు వాస్తవార్థం ఇట్లు తెలియవలెను. శుశ్రూషాదులతో భరించువాడు భర్త అని అభిప్రాయం. ఇచట భర్తృశబ్దమునకు భృత్యుడని అర్థము. నేను రాక్షసులకు స్వామి అయినా నీకు తగిన భృత్యుడనే కావున లోకత్రయంలో ప్రసిద్ధిగాంచిన నన్ను భృత్యునిగా అంగీకరించు. నేను చాలా కాలం నుండి నీకు శుశ్రూషాదులతో ప్రీతి కలిగించువాడను. స్వామిద్వారపాలకుడైన జయుడే రావణరూపంగా ఉద్భవించాడు గదా. కావున నన్ను భృత్యునిగా అంగీకరించు. మానవులనే రక్షించవలెను అని భావించకు. కృపతో భేదభావం మరిచినదానా! పండితుడనని భావిస్తున్న రాక్షసభృత్యుడనగు నాయందు కూడా ఇతను రక్షించదగినవాడే అని తలచుము అని భావం.

రాముని రాజ్యాచ్చ్యుతం అసిద్ధార్థం పరిమితాయుష్కం అను రావణుని మాటలకు వాస్తవార్థము ఇట్లు చెబుతున్నారు. 'రాజ్యాచ్చ్యుతం' అనగా రాజ్యభోగములను తుచ్ఛీకరించినవాడు అని, 'అసిద్ధార్థుడు' అనగా అవాప్తసమస్తకాముడు, 'పరిమితాయుషం' అనగా పరిగతం అల్పం ఆయుః అను వ్యుత్పత్తిచే అల్పాయువును విడిచినవాడు అనగా అపరిమితాయుష్యం కలవాడు. ఏ గుణాలతో అతనిని వరిస్తున్నావు అనగా అనిర్వచనీయ

గుణాలు కలవాడు అని ,'దుర్మతి'ః అనగా దుష్టులలో కూడా అనుగ్రహించు బుద్ధికలవాడు. 'బుధః ఖే రోహిణీం యథా' అనుటకు ఇది భావం. బుధుడు తన తల్లియైన రోహిణిని పూజించడానికి స్వీకరించినట్లు రావణుడు కూడా తన తల్లియైన సీతాదేవిని స్వీకరించాడని తాత్పర్యం. అనగా రావణుడు సీతాదేవిని తన ఇంటిలో ప్రతిష్ఠించి తన ఇష్టదేవతగా ఆరాధించుటకే అని గ్రహించాలి.

నలకూబరవేదవత్యాదులశాపముండగా రావణాసురుడు పరదారయైన సీతాదేవి నెట్లు స్పృశించాడు. అనగా రావణాసురుడు సీతాదేవిని సాక్షాత్తుగా స్పృశించలేదు. జానుకేశాదిచ్ఛాయనే గ్రహించాడు. రాక్షసులు ఛాయను గ్రహించగలరు. ఈ విషయమే స్కాన్దమున ఇట్లు చెప్పబడింది.

**ఛాయాగ్రాహిత్వమప్యస్తి సర్వవిద్యావిశారదే ।**
**కేశచ్ఛాయాం పరామృశ్య జానుచ్ఛాయాం తథైవ చ ॥**

**గృహీత్వా జానకీం హృష్టో లంకాం ప్రాయాత్స రావణః ।**
**సీతాపహరణం చైవ యే శృణ్వన్తి నరోత్తమాః ।**

**న తేషామశుభం దేవి భవిష్యతి కదాచన ॥**

అని ఛాయాగ్రహణమే చేశాడు కాని సాక్షాత్ స్పర్శ కాదని స్కాన్దోక్తి. అట్లే సీతాపహరణ గాథను వినిన వారికి ఎపుడూ అశుభం కలుగదని స్కాన్దమున ఫలశ్రుతి వివరించబడింది.

ఇట్లు క్రూరంగా ప్రవర్తించిన రావణాసురుని సీతాదేవి సద్యోమరణం పొందుమని ఎందుకు శపించలేదు అనగా వేదవతి రావణాసురుడు ఒకడు గాక సమూలనాశమును ప్రతిజ్ఞ చేసినందువల్ల, రాముడు కూడా దేవతల ముందు ఋషుల ముందు అట్లు ప్రతిజ్ఞ చేసినందున ఒక్కరావణుని మరణముతో ఆ ప్రతిజ్ఞ నెరవేరదని సమాధానం.

దక్షిణ కరముతో మూర్ధజాలు అనగా కేశాలు వామకరముతో 'ఊర్వోః' అనగా పాదయోః అని తిలక వ్యాఖ్యానం. పాదాలు పట్టుకొని లంకకు రావలయునని ప్రార్థించాడని తాత్పర్యం. ఇచట పరుషవాక్యాలతో రావణుడు ప్రవర్తించెననగా నన్ను భృత్యునిగా అంగీకరిస్తే నీముందు ప్రాణాలను విడిచెదను అని బెదిరిస్తూ రథమునధిరోహింప చేశాడని అభిప్రాయం. వాస్తవంగా సీత పలికిన దైన్యవాక్యాలన్నీ లౌకికరీతిని అనుసరించి పలికినవిగా తెలియవలెను. ఆమె ఆక్రోశం కూడా మానుషభావం సూచించుటకు మాత్రమే. ఇచట సీతను 'మత్తేవ భ్రాన్త చిత్తా యథా ఆయరా యథా' అని ఇక యథా శబ్దములను ప్రయోగించుట వల్ల వలె చెప్పుట వలన సీతాచేష్టలన్నీ నటన అని సూచింపబడు చున్నది అని.

వనంలో రాక్షసాదులు హరింతురనే నన్ను కైక వనానికి పంపియుండును. అని సీత మనసులో ఎప్పటి నుండియో ఉన్నమాటకే 'సుప్తప్రమత్తకుపితానాం భావజ్ఞానం దృష్టం' అనే న్యాయానుసారంగా ఇపుడు పలికిందని తెలియాలి. ఇక ఇపుడు చిత్తవిభ్రమంతో రామునికి రావణాపహరణమును తెలుపుమని అచేతనములను కూడా ప్రార్థిస్తున్నది. ఇచట ఏడు శ్లోకాలలో రామునికి ప్రాణముల కన్నా ప్రియురాలిగా నున్న నన్ను రావణుడు హరిస్తున్నాడని

రావణునికి భయపడకుండా రామునికి తెలుపుదని చెబుతున్నది. జటాయువునకు కూడా ఇట్లే చెప్పింది. రావణుడు అతిబలవంతుడు, నీవు గెలువజాలవు. కావున రామునకు తెలుపు అని.

ఇక 50, 51 సర్గలలో స్వామివిషయంలో దాసుడు యథాశక్తి దాస్యం నాచరించాలి అను విషయాన్ని లోకంలో ప్రవర్తింప చేయటానికి జటాయువృత్తాన్తాన్ని వర్ణిస్తున్నారు. మొదట జటాయువు సాన్త్వన భర్త్సనాలతో రావణుని మార్చుటకు చేసిన ప్రయత్నం తెలుపబడింది. జటాయువు మొదట మహాశరీరము కల రావణుని దర్శించాడు. తరువాత సీతను చూచాడు. ఇచట జటాయువును వాల్మీకి మహర్షి 'వనస్పతి గతశ్రీమాన్' అన్నాడు. శ్రీమచ్ఛబ్ద ప్రయోగమునకు కైంకర్య శ్రీసమృద్ధుడని తాత్పర్యము.

రావణాసురునితో జటాయువు అన్న మాటలు "నేను పురాణధర్మంలో నున్నవాడను. సత్యసంశ్రయుడను" అని. ఇచట పురాణధర్మమనగా సనాతనధర్మమని అనగా దాస్యవృత్తి అని తాత్పర్యం. సత్యసంశ్రయుడను అనగా 'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' అను శ్రుత్యనుసారం సత్యమనగా పరబ్రహ్మ. పరబ్రహ్మయే ఆలంబనంగా గలవాడను అని తాత్పర్యం. భగవదేకోపాయనిష్ఠుడని భావం. దాసుడను నేనుండగా నీవు సీతనపహరించుట యుక్తం కాదు అని అభిప్రాయం. ఇట్లు తన స్వరూపాన్ని చెప్పి స్వామిస్వరూపాన్ని చెప్పుతున్నాడు. "రాముడు సర్వలోకానికి స్వామి. అనగా నీకు కూడా స్వామి" యని. కావున రాజదారాపహరణం యుక్తం కాదని అభిప్రాయం. రామునిపై నీకు స్వామిత్వభావన లేకున్నా మనుష్యమాత్రభావన లేదా రాజభావననైనా చేసి సీతను విడిచిపెట్టు అని తాత్పర్యం. నీవు రాముని రాజుగా భావించకున్నా పరదారాభిమర్శనం చేయరానిది కదా! కావున పరదారాభిమర్శనబుద్ధిని మాను, సామాన్యులే చేయతగని పనిని రాజు బొత్తిగా చేయరాదు కదా! ఇచట స్వార్థానికి కాదు. లోకానుగ్రహానికైనా దీనిని చేయరాదు. రాజుననుసరించియే లోకులు ధర్మాదులందు ప్రవర్తిస్తారు కదా! కావున రాజు పాపాలను విడచి ధర్మమునే ఆచరించాలి అని అభిప్రాయం. పరమరహస్యము శాస్త్రపర్యాలోచన చేసినా సూక్ష్మదృష్టి లేనివారికి తెలియశక్యము కాదు కదా! మోక్షధర్మాదిజ్ఞానసంపత్తికల రాజును అనుసరించే చక్కగా బోధపడకున్నా ప్రజలు ఆచరిస్తారు. ఇట్లు ప్రజలకు ధర్మముపదేశించవలసిన రాజులు అధర్మము నాచరించరాదని తాత్పర్యం. ఇట్లు పరదారాభిమర్శనం ఐశ్వర్యంనుండి భ్రష్టుని చేయును అనికూడా చెబుతున్నారు. ఇట్లు ఇన్ని ఉపదేశించినా సీతను విడిచిపెట్టనందున నీవంటివానికి ఉపదేశం వ్యర్థమంటున్నాడు. ఒకవేళ శత్రుభార్యాపహరణం నా స్వభావం అన్నా ఇచట శత్రుప్రసక్తియే లేదు. అతను నీ విషయంలో ఏ అపరాధమూ చేయనపుడు శత్రుప్రసక్తి ఎక్కడిది? ఖరవధ అపరాధము కాదా అనగా ఖరుడు అతిగా ప్రవర్తించినందున వధించబడ్డాడు. ఇందులో రాముని తప్పేమిటి? వస్త్రబద్ధమైన సర్పం కాటు వేసి నశింపచేయునట్లు నీచే అపహరించబడిన సీత నిన్ను నశింపచేస్తుంది అని అభిప్రాయం. కామస్వభావుడైన వాని స్వభావం మార్చరానిది. "ధర్మేణ పాపమపనుదతి" అను శ్రుతివాక్యముతో కామస్వభావనివృత్తిపరంగా బోధించబడిన ధర్మం పాపులలో నుండదు. కావున పాపుల స్వభావం మార్చజాలం.

స్వతః ప్రమాణభూతమైన శ్రుతిని వేదవిత్తు సమక్షంలో న్యాయసిద్ధి హేతువులతో శ్రుత్యర్థము ఇతరార్థ పరంగా వ్యాఖ్యానించ జాలనట్లుగా ఒకవేళ వేదశ్రుతికి అన్యార్థాన్ని లేదా అపార్థాన్ని చెప్పితే తానే నశించునట్లు

అపహరించ శక్యం కాని సీతను అపహరిస్తే నీవే నశిస్తావని తాత్పర్యం. వేదార్థం చక్కగా తెలిసినవాడు వేదశ్రుతికి విపరీతార్థం కల్పించుటను అనగా "న సురాం పిబేత్" అను నిత్యనిరపేక్షమగు శ్రుతికి సుర గొనిపోదగినది. ద్రవద్రవ్యము కావున పాలవలె అను తర్కసహితహేతువులతో అపార్థమును సహించజాలక తన శక్త్యనుగుణముగా నివర్తింప చేయునట్లు నేను కూడా బలాత్కారముగా అపహరిస్తున్న సీతను నాశక్తి కొలది నివర్తింప చేస్తాను అని భావము.

నీవు శూరుడవైతే నాతో యుద్ధం చేయుము. లేదా రాముడు వచ్చువరకూ నిలువు. అపుడు రామునిచే వధింపబడతావు. ఒకవేళ నీవు శూరుడవైతే రాముడొచ్చు వరకు ఆగి రామునితో యుద్ధం చేయుము. రాముడు వచ్చువరకూ నిలిస్తే రాముడు తనకు చేసిన అపరాధానికి ప్రతీకారమే కాక తనవారలైన దేవఋష్యాదులకు చేసిన అపరాధానికి కూడా ప్రతీకారం చేయగలడు అని భావం. ఇలా చెప్పుచున్నా పలాయనము చేయుచున్న రావణునికి మరల బోధిస్తున్నాడు.

ఇక యాబది యొకటవ సర్గలో స్వామికార్యం కొరకు జటాయువు చేయు ప్రాణత్యాగాన్ని వర్ణిస్తున్నారు. యాబది రెండవ సర్గలో యుద్ధకాలంలో విడిచిన సీతను రావణుడు మరల గొనిపోవుటను చెబుతున్నారు. జటాయువును వధించిన రావణుడు సీతను మరల అపహరించే ప్రయత్నంలో ఉండగా సీత విలపిస్తూ నా అపహరణప్రయత్నాన్ని సూచించే శకునాలు నిమిత్తాలు లక్షణమూ నీకు కనపడుతున్నా నీకు తెలియడంలేదు అని శ్రీరాముని యుద్దేశించి మాటలాడుతున్నది.

రావణాసురుడు సీతను పరామర్శించడాన్ని దివ్యజ్ఞానంతో చూచిన బ్రహ్మ బాలకాండలో శ్రీమహావిష్ణువు చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చబడింది అనుచున్నాడు. సంతోషాతిశయంతో దగ్గర ఎవ్వరూ లేకున్నా అట్లు పలికాడని అభిప్రాయం. అనగా రావణవధ సిద్ధమైనదని సంతోషం తాత్కాలికంగా నేర్పడిన సీతదశను చూచుటవల్ల. వ్యథ కలిగినది. ఇట్లు సీతను పరామర్శించుటను చూచి దైవవశాన రావణునికి సంప్రాప్తించబోయే వినాశాన్ని తెలిసి బాధను, సంతోషాన్ని ప్రకటించాడని తాత్పర్యం. రావణాసురుని మేఘంగా సీతాదేవిని మెరుపుగా వర్ణించుటవలన మేఘంలో మెరుపు క్షణముండునట్లు రావణుని వద్ద సీత కూడా క్షణకాలమే ఉండునని సూచించబడింది. సీతాదేవి వస్త్రంతో రావణుడు అగ్నితో ప్రదీప్తమైన పర్వతంవలె శోభిల్లాడు అని వర్ణించడం వల్ల ఇచట కూడా సీతాపదాన్ని గ్రహించుటలో రావణునకు సంతాపం కలుగబోతున్నదని సూచించబడింది. ఇది అలంకారంతో వస్తుధ్వని. సీతాదేవి పద్మపత్రాదికాలు రావణునిపైబడినవి అని చెప్పుటచే రావణాసురుని ఐశ్వర్యం క్షణకాలంలోనే నశిస్తుందని సూచించబడింది. ఇది వస్తునాం వస్తుధ్వని. మధ్యాహ్నకాలంలో ఆదిత్యరాగంతో అరుణాభ్రంవలె ప్రకాశించెనని వర్ణించడం వల్ల మధ్యాహ్నకాలంలో అరుణాభ్రం ఉత్పాతం కాన ఇది రావణవినాశ సూచకోత్పాతమని తాత్పర్యం. రావణాసురుని ఆశ్రయించిన సీత నీలమణిని ఆశ్రయించిన కాంచనమాలగా భాసించిందని చెప్పుటచే నీలమణి రజతంతోనే భాసిస్తుంది కాని బంగారము శోభాతిరస్కారం కాన ఇచట శోభించెను అనునది వ్యతిరేకోక్తితో శోభించలేదు అని తాత్పర్యం.

'ప్రాశోభయత వైదేహీ గజం కక్ష్యేవ కాంచనీ' అని యేనుగుకు గొలుసువలె రావణుని సీత శోభింపచేసినది అని వర్ణించుట వల్ల గొలుసు యేనుగునకుండి మావటివానితో నిగ్రహించబడునట్లు సీత కూడా రావణుని వద్దనుండి రామునిచే నిగ్రహించబడుతుందని సూచించబడింది. సీతాదేవి శిరస్సునుండి జారిన పుష్పవృష్టి భూమి మీద పడింది అని వర్ణించుట తల్లీ మామనోరథాన్ని నీవు నెరవేరుస్తున్నావని సంతోషంతో దేవతలు కురిపించిన పుష్పవృష్టి సీతాదేవి శిరస్సున పడి అటనుండి భూమిమీద పడిందని తాత్పర్యం. సీతాదేవి శిరస్సు నుండి పడినదని చెప్పుట రావణాసురుని సన్నిధిలో దేవతలకు అంతటి ధైర్యం సంభవం కాదు కాన సీత శిరమున ధరించిన పుష్పములు భూమిపైపడినవి అని చెప్పియున్నారని తాత్పర్యం. కావుననే ముందు ముందు భూమిమీద పుష్పసహితమార్గమును చూచిన రాముడు ఈ పుష్పాలు సీతకు నేనిచ్చినవే, సీత ధరించినవిగా నేను గుర్తుపట్టితిని అని అంటాడు.

ఇక యాబది మూడవసర్గలో రావణాసురుని చౌర్యవృత్తిని సీతాదేవి పలువిధాలుగా నిందించుట వర్ణించబడింది.

"గృధ్రరాజః పురాణోఽసౌ" అని జటాయువును పురాణః అని అతివృద్ధునిగా చెప్పుటవల్ల అతివృద్ధుని చంపి నేను శూరుడనని భావిస్తున్నావు అని వ్యంగ్యోక్తి. నీ వీర్యం పరమమని అవహేళన. నీవు శ్రీరాముని భయంతో పలాయనం చేస్తున్నావు. నేను స్త్రీని కావున వారించజాలను అని భావం. శక్తి అభిమానాలు కలవాడు పలాయనం చేయుట అసంగతం. శక్తి పలాయనాలు పరస్పర విరుద్ధాలు. ఇట్లు పలాయనం చేస్తూ నీవిషయంలో శ్రీరాముడేమి చేయగలడు? నీవొక ముహూర్తకాలం నిలిస్తే ఏమైననూ చేయగలడు. ఒక ముహూర్తకాలం నిలిస్తే ఇక వెళ్ళజాలవు. అనగా మృతి చెందుతావని తాత్పర్యం. పరదారలపై వ్యామోహం వల్ల పొందు అతిభయంకరమైన నరకం సంప్రాప్తించగలదని సీతాదేవి ఉపదేశిస్తున్నది. ఇట్టి నరకం లభించేది ఎపుడో కదా ఇపుడు లభించు సుఖమునెపుడో రాబోయే నరకానికై విడుచుట తగునా? అనగా రామునికి అపకారం చేసి నీవు జీవించుటే దుర్లభం అంటున్నారు. నిన్ను తీసుకొని దేశాన్తరానికి వెళ్ళెదను. అపుడు రామభయముండదు కదా! అనగా ఎక్కడికి వెళ్ళినా సుఖం పొందజాలవంటున్నారు. ఇట్లు సీతాదేవి చెప్పినదంతా పాపిష్ఠుడైన రావణుని ముందు సముద్రఘోష తుల్యమయిందని వివరిస్తున్నారు.

ఇక యాబది నాలుగవ సర్గలో సీతను అశోకవనంలో నివసింపచేయుట వర్ణించబడింది. దైవవశాన రాముడు ఋష్యమూకపర్వతప్రాంతానికి వస్తే సుగ్రీవాదులు రామునకు చెబుతారు అని భావించి సీత అచట ఆభరణాలను వస్త్రమున కట్టి వారిముందు విడిచింది. ఈ కార్యమును సీతాపహరణంతో కలిగిన చిత్తక్షోభతో రావణాసురుడు తెలియజాలక పోయాడు. ఒకవేళ తెలిస్తే ఆయాభరణాలమూటను తానే తీసుకొనేవాడని అభిప్రాయం. రామునిచేతిలో మృత్యువు లభించగలదని సంతోషమని మహేశ్వరతీర్థవ్యాఖ్యానం. ఉత్కటపాపం చేస్తే పుణ్యక్షయం కాజాలదు కాన పుణ్యక్షయం కాకపోతే మృత్యువు సమీపించజాలదని భావించే తమోగుణం ఏర్పరచుకొని తల్లి విషయంలో కూడా విరుద్ధ శబ్దవ్యవహారం చేస్తున్నాడని అభిప్రాయం అని కొందరు వ్యాఖ్యానం చేసియున్నారు. కాని వారి మాట వల్ల ఈ సర్గ చివర చెప్పబోవు 'బభూవ మోహాన్మదిత' అన్నది అసంగతం కావలసివస్తుంది. అట్లే 'ఆత్మానం బుద్ధివైక్లబ్యాత్కృత కృత్యమమన్యత' అను మాటకూడా కుదరక పోవలసి వస్తుంది.

కాని వాస్తవంగా రావణునకు శ్రీరామునితో విరోధం లోకదృష్టిలో అనర్థముగా ప్రతీయమానమైనా సీతాపహరణం ద్వారా శ్రీరామునిచే తన వధ తనకు అత్యంతాభీష్టం కావున శ్రీరామునితో వైరం కొనితెచ్చుకొని సంతోషించాడని తాత్పర్యం.

స్కాన్దపురాణంలో ఈ సర్గశ్రవణఫలమిట్లు చెప్పబడింది.

**సీతాపహారమారభ్య లంకాయాం స్థాపనావధి ।**
**శ్రవణాత్ శాస్త్రవిహితా జ్యేష్ఠా దేవీ వినశ్యతి ॥**

అని సీతాపహారం నుండి సీతాదేవిని లంకలో నుంచువరకూ కథాశ్రవణం వల్ల శాస్త్రవిహితమైన జ్యేష్ఠాదేవి నశిస్తుందని అర్థం.

ఇక యాబదియైదవ సర్గలో రావణుడు పూర్వసర్గలో తన ప్రభావాన్ని చెప్పుటవల్ల ప్రలోభం కలిగించి ఇపుడు భోగోపకరణం ప్రదర్శించుటవల్ల సీతను లోభింపచేస్తున్నాడు.

నేను ఒక్కొక్క పనిని చేయుటకు ఒక్కొక్క వేయి పరిచారికావర్గాన్ని నియోగిస్తున్నాను అని రావణుని వాక్యం.

"మమ భార్యా భవప్రియే" అను వాక్యానికి అకారప్రశ్లేషతో 'అభవప్రియే' అని సంబోధన. అభవ అనగా మోక్షము. మోక్షము నందు ప్రీతి కలదానా అని, భార్యా శబ్దమునకు 'భా ఆర్యా' అనుపద విభాగముతో 'భా' అనగా 'చిద్రూపిణీ' అని 'ఆర్యా' అనగా శ్రేష్ఠురాలని అర్థం. నీవు నాకు వారికి అందరికి ఈశ్వరురాలవు కమ్మని తాత్పర్యం.

'భజస్వ మాభితప్తస్య' అను శ్లోకానికి నీకు భృత్యుడనవుతానని పరితపించుచున్న నాయందు అనుగ్రహం చూపు అని తాత్పర్యం. 'దీనేన తాపసేన' అనుదానికి దీనానాం ఇనః, తాపసానాం ఇనః అని విభాగం 'దీనేనశ్చాసౌ తాపసేనశ్చ దీనేన తాపసేన' అని విగ్రహవాక్యం. దీనులకు తాపసులకు సూర్యునివలె ప్రకాశం అందించేవాడని తాత్పర్యం. 'అల్పతేజసా' అన ఇతరుల తేజస్సును అల్పం చేయువాడని అర్థం. 'తమేవ భాన్తమనుభాతి సర్వం' 'తస్య భాసా సర్వమిదం విభాతి' అని శ్రుతి కదా. ఇంతటి పరమపురుషుడైన రాముని గురించి ఎందుకు విలపిస్తావు అని అర్థం. 'యౌవనం హ్యధ్రువం భీరు' అనుచోట యౌవనశబ్దానికి సకలావస్థలు లక్ష్యార్థములు అనగా ఆయుష్యం మొత్తం. అనగా నీసేవకు అనుకూలమైన నా సర్వాయువు ధ్రువమని తాత్పర్యం. నేను నీకు తగిన భృత్యుడను, కావున నన్ను భృత్యునిగా అంగీకరించు. నన్ను భృత్యునిగా అంగీకరించి ఈ లంకలో 'మయా ఏవ హి రమస్వ' అనగా మాశబ్దమునకు తృతీయైకవచనము. అనగా రాజ్యం లక్ష్మితో రమించు అని అభిప్రాయం.

23, 24 శ్లోకాలకు స్వాపదేశార్థమిట్లున్నది. వాయువును బంధించజాలనట్లు అగ్నిశిఖను గ్రహించజాలనట్లు మనోరథాలతో నైననూ లంకకెవ్వరు రాగలరు? నా బాహురక్షితవైన నిన్ను ఎవడు హరించగలుగును? రాముడు తప్ప అట్టివాడితరుడు లేడు. ఒక్క శ్రీరాముడు మాత్రం రాగలడు. నిన్ను గొనిపోగలడు కావున అతను తప్పక వచ్చి నిన్ను తీసుకొని పోగలడు. నీవు శ్రీరాముని ఎపుడు చూస్తానో అని ఉత్కంఠను చూపకు.

26,27 శ్లోకాలకు వ్యంగ్యార్థం ఇట్లు మహేశ్వరతీర్థయంలో చెప్పబడింది. తనకు కులదేవతయైన సీతాదేవికి స్వాత్మసమర్పణాన్ని ఆత్మీయసమర్పణాన్ని చేస్తున్నాడు. లంకలో రాజ్యం పాలించు అని ఆత్మీయ సమర్పణం

చేస్తున్నాడు. తన సుకృతఫలం కూడా సమర్పిస్తున్నాడు. 'వనవాసేన' అనుచోట వనశబ్దమునకు జలమర్థము. జలమధ్యంలో నున్న లంకాద్వీపవాసినైన నాచేత పూర్వం చేయబడిన దుష్కృతం నీదర్శనమాత్రంతో నశించింది. నా సుకృతఫలరూపధర్మాన్ని ధర్మఫలమును నీకు నివేదిస్తున్నాను. స్వీకరించు. నేను సమర్పించిన పుష్పకవిమానంలో సకల సంపదలతో విహరించు. భృత్యుని వద్ద సిగ్గుపడుట తగదు. మనిద్దరికి దాసదాస్యవద్భావసంబన్ధం అనాదిసిద్ధం అని తాత్పర్యం.

ఇక 56వ సర్గలో రావణవాక్యాలను విని పరుషంగా మాటలాడుతున్న సీతను అశోకవనానికి గొనిపోవుట చెప్పబడుతున్నది. సీత నిర్భయంగా రావణునితో బదులు పలికింది అని 'నిర్భయంగా' అనుటకు స్త్రీని బలాత్కారంగా అనుభవించే ప్రయత్నం చేస్తే శిరస్సు నూరు వ్రయ్యలవుతుందని బ్రహ్మశాపమున్నందున ఆ శాపాన్ని తలచిన సీత నిర్భయంగా మాటలాడింది. ఒకవేళ శాపం కూడా లెక్కించక బలాత్కారానికి ప్రయత్నిస్తే యోగబలంతో అదృశ్యురాలను, అస్పృశ్యురాలను కాగలను అని తాత్పర్యం.

యూపగత పశువుకు వధ తప్పనట్లుగా రామునకు అపరాధం చేసిన నీ జీవితం దుర్లభం అని తాత్పర్యం. పరదారాభిమర్శనరూపపాపంతో నీవు ఆయుష్యహీనుడవౌదువు లంకవైధవ్యం కలదౌను.

**"ఆయుర్బలం యశో లక్ష్మీః పరదారాభిమర్శనాత్ । సద్య ఏవ వినశ్యంతి"** అని స్మృతివాక్యం కదా! తాపసుడగు రాముడు దీనుడు నన్నేమి చేయగలడు అని పలికిన రావణుని మాటకు దైవబలసంయుక్తుడగు రాముడు నీ దర్పాదులను నశింపచేయగలడని సమాధానంగా తెలియుము. ఇట్లు చెప్పుట వల్ల రజస్తమోగుణయుతులకు ఈశ్వరుడు దుర్లభుడని అభిప్రాయం.

ఇచట సీతాహరణం చైత్రమాసంలో జరిగిందని తెలుసుకోవాలి. సంవత్సరాంతంలో రావణవధ జరిగింది. దీనివల్ల మూడు సంవత్సరాలు రాముడు పంచవటిలో నివసించాడని తెలుస్తున్నది. హేమంతఋతువర్ణనము చేయుట రాముని తపోవిశేషాన్ని తెలుపుటకే కాని శూర్పణఖా ఆగమనాన్ని తెలుపుటకు కాదని గ్రహించాలి.

ఈ వాక్యాలకు మహేశ్వరతీర్థుల వారి వ్యాఖ్య ఇట్లున్నది. "ఓ వైదేహి! నామాట విను. 12నెలలు ఎదురు చూస్తాను. ఈలోపు భృత్యుని అనుగ్రహించుటకు అంగీకరించకుంటే 'ప్రాతరాశార్థః ప్రాతఃకాలముననే ఆశాసు స్థిత గృధ్రాద్యర్థం" ఆయా చిక్కులలో నుండే గృధ్రాది పక్షుల కొరకు  నా ఆజ్ఞతో వంటవారు నన్ను ఛేదిస్తారు. అనగా నన్ను భృత్యునిగా అంగీకరించకుంటే ఇక నేను బ్రతుకజాలను అని అభిప్రాయం. శస్త్రములతో ఛేదించి కంక గృధ్రాదులకు వేయమన్న నా ఆజ్ఞతో నట్లే చేస్తారు.

సీతాదేవి లక్ష్మి అవతారమని చెప్పబడింది. 'సీతా లక్ష్మీర్భవాన్ విష్ణుః' అని చెప్పబడింది. విష్ణుపురాణంలోకూడా "రాఘవత్వేఽభవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని" అని చెప్పారు. ఇట్టి సీతను యుద్ధంలో మూర్ఛపోయిన లక్ష్మణుని ఉద్ధరించజాలని రావణుడు సీతను ఎలా బలాత్కరిస్తాడు?

**హిమవాన్ మందరో మేరుః త్రైలోక్యం వా సహామరైః ।**
**శక్యం భుజాభ్యాముద్ధర్తుం న సంఖ్యే భరతానుజః ॥**

అని కూడా చెప్పియున్నారు కదా అనగా సీతాదేవి పూర్వజన్మ అయిన వేదవతి ఇట్లు సంకల్పించింది. ఈ విషయమే ఉత్తరకాండలో ఇట్లు చెప్పబడినది.

**యస్మాత్తు ధర్షితా చాహం త్వయా పాపాత్మనా వనే ।**
**తస్మాత్తవ వధార్థం వై ఉత్పత్స్యేఽ హం మహీతలే ॥**

అని దేవకార్యనిర్వాహానికి తానే తన ధర్షణమును అంగీకరించింది. తన బిడ్డ బావిలో పడినపుడు తల్లి ఆ బిడ్డను పైకి తెచ్చుటకు తానుకూడా బావిలో దూకునట్లు వాత్సల్యాతిశయంతో సీతాదేవి రావణునిచే చెరబట్ట పడిన దేవతాస్త్రీలను విడిపించటానికి రక్షించుటకు తనకు తానుగా లంకకు గొనిపోవుటకు అంగీకరించిందని అభిప్రాయం. ఈ విషయమునే సుందరకాండలో సీతాదేవియే చెప్పనున్నది.

**నాపహర్తుమహం శక్యా తస్య రామస్య ధీమతః ।**
**విధిస్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః ॥**

అని. అయినపుడు ఇచట ఇట్లు సీతాప్రలాపాదికాలెందుకనగా పతితో ఎడబాటు కలిగినపుడు పతివ్రత ఇట్లు ప్రవర్తించాలి అని లోకహిత ప్రవర్తన కొరకే అని తెలియాలి. అందుకే వాల్మీకి కూడా 'సా తు శోకపరీతాంగీ' ఇత్యాదిగా సీతాదేవి దుఃఖంతో ప్రలాపాలవంటి వాక్యాలు లోకరీతిననుసరించి చెప్పినవే. శోకగ్రస్తురాలు అని ఇతర జనులు చూచి నమ్ముటకే నటులు లోకరీతిననుసరించి నటించునట్లు అని తెలియాలి. ఈ సర్గశ్రవణఫలమునిట్లు చెప్పారు.

**సీతారావణసంవాదం రాక్షసీనాం చ తర్జనమ్ ।**
**సీతాప్రత్యుక్తి కథనం యే శృణ్వన్తి నరోత్తమాః ।**
**విధూతపాపాస్తే యాన్తి బ్రహ్మలోకం సనాతనమ్ ॥**

సీతారావణసంవాదాన్ని రాక్షసస్త్రీల తర్జనమును సీతాసమాధానాన్ని విన్న మానవోత్తములు పాపాలన్నీ తొలగి పరబ్రహ్మలోకం చేరుతారు.

ఇక యాబదియేడవ సర్గలో ఇంతవరకు వర్ణించిన సీతాపహరణవృత్తాంతాన్ని నిలిపి శ్రీరాముడు మాయా మృగాన్ని అనుసరించిన కథాశేషాన్ని వివరిస్తున్నారు. ఒకే నక్క వెనుకనుండి క్రూరంగా అరచుట దుర్నిమిత్తమని భావం. వాయసాదిపక్షులు, సృగాలాదులు, కృష్ణసారాది మృగాలు సూర్యాధిష్ఠిత దిక్కునకు అభిముఖంగా అరచుట దుఃఖసూచకమని అభిప్రాయం.

ఇక 58వ సర్గలో సీతాప్రాప్తిదేహంతో శ్రీరాముడు చేయు ప్రలాపాదులు వర్ణించబడ్డాయి. రాముడు విలపిస్తూ చతుర్దశవర్షావధికవనవాసం అసత్యం కాదు కదా అంటున్నాడు. అనగా 14సంవత్సరాలు ముగియకమునుపే సీతావియోగంవల్ల కలిగిన దుఃఖంతో జీవితాన్ని ముగించవలసివచ్చునా అని సందేహం. రాముని హృదయంలో కైకేయి సర్వవినాశం కొరకే తమను అరణ్యానికి పంపిందని ఎప్పటినుండియో ఉన్నది. అది ఇట్లు దుఃఖావేగంతో

బయటపడిందని అభిప్రాయం. కపటబుద్ధితో మారీచుడు నాస్వరముతో పిలుచుట, దానిని విని సీత నిన్ను పంపుట, నీవు ఇటకు వచ్చుట ఇవి అన్నియూ నాలో శంకను కలుగజేస్తున్నవని తాత్పర్యం. ఇచట రాముడు ఇలా చింతించుటకు సీతాసౌందర్యాతిశయం కారణమని 'వరారోహా' అనుపదం సూచిస్తున్నది.

ఇంతవరకు సంగ్రహంగా చెప్పిన విషయాన్నే 59వ సర్గలో విస్తారంగా వివరిస్తున్నారు. నీచేత రక్షించ బడుచున్న సీతకు ఎట్టి హాని కలుగనేరదని నమ్మకంతో నేను ఆమెను విడిచివచ్చాను. అయినపుడు ఆమెను ఒంటిగా విడిచి ఎందుకు వచ్చావు?. అని రాముని ప్రశ్న. అట్లు శ్రీరాముని మాటలు విని లక్ష్మణుడు ఇంతకు మునుపు సీతావచనశ్రవణమునకే దుఃఖిస్తున్నవాడు ఇపుడు శ్రీరాముని మాటలతో ఇంకొంత అధికంగా దుఃఖించాడు అని తాత్పర్యం. అందరునూ నీవు అకృత్యం చేశావు అనుటవల్ల దుఃఖాతిశయం సూచితం. సీతావాక్యములలో భరతుడు ఏదైనా అవకాశం లభిస్తే నేను రాముని తప్పకుండగా చంపుతాను అని కూడా సందేశం పంపియుందును. అని 'సంకేతాత్ భరతేన' అను వాక్యానికి అభిప్రాయం. అట్లు భరతుని సంకేతంతో మావెంట వచ్చావే కాని రామభక్తితో కాదని అభిప్రాయం.

స్త్రీల మాటలకు, అందులోను కోపించిన స్త్రీపలికిన పరుషవాక్యాలు విని సీతను విడిచి ఇటకు వచ్చుటను నేను మెచ్చుజాలను. కోపించిన స్త్రీ ఏదైనా కోపంతో పలికితే సహించాలి. ఒకవేళ సహించలేకపోతే అటనుండి బయటకు వెడలి కొద్ది దూరంలో దాగి నిలిచి ఆమెను కాపాడాలి కాని పూర్తిగా ఆమెను విడిచి వచ్చుట నీ అపనీతియే అని అభిప్రాయం. ఇట్లు సీతప్రేరణతో నాలో రాక్షససంహారం సామర్థ్యం లేదని శంకించితివా, సీతాపరుషవాక్యాలతో నీకు లోకంలో అపనింద కలుగునని వచ్చితివా? కేవలం పరుషవాక్యాలను సహించలేకనే వచ్చితివా! మూడూ అసంగతాలే నా సామర్థ్యం రాక్షససంహారవిషయంలో నీకు తెలుసు కదా!

ఇక ఈ సర్గను వినుట వలన కలుగు ఫలాన్ని స్కాన్దంలో ఇట్లు చెప్పారు.

**సీతాదురుక్తి కథనం లక్ష్మణస్య ముఖాచ్చ్యుతమ్ ।**
**శ్రుత్వా న జాతు పీడా స్యాత్ అభిశాపకృతే మహత్ ॥**

అని సీతా పరుషవాక్యాలు లక్ష్మణుని నోటిద్వారా వచ్చిన వాటిని వింటే అపనిందల భయం ఎపుడూ కలుగదు అని అభిప్రాయము.

శ్రీమద్రామాయణమున ఇంతవరకు సీతారాముల సంభోగశృంగారం వర్ణించబడింది. ఇక వేలారోహణం నుండి విప్రలమ్భశృంగారాన్ని వర్ణించుట ప్రారంభించారు. విప్రలంభ అవస్థలు 'అభిలాషమనస్సంగౌ సంకల్పః గుణసంస్తుతిః, ప్రద్వేషః, తాపాభిమతి త్యాగా వున్మాదో మూర్ఛనా మృతిః' అని ఇందులో 8వ అవస్థ అయిన ఉన్మాదం చెప్పబడుతున్నది. ఇచట కొన్ని అనిష్టనిమిత్తాలు వర్ణించబడుతున్నవి. పురుషులకు వామాక్షి స్పన్దనం అనిష్టసూచకం.

**అధో వామదృశస్ఫూర్త్తౌ బహ్వనిష్టో భవేత్పుమాన్ ।**
**ప్రయాణకాలే స్ఖలనం కరోతీష్టస్య భంజనమ్ ॥**

అని పయనసమయంలో కాలు జారుట అశుభం కలిగిస్తుంది. భృంగముల హీనస్వరాల వల్ల వృక్షాలు రోదిస్తున్నట్లున్నవి. 'ఉన్మత్త ఇవ లక్ష్యతే' అను చోటగల ఇవ శబ్దం ఈ శ్లోకంలో అన్ని పదములకు అన్వయిస్తుంది. శోకరక్తేక్షణ ఇవ, శోకాదున్మత్త ఇవ, శోకాత్ప్రధావద్భిః విలపన్నివ, శోకార్ణవపరిప్లుత ఇవ లక్ష్యతే అని అట్లు కనపడుతూ ఉన్నాడని భావం. వాస్తవంగా శ్రీరాముడు అట్టివాడు కాదని తాత్పర్యం. కావుననే సీతాదులకొరకు విలాపాదులు, సీతాన్వేషణసమయంలో సీతాఉద్దేశ్యముగా వృక్షమృగాదులను ప్రశ్నించుట ఇదంతా శ్రీరాముడు లోకశిక్షణ కొరకే నటించాడని తెలుపుటకే సర్వజ్ఞుడగు వాల్మీకి భగవానుడు "ఉద్భ్రమన్నివ ఉన్మత్త ఇవ" అని అచట అచట ఇవ శబ్దం ప్రయోగించాడు. కావున శ్రీమద్భాగవతంలో శ్రీశుకుడు కూడా.

**రక్షోఽధమేన వృకవద్విపినేఽసమక్షం**
**వైదేహరాజ దుహితర్యపయాపితో యామ్ ।**
**భ్రాత్రా వనే కృపణవత్ ప్రియ వియుక్తః**
**స్త్రీసంగినాం గతిమితి ప్రథయంశ్చచార ॥**

**మర్త్యావతారస్త్విహ మర్త్యశిక్షణం రక్షోవధాయైవ న కేవలం విభోః**
**కుతోఽన్యథా సూర్య మతస్స్వ ఆత్మన్ సీతాకృతాని వ్యసనానీశ్వరస్య ।**
**స వై న ఆత్మాత్మవతామధీశ్వరః సక్తస్త్రిలోక్యాం భగవాన్వాసుదేవః**
**న స్త్రీకృతం కశ్మల మశ్నువీత న లక్ష్మణం చాపి విహాతుమిచ్ఛతి ॥**

అని ఈ అభిప్రాయాన్నే బలపరిచాడు. ఇట్లే స్కాన్దపురాణంలో కూడా దేవతలనుద్దేశించి శ్రీమహావిష్ణువు ఇట్లు పలికాడు.

**అహం దాశరథిర్భూత్వా హన్మి రావణమహవే**
**శ్రీమద్రామావతారేఽస్మిన్ అజ్ఞవత్క్రియతే మయా ।**
**మన్మాయా మోహితం రక్షో మనుష్యం మామవేక్ష్యతి**
**అన్యథా తస్య సానూనం న భవేద్యత్ర కుత్రచిత్ ॥**

అని ఇదే విషయం వివరించాడు. ఇట్లు బహువిధ దుఃఖప్రలాపాలు దేహాదులను ఆత్మ అని భావించే చేస్తారు. దేహాదులందు ఆత్మబుద్ధి అజ్ఞానమూలకం. తానాచరించిన లీలలను వినినంతనే సకల లోకాలకు ముక్తి నిచ్చుటకు భూలోకంలో నరరూపంగా అవతరించినవాడు, సచ్చిదానందఘన విగ్రహుడు, పరమాత్మ అయిన శ్రీరామునకు, మాయాధిష్ఠాతకు, పరమేశ్వరునకు, భృగుశాపాదులద్వారా కూడా అజ్ఞాన గాధముండునని చెప్పుటకే అవకాశం లేదు. కావున ఇట్టి వివాదాలు, విలాపాలు, ఉన్మాదాలు శ్రీరామునిచే లోకశిక్షణకే అనుకరించబడ్డాయని తెలియాలి. ఇట్టి సందర్భముల నన్నింటిలోనూ ఈ అభిప్రాయమునే గ్రహించాలి.

శ్రీరాముడు సీతాదేవిని 'పీతకౌశేయవాసిని'గా కనిపిస్తున్నావు అనుట మోహముతో అటులనిపించుట వలన. నిరంతర కామినీభావనతో కాముకునకు కామినీ సాక్షాత్కారం కలుగుతుందని ప్రసిద్ధి. ఇదంతా లోకవ్యవహారనటన అని ఇదివరకే చెప్పాము గాన ఇట్టి వర్ణనతో పరమాత్మయందు రజస్తమోగుణసంభావన చేయరాదని తాత్పర్యం.

ఇక అరువది యొకటవ సర్గలో శ్రీరాముని 9వ అవస్థ అయిన మూర్ఛను వర్ణిస్తున్నారు. అరవది రెండవ సర్గలో అవస్థను ఈరీతిని వర్ణిస్తున్నారు. 'సీతామపశ్యన్ ధర్మాత్మా కామోపహత చేతనః' అని చెప్పుటవల్ల ధర్మానికి విరుద్ధం కాని కామం నింద్యం కాదని సూచించబడినది. 'మహాబాహుః' అని చెప్పుటవల్ల రాముడు ఊర్ధ్వబాహువు అని, 'కమలలోచనః' అనుటవలన మకరన్దంతోకూడిన పద్మమును బోలుటవలన కన్నీటితో నిండిన కన్నులు సూచించబడ్డాయి. అరువది మూడవ సర్గలో తాపమను మదనావస్థను వివరిస్తున్నారు.

**"శిలాతలే పూర్వముపోపవిష్టా కాంతస్మితా లక్ష్మణ జాతహాసా ।**
**త్వామాహ సీతా బహువాక్యజాతమ్"**

అని పూర్వం ఏ గోదావరీనదీతీరంలో సీతాదేవితో కలిసి సరసలీలావిహారం కలిగియుండెనో ఆ ప్రదేశానికి వెళ్ళిన రాముడు అచటి గోదావరీనదిని, ఆ ప్రదేశాన్నీ చూచి పుర్వానుభవాన్ని స్మరించి లక్ష్మణునితో ఇట్లు పలుకుతున్నాడు. నేనీ ప్రదేశమున శూన్యంగా అనగా జనరహితంగా నున్నందున ఇచట నేను నిధిని పొందాను. ప్రణయరసధారలో నేను పండితమానినైనా ఇపుడు ఈ విరహములో అప్రధానుడనయ్యాను. పూర్వం అయోధ్యా నగరంలో నున్నందున అత్తలు, పెద్దల సన్నిధానంలో నున్నందున సంకోచంతో విహరించునది ఇపుడు ఇది ఏకాన్తస్థలం కాన సరసభోగాలలో సీత సర్వస్వదానం చేసింది. గోదావరీనదిలో జలక్రీడాసమయంలో సీతాదేవి ముందుగానే తీరంలో కల శిలోపపృష్ఠమున కూర్చొని చాలాసేపు జలవిహారం చేసిన రాముడు అలసి మరొక దారిలో నదిని దాటలేరుగాన ఒక శిలాతలమార్గం ద్వారా రావాలని చూస్తుండగా సీతాదేవి ఇపుడు కోసల వంశములోనిది గాన 'ప్రేక్షితజ్ఞాస్తు కోసలాః' అను న్యాయంతో ప్రియుడైన రాముని చూపుతోనే అభిప్రాయం గుర్తించి అతనిని మరికొంచెం ఇబ్బంది పెట్టుటకు, అతను ఆశ్రయించదలచిన శిలాతలమందు తానే ముందు వచ్చి కూర్చుండేది. ఆ శిలలో కూడా రాముడు ఏయే భాగాన్ని ఆశ్రయించి రాదలుచుకొన్నాడో ఆయా భాగాన్ని ఆక్రమించి రామునిపై నీరు చల్లుతూ ఉండేది. ఇలా రామునిపై తాను సాధించిన విజయానికి సూచకంగా 'కాంతస్మితా' సహజ మధురహాసవతి స్వవిజయం వల్ల కలిగిన సంతోషంతో జాతహాసయగు సీత లక్ష్మణునితో ఇట్లు పలికింది. ఇంతవరకెక్కడా పరాజయం ఎరుగనివాడు, ఇపుడు స్త్రీవలన కొత్తగా పరాజయం కలుగుట వల్ల రాముడు లజ్జతో ముఖం దించుకొని యున్నాడు. అట్టి రాముని దృష్టిలో పెట్టుకోకుండా అగ్రజుడగు రాముని బహువిధాలుగా ప్రశంసించుచున్న లక్ష్మణునితో చాలా పరిహాసవాక్యములు పలికింది.

మీ అన్నదమ్ములు సంకల్పించిన కార్యాలన్నీ నిర్వర్తించగల సమర్థులు. మీరు అతిబలపరాక్రమశాలులు, పురుషధౌరేయులు. మేము అబలలం కదా. మీరు వేటకు, శత్రుసంహారానికి ఇంటినుండి నగరంనుండి బయలు వెడలువారు. మేము ఇల్లు దాటి బయట కాలుపెట్టనివారం. మీరు సంకల్పించినదంతా నెరవేర్చితిరి కదా! ఇపుడు

నీవు బాగా పొగడుతున్న మీ అన్నగారు గెలిచారు కదా అని చాలా పరిహాసవాక్యాలను ఇచటనే కూర్చొని పలికింది అని అభిప్రాయం.

ఇట్లు విలపిస్తున్న రాముడు లక్ష్మణుని సాంత్వనవాక్యం విన్నా, ఆమాటలను ఆలోచించజాలక ధైర్యం విడనాడాడు. కావుననే మరల దుఃఖం పొందాడు. ఇట్లు రాముడు శోకించుట చారుల ద్వారా విన్న రావణాసురుడు రాముడు సామాన్య మానవుడే యను బుద్ధి దృఢమై తనచేత రాముడు వధించబడేవాడే అని భావించుటకే అని తెలియాలి. ఇదే విషయాన్ని బ్రహ్మాండపురాణంలో ఇలా చెప్పారు.

**స్త్రీపుంమలానుషంగాత్మా దేహో నాస్య విజాయతే ।**
**కిన్తు నిర్దోష చైతన్యం సుఖనిత్యాం స్వకాం తనుమ్ ॥**

**ప్రకాశయతి సైవేయం జనిర్విష్ణోర్న చాపరా ।**
**తథాప్యసురమోహార్థం పరేషాం చ క్వచిత్క్వచిత్ ॥**

**దుఃఖాజ్ఞాన శ్రమాదీంశ్చ దర్శయేచ్ఛుద్ధసద్గుణః ।**
**క్వ వ్రణాది క్వ చాజ్ఞానం స్వతంత్రాచిన్త్య సద్గుణే ।**
**మోక్షాభావాయ తేషాం తు దర్శయత్తానజో హరిః ॥**

అని రాక్షసమోహం కొరకే ఇట్టి భావాలను చూపాడు అని స్పష్టంగా చెప్పియున్నారు. ఇట్లు చెప్పుట వల్ల రామునిలో రావణునకు ఈశ్వరబుద్ధి కలుగకుండుటవల్ల మోక్షం కలుగకుండుట కూడా రాముని శోకఫలమే అని అభిప్రాయం. ఇట్లే రావణుని ద్వారా సీతాపహరణం చేయించుట కూడా రావణుని పుణ్యాతిశయాన్ని నశింపచేయుటకే. దీనితో రావణుని వధ్యుని చేయుటకే అని తెలియాలి. ఈ విషయమే స్కాన్దంలోని కేదారఖండంలో ఇట్లు కథగా చెప్పబడింది.

గొప్పతపస్సుచే గొప్పబలం పొందిన రావణాసురుడు అంతకంటే అధికతపోబలంలేనివానిచే గెలువరాని వాడు. దేవతలు తాముగా రావణుని కంటే అధికతపస్సు చేయజాలరు. కావున అట్టి దేవతల కార్యాన్ని అత్యంతం అనుచితమగు సీతానురాగమోహానువృత్తి సంపాదనతో రావణుని తపోబలాన్ని భ్రష్టం చేయవలెనని లక్ష్మీదేవితో కలిసి విచారించి రావణుని తపోబలాన్ని హరించుటకే శ్రీమహావిష్ణువు బ్రహ్మవిద్య అయిన సీతతో కలసి అవతరించాడు అని ఈవిషయాన్నే బలపరచడమయింది.

ఇక అరువది నాలుగవ సర్గలో ఆయా విశేషచిహ్నాలతో సీతాపహరణనిశ్చయం చేయడం వర్ణించబడింది. ఎంత అడుగుతున్నా గోదావరి స్వయంగా చెప్పుట లేదు. పంచభూతాలు ప్రేరణ ఇచ్చినా చెప్పుట లేదు. సీతాదేవి జాడను నది చెప్పనందున రాముడు సీతాసందర్శనంలో నిరాశ చెందాడు. దివ్యదేవతయైన గోదావరి చెప్పుట లేదు, కాన సీతాదర్శనం దుర్లభమని నిరాశ చెందాడని తాత్పర్యం. సీతాదేవి ఎక్కడ? అని రాముడు అడుగగా పక్షులు ఆకాశం చూపుతూ దక్షిణదిక్కుకు వెళ్తున్నవి. అనగా ఆకాశాన్ని చూచుటచే ఆకాశమార్గంతో సీత వెళ్ళినదని దక్షిణదిక్కునకు వెళ్ళినదని పక్షులు మృగములు సూచిస్తున్నవి అని తాత్పర్యము.

సీతాదేవి కేశపాశంలో ధరించిన పుష్పాలు క్రిందపడినవాటిని శ్రీరాముడు గుర్తించి ఇవి నేను ఇచ్చినవే. నాకు ప్రియం కావిస్తూ సూర్యుడు, వాయువు, భూమి ఈ పుష్పాలను కాపాడుచున్నవని తలచుచున్నానంటున్నాడు. ఇచట సూర్యుడు వాడనీయక, ఎత్తి మరొకచోట పడవేయకుండగా వాయువు ధరించుట వల్ల, భూమి కాపాడు తున్నాయని తాత్పర్యం. లక్ష్మణుని మహాబాహువని చెప్పుటవల్ల బలవత్సహాయత్వము, రాముని 'పురుషర్షభః' అని చెప్పుటవల్ల స్వతః పరాక్రమశాలిత్వమూ సూచించబడుతున్నవి. రాముడు పర్వతమునడిగిన దానినే పర్వతం ప్రతిధ్వనిరూపంగా పలుకుటవల్ల పర్వతం నిరాదరణ చేసిందని రాముడు భావించాడని తాత్పర్యం. రాముడు లక్ష్మణునితో ఇంతకాలము రాక్షసులతో వైరము లేదు కాన వారిని సంహరించలేదు. ఇక ఇపుడు సీతానిమిత్తంగా తీవ్రవైరం కలిగినందున రాక్షసులను సమూలంగా నశింపజేస్తాను అంటున్నాడు. ఇట్టి స్థితిలో సీతాదేవిని రక్షించలేదు గాన ధర్మంపై కూడా కోపము కలిగింది. ఒక్కధర్మమునందేకాక ధర్మఫలప్రదులైన దేవతలందు కూడా కోపము కలిగింది అంటున్నారు. నన్ను అవమానించుటకు కారణమైన దోషరూపమైన గుణంతో (కారుణ్యము) ఏమి ప్రయోజనం అని అభిప్రాయం. అనగా ఇక దయను విడిచి కోపిస్తానంటున్నాడు. రాక్షసులకు అనుకూలంగా ప్రవర్తించు భూతములకు, రాక్షసులకు నాశనం కలిగిస్తాను. ఉదయించిన సూర్యభగవానుడు అనాయాసంగా చంద్రుని వెన్నెలకు తేజస్సును అపహరించి ప్రకాశించునట్లు నాతేజస్సు సకల వస్తుగుణాలను సంహరించి ప్రకాశిస్తున్నదని అభిప్రాయం.

ఒకవేళ సీతాదేవిని పొందజాలని నాడు జగత్సంహారం కావించినా ఇది తప్పని ఎవ్వరూ అనజాలరు అని భావం. ఈ విషయమునే సుందరకాండలో హనుమంతుడు అంటాడు.

**యది రామస్సముద్రాంతాం మేదినీం పరివర్తయేత్ ।**
**అస్యా హేతోర్విశాలాక్ష్యా యుక్తమిత్యేవ మే మతిః ॥**

అని చెప్పియున్నాడు. అయోనిజగా చెప్పుటవలన నాకంటే అతిశయం కలదని వీరశ్రేష్ఠుడగు జనక చక్రవర్తిపుత్రిగా చెప్పి నాతో సమానురాలని సూచించాడు.

ఇక 65వ సర్గలో జగత్తును సంహరిస్తానని క్రోధకలుషితుడైన శ్రీరాముని లక్ష్మణుడు ఓదార్చుటను వివరిస్తున్నారు.

కోపించిన నీవు నీలో సహజంగానున్న మృదుత్వశాన్తత్వాది గుణాలను విడువరాదంటున్నాడు. "న తస్యేశే కశ్చన తస్య నామ మహద్యశః" అని శ్రుతి వాక్యంలో చెప్పబడిన నిస్సీమాభ్యధికత్వాదిగుణాలను గ్రహించాలి. నేను శాంతంగా నున్నందువల్లనే ఈ దశ ప్రాప్తించింది. ఇక ఇపుడు కూడా కోపించకుంటే ఇక నాకెవడు భయపడును? ఎట్లు సీతాదేవి లభిస్తుంది అనగా ఒకడు చేసిన తప్పునకు అందరినీ శిక్షించరాదనుచున్నాడు. ఒకడే అని ఎట్లు చెప్పగలవు అనగా ఒకే రథము ఒకని అడుగుజాడలే కనబడుతున్నవి. కాన ఒకడే అపరాధి అని నిశ్చయమని భావం.

ఇట్లు లక్ష్మణుడు ఓదార్చుట వల్ల రామునికోపం శాంతించిందని చెప్పుటవల్ల రావణుడారాధించిన రావణ పక్షపాతియైన రుద్రుని సంకల్పం వల్ల రామకోపం భగ్నమైనదని కొందరు చెప్పుట అసమంజసంగా తెలుసుకోవాలి.

ఇక 66వ సర్గలో లక్ష్మణుడు రాముని శాంతింపజేసి తరువాత చెప్పవలసిన దానిని చెబుతున్నాడు. ఇచట లక్ష్మణుడు రామునితో దశరథమహారాజు 'మహాత్మా కర్మతో మహతా తపసా రాజ్ఞా' అని గొప్ప పనిచేసి గొప్ప తపమునాచరించిన దశరథ మహారాజు దేవతలు అమృతమునువలె నిన్ను పొందాడు అంటున్నాడు. దీనివల్ల అశ్వమేధ పుత్రకామేష్టిప్రభృతికర్మలతో లోకరంజకుడగు దశరథమహారాజుతో అనుటవలన అశ్వమేధాదికర్మలను మన్త్రద్రవ్యక్రియాలోపాదులు లేకుండగా అధికారి అయినవారే ఆచరించారని తెలుస్తున్నది. అమృతంతో పోలిక చెప్పుటవల్ల అమృతమువలె భోగ్యం బహుయత్న సాధ్యం అని కూడా బోధించబడుతున్నది. దేవతలచేత అని బహువచన ప్రయోగం అనేక దేవతలు చేయవలసిన ప్రయత్నాన్ని ఒక దశరథమహారాజే చేశాడని సూచించ బడుతున్నది.

రాముని ఓదార్చే ప్రసంగంలో దైవికములైన అర్థానర్థాలను మహానుభావులు కూడా పొందియున్నారని దృష్టాన్తముఖంగా ప్రతిపాదిస్తున్నాడు. ఇది లోకసహజం. యయాతి మహారాజు నహుషపుత్రుడు. తన సుకృతముతో స్వర్గం చేరినపుడు అసూయా కలుషచిత్తుడైన ఇంద్రుడు యయాతిని మీలోకమున మీరాజ్యమున సర్వశ్రేష్ఠుడెవరు అని అడుగగా సత్యవాది అయిన యయాతి నేనే అని చెప్పెను. అపుడు ఇంద్రుడు ఆత్మశ్లాఘిత్వము స్వర్గార్హం కాదు అని భూలోకమున పడవేసెను అనుగాథ పురాణప్రసిద్ధం. ఇచట 'నహుషాత్మజః' అని చెప్పుట వల్ల నహుషగాథ కూడా సూచించబడింది. నహుషుడు స్వర్గమున ఇన్ద్రపదవిని పొంది శచీదేవిని సమీపించుటకు పల్లకిలో వెళ్ళుతూ శచీదేవిని స్మరిస్తూ తనపల్లకి మోస్తున్న సప్తర్షులను 'సర్ప' 'సర్ప' 'నడువుడు' 'నడువుడు' అని ప్రేరేపించగా అగస్త్యమహర్షి సర్పం కమ్ము అని శపించాడు. అట్లు నహుషుడు చాలాకాలం సర్పంగా నుండినాడని గాథ.

ఇట్లు మహానుభావులకు కూడా తప్పక సుఖదుఃఖాలు కలుగుతున్నపుడు ఇట్టి సుఖదుఃఖాలకు సంతోష శోకాలను పొందుట నీవంటి వానికి తగదని తాత్పర్యం. ఇపుడు కలుగు ఫలానుభవం పూర్వకర్మసాధ్యం కావున అపుడు ఇట్టి ఫలం అనుభవించుటకు కారణమైన కర్మలను ఆచరించకుంటే ఇపుడు ఫలం కలుగదు. కావున పూర్వకర్మఫలం లభించినపుడు విచారమెందుకు? మనం చేసినదాన్నే కదా అనుభవిస్తున్నాము అని ఆలోచించాలి అని భావం.

ఇక 67వ సర్గలో లక్ష్మణుని సాన్త్వనవాక్యాలతో ధైర్యం తెచ్చుకొని జటాయు రావణయుద్ధభూమికి దక్షిణభాగానికి కొంతదూరం వెళ్ళి జటాయువును చూచి రోదించడాన్ని వివరిస్తున్నారు. తానుగా రాముడు ఉపదేశించువాడైనా సారగ్రాహి కావున 'బాలాదపి సుభాషితం' అను న్యాయానుసారంగా లక్ష్మణుని ఉపదేశాన్ని గ్రహించాడు.

జటాయువు శ్రీరామునితో నీకు ప్రాణసమురాలైన సీతను, నాప్రాణాలను రెంటినీ రావణుడు హరించాడు. అనగా నాప్రాణాలను హరించినట్లు చేసి సీతను హరించాడు అని పలుకుతున్నాడు. ఇచట జటాయువు రాముని 'ఆయుష్మన్' అని సంబోధిస్తున్నాడు. ఖరాదులను వధించుట వల్ల రాముని బలం తెలిసున్ననూ, ఆ అవకాశం లేకున్ననూ స్నేహము భయమును శంకించాడు గాన రామునికి దీర్ఘాయుష్యాన్ని ఆశంసిస్తున్నాడని తాత్పర్యం.

జటాయువు స్థితి చూచి రాముడు రోదించాడు. "న చాస్య మహతీం లక్ష్మీం రాజ్యనాశోఽ పకర్షతి" అని 'వనవాసో మహోదయః' అని రామునికి అభిమతతమాలుగా పేర్కొనబడిన రాజ్యనాశవనవాసాలు ఇపుడు సీతా వియోగాన్ని జటాయువియోగాన్ని కలిగించడంవల్ల అనర్థకరాలయ్యాయని తాత్పర్యం. ఇచట రాజ్యభ్రంశం, వనవాసం, సీతావియోగం, జటాయువధ, రాజ్యం పోయినా అదే రాజ్యంలో భిక్షుకవృత్తితో నివసించవచ్చు. ఆ యవకాశం కూడా లేకుండా వనవాసం సంప్రాప్తించింది. వనవాసంలో కూడా ఇష్టజనులతో కలిసివుంటే అంతగా బాధయుండదు. ఆ యవకాశం కూడా సీతావియోగముతో దూరమైనది. ఇష్టజనవియోగం కలిగినా బంధు మిత్రులుంటే కొంత ఉపశమనం కలుగుతుంది. ఆయవకాశాన్ని కూడా జటాయునాశం దూరం చేసింది. ఇదంతా దుఃఖపరంపరకై దౌర్భాగ్యవశాన సంప్రాప్తించిందని రాముడు విలపిస్తున్నాడు. ఈ నా దౌర్భాగ్యం సర్వవస్తు దాహకుడగు అగ్నినికూడా దహిస్తుందంటున్నాడు. అనగా ఎపుడూ ఎడబాటు ఎరుగని లక్ష్మణుని కూడా ఎడబాపునేమో అని రాముని భయంగా గ్రహించాలి.

రాముడు రోదించుట అనగా పరమేశ్వరుడగు శ్రీరాముడు భక్తపక్షపాతి కాన భక్తుడైన జటాయువు ఆపన్నుడగుట చూచి, పరమప్రియురాలైన సీతను రావణుడు హరించుట తెలిసి, 'వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః' అని చెప్పుటవల్ల భక్తుల ఆపద చూచి ద్విగుణీకృత తాపాగ్నుడైనాడు. సీతను చూడలేకపోవుట వల్ల ఒకతాపం, జటాయునాశం ఇంకొకతాపం. ఇది ద్విగుణతాపమని అభిప్రాయం.

ఇక 68వ సర్గలో భగవంతుని కార్యానికై శరీరం విడిచిన జటాయువును మోక్షానికి పంపుట వర్ణించబడుతున్నది.

జటాయువు శ్రీరామునితో రావణాసురుడు సీతను అపహరించిన ముహూర్తం పేరు విన్ద అని చెప్పాడు. 'విన్దతి లభతే అస్మిన్ ఇతి విన్దః' అని వ్యుత్పత్తి. పోయిన ధనాన్ని మరల లభింపచేసేది విన్ద అని అర్థం. ఇది విద్ల్‌లాభే అని ధాతువు నుండి ఏర్పడిన రూపం. ఇది పదునొకండవ ముహూర్తం. పురాణమున ముహూర్త లక్షణం ఇలా చెప్పబడింది.

**రౌద్రశ్శ్వేతశ్చ మైత్రశ్చ తథా సారభటస్స్మృతః ।**
**సావిత్రో వైశ్వదేవశ్చ గాంధర్వః కుతపస్తథా ॥**

**రౌహిణస్తిలకశ్చైవ విజయో నైరృతస్తథా ।**
**శమ్బరో వారుణశ్చైవ భగః పంచ దశ స్స్మృతః ॥**

ఈ పదిహేనూ పగటి ముహూర్తాలు. వీటిలో 'విజయ' అనే దానికి నామాంతరమే విన్ద అని, కేవల ముహూర్తప్రభావంతో సీతారూపేప్ట ప్రాప్తి సాధ్యము కాదు. అనిష్టమైన రావణవినాశం కూడా ఈ ముహూర్తంలోనే జరుగుతున్నదని తెలియాలి. అందుకే మత్స్యబంధనం పొంది మత్స్యం నశించునట్లు సీతాపహరణంతో రావణుడు నశించునని తెలిపింది. రావణాసురునిచే చంపబడిన జటాయువునకు ఇంత సమయం ప్రాణాలు ఎలా నిలిచాయి. అనగా, సీతాదేవి అనుగ్రహంతో అని తెలుసుకోవాలి. స్కాన్దపురాణమున ఈ విషయాన్నే ఇలా వివరించారు.

**దేవీ మాం ప్రాహ రాజేన్ద్ర యావత్సంభాషణం మమ ।**
**భవతస్తావ దాసన్మే ప్రాణా ఇత్యాహ జానకీ ॥**

మోక్షప్రదానోచితమైన సుకృత విశేషాన్ని 'సీతామభ్యవపన్నో మే ఉపకార' అని తెలుపుతున్నారు. నాకొరకు లభించిన మహద్రాజ్యాన్ని వదిలాడు అనుటతో ప్రాప్యాభాసపరిత్యాగం. 'మమ హేతోః' అని చెప్పుటవల్ల ఉపాయానుష్ఠానం చెప్పబడింది. నా తండ్రి మరణించుటవల్ల ఇక ముందు ఇతని పక్షమునాశ్రయించి సుఖంగా నుంటానని తలచిన నేను ఇతను మరణించుటవల్ల నిరాశచెందాను అని భావం. ఇతనాచరించిన ఉపకారానికి ఇతను పైతృకవిధిలో అర్చించదగినవాడు.

యజ్ఞశీలాదులకు లోకమార్గంలో పునరావృత్తిరహితులకు అనగా ముక్తులకు లభించే వైకుంఠలోకం పొందు అనుచున్నారు. తిర్యక్ జంతువులకు కర్మాధికారం లేనందున అగ్ని సంస్కారార్హత కూడా లేనందున ఉత్తమలోకాలను పొందడానికి యోగ్యత లేకున్నా నాచేత ఆజ్ఞాపించబడి నీవు ముక్తి పొందు అని అర్థం.

ఇచట అపరావర్తులు అనగా 'అరణ్యం గచ్ఛేత్ తతో న పునరేయాత్' అని శ్రుతి చెప్పినట్లుగా సన్న్యాసులు అని అర్థం. కొందరు ఇచట 'రణాదపలాయితానాం' అని యుద్ధంలో వెనుదిరుగనివారని చెప్పుట కుదురదు. జటాయువు అట్టివాడే కావున అట్టిఫలం స్వతస్సిద్ధంగా నున్నందున రాముడు విడిగా ఆజ్ఞాపించవలసిన పని లేదు. ధర్మప్రకరణంలో ముక్తులను చెప్పుట కుదురదు కదా? 'భూమిప్రదాయినాం' అనగా భూమిభోగత్యాగులు అని అర్థం. అనగా నైష్ఠికులని తాత్పర్యం. 'ప్రాజాపత్యం గృహస్థానాం, బ్రాహ్మం సన్న్యాసినాం స్మృతం' ఇత్యాది వాక్యాలతో చెప్పబడిన ఆయా స్థానాలను గ్రహించాలి. లేదా యజ్ఞదానతపస్సన్న్యాసులకు శాస్త్రం చేత విహితమైన స్థానాలను నాచేత సంస్కరించబడి నీవు పొందుము. ఇక నాచే ఆజ్ఞను పొందిన నీవు సర్వశ్రేష్ఠాలగు లోకాలను "అథ యదతః వరోదివోజ్యోతిర్దీప్యతే విశ్వతః పృష్ఠేషు సర్వతః పృష్ఠేషు అనుత్తమేషూత్తమేషు" ఇత్యాది శ్రుతిప్రసిద్ధములైన విష్ణులోకాలకు వెళ్ళు అని భావం. మానుషభావం పొందియున్న శ్రీరాముడు ముక్తినిచ్చుట ఎలా సంభవం? ముక్తిప్రదానం పరత్వాసాధారణచిహ్నం కదా, అనగా నిజమే. కాని 'సత్యేన లోకాన్ జయతి' అని చెప్పిన రీతిగా స్వార్జిత ధర్మవిశేషంతో సర్వలోకాలను స్వాధీనం చేసుకున్నందున ఇది అసంగతం కాజాలదు.

ఇచట ఇంకొందరు నాచేత సంస్కరించబడి ఆ తరువాత ఆజ్ఞాపించబడిన నీవు యజ్ఞశీలురు పొందే లోకాలను పొందుము. చివరికి నన్ను చేరుము. "సోஉ శ్నుతే సర్వాన్ కామాన్ స హి బ్రహ్మణా విపశ్చితా" అని చెప్పిన రీతిగా ముక్తభోగం పొందుము అని నిర్హేతుకంగా ముక్తిని ప్రదానం గావిస్తే అందరికీ ముక్తి లభించవలసి వచ్చును కదా? అనగా స్వకార్యాన్ని ఉద్దేశించి ప్రాణత్యాగం చేయుటకంటే ఇతర హేతువులెందుకు? కావుననే నృసింహపురాణంలో ఇలా చెప్పబడింది.

**మత్కృతే నిధనం యస్మాత్ త్వయా ప్రాప్తం ద్విజోత్తమ! ।**
**తస్మాన్మమ ప్రసాదేన విష్ణులోకమవాప్స్యసి ॥**

అని చెప్పబడింది. ఇట్లే "కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః" అని గీతాచార్యుడు కర్మను కూడా ముక్తిహేతువుగా చెప్పియున్నాడు. మరి 'నాన్యః పంథాః అయనాయ విద్యతే' అని ఇతరం వల్ల మోక్షం లభించదని చెప్పారు కదా అనగా అటు పరమాత్మకంటే ఇతరులు ముక్తినీయజాలరు అనియే అర్థం. ఇది కూడా సాక్షాత్ ముక్తి ప్రదత్వం లేదని తాత్పర్యము. ఈ సందర్భంలో పరమాత్మస్వరూపమే చెప్పబడింది అని చెబుతున్నారు.

ఇట్లే మరియొక వ్యాఖ్యానం కూడా కలదు. ఓ గృధ్రరాజా! నాతో సంస్కరించబడిన నీవు నాచే ఆజ్ఞాపించబడి నాలోకాలకు వెళ్ళు. ఆనుషంగికంగా యజ్ఞశీలురు ఇతరులు వెళ్ళు లోకాలను కూడా చేరుము. 'తస్మాదగ్నిం పరమం వదన్తి' అని ఆహితాగ్నికూడా పృథక్ ధర్మత్వం బోధించబడిందిగాన యుద్ధంలో పలాయనం చేయనివారు పొందులోకాలను అని వ్యాఖ్య. యుద్ధంలో పలాయనం చేయనివారి గతిని చెప్పవలసిన పని లేదు. జటాయువు అపరావర్తియే కదా. రాముని అనుగ్రహం వల్ల రాముని కార్యాలను, ఆచరించి ముక్తి పొందిన వారిలో 'సుగ్రీవో హనుమాన్ ఋక్షో గజో గృధ్రో వణిక్పథః' అని చెప్పిన ముక్తులలో జటాయువు కూడా పరిగణింపబడియున్నాడు. ఇట్లు చెప్పుట వల్ల సంకల్పమాత్రంతో కర్మాధికారంలేని వారికి కూడా, తిర్యక్కులకు, సాధనహీనులకు కూడా ముక్తినిచ్చుటవల్ల శ్రీరామభగవానుడు స్వస్వరూపాంశతో మాయావృతునిలా కనపడుతున్నాడు.

ఇక "తృతీయేన జ్యోతిషా సంవిశస్వ" ఇత్యాది మంత్రంతో నాతో అనుజ్ఞ పొందినవాడవై యజ్ఞాధికారుల లోకాలను పొందుము. బ్రహ్మమేధ సంస్కార బలమునూ పొందుము అని భావం. బ్రహ్మమేధ సంస్కారఫలం సంస్కారోత్తరక్షణంలోనే లభిస్తుంది అని చెప్పబడుతున్నది. తిర్యక్కులకు కర్మాధికారము లేకున్నా సంస్కారం లేనివారికి పరలోకముండదు గాన నాతో సంస్కరించబడిన నీవు నా అనుజ్ఞతోనే ఉత్తమలోకాలను చేరుము. 'అపరావర్తినాం' అనగా పునరావృత్తిరహితులకు, ముక్తులకు అని ఫలితార్థం. 'న పునరావర్తతే' అని కదా శ్రుతి.

యజ్ఞశీలాది లోకమార్గంతో అపరావర్తులలోకం చేరుము అని తాత్పర్యం. భగవంతుడైన రాముడు తిర్యక్కైన జటాయువునకు సంస్కారం చేయుట తగునా? అనగా 'న శూద్రా భగవద్భక్తా' అనుచోట శూద్ర శబ్దము ఉపలక్షణం కాన భగవద్భక్తులగు ప్రాణులన్నిటికీ మోక్షాధికారం తెలుపబడుచున్నందున ఇది యుక్తమే అని సమాధానం.

ఇలా జటాయువునకు మోక్షము నొసంగుటవల్ల రాముడు పరమాత్మ అని తెలుస్తున్నది కదా. 'త్వం గతిః పరమా దేవ' ఇత్యాదులతో బాలకాండలో, 'స హి దేవైరుదీర్ణస్య' ఇత్యాదులతో యుద్ధకాండలో, 'సీతా లక్ష్మీర్భవాన్ విష్ణుః' ఇత్యాదులచే శ్రీమద్భాగవతములో కూడా శ్రీరాముడు పరమాత్మ అని స్ఫుటంగా చెప్పబడింది. ఇట్లు సమస్తకల్యాణగుణాకరుడగు శ్రీమన్నారాయణుడు రావణాదివధరూపలోకహితంకొరకు స్వయంగా దశరథభవనంలో అవతరించినవాడు సీతకొరకు విలపించుట ఎట్లు కుదురును? అనగా ఇది కూడా దోషంకాదు.

**వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః ।**
**నిశ్చితాఽపి హి మే బుద్ధిర్వనవాసే దృఢవ్రతా ॥**

**భరతస్నేహ సంతప్తా బాలిశీక్రియతే పునః ।**
**సీతాపహరణజం దుఃఖం న మే సౌమ్య తథాగతమ్ ॥**
**యథా వినాశో గృధ్రస్య మత్కృతే చ పరంతప ॥**

ఇత్యాది వాక్యాలతో సర్వేశ్వరునకు కూడా ఆశ్రితవాత్సల్యం వల్ల దుఃఖితులైన ఆశ్రితులను చూచి వారి దుఃఖంతో తానుకూడా దుఃఖితునివలె తోస్తాడు. వారిదుఃఖాన్ని తొలగిస్తాడు అని ఋషి అభిప్రాయం అని తెలుసుకోవాలి. శుకాది మహర్షులు మాత్రము స్పష్టంగా.

**"మర్త్యావతారస్త్విహ మర్త్యశిక్షణం రక్షో వధాయైవ న కేవలం విభోః"**

ఇత్యాది ప్రకారంగా శ్రీరామునకు దుఃఖమెక్కడిది అనే అంటున్నారు. ఇట్టి సందర్భాలలో ఇతరత్ర కూడా ఇట్లే పరిహారాన్ని చూడాలి.

పద్మపురాణంలో కూడా

**సంస్కారమకరోత్తస్య రామో బ్రహ్మవిధానతః ।**
**స్వపదం చ దదౌ తస్మై సోఽపి రామప్రసాదతః ।**
**హరేస్సామాన్యరూపేణ ప్రయయౌ పరమం పదమ్ ।**

అని జటాయువు నుద్దేశించి చెప్పబడింది. కాన స్నేహధర్మంతో తిర్యక్కులకు కూడా దాహము చేయడం యుక్తమే అనిపిస్తుంది. సారూప్యముక్తిని కూడా ప్రదానం చేశాడు. అని 'మయా' అను పదమునకు 'మద్రూపేణ' అను వ్యాఖ్యానంతో సామాన్యహరిరూపంగా అని చెప్పియున్నారు.

గృధ్రరాజాన్ని దహింపజేసి స్వర్గగమనసూక్తం జపించి గోదావరికి వెళ్ళి స్నానము చేసి ఉదకము నిచ్చి రోహిమాంస పిండాలను ఇచ్చాడు అని క్రమాన్ని తెలుసుకోవాలి. అయినా ఇచట వైదికోత్తముడగు రాముడు హీనజాతియగు తిర్యక్కునకు వైదికకర్మతో ఎలా సంస్కారం చేశాడు అని అనరాదు. జటాయువు అత్యన్త భక్తుడు గాన అతని జాతివివక్ష తొలగింది.

**న శూద్రా భగవద్భక్తా విప్రా భాగవతాస్స్మృతాః ।**
**సర్వవర్ణేషు తే శూద్రా యే హ్యభక్తా జనార్దనే ॥**

అని స్పష్టంగా చెప్పబడియున్నది. ఈ వచనం "అపశవో వా అన్యే గో అశ్వేభ్యః" అనునట్లు ప్రశంసా పరమని చెప్పవచ్చునే అనగా బాధ లేదు. బ్రాహ్మణత్వాది జాతిశాస్త్రంతో తెలియదగినదే కాని గోత్వాది జాతివలె ఆకృతి గమ్యంకాదు. అయినపుడు ఆ వచనముతో సామ్యం శంకించరాదు. కావుననే విశ్వామిత్రునకు కూడా క్షత్రియత్వం తొలగిపోయింది, బ్రాహ్మణత్వం సంప్రాప్తించిందని చెప్పబడింది అని బాలకాండలో నిరూపించబడింది. శ్రమణీవృత్తాంతంలో ఈ విషయాన్ని ఉపపాదిస్తాము. ఇది ద్రౌపదీవివాహం లాగా ఐతిహాసిక విలక్షణ వ్యక్తి విశేషనియతం కాన ఇచట ఇతరశంకల కవకాశం లేదు. స్వర్గగమన సూక్తాలనగా యామ్యసూక్తము, నారాయణ సూక్తమును జపించాడని తాత్పర్యం.

జటాయుసంస్కారశ్రవణఫలాన్ని స్కాన్దంలో ఇలా చెప్పియున్నారు. 'జటాయోస్సంస్కృతిం శ్రుత్వా స్వర్లోకం యాతి మానవః' అని స్వర్గగమనం ఫలంగా చెప్పబడింది.

ఇక 69 సర్గలో అయోముఖి విరూపకరణ పూర్వకంగా కబన్ధదర్శనం వర్ణించబడింది. సీతావినాశం వల్ల కలిగినదుఃఖం కన్నా కబన్ధబాహువులలో చిక్కిన దుఃఖం గొప్పదని తాత్పర్యం.

ఇక 70వ సర్గలో కబన్ధబాహుచ్ఛేదం, పూర్వజన్మస్మృతి వర్ణించబడుతున్నవి.

ఆకలిగొన్న నాకు దైవమే ఆహారం కొరకు మిమ్ములను పంపియుంటుంది కాన ఎందుకిలా ఊరక నిలుస్తారు అని కబన్ధుడు రామలక్ష్మణులతో అన్నాడు. శ్రీరాముడు బాహుచ్ఛేదనం గావిస్తే శాపమోక్షం కాగలదని ఇంద్రుడు చెప్పిన మాటను తలచుకొన్నాడు.

ఇక 71వ సర్గలో కబన్ధుడు స్వవృత్తాన్తకథనపూర్వకంగా స్వశాపవిమోక్షానికి స్వశరీరదహనాన్ని ప్రార్థిస్తున్నాడు. నేను పూర్వం సుందరరూపుడను, క్రూరరూపం ధరించి మునులను భయభ్రాంతులను చేస్తుండగా నాచే భయపెట్టబడిన స్థూలశిరా అను ముని నాకు క్రూరరూపముండాలని శపించాడు. ఋషిశాపము వల్ల లభించిన ఘోరరూపంతో ఘోరతపస్సు చేసి బ్రహ్మను సంతోషింపచేసి దీర్ఘాయుత్వం పొంది ఆ గర్వముతో ఇంద్రునితో యుద్ధం చేయగా ఇంద్రుడు తన వజ్రాయుధంతో నాకీ అవస్థ కలిగించాడు. రాముడు నా భుజాలను ఛేదించినపుడు శాపమోక్షమవుతుందని ఋషి అనుగ్రహించాడని తెలిపాడు.

ఇక 72వ సర్గలో సంస్కరించబడిన కబంధుడు దివ్యరూపం పొంది రామునికి మిత్రుని ఉపదేశిస్తున్నాడు. రామునిచే సంస్కరించబడినందున పూర్వతపఃప్రభావంతో హంసయుక్త విమానం లభించింది. కబంధుడు దివ్యరూపధరుడై రామునితో ఇలా పలికాడు. "రామా? లోకంలో సంధివిగ్రహయానఆసనద్వైధీ భావసమాశ్రయాలు అనే ఆరు యుక్తులు గలవు. ఇవియే గుణాలనబడతాయి. ఆ ఆరు యుక్తులతోనే సకల విషయాలను విచారిస్తారు. ఇట్లు న్యాయమార్గంగా విచారిస్తే క్షీణదశలో నున్న ఇరువురు పురుషులు సంశ్లిష్టులైతే కార్యసిద్ధి లభిస్తుంది. దుర్దశను పొందిన పురుషుడు అట్టివానితోనే కలుస్తాడు. రాజ్యహీనుడవైన నీవు దురవస్థను పొందినవాడవు, దార ప్రధర్షణం పొందావు. కావున ఇపుడు నీవు దురవస్థను పొందిన అట్టి ఇంకొక పురుషునితో స్నేహం చేయకుండగా సీతాప్రాప్తి సిద్ధించదు".

ఇక ఆరు యుక్తులు అనుదానికి ఇంకొక వ్యాఖ్యశాస్త్ర దీపికలో పార్థసారథిమిశ్రులు యుక్తిశబ్దానికి ప్రమాణాన్ని అర్థంగా చెప్పియున్నారు. అపుడు ప్రత్యక్ష అనుమాన ఉపమాన శబ్ద అర్థాపత్తి అభావములనే ఆరు ప్రమాణాలు ఇచట యుక్తి శబ్దాని కర్థము. ఆరు ప్రమాణాలతో అన్ని వస్తువులను విచారిస్తాము. అన్ని ప్రమాణాలతో క్షీణుడైన పురుషుడు క్షీణపురుషునితో సేవించబడతాడు. ఇపుడు హీనదశను పొందావు ఇది ప్రత్యక్షం. నీవు దీనివల్ల దారప్రధర్షణరూపవ్యసనం పొందావు. ఇది అనుమానము. మిత్రుడు లేకుండగా సిద్ధి పొందజాలవు. ఇది అర్థాపత్తి. అతణ్ణి మిత్రుని చేసుకో- ఇది శబ్దప్రమాణము. ఇట్లు మిత్రలాభంతోనే కార్యసిద్ధి అని శాపవిమోచనం పొందిన కబంధుని వాక్యం. సుగ్రీవునితో మైత్రి చేసుకొంటే సుగ్రీవుడు సీతను వెదకుటకు అన్ని దిక్కులకు పంపుతాడు. ఇట్లు అన్ని దిక్కులకు అని చెప్పుటవల్ల రావణాసురుని భవనాలు అన్ని దిక్కులలో నున్నవని తెలుస్తున్నది. కావున సీత ఏదిక్కులోనున్న రావణాలయంలో ఉన్నదో తెలుసుకోవడానికి అన్ని దిక్కులకూ పంపుతాడని తాత్పర్యం.

సుగ్రీవుని నివాసానికి మార్గముపదేశించి కబంధుడు వెళ్ళుటను 73వ సర్గలో చెబుతున్నాడు. ఆదారిలో మాతంగశిష్యురాలు పరిచారిణి శబరి నివసిస్తున్నది. ఆమె ఆశ్రమం అతిరహస్యమైనది. ఇతరులచే చూడ శక్యంకానిది. నీవు శబరి అనుగ్రహం పొందుటకు శబర్యాశ్రమం పోయి ఆమెను దర్శించి తరువాత పంపానది ముందున్న ఋష్యమూకపర్వతానికి వెడలాలి అంటున్నాడు.

ఆ శబరి దేవోపముడవైన నిన్ను చూచి స్వర్గానికి పోగలదు. ఇచట దేవా! అని సంబోధన. ఉపమా ఉప – మా యస్య అను విగ్రహవాక్యంతో లక్ష్మి నిత్యసన్నిహితంగా నుండి శ్రీ మహావిష్ణువును చూచి అని తాత్పర్యం. అట్లే స్వర్గమనగా స్వః గీయత ఇతి స్వర్గః స్వర్గశ్చాసౌ లోకశ్చ అను వ్యుత్పత్తితో స్వర్గలోకమనగా వైకుంఠమని అర్థం. ఇట్లు శ్రీమన్నారాయణుని దర్శించి వైకుంఠం పొందుతుంది అని తాత్పర్యం. ఇట్లు చెప్పుటవల్ల ఋష్యమూక పర్వతం పంపాసమీపంలో నున్నదని తెలుస్తున్నది.

ఇట్లు కబన్ధ రామసంవాదం విన్నందువల్ల కలుగుఫలమును స్కాన్దమున ఇట్లు చెప్పారు.

**కబన్ధరామసంవాదం యే శృణ్వన్తి సదాదరాత్ ।**
**విప్రావమానజనితస్తాపః క్షిప్రం వినశ్యతి ॥**

అని బ్రాహ్మణావమానం వల్ల కలుగు తాపం నశించుట ఫలంగా చెప్పబడింది. అరణ్యకాండలో ఇంత వరకు భగవత్కైంకర్యము దాని ఫలమును చూపారు. ఇక ఇపుడు 74వ సర్గలో ఆచార్యాభిమాననిష్ఠాతత్ఫలాలను వివరిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన రామలక్ష్మణులకు అతిథిపూజ గావించిన శబరి రామునితో ఇలా పలుకు తున్నది. "చక్షుషా తవ సౌమ్యేన పూతాఽస్మి రఘునందన" అని. రాముని శబరి దేవవరుడు అనగా శ్రీ మహావిష్ణువని తెలుపుట ద్వారా శబరికి పరమార్థజ్ఞానం కలదని తెలుస్తున్నది. 'సౌమ్యేన చక్షుషా' అనగా నిర్హేతుకటాక్షంతో పవిత్రురాలనైతిని అనగా పూర్వాఘనాశం చెప్పబడింది. 'అరిందమ' అన్న సంబోధనతో ఉత్తరాఘనాశం చెప్పబడింది. 'త్వత్ప్రసాదాత్ అనగా ధాతుః ప్రసాదాత్ మహిమానమాత్మనః' అని చెప్పబడుటవల్ల ఆచార్యప్రసాదముచే వృద్ధి పొందిన నీఅనుగ్రహముతో అక్షయలోకాలకు వెళ్తాను. అనగా పునరావృత్తిరహితమైన పరమపదానికి వెళ్ళెదను అని అర్థం. నీ ఆచార్యులతోనే కలిసి అపుడే ఎందుకు వెళ్ళలేదు అనగా చెబుతున్నారు. మతంగశిష్యులు మా ఆచార్యులు. వారు ధర్మజ్ఞులు. యోగరూపమైన భగవత్ప్రాప్త్యుపాయం లేకున్నా ఆచార్యప్రసాదం వల్ల లభించిన భగవత్ ప్రసాదం వల్ల ఈమె సద్గతి పొందగలదు అని భవిష్యద్వృత్తాంత జ్ఞానానికి కావలసిన భాగ్యం కలవారు నన్నాదేశించారు. ఇచటికి రాముడు వస్తాడు. అతనిని ప్రతిగ్రహించి ఆతిథ్యంతో సత్కరించాలి. ఆ రామదర్శనంతో అక్షయలోకాలకు వెళ్ళగలవు అని తెలిపారు. ఇట్లు తెలుపుటవల్ల ఆచార్య శుశ్రూషణ భగవత్ప్రసాదం ద్వారా మోక్షహేతువని తెలుపబడింది. రాముడు చిత్రకూటానికి వచ్చిన నాటి నుండి నేటివరకు అనేక వన్యమూలఫలాలు జాగ్రత్తగా సంపాదించి ఆదరంగా దాచియుంచి, ఆయా ఫలముల మాధుర్యాలను పరీక్షించి ఉంచింది అనునది సంప్రదాయం. "తాం విజ్ఞానే తా నిత్యామంహిష్కృతాబ" అని చెప్పుటవలన హీనజాతి జాతయైనా ఆచార్యప్రసాదలబ్ధ బ్రహ్మజ్ఞానం కలది అని తెలిసి భగవంతుడగు రాముడు కూడా ఆదరించాడని సూచిస్తున్నారు. దనువువలన

నీ ఆచార్యుల ప్రభావం విన్నాము. ఆ ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూడగోరుతున్నాము. నీవు దర్శింప దలచితివేని అని.

ఇచట శబరి ఫలాలను తాను పరీక్షించి భక్షించి చూచి తరువాతనే సుపక్వములు, మధురములగు ఫలాలను రామునకిచ్చింది అని పద్మపురాణం స్పష్టంగా చెబుతున్నది చూడుడు.

**ప్రత్యుద్గమ్య ప్రణమ్యాథ నివేశ్య కుశవిష్టరే ।**
**పాదప్రక్షాళనం కృత్వా తత్తోయం పాపనాశనమ్ ॥**

**శిరసా ధార్య పీత్వా చ వన్యైః పుష్పైరథార్చయత్ ।**
**ఫలాని చ సుపక్వాని మూలాని మధురాణి చ ॥**

**స్వయమాస్వాద్య మాధుర్యం పరీక్ష్య పరిభక్ష్య చ ।**
**పశ్చాన్నివేదయామాస రాఘవాభ్యాం దృఢవ్రతా ॥**
**ఫలాన్యాస్వాద్య కాకుత్థ్సస్తస్యై ముక్తిం పరాం దదౌ ।**

అని శబరి రామునితో ఆచార్యప్రభావాన్ని తెలుపుతున్నది. ఆమె ఆచార్యులు దేవతార్చన గావించిన ఈ వేదులు ఆచార్యుల ప్రభావంతో ఈనాటికీ వారు లేకున్నా అన్ని దిక్కులనూ ప్రకాశింపచేస్తున్నవి అని చెప్పుటవల్ల ఆచార్యులవారికి అభిమతమైన ప్రదేశం ఆచార్యులు లేకున్నా శిష్యులకు సంసేవ్యమే అని సూచించబడింది. ఉపవాసశ్రమతో అలసి స్నానార్థం సప్తసాగరాలకు వెళ్ళుటకు శక్తిలేక మాగురువులు ధ్యానించినంత మాత్రాన ఎదురుగా వచ్చిన సప్తసాగరాలను చూడండి. ఆ సాగరములలో స్నానం చేసిన మా గురువులు ఆ చెట్లపై వేసిన ఆర్ద్రవస్త్రములు నేటికీ వారి అంగసంపర్క వైభవంతో ఆరుట లేదు. వారి పుష్పమాలలు నేటికీ వాడుటలేదు. ఇట్లు చెప్పుటవల్ల “గురుం ప్రకాశయేద్ధీమాన్” అనునట్లు ఆచార్యవైభవాన్ని ప్రకటించవలయును అని సూచించారు.

ఈ సర్గ వృత్తాంతంతో మతంగశిష్యులచే ఉపదేశింపబడిన సమాధికల శబరి గురువుగారి ఆజ్ఞతో రాముడు వచ్చునంత వరకూ నిలిచి రాముని పూజించి రాముని అనుజ్ఞతో స్వసమాధి బలంతో తమ గురువులు చేరిన స్వర్గవిశేషాన్ని చేరింది అని తెలుస్తున్నది. విదురాదులకు వలె స్త్రీకి కూడా యోగాధికారముంటుంది యోగాంగ యజ్ఞాదికర్మలస్థానమున గురుశుశ్రూష విధించబడింది. ఇచట స్వర్గమనగా మొదట అక్షయమని చెప్పుటవల్ల పునరావృత్తిరహితమైన పరమపదమని గ్రహించాలి. “ఏవమేవాముత్ర పుణ్యచితో లోకః క్షీయతే” అను శ్రుతి వాక్యంతో కేవల స్వర్గం క్షయమే కాని అక్షయం కాదు కదా!

ఇక 75 వ సర్గలో పంపాగమనం వర్ణించబడుతున్నది. సీతాదేవియందే మనసును లగ్నం చేసిన శ్రీరాముడు పద్మంతో సుందరమైనది, మతంగాశ్రమ సమీపవర్తిని అయిన పంపానదిని చేరాడు. ఇట్లు75 సర్గలతో అరణ్యకాండ ముగుస్తున్నది. అరణ్యకాండ శ్రవణఫలం స్కాందంలో ఇలా చెప్పబడింది.

**అరణ్యకాణ్డ మాహాత్మ్యం యే శృణ్వన్తి మహీతలే ।**
**శ్రీరామస్య ప్రసాదేన విష్ణులోకం వ్రజన్తి తే ॥**

అని అరణ్యకాండను చక్కగా విన్నవారు శ్రీరామానుగ్రహంతో విష్ణులోకం పొందుతారు అని చెప్పబడింది.

ఇక అరణ్యకాణ్డ శ్రవణఫలం బ్రహ్మాండపురాణంలో 147వ అధ్యాయమున ఇలా చెప్పబడింది.

**ఆరణ్యకం తు యః కాండం అతిభక్తిసమన్వితః ।**
**పఠేద్వా శృణుయాద్వాపి సోమసాయుజ్యమాప్నుయాత్ ॥**

ఆరణ్యకాండను అతిభక్తితో చదివినవాడు చంద్రసాయుజ్యం పొందుతాడు.

"సర్వం శ్రీరామచన్ద్రపాదార్పణమస్తు"

## కిష్కింధాకాండ సారాంశం

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

రాముడు పంపాసరోవర సమీపంలోని ప్రకృతిని వీక్షించి వ్యాకులతను పొందాడు. ఇది రాముని ధీరోదాత్తతకు భంగమనిపిస్తుంది. కాని సీతారాముల సంబంధం ప్రకృతి పురుష సంబంధం. అది అవినాభావ సంబంధం లక్ష్మణుడు రామునితో ఉత్సాహవాక్యాలు పల్కగా వారు ముందుకు సాగారు. వారిని చూచిన సుగ్రీవుడు భయశంకితుడయ్యాడు. వారి వృత్తాంతాన్ని తెలుసుకొమ్మని హనుమంతుని పంపించాడు. నీ ముఖాన్ని నాకు ఎదురుగా ఉంచి వారితో మాట్లాడమన్నాడు. ఇది సుగ్రీవుని లౌకికప్రజ్ఞకు పరమ నిదర్శనం. హనుమంతుడు కపిరూపాన్ని పరిత్యజించి భిక్షురూపం ధరించి వారి వద్దకు వెళ్లాడు. వెళ్లిన వెంటనే రామలక్ష్మణులను వీక్షించి ప్రణామం చేశాడు. ఇక్కడ భిక్షు శబ్దానికర్థం బ్రహ్మచారియనియా? లేక సన్యాసి అనియా? ఆలోచించవలసిన విషయం. గోవిందరాజీయం బ్రహ్మచారి అనే అర్థం చెప్పడం అసంగతమంటుంది. జ్ఞానాధికుడైన గృహస్థునకు, కేవల పరివ్రాజకుడు నమస్కరించవచ్చని దానికి నిషేధమేమీలేదని, అజ్ఞులైన గృహస్థుల విషయంలో నిషేధం ఉంటే ఉండవచ్చని గోవిందరాజీయాభిప్రాయం. ఇంచుమించుగా మహేశ్వరతీర్థీయం కూడ ఈ భావననే సమర్థించింది.

**"ఆయాతాశ్చ సువృత్తాశ్చ బాహవః పరిఘోపమాః"** అని హనుమంతుడు వారితో ప్రసంగిస్తూ మీరెవరని అడుగుతాడు. రామలక్ష్మణుల ఇరువురి బాహువులను కలిపి బహువచన ప్రయోగం చేసి ఉంటాడని ఒక భావన. అది కాదు రాముడు హనుమంతునికి చతుర్భుజరూపంతో సాక్షాత్కరించాడని మరో భావన. వారేమీ సమాధానమీయలేదు. అంత ఆతడు తాను సుగ్రీవుడు పంపగా వచ్చానని సత్యం వచించాడు. అంత రాముడు లక్ష్మణునితో ఈతనితో మాట్లాడమంటాడు. తాను సమాధానం చెప్పకుండా లక్ష్మణుని ఎందుకు ఆదేశించాడని చెప్పడం చాలా అభిప్రాయాలు ఉన్నాయి. రాముడు "పూర్వభాషి" కాన ముందే మారుతి మాట్లాడినందున అట్లా దేశించి ఉండవచ్చు. లేదా లక్ష్మణుడే ఆదిశేషుడు, ఆయనే పతంజలియై వ్యాకరణభాష్యం వ్రాసాడు. నవవ్యాకరణ పండితుడైన పావనితో లక్ష్మణుడు మాట్లాడడమే ఉచితమని భావించి ఉండవచ్చు. ఎన్నో భావనలు, ఎన్నో ఊహలు. లక్ష్మణుడంత తమ వృత్తాంతాన్ని అంతా వివరించి **"సుగ్రీవం వానరేంద్రం తు రామః శరణమాగతః"** అని చెప్పగానే రామసుగ్రీవమైత్రికి ఆటంకం లేదని నిశ్చయించాడు హనుమంతుడు.

అతడు వెంటనే భిక్షురూపాన్ని వదలి వానరరూపాన్ని స్వీకరించాడు. వెంటనే వారిని తన భుజాలపై ఆరోహింపజేసుకొని సుగ్రీవుడు ఉండే గిరిశృంగానికి పయనమయ్యాడు. ఇక్కడ వాల్మీకి

**"అయం రామో మహాప్రాజ్ఞః సంప్రాప్తో దృఢవిక్రమః ।**
**లక్ష్మణేన సహభ్రాత్రా రామోయం సత్యవిక్రమః ॥**

**ఇక్ష్వాకూణాం కులే జాతో రామో దశరథాత్మజః"** అని హనుమంతుడంటూ సుగ్రీవునికి పరిచయం చేశాడని పేర్కొన్నారు.

ఇక్కడ ముమ్మారు రామశబ్ద ప్రయోగం జరిగింది. ఆ శబ్దాన్ని ఒక్కమారు వాడితే చాలు ఇక్కడ. లేని ముమ్మారు ఆ శబ్దం ఎందుకు ప్రయోగింపబడింది. "రామ రామ రామ" అని ముమ్మారు అంటే సహస్రవాచక మవుతుంది. అప్పుడు అనంతత్వం సిద్ధిస్తుంది. రామసంస్పర్శవల్ల మారుతితో రామనామస్మరణ ప్రారంభమయిందని మహర్షి అభిప్రాయం.

రామలక్ష్మణులను సామాన్యులుగా మాత్రం ఊహించవద్దని. వారు మహాప్రాజ్ఞులు, పరాత్పరులు అని, వారిని పూజించమని

**"భవతా సఖ్యకామౌ తే భ్రాతరౌ రామలక్ష్మణౌ ।**
**ప్రతిగృహ్యార్చయస్వైతే పూజనీయతమావుభౌ" ॥**

సుగ్రీవుని ముందే హెచ్చరించాడు. సుగ్రీవుని అహంభావం పెల్లుబికింది. నమస్కరించలేదు సరికదా. నాతో నెయ్యంచేసే సంపూర్ణాభిప్రాయం నీకుంటే నా చేతిలో చేయివేయమని తన చేతిని ముందుకు చాచాడు సుగ్రీవుడు. శ్రీరాముడప్పుడు తన చేతిని సుగ్రీవుని చేతిలో ఉంచి స్నేహధర్మం ప్రకారంగా కౌగిలించుకొన్నాడు. సుగ్రీవుడు రాముని నుండి ఆశించింది స్నేహం మాత్రమే. రాముడు సుగ్రీవుని శరణు వేడుతున్నట్లుగా హనుమంతుడు, లక్ష్మణుడు వచించారు. కాని సుగ్రీవుడు శరణన్నమాట అనలేదు. నమస్కారమైనా చేయలేదు. మనస్సులోనయినా రాముని శరణు కోరలేదు. కాబట్టి సుగ్రీవుడు మనసా, వాచా,కర్మణా రాముని శరణాగతిచేయలేదు. భక్తుడు భగవంతుని శరణు అర్థించి పాదాలను ఆశ్రయించాలేకాని తదితరాలను ఆశ్రయించరాదు. సుగ్రీవుడు రాముని చేతిని ఆశ్రయించాడే కాని పాదాలను ఆశ్రయించలేదు. అందువల్లనే రాముని స్నేహం పొంది కూడ స్వీయకర్మ ఫలితంగా కష్టాలు అనుభవించాడు అందుచే వాలితో చేసిన మొదటి యుద్ధంలో చావుదెబ్బలు తిన్నాడు.

సుగ్రీవుని దృష్టిలో రాముడు అతనికి స్నేహితుడే తప్ప మరేమీ కాదు. **"త్వం వయస్యోఽసి మే హృద్యో హ్యేకం దుఃఖం సుఖం చ నౌ"** అని నేను నీ స్నేహం సంపాదించడంవల్ల మన సుఖదుఃఖాలు సమానమయ్యాయని అంటాడే కాని రాముడు తనకన్న గొప్పవాడని సుగ్రీవుని భావనలో ఏలేశమూ లేదు. సాలవృక్షం యొక్క కొమ్మ నొకదాన్ని విరిచి నేలపై ఉంచి, రాముని దానిపై కూర్చుండేలా చేసి, తాను కూడా కూర్చున్నాడు. అంతేకాని లక్ష్మణుని కనీసం కూర్చొమ్మని కూడా అనలేదు. జరిగిన అపరాధం హనుమంతుడు తెలుసుకొని వెంటనే దాన్ని సరిదిద్దాడు. చందనవృక్షం యొక్క కొమ్మను తీసుకొని వచ్చి లక్ష్మణుని దానిపై ఆసీనుణ్ణి కావించాడు. లక్ష్మణుడు ఆదిశేషాంశసంభూతుడు కావున చందనవృక్షచ్ఛాయలో శాంతి వహిస్తాడని ఆయన భావన. నారదుడు తన భక్తి సూత్రాలలో **"తస్మిన్ తజ్జనే భేదాభావాత్"** అని భక్తి యొక్క గొప్పదనాన్ని వివరిస్తాడు. ఈ విధంగా సుగ్రీవుడు లక్ష్మణుని విషయంలో భాగవతాపరాధం చేసాడు. మరోసారి కూడ ఇలాగే ప్రవర్తిస్తాడు ఆతడు. అగ్నిసాక్షికంగా ఆ స్నేహాన్ని బలపరిచినవాడు ఆంజనేయుడే.

సఖ్యం చేకూరిన పిమ్మట వాలిని వధించి భార్యావియోగదుఃఖం రూపుమాపమని రాముని ముందు వాపోతాడు సుగ్రీవుడు. మీ వైరకారణం ఏమిటని రాముడు ప్రశ్నిస్తాడు. సుగ్రీవుడు తన కథనంతా చెప్పిన పిమ్మట వాలిదోషాన్ని గ్రహించిన రాముడు వాలిని వధిస్తానని ప్రతిజ్ఞ చేసాడు. అంతకు ముందే సుగ్రీవుడు సీత రసాతలంలో ఉన్నా,

అంతరిక్షంలో ఉన్నా, నష్టమైన వేదశ్రుతిని విష్ణువు తీసుకొని వచ్చిన విధంగా ఆమెను తీసుకొని వస్తానని రామునికి మాట ఇచ్చాడు.

అనంతరం రావణుడు ఒక స్త్రీని ఆకాశమార్గాన తీసుకొని పోవడం ఆమె రామా! రామా! అని దీనాలాపాలు కావించడం, ఆమె ఆభరణాలను ఉత్తరీయంలో ఉంచి క్రిందకు జారవిడవడం చెప్పి, ఆమె సీతయే కావచ్చని ఆ నగలు రామునికి చూపిస్తాడు. రామునికి కంటనీరు కారగా లక్ష్మణుని వాటిని పరిశీలించమన్నాడు.

**నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే।**
**నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్ ॥**

అని కేయూరాలను, కుండలాలను తాను గుర్తించలేనని, నిత్యమూ పాదాభివందనం చేయడం వల్ల నూపురాలను మాత్రం గుర్తించగలనని అంటాడు. ఈ శ్లోకాన్ని వ్యాఖ్యాతలు ఎవరూ పెద్దగా స్పృశించలేదు. ఇది లక్ష్మణుడు సాధారణంగా అన్నమాట మాత్రమే అని అనుకోవాలి. కారణం నూపురాలలో ఒకటి. ఇది వరకే క్రింద పడిపోయింది. రామలక్ష్మణులు ఆ నగలు సీతవే అని నిశ్చయిస్తారు. అప్పుడు ఎంతో ఆతురతతో రాముడు రావణుని నివాసం ఎక్కడని సుగ్రీవుని ప్రశ్నిస్తాడు. సుగ్రీవుడప్పుడు రామకార్యం నెరవేర్చడానికి ముందే తన కార్యం నెరవేర్చుకోవాలనే తలంపుతో

**"న జానే నిలయం తస్య సర్వథా పాపరక్షసః।**
**సామర్థ్యం విక్రమం వాపి దౌష్కులేయస్య వా కులమ్ ॥**

**సత్యం తే ప్రతిజానామి త్యజ శోకమరిందమ।**
**కరిష్యామి తథా యత్నం యథా ప్రాప్స్యసి మైథిలీమ్" ॥**

అని అసత్యమాడాడు. రావణునినివాసంకాని, అతని శక్తిసామర్థ్యాలు కాని తనకు తెలియవంటాడు. ఎంత ప్రయత్నం చేసయినా సరే నీవు సీతను పొందేలా చేస్తానని బాస చేసాడు. రావణుని పరాక్రమం తనకు తెలియదని చెప్పడం మొదటి అబద్ధం. రావణుని నివాసం తనకు తెలియదనడం మరో అబద్ధం. స్వీయకార్యం నెరవేర్చుకోవాలనే సుగ్రీవుని తలంపు రాముని ఉపయోగం కొరకే అని కొందరి అభిప్రాయం.

సుగ్రీవునికి పుట్టుకతోనే తెలివి నేర్పు వచ్చాయని తార చెబుతుంది. ఇంతకూ రాముడు వాలిని వధించగలడా? లేడా? అనే సంశయం అతనిని పీడించింది. రాముడు సుగ్రీవప్రత్యయార్థం దుందుభి కళేబరాన్ని పది యోజనాలు దూరంలో పడేలా పాదాంగుష్ఠంచే చిమ్మాడు. అది ప్రస్తుతం ఎండి గుల్లయిందని భావించాడు సుగ్రీవుడు. అంత రాముడు సప్తసాలభంజనం కావించాడు. అప్పుడు మాత్రమే సుగ్రీవుడు

**"స మూర్ధ్నా న్యపతద్భూమౌ ప్రలంబీకృతభూషణః।**
**సుగ్రీవః పరమప్రీతో రాఘవాయ కృతాంజలిః" ॥**

అని రాముని పాదాలపై వ్రాలి అంజలి ఘటించాడు. అంతవరకూ సుగ్రీవుడు చేసినవన్నీ భగవతాపరాధాలే. అందువల్లనే వాలితో జరిగిన మొదటియుద్ధంలో చావుదెబ్బలు తిన్నాడు. వాలి సుగ్రీవుల మొదటియుద్ధంలో

రాముడు సుగ్రీవుణ్ణి అనుగ్రహించలేదు. అంటే వాలిని వధించలేదు. దానికి కారణం వారిరువురు సమాన రూపంతో ఉన్నారని రాముడు చెప్పి సుగ్రీవుని ఓదార్చాడు. ఇది పై పైమాట. రాముడు దివ్యాస్త్రం ప్రయోగిస్తే ఎవరినుద్దేశించి అది ప్రయోగింపబడితే అది వారినే వధిస్తుంది. లేదా ఆంజనేయుని అడగవచ్చు. లేదా తిరిగి పారిపోయి వస్తున్నాడు సుగ్రీవుడని, వెంట తరుముతున్నవాడు వాలి అని చంపవచ్చు. దానికి ముఖ్యకారణం అప్పుడు వాలి ఇంద్ర దత్తమైన మాలను ధరించిరాలేదు. అందువల్లనే రాముడు వాలిని వధించగలిగాడని ఆయనకు అపవాదం రావచ్చు. అందువల్లనే రాముడు బాణం వేయలేదు. అందుకు సుగ్రీవుని అపరాధాలు కూడ తోడయ్యాయి. లక్ష్మణునిచేతనే సుగ్రీవుని మెడలో గుర్తుగా గజపుష్పమాలను వేయించాడు. వెంటనే అతని గాయాల బాధంతా మటుమాయ మయ్యింది. ఆ సమయంలో సుగ్రీవుడు ఇలా ప్రకాశించాడని వాల్మీకి

**"విపరీత ఇవాకాశే సూర్యో నక్షత్రమాలయా"** వ్రాయడం జరిగింది. ఇది విరుద్ధంగా గోచరిస్తుంది. "పరీతంతు దివాప్రోక్తం విపరీతం తు శర్వరీ" అని నిఘంటువు చెబుతుంది. అలాగే సూర్యశబ్దానికి చంద్రుడు అనే అర్థం కూడ ఉంది. "రాకా మధ్యగతశ్చంద్రః సూర్య ఇత్యభిధీయతే" అని అర్థం. ఇలా సమన్వయం చేసుకొంటే తప్ప ఇది కుదరదు.

మళ్లీ రెండో మారు సుగ్రీవుడు వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. వాలి వెళ్లబోతూ ఉంటే తార హితోపదేశం చేస్తుంది. సుగ్రీవుడు రాముని ఆశ్రయంలో ఉన్నాడంటుంది. దానికి వాలి ప్రత్యుత్తరమిస్తూ ధర్మాత్ముడు కృతజ్ఞుడు అయిన రాముడు ఎప్పుడూ అధర్మం ఆచరించడని, ఆయన ఏది చేస్తే అదే ధర్మం అనబడుతుందని అంటాడు. ఆ సమయంలో ఆర్తుడైన సుగ్రీవుని రక్షణార్థమై వాలిపై రాముడు బాణం ప్రయోగించాడు. వాలి ఆ బాణపు దెబ్బ వల్ల పుట్టిన బాధతో రాముణ్ణి అధిక్షేపించాడు. నాతో ద్వంద్వయుద్ధం చేయకుండా ప్రచ్ఛన్నయుద్ధం ఏలచేసావని ఎన్నో విధాలుగా ప్రశ్నిస్తాడు. రాముడు అన్నింటికీ సమాధానమిచ్చాడు. ముఖ్యంగా రెండు ప్రశ్నలు వేసాడు. అన్నదమ్ముల కలహంలో నీవెందుకు కలగజేసుకున్నావు అని. దానికి రాముడిచ్చిన సమాధానం అంతరార్థంతో కూడి వుంటుంది. రాముడు నాకే అపకారం చేశావన్నాడు. దేవతలు తమ తమ అంశలతో వానరులను సృష్టించే సమయంలో రావణవధకు ఉపయోగించమని ఇంద్రుడు నిన్ను సృష్టిస్తే నీవు నా శత్రువుతో చేతులు కలిపావన్నాడు. నీవు పరాఙ్ముఖవధ ఎందుకు చేశావన్నాడు. జాతిధర్మాన్ని బట్టి శిక్షవేయాలని నరవానరరూపంతో సంచరించే శక్తి మీకు ఇచ్చినా, నీవు వానరరూపంలో ఉండిపోయావని, మృగాన్ని ఏవిధంగానైనా కొట్టవచ్చని రాముడు ప్రత్యుత్తరమిచ్చాడు. అంత వాలి నేను నీ ద్వారా చనిపోవాలనే కోరికతోనే వచ్చానని. **"త్వత్తోహం వధ మాకాంక్షన్ వార్యమాణోపి తారయా"** అని వచించి అంగదుని రాముని కప్పగించి ప్రాణాలు విడుస్తాడు.

పిమ్మట తార ఎన్నో విధాలుగా విలపిస్తుంది. రాముడు, ఆంజనేయుడు ఆమెను ఓదార్చారు. రాముని ఆదేశంపై వాలికి అంత్యేష్టి నిర్వహించబడింది. అనంతరం సుగ్రీవుడు కిష్కింధారాజ్యానికి అభిషిక్తుడయ్యాడు. అంగదుణ్ణి యువరాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు.

"ప్రస్తుతం వర్షాసమయం. కార్తికమాసం వచ్చిన తరువాత సీతాన్వేషణ ప్రారంభించవచ్చు. రాజ్యస్వీకారం చేసావు కనుక సుహృదయులను సంతోషపెట్టు" అనే రాముని మాటప్రకారంగా సుగ్రీవుడు రాజ్యసుఖాలతో తేలియాడసాగాడు. రామలక్ష్మణులు ప్రస్రవణగిరిపై ఉండిపోయారు. గడువు ముగియబోతోంది. కనీసం

ఒక్కసారయినా సుగ్రీవుడు రామసందర్శనార్థం రాలేదు. హనుమంతుని సూచనపై సేనలను సమీకరించమని నీలుని ఆజ్ఞాపించాడు సుగ్రీవుడు గడువు ముగిసింది రాముడు లక్ష్మణునితో

**"న చ సంకుచితః పంథా యే న వాలీ హతో గతః ।**

**సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలిపథమన్వగాః"** అని ఇచ్చిన మాటకు కట్టుబడి యుండు. వాలి వెళ్లిన త్రోవ మూయబడలేదు. ఆ దారిలో వెళ్లవద్దు అని చెప్పవలసిందన్నాడు. లక్ష్మణుడు కోపోద్రిక్తుడై తోక త్రొక్కిన త్రాచులా లేచాడు. రాముడంత కఠినంగా వ్యవహరించవద్దని, మృదువుగా ప్రవర్తించమని హితం పలికాడు. లక్ష్మణుని రాకను గూర్చి మంత్రులు సుగ్రీవునికి తెలిపి కర్తవ్యాన్ని వివరించారు. హనుమంతుడు కూడ హితం ఉపదేశించాడు. తార యుక్తియుక్తంగా పలికి సౌమిత్రిని శాంతింపచేసింది. సుగ్రీవుడు పశ్చాత్తాప హృదయంతో లక్ష్మణుని పల్లకీలో కూర్చుండబెట్టి రామసన్నిధికి వచ్చి పాదాభివందనం చేసాడు. సీతాదేవిని అన్వేషించవలసిందని నలుదిక్కులకు వానరులను పంపించాడు. సేనలు అప్పటికే కిష్కింధకు చేరాయి.

వినతుని తూర్పుదిక్కుకు, అంగదాదులను దక్షిణ దిక్కుకు, సుషేణుని పశ్చిమదిశకు, శతబలిని ఉత్తరదిక్కుకు వానరులను తోడిచ్చి పంపించాడు. ఇక్కడ ఇంచుమించు భూగోళమంతా వివరించబడింది. నెలరోజులు గడువు ఇచ్చి పంపించాడు ఆ సమయంలో తిరిగి రావాలని, లేదా వధార్హులవుతున్నారని, కార్యసాధన పూర్తి అయితే గడువు దాటినా మన్నిస్తానని పలికాడు. రాముడప్పుడు ఆనవాలుగా తన ఉంగరాన్ని సీతాదేవికి చూపించమని హనుమంతునికిచ్చాడు. వన్యవృత్తిని ఆశ్రయించిన రాముని వద్ద ఈ ఉంగరం ఎక్కడ నుండి వచ్చింది? ఎన్నో శంకలు ఎన్నో సమాధానాలు. ఏదో ఒకటి నిర్ణయించాలికదా! గంగానది దాటుతున్నప్పుడు ప్రత్యుపకారంగా గుహునికి ఈయడానికై రాముడు సీత వద్ద నుండి ఈ ఉంగరం తీసుకొన్నాడని అతడు నిరాకరించగా, రాముని వద్దనే అది ఉండిపోయిందని, అది ఇప్పుడు హనుమంతునికి ఈయబడిందని ఒక సమాధానం చెప్పుకోవచ్చు. అందరూ అన్ని దిక్కులకు బయలుదేరారు. తూర్పు, పడమర, ఉత్తరం దిక్కులకు వెళ్లినవారు నెలదాటకుండగానే తిరిగి వచ్చి సీత జాడ కానరాలేదని తెలియజేశారు.

అంగదుడు, హనుమంతుడు జాంబవంతుడు మున్నగువారు దక్షిణదిక్కు కేగి సీతను అన్వేషింపసాగారు. కండు మహర్షి శాపంతో నిర్జనారణ్యంగా మారిన ప్రదేశాన్ని కూడ గాలించారు. వారికి అక్కడ ఒక రాక్షసుడు తారసిల్లాడు. అతనినే రావణునిగా భావించి అంగదుడు వానిని నేలకూల్చాడు. అప్పటికే నెలరోజులు గడువు పూర్తి అయింది. వారు పిపాసాపీడితులై స్వయంప్రభగుహలో ప్రవేశించారు. ఆమె వారికి ఆతిథ్యమిచ్చింది. ఆ యోగిని అనుగ్రహంతో అందరూ దక్షిణ సముద్రతీరం చేరారు. ఉత్తుంగ తరంగాలతో కూడుకొన్న సముద్రాన్ని వీక్షించి సుగ్రీవుని నిందింపసాగారు.

ఇక్కడ సుగ్రీవుని లోపాలను అంగదుడు పూసగ్రుచ్చినట్లు చెబుతాడు. అన్న మరణించాడో లేదో పూర్తిగా తెలుసుకోకుండానే తారను స్వీకరించడం, బిలద్వారాన్ని మూసివేయడం, అగ్నిసాక్షికంగా స్నేహం చేసి రాముని విషయంలో కృతఘ్నత చూపించడం, ఇలా సుగ్రీవుని దోషాలను లెక్కపెట్టాడు. తిరిగి వెళ్లి సుగ్రీవుని చేతిలో మరణించడం కన్న ప్రాయోపవేశం ఉత్తమమని భావించి రామకథను గానం చేయసాగారు. అంత జటాయువు

సోదరుడు సంపాతి రెక్కలు లేకుండా అక్కడకు ప్రాకుకొంటూ వచ్చాడు. విషయాన్ని అంతా గ్రహించి సంపాతి రావణోదంతాన్ని తెలియజేసాడు.

**"పుత్రో విశ్రవసః సాక్షాత్ భ్రాతా వైశ్రవణస్య చ ।**
**అధ్యాస్తే నగరీం లంకాం రావణో నామ రాక్షసః" ॥**

ఇందు మొదటి పాదాన్ని ఇంతకు పూర్వమే జటాయువు తెలిపియున్నాడు. ఆ శ్లోకంలోని రెండో పాదాన్ని ఇక్కడ సంపాతి పూర్తిచేశాడు. ఇది వాల్మీకి మహర్షి అత్యద్భుత కవితాసృష్టి. అతడే సీతారావణుల వృత్తాంతాన్ని వారికి తెలియజేశాడు. జటాయువుకి జలాంజలులు సమర్పించిన వెంటనే సంపాతికి రెక్కలువచ్చాయి.

సముద్ర తరణం ఎవరు చేయగలరని వారు తర్జనభర్జన చేసారు. గయుడుపది, గవాక్షుడు ఇరవై, గవయుడు ముప్పై, శరభుడు నలభై, గంధమాదనుడు ఏభై, మైందుడు అరవై, ద్వివిదుడు డెబ్బై, సుషేణుడు ఎనభై, జాంబవంతుడు తొంభై యోజనాలు దాటగలమంటారు. అంగదుడు తాను నూరు యోజనాలు సముద్రాన్ని దాటగలను గాని తిరిగిరావడం అనుమానం అన్నాడు.

అప్పుడు వానరులందరూ ఆంజనేయుని జన్మవృత్తాంతాన్ని తెలిపి సముద్రలంఘనానికై ప్రేరేపించారు. జాంబవదాదులు ప్రస్తుతిచేయగా హనుమంతుడు లంకకు వెళ్లడానికై ఉత్సాహాన్ని వ్యక్తం చేసి తన అద్భుత రూపాన్ని ప్రకటించాడు.

**"మనస్సమాధాయ మహానుభావో**
**జగామ లంకాం మనసా మనస్వీ"**

అని అంటారు వాల్మీకి. లంకను గూర్చి ఆలోచిస్తూ మనస్సులో నిర్ణయించుకొని బయలుదేరాడు అని అర్థం. ఇక్కడ ఒక చమత్కార విషయం చెబుతారు. సీతమ్మ పాదాలనే మనస్సులో భావించి బయలుదేరితే నేరుగా అక్కడకే చేరేవాడేమో!

ఇవి కిష్కింధాకాండలోని విశేషాలు.

# శ్రీమద్వాల్మీకి రామాయణం - కిష్కింధాకాండ సమీక్ష

వ్యాఖ్యాత - డా॥యస్.వి.రంగరామానుజాచార్యులు

శ్రీమతే రామానుజాయ నమః

జయతాత్ రామభద్రో య జానకీరాగరంజితః ।
హనూమదాది సంసేవ్యః సాక్షాద్విష్ణుర్య ఈడ్యతే ॥

సప్తసాలానుభేదేన ప్రక్షేపాద్దుందుభేస్తనోః ।
స్వీయం బలముపాదర్శ్య సుగ్రీవాశ్వాసకారకః ॥

ధర్మగ్లానిమపాకృత్య కృతకృత్యత్వసిద్ధయే ।
సుగ్రీవసఖ్యసంప్రీతో వాలినో దౌష్ట్యమాహరత్॥

పరదారాభిమర్శస్య ప్రాణదండం ప్రదర్శయన్ ।
జానకీశోకనాశాయ కేనాశగతిచింతయా ।
హనూమదాదీన్ సంప్రేష్య దౌత్యకృత్యం చ యోఽదిశత్ ॥

తదీయతత్త్వవ్యాఖ్యానవ్యాపృతాన్ విబుధోత్తమాన్ ।
ప్రణమ్య మూర్ధ్నా సంక్షేపాత్ వ్యాఖ్యావత్త్వమిహోద్ధియే ॥

యతో హి తత్త్వవ్యాఖ్యానే విదుషాం వ్యాపృతా మతిః ।
స చేతశ్చిత్తసంతోషప్రదాత్రీ సా మహీయతామ్ ॥

కిష్కింధాకాండ - మహేశ్వర - తీర్థీయ - గోవిందరాజీయ వ్యాఖ్యాపర్యాలోచనం

శ్రీరామాయణానికి వ్యాఖ్యానాలు ఎన్ని వున్నా గోవిందరాజీయవ్యాఖ్యా - మహేశతీర్థీయవ్యాఖ్య అనే రెండు వ్యాఖ్యలు విశేషంగా వివేచింపదగి వున్నాయి. గోవిందరాజు తన వ్యాఖ్యాన ఆరంభంలో రామాయణ మహాకావ్యాన్ని తాను ఎలా వ్యాఖ్యానించేది విస్పష్టంగా పేర్కొన్నాడు.

క్వచిత్పదార్థం క్వచిదన్వయార్థం క్వచిత్పదచ్ఛేద సమర్థనాని ।
క్వచిత్క్వచిద్గాఢనిగూఢభావం వక్ష్యే యథాపేక్షమవేక్షణీయమ్ ॥

కొన్ని చోట్లలో పదాల అర్థాన్ని, కొన్ని చోటుల్లో పదార్థాల సమన్వయం వల్ల వచ్చిన అన్వయార్థాన్ని కొన్ని స్థలాల్లో పదాల విరుపును ఉచితంగా సమర్థించడం, మరికొన్ని చోట్ల నిగూఢంగా వున్న అభిప్రాయాలను వెల్లడి చేయడం అనేది ఇతని వ్యాఖ్యాస్వభావం ఇతనిమాటలవల్లనే తెలుస్తుంది. ఇంచుమించుగా మహేశతీర్థీయవ్యాఖ్య

కూడా ఇలాంటి పద్ధతిలోనే వుంటుంది. అయితే గోవిందరాజీయవ్యాఖ్యకున్న విషయవిస్తృతి సాంప్రదాయిక తత్త్వరహస్యాలను సమన్వయరీతులను ఆవిష్కరించే ధోరణి మహేశతీర్థీయవ్యాఖ్యకు లేదని చెప్పవలసి వుంది. ఒకవిషయం మాత్రం వ్యాఖ్యావివేచకులు తప్పనిసరిగా అంగీకరింపవలసివుంది. అదేమిటంటే పదార్థవివరణంలోనూ, పదసమన్వయంలోనూ, మరికొన్ని అంశాలలోనూ, గోవిందరాజీయవ్యాఖ్య మహేశ్వర తీర్థీయాన్నే అనుసరిస్తుంది అని. తత్త్వనిరూపణాప్రక్రియలో తీర్థీయవ్యాఖ్య గోవిందరాజీయవ్యాఖ్య లాగా విస్తృతం కాకపోయినా, సంగ్రహంగా తత్త్వనిరూపణ ప్రక్రియ దానికీ ఉంది. గోవిందరాజీయవ్యాఖ్యలోలేని కొన్ని విలక్షణ లక్షణాలు అంటే విస్తారంగా వివిధపురాణశ్లోకాలను ఉట్టంకించి రామాయణకథాసన్నివేశాలను సముచితంగా వివరించడం, ప్రతిసర్గ ఫల శ్రుతులను పురాణప్రమాణపురస్సరంగా ఉట్టంకించడం, పాఠశోధనం చేయడం శ్లోకక్రమాన్ని నిర్ణయించడం ఇలాంటివి ఎన్నో విశేషాలు మహేశ్వరతీర్థీయంలో ఉన్నాయి. గోవిందరాజీయవ్యాఖ్య తన వ్యాఖ్యానశైలిని పేర్కొన్నట్లే మహేశ్వరతీర్థీయం తన వ్యాఖ్యానశైలిని ఆరంభంలో విస్పష్టపరచినది. గ్రంథగతాలైన శబ్దాలను శోధించడం, నిఘంటువులను ఉట్టంకించడం, పదాల అర్థాలను వివరించడం అంతేకాకుండ సీతారామాదులు ఆయా సందర్భాలలో పలికిన పరుషమైన వచనాలకు వాస్తవమైన తాత్పర్యమేమిటో వివరించడం, పూర్వవ్యాఖ్యానాలలోని వాక్యాలను ఉద్ధరించి తన వ్యాఖ్యలో చూపడం తీర్థీయవ్యాఖ్యకు స్వభావమని వ్యాఖ్యావచనాలను బట్టే స్పష్టమౌతుంది. గోవిందరాజీయవ్యాఖ్య పూర్తిగా రామానుజీయ శ్రీవైష్ణవసిద్ధాంతాన్ని, సంప్రదాయరహస్యాలను, రామాయణకథా సన్నివేశాలతోనూ, శ్లోకసమన్వయాలతోనూ విశదపరచేదిగా వివేచకులకు అడుగడుగునా విస్పష్టంగా గోచరిస్తుంది. ఈ విధంగా ఇది సాంప్రదాయికవ్యాఖ్య అనే అనాలి. ఈ సాంప్రదాయస్వభావాన్ని పరిరక్షించడం కోసం గోవిందరాజీయవ్యాఖ్య ఒకటి, రెండుచోటులలో అస్వాభావికమైన సంప్రదాయధోరణి ప్రభావితమైన సమన్వయాలను కూడా ఆవిష్కరిస్తూ ఉంటుంది. ఇక తీర్థీయవ్యాఖ్య ఇలాంటివిశేష సాంప్రదాయిక సమన్వయధోరణిని ఆవిష్కరిస్తున్నట్లు అంతగా కనిపించకపోయినా స్మార్తసంప్రదాయాన్ని అనుసరించినదేనని వివేచకుల భావన. అయితే ఇందులో వాస్తవికత లేదని చెప్పాలి. ఎందువల్లంటే కేవలం పదార్థవివరణకు ఇచ్చిన ప్రాధాన్యం ఏవిధమైన సాంప్రదాయిక విషయాలకు ఈయకపోవడం వివేచకులు గుర్తింపగలరు. గోవిందరాజీయవ్యాఖ్య – రామానుజీయం, తనిశ్లోకీ ప్రభృతివ్యాఖ్యావిశేషాలను ఉట్టంకించేది కాగా, తీర్థీయవ్యాఖ్య తిలకాదివ్యాఖ్యానాల్లోని విశేషాలను ఉట్టంకిస్తూ ఉంటుంది.

ప్రస్తుతము కిష్కింధాకాండలోని విశేషాలను ఈ రెండువ్యాఖ్యలు ఎలా విశ్లేషించాయో యథావకాశంగా వివేచింపవలసివుంది. కిష్కింధాకాండ వ్యాఖ్యారంభంలో గోవిందరాజీయవ్యాఖ్య కాండతాత్పర్యాన్ని సాంప్రదాయ రీతిలో వివరించింది. ఇది దీని అభిప్రాయం. వెనుకకాండలో అంటే అరణ్యకాండలో దీనజన సంరక్షణరూపమైన ధర్మాన్ని శ్రీరామచంద్రుడు అనుష్ఠించి చూపగా, కిష్కింధాకాండలో మిత్రసంరక్షణ రూపమైన ధర్మం ఆతనిచే ఎలా ఆచరింపబడిందో నిరూపింపబడింది. వెనుక కాండలో పరమాత్మయొక్క అసాధారణ లక్షణమైన 'మోక్షప్రదత్త్వం' అనేది శ్రీరామచంద్రునియందు అన్వయించి నిరూపింపబడగా, ఈ కాండలో పరమాత్మయందుకల అసంఖ్యాలైన కల్యాణగుణాలు శ్రీరామచంద్రునియందు పరిపూర్ణంగా ఎలా వున్నాయో వివేచించి నిరూపింపబడినాయి. శ్రీరామాయణము శ్రీవైష్ణవసంప్రదాయంలో అనుసంధింపబడే "ద్వయమని" చెప్పబడే మంత్రముయొక్క తాత్పర్యాన్ని

వివరిస్తుందని గోవిందరాజీయవివరణము. ఈ సందర్భంలో గోవిందరాజు సమగ్రమైన మంత్రతాత్పర్యసమన్వయాన్ని సంగ్రహంగా ఇలా ఉట్టంకించారు. ప్రథమకాండంలో ద్వయమంత్రంలోని శ్రీమత్ అనే పదంచేత చెప్పబడిన శ్రీమత్త్వం అనే లక్షణం అనగా లక్ష్మీవిశిష్టుడై ఉండుట అనే స్వభావం చెప్పబడింది. రెండవ కాండలో సర్వజనులకు వ్యామోహాన్ని కలిగించేవాడుగా శ్రీరామచంద్రుని నిరూపించడం వలన సమస్తానికి ఆశ్రయమైనవాడు అనే "నారాయణ" పదముయొక్క తాత్పర్యం ఉట్టంకింపబడింది. ఇక మూడవదైన అరణ్యకాండలో పంచవటిలో నివాసం ఉండటం అనే వృత్తాంతం ద్వారా మునిజనులు చేసిన కైంకర్యాన్ని వర్ణించడం ద్వారా 'శ్రీమతే నారాయణాయ' అనే చోట గల చతుర్థీవిభక్తియొక్క అర్థం నిరూపింపబడింది. ఇదేకాండలో గల ఖరాదివధ వృత్తాంతం ద్వారా 'నమః' అనే శబ్దం అర్థం చెప్పబడింది. మారీచుని దర్శించడంతో ప్రారంభించి చేతనులను ఉద్ధరించే విధానం ప్రదర్శింపబడింది. మారీచదర్శనవృత్తాంతంచేత విశేషంగా భగవంతునియొక్క నిత్యానుభవానికి యోగ్యుడైన జీవుడు భగవంతుని విడచి ఇతరవిషయములందు ప్రీతిగలిగి ఉండటం అనే అంశం చెప్పబడింది. తర్వాత రావణుడనే మహామోహం ఆ జీవుని ఆక్రమించడం, జటాయువువృత్తాంతం ద్వారా రావణుని మరల్చలేకపోవడం, తద్వారా "కేవల కర్మచేత సంసారం తొలగదు" అనే రహస్యం చెప్పబడింది. లంకలో ప్రవేశించటం అనేది, సంసారంలో ప్రాకృతిక శరీరంలో ప్రవేశించడమేనని ఏకాక్షి, ఏకకర్ణి, మొదలైనవారి ప్రవృత్తులద్వారా జీవుడు తాపత్రయంచే ఎలా బాధపడతాడో చెప్పబడింది. రాముడు సీతను వెతకడం ద్వారా భగవంతుడు జీవుని ఉద్ధరించటానికి ఎలా ఉపాయాన్ని ఆలోచిస్తాడో చెప్పబడింది. ఇదంతా అరణ్యకాండలోని విశేషం. ఇక కిష్కింధాకాండలో ఆచార్యుడి ద్వారా జీవునకు తనపట్ల ప్రీతిని ఆభిముఖ్యాన్ని కలిగింపగోరి పరమాత్మయే స్వయంగా ఆచార్యాన్వేషణ చేసిన వైనం నిరూపింపబడుతుంది. ఇక కిష్కింధాకాండలోని ప్రథమసర్గలో ఈ చేతనవర్గం తనను విడచి ఇతరేతరభోగాలపట్ల ప్రావీణ్యం కలిగి నన్ను చేరలేకపోతున్నదే అని భగవంతుడు పడిన క్లేశాన్ని నిరూపించడం జరిగింది. "ఏకాకీ న రమేత" అని కదా ఉపనిషత్సూక్తి. ఈవిధమైన సాంప్రదాయిక వివరణానికి అనుకూలంగానే గోవిందరాజీయవ్యాఖ్య కిష్కింధాకాండలో సాగింది. పంపాసరోవరాన్ని దర్శించి శ్రీరామచంద్రుడు ఇష్టజనవియోగం వలన కలిగిన కామోద్దీపనము చిత్తవిభ్రమ కారణమని, ఇలాంటిస్థితి శ్రీరామచంద్రునివంటి పురుషధౌరేయులకు కూడా తప్పదని వాల్మీకి పంపాసరోవర వర్ణన ముఖంగా దర్శింపచేస్తున్నాడని మహేశ్వరతీర్థీయ వ్యాఖ్య. ఇక్కడ ఈ వర్ణనం కూడా సంప్రదాయానుకూలమే అని గోవిందరాజీయవ్యాఖ్యా తాత్పర్యము. పంపాసరోవరతీరాన వున్న పెద్దపెద్ద చెట్లు శిఖరాలతో కూడివున్నట్లు ఉన్నత శాఖాగ్రాలతో భాసిస్తున్నాయని వాల్మీకి అన్న మాటచేత భగవద్దయారసాన్ని ఆశ్రయించివున్న ఆచార్యులు వారిని అనుసరించివున్న శిష్యులు సూచింపబడుతున్నారని గోవిందరాజీయ వివరణం. 'అత్ర చ, పరత్ర చ' అను న్యాయాన్నిబట్టి నిత్యవిభూతిలో కూడా శిష్యవత్త్వం సూచింపబడుతున్నది. ఇక్కడ వున్న చెట్లు మేఘాలు జలాలను వర్షిస్తున్నట్లుగా, పుష్పాలను వర్షించడం, ఆచార్యపురుషులు ఇతరులకు తత్త్వాన్ని ఉపదేశించడమే అని. నలువైపులా వీస్తున్నగాలి, పూలపై సంచరిస్తూ, ఆయా కుసుమస్థానాలనుండి కదులుతూ గానం చేస్తున్న తుమ్మెదలచే అనుసరింపబడుతున్నది అనడంలో తనకంటే అనన్యులైన జ్ఞానులలో భక్తిని వృద్ధి పొందించడానికి స్వయంగా భగవానుడు భూమిని అవతరించినపుడు ఆయనను అనుసరించి గానంచేస్తున్న భక్తసందోహాన్ని సూచిస్తున్నదని గోవిందరాజీయవ్యాఖ్యానం. ఇక ఈ గాలి మదించిన కోకిలల గానంతో చెట్లను

నర్తింపజేస్తూ కొండగుహలనుండి గానంచేస్తూ బయల్వెడలడం, స్వయంగా భగవానుడు వేదప్రవర్తనము ద్వారా లోకానికి భక్తిని అలవరచడానికి వైకుంఠంనుండి దిగిరావడమే అని, అక్కడ మాలాబద్ధాలై బారులుతీరిన వృక్షాలు, భగత్కృపచే ఒకరితోనొకరు సన్నిహితులై ఉన్న భాగవతజనులే అని వ్యాఖ్యానించడం జరిగింది. అలాగే పవనవిక్షిప్తాలైన పాదపాలు షట్పదగానాలతో కూడి భగవదనుభవవశంగా వివశులై సామగానంచేస్తున్న భాగవతోత్తములవలె ఉన్నవని వివరించడం శ్రీవైష్ణవసంప్రదాయానికి అనుగతమైన వ్యాఖ్య. ఇలాసాగిన వ్యాఖ్యలో గోవిందరాజు సిద్ధాంతరహస్యాలను కూడా వెల్లడి చేస్తూ వుంటాడు. "ఏష నత్యూహః" అనే శ్లోకంలో కేవలజపపరులైనవారు చెప్పబడ్డారని, జ్ఞానభక్తులు రెండుమాత్రమే వెంటనే భగవత్ప్రీతిని కలిగించేవి కనుక, వీటికంటే వేరైన సాధనములను(జపాదులను) ఆశ్రయించేవారు భగవంతునికి అంతగా ప్రీతిపాత్రులుకారు అన్న రహస్యం ఇక్కడ సూచింపబడుచున్నదని వ్యాఖ్యాతయొక్క అభిప్రాయం. ఇలా ఇంచుమించుగా ప్రతిశ్లోకంలోనూ గోవిందరాజు సాంప్రదాయిక విషయాలను విపులంగా వివరిస్తారు. సీతావియోగసంతప్తుడైన శ్రీరామచంద్రుడు భగవత్విదూరుడై సంసారంలో పడి పరితపిస్తున్న జీవుల దుఃఖాన్ని చూసి క్లేశపడుతున్న భగవానుడిగా సాక్షాత్కరించాడు. ఇక సీతారాములసంబంధం జీవాత్మపరమాత్మలబంధంగా అది స్వాభావికమైనదిగా వ్యాఖ్యాత నిరూపించాడు. ఇక చెట్లకొమ్మలపై స్థిమితంగా కూస్తున్న పక్షులు జ్ఞానప్రధానమైన పరమపదంలో సామగానం చేస్తున్న నిత్యముక్తుల స్థితిని సూచిస్తున్నదని అంటాడు.

**విక్షిప్తాం పవనేనైతాం అసౌ తిలకమంజరీమ్ ।**
**షట్పదః సహసాఽభ్యేతి మదోద్ధూతామివ ప్రియామ్ ॥**

అనే శ్లోకంలో 'తిలకమంజరీం షట్పదః సహసా అభ్యేతి' అనే వాల్మీకివచనంచేత భగవద్దయకు పాత్రమైనవారికి, ఉత్తరక్షణంలోనే 'ద్వయమంత్రం' లభిస్తుందని సూచింపబడుతుందని వ్యాఖ్యాతశ్లోకతాత్పర్యాన్ని ఉట్టంకిస్తాడు. 'కుసుమశాలినః' అనే పదం జ్ఞానుల జ్ఞానసమృద్ధిని తెలియజేస్తున్నదని అంటాడు. ఈ సందర్భంగా

**పద్మకేసరసంస్పృష్టః వృక్షాంతరవినిస్సృతః ।**
**నిశ్శ్వాస ఇవ సీతాయా వాతివాయుర్మనోహరః ॥**

అనే శ్లోకానికి గోవిందరాజు చేసిన వ్యాఖ్య భావగంభీరంగా సాగింది. ఈ శ్లోకాన్ని ద్రవిడోపనిషత్ వ్యాఖ్యాతలు కూడా వ్యాఖ్యానించారు. ఈ శ్లోకానికి వ్యాఖ్యాత వ్రాసిన కొన్ని విశేషాలను గమనించుదాం. పద్మకేసరసంస్పృష్ట ఇత్యాది శ్లోకం వాయు వర్ణనపరం. పద్మాలకింజల్కాలచే సంస్పృష్టుడై (కూడిఉండి) వృక్షాలమధ్యభాగంనుండి వెలుపలికి వచ్చిన వాయువు సీతమ్మయొక్క నిట్టూర్పులా వీస్తున్నదట. కనుకనే మనోహరంగా వున్నదని తాత్పర్యం. ఇక వ్యాఖ్యాతృభావన ప్రతిపదస్వారస్య నిరూపణపురస్సరంగా శ్లోకంలోని నిగూఢరమణీయతను వెలికిదీస్తున్నది. సర్వప్రాణులకు ప్రాణనహేతువైన (బ్రతుకుకు కారణమైన) వాయువే. మా ప్రాణాలను, మా సర్వస్వాన్ని హరిస్తున్నదని వ్యాఖ్యాత, వక్తృతాత్పర్యాన్ని ఆవిష్కరిస్తున్నాడు. పద్మకేసరసంస్పృష్టః – ధూళిగా చేయడమే వాయుకృత్యం. కనుకనే సర్వప్రాణహేతువైన వాయువే సర్వాన్ని ధూళిగా చేయడానికి ప్రవర్తిస్తున్నాడు. సర్వసంహారానికి ప్రయత్నిస్తున్నాడని అభిప్రాయం. లేదా, 'పద్మా' (లక్ష్మీదేవియొక్క) విరహంవల్ల పద్మకేసరాలు కూడా ప్రతికూలమై వాయువుకు సహాయం

చేస్తున్నాయని అభిప్రాయం. 'పాదారుంతుదమేవ పంకజరజః' అని అన్నట్లు సహజంగా స్వజనాన్నే బాధించేది. మననెందుకు బాధించదు? రాజసప్రకృతి కలదవడంవల్ల మననూ బాధించడానికి ఉపక్రమిస్తున్నది. అంతే కాదు, సహజంగానే ఇతరులను సంహరించడంలో సమర్థమైంది, పైగా సహాయునితో కూడిఉంది. లేదా, రూపవంతుడైన వాడు అసహాయశూరుడు. రూపరహితుడైన వాయువు సహాయమపేక్షించకుండా ఎలా ఉంటాడు. కేసరసంస్పృష్టుడై శరీరాన్ని పొంది ఇప్పుడు దారుఢ్యాన్ని సంపాదించాడు వాయువు, కనుక ఇతరులను బాధించడంలోనూ ఆశ్చర్యమేమీ లేదు. మరి వాయువు పీడాజనకమైనప్పుడు, పూర్వమే వాయువును పరిహరించాలి కదా! అంటే వృక్షాంతరవినిస్సృతః – చెట్లమధ్యనుంచి అమాంతంగా (ఒక్కసారిగా) దూసుకువచ్చింది వాయువు. కనుక నివారింపరానిదే. లేదా, ఎలాగైతే ఒక రాజకుమారుడు ఠీవిగా నీడలోవస్తాడో అలాగే ఈ వాయువు చెట్లచాటున నీడలో వస్తున్నాడు అని చెప్పవచ్చు. మన్మథతాపంచేత విశ్రాన్తికోసం చెట్లనీడను ఆశ్రయించడానికి కూడా సాధ్యంకాదు. మరి, పరి హరింపరాదా అంటే 'నిశ్వాస ఇవ సీతాయాః' సీత నిట్టూర్పులా వాయువు ఉంది. కనుక పూర్వపరిచితమైన దానిలా ఉన్నదాన్ని పరిహరించడం సాధ్యంకాదుకదా అని అభిప్రాయం. లేదా, సీతానిశ్వాసంతో సమానంగా ఉండటం చేత ఒకవేళ సీతయే చెట్లచాటున ఉన్నదేమో అనే భావనచే కదలలేక ఉండిపోయాను అంటున్నాడు రాముడు. 'సురభినిశ్వసితే దధతః తృషాం' అని కవులచే నిశ్వాసమందు సౌరభ్యం చెప్పబడుతున్నది. లేదా, వాయువు సాధనసంపత్తితో కూడియే బాధించడం లేదు, కేవలం స్మరణమాత్రజనకమై అంటే సీతాస్మృతిని కలిగించడం ద్వారా కూడా బాధిస్తున్నది. ఎప్పుడో ఒకప్పుడు రావడంకాదు సర్వదా వస్తున్నది అనడానికి 'వాతి' అని క్రియాపదప్రయోగం. సమస్తవనాన్ని విలాసంగా సంచరిస్తున్నది వాయువు. కనుక పరిహరణ శక్యంకాదు. వాతి అనడంచేత 'వా గతి గంధనయోః' అనే ధాతువుకు గంధనం కూడా అర్థం. కనుక తన పరిమళంచేత అందర్నీ వశపరచుకుంటున్నదని కూడా భావం. ఇలా బాధపెట్టేవాడు ఎవ్వడో అనామకుడు కాదు. సర్వ ప్రాణనహేతువైన వాయువే. లేదా, 'భీషాస్మాత్ వాతః పవతే' (పరమాత్మ అంటే భయపడి వాయువు వస్తున్నది) అన్న ఉపనిషద్వచనాన్ని బట్టి – 'నేనంటే భయపడి నన్ను బాధిస్తున్నాడు' అని కూడా రాముని అభిప్రాయం. ఎలా బాధిస్తున్నది? అన్న శంకకు సమాధానంగా 'మనోహరః' అంటున్నాడు. పైకి అగుపించని ఆంతర్యపదార్థమైన మనస్సును కూడా హరిస్తున్నాడు. 'పద్మకేసర సంస్పృష్టః' అనడంచేత చల్లదనం చెప్పబడింది. 'వృక్షాంతరవినిస్సృతః' అనడంచేత మెల్లగా వీస్తున్నదని తెలుస్తున్నది. 'నిశ్వాస ఇవ సీతాయాః' అనడంచేత భరితత్వం తెలుస్తున్నది. 'పద్మకేసరసంస్పృష్టః' అనడంచేత ఒకచోరునకుండే సమాధి (ఏకాగ్రత) తెలుస్తున్నది. చోరుడు తన శరీరాన్ని నల్లని రంగుతో పూసుకొని, ఎవరికీ తెలియరానివిధంగా వచ్చినట్లే, పద్మకేసర ధూళి ధూసరిత దేహుడై దొంగలా వస్తున్నాడు వాయువు అని అభిప్రాయం. స్వరూపాన్ని కప్పిపుచ్చి ఇతరులను భయపెట్టడానికే ఈ వేషం. వృక్షాంతరవినిస్సృతః చెట్లచాటున దాగివుండి పథికులు దగ్గరకు రాగానే అకస్మాత్తుగా పైనబడి బాధిస్తున్నాడని అభిప్రాయం. నిశ్వాస ఇవ సీతాయా అనడంచేత బహుకాలపరిచయం కలవాడిగా దగ్గరకు చేరి కుశలప్రశ్నలు వేసి సంభాషిస్తూ ఆనుపానులు తెలిసికొంటున్నవానిలా ప్రవర్తిస్తున్నాడని భావం. వాతి అనడంచేత పథికుని ధనం తనచేతికి అందేంతవరకు దానిపట్ల ఆసక్తి లేనివానిలాగా అనుసరిస్తూ ఇటు అటు సంచరిస్తూ వస్తున్న దొంగలా ప్రవర్తిస్తున్నాడని వ్యక్తమౌతున్నది. వాయుః అనడంచేత ఈతని చౌర్యాన్ని చూచి ఎవరైనా గట్టిగా పట్టదలచినా

చేతికి దొరకక లాఘవంగా తప్పించుకోగల సమర్థుడని స్పష్టపడుతున్నది. కేవలం పైపైన మాత్రమే అపహరించడం లేదు. గుప్తంగా వున్న సొత్తును కూడా హరిస్తున్నాడనడానికి మనోహరః అన్నాడు కవి. దీన్నిబట్టి నిర్హేతుక హరిదయాప్రవాహం వర్ణింపబడుతున్నది. ఎవ్వరిని అనుగ్రహింప దలచాడో వాడి సొత్తునేకదా స్వామి అపహరింపచేసేది. పద్మకేసరసంస్పృష్టః అనే సమాసంలో పద్మా శబ్దానికి 'ఙ్యాపోః సంజ్ఞా చ్ఛందసోః' అనే పాణినీయ సూత్రంచేత హ్రస్వం వచ్చి పద్మకేసర అని అయింది. దీనివల్ల పద్మంయొక్క కేసరాలవంటి అనురాగాలచే సంస్పృష్టుడై అంటే పురుషకారమైన లక్ష్మీదేవియొక్క ప్రణయంచేత ప్రవర్తిస్తున్నాడు స్వామి అని స్ఫురిస్తున్నది. కనుకనే ఆచార్యులు ఇలా అన్నారు –

**పితేవ త్వత్ప్రేయాన్ జనని పరిపూర్ణాగసి జనే**
**హితస్రోతో వృత్త్యా భవతి చ కదాచిత్ కలుషధీః ।**

**కిమేతన్నిర్దోషః క ఇహ జగతీతి త్వముచితైః**
**ఉపాయైర్విస్మార్య స్వజనయసి మాతా తదసి నః ॥**

అమ్మా! తండ్రిలాగా నీ ప్రియుడైన స్వామి, పరిపూర్ణమైన అపరాధం జీవుడు చెప్పినప్పుడు, హితాన్ని కలిగించే వ్యవహారసరళిలో ఒక్కొక్కప్పుడు కొంత కలతచెందినవాడై శిక్షించనుద్యమిస్తాడు. "ఇదేమయ్యా! ఈ జగత్తులో తప్పుచెయ్యనివాడు ఎవ్వడు? అంటూ ఉచితోపాయాలతో ఆయన జీవుల తప్పులను మరచిపోయేలా చేసి, ఈ జీవకోటిని సాపరాధులైన వారిని కూడా నీవారిగా స్వీకరిస్తున్నావు కదా! కనుకనే నీవు మాకు అమ్మవైనావు" అంటారు ఆచార్యులు. ఈ లక్ష్మీగతమైన పురుషకారవైభవాన్ని రాక్షసస్త్రీలు సాపరాధులైనా హనుమంతుడు వారిని శిక్షించకుండా అడ్డిన సీతమ్మలో స్వాభావికకృపాళుతాగుణంగా పెద్దలు వివరిస్తారు. సాధారణంగా లోకంలో తండ్రి తనకొడుకు తప్పుచేసినప్పుడు మళ్లీ అటువంటి తప్పు ఆతడు చేయకుండా ఉండేలా శిక్షించడానికి ఉద్యమించినపుడు తల్లి అడ్డుపడి భర్తను అనునయించి శిక్షించకుండా చేసి బిడ్డను దగ్గరకు చేర్చుకుంటుంది. ఈ మాతాపితృస్వభావమే పైశ్లోకంలో ఆచార్యులు వ్యక్తపరచారు. ప్రస్తుతశ్లోకంలో పద్మకేసరసంస్పృష్ట అనే చోట వాయువిశేషణాలుగా వేసినవన్నీ స్వామికి అన్వయించవచ్చని వ్యాఖ్యాతృహృదయం. వాయువు అంటే నిరంతరం సాపరాధులైన చేతనులకు ఈ సంసారమండలంలో దిద్దుబాటుచేయడానికి ప్రవర్తించే స్వామియే. పద్మాశబ్దం సమాసపదంగా హ్రస్వమైనా లక్ష్మిని బోధించింది. కేసర శబ్దం ఆమెయొక్క కేసరతుల్యమైన అనురాగాలను బోధిస్తుంది. ఆయన ఇలాంటి అమ్మయొక్క అనురాగాలచే సులాలితుడు స్వామి. కనుక పద్మకేసరసంస్పృష్ట అని తాత్పర్యం. వృక్షాంతరవినిస్సృతః వృక్షాలమధ్యనుండి వాయువు వీస్తున్నది. ఇక్కడ స్వామి వృక్షంగా నిరూపింపబడిన సంసార మండలంలో ప్రవర్తిస్తున్నాడు.

'ఊర్ధ్వమూలమధశ్శాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్' అని శ్రీగీత ఈ సంసారమండలాన్ని వృక్షంగా రూపించింది. ఇక నిశ్వాస ఇవ సీతాయాః అనడంచేత 'స్త్రీప్రాయమితరత్ సర్వం' (స్వామి ఒక్కడు తప్ప మిగిలిన చేతనవర్గమంతా స్త్రీసమానమే) అన్నట్లు స్త్రీలవలె సంసారచక్రంలో పడి కర్మపరతంత్రులై వివశులై ఉన్న చేతనులకు నిశ్వాసంలాగా ఆశ్వాసకారకుడౌతున్నాడు స్వామి. నిశ్వాసప్రసారం ప్రాణప్రవృత్తిని సూచించినట్లుగా స్వామి చేసే

ఆశ్వాసమే (ఊరడింపే) ఈ చేతనకోటికి ప్రాణధారకమౌతుందని తాత్పర్యం. వాయువు సర్వత్ర ఉన్నట్లు స్వామి రాగద్వేషాదిశబ్దవాచ్యుడై సార్వత్రికుడు (అంతటా వున్నవాడు) మనోహరః అన్నచోట తన వాత్సల్యసౌశీల్యాది కల్యాణగుణాలచేత సర్వస్పృహణీయుడై చేతనుల మనస్సులను తనవైపు త్రిప్పుకొంటున్నవాడు అని అర్థం. (ఈ శ్లోకాన్ని ద్రమిడోపనిషత్ వ్యాఖ్యాకారులు వ్యాఖ్యానించారని వ్యాఖ్యాత సూచించాడు.) ఈ శ్లోకక్రమంలో విశేషంగా వివేచింపదగిన శ్లోకం మరొక్కటి ఉంది. –

**సౌమిత్రే! పశ్య పంపాయాః దక్షిణే గిరిసానుని ।**
**పుష్పితాం కర్ణికారస్య యష్టిం పరమశోభనామ్ ॥**

అని. 'ఓ లక్ష్మణా! పంపయొక్క దక్షిణతీరాన వున్న పర్వతపు చరియలపై బాగా పుష్పించిన కర్ణికారతరువు యొక్క పరమసుందరమైన యష్టిని(లతను) చూడు' అంటాడు స్వామి. ఇక్కడ పంపా దక్షిణతీరాన్ని ప్రాకృతదృష్టితో కాక వ్యాఖ్యాతలు ఔపనిషదదృష్టితో చూచి వ్యాఖ్యానించడం విశేషఖ్యాపనీయం. ఇక్కడ స్వామి విరజకు వెనుకవైపున ప్రకృతిమండలంలో రాజసతామసాది గుణాలచే పరిజుష్టులై వున్న వివిధచేతనుల (జీవుల) స్వరూపాన్ని తనకటాక్ష వీక్షణం చేత సాక్షాత్కరించి ఇలా వారి స్వభావాన్ని ఆవిష్కరిస్తున్నాడు. 'సౌమిత్రే! పశ్య పంపాయాః' ఇత్యాదిగా పుష్పించిన కర్ణికారయష్టిని వర్ణించడం ద్వారా సత్యాదిలోకాల్లో విజృంభించిన రాజసీప్రవృత్తి సూచింపబడుతున్నది. ఈ శ్లోకంలో క్రమంగా పంపాతీరప్రదేశం సూచింపబడగా దానిచేత రజోమయప్రకృతి మండలాంతర్గత లోకాలు వ్యక్తపరుపబడుతున్నాయి. 'అధికం శైలరాజోఽయం' అనే శ్లోకంలో ఋష్యమూకపర్వత సమీపగమనం సూచింపబడగా రజోగుణపరివర్ధకమైన ప్రాకృతలోకం వ్యక్తమౌతున్నది. ఇక్కడనుంచి ఏడు శ్లోకాలలో పంపా తీరానవున్న వివిధవృక్షాలను కవి వర్ణించగా వ్యాఖ్యాత పదార్థవివరణరూపంగా వీటి స్వరూపాన్ని విశదపరచాడు. ఇంతవరకు శ్లోకాలలో వివిధవృక్ష వర్ణనముఖంగా విషయప్రవణులైన ప్రాకృతజనులు సూచింపబడుతున్నారని వ్యాఖ్యాతృభావన. ఇక్కడ వాయుస్వభావాన్ని అందంగా వర్ణించిన 'పాదపాత్ పాదపం గచ్ఛన్' ఇత్యాది శ్లోకాల్లోని అందమైన భావాన్ని కవిహృదయానురూపంగా రామానుజీయవ్యాఖ్య విశదపరచింది. ఇక్కడ 'నైకరసాస్వాదః' అని వాయువుకు వేసిన విశేషణంచేత అభినవపుష్పకుతూహలాకులత్వం, ప్రత్యగ్రరసికత్వం వ్యక్తమౌతుందంటాడు కవి. తాత్త్వికార్థాలవివరణంలో వ్యాఖ్యాతలకు ఎంతటి అభినివేశం ఉన్నదో రసఘనాలైన సన్నివేశాలను ఆవిష్కరించడంలో కూడా వ్యాఖ్యాతలకు అంతటి అభినివేశం మనకు గోచరిస్తుంది ఈసందర్భంలో.

ఇక్కడ శ్లోకాల్లో మధుకరస్వభావవర్ణపరాలైన శ్లోకాలు (1) ఇదం మృష్టం ఇదం స్వాదు....... (2) నిలీయ పునరుత్పత్య అనే రెండూ ఉత్ప్రేక్షామనోహరాలుగా వ్యాఖ్యాతలు వివరించారు. ఇక్కడ తీర్థీయవ్యాఖ్య సంగ్రహంగా వుండగా, గోవిందరాజీయ, రామానుజీయాలు మరికొంత విశదంగా వున్నాయి. 'పద్మసౌగంధికవహం' అనే శ్లోకంలో పద్మసౌగంధికవహం అనే పదం లాక్షణికమని వ్యాఖ్యాతృభావన. పద్మం చ సౌగంధికం చ పద్మసౌగంధికే, తే వహతి ప్రాపయతి ఇతి పద్మసౌగంధికవహః అని అర్థం చెప్పాలి. పద్మం సౌగంధికం అనే రెండురకాల పుష్పాలు నిర్దేశింపబడ్డాయి. వీటిని మోసేవాడు పద్మసౌగంధికవహుడు అంటే వాయువు. వాస్తవానికి వాయువు పద్మసౌగంధిక పుష్పాలను మోయడం కుదరదు కదా కనుక వీటి పరిమళాన్ని మోస్తున్నాడని లక్షణశక్తిద్వారా అర్థం చెప్పాలి అంటే పద్మశబ్దం పద్మగంధాన్ని సౌగంధికశబ్దం తత్సమవేతమైన గంధాన్ని లక్షణచే బోధిస్తాయన్న మాట. మరి లక్షణ

చెప్పినపుడు ప్రయోజనం ఉండాలి కదా! ప్రయోజనం లేని ప్రయోగింపరాదుకదా! కనుక పద్మాన్ని ముక్కుకు దగ్గరగా తెచ్చినా పైనున్న చల్లని పరిమళాన్ని గ్రహిస్తుందే తప్ప లోనున్న ఉష్ణత్వవిమిశ్రమైన గంధాన్ని గ్రహింపజాలదుకదా! అలాగే ఈ వాయువు కూడా పైనున్న చల్లని పరిమళాన్ని మాత్రమే పట్టుకువస్తున్నాడని అభిప్రాయం. పద్మసౌగంధికశబ్దాలు గుణివాచకాలైన గుణికి గుణాలకు అభేదాన్ని వివక్షచేసి పద్మసౌగంధికాల్లో వున్న పరిమళగుణం ఇక్కడ చెప్పబడుతున్నదని కూడా చెప్పవచ్చు. ఈ రెంటినీ (పద్మసౌగంధికాలు రెంటినీ) నిర్దేశించడాన్ని బట్టి అనేకపుష్పాలతో నిర్మించిన మాలను ధరించినప్పటిలాగా నానాపుష్పపరిమళాన్ని వాయువు మోసుకొస్తున్నదని భావం. శివం అంటే శుద్ధమని అభిప్రాయం. కనుక అన్యసంస్పృష్టత్వం చెప్పబడడంచేత ఇది ప్రాథమిక మలయమారుతమని సూచింపబడుతున్నది. శోకవినాశనం అనడంచేత విరహజనులకు దక్షిణవాయువు శోకవివర్ధకమే తప్ప శోకవినాశకం కాదు. కనుక జీవించివున్నవానికి శోకం కలిగింపవచ్చు. జీవితానికే అపాయాన్ని కలిగిస్తున్నపుడు శోకధర్మి (శోకధర్మాన్ని కలిగినవాడు) ఉండనే ఉండదు. కనుక పూర్తిగా శోకమూలాన్నీ తీసివేసేవాడు కనుక శోకవినాశనుడని విశేషణం సార్థకం.

'శ్యామా పద్మపలాశాక్షీ' అనే శ్లోకంలో తన విరహంచేత శోకాకుల అయి వున్న సీత 'కథం ధారయతి ప్రాణాన్' ప్రాణాలను ఎలా ధరిస్తుంది? అని అంటూ కవి వివశా అని విశేషణం వేశాడు. దాన్ని వ్యాఖ్యానిస్తూ, వివశమైన ప్రాణాల్ని త్యజించడంలో కూడా సీత వివశయే. అంటే అస్వతంత్రయే అన్న రామాభిప్రాయాన్ని వ్యక్తపరచాడు వ్యాఖ్యాత. 'స్మితహాస్యాన్తరయుతం' ఇత్యాది శ్లోకంలో సీత మాట్లాడే తీరును కవి నిరూపించిన ప్రక్రియను వ్యాఖ్యాత చక్కగా విశదపరచాడు. ఆమె మాట్లాడేతీరు 'స్మితహాస్యాన్తరయుతం' అంటే స్వాభావికమైన చిరునవ్వుతోనూ, ఆగన్తుకమైన హాస్యంతోనూ కూడి ఉన్నదట. 'కాంతస్మితా లక్ష్మణ జాతహాసా' అని చెప్పినదాన్నే కవి వ్యక్తపరచాడు. 'గుణవత్' అనడంచేత, తనమాట కంటే ఆమె మాట ఉత్కర్షవంతమై ఉన్నదట. "మధురం హితం" అనడంచేత, ప్రియహితమై వున్నదని, కనుకనే "అతులం" అసమానం అని, 'ప్రియవాదీ చ భూతానామ్' అని చెప్పబడిన రాముని సంభాషణారీతికంటే అతిశయమై వున్నదంటాడు వ్యాఖ్యాత. "వైదేహ్యా వాక్యం కదా శ్రోష్యామి" అనడంచేత "ఏతత్ సామగాయన్నాస్తే" అని చెప్పబడినట్లు, సంసారోత్తీర్ణుడైన చేతకాని సామగానాన్ని ఎప్పుడు వింటాడు? అని స్వామి పరమపదంలో దిగులుచెంది ఉన్న వైనాన్ని ఈ వచనవిన్యాసం స్ఫురింపజేస్తున్నదని వ్యాఖ్యాతృభావన. 'ప్రాప్య దుఃఖం వనే శ్యామా' అనే శ్లోకంలో వెనుక అరణ్యంలో ఉన్నప్పుడు సీత పల్కిన మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని అనాదికాలం నా కైంకర్యం చేయడానికి జీవుడు యోగ్యుడన్న అభిప్రాయాన్ని స్వామి వ్యక్తపరుస్తున్నాడట.

ఇక్కడ 'న హ్యహం జీవితుం శక్తః' అనే శ్లోకం తరువాత 'ఇతి రామం మహాత్మానం' అనే శ్లోకానికి ముందు, 'ఇతి రామస్తు విలపన్' ఇత్యాదిగా కొన్ని శ్లోకాలు కొన్ని కోశాల్లో కనిపిస్తున్నాయని, అయితే అవి లేకపోయినా పూర్వాపరాన్వయానికి భంగం లేదు కనుక వాల్మీకిపాఠంగా అనిపించడం లేదు. కనుక వ్యాఖ్యానింపక విడిచారని రామానుజీయ వ్యాఖ్యాత పేర్కొన్నాడు. ఇక్కడ తీర్థీయం కూడా ఈ శ్లోకాల ప్రస్తావన చేయలేదు. వ్యాఖ్యానించనూ లేదు. ఇక్కడ 'త్యజ్యతాం కామవృత్తత్వం' ఇత్యాది శ్లోకాల్లో లక్ష్మణుని ప్రతిబోధనం తత్త్వప్రతిపాదకమని వ్యాఖ్యాతృ భావన. వాత్సల్యంతో ఎందుకు తపిస్తావు? 'సాధుకారీ సాధుర్భవతి, పాపకారీ పాపో భవతి' అని నీవే చేసిన

శాస్త్రమర్యాదను నీవే గుర్తింపలేకపోతున్నావా? అనే అభిప్రాయం కూడా స్ఫురిస్తున్నదని వ్యాఖ్యానం. 'ఏవం సంబోధితస్తత్ర' అనే శ్లోకంలో శోకమోహశబ్దాలకు దయావాత్సల్యాలే అర్థాలని తాత్త్విక విశ్లేషణం. వాటిని విడవడం అంటే శాస్త్రమర్యాదననుసరించి చేతనులను రక్షించడానికి ఉద్యమించడమే. తరువాత శ్లోకంలో భగవంతుడు సంసారమండలాభిముఖుడైనాడని వ్యక్తమౌతున్నది. 'తం మత్తమాతంగ విలాసగామీ' అనే శ్లోకంలో లక్ష్మణస్వభావాన్ని కవి వర్ణించిన తీరులో సాంప్రదాయికరీతిని వ్యాఖ్యాతలు భావించారు. 'అవ్యగ్రమనాః' అనడంచేత అచంచలచిత్తుడని వ్యక్తపరుపబడింది. రామునివిషయంలో ఎంతమాత్రం కదలని (స్థిరమైన) ప్రేమభారం కలవాడని అభిప్రాయం. మహాత్మా అనడంచేత అప్రచ్యుతమైన ధైర్యం కలవాడని స్ఫురిస్తున్నది. 'అప్రమత్తః' అనడంచేత రామునిగమనంలోని సౌందర్యాన్ని అనుభవించటంలో కూడా ఆసక్తిని ప్రదర్శించనివాడు లక్ష్మణుడని అవగతం అవుతున్నది. ఎందువల్లనంటే అరణ్యానికి వచ్చే ముందు తల్లి సుమిత్ర ఇలా సందేశించింది.

"రామే ప్రమాదం మా కార్షీః పుత్ర భ్రాతరి గచ్ఛతి". "నాయనా! సోదరుడైన రాముడు నడచి వెళు తున్నప్పుడు ఎంతమాత్రం ప్రమత్తుడవు కావద్దు సుమా!" అని కనుకనే (ఇలా నిరంతరం రామసేవాధురంధరుడవడం చేతనే అనే పేరు సార్థకం. నిత్యకైంకర్యలక్ష్మీయుక్తుడని అభిప్రాయం. ఇక్కడ మత్తమాతంగగామి అయిన అన్నను రెండువిధాల లక్ష్మణుడు రక్షించాడట. వాల్మీకి – 'రరక్ష ధర్మేన బలేన చైవ' అన్నాడు. ఇక్కడ ధర్మంచేత, బలంచేత రాముని రక్షించాడని అనడంచేత,

**సంస్తభ రామ! భద్రం తే మా శుచః పురుషోత్తమ! ।**
**నేదృశానాం మతిర్మందా! భవత్యకలుషాత్మనామ్ ॥**

ఇత్యాదిగా రాజనీతిని బోధించడం అనేది ఒక విధానం, "తత్రాప్యేనం హనిష్యామి" అని తన బలాన్ని ఆవిష్కరించడం అనేది మరొకవిధానం.ఇలా రెండువిధాల ధర్మ–బలాలతో రాముని లక్ష్మణుడు రక్షించాడంటారు వ్యాఖ్యాతలు. రక్షించటం అంటే దుఃఖరహితునిగా చేయడమే. ఈ అంశం తీర్థీయవ్యాఖ్యలోకూడా ఇలానే వ్యాఖ్యానింప బడింది. ఇది తీర్థీయవ్యాఖ్యానుసరణమేనని చెప్పాలి.

ఈవిధంగా సీతావియోగంచేత ధైర్యాన్ని కోల్పోయిన రామచంద్రునికి లక్ష్మణుడు చేసిన ప్రతిబోధనలో కూడా తాత్త్వికరహస్యాలున్నట్లు గోవిందరాజీయవ్యాఖ్య వివరించింది. ఈ కిష్కింధాకాండ ప్రథమసర్గ అంతా గోవిందరాజు దృష్టిలో సాంప్రదాయిక తత్త్వరహస్యాలతో భగవంతునకు భగవద్వియుక్తుడైన జీవునకు గల స్వాభావిక సంబంధానికి సంసారమూలంగా ఏర్పడిన వ్యాఘాతం, సంసారులై దుఃఖపడుతున్న చేతనులను చూచి భగవంతుడు పడుతున్న క్లేశం విశదపరుస్తున్నది. ఇక పంపాసరోవరం సమీపానగల వనసంబద్ధాలైన వృక్షాలను వర్ణించడంలో బంధమోక్షాది వివిధదశలలోగల చేతనుల అనుభవ తారతమ్యాలను, హనుమద్దర్శనంచేత ముందు ముందు కలగనున్న ఆచార్యుల ప్రాప్తికి సంబంధించిన బీజావాపాన్ని, ఈ ప్రథమసర్గ సూచిస్తున్నదని గోవిందరాజీయవ్యాఖ్య విశదపరుస్తున్నది.

ఈ సర్గకు సంబంధించినంతవరకు మూలశ్లోకాల పదాల అర్థాన్ని వివరించడానికే మహేశ్వరతీర్థవ్యాఖ్య పరిమితమైనది.వ్యాఖ్యానంలో ఏదశలోనూ తాత్త్వికరహస్యోద్ఘాటనమనేది కనిపించదు. అయితే చాలావరకు

గోవిందరాజు కథాసన్నివేశాలకు సంబంధించిన అర్థసమన్వయంలో తీర్థీయవ్యాఖ్యనే అనుసరించాడు. తాత్త్వికార్థ వివరణంలో రామానుజీయ వ్యాఖ్యాదులు ఆతనికి ఆలంబనాలు. ఈ సర్గ పంపాదర్శనం వల్ల రామునికి కలిగిన కామార్థత్వాన్ని ప్రతిపాదిస్తున్నదని స్కాందపురాణప్రమాణ పురస్సరంగా తీర్థీయవ్యాఖ్య పేర్కొన్నది. ఇంతకంటే ఇక్కడ తీర్థీయవ్యాఖ్య పేర్కొన్న విశేషాలు ఏమీలేవు.

ఇలా స్కాంద శ్లోకాలను ప్రదర్శించి సర్గతాత్పర్యాన్ని వివరించడం తీర్థీయవ్యాఖ్యకు గల విలక్షణత అని పూర్వమే చెప్పడం జరిగింది. ప్రస్తుతంలో ప్రథమసర్గ శ్రీరామచంద్రుని కామార్థత్వం కామపురుషార్థ ప్రయోజనాపేక్షిత్వం సూచింపబడుతున్నదని వ్యాఖ్యాతృభావన. దీనిని సమర్థించడానికి పై నుదహరించిన స్కాంద శ్లోకాలను వ్యాఖ్యాత ప్రదర్శించాడు.రాముడు విరహవిహ్వలుడై భ్రమరాదులను శపించాడని స్కాందవచనం అయితే పైన ఇచ్చిన శ్లోకాలలో ప్రథమపాదం స్పష్టంగా లేదు అయినా ఇది దాని భావంగా చెప్పవచ్చు. గంధఫలివిఫలం కావాలని శపించాడు. తుమ్మెదల ఝుంకారాలు కర్ణారుంతుదాలుకాగా వాటినీ శపించాడు. ఇక చక్రవాకాలను రాత్రివేళలో విశ్లేషం కలగాలని శపించాడు. ఇక చిలుకలు ఇతరులచే (పంజరాలలో) పెంచబడతాయని, చందనవృక్షం సర్పనివాసం అవుతుందని వాయువు సర్పాలచే భుజింపబడుతుందని, జ్యోత్స్న (వెన్నెల) కళంకప్రచ్ఛాదితమవుతుందని శ్రీరామచంద్రుడు సీతావిరహదశలో విరహవ్యథోద్దీపకాలైన వీటినన్నింటిని శపించాడట. ఈ సర్గలో రాముని విరహభావనయే వర్ణింపబడిందనే తాత్పర్యాన్ని వ్యాఖ్యాత ఇలా వివరించాడు.

ఈ సర్గ హనుమంతునికి గల బుద్ధివైభవాన్ని, సుగ్రీవుని స్వభావంలో గల చాంచల్యాన్ని లెస్సగా ఆవిష్కరిస్తున్నదని వివేకుల భావన. హనుమద్వచనాలను, సుగ్రీవుని వచనాలను వ్యాఖ్యాతలు పదార్థవివరణ పురస్సరంగా వ్యాఖ్యానించారు. 'చింతయిత్వా స ధర్మాత్మా' అనే నాల్గవ శ్లోకంలో ధర్మాత్మా అనే శబ్దానికి 'రాజధర్మ' మర్థమని గోవిందరాజీయ తీర్థీయాలు రెండూ వ్యాఖ్యానించాయి. సుగ్రీవుడు రాజధర్మాన్ని ఎరిగినవాడు కనుక తానున్న ఋష్యమూకంపై స్థిరంగా ఉండడమా? లేక పలాయనం చిత్తగించడమా? ఏది యుక్తమని విచారించి మంత్రులతో పర్యాలోచించి, ఉద్వేగాన్ని పొందాడని వ్యాఖ్యాతలిరువురూ ఒకే విధంగా వ్యాఖ్యానించారు. వాలిభయంతో ఋష్యమూకపర్వతంలోని ఆ యా ప్రదేశాల్లో పరుగులు తీసి, చివరకు యథావస్థితస్థానానికే చేరారట వానరులు. 'మలయో-యం గిరివరః' అనే శ్లోకంచేత చెప్పబడిన మలయపర్వతమే ఋష్యమూకమని వ్యాఖ్యాతృభావన. 'మలయో-యం ఋష్యమూకావయవపర్వతః' మలయం ఋష్యమూకానికి అవయవమైన పర్వతమని గోవింద రాజీయవ్యాఖ్య. ఈ సందర్భంగా వ్యాఖ్యాత 'పర్వతాదృశ్యమూకాత్తు పుప్లువే యత్ర రాఘవౌ' అని ఋష్యమూకం పైననే వానరుండుండినట్లు చెప్పబడటంచేత అదే మలయపర్వతమని వ్యాఖ్యాతృభావన. ఒకవేళ వాలియే ఇలా మారువేషంతో ఇక్కడకు వచ్చిఉండవచ్చు కదా అనే శంకను 'యస్మాదుద్విగ్నచేతస్త్వం' అని చెప్పబడింది. తరువాత శ్లోకంలోని పాపకర్మాణం అనే చోట అనుజభార్యాపహరణమే వాలి చేసిన పాపకర్మ అని వ్యాఖ్యాతృహృదయం.

'అహో శాఖామృగత్వం' ఇత్యాది శ్లోకాలు హనుమంతుడు, సుగ్రీవుని ఆశ్వాసించే అభిప్రాయంలో చెప్పబడ్డాయి. ఇక్కడ మతి, బుద్ధి, విజ్ఞానాదిశబ్దాల అర్థాలను వ్యాఖ్యాతలు సముచితంగా వివరించారు. బుద్ధిశబ్దం సామాన్యజ్ఞానాన్ని, విజ్ఞాన విశేషజ్ఞానాన్ని బోధిస్తోంది. ఇంగితం అంటే హృదయాభిప్రాయసూచకమైన వ్యాపారం (చేష్ట) ప్రభువుకాదలిచినవాడు బుద్ధివిజ్ఞానసంపన్నుడై పరేంగితాన్ని ఎరిగి ప్రవర్తింపగలగాలని హనుమంతుని

అభిప్రాయంగా వ్యాఖ్యాతలు వివరించారు. సుగ్రీవుడు హనుమంతునితో రామలక్ష్మణులసమీపానికి ప్రాకృతవేషంతో వెళ్ళి వారిరాకకు గల కారణాన్ని గ్రహింపకోరుతూ పలికిన పలుకులను వ్యాఖ్యాతలు ప్రతిపదవివరణపురస్సరంగా విస్పష్టంగా వివరించారు. ఇక్కడ తీర్థీయవ్యాఖ్యకు గోవిందరాజీయవ్యాఖ్యకు ఇంచుమించుగా తేడాఏమీ లేకపోవడం వివేచకులు గమనించాలి.

ద్వితీయసర్గ – సుగ్రీవుడు హనుమంతుని పంపడం ప్రధానంగా సాగింది. 'ఏకమేకాయనగతాః' అనే శ్లోకంలో ఏకాయనగతాః అనే మాటకు ఒకే స్థానంలో సుగ్రీవునితోపాటు ఉన్నవారు అని గోవిందరాజీయం వివరింపగా, ఏవమ్ అనే పదానికి బదులుగా ఏకమ్ అన్న పాఠాన్ని సూచించి రామానుజీయవ్యాఖ్య, పారిపోయి ఒంటరిగావున్న సుగ్రీవుని చేరి ఒకే స్థానంలో ఉన్నవారు అని వ్యాఖ్యానించింది. ఇక్కడ తీర్థీయవ్యాఖ్య – 'సుగ్రీవేణ ఏకదుఃఖాః హరయః' ఇత్యాదిగా సుగ్రీవునితోపాటు ఒకే దుఃఖాన్ని (వాలి భయాన్ని) అనుభవిస్తున్న కోతులు అని వ్యాఖ్యానించింది.

ఈ ద్వితీయసర్గ చేతనుడు భగవానుడు తన వైముఖ్యాన్ని గమనించి దండిస్తాడేమోనని భయపడుతూ ఉండగా భగవానుడు ఆతనిపట్ల ఆభిముఖ్యాన్ని చూపించడమనే దాన్ని ప్రధానంగా ప్రతిపాదిస్తున్నాడని గోవిందరాజీయం వ్యాఖ్యానించింది. ఇక్కడ మరికొన్ని వ్యాఖ్యావిశేషాలు గమనించుదాం.

**వైముఖ్యం గంధఫల్యాస్తు భ్రమరాన్ అశపత్ప్రభుః ।**
**కోశాన్నిశీథే విశ్లేషం పికమన్యవివర్ధనమ్ ॥**

**చందనం సర్పనిలయం వాయుం సర్పాశనం తథా ।**
**జ్యోత్స్నాం కలంకసంఛన్నాన్ శశాప రఘునందనః ॥ అని.**

ఇక మూడవ సర్గలో పూర్వసర్గసంగతిని, తాత్త్వికార్థాన్ని వివరిస్తూ గోవిందరాజీయం ఇలా అంటుంది. వైకుంఠవాసుల్లో కొందరు తనయందు ఏకాగ్రనిష్ఠులై ఉండగా మరికొందరు లంపటత్వం కలిగి ఉండటాన్ని గమనించి బాధ చెందిన స్వామియొక్క దయాప్రవృత్తి ప్రథమసర్గలో వర్ణింపబడింది. ద్వితీయంలో చేతనుడైన జీవుడు భగవంతునిపట్ల తన అపరాధాన్ని భావించి స్వామి దండిస్తాడని భయపడుతూ వుంటే దానిపట్ల భగవదాభిముఖ్యం ఎలాంటిదో చెప్పబడింది. ఇక మూడవ సర్గలో ఆచార్యకృత్యం నిరూపింపబడుతున్నది. అని ఈసర్గలో 'కపిరూపం పరిత్యజ్య' ఇత్యాది శ్లోకం విచారయోగ్యం. ఇక్కడ గోవిందరాజీయంలో విశేషమైన చర్చ ఉంది. యతిరూపాన్ని ధరించి, ఆంజనేయుడు రామలక్ష్మణుల సన్నిధికి సుగ్రీవుని ప్రోద్బలంతో వచ్చాడని "భిక్షురూపం తతో భేజే" అనే వచనానికి అర్థం స్ఫురిస్తూ ఉండగా, ఇక్కడ భిక్షుశబ్దం 'యతి' బోధకమా? బ్రహ్మచారి బోధకమా? అనే విచికిత్స చేశారు వ్యాఖ్యాతలు. గోవిందరాజీయవ్యాఖ్య బ్రహ్మచారి అనే అర్థం అసంగతమని ఇతరేతర వ్యాఖ్యాఖండన పురస్సరంగా పేర్కొన్నది. భిక్షురూపం– సన్యాసివేషం అని గోవిందరాజు వివరణ. ఈ సందర్భంలో సన్యాసిరూపుడైన హనుమంతుడు రామలక్ష్మణులకు నమస్కరించాడని తరువాత శ్లోకంలో 'రాఘవౌ ప్రణిపత్య' అనే వచనంచేత తెలుస్తున్నది. కనుక సన్న్యాసి, గృహస్థులకు నమస్కరింపవచ్చునా? అని శంకించి, గృహస్థుని విషయంలో సన్యాసి నమస్కరింపవచ్చునని దృఢపరచాడు గోవిందరాజు. మరి సన్యాసి గృహస్థులకు నమస్కరింప

రాదని నిషేధవాక్యాలున్నాయి కదాఅన్న ప్రశ్నకు సమాధానంగా జ్ఞానాధికుడైన గృహస్థుడు కనిపించినా, తనకర్మచేత (పరివ్రజనక్రియ) చేత మాత్రమే అధికుడైన యతి, నమస్కరించకపోతే అది 'విప్రాణాం జ్ఞానతో జ్యైష్ఠ్యమ్' అన్న రామవచనం విరోధిస్తుందని, అంతేకాక యతి నమస్కరించరాదనే నిషేధం ఏదీ మనువు చెప్పలేదని సమాధానించాడు. అజ్ఞులైన గృహస్థులవిషయంలో మాత్రమే అలాంటి నిషేధం ఏదైనా వుంటే పాటింపవచ్చునని విజ్ఞుల విషయంలో కాదని నిష్కర్షించాడు.

'యతిగా తాను నమస్కరింపరాదనే శాస్త్రనిషేధం వున్నా, రామలక్ష్మణుల అపూర్వరూపాన్ని దర్శించి శాస్త్రనియమాన్ని విస్మరించి హనుమంతుడు నమస్కరించా'డని కొందరి వ్యాఖ్యానం సరికాదని అది ఉపక్రమ విరుద్ధమని పేర్కొన్నారు. ఇంగితజ్ఞుడైనవాడు ఇతరుల హృదయాభిప్రాయం తెలియకుండా అడ్డేలా, లేదా తన వాస్తవస్వభావం వెల్లడి అయ్యేలా తాను గ్రహించిన ఆకారానికి విరుద్ధంగా అలా అవశుడై నమస్కరించడం సముచితం కాదని పేర్కొన్నాడు. ఈసందర్భంలో మహేశ్వరతీర్థీయవివరణాన్ని కూడా ఈతడంగీకరించలేదు. తీర్థీయవ్యాఖ్య, భిక్షుశబ్దానికి బ్రహ్మచారి అనే అర్థాన్ని తీసికొని దోషపరిహారం చేయగా బ్రహ్మచారిత్వం పూర్వం ఉన్నదే కనుక ఇప్పుడు కొత్తగా బ్రహ్మచారివేషపరిగ్రహం అవసరంలేదని గోవిందరాజులు ఖండించాడు. అంతేకాక ఒకవేళ యతి అనే అర్థం స్వీకరించి వారిని దర్శించినంతమాత్రంచేతనే వారిరువురు సుగ్రీవవిరోధులను నిరసింపగల సమర్థులని 'రూపమేవాస్యై మహిమానమాచష్టే' అని చెప్పబడినట్లు వానిని గుర్తించి వేషాంతరాన్ని గ్రహించివున్న హనుమంతుడు తన చారుత్వాన్ని ప్రకటించటానికే నమస్కరించాడని అనవచ్చుగదా? అన్న తీర్థీయ సమన్వ యాంతరాన్ని కూడా ఖండించాడు గోవిందరాజు. 'సుగ్రీవో నామ ధర్మాత్మా' ఇత్యాదివచనాలన్నీ అప్పుడు ముందు అనవలసివుంటుంది కనుక ఈ సమన్వయం సరిలేదని గోవిందరాజాభిప్రాయం. ఇక్కడనే గోవింద రాజీయవ్యాఖ్య అపరే తు అంటూ మరొకపక్షాన్ని కూడా చూపించింది.

'కపిరూపం పరిత్యజ్య' అని ఆరంభంలో కపిరూపాన్ని విడచి అని చెప్పడంచేత ముందు ముందు 'భిక్షురూప ప్రతిచ్ఛన్నం సుగ్రీవ ప్రియకామ్యయా' ఇత్యాదిగా భిక్షురూపంతో ప్రతిచ్ఛన్నుడై (కప్పబడి) ఉన్నట్లు స్వయంగానే హనుమానుడు ఆవిష్కరించాడు. కనుక మానుషరూపాన్నే ఆతడు స్వీకరించాడని తప్పక అంగీకరించాలి కనుక మనుష్యత్వవిశిష్టమైన భిక్షురూపమే అతడు గ్రహించాడని కనుక ఇక్కడ భిక్షుశబ్దానికి బ్రహ్మచర్యం మాత్రమే చెప్పబడుతున్నది కనుక, వందనాదివిషయంలో విరోధమేమీ లేదు అని ఈ పక్షంయొక్క అభిప్రాయాన్ని వివరించి గోవిందరాజీయం, ఈ పక్షంలోకూడా వెనుక చెప్పిన దోషాలనే దోషాన్ని భావించాలని మాత్రమే సమాధానించింది.

అయితే, తీర్థీయసమన్వయాన్నే (రెండవ సమన్వయాన్నే) రామానుజీయవ్యాఖ్య సమర్థించింది. గోవిందరాజు ఖండించిన కొన్ని పక్షాలు రామానుజీయవ్యాఖ్య చూపినవే అవడం విశేషం. ఇక్కడ రామానుజీయవ్యాఖ్య తీర్థీయ సమన్వయాన్నే యుక్తిపురస్సరంగా సమర్థించటం గమనించవలసివుంది. అంతేకాదు తీర్థీయవ్యాఖ్య పేర్కొన్నట్లు అసలు భిక్షుశబ్దం సన్న్యాసివాచకమనక్కరలేదని ఒకవేళ సన్న్యాసివేషం వేసినా శరీరమంతా రోమాలతోకూడి తోకకల్గిన కపిరూపం, దాచినా దాగనిది కనుక మనుష్యవేషాన్నే ధరించి తన కపిత్వాన్ని హనుమంతుడు మరుగు పరచాడని. కనుక ఇలా గ్రహించిన మనుష్యరూపం వటురూపమే తప్ప యతిరూపం కాదని రామానుజీయవ్యాఖ్య

తీర్థీయవ్యాఖ్యనే గట్టిగా సమర్థించింది. హనుమానుడు పూర్వమే బ్రహ్మచారి అయినా, మనుష్యబ్రహ్మచారి రూపాన్ని గ్రహించడం దోషం కాదని రామానుజీయవ్యాఖ్య ఒకవిధంగా గోవిందరాజవ్యాఖ్యకు సమాధానం చెబుతున్నట్లుగా ఉండటం కూడా గమనించవచ్చు.

'ఆయతాశ్చ సువృత్తాశ్చ బాహవః' అని బహువచనప్రయోగాన్ని సమర్థిస్తూ, రామలక్ష్మణులిరువురు కనుక ఇద్దరి బాహువులనుద్దేశించి బహుత్వమని అంటూ, రాముడే భక్తుడైన హనుమంతునికి 'చతుర్భుజ'రూపంలో సాక్షాత్కరించాడని తన సాంప్రదాయికసమన్వయశైలిని ఇక్కడ చూపించాడు గోవిందరాజు.

**ఆయతాశ్చ సువృత్తాశ్చ బాహవః పరిఘోపమాః ।**
**సర్వభూషణభూషార్హాః కిమర్థం న విభూషితాః ॥**

అన్న రామలక్ష్మణభుజవర్ణనాపరమైన శ్లోకంలో గోవిందరాజీయ వివరణం ఇలా సాగింది. 'పరిఘోపమాః' అనడంచేత స్వసౌందర్యాన్ని అనుభవింపదలచినవారికి సమస్తవిరోధులను నివర్తింపజేయగల సామర్థ్యం కలవని అభిప్రాయం. 'సర్వభూషణభూషార్హాః' అనడంచేత ఆభరణానికే ఆభరణం అన్నట్లు, భూషణాలను కూడా భూషించడానికి సమర్థాలు అయిన ఈ భుజాలు ఎందుకు అలంకరించలేదు? అని హృదయాభిప్రాయం. లేదా, దృష్టిదోషపరిహారం కొరకు ఇలాంటి బాహుసౌందర్యం ఆచ్ఛాదింపవలసివుంది. అది ఎందుకు ఆచ్ఛాదింపలేదు? అని కూడా అనవచ్చు. లేదా, ఆభరణాలచే కప్పబడిన సౌందర్యమే మమ్ములనాకర్షించడానికి వశపరచుకోవడానికీ చాలు, కనుక ఆభరణం లేకుండ సౌందర్యాన్ని దర్శింపజేయడం అధికమేనని అభిప్రాయం. లేదా మరొక భావన. రాజకుమారులకు ఒక్కక్షణం తాంబూలం లేకపోతే మ్లానత ఏర్పడ్డట్లు, క్షణమాత్రం విరహమేర్పడిన భూషణాలు నిలువలేవు. అలాంటి భూషణాలకు బాహువిశ్లేషాన్ని ఎందుకు కలిగించారు? అని ప్రశ్న.

ఇక తనిశ్లోకిలో 'సర్వభూషణ భూషార్హాః' అనడంచేత బాహువులు సర్వభూషణాతీత కాంతికలవని వ్యక్తమౌతున్నదని వివరింపబడుతున్నది. 'కిమర్థం న విభూషితాః' అనడంచేత భుజాలను అలంకరించడంద్వారా ఈ బాహువులకు గల భూషణాధికకాంతిమత్త్వం ఎందుకు ప్రకాశింపజేయబడలేదు అనే హార్దాభిప్రాయం కూడా వ్యక్తమౌతున్నదని అభిప్రాయం. ఇక్కడ –

"అప్రతిహతమైన సంకల్పం కలవాడై ఉన్నా, స్వామి నిత్యసూరులను విడచి, నాల్గవ అవతారాన్ని స్వీకరించడంలో హేతువేమిటి?" అనే హనుమదభిప్రాయం వ్యక్తమౌతున్నదని వ్యాఖ్యాతృభావన. 'ఇమే చ ధనుషీ' అనే శ్లోకంలో ధనుస్సులను ఇంద్రవజ్రాలతో పోల్చడం అభూతోపమ అంటాడు గోవిందరాజీయవ్యాఖ్యాత. ఇక్కడ వజ్రం ఒక్కటే కాగా, వజ్రం అని ద్వివచనం వేసి ద్విత్వకల్పనం చేయడమే అభూతోపమ అనడంలో బీజమని తీర్థీయవ్యాఖ్యాన వివరణం. ఇలా, ఇక్కడ హనుమంతుడు రామలక్ష్మణులనుద్దేశించి పల్కిన పలుకులను వ్యాఖ్యాతలు వివరించిన తీరు హృద్యం. ప్రతిపదస్వారస్యాలు మననైకహృద్యాలు. ఇక్కడకూడా గోవిందరాజీయవ్యాఖ్య సాతిశయము, సాంప్రదాయికసమన్వయానుగతము అని గుర్తించాలి. పరత్వలక్షణనిరూపకాలే ఈ శ్లోకాలు. ఈ సర్గలోనే హనుమంతుని ఆచార్యత్వనిరూపకలక్షణాలను వ్యాఖ్యాతలెస్సగా విశదపరచాడు. 'నానృగ్వేద వినీతస్య'

ఇత్యాదిగా రాముడు లక్ష్మణునితో హనుమద్వచనరచనలోని వైశిష్ట్యాన్ని ఉట్టంకించినవిధానం హనుమంతుడు ఉత్తమాచార్యునిగా నిరూపించడమేనని గోవిందరాజీయవ్యాఖ్య విస్తృతంగా వివరించింది.

ఆచార్యత్వనిరూపణం తీర్థీయవ్యాఖ్యా సమ్మతమేనా?

ఇక్కడ తీర్థీయవ్యాఖ్య ఏదశలోనైనా హనుమంతుని ఆచార్యునిగా సంభావించిందా? అనే శంక వివేచకులకు కలుగవచ్చు. ఎందువల్లనంటే, ఇలాంటి వివరణం కేవలం వైష్ణవసంప్రదాయమాత్రసమ్మతం తప్ప ఇతరసంప్రదాయ సమ్మతం కాదనే భావన కూడా కలిగే అవకాశం ఉంది కనుక. కాని, తీర్థీయవ్యాఖ్యలో చిట్టచివర సర్గాంతవివరణలతో మహేశతీర్థులు ఇచ్చిన ఫలశ్రుతివచనాన్ని గమనిస్తే హనుమంతుని ఆచార్యునిగా స్వీకరించడం స్మార్తసంప్రదాయ సమ్మతమేకాక పురాణసమ్మతమని స్పష్టపడుతుంది.

**సుగ్రీవో మారుతిం తత్ర ప్రేషయామాస రాఘవమ్ ।**
**మారుతిప్రేషణం శ్రుత్వా సద్గురుం లభతే నరః ॥**

అని ఫలశ్రుతివచనం. సుగ్రీవుడు రామునివద్దకు హనుమంతుని పంపిన కథను వింటూనే సద్గురువును నరుడు పొందుతాడని దీని తాత్పర్యం. ఈ శ్లోకం పరోక్షంగా హనుమంతుని ఆచార్యత్వాన్ని సమర్థిస్తున్నదనడంలో అభ్యంతరం ఎవ్వరికీ అక్కరలేదు. గోవిందరాజీయం దీన్ని బాగా సుప్రకటం చేసిందని భావించవచ్చు.

ఈ సర్గలో శ్రీరామచంద్రుడు హనుమంతుని ఉత్తమదూతగా నిరూపించిన తీరును వ్యాఖ్యాతలు బాగా వివరించారు.

**నానృగ్వేదవినీతస్య నాయజుర్వేదధారిణః ।**
**నా సామవేదవిదుషః శక్యమేవం ప్రభాషితుమ్ ॥**

అని హనుమద్భాషణ ప్రశంసాపరమైన రామవచనంలోని తాత్పర్యాన్ని సప్రమాణంగా, విస్పష్టంగా వ్యాఖ్యాతలు విశదపరచారు.

**చేతనోజ్జీవనం ఆచార్యమాత్రసాధ్యం ।**

చేతనులైన జీవులను ఉజ్జీవింపచేయడమనేది ఆచార్యముఖంగానే సాధింపబడాలి తప్ప మరోవిధంగా సాధ్యంకాదని నిరూపించడానికే ఉత్తమాచార్యలక్షణాలను 'నానృగ్వేద' ఇత్యాదిశ్లోకంలో విశదపరచాడు వాల్మీకి అని వ్యాఖ్యాతృభావన.

**ఆచార్యో వేదసంపన్నో విష్ణుభక్తో విమత్సరః ।**
**మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ సదా మంత్రార్థదః శుచిః ॥**

**గురుభక్తి సమాయుక్తః పురాణజ్ఞో విశేషతః ।**
**ఏవం లక్షణసంపన్నో గురురిత్యభిధీయతే ॥**

అని చెప్పబడిన ఆచార్యలక్షణాన్ని ఈ శ్లోకంలో నిరూపించడం జరిగిందని గోవిందరాజీయవివరణం. ఆచార్యుడు వేదం అధ్యయనం చేసి వేదవిజ్ఞానంచేత సుసంపన్నుడై, విష్ణువు పట్ల భక్తి గలిగి, మాత్సర్యదోషరహితుడై, మంత్రవేత్తయై, మంత్రమందు ప్రీతి కలవాడై, ఎల్లప్పుడు మంత్రార్థాన్ని ఆశ్రితులకు అందిస్తూ, సర్వవిధశౌచం కలిగి, తన ఆచార్యుని పట్ల భక్తిశ్రద్ధలు కలవాడై, పురాణపరిజ్ఞానం విశేషంగా కలిగి ఉండాలని, ఇలాంటి లక్షణాలు కలవాడే ఆచార్యుడని చెప్పబడతాడని శాస్త్రనిరూపితాలైన ఆచార్యగుణాలు ఈ 'నానృగ్వేద' ఇత్యాది శ్లోకం ద్వారా చెప్పబడుతున్నాయని వ్యాఖ్యాతృభావన. ఋగ్వేదవినీతుడు అంటే ఋగ్వేదశిక్షితుడని అర్థం. వినయ–ధారణ వేదనాలు కూడా అన్ని వేదాలకూ అన్వయించాలని ముందు గోవిందరాజీయం పేర్కొన్నా 'యద్వా' అని పక్షాంతరాన్ని చూపుతూ, వినీతశబ్దాన్ని ఋగ్వేదానికి, ధారణశబ్దాన్ని యజుర్వేదానికి, విద్వత్ శబ్దాన్ని సామవేదానికి అన్వయిస్తూ, ఋగ్వేద వినీతుడు, యజుర్వేదధారి, సామవేత్త అనడంలో యుక్తిని ఇలా ప్రదర్శించింది. ప్రతివర్ణానికి స్వరభూయస్త్వం (విశేషస్వరవైశిష్ట్యం) ఉంటుంది కనుక, మనస్సును నియమించి సావధానంగా ఉచ్చరింపదగి ఉన్నది కనుక, 'ఋగ్వేదవినీతస్య' అని అనడం జరిగింది. ఇక, ఒక్కొక్క అనువాకంలో ఇతరేతరానువాకాలలోని వాక్యాలు వచ్చిచేరి సాంకర్యం ఏర్పడి ఉంటుంది కనుక, మంత్రధారణం చాలా క్లిష్టమై వుంటుంది యజుర్వేదంలో. ఈ నిమిత్తంగా 'యజుర్వేదధారిణః' అనడం జరిగింది. ఇక, ఊహరహస్యాదిగర్భితాలైన గానవిశేషాలు తెలియరానివి కనుక, "సామవేద విదుషః" అనటం జరిగింది. ఇక అథర్వణవేదానికి ఈ విధమైన అధ్యయనాది నియమం లేదు కనుక దాని ప్రస్తావన ప్రస్తుతంలో రాలేదు. మూడువేదాలలోనూ వినయ–ధారణ–వేదనాలు లేనివానికి ఇలా మాటాడే సామర్థ్యం ఉండదు కనుక, హనుమంతునికి ఇలాంటి సామర్థ్యమున్నదని ఆతని వచనవిన్యాసశైలిని బట్టి తెలుస్తున్నదంటున్నాడు రాముడు.

ఇక ఋగ్వేదవినీతత్వాదులు ఎలా ఉంటాయో వ్యాఖ్యాత ఉదాహరణముఖంగా ఇలా వివరించాడు.

"ఉభౌ యోగ్యావహం మన్యే రక్షితుం పృథివీమిమాం" అని హనుమానుడు అనడాన్నిబట్టి సృష్టిస్థితి సంహారకర్తృత్వం ఋగ్వేదవినీతుడు కానివానికి చెప్పనలవికాదని అభిప్రాయం. ఐతరేయకంలో – 'బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్' అనే మంత్రంచేత సృష్టిస్థితిసంహారకర్తృత్వమే మొట్టమొదటగా చెప్పబడుతున్నది. ఇలాగే 'మానుషౌ దేవరూపిణౌ' అని హనుమంతుడు అనడంచేత ఆతని యజుర్వేదధారిత్వం అవగతమవుతున్నదంటాడు వ్యాఖ్యాత. 'అజాయమానో బహుధా విజాయతే' అనే శ్రుతివచనంచేత పూర్వోక్తమైన అవతారరహస్యం వెల్లడి చేయబడింది. కనుక యజుర్వేదధారణం సిద్ధిస్తున్నది. 'సువర్ణాభౌ పద్మపత్రేక్షణౌ' అని అనడంచేత ఇక్కడ సామ శ్రుతి పర్యాలోచన మున్నదని వ్యాఖ్యాతృభావన. సామవేదాంతర్గతమైన ఛాందోగ్యోపనిషత్తులో 'అథ య ఏషోఽ౦తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే' అని ఆరంభించి, 'తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ' సూర్యకిరణవికసితమైన పుండరీకం వంటి కనులున్నాయని చెప్పబడింది కనుక ఇది ఎరిగినవానికే 'పద్మపత్రేక్షణౌ' అని వర్ణించడం శక్యం. కనుక త్రివేదిత్వం హనుమానునికున్నదని అభిప్రాయం.

రెండవ శ్లోకంలో అంగాభిజ్ఞత నిరూపింపబడిందని అభిప్రాయం. అంగాలు ప్రధానమైనది వ్యాకరణం. హనుమానుని భాషణంలో ప్రకృతిప్రత్యయసమాససంధ్యాదుల్లో ఏమాత్రం దోషం లేదు కనుక ఆతడు వ్యాకరణాన్ని సాకల్యంగా, బహువారం శ్రవణం చేశాడని భావన. 'న ముఖే' ఇత్యాదిగా నాల్గుశ్లోకాల్లో శిక్షాపరిజ్ఞానం చెప్పబడిందని

వ్యాఖ్యానం.ఇక్కడ 'న కించిదపశబ్దితమ్' అనే మాటచేత హనుమంతుడు సంస్కృతంలో మాటాడాడని తీర్థీయవ్యాఖ్య. రామానుజీయం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరచింది. ఇక్కడ శిక్షావచనాలనుట్టంకించి గోవిందరాజీయం స్వరాదివికృతిరాహిత్యాన్ని నిరూపిస్తున్నాడు.

**గీతీ దీర్ఘీ శిరఃకంపీ తథా లిఖితపాఠకః ।**
**అనర్థజ్ఞో అల్పకంఠశ్చ షడేతే పాఠకాధమాః ॥**

**న శిరః కంపయేద్గాత్రం భ్రువౌ చాప్యక్షిణీ తథా ।**
**తైలపూర్ణమివాత్మానం తత్తద్వర్ణే ప్రయోజయేత్ ॥**

అని చెప్పబడినట్లుగా, గానం చేస్తూ వేదాన్ని పఠించేవాడు, దీర్ఘంగా సాగదీసేవాడు, శిరస్సును వణికించే వాడు, అలాగే పుస్తకంలో వ్రాసినది చూచి పఠించేవాడు, అర్థజ్ఞానం లేనివాడు, సన్నని (స్వరహీనమైన) కంఠం కలవాడు, ఈ ఆర్వురు వేదపాఠకులలో అధములని శిక్షాశాస్త్రవచనం. అలాగే, శిరఃకంపం చేయరాదు. శరీరాన్ని, కనుబొమలు, కన్నులు కదపరాదు. తైలపూర్ణమైన ఒకభాండాన్ని శిరస్సుపై ధరించినవానిలా తొణకక బెణకక వేదపాఠం సాగించాలని కూడా శిక్షావచనం. హనుమభాషణంలో ఈ అంగానికి అన్వయం ఉన్నదని వ్యాఖ్యాతృభావన. ఇంతవరకు ఉచ్చారణశక్తి చెప్పబడిందంటాడు వ్యాఖ్యాత. ఇక, వాక్యప్రయోగచాతుర్యాన్ని 'అవిస్తరమ్' ఇత్యాదిశ్లోకం చెబుతున్నదట. ఈ శ్లోకంలోని ఒక్కొక్కపదానికి తాత్పర్యాన్ని వ్యాఖ్యాతలు లెస్సగా విశదపరచారు. గోవిందరాజీయం ఇలా అంటున్నది– పై శ్లోకంలో 14 రకాల దోషాలు ప్రసక్తాలవుతాయని 'అవిస్తరమ్' ఇత్యాదివచనాలనే ఉపలక్షణ రీత్యా చెప్పబడుతున్నది.

**శంకితం భీతముద్ఘుష్టమవ్యక్తమనునాసికమ్ ।**
**కాకుస్వరం శీర్షగతం తథాస్థానవివర్జితమ్ ॥**

**విస్వరం విరసం చైవ విశ్లిష్టం విషమాన్వితమ్ ।**
**వ్యాకులం తాలుభిన్నం చ పాఠదోషాశ్చతుర్దశ ॥**

ఇత్యాదిగా పదనాల్గు పాఠదోషాలుట్టంకించబడ్డాయి.సందేహగ్రస్తంగా పఠించడం, భయపడుతూ పఠించడం, బిగ్గరగా అరుస్తూ పఠించడం, అసలే వినరానివిధంగా పఠించడం, ముక్కుతో పలకడం, కాకుస్వరస్ఫూర్తి కలిగేలా పఠించడం, (భయక్రోధాలను సూచించే కంఠస్వరాన్ని కాకువు అంటారు.) అంగుడులో లోపల ఎక్కడో ఉండేలా పలకడం, అక్షరాల స్థానాలను విడచి పలకడం, స్వరహీనంగా పలకడం, వినడానికి ఇంపుగా లేనట్లు పలకడం, విడదీసి పలకడం, క్లిష్టంగా కలిపి పలకడం, కలవరపాటుతో లేదా కలగాపులగంగా కలిపి పలకడం, దవడలలో భేదం కలిగేలా పలకడం అనేవి పదునాల్గు పాఠదోషాలు. వీటిలో కొన్నిటిని రాముడు నిర్దేశించి మిగిలినవాటికి ఉపలక్షణంగా చేశాడు. ఈ దోషాలేవీ హనుమంతుని భాషణంలో లేవని అభిప్రాయం.

మరొకచోట మరికొన్ని పాఠదోషాలు నిర్దేశింపబడ్డాయని వ్యాఖ్యాత ఇలా చూపాడు.

**ఉపాంశుదష్టం త్వరితం నిరస్తం విలంబితం గద్గదితం ప్రగీతమ్ ।**
**నిష్పీడితం గ్రస్తపదాక్షరం చ వదేన్న దీనం న తు సానునాస్యమ్ ॥**

ఈ శ్లోకంలో కూడా వెనుక చెప్పిన దోషాలే నిర్దేశింపబడ్డాయి. ఇంతవరకు పాఠదోషాలు చెప్పి, ఇక పాఠగుణాలు నిర్దేశిస్తున్నాడు కవి.

'సంసారక్రమ సంపన్నామ్' అనే శ్లోకంలో వ్యక్తపదత్వం, వ్యక్తాక్షరత్వం, మాధుర్యాదిగుణవత్త్వం ఇత్యాదులు చెప్పబడ్డాయని అంటూ గోవిందరాజీయ వ్యాఖ్యాత శిక్షావచనాన్ని ఇలా ఉట్టంకించాడు.

**మాధుర్యమక్షరవ్యక్తిః పదచ్ఛేదస్తథా త్వరా ।**
**ధైర్యం లయసమత్వం చ షడేతే పాఠకా గుణాః ॥**

అని మాధుర్యము, అక్షరవ్యక్తి, పదచ్ఛేదం, అత్వర, ధైర్యం, లయసమత్వం అనేవి ఆరు పాఠగుణాలని అభిప్రాయం. హనుమద్భాషణంలో అవి ఉన్నాయని అభిప్రాయం. ఇక 'అనయా చిత్రయా వాచా' అనే శ్లోకం చేత మాధుర్యపరాకాష్ఠ చెప్పబడిందని వ్యాఖ్యాతృ భావన. 'త్రిస్థానవ్యంజనస్థయా' అనే పదానికి వ్యాఖ్యాత అభిప్రాయాన్ని ఇలా స్పష్టపరచాడు. ఇక్కడ ఉర్ణకంఠశిరస్సులనే మూడుస్థానాల్లో వ్యంజనాభివ్యక్తి చెప్పబడినా శిరస్సులో వ్యక్తమవడం అనేది 'శీర్షగతం తథా' అని పూర్వం నిర్దేశించిన పాఠదోషాల్లో చెప్పబడింది కనుక, ఉదాత్తానుదాత్త స్వరితస్వరాభి వ్యక్తియే ఇక్కడ ఉద్దిష్టమని వ్యాఖ్యాత సప్రమాణంగా ఉట్టంకించాడు.

**అనుదాత్తో హృది జ్ఞేయో మూర్ధ్న్యుదాత్త ఉదాహృతః ।**
**స్వరితః కంఠమూలీయాః పార్శ్వాస్యే ప్రచయస్య తు ॥**

ఇత్యాదిగా హృదయంలో అనుదాత్తము, మూర్ధయందు ఉదాత్తము, కంఠమూలంలో స్వరితము అనే మూడు స్వరాల ప్రస్తావన ఇక్కడ ఉన్నదని అభిప్రాయం. 'ఏవంవిధ' ఇత్యాది శ్లోకంచేత బుద్ధిచాతురి, ప్రశాంసావ్యజంగా కులగోత్రనామధేయరాజ్యత్యాగకరణాది విషయాలనన్నిటినీ ప్రశ్నించడం ద్వారా వ్యక్తమవు తున్నదని వ్యాఖ్యాతృ భావన. 'యథా' అనే శ్లోకంలో "మేము ఆచార్యాభిమాననిష్ఠులమని, కనుక వారి చెప్పిన కార్యాన్ని వారి మాటను అనుసరించే నిర్వహింపగలమ" ని రామప్రతిజ్ఞ ఇక్కడ వ్యక్తమవుతున్నదంటాడు వ్యాఖ్యాత.

ఈ విధంగా ఈ సందర్భంగా హనుమత్ప్రశంసనపరవచనాలను గోవిందరాజీయ- రామానుజీయాలు విశేషంగా వ్యాఖ్యానించాయి. తీర్థీయవ్యాఖ్య కేవలం పదార్థవివరణం మాత్రమే చేసింది. వ్యాఖ్యానశైలిలో గల భేదాన్ని ఇక్కడ స్పష్టంగా గమనించవచ్చు. ఈ విధంగా ఈ మూడవ సర్గ ఆచార్యలాభాన్ని చెబుతున్నదని, ఆచార్యాభిమాననిష్ఠులైన వారికే, తాను త్వరగా లభిస్తాననే భగవత్ప్రతిజ్ఞ "ఏవం విధో యస్య దూతః" అనే శ్లోకంలో సూచింపబడుతున్నదనే అభిప్రాయాన్ని గోవిందరాజీయవ్యాఖ్య వివరించింది.

నాల్గవ సర్గ ఆచార్యముఖంగా చేతనలాభం భగవానునికి కలిగినట్లు చెబుతున్నదని గోవిందరాజీయవ్యాఖ్య. (ఇంతవరకు భగవంతునికి దూరమై తన అపరాధాన్ని గమనించి తనను దండిస్తాడేమోనని, స్వామి పట్ల భీతిభావంకల్గి ప్రవర్తిస్తున్న జీవుని ఆచార్యుని అనుగ్రహం (పురుషకారం) మూలంగా, స్వామి తన దరిచేర్చుకొన్నవైనాన్ని ఈ సర్గ

వ్యక్తపరుస్తున్నదని అభిప్రాయం.) ఈ సర్గలోని 'తతః పరమసంహృష్టః' అనే మూడవ శ్లోకంలోని 'ప్లవగర్షభః' అనే పదంలోని గ అనే అక్షరం గాయత్రీమంత్రంలోని పదయవ అక్షరమైన గకారాన్ని గ్రహిస్తుందని తీర్థీయవ్యాఖ్యోద్ధృతటీక చెబుతున్నది. ఇక్కడకు 9000 శ్లోకాలు పూర్తి అయినాయని గోవిందరాజీయం సూచిస్తున్నది. 11వ శ్లోకంలో రాముని దివాకరునితో సమానంగాను సీతను దినక్షయసమయంలోని ప్రభతో సామానమైన దానిగాను చెప్పడంచేత, శ్రీరామునికి సీత నిత్యసన్నిహిత అని సూచించబడుతున్నదని స్వారస్యం తీర్థీయవ్యాఖ్య ఉట్టంకించింది. ఐశ్వర్యభ్రంశ దశలోకూడా సీత రాముని అనుసరించి ఉంటున్నదని దినక్షయప్రభానుగత సౌర్యసామ్యం సూచిస్తున్నదని గోవిందరాజీయవివరణం. దివాకరప్రభతో దివాకరుడు సాయంకాలసమయంలో అనుగతుడై ఉండడం అనేది స్పష్టంగా ప్రతీతం అవుతుంది కనుక, భార్యకుగల ప్రీతి భర్తకు క్లేశాలు కలిగినప్పుడు కూడా అనుసరించడంలో స్పష్టమవుతుందనే భావన ఇక్కడ వ్యాఖ్యానంచేత అవగతమవుతున్నది.

'అహమస్యావరజో భ్రాతా' అనే 12 వ శ్లోకంలో శ్రీవైష్ణవసంప్రదాయానుగతమైన ఒక విషయాన్ని వ్యాఖ్యాత గోవిందరాజు పరామర్శిస్తున్నాడు. లక్ష్మణుడు సుగ్రీవునితో తనను పరిచయం చేసికొంటూ 'నేను ఆతని చిన్న తమ్ముణ్ణి. ఆతనిగుణాలచే ఆకర్షింపబడి దాస్యం చేస్తున్నాను.' అని అంటాడు. శ్రీవైష్ణవసంప్రదాయంలో జీవులందరికీ భగవద్దాస్యం అనే స్వాభావికలక్షణం అని "దాసభూతాః స్వతః సర్వే హ్యాత్మనః పరమాత్మనః" అన్న పురాణసూక్తి చెప్పినదాన్ని స్వరూపంగా స్వీకరించడం చాలా ప్రధానమైన విషయం. ఇంచుమించుగా సాంప్రదాయికగ్రంథాలన్నీ ఈ జీవస్వరూపాన్ని చాలా స్పష్టంగా విశదపరుస్తాయి. అయితే ప్రస్తుతశ్లోకంలో లక్ష్మణుడు "గుణైః దాస్యముపాగతః" ఆతని గుణగణాలను బట్టి నేనాతనికి దాసుడనైనానని అంటున్నాడు. అంటే ఈతనికి జీవస్వరూపాన్నిబట్టి అందరిలో సమానంగా సహజంగా స్వరూపసిద్ధమైన దాసత్వభావన ఉందా? లేక, గుణాలనుబట్టి మాత్రమే ఏర్పడ్డ దాస్యత్వమా? అనే శంక కలుగుతుంది. ఈ రెండురకాల దాస్యాలకు ఉన్న తేడా ఏమిటి? ఏది గొప్పది? ఇలాంటి శంక ఉన్నది. ఈ శంకను లేవనెత్తి శ్రీవచనభూషణాదిగ్రంథాలు గుణప్రయుక్తదాస్యం, స్వరూపప్రయుక్తదాస్యం అని దాస్యాన్ని రెండురకాలుగా చెప్పి, గుణప్రయుక్తదాస్యం కంటే స్వరూపప్రయుక్తదాస్యమే గొప్పదని నిష్కర్షించాయి. మరి లక్ష్మణుని విషయంలో దాస్యం ఎలాంటిది? అంటే, ఇక్కడ "గుణైః దాస్యముపాగతః" అని, నేను ఆతనిగుణాలకు వశపడి దాస్యం చేస్తున్నానని చెప్పాడు కనుక గుణకృతదాస్యమే. మరి, అరణ్యకాండంలో 'పరవానస్మి కాకుత్స్థత్వయి వర్షశతం గతే' ఇత్యాదిగా స్వరూపప్రయుక్తమైన దాస్యమే తనకున్నదని లక్ష్మణుడు వ్యక్తపరచాడు కదా! ఇక్కడ ఇలా అంటే, రెంటికీ విరోధం లేదా? అని శంకించి, యోగ్యతాప్రకర్షనుబట్టి గుణపరపుష్టమైన దాస్యమిది అని, రెంటికీ విరోధం లేదని వ్యాఖ్యాత వ్యాఖ్యానించాడు. ఇక్కడ చేసే దాస్యం కూడా శ్రీరామచంద్రుని ముఖానికి ఉల్లాసాన్ని కలిగించేదేదని చెప్పడానికి 'కృతజ్ఞస్య బహుజ్ఞస్య' అన్నాడు లక్ష్మణుడు. స్వల్పం చేసినా అధికంగా భావించే స్వభావం కలవాడు రాముడని అభిప్రాయం. ఈ కైంకర్యం కూడా సహజమేననడానికి 'లక్ష్మణో నామ నామతః' అని అన్నాడు. తన నామాన్ని బట్టి కైంకర్యలక్ష్మీసంపన్నుడని అభిప్రాయం. 'సుఖార్హస్య మహార్హస్య' ఇత్యాదిగా రామునికి కలిగిన రెండు దశలు అంటే ఐశ్వర్యవత్త్వదశ, ఐశ్వర్యహీనతా దశ అనేవి రెండూ ఇక్కడ నిర్దేశింపబడటంవల్ల ఈ రెండు దశల్లోనూ దాస్యం సాగినట్లు చెప్పడం చేత ఇది సహజదాస్యమని వ్యక్తపరుపబడింది. కనుక లక్ష్మణుని కైంకర్యం సహజమే కాగా, గుణాలు దానికి పరివర్ధకాలైనాయని అవగతమవుతున్నది.

ఇక, తనిశ్లోకి దాస్యం విషయంలో ఇలా వ్యాఖ్యానించింది. సర్వదేశసర్వావస్థల్లోనూ విశ్లేషణ ఎంతమాత్రం లేకుండా కైంకర్యం నిర్వహించడాన్ని సూచించడానికే ఉప అనే పదం. సహజసిద్ధమైన దాస్యమే వ్రతంగా కలిగివున్నా ఇదీ భోగ్యంగానే ఉన్నదనడానికి 'గుణైః దాస్యముపాగతః' అని గుణప్రయుక్తత్వం కూడా చెప్పబడింది. ఇక 'ఏష దత్త్వా చ విత్తాని' ఇత్యాది శ్లోకంచేత, పరత్వము సౌశీల్యము రెండూ వ్యక్తపరుపబడ్డాయి.'లోకనాథః పురా భూత్వా సుగ్రీవం నాథమిచ్ఛతి' అని, తాను లోకనాథుడై ఉంటూనే సుగ్రీవుని శరణు కోరాడనటంలో తనకు గల లోకనాథత్వమే సుగ్రీవుని నాథునిగా కోరడంలో హేతువంటాడు వ్యాఖ్యాత. ఎలాగ? పరత్వం లేనిచోట సౌశీల్యం గుణంకాదు కదా! జాలసౌశీల్యం అంటే 'మహతాం మందైస్సాకం నీరంధ్రేణ ప్రవృత్తిః' అని పెద్దల వివరణం. గుణాలచేత మహత్త్వం కలవారు తమకంటే తక్కువవారితో కలసి మెలసి ఉండడమే సౌశీల్యం. దీన్ని బట్టి మహత్త్వం ఉంటేనే సౌశీల్యానికి అర్థం ఉంటుందని, మహత్త్వం లేనిచోట సౌశీల్యానికి అవకాశమేలేదని, మహత్త్వంలేనిచోట ఈ కలివిడితనం ఉన్నా అది గుణం కాజాలదని అభిప్రాయం. ఇక్కడ 'లోకనాథ' శబ్దంచేత (ఇది, ఈ లోకానికే నాథుడు అనే ఉపపదం లేని శబ్దం అవడంచేత సకలలోకాలకు రాముడు నాథుడని వ్యక్తపరుపబడుతున్నది. 'ప్రాప్య చానుత్తమం యశః' ఇత్యాదిగా యశస్సు 'అనుత్తమం' అనడంచేత పరత్వదశలో కంటే అవతారదశలోనే యశస్సు అతిశయితమని వ్యక్తమవుతున్నది. ఇచ్ఛతి అనడంచేత ఇక్కడ రామునికి గల స్వాతంత్ర్యం అప్రతిహతమని తెలుస్తున్నది. ఇలా స్వతంత్రేచ్ఛలో అర్థించడం కూడా రామునికి గుణమే అంటాడు వ్యాఖ్యాత. ఈ సౌశీల్యాన్నే పితా ఇత్యాది శ్లోకాల్లో కూడా వ్యక్తమవుతున్నదని వ్యాఖ్యాతృభావన. 'యస్య ప్రసాదే సతతం ప్రసీదేతో ఇమాః ప్రజాః' అనడంచేత రాముని ప్రసాదంచేతనే సకలపురుషార్థాలు పొంది ప్రజలు ప్రసన్నులవుతారని, అలాంటి రాముడు, తన కటాక్షాన్ని అపేక్షించే క్షుద్రతరజనులలో ఒకడైన సుగ్రీవుని ప్రాసాదాన్ని అభికాంక్షించటం అనేది ఆయనకుగల నిరంకుశ స్వతంత్రేచ్ఛ ఎంతనిరాకరింపజాలనిదో వ్యక్తపరుపబడుతున్నదని వ్యాఖ్యాత విశదపరచాడు. 'యేన సర్వగుణోపేతాః' ఇత్యాది శ్లోకద్వయం కూడా సౌశీల్యాభివ్యంజకమే. 'శోకాభిభూతే రామే తు' అనే శ్లోకంలో రామునికి కల్గిన శోకం ఆయన సంబోధించినది కాదని, శోకాభిభూతమైన స్వజనాన్ని చూచి స్వయంగా శోకాకులుడైనాడని, కనుక ఈ శోకాన్ని తీర్చగలవాడు ఆచార్యుడు మాత్రమేనని లక్షణవాక్యతాత్పర్యంగా వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. ఈవిధంగా ఈ చతుర్థసర్గ చేతనుడైన జీవునికి భగవంతుడు లభించడమనేది కేవలం ఆచార్యాధీనమేనని వ్యక్తపరుస్తున్నదంటాడు. ఇక్కడ సుగ్రీవుడు భగవల్లాభకాంక్షియైన జీవుడని, హనుమంతుడు ఆచార్యుడని, రాముడు ప్రాప్యతత్త్వమైన పరమాత్మ అనే తాత్త్వికభావన వ్యక్తపరుపబడుతున్నది. గోవిందరాజీయ-రామానుజీయ తనిశ్లోకి వ్యాఖ్యల్లోనని గ్రహించాలి.

ఇక పంచమసర్గలో ప్రతిపాద్యతత్త్వాన్ని వ్యాఖ్యాత ఇలా విశదపరచాడు. పాపభీతుడై, ఫలప్రదానంచేసే భగవంతుని వల్లకూడా భయపడుతూ, ఆతని దరిజేరక దూరంగా ఉండేజోడు, ఆచార్యముఖంగా భగవంతుని గుణాలను విని, ఆయనయే ఉపాయం తప్ప మరింక వేరే ఉపాయంలేదనే 'తదేకోపాయతానిష్ఠ' ఇక్కడ సుగ్రీవుడు హనుమంతుని ద్వారా రాముని ఆశ్రయించడంలో సూచింపబడుతున్నది అని. ఈ సర్గలో 'సకృత్వా మానుషం రూపం' ఇత్యాదిగా సుగ్రీవుడు హనుమంతుని మాటలు విన్నా తరువాత మనుష్యరూపాన్ని ధరించాడని చెప్పడాన్ని బట్టి, హనుమంతుడు రామలక్ష్మణుల వేరొక ప్రదేశంలో ఉంచి, వారిరాకను సుగ్రీవునికి తెలియపరచాడని

అవగతమవుతున్నదని వ్యాఖ్యానించారు తీర్థీయ– గోవిందరాజీయ వ్యాఖ్యాతలు. "సంత్యజ్య భిక్షురూపమరిందమః" అని హనుమంతుడు భిక్షురూపాన్ని విడచిపెట్టాడని చెప్పడం చేత, సుగ్రీవవిశ్వాసం కోసం "తౌ త్వయా ప్రాకృతేనైవ గత్వా జ్ఞేయే ప్లవంగమ" అని పూర్వం చెప్పినవిధంగా మళ్ళీ భిక్షురూపాన్నే ధరించి సుగ్రీవసన్నిధికి హనుమంతుడు వెళ్ళాడని వ్యక్తపరుపబడుతున్నదని వ్యాఖ్యాతృ భావన. 'త్వం వయస్యోఽసి' అనే శ్లోకంచేత జీవుడు పరమాత్మయొక్క పరమసామ్యాన్ని కోరడం చెప్పబడుతున్నదంటాడు వ్యాఖ్యాత. ఇక్కడ హనుమంతుడు అగ్నిసాక్షికంగా సుగ్రీవస్నేహాన్ని పొందడం అనేది రామానుజ్ఞ చేతనే ఎందువల్లనంటే, అగ్నిసాక్షికంగానే స్నేహాన్ని పొందమని పూర్వం కబంధుడు రామునికి చెప్పాడు కదా అని తీర్థీయవ్యాఖ్య.

ఆరవ సర్గలో పదార్థవివరణ ప్రక్రియ, తీర్థీయ–గోవిందరాజీయాల్లో రెండిటా సమానంగానే ఉంది. అయితే 1,2 శ్లోకాల వివరణంలో విలక్షణత కూడా గోచరిస్తున్నది.

ఈసర్గలో రాముడు వాలివధను ప్రతిజ్ఞ చేయగా, సుగ్రీవుడు కూడా సీతాన్వేషణముఖంగా రామకార్య సాధనాన్ని ప్రతిజ్ఞ చేయడం ప్రధానవిషయం.

**భార్యావియోగజం దుఃఖం అచిరాత్త్వం విమోక్ష్యసే ।**
**అహం తామానయిష్యామి నష్టాం వేదశ్రుతీ మివ ॥**

అన్న శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ వేదము–శ్రుతి రెండూ ఒక్కటే కదా! పర్యాయపదప్రయోగం ఎందుకు? అని శంకించి, 'శ్రూయత ఇతి శ్రౌతిః' అనే వ్యుత్పత్తినిబట్టి వేద–శాస్త్రాలు రెండూ శ్రుతిశబ్దంచేత చెప్పబడవచ్చును కనుక, శ్రుతిశబ్దం సాధారణ వాచకమని, కనుక శాస్త్రాదివ్యావృత్తి ద్వారా వేదాలను మాత్రమే ఇక్కడ పరిగ్రహించడానికి వేదశబ్దం చేర్చి 'వేదశ్రుతీమ్' అనడం జరిగిందని తీర్థీయగోవిందరాజీయాలు రెండూ వ్యాఖ్యానించాయి. ఇక్కడ వేదశ్రుతి హరింపబడటం, దాన్ని స్వామి తిరిగి సంపాదించడం అనే ఐతిహ్యాన్ని ఉట్టంకిస్తూ, గోవిందరాజీయం 'మధుకైటభాపహృతాం వేదశ్రుతీమ్' అని తీర్థీయానుకరణం చేసి వ్రాశాడు. ఇక తీర్థీయవ్యాఖ్య, మరి కొంత ముందుకు వెళ్ళి "మధుకైటభాభ్యాం పాతాళే గుప్తా వేదభూతం మత్స్యాకృతిర్హరిర్యథా ఆనీతవాన్, తథా" వ్యాఖ్యానించింది. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. మధుకైటభహననం చేసినది హయగ్రీవావతారముతోనే గాని మత్స్యావతారంతో కాదుకదా! మత్స్యావతారం సోమకవధకు సంబంధించింది. కనుక ఈ ఐతిహ్యపరివర్తనం వ్యాఖ్యాతలు ఎలా చేశారో వివేచించవలసి ఉంది. "అనుమానాత్తు జానామి మైథిలీ సా న సంశయః" అన్న సుగ్రీవవచనాల్లో అనుమాన శబ్దానికి స్పష్టమైన వివరణ వ్యాఖ్యాత లెవ్వరూ ఇవ్వకపోవడం గమనార్హం. ఇక్కడ అనుమానం ఏమిటో వివరిస్తూ తీర్థీయం ఇలా అన్నది. "రావణునిచే ఎవ్వతెయో ఒకతె హరింపబడి నాచే చూడబడింది. అప్పుడు ఋష్యమూకంపై నేనున్నాను. ఆమె సీతయే అయి ఉండవచ్చు" అని అనుమానప్రకారం (ఇత్యనుమాన ప్రకారః) అంటూ చేసిన తీర్థీయవివరణం కూడా లోకరీతిలో అనుమానశబ్దాన్ని కేవలం ఊహ అనే అర్థంలో గ్రహించి వ్యాఖ్యానించినట్లు కనబడుతున్నది. ఇక్కడ మాటాడినవాడు సుగ్రీవుడు ఒక కపి మాత్రమే కనుక శాస్త్రీయానుమాన ప్రక్రియ ఇక్కడ ప్రసక్తం కాదనే భావనతో సామాన్యరూపంగానే వ్యాఖ్యాత వివరించి ఉండవచ్చు.

వాస్తవానికి యుక్తిపురస్సరంగా చేసే ఊహయే అనుమానమని చెప్పబడుతుంది. ఇక ప్రత్యక్షప్రమాణంగా సీత పడవేసిన ఆభరణాలను చూపడం తరువాత వర్ణింపబడింది.

ఆభరణ దర్శనానంతరం–లక్ష్మణుడు పల్కిన –

**నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే ।**
**నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్ ॥**

ఇత్యాది శ్లోకాన్ని వ్యాఖ్యాతలెవ్వరూ ఎంతమాత్రం స్పృశింపకపోవడం గమనార్హం. విశేషించి సాంప్రదాయిక రీతిలో వివరణం సాగించే గోవిందరాజీయం కూడా ఎందుకు ఈ శ్లోకాన్ని వ్యాఖ్యానింపక విడచిందో తెలియదు. ఈ సర్గల్లో ఎక్కడా, ఫలశ్రుతిశ్లోకాలను తీర్థీయం ప్రదర్శించకపోవడం కూడా గమనార్హం.

ఇక ఏడవ సర్గలో గోవిందరాజీయం, తాత్త్వికదృష్ట్యా ప్రతిపాదింపబడే విషయాన్ని ఇలా నిర్దేశించింది. "ఇలా, ఆభరణదర్శనవ్యాజంతో సీతమ్మయొక్క ఆభరణాలను సుగ్రీవుడు చూపడం, వాటిని రాముడు దర్శించడం అనే ఈ సన్నివేశాన్ని నిమిత్తంగా చేసికొని యాదృచ్ఛికము, ప్రాసంగికము అయిన సుకృతం (పుణ్యం) ఏర్పడడాన్ని బట్టి జీవుని పొందాలనే త్వరాతిశయాన్ని భగవానుడు ప్రదర్శించడం సప్తమంలో ఉంది" అని. ప్రథమశ్లోకంలో 'బాష్పగద్గదః' అనడంచేత, రాముని కన్నీటిని చూచి కలత చెందిన సుగ్రీవుడు తానుకూడా కన్నీరుపెట్టుకోవడం అనేది "ఏకం దుఃఖం సుఖం చ వా" అని అన్నదానికి ఇది ప్రథమోదాహరణం అంటుంది గోవిందరాజీయవ్యాఖ్య.

ఇక రెండవ శ్లోకాన్ని వివరించడంలో వ్యాఖ్యాతలు చక్కటి అభినివేశాన్ని చూపించారు. సుగ్రీవుడు రామునితో అంటాడు.

**న జానే నిలయం తస్య సర్వథా పాపరక్షసః ।**
**సామర్థ్యం విక్రమం వాపి దౌష్కులే యస్య వా కులమ్ ॥**

సర్వాత్మనా పాపరాక్షసుడైన ఆతని నివాసస్థానం నాకు తెలియనే తెలియదు అని సుగ్రీవవచన తాత్పర్యం. ఇక్కడ వ్యాఖ్యాతృభావన ఏమిటో పరిశీలించుదాం. ఇక్కడ గోవిందరాజీయం ఇలా వ్యాఖ్యానించింది.

మరి, ఇలా చెప్పడం అంటే సర్వాత్మనా రావణుని నిలయం తెలియదని చెప్పడం ముందు ముందు చెప్పబోయే మాటకు విరుద్ధం కదా! ఎందువల్లనంటే ముందు, వానరులను ఆ యా దిక్కులకు పంపేముందు ఇలా చెబుతాడు సుగ్రీవుడు.

**ద్వీపస్తస్యాపరే పారే శతయోజనమాయతః**
**అగమ్యో మానుషైర్దీప్తై తం మార్గధ్వం సమంతతః ।**

**సహి దేశస్తు వధ్యస్య రావణస్య దురాత్మనః**
**రాక్షసాధిపతేర్వాసః సహస్రాక్షసమద్యుతేః ॥**

అని దానికి (దక్షిణసముద్రానికి) రెండవ వైపున శతయోజనవిస్తీర్ణమైన ద్వీపం ఉన్నది. అది మనుష్యులచేగాని, దేవతలచేగాని ప్రవేశింపరానిది. దానిని పూర్తిగా వెదకండి. అదే, దురాత్ముడు, వధార్హుడు, ఇంద్రసమపరాక్రముడైన రాక్షసాధిపతి రావణుని నివాసస్థానం. అని అభిప్రాయం. ఇలా ముందు ముందు చెప్పబోయే మాటలకు ప్రస్తుతం తానేమీ ఎరుగనని చెప్పడం విరుద్ధం కదా! కనుక, తన పనిలో ముందు ముందు రావణుని ప్రవర్తింపజేయడానికి సుగ్రీవుడు ఇలా అన్నాడు. కనుకనే, 'బ్రూహి సుగ్రీవకం దేశం హ్రియంతే లక్షితా త్వయా' (సుగ్రీవా! ఏ ప్రదేశంలో సీత హరింపబడుతూ నీ కగుపించిందో ఆ ప్రదేశాన్ని నాకు చెప్పు) అని రాముడు అడిగినప్పుడు, సుగ్రీవుడు ప్రతివచనం చెప్పలేదు. వెళ్తున్న ప్రదేశం కూడా ఎలా తెలియకుండా వుంటుంది? అతడిలా అన్నాడు. 'హ్రియమాణా మయా దృష్టా' హరింపబడుతూ నాచే (సీత) చూడబడింది అని. ఇలా ఆమె ఏ ప్రదేశంలో హరింపబడుతూ అగుపించిందో ఆ ప్రదేశాన్ని తాను ఎరిగివుండి కూడా చెప్పకపోవడం ఆరంభంలోనే మిత్రద్రోహానికి పాల్పడటమే అవుతుంది కదా! అని శంకించి ఇలా సమాధానం చెప్పింది గోవిందరాజీయం. దూరదర్శియైన సుగ్రీవుడు తన మనస్సులో ఇలా భావించాడు. ఏమంటే, ఒకవేళ రావణవృత్తాంతం నాకు తెలుసునని నేను ముందే చెప్పిన పక్షంలో, అప్పుడు అతిదుఃఖితుడై ఉన్న రాముడు, సీతాన్వేషణమే ముందు సాగించమని నన్ను ప్రేరించవచ్చు. అది యుక్తం కాదు. ఎందువల్లనంటే వానరులంతా వారివశంలో వున్నారు. నా వశంలో లేరు. (కనుక సీతాన్వేషణం అసాధ్యం) ఒకవేళ ఏ కొందరినో తనవైపు త్రిప్పుకొని సీతాన్వేషణానికి ఉద్యమించినా, రావణునితో వాలి సఖ్యం చేసి ఉన్నాడు కనుక, మేమనుకొన్నవిధంగా సీతాన్వేషణాన్ని ఎలా సాగనిస్తాడు? అప్పుడు నాపని, రామకార్యం రెండూ చెడతాయి. కనుక తత్త్వాన్ని చెప్పను, అని అజ్ఞానాన్ని అభినయించాడు సుగ్రీవుడు. ఇది సుగ్రీవుని దూత విశిష్టతను వ్యక్తపరుస్తున్నది.

మరి, అలా అయితే, సీతాన్వేషణానికి వానరులను పంపేటప్పుడు సుగ్రీవుడు పలికిన మాటలను విన్న రాముడు, సుగ్రీవునికి పూర్వమే రావణనివాసస్థానం తెలుసునని, తెలిసినా చెప్పలేదని శంకింపవచ్చుకదా! అన్న ప్రశ్నకు గోవిందరాజీయం ఇలా సమాధానం చెప్పింది. తార, లక్ష్మణునితో పలికిన మాటలను రాముడు విని ఉన్నాడు కనుక అలా శంకింపడు. కారణం తార పల్కిన మాటలనుబట్టే సుగ్రీవునికికూడా తత్త్వం తెలిసింది తప్ప స్వయంగా అతనికేమీ ముందుగా తెలియదనే రాముడు భావిస్తున్నాడు కనుక. తార లక్ష్మణునితో ఇలా అన్నది –

**శతకోటి సహస్రాణి లంకాయాం కిల రాక్షసాః ।**
**అయుతాని చ షట్త్రింశత్ సహస్రాణి శతాని చ ॥**

**అహత్వా తాంశ్చ దుర్ధర్షాన్ రాక్షసాన్ కామరూపిణః ।**
**న శక్యో రావణో హంతుం యేన సా మైథిలీ హృతా ॥ ఇత్యాది.**

లంకలో శతకోటి సహస్రసంఖ్యాకులైన రాక్షసులున్నారు. షట్త్రింశత్ సహస్రశతాయుత సంఖ్యాకులైనవారు, దుర్జయులు, కామరూపులు. వారిని చంపక సీతనపహరించిన రావణుని చంపడం సాధ్యం కాదు. అని ఈ మాటల తాత్పర్యం. పైగా, లోకాలోకపర్యంతం పర్యటించిన సుగ్రీవునికి అది తెలియకపోవటం అంటూ ఏమీ లేదు. కనుకనే, రామబలపరీక్షసమయంలోనూ, దుందుభి మొదలైనవారి ధర్షణ సమయంలోనూ చెప్పవలసివున్నా,

రావణుని వాలి జయించాడన్న వృత్తాంతాన్ని సుగ్రీవుడు చెప్పలేదు. మరి, అలా అయితే, ఇప్పుడు అతడు పరమార్థంగా ఏమీ ఎరుగడు. కేవలం తారవచనాలవల్లనే ఆతడు తత్త్వాన్ని తెలుసుకొన్నాడని భావించడం సముచితం కాదు. అంటే, అదికాదు. తారను దర్శించినది మొదలు కామపరవశుడై సుగ్రీవుడు తారతోపాటు రామకార్యాన్ని పర్యాలోచించలేదు. కనుక ఆతనికి తారాపర్యాలోచనవరకు ఏమీ తెలియదనేదే యుక్తం. ఒకవేళ తెలిసివుంటే, సీతాహరణం చూచానని చెప్పినప్పుడే ఆ దిక్కుగురించి చెప్పి ఉండేవాడుకదా! ఇక్కడ కొందరిలా అన్నారు. నిలయం న జానామి (నివాసస్థానం తెలియదు.) అన్న మాటకు ఇప్పుడు ఆతని నివాసస్థానం తెలియదనే అభిప్రాయం. ఏమాత్రం రావణవృత్తాంతం ఎరుగక, ఎంతోకొంత ఆతని వృత్తాంతం తెలియాలని భావించిన రాముడు ఆ రాక్షసుడు ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించినప్పుడు, తాను ఎరిగిన అంశమైనా చెప్పకుండా ఇప్పుడు ఆతని స్థానం తెలియదని చెప్పడం అనేది వంచనయే అవుతుంది కదా! ఆతని నివాసస్థానం తెలిస్తే దాన్ని భేదించినందువల్ల, ఆతడే వెలుపలికి వస్తాడని రామాభిప్రాయం. పైగా, ఇప్పుడు ఆతని నివాసం గురించి తెలియకపోయినా సామర్థ్యపరాక్రమాలైనా చెప్పవలసి ఉంటుందికదా! ఇతరదిక్కులకు వానరులను పంపడం, వారినుద్దేశించి – 'రావణస్సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః' (వైదేహితోపాటుగా రావణుడు అక్కడకక్కడ వెదుకదగినవాడు) అని చెప్పడం, చాలాకాలం విలంబం అయింది కనుక, రావణుని స్థానం నియతంగా ఇదే అనే నిర్ణయానికి అవకాశంలేదు కనుక ఎక్కడనో ఒకచోట అలా వానరులను నలుదిక్కులకు పంపవచ్చు. కనుక ఇందులో అసంగతి ఏమీలేదు. ఇక్కడ ఈ అభిప్రాయాన్ని కూడా నిరసించినట్లే అవుతున్నది. ఏమిటంటే సర్వాత్మనా అన్నివిధాల అతని నిలయం తెలియదు. అనడంచేత విశిష్టంగా తెలియకపోవడమే దాని అర్థం. కనుక ఆపైన ముందు ముందు ఏదోవిధంగా ఆతని ఉనికి తెలిసినా విరోధం ఏమీలేదు అని. వానరులకు ఎంతచెప్పవలసివుందో అదంతా ముందే మొదటే చెప్పవలసివుంటుందికదా!

ఇక్కడ మరికొందరిలా ఉద్ఘాటించారు.

ఒక సంవత్సరకాలం సీతదుఃఖపడకపోతే, రావణుడు శివునిపూజ చేసినందుకు ఫలం లేకుండా పోతుందికదా! కనుక దైవప్రతిబంధమూలంగానే సుగ్రీవునికిగూడా అజ్ఞానం ఏర్పడింది. (ఆమె గురించి తెలియలేదు) అని. ఈ సమాధానం పరమనింద్యం. ఎందువల్లనంటే, దృష్టఫలం కనిపిస్తూ ఉండగా అదృష్టఫలాన్ని కల్పించడం అన్యాయం కదా! దృష్టే ఫలే సంభవతి అదృష్టకల్పనాయాః అన్యాయ్యత్వాత్ అని న్యాయం. ఇది దీని అభిప్రాయం. రావణుని శివపూజకు ఆతడు పొందిన లంకారాజ్యం భోగాదులు ఫలం తప్ప, సీతను చెరపట్టడం, ఆమె దుఃఖపడడం అనేది ఫలం ఎలా అవుతాయి. శివపూజకు పరదారాభిమర్శనమే ఫలమనడం సర్వాత్మనా అసందర్భము–అయుక్తము. కనుక పూర్వం చెప్పినట్లు, రామునిలో సుగ్రీవుడు మాటాడినప్పటికి ఆతనికి కొంతయే తెలుసును. తారాసంబంధంచే మరికొంత తెలిసింది, కనుకనే ముందుచెప్పిన మాటలకు వానరప్రేషణసమయంలో చెప్పిన మాటలకు తేడా వున్నదని, అది యుక్తమేనని స్పష్టమవుతున్నది అని గోవిందరాజీయవివరణ. ఈ సర్గలోని రామసుగ్రీసంవాదశ్రవణానికి శ్రోతలకు కలిగే ఫలం దుఃఖవిమోచనమని స్కాందోక్తఫలశ్రుతిని తీర్థీయవ్యాఖ్య ఉట్టంకించింది. "రామసుగ్రీవసల్లాపం శ్రుత్వా దుఃఖాద్విముచ్యతే" అని.

ఎనిమిదవ సర్గలో సుగ్రీవుడు తన శోకానికిగల కారణాన్ని విశదపరచడం విషయం 15,16శ్లోకాలలో రెండుసార్లు రామశబ్దాన్ని ప్రయోగించడం ఎందుకు? అనే శంకకు సమాధానంగా ధ్వని సిద్ధాంతమర్యాద ననుసరించి మహేశ్వరతీర్థులు రెండవ రామశబ్దం క్రియావిశేషణంగా అంటే రామం అభిరామం యథా తథా ఉవాచ అని అన్వయింపవచ్చునని సూచించాడు. అందంగా మాటాడాడని భావం. ఇలాంటి వ్యాఖ్యానం ఈ రెండువ్యాఖ్యానాల సూక్ష్మానుశీలనాదృష్టి ఎలాంటిదో వ్యక్తపరుస్తున్నది. కొన్నిచోట్ల శక్త్యభిప్రాయాన్ని వివరించడము వ్యాఖ్యాత జాగరూకత వహించినట్లు స్పష్టం. 'సుఖం హి కారణం శ్రుత్వా' అనే 42వ శ్లోకంలో రాముని బుద్ధివైశద్యాన్ని తత్త్వవిచారణాదృష్టిని వ్యక్తపరచేలా వ్యాఖ్యాత వ్యాఖ్యానిస్తాడు. "కారణం శ్రుత్వా వైరస్య సంప్రధార్య బలాబలమ్" అనడంలో ఆంతర్యం ఏమిటి? వైరకారణం వైరం ఈ రెంటిలో ఏది ప్రబలమైందో పరిశీలించి బలాబలాలు పరిశీలించి ప్రతివిధానం చేస్తానంటాడు రాముడు. ఇక్కడ వైరకారణం దుర్బలమైనా వైరం బలవత్తరమైతే ఒకేవిధమైన ప్రతివిధి, వైరకారణం బలవత్తరమై వైరం దుర్బలమైతే ఒకేవిధమైన ప్రతివిధానం ఉంటుంది. అపరాధం స్వల్పమైనా ఆతడు ప్రబలవైరాన్ని చూపితే ఈనాడే వానిని చంపుతానని, అపరాధం పెద్దదైనా వైరం స్వల్పమైతే సముచితసమాధానముఖంగా నీకు సుఖాన్ని కలిగిస్తానని రామాభిప్రాయాన్ని వ్యాఖ్యాత లెస్సగా ఆవిష్కరించాడు. ఇంచుమించుగా గోవిందరాజీయవ్యాఖ్య సాంప్రదాయికవిశేషాలు లేనిచోట తీర్థీయవ్యాఖ్యనే అనువదిస్తూ ఉంటుంది. అక్కడక్కడ తీర్థీయవ్యాఖ్యను అనువదిస్తూ ఉపపత్తిని కూడా శాస్త్రీయంగా సూచిస్తూ ఉంటుంది.

తొమ్మిదవసర్గ వాల్యపరాధవృత్తాంతాన్ని విశదపరుస్తుంది. తీర్థీయవ్యాఖ్య, వివరణలోకి వెళ్ళక సంగ్రహంగా అర్థాన్ని చూపిస్తుంది. కనుక తీర్థీయవ్యాఖ్యను బట్టి చాలావరకు కిష్కింధాకాండలో కేవలం పదార్థవివరణమే తప్ప విశేషచర్చలు వివరణలు అంతగాలేవు. ఈ దృష్టితో తీర్థీయవ్యాఖ్యను లఘుటీకగా పేర్కొనడం సముచితం. దీన్ని ఆలంబనగా పదార్థవివరణం వరకు తీసికొని, ఇతరవ్యాఖ్యలతోపాటు అనువదిస్తూ, తనదైన సాంప్రదాయిక ధోరణిలో తాత్త్వికవిచారణ చేయడం గోవిందరాజీయ వ్యాఖ్యాస్వభావంగా మనకు కనిపిస్తుంది. కనుకనే ఇది తీర్థీయవ్యాఖ్య కంటే ఎన్నో రెట్లు విస్తృతం. బహుళవిచార భరితం. వ్యాకరణవ్యుత్పత్తులు పాణినీయ సూత్రోట్టంకనాలు కూడా తీర్థీయవ్యాఖ్య కంటే అధికమే.

పదవసర్గలో వాలి దోషాన్ని గమనించి రాముడు తద్వధకై దృఢప్రతిజ్ఞ చేయడం ప్రధానవిషయం. పదకొండవ సర్గ రాముని బలాన్ని దర్శింపజేయడం విషమంగా సాగుతుంది. ఇక్కడ కూడా రెండు వ్యాఖ్యల్లోనూ చాలావరకు వ్యాఖ్య సమానమే. 'యథా రాత్రౌ' అనే శ్లోకంలో ప్రయోగింపబడిన 'మాయావి' శబ్దానికి మయపుత్రుడు అర్థం కాదని, దుందుభిపుత్రుడైన మరొక 'మాయావి' అని గోవిందరాజీయ వివరణం.

ఈ పదకొండవ సర్గలోనే మరికొన్ని విశేషాలు గమనించుదాం.

**సముద్రాత్పశ్చిమాత్పూర్వం దక్షిణాదపి చోత్తరమ్ ।**
**క్రామత్యనుదితే సూర్యే వాలీవ్యగతక్లమః ॥**

అనే శ్లోకాన్ని వివరిస్తూ తీర్థీయం ఇలా అంటుంది. 'అనుదితే సూర్యే' అనేది ఉత్తరావధిని బోధిస్తున్నది. 'బ్రాహ్మే ముహూర్తే ఉత్థాయ' అని బ్రాహ్మముహూర్తమే పూర్వావధిగా అనుష్ఠానాంగంగా విధింపబడినకాలం. పరిక్రమణమనేది అనుష్ఠానం కొరకే.

**చతుర్భ్యోఽపి సముద్రేభ్యః సంధ్యామన్వాస్య రావణ ।**
**ఇమం ముహూర్తమాయాతి వాలీ తిష్ఠ ముహూర్తకమ్ ॥**

అని ఉత్తరకాండలో తార పలికిన మాటలను బట్టి అవగతమవుతున్నది. అని. ఇక్కడ నాల్గుసముద్రాల్లోనూ సంధ్యావందనం చేసినట్లు పైన నిర్దేశించిన ఉత్తరకాండశ్లోకంవల్ల తెలుస్తున్నది కనుక, నాల్గుసముద్రాల్లో ఒకే సంధ్యావందనం చేయడమెలా? అని తీర్థీయవివరణంపై శంకించి, గోవిందరాజీయం ఇలా సమాధానం చెప్పింది.

"ఎలాగైతే ఒకే తటాకంలో నాల్గుపార్శ్వాలున్నట్లుగా, నాల్గుసముద్రాల్లో స్నానం, ఆచమనం, అర్ఘ్యప్రదానం, జపం అనే నాల్గు సంధ్యాకృత్యాలూ చేయడంలో అభ్యంతరం లేదు" అని. ఇక్కడ తీర్థీయ–గోవిందరాజీయవచనాలు సమానంగా ఉన్నా, రామానుజీయవ్యాఖ్యావిశేషాలనే గోవిందరాజీయం అనువదించిందని చెప్పవలసి ఉంది. ఎందువల్లనంటే, రామానుజీయవచనాలు– గోవిందరాజీయవచనాలు సమానంగా ఉన్నాయికనుక. ఈ సర్గలోని చాలా శ్లోకాలకు తీర్థీయవ్యాఖ్య లేదు. గోవిందరాజీయ–రామానుజీయాలు కూడా టీకారూపంగా చాలా సంగ్రహంగానే ఉన్నాయి.

38 వ శ్లోకంలో 'వీరపాణం సమర్థ్యతామ్' అన్నచోటున ప్రయోగింపబడిన 'వీరపాణ' శబ్దానికి తీర్థీయవ్యాఖ్య–గోవిందరాజీయవ్యాఖ్యలు ఇలా అర్థం వ్రాశాయి.

"వీరపాణం" అంటే యుద్ధానికి ఉపక్రమించేముందు ఉత్సాహాన్ని వృద్ధిచేసుకోవడానికి వీరులు చేసే ద్రవపానం అని.

'తమేవ ముక్త్వా సంక్రుద్ధో మాలాముక్షిప్య కాంచనీం' ఇత్యాది. ఇక్కడ తీర్థీయవ్యాఖ్యలోలేని కొన్ని విశేషాలు గోవిందరాజీయంలో ఇలా చెప్పబడ్డాయి. 'ఇమే చ విపులా స్సాలాః' అనే శ్లోకంలో ఓజసా అనడంచేత వెనుక చెప్పినట్లు ఇక్కడ ధనుఃప్రయోగం లేకుండ హస్తంతోనే బాణాన్ని విసరి వృక్షానికి రంధ్రం చేశాడని వ్యక్తమవుతున్నదని గోవిందరాజీయవివరణం కాగా, ఈ వివరణానికి అనుకూలంగానే ఇక్కడ 2,3 పక్షాలను చూపించాడు వ్యాఖ్యాత.

వేధనం చేయడానికి సమర్థుడు, కాని అలా ఎప్పుడూ చేయలేదని ఘటతే అనే పదంచేత వ్యక్తమవుతున్నదని, ఇలాగే ఉత్తరత్ర అన్వయించదని ఒక అభిప్రాయం.

తన జాతికి విరుద్ధం కనుక యుద్ధంలో ఏనాడో ధనుస్సును గ్రహించడం చేయకపోయినా, లీలగా(క్రీడగా) వినియోగించడానికి ధనుస్సున్నదని మరొక అభిప్రాయం. 'తమువాచాథ సుగ్రీవః' అనే 70 వ శ్లోకంలో 'సప్తసాలానిమాన్ పురా ఏవమేకైకశో వాలీ వివ్యాథ' అనేచోట ఏవమేకైకశః అసకృద్వివ్యాథ అని యోజన అని వ్యాఖ్యాత పేర్కొన్నాడు. ఇక్కడ తరువాత శ్లోకంలో కూడా రాముడు వాలిని చంపగలడని నిర్ణయించడానికి కావలసిన యుక్తులను మూలానుసారంగా వ్యాఖ్యాత వివరించాడు.

ఆ వాలి ఇలాంటి ఏడు సాలవృక్షాలను ఒక్కొక్కటిగా బాణంతో కొట్టాడు. ఆ తరువాత కూడా చాలాసార్లు కొట్టాడు. ఇక తరువాత శ్లోకంలో ఈ సప్తసాలాల మధ్యలో ఒక చెట్టును ఒక బాణంతో రాముడు విదారణం చేస్తే, అప్పుడాపరాక్రమాన్ని చూచి ఆతడు వాలిని చంపగలడని భావింపవచ్చు అని, ఇక్కడ వాలిబలాన్ని చెబుతూ ధనుశ్శతదూరం, మృతమహిషశరీరాన్ని వాలి పాదప్రకోష్ఠంతో లేవనెత్తి చిమ్మివేశాడట. ఇక్కడ ధనుశ్శతం అంటే ఏమిటో వ్యాఖ్యాత ప్రమాణపురస్సరంగా వివరించాడు. ఇరవైనాల్గు అంగుళాలు ఒక హస్తం. నాల్గుహస్తాలు ఒక ధనువు. ఇలాంటి నూరుధనువుల నాల్గువందలహస్తాలదూరం అని వివరించాడు వ్యాఖ్యాత. ఇలా పాదబలాన్ని ప్రదర్శించగలిగితే రామునిచేతిలో వాలి హతుడు కాగలడని విశ్వసిస్తానని, సుగ్రీవవచనతాత్పర్యంగా వ్యాఖ్యాత విశదపరచాడు. 39వ శ్లోకవ్యాఖ్యానంలో 'మాలాముక్షిప్య కాంచనీమ్' అనే చోట కాంచనమాలకుగల ప్రశస్తతను గోవిందరాజు ఉట్టంకించాడు. 'ఎవ్వడైనా ఆ మాలను ధరించివున్నప్పుడు ఎదురుగా వస్తే, ఎదుటివాని బలం అంతా వాలికే సంక్రమిస్తుందని మహేంద్రుడిచ్చిన వరప్రభావం కల మాల' అది అని. రామానుజీయం శ్లోకపాఠాన్ని నిర్దేశించింది. ఈ సందర్భంలో తీర్థీయవ్యాఖ్య చూపిన ఒక వ్యాఖ్యావిశేషాన్ని మనం గమనింపవలసి ఉంది.

వాలికి గల బాణవిమోచనసామర్థ్యాన్ని వివరిస్తూ సుగ్రీవుడు అన్నమాటల్లో 67వ శ్లోకంలో

**ఇమే చ విపులా స్సాలాః సప్త శాఖావలంబినః ।**
**యత్రైకం ఘటతే వాలీ నిష్పత్రయితుమోజసా ॥**

'నిష్పత్రయితుం' అనే ప్రయోగాన్ని గోవిందరాజు 'నిర్గతశరపత్రం కర్తుమ్' అని అర్థాన్ని నిర్దేశించి ఊరుకొన్నాడు. దీన్ని తీర్థీయవ్యాఖ్య మరింత విస్పష్టంగా విశదపరచింది. ఏడు మద్దిచెట్లలోనూ, ఒక్కొక్కమద్దిచెట్టు లోనికి బాణం దూసుకొని వెళ్ళి, బాణానికి గల పత్రాలు అంటే రెక్కలు (బాణం చివర బాణం సమతూకంగా గాలిలో ప్రయాణించడానికి ఏర్పరచిన రెక్కలు) బాణంతోపాటుగా చెట్టులో ఏర్పడిన రంధ్రంలో దూరి వెలుపలికి వచ్చేలా (నిర్గతపత్రం యథా స్యాత్ తథా కర్తుం) చేయగల సమర్థంతు వా అని తీర్థీయం వివరించింది. చాలామంది అనువాదకర్తలు ఈ వ్యాఖ్యాతత్త్వాన్ని గుర్తించినట్లు కనిపించదు. కొందరైతే చెట్టు ఆకులు పూర్తిగా రాలిపోయేలా బాణాలను వేశాడని అనువదించారు. ఈ సందర్భంలో తీర్థీయవివరణం విశేషంగా గమనింపదగి ఉంది. ఇదే సందర్భంలో 70 వ శ్లోకంలోని అసకృద్వివ్యాథ అనే అంశాన్ని వివరించడంలో తీర్థీయవ్యాఖ్య చాలా విస్పష్టంగా ఉంది. ఇక్కడ గోవిందరాజీయవ్యాఖ్యలో మాటిమాటికీ ఇలా వేధనం చేశాడు వాలి అనే భావం మాత్రమే వస్తున్నది. తీర్థీయవ్యాఖ్య ఇలా అంటున్నది– ఒకసాలవృక్షంలో ముందు బాణంతో ఒకరంధ్రం చేసి, అక్కడ నాటిన బాణాన్ని వెలికితీసి, అదే రంధ్రంలో మరొకబాణం, ఇలా ఒకే రంధ్రంలో అనేకబాణాలను కొట్టేవాడని తాత్పర్యం అని. ఇలా సందిగ్ధవిషయాలను విస్పష్టపరచడం తీర్థీయవ్యాఖ్యకు గల విశిష్టత అనవచ్చు. ఇక్కడ గోవిందరాజీయం ధనుస్సు లేకుండానే కేవలబాణంతో వాలి, ఒక సాలాన్ని కొట్టగల సమర్థుడని వ్యాఖ్యానించింది. ఈ సర్గను అధ్యయనం చేయడం లేదా శ్రవణం చేయడంవల్ల కలిగే ఫలం ఏమిటో తీర్థీయవ్యాఖ్య ఇలా నిర్దేశించింది. స్కాందోక్తరీత్యా –

**విద్యాబలం దైవబలం జ్ఞానబంధుబలం తథా ।**
**సేనాబలం భవేత్తస్య వాలినో బలకీర్తనాత్ ॥**

ఎవ్వడు వాలిబలాన్ని కీర్తిస్తాడో వానికి విద్యాబలం, దైవబలం, జ్ఞానబలం, బంధుబలం, సేనాబలం ఏర్పడుతుందని తాత్పర్యం. పంద్రెండవ సర్గ వాలి నిమిత్తంగా శ్రీరామసుగ్రీవాదిప్రస్థానాన్ని చెబుతున్నది. ఈ సర్గలోనే ఆరంభంలో శ్రీరామబలసందర్శనం కూడా వర్ణింపబడింది. ఇక్కడ 'స విసృష్టో బలవతా' అనే రెండవ శ్లోకంలో రామవినిర్ముక్తమైన బాణం సప్తసాలభేదనం చేసి పర్వతాన్ని ఛేదించి భూమిని ప్రవేశించిందనే వాల్మీకి చెప్పిన అభిప్రాయాన్నే పురాణం అనువదించిందని తీర్థీయవ్యాఖ్య స్కాందవచన పురస్సరంగా –

**సప్తభూమీః సప్తగిరీన్ సప్తసాలాన్ మహాబలాన్ ।**
**స బాణో వేగసంపన్నో భిత్త్వా తూణీరమావిశత్ ॥**

ఇత్యాదిగా సూచించింది. అయితే గోవిందరాజీయవ్యాఖ్య పూర్వాచార్యవచనాన్ని శ్రీవత్సచిహ్నమిశ్రుల అతిమానుషస్తవంలోని శ్లోకం–

సాలాంశ్చ సప్త సగిరీన్ సరసాతలాన్ ఇత్యాదిగా నిర్దేశించింది. ఇది దీని అభిప్రాయం.

**సాలాన్ హి సప్తసగిరీన్ సరసాతలాన్ యాన్**
**ఏకేషు మందజవతో నిరపత్త్రయస్త్వమ్ ।**
**తేష్వేక వివ్యథన భిన్న కపి ప్రణున్నం**
**శాఖామృగం మృగయసే స్మ కథం సహాయమ్ ॥**

ఏడు మద్దిచెట్లను, కొండలను, భూమితోను కలిపి ఏకబాణప్రయత్నం చేతనే కొట్టి పత్త్రరహితం చేయ గల్గినావు. కేవలం చెట్లను మాత్రమే కొట్టగల వాలిచే నలగకొట్టబడిన సుగ్రీవుని సహాయంగా వెతికావే! ఇదేమి విడ్డూరం స్వామీ! అంటారు శ్రీవత్సాంకమిశ్రులు దీన్ని ఇక్కడ వ్యాఖ్యాత పరామృశించాడు. ఈసందర్భంగా శ్రీరామచంద్రుని అతిమానుషప్రభావాతిశయాన్ని దర్శించి ఆశ్చర్యపడిన సుగ్రీవుడు ప్రహ్వాభావంతో చేసిన ప్రణామం భగవద్విషయంలో చేయవలసిన ప్రణామప్రకారాన్ని లోకానికి తెలియపరుస్తున్నదంటాడు గోవిందరాజు. ఇక్కడ 'ప్రలంబీకృతభూషణః' అనే విశేషణం ఉదరం భూమికి తగలకుండా ప్రణామం చేయాలని సూచిస్తున్నదని వివరించాడు.

ఇక్కడ గోవిందరాజు రామవినిర్ముక్తమైన బాణం సప్తసాలభేదనం చేసి తిరిగివచ్చి తూణీరం ప్రవేశించడం అచేతనమైన బాణానికి ఎలా సాధ్యం? అన్న శంకను నిరాకరిస్తూ ఇది మంత్రప్రభావసాధ్యమని సూచించాడు. తీర్థీయవ్యాఖ్య ఈశంకనుగాని సమాధానంగాని సూచించలేదు. ఈ సందర్భంగా రామబాణం భూమిప్రవేశం చేసిన వైనాన్ని సుగ్రీవుడు చూడలేకపోయినా వాల్మీకి తాను ధర్మవీర్యంచేత దర్శించగలిగాడని వ్యాఖ్యాత పేర్కొన్నాడు. రామప్రేరితుడైన సుగ్రీవుడు వాలిని ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించినప్పుడు కిష్కింధనుండి వాలినిర్గమనం అస్తాద్రినుండి సూర్యుడు ఉదయించినట్లున్నదని వాల్మీకి వర్ణించాడు. 'నిశ్చక్రామ సుసంరబ్ధో భాస్కరోస్త తటాదివ' ఇక్కడ సూర్యుడు అస్తతటం నుంచి నిర్గమనాన్ని పొంది క్రమంగా కనిపించకుండా పోయినట్లు, వాలి కిష్కింధనుండి బయల్వెడలడం క్రమంగా ఆతని వినాశనం కానున్నదని సూచిస్తున్నదని వ్యాఖ్యానించాడు గోవిందరాజు. తీర్థీయవ్యాఖ్య

ఈ పోలికలోని ఆంతర్యాన్ని గుర్తించినట్లు కనిపించదు. మేరువుకు ఉత్తరదిక్కున వారినుద్దేశించి ఇలా చెప్పబడిందని అంటూ, అక్కడివారికి మేరువుకు ఉత్తరదిక్కున ఉన్నవారికి అస్తగిరియే ఉదయగిరి అని వ్యాఖ్యానించింది. వాస్తవానికి అస్తగిరినుండి సూర్యుడు నిష్క్రమించడం 'నిశ్చక్రామ సుసంరబ్ధో భాస్కరోఽస్తతటాదివ' అంటే అస్తాద్రివెనుకకు కనిపించకుండా వెళ్ళడమే. ఇది మేరువుకు దక్షిణాన వున్నవారు, మేరువునుండి సూర్యుడు నిష్క్రమించడమేకదా అస్తమయంగా దర్శిస్తున్నది. ఇలాగే కిష్కింధనుండి వాలి నిష్క్రమించడం అంటే ఉదయించడము కాదు అస్తమించడమే. ఇక అక్కడనుండి మనకు అగుపించనివిధంగా నశించనున్నాడనే అభిప్రాయం. దాన్ని సూచించడమే వాల్మీకి తాత్పర్యమని గోవిందరాజవ్యాఖ్యాతాత్పర్యమే ఇక్కడ సందర్భసముచితంగా తోస్తున్నది. ఈ సందర్భంలో గోవిందరాజు ఉద్ధరించిన రామానుజీయటీకావివరణం కూడా ఈసందర్భంలో ఆర్యభటాద్యుక్తిసమన్వయపురస్సరంగా సాగింది. దీన్ని పాఠకులు అనుశీలనం చేయాలి.

ఈసందర్భంగా రామానుజీయ వ్యాఖ్యాత ఇలా పేర్కొన్నాడు – మనదేశంలో ఉన్న ఉదయగిరి ఇతర ప్రదేశదృష్టిలో అస్తగిరి అవుతుంది అన్న అభిప్రాయానికి తాత్పర్యం సిద్ధపురవాసులకు అస్తాద్రి అని ఈ అభిప్రాయమే – 'ఉదయో యో లంకాయాం సోఽస్తమయస్సవితురేవ సిద్ధపురే' అన్న ఆర్యభటోక్తి విస్పష్టపరుస్తున్నది అని.

ఈ ప్రఘట్టకంలో వాల్మీకి చాలా అందమైన ఉపమాలను దర్శింపజేశాడు. అశ్వినీదేవతల్లా సహజంగా కలిసివుండవలసిన వాలిసుగ్రీవులు, బుధాంగారకుల్లా కొట్టుకోవడం దైవవిలసితమేనని వాల్మీకి ఈ రెండు ఉపమాలద్వారా సూచిస్తున్నాడు. ఈ పోలికల్లోని ఆంతర్యాన్ని ఏవ్యాఖ్యాత వివరించకపోవడం గమనింపదగి ఉంది. వాలిసుగ్రీవులకు జరిగిన ద్వంద్వయుద్ధాల్లో మొదటిసారి వాలిని రాముడు తాను పూర్వం సుగ్రీవునికి వాగ్దానం చేసినవిధంగా ఎందుకు సంహరించలేదు? అనే ఆక్షేపానికి, రాముడు స్వయంగానే, యుద్ధం చేస్తున్నప్పుడు వాలిసుగ్రీవుల ఆకారాలు ఒకేవిధంగా ఉండటంవల్ల తాను గుర్తింపలేక బాణవిమోచనం చేయలేదని చెప్పిన ప్రతిసమాధానం ఎంతవరకు సమంజసంగా ఉన్నది? అని శంకించి వ్యాఖ్యాతలు తమకు తోచిన సమాధానాలు చెప్పారు. ఇక్కడ తీర్థీయవ్యాఖ్య శంకోత్థాపన సమాధానాలేవీ చేయలేదు. గోవిందరాజీయం, రాముని సమాధానం ఎంతవరకు సమంజసం అనే శంకను ఆక్షేపరూపంగా చేసి, ఆకారాలు సమానంగా ఉన్నా కాంచనమాలను వాలి ధరించి ఉన్నాడు కనుక, భేదాన్ని గుర్తించవచ్చనే ఆక్షేపానికి సమాధానంగా – మొదటిసారి యుద్ధానికి వచ్చినప్పుడు వాలి కాంచనమాలను ధరించలేదని చెప్పి, అయినప్పటికీ, మదించి ఉండటం, భోగచిహ్నాలను ధరించి ఉండటం, అశాంతుడై ఉండి కిష్కింధనుండి వెలుపలికి రావడం మొదలైన అసాధారణస్వభావాలనుబట్టి ఇరువురికీ భేదం స్పష్టమే కదా అని, అంతేకాక, రాముడు తనకు సంశయం కలిగినప్పుడు సమీపస్థులైన హనుమదాదులను ప్రశ్నించవచ్చుగదా అని అంతేకాక, సహజంగా 'ప్రేక్షితజ్ఞాస్తు కోసలా' అన్నట్లు రాముడు సూక్ష్మజ్ఞుడు కనుక వాలిసుగ్రీవభేదాన్ని గుర్తించలేదా అనే ఆక్షేపాన్ని నిరూపించినంతగా సాభినివేశంగా సమాధానించలేదు. ప్రతిసమాధానాన్ని గోవిందరాజు చాలా సామాన్యంగానే చెప్పాడు. అదేమిటంటే 'రాముడు కేవలం కొన్ని కంటికి కనిపించే హేతువులనే చెప్పాడు' అని.

ఈ సమాధానం అంతగా వివేచకులకు రుచించదనేది సత్యం. ఇక్కడ వ్యాఖ్యాత మరికొంతస్పష్టత కనపరిస్తే బావుండేదని విమర్శకుల భావన.

తీర్థీయవ్యాఖ్య ఈవిషయంలో ఎలాంటి చర్చ చేయలేదు.

రామాయణంలో వాల్మీకి ఆ యా సందర్భాల్లో వాడే ఉపమానాలు పరమశాస్త్రీయంగా కేవలం వ్యాఖ్యాన మాత్రగమ్యాలుగా ఉంటాయి. ఈ ఉపమానిర్వహణ ప్రక్రియపట్ల వ్యాఖ్యాతలు కొన్నిచోట్ల ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. ఇదే సందర్భాల్లో క్లిష్టాలైన పదాల అర్థాలను విశదపరచడంలో కూడా వారు విశేషప్రయత్నం చేశారు. విశేషంగా 13,14 సర్గల్లో వాలిసుగ్రీవులయుద్ధం బుధాంగారకఘర్షణంలా ఉన్నదని 13వ సర్గలో వాల్మీకి వేసిన ఉపమానాన్ని వ్యాఖ్యాతలు వివరించకపోయినా, జ్యోతిశ్శాస్త్రసంబంధమైన మరొక పోలికను వాల్మీకి 14వ సర్గలో వాడాడు. రెండవసారి వాలితో యుద్ధానికి తలపడిన సుగ్రీవుని గుర్తించడంకోసం, రాముడు లక్ష్మణుద్వారా గజపుష్పమాలను ఆతని కంఠాన అలంకరింపజేశాడు. ఇలా కంఠమాలతోకూడిన సుగ్రీవుడు ఎలా ఉన్నాడో వర్ణిస్తూ వాల్మీకి –

**శోభస్యేహ్యధికం వీరు లతయా కంఠసక్తయా ।**
**విపరీత ఇవాకాశే సూర్యో నక్షత్రమాలయా ॥**

అని ఒక విలక్షణమైన ఉపమానాన్ని నిర్దేశించాడు. ఇక్కడ ఉత్తరార్ధంలోని 'విపరీత' శబ్దాన్ని ప్రథమాంతంగా అన్వయించాలా? లేక విపరీత ఇవ అని సప్తమ్యంతంగా అన్వయించాలా? అనే శంక ఇక్కడ కలుగుతుంది. ఇక్కడ తీర్థీయవ్యాఖ్య రెండురకాల సమన్వయాన్ని దర్శింపజేసింది.

ప్రథమాంతంగా విపరీత శబ్దాన్ని తీసుకొన్నప్పుడు అది 'సూర్య' శబ్దానికి విశేషణం. సూర్యశబ్దం సూర్యునిగా ప్రసిద్ధిచెందిన జ్యోతీరూపాన్నికాక చంద్రుని బోధిస్తున్నదని వ్యాఖ్యాత పేర్కొన్నాడు. సూర్యశబ్దం చంద్రుణ్ణి ఎలా బోధిస్తుంది? అన్న శంకను సమాధానిస్తూ, 'సూర్యో నక్షత్రమాలయా' అని సూర్యుని నక్షత్రపరివేష్టితునిగా చెప్పడం వల్ల, ఇది చంద్రుని విషయంలోనే సార్థకం కనుక సూర్యశబ్దం చంద్రవాచకమేనని ఒక సమన్వయం. మరొక సమన్వయాన్నిబట్టి సూర్యశబ్దం ప్రసిద్ధసూర్యవాచకమే. అయితే సూర్యునికి నక్షత్రపరివేష్టితత్వం ఎలాగ? అన్న శంకను సమాధానిస్తూ, ఇది అభూతోపమ అని వివరించాడు వ్యాఖ్యాత. వాస్తవానికి సూర్యుడు నక్షత్రపరివేష్టితుడై ఆకాశంలో ప్రకాశించడం సాధ్యం కాకపోయినా, ఇలా అసాధ్యమైన ఉపమానాన్ని వేయడం ద్వారా ఒకవేళ అలా సాధ్యమైతే ఎలా ఉంటుందో ఆ దశలో సూర్యుడు ఎలా ప్రకాశిస్తాడో సుగ్రీవుడు అలా ప్రకాశించాడని అభూతోపమ ఇక్కడ నిర్వహింపబడింది. ఇక మూడవ రకమైన సమన్వయం విపరీతశబ్దాన్ని సప్తమ్యంతంగా అన్వయించడం. విపరీతశబ్దం 'విపరీతం తు శర్వరీ' అనే శాస్త్రకారవచనాన్నిబట్టి పూర్ణిమారాత్రి అని అర్థం. పూర్ణిమారాత్రి ప్రకాశించే చంద్రునికే సూర్యుడనిపేరు అని వ్యాఖ్యాత సప్రమాణంగా పేర్కొన్నాడు. ఈ సందర్భంగా తీర్థీయవ్యాఖ్య ఈ క్రింది ప్రమాణవచనాన్ని ఉట్టంకించింది.

**పరీతం తు దివా ప్రోక్తం విపరీతం తు శర్వరీ ।**
**పౌర్ణమాసే గతశ్చంద్రః సూర్య ఇత్యభిధీయతే ॥ అని.**

ఈ శ్లోకంలో 'పౌర్ణమాసే గతశ్చంద్రః' అనే చోట గల 'పౌర్ణమాసే గతః' అనే పదాన్ని రాకామధ్యగతః అని గోవిందరాజు పరివర్తనం చేసిన పాఠాన్ని స్వీకరించి ఇదే అభిప్రాయాన్ని యథాతథంగా స్వీకరించాడు. అయితే ఉపపత్తిని చూపిన వైనం కొంతవేరుగా ఉంది. కేవలం పై శ్లోకాన్ని ఉట్టంకించి పౌర్ణమాసే గతచంద్రుడు సూర్యశబ్దవాచ్యుడని మాత్రమే తీర్థీయవ్యాఖ్య పేర్కొనగా ఇక్కడ అలా చంద్రుని సూర్యునిగా పేర్కొనడంలో గల యుక్తిని గోవిందరాజీయవ్యాఖ్య ఇలా పేర్కొన్నది. 'నవో నవో భవతి' అనే శ్రుతివచనంలో 'అహ్నాం కేతుః' అని చెప్పబడిన సూర్యుడు చంద్రునికి ఆప్యాయనం కలిగించేవాడు కనుక అంటే తన కిరణాలద్వారా అమృతాన్ని చంద్రునిచేరేలా చేసి చంద్రునికి పూర్తిని కలిగించేవాడు కనుక, చంద్రుడుకూడా సూర్యునిచేత చెప్పబడుతున్నాడని యుక్తిని పేర్కొన్నాడు.

ఇక్కడ విపరీత శబ్దానికి విశేషంగా పరీతమైన కాలం అంటే ప్రలయకాలం అని ఈ దశలో మధ్యాహ్న సమయంలోనే నక్షత్రాలు విస్పష్టంగా గోచరిస్తాయి కనుక ఇలా గోచరించే నక్షత్రాలతోకూడిన ప్రలయకాలీన సూర్యునిలా సుగ్రీవుడు ఉన్నాడనే అభిప్రాయాన్ని విశేషంగా పేర్కొన్నాడు వ్యాఖ్యాత. అంతేకాక, రాత్రిసమయం ఇంద్రధనుస్సు కనిపించడం, పగటిసమయంలో నక్షత్రాలు కనిపించడం రాజ్యాధిపతి వినాశనానికి నిదర్శనమన్న గర్గవచనాన్ని

**రాత్రా వింద్రధనుర్దర్శే దివా నక్షత్రదర్శనే ।**
**తద్రాష్ట్రనాథనాశః స్యాదితి గర్గస్య భాషితమ్ ॥**

ఇత్యాదిగా ఉదాహరించి, సుగ్రీవుడు ప్రలయకాలనక్షత్రపరివేష్టితుడైన సూర్యునిలా ఉన్నాడనే పోలికద్వారా భవిష్యత్కాలంలో జరుగునున్న వాలివధకు సూచకంగా సుగ్రీవుడు వనమాలతో జ్వలిస్తూ ప్రకాశిస్తున్నాడని చెప్పబడుతున్నదని వ్యాఖ్యాతచేసిన వివరణం చాలా విశేషంగా గమనింపదగి ఉన్నది. ఇక్కడ గోవిందరాజు తాను వ్రాసిన విశేషాలన్నీ స్వాచార్యముఖంగా విన్నట్లు విస్పష్టపరచాడు. ఇత్యస్మదాచార్యోక్తం– ఇక్కడ రామానుజీయవ్యాఖ్య విష్ణుపురాణంలోని

**క్షీణం సోమసురైః పేతమాప్యాయయతి దీప్తిమాన్ ।**
**మైత్రేయైకకలం సన్తం రశ్మినైకేన భాస్కరః ॥**

దేవతలచే త్రాగబడి ఏకకలావశిష్టుడైన చంద్రుని దీప్తిమంతుడైన భాస్కరుడు తన కిరణాలచే ఆప్యాయితుణ్ణి చేస్తాడని దీని భావం. ఈ అభిప్రాయాన్ని రామానుజీయం నిర్దేశించింది.

15 వ సర్గలో వాలి యుద్ధోద్యతుడై రావడాన్ని నివారిస్తూ తార పలికిన సాంత్వనవచనాలు ప్రధానంగా వర్ణింపబడ్డాయి. ఈ సర్గలో తారపలికిన మాటలలో శ్రీరామతత్త్వాన్ని నిరూపించిన శ్లోకాలు 'నివాసవృక్ష స్సాధూనామ్'

ఇత్యాదులు శ్రీవైష్ణవసంప్రదాయంలో విశేషానుసంధేయాలు. కనుక గోవిందరాజవ్యాఖ్యానాల్లో చాలా విశేషాలు వర్ణింపబడ్డాయి. తీర్థీయవ్యాఖ్య పూర్తిగా ఈ శ్లోకాలవ్యాఖ్యానాన్నే విడచిపెట్టడం విడ్డూరంగానే వుంది.

'నివాసవృక్షః' ఇత్యాదిశ్లోకాల్లో గోవిందరాజీయవ్యాఖ్యానవిశేషాలు సంగ్రహంగా పర్యాలోచించుదాం. 'నివాసవృక్షః' అనేది అభేదాధ్యవసాగర్భితప్రయోగం. సర్వథా సాదృశ్యం ఇక్కడ చెప్పబడుతున్నదని వ్యాఖ్యాతృ భావన. 'నివాసవృక్షః' అనే సమాసంలో 'నివాస' పదంవల్ల ఎప్పుడో ఒకప్పుడు నీడనిచ్చే సాధారణవృక్షాలు ఉపమానకోటినుండి వ్యావర్తింపబడుతున్నాయి.

**వాసుదేవతరుచ్ఛాయా నాతిశీతా న ఘర్మదా ।**
**నరకాంగార శమనీ సా కిమర్థం న సేవ్యతే ॥**

అన్న పూర్వోక్తవచనం స్మరింపవలసిఉంది. 'సాధూనాం' అనడంవల్ల సుగ్రీవునికి ద్రోహంచేసినందువల్ల తమలో సాధుత్వం లేశమాత్రమైనాలేదని సూచింపబడింది. ఆపన్నానాం పరాయణం అనడంచేత 'యోగక్షేమం వహామ్యహమ్' అని స్వామి గీతలో చెప్పినట్లు ఆపన్నులై ఆశ్రయించినవారి సర్వయోగక్షేమాలూ తానే చూస్తూ ఉపాయదశనుండి (ఉపాయంగా స్వామిని ఆశ్రయించినది మొదలు) ఫలపర్యన్తం (ఫలాన్ని ఇచ్చేవరకు) సర్వ కార్యాల్లోనూ స్వామి వెంటనంటియే ఉంటాడని సూచింపబడింది. విశేషించి ఆర్తులకు ఆశ్రయమైనవాడు స్వామి. ఆశ్రయించినవారిలోకూడా ఆర్తులైనవారికి సరియైన ఆశ్రయం లభించినప్పుడే సర్వకార్యసిద్ధి అని కూడా సూచింపబడింది. "యశశ్చైకభాజనమ్" అనడంచేత ఇలాంటి ఆశ్రయం రక్షకము లోకంలో మరొక్కటి లేదని సూచింపబడుతున్నది.

ఇక్కడ తార పలికిన పలుకుల్లో నాల్గురకాలైన ఆశ్రయయోగ్యాలు గీతలో చెప్పబడిన ఆర్త – జిజ్ఞాసు– అర్థార్థి–జ్ఞానులు చెప్పబడుతున్నారు. పై శ్లోకంలోని సాధూనామ్, ఆపన్నానామ్, ఆర్తానామ్, యశసః అనే నాల్గు పదాలు క్రమంగా జిజ్ఞాసువులైన కైవల్యకాములు, అపూర్వైశ్వర్యకాములు (అర్థకాములు) భ్రష్టైశ్వర్యకాములు (ఆర్తులు) జ్ఞానులు జ్ఞానీత్వాత్మైవ మే మతం అని చెప్పబడిన కీర్తికి భాజనులై దుర్లభులైన జ్ఞానులు చెప్పబడుతున్నారు. లేదా మరొకరకంగా చెప్పవచ్చు. సాధువులనగా ఉపాసకులు, ఆపన్నులంటే 'సకృదేవ ప్రపన్నాయ' అన్నట్లు కొంత మాత్రమే ప్రపన్నులైనవారు వీరే దృప్తప్రపన్నులు. ఆర్తులంటే ఆర్తప్రపన్నులైనవారు. వీరందరికీ రక్షకుడవటంవల్ల ఆశ్రితఫలప్రదాత అయిన స్వామి, దీనికి ఉపకరించే జ్ఞానం పుష్కలంగా కలవాడని 'జ్ఞానవిజ్ఞానసంపన్నః' ఇత్యాది శ్లోకంచేత చెప్పబడింది. జ్ఞానం అంటే లౌకికజ్ఞానం, విజ్ఞానం అంటే శాస్త్రజన్యజ్ఞానం. వీటితోకూడినవాడు. ఇక్కడనే వ్యాఖ్యాత జ్ఞానశబ్దం ధర్మభూతజ్ఞానాన్ని, విజ్ఞానశబ్దం స్వరూపభూతజ్ఞానాన్ని చెబుతున్నదని వ్యాఖ్యానించాడు. 'నిదేశే నిరతః పితుః' అనే అంశంచేత పితృవచనపరిపాలకత్వధర్మం చేత ఉపలక్షితమైన సౌలభ్యం సూచింపబడు తున్నది. 'గుణానామాకరః' అన్నమాటచేత సకలకల్యాణగుణాస్పదుడు స్వామి అని చెప్పబడింది. ఆకరః అనే శబ్దంచేత గుణాలకంటే వేగంగానే గుణి ఉన్నట్లు స్పష్టపరుపబడింది. మహాన్ అనే విశేషణంచేత గుణాలకంటే ఉత్కృష్టమైనది గుణితత్త్వమని సూచింపబడింది. దోషానామివ శైలేంద్రః అనేచోట బహుత్వం చేత జ్ఞానశక్తి బలైశ్వర్యాది గుణబాహుల్యం పరమాత్మ అయిన రామునికున్నదని సూచింపబడింది.

కొన్నిచోటులలో గోవిందరాజీయవ్యాఖ్య అతిసామాన్యమైన విషయాలనుకూడా పౌర్వాపర్యవచనవిరోధాన్ని పరిహరించే దృష్టితో ప్రస్తావించి విచారించింది. వీటిలో 16 వ సర్గలో రాముడు వాలిహననానికై ఒకే ఒకబాణాన్ని ప్రయోగించినాడా లేక అనేకబాణాలు ప్రయోగించినాడా? అని. ఇక్కడ వ్యాఖ్యాత బాణప్రయోగసూచకాలైన పలు శ్లోకశబ్దప్రయోగాలను సమన్వయించి ఒకే బాణాన్ని విడచి వాలిని గ్రహణం చేసినట్లు నిష్కర్షించాడు. ఈ క్రింది చర్చను గమనిస్తే ఈ విషయం స్పష్టపడుతుంది.

ఇక్కడ వ్యాఖ్యానం –

**నరోత్తమః కాలయుగాన్తకోపమం**
**శరోత్తమం కాంచనరూప్యభూషితమ్ ॥**

ఇత్యాది శ్లోకంలో చర్చ ఇలా సాగింది. మరి, ఇక్కడ శరోత్తమం అని ఏకవచనప్రయోగంచేత ఒకేబాణం చేత వాలి చంపబడ్డాడని తెలుస్తున్నది. ఇది, ఉత్తరత్ర 'రామేణ ప్రహితై రౌద్రైర్మార్గణైర్దూరపాతిభిః' అనే తార పలికిన మాటకు విరుద్ధంగా ఉందికదా! అక్కడ మార్గణైః అని బహుబాణహతత్వమే స్పష్టం కదా! అంటే, ఇదిసరికాదు. తార పలికిన మాటలు వ్యాకులచిత్తతతో పలికినవే కాని స్వస్థచిత్తతతో కాదుకదా! ఎందువల్లనంటే తార, వాలి ఒకేబాణంచేత చంపబడ్డాడని వినికూడా పైవిధంగా అన్నది. వాల్మీకి ముందు ముందు అంటున్నాడు కూడా –

**తం భార్యా బాణమోక్షేణ రామదత్తేన సంయుగే ।**
**హతం ప్లవగశార్దూలం తారా శుశ్రావ వాలినమ్ ॥**

యుద్ధంలో రామప్రయుక్తమైన బాణంచేత వాలి చంపబడినాడని అతని భార్య తార విన్నది. అని. సర్గారంభంలోకూడా 'నిజఘాన చ తత్రైనం శరేణైకేన రాఘవ' ఒకే బాణంచే వాలిని రాముడు సంహరించాడని అన్నాడు వాల్మీకి. ఇక్కడ ఏకేన అని ఏకత్వమే చెప్పబడుతున్నది కదా! ఇక, చెట్లచాటున ఉండి చంపడం ఎందుకు? అంటే చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు కనుక, ప్రతిజ్ఞానిర్వహణం కొరకు వంచనతోనైనా చంపితీరవలసిందే. 'ప్రతిజ్ఞాతశ్చ రామేణ తథా వాలి వధం ప్రతి' అని కదా ప్రతిజ్ఞావాచకం.

గోవిందరాజీయవ్యాఖ్యలో ఇంతకంటే విశేషాలేమీ వ్రాయబడలేదు.

తీర్థీయవ్యాఖ్య 16 వ సర్గ కథాఫలాన్ని ఈ క్రిందివిధంగా నిర్దేశించింది.

**గిరీణాం భేదనం చైవ కిష్కింధా గమనం తథా ।**
**వాలిసుగ్రీవయోర్యుద్ధం శ్రుత్వా విజయపూర్వకమ్ ॥**
**యుద్ధే విజయమాప్నోతి వాలినో విజయం యథా । అని.**

ఇది వీటిభావం – కొండలను రాముడు భేదించడం, కిష్కింధకు సుగ్రీవునితో వెళ్ళడం, అక్కడ వాలి సుగ్రీవులకు యుద్ధం జరగడం, సుగ్రీవునికి జయం కలగడం, ఇవన్నీ విన్నవారికి, వాలిని జయించినట్లుగా శత్రు విజయం కలుగుతుంది. అని ఈ శ్లోకాలు స్కాందంలోనివి. చివరిపాదంలో వాలినో విజయం యథా అనే చోట కర్మార్థంలో షష్ఠి. వాలిని జయించడమే తప్ప వాలికర్తృకమైన జయం కాదని గ్రహించాలి.

సప్తదశసర్గ వాలి చేసిన రామనిందను ప్రతిపాదిస్తున్నది. ఈ సర్గలో తీర్థీయవ్యాఖ్య, 'తం దృష్ట్వా రాఘవం వాలీ' అని ఆరంభించి, సర్గసమాప్తి పర్యంతం తాత్త్వికమైన అర్థాన్ని విశదపరచింది. ఈ సందర్భంలో గోవిందరాజీయ వ్యాఖ్య కేవలం టుప్‌టీకలా సాగింది. తీర్థీయవ్యాఖ్య చాలా విస్తృతంగా వ్యాఖ్యానించింది. ఇంచుమించుగా వాలి రాముని నిందించిన శ్లోకాల్లో స్తుతిపరంగానే వస్తుతత్త్వాన్ని ఆవిష్కరించింది.

**తదస్త్రం తస్య వీరస్య స్వర్గమార్గప్రభావనం ।**
**రామబాణాసనక్షిప్తమావహత్ పరమాం గతిమ్ ॥**

అన్న శ్లోకంలో పరమాం గతిమ్ అన్న పదాన్ని గోవిందరాజీయం వివరించవలసివుంది. పరమగతి అంటే మోక్షమా? లేక కేవలస్వర్గమానమా? అనే సందేహం ఇక్కడ కలగడం సహజం. ఇతరేతరవిధంగా మరణం సంభవిస్తే అది స్వర్గకారణం కావచ్చు కాని, సాక్షాత్ రామునిచేత ఏర్పడిన మరణం పరమపదహేతువే కావాలి కదా! 'పరమాం గతిమ్' అని చాలా విస్పష్టంగా వాల్మీకియే చెబుతున్నప్పుడు వ్యాఖ్యాతలు వ్యాఖ్యానింపక విడవడం అంత సముచితంగా గోచరింపదు. రామానుజీయంగాని, తనిశ్లోకిగాని ఎలాటి వివరణ చేయకపోవడం గమనార్హం. అయితే తీర్థీయవ్యాఖ్య ఉద్ధరించిన టీక – 'వాలినో ముక్తిరభూదిత్యర్థః' అని వ్యాఖ్యానించి కొంతన్యాయం చేసిందని చెప్పకతప్పదు.

ఇక, మిగిలిన శ్లోకాల వ్యాఖ్యావిషయంలో తీర్థీయం తప్ప మిగిలినవన్నీ గచ్ఛద్వ్యాఖ్యలే. ఇక్కడ వాలి మాటలు ఈ వ్యాఖ్యాతలకు కేవలం సామాన్యుడైన ఒక ఆర్తుని (శరపీడితుని) ఆక్రోశంలానే అగుపించాయి తప్ప వేరుకాదు. ఇక్కడమాత్రం తీర్థీయవ్యాఖ్య తన 'తత్త్వదీపిక' అనే పేరును అన్వర్థం చేసుకొన్నది. ఇక్కడ ఈ వ్యాఖ్యావిశేషాలను కొంత సాకల్యంగా గమనింపవలసివుంది. ఇక్కడ మరొక విషయం గమనించాలి. ముందు సాధారణంగానే తీర్థీయం ఆపాతతః గోచరించే పదార్థాన్నే ప్రతిపాదించింది. దీన్నే వ్యాఖ్యాతలు అనుసరించారు. ఇక తాత్త్వికార్థం ఇలా సాగింది.

46 వ శ్లోకంలో 'త్వయా అదృశ్యేన' అనే చోట రాముడు చెట్టుచాటున ఉండి చంపడంలోని ఆంతర్యాన్ని తీర్థీయవ్యాఖ్య ఇలా వివరించింది.

రాముడు చెట్టుచాటున ఉండి ఎందుకు చంపాడు?

మరి, వాలిసుగ్రీవులు యుద్ధం చేస్తున్నప్పుడు, రాముడు అదృశ్యుడై వాలినెలా చంపాడు?అని శంక. ఇది సమాధానం. నిజమే. ఇక్కడ రాముడు వాలితో ప్రత్యక్షయుద్ధం చేయడం కుదరదని పురాణవచనం.

**ఆహూయ వాలినం బ్రహ్మా దదౌ వరమనుత్తమమ్ ।**
**ప్రతీపవర్తిభూయాద్బలమర్ధమరిందమ ॥**

బ్రహ్మ వాలిని ఆహ్వానించి ప్రశస్తమైన వరాన్నిచ్చాడు. ఏమని? ఎవడు వాలికి ఎదురుపడి యుద్ధం చేస్తాడో వానిలోని సగంబలం వాలికి సంక్రమిస్తుంది అని. ఈ కారణంగానే రాముడు ప్రత్యక్షయుద్ధం చేయలేదు అని.

అయితే ఇక్కడ ప్రమాణంగా తీర్థీయవ్యాఖ్య ఇచ్చిన వచనం ఎక్కడిదో ఆకరం చెప్పబడలేదు. ఇక్కడనే మరొక విశేషం. వాలి మాటాడిన మాటల్లో, ఒక శ్లోకంలో ఇలా అన్నాడు –

**న్యస్తాం సాగరతోయే వా పాతాలే వాపి మైథిలీమ్ ।**
**ఆనయేయం తవాదేశాత్ శ్వేతామశ్వతరీమివ ॥ అని.**

మరి, వెనుక చెప్పినట్లు వాలికి సీతను తీసుకొనిరాగల సామర్థ్యం ఉన్నదని తెలిసికూడా, రాముడు వాలితో సఖ్యం ఎందుకు చేయలేదు? అని శంకించి, దానికి వ్యాఖ్యాత ఇలా సమాధానం చెప్పాడు. ఏమంటే వాలిని సంహరిస్తానని సుగ్రీవునికి ప్రతిజ్ఞచేశాడు కనుక ఇతరకారణం కూడా ఉన్నది కనుక అని, ఆ కారణం ఏమిటి? అన్న శంకకు స్కాందవచననిదర్శనపురస్సరంగా వ్యాఖ్యాత ఇలా చెప్పాడు –

**అభయం వాలినే దత్తే ప్రతిజ్ఞా పరిహీయతే ।**
**రావణస్య సఖా వాలీ రావణోఽపి వ్రజేత్తు మామ్ ॥**
**రావణస్య వధాభావాత్ అవతారఫలం న హి ॥**

అని రాముడు ఇలా అంటున్నాడు – వాలికి అభయం ఇస్తే, సుగ్రీవునికిచ్చిన మాట పాడవుతుంది. రావణుడు వాలి మిత్రుడు కనుక తన మిత్రుడైన వాలి రామశరణాగతి చేయగానే రావణుడూ శరణు వేడుతాడు. అప్పుడు రావణవధ జరుగదు కనుక ఇక అవతారానికి ఫలం ఎలా సిద్ధిస్తుంది? అని పై శ్లోకాల తాత్పర్యం.

ఇక ఈ పదిహేడవసర్గలో మరణోన్ముఖుడైన వాలి పలికిన పరుషవాక్యాలలో తాత్త్వికార్థాన్ని తీర్థీయవ్యాఖ్య ఎలా వివరించిందో పరిశీలించుదాం.

ఇక్కడ రామబాణహతుడైన వాలి రాముని నిందించడం పైకి గోచరించే అర్థం. దీన్ని గోవిందరాజీయ – రామానుజీయాలు యథాతథంగానే వివరించాయి.

'తం దృష్ట్వా రాఘవం వాలీ లక్ష్మణం చ మహాబలమ్' అని ఆరంభించి సర్గసమాప్తి పర్యంతం వాస్తవమైన అర్థం ఇది. వాలి శ్రీరామునితో నిష్ఠురం మాటాడినా వాలివాక్కు శ్రీరామచంద్రుని సాక్షాత్తూ పరమాత్మగా భావించి స్తుతిస్తున్నది. తం దృష్ట్వా ఇత్యాదిశ్లోకాలచేనని వ్యాఖ్యాతృ భావన. 'అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం పరుషం ధర్మసంహితమ్' అని, పరుషం అంటే చాలా తీవ్రంగా హృదయానికి బాధను కలుగజేసే మాట అని అర్థం. అయితే ఇక్కడ ధర్మసహితమ్ అన్న విశేషణం కవి చేర్చడం చేత పైకి పరుషంగా గోచరించినా వాస్తవంగా ప్రశ్రితం గర్వవిదూరం ధర్మబద్ధము అయిన మాట. 'పరాఙ్ముఖ వధం కృత్వా' అనేచోట పరాఙ్ముఖుడంటే భగవత్తత్త్వానికి విముఖుడై విషయలోలుపుడైనవాడని అభిప్రాయం. ఇలాంటి భగవద్విముఖుని సంహరించినందువల్ల, ఏ గుణం పొందలేదు అని కాకువు. నిర్వహింపరాని మహాగుణాన్ని పొందావని గూడా అభిప్రాయం. ఏ కారణంగా యుద్ధసంరబ్ధుడనైన నేను (వాలి) నీ గురించి (త్వత్కృతే) నిధనాన్ని పొందానో, నీచేతనే నిధనాన్ని పొందానో ఆకారణంగా వధించిన నీకే కాక, వధింపబడిన నాకూ గొప్పగుణమే ఏర్పడిందని వాలి మాటలలోని ఆంతర్యం. సాక్షాత్తు ధర్మప్రతిష్ఠాపనం చేత అధర్మం దూరీకరించనవతరించిన, స్వామి చేతిలో నిహతుడు కావడం తనకు పరమగుణమేనని వాలి

తాత్పర్యం. ఈ అభిప్రాయంతోనే సప్తదశసర్గారంభంలోని శ్లోకాల్లో పరమాం గతిమ్ అని వాల్మీకి ప్రయోగించిన పదానికి తీర్థీయవ్యాఖ్య ముక్తిని పొందాడని వ్యాఖ్యానించింది. ఇది ఇతరవ్యాఖ్యల్లో లేని విశేషమే కాక, ప్రస్తుతం వివరణానికి ఎంతో అనుకూలం అని గమనించాలి. పై శ్లోకంలో 'గుణం' అన్నదాన్ని వ్యాఖ్యాత మరొకవిధంగా గూడా వ్యాఖ్యానించాడు. 'రాజాత్వశాసన్ పాపస్య తదవాప్నోతి కిల్బిషమ్' (రాజు పాపాత్ముని దండించకపోతే ఆ పాపాన్ని తానే పొందవలసి వుంటుంది.) అని అన్నట్లు వాలిని దండించడం చేతనే (తనను దండించడం చేతనే) పాపపరిహారరూపమైన గుణం రామునిచే పొందబడిందని తాత్పర్యం.

రాజులు దండధారులై శిక్షించినప్పుడు తప్పుచేసి దండింపబడినవారు నిర్మలులై స్వర్గాన్ని పొందుతారని ఈ క్రింది ప్రమాణవచనం విస్పష్టపరుస్తున్నది.

**రాజభిః ధృతదండాస్తు కృత్వా పాపాని మానవాః ।**
**నిర్మలాః స్వర్గమాయాన్తి సంతస్సుకృతినో యథా ॥**

ఇలాగే వాలికూడా స్వర్గాన్ని పొందుతాడని అభిప్రాయం.మరి, సుగ్రీవునితోగల సఖ్యాన్ని గురించి విని ఉండికూడా, వచ్చి రామునిచేతిలో ఎందుకు హతుడైనట్లు అన్న ప్రశ్నకు సమాధానం – సుగ్రీవహస్తవధకంటే, సాక్షాత్తు భగవానుడైన శ్రీరామునిచేతిలో చంపబడటం, మోక్షకారణం అని వాలి భావించాడని అంటాడు వ్యాఖ్యాత. కులీనత్వము మొదలైన గుణాలను విని, శమదమాది రాజధర్మాలను కూడా విచారించి నీ అభిజనాన్ని కూడా ఎరిగి, తార యుద్ధానికి వెళ్ళరాదని ప్రతిరోధించినా యుద్ధానికి వచ్చినపుడు ఇతరులతో యుద్ధసంసక్తుడనై ఉన్న నన్ను నీవు చంపవని భావించి, నీవు ఎదురుగా లేనందున యుద్ధప్రసక్తుడనై ప్రమత్తుడనైన నేను నీచే చంపబడ్డాను. కనుక నేను నీచేత చంపబడటంచేత మంగళమే ఏర్పడింది. కనుక నేను నీ విషయంలో వేరేవిధంగా భావించడంలేదు. అని వాలి వచనతాత్పర్యంగా వ్యాఖ్యాత వివరించాడు.

ఇక నత్వాం అనే శ్లోకంచేత నిన్ను అధార్మికత్వపాపసమాచారత్వాది దుర్గుణాలు కలవానిగా నేనెరుగను. కేవలం సజ్జనవేషం మాత్రమే వేసికొన్నవానిగా కూడా నేను భావింపను. సాక్షాత్తుగా అపహతపాప్మత్వాది కళ్యాణ గుణాలు కల పరమాత్మగానే తెలిసికొన్నానని వాలివచన తాత్పర్యం. ఈ సందర్భంలో వ్యాఖ్యాత, ఇక్కడ ప్రతిపాదింప బడిన తత్త్వం సగుణమేనని వ్యాఖ్యాత (తీర్థీయవ్యాఖ్యాత) భావిస్తున్నాడు. మరి, అపరాధం ఎంతమాత్రం లేని నిన్ను నేను చంపాను కదా! ఇక నాకు ఈశ్వరత్వం ఎక్కడిది? దోషరాహిత్యం కూడా ఎక్కడిది? అన్న రామవచనాన్ని ఉద్భావన చేసి వాలియే ప్రతిసమాధానిస్తున్నాడు. నీవు కూడా పాపం చేయనివానిని సంహరింపవు. నేను నీపట్ల అపకారం చేయకపోయినా, ఫలమూలాలు తింటూ వానరజాతికి చెందిన నన్ను నీవు సంహరించావంటే తప్పక నాలో ఏదో దోషం ఉన్నదన్నమాట. ఎందువల్లనంటే, క్షత్త్రియకులంలో అవతరించి లోకానుగ్రహం కోసం జగన్మర్యాదను పాలిస్తున్న పరమకరుణాశాలివైన నీవు సుతరాము అన్యాయాచరణానికి పాల్పడవు అనే అభిప్రాయాన్ని 'ధర్మలింగ' ఇత్యాది శ్లోకంలో వ్యక్తపరచాడు వాలి. వ్యాఖ్యాత ఇలా అంటాడు – ఓ రామా! రాజకులంలో పుట్టి ధర్మాత్మునిగా ప్రసిద్ధిచెంది ప్రయోజనాన్ని పురస్కరించుకొని, వాస్తవంగా భవ సంబంధం లేనివాడవే అయిన నీవు భవసంబంధం కలవానిగా ఉండటం ఒక విరోధం, వధ జరపడం మరొక విరోధంగా తోచవచ్చు. కాని ఇది

వాస్తవం కాదు. రాజనీతినిబట్టి పర్యాలోచించినా, నన్ను చంపడం అనేది నీకు సర్వాత్మనా తగునా తగునని వాలి భావనగా వ్యాఖ్యాత పేర్కొన్నాడు. అంతేకాదు వైరబుద్ధితో నిన్ను చంపిన నన్ను స్తుతిస్తున్నావే అన్న శంకకు సమాధానంగా వాలి పల్కిన వాక్యాలుగా వయమ్ ఇత్యాదిశ్లోకాలను వ్యాఖ్యాత సమన్వయించాడు. ఇంద్రియవశివర్తినైన నాకు ఈశ్వరత్వమున్నదా అన్న రామ శంకకు నీలో నిర్గుణేశ్వరత్వమూ ఉన్నదని త్వమ్ ఇత్యాదిశ్లోకంచే వాలి ప్రతిపాదించాడని వ్యాఖ్యాతృభావన. 'మనుజేశ్వర' అన్న శబ్దం మనుజరూపంలో ఉన్న ఈశ్వరుని బోధిస్తుందని వ్యాఖ్యాతృ భావన.'కామప్రధానః' అన్న పదాన్ని 'కామస్య ప్రధానః' అని వ్యుత్పత్తిని వ్రాసి 'నిర్జితకాముడవు' అని వివరించాడు వ్యాఖ్యాత. కోపనః కోపంకలవాడని అర్థం. అయినా, శత్రువిషయంలోనే అని వ్యాఖ్యాతృయోజన. అనవస్థితః అన్నపదానికి సాధారణం బుద్ధిలో కుదురుబాటులేనివాడు, చంచలుడు అని అర్థంకాగా ఇక్కడ వ్యాఖ్యాత శత్రుసంహరణంకోసం ఒకేచోట ఉండక అక్కడక్కడ సంచరించేవాడు అని సమన్వయించి నీవు లక్ష్మీపతివి కనుక నీ బుద్ధి ధనం విషయంలో కూడా లంపటంకాదని వ్యాఖ్యానించాడు వ్యాఖ్యాత. ఇలాగే చాలా శ్లోకాల్లో కాక్వాది స్వరాలను చేర్చి అర్థాన్ని వ్యాఖ్యాత స్తుతిపరంగా మార్చాడు. ఈ సర్గ అంతా ఎలా సాగిందో మనం 1,2 శ్లోకాల విశేషపరిశీలనలో తెలుసుకోవచ్చు. ఈ శ్లోకం గమనించండి –

**శఠో నైకృతికః క్షుద్రో మిథ్యా ప్రశ్రితమానసః ।**
**కథం దశరథేన త్వం జాతః పాపో మహాత్మనా ॥**

దీనికి నిందాపరమైన అర్థం ఇది. గూఢంగా అపరాధం చేసే శఠునివి, అపరాధివి, క్షుద్రానివి, అవాస్తవంగా శాంతంలా కనిపించే మనస్సు కలవాడవి అయిన నీవు మహాత్ముడైన దశరథునిద్వారా ఎలా పుట్టావు? ఇది వాలి చేసిన రామనింద.

ఈ నిందాపరవాక్యాన్ని వ్యాఖ్యాత ఇలా సమన్వయించాడు. మహాత్మనా – మహానుభావుడైన, దశరథేన జాతః – దశరథునిద్వారా పుట్టిన నీవు (కారణగుణాలు కార్యమందూ సంక్రమిస్తాయి.) కనుక నీవు గుణవంతుడవే తప్ప శఠునివి, నైకృతికునివి, క్షుద్రానివి, అవాస్తవంగా శాంతంగా కనిపించే మనస్సు కలవాడవు, పాపివి కథం – ఎలా అవుతావు? అలాటివాడవుకావని అభిప్రాయం.

ఇలాగే, మరొకశ్లోకానికి ఈ వ్యాఖ్యాకారుని సమన్వయం సాభినివేశంగా చమత్కారంగా సాగింది.

**ఉదాసీనేషు యోఽస్మాసు విక్రమస్తే ప్రకాశితః ।**
**అపకారిషు తే రాజన్ నహి పశ్యామి విక్రమమ్ ॥**

నీతో ఎలాంటి విరోధంలేని తటస్థులమైన మాపట్ల నీవు చూపిన పరాక్రమం నీకు అపకారం చేసే శత్రువుల పట్ల అదే పరాక్రమం మాకు కనిపించడంలేదు అని వాలినింద. వ్యాఖ్యాత దీన్ని ఇలా సమన్వయించాడు. 'అపకారులమైన మాపట్ల (దయతో) మాకు నీవు చూపిన విక్రమం(పాదారవిందదర్శనం) ఎట్టి సంసార బంధం లేక ఉదాసీనులైన యోగులకు కూడా నీవు చూపినట్లు మాకు అనిపించడంలేదు. నీ అవ్యాజకృపకు ఇదే నిదర్శనమ'ని వాలి చేసిన స్తుతిగా ఈ శ్లోకవాక్యం మారిపోయింది. ఇంచుమించుగా చాలావరకు శ్లోకాలను వాలిపలికిన

రామనిందాపరాలైన వాక్యాలను వ్యాఖ్యాత స్తుతిపరాలుగా విరచి అన్వయించాడు. ఇంతవరకు కేవలం పదార్థ వివరణానికి మాత్రమే పరిమితమైన ఈ వ్యాఖ్యకు ఇది విలక్షణమైన శైలి అనే చెప్పవలసివుంది. ఇక్కడ వ్యాఖ్యాత మరొక శ్లోకంలో రాముడు వాలికి ఎదురుగా వచ్చి యుద్ధం చేసిన పక్షంలో రామబలం వాలికి సంక్రమిస్తుంది. కనుక రాముడు చాటుగా ఉండి వాలిని కొట్టినాడనే అపవాదాన్ని కూడా వ్యాఖ్యాత తన ఈ విలక్షణవ్యాఖ్యాశైలిచే నిరాకరించాడు. నీవు నాకెదురుగా ఉండి యుద్ధం చేసినట్లైతే ఈశ్వరుడవైన నీకు మరణశంక ఎలా ఏర్పడుతుంది. ఇక అమరుడవైన నీతో ఎదురుగా ఉండి యుద్ధం చేయలేకపోయినానే అని, రాముని సమక్షంలో ఎదిరించి యుద్ధంచేసి వాలి నిహతుడైనాడనే కీర్తి నేను పొందలేకపోతినే అను దుఃఖం నన్ను పీడిస్తున్నదని వాలివచనతాత్పర్యంగా తీర్థీయవ్యాఖ్య వివరించింది.

ఇలా నిహతుడవటమే యుక్తమని భావించే నీవు సుగ్రీవుని ఎందుకు రామరాజ్యం నుంచి వెడలగొట్టావు? అన్న ప్రశ్నకు సమాధానంగా వాలివచనాన్ని ఇలా సమర్థించాడు వ్యాఖ్యాత. నేను నశించడానికి నిమిత్తమైన బిలద్వారపిధానమనే అధర్మకృత్యాన్ని చేసి రాజ్యం సంపాదించడంకంటే తనను యుద్ధంలో చంపి రాజ్యం పొందడమే సుగ్రీవునికి ధర్మబద్ధమని నిరూపించడానికి ఆతనిని నిష్కాషించానని వాలి తాత్పర్యంగా 'యుక్తం యత్ప్రాప్నుపాయా ద్రాజ్యం సుగ్రీవః స్వర్గతే మయి' అనే శ్లోకాన్ని వ్యాఖ్యాత సమన్వయించాడు. ఇలా ఇంచుమించుగా ఈ సర్గలోని శ్లోకాలన్నీ అన్యతాత్పర్యకంగా రామస్తుతిపరంగా సమన్వయించడంతో ఔచిత్యం ఏమిటి? అన్న శంకను 18వ సర్గలోని మొదటిశ్లోకమే నిరాకరించి, ఔచిత్యాన్ని విస్పష్టపరుస్తున్నదని వ్యాఖ్యాతృభావన.

**ఇత్యుక్తః ప్రశ్రితం వాక్యం ధర్మార్థసహితం హితమ్ ।**
**పరుషం వాలినో రామో నిహతేన విచేతసా ॥**

ఇలా రామబాణనిహతుడైన వాలిచే ధర్మార్థసహితము హితము అయినప్పటికీ పరుషమైన వాక్యం రాముడు చెప్పబడ్డాడు. రామునుద్దేశించి వాలి పరుషమైనా ధర్మార్థహితకరమైన వాక్యాన్ని పలికినాడని తాత్పర్యం. ఈ శ్లోకం వాలి పరుషంగా పలికినా ఆ పలుకులు ధర్మబద్ధాలు, ప్రయోజనవంతాలు, హితకరాలు అని వాల్మీకి స్వయంగా అనడాన్నిబట్టి పూర్వసర్గలోని వాక్యాలకు వ్యాఖ్యాతృకృతమైన సమన్వయం ఉచితమైనదేనని సమర్థించుకోవడం కూడా సముచితంగా ఉంది. ఇక్కడ గోవిందరాజీయం (పైశ్లోకంలోని) పరుషం అనే అంశాన్ని అజ్ఞానకృతమైనదే అపారుష్యం అని సమర్థించాడే తప్ప, 'ధర్మార్థసహితం హితం' 'ప్రశ్రితం' అనే పదాల సమన్వయం ఎలాగో చెప్పలేదు. పూర్వసర్గ, అగ్నిక్షేపపరమేనని అలాకాకపోతే ఈ సర్గలో శ్రీరాముని సమాధానం కుదరదని ఈతడు (గోవిందరాజు) భావించినట్లు తోస్తున్నది.

అష్టాదశసర్గలో వాలికి ప్రతిసమాధానంగా రాముడు పలికిన పలుకులు వ్యాఖ్యానించడంలో రామానుజీయ వ్యాఖ్య తనిశ్లోకీవ్యాఖ్యలు కొంత విశేషాన్ని చూపించాయి. అయితే కొన్ని శ్లోకాల్లో తనిశ్లోకి ప్రదర్శించిన కొన్ని అంశాలు కొన్ని విశేషాలను చాలా సూక్ష్మంగా ఆవిష్కరించింది. 'ధర్మార్థగుణ సంపన్నం'అనే శ్లోకంలోను 'ధర్మమర్థం చ కామం చ' అనే శ్లోకంలోనూ ధర్మశబ్దం వైదికపురుషార్థమని ఇదేశ్లోకంలో లౌకికం సమయం అనే పదం లౌకికమైన ఆచారాన్ని తెలియజేస్తుందని అంటూ, తనిశ్లోకి ఇలా అంటుంది–

'తేన ద్వయోరేక భార్యత్వేఽపి మాససంవత్సరాది ప్రతినియతికాల సంకేతః' అని. ఈ మాటలోని ఆంతర్యం ఏమిటో స్పష్టంగా లేదు. అయినా, ఈమాట ఒకే విషయాన్ని సూచిస్తున్నది. వానరజాతిలో అన్నదమ్ములకు ఒకే భార్య ఉండవచ్చునని, అలా ఉన్నప్పుడు మాససంవత్సరాది కాలనియమాన్ని పాటింపవలసి ఉంటుందని. బహుశః పాండవులు ద్రౌపదివిషయంలో చేసికొన్న కాలనియమంలాంటిదే ఇది కావచ్చని ఊహించడానికి అవకాశం ఉంది.

తానున్న ప్రదేశం (విషయం) నిమిత్తంగాగాని, పురంలోగాని రామునితో కలహనిమిత్తం తనకు లేదని, కనుక తనను నిర్నిమిత్తంగా చంపడం అన్యాయమని వాలి పలికినదానికి రాముని సమాధానంగా 'ఇక్ష్వాకూణా మియం పృథ్వీ' ఇత్యాదిశ్లోకం వాల్మీకిచే నిర్దేశింపబడింది. ఇక్కడకూడా తనిశ్లోకి కలహనిమిత్తాలను ఈ క్రిందివిధంగా పేర్కొన్నది.

1. నీవు అనుభవించిన వనాలు, గిరులు, ఉపవనాలు, పట్టణాలు ఇవన్నీ మావి కావా?

2. నీకు – మాకు జ్ఞాతిభావంకూడా ఉంది. ఎలా? 'త్వం వయస్యశ్చ హృద్యో మే', 'ఏవం దుఃఖం సుఖం చ నౌ' అని సుగ్రీవసఖుడైన నాకు (రామునికి) నీవు జ్ఞాతివికావా? జ్ఞాతిత్వం కూడా కలహనిమిత్తమేనని అభిప్రాయం.

3. 'తేనాహం ప్రతిషిద్ధశ్చ హృతదారశ్చ రాఘవ!' అని సుగ్రీవుడు నాతో (రామునితో) అన్నాడుకదా! సుగ్రీవుని దారను హరించడం, సుగ్రీవుని నగరప్రవేశాన్ని నిషేధించడం కలహనిమిత్తం కాదా?

4. అంతేకాదు సోదరుని – 'వస్త్రేణైకేన వానర' అని చెప్పినట్లు సుగ్రీవుని ఏకవస్త్రునిగా (ఒకే బట్టకలవానిగా) బహిష్కరించడం కలహనిమిత్తం కాదా?

5. సుగ్రీవుని గృహ–దార–భూ–జలాదికం నీవు హరించలేదా?

6. ఇక స్త్రీవివాదం కూడా ఉంది. ఎలా?

'భ్రాతుర్వర్తసి భార్యాయామ్' అనే శ్లోకంలో చెప్పబడింది. ఇలా తనిశ్లోకి ఎన్నో కలహనిమిత్తాలను ఉట్టంకించింది. ఇక్కడ వాలి చేసిన మరొక అభియోగం.

నీకు– నాకు పరస్పరపరిజ్ఞానం పరిచయం లేదు. నా గృహానికి వచ్చి నిరపరాధినైన నన్ను సంహరించావు ఇది సరికాదు అని. దీనిక సమాధానం – 'తాం పాలయతి ధర్మాత్మా' అని ఆరంభించి 'కామతంత్రప్రధానశ్చ న స్థితో రాజవర్త్మని' అనే శ్లోకం వరకు రామునిచే చెప్పబడింది. నీవు అపరాధివేనని రామాభిప్రాయం. భరతుని ఆదేశంచేత ధర్మవిప్లుతిని ఆతనిపక్షాన నివారిస్తున్నానని రామాభిప్రాయం కాగా, కనిష్ఠుడైన భరతుడు జ్యేష్ఠుని ఎలా నియోగిస్తాడు. అసలు అతడు రాజ్యాన్ని స్వీకరించలేదుగదా! ఇత్యాది శంకలను వ్యాఖ్యాత లేవనెత్తి సమాధానం చెప్పాడు. ఇక్కడ ధర్మ శబ్దానికి రాజధర్మమని అర్థం. వాస్తవానికి భరతుడు రాముని ధర్మనియమనవిషయంలో ఆదేశించలేదు. అయినప్పటికీ ఇది అసత్యం కాదు. ఎందువల్లనంటే ఏదోవిధంగా అంటే పాదుకలపై భారం ఉంచి తాను వాటి ప్రతినిధిగానైనా రాజ్యభారాన్ని స్వీకరించాడు. కనుక, ఆతనివంశంలో పుట్టినవారందరికీ ఆతని

ఆదేశమే చెల్లుబాటులో ఉంటుంది అని రామహృదయంగా వ్యాఖ్యాత వ్యాఖ్యానించాడు. కనుకనే అయోధ్యాకాండలో చెప్పబడింది – 'త్వం రాజా' ఇత్యాది.

'యవీయాన్ ఆత్మనః పుత్రః' అనే శ్లోకంలో రాముడు తమ్ముడు, తన పుత్రుడు, శిష్యుడు ఈ ముగ్గురు పుత్రునివలె చూడదగినవారంటాడు. ఇక్కడ పుత్రశబ్దం దృష్టాంతంగా ఈయబడిందని వ్యాఖ్యానం. ఏవిధంగా పుత్రునియందు పుత్రుని చూడవలసినవిధంగానే చూడటం ఉంటుందో అలాగే ఇతరలిరువురిపట్ల కూడా ఉండాలని దీని అభిప్రాయం అంటాడు వ్యాఖ్యాత. పుత్రునిపట్ల పుత్రునిలా ప్రవర్తించడం ఏమిటి? అని శంకించి సమ్యక్ స్నేహః సరియైన ప్రేమప్రవృత్తి అని వ్యాఖ్యానించాడు. 'గగనం గగనాకారం' అన్నట్లు ఈ ప్రయోగాన్ని తీసికోవాలంటాడు వ్యాఖ్యాత. ఇలా ఉండాలి అనడంలో ప్రమాణం ఏమిటి? అన్న శంకకు సమాధానం 'ధర్మశ్చేదత్ర కారణమ్' అని, ఈ విషయంలో అంటే పుత్రునిపట్ల ఎంతటి నిర్వ్యాజప్రేమ ప్రవృత్తి ఉంటుందో అలాంటిదే తమ్మునిపట్ల, శిష్యులపట్ల కూడా ఉండాలి అనడంలో ధర్మమే వ్యవస్థాపకమని అభిప్రాయం. ధర్మాన్ని పాటింపనక్కర లేనప్పుడు ఈ వ్యవస్థలేకపోయినా ధర్మాన్ని పాటించాలి అన్నప్పుడు తప్పక ఈ దృష్టితోనే చూడాలని అభిప్రాయం. ఇంచుమించుగా ఈ సర్గలోని వాలి వచనాలను వ్యాఖ్యాత ఇలాగే అంతర్గతతాత్పర్యంగా విశదపరచాడు. ప్రతిశ్లోక పరిశీలనం అవసరం లేకపోయినా 18వ సర్గలో వాలికి ప్రతిసమాధానం చెబుతూ రాముడు పలికిన వాక్యాల్లో–

'భ్రాతుర్వర్తసి భార్యాయామ్ త్యక్త్వా ధర్మం సనాతనమ్' సనాతనధర్మాన్ని విడచి సోదరుని భార్యతో కూడి ఉండటం అనేది విశేషాపరాధంగా రాముడు భావిస్తున్నట్లు, దాన్ని పురస్కరించుకొని వాలివధ జరిపినట్లు అవగతం అవుతున్నది. అయితే సోదరుని భార్యతో కూడిఉండటం అనేపని, సుగ్రీవుడు కూడా చేశాడు కదా! మరి, ఈదోషం అతనికంటదా! ఆతనిని కూడా ఇదే అపరాధాన్నిబట్టి శిక్షింపద్దా? అనే శంకను సమాధానించడానికి వాలి–సుగ్రీవులిద్దరూ చేసిన పని ఒక్కటే అయినా సూక్ష్మమైన భేదాన్ని రాముడు భావించినట్లు వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించారు. 'అస్య త్వం ప్రమాణస్య' 'తత్ప్రతీతస్య' అనే రెండుశ్లోకాలను గోవిందరాజు, మహేశ్వరతీర్థులు ఇరువురూ వ్యాఖ్యానించారు. ఇక్కడ గోవిందరాజీయవ్యాఖ్య ఒకకాలధర్మాన్ని ఉన్నయనం చేసి ఉట్టంకించింది.

'అనేన జీవతో భ్రాతుర్భార్యా భ్రాత్రా న గ్రాహ్యా, మృతస్య తు గ్రాహ్యా ఇతి తత్కుల ధర్మః ప్రతీయతే అత ఏవ హి వాలినో బిలగమనానంతరం మంత్రిభిరభిషిక్తస్య సుగ్రీవస్య తారాపరిగ్రహణం రామో న నిందితవాన్' ఈ మాటచేత బ్రతికివున్న సోదరుని భార్యను పరిగ్రహింపరాదని, మరణించిన సోదరుని భార్య పరిగ్రహింపతగునని వారి కాలధర్మంగా తెలుస్తున్నది. కనుకనే వాలి, బిలంలోనికి వెళ్ళిన తరువాత, మంత్రులచే అభిషిక్తుడైన సుగ్రీవుడు తారను పరిగ్రహించడాన్ని రాముడు నిందించలేదు అని వ్యాఖ్యాత వివరించాడు. ఇక్కడ వాస్తవంగా వాలి మరణించకపోయినా బిలంలోనుండి బహుకాలం తిరిగి రాకపోవడం, రుధిరాది నిర్గమనం మొదలైనవాటినిబట్టి వాలి మరణాన్ని సుగ్రీవుడే కాక, ఆతని మంత్రులుకూడా భావించనందువల్ల తారాపరిగ్రహణం తప్పుగా భావింపబడలేదని, ఈ భావనతోనే రాముడు కూడా నిందించలేదని వ్యాఖ్యాతయొక్క అభిప్రాయంగా భావించవచ్చు. ఇదే సందర్భాన్ని తీర్థీయవ్యాఖ్య మరింత స్పష్టపరచింది – నను భ్రాతృభార్యావమర్శనం సుగ్రీవస్యాపి సమానమ్ ఇత్యాశంక్య, సుగ్రీవో మాయావినా బిలాంతర్గతయుద్ధేన తన్మరణం నిశ్చిత్య, తారాయామవర్తిష్ట, త్వం తు తజ్జీవనం

జ్ఞాత్వాపి రుమాయాం వర్తసే ఇతి వైషమ్యమ్ అస్తి ఇత్యాహ – మరి సోదరుని భార్యను పరిగ్రహించడం అనేది సుగ్రీవునికి సమానమే అని శంకించి, సుగ్రీవుడు మాయావితో జరిగిన బిలాంతర్గతయుద్ధంచేత వాలి మరణించాడని నిశ్చయించి తారయందు ప్రవర్తించాడు. నీవైతే, సుగ్రీవుడు బ్రతికివుండటం తెలిసి ఉండే రుమయందు ప్రవర్తించావు. ఇలా ఇరువురిప్రవృత్తిలో తేడా ఉందని భావించి అంటున్నాడు అని స్పష్టంగా భేదాన్ని ఉట్టంకించింది తీర్థీయవ్యాఖ్య.

అయితే, ఇక్కడ సుగ్రీవుడు, వాలి బిలంనుండి వెలికి రావడానికి ముందు తారాపరిగ్రహణం చేయడం, అంగదునకు నచ్చలేదని ధర్మబద్ధంగా ఆతడు భావించలేదనే అభిప్రాయాన్ని స్పష్టపరిచే శ్లోకాన్ని గోవిందరాజీయం–తీర్థీయం రెండూ ఉట్టంకించాయి. అయితే, అంగదుని అభిప్రాయంలోని ఔచిత్యానౌచిత్యాలను వ్యాఖ్యాతలు వివేచింపకపోవడం గమనార్హం.

ఈ సమస్తపృథివీ ఇక్ష్వాకులదే కనుక, తమ పాలనాపరిధిలోగల వారి దౌష్ట్యాన్ని నిగ్రహింపవలసిన బాధ్యత దోషావహం కాదని రామునిభావనను శ్లోకోట్టంకనపురస్సరంగా వ్యాఖ్యాతలిర్వురూ సమర్థించారు. వ్యాఖ్యానరీతి సమానమే.

ఈ సర్గలో రాముడు వాలిని ప్రచ్ఛన్నంగా ఉండి సంహరించడంలోని ఔచిత్యాన్ని గోవిందరాజీయవ్యాఖ్య ప్రశ్నించి సమాధానించింది. ఆ సమాధానం ఇది – ఒకవేళ రాముడు వాలికి ఎదురుగా నిలబడి ఉంటే, వాలి శ్రీరామప్రభావాన్ని విని ఉన్నవాడగుటచేత వినమ్రుడై పోతాడు. అప్పుడు తనకు వినమ్రుడైన వానిని సంహరింపరాదు. ప్రతిజ్ఞ పాడవుతుంది. వాలి శరణుజొచ్చినపుడు ఇతని మిత్రుడైన రావణుడూ శరణు పొందవచ్చు. అప్పుడు (ఆతని వధించడం యుక్తం కాదు కనుక) దేవకార్యం చెడిపోతుంది. కనుక రాముడు వాలిని చాటుగా ఉండి చంపాడు. ఇది గోవిందరాజీయవివరణం. ఇది సాంప్రదాయికధోరణిలో మాత్రమే వ్రాసిన మాట తప్ప వస్తుతత్త్వాన్ని సందర్భసముచితంగా సమన్వయపరచి వ్రాసిన మాటగా తట్టదు. కనుకనే ఇలాంటి సమాధానం సాంప్రదాయికులకే తప్ప సామాన్యాలోచనాపరులకు అంతగా రంజకం కాదు అని విమర్శకుల భావన. ఈ సర్గలో చాలా శ్లోకాల సమన్వయం గోవిందరాజీయ తీర్థీయవ్యాఖ్యల్లో సమానమే. పంతొమ్మిదవ సర్గ తారాగమన ప్రతిపాదకం.

'శత్రుతుల్య పరాక్రాన్తం' అనే శ్లోకంలో, 'శార్దూలేనామిషస్యార్థే మృగరాజం యథాతథమ్' అనే చోట, మాంసం కోసం పెద్దపులిచేత సంహరింపబడిన మృగరాజైన సింహంలా వాలి ఉన్నాడంటాడు వాల్మీకి. శార్దూల శబ్దానికి పెద్దపులి అనే అర్థం ప్రసిద్ధం. ఇది సంభవమా? సింహంచేత పెద్దపులి చంపబడటం ఉండవచ్చు తప్ప, పెద్దపులి సింహాన్ని చంపడం లోకవిరుద్ధం కదా! అనే శంకను వారిస్తూ తీర్థీయవ్యాఖ్య శార్దూలశబ్దానికి సింహమనే అర్థాన్ని నిర్దేశించింది. మరి, మృగరాజం అనే శబ్దానికే సింహమనే అర్థంకదా? అప్పుడు సింహంచే చంపబడిన సింహంలా వాలి ఉన్నాడంటే విశేషం ఏముంది? గోవిందరాజీయవ్యాఖ్య తీర్థీయవ్యాఖ్యను సరిదిద్దడానికి ప్రయత్నించినట్లు కనబడుతుంది. తీర్థీయవ్యాఖ్య శార్దూలశబ్దానికి సింహమని అర్థం చెప్పడానికి ప్రమాణంగా వైజయన్తీనిఘంటువునుట్టంకించింది.

**సింహో మృగేంద్రః పంచాస్యో హర్యక్షః శ్వేతపింగళః ।**
**వ్యాదీర్ణాస్యో మాహానాద శ్శార్దూలః ॥**

అని. అయితే వాస్తవానికి సింహాలు రెంటివాంఛ మాంసం విషయంలో వైరం ఏర్పడటంగాని, వాటిలో ఒకటి మరొకదానిని చంపడంలోగాని విరోధం ఏమీ లేదు. కనుక సింహంచే చంపబడిన సింహంలా అనడంలోనూ ఔచిత్యం ఉంది. అయితే గోవిందరాజీయవ్యాఖ్య- యథాతథంగా ఉట్టంకించి, ఈ సంగతిని నివారించడానికి యద్వా అని సమన్వయాంతరాన్ని ప్రదర్శించింది. ఇది అభూతోపమ అని గోవిందరాజీయ నిర్వహణం. వాల్మీకి హృదయం ఇదే అనిపిస్తుంది. శార్దూలంచేత (పెద్దపులిచేత) సింహం చంపబడటం అసంభావితమే కదా! కనుక ఇది అభూతోపమ అని గోవిందరాజీయవివరణం సముచితంగా తోస్తున్నది.

ఇదే సందర్భంలో తారాస్వభావాన్ని అవస్థను వర్ణిస్తూ వాల్మీకి శుభా అని తారకు విశేషణం వేశాడు. శుభహృదయం అని దానికి అర్థం వ్రాశాడు వ్యాఖ్యాత. ఆమె హృదయంలో ఉన్న శుభభావన ఎలాంటిది? వ్యాఖ్యాత తారాహృదయాన్ని ఇలా ఆవిష్కరిస్తున్నాడు.

వాలిని చంపడంలో శ్రీరామచంద్రుని దోషం ఎంతమాత్రం లేదు. దోషమంతా వాలిదే. మంచినీరు త్రాగడానికి బావిత్రవ్వితే, మెడకు గుదిబండకట్టుకొని ఆ బావిలో దూకి చావడం, చచ్చినవాని దోషమే తప్ప వేరు కాదుగదా! ఈతడుకూడా అనుకూలుడై ఉంటే ఇలాగే ఎందుకు రక్షింపడు? పైగా – మమ ప్రాణా హి పాండవాః అన్నట్లు తనకు ప్రాణభూతుడై, తన్నాశ్రయించినవానినే హింసించేవానిని ఎవడు సహింపగలడు? కనుకనే మొదటిసారి యుద్ధంలో వాలిని సంహరింపలేదు. అయితే, తన్నాశ్రయించివానిపట్ల జరుగుతున్న అపరాధాన్ని చూచియే రెండవసారి యుద్ధంలో రాముడు వాలిని సంహరించాడు అని తార భావించింది. ఇలాంటి శుభభావన కలదవడంచేతనే 'శుభా' అన్నాడు కవి. ఇది ప్రతిపద్యస్వారస్యకథనవిధానం. గోవిందరాజీయంలో విశేషంగాను, తీర్థీయంలో అక్కడక్కడా, ఇలాంటి విశేషాలు గోచరిస్తాయి.

తారావిలాపం 20వ సర్గలో వర్ణింపబడింది. 21 వ సర్గలో హనుమంతుడు తారను సాంత్వనపరుస్తూ 'సంస్కార్యో హరిరాజశ్చ' కపిరాజైన వాలి దహనసంస్కారం చేయదగినవాడని హనుమంతుడన్నాడు.అయితే 22 వ సర్గలో 'వీక్షమాణః' ఇత్యాదిగా ప్రథమశ్లోకంలో వాలి మరణించలేదని కవి సూచించాడు. మరి దానికి దీనికి వైరుధ్యం లేదా అని శంకించి, తీర్థీయ- గోవిందరాజీయవ్యాఖ్యలు రెండూ ఒకేవిధంగా శంకపరిహారం చెప్పాయి. ఇప్పటికీ చూస్తున్నప్పటికీ, అమోఘమైన రామబాణంచేత వాలిమరణం నిశ్చితమే కనుక హనుమంతుడు అలా అన్నాడని సమాధానం.

23,24 సర్గల్లో వాలి మరణానంతర తారావిలాపాలను, తారాప్రలాపాలను విని దుఃఖించిన సుగ్రీవుని ఆశ్వాసపరచడంతోపాటు తారకు రామునిపట్ల గల విశేషప్రతిపత్తి ఎలాటిదో వాల్మీకి వర్ణించాడు. ఈ సర్గలవ్యాఖ్యలో తీర్థీయవ్యాఖ్య ఎలాటివిశేషాలను ఉట్టంకించలేదు.

తార రామునితో పలికిన పలుకులను ఆవిష్కరించే –

**త్వమప్రమేయశ్చ దురాసదశ్చ జితేంద్రియశ్చోత్తమ ధార్మికశ్చ ।**
**అక్షయ్యకీర్తిశ్చ విచక్షణశ్చ క్షితిక్షమావాన్ క్షతజోపమాక్షః ॥**

అనే ఈ శ్లోకాన్ని గోవిందరాజీయవ్యాఖ్య చాలా విశేషంగా తత్త్వరహస్యనిరూపణపరంగా వ్యాఖ్యానించింది.

'తస్మిన్ క్షణే' (25వ శ్లో) అనే శ్లోకంలోని క్షితిక్షమావాన్, భువనస్య గోప్తా అనే విశేషణాలచేత భూమిలా అవిచాల్యమైన క్షమాగుణం కలవాడు, సమస్తజగత్తుకు పరిరక్షకుడు రాముడని చెప్పడం ద్వారా క్షమావత్త్వ-భువనపరిరక్షకత్వగుణాలు తారచే భావించబడ్డాయి. ఇలాగే 28 వ శ్లోకంలోని 'పురుషప్రధానమ్' అనే విశేషణంచేత పురుషోత్తమత్వం, 'చారునేత్రం' అనే విశేషణం చేత 'పుండరీకాక్షత్వం' చెప్పబడింది.

ఈ విధంగా పూర్వశ్లోకాలలో వ్యక్తపడిన పురుషోత్తమత్వ-పుండరీకాక్షత్వాదులచే అనుసంహితమైన రాముని పరత్వ లక్షణాన్ని, తార, 'త్వమప్రమేయశ్చ' అనే శ్లోకంలో విశేషంగా అనుసంధానం చేస్తున్నదని గోవిందరాజీయ వివరణం. ఇక, ఒక్కొక్క విశేషణాన్ని వ్యాఖ్యాత ఎలా బహుముఖంగా వ్యాఖ్యానించాడో పరిశీలిద్దాం.

త్వం నీవు అనడంచేత ముందు ముందు నిరూపింపబడనున్న ధర్మాలను బట్టి, ఆ ధర్మాలతో కూడిన విలక్షణవ్యక్తిత్వం నీదని సూచింపబడుతున్నది.అప్రమేయుడు అంటే వేదాహం అని ప్రారంభించి మహాంతం క ఇత్థా వేద ఇత్యాదిగా వున్న వేదంచేత కూడా ఇట్టివాడని పరిచ్ఛేదింపరానివాడు. 'సోంగవేదవానవేద' అన్నట్లు, తనను గురించి తానే ఇంతవాడని తెలియనివాడు. త్వమ్ అనే పదం ప్రత్యక్షంగా రూపం కనిపిస్తున్నట్లు నిర్దేశించినా, అప్రమేయ పదం మనోవృత్తులచే భావింపరానివాడని తెలియజేస్తున్నది. మరొక విశేషం. శరచాపాలు ధరించిన వాడివైనా నీవు శంఖచక్రధరుడవే అని భావం. నీ సౌలభ్యదశ ఇట్టిదని చెప్పరానిదే. ఎట్టి సాధనలు లేకపోయినా, ప్రతాపాతిశయంచేతనే నిరవధికసాధనసంపత్తికలవాడవై, శత్రుదురవగాహుడవు ఇలా అంతఃకరణం చేతపొందరాని వాడవైనా బాహ్యసాధనసంపత్తిచే పొందదగినవాడవా? అంటే, కాదనడానికి 'దురాసదశ్చ' అని చెప్పబడింది. మనస్సుచేత పొందరానివాడైప్పుడు మరొకవిధంగా సుఖాసదుడు ఎలా అవుతాడు? దుష్ఠైరాసదః దురాసదః "మహాజనో యేన గతః స పంథా" సన్మార్గాన్ని విడచిన వారికి పొందరానివాడు. ఇక్కడ వ్యాఖ్యాత వ్యాకరణశాస్త్ర నిర్దిష్టమైన ధాత్వర్థాలను, షడ్ ధాతువుకు గల అర్థాలను మూడింటినీ పరిగ్రహించి విశరణ-గతి-అవసాదనాలు మూడు లేనివాడని అర్థం చెప్పాడు. నిత్యుడు కనుక విశణార్హుడు కాడు. విభువు కనుక విచలనార్హుడు కాడు. కదిలింపరానివాడని అభిప్రాయం. నిత్యానందస్వభావుడు కనుక అవాసాదాన్ని పొందింపరానివాడని అభిప్రాయం. దురాసదః అనే పదాన్ని ఇలా వివరించాడు గోవిందరాజీయవ్యాఖ్యాత. దురాసదుడు అంటే దరిచేరరానివాడని అభిప్రాయం. వాలివధవల్ల కోపగించనివారు ప్రతీకారం చేయదలచినా వారిక దరిజేరనివాడు. అంటే దురాసద శబ్దానికి తాత్త్వికంగా మరొక అర్థం. బాహ్యకుదుష్టులైన వారెవరున్నారో – వేదబాహ్యులు, వక్రమైన బుద్ధికలవారు ఎవరో వారికి పొందరానివైభవం కలవాడని కూడా అభిప్రాయం. ఈ విధంగా 'అప్రమేయత్వం' 'దుర్ధర్షత్వం' అనే లక్షణాలచే అభివానం కలవాడైనా, ఇతరుల భార్యలను, రాజ్యాన్ని లోభబుద్ధితో కోరేవాడు కాడని భావం.

ఇక, జితేంద్రియః అంటే ఇంద్రియాలు జయించినవాడని సామాన్యార్థం. కనుకనే రాజ్యలోభంలేక నిస్పృహగా సుగ్రీవునికి రాజ్యాన్ని విడచినవాడైనవాడు. జితేంద్రియుడు కనుకనే 'న రామః పరదారాన్ వై చతుర్భ్యామపి పశ్యతి' అన్నట్లు ఇంద్రియవిజేతయై ఇతరస్త్రీలను ఎంతమాత్రము తేరిపారచూడనివాడు అని కూడా అభిప్రాయం. జితేంద్రియశబ్దంచేత 'పశ్యతః చక్షుః స శ్రుణోత్యకర్ణ అపాణిపాదో జవనో గ్రహీతా' అని ఉపనిషత్తు చెప్పినట్లుగా

ప్రాకృతదేహంలోని కన్ను, చెవి, పాదాలు మొదలైన అవయవాల అవసరమే లేకుండానే ఆ యా ఇంద్రియాల కృత్యాలను నిర్వహింపగలవాడని అభిప్రాయం. ఇది పరమాత్మత్వ లక్షణం. ఇంద్రియనిరపేక్షంగా సర్వత్ర సర్వదా అన్నీ ఎరిగి ఉండువాడని కూడా అభిప్రాయం. మరొక అభిప్రాయం– 'దుర్గ్రహం మనసాప్యన్యైరింద్రియై రపి దుర్జయైః' అన్నట్లు మనస్సుచేత గ్రహింపరాని వాడు. ఇతరేంద్రియాలచే కూడా గ్రహింపబడడని అభిప్రాయం. సర్వం వాక్యం సావధారణం అన్న న్యాయాన్నిబట్టి త్వజితేంద్రియః నీవు జితేంద్రియుడవు అన్న వాక్యానికి 'త్వమేవ జితేంద్రియః' నీవే జితేంద్రియుడవు అని వ్యాఖ్యాత అర్థం చెప్పాడు. అబ్భక్షః వాయుభక్షః అనే పదాలు ఎలాగైతే నీటినే భక్షించేవాడు, గాలినే భుజించేవాడు అని అవధారణార్థాన్ని ఇస్తాయో అలాగే ఇక్కడకూడా అని వ్యాఖ్యాత అభిప్రాయం. త్వమేవ నీవే అని అవధారణానికి తాత్పర్యం ఏమిటి? ఇతరేతరదేవతలలో ఆ ఇంద్రియనిగ్రహం లేదా అంటే లేదంటాడు వ్యాఖ్యాత.

**అహల్యాయై జారస్సురపతిరభూ త్మతనయా ।**
**ప్రజానాథోఽ యాసీత్ అభజత గురోరిందుబలామ్ ॥**

అన్నట్లుగా, సాక్షాత్తు సురపతియైన దేవేంద్రుడు ఇంద్రియచపలుడై గౌతమపత్నిని కామించి భంగపడ్డాడు. ఇక ప్రజాపతి తాను సృజించిన పడతినే కామించాడు. చంద్రుడు గురుపత్నియైన తారను పరిగ్రహించి మహాసంగ్రామాన్నే తన కామాతురతచేత తెచ్చిపెట్టాడు. కనుక ఇలాంటి దేవతల్లాకాక నిగృహీతేంద్రుడవు నీవు అని అభిప్రాయం. ఇలాంటి విరాగియైనా మా విషయంలో హింసకు పాల్పడ్డాడు కదా కనుక రాముడు అధార్మికుడా? అన్న శంకను వారించడానికి "ఉత్తమధార్మికశ్చ" అన్నది తార. తనను ఆశ్రయించినవారి సంరక్షణకోసమే వాలివధలాంటి కృత్యాలు చేశాడు కనుక, స్వామి, పరమధార్మికుడని భావం. స్వార్థమైన కర్మలు చేసేవాడు అధమధార్మికుడు. స్వార్థపరార్థాలను రెంటినీ ఉద్దేశించి కర్మ చేసేవాడు మధ్యమధార్మికుడు. ఇక పరార్థమే ప్రవర్తించేవాడు పరమధార్మికుడని వ్యాఖ్యాతృభావన. ఇక్కడ వ్యాఖ్యాత 'ఉత్తమధార్మిక' శబ్దానికి రెండుమూడురకాలుగా అర్థాలు వ్రాశాడు.

వర్ణాశ్రమాచారాలచేత ఆరాధింపబడేవాడు ధార్మికుడు. భక్తిపూర్ణభజనీయుడు. ఉత్తమధార్మికుడు. లేదా, ఉత్తమధార్మికుడంటే శరణాగతవత్సలుడై తద్రక్షకుడు. లేదా, "ఉపాయో గురురేవ స్యాత్ తేనానుగృహీతో బ్రహ్మలోకం గచ్ఛతి". ఉపాయం గురువే అయివుంటాడు. ఆ గురువుచే అనుగ్రహింపబడి బ్రహ్మలోకానికి (పర పదానికి) వెళ్తాడు. అని చెప్పబడిన ఆచార్యసమాశ్రయమనే ఉత్తమధర్మం కలవాడు ఉత్తమధార్మికుడు. రాముడు కూడా ఆచార్యసమాశ్రయణం చేశాడు లోకశిక్షణకోసమని అభిప్రాయం. లేదా, 'ఆనృశంస్యం పరో ధర్మః' అన్నట్లు క్రూరత లేకపోవడమే పరమధర్మం కనుక అలాంటి పరమధర్మాన్ని స్వాశ్రితరక్షణకొరకు స్వీకరించినవాడు ఉత్తమధార్మికుడు. ఆర్తుడైన సుగ్రీవుని రక్షించినవాడు ధార్మికుడు. అకృత్యం చేసిన వాలిని సంహరించి ఆతనిని పవిత్రుని చేసినవాడు కనుక ఉత్తమధార్మికుడు. మరి, చాటున ఉండి చంపాడు కనుక ధార్మికుడెలా అవుతాడు? అనే శంకను వారించడానికి అక్షయ్యకీర్తిశ్చ అని విశేషణం. ఆశ్రితులైనవారిపట్ల అపరాధం చేసిన వారు మృగప్రాయులు కనుక వారిని వేటాడేవిధానంలోనే వెనుకనుండి సంహరించడం యుక్తమే కనుక, అంతేకాక మృగాలతో ఎదురుపడి యుద్ధం

చేయడం సార్వభౌములైనవారికి దోషాపాదకం కనుక వాలివధలో దోషంలేనిదేకాక కీర్తికరమనే అభిప్రాయాన్ని 'అక్షయ్యకీర్తిః' అనే విశేషణం చెబుతున్నది. అక్షయ్యమైన నాశరహితమైన కీర్తి కలవాడని తాత్పర్యం. 'తస్య నామమహద్యశః' అన్న ఉపనిషద్వాక్యాన్నిబట్టి ఆతనికి మహాయశస్సని ప్రసిద్ధి కనుక అక్షయ్యకీర్తి. ఇది పరత్వసిద్ధిని చెప్పే విశేషణం.

విచక్షణశ్చ – దూరదృష్టి కలవాడవటంచేత యుక్తాయుక్తవిచారపూర్వకంగా సర్వకార్యాలూ చేసేవాడు. కనుకనే నిరపరాధవధ కాకూడదని వాలిచే సుగ్రీవుని ఒకసారి బాగాకొట్టించి, లక్ష్యవైపరీత్యం జరుగరాదని అంటే ఒకరిని చంపబోయి మరొకరిని చంపడం జరుగరాదని గజపుష్పమాలను సుగ్రీవుని ధరింపజేసినవాడు కనుక విచక్షణుడన్న మాట. శత్రుడెవ్వరో, మిత్రుడెవ్వరో స్పష్టంగా గుర్తించి సంహరించినవాడు. శిక్షింపదగినవానిని శిక్షించినా, శిక్షింపరాని నిరపరాధులైన అంగదాదులపట్ల ఎట్టి తీవ్రత లేనివాడు కనుక విచక్షణుడు. కనుకనే క్షమవాన్ సహనం కలవాడు. స్వాశ్రితులపట్ల అపచారం చేసినవారిని "సపుత్రపౌత్రం సామాత్యం సమంత్రి జ్ఞాతిబాంధవం హత్వా" పుత్ర పౌత్రాలతోనూ, అమాత్యమంత్రిజ్ఞాతులతోను కలిపి సంహరించి అన్నట్లుగా సబాంధవంగా వాలివధార్హుడైనా, అలా చేయక ఆతనిని మాత్రమే శిక్షించి తదాశ్రితులనందరినీ విడువడం క్షమాగుణం కనుక క్షతి క్షమావాన్. పృథివివంటి సహనం కలవాడు స్వామి అని అభిప్రాయం. ఏబదికోట్ల విస్తారంగల పృథివికి ఎంతటి సహనం ఉన్నదో, అదంతా నీకే ఉన్నదని ప్రశంసించడమే ఇది. 'క్షమావాన్' అనేచోట వాక అని మతుప్ ప్రత్యయం. నిత్యయోగిన్నిబోధిస్తున్నది. నిత్యమూ క్షమ (సహనం) కలవాడన్నమాట. కనుక ఏ ఒకప్పుడో ఆతనిలో క్షమారాహిత్యం (అసహనభావం) లేశమాత్రమైనా అగుపించదని అభిప్రాయం స్ఫురిస్తున్నది.

'క్షతజోపమాక్షః' ఎర్రని కన్నులుకలవాడు స్వామి. ఈనాడు వాలి చేసిన అపరాధంవల్ల కన్నులు ఎర్రజేసినా, స్వామి, వాలిబంధువులపట్ల క్షమకలిగే ఉన్నాడు లేదా, ఎర్రని ముఖము, నేత్రాలు, పాణి కలవాడు. ఈ మూడింట ఎర్రదనం కలవాడని అభిప్రాయం. 'త్రితామ్రః' మూడుస్థానాల్లో (ఎర్రదనంకలవాడు) అని సాముద్రికశాస్త్రం చెబుతున్నది కనుక, ఎర్రని నేత్రప్రాంతాలు కలవాడని భావన. 'రామో రక్తాంతలోచనః' అని ప్రసిద్ధి. ఇక్కడ ప్రతి విశేషణంతోను చకారప్రయోగం వల్ల ఒక్కొక్కగుణమే రాముని పరత్వాన్ని పరతత్వాన్ని నిరూపింపసమర్థమనే అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తున్నది. క్షమావాన్ అనేచోట చకార ప్రయోగం లేకపోవడం, కాముడు సహనాన్ని వహిస్తే అందరూ సహనాన్ని కలిగే ఉంటారని ఆ గుణం సార్వజనీనమని సూచిస్తున్నది. కనుక క్షమాగుణం ఇతరత్రకూడా ఏర్పడి ఉందికనుక నిరపేక్షం కాదనే భావంతో చకారప్రయోగం లేకుండానే క్షమావాన్ అని మాత్రమే ప్రయోగించడం జరిగింది. క్షతజోపమాక్షః అనేచోట ఎర్రని కన్నులు కలిగివుండటం విగ్రహ(దేహ) గుణం కనుక మిగిలిన గుణాల వంటిది వాటిలో చేర్చదగినదికాదని ఇక్కడ కూడా చకారం చేర్చలేదు. కనుక క్షమాది ఆత్మగుణాలకంటే ఎర్రని కన్నులు కలిగి ఉండడమనే దేహగుణం వేరని సూచింపబడుతున్నది. ఇలా అర్థం చెప్పి, మళ్ళీ విశేషాలన్నింటికీ విశేషంగా అర్థనిర్దేశం ఇలా చేశాడు వ్యాఖ్యాత.

అప్రమేయః తనను ఆశ్రయింపనివారికి దుర్జ్ఞేయుడు తెలియరానివాడు. చకారాన్నిబట్టి ఆశ్రితులకు సుజ్ఞేయుడని వ్యక్తమౌతున్నది.

"నాయమాత్మ ప్రవచనేన లభ్యః సమేధయా బహునా ప్రశ్రుతేన యమేవైష వృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్" అన్న ఉపనిషద్వచనాన్నిబట్టి, ఎవరిని స్వామి స్వయంగా వరిస్తాడో (చరణీయునిగా స్వీకరిస్తాడో) వానికే స్వస్వరూపాన్ని స్వభావాలను ఆవిష్కరిస్తాడు తప్ప కేవల శ్రవణమనననిదిధ్యాసనాలవల్ల కాదని చెప్పడానికే 'అప్రమేయః' అన్న విశేషణం వరణీయులకు సులభుడని శ్రీయామున శ్రీసూక్తి – 'నమో నమో వాఙ్మనసైక భూమయే' అని ఇలాగే అనాశ్రయులకు దురాసదుడు, దుష్ప్రాపుడు. ఆశ్రితులకు సులభుడు. జితేంద్రియుడు. అయినా ఆశ్రితులపట్ల చాపల్యం కలవాడే స్వామి ఉత్తమధార్మికశ్చ అని చకారంచేత దూరీకృతమైన అధర్మం కలవాడు. అంటే ధర్మాన్ని దూరంచేసినవాడని అభిప్రాయం. అక్షయ్యకీర్తిశ్చ అనేచోట చకారం చేత కీర్త్యనురూపాలైన విశేషకృత్యాలు స్వామిచేశాడని అవగతమవుతున్నది. విచక్షణశ్చ అనేచోట చకారంచేత ఆశ్రితులను విడవ శక్తికలవాడనే అభిప్రాయం వ్యక్తపరుపబడుతున్నది. 'మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన' అని కదా స్వామిప్రతిజ్ఞ. ఇక్కడ చకారం దేహలీ దీపన్యాయంగా గడపై పెట్టిన దీపంలోనికి వెలుపలికి వెలుగునిచ్చినట్లుగా ఉభయత్ర అన్వయిస్తున్నది.

ఇక్కడ రామాయణ తనిశ్లోకి ఇంచుమించుగా ఇలాగే వ్యాఖ్యానించింది. ఈ శ్లోకానికి మరికొన్ని శ్లోకాలకు మహేశ్వరతీర్థీయవ్యాఖ్య దాదాపుగా ఏమీలేనట్లే. ఇతరవ్యాఖ్యాతలంతా వ్యాఖ్యానించారు గనుక ఇవి ప్రక్షిప్తాలనే అవకాశం లేదు. త్వమాత్త బాణాసన బాణపాణిః అని ఆరంభించి మహేశ్వరతీర్థీయంతో అక్కడక్కడా ఒక్కొక్కపదం వివరింపబడింది. గోవిందరాజీయవ్యాఖ్య – త్వమాత్త బాణాసన అనే 31వ శ్లోకంలోని ఉత్తరార్ధం అవతారరహస్య సూచకంగా ఉన్నా విశేషంగా వ్యాఖ్యానించలేదు. మహేశ్వరతీర్థీయం అభ్యుదయ శబ్దానికి సౌభాగ్యమని అర్థం వ్రాయగా గోవిందరాజీయం దాన్నే స్వీకరించింది. అయితే తనిశ్లోకిమాత్రం కొన్ని పదాలప్రయోగతాత్పర్యాన్ని లెస్సగా వివరించింది. రాముడు తారదృష్టిలో దివ్యపురుషునిగా గోచరించాడు. ఆతడు ధనుస్సును ధరించిన తీరు, తదుచితమైన శరీరసంస్థానము అంటే మహావీర్యత్వనిమిత్తమైన అంతస్సారాన్ని వ్యక్తపరచే శరీరసంస్థానం ఆమెకు గోచరించింది. వ్యాఖ్యాత ఇలా అంటాడు. మహారాజలక్షణాలైన శౌర్యాదిగుణాలను వ్యక్తపరచే మనుష్య శరీరసన్నివేశాల్లో కూడా ఇలాంటి లక్షణం గోచరించదని దాన్ని సూచించడానికే అభ్యుదయ పదప్రయోగం కవి చేశాడంటాడు. ఇక్కడ దివ్యేన 'త్రిపాదస్యాం మృతం దివి' ఇత్యాది ప్రమాణసిద్ధప్రాకృతలోకస్థితదివ్యమంగళ విగ్రహసన్నివేశేనేత్యర్థః అని వ్యాఖ్యానించి వ్యాఖ్యాత తారకు శ్రీరాముని అప్రాకృతపరమపదనాథవిగ్రహం సాక్షాత్కరించిందని సూచించాడు. యచ్చాపి అనే సార్ధశ్లోకవ్యాఖ్య గోవిందరాజీయ మహేశ్వరతీర్థీయాల్లో సమానం. ఏ బాణంతో వాలిని చంపావో అదే బాణంతో నన్నూ చంపమంటుంది తార. వాలి స్త్రీవధదోషం రాదా? అంటే రాదంటుంది? కారణం ఏమిటి? తాను వాలికి ఆత్మస్థానీయ అని శాస్త్రవచనాలు. 'అర్థో వా ఏష ఆత్మనః యత్పత్నీ', 'ఆత్మా హి దారాః' ఇత్యాదిగా ఉద్ఘోషిస్తున్నాయి కనుక తారావధ వాలివధలోనే అంతర్భవిస్తుంది కనుక వేరే దోషం ఏదీ అంటదు అని వివరణం రెండింటా సమానమే. రామానుజీయం శ్లోకక్రమాన్ని సూచించింది.

త్వం చాపి అనే 38 వశ్లోకం ఉత్తమధార్మికశ్చ అనే పూర్వశ్లోకవిశేషణానికి వివరణంగా వ్యాఖ్యాత వ్యాఖ్యానించాడు. 41,42 'మా వీరభార్యే', 'త్రయో హి లోకా' అనే రెండుశ్లోకాలు వ్యాఖ్యానించడంలో

గోవిందరాజీయానికి మహేశ్వరతీర్థీయానికి సూక్ష్మంగా తేడా ఉన్నట్లు అగుపిస్తుంది. వీరపత్నీ! జీవించలేననే విరుద్ధభావనను పెట్టుకోవద్దు. విధాతచేతనే ఈ లోకమంతా విధింపబడింది. ఈ సమస్తసుఖదుఃఖసంబంధాన్ని ఆ విధాతయే కల్పించాడని లోకం చెబుతుంది. మూడులోకాలూ విహితమైన విధానాన్ని అతిక్రమించలేవు. ఆతని వశంలోనే అవి ఉంటాయి. కనుక విధివిధానాన్నిబట్టి పరమప్రీతిని పొందుదువు గాక! నీ పుత్రుడు యౌవరాజ్యాన్ని పొందగలడు. అంటూ శ్రీరామచంద్రుడు తారను ఉపసాంత్వనపరచేవాక్యాలు. ఈ రెండుశ్లోకాల్లోను విధిలేక విధాత అనే శబ్దానికి రాముడు ఉద్దేశించిన అభిప్రాయం ఏమిటి? అని పర్యాలోచిస్తే పైకి విధి శబ్దానికి బ్రహ్మ లేక చతుర్ముఖుడు అనే అర్థం తోచినా, అంతరార్థం పరమాత్మ అనియే. ఇక్కడ విధి విధాతృ శబ్దాలకు చతుర్ముఖమైన అర్థాన్నే గోవిందరాజీయవ్యాఖ్య చెబుతున్నది. విధాత్రా బ్రహ్మణా అని విహితం విధానం బ్రహ్మకల్పితం ప్రకారం అని విధాతృశబ్దానికి అర్థం వ్రాశాడు. ఈ లోకం స్రష్ట అయిన చతుర్ముఖబ్రహ్మ కల్పించిన విధానాన్ని దాటజాలదని కనుక సుఖదుఃఖాలు బ్రహ్మకల్పితాలని అభిప్రాయం. గోవిందరాజీయవ్యాఖ్యనుబట్టి అయితే గోవిందరాజీయ వ్యాఖ్యలాగానే విధాతృశబ్దానికి విధాత్రా బ్రహ్మణా అనే వ్యాఖ్యానించి ఈ లోకాలన్నీ విధాతృకల్పితమైన సుఖదుఃఖయోగాన్ని దాటజాలవు అని అంటుంటే "బ్రహ్మాదయోఽపి విధికల్పితప్రకార ముల్లంఘితుం న శక్నువన్తి కిముత మర్త్యాదయః ఇతి భావః." అని వ్యాఖ్యానించింది మహేశ్వరతీర్థీయవ్యాఖ్య. ఇక్కడ "విధాతా విహితః బ్రహ్మణా నిర్మితః" అన్న వ్యాఖ్యనుబట్టి విధాతృశబ్దానికి చతుర్ముఖబ్రహ్మ అనే అర్థాన్ని వ్రాసినా, విహితం విధానం కల్పితం ప్రకారం తస్య వశగాః విధార్వశగాః నాతిక్రామంతే అని అంటూ పైని పేర్కొన్నవిధంగా "బ్రహ్మాదయోపి విధికల్పిత ప్రకార ముల్లంఘితుం న శక్నువన్తి కిముత మర్త్యాదయః" బ్రహ్మాదులు కూడా విధికల్పితమైన ప్రకారాన్ని ఉల్లంఘించడానికి శక్తులు కారంటే ఇక మర్త్యులవిషయం చెప్పేదేముంది? అన్న అభిప్రాయాన్నిబట్టి పౌర్వాపర్య వైరుధ్యం ఉన్నట్లు అనిపిస్తున్నది. ఒకచోట విధాతృశబ్దానికి బ్రహ్మ అని మరొకచోట విధివిధానాన్ని బ్రహ్మాదులు కూడా దాటలేరనడంచేత, విధి శబ్దానికి దైవమనే అర్థం స్ఫురించడంవల్ల వైరుధ్యం ఉన్నట్లుగా అనిపించినా, బ్రహ్మకూడా విధివిధానాన్ని దాటలేడనే అభిప్రాయమే యథార్థమైనదని భావించడం సముచితం.

ఇరవై అయిదవ సర్గలో సర్వసాంత్వనపూర్వకంగా రాముడు వాలికి సంస్కారం చేయించడం వర్ణింపబడింది. ఈ సర్గలోని శ్రీరామకృతప్రతిబోధన నిరూపకాలైన శ్లోకాలు రెండు వ్యాఖ్యల్లోనూ విశేషంగా వ్యాఖ్యానింపబడ్డాయి. ఈ శ్లోకాలు అవశ్యమననీయాలు. నియతిః కారణం లోకే(4) న కర్తా కస్యచిత్ కశ్చిత్(5) న కాలః కాలమత్యేతి(6) న కాలస్యాస్తి బంధుత్వం(7) కింతు కాలపరిణామః(8) లోకంలో నియతియే కారణం. నియతియే కర్మసాధనం. సర్వప్రాణులను నియమించడంలో నియతియే కారణం. ఎవ్వడూ ఎవ్వనినీ నియంత్రించడంలో స్వతంత్రుడుకాడు. ఈ లోకం స్వభావాన్ని అనుసరించే ప్రవర్తిస్తున్నది. కాలమే దీనికి చిట్టచివరి గతి(పరాయణం). కాలకాలాన్ని అతిక్రమించదు. కాలము నశించదు. స్వభావాన్ని పొంది ఏ ఒక్కడు దాన్ని అతిక్రమించడు. కాలానికి బంధుత్వం లేదు. దానికి ఏ నిమిత్తమూ లేదు. అది పరాక్రమాన్ని చూడదు. మిత్రుడు జ్ఞాతి మొదలైన సంబంధం కూడా కాలప్రవృత్తికి నియామకం లేదా కారణం కాదు. కనుక కాలం అనేది జీవునికి వశపడింది కాదు. కాని, కాలం వల్ల ఏర్పడే పరిణామాన్ని సమ్యగ్ ద్రష్ట అయినవాడు (లెస్సగా ఎరిగేవాడు) గమనించాలి. ధర్మం అర్థం కామం అనే త్రివర్గం కాలక్రమంలోనే ఇమిడి ఉంటాయి. ఈ అభిప్రాయాన్ని వ్యక్తపరచే పై శ్లోకాలలోని కాలశబ్దానికి అర్థాన్ని

నిర్ణయించడంలో గోవిందరాజీయ మహేశ్వరతీర్థీయ వ్యాఖ్యలలో తేడా ఉంది. "కాలం పరమాత్మ" పరమాత్మయే నియతి అని గోవిందరాజీయవ్యాఖ్య. ఇక్కడ గోవిందరాజీయవ్యాఖ్య పూర్తిగా తాత్త్వికదృష్టితోనే సాగింది. ముందుగా తీర్థీయ అభిప్రాయాన్ని గమనించుదాం.

నియతి శబ్దానికి కూడా పరమాత్మయనే గోవిందరాజీయవ్యాఖ్య – "నియమ్యతే అనేనేతి నియతిః ఈశ్వరః" అని గోవిందరాజీయం. "నియమ్యతే అనయా ఇతి వ్యుత్పత్త్యా నియతిః కాలః" అని తీర్థీయవ్యాఖ్య. నియతి అనగా కాలం సర్వనియామకం.ఎవ్వడూ ఎవ్వనికీ కర్తగాడు. స్వభావం అనేది కాలంలోనే ఉంది. దానికి లోబడే ఉంటుంది. కనుక, కాలమే, ఇష్టప్రాపకం (ఇష్టాన్నిచ్చేది) అనిష్టనివారకం (అనిష్టాన్ని నివారించేది) కనుక పర ప్రాప్యం. ప్రాణులే ఒకరికొకరు కర్తలై ఉంటారంటేనే సరిపోతూ ఉండగా, అసలీ కాలమనే అదృష్టాన్ని కల్పించవలసిన అవసరం ఏమిటి? అంటే, కాలమే ప్రాణులకు సుఖదుఃఖప్రాపకం కనుక అదే(మహాకాలమే) దివసము, పక్షము, మాసము, ఋతువు మొదలైన స్వరూపంతో ఔపాధికమై ఉంటుంది.దాన్ని ఎవ్వరూ అతిక్రమించలేరు. ఏకాలంలో ప్రాణి సుఖదుఃఖాలను భోగింపవలసి ఉందో ఆ కాలాన్ని విడచి, వేరుకాలంలో భోగించడం సాధ్యంకాదు. కాలానికి న్యూనత ఎప్పుడూ లేదు. నిరంకుశమైన స్వభావంకల కాలం తన నియమనాన్ని తానే ఉల్లంఘించలేదు. ఇక దానికి పరతంత్రుడైన, ప్రాణి సంగతి చెప్పేదేముంది? కాలమనేది ఏ హేతువుచేత కూడా వశపరచుకోరానిదే.కాలానికి తనను వశపరచుకొనగల బాంధవ్యం అంటూ ఏ పురుషునిలోనూ లేదు. మిత్ర జ్ఞాతిసంబంధం కూడా లేదు. వశీకరణోపాయంగా పురుషకృతమైన ఉపకారం ఏదీ కాలానికి లేదు. పురుషుని పరాక్రమం కూడా కాలాన్ని వశపరచుకొనే ఉపాయం కాదు. కనుక కాలం పురుషునికి అధీనం కాదు. కనుక, శ్రేయస్సును వీక్షించేవాడెవడైనా సర్వలోకవ్యవహారము కాలపరిణామమేనని గమనించాలి. ధర్మార్థకామాలు కాలక్రమసహితాలు. అంటే పూర్వాహ్నము, మధ్యాహ్నము, అపరాహ్నము అని మూడు కాలాలకు ఆయత్తమై ధర్మార్థకామాలు అమరి ఉంటాయి. ఏ కాలంలో ఏ కర్మచేయవలసిఉందో ఆ కర్మ ఆ కాలాన్ని అతిక్రమించదు. కనుక కాలానుబంధంచేత ధర్మార్థకామానుష్ఠానం చేసిన వాలి కాలవిహితమైన స్వర్గాన్నే పొందాడని పై శ్లోకాలన్నీ కాలపరంగానూ, కాలమహిమను చెప్పేవిగానూ, మహేశ్వరతీర్థీయాన్నిబట్టి అవగతమౌతుంది. ఇక గోవిందరాజీయం ఇవే శ్లోకాలను ఎలా వ్యాఖ్యానించిందో గమనించండి.

"నియమ్యతే అనేనేతి నియతిః ఈశ్వరః లోకే విషయే కారణం సర్వలోక కర్తా ఇత్యర్థః" దేనిచేత ఈ సమస్తమూ నియమింపబడుతుందో అది నియమం. అదే ఈశ్వరతత్త్వం. లోకంలో కారణం సర్వలోకకర్త అని అర్థం అంటూ నియతి శబ్దాన్ని సకలలోకకర్త అయిన పరమాత్మగా పేర్కొని, సర్వప్రాణులు నియోగింపబడటంలో సర్వప్రవర్తకుడు (నియతి) అయిన ఈశ్వరుడే కారణం. "తేన వినా తృణమపి న చలతి" ఆయన లేకపోతే గడ్డిపోచైనా కదలదు. అనే న్యాయాన్నిబట్టి, ఈశ్వరపరతంత్రమై లోకం కర్మచేస్తున్నది. స్వతంత్రంగా కాదు. ఈ విధంగా అన్వయముఖంగా ఈశ్వరాధీనత్వాన్ని చెప్పి, వ్యతిరేకముఖంగా దీన్నే (ఈ సమస్తము ఈశ్వరాధీనమని) 'న కర్తేతి కస్యచిత్' అనే శ్లోకంచే చెబుతున్నాడు కవి. ఏఒక్కడూ మరొక్కనికి స్వతంత్రంగా కర్తగాని, ప్రేరకుడుగాని కాజాలడు. ఈ లోకమంతా స్వభావానికి లోబడిఉంటుంది. ఇక్కడ హేతువేమిటి? అన్న శంకకు సమాధానంగా 'తస్య కాలః పరాయణమ్' అని చెప్పబడింది. సర్వవిధలోకప్రవృత్తికీ కారణం కాలమే అని అంటూ వ్యాఖ్యాత– కాల– నియతి–

స్వభావాదిశబ్దాలన్నీ ఈశ్వరబోధకాలని నిష్కర్షించాడు. స్వభావ నియతి కాలాదిశబ్దైః ఈశ్వర ఏవాభిధీయతే, అన్యథా అనేకరాజత్వాపత్తేః స్వభావం, నియతి, కాలం మొదలైన శబ్దాలచేత ఈశ్వరుడే చెప్పబడుతున్నాడు. అలా కాకపోతే లోకనియామకులు అనేకులు కావలసివస్తారు. ఇక్కడ ఈ విషయాన్ని సమర్థించడానికి శ్వేతాశ్వతరవచనాన్ని ప్రమాణంగా చూపుతున్నాడు వ్యాఖ్యాత – 'స్వభావమేకే కవయో వదన్తి' అని. తరువాత శ్లోకంలో కాలశబ్దాన్ని సాక్షాత్పరమాత్మవాచకంగా వ్యాఖ్యానించాడు వ్యాఖ్యాత. 'కాల ఈశ్వరః', 'కాలం నాత్యేతి', 'ఆత్మానం నాతిక్రామతి' అంటూ కాలరూపుడైన ఈశ్వరుడు తానేర్పరచిన నియమాన్ని తాను ఎంతమాత్రం ఉల్లంఘించడు. ఈ లోకం కాలరూపుడైన పరమాత్మకు పరతంత్రమైనట్లు పరమాత్మ ఇంకెవ్వరికీ అధీనపడలేదు. శ్రుతివచనం దాన్నే చెబుతున్నది. "న చాస్య కశ్చిత్ జనితా న చాధిపః" (ఆయనను పుట్టించినవాడెవ్వడూ లేడు) నియామకుడెవ్వడూ లేడు. కాలానికి నాశనం లేదు. అంటే ఆరురకాల వికారాలు లేవు. ఇది కేవలం ఈశ్వరలక్షణం కనుక వ్యాఖ్యాత ఇక్కడ పరమాత్మత్వ నిరూపకమైన పురాణవచనాన్ని ప్రమాణంగా ఇచ్చాడు.

**అపక్షయవినాశాభ్యాం పరిణామర్ధి జన్మభిః ।**
**వర్జితశ్శక్యతే వక్తుం యస్సదాస్తీతి కేవలమ్ ॥**

అని. అపక్షయము, వినాశము, పరిణామము, బుద్ధి, జన్మలులేనిదై ఆ పరమాత్మతత్త్వం అస్తి అని సత్తారూపంగానే నిర్దేశింపబడుతుందని భావం. ఇక్కడ స్వభావశబ్దానికి కూడా పరమాత్మయే అర్థమని వ్యుత్పత్తిని చూపించాడు వ్యాఖ్యాత. "స్వస్మిన్ భవతీతి స్వభావః" తనయందే అంటే స్వాధిష్ఠానంగానే తాను స్వతంత్రంగా ఉండే ఈశ్వరతత్త్వమే స్వభావశబ్దానికి అర్థం. నియతి– కాలశబ్దాలతోపాటు స్వభావశబ్దం కూడా పరమాత్మబోధకమేనని నిర్ధారించాడు వ్యాఖ్యాత. మళ్ళీ ఈశ్వరనిరంకుశస్వాతంత్ర్యాన్నే 'న కాలస్య' అనే శ్లోకం చెబుతున్నది. "కాలస్య ఈశ్వరస్య బంధుత్వం నాస్తి" కాలానికి అంటే ఈశ్వరునికి బంధుత్వం లేదు. కనుక ఈతడు బంధువు అనే పక్షపాతం లేదని అభిప్రాయం. ఆ పరమాత్మతత్త్వాన్ని వశీకరించుకొనే ఉపాయం కూడా లేదు. అయితే ఇక్కడ సంప్రదాయానుగతమైన ప్రక్రియనుబట్టి భగవంతుని వశపరచుకొనే ఉపాయం 'భగవదనుగ్రహం' తప్ప వేరే ఏమీలేదని నిష్కర్షించాడు వ్యాఖ్యాత. "తత్ప్రసాదం వినా స్వప్రయత్నేన వశీకర్తుం న శక్యేత్యర్థః" ఇత్యాదిగా భగవంతుడు పురుషప్రయత్నసాధ్యుడు కాదని, ఆయన స్వయంగా అనుగ్రహిస్తేనే తాను స్వస్వరూపాన్ని సాక్షాత్కరింపజేస్తాడనే స్వాభిమతదర్శనాన్ని ఇక్కడ ఆవిష్కరించాడు వ్యాఖ్యాత. పరమాత్మను వశపరచుకొనే హేతువు పరాక్రమం ఎంతమాత్రం కాదు. మిత్ర–జ్ఞాతి–సంబంధం లేదు. అపరాధుల విషయంలో వారెవరైనా దండధరుడు ఈశ్వరుడు. కనుకనే శ్రుతి అంటున్నది.

"ఏష సేతుర్విధరణః ఏషాం లోకానామసంభేదాయ" ఈ లోకాలు ఒకదానిలో ఒకటి కలసిపోకుండా విడివిడిగా నిలబెడుతున్నవాడు భగవానుడేనని అభిప్రాయం. కనుక ఈశ్వరుడే కారణం. ఈ జీవునికి వశివర్తికాడు. ఈ జీవులు చేసిన కర్మను అనుసరించియే సర్వమూ నడుపుతూ ఉంటాడని అభిప్రాయం. మరి, పరమాత్ముడైన జీవుడు ఏమి చేయాలి? అన్న శంకను వారించడానికి "కింతు కాలపరిణామో ద్రష్టవ్యః" ఇత్యాది శ్లోకం చెప్పబడింది. శాస్త్రనిష్కర్షను బాగుగా అర్థం చేసికొనదలచినవాడు చేతనలను కర్మానుగుణంగా ఏర్పడే పరిణామాన్ని లెస్సగా

గమనించాలి. కనుక, ఈశ్వర కర్మవల్ల ఏర్పడే పరిణామాలపట్ల శోకపడరాదని అభిప్రాయం. ఇలా నియతి–కాల–స్వభావాది శబ్దాలచేతనే పరమాత్మను నిర్దేశించి దైవవ్యవహారాన్ని చెప్పడం ఎందుకు? సాక్షాత్తూ పరమాత్మ శబ్దాన్ని ప్రయోగించి తత్త్వబోధనం చేయవచ్చును కదా! అని శంకించి వ్యాఖ్యాత "అత్ర నియతి–కాల–స్వభావపదైః వ్యామిశ్రతయోక్తిః తదానీం రహస్యం వక్తుమనర్హత్వాత్" ఆ సమయం తత్త్వబోధనానికి తగినది కాదనే అభిప్రాయంలోనే ఇలా చెప్పడం అని సమాధానించాడు. ఆ తరువాత శ్లోకాలవ్యాఖ్యానంతో తీర్థీయ–గోవిందరాజీయవ్యాఖ్యలో పెద్దగా తేడా ఏమీలేదు. మిగిలిన శ్లోకాలు వాలికి జరిగిన చరమసంస్కారాన్ని వర్ణించడమే లక్ష్యంగా కలిగి ఉన్నాయి. ఇక్కడ కేవలం ఆ యా పదాల అర్థాలను వివరించడమే వ్యాఖ్యాతృలక్ష్యంగా వ్యాఖ్యానం సాగింది. రామానుజీయ వ్యాఖ్యనుబట్టి

**అంగదం పరిగృహ్యాశు తారా ప్రభృతయస్తదా ।**
**క్రోశంతః ప్రయయుః సర్వే వానరా హతబాంధవాః ॥**

అనే శ్లోకం అధికపాఠంగా ఉన్నది. దాన్ని గోవిందరాజీయం–తీర్థీయం రెండూ వ్యాఖ్యానించలేదు. వాల్మీకి వాలికి జరిగిన చరమసంస్కారాన్ని పరమవైదికంగా వర్ణించాడు. మరి ఇలా వర్ణించడంలో ఔచిత్యం ఏమిటి? పశు పక్ష్యాదిజాతులకు చరమసంస్కారాధికారం ఉన్నదా? అనే శంకను గోవిందరాజీయవ్యాఖ్య లేవనెత్తి ఇలా సమాధానం చెప్పింది. యద్యపి తిర్యగధికరణరీత్యా తిరశ్చాంన న శాస్త్రవిహితసంస్కారాధికారః, తథాపి, దేవాంశసంభూతానాం తిర్యగవస్థామాత్రాభాభాం వేదాధ్యయన సంయోగాదేవ క్షత్రజాతత్వాత్ సంస్కారార్హతా అస్తీతి బోధ్యం. (నిజానికి తిర్యగధికరణరీతినిబట్టి, పశుపక్ష్యాదులకు శాస్త్రవిహితమైన సంస్కారానికి అర్హతలేదు. అయినప్పటికీ దేవాంశ సంభూతులైనవారికి విశేషించి కేవలం తిర్యగ్జాతిలో పుట్టడం మాత్రమే కలిగినప్పుడు వేదాధ్యయనసంబంధాన్ని బట్టి క్షత్రియజాతిలోపుట్టినట్లు గనుక సంస్కారాహిత ఉన్నది.) అని చెప్పింది. ఇక్కడ మహేశ్వరతీర్థీయం ఈ విధమైన శంకా సమాధానాలు ఏవీ ప్రస్తావించకుండా ఈ ఘట్టాన్ని పఠనం చేస్తే కలిగే ఫలాన్ని గురించి స్కాందవచనాన్నిచ్చి ఉట్టంకించింది.

**తారాప్రలాపమాకర్ణ్య వాలినో నిధనం తథా ।**
**కపీంద్రసంస్కృతిం నారీ శ్రుత్వా హ్యవిధవా భవేత్ ॥**
**దీర్ఘాయుష్యం భవేద్భర్తుః పుత్రిణీ సంభవిష్యతి ॥**

వాలినిధనాన్ని, తారాప్రలాపాలను, కపీంద్రసంస్కారాన్ని విన్న నారి అవిధవ (వైధవ్యం లేనిది) అవుతుంది. అంతేకాదు ఆమె భర్త దీర్ఘాయువు కలవాడౌతాడు. ఆమె పుత్రవతి అవుతుంది. అని ఫలశ్రుతి.

26వ సర్గలో గోవిందరాజీయకారుడు చాలా విశిష్టమైన విచారణ చేశాడు. 'పూర్వోయం వార్షికో వాసః' అనే 13వ శ్లోకం 'నాయముద్యోగసమయః' అనే 14వ శ్లోకం 'ఇయం గిరి గుహా రమ్యా' అనే 15వ శ్లోకం, 'కార్తికే సమనుప్రాప్తే' అనే 16వ శ్లోకం ఈ నాల్గింటినీ వ్యాఖ్యానించడంలోనే రాముడు కిష్కింధగుహలో ఉన్న కాలాన్ని గురించి విచారించి వనవాస – రావణ – వధాదికథావృత్తాలు జరిగిన కాలాలను కూడా సూచించాడు.

పై శ్లోకాలకు తాత్పర్యం ఇది.

"ముందు ఏర్పడిన శ్రావణమాసం వార్షికమాసమని చెప్పబడుతున్నది. ఇది జలాగమనకాలం. సౌమ్యుడా! ఇప్పటినుండి నాల్గుమాసాలు వార్షిక సంజ్ఞ కలిపి ఆరంభింపబడుతున్నాయి. ఇది ఉద్యోగసమయం కాదు. నీవు శుభప్రదమైన పట్టణాన్ని ప్రవేశించు. సౌమ్యుడా! నేనిక్కడ గిరిపై లక్ష్మణునితోపాటు నివసింపగలను. ఈ గిరిగుహ రమ్యమైనది. విశాలమైంది. వాయుసంచారం కలిగి ఉంది. జలసమృద్ధి కలిగి అనేక తామరసోత్పపుష్పశోభితమైంది. కార్తికమాసం రాగానే నీవు రావణవధకై ప్రయత్నించు. ఇది మన ప్రతిజ్ఞ. సౌమ్యుడా! నీవు నీ గృహాన్ని ప్రవేశించు. నీ రాజ్యమందు అభిషిక్తుడవై మిత్రులను ఆనందింపజేయి."

వార్షికశబ్దార్థ విచారణ – 'వర్షా' శబ్దానికి 'స్త్రియాం ప్రావృట్ స్త్రియం భూమ్ని వర్షా' అన్న అమరవచనాన్ని బట్టి వర్షర్తువని అర్థం. ఈ వర్షాశబ్దం కంటే తత్ర భవః ఇక్కడ ఏర్పడినది అనే అర్థంలో వర్షాభ్యష్ఠక్ అనే పాణినీయసూత్రంచేత ఠక్ ప్రత్యయం చేరిస్తే వార్షికశబ్దం ఏర్పడింది. "ద్వౌ ద్వౌ మార్గాది మాసౌ స్యాదృతుః" అనే వచనాన్నిబట్టి రెండు రెండు మాసాలు ఒక్కొక్క ఋతువు కనుక శ్రావణ భాద్రపదమాసాలు రెండూ వర్షర్తువు ఈ రెంటిలోనిదే కనుక శ్రావణానికి కూడా 'వార్షిక' శబ్దం వర్తిస్తుంది. కనుకనే వాల్మీకి 'వార్షికో మాసః శ్రావణః' అన్నాడు. వార్షికసంజ్ఞ కలవి నాల్గుమాసాలు. ఆశ్వయుజ –కార్తికమాసాలుకూడా కలుపుకొని శ్రావణ–భాద్రపద–ఆశ్వయుజ కార్తికాలు నాల్గు వర్షాకాలం. ఛత్రిన్యాయంచేత గొడుగు కలవారి గుంపులో చేరి నడచివెళ్ళే గొడుగులు లేనివారిని కూడా ఒకరిద్దరిని 'ఛత్రి' గొడుగుకలవారిలో చేర్చి వ్యవహరించడం ఛత్రిన్యాయం. అలాగే శ్రావణ భాద్రపదాలురెండే వర్షాకాలమైనా ఆ తరువాత వెంటనే ప్రవర్తించే ఆశ్వయుజ కార్తికమాసాలు కూడా వర్షాలు కురుస్తూఉండటంవల్ల వర్షప్రభావాన్నిబట్టి వార్షికమాసాలుగానే పరిగణించారు.కనుకనే "చత్వారో వార్షికా మాసాః" అని వాల్మీకి వ్యవహారం. ఇవి నాల్గు యుద్ధయోగ్యాలు కావు. వర్షధారలవల్ల భూమి బురదతోకూడి ప్రయాణాని కనుకూలంగా ఉండదు కనుక. ఇక్కడ వ్యాఖ్యాత కేచిత్తు (కొందరు) అని మరొక విచారపక్షాన్ని సూచిస్తున్నాడు. కేచిత్తు పక్షా వై మాసాః ఇతి శ్రుతిపక్షమాశ్రిత్య చత్వారో వార్షికా మాసాః ఇత్యుక్తం. శ్రావణః ప్రథమో మాసః ఇత్యత్రాపి ప్రథమః పక్ష ఇత్యర్థః. చత్వారో వార్షికా మాసాః గతాః, వర్షశతోపమాః అని ఉపసంహారవాక్యం. (ముగింపులోని మాట) ఉన్నది కనుక అని. ఇది అభిప్రాయం కొందరు పక్షా వై మాసాః పక్షాలే మాసాలు అన్న శ్రుతివచనాన్నిబట్టి చత్వారో వార్షికా మాసాః అని చెప్పబడింది. శ్రావణః ప్రథమో మాసః అన్నప్పుడు కూడా (మాసశబ్దానికి పక్షమనే అర్థం) ప్రథమపక్షమనే అర్థం. చత్వారో వార్షికా మాసాః గతాః, వర్షశతోపమాః నూరు సంవత్సరాలతో పోల్చదగిన నాల్గు వార్షికమాసాలు గడిచాయి. అని ఉపసంహారవచనం ఉన్నదికదా! అని వివరించారు. అని పక్షాంతరాన్ని పేర్కొన్నాడు వ్యాఖ్యాత. అయితే వ్యాఖ్యాతయొక్క అభిప్రాయాన్నిబట్టి మాసశబ్దం పక్షపరం కాదు. నెలరోజులనే అభిప్రాయం. కనుకనే తరువాతి శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ–

కార్తికే (మాసి) సమనుప్రాప్తే అన్న శ్లోకంలోని కార్తికమాసశబ్దంచేత ఆశ్వయుజాన్తం తీసుకోవాలని వ్యాఖ్యానించాడు."సమీపం ప్రాప్తే సమనుప్రాప్తే ఆశ్వయుజాన్తే ఇత్యర్థః" అని ఎందువల్లనంటే ఆశ్వయుజంలో కూడా ప్రయత్నానికి కావలసిన పూర్వరంగాన్ని ఏర్పరచుకొని, సీతాన్వేషణం మార్గశీర్షమాసంలోనే జరుపనున్నారు

కనుక. ఈ దృష్టితోనే "వయమాశ్వయుజేమాసే పింగాక్ష ప్రతిచోదితాః" అని వాల్మీకి రామవచనంగా ముందు ముందు చెప్పించనున్నాడు. ప్రచోదనం అంటే సన్నహనం, అంటే ఉద్యమానికి కావలసిన పూర్వసన్నద్ధత అన్నమాట. దీన్నిబట్టి శ్రావణ-భాద్రపద-ఆశ్వయుజ కార్తికాలు నాలుగు వార్షికమాసాలు కనుక పూర్ణస్థాయిలో ఉద్యమం సాగకపోయినా ఆశ్వయుజాంతంలోను కార్తికామాసంలోను సేనా సంసిద్ధత ఏర్పరచుకొని, వార్షికమాసాలు నాలుగూ పూర్తికాగానే మార్గశీర్షంలో నిర్గమనం (సీతాన్వేషణకై బయలుదేరటం) జరగాలని రామాభిప్రాయంగా వ్యాఖ్యాత చెబుతున్నాడు వాల్మీకివచనాలనుబట్టి. కార్తికంలో జరుగువలసినపూర్వరంగసన్నాహానికి సుగ్రీవుడు చేయవలసింది చేయడం లేదనే భావంతోనే కామునికి క్రోధం కలిగినది. లక్ష్మణుని సుగ్రీవసన్నిధికి పంపడం కూడా జరిగింది. స్వయంప్రభాగుహాబిలంలో ప్రవేశించి వెలికివచ్చిన తరువాత 'ద్రుమాన్ వాసంతికాన్ దృష్ట్వా' అని వసంతఋతువు గురించి ప్రస్తావించడం జరిగింది. ఇది వసంతోపక్రమభూతపుష్పోద్గమకాలానికి ముందు సన్నిహితంగా ఉండే ఆకులు రాలే ఫాల్గుణమాసాన్ని దృష్టిలో పెట్టుకొని అలా అనడం జరిగింది. అలాకాకపోతే ఫాల్గునచైత్రమాసాలు వసంతం అనే పక్షాంతరాన్నిబట్టి అనవచ్చు అని గోవిందరాజీయవ్యాఖ్య. ఇక్కడ అనుసంధింపదగిన కాలక్రమాన్ని ఈ వ్యాఖ్యాత ఇలా నిర్దేశిస్తున్నాడు. 'ఉత్తరస్యావధినా పూర్వస్యావధిం జానీయాత్' తరువాతి అవధినిబట్టి పూర్వకాలావధిని తెలుసుకోవాలి. అన్న న్యాయాన్నిబట్టి తరువాత తరువాత ఉన్న కాలాన్ని గ్రహించడం ద్వారా పూర్వోకులసంఖ్యను జ్ఞాపనం చేయడం వాల్మీకిశైలి అంటాడు వ్యాఖ్యాత. దీన్నిబట్టి చైత్రమాసంలో రాముడు అయోధ్యనుండి నిర్గమించడం, అగస్త్యాశ్రమానికి వెళ్ళడానికి ముందే పది సంవత్సరాలు గడిచాయని చెప్పడం జరిగింది. ఇక, పంచవటిలో మూడుసంవత్సరాల తర్వాత చైత్రమాసం రాగా శూర్పణఖా నాసికాఖండనం ఖరదూషణాది సంహారం జరిగినట్లు అవగతమవుతున్నది. రావణుడు మారీచవచనాదులనుబట్టి కొంచెం ఆలస్యంగా ఆ చైత్రమాసంలోనే సీతను హరించాడు. సీతావిరహంచేత దుఃఖపడుతున్న రాముడు చేసిన వసంతవర్ణనంలో 'చైత్రవనానిలః' అన్నాడు కదా! మళ్ళీ ఫాల్గుణం రాగానే రావణవధ అయింది. ఇక ప్రస్తుతంలో ఆషాఢంలో వాలివధ, శరత్కాలంలో సేనాసన్నధత, మార్గశీర్షంలో వానరప్రస్థానం స్వయంప్రభాబలంతో చాలాకాలం గడపడం జరిగాయి. 'కాలశ్చ నో మహాన్ యాతః' అని చెప్పబడింది కదా! ఇక వెలుపలికి వచ్చిన తర్వాత ఫాల్గున శుద్ధత్రయోదశినాడు హనుమంతుడు సముద్రాన్ని దాటడం, చతుర్దశినాడు తిరిగిరావడం, పౌర్ణమినాడు దండయాత్ర ఇత్యాది. ఇక మిగిలింది యుద్ధకాండలో చెబుతాం అని సమయనిర్ణయ విచారణను ముగించాడు గోవిందరాజీయ వ్యాఖ్యాత.

ఇక ఇదే సర్గలోని సుగ్రీవరాజ్యాభిషేచనప్రక్రియ అంతా వైదికంగా సాగినట్లు వాల్మీకి వర్ణించగా, అక్కడక్కడ విశిష్టపదాలకు అర్థాలను మాత్రమే వ్యాఖ్యాతలు చెప్పారు. ఇక్కడ ఒకవిషయాన్ని గుర్తించాలి. వెనుక వాలికి జరిగిన సంస్కారం వైదికంగా సాగటాన్నిబట్టి వానరులలో వాలి క్షత్రియజాతివాడని వ్యాఖ్యాత పేర్కొన్నాడు. దానికి ప్రోద్బలంగా వర్ణవ్యవస్థవానరుల్లోనూ ఉన్నట్లు ఈ శ్లోకం సూచిస్తున్నది -

**తతస్తే వానరశ్రేష్ఠం యథాకాలం యథావిధి ।**
**రత్నైర్వస్త్రైశ్చ భక్ష్యైశ్చ తోషయిత్వా ద్విజర్షభాన్ ॥**

అన్న శ్లోకంలో 'ద్విజర్షభాన్' అన్న పదానికి 'యాజనార్థమాగతాన్' 'మంత్రవిదః వానరపురోహితాః' అని గోవిందరాజీయవ్యాఖ్య వివరించగా, మహేశ్వరతీర్థీయం 'ద్విజర్షభాన్' అన్న పదానికి వానరజాతీయద్విజర్షభాన్ అని వివరణం ఇచ్చింది. దీన్నిబట్టి వానరులలోనూ వర్ణవ్యవస్థ ఉన్నందువల్ల, వాల్మీకి, వాలిని క్షత్రియునిగా పరిగణించి వైదికచరమసంస్కారాన్ని వర్ణించాడు. అలాగే ప్రస్తుతంలో సుగ్రీవపట్టాభిషేక ప్రక్రియకూడా అలాగే సాగిందని వర్ణించాడు. ఇదంతా వైదికప్రక్రియగానే వాల్మీకి "శాస్త్రదృష్టేన విధినా మహర్షివిహితేన చ" అని చెప్పగా గోవిందరాజీయం మహర్షివిహితేన విధినా అంటే కల్పసూత్రోక్తవిధిచే అని అర్థం వ్రాశాడు. మహేశ్వరతీర్థీయమూ ఇలాగే చెప్పింది.'శాస్త్రంవేదః', 'మహర్షయః మన్వాదయః' అని అక్కడి వివరణం.

**అభిషేచనం చ తారాయా రుమాయాః ప్రాప్తిముత్తమామ్ ।**
**సుగ్రీవస్య సదా శ్రుత్వా రాజ్యలాభం స గచ్ఛతి ॥**

ఎవ్వడు సుగ్రీవుని అభిషేచనాన్ని, ఆతడు తారారుమలను పొందడాన్ని వింటాడో వానికి రాజ్యలాభం కలుగుతుందని అభిప్రాయం. 27 వ సర్గలో రాముడు సీతావిరహంచేత ఏకాంతవాసం దుర్భరంకాగా శోకిస్తూవుంటే ఆయనను ఓదార్చడం లక్ష్మణుడు చేయగా దాన్ని వర్ణించడం జరిగింది. ఇక్కడ శ్రీరాముడు లక్ష్మణునితో కలిసి నివసించడానికి స్వీకరించిన గిరిగృహ వాస్తురీత్యా నివాసయోగ్యంగా తూర్పు ఉత్తరాలకు విస్తరించి ఉన్న ప్రదేశాలలో గుహ, నైరుతిమూల ద్వారం కలిగి ఉన్నందున పౌరస్త్యవర్షం ప్రవేశించరానిదిగా ముందునుండి వర్షం ప్రవేశించడానికి వీలుకానిదిగా వెనుక ఉన్నతంగానుండి పురోహితనిరోధకంగా ఉన్నదని తీర్థీయవ్యాఖ్య సరణినే గోవిందరాజీయం స్వీకరించింది. వాల్మీకి శ్లోకానికి కేవలం భావానువాదమే ఈ వ్యాఖ్యాతలిరువురూ చేశారని మూలశ్లోకాన్నిబట్టి గమనించవచ్చు.

**ప్రాదుక్ ప్రవణే దేశే గుహో సాధు భవిష్యతి ।**
**పశ్చాచ్చైవోన్నతా సౌమ్య! నివాతేయం భవిష్యతి ॥**

అని ఇక లక్ష్మణుడు శోకాకులుడైన రాముని ప్రతిబోధించే శ్లోకాల్లో 35 వ శ్లోకంలో "క్రియాపరః" "దైవపరాయణః" అన్న రామవిశేషణాలను వివరిస్తూ – తీర్థీయవ్యాఖ్య "క్రియాపర ఇత్యనేన కార్యసిద్ధిహేతు భూతపురుషకారత్వముచ్యతే" కార్యపరుడు అనే వానిచేత కార్యసిద్ధిహేతువైన పురుషకారత్వం చెప్పబడుతున్నదని వ్యాఖ్యానించింది. గోవిందరాజీయం దీన్నే స్వీకరిస్తూ – దైవపరాయణ శబ్దానికి విలక్షణార్థాన్ని చెప్పింది. దైవపరాయణః అంటే భాగ్యసంపన్నుడు అని తీర్థీయవివరణ కంటే – 'కార్యసిద్ధిహేతుభూతదైవతనిష్ఠతా ఉక్తా' అని కార్యసిద్ధికి కావలసిన దైవతనిష్ఠత చెప్పబడుతున్నదని చేసిన వివరణం సముచితం. ఇక అవ్యవస్థితశబ్దానికి ఉద్యోగశూన్యుడని తీర్థీయవ్యాఖ్య ధైర్యరహితుడని గోవిందరాజీయవివరణ. రెండూ సముచితాలే. ధైర్యంలేనివాడు ఉద్యమింపజాలడుకదా! కనుక ధైర్యరహితః ఉద్యోశూన్యః అనే అర్థాలు రెండూ ఇక్కడ అపేక్షితాలే.

28వ సర్గ వర్షవర్ణనరూపం రసఘనం. ఈ సర్గను వ్యాఖ్యానించడంలో గోవిందరాజీయం సాంప్రదాయికాభి నివేశాన్ని విశేషంగా చూపించింది. ఇక్కడ భగవానుడు స్వాశ్రితవిశ్లేషాన్ని సహింపజాలననే తన స్వభావాన్ని అన్యాపదేశంగా లక్ష్మణునికి ప్రదర్శిస్తూ, ఎంతోకొంతవిరోధనిరసనం చేసి స్వాశ్రితరక్షణం చేయడమనే కొంతలాభాన్ని

పొందగల్గినా ఇది సరియైనది కాదని భావిస్తున్నాడు స్వామి.'నవమాస ధృతం గర్భం' ఇత్యాది తృతీయశ్లోకం శ్రుతితాత్పర్యనిదర్శకమని గోవిందరాజీయవ్యాఖ్య తీర్థీయానుసారి.

"యాభిరాదిత్య స్తపతి రశ్మిభిః తాభిః పర్జన్యో వదతి" ఇతి శ్రుతిరత్రానుసంధేయా అని తీర్థీయవ్యాఖ్య. దాన్నే గోవిందరాజీయం అనువదించింది. "శక్యమంబరమారుహ్య" అనే నాల్గవ శ్లోకానికి తీర్థీయవ్యాఖ్య అసలు లేదు. ఇక్కడ సూర్యమండలాంతర్వర్తియైన విష్ణువు ఆరాధింపదగినవాడని గోవిందరాజీయవ్యాఖ్య –

"దివాకరం అస్మత్కులగురుభూత సూర్యమధ్యే సదా ధ్యేయం విష్ణుమ్", "అలంకారప్రియో విష్ణు" ఇతి న్యాయేన అలంకర్తుం శక్యమ్ అని. ఇక్కడ 'సహపత్న్యా విశాలాక్ష్యా' అని అయోధ్యాకాండంలో చెప్పినట్లు సీతతోపాటు కలిసి ఆరాధించి భాగ్యం కలుగలేదే అన్న రాముని తహతహ ఇక్కడ వ్యక్తమౌతుందంటాడు వ్యాఖ్యాత.

'సంధ్యారాగోత్థితైః' అనే 5వ శ్లోకంలో ఉపమాలంకారమని గోవిందరాజీయవ్యాఖ్య. వాస్తవానికి ఇలాంటి వ్రణపటబంధనం ఆకాశానికి అసంభావ్యం కనుక ఇది సంభావనాపరమై ఆకాశానికి వ్రణపటం కట్టబడిందా అన్నట్లున్నదనే ఉత్ప్రేక్ష చెప్పడమే ఆలంకారిక మర్యాదాసమ్మతం. అయితే తనిశ్లోకీ వ్యాఖ్య ఇక్కడ అతిశయోక్తి అని అంటున్నది. ''అంబరస్య వ్రణసంబంధాసంభవాదతిశయోక్తిరలంకారః'' అని ఆకాశానికి వ్రణసంబంధం సంభవించదు కనుక అసంబంధే సంబంధపరికల్పనరూపమైన అతిశయోక్తి అని అభిప్రాయం. ఇదీ సమర్థనీయమే. అలాగే "కామాతురమివాంబరమ్" అనే చోట ఉత్ప్రేక్షయేనని తనిశ్లోకి. ఇది రూపకానుప్రాణితం. ఎందువల్లనంటే మందమారుత నిస్వాసం సంధ్యా చందనరంజితం అనే రెండుచోట్ల మందమారుతం నిశ్వాసంగాను, సంధ్య చందనంగాను, రూపితమైనందున రూపకం. దీనిచే ఉత్ప్రేక్ష అనుప్రాణితమైందని భావన. ఇలా అలంకారనిరూపణ ప్రక్రియ గోవిందరాజీయ రామానుజీయ తనిశ్లోకి వ్యాఖ్యల్లోనే గోచరిస్తుంది. మహేశ్వరతీర్థీయంలో అలంకారనిరూపణ ప్రక్రియ లేదు. 'ఏషా ఘర్మ పరిప్లుష్టా' అనే 7వ శ్లోకంలో సీతేవ అని సీతతో భూమి పోల్చడంచేత ఈ పోలికను నిర్వహించడానికి శ్లేషాలంకారం ఆశ్రయింపబడింది. ఘర్మపరిక్లిష్టా ఇత్యాది విశేషణాల్లో అని గోవిందరాజీయం. 'పాతువాంజలిభిశ్శక్యం' అనే శ్లోకంలో వాయువుకు అందలిపానసంబంధంలేకపోయినా ఉన్నట్లు చెప్పడం అతిశయోక్తి అని గోవిందరాజీయం. తనిశ్లోకి ఇక్కడ 'అంజలిభిః పాతుం శక్యం' అనడంచేత వాతవయవాల పట్ల ప్రశ్లిష్టావయవత్వం అతిశీతలత్వం వ్యక్తపరుపబడుతున్నదని వ్యాఖ్యానించింది. 9వ శ్లోకంలో బింబప్రతిబింబభావమూలకంగా ఉపమా నిర్వహింపబడిందని గోవిందరాజీయం. 10వ శ్లోకంలో రూపకానుప్రాణితోపమాలంకారం. 11వ శ్లోకంలో వ్యస్తరూపకం. ఉత్ప్రేక్షరూపకాలకు అంగాంగిభావసంకరం. 10వ శ్లోకంలో తనిశ్లోకి – అంతస్తనితశబ్దంచేత వేదాధ్యయనిరతులైన బ్రహ్మచారులు సరిగా ఉచ్చరింపలేకపోతే గురువు కశాఘాతంచేత శిక్షించగా వారు వేదననుభవించడం సూచింపబడిందని వ్యాఖ్యానించింది. దానివల్ల ఆనాటి వేదాధ్యయనవ్యవస్థ సూచింపబడు తున్నది.మెరుపులచే కొట్టబడిన అంబరవేదనాఘోష మేఘాలగర్జనతో చేరినట్లు గురూచ్చారణా ననుచ్చారణజనితమైన వేదఘోషం బ్రహ్మచారుల వేదనాఘోషం రెండూ సమ్మిశ్రితాలైనాయని వ్యక్తమవుతుందంటాడు వ్యాఖ్యాత.

కొన్ని తాత్త్విక భావనలు

గోవిందరాజీయం రామానుజీయం తనిశ్లోకి ఈ మూడింటిలో అక్కడక్కడ వర్షవర్ణపరాలైన శ్లోకాల్లో తాత్త్వికభావాలు వ్యక్తమవుతున్నాయన్న వ్యాఖ్యానం గోచరిస్తుంది. కొన్నిటిని గమనించుదాం. 14వ శ్లోకంలో

కుటజాలను వర్ణించిన కవి, అవి రామునికి కామసందీపకాలుగా ఉన్నాయన్నాడు. ఇక్కడ "అనేన కేషాంచిదస్మదీయేషు బ్రహ్మానుభవసంతుష్టేషు సత్సు కేషాంచిదస్మదనుభవాభావో మమాతీవ దుస్సహ ఇత్యుక్తమ్" అని వ్యాఖ్యానించాడు వ్యాఖ్యాత. కొందరు మనలోనివారు బ్రహ్మానుభవంచేత సంతుష్టి చెంది ఉండగా మరికొందరికి మా అనుభవం లేకపోవడం నాకెంతో దుర్భరంగా ఉన్నదన్న భగవద్భావన వ్యక్తమవుతున్నదని అభిప్రాయం. 15వ శ్లోకంలో (రజః ప్రశాన్తం ఇత్యాది) భగవత్కటాక్షఫలం ఎలాంటిదో అన్యాపదేశంగా కవి చెబుతున్నాడని వ్యాఖ్యాతృభావన. రజశ్శబ్దంచేత రజస్తమస్సులు రెండూ ప్రశాంతమైనాయని చెప్పబడుతున్నది. 'వాయు' శబ్దంచేత సతతసంసారగతియైన జీవుడు సూచింపబడుతున్నాడు. 'సహిమ' అనే శబ్దంచేత శీతలహృదయత్వం, 'నిదాఘ' శబ్దంచేత ఆధ్యాత్మికాది తాపత్రయశాంతి, యాత్రా శబ్దంచేత సంసారగతి, 'స్వదేశ' శబ్దంచేత స్వప్రాప్యభూతపరమపదం వ్యక్తమవుతున్నాయి. ఇక 16వ శ్లోకంలో హంసలు వర్షభీతితో మానససరోవరానికి వెళ్తున్నాయని అనడంచేత పరమహంసలని చెప్పబడే సన్యాసులు చాతుర్మాస్యకారణంగా తమసంచారాన్ని నిలిపారని వ్యక్తమవుతున్నది.

'సంప్రస్థితాః' అనే మాటచేత "వైరాగ్యవత్త్వం" వ్యక్తమవుతున్నది. 'ప్రియాన్వితాః' అనే పదం భగవద్భక్తిని స్ఫురింపజేస్తున్నది. "అభీక్ష్ణవర్షోదక విక్షతేషు" అనే పదంచేత భగవత్కటాక్షంచేత కర్మనివృత్తి చెప్పబడుతున్నది. ఇక 17వ శ్లోకంలో ఆకాశాన్ని వర్ణిస్తూ కవి శాంతిమహార్ణవస్వరూపం గోచరిస్తున్నదన్నాడు. ఇక్కడ "అనేన మందోజ్ఞానేన ప్రకాశాప్రకాశం బ్రహ్మస్వరూపముచ్యతే" అంటాడు వ్యాఖ్యాత. అజ్ఞానం తొలగినందువల్ల కొంత ప్రకాశించి, ఇంకా అజ్ఞానసంబంధం ఉండటంచేత అప్రకాశంగా ఉన్న అంటే తెలిసీతెలియకఉన్న బ్రహ్మస్వరూపం ఇక్కడ స్ఫురిస్తున్నదంటాడు. 18వ శ్లోకంలో వేగంగా పరుగెడుతున్న గిరి నదులను వర్ణించాడు కవి. ఇక్కడ – "అత్ర సాత్త్వికరాజసజ్ఞానమిశ్రం భగవద్విషయానురాగయుక్తం భక్తిప్రేరిత స్తుతిరేవ ముఖరితపరిసరం హృదయం వహన్తో భక్తాః కథ్యంతే" అంటాడు వ్యాఖ్యాత. గిరినదీప్రవాహాలు సర్జకదంబపుష్పాలతో కూడి క్రొత్తగా గైరికాదిధాతుమిశ్రితమైన జలం నెమళ్ళ కేకలతో అనుస్యూతమై గలగలపారుతున్నాయి. ఈ పారే నదులే భక్తులు. వీరికి సాత్త్విక–రాజసజ్ఞానాలు పూలలా ఉన్నాయి. గైరికాదిధాతువుల్లా భగవద్విషయకరాగం ఉంది. మయూరకేకారాల్లా భక్తిప్రేరిత స్తుతిరవాలచేత ప్రతిధ్వనియుత పరిసరంగల హృదయం కలిగి ఉన్నారట భక్తులు. ఇక, 19వ శ్లోకంలో జంబూఫలాన్ని భూమిపతితమైన ఆమ్రఫలాన్ని కవి వర్ణించాడు. ఇది వ్యాఖ్యాతదృష్టితో భగవత్కృపచేత లభించిన జీవఫలాభోగం అయింది. 20వ శ్లోకంలోని గర్జిస్తున్న మేఘాలు– మార్గప్రతిష్ఠాపనంకోసం ఉద్యమించిన సర్వలోకప్రసిద్ధ సకలభావదృక్కులుగా వ్యాఖ్యాతకు గోచరిస్తున్నారు. 21వ శ్లోకంలో వర్షాజలాలచే తడిసిన శాద్వలాలు (పచ్చికబయళ్ళు) వ్యాఖ్యాతకు దివ్యదంపతీకరసముద్ధృతాలైన జలకుంభాలతో తడుపబడిన ఆలవాలాలు కల ఉద్యానవనాలతో సమానంగా లోకాలన్నీ గోచరిస్తున్నాయి.

22వ శ్లోకంలో జలపూర్ణాలైన మేఘాలు బెగ్గురుపక్షులతోకూడి పర్వతశృంగాలపై మెల్లమెల్లగా ఆగి ఆగి సమితిభారాన్ని వహిస్తూ గర్జిస్తూ వెళ్తున్నాయి అనే భావనతో వ్యాఖ్యాతకు ఒక అందమైన తాత్త్వికాభిప్రాయం గోచరిస్తున్నది. "అనేన హృదయే నోద్వహన్ హరిమ్" "ఇత్యుక్తరీత్యా భగవద్ధ్యానేన యుక్తాః విశదజ్ఞానాః సంతతస్తుతిశీలాః పూర్వాఘోత్తరాఘక్లేశం క్రమేణోత్తీర్య పరాం కోటిమాపన్నా ప్రతిపద్యన్తే" అని వ్యాఖ్యాతృవచనం.

ఇది దీని అభిప్రాయం.

ఇక్కడ సజలమేఘాలు, తమ హృదయాల్లో శ్రీహరిని ధరించి, నిరంతరభగవద్ధ్యానయుక్తులైన భక్తులు. విశదజ్ఞానమే మేఘాలలోని జలం. ఒక శిఖరం నుండి మరొక శిఖరాన్ని మెల్లగా దాటి మేఘాలు వెళ్తున్నట్లు, భక్తులు కూడా పూర్వాఘ – ఉత్తరాఘలను అంటే క్రమంగా అతిక్రమించి, పై స్థితికి పరాంకోటిని పొందారు. ఇలాంటి ఉత్తమభక్తులిక్కడ వర్షమేఘవర్ణముఖంగా కవిచే సూచింపబడుతున్నారని వ్యాఖ్యాతృభావన.

23వ శ్లోకంలో ఆకాశంలో మేఘకామనతో సానందంగా ఎదురుగా వెళ్తున్న బలాక పంక్తి, గాలికి మధ్యమధ్య పంక్తివిచ్ఛేదం ఏర్పడుతూ ఉండగా, ఆకాశానికి అందంగా అలంకరించిన పుండరీకమాలలో ఉన్నదన్న భావన చెప్పబడింది. ఇందులో – కాలమేఘశ్యాముడైన భగవంతుని పొందడానికి ప్రవర్తించిన భక్తిరూపాపన్నమైన బుద్ధి, సత్పురుషునికి కలుగుతున్నదని వ్యక్తపరుపబడుతున్నదని వ్యాఖ్యాతృభావన. ఇంచుమించుగా ప్రతి శ్లోకంలోనూ వ్యాఖ్యాత విశదపరచిన భావాలు ఇలాంటిదే, గోవిందరాజీయ – రామానుజీయాల్లో భాసిస్తున్నాయి. 24వ శ్లోకంలో భగవత్కటాక్షదృష్టిచేత కొంత విస్తరించిన భక్తిగల భక్తులు సూచింపబడుతున్నారు. 25వ శ్లోకంలో తుల్య యోగితాలంకారంతోపాటు లోకోచ్ఛేదనంకోసం ప్రవర్తిస్తున్న శ్రీహరి తదేకాయత్తచిత్తుడని ఆయనకు శేషభూతులైన జీవులు శేషియైన హరికి పరతంత్రులై ఉన్నారని సూచింపబడుతున్నది. 29వ శ్లోకంలో “శనైర్నదం షట్చరణాస్సృజం” అన్నమాటచేత చేతనాలు క్రమంగా భగవత్ప్రాతికూల్యాన్ని విడచి ఆనుకూల్యాన్ని వహిస్తున్నారని సూచింపబడుతున్నది.

32వ శ్లోకంలో ‘మార్గానుగః’ ఇత్యాది శబ్దాలచేత సన్మార్గచారి అంటే వేదమార్గానుసారి అయిన తత్త్వవేత్త దిగ్విజయానికి ఉద్యమించి ప్రతివాది శబ్దాన్ని విని, వాదయుద్ధాన్ని కాంక్షిస్తూ వెనుక మరలిన వైనం వ్యక్తమౌతున్న దంటాడు వ్యాఖ్యాత. ఇంతవరకు గోవిందరాజీయవ్యాఖ్య శైలి ఇది. ఇక, ‘షట్పాదతంత్రైః’, ‘క్వచిత్ప్రవృత్తై’ ఇత్యాది. 37 శ్లోకాల్లో ‘వనేషు సంగీతమివ ప్రవృత్తమ్’ వనాల్లో సంగీతం ప్రవర్తించిందా అన్నట్లున్నదని ఉత్ప్రేక్షానుగుణంగా వ్యాఖ్యాత చేసిన సమన్వయం సాహిత్యవివేచనారీతిని చక్కగా చూపుతున్నది. ఇక్కడ గోవిందరాజీయవ్యాఖ్య మహేశ్వరతీర్థీయ సమన్వయాన్నే ఈ శ్లోకాల్లో స్వీకరించింది. తాత్త్వికవిషయప్రస్తావనలేని వివరణల్లో గోవిందరాజీయ వ్యాఖ్యకు తీర్థీయవ్యాఖ్యయే చాలావరకు మార్గదర్శకమనడంలో అనౌచిత్యం లేదు. తాత్త్వికసమన్వయశైలిమాత్రం తీర్థీయవ్యాఖ్య చాలాదూరమనే చెప్పాలి. ఇక్కడ సాంప్రదాయిక వ్యాఖ్యాశైలి అనేది గోవిందరాజీయ–రామానుజీయ–తనిశ్లోకి వ్యాఖ్యల విశేషోపజ్ఞమేనని కూడా నిర్మత్సరబుద్ధులైన విద్వాంసులు గుర్తింతురుగాక.

**నివృత్తకర్మాయతనః నూనం సంచితసంచయః ।**
**ఆషాఢీ మభ్యుపగతో భరతః కోసలాధిపః ॥**

అనే శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ ఉపరతగృహవ్యాపారుడై ఆషాఢపౌర్ణమాసిని వ్రతాంతంగా స్వీకరించి కోసలాధిపుడైన భరతుడు చాతుర్మాస్యవ్రతాచరణ చేశాడని చెబుతూ మహాభారతపురస్సరంగా చాతుర్మాస్యవ్రత నిర్ణయం మహేశ్వరతీర్థీయకారుడు.

**ఆషాఢే తు సితేపక్షే ఏకాదశ్యాముపోషితః ।**
**చాతుర్మాస్య వ్రతం కుర్యాత్ యత్కించిత్ ప్రయతో నరః ॥**

**వార్షికాంశ్చతురో మాసాన్ వ్రతం కించిత్ సమాపయేత్ ।**
**అసంభవే తులార్కేపి కర్తవ్యం తత్ప్రయత్నతః ॥**

అని. ఆషాఢ శుక్ల ఏకాదశినాడు ఉపవాసం ఉండి చాతుర్మాస్యవ్రతం అనుష్ఠించాలని దీని అభిప్రాయం. ఈ సర్గలోని ఇతరశ్లోకాల వ్యాఖ్యానం గోవిందరాజీయ తీర్థీయవ్యాఖ్యలకు సమానంగానే ఉంది. కవితావైభవదృష్టితో ఈ సర్గ చాలా అందమైంది. కావ్యత్వలక్షణమైన వర్ణనాచాతుర్యం ఇక్కడ పరాకాష్ఠ చెంది అనన్త కాలిక లౌకిక కవులకు మార్గదర్శకమైంది. దీన్ని ఆవిష్కరించడంలో వ్యాఖ్యలు కొంతవరకు కృతకృత్యతను సాధించాయని చెప్పవచ్చు.

29వ సర్గలో కామవృత్తుడై ప్రతిజ్ఞను మరచి ఉన్న సుగ్రీవుని హనుమంతుడు ప్రతిబోధించి కార్యోన్ముఖుని చేయడం ప్రధాన విషయం. హనుమద్వచనాలను సుగ్రీవప్రవృత్తిని దీనికి పూర్వరంగంగా వర్ణింపబడిన సుగ్రీవకామప్రవృత్తిని ప్రతిపాదించే శ్లోకాలను ఇంచుమించుగా ప్రతిపదార్థవివరణరీతిలో తీర్థీయం, దాన్ని అనుసరించి గోవిందరాజీయం వివరించాయి. ఈ రెండు వ్యాఖ్యలకు పెద్దగా తేడా ఎక్కడా లేదు. ఈ సందర్భంగా రామానుజీయటీకలో కొన్ని శ్లోకాలకు కామందకీయవచనోదాహరణపురస్సరంగా వివరణ ఈయబడింది.

**యస్య కోశశ్చ దండశ్చ మిత్రాణ్యాత్మా చ భూమిప ।**
**సమవేతాని సర్వాణి సరాజ్యం మహదశ్నుతే ॥**

అనే శ్లోకానికి వ్యాఖ్యానిస్తూ దండ శబ్దానికి సైన్యవిశేషమని మాత్రమే గోవిందరాజీయం అర్థనిర్దేశం చేసింది. తీర్థీయం –

'అద్వైధ్యః క్షత్రియప్రాయో దండో దండవిదాం మతః' అన్న కామందకీ వచనైకదేశాన్ని మాత్రమే ఇచ్చింది. ఇది చాలదు. కనుక రామానుజీయవ్యాఖ్య 'దండ' శబ్ద వివరణానికి పూర్తిగా కామందకవచనాలను ఇలా నిర్దేశించింది.

**పితృపైతామహోవంశసంభవో దత్తవేతనః ।**
**విఖ్యాతపౌరుషో జన్యే కుశలః కుశలైర్వృతః ॥**

**నానాప్రహరణోపేతో నానాయుద్ధవిశారదః ।**
**నానాయోధసమాకీర్ణః విరాజిత హయద్విపః ॥**

**ప్రవాస్య చ సుదుఃఖేషు యుద్ధేషు చ కృతశ్రమః ।**

అని దండశబ్దార్థాన్ని విశేషవచనపురస్సరంగా వివరించింది. ఇది దీని భావన. తండ్రి తాతలనుండి వచ్చింది. ఉత్తమవంశసంజాతము, వేతనంచే పోషింపబడేది. యుద్ధాల్లో ప్రసిద్ధి వడసిన పౌరుషం కలది, నిపుణత కలిగి, నిపుణవ్యక్తులతో కూడినది. అనేకానేకాయుధాలతో కూడినది. అనేకులైన యుద్ధవిశారదపురుషులు కలది, గుర్రాలతోను ఏనుగులతోను ఒప్పునది, దూరదేశాలకు వెళ్ళికూడా అతిదుఃఖకరాలైన యుద్ధాల్లో విశేష శ్రమ చేసినది. ద్వైధం (పరస్పర వైరభావన లేనిది). క్షత్రియులతో పూర్తిగా ఏర్పడినది అయిన సైన్యవిశేషమే 'దండ' మని దండవేత్తలెరుగుదురు అని అభిప్రాయం. "దండ్యతే అనేన ఇతి దండః" దీన్ని సాధనంగా చేసికొని శత్రువు శిక్షింపబడుతాడు కనుక దండము అనే వ్యుత్పత్తిని బట్టి సైన్యవిశేషమనే అర్థం చెప్పబడింది. ఎవ్వనికి కోశము

మిత్రులు, దండము తాను కలిసికట్టుగా ఉండే వ్యవస్థ ఉంటుందో వాడే రాజ్యాన్ని లెస్సగా భోగింపగలడని తాత్పర్యం. హనుమత్ ప్రతిబోధనవచనాల్లో ఇదికూడా ఒకటి. ఇలా నీతిప్రధానంగా సాగిన ఈ సర్గను గోవిందరాజీయ-తీర్థీయ- రామానుజీయ వ్యాఖ్యలు సమానంగానే వ్యాఖ్యానించాయి. ఇక్కడ విశేషించి హనుమదుపదేశంలో 'మిత్రకార్యాన్ని సముచితకాలంలో చేయాలి' అన్న నీతిసూత్రాన్ని నిరూపించే వాల్మీకి శ్లోకాల పౌర్వాపర్యశ్లోక తాత్పర్యసమన్వయంలో వ్యాఖ్యలు జాగరూకతను వహించాయి.

"త్రిపంచరాత్రా దూర్ధ్వం యః ప్రాప్నుయాన్నేహ వానరః" అన్న శ్లోకంలో త్రిపంచరాత్రశబ్దానికి తీర్థీయవ్యాఖ్య వ్యుత్పత్తిని ఇలా చూపింది. 'త్రిరావృత్తానాం పంచానాం రాత్రాణాం సమాహారః త్రిపంచరాత్రం' మూడుసార్లు ఆవృత్తాలైన ఐదేసి రాత్రుల సమూహమే అంటే పదిహేనురాత్రులు త్రిపంచరాత్రశబ్దానికి అర్థం. ఈ సర్గలకు ఫలశ్రుతివచనాలను తీర్థీయం ప్రదర్శించలేదు. ముప్పదియవ సర్గలో శరత్కాలం వచ్చినా ఇంకా సీతాన్వేషణానికి ఉద్యమించని సుగ్రీవుని చూచి రాముడు కోపగించడమే ప్రధానవిషయం. ఇక్కడ "ఆ సేనః పర్వతస్యాగ్రే" అనే శ్లోకం ఆ తర్వాత "దృష్ట్వా చ విమలం వ్యోమ" అనే శ్లోకక్రమాన్ని గోవిందరాజీయం నిర్దేశించింది. "వ్యత్యాసస్తు లేఖకప్రమాదకృతః" తేడా ఏదైనా ఉంటే అది లేఖక దోషమేనని పేర్కొన్నాడు వ్యాఖ్యాత. తీర్థీయవ్యాఖ్యలో అసలు "ఆ సేనః పర్వతస్య" అనే శ్లోకాన్నే ప్రస్తావించకపోవటం గమనార్హం. ప్రతీక నిర్దేశం లేకపోయినా శ్లోకపాఠంలో తేడాఉన్నదని భావింపనక్కరలేదు. ఇలా వ్యాఖ్యానింపక విడచిన శ్లోకాలు ఎన్నో ఉన్నాయి. 14వ శ్లోకంలో 'తతః చంచూర్య కుటిలం' అని గోవిందరాజీయపాఠం. 'సంచార్య కుటిలం' అని తీర్థీయ పాఠం. చంచూర్య అనే పదం 'నిత్యం కౌటిల్యే గతౌ' అనే సూత్రంచేత యజన్తంగా వ్యాఖ్యాత నిరూపించాడు. ఫలాభిలాషతో కుటిలమార్గంలో చరించి అని అర్థం. తీర్థీయం కూడా ఇదే.

లక్ష్మణుడు రామునికి చేసే ప్రతిబోధనం భగవానుడు తనను ఆశ్రయించిన చేతనులను రక్షించడంలో విలంబం చేయకుండా ప్రేరేపించడమేనని గోవిందరాజీయం అంటుంది.

**అత్ర ప్రకరణే లక్ష్మణేన రామస్యాశ్రితరక్షణత్వారా ।**
**సందీప్యత ఇతి స్వోపదేశః సులభః ॥**

అని వివరణం. ఇక్కడ కొన్ని శ్లోకాలు అస్పష్టభావాలుగా ఉన్నాయి. వాటిలో -

**క్రియాభియోగం మనసః ప్రసాదం సమాధియోగానుగతం చ కాలం ।**
**సహాయసామర్థ్య మదీనసత్త్వ! స్వకర్మహేతుం చ కురుష్వ హేతుమ్ ॥**

అన్న శ్లోకాన్ని వివరిస్తూ తీర్థీయం ఇలా పేర్కొన్నది. హే అధికసత్త్వ! (అధీనసత్త్వ అన్నదానికి ఇది అర్థం) క్రియాభియోగం-కార్యోద్యోగం (కార్యంలో ఉద్యమించడాన్ని) మనఃప్రసాదం-(మనస్సుయొక్క ప్రసన్నతను) సమాధియోగానుగతం-ఈ మనఃప్రసాదమనేది ఏకాగ్రతారూపమైన సమాధినిష్ఠతో కూడినదై ధైర్యోపాయాభ్యానుబద్ధం కాలం చ ధైర్యముతో ఉపాయము ఈ రెంటితో అనుబద్ధమైన కాలాన్ని సుగ్రీవాది సహాయసామర్థ్యం చ - సుగ్రీవుడు మొదలైన సహాయులశక్తియుక్తులను, సకర్మహేతుం చ - స్వకర్మదేవతోపాసనాత్మకం తదేవహేతుః, తం చ హేతుం కురుష్వేత్యర్థః - స్వకర్మహేతుం చ అంటే స్వకర్మచే దేవతోపాసనం చేయడం అనేది కూడా

హేతువుగా తీసికొని ఈ విధంగా క్రియాభియోగం కార్యోద్యోగంతోపాటు చెప్పబడిన మనఃప్రసాదం, ధైర్యోపాయాలలో అనుగతమైన కాలం, స్వకర్మదైవతోపాసనం ఇవన్నీ సీతాప్రాప్తిరూపకార్యసిద్ధికి హేతువులౌతాయి తప్ప, కామపరతంత్రుడై శోకించడం కాదనే లక్ష్మణుని అభిప్రాయం వ్యాఖ్యాతలచే లెస్సగా వ్యక్తపరుపబడింది.

ఇలాగే, రాముడు పల్కిన మాట ఎలాంటిదో వాల్మీకి వివరిస్తూ –

**స లక్ష్మణం లక్ష్మణమప్రధృష్యం స్వభావజం వాక్యమువాచ రామః ।**
**హితం చ పథ్యం చ నయప్రసక్తం ససామధర్మార్థసమాహితా చ ॥**

అనే శ్లోకానికి గోవిందరాజీయ–తీర్థీయవ్యాఖ్యలు వేరు వేరు సమన్వయాలు చూపాయి. ఇక్కడ "అప్రధృష్యం, స్వభావజం, హితం, పథ్యం చ నయప్రసక్తం ససామ ధర్మార్థ సమాహితం చ వాక్యం లక్ష్మణముద్దిశ్య రామః స లక్షణం ఉవాచ" అని వాక్యవిశేషణాలుగా అప్రధృష్యత్వాది విశేషణాలను తీర్థీయం చేర్చి సమన్వయించింది.

ఇక్కడ పైన పేర్కొన్న 'వాక్యం' లక్ష్మణప్రోక్తమా? రామప్రోక్తమా? అన్న శంకకు తావీయకుండా, ఇలాంటి వాక్యం మాట్లాడిన లక్ష్మణునితో రాముడు అన్నాడు అని వ్యాఖ్యానించడంద్వారా అప్రధృష్యత్వాది విశిష్టమైన ఈ వాక్యం లక్ష్మణునిదేనని నిష్కర్షించింది తీర్థీయవ్యాఖ్య. "రామః అప్రధృష్యం.......... ధర్మార్థ సహితం చ వాక్యముక్తవన్తం లక్ష్మణం సక్షణమువాచ ఇత్యన్వయః" అని అన్వయం తీర్థీయాభిప్రేతం. అయితే ఇలాంటి లక్షణాలు గల వాక్యాన్ని రాముడు లక్ష్మణునితో పలికాడు అని ఈవాక్యం రామప్రోక్తంగా గోవిందరాజీయం సమన్వయించింది. "యద్వా అప్రధృష్యత్వాది విశేషణ విశిష్టం వాక్యం రామ ఉవాచ, లక్ష్మణోక్తానువాదరూపత్వాత్ రామవాక్యస్యాపి తథాత్వమ్ ఇతి బోధ్యమ్" అని. ఇక్కడ తీర్థీయ సమన్వయంతోపాటు గోవిందరాజీయం మరొక విధమైన సమన్వయాన్ని కూడా చూపి తత్సమర్థకంగా అన్నమాట గుర్తించాలి. లక్ష్మణవాక్యం పై లక్షణాలు కలిగి ఉన్నట్లే రామవచనం కూడా లక్ష్మణవాక్యానువాదరూపం కనుక అవే లక్షణాలు కలిగి ఉండడంలో అభ్యన్తరం లేదని వ్యాఖ్యానించింది. ఇలాంటి సూక్ష్మసమన్వయభేదం రెండు వ్యాఖ్యల్లోనూ అక్కడక్కడ చూడవచ్చు. గోవిందరాజీయ సమన్వయానికి రామానుజీయవ్యాఖ్యావచనమే మూలం. రామానుజీయం ఇలా అంటుంది–

"ఏతత్ శ్లోకోక్తాప్రధృష్యాది ధర్మాణాం పూర్వోక్తలక్షణవాక్యేషు విద్యమానత్వాత్, ఉపరిష్టాద్రామే లక్ష్మణోక్తస్యైవ అనూద్యమానత్వాదుక్తవంతమితి పదమధ్యాహర్తవ్యమ్" ఈ శ్లోకంలో చెప్పబడిన అప్రధృష్యత్వాది ధర్మాలు పూర్వోక్తలక్షణవాక్యాల్లో ఉన్నాయి కనుక పైన (ముందు) రాముడు లక్షణవాక్యాలనే అనువదించాడు కనుక ఉక్తవన్తం అని అధ్యాహారం చేసికోవాలి అని ఈ వాక్యాల తాత్పర్యం. అయితే ఈ వాక్యాలు కూడా తీర్థీయ సమన్వయాన్నే విస్పష్టపరుస్తున్నప్పటికీ, రామవచనాలు లక్ష్మణవచనానువాదరూపాలని అనడం చేతనే రామవాక్యం కూడా అప్రధృష్యత్వాది విశేషాలతో కూడినదేనని స్పష్టపడుతోంది కనుక, గోవిందరాజీయం ఇక్కడ నిగూఢంగా ఉన్న అభిప్రాయాన్నే వ్యక్తపరచిందని భావించడం సముచితం.

'జలగర్భాః' ఇత్యాది శ్లోకాల్లో 'వృష్టివాతాః' అన్న పదానికి 'పురా వాతాః' అని గోవిందరాజీయవివరణం శ్రుత్యనుగతం. కారీరీష్టి ప్రకరణంలో యజుర్వేదమే వృష్టికారకాలైన వివిధవాయువుల గురించి ప్రస్తావిస్తూ పాశ్చాత్యమతాలు వృష్టినిరోధకాలని, పురోవాతాలు వృష్టికారకాలని పేర్కొన్నది. తదనుగుణంగానే గోవింద

రాజీయవ్యాఖ్య అర్థనిర్దేశం చేసింది. ఈ సర్గలోని ప్రవృత్తి (వ్యవహారం) రామావతారసంబంధంగానే సర్వత్ర నిరూపింపబడిందని గోవిందరాజీయం. "దర్శయన్తి శరన్నద్యః" అనే శృంగారరసనిర్భరమైన శ్లోకంలో కూడా గోవిందరాజీయానికి తాత్త్వికార్థస్ఫూర్తికలగడం దానికిగల తత్త్వాభినివేశానికి తార్కాణం. "అనేన చిరకానువర్తనేన గురూణాం శిష్యేభ్యో రహస్యార్థప్రకాశనం సూచ్యతే" శరత్కాలనదులు నెమ్మనెమ్మదిగా తమ ఇసుకతిన్నెలను బయల్పరుస్తున్నాయి. నవప్రియసంగమవేళలో స్త్రీలు తమ జఘనాలను దర్శింపజేసినట్లుగానని వాల్మీకి శృంగారరసఘనమైన ఉపమానాన్ని ప్రదర్శించాడు. ఇక్కడ వ్యాఖ్యాతకు "చిరకాలం తమను అనుసరించి ఉండటంవల్ల గురువులు శిష్యులపట్ల కృపాళువులై, మెల్లమెల్లగా విద్యారహస్యార్థాలను ఆవిష్కరించడం" అనే తాత్త్వికాభిప్రాయం స్ఫురిస్తున్నది. తీర్థీయం ఈ శ్లోకాన్నే వ్యాఖ్యానింపక విడచింది. 30వ శ్లోకంలో (సంప్రత్యనేకాశ్రయ చిత్రశోభా అనే చోట) సూర్యకిరణప్రతిబోధకాలైన పద్మాకరాల్లో (కొలనులలో) శరలక్ష్మి విచిత్రంగా శోభిస్తున్నదన్న అభిప్రాయం వెనుక "భగవత్కటాక్షబోధితేషు పురుషేషు నానారూప సంవిత్ప్రకాశ ఉచ్యతే" భగవత్కటాక్షంచేత ప్రతిబోధితాలైన జీవులలో అనేకవిధాలైన తత్త్వజ్ఞానాలు వెల్లివిరియడం అనేభావం స్ఫురిస్తున్నదంటాడు వ్యాఖ్యాత. 38వ శ్లోకంలో 'అన్యోన్య వైరామరుర్షాయుతానామ్' అనే చోట వృత్తభంగం ఆర్షమని గోవిందరాజీయ రామానుజీయుల నిర్ణయం. ఇక్కడ వృత్తభంగపరిహారంకోసం అమరుష్య అనే విధంగా రేఫకు ప్రక్కన ఉకారాన్ని చేర్చి పఠించాలని తీర్థీయవ్యాఖ్య పాఠపరివర్తనాన్ని సూచించింది. (అత్ర వృత్తభంగపరిహారాయ అమరుష్యేతి రేఫస్య ఉకారః పఠనీయః) అప్పుడు 'అన్యోన్య వైరామరుషాయుతానామ్' అన్న పాఠం సూచించినట్లవుతుంది. అమర్షా శబ్దాన్ని అమరుషా శబ్దంగా మార్చినా ఇదీ ఆర్షమేనని చెప్పవలసిఉంటుంది. 43వ శ్లోకంలో (వ్యపేత పంకాసు) అనే శ్లోకంలో 'ససారసారావవినాదితాసు' అనే సమాసానికి "ససారసాః తేషాం రావవినాదితాశ్చేత్ తథా తాసు" అని తీర్థీయవివరణం. దీన్నే అనుసరించిన గోవిందరాజీయవివరణ అంత సమంజసంగా తోచటం లేదు.

సారసానామ్ ఆరామవినాదితాని – సారసారావవినాదితాని వినాదిత శబ్దం భావప్రత్యయాన్త వినాదమనే అర్థం. ఆరావ శబ్దానికి కూత అని అర్థం. వినాదితం అంటే ధ్వని అని అర్థం. సారసపక్షులకూతల ధ్వనులే సారసారావవినాదితాలు. వీటితో కూడినవి అనే అర్థంలో సారసారావవినాదితైః సహ వర్తంతే అనే అర్థం సహశబ్దాన్ని సాదేశం చేస్తే, ససారసారావ వినాదితా అని కావచ్చు. సారసపక్షులకూతల ధ్వనులతో కూడినవి అని నదులకు విశేషణం కావడంలో అభ్యంతరం లేదు. 'స గోకులాసు' 'స వాలుకాసు' అనే చోట సహ శబ్దంతో సమాసం చేసినట్లే ఇక్కడా చేయడం సముచితం. ఆ రెండు శబ్దాల సాహచర్యంచేత అదేవిధంగా ససారసేత్యాది సమాసం కూడా సహశబ్దంచేతనే.

ససారసాశ్చ రావవినాదితాశ్చ అని చెప్పినప్పుడుకూడా 'రావం' దేనికి సంబంధించినది? అని శంక వచ్చినప్పుడు సారససంబంధమైందని తాత్పర్యతః అన్వయించుకోవలసివస్తుంది. ఇంతకంటే పైన చెప్పిన సమాసవిధానమే ముందు షష్ఠీతత్పురుష ఆపైన సహశబ్దంతో సమాసం చెప్పడమే బాగుంటుంది. ఇలాగే సమాసనిర్మాణం క్లిష్టంగా ఉన్న సందర్భాల్లో వ్యాఖ్యాతల వ్యాఖ్యానశైలి గమనింపదగిఉంది. 47వ శ్లోకంలో "శశాంకోదితచారువక్త్రా తారాగణోన్మీలిత చారునేత్రా" అనే రెండు సమాసాల్లోనూ క్రమంగా "ఉదిత శశాంక

చారువక్త్రా” అని, “ఉన్మీలితతారాగణ చారునేత్రా” అని శబ్దక్రమపరివర్తనంతో తీర్థీయ గోవిందరాజీయవ్యాఖ్యాతలు చేసిన వ్యాఖ్యానం గమనార్హం. 31వ సర్గలో అంగదుడు లక్ష్మణకోపాన్ని సుగ్రీవునికి చెప్పడం ప్రధానవిషయం. 31వ సర్గలోని మొదటిశ్లోకం –

**సకామినం దీనమదీనసత్త్వం శోకాభిపన్నం సముదీర్ణకోపమ్ ।**
**నరేంద్రసూనుర్నరదేవపుత్రం రామానుజః పూర్వజమిత్యువాచ ॥**

గాయత్రీమంత్రంలోని –'దే' అనే పదకొండవ అక్షరం, పై శ్లోకంలోని నరదేవపుత్రం అనే పదంలోని 'దే' అక్షరంచేత గ్రహింపబడుతున్నదని తీర్థీయ – గోవిందరాజీయాలు రెండూ ఉట్టంకించాయి. ఇంతవరకు పదివేలశ్లోకాలు గడిచాయని గోవిందరాజీయం పేర్కొన్నది. 'హతోగ్రజం పశ్యతు వీరవాలినమ్' అనే పాఠాన్ని ఛందోభంగయుతంగా గమనించి 'వీర తస్య' అనే పాఠాన్ని స్వీకరించింది గోవిందరాజీయం. వృత్తభంగమార్షమని రామానుజీయం. తీర్థీయవ్యాఖ్యలో దీని ప్రస్తావన లేదు. ఈ సర్గలో రామానుజీయవ్యాఖ్య కొన్ని విశేషపాఠాలను సూచించింది. 17వ శ్లోకంలో 'పూర్వజం చార్తమాత్మవాన్' అనే పాఠాన్ని రామానుజీయం సూచించింది. 36వ శ్లోకంలో “నిపత్యతూర్ణం నృపతేస్తరస్వీ తతః కుమారశ్చరణౌ వవందే” అనే పాఠాన్ని రామానుజీయం సూచించింది. ఇదే సందర్భంగా “జగ్రాహ మాతుః పునరేవ పాదౌ” ఇత్యత్ర పుత్రశబ్దః పితృనమస్కారాపేక్షయా ప్రయుక్తః అని నిర్దేశించింది రామానుజీయం అయితే ఇక్కడ పుత్రశబ్దావశ్యకత ఏమిటో వివేచింపవలసిఉంది. ఇక్కడ 51వ శ్లోకంలో 'రోషోహ్యస్య నివర్త్యతామ్' అనే పాఠం రామానుజీయంచే సూచింపబడింది. ఈ సర్గలో వ్యాఖ్యాతల విశేషవ్యాఖ్యానం ఏమీలేదు. వ్యాఖ్యాశైలి సమానమే.

హనుమంతుడు హితోపదేశం చేయడం 32వ సర్గలో వర్ణింపబడిన విషయం.

'కృతాపరాధస్య హితే' అనే శ్లోకంలోని తాత్పర్యాన్ని సాంప్రదాయికంగా గోవిందరాజీయ– రామానుజీయ– తనిశ్లోకీ వ్యాఖ్యలు వివరించాయి. “అంజలిః పరమా ముద్రా క్షిప్రం దేవప్రసాదినీ”అన్న న్యాయాన్నిబట్టి భగవంతునిపట్ల జరిగిన ప్రచారానికి లక్ష్మణునికి ప్రత్యంజలి ఘటించడం తప్ప వేరే పరిహారంలేదని సూచింపబడుతున్నదీశ్లోకంలో 'తే' అనే పదంచేత ఇక్కడ అధికారనియమం ఏమీలేదని సూచింపబడింది.'అంజలిమ్' అనేచోట గల ఏకవచనంచేత ఒకసారి అంజలి ఘటిస్తే చాలునని సూచింపబడింది. 'బధ్వా' అనే పదంచేత దేశకాలనియమం కూడా లేదని సూచింపబడుతున్నది. 'బధ్వా లక్ష్మణస్య ప్రసాదనాత్' అనే వచనంచేత పైనిర్దేశించిన న్యాయంలోని “క్షిప్రం దేవప్రసాదినీ” అన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఈ శ్లోకంలో రామప్రేరణచే వచ్చి ధనుష్టంకారంచేసి క్రోధాన్ని ఆవిష్కరించిన లక్ష్మణుని ఎలా ప్రసన్నుణ్ణి చేసికోవాలి? అని కింకర్తవ్యతామూఢుడైన సుగ్రీవునితో హనుమానుడు అపరాధం చేసిన నీకు అంజలి ఘటించి లక్ష్మణుని ప్రసన్నుణ్ణి చేసికోవడంకంటే వేరే మార్గమేమీ అగుపించడంలేదని అంటాడు. దీన్ని తనిశ్లోకి వ్యాఖ్య ఇలా వ్యాఖ్యానించింది. అపరాధారంభంలోనే అనుతాపం కలిగిఉంటే స్వల్పప్రాయశ్చిత్తంచేతనే పరిహారం ఉండేది. ఇప్పుడు ఇంతమాత్రంచేత పరిహారం సాధ్యంకాదు. అయితే సాంత్వనం చేయాలి. కనుక అంజలి ఘటించాలి. దానిచేత భగవదవతారం జరిగినప్పుడు భగవద్భక్తులను ప్రసన్నం చేసికోవడమే ప్రాయశ్చిత్తమని వ్యక్తపరుపబడు తున్నది.

**అనుతప్తస్తు తానేవ క్రామయేన్నాన్యథా శమః ।**
**భగవత్యపచారేఽపి సైషా శాంతిరనుత్తమా ॥**

అని స్మృతివచనం. ఈ శ్లోకాలను తీర్థీయం ఎంతమాత్రం వ్యాఖ్యానించకపోవడం గమనించాలి. ప్రతిపదార్థవివరణంలో విశేషం ఏమీ లేదు.

ఇక 33వ సర్గలో అంతఃపురంలో ప్రవేశించిన లక్ష్మణుని తార అనునయించడం నిరూపించబడింది. ఈ సర్గలో సుగ్రీవనివాసస్థానమైన గుహాప్రదేశాన్ని వాల్మీకి మనోజ్ఞంగా వర్ణించాడు. 'దివ్యపుష్పఫలైర్వృక్షైః' అని అనడంచేత ఇంద్రప్రదత్తాలైన స్వర్గీయవృక్షాలు చెప్పబడుతున్నాయని గోవిందరాజీయం.

ఆరంభంలో 'వానరేంద్ర గృహం రమ్యమ్' ఒక రమ్యశబ్దాన్ని వేసి అనేక విశేషణాలవ్యవధానంలో 'సుగ్రీవస్య గృహం రమ్యమ్' అని మరొక రమ్యశబ్దాన్ని వాల్మీకివాడడంలోని ఔచిత్యాన్ని గోవిందరాజీయం వివరించింది. ఒక రమ్యశబ్దం 'స్వరూపతః రమ్య' మని మరొక రమ్యశబ్దం కవివేసిన విశేషణాలచేత రమ్యమని వ్యాఖ్యానం నిరూపించింది. అయితే ఇక్కడ యుద్ధం అని పక్షాంతరాన్ని చెబుతూ వ్యాఖ్యాత - వానరేంద్రగృహమనే శబ్దం వారణేంద్రులైన ఋక్షరజస్సు వాలి ఇరువురిగృహాన్ని, తరువాత సుగ్రీవగృహాన్ని రెండవ గృహశబ్దం తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించాడు. ఇలా పక్షాంతర వ్యాఖ్యానం అవసరమా? అని వివేచించాలి. మిగిలిన శ్లోకాల్లో విశేషించి తారావర్ణనపరాలైన శ్లోకాలలోని సమస్తపదాల వివరణం ఇంచుమించుగా తీర్థీయ-గోవిందరాజీయాదుల్లో సమానంగానే ఉన్నది. అయితే కొన్ని శ్లోకాల్లో రామానుజీయ-తనిశ్లోకాదుల్లో తీర్థీయంలోలేని విశేషార్థవర్ణనం ఉంది. గమనించుదాం.

**కిం కోపమూలం మనుజేంద్ర పుత్ర! కస్తే న సంతిష్ఠతి వాఙ్నిదేశే ।**
**కశ్శుష్కవృక్షం వనమాపతన్తం దవాగ్నిమాసీదతి నిర్విశంకః ॥**

నాల్గుమాసాలు రాజపుత్రులనిద్దరిని మేఘగర్జనపాలు చేసి, స్వయంగా భోగప్రవణయై ఉంటూ, ఇదే వారి కోపానికి కారణమని తెలిసికూడా తార తెలియనట్లు 'కిం కోపమూలమ్' కోపానికి మూలమేమిటి? అని ప్రశ్నిస్తున్నది. వారికృపారసభరదృష్టి ఎలాంటిదో ఎరిగిఉన్నందున లక్ష్మణుని దృష్టి ప్రసాదాన్ని గమనించినందువల్లనే ఇలా మెల్లగా కోపకారణం ఎరిగిఉండే ప్రశ్నించింది తార అని ప్రశ్న తాత్పర్యం. 'మనుజేంద్ర పుత్ర' అని బోధించడంలోని ఆంతర్యాన్ని వ్యాఖ్యాత ఇలా ఉట్టంకించాడు. అరవైవేలసంవత్సరాలు రాజ్యపాలనం చేసి ప్రజాపరాధాన్ని సహించిన దశరథునిపుత్రుడవు నీవు, అపరాధిజనుల శిరశ్ఛేదం చేస్తానని ఇప్పుడు స్వయంగా వచ్చావు. నీరీతి చాలా బాగున్నదయ్యా! అని దెప్పిపొడుపుగా చేసిన సంబోధనం ఇది. 'కస్తే న తిష్ఠతి వాఙ్నిదేశే' ఇక్కడ కః ఎవ్వడు నీ ఆదేశాన్ని పాలించడంలేదు? అన్న ప్రశ్నలో నీ దృష్టిలో సుగ్రీవుడే కదా! నీ శాసనం ఉల్లంఘించాడని నీవు భావిస్తున్నది. అయితే ఆతడెలాంటివాడో నీవెరుగవా? శాస్త్రవశ్యతకు కావలసిన బుద్ధివైభవం లేనివాడు, చూచిన వస్తువును చూచినట్లే అనుభవించాలనే చాపల్యం కలిగి స్వభావాన్ని విడువజాలని జంతుజాతిలో పుట్టినవాడు. వానికి చేజారిన భోగాలను నోటికందించి నీ ఆజ్ఞను పాటిస్తున్నవానిని హింసించనుద్యమించావే మండుతున్న నిప్పుల్లో పడే శలభంలాంటివాడేకదా వాడు. శలభంలో ఉన్న చాపల్యం విషయాలపట్ల సుగ్రీవునికీ ఉన్నదని

అభిప్రాయం. మిగిలిన శ్లోకాలవ్యాఖ్యానం గోవిందరాజీయతీర్థీయాల్లో సమానమే. 'తదాగచ్ఛ మహాబాహో' అనే 59వ శ్లోకంలోని 'చారిత్రం రక్షితం త్వయా' 'నీవు చారిత్రాన్ని బాగుగా రక్షించావు' అని తార అనడంలోని ఆంతర్యం "అంతః పురస్త్రీలదర్శనం అనుచితమని ఇక్కడనే నిలుచుండి నీవు సదాచారాన్ని పాటించావు" అని తీర్థీయవ్యాఖ్య. ఇంతేకాక శరణాగతరక్షణాచారం నీవు బాగా అనుష్ఠించావు అని గోవిందరాజీయవ్యాఖ్య. 'తారయా' ఇత్యాదినాల్గు శ్లోకాలు (61,62,63,64) ఏకాన్వయమని తీర్థీయవ్యాఖ్య గోవిందరాజీయవ్యాఖ్యలకు రెంటికీ ఏకవాక్యత ఉంది.

34వ సర్గలో సుగ్రీవునుద్దేశించి లక్ష్మణుడు రామసందేశాన్ని చెప్పడం ప్రధానవిషయం.

'శతమశ్వానృతే హంతి' ఇత్యాదిశ్లోకాల్లో అశ్వానృతగవానృతాది శబ్దాలకు నూరు అశ్వాలను చంపినందువల్ల కలిగే దోషానికి అశ్వానృతమని, వేయిగోవులను చంపినందువల్ల కలిగే దోషాన్ని పురషానృతమని, ఇక మహాపురుషుడైన రామునివిషయంలో చేసే దోషం సర్వదోషావహమని వ్యాఖ్యాతలంతా ఐకకంఠ్యంతో వ్యాఖ్యానించారు.

35వ సర్గలో తార లక్ష్మణుని సాంత్వనపరచడం ప్రధానవిషయం. సుగ్రీవుని విషయాసక్తిని ప్రాప్తకాలవిస్మృతిని చెప్పే 6,7,8 శ్లోకాలను తీర్థీయం కేవలం 1,2, పదాల అర్థం నిర్దేశించడం తప్ప వ్యాఖ్యానింపక పూర్తిగా విడచింది. అయితే, గోవిందరాజీయం- రామానుజీయవ్యాఖ్యను అనుసరించి విశ్వామిత్రవృత్తాంతాన్ని బాలకాండాధారంగా సప్రమాణంగా ఇక్కడ స్మరింపజేస్తున్నది. 'తేన శక్యా రణే హంతుమ్' అనే 18వ శ్లోకంలో 'న' కారం చేర్చాలని, అందువల్ల 'న హంతుం శక్యః రావణః' రావణుడు చంపశక్యం కానివాడని అర్థం పర్యవసిస్తుందని 'తేన' అనేది తృతీయాన్తశబ్దం కనుక ఇలా నకారం తెచ్చి అన్వయించుకోవాలని తీర్థీయవ్యాఖ్య. 'తేన' అంటే "రాక్షసవధేన వినా" రాక్షసులసంహారం లేనిదే క్రూరకర్ముడైన రావణుడు చంపశక్యంకాదని నకారం చేర్చవలసిన అగత్యం ఉన్నదని ఈవ్యాఖ్యలోని ఆంతర్యం.

అయితే, తేన అనేదాన్ని విడగొట్టితే 'న' అనే పదచ్ఛేదం ద్వారా తే రాక్షసా న శక్యా హన్తుమ్, అని అన్వయించి ఉత్తరవాక్యంలోని 'క్రూరకర్మ చ' అనే చోటఉన్న చకారాన్ని బట్టి 'రావణోపి హన్తుం న శక్యం' అని అర్థసిద్ధమ్ రామానుజీయవ్యాఖ్యల భావన. 18వ శ్లోకంలో శ్రీమత్ అని గోవిందరాజీయపాఠం. ఇది రామానుజీయపాఠానుసారమే. తీర్థీయవ్యాఖ్య 'శాపాత్' అని పాఠం స్వీకరించింది. ఈ పాఠానికి తగినట్లుగా రావణునికి నందికేశ్వరుని వలన కల్గిన శాపాన్ని వ్యక్తపరచే వృత్తాన్తాన్ని ఈ వ్యాఖ్యలో ఉట్టంకించింది.

36వ సర్గలో లక్ష్మణ-సుగ్రీవ సౌహృదభాషణమే ప్రధానవిషయం. ఈసర్గలో 'యది కించిదతిక్రాన్తం' ఇత్యాది 11వ శ్లోకంలో గోవిందరాజీయవ్యాఖ్య కొంత విశేషంగా ఉంది. ఒకవేళ విశ్వాసంచేత ప్రణయంచేత ఏ కొంతైనా అతిక్రమణం ఏర్పడిఉంటే భృత్యుడనైనా ఈ దోషం క్షంతవ్యం. ఎందువల్లనంటే అపరాధం చేయనివాడంటూ ఎవ్వడూ ఉండడుకదా! అని శ్లోకతాత్పర్యం. ఈ శ్లోకంలో తనిశ్లోకి ప్రతిపదవ్యక్తమైన రమ్యంగా ఆవిష్కరించింది. ఈ శ్లోకంచేత 'కృతాపరాధస్య' అని పూర్వం ఉపదేశించిన దాని అనుష్ఠానం చెప్పబడుతున్నది. 'కించిత్' అనడంచేత అపరాధం సమానార్హమేనని అధికాతిక్రమణమైతే ప్రసాదనంచేత కూడా నివర్తింపరానిదే అవుతుందని సూచింప బడింది.'యది' అనే శబ్దంచేత వాస్తవానికి స్వల్పాపరాధానికి కూడా సంభావన లేదని సూచింపబడుతున్నది. 'విశ్వాసాత్' అనడంచేత బుద్ధిపూర్వంగా చేసే అపరాధం కాదని చెప్పబడుతున్నది.'ప్రణయేన'

అనడంచేత అతిక్రమణం కనిపించినా వాస్తవంగా అతిక్రమణం కాదని ఆభాసం మాత్రమేనని సూచింపబడుతున్నది. ప్రేష్యస్య అనడంచేత ఒకవేళ బుద్ధిపూర్వకంగా వాస్తవాపరాధమే జరిగినా క్షమించదగినదని సూచింపబడుతున్నది. 'క్షమితవ్యమ్' అనడంచేత క్షమించకపోతే ప్రత్యామ్నాయం ఉన్నదని వ్యక్తపరుపబడుతున్నది.'న కశ్చిన్నాపరాధ్యతి' అనడంచేత విశ్వాసప్రణయ పాత్రభూతుడైనవాడు స్వల్పాపరాధం చేస్తే ఇలాంటి అపరాధం సర్వత్ర వర్జనీయమని సూచింపబడుతున్నది. 16వ శ్లోకంలో 'ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య' ఇత్యాది శ్లోకంలో 'దోషజ్ఞః' అనే పదానికి స్వదోషజ్ఞుడు అని గోవిందరాజీయవివరణ. లోకంలో సమర్థుడైన పురుషుడు తన దోషాన్ని కప్పిపుచ్చుకుంటాడు. పైకి తెలియనీయడు. నీవు అలాంటివాడవు కావని దీని తాత్పర్యం. ఇక ఇక్కడ తనిశ్లోకిలో విశేషార్థజ్ఞాపకం ఉంది. 20వ శ్లోకంలో 'శోకాభిభూతస్య' అనే పదంచేత రాముడు స్వభావతః పరుషభాషణం చేయడని వ్యక్తమవుతున్నది. "ఉచ్యమానోఽపి పరుషం నోత్తరం ప్రతిపద్యతే" (ఎవరైనా తనను గురించి పరుషాలు మాటాడిన ప్రతిసమాధానింప నెరుగడు) అని ప్రసిద్ధి కదా! అలాంటి రాముని మాటలు విని నేను నీతో అలా మాటాడానని, ఒకరు చెప్పినదానిని అనువదించి మాటాడానే తప్ప వేరే కాదని లక్ష్మణుడు తాను మాటాడిన మాటలలో దోషం లేదని వ్యక్తపరుస్తున్నాడు. ఇక్కడ గ్రహింపదగినదిది – కార్యాభిసంధి ఏర్పడవలసిఉండగా స్వామియైన శ్రీరామచంద్రునివద్దకు వేగంగా వెళ్ళాలని మరచి ఇతరేతర వ్యాసంగంచేత అన్న మాటను మీరి మహారాజైన సుగ్రీవుడు అపరాధం చేయగా, లక్ష్మణుని క్రోధావేశాన్ని గమనించి పరమమిత్రుడైన హనుమంతుడు అంజలిబంధనం తప్ప అపరాధక్షమణమార్గం లేదని, మహారాజుకు ఉపదేశం చేయగా మహారాజుకూడా దాన్ని లెస్సగా గ్రహించి ఏదైనా అపరాధం జరిగి ఉంటే క్షమించమని క్షమను కోరుతూ, 'న కశ్చిన్నాపరాధ్యతి' అని చెప్పడంచేత భగవంతుని విషయంలో అపరాధం చేసినవాడుకూడా భాగవతక్షమాపణం కోరితే భాగవతక్షమాపణముఖంగానే భగవానుడు అపరాధాన్ని క్షమిస్తాడు. అటు తర్వాత భగవదపచారరహితుడై తత్కైంకర్యయోగ్యుడౌతాడు అని ఈ అర్థాన్ని విశదీకరించాడు. తరువాత "యచ్చ శోకాభిభూతస్య" అని లక్ష్మణుడు తాను మాటాడిన పరుషవచనాలకు రాముడు శోకాభిభూతుడై క్రోధంలో మాటాడిన మాటలే కారణమని ఆతని స్థితిని మాటలను గమనించి తదనురూపంగానే తాను మాటాడానని తన మాటలలోని ఆంతర్యాన్ని వ్యక్తపరచి, సుగ్రీవుని లక్ష్మణుడు ప్రసన్నుని చేశాడు. దీనినిబట్టి శ్రీవైష్ణవులపరాధంచేసి పశ్చాత్తాపంచేత ప్రాయశ్చిత్తాన్ని చేసికొన్నప్పుడు స్వాపరాధదశలో స్వాచరితములైన అపచారాలను తొలగించడానికి వారి (శ్రీవైష్ణవులు) ప్రసన్నులుగా చేసికొనదరి ఉన్నవన్నీ శాస్త్రార్థాన్ని ప్రకటించడం ఇక్కడ విశేషమని తనిశ్లోకి వ్యాఖ్యానించింది. శ్రీరామునిపట్ల అపచారపడిన సుగ్రీవుడు పశ్చాత్తప్తుడై దోషపరిహారం చేసికోగా ఆతడు దోషం చేశాడనే భావనతో ఆతనిపట్ల పరుషంగా ప్రవర్తించిన లక్ష్మణుడు తాను స్వయంగా తన దోషాన్ని తొలగించు కొనేందుకు సుగ్రీవుని ప్రసన్నుని చేసికోవడంపై శాస్త్రార్థానికి దృష్టాన్తమని వ్యాఖ్యాత తాత్పర్యం.

ఇక్కడ లక్ష్మణవచనాలలోని ఆంతర్యాన్ని తీర్థీయవ్యాఖ్య ఇలా వ్యక్తపరచింది– "స్వోక్తపరుషవాక్యానాం రామోక్తత్వశంకా మాభూదితి స్వేనైవ ఉక్తమాపాదయన్ స్వాపరాధం శమయతి" తాను మాటాడిన పరుషవాక్యాలు రాముడు పలికినవనే శంక కలుగరాదని ఆ మాటలన్నీ తనవేనని లక్ష్మణుడు పేర్కొని తన అపరాధాన్ని ప్రశమింప చేస్తున్నాడని ఈ వాక్యాల తాత్పర్యం.

37వ సర్గలో సర్వవానరసమానయనం ప్రధానవిషయం. ఈ సర్గలో వ్యాఖ్యావిశేషాలు ఏమీ లేవు. 38వ సర్గలో వివిధప్రదేశాలకు పంపబడిన దూతలు తిరిగివచ్చిన తరువాత సుగ్రీవుడు ఏమి చేశాడో వర్ణింపబడింది.

రామసుగ్రీవసమాగమం ఇక్కడ ప్రధాన విషయం. ఈ సర్గలోని వానరసంఖ్య నిర్దేశంచేసిన శ్లోకాల్లోని సంఖ్యను వ్యాఖ్యాతలు వివరించడం 1,2 శ్లోకాల్లో తప్ప వ్యాఖ్యావిశేషాలేమీ లేవు. 39వ సర్గలో సర్వవానరసమాగమం వర్ణింపబడింది. 40వ సర్గలో తూర్పుదిక్కుకు సుగ్రీవునిచేత వినతుడు పంపబడటం విషయం. 20వ శ్లోకంలో మేరువుకు తూర్పుదిక్కున ఉన్న ఉదయాచలం వరకు వెదకాలని పంపబడిన వానరులనుద్దేశించి మేరువుకు దక్షిణదిక్కున ఉన్న భాగీరథ్యాది నదీపర్వతాద్యన్వేషణవిధానం ఎలా కుదురుతుంది? అని శంకించి, హేమాచలానికి వింధ్యకు మధ్యలో ఉన్నదేశం ఆర్యావర్తమని దాన్ని దృష్టిలో పెట్టుకొని దిగ్విభాగం చేయబడిందని అంతే తప్ప మేరుపర్వతదృష్టితో కాదని తీర్థీయవ్యాఖ్య. ఇక్కడ గోవిందరాజీయం మరికొంత ఇలా చెబుతున్నది. "అత్రేదమవ ధేయం" ఇక్కడ ఇది గ్రహింపవలసిఉంది. శరావతి అని పేరుగల ఒకనది హిమవద్వింధ్యమధ్యదేశంలో వలయా కారంగా ప్రవహిస్తున్నది. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు సీతాన్వేషణానికి ఉద్దిష్టమైన ప్రాచీదిక్కు నిర్ణయింపవలసి ఉంది. కిష్కింధను దృష్టిలో పెట్టుకొని కాదు. లేదా మేరుపర్వతాన్ని దృష్టిలో పెట్టుకొని కూడా కాదు అని. ఈ సందర్భంగా శ్లోకాల్లో వర్ణింపబడిన ఆ యా జాతులవిశేషాలను వ్యాఖ్యాతలు సమానంగానే విశదపరచారు. ఈ సర్గలో 31వ శ్లోకంవరకు జంబూద్వీపాన్ని వర్ణించి 32 నుండి పక్షిద్వీపాన్ని వర్ణించిన శ్లోకాలను ఇక్షుసముద్ర ద్వీపాలను వాటి దుర్గమత్వాన్ని మధుసముద్రాన్ని 43 నుండి శాల్మలిద్వీప– కుశద్వీప–క్రౌంచద్వీపాలను ఇక్షు–సురా–దధి–సర్పిసముద్రాలను 'తతస్సముద్రద్వీపాంశ్చసుభీమాన్' అనే శ్లోకంచే తంత్రంగా (శబ్దవృత్తి పురస్సరంగా) నిరూపించి తరువాత 'తతః పాండరమేఘాభం' ఇత్యాదిశ్లోకంచే క్షీరోదాన్ని కవి వర్ణించాడని వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. 47వ శ్లోకంలో 'ఘృతోదం సాగర శ్రేష్ఠం' అన్న పాఠం అసాధువని 'జలోదం సాగరశ్రేష్ఠం' అనేది సాధుపాఠమని రామానుజీయం. ఈ సందర్భంలో రామానుజీయ – గోవిందరాజీయాల ననుసరించి కొన్ని విశేషశ్లోకాలు ఉట్టంకింపబడ్డాయి. తీర్థీయం వీటిని పరామృశింపలేదు. వాటిలో –

> **తత్ర చంద్రప్రతీకాశం పన్నగం ధరణీధరం ।**
> **పద్మపత్రవిశాలాక్షం తతో ద్రక్ష్యథ వానరాః ॥ అన్న శ్లోకం ఒకటి.**

'తత్ర శైలనిభా భీమా' ఇత్యాదిశ్లోకాల్లో రక్షాంసిహవాపులోనువాన్ ఇత్యనువాకార్థః అనుసంధేయః. ఇత్యాదిగా 'రక్షాంసి' ఇత్యాద్యనువాకార్థం అనుసంధానం చేయాలని తీర్థీయం వైదికరహస్యాన్ని ఆవిష్కరించింది.

56,57 శ్లోకాల్లో త్రివిక్రమాక్రమణాన్ని వర్ణించిన వైనాన్ని వివరిస్తూ సౌమనసశృంగం మీద పూర్వపాదాన్ని ద్వితీయపాదాన్ని మేరువుకు పశ్చిమదిశావధియైన సావరిః మేరువుయొక్క శిఖరంపై ఉంచాడని చెప్పబడిన వచనంలోని అస్వారస్యాన్ని ఎత్తిచూపుతూ 'వస్తుతః మేరోరేవ శిఖరే ద్వితీయపదం న్యస్తం మేరుశిఖరస్య స్వర్గత్వాత్, భూమావేకం స్వర్గే ద్వితీయం తృతీయం బ్రహ్మలోకే ఇతి పౌరాణికీ కథా' అని అన్నది గోవిందరాజీయం. పైన చేసిన వివరణాన్నిబట్టి ఒకపాదం సౌమనసశృంగంమీద, మరొకటి మేరుసావర్ణిపైన ఉంచాడనడంచేత బలిరాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించినట్లు చెప్పబడుతున్నది. భూమధ్యస్థమేరువుపై పాదం ఉంచినట్లు చెబితే బలిరాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించినట్లు కాదుకదా! అంటూ మేరుశిఖరంపైనే రెండవ పాదం ఉంచాడనడంచేత రెండవ పాదంచేత స్వర్గస్థానాన్ని ఆక్రమించాడని వ్యక్తమవుతున్నదని ఇలా రెండుపాదాలచేత భూస్వర్గాలను మూడవ అడుగుతో

బ్రహ్మలోకాన్ని ఆక్రమించాడన్న పౌరాణికగాథ ఇక్కడ అన్వయించుకోవాలని వ్యాఖ్యాతృభావన. ఇక్కడ తీర్థీయవ్యాఖ్యకంటే కొంతవిశేషాన్ని గోవిందరాజీయంలో అన్వయించవచ్చు. ఉదయశైలమే తూర్పుదిక్కుగా నిర్ణయింపబడిన శైలమనే పురాణనిర్ణయాన్ని వ్యాఖ్యాతలు ఇక్కడ పేర్కొన్నారు. ఇక్కడ తీర్థీయ–గోవిందరాజీయాలలో సంవాదం ఉన్నా రామానుజీయ–తనిశ్లోకి వ్యాఖ్యల్లో కొంత విశేషం ఉంది.

దక్షిణదిక్కుకు వానరప్రేషణం 41వ సర్గలో విషయం. విషయదృష్ట్యా ఈ సర్గ చాలా విశిష్టమైనది. వింధ్యకు దక్షిణపార్శ్వంలో ఉన్న దేశాలను గురించి ఈ సర్గ ప్రస్తావిస్తున్నదని వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. "సహస్ర శిరసా వింధ్యం" అనే శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ దానిచేత పూర్వభాగస్థదేశాలు చెప్పబడుతున్నాయని రామానుజీయవ్యాఖ్య. 'సహస్ర శిరసం' ఇత్యాదిగా వెనుకలాగానే మధ్యదేశాన్ని దృష్టిలో పెట్టుకొని వింధ్యకు దక్షిణత్వవ్యపదేశమని గోవిందరాజీయం. తీర్థీయం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరచింది. 'సహస్ర శిరసం' అని ప్రారంభించి 'సర్వమేవానుపశ్యత' ఇత్యాదిశ్లోకపర్యన్తం వింధ్యకు పశ్చిమభాగంలో ఉన్నవి, దక్షిణపార్శ్వంలో ఉన్నవి అయిన నదీనగరదేశాలను ఉపదేశిస్తున్నాడు కవి అని రామానుజీయం– తీర్థీయం. 'గోదావరీమ్' అనే శబ్దం చేత దండకారణ్యంలో ఉన్న గోదావరీఖండం చెప్పబడుతున్నదని గోవిందరాజీయతీర్థీయాలు.

ఇక్కడ మహేంద్రపర్వతాన్ని వర్ణించి దానికి సన్నిహితంగా ఉన్న సముద్రపు అపరపార్శ్వంలో శత యోజనాయుతమైన ద్వీపం ఉన్నదని అక్కడ తప్పక సీతకొరకు అన్వేషించాలని సుగ్రీవుడు 22,23,24 శ్లోకాల్లో చెప్పాడు. మరి ఇంతస్పష్టంగా రావణనివాసం తెలిసి ఉండి ఇతరదిక్కులకు సీతాన్వేషణై వానరులను పంపవలసిన అగత్యం ఏమి వచ్చింది? అని శంకించి ఒకవేళ రావణుడు మరొకస్థానానికి సీతను తీసికొని వెళ్ళవచ్చుననే భావనతోనేనని వ్యాఖ్యాతలు సమాధానం చెప్పారు.

ఇక్కడ తీర్థీయవ్యాఖ్య ఒకప్రశ్నవేసి సమాధానం చెప్పింది. మరి

**స హి దేశస్తు వధ్యస్య రావణస్య దురాత్మనః ।**
**రాక్షసాధిపతేః వాసస్సహస్రాక్ష సమద్యుతేః ॥**

అన్న శ్లోకంలో చాలా విస్పష్టంగా రావణాసురిని నివాసస్థానం తనకు తెలిసినట్లు నిశ్చయించి చెబుతున్నాడు సుగ్రీవుడు. ఆనాడు 'న జానే నిలయం తస్య సర్వథా పాపరక్షసః' అని సర్వాత్మనా దుర్మార్గుడైన ఆ రాక్షసుని నివాసాన్ని ఎంతమాత్రం ఎరుగను. అని అసత్యం ఎందుకు చెప్పినట్లు? అని ప్రశ్న. దానికి సమాధానం. వాలివధకంటే పూర్వమే రావణనివాసస్థానాన్ని నిశ్చయించి చెప్పిన పక్షంలో వాలివధను చేయకుండానే స్వయంగా రావణునే సంహరించి సీతను అన్వేషిస్తాడు రాముడు. అప్పుడు తనకు రాజ్యప్రాప్తి, వాలివధ ఏర్పడవు అనే భయంతో అప్పుడు చెప్పలేదు. కాని, ఇప్పుడా భయానికి తావు లేదు కనుక నిర్భయంగా రావణనివాసాన్ని చెప్పాడని తీర్థీయవ్యాఖ్య. మరొక సమాధానం ఇది. వెనుక వాలిభయంతో దేశాలు పట్టి తిరుగుతున్నప్పుడు యాదృచ్ఛికంగా రావణనివాసాన్ని చూచినా స్పష్టంగా అవగతి లేదు కనుక ఆనాడు చెప్పలేదు. ఇప్పుడైతే స్పష్టంగా తెలియని ప్రదేశమే అయినా వెదుకవలసిన ప్రదేశాల్లో ప్రాధాన్యాన్ని బట్టి విశేషంగా ఈ ప్రదేశాన్ని ఉట్టంకించడంలో విరోధం లేదని మరొక సమాధానం.

ఈ రెండవ సమాధానాన్నే గోవిందరాజీయవ్యాఖ్య కూడా సమర్థించింది. అయితే ఇక్కడ దీన్ని గమనించాలి. ప్రధానులైన హనుమదాదులు వెదుకవలసిన మార్గంగా ఈ సర్గలో నిర్ణయించిన ప్రదేశాలను వర్ణించిన తీరునుబట్టి సుగ్రీవునికి స్పష్టంగా పూర్వమే రావణనివాసం తెలుసునని అవగతమవుతున్నది కనుక అస్పష్టంగా ఉన్న గౌరవాన్ని బట్టి నిశ్చయంగా సుగ్రీవుడు ఇప్పుడు చెప్పాడనే రెండవ సమాధానం అంత సమంజసంగా అనిపించడంలేదు. కనుక తీర్థీయవ్యాఖ్య చెప్పిన మొదటిసమాధానమే సమీచీనంగా ఉన్నదనిపిస్తున్నది.

42వ సర్గలో కూడా పశ్చిమదిక్కుకు వెళ్ళవలసిన వానరుల నియోజనం వర్ణింపబడింది. 19వ శ్లోకంలో పారియాత్ర పర్వతశిఖరంపై అనేకులు గంధర్వులుంటారని చెప్పి 20వ శ్లోకంలో అగ్నిసంకాశాలైన 24 కోట్ల గంధర్వులు కామరూపులని చెప్పి 21వ శ్లోకంలో అక్కడ ఫలమేదీ స్వీకరించరాదని మహాబలులైన గంధర్వవీరులచే అక్కడ ఫలమూలాదులు రక్షింపబడుతాయని చెబుతూ, అక్కడ ప్రయత్నపూర్వకంగా సీతను వెదకండని చెప్పి "న హి తేభ్యో భయం కించిత్ కపిత్వమనువర్తతామ్" అని వాల్మీకి స్పష్టంగా కపిత్వాన్ని అనువర్తిస్తే భయమేదీ లేదని అనడంచేత ఈ వానరులు దివ్యాంశసంభూతులు కనుక స్వాభావికంగా కపిత్వానువర్తనం కాని ఇలాంటిచోట ప్రాకృతకపిత్వస్వభావాన్ని చేష్టాదులను అనువర్తిస్తే, వనాలలో కపిసంచారం సహజసిద్ధమైన లక్షణం కనుక గంధర్వులు పట్టించుకోరు కనుక వారివల్ల భయమేదీ లేదని వాల్మీకి స్పష్టపరచగా ఈ అభిప్రాయాన్నే గోవిందరాజీయ-రామానుజీయ వ్యాఖ్యలు స్పష్టపరచాయి. అయితే తీర్థీయం ఈ హేతువును పక్కన పెట్టి "తేభ్యో గంధర్వేభ్యో భయం నాస్తి రామకార్యసహాయత్వాత్" రామకార్యంలో సహకరించడానికి వెళ్తున్నారు కనుక కోతులకు గంధర్వభయం లేదని వ్యాఖ్యానించింది. గోవిందరాజీయాదుల వ్యాఖ్యకంటే ఈ వ్యాఖ్య తాత్త్వికదృష్టితో సముచితంగా ఉన్నదని చెప్పాలి. ఇక్కడ ఒకవిశేషాన్ని గమనించాలి. భాగవతాదుల్లో పంచజనాది హననంచేసి కృష్ణుడు పాంచజన్యాదులు పొందినట్లున్నది. ఇలాగే విశ్వకర్మ సుదర్శనచక్రనిర్మాణం చేసినట్లు విష్ణుపురాణాదుల్లో ఉన్నది. ఇక్కడ వాల్మీకి రెండుశ్లోకాల్లో ఈ పౌరాణికప్రసిద్ధగాథను స్మరింపజేస్తున్నాడు.

**చతుర్భాగే సముద్రస్య చక్రవాన్నామ పర్వతః ।**
**తత్ర చక్ర సహస్రారం నిర్మితం విశ్వకర్మణా ॥**

**తత్ర పంచజనం హత్వా హయగ్రీవం చ దానవమ్ ।**
**ఆజహార తతశ్చక్రం శంఖం చ పురుషోత్తమః ॥**

కృష్ణావతారంలో ఉట్టంకింపబడిన ఈ కథ విష్ణ్వవతారంలో కూడా ఉన్నదని గోవిందరాజీయవ్యాఖ్య చెప్పింది. అయితే ఈ విష్ణ్వవతారం ఏది? కృష్ణావతారం కంటే అది వేరైనదా? అన్న సందేహానికి ఇక్కడ వ్యాఖ్యాత ఎలాంటి సమాధానం చెప్పలేదు. ఆ పంక్తులు గమనించండి. "కృష్ణ పంచజనం హత్వా పాంచజన్యం జగ్రాహేత్యుచ్యతే। తద్విష్ణ్వవతారేఽపి అస్తేతి జ్ఞేయమ్" ఈ మాటలోని ఆంతర్యం స్పష్టంగా లేదు. ఇక తీర్థీయం ఏ అవతారమో వివరాల్లోకి వెళ్ళకుండా "కస్మింశ్చిత్ దేవాసురయుద్ధే విష్ణోరవతారః పురుషోత్తమః పంచజనం హయగ్రీవాఖ్యం చ దానవం హత్వా సుదర్శనపాంచజన్యౌ జగ్రాహేతి పౌరాణికీ కథా" ఒకానొక దేవాసురయుద్ధంలో విష్ణ్వవతారమైన పురుషోత్తముడు పంచజనుణ్ణి హయగ్రీవుడనే దానవుణ్ణి చంపి సుదర్శనపాంచజన్యాలను గ్రహించాడని పౌరాణిక

కథ అని మాత్రమే చెప్పింది. ఆ యా అవతారాలలో మాత్రమే వచ్చిన ఆయుధాలు కావు సుదర్శనపాంచజన్యాలు. పరమపదంలో ఉన్నపుడే స్వామికి స్వాభావికంగా పంచాయుధవైశిష్ట్యం ఉంది. అయితే సర్వకాలసర్వావస్థానపాయులైన ఆ ఆయుధాలే ఆ యా వ్యాజంగా ఆ యా అవతారాల్లో స్వామికి అందుతూ వచ్చాయని మనం అవగతం చేసికోవాలి. కృష్ణావతారంలో పాంచజన్యం లాగా, రామావతారంలో అగస్త్యునిద్వారా వైష్ణవధనుస్సైన శార్ఙ్గాన్ని పొందినట్లుగానని భావించాలి. ఈ సర్గలో –

**అతోఽన్యదపి యత్కార్యం కార్యస్యాస్య హితం భవేత్ ।**
**సంప్రధార్య భవద్భిశ్చ దేశకాలార్థ సంహితమ్ ॥**

అన్న శ్లోకాన్ని రామానుజీయానుసారంగా గోవిందరాజీయం వ్యాఖ్యానించింది. తీర్థీయంలో కూడా దాని వ్యాఖ్య ఉంది. ఇలా ఇక్కడ 58 శ్లోకాలున్నాయని గోవిందరాజీయ పరిగణన.

43వ సర్గలో ఉత్తరదిక్కుకు శతవలి అనే వానరుణ్ణి పంపడం ప్రధానవిషయం. 'తత్సరస్యమతిక్రామ్య' అనే శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ గోవిందరాజీయం ఇలా అంటుంది. ఇక మేరుపర్యన్త ఇలావృతప్రదేశాన్ని ఉపదేశిస్తున్నాడు. తత్సర ఇతి. ముందు ముందు 'హిమవంతం చ మేరుం చ సముద్రం చ తథోత్తరమ్' అని చెప్పబోతున్నాడు కనుక ఇక్కడ మేరుప్రసక్తి లేనేలేదని భ్రాంతిపడకూడదు. మేరువుకు సంబంధించిన ఉపరిభాగం ఆకాశం ఉన్నదని గుర్తించాలి. ఈశ్లోకంలో 'నష్టచంద్రదివాకరం', 'అనక్షత్రగణం వ్యోమ' అని రెండు విశేషణాలు వ్యోమకు ఆకాశానికి వేయడం జరిగింది. నియతమైన మార్గంలో సంచరించే సూర్యచంద్రనక్షత్రాదులకు మేరుసమీపంలో కిరణసంచారం ఉండదు కనుక 'నష్టచంద్రదివాకరం' అని అనడం జరిగింది. విష్ణుపురాణం ఈ విషయాన్నే ఇలా స్పష్టపరచింది.

**యావత్పురస్తాత్ తపతి తావత్పృష్ఠే చ పార్శ్వయోః ।**
**ఋతే హిమగిరేర్మేరోరుపరి బ్రహ్మణస్య భామ్ ॥**

హేమగిరియైన మేరువుకు ఎంత ముందువైపున సూర్యతాపం ప్రసరిస్తుందో అంతే వెనుకభాగాన కూడా. ఇలాగే ఇరువైపులా సూర్యతాపం ప్రసరిస్తుంది కాని మేరువుకుపైన బ్రహ్మసభనుద్దేశించి ఉపరిభాగాన సూర్యకిరణ ప్రసారం ఉండదు అని దీని అభిప్రాయం. ఈ అభిప్రాయాన్నే పై శ్లోకాలు చెబుతున్నాయని గోవిందరాజీయవివరణం. ఇక్కడ తీర్థీయవ్యాఖ్య లేదు.

ఈ సర్గలోని 58వ శ్లోకం –

**భగవానపి విశ్వాత్మా శంభురేకాదశాత్మకః ।**
**బ్రహ్మా వసతి దేవేశో బ్రహ్మర్షిపరివారితః ॥**

వ్యాఖ్యాతలచే విభిన్నంగా వ్యాఖ్యానింపబడింది. ఇక్కడ తీర్థీయవ్యాఖ్య ఉన్నంత స్పష్టంగా, ఇతరేతర వివరణాలు లేవు. ఇక్కడ భగవచ్ఛబ్దం సాక్షాన్నారాయణున్నే బోధిస్తుందని ఇది నారాయణునియందే రూఢమని తీర్థీయవివరణం. "భగవాన్నారాయణః రూఢనామేదం, స హి భగవచ్ఛబ్దేన ఝటితి ప్రతీయతే, అయమత్ర పదాన్వయః, విశ్వాత్మా భగవాన్ బ్రహ్మర్షిపరివారితః తత్ర వసతి, దేవేశో బ్రహ్మా బ్రహ్మర్షిపరివారితః తత్ర వసతీతి యోజనా" అని తీర్థీయ

సమన్వయం. ఈ వ్యాఖ్యకాక, తీర్థీయోద్ధృతమైన టీకలో – "భగవాన్ షడ్గుణైశ్వర్యసంపన్నః, బ్రహ్మా వేదాత్మకః, శంభుః శివః తత్ర చ సతి" అని 'వసతి' అనే ఏకవచనప్రయోగంచేత శివునికే భగవాన్, బ్రహ్మా, శంభుః అనే శబ్దాల చేత నిర్దేశమని భావిస్తున్నట్లు సమన్వయం ఉంది. ఇది తీర్థీయసమన్వయానికి విరుద్ధం. గోవిందరాజీయ రామానుజీయాదులు తీర్థీయవ్యాఖ్యకే ప్రమాణపురస్సరంగా వివరించాయి. భగవానితి విశ్వాత్మా విశ్వశరీరకుడు సమస్తవిశ్వాన్ని శరీరంగా కలవాడు. భగవాన్ షాడ్గుణ్యపూర్ణ వాసుదేవః, (భగవాన్ అంటే జ్ఞానశక్త్యాది షడ్గుణాలతో పరిపూర్ణుడైన వాసుదేవుడు)

**ఏవమేవ మహాన్ శబ్దో మైత్రేయ భగవానితి ।**
**పరమబ్రహ్మభూతస్య వాసుదేవస్య నాన్యగః ॥**

ఇలాగే భగవాన్ అనే ఈ మహాశబ్దం ఓ మైత్రేయా! పరబ్రహ్మస్వరూపుడైన వాసుదేవునికే అన్వయిస్తుంది తప్ప ఇతరత్ర అన్వయించదు. ఇదికూడా (భగవాన్ అనేది కూడా) శంభువిశేషణం అనడానికి వీలుకాదు. (ఎందువల్లనంటే) ఏకాదశాత్మకత్వ విశేషణం అన్వయించదుకదా! ఏకాదశాత్మకుడు అంటే 11వ మూర్తి, శంభువు, రుద్రుడు, దేవదేవేశుడైన బ్రహ్మ, బ్రహ్మర్షిపరివారితుడై అక్కడ ఉన్నాడు. 'వసతి' అనే క్రియ సర్వత్ర అన్వయిస్తుంది. ఒకవేళ, సందర్భం లేదుకనుక విష్ణువు ఇక్కడ చెప్పబడటం లేదని అంటే, రుద్రుడుకూడా చెప్పబడటం లేదని చెప్పవలసి ఉంటుంది. శంభుశబ్దానికి 'శంభావయతి' అనే వ్యుత్పత్తినిబట్టి బ్రహ్మ అనే అర్థం చెప్పవచ్చుకదా! అప్పుడు విశేషణాలన్నీ బ్రహ్మపరాలే కావలసి వస్తాయి. ఎందువల్లనంటే "శంభూ బ్రహ్మ త్రిలోచనే" అనే కోశకారవచనం కూడా శంభుశబ్దానికి బ్రహ్మ అనే అర్థాన్ని ఇస్తుంది. కనుక భగవచ్ఛబ్దం, విశ్వాత్మశబ్దం విష్ణుపరాలేనని తాత్పర్యం. (శంభు–బ్రహ్మ శబ్దాలు తత్పరాలే) ఇక రామానుజీయం కూడా ఇదే సమన్వయాన్ని అక్షరశః పేర్కొన్నది. అంటే ఇక్కడ రామానుజీయాన్నే గోవిందరాజీయం అనువదించిందన్నమాట. అంతేకాదు. ఇక్కడ 'బ్రహ్మర్షిపరివారితః' అన్న విశేషణం భగవాన్, శంభుః, బ్రహ్మ అనే మూడింటికి అన్వయించాలని అలా కాకపోతే విశేషణ వైరూప్యం ఏర్పడుతుందని రామానుజీయవ్యాఖ్య వివరించింది. ఎందువల్లనంటే ఈ విశేషణం బ్రహ్మకుమాత్రమే వేస్తే భగవాన్ విశ్వాత్మా శంభుః ఏకాదశాత్మికః, బ్రహ్మా దేవేశః బ్రహ్మర్షి పరివారితః అని, మొదటిరెంటికే ఒక్కొక్క విశేషణం, మూడవ దానికి రెండువిశేషణాలు అనే వైరూప్యం ఏర్పడుతుందని రామానుజీయవివరణం.

మిగతావ్యాఖ్య సర్వత్ర సమానమే.

44వ సర్గలో నిశ్చితమైన కార్యాన్ని సాధించే సామర్థ్యం కల హనుమంతునికి అంగుళీయకాన్నివ్వడం ప్రధానప్రతిపాద్య విషయం. ఇక్కడ సందర్భాన్ని తీర్థీయవ్యాఖ్య లెస్సగా వివరించింది. సుగ్రీవుడు సీతాన్వేషణపరమైన అర్థసాధనం విషయంలో హరిశ్రేష్ఠుడైన హనుమంతునియందు నిశ్చయాన్ని పొందిఉన్నాడు. కనుక "విశేషేణ తు సుగ్రీవో హనూమత్యర్థముక్తవాన్" అన్నాడు వాల్మీకి. ఇక్కడ ఉక్తవాన్ అనే క్రియాపదానికి నిక్షిప్తవాన్ అని అర్థం నిర్దేశించాడు రామానుజీయవ్యాఖ్య కర్త. ఇక తీర్థీయవివరణం ఇది సీతాన్వేషణం కొరకు సర్వదిక్కులలోను వానరులను నియోగించి, హనుమంతుడు సర్వోత్తముడు కనుక ఆయనచేతనే కార్యసిద్ధి కలుగుతుందని నిశ్చయించి ప్రశంసాపురస్సరంగా ఆతనితో అంటున్నాడని సంగతిని చెప్పింది తీర్థీయం. ఇక్కడ మరొకరహస్యాన్ని తీర్థీయవ్యాఖ్య

వివరించింది. ఇక్కడ విశేషంగా చేయబడిన ఉపదేశం 'ఈ రాముడు శ్రీ మహావిష్ణువే' అని చెప్పడమే. నృసింహ పురాణం ఇలా చెప్పింది –

**వాయుపుత్రసమీపం తు గత్వా తం వాక్యమబ్రవీత్ ।**
**శ్రుణు మద్వచనం వీర హనుమాన్మారుతాత్మజ ॥**

**అయమిక్ష్వాకు దాయాదో రాజా రామః ప్రతాపవాన్ ।**
**సర్వాత్మా సర్వలోకేశో విష్ణుర్మానుషరూపధృత్ ॥**

వాయుపుత్రుని సమీపానికి వెళ్ళి మాటాడాడు. వీరా! మారుతాత్మజా! నా వచనాన్ని విను. ఈయన ఇక్ష్వాకుదాయాదుడైన రాముడు ప్రతాపశీలుడు. రాజు. సర్వాత్మకుడు, సర్వలోకేశుడు అయిన విష్ణువు మనుష్యరూపాన్ని ధరించాడు అని. ఇలా సుగ్రీవుడు, రాముని అవతారపురుషత్వాన్ని హనుమంతునికి తెలియజేస్తున్నాడని తీర్థీయవ్యాఖ్యా తాత్పర్యం. అయితే ఇది అంత సమంజసంగా లేదు. రామాయణంలో ఎక్కడా సుగ్రీవునికి అలాంటి తత్త్వవివేకం లేశమైనా ఉన్నట్లు గోచరించదు. కనుకనే గోవిందరాజీయాదుల్లో కూడా దానికి సమర్థనం లభించలేదు.

12వ శ్లోకంలో "దదౌ తస్య తతః ప్రీతః స్వనామాంకోపశోభితమ్ అంగులీయమభిజ్ఞానమ్" ఇత్యాదిగా రాముడు స్వనామాంకితమైన అంగులీయకాన్ని సీతాప్రత్యభిజ్ఞానం కోసం హనుమంతునికి అంగులీయకమిచ్చినట్లు వాల్మీకి చెప్పాడు. దానిపై గోవిందరాజీయం ఒకప్రశ్నను వేసి సమాధానం చెప్పింది.

మరి, సకలధనాన్ని విడచి వన్యవృత్తిని ఆశ్రయించి ఉన్న శ్రీరామచంద్రునికి అంగులీయకం ఎలా వచ్చింది? విశేషించి సీతాన్వేషణసమయంలో వినియోగపడేలా దాన్ని ఎలా జాగ్రతపరచాడు స్వామి? అలా చెప్పలేదే వాల్మీకి? అని శంక. అయితే రాముడు దానికొరకు రక్షించి ఉంటాడని గోవిందరాజీయం చెప్పిన ఒకసమాధానం ఇది అంతసమంజసంగా అనిపించదు. జరుగబోయే సీతాపహరణాన్ని ముందే ఊహించి దౌత్యకృత్యాన్ని కూడా ముందే భావించి తదర్థమై అంగులీయకాన్ని రక్షించి స్వామి ఉంచాడనటం చాలా అసహజంగా అనిపిస్తుంది. దానికి మరొక సమాధానం చెప్పాడు వ్యాఖ్యాత. అసలు రామునిదగ్గరకు స్వనామాంకితాంగులీయకం ఎలా వచ్చింది? అది సీతవద్ద ఉండాలిగా! అని శంకించి ఒకప్పుడు సీతదగ్గరనుండి ప్రణయదశలో రావణాగమనానికి ముందే రాముడు తీసుకొని ఉంటాడని. ఇది కొంతవరకు సంభావ్యమే. భార్యాస్నేహంచేత చిటికినవ్రేలికి ఎప్పుడో ముద్ర ధరింపబడటం దేశానుసారం అని మరొక సమాధానం. 'గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్' (చేతిలోనికి తీసికొని భర్తకు కరభూషణమైన అంగులీయకాన్ని సీత చూస్తున్నది) అని వాల్మీకి చెప్పాడు కనుక భర్తుః కరవిభూషణం అనడాన్నిబట్టి జనకుడే కరవిభూషణంగా రామునికి ఇచ్చి ఉండవచ్చునని భావించడం తప్పలేదు. మరి ఆభరణాలన్నీ త్యజించినప్పుడు అంగులీయకం మాత్రం ఈయలేదా? అని ప్రశ్న. స్త్రీకి నాసాకర్ణకరాద్యాభరణాలు అపరిహార్యాలైనట్లు వివాహసమయంలో తనకు బహూకృతమైన స్వనామాంకితముద్రకూడా ప్రీతినిబట్టి తనకు అపరిచార్యమే కనుక దాన్ని రక్షించుకొన్నాడు రాముడు, సీతాప్రీతితోనని అనడంలో అభ్యంతరం లేదు. ఇలాంటి శంకాసమాధానాలు తీర్థీయరామానుజీయాల్లో లేవు.

45వ సర్గలో పంపబడిన వానరాల సన్నాహం వర్ణింపబడింది. 2వ శ్లోకంలో వానరులను 'శలభా ఇవ' అని పోల్చడంలోని ఆంతర్యం ఏమిటి? శలభాలు అగ్నిచే ఆకృష్టాలై సులభంగా నశించే స్వభావం కలవి కనుక,

వానరులు కూడా విషయచాపలంచే నశించేవారని భావం స్ఫురింపదా? అనే కుశంకకు తావు లేకుండా తీర్థీయవ్యాఖ్య శలభోపమానంచే వానరులసంఖ్య లెక్కింపరానిదని వ్యక్తమవుతున్నదని చెప్పింది. (శలభోపమానేన వానరాణామ సంఖ్యేయత్వముక్తమ్) మొదటిశ్లోకంలో 'సర్వాన్' అని ఆరంభించి ద్వితీయపాదంలో 'సమస్తాన్' అనడం పునరుక్తి కదా అనే శంకను వారిస్తూ గోవిందరాజీయం సమః తాన్ అని విభజించింది. సమః అంటే సర్వత్ర సమభావన కలిగి పక్షపాతరహితుడై అని అర్థం చెప్పింది. సమస్తశబ్దానికి సంఘీభూతులని కూడా అర్థం. కనుక సర్వాన్ సమస్తాన్ అనే రెండు కలిసి సంఘీభూతులైన సర్వవానరులను అని అర్థం చెప్పినా దోషం లేదని వ్యాఖ్యాతృ భావన కూడా. 'ఆనయిష్యామహే సీతామ్' ఇత్యాది శ్లోకాల్లోని అత్యుత్సాహపూర్ణాలైన వానరుల చేష్టలను వ్యాఖ్యాతలు విశేషంగా వివరించలేదు. ఇది వ్యాఖ్యాగమ్యమైన విషయం కాకపోవడమే దానికి కారణం. 46వ సర్గలో సుగ్రీవుడు తనకు సర్వభూమండలపరిజ్ఞానం కలగడానికి మూలమేమిటో రామునికి వివరించటం ప్రధానవిషయం. ఇక్కడ దుందుభి ప్రస్తావన తెచ్చిన సుగ్రీవవచనాల్లోని "దుందుభి" శబ్దం అభేదోపచారం చేత తత్పుత్రుడైన మాయావి చెప్పబడుతున్నాడని తీర్థీయవ్యాఖ్య చెబుతున్నది. దీన్ని పూర్వపక్షనిర్దేశపురస్సరంగా సమర్థించింది గోవిందరాజీయ వ్యాఖ్య. ఒకే సందర్భంలో దుందుభి మాయావి వృత్తాన్తాలు రెండూ ప్రసక్తాలై పూర్వం చెప్పబడ్డాయి కనుక ఇక్కడ మహిషరూపుడైన దుందుభి, ఎలాగా తనకు అగుపించకుండా ప్రచ్ఛన్నంగా దాచుకొని, వాలి బిలం నుండి వెలికి వచ్చి నగరానికి చేరిన తర్వాత ఒకప్పుడు మళ్ళీ ఉన్మత్తుడై వచ్చి వాలిచే చంపబడ్డాడని, కనుక విరోధమేమీలేదని వ్యాఖ్యాత పేర్కొన్నాడు. మాయావి చంపబడిన గుహాప్రదేశం దగ్గరే దుందుభిచంపబడటంవల్ల సుగ్రీవుడు మాయావి దుందుభులపేర్లను వ్యత్యాసం చేసి ఇలా చెప్పడంలో అనౌచిత్యం ఏమీలేదని వ్యాఖ్యాతృభావన. అయితే, ఈ సందర్భంగా "ఇలా ఒకచోట ఒకపేరును మరొకచోట మరోపేరును ప్రస్తావించడం వాల్మీకిశైలి" అని వ్యాఖ్యానించిన గోవిందరాజీయాభిప్రాయం సమంజసంగానే అనిపిస్తున్నది. ఎందువల్లనంటే రావణుడు సీతకు పీడను కలిగించేసమయంలో హనుమంతుడు ఆ జరిగినవిషయాన్ని చెప్పేటప్పుడు వేరే పేర్లను ప్రస్తావించాడు వాల్మీకి.

మాయావి-దుందుభుల విషయంలోను, వారికిగల పరస్పరసంబంధం విషయంలోనూ వ్యాఖ్యాతల్లో భిన్నాభిప్రాయాలున్నట్లు తోస్తున్నది. తీర్థీయవ్యాఖ్య మాయావి దుందుభిపుత్రుడని పేర్కొన్నది. వాస్తవానికి మాయావి కథప్రస్తావింపబడిన 9వ సర్గలో తీర్థీయవ్యాఖ్య ఈ విషయంలో ఏ విధమైన వివరణం ఇవ్వలేదు. కాని గోవిందరాజీయవ్యాఖ్య ఉత్తరకాండవచనాన్ని ఉట్టంకిస్తూ "మాయావీ ప్రథమస్తాత దుందుభిః తదనన్తరం" అని మయుడు చెప్పిన మాటనుబట్టి మాయావి-దుందుభి ఈ ఇరువురూ మయునిపుత్రులని వారిలో మాయావి పెద్దవాడు కాగా, దుందుభి చిన్నవాడని తెలుస్తున్నది. కనుకనే గోవిందరాజీయవ్యాఖ్య 9వ సర్గలోని "మాయావీ మాన తేజస్వీ పూర్వజో దుందుభే సుతః" అనే వాల్మీకివచనాన్ని వివరిస్తూ, పైన పేర్కొన్న రామాయణోత్తరకాండలోని ఐతిహ్యాన్ని పురస్కరించుకొని పూర్వజో దుందుభేః సుతః అనే పదాలకు దుందుభేః పూర్వజః మయస్య పుత్రః మాయావీ అని వివరణాన్నిచ్చింది గోవిందరాజీయవ్యాఖ్య. అయితే అక్కడ వాల్మీకి ఉట్టంకించిన స్త్రీకృతమైన మహావైరమేమిటో వ్యాఖ్యాతలెవ్వరూ వివరించలేదు. 11వ సర్గలో దుందుభి అనే మహిషం గురించిన ప్రస్తావన వచ్చినప్పుడుకూడా తీర్థీయంగాని, తదుద్ధృతటీకలు కాని ఎలాంటి వివరణ ఈయకపోవటాన్ని గమనించాలి.

47వ సర్గలో దక్షిణదిక్కుకు వెళ్ళినవారు తప్ప మిగిలిన దిక్కులకు వెళ్ళిన వానరుల ప్రత్యాగమనం ఇక్కడ వర్ణింపబడింది. ఈ సర్గలోని చిట్టచివరి శ్లోకంలో వానరులంతా వెదుకవలసిన ప్రదేశాలన్నీ వెదికారని ఇక ఏ దిక్కుకు హనుమానుడు వెళ్ళాడో ఆ దిక్కుననే "ఉదార సత్త్వాభిజనో మహాత్మా స మైథిలీం ద్రక్ష్యతి వానరేంద్రః" అనే వాక్యం చేత నిర్దేశింపబడిన హనుమానుడు మైథిలిని దర్శింపగలడు అని చెప్పడంలో మూడు హేతువులున్నాయని గోవిందరాజీయవ్యాఖ్య పేర్కొన్నది.

1. ఉదారసత్త్వాభిజనః – శ్రేష్ఠసత్త్వముగల వంశము కలవాడు అనడంచేత బలవంతునిపుత్రుడు అనేది సీతాదర్శనంలో ప్రథమహేతువు.

2. మహాత్మా – మహాధైర్యశాలి అనడంచేత సీతను దర్శించకుండా రాడని సీతాదర్శనానికి కావలసిన ధీరత కలవాడని రెండవహేతువు.

3. దిశంతు – "యామేవ ధాతా తు సీతా తామాస్థితః" అనడంచేత సీత దక్షిణదిక్కుననే ఉన్నది కనుక ఆమెను హనుమంతుడు తప్పక దర్శింపగలడని దిక్కు మూడవ హేతువుగా చెప్పబడింది.

48 వసర్గలో సీతాన్వేషణానికి దక్షిణదిక్కుకు వెళ్ళిన హనుమదాదులు అసురనిరసన చేసినంతవరకు గల వృత్తాన్తం చెప్పబడింది. 'స్నిగ్ధపత్త్రాః స్థలే' ఇత్యాది (11) వ శ్లోకంలో కూడా ఆ శ్లోకంలోని (న సంతి శ్లోకంలోని) న సంతి అనేది అన్వయిస్తుందని తీర్థీయం, రామానుజీయం రెండూ చెబుతున్నాయి. అయితే ఆ శ్లోకంలో (11) భ్రమరైశ్చాపి వర్జితాః అని ఉండటంచేత న సంతి అనేది అన్వయించదని గోవిందరాజీయాభిప్రాయం.

49 వ శ్లోకంలో ప్రదేశాన్తరాన్వేషణం వర్ణింపబడింది. వ్యాఖ్యా విశేషాలేమీలేవు. 50,51 సర్గల్లోనూ వ్యాఖ్యావిశేషాలు లేవు. వివిధప్రదేశాన్వేషణం 50 లోనూ, స్వయంప్రభాబిలప్రవేశం 51 లోనూ వర్ణింపబడ్డాయి. హనుమంతుడు స్వయంప్రభతో పలికిన మాటలలో తమ మానసికస్థితిని శారీరికస్థితిని వర్ణించడాన్ని వ్యాఖ్యాతలు యథామూలంగా విశదపరచారు. ఈ సర్గలోనూ, వెనుకటి సర్గల్లో లాగానే కేవలం పదపదార్థ వివరణానికిచ్చిన ప్రాధాన్యాన్ని ఇతరేతరవిశేషవివేచనకు ఈయలేదు. ఇందులో తత్త్వార్థవిశ్లేషణం కూడా ఏమీలేదు.

51వ సర్గలో స్వయంప్రభానివాసస్థానమైన బిలాన్ని గురించి హనుమంతుడు ప్రశ్నింపగా స్వయంప్రభ చెప్పిన సమాధానాన్ని వాల్మీకి 10వ శ్లోకంలో 'మయోనామ మహాతేజాః' ఇత్యాది శ్లోకంచే నిర్దేశించాడు. ఇక్కడ వ్యాఖ్యాత "మయోనామ త్రిపురాధిపతిః త్రిపురే నష్టే స్వరక్షణార్థమిదం హిలం కృతవానితి మత్స్యపురాణే త్రిపురదహన ప్రస్తావేఽభిహితమ్" మయుడనే ప్రసిద్ధిగల త్రిపురాధిపతి త్రిపురనాశానంతరం తనరక్షణకోసం ఈ బిలాన్ని నిర్మించాడని మత్స్యపురాణంలో త్రిపురదహనప్రస్తావంలో చెప్పబడింది. అని ఐతిహ్యాన్ని పేర్కొన్నాడు. ఈతడు మాయావి అంటే మాయాయుక్తుడని చెప్పబడటంచేత ఈతడు అసురతక్షకుడైన మయుడు కాడని సూచింపబడు తున్నాయని కూడా వ్యాఖ్యాత (గోవిందరాజీయం) పేర్కొన్నాడు.

52వ సర్గలో స్వయంప్రభ పూర్వసర్గాంతంలో హనుమదాదుల ఆగమనానికి కారణం ప్రశ్నించినదానికి ప్రతిసమాధానం హనుమంతుడు స్వాగమన హేతువును చెప్పడం వర్ణింపబడింది. 52వ సర్గారంభంలో ఉండవలసిన తీర్థీయవ్యాఖ్య ప్రతీకవచనం. "అథ హనుమతా స్వాగమనహేతురుచ్యతే ద్విపంచాశే అథేత్యాది"

అనేది 51వ సర్గకు ఆదిలో చేర్చబడింది. ఇది గ్రంథసంపాదనంలోని దోషం కాకపోయినా ముద్రణపరంగా ఏర్పడిన దోషం కావచ్చు. వ్యాఖ్యానవిశేషాలు లేవు. 53వ సర్గలో స్వయంప్రభాబిలంనుండి వెలుపలికి వచ్చిన వానరుల నిర్వేదం వర్ణింపబడింది. ఈ సర్గలో కాలాన్ని నిర్దేశిస్తూ వాల్మీకి వ్రాసిన శ్లోకాలు సమన్వయంలోనూ, కాలనిర్ణయంలోనూ వ్యాఖ్యాతలు తమ కాలజ్ఞతను ప్రదర్శించారు. "తా వసంతమనుప్రాప్తం" అనే శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ తీర్థయవ్యాఖ్య గోవిందరాజీయవ్యాఖ్యలు సమానశైలినే చూపినా మాసనిర్దేశంలో కొంతతేడా చూపినట్లు తులనానుశీలనవలన అనిపిస్తున్నది. వసంతకాలం ప్రత్యాసన్నమైందని అన్నప్పుడు సాక్షాత్తు వసంతం వచ్చిందని కాదని, 'మాఘం ప్రవర్తించిందని' (మాఘః ప్రవృత్తః) తీర్థీయవ్యాఖ్య. అయిన ఇది ఫాల్గుణమేనని గోవిందరాజీయ వ్యాఖ్య – 'పౌషోతీతః మాఘః ప్రవృత్తః' అని తీర్థీయం అంటే "పౌషో మాఘశ్చాతీతః, ఫాల్గునః ప్రవృత్తః" అని గోవిందరాజీయం దాన్ని దిద్దుబాటు చేసింది. ఇలాగే 'వయమాశ్వయుజే మాసి' అనే శ్లోకవ్యాఖ్యానంలో 'వయమాశ్వయుజే మాసి హనుమచ్చాంతేన సుగ్రీవేణ త్రిపంచరాత్ర సంఖ్యయా హనూమతాః' అని తీర్థీయం. ఇక్కడ దశరాత్రసంఖ్యయా అని గోవిందరాజీయం.

ఇక్కడ వ్యాఖ్యాతల భావాలలోని తేడాను ఈ క్రింది వాక్యాల్లో గమనించండి.

వసంతమనుప్రాప్తం వసంతకాలం దగ్గరకు వచ్చింది. అప్పుడు శిశిరము ఎలా? ఇలా శరత్కాలాంతంలో సుగ్రీవుడు మార్గశీర్షమాసంలో సేనను రప్పించి పౌషమాసాన్ని అవధిగా నిర్ణయించి సీతాన్వేషణ కొరకు ఆ పౌషమాసం గడచిపోయింది. మాఘం వచ్చింది. ఇక్కడ గోవిందరాజీయం ఆపౌషమాసం మాఘం కూడా గడచిపోయింది. ఫాల్గునమే వచ్చిందని మార్చింది. కనుక వసంతం సన్నిహితమైందే తప్ప రాలేదు. మేము (వానరులు) ఆశ్వయుజ మాసంలో హనుమంతునిచే ప్రేరితుడైన సుగ్రీవునిచేత 15 రోజులు 'త్రిపంచరాత్ర సంఖ్యయా' గణనంలో (ఇక్కడ త్రిపంచరాత్రస్థానంలో దశరాత్రసంఖ్యయా అని గోవిందరాజీయం మార్పు చేసింది.) నియమించి ఆహ్వానింప బడ్డారు. అటుతరువాత మార్గశీర్షమాసంలో లక్ష్మణప్రేరితుడైన సుగ్రీవునిచేత పదిరోజులగణనంతో రప్పింపబడ్డారు. (ఇక్కడ గోవిందరాజీయం మార్పుచేయక దశరాత్రసంఖ్యను స్వీకరించింది) తర్వాత సీతాన్వేషణ విషయంలో పౌషమాసాన్ని అవధిగాపెట్టి ఆతనిచే పంపబడ్డారు. ఈ విధంగా ఆశ్వయుజమాసాన్ని ఆరంభించి కాలసంఖ్యచేత నియమింపబడిన వానరులకు కాలాన్ని విస్మరించడం అనేది యుక్తం కాదుకదాఅని అభిప్రాయం. ఇలా వ్యాఖ్యానించి మళ్ళీ తీర్థీయవ్యాఖ్య పక్షాంతారాన్ని కూడా నిర్దేశించింది. దీన్నే గోవిందరాజీయవ్యాఖ్య మరొకపక్షంగా చూపించింది. తీర్థీయవ్యాఖ్యలో చూపబడిన పక్షాంతరం ఇది. యద్వా లేక ఆశ్వయుజమాసంలో అన్నచోట ఆశ్వయుజమాసశబ్దం కంటే వేయబడిన సప్తమీవిభక్తి సామీప్యాదివివక్షచేత అందువల్ల కార్తికమాసం చెప్పబడుతున్నది.

**కార్తికే సమనుప్రాప్తే త్వం రావణవధేయత ।**
**ఏష నస్సమయః సౌమ్య ప్రవిశత్వం స్వమాలయమ్ ॥**

అని నిర్ణయించిన కాలం అతిక్రమించడంవల్ల శ్రీరామచంద్రునికోపాన్ని దర్శించడంవల్ల ఇక్కడ కార్తికమాసం చివరిభాగమే చెప్పదలచింది. 'ప్రస్థితాః సోపిచాతీతః కిమతః కార్యముత్తరమ్' అనేచోట అపి చ అనేమాటచేత వెదకడానికి అవధి నిశ్చయించిన మార్గశీర్షమాసంకూడా కలుపుకోబడుతున్నది. ఇవే వాక్యాలను చూపి మధ్యలో

1,2 చోట్ల చిట్టచివరమాత్రం మార్గశీర్షమాసం స్థానంలోనూ గోవిందరాజీయం మార్పులు చేసింది. ఇది దాని వాక్యవిన్యాసం. 'అన్యేత్యాహుః' – ఇతరులైతే ఇలా అన్నారు. "దశమ్యాముత్థితాయామ్" అన్నప్పుడు ఎలాగైతే సప్తమీవిభక్తి సమీపాధికరణవివక్షచే ప్రయోగింపబడుతున్నదో అలాగే, ఆశ్వయుజే మాసి అనే శ్లోకంలోని ఆశ్వయుజశబ్దంకంటే ప్రయోగించిన సప్తమి కూడా ప్రయోగింపబడింది. కనుక "కార్తికే సమనుప్రాప్తే త్వం రావణ వధేయత" అని చెప్పిన కాలంకూడా అతిక్రమించినందువల్ల రామునికి కల్గిన కోపాన్ని దర్శించనందువల్ల (ఇక్కడ) కార్తికమాసాంతమే వివక్షితం. అదికూడా దాటిపోయింది. వెదుకడానికి హద్దుగా నిర్ణయించిన ఆ మార్గశీర్షమాసంకూడా దాటిపోయింది. అపి చ అనే రెండు పదాలచేత అటు తరువాత వెంటనే ప్రసక్తమయ్యే పౌషమాఘమాసలు రెండూ కలుపుకోబడుతున్నాయి. కనుక ఫాల్గునమే వచ్చిందని భావం. అని అన్నారు. కనుక సమాధానం ఏంచేయాలి అని పక్షాంతరాన్ని గోవిందరాజీయం తీర్థీయవ్యాఖ్యావిశేషాన్నే మార్పుచేసి చూపింది. ఈ మార్పు కాలనిర్దేశకృతమైన విరోధం లేకుండా చేయడానికేనని గమనించాలి. 28వ శ్లోకం (అప్రవృత్తే చ సీతాయాః)లో 'ప్రాయోపవిశనం' అన్న శబ్దాన్ని వాల్మీకి ప్రయోగించాడు. దాన్ని ప్రాయోపవేశనం, ప్రాయోపవిశనం అని రెండు రకాలుగా వ్యాఖ్యాతలు నిర్వచించారు. "ప్రాయాయ అంతగమనాయ ఉపవేశనం ప్రాయోపవేశనం" అని గోవిందరాజీయ వివరణం. దీన్నే తీర్థీయవ్యాఖ్య ప్రాయోపవిశనంగానే నిర్దేశిస్తూ విశధాతువుకు గుణం రాకపోవడం ఆర్షమని పేర్కొన్నది.'అనశనదీక్ష' అని అర్థవివరణం చేసింది. "ప్రాయశ్చానశనే మృత్యా" వి కోశః. అని కోశకార వచనాన్ని కూడా ఉట్టంకించింది. 31వ శ్లోకంలో వాక్యవిన్యాసం వాల్మీకిది విచిత్రంగా ఉంది. "కిం మే సుహృద్భిర్వ్యసనపశ్యద్భిః జీవితాంతరే" అనే వాక్యాన్ని ఆపాతతః చూస్తే అపార్థమే వస్తుంది. జీవితావసానంలో నావ్యసనాన్ని చూస్తున్న స్నేహితులవల్ల ప్రయోజనం ఏముంది? అంటే తనవారి క్లేశాన్ని చూస్తూఉండే స్నేహితులవల్ల ప్రయోజనం శూన్యమనే అర్థం స్ఫురిస్తున్నది. కాని వాక్యతాత్పర్యం ఇదికాదని వ్యాఖ్యాతలు లెస్సగా వ్యాఖ్యానించారు. "జీవితావధే వ్యసనం పశ్యద్భిః సుహృద్భిః కిమ్? సుహృదో మద్వ్యసన ప్రదర్శనేన క్లేశయిత్వా మమ కిం ప్రయోజనమ్" మిత్రులకు నాకు కలిగిన క్లేశాన్ని చూపించి బాధ పెట్టినందువల్ల ప్రయోజనం ఏమిటి? ఇలా మిత్రులకు మనక్లేశాలను చూపెట్టి వారిని బాధపెట్టరాదని ఈ వాక్యతాత్పర్యంగా వ్యాఖ్యాత చేసిన వివరణం మనోజ్ఞం.

54వ సర్గలో హనుమంతుడు, అంగదుని మతాన్ని భేదించడం ద్వారా (యుక్తిపురస్సరంగా నిరాకరించడం ద్వారా) ఆతడు సుగ్రీవసన్నిధికి వెళ్ళేలా నియోజనం చేయడం ప్రధానవిషయం. ఈ సర్గలోని మొదటి శ్లోకం ఇలా ఉంది –

**తథా బ్రువతి తారే తు తారాధిపతివర్చసి ।**
**అథ మేనే హృతం రాజ్యం హనుమాన్ అంగదేన తత్ ॥**

ఈ శ్లోకానికి తాత్పర్యం ఇది –చంద్రునివంటి తేజస్సుగల తారుడు అలా మాటాడుతూ ఉండగా అంగదునిచే రాజ్యం హరింపబడిందని హనుమానుడు భావించాడు.

వెనుకకు తిరిగివెళ్తే సుగ్రీవాజ్ఞకు భంగం కలిగింది కనుక తీక్ష్ణదండాన్ని ఎదుర్కోవలసి వస్తుందని భయపడిన వానరులనుద్దేశించి తారుడు ఇలా అన్నాడు. "ఈ బిలం ప్రవేశించి మాసమంతా ఉందాం. భయపడవలసిన

అవసరం ఏమిటి? ఇక్కడ దేవేంద్రునివల్లగాని, సుగ్రీవునివల్లగాని, రాఘవునివల్లగాని భయంలేదు. ఇది మాయానిర్మితం. ఎవ్వరికీ ప్రవేశింపరానిదే. అధికవృక్షజలాదులతోనూ భోజ్యవస్తువులతో కూడిఉంది.” అన్న తారునిమాటలు, అంగదునే సమర్థించినట్లవుతున్నందువల్ల తిరిగి వెళ్ళరాదనే అంగదుని నిర్ణయాన్నే కపులంతా సమర్థించడాన్నిబట్టి, వానరులలో ప్రముఖులైనవారినందరినీ అంగదుడు, సుగ్రీవునికి ప్రతిపక్షం చేసినందువల్ల రాజ్యం హరింపబడినట్లేనని నీతికోవిదుడైన హనుమానుడు భావించాడట. ఇది ఇలా ఉండగా వ్యాఖ్యాతల్లో తీర్థీయవ్యాఖ్యాత అసలీప్రస్తావనే చేయకపోగా గోవిందరాజీయం “రాజ్యం హృతం మేనే” అన్న మాటలకు “రాజ్యం కర్తుం సామర్థ్యమస్తీతి మేనే” అని వ్యాఖ్యానించడం విషయగతమైన గాంభీర్యాన్ని కప్పిపుచ్చడమేనని భావించాలి. ఇక్కడ అంగదునికి రాజ్యపాలనాసామర్థ్యం ఉన్నదని నిశ్చయించడంకాక, అంగదుడు సుగ్రీవునికి వ్యతిరేకంగా అభిప్రాయాన్ని కూడగట్టడాన్నిబట్టి, సుగ్రీవరాజ్యాన్ని కూడా హరింపగల నీతికుశలత అంగదునికున్నదని నిశ్చయించి, ఎలాగైనా అంగదప్రయత్నాన్ని అడ్డాలని ఉద్యమించినట్లు ముందుముందు శ్లోకాలనుబట్టి నిర్ణయింపవలసి ఉంటుంది.

‘బుద్ధ్యాహ్యష్టాంగయా యుక్తం’ అనే రెండవ శ్లోకంలోని అష్టాంగాలు, చతుర్బలాలు మొదలైన నీతిశాస్త్రప్రధాన పారిభాషికపదాలకు తీర్థీయం సప్రమాణంగా వివరణాన్నిచ్చింది. గోవిందరాజీయం దాన్ననుసరించింది.

గ్రహణ–ధారణ–స్మరణ–ప్రతిపాదన–ఊహాపోహార్థవిజ్ఞాన–తత్త్వజ్ఞానాలు ధీగుణాలుగా చెప్పబడ్డాయి. ఈ ఎనిమిది గుణాలతోకూడిన బుద్ధిని అష్టాంగయుక్తమైన బుద్ధి అంటారు. బాహుబల–మనోబల–ఉపాయబల–బంధుబలాలనేవి నాల్గుబలాలు.దేశకాలజ్ఞత, దార్ఢ్యం, సర్వక్లేశసహిష్ణుత్వం, సర్వవిజ్ఞానిత్వం, దాక్ష్యం, ఊర్జః, సంవృతమంత్రత్వం,అవిసంవాదిత్వం, శౌర్యం, శక్తిజ్ఞత్వం, కృతజ్ఞత్వం, శరణాగతవత్సలత్వం, అమర్షత్వం, అచపలత్వం అనేవి పదునాల్గుగుణాలు. ఇవన్నీ కలవాడు వాలిపుత్రుడైన అంగదుడని భావించాడట హనుమాన్. కనుకనే తారాదులనందరినీ తన అభిప్రాయానికి తగ్గట్లు మలచుకొని, సుగ్రీవరాజ్యాన్ని నీతిచే హరించాడనే భావనను హనుమంతునికి కలిగించాడని ప్రఘట్టక తాత్పర్యం. నీతిశాస్త్రపరంగా ఈ సన్నివేశాలను వ్యాఖ్యాతలు ఇంకా విశేషంగా వివరింపవలసిఉన్నా వ్యాఖ్యాతలు అవసరమైన చోట్ల మాత్రమే వివరించి సంతృప్తి చెందారు. ఈ సర్గలో తీర్థీయ–గోవిందరాజీయాలకు చెప్పుకోదగ్గ తేడా ఏమీలేదు.

కొన్నచోట్ల కొద్దిపాటితేడా నిర్వచనంలో చూపినా తాత్పర్యతః రెంటికీ పెద్దగా అభిప్రాయంలో తేడా లేదు. ఉదాహరణానికి – ‘కోపోపాయ సమన్వితైః’ అనే పదానికి కోపరూపఉపాయః కోపోపాయః దండః, తత్సమన్వితైః అని గోవిందరాజీయం, కోపజన్యోపాయః కోపోపాయః దండః ఇత్యాదిగా తీర్థీయం. ఇక్కడ కోపరూపః ఉపాయః అని ఒకవివరణం. కోపజన్యః ఉపాయః అని మరొక్కవివరణం. తాత్పర్యం మాత్రం దండోపాయమని. ఇదీ వీటికి గల తేడా. చాలా చోట్ల ఇలాగే నడిచింది వ్యాఖ్యాద్వయం. తత్త్వనిరూపణంలో మాత్రం గోవిందరాజీయునిదే పైచేయి అని అంగీకరింపక తప్పదు. పద పదార్థవివరణంలో తీర్థీయశైలి ప్రసన్నమనోహరం. ఇదే గోవిందరాజీయునికి చాలాచోట్ల మార్గదర్శకం.

55వ సర్గలో కోతులు ప్రాయోపవేశప్రయత్నం చేయడం ప్రతిపాద్యవిషయం. ఇక్కడ వ్యాఖ్యావిశేషాలేవీ లేవు. 56వ సర్గలో సంపాతిసంవాదవర్ణనవిషయం. ఈ సర్గలో సంపాతివచనాలలోని అన్వయక్లిష్టతను పరిష్కరించారు వ్యాఖ్యాతలు. రామానుజీయవ్యాఖ్య- తీర్థీయవ్యాఖ్యలు.

**పరం పరాణాం భక్షిష్యే వానరాణాం మృతం మృతమ్ ।**
**ఉవాచేదం వచః పక్షీ తాన్నిరీక్ష్య ప్లవంగమాన్ ॥**

అనే శ్లోకంలో శ్రేష్ఠులైన వానరుల్లో శ్రేష్ఠుడైనవాణ్ణి తింటాను అంటూ 'మృతం మృతం భక్షిష్యే' చంపి చంపి తింటాను అని దానర్థం. మృతం మృతం అన్న క్తాన్తపదాలకు చనిపోయిన చనిపోయిన అని అర్థం చెబితే ఇక్కడ వీప్సకు రెండుసార్లు పదాన్ని ఆవృత్తిచేయడానికి తాత్పర్యం ఏమిటి? దీన్ని వ్యాఖ్యాతలు ఇలా వివరిస్తున్నారు. పరాణాం అంటే శ్రేష్ఠులైన వానరుల్లో పరం ముఖ్యమైన వానరాన్ని మృతం మృతం హత్వా హత్వా చంపి చంపి భక్షిస్తాననే మాటను పక్షిపలికింది. అలాకాకపోతే స్వయంగా మరణించిన వానరాన్ని భక్షిస్తే వెనుక వానరాణాం భయమాగతం అని వానరుల భయానికి సంపాతియే కారణమని వానరులనడం, "పశ్య గృధ్రాప్రదేశేన" ఇత్యాదిగా సీతావ్యాజంగా సాక్షాత్తు యముడే వానరులవినాశనానికై ఇక్కడికే వచ్చాడు. అని అంగదుడు ముందు ముందు అనబోవడం ఇవేవీ కుదరవు కదా! మృతాలైనవాటిని భక్షించే పక్ష్యాదులు ఏవీ ఇతరులకు భయహేతువులు కావుకదా! పైగా ఆకలితో నకనకలాడుతూ మాంసం కొరకు అప్పుడే వెలుపలికి వచ్చిన సంపాతి, ఆ వానరాలు స్వయంగా మరణించాలని అపేక్షింపదు కనుక వారిని చంపి చంపి తింటానని అనడంలో అనౌచిత్యం లేదని వ్యాఖ్యాతృభావన. రామానుజీయవ్యాఖ్యకూడా ఇదేభావనను వ్యక్తపరచింది. ఇదే సర్గలో 'తదసుఖమనుకీర్తితం' అనే శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ రామానుజీయవ్యాఖ్య ఇలా అంటుంది. శ్లోకం చివర 'సగృధ్రరాట్' అనే పదం ఉండటం సమీచీనమని అలాకాకపోతే వృత్తభంగం ఏర్పడుతుందని వ్యాఖ్యాత పేర్కొనడాన్నిబట్టి ఇతరకోశాల్లో వృత్తభంగకరంగా మరొకపదం ఉండి ఉంటుందని ఊహించవలసిఉంది. ఇక్కడ వ్యాఖ్యాత మరొకవిషయం ఇలా ఉట్టంకిస్తున్నాడు. కొన్ని కోశాల్లో ఈ 'తదసుఖ' ఇత్యాది శ్లోకం తర్వాత సర్గపరిసమాప్తి కనుపిస్తున్నది. కొన్ని కోశాల్లో "సూర్యాంశు దగ్ధపక్షత్వాత్" అనే శ్లోకం తర్వాత సర్గసమాప్తి గోచరిస్తున్నది. సాధారణంగా సర్గసమాప్తిని స్ఫురింపజేసే వృత్తభేదం ఉందికనుక 'తదసుఖమ్' అనే శ్లోకం తర్వాతనే సర్గపరిసమాప్తి సముచితమనిపిస్తున్నది అని రామానుజీయవ్యాఖ్య. గోవింద రాజీయంకూడా ఈ శ్లోకంతోనే సర్గసమాప్తిని ఉట్టంకించింది. ఇతరవ్యాఖ్యాతలెవ్వరూ ఈ వృత్తభేదాన్నిగాని, సర్గసమాప్తినిగాని పట్టించుకొన్నట్లు అగుపించదు. ఈ సర్గలో ఇంచుమించుగా వ్యాఖ్యాతలు ప్రతిశ్లోకాన్నీ వ్యాఖ్యానించినా చెప్పుకొనదగిన విశేషాలు లేవు. "అస్మిన్ సర్గే పంచవింశతి శ్లోకాః" అని గోవిందరాజీయం శ్లోకనిర్దేశం చేసింది. అయినప్పటికీ 'సూర్యాంశుదగ్ధ' ఇత్యాది శ్లోకంతోనే సర్గసమాప్తిని భావిస్తున్నదని భావింపరాదు. 18 నుండి 25 వరకు ఏ ఒక్కశ్లోకాన్నీ వ్యాఖ్యానింపకపోవడం గమనార్హం. తీర్థీయంలో కూడా ఈ శ్లోకాల వ్యాఖ్యానం లేదు. దాన్నిబట్టే ఇవి సర్గాంతంగా ఇతరకోశాలనుబట్టి పరిగణింపబడినా వ్యాఖ్యానింపక వ్యాఖ్యాతలు విడిచారని భావించడం సముచితం.

57వ సర్గలో సంపాతిప్రశ్నకు ప్రతిసమాధానం వర్ణింపబడింది. పై సర్గలో జటాయువు, వానరుల మాటలు విని దశరథునికి మిత్రుడు జటాయువు అన్న ప్రస్తావన వచ్చినపుడు "తస్యైవ చ వామభ్రాతుః సఖా దశరథః

కథమ్” అని ప్రశ్నించాడు. అయితే అంగదుని ప్రతిసమాధానంతో ఈ సర్గలో “రామస్య తు పితుర్మిత్రం జటాయుర్నామ గృధ్రరాట్” అని మాత్రం చెప్పి జటాయువు అడిగిన మైత్రీప్రకారాన్ని చెప్పకపోవడంలోని ఆంతర్యాన్ని వ్యాఖ్యాతలు ఇలా చెప్పారు. “మైత్రీప్రకారం నాకు తెలియదు” అని చెప్పడంలోనే అంగదుని తాత్పర్యం అని ఉట్టంకించాడు. గోవిందరాజీయ రామానుజీయాల్లో ఇంతకంటే వ్యాఖ్యలేదు. తీర్థీయవ్యాఖ్య అసలేలేదు. 58వ సర్గలో సంపాతి సీత ఉన్నస్థానాన్ని ఉట్టంకించటం ప్రధానవిషయం. ఈ సర్గలోని 16వ శ్లోకం నుండి 28వ శ్లోకం వరకు తన దివ్యత్వాన్ని ఆవిష్కరించడానికి సంపాతి పలికిన మాటల్లోని అభిప్రాయాన్ని వ్యాఖ్యాతలు విస్పష్టంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఒకవిషయాన్ని గమనించాలి. 18వ శ్లోకంలో సంపాతి తనజన్మ వైనతేయునివల్ల జరిగిందని “వైనతేయాచ్చ నో జన్మ” అని స్పష్టపరిచాడు. అయితే వైనతేయశబ్దానికి వినతపుత్రులైన గరుడుడు, అనూరుడు (అరుణుడు) ఇద్దరూ అర్థం కావచ్చు కనుక ఇక్కడ సంపాతి జటాయువు ప్రభృతులు గరుడపుత్రులా? అరుణపుత్రులా అనే సంశయం కలుగుతుంది. ఇక్కడ అర్థవివరణంలో తీర్థీయవ్యాఖ్యలో ఉన్న స్పష్టత గోవిందరాజీయంలో లేదు. పైగా వాక్యాల్లో పూర్వాపరవైవిధ్యం కూడా ఉన్నట్లు గోచరిస్తున్నది. ఎలా? మొదట వైనతేయాత్ – గరుడాత్ నః అస్మాకం, జన్మ ఉత్పత్తిః అని ‘గరుడునివల్ల మాజన్మ’ అని అర్థం వ్రాసిన గోవిందరాజీయం నను అని ఒక పూర్వపక్షం చేసి –

**ద్వౌ పుత్రౌ వినతాయాస్తు గరుడో అరుణ ఏవ చ ।**
**తస్మాజ్జాతోహమరుణాత్ సంపాతిస్తు మమాగ్రజః ॥**

అని అరణ్యకాండలో జటాయువు తాను అరుణపుత్రునిగా చెప్పాడు కనుక ఇక్కడ వైనతేయుడంటే గరుడుడని అర్థం చెప్పకూడదు కదా? అని శంకోత్థాపనం చేసి “వైనతేయాదిత్యస్య వినుతా పుత్రాత్ అరుణాదిత్యర్థ ఇత్యదోషాత్” అని వినతాపుత్రుడైన అరుణుడని వైనతేయశబ్దానికి అర్థం చెప్పడం దోషంకాదని సమాధానం చెప్పాడు. మరి, పూర్వం వైనతేయాత్ గరుడాత్ అని అర్థం వ్రాయడంలో ఔచిత్యం ఎంతమాత్రం లేదని స్పష్టం. అంతేకాక, ‘వైనతేయగతిః’ అన్న సమాసానికి వైనతేయయోః అరుణగరుడయోః గతిరిత్యర్థః. అని వివరణం కూడా ఇచ్చి పూర్వం దానికి విరుద్ధంగా అర్థం వ్రాయడం అసమంజసంగా తోస్తున్నది. ఇది ప్రామాదికం. బహుశః లేఖకప్రమాదం కూడా కావచ్చు వైనతేయ శబ్దానికి అరుణుడని సాక్షాత్తుగా అర్థం వ్రాస్తే సరిపోగా నను అని శంకోత్థాపనం చేయడం కూడా వ్యర్థము. అపార్థము అని గమనించాలి. తీర్థీయవ్యాఖ్య ఇలాంటి ‘అసావిదిత్యో బ్రహ్మ’ అనే వ్యవహారంలేక “వైనతేయాత్ వినతాపత్యాత్ అనూరోః అస్మాకం జన్మ” అని నిస్సందిగ్ధంగా అర్థం వ్రాసింది. శంకా సమాధానాలకు అవకాశం ఈయలేదు. ఇక ‘అస్మాకం విహితావృత్తిః’ అనే శ్లోకానికి ‘గర్వితం తు కృతం కర్మ’ అనే శ్లోకానికి పౌర్వాపర్యనిర్ణయం వ్యాఖ్యాతలంతా ఏకకంఠంగా చేశారు. ‘కథాసు సంగతి’ ని హేతువుగా చూపి నిర్ణయం చేశారు.

“తతస్తదమృతాస్వాదమ్” అని ప్రారంభించి ఐదు సర్గలు (59.60,61,62,63) ప్రక్షిప్తాలని గోవిందరాజీయ–రామానుజీయవ్యాఖ్యల నిర్ణయం. “తతస్తదమృతాస్వాదమ్” అని ఆరంభించి ఐదుసర్గలు ప్రక్షిప్తాలు. సర్వకోశాల్లోనూ అగుపించడంలేదు కనుక అవే లేకపోయినా కథాసంవిధానం నడుస్తున్నది కనుక పైగా పూర్వం చెప్పిన విషయాలకు

విరోధం కూడా గోచరిస్తున్నది కనుక అని ఇవి ప్రక్షిప్తాలనడంలో హేతువులు చూపి, అయినా ఇవి వ్యాఖ్యానింపబడుతున్నాయి అని వ్యాఖ్యానించడం విశేషం. రామానుజీయం ఇదే అభిప్రాయాన్ని ఆవిష్కరిస్తూ – "స్థితస్య గతిశ్చింతనీయా ఇతి న్యాయేన తే వ్యాఖ్యాయన్తే" ఉన్నదానికి ఒకగతి ఆలోచించాలి. అనే న్యాయాన్నిబట్టి వ్యాఖ్యానిస్తున్నాం. అని ఉన్నది. కనుక ఈ 5 సర్గలవ్యాఖ్య గచ్ఛద్వ్యాఖ్యయే. తీర్థీయవ్యాఖ్య ఇలాంటిమాటలేమీలేకుండ 5 సర్గలు వ్యాఖ్యానించింది. కొన్ని అసంగతులు శ్లోకాల్లో ఉన్నట్లు గోవిందరాజీయం పేర్కొన్నది. 60వ సర్గలోని–

**తతస్తు సాగరాన్ శైలాన్ నదీస్సర్వాస్సరాంసి చ ।**
**వనాన్యుదధివేలాం చ సమీక్ష్యమతిరామత్ ॥**

అనే శ్లోకంలో సంపాతి తాను సూర్యతాపంచేత పీడితుడై వింధ్యశిఖరంపై పడి స్మృహకోల్పోయి, మళ్ళీ తిరిగి స్మృహ కలిగిన తర్వాత సమస్తసాగరాలను నదులను కొండలను దర్శించానని చెప్పడం అసంగతమని గోవిందరాజీయం వ్యాఖ్యానించింది. "వింధ్యప్రదేశపతితస్య సకల సాగరదర్శనస్య అనుపపన్నత్వాత్" (వింధ్య పర్వతంపై పడినవానికి సకలసాగరదర్శనం కలగడం అసంగతమని వ్యాఖ్యాతృభావన) కనుక ఈ అసంగతిని దృష్టిలో పెట్టుకొని తీర్థీయవ్యాఖ్య 'సాగరాన్' అన్న బహువచనశబ్దానికి సాగరం అని ఏకవచనార్థం చెప్పింది. 64 వ సర్గలో శతయోజనవిస్తీర్ణమైన సాగరాన్ని లంఘించడం విషయంలో అంగదుడు చేసిన ప్రస్తావనాన్ని విని ఏ వానరులూ మాటాడక తూష్ణీంభావం వహించడంలో ఔచిత్యం ఏమిటని తీర్థీయవ్యాఖ్య శంకించి సమాధానం చెప్పింది. ఇది దాని అభిప్రాయం. మరి, అపారసంఖ్యాకాలైన యోజనాలదూరం లంఘింపసామర్థ్యం కల వానరులు, అసమర్థులైనవారిలా కేవలం నూరు యోజనాలదూరం లంఘించడం గురించి ప్రస్తావన వచ్చినపుడు మాటాడక మిన్నక ఉండటం ఎలా జరిగింది? అనుల్లంఘనీయశాసనంకల సుగ్రీవుడు ఏర్పరచిన కాలనియమం అతిక్రమింపబడటంచేత, ధైర్యం జారిపోయినందువలన, అప్రమేయంగల రావణుని సామర్థ్యాన్ని ఎరిగినందువలన వానరులు సమర్థులై ఉండికూడా మిన్నకుండినారని భావించాలి. కనుకనే స్కాందపురాణంలో చెప్పబడింది.

**నీలోఽఙ్గదో హనూమాంశ్చ జాంబవాన్ అథ కేసరీ ।**
**సముద్రతీరమాగమ్య న శేకుస్స్పందితుం పదమ్ ॥**
**రావణస్య బలం జ్ఞాత్వా తీరే నదనదీపతేః ॥ అని.**

నీలుడు, అంగదుడు, హనుమానుడు, జాంబవంతుడు, కేసరి వీరంతా సముద్రతీరానికి వచ్చి కాలు కదపలేకపోయారు. దానికి కారణం సముద్రతీరంలో రావణాసురుని బలాన్ని ఎరుగడమే అని, ఇలా స్కాందవచన నిదర్శనపురస్సరంగా తీర్థీయవ్యాఖ్య శంకాసమాధానాలను ఆవిష్కరించింది. గోవిందరాజీయంలో ఈ అంశంలో ఈ వివేచనం లేదు. వ్యాఖ్యకూడా లేదు.

ఇక 65వ సర్గలో అంగదవచనం ప్రధానాంశం. ప్రథమశ్లోకవ్యాఖ్యానంలో గోవిందరాజీయం ఇలా అంటున్నది. వాస్తవానికి గజాదులు కూడా శతయోజనలంఘనంలో సమర్థులే. ఎందువల్లనంటే సుగ్రీవసన్నిధిలో వానరులు స్వయంగా తమ శక్తిని ఈ క్రిందివిధంగా ఆవిష్కరించారు.

**భూతలే సాగరే వాపి శైలేషు చ వనేషు చ ।**
**పాతాలస్యాపి మధ్యే వా న మామిచ్ఛద్యతే గతిః ॥**

భూతలంమీద, సాగరంలోనూ, పర్వతాలయందుగాని, వనాలలోగాని, పాతాళమధ్యంలోగాని, నాగతికి ప్రతిహతి లేదు అని. 'న హి వో గమనే సంగః' ఇత్యాదిశ్లోకంల్లో అంగదుడు కూడా స్వయంగా అన్నాడుకదా! అయినప్పటికీ రావణుడు అధిష్ఠించి ఉన్న లంకలో ప్రవేశించడం, సీతనువెదకడం ఇతరులకు దుష్కరం కనుక ఈ కృత్యాన్ని సాధించగల హనుమంతుని ప్రోత్సహించడానికే అలా అన్నారని భావించాలి అని ఇంతవరకూ గోవిందరాజీయవ్యాఖ్య. విశేషాలకు తీర్థీయవ్యాఖ్యవిశేషాలకు ఏమీ తేడా లేదు. రామానుజీయం వివిధపాఠాలను ప్రదర్శించింది. జాంబవద్వచనానువాదసంవాదంలో "ఋక్షత్వం" వానరావాంతరజాతి అని కనుకనే సుగ్రీవాదులు కూడా ఋక్షరాజులేనని రామానుజీయవ్యాఖ్య ఈ విషయాన్నే మరికొంత విశదపరచింది తీర్థీయవ్యాఖ్య.

"తమువాచ హరిశ్రేష్ఠో జాంబవాన్ వాక్యకోవిదః" అనే శ్లోకంలో జాంబవంతుని 'హరిశ్రేష్ఠ' అని సంబోధించడాన్నిబట్టి జాంబవంతుడు భిన్నజాతీయుడుకాడని కోతులతో ఉన్న సాధర్మ్యాన్నిబట్టి (సమాన ధర్మత్వాన్ని బట్టి) అని గమనించాలి. ఋక్షజాతికి వానరజాతికి భేదం చాలా స్వల్పం. కనుకనే అంగదున్నుద్దేశించి జాంబవంతుడు కూడా "హర్యృక్షసత్తమ" అని సంబోధించడం కూడా దాన్నిబట్టియేనని గుర్తించాలి అని తీర్థీయవ్యాఖ్య. హరిత్వఋక్షత్వాలకు సంబంధంలేకపోతే 'హర్యృక్ష' ప్రయోగం ఎలా సాధ్యం? హర్యృక్షసత్తమ అనేది మునివచనాన్నిబట్టి నిర్ధారణషష్ఠిగా స్వీకరించాలని లేదా సప్తమీసమాసంకూడా కావచ్చని తీర్థీయవ్యాఖ్య. 66వ సర్గలో హనుమంతుని జాంబవంతుడు ప్రేరించడం ప్రధానవిషయం.

66వ సర్గ వ్యాఖ్యావిశేషాలు ఇంచుమించుగా ఏమీలేవు. వ్యాఖ్యాతలు పదాలను వివరించడం తప్ప చేసిన వ్యాఖ్యానం ఏమీలేదు. 'అరిష్టనేమినః' అనే ప్రయోగం నకారాన్తంగా ఉండడం ఆర్షమని వ్యాఖ్యాతృవివరణం. 'త్రివిక్రమే మయా తాత' అనే 32వ శ్లోకంలో జాంబవంతుడు త్రివిక్రమావతారసమయంలో చూపిన పరాక్రమ వైశిష్ట్యాన్ని వివరిస్తూ శ్రీ ఉత్తరరామాయణంలోని –

**బహుయోజనసాహస్రం క్రామత్యేష తతోఽంబరా ।**
**పితుర్బలాచ్చ బాల్యాచ్చ భాస్కరాభ్యాసమాగతః ॥**

అనే శ్లోకాన్ని ఉట్టంకించి సమర్థించాడు తీర్థీయవ్యాఖ్యాత.

67వ సర్గలో వ్యాఖ్యావిశేషాలేమీలేవు.

ఇక్కడ హనుమత్ప్రేరణమే ప్రధానవిషయం.

ఇలా తీర్థీయ–గోవిందరాజీయవ్యాఖ్యలకు గల పరస్పరసంబంధాన్ని మూలగ్రంథావగాహనలో వీటికిగల విశిష్టస్థానాన్ని ఇంకా పఠితలు విశేషంగా మననం చేయాలి.

# సుందరకాండ సారాంశం

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

హనుమంతుడు అంజనాదేవి కుమారుడు. పరమాత్మయే జీవాత్మ అనే "సోఽహం" భావం అద్వైత సిద్ధాంతం కాగా, జీవాత్మ పరమాత్మకు అణురూపుడు కాబట్టి పరమాత్మకు సదా దాసుడై ఉండాలనే భావం ఈ సిద్ధాంతమయ్యింది. దీనివల్ల జీవుడు ఎల్లప్పుడూ పరమేశ్వరునకు దాసుడై ఉండాలనే సంప్రదాయం బయలుదేరింది. ఆంజనేయుడు కేవలం రామదాసుడేకాదు. మహాజ్ఞానికూడ. జ్ఞానికూడ లోకసంగ్రహణార్థం కొన్ని కర్మలు ఆచరించడం తప్పనిసరి అవుతుంది. ఆంజనేయునిలో కేవలం దాస్యరూపమైన శరణాగతితత్త్వమే కాదు. ఆచార్యత్వం కూడ గోచరిస్తుంది. లంకలో రామదర్శనానికై ఎదురుచూచే సీత వద్ద ఆయన వ్యవహరించిన విధానం దీనిని వ్యక్తం చేస్తుంది.

హనుమంతుడు ఒక మహాయోగి. అణిమ మహిమ మున్నగు సిద్ధులెన్నో కలవాడు. అంత మహాత్ముడయినా "దాసోఽహం కోసలేంద్రస్య"అని యోగంకన్న, జ్ఞానంకన్న భగవద్దాస్యం మిన్నయని ఎలుగెత్తి చాటాడు. రామకార్యార్థమై తన శరీరాన్ని పెంచి చారణులు విహరించే మార్గంలో పయనించాడు. అంతకన్న పై మార్గంలో పయనిస్తే క్రిందకు దిగడం కష్టదాయకం. బయలుదేరేసమయంలో బ్రహ్మచారి సంప్రదాయాన్ని అనుసరించి ముందు గురువులైన సూర్యునికి నమస్కరించాడు. రామబాణం వలె వెళ్లివస్తానని ప్రతిజ్ఞ చేసాడు. రామబాణగమనాన్ని సప్తసాలభంజనవేళ ఆయన వీక్షించాడు. మార్గమధ్యంలో ఎన్నో ఆటంకాలను అధిగమించాడు. మైనాకుడిచ్చిన ఆతిథ్యమును మాటమాత్రంచే గ్రహించాడు. సూక్ష్మగ్రాహియై సురసనోటలో ప్రవేశించి బయటకు వచ్చి ఆమె కోరిక నెరవేర్చాడు. ఛాయాగ్రాహిని నిర్జించాడు. అప్పుడాయన నీడ చాల పెద్దదిగా కనబడింది. కావున ప్రాతఃకాలంలోనే సముద్రలంఘనం చేసాడని తిలకవ్యాఖ్యానం చెబుతుంది.

మారుతి తన శరీరాన్ని పెంచడంలో ధృతి, మైనాకుడు ఇచ్చిన ఆతిథ్యంలో దృష్టి, సురసవద్ద మతి, ఛాయాగ్రాహిని వధించడంలో దాక్ష్యం ప్రదర్శించాడని, ఈ నాలుగు గుణాలు ఎవరి వద్ద ఉంటాయో వాడు కర్తవ్య పరాయణుడు కాగలడని ఆకాశసంచారులు ప్రస్తుతి చేసారు. తనవారు చూస్తూ ఉండగా పున్నమినాడు సముద్రం ఉప్పొంగినట్లు శరీరంపెంచాడని, తగ్గించే సమయంలో యోగి బ్రహ్మానందానుభూతిని పొంది తిరిగి ప్రకృతిలోనికి వచ్చినట్లు కుదించాడని వ్రాయడం వాల్మీకి అత్యంత ప్రతిభకు ఒక నిదర్శనం. తాను ఏ మాత్రం శ్రమను సముద్రలంఘనంలో పొందకపోవడంవల్ల వందల కొలది యోజనాలు తాను పయనించగలననే ఆత్మవిశ్వాసాన్ని పొందాడు. భవిష్యత్తులో సంజీవిని తెచ్చుటకు వెళ్ళినప్పుడు ఈ ధైర్యమే ఆయనకు దోహదమయింది.

లక్ష్యాలక్ష్యరూపంతో లంకలో ప్రవేశించాలనుకొన్నాడు. సూక్ష్మరూపమని భావం. లంబమనే పేరు గల గిరి యొక్క శిఖరంపై నున్న నగరంలో ప్రవేశించాలనుకొన్నాడు. లంబాకార శిఖరమని భావం అది వస్వోకసారప్రతిమయై ఉంది. అంటే అలకాపురి కాని ఇంద్రపురికాని అయి ఉండవచ్చు అన్నట్లు ఉంది. ఈ దుర్గం విషమమై ఉంది. రాముడు సమబుద్ధికలవాడుకదా. శ్రీరాముడు సైతము ప్రవేశించి ఏమి చేయగలడు? ఎలా దీనిని సాధించగలడని

చింతించాడు. సీతను చూచిన పిమ్మటనే ఆ విషయాన్ని ఆలోచించవచ్చునుకొన్నాడు. మారుతి లంకలో ప్రవేశిస్తూ ఉండగా లంకాధిదేవత చూచి తన అరచేతితో వేగంగా బలంకొలది కొట్టింది. మారుతి కూడ ఆమె స్త్రీయని భావించి లఘుముష్టి ప్రహారం చేసాడు. వానరుడొకడు నిన్ను జయించినపుడు రాక్షసులకు కీడు దాపురిస్తుందనే బ్రహ్మవాక్యాన్ని జ్ఞప్తిచేసుకొని ఆమె హనుమంతుని లంకలో ప్రవేశింపుమని వచించింది.

**"అద్వారేణ మహాబాహుః ప్రాకార మభిపుప్లువే"** అని వాల్మీకి. ముఖద్వారం నుండి కాక ప్రాకారం నుండి దుమికి లంకానగరంలో అడుగుపెట్టాడు ఆంజనేయుడు. అద్వారంతో అనడంచేత లంకాపరిభవం రాక్షసులకు తెలియరాలేదని తిలకం, శత్రుపట్టణంలో ద్వారం నుండి ప్రవేశించరాదని రామానుజీయం, శత్రుస్థానంలో అద్వారం నుండే ప్రవేశించాలని దీపిక వ్యాఖ్యలు వివరించాయి. అప్పుడు ఎడమ కాలుముందు ఉంచి ప్రవేశించాడు. అద్వారమనేచోట యోగసంప్రదాయప్రకారంగా బ్రహ్మద్వారం గుండా వెళ్లాడనే భావం కూడ నిబిడీకృతం, పద్మ, స్వస్తిక, వర్ధమాన నామక గృహాదుల నన్నింటిని పృషదంశకమాత్ర సదృశుడై పరిశోధించాడు. రాత్రి సమయంలో మార్జాలప్రమాణుడై తిరిగాడు. పిల్లి ఎవరి దృష్టిలోను పడకుండా తన పని తాను చక్కపెట్టుకోగలదు. అంత చంద్రోదయమై చంద్రుడు చక్కగా ప్రకాశించాడు. అయిదో సర్గలో చంద్రోదయవర్ణన జరిగింది. చంద్రుడు 27 నక్షత్రాలకు అధిపతి కావున ఇందు 27 శ్లోకాలనే మహర్షి వ్రాయడం జరిగింది.

రావణాదుల భవనాలలోను, పుష్పకవిమానంలోను అన్వేషించాడు. చివరకు రావణాంతఃపురంలో ప్రవేశించాడు. అక్కడ గాఢనిద్రలో ఉన్న రావణుని, అంతఃపురం స్త్రీలను, మండో(దో)దరిని వీక్షించాడు. మండోదరిని చూచిన వెంటనే ఆమెయే సీతయని హర్షోల్లసితుడయ్యాడు. "ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం....." అని భుజాలు చరుచుకొన్నాడు. వాలాన్ని ముద్దాడాడు. గంతులు వేసాడు. స్తంభం పైకి ఎగబ్రాకి భూమి మీదికి జారాడు. ఇవన్నీ వ్యామోహంచే కోతిలక్షణాలు కనబరచాడని తిలకం, ఉపాంశువుగా అంటే ఇతరులకు తెలియరాకుండా చేశాడని దీపికవ్యాఖ్యలు వివరించడం జరిగింది.

పిమ్మట అలా నిద్రించియున్న ఆమెను చూచి ఆమె సీతకాదని నిర్ధారించుకొన్నాడు. పానభూమిలో సీత కొరకై అన్వేషించాడు. ధర్మలోపశంకకు కూడా లోనయ్యాడు. ఆ శంకను నివృత్తం చేసుకొని మళ్ళీ వెతికాడు. ఆమె మరణించిందేమోయని దుఃఖించాడు. ఉత్సాహం తెచ్చుకొని మళ్ళీ అన్వేషించాడు. సీత కోసమై మారుతి ఎక్కడా సీతకానరాకపోవడంచే చింతాక్రాంతుడయ్యాడు. ఆమె గతించియుండునని భావించి చింతించి, ఆ వార్తను రామునికి తెలియజేస్తే అనర్థాలు కలుగుతాయని నిర్ణయించాడు.

సంపాతి చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చి మళ్లీ కర్తవ్యోన్ముఖుడయ్యాడు. లక్ష్మణునితో కూడిన రామునకు, సీతకు, తదితర దేవతలకు నమస్కరించాడు. అశోకవనంలో ప్రవేశించి, ఒక శింశుపా వృక్షంలో దాగి యుండి సీతను అన్వేషించసాగాడు. అక్కడ పవిత్ర జలాలతో నిండిన నదిని చూచి "సంధ్యా కాల మనాశ్యామా ధ్రువ మేష్యతి జానకీ" అని సీత ఇక్కడకు ప్రాతః స్నానధ్యానాదులకై తప్పక వచ్చునని నిర్ధారించుకొన్నాడు. యోగ సంప్రదాయంలో 18 సిద్ధులు సిద్ధిస్తే తప్ప మూలప్రకృతి దర్శనం జరగదు. కాబట్టి 15వ సర్గలో 19 శ్లోకంలో

మారుతికి సీతాసందర్శనభాగ్యం కల్గినట్లు మహర్షి వ్రాయడం జరిగింది. "తతో మలిన సంవీతాం" అని ప్రారంభించి "సుఖార్హాం దుఃఖసంతప్తాం వ్యసనానా మకోవిదామ్" అని సర్వసుఖాలు పొందడానికి యోగ్యురాలైయుండి కూడ దుఃఖాల పాలయియున్న ఆమెను జూచి ఆమెయే సీత అయి ఉండవచ్చునని భావించాడు. ఋశ్యమూక పర్వతం మీదుగా పై నుండి వెళ్లిన అంగన రూపరేఖలే ఈమెయందున్నవని, ఆమె క్రిందకు జారవిడిచిన ఆభరణాలు ఇందులేవని, ఆనాటి ఉత్తరీయం రంగు ఈమె ధరించిన చీరరంగు ఒకే విధంగా ఉన్నాయని, ఇలా అనేక విధాలుగా ఊహించి ఈమెయే సీత అయి ఉంటుందని నిర్ణయించుకొన్నాడు.

పిమ్మట మారుతి సీతాదేవిశీలసౌందర్యాలను ప్రశంసిస్తూ, కష్టదశలోనున్న ఆమెను చూచి తాను కూడ శోకసంతప్తుడయ్యాడు. ఇంతలో తెల్లవారబోతోంది. రావణుడు ఆమెను చూడడానికి రాగా ఆ చెట్టు ఆకుల మధ్యలో ఎవరికి కానరాకుండ ఉండిపోయాడు. మలమండల చిత్రాంగి అయిన సీతను రాక్షసాధిపతి వీక్షించాడట. మలరూపమైన మండనంచే చిత్రమైన అంగములు కలదని, మలావృత అయినా ఆశ్చర్యాన్ని కలిగించే దేహం కలదని తిలకం వ్యాఖ్యానించింది. మలమే మండనమని, దానిచే చిత్రమైన అంగములు కలదని దీపిక వచించింది. రావణునిలో జీవలక్షణం, స్వరూపలక్షణం కూడ గోచరిస్తాయి. ఒకప్పుడామెను కామభావంతోను, మరొకప్పుడు దైవభావనతో వీక్షించడం జరిగింది.

**"ఏవం చైతదకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి"**

అని అంటాడు రావణుడు. నాయందు కామం లేనిదానివైన నిన్ను స్పృశించనంటాడు. అకారమంటే విష్ణువనే అర్థం కావున విష్ణువు నందు కామం కలదానివైన నిన్ను స్పృశించననే అర్థాంతరం కూడ ఇందు స్ఫురిస్తుంది. సీతాదేవి ఆతనితో

**"అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్ ।**
**న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా" ॥** అని తన ప్రభావం చేత, రామాజ్ఞ లేని కారణంచేత నేను భస్మం చేయడం లేదు అంటుంది. ఇందు బ్రహ్మాదుల వరరూపమైన నీ తపఃఫలితాన్ని కూడ గౌరవించాలి కాన ఆ పనిచేయడం లేదనే అర్థాంతరం కూడ స్ఫురిస్తుంది. "తృణమంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా" అని తృణం అడ్డంగా ఉంచి రావణునితో మాట్లాడిందని ఇందు ఎన్నో వ్యాఖ్యానాలు. ఎన్నో అర్థాలు. ఉపనిషద్వాక్యం ప్రకారంగా ఎవరికి ఎన్ని విజయాలయినా, అమ్మవారి ముందు తృణప్రాయాలు అని భావం. రావణుడామెకు రెండు నెలలు గడువిచ్చి వెళ్ళిపోతాడు. రావణాజ్ఞపై రాక్షసాంగనలు సీతను పీడింపసాగారు. అంతట త్రిజట తన స్వప్నవృత్తాంతాన్ని వివరించి రాఘవునకు విజయం, రాక్షసేంద్రునికి వినాశం తప్పదని హెచ్చరించింది.

**"పక్షీ చ శాఖానిలయం ప్రవిష్టః**
**పునః పునశ్చోత్తమ సాంత్వవాదీ" (27-53)**

**"పక్షీ చ శాఖానిలయః పృహృష్టః"** అనే పాఠాంతరం కూడ ఉంది. దేహం మీది శుభలక్షణాలను తెలిపి, శాకునలక్షణాలను కూడ వ్యక్తపరచడం జరిగిందని ఎన్నో వివరణలు, వ్యాఖ్యానాలు, ఇక మారుతి మళ్లీ ఆలోచనకు

లోనయ్యాడు. తాను సీతతో మాట్లాడకుండ ఓదార్చకుండ వెళ్లినచో అనర్థం జరగవచ్చుననుకొన్నాడు. తాను సంస్కృతంలో మాట్లాడితే ఆమె నమ్మకపోవచ్చునని, సాధారణ మనుష్యభాషలో ప్రసంగించాలనుకొన్నాడు. మైథిలీప్రాకృతంలో మాట్లాడాడని కొందరి వ్యాఖ్యానం. ఆయన ఎప్పుడూ దశరథుని ముందు పేర్కొని అటు పిమ్మటే వక్తవ్యాంశం చెప్పడం పరిపాటి. అంత సీత "పింగాధిపతే రమాత్యం" అయిన మారుతిని చూచింది. పింగ శబ్దానికి నేరుగా వానరార్థం లేకపోయినా విశేషంచే వానరమనే అర్థం చెప్పవలసియుంది. ఆమె కూడ తెల్లవారు జామున కోతిని చూచానేమిటని ఎన్నో ఆలోచనలకు లోనయ్యింది. చివరకు రామదూతగా ఆతనిని విశ్వసించింది. మారుతి వర్ణించిన రామలక్ష్మణస్వరూపాలను విని, ఆతడిచ్చిన అంగుళీయకమును గ్రహించి, చూడామణిని ఆనవాలుగా ఇచ్చి కాకాసుర వృత్తాంతాన్ని, మనస్తిలకవృత్తాంతాన్ని అభిజ్ఞానంగా చెప్పింది. హనుమంతుడు ఆమెను ఓదార్చి తిరుగుప్రయాణానికి సిద్ధమయ్యాడు.

ఇక్కడ ఒక్క విషయాన్ని పర్యాలోచన చేయవలసియున్నది. **"న మాంసం రాఘవో భుంక్తే"** అని మారుతి సీతతో చెబుతాడు. కాని ఇదివరకు రాముడు మాంసభక్షణ చేసినట్లు చెప్పబడింది. ఇది ఎలా సమర్థనీయమని వ్యాఖ్యానకారులు, విమర్శకులు పెక్కు అర్థాలు చెప్పారు. కాని సీతాపహరణం జరిగిన తరువాత రాముడు మాంసాన్ని ముట్టలేదని చెబితే ఏ దోషమూ ఉండదు.

అంత ఆంజనేయుడు తాను చేయవలసిన పనిలో అల్పకార్యం మిగిలిపోయిందనుకొన్నాడు. రాక్షసరాజుతో సంభాషించి వెళ్లాలనుకొన్నాడు. సామదానభేదోపాయాలకన్న దండోపాయమే రాక్షసుల పట్ల ఉచితమవుతుందని భావించాడు. అశోకవనాన్ని భంజించాడు. అంత రాక్షసకాంతలు సీతవద్దకు వచ్చి నీతో మాట్లాడినవాడెవ్వడని ప్రశ్నించారు. దానికామె **"అహిరేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః"** అని పాముపాదాలు (జాడలు) పాములకే ఎరుక అని నిగూఢంగా మాట్లాడింది. ఒక్కొక్కప్పుడు సత్యాన్ని గూఢంగా మలిచి చెప్పవచ్చు. అందు అసత్యదోషం ఉండదు.

రావణుడు తన మీద యుద్ధానికి పంపిన కింకరులను, జంబుమాలిని, ఏడుగురు మంత్రిపుత్రులను, ఐదుగురు సేనాపతులను, అక్షకుమారుని హనుమ వధించాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం ప్రయోగించగా, దానికి కట్టుబడి రావణసభలోనికి ప్రవేశించాడు. రావణుడు మారుతిని చూచిన వెంటనే.

**"యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా ।**
**సోఽయం వానరమూర్తి స్స్యాత్ కిం స్విద్బాణోఽపి వాసురః" ॥ (50-3)**

అని తనను శపించి నందీశ్వరుడే ఇలా వచ్చాడా? లేదా బాణాసురుడు ఈ రూపంతో వచ్చాడా? అని భావించాడు. దీనివల్ల మహాబలి సుతుడైన బాణుడు కూడ రావణుని శపించాడని తిలకం, లేక ఇతడు బాణుడా అని భావించాడని దీపిక వచించాయి. పావని వాక్పాటవం కలవాడు కాన రాజమర్యాద ననుసరించి ముందు "వాక్యమర్థవదవ్యగ్రః తమువాచ దశాననమ్" అని సభానియమానుసారంగా మాట్లాడాడు. పిమ్మట సీతారాముల సామర్థ్యాన్ని వివరించి

మృదువుగా మందలించాడు. సీతాదర్శనార్థమై వచ్చానని, ఆమెను నీ గృహంలో చూచానని అన్నాడే తప్ప, ఆమెను నీవు అపహరించావని తూలనాడలేదు.

**"బ్రహ్మా స్వయంభూశ్చతురాననో వా**
**రుద్రస్త్రినేత్ర స్త్రిపురాంతకోవా ।**
**ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా**
**త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్" ॥ (51-45)**

ఇందు వ్యుత్క్రమంగా ముందు ఇంద్రుని, పిమ్మట రుద్రుని, అటు పిమ్మట బ్రహ్మను సంభావనచేసి అర్థం చెప్పాలని తిలకం వ్యాఖ్యానించింది. రావణుడు క్రోధోద్రిక్తుడై వానరవధకై ఆజ్ఞాపిస్తాడు. దూతను వధింపదగదని విభీషణుడు హితం పలికాడు. రావణాజ్ఞతో రాక్షసులు హనుమంతుని తోకకు నిప్పట్టించి నగరమంతా త్రిప్పారు. హనుమంతుడు ఒక్కక్షణంలో హ్రస్వత్వాన్ని పొంది, బంధవిముక్తుడై లంకాదహనం కావించాడు. అంత సీత మారుతి విషయంలో చల్లనివాడవు కమ్మని అగ్నిని ప్రార్థించింది. సీత ఏమంటుందో అని ముందు చింతించి "జానకీ న చ దగ్ధా" అనే చారణుల అమృత వాక్యాలను విని, అగ్నిని చల్లార్చికొని సీతను మరల సందర్శించి తిరుగు ప్రయాణమయ్యాడు మారుతి.

తిరిగి సముద్రతీరం చేరాడు. వానరులందరికి **"దృష్టా సీతేతి విక్రాంతః సంక్షేపేణ న్యవేదయత్"** అని సంక్షిప్తంగా మారుతి సీతాదర్శనాన్ని వివరించాడు. "సీతా దృష్టా" అనకుండా "దృష్టా సీతా" అని అనడం హనుమంతుని వ్యాకరణ పాండిత్యానికి పరమోదాహరణం. లేదా విపరీతార్థాలు వచ్చే ప్రమాదం ఉంది. తాను లంకలో సంచరించిన విధానాన్ని వారికి పూసగ్రుచ్చినట్లు వివరించాడు. ఇక్కడ రావణుని వారించే సందర్భంలో

**"వరా మందో(డో) దరీ నామ తయా చ ప్రతిషేధితః"** అని మండోదరి నివారించిందని చెప్పాడు. కాని మహర్షి ధ్యానమాలిని నివారించినట్లుగా ముందు చెప్పడం జరిగింది. ఈ రెండింటికి స్వవచన వ్యాఘాతం లేకుండా సమర్థించడం కోసం ఇక్కడ మండోదరీ శబ్దానికి సూక్ష్మమైన నడుము కలదియని వ్యాఖ్యానకారులు అభిప్రాయపడ్డారు. కొందరు ఇద్దరూ వారించారని అర్థం చెబుతారు.

కాని వారి నామాదికం హనుమంతునకు పూర్తిగా పరిచితం కాకపోవడం వల్ల అలా చెప్పి ఉండవచ్చు. అందరూ లంకపై దండెత్తుటకు ఉత్సహించారు. అంగదుడు కూడ అలాగే అంగీకరించడంతో జాంబవంతుడు వారించాడు. అందరూ తిరుగు ప్రయాణమై మధువనం చేరారు. అంగదుని అంగీకారం తీసుకొని వానరులు మధుభక్షణం చేసి కేరింతలు కొట్టారు. వానరులచే భంగపడిన దధిముఖుడు వేగంగా సుగ్రీవుని సన్నిధికి వెళ్ళి మధువన విధ్వంసాన్ని తెలియజేసాడు. సుగ్రీవుడు కార్యం సఫలమైనదని భావించి రామలక్ష్మణులకు విషయాన్ని వ్యక్తపరచాడు. సుగ్రీవసందేశానుసారంగా హనుమదాదులు కిష్కింధకు వచ్చినారు. హనుమంతుడు రామునకు ప్రణమిల్లి, దక్షిణ దిక్కుగా తిరిగి సీతకు వందనమాచరించి చూడామణిని ఇచ్చాడు. ఆమె చెప్పిన అభిజ్ఞానాలను వివరించాడు. అనంతరం సీతాసందేశాన్ని వినిపించాడు.

ఇవి సుందరకాండలోని విశేషాలు.

# శ్రీమద్వాల్మీకి రామాయణం - సుందరకాండ సమీక్ష

**వ్యాఖ్యాత - డా॥ శలాక రఘునాథ శర్మ**

**విఘ్నేశ్వరం విఘ్నశాన్త్యై వాణీం వాచః ప్రవృత్తయే ।**
**గురూన్ గూఢార్థభావాయ ప్రణమామి పునః పునః ॥**

శ్రీమద్రామాయణం సాక్షాత్తు వేదమే. అందులో అనేకమైన గంభీరమైన రహస్యాలు భావుకులకు గోచరిస్తాయి. మందమధ్యమాధికారుల కోసం పరమభావుకులైన మహాత్ములు వ్యాఖ్యానాలు రచించారు.

రామాయణంలో సుందరకాండానికి ఒక ప్రత్యేకత వున్నది. దానిని దృష్టిలో ఉంచుకొని కవి హృదయభావనా పాటవం నిండుగా పండించుకొన్న మహానుభావులు శ్రీగోవిందరాజనామ విభూషితులు శృంగార తిలకమనే వ్యాఖ్యానాన్ని మానవజాతికి అందించారు. శ్రీపరమహంస పరివ్రాజకాచార్యులు, శ్రీ నారాయణ తీర్థులవారి శిష్యులు శ్రీమహేశ్వర తీర్థులు శ్రీరామాయణ తత్త్వదీపిక అనే వ్యాఖ్యానాన్ని ప్రసాదించారు. సుందరకాండకు సంబంధించి ఆ రెండు వ్యాఖ్యానాలను తులనాత్మకంగా సమీక్షించి తెలుగుజాతి ముందుంచటం ఈ రచన లక్ష్యం. సాధారణంగా విశేష సంభావన ఉన్న తావులు మాత్రమే ఇందులో అనుశీలనకు వస్తున్నాయి. అక్కడక్కడా పై వ్యాఖ్యాతలు రామానుజీయ వ్యాఖ్యా విశేషాలను తమ రచనలలో నిక్షిప్తం చేశారు. సంభావ్యం అనుకొన్న చోట వానిని గూడా ఇందులో ప్రదర్శిస్తున్నాను.

## ఒకటవ సర్గము

శ్రీ గోవిందరాజస్వామి పీఠికాప్రాయంగా కొన్ని విషయాలు చెప్పారు.

1. కిష్కింధాకాండలో పరమాత్మ అసాధారణ లక్షణాలను, సమస్త కల్యాణగుణాలకు ఆకరం కావటాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ సర్వసంహర్త లక్షణాన్ని ప్రతిపాదిస్తున్నారు. లేదా

2. పూర్వకాండలో అన్నివిధాలా మిత్రసంరక్షణ చేయదగినది అని చెప్పారు. ఇప్పుడు ఇక్కడ దూత ద్వారా పతివ్రత ఈ విధంగా ప్రవర్తించాలి అనే విషయాన్ని నిరూపిస్తున్నారు. లేదా

3. సర్వరక్షణప్రవృత్తుడైన విష్ణువునకు ఆచార్యరూప పురుషకారలాభం కలిగిన విషయాన్ని ఇంతకు ముందు చెప్పారు. ఇప్పుడు ఆచార్యుని కృత్యాన్ని చెబుతున్నారు. అందులో మొదటిసర్గలో ఉపదేశానికి యోగ్యుడైన శిష్యుని అన్వేషణను ప్రతిపాదిస్తున్నారు.

శ్రీమహేశతీర్థుల వారి పీఠికాంశాలు ఈ క్రిందివిధంగా వున్నాయి.

పూర్వకాండలో 'జగామ లంకాం మనసా మనస్వీ' అని హనుమంతుడు మనస్సుతో వెళ్ళిన విషయాన్ని చెప్పారు. ఇప్పుడు కాయంతో కూడా వెళ్ళటానికి కోరుతున్న విషయాన్ని చెబుతున్నారు.

**తతో రావణ నీతాయాః సీతాయాః శత్రుకర్శనః ।**
**ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి ॥(1)॥**

తిలకం ఇలా అంటున్నది. చారణులు తిరిగే దారిలో ఆకాశంలో కూడా పదం ఉంచటానికి, వెదకటానికీ ఇతడు సమర్థుడు. దీనిచేత అతని బుద్ధి చాతుర్యాతిశయమూ, దాని ద్వారా శిష్యుని స్థానాన్ని అన్వేషించే పరగురు స్వరూపాన్ని తెలియజేస్తున్నారు.

తతః – తరువాత – ముద్రను ప్రదానం చేయటంతో భగవదాజ్ఞను పొందిన తరువాత.

**శత్రుకర్శనః** – అజ్ఞానాన్ని తొలగించే శీలం కలవాడు.

**చారణాచరితే పథి** – ధర్మములను ఆచరణలో పెట్టించేవారు చారణులు – పూర్వాచార్యులు. వారు ప్రవర్తించే మార్గంలో ఉన్నవాడు. "మహాజనో యేన గతః స పన్థాః" – 'మహాజనులు ప్రవర్తించేదే ఇతరులకు మార్గము' అన్న మాటలను బట్టి సదాచారంలో నిలుకడ కలవాడు అని అర్థం.

**రావణ నీతాయాః** – రావణుడంటే అసత్ప్రలాపాలను చేసేవాడు – అవివేకుడు. అతని వశం పొందిన సీత ఇచట అనాదియైన భగవంతునకు పరతంత్రయైన చేతనకు ప్రతీక ఆమె, పదమ్ – స్థానము – సంసారమండలము. దానిని వెదకటానికి హనుమంతుడు సంకల్పించాడు.

లేదా – పదమంటే వ్యవసాయం – జీవుడు భగవంతుని పొందటానికి చేసే వ్యవసాయం. దానికోసం సంకల్పించాడు.

**దీపికలో** ఈ పై అంశాల ప్రస్తావన కానరాదు. **తిలకం** గాయత్రీ మంత్రంలో పన్నెండవ అక్షరం ఈ శ్లోకంలో ఉన్నది అన్నది. అయితే విద్వాంసులు దానిని చూసుకోవాలి అని మాత్రం ప్రకటించింది.

**ధీర స్సలిల కల్పేషు విచచార మహాకపిః । (3)**

**తిలకం :–** సలిలముల వంటివగుట వైడూర్యవర్ణమువలన

**దీపిక :–** చల్లదనము కలిగిన వానియందు.

**అంజలిం ప్రాఙ్ముఖః కుర్వన్ పవనాయాత్మయోనయే ।**
**తతోఽభివవృధే గన్తుం దక్షిణో దక్షిణాం దిశమ్ ॥(9)॥**

**తిలకం** – ఆత్మయోనయే – తనకు కారణభూతుడైన వాయుదేవునకు. ప్రాఙ్ముఖః అంజలిం కృత్వా– తూర్పునకు తిరిగి అంజలి ఘటించి– కుర్వన్ అనే పాఠం అయుక్తము. ఎందుకంటే శతృప్రత్యయం చేత తూర్పునకు తిరిగి అంజలి ఘటించటం, దక్షిణ దిక్కుగా గమనానికి సిద్ధపడటం అనే రెండు పనులకు ఏకకాలికత్వం సరిపడదు.

**దీపిక** – ఈ ప్రస్తావన లేదు.

**మధ్యమే నార్చిషా జుష్టో ధూమరాజీరివానలః । (16)**

**తిలకం –** మధ్యమేన అర్చిషా అంటే నడిమి జ్వాలతో ప్రక్క భాగాలలో ఉన్న జ్వాలలు పొగను వెలువరించేవి కావు.

**దీపిక –** కాళి, కరాళి, విస్ఫులింగిని, ధూమ్రవర్ణ, విశ్వరుచి, రోహిత, మనోజవ అనే పేర్లు గల ఏడు అగ్ని జిహ్వల యందు మధ్యనున్న ధూమ్రవర్ణ అనే జ్వాలతో కూడిన అగ్ని.

**శిరోభిః పృథుభి స్సర్పా(ర్నాగా) వ్యక్తస్వస్తికలక్షణైః । (19)**

**తిలకం –** స్వస్తికమంటే పాము పడగ మీద ఉండే అర్ధచంద్రాకారపు గుర్తు

**దీపిక –** స్వస్తికము – పడగమీద ఉండే నల్లని చార

**దర్శయన్తో మహావిద్యాం విద్యాధర మహర్షయః । (27)**

**తిలకం –** మహర్షుల వంటి విద్యాధరులు అని ఉపమిత సమాసంగా స్వీకరించింది. విద్యాధరులు, మహర్షులు అని ద్వంద్వార్థం గ్రహింపరాదు. ఎందుకంటే తరువాతి శ్లోకంలో విద్యాధరులను మాత్రమే గ్రహించారు.

**దీపిక –** విద్యాధరులలో శ్రేష్ఠులు.

'మహావిద్యాం' – అణిమ మొదలైన అష్టమహాసిద్ధుల రూపమైన దానిని అనే అర్థాన్ని రెండు వ్యాఖ్యలూ స్వీకరించాయి.

**రామార్థం వానరార్థం చ చికీర్షన్ కర్మ దుష్కరమ్ । (30)**

**దీపిక –** ఇది ప్రధానంగా రామకార్యమే కదా వానరార్థం అని ఎందుకు చెప్పారు అని ప్రశ్నించుకొని వానరులకు రామకార్యమందు తమకార్యమే అన్నంత అభిమానం ఉన్నందువలన అని సమాధానం చెప్పింది.

**తిలకం –** ఏమీ చెప్పలేదు

**తేజ స్సత్త్వం తథా వీర్య మావివేశ సవీర్యవాన్ । (36)**

**తిలకం –** తేజస్సు, వీర్యము, బలము ఇంతకు ముందున్నవియే. వానిని విశేషముగా వృద్ధిపరచుకొన్నాడని రామానుజీయం. తేజస్సు – ఇతరులను ధిక్కరింపగల సామర్థ్యము,

**సత్త్వము –** బలము, వీర్యము – ఆకాశాదుల నుండి దూసుకొని పోగల సామర్థ్యము

**దీపిక –** తేజస్సు. ఇతరులను చులకన చేయుటలోని సమర్థత, సత్త్వము బలము.

**యథా రాఘవ నిర్ముక్త శ్శరః శ్వసనవిక్రమః । (39)**

**తిలకం –** రాఘవ శరదృష్టాంతం చేత తాను జాగు చేయకుండా, అడ్డులేకుండా, వ్యర్థత లేకుండా పోగలనని సూచించాడని రామానుజీయం.

**విముక్తాః తస్య వేగేన ముక్త్వా పుష్పాణి తే ద్రుమాః ।**
**అవశీర్యన్త సలిలే నివృత్తా స్సుహృదో యథా ॥(52)॥**

**తిలకం –** చెట్లు పూవులను వదలి నీటిలో పడిపోయాయి అనటం చేత బయలుదేరిన మిత్రముల నుండి మరలిన వారు కన్నీరు విడుస్తూ శోకం అనే మున్నీటిలో మునిగిపోవటం ధ్వనిస్తున్నది.

**దీపిక –** బంధువులను సాగనంపటం కోసం వెళ్ళిన చెలికాండ్రు వారిని పంపి ఎలా తిరిగి వస్తారో చెట్లు ఆ విధంగా మరలినాయి.

**పిబన్నివ బభౌ చాపి సోర్మిమాలం మహార్ణవమ్ ।**
**పిపాసురివ చాకాశం దదృశే స మహాకపిః ॥(57)॥**

**తిలకం –** సముద్రాన్ని త్రాగుచున్నట్లు, ఆకాశాన్ని త్రావగోరుచున్నట్లు ప్రకాశిస్తున్నాడని చెప్పటం చేత అతని మహా ప్రయత్నం తెలియవస్తున్నది. దూకునందలి వేగంతో సముద్రం చెదరి క్షీణించిపోగా అతడు దానిని త్రావుతున్న స్ఫూర్తి కలుగుతున్నది. అలాగే ఆకాశం కూడా. ఈ విధంగా అతడు అతివేగంతో పోతూ మహా సముద్రాన్నీ, మహాకాశాన్నీ పీల్చి వేస్తున్నట్లుగా కన్పట్టాడు.

**దీపిక –** నీటికి చేరువగా ఉన్నప్పుడు జలనిధిని త్రావుచున్నట్లు, పైని వెళ్ళే సమయంలో ఆకాశాన్ని జుర్రుతున్నట్లు కన్పట్టాడు.

**ఖే యథా నిపతన్త్యుల్కా హ్యుత్తరాంతాద్వినిస్సృతా ।**
**దృశ్యతే సానుబన్ధా చ తథా స కపికుంజరః ॥(65)॥**

**తిలకం –** ఉల్కపడినట్లు అనే పోలిక చేత రావణునకు జరగబోయే అశుభం తెల్లమవుతున్నది. (రామా)

**దీపిక –** సానుబంధ అంటే మరొక సూక్ష్మమైన ఉల్కతో కూడినది.

**సాగరే మారుతావిష్టా నౌ రివాసీత్తదా కపిః । (67)**

**తిలకం –** నీటి ఒత్తిడితో క్రింది భాగంతో, ఆకాశపు ఒత్తిడితో పై భాగంతో ఓడ నడక సాగిస్తుంది. అదే విధంగా హనుమంతుడు శరీరపు పై భాగం చేతా, క్రింది నీటి ఒత్తిడి చేతా ఒకే విధమైన ఆకారం కలవాడై గాలి నిండిన నావలాగా ప్రయాణించాడు.

**దీపిక –** పైని ఉన్న శరీరపు గట్టితనం గల, నీడలో చొరబడి నీడకు సంబంధించిన ప్రతిబింబం చేత ఒకే విధమైన ఆకారం కలవాడై నీటిలోపల మునిగిన మూలం కలదీ, వెలుపలనున్న ఊర్ధ్వభాగం కలదీ అయి, గాలిలో కదులుచున్న నావ వలె హనుమంతుడు ప్రయాణం సాగించాడు.

**యం యం దేశం సముద్రస్య జగామ స మహాకపిః ।**
**స స తస్యోరువేగేన సోన్మాద ఇవ లక్ష్యతే ॥(68)॥**

**తిలకం –** తిరుగుళ్ళు పడటం, నురుగులు క్రక్కటం, పెద్దగా రొద చేయటం అనే వానివలన ఈ ఉపమానం సరిపడుతున్నది. ఎగిరి పడుతున్న నీరు కలది అని తాత్పర్యం.

**దీపిక –** పై తాత్పర్యాన్నే అనువదించింది.

**దశయోజన విస్తీర్ణా త్రింశద్యోజన మాయతా ।**
**ఛాయా వానరసింహస్య జలే చారుతరాభవత్ ॥(75)॥**

**తిలకం –** ముప్పది యోజనాల పొడవున వానరసింహుని నీడ ఉంటే నాలుగవ అడుగులోనే హనుమంతుడు లంకలో ఉండేవాడు కదా! అలా అయితే మైనాకసంవాదం, సురసాసంవాదం మొదలైనవి కుదరవు. బింబం కంటే ప్రతిబింబం అధిక ప్రమాణంలో ఉండదు కదా! ఈ మాట ఎలా సరిపడుతుంది అని శంకింపరాదు. ఇక్కడ ఛాయ అంటే ప్రతిబింబం కాదు. అది హనుమంతుని శరీరాకారపు గుర్తుగా పడని ఎండపడని ప్రదేశాన్ని సూచిస్తుంది. (ప్రొద్దున సూర్యునికభిముఖంగా నిలుచున్న 5 అడుగుల వ్యక్తి నీడ వెనుక భాగాన పదింతలుగా వ్యాపించి కనబడిన విధంగా) హనుమంతుడు ప్రాతఃకాలంలోనే సముద్రలంఘనం చేశాడు. అప్పుడు అతని నీడ సముద్రంలో ఆ విధంగా అతి దీర్ఘంగానే కనబడుతుంది.

**దీపిక –** వివరణ లేదు.

**సిషేవే చ తదా వాయూ రామకార్యార్థసిద్ధయే । (84)**

**తిలకం –** సిషేవే – సేవించెను అనటం చేత వాయుదేవుడు హనుమంతునకు తండ్రి కదా, సేవించటం ఏమిటి? అని శంకింపరాదు. రామకార్యమునందు ప్రవర్తించటం వలన పూజ్యుడే అయ్యాడు (రామా).

**దీపిక –** వివరణ లేదు.

**సాహాయ్యం వానరేంద్రస్య యదినాహం హనూమతః ।**
**కరిష్యామి భవిష్యామి సర్వవాచ్యో వివక్షతామ్ ॥(88)॥**

**తిలకం –** వివక్షతామ్– పలుకగోరు వారికి – వాగింద్రియము కలవారికి. సర్వవాచ్యః భవిష్యామి – సర్వనిందా వాక్యములకు లక్ష్యమగు వాడనగుదును. ఈ వానరేంద్రునకు సాయం చేయకపోతే మాట్లాడే శక్తిగల వారందరూ నన్ను నిందిస్తారని భావం.

**దీపిక –** మైనాకుని ఈ వాక్యానికి తిలకం చెప్పిన అభిప్రాయాన్నే అనువదించింది.

**కాకుత్ స్థస్యాఽనృశంస్యం చ మైథిల్యాశ్చ వివాసనమ్ । (100)**

**తిలకం –** కాకుత్థ్సుని ఆనృశంస్యం అంటే సీతావిషయకమైన దయను.

**దీపిక –** రాముని కృతజ్ఞతను.

**స తదా పాతిత స్తేన కపినా పర్వతోత్తమః ।**
**బుద్ధ్వా తస్య కపేర్వేగం జహర్ష చ ననన్ద చ ॥(109)॥**

**తిలకం –** జహర్ష, ననన్ద అని సమానార్థకాలయిన రెండు పదాలను ప్రయోగించటం చేత దేహము, మనసు అనే వాని వికాసరూపమయిన వికృతి తెలియవస్తున్నది. అతని వేగంచేత అతనికి గ్లాని లేదని తెలిసికొని మైనాకుడు హృష్టమైన మనస్సు కలవాడయ్యాడని భావం.

**దీపిక –** జహర్ష, ననంద అనటం చేత కాయమనస్సుల వికృతి తెలియవస్తున్నది.

**అస్మాకమపి సంబంధః కపిముఖ్య త్వయాఽస్తి వై ।**
**ప్రఖ్యాత స్త్రిషు లోకేషు మహాగుణపరిగ్రహః ॥(118)॥**

**తిలకం –** పరిగ్రహింపబడిన వాడు పరిగ్రహుడు. మహాగుణులంటే ఉత్తమపురుషులు. అట్టివారు గ్రహించిన వాడుగా లోకముల యందు ప్రసిద్ధికెక్కినవాడవు అని మైనాకుని ప్రశంస.

**దీపిక –** మహాగుణుడనగా వాయువు. అతడు నిన్ను స్వీకరించెనని ప్రశంస.

**ప్రీతోఽస్మి కృతమాతిథ్యం మన్యు రేషోఽపనీయతామ్ ॥(131)॥**

**తిలకం –** నీ దర్శనమువలననే ఆతిథ్యము పొందినట్లు నేను భావింతును. మన్యువనగా కోపము. నేను చేసిన పూజను స్వీకరించలేదనెడు కోపమును విడనాడుము అని భావము.

**దీపిక –** మన్యుః – పూజను స్వీకరింపక పోవుట వలన కలిగెడు దైన్యమును విడనాడుము.

**అథోర్ధ్వం దూరముత్పత్య హిత్వా శైలమహార్ణవౌ ।**
**పితుః పన్థానమాస్థాయ జగామ విమలేఽంబరే ॥(135)॥**

**తిలకం –** శైలం అయిన మైనాకుని, సముద్రుణ్ణీ వదలి, ఆకారం ధరించి వచ్చిన వారిద్దరినీ వదలి (హనుమంతుడు ఆకాశంలో మళ్ళీ ప్రయాణం సాగించాడు) దీనిచేత మైనాకునివలె సముద్రుడు కూడా ఏదో ఒక స్వరూపాన్ని ధరించి అక్కడ కానవచ్చాడని తెలియవస్తున్నది.

**దీపిక –** పితుః పన్థానం – తండ్రి అయిన వాయుదేవుని మార్గమును.

**తద్ద్వితీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్ । (137)**

**తిలకం –** రెండవది అంటే పర్వత జయరూపమైన పని. మొదటిది సముద్రలంఘనము.

**దీపిక –** సముద్రలంఘనము మొదటి పని. మైనాకగిరియందు సేద దీరకుండా వెళ్ళటం రెండవ పని.

**సాహ్యం కృతం తే సుమహ ద్విక్రాంతస్య హనూమతః ।**
**క్రమతో యోజనశతం నిర్భయస్య భయే సతి ॥(141)॥**

**తిలకం –** మిక్కిలి విస్తృతమైన సముద్రం పై భాగాన ఆకాశంలో వెళ్ళే సమయంలో సముద్రంలో పడటం మొదలైన భయానికి హేతువును ఊహించే అవకాశం ఉన్నా, అట్టి భయం లేని హనుమంతునికి (నీవు సాయం చేశావు).

**దీపిక –** నీకు నా వలన భయం ఉన్నా, నిర్భయుడైన హనుమంతునకు సాయం చేశావు. (కనుక నీకు రక్షణ నిస్తున్నానని భావం).

**అయం వాతాత్మజః శ్రీమాన్ ప్లవతే సాగరోపరి । (146)**

**తిలకం –** ఇక్కడ శ్రీ శబ్దం మిక్కిలి దూరం గల సముద్రాన్ని దాటుతున్నా మీద మీద పెరుగుతున్న బలం వలన తెలియవచ్చే శోభను అభివ్యక్తం చేస్తున్నది.

**దీపిక –** వివరణ లేదు.

**అన్యకార్య విషక్తస్య బద్ధవైరస్య రాక్షసైః । (154)**

**తిలకం –** మారీచమృగాన్ని గ్రహించటం అనే మరియొక పనిలో తగులుకొనియున్న రాముని (భార్యను రాక్షసులు అపహరించారు).

**దీపిక –** మాయామృగవధం కోసం బయలుదేరిన

**కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని । (155)**

**తిలకం –** విషయవాసిని అంటే రామరాజ్యంలో నివసిస్తున్నదానా!

**దీపిక –** విషయవాసిని – రామరాజ్యంలో నివసిస్తున్నదానా! రఘునాథుడు త్రైలోక్యనాథుడు కనుక నీవు నివసిస్తున్నది అతని రాజ్యంలోనే అని మరికొంత వివరణను ఈ వ్యాఖ్య ఇచ్చింది.

**ప్రవిష్టోఽస్మి హితే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే । (160)**

**తిలకం –** ఆమె దాక్షాయణి అని హనుమంతునకు ఎలా తెలిసింది? అంటే తన వరప్రసాదాన్ని గురించి చెప్పే సమయంలో ఆమెయే తన దాక్షాయణీత్వాన్ని చెప్పి ఉంటుందని ఊహించాలి.

**దీపిక –** వివరణ లేదు.

**అత్యర్థం సేవితే చిత్రభానునా । (167)**

**తిలకం –** చిత్రభానునా – అగ్నిచేత సేవింపబడిన

**దీపిక –** ఆకాశానికి నలుబది తొమ్మిది అగ్నులతో సంబంధం ఉన్నదని చెప్పి అందులో ప్రధానమైన చిత్రభాను సంబంధాన్ని పేర్కొంటున్నారు.

**తాం తు దృష్ట్వా చ ధృత్యా చ దాక్షిణ్యేన నిపాత్య చ ।**
**స కపిప్రవరో వేగాద్ వవృధే పునరాత్మవాన్ ॥(186)॥**

**తిలకం –** దృష్టితో దూరం నుండియే చూడటం చేత, ధృతితో ముఖాన్ని బిగించటం చేత, పుట్టిన దిట్టతనం చేత, దాక్షిణ్యం చేత – పాటవం చేత.

**దీపిక –** దృష్టితో సూక్ష్మదర్శనం చేత, ధృతితో ధైర్యం చేత, దాక్షిణ్యేన – నేర్పుతో – శీఘ్రంగా పనిచేయగల నేర్పుతో.

**యస్య త్వేతాని చత్వారి వానరేంద్ర యథా తవ ।**
**ధృతి ర్దృష్టి ర్మతి ర్దాక్ష్యం స్వకర్మసు న సీదతి ॥(189)॥**

**తిలకం –** ధృతి మొదలైన నాలుగు, స్వకర్మసు తనకు అనుకూలము గల కార్యముల యందు నావసీదతి – చెడిపోదో (ఒక్కొక్కటిని దృష్టిలో వుంచుకొని ఏకవచనం) అట్టి నీ చేత ఆపెనుభూతము చచ్చినదని యోచన.

**దీపిక –** ఈ వివరములు లేవు.

**సతైః సంభావితాః పూజ్యః ప్రతిపన్న ప్రయోజనః ।**
**జగామాకాశ మావిశ్య పన్నగాశనవత్కపిః ॥(190)॥**

**తిలకం –** ప్రతిపన్న ప్రయోజనః – ముందుగానే పొందిన కార్యసారము కలవాడు. ప్రయోజనము స్త్రీపరముగా సమానమే అయిననూ సురస విషయములో జయప్రతిపత్తి, సింహిక విషయములో వధప్రతిపత్తి అను విధముగా సిద్ధించినది.

**దీపిక –** ప్రతిపన్న ప్రయోజనుడు – పొందిన – సాధించిన ప్రకృత కార్యము కలవాడు.

**స చారు నానావిధరూపధారీ పరం సమాసాద్య సముద్రతీరమ్ ।**
**పరై రశక్యః ప్రతిపన్నరూపః సమీక్షితాత్మా సమవేక్షితార్థః ॥(198)॥**

**తిలకం –** ప్రతిపన్నరూపుడు – పొందిన సహజరూపము కలవాడు, సమీక్షితాత్ముడు – చక్కగా సరిదిద్దుకొను దేహము కలవాడు, సమవేక్షితార్థుడు – నిరూపించుకొనిన కార్యము కలవాడు.

**తిలకం –** రామానుజీయం చెప్పిన అర్థాలను ఇలా సంగ్రహించింది. చారు నానావిధరూపధారి – ఆయాపనులకు అనుగుణమైన రమణీయము, స్థూలము, సూక్ష్మము మొదలైన రూపములను ధరించువాడు. పరులకు – సింహిక మొదలైన శత్రువు చేత అశక్యః – సాధింపనలవి కానివాడు. సమీక్షితార్థుడు – చక్కగా చూచుకొన్న, బాగుగా పెరిగిన దేహము కలవాడు, సమవేక్షితార్థుడు – సమాలోచన చేసిన కృత్యం కలవాడు, ప్రతిపన్నరూపుడు – మరల పొందిన సహజ స్వరూపం గలవాడు.

**దీపిక –** మరల పొందిన పిల్లి వంటి రూపం కలవాడు (తక్కిన వారి వివరణ తిలకం వలెనే వున్నది).

**తత స్స లంబస్య గిరేః సమృద్ధే విచిత్ర కూటే నిపపాత కూటే ॥(199)॥**

**తిలకం –** లంబస్య – వ్రేలాడుచున్న దాని వలె ఉన్నట్టి – తెలియరాని అగ్రభాగములు కలదాని, విచిత్రకూటే – పెక్కు ఆశ్చర్యముల సముదాయమైనదాని

**దీపిక –** లంబస్య – లంబమను పేరు గల గిరి యొక్క శిఖరమున.

## రెండవ సర్గము

**జగామ నగవన్తి చ । (7)**

**తిలకం –** నగవన్తి – ప్రసిద్ధికెక్కిన వృక్షములతో కూడినవి (వనములను).

**దీపిక –** నగవన్తి – చిన్నతిప్పలు కలవానిని

**సీతాపహరణార్థేన రావణేన సురక్షితామ్ । (15)**

**తిలకం –** సీతాపహరణం ప్రయోజనంగా గల – సురక్షితం కావటంలో ఇది హేతువు.

**దీపిక –** సీతాపహరణం కారణంగా అపహరింపబడిన ద్రవ్యం అక్కడ ఉన్నది కనుక సురక్షితంగా చేయబడిన దానిని.

**మనసేవ కృతాం లంకాం నిర్మితాం విశ్వకర్మణా । (21)**

**తిలకం –** నిజానికి విశ్వకర్మ నిర్మించినా ఎవడో మహానుభావుడు భావనాబలంతో నిర్మించినట్లు లంక కన్పట్టింది.

**దీపిక –** వివరణ లేదు.

**అవకాశో న సాన్త్వస్య రాక్షసేష్వభిగమ్యతే ।**
**న దానస్య న భేదస్య నైవ యుద్ధస్య దృశ్యతే ॥(29)॥**

**తిలకం –** రాక్షసప్రకృతి వలన సామానికీ, అతిశయించిన ధనసంపత్తి వలన దానానికీ, బలదర్పితుడు కావటం వలన భేదానికీ, బుద్ధి పరాక్రమాదులతో కూడినందువలన దండానికీ అవకాశం లేదు.

**దీపిక –** పై భావాలనే ఇంచుమించుగా అనువదించింది.

**లక్ష్యాలక్ష్యేణ రూపేణ రాత్రౌ లంకాపురీ మయా ।**
**ప్రవేష్టుం ప్రాప్తకాలం మే కృత్యం సాధయితుం మహత్ ॥(35)॥**

**తిలకం –** గుర్తింపదగిన శరీరం కలిగి ఉంటే రాక్షసులు పట్టుకుంటారు. గుర్తింపబడని రూపమైతే లంకనంతా గాలించటం సాధ్యం కాదు. కృత్యాన్ని సాధించటానికి రాత్రి యోగ్యమైన కాలం.

**దీపిక –** లక్ష్యాలక్ష్యేణ రూపేణ అంటే సూక్ష్మరూపంతో అని అర్థం. మహత్, కృత్యమ్ – సీతను అన్వేషించటం అనే గొప్ప పని.

**హనూమాంశ్చిన్తయామాస వినిఃశ్వస్య ముహుర్ముహుః ।**
**కేనోపాయేన పశ్యేయం మైథిలీం జనకాత్మజామ్ ।। (36)।।**

**తిలకం –** మాటిమాటికీ నిట్టూరుస్తూ అనటం చేత సముద్రాన్ని దాటటం కంటే లంకాప్రవేశం మిక్కిలి దుష్కరం అనే హనుమంతుని భావన అభివ్యక్తమవుతున్నది.

**దీపిక –** వివరణ లేదు.

**భూతాశ్చార్థా విపద్యన్తే దేశకాల విరోధితాః ।**
**విక్లబం దూతమాసాద్య తమ స్సూర్యోదయే యథా ।। (39)।।**

**తిలకం –** చక్కని ఉపాయాల ప్రయోగంతో సిద్ధించినట్లే కన్పట్టే కార్యాలు కూడా దేశకాలముల ఆనుకూల్యం లేకపోవటం వలన ధీరుడు – ఆలోచించి కార్యానికి తొడగేవాడు కాని దూతవలన సూర్యోదయ కాలంలో చీకట్ల వలె చెడిపోతాయి.

**దీపిక –** భూతములైన అర్థములు – నెరవేరిన ప్రయోజనాలు కూడా, విక్లబుడు – వివేకులు లేనివాడు – అట్టి దూతను బట్టి చెడిపోతాయి.

**న వినశ్యేత్ కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్ । (41)**

**తిలకం –** వైక్లబ్యమ్ – నా అపాండిత్యము.

**దీపిక –** వైక్లబ్యమ్ – బుద్ధిహీనత

వైక్లబ్యం మొదలగు దాని యందు స్వస్య – నాదైన అనే పదాన్ని కలుపుకొని అర్థం చెప్పుకోవాలి.

**ఇహాహం యది తిష్ఠామి స్వేన రూపేణ సంవృతః ।**
**వినాశముపయాస్యామి భర్తురర్థశ్చ హీయతే ।। (45)।।**

**తిలకం –** సహజసిద్ధమైన పెద్ద ఆకారంతో స్వేనరూపేణ

**దీపిక –** ప్రస్తుత కార్యమునకు భంగం కలుగకుండా అస్తమయం వరకు తన్నుతాను తెలియరాకుండా చేసికొనటం ఉచితం అనే భావాన్ని మనస్సులో పెట్టుకొని పలుకుతున్నాడు.

**పృషదంశకమాత్ర స్సన్ బభూవాద్భుతదర్శనః । (49)**

**తిలకం –** పృషదంశకమాత్రుడంటే పిల్లి అంత దేహప్రమాణం కలవాడు.

**దీపిక –** పృషాన్ మూషికాన్ దశతి – పృషములను అంటే ఎలుకలను కొరికి తింటుంది కనుక పృషదంశమంటే పిల్లి.

**శాతకుంభమయైర్జాలై ర్గన్ధర్వనగరోపమామ్ ।**
**సప్తభౌమాష్టభౌమైశ్చ స దదర్శ మహాపురీమ్ ॥(52)॥**

**తిలకం –** భూమి శబ్దం చేత ఆసనాలు శయనాలు మొదలైన వానికి యోగ్యమైన తలం – పరపుగా ఉండే ప్రదేశం చెప్పబడుతుంది అంటే ఇప్పుడు వ్యవహారంలో వున్న అంతస్తు. సప్త – ఏడైన, భూములు – తలములు గల పెద్ద భవనాలు. అలాగే ఎనిమిది అంతస్తుల భవనాలు అష్టభౌములు. అటువంటి ప్రాసాదాలు గల మహాపురి లంక.

**దీపిక –** భూమిషు భవన్తీతి భౌమాని తలాని – భూముల యందు ఏర్పడే తలములు భౌమములు. సప్త భౌమములు గల ప్రాసాదములు సప్తభౌములు. అలాగే అష్టభౌమములు.

**చన్ద్రోఽపి సాచివ్య మివాస్య కుర్వన్ తారాగణై ర్మధ్యగతో విరాజన్ ।**
**జ్యోత్స్నా వితానేన వితత్య లోక ముత్తిష్ఠతే నైక సహస్రరశ్మిః ॥(57)॥**

**తిలకం –** మధ్యగతః అంటే సన్నిహితంగా ఉండటం వలన తారాగణముల మధ్య నున్నవాడని అర్థం. చంద్రుడు హనుమంతునకు మంత్రిత్వాన్ని నెరపుతున్నాడా అన్నట్లు నక్షత్ర సముదాయంతో పాటు ఉదయించాడు. ఇంతకు ముందు సాగరము, మైనాకుడు, దివాకరుడు అనువారి వలె చంద్రుడు కూడా హనుమంతునకు సచివత్వం నిర్వహించటానికి ఉదయించాడు అని భావం.

**దీపిక –** అపి శబ్దం చేత మైనాకుని వలె, సముద్రము వలె అనే అర్థం తెలియవస్తుంది.

## మూడవ సర్గము

**సలంబశిఖరే లంబే లంబతోయదసన్నిభే ।**
**సత్త్వమాస్థాయ మేధావీ హనుమాన్మారుతాత్మజః ॥(1)॥**

**తిలకం –** లంబే – లంబమను పేరుగల, లేదా వ్రేలాడుచున్నట్లున్న శిఖరము నందు. సత్త్వమాస్థాయ – సత్త్వం అంటే వ్యవసాయం, ధైర్యమని తాత్పర్యం.

**దీపిక –** లంబే – లంబాకారము గల, లంబశిఖరే – లంబమనే పేరుగల శిఖరము నందు, సత్త్వమ్, ఆస్థాయ – బలమును కూడదీసుకొని.

సత్త్వమాస్థాయ అనే దానికి రామానుజీయం లంకను చేరుకోవటానికి మాత్రం కావలసినంత దూకే శక్తిని కూడదీసుకొని అని అర్థం చెప్పింది.

**వస్వోకసారా ప్రతిమాం తాం వీక్ష్య నగరీం తతః ।**
**ఖమివోత్పతితుం కామాం జహర్ష హనుమాన్ కపిః ॥(12)॥**

**తిలకం –** వస్వోకసార అంటే అలక – కుబేరుని పట్టణం లేదా వస్వోకసార అంటే తూర్పు దిక్కున వున్న ఇంద్రునిపురి.

**వస్వోకసారా శక్రస్య యామ్యా సంయమనీ తథా ।**
**పురీ సుఖా జలేశస్య సోమస్య చ విభావతీ ॥**

అని విష్ణుపురాణం చెప్పిన దాని ప్రకారం వస్వోకసార ఇంద్రుని పురి.

**దీపిక –** వస్వోకసార అనేది తూర్పు దిక్కున ఉన్న ఇంద్రునిపురి.

**వివస్వత స్తనూజస్య హరేశ్చ కుశపర్వణః ।**
**ఋక్షస్య కేతుమాలస్య మమ చైవ గతిర్భవేత్ ॥(16)॥**

**తిలకం –** సుగ్రీవునకు, కేతుమాలునకు, కుశపర్వునకు, నాకు ఇందు గతి కలదు. వెనుక నీలాదులను చెప్పి ఉన్నారు. ఇక్కడ మరికొందరకు గతి కలదనే విషయం ఆలోచింపగా తోచిన విషయంగా పేర్కొన్నారు.

రామానుజీయం – మమ చ – నాకు కూడా అని చివరకు చెప్పటం వలన తాను సర్వోత్తముడైనా తన తక్కువతనాన్ని (వినయగరిమను) చెప్పుకున్నాడని భావించాలని వివరించింది.

**దీపిక –** ఇట్టి విశేషాలు చెప్పబడలేదు.

**సమీక్ష్య తు మహాబాహూ రాఘవస్య పరాక్రమమ్ ।**
**లక్ష్మణస్య చ విక్రాన్త మభవత్ ప్రీతిమాన్ కపిః ॥(17)॥**

**తిలకం –** రామలక్ష్మణులు అనాయాసంగా గెలువటానికి వీలయినదని భావించి ప్రీతిమంతుడయ్యాడు.

**దీపిక –** దీనినే తెలియజేసింది.

**తాం రత్నవసనోపేతాం కోష్ఠాగారావతంసకామ్ ।**
**యంత్రాగారస్తనీ మృద్ధాం ప్రమదామివ భూషితామ్ ॥(18)॥**

**తాం నష్టతిమిరాం దీప్తై ర్భాస్వరైశ్చ మహాగృహైః ।**
**నగరీం రాక్షసేన్ద్రస్య దదర్శ స మహాకపిః ॥(19)॥**

**తిలకం –** ఇందులో 18వ శ్లోకంలోనికి 19వ శ్లోకం నుండి 'దదర్శ' చూచాడు అనే పదాన్ని అపకర్షించుకోవాలి. ఈ రెండు శ్లోకాలు ఒకే వాక్యం కాదు. 'తాం' అనే పదం రెండు శ్లోకాలలోనూ ఉన్నది కనుక. అంతేకాదు మొదటి శ్లోకంలో స్త్రీసామ్యం చెప్పి ఉన్నది కనుక. ఈ కారణాల చేత రెండు శ్లోకాలను, విడివిడి వాక్యాలుగా స్వీకరించాలి. మొదటివాక్యంలో లేని క్రియాపదం 'దదర్శ' అనే దానిని క్రింది శ్లోకం నుండి పైకి లాగుకోవాలి.

**దీపిక –** ఈ రెండు శ్లోకాలు కలిపి ఒకే వాక్యంగా గ్రహించాలి. అయితే 'తాం' అనే పదం రెండు పర్యాయాలు ఎందుకు ప్రయోగించారు అంటే మొదటిది ప్రసిద్ధిని సూచిస్తుంది. రెండవది పూర్వం చెప్పిన దానిని పరామర్శిస్తుంది

తిలకం పేర్కొన్న స్త్రీసామ్యోక్తిని దీపిక పట్టించుకోలేదు.

**వనాన్యుపవనా నీహ లంకాయాః కాననాని చ ।**
**సర్వతో గృహముఖ్యాని ద్రష్టుమాగమనం హి మే ॥(34)॥**

**తిలకం –** ఉపవనములంటే యింటితోటలు. కాననములు శూన్యములైన అరణ్యములు.

**దీపిక –** ఉపవనములు – కృత్రిమవనములు – వనములు క్షుద్రములు.

**సమయే సౌమ్య తిష్ఠన్తి సత్త్వవన్తో మహాబలాః । (44)**

**తిలకం –** సమయము నందు – కట్టుబాటు నందు, స్త్రీవధను వర్జించుట అనెడి వ్యవస్థయందు, సత్త్వవన్తః – ధైర్యవంతులు.

**దీపిక–** సమయమునందు స్త్రీ చంపరానిది అను ఏర్పాటునందు

**యదా త్వాం వానరః కశ్చిద్ విక్రమాద్వశమానయేత్ ।**
**తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయమాగతమ్ ॥(47)॥**

**తిలకం –** పై శ్లోకంలో చెప్పిన వరదాన విషయాన్ని వివరిస్తున్నది. రావణుడు దిగ్విజయం చేసినప్పుడు నందికేశ్వరాదులు లంకకు అప్పటికప్పుడు వినాశం కలిగేవిధంగా శపించారు. అప్పుడు లంక బ్రహ్మకడ కరిగి నాకు వినాశం కలుగనీయకుమని ప్రార్థించింది. అతడామెకు నీకు వెనువెంటనే వినాశం సంభవింపదు. ఎప్పుడైతే వానరుడు నిన్ను అవమానిస్తాడో అప్పుడు నీకు వినాశం కలుగుతుంది అని ఆమెకు వరం ఇచ్చాడు. ఆ కథను ఇక్కడ అనుసంధించుకోవాలి.

## నాలుగవ సర్గము

**అద్వారేణ మహాబాహుః ప్రాకార మభిపుప్లువే । (1)**

**తిలకం –** అద్వారంతో అనటం చేత లంకాపరిభవం రాక్షసులకు తెలియరాకుండెనని అభివ్యక్తమవుతున్నది.

పగవాని గ్రామంగానీ, పట్టణంగానీ, విశేషించి ప్రత్యేక సమయంలో ద్వారం నుండి ప్రవేశింపరాదు అని చెప్పిన విధంగా హనుమంతుడు అద్వారం నుండి ప్రవేశించాడని రామానుజీయం.

**దీపిక –** అద్వారేణ – శత్రుస్థానాన్ని అద్వారం నుండి ప్రవేశించాలి అనే శాస్త్రాన్ననుసరించి ఈ మాటను చెప్పారు.

**ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజహితం కరః ।**
**చక్రేఽథ పాదం సవ్యం చ శత్రూణాం స తు మూర్ధని ॥(2)॥**

తిలకం – శత్రువుల స్థానంలో ప్రవేశించే సమయంలో ఎడమకాలు ఉంచి ప్రవేశించాలి. ఇది శత్రువు తలమీద పాదం ఉంచటం వంటిది. బృహస్పతి స్మృతిలో ఇలా ఉంది.

**ప్రయాణ కాలే చ గృహప్రవేశే వివాహకాలేఽపి చ దక్షిణాంఘ్రిమ్ ।**
**కృత్వాఽగ్రతః శత్రుపురప్రవేశే వామం నిదధ్యాచ్చరణం నృపాలః ॥**

ప్రయాణసమయంలో, గృహప్రవేశసమయంలో, వివాహకాలంలో ముందు కుడికాలు మోపాలి. శత్రుపురప్రవేశంలో రాజు ఎడమ కాలు ముందు ఉంచి ప్రవేశించాలి.

రామానుజీయంలో కూడా ఈ విషయం ఉన్నది. ముందు ఎడమకాలు ఉంచి ప్రవేశిస్తే శత్రువులు పరాభూతులవుతారని అర్థం అని వివరించింది.

**దీపిక –** అది–అంటే ముందు ఎడమ పాదం ఉంచటం శత్రువుల తలపైన ఉంచినట్లే అవుతుంది.

**సితాభ్రసదృశైశ్చిత్రైః పద్మస్వస్తిక సంస్థితైః ।**
**వర్ధమానగృహైశ్చాపి సర్వతస్సువిభూషితా ॥(7)॥**

**తిలకం –** పద్మస్వస్తిక నామములతో ఒక ప్రత్యేక విధానంతో నిర్మించిన గృహాలు అలాగే వర్ధమాన నామం గల గృహాలు. వీని లక్షణాలను వరాహమిహిరసంహితలో చూడండి. విస్తరణ భయం వలన వ్రాయటం లేదు.

**దీపిక –** వివరాలను ఇచ్చింది.

**చతుశ్శాలా చతుర్ద్వారా సర్వతోభద్ర సంజ్ఞితా**
**పశ్చిమద్వారరహితా మధ్యావర్తా హయాననా ।**
**దక్షిణద్వారరహితా వర్ధమానా ధనప్రదా**
**ప్రాగ్ద్వారరహితా స్వస్తిక్యా పుత్రధనప్రదా ॥**

పద్మ, స్వస్తిక, వర్ధమాన అనే పేర్లు గలవి ప్రభువుల గృహాలు.

**రాఘవార్థం చరన్ శ్రీమాన్ దదర్శ చ ననన్ద చ । (8)**

**తిలకం –** ప్రవేశింపనలవి కాని లంకను సునాయాసంగా ప్రవేశించి అంతటా సీత కోసం వెదుకుతాను. అందువలన రామసుగ్రీవుల మనోరథసిద్ధి తప్పక కలుగుతుంది అని ఆనందించాడని అర్థం.

**దీపిక –** వివరణ లేదు.

**శుశ్రావ మధురం గీతం త్రిస్థాన స్వరభూషితమ్ ।**
**స్త్రీణాం మదసమృద్ధానాం దివి చాప్సరసామివ ॥(10)॥**

**తిలకం –** మూడు స్థానాలు ఉరము, కంఠము, శిరస్సు వీని యందు పుట్టిన స్వరములతో భూషితము అవి మంద్ర మధ్య తారములు.

**దీపిక –** పై అర్థాన్ని అనువదించింది.

**దీక్షితాన్ జటిలాన్ ముండాన్ గోజినాంబరవాససః ।**
**దర్భముష్టి ప్రహరణాన్ అగ్నికుండాయుధాంస్తథా ॥(15)॥**

**తిలకం –** ఇంద్రునిచేతిలో వజ్రం ఎట్టిదో బ్రాహ్మణుని కరంలో దర్భ అటువంటిది అనే స్మృతి వాక్యాన్ననుసరించి దర్భలను కొందరు పిడికిటిలో పెట్టుకొని ఉన్నారు.

**దీపిక –** అనిష్టాలను నివారించే అనుష్ఠానానికి సాధనాలు కనుక దర్భముష్టులకు ఆయుధత్వం కలిగింది.

**“నాతి దీర్ఘాతి హ్రస్వకాన్” (19)**

**తిలకం –** ఇక్కడ హకారం మీద రకారధ్వని కాకుండా ఋకారం వంటి ఉచ్చారణ చేయాలి. అప్పుడు అది ఛందోభంగాన్ని తొలగిస్తుంది. (అతిహ్రస్వ అని సాధారణపద్ధతిలో చదివితే ‘తి’ గురవుతుంది. అది ఛందస్సును భంగిస్తుంది. ఇట్లే ధ్వజినః అనవలసిన చోట ధ్వజీన్ అనటం కూడా ఛందోభంగపరిహారం కోసమే. (ఇట్టి వానిని ఆర్ష ప్రయోగాలు అంటారు).

**దీపిక –** దీనిని తడవలేదు.

**రాక్షసాధిపతే ర్గుప్త మావివేశ మహాకపిః । (28)**

**తిలకం –** ఆవివేశ – రాక్షసాధిపతి యింటి వైపు వెళ్ళాడు అని అర్థం. గృహంలో ప్రవేశించటం ముందు దూరంగా చెప్తున్నారు కనుక.

**దీపిక –** ఆవివేశ – ఆససాద – సమీపించాడు. సాక్షాత్తుగా ప్రవేశించటం ముందు చెబుతున్నారు కనుక.

## అయిదవ సర్గము

**తత స్స మధ్యంగత మంశుమంతం జ్యోత్స్నా వితానం మహదుద్వమంతమ్ ।**
**దదర్శ ధీమాన్ దివి భానుమంతం గోష్ఠే వృషం మత్తమివ భ్రమన్తమ్ ॥(1)॥**

**తిలకం –** దివి – ఆకాశము నందు, మధ్యంగతమ్ – ఆకాశం నడుమ ఉన్నవాడని అర్థం. లంకా ప్రవేశ సమయంలో చంద్రోదయాన్ని చెప్పటం వలన రావణనగరప్రవేశం అర్ధరాత్రి జరిగిందని సూచన.

**దీపిక –** మధ్యంగతుడనగా ‘గగనము యొక్క’ అనే దానిని కలుపుకోవాలి. లేదా తారల మధ్యలో వున్నవాడు.

**లోకస్య పాపాని వినాశయన్తమ్ । (2)**

**తిలకం –** పాపములంటే దుఃఖాలు.

**దీపిక –** పాపశబ్దంచేత పాపఫలమైన దుఃఖాన్ని చెబుతున్నారు. లోకాహ్లాదకరుడు కాబట్టి చంద్రుడు దుఃఖ వినాశకుడు. లేదా సూర్యచంద్రాదులకు లోకపావనత్వం ఉన్నది కనుక చంద్రుడు పాపవినాశకుడు.

**హంసో యథా రాజతపంజరస్థః ।**
**సింహో యథా మందరకందరస్థః ॥(4)॥**

**తిలకం –** రాజతపంజరస్థః – వెండి పంజరంలో ఉన్నవాడు. గగనగర్భంలో కదుగబడినవాడు కనుక. గర్వికుంజరస్థుడు నీలవర్ణంగల గగనానికి పైభాగంలో ఉన్నాడుకనుక.

**దీపిక –** వివరణలు లేవు.

**వినష్ట శీతాంబు తుషారపంకో ।**
**మహాగ్రహ గ్రాహ వినష్టపంకః ॥ ఇత్యాది (6)**

**తిలకం –** మహాగ్రహాలు శుక్రబృహస్పత్యాదులు. వాని గ్రహణం చేత ఆచ్ఛాదనం చేత వినష్టమైన పంకం గలవాడు. తన తేజస్సుతో మహాగ్రహాలను తిరస్కరించి పొందిన నైర్మల్యం కలవాడని అర్థం. లేదా మహాగ్రహమంటే సూర్యుడు, అతని కిరణ పరిగ్రహం చేత వినాశం చేయబడిన పంకం – చీకటి కలవాడు. సూర్యకిరణసంక్రమణం చేత దేదీప్యమానమైన మండలం కలవాడని అర్థం.

దీనిని గూర్చి వరాహమిహిరుడు ఇలా చెప్పాడు. నీటితో సముదైన చంద్రుని యందు సూర్యుని కాంతులు చొరబారి రాత్రికి సంబంధించిన చీకటిని తొలగిస్తాయి. అద్దం లోపల చొరబారిన కిరణాలు మందిరం లోపలి చీకటిని తొలగించినట్లుగా.

**దీపిక –** పై అభిప్రాయాలనే తెలిపింది.

**స్వర్గప్రకాశః భగవాన్ ప్రదోషః । (7)**

**తిలకం –** స్వర్గప్రకాశమనగా స్వర్గతుల్యము. దానివలె ఆనందావహమని అర్థము.

**దీపిక –** సీతాన్వేషణకు అనుకూలత కలిగినందువలన ఆనందకారణం కాబట్టి ప్రదోష సమయానికి స్వర్గ సదృశత్వం. అందువలననే ప్రదోష పురుషుడు భగవంతుడు, పూజ్యుడు, ఆదరణీయుడు.

**బుద్ధిప్రధానాన్ రుచిరాభిధానాన్**
**సంశ్రద్దధానాన్ జగతః ప్రధానాన్ ॥**
**నానావిధానాన్ రుచిరాభిధానాన్**
**దదర్శ తస్యాం పురి యాతుధానాన్ ॥(15)॥**

**తిలకం –** బుద్ధిప్రధానులంటే బుద్ధితో శ్రేష్ఠులు – ఉత్తమ బుద్ధులు కలవారు అని అర్థము. రుచిరాభిధానులు మంచి వ్యవహారములు కలవారు లేదా హృద్యములగు నామధేయములు కలవారు. సంశ్రద్ధధానులు అంటే ఆస్తికులు, నానావిధానాన్ – పెక్కు ఆకారములు కలవారు.

**దీపిక –** రుచిరాభిధానులు, మనోహరములైన పలుకులు కలవారు, నానావిధానులు – అనేక వ్యాపారములు, ప్రవృత్తులు కలవారు.

**చన్ద్రప్రకాశాశ్చ హి వక్త్రమాలాః**
**వక్రాక్షిపక్ష్మాశ్చ సునేత్రమాలాః ॥**
**విభూషణానాం చ దదర్శ మాలా**
**శృతహ్రదానామివ చారుమాలాః ॥(22)॥**

**తిలకం –** హనుమంతుడు రాక్షసస్త్రీల ముఖాలను, కన్నులనూ పరీక్షించటం రాక్షసియా, మానుషియా అని నిర్ణయించట కోసం. ఆభరణాలను పరిశీలించటం సీత ఆభరణాలను పోలిన నగలు ఉన్నాయేమో అనే సంశయంతో.

**దీపిక –** ఈ వివరణలు లేవు.

**దదర్శ తన్వీం మనసాభిజాతామ్ । (23)**

**తిలకం –** హనుమంతుడు మనస్సుతో అభిజాతయైన సీతను మాత్రం ఆ రాక్షసకాంతలలో చూడలేదు. ఆమె మనస్సుతో అభిజాత అంటే 'ఏ పాపమూ ఎరుగని నన్ను దిక్కులేని దానిని వలె పీడించావు కనుక నీ చావు కోసం నేను పుడతాను' అని ఉత్తర రామాయణంలోని మాట ప్రకారం తన సంకల్పంతో పుట్టినది అని అర్థం.

**దీపిక –** మనస్సుతో అభిజాత అంటే అయోనిజ.

**పాంసుప్రదిగ్ధామివ హేమరేఖామ్ । (25)**

**తిలకం –** సహజ శుద్ధ స్వభావం కల వ్యక్తికి అప్రయత్నంగా వచ్చిపడిన మాలిన్య సంబంధంగా ఈ పోలిక.

**దీపిక –** దుమ్ముకొట్టుకొన్న బంగారు రేఖ వలె.

## ఆరవ సర్గము

**సనికామం విమానేషు విషణ్ణః కామరూపధృక్ ।**
**విచచార పునర్లంకాం లాఘవేన సమన్వితః ॥(1)॥**

**తిలకం –** హనుమంతుడు విషణ్ణుడెందుకు అయ్యాడంటే విమానముల యందు సీతను చూడలేదు కనుక.

**దీపిక –** ఇట్టి వివరణ లేదు.

**"ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్ర నివేశనమ్" ॥(2)॥**

**తిలకం –** (రామా) వెనుక రావణభవనం ప్రవేశించిన హనుమంతుడు మెలుకువగా ఉన్న పెక్కండ్రు రాక్షసులు తిరుగుతూ ఉండటం చేత మధ్యలో లంకలో అన్వేషణం చేయటం చేత రాత్రివేళ మళ్ళీ రావణభవనానికి వచ్చినట్లు తెలుసుకోవాలి.

**దీపిక –** ఇట్టి వివరణ లేదు.

**నిత్యార్చితం పర్వహుతం పూజితం రాక్షసైః సదా । (12)**

**తిలకం –** రావణుడు ఆహితాగ్ని కనుక అతని యింటిలో పర్వదినాలలో దర్శపూర్ణమాసాది హోమాలు ఉంటాయి. ఇతని ఆహితాగ్నిత్వం యుద్ధకాండలో ప్రసిద్ధం.

**దీపిక –** పర్వముల యందు హోమములు కలది. రావణుడు ఆహితాగ్ని కనుక

**చచార హనుమాం స్తత్ర రావణస్య సమీపతః । (15)**

**తిలకం –** రావణుని సమీపంగా హనుమంతుడు సంచరించాడు అంటే రావణుని భవనానికి దగ్గరగా అని అర్థం.

**దీపిక –** ఈ అభిప్రాయాన్నే తెలియజేసింది.

**విద్యుజ్జిహ్వేన్ద్రజిహ్వానామ్ । (25)**

**తిలకం –** ఇక్కడ వ్యక్తులు ఇద్దరే ఉండగా బహువచనం ఏల అంటే విద్యుజ్జిహ్వ, ఇంద్రజిహ్వ నామములు కలవారు పెక్కుమంది ఉండటం వలన.

**దీపిక –** పై అభిప్రాయాన్నే చెప్పి లేదా ఆర్ష ప్రయోగం అన్నది.

**రావణస్యోపశాయిన్యో దదర్శ హరిసత్తమః ॥(29)॥**

**తిలకం –** ఉపశాయిన్యః – పర్యాయంగా శయనించేవారు. రావణుడు నిద్రించియున్నపుడు వంతుల ప్రకారం కొందరు మేల్కొని ఉంటారని భావం.

**దీపిక –** ఉపశాయినులు అంటే దగ్గరగా పడుకొనేవారు.

**సహస్రం వాహినీ స్తత్ర జాంబూనదపరిష్కృతాః ।**
**హేమజాలపరిచ్ఛన్నా స్తరుణాదిత్య సన్నిభాః ॥(35)॥**

**తిలకం –** జాంబూనదం అంటే జంబూనదిలో పుట్టిన ఒక విశిష్టమైన స్వర్ణం. హేమమంటే సాధారణమైన స్వర్ణం.

**దీపిక –** వివరణ లేదు.

**అనేకరత్నసంకీర్ణం నిధిజాలం సమన్తతః ।**
**ధీరనిష్ఠితకర్మాంతం గృహం భూతపతేరివ ॥(39)॥**

**తిలకం –** ధీరులు చేసిన కల్పకర్మము కలది.

**దీపిక –** ధీరులు, దృఢవ్రతాలు అయిన వారి కర్మము – తపో రూపమైనది – దాని అంతయు – ఫలము కలది. మహాతపఃఫలము కలది అని తాత్పర్యము.

## ఏడవ సర్గము

**స వేశ్మజాలం బలవాన్ దదర్శ వ్యాసక్త వైఢూర్యసువర్ణజాలమ్ ॥(1)॥**

**తిలకం –** వ్యాసక్తవైడూర్యసువర్ణజాలమ్ – వైడూర్యములతో కూర్పబడిన బంగారపు జాలక రంధ్రములు గలది (జాలకం – గవాక్షమ్).

**దీపిక –** కూర్పబడిన వైడూర్యములు గల స్వర్ణగవాక్షములు కలది.

**నివేశనానాం వివిధాశ్చ శాలాః। (2)**

**తిలకం –** నివేశనశాలలు అంటే భవనాల లోపలి శాలలు

**దీపిక –** అవాంతరగృహాలు.

**తాని ప్రయత్నాభిసమాహితాని మయేన సాక్షాదివ నిర్మితాని। (4)**

**తిలకం –** గట్టి ప్రయత్నంతో వాని వానికి తగినట్లుగా ఆయా స్థానాలలో ఉంచబడినవి. ఇవ శబ్దం చేత మయుని నిమిత్తంగా పెట్టుకొని రావణుడే దృఢమైన ప్రయత్నంతో నిర్మించుకొన్నాడనే అర్థం స్ఫురిస్తుంది.లేదా ఇతర గృహాలన్నీ విశ్వకర్మనిర్మితాలే. రావణుని భవనాలు మాత్రం ప్రత్యేకంగా ఉపాయాలను చూపి నిర్మింపజేసినట్టివి. తక్కిన గృహాల కంటే ఇది విశేషం.

**దీపిక –** విశ్వకర్మ నిర్మించినవైనప్పటికీ, మయుడు విచిత్రవిధానంతో వీనిని రావణుని కోసం నిర్మించాడని భావం.

**కామస్య సాక్షాదివ భాన్తి పక్షాః। (13)**

**తిలకం –** కామునికి సహాయములు వలె.

**దీపిక –** కామోద్దీపకములని మరికొంత వివరణ ఇచ్చింది.

**తతస్తదా బహువిధభావితాత్మనః కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః।**
**అపశ్యతోఽభవదతిదుఃఖితం మనః సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః ॥(17)॥**

**తిలకం –** బహువిధభావితాత్మనః – పెక్కు విధములుగా ఆలోచించుచున్న మనస్సు కల – పెక్కుతీరులైన చింతలతో కూడినవాడగు, కృతాత్మనః – చేయబడిన ప్రయత్నము గల 'ఆత్మా దేహే ధృతౌ యత్నే స్వభావ

పరమాత్మనోః' అని వైజయంతి, సువర్త్మనః – గొప్పదైన నీతి మార్గమున ప్రవర్తించు, సుచక్షుషః – ఒకమారు చూచినంతనే చూడవలసిన సర్వమును కరతలామలకం వలె సాక్షాత్కరించుకొనుటకు సమర్థుడైన

**దీపిక –** బహువిధభావితాత్మనః – పెక్కు విధములగు చింతలతో కూడిన మనస్సు గల, సుచక్షుషః – దూరము నందున్న దానిని కూడ సాక్షాత్కరించు సమర్థత గల – తక్కినవి పైవానితో సమానం.

## ఎనిమిదవ సర్గము

**ప్రతప్త జాంబూనద జాల కృత్రిమమ్ । (1)**

**తిలకం –** బాగుగా మరగించిన బంగారుతో చేయబడిన కృత్రిమ పక్షులు మొదలగునవి కలవి. (పుష్పకము).

**దీపిక –** పుటము పెట్టిన బంగారు గవాక్షములు కృత్రిమ నిర్మాణము కలది.

**తదప్రమేయాఽప్రతికారకృత్రిమమ్ । (2)**

**తిలకం –** చిన్న చిన్న భాగములుగా భావించుటకు వీలుకానిది, ప్రతి నిర్మాణము చేయుటకు సాధ్యము కానిది, నిర్మించిన విశ్వకర్మయే ఎంత గొప్పగా, సుందరముగా ఏర్పడినది! అని ఆశ్చర్యముతో మెచ్చుకొనునట్లున్నది (పుష్పకం).

**దీపిక –** పై భావములనే వక్కాణించింది.

4 నుండి 8వ శ్లోకం వరకు కులకం (ఏకాన్వయం కలది)

**మనస్సమాధానవిచారచారిణమ్ । (4)**

**తిలకం –** విచారమంటే వివిధమైన గతి. మనోభావన ననుసరించి పెక్కుగతులతో తిరుగాడునట్టిది.

**దీపిక –** మనస్సు భావించిన పెక్కుతీరులైన గతులు కలది. మనస్సు కోరిన విధముగా సర్వదేశములకు పోగల శీలం కలదని అర్థం. లేదా – మనస్సమాధానం చేత అంటే నిశ్చలత్వం చేత, ఎక్కడ భావన ఉంటే అక్కడ తిరుగాడే స్వభావం కలది.

**మనః సమాధాయ తు శీఘ్రగామినమ్ । (5)**

**తిలకం –** మనస్సును ఏకాగ్రంగా చేసికొని.

**దీపిక –** స్వామిచిత్తాన్ని తన హృదయంలో నిలుపుకొని స్వామిచిత్తం ఎరిగి అని భావం.

**విచిత్రకూటం శిఖరం గిరేర్యథా । (6)**

**తిలకం –** కూటమంటే మధ్య మధ్య ఉండే ఎత్తైన ప్రదేశం. శిఖరం అంటే మహాశృంగం అని ప్రయోగాన్ని బట్టి అనుకోవాలి.

**దీపిక –** విచిత్రమైన కొండ కొమ్మలు కలది.

**వహన్తి యం కుణ్డలశోభితాననాః**
**మహాశనా వ్యోమచరా నిశాచరాః ।**
**వివృత్తవిధ్వస్తవిశాలలోచనాః**
**మహాజవా భూతగణాః సహస్రశః ॥(7)॥**

**తిలకం –** కుండల శోభితములైన ఆనవాలు కలవారు, గొప్ప తిండి కలవారు, ఆకాశంలో తిరిగేవారు, తిరుగుళ్ళు పడుతున్న పెద్ద గ్రుడ్లు కలవారు, గొప్ప వేగం కలవారు అయిన భూతములు వంటి వ్యక్తులు వేలకొలదిగా ఆ పుష్పకాన్ని మోస్తున్నారు. ఇక్కడ మోస్తున్నట్లు అర్థం చెప్పాలని యీ వ్యాఖ్య అంటున్నది. ఎందుకంటే అంతఃపురంలో ఉన్న విమానాన్ని భూతగణాలు మోయటం సంభవించదు కదా! ఆ విధంగా మోస్తున్నట్లు చిత్రించిన భూతగణాల ప్రతిమలు దాని మీద చెక్కబడి ఉన్నాయని అర్థం గ్రహించాలి.

**దీపిక –** వహన్తి – వహన్తీవ – విమానం మీద నిర్మించి, నిశాచరుల ఆకారాలు గల ప్రతిమలు మోస్తున్నట్లుగా ఉన్నాయని అర్థం.

**రామానుజీయం –** కామగమనం గల విమానానికి వాహకులు అక్కరలేదు. వహన్తి అంటే రక్షన్తి – రక్షిస్తున్నారు అనే అర్థము కూడా ఇక్కడ కుదరదు. అంతఃపురం మధ్య వున్న విమాన సంరక్షణ కోసం రాక్షసులను నియమించటం సంభవించదు. అందువలన ఇక్కడ సమాధానాన్ని పండితులు పరిశీలించాలి అన్నది.

## తొమ్మిదవ సర్గము

**మార్గమాణస్తు వైదేహీం సీతామాయతలోచనామ్ ।**
**సర్వతః పరిచక్రామ హనూమానరిసూదనః ॥(3)॥**

**తిలకం –** సర్వతః అంటే పుష్పకం కాక తక్కిన అన్ని స్థలాలలో అని అర్థం. పుష్పకారోహణాన్ని తరువాత చెబుతున్నారు కనుక.

**రామానుజీయం–** రావణభవనం చుట్టూ ఉన్న అతని తమ్ముల, కొడుకుల, మంత్రుల భవనాలన్నింటి యందూ తిరుగాడడం సర్వతః అనే దానికి అర్థం.

**దీపిక –** తిలకాభిప్రాయాన్నే అనువదించింది.

**ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేన్ద్ర నివేశనమ్ । (4)**

**తిలకం –** రాక్షసేన్ద్ర నివేశనమ్ – పుష్పకం మధ్యలో వున్న ఆలయం కంటే ఇతరమైన మూలస్థానం. రావణుని నివేశనమని మళ్ళీ గ్రహించటం అపూర్వ విశేషాన్ని చెప్పే తాత్పర్యంతో అని గ్రహించాలి.

**దీపిక –** రావణస్య నివేశనమ్ – నివేశ్యన్తే పరిగృహ్యాన్తే పత్న్యః అత్రేతి నివేశనమ్ – పత్నులను

**యా చ రాజ్ఞః కుబేరస్య యమస్య వరుణస్య చ ।**
**తాదృశీ తద్విశిష్టా వా బుద్ధీ రక్షో గృహేష్విహ ॥(9)॥**

**తిలకం–** రక్షోగృహములంటే రావణుని తమ్ముల, పుత్రుల, అమాత్యుల గృహాలయందు. ఇక్కడ బుద్ధిశబ్దం వెనుక శ్లోకంలో చెప్పిన సర్వ శబ్దం కంటే భిన్నార్థకం కాదు. కనుక కుబేరాదుల ఒక్కొక్కదిక్పాలకుని ఐశ్వర్యం రక్షస్సుల యిళ్ళలో ప్రతి గృహంలోను ఉన్నదనే అర్థాన్ని ఇది అభివ్యక్తం చేస్తుంది.

**దీపిక –** వెనుక శ్లోకంలోని లక్ష్మీశబ్దానికి శోభ అనీ, యీ శ్లోకంలోని బుద్ధి శబ్దానికి ఐశ్వర్యమనీ అర్థం చెప్పి పునరుక్తి దోషాన్ని పరిహరించింది.

**తస్య హర్మ్యస్య మధ్యస్థమ్ । (10)**

**తిలకం –** ఇది వెనుక చెప్పిన విషయమే. అయితే పుష్పకం మధ్య రావణుని ప్రత్యేక భవనం ఒకటి ఉన్నది అని స్పష్టం చేయటం కోసం మళ్ళీ చెబుతున్నారు.

**దీపిక –** వివరణ లేదు.

**జాలవాతాయనైర్యుక్తం కాంచనైస్స్ఫాటికైరపి । (16)**

**తిలకం –** జాలములంటే పైభాగంలో అడ్డంగా గాజుపలకలతో చేసిన అమరికలు. వాతాయనాలంటే కేవలం రంధ్రాలు లేదా అర్థస్పష్టత కోసం ఒకే అర్థం గల రెండు శబ్దాలను ప్రయోగించారనుకోవాలి.

**దీపిక –**గోడపైభాగంలో అలంకారం కోసం స్వస్తికము, సర్వతోభద్రము మొదలైన ఆకారాలతో విశాలంగా ఉంచినవి జాలములు. గాలి సంచారం కోసం ఏర్పరచిన గవాక్షాలు వాతాయనాలు.

ఇంద్రనీల మహానీల మణి ప్రవరవేదికమ్.

**తిలకం –** మహానీలములు – సింహళ ద్వీపంలో లభించే నీల రత్నాలు.

**దీపిక –** ఇంద్రనీలం – పాలకు నీలిమను సంతరించే ఒక జాతి. రత్నం – మహానీలం – సింహళ ద్వీపంలో గనులలో పుట్టే రత్నం.

**ఆదిత్యతరుణోపమమ్ । (18)**

**తిలకం –** తరుణ ఆదిత్యుని వంటిది. ఉపసర్జనానికి పరనిపాతం ఆర్షం. (ఉపసర్జనమంటే సమాస శాస్త్రంలో కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగిన పదం. అది సమాసంలో పూర్వపదంగా ఉండాలి. ఆ నియమం ప్రకారం తరుణాదిత్య ఉపమమ్ అని ఉండాలి. కాని ఇక్కడ 'ఆదిత్య తరుణ' అని ప్రయుక్తమైనది. ఋషి ప్రయోగంగా ఇది సాధువు.

**స్ఫాటికైరావృతతలాం దంతాంతరితరూపికామ్ । (23)**

**తిలకం –** మధ్య మధ్య ఏర్పరచిన దంతపు పలకలు గలది.

**దీపిక –** దంతములతో చేసిన రూపములు నడుమన ఏర్పరచిన నిర్మాణం కలది.

**చిత్రాం పుష్పోపహారేణ కల్మాషీమివ సుప్రభామ్ । (28)**

**తిలకం –** కల్మాషి అంటే శబల వర్ణ (పెక్కు రంగుల కలయిక కలది). వసిష్ఠధేనువు వలె అన్ని కోరికలను తీర్చునట్టిది కాబట్టి కల్మాషీ సాదృశ్యం.

**దీపిక –** కల్మాషీ శబ్దం వసిష్ఠ ధేనువును తెలియజేస్తుంది. దీని చేత సర్వానందదాయిని అని తెలుస్తున్నది.

**స్వర్గోఽయం దేవలోకోఽయ మిన్ద్రస్యేయం పురీ భవేత్ ।**
**సిద్ధిర్వేయం పరా హి స్యా దిత్యమన్యత మారుతిః ॥(31)॥**

**తిలకం –** ఇది మరొక స్వర్గం. దేవతల లోకం – ముప్పది మూడు కోట్ల దేవతల లోకం. ఇంకా ఇంద్రుని అమరావతి. పరాసిద్ధిః బ్రహ్మలోకం అని మారుతి తలపోశాడు. ఈ విధంగా ఉత్తరోత్తరోత్కర్ష ఇందు కానవస్తుంది.

**దీపిక –** స్వర్గము పాతాళాదుల లోనిది. దేవలోకము వాయు, వరుణాదుల లోకము. ఇంద్రపురి – అమరావతి పరాసిద్ధిః – మిక్కిలి గొప్పది అయిన తపస్సునకు ఫలభూతమైన బ్రహ్మలోకము.

**తత్రప్రసుప్తం విరురుచే నిశ్శబ్దాంతరభూషణమ్ । (36)**

**తిలకం –** అతినిద్రాపరవశత్వం చేత అంగములు నిశ్చలంగా ఉన్న కారణంగా గలగలలాడని భూషణాలు కలది.

**దీపిక –** అటు ఇటు కదలినా ఆభరణాల ధ్వనులు వినరావటం లేదు. అట్టి ఆభరణాలు కలది.

**ప్రభావర్ణప్రసాదాశ్చ విరేజుః । (44)**

**తిలకం –** ప్రభ – కాంతి, వర్ణము – రూపము, ప్రసాదము – ప్రసన్నత.

**దీపిక –** ప్రభ – దేహకాంతి, వర్ణము – రూపము, ప్రసాదము – ఔజ్జ్వల్యం

**వ్యావృత్తగురుపీనస్రక్ప్రకీర్ణవరభూషణాః ।**
**పానవ్యాయామకాలేషు నిద్రాపహృతచేతసః ॥(45)॥**

**తిలకం –** పానవ్యాయామ కాలములందు పానము చేసిన పిమ్మట జరిగే రతి వ్యాపార సమయములందు.

**దీపిక –** పానం అయిన తరువాత జరిగే గీతనృత్యాది వ్యాపార సమయాలలో.

**కింకిణీజాలసంకోశా స్తా హైమవిపులాంబుజాః ।**
**భావగ్రాహా యశ స్తీరా స్సుప్తా నద్య ఇవాఽఽబభుః ॥(52)॥**

**తిలకం –** కింకిణీ జాలములనెడు మొగ్గలు కలవి. ఈ స్థానమందు "సత్కోశాః" అనే పాఠాంతరం కనబడటం వలన సంకోశ శబ్దం ముకుళవాచి అని తెలియవస్తున్నది. భావములనగా శృంగారచేష్టలు అవియే మొసళ్ళు.

సుప్తిదశలో కూడా వాసనావశం చేత భావములకు అభివ్యంజకములైన భంగిమలు కలవికావటం వలన భావగ్రాహలు అని చెప్పారు. యశస్తీరాః – యశశ్శబ్దం చేత యశస్సునకు కారణమైన ప్రక్కలకు వ్యాపించిన ప్రభ చెప్పబడినది అదియే తీరముగా గలవారు/కలవి.

**దీపిక –** భావములు అంటే విలాసములు. అవే మొసళ్ళు. యశస్తీరాః – లక్షణ చేత కాంతిరోధస్సులు అని అర్థం.

**మృదుష్వంగేషు కాసాంచిత్కుచాగ్రేషు చ సంస్థితాః ।**
**బభూవుర్భూషణానీవ శుభా భూషణరాజయః ॥(53)॥**

**తిలకం –** కొందరు స్త్రీల మృదువైన అంగములందు భూషణముల సముదాయములు భ్రమరముల వలె – కాముకుల వలె – వ్రాలాయి. (ఇక్కడ తిలకం భూషణానీవ అనే దానికి భ్రమరాణీవ అనే పాఠాన్ని గ్రహించింది. పిదప, కొందరు భూషణానీవ అనే పాఠాన్ని గ్రహించి నగల ఒత్తిడికి కలిగిన రేఖలు నగల వలెనే భాసించాయి అని అర్థం చెప్పారని వివరించింది).

**దీపిక –** ఈ రెండవ అర్థాన్నే 'భూషణానీవ' అనే పాఠాన్ని గ్రహించి చెప్పింది.

**ముఖాని స్మ సపత్నీనా ముపాజిఘ్రన్ పునఃపునః । (58)**

**తిలకం –** రావణుని యందు మిక్కిలిగా తగులము గల మనస్సు గల కాంతలు కొందరు సపత్నుల ముఖములను, రావణుని ముఖమే అనుకొని వాసనలు చూస్తున్నారు. దీనికి కారణం విరివిగా తగుల్కొన్న మనస్సు, అస్వతంత్రత మొదలైనది.

**దీపిక –** పైభావాలను అలాగే ఉట్టంకించింది.

**బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య యదీదృశీ రాఘవధర్మపత్నీ ।**
**ఇమా యథా రాక్షసరాజభార్యా స్సుజాతమస్యేతి హి సాధుబుద్ధేః ॥(72)॥**

**తిలకం –** రాఘవ ధర్మపత్ని ఈ రాక్షసరాజభార్యల వలె స్వయంవరానికి పూర్వమే రావణుని ధర్మపత్ని అయి ఉంటే ఈతని పుట్టుక ప్రశంసనీయమయ్యేది – అనే భావన హరీశ్వరునకు – హనుమంతునకు కలిగింది.

అయితే ఇది అసాధుబుద్ధి. కోతితనం వల్ల ఏర్పడిన ఆలోచన. నిజానికి అతని బుద్ధి కాదు – అనే అర్థాన్ని స్ఫురింపజేయటం కోసం సాధుబుద్ధేః అనే మాటను ప్రయోగించారు.

లేదా – ఈ రాక్షస రాజభార్యలు తమ భర్తతో కలిసి సకల భోగాలతో కూడి ఉన్నట్లుగా రాఘవ ధర్మపత్ని తన భర్తను కూడి ఉన్నట్లయితే ఈ రాక్షసుని పుట్టుక మంచిదై ఉండేది అన్న భావన హనుమకు కలిగింది. అంటే ఈ రాక్షసుడు రాఘవధర్మపత్నిని రాఘవునికి తిరిగి అప్పగిస్తే వాని పుట్టుక ప్రశంసింపదగినది అవుతుందని భావన.

ఇక్కడ కపీశ్వరుడు సాధుబుద్ధి ఎలా అయ్యాడు అంటే అతిక్రూరుడైన రావణుని క్షేమం కూడా కాంక్షిస్తున్నాడు కనుక.

**దీపిక –** పై రెండు భావాలను అనువదించింది. మరికొన్నింటిని ఇలా వివరించింది.

1. ఈ రాక్షసుడు రాఘవధర్మపత్నిని ఎత్తుకొనివచ్చినట్లుగా హరీశ్వరుడైన సుగ్రీవుడు ఇతని యీ కాంతలను ఎత్తుకొని వస్తే అతనిది మంచి పుట్టుక అయి ఉండేది. (దెబ్బకు దెబ్బ అన్నట్లు).
2. రాఘవధర్మపత్నిని పరమ పవిత్ర స్వభావం కలదానిని, ఈ కాంతలను వలె రావణుడు తీసుకొని వచ్చాడంటే వాని పుట్టుక ఏమి పుట్టుక? అనే భావన కలిగింది. నీచమైన పుట్టుక అని నింద.
3. ఈ రాక్షసరాజభార్యలను నేను చూచినట్లుగా రాఘవధర్మపత్నిని కూడా నేను చూడగలిగితే నా జన్మ మంచిదవుతుందనే భావన హనుమంతునకు కలిగింది.
4. వీరిని వలె నేను రాఘవధర్మపత్నిని చూడగలిగితే సీత కానరాకపోవటం వలన సుగ్రీవరామాదుల భయంవలన ప్రాయోపవేశం చేయటానికి సిద్ధపడిన అంగదుడు మొదలగు వానరసమూహం జన్మ చరితార్థమవుతుంది.
5. ఈ రాక్షసరాజభార్యలు ఎలా జీవించి ఉన్నారో రాఘవధర్మపత్ని కూడా అలాగే జీవించి ఉంటే శ్రీరాముని జన్మము సుజాతమయ్యేది అనే భావన హనుమకు కలిగింది.
6. ఓ రాక్షసరాజా! ఈ స్త్రీలు నీకు భార్యలయి సుఖపడుతున్నట్లుగా, రాఘవధర్మపత్ని కూడా అతనితో కూడి సుఖంగా ఉండాలి. అలాకాక ఇట్టిదే అయితే నీబ్రదుకు సుజాతం కానేకాదు అని రావణునకు ఉపదేశించాలి అనే భావన ఆంజనేయునకు కలిగింది. .
7. ఈ రాక్షసరాజభార్యలు ఎంత అందగత్తెలో రాఘవధర్మపత్ని అట్టిదవుతుందా? కాదు, ఆమె త్రిలోక సుందరి అందువలన ఇక్కడ లేదు – అనే నిశ్చయభావం హనుమంతునకు కలిగింది.

**పునశ్చ సోఽచిన్తయ దార్తరూపః**
**ధ్రువం విశిష్టా గుణతో హి సీతా ।**
**అథాయమస్యాం కృతవాన్ మహాత్మా**
**లంకేశ్వరః కష్టమనార్యకర్మ ॥(73)॥**

**తిలకం –** సీత గుణాలను బట్టి, పాతివ్రత్యములను బట్టి విశిష్ట, సర్వోత్కృష్ట. అట్టి ఆమెను గూర్చి ఆర్తరూపుడనైన నేను ఏమి మాటాడితిని అని మనస్సులో బాధపడి ఆమె విషయమున అనార్యకృత్యమును చేసితినని విచారించెను.

**దీపిక –** లంకేశ్వరుడు అనార్యకృత్యమును, అపహరణ రూపమైన దానిని చేసెనని మహాత్ముడగు హనుమంతుడు ఆర్తరూపుడై విచారించెను.

## పదవ సర్గము

**తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితమ్ ।**
**అవేక్షమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్ ॥(1)॥**

**తిలకం –** శయనాసనమ్ – శయనము యొక్క ఆసనము. మంచమని అర్థము.

**దీపిక –** శయనం చ తదాసనం చ. పడుకొనేది, కూర్చునేది – పర్యంకమని అర్థం. రెండు పనులకు పనికి వస్తుంది కనుక రెండు నామములతో వ్యవహరించారు. లేదా ఆసనమంటే ఉండేది. శయనానికి సంబంధించిన ఆసనం శయనగృహమని అర్థం. దివ్యోపమమ్ – ఇంద్రుని శయనం వంటిది.

**నిశ్శ్వసన్తం యథా నాగం రావణం వానరర్షభః ।**
**ఆసాద్య పరమోద్విగ్న స్సోపాసర్పత్ సుభీతవత్ ॥(12)॥**

**తిలకం –** వీడు పాపాత్ముడు, దేవిని అపహరించినవాడు, వీని దగ్గర నిలవటం అనుచితం అని ఖిన్నచిత్తుడై ప్రక్కకు తొలగాడు. సుభీతవత్ – భయకారణమైన పిశాచాదుల ఎదుట నిలవటానికి వెరచినట్లుగా ప్రక్కకు తొలగాడని భావం.

**దీపిక –** ఈ అభిప్రాయాన్నే తెలియజేసింది.

**వజ్రోల్లిఖితపీనాంసౌ విష్ణుచక్రపరిక్షతౌ । (16)**

రావణుని చేతులు వజ్రపుగాయాలతో బలిసి ఉన్నాయి. విష్ణుచక్రపు దెబ్బలు గట్టిగా తిని వున్నాయి.

**తిలకం –** వీని చేత రావణుడు వజ్రానికీ, విష్ణువు చక్రానికి కూడా చావనివాడనే అర్థం స్ఫురిస్తుంది.

**దీపిక –** విష్ణువంటే ఉపేంద్రుడని మాత్రం చెప్పి ఊరుకున్నది.

**తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః ।**
**శుశుభేఽచలసంకాశః శృంగాభ్యామివ మందరః ॥(22)॥**

**తిలకం –** ఇక్కడ రెండు భుజములను చెప్పటం వలన రావణునకు యుద్ధాది కాలంలోనే ఇరువది చేతులు, పది తలలు ఉంటాయని భావించాలి.

**దీపిక –** ద్విభుజత్వము, ముందు చెప్పబోయే మహాముఖత్వము అనే అంశాలు రావణుడు కామరూపుడు కనుక సరిపడుతాయి.

**చూతపున్నాగసురభి ర్వకుళోత్తమసంయుతః ।**
**మృష్టాన్నరససంయుక్తః పానగన్ధపురస్సరః ॥(23)॥**

**తిలకం –** అతని ముఖవాసన పానపదార్థపు గంధంతో కూడినది. పానమంటే మద్యం – దాని గంధంతో కూడినది.

**దీపిక –** రాక్షసత్వం వలననే వామాచారరూపమైన పూజ చేయటం వలన మధుపానం ఇక్కడ ప్రసక్తమైనది.

**నృత్తవాదిత్రకుశలా రాక్షసేన్ద్రభుజాంకగాః ।**
**వరాభరణధారిణ్యో నిషణ్ణా దదృశే హరిః ॥(32)॥**

**తిలకం –** రాక్షసేంద్రుని భుజాన్నీ అంకాన్నీ పొందినవారు – అంటే ఒడిలో కూర్చోపెట్టుకొని కౌగిలించుకోవటం చేత లాలింపబడినవారని తాత్పర్యం.

**దీపిక –** రాక్షసేంద్రుని భుజాలను, అంకాన్ని పొందుతున్నవారు అంటే అంతగా అతనికి ప్రియమైన వారని అర్థం.

**అంగహారైస్తథైవాన్యా కోమలై ర్నృత్తశాలినీ । (36)**

**తిలకం –** సుషుప్త్యవస్థలో ఉన్నా వాసనా బలం చేత నృత్త సన్నివేశంలో ఉన్నదిగా ఒక కాంత కన్నట్టుచున్నది.

**దీపిక –** ఈ అభిప్రాయాన్నే అనువదించింది.

**కాచిద్వీణాం పరిష్వజ్య ప్రసుప్తా సంప్రకాశతే । (37)**

**తిలకం –** మహానదిలో యాదృచ్ఛికంగా వచ్చిన పద్మనాళాలతో పాటు ఉన్న తామరతీగల సముదాయమనే పడవను ఆశ్రయించి వున్నట్లుగా వీణను కౌగిలించుకొని ఒక వనిత పడుకొని వున్నది.

**దీపిక –** యదృచ్ఛంగా వచ్చిన ప్లవమును ఆశ్రయించినట్లుగా వీణను కౌగిలించుకొని పడుకొని ఉన్నది.

**డిండిమం పరిగృహ్యాన్యా తథైవాసక్తడిండిమా ।**
**ప్రసుప్తా తరుణం వత్సముపగూహ్యేవ భామినీ ॥(44)॥**

**తిలకం –** ఒక డిండిమమును ఆనుకొని మరొక డిండిమమును చేతితో పట్టుకొని ఒక భామిని శయనించి ఉన్నది. అది ఏకకాలంలో యువకుడైన ప్రియుని, కుమారుని కౌగిలించుకొని పడుకొన్నట్లున్నది.

**దీపిక –** రెండు డిండిమములలో ఒకటి రమణుని వలె మరియొకటి పుత్రుని వలె ఉన్నదని యీ వ్యాఖ్యయు వివరించింది.

**కలశీమపవిధ్యాన్యా ప్రసుప్తా భాతి భామినీ ।**
**వసన్తే పుష్పశబలా మాలేవ పరిమార్జితా ॥(46)॥**

**తిలకం –** కలశి – నీటితో నిండినదనే అర్థాన్ని గ్రహించాలి.

**అపవిధ్య –** క్రిందికి వంచి – దీని చేత సలిల సంబంధం తెలియవస్తున్నది. పరిమార్జితా – కొంచెం పాటి నీటితో తడుపబడినది. బోర్లగించిన కుండ నుండి వెలువడిన గంధోదకంతో తడుపబడినదై నీరు చిలుకరించిన పుష్పమాలవలె ఒకతె కానవచ్చినది.

**దీపిక –** బోర్లగించిన తన నీటి కుండతో తడితడిగా చేయబడిన శరీరము గల ఒక భామిని వసంతకాలంలో వాడిపోకుండా నీళ్ళు చల్లిన మాల వలె ప్రకాశించింది.

**ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం**
**ననన్ద చిక్రీడ జగౌ జగామ ।**
**స్తంభానరోహన్నిపపాత భూమౌ**
**నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్ ॥(54)॥**

**తిలకం –** వ్యామోహం వలన కోతి లక్షణాలను వ్యక్తపరిచాడు.

**దీపిక –** ఈ చేష్టలన్నీ ఉపాంశువుగానే – ఇతరులకు తెలియరానీకుండా చేశాడు.

## పదకొండవ సర్గము

**అవధూయ చ తాం బుద్ధిమ్ బభూవావస్థిత స్తదా । (1)**

**తిలకం –** ఆ బుద్ధిని – మందోదరియందు సీతాబుద్ధిని త్రోసివైచి స్వస్థచిత్తుడైనాడు.

**దీపిక –** ఆ బుద్ధిని సీతాసంభావన చేత ప్రవృత్తమైన కోతిబుద్ధిని – తొలగించుకొని అపరాం చిన్తామ్ – మందోదరిని సీతగా భావించిన బుద్ధిని కాక మరియొక బుద్ధిని – ఈమె ఆమె కాదు అనే బుద్ధిని పొందాడు.

**రతాభిరతసంసుప్తం దదర్శ హరియూథపః । (7)**

**తిలకం –** రత శబ్దం బాహ్యసురతాన్నీ, అభిరతశబ్దం కరణబంధాది రూపమైన సురతాన్నీ తెలుపుతాయి.

**దీపిక –** రతిశ్రాంతి చేత గాఢ నిద్ర పొందిన వానిని.

**వరాహవార్ధ్రాణసకాన్ । (15)**

**తిలకం –** ఒక విధమైన మేకపోతులు వార్ధ్రాణసములు – దీనికి "త్రిపిబం, త్విన్ద్రియక్షీణం యూపస్యాగ్రచరం తథా రక్తవర్ణం చ రాజేన్ద్రభాగం వార్ధ్రాణసం విదుః" అనే స్మృతివాక్యాన్ని ప్రమాణంగా చూపింది. పక్షివిశేషమని కొందరు ఖడ్గమృగమని కొందరూ అంటారన్నది.

**దీపిక –** వార్ధ్రాణసము – ఒక విధమైన పక్షి నల్లని మెడ, ఎర్ర తల, తెల్లని రెక్కలు కల పక్షిని వార్ధ్రాణసం అంటారని విష్ణుధర్మోక్తం చెప్పిన మాటను ఉటంకించింది. కాదా ఒక విధమగు మేక. మూడింటితో – ముఖంతో చెవులతో, త్రాగునది, మూడు ఇంద్రియములు క్షీణించినది, తెల్లనిది, ముసలిది అయిన మేకపోతును వార్ధ్రాణసం అని యాజ్ఞికులు వ్యవహరిస్తారు. ఖడ్గమృగం కూడా కావచ్చు. హలాయుధ నిఘంటువు "వార్ధ్రాణ ఖడ్గమృగః" అని చెప్పింది.

**తథామ్లలవణోత్తంసై ర్వివిధైరాగషాడబైః । (17)**

**తిలకం –** షాడబాలు ఆరురుచుల సంయోగంతో చేసిన భక్ష్య విశేషాలు. రాగ షాడబాలంటే రాగంతో కూడిన షాడబాలు. రాగమంటే తెల్లని ఆవాలు. చక్కెర, తేనె, ద్రాక్ష, దానిమ్మ మొదలైన మధుర పదార్థాలు కలిపిన ద్రవపదార్థం పల్చగా ఉంటే రాగం చిక్కగా ఉంటే షాడబం అని ప్రమాణ శ్లోకాలను ప్రదర్శించింది.

**దీపిక –** విరళరసములైతే రాగములనీ, వస్త్రగళితములైతే షాడబములనీ అంటారని ప్రమాణాలు చూపింది.

**దివ్యాః ప్రసన్నా వివిధా స్సురాః కృతసురా అపి ।**
**శర్కరాౢ ౢసవమాధ్వీక పుష్పాసవ ఫలాసవాః ॥(21)॥**

**తిలకం –** కృతసురాః – కృత్రిమంగా ఏర్పడిన మద్యములు. వానినే వివరిస్తున్నారు. శర్కరతో చేసినవి, తేనెతో చేసినవి, పూల మకరందంతో చేసినవి, ఫలరసాలతో చేసినవి. దివ్యములంటే అమృతమథనం నాడు పుట్టిన వారుణి జాతికి చెందినవి.

**దీపిక –** పై అంశాలనే వివరించింది

**తాసాం నిద్రావశత్వాచ్చ మదనేన విమూర్ఛితమ్ ।**
**పద్మినీనాం ప్రసుప్తానాం రూపమాసీద్యథైవ హి ॥(35)॥**

**తిలకం –** ఇక్కడ చ కారం అప్యర్థకం. నిద్రాపరవశలైనప్పటికినీ వారల రూపం ప్రసుప్తలైన పద్మినుల రూపంవలె రమ్యంగా ఉన్నది.

**దీపిక –** మదనేన – మదన హేతుకమైన రతిచేత – తిలకం దీనిని చెప్పలేదు.

**అయం చాత్ర మయా దృష్టః పరదార పరిగ్రహః । (37, 38)**

**తిలకం –** పరదార రూపమైన అంతఃపురాన్ని చూడటం.

**దీపిక –** దారశబ్దం స్త్రీసామన్య వాచి, అవరోధ శబ్దం స్వధర్మయుక్త కులస్త్రీని తెలియజేస్తుంది. ప్రసుప్తస్య అనే పదం వల్ల నగ్నప్రాయత్వం తెలియవస్తున్నది. ఆ సమయంలో వస్త్రాలు చెదరిపోతాయి కనుక (తిలకం దీనిని స్పృశింపలేదు).

**మనో హి హేతు స్సర్వేషా మిన్ద్రియాణాం ప్రవర్తనే ।**
**శుభాశుభాస్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితమ్ ॥(42)॥**

**తిలకం –** శుభములు, అశుభములు అయిన అవస్థల యందు ఇంద్రియముల ప్రవర్తనలో మనస్సే కారణము – సువ్యవస్థితమ్ – అచ్చట నిద్రించియున్న స్త్రీల యందు అభిలాషము కలుగలేదు.

**దీపిక –** ఈ విషయాలు లేవు.

## పన్నెండవ సర్గము

**నిశాగృహాన్ (1)**

**తిలకం –** నిశాగృహాలంటే రాత్రి యందు నివసించటానికి యోగ్యమైన గృహాలు.

**దీపిక –** పై అభిప్రాయాన్నే తెలియజేసింది.

**ధ్రువం హి సీతా మ్రియతే యథా న మే । విచిన్వతో దర్శనమేతి మైథిలీ ॥(2)॥**

**తిలకం –** ఏకారణం చేత వెదకుతున్న నాకు సీతాదర్శనం కలుగలేదో ఆ కారణం చేత ఆమె తప్పక మరణించి ఉంటుంది. లేదా యథా న మే అనే పదాల స్థానంలో అథవా న అనే వాక్యం చదువుకోవాలి. అప్పుడు మరణించి గానీ ఏదో ఇతరులకు ప్రవేశింపరాని స్థలంలో ఉండటం గానీ సంభవించింది అనే అర్థం వస్తుంది.

**దీపిక –** మరణవిషయాన్ని మాత్రమే పేర్కొన్నది.

**నమేఽస్తి సుగ్రీవసమీపగా గతి స్సుతీక్ష్ణదండో బలవాంశ్చ వానరః ॥(5)॥**

**తిలకం –** శత్రువుల యెడల పరాక్రమాన్ని చెడగొట్టుకొని ఎక్కువ కాలాన్ని వృథా చేసిన నాకు సుగ్రీవుని దగ్గరకు పోయే గతి యింకలేదు. సుగ్రీవుని దగ్గరకు పోవటం అయోగ్యమైనది అని అర్థం.

**దీపిక –** సుగ్రీవుని దగ్గరకు నేను పోరాదు అని అర్థం.

**ధ్రువం ప్రాయముపైష్యన్తి కాలస్య వ్యతివర్తనే । (8)**

**తిలకం –** గడువు దాటిపోగా ప్రాయోపవేశం చేస్తారు. జాంబవంతుడు మొదలగువారు అని కలుపుకోవాలి.

**దీపిక –** సీత నాకు కానరాలేదని చెప్పినంతనే ప్రాయోపవేశం చేసి ప్రాణాలను వదలివేస్తారు. నాకు నిర్ణయించిన కాలం అయిన వెంటనే కూడా ప్రాయోపవేశం చేస్తారు.

**ఇతి సంచింత్య భూయోఽపి విచేతుముపచక్రమే ।**
**భూమీగృహాంశ్చైత్యగృహాన్ గృహాతిగృహకానపి ॥(14)॥**

**తిలకం –** గృహాతిగృహకాన్ – గృహాలను దాటి దూరంగా స్వైరవిహారంకోసం కట్టుకొన్న గృహాలను

**దీపిక –** గృహాతిగృహకాన్ – గృహాలను దాటి దగ్గరగా స్వైరవిహారంకోసం నిర్మించుకొన్న యిండ్లను.

**ప్రాకారాంతరరథ్యాశ్చ ........... తేనావలోకితమ్ । (18)**

**తిలకం –** ప్రాకారాంతర రథ్యలు అంటే ప్రాకారం మధ్యలో ఉన్న వీధులు.

**దీపిక –** ప్రాకారం మధ్య ఉన్న మంత్రి కుమారాదుల వీధులు.

**నాగకన్యా వరారోహాః పూర్ణచంద్రనిభాననాః ।**
**దృష్టా హనుమతా తత్ర న తు సీతా సుమధ్యమా ॥**

**ప్రమథ్య రాక్షసేన్ద్రేణ నాగకన్యా బలాద్ధృతాః ।**
**దృష్టా హనుమతా తత్ర న సా జనకనన్దినీ ॥(21, 22)॥**

**తిలకం –** 22వ శ్లోకంలో 'బలాద్ధృతాః' అనటం చేత బలాత్కరించి తెచ్చిన నాగకన్యలను గురించి చెప్పారు. పూర్వ శ్లోకంలో వివాహం చేసికొని తెచ్చిన వారిని చెప్పారు. ఆ విధంగా పునరుక్తి లేదు.

**దీపిక –** పై అర్థాన్నే చెప్పింది.

**పదమూడవ సర్గము**

**కిన్ను సీతాథ వైదేహీ మైథిలీ జనకాత్మజా ।**
**ఉపతిష్ఠేత వివశా రావణం దుష్టచారిణమ్ ॥(6)॥**

**తిలకం –** సీత అనటం చేత అయోనిజ, వైదేహి – జన్మభూమికి సంబంధించిన విశిష్టత కలది, మైథిలి – ఆచార ప్రధానమైన కులోత్కర్ష కలది. ఇట్టి జనకాత్మజ దుష్టచారి అయిన రావణుని చేరుతుందా? చేరదు.

**రామానుజీయం–** ఇక్కడ మరికొన్ని విశేషాలను చెప్పింది. సీత అనటం చేత అయోనిజ అయినందు వలన కలిగిన వైశిష్ట్యమూ అథ శబ్దం చేత గుణసముచ్చయమూ, మైథిలి అనటం చేత సదాచారయుక్తులకు, సత్పురుషులకు నివాసం అయిన నగర సంబంధమైన వైశిష్ట్యమూ తెలియవస్తున్నాయి. జనకాత్మజ అనటం చేత 'కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః' జనకాదులు కర్మతోడనే సంసిద్ధి పొందారు – అనే ప్రసిద్ధి గల జనక సంబంధము వలన కలిగిన వైశిష్ట్యం వెల్లడి అవుతున్నది. ఇట్టి దేవి రావణమిత్రభావనతో చేరుకుంటుందా? చేరుకోదు.

**దీపిక –** పై అంశాలను యథాతథంగా స్వీకరించింది.

**అథవా హ్రియమాణాయాః పథి సిద్ధనిషేవితే ।**
**మన్యే పతిత మార్యాయా హృదయం ప్రేక్ష్య సాగరమ్ ॥(8)॥**

**తిలకం –** సాగరాన్ని చూచి భీతమైన హృదయం సముద్రంలో పడి ఉంటుంది. హృదయం భయస్థానం కనుక దానికి మూలమైనది శరీరం కనుక హృదయశబ్దం ఇక్కడ శరీరాన్ని సూచిస్తుంది.

**దీపిక –** హృదయము పతితము అంటే మనస్సు ఎగిరి వెళ్ళిపోయినది అని అర్థం. మనస్సు పైకి లేచిపోవటమే మరణం. ఆ విధముగా చనిపోయి ఉంటుందని భావం.

**వినష్టా వా ప్రణష్టా వా మృతా వా జనాకత్మజా । (17)**

**తిలకం –** వినష్ట – భూగృహాదులలో నిలుపటం చేత కానరానిది అయినది. ప్రణష్ట – సముద్రంలో పడటం మొదలైన కారణంగా త్యక్తజీవిత అయి ఉంటుంది. మృత – రామ విరహదుఃఖాన్ని సహింపలేని కారణంగా తనంత తాను మరణించి ఉంటుంది.

**దీపిక –** దృశ్య దేశంలో మాయ చేత కానరాకపోవటం వినాశం.

అదృశ్య దేశంలో నిలపటం ప్రణాశం. రామవిశ్లేషం వలన పుట్టిన దుఃఖం చేత స్వయంగా మరణించి ఉండవచ్చు (మృత).

**పరుషం దారుణం క్రూరం తీక్ష్ణ మిన్ద్రియతాపనమ్ ।**
**సీతానిమిత్తం దుర్వాక్యం శ్రుత్వా స న భవిష్యతి ॥(24)॥**

**తిలకం –** పరుషము – చెవికి కటువైనది, దారుణము – భయంకరమైనది, క్రూరము – ఉగ్రమైనది, తీక్ష్ణము – సహింపనలవి కానిది, ఇంద్రియతాపనము – ఇంద్రియములకు క్షోభ కలిగించునది.

**దీపిక –** పరుషము – కర్ణ కఠోరము – తక్కిన అర్థాలు యథాతథంగా ఉన్నాయి.

**ఉపవాస మథో శస్త్రం ప్రచరిష్యన్తి వానరాః । (36)**

**తిలకం –** శస్త్రమంటే శస్త్రాలతో పడిపోవటం – మరణం పొందటం.

**దీపిక –** వివరణ లేదు.

**ఉపవిష్టస్య వా సమ్య గ్లింగినీం సాధయిష్యతః ।**
**శరీరం భక్షయిష్యన్తి వాయసాః శ్వాపదాని చ ॥(42)॥**

**తిలకం –** ఉపవిష్టస్య అంటే ప్రాయోపవేశం చేసిన, లింగమంటే సన్యాసము – అనశనము – అన్నం తినటం మానివేయటం. దానిని సాధిస్తూ లింగినమని ఒక పాఠం. అప్పుడు లింగమంటే శరీరం. అది కలది లింగి – ఆత్మ. దానిని సాధిస్తూ అంటే శరీరము నుండి ఆత్మను వదలింపజేస్తూ అని అర్థం.

**దీపిక –** ఈ వ్యాఖ్యానం 'లింగినీమ్' అనే పాఠాన్ని స్వీకరించలేదు. పై తిలకంలోని రెండవ అర్థాన్ని మాత్రమే గ్రహించింది.

**సుజాతమూలా సుభగా కీర్తిమాలా యశస్వినీ ।**
**ప్రభగ్నా చిరరాత్రీయం మమ సీతా మపశ్యతః ॥(44)॥**

**తిలకం –** సుజాతమూలా – మొదట లంకాధిదేవతను జయించిన కారణంగా శోభన ప్రారంభం కలది, సుభగా – చంద్రోదయం చేత రమ్యంగా ఉన్నది, కీర్తిమాలా – నాకీర్తిమయమైన మాల, యశస్వినీ – హనుమంతుని లంకా ప్రవేశ రాత్రి అని లోకంలో విఖ్యాతి పొందినది. చిరరాత్రిః – జాగరణం చేత మిక్కిలి దీర్ఘమైనట్లున్నది అయిన ఈ రాత్రి. ఈ విధంగా కల్యాణి అయిన యీ రాత్రి ప్రభగ్నా – సీతను చూడని కారణంగా నాకు వ్యథ మాత్రమే కలిగించి సమాప్తమయినది.

**దీపిక –** సుజాతమూలా – మొదటి నుండీ సీతను వెదకటానికి ఉపయోగపడినది కనుక శోభనమైన మూలం కలది. సుభగా సీతాన్వేషణకు సౌకర్యాన్ని కలిగించే వెన్నెల కలది కనుక మనోహర. కీర్తిమాలా – కీర్తనమే

కీర్తి. సీతాన్వేషణకు సహకరించినది అని అందరూ కొనియాడే రూపమైన కీర్తియే మాలగా గలది. యశస్వినీ – హనుమంతుడు లంకను ప్రవేశించిన రాత్రి అని ఖ్యాతి పొందినది. చిరరాత్రిః – చిరకాల విశిష్ట అయిన రాత్రి – దీర్ఘరాత్రి అని అర్థం. ఈ విధంగా రామకార్య సహాయేచ్ఛతో రాత్రి కూడా వృద్ధి పొందినదని తెలియవస్తున్నది. ఇట్టి రాత్రి, సీతను చూడలేని నాకు ప్రభగ్న – నిష్ఫలమైనది అని అర్థం.

**అథ వైనం సముత్క్షిప్య హ్యుపర్యుపరి సాగరమ్ ।**
**రామాయోపహరిష్యామి పశుం పశుపతేరివ ॥(50)॥**

**తిలకం –** పశుపతి అంటే ఇక్కడ అగ్ని. పశువు మేక. దీనికి ప్రమాణము "ఇమం పశుం పశుపతే ఆద్య బధ్నామ్యగ్నే" అనే శ్రుతివాక్యము. పశుపతీ, ఆద్యా, అగ్నిదేవ నీకై ఈపశువును బంధించుచున్నాను అని శ్రుతి వాక్యతాత్పర్యం.

**దీపిక –** దీనిని గురించి ప్రస్తావించలేదు.

**ఇతి చిన్తాం సమాపన్న స్సీతా మనధిగమ్యతామ్ ।**
**ధ్యానశోకపరీతాత్మా చిన్తయామాస వానరః ॥(51)॥**

**తిలకం –** మొదట చింతా – విచారము, అటు పిమ్మట ధ్యానము తెలియదగిన విషయమును గురించి నిరంతరమైన భావన. మరల చింత అంటే – దురంతరమైన శోకము.

**దీపిక –** వ్యాఖ్యానించలేదు.

**భగవానపి సర్వాత్మా నాతిక్షోభం ప్రవాతి వై । (63)**

**తిలకం –** సర్వాత్మా – సర్వమును పొందువాడు కనుక వాయువు. అతడును అతిక్షోభముగా వీచుటలేదు. అతికంపన పూర్వకముగా ఇచట సంచరించుట లేదు.

**దీపిక –** సర్వాత్ముడు వాయువు

**సంక్షిప్తోఽయం మయాఽఽత్మా చ రామార్థే రావణస్య చ । (64)**

**తిలకం –** ఈ నాదేహాన్ని రామప్రయోజనసిద్ధికోసం, రావణుని అదృశ్యత్వం కోసమున్నూ సంక్షిప్తం చేస్తాను. తక్కువ ప్రమాణం కలదిగా చేస్తాను.

**దీపిక –** గూఢవృత్తితో సీతాదర్శనాన్ని ఆకాంక్షించినందువలననూ, రావణుని కంటపడటాన్ని పరిహరించటం కోసమున్నూ సంక్షిప్తం చేస్తాను.

**తదున్నసం పాండురదంతమవ్రణం శుచిస్మితం పద్మపలాశలోచనమ్ ।**
**ద్రక్ష్యే తదార్యావదనం కదా న్వహం ప్రసన్నతారాధిపతుల్యదర్శనమ్ ॥(68)॥**

**తిలకం –** తత్ – ఆ కారణం వలన, ఉన్నసమ్ – ఎత్తైన నాసిక కలది, అవ్రణమ్ – ఏ దోషమూ లేనిది. తత్ – గుర్తుగా రాముడు తనకు (హనుమంతునకు) తెలియజెప్పినది.

**దీపిక –** సమున్నతా నాసా యస్య తత్ – సమున్నసమ్

(ఇతని దృష్టిలో "సమున్నసమ్" అనేది పాఠం. అవ్రణమ్ – దోషములు లేనిది).

## పద్నాల్గవ సర్గము

**స తు సంహృష్టసర్వాంగః ప్రాకారస్థో మహాకపిః ।**
**పుష్పితాగ్రాన్ వసంతాదౌ దదర్శ వివిధాన్ ద్రుమాన్ ॥(2)॥**

**తిలకం –** పులకిత సర్వాంగుడై వసంతాదౌ – పౌర్ణమాసితో నెలలను లెక్క కట్టవలయునన్న పక్షాన్ని అనుసరించి ఫాల్గున పౌర్ణమాసికి ప్రపూర్వదినం కనుక (రెండు తిథుల వెనుకదినం కనుక) వసంతాది అన్నారు.

**దీపిక –** వివరణ లేదు

**ప్రహృష్టమనుజే కాలే । (8)**

**తిలకం –** ప్రహృష్టమనుజకాలం అంటే వసంతం. వసంతంలో మనుజులు అధికంగా కామభావన కలిగి ఉంటారు కనుక.

**దీపిక –** వసంతము తొలి దినాలలో

**విహంగసంఘైర్హీనాస్తే స్కన్ధమాత్రాశ్రయా ద్రుమాః ।**
**బభూవురగమాస్సర్వే మారుతేనేవ నిర్ధుతాః ॥(17)॥**

**తిలకం –** స్కంధ మాత్రాశ్రయములు అంటే పుష్పాదులకు అనాశ్రయములు అని అర్థం. అందువలననే అగమములు అగమ్యములు – అసేవ్యములు.

**దీపిక –** పత్రపుష్పాదులకు ఆశ్రయములు కాదు. ఆకారణంగా అసేవ్యములు అని తాత్పర్యం.

**దదర్శ హరిశార్దూలో రమ్యం జగతి పర్వతమ్ । (28)**

**తిలకం –** జగతి అంటే భూమి, మట్టి అని అర్థం. అది ప్రధానంగా ఉండటం చేత జగతి పర్వతం అయింది. లేదా జగతి పర్వతమని దానికి పేరు.

**దీపిక –** పై భావాన్ని అనువదించింది. కాని పేరుగా భావించలేదు.

**దదర్శ చ నగా త్తస్మాన్నదీం నిపతితాం కపిః ।**
**అంకాదివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్ ॥(29, 30)॥**

**జలే నిపతితాగ్రైశ్చ పాదపైరుపశోభితామ్ ।**
**వార్యమాణామివ క్రుద్ధాం ప్రమదాం ప్రియబన్ధుభిః ॥(30)॥**

**తిలకం –** ఇక్కడ కోపించి యింటి నుండి వెళ్ళిపోయిన ఒక వనిత సఖీసాంత్వనంచేత మరల తిరిగి రావటంతో నదిని పోలుస్తున్నారు. వృక్షాగ్రములు అడ్డుకొనగా మరల పర్వతాభిముఖంగా సాగిన ప్రవాహం గల నది. పర్వతం భర్త, నది కాంత, చెట్లు బంధువులు, పర్వతం నుండి జారటం కోపంతో ఇంటి నుండి వెలువడటం, చెట్లు అడ్డుకోవటం బంధువుల అనునయం.

**దీపిక –** పతితామ్ – క్రోధంతో వెలువడిన వనిత వలె నీటిలో నిపతితములైన అగ్రాలు గల పాదపములే (చెట్లే) ప్రియబంధువులు. వారు వారించారు. అందువలననే కాంతుని యందు ప్రసన్నయై మరల తిరిగి వచ్చింది.

**సచ్ఛత్రా స్సవితర్దీకాః సర్వే సౌవర్ణవేదికాః । (35)**

**తిలకం –** అరుగుల మీదకు ఎక్కటానికి బంగారుతో చేయబడిన మెట్లతో కూడినవి.

**దీపిక –** మహావేదికలపైన ఏర్పరచిన బంగారు అరుగులు.

**ఇమాం సా రామమహిషీ నూనమేష్యతి జానకీ ।**
**............ రామచిన్తాను కర్శితా ॥(44,46)॥**

**తిలకం –** రామచింతన చేత కృశించినదై, రామవియోగం వలన పుట్టిన తాపాన్ని పోగొట్టుకోవటం కోసం ఈ వనప్రదేశానికి వస్తుందని అర్థం.

**దీపిక –** ఈ పద్మలత కడకు తప్పక రాగలదు అని అన్వయం.

**సంధ్యాకాలమనాః శ్యామా ధ్రువమేష్యతి జానకీ ।**
**నదీం చేమాం శివజలాం సంధ్యార్థే వరవర్ణినీ ॥(49)॥**

**తిలకం –** సంధ్యాకాలమనాః – సంధ్యాకాలమునందు మనస్సు కలది. సంధ్యోపాసనయందు తత్పర అని అర్థం. సంధ్యార్థం వస్తుంది. ప్రతిదినం అనే మాటను కలుపుకోవాలి.

**దీపిక –** వివరణ లేదు.

## పదిహేనవ సర్గము

**ప్రదీప్తామివ తత్రస్థో మారుతిస్సముదైక్షత ।**
**నిష్పత్రశాఖాం విహగైః క్రియమాణామివాసకృత్ ॥(6)॥**

**తిలకం –** ఒక్క మారుగా వచ్చి వ్రాలుచున్న పక్షుల రెక్కల చేత రాలిపోయిన ఆకులు కలవియగుట చేత ఆకులు లేని కొమ్మలు కలది వలె ఉన్నది.

**దీపిక –** ఒక్కమారుగా పెక్కు పక్షుల రెక్కలతో కప్పబడిన ఆకులు కలగటం చేత పత్రాలు లేని కొమ్మలు కలదిగా ఉన్నది. (అశోకవనిక).

**స దదర్శావిదూరస్థం చైత్యప్రాసాదముచ్ఛ్రితమ్ । (15)**

**తిలకం –** చైత్యం అంటే బుద్ధమందిరం. దాని ఆకారము వంటి ఆకారం గల ప్రాసాదం – ఎత్తుగా పొడవుగా ఉండటం వలన ఈ పోలిక.

**దీపిక –** చైత్యప్రాసాదం – బుద్ధాండాకార ప్రాసాదం – పొడవుగా ఉన్నత స్వరూపంతో ఉండటం వలన.

**దదర్శ శుక్లపక్షాదౌ చన్ద్రరేఖామివామరామ్ । (19)**

**తిలకం –** శుక్ల పక్షం మొదట అనటం చేత వర్ధిష్ణుత్వం – క్రమంగా అభివృద్ధిని పొందే లక్షణం తెలియవస్తున్నది.

**దీపిక –** వివరణ లేదు.

**హ్రియమాణా తదా తేన రక్షసా కామరూపిణా । (27)**

**తిలకం –** ఇట్టి గుర్తుల చేత హనుమంతుడు ఆమె సీత అని విచారించి వెనుకటి గుర్తులను బట్టి కూడా ఆమెయే అయి వుంటుందని తర్కించాడు.

**దీపిక –** అందువలన సీత అయి వుంటుందని తర్కించాడని పూర్వశ్లోకంతో సంబంధం.

**కుర్వన్తీం ప్రభయా దేవీం సర్వా వితిమిరా దిశః । (29)**

**తిలకం –** పది నెలలు స్నానం లేక మలిన అయి ఉన్నా తన కాంతిచేత దిక్కులను కాంతివంతంగా చేస్తున్నదని ఆమె దేహకాంతి అతిశయాన్ని చెప్పే వాక్యం.

**దీపిక –** వివరణ లేదు.

**సంస్కారేణ యథా హీనాం వాచమర్థాంతరం గతామ్ । (39)**

**తిలకం –** సంస్కార మంటే శబ్దవ్యుత్పత్తి. అది లేనిది. అందువలననే చెప్పదలచినదానికంటే వేరైన అర్థాన్ని పొందినది. విపరీతార్థ అయిన వాక్కు వంటిదని భావం. సంస్కారం లేకపోవటం వలన ప్రతిపాదింపదలచిన అర్థాన్ని చెప్పలేక, చెప్పదలపని అర్థాన్ని బోధిస్తున్న వాక్కు వలె సీత ఉన్నదని అర్థం. చక్కని వ్యుత్పత్తి లేకపోవటం వలన అర్థాంతరాన్ని పొంది, వ్యుత్పత్తి తెలిసిన తరువాత స్వార్థాన్ని ప్రతిపాదించే వాక్కువలె ఉన్నదని అర్థం.

**దీపిక –** సరియైన వ్యుత్పత్తి లేనిదశలో అర్థాంతరాన్ని పొందిన వాక్కు వ్యుత్పత్తి అనంతరం స్వార్థాన్ని ప్రదర్శిస్తుంది. ఆ విధంగా ఉన్నదని తాత్పర్యం.

**తాన్యాభరణజాలాని శాఖాశోభీన్యలక్షయత్ । (41)**

**తిలకం –** భర్త యెడబాటు సమయంలో భూషణధారణం అనుచితం కనుక తన అవయములనుండి తీసి కొమ్మ మీద ఉంచిందని అర్థం. అందుచేత శాఖయందు శోభిల్లుతూ ఉన్నాయి.

**దీపిక –** శాఖ యందు శోభిల్లుతూ ఉన్న వానిని. దీనిచేత రామ విశ్లేష సమయంలో భూషణాలను ధరించటం అనుచితం కనుక వైదేహి వానిని తన అవయవాల నుండి వేరుచేసి శాఖ యందు ఉంచిందని తెలియ వస్తున్నది.

**మణివిద్రుమచిత్రాణి హస్తేష్వాభరణాని చ ।**
**శ్యామాని చిరయుక్తత్వా త్తథా సంస్థానవన్తి చ ॥(42)॥**

**తిలకం –** శ్యామములు – విరహతాపం వేడి వలన కమిలి పోయినట్టి అలాగే – చిరయుక్తత్వం వలన చేతుల యందు ఆభరణాలున్న గుర్తులు స్పష్టంగా కానవస్తున్నాయి.

**దీపిక –** హస్తేషు – చేతుల ఆయా భాగాల యందు, చిరయుక్తత వలన పెద్దకాలం ధరించి ఉన్నందువలన ఆభరణాలు ధరించిన గుర్తులు కలవి.

**ఇయం సా యత్కృతే రామ శ్చతుర్భిః పరితప్యతే ।**
**కారుణ్యేనానృశంస్యేన శోకేన మదనేన చ ॥**

**స్త్రీ పణష్టేతి కారుణ్యా దాశ్రితేత్యానృశంస్యతః ।**
**పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ ॥(49, 50)॥**

**తిలకం –** రాముడు కారుణ్యము మొదలైన నాల్గింటితో ఏ వ్యక్తిని గురించి పరితపిస్తున్నాడో ఆ యీమె. కారుణ్యాదుల పరితాపహేతుత్వాన్ని విభజించి చూపుతున్నారు. 1. ఆపదసమయంలో స్త్రీలు రక్షింపబడవలసినవారు అది నేను చేయలేకపోయాను అని కారుణ్యంతో పరితపిస్తున్నాడు. 2. ఆనృశంస్యం అంటే క్రూరత లేనితనం, ఆశ్రితులను సంరక్షించటమే స్వభావంగా ఉన్నతనం. అందువలన ఆశ్రితురాలిని రక్షింపలేకపోయానని బాధపడు తున్నాడు. 3. "అర్థో వా ఏష ఆత్మనో యత్పత్నీ" పత్ని తనకు ధనము అను చెప్పిన రీతి ననుసరించి తన ధన సంపద అయిన పత్నిని రక్షింపలేకపోయాననే శోకంతో కుమిలి పోయాడు. 4. మదనేన – ప్రియురాలు (తనకు మదన సుఖం ఇచ్చేది) అయిన సీతను కాపాడలేకపోయానని దుఃఖిస్తున్నాడు.

**దీపిక –** పై అభిప్రాయాలను సంగ్రహించి చెప్పింది.

**అస్యా దేవ్యా మనస్తస్మిన్ స్తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్ ।**
**తేనేయం స చ ధర్మాత్మా ముహూర్తమపి జీవతి ॥(52)॥**

**తిలకం –** వారిద్దరి అన్యోన్యానురాగాన్ని చెబుతున్నారు. ఈ దేవి మనస్సు ఆ రామునియందు చెదరక నిలిచి ఉన్నది. ఆకారణం చేత ఈమె ముహూర్త కాలమైనా జీవిస్తున్నది. ఆ శ్రీరాముని మనస్సు ఈమె యందు

గట్టిగా నిలిచియున్నది. ఆకారణంగా అతడు ముహూర్తమైనా జీవిస్తున్నాడు. వారిరువురి మనస్సు ఆ విధంగా ఒకరియందొకరిలో నిలిచి ఉండకపోతే ముహూర్తకాలపు బ్రతుకు కూడా సమకూడదు అని భావం.

**దీపిక –** ఈ సీత మనస్సు రాముని యందు ప్రతిష్ఠితమైయున్నది. ఆ కారణంగా ఈమెయు, అతడును జీవించి ఉన్నారని సంబంధము.

**దుష్కరం కృతవాన్ రామో హీనో యదనయా ప్రభుః ।**
**ధారయత్యాత్మనో దేహం న శోకేనావసీదతి ॥(53)॥**

**తిలకం –** హనుమంతుడు మాల్యవచ్ఛిఖరం మీద రాముని సీతా విరహం అతిశయాన్ని విని 'ఇదియేమి? ఈ వసిష్ఠశిష్యుడు ఒక ఆడుదాని కొరకు ఎందుకింతగా పేలవంగా దుఃఖిస్తున్నాడు' అని చులకనతనంతో పరిహసించి ఉన్నాడు. ఎందుకంటే తాను విరక్తుడు కనుక. ఇప్పుడు ఆమె విలక్షణ్య అతిశయాన్ని చూచి విశేషజ్ఞుడయ్యాడు కనుక ఇట్టి విరహంలో రాముడు దేహాన్ని పట్టుకొని ఉండటం అన్ని విధాలా అశక్యము అని నిర్ణయానికి వచ్చి ఇలా అంటున్నాడు.

1. దుష్కరం కృతవాన్ రామః – రాముడు చేయనలవికాని పని చేశాడు. అదేమిటంటే ఈమె వియోగాన్ని పొంది మనస్సును చిక్కబట్టుకొని ఎవరికీ చేయనలవికాని పనిని చేశాడు.

2. హీనో యదనయా ప్రభుః – ఈమె లేక దేహం ధరించి ఉండటం అనేది అశక్యం. దానిని శక్యం చేశాడు కనుక ప్రభువు ఏనుగులను, గుఱ్ఱాలను శిక్షించటమూ, రాజ్యం పరిపాలించటం అతనికి తెలుసు కానీ ప్రణయధారయందు ప్రథమాంశమైనా అనుభవించినవాడు కాదు.

3. ధారయత్యాత్మనో దేహమ్ – ఇతడేమన్నా అడుగుకొని తెచ్చుకొన్న దేహాన్ని ధరిస్తున్నాడా? కాదే, అది అతనిదే అయిన దేహము. ఇట్టి దేహము భోగములకు స్థానమే కానీ, దుఃఖాయతనం కాదు. 'దిహ ఉపచయే' అనే ధాతువు నుండి 'దేహ' శబ్దం ఏర్పడినది. దాని చేత ఈ అర్థం సిద్ధిస్తున్నది. సీతాశరీరం తనకు పరతంత్రం కనుక దానిని వదలటం సాధ్యం కాదు. కానీ తనకు అధీనమైన దేహాన్ని ధరించటం యుక్తం కాదు కదా! ఎంత విశేషజ్ఞుడైనా ఎట్లు దీనిని త్యజింపగలడు? ఆ విషయంలో అంటున్నారు. అంత శోకంలో కూడా శరీరం రాలిపోకుండా చూచుకున్నాడు. అదే దుష్కరమైన – ఎంతటివారైనా చేయజాలని – కర్మము. రాముడది చేశాడని ఆశ్చర్యం.

**దీపిక –** దుష్కరమిత్యాది శ్లోక ద్వయంతో రాముని శరీర కార్శ్యము, ప్రాణధారణము విచిత్రమని ప్రతిపాదిస్తున్నారు.

**ఏవం సీతాం తదా దృష్ట్వా హృష్టః పవనసంభవః ।**
**జగామ మనసా రామం ప్రశశంస చ తం ప్రభుమ్ ॥(55)॥**

**తిలకం –** మలిన వస్త్రాలను ధరించటం, ఉపవాసాలతో కృశించిపోవటం, శోక ధ్యాన పరాయణ కావటం మొదలైన పతివ్రతాధర్మాలు కల సీతను చూచి (చూడగలిగానన్న భావంతో) హర్షం పొంది మనస్సుతో రాముని

చేరుకున్నాడు - అంటే స్మరించాడు. బుద్ధిలో ఉన్న ఆ ప్రభువును మరల ఒకరినొకరు కలిసికోవటానికి ఉపయోగించే పతివ్రతాధర్మనిష్ఠను తాను దర్శించాడు కనుక రాముని భాగ్యోత్తరత్వాన్ని ప్రశంసించాడు. లేదా ఇంతటి సౌందర్యవతి అయిన సీతను చూచి ఈమె ఎడబాటు పొందిన రామునకు మహాదుఃఖము ప్రాప్తించినది. అందువలన అతడు విరహంతో అలమటించటం తగిన పనియే అని రాముని స్తోత్రం చేశాడు.

**దీపిక –** పునఃప్రాప్తికి ఉపయుక్తమైన పతివ్రతాధర్మనిష్ఠ కానవచ్చిన కారణంగా రాముడు భాగ్యోత్తరుడని హనుమంతుడు స్తుతించాడని భావం.

## పదహారవ సర్గము

**మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా ।**
**యది సీతాఽపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః ॥(3)॥**

**తిలకం –** గురువుల వద్ద మంచి శిక్షణ పొందిన లక్ష్మణునికి మాన్యురాలు, గురువైన రామునకు ప్రియురాలు అయిన సీతాదేవి కూడా ఇంతగా దుఃఖార్తురాలు అయినదంటే ఆహా కాలము దురతిక్రమమే. (కాలలీలలను ఎవ్వరూ దాటజాలరు).

**గురుప్రియా –** రాముని ప్రియురాలు – కాలో హి దురతిక్రమః కాలము దురతిక్రమమే అనే అర్థం సిద్ధిస్తున్నది. హి శబ్దం అవధార్థకం అవ్యయాలు అనేకార్థకాలు కనుక. జగద్రక్షకులైన రామలక్ష్మణులు రక్షిస్తున్న సీతకు కూడా ఇటువంటి దుఃఖం ప్రాప్తించిందంటే కాలము దురతిక్రమమే అని భావం.

**దీపిక –** పై భావాన్నే అనువదించింది.

**తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణామ్ ।**
**రాఘవోఽర్హతి వైదేహీం తం చేయమసితేక్షణా ॥(5)॥**

**తిలకం –** తుల్యశీలవయోవృత్తామ్ – శీలం అంటే స్వభావం వెనుక చెప్పినట్లు వారిద్దరు పరస్పరం మనసులలో ప్రతిష్ఠితులై ఉన్నారు అన్నమాట తుల్యశీలాన్ని నిరూపిస్తుంది. తుల్యవయస్కామ్ – పదునారేండ్ల పురుషునకు పదిరెండేండ్ల కన్య తుల్య. ఇలా చెప్పకపోతే వైరం కలుగుతుంది. శాస్త్రవిరోధం వలన కూడా సరిపడదు. అందువలననే విష్ణుపురాణం "వర్షైరేకగుణాం భార్యాముద్వహే త్త్రిగుణో వరః, ద్వ్యష్ట వర్షోఽష్టవర్షాం వా వయోమాత్రావరా చ యా" – అని చెబుతున్నది. స్త్రీ కంటే పురుషుడు మూడింతలు ఎక్కువ వయస్సు కలవాడు కావచ్చును. అంటే ఎనిమిదేండ్ల కన్యకను ఇరువది నాలుగేండ్ల వయస్సు గల వ్యక్తి వివాహం చేసుకోవచ్చును. లేదా ఎనిమిదేండ్ల బాలికను పదునారేండ్ల వయస్సు కలవాడు పెండ్లాడ వచ్చును. మొత్తానికి వయస్సులో పురుషుని కంటే స్త్రీ చిన్నదై ఉండాలి అని స్థూలంగా ఆ శ్లోకం భావం. ఇక్కడ వయస్తుల్యత్వం సీతారాములకు 12-16.

**తుల్యవృత్తామ్ –** రాముడు 'దోషో యద్యపి తస్య స్యాత్ సతా మేతదగర్హితమ్' అన్నాడు. అలాగే సీత

**పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ ।**
**కార్యం కరుణమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి ॥**

అన్నది. ఇలా దోషం చేసిన, వారి విషయంలో వారిద్దరి ప్రవృత్తీ ఒక రకంగా ఉన్నది. కనుక సీత రామునితో తుల్యవృత్తీ. ఇక్కడ తుల్య శబ్దం అనురూపపరం. రామునికి అనురూపమైన శీలము, వయస్సు, చారిత్రము కలది సీత – అని భావం.

**తుల్యాభిజన లక్షణామ్ –** అభిజన మంటే కులం, లక్షణమంటే సాముద్రికం – చేతులలో ఉండే రేఖలు మొదలైనది. సార్వభౌమ లక్షణం గల వానికి భార్యకాదగిన వ్యక్తికి ఏ సాముద్రికలక్షణాలు ఉండాలో అవి సీత యందు ఉన్నాయి అని తాత్పర్యం.

**దీపిక –** తుల్య శీల వయోవృత్తా – రామానురూప స్వభావ వయ శ్చారిత్ర అని అర్థం. తుల్యాభిజన లక్షణా – అభిజనమంటే కులం, లక్షణమంటే సాముద్రిక శాస్త్రంలో చెప్పబడినది.

**సర్వాన్ భోగాన్ పరిత్యజ్య భర్తృస్నేహబలాత్కృతా ।**
**అచిన్తయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనమ్ ॥(19)॥**

**తిలకం –** భుజ్యన్త ఇతి భోగాః – అనుభవింపబడే భోగాలన్నింటినీ, చిలుకలు, గోరువంకలు, కందకములు మొదలైన భోగ సాధనాలన్నింటినీ – అలాగే తల్లి మొదలైన వారినందరినీ, వదలివైచి, పరి – అంటే అక్కడ లేశమాత్రమైన ఆశను కూడా పెట్టుకోకుండా – ఈ పరిత్యాగం కూడా తన వశం చేత కాదు. భర్తృస్నేహ బలాత్కృతా – అభిమతమైన విషయం మీద స్నేహాతిశయం తక్కిన అన్నింటినీ పరిత్యాగం చేయిస్తుంది.

వదలవలసిన వారి విషయంలో స్నేహం లేదు సరే. వెళ్ళవలసిన దేశానికి సంబంధించిన దుఃఖాన్నైనా స్మరించిందా? లేదా – అని చెబుతున్నారు. అచింతయిత్వా దుఃఖాని, రాముని కంటే వేరైన వస్తువు ననుభవించటంలోనే ఆమెకు దుఃఖానుభవభావన ఉన్నదని తాత్పర్యం.

ప్రవిష్టా నిర్జనం వనమ్ – అడవి యందలి భర్తృ సన్నిధియే తన భోగమునకు ఏకాంత స్థలమని ఆమె హృదయంలో గట్టిగా నాటుకున్నదని భావం.

**దీపిక –** భర్తృస్నేహబలాత్కృతా – భర్త యొక్క స్నేహబలం చేత బ్రదుకుచున్నదని భావం.

**ఇమామసితకేశాన్తాం శతపత్రనిభేక్షణామ్ ।**
**సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః ॥(28)॥**

**తిలకం –** అసిత కేశాంత – వెండ్రుకల చివరల యందు కూడా చిక్కని నీలిమ కలది. ఇది సాధారణంగా స్త్రీలలో దుర్లభం. అందువలననే వైరాగ్యంతో జడలు కట్టించుకొన్నవానికి కూడా వ్యామోహం కలిగిస్తుంది. శతపత్రనిభేక్షణామ్ –తెల్లతామరల వంటి చూపులు కలది. నిజానికి ఈమె నల్లని కనుగ్రుడ్లు కలది అయినా కనులలో ఒక భాగం నందు పోలిక. కమలపత్రాక్షుడైన శ్రీరామచంద్రునకు వ్యామోహం కలిగించేది. సుఖార్హాం – రాముని ఒడిలో ఉండి సుఖాలు అనుభవించటానికి యోగ్య అయినది. దుఃఖితామ్ – రాక్షసీగణం మధ్యలో దుఃఖపడుతున్నది. మమాపి వ్యథితం మనః – శాఖామృగమైన నా మనస్సు కూడా వేదన పొందినది. లేదా శోక

హర్షములకు స్థానం కాని నామనస్సు కూడా వేదన పొందింది. ఇంక పరమదయాళువైన రాముడు దుఃఖపడటంలో ఆశ్చర్యం ఏముంది.

**దీపిక –** ఈ చివరి మాటను మాత్రం అనువదించింది.

## పదిహేడవ సర్గము

**సాచివ్యమివ కుర్వన్ స్వప్రభయా నిర్మలప్రభః ।**
**చన్ద్రమా రశ్మిభిః శీతై స్సిషేవే పవనాత్మజమ్ ॥(2)॥**

**తిలకం –** ఏమీ వ్యాఖ్యానించలేదు.

**దీపిక –** సీతాదర్శనాది యందు ప్రభయా – తనకాంతితో సాచివ్యము – సాహాయ్యము, చేయుచున్న వాని వలె, పగటి యందు ఎక్కడనో ఏకాంత ప్రదేశంలో ఉండటం వలనను, నిద్రావ్యాకులత్వం వలనను, సరిగా రాక్షసస్త్రీలను, సీతను చూచి ఉండలేదు. రాత్రిపూట చంద్రోదయం కాగా సీతాదుల సమీపదేశానికి వచ్చి సరిగా సర్వదర్శనం చేశాడని భావం.

**క్లిష్టరూపా మసంస్పర్శా దయుక్తామివ వల్లకీమ్ । (22)**

**తిలకం –** అసంస్పర్శాత్ – ఉద్వర్తనము (నలుగుబెట్టుట) మొదలైన సంస్కారములు లేకపోవుట వలన, అయుక్తామ్ – తంత్రులను సరిగా ఎక్కించని వల్లకి వలె జానకి ఉన్నది.

**దీపిక –** పై అర్థాలనే వివరించింది.

**సీతాం భర్తృవశే యుక్తా మయుక్తాం రాక్షసీవశే । (23)**

**తిలకం –** రాక్షసీవశంలో అయుక్త అంటే అనవస్థిత – వారి మాటలను విననిది.

**దీపిక –** అయుక్త – అయోగ్య

**సా మలేన చ దిగ్ధాంగీ వపుషా చాప్యలంకృతా ।**
**మృణాళీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ ॥(25)॥**

**తిలకం –** వివరణ లేదు

**దీపిక –** వపుషాఽలంకృతా – స్వభావ రమణీయమని అర్థం

విభాతి న విభాతి చ – స్వభావసౌందర్యంవలన ప్రకాశిస్తున్నది. సంస్కారం లేకపోవటం వలన ప్రకాశించకుండా ఉన్నది.

**హర్షజాని చ సోఽశ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణామ్ ।**
**ముమోచ హనుమాం స్తత్ర నమశ్చక్రే చ రాఘవమ్ ॥(31)॥**

**తిలకం –** ఉపపద విభక్తి కంటే కారక విభక్తి బలీయసి కనుక 'నమస్కరోతి దేవాన్' మొదలైన వాని యందు వలె ఇక్కడ 'రాఘవమ్' అన్న చోట ద్వితీయ వచ్చింది.

**దీపిక –** రాఘవం నమశ్చక్రే – భగవంతుడైన రాఘవుని అనుగ్రహం వలననే నేనీమెను చూడగలిగానని మరల మరల స్మరించి నమస్కారం చేశాడని అర్థం.

**హనుమాన్ సంవృతోఽభవత్ । (32)**

**తిలకం –** రాక్షసీగణానికి కనబడకుండటం కోసం శింశుపాపర్ణములతో తన్ను కప్పుకొని గూఢంగా ఉన్నాడు.

**దీపిక –** రాక్షసీగణం దర్శనపరిహారం కోసం సూక్ష్మరూపాన్ని అవలంబించి వృక్షమూల సమీపంలోని శాఖలలో నిలీనుడై వున్నాడు.

## పద్దెనిమిదవ సర్గము

**కాంచనై రపి భృంగారై ర్జగృహుస్సలిలమగ్రతః ।**
**మండలాగ్రాన్ బృసీం చైవ గృహ్యాన్యాః పృష్ఠతో యయుః ॥(12)॥**

**తిలకం –** భృంగారములతో – కనకాలువులనే పాత్రలతో, బృసీ – ఆసనము.

**దీపిక –** భృంగారములంటే ఉమ్మెత పువ్వు వంటి ఆకారం గల నీటి పాత్రలు.

**తం పత్రవిటపే లీనః పత్రపుష్పఘనావృతః ।**
**సమీపమివ సంక్రాన్తం నిధ్యాతుముపచక్రమే ॥(25)॥**

**తిలకం –** పత్రవిటపే – ఆకులు దట్టంగా ఉన్న కొమ్మ మీద, పత్రపుష్పఘనావృతః – ఆకుల, పువ్వుల సమూహం చేత కప్పబడినవాడు, సమీపమ్ ఇవ సంక్రాంతం – దగ్గరగా వచ్చిన వానిని, ఇక్కడ 'ఇవ' శబ్దం వాక్యాలంకారంగా ప్రయుక్తమైనది. లేదా దూరంగా వచ్చి ఉన్నవాడైనా తేజస్సు చేత సమీపము నందే ఉన్నట్లుగా భాసిస్తున్నవాడు. నిధ్యాతుమ్ – చూడటానికి.

**దీపిక –** పత్రవిటపే– ఆకులు దట్టంగా ఉన్న కొమ్మ మీద, నిధ్యాతుమ్ – చూడటానికి

**రావణోయం మహాబాహు రితి సంచింత్య వానరః ।**
**అవప్లుతో మహాతేజా హనుమాన్మారుతాత్మజః ॥(30)॥**

**తిలకం –** అవప్లుతః – దిగివచ్చిన వాడు – రావణ చేష్టలన్నింటినీ చూడటానికి వెనుక తానున్న చోటు నుండి క్రింది కొమ్మకు దిగి వచ్చిన వాడని అర్థం.

**దీపిక –** అవప్లుతః – రావణుని రూపాన్ని, చేష్టలను గమనించటానికి పై కొమ్మనెక్కిన వాడని అర్థం.

## పంతొమ్మిదవ సర్గము

**మలమండనచిత్రాంగీం మండనార్హామమండితామ్ ।**
**మృణాళీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ ॥(6)॥**

**తిలకం –** మలమండన చిత్రాంగీమ్ – మలరూపమైన మండనము చేత చిత్రమైన అంగములు కలది. మలావృత అయినా ఆశ్చర్యాన్ని గలిగించే దేహం కలదని అర్థం.

**దీపిక –** మలమే మండనము, దాని చేత చిత్రమైన అంగము కంటే కర్బురగాత్రి అని అర్థం.

**సమీపం రాజసింహస్య రామస్య విదితాత్మనః ।**
**సంకల్పహయసంయుక్తై ర్యాన్తీమివ మనోరథైః ॥(7)॥**

**తిలకం –** వివరణ లేదు.

**దీపిక –** సంకల్పములు – ఇట్టిట్లు చేస్తాను అనే విధమైన విచారములు. అవే గుఱ్ఱాలు. వానితో కూడిన మనోరథములతో రాముని సమీపమునకు పోవుచున్నదానివలె ఉన్న సీతను రావణుడు చూచాడు.

**వృత్తశీలకులే జాతా మాచారవతి ధార్మికే ।**
**పునస్సంస్కారమాపన్నాం జాతామివ చ దుష్కులే ॥(10)॥**

**తిలకం –** దృఢమైన శీలము గల, ఆచారనిష్ఠగల, ధార్మికమైన – అంటే యజ్ఞాది ధర్మప్రధానమైన కులము నందు పుట్టినది, సంస్కారమాపన్నామ్ – వివాహరూపమైన సంస్కారమును పొందినది, అందువలననే దుష్కులమునందు మరల పుట్టిన దానివలె ఉన్నది అయిన సీతను రావణుడు చూచాడు. కుమారులకు ఉపనయనము వలె, కుమారీ వ్యక్తులకు వివాహసంస్కారము రెండవ జన్మము. 'వైవాహికో విధిః స్త్రీణా మౌపనాయనికః స్మృతః' అను స్మృతివాక్యము వలన ఇది తెలుస్తున్నది. స్త్రీలకు వివాహవిధి, ఉపనయనము వంటిది.

**దీపిక –** పై అభిప్రాయములను తెలియజేసి, సత్కులమునందు పుట్టిన బాలిక, చెడ్డకులమువాని వివాహము చేసికొన్న విధముగా సీత కన్పట్టెనని వ్యాఖ్యానించింది.

**దీప్తా మివ దిశం కాలే పూజామపహృతా మివ । (13)**

**తిలకం –** దీప్తామ్ – దాహముతో కూడినది, కాలే – ఉత్పాతకాలమందు. పూజామపహృతామ్ ఇవ – అపహరింపబడిన పూజవలె ఇక్కడ పూజా శబ్దం చేత పూజాద్రవ్యమును గ్రహించాలి.

**దీపిక –** దీప్తామ్ – దహింపబడుచున్నదానిని, కాలే – ఉత్పాత కాలమునందు. పూజామపకృతామివ – వ్యాఖ్యానించలేదు.

**పతిశోకాతురాం శుష్కాం నదీం విస్రావితా మివ ।**

**తిలకం –** విస్రావిత – గట్టు తెగటం మొదలైన కారణం చేత మరియొక పోయిన నీరు గల నది వలె ఉన్న సీతను రావణుడు చూచాడు.

**దీపిక –** రోధో భంగాదికం చేత జలములేకుండా చేయబడిన నది వలె ఉన్న సీతను

**పరిక్షీణాం కృశాం దీనా మల్పాహారాం తపోధనామ్ ।**
**ఆయాచమానాం దుఃఖార్తాం ప్రాంజలిం దేవతామివ ॥**

**తిలకం –** అల్పాహార – నీరు మాత్రమే ఆహారముగా గలది – లేదా అల్పాహార అంటే మితభోజిని – ఇది ఉత్తమ స్త్రీలక్షణం. ఆయాచమానామ్ – రఘుముఖ్యునిచేత దశగ్రీవపరాభవాన్ని ప్రార్థిస్తున్న దాని వలె ఉన్న సీతను.

**దీపిక –** దేవతను ప్రార్థించుచున్న దానివలె ఉన్న సీతను

**సుపక్ష్మతామ్రాయతశుక్లలోచనామ్ । (23)**

**తిలకం –** చివళ్ళయందు తామ్రవర్ణము, నడుమ తెల్లని వర్ణము గల కన్నులు కలది.

**దీపిక –** వివరణ లేదు.

## ఇరవైయవ సర్గము

**నేహ కేచిన్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః ।**
**వ్యపసర్పతు తే సీతే భయం మత్తస్సముత్థితమ్ ॥(4)॥**

**తిలకం –** ఇచట వేరు విధములైన భయహేతువులు నీకు లేవు అని రావణుడు సీతతో అంటున్నాడు.

**దీపిక –** నీకు భయము కలిగించే మనుష్యులు కాని రాక్షసులు గాని యిచట లేరు. నిజానికి సర్వేశ్వరివైన నీకు ఎందును భయశంక లేదని భావం.

**ఏవం చైతదకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి ।**
**కామం కామః శరీరే మే యథాకామం ప్రవర్తతామ్ ॥(6)॥**

**తిలకం –** కామము అంటే అత్యంతము, యథాకామం – యథేచ్ఛగా

**దీపిక –** పరదారలను చేపట్టుట మాకు స్వధర్మము. అయినా నా యందు కామభావన లేని స్త్రీని నేను తాకను అంటున్నాడు. స్వధర్మ ఇత్యాది శ్లోకద్వయానికి వాస్తవార్థం ఏమిటంటే – కాముకుడవైన నీవు నమ్మదగిన వాడవు అంటావేమో చెబుతాను విను. రక్కసులకు పరదారాహరణాదికం స్వధర్మమే అయినా నా శరీరంలో కామం యథేచ్ఛగా ప్రవర్తింపనీ, మన్మథవికారం విచ్చలవిడిగా కలుగనీ, అయినా ఇదంతా, నా యిష్టదేవతవయిన

నీయందు ఘటిల్లదు. అందువలననే అకామామ్ – నాయందు భృత్యత్వకామన లేని దానిని, లేదా అకామామ్ – విష్ణువు నందు కామము కలదానిని – నిన్ను స్పృశింపను. నీ ఆజ్ఞ లేక నీ పూజచేయటానికి కూడా నేను భయపడతాను అని భావన.

**ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే ।**
**యదతీతం పునర్నైతి స్రోత శ్శీఘ్రమపామివ ॥(12)॥**

**తిలకం –** వ్యాఖ్యానించలేదు.

**దీపిక –** చక్కగా ఏర్పడిన నీ యౌవనం గడచిపోతున్నది. పోయినది మరల తిరిగిరాదు. అందువలన భోగములననుభవించు అని కలుపుకోవాలి.

నిజానికి నీ పూజకు యోగ్యమైన నా ఆయువు వ్యర్థంగా గడచిపోతోంది అని రావణుడు దుఃఖిస్తున్నాడు. తే–నీ భృత్యుడనైన నా – అని అర్థం, యౌవనమ్ – దార్ఢ్యావస్థ. ఏ కారణంగా నీ భృత్యుడనైన నా ఆయువు వ్యర్థంగా గతించిపోతున్నదో, ఆకారణంగా నాకు నీ పూజకొరకైన అనుమతిని అనుగ్రహించు అని ప్రార్థన ఇక్కడ తెలియవస్తున్నది.

**త్వాం సమాసాద్య వైదేహి రూపయౌవనశాలినీమ్ ।**
**కః పుమానతివర్తేత సాక్షాదపి పితామహః ॥(14)॥**

**తిలకం –** కః అతివర్తేత – ఎవ్వడు హద్దులు మీరును ఎవ్వడు మీరజాలడని భావం.

**దీపిక –** నాతివర్తేత – క్షోభపడడు నిన్ను పొందదలచిన వాడు తప్పక క్షోభపడునని భావము – 'కః పుమానతివర్తేత' అనే పాఠంలో ఎవ్వడు నిన్ను అతిక్రమింపడు అని అర్థం.

వాస్తవానికి – త్వామ్ అంటే లక్ష్మీదేవివైన నిన్ను. ముందు "సీతా లక్ష్మీర్భవాన్ విష్ణుః" – సీతాలక్ష్మి, నీవు విష్ణుడవు అని చెప్పబోతున్నారు. అట్టి నిన్ను చేరుకొని సాక్షాత్తు పితామహుడు బ్రహ్మదేవుడు కూడా, నాతివర్తేత – ఆరాధించక ఉండలేదు. ఇక మానవమాత్రుడెవడుండగలడు – అని అర్థం.

**యద్యత్ పశ్యామి తే గాత్రం శీతాంశుసదృశాననే ।**
**తస్మింస్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే ॥(15)॥**

**తిలకం –** వ్యాఖ్యలేదు

**దీపిక –** గాత్రమంటే అవయవ విశేషం. ఆయా అవయవవిశేషమందు నా కన్ను బద్ధమై ఉంటున్నది. ఇష్ట దేవతవైన నీ దర్శనము ముక్తిసాధకం కనుక – అని భావం.

**భవ మైథిలి భార్యా మే మోహమేనం విసర్జయ ।**
**బహ్వీనాముత్తమస్త్రీణా మాహృతానామితస్తతః ।**
**సర్వాసామేవ భద్రం తే మమాగ్రమహిషీ భవ ॥(16)॥**

**తిలకం –** వ్యాఖ్యానించలేదు.

**దీపిక –** ప్రకృతార్థము స్పష్టము. నిజానికి ఇక్కడ ఈ అర్థాన్ని స్వీకరించాలి. భార్యా – భయా – కాంతితో, ఆర్యా– శ్రేష్ఠురాలవు, భవ – అగుము, ఏనం మోహం విసర్జయ – ఈ మోహమును, నాయందు శత్రుత్వశంకా రూపమైన దానిని వదలివేయుము. నా ఉత్తమస్త్రీలలో అగ్రమహిషి అయిన మందోదరి కలదే, ఆమెకు, నాకును ఈశ్వరివి అగుము అనే పదాలను కలుపుకొని అర్థం చెప్పుకోవాలి.

**కిం కరిష్యసి రామేణ సుభగే చీరవాససా ।**
**నిక్షిప్తవిజయో రామో గతశ్రీర్వనగోచరః ।**
**వ్రతీ స్థండిలశాయీ చ శంకే జీవతి వా న వా ॥(26)॥**

**తిలకం –** ఇట్లు పూర్వశ్లోకంలో తన్ను పొగడుకొని రావణుడు ఇప్పుడు రాముని నిందిస్తున్నాడు. నిక్షిప్త విజయుడు – త్యక్త విజయుడు, స్థండిలశాయి – నేలపై పడుకొనేవాడు.

**దీపిక –** బుద్ధి మిత్యాది శ్లోకాలకు వాస్తవార్థం ఏమిటంటే – రాముని కూడిన నేను నీకు అఖిల సంపత్సమృద్ధిని ఇస్తాను. కనుక నన్ను రామునితో కలుపు అని సీత అంటుందని శంకించి రావణుడు అంటున్నాడు. నేను సంపదాదులను కోరేవాడను కాను. మరేమంటే మోక్షకామిని. అందువలన నాకు మోక్షం లభించేవరకు నీ పాదాబ్జములను వదలను అనే అభిప్రాయంతో పలుకుతున్నాడు.

ఓ సుభగా! నా బుద్ధ్యాదికాన్ని చూడు. రాముడు నిక్షిప్త విజయుడు – స్వతస్సిద్ధమైన విజయం కలవాడు. వనగోచరుడు – వనం అంటే జలం అది గోచరంగా నివాసస్థానంగా కలవాడు అంటే నారాయణుడని అర్థం. అందువలననే గతశ్రీః – పొందిన లక్ష్మికలవాడు. అందువలననే వ్రతీ – ప్రతి భక్తుని సంరక్షణవ్రతమునందు శీలం కలవాడు. అందువలననే స్థండిలశాయి తండ్రి మాటను పరిపాలించటానికి (సర్వభోగాలు వదలి) నేల మీద పడుకొనేవాడయ్యాడు. ఎలాగా అంటే అచీరవాససా – చీర వాసస్సు లేకుండా – పీతాంబరధారి అయి, ఇటువంటి ఆ రామునితో కూడి ఇప్పుడు నీవు ఏమియు చేయలేవు (కిం కరిష్యసీతి శంకే). అందువలన జీవతి – నేను బ్రతికి యుండగా, రామః త్వాం ద్రష్టుమపి నోపలప్స్యతే – రాముడు నిన్ను చూడటానికి కూడా తగడు. నా చేతి నుండి నిన్ను రాఘవుడు పొందడు. నన్ను చంపిన తరువాత రాముడు నిన్ను చూడటం అనే ఫలాన్ని పొందుతాడు.

**న రామస్తపసా దేవి న బలేన న విక్రమైః న ।**
**ధనేన మయా తుల్య స్తేజసా యశసాఽపి వా ॥(34)॥**

**తిలకం –** వ్యాఖ్యానింపలేదు.

**దీపిక –** వాస్తవార్థం ఏమిటంటే రాముడు తపస్సు మున్నగు వానితో నాకు తుల్యుడు కాదు. కానీ నిరవధికమైన షడ్గుణైశ్వర్యసంపన్నుడైన భగవానుడు. నా కంటే ఎంతో అధికుడు అని

**పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్ ధననిచయం ప్రదిశామి మేదినీం చ ।**
**మయి లల లలనే యథాసుఖం త్వం త్వయి చ సమేత్య లలన్తు బాన్ధవాస్తే ॥(35)॥**

**తిలకం –** పిబ – త్రాగు – మద్యం అనే పదం కలుపుకోవాలి. విహరించు – సంచరించు. విహార శబ్దానికి సంచారం చేయుట అని అర్థం కూడా ఉన్నది.

**దీపిక –** పిబ – త్రాగు – మధువును అని కలుపుకోవాలి. మయిలల, రమస్వ – నా యందు ఆనందం పొందు. వాస్తవానికి – మయి నేను భృత్యుడను కాగా నీవు రమించు, భోగాలనుభవించు అనే అర్థాన్ని గ్రహించాలి.

ఈ ఇరవైయవ సర్గలో శ్రీ మహేశ తీర్థుల వారు రావణుడు కాముకుడై పలికిన సర్వ వాక్యాలకు భక్తుని పరంగా, ఉపాసనా నిష్ఠగల వాని పరంగా వ్యాఖ్యానించారు. ఈ సర్గలో రావణుడు కామకామి కాదు. మోక్షకామి. సీతాదేవి పరదేవత. శ్రీరాముడు శ్రీమహావిష్ణువు. ఈ స్ఫురణతో ఈ సర్గను అధ్యయనం చేయాలి అనే తాత్పర్యం శ్రీరామాయణ తత్త్వదీపికలో రావణ వాక్యాల వ్యాఖ్యానంలో కానవస్తుంది. శ్రీగోవిందరాజుల వారి శృంగార తిలక వ్యాఖ్యానంలో ఈ స్ఫూర్తి రేఖామాత్రంగా కూడా లేదు.

## ఇరవైయొకటవ సర్గము

**చిన్తయన్తీ వరారోహా పతిమేవ పతివ్రతా ।**
**తృణమన్తరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా ॥(2)॥**

**తిలకం –** శుచిస్మిత– నిజానికి సీత దుఃఖార్త అయినప్పుడు శుచిస్మిత అనటం వస్తుస్వభావంచేత సస్మితవలె ప్రతీయమానం అవుతుంది కనుక.

తనిశ్లోకి భావాలను తిలకం ఈ విధంగా సంగ్రహించింది తృణమన్తరతః కృత్వా – గడ్డిపరకను అడ్డు పెట్టుకోవటం ఎందుకంటే పరపురుషుని ముఖం చూచి ప్రసంగం చేయటం మర్యాద కాదని, లేదా – గడ్డి పరకను వలె తీసిపారవేస్తూ, లేదా – నేను చెప్పబోయే మాటను ఇది గడ్డిపరకతో సమానమని లెక్కపెట్టడు అనే బుద్ధితో లేదా దేవీ! నీవు దయతో ఎవనిపై చూపు ప్రసరింపజేస్తావో అతడు శ్లాఘ్యుడు, గుణవంతుడు, ధన్యుడు, కులీనుడు, బుద్ధిమంతుడు, శూరుడు, విక్రమం గలవాడు అని వీడు కడకంటి చూపు పడటానికి యోగ్యుడు అనే భావంతో, స్వామి మునుపు గడ్డిపరకను కైకొని కాకాసురుని ముప్పుతిప్పలు పెట్టాడు, అలాగే ఈ గడ్డిపరకతో ఇతనిని కూడా సర్వనాశనం చేయాలి అనే భావంతో లేదా అచేతనాన్ని చేతనం చేసి సంబోధించటం చేత అట్టి వాక్యం పలుకుతున్నాను అనే భావంతో, దగ్గరగా వస్తున్న రావణుని వ్యవధానంతో చూడాలి అనే బుద్ధితో, నీవు పశుసమానుడవు నీకు ఈ గడ్డిపరకయే భోగ్య వస్తువు అనే భావనతో, రామ విరోధంతో నీవు నీ అందరితో పాటు నశిస్తావని సూచనగా ఈ గడ్డి పరకను నిలువుగా చీల్చి చెబుతున్నాను అనే భావనతో.

**దీపిక –** శుచిస్మితా – అనే పదాన్ని వ్యాఖ్యానించలేదు. తృణమన్తరతః కృత్వా – రావణునితో నేరుగా మాట్లాడటం యోగ్యం కాదు కనుక గడ్డిపరకను అడ్డు పెట్టుకొని మాట్లాడింది.

**నాహమౌపయికీ భార్యా పరభార్యా సతీ తవ ।**
**సాధు ధర్మమవేక్షస్వ సాధు సాధువ్రతం చర ॥(6)॥**

**తిలకం –** పరభార్యా సతీ, అహమ్ – పరుని భార్యను, పతివ్రతను అయిన నేను తవ ఔపయికీ, భార్యా, న – నీకు యోగ్యనైన భార్యను కాను. సాధాధర్మమ్ – సజ్జనుల ధర్మమును, సాధువ్రతమ్ – సజ్జనుల వ్రతమును సాధు –చక్కగా, చర – ఆచరించు.

**దీపిక –** నిజానికి – నేను నీకు భరింపదగినదానను కాను. మరి, పరభార్యను – పరుడైన రాముని చేత భరింపబడదగిన దానను. అందువలన సాధుధర్మమును, సాధువ్రతమును నీవు ఆచరించు.

**యథా తవ తథాఽన్యేషాం దారా రక్ష్యా నిశాచర ।**
**ఆత్మానముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతామ్ ॥(7)॥**

**తిలకం –** నిన్ను నీవు పోలికగా చూచుకొని నీ భార్యలనెట్లు కాపాడుకొందువో అట్లే పరుని భార్యను రక్షింపవలయును. అందువలన నీ భార్యలయందు నీవు రమింపుము.

**దీపిక –** నీకు నీదారల శుద్ధి ఎట్లు ఇష్టమో అట్లే ఇతరులకు వారి భార్యల శుద్ధి యిష్టము అని ఆత్మదృష్టాంతము వలననే పరదారలయందు నిస్పృహుడవు, స్వదారనిరతుడవు కమ్ము.

దీపిక యందు వివరణము కొంత అధికముగా వున్నది. పరదారల యందు నిస్పృహత్వమును తిలకము చెప్పలేదు.

**శక్యా లోభయితుం నాహ మైశ్వర్యేణ ధనేన వా ।**
**అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా ॥(15)॥**

**తిలకం –** ఈ శ్లోకం రావణుడు చూపెడు ప్రలోభాలకు అమ్మవారు సమాధానం చెబుతున్నది. ఐశ్వర్యము చేత – అంతఃపుర స్త్రీలకు ఈశ్వరుడగుట చేత, ధనేన – ఆభరణాదికంచేత, లోభయితామ్ – వంచించటానికి, నేను శక్యురాలను కాను. ఇందుకు కారణం చెబుతున్నారు. అహం రాఘవేణ అనన్యా – నేను రాఘవునకు నిత్యానపాయినిని. రాఘవేణ – రఘుకులంలో అవతరించిన విష్ణువుతో – అనన్యా – అవిభక్తురాలను – వేరు చేయటానికి వీలు లేనిదానను. ఏయే కులంలో విష్ణువు అవతరిస్తాడో అక్కడక్కడ లక్ష్మినై అవతరిస్తాను అని భావం. తృతీయా విభక్తిచేత అతనికి పరతంత్రనై ఉంటాను అనే అర్థం కూడా ప్రతీయమానం అవుతుంది. కేవలం పరతంత్రనే కాదు. ఆయన కంటే అతిశయానికి కూడా స్థానమైన దానను అని 'భాస్కరేణ ప్రభా యథా' అనే వాక్యభాగం చేత తెలియజేస్తున్నది. అది నిజమే. ప్రభ భాస్కరుని కంటే అతిశయాన్ని కూర్చునది కదా! మారీచుడు నీకు ఈ విషయాన్ని నివేదించాడు కూడా. "అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా" అతని తేజస్సు అప్రమేయం. ఎందుకంటే జనకాత్మజ అతనిది. ఓయి రావణా! నీవా హితవచనాన్ని మరచిపోయావా ఏమి? అని తత్త్వాన్ని రావణునకు సీత ఉపదేశించింది.

**దీపిక –** రావణుడు చెప్పిన ప్రలోభన వాక్యాలకు (సీత) ఉత్తరం (ఈశ్లోకం ద్వారా) చెబుతున్నది. ఐశ్వర్యేణ – అంతఃపుర నియంతృత్వం చేత – ఇంత మాత్రమే ఈ శ్లోకానికి దీపిక చేసిన వ్యాఖ్యానం.

**సాధు రావణ రామేణ మాం సమానయ దుఃఖితామ్ ।**
**వనే వాసితయా సార్ధం కరేణ్వేవ గజాధిపమ్ ॥(18)॥**

**తిలకం –** నన్ను రామునితో కలుపు అని రావణుని సీత అడుగుతున్నది. ఇది దారిలో చోరుని పానీయం అడిగిన తీరుగా ఉన్నది. రావణ అని సంబోధిస్తున్నది. నా వియోగంచేత నీ క్రౌర్యం మరింత పెరిగింది అని భావం. ఈ విధంగా అత్యధికమైన క్రౌర్యం గల వానిని యాచించటం వలన తన అతిశయం వ్యక్తమవుతున్నది. రామేణ – రామునితో అంటే సర్వాంగ సుందరునితో, మామ్ – నన్ను, ఎట్టి నన్ను అంటే అతనికి తప్ప మరియొకనికి దక్కరాని దానిని, అతని యెడబాటు నందు జీవితాన్ని నిలుపుకొనే శక్తి లేని దానిని, దుఃఖిస్తూ ఉన్నదానిని, దీనికొక పోలికను చెబుతున్నారు. యౌవనం పొందిన ఆడేనుగుతో గజరాజును కలిపినట్లు కలుపు.

రామునితో సంగమనం అంటే రాముని ఈ ప్రదేశానికి పిలవటం. అంతేకాని నన్ను అక్కడికి నీవు తీసుకొని పోవటం ఇష్టం లేదు. అందువలననే కరేణుతో గజాధిపుని కలిపినట్లు అని చెప్పారు.

**దీపిక –** సమానయ – సంగమం పొందించు. వనే వాసితయా వనంలో బంధింపబడిన ఏనుగును గజరాజుతో కలిపినట్లు అని విభక్తులను మార్పు చేసికొని అన్వయించుకోవాలి. తక్కిన తిలకంలో చెప్పిన భావాలు ఇందులో లేవు.

## ఇరవైరెండవ సర్గము

**సన్నియచ్ఛతి మే క్రోధం త్వయి కామః సముత్థితః ।**
**ద్రవతోఽమార్గమాసాద్య హయానివ సుసారథిః ॥(3)॥**

నీయందు పుట్టిన కామం నా క్రోధాన్ని, తప్పుదారి బట్టి పారిపోతున్న గుఱ్ఱాలను మంచి సారథి వలె, హద్దు మీరకుండా చేస్తున్నది.

**తిలకం –** సన్నియచ్ఛతి – నిరోధిస్తున్నది. ద్రవతః – పరువిడుచున్న, అమార్గమ్ – అని పదవిభజన.

**దీపిక –** పై అర్థాలను చెప్పి తరువాత ఇలా వ్యాఖ్యానించింది. వాస్తవానికి ఇష్టదేవత యందు చక్కగా పుట్టిన కామం – కోరిక భక్తియే. నా క్రోధాన్ని – రాక్షసజాతినైన నాకు ఎల్లవేళలా క్రోధం ఉండటం సహజం. క్రోధ శబ్దం చేత, అంతశ్శత్రువులైన క్రోధాదులు ఆరూ తెలియవస్తాయి. ఆ సముదాయాన్ని నీయందలి భక్తి అరికట్టుచున్నది అని భావం.

(రావణుని కామోక్తులను భక్త్యుక్తులనుగా వక్కాణించటం ఈ సర్గలో కూడా కన్పట్టుతున్నది).

**ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీమ్ ।**
**మమ త్వాం ప్రాతరాశార్థ మారభన్తే మహానసే ॥(9)॥**

రెండు నెలల తరువాత నన్ను భర్తగా కోరని నిన్ను నాకు నా వంటశాలలో ప్రొద్దుటి భోజనానికి కోసి వండుతారు.

**తిలకం –** రెండు నెలలు గడచిన చివరి రాత్రి దాటిన వెంటనే నిన్ను నా ప్రొద్దుటి భోజనం కోసం వంటశాలలో ముక్కలుగా నరికి పాకం చేస్తారు. ఆరభన్తే అంటే ఆలభన్తే – రలలకు అభేదం కనుక.

**దీపిక –** ప్రాతారాశార్థం – అన్న చోట ప్రాతః శబ్దం చేత రెండు నెలల అవధి దాటిన వెంటనే వచ్చే ఉదయకాలం తెలియవస్తుంది. అటు పిమ్మట నీ భర్తను కోరని నా రాజ్యలక్ష్మిని (మామ్ – అంటే లక్ష్మిని) నీవు 'ప్రాప్స్యసి' – పొందుతావు అనే పదం కలుపుకోవాలి. నా పాకశాలలో ఆలభనం చేసిన పశువులను నీవు భుజించు అని రావణుని భావనగా ఈ వ్యాఖ్యానం చెప్తున్నది. దానికి ఒకటి రెండు పదాలను అధ్యాహారం చేసుకోవాలని కూడా వ్యాఖ్యానించింది.

**స కల్పవృక్షప్రతిమో వసన్త ఇవ మూర్తిమాన్ ।**
**శ్మశానచైత్యప్రతిమో భూషితోఽపి భయంకరః ॥(29)॥**

**తిలకం –** అలంకరించుకొనటం చేత కల్పవృక్ష సామ్యము. భయం కలిగిస్తున్నాడు కనుక శ్మశానంలో ఉన్న చెట్టుతో లేదా మంటపంతో పోలిక.

**దీపిక –** వివరణ లేదు.

**మయా క్రీడ మహారాజ సీతయా కిం తవానయా ।**
**వివర్ణయా కృపణయా మానుష్యా రాక్షసేశ్వర ॥(40)॥**

రావణుని మరొక భార్య ధాన్యమాలిని మాటలు.

**తిలకం –** వ్యాఖ్యానం లేదు.

**దీపిక –** అకృపణయా అని పదచ్ఛేదం – పతివ్రతతో అని అర్థం. అమానుష్యా – దేవతాస్వరూపతో, అందువలననే వివర్ణయా – మనుష్య భోగాలకు విలక్షణమైన దానితో ఉత్తమ వర్ణము కల సీతతో నీకు పనియేమి? నాతో విహరించు అని ధాన్యమాలిని రావణునితో అన్నది.

## ఇరవైమూడవ సర్గము

**దీపిక –** ఈ రెండు సర్గలలో ఉన్న భార్యా శబ్దానికి భర్తవ్యా భరింపబడదగినది అని మాత్రమే అర్థం. భార్యాత్వం అంటే భరింపబడవలసిన వ్యక్తితనం. ఈ భావన తిలకంలో లేదు.

**తస్య పుత్రో విశాలాక్షి రావణః శత్రురావణః । (8)**

**తిలకం** – వివరణ లేదు.

**దీపిక –** విశ్రవో బ్రహ్మపుత్రుడు అని చెప్పటం చేత రావణుని కులీనత్వం అభివ్యక్తమవుతున్నది.

**పుష్పవృష్టిం చ తరవో ముముచుర్యస్య వై భయాత్ ।**
**శైలాశ్చ సుస్రువు పానీయం జలదాశ్చ యదేచ్ఛతి ॥(18)॥**

**తిలకం –** కొండలు, మేఘాలు రావణుడు ఎప్పుడు కోరితే అప్పుడు నీటిని వదులుతాయి. ముముచుః అనే భూతకాల క్రియను 'ముంచన్తి' అని వర్తమాన కాలక్రియగా మార్చుకొని అర్థం చెప్పుకోవాలని సూచించింది.

**దీపిక –** వ్యాఖ్యానించలేదు.

## ఇరవైనాల్గవ సర్గము

**మానుషీ మానుషస్యైవ భార్యాత్వం బహుమన్యసే ।**
**ప్రత్యాహర మనో రామా న్నత్వం జాతు భవిష్యసి ॥(3)॥**

**తిలకం –** న త్వం జాతు భవిష్యతి – 'తస్య' అనే మాట కలుపుకొని అర్థం చెప్పుకోవాలి. నీవిటుపై ఎన్నటికిని ఆ రామునిదానవు కాజాలవు అని అర్థం.

**దీపిక –** ఇక్కడ వాస్తవార్థం. మానుషుడై అవతరించిన రామునకు భార్యాత్వాన్ని అంగీకరిస్తున్నావు. అందువలన రాముని నుండి నీ మనస్సును మరల్చుకోవద్దు. (న ప్రత్యాహర) త్వం జాతు భవిష్యసి – నీవు ఎన్నటికినీ అతనిదానవే అవుతావు. 'తస్య' అనే పదాన్ని అధ్యాహారం చేసుకొని ఈ అర్థాన్ని ఈ వ్యాఖ్యాత సాధించారు.

**రాజ్యాద్భ్రష్టమసిద్ధార్థం విక్లబం త్వమనిన్దితే । (5)**

**తిలకం –** వ్యాఖ్యానించ లేదు.

**దీపిక –** రాజ్యాత్ భ్రష్టమ్ – పితృవాక్యపరిపాలనకోసం రాజ్యాన్ని విడచిన వానిని (శ్రీరాముని) అసిద్ధార్థమ్ – అశ్చాసౌ సిద్ధార్థశ్చ – సిద్ధమైన సర్వ ప్రయోజనమూ కలవాడగు విష్ణువు. 'అ' శబ్దం విష్ణువాచకం. ఈ వ్యాఖ్యాత 'అ' శబ్దాన్ని నఞర్థకంగా తీసుకోలేదు. విష్ణుపర్యాయవాచకంగా గ్రహించాడు. విక్లబమ్ – దయాళువు అయిన వానిని.

8 నుండి 13 వరకు

**తిలకం –** సువర్చల మొదలైన బహు దృష్టాంతాలను ప్రదర్శించటం తన పాతివ్రత్యదార్ఢ్యాన్ని వ్యక్తం చేయటం కోసం.

**దీపిక –** ఇందు మిక్కిలి దుర్దశలలో కూడా దృఢవ్రతత్వాన్ని అభివ్యక్తం చేయటం కోసం నానావిధ అనేక సాధ్వీనిదర్శనోపన్యాసం అని అనుసంధించుకోవాలి.

**పరితుష్టాస్మి భద్రం తే మానుషస్తే కృతో విధిః ।**
**మమాపి తు వచః పథ్యం బ్రువన్త్యాః కురు మైథిలి ।**
**రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్ ॥(22)॥**

**తిలకం –** మానుషో విధిః కృతః – మనుష్యజాతికి ఉచితమైన పాతివ్రత్య ప్రకటనము ఇంతకాలము చేసితివి చాలు అని భావము.

**దీపిక –** ఇక్కడ వాస్తవార్థం ఏమంటే పరితుష్టాస్మి మొదలుకొని మూడు శ్లోకములు కులకము (ఏకాన్వయము) దాని అర్థమిది. ఓ మైథిలీ మానుషం – మనుష్య ధర్మమైన భయమును వదలి రావణుని అందును కృపణుని, భర్తారమ్ – భ్రియతే శుశ్రూషాదినా స్వామిన మితి భర్తా – స్వామిని శుశ్రూష మొదలగు దానితో భరించువాడు – అనగా భృత్యుడగు వానిని, ఆశ్రయ – ఆశ్రయింపుము అనగా భృత్యునిగా అంగీకరింపుము అని తాత్పర్యము.

**కింతే రామేణ వైదేహి కృపణేన గతాయుషా ।**
**ఏతదుక్తం చ మే వాక్యం యది త్వం న కరిష్యసి ।**
**అస్మిన్ ముహూర్తే సర్వాస్త్వాం భక్షయిష్యామహే వయమ్ ॥(27)॥**

**తిలకం –** వ్యాఖ్యానం లేదు.

**దీపిక –** 'దివ్యాంగరాగా వైదేహి' మొదలుకొని మూడు శ్లోకములకు కులకము. దాని వాస్తవార్థము. ఓ వైదేహీ ! గతాయుష్కుడు అనగా పొందిన ఆయుస్సు కలవాడు అయిన రామునితో నీకు (సంగమము కలుగును). నీకు జాలితో పనిలేదు. ఈనాడు మొదలుకొని నీవు సర్వాభరణభూషితవై మా అందరి లోకములకు ఈశ్వరివి కమ్ము. నేను పలికిన ఈ వాక్యమును నీవు చేయవేని నిన్నుద్దేశించి యీ ముహూర్తమునందే మేమందరము తిని వేయుదుము. (విషమును) (కుండలములలో ఉన్న పదములను కలుపుకొని అర్థము చెప్పుకొనవలయును – అని యీ వ్యాఖ్యాత భావము).

## ఇరవైయెదవ సర్గము

**తథా తాసాం వదన్తీనాం పరుషం దారుణం బహు ।**
**రాక్షసీనామసౌమ్యానాం రురోద జనకాత్మజా ॥(1)॥**

**తిలకం –** తాసాం వదన్తీనామ్ – వారు వదురుచుండగా

**దీపిక –** సీతావిలాపానికి వాస్తవార్థం ఏమిటంటే శ్రీరామవియోగము, ఘోరరాక్షసుల ముందు ఉండటమూ, విరూపలైన రాక్షసులతో కలసి ఉండటమూ వలన కలిగిన వివిధ ప్రలాపాదికమని తెలియవలెను. ఈ కాండలో ఎక్కడ ఎక్కడ సీతాప్రలాపప్రసక్తి ఉన్నదో అక్కడ అక్కడ ఈ విధంగానే ఊహించాలి.

**సా త్వశోకస్య విపులాం శాఖా మాలంబ్య పుష్పితామ్ ।**
**చిన్తయామాస శోకేన భర్తారం భగ్నమానసా ॥(6)॥**

**తిలకం –** అశోకము – ఇక్కడ హనుమంతుడు ఉన్న శింశుపాశాఖకు దగ్గరలో నున్న అశోకము కొమ్మను అని అర్థం.

**దీపిక –** అశోకము యొక్క విపులమైన శాఖను అవలంబించి హనుమంతుడెక్కి కూర్చున్న శింశుపామూలానికి వచ్చిన సీత అశోకం కొమ్మను పట్టుకొన్నది అంటే అశోకపుకొమ్మలు, శింశుపకొమ్మలు పెనవేసుకొని ఉన్నాయని తెలియవస్తున్నది.

పెనవేసికొనుట ఈ వ్యాఖ్య చెప్పిన విశేషం. ఈ భావన రామానుజీయంలో కూడా కానవస్తుంది.

## ఇరవైయారవ సర్గము

**ఖ్యాతః ప్రాజ్ఞః కృతజ్ఞశ్చ సానుక్రోశశ్చ రాఘవః ।**
**సద్వృత్తో నిరనుక్రోశ శ్శంకే మద్భాగ్యసంక్షయాత్ ॥(13)॥**

**తిలకం –** రాముడు రాకపోవటానికి పెక్కు విధములైన కారణాలను సీత శంకిస్తున్నది. అది నా భాగ్యహీనతయే కానీ అతని గుణరాహిత్యం కాదు అని అతని గుణవైభవాన్ని పేర్కొంటున్నది.

**ప్రాజ్ఞుడు –** దోషమున్న చోట కూడా గుణాలను దర్శించేవాడు – దీనికి ఆధారం – నీవు మధ్యమాంబ అయిన కైకను ఎన్నటికిని నిందింపరాదు అనటం.

కృతజ్ఞుడు ఏదో ఒక్క చిన్న ఉపకారం చేత సంతోషపడును అన్నదానిని బట్టి తన ఆశ్రితులు చేసిన చిన్న పనిని కూడా మనస్సులో ఉంచుకుంటాడు.

**సానుక్రోశుడు –** ఎవరికైనా ఎంత చిన్న ఆపద వచ్చినా భృశం భవతి దుఃఖితః – మిక్కిలిగా దుఃఖపడతాడు ఇది అతని జాలి పొందే లక్షణానికి నిదర్శనం.

**సద్వృత్తుడు –** ఇతరుల సమృద్ధి ఒక్కటే ప్రయోజనంగా భావించి ప్రవర్తించేవాడు.

**ఖ్యాతుడు –** ఈ విధంగా శత్రువుల గోష్ఠిలో కూడా కొనియాడబడేవాడు.

ఇంత సద్గుణ సంపత్తి ఉన్నా నన్ను గూర్చి రాకపోవటం కేవలం నా దురదృష్టం అని సీత బాధపడినది.

**దీపిక –** ప్రాజ్ఞత్వాది గుణాలు గల రాముడు నా అదృష్టం చెడిపోవటం వలన నిరనుక్రోశుడు – దయలేని వాడు అయినాడా? అని శంక.

**పుణ్యోత్సవసముత్థా చ నష్టభర్త్రీ సరాక్షసీ ।**
**భవిష్యతి పురీ లంకా నష్టభర్త్రీ యథాఽఙ్గనా ॥(30)॥**

**తిలకం –** పుణ్యోత్సవముల నుండి సముత్థ – నశించిన పుణ్యోత్సవములు కలది. సరాక్షసి – రాక్షసీజన మాత్రయుక్త నష్టభర్త్రీ సరాక్షసీ – అర్థాత్ – హతరాక్షస – అయి మగడు చచ్చిన అంగనవలె పుణ్యోత్సవాలు నశించినది అవుతుంది.

**దీపిక –** వ్యాఖ్యానించలేదు.

**అథవా కిన్ను తస్యార్థో ధర్మకామస్య ధీమతః ।**
**మయా రామస్య రాజర్షే ర్భార్యయా పరమాత్మనః ॥(42)॥**

ధర్మకాముడు, ధీమంతుడు, రాజర్షి, పరమాత్మ అయిన రామునకు భార్యనైన నాతో పనియేమి?

**తిలకం–** ధర్మకాముడు – కామ అపేక్ష లేనివాడు, పరమాత్మనః – ఉత్కృష్టమైన స్వభావం కలవాడు అయిన రామునకు భార్యతో పనియేమి?

**దీపిక –** ధర్మకాముడు – కామపరుడుకాని వాడు. పరమాత్ముడు – ఆత్మారాముడు.

**ప్రియా న్నసంభవే ద్దుఃఖ మప్రియాదధికం భయమ్ ।**
**తాభ్యాం హి యే వియుజ్యన్తే నమస్తేషాం మహాత్మనామ్ ॥(50)॥**

**తిలకం –** ప్రియము వలన ఇవి సీతాదేవి వాక్కులు ప్రియుని వలన ఎవరికి దుఃఖము సంభవింపదో అంటే సుఖమే కలుగుతుంది. ప్రియము వలన అంటే అనుకూలవస్తువు వలన, అప్రియాత్ – ప్రతికూలవస్తువు వలన – అధికమైన భయం కలుగుతుంది. తాభ్యామ్ – ఆ ప్రియాప్రియముల నుండి – వియుక్తులైన మహాత్ములకు నమస్కారము. అట్టి వారే సర్వోత్తములని భావము.

**దీపిక –** ప్రియము వలన – అభిమతమైన వస్తువుల వలన, అప్రియాత్ – అనభిమతమైన వస్తువు వలన, తాభ్యామ్ – ప్రియ, అప్రియరూప విషయముల వలన పుట్టిన సుఖభయముల నుండి వియుక్తులైన వారు అని అర్థం. అట్టివారు మహాత్ములు. వారికి నమస్కారము.

## ఇరవైయేడవ సర్గము

**రాఘవశ్చ మయా దృష్ట శ్చతుర్దన్తం మహాగజమ్ ।**
**ఆరూఢశ్శైల సంకాశం చచార సహ లక్ష్మణః ॥(12)॥**

**తిలకం –** శిబిక ఎక్కి రాముడు లంకకు వచ్చినట్లు వెనుకటి శ్లోకంలో చెప్పారు. కాబట్టి దాని నుండి ఇప్పుడు మహాగజాన్ని అధిరోహించినట్లు చెబుతున్నారు. స్వప్నాధ్యాయంలో ఇలా చెప్పారు – ఎద్దులను, ఏనుగులను ఎక్కటం, ప్రాసాదంపై భాగాన్నీ కొండల, వృక్షాల శిఖరాలను అధిరోహించటం, మలం పూత, ఏడుపు, చావు, అగమ్యాగమనం అనేవి కలలో కనిపించటం శుభఫలదాయకం.

**దీపిక –** వ్యాఖ్యలేదు.

**తతస్తస్య నగస్యాగ్రే హ్యాకాశస్థస్య దన్తినః ।**
**భర్త్రా పరిగృహీతస్య జానకీ స్కంధమాశ్రితా ॥(14)॥**

**తిలకం –** ఇక్కడ పంద్రెండు వేల శ్లోకములు పూర్తి అయినవి. పదమూడవ వేయి మొదటి శ్లోకం ఇది. గాయత్రీమంత్రంలోని పదమూడవ అక్షరం ఇందులో ఉన్నది. దానిని తెలుసుకోవాలి.

**దీపిక –** తతస్తస్య అనే శ్లోకంలో నాలుగవ అక్షరం స్య అనేది ఇక్కడ పదమూడవ అక్షరంగా సంగ్రహింపబడింది.

**తిలకం –** ఎప్పటిలాగానే ఊహించుకోవాలని చెప్పింది.

**దీపిక –** దానిని పట్టి చూపింది.

**ఛాయావైగుణ్యమాత్రం తు శంకే దుఃఖముపస్థితమ్ ।**
**అదుఃఖార్హామిమాం దేవీం వైహాయసముపస్థితామ్ ॥**

**అర్థసిద్ధిం తు వైదేహ్యాః పశ్యామ్యహముపస్థితామ్ ।**
**రాక్షసేన్ద్రవినాశం చ విజయం రాఘవస్య చ ॥(48, 49)॥**

**తిలకం –** అయితే అటువంటి దుఃఖానుభవం సీతకు ఎందుకు కలిగింది? అనే శంకకు త్రిజట సమాధానం చెబుతున్నది. ఛాయావైగుణ్య మాత్రమును నేను చూస్తున్నాను. వైహాయసం ఉపస్థితామ్ – విమానాన్ని అధిరోహించిన – అంటే దివ్యభోగార్హ అయిన సీతను అని అర్థం. ఛాయా వైగుణ్యం అంటే కాంతి చెదరుట. లేదా ఛాయ అంటే ఇక్కడ నీడ అని అర్థం. దాని వైగుణ్యమంటే విషమత్వం. సర్వ లక్షణలక్షిత అయిన ఆ సీతకు నీడయందలి విషమత్వము ఇంతటి దుఃఖాన్ని కలిగించిందని భావం.

**దీపిక –** ఛాయా వైగుణ్యం – వైవర్ణ్యము – దేహకాంతి తరుగుట. అంతమాత్రమే నేను కనుగొన్నాను – ఇంతమాత్రము చేతనే అదుఃఖార్హ – దుఃఖం పొందరానిది – అంతేకాదు వైహాయసముపస్థితామ్ – దివ్య భోగములకు అర్హురాలు. అర్థసిద్ధిం – ప్రయోజనసిద్ధిని. ఆ ప్రయోజనము రాఘవేంద్ర విజయ, రాక్షసేంద్రవినాశరూపమైనది.

**పక్షీ చ శాఖా నిలయః ప్రహృష్టః పునః పున శ్చోత్తమ సాన్త్వవాదీ ।**
**సుస్వాగతాం వాచ ముదీరయానః పునః పునశ్చోదయతీవ హృష్టః ॥(53)॥**

**తిలకం –** దేహం మీది శుభ స్పందనలను తెలిపి యిపుడు శాకున శుభలక్షణాలను ఇక్కడ తెలియజేస్తున్నారు.

పక్షి – పింగళిక – పైడికంటి అనే పిట్ట – శాఖానిలయః – కొమ్మ మీద కూర్చుని ఉన్నది, ప్రహృష్టః – చాలా ఆనందం పొందినట్టిది. పునః పునః ఉత్తమ సాంత్వవాదీ – మరల మరల కమ్మగా కూయుచున్నది. మీద మీద ఓదార్పు కలిగే స్వరంతో కూస్తున్నది. సుస్వాగతమ్ – మంచి చుట్టముల రాకను తెలియజేసే పలుకు పలుకుతున్నది. చోదయతీవ – రామాగమనాన్ని చెప్పుతున్నట్లు ఉన్నది. లేదా రాఘవుని తెలియజేస్తున్నది.

ఇక్కడ ఆచార్యుల వ్యాఖ్యానం ఇలా ఉన్నది. పక్షి – అంటే ప్రశస్తమైన రెక్కలు గల గరుత్మంతుడు. రెక్కలను విప్పార జేసి ప్రదక్షిణముగా తిరుగుచూ, శాఖానిలయః – చిగురించిన, పూచిన కొమ్మ మీద పట్టుగా కూర్చుండి – ఆర్ద్రత ఎక్కువగా గల చెట్టు భాగమే ఇక్కడ శాఖగా చెప్పబడినది. ప్రదక్షిణముగా తిరుగుట, చెమ్మ గల కొమ్మను ఎక్కటం, పట్టు చిక్కించుకొని ఉండటం అనేవి శుభాన్ని సూచిస్తాయి. ప్రహృష్టః – అక్కడ ఉన్న పండ్లను తినటం చేత సంతుష్టమై ఉన్నది. మాటి మాటికీ సాంత్వనం మాటలు పలుకుతున్నది. 'దుఃఖింపకు నీ భర్త వెనువెంటనే వస్తాడు. ఇది శోకానికి తగిన సమయము కాదు' అని చెప్పుచున్నట్లు కూస్తున్నది. అటుపైన సుస్వాగతవాక్కును పలుకుచున్నది. ఇంతమాత్రమే కాదు. నీ పగవానికి సంతాపాతిశయము కూడా కలుగుతుంది అని చెప్పుచున్నట్లు వున్నది. విరహక్లిష్టమైన స్త్రీకి సుస్వాగత వచనం అంటే పగవాని సంతాపాతిశయకథనమే. మరల మరల ప్రచోదన చేస్తున్నది. ప్రియునిరాక నిశ్చితమైనపుడు స్నానము, అలంకరణము మొదలైన దాని నేల

చేయవు అని సీతను పురికొల్పుతున్నదా! అన్నట్లున్నది. హృష్టః – నాయికకు శుభం కలిగే సమయంలో కలిగే హర్షం తనకే కలిగినట్లుగా పులకలెత్తిన దేహంతో తెలియజేస్తున్నదా! అన్నట్లు ఉన్నది.

**దీపిక –** శాఖా నిలయః – కొమ్మ మీద ఉన్న గూటికి చేరుకొన్నది. ఉత్తమ సాంత్వ వాదీ – ఉత్తమ శాంత స్వరంతో కూయుచున్నది. సుస్వాగతాం వాచమ్ – శుభమైన రాక అనే మాటను తెలుపుతున్నది. మరల మరల ప్రచోదన చేయుచున్నది. శోభనమైనది ఏర్పడినది. దానికి ప్రీతితో ఎదురేగుము అని మరల మరల ప్రేరణ చేయుచున్నది.

### తనిశ్లోకి సంబంధమైన తిలక వ్యాఖ్యానంలోని మరికొన్ని విశేషాలు

శ్రీమద్రామాయణము ఉత్తమమైన ధ్వని కావ్యం. ఇందులో ఈ కాండరూపమైన ప్రబంధంలో అనాది భగవత్సంబంధం గల చేతనుని (జీవుని) ఉజ్జీవింపజేయటానికి పూనుకొన్న ఆచార్యుని ప్రవృత్తి వ్యంగ్యరూపంలో తెలియవస్తున్నది. ఇక్కడ లంక అంటే దేహం. ఏకాక్షి మొదలైన వాళ్ళు ఇంద్రియాలు. రావణ కుంభకర్ణులు అహంకార మమకారాలు ఇంద్రజిత్తు మొదలైన వాళ్ళు కామక్రోధ లోభ మోహ మదమాత్సర్యాదులు. అటువంటి లంకలో బంధింపబడిన సీత వంటి వాడు చేతనుడు (జీవుడు). అతనికి భగవద్ జ్ఞానాన్ని ఉపదేశించే ఆచార్యస్థానీయుడు మారుతి. అట్టి ఆచార్యలక్షణాన్ని ఈ శ్లోకం ప్రతీయమానం చేస్తున్నది.

పక్షి – అంటే పక్షములు – గమన సాధనములు కలది కనుక జ్ఞానకర్మలను గ్రహించాలి. రెండు రెక్కలతో పక్షులకు ఆకాశంలో గమనం కలిగినట్లుగా జ్ఞానకర్మములతో పరమగతి నియతంగా ఏర్పడుతుంది అని చెప్పి ఉన్న విషయం ఇక్కడ ప్రమాణం. 'బ్రాహ్మణులు యజ్ఞముతో, జ్ఞానముతో, తపస్సుతో తత్త్వమును తెలియగోరుదురు' అనే శ్రుతివాక్యాన్ని బట్టి జ్ఞానకర్మములకు అంగాంగి భావం ఉండటం చేత ఇక్కడ ఆ రెంటికీ సముచ్చయం, వివక్షితం. దీనిచేత ఆచార్యశబ్దనిర్వచనం చెప్పబడింది. శాస్త్రార్థములను సంపాదించుకొన్నవాడు, ఆచారము నందు నెలకొల్పినవాడు, స్వయముగా ఆచరించువాడు కనుక 'ఆచార్యుడు' అవుతున్నాడు.

శాఖా శబ్దం ఇక్కడ వేదశాఖలను తెలుపుతుంది. నిలయ శబ్దం తదేకపరత్వాన్ని తెలియజేస్తుంది. స్వశాఖను వదలివేసినవాడు ప్రత్యవాయం పొందుతాడని శాస్త్రాలు చెబుతున్నాయి కనుక. దానిని గూర్చి శిక్షాశాస్త్రం ఇలా చెబుతున్నది. అధ్యయనం చేసిన వేదాన్ని వదలివేసిన నరాధముడు భ్రూణహత్య చేసినవాడవుతాడు. నీచయోని యందు జన్మిస్తాడు. నిలయశబ్దం చేత తన శాఖామంత్రభాగాలకు సంబంధించిన శ్రవణమనననిధిధ్యాసనరూప తదనుష్ఠానాదులు తెలియవస్తాయి. దీనితో ఆచార్యలక్షణాలు తెలుస్తున్నాయి. వేదసంపన్నుడు, విష్ణుభక్తుడు, విమత్సరుడు, మంత్రజ్ఞుడు, మంత్రభక్తుడు, ఎల్లవేళల మంత్రములను ఆశ్రయించి ఉండువాడు, పరిశుద్ధుడు, గురుభక్తితో చక్కగా కూడియుండువాడు, విశేషించి పురాణములను అధికంగా తెలిసినవాడు – ఇట్టి లక్షణాలు నిండుగా గల ఆచార్యుడు 'గురువు' అనే పదానికి యోగ్యుడవుతాడు.

**ప్రహృష్టః –** ఎల్లవేళల సంతుష్టమైన హృదయం కలవాడు. ఇది ఎల్లవేళల సేవనీయతను తెలుపుతుంది. ఆహ్లాదంతో వెలువడిన చల్లని భాష్పధారలు కలవాడు, పులకలెత్తిన గాత్రము కలవాడు, ఎల్లవేళల పరుల గుణములను

మెచ్చుకొనువాడు లేదా పరమాత్మ గుణముల ఆవేశము కలవాడు అయిన వానిని దేహధారులందరూ వెదకి పట్టుకోవాలి అని శాస్త్రాలు చెప్పాయి.

ఉత్తమ సాంత్వవాది. ఉత్తముడంటే పరమాత్మ అతనికి సంబంధించిన మంచి మాటలను శిష్యులకు తెలిపేవాడని అర్థం. సాంత్వవాదశీలుడని అర్థం. పునఃపునః మరల మరల అనటం చేత కృషీవలుడు ఒకప్పుడు పంట పండకపోతే వ్యవసాయాన్నే వదలిపెట్టడు. మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తాడు. అలాగే ఆచార్యుడు కూడా తన మాటలు శిష్యులు వినకపోయినా మళ్లీ మళ్లీ బోధిస్తాడు. ఈ విధంగా ఆచార్యునకు భగవంతుని కంటే విశిష్టత సిద్ధిస్తున్నది. భగవంతుడు పార్థునకు గీతనుపదేశించి, అతడు దానిని మరొకసారి చెప్పు నేను మరచాను అని అశ్వమేధపర్వంలో అడిగితే నీవు శ్రద్ధలేనివాడవు బుద్ధిహీనుడవు. నేను చెప్పను అన్నాడు. ఆచార్యుడు అలా అనడు.

అంతేకాదు 'సుస్వాగతాం వాచ ముదీరయానః' సంప్రదాయ విచ్ఛేదంకాని రీతిలో ఆచార్య పరంపరతో వచ్చిన వాక్కును – అష్టాక్షరాది మంత్రరాజరూపమైన దానిని నిర్హేతుకి అయిన దయతో పలుకుతున్నవాడు.

ఇంకా పునః పునశ్చోదయతీవ – ఉపదేశించిన దాని అనుష్ఠానం కొరకు చోదన చేస్తున్నాడు. లేకపోతే ఉపదేశం అనర్థకం అయిపోతుంది. హృష్టః – దీనిచేత శిష్యశిక్షణము ఆచార్యునకు స్వప్రయోజనమని తెలియవస్తున్నది.

## ఇరవైయెనిమిదవ సర్గము

**నైవాస్తి నూనం మమ దోష మత్ర వధ్యాఽహమస్యాప్రియదర్శనస్య ।**
**భావం న చాస్యా మహమప్రదాతుమలం ద్విజో మంత్ర మివాద్విజాయ ॥(5)॥**

**తిలకం –** ఆత్మహననం దోషం కదా అంటే నా విషయంలో కాదు. ఎందుకంటే రావణుని చేతిలో చావటం కంటే నన్ను నేను చంపుకోవటం మేలు. ఆత్మహననం కాకపోతే అప్రియదర్శనుడైన రావణుడు నన్ను చంపుతాడు. దుర్మరణం కంటే దుష్టరాక్షసుని చేతిలో మరణం అతికష్టం అని భావం.

అయితే "సర్వతః ఆత్మానం గోపాయేత్" అన్ని వైపులనుండియు తన్ను తాను రక్షించుకోవాలి అనే శ్రుతి వాక్యాన్ని అనుసరించి అతనిని ఆశ్రయించి రక్షణ పొందవచ్చు కదా అని శంకించి అంటున్నారు. అతని భావాన్ననుసరించి ప్రవర్తించటం నాకు చేతకాదు. ఈ నా భావము రామునిది. అతని సొమ్మును ఇతరులకు ఇచ్చే అర్హత నాకు లేదు అని తాత్పర్యం.

**దీపిక –** ఆత్మహననం లేకున్నా రావణుడు చేసే దుష్టహత్యకు పాల్పడే అవకాశం ఉన్నది కనుక ఆత్మహత్య దోషం కానేరదని భావం. అయితే దుర్మరణం పొందకుండా రావణానుకూలత్వాన్ని పొందవచ్చు గదా అంటే నా చిత్తము వానిపై ప్రవర్తించదు అని దృష్టాంతముఖంగా భావించింది.

**అనన్య దైవత్వ మియం క్షమా చ భూమౌ చ శయ్యా నియమశ్చ ధర్మే ।**
**పతివ్రతాత్వం విఫలం మమేదం కృతం కృతఘ్నేష్వివ మానుషాణామ్ ॥(12)॥**

**తిలకం –** అనన్యదైవత్యమ్ – ఆశ్రయణీయ అయిన దేవత మరియొకతె కలదు. ఆమె నన్ను రక్షిస్తుంది అనే బుద్ధి లేనితనం. ఇయం క్షమా చ– రావణుని పరుషాక్షరాలు, రాక్షస స్త్రీల తర్జన భర్త్సనాదులు అనువానిని రాముని మధురాలాపాలను వినాలనే కుతూహలంతో నేను సహించి ఉన్నాను.

భూమౌ చ శయ్యా నీ (రాముని) అంకం చేరుకుంటాను అని అటువంటి భోగం నాకు ఎన్నటికైనా కలుగదా అనే ఆశతో నేను నేలపైననే పడుకొని ఉంటున్నాను.

నియమశ్చ ధర్మే – రక్షకత్వ ధర్మం కూడా రాముని పైననే ఉన్నది అనే బుద్ధితో నేను ఉన్నాను. అందువలననే 'ఓయి దశగ్రీవా! నిన్ను భస్మం చేయకున్నాను' అని రాముని చూచియే అన్నది. పతివ్రతాత్వం – ఇది నా వ్రతము అని (రాముడు) పలికిన (పతి) వ్రతం కంటే వేరైన వ్రతం నాకు కొంచెం కూడా లేదు అని అర్థం. పతి యొక్క వ్రతమే వ్రతముగా గలది పతివ్రత. ఆమె భావం పతివ్రతాత్వం. నా ఇదంతా విఫలం అయింది. అమోఘమైనా మోఘమైంది. అది మనుష్యులలో కృతఘ్నుల యందు చేసిన ఉపకారంలాగా రాముడు – ఆత్మానం మానుషం మన్యే – నన్ను మనుష్యునిగా సంభావించుకొంటున్నాను అన్నాడు కనుక అతడు కూడా మనుష్యుడే. కనుక అతని కంటే వేరైన మనుష్యులయందు అని అర్థం. దీనికంతా మూలం ఏమిటి? అంటే నాదే అయిన దుష్కృతం.

**దీపిక –** అనన్య దైవత్వం – పతిమాత్రమే దేవతగా కలిగిన లక్షణం, కృతం – అంటే చేసిన ఉపకారం.

**ఇతీవ దేవీ బహుధా విలప్య సర్వాత్మనా రామమనుస్మరన్తీ ।**
**ప్రవేపమానా పరిశుష్కవక్త్రా నగోత్తమం పుష్పితమాససాద ॥(17)॥**

**తిలకం –** పుష్పితమ్ ఆససాద – పుష్పితము అనటం శుభసూచన తెలియజేయటం లేదా అగ్నిప్రవేశం చేస్తున్నదాని వలె.

**దీపిక –** వివరణలు లేవు.

**శోకాభితప్తా బహుధా విచిన్త్య సీతాఽథ వేణ్యుద్గ్రథనం గృహీత్వా ।**
**ఉద్బధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్రమహం గమిష్యామి యమస్య మూలమ్ ।**
**ఉపస్థితా సా మృదు సర్వగాత్రీ శాఖాం గృహీత్వాఽథ నగస్య తస్య ॥(18)॥**

**తిలకం –** వేణ్యుద్గ్రథనం – జుట్టు ముడిపెట్టుకొనటం, యమస్య మూలం – యముని సమీపమునకు

**దీపిక –** చెట్టుకొమ్మని పట్టుకొని నిలిచి ఉన్నదని భావం.

## ఇరవైతొమ్మిదవ సర్గము

**తథాగతాం తాం వ్యథితా మనిన్దితాం వ్యపేత హర్షాం పరిదీనమానసామ్ ।**
**శుభాం నిమిత్తాని శుభాని భేజిరే నరం శ్రియా జుష్ట మివోపజీవినః ॥(1)॥**

**తిలకం –** తథాగతామ్ – 'రహస్యం చ ప్రకాశం చ' అని చెప్పిన రీతిగా సర్వమును ఉన్నదున్నట్లుగా సాక్షాత్కరించుకోగలిగిన మునికి కూడా ఇది ఇట్టిది అని విస్పష్టంగా చెప్పలేనట్టి స్థితిలో ఉన్నదానిని అనే అర్థం తథా శబ్దంచేత వ్యక్తమవుతున్నది. తామ్ – ధర్మి స్వరూపాన్ని మించి ఏ కొంచెము అతిశయం లేనిదానిని, వ్యథితామ్ – ఆశంస యందు భూతవత్తుగా ప్రయోగించటం చేత నిష్ఠా ప్రత్యయం వచ్చింది. ఆ విధంగా వెనుక చెప్పిన దుఃఖలక్షణాలన్నీ ఉన్న దానిని అనే అర్థం వస్తుంది. ఇటుపైనే అన్ని కష్టాలూ వచ్చిపడతాయని భావిస్తున్నదానిని అని అర్థం. అనిన్దితామ్ –రామవిరహంలో ఎలా ఉండాలో అలా ఉన్న దానిని – భిన్నంగా ఉంటే నిందితయే అవుతుంది. వ్యపేత హర్షామ్ – హర్షము మునుపు ఈమె యందుండి వెళ్ళిపోయినది అని తెలియని దానిని – వి....అప అనే రెండు ఉపసర్గలు ఈ అర్థాన్ని తెలియజేస్తున్నాయి. పరిదీనమానసామ్ – హర్షము వచ్చినా ఆశ్రయము లేనిదానిని, పరి అనే ఉపసర్గ చేత ఈ అర్థం తెలియవస్తుంది. శుభామ్ – గుణాధిక విషయుడైన రాముని విరహం చేత కలిగిన వికృతి చేత ఆ దశయందే నీరాజన కర్తవ్య అన్నట్లుగా ఉన్నది. నిమిత్తాని శుభాని భేజిరే – అట్టి సీతను శుభములను సూచించే నిమిత్తములు పొందాయి (తనిశ్లోకి).

**దీపిక –** వివరణ లేదు.

**శుభం పునర్హేమ సమాన వర్ణమీషద్రజో ధ్వస్తమివామలాక్ష్యాః ।**
**వాస స్థితాయా శ్శిఖరాగ్రదత్యాః కించిత్పరిస్రంసత చారుగాత్ర్యాః ॥(5)॥**

**తిలకం –** శిఖరాగ్రదత్యాః – గుండ్రని చివళ్ళు గల అగ్రదంతములతో కూడియున్నది. శిఖరమంటే దానిమ్మగింజ అనే అర్థం కూడా ఉన్నది. అటువంటి ముందు దంతములు కలది. అట్టి సీతయొక్క వస్త్రం కొంచెంగా జారినది. ఊరుకంపం వలన అని భావం. అలా జారటం కాంతుని రాకను సూచిస్తుందని భావం. శిఖరముల వంటి దంతాలు గలవారు గొప్ప అదృష్టం కలవారవుతారని దీర్ఘకాలం జీవిస్తారనీ సాముద్రికశాస్త్రం చెబుతున్నది.

**దీపిక –** పెద్దగా వివరణ లేదు. శిఖరాగ్రదత్యాః – శిఖరముల వంటి అగ్ర దంతములు కలది. పరిస్రంసత – పర్యస్రంసత అని మాత్రం చెప్పింది.

## ముప్పైయవ సర్గము

**అహం త్వతితనుశ్చైవ వానరశ్చ విశేషతః ।**
**వాచం చోదాహరిష్యామి మానుషీమిహ సంస్కృతామ్ ॥(17)॥**

**తిలకం –** హనుమంతుడు సీతతో మాట్లాడటానికి సందేహిస్తున్న సందర్భం.

**అతితనుః –** మిక్కిలి సూక్ష్మతముడను. సంస్కృతామ్ – ప్రయోగ సౌష్ఠవము, లక్షణ సంస్కార యుక్తము అయిన మనుష్య సంబంధ వాక్కును – విశేషంగా వానరుడను – ప్రయోగిస్తే సీత శంకించవచ్చునని తాత్పర్యం.

**దీపిక –** వివరణ లేదు.

**సేయమాలోక్య మే రూపం జానకీ భాషితం తథా ।**
**రక్షోభిస్త్రాసితా పూర్వం భూయస్త్రాసం గమిష్యతి ॥(20)॥**

**తిలకం –** ఇట్లు మనుష్యభాషతో వ్యవహరించటాన్ని నిశ్చయించుకొని ఇప్పుడు ఆ భాషతో కూడా వానర రూపంతో ఆమె ముందు నిలబడి మాటలాడితే దోషం కలుగవచ్చునని విచారిస్తున్నాడు.

**దీపిక –** పై భావాన్నే అనువదించింది.

**అసత్యాని చ యుద్ధాని సంశయో మే న రోచతే ।**
**కశ్చ నిస్సంశయం కార్యం కుర్యాత్ప్రాజ్ఞ స్ససంశయమ్ ॥(35)॥**

**తిలకం –** అసత్యాని – జయము, అపజయము అనువాని విషయంలో నిశ్చయం లేనివి (యుద్ధములు) సంశయః – సంశయితమైన అర్థం. అది ఇక్కడ సంగ్రామం. అయినా దానిని చేస్తే అదే కార్యాన్ని పాడు చేస్తుంది. నిందకు స్థానం అవుతుంది. బుద్ధిమంతుడు ఎవ్వడు సంశయంతో కూడిన పనిని, నిస్సంశయంగా – నిర్విచారంగా – ఆలోచించకుండా చేస్తాడు? ఎవ్వడూ చేయడని అర్థం.

**దీపిక –** సంశయరూపమైన పనులు చేసేవాడు మూఢుడు అనే భావంతో పలుకుతున్నారు. నిస్సంశయుడు – నిర్వికారుడు. నిస్సంశయః అని ప్రథమాంతంగా ఈ వ్యాఖ్య స్వీకరించింది.

## ముప్పైయొకటవ సర్గము

**ఏవం బహువిధాం చిన్తాం చిన్తయిత్వా మహాకపిః ।**
**సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ ॥(1)॥**

ఇట్లు పెక్కు విధాలుగా ఆలోచించి మహాకపి హనుమంతుడు వైదేహి సమీపంలో మధురమైన వాక్యం పలికాడు.

**తిలకం –** చింతాం కృత్వా – కర్తవ్యమైన అర్థాన్ని నిశ్చయించి అని అర్థం. సంశ్రవే – చక్కగా వినబడుతుంది దీనియందు – అనే అర్థంలో సంశ్రవమంటే సమీపంలో లేదా – 'పాత్యే గేయే చ మధురం' అనే మాటను బట్టి సంశ్రవే అంటే శ్రవణమునందు – మధురం – లోకంలో జ్ఞానప్రసరణం ద్వారా ఇంద్రియాల నుండి వెలువడి, విషయములను గ్రహించి అటుపైన రసం పుడుతుంది. కానీ ఇక్కడ అలా కాదు. నాదం చెవినబడినంతనే రసం పుడుతుంది అని అతిశయోక్తి. పూర్వాపర నిరూపణ లేకుండా విన్నంతనే రసజనకం కావటం ఇక్కడ సంశ్రవే మధురం అన్నదానికి అర్థం. వైదేహ్యాః – కులాన్ని అనుసరించి దేహము నందు నిస్పృహ కల జానకి – దేహం ఇచ్చి అయినా రసానుభూతి పొందుతుందని భావం.

**దీపిక –** సంశ్రవే – సంశ్రవణము నందు, మధురం – మధురమైన, వైదేహ్యాః – వైదేహీ నిమిత్తంగా, సమీపార్థాన్ని, యద్వాతో ఈ వ్యాఖ్యానం చూసింది. హనుమంతుడు చెప్పే మాటను సీత మాత్రమే వినాలి, మరి యే యితర కాంతయు వినరాదు అన్న భావనతో సమీపంలో పలికాడని భావం.

**సా తిర్యగూర్ధ్వం చ తథాప్యధస్తాన్నిరీక్షమాణా తమచిన్త్యబుద్ధిమ్ ।**
**దదర్శ పింగాధిపతే రమాత్యం వాతాత్మజం సూర్యమివోదయస్థమ్ ॥(19)॥**

**తిలకం –** అధస్తాత్ అనటం వలన ఎవడైన నరుడు భూమిని చీల్చుకొని వచ్చి రామనామములను కీర్తిస్తున్నాడా, అన్నట్లు క్రింది వైపు చూచింది. లేదా శింశుప క్రింది, పై భాగాలలో చూచింది.

తమచిన్త్యబుద్ధిం దదర్శ – చింతింపనలవి కాని బుద్ధిగల వానిని చూచింది. అతని దేహాన్ని చూచినంతనే ఆమె, ఇతడు ఈ లంకలో ప్రవేశించి అంతఃపురంమధ్యలో ఉన్న అశోకవనంలో ప్రవేశించాడంటే నిపుణతరమైన మతి కలవాడు అయి ఉండాలి అని నిశ్చయం పొందింది.

పింగాధిపతే రమాత్యం – స్వరవిశేషం చేత ఇతడు వానరుడు. అందునా స్వతంత్రుడు కాడు. స్వసజాతీయుడైన ఒకానొక రాజునకు మంత్రి. ఆ రాజకార్యం ఇతనికి హస్తగతం అని నిశ్చయించుకొన్నది.

వాతాత్మజమ్ – రాముని బ్రతికించటానికీ, నన్ను బ్రతికించటానికీ సర్వప్రాణులను జీవింపజేయటానికి కారణభూతుడైన వాయువు కుమారుడు ఈతడు అయిఉండాలి అని భావించినది.

సూర్యమివోదయస్థమ్ – రాముడనే దివాకరుని ఉదయసూచకంగా ఉదయగిరి యందున్న సూర్యుని వలె ఉన్నవాడని తలపోసినది.

లేదా సూర్యశబ్దం చేత అతనితో సంబంధం గల అరుణుడు అని అర్థం. ఔచిత్యం వలన ఇక్కడ సూర్యుడంటే అరుణుడు (తనిశ్లోకి).

**దీపిక –** వివరణలు లేవు.

## ముప్పైరెండవ సర్గము

**సా తం సమీక్ష్యైవ భృశం విసంజ్ఞా గతాసుకల్పేవ బభూవ సీతా ।**
**చిరేణ సంజ్ఞాం ప్రతిలభ్య భూయో విచిన్తయామాస విశాలనేత్రా ॥(8)॥**

**తిలకం –** విసంజ్ఞా – మూర్ఛితయై, గతాసుకల్పా – మృతప్రాయమై, ఇవశబ్దం – వాక్యాలంకారంలో ప్రయుక్తం. చిరేణ, సంజ్ఞాం ప్రతిలభ్య – మరల ప్రబోధనం కాలమే చేయగా స్వస్థత పొందినదై. వికృత వానర వేష దర్శనం చేత మూర్ఛిత అయినది. మరల ప్రబోధనం కాలమే చేయగా స్వస్థత పొందినదై. వికృతవానరవేష దర్శనం చేత మూర్ఛిత అయినది. మరల కాలంలో ప్రబుద్ధ అయినది అని తాత్పర్యం.

**దీపిక –** వీక్షమాణా – ఈ మాటను రాక్షసస్త్రీలు విన్నారా? ఏమి అని అటు ఇటు శంకతో చూస్తున్నదని భావన.

**మనోరథః స్యాదితి చిన్తయామి**
**తథాఽపి బుద్ధ్యా చ వితర్కయామి ।**
**కిం కారణం తస్య హి నాస్తి రూపం**
**సువ్యక్తరూపశ్చ వదత్యయం మామ్ ॥(13)॥**

**తిలకం –** మొదట ఇది – అంటే రామనామాన్ని చెప్పేవాని దర్శనము, మనోరథః – అభిలాష మాత్రమని భావిస్తున్నాను. అయినా బుద్ధితో ఇది – అంటే ఈ చింత సత్యమనిపించినా వితర్కిస్తున్నాను. ఎందుకంటే మనోరథానికి రూపం లేదు కదా. ఈ వానరుడేమో సువ్యక్తరూపుడై నన్ను పలుకరిస్తున్నాడు. అందువలన ఇది కేవలం మనోరథం కాదని ఊహిస్తున్నాను అని సీత సంభావిస్తున్నది.

**దీపిక –** మనోరథము కాదని విచారిస్తున్నాను. కారణమేమంటే, తస్య – ఆ మనోరథానికి, రూపం నాస్తి – రూపం లేదు. రూప్యతే ప్రాప్యతే అనేన ఇతి రూపకం అనే వ్యుత్పత్తి ననుసరించి రూపమంటే ప్రాపకము. అది లేదు. తక్కిన భావాలు తిలకం వలనే ఉన్నాయి. దీపికలో రూపం అనే దానికి ప్రాపకం అనే అర్థం చెప్పటం విశేషంగా ఉన్నది.

## ముప్పైమూడవ సర్గము

**కోను పుత్రః పితా భ్రాతా భర్తా వా తే సుమధ్యమే ।**
**అస్మాల్లోకాదముం లోకం గతం త్వమనుశోచసి ॥(9)॥**

**తిలకం –** అముం లోకం గతం – పరలోకమును పొందిన, 'యమ్' అనే పదాన్ని కలుపుకోవాలి. ఈ లోకం నుండి పరలోకానికి వెళ్ళిన పుత్రాదులలో ఎవనిని గూర్చి దుఃఖపడుతున్నావు? అని అర్థం. 'గతా త్వమ్' అని ఒక పాఠం. ఆ స్వర్గం నుండి యీ మనుష్యలోకం పొందిన నీవు దుఃఖిస్తున్నావు. అట్టి నీకు పుత్రాదులు ఎవ్వరు? అని ప్రశ్న.

**దీపిక –** పరలోకమును పొందిన ఎవనిని గూర్చి (పుత్రాదులను) నీవు శోకిస్తున్నావు. అని ప్రశ్న.

పాఠాంతరాన్ని గురించి ప్రస్తావించలేదు.

**పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః ।**
**స్నుషా దశరథస్యాహం శత్రుసైన్యప్రతాపినః ॥(15)॥**

**తిలకం –** శత్రువులు బ్రదికియుండగా నా మామ దశరథుడు జీవించి ఉండలేదు. ఆయన బ్రతికి ఉంటే నేను ఇట్టి అవస్థను ఎలా పొందుతాను అని 'శత్రుసైన్యప్రతాపినః' అనే మాటకు భావం.

**దీపిక –** వివరణ లేదు.

**న పిబేయం న ఖాదేయం ప్రత్యహం మమ భోజనమ్ ।**
**ఏష మే జీవితస్యాన్తో రామో యద్యభిషిచ్యతే ॥(20)॥**

సీతాదేవి కైకమాటలుగా హనుమంతునికి వివరిస్తున్న మాటలు.

**తిలకం –** భోజనమంటే తినబడేది – తినెడి, త్రావెడి పదార్థం. మమ భోజనమ్ – నాకు సంబంధించిన భోజనమేది కలదో దానిని, న పిబేయం, న ఖాదేయం – త్రావను, తినను. ఏషః – అంటే ఈ రాముని పట్టాభిషేకము.

నా బ్రదుకునకు అంతము. (రామునికి పట్టాభిషేకం చేస్తే నేను అన్నపానాలు మాని వైచి చనిపోతాను అని కైక దశరథునితో అన్నదని సీత హనుమంతునకు చెబుతున్నది).

**దీపిక –** మమ భోజనం అన్న చోట ప్రథమా విభక్తి అర్థంలో షష్ఠీ ప్రయోగం. రామునికి అభిషేకం చేస్తే నేను భోజనము తినను, (నీరు) త్రావను అని భావం.

**ప్రాగేవ తు మహాభాగః సౌమిత్రిర్మిత్రనన్దనః ।**
**పూర్వజస్యానుయాత్రార్థే ద్రుమచీరైరలంకృతః ॥(28)॥**

లక్ష్మణుడు రామునికంటే ముందుగానే నారచీరలతో తన్ను అలంకరించుకొన్నాడని సీత హనుమంతునకు చెప్పినది.

**తిలకం –** ప్రాగేవ – ముందుగానే – నిజానికి రాముని తరువాతనే లక్ష్మణుడు నారచీరలను స్వీకరించాడు. అయినా అతని త్వరాతిశయాన్ని స్ఫురింపజేయటం కోసం 'ముందుగానే' అనే మాటను సీత ప్రయోగించింది. "మహాభాగః" – "అహం సర్వం కరిష్యామి" – నేను నీకు కావలసినదంతయు (వనంలో) చేస్తాను – అన్న ప్రతిజ్ఞననుసరించి సర్వవిధ కైంకర్యాన్ని చేయటానికి తగిన, అభిషేక విఘ్నం కారణంగా ఏర్పడిన మహాభాగ్యం సంపదగా గలవాడు. సౌమిత్రిః – 'సృష్టస్త్వం వనవాసాయ' – నీవు వనవాసం కోసమే పుట్టావు నాయనా! అని కొడుకునకు చెప్పిన తల్లి సుమిత్ర ముద్దుబిడ్డ అయినవాడు. మిత్రనందనః – ఈ లక్ష్మణుడు సర్వవిధ కైంకర్యకర్త అని అనుకూలురైన మిత్రులతో అభినందింపదగినవాడు. అలంకృతః – రామకైంకర్యానికి అనురూపమైన నారచీరలతో అలంకరింపబడినవాడు.

**దీపిక –** ఈ శ్లోకాన్ని స్పృశించలేదు.

## ముప్పైనాల్గవ సర్గము

**కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మా ।**
**ఏతి జీవన్తమానన్దో నరం వర్షశతాదపి ॥(6)॥**

నూరేండ్లకయినా బ్రతికి వున్న నరునకు ఆనందం కలుగుతుంది అనే ఈ లోకోక్తి నా విషయంలో ఇప్పుడు సత్యార్థమై భాసిస్తున్నది. (సీత భావన).

**తిలకం –** పెల్లుగా దుఃఖాలు కలుగుతున్నా రామదర్శన ప్రత్యాశతో అతికష్టం మీద జీవిస్తున్న దేవికి జీవన ఫలం లభిస్తున్నది కనుక దానిని నిరూపించే గాథను గూర్చి ప్రీతితో అనుకుంటున్నది.

**కల్యాణీ –** సత్యమైన అర్థము కలది. మా – నన్ను గూర్చి, బత – ఆహా – ఆనందాభివ్యక్తిని సూచించే అవ్యయం.

**దీపిక –** వర్షశతాదపి – నూరు సంవత్సరాల మధ్య తిలకం – నూరు సంవత్సరాల చివరికైనా అనే అర్థాన్ని స్వీకరించింది.

**కిం ను స్యాచ్చిత్త మోహోఽ యం భవేద్వాతగతిస్త్వియమ్ ।**
**ఉన్మాదజో వికారో వా స్యాదియం మృగతృష్ణికా ॥(23)॥**

సీత హనుమంతుని దర్శనం చేత నాలుగు విభ్రమపక్షాలు.

**తిలకం** – 1. **చిత్తమోహః** – రాముని క్షేమ వార్తను వినాలనే కుతూహలం చేత కందళితమైన నిరంతర చింతా పరిణతి విశేషరూపమైన ఒకానొక మనో విభ్రమం. అసత్యమైన చిత్తసంకల్పం కానీ.

**2. వాతగతిః** – ఉపవాసాదులు కలిగించిన ధాతుక్షోభ వలన ఏర్పడిన వాత ప్రకోపరూపమైన భ్రమ. లేదా దాని అధ్యారోపం గానీ. వాయువునకు దుమ్ముకణాల అధ్యారోపం వంటిది.

**3. ఉన్మాదజః** – వికారః వా – ఉన్మాదమంటే ఎడబాటులో ఉన్నవారికి కలిగే ఒకానొక అవస్థా విశేషం దానివలన కలిగిన వికారం – భ్రమ.

4. **మృగతృష్ణికా** – ఒకటి మరియొక రూపంలో కన్పట్టటం.

ఇందులో చిత్తమోహ ఉన్మాదములు ప్రకృతిలో (సమావస్థలో) లేని వానికి కన్పట్టే విశేషాలు. వాతగతి, మృగతృష్ణికలు – ప్రకృతిలో ఉన్నవానికి సంబంధించినవి.

**దీపిక** – చిత్తమోహమనే దానికి 'తిలకం' చెప్పిన అర్థాన్నే చెబుతూ అతడు పంపిన దూతను చూడటం, సంభాషించటం అనే రూపమైన భ్రమ అన్నది వాతగతి, ఉన్మాదవికారములకు తిలకం వాక్యాలనే అనువదించింది. మృగతృష్ణికా – అనే దానికి సర్వశరీరులకు సాధారణమైన దేశకాల విశేషముల చేత పుట్టే కన్నుచెదరటం వంటి భ్రమ అని అర్థం చెప్పింది.

**ఇత్యేవం బహుధా సీతా సంప్రధార్య బలాబలమ్ ।**
**రక్షసాం కామరూపత్వా న్మేనే తం రాక్షసాధిపమ్ ॥(25)॥**

**తిలకం** – రక్షసాం బలాబలమ్ – మోహత్వాదులు అబలము. రావణుని కామరూపత్వము బలము – వీనిని సంభావించి.

**దీపిక** – రక్కసుల బలము కామరూపధారణము – అబలము – రామదూత అయిన వానరుడు కూడా లంకకు రాగలగటం.

## ముప్పైయైదవ సర్గము

**క్వ తే రామేణ సంసర్గః కథం జానాసి లక్ష్మణమ్ ।**
**వానరాణాం నరాణాం చ కథమాసీ త్సమాగమః ॥(2)॥**

**తిలకం** – గురుకులవాసమునకు అయోగ్యులయిన వానరులకు, వసిష్ఠశిష్యులయిన రామాదులకు ఇట్టి సమాగం ఎలా కలిగింది అని సీత అడిగిన ప్రశ్న.

**దీపిక –** వివరణ లేదు.

**రామః కమలపత్రాక్షః సర్వసత్త్వమనోహరః ।**
**రూపదాక్షిణ్యసంపన్న ప్రసూతో జనకాత్మజే ॥(8)॥**

శ్రీరామచంద్రుని లక్షణాలను హనుమంతుడు సీతాదేవికి వర్ణించి చెబుతున్నాడు.

**తిలకం –** కమలపత్రాక్షుడు – కాంతిప్రవాహంలో సుడివలె మిక్కిలి ఆకర్షకంగా కనబడే నయనాల శోభ గలవాడు. అటువంటి నయనసౌందర్యానికి అవధి భూమి వంటివాడు. సర్వసత్త్వమనోహరుడు – తిర్యగ్జాతులమై కొమ్మ నుండి కొమ్మకు ఎగురుతూ ఉండే మా వంటివానికి కూడా చిత్తాన్ని అపహరించేవాడు. విశేషజ్ఞానంలేని వానికి కూడా మనోహరుడని తాత్పర్యం. రూపదాక్షిణ్యసంపన్నుడు. రూపం అనేది విగ్రహగుణాలను తెలియజేస్తుంది. దాక్షిణ్యం అనేది ఆత్మగుణాలకు ఉపలక్షణం. దేహగుణాలతో, ఆత్మగుణాలతో తెచ్చిపెట్టుకున్నది కాదు. పుట్టుకతో వచ్చిన విశిష్టతయే సుమా అని యీ శబ్దానికర్థం. ఏమయ్యా! ఇంత గొప్పగా పొగడుతున్నావు. ఇటువంటివాడు మరొకడు లేడా? అనే శంక కలుగుతుందని దానిని తొలగించటానికి జనకాత్మజే – ఓ జనకాత్మజా అని సంబోధిస్తున్నాడు. అంటే నీవు కూడా రాముని లక్షణాల వంటి లక్షణాలు కలదానవే అనే భావాన్ని ఈ సంబోధన అభివ్యక్తం చేస్తుంది.

**దీపిక –** రూపం అనే విగ్రహగుణాలకు ఉపలక్షణం ప్రసూతః – అనే పదం గుణాలు పుట్టుకతో వచ్చినవే అనే అర్థాన్ని ప్రతీయమానం చేస్తుంది.

దీపిక తక్కిన తిలకోక్త విషయాలను పట్టించుకోలేదు.

**అర్చిష్మా నర్చితోఽత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః । (12)**

హనుమంతుడు సీతకు వివరిస్తున్న శ్రీరాముని లక్షణాలు.

**తిలకం –** బ్రహ్మచర్యవ్రతే స్థితః – గృహస్థునకు బ్రహ్మచర్యం అంటే ఋతుకాలంలో కాక తక్కిన సమయంలో స్త్రీ సంగమాన్ని వదలిపెట్టటం. దీనిని గురించి మనువు చెప్పిన మాటలు – ఋతువు అంటే రజస్వల అయిన నాటి నుండి పదునారు దినాలు. అందులో సరి సంఖ్య గల రాత్రులందు స్త్రీ సంగమం చేయాలి. తక్కిన దినములు, పర్వదినాలయిన.. నాలుగు వదలినవాడు బ్రహ్మచారియే అవుతాడు.

**దీపిక –** బ్రహ్మచర్యవ్రతే స్థితః – అందు ప్రసిద్ధుడని అర్థము.

**స తవాదర్శనాదార్యే రాఘవః పరితప్యతే ।**
**మహతా జ్వలతా నిత్యమగ్నినేవాగ్నిపర్వతః ॥(45)॥**

సీతకు హనుమంతుడు రాముని స్థితిని గురించి చెప్పిన వాక్యం.

**తిలకం –** అగ్నిపర్వతం అనేది మేరు శిఖరంలో ఉండే ఒకానొక కొండ. భారతంలో దీనిని గూర్చి – ఈ మాల్యవంతం అనే పర్వతశిఖరం మీద ఎల్లవేళలా అగ్ని కానవస్తూ వుంటుంది. అది సంవర్తకమనే పేరుగల కాలాగ్ని – అని చెప్పారు.

**దీపిక –** అగ్నిపర్వతం అంటే అగ్నికి నెలవైన పర్వతము.

## ముప్పైయారవ సర్గము

**గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్ ।**
**భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్ ॥(4)॥**

హనుమంతుడు రాముని నుండి తెచ్చిన అంగులీయకమును గ్రహించి సంతోషమొందిన సందర్భము.

**తిలకం –** గృహీత్వా – గ్రహించి దేశాంతరము నుండి వచ్చిన బంధువును చూచినట్లు స్వయముగా ప్రీతితో దానిని గ్రహించి, ప్రేక్షమాణా – వర్తమానార్థకమైన శానచ్ ప్రత్యయము చేత నిలిపిన చూపును కదలింపనిదై అనునర్థము తెలియవచ్చును. పూర్వము హనుమంతుని రావణుడని శంకించినది. భర్తుః కరవిభూషణమ్ – పాణిగ్రహణకాలము నందు చేతితో తాకబడిన ఆభరణము. 'కరవిభూషణమ్' అనే పదంతో ఈ విషయం తెలియవస్తున్నది. భోగాతిశయం వలన ప్రణయకోపం కలిగింది. ఒకరినొకరు చూచుకొనటం, మాటలాడుకొనటం మానివేసిన దశలో రామునికి సీతతో మాటాడవలెనని కోరిక కలిగింది. అభిమానం అతిశయించిన సీత మౌనంగా వున్నది. రాముడు ఉంగరాన్ని నేలమీదకు జార్చాడు. అప్పుడు సీత ఉంగరం జారింది అని పలికింది. ప్రణయ కోపం పట్టుతప్పింది. కౌగిలింత మళ్ళీ కలిగింది. ఈ కరవిభూషణం ఇటువంటి స్థితిని కలిగించినట్టిది. భర్తారమివ సంప్రాప్తా – అంగులీయకదర్శనం వలన తన కాంతుని చేతిని స్మరించింది. ఆ స్మరణతో బాహువును, దాని స్మృతితో మొత్తము దేహాన్ని భావనాప్రకర్షం చేత అతడు తన ముందే వున్నట్లుగా భావించి ఆలింగనం చేసుకొన్నది. తల్లి అనే భావనతో వాల్మీకి మహర్షి సంప్రాప్తా ఇవ – అని మాత్రమే చెప్పారు. జననీకృతమైన భోగమును వర్ణింపరాదు గదా! జానకీ – హర్షశోకములతో పొంగుట, క్రుంగుటలు లేని కులము నందు పుట్టిన జానకి ఇప్పుడు ముదిత అయినది.

**దీపిక –** ఈశ్లోకాన్ని స్పృశించలేదు.

**ద్వివిధం త్రివిధోపాయ ముపాయమపి సేవతే ।**
**విజిగీషుస్సుహృత్ కచ్చి న్మిత్రేషు చ పరంతపః ॥(17)॥**

రాముని ఉపాయప్రయోగాన్ని గురించి సీత హనుమంతుని అడుగుతున్న సందర్భం.

**తిలకం –** పరంతపః – శత్రువులను తపింపజేయు రాముడు మిత్రేషు విషయే – మిత్రుల విషయంలో సుహృత్ సన్ – చెలిమికాడై, ద్వివిధమ్ – సామదానరూపమైన రెండు విధములుగానైన ఉపాయమును సేవించుచున్నాడా? చకారం చేత అమిత్రులను సముచ్చయం చేసుకోవాలి. అమిత్రుల విషయంలో విశేషంగా గెలుపు పొందాలనే కోరిక కలవాడై, త్రివిధోపాయమ్ – దానము, భేదము, దండము అను మూడు తీరులైన

ఉపాయమును సేవిస్తున్నాడా? సుహృత్తుల విషయంలో ఎన్నటికినీ భేద దండములను చేయరాదు. శత్రువుల విషయంలో సామోపాయం పనికిరాదు. ఈవిధంగా కాక మరియొక విధంగా అర్థం చెప్పుకొనవలసి వస్తే విజిగీషు, సుహృత్పదాలకు ప్రయోజనం మృగ్యమవుతుంది.

**దీపిక –** సుహృత్తు, పరంతపుడు అయిన రాముడు విజిగీషు వై త్రివిధోపాయమును సామదాన భేదరూపమైన దానిని, ఉపాయమపి – దండోపాయమును కూడ, మిత్రులయందు, చకారము వలన అమిత్రులయందును రెండు విధములుగా అగునట్లుగా సేవించుచున్నాడా? మిత్రులయందు సామదానములు, అమిత్రులయందు భేద దండములు అను విధముగా విభజించి ప్రయోగించుచున్నాడా? అని ప్రశ్న.

## ముప్పైయేడవ సర్గము

**స తస్మాత్పాదపా ద్ధీమానాప్లుత్య ప్లవగర్షభః ।**
**తతో వర్ధితుమారేభే సీతాప్రత్యయకారణాత్ ॥**

**తిలకం –** ఈ శ్లోకము శరీరము పెంపు కొరకు హనుమంతుడు వృక్షము నుండి దిగుటను చూపుతున్నది. దీని చేత, ఇంతకు ముందు చెట్లు నుండి దిగిన విషయానికి చెట్టుపై భాగం నుండి దగ్గరగానున్న కొమ్మ మీదికి దిగటం అర్థంగా భావించాలి. ఇప్పుడు ఆ కొమ్మ నుండి నేల మీదికి దిగటాన్ని సంభావించాలి.

**దీపిక –** పాదపాత్ – అంటే చెట్టు మొదటి నుండి ఎగిరి శరీరం పెంపొందించే పనిలో వేగం చేత చెట్ల కొమ్మలు విరిగిన ధ్వనిచేత రాక్షస స్త్రీలు తన్ను గుర్తిస్తారేమో అని తలచి ప్రక్కకు తొలగినాడని భావం.

**యదహం గాత్రసంస్పర్శం రావణస్య బలాద్గతా ।**
**అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ ॥(63)॥**

సీత హనుమంతునితో అన్నమాట.

**తిలకం –** అనీశా – స్వయముగా ఏమీ చేయటానికి అసమర్థురాలను. వినాథా – స్వామి సన్నిధానంలో లేనిదానను, వివశా – చేష్టలుడిగినదానను. (కనుక రావణుడపహరించిన సమయంలో రావణ గాత్ర స్పర్శ సంభవించి ఉండవచ్చు).

**దీపిక –** అపహరణ సమయంలో రావణుని గాత్రస్పర్శ ఎలా సంభవించింది – అంటే చెప్పుచున్నారు. భర్తృ భక్తి చేత లక్ష్మణుని స్వయంగా పంపించి వేశాను. ఈ అనర్థం లక్ష్మణుని ప్రస్థాపనం చేత కలిగినదే కానీ కామకృతం కాదు. తక్కిన అర్థాలు తిలకంలో వలెనే. విగతస్వామికా – అసన్నిహితనాథ అని అర్థం.

## ముప్పైయెనిమిదవ సర్గము

**స్త్రీత్వం న తు సమర్థం హి సాగరం వ్యతివర్తితుమ్ ।**
**మామధిష్ఠాయ విస్తీర్ణం శతయోజన మాయతమ్ ॥(3)॥**

తాను సీతను తీసుకొని పోతాననగా అమ్మవారు చెప్పిన మాటలకు సంతోషించి హనుమంతుడు పలికిన మాటలు.

**తిలకం –** మిక్కిలి విస్తీర్ణమైన నూరు యోజనాల సముద్రాన్ని నాపై అధివసించి దాటటానికి స్త్రీత్వము సమర్థము కాదు. స్త్రీ సమర్థురాలు కాదని తాత్పర్యం. లేదా సముద్రమునకు సంబంధించిన నూరు యోజనాల వ్యాప్తిని నాపై అధిరోహించి కూడా స్త్రీత్వాన్ని తొలగించుకోవటం సాధ్యం కాదు అని అర్థం. స్త్రీత్వం అంటే భయపడే లక్షణం. నాపై ఎక్కి సముద్రాన్ని దాటుతున్నా ఆభయం నీ నుండి తొలగిపోదు అని భావన.

**దీపిక –** స్త్రీత్వమ్ అన్న చోట స్త్రీవైన నీవు అని రెండు పదాలుగా విభజించి చెప్పుకోవాలి. సమర్థం అన్నచోట 'సమర్థా' అని ఉండాలి. ఆ మార్పు ఆర్షము. స్త్రీవయిన నీవు సముద్రాన్ని దాటటానికి సమర్థురాలవు కాదుగదా! అని తాత్పర్యం. స్త్రీలు భయపడే స్వభావం కలవారు కనుక అదికూడా ఒక అలంకారమే అని భావం. సాగరస్య 'నివర్తితుమ్' అని ఒక పాఠం. సాగరానికి సంబంధించిన నూరు యోజనాల విస్తీర్ణాన్ని, నాపై కూర్చుండి కూడా నిర్వహించటానికి స్త్రీవయిన నీవు సమర్థురాలవు కాదని యోచన.

**తస్యోపవనషండేషు నానా పుష్పసుగన్ధిషు ।**
**విహృత్య సలిలక్లిన్నా తవాంకే సముపావిశమ్ ॥(14)॥**

సీత హనుమంతునితో అభిజ్ఞానం కోసం వివరిస్తున్న మాటలు.

**తిలకం –** సీత తన మాటలుగా రామునకు నివేదించవలసిన మాటలను హనుమంతునకు చెప్తున్నది.

**దీపిక –** ఇక్కడ ఎదురుగా ఉన్న హనుమంతునితో మాట్లాడుతున్న సీత రాముని సంబోధించినట్లుగా 'తవాంకే సముపావిశమ్' – నీ అంకమునందు ఉంటిని. అనటం ఎలా అని శంకించరాదు. నాకు గుర్తును తెలియజేస్తూ పలకటానికి ప్రారంభించిన సీత నిన్నే అభిముఖంగా భావించి ఈ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చిందని హనుమంతుడు రామునికి నివేదించాలి – అనే ఉద్దేశ్యంతో ఇలా పలికింది.

**మమైవ దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః ।**
**సమర్థావపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ ॥(48)॥**

అభిజ్ఞానం గురించి చెప్పిన తరువాత సీత దుఃఖంతో పలుకుతున్న మాటలు.

**తిలకం –** సమర్థౌ – ఆ రామలక్ష్మణులు సమర్థులు – అంటే విరోధివర్గాన్ని పెకలించివైచి నన్ను రక్షించటానికి అనుగుణమైన శక్తి కలవారు. ఇంతకు ముందు శత్రువులను కాల్చిపారవేసినవారు. అట్టివారు, మామ్ – ప్రాణపర్యంతము రక్షణప్రవృత్తికి అర్హమైన దశను పొందిన నన్ను, చూడకున్నారు అంటే దానికి వారియందో, నాయందో ఏదైనా సంభవించి ఉండాలి. ఈరెంటిలో వారి యందు (రామలక్ష్మణుల యందు) అటువంటి నిమిత్త ప్రసక్తి ఏ మాత్రమూ లేదు. సామర్థ్యము, పరంతపత్వమూ మొదలైనవి కనబడుతున్నాయి కనుక. ఇక మిగిలిందే మిటంటే నా పాపమే దీనికి నిమిత్తం అయి ఉండాలి. లేదా మనము సర్వజ్ఞులము కాము. తెలియక ఏదో

అపరాధం జరిగి ఉంటుంది. అది ప్రారబ్ధఫలం కనుక అనుభవింపక తప్పిపోదు లేదా నేను 'కింత్వామన్యత వైదేహః' ఇత్యాదిగా మా తండ్రి నిన్ను గూర్చి ఏమనుకున్నాడో? పురుషవిగ్రహం స్త్రీని నిన్ను అల్లుడుగా పొంది – అని భగవదపచారం చేశాను. అది నిమిత్తం కావచ్చు నాయీ దుఃఖానుభవానికి. ఇదివరకు అని ఉన్నది కూడా – మునుపు దేహాంతరంలో నేనేమి పాపం చేసి ఉన్నానో – అని దేహాంతరం అంటే ఇక్కడ బాలశరీరము నందు.

**దీపిక –** వ్యాఖ్యానించలేదు.

## ముప్పైతొమ్మిదవ సర్గము

**మణిం తు దృష్ట్వా రామో వై త్రయాణాం సంస్మరిష్యతి ।**
**వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ ॥(2)॥**

**తిలకం –** త్రయాణామ్ – అన్న చోట షష్ఠి కర్మార్థంలో వచ్చింది. వివాహకాలంలో శిరోమణిని ఇవ్వటం వలన (నా) తల్లిదండ్రులను, స్వీకరించటం వలన నన్ను ఈ విధంగా మా ముగ్గురిని శ్రీరాముడు స్మరిస్తాడు అని భావం. పాణిగ్రహణోత్సవంలో నాకు అత్తమామలు శిరోభూషణంగా మొదట దీనిని ప్రదానం చేశారు. అందువలన ఆ ముగ్గురిని ఒక్కమారుగా శ్రీరాముడు స్మరిస్తాడు అని సీత చెప్పింది అని ఒకడు వక్కాణించాడు. కానీ అది అనుచితం. ఎందుకంటే ఈ మణిరత్నాన్ని వైదేహికి మా మామగారు ప్రదానం చేశారు. అది ఆమె శిరస్సుపై చక్కగా వెలుగొందుతూ ఉన్నది అని రాముడు ముందు చెప్పబోతున్నాడు. అంతేకాదు. వివాహకాలంలో రామజనని రాలేదు.

**దీపిక –** పాణిగ్రహణకాలంలో నా తల్లి ఈ రత్నాన్ని దశరథుని సన్నిధిలో జనకుని హస్తం నుండి గ్రహించి శిరోభూషణంగా నాకు యిచ్చింది. అందువలన నా తల్లిని, తన తండ్రి జనకుని, నన్ను ఏకకాలంలో రాముడు స్మరిస్తాడు అని అర్థం.

**తవాదర్శనజ శ్శోకో భూయో మాం పరితాపయేత్ ।**
**దుఃఖాద్దుఃఖ పరామృష్టాం దీపయన్నివ వానర ॥(23)॥**

**తిలకం –** దుఃఖాత్, దుఃఖపరామృష్టామ్ – పూర్వదుఃఖము కంటే అధికమైన దుఃఖముతో స్పృశింపబడిన దానిని దీపయన్ ఇవ – వృద్ధి పొందించుచున్నది వలె.

**దీపిక –** అతి దుఃఖాన్ని పొందిన దానిని అని అర్థం. ఇక్కడ పూర్వదుఃఖ విషయ ప్రస్తావన లేదు.

## నలభైయవ సర్గము

**త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర ।**
**అర్ధసంజాత సస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా ॥(2)॥**

**తిలకం –** అర్ధ సంజాత సస్యా – సగము ఉత్పన్నమైన పంటగల (వసుంధర) సగం పండిన నేలకు వర్షం వస్తే ఎంత సంతోషం కలుగుతుందో అంతగా నేను ఆనందపడుచున్నాను అని అర్థం.

**దీపిక –** అర్ధసంజాతాని – పంటకు వచ్చిన – అటుపై నీరు లేకపోవటం వలన కంకులు మాత్రం మిగిలిన సస్యంకలదైన వసుంధర దైవానుగ్రహం వలన సంపన్నమైన దృష్టితో నిండైన సస్యం కలది అయినట్లు అమృతోపమం వంటి నీ దర్శనం వలన ధరింపబడిన జీవితం కలదాన నయ్యాను – అని భావం. నీవు రాక ముందు జీవితం నశించిపోయిందనే స్థితిలో ఉన్నాను. ఇప్పుడు మరల క్రొత్త జీవితం పొందినదానను వలె అయ్యాను – అని తాత్పర్యం.

దీపికలో ఇచ్చిన వివరణ తిలకంలో లేదు.

**మనశ్శిలాయాస్తిలకో గండపార్శ్వే నివేశితః ।**
**త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి ॥(5)॥**

**తిలకం –** తిలకే ప్రణష్టే – నేను ముందు పెట్టుకొన్న తిలకం జారిపోగా మనశ్శిలతో నీవు నా గండ స్థల మందు తిలకం పెట్టిన సంగతిని నీవు స్మరించు – అని రామునితో చెప్పవలసినదిగా సీత హనుమంతునకు చెప్పినది.

**దీపిక –** నా తిలకము జారిపోగా నీవు మనశ్శిలతో నా గండభాగం మీద పెట్టిన తిలకాన్ని స్మరించు. అది ఒక అభిజ్ఞానము అని భావం.

## నలబైయొకటవ సర్గము

**అల్పశేషమిదం కార్యం దృష్టేయమసితేక్షణా ।**
**త్రీనుపాయానతిక్రమ్య చతుర్థ ఇహ దృశ్యతే ॥(2)॥**

**తిలకం –** 'అభిగమ్య తు వైదేహీం నిలయం రావణస్య చ' వైదేహిని సమీపించటం రావణుని నిలయం తెలుసుకోవటం అనే రెండు కార్యాలలో సీతాదర్శనరూపమైన కార్యం పూర్తి అయినది. ఈ పని – అంటే రావణ నిలయ పరిజ్ఞాన రూపమైన, అల్పశేషమ్ – కొంచెముగా మిగిలియున్నది. అంతఃపురముతో కూడిన లంకనంతటిని చక్కగా పరిశీలించి ఉన్నప్పటికీ రాక్షసుల బలాబలాలను, రావణుని హృదయాన్నీ ఈ మొదలైన వానిని తెలియలేదు కనుక కార్యము కొంచెంగా మిగిలి వున్నదని హనుమంతుని భావం. ఈపనిలో – అంటే రాక్షసుల బలం, రావణ హృదయ పరిజ్ఞానం – అనే పనిలో మూడు ఉపాయాలను సామ దాన భేదములను, దాటి – కాక దండమునే ప్రయోగించాలి – అని హనుమంతుడు సంభావించాడు.

**తిలకం–** ఇక్కడ పనులు రెండు. దేవీదర్శనం పరబలాదుల పరిజ్ఞానము. అందులో దేవీదర్శనం అనే గొప్పది, ప్రధానమైనదీ అయిన పని నెరవేరినది. రెండవది ఆనుషింగికం కనుక కొంచెముగా మిగిలినదని సంభావించాడని భావం.

**సా విహ్వలా శోకలతాప్రతానా వనస్థలీ శోకలతాప్రతానా ।**
**జాతా దశాస్య ప్రమదావనస్య కపే ర్బలాద్ధి ప్రమదావనస్య ॥(20)॥**

**తిలకం –** దేనిని గురించి శోకిస్తారో అది శోకము – ప్రతానము అంటే సముదాయము. అశోకము అంటే శోచ్యము కానిది అశోచ్యమైన లతాప్రతానము కలది అశోకలతాప్రతాన (వనస్థలి). దశాస్య ప్రమదావనము – దశాస్యుని వనితలకు భోగవర్ధనము కనుక అవనము – రక్షకము అది ఇప్పుడు కపిబలం వలన విహ్వల – విరిగి ముక్కలయినది కనుక శోకమనే లతల సముదాయం కలదిగా అయినది అని భావం. లేదా శోకలతలు అంటే శోకరతలు – రలలకు అభేదం కనుక. అప్రృతానములు అంటే నీటి యందలి ప్రతానములు – కమలములు, కలువలు తీగలు కలవి అంటే వాడిపోయిన జలజములు కలవి అని అర్థం. ప్రమదావనస్య – సీతారూప ప్రమదను పాలిస్తున్న వనస్థలి – కపిబలం వలన విహ్వల అయినది అని తాత్పర్యం.

**దీపిక –** ప్రమదావనం అంటే అంతఃపుర విహారవనం అని అర్థం. అది దశాస్య ప్రమదావనం రావణుని స్త్రీలకు భోగసంవర్ధనం ద్వారా అవనమైనది – రక్షకమైనది. అశోకలతాప్రతాన – అశోకలతల సముదాయము. శోకలతా ప్రతాన అయినది – శోకించటానికి యోగ్యమైన లతల సముదాయము కలది – అయినది (కపిబలం వలన).

## నలభైరెండవ సర్గము

**అహమప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయమ్ ।**
**వేద్మి రాక్షసమేవైనం కామరూపిణమాగతమ్ ॥(10)॥**

**తిలకం –** ఇది అసత్యోక్తిగా పరిగణింపదగినది కాదు. ఏమంటే వివాహ కాలంలో, రతి సంప్రయోగంలో ప్రాణ సంకట పరిస్థితిలో, సర్వధనము కోల్పోయే సందర్భంలో, మిత్రుని కార్యవిషయంలో – జనులు అసత్యం పలుకుతారు. ఇవి పాతకం కలిగించని అనృతాలు అని తత్త్వజ్ఞులు చెబుతారు కనుక.

**దీపిక –** అస్య – అస్మాత్ – ఇతని వలన భీతురాలను అని మాత్రమే వివరించింది. ఋతానృత నిర్ణయం జోలికి పోలేదు.

**న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా ।**
**అస్మాభి ర్బహుధా పృష్టా నివేదయితుమిచ్ఛతి ॥(14)॥**

**దీపిక –** 'న నివేదయితు మిచ్ఛతి' అనటం చేత అతడెవరో ఆమెకు తెలుసును అని వారి అభిప్రాయమనే విషయాన్ని గురించి తిలకం వివరణ ఇవ్వలేదు.

**హనుమానపి తేజస్వీ శ్రీమాన్ పర్వతసన్నిభః । (30)**

**తిలకం –** 'శ్రీమాన్' అనటం తత్కాలంలో పుట్టిన హర్షాతిరేకం చేత కలిగిన కాంతిని తెలియజెప్పుటకోసం.

**దీపిక –** దీనిని స్పృశించలేదు.

**రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ।**
**రామస్య అక్లిష్ట కర్మణః ॥(33, 34)॥**

**తిలకం –** అభిపాలితః – గొప్పగా పూర్తిగా రక్షింపబడినవాడు (సుగ్రీవుడు) వాలివధచేత అని భావం. అక్లిష్టకర్మణః – అనటం చేత తన దాస్యం కర్మకృతం కాదు. స్వరూపప్రయుక్తమైనది అని అర్థం.

**దీపిక –** తన జయం కోసం స్వామిని స్తుతిస్తున్నాడు.

## నలబైమూడవ సర్గము

**ఆరురోహ హరిశ్రేష్ఠో హనుమాన్మారుతాత్మజః ।**
**ఆరుహ్య గిరి సంకాశం ప్రాసాదం హరియూథపః ॥**
**బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః ॥(4)॥**

**తిలకం –** హరియూథములకు పతి అయినా 'అహరి' కావచ్చును అని దానిని కాదనటం కోసం హరిశ్రేష్ఠుడు అన్నారు. ప్రతిసూర్యుడంటే రెండవ సూర్యుడు – దీని చేత సూర్యోదయాన్ని సూచిస్తున్నారు.

**దీపిక –** వివరణ లేదు.

**దశనాగబలాః కేచిత్ – ఇత్యాది (22)**

**తిలకం –** తనకంటే వేరైన వానరశ్రేష్ఠులను పేర్కొనటం రాక్షసులకు ఉత్సాహభంగం చేయటానికి

**దీపిక –** రాక్షసుల హృదయాలను చీల్చి వేయటానికి 'మాదృశానాం సహస్రాణి' ఇత్యాది వాక్యాలు హనుమంతుడు చెప్పాడు.

## నలబైనాల్గవ సర్గము

**ధనుశ్చక్రధనుః ప్రఖ్యం మహద్రుచిరసాయకమ్ ।**
**విస్ఫారయానో వేగేన వజ్రాశనిసమన్వయమ్ ॥**

**తస్య విస్ఫారఘోషేణ ధనుషో మహతా దిశః ।**
**పదిశశ్చ నభశ్చైవ సహసా సమపూర్యత ॥(3,4)॥**

**తిలకం –** రుచిరసాయకమ్ అంటే రుచిరమైన సాయకములకు అర్హమైనది (ధనస్సు). విస్ఫారయానః విస్ఫారయమాణః అనే దానికి ఆర్షప్రయోగం అల్లెత్రాటిని లాగుచూ అని అర్థం. నభః సమపూర్వత. సమపూర్యన్త – అని వచనాన్ని మార్చుకొని అర్థం చెప్పుకోవాలి.

**దీపిక –** సమపూర్యత దిక్కులు మొదలగు వాని సముదాయాన్ని సూచిస్తూ ఏకవచనప్రయోగం చేశారు.

**తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ ।**
**న ధను ర్నరథో నాశ్వాస్తత్రాదృశ్యంత నేషవః ॥(17)॥**

హనుమంతుడు జంబుమాలి వెడద రొమ్ము మీద పరిఘను పడవేయగా అతనితల, చేతులు, పిక్కలు, ధనస్సు, రథము, గుఱ్ఱములు కన్పట్టలేదు. (అన్నీ ఒక్కపెట్టున నుగ్గునుగ్గయిపోయాయని భావం).

**తిలకం–** ఇక్కడ అశ్వ శబ్దం చేత ఖరాలను గ్రహించాలి. అతడు ఖరములు పూన్చిన రథంతో వచ్చినట్లు చెప్పిన కారణంగా.

దీపిక పై అభిప్రాయాన్నే తెలిపింది.

## నలభైయైదవ సర్గము

**మహాబలపరీవారా ధనుష్మన్తో మహాబలాః ।**
**కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః పరస్పరజయైషిణః ॥(2)॥**

**తిలకం –** కృతాస్త్రా అస్త్ర విదాం శ్రేష్ఠాః అని ఉండాలి. 'కృతాస్త్రాస్త్ర' అనటం ఆర్షం.

**దీపిక –** ఈ వ్యాఖ్యానం 'కృతాస్త్రాస్త్ర విదాం' అని సమాసరూప పదంగా భావించి కృతాస్త్రులలో, అస్త్రవిదులలో శ్రేష్ఠులు అని అర్థం చెప్పింది.

అలాగే 'పరస్పరజయైషిణః' అనే పదానికి

**తిలకం –** ఒక్కొక్కడు హనుమంతుని గెలిచే కోరిక కలవారు అని అర్థం చెప్పింది.

**దీపిక –** నేను నేను అనే భావనతో ఒకరి కంటే ఒకరు మించవలెననే ఉత్సాహాతిశయం కలవారనే అర్థం చెప్పింది.

**తలేనాభ్యహనత్కాంశ్చిత్ పాదైః కాంశ్చిత్ పరంతపః । (12)**

**తిలకం –** పాదైః – అని బహువచనంతో వ్యవహరించటం వానరములను ద్విపాత్తుల యందూ, చతుష్పాత్తులయందునూ గ్రహించటం వలన సరిపడుతుంది.

**దీపిక –** దీనిని పట్టించుకోలేదు.

## నలభైయారవ సర్గము

**హతాన్ మన్త్రిసుతాన్ బుద్ధ్వా వానరేణ మహాత్మనా ।**
**రావణ స్సంవృతాకార శ్చకార మతిముత్తమామ్ ॥(1)॥**

మహాత్ముడగు వానరుడు తన మంత్రులను చంపిన విషయం తెలిసికొని రావణుడు సంవృతాకారుడై ఆలోచించాడు.

**తిలకం –** సంవృతాకారుడంటే అంతర్మనస్కుడు.

**దీపిక –** సంవృతాకారుడు గూఢాకారుడు. లోపల పుట్టిన శంక కలవాడని అర్థం.

**నావమాన్యో భవద్భిశ్చ హరిర్ధీర పరాక్రమః । (9)**

**తిలకం –** ఇక్కడితో పదమూడు వేల శ్లోకాలు పూర్తి అయ్యాయి. పదునాలుగవ వేయి శ్లోకం మొదలు. ఇందులో 'ధీ' అనే గాయత్రీ మంత్రం పదునాలుగవ అక్షరం నిక్షిప్తం.

**దీపిక –** 'ధీ' అనే గాయత్రి మంత్రపు పదునాలుగవ అక్షర 'నావమాన్య' అనే శ్లోకపు పదకొండవ అక్షరంతో సంగ్రహింపబడుతున్నది.

**తోరణస్థం మహోత్సాహం మహాసత్త్వం మహాబలమ్ ।**
**మహామతిం మహావేగం మహాకాయం మహాబలమ్ ॥(18)॥**

రావణుని పంచసేనాగ్రయాయులు హనుమంతుని చూచిన సందర్భం.

**తిలకం –** ఉత్సాహమంటే లోకోత్తర కార్యాలయందు సుస్థిరమైన ప్రయత్నం. అదికలవాడు మహోత్సాహుడు. మహాసత్త్వుడు అంటే గొప్ప నిర్ణయశక్తి కలవాడు. శ్లోకంలో బల శబ్దం రెండు చోట్ల ప్రయోగింపబడింది. రెండవ బలం శక్తివాచకం.

**దీపిక –** సత్త్వమంటే చిత్తం.

## నలబైయేడవ సర్గము

**స మన్దరాగ్రస్థ ఇవాంశుమాలికో**
**వివృద్ధకోపో బలవీర్యసంయుతః ।**
**కుమారమక్షం సబలం సవాహనం**
**దదాహ నేత్రాగ్ని మరీచిభి స్తదా ॥(17)॥**

**తిలకం –** మందరాగ్రస్థః – మందరమనేది భూమధ్య పర్వతం. దాని అగ్రమందు అంటే మధ్యాహ్న కాలమందలి సూర్యుడని ఉగ్రత్వాన్ని చెప్పటం. రామానుజీయం – మందర అంటే సాలగ్రామ పర్వతం ఉత్తరభాగం నందలి భారత ఖండ మధ్యలో ఉండే ఒకానొక పర్వతం. దాని శిఖరం మీద ఉన్న సూర్యుడు. దీని చేత ఉత్తరాయణంలో మధ్యాహ్నగతుడైన సూర్యుని చెప్పినట్లయినది.

**దీపిక –** మధ్యాహ్న గతత్వమును చెప్పినారు (మందరాగ్రస్థ శబ్దం చేత).

**ఇతి ప్రవేగం తు పరస్య తర్కయన్ ।**
**స్వకర్మయోగం చ విధాయ వీర్యవాన్ ॥(30)॥**

**తిలకం –** పరదు – శత్రువైన అక్షుని ప్రవేగాన్ని, తర్కయన్ – ఆలోచిస్తూ, స్వకర్మయోగం, విధాయ – యుద్ధం చేయవలసిన క్రమాన్ని సంకల్పించి, మొదట గుఱ్ఱాలను చంపి తరువాత రథాన్ని విరగగొడతాను అని నిశ్చయించాడని తాత్పర్యం.

**దీపిక –** స్వకర్మయోగాన్ని – తన కర్తవ్యాన్ని నిర్ణయించుకొని అని అర్థం.

## నలభైయెనిమిదవ సర్గము

**న తేఽ స్త్యశక్యం సమరేషు కర్మణా న తేఽ స్త్యకార్యం మతిపూర్వమంత్రణే ।**
**న సోఽ స్తికశ్చిత్త్రిషు సంగ్రహేషు వై న వేద యస్తేఽ స్త్రబలం చ సంయుగే ॥(5)॥**

రావణుడు ఇంద్రజిత్తును ప్రశంసిస్తున్న సందర్భం.

**తిలకం –** సమరములందు నీ పురుషకారంతో అశక్యమైనది లేదని అర్థం. అలాగే మతిపూర్వ మంత్రణ మందు అంటే వివేకపూర్వ విచారమందు అకార్యం – అజ్ఞాతకార్యము – తెలియుటకు అశక్యమైన కార్యము లేదని భావం. సంగ్రహేషు – భోగ్యత్వముతో భోక్తలచేత సంగ్రహింపబడతాయి కనుక సంగ్రహములంటే లోకములు అట్టి త్రిషు – మూడింటి యందును, నీ అస్త్ర బలమును శారీర బలమును తెలియనివాడు లేడు. సర్వలోక ప్రఖ్యాత శస్త్రాస్త్ర బలసంపన్నుడవని అర్థము.

**దీపిక –** కర్మణా అంటే పరాక్రమం చేత, అకార్యం – అకార్య విషయజ్ఞానం లేదని అర్థం. బలం అంటే స్వాభావిమైన బలమని అర్థం.

**న వీర సేనాగణశో చ్యవంతి న వజ్రమాదాయ విశాలసారమ్ ।**
**న మారుతస్యాస్య గతేః ప్రమాణం న చాగ్నికల్పః కరణేన హన్తుమ్ ॥(12)॥**

రావణుడు ఇంద్రజిత్తుతో అంటున్న మాటలు

**తిలకం –** ఓయి వీరుడా! గణములను శోకింపజేయు ఒక్కమారుగా పెక్కంద్రను చావగొట్టు హనుమంతుని విషయమున సేనలు, న అవంతి – రక్షింపవు. ఒక్క మారుగా అనేకులను వినాశము చేయువాని యందు సేన పనికిమాలినది అని అర్థము. అందువలన సేనలతో కలసి వెళ్ళవద్దు అని భావము. హనుమంతుని విషయంలో వజ్రము – అల్పసారమైన వజ్రమును గైకొని పోరాదు. ఇతని గతి ప్రమాణము మారుతమునకు కూడ లేదు. మారుతము కంటే అతిశయితమైన గతి ప్రమాణము కలవాడని అర్థము. అగ్నికల్పుడైన హనుమానుడు కరణముతో ముష్టి మొదలగు వానితో చంపుటకు సాధ్యుడు కాడు. అగ్నికల్పుని యందు ముష్ట్యాది ప్రహారమునకు ప్రవృత్తి కలుగదని భావము.

**దీపిక –** 'న మారుతస్య' ఇత్యాది. మారుతి సర్వదిగ్గమనశీలుడు కనుక ఏ దిక్కునుండి వచ్చి దెబ్బకొట్టునో ఎవనికిని తెలియదని భావము. లేదా హనుమంతుని గతి ప్రమాణము మారుతునకును లేదని భావము. అందువలన, అలసారమ్–మొక్కవోయిన అంచు గల, వజ్రమ్–వజ్రమును, ఆదాయ–కైకొని, న విశ–రణమున ప్రవేశింపకుము.

**న ఖల్వియం మతిః శ్రేష్ఠా యత్త్వాం సంప్రేషయామ్యహమ్ ।**
**ఇయం చ రాజధర్మాణాం క్షత్రస్య చ మతిర్మతా ॥(13)॥**

**తిలకం –** నేను నిన్ను యుద్ధమునకు పంపుతున్నాను అనే తలపు శ్రేష్ఠమైనది కాదు. కానీ రాజనీతి స్వరూప ధర్మములకు, వాని ననుష్ఠించు క్షత్రియునకు ఉచితమే. బాలుని పంపటం అనుచితమే అయినా తన

వారు ఉండగా ప్రధాన పురుషుడు వెళ్ళటం నీతిశాస్త్రవిరుద్ధమని నిన్ను పంపక తప్పటం లేదని నా అభిప్రాయం అంటున్నాడు రావణుడు.

**దీపిక –** నేను నిన్ను పంపుతున్నాను అనే మతి ఏది ఉన్నదో అది ఉచితమైనది కాదు. కానీ రాజనీతి రూప ధర్మములకు, వాని నాచరించు క్షత్రియునకు అది ఉచితమే అని అభిప్రాయం.

**తతస్తు లక్ష్యే స విహన్యమానే శరేష్వమోఘేషు చ సంపతత్సు ।**
**జగామ చింతాం మహతీం మహాత్మా సమాధిసంయోగసమాహితాత్మా ॥(34)॥**

ఇంద్రజిత్తు హనుమంతునితో పోరాడు సందర్భము.

**తిలకం –** అమోఘములైన శరములు మీద మీద పడుతున్నప్పటికీ లక్ష్యభూతుడైన హనుమంతుడు వానినుండి విడుదల పొందుచుండగా సమాధి సంయోగ సమాహితాత్ముడైన – అప్రమత్తచిత్తుడైన ఆ మహాత్ముడు ఇంద్రజిత్తు గొప్పచింతలోనికి చేరుకొనెను.

**విహన్యమానే సతి –** గత్యర్థకమైన హన ధాతువునకు కర్మకర్త్రర్థమున లట్ ప్రత్యయమునకు శానచ్ ఆదేశం రాగా ఈ రూపం ఏర్పడుతుంది.

సమాధి సంయోగ సమాహితాత్మా – సమ్యగాధీయత ఇతి సమాధిః – అంటే లక్ష్యం. దానియందు సంయోగం అంటే శరసంధానం – దానియందు సమాహితమైన ఆత్మ కలవాడు.

**దీపిక –** పై అభిప్రాయాలనే అనువదించింది. లక్ష్యసంధాన శరసంధాన దత్తచిత్తుడని సమాధి సంయోగ సమాహితాత్మ శబ్దానికి అర్థం.

## నలభైతొమ్మిదవ సర్గము

**తత స్సకర్మణా తస్య విస్మితో భీమవిక్రమః ।**
**హనుమాన్ రోషతామ్రాక్షో రక్షోఽధిపమవైక్షత ॥(1)॥**

పట్టువడిన హనుమ కోపతీవ్రత.

**తిలకం –** యుద్ధం కోసం రావణుడు రావాలి అని నేను ప్రయత్నం చేశాను. కానీ ఆ నీతివేత్త ఆసనమందు ఉండియే ఇంద్రజిత్తు ద్వారా నన్ను బంధించి తెచ్చాడని ఆ పనితో విస్మయం కలిగినవాడయ్యాడని హనుమంతుడు తీవ్రకోపం కలవాడయ్యాడు.

**దీపిక –** సింహాసనం నుండి కదలకయే బ్రహ్మాస్త్రంతో తన్ను బంధించిన కర్మముతో హనుమంతుడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

**మంత్రిభి ర్మన్త్రతత్త్వజ్ఞై రన్యైశ్చ శుభబుద్ధిభిః ।**
**అన్వాస్యమానం రక్షోభి స్సురైరివ సురేశ్వరమ్ ॥(13)॥**

**తిలకం –** మంత్రిభిః – ప్రశస్తమైన మంత్రము గల వారి చేత, అందువలన 'సచివైః' అనే మాటతో పునరుక్తి ఏర్పడదు.

**దీపిక –** మంత్రి అంటే బుద్ధి సహాయుడు, సచివుడు కార్యసహాయుడు.

**యాభైయవ సర్గము**

**యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా ।**
**సోఽయం వానరమూర్తి స్స్యాత్కింస్విద్బాణోఽపి వాఽసురః ॥3॥**

**తిలకం –** బాణుడు మహాబలిసుతుడు. దీనిచేత – ఇక్కడి అతని ప్రస్తావన చేత బాణుడు కూడా రావణుని కొంచెంగా శపించాడని తెలియవస్తున్నది.

**దీపిక –** శప్తః – నా ముఖంతో సమానమైన ముఖం కలవారిచేత నీకు నాశం సంభవిస్తుందని నంది శపించాడు. లేదా ఇతడు మహాసురుడైన బలిసుతుడు బాణుడా అని భావించాడు.

దీపిక బాణాసురుని శాప విషయాన్ని భావించలేదు.

**ఏవముక్తో హరిశ్రేష్ఠ స్తదా రక్షో గణేశ్వరమ్ । (12)**

**తిలకం –** 'రక్షోగణేశ్వరమ్' అనటం చేత తన్ను ప్రశ్నిస్తున్న ప్రహస్తుని లెక్కచేయకుండా నేరుగా రావణునితో హనుమంతుడు మాటలాడినాడని అర్థం.

**దీపిక –** వివరణ లేదు.

**విముక్తో హ్యహమస్త్రేణ రాక్షసైస్త్వభిపీడితః ।**
**కేనచిద్రాజకార్యేణ సంప్రాప్తోఽస్మి తవాన్తికమ్ ॥(19)॥**

**తిలకం –** నా దర్శనం ప్రయోజనం ఏమి? అని రావణుని విచికిత్సకు ఇందులో సమాధానం చెబుతున్నారు.

**దీపిక –** అస్త్ర విముక్తుడనైనా కార్యవశం వలన బుద్ధిపూర్వకంగానే నేను వీరి చేత (రక్కసుల చేత) పీడింపబడుతున్నాను కనుక ఇది నాకు లాఘవాన్ని కలిగించే విషయం కాదని భావం.

**యాభైయొకటవ సర్గము**

**అహం సుగ్రీవసందేశా దిహప్రాప్త స్తవాలయమ్ ।**
**రాక్షసేన్ద్ర హరీశస్త్వాం భ్రాతా కుశలమబ్రవీత్ ॥(2)॥**

హనుమంతుడు రాక్షస చక్రవర్తితో మాట్లాడటం ప్రారంభించిన సందర్భం.

**తిలకం –** నేను రామదూతనే. సందేశం మాత్రం సుగ్రీవునిది. సుగ్రీవ సందేశాత్ – సుగ్రీవ సందేశం కారణంగా సందేశం అందించటం కోసం అని అర్థం. భ్రాతా – సోదరుని వలె హితకరుడైన సుగ్రీవుడు నీ కుశలం

అడుగుతున్నాడని భావం. నిజానికి సుగ్రీవుడు ఏ సందేశమూ ప్రత్యేకంగా పంపలేదు. అయినా దూత చెప్పిన సర్వమూ స్వామి చెప్పినట్టిదే అనే ఆశయంతో హనుమంతుడు ఈ మాట అన్నాడు.

**దీపిక –** భ్రాతా – వాలి రావణులకు సఖిత్వ సంబంధం ఉండటం వలన భ్రాతృత్వం.

**సముద్రం లంఘయిత్వైవ తాం దిదృక్షు రిహాగతః ।**
**భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా ॥(16)॥**

**తిలకం –** సీతాయాస్తు కృతే – సీతను పొందటం కోసం సీతను దర్శించటం కోసం సముద్రం దాటి వచ్చాను అని అర్థం. ఆమెను నీ యింటిలో చూచాను.

**దీపిక –** 'తాం' అనే పదాన్ని త్వాం గా ఈ వ్యాఖ్య స్వీకరించింది. త్వామ్ అంటే సుగ్రీవుని సోదరుడవైన నిన్ను అతనిని రావణుని చూస్తే సర్వలోకవృత్తాంతాలను తెలిసినవాడైన అతడు నీకు సీతాగతిని తెలియజేస్తాడు అని సుగ్రీవుడు చెప్పి ఉన్నాడు కనుక రావణుని చూచు కోరికతో అనేది కుదురుతున్నది. దైవవశం చేత కుంటివాని మీద గంగ వచ్చిపడినట్లు నీ యింటిలో తిరుగుతున్న నాకు సీతాదేవి కనపడింది.

**తత్త్రికాలహితం వాక్యం ధర్మ్యమర్థానుబంధి చ ।**
**మన్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్ ॥(21)॥**

హనుమంతుడు రావణునకు చేసిన హితబోధ.

**తిలకం –** సీతను తిరిగి అప్పగించకపోతే అధర్మమును కలిగిస్తుంది కాబట్టి, రామునికి చేసిన అపరాధాన్ని తొలగించుకోవటానికి అవకాశం ఉంది కాబట్టి నీవు సీతను రామునికి తిరిగి ఇచ్చివేయాలి.

**త్రికాలహితమ్ –** భూత భవిష్యద్వర్తమానకాలాలలో హితమైన దానిని, మన్యస్వ – భావించు. దారుణమైన అధర్మము నిన్ను, నీ పూర్వ పురుషులను నాశనం చేస్తుంది కనుక దానిని పరిహరించటం అనేది భూతకాలానికి సంబంధించిన హితం.

**దీపిక –** త్రికాల హితమ్ –సీతను ఇట్లు చెరపట్టకపోవటం వలన పూర్వం చేసిన తప్పు తప్పిపోతుంది. దాని వలన ఇప్పటి ఐశ్వర్యం చెడకుండా ఉంటుంది. అది భావిశుభానికి కారణం అవుతుంది. ఆవిధంగా త్రికాలహితం.

**న తు ధర్మోపసంహార మధర్మఫలసంహితం తదేవ ఫలమన్వేతి ధర్మశ్చాధర్మనాశనః ।**
**ప్రాప్తం ధర్మఫలం తావద్భవతా నాత్ర సంశయః ఫలమస్యాప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే ॥(29)॥**

రావణునకు హనుమంతుడు చేసిన హితబోధలోని వాక్యాలు.

**తిలకం–**ఇక్కడ తుశబ్దం పైని చెప్పిన శంకను మరలించేది. ధర్మోపసంహారం అంటే దీని చేత ధర్మం ఉపసంహరింపబడుతుంది కనుక ధర్మఫలం. ఫలం లభించిన తరువాత ధర్మమును ఉపసంహరిస్తారు కదా! అది – అంటే ధర్మఫలం అధర్మఫలసంహితం కాదు. అంటే ధర్మఫలం అధర్మఫలంతో కూడినది కాదు. ఎందుకంటే

అది ధర్మఫలాన్ని అనువర్తిస్తుంది. అధర్మము ఉండగా దాని ఫలాన్ని అనుసరించకపోవటం ఎలా జరుగుతుంది అంటే చెబుతున్నారు. ధర్మము అధర్మాన్ని నశింపజేస్తుంది కనుక అని, అధర్మానికి విరుద్ధమైన ధర్మము మేలుకొని ఉంటే అధర్మవార్త అయినా ఎలా ఉంటుంది? 'ధర్మేణ పాపమపనుదతి' ధర్మము చేత మానవుడు పాపాన్ని తొలగించుకుంటాడు – అని వేదవాక్యం. ఈ అర్థాన్ని ప్రతిపాదిస్తుంది. ఒకవేళ వ్యత్యయం కలుగదా? అని శంకింపరాదు. అంటే అధర్మం ధర్మాన్ని నశింపజేయదా అని శంకింపరాదు. అనటం కోసం అవధారణార్థంలో 'చ' అనే శబ్దాన్ని ప్రయోగించారు. ధర్మమే అధర్మాన్ని నశింపజేస్తుంది కానీ అధర్మం ధర్మాన్ని నశింపజేయదు అని తాత్పర్యం. శ్రుత్యర్థం కుడా అదే కదా! అధర్మవిషయంలో ప్రమాణం లేదు. అయితే ధర్మం అధర్మనాశకం అంటే ప్రాథమికమైన ధర్మమే అధర్మాన్ని నశింపజేస్తుంది కానీ ఇప్పుడు క్రొత్తగా చేసే ధర్మం అధర్మాన్ని నశింపజేయదు అని శంకపట్టువచ్చుననే దృష్టితో 'తావత్' అనే పదాన్ని ప్రయోగించారు. ఆశబ్దం ఇక్కడ కార్త్స్న్యవాచి అంటే సమస్తమైన అధర్మాన్నీ నాశనం చేస్తుందని భావం. కాబట్టి నీవు ఇప్పుడు చేసే ధర్మమైనా నీ సీతాపహరణరూపమైన అధర్మాన్ని నాశనం చేస్తుందని తాత్పర్యం. కాబట్టి అతిశీఘ్రంగా సీతను రామునికి అప్పగించటం అనే ధర్మాన్ని ఆచరించు అని ఉపదేశం. లేకపోతే ఇప్పటికిప్పుడు నీకు వినాశం సంభవిస్తుంది అని హెచ్చరిక. ఇక్కడ కర్తవ్యంగా హనుమంతుడు విధిస్తున్నది సీతను రామునకు అప్పగించటం ద్వారా రాముని శరణాగతి పొందటం అనేది.

**దీపిక –** అవునయ్యా! నేను సంపాదించిన గొప్పదైన ధర్మమే నన్ను కాపాడుతుంది అని శంకించి రోగము, రాజ్యలాభము అనువాని వలె ధర్మాధర్మఫలములు రెంటినీ కలిపి అనుభవిస్తానా? లేక అధర్మాన్ని బాధించి ధర్మ ఫలానుభవాన్నే పొందుతానా? అనే రెండు పక్షాలను హనుమంతుడు రావణపరంగా ఊహించి సమాధానం చెబుతున్నాడు. అందులో మొదటిదానిని కాదంటున్నాడు. ధర్మోపసంహారము – అంటే ధర్మఫలమైన సుఖము అధర్మఫల సంహితం కాదు. అధర్మఫలం అయిన దుఃఖంతో కలసి అనుభవింపబడదు. తీవ్రతపస్సు అనే ధర్మము, పరదారాపహరణము అనే అధర్మము అనే రెండింటి ఫలాలైన అవధ్యత్వము, వధ్యత్వము అనేవి రెండూ కలిసి ఉండటానికి వీలు లేదు. రోగానుభవ, రాజ్యానుభవాల వలె ఏకకాలంలో అవి అనుభవించదగినవి కావు – ఇది మొదటి పక్షాన్ని కాదన్నదని వాదన.

ఇంక రెండవ పక్షాన్ని దూషిస్తున్నారు. తత్ ధర్మఫలమేవ అన్వేతి – ధర్మఫలం ధర్మఫలాన్నే అనుసరిస్తుంది. ఈ వ్యాఖ్య ధర్మశ్చాధర్మనాశనః – అనే పాఠాన్ని కాక ధర్మో నాధర్మనాశనః అనే పాఠాన్ని గ్రహించింది. ధర్మము అధర్మ నాశనము కాదు. అధర్మాన్ని బాధించు ధర్మఫలానుభవం కుదరదు అని భావం.

లేదా, ఎవరి నుండి అవధ్యత్వాన్ని నీవు ప్రార్థింపలేదో వారి నుండి కూడా పూర్వం సంపాదించిన మహా సుకృత సంచయమే రక్షిస్తుంది అనుకుంటున్నావేమో. అలా అయితే నీవు చేసిన అధర్మం, తుల్యన్యాయానన్ననుసరించి, నిన్ను నాశనం చేస్తుంది కదా! ఎందుకంటే ధర్మఫలం అధర్మఫలం అనేవి రెండూ విరుద్ధ విషయాలు కనుక అని రెండూ విడివిడిగా అనుభవింపదగినవే. పూర్వకృతమైనధర్మం ఇప్పుడు చేసిన అధర్మానికి నాశకం కాదని భావం చకారంవలన అధర్మం కూడా ధర్మనాశనం కాదనే అర్థం లభిస్తుంది. ధర్మాధర్మాలు అనుభవం చేత మాత్రమే

నశిస్తాయని భావం. అయితే గొప్ప పుణ్యఫలం అనుభవం ముగిసిన పిదప అధర్మఫలానుభవం కలుగుతుందని అనుకోకూడదు. నీ ధర్మఫలం అంతా (తావత్) ఇంతకు ముందే అనుభవానికి వచ్చింది. ఇప్పుడు సీతాహరణ రూపమైన అధర్మం ఫలితానికి వస్తున్నది – అని భావం.

ఈ శ్లోకాలకు సంబంధించి తిలకం ధర్మఫలం అధర్మఫలాన్ని పోగొడుతుంది కనుక ధర్మం – సీతను వదిలి పెట్టటం అనే రూపమైన దానిని నీవు చేయాలి అనే అర్థాన్ని ప్రతిపాదిస్తున్నది. దీపిక నీవు చేసిన ధర్మం అధర్మాన్ని పరిహరించటం ద్వారా నిన్ను కాపాడదు. కాబట్టి సీతాదేవిని రామునికి అప్పగించి ధర్మం చేసి ఆ ఫలాన్ని అనుభవించు అని చెబుతున్నది.

**బ్రహ్మ స్వయంభూ శ్చతురాననో వా రుద్ర స్త్రినేత్ర స్త్రిపురాంతకో వా ।**
**ఇన్ద్రో మహేన్ద్ర స్సురనాయకో వా త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్ ॥ (45)**

హనుమంతుడు రావణునితో అన్నమాట. స్వయంభువు, చతురాననుడు అయిన బ్రహ్మగానీ, త్రిపురాంతకుడు, త్రినేత్రుడు అయిన రుద్రుడు గానీ సురనాయకుడైన ఇంద్రుడైన మహేంద్రుడు గానీ రామునకు వధ్యుడవయిన నిన్ను యుద్ధంలో కాపాడటానికి శక్తులు కారు.

**తిలకం –** ఇక్కడ విశేషణాంతరాలను గ్రహించటం వారి సామర్థ్యవిశేషాన్ని తెలియజేయటం కోసం ఈ ప్రకర్షత్వాన్ని పరిహరించటం కోసం (అంటే బ్రహ్మ కంటే, రుద్రుని కంటే ఇంద్రుడు గొప్పవాడు అనే అర్థాన్ని పరిహరించటం కోసం) వ్యుత్క్రమంగా అర్థసంభావన చేయాలి అంటే ముందు ఇంద్రుని, తరువాత రుద్రుని, అటుపై బ్రహ్మను సంభావించాలి.

ఇంద్రుడంటే పరమైశ్వర్యయుక్తుడని అర్థం. అట్టి త్రిలోకాధిపతి కూడా నిన్ను కాపాడలేడు. అతడు త్రిలోకాధిపతి అయినా పరనిరసన సామర్థ్యం లేదు కనుక అశక్తుడనుకుందామా? కాదు – ఎందుకంటే వృత్రహనన ప్రసిద్ధమైన సామర్థ్యం అతనికి ఉంది. యో వృత్రమవధీత్ తన్మహేన్ద్రస్య మహేంద్రత్వమ్ – అనే శ్రౌతనిర్వచనం ప్రకారం వృత్రుని సంహరించినవాడే మహేంద్రుడు. అయినా అతడు నిన్ను కాపాడే సమర్థుడు కాడు. తనంత తాను సమర్థుడైనా సహాయ సంపత్తిలేనివాడు కనుక సమర్థుడు కాడా? అంటే కాదు. అతడు సురనాయకుడు. తనకు సాటియైన ముప్పది మూడుకోట్ల దేవతలు సహాయులుగా గలవాడు. అయినా రామవధ్యుడవైన నిన్ను కాపాడలేడని భావం.

పోనీ క్షుద్రుడైన ఇంద్రుడు సమర్థుడు కాకపోతే రుద్రుడు రక్షిస్తాడు అంటావేమో. రక్షించలేడు. ఎటువంటి రుద్రుడు. అతడు ప్రళయకాలంలో ప్రజలనందరినీ రోదింపజేసే సమర్థత కలవాడు. అయినా రక్షించలేడు. కాల విశేషంలోనే కదా అతడు సంహారకుడు! ఇప్పుడు సంహారకాలము కాదు కనుక అశక్తుడు అనటానికి వీలులేదు. ఎందుకంటే త్రినేత్రుడు. ఫాలనేత్రపు మంటతో మన్మథుని దహించినవాడు. అది కాకతాళీయంగా జరిగింది అంటావేమో! ప్రబలతరులైన మహాసురులకును సంహారకుడు అని చెప్పటానికి త్రిపురాంతక అనే విశేషాన్ని గ్రహించారు అట్టి రుద్రుడు కూడా రక్షించలేడు (రామవధ్యుని).

బ్రహ్మపుత్రుడు, జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అని రుద్రుని స్తుతించారు. కనుక అతని కంటే అతని తండ్రి బ్రహ్మ రక్షించగలడేమో ఎందుకంటే అతడు బ్రహ్మ బ్రహ్మ – బృంహతి – అతి విస్తృతంగా వృద్ధి పొందినవాడు. అయినా స్వయముగా కర్మమునకు వశం అయినవాడు. రక్షణ విషయంలో ఎలా సమర్థుడవుతాడు? అంటే కర్మవశ్యత్వం ఉన్నా అసాధారణ స్థితితో అనుత్పన్నుడు అందుకే అతనిని స్వయంభువు అంటారు కనుక సమర్థుడవుతాడు అని భావిస్తావేమో! అతడు కూడా రామవధ్యుని రక్షింపలేడు. స్వయంభువైనా సహాయ సంపత్తి లేనివాడు కదా అంటే కాదు. చతురాననుడు ఒక్కమారుగా సర్వ వేదాలను ఉచ్చరించటవలన సంపాదించుకొన్న అతిశయం కలవాడు – అయినా రామవధ్యుని రక్షింపలేడు.

**దీపిక –** "స్వయంభూః" మొదలైన విశేషణాలు వారి సామర్థ్య విశేషాన్ని తెలియజేయటం కోసం. ఇంద్రుడంటే పరమైశ్వర్యవంతుడు. వృత్రాసురుని సంహరించినవాడు మహేంద్రుడు. మూడు లోకాలను నియమించేవాడు, వృత్రహంత, సర్వసురలతో కూడినవాడు అయిన వజ్రపాణి కూడా రామవధ్యుని రక్షింపలేడు.

రుద్రుడంటే సంహారకాలంలో ప్రజలను సంహరిస్తూ ఏడిపించేవాడు. రుతమంటే శబ్దము. అది వేదాత్మకము. దానిని కల్పాదియందు బ్రహ్మకు అందించినవాడు కనుక రుద్రుడు. లేదా రుతం చేత – నాదం చేత ఈ జగత్తునంతా ద్రావయతి – రంజింపచేసేవాడు రుద్రుడు. లేదా రుతం చేత అంటే ప్రణవరూపనాదంచేత ప్రజలకు ఇష్టమైన అర్థాన్ని దాపయతి – ఇప్పించేవాడు రుద్రుడు లేదా రుతం అంటే సంసార దుఃఖాన్ని, లేదా దుఃఖహేతువును ద్రావయతి – పారద్రోలేవాడు రుద్రుడు. ఈవిషయాన్ని ఈ శ్లోకం స్పష్టం చేస్తున్నది.

**"మద్దుఃఖం దుఃఖహేతుం వా తద్ద్రావయతి యః ప్రభుః ।**
**రుద్ర ఇత్యుచ్యతే తస్మా చ్ఛివః పరమకారణమ్" ॥**

ఇటువంటి వ్యుత్పత్తులతో రుద్రత్వము, భస్మీకరణసమర్థమైన ఫాలలోచనయుక్తత్వము, త్రిపురాంతకత్వము మొదలైన ధర్మములతో కూడిన మహేశ్వరుడైనా రామవధ్యుని రక్షింపలేడు.

బ్రహ్మ స్వయంభువు అంటే స్వతంత్రుడు, పరతంత్రుడు కాడు. బృహత్వము, నిత్యస్వతంత్రత్వము, బహుముఖత్వము, కార్యనిర్వాహకత్వము మొదలైన ధర్మములతో కూడిన విరించి కూడా రామవధ్యుని రక్షింపలేడు.

దీపికలో రుద్రశబ్దానికి చెప్పిన నాలుగైదు వ్యుత్పత్తులు తిలకంలో కనిపించవు.

## యాభైరెండవ సర్గము

**2. శ్లో॥ వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా ।**
**నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః ॥**

దురాత్ముడైన రావణుడు హనుమంతుని వధమును ఆజ్ఞాపించగా, స్వామి చెప్పిన దానిని నివేదించిన హనుమంతుని, దౌత్యమును – అంటే దూతవధమును విభీషణుడు ఇష్టపడలేదు.

**తిలకం –** 'నివేదితవతః' అనే పాఠాన్ని స్వీకరించింది. 'మతి' అంటే ఇక్కడ కార్యం. నివేదింపబడిన తన రాకకు సంబంధించిన కార్యాన్ని హనుమంతుడు నివేదించినవాడు కాగా, దీనిచేత అతడు తన్నాదేశించిన అర్థాన్ని మాత్రమే చెప్పినవాడు కనుక తప్పుచేయనివాడు కాబట్టి అవధ్యుడని అభిప్రాయం. దౌత్యమ్ – దూతకు సంబంధించిన, రావణుడాదేశించిన వధమును, విభీషణుడనుమతింపలేదు.

**దీపిక –** నివేదితమతౌ– అనే పాఠాన్ని, తిలకం పాఠాంతరంగా నిర్ణయించిన దానిని, ప్రధాన పాఠంగా స్వీకరించి పైన చెప్పిన అర్థాన్ని వివరించింది. 'నివేదితవతః' అనే పాఠం ఉన్నట్లు కూడా సూచించలేదు.

## యాభైమూడవ సర్గము

**సర్వేషామేవ పర్యాప్తో రాక్షసానామహం యుధి ।**
**కింతు రామస్య ప్రీత్యర్థం విషహిష్యేఽహ మీదృశమ్ ॥(13)॥**

**తిలకం –** రావణాది వధను తానే చేయాలి కనుక అది రామునికి అభిమతం కనుక రాక్షసులు చేస్తున్న ఈ బంధనము, లాగటము మొదలైన వానిని నేను సహిస్తానని భావం. 'రామస్య ప్రీత్యర్థం' అన్న చోట ఛందస్సు భంగం అవుతున్నది. అది ఆర్షం కనుక దోషం కాదు.

**దీపిక –** నేను రాక్షసులందరిని చంపటానికి చాలుదును. హననస్య – చంపటానికి అనే దానిని అధ్యాహారం చేసుకోవాలి. అయినా రాముని ప్రీతి కొరకు దీనినంతా – ఈ అవమానాన్నంతా సహిస్తాను. సర్వరాక్షససంహారము చేస్తానని రాముడు ప్రతిన పట్టాడు కనుక –

ఛందో భంగ విషయ ప్రస్తావన ఇందులో లేదు.

**యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః ।**
**యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః ॥**

**తిలకం –** పతి శుశ్రూష మొదలైన పదాలు వాని ఫలితాన్ని చెప్పే తాత్పర్యం కలవి. ఏకపత్నీత్వము – పాతివ్రత్యము.

**దీపిక –** ఏకపత్నీత్వం – ఏకః పతిః యస్యాః సా ఏకపత్నీ. తస్యా భావః – ఏకపత్నీత్వం. ఒకే వ్యక్తికి పత్ని అయిన లక్షణం – అంటే పాతివ్రత్యం అని యీ వ్యాఖ్య వ్యుత్పత్తిని చూపింది. తిలకం చెప్పిన ఫలపరత్వాన్ని ఇది ప్రస్తావించలేదు.

**యది కిఞ్చిదనుక్రోశ స్తస్యమయ్యస్తి ధీమతః ।**
**యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః ॥(29)॥**

ఇది సీతాదేవి అగ్నిని గూర్చి చేసిన ప్రార్థన. నాయందా రామునకు దయ ఉంటే నాకు ఏ కొంచెమైనా అదృష్టం మిగిలి ఉంటే అగ్నిదేవా! హనుమంతుని విషయంలో చల్లనివాడవు కమ్ము.

**తిలకం –** కించి దనుక్రోశః – అనేది ఏకపదం. భాగ్య శేషః – ఇప్పుడు నిరంతరంగా దుఃఖాన్ని అనుభవిస్తూ ఉండటం వలన భాగ్యప్రసక్తియే లేదని భావిస్తున్న సీత భాగ్యశేషం ఉంటే అంటున్నది.

**దీపిక –** వ్యాఖ్యానించలేదు.

## యాభైనాల్గవ సర్గము

**శ్వసనేన చ సంయోగా దతివేగో మహాబలః ।**
**కాలాగ్ని రివ జజ్వాల ప్రావర్ధత హుతాశనః ॥(21)॥**

హనుమంతుని తోక చిచ్చు వాయుప్రేరణతో మరింత విజృంభించినది – అని చెబుతున్నారు.

**తిలకం –** మునుపు రావణుని వలన మిక్కిలి భీతి పొందినవారు అయినా అగ్ని వాయువులు ఇప్పుడు, రాక్షసుల క్షయాన్నీ, దేవతల బలోదయాన్నీ గమనించి శంకలేనివారై విజృంభిస్తున్నారని భావం.

**దీపిక –** పై అభిప్రాయాన్నే అనువదించింది.

**తతస్తు లంకాపురపర్వతాగ్రే సముత్థితో భీమపరాక్రమోఽగ్నిః ।**
**ప్రసార్య చూడావలయం ప్రదీప్తో హనూమతా వేగవతా విసృష్టః ॥(32)॥**

హనుమంతుడు లంకను కాల్చివేస్తున్న సందర్భం.

**తిలకం –** లంకాపురపర్వతాగ్రే – లంకాపురానికి ఆధారమైన త్రికూట శిఖరం మీద – దాని మీద ఉండటం వలన లంకకు ఆ విధంగా నిర్దేశం. పర్వతాగ్రం మీద ఉన్న లంకాపురం మీద అని పరనిపాతంగా వ్యవహరించారని కానీ గ్రహించాలి. చూడావలయమంటే జ్వాలలసముదాయం. ప్రదీప్తః – గృహములయందు అని కలుపుకొని ఉంచబడిన (అగ్ని).

**దీపిక –** పూర్వపదంగా ఉండవలసిన దానికి పరనిపాతం అనే విషయాన్ని ఈ వ్యాఖ్య చెప్పలేదు. 'భీమపరాక్రమః' అనే పదానికి భయంకరమైన వేగం కలది అనే అర్థాన్ని ఈ వ్యాఖ్య తిలకం కంటే అధికంగా చెప్పింది.

52. శ్లో॥ తిలక వ్యాఖ్యను బట్టి యీ సర్గలో 51 శ్లోకాలే.

దానిని గురించి శ్రీగోవిందరాజులవారిలా వ్రాస్తున్నారు. "తతో మహాత్మా" అని ప్రారంభం అయ్యే శ్లోకం 'స రాక్షసాన్' అనే 49వ శ్లోకంలో చెప్పిన అర్థంతో గతార్థం అవుతుంది కనుకనూ, అనేక కోశాలలో కనబడకపోవటం వలననూ ప్రక్షిప్తం. అనేక కోశాలలో ఈ సర్గ సమాప్తి విపర్యయమూ, తరువాతి సర్గ ఆరంభ విపర్యయమూ కాన వస్తున్నది.

**దీపిక మాత్రం –** రాబోయే సర్గలోని మొదటి శ్లోకాన్ని ఈ సర్గలోని అంతిమ శ్లోకంగా గ్రహించి వ్యాఖ్యానించింది.

## యాబైయైదవ సర్గము

**ధన్యాః ఖలు మహాత్మానో యే బుద్ధ్యా కోపముత్థితమ్ ।**
**నిరున్ధన్తి మహాత్మానో దీప్తమగ్నిమివాంభసా ॥(4)॥**

హనుమంతుని పశ్చాత్తాప భాగంలోనిది.

**తిలకం –** "ధన్యాః ఖలు మహాత్మానః" అనే చోట "ధన్యాస్తే పురుషశ్రేష్ఠాః" అనే పాఠాన్ని గ్రహించింది. కానీ కొన్ని కోశాలలో "ఖలు మహాత్మానః" అనే పాఠం ఉన్నది. అయితే అప్పుడు రెండు పాదాలలోను మహాత్మ శబ్దం ఉన్నట్లవుతుంది. తిలకం గ్రహించిన పాఠంలో పునరుక్తి ప్రస్తావన లేదు.

దీపిక మాత్రం పునరుక్తి పాఠాన్నే గ్రహించి దుఃఖాతిశయం వలననే మహాత్మపద పౌనరుక్త్యం కనుక దోషం కాదని వక్కాణించింది.

## యాబైయారవ సర్గము

**కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే ।**
**పర్యాప్తః పరవీరఘ్న యశస్య స్తే ఫలోదయః ॥(11)॥**

సీత హనుమంతునితో అన్న మాట

**తిలకం –** అస్యకార్యస్య – ఈ కార్యానికి, అంటే సర్వరాక్షస వధ పూర్వకమైన, నన్ను రాముని దగ్గరకు చేర్చటం అనే పనిని నీ బలోదయం – అంటే శక్తి మహిమ లేదా సైన్యాన్ని పురికొల్పటం – అనేది నీకు యశస్సును కలిగించేది. రామునికి కాదని భావం.

**దీపిక –** పై వివరణలో బలోదయపదాన్ని మాత్రం వివరించలేదు. తక్కిన విషయం యథాతథంగా ఉన్నది.

10 నుండి 22 వరకు గల శ్లోకాలలో అరిష్టమనే పర్వతాన్ని పదునాలుగు విధాలుగా అభివర్ణించారు. అందులో కొన్ని

**తిలకం –** శరద్ఘనైః – శరత్కాలంలోని మేఘాల చేత – శరత్కాలంలో పుష్పించే ఏడాకుల అరటిచెట్లు మొదలైన వానిచేత శుభ్రంగా చేయబడినవై ముదిమి చేత వణకిపోవుచున్నదానివలె ఆ పర్వతం కన్పట్టుచున్నది. "శరద్వనైః" అని ఒక పాఠం. అప్పుడు బహువార్షిక వృక్షముల చేత అని అర్థం. శరవణముల చేత అని అర్థాన్ని కూడా గ్రహింపవచ్చు. 'శరవణ' అనేది తకారాంతంగా కూడా ఉన్నది. శరవణంలో పుట్టిన కృపాచార్యునకు 'శారద్వత' అనే పేరు కలగటం దీనికి ప్రమాణం.

**దీపిక –** శరది వనైః – శరద్వనముల చేత సప్తపర్ణాది శరత్కాల వృక్ష సంఘాల చేత అని మాత్రం వివరించింది.

## యాభైయేడవ సర్గము

**కేచిదుచ్ఛ్రితలాంగూలాః ప్రహృష్టాః కపికుంజరాః ।**
**అంచితాయత దీర్ఘాణి లాంగూలాని ప్రవివ్యధుః ॥(42)॥**

హనుమంతుని రాక నెరిగిన వానరుల ఆనందహేలను వివరించే సందర్భం.

**తిలకం –** అంచితాయత దీర్ఘాణి – ఇక్కడ దీర్ఘపద సన్నిధానం వలన ఆయత శబ్దానికి స్థూలమైనది అనే అర్థాన్ని గ్రహించాలి.

**దీపిక –** ఆయామ మంటే విస్తారము. కొందరు దీనిని స్థూలపరంగా వ్యాఖ్యానించారు.

దీపిక తిలకం అభిప్రాయంతో ఏకీభవించినట్లు కనపడదు.

## యాభైయెనిమిదవ సర్గము

**గచ్ఛతశ్చ హి మే ఘోరం విఘ్నరూప మివాభవత్ ।**
**కాంచనం శిఖరం దివ్యం పశ్యామి సుమనోహరమ్ ॥8॥**

హనుమంతుడు లంక నుండి తిరిగి వచ్చిన తరువాత తక్కిన వానరులకు అక్కడి విశేషాలు చెప్తున్నాడు.

**తిలకం –** విఘ్నరూపమివ అనటం వలన నిజమైన విఘ్నం కాదని భావం. పశ్యామి మొదలైన వాని యందు వ్యత్యయం చేత వర్తమాన రూప ప్రయోగం. నిజానికి లిఙ్రూపం ఉండాలి.

**దీపిక –** పశ్యామి అంటే అపశ్యం అని మాత్రం చెప్పింది.

**ఏవముక్త స్సురసయా దశయోజనమాయతః ।**
**తతోఽర్ధగుణవిస్తారో బభూవాహం క్షణేన తు ॥(29)॥**

సురస వృత్తాంతం వానరులకు హనుమంతుడు వివరిస్తున్న సందర్భం.

**తిలకం –** అర్ధగుణ విస్తారః – అన్న చోట అర్ధ శబ్దం – కొంత ప్రదేశం అనే అర్థాన్ని ఇస్తుంది. కొంచెం ఎక్కువ విస్తారం కలవాడనయ్యాను అని భావం. ఇదే ఇక్కడి అర్థం. ప్రథమ సర్గలో చెప్పిన నూరు యోజనాల విస్తారం అనేది సరిపడని విషయం. ఆ గ్రంథం ఎవరో కల్పించినదని అక్కడ చెప్పి ఉన్నాము.

**దీపిక –** అర్ధగుణ విస్తారః – తతః దాని కంటే దశయోజనము కంటే సగం అంటే అయిదు యోజనాల విస్తారం దాని గుణం అంటే ఆవృత్తి – రెట్టింపు – అనగా పది యోజనాల విస్తారము మొదటి సర్గలో దశ యోజన విస్తారం అని చెప్పారు కనుక తదనుగుణంగా ఇలా వ్యాఖ్యానించాయి.

ఇక్కడ రెండు వ్యాఖ్యలలో భేదం స్పష్టంగా కానవస్తున్నది. తిలకం ప్రకారం నూరు యోజనాల వ్యాప్తి అసంభవం కనుక అది కల్పిత గ్రంథమని గోవిందరాజుల వారి నిర్ణయం. దీపిక యథాతథంగా వ్యాఖ్యానించింది.

**స్త్రీణాం మధ్యా త్సముత్పత్య తస్య భార్యా దురాత్మనః ।**
**వరా మండోదరీ నామ తయా చ ప్రతిషేధితః ॥(76)॥**

రావణుని దురాగతాన్ని కపులకు వివరిస్తున్నాడు హనుమంతుడు.

**తిలకం –** సముత్పత్య – లేచి రావణుని సమీపానికి వెళ్ళిందని భావం. మండోదరీ అంటే మండనభూతమైన ఉదరం కలది అని అర్థం. లేదా మందత్వమంటే అల్పత్వం. దడలకు అభేదం కనుక మందోదరి. సూక్ష్మమైన నడుము కలది అని తాత్పర్యం లేదా మందా అంటే చిన్న చీమ. దాని నడుము వలె సన్నని నడుము కలది అని అర్థం.

అది అలా ఉంచి, మునుపు సీతను చంపనుంకించిన రావణుని వారించింది ధాన్యమాలిని అని కదా కవి చెప్పినది. ఇప్పుడు మండోదరిని స్మరించారేమి? అని శంకింపరాదు. అప్పుడు ధాన్యమాలినిని, ఇప్పుడు మండోదరిని పేర్కొనటం చేత ఇద్దరు వారించారని సంభవించాలి. అంతేకాక వారి నామాదికం హనుమంతునకు పూర్తిగా పరిచితం కాకపోవటం వలన ఇలా చెప్పి ఉండవచ్చు.

**దీపిక –** మండోదరి వ్యుత్పత్తిని గూర్చి పట్టించుకోలేదు. ధాన్యమాలినియా, మండోదరియా అనే విషయం తిలకం అభిప్రాయాన్నే అనువదించింది.

**యద్యన్యథా భవే దేత ద్ద్వౌ మాసౌ జీవితం మమ ।**
**న మాం ద్రక్ష్యతి కాకుత్స్థో మ్రియే సాఽహ మనాథవత్ ॥(108)॥**

ఇది సీత హనుమంతునకు చెప్పిన మాట. హనుమంతుడు దానిని కపులకు చెబుతున్నాడు.

**తిలకం –** ఆ రామలక్ష్మణులు నన్ను చేరకపోతే రెండు నెలలు మాత్రమే నాబ్రతుకు. అటుపై జీవించనని అర్థం. న మాం ద్రక్ష్యతి – రెండు నెలల లోపల రాముడు నాకు కనబడకపోతే అప్పుడు నేను చనిపోతాను – అని శ్లోకతాత్పర్యం. మాస శబ్దం ఇక్కడ పక్షం అనే అర్థాన్నిస్తుంది. "పక్షా వై మాసాః" అని శ్రుతి వాక్యం ఇక్కడ ప్రమాణం.

**దీపిక –** యద్యన్యథా – దీని కంటే మరొక విధంగా అయితే అంటే రామలక్ష్మణులు రాకపోతే ఇంక నా బ్రతుకు రెండు నెలలో అనాథవత్ మ్రియే – రాక్షస స్త్రీలు చంపటం చేత అని భావం.

రెండు మాసములు అంటే ఒక నెల అనే అర్థాన్ని దీపిక సంభావించలేదు. రాక్షస స్త్రీలు చంపటం అనే విషయాన్ని అధికంగా పేర్కొన్నది.

### యాభైతొమ్మిదవ సర్గము

**తపసా ధారయే ల్లోకాన్ క్రుద్ధో వా నిర్దహేదపి ।**
**సర్వథాఽతిప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః ।**
**తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్ ॥ (4)**

రావణుడు పరమ పతివ్రత అయిన సీతను తాకి ఏల కాలిపోలేదు– అని శంకించి హనుమంతుడు సమాధానం చెబుతున్నాడు.

**తిలకం –** సీత దురాత్ముడైన రావణుని తన్ను తాకినంతనే ఎందుకు కాల్చి వేయలేదు అని ఆశంకించి అతనికి కూడా తపస్సంపత్తి ఉన్నది కనుక అని వివరిస్తున్నారు.

లేదా – రావణుని తపస్సును గూర్చి చెప్పటం వలన సీత పాతివ్రత్యాతిశయం తెలియవస్తుంది.

రావణుడు తపస్సంపన్నుడు కనుకనే సీతాస్పర్శ చేత కాలిపోలేదని అర్థం.

**దీపిక –** పై అర్థాన్నే చెప్పింది కాని సీతా పాతివ్రత్యాతిశయాభివ్యక్తిని గూర్చి మాట్లాడలేదు.

## అరవైయవ సర్గము

**న తావదేషా మతి రక్షమానో యథా భవాన్ పశ్యతి రాజపుత్ర ।**
**యథా తు రామస్య మతిర్నిదిష్టా తథా భవాన్ పశ్యతు కార్యసిద్ధిమ్ ॥6॥**

ఇవి అంగదుని గూర్చి జాంబవంతుడు పలికిన మాటలు

**తిలకం –** జాంబవంతుడు అంగదుని మాటలను ఒక వంక మెచ్చుకుంటూనే మైత్రీపూర్వకంగా అతనిని నిషేధిస్తున్నాడు – నీ మతి అక్షమ – అయుక్త కాదు తగినదే. నీవు సరియైన మాటలనే పలికావు. అయినా మనమంత సమర్థులమైనా రామాజ్ఞననుసరించియే ప్రవర్తించాలి. స్వాతంత్ర్యంతో కాదు.

**దీపిక –** పై అభిప్రాయంతో పాటు, రాముని ఆలోచన ఏ విధంగా ఉన్నదో ఆ విధంగా నీవు కార్యసిద్ధిని భావించాలి అనే అర్థాన్ని ఈ వ్యాఖ్య జోడించింది.

## అరవైయొకటవ సర్గము

**తత శ్చానుమతా స్సర్వే సంప్రహృష్టా వనౌకసః ।**
**ముదితాః ప్రేరితా శ్చాపి ప్రనృత్యంతో భవం స్తతః ॥(15)॥**

మధువన భంగానికి అంగదుని వలన అభ్యనుజ్ఞ పొందిన వానరుల సంతోషాతిశయాన్ని వర్ణిస్తున్నారు.

**తిలకం –** ఇంతకు పూర్వమే సీతాదర్శనం వలన ఉప్పొంగిపోతున్నారు. దానిపై అంగదుడు మధువనంలో ఇష్టం వచ్చినట్లు విహరించటానికి అంగీకారం తెలిపాడు. ఇక వాళ్ళ ఆనందపారవశ్యానికి అవధులు లేకుండా పోయినాయనే తాత్పర్యం ఈ వ్యాఖ్య వివరించింది.

**దీపిక –** శ్లోకంలో సంప్రహృష్టాః, ముదితాః అని సమానార్థకమైన పదాలు రెండు ఉన్నాయి. ఇది పునరుక్తికాదు. హర్షము అంటే వెలికి తెలియవచ్చేది. మోదం అభ్యంతరం. ఆ భేదాన్ని గమనించమంటున్నది ఈ వ్యాఖ్య.

## అరవైరెండవ సర్గము

**హనూమతా దత్తవరై ర్హతం మధువనం బలాత్ ।**
**వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః ॥(17)॥**

హనుమంతుడు వరమీయగా కోతులన్నీ మధువనాన్ని తుక్కుదూగరగా కొట్టాయి. మమ్మల్ని మోకాళ్ళతో గుంజుకుంటూ పోయాయి. మాకు దేవమార్గాన్ని చూపాయి.

**తిలకం –** దేవమార్గం – అంటే అపానద్వారం. దేవశబ్దం వాయువునకు వాచకం. ఉపనిషత్తులో వాయులోక విషయకంగా దేవలోక శబ్ద ప్రయోగం ఉండటం వలన ఈ అర్థం సిద్ధిస్తున్నది.

**దీపిక –** దేవమార్గమంటే అపానం.

తిలకం ఆ అర్థం ఎలా వచ్చిందో వివరించింది.

## అరవైమూడవ సర్గము

**తతో మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః ।**
**దృష్ట్వైవోద్విగ్నహృదయో వాక్యమేత దువాచ హ ॥(1)॥**

దధిముఖుడు తల పాదాలకు తాకేట్లుగా సుగ్రీవునికి ప్రణమిల్ల వానరరాజు ఉద్విగ్న హృదయుడై ఇలా పలికాడు.

**తిలకం –** ఉద్విగ్నహృదయుడంటే భీతియైన హృదయము కలవాడు. మేనమామ కాళ్ళమీదపడటం స్వామిత్వాన్ని అనుసరించి.

**దీపిక –** వివరాలు లేవు.

**కిమయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః ।**
**కంచార్థమభి నిర్దిశ్య దుఃఖితో వాక్యమబ్రవీత్ ॥(14)॥**

రాజా! వనపాలకుడైన వానరుడు వచ్చాడు. దుఃఖముతో ఏమి చెప్పాడు? అని లక్ష్మణుడు సుగ్రీవుని అడిగాడు.

**తిలకం –** వివరణ ఇవ్వలేదు.

**దీపిక –** తనతోపాటే ఉన్న లక్ష్మణుడు ఈ విధంగా ప్రశ్నిస్తున్నాడంటే, దధిముఖుడు వనభంగాదికాన్ని తన జాతికి ఉచితమైన భాషలో చెప్పి ఉంటాడు. లేదా రహస్యంగా చెవిలో చెప్పిఉంటాడు అని గ్రహించాలి.

ఈ వివరణ ఇచట సముచితంగానే ఉంది.

## అరవైనాల్గవ సర్గము

**సౌమ్య రోషో న కర్తవ్యో యదేభిరభివారితః ।**
**అజ్ఞానా ద్రక్షిభిః క్రోదా ధ్భవన్తః ప్రతిషేధితాః ॥(6)॥**

మంచివాడా! మా వాళ్ళు మిమ్ములను అటకాయించారు. అజ్ఞానం వలన క్రోధం వలన మిమ్ములను అడ్డుకొన్నారు. మీరు కోపం పెట్టుకోకండి – అని దధిముఖుడు అంగదునితో అన్నాడు.

**తిలకం –** భవన్తః – గౌరవార్థంలో బహువచనం. అంతేకానీ హనుమదాదులను కలుపుకొన్నందువలన వచ్చిన బహువచనం కాదు. తరువాతి శ్లోకంలో కూడా అంగదుని ఉద్దేశించే మాట్లాడుతున్నాడు కనుక. అజ్ఞానాత్, క్రోధాత్ – అజ్ఞానంవలనయిన కోపంతో అని అర్థం. కొందరు, అజ్ఞానంవలనా, క్రోధంవలనా మిమ్ములను మావారు నివారించారు అనే అర్థం చెప్పారు.

**దీపిక –** ఓ సౌమ్యుడా! అజ్ఞానంవలననూ, క్రోధంవలననూ మిమ్ములను అటకాయించటం అనే ఈ అడ్డగింపు ఏదైతే ఉందో దానిని గూర్చి నీవు కోపం చేయవద్దు అని అన్వయం. దీనినే తిలకం పైన అనువదించింది. (కొందరు – ఇత్యాది చివరి వాక్యంలో).

**కౌసల్యా సుప్రజా రామ సమాశ్వసి హి సువ్రత ।**
**దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా ॥(32)॥**

ఇవి సుగ్రీవుడు రామునితో అంటున్న మాటలు "ఓరామా! కౌసల్య సుప్రజ అయినది. ఓయి సువ్రతా! ఊరడిల్లు. చూచాడు హనుమ సీతను ఇందులో సందేహం లేదు."

**తిలకం –** ఓ రామా! ఈ విధంగా దేవి ఉనికిని తెలిసికొనిరావటం వలన కౌసల్య సుప్రజ – మంచి బ్రతుకు గల సంతానము కలది అయినది. సీత ఉన్నది అనే విషయం తెలుసుకొని నీవు ప్రాణాలు నిలుపుకొంటావు కనుక – అని తాత్పర్యం.

**దీపిక –** ఈ అభిప్రాయాన్నే వివరించింది.

## అరవైయైదవ సర్గము

**శ్లో॥ ఏకవేణీధరా ॥14॥**

**తిలకం –** మూడుగా విభాగాలు లేక చుట్టబడిన కేశపాశమును ఏకవేణి అంటారు.

**దీపిక –** వివరణ లేదు.

27. శ్లో॥

ఇక్కడ తిలక కారులు, హనుమంతుడు సముద్రాన్ని దాటినపుడు సంభవించిన సురసానిరసనం మొదలైన దానిని, అక్షవధ, లంకాదహనం మొదలైన దానిని తన జాతి వారైన అంగదాదులకు వెనుక చెప్పి ఉన్నాడు.

అయినా ప్రభు సన్నిధిలో అది తన్ను తాను పొగడుకోవటంలో పర్యవసిస్తుందని వానిని గురించి చెప్పలేదని భావించాలి. తన వృత్తాంతాన్ని కూడా మొత్తంగా చెప్పాడని సూచనప్రాయంగానైనా చెప్పటం సముచితం. అయినా అంగదుని దగ్గర వివరించి చెప్పటం గోప్య విశేషగోపనార్థమనీ, ఇక్కడ వివరించకపోవటం చెప్పరాని విషయాలను చెప్పకుండటంకోసమనీ గమనించాలని సమీక్షించారు.

## అరవైయారవ సర్గము

**యథైవ ధేనుస్స్రవతి స్నేహాద్వత్సస్య వత్సలా ।**
**తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్ ॥**

**తిలకం –** వత్సలా – దూడయందు అతిప్రీతిగల ధేనువు వత్సవిషయక స్నేహం వలన ద్రవించిపోతుందో, అదేవిధంగా మణిశ్రేష్ఠాన్ని చూస్తున్న నా హృదయం ద్రవించిపోతున్నది. అని రాముదు విలపిస్తూ అన్నాడు.

**దీపిక –** వత్సస్య అన్నచోట కూడా దర్శనాత్ అనే పదాన్ని కలుపుకోవాలి. దూడను చూడగా అని అర్థం. హృదయం అన్నచోట కూడా స్నేహంతో ద్రవించిపోతుంది అని సంబంధం.

## అరవైయేడవ సర్గము

**సాఽభివీక్ష దిశః సర్వా వేణ్యుద్గ్రథనముత్తమమ్ ।**
**ముక్త్వా వస్త్రా ద్దదౌ మహ్యం మణిమేతం మహాబల ॥(30)॥**

ఆమె (సీత) దిక్కులన్నీ పరికించి జడలో ఒకచోట గుడ్డచుట్టి దాచుకొన్న ఉత్తమమైన మణిని తీసి నాకు ఇచ్చినది.

**తిలకం –** దిక్కులను పరికించటం రాక్షస స్త్రీలు చూచి రావణునకు తెలుపుతారేమో అనే భయంతో. వేణి యందు చక్కగా కట్టిపెట్టబడునది. వేణియందు ధరింపదగినదని భావం. చీర అంచున ముడివేయబడి వున్నది అని భావం. సాధారణస్థితిలో శిరోభూషణంగా ధరించవలసినది ప్రస్తుతం, కొంగుముడిలో దాచుకొన్నదని భావం.,

**దీపిక –** దిక్కులను పరికించటం గురించి చెప్పలేదు. వేణ్యుద్గ్రథితం – కొన్ని కేశములతో ఏర్పరచిన జడయందు ఎత్తికట్టబడునది. వస్త్రాన్ముక్త్వా – వస్త్రాంతము నందు ముడివేయబడి దానిని తీసి – ముడిని వదలించి – యిచ్చినదని తాత్పర్యం.

## అరవైయెనిమిదవ సర్గము

**యది వా మన్యసే వీర వసైకాహమరిందమ ।**
**కస్మింశ్చి త్సంవృతే దేశే విశ్రాంతః శ్వో గమిష్యసి ॥**

**మమ చాప్యల్పభాగ్యాయా స్సాన్నిధ్యాత్తవ వీర్యవన్ ।**
**అస్య శోకవిపాకస్య ముహూర్తం స్యాద్విమోక్షణమ్ ॥(3, 4)॥**

నాయనా! నీకు చిత్తం వస్తే ఒక్కరోజు ఇక్కడే ఉండు. ఎక్కడైనా గోప్యంగా ఉన్నచోట విశ్రాంతి తీసుకొని రేపు పోదువు. అలా దురదృష్టవంతురాలనగు నీ సాన్నిధ్యంవలన ఈ నా శోకవిపాకానికి కొంచెంసేపు విముక్తి కలుగుతుంది.

**తిలకం –** శోకవిపాకము అంటే శోకవృద్ధి అని అర్థం

**దీపిక –** శోకవిపాకం అంటే శోకరూపమైన పాపపరిణామం ఫలానికి అని అర్థం.

# యుద్ధకాండ సారాంశం

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ**

పురుష ప్రయత్న సాధ్యమైన విషయం సుందరకాండలో చెప్పబడగా దానిని సాధించే విధానం యుద్ధకాండలో వివరింపబడుతోంది. స్వామి ఆజ్ఞాపించిన కార్యాన్ని నిర్వహించడమేకాక, కార్యాంతరాన్ని కూడా నిర్వహించేవాడు ఉత్తమభృత్యుడవుతాడు. ఇంత సంతోషవార్త చెప్పిన హనుమంతునికి తాను ప్రత్యుపకారమేమీ చేయగలనని, ఆలోచించి కాలానుగుణంగా రాముడు ఆతనిని ఆలింగనం చేసుకొన్నాడు. సుగ్రీవుడు కర్తవ్యాన్ని ఉపదేశించగా రాముడు యుద్ధకార్యోన్ముఖుడయ్యాడు. "సర్వం తీర్థం చ వై సైన్యం జితమిత్యుపధారయ" అని ఇచట చకారాన్ని, అవధారణాన్ని రెండింటిని ప్రయోగించడం వల్ల ఎన్ని విఘ్నాలు కలిగినా జయం తప్పదని ఇందు నిర్ధారింపబడింది' అప్పుడు.

**"తపసా సేతుబంధేన సాగరో చ్ఛోషణేన వా ।**
**సర్వథా సుసమర్థోఽస్మి సాగరస్యాస్య లంఘనే" ॥**

అని రాముడు తనతపః ప్రభావంచే సాగరోల్లంఘనాది కార్యాలు నిర్వహించగలనని తపోబలంవల్ల వాటిని సాధించగలనని వచించాడు. అయినా మనుష్యస్వభావాన్ని అనుసరించి హనుమంతుని ప్రశ్నిస్తాడు. రాముడు యుద్ధప్రస్థానానికి ఆజ్ఞ ఇస్తూ, సూర్యుడు ఆకాశమధ్యగతుడై ఉన్నాడు. కావున ఈ విషువత్తు ముహూర్తంలోనే (అభిజిత్తు) ఉత్తరా నక్షత్రంలోనే ప్రయాణం నాకు అభిమతం అంటాడు.

ఇక్కడ గోవిందరాజీయం అభిజిత్తు దక్షిణయాత్రకు నిషిద్ధం కదా! అని శంకించి లంక కిష్కింధకు ఆగ్నేయంలో ఉందని వచించింది. **"సీతాం హృత్వా తు మే జాతు క్వాఽసౌ యాస్యతి యాస్యతః"** అనే చోట 'జాతు' అనే పదం వద్ద "యాతు" అనే పాఠాంతరాన్ని కూడ చర్చించింది. "యాతు" అంటే రాక్షసుడు. ఇక ఆతడు ఎక్కడికి వెళ్ళగలడు? అనే అర్థాన్ని కూడ వివరించింది.

సుగ్రీవుడు పల్లకీలో రాగా రామలక్ష్మణులు హనుమదంగదులను అధిష్ఠించారు. అపుడు వారు గ్రహాలతో కూడిన సూర్యచంద్రులులా "గ్రహాభ్యాం చంద్రభాస్కరౌ" అన్నట్లు ప్రకాశించారట. నాలుగు గ్రహాలు ఒక రాశిలో కలిస్తే బహు జనవినాశ హేతువవుతుందని గోవిందరాజీయం వివరించింది. అందరూ సముద్రతీరం చేరారు. ఉత్తుంగ తరంగాలతో కూడిన సముద్రాన్ని చూచిన వెంటనే రాముడు **"సీత దీనిని వీక్షించి ఎంతో భయపడి ఉంటుంది కదా!"** అని వాపోయాడు. లక్ష్మణుని ధైర్యవచనాలతో ఊరట చెంది సూర్యాస్తమయమవుతోందని సంధ్యోపాసన కావించాడు. ఎంత శోకపరితప్తుడయినా రాముడు తన కర్తవ్యాన్ని విస్మరించలేదనడానికి ఇది పరమోదాహరణం.

ఇంక అచ్చట హనుమంతుడు వెళ్లిపోయిన పిమ్మట, ఆతడు చేసిన భయంకర కృత్యాలను తలచి సిగ్గుతో తలవంచి ఆప్తులతో రావణుడు ఆలోచించసాగాడు. హితులు సమర్థులగు మంత్రులతో ఆలోచించి దేవునిపై భారం వేసి కర్మారంభం చేస్తారని, మీరు నాకు ఆప్తులు కాన కర్తవ్యాన్ని వివరించండని ఆదేశిస్తాడు. సీతాపహరణ వృత్తాంతం ఇంత వరకూ గోప్యంగానే ఉంది. హనుమంతుని రాకతో అది బట్టబయలయింది. వారు అందరూ

**"సుమహాన్నోబలం కస్మాత్ విషాదం భజతే భవాన్"** అని మనకు సాయుధమైన సైన్యం ఉండగా విచారమెందుకంటారు. "సుమహత్, వో, బలం" అనే చోట భావ్యనర్థ సూచక శబ్దాలున్నాయని గోవిందరాజీయం వచిస్తుంది. అప్పుడు విభీషణుడు రాముని పరాక్రమాన్ని తెలిపి సీతను రామునకు అప్పగించడమే మేలని హితం పలికాడు. తాను సీతను అపహరించిన విషయం సభలో బహిర్గతం కావడంచే రావణుడు కొలువు వీడి తన భవనానికి వెళ్లిపోయాడు. విభీషణుడు రావణుని భవనానికేగి మళ్లీ హితబోధ చేశాడు.

అనంతరం దశగ్రీవుడు చుట్టూ కట్టుదిట్టంచేసి ఆలోచనామందిరానికి రావలసిందిగా అందరినీ ఆహ్వానించాడు. కుంభకర్ణునికి ఈ విషయం ఏమీ తెలియదు. "సా తు సంవత్సరం కాలం మామయాచత భామినీ" అని తాను ఆమెకు గడువు ఇచ్చిన కాలాన్ని వక్రీకరించి ఆమెయే తనను గడువు కోరిందని వచించాడు. కాని కుంభకర్ణుడు కామాతురుడైన రావణుని వాక్యాలలో ఆంతర్యాన్ని గ్రహించి క్రుద్ధుడై గతజలసేతుబంధనం చేస్తున్నావని అధిక్షేపించాడు. వెంటనే అవసరం వచ్చినపుడు పిలవమని శత్రురక్తం త్రాగుతానని వచించాడు. మహాపార్శ్వుడంత సీతను బలాత్కరించి అనుభవించవచ్చుకదా! అని అనడంతోనే రావణుడు తనకు బ్రహ్మ ఇచ్చిన శాపాన్ని వివరించాడు.

కాని విభీషణుడు "ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" అని హితం పలికాడు. "దాశరథాయ" అనే ప్రయోగం ఎలా సాధువవుతుంది. అనే విషయంలో చాలా సమాధానాలు చెబుతారు. దశరథ శబ్దానికి విష్ణువు అనే అర్థం పక్షివాహనంగా కలవాడనే వ్యుత్పత్తిలో కుదురుతుంది. విష్ణు సంబంధుడైన రామునికి అనే అర్థంలో సంబంధార్థంలో "అణ్ ప్రత్యయం" చేస్తే "దాశరథః" అనే రూపం సాధువవుతుంది. అంత రావణుడు, విభీషణుని తూలనాడాడు. జ్ఞాతుల వల్లనే భయమెక్కువ అంటాడు ఆతడు. ఇంద్రజిత్తు కూడ తండ్రి మార్గాన్నే అనుసరించాడు. ఇక విభీషణుడు వారి ధిక్కారానికి గురియై **"స్వస్తి తేఽస్తు గమిష్యామి సుఖీభవ మయా వినా"** అని పలికి నలుగురు రాక్షసులతో కలిసి సభాభవనం వీడి బయటకు రావడం జరిగింది.

విభీషణుడు ధర్మాత్ముడు, సాత్త్వికగుణసంపన్నుడు, రాక్షసవంశంలో జన్మించినా ముందునుంచి ధర్మమార్గంలో చరించినవాడు. ఈ విషయాన్ని శూర్పణఖ, అనల, సరమ కూడ వచిస్తారు. శరణాగతికి ఆరు అంగాలు ప్రధానం. ఆ ఆరు లక్షణాలు విభీషణునిలో గోచరిస్తాయి. భగవంతునిపై సద్బుద్ధి కలిగి ఉండడం, ఆయన శరీరభూతాలపై సమదృష్టి కలిగి ఉండడం మొదటిదైన ఆనుకూల్యమైన అంగం. ఈశ్వరాధిక్యాన్ని గుర్తించి, దానికి వ్యతిరేకంగా ఉన్న వాటిని విడిచిపెట్టడం రెండవదైన ప్రాతికూల్యవర్జనం. భగవంతుడు తనను తప్పక రక్షిస్తాడనే మహావిశ్వాసం మూడవది. భగవంతుని ముందు తన దీనత్వాన్ని చాటుకోవడం కార్పణ్యప్రదర్శనం. అది నాల్గవది ఈశ్వరుని ఆశ్రయించి "కావవే వరదా!" అని మొఱపెట్టుకోవడం గోప్తృత్వవరణం. అది అయిదవది చివరిది ఆత్మనిక్షేపం. తన సర్వభారాన్ని స్వామికి అప్పగించడం ఆత్మనిక్షేపం. ఈ ఆరు అంగాలు విభీషణునిలో సంపూర్ణంగా గోచరిస్తాయి.

శరణాగతికి ప్రధాన ఫలితం కైంకర్యరూపమోక్షం చేకూరడం. రాజ్యభోగాది సమస్తైశ్వర్యాలు చేకూరడం ఆనుషంగిక ఫలితం. ఈ రెండింటిలో విభీషణుడు ఏది కోరి వచ్చాడనే విషయంలో వాదోపవాదాలు ఉన్నాయి. ఈ విషయంలో హనుమంతుడు రామునితో ప్రసంగిస్తూ

"ఉద్యోగం తవ సంప్రేక్ష్య మిథ్యా వృత్తం చ రావణం ।
వాలినశ్చ వధం శ్రుత్వా సుగ్రీవం చాభిషేచితం ।
రాజ్యం ప్రార్థయమానస్య బుద్ధిపూర్వమిహాగతః" ॥ అని

ఇతడు రాజ్యం కోరి వచ్చాడని అంటాడు. అయినా అతనికి ప్రధాన ఫలితం కూడ చేకూరింది. విభీషణుడు సుగ్రీవపురస్సరంగా రాముని శరణు అర్థించాడు. దీనిని "పురుషకారం" అని కూడ అంటారు. "పురు సనోతి ఇతి పురుషః తం కరోతీతి పురుషకారః" అని వ్యుత్పత్తి. అల్పమపి ప్రాసంగికతయా అధికం "కరోతీతి పురుషకారః" అని స్వల్పమైనా అధికంగా చేసి చెప్పడమనేది పురుషకారం, సుగ్రీవుడు ముందు అంగీకరించకపోయిన సమయంలో రాముడు తన వ్రతనియమాన్ని చెబుతాడు.

"సకృదేవప్రపన్నాయ తవాస్మీతి యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ" ॥

అని తన శరణాగతరక్షణదీక్షానియమాన్ని తెలియజేశాడు. రాముడు ఇందు "ఏవ" అనే పదం అన్ని శబ్దాలకు అనువర్తించేలా వ్రాయడం వాల్మీకిప్రతిభకు మరో నిదర్శనం. శ్రీరాముడు కూడ విభీషణుని మనోభిప్రాయాన్ని గ్రహించి ఆతనిని లంకానగరపట్టాభిషిక్తుని కావించాడు. అనంతరం అతని సూచనపై సముద్రుని ప్రార్థించుటకై దర్భాసనంపై ఆసీనుడయ్యాడు.

అక్కడ లంకలో శార్దూలుని సూచనను అనుసరించి రావణుడు సుగ్రీవుని తన పక్షానికి రప్పించడానికై భేదోపాయాన్ని చేబట్టి, శుకుడనే దూతను ఆతని వద్దకు పంపించాడు. రామునికి తాను మాట ఇచ్చిన విషయాన్ని గుర్తెరింగిన సుగ్రీవుడు తగిన ప్రత్యుత్తరాన్ని శుకుని ద్వారా రావణునికి తెలియజేస్తాడు. వానరులు శుకుని బంధించగా రాముడు ఆతనిని విడిపింపజేసాడు.

మూడు రాత్రులు దర్భాసనంపై రాముడు శయనించి ఉపాసించినా, సముద్రుడు కానరానందులకు క్రుద్ధుడై బ్రహ్మాస్త్రాన్ని సంధించబోగా సాగరం కల్లోలమయింది. సముద్రుడు అంత రామసన్నిధికి ఏతెంచి తన స్వభావం లోతుగానుండి దాటశక్యం గాకుండ ఉండడమని విన్నవించుకొని, ఎక్కుపెట్టిన బాణాన్ని ద్రుమకుల్యంపై ప్రయోగింపజేసి పాపకర్ములను నశింపజేయించాడు. ఈ విషయంలో పిళ్లై లోకాచార్యులవారు ప్రపత్తికి దేశకాల ప్రకారనియమాలు లేవు కాని విషయనియమం మాత్రం ఉందని, అధికుడు అల్పుని విషయంలో చేసే శరణాగతి విఫలమవుతుందని శ్రీ వచన భూషణంలో తెలియజేసారు. రాముడు రావణసంహార సమర్థుడగునా కాదా? అని పరీక్షించుటకై సముద్రుడు ఆలస్యంగా వచ్చాడని గోవిందరాజీయ వ్యాఖ్యానం. విశ్వకర్మ తనూజుడైన నలుని ద్వారా తనపై సేతువును నిర్మించమని సముద్రుడు రామునితో విన్నవించుకొన్నాడు. మొదటిరోజు 14 యోజనాలు, రెండోరోజు 20 యోజనాలు, మూడో రోజు 21 యోజనాలు, నాల్గవరోజు 22 యోజనాలు, ఐదోరోజు 23 యోజనాలు మొత్తం 5రోజులలో శతయోజన విస్తీర్ణంగా సేతువు నిర్మింపబడింది. సముద్రమును తరించి అందరూ అవ్వలితీరం చేరారు. తండ్రి నలునికి అట్టి శక్తిసామర్థ్యాలు చేకూర్చాడు కావున నలుడు సేతువు నిర్మించగలిగాడు. సువేలాద్రిపై అందరూ విడిది చేశాడు. రామునికి శుభసూచకాలు, రావణునికి అశుభసూచకాలు శకునాలు

గోచరించాయి. వానరరాక్షసబలాబలతారతమ్య నిర్ణయం చేసి చెప్పవలసిందిగా రావణుడు శుకసారణులకు ఆదేశించాడు. వారిని విభీషణుడు గుర్తించగా వారి ద్వారా రాముడు రావణునకు మరునాడు ఉదయం నుండే యుద్ధమని సందేశం పంపాడు.

అప్పుడు శుకుడు రాముడు ధర్మాత్ముడని, ఆయనను జయించుట అసాధ్యమని

**"యస్మిన్న చలతే ధర్మో యో ధర్మం నాఽతివర్తతే ।**
**యో బ్రాహ్మమస్త్రం వేదాంశ్చ వేద వేదవిదాంవరః" ॥**

అని రామునకు బ్రహ్మాస్త్రప్రయోగవిద్య తెలియునని, రాముడు నీకన్న అధికుడని పలుకుతాడు. పిమ్మట రావణుడు శార్దూలుని పంపగా అతడు బంధవిముక్తుడై రాముని యుద్ధసంసిద్ధతను వ్యక్తపరుస్తాడు.

తదనంతరం రావణుడు విద్యుజ్జిహ్వునిద్వారా శ్రీరాముని మాయాశిరస్సును, ధనుస్సును చూపించి, అశోకవనంలో జానకిని భయపెడతాడు.

**"ఛిన్నం తే సర్వతోమూలం దర్పస్తే నిహతో మయా ।**
**వ్యసనేనాత్మనస్సీతే మమ భార్యా భవిష్యసి" ॥**

"భార్యాణాం సర్వాసామీశ్వరీ భవ" ఇత్యాది వాక్యాలు పలుకుతాడు. అంతేకాక "తతోఽ బ్రవీత్త్వాం భవ మే వశానుగా" అని కూడ అంటాడు. ఇక్కడ మహేశ్వరతీర్థీయం చక్కని వ్యాఖ్యానమందించింది.

"మేఽవశానుగా" అనే చోట అకార ప్రశ్లేషచేస్తే మే లక్ష్మీదేవి! అవశానుగా = విష్ణు స్వరూపుడగు రామునికి వశ్యురాలవై వెళ్లగలవు అని వాస్తవార్థాన్ని వివరించింది.

శ్రీరాముని మాయా శిరస్సును, ధనుస్సును చూచి సీతాదేవి పరిపరివిధాలుగా విలపిస్తూ ఉండగా (విభీషణుని భార్యయైన) సరమ ఆమెను ఊరడించింది. మాల్యవంతుడు రావణునకు హితోపదేశం చేయగా ఆతడు కుపితుడై యుద్ధానికి ఏర్పాట్లు కావించాడు. సువేలాద్రియందున్న సుగ్రీవాదులు రావణుని చూచారు. సుగ్రీవుడు ఒక్క ఉదుటన పైకెగిరి రావణునిపై విరుచుకొనిపడి ద్వంద్వయుద్ధం చేసాడు. సుగ్రీవుడు రావణుని చంపగలిగినవాడైనా రామప్రతిజ్ఞకు భంగం రాకుండా తిరిగివచ్చాడని గోవిందరాజీయవివరణ. శ్రీరాముడు తన చివరి ప్రయత్నంగా అంగదుని దూతగా రావణుని వద్దకు పంపుతాడు. అంగదుడు సందేశం వినిపించి తిరిగి వస్తూ రావణప్రాసాదగోపురాన్ని ధ్వంసం చేశాడు.

**"రావణస్తు పరం చక్రే క్రోధం ప్రాసాదధర్షణాత్ ।**
**వినాశం చాత్మనః పశ్యన్ నిఃశ్వాసపరమో భవత్" ॥**

అంగదుడు తన ప్రాసాదాన్ని బ్రద్దలు కావించినందులకు రావణుడు మిక్కిలి కోపించాడు. ఇక తనకు మరణమాసన్నమైనట్లు తలుస్తూ నిట్టూర్పు విడిచాడు. రాక్షసులకు వానరులకు ఘోరయుద్ధం ప్రారంభమయింది. ప్రజంఘుడు మున్నగు రాక్షసవీరులెందరో హతులయ్యారు. రామనామాంకితబాణాలతో రణమండలమంతా

వ్యాపించింది. తొలి నాటి యుద్ధం రాత్రివేళ కూడ జరిగింది. ఇంద్రజిత్తు అదృశ్యుడై రామలక్ష్మణులను నాగపాశబద్ధులను గావిస్తాడు. రావణుని ఆదేశానుసారం త్రిజట మున్నగు రాక్షసస్త్రీలు పుష్పకవిమానంపై సీతను అధిరోహింపజేసి యుద్ధభూమిని చూపిస్తారు. రామలక్ష్మణులు మృతులైనట్లు భావించి సీతాదేవి మిక్కిలి తల్లడిల్లింది. త్రిజట భర్తృవిహీనయైన స్త్రీ ఈ విమానాన్ని అధిరోహించలేదని పరిపరివిధాలుగా సీతను ఓదార్చింది.

అస్త్రప్రభావాన్ని చాటి చెప్పుటకై రాముడు కూడ భూశయ్యాగతుడయ్యాడు. గరుత్మంతుని రాకతో రామలక్ష్మణులు బంధవిముక్తులయ్యారు. హనుమంతుడు ధూమ్రాక్షుని, అంగదుడు వజ్రదంష్ట్రుని హతమార్చారు.

ఆకంపనుడు కూడ హనుమంతునిచే హతుడయ్యాడు. ప్రహస్తుడు నీలుని చేతిలో నిహతుడయ్యాడు. వరుసగా పరాజయాలను చవిచూస్తున్న రావణుడు స్వయంగా యుద్ధానికి బయలుదేరాడు. విభీషణుడు చెప్పగా రాముడు రావణుని చూచి.

**"అహో దీప్తో మహాతేజా రావణో రాక్షసేశ్వరః ।**

**ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యో రశ్మిభిర్భాతి రావణః" ॥** అని ప్రశంసిస్తాడు. శత్రువును కూడా ప్రశంసించడం రాముని ఔదార్యం. రావణుడు వరుసగా సుగ్రీవుడు, హనుమంతుడు, నీలుడు విహ్వాలులయ్యేట్లు యుద్ధం చేశాడు. హనుమంతుడు తేరుకొని మరొకరితో యుద్ధం చేస్తున్న రావణునిపై విజృంభించలేదు. రావణుడు ప్రయోగించిన శక్తి అనే అస్త్రానికి లక్ష్మణుడు స్పృహ కోల్పోయి రణభూమిలో పడిపోయాడు. రావణుడంత రథం నుండి దిగి లక్ష్మణుని ఎత్తుకొని పోవడానికి ప్రయత్నించాడు. కాని సౌమిత్రి శేషాంశ సంభూతుడు కాన ఆ పని చేయలేకపోయాడు. అంత మారుతి ముష్టి ప్రహారంతో రావణుని స్పృహతప్పి పోవునట్లు చేసి లక్ష్మణుని రామ సన్నిధికి కొనివచ్చాడు. అంత రామరావణయుద్ధం ప్రారంభమయింది. మారుతి వచ్చి వేడుకొనగా శ్రీరాముడు ఆతని భుజస్కంధాలపై అధిరోహించాడు.

రావణుడు తన తీక్ష్ణబాణాలతో హనుమంతుని రక్తసిక్తుని కావిస్తాడు. రాముడప్పుడు "కోపస్య వశమేయివాన్" క్రోధావేశవశుడయ్యాడు. వెంటనే వరుసగా బాణాలు వేసి రావణుని రథాన్ని, చక్రాలను, అశ్వాలను, ధ్వజపతాకాలను, సారధిని కూలనేసి, ఆతని వక్షఃస్థలంపై గట్టి దెబ్బకొట్టాడు.

**"యో వజ్రపాతాశని సన్నిపాతాత్**
**న చుక్షుభే నాపి చచాల రాజా ।**
**స రామబాణాభిహతో భృశార్తః**
**చచాల చాపం చ ముమోచ వీరః" ॥**

అని రావణుడు రామబాణాభిహతుడై చాపం వదిలివేసాడని వాల్మీకి వ్రాసాడు. నిరాయుధుడైన వానిని రాముడు చంపడని భావించి అతడు చాపం వదిలాడని, ఇంతలోనే రాముడు మరో బాణంవేయగా కిరీటం నేలపై పడిందని, రాముడంత వాత్సల్యం చూపించి, నిరాయుధుడైన వానిని చంపలేనని, మళ్లీ తిరిగి యుద్ధానికి రావలసిందని రావణుని పంపివేస్తాడు. తన భార్యను అపహరించిన వానిని చంపితీరుతానని ప్రతిజ్ఞచేసి కూడా నిరాయుధుడైన

రావణునిపై బాణప్రయోగం చేయని ధర్మవీరుడు రాముడు. అంత రావణుడు కుంభకర్ణుని మేల్కొలుపవలసిందని ఆజ్ఞాపిస్తూ

**"నవ షట్ సప్త చాష్టౌ చ మాసాన్ స్వపితి రాక్షసః**

**మంత్రయిత్వా ప్రసుప్తోఽయమ్ ఇతస్తు నవమేఽహని"** అని వచిస్తాడు. అతడు తన ఇష్టానుసారంగా ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది మాసాల చొప్పున నిద్రిస్తూ ఉంటాడని, యుద్ధవిషయాన్ని చర్చించిన పిమ్మట తొమ్మిది రోజుల క్రితమే నిద్రించాడని, ఆతనిని నిద్రలేపండని ఆజ్ఞాపిస్తాడు. బ్రహ్మశాపంవల్ల అతడు వరుసగా ఆరునెలలు నిద్రిస్తాడు. ఆ తరువాత ఆతని ఇష్టానుసారం నిద్రించవచ్చు. రావణుడు విభీషణాదులతో మంత్రణచేసిన పిమ్మట మరునాడే నిద్రకు ఉపక్రమించాడని మంత్రణదినమునందే విభీషణుడు శ్రీరాముని పొందుట, మూడురోజులు దర్భశయనం, ఐదురోజులు సేతునిర్మాణ సముద్రతరణం, సువేలాద్రిపై ఆ రాత్రి వసించడం, ఆ మరునాడే సుగ్రీవునిచే రావణకిరీటభంగం, అంగదరాయబారం జరిగాయని, ఈ విధంగా యుద్ధప్రారంభానికి ముందే తొమ్మిది రోజులు గడిచాయని మహేశ్వరతీర్థుల వ్యాఖ్యానం.

కాని గోవిందరాజీయ వివరణ మరోవిధంగా ఉంది. ఇక్కడ "నవసప్తదశాష్టౌ చ మాసాన్" అనే పాఠాంతరం కూడ ఉంది. నవ + సప్త 9 + 7 = 16 అందు దశాష్టౌ (అష్టిరశనం నాశః) అందు 10 మాసాలు తగ్గగా ఆరుమాసాలవుతాయి. పై పాఠాన్నే స్వీకరిస్తే" నవ = 9 షట్ = 6 సప్త = 7, అష్ట= 8 మొత్తం 9 +6 +7 +8 = 30, **ఆరు రోజులు మాసమని ఒక పక్షం** 30 × 6 = 180 అనగా 6 మాసాలు. అతడు 6 మాసాలు విరామం లేకుండ నిద్రించి లేస్తాడు. అటు పిమ్మట అతని ఇష్టానుసారంగా పరుండవచ్చు. మేల్కొనవచ్చు.

ఫాల్గుణ శుక్ల త్రయోదశి హనుమంతుని లంకా ప్రవేశం, చతుర్దశి ఉదయం లంకాదాహం, ఆంజనేయుడు వెంటనే బయలుదేరి రామసన్నిధికి చేరడం, చతుర్దశీయుక్త పూర్ణిమలో యుద్ధయాత్ర ప్రారంభించడం, మిగులు పూర్ణిమనాడు ఉదయం మంత్రణం, విభీషణ నిర్గమనం, శ్రీరామశరణాగతి, పాడ్యమినాడు దర్భశయనం, నాడే కుంభకర్ణ నిద్రప్రారంభం, అష్టమి వరకు మూడు రోజులు దర్భశయనం, అయిదు రోజులు సేతుబంధనం, అష్టమి నాడు, రాత్రి సువేలాద్రి అధిరోహణం, నవమినాడు లంకముట్టడి. నాటిరాత్రి నాగాస్త్రబంధనం, తద్విముక్తి, యుద్ధంలో రెండోరోజు రావణపరాభవం, కుంభకర్ణుడు నిద్రలేవడం, ఆ రోజే ఇంద్రజిత్తుచే వానరులు హతులవ్వడం, ఆ రాత్రే సంజీవనీ ప్రభావంతో వానరులు పునర్జీతులు కావడం. 3,4, 5 రోజులలో ఇంద్రజిత్తు మరణించడం, ఆరో రోజు మూలబలం సంహారం. ఏడో రోజు రామ రావణ యుద్ధం జరిగిందని, అమావాస్యనాడు ఏడోరోజు పూర్తిగా సాగినయుద్ధం ఎనిమిదో రోజున రావణవధతో ముగిసిందని, **"రామరావణయోర్యుద్ధం సప్తరాత్రమవర్తత"** అనే దానికి ఇది సరిపోతుందని గోవిందరాజీయవ్యాఖ్య.

మరి రావణుడు సీతకు 2 మాసాలు గడువు ఇచ్చాడు కదా! మరి 14సం॥ నిండడానికి ఒకమాసం మిగిలిపోయిందికదా! అనే శంక ఉదయిస్తుంది. రావణుడు సీతాదేవికి 2 మాసాలు గడువు ఇచ్చినప్పటికీ, సీత "ఊర్ధ్వం మాసాన్న జీవేయం" అని అన్నది కాన ఇక ఒక మాసంలోనే వనవాసదీక్షపూర్తవుతుందని ఆమె అభిప్రాయం సమంజసమని గోవిందరాజీయం పేర్కొన్నది. జరుగుతున్న ఫాల్గుణ మాసంతోనే వనవాసదీక్ష పూర్తికాగలదని ఆమె నిశ్చయం.

నిద్రించు కుంభకర్ణుని లేపుట అనుచితమయినా, అతడు అవసరం వచ్చినపుడు తెలియపరచమన్నాడు. కాన, ఇది దారుణ సమయంకాన నిద్రలేపవచ్చు. కుంభకర్ణుని మరణానంతరం రావణుడు ఎంతగానో విలపించాడు. విభీషణుని మాట విననందులకు పశ్చాత్తాప హృదయుడయ్యాడు. కుంభకర్ణుడు ఇక్కడ సుగ్రీవునితో నీవు బ్రహ్మ పౌత్రుడవని, ఋక్షరజుని పుత్రుడవని అంటాడు. గోవిందరాజీయం ఇలా వివరించింది. బ్రహ్మ ఆవులింపగా నోటి నుండి ఋక్షరజుడనే వానరుడు పుట్టాడని, అతడు అప్సరోరూపజనకరూపమైన సరస్సులో తెలియక స్నానంచేసాడని, వెంటనే అప్సరోరూపం పొందాడని, ఇంద్రాదిత్యులిరువురు ఆమెను కామించి ఒకే పర్యాయం కరగ్రహణం చేసారని, ఆ యువతి వాలస్థానంలో ఇంద్రుని రేతస్సు, కంఠభాగంలో సూర్యుని రేతస్సునిలిచాయని, వాలస్థానం నుండి వాలి, కంఠభాగం నుండి సుగ్రీవుడు ఉద్భవించారని, ఆమె మళ్లీ స్నానం చేయగా ఋక్షరజసుని రూపం వచ్చిందని, అందువల్ల బ్రహ్మకు వాలి సుగ్రీవులు పౌత్రులని ఒక ఐతిహ్యాన్ని వివరించింది. బ్రహ్మకుమారుడు కశ్యపుడు, అతని కుమారుడు ఆదిత్యుడు, ఆతని కుమారుడు సుగ్రీవుడు కాన బ్రహ్మకు పౌత్రుడయ్యాడు సుగ్రీవుడు. ఈ ఉద్దేశ్యంతోనే మారుతి కూడ రావణునితో భ్రాతృసమానుడైన సుగ్రీవుని వచనాన్ని ఆలకింపుమని సుందరకాండలో అనడం జరిగింది కాబోలు.

అటు పిమ్మట అంగదుడు నరాంతకుని, హనుమంతుడు దేవాంతకుని, త్రిశిరుని, నీలుడు మహోదరుని, ఋషభుడు మహాపార్శ్వుని, లక్ష్మణుడు అతికాయుని వధిస్తాడు. ఇంద్రజిత్తు మళ్లీ యుద్ధానికి వచ్చి వానరసేనను తునిమాడాడు. రామలక్ష్మణులు మూర్ఛిల్లినట్లు ఉండిపోగా, అతడు లంకకు చేరి తండ్రికి తనవిజయవార్తను చెబుతాడు. జాంబవంతుని ఆదేశంపై మారుతి సంజీవనీ పర్వతాన్ని తీసుకొనిరాగా రామలక్ష్మణులు, వానరులు స్వస్థులయ్యారు. అంతవరకూ మరణించిన వానరులందరూ పునర్జీవితులు అయ్యారు. రావణుని ఆజ్ఞపై చనిపోయిన రాక్షసులను భటులు సముద్రంలోకి త్రోసివేయడంతో రాక్షసులకు ఆ అవకాశం లభించలేదు. మరొక్కసారి మళ్లీ లంకా దహనమయ్యింది. అంగదుడు కంపనుని, ప్రజంఘుని, ద్వివిదుడు శోణితాక్షుని. మైందుడు యూపాక్షుని, సుగ్రీవుడు కుంభుని వధిస్తారు. హనుమంతుడు నికుంభుని సంహరిస్తాడు. శ్రీరాముడు మకరాక్షుని వధిస్తాడు.

ఇంద్రజిత్తు మాయాసీతను సృష్టించి, హనుమంతుడు చూస్తూ ఉండగా ఆమెను వధిస్తాడు. (మాయా) సీత వధింపబడిన వార్తను విని రాముడు చింతాక్రాంతుడయ్యాడు. లక్ష్మణుడు ధర్మాధర్మాలను గూర్చి ప్రస్తావించి రామునికి ధైర్యం చెబుతాడు. విభీషణుడు ఇంద్రజిత్తు మాయను తెలిపి నికుంభిలాహోమాన్ని ధ్వంసం చేయడానికై లక్ష్మణుని పంపమన్నాడు. మూడు రోజులు లక్ష్మణునకు, ఇంద్రజిత్తుకు ఘోరయుద్ధం జరిగింది.

**"ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది ।**
**పౌరుషే చాప్రతిద్వంద్వ శ్శరైనం జహి రావణిమ్" ॥**

అని ఐంద్రాస్త్రప్రయోగం చేసి లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించాడు. రాముడు లక్ష్మణుని కొనియాడి ఇక రావణుడు హతుడైనట్లే అని వచిస్తాడు. సుషేణుడు చికిత్స చేయగా గాయపడిన వారందరు తేరుకొన్నారు. రావణుడు దుఃఖావేశంతో సీతాదేవిని చంపుటకుద్యమించాడు. కాని సుపార్శ్వుని వచనాలను విని వెనుదిరిగాడు. శ్రీరాముడు గాంధర్వాస్త్ర ప్రయోగం చేసి రావణుని మూలబలాలను తుత్తునియలు గావించాడు. ఆత్మీయులందరూ హతులైనందులకు రాక్షసస్త్రీలు ఆక్రందనచేసారు.

ఇంటింట ఆర్తితో నున్న రాక్షసస్త్రీల రోదనధ్వనులు వినలేక రావణుడు నిట్టూర్చి మళ్లీ స్వయంగా యుద్ధానికి సిద్ధమయ్యాడు. వానరులు పారిపోతూ ఉండగా, వారికి ధైర్యం కలగజేయడానికి సుగ్రీవుడు విరూపాక్షుని వధించాడు. మహోదరుడు కూడ ఆతనివల్లనే మృతిచెందాడు. అంగదుడు మహాపార్శ్వుని సంహరించాడు. రావణుడు ఆసుర్యాస్త్రం ప్రయోగించగా శ్రీరాముడు ఆగ్నేయాస్త్రం వేసి దానిని వమ్ము కావించాడు. రావణుడు ప్రయోగించిన శక్తి అనే ఆయుధానికి లక్ష్మణుడు మూర్ఛితుడయ్యాడు. అది మయనిర్మితం. లక్ష్మణుని పాటు చూచిన రాముడు కోపించి

**"అరావణం మరామం వా జగద్ద్రక్ష్యథ వానరాః"**

అని ఈ జగత్తులో రావణుడో? రాముడో? ఒక్కడే మిగిలి యుండాలని తీవ్రనారాచాలను ప్రయోగించాడు. ఆ శరాఘాతాలకు తట్టుకోలేక రావణుడు భయంతో పారిపోయాడు. స్పృహలేని స్థితిలో నున్న లక్ష్మణుని చూచి రాముడు చింతాక్రాంతుడై

**"దేశే దేశే కలత్రాణి దేశే దేశే చ బాంధవాః ।**
**తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః" ॥**

"ఏదేశంలోనైనా భార్య లభించవచ్చు. బంధువులు ప్రాప్తించవచ్చు. కాని లక్ష్మణుని వంటి సోదరుడు ఎచ్చటా దొరకడు." అని శోకవిహ్వలుడు కాగా సుషేణుడు లక్ష్మణుడు మరణించలేదని వెంటనే సంజీవనీత్యాదులైన ఓషధులను తెమ్మని హనుమంతునితో వచించాడు. హనుమ ఆ గిరిశిఖరాన్నే పెల్లగించి తీసుకొనివస్తాడు. లక్ష్మణుడు స్వస్థుడయ్యాడు. సూర్యాస్తమయం లోపునే రావణుని వధించమని లక్ష్మణుడు రాముని తొందర పెట్టాడు.

శ్రీరాముని విజయం కొరకై ఇంద్రుడు తన దివ్యరథాన్ని మాతలి అనే సారథితో కలిపి పంపించాడు. మళ్ళీ రావణుడు వచ్చి రామునితో యుద్ధం కావించాడు. రాముని బాణప్రహారాలకు తట్టుకోలేని రావణుని చూచి, అతని సారథి రథాన్ని ప్రక్కకు మళ్లించాడు. అందువల్ల రావణుడు సారథిని తీవ్రంగా మందలించాడు. అతడు తన ధర్మాన్ని పాటించానని వచింపగా సారథికి రావణుడు తన హస్తాభరణాన్ని కానుకగా ఇచ్చి మళ్లీ యుద్ధానికి వచ్చాడు.

"తతో యుద్ధ పరిశ్రాంతం సమరే చిన్తయాస్థితమ్, రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్" శ్రమనొంది తన ఎదుట సన్నద్ధుడైన రావణుని చూచి నా పరతత్త్వాన్ని ప్రకటించకుండా ఈ రావణుని ఎలా జయించాలనే ఆలోచించేరాముని వద్దకు అగస్త్యుడు వచ్చి ఆదిత్యహృదయం ఉపదేశిస్తాడు.

ఇక్కడ గోవిందరాజీయం రాముడు చింతావిష్టుడు కావడం వల్ల, రాముని యందు వాత్సల్యంవల్ల, కార్యత్వరవల్ల "రామ! రామ!" అని ద్విరుక్తి చెప్పబడింది. దానిని జపించడం వల్ల రాముడు అధిక తేజస్వంతుడయ్యాడు. యుద్ధప్రారంభకాలం నుండి రామరావణయుద్ధం ఏడు రోజులు జరిగింది. రాముడు రావణుని శిరస్సు పదే పదే ఉద్భవిస్తూ ఉండగా 101 పర్యాయాలు ఖండించాడు. రాత్రి విరామం లేకుండా ఆనాడు రామరావణయుద్ధం జరిగింది. మాతలి సూచనపై రాముడు బ్రహ్మాస్త్రప్రయోగం చేయగా రావణుడు నేలకూలాడు. ఫాల్గుణ అమావాస్య లేదా ప్రతిపద్యుక్తమైన అమావాస్యనాడు రావణవధ జరిగింది.

అనంతరం శ్రీరాముడు అన్నగారి వధకై విలపించుచున్న విభీషణుని ఓదార్చి సంస్కారవిధిని కావించమన్నాడు. మండోదరి విలపిస్తూ ఉండగా అందరికీ కన్నీరు కురిసింది. శ్రీరాముని ఆదేశానుసారం విభీషణుని లక్ష్మణుడు లంకాపట్టాభిషిక్తుని కావించాడు. పిమ్మట హనుమంతుడు వెళ్ళి శ్రీరాముని విజయవార్తను సీతాదేవికి తెలియజేశాడు. సీత తాను రామలక్ష్మణులను చూడగోరుచున్నానని వర్తమానం పంపింది. రాముని ఆదేశం ప్రకారం తాను ఏ స్థితిలోనున్నానో అలాగే వస్తానని సీత చెప్పినా, ఆమెకు అభ్యంజన స్నానమాచరింపజేసి పల్లకీలో విభీషణుడు రామసన్నిధికి తీసుకొని వచ్చాడు. సీతను సర్వాభరణభూషితురాలుగా రాముడు రమ్మనడంలో ఒక అభిప్రాయం ఉండవచ్చు. ఆమె ఇప్పుడగ్ని ప్రవేశం చేస్తుంది. దానికి శుచి, శుభ్రం, పవిత్రత ప్రధానం, అందువల్ల రాముడలా ఆజ్ఞాపించాడేమో! రాముడు సీతతో పరుషసంభాషణ కావిస్తాడు. లక్ష్మణ, భరత, సుగ్రీవ విభీషణాదులలో ఎవరి వద్దకయినా వెళ్ళి నీ మనస్సును కుదుటపరుచుకొని సుఖంగా వసించమన్నాడు. ఇందు రాముని అభిప్రాయం నీవు వారిని పరిపూర్ణంగా అనుగ్రహించవలసియున్నదని సూచించడానికేమో!

ఇతః పూర్వం ఇటువంటి పరుషవాక్యాలు రాముని నోటివెంట రావడం సీత ఎరుగదు. ఆమె తన పాతివ్రత్యాన్ని నిరూపించుకోవడానికై అగ్నిప్రవేశం చేయాలనుకొన్నది. రాముడు మాత్రం నేరుగా సీతను అగ్నిప్రవేశం చేయమని కోరలేదు. లక్ష్మణుని చితిని సిద్ధపరచమని చెప్పి అగ్నికి ప్రణమిల్లి సీత అందు ప్రవేశించింది. బ్రహ్మాది దేవతలు అందరూ అక్కడకువచ్చి రాముని స్తుతించారు. అగ్నిదేవుడు తండ్రిలా సీతాదేవిని తీసుకొని వచ్చి శ్రీరామునికి సమర్పిస్తాడు. రాముడప్పుడు ఇట్టి ఉత్తమురాలిని అన్యాయంగా పరుషవచనాలతో నొప్పించానుకదా! అని వ్యాకులపాటుతో కంట తడిపెట్టుకొన్నాడు. తాను మహావిష్ణువుగా ఇచ్చినవాగ్దానం ప్రకారం 11 వేల సంవత్సరాలు రాజ్యపాలనచేసి పిమ్మట అవతారాన్ని చాలిస్తానని దశరథుని సమక్షంలో చెప్పడం జరిగింది. దశరథుడు సీతారామలక్ష్మణులను ఆశీర్వదించి స్వర్గానికి వెళ్ళిపోతాడు. శ్రీరాముని కోరికపై దేవేంద్రుడు మృతులైన వానరులందరిని పునర్జీవితులను కావించాడు. శ్రీరాముడు పుష్పకాన్ని అధిరోహించి అయోధ్యకు బయలుదేరాడు. మార్గమధ్యంలో రాముడు సీతకు ప్రఖ్యాత ప్రదేశాలనన్నింటిని చూపిస్తాడు. **"అత్ర పూర్వం మహాదేవః ప్రసాదమ్ అకరోత్ ప్రభుః"** ఇచట మహాదేవ శబ్దానికి సముద్రుడని అర్థమని మహేశ్వరతీర్థీయంచెబుతుంది. గోవిందరాజీయం కూడ ఇచ్చట మహాదేవ ప్రసాద శబ్దం రామప్రతిష్ఠిత శివలింగాన్ని, రుద్రానుగ్రహాన్ని చెప్పడం లేదని వచించింది. "దర్శయామాస చాత్మానం సముద్ర స్సరితాం పతిః" అనే బాలకాండలోని ప్రథమసర్గలోని శ్లోకాన్ననుసరించి మహేశ్వరతీర్థీయాభిప్రాయమై ఉండవచ్చు. కాని సేతునిర్మాణానికి ముందే శివలింగప్రతిష్ఠచేసినట్లు కూర్మపురాణం, రావణసంహారమయిన పిమ్మట శివలింగాన్ని ప్రతిష్ఠచేసినట్లుగా పద్మపురాణం పేర్కొన్నాయి. ఇచట "అత్రపూర్వం మహాదేవః" అనే చోట ఉన్న మహాదేవ శబ్దానికి మహాదేవుని ప్రసాదం వల్ల స్వపితృదర్శనం జరిగిందని భావం అని గోవిందరాజీయం.

పుష్పకం కిష్కింధలో ఆగగా ఉత్తమురాంద్రయిన వానర స్త్రీలు అయోధ్యను చూచుటకై దానిని అధిరోహించారు.

**"పూర్ణే చతుర్దశే వర్షే పంచమ్యాం లక్ష్మణాగ్రజః ।**
**భరద్వాజాశ్రమం ప్రాప్య వందే నియతో మునిమ్" ॥**

చైత్రశుద్ధపాడ్యమినాడు రావణసంస్కారం, విదియనాడు విభీషణపట్టాభిషేకం, తదియనాడు సీతాసమాగమం, చవితినాడు కిష్కింధకు రావడం. పంచమినాడు భరద్వాజాశ్రమప్రాప్తి, షష్ఠినాడు నందిగ్రామంలో జటావిసర్జనం, సప్తమినాడు పుష్యమి నక్షత్రంలో శ్రీరామపట్టాభిషేకం అని మహేశ్వరతీర్థీయంలో చెప్పబడింది. గోవిందరాజీయం ఇంచుమించుగా ఇలాగే వచించింది. కాని చాంద్రమాన ప్రకారం సప్తమీనాడు పుష్యమీ నక్షత్రం ఎన్నడో కాని సంభవించదు. బయలుదేరునపుడే చైత్రశుద్ధ పంచమినాడు వనవాసరమనినీ కూడ గోవిందరాజీయం వచించింది. ఇది ఏ ప్రమాణంగా జరిగిన పరిగణనో ఆలోచించవలసి ఉంది.

ఆంజనేయుడు ముందుగానే వెళ్ళి భరతునికి రామాగమనం తెలియజేస్తాడు.

భరతుడు రాజ్యాన్ని రాముని కర్పిస్తూ

**“పూజితా మామికా మాతా దత్తం రాజ్యమిదం మమ ॥**
**తద్దదామి పునస్తుభ్యం యథాత్వమదదా మమ ।**

**అని ఇదివరకటివలె“ తద్దదామి తవైవాహం” ॥** అని అనకుండా “తద్దదామి పునస్తుభ్యం” అని ఏ అపేక్షలేనివాడై సమర్పణ చేసాడు.

రత్నమయ సింహాసనంపై సీతాసహితుడై రాముని అధిష్ఠింపజేసి వసిష్ఠాదులు అభిషిక్తుని కావించారు. అనంతరం రాముడు ఎన్నో సత్కారాలు చేసాడు. సుగ్రీవునికి మణిహారాన్ని, అంగదునికి కనకాంగదాలను బహూకరించాడు. ముత్యాలహారాన్ని సీతాదేవికి ఈయగా, ఆమె వస్త్రాలను, అభరణాలను కూడ కలిపి మారుతికి ఇచ్చింది.

**“లబ్ధ్వా కులధనం రాజా లంకాం ప్రాయాద్విభీషణః”**

ఇచ్చట కులధనశబ్దానికి శ్రీరంగ విమానమని గోవిందరాజీయం అభిప్రాయపడింది. “కులధనము” అనగా ఇచ్చట లంకారాజ్యమే అని మహేశ్వరతీర్థీయం వచించింది. ఉత్తరకాండలో మళ్ళీకులధనాన్ని ఇచ్చినట్లు చెప్పబడింది. ఇప్పుడే శ్రీరంగవిమానాన్ని ఇచ్చివేస్తే ఇకరాముడు ఎవరిని పూజించినట్లు? అవతార పరిసమాప్తితో ఇక్ష్వాకుల దైవతమయిన శ్రీరంగవిమానాన్ని ఇచ్చినట్లు చెప్పాలని మహేశ్వరతీర్థీయం.

యౌవరాజ్యానికి లక్ష్మణుడు అంగీకారం చూపకపోవడంతో భరతుడే యౌవరాజ్యాభిషిక్తుడయ్యాడు. రామరాజ్యం ఎలా ఉంటుందో వాల్మీకి కన్నులకు కట్టినట్లు వర్ణించాడు. రాముడు పదివేల సంవత్సరాలు పరిపాలించాడని వాల్మీకి ముందు చెప్పి, తరువాత పదకొండు వేల సంవత్సరాలు పాలించాడని చెప్పడంచే రాముడు సీతాదేవితో కలసి పదివేల సంవత్సరాలు, సీతను పరిత్యజించినపిమ్మట మరోవేయి సంవత్సరాలు రాజ్యపరిపాలన చేసాడని చెప్పవలసియుంది.

**“శృణ్వన్ రామాయణం భక్త్యా**
**యః పాదం పదమేవ వా ।**
**స యాతి బ్రహ్మణః స్థానం**
**బ్రహ్మణా పూజ్యతే సదా” ॥** ఇవి యుద్ధకాండలోని విశేషాలు.

# శ్రీమద్వాల్మీకి రామాయణం - యుద్ధకాండ సమీక్ష

**వ్యాఖ్యాత - డా॥ ముదిగొండ శంకరశర్మ**

పురుష ప్రయత్నసాధ్యమైన విషయం సుందరకాండలో చెప్పబడింది. దానిని సాధించు ప్రకారం ఈ కాండలో చెప్పబడుతున్నది. ఇతరులకు అసాధ్యమైన సముద్రలంఘన , లంకాప్రవేశ, సీతాదర్శన, రాక్షసమర్దన, లంకాదాహాది కార్యాలను నిర్వహించి వచ్చిన ఆంజనేయుని కృతకృత్యుడగు సేవకుని విషయంలో ప్రభువే ఈ విధంగా ఆంజనేయుని ప్రశంసిస్తూ ఉన్నాడు.

ఇతరులు మనసు చేతగూడ ఊహించలేని గొప్పపనిని ఆంజనేయుడు చేశాడు. సముద్రతరణవిషయంలో ఇతడికి గరుడవాయువులు మాత్రమే సాటివస్తారు. అజేయమగు లంకను దేవదానవగంధర్వాదులలో ఎవరూ ఈతనివలె స్వీయబలంతో ప్రవేశించి బ్రతికి బయటకురాగలరు? ఇతనికి ఎవరూ సాటిరారు. ఇతడు సుగ్రీవాజ్ఞా పాలననేకాక చెప్పబడనివైనప్పటికీ అశోకవనభంగ, రాక్షససంహార లంకాదాహాదులను స్వీయ పరాక్రమానుగుణంగా నిర్వహించిన ఉత్తమభృత్యుడు.

స్వామి ఆజ్ఞాపించిన కార్యనిర్వహణ చేయుటేగాక చెప్పబడనివైనా ప్రకృతోపయుక్తకార్యాంతర నిర్వహణ చేయువాడు ఉత్తమభృత్యుడు. సామర్థ్యముండికూడ ప్రభువు చెప్పని ఉపయుక్త కార్యాన్ని చేయనివాడు మధ్యమభృత్యుడు. ఇక్కడ "భృత్యోఽ భృత్యస్సమర్థోఽ పి" అని పాఠాంతరం. నియుక్త కార్యాచరణంవల్ల భృత్యుడు, ఉపయుక్త అధికకార్యాచరణంవల్ల అభృత్యుడు. ఇక సామర్థ్యముండీ చెప్పిన పనినిగూడ చేయని వాడధమభృత్యుడు.

ఆంజనేయుడు ఉత్తమభృత్యుడు. సీతాన్వేషణకై నియుక్తుడైన ఇతడు తద్దర్శనంతో పాటు అనుక్తములైనా ప్రకృతోపయుక్తములైన రాక్షససంహారాదుల నొనర్చి సుగ్రీవుని సంతుష్టుని చేశాడు. సీతావృత్తాంతం మాకు తెలియనిచో మేమందరం శరీరాలను విడిచిఉండేవాళ్లం. అట్టి అధర్మాచరణం మేము చేయకుండునట్లు 'సీతను చూచి వచ్చితి' నని చెప్పినాడు.

ఇట్టి సంతోషవార్త చెప్పిన ఇతనికి తగిన ప్రత్యుపకారమేమి చేయగలను? నాసందేశము ఆమెకు, ఆమె సందేశం నాకు వినిపించి మమ్ముభయులను జీవింపజేసిన ఈ మహాత్మునికి సర్వస్వదానంగా ఈ కౌగిలినిచ్చెద అని శ్రీరాముడు ప్రీతిపులకితదేహుడై హనుమంతుని ఆలింగనం చేసుకొన్నాడు.

నిస్పృహుడగు ఆంజనేయుని సంతుష్టుని చేయడం ఇతరదానాలవల్ల సాధ్యపడదు కావున సర్వాశ్రయభూత స్వీయసాక్షాత్పరమేశ్వరస్వరూపభావనతో ఆలింగనవ్యాజంతో సర్వస్వదానం శ్రీరామచంద్రుడనుగ్రహించాడు.

పిమ్మట సుగ్రీవాదులు వినుచుండగా శ్రీరాముడిట్లువచించాడు. సీతాన్వేషణ చక్కగా చేయబడింది. సముద్ర తరణం గురించి ఆలోచించిన మనసు వ్యాకులపడుతున్నది. వానరులు సముద్రమును ఎట్లు దాటుదురు అనుదానికి సమాధానమేమి? హనుమంతునితో ఈవిధంగా పలికి శోకావృతచిత్తుడై చింతించాడు.

## రెండవ సర్గము

శోకావిష్టుడగు శ్రీరాముని గూర్చి నీతిశాస్త్రజ్ఞుడు, మిత్రగుణసంపన్నుడు అగు సుగ్రీవుడు సీతావృత్తాంత శ్రవణమువలన ప్రీతియుక్తుడై ఉండవలసిన క్షత్రియపుత్రుడగు ఇతడు దుఃఖించుట తగదని తలచి శ్రీరామ దుఃఖనివారణమగు వాక్యాన్ని ఇలా పలికాడు.

అజ్ఞానివలె నీవు దుఃఖించుట తగదు. సీతావృత్తాంతం తెలియనపుడు దుఃఖించడానికి కారణముంది. ఇపుడట్టికారణం కూడ లేదు కద! నీవు రాబోవు విషయాలను ఊహించగలిగినవాడవు. నీతిశాస్త్రజ్ఞుడవు. ఆత్మజ్ఞుడవైన నీవు పరమపరుషార్థ ప్రతిబంధకమైన విషయాసక్తిని యోగులు వదలినట్లు దుఃఖకలుషితబుద్ధిని వదలుము. సముద్రతరణం దుస్తరమందువేమో! సముద్రాన్ని దాటి లంక నాక్రమించి నీ శత్రువును సంహరించగలం కాబట్టి ఏ విషయంలోను నీవు సంతాపం పొందనవసరంలేదు. సంతాపకారణమున్నా దానిని వదలవలె. ఏమన శోకంవలన ఉత్సాహం క్షీణించుట, అనుత్సాహం వలన దైన్యం, దైన్యం వలన అర్థనాశనం, అర్థనాశనం వలన ఆపదలను పొందుదురు. శత్రువును అణచుటలో సహాయం ఎవరు చేస్తారు? అనే ఆందోళన అక్కర లేదు. పరాక్రమశాలులు, సమర్థులు, ఉపాయకుశలులు, నా సంబంధులైన ఈ వానరశ్రేష్ఠులు నీసంతోషం కోసం నిప్పులలో దూకుటకయిననూ ఉత్సాహం కలిగియున్నారు. వీరి ముఖప్రతిబింబితోత్సాహము చూచి వీరి చిత్తవృత్తిని, ఉత్సాహాన్ని ఊహిస్తున్నాను. పాపాత్ముడగు రావణుని సంహరించి సీతను తీసుకొని వచ్చు విషయంలో ఉత్సాహం పొందు.

ఈ సముద్రంమీద వారధిని ఎట్లు నిర్మించాలి? లంకను ఎట్లు చూడగలం? అని ఆలోచించు. లంకను చూచితిమో! రావణుడు హతుడయినట్లు భావించు. సేతునిర్మాణం జరుపనిది ఇంద్రాదిదేవతలు కూడ లంకను జయింపజాలరు. ఏసమయంలో సేతుబంధనం సంపూర్ణమగునో అపుడు వానరసైన్యం సముద్రాన్ని దాటుట, లంకను జయించుట జరిగినట్లు తలచు.

**మహేశ్వరతీర్థీయ వ్యాఖ్యానవిశేషం: -**

“సర్వం తీర్ణం చ వై సైన్యం జితమిత్యుపధారయ” ఇచట చకారాన్ని, అవధారణాన్ని రెంటిని చేర్చుటవలన రాక్షససైన్యకృత విఘ్నబాహుళ్యం సంభవించినా మనసైన్యం అప్రతిహతంగా జయింపగలదని చెప్పబడింది.

ఈ శూరులగు వానరులు రాక్షసులతో కూడిన లంకను పెళ్ళగించి తెచ్చుటకునూ సమర్థులు. అందు వలన శౌర్యాన్ని నశింపచేసెడి ఈ దుఃఖాన్ని విడిచిపెట్టు. శూరపురుషుడు అవలంబించతగిన ధైర్యం అవలంబించు. నీవంటి శూరులు సీత కనిపించలేదనికాని, దశరథుడు మరణించినాడని కాని దుఃఖించకూడదు. నీవు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవు. సర్వశాస్త్రజ్ఞుడవు. మావంటి అనుచర సహాయంతో శత్రువును జయింతువు. ముల్లోకాలలో ధనుర్ధరుడవగు నిన్నెదిరింపగల యోధుని నేను చూడలేదు. వానరులపై ఆధారపడిన ఈకార్యం ఎపుడూ నశించదు. సముద్రాన్ని దాటి త్వరలో సీతను చూడగలవు.

దుఃఖించింది చాలు. క్రోధమవలంబించు. నిరుద్యోగులైన క్షత్రియులు క్రోధయుక్తుని చూచి భయ పడుతున్నారు. సేతుబంధనం సర్వార్థసిద్ధికి మూలం కావున సముద్రతరణార్థం తదుపాయాన్ని విచారించు. శిలావృక్షాదులతో యుద్ధముచేయు కామరూపులగు వానరయోధులు శత్రుసైన్యాన్ని నాశనం చేస్తారు. సేతువును బంధించిగాని, బంధింపకగాని ఏదోవిధంగా సముద్రాన్ని దాటెదము. జయం పొందుతాము. నామనస్సు సంతుష్టి పొంది ఉన్నది. నేత్రస్ఫురణాది అనేక నిమిత్తాలను చూస్తూ ఉన్నాను. సర్వథా నీవు విజేతవు.

## మూడవ సర్గము

లీలామానుష విగ్రహుడైన రాముడు మనుష్య స్వభావానుసారం సముద్రాన్ని ఎట్లు దాటగలమనే భీతిని పొందియూ హేతుబద్ధములైన సుగ్రీవవాక్యాలను విని నీతిశాస్త్రానుసారం శత్రుదుర్గాది స్వరూప జ్ఞానంకొరకు హనుమంతుని ప్రశ్నిస్తున్నాడు.

తపః ప్రభావమునగాని, 'తరసా' అనే పాఠాంతరం ఉంది. (అపుడు వేగం చేత అని అర్థం స్వీకార్యం) సేతుబంధనం, సముద్రాన్ని ఎండగట్టుటవలనగాని ఈ సముద్రాన్ని దాటగలను. ప్రవేశించడానికి దుస్సాధ్యమైన లంకకు జల, గిరి, సహజప్రాకారాలు ఎన్ని ఉన్నాయి? సైన్యపరిమాణం ఎంత? ద్వారరక్షణవిధానం ఎట్టిది? కందకాలలోని జలప్రతిబంధకం ఎంతటిది? ప్రాకార పరిఘానిర్మాణం, పట్టణంలోని భవన విశేషాలన్నింటిని యథార్థంగా కంటికి కనుపించే విధంగా నాకు తెలియజెప్పు.

హనుమానుడు ప్రత్యుత్తరిస్తున్నాడు. లంకప్రాకారాలచేతను కందకాలచేతను రక్షితమై ఉంది. రావణతేజస్సు చేత లంక గొప్పసమృద్ధిని పొంది ఉంది. ఆర్ద్రహృదయులైన రాక్షసులచే రక్షితమై ఉంది. సేన విభజింపబడి యథావసరంగా అచట అచట ఉంచబడింది. వివరించి చెపుతాను. ఉత్సాహయుక్తమైన చతురంగ బలపరివృతమై, పరప్రవేశ అయోగ్యమై లంక విరాజిల్లుతున్నది. ఆయసబలిష్ఠకవాటాలతోను, గొప్పగడియలతోను, బాణవిసర్జన యంత్రములతోను, నూరుగురిని ఒక్క పెట్టున పరిమార్ప గల శతఘ్నులతోను నింపబడి చతుర్దిక్కుల నాలుగు మహాద్వారాలు కలిగిఉంది. సువర్ణమయప్రాకారయుక్తమై ఉంది. లోతైన నీరు మొసళ్ళు కల కందకాలు ప్రాకారం చుట్టూ ఉన్నాయి. నాలుగు మహాద్వారాలనుండి నీటికందకాల మీదుగా గమనాగమనాలను సలుపుటకు దారుఫలకనిర్మిత యాన్త్రిక సంచార మార్గాలు ఉన్నాయి. శత్రుసైనికులు ఆ మార్గాలలో ప్రవేశప్రయత్నం చేస్తే యంత్రాల ద్వారా మార్గాలను మూసివేయటం జరుగుతుంది. శత్రువులు పరిఘలను దాటి ద్వారప్రవేశం చేయలేరు. ఈ నాలుగు మహాద్వారాలలో ఉత్తరద్వారం బలిష్ఠమై కాంచనస్తంభ శోభితమై అకంప్యమై ఉంది. లంక జల, వన, గిరి, పరిఘాదుర్గాలు కలిగిఉంది. ద్యూతాది వ్యసనరహితుడు, జాగరూకుడు, యుద్ధోత్సాహి అయిన రావణుడు యుద్ధసమయంలో వలె సర్వథా స్వసైన్యావలోకనం చేస్తున్నాడు. ఇక లంకానగరం అత్యున్నతత్రికూట పర్వతస్థమవటంచేత దేవతలు కూడ ప్రవేశింపసాధ్యం కాకుండా ఉంటుంది. ఇక లంకా పూర్వద్వారంలో 10వేలమంది, దక్షిణద్వారంలో లక్షమంది, పశ్చిమద్వారంలో పదిలక్షలమంది, ఉత్తరద్వారంలో కోటిమంది సైనికులుండి నగర రక్షణచేస్తున్నారు. వీరందరూ విశ్వసనీయులు, రావణపూజితులు. నగరం మధ్యలో అనేక వేల

సైనికులున్నారు. ఇంతటి దుర్గమమైన లంకను ఎట్లు జయించాలనే శంక అక్కర లేదు. పరిఘామార్గాలు నాచేత భగ్నములయ్యాయి. కందకాలు శిలావృక్షాదులచే పూడ్చబడినాయి. రాక్షససైనికబలంలో నాల్గవవంతు నాచే నాశనం చేయబడింది.

ఏదో ఒక ఉపాయాన్ని అనుసరించి సముద్రాన్ని దాటగలం. వానరులచే లంక నాశితమైనట్లు భావించుము. సుముహూర్తంలో యుద్ధప్రస్థానానికి ఆజ్ఞ ఇవ్వు.

## నాలుగవ సర్గము

లంకా విశేషాలు ఆంజనేయునివలన తెలిసికొని శ్రీరాముడు యుద్ధప్రస్థానానికి ఆజ్ఞ ఇస్తున్నాడు. సుగ్రీవా! లంకను బాణాలతో నశింపజేసెద. ఇపుడు సూర్యుడు మధ్యగతుడై ఉన్నాడు. ఈ అభిజిన్ముహూర్తం విజయావహం కాన ఇపుడే పయనించుట నాకభిమతం.

### గోవిందరాజీయ వ్యాఖ్యానవిశేషాలు

అభిజిన్ముహూర్తం దక్షిణయాత్రాదులకు నిషిద్ధం కదా? అను శంకకు సమాధానం. కిష్కింధకాగ్నేయంగా లంక ఉంది. కావున ఇది దక్షిణప్రస్థానము కాదు. విజయాఖ్యమగు ఈ అభిజిన్ముహూర్తంలో బయలుదేరితే సీతనపహరించిన రావణుడెచటికేగినా వధించగలను.

**గో. వి. "సీతాం హృత్వా తు మే యాతు"** అను పాఠాంతరంలో యాతు రాక్షసుడు అని అర్థం. అర్థాంతరం కూడాఉంది. యాతు వెళ్ళుగాక! ఎచటికి వెళ్ళగలడు? అనే భావం కూడ ఉంది.

ఇపుడే సముద్రతరణాన్ని గూర్చి ఆలోచించి కాలహరణం చేయడం కంటే వేగంగా మనం ప్రయాణం చేయడం ఆవశ్యకం. ఏమన మన యుద్ధప్రస్థానశ్రవణం వలన విషపానం చేసి ప్రాణాలు పోయే సమయంలో అమృతస్పర్శపొందిన వానివలె సీత బతుకుమీద ఆశను పొందగలదు. నేడు ఉత్తరఫల్గున నక్షత్రం నాకు సాధనతార. రేపు హస్త నైధన తార. కావున నేడే సైన్యసమేతంగా బయలుదేరుదాము. శుభసూచకనిమిత్తాలు ఉద్భవిస్తున్నాయి. రావణుని చంపి సీతను తెస్తాను. నా కుడికన్ను పైభాగం అదరుతున్నది. తప్పక నా మనోరథం తీరుననుటకు ఇది సూచన.

శ్రీరాముడు ఈ విధంగా సేనాసంవిధానం చేయండని చెపుతున్నాడు. బలవంతులైన లక్షవానరులతో నీలుడు మార్గానికి ముందుండాలి. నీలా!ఫలజలసమృద్ధికల మంచిమార్గంలో సేనను నడుపు. విషాదులచే ఫలజలాదులను శత్రువులు పాడుచేయకుండునట్లు సావధానుడవై సైన్యాన్ని రక్షిస్తూ ఉండు. పరాక్రమవంతులే ప్రస్థానము చేయాలి. వానరులు గుంపులుగా ముందు నడతురుగాక. గజగవయగవాక్షులు ముందు నడచెదరుగాక. ఋషభుడు దక్షిణపార్శ్వమును, గంధమాదనుడు వామపార్శ్వమును పాలింతురుగాక!

సేనామధ్యంలో హనుమంతుని అధిరోహించి సైన్యమును ఉత్సాహపరుస్తూ నేను వెళతాను. అంగదుని అధిరోహించి లక్ష్మణుడు వచ్చుగాక.

**గో.వి.** సుగ్రీవుడు పల్లకి నెక్కి మాతో రావాలి. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి ఈముమ్వురూ సేనాపశ్చాద్భాగాన్ని రక్షింతురుగాక.'రామాజ్ఞను పాలింపు' దని సుగ్రీవుడు వానరులను ఆదేశించాడు.

ముందు మార్గశోధనచేయవలసిన నీలునకు సహాయంగా స్వయంప్రవృత్తితో కుముదునితో కలసి దక్షిణపార్శ్వరక్షకులైన ఋషభుడు మార్గశోధన చేస్తున్నాడు. సేనామధ్యంలో సుగ్రీవరామలక్ష్మణులు వెళుతూ వున్నారు. వీరుడగు శతవలి పదికోట్లసైనికులతో వానరసేననంతా రక్షిస్తున్నాడు. కేసరి, పనసుడు, గజుడు, అర్కుడు, వందకోట్లసైనికులతో ఎడమభాగాన్ని రక్షిస్తున్నారు.

**వ్యా.వి.** ఇక్కడ చెప్పబడిన గజుడు మొదట పేర్కొనబడిన గజుడేనని గోవిందరాజీయమతం. తరువాత ఇతడు మరొక గజుడని మహేశ్వరతీర్థాభిప్రేతం.

భల్లూకసేనతో కూడిన సుషేణజాంబవంతులు సుగ్రీవుని ముందుంచుకొని పశ్చాద్భాగాన్ని సంరక్షిస్తున్నారు. సేనాపతి నీలుడు ముందు నడుస్తూనే సేనను అంతటిని రక్షిస్తున్నాడు. దరీముఖుడు, ప్రజంఘుడు, రంభుడు, రభసుడు వానరులనందరినీ త్వరపెడుతూ వెళ్ళారు.

వానరవాహినులు రామశాసనభీతితో పట్టణ, జనపదాలను వర్జించి వెళ్ళాయి. హనుమదంగదులను అధిష్ఠించిన రామలక్ష్మణులు గ్రహాలతో కూడిన సూర్యచంద్రులవలె ప్రకాశించారు.

**వ్యా.వి.**"గ్రహాభ్యాం" అను మూలాన్ని వ్యాఖ్యానిస్తూ ఆ రెండుగ్రహాలు రాహుకేతువులని మహేశ తీర్థులున్నూ, శుక్రబృహస్పతులని గోవిందరాజులూ అన్నారు. అంతేకాక చతుర్గ్రహసంయోగంవంటి ఈ సంయోగం బహుజన సేనావినాశకరమనే విశేషం గోవిందరాజీయమందు ఆవిష్కృతమైంది.

అపుడు లక్ష్మణుడు రామునితో ఇట్లన్నాడు. రావణసంహర్తవై సీతను పొంది అయోధ్యకేగగలవు. ఆకాశంలోను, భూమిలోను శుభనిమిత్తాలు నీకార్యసిద్ధిని సూచిస్తున్నాయి. అనుకూలవాయువు మృదువుగా సుఖకరంగా వీస్తున్నది. మృగాలు, పక్షులు కర్ణపేయంగా నినదిస్తున్నాయి. (ఇంతవరకు భూమియందలి శకునాలను దెల్పి, ఆకాశంలో శకునాలను దెల్పుతున్నాడు)– సూర్యుడు నిర్మలుడుగ ఉన్నాడు. దిక్కులు ప్రశాంతంగా ఉన్నాయి. శుక్రుడు ప్రసన్న తేజస్కుడై నీ వెనుక ప్రకాశిస్తూన్నాడు. కాంతిమంతులైన సప్తర్షులు ధ్రువునికి ప్రదక్షిణంగా తిరుగుచూ ప్రకాశిస్తున్నారు.

**గో.వి.**శుక్రుడు రామునికి పశ్చాద్భాగంలో ఉన్నాడు. శుక్రుడు ఎదురుగా ఉన్నపుడు యుద్ధాది యాత్రలు చేయకూడదు. ప్రతిశుక్రం.. అపి శక్రేణ సదృశో హతసైన్యో నివర్తతే అని జ్యోతిషోక్తి. ఇచట జాతకరీత్యా, గోచారరీత్యా రామానుకూల, రాక్షసప్రతికూలఫలాలు ఉపపాదింపబడుతున్నవి. కిష్కింధనుండి ఆగ్నేయంగా ప్రయాణించే రామునికి శుక్రుడనుకూలుడు. ఫాల్గుణపూర్ణిమ దండయాత్రాప్రస్థానం. ఉత్తరఫల్గునీయుక్త సంపత్తి అభిజిన్ముహూర్తంలో తత్కాలగ్రహపునర్వసు–కర్కటకరాశిలో జనించిన శ్రీరామునికి యుద్ధసమయానికి 12 x 3 = 36 సంవత్సరముల వయస్సు. త్రిరావృత్తి జరిగిన సందర్భంలో గోచారరీత్యా తత్కాల అనుకూల ప్రతికూలగ్రహస్థితి. దశమశుక్రుడు, ద్వితీయగురువు, షష్ఠస్థానస్థితశనికేతువులు, దశమబుధుడు, తృతీయచంద్రుడు, నవమసూర్యుడు ఈ ఏడు గ్రహాలు

అనుకూలం. పంచమ కుజుడు, ద్వాదశరాహువు ప్రతికూలురు. అందువలననే బ్రహ్మాస్త్ర నాగాస్త్ర బంధనలు సంభవించాయి. ఇక రాక్షసవిషయంలో మూలానక్షత్రం, ధనూరాశి, పంచమ శుక్రుడు, జన్మరాశిలోని శనికేతువులు, ద్వాదశకుజుడు, చతుర్థసూర్యుడు, పంచమబుధుడు ఈ ఆరుగ్రహాలూ ప్రతికూలంగా ఉన్నాయి. సప్తమరాహువు నవమగురువు, దశమచంద్రుడు అనుకూలురు.

పురోహితునితో కూడిన త్రిశంకువు నిర్మలుడై వెలుగుతున్నాడు వ్యా.వి. "సపురోహితః" అనుటచే పురోహితసహితుడగు త్రిశంకువు చెప్పబడినాడు. వసిష్ఠవిరోధియగు త్రిశంకువు ఆయనతో కలసి ఉండుట సంభవించదు కావున విశ్వామిత్ర సృష్ట సప్తఋషులలోని వసిష్ఠుడు పురోహితపదవాచ్యుడని మహేశ్వరతీర్థులు వ్యాఖ్యానించారు. ఈ అర్థమేకాక పురోహితపదవాచ్యుడు విశ్వామిత్రుడుగూడ కావచ్చునని గోవిందరాజులన్నారు. "బ్రహ్మణానా మార్త్విజ్యం" అను ఆపస్తంబ పరిభాషాసూత్రానుసారం ఆలోచిస్తే విశ్వామిత్రుడు పురోహితుడగు అవకాశం లేదు. ఇక్ష్వాకుకుల నక్షత్రమైన 'విశాఖ' క్రూర గ్రహైరనాక్రాంతమై నిర్మలముగా ప్రకాశిస్తున్నది. (విశాఖ ఇక్ష్వాకుకులనక్షత్రమని జ్యోతిషదర్పణంలో ఉంది)

ఇక రాక్షసప్రతికూలవిషయాలను లక్ష్మణుడు చెపుతున్నాడు. రాక్షసనక్షత్రమైన మూలానక్షత్రం సన్నిహితమైన ధూమకేతువుచే పీడింపబడుతున్నది. ఇది రాక్షసవినాశనానికి సూచన. మృత్యువశులైన రాక్షసుల అంతకాలంలో ఇట్టి గ్రహపీడ సంభవిస్తుంది.

**మ.వి.** ఉత్పాతగ్రహమైన ధూమకేతుస్పర్శవలన మూలానక్షత్రం సంతప్తమవుతున్నది. "సర్వచైతద్వినాశాయ" విశాఖానక్షత్రముజ్వలంగా ఉండుట, మూలానక్షత్రపీడనం, రాక్షసనాశనాన్ని సూచిస్తున్నది.

లక్ష్మణుడు తిరిగి శుభసూచనలను చెపుతున్నాడు. మంచినీరు మధురంగా ఉంది. ఏ ఋతువులో పుష్పం పూయవలెనో, ఏ ఫలం ఫలింపవలెనో అట్లె పూస్తూ ఉన్నాయి, ఫలిస్తున్నాయి. అకాలకుసుమోత్పత్తి ఉత్పాతకారకం. అట్టిది ప్రస్తుతం లేదు. ఈ కపిసైన్యం దేవసైన్యంవలె ప్రకాశిస్తున్నది. ఈ శుభసూచనలను చూచి ప్రీతుడవుకమ్ము.

భూమినావరించి నడచుచున్న వానరసేనయొక్క పాదధూళి ఆకసము నావరించి సూర్యప్రభను నివారించింది. మేఘం ఆకాశాన్ని ఆవరించినట్లు పర్వతవనయుక్త దక్షిణదిగ్భూమిని వానరసేన ఆవరించి వెళ్ళింది. వానరసేన నదులనుదాటిన పిదప అంతవరకు స్తంభించిన నదులు చాలా యోజనముల దూరము విపరీత వేగంతో ప్రవహించాయి. వానరులు స్వీయమర్కటచేష్టలను ప్రదర్శిస్తూ పయనించారు. బాగుగ పండినట్టి వరిమడులవలె భూమినావరించియున్న వానరసేన ఉండినది.

**వ్యా.వి.** 1.ఫలించిన వరి పంట కలిగిన మాగాణిమడులచేత ఆవరింపబడిన భూమివలె వానరావృతభూమి భాసించింది. 2.ఫలించిన వరిపంటచే వరిమడులవలె వానరులచే ఆవరింపబడివ భూమి ఉండినది.

మహేంద్ర పర్వతశిఖరాన్ని ఆరోహించి సముద్రాన్ని చూచిన శ్రీరాముడు లక్ష్మణ సుగ్రీవులతో ఇట్లు పలికాడు. సముద్రతీరాన్ని చేరినాము. ఇక సముద్ర తరణ విషయం ఆలోచించాలి. ఉపాయం లేక దీనిని దాటలేము. సేనానివేశనం చేద్దాం, ఇట్లని రాముడు సేనను విడిదిచేయుటకు ఆజ్ఞ ఇచ్చాడు.

సముద్రం ప్రక్కగా విడిసిన ఆ వానరసేన (తేనెవర్ణము కలిగిన వానరులు కలిగినది కావున) రెండవ తేనె సముద్రమో అన్నట్లు భాసించింది. సైనిక కోలాహలం సముద్రమహానాదాన్ని అణచింది. ఆ వానరవాహిని కోతులతో, కొండముచ్చులతో, భల్లూకములతో త్రిధా విభక్తమయినది.

ఆకాశ సముద్రసామ్యం వర్ణింపబడుతున్నది. రాత్రులలో చంద్రకిరణస్పర్శచేత జలతరంగాల యందలి తుంపరలు అగ్నికణాలవలె భాసిస్తూ ఉండును. అగ్నికణతుల్య శీకరాకీర్ణం సముద్రం–నక్షత్ర గణాకీర్ణమాకాశం, గొప్ప సర్పములు కలిగినది సముద్రం – గంధర్వాదులవలె ఉరగులు గూడ ఆకాశచారులగుటచే పెద్దసర్పాలు కలిగియుండుటలో ఆకాశము సముద్రతుల్యమే. సముద్రంలో ఆకశంలో, రాక్షసనివాసం ప్రసిద్ధమే. పాతాళంవలె గంభీరంగా ఉండుట ఉభయత్ర తుల్యమే. భయంకరంగా ఉండడమూ సమానమే. ఇట్టి విశేషణతుల్యం ఆకాశం సముద్రతుల్యం–అట్లే సముద్రమాకాశతుల్యం. ఇది సముద్రమని–ఇది ఆకాశమని భేదము కనుపించడం లేదు. సముద్రాకాశములు కలిసియే భాసిస్తున్నాయి. నక్షత్రాలచేత, ముత్యాలచేత, ఆకాశసముద్రాలు భాసిస్తున్నాయి. మేఘయుక్తాకాశానికి, తరంగయుక్త సముద్రానికి భేదం కనిపించడం లేదు. తరంగముల పరస్పర ఘట్టన జనిత శబ్దాలు మహాయుద్ధ సమయమందలి భేరీ నినాదాలవలె వినిపిస్తున్నాయి.

మహావేగంకలిగిన వాయువుచే క్షుబ్ధమయిన సముద్రం నుండి మహాధ్వనితో ఆకాశానికి ఎగసిన రత్నసమూహయుక్త తరంగాలు కలిగినట్టిదీ, క్రూరజలజంతు సమాకులముగ ఉండి కోపముతో అకాశానికి ఎగయుచున్నట్లున్నదీ, ఆకాశమందు మాట్లాడుచున్నట్లు శబ్దించు తరంగాలు కలిగినట్టిది అయిన గర్జించు తరంగములుద్గమించు సముద్రాన్ని విస్మయావిష్టులై వానరులు చూచారు.

## అయిదవ సర్గము

రాముని యందలి కృతజ్ఞత, స్నేహం, పరీక్ష్యకారిత్వం, మహోత్సాహం, శరణాగతవాత్సల్యం ఇత్యాది గుణాలు చూపబడినాయి. ప్రధానమైన కారుణ్యగుణాన్ని చూపుటకీ సర్గ ఆరంభింపబడుతున్నది.

సేనానాయకుడైన నీలునిచే శాస్త్రోక్త విధానానుసారం ఆ వానరసేన అంతటా రక్షణ కలిగి వ్యాకులపాటు లేకుండా ఉంది. సేనారక్షణార్థం మైంద ద్వివిదులు అన్ని దిక్కుల తిరుగుతూ ఉన్నారు. సముద్ర తీరాదులు విరహోద్దీపకాలగుటచే సీతావిరహజశోకాన్ని సహింపజాలని శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లంటున్నాడు.

శోకం కొంతకాలం గడచిన పిమ్మట తగ్గును కద? సీతను చూడని నా శోకం మాత్రం దినదినాభివృద్ధి పొందుతూ ఉంది. ఈ శోకం విలక్షణమైంది. సీత దూరమందు కలదని నేను దుఃఖించుట లేదు. ఈ ప్రస్థానం వలన దూరం తగ్గెను కద? బలవంతుడైన రాక్షసునిచే అపహృత అని గూడ దుఃఖించడంలేదు. రావణసంహారంతో తన్నివృత్తి చేసుకొందును. ఆమె యౌవనం నిష్ప్రయోజనం అవుతున్నదని మాత్రమే బాధ కలుగుతూ ఉంది.

**గో.వి :** సీతాదేవి నిత్యయౌవనం కలది కావున రామశోకకారణమైన ఆమె యౌవనం వృథా అవుతున్నదని మాత్రమే. వస్తుతః పరమేశ్వరుడయిననూ మానుష భావాపన్నుడగుటచే రాముడిట్లన్నాడు. (ప్రియాస్పృష్ట వస్తు స్పర్శ ప్రమోదకారి కావున అందుకొరకు వాయువును ప్రార్థించుచున్నాడు)

**మ.వి :** వాయుదేవా! నన్ను స్పృశించుచున్న నీవు నాకాంత ఉన్నచోట సంచరించు. ఆమెకు నాశరీర స్పర్శ సిద్ధి కలుగుతుంది.

చంద్రుని చూడటంవలన చంద్రముఖి అయిన ఆమెను చూచినట్లెట్లగునో అట్లే స్పర్శసిద్ధిని ఆకాంక్షిస్తున్నాను. ఆమె వయస్సు అతిక్రమిస్తున్నదని మాత్రమే నేను దుఃఖించడం లేదు. ప్రియురాలైన సీత సమస్తభోగాలను త్యజించి వనానికి నావెంటవచ్చి రావణుడపహరించు సమయంలో అతనిని భస్మముచేయు తపశ్శక్తికలిగినదైనను "తత్తస్య సదృశం భవేత్" (సుం.కాం. 37-64) (రావణుని సంహరించి నన్ను రక్షించి తెచ్చుకొను బాధ్యత రామునిదే) అను భావంతో "హా నాథ" అని పిలచిన పిలుపు నాహృదయమందుండి త్రాగబడిన విషంవలె నాశరీరాన్ని దహిస్తున్నది.

**వ్యా.వి.** ఇందువలన శ్రీరామునికి పరదుఃఖదుఃఖిత్వరూపకారుణ్యం ఇట చెప్పబడింది.

ఈ సంతాపం జలప్రవేశం చేయక శమింపదని తలచిన శ్రీరాముడు దానికి అగ్నిత్వాన్ని రూపిస్తున్నాడు. సీతావియోగమే ఇంధనంగా కలిగినట్టిదీ, తచ్చింత అనే జ్వాల కలిగినట్టిదీ అయిన మన్మథాగ్ని శీతల అశీతల సమయాలు రెంటియందును నన్ను దహిస్తున్నది. లక్ష్మణా! నీవు లేకుండా సముద్రంలో మునిగి పరుండెద. జ్వలించే మదనాగ్ని నెమ్మదిగా దహిస్తుంది.

**గో.వి. :** ఇట్లనుట వలన లక్ష్మణుడు శేషావతారుడని సూచితమయినది. ఎట్లన శేషశాయియగు విష్ణునకు తత్సాన్నిధ్యం వలన నిరంతరం శ్రీలక్ష్మి గుర్తుకు వస్తుంది కద?

**మ.వి.** "సమా సుప్తే జనే దహేత్" అనుపాఠాంతరం ప్రకారం జనం నిద్రించిన పిదప జ్వలించు కామాగ్ని మా-దహేత్ బాధింపదు. అందువలన నీవులేకయే సముద్రంలో శయనిస్తాను.'ఆమె-నేను, ఉభయులం ఈ నేలమీద శయనించుట' అనేది నాకు జీవించుటకు గొప్పకారణమవుతూ ఉంది. ప్రేమికులేకశయ్యాగతులైనట్లు మేమిరువురం ఏకధరణ్యాశ్రితులమగుటయే నాకు జీవనాధారమవుతున్నది. జలం కల వరిమడి ప్రక్కన ఉన్నట్టి ఉదకరహితమైన వరిమడి ఆ చెమ్మతో ఎట్లు జీవించునో సీత జీవించిఉన్నదని తెలుసుకుని నేను జీవిస్తున్నాను. శత్రువులను జయించి సుందరియగు సీతను ఎపుడు చూచెదనో! రోగి సిద్ధౌషధ పానం చేసినట్లు ఆమె అధరామృతాన్ని ఎపుడు పానం చేతునో! క్రిక్కిరిసిన చనుకట్టుతో కంపయుక్త అయిన ఆమె నన్నెపుడు ఆలింగనం చేయునో, నాథుడుండియూ అనాథవలె రాక్షసమధ్యమందున్న ఆమె రక్షకుని గానక ఉన్నది. జనకుని కూతురు, నాకు ప్రియురాలు, దశరథునికోడలు అగు సీత రాక్షసస్త్రీలమధ్య శయనించి ఉన్నది. సహజకృశోదరి అయిన సీత శోకనిరాహారాదులవల్ల మరింత సన్నబడింది. రావణసంహారంచేసి ఎపుడు సీతను తీసుకుని వచ్చి మానసిక శోకాన్ని విసర్జించ గలను?సాధ్వియగు సీత తొందరకలదియై నన్నాలింగనం చేసుకుని ఎపుడు ఆనందబాష్పాలను విడువగలదు? శుద్ధవస్త్రం మురికినివలె సీతావియోగదుఃఖాన్ని ఎపుడు వదలెదను? ఈ విధంగా శ్రీరాముడు శోకిస్తూ ఉండగ సూర్యుడస్తమించాడు. సర్వవిధాల సేవకుడైన లక్ష్మణుని సమక్షంలో శ్రీరాముడీ విధంగా దుఃఖించుటలో ఔచితీ భంగమేమీ లేదు.

## ఆరవ సర్గము

ఇట్లుండ హనుమద్గమనానంతరం లంకయందు ఆంజనేయునిచే చేయబడిన భయంకరకృత్యాన్ని చూచి సిగ్గుతో కొద్దిగ తలవంచి రావణుడిట్లన్నాడు.

ఒక వానరమాత్రునిచే లంక భయకంపితమైంది. చైత్యప్రాసాదం భగ్నం చేయబడింది. సీత చూడబడింది. బలవంతులగు రాక్షసులు చంపబడినారు. లంక దహింపబడి వ్యాకులపెట్టబడింది. ఇపుడు మనకు హితమైన ఏపనిచేస్తే కార్యసిద్ధి కలుగునో చెప్పండి. చేస్తాను. విజయం మంత్రమూలకం అని పెద్దలు వచిస్తారు. కావున రాముని విషయంలో మంత్రం (ఆలోచన) చేయండి. ఆలోచన చేసేవాళ్ళు గుణానుసారం ఉత్తములుగాను, మధ్యములుగాను, అధములుగాను, మూడువిధాలుగా ఉంటారు. 1. హితపరులు,ఆలోచనయందు సమర్థులగు మంత్రులతోగాని, సుఖదుఃఖాలను పంచుకొనే మిత్రులతోగాని, మేలుకోరునట్టి బంధువులతోగాని చక్కగా ఆలోచించి కర్మారంభం చేసి దేవునిమీద భారం వేయువాడు ఉత్తమపురుషుడు. 2. తానొక్కడే ఆలోచించి దైవమునాశ్రయించి కార్యారంభం చేయువాడు మధ్యమపురుషుడు. హితాఽహితములను ఆలోచించకుండా దైవాన్ని లెక్కించకుండా చేయుదునని ప్రారంభించి పూర్తి చేయక ఉపేక్షించువాడు అధముడు. ఉత్తమమధ్యమ అధమపురుషులున్నట్లే మంత్రాలు కూడ మూడు విధాలు ఉన్నాయి. 1. మంత్రులందరు ఐకమత్యం పొంది శాస్త్రదృష్టి కలవారై ఆలోచించి ఐకమత్యంతో చేయునది ఉత్తమ మంత్రం. 2. మంత్రులు ప్రారంభంలో భిన్న బుద్ధులుగ ఉన్నప్పటికి చివరకు ఐకమత్యంతో జరుపు నిర్ణయం మధ్యమమంత్రం. 3. మంత్రులు భిన్నాభిప్రాయాలు కలవారై వాదించుకొంటూ ఐకమత్యంలో ప్రీతి లేక చేసే మంత్రం అధమమంత్రం. కావున బుద్ధిమంతులైన మీరు ఐకమత్యంతో నాలోచించి కార్యనిర్ణయం చేయండి. అదియే నాకభీష్టం.

అనేకమంది వానర వీరులతో రాముడు మనలను అడ్డగించుటకు లంకకు వస్తున్నాడు. సముద్రాన్ని ఎండించిగాని, మరొకవిధంగాగాని అనుచరసహితుడైన రాముడు సముద్రాన్ని దాటగలడు. ఈవిధంగా వానర విరోధం సంభవింపబోవుతున్నది. నగరమందు, సైన్యమందు, ఏదిమంచిదో, ఏమిచేయవలెనో వాటిని బాగుగ నాలోచించండి.

## ఏడవ సర్గము

రావణవాక్యాలను ఆలకించి, రామపరాక్రమం, శత్రుబలం తెలియనట్టి మదోద్ధతులైన రాక్షసులు'దేవదానవ విజేతవగు నీ పరాక్రమాన్ని విస్మరించి మానవశత్రువును గురించి ఎందుకు శంకిస్తున్నావు? అను భావం కలవారై రావణుని స్తుతిస్తున్నారు. ఓరాజా! పరిఘ (ఇనుపకట్లగుదియ) శక్తి (బల్లెము)ఖడ్గ, శూలాద్యాయుధాలుకల గొప్పసేనా బలం మనకు ఉంది. ఎందుకు విషాదం పొందుతున్నావు?

**గో.వి.**"సుమహాన్నో బలం" అని ఉంది. భావి అనర్థ సూచనగ రాక్షసులనోటివెంట 'గొప్పబలములే' దు అను అర్థంకల మాటలు వెలువడినాయి. నీచే భోగవతీ నగరంలోని నాగులందరూ జయింపబడినారు. యక్షసమేత కుబేరుడు నీచే పరాజితుడయినాడు. అతని నుండి పుష్పకవిమానాన్ని అపహరించావు. మయుడు నీకు భయపడి అతని పుత్రి మండోదరిని నీకిచ్చి వివాహము చేశాడు.

**గో.వి.** నిజమేమిటంటే రావణుని విషయంలో భ్రమపొందిన మయుడు కన్యాదానం చేసినట్లు ఉత్తరగ్రంథంలో చెప్పబడుతుంది. వాస్తవమిట్లుండ ప్రభుప్రీతిని అభిలషించి రాక్షసులీ విధంగా స్తుతించారు. నీచెల్లియగు కుంభీనసి భర్త మధు దానవేంద్రుడు యుద్ధంలో వశుడైనాడు. వాసుకిప్రభృతి నాగులను రసాతలానికి వెళ్ళి యుద్ధంలో వశవర్తుల చేసుకొన్నావు. బ్రహ్మవరప్రభావంతో చూర్ణం చేయబడినా తిరిగి జీవించి శక్తి కల్గిన కాలకేయాది దానవులు వత్సరకాలం యుద్ధం చేసినా నీకు వశులైనారు. వారి వద్ద పలువురు రాక్షసులు మాయలను అభ్యాసం చేశారు. శూరులగు వరుణపుత్రులు నీచే జయింపబడినారు. యమదండం అనే మొసలి, శాల్మలి అనే ముళ్ళచెట్టు, కాలపాశం అనే తరంగం, యమకింకరులు అనే సర్పాలు కలిగిన యమసేనాసముద్రంలో మునిగిన నీవు ఆ యముని జయించి మృత్యువును నిషేధించావు. సమస్తలోకాలూ స్వల్ప యుద్ధమాత్రంలో కలతచెందినాయి. పరాక్రమశాలురైన అనరణ్యప్రభృతిక్షత్రియులు అజేయులగు వారు నీచే సంహరింపబడినారు. వారితో శ్రీరాముడు పోల్చదగడు. నీవు అట్లు ఊరకే ఉండు. ఈ ఇంద్రజిత్తు ఒక్కడే సమస్తవానరులను వధింపగలడు. ఈశ్వరారాధనచే దుర్లభులగు వరాలను ఈతడు పొందినాడు. ఇతడు ఇంద్రుని బంధించి తెచ్చి బ్రహ్మదేవుని వాక్యానుసారం అతనిని విడిచిపెట్టినాడు. సేనాయుతుడైన రాముని సంహరించుటకు ఇంద్రజిత్తును పంపు. హనుమంతుని నుండి వచ్చిన ఈ ఆపద ఊహింపనిది. నీవు మనస్సులో ఈ విషయం ఉంచుకోకు. నీవు రాముని వధింపగలవు.

## ఎనిమిదవ సర్గము

సేనాపతి ప్రహస్తుడు ఈ విధంగా పలికాడు. దేవదానవ గంధర్వాదులు నీతో యుద్ధం చేయ శక్తులు కారు. ఇక ఈ వానరులెంత? హనుమంతుడు వచ్చిన సమయంలో 'మనల జయించు సమర్థత ఎవరికీలేదు' అనే విశ్వాసంతో ప్రమత్తులమై ఉంటిమి. అందువలన వంచింపబడినాం. అట్టి శత్రుపరిభవం న్యూనతను కలిగించదు. నేను జీవించి ఉండగా ఆ వానరుడు బ్రతికి వెళ్ళగలడా! భూమిలో ఎక్కడా వానరులు లేకుండా చేయడానికి నాకు ఆజ్ఞ ఇవ్వు. వానరులనుండి లంకకు రక్షణ కల్గిస్తాను. పిమ్మట దుర్ముఖ, వజ్రదంష్ట్రులు సేనాయుతుడు, లక్ష్మణ సుగ్రీవయుతుడైన రాముని వధించి వస్తామని పలికారు.

**మ.వి.**'వాస్తవార్థస్తు రామం లక్ష్మణం వినా సుగ్రీవం హత్వా ఆగమిష్యామీతి సంబంధః' (8.11.శ్లోక.వ్యా) రామలక్ష్మణులను విడచి సుగ్రీవాదుల సంహరింతునని రాక్షసవాక్యానికి అర్థము చెప్పారు. ఇకముందు గూడ ఇట్టి స్థలాలలో వీరిట్లే వ్యాఖ్యానించారు.

కాని ఆ శ్లోకాలకు ఆ యర్థం ఎట్లు వచ్చునో గ్రహించలేకున్నాం. వజ్రదంష్ట్రుడు ఇంకను ఇట్లంటున్నాడు. ఓ రాజా! ఉపాయం కలవాడే జాగరూకుడై శత్రువుల జయింపగలడు. కామరూపులగు వేలమంది రాక్షసులు మానవధారులై రామునొద్దకేగి "మేము మీతమ్ముడు భరతుడు పంపగా వచ్చాం. అతడు సేనాయుక్తుడై త్వరలో రాగలడు." అని తొట్రుపాటులేక చెప్పాలి. పిదప సర్వాయుధధారులమైన మేమిచటినుండి వెళ్ళి ఆకాశమునుండి రాళ్ళను, ఆయుధాలను, వర్షించి వానరసేనను యమపురికి పంపుతాం. అపుడు మోసపోయిన రామలక్ష్మణులు ప్రాణాలు విడుస్తారు.

కుంభకర్ణపుత్రుడైన నికుంభుడు ఇట్లన్నాడు. మీరందరు మహారాజుతో కూడి ఉండండి. నేనొక్కడనే వెళ్ళి శత్రువులనందరిని సంహరిస్తాను.

పర్వతాకారుడైన వజ్రహనువు నాలుకతో నోరు చప్పరించుకొంటూ 'నేనొక్కడనే వెళ్ళి సమస్త వానర సేనను భక్షిస్తాను. మీరందరూ స్వస్థచిత్తులై క్రీడిస్తూ మధుపానం చేస్తూ ఉందురుగాక' అని పలికాడు. మహేశ్వర తీర్థీయంలో ఇచటగూడ "రాఘవాదీన్వినేతి శేషః" అన్నారు.

## తొమ్మిదవ సర్గము

నికుంభుడు, ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, మొదలైన రాక్షసవీరులు వివిధాయుధధారులై ఆసనములనుండి లేచి రావణునితో 'రామలక్ష్మణ సుగ్రీవ హనుమంతులను వధిస్తాం' అన్నారు. వారిని వారించి ఇంద్రజిత్తు రావణామాత్యులనుద్దేశించి విభీషణుడు విక్రమించుటకిపుడవసరములేదనే భావం కలవాడై విక్రమింపతగిన కాలమునుగూర్చి చెపుతున్నాడు. ఇంద్రజిదాదులను తనకనుకూలపరచుకొనుటకు తాత! ఓ నాయనా! అని సంబోధించాడు.

సామదానభేదరూపత్రివిధోపాయములు ప్రయోగించినా ఫలించనప్పుడు అది దండనకు తగిన కాలమని నీతిశాస్త్రజ్ఞులు చెప్పారు. కాబట్టి దండమునకిది కాలంకాదు. అంతమాత్రమేకాక శత్రువు దండ్యుడగుట కనర్హుడు. విషయాసక్తచిత్తులయందు, విరక్తులయందు, శత్రువులచే నాక్రమింపబడినవారియందు, దైవప్రాతికూల్యమున సంపత్తులు క్షీణించిన వారి విషయంలో, బాలవృద్ధాదులయందు బాగాపరీక్షించి నీతిశాస్త్రానుసారం మంత్రులతో విచారించి చేయబడిన దండములు సిద్ధిస్తాయి. రాముడిట్టివాడు కాదు. ఏమరుపాటులేనివాడు. బలవంతుడు, అకాలంలో రోషముపొందనివాడు అట్టి వానినెట్లెదిరింతురు?

**గో.వి.** కామందకుడు ఇట్లన్నాడు. (ఇతడు నీతిశాస్త్రకర్త) బాలుని, వృద్ధుని, దీర్ఘరోగిని, జ్ఞాతి బహిష్కృతుని, భయపడువానిని, భయపడు జనులు కలిగినవానిని, లుబ్ధజనయుక్తుని, విరక్తుని, అత్యంతవిషయాసక్తుని, బహ్వాలోచనలు కలవానిని, దేవబ్రాహ్మణనిందకుని, దైవోపహతుని, దైవచింతనామాత్రపరుని, దుర్భిక్షవ్యసనయుక్తుని, బలమైన వ్యసనములు కలవానిని, స్వస్థానమందులేనివానిని, అనేకమందితో శత్రుత్వము కలవానిని, కాలవశగుని, సత్యరహితుని, ధర్మరహితుని, ఈ ఇరువదిమందితో సంధిచేయనక్కరలేదు. దండం ప్రయోగించాలి. రాముడట్టివాడు కాదు.

**మ.వి.** "జితరోషం" అనుట వలన రాముడు పాపరహితుడగుట వలన దైవోపహతుడు కాడని చెప్పబడింది. రాముడు దైవోపహతుడు గాడనుటకు అసాధ్యకార్యాలను చేసినాడు. ఇది ఎవరయినా ఆలోచించినారా? రామాదుల బలపరాక్రమాలు పరిమితిలేనట్టివి. శత్రుబలమును తక్కువచేసి చెప్పవద్దు. రాక్షసరాజైన రావణునికి రాముని వలన ఏమపకారం జరిగిందని సీతాపహరణం చేయబడింది? ఖరాదివధకు ప్రతీకారమంటారా? కాదు. ప్రతిప్రాణికి తన ప్రాణాలను రక్షించుకొనుట ముఖ్యం కదా? స్వయంగా రాముని చంపగోరి యుద్ధానికి వచ్చిన ఖరుని స్వప్రాణసంరక్షణార్థం శ్రీరాముడు సంహరించాడు. కాక రాముడపకారముచేసినట్లు భావించినప్పటికి సీతాపహరణం చేయతగింది కాదు. అపకీర్తికరం, ఆయుఃక్షయకరం, ధననాశకరం అయిన పరదారాగమనం ఘోరపాపజనకం.

అపహరించబడిన సీత మనకు భయకారకురాలు. ఆమెను పరిత్యజిద్దాం. రామునికి అర్పిద్దాం. కలహంను తెచ్చు పనివలన ఏమిప్రయోజనం! ధార్మికుడు, పరాక్రమవంతుడు అయిన రామునితో నిష్ప్రయోజనమైన వైరం పూనడం మనకు యుక్తం కాదు. సీతాదేవి రామున కివ్వబడుగాక. గజాశ్వరత్నయుక్తమైన లంకను రాముడు బాణాలతో ఛేదించకముందే సీత సమర్పింపబడుగాక. భయంకర వానర వాహిని లంకను నిరోధించక ముందే సీత ఇవ్వబడుగాక. మనము స్వయంగా సీతనివ్వమేని లంక, రాక్షసులు నశిస్తారు. నీవు నాకు అన్నవు కావడం వలన వేడుకొంటున్నాను. నామాటలను ఆచరించుము. ఉత్తరకాలంలో మంచిచేయుమాటను (సీతనిమ్మని) చెపుతున్నాను. అట్లు కాదేని సుదృఢాలైన, తీవ్రములైన, తీక్ష్ణాగ్రములైన బాణములను నిన్ను వధించుటకు దాశరథి ప్రయోగిస్తాడు. కోపం విడిచిపెట్టు. కీర్తిని, సుఖాన్ని పెంచు. ధర్మాన్ని ఆశ్రయించు. పుత్రబాంధవయుక్తంగా జీవిద్దాము, రామునికి సీతనిమ్ము. ఇట్టి విభీషణవాక్యాలను విన్న రావణుడు వారందరిని వదలి అంతఃపురానికి వెళ్ళాడు.

## పదవ సర్గము

**మ.వి**.....“రాక్షసాధిపతేర్వేశ్మ భీమకర్మా విభీషణః” రావణుని స్వలంకృతమైన నివాసగృహంలోనికి విభీషణుడు ప్రవేశించాడు. ‘ఆకేశగ్రహణాన్మిత్ర మహితేభ్యో నివారయేత్’ అనగా జుట్టుపట్టుకుని అయినా అహితవిషయాలనుండి మిత్రుని నివారించాలి అనే న్యాయానుసారం సర్వాత్మనాహితం చెప్పాలన్న భావంతో రావణునికి అనిష్టమైన విభీషణునికి చెప్పబడింది.

సీతాప్రదానమే మనందరకు ధర్మార్థాలను ఇచ్చుననే నిశ్చయము కల్గినట్టిది, రావణునికి ఇష్టహితవాక్యాలు చెప్పసాహసించు విభీషణుడు సర్వసమృద్ధమైన రావణగృహాన్ని సహస్రాంశువు మేఘాలలో ప్రవేశించినట్లు (ఇట్లు చెప్పుటచే రావణగృహం విభీషణతేజస్సును అపహరించునది అని వ్యంజితమవుతున్నది) ప్రవేశించాడు. అచట రావణవిజయార్థమై వేదవేత్తలచే ఉచ్చరింపబడు పుణ్యాహవాచక మన్త్రఘోషను విన్నాడు. తేజస్వియైన విభీషణుడు ఇతరరాక్షసులచే శ్లాఘింపబడుతూ, సింహాసనస్థుడైన రావణునికి నమస్కరించాడు. ‘జయ’ మనిపలుకుతూ రాజుగారి కనుసన్నలచే సూచితమయిన బంగారుమయమైన ఆసనంమీద కూర్చున్నాడు. మంత్రులుకాక అన్యజనులులేనట్టి ఏకాంతంలో అన్నగారిని నమస్కారస్తుతివాక్యాలతో ప్రసన్నునిగ చేసుకుని ప్రాప్తకాలజ్ఞుడు, మంచిచెడులను గ్రహించువాడు అయిన విభీషణుడు యుక్తియుక్తములు, హితములు అయిన మాటలు చెప్పాడు.

సీతను లంకకు నీవు తీసుకునివచ్చినది మొదలు అశుభనిమిత్తాలు కనిపిస్తున్నాయి. మన్త్ర పూతహవిస్సును సమర్పించినా రవ్వలతోను, పొగతోను స్వల్పంగానే అగ్ని ఆవిర్భవిస్తున్నది. బాగా జ్వలించడం లేదు. వంటఇండ్లలో, అగ్నిహోత్రగృహాలలో, వేదాధ్యయనగృహాలలో, సర్పాలు కనుపిస్తున్నాయి. హోమద్రవ్యాలలో చీమలు నివసిస్తున్నాయి. ఆవులకు పాలు తగ్గినాయి. మత్తగజాలు మదరహితాలుగా ఉన్నాయి. గుఱ్ఱాలు దీనంగా అరుస్తున్నాయి. ఆహారం స్వీకరించడం లేదు. గాడిదలు, ఒంటెలు, కంచరగాడిదలు, వెంట్రుకలులేనివగుతూ కళ్ళనీళ్ళుకారుస్తూ వైద్యం చేసినా స్వస్థత పొందడం లేదు. కాకులు క్రూరంగా అరుస్తూ గుంపులుగా విమానాగ్రాదుల మీద కనిపిస్తున్నాయి. గద్దలు గుంపులుగా ప్రతిగృహంలోను వసిస్తున్నాయి. నక్కలు ప్రాతస్సాయంసంధ్యలలో

పట్టణసమీపానికి వచ్చి అమంగళకరంగా అరుస్తున్నాయి. కుక్కలు మొదలగు మాంసభక్షకమృగాలు గుంపులుగా పిడుగువంటి ధ్వనితో అరుస్తున్నాయి. ఈ దుర్నిమిత్తాలు పరాజయసూచకాలు. లంకాదహనాదులు జరిగిన ప్రస్తుత సమయంలో సమర్థమైన ప్రాయశ్చిత్తం ఇదే! ఏమన సీత రామునికి ఇవ్వబడుగాక. ఇట్లు చెప్పిన విభీషణుడు రాజుకు కోపం వస్తుందనే భావంతో తిరిగి ఇట్లంటున్నాడు. నేను చెప్పిన మాటలు'మోహాత్' కార్యతత్త్వపరిజ్ఞానం లేకపోవడం వలన 'లోభాత్' జీవితాశవల్ల నేను చెప్పినట్లు భావించి దోషంగా తలచవద్దు. ఈదుర్నిమిత్తాలు జనులందరికీ కనిపిస్తున్నాయి. (ప్రహస్తాది) మంత్రులందరూ భయం వలన ఈ విషయాలు నీతో చెప్పడం లేదు. సోదరుడనగుటచే చూచినది, విన్నది, నీకు తప్పక చెప్పాలి. నీవు ఆలోచించి న్యాయమైన పనిని చెయ్యి. ఈవిధంగా విభీషణుడు చెప్పాడు.

హితం, ప్రయోజనకరం, మృదులం, యుక్తియుక్తం, భూతభవిష్యద్వర్తమాన శ్రేయస్కరం అయిన విభీషణుని మాటను వినిన రావణుడు తన భావాన్ని మార్చుకోకుండా ఇలా సమాధానం చెపుతున్నాడు.

**గో.వి.** విభీషణవాక్యం భూతకాలంలో జరిపిన సీతాపహరణప్రాయశ్చిత్తరూపం, వర్తమాన కాలంలో సుఖకారకం, ధర్మయుక్తమగుట వలన భవిష్యచ్ఛ్రేయస్కరం.

ఎవరినుండి కూడా నాకు భయం లేదు. రాముడు సీతనెంతమాత్రం పొందలేడు. ఇంద్రసహితులైన సమస్తదేవతలు రామునికి సహాయపడినా నా ఎదురు రాముడు నిలువలేడు. ఈవిధంగా మాట్లాడిన రావణుడు హితవాది అయిన విభీషణుని విసర్జించాడు.

## పదకొండవ సర్గము

పాపి అయిన రావణుడు తాను విభీషణవాక్యాలను ఖండించకపోవటం వలన ప్రహస్తాదులకు కూడా అనాదరం కలదనే భావంతో, సీతాపహరణరూప కుత్సితకర్మాచరణచేసినవాడు కావటంచేత, సీతయందు కామ మోహితుడగుటవల్ల "కృశః" చింతాకులుడయ్యాడు. మంత్రమునకు తగిన అకాలమందు యుద్ధం ప్రాప్తించి ఉండగా మంత్రులతోను, స్నేహితులతోను, ఆలోచించుటకది తగిన సమయంగా భావించాడు.

**గో.వి.** వాల్మీకిహృదయం ఏమంటే "అతీత సమయే కాలే" రావణుని ఆయుఃకాలం అయిపోగా యుధి యుద్ధమందు అమాత్యస్నేహితులతో సహ "ప్రాప్తకాలం"మృత్యువు ప్రాప్తించిందని తలచాడు.

**మ.వి. :** కామసంపన్నుడు కావడం వలన పాపకర్ముడైనా, "మైథిలీమనుచింతయన్" సీతను స్వేష్టదేవతగా భావిస్తున్నవాడై "మైథిలీకామమోహితః" సీతాదేవికి భృత్యుడ నయ్యెదనని భావించాడు. స్వర్ణమయగవాక్షాలు కలిగిన సుశిక్షితాశ్వయుక్తమైన రథానికి ప్రదక్షిణం చేసి అధిరోహించి మంత్రశాలకు వెళ్ళాడు.

గొప్పదగు పని సమర్థతతో నిర్వహింపదగి ఉంది. కావున నగరస్థ రాక్షసులనందరిని పిలుచుకొని రమ్మని వేగచారులైన దూతలను ఆజ్ఞాపించాడు. (ఇట్లనుటవలన సేనాయుతుడగు రాముడు సముద్రతీరమందున్న విషయం చారముఖంగా రావణుడు తెలుసుకొనెనని సూచింపబడింది)

రావణదూతలు నిర్భీతితో శయనాలమీద, ఉద్యానవనాలలో, క్రీడించేవాళ్ళను కూడ పిలిచారు. వాహనారూఢులై కొందరు, పదాతులై కొందరు సభాభవనం ప్రవేశించి రాజుకు నమస్కరించి యథార్హస్థానాలమీద కూర్చున్నారు. రథాధిరూఢుడైన విభీషణుడు సభాప్రవేశం చేసి అన్నగారికి ప్రవర, నామాలను వినిపించి నమస్కరించాడు. ప్రహస్తాదులు సభ నలంకరించారు. గంధపుష్పమాలికాధారులైన సభాసదులచే ఆ భవనం సుగంధపూరితమైనది. సభాసదులందరూ మౌనంగా ప్రభుసింహాసనాన్నే వీక్షిస్తూ ఉన్నారు.

## పన్నెండవ సర్గము

సభనంతటిని కలియజూచిన రావణుడు సేనాపతి ప్రహస్తుని ఇట్లాజ్ఞాపించాడు. చతురంగబలాలకు ఇతఃపూర్వముకంటే అధికంగా రక్షణవిషయంలో జాగరూకులై ఉండునట్లు ఆజ్ఞాపించు. ప్రహస్తుడు రావణాజ్ఞ పాలించాడు. పిమ్మట 'సుఖేప్సు' వగు రావణుడు ఇట్లన్నాడు.

**వ్యా.వి.** ఇచట 'సుఖేప్సు' వన కామపురుషార్థాన్ని మాత్రం కోరువాడే కాని విజయాన్ని కోరువాడు కాదని సూచితం.

మంత్రుల ఆభిముఖ్యసంపాదనకొరకు ముందుగా వారిని ప్రశంసిస్తున్నాడు. ధర్మార్థకామపురుషార్థాలలో చిక్కులు సంభవించినపుడు ఏ ధర్మాన్ని ఆచరించాలి? దానివలన కలుగు సుఖదుఃఖాలు, తత్కారణాలు అయిన హితాహితములు ఏవి అనే విషయం మీరు బాగా ఎరుగుదురు. అన్నిసందేహాలను నిరాకరింప సమర్థులు. మీరాలోచించి నిశ్చయించి ప్రారంభించిన అన్ని పనులు సఫలములయినాయి. విషయమిదివరలో తెలిపినాను. నిద్రితుడగుట వలన కుంభకర్ణునకు ఈ విషయం చెప్పలేదు. మహాబలుడు కుంభకర్ణుడు ఆరుమాసాలు నిద్రించి ఇపుడు లేచి వచ్చినాడు. (సీతను తిరిగి ఇవ్వకయే రాముని జయించు విషయాన్ని విచారింపుడని చెప్పతలచి నిద్రించు కుంభకర్ణునికి సీతాపహరణవృత్తాంతం తెలియదు కావున ఆతడికి తెలియడానికి రావణుడు ఇట్లంటున్నాడు)

రాక్షససంచారయోగ్యమైన దండకారణ్యం నుండి సీతను తెచ్చాను. మూడులోకాలలో సీత వంటి స్త్రీ మరొకతె లేదు. మందగామిని అయిన ఆమె నా శయ్యను అధిరోహించడానికి ఇష్టపడుటలేదు. ఆ సీత సుందర పాదద్వంద్వం చూస్తుండగా నాకు మన్మథబాధ వృద్ధి అవుతూ ఉంది. అగ్నిజ్వాలవలె, సూర్యప్రభవలె నున్నట్టిది ఎత్తగుముక్కు, సుందరనేత్రాలు కల సీతను చూచి మన్మథవశుడనవుతున్నాను. హర్షక్రోధావస్థలలో సమానంగా బాధను కలిగించువాడు, శరీరవివర్ణకారి, శోకసంతాప సమయాలలో కూడ (అక్షాది వధజనితదుఃఖసమయమందు గూడ) బాధించే మన్మథునిచే కలియబెట్టబడిన మనస్సు కలవాడనయ్యాను. ఆమె భర్తయైన రాముడు రాగలడను ఆశతో నన్ను సంవత్సరకాలం గడువు కోరింది. ఆమెమాట మన్నించాను. మార్గం నడచి అలసిన గుర్రంవలె మన్మథబాధచే అలసిపోయాను.

**వ్యా.వి.** యథార్థంగా ఈ సంవత్సరకాలావధిని సీత కోరలేదు. రావణనిర్ణయమది. ఆ విషయాన్ని రావణుడు వక్రించి చెప్పాడు.

**మ.వి.**'సా మే న శయ్యామారోఢుమిచ్ఛత్యలసగామినీ' ఆమె నన్ను పొందుటకిష్టపడుట లేదు అను యథార్థాన్ని చెప్పి అట్టిదానివలన ఏమి ప్రయోజనం? వదిలిపెట్టు అని అంటారనే శంకతో తానుపెట్టిన సంవత్సరకాలావధిని ఆమె కోరినట్లు వక్రీకరించి రావణుడు చెప్పాడు. దండకారణ్యం నుండి సీతను తెచ్చితినని ప్రారంభించి– మన్మథబాధచే అలసితిని అని చెప్పినంత వరకు వాస్తవార్థమేమంటే పూజార్థం తీసుకుని రాబడినట్టిదీ, త్రిలోకమోహినీ, నాఇష్టదేవత అయిన సీతాదేవి నేలమీద శయనించి దుఃఖిస్తుండగా చూచిన నేను దుఃఖితుడనయ్యాను. "సా మే న శయ్యామారోఢుమిచ్ఛతి" మదర్పిత శయ్యను స్వీకరించడం లేదు. ఇట్టి స్త్రీ దుఃఖార్హురాలు కాదని చెప్పడానికి త్రిలోకసుందరి అని వర్ణింపబడింది. ఇక పాదవర్ణనలో సమస్తపాపనాశకాలైన ఆపాదద్వంద్వాన్ని చూచి, సూర్యాగ్నితుల్యయగు ఆమె దుఃఖించడం చూచి "మే శరీరజః" సీతానిమిత్తమైన అగ్నివృద్ధి చెందుతున్నది. 'నీభార్యలతో సుఖించవచ్చునుకద' అను శంకకు "ఉన్నసంవదనం" అను శ్లోకద్వయం చెప్పబడినాయి. కామకలుషీకృతుడను అయినప్పటికి దుఃఖించు సీతను చూస్తూ "కామస్య వశమేయివాన్" కామునికి వశమగుదునా ఏమి అని కాక్వర్థము సూచితమైంది. సరే! జగదంబయైన సీత మీఇంటనే కలదుకద? ఇపుడేమి నష్టం కలిగింది? అనుదానికి సమాధానం – "సా తు సంవత్సరం కాలం....." ఆమె ఇచట ఉండుకాలం కూడా పూర్తికావచ్చిందని బాధపడుతున్నాడు.

అక్షోభ్యం, దుస్తరం అయిన సముద్రాన్ని వానరులుగాని, రామలక్ష్మణులుగాని ఎలా దాటగలరు? కాక ఒక్క వానరుడింతటి యుద్ధం చేశాడు కదా! కార్యగతులెట్లుండునో చెప్పలేము. మీ మీ బుద్ధులకు తోచినట్లు చెప్పండి. అపుడు దేవాసురయుద్ధంలో మీతోకూడిన నాకు విజయం కలిగింది. మీరట్లే ఉండిరి. మనుష్యునివలన నాకు భయం లేదు. అయినా చక్కగా ఆలోచించండి. రాజపుత్రులు సుగ్రీవప్రభృతి వానరవీరులను తోడ్కొని సీత ఉండే స్థలం తెలిసికొని సముద్రతీరానికి చేరారు. సీత ఇవ్వబడకుండునట్లు, రాఘవులు హతులగునట్లు మీరు చక్కగా ఆలోచించి నిశ్చితవిషయం చెప్పండి. రాముడుకాక ఇతరునకెవ్వరికినీ వానరసహితంగా సముద్రతరణం చేసివచ్చు శక్తిని చూడలేదు. కాన నాకే జయం.

**మ.వి.**"అదేయా చ యథా సీతా వధ్యౌ దశరథాత్మజౌ" ఇచట అవధ్యౌ అని పదచ్ఛేదం చేసుకోవాలి. దశరథాత్మజులు వధ్యులుకారని భావం. ఇట్లే "నహి శక్తిం ప్రపశ్యామి జగత్యన్యస్య కస్యచిత్! సాగరం వానరై స్తీర్త్వా నిశ్చయేన జయో మమ".(12–26). 'మమ జయే' నా జయం విషయంలో 'అన్యస్య కస్యచిదపి' ఇతరులెవరికి కూడా 'నిశ్చయే శక్తిం న పశ్యామి' జయాపజయాలను నిశ్చయించే శక్తిలేదు. 'ఏవం నిశ్చయే సతి' ఇట్లు నిశ్చయింపబడగా 'మమ జయో న' నాకు జయం లేదు. ఇదివాస్తవార్థం. కామాతురుడు, విపరీతబుద్ధి అయిన రావణుని అసంబద్ధ భాషణం విన్న కుంభకర్ణుడు మిక్కిలి కోపంతో ఇట్లన్నాడు. ఒక్కసారిమాత్రమే చూడబడిన రామభార్య సీత ఇచటికి ఎపుడు తీసికొనిరాబడిందో అపుడే (తత్పూర్వమే) మాతో ఆలోచించి ఉంటే బాగుండేది. ఇపుడు చేసే ఈ ఆలోచన 'గతజలసేతుబంధన' సదృశం.

**గో.వి.** ఈ విషయంలో (10 వ సర్గలో రావణుడు చెప్పిన విధంగా) ఉత్తమ మంత్రణ చేయలేదు. "ఏకోఽర్థం విమృశన్" అన్నట్లు మధ్యమమంత్రణం కూడా చేయలేదనే భావంతో కుంభకర్ణుడు మాట్లాడాడు. ఇపుడు మా అందరితో చేసే మంత్రణమంతా సీతాపహరణానికి పూర్వమే చేయబడి ఉంటే సమంజసంగా ఉండేది. ముందుగా

న్యాయాన్యాయవిచారణ చేసి ఏరాజు పనులు ఆరంభిస్తాడో నిశ్చితబుద్ధిగల అతడు పిమ్మట పరితపించడు. ఉపాయం విచారింపక చేసే పనులు, విపరీతక్రియలు, నిష్ఫలం కావడమే కాక ఆ పాత్రములయందు ఉంచిన హవిస్సులవలె అనర్థకరములవుతాయి. మంత్రణానంతరం చేయదగిన కర్మారంభం ముందుగాచేసి ముందుగా చేయవలసిన మంత్రణం తరువాత చేయువాడు నీతి తెలియనివాడు. అట్టి ఆలోచనారహితుని, చపలుని, అతడు బలవంతుడయినప్పటికీ రంధ్రాన్వేషులైన శత్రువులు అవకాశం చూచుకొని పరిభవిస్తారు. దాటుటకసాధ్యపడని క్రౌంచపర్వతాన్ని కుమారస్వామి బాణాలద్వారా చేయబడిన రంధ్రాలనుండి హంసలు ప్రవేశించినట్లు ప్రవేశించి పరాజితుని చేస్తారు. అపాయంతో కూడుకున్నట్టి, అనాలోచితమైన సీతాపహరణరూపపాపకార్యం ధూర్తసహాయంతో నీచే చేయబడింది. కనుక అవకాశమేర్పడింది. అయిననూ దైవగతివలన ఇప్పటివరకు రాముడు నిన్ను సంహరించ లేదు. కనుక నీకు తగనట్టి నీచే చేయబడినట్టి దీనిని కృత్యాకృత్యపరిగణనచేయక ఇతరులకసాధ్యమైన నీశత్రు సంహారంను చేయుటద్వారా నీకు సాధించి ఇస్తాను. వ్యసనరహితుడవు కా.

పరాక్రమయుక్తులైన రామలక్ష్మణులను జయింపగలవా? అనే సందేహానికి ఇట్లు ప్రత్యుత్తరిస్తున్నాడు. వారిద్దరూ ఇంద్రసూర్యులయినా, అగ్నివాయువులయినా, కుబేరవరుణులయినా యుద్ధం చేస్తాను. పర్వతాకారుడనైన నేను యుద్ధమునకి వెళ్ళగా ఇంద్రుడు కూడా భయపడును. ఆ రాముడు మొదటబాణం వేసి రెండవ బాణంతో చంపునంతలో అతడి నెత్తురు త్రాగుతాను. సుఖంగా వుండు. రామలక్ష్మణులను సంహరించి నీకు జయం కలిగించడానికి ప్రయత్నిస్తాను. సమస్తవానరశ్రేష్ఠులను భక్షిస్తాను. నీవు మద్యం సేవించి రమిస్తూ ఉండు. బాధలేకుండా అన్నిపనులను చేసుకొంటూ వుండు. రాముడు చనిపోగా బహుకాలం సీత నీవశంలో ఉండగలదు.

**వ్యా.వి.:** "పునర్మాం స ద్వితీయేన శరేణ నిహనిష్యతి, తతోఽహం తస్య పాస్యామి రుధిరం......" కుంభకర్ణోక్తియందు రెండవ బాణంతో రాముడు నన్ను చంపును. అపుడు నేను ('తస్య కర్తరి షష్ఠి'.రాముడు చంపుటచేత) నారక్తం తాగుతాను. శ్రీరాముని జయించు సామర్థ్యం నాకు లేదని కుంభకర్ణుడు విజ్ఞాపన చేస్తున్నాడు. "వధే న వై దాశరథేస్సుఖావహం జయం తవాహర్తుమహం యతిష్యే.....ఖాదామి....." రామునివలన నాకు మరణం సంభవించినపుడు తవ సుఖావహం జయం న యతిష్యే- నీకు జయాన్ని తీసుకొనిరాలేను. అయితే 'సహలక్ష్మణేన రామం'(వినా) లక్ష్మణయుక్తుడైన రాముని విడచి ఇతరవానరులను మాత్రం భక్షిస్తాను. ఇట్లే అధ్యాయాంతంలో "మయా తు రామే గమితే యమక్షయం చిరాయ సీతా వశగా భవిష్యతి" గో.రా.నాచేత రాముని యందు అక్షయంగా పొందజేయబడిన సీత రామునికి వశురాలవుతుంది. నీవు సంతసిస్తావు కద?(కాక్వర్థము)

**మ.వి.** మయా రామే విషయే-యమక్షయం గమితే సతి సీతా అస్య విష్ణురూపరామస్య వశమాగమిష్యతి అని గోవిందరాజీయభావాన్నే చెప్పారు. వ్యాఖ్యాతలిరువురుకూడా క్లిష్టాన్వయంతో కుంభకర్ణుని ఈ వాక్యాలలో అర్థాంతరం రామవిజయం, సీతాప్రాప్తిని సూచిస్తున్నారు.

## పదమూడవ సర్గము

కుంభకర్ణుని మాటలను విని కుపితుడైన రావణుని ప్రసన్నం చేసుకోవడానికి మహాపార్శ్వుడు దోసిలియొగ్గి ఇట్లన్నాడు. తేనెకోసం అడవికి వెళ్లి తేనెను సంపాదించి దానిని ఆస్వాదించనివాడు మూఢుడు. నీవే ఈశ్వరుడవు. నీకు శాసకులెవరూ లేరుకద? శత్రువులను తృణీకరించి వైదేహితో సుఖించు.

"ఈశ్వరస్యేశ్వరః కోఽ స్తి.......రమస్వ సహ వైదేహ్యా శత్రూనాక్రమ్య మూర్ధసు"

**గో.వి. :** రామునికి ప్రభువెవ్వడూలేడు.'శత్రూన్' ఇచట బహువచనం గౌరవవాచకం. రాముని 'మూర్ధస్వాక్రమ్య' శిరస్సుచేత నమస్కరించి సీత భర్తతో ఎట్లు సుఖిస్తుందో అట్లే నీభార్యలతో సుఖించు అని అర్థాంతరం. మరియు సీతతో సహ రామునికి నమస్కరించి అని కూడా వ్యాఖ్యానించవచ్చు. తిరిగి మహాపార్శ్వుడు ఇట్లంటున్నాడు. 'కుక్కుటవృత్తి'చే బలాత్కారంగా అయినా సీతతో సుఖించు. ఒకవేళ (నీకోరిక తీరిన పిమ్మట) ఏదయినా "బలాత్కుక్కుటవృత్తేన.........ఆక్రమ్యాక్రమ్య సీతాం వై తథా భుంక్ష్వ రమస్వ చ" (కోడి తన భాగస్వామి అయిష్టాన్ని లెక్కచేయకుండా భోగిస్తుంది. దానిని 'కుక్కుటవృత్తి' అంటారు) వాల్మీకి హృదయం ఏమంటే కుక్కుటవృత్తితో ఇతరత్ర ఉందువుగాక 'సీతాం బలాత్ భుంక్ష్వ' భుంక్ష్వ రక్ష అనే అర్థాన్ని స్వీకరించి సీతను రక్షించు.

భయం కలిగితే కలగనీ. దానిని సహించగలవు. నీవట్లుండు. మాతో కూడిన కుంభకర్ణేంద్రజిత్తులు ఇంద్రుడినైనా నివారించగలరు. ఇపుడు విభీషణమతాన్ని ఖండిస్తున్నాడు. సీతను సమర్పించడం, లేక సామవాక్యాలను చెప్పడం, భేదప్రయోగం చేయడం. ఇవి యుద్ధంలో అసమర్థులైన వారు అనుష్ఠింపతగినవి. దండోపాయం ద్వారా కృతార్థుడవు కా. శస్త్రబలంతో ఇక్కడికి వచ్చే సమస్త శత్రువులను నిగ్రహిద్దాం. ఈవిధంగా మహాపార్శ్వుడు అనగా ఆతనిని పొగడి రావణుడిట్లన్నాడు. మహాపార్శ్వ! నాకొక రహస్యం ఉంది. దానిని చెపుతాను. బ్రహ్మదేవుని గృహానికి వెళు తున్న పుంజికస్థల అనే అప్సరసను చూచి ఆమెను భోగించాను. వాడిన తామరతూడువలె ఆమె బ్రహ్మసమీపానికి వెళ్లింది. ఆవిషయం ఆ మహాత్మునకు తెలిసినట్లుంది. బాగా కోపపడిన బ్రహ్మ నన్నిలా శపించాడు. 'నేటినుండి ఏ ఇతర స్త్రీలనయినా బలాత్కారంగా పొందితే తత్క్షణమే నీశిరస్సు నూరు ముక్కలు అవుతుంది.' తచ్ఛాపభీతుడనైన నేను సీతను బలాత్కరించలేక పోతున్నాను.

**గో.వి.** ఇంతకుముందు రావణుడు ఇలాగే 'రంభ' విషయంలో ప్రవర్తించగా నలకూబరుడు శపించాడు. ఆతడు పుత్రతుల్యుడు కావడంవల్ల శాపాన్ని లెక్కించకుండా అదేవిధంగా ప్రవర్తించగా బ్రహ్మ శపించాడు. అతిక్రమించరాని బ్రహ్మదేవుని మాటను ఇపుడు రావణుడు వ్యక్తపరచాడు.

సముద్రమువంటి వేగం, వాయువువంటి గమనం నాకు ఉన్నాయనే విషయం రామునికి తెలియదు. అందువలన వస్తున్నాడు. గుహలో నిద్రించే సింహమువంటివాడను, నిద్రించే మృత్యువువంటివాడను అయిన నన్ను నిద్రలేపడానికి ప్రయత్నించేవాడు రెండునాల్కలుకల సర్పాలవంటి తీవ్రమైన నాబాణాలను యుద్ధంలో చూస్తాడు. ఏనుగులపై ప్రయోగించబడే కౌరవులవంటి వజ్రతుల్యాలైన బాణాలతో సంతాపం కలుగజేస్తాను. స్వీయసేనాయుక్తుడై ఉదయించే సూర్యుడు నక్షత్రప్రభను అపహరించే విధంగా వానరసేనను సంహరిస్తాను.

## పద్నాల్గవ సర్గము

దుష్టమంత్రుల నిరర్థకవాక్యాలను సహింపలేని విభీషణుడు కర్తవ్యార్థబోధకమైన హితాన్ని ఉపదేశిస్తున్నాడు. సీతాదేవిని మహాసర్పంగా (రూపకాలంకారమున) వర్ణిస్తున్నాడు. సీతాదేవి విశాలవక్షమే విప్పారిన సర్పశరీరం. ఆమె దుఃఖమే విషం. స్వాభావికమైన ఆమె చిరునవ్వు అనే తెల్లదనంచేత, కాముక హృదయహారిత్వంచేత తీక్ష్ణమగు కోరలు, దుఃఖంతో తలగడగ చేసుకొనిన పంచాంగుళులుకల ఆమెబాహువే పంచశిరస్సులు కలిగిన పడగ. అట్టి

సీత అనే మహాసర్పాన్ని నీవేల వరించావు? సీతవలన నీకొక్కనికే అనర్థం కాదు. నీసంబంధులందరికీ అనర్థాలు సంభవిస్తాయి. కాన పర్వతాకారులైన వానరులు లంకవైపు రాకముందే సీతను సమర్పించు. వజ్రాయుధతుల్యం, వాయువేగం అయిన రామబాణం రాక్షసుల శిరస్సులను ఖండించకముందే సీతను ఇవ్వు. (ఇచటరాజును అనజాలని మాటలను ప్రహస్తునితో విభీషణుడు అంటున్నాడు) ప్రహస్తా! ప్రాణాలు తీసే పిడుగులవంటి రామబాణాలు నీశరీరంలో ఇంకా ప్రవేశింపకుండుట వలన నీవు నిన్ను పొగడుకొంటున్నావు. రావణకుంభకర్ణేంద్రజిదాదులు ఎవరూ యుద్ధంలో రాముని ముందు నిలువలేరు. రాజా! సూర్యుడు నిన్నుదాచినా, వాయువుయొక్క ఇంద్రునియొక్క వడిలో దాగినా, పాతాళానికి వెళ్లినా బ్రతికినంతకాలం రాముడు నిన్ను విడువడు.

ఈవిధమైన విభీషణహితవాక్యాలను విని ప్రహస్తుడన్నాడు. దేవదానవగంధర్వాదులెవరి వలనా మాకు భయంలేదు. ఇక రాజపుత్రుడైన రాముని వల్ల మాకెపుడూ భయం కలుగదు. హితం కానట్టి ప్రహస్తవాక్యాన్ని విన్న విభీషణుడు రాజహితాన్ని కోరువాడై ధర్మ, అర్థ, కామాలను బాగుగా విచారించి ఇలా అన్నాడు. 'ప్రహస్తా! ధర్మబుద్ధిలేనివాడు స్వర్గం పొందజాలనట్లు నీవుగాని, కుంభకర్ణాదులుగాని,'రాముని గెలుతుమని' చెప్పిన విషయాలు సఫలాలు కావు. పడవలేనివాడు సముద్రం దాటలేని విధంగా మనలో ఎవరికిగూడ కార్యదక్షుడైన రాముని వధించడం సాధ్యంకాదు. శ్రీరాముడు ధర్మరక్షణకొరకు ప్రాణాలనయినా వదులుటకు సిద్ధపడతాడు. తనను, సారథిని, గుర్రాలను రక్షించుకొంటూ యుద్ధంచేయగల మహారథుడు.సహజపరాక్రమశాలి. విరాధ, కబంధ వాలి ప్రభృతి దుష్టసంహర్త. కార్యదక్షుడు. అట్టివాని యుద్ధతంత్రాన్ని దేవతలుగూడ గ్రహింపనలవికాదు. ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు, రావణుడు మొదలగు యోధులు ఎవరూ యుద్ధంలో రాముని ఎదుట నిలువ సమర్థులు కారు. తీక్ష్ణస్వభావి. 'వాక్పారుష్య' దండపారుష్య, స్త్రీలౌల్య,అర్థదూషణ, సురాపాన,మృగయా, ద్యూతములనే ఏడు వ్యసనాలు కల ఈ రాజు మిత్రరూపులుగా కనిపించే శత్రువులైన మీచేత రాక్షసనాశనంకోసం ఇచ్చకపు మాటలతో పొగడబడుతున్నాడు. భయంకరాకారుడైన వేయితలలు కల మహాసర్పంచే చుట్టుకోబడిన వానివలె 'రామద్వేషావృతు' డగు రావణుని బయటకుతీసి విముక్తుని చేయండి. 'సమయం దాటింది ఈస్థితిలో ఏమిచేయగల' మందురేమో! ఈ రాజువల్ల అన్నిసుఖాలను బొందిన మీరు ఐకమత్యం కలిగి రాజును రక్షించండి. గొప్పభూతములావేశించిన పురుషుని జుట్టుపట్టి ఈడ్చి మంచిమార్గంలో పెట్టినట్లు రక్షించాలి.

**గో.వి.**"యావద్ధి కేశగ్రహణం" అనువాక్యానికి అర్థద్వయం ఉంది. (1) శత్రువులు మిత్రుని జుట్టుపట్టుకొని ఈడ్చుకొని వెళ్ళకముందే, (2) అపమార్గంలో పోయే మిత్రుని జుట్టుపట్టి ఈడ్చి అయినా సన్మార్గానికి మరలించాలి. సంహరణసమర్థుడైన లక్ష్మణుడను సముద్రంలో పడినట్టి, రాముడే బడబాగ్నిముఖంలో పడబోవుచున్నట్టి, ఈ రాజును ప్రారంభంలోనే మీరు చేయూతనిచ్చి తరింపచేయండి.

**గో.వి.**'సంహారిణా' అనుదానికి 'సువారిణా' అనేది పాఠాంతరం. ఉపమేయోపమానములైన రాఘవ-సాగరములకు ఈ శబ్దమర్థద్వయముచే అన్వయిస్తున్నది. (శోభనో వారః బృందః, అథవా స్యందనః సరాఘవః తేన, శోభనో వారి యస్య సః సువారిః సాగరః తేన సువారిణా) మంచిసేనాబృందం కలవాడు, లేక మంచిరథం కలవాడు రాఘవుడు. సుందరమైన జలం కలది సముద్రం.

ఈరాజుకు, లంకాపురవాసులందరికీ హితం కలిగించే నామాట చెప్పుతున్నాను. సీతను రామునకిద్దాము. మేముగూడ శత్రువగు రామునితో యుద్ధంచేసి జయిస్తామని చెప్పాము కద? అందురేమో! తనయొక్క, శత్రువుయొక్క బలాబలాలను, వృద్ధిక్షయాలను గుర్తించి రాజుకు హితం చెప్పాలి. తాను వృద్ధిలో ఉన్నపుడు యుద్ధమూ, శత్రువు వృద్ధియందున్నపుడు సంధీ, ఉభయులు సములుగా ఉన్నపుడు ఆసనం(ఊరకుండుట) చేయవలెనని మంత్రులు రాజుతో చెప్పాలి. ప్రస్తుతం రామునికి వృద్ధీ, రావణునికి నగరదహన, కుమార– సైన్యనాశనరూపక్షయం సంభవించి ఉండడంవల్ల 'సీతాప్రదాన' రూపసంధి శ్రేయస్కరమనే విషయాన్ని మంత్రులు రాజుకు చెప్పాలి.

## పదిహేనవ సర్గము

ధీశక్తిలో బృహస్పతితో సముడైన విభీషణుని మాటలను ఎట్లో సహించి ఇంద్రజిత్తు ఇట్లన్నాడు. పినతండ్రీ! ప్రయోజనరహితమైన మాటలను మహాభీతుడవై ఏల పలికావు? ఈపులస్త్యవంశజాతునికి తగని మాటలను పలికావు. ఇట్టిమాటలు చెప్పుట వినుటకూడ నింద్యములు. ఈపులస్త్యవంశంలో బలపరాక్రమాదులులేనివాడు మాపినతండ్రి విభీషణుడొక్కడే. నీవు భయపడి మమ్ముల భయపెట్టుచున్నావేమి? రాజపుత్రులైన రామలక్ష్మణులెంత? వారిని హీనరాక్షసుడయినా సంహరిస్తాడు. త్రిలోకాధిపతి అయిన ఇంద్రుడు యుద్ధంలో మాచే మట్టికరచినాడు. భయంచే దేవగణాలు నాలుగుదిక్కుల పారిపోయాయి. భయంకరంగా గర్జిస్తూ వచ్చిన ఐరావతాన్ని నేలపైపడద్రొబ్బి దాని దంతాలను పెకలించి వాటితో దేవతలను పారద్రోలాను. దేవదానవులకు భయం కలిగించు పరాక్రమం కలిగిన నేను రాజపుత్రులను జయింప సమర్థుడను కానా?

ఇంద్రజిత్తు మాటలకు విభీషణుడు ప్రత్యుత్తరిస్తున్నాడు.కుమారా! ఇప్పటికి గూడ నీకు పరిణత బుద్ధి కలుగలేదు. బాలుడవు. నీకు మంత్రాంగం చేసే శక్తి లేదు. అందువల్ల అర్థవిహీనాలు, ఆత్మవినాశకరాలు అయిన పెక్కుమాటలు మాట్లాడావు. నీవు ఈ రావణునికి పుత్రుడని ప్రసిద్ధి కల మిత్ర రూపశత్రుడవు. ఏమయిన రామునివలన రాబోయే సర్వనాశనాన్ని వినిగూడ అజ్ఞానంవలన యుద్ధానికి అంగీకరిస్తున్నావు. తండ్రికి వినాశనకరమైన ఆలోచన చెప్పిన దుర్బుద్ధివగు నీవు వధ్యుడవు. బాలుడవు, సాహసివి, బలవంతుడవు అగు నిన్నీ మంత్రాలోచనా మందిరానికి తోడ్కొనివచ్చినవాడును వధ్యుడే. మంచిచెడులు తెలియనివాడవు, గర్వితుడవు, వినయములేనివాడవు, క్రూరప్రవృత్తి కలవాడవు, దుష్టమనస్కుడవు, అవివేకివి అయిన నీ'వత్యంతదుర్మతివి'. చిన్నవాడవగుటచే ఇట్లు మాట్లాడుతున్నావు.

**గో.వి.** ప్రహస్తుడు 'దుర్మతి' మహాపార్శ్వుడు 'సుదుర్మతి', నీవు 'అత్యంతదుర్మతివి'. బ్రహ్మదండ సదృశాలైన జ్వాలతోకూడి మృత్యువువలె భాసించు రామబాణాలను యుద్ధంలో ఎవడు సహించగలడు? ఇట్లు ఇంద్రజిత్తును మందలించిన విభీషణుడు – రావణునితో

**గో.వి.** బ్రహ్మదండమంటే యుగాంతంలో అగ్నివలె వెలుగు ధూమకేతువని కొందరు, బ్రహ్మశాపమని కొందరు చెపుతారు.

ఓరాజా! ధనాన్ని, రత్నాలను, భూషణాలను, దివ్యవస్త్రాలను, మణులను, సీతతోసహా రామునికి సమర్పించి దుఃఖరహితులుగా జీవిద్దామని తన వాదాన్ని ముగించాడు.

## పదహారవ సర్గము

పూర్వసర్గలో చెప్పబడిన విభీషణవాక్యాలు, అందలివిషయాలు, ప్రతికూలంగా ఉన్నప్పటికీ వినడానికి సొంపైనవి. మనస్సులో నాటుకొనేటట్లు చెప్పబడినాయి. కేవలం వినడానికి ఇంపుగా ఉండడమేకాకుండా దుర్దశానివారకాలు. వినడానికి కటువుగా ఉండినా భావికాలాలలో శుభం చేకూరుస్తాయి. వినిన రావణుడు సంతసించలేదు. మృత్యువశ్యుడు కావడంతో పరుషాలైన మాటలతో ఇట్లన్నాడు.

శత్రువుతోను, కోపించినసర్పంతోను, సహవాసంచేయవచ్చుకాని మిత్రునివలె కనుపించే శత్రుపక్షపాతితో సహవాసం చేయరాదు. అన్నిలోకాలలో దాయాదుల స్వభావం నాకు తెలుసు. కష్టాలు వచ్చినపుడు దాయాదులు సంతసిస్తూ ఉంటారు. స్వజాతిశ్రేష్ఠుని, కార్యసాధకుని, విద్వాంసుని, శూరుని, అవమానించి పరిభవిస్తారు. నిత్యం సన్నిహితులుగా ఉండికూడా కష్టదశలో ద్రోహం చేసేవారు, క్రూరకర్ములు అయిన జ్ఞాతులు భయం కలిగిస్తారు. ఇందుకు ఉదాహరణం చెపుతున్నాను. పద్మవనంలో ఏనుగులను బంధించే తాళ్ళతో వస్తున్న మానవులను చూచి ఏనుగులు కొన్ని గీతాలు పఠించాయి. వినండి – మనకు నిప్పుగాని, ఆయుధాలుగాని, బంధించుత్రాళ్ళుగాని, భయజనకాలుకావు. వీరిప్రక్కనున్నట్టి మార్గదర్శులైన మనజ్ఞాతులే అగ్న్యాదుల కంటే భయజనకాలు. మనలను పట్టుకొనే ఉపాయం వీరికీ జ్ఞాతిగజములే చెప్పగలవు. ఆవులయందు సంపద, బ్రాహ్మణులయందు ఇంద్రియనిగ్రహం, స్త్రీలయందు చాపల్యం, ఎలా సహజమో! జ్ఞాతులవలన భయంకూడా అట్లే సహజం. అందువలన ఓ విభీషణా! నేను ఐశ్వర్యం పొంది లోకంచే సత్కరింపబడడం, జ్ఞాతులలో శ్రేష్ఠుడను కావడం. జ్ఞాతివైన నీవు సహించలేకున్నావు. తామరాకులపై నీటిశకలాలు ఎంతకాలం కలసిఉన్నా ఐక్యమందజాలవో దుష్టులతో బహుకాల సన్నిహితత్వం ఉండినా స్నేహం కలుగదు. తుమ్మెద పుష్పాలనుండి తేనెను స్వీకరించి ఆధారభూతములగు పుష్పాలను విసర్జిస్తున్నది. అట్లే నీవుగూడ నాయందు సుహృద్భావం లేకుండా ఉన్నావు. దుర్జనలక్షణమిదేకదా? ఏనుగు స్నానానంతరం మట్టిని తొండంద్వారా తనమీద పోసుకొన్నట్లు దుర్జనుల సౌహార్దం గజస్నానంవలె ప్రయోజనరహితం అవుతుంది. శరత్కాలమేఘాలు గర్జించినా భూమిని వర్షంతో ఎలా తడపవో అట్లే అనార్యులు పైన ఉపకరించినట్లు కనుపించినా ఉపకరించరు. నీవు నాతమ్ముడవు. నీవుకాక ఇతరుడు ఎవడయినా నా వెనుక నీవుమాట్లాడినట్లు మాట్లాడి ఉండే వానిని ఈ క్షణంలో నశింపచేసి ఉండేవాడను. ఛీ! కులంలో చెడబుట్టిన నిన్ను త్యజిస్తున్నాను.

ఇట్లు తానుచెప్పిన హితవాక్యాలను పెడచెవినిబెట్టి పరుషంగా రావణుడు పలుకగా తన అనుచరులైన నలువురు రాక్షసులతో ఆకాశానికి ఎగసి అచటి నుండి శ్రీమంతుడగు విభీషణుడు జ్యేష్ఠసోదరుడగు రావణునితో ఇట్లు పలికాడు.

**గో.వి.**ఇచట మూలంలో శ్రీమంతుడగు విభీషణుడని ఉంది. శ్రీరామశరణాగతి సందర్భంలో 'పరిత్యక్తా మయా లంకా మిత్రాణి చ ధనాని చ' నేను లంకను, మిత్రులను, ధనాలను వదలితినని చెప్పబోవు విభీషణుడు శ్రీమంతుడు ఎట్లు కాగలడు? అను శంకకు సమాధానం. దుష్టరావణుని త్యజించుట, రామాభిముఖ్యములే ఇచట 'శ్రీః' సంపత్తిగా చెప్పబడినాయి.

రాజా! నీవు నాకు అన్నవగుట వలన నీకు తగిన సమాధానం చెపుతున్నాను. నీవు అనదలచిన మాటల నన్నిటిని అను. 'అయితే ఊరకుండక ఆకాశానికి ఎగసి ఎందుకు మాట్లాడుతున్నా' వందువేమో! నీవు పితృసముడవగు జ్యేష్ఠుడవు. పూజ్యుడవు. కాని ధర్మము తప్పినవాడవు. అందువలన నీ ఈ పరుషములు, అనృతములునగు మాటలను క్షమించలేను. నీ హితం కోరి నీతియుక్తములైన మాటలు చెప్పాను. మృత్యువుకు వశులగువారు మంచిని వినరు కదా? రాజా! ప్రియంగా మాట్లాడువారు, వినువారు, ఎక్కడైనా దొరకుతారు. అప్రియముగా ఉండి హితం కలిగించే మాటలు మాట్లాడువాడు వినువాడుగూడ అరుదు. కాని మృత్యుపాశబద్ధుడవైన నిన్ను చూచి ఊరకుండలేక హితం పలికాను. మండుచున్న ఇంటిని చూస్తున్నవాడు ఎవడూ ఊరకుండలేడుకదా? రామబాణనిహతుడవైన నిన్నుచూడలేను. బలవంతులు, శస్త్రాస్త్రవేత్తలు అగు రాక్షసులు యుద్ధంలో మృత్యుగ్రస్తులై ఇసుక కట్టవలె నశిస్తున్నారు. నీమీద గౌరవంవలన నీమంచిని కోరి నేను యుద్ధం వలదన్నాను. నామాటలు నీకు రుచించలేదు. మరణం సన్నిహితంగా ఉన్నవారు స్నేహితులు చెప్పిన మంచిమాటలను స్వీకరింపరు కదా?

**మ.వి.** 'పరీతకాలా హి గతాయుషః' అనే మూలానికి పై అర్థమేకాక 'చుట్టుకొనబడిన సర్పముచే ఆయుష్యం నశించినవారు' అనే అర్థాంతరం కూడా చెప్పారు.

## పదిహేడవ సర్గము

"ఇత్యుక్త్వా పరుషం వాక్యం రావణం రావణానుజః, ఆజగామ ముహూర్తేన యత్ర రామస్సలక్ష్మణః"(17.1)

**గో.వి.**'అనుకూలసంకల్పం' 'ప్రతికూలవర్జనం' 'రక్షింపగలడను విశ్వాసం' 'అట్టివానిని వరించుట' 'ఆత్మనిక్షేపం' (తనను సమర్పించుకొనుట) 'కార్పణ్యం' (దైన్యము) అనే ఈ ఆరు శరణాగతికంగాలు. ఇవన్నీ విభీషణునిలో ఉన్నాయి. ఇందు రామానుకూలసంకల్పం, రావణవిసర్జనం, మరలమరల ఉపదేశించుటవలన మహావిశ్వాసం, ఇతఃపూర్వమే చెప్పబడినాయి. ఇపుడు 'కార్పణ్య' రూపశరణాగత్యంగం ప్రదర్శింపబడుతున్నది. ఇత్యుక్త్వా రావణునితో సీతనిమ్మని, అలా చేస్తే అందరం క్షేమంగా ఉంటామని, సీతాప్రదానం చేయనిచో అందరం నాశనం అవుతామని, అనేకపర్యాయాలు చెప్పినప్పటికి అవి దంపతులకు సుఖంగా ఉండే మలయమారుతం విరహిణియైన స్త్రీకి దుఃఖం కలిగించునట్లు విభీషణోక్తవచనాలు హితములయినప్పటికి రావణునికి పరుషాలుగా ఉన్నాయి. కష్టకాలంలో సోదరుని విడచినాడనే అపయశస్సును పొందకుండా ఉండటానికి అంతవరకు రావణునికి చెప్పినాడు. లోకాలను ఏడ్పించేవాడని రావణశబ్దార్థం. అట్టి రావణునికి హితవాక్యాలు పరుషాలుగా ఉన్నాయి. "రావణానుజుడు" అయినా సత్త్వప్రధానుడు కాబట్టి చెప్పతగిన మంచిమాటలు చెప్పినాడని వాల్మీకి విభీషణుని ప్రశంసించుట ధ్వనిస్తున్నది. జ్యేష్ఠుడు పితృసమానుడు కదా?అట్టివానికి తమ్ముడు ఉపదేశించుటలో ఔచిత్యం ఉందా? అనే శంకకు సమాధానం 'అజ్ఞం హి బాలమిత్యాహుః, పితేత్యేవ చ మంత్రదం' అజ్ఞానిని బాలుడుగా, జ్ఞానిని తండ్రిగాను చెపుతారు కాబట్టి అజ్ఞానియైన రావణునికి విభీషణుడు ఉపదేశించవలసి వచ్చింది. విభీషణుడు రాముని వద్దకు వచ్చాడు. ఇందులోని స్వారస్యమేమంటే రావణునితో సంబంధం వదులుకొని శ్రీరాముని నివాస స్థానమే తనకు స్వస్థానంగా భావించి వచ్చాడు. అంతేగాని రామునివద్దకు వెళ్ళెను అని వాల్మీకి పదప్రయోగం

చేయలేదు. ముహూర్తేన ఆక్షణమందే విష్ణుస్మరణంలో విముఖులైన జనులున్నచోట నివసించడంకంటె అగ్నిజ్వాలల మధ్యలో నివసించడం శ్రేష్ఠం అన్నట్లు నిప్పులున్నదోవలో కాలిడిన వానివలె రావణగృహాన్ని విసర్జించాడు. ఇక రామాభిముఖ్యమెట్లున్నదన కట్టిన పలుపుత్రాడు విప్పిన వెంటనే తల్లివద్దకు పరువెత్తుకొనువచ్చే దూడ తల్లిని తప్ప మధ్యనున్న ఏవస్తువునూ గమనించని విధంగా వేగంగా వచ్చాడు. 'యత్ర రామః' ఎక్కడ రాముడుండెనో, 'రామాపేక్షయా' రామనివాసస్థప్రాశస్త్యం ఇక్కడ సూచితం. 'సలక్ష్మణః' లక్ష్మణసహితుడైన రాముని ఒద్దకు వచ్చెననుటవల్ల పురుషకారసాన్నిధ్యం సూచితం. ఈ శ్లోకంలో భగవద్విముఖులు ఉండే దేశం విడువదగినదని, భగవత్సంబంధిదేశం పొందదగినదని చెప్పబడింది. ఒక శంక. విభీషణుడు 'ధర్మాత్ముడు' గా బ్రహ్మాదిదేవతలచే పొగడబడినాడు. అట్టివాడు బాల్యంనుండి తనకు పోషకుడు, పితృసముడు అయిన రావణుడు శత్రుబాధ పొందబోవు చుండగా అతనిని ఎట్లు వదలినాడు? వదలినా అతని శత్రువును ఎలా ఆశ్రయించినాడు? ఆశ్రయించినా రాజ్యాభిలాషను ఎట్లు పొందినాడు? అట్టి అభిలాష ఉన్నప్పటికి రావణవధోపాయాలను చెప్పవచ్చునా? ఇది ఏమి ధర్మం? అని. కొందరిట్లు సమాధానం చెపుతున్నారు – రావణుడు మహాదోషదూషితుడు. కావున

**గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః ।**
**ఉత్పథం ప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే ॥**

దుర్మార్గగామియైన గురువునయినా వదలమనే ధార్మికసూక్తిననుసరించి అలా త్యజించాడని. సిద్ధాంతమే మనగా–తపశ్శాలి, సాత్వికుడు అయిన విభీషణుడు శ్రీరాముని దుష్టసంహరణార్థం అవతరించిన సాక్షాన్మహావిష్ణువు గాను, సర్వప్రాప్య పరబ్రహ్మగాను గుర్తించాడు. విభీషణుడేకాదు. మండోదర్యాదులుకూడా రాముని పరమేశ్వరునిగానే గుర్తించారు. సామాన్యవిశేషధర్మాలను గమనించాడు. పెద్దన్ననుసరించుట సామాన్య ధర్మం. ఈ ధర్మాచరణవల్ల చిత్తశుద్ధి కలిగి తద్ద్వారా మోక్షం ప్రాప్తిస్తుంది. యజ్ఞపురుషుడైన మహావిష్ణుని అవతారమగు శ్రీరాముని ఆశ్రయించుట, ఆరాధించుట, అందరికి లభించేవి కావు. కాన విశేషధర్మం సామాన్య విశేషధర్మాలకు విరోధంలేనపుడు రెంటిని ఆచరింపవచ్చు. విరోధం వచ్చిన ఇట్టిస్థితిలో సామాన్యధర్మాన్ని వదలి విశేషధర్మాన్నే స్వీకరించాలి. కావుననే ఇంతకాలం రావణసన్నిధివీడకుండా అతనికనేక పర్యాయాలు హితోపదేశం చేశాడు.

ప్రయోజనం లేకపోయింది. అన్నను త్యజించాడు. సామాన్యధర్మాన్ని వదిలాడు. విశేషధర్మాన్ని స్వీకరించాడు. రామాశ్రయణం చేశాడు. కనుక 'కృతఘ్నుడ' నే శంక లేదు. మరియూ విభీషణునికి ఎపుడూ రాజ్యకాంక్ష లేదు. శరణాగతిసమయంలో 'పుత్రులను, భార్యను, వదలి నిన్ను శరణుపొందుతున్నాను' అన్నాడు. ఇక నాకు అన్నీ నీవే అన్నాడు. కాని శ్రీరాముడు రావణుని సంహరించి 'రాజానం త్వాం కరిష్యామి' నిన్ను రాజును చేస్తానన్నాడు. విభీషణునకట్టికోరిక లేకున్నా రామాజ్ఞను అంగీకరించాడు.

**ఆయురారోగ్యమర్థాంశ్చ భోగాంశ్చైవానుషంగికాన్ ।**
**దదాతి ధ్యాయతాం నిత్యమపవర్గప్రదో హరిః ॥**

అన్నట్లు మోక్షప్రదుడైన శ్రీహరి అవాంతరఫలాలుగా ఐశ్వర్యాదులను ప్రసాదించడం సహజమేకదా? హనుమంతుడు శ్రీరాముడు ధర్మాత్ముడు కాన భక్తిభావంతో వచ్చినాడని యథార్థం వాక్రుచ్చిన రాజనీతిని మాత్రమే

విశ్వసించే సుగ్రీవుడు నమ్మదనుభావంతో రాజ్యకాంక్షిగ వచ్చినాడని చెప్పబోతున్నాడు. అయినచో రామాంజనేయ విభీషణ వాక్యాలకు విరోధం ఏర్పడుతుంది. అనినచో 'అంతరంగ' బహిరంగాలలో అంతరంగం ప్రబలంకావున విభీషణ వాక్యమే ప్రబలం. అందువలననే 'నిన్ను రాజును చేతు' నని రాముడన్నపుడు విభీషణుడు సమాధానం చెప్పకుండుటేగాక నాకు ప్రాణాలున్నంతవరకు యుద్ధంలో నీకు సహాయము చేస్తానని మాత్రమే వచించాడు. కాని రాజ్యస్వీకార విషయకాభిముఖ్యాన్ని ప్రదర్శించలేదు. విభీషణుని అనుమతిలేకుండగనే 'ధర్మంగా రాజ్యపాలనచెయ్యి. నా శాసనమిది. ఎదురు సమాధానముచెప్పవద్దు' అనే శ్రీరామవాక్యం ఉత్తరకాండలో కనుపిస్తున్నది. రాజ్యాసక్తిలేని విభీషణునికి కులధనంగా "శ్రీరంగనాథుని"శ్రీరాముడివ్వడం జరిగింది. ధర్మసంస్థాపనకొరకు అవతరించిన శ్రీరాముడు పరిశిష్టరాక్షసుల సన్మార్గాలుగా జేయడానికి ఇతనిని రాజుగా ఉండడానికి అంగీకరింపజేశాడు. ఈ రాజ్యపాలనగూడ భగవదాజ్ఞాపరిపాలనారూపమైన కైంకర్యమే అవుతుంది. ఇట్లే లక్ష్మణుడుగూడ దశరథుని పరిత్యజించి "భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవ" అని ఉపాధిసంబంధాన్ని వదలుకొని అందరికి ఆశ్రయభూతుడైన శ్రీరాముని ఆత్మబంధువుగా భావించి 'నీకు పరిచర్యచేస్తా'నని శ్రీరాముని శరణుపొందాడు. రక్తసంబంధాన్ని వదలుకొని ఆత్మబంధువైన రాముని ఆశ్రయించాడు. అందుచేతనే రావణపరిత్యాగసమయంలో "శ్రీమాన్" అని వాల్మీకిచే స్తుతింపబడినాడు. కాన విభీషణునియందు ధర్మలేశం కూడా లేదు. మరొకశంక ఉంది. రామలక్ష్మణులు ఇంద్రజిత్తుచే నాగపాశబద్ధులయిన సందర్భంలో నామనోరథములన్నీ భగ్నములయ్యాయి ఇత్యాదిగా విభీషణుడు విలపించడం, సుగ్రీవుడు 'రాజ్యం పొందగలవ'ని అనునయించడం ఏమిటి? అంటె అది విభీషణుని హృదయం తెలియని సుగ్రీవుని సాంత్వన వాక్యాలు. కావున విరోధం లేదు.

రావణసభనుండి ఆకాశానికి ఎగసినసమయంలోనే సుగ్రీవాదులు విభీషణుని చూశారు. అతడు దావాగ్ని చుట్టుముట్టగా ఎట్లో తప్పించుకుని నీటిలో మునగడానికి త్వరగా వస్తున్నవానివలె కనిపించాడు. ఉన్నతంగా బలిష్టంగా ఉండి స్వర్ణాద్యాభరణాలను ధరించిన విభీషణుడు మేరుపర్వతశిఖరంవలె ఉన్నాడు. ప్రతిపక్షరావణ పరిత్యాగంచేసి స్వపక్షం చేరవలసినవాడు కావున మేరుశిఖరంవలె స్థిరంగా ఉన్నాడు. ఇచట మెరుపువలె అను విశేషణం ఉంది. తేజస్వీ, ఆభరణభూషితుడూ కావడంవలన అట్లుండుటే కాక వానరులు నన్ను చేర్చుకుందురో లేదో? నన్ను స్వీకరింపనిచో నాగతి ఏమగునో? అనే ఆందోళనతో వణుకుకలిగి ఆకాశగతుడగుటచే 'మెరుపు'వలె భాసించాడు. ఆకాశగతుని భూమిపై గల వానరులు చూచారు.

అనల, శరభ, సంపాతి, ప్రఘస నామధారులైన నలువురు మంత్రులతో సర్వాయుధధారియైన విభీషణుడు లంకానగరమునుండి రావడం చూచిన సుగ్రీవుడు ఇతడు శత్రువా? చారుడా? అనే విషయాన్ని వానరముఖ్యులతో మంతనం చేశాడు. విభీషణుని ముఖప్రసన్నతను గమనించి నిర్దుష్టుడని గ్రహించిగూడ శ్రీరామునిమీదగల అత్యంతప్రేమవల్ల విభీషణుని విషయాన్ని సందేహించాడు.

**మ.వి.** విభీషణుడు ఎత్తుగా, బలిష్ఠుడుగా ఉండటంచే 'మేరుశిఖరసాదృశ్యం' ఆకాశాన పరిభ్రమించుటవలన మేరుతో సాదృశ్యం చెప్పబడినాయి. హనుమదాదులతో సుగ్రీవుడిట్లన్నాడు. సర్వాయుధాలను ధరించి నలువురు రాక్షసులతో వచ్చు ఇతడు మనలను సంహరించడానికి వస్తున్నాడు. సంశయం అక్కరలేదు.

**వ్యా.వి.** యథార్థంగా విభీషణుని వద్ద ఒక్కగదమాత్రమే ఉంది. సుగ్రీవుడు 'సమస్తాయుధాలు ధరించి వస్తున్నాడు. విభీషణుడు శ్రీరామునికి ఎవరివలన అపకారం సంభవించునో అనే ఆందోళనకల సుగ్రీవుడు అనేకాయుధాలున్నవాడుగా ఊహించాడు. కాక గదాయుధం ధరించే చాకచక్యం గమనించి సర్వాయుధ ప్రయోగ నిపుణుడీతడని గుర్తించి అట్లని ఉండవచ్చు. సుగ్రీవుని మాటలు విన్న వానరులు మద్దిచెట్లను, కొండశిఖరాలను పెకలించి ధరించి ఇట్లన్నారు. 'దురాత్ములైన వీరిని చంపడానికి అనుజ్ఞ ఇవ్వు. అల్పబలులైన వీరు చచ్చి క్రిందబడతారు'

**వ్యా.వి.** వానరులు ఇలా అడగడం ఎందులకు? అడుగకుండగనే చంపవచ్చునుకదా? అంటే రాజాజ్ఞాను సారమే తాము స్వతంత్రులం కామని సూచించుటకట్లన్నారు.

**గో.వి.** వానరులు ఇలా పలికితే పలుకుదురుకాక. సర్వజ్ఞుడు, పరమకారుణికుడు, సర్వలోకశరణ్యుడు అగు శ్రీరాముడు నన్ను తప్పక రక్షింపగలడు' అను మహావిశ్వాసం ఉన్న విభీషణుడు ఆయుధధారులైన వానరులను సరకుగొనక సముద్రోత్తరతీరంలో ఆకాశంలో నిర్భయుడై ఉన్నాడు. వెంటనే శరణాగతి పొందలేదు. ఎంతటి కృపాళువగు రాజునయినా ఆంతరంగికులద్వారా ఆశ్రయించాలని తెలిసినవాడు కావున 'మహాప్రాజ్ఞః' అని చెప్పబడినాడు. వానరులు నాభావం తెలియక రావణసంబంధిని కావడంచేత నన్నన్యథా భావిస్తున్నారు. ఇది రామభక్తిప్రేరితమేకాని నామీద ద్వేషంతో కాదు. ఇదికూడా వారికి గుణమేకదా? ఇట్టి సుగ్రీవాదులు నన్ను విశ్వసింపకుంటే రామాశ్రయణప్రయోజనం ఏముంటుంది? కాన వీరిద్వారా రామలక్ష్మణులను ఆశ్రయించడం యుక్తమని తలచి సుగ్రీవుని, వానరులను, ఉద్దేశించి పరేంగితజ్ఞుడైన విభీషణుడు రామునికి పురుషకారభూతులగు వానరులకు, సర్వులకు వినుపించే విధంగా బిగ్గరగా ఇలా పలుకుతున్నాడు.

రావణుడు లోకములను ఏడ్పించేవాడు. లోకకంటకుడు. దుష్టప్రవృత్తికలిగిన దుర్మార్గులైన రాక్షసులకు ప్రభువు. నేనాతనికి సోదరుడను. నాపేరు విభీషణుడు. ఆ రావణుడు జటాయువును సంహరించి వివశ అయిన సీతాదేవిని అపహరించి దీనురాలగు నామెను రాక్షసస్త్రీలకట్టడిలో నిర్బంధించాడు. తత్సంబంధంతో నాకుకూడా ఆ దోషం సంభవించింది. అపుడు నేను అనేకహేతువులను చూపి 'సీతను రామునికి అర్పింపవలసిందిగా అనేకపర్యాయాలు బోధించాను.

**మ.వి.** "రావణో నామ దుర్వృత్తః" (17-10)మొదలు "విభీషణముపస్థితం" వరకు కల ఈ ప్రకరణంలో ఆరంగాలుకల శరణాగతి ప్రదర్శింపబడుతున్నది. ప్రథమశ్లోకంలో స్వీయ (రావణునిసోదరుడగుట, రాక్షసుడగుట మొదలగు) దోషాలను చెప్పుకొనుటద్వారా స్వీయగర్వహానిరూప "కార్పణ్య" మనే శరణాగత్యంగం చెప్పబడినది. 'సీతను రామునకిమ్ము' అనుటవలన ఆనుకూల్యరసంకల్పరూప శరణాగత్యంగం చూపబడింది.

చావబోవువాడు ఔషధాన్ని నిరాకరించినట్లు నేను చెప్పిన హితవాక్యాలను రావణుడు స్వీకరించలేదు. రావణుడు పరుషవాక్యాలతో నన్ను సేవకుని అవమానించాడు. "త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః" పుత్రులను, భార్యను వదలుకొని శ్రీరాముని శరణుపొందుతున్నాడు. మ.వి. లంకను వదలుకొని వచ్చుటతో ప్రాతికూల్యస్య వర్జనం అను శరణాగత్యంగం 'శరణం గతః' శరణుపొందుచున్నాననుటద్వారా 'ఆత్మనిక్షేప' రూప శరణాగత్యంగం చూపబడినాయి.

**సర్వలోకశరణ్యాయ రాఘవాయ మహాత్మనే ।**

**నివేదయత మాం క్షిప్రం విభీషణముపస్థితమ్ ॥**

**గో.వి.** ఈవిధంగా శరణ్యుడగు రామునికి కూడా వినుపించేటట్లు విజ్ఞాపనచేసి ఆంతరంగికులు, పురుషకారభూతులు అయిన వానరులను ఈవిధంగా ప్రార్థిస్తున్నాడు. "సర్వలోకశరణ్యాయ" శరణుకోరువ్యక్తి కుల విద్యావర్తనాలను వేటినీ గమనించక కోరిన ప్రతివారికి అభయప్రదానం ఇచ్చే రాముడు మహాపరాధియైన రావణునకు గూడ శరణ్యుడే. ఆతని బంధువులకు శరణ్యుడగుటలో సందేహమేముంది. నీవాడను అనిన ప్రతివానిని రక్షించువాడు. మట్టిపెడ్డలు సులభములయినప్పటికి, మేరుపర్వతం మహోన్నతమయినప్పటికి వాటినెవరూ ఆశ్రయించరు. సాక్షాత్‌బ్రహ్మ వస్తువే. మానవులకు, జంతువులకు, కంటికి కనిపిస్తున్న 'మానవరూపం ధరించిన' మహాత్ముడగు రాఘవునికి "నివేదయత మాం క్షిప్రం విభీషణముపస్థితం" విభీషణుడు వచ్చినట్లు వేగంగా తెలపండి అన్నాడు. ప్రత్యక్షంగా కనుపిస్తూ ఉండగా తాను వచ్చినట్లు తెలుపుటలో ప్రయోజనం లేదు. ఏమని తెలపాలి? నాయొక్క నిరపరాధిత్వాన్ని, నా ఇహపరలోకఫలభోగవైరాగ్యాన్ని, శరణాగతిని, శ్రీరామకైంకర్యాభిలాషను తెలపండి అని భావం. "క్షిప్రం" త్వరగా తెలపండి. శరణ్యుడగు శ్రీరాముడే స్వయంగా నన్ను పరిగ్రహింపకముందే మిత్రులైన మీరు నావిషయాలు దెలపడం భావ్యం. "విభీషణం" రావణునివలె నేను మీకు ప్రతికూలుడనుకాను. 'విభీషణస్తు ధర్మాత్మా' అని కీర్తింపబడినవాడను."ఉపస్థితం" సమీపమందున్నవాడను.

**మ.వి.** "సర్వలోకశరణ్యాయ" వీరు పనికొస్తారు – వీరు పనికిరారు అనే తేడా లేకుండా దేవతలు, మనుష్యులు, రాక్షసులు, జంతువులు, అందరికీ ఆశ్రయింపదగినవాడు. "రాఘవాయ" యాచకుల కోరికలను సంపూర్ణంగా తీర్చు రఘువంశంలో పుట్టినవాడు. ఇందువల్ల కోరికలు కలవారు ఎపుడాశ్రయించినా వారు సంపూర్ణ మనోరథులగుదురని సూచింపబడింది."మహాత్మనే" పరమాత్మస్వరూపునికి సర్వవిధబంధువుగా ఆశ్రయించిన నేను వచ్చానని వేగంగా చెప్పండి. బాగుగా దప్పిగొన్నవాడు పరిమిళితజలయుక్తసరస్సునుచూచి నీళ్లు త్రాగడంలో ఆలస్యం సహించలేనట్లు ఆలస్యాన్ని సహించకపోవడం సూచించబడింది. నేను వచ్చినట్లు చెప్పండి. మీకు (వానరులకు) ఏమీ శ్రమలేకుండానే పుణ్యం రాగలదు. 'వాచా ధర్మమవాప్నుహి' సర్వలోకశరణ్యుడనుట వల్ల 'గోప్తృత్వవరణరూప' శరణాగత్యంగం ప్రదర్శింపబడింది. (అనగా రక్షకుని ఎన్నుకొనుట) 'విభీషణముపస్థితం' సమీపమందున్నవానినిగా నన్ను నివేదించండి. అనుకూలురమగు మమ్ము రక్షింపగలడను విశ్వాసం వ్యక్తమవు తున్నది. ఇందువల్ల 'విశ్వాసరూప' శరణాగత్యంగం ప్రదర్శించబడింది. ఇక్కడ ఒకప్రశ్న. రాముడే సాక్షాన్నారాయణుడనే విషయం విభీషణునకెట్లు తెలుసు? విభీషణుడు తపస్సు చేసి బ్రహ్మను ప్రసన్నం చేసుకొన్నపుడు 'వరం కోరుకొమ్మ'ని బ్రహ్మ అంగీకరించి 'నీవు ధర్మిష్ఠుడవగుదువు' అన్నాడు (ఉత్తరకాండ.10సర్గ). కావున తద్వరప్రభావంతో జగద్రక్షణార్థం నారాయణుడే శ్రీరాముడుగా అవతరించెనని విభీషణుడు గుర్తింపగలిగాడు.

విభీషణుని మాటలను విన్న సుగ్రీవుడు 'అతిస్నేహః పాపశంకీ' అను న్యాయానుసారం సర్వశక్తిమంతుడు రాముడనే విషయం విస్మరించి శరణాగతవత్సలుడైన రాముడు ఈ విభీషణుని మాటలను విశ్వసించి ఇతనిని స్వీకరిస్తాడు. స్వభావక్రూరుడైన ఇతనివల్ల పిదప రామునకి అపాయం సంభవించును అనే సందేహంతో రామునితో ఇట్లంటున్నాడు.

రావణుని తమ్ముడగు విభీషణుడు నలువురు అనుచరులతో నిన్ను శరణుపొందవచ్చినాడు. అన్నివిషయాలలో జాగరూకుడవై ఉండు. అదృశ్యచారులు, కపటోపాయాలుకల ఈ రాక్షసుల విషయంలో విశ్వాసముంచవద్దు. ఇతడు రావణుని చారుడు కావచ్చు. మనలో ప్రవేశించి మనకు మిత్రభేదం పెట్టగలడు. లేక నమ్మకం పొందిన పిదప ఈతడే సందు చూచుకుని మనలను ప్రహరింపవచ్చు.'శత్రువులనుండి వచ్చినవానిని స్వీకరించిన శత్రుబలక్షయం, మనకు బలం పెరుగుట సంభవించును కదా? అని అందువేమో! మిత్రసంబంధిబలం, ఆటవికసైనిక బలం, మూలసైనికబలం, తాత్కాలికవేతనసైన్యబలం. వీటిలో దేనినయినా స్వీకరించవచ్చు. కాని శత్రుబలాన్ని స్వీకరించకూడదు. శత్రువగు రావణునిసోదరుడు శత్రుపక్షంనుండి వచ్చినాడు. ఎలా విశ్వసింపగలం? శరణాగతుని ఎట్లు విడుతు' నందువేమో! రావణచారునిగా ఇతనిని గుర్తించు. ఇతని శరణాగతి మోసపూరితం. ఇతనిని నిగ్రహించాలి. రావణప్రేరితుడై వక్రబుద్ధికల ఈ రాక్షసుడు మనలను నమ్మించి అంతర్ధానగతుడై మనలను ప్రహరింపగలడు. మేధావియైన శత్రువు ఎవరికీ దెలియకుండా పరసైన్యంలో ప్రవేశించి ఛిద్రమరసి శత్రుసంహారం చేస్తాడు. అనుచరసహితుడైన ఇతనిని తీవ్రదండనద్వారా వధించాలి. ఇలా పలికి సుగ్రీవుడు మౌనంగా ఉండినాడు. పిమ్మట హనుమదాదులతో రాముడిట్లు పలికాడు.

'కపిరాజగు సుగ్రీవుడు రావణసోదరుని గురించి చెప్పిన యుక్తియుక్తమైన, ప్రయోజనకరమైన వాక్యాలను మీరుకూడా విన్నారు కదా? ఒక మిత్రుడు ఉపదేశించిన పిదప మిగిలిన మిత్రులు ఊరకుండనక్కరలేదు. కార్యసంకటస్థితిలో బుద్ధిమంతుడు, సమర్థుడు అయిన మిత్రుడెవడయినా ఉపదేశించుట భావ్యం. అందువలన మీ మీ అభిప్రాయాలను తెలపండి.' ఈవిధంగా శ్రీరాముడు అడిగాడు. వినయంతో కూడిన వానరులు రామహితాన్ని కోరుతూ ఇట్లన్నారు.

రామా! ఈ ముల్లోకాలలో నీకు తెలియని విషయంలేదు. రాముడు వానరులకు మిత్రుడను కీర్తిని లోకంలో కలిగించడానికి మమ్మిట్లు ప్రశ్నిస్తున్నావు. 'పూజయన్' అనే పాఠాంతరానికి మమ్ములను అభినందించుటకు ఇట్లడుగుతున్నావు లేక మేము చెప్పబోయే విషయాలు ఖండింపతగినవిగా ఉంటాయి. కావున నీ మాటే సిద్ధాంతీకరింపబడుతుంది. అపుడు నీప్రభావాన్ని ప్రకటించుకోవడానికి నిన్ను నీవు పూజించుకోవడానికి ప్రశ్నిస్తున్నావు. నీవు సత్యవ్రతుడవు. శరణాగతరక్షణమనే వ్రతం కలవాడవు. కాబట్టి అపరాధులైన రావణాదుల విషయంలో కూడా వ్రతధర్మాన్ని వదలేవాడవు కావు. సర్వజ్ఞుడవైనప్పటికి మంచిహేతువులతో విచారించి ఆచరించేవాడవు. మిత్రులకధీనమైన మనస్సు కలవాడవు. సమర్థులు, బుద్ధిమంతులు అగు మంత్రులు యుక్తియుక్తంగా ఎవరి ఆలోచనలు వారలు చెపుతారు. ఈవిధంగా శ్రీరామునికి వానరులు చెప్పిన పిదప యువరాజైన అంగదుడు విభీషణపరీక్షా ప్రయోజకమగు మాటలు పలికాడు.

'ఇతడు శరణాగతుడయినప్పటికీ శత్రువువద్దనుండి రావడంచేత అనుకూలుడు కాడు. అందువల్ల పరీక్షించకుండా విశ్వసింప వీలుకాదు. యథార్థంగా మనసులోని భావాన్ని బయటపెట్టని వక్రబుద్ధికలవారు రంధ్రాన్వేషులై మనల ప్రహరిస్తారు. మహానర్థం సంభవిస్తుంది. కాబట్టి ఏదో ఒకపనిని ఇతనికి అప్పగించి ఇతని గుణదోషాలను పరిశీలించి గుణాలు అధికంగా కనిపిస్తే స్వీకరిద్దాం. దోషాలు అధికంగా ఉంటే పరిత్యజిద్దాం'

ఏదో ఒక పనిని అప్పగించకుండా గుణదోషాలు తెలియవు. త్వరపడి పనినప్పగిస్తే ఆతడు దుష్టుడయితే మంత్రభంగం అవుతుందనే భావంతో అంగదాభిప్రాయానికి భిన్నంగా శరభుడిట్లంటున్నాడు. 'వెంటనే ఈవిభీషణుని వద్దకు చారుని పంపుదాము. సూక్ష్మబుద్ధియైన చారుడు విచారించి వచ్చిన పిదప అనుకూలుడయితే పరిగ్రహిద్దాం.'

జాంబవంతుడు శాస్త్రదృష్టితో ఆలోచించి నిరపాయమైన ఈమాట అన్నాడు – బద్ధవైరం కలిగిన పాపిష్టుడైన రావణునివద్ద నుండి ఈవిభీషణుడు వచ్చాడు. ఇతడిపుడు రాతగిన దేశమూకాదు. సమయమూకాదు. (అన్నగారు సంకటస్థితిలో ఉన్నపుడు రావటం ఉచితమా?) సర్వథా శంకింపతగినవాడు కావున స్వీకరించవద్దు.

శంకింపవీలున్నప్పటికీ నిజంగా మంచివాడయితే శరణాగతుని విడవడమేకాక ఆతడివల్ల కలుగబోయే ఉపకారాలు కూడా లేకుండా పోతాయనే భావంతో మైందుడు ఇలా అన్నాడు. మధురంగా, మృదువుగా అజ్ఞాతపురుషులు రావణుని వృత్తాంతం విభీషణుని అడగాలి. అపుడతడి సమాధానవాక్యాల వల్ల దుష్టుడా! లేక అదుష్టుడా అనే విషయం గ్రహించవీలవుతుంది. తదనుగుణంగా నిర్ణయం తీసుకోవచ్చు.

ఇంతవరకు వక్తలలో సుగ్రీవుడు వధించాలని, అంగదాదులు పరీక్షించి స్వీకరించడమో, లేక పరిహరించడమో చేయుమని చెప్పారు. ఇక హనుమానుడు పూర్వోక్తాలైన వాదాలను ఖండిస్తూ దోషరహితుడైన విభీషణుని వెంటనే స్వీకరించాలని చెప్పబోతున్నాడు.

స్వామీ! బుద్ధిమంతుడవు, సమర్థుడవు, మహావక్తవు అగు నిన్ను మాటలలో బృహస్పతి గూడ మించలేడు. నా తర్కకౌశలాన్ని ప్రదర్శించటానికి కాని, ఇతరమంత్రుల యందలి స్పర్థవల్లగాని, నేను గొప్పవక్తనని, మేధావినని నిరూపించుకోవడానికి గాని, స్వేచ్ఛగా మాట్లాడదలచి కాని, లేక ఈ విభీషణుని విషయంలో పక్షపాతంవల్ల గాని నేను మాట్లాడడం లేదు. నీవు నాయందుంచిన గౌరవం వల్ల మాట్లాడుతున్నాను.

గుణదోషాలను పరీక్షించాలని అంగదుడు చెప్పినమాట ఉపపన్నంకాదు. ఏమన ఏపనిలోనయినా వినియోగింపనిదే గుణదోషాలు తెలియవు. అతని గుణాలు తెలిసినగాని గొప్పకార్యాలలో వినియోగించ వీలుకాదు కదా? అనగా పనిలో నియోగిస్తేకాని గుణదోషాలు తెలియవు. గుణదోషాలు తెలియనిది గొప్పపనులలో వినియోగింప వీలుండదు. కావున 'అన్యోన్యాశ్రయదోషం' పట్టింది. 'చారుని పంపవలె' నని శరభుడు అన్నమాట అసంగతం దూరంగా ఉన్న వానివద్దకు రహస్యంగా చారుని పంపి ఆతడి అభిప్రాయం గ్రహింపవచ్చును గాని సమీపంనుండి ఆకాశగతుడై మనలనందరిని చూస్తున్న వ్యక్తివద్దకు చారుని పంపడం ప్రయోజనకారి కాదు కద! ఇక తగనిచోటుకు తగని సమయంలో విభీషణుడు వచ్చినాడని జాంబవంతుడు అన్నాడు. ఈ సందర్భంలో నేను చెప్పతగిన విషయం ఒకటుంది. యథార్థంగా విభీషణుడు రాదగిన దేశకాలాలు ఇవే. ఉత్తముడవైన నిన్ను, అధముడైన రావణుని మనసులో విమర్శించుకుని, అట్లే ఉభయుల గుణదోషాలను ఆలోచించి, కబంధ, ఖరాదిరాక్షసులను, మహాపరాక్రమశాలియైన వాలిని వధించిన నీపరాక్రమం, సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేయడం, సముద్రమును దాట నుత్సహించడం మొదలైన నీగుణాలను తెలుసుకున్న ఆతని బుద్ధికి ఆతని ఆగమనం అనుగుణంగానే ఉంది. అపరిచిత స్వరూపస్వభావులగు పురుషులు వెళ్ళి విభీషణునితో మాట్లాడి పరీక్షించాలని మైందుడన్నాడు కద? కాని

మంచివాడయినప్పటికి పరిచయంలేనివాళ్లు ఏవిషయమయినా అడిగితే 'నన్ను అనుమానించి వీరిట్లడుగుతున్నారు. ఏమిమాట్లాడితే ఏమనర్థం సంభవించునో' అని సమాధానం చెప్పడానికి సందేహిస్తారు. అపుడు దోషరహితుడుగూడ ఇట్లు ప్రశ్నించడంవల్ల దుష్టుడుగా కనబడతాడు. ఎదుటివాని భావాన్ని వేగంగా గ్రహించడం ఎంతసమర్థునకయినా సాధ్యపడదు. కపటంగా అడుగబడినవాడు తన యథార్థాభిప్రాయాన్ని చెప్పడు. ఇలా హనుమానుడు అంగదాదుల అభిప్రాయాలలోని లోపాలను తెలిపి స్వీయాభిప్రాయాన్ని ప్రకటిస్తున్నాడు.

ఈ విభీషణుడు పరిగ్రహింపదగినవాడు. మాట్లాడుతున్న ఇతనిలో దుష్టభావం కనుపించడంలేదు. ఇతని ముఖం ప్రసన్నంగా ఉంది. కాన సంశయం అక్కరలేదు. దుష్టాభిప్రాయం కలిగి గూఢంగా అపకారం చేయతలచిన వాడు నిర్భయంగా రాలేడు. ఇతడు నిర్భయుడు. స్వస్థుడై వచ్చాడు. ఇతని వాక్కుగూడ తడబాటులేకుండా ఉంది. అందువల్ల సందేహం అనవసరం. ముఖంలోని భావాలు ఎంతదాచి పెట్టాలనుకున్నా దాగవు. హృదయగతమైన భావాలు ముఖంలో ప్రతిబింబితమవుతాయి. దేశకాలాలననుసరించి పురుషులయందు ప్రయోగింపబడిన కార్యం ప్రతిబంధరహితంగా వేగంగా ఫలిస్తుంది. ఈ విభీషణుడు రావణసంహారంకొరకు నీవు ప్రయత్నిస్తుండడం చూచి రావణుని దుష్టమార్గాన్ని గమనించి, వాలివధను, సుగ్రీవపట్టాభిషేకవిషయాలను విని, రాజ్యం కోరి బుద్ధి పూర్వకంగా ఇక్కడకు వచ్చాడు. నా శక్తికొలది విభీషణుడు దోషరహితుడని చెప్పాను. శేషించిన కర్తవ్యాకర్తవ్యాలకు నీవే సాక్షివి.

## పద్దెనిమిదవ సర్గము

సుగ్రీవవాక్యశ్రవణంతో కలుషితమైన మనస్సుకు హనుమద్వాక్యాలు కొంతప్రశాంతతను సమకూర్చగా సామాన్యవిశేషశాస్త్రవిషయాలు తెలిసిన శ్రీరాముడు తనభావాలను చెపుతున్నాడు. తాను చెప్పబోయే మాటలు తమకు వ్యతిరేకంగా ఉన్నాయని సుగ్రీవాదులు బాధపడతారేమోనని వారిని బుజ్జగిస్తూ రాముడిట్లంటున్నాడు.

'నాకుకూడా విభీషణుని గురించి కొన్నిమాటలు చెప్పాలని ఉంది. నాశ్రేయస్సుకోరే మీరు నేను చెప్పే హేతువులను వినండి. అంగదాదులు 'దుష్టుడు కానిచో పరిగ్రహింపవచ్చు'నన్నారు. అది నాకు సమ్మతం కాదు. 'దుష్టుడుకాడు కావున పరిగ్రహింపు'మని ఆంజనేయుడన్నాడు. పరిగ్రహించడం నాకిష్టమయినా దుష్టుడు కాకపోవుటను' కారణంగా చెప్పడం నాకసమ్మతం. 'రాఘవం శరణం గతః' "శరణ్యం శరణం గతః" శరణాగతుడనని విభీషణుడు అనడంవల్ల మాత్రమే నేనాతనిని పరిగ్రహించుటకు కారణం. ఆతని శరణాగతి సహజమైనదైనా, కపటమైనదైనా, అభినయమయినదైనా, నాదృష్టిలో ఒక్కటే. ఆతడు పరిగ్రాహ్యుడే.

**మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన ।**
**దోషో యద్యపి తస్య స్యాత్సతామేతదగర్హితమ్ ॥18-3॥**

శరణాగతునెట్లు విడిచిపెట్టగలను? సర్వశక్తియుక్తుడనైనప్పటికి శరణాగతశబ్దం విన్న తరువాత అతనిని విడచు శక్తి నాకు లేదు. ఒకవేళ కనుపించిన, కనుపించని అనేక అనర్థాలు సంభవించినప్పటికి, మిత్రులకు అసమ్మతమయినా, నాకు ప్రాణహాని జరిగినా శరణాగతుని విడువలేను. సుగ్రీవాదులు వచించిన దోషం అతనిలో యథార్థంగా లేవు. దోషాలు అధికంగా ఉన్నప్పటికీ శరణాగతులలో దుష్టుని పరిగ్రహించడం ఆ దుష్టుని

పరిగ్రహించడంకన్నా గొప్పకీర్తిని కలిగిస్తుంది. దుష్టశరణాగతపరిగ్రహణం చేయకూడదని శిష్టులెవరూ చెప్పలేదు. శాస్త్రాలలో దుష్టులను త్యజించాలని చెప్పినమాట శరణాగతులుకాని దుష్టులనుద్దేశించి మాత్రమే. అందువల్లనే అధికదోషయుక్తుడైనప్పటికీ శరణాగతుని రక్షించుటే కర్తవ్యం అనే విషయాన్ని "తస్మాదపి వధ్యం ప్రపన్నం న ప్రతి ప్రయచ్ఛంతి" (తై.సం. 6.5.8) వధింపబడవలసినవానినైనా శరణాగతుని తిరిగి ఇవ్వరాదు అని శ్రుతి చెపుతున్నది. "దోషో యద్యపి తస్య సాత్" యథార్థంగా ఇతనియందు దోషంలేదు. ఒకవేళ ఉండుగాక! ఉండినా అతని దోషం అతనిలోనే ఉండుగాక! మనలనేమి చేస్తుంది?

**గో.వి.** 'మిత్రభావేన సంప్రాప్తం' సంపూర్ణభక్తిలేకున్నా స్నేహభావంతో ఆభిముఖ్యంతో ద్వేషరహితుడుగా నున్నవానిని. అందువల్లనే సీతాదేవి రావణునితో "తేన మైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి"(సుందర. 21-21) నీవు జీవించాలనుకుంటే రామునితో మిత్రభావం (శరణాగతిని) పొందు అని చెప్పింది. 'మిత్రభావేన' నాకు (రామునకు) కల సౌహార్దాది గుణాలను పురస్కరించుకొని 'సంప్రాప్తం' వచ్చిన వానిని. నేను లంకకు వస్తున్న విషయం తెలిసి కూడా త్వరతో ఇక్కడికి వచ్చిన వానిని ఎలా విడువగలను? 'సంప్రాప్తం' దేవాలయానికి వెలుపల పాదరక్షలను ఉంచి స్వామికి వందనమాచరించునపుడు ఆ పాదరక్షలను గురించే ఆలోచించువాని గూర్చి చిత్తం దేవుని మీద-భక్తి చెప్పులమీద అనే నానుడి ఏర్పడింది. ఈ విభీషణుడట్టివాడు కాడు. 'సంప్రాప్తం' సమ్యక్ ప్రాప్తం. లంకను, మిత్రులను, ధనాదులను వదలుకొని వచ్చినవాడు. విరోధుల వదలి వచ్చినవాడు. 'సంప్రాప్తం' తల్లి, తండ్రి, సోదరుడు, నివాసం, ఇతడు లంకలో ఉంది. 'రాముని శరణు పొందుతున్నా' నన్నచో తద్రక్షణకు సైన్యసహితంగా నేను లంకకు వెళ్ళవలసి వచ్చేది. అట్లుకాక ఆతడే ఇక్కడికి రావడం 'కుంటివానిని గంగ స్వయంగా తడిపిన' విధంగా ఇతని ఈ రాక నాకు ప్రయోజనకారియే అని 'సంప్రాప్తం'. ప్రాప్తి వచ్చుట మాత్రమే నాకపేక్షితముకాని, కాయికవాచికమానసిక రూపమైన సంపూర్ణ శరణాగతి ఇక్కడ కనిపిస్తున్నది. కావున సంప్రాప్తమనడం జరిగింది. 'న త్యజేయం' విడవడానికి సమర్థుడను కాను. 'న త్యజేయం' రక్షింపమని నన్ను పిలిచేవారిని ప్రతీక్షించే నేను ఇచటికి వచ్చినవానిని ఎట్లు త్యజింతును?'కథంచన' ఎట్లు? (వదులుకుందును?) అరణ్యవాససమయంలో సీత రామునితో రాక్షసులతో నిష్కారణ విరోధం వలదనగా ఋషులకు రాక్షసబాధానివారణ చేస్తానని ప్రతిజ్ఞ చేశాను. ప్రతిజ్ఞాపాలన చేయడానికి అవసరమయితే నిన్ను (సీతను) లక్ష్మణుని, నాజీవితాన్నైనా వదలుకొందును. "అప్యహం జీవితం జహ్యాం" (అర. 10.19) అని అన్నాను. దూడలమీద ప్రేమగల గోవు సహజంగా చివరి సంతానవిషయంలో ప్రేమాధిక్యం కనపరస్తూ పెద్దదూడలను దూరంగా ఉంచేవిధంగా మిమ్ముల (వానరుల) నయినా దూరంగా నుంచుతాను కాని ఈ ఆశ్రితుని ఎట్లు విడువగలను? 'కథంచన'సర్వదేశ సర్వకాలములలో కూడా గూడ విడువను. 'దోషో యద్యపి తస్య స్యాత్' అతనికి దోషాలునున్నప్పటికి ఆశ్రిత దోషాలను కూడా సహించే వాత్సల్యస్వభావం ఉన్న నాకు ఇతడు స్వీకారార్హుడే. 'దోషో యద్యపి తస్య స్యాత్' శరణాగతునకు అసలు దోషాలేమిటి? ఛాందోగ్య శ్రుతి ఇలా చెపుతుంది. "తద్యథైషీకాతూలమగ్నౌప్రోతం ప్రద్రూయేత ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రముచ్యంతే" (ఛాం5.24.3) ముంజగడ్డి అగ్నికి ఎంత వేగంగా భస్మమవుతుందో అట్లే ఇతని (ముక్తుని) భూత భవిష్యత్పాప రాశి భస్మమవుతుంది అని శ్రుతి చెపుతుంది. కావున భగవత్సమాశ్రయణం వల్ల శరణాగతుని పాపాలన్నీ నశించాయి.

కాబట్టి ప్రస్తుతం దోషరహితుడేనని భావం 'దోషో యద్యపి తస్య స్యాత్' ఇతనికి కల శరణాగతిరూప మహాగుణ సంపత్తి ఉండగా ఇతరదోషం ఇతనిని త్యజించడానికి కారణం కాలేదు. 'దోషో.....స్యాత్' ఇతని యందు దోష గుణముందని అనుకొందాం. అపుడు దోషము గుణము–దోషి అది కల వ్యక్తి పరిత్యజింపవలసింది దోషమునే కాని దోషిని కాదు. అందువలన స్వీకారార్హుడే. 'దోషో యద్యపి' ఇతనికి నన్ను వధించాలని కోరిక ఉంటే 'తస్య స్యాత్' అతని కోరిక తీరుగాక. ఒక పావురం తనకు మారకుడగు కిరాతునికి ఆత్మసమర్పణ రూపమైన ఆతిథ్యమిచ్చింది కదా? (ఉత్తర గ్రంథమందీకపోతోపాఖ్యానం వివరింపబడుతుంది) దుష్టుని స్వీకరించడం మంత్రులకు ఇష్టం కాదు కదా? అనినచో 'సతామేతదగర్హితం' దుష్టశరణాగతిని అంగీకరించడం సత్పురుషులచే నిషేధింపబడలేదు. నాయందు పక్షపాతం కలిగిన వానరవీరులు అనవసరంగా భయపడుతూ నన్ను నిందించినా పరమార్థదర్శులగు కపోతాదులు ఇట్టి దానిని అభినందించి ఆచరించారు కదా! దుష్టజనపరిగ్రహం పనికిరాదనే సామాన్య శాస్త్రాన్ని "తస్మాదపి వధ్యం ప్రపన్నం న ప్రతిప్రయచ్ఛంతి" అనే శ్రుతి ప్రతిపాదిత విషయం విశేషశాస్త్రం. కావున దుష్ట శరణాగతుని రక్షించడాన్ని శిష్టులు కాదనలేదు. మీదు మిక్కిలి శ్రేయస్కరం సర్వజ్ఞునికి కొంత అజ్ఞానాన్ని, (విభీషణుని విషయంలో) సర్వశక్తియుక్తునకు శరణాగతపరిత్యాగశక్తిరాహిత్యాన్ని, ఈ శ్లోకంలో చెప్పబడినాయి.

శ్రీరాముని మాటలు వినిన సుగ్రీవుడు తదర్థాలను విమర్శించి ఇది చాలా సాహసనిర్ణయమని తలచి భీతుడై తిరిగి నీతియుక్తంగా మాట్లాడాడు. 'ఈవిభీషణుడు దుష్టుడుకానీ' కాకపోనీ, ఇతడు కృతఘ్నుడు. ఇతనితో మనకేమి ప్రయోజనం? లంకదగ్ధమవడం, పుత్రాదులు సంహరింపబడడం మొదలగు సంకటాలు సోదరుడగు రావణునికి సంభవించిన ఈ దశలో సోదరుని త్యజించిన ఈ కృతఘ్నుడు ఎవరిని పరిత్యజింపడు? ఇట్టి వానినెవ్వడు స్వీకరించును?

సుగ్రీవుని మాటలు విని ధర్మరహస్యంగాని, నాశక్తిసామర్థ్యాలుగాని, గమనించక ఇతడిలా మాట్లాడుతున్నాడని తలచి చిరునగవుతో సుగ్రీవుని సాంత్వనపరచడానికి రాముడిట్లన్నాడు. 'శాస్త్రాధ్యయనం చేయనివాడు' వృద్ధసేవ చేయనివాడు, ఈ సుగ్రీవునివలె మాట్లాడలేడు. కాని ఈ విభీషణుడు ఇలా రావడంలో లోకసిద్ధమైన సమస్త రాజన్యులలో ఉన్న సూక్ష్మధర్మం నాకు స్ఫురిస్తున్నది. జ్ఞాతులు, సరిహద్దుల వెంట ఉండే రాజులు, చిక్కులు కలిగినపుడు బాధకులై శత్రువులవుతారు. కాని ధర్మాత్ములగు రాజులు మాత్రం జ్ఞాతులను మన్నిస్తూ ఉంటారు. సంకటసమయంలో వారుగూడ ప్రజ్ఞాశౌర్యశాలి అయిన జ్ఞాతిని శంకిస్తారు. ఇక దుర్మార్గుడగు రావణుడు జ్ఞాతిని అవమానించునని చెప్పవలెనా! అందువల్ల శంకించిన రావణుని వ్యతిరేకించి ఈ విభీషణుడు వచ్చాడు. అని ఇంత వరకు రావణపరిత్యాగవిషయంతో కారణాలను చెప్పి తాను విడువకపోవడానికి కారణాలను రాముడు వివరిస్తున్నాడు.

సుగ్రీవా! శత్రు సంబంధి కావున విభీషణుడు పరిగ్రహింపతగడని నీవన్న దానికి శాస్త్రీయమైన సమాధానం విను. మనం రాక్షసకులజులం, సరిహద్దురాజులం కాము. కాన రాజ్యార్హులం కాము. ఆ రాజ్యవిషయంలో మనకు కోరిక లేదు. కాన రావణుని యందువలె మనకు ఇతనియందు కాని, ఇతనికి మనయందు కాని విరోధముండదు. కాన మనలను ప్రహరించుటగాని, పరిత్యజించుటగాని చేయదు, కాక రాక్షసుడైన ఇతడు రాజ్యాన్ని కోరుతున్నాడు. రావణుని మనద్వారా సంహరింపజేయాలనుకొంటున్నాడు. కావున మనకెపుడూ అపకారం

చేయడు. మూర్ఖులగు రాక్షసులకు యుక్తియుక్తమగు ఆలోచన ఉండునా? అందువేమో వారిలోకూడా పండితులుందురు. కాన విభీషణుడు పరిగ్రాహ్యుడు. పండితులు, విక్షేపరహితులు, సంతుష్టులు అగు జ్ఞాతులు ఎపుడూ పరస్పరం కలిసి ఉండరు. అందువలనే సమయం వచ్చినపుడు విభేదిస్తారు. ఇతనికి రావణుని వలన భయం కలిగింది. అందుకు తార్కాణం భయాతురమైన ఇతని కంఠధ్వనియే. తనను రక్షించుకొనుటకే వచ్చినాడు.

**మ.వి.** "ప్రవాదశ్చ మహానేషః" దీని భావము జ్ఞాతుల నుండి భయం వస్తుందనే విషయాన్ని హస్తి గీతాదులు (యు.16 వ సర్గలో వివరింపబడినవి) బోధిస్తున్నాయి. అని ఇదియే లోకప్రవాదముగూడ.

**వ్యా.వి.** జ్ఞాతి స్వభావమిట్టిదయినా అన్నగారిని అనుసరించడం ధర్మం కదా? అనే శంకకు సమాధానం శ్రీరాముడు చెపుతున్నాడు.

**న సర్వే భ్రాతరస్తాత భవంతి భరతోపమాః ।**
**మద్విధా వా పితుః పుత్రాస్సుహృదో వా భవద్విధాః ॥** (యు.18.15)

సుగ్రీవా! సోదరులందరూ భరతునివంటి వారుకారు. తండ్రీకొడుకులు అందరూ దశరథ రాములవంటివారు కారు. స్నేహితులందరూ నీవంటివారుకారు. కైకేయివరప్రసాదితమై పితృదత్తమైన రాజ్యము నంగీకరింపక అడవి కేగిన నన్ననుసరించి వచ్చి నీదే రాజ్యం, నేను నీదాసుడను అనిన భరతుని వంటి సోదరులు ఎందరుంటారు? ఇచట ఇట్టి లబ్ధరాజ్యప్రసక్తి లక్ష్మణునికి లేదు కావున భరతుని గురించి చెప్పడం జరిగింది. సీతాన్వేషణకు సమయం మించిపోతున్నదని కోపించిన లక్ష్మణుని కఠినోక్తులకు పాత్రుడవై కూడా మాయందు ప్రేమాతిశయాన్ని ప్రకటిస్తూ ఉన్న నీవంటి స్నేహితులు ఉండరుకదా? జ్యేష్ఠుడనగుట వలన సహజంగా సంక్రమించే రాజ్యం తండ్రి సూచనానుసారం సోదరునకు సంక్రమింపజేసి అడవికి వచ్చిన నావంటి పుత్రులు, పుత్రవిరహదుఃఖితుడై ఆకారణంగా శరీరత్యాగం చేసిన దశరథుని వంటి తండ్రులెందరు ఉంటారు? ఇచట శ్రీరాముడు ఆత్మప్రశంస చేసికొన్నాడా? తన గతచరిత్ర చెప్పడం వల్ల ఆ దోషమాపాదింపబడదు. దీని కుదాహరణం. శకుంతలను మొదట చూచినపుడే ఆమెయందు తన మనస్సు లగ్నం కావడం గమనించి 'నామనస్సీమె యందు లగ్నమగుటచే నీమె క్షత్రియపరిగ్రాహ్య' అని దుష్యంతుడు అనుకొన్నాడు. "సతాం హి సందేహపదేషు వస్తుషు ప్రమాణమంతఃకరణప్రవృత్తయః" అన్న విధంగానే ఇచట గూడ ఆత్మప్రశంసారూపదోషం ఆపాదింపబడదు. 'మద్విధా వా పితుః పుత్రాః' దశరథునికి నావంటి కుమారులుండవచ్చు, లేకపోవచ్చు, కాని భరతుని వంటి సోదరులు, నీవంటి మిత్రులు ఉండరు కద! అని వ్యాఖ్యాంతరము.

నీతివాక్యాల ద్వారా విభీషణశరణాగతిని నిరాకరించడానికి సమర్థుడైన సుగ్రీవుడు అనర్థాశంకచే వ్యాకుల మనస్కుడై విభీషణశరణాగతిని నిరోధించుటకు రామునికి నమస్కరించి ఇట్లన్నాడు. 'ఈ విభీషణుడు రావణుడు పంపగా వచ్చినాడని తెలుసుకో. ఇతనిని నిగ్రహించాలి. ఇతడు కపటబుద్ధితో వచ్చాడు. మనం విశ్వసించిన పిమ్మట అదృశ్యుడై నన్నుగాని, నిన్నుగాని, లక్ష్మణునిగాని ప్రహరించుటకు వచ్చాడు. ఇతడు రావణసోదరుడు కద! ఇతడు వధార్హుడు' ఈవిధంగా పలికిన సుగ్రీవుడు విభీషణస్వీకారాన్ని సహించక ప్రణయదోషంతో మిన్నకుండినాడు.

తనమీద ప్రేమాధిక్యంతో సుగ్రీవుడు ఇలా అన్నాడని గ్రహించి తన శక్తిని వివరించి సుగ్రీవుని 'అతిశంకను' పోగొట్టడానికి శరణాగతరక్షణరూపమైన స్వీయవ్రతం ధర్మశాస్త్రసిద్ధం కావున విభీషణుని పరిత్యజింప వీలుపడదని చెప్పడానికి శ్రీరాముడు ఇట్లన్నాడు. దుష్టుడయినా, కాకున్నా ఈరాక్షసుడు నాకుగాని, నా సంబంధులగు మీకుగాని, లేశ మాత్రం కూడా అపకారం చేయలేడు. పిశాచ యక్షరాక్షసులను, భూమిలోని సమస్త రాక్షసులను "అంగుళ్యగ్రేణ తాన్హన్యామిచ్ఛన్" తలచుకొంటే వ్రేలికొనగోటితో సంహరించగలను.'

**వ్యా.వి.** రాముడు తన శక్తిని చెపుతున్నాడు. సుగ్రీవా! నీ సైనికులతో నీవు ఇక్కడే ఉండు. భూమిలోని సమస్తరాక్షసులను నేనొక్కడనే సంహరిస్తాను. నాకు శస్త్రాస్త్రాదులక్కరలేదు. సంపూర్ణహస్తమక్కరలేదు. ఒక్క వేలుచాలు. వేలు కూడా పూర్తిగా అక్కరలేదు 'అంగుళ్యగ్రేణ' ఏవ్రేలి కొనగోటనయినా లంకలోని రాక్షసులను మాత్రమేకాదు, సమస్తరాక్షసులను సంహరించగలను. సామూహికంగా చంపడం నాకు ఇష్టం లేనందువల్ల వారంతా బ్రతికి ఉన్నారు.

**శ్రూయతే హి కపోతేన శత్రు శ్శరణమాగతః ।**
**అర్చితశ్చ యథాన్యాయం స్వైశ్చ మాంసైర్నిమంత్రితః ॥ (యు.18.24)**

ఇతడు అపకారి అగుగాక ఇతనివలన నాకుప్రాణహాని సంభవించిన సంభవించుగాక! అయినప్పటికి ఇతడు రక్షింపతగినవాడు. ప్రసిద్ధమగు 'కపోతోపాఖ్యానం' విన్నారు కదా? ఒక పావురం తాను నివసించిన వృక్ష సమీపానికి వచ్చి చలితో, ఆకలితో, బాధపడుతున్నవాడు గతంలో తన భార్యయైన పావురాన్ని చంపినాడు అయినా కిరాతుని శరణాగతునిగా భావించి అగ్నిద్వారా చలిని తీర్చుటేగాక తన శరీరాన్నే అతనికి ఆహారంగా ఇచ్చింది కదా?

**మ.వి.** విభీషణ స్వీకారవిషయంలో నీతిశాస్త్రాన్ని, లోకవ్యవహారాన్ని, స్వీయశక్తిని ప్రదర్శించి అశక్తుడైన పురుషుడు కూడా తన ప్రాణం విడచి అయినా శరణాగతుని రక్షించాలి అని ఒక చరిత్ర శ్రీరాముడు చెపుతున్నాడు.

**గో.వి.** 'కపోతేన' ధర్మాధికారం లేనట్టి పక్షి మాత్రమే ఇట్టి ధర్మాచరణ చేయగా మనవంటివారి విషయంలో చెప్పతగినదేముంది? 'కపోతేన' అసహాయమైన కపోతమే అలా చేయగా ఇందరు సహచరులున్న మనం రక్షించాలి కదా? 'శత్రుః' పావురానికి ఆ కిరాతుడు భార్యాసంహర్త అయిన శత్రువు. విభీషణుడు మనకలా కాదే. అయినా ఇతనిని రక్షించకుంటే మన పౌరుషమెందుకు? 'శరణమాగతః' పావురం నివసించే వృక్షం కిందికి వచ్చిన కిరాతుడు వృక్షాధిదేవతకు శరణాగతుడనని నివేదించాడు. ఆ విషయం కూడా పావురం ఎరుగదు. ఆ కిరాతుడు పావురాన్ని శరణు వేడలేదు. ఇక విభీషణుడో! రఘువంశరాజులు శరణాగతరక్షకులను భావంతో 'రాఘవం శరణం గతః' అంటూ నావద్దకు వచ్చినాడు. అర్థాంతరం. ఆ కిరాతుడు 'శరణం' 'ఆగతః' శరణమనగా పక్షినివాసస్థానమగు వృక్షం. అచటికి వచ్చినాడని మాత్రమే వాస్తవంగా శరణాగతుడుకాడు. "అర్చితశ్చ" అతడు కిరాతుడు కావున సహజ శత్రువు. భార్యాపహారి. అట్టివానిని బాధపడుతున్నాడని ఉపేక్షించడం గాని, చంపడానికి ఉపాయాలను వెదకడంకాని చేయక ఆ పావురం అతిథిని దేవునిగా భావించి చలి తగ్గించడానికి సమీపంలో మంట వేసి చలిని నివారించడం ద్వారా అర్చించింది. మనమో! 'ఈ విభీషణుని అనుచరులతో సహ తీవ్రదండనతో చంపుదాము' 'యథాన్యాయం' భార్యను చంపినాడను విషాదం మనసునందుంచుకొనక మంచి మిత్రుడింటికి వచ్చినపుడు

ఆకలి తీరువరకు ఆదరపూర్వకంగా ఎలా ఆతిథ్యమిస్తావో అలా సంపూర్ణాదరంతో 'స్వైశ్చ మాంసైర్నిమంత్రితః' బహిః పదార్థాలను కొన్ని తెచ్చి అతిథ్యమివ్వడం కాదు అజ్ఞులు ఏ శరీరాన్ని 'నేను' అనుకొంటూ ఉంటారో, విజ్ఞులు కూడా ధర్మాచరణకు ముఖ్య సాధనంగా ఏ శరీరాన్ని భావిస్తూ ఉంటారో అట్టి స్వీయశరీరాన్ని 'ఇదే మహత్తర తప'మని శరభంగ మహర్షివలె (అరణ్యకాండయందీగాధ కలదు) అగ్నిలో పడవేసి భోజనం కోసం సమర్పించుకొన్నది. 'సః' ఆ పావురమొక పక్షి. ధర్మానుష్ఠానం చేయడానికి అవకాశమున్న జాతిలో గాని, శరణాగత రక్షకులని ప్రసిద్ధి పొందిన వంశంలోగాని పుట్టలేదు. 'తం' తనకేకాక సమస్త పక్షి జాతికి విరోధియైన కిరాతుని, విశేషించి తన భార్యను సంహరించిన వానిని, తన వద్దకు రావలెనని వచ్చినవాడు కాక తలవనితలంపుగా వచ్చి పడిపోయిన వానిని, ప్రాణరక్షణకు మరొక ఉపాయం లేనట్టి వానిని, పావురం ఇల్లాలిని అపహరించినందుకు పశ్చాత్తాపం వ్యక్తపరచడంగాని, మంచిమాటలతో అనునయించడంగాని చేయని అతనిని సంతోషంగా అంగీకరించింది. అతనికొరకు ఆత్మత్యాగం చేసుకొన్నది. ఇట్లు చెప్పడంలో శ్రీరాముని భావం ఒకవేళ ఇట్లే రావణుడు వచ్చినా మనం అతనికి ఆశ్రయం ఈయవలెనని. ఈ కపోతం మనుష్యజన్మకానప్పటికి గజేంద్రునివలె ధర్మానుష్ఠాన యోగ్యజ్ఞానమాత్రం కలిగినదీ కాదు. సామాన్య పావురం అనడం వల్ల శాస్త్రాధికారరాహిత్యం, బుద్ధిమాంద్యం, పక్షిత్వం సూచింపబడినాయి. 'వానరశ్రేష్ఠ' అని రాముడు సుగ్రీవుని సంబోధించాడు. మరొక చరిత్ర సూచితమవు తున్నది. ఒకవానరం పెద్ద పులి తరుమగా భయపడి తాను ఉంటున్న చెట్టును ఎక్కిన కిరాతుని రక్షించింది. చెట్టుక్రింద పొంచి ఉన్న పెద్ద పులి కొంతసేపటికి వానరం నిద్రించిన సమయంలో కిరాతునితో నిన్ను రక్షిస్తాను. కోతిని క్రిందికి తోసివేయమనగా కృతఘ్నుడు, పాపిఅయిన కిరాతుడు తనను రక్షించిన ఆ కోతిని కిందకు పడదోశాడు. కిందపడిన కోతిని పట్టుకుని 'నిన్ను వదలుతాను ఉపకారివైన నీకు ద్రోహం చేసిన ఆ కిరాతుని కిందికి తోసెయ్యమని' మనుష్యమాంసాభిలాషియైన పెద్ద పులి చెప్పింది. ధర్మం తెలిసిన ఆ కోతి ప్రాణాపాయస్థితి కావున ఇష్టములేకున్నా అట్లేనని అంగీకరించి చెట్టు ఎక్కి ఉపకారియగు తనకు అపకారం చేసికూడా, గత్యంతరం లేక తన నివాసస్థానంలోనే ఉన్న ఆ కిరాతుని 'శరణాగతుడ'ను భావంతో రక్షించింది. నీవు వానరులందరికి అధిపతివి. అట్టి నీవు జాతి ధర్మాన్ని గుర్తించి శరణాగతుని ఎందుకు స్వీకరించవు? ఇక నావంటివాడు విసర్జించ వచ్చునా!(1) 'మద్విధః' శరణాగతరక్షకులుగా ప్రసిద్ధమైన రఘువంశంలో జనించి, వసిష్ఠ విశ్వామిత్రమహర్షుల శిష్యుడనయి, రాజయోగి జనకునికి అల్లుడయి, శత్రువగు మారీచునిచే "రామో విగ్రహవాన్ధర్మః" అని కీర్తింపబడిన నేను కూడా శరణాగతహింస చేస్తే లోకం ఎలా ఉంటుంది? (2) 'మద్విధః' నావృత్తాంతాన్ని తర్వాత చెపుతా. సామాన్య రాజధర్మం ఆచరించేవారయినా శరణాగతుని విడువరు. వధింపతగని వారిని వధించుట రావణాదులకు చెల్లుతుంది కాని మావంటి వారికి కాదు.

'శాస్త్రజ్ఞానంలేని కపోతాదుల ఆచరణాన్ని మనం స్వీకరించనక్కరలేదు. శ్రుత్యాదివాక్యములు చెప్పనిది పక్ష్యాదులనుష్ఠించినవి కాబట్టి మనం కూడా ఆచరించాలని భావించడం పొరపాటు' అనే సందేహానికి సమాధానంగా శ్రీరాముడు ఇలా అంటున్నాడు. కణ్వపుత్రుడు, సత్యవాది అయిన 'కండుమహర్షి' పఠించిన వేదమూలక స్మృత్యుక్తములైన ప్రాచీన గీతాలను విను. 'శరణాగతుడను' ఇత్యాది మాటలు పలుకకున్నా, దోసిలి ఒగ్గి అంజలి బంధం చేయకున్నా, దైన్యంతో కనిపించే వానిని, అంజలి బంధనం లేకున్నా, దైన్యం కనుపించకపోయినా

హృదయపూర్వకంగా ప్రార్థన చేసేవానిని, ఇవి ఏవిలేకున్నా 'శరణాగతుని' అంటే రక్షకుడుగా భావింపబడిన వ్యక్తి నివాసస్థలానికి వచ్చినవానిని, లేక శరణాగతుడనని చెప్పినవానిని అతడు శత్రువైనప్పటికి చంపకూడదు. ఇట్లు శరణాగతుని ఆదరించడం శాస్త్రాలు చెప్పినవనిగాని, లేక ఇహ పరలోక సుఖసాధనమనిగాని, లేక ప్రత్యవాయ పరిహారార్థమనిగాని చెప్పడానికి ముందు 'ఆనృశంస్యార్థం' ఇతడు ఘాతకుడు అనే అపకీర్తిరాకుండా శరణాగతుని స్వీకరించాలి. లేక 'ఆనృశంస్యార్థం' సకల ధర్మసారభూతమైన దయాగుణం దానిని రక్షించడానికి.

**ఆర్తో వా యది వా దృప్తః పరేషాం శరణం గతః ।**
**అరిః ప్రాణాన్పరిత్యజ్య రక్షితవ్యః కృతాత్మనా ॥ (యు,18.28)**

**వ్యా.వి.** 'ఆర్తః' తన కోరిక తీర్చుటలో ఆలస్యాన్ని సహించలేనివాడు. లేక శరణాగతి సమయంలో కూడ నిజాపరాధాలను తలచి భయపడేవాడు. 'దృప్తః' తొందరను ఆలస్యాన్ని గమనించక ఫలసిద్ధిని మాత్రం కోరేవాడు. లేక వినయరహితుడు. స్వాపరాధభయం లేనివాడు. ఇక మోక్షం కోరువాడయితే 'ఆర్తః' సంసారమువిషయంలో విరక్తిచెంది వెంటనే శరీరాన్ని వదలాలనే కోరిక కలవాడు. 'దృప్తః' శరీరావసాన సమయంలో ముక్తిని కోరువాడు లేక నీవు తప్ప నాకితరరక్షకులు లేరనుభావంతో శరణాగతుడయినవాడు. 'ఆర్తుడు' హేళనాపూర్వకంగా శరణాగతుడనువాడు దృప్తుడు. లేక శరణాగతి సమయంలో కూడా గూఢహృదయుడు కావడం వలన శత్రుభావాన్ని మరువనివాడు దృప్తుడు. ఆర్తుడయినా, దృప్తుడయినా, శరణు కోరినవాడైనా, లేక 'పరేషాం శరణాగతః' శత్రువుల మధ్య నుండి వచ్చి శత్రుత్వం వీడకుండా పైకి మాత్రం 'శరణాగతుడను' అని చెప్పుకొనువాడయినా, అట్టి వారందరినీ దృఢమనస్కుడు, ధర్మవేత్త అయినవాడు అస్థిరములగు ప్రాణం విడిచికూడా రక్షించాలి. శరణాగతుని రక్షించాలనేది విశేషశాస్త్రం. తనను తాను రక్షించుకోవాలనేది సామాన్యశాస్త్రం. కాన తన ప్రాణాలను పరిత్యజించి శరణాగతుడెట్టి వాడయినా రక్షించాలి.

శరణాగతుని యొక్క శత్రువుకు భయపడిగాని, శరణాగతునికి భయపడిగాని, శాస్త్రజ్ఞానం లేకపోవడం వలనగాని, స్వేచ్ఛాచారికావడం వలనగాని, లేక అతడి శత్రువువల్ల కొంతలాభం పొందదలచిగాని, శక్తి ఉండికూడ శరణాగతుని రక్షింపకపోవడం పాపహేతువవుతుంది. అట్లు రక్షింపకుండుట లోకనింద్యం. శరణాగతుని రక్షించకపోవడం ఇహ పరదుఃఖహేతువగుట మాత్రమేకాక తన పుణ్యం కూడా నశించునని కండుమహర్షి చెపుతున్నాడు. సమర్థుడగు వ్యక్తి శరణాగతుని రక్షించని సందర్భంలో ఆతడి శత్రువు వలన చంపబడినచో రక్షింపని ఈతని సమస్త పుణ్యాలను చనిపోయిన ఆ శరణాగతుడు స్వీకరించి పరలోకానికి వెళతాడు.

ఇంతవరకు కండుమహర్షి మాటలు చెప్పి శ్రీరాముడు ఇలా అంటున్నాడు. శరణాగతుని రక్షించకపోవడం నరకప్రాప్తికారకం. కీర్తినాశకరం, బలవీర్యవినాశకరం అవుతుంది. కావున ధర్మపాలన చేయవలసిన నేను కండు మహర్షి మాటలను అనుసరిస్తాను. దానివలన పాపనివృత్తి, యశఃప్రాప్తి, స్వర్గరూపఫలప్రాప్తి కలుగుతాయి. ఈ విధంగా 'తస్మాదపి.......ప్రయచ్ఛంతి' అనే శ్రుతి, కండుమహర్షి గీతరూపస్మృతి, కపోతోపాఖ్యానరూపశిష్టాచారం, అసద్ధేతుఖండనపురస్సరంగా స్వీయాభీష్టప్రకటన, పూర్వోక్తములైన నాలుగు హేతువులు శరణాగతరక్షణం కర్తవ్యమని నిరూపించినవని శ్రీరాముడు వక్కాణించాడు.

**మ.వి.** శ్రీరాముడు పై నాలుగు హేతువులను చూపడమేకాక సర్వలోకస్వామి, శరణ్యుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తి, అపారకరుణాసముద్రుడు అగు తనకు సహజమైన వ్రతవిశేషం ఉన్నదని చెపుతున్నాడు.

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥**

**వ్యా.వి.** 'సకృదేవ' ఒక్క పర్యాయం మాత్రమే సామాద్యుపాయాలను ప్రయోగించుటలో అనేక పర్యాయాలకు అవకాశముంటుంది. ప్రపత్తిలో మాత్రం ఆవృత్తి అక్కరలేదు. గమనార్థక ధాతువులన్నీ జ్ఞానార్థకాలు కూడ అగుటచే ప్రపన్నాయ శరణాగతుని కొరకు ఇచట ఈ పదం మానసిక శరణాగతిని చెపుతున్నది. 'తవాస్మీతి' భవదీయుడని ఇది వాచికమైన శరణాగతిని బోధిస్తున్నది. మానసిక వాచిక శరణాగతులలో ఏ ఒక్కటి ఉన్నప్పటికి– లేక 'ప్రపన్నాయ' శరణాగతిరూపోపాయం కలిగి 'తవాస్మీతి చ యాచతే' నీవాడను కావాలని ఫలాన్ని యాచించేవానికి సమస్తభూతాల నుండి భయరహితస్థితిని ఇస్తున్నాను. ఇక్కడ 'అభయ' మంటే మోక్షమే. తైత్తిరీయోపనిషత్తు ఇట్లు చెపుతున్నది. "అథ సో భయం గతో భవతి" (బ్రహ్మ వల్లి.7) బ్రహ్మాత్మైక్యజ్ఞానం కలవారు భయరహితులవుతారు. "ఆనందం బ్రహ్మణో విద్వాన్", 'న భేతి కుతశ్చ నేతి' (బ్రహ్మ వల్లి.9) ఆనందస్వరూపమైన బ్రహ్మం నిజస్వరూపంగా గుర్తించిన విద్వాంసుడు (వస్త్వంతరమే లేదు కావున) దేనికీ భయపడదు. ప్రధానఫలం అభయరూప మోక్షమయినా తాను సర్వ ఫలప్రదాత అగుట వలన నీవాడను కావాలనే విశేష ఫలయాచనను గూడ సఫలం చేస్తుంది. ఇది నావ్రతం ఇక్కడ 'సర్వభూతేభ్యః' సమస్త భూతాల నుండి అభయప్రదానం చెప్పబడింది. అట్లే 'సర్వభూతేభ్యః' అనే దానికి చతుర్థ్యర్థం స్వీకరిస్తే శరణాగతసంబంధి సమస్తభూతాల కొరకు అభయప్రదానం చేస్తున్నాననే అర్థాంతరం గ్రహింప తగింది.

ఓ సుగ్రీవా! పురుషకారభూతులైన మీద్వారా సమాశ్రయణం అందుకోగోరిన విభీషణుని నీవే తీసికొనిరమ్ము. కాలయాపనవలన కలిగినదుఃఖం అపుడు ఇతనికి నివృత్తమవుతుంది. ఇతడు ధర్మాత్ముడగు విభీషణుడు కావచ్చు. లేక దుర్మార్గుడగు రావణుడే విభీషణ వేషధారియై వచ్చి ఉండవచ్చు. విభీషణుడైనచో అతడితో వచ్చిన నలువురు మాత్రమే రక్షింపబడతారు. ఇది సామాన్యధర్మం. ఈతడు రావణుడే అయినచో లంకావాసులందరూ రక్షింపబడతారు. ఇది చాలా ఉత్కృష్టధర్మం. ఇతడు "రాఘవం శరణం గతః" అనినపుడే నేను అభయప్రదానం చేశాను. ఏ రావణుని సంబంధంతో విభీషణుని నీ వింతగా శంకించావో అట్టి రావణుడు సీతను సమర్పించకుండానే ఈ వేషంలో వచ్చినప్పటికి అభయప్రదానం చేశాను. కావున 'ఇతడు విభీషణుడు కాడు. రావణుడే అని గుర్తించితిని' అని నాతో చెప్పుటకు రావద్దు. వెంటనిడుకొని రమ్ము

సుగ్రీవుడు శ్రీరాముని శరణాగతరక్షదీక్షను, తనమీద గల సుహృద్భావాన్ని గుర్తించి విస్మయంతో ఇట్లన్నాడు. ధర్మసూక్ష్మములను గుర్తెరిగిన ఓ రామా! నీ ఈ ధర్మాచరణం ఆశ్చర్యకరం కాదు. ఏమన భృత్యసంరక్షణదక్షుడవు. నీకు పొందదగినది ఏమీ లేదు. నీకు పరశ్రేయస్సే ప్రధానం. సమస్త సుఖదాతవగు నీవు శరణాగతుల విషయంలో, ఆశ్రితులగు మావిషయంలో, సుఖకారివనడంలో విస్మయం ఏముంది?

"అనుమానాచ్చ, భావాచ్చ, సర్వతస్సు పరీక్షితః తస్మాత్ క్షిప్రం సహాస్మాభిస్తుల్యో భవతు....." (యు.18.38)

ఈ విభీషణుడు వధ్యుడని నేను పూర్వం చెప్పాను. అట్టి నా మనసు గూడ ఇతడు శుద్ధుడని గుర్తించింది. అంతేకాక 'అనుమానాత్' హేతుబద్ధములైన నీయొక్క, హనుమానుని యొక్క మాటలు వినడం వలన కూడా ఇతడు పరిశుద్ధుడని గుర్తించాను. 'భావాత్' ఇతని భావబోధకం, పరిశుద్ధం, ప్రసన్నం అయిన ముఖవర్చస్సు వలన ఇతడు పరిశుద్ధుడని గుర్తించాను. వ్యాఖ్యాంతరం. 'అనుమానాత్' హృదయంలోని భావాన్ని వ్యక్తపరచే ముఖలక్షణాల వలన, 'భావాత్' ఆతని ఆర్తధ్వని, ఆతని మృదుస్వభావం వలన చంపవలెనని నేనన్నపుడు, అపరిత్యాజ్యుడని నీవనినపుడు కూడా ఉద్వేగ రహితముఖవర్చస్సు కలవాడగుట వలన, ఇతడు పరిశుద్ధుడు. నేను బాగుగా పరీక్షించాను. ఇతఃపూర్వము అజ్ఞానంతో పాపం చేశాను. యథార్థంగా ఇతనిని నీసన్నిధికి చేర్చుటలో క్షణమాత్రం కూడా ఆలసించడం పనికిరాదని గుర్తించాను. మమ్ము పురుషకారభూతులుగా భావించి తనను నీకు నివేదించమని మమ్ము కోరుటచే క్రూరస్వభావులమైన మాకు నచ్చచెప్పడానికి నీకింతటి ప్రయాస కలిగింది. మాతో ఈతడు సముడగుగాక! జ్ఞానియగు విభీషణుడు మా అందరితోడ స్నేహం అంగీకరించునుగాక.

'ఓ విభీషణా! శ్రీరాముడు నీకభయమిచ్చాడు. రాఘవుని సన్నిధి కేగుదము' అను పశ్చాత్తప్తుడు, మిత్ర శ్రేష్ఠుడునగు సుగ్రీవుని స్నేహపూరిత వాక్యాలను విని విభీషణుడు తన సన్నిధికి వచ్చునంతలో "విభీషణే నాశు జగామ సంగమం" సుగ్రీవాదులు విభీషణునితో మాట్లాడు ఆలస్యాన్ని కూడా సహించలేక ఒకవేళ సుగ్రీవుని చిత్తం తిరిగి మారునేమోననే ఆందోళనతో 'ఆశు' వేగంగా విభీషణునితో కలవగోరి శ్రీరాముడు వెళ్లాడు. ఆశ్రితునెపుడు ఆలింగనం చేయుదుననే త్వరతో తన 'శరణాగత రక్షణ ప్రతిజ్ఞా' భంగం కానందుకు సంతసించి ఆశ్రితుని రక్షించడానికి వెళ్ళాడు. దేవేంద్రుడు గరుత్మంతుని వద్దకు వచ్చినట్లు వచ్చాడు. ఇంద్రుడు గరుత్మంతుని స్నేహం తనకు లాభకారిగా భావించినట్లు శ్రీరాముడు గూడ తలచాడు.

## పంతొమ్మిదవ సర్గము

విభీషణుడు అభయం కోరినాడు. శ్రీరాముడు సర్వభూతములనుండి అభయం ఇచ్చినాడు. వెనుక వినిన దానికంటే అధికంగా శ్రీరాముని కళ్యాణ గుణాదులు ప్రత్యక్షం కావడంచేత వినయంతో కుంచింపబడిన శరీరం కలిగిన జ్ఞానియగు విభీషణుడు ఆకాశంలో ఉండడంతో శ్రీరామసన్నిధిలో సుగ్రీవాది ముఖ్యులందరూ పరివేష్టించి 'ఇట దిగుమ' ని ఆహ్వానిస్తుండగా వానరమధ్యస్థమైన ఆ స్థలంలో ఆకాశంనుండే బోరగిలపడి నమస్కరిస్తూ భూమిపై వాలి సాష్టాంగప్రణామం ఆచరించాడు. అభయదానానంతరం ప్రయోజనాకాంక్ష లేకయే శ్రీరామదర్శన సంతుష్టుడై భక్తులగు నలువురు అనుచరులతో కలిసి నమస్కరించాడు. 'నివేదయత మాం' అని శరణాగత్యుపాయం అనుష్ఠించింది తానొక్కటే అయినా తత్ఫలం, అనుచరులకుగూడ సమానమే 'పశుర్మనుష్యః పక్షీ వా యే చ వైష్ణవ సంశ్రయాః, తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమం పదమ్' కావున రామపరిచర్య విభీషణ సచివులకు కూడా లభించింది.

**మ.వి.** స్వామిసన్నిధిలో పై నుండి దిగితే ముందుగా పాదాలు కనిపిస్తాయి. అది అనుచితం కాబట్టి ఆకాశమునుండి బోరగిలబడి నేలబడినాడు.

**వ్యా.వి.** అంతలోనే శరణాగతుడనని పలికిన విభీషణుడు శారీరక శరణాగతిని వేడుతున్నాడు. 'వధింపవలె' శంకింపదగినవాడు. 'విడువదగడు' 'తీసుకొని రావలసినది' మాలో ఒకడుగ ఉండుగాక' అని నానావిధాలుగా అనిన మాటలు వినినా ఉద్వేగరహితమైన స్థిరచిత్తం కల ధర్మాత్ముడగు విభీషణుడు పాలుత్రాగే పసిపిల్లవాడు తల్లి స్తనాలనువలె తనకు సుఖసాధకాలుగా భావించిన శ్రీరాముని పాదాలపై పడినాడు. అలా పడడం ఎలా ఉందంటే ఇతరులు వచ్చి వివశులైన హస్తాద్యవయవాలను యథాస్థానంలో ఉంచి లేపవలసినట్లుగా పడినాడు. ఇక్కడ అనుకూల సంకల్పం, ప్రతికూలవర్జనం, 'ధర్మాత్మా' అనుట ద్వారా మహావిశ్వాసం 'శరణాన్వేషీ' అనుటవల్ల గోప్తృత్వవరణం, 'పపాత' అనుట ద్వారా ఆత్మనిక్షేపం అనే సాంగశరణాగతి చేయబడింది.

ఇక వాచిక శరణాగతి చెప్పబడుతున్నది. రామపాదాలను పట్టిన ఆ సమయంలో విభీషణుడు ఇలా పలికాడు. ముందు ఇవే మాటలు ('రాఘవం శరణం గతః') అన్నపుడు సుగ్రీవాదులకు కటువుగా వినిపించాయి. ఇపుడవే మాటలు సంతోషం కలిగిస్తున్నాయి. పురుషకారభూతులైన సుగ్రీవాదులతో 'నేను వచ్చిన విషయాన్ని నివేదించమ'న్నాడు. ఇపుడు తన చరిత్రను శ్రీరామునితో స్వయంగా దెలుపుతున్నాడు. నేను రావణుని సోదరుడను. అతనిచే అవమానితుడనై సమస్తభూతాలకు శరణ్యుడవైన జ్ఞానశక్తిపరిపూర్ణుడవగు నీకు శరణాగతుడనయ్యాను. ఆవాసస్థానమైన లంకను, మిత్రులను, ధనాన్ని త్యజించాను. నా రాజ్యం, జీవితం, ఇహపరలోకసుఖం, నీ అధీనంలో ఉన్నాయి. నీకైంకర్యం తప్ప ఇతరాలను నేను కోరడంలేదు. ఇట్లు "భవద్గతం మే రాజ్యం జీవితం చ సుఖాని చ" అని తన సమస్త భారాన్ని రాముని యందుంచిన విభీషణుని మాటను విన్న శ్రీరాముడు ప్రారంభంలోనే నిన్ను స్వీకరించవలసి ఉండగ ఇంతటి విలంబం జరిగిందని సాంత్వన వాక్యాలు బలుకుతూ, ఆతని హృదయాన్ని ఆర్ద్రీభూతమొనర్చి కన్నులతో త్రాగుతున్న వానివలె అత్యంతాదరంతో చూస్తూ, శ్రీరాముడు ఇట్లన్నాడు. 'యథార్థమగు రాక్షసులయొక్క బలం, బలహీనత చెప్పవలసింది.'

**గో.వి.** ఇచట రాముడు 'నీవారి బలమును' అని పలుకక 'రాక్షస బల' మని పలుకుట వలన విభీషణుడిప్పటికే ఇక్ష్వాకువంశీయుడుగా శ్రీరాముడు భావించినట్లు స్ఫురిస్తున్నది. భగవంతుని ఆశ్రయించడం వలన 'భ్రమరకీట' న్యాయంగా విభీషణునికి తత్సామ్యం ప్రాప్తించింది. రామునికి విభీషణుడు ఇలా జవాబిస్తున్నాడు. 'బ్రహ్మవర ప్రభావంతో సమస్త భూతాలకు రావణుడు అవధ్యుడుగా ఉన్నాడు. రాజపుత్ర' అని రాముని సంబోధించడం వలన రావణునికి మానవవధ్యత్వం సూచింపబడింది.

'రావణుని తరువాత నా అన్నయైన కుంభకర్ణుడు పరాక్రమవంతుడు. యుద్ధంలో ఇంద్రునితో సమానుడు. సేనాపతి ప్రహస్తుడు కుబేరసేనాని మాణిభద్రుని ఓడించిన పరాక్రమశాలి. అభేద్యకవచధారి అయిన ఇంద్రజిత్తు ధనుర్ధరుడై యుద్ధవ్యూహంలో అగ్నినర్చించి ప్రసన్నుని చేసికొని అదృశ్యుడై శత్రువులను వధిస్తున్నాడు. మహోదర ప్రభృతి సేనాపతులు లోకపాలతుల్యులు, రక్తమాంసభక్షకులు, కామరూపులు అగు పదివేలకోట్లమంది రాక్షససైనికులు ఉన్నారు. వీరితో కూడిన రాజగు రావణుడు లోకపాలకులను జయించాడు.' విభీషణుని మాటలు విని శ్రీరాముడు ఆలోచించి ఇలా పలికాడు. 'విభీషణా.' నీవు చెప్పిన అన్ని విషయాలను గ్రహించాను. అనుచరయుక్తుడైన రావణుని సంహరించి నిన్ను రాజును చేస్తాను. సత్యంగా చెపుతున్నాను. రావణుడు రసాతలానికి, పాతాళానికి, సత్యలోకానికి

ఎక్కడికి వెళ్లినా నేను జీవించి ఉండగా తప్పించుకోలేడు. పుత్రబంధుసహితుడగు రావణుని సంహరించకుండా నేనయోధ్యను ప్రవేశించను. నాముచ్వురు సోదరుల మీద ఒట్టు వేసి చెపుతున్నాను.

రాముని మాటలు విన్న విభీషణుడు రాజ్యవిషయంలో కోరికలేనివాడు కావడంలో తనకు శ్రీరామకైంకర్యమే పరమ ప్రయోజనం కాబట్టి నమస్కరించి ఇట్లంటున్నాడు. లంకను ముట్టడించడంలో రాక్షసవధలో బలము కొలది ప్రాణాలున్నంతవరకు సహాయం చేస్తాను. వానరసేనలో ప్రవేశిస్తాను.

భగవత్కైంకర్యం తప్ప మరొకటి కోరని విభీషణుని ఆలింగనం ద్వారా వశపరచుకొని తానిచ్చే అవాంతర ఫలాలను అంగీకరించాలనే అభిప్రాయంతో శ్రీరాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. 'లక్ష్మణ! సముద్ర జలం దెచ్చి విభీషణుని సమస్త రాక్షసులకు రాజన్యునిగా అభిషేకించు. నేను ప్రసన్నుడనై ఉన్నాను.'

**గో.వి.** "ప్రసన్నే మయి" అనుటవల్ల ఈ పట్టాభిషేకం విభీషణాభీష్టమునసరించికాక రామాభీష్టానుసారం జరుగుతున్నట్లు సూచింపబడుతున్నది.

అపుడు లక్ష్మణుడు వానరముఖ్యులమధ్య రాజశాసనానుసారం విభీషణుని రాజుగా అభిషేకించాడు. అందుకు విభీషణుడు వ్యతిరేకతను ప్రకటింపలేకపోయాడు. శ్రీరామానుగ్రహం చూచిన వానరులందరు హర్షనాదాలు చేశారు.

పిమ్మట హనుమత్సుగ్రీవులు విభీషణునితో అక్షోభ్యమగు సముద్రమును ససైన్యముగ ఎట్లు దాటవలెనో ఉపాయం చెప్పగోరగా విభీషణుడు ఇలా అన్నాడు. 'శ్రీరాముడు సముద్రుని శరణు వేడాలి. శ్రీరామ కూటస్థుడగు సగరుని పుత్రులవల్ల త్రవ్వబడి వృద్ధినందిన 'సాగరుడు' ఉపకారజ్ఞుడగుటచే రామకార్యాన్ని నెరవేర్చగలడు. విభీషణోపదేశానుసారం' నీవు సాగరుని శరణు వేడవలెన'ని సుగ్రీవుడు రామునికి తెలిపాడు. సహజ ధర్మిష్ఠుడైన రాముడు అందుల కంగీకరించాడు.

పిమ్మట దర్భలు పరుచబడిన సముద్రతీరంలో అగ్న్యాయతన వేదియందు అగ్నిహోత్రునివలె శ్రీరాముడు శయనించాడు. ఈ ఉపమానంతో శ్రీరాముడుగూడ అగ్నివలె జ్వలింపగలడని వ్యంజితమవుతున్నది.

## ఇరవైయవ సర్గము

లంకా వృత్తాంతం చెప్పబడుతున్నది. విభీషణగమనానంతరం సముద్రతీరప్రాంతంలో విడిచిన సుగ్రీవ రక్షితసేనను రావణుని చారుడు శార్దూలుడు జాగృతతో పరికించి లంకకు తిరిగివచ్చి రావణునితో ఇలా చెప్పాడు. వానర భల్లూక సేన దుష్ప్రవేశంగా, అపరిచ్ఛిన్నంగా ఉండి రెండవ సముద్రంవలె ఉంది. లంకాభిముఖంగా వస్తున్నది. ఉత్తమాయుధధారులైన రామలక్ష్మణులు లంకవైపు వస్తున్నారు. వానరసేన ఎటుచూచినా పదియామడల పరిమితితో భూమిని ఆవరించి ఉంది. నేను మామూలుగా చూశాను. యథార్థవిషయం దూతలద్వారా తెలుసుకో. సీతను సమర్పించడంతోగాని, సామవాక్యప్రయోగంతోగాని, భేదోపాయప్రయోగంతోగాని ప్రవర్తించు.

పిమ్మట రావణుడు భేదోపాయాన్ని ఆశ్రయించడానికి ప్రయత్నిస్తూ అర్థజ్ఞానయుక్తుడగు శుకుని చూచి ఇట్లన్నాడు. సుగ్రీవునితో నా ఈ మాటలను పారుష్యరహితంగా శ్రావ్యంగా ఇలా చెప్పు. సుగ్రీవా! నీవు గొప్పకులంలో

పుట్టితివి. బ్రహ్మపుత్రుడగు ఋక్షరజసుని కుమారుడవు. తద్వారా మనకు బంధుత్వం ఉంది. గొప్పబలవంతుడవు. అల్పబలుడైన రామునితో నీకేమి? రాముని వెంట రావడం వల్ల నీకు లాభం లేదు. ప్రయోజన రహితమైన నాతో వైరం అనుచితం. నీవు నాకు సోదరతుల్యుడవు. నేను సీతనపహరిస్తే నీకేమి నష్టం? నీకేమి సంబంధం? బుద్ధిమంతుడవగు నీవు తిరిగి కిష్కింధకు వెళ్ళు. నామాటమన్నించకుండా నీవు ఇక్కడికి వచ్చినప్పటికీ ఏమీచేయలేవు. దేవ గంధర్వాదులకే ఈ లంకను పొందడం సాధ్యం కాదు. ఇక నరవానరులేమి చేస్తారు? రావణసందిష్టుడగు శుకుడు ఆకాశానికి ఎగిరి పక్షి రూపంలో సముద్రాన్ని దాటి ఆకాశంలో ఉంటూనే సుగ్రీవునితో రావణోక్తసందేశాన్ని వినిపించాడు. ఈ విధంగా మాట్లాడుతున్న పక్షి రూపధారియగు శుకుని చూచిన వానరులు ఆకాశానికి ఉద్గమించి చుట్టుముట్టి రెక్కలను విరుచుటకు పిడికిళ్ళతో చంపుటకు ప్రయత్నించారు. ఆ శుకుని బంధించారు. వానరపీడితుడగు శుకుడు శ్రీరాముని కిట్లు మొరపెట్టుకొన్నారు.

'ఓ రామా! యజమానుని సందేశం వినిపించే దూత వధార్హుడుకాడు. స్వీయాభిప్రాయాన్ని ప్రకటించే దూతమాత్రమే వధ్యుడు. ఈ వానరులను వారించుము' ఇట్లు రోదిస్తూ శుకుడు పలుకగా రాముడు వానరులను 'వీనిని వధింప వలద' ని ఆజ్ఞాపించాడు. విముక్తుడగు శుకుడు సుగ్రీవునితో తన సందేశానికి సమాధానమేమని అడిగాడు.

'ఓ రావణా! నీవు నాకుపకరించే మిత్రుడవుకావు. ప్రియుడవు కావు. ఎట్లు సోదరుడవవుతావు? నామిత్రుడగు రామునికి శత్రువైనందువల్ల నాకును శత్రువువే! నీ సోదరుడగు వాలికి మిత్రుడను కాన నీకును మిత్రుడనే' అందువేమో! రామునికి శత్రువువైన నీవు నాకు విరోధివే. వాలివలె నీవును వధార్హుడవు. జ్ఞాతి,బంధు, సుతసహితంగా నిన్ను వధిస్తాను. నీవెక్కడ దాగినా రాఘవుని నుండి విముక్తుడవు కాలేవు. రామబాణ తాడితుని రక్షింప కలవాడు ముల్లోకాలలో లేడు. వృద్ధుడగు జటాయువును సంహరించడం పరాక్రమమా? రాఘవులు సమక్షంలో లేని సమయాన సీతనపహరించిన నీవు రాబోయే అనర్థాన్ని తెలుసుకోలేకున్నావు. అజేయుడగు రాముడు నీప్రాణం తీయుననే విషయాన్ని తెలుసుకోలేకున్నావు అని సుగ్రీవుడు ప్రతిసందేశమిచ్చాడు.

అపుడు అంగదుడు శుకుని చర్యలనుబట్టి అతనిని బంధింపగా శ్రీరామునితో శుకుడిట్లు మొరపెట్టుకొన్నాడు. 'రామా! నన్నీవానరులు హింసించి చంపబోతున్నారు. నేను మరణిస్తే నే నపరాధిని కావున నాజీవితకాలంలో చేసిన పాపములన్నీ ప్రభువువైన నీకు సంక్రమిస్తాయి' శుకుని మొర వినిన రాముడు 'దూతయగు వీనిని సంహరించ వద్దు. బంధవిముక్తుని చేయండి. సముద్ర రక్షణ తీరమందు విడువవచ్చు' నని చెప్పాడు.

## ఇరవైయొకటవ సర్గము

సముద్రతీరంలో శ్రీరాముడు దర్భలను పరచి సాగరునికి అంజలి ఘటించి సర్ప శరీరంవలె మృదువైన బాహువును తలగడగా చేసుకొని సముద్రాభిముఖంగా శయనించాడు.

**గో.వి.** ఇచట అతి సుకుమారునకు కఠినమైన భూతల శయనమెందుకు? సర్వ రక్షకుడగు నారాయణుడు సముద్రుని ప్రార్థించడమెందుకు? అని ఈ శ్లోకంలోని యందలి విశేషణాల ద్వారా వాల్మీకి మహర్షి యొక్క ఖేదం వ్యక్తమవుతున్నది.

శ్రీరాముడు అయోధ్యలో ఉండిన రోజులలో కేయూరాద్యాభరణభూషితభుజాలతో సైరంధ్రీ స్త్రీలు (అలంకరణ చేయు అంతఃపుర స్త్రీలు) గంధాదులనలంకరించే సందర్భాన వారిచే అనేక విధముల స్పృశింపబడినట్టిది, అగరు చందనాదులతో గుబాళించినట్టిది, బాలసూర్యసదృశమైన కుంకుమతో శోభించినట్టిది, పూర్వం హంసతూలికా తల్పంమీద సీతాదేవికి తలగడగా శోభించినట్టిది, గంగా ప్రవాహస్థ తక్షక శరీర తుల్యమైనది, యుద్ధంలో మహాకవాటం యొక్క గడియవలె శత్రువులను నిలువరించినది, శత్రుశోకాన్ని అధికం చేయునట్టిది, సమస్త భూమండలానికి ఆలంబన భూతమైనట్టిది, బాణప్రయోగంవల్ల కలిగిన రాపిడికి ఏర్పడిన కణుతులు కలిగినట్టిది, పరిఘాయుధంవలె దృఢమయినట్టిది, వేల గోవులను దానము చేసినట్టిది, మిత్రులకానందకారి, దీర్ఘమైనట్టిది అగు తన కుడి భుజాన్ని తలగడగా ఉంచుకొని దాక్షిణ్యం కలిగి సర్వాభయప్రదుడగు శ్రీరాముడు 'నాకు సముద్ర తరణంగాని, లేక మరణంగాని సంభవించుగాక' అని దృఢదీక్షతో శాస్త్రోక్త కాయిక వాచిక మానసిక నియమాలతో సముద్రాభిముఖంగా శయనించాడు.

**గో.వి.** ఇచట "పరమనారీణా మభిమృష్టం" గొప్ప స్త్రీలచే స్పృశింపబడిన అనడంవల్ల రామునికి ఇతర భార్యలు ఉన్నారనే సందేహం కలుగుతుంది. రామాయణంలో ఎక్కడా ఇతర భార్యలున్నట్లు చెప్పబడక పోవుటేగాక వివాహానంతరం 12. సంవత్సరాలు సమస్త భోగాలను సీతారాములు అనుభవించినట్లు సమా ద్వాదశ......భుంజానా మానుషాన్ భోగాన్ అని సీత చెప్పుటచేత కూడా వివాహాంతరవాదం నిష్కాసితమయింది. కాని 'రామస్య దయితా భార్యా' రామునికి మిక్కిలి ప్రియురాలగు భార్య సీత అనుట ద్వారా ఇతర భార్యలున్నట్లు సూచితమవుతున్నది కద? అట్లే 'రోహిణీ యథా' అనుటతో చంద్రునికి ఇరువది ఏడుగురు భార్యలున్నట్లు రామునికి కూడా భార్యాంతర మున్నట్లు సూచింపబడుతున్నది అనే సందేహానికి సమాధానం ఏమన 'దయితో భ్రాతుః' ప్రేమాస్పదుడగు సోదరుడు లక్ష్మణుడని సంబోధించినంత మాత్రాన భరతాదులు రామునికి ప్రేమాస్పదులు కారా! రాజగృహంనుండి సుఖాలను అనుభవింపతగిన సీతాలక్ష్మణులు వనవాసానికి రాముని అనుసరించి వెళ్ళడం వలన మిక్కిలి ప్రేమాస్పదులని చెప్పడమే. వాల్మీకి హృదయం ఇక దృష్టాంతంలోని రోహిణి నక్షత్రాలలో ఒకతెయగు రోహిణి కాదు. ఈమె చంద్రునితో నిత్యసంబంధం పెట్టుకోజాలదు కద? కాన ఈ రోహిణి వేరు. మరొక సందేహం. మంథర దుర్బోధ చేస్తూ "హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమా స్త్రియః" (2.8.12) రామపట్టాభిషేకంవలన రాముని గొప్ప స్త్రీలు సంతోషించగలరు. ఇక్కడ బహువచనం ప్రయోగింపబడడంతో రామునికి బహుభార్యాత్వం సిద్ధిస్తుంది కద? అట్లే సుందరకాండలో సీత దుఃఖిస్తూ "స్త్రీభిస్త్వం.....స్త్వం రంస్యసే" (5.28.14). నీవు స్త్రీలతో రమిస్తున్నావు. అని అన్నది.

ప్రస్తుతం ఇక్కడ కూడా "భుజైః పరమ నారీభిరభిమృష్టమనేకధా" అనేక విధాల గొప్ప స్త్రీలచే స్పృశింపబడినట్టి రామభుజవిశేషణంగా చెప్పబడింది. కాన రామునికి బహుపత్నీత్వం సిద్ధం, అని సందేహం.

సమాధానమేమంటే 'రామునికి సంబంధించిన స్త్రీ' లనగా సీత, కౌసల్య, వాళ్ల దాసీజనం చెప్పబడినారు. లేక 'స్త్రియః' అను బహువచనం గౌరవవాచకంగా సీతనే చెపుతుంది. ఎట్లన అదేచోట భరతునికి ఒకే భార్య ఉండగా కైకేయితో మంథర "స్నుషాః" నీకోడళ్ళు అని సంబోధించింది. కావున ఆ బహువచనం గౌరవ వాచకమే. అట్లే 'రంస్యసే' రమించుచుంటివనడం లౌకికరీతిననుసరించి సీత అనిన మాట మాత్రమే. "పరమనారీణాం"

అన్నచోట అలంకరించు సైరంధ్రులు చెప్పబడినారు. లేక గొప్ప స్త్రీలచే స్పృశింపదగిన అని చెప్పవచ్చు. మరొక పక్షంప్రకారం తనను మానవునిగా రాముడు తలచినా వాల్మీకి మహర్షి "జజ్ఞే విష్ణు స్సనాతనః" అని చెప్పడంవల్ల మహావిష్ణువను భావం కలవాడు కావున 'పరమనార్యః' అను బహువచనం శ్రీదేవి, భూదేవి, నీళాదేవులను సూచిస్తున్నది.

మరొక సందేహం. సీతాపరిత్యాగానంతరం రాముడు అశ్వమేధాదులను అనుష్ఠించుటవల్ల బహుపత్నులున్నట్లు ఊహించినా వారు యజ్ఞాంగంగా పరిగ్రహింపబడిన వారవుతారేగాని భోగాదులకు ఉపయుక్తలు కారు. యథార్థంగా ఉత్తరకాండలో సీతాప్రతిమ ద్వారా యజ్ఞాదులలో పత్నీకృత్యాలు నిర్వహింపబడినట్లుంది. అట్టి స్థితిలో హేమాద్రి స్మృతిలో "దర్భపుంజీలం తత్ స్థానే నిధాయ" దర్భ కట్టనుంచుకొని యాగానుష్ఠానాదులు చేయవచ్చునని ఉండికదా! అంటే నారాయణావతారమైన శ్రీరాముని నడవడి కంటే స్మృతి ప్రమాణం కాలేదు. ఆపస్తంబమహర్షి 'ధర్మజ్ఞ సమయః ప్రమాణం వేదాశ్చ' అన్నారు. ముందు ధర్మజ్ఞుని ఆచారమే ప్రమాణంగా చెప్పబడింది. 'మహాజనో యేన గతస్స పంథాః' గొప్పవాడు నడచిందే మార్గమవుతుంది. కాని రాజసూయాశ్వమేధంలో భార్య లేకపోవడం వల్ల యాగం ఆగిపోవలసిఉండగా భగవదవతారరూపుడగు శ్రీ రాముడు ప్రతిమ ద్వారా తత్పూరణ చేసి యాగం నిర్వహించుటచే అది వేదవిహితమని గ్రహించాలి.

నియమయుక్తుడై శ్రీరాముడు మూడహోరాత్రాలు సముద్రుని ఉపాసించాడు. 'సమస్త రాక్షసులను అంగుళ్యగ్రంగా సంహరిస్తా' నని స్వశక్తిని ప్రకటించిన మహాపరాక్రమశాలియగు రాముడు నీతివేత్త కావడంవల్ల ముందుగా సామమును ప్రయోగించాడు. అనపరాధివిషయంలో ఆక్రమణ అనుచితమని తెలిసి సముద్రుని ఉపాసించాడు. ఈ విధంగా యథాశాస్త్రీయంగా శరణాగతుడయినప్పటికి అజ్ఞుడగు సముద్రుడు దర్శనమివ్వలేదు. అందువల్ల క్రోధంతో రక్తాక్షుడగు రాముడు లక్ష్మణునితో ఇట్లన్నాడు. ఇక్కడ లక్ష్మణుడు 'శుభలక్షణం' అని చెప్పబడినాడు. రాముని ఆగ్రహాన్ని గమనించి మందహాసం చేయడంవల్ల ఆ విశేషణం చెప్పబడింది.

**గో.వి.** రాముడు చక్కగా శరణాగతి చేసినాడు కదా! ఫలితం రాకపోవుటకేమి కారణం? అనే సందేహానికి శరణాగతికి క్షత్రియుడగు రాముడు అధికారి కాడు. అందుకు అసమర్థుడే అధికారి. రాజసూయంలో అనధికారియైన బ్రాహ్మణుడు ఆ యాగం చేస్తే ఫలితముంటుందా?

లక్ష్మణా! గర్విష్టుడగు ఈ సముద్రుడు స్వయంగా దర్శనమివ్వడంలేదు. క్రోధము లేకుండుట, అపరాధాలను సహించుట, పరచిత్తములను అనుసరించుట, ప్రియవాదిత్వం, ఈ సద్గుణాలన్నీ గుణరహితులవిషయంలో అసమర్థుడు అనే బుద్ధిని కలిగిస్తాయి. ఇక ఆత్మస్తుతిపరుని, వంచకుని, నిర్దయుని, అపమార్గవర్తిని, మంచిచెడులు గమనింపక ఒకే రకమైన దండన విధించేవానిని, అజ్ఞులు సత్కరిస్తారు. గుణవంతుడనే కీర్తిగాని, దాత అనే యశస్సుగాని, యుద్ధంలో జయముగాని, సామోపాయంతో సంభవించవు. ఈ సముద్రాన్ని నా బాణాలతో శోషింపజేయాలనుకున్నా నా సహనగుణం ఆ పనిని చేయనివ్వడంలేదు. ఈ సముద్రుడు నన్ను అసమర్థుడుగా భావిస్తున్నాడు. రాక్షసనివాసస్థానమైన సముద్రం తద్దోషాలను గూడ స్వీకరించింది. ఛీ! ఇట్టి సముద్రుని విషయంలో

క్షమాగుణం పనికిరాదు. ఇంతవరకు దర్శనమివ్వని సముద్రుని మాటలతో భయపెట్టిన రాముడు చేతలతో భయపెట్టబోతున్నాడు.

"చాపమానయ సౌమిత్రే శరాంశ్చాశీవిషోపమాన్, సాగరం శోషయిష్యామి పద్భ్యాం తు ప్లవంగమాః" లక్ష్మణా! ధనువును, బాణములను ఇమ్ము. సముద్రాన్ని శుష్కింప జేస్తాను. వానరులు పాదచారులై సముద్రాన్ని తరింతురు గాక!

**గో.వి.** ఇక్కడ శ్రీరాముడు సత్వరమే బాణప్రయోగం చేయకుండా ఇప్పటికయినా సముద్రుడు దర్శన మిచ్చునేమోనని వ్యవధినిస్తూ మాట్లాడుతున్నాడు. (నిర్గుణం వశీకర్తుం సగుణ మానయ) 'నిర్గుణుడైన సముద్రుని వశపరచుకోవడానికి సగుణమగు (గుణ మన ధనువును వంచి కట్టు నారిత్రాడు) ధనువును తెమ్ము' (అస్యాః అనమ్రత్వం నివారయితుం నమ్రం చాపమానయ) నమ్రస్వభావరహితుడగు ఇతనిని వంచుటకు (నారిత్రాడు కట్టుట వలన) వంగిన ధనువును తెమ్ము లక్ష్మణుడు శేషుని అవతారం కావడం వల్ల శేషునికి శయ్యాభూతమైన సముద్రునిమీదగల స్నేహభావంతో కొద్దిగ ఆలస్యం చేశాడు. అపుడు 'సౌమిత్రీ! ఆలస్యం చేస్తున్నావేమి?' అనగా లక్ష్మణుడు ధనువు నిచ్చినాడు రాముడు 'శరాంశ్చ' బాణాలను ఇమ్మన్నాడు. లక్ష్మణుడు సామాన్యబాణాలను ఇచ్చినాడు. అలాకాదు. 'ఆశీవిషోపమాన్' కంటిలో గూడ విషం ఉండే సర్పాలు ఆశీవిషములనబడతాయి. అట్టి సర్పతుల్య బాణాలను ఇమ్మనగా లక్ష్మణుడిచ్చినాడు. ఇవి ఎందులకని అడుగగా సాగరాన్ని శుష్కింపజేస్తానన్నాడు. రామబాణాలకు దాహశక్తి ఉంది. కావున చతుర్థీభూతమగు జలంలేకున్నా మిగిలిన నాలుగుభూతాలద్వారా జగత్తును నిర్వహింతునని భావం. మా కూటస్థుడగు సగరుని పుత్రులు త్రవ్వుటచే వృద్ధి పొంది సాగరమనే పేరు పొంది ఉన్న, నీవు జ్ఞాతి విరోధం చూపుతున్నపుడు మేము కూడా అలాగే ఉంటాం. నిన్ను శుష్కింపజేస్తాను. సగర పుత్రులు వేయి మంది తవ్విన నిన్ను నేనొక్కడనే ఎండింప జేస్తాను. వానరులు పాదచారులై లంకకు నడచి వెళ్ళుదురు గాక!

లక్ష్మణా! ఈ సముద్రాన్ని నా బాణాలతో కొట్టి నలుదిక్కుల చెలియలికట్టలు దాటునట్లు చేస్తాను. రాక్షస నివాసస్థానమైన సముద్రాన్ని నీళ్లతో సహా క్షోభింపజేస్తాను'! ఇట్లు పలికిన రాముడు కోపంతో కనుగ్రుడ్లు గిరగిరదిరుగ ధనుర్ధరుడై ప్రళయ కాలాగ్నివలె జ్వలించాడు. దృఢముష్టితో ఆకర్ణాంతం నారిసారించి లోకములు గడగడలాడునట్లు దేవేంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించినట్లు బాణాలు వదిలాడు. (ఇది అభూతోపమ వజ్రాయుధ మొకటియే కద?) ఆ సముద్రంలో బాణాలు జ్వలిస్తూ మహావేగంగా ప్రవేశించాయి. మహావాతం వలన జనించిన భయంకర శబ్దంతో కూడిన గొప్ప సముద్రతరంగాలు మొసళ్ళు, తిమింగలాలతో కూడినవై మహాఘోరంగా కనిపించాయి. శంఖములు, ముత్యపు చిప్పలతో కూడి ఎత్తుగా ఎగురుతున్న మాలారూపతరంగాలు కల సముద్రం రామబాణప్రవేశం వల్ల ధూమసహితయై భయంకరంగా కనిపించింది. రామబాణాలు పాతాళంలో ప్రవేశించినందున మహాసర్పాలు కన్నులెర్రబడగా విషం కక్కి పీడింపబడినాయి. పాతాళస్థదానవులు పీడింపబడినారు. సముద్ర తరంగాలు వింధ్య, మందర పర్వతాలవలె అత్యున్నతంగా ఎగసినాయి. కోపంతో తీవ్రంగా ఊపిరి పీల్చుతూ అపూర్వశరసంధాన ప్రయత్నం చేసే రాముని 'వద్దు- వద్ద' ని నివారించిన లక్ష్మణుడు రాముడు తత్ప్రయత్నాన్ని వీడనందున వేగంగా వచ్చి ధనుస్సును పట్టుకొన్నాడు.

## ఇరవైరెండవ సర్గము

**గో.వి.** మొదట సముద్రతరణం కోసం శరణము పొందగా సముద్రుడు దర్శనమీయనందున 'ధనువు తెమ్మ'ని మాటలతో భయపెట్టి ప్రయోజనం లేక బాణాలతో క్షోభింపజేసి అప్పటికీ సముద్రుని దర్శనమివ్వకపోవడం వల్ల భయపెట్టడానికి రాముడు బ్రహ్మాస్త్రసంధానం చేస్తూ ఇట్లన్నాడు.

ఓ సముద్రుడా! ఇపుడే నిన్ను పాతాళం వరకు ఎండగడతాను. నా బాణాలచేత నీ జలం ఇంకి పోతుంది. ఇసుక మాత్రమే మిగులుతుంది. పెద్దవర్షాలు పడినప్పటికి జలం లేకుండా చేస్తాను. వానరులపుడు నడచి లంకకు వెళతారు. నాబలాన్ని గాని పరాక్రమాన్ని గాని విచారించకుండా నావల్ల రాబోయే బ్రహ్మాస్త్రపీడను కూడా తెలసుకోలేకున్నావు. ఇలా పలికిన రాముడు బ్రహ్మశాపతుల్యమైన బాణాన్ని ధనుస్సు నందు సంధించి బ్రహ్మాస్త్రంతో అభిమంత్రించి వదలడానికి బాగుగా లాగాడు. అపుడు ఆకాశం, భూమి, విడిపడినట్లు అయింది. పర్వతాలు కంపించాయి. చీకటి కమ్మి దిక్కులు కనుపించలేదు. సరస్సులు, నదులు క్షోభించాయి. సూర్యచంద్రులు నక్షత్రాలతో భయంతో వక్రగమనం చేశారు. చీకట్లు కమ్మడం వల్ల సూర్యకిరణాలు ఆకాశంలో కొరవుల వలె కాంతిహీనములై కనుపించాయి. భయంకర శబ్దాలతో పిడుగులు పడినాయి. మేఘపంక్తులు వాయువుతో కూడి శబ్దించాయి. గొప్ప వృక్షాలు వాయువేగానికి విరిగిపోయాయి. కనుపించే మనుష్యాదులతో, కనుపించని పిశాచాదులతో కూడిన సమస్త ప్రాణులు భయపడి నినదించాయి. ఉద్వేగంతో క్రిందపడి స్పందించుటకు కూడా అశక్తములైనాయి.

అపుడు నాగ రాక్షస మిశ్రితతరంగాలతో మహావేగంతో సముద్రం రామబాణక్షుబ్ధమై ప్రళయకాలం కాకున్నా సీమకు ఆమడదూరం లోపలికి పోయింది. అలా వెనుకకు మరలిన సముద్రునిపై రాముడు బాణప్రయోగం చేయలేదు. మేరుపర్వతంనుండి సూర్యుడుదయించినటుల సముద్రమధ్యంనుండి సముద్రాధిదేవతయైన సాగరుడు దర్శనమిచ్చాడు. దివ్యాభరణాలను, రక్తవస్త్రాలను, పుష్పమాలలను ధరించిన అతడు తన సౌజన్యాన్ని ప్రదర్శించడానికి శిరసున అంజలి బంధన మొనర్చి బాణంను సంధించి ఉన్న రామునితో ఇలా అన్నాడు.

**గో.వి.** తన విరోధులను రాములచే సంహరింపజేయుటకు, రావణభీతుడు కావున రావణుని జయించు శక్తిని పరీక్షింప గోరి, సముద్రుడు ఆలస్యం చేశాడు.

ఓ రామా! నేనేమి చేయాలి? 1. లోతు లేకుండా ఉండమందువా?, 2. లేక నీళ్లను స్తంభింపజేయమందువా? 3. లేక సేతునిర్మాణంలో సహాయపడు మందువా? 1. ప్రశ్నకు సమాధానం. పృథివి, వాయువు, ఆకాశం, ఉదకం, అగ్ని, ఈ పంచభూతాలు కఠినంగా ఉండడం, పక్కకువీచడం, అవకాశం ఇవ్వడం, లోతుగ ఉండడం, ఊర్ధ్వంగా జ్వలించడం అనే సహజ గుణాలను వదలక నిత్యమర్యాదను ఆశ్రయించి ఉంటున్నాయి. నాకు లోతుగా ఉండడం, దాటుటకు వీలు లేకుండా ఉండడం, సహజస్వభావాలు. నేనిట్లే ఉండాలి. లోతు లేకుండా ఉండడం, దాటుటకు వీలుగా ఉండడం అనేవి నాకు వికారాలు. కాన నా అగాధత్వాన్ని వదలలేను. ఇక 2. కామ, లోభ, దండ భయాలతో ఏ కారణం వల్ల కూడా నీళ్లను ఘనీభవింపజేయలేను. (ఇట్లనుట వలన అన్ని మర్యాదలను నీవే కాపాడవలసినవాడవని సూచితమయింది) అట్లు చేసిన సముద్ర స్థిత సమస్త జల జంతువులకు బాధకలుగుతుంది కదా! 3. ఇక ఏ విధంగా నీకు సహాయంచేయగలనో అలా చేస్తాను. వానరసేన సముద్రం దాటువరకు

మొసళ్ళు మొదలగు జలచరాల బాధ కలుగకుండ చేస్తాను. సేతుబంధనం చేయునపుడు వృక్షాలు శిలలు మునుగకుండా చేస్తాను.

**గో.వి.** 'న కామాత్' ఏదయినా అభిలాషతో జలాలను స్తంభింప చేయలేను. 'న చ లోభాద్వా' నాయొక్క వస్తువులు నశిస్తాయనే లోభం వలన కూడా జలాలను స్తంభింపచేయలేను. కాని 'పార్థివాత్మజ' దశరథ గర్భజనిత పరమేశ్వర! నీవీశ్వరుడవు అనే భయంతో, నీ యందలి భక్తితో వానరరూపులగు నీ ఈ అంతరంగ భక్తులతో కూడిన నీపాదధూళిని వహించు భాగ్యం నాకు దొరుకతున్నదనే కారణంచేత సేతువు మునుగనివిధంగా జలాన్ని స్తంభింపజేస్తాను.

రాముడు ఇలా అన్నాడు. 'బాణం సంధించాను. వ్యర్థముకాని ఈ బాణాన్ని ఎక్కడ వేయాలి'? సముద్రుడు చెప్పాడు. 'ఇక్కడికి సమీపంలో ఉత్తరభాగాన 'ద్రుమకుల్య' మనే ప్రదేశం ఉంది. అక్కడ దుర్మార్గులగు దొంగలు వసిస్తూ నా నీటిని తాగుతున్నారు. పాపిష్టులగు వారి స్పర్శ భరించలేకున్నాను. అమోఘమైన ఈ బాణం వారిపై ప్రయోగించు.' సముద్రుడు వ్రేలితో చూపిన ఆ ప్రదేశంలో పిడుగు వంటి ఆ బాణాన్ని రాముడు విడిచాడు. అక్కడ భూమి బాణపీడితమై పెద్దగ నినదించింది. బాణవ్రణితమైన ఆ ప్రదేశం నుండి రసాతలంలోని జలం పైకి వచ్చింది. ఆ బావికి 'వ్రణకూప' మనే ప్రఖ్యాతి కలిగింది. ఆ ఉదకం సముద్రమువలె భాసించింది. ఆభీరాది చోరులచే స్పృశింపబడిన జలాలను ఆ ద్రుమకుల్య ప్రదేశంనుండి శ్రీరాముడు శోషింపజేశాడు. ఆ సముద్ర మధ్య ప్రదేశానికి శ్రీరాముడు అనేక వరాలిచ్చాడు.

**వ్యా.వి.** ఒక సందేహం తనను మనుష్యునిగా భావించుకొంటున్న రాముడు వరములివ్వడం ఎలా? అని "అమర విక్రమః" 'సత్యంచే లోకాలను జయిస్తున్నాడ' నే న్యాయానుసారం సర్వలోకాలను వశపరచుకొనినవాడు కావున వరప్రదుడు కావడం ఉచితమే. పశువులకు సుఖప్రదమగు పచ్చగడ్డి కలిగియుండుగాక! వ్యాధులు ప్రారంభకాలమందే నశించుగాక ! తేనె, నెయ్యి, బహుక్షీర ప్రదములగు పశువులు, సుగంధ యుక్త సమస్తౌషధులు, వీటితో ఈ ప్రదేశం నిండియుండు గాక! రామవరప్రభావంతో మరుభూమి కాంతారంగా మారడంవల్ల ఆ ప్రదేశం 'మరుకాంతారం'గా ప్రసిద్ధి చెందింది. సముద్రుడు శ్రీరామునితో ఇలా అన్నాడు. ఈ నలుడు విశ్వకర్మ పుత్రుడు. పితృసమానుడు. ఈతని తల్లికి విశ్వకర్మ 'నా వంటి కుమారుడు నీకు పుట్టున' ని వరమిచ్చాడు. ఆకాశంలోనూ, నీళ్లలోనూ స్థిరనిర్మాణాలను, చరమగు విమాననిర్మాణాన్ని తండ్రివలె చేయగలడు. నాపై ఇతడు సేతువును నిర్మించుగాక! ఆసేతువును మునుగకుండ నేను వహిస్తాను. ఈ విధంగా చెప్పి సముద్రుడు అంతర్హితుడయ్యాడు.

**మ.వి.** రామసంబంధమాత్రంతో ఆంజనేయునికి మైనాకుని ఆశ్రయభూతునిగా చేయ ప్రయత్నించిన సముద్రుడు సాక్షాత్ రాముడే వచ్చినపుడు ముందుగనే సేతునిర్మాణోపాయం ఎందువల్ల చెప్పలేదు? నిజమే. తాను ఆలసించినగాని కోపించి రాముడు శరసంధానం చేయడు. అస్త్రప్రయోగానికి ముందు ప్రసన్నుని చేసుకొని అదే బాణంతో తనశత్రువులను సంహరింపజేసి పిదప ఉపకరించాలని సముద్రుని భావం.

అపుడు నలుడు లేచి రామునితో ఇట్లన్నాడు. సముద్రుడు నిజం చెప్పాడు. విస్తృతమైన ఈ సముద్రంపై సేతునిర్మాణం చేస్తాను. మాతండ్రి నా కట్టి సామర్థ్యమిచ్చాడు. తిరిగి వానరులతో ఇట్లన్నాడు. పురుషునికి దండోపాయమే ఆశ్రయణీయమని నా భావం. కృతఘ్నులుకానివారి యందు సహనం వ్యర్థం. సామదానోపాయాలు వ్యర్థములు. ఈ సాగరుడు సగరపుత్రులచే వృద్ధి చెంది కూడా కృతజ్ఞత లేక ఆలస్యం చేసి రామబాణభయంతో సేతునిర్మాణానికి తగిన చోటు చూపాడు. నా శక్తిసామర్థ్యాలను గూర్చి సముద్రుడు యథార్థమే పలికాడు. ఎవరూ చెప్పకుండానే నా శక్తిని నేనే చెప్పుకొనేవాడను కాను. ఓ వానరులారా! సేతునిర్మాణంలో నాకు సామర్థ్యం ఉంది. సేతునిర్మాణం కొరకు వృక్షశిలాదులను తీసుకొనిరండి.

పిమ్మట రామనియుక్తులగు వేలమంది వానరులు అన్నిదిక్కులకూ ఉత్సాహముతో వెళ్లారు. పర్వతాకారులైన వానరులు మహా వృక్షాలను విరచి సముద్రం వద్దకు తెచ్చారు. సాలాది నానావృక్షాలతో సముద్రాన్ని పూరించారు. సమూలాలు, మూలరహితాలు అయిన వృక్షాలు తెచ్చారు. వృక్షాలు చాలక మహాకాయులైనవాళ్లు గజసదృశమైన మహాపాషాణాలను యంత్రాల మీద తెచ్చారు. మహాశిలలు వేయడంవల్ల పైకెగసిన జలం ఆకాశంలో అక్కడక్కడ వ్యాపించింది. సముద్రం క్షోభించింది. హెచ్చుతగ్గులు లేకుండా ఉండడానికి కొందరు నూరు ఆమడలనిడివిగల త్రాడు పట్టుకొని సరిచేస్తూ ఉన్నారు. కొందరు కర్రలను పేర్చారు. దండధారులగు కొందరు వానరులను త్వరపరిచారు.

**మ.వి.** "దండానన్యే ప్రగృహ్ణంతి విచిన్వంతి తథాఽ పరే" సేతువును కొలుచుటకు 'మాన' దండాలను కొందరు ధరించారు. 'విచిన్వంతి' ఉబ్బెత్తులను పరీక్షిస్తూ ఉన్నారు. లేక వృక్షాదుల తెచ్చు వానరులను త్వర పెట్టడానికి బెత్తాలను పట్టుకొన్నారు. శ్రమకలిగి వృక్షచ్ఛాయలలో విశ్రమించినవారిని 'విచిన్వంతి' అన్వేషిస్తున్నారు.

మహాశిలలను ధరించి పరువెత్తుచున్న వానరులు ఏనుగులవలె కనుపించారు. వానరసహాయంతో సముద్రమీద మొదటి రోజు 14 ఆమడల పొడవు, రెండవ రోజు 20 ఆమడల పొడవు, మూడవ రోజు21 ఆమడల పొడవు, నాలుగవ రోజు 22 ఆమడల పొడవు, ఐదవ రోజు 23 ఆమడల పొడవు, సువేల పర్వత పర్యంతం నలుడు సేతువును నిర్మించాడు. ఈసేతువు ఆకాశంలోని నక్షత్ర సంచార యోగ్యమగు 'స్వాతి' మార్గంవలె శోభించింది. పది ఆమడల వెడల్పు, నూరు ఆమడల పొడవు గలిగి అనితరసాధ్యమైన నలనిర్మితసేతువును దేవగంధర్వాదులు అకాశగతులై చూచి విస్మయం పొందారు. సంతుష్టులగు వానరులు ఎగురుతూ, పరువెత్తుతూ, ఉత్సాహం ప్రదర్శించారు. గదాపాణియగు విభీషణుడు అనుచరసహితంగా సముద్ర దక్షిణతీరప్రాంతంలో శత్రువులను ప్రహరించడానికి నిలిచి ఉన్నాడు. సుగ్రీవుడు రామునితో 'హనుమంతునిపై నీవు, అంగదునిపై లక్ష్మణుడు అధిరోహించండి. శతయోజన విస్తీర్ణమగు ఈ సముద్రాన్ని నడచి దాటడం ఆలస్యకారకం. వీళ్లు ఆకాశమార్గాన సత్వరం దరికి చేర్చుతారు' అన్నాడు. సేనకు ముందు భాగాన సుగ్రీవ లక్ష్మణ సహితుడగు రాముడు వెళ్ళాడు. వానరసేన వారిని అనుసరించింది. అపుడు వెలువడిన ఘోరశబ్దం సముద్రఘోషను అణచివేసింది. సముద్రం దాటిన వానరసేన సుగ్రీవాజ్ఞానుసారం కందమూలఫలాదులు, సమృద్ధోదకము కల ప్రదేశంలో విడిసింది. సేతుబంధనం చూచిన దేవ గంధర్వాదులు రాముని విజయాన్ని ఆకాంక్షించి శుభం పలికారు.

## ఇరవైమూడవ సర్గము

ఉత్పాత నిమిత్తాలను చూచిన శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లన్నాడు. జనక్షయాన్ని సూచించే అనేక ఉత్పాతాలు కనుపిస్తున్నాయి. వానర రాక్షస వీరసంహారం సంభవిస్తుంది. సూర్యునిచుట్టూ నలుపు, ఎరుపు, ముదురు ఎరుపు రంగులు కలిగిన పరివేషం (వరద గూడు) లోకనాశం కొరకు ప్రళయకాలంలో ఏర్పడే పరివేషం వలె ఉదయించి క్రూరంగా భాసిస్తున్నది. ఇట్లే అమంగళకరమైన ఉత్పాతాలు కనుపిస్తున్నాయి.

**గో.వి.** సాయంకాలం ఇలా మూడు మండలలుగా మూడు వర్ణాలతో పరివేషం ఏర్పడడం రాజుల నాశనాన్ని సూచిస్తున్నది. కాశ్యపుడు ఇలా అన్నాడు. "నృపఘ్నో యస్త్రి మండలం" "దినకర పరివేషస్సర్వనాశశ్చతుర్థే" సాయంకాలపరివేషం సర్వనాశనసూచకం. సూర్యునిలో నల్లని ఛిద్రము కనుపిస్తున్నది. "చంద్రార్క మండలచ్ఛిద్రం దృష్ట్వా జనపదక్షయః" చంద్రసూర్యులయందు రంధ్రం కనిపిస్తే జననాశం సంభవిస్తుందని వరాహమిహిరుడన్నాడు. రాముడు ఇలా చెప్పి లంకాభిముఖంగా బయలుదేరాడు. రామునికి ఉత్సాహం కలిగించడానికి వానరులు తోకలనెత్తుట ప్రభృతి మర్కటచేష్టలతో గర్జిస్తూ బయలుదేరారు. 'లంకను చూచి వానరులు భయపడుదురేమో' నని సందేహించిన రాముడు వీరిని జూచి సంతసించాడు.

## ఇరవైనాల్గవ సర్గము

వానరసేనానివేశనానన్తరం శ్రీరాముడు ధ్వజాది శోభితమైన లంకను చూచాడు. "మృగశాబాక్షి" లేడిపిల్ల కన్నుల వంటి కన్నులు కలిగిన సీత రావణనిర్బంధంలో ఉన్న విషయాన్ని స్మరించి వేడిగా నిట్టూర్చి యుద్ధయాత్రా సమయంలో సీతను స్మరించుకోవడం అనుచితమని భావించి ఆమెను స్మరించడం ఆపి లక్ష్మణునితో సీతావియోగ దుఃఖవిస్మారకంగా లంకానగరాన్ని వర్ణించి చెపుతున్నాడు.

**గో.వి.** మాయామృగాన్ని (లేడిని) పట్టుకోవడానికి తాను దానిని అనుసరించి వెళ్లే సమయంలో ఆ మృగం వంక కుతూహలంతో లేడిపిల్ల చూచినట్లు చూచిన ఆ సీత స్మృతిపథానికి రావడంలో రాముడట్లు "మృగశాబాక్షి" అని స్మరించాడు.

లక్ష్మణా! విశ్వకర్మనిర్మితమై పర్వతాగ్రంలో కల ఈ లంకను చూడు. ఉన్నతసౌధాలతో లంక తెల్లని మేఘాలచే కప్పబడిన ఆకాశంవలె శోభిస్తున్నది. పత్ర పుష్ప ఫల శోభితాలైన వనాలతో, అనేక పక్షి జాతులతో లంక శోభిస్తున్నది. మదించిన కోకిలలతో, మధుమత్తములై పుష్పములమీద లీనమయిన తుమ్మెదలతో, కోకిలలతో ఆకులితమైన వనాలను మాటిమాటికి వాయువు కంపింపజేస్తున్నది అని రాముడు అన్నాడు.

**గో.వి.** మదించిన కోకిల లుండుట– ఈ విశేషణం వల్ల ఎల్లప్పుడూ పండ్లు ఉన్నాయని, పుష్పాలమీద లీనమయిన తుమ్మెదలు కలవనుటచే ఎల్లప్పుడూ పూసే పుష్పాలు కలిగినవని, కోకిలలచే ఆకులితమనుట వలన కోకిలలు చిగురుటాకులను అభిలషిస్తాయి. కావున ఎల్లప్పుడూ చిగురుటాకులను కలిగినట్టి వనాలని చెప్పబడింది.

పిమ్మట రాముడు గరుడవ్యూహంగా నివేశితమయిన వానరసేనయందు ఆయాస్థానాలలో నీలాంగదాదులను నియమించాడు. పిదప రామాజ్ఞానుసారం విముక్తుడగు శుకుడు మహాభయం పొంది రావణుని సమీపానికి

వెళ్లాడు. శుకుని చూచిన రావణుడు నవ్వుతూ 'నీరెక్కలు విరువబడినట్లు కనుపిస్తున్నాయి. చపలచిత్తులైన వానరులకు చిక్కితివా ఏమి?' అని ప్రశ్నించాడు. భయంతో శుకుడిట్లన్నాడు. సముద్రోత్తర తీరంలో సుగ్రీవునికి నీ సందేశాన్ని యథాతథంగా వినిపించాను. నన్ను చూచిన వెంటనే వానరులు బంధించి చంపడానికి ప్రయత్నించారు. తీవ్రకోపంతో వున్న వారితో మాట్లాడే అవకాశం కలుగలేదు. విరాధకబంధఖరహంతయైన శ్రీరాముడు సేనాసమేతుడై సేతువును నిర్మించి సముద్రం దాటి సీతాస్థానానికి వచ్చినాడు. వానర భల్లూకసేన భూమిని ఆవరించి ఉంది. వానర రాక్షస బలాలకు సంధి కుదరదు. సీతనివ్వడంగాని, యుద్ధం చేయడంగాని, ఏదో ఒకటి వెంటనే చేయాలి. శుకుడు ఇలా చెప్పగా రక్తనేత్రుడైన రావణుడు కన్నులతో దహించేవానివలె చూస్తూ ఇలా అన్నాడు. అన్ని లోకాల నుండి నాకు భయం ఏర్పడినా సీతను ఇవ్వను. సముద్రవేగం, మారుతగమనం నాకు ఉన్నవనే విషయం తెలియక రాముడు నాతో యుద్ధాన్నే కోరుతున్నాడు. నా పరాక్రమ మితఃపూర్వం రామునికి తెలియదు. ఇపుడు తెలియగలదు. (ఇచట రావణుడు రూపకాలంకార మిషతో యుద్ధం తనకు వినోదకారి అని చెపుతున్నాడు) శత్రుసేన అను నృత్యశాలలో ప్రవేశించి బాణాలనే వీణను వాయిస్తూ దండాలతో మ్రోగినట్టి, నారిత్రాటిశబ్దమే తుముల స్వనంగా కలిగినట్టి, భీతులు, ఆర్తులు, చేయు రోదన ధ్వనులే మహాస్వనంగా కలిగినట్టి, బాణాల ధ్వని అనే నాదం కలిగినట్టి, ధనుర్వీణను యుద్ధభూమిలో మ్రోగిస్తాను. (వీణకు 'మంద్ర' 'మధ్య' 'తార' భేదాలతో స్వరత్రయమున్నట్లు ఇచట గూడ మూడు స్వరాలు చెప్పబడినాయి).

## ఇరవైయైదవ సర్గము

పిమ్మట రావణుడు మంత్రులగు శుక సారణులతో (ఈ శుకుడు గత సర్గలో మాటలాడిన శుకుడు కాడు) ఇలా చెప్పాడు. 'అపూర్వమగు సేతువు రామునిచే నిర్మితమయింది. వానరసేన సముద్రం దాటింది. వానర బలాన్ని గురించి తెలిసికోవలసి ఉంది. మీరిరువురు రహస్యంగా వానరసైన్యంలో ప్రవేశించి సైన్యసంఖ్యను, వారి బలపరాక్రమాదులను గ్రహించండి. అన్ని విషయాలు తెలుసుకొని శీఘ్రంగా రండి.' ఈ విధంగా రావణుడు ఆదేశించగా శుకసారణులు మర్కటరూపాలను ధరించి వానరసేనలో ప్రవేశించారు. పర్వతాగ్రములయందు, గుహలయందు, అరణ్యమందు, సముద్రతీరమందు, సముద్రమును దాటిన, దాటుచున్న, దాటబోయెడి వానరసేనా సముద్రాన్ని చూచారు. అపారమగు ఆ వానరసేనను లెక్కించడం వారికి సాధ్యం కాలేదు. వీరిని గుర్తించిన విభీషణుడు వీరిని శ్రీరాముని వద్దకు తీసుకొనివచ్చి 'ఈ శుకసారణులు రావణుని మంత్రులు చారులుగా' వచ్చారని చెప్పాడు. వారు జీవితాశవదలి భయంతో వినయంగా ఇట్లన్నారు. 'రామా! రావణుడు పంపగా మీ బలం తెలిసికోవడానికి వచ్చాము' సర్వభూతహితుడైన రాముడు వారిని చూచి నవ్వుచూ ఇట్లన్నాడు. మీరు సైన్యాన్ని, మమ్ములను పరిశీలించారు కదా! పని పూర్తి అయినచో తిరిగి వెళ్లండి లేక చూడతగినదేదయినా ఉంటే ఈ విభీషణుడు మీకు పూర్తిగా చూపగలడు. మీకు ప్రాణభయం లేదు. ఆయుధరహితులగు దూతలు వధార్హులు కారు. విభీషణా! వీరిని విడిచిపెట్టు. శుకసారణులారా! మీరు లంకకేగి రావణునితో నా ఈ మాటలు చెప్పండి. 'ఏ బలంతో నా భార్యయగు సీతను అపహరించావో సైన్యయుతుడవై ఆ బలాన్ని ప్రదర్శించు. రేపు లంకను ధ్వంసం చేస్తాను' రామసందేశం విని ధర్మవత్సలుడగు రామునకు 'జయ' మని పలికి లంకకు తిరిగి వచ్చి

రావణునితో శుకసారణులు ఇలా చెప్పారు. 'విభీషణునకు పట్టుబడిన మేము వధార్హులమైనా తేజస్వియు, ధర్మాత్ముడు అగు రామునిచే విముక్తులమైనాము. సేనమాట అటుంచండి శస్త్రాస్త్రవేత్తలగు రామలక్ష్మణసుగ్రీవవిభీషణులు ఈ నలువురే ప్రాకారయుక్తమైన లంకను పెకలించి మరొకచోట పెట్టుటకు సమర్థులు. లక్ష్మణ సుగ్రీవ విభీషణుల నట్లుంచండి. శ్రీరాముని రూపాన్ని, ఆయుధాలను చూస్తే ఆతడొక్కడే లంకలోని సమస్త రాక్షసులను వధించగలడని తలచుకొంటున్నాము. ఆ సేన ఇంద్రాదులకుగూడ నజేయం. వారితో విరోధం వద్దు. సీతను రామునికి సమర్పించడం మంచిది.

## ఇరవైయారవ సర్గము

వారు చెప్పిన హితవాక్యాలను విని 'సర్వ లోకాల నుండి భయం వచ్చినప్పటికి సీతను అర్పించను. వారికి పట్టుబడి భయంతో మీరు ఇట్లు అంటున్నారు. నన్నెవరు జయించగలరు?' ఇట్లు పలికి వానరసేనను చూచు తలంపున శుకసారణులతో అత్యున్నత సౌధమెక్కి సముద్రం, భూమి, పర్వతాలు, అంతటా వానరావృతమై ఉండడం చూచి రావణుడు సారణుని ఇట్లు ప్రశ్నించాడు. 'వీరిలో మహాశూరులెవరు? ఎవరు ముందుగా యుద్ధంలో పాల్గొంటారు? ఎవరి మాట సుగ్రీవుడు వింటాడు? సేనానులలో ఎవరు ముఖ్యులు? సారణా! యథార్థం జెప్పు' అపుడు సారణుడు సేనానాయకులను వివరించి చెపుతున్నాడు.

లంకాభిముఖంగా సింహనాదం చేస్తున్న ఈ నీలుడు సర్వవానర సేనానాయకుడు. ఇతడు వాలిపుత్రుడైన, యువరాజు అంగదుడు. ఇతడు సేతునిర్మాత నలుడు. ఇతడు శ్వేతుడు. ఇతడు కుముదుడు. ఇతడు రంభుడు. ఇతడు శరభుడు. ఇతడు వినతుడు. ఇతడు క్రోధనుడు. ఇతడు గవయుడు. ఈ సేనా నాయకు లందరు బలవంతులు, కామరూపులు. వీరు స్వీయసైన్యంతో లంకను మర్దింప నుత్సహిస్తున్నారు.

## ఇరవైయేడవ సర్గము

ఇతడు హరుడు. భల్లూకాధిపతియగు ధూమ్రుడితడు. ఇతడు జాంబవంతుడు. దేవాసుర యుద్ధ మందితడు ఇంద్రునకు సహాయపడి అనేక వరముల నందినాడు. ఇంద్రోపాసకుడీ దంభుడు. నాలుగు కాళ్ళ జంతువులలో ఈ సన్నాదనునికి మించిన శరీరం ఎవరికీ లేదు. ఇతడామడ దూరంగా అంగ వేస్తాడు. ఇతడు క్రథనుడు. పూర్వవైరాన్ని స్మరించుకొంటూ గజములచే వృక్షాలను వృక్షాలచే గజములను ప్రహరిస్తూ ఉంటాడు.

**వ్యా.వి.** శంబపాదుడనే రాక్షసుడు గజరూపధారియై మునులను బాధిస్తుండగా హనుమానుని తండ్రి యగు కేసరి మునుల ప్రేరణతో గజరూపధారియగు శంబపాదుని సంహరించాడు. సంతుష్టులైన మునులు కేసరికి 'మహా పరాక్రమశాలియగు సుతుడు కలుగున' ని వరమిచ్చారు. అది మొదలు ఏనుగులకు, కోతులకు వైరమేర్పడింది. ఇతడు ప్రమాథి. కొండముచ్చులకు నాయకుడు. ఇతడు ఆంజనేయుని తండ్రి కేసరి. ఇతడు శతవలి. ఇక గజ, గవాక్ష, గవయ, నీల, నళప్రభృతి సేనా నాయకులొక్కొక్కరు 10కోట్ల వానరులకు నాయకులు. మహాప్రభువులగు వీరు లంకను మర్దింప గోరుతున్నారు.

## ఇరవైయెనిమిదవ సర్గము

సారణుడు చెప్పమరచిన వారిని శుకుడు వ్రేలితో చూపుతూ చెప్పడం ప్రారంభించాడు. ఈ స్ఫురద్రూపులగు మైందద్వివిదులు అమృతప్రాశన చేశారు. ఇతడు సీతనన్వేషించి నిన్ను దర్శించిన వాయుసుతుడు, కేసరికి క్షేత్రజుడు అగు ఆంజనేయుడు. ఇతడు బాల్యదశలో ఆకలితో సూర్యుని జూచి "ఈ సూర్యుని భక్షించెద" నని తలచి స్వీయవాస స్థానమైన కనకాచలంనుండి ఆకాశానికి ఎగసి సూర్యతేజస్సుచే ఉదయపర్వతంమీద పడినాడు. దవడ (హను) భాగం భిన్నమగుట వలన 'హనుమంతుడ' ని పిలువబడుతున్నాడు.

**గో.వి.** ఉత్తరకాండ యందు వజ్రాయుధంతో కొట్టబడుటవలన పడిపోయినట్లుంది కద? అనే సందేహానికి సమాధానం. అది కూడా కారణాంతరమని.

ఈ హనుమానుని అధిరోహించిన నల్లని శరీరచ్ఛాయ కలిగినట్టి, పద్మనేత్రుడైన రాముడు ఇక్ష్వాకు వంశంలో అతిరథుడు. ఖర, విరాధ, వాలి ప్రభృతి మహావీరులను వధించిన ప్రఖ్యాత పౌరుషం కలవాడు. అంత మాత్రమే కాదు. "యస్మిన్ ధర్మో న చలతి" జాబాలి మహర్షి నాస్తికవాద మొనర్చి అయోధ్యకు తోడ్కొని వెళ్ళ ప్రయత్నించినా ధర్మమార్గం నుండి చలించనివాడు."యో ధర్మం నాతివర్తతే" భరతుడు బ్రతిమిలాడినా తండ్రికిచ్చిన మాటను జవదాటనివాడు. సీత 'రాక్షసులతో నిష్కారణకలహము వలద' నినా మునులకు చేసిన అభయప్రదానరూపధర్మాన్ని వదలనివాడు. వేదాలు, బ్రహ్మాస్త్రాలు తెలిసినవాడు, ఇంద్ర పరాక్రముడు. మృత్యువునకు వలె మహాక్రోధం కలవాడు. ఈతని భార్య అయిన సీతను నీవు అపహరించావు. ఆ రాముడు నీతో యుద్ధం చేయడానికి వచ్చి ఉన్నాడు. రాముని కుడిపార్శ్వంలో బంగారుఛాయతో నిలబడి ఉన్న లక్ష్మణుడు రామునికి కుడిచేయి వంటివాడు. ప్రాణసముడు. ప్రాణరక్షకుడు. నీతిలోను సర్వశాస్త్రాలలోను నిష్ణాతుడు. రామునికి ఎడమవైపు ఉన్నట్టి విభీషణుడు రాజ్యకాంక్షా రహితుడు. రాజరాజగు శ్రీరాముని చేత లంకకు రాజుగా అభిషేకింపబడినాడు. రామ – విభీషణుల మధ్య పర్వతసదృశుడగు సుగ్రీవుడున్నాడు. వంశంచేత, జ్ఞానంచేత వానరులను అతిశయించి ప్రకాశిస్తున్నాడు. ఏ మాలాధారణం వలన వాలి అపరాజితుడుగా ఉండెనో! ఆ కాంచనమాలను, తారాదేవిని, వానరరాజ్యాన్ని, శ్రీరామునివలన శాశ్వతంగా పొందినాడు. సమస్తవానరసేనాపరివృతుడగు సుగ్రీవుడు నీతో యుద్ధం చేయ నిలచి ఉన్నాడు. ఈ వానరసేనను జయించే ప్రయత్నం చేయుము.

**గో.వి.** "యథా జయస్స్యాన్న పరైః పరాజయః" యథా తే జయ స్యాత్, పరైః పరాజయః న స్యాత్ నీకెట్లు జయం కలుగునో– శత్రుకారణంగా పరాజయం కలుగదో అలా ప్రయత్నించు. ఇది ముఖ్యార్థం. కాని 'యథా తే జయః న స్యాత్, పరైః పరాజయః స్యాత్ తథా యత్నః విధీయతాం' నీ కెట్లు జయం కలుగకుండునో, శత్రువులచే పరాజయమే కలుగునో, ఆ యత్నం చేయుమనే అర్థం ధ్వనిస్తున్నది.

## ఇరవైతొమ్మిదవ సర్గము

శత్రువులను చూచి భీతులైన శుకసారణులు శత్రువులను స్తుతించారని తలచిన రావణుడు తన భయాన్ని కప్పిపుచ్చుకొనుటకు అధోముఖులై నమస్కరిస్తున్న శుకసారణులతో పరుషంగా ఇట్లన్నాడు. నిగ్రహానుగ్రహసమర్థుడగు

రాజునకు అప్రియములైన ఇట్టి మాటలు చెప్పడం తగినది కాదు. శత్రువులు యుద్ధార్థమై ఎదురు వస్తూ ఉండగా తగని సమయంలో ఈ శత్రుస్తవమేల? రాజును అనుసరించి జీవించువారు ఎట్లు మెలగాలి అనే రాజనీతిసారం మీకు తెలియలేదు. మీరొనర్చిన గురుసేవ వృథా అయింది. రాజనీతిని మీరధ్యయనం చేసినా తద్విశేషజ్ఞానం మీకు కలుగలేదు. మీవంటి మూర్ఖులు మంత్రులుగా ఉండగా దైవగతి వలన రాజ్యాన్ని వహించాను. జీవించి ఉన్నాను. మీకు మృత్యుభయం లేదా ఏమి? నా నోరే మరణాన్ని గాని, శ్రేయస్సును గాని ఇచ్చును కద? దవాగ్ని మధ్య వృక్షాలు జీవించవచ్చుగాని రాజు కోపపాత్రులు జీవించలేరు. మీ పూర్వోపకారాలను స్మరించి శత్రుపక్షాలను ప్రశంసించినా మిమ్మల్ని చంపడం లేదు. నా సన్నిధిలో ఉండకుండా బయటకు వెళ్లండి. మిమ్మల్ని పరిత్యజించడమే మీకు మరణతుల్యం! రావణుడు ఇలా కఠినంగా అనగా సిగ్గుపడిన శుకసారణులు రావణుని 'జయ' మని అభినందించి వెళ్లారు. రావణుడు సమీపంలో ఉన్న మహోదరునితో 'నీతిజ్ఞులగు చారులను శీఘ్రంగా పిలువమని' చెప్పాడు. మహోదరుని ఆజ్ఞానుసారం చారులు వచ్చి జయమని పలికారు. శత్రుభయం ఎరుగని విశ్వసనీయులైన ఆ చారులతో రావణుడు ఇలా అన్నాడు. 'మీరు రాముని కర్తవ్యనిశ్చయాన్ని పరీక్షించండి. అతని ఆంతరంగికులైన మంత్రు లెవరు? రాముడెలా నిద్రిస్తాడు? ఎలా మేల్కొంటాడు? అన్ని విశేషాలను తెలిసికొనిరండి'.

**గో.వి.** రాముని కర్తవ్యనిశ్చయం దృఢమైనది కానిచో భయపెడదాము. అంతరంగమంత్రులు ప్రీతియుక్తులు కానిచో భేదోపాయాన్ని ప్రయోగిద్దాము. రాముడు ఒంటరిగా నిద్రిస్తాడా? లేక అనేకులతో కలసి నిద్రిస్తాడా? ఏకాకిగా నిద్రించే యెడల నిద్రాసమయంలో యుద్ధం చేద్దాము. మెలకువ సమయంలో చింతిస్తాడా? లేక నిశ్చలుడుగ ఉంటాడా? చింతాకులుడుగా ఉంటే వెంటనే దాడి చేద్దాము. లంక మీద దండెత్తుటలో ఆలస్యం చేస్తాడా లేక వెంటనే బయలుదేరుతాడా? ఆలస్యమైతే క్రమంగా వంచన చేద్దాము. అని రావణుడు ఆలోచించి అన్ని వివరాలను పరిశీలించి రమ్మని చారులను పంపాడు.

పండితులగు రాజులు చారులద్వారా శత్రుసమాచారాన్ని పూర్తిగా తెలిసికొని యుద్ధంలో స్వల్ప ప్రయత్నంతోనే జయిస్తారు. చారులు శార్దూల పురస్సరంగా రామలక్ష్మణులున్న చోటికి వెళ్లారు. అపారమైన వానరసేనను చూచి భయపడినారు. విభీషణునిచే గుర్తింపబడి పట్టుబడినారు. వానరపీడితులగు ఈ చారులందరు దయామయుడైన రామునిచే ముక్తులైనారు. తిరిగి వచ్చి రావణునికి శ్రీరాముని వృత్తాంతమును నివేదించారు.

## ముప్పైయవ సర్గము

శార్దూలుడు తాము పట్టుబడి రామునిచే విడిపింపబడిన వృత్తాంతాన్ని రావణునికి నివేదించి సేనాసమేతుడగు రాముడు యుద్ధము చేయడానికి వస్తున్నాడు. సీతనిమ్ము, లేక చక్కగా యుద్ధం చేయుమని పలికాడు. సీతాప్రదానానికి ఇష్టపడని రావణుడు శార్దూలుని ఇలా అడిగాడు. 'వానరుల పరాక్రమాదులెట్టివి? వారెవ్వరెవ్వరి సంతానం? వారి ప్రభావమెట్టిదనే విషయం, వారి బలాబలాలు ఎలా ఉంటాయి? వీటిని గుర్తించి కర్తవ్యం నిశ్చయించుకొంటాను.' శార్దూలుడిట్లు సమాధానం చెప్పాడు.

రాజగు సుగ్రీవుడు ఋక్షరజసుని పుత్రుడు. గద్గద పుత్రుడు జాంబవంతుడు.

**మ.వి.** బ్రహ్మదేవుడు ఆవులించగా జాంబవంతుడు జన్మించినట్లు "జృంభమాణస్య సహసా మమ వక్త్రాద జాయత"అని బ్రహ్మముఖోత్పత్తి చెప్పబడింది. కాని బ్రహ్మ ఆవులింతనుండి ప్రభవించిన శక్తి గద్గదుని భార్య యందు ప్రవేశించుట వలన జాంబవంతుడు పుట్టినాడు. కాన గద్గద పుత్రుడనుటలో బాధకం లేదు. గద్గదుని మరొక పుత్రుడు ధూమ్రుడు. బృహస్పతి సుతుడగు కేసరి ఆంజనేయుని తండ్రి. ధర్మ (వరుణ) పుత్రుడు సుషేణుడు. చంద్రసుతుడు దధిముఖుడు. మృత్యువే సుముఖ, దుర్ముఖ, వేగదర్శులుగ జన్మించెను. సర్వవానర సేనాపతి నీలు డగ్ని పుత్రుడు. కేసరికి క్షేత్రజుడు హనుమానుడు. ఇంద్రపౌత్రుడు వాలి సుతుడు అంగదుడు. అశ్వినీ దేవతల కుమారులు మైందద్వివిదులు. యమపుత్రులు గజ, గవయ, శరభ, గంధమాదనులు. పదికోట్ల ముఖ్యసైనికులు, దేవపుత్రులు ఉన్నారు. మిగిలిన వారి చరిత్ర చెప్పలేను. దశరథపుత్రుడు, ఖరాది రాక్షస సంహర్త అయిన శ్రీరామునితో సమానులు ఈ భూమండలంలో ఎవరూ లేరు. ధర్మాత్ముడగు లక్ష్మణుని బాణం తగిలిన ఇంద్రుడు గూడ బ్రతుకలేడు. శ్వేతుడు, జ్యోతిర్ముఖుడు, సూర్యపుత్రులు. హేమకూటుడు వరుణపుత్రుడు. విశ్వకర్మ సుతుడు నలుడు. వసుపుత్రుడు దుర్ధరుడు. రామదత్త లంకను స్వీకరించిన నీ సోదరుడు విభీషణుడు రామునికి హితం చేస్తున్నాడు. వీరందరూ సువేలపర్వతంపై ఉన్నారు. అనంతర కర్తవ్యమాలోచించు.

## ముప్పైయొకటవ సర్గము

తరువాత ఏకాంతసమయంలో సచివులతో మంత్రణం చేసి కర్తవ్యం నిర్దేశించి అంతఃపురానికి వెళ్లిన రావణుడు మాయావియైన విద్యుజ్జిహ్వుని వెంట తీసుకుని సీతాదేవి వద్దకు బయలుదేరాడు. 'విద్యుజ్జిహ్వా! మనముభయులం సీతను మోహపెడదాము. మాయామయములైన రామశిరస్సు, ధనువు, అమ్ములపొదులను, సృజించి వాటిని ధరించి నావెంట రమ్ము' అని రావణుడు ఆజ్ఞాపించగా విద్యుజ్జిహ్వుడు అలా చేశాడు. అందుకు సంతసించిన రావణుడు అతనికి ఆభరణాలను బహుమతిగా ఇచ్చాడు. అశోకవనంలో శోకావిష్టయగు సీతను సమీపించిన రావణుడు సంతోషవార్త చెప్పువానివలె దుష్టమగు మాటను ఇలా చెప్పాడు. నీ భర్త యగు రాముడు యుద్ధంలో చనిపోయినాడు. నీకాధారం పోయింది. ఇక నేను ప్రార్థింపకయే నాకు భార్యవు కాగలవు. ఈ బుద్ధి వదిలిపెట్టు. చనిపోయినవానితో ఏమి చేస్తావు? నాభార్యలకందరికి ఈశ్వరివి కమ్ము. మూఢురాలా! స్వల్ప పుణ్యము కల దానా! పురుషార్థం గతించినదానా! పండితురాలనని గర్వించుదానా! రాముడు నన్ను చంపుటకు గొప్ప వానరసేనతో బయలుదేరి సముద్రఉత్తరతీరంలో విడిది చేశాడు. వారలతిగాఢంగా నిద్రిస్తున్న విషయం చారుల వలన తెలిసింది. ప్రహస్తుడా రాత్రి గొప్ప వానరసేనతో వెళ్ళి ఆ వానరసేనను సంహరించాడు. రాముని శిరస్సను ఖండించాడు. విభీషణుడు పట్టుబడినాడు. లక్ష్మణుడు వానరులతో పారిపోయాడు. నీ భర్త శిరస్సు తీసికొని వచ్చాము. ఇట్లు సీతకు చెప్పి విద్యుజ్జిహ్వా! రాముని శిరస్సును ఈ దీనురాలగు సీతకు చూపుము. భర్త దురవస్థను ఈమె చూచుగాక! అని విద్యుజ్జిహ్వునితో చెప్పగా ఆతడు మాయానిర్మితమైన రామశిరస్సును అక్కడ ఉంచి వెళ్లాడు. త్రిలోక ప్రసిద్ధమగు రాముని బంగారు ధనుస్సును అక్కడ ఉంచి రావణుడు సీతతో 'ఇక నీవు నాకు వశురాలవు కమ్ము' అన్నాడు.

**మ.వి.** "ఉపసృత్య తతస్సీతాం" మొదలు సర్గాంతం వరకు వాస్తవార్థమేమంటే రావణుడు సీతను భగవతిగా తెలుసుకొని రామహస్తం నుండి మరణం కోరినవాడు. అయినా రామునితో వైరం పెట్టుకొని మరణించెనని ఇతర రాక్షసులనుకొనునట్లు సీతను మాయ చేయాలని మాయాశిరస్సును ధనుర్బాణాలను ప్రదర్శించి రామవధ శంకచే మోహితురాలైన సీతను రహస్యంగా ప్రియవచనాలతో ఊరడింపజేస్తున్నాడు. సన్నిహితంగా వెళ్ళి సంతోషం కలుగ జేస్తూ 'దుష్టమగు మాటను' – ఇతర రాక్షసులకు దుష్టముగా ఉండే మాటలు పలికాడు. 'సాంత్వమానా' 'సాంత్వమానా' రామునికి ఎలాంటి అపాయం లేదని నేను చెపుతున్నా ఏ రామునుద్దేశించి 'వల్గసి' దుఃఖంతో పరుగెత్తుతున్నావు. రాముడు చనిపోయెనా ఏమి? హతుడు కాలేదు కద! అని అర్థం. అందువలన దుఃఖించవద్దు. 'నేను దుఃఖించిన నీకేమి నష్ట'మని అంటుందేమోనని దానికి సమాధానం చెపుతున్నాడు. "ఛిన్నం తే సర్వతో మూలం దర్పస్తే నిహతో మయా! వ్యసనేనాత్మన స్సీతే మమ భార్యా భవిష్యసి" ఓ సీతా! 'వ్యసనే నాత్మనః' వ్యసన కారణంగా 'తే' నీచేత 'మమ' నీ భృత్యుడనైన నాయొక్క 'దర్పః' గర్వం 'మయా' లక్ష్మితో కూడా 'సర్వతః' సర్వప్రకారాలుగా 'నిహతః' నశించింది 'మూలం చ' సంపత్తి వచ్చు మార్గం కూడ నశించింది. అందువలన 'భార్యా భవిష్యసి' (రామేణైవ అని అధ్యాహారం చేసికోవాలి) రాముని చేతనే భరింప తగినదానవు (భార్యవు) కాగలవు. అందువలన దుఃఖించవద్దని భావం."విసృజ్యే మాం మతిం మూఢే కిం మృతేన కరిష్యసి? అల్పపుణ్యే నివృత్తార్థే మూఢే పండితమానిని" హే అమూఢే! సర్వజ్ఞురాలా! మాయా కల్పితమైన శ్రీరామ హనన విషయకమగు 'మతిం' 'విసృజ్య' ఈ బుద్ధిని విడచి "భార్యాణాం సర్వాసామీశ్వరీ భవ" నాభార్యలకు కూడ ఈశ్వరివి కమ్ము. స్వల్పపుణ్యము కలిగిన, నివృత్తపురుషార్థుడనైన, పండితుడనైన, గర్వితుడనైన, మూఢుడనైన, మృతకల్పుడనైన నా మీద దయకలదానవు కమ్ము. 'న కరిష్యసి' నీవు దుఃఖాన్ని విడువకుంటే నేనిపుడే మరణిస్తాను. అట్లయిన ఈ రాక్షస స్త్రీలు రామవిపత్తును చెపుతున్నారని సందేహించి కోపంతో ఇలా అన్నాడు. "శృణు భర్తృవధం సీతే" నీవు వారు చెప్పిన ఈ విషయం వినినా విందువు గాక అబద్ధమగు ఈవిషయాన్ని మాత్రం నేను సహించను. ఆ రాక్షస స్త్రీల మాటలన్నిటిని రావణుడు అనువదించాడు. 'రాముడు నన్ను సంహరించడానికి సముద్రతీరానికి వచ్చాడు' మొదట సర్గాంతంలో "తతోఽ బ్రవీత్తాం భవ మే వశానుగా" మే–అవశాను గా అని పదచ్ఛేదం చేసుకొని హే'మే' లక్ష్మీ దేవి! 'అవశానుగా' ఈ విష్ణురూపుడగు రామునికి వశ్యురాలవై వెళ్ళగలవు. ఇది వాస్తవార్థం.

## ముప్పైరెండవ సర్గము

సీతాదేవి రాముని శిరస్సును, ధనువును చూచి చిహ్నాలను గుర్తించి అదే రాముని శిరస్సుగా భావించి దుఃఖిస్తున్నది. ఓ కైకేయీ! నీకోరిక తీరింది. కులపుత్రుడగు రాముడు హతుడైనాడు. కయ్యాలమారివగు నీచే రఘువంశం నాశనం చేయబడింది. రాముడు నీకేమపకారము చేసినాడు? నాతో కూడా నారవస్త్రాలను ధరింపచేసి అడవికి పంపితివే! ఇలా దుఃఖిస్తూ సీత నరుకబడిన అరటిచెట్టువలె నేలపైపడి మూర్ఛిల్లింది. తిరిగి ముహూర్తకాలంలో స్పృహను పొంది భర్తృశిరస్సును చూచుటకు కన్నీరడ్డుపడ నేత్రాలను విప్పార్చి చూస్తూ మాయామయమైన రాముని శిరస్సును దగ్గర ఉంచుకొని శిరమును ఆఘ్రాణించి ఇలా దుఃఖిస్తున్నది. 'శత్రుసంహారం చేయకుండా మరలన'నే

వీరవ్రతం ఆచరించువాడ! ఇట్టి నీ స్థితిని చూచాను. విధవనైతిని. ముందుగ భర్త మరణించుట భార్య దోషం వలన సంభవిస్తుంది. ఇచట అట్టి దోషము లేదు కద? భర్తృ మరణం భార్యకు వైగుణ్య హేతువు. నీవు మంచి నడవడి కలవాడవు. సాధువర్తనం కల నీవు నాఎదుట ఎలా మృతుడవైనావు? మొదట అరణ్యవాసదుఃఖం. అంతకుమించి రావణాపహరణం. ఇలా దుఃఖమునుండి దుఃఖాంతరం పొందుతూ శోకసముద్రంలో మునిగిన నన్ను రక్షించే ప్రయత్నం చేసిన నీవు గూడ ఇపుడు నా కారణంగా హతుడవైనావు. ఇక నాకు మరణమే మేలు. మా అత్త కౌసల్య వత్స మరణించిన ఆవువలె వివత్స అయినది కద. ఇదివరలో బ్రాహ్మణులు నీవు దీర్ఘాయువు వని చెప్పారు. వారి మాటలు అబద్ధములై నీవు అల్పాయుష్కుడవైనావు. సమస్త భూతములకు కారణమైన ఈ కాలస్వరూపుడగు పరమాత్మ ఏకారణంతో నిన్ను చంపినాడో! అందువలననే నీభాగ్యవిపర్యయం వలన వారి జ్ఞానం నశించింది. వ్యసనాలను విడిచిపెట్టుటలో కుశులుడవు. నీతిశాస్త్రవేత్తవు. ఉపాయజ్ఞుడవు. అట్టి నీవు ఊహించని మృత్యువును ఎలా పొందావు? ఏరోజు రాత్రి సముద్ర తీర మందుంటివో క్రూరమగు ఆ కాళరాత్రిచేత నానుండి అపహరింపబడి కౌగిలించుకొనబడినావు.

వ్యాఖ్యానాంతరం (పాఠాంతరానుసారం) 'మయాచ్ఛిద్య' కాళ రాత్రి వంటి నాచే కౌగలించుకోబడి బలంగా హరింపబడినావు. ఘోరవైధవ్యలక్షణాలు కలిగిన క్రూరురాలనగు నా కౌగిలే నీ మరణానికి హేతువు."కమలలోచన" కమలనేత్రుడవగుట వలన నీవు కాళరాత్రిచేత హరింపబడినావు. (రాత్రులు కమలాలు ముకుళితములగును కద?) శోచనీయనగు నన్ను విడచి ప్రియురాలినివలె భూమిని ఆలింగనం చేసుకొని శయనించావేమి? ("పురుషర్షభ" అని సంబోధించుటవలన అట్టి శరత్వం నీకనుచితమని సూచితమయింది) మనముభయులం గంధాదులతో అర్చించిన ధనుస్సు ఇట్లయింది. మామగారైన దశరథాది పితృదేవతలతో కలసి స్వర్గంలో ఉన్నావు. గొప్ప పుణ్య కర్మల నాచరించిన ఇక్ష్వాకు ప్రముఖులను స్వర్గమందు నక్షత్రభూతుడవైన నీవు విమానమునుండి చూస్తున్నావు. బాలను, బాల్యమందే నీకు భార్యనయిన సహచరినగు నన్ను చూడవేమి? నాతో మాటలాడవేమి? నీవు వివాహసమయంలో నాపాణిని గ్రహించునపుడు 'నీతో సాహచర్య మొనరించెద' నని ప్రతిజ్ఞ చేశావు. ఆ ప్రతిజ్ఞను స్మరించుకొని దుఃఖించు నన్ను నీ సమీపానికి తీసుకొని వెళ్ళు. నీకు ప్రేయసిని. దుఃఖితురాలనైన నన్ను వదలి పరలోకానికి ఏల వెళ్లావు? ఆభరణాలచేత, సుగంధద్రవ్యాల చేత అలంకరిపబడుటకు తగిన, నా ఒక్క దానిచేత మాత్రమే కౌగిలింపబడినట్టి నీ శరీరం ఇపుడు గృధ్రాదులచే ఆక్రాంతమవుతున్నది. వనవాసానంతరం యజ్ఞాది క్రతువులు నిర్వహించిన పిమ్మట అంత్యసమయంలో యజ్ఞీయవహ్ని వలన సంస్కరింపబడవలసిన నీవు అట్టి సంస్కారమే పొందలేదు?

**వ్యా.వి.** వనవాసాత్పూర్వం శ్రీరాముడు యజ్ఞాదుల నిర్వహించలేదు. కావున వనవాసానంతరం తగిన దక్షిణలతో అగ్నిష్టోమాది క్రతువుల ద్వారా దేవతలను పూజించి అవసానదశలో యజ్ఞీయమగు 'వైతానికాగ్ని' ద్వారా తన శరీరాన్ని సంస్కరింపబడవలసి ఉండగా యజ్ఞాద్యనుష్ఠానాత్పూర్వమే తనకిట్లు మరణం సంభవించినదేమి?

వనవాసానికి ముప్వురు వెళ్ళియుండగా ఏకాకిగా వచ్చిన లక్ష్మణుని చూచిన కౌసల్య దుఃఖంతో విహ్వలయై సీతారాములేరని అడుగుతుంది. అపుడు లక్ష్మణుడు మిత్రసహితుడవైన నీ వధను గురించి చెపుతాడు, నీవు

నిదురలో చంపబడినట్లు, రావణగృహము నందు నేనున్నట్లు విన్న కౌసల్య గుండె పగిలి గతిస్తుంది. దుశ్శీలనగు నా కారణంగా బలవంతుడగు రాముడు దుర్బలుడగు ప్రహస్తునిచే సముద్రాన్ని దాటి గోష్పదమందు వధింపబడినాడు. (అనగా సముద్రజలాన్ని దాటినవాడు ఆవు గిట్టవల్ల కలిగిన గుంటలోని నీటిలో చనిపోవుట ఎట్టిదో ఖరాది సంహర్త అయిన రాముడు ప్రహస్తునిచే వధింపబడడం అట్టిదని భావం) అజ్ఞానంతో రామునిచే పెండ్లాడబడినాను. స్వకుల దూషణినగు నేనే ఆర్య పుత్రుడగు రామునికి భార్యా రూప మందున్న మృత్యువునైనాను. నేను జన్మాంతరంలో కన్యాదానానికి విఘ్నం కలిగించానేమో! సర్వాతిథి పూజకుడగు రాముని భార్యనైన నేను గూడ ఈ భోగకాలంలో దుఃఖిస్తున్నాను కద? ఓ రావణా! నా భర్త రాముని శరీరం మీద త్వరగ నన్ను పడవేయి. భార్యాభర్తలమగు మమ్ము కలుపు. ఉత్తమమైన కల్యాణప్రదమైన పతిసంయోగాన్ని కలుగజేయి. శిరస్సుతో శిరస్సును, శరీరంతో శరీరాన్ని కలుపు మహాత్ముడగు రామునితో అనుగమిస్తాను. ఈ విధంగా సీతాదేవి భర్త శిరస్సును, ధనువును చూస్తూ మాటిమాటికి దుఃఖించింది.

**గో.వి.** సీత సామాన్య స్త్రీవలె భర్త శిరస్సు కనిపించి కూడా చాలాకాలం రోదించి ఎలా జీవించింది? అనే సందేహానికి సమాధానమేమన ఈ దివ్య దంపతులకు పరస్పరం బ్రతికియుండుటే వీరు జీవించి ఉండుటలో కారణం అంతియేకాని జీవించి ఉన్నటుల తెలియుట, తెలియక పోవుట కారణాలు కావు. అందువలన యథార్థంగా రాముడు జీవించి ఉండెను కావున ఈమె జీవించి ఉంది.

అపుడు ద్వారపాలకుడు రావణునికి నమస్కరించి నీ దర్శనం కోరి మంత్రులతో ప్రహస్తుడు వచ్చినాడు. నీవు వారికి దర్శనమిమ్మని కోరాడు. ఆ మాట విన్న రావణుడు అశోకవనం విడిచి మంత్రులకు దర్శనమిచ్చాడు. శ్రీరాముని పరాక్రమం తెలుసుకొని సభాప్రవేశం చేసి మంత్రులతో చర్చించి కర్తవ్యం నిశ్చయించాడు.

రావణుడు వెళ్ళిన మరుక్షణమే ఆశోకవనంలో మాయామయములైన రామశిరస్సు, ధనువు, అంతర్ధానం అయినాయి. సన్నిహితులు హితైషులగు సేనానులతో 'కారణం చెప్పకుండానే సైన్యాలను తీసుకొని రండ'ని రావణుడాజ్ఞాపించాడు.

**మ.వి.** రామశిరమును, ధనువును చూచి సీత దుఃఖించుటలో వాస్తవార్థ మేమన ఇవన్నియు మాయా కల్పితములని ఆమెకు తెలిసి గూడ నమ్మినదానివలె రాక్షసులను వంచించుటకు విలపించింది.

**గో.వి.** సైనికులకు 'రామునితో యుద్ధం చేయుటకు రండ' ని కారణం తెలిపినచో ఇతఃపూర్వం సీత వద్ద తాను చెప్పినట్టి రామ, తత్సైన్య వధ అసత్యమని ఆమెకు తెలుస్తుంది. కావున కారణం చెప్పకుండానే సైనికులను పిలువుమన్నాడు. రావణాజ్ఞానుసారం సేనాపతులు స్వీయ సైనికబలాన్ని రావణసమీపానికి తెచ్చి ఆ విషయాన్ని యుద్ధకాంక్షియగు రావణునికి విన్నవించారు.

## ముప్పైమూడవ సర్గము

ఆమె యందు స్నేహం కలిగిన విభీషణపత్నియగు సరమ సీతనోదార్చింది.

**గో.వి.** రాక్షస స్త్రీయగు సరమకు సీతతో సఖ్యమెలా? ఓదార్చుట ఎలా జరిగింది? రావణనిర్దేశం వలన సీతారక్షణమందు దృఢదీక్ష కలిగిన ఆమె సీతయోగక్షేమాదికాన్ని చూడడం ద్వారా దయకలదై స్నేహయుతురాలయింది.

**మ.వి.** సీతాసరమలకు స్నేహమెట్లన విభీషణపత్నియగుటవలన సీత యందు ఈమెకు భక్తి ఉంది. రావణుడుగూడ సాత్వికురాలగు ఈమెను సీత నాశ్వాసించుటకు ఆదేశించాడు. సీతను రక్షించుచున్న ఈమె సీతకు సఖి అయ్యింది. సరమను గూర్చి సుందరకాండలో హనుమంతునితో సీత సరమ పెద్దకుమార్తె వకుళ ద్వారా నాకీవిషయం తెలిసెనన్నది. కావున వారికి స్నేహం కలదని వ్యక్తమయింది. కనుక సరమకు సీత నాశ్వాసించుట సహజమే.

కరస్పర్శాదులద్వారా పూర్వమాశ్వసించిన సరమ ఇపుడు రావణవృత్తాంతం చెప్పుట ద్వారా ఓదార్పసాగెను. వైదేహీ! ఊరట పొందు. నీవు వ్యథ చెందవద్దు. నీవు నాకు సఖివగుట వలన రావణభయం వదలి ('గగనే') వృక్షం తొఱ్ఱలో-('గహనే' అను పాఠాంతరానికి) వృక్షావృత ప్రదేశంలో, ఏకాంతంగా దాగి నీకు సన్నిహితంగా ఉండి రావణుడు నీతో అన్నమాటలను, నీవందులకు స్పందించి దుఃఖించిన తీరును అన్నీ విన్నాను. నీ నిమిత్తం నేను జీవితాన్ని గూడ లెక్క చేయను. సఖినగు నేను నీకు నిష్కారణపీడ కలుగుటను సహించలేను కద!

**గో.వి.** విభీషణుని భార్యను సీతారక్షణవిషయంలో రావణుడు ఎలా నియమించాడు? పోనీ నియమించినపుడు ఆమె గూఢంగా ఉండి వినవలసిన పని ఏమి? సమాధానం. విభీషణుడు లంకలో ఉండిన సమయంలో సీత యోగక్షేమాలను పరామర్శించడానికి ఆంతరంగికురాలగు సరమ నియోగింపబడింది. విభీషణ నిర్గమనానంతరం ఇపుడు సీతారావణసంభాషణను ప్రత్యక్షంగా వినడానికి భయపడి దాగి వినడం జరిగింది. రక్షించుటకు దాసిగా నియోగింపబడింది. తమ్ముని భార్య కోడలు వంటిది కాన కనుపించకుండుట ఉచితం. కాక ఈ సరమ వేరని కొందరంటారు.

ఆ రావణుడేల సంభ్రమంతో వెళ్ళెనో బయటకేగి అన్నియూ తెలుసుకున్నాను. నిద్రించునపుడు వధించుట గాని, మెలకువతో ఉన్నపుడు వధించుటగాని, పురుషవ్యాఘ్రుడగు రాముని విషయంలో ఉపపన్నములు కాలేదు. రామరక్షితులగు వానరులను వధించుట సాధ్యపడదు. బలవంతుడగుట మాత్రమే కాక సౌభాగ్య లక్షణముల వలన గూడ రాముడు వధార్హుడు కాడని సరమ రాముని వర్ణిస్తున్నది. ఆజానుబాహువు, విశాలవక్షస్కుడు, ప్రతాపవంతుడు, ధనుర్ధరశ్రేష్ఠుడు, సుందరావయవవిశిష్టుడు, ధర్మాత్ముడుగా కీర్తితుడు, తనను అనుచరులను రక్షించువాడు, శత్రుసంహర్త అయిన రాముడు లక్ష్మణునితోడ కుశలియై ఉన్నాడు. సర్వభూతవిరోధి, చేయదగని పనులు చేసే మాయావి అయిన రావణునిచే మాయామయములైన శిరఃప్రభృతులు కల్పించబడినాయి. నీ శోకం తొలగింది. నీకు శుభసమయం ఆసన్నమయింది. నాప్రియవచనాలు విను. రాముడు సేనాసమేతుడై సముద్రదక్షిణ తీరానికి వచ్చియున్నాడు. లక్ష్మణసమేతుడగు రాముని సాగరతీరవాసులు చూశారు. రావణ ప్రేరిత చారులు 'రాముడు సముద్రం దాటి వచ్చె' ననే వార్త తెచ్చారు. అదే విషయం అతడు మంత్రులతో మంత్రాంగం చేస్తున్నాడు. ఇలా చెపుతున్న సరమ సైనికులు చేసే సింహనాదాన్ని, భేరీ నినాదాన్ని సీతతో సహ వినింది. అపుడు తిరిగి సీతతో సరమ ఇట్లన్నది. యుద్ధసన్నాహసూచకమగు భయంకర భేరీ శబ్దం విను. చతురంగబలాలు యుద్ధసన్నాహాలు

చేస్తున్నాయి. నీ శోకం పోగొట్టే విజయలక్ష్మి నిన్ను వరిస్తూ ఉన్నది. రాక్షసులకు భయం వచ్చింది. యుద్ధంలో రావణుని జయించి అచింత్యపరాక్రముడగు నీ భర్త నిన్ను పొందగలడు.

**గో.వి.** రామవర్ణనావిశేషములు– 'కమలపత్రాక్షః' ఎఱ్ఱని కన్నులు కలవానిని సంపత్తి వదలదని సాముద్రికు లంటారు. కమలముల వంటి కన్నులు కలవాడన ఆ కన్నులయందీషద్రక్తిమ కలదు–అని. దేవతలమధ్య దేవేంద్రుని వలెనున్నవాడు–సర్వశ్రేష్ఠుడు. 'అచింత్య పరాక్రమః' ఒకే ఒక్క బాణంతో మరుకాంతారవాసులగు దొంగల నందరిని వధించిన పరాక్రమశాలి. అట్లయిన ఎందుకు ఆలసిస్తున్నాడన 'జితక్రోధః' రావణుడు ఎదురుపడనందున క్రోధావకాశం రాక నిగృహీత కోపుడయ్యాడు.

విష్ణుసహితుడగు దేవేంద్రుని వలె లక్ష్మణసహితుడగు రాముడు రాక్షసులమీద పరాక్రమింపగలడు. రావణ పతనానంతరం నీ సన్నిధికి వచ్చిన రాముని ఒడిలో కూర్చుండి ఉన్న నిన్ను త్వరలో చూడగలను. విశాల వక్షస్కుడగు రాముని హృదయమందు ఆతనిని ఆలింగనం చేసుకొని ఆనందబాష్పాలను విడువగలవు. రామవియోగ సమయంనుండి ఇంతవరకు ముడి వేయబడియే ఉన్నట్టి, పిరుదులను తాకు దీర్ఘములగు నీకురులను రాముడు కొలది కాలంలోనే విడిపించగలడు. ఉదయించు పూర్ణచంద్రతుల్యమగు రాముని ముఖమును చూచి దుఃఖాశ్రువులను నిశ్శేషంగా – సర్పము కుబుసమును విడుచు విధంగా విడువ గలవు. శత్రుసంహారానంతరం సుఖార్హురాలవగు నీవు సంపూర్ణసుఖం పొందగలవు. (సరమ ఇష్టప్రాప్త్యనిష్టనివృత్తులకు సూర్యనమస్కారము కర్తవ్య మని చెపుతున్నది) ఏ సూర్యభగవానుడు మేరుపర్వతం చుట్టూ అశ్వం వలె మహావేగంతో ప్రదక్షిణం చేస్తున్నాడో ఆ దినకరుని శరణు పొందు. ఏమన ఈ సూర్యుడే దేవతలకు, మనుష్యులకు ఓషధులకు, అందరికి కారణ భూతుడు.

**గో.వి.** సూర్యుడు అన్నిటికి కారణం అనగా వర్షాదుల ద్వారా జగత్తునకు ఆప్యాయనం చేయువాడు. ఛాందోగ్యోపనిషత్తులోని పంచాగ్నివిద్యలో చెప్పిన విధంగా 'అగ్ని యందుంచబడెడి ఆహుతి సూర్యునికి చేరుతుంది. ఆదిత్యుని వల్ల వర్షం, వర్షం వల్ల అన్నం, అన్నం వల్ల ప్రజలు జనిస్తారు' అని శ్రుతివాక్యం. కాన సూర్యుడు వర్షం ద్వారా అన్నిటికి కారణమవుతున్నాడు. అశ్వంవలె తిరుగుతున్నాడనుట వల్ల 'భీషాస్మా ద్వాతః పవతే – భీషోదేతి సూర్యః' (తై.ఉ.2–8) భయపడి సూర్యుడు ఉదయిస్తున్నాడని శ్రుతి అనుట వల్ల ఈతడు గూడ ఈశ్వరాజ్ఞానువర్తి అని గుర్తు చేయబడింది.

## ముప్పైనాల్గవ సర్గము

రావణుని మాటలతో దుఃఖించిన సీతను పూర్వసర్గోక్త వాక్యాల ద్వారా సరమ ఆహ్లాదపరచి ఇలా అన్నది. (సీతా! నేను గుప్తంగా రాముని వద్ద కేగి నీ కుశలమును రామునికి నివేదించి తిరిగి వస్తాను. నేను ఆకాశంలో వెళుతూ ఉండగా నా మార్గాన్ని గమనించడానికి వాయు గరుడులు కూడా సమర్థులుకారు. ఇలా చెపుతున్న సరమతో వెనుక శోకావిష్టయైన సీత మధురంగా ఇలా అంది.

**గో.వి.** శ్రీరాముని దగ్గర నుండి సందేశం తీసుకొని వస్తాననిన సరమతో 'వలదు' నిన స్నేహహాని, ఇక రామునికి సందేశం పంపడం – లోగడ హనుమానునితో తాను సీత 'తత్తస్య సదృశం భవేత్' 'రావణసంహారం

చేసి నన్ను తీసికొని వెళ్ళుట ఆతడికి తగినట్లుంటుంది' అన్న మాటల కనుగుణంగా ఉండదు. కావున సరమకు వేరే కర్తవ్యాన్ని నిర్దేశించే మిషతో నిపుణంగా పరిహరిస్తున్నది.

'సరమా! నావిషయంలో ఇతరులు చేయలేని పనులు కూడా నీవు చేయగలవని తెలుసుకొన్నాను. నీవు ఆకాశమార్గంలోను, రసాతలానికి వెళ్లడానికి సమర్థురాలవు. నాకు ప్రియం చేయగోరినట్లయితే రావణుడేమి చేయాలనుకొంటున్నాడో తెలుసుకోవాలని కోరుతున్నాను. దుష్టుడు క్రూరుడు అగు రావణుడు త్రాగబడిన మద్యం వలె మోహం (భ్రాంతిని) కలిగిస్తున్నాడు. నన్ను రక్షించే రాక్షసస్త్రీలచేత తర్జింప జేస్తున్నాడు. భర్త్సనం చేయిస్తున్నాడు.

**గో.వి.** ముక్కుపై వేలుంచుకొనుట, కనుగ్రుడ్లు త్రిప్పుట, దంతముల ప్రదర్శించుట, మొదలగు ముఖ చేష్టలచే భయపెట్టడం 'తర్జనం'. చంపెదను, దహించెదను ఇత్యాది మాటలతో భయపెట్టడం 'భర్త్సనం'

రావణభయంతో నా మనస్సు స్వస్థంగా లేదు. ఆ రావణుని వార్తలు, ఆతని నిశ్చయం తెలిసికొని నాకు తెలిపి మిక్కిలి ఉపకరించినదానవు నీవు. ఈవిధంగా అంటున్న సీతయొక్క కన్నీరు నిండిన ముఖాన్ని ఆప్యాయతతో తడిమి సరమ ఇట్లన్నది. 'నీ భావం తెలిసింది. రావణసమీపానికి వెళతాను. శత్రువు అభిప్రాయం తెలుసుకొని తిరిగి వస్తాను' అని చెప్పి రావణమంత్రణాలయానికి వెళ్లి విషయాలను గ్రహించి తిరిగి వచ్చిన సరమ సీతతో ఇలా చెప్పింది. 'రావణుని తల్లి' 'కైకసి' 'అవిద్ధుడ'ను వృద్ధమంత్రి రావణునితో సీతను రాముని కిమ్మనియు, ఒక రామదూత సముద్రం దాటి సీతను నిన్ను చూచి రాక్షసులను సంహరించి లంకను కాల్చి వెళ్ళినాడు. ఇట్టి దూత కలిగిన రాముడు దేవుడని మా అభిప్రాయం. కావున యుద్ధం వలదని ఎన్నో విధముల బోధించినా రావణుడు అంగీకరించలేదు. యుద్ధంలో తాను బ్రతికియున్నంతవరకు సీతను (నిన్ను) వదలడానికి క్రూరుడైన రావణునికి, తన్మంత్రులకు ఇష్టం లేదు. ఇదే వారి నిశ్చయం. ఈ నిశ్చయబుద్ధి ఆతని మరణం కొరకే ఏర్పడింది. రాముడు రావణుని సంహరించి నిన్నయోధ్యకు తీసుకొని వెళ్ళగలడు.

వీరిలా మాట్లాడుతూ ఉండగా వానరులయొక్క భేరీ శంఖ శబ్దాల చేత భూమి దద్దరిల్లింది. వానరసైన్య శబ్దాన్ని వినిన రాక్షసరాజసేవకులు తేజోరహితులై దీనులైనారు. రాజు (రావణుని)లో దోషముండగా తదాశ్రితులెట్టి శ్రేయస్సునూ పొందలేరు కద?

## ముప్పైయైదవ సర్గము

ఆ భేరీశబ్దం విని ముహూర్తకాలం ఆలోచించి క్రూరుడగు రావణుడు మంత్రుల నిందిస్తూ ఇలా అన్నాడు. 'రాముడు సముద్రం దాటిన విషయం, ఆతడి పరాక్రమం మీద్వారా విన్నాను. మీరు పరాక్రమవంతులని నాకు తెలుసు. ప్రస్తుతం ఒకరి ముఖ మొకరు చూచుకొంటూ నిరుత్సాహంగా ఉన్న విషయం కూడా నాకు తెలుసు.' అపుడు రావణుని మాతామహుడగు సుమాలికి సోదరుడు, మహాజ్ఞాని అయిన మాల్యవంతుడు రాజనీత్యనుసారం బలవంతుడగు రామునితో సంధి మంచిదనే నీతిని వివరించాడు.

ఓ రాజా! ఆన్వీక్షకీ, త్రయీ, వార్తా, దండనీతి అనే పేర్లు కల నాలుగు విద్యలలో శిక్షితుడు, నీతి శాస్త్రానుసారి అయిన రాజునకు ఐశ్వర్యం నిలచి ఉంటుంది. శత్రువులు వశులై ఉంటారు.

**గో.వి.** కామందకుడు ఇలా చెప్పాడు. 'ఆన్వీక్షకీ' ఆత్మవిజ్ఞానం 'త్రయీ' ధర్మాధర్మజ్ఞానం. 'వార్తా' అర్థాఽనర్థ జ్ఞానం. 'దండనీతి' నీత్యవినీతిజ్ఞానం. ఇవి కలిగిన రాజు కష్టాలలో కూడా నశించడు. స్వీయ బలక్షయకాలంలో, శత్రువు సముడుగా ఉన్నపుడు సంధి చేసికొంటూ, తాను బలాధికుడుగానున్న సమయాన యుద్ధం చేస్తూ ఐశ్వర్యం పొందగోరువాడు కాలానుసారంగా సంధి విగ్రహములు చేయాలి. నీతిశాస్త్రం ఇలాఉన్నది. కాబట్టి బలవంతుడగు రామునితో సంధి చేసుకోవడం మంచిది. బలవంతునితో సంధి దానోపాయసాధ్యం. కాన ఏకారణంతో మీరుభయులు విరోధులయినారో ఆ సీతను రామున కిమ్ము. విరోధం వద్దు. రాముడు ఎలా నా కంటే బలవంతుడందువేమో! దేవ గంధర్వాదులు, ఋషులు, రామునికి జయం కోరుతున్నారు. దేవతలు రామునికి జయం కోరుటలో కారణముంది. దేవతలు ధర్మపక్షపాతులు. ధర్మం రాముని ఆశ్రయించి ఉన్నది. బ్రహ్మదేవుడు దేవతలు- రాక్షసులు అనే రెండు పక్షాలను, ధర్మాధర్మాలను సృజించాడు. దేవతలు ధర్మాన్ని, ఆసురప్రకృతులు అధర్మాన్ని ఆశ్రయించారు. ధర్మ పక్షపాతులైన దేవతలు ధర్మాశ్రితుడగు రామపక్షపాతులు అయినారు. ధర్మం అధర్మాన్ని పరిభవించే కాలం కృతయుగమని, అధర్మం ధర్మాన్ని పరిభవించే కాలం కలియుగమని చెప్పబడింది. నీవు అధర్మాన్నాశ్రయించావు. కావున కలి నీలో ప్రవేశించింది. కృతయుగం కంటే కలి దుర్బలం కావున మన కంటే రాముడు బలవంతుడు. నీవు దిగ్విజయం కోసం సంచరించినపుడు పరదారాపరిగ్రహం చేయుట, యజ్ఞదాన తపః ప్రభృతుల నాశనం చేయుట ద్వారా అశుభహేతువులైన అధర్మాన్ని స్వీకరించావు. శుభహేతువగు ధర్మాన్ని వదిలినావు. కావున ధర్మపరులగు శత్రువులు మనకంటే బలవంతులు! నేను అధర్మాన్ని స్వీకరించి ధర్మాన్ని నశింపజేయగా- తదాశ్రితులగు దేవతలు బలవంతులు కావడం ఎలా? అనే శంకకు అధర్మం ఆశ్రితుల నశింపజేస్తుందని భావించిన మాల్యవంతుడు ఇట్లన్నాడు.

"సప్రమాదా ద్వివృద్ధస్తే ధర్మోఽభిగ్రసతే హి నః, వివర్ధయతి పక్షం చ సురాణాం సురభావనః"

**గో.వి.** 'సః' అధర్మం 'తే' నీ అవిచారితకృత్యం వల్ల వృద్ధిపొంది మనలను నాశనం చేస్తున్నది. సురలకు అనుకూలమై వాళ్ల వృద్ధికి సహాయపడుతున్నది.

**మ.వి.** దేవతలను వృద్ధి చేసే 'సః' ధర్మం 'తే' నీ ప్రమాదంవల్ల- అనగా యజ్ఞదానాదులకు విఘ్నం కలిగించుటవల్ల 'వివృద్ధః' స్యాత్, వృద్ధి పొందినది కద? ఇపుడు 'నః' అధర్మాన్ని ఆశ్రయించే మనలను గ్రసిస్తున్నది కద! దేవతల పక్షాన్ని వృద్ధి చేస్తున్నది.

దేవర్షిపత్నులను, కన్యలను అపహరించడం మొదలగు ఏదో ఒక కారణంగా ఋషులకు మనస్తాపం కలిగింది. అందువల్ల దుస్సహమైన క్రోధం పుట్టింది. పూతాత్ములగు ఆ ఋషులు ధర్మానుగ్రహంకోసం శ్రేష్ఠములైన అగ్నిష్టోమప్రభృతి విశ్వజిద్యాగ పర్యంత యాగానుష్ఠానం చేస్తూ అగ్నిలో హోమాలు చేస్తూ రాక్షసులను లెక్క చేయకుండా ఉచ్చస్వరాలతో వేదాలను అధ్యయనం చేస్తున్నారు. గ్రీష్మకాలంలోని మేఘాలవలె రాక్షసులు నలుదిక్కుల పారిపోతున్నారు. హోమధూమం రాక్షసుల తేజస్సును నశింపజేస్తున్నది. నీవు దేవదానవ యక్షుల వల్ల అవధ్యుడవుగా బ్రహ్మవలన వరం పొందావు. మహాపరాక్రమం కలిగిన మనుష్యవానర భల్లూక గోలాంగూలాలు ఇక్కడకు వచ్చి గర్జిస్తున్నాయి. వీళ్లవల్ల నీకు అవధ్యత్వం లేదు కద?

ఇలా ఉండగా సమస్త రాక్షసవినాశసూచకంగా అనేక ఉత్పాతాలు కనిపిస్తున్నాయి. ఘోరంగా గర్జించే మేఘాలు వేడి రక్తము కూడిన వర్షాలను కురిపిస్తున్నాయి. వాహనములగు గుర్రాలు, గజములు కంట నీరు కార్చుతూ ఉన్నాయి. ధ్వజాలు మలినంగా ఉన్నాయి. దుష్టములగు నక్కలు, గ్రద్దలు, గుంపులుగా కూడి భయంకరంగా అరుస్తున్నాయి. నల్లని స్త్రీలు తెల్లని దంతాలతో నవ్వుతూ, గృహపరికరాలను దొంగిలిస్తూ స్త్రీలకు స్వప్నాలలో కనిపిస్తున్నారు. హవిస్సులను కుక్కలు భుజిస్తున్నాయి. ఆవులకు గాడిదలు పుడుతున్నాయి. పందికొక్కులు ముంగిసలతో కూడుతూ ఉన్నాయి. పిల్లులు పులులతో, పందులు కుక్కలతో, కిన్నరులు మనుష్య రాక్షసులతో కలుస్తూ ఉన్నారు, ఎర్రనిపాదాలు పాండువర్ణం కలిగిన పావురాళ్ళు రాక్షసనాశం కొరకు తిరుగుతున్నాయి. మధురంగా పలికే రామచిలుకలు వికృతస్వరాలతో అరుస్తున్నాయి. పక్షులు సూర్యాభిముఖంగా రోదిస్తున్నాయి. బోడిగుండు కలిగి భయంకరుడు నల్లని మృత్యురూపుడు అయిన కాలుడు అన్ని గృహాలలో ఉదయం, సాయంత్రం, దర్శనమిస్తున్నాడు. దుష్టములైన ఇట్టి ఉత్పాతాలు కనిపిస్తున్నాయి. సేతునిర్మాతయగు రాముడు మనుష్యరూపధారి అయిన విష్ణువని అనుకొంటున్నాను. ఇతడు మనుష్యమాత్రుడు కాడు. వీటిని గుర్తించి చేయతగిన దానిని చేయి.

ఈ విధంగా మంత్రులలో ఉత్తమ పౌరుషం కల మాల్యవంతుడు చెప్పి రావణుని చూచి ముఖకవళికల వల్ల ఆతని మనస్సు మారలేదని గ్రహించి మిన్నకున్నాడు.

## ముప్పైయారవ సర్గము

మాల్యవంతుడు చెప్పిన హితవాక్యాలను దుష్టాత్ముడగు రావణుడు మృత్యువశంగతుడగుటవలన సహించలేక పోయాడు. క్రోధావిష్టుడై మాల్యవంతునితో ఇట్లన్నాడు. శత్రుస్నేహం వల్ల హితమనే దృష్టితో నేను వింటానని భావించి నీవు పలికిన పరుషమైన ఈ మాట నాచెవి కెక్కలేదు.

"మానుషం కృపణం రామమేకం శాఖామృగాశ్రయం, సమర్థం మన్యసే కేన త్యక్తం పిత్రా వనాలయమ్" (36-4) మనుష్యుడగుటచే హీనబలుడు, సహజంగా హీనుడు, ఏకాకి, క్షుద్ర వానర సహాయుడు, తండ్రి వెళ్ళ గొట్టుటచే నిర్ధనుడు, రాజ్యహీనుడు అగు రాముడు నా కంటే బలవంతుడని ఎలా అనుకొన్నావు?

**మ.వి.** యథార్థమిది. 'వనాలయం' వనమనగా జలం కాన సముద్రం శయనస్థానంగా కలవాడు. వట పత్రశాయి అగు నారాయణుడని అర్థం. అందువలననే 'పిత్రా త్యక్తం' జన్మాదిత్యరహితుడు. ఈశ్వరునికి జన్మాదులు లేవు కాన తండ్రిలేడు. అందువలననే 'ఏకం' అద్వితీయుడు. అందువలననే 'శాఖామృగాశ్రయం' శాఖలన వేదశాఖలు. వాటిచే 'మృగ్యః' వేద్యుడు. వేదవేద్యుడు. అతడే ఆశ్రయంగా కలవాడు. పరమాత్మ అయినప్పటికి 'మానుషం' మనుష్యరూపంతో అవతరించిన, అందువలననే 'కృపణం' కృపాళువు అగు రాముని 'సమర్థం మన్యసే' సమర్థునిగా తలచితివి కద! అని అంతరార్థం.

సమస్త రాక్షసాధిపతిని, దేవతలకు భయంకరుడను అగు నన్ను హీనునిగ ఎలా అనుకొంటున్నావు?

"హీనం మాం మన్యసే కేన హ్యహీనం సర్వవిక్రమైః"

**మ.వి.** రాముని సమర్థునిగా తలచుట ఉచితమే! పరాక్రమహీనుడను, రాక్షసాధీశ్వరుడను అగు అహీనునిగా (హీనుడు కానివానిగ) 'కేన' ఎందువలన అనుకొంటున్నావు? సజాతీయవీరుని యందలి ద్వేషం వలనగాని, శత్రు పక్షపాతం వలన గాని, శత్రుప్రోత్సాహం వలన గాని నీవిట్లు పరుషంగా మాట్లాడినావు. పండితుడగు వాడు శత్రుప్రోత్సాహం లేక ప్రభావయుక్తుని, పరిపక్వ బుద్ధిని గూర్చి పరుషంగా మాట్లాడడు కద? సీతను తెచ్చి రాముని భయంతో తిరిగి ఇత్తునా? సుగ్రీవలక్ష్మణవానరసహితుడగు రాముడు కొన్ని దినాలలో నాచే సంహరింపబడతాడు చూడు! "పశ్య కైశ్చిదహోభి స్త్వం రాఘవం నిహతం మయా" (36-9)

**మ.వి.** రాముని హస్తములనుండి చావును కోరుకొనియే నేను సీతను తెచ్చాను. ఇపుడు భయపడి తిరిగి ఎందుకిస్తాను? అట్లయిన రాముడు వస్తాడు కద? అందువేమో! కొన్ని రోజులలో 'మయా' నా కారణంగా 'నిహతం' 'హననహింసాగత్యోః' అను ధాత్వర్థానుసారం 'ఆగతం' వచ్చునట్టి వానరకోటితో కూడిన సుగ్రీవ లక్ష్మణయుతుడగు రాముని'పశ్య' చూడగలవు.

అజేయుడనగు నేను రామునితో జరిగే యుద్ధానికి భయపడుదునా? శత్రువులచే నేను రెండు ముక్కలయినప్పటికి ఎపుడూ తలవంచను. ఇది నీతి విరుద్ధమందువేమో! ఇది నాకు కల సహజదోషము. "స్వభావో దురతిక్రమః" సహజ స్వభావాన్ని వదలలేను కద? చేదుగా ఉండే వేప తియ్యనగునా? స్వల్పమగు సముద్రంమీద సేతువు కట్టుట కాకతాళీయంగా జరిగింది. విస్మయం అక్కర లేదు. వానరులతో రాముడు సముద్రం దాటుతాడు. కాని జీవించి తిరిగి వెళ్ళడు. సత్యంగా శపథం చేస్తున్నాను.

"ప్రతిజానామి తే సత్యం న జీవన్ ప్రతియాస్యతి" (36.13)

**మ.వి.** రాముడు సముద్రాన్ని దాటి జీవించి తిరిగి వెళ్ళగలడని నీకుసత్యంగా శపథం చేస్తూ ఉన్నాను.'న' సందేహమక్కరలేదు.

ఇట్లు అహంకారయుక్తంగా రావణుడు అనగా తన ఉపదేశం విఫలమైనందుకు సిగ్గుపడిన మాల్యవంతుడు జయం అని పలికి స్వస్థానానికి వెళ్లాడు. రావణుడు మంత్రులతో ఆలోచించి నిశ్చయించి లంకానగరంలో సాటిలేని రక్షణను సమకూర్చాడు. తూర్పుద్వారంలో ప్రహస్తుని, దక్షిణద్వారంలో మహోదర మహాపార్శ్వులను, పశ్చిమ ద్వారంలో ఇంద్రుజిత్తును, సైన్యసమేతులై ఉండునట్లు నియమించి ఉత్తరద్వారంలో శుకసారణులతో తాను గూడ ఉందునని చెప్పాడు. అనేక రాక్షసులతోకూడిన విరూపాక్షుని నగర మధ్యస్థ చైత్యస్థానంలో ఉండునట్లు నియమించాడు. మృత్యుచోదితుడగు రావణుడు తనను కృతకృత్యునిగా భావించి మంత్రులను పంపి తాను అంతఃపురానికి వెళ్లాడు.

## ముప్పైయేడవ సర్గము

రామసుగ్రీవులు హనుమదాదులతో మాట్లాడుతూ ఉండగా విభీషణుడు ఇలా చెప్పారు. 'నా నలువురు మంత్రులు అనల, శరభ, సంపాతి, ప్రఘసనులు పక్షిరూపధారులై లంక కేగి శత్రువ్యూహాన్ని గమనించి వచ్చారు. (పూర్వ సర్గాంతమున నియమింపబడినవిధంగా) ప్రాగాది చతుర్దిగ్ద్వారములలో ప్రహస్తాది మహావీరులు సేనా

పరివృతులై యుద్ధసన్నద్ధులై ఉన్నారు. గజయోధులు వేయిమంది, పదివేలమంది రథికులు, ఇరువదివేలమంది అశ్వారూఢులు, పదాతులు కోటిమంది. క్రూరులగు వీరు, రావణునికిష్టులైన సైనికులు వీరొక్కక్కరికి వేల పరివారం ఉంది. రావణుడు దిగ్విజయం వెళ్లినపుడు రావణసదృశులు పరాక్రమవంతులగు అరువది లక్షల సైనికులను వెంటనిడుకొని వెళ్ళి దిగ్విజయం చేశాడు. ఇపుడు సేనకంటే అధికమైన సేన ఉంది. రావణబలవర్ణన చేసినందులకు కోపించవద్దు. నీకు రోషం కలిగిస్తున్నాను. భయపెట్టడం లేదు. నీవు దేవతల జయించడానికి కూడా సమర్థుడవు. నీవు కూడా సేనను నాలుగువిధాలుగా విభజించి రావణుని మథించగలవు' విభీషణుడు ఇలా చెపుతూ ఉండగానే రాముడు శత్రుప్రతిక్రియకోసం ఇలా చెప్పాడు. 'తూర్పుద్వారాన ప్రహస్తునికి ప్రతియోద్ధగా నీలుడు, దక్షిణద్వారంలో మహోదర మహాపార్శ్వులను నిరోధిస్తూ అంగదుడున్ను, పశ్చిమద్వారంలో ఇంద్రజిత్తును పీడిస్తూ హనుమానుడు, సేనానాయకులై యుద్ధం చేయుదురు గాక. వర బల గర్వితుడగు రావణుని ఉత్తరద్వారమందు లక్ష్మణయుక్తుడనై పీడిస్తాను. సుగ్రీవుడు, జాంబవంతుడు, విభీషణుడు, సేనాపరివృతులై మధ్యగుల్మమందు ఆంజనేయునకు, నాకు, మధ్యలో ఉందురు గాక! వానరులు ఇపుడు ఉన్నట్లు మానవరూపాలతో ఉండవద్దు. మనకు గుర్తుగా వానరరూపంగా ఉండాలి. నేను, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు, హనుమానుడు, అంగదుడు, నీలుడు, ఈ ఏడుగురం మాత్రమే మానవ రూపంతో ఉండాలి' కార్యసిద్ధి కొరకు రాముడీ విధంగా చెప్పి సువేలారోహణం చేయ నిచ్చగించాడు.

## ముప్పైయెనిమిదవ సర్గము

సుగ్రీవవిభీషణులతో రాముడు 'ఈ సువేలపర్వతం అధిరోహించి ఈ రాత్రి ఇక్కడ ఉందా' మన్నాడు. అక్కడ నుండి రావణుని నిలయమైన లంకను చూద్దాము. ఆ రావణునికి ధర్మం తెలియదు. శాస్త్ర విహిత స్వకులాచారం తెలియదు. తన కులముయొక్క ఔన్నత్యం తెలియదు. అందువలననే తన చావు కొరకు సీతను అపహరించాడు. రావణుని పేరు వినిపించినపుడు నాకు రోషం కలుగుతున్నది. ఆతడి అపరాధం వల్ల సమస్త రాక్షసవధను చూడవలసి వస్తున్నది. 'ఒకని దోషంవల్ల ఇతరులను సంహరించుటేమి'? అను శంకకు సమాధానం. ఒకడు పాపం చేస్తాడు. ఆ అపరాధంవల్ల తత్సంబంధులందరూ నశిస్తారు. ఇలా మాట్లాడుతూ రావణుని మీద క్రోధం కలవాడైన రాముడు సువేలపర్వతం అధిరోహించాడు. ధనుర్ధారియగు లక్ష్మణుడు అనుసరించాడు. సుగ్రీవ ప్రముఖులు సేనాయుతులై శీఘ్రంగా సువేలపర్వతం అధిరోహించారు. అక్కడ నుండి రామాదులు త్రికూట పర్వతశిఖరం మీద ఆకాశంలో వ్రేలాడుచున్నట్లున్న లంకానగరాన్ని చూచారు. లంకానగరప్రాకారం మీద క్రిక్కిరిసి ఉన్నట్టి నల్లని రాక్షసులు ప్రాకారాంతరం వలె భాసించారు. యుద్ధోత్సాహులగు వానరులు రాక్షసులను జూచి సింహనాదాలు చేశారు. సూర్యుడస్తమించగా పూర్ణచంద్రుని వెలుగువల్ల రాత్రి ప్రకాశించింది. (లేక వానరులచే వెలిగింపబడిన దీపములు పూర్ణచంద్రప్రభాతుల్య ప్రకాశమిచ్చుచున్నవి) రామాదులా సువేలపర్వతముపై సుఖంగా వసించారు.

## ముప్పైతొమ్మిదవ సర్గము

సువేల పర్వతోపాంత్య సుందరోద్యానాలలో విహరించే వానరులు సుగ్రీవాజ్ఞానుసారం లంకానగరానికి బయలుదేరారు. పక్షులను, జంతువులను భయపెడుతూ వెళ్లారు. సింహనాదాలతో లంకను కంపింపజేశారు. ఆ వానరుల పాదాభిఘాతంవల్ల లేచిన దుమ్ము ఆకాశమంతా వ్యాపించింది. వానర సింహనాదభీతములైన సింహాది

మృగాలు నలుదిక్కులకు పరువెత్తినాయి. త్రికూటపర్వతానికి కల మూడు శిఖరాలలో సువేలమను పేరుగల మొదటి శిఖరం వర్ణితమైంది. ఇపుడు మధ్యమశిఖరస్థ లంకానగరం వర్ణింపబడుతున్నది. ప్రసిద్ధమైనట్టి, మిగిలిన శిఖరముల కంటే ఉన్నతమయినట్టి, అంతటను పుష్పములచే నిండియుండుట వలన బంగారుకొండవలె నున్నట్టి, పక్షులకు గూడ ప్రవేశింపరానట్టి, నూరు ఆమడల పొడవు, ముప్పది ఆమడల వెడల్పు కలిగినట్టి, లంకానగరమందు ఉన్నతములగు సౌధములమధ్య వేయిస్తంభాలతో నగరానికి అలంకారప్రాయమైన రావణనివాసస్థానమగు అత్యున్నత చైత్యప్రాసాదాన్ని వానరులు, శ్రీరాముడు చూచి విస్మయమందారు.

## నలబైయవ సర్గము

సువేలపర్వతం నుండి శ్రీరామాదులు లంకాగోపురాన శ్వేతచ్ఛత్రాది సమస్తరాజోపచారాలయందు ఉన్న, సర్వాభరణభూషితుడగు రావణుని చూశారు. ఇంతలో సుగ్రీవుడు, 'ఈ దురాత్ముడు మా స్వామి ఎదుట రాజోపచారాలను పొందుచున్నా'డను కోపావేశంతో మనోబలంతో, శారీరకబలంతో, రావణుడున్నట్టి గోపురానికి సువేల పర్వతాగ్రమునుండి ఎగిరాడు. రావణుని ఎదుట నిర్భయుడై నిలచి ముహూర్తకాలం రావణుని చూచి ఆతనిని తృణీకరించి పరుషంగా ఇట్లన్నాడు. రామునకు వస్తుతః దాసుడను. ఆతడు నన్ను మిత్రుడుగా భావిస్తాడు. నేను నిన్నిపుడు విడువను అంటూ రావణుని మీదకు తటాలున ఎగిరి ఆతని కిరీటాన్ని కింద పడవేశాడు. నీవు సుగ్రీవుడవు. (మంచి మెడ కలిగిన వాడవు) కాని నా ఎదుట పడితివి కాన మెడలేనివాడవగుదువు అని రావణుడు సుగ్రీవుని రెండు చేతులు పట్టి నేల మీదకు కొట్టాడు.

కొట్టబడిన బంతి వలె లేచిన సుగ్రీవుడు బాహువులతో రావణుని క్రింద పడవేశాడు. పరస్పర దృఢాలింగనం వల్ల చెమర్చిన దేహాలు కలవారు, గోళ్ళతో చీరుకొనుటచేత రక్తదేహులు, దృఢాలింగనంతో కదలిక లేనివారు, కౌగిలి వీడిన సమయమందు పుష్పించిన బూరుగ, మోదుగ వృక్షముల వలె ఉన్నవారు అయి, వానర రాక్షసేంద్రులు ప్రకాశించారు. పిడికిలి పోటులతో, అరచేతి దెబ్బలతో, మోచేతి పోటులతోను, మహాబలులగు వారిరువురూ సహింప వీలుకాని యుద్ధం చేశారు. ఇట్లు చాలాకాలం గోపురవేదిక మీద బాహుయుద్ధం చేసి పరస్పరం నెట్టుకొంటూ వెనుకకు నడుస్తూ, ప్రాకారానికి –పరిఘకు (కందకానికి) మధ్య పడ్డారు. నేల తగులకుండగనే పైకి ఎగసి ముహూర్త కాలం ఊపిరి పీల్చుకొన్నారు. యుద్ధచాతుర్యంతో వ్యాఘ్రసింహాలవలె, ఏనుగుగున్నల వలె యుద్ధం చేశారు. వారిరువురు చక్రాకారంగా తిరుగుతూ యుద్ధం చేశారు. పరస్పరం హింసించుకొనే ప్రయత్నంలో వారుభయులు భక్ష్యంకొరకు పొంచి ఉండే పిల్లులవలె నిశ్చలంగా పొంచి ఉన్నారు.

**వ్యా.వి.** నాట్యాచార్యుడు భరతుడిట్లన్నాడు. 'ఒంటి కాలు మీద తిరుగుట'ను 'చారీ' అంటారు! రెండు పాదాల మీద తిరుగడాన్ని 'కరణ' మంటారు. బహుకరణాలను 'ఖండ' మంటారు. మూడు నాలుగు ఖండ ప్రచారాలు కలిగినదానిని 'మండల' మంటారు.

యుద్ధపండితులగు ఆ సుగ్రీవరావణులు అట్టి మండలాలను సవ్యంగా, అపసవ్యంగా, అర్ధ భ్రమణముతో, ప్రయోగించారు. పాదాలను ముందుకు, వెనుకకు, ప్రక్కలకు ప్రసారం చేస్తూ గోమూత్రం వంటి వక్రగమనంతో

యుద్ధం చేశారు. ఎదుటి వాని దెబ్బను స్థానచలనం ద్వారా వ్యర్థపరచుట, దెబ్బకు దెబ్బతీయుట, ఒకడు నిలచి యుండగా రెండవ వ్యక్తి దూరంగా వెళ్ళి వచ్చుట, ఎదురుపడి పరువెత్తుకొని వచ్చుట, తాను శరీరాన్ని పెంచిగాని, కుంచించుకొని గాని, ప్రత్యర్థిని వంచి వెళ్ళుట–అనగా కప్పవలె దాటుట, నిరీక్షించుట, పెడ ముఖంతో నడచుట, నిలబడి వెనుకకు నడచుట, శరీరాన్ని సంకోచించి వెళ్ళుట, ప్రత్యర్థిని పాదంతో తన్నుటకు ఎగురుట, శత్రుబాహువును పట్టుకొనుటకు తన చేతిని చాచుట, ప్రత్యర్థి తన చేతిని పట్టుకొనునంతలో స్వీయ బాహువును ముడుచుకొనుట, ఈ విధంగా ఖడ్గవిద్యలో, మల్లశాస్త్రంలో చెప్పబడిన విధంగా అనేక విధములైన గమనాలతో కూడిన యుద్ధం చేశారు.

ఇట్లుండ అనేకప్రదేశాలలో అనేక రావణప్రదర్శనకు అనువైన మాయాప్రదర్శన చేయాలని రావణుడు తలచాడు. రావణుడు మాయాయుద్ధం చేయతలపెట్టగా మాయారహితుడైన సుగ్రీవుడు ఇదే తనకు విజయంగా భావించి రావణాభిప్రాయమెరిగి ఆతడినే మార్చి దీర్ఘకాల యుద్ధంవల్ల కలిగిన శ్రమను జయించి ఆకాశంలోకి ఎగిరాడు. తిరిగి సుగ్రీవుడు వచ్చునన్న భావంతో మోసగింపబడిన రావణుడచటనే గోపురం మీద ఉండినాడు. యుద్ధకీర్తి నందిన సుగ్రీవుడు రాక్షసరాజును అమాయిక యుద్ధంలో ఇతఃపూర్వం రావణునికి అననుభూతమైన శ్రమను కలుగజేసి సూర్యసుతుడగు సుగ్రీవుడు తండ్రివలె ప్రకాశిస్తూ ఆకాశానికి లంఘించి తన గొప్పతనమును ప్రదర్శించినవాడై వానరులలో ఒకడుగ కనుపించునట్లు రాముని ప్రక్కనే ఉండినాడు.

**గో.వి.** సుగ్రీవుడు రావణుని చంప సమర్థుడైనప్పటికి 'రావణుని సంహరింతు' నను రామప్రతిజ్ఞ వృథాకాకుండుటకుగాను రావణసంహారం చేయలేదని సూచితం. రావణుడు మాయను ప్రయోగించిన దానికి ప్రతిక్రియగ తాను గూడ మాయను ప్రయోగించవలసి వస్తుంది. అది రామునికి ఆగ్రహకారణం అవుతుంది. కావున సుగ్రీవుడు మరలి వచ్చాడు. శ్రీరామునికి యుద్ధోత్సాహం పెంచుతూ వానరముఖ్యులచే పూజింపబడినాడు.

## నలభైయొకటవ సర్గము

సుగ్రీవుని యుద్ధచిహ్నాలను చూచిన రాముడు సుగ్రీవుని ఆలింగనం చేసుకొని ఇట్లన్నాడు. 'నాతో ఆలోచించకుండా నీవు సాహసం చేశావు. రాజులిట్టి సాహసాలు చేయరు. మమ్మందరిని సందేహంలో ఉంచావు. ఇక ముందు మాతో సంప్రదించకుండా ఇలాంటి సాహసం చేయవద్దు. నీకు ఆపద వస్తే సీతతోగాని, లక్ష్మణ భరత శత్రుఘ్నులతో గాని, నాశరీరముతో గాని ప్రయోజనం ఏముంది?'

**గో.వి.** గోవు క్రొత్త దూడ జనించినపుడు దాని యందు అధిక ప్రేమ కలిగియుండునట్లు సీతను కూడా అనాదరం చేసి నూతనాశ్రితుడైన ఒక వానరమాత్రుని విషయంలో అభినివేశం కల శ్రీరాముని వాత్సల్యాతిశయం చెప్పబడుతున్నది. నీకాపద సంభవించిన యెడల "అర్థో వా ఏష ఆత్మనః యత్పత్నీ (తై. బ్రా)" అని శ్రుతి చెప్పిన విధంగా అర్ధశరీరమగు సీతతో, ఆత్మతుల్యులగు భరతాదులతో గాని, 'ఆత్మానం సర్వధా రక్షేద్దారైరపి ధనైరపి' భార్య కంటే, ధనము కంటే నిన్ను నీవు సర్వధా రక్షించుకోవాలనే స్మృతివాక్యాన్ని అనుసరించి అత్యంత ముఖ్యమగు స్వీయశరీరంతో కాని ప్రయోజనమేమి? అనినాడు.

రాముడిదేవిషయాన్ని వివరిస్తూ 'నీ పరాక్రమం తెలిసి కూడా నేనిట్లు నిశ్చయించు కొన్నాను. నీవు కనుక తిరిగి రానిచో ప్రతిజ్ఞానిర్వహణ కొరకు రావణుని పుత్రులతో కూడా యుద్ధంలో సంహరించి శరణాగతి విఫలం కాకుండా ఉండడానికి విభీషణుని అభిషేకించి కులధర్మం చెడకుండా భరతుని రాజుగా చేసి దేహాన్ని వదలుదామను కొన్నాను' అన్నాడు. దానికి సుగ్రీవుడు ఇలా అన్నాడు. రామా! నీ భార్యను అపహరించిన రావణుని చూచి కూడా నీ దాసుడను, పౌరుషవంతుడను అగు నేను ఎలా సహించగలను? ఇది సాహసంకాదు. దాసుని కర్తవ్యం.

**గో.వి.** ఛాందోగ్యశ్రుతిలో 'యదాదిత్యస్య కృష్ణం రూపం' అన్న చోట వ్యాఖ్యాతలు సూర్యునికి నల్లని చిహ్నం ఉత్పాతకాలాలలో కనుపిస్తుందని చెప్పారు.

'వానరులతో కూడి వెంటనే వేగంగా లంకకు వెళదాము.' ఇలా చెప్పిన రాముడు వేగంగా సువేలపర్వతం నుండి క్రిందికి దిగి గొప్పదగు వానరసేనను చూశాడు. (ఇందువలన వానరులందరు సువేలపర్వతం అధిరోహించ లేదని తెలుస్తున్నది) రాముడు సుగ్రీవునితో కలసి యుద్ధం చేయడానికి సేనను ప్రోత్సహించాడు. ధనుర్ధారియు, మహాబలశాలి అగు రాముడు లంకాభిముఖంగా సేనాగ్రభాగంలో నడచాడు. లక్ష్మణాదులు అనుసరించారు. భూమినంతటిని ఆవరించిన సేన వారిని అనుసరించింది. గజములవంటి వానరులు పర్వత శిఖరాలను, గొప్ప వృక్షాలను ధరించారు.

రామాజ్ఞానుసారం అప్రవేశ్యమగు లంకను వానరులు ముట్టడించారు. ఉత్తరద్వారాన్ని తమ్మునితో కూడిన శ్రీరాముడు శత్రువులనుండి స్వీయబలాన్ని రక్షించుకొంటూ ముట్టడించాడు. భయంకర రాక్షసరక్షితము, రావణాధిష్టితమునగు ఉత్తరద్వారాన్ని రాముడు కాక ఇతరులెవరాక్రమించగలరు? ద్వారసమీపంలో వేదికలపై ఉంచబడిన అనేకాయుధాలను, కవచాది పరికరాలను చూచారు. వానరసేనాపతియగు నీలుడు మైంద ద్వివిదులతో కలసి తూర్పు వాకిట నిలచాడు. ఋషభ, గజ, గవాక్ష గవయులతో కూడిన అంగదుడు దక్షిణద్వారాన్ని ముట్టడించాడు. ప్రమాథి ప్రఘసులతో కూడిన హనుమానుడు పశ్చిమద్వారాన్ని ఆక్రమించాడు. దుర్జయులగు రావణేంద్రజిత్తులున్న ఉత్తర పశ్చిమ ద్వారాలకు మధ్య వాయవ్యభాగంలో రామాంజనేయులకు యథావకాశంగా సహకరించుటకు కాకాక్షిన్యాయానుసారం జాంబవంతునితో కూడిన సుగ్రీవుడు ముప్పది ఆరు కోట్ల వానర వీరులతో సంసిద్ధుడై ఉండినారు. లక్ష్మణవిభీషణులు ఒక్కొక్క ద్వారం వద్ద కోటి కోటి సేనను ఉంచారు. మహాబలులగు వానరులు తోకలనెత్తి కోపంతో ఎఱ్ఱబడిన ముఖాలతో యుద్ధసన్నద్ధులై ఉండినారు. ఆ వానరసమాగమం ఎనిమిది కాళ్ళ శరభమృగముల యొక్క సమాగమంవలె ఆశ్చర్యకరంగా ఉన్నది.

**గో.వి.** 'శరభాణాం' రేఫ లకారములకు అభేదం గ్రహిస్తే 'శలభానాం' మిడుతలదండువలె ఒకే పర్యాయం వానరులు దూకి అనే అర్థం గ్రహించాలి.

ఆ వానరులు భూమ్యాకాశాలు నిండినట్లు వ్యాపించారు. వెనుక నియమింపబడినవారు కాక ఒక్కొక్క ద్వారంలో ఒక్కొక్క కోటి వానరులు యుద్ధార్థమై వెళ్ళారు. శిలావృక్షధారులైన వానరుల ముట్టడిలో ఉన్న లంక గాలి కూడా చొరబడనవకాశం లేనిదై ఉండెను. ముట్టడింపబడిన రాక్షసులు వానరులంత వేగంగా ముట్టడించడం చూచి విస్మయం పొందారు. పిమ్మట రాజనీత్యనుసారం సామాద్యుపాయాలు క్రమంగా ప్రయోగింపతలచి యుద్ధం

చేయడానికి శత్రుపురం ముట్టడించిన రాజులు యుద్ధంకొరకు దూతముఖంగా శత్రురాజులనాహ్వానించవలెననెడి రాజధర్మాన్ని స్మరించి విభీషణునితో సంప్రదించి ఆతని అనుమతితో అంగదుని దూతగా పంప నిశ్చయించి అతనిని పిలిచి శ్రీరాముడు ఇలా చెప్పాడు.

**మ.వి**. "విభీషణమతే స్థిత్వా" అను పాఠాంతరానికి యుద్ధంలో రావణుడు శరణు పొందితే రావణునికే లంకారాజ్యం ఇవ్వవలసినదను విభీషణాభిమతానుసారం.

నీవు నిర్భయుడవై శ్రమను లెక్కించనివాడవై రావణునివద్ద కేగి అతనితో నా మాటలను ఇలా చెప్పు. హీన పరాక్రముడవు, సంపద్రహితుడవు, ఆసన్నమరణుడవు, జ్ఞానరహితుడవు అగు ఓ రావణా! ఋషులకు, దేవతలకు, గంధర్వాదులకు, అచ్చరలకు, రాజులకు వరదాన బలగర్వంతో ద్రోహం చేసి ఉన్నావు. నీ గర్వం నశించింది. సీతాపహరణం వల్ల కోపించిన నేను నిన్ను శిక్షించడానికి లంకాద్వారంలో ఉన్నాను. ఋషులు, దేవతలు, రాజర్షులు పొందిన స్వర్గమును నాచే వధింపబడెడి నీవు గూడ పొందగలవు.

**మ.వి.** నాచే మరణించి నీవు పుణ్యలోకములకు వెళ్లగలవు. "రాజభిర్ధృతదండాస్తు కృత్వా పాపాని మానవాః నిర్మలా స్వర్గమా యాంతి సంతస్సు కృతినో యథా.... రాజాత్వశాసన్ పాపస్య తదవాప్నోతి కిల్బిషమ్" (కి.కాం. 18-32,33) పాపం చేసిన మానవులు రాజుచేత దండింపబడినచో సుకృతం చేసిన వారివలె స్వర్గానికి వెళ్లెదరు. మరియు రాజు పాపిని దండించనిచో ఆతని పాపాన్ని ఈ రాజు పొందుతాడు. కావున నాచే వధ్యుడవగు నీవు పుణ్యలోకముల బొందుట, నేనుపేక్షాదోషమును పొందకుండుట ఈ రెండూ నీ వధవలన సమకూరును.

మారీచుని మాయచే నన్నావలకు బంపి ఏ బలాన్ని ఆశ్రయించి సీతను హరించితివో ఆ బలాన్ని ఇపుడు ప్రదర్శించు. జానకిని తీసుకొనివచ్చి నా కర్పించి శరణాగతి కోరకుంటే ఈ లోకంలో రాక్షసులు లేకుండా చేస్తాను.

**మ.వి.** బంగారం దొంగిలించినవాడు తిరిగి ఆ బంగారాన్ని యజమానునికి తిరిగి ఇవ్వనిచో ప్రాయశ్చిత్తా ధారం కూడా లేనట్లు సీతాప్రత్యర్పణం చేయనిదే నీకు ప్రాణరక్షణముండదు. రావణుడు శరణాగతుడయినచో కోసల రాజ్యమిచ్చెదనని రామాభిప్రాయం.

శరణాగతి రాజ్యకాంక్షతో చేయవద్దు.(శరణాగతుడవయితే రక్షిస్తాను కాని లంకారాజ్యం ఇవ్వను) ధర్మాత్ముడగు ఈ విభీషణుడు నన్ను శరణుపొందినందున లంకారాజ్యం నీ మరణానికి ఉత్తరక్షణంలోనే నిష్కంటకంగా విభీషణుడు పొందుతాడు. నీవు ధర్మరహితుడవు. అందువల్ల అస్వాధీనమనస్కుడవు - మూర్ఖసహాయుడవు అగు నీవు ఒక్క క్షణం కూడా రాజ్యాన్ని అనుభవించలేవు. సీతనిచ్చి శరణుపొందు. విభీషణునికి రాజ్యమిచ్చి నీ ప్రాణాలను రక్షిస్తాను. అలా కాకుంటే యుద్ధానికి సిద్ధంగా ఉండు. నా బాణాలచేత మరణించి పునీతుడవు కాగలవు. లేక నీవు ఏరూపంలో ఎచట దాగినా నాచూపునబడి బ్రతికి తిరిగిరావు. నీకొక మంచిమాట చెపుతున్నాను. యుద్ధమందు రాక్షసులెవరూ బ్రతికి ఉండరు. కావున నీవు ఆత్మశ్రాద్ధం పెట్టుకో. అట్లే చావబోవువాడు చాపల్యంతో జాయా పుత్రాదులను చూస్తాడు. అదేవిధంగా ఈ లంకను బాగుగా చూచుకో. నీబ్రతుకు నాచేతిలో ఉన్నది.

శ్రీరాముడీ విధంగా చెప్పగా అంగదుడాకాశానికి ఎగిరాడు. రావణమందిరానికి వెళ్లి రావణుని చూచి బంగారునూపురాలు ధరించిన అంగదుడు జ్వలించే అగ్నివలె రావణునితో అన్యూనాతిరిక్తంగా రామసందేశం వినిపించి నేను రామదూతను, వాలి పుత్రుడను, అంగదుడను. నన్ను గురించి ముందు విని ఉన్నావు కదా! రాఘవుడు నీ కిట్లు చెప్పమన్నాడు. 'పట్టణమునుండి బయటకువచ్చి యుద్ధం చేసి శూరుడవు కమ్ము. నిన్ను, నీపుత్రులను, బంధువులను చంపుతాను. అపుడు త్రిలోకాలు నిర్భయాలవుతాయి. నీవు జానకిని సత్కారపురస్సరంగా నమస్కరించి నాకు సమర్పించకుంటే నీ మరణానంతరం విభీషణునికి రాజ్యమిస్తాను.' ఇలా అంగదుడు పరుషంగా మాట్లాడగా సహింపని రావణుడు 'దుర్బుద్ధియగు ఈ అంగదుని పట్టి వధించండి' అని అనేక పర్యాయాలు శాసించాడు. ఘోరాకారులైన నలువురు రాక్షసులు అంగదుని పట్టుకోవడానికి ప్రయత్నించారు. అంగదుడు తన బలం వాళ్లకు తెలుపతలచి వారికి పట్టుబడినాడు. ఆ నలువురు రాక్షసులను పక్షులవలె చంకలో ఇరికించుకొని కొండవలె ఉన్నతమగు ప్రాసాదం పైకి ఎగసి రావణుడు చూస్తూ ఉండగా ఆ రాక్షసులను క్రిందికి వేగంగా విసరివైచాడు. పిమ్మట మహోన్నతమగు రావణ భవనశిఖరాన్ని చూచి పాదాలతో ఆ ప్రాసాదశిఖరాన్ని పగులగొట్టి తన పేరు చాటుచూ ఆకసానికి ఎగసి రాక్షసులకు బాధను, వానరులకు హర్షమును కలిగిస్తూ వానరమధ్యంలో ఉన్న రాముని ప్రక్కకు వచ్చి చేరాడు.

## నలబైరెండవ సర్గము

రావణుడు లంకను ముట్టడించిన వానరసేనను చూడదలచి ప్రాసాదం అధిరోహించి అపారమగు వానరసేనను చూచి 'వీరి నెట్లు నాశనం చేయగల'నని చింతపడినాడు. శ్రీరాముడు వానరులను యుద్ధం చేయడానికి ఆజ్ఞ ఇచ్చాడు. వానరుల సింహనాదాలతో లంక ప్రతిధ్వనించింది. వానరులు పర్వత శిఖరాలతోగాని, పిడికిళ్ళ చేతగాని లంకను చూర్ణం చేస్తామని తలచారు. రావణుడు చూచుచుండగా ఆతడిని లెక్కించక లంకాప్రాకారాన్ని అధిరోహింపసాగారు. ప్రాకారాన్ని ధ్వంస చేశారు. కందకాలను వృక్షాదులతో పూడ్చిరి.

**జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।**
**రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥**

అతిబలుడగు రాముడు, మహాబలుడగు లక్ష్మణుడు, రాఘవపాలితుడగు సుగ్రీవుడు జయం పొందు తున్నారని గర్జిస్తూ ప్రాకారం వైపు పరుగెత్తారు. అంతలో వీరబాహువు, సుబాహువు, నళుడు, ప్రాకారం వెంబడి స్కంధావారం (యుద్ధ మధ్య సమయాలలో విశ్రాంతి తీసుకొను స్థానం. లేక వ్యూహముగా సేన నుంచుటను స్కంధావారమందురు) ఏర్పరచారు. పనస, ప్రఘసులతో కూడిన కుముదుడు సైన్యపరివృతుడై ఈశాన్యకోణమందు, శతవలి సేనాపరివృతుడై ఆగ్నేయ కోణమందు, తారాజనకుడు సుషేణుడు సైన్యసమేతుడై నైరృతకోణమందు ఉండి ప్రాగ్దక్షిణ పశ్చిమద్వారముల వద్ద యుద్ధము చేయు వారికి సహాయపడుటకు నిలచి ఉండిరి. రాముడు లక్ష్మణ సుగ్రీవులతో కూడుకొని ఉత్తరద్వారము నావరించి నిలిచాడు. కోటి కొండముచ్చులతో కూడిన గవాక్షుడు (ఈ గవాక్షుడు గజగవయాదులలో ఒకడగు గవాక్షుడు కాదు), కోటి భల్లూకములతో కూడిన ధూమ్రుడు,

రామపార్శ్వంగా నిలచారు. సర్వసన్నద్ధుడగు విభీషణుడు అమాత్యసహితుడై రామపార్శ్వంలో ఉండినారు. గజ, గవయ, గవాక్ష, శరభ, గంధమాదనులు వానరసేన చుట్టూ పరుగెత్తుచూ వానరసేనను రక్షిస్తూ ఉండిరి. కోపం పొందిన రావణుడు సైనికులకు యుద్ధం చేయమని ఆజ్ఞ ఇచ్చాడు. వెంటనే రాక్షసులు సింహనాదాలు చేశారు. యుద్ధభేరులను మ్రోగించారు. శంఖనాదాలు చేశారు. నల్లని దేహచ్ఛాయ కలిగి స్వర్ణాద్యాభరణధారులైన రాక్షసులు శంఖధారులై మెరుపులతోను, బెగ్గురు పక్షులతోను కూడిన మేఘాలవలె భాసించారు. శంఖ దుందుభి ఘోష, రాక్షస–వానర సింహ నాదములు, ఏనుగుల ఘీంకరింపులు, రథ నేమి (ఇరుసు) ధ్వని, గుఱ్ఱముల సకిలింపులు వీటి తోడ భూమి–ఆకాశము– సముద్రము ప్రతిధ్వనించాయి. యుద్ధం ప్రారంభించబడింది. రాక్షసులు స్వీయ పరాక్రమాదులు ప్రకటించుకొంటూ గదలతో, శూలాలతో, గొడ్డళ్ళతో, రథశక్తులతో వానరులను ప్రహరించారు. మహాకాయులగు వానరులు 'రాజగు సుగ్రీవుడు జయిస్తున్నాడ'ని గొప్ప శబ్దం చేస్తూ, తమ పేర్లను పరాక్రమాలను ప్రకటిస్తూ శిలావృక్షాదులతోను, నఖదంతములతోను వేగంగా రాక్షసులను కొట్టినారు. ('వేపితాః' అను పాఠాంతరానికి కోపంతో కంపిస్తూ అని అర్థం) భూమి పై గల వానరులను ప్రాకారం మీదున్న రాక్షసులు వివిధాయుధాలతో నొప్పించారు. కోపమందిన వానరులు ప్రాకారం మీదికి ఎగిరి రాక్షసులను క్రింద పడవేశారు. ఆ దొమ్మియుద్ధంలో రక్తమాంసాదులచే నేల బురద అయింది.

## నలభైమూడవ సర్గము

ద్వంద్వయుద్ధం సాగింది. ఇంద్రజిత్తుతో అంగదుడు, ప్రజంఘునితో సంపాతి, జంబుమాలితో హనుమానుడు, మిత్రఘ్నునితో విభీషణుడు, తపనునితో గజుడు, నికుంభునితో నీలుడు, ప్రఘసునితో సుగ్రీవుడు, విరూపాక్షునితో లక్ష్మణుడు యుద్ధం చేశారు. అగ్నికేతుడు, రశ్మికేతుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, వీరు రామునితోను, వజ్రముష్టి మైందునితోను, అశనిప్రభుడు ద్వివిదునితోను, ప్రతపనుడు నలునితోను, విద్యున్మాలి సుషేణునితోను తక్కిన రాక్షసులు ఇతర వానరులతోను ద్వంద్వయుద్ధం చేశారు. వానర రాక్షస దేహాల నుండి వెలువడిన రక్తం నదివలె ప్రవహించింది. వారి వెంట్రుకలు అందలి పచ్చిక దిబ్బల వలె, శరీరాలు కట్టెలవలె భాసించాయి. అంగదుని ఇంద్రజిత్తు గదచే ప్రహరింప ఆతడు ఇంద్రజిత్తుయొక్క రథాన్ని, అశ్వసారథి సహితంగా ధ్వంసం చేశాడు. సంపాతి బాణతాడితుడై అశ్వత్థవృక్షముతో ప్రజఘుని సంహరించాడు. జంబుమాలి రథశక్తిచే హనుమానుని గుండెమీద కొట్టగా హనుమానుడు ఆ రథం అధిరోహించి జంబుమాలిని చేతి దెబ్బతో సంహరించాడు. ప్రతపనుడు వేగంగా నలునిమీద బాణాలు ప్రయోగింపగా గాయపడిన నలుడు ప్రతపనుని గ్రుడ్లు పెకలించి చంపాడు. వానరసేనను సంహరిస్తున్న ప్రఘసుని సప్త పర్ణ వృక్షముతో సుగ్రీవుడు సంహరించాడు. అగ్నికేతుడు, రశ్మికేతుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, వీరు రామునిపై శరవర్షం కురిపించగా కోపం పొందిన రాముడు బాణాలతో ఆ నలువురి శిరస్సులను ఛేదించాడు. వజ్రముష్టిని మైందుడు పిడికిట పొడువగా వాడు రథాశ్వసహితంగా కూలిపోయాడు. నికుంభుడు నీలుని భేదించి పకపక నవ్వాడు. ఆ నీలుడు నికుంభుని రథచక్రం ఊడబెరికి దానిచే అతడి సారథిని సంహరించాడు. ద్వివిదుడు పర్వతశిఖరంతో అశనిప్రభుని ప్రహరింప ఆతడు బాణాలతో ద్వివిదుని నొప్పించాడు. కోపించిన ద్వివిదుడు సాలవృక్షంతో అశనిప్రభుని రథాశ్వసారథి సహితంగా చంపాడు. విద్యున్మాలి సుషేణుని బాణాలతో

నొప్పింపగా ఆతడు పర్వతశిఖరంతో విద్యున్మాలిని వధించాడు. ఇలా ద్వంద్వయుద్ధంలో వానరులచే రాక్షసులు సంహరింపబడినారు. క్షతగాత్రులగు రాక్షసులు తమకు రాత్రియందు బలాధిక్యముండును కాన యుద్ధకాంక్షులై సూర్యాస్తమయ సమయాన్ని ప్రతీక్షిస్తూ ఉండిరి.

## నలభైనాల్గవ సర్గము

ఇట్లుండ వానరప్రాణహారిణి అయిన రాత్రి ప్రారంభమయింది. ఆ చీకటిలో శత్రువనే భ్రాంతితో వానరులను వానరులు, రాక్షసులను రాక్షసులు ప్రహరించుకొన్నారు. 'వధింపుము' 'చీల్చుము' 'పరువెత్తెదవేమి?' అను వీరాలాపాలు ఆ చీకటిలో సర్వత్ర వినిపించాయి. వానరులను రాక్షసులు భక్షింపసాగిరి. రామలక్ష్మణులు కనుపించి కనుపించని రాక్షసులను బాణములచే సంహరించిరి. ఘోరమగు ఆ కాళరాత్రి వానరరాక్షసప్రాణహారిణియై దురతిక్రమమై ఉన్నది. అపుడు యమశత్రువు, మహోదరుడు, మహాపార్శ్వుడు, వజ్రదంష్ట్రుడు, శుకుడు, సారణుడు, వీరు ఆరుగురు ఏకీభవించి రామునిమీద మాత్రమే బాణాలు ప్రయోగిస్తూ మీదకు వచ్చారు. రాముడు ఆరు బాణాలతో ఆ ఆరుగురి మర్మస్థానాలలో ప్రహరించగా వారు యుద్ధంనుండి ప్రాణాలను దక్కించుకొని వెళ్లారు. ప్రకాశం గల రామబాణాలు దిక్కుల, విదిక్కుల ప్రసరించి చీకటిని తొలగించాయి. రామాభిముఖంగా యుద్ధం చేయవచ్చిన వారందరూ నిప్పులో పడిన మిడుతలవలె భస్మీభూతులైనారు. వానరరాక్షససింహనాదాలు త్రికూట పర్వత గుహలలో వ్యాపించి ప్రతిధ్వనిస్తూ ఆ పర్వతం సమాధానం చెప్పిందో అన్నట్లుండెను. నల్లని కొండముచ్చులు రాక్షసులను కౌగలించుకొని భక్షిస్తూ ఉన్నాయి. ఆ మహాయుద్ధంలో అంగదుడు ఇంద్రజిత్తును సంహరించడానికి సిద్ధపడి వేగంగా ప్రహరించి గుర్రాలను, సారథిని సంహరించాడు. అపుడు ఇంద్రజిత్తు రథాన్ని వదలి అచటనే కనుపించకుండా పోయాడు. అంగదుని పరాక్రమం చూచిన దేవతలు, మహర్షులు, రామలక్ష్మణసుగ్రీవులు, ఇంద్రజిత్ప్రభావజ్ఞులు కావున ఆతడు అంగదునిచే పరాజితుడు కావడం చూచి సంతసించి 'బాగు బాగ' ని స్తుతించారు. వాలి పుత్రునిచే పరాజితుడగు ఇంద్రజిత్తు మహాక్రోధం పొందాడు. రాముడు వానరులతో 'మీరందరూ జాగరూకులై ఉండండి. ఇంద్రజిత్తు బ్రహ్మ వరప్రభావంతో మూడు లోకాలను మిక్కిలి బాధిస్తూ ఉన్నాడు. నిశాచరుడగుటవల్ల ఈ రాత్రిలో అధిక బలయుక్తుడై వచ్చి ఉన్నాడు. వరములిచ్చిన బ్రహ్మ మనకు పూజనీయుడు కదా? మీరాతని బాణ బాధను సహించి ఉండండి.

యుద్ధంలో మహా క్రూరుడగు ఇంద్రజిత్తు అదృశ్యుడై తీవ్రమగు పిడుగుల వంటి బాణములను విడచాడు. రామలక్ష్మణుల సర్వావయవాలను నాగమయ బాణాలతో నొప్పించి బంధించాడు. ఆ బాణాలు నాగమయములు కాన చుట్టుకొని కాటు వేసి బంధించాయి. శరములగుటచే బాధించాయి. ప్రత్యక్షంగా యుద్ధం చేయలేని ఇంద్రజిత్తు మాయాబలంతో రాజపుత్రులను నాగపాశాలతో బంధించాడు.

**మ.వి.** కనుబొమలు ముడిపెట్టుట మాత్రంచేత సమస్త జగత్తులను సంహరింప సమర్థుడైన సర్వేశ్వరుడు పరమాత్మ అగు రాముడు ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగపాశబాణాలతో బద్ధుడు కావడం ఏమిటి? అనగా తాను ఏర్పరచిన మర్యాదానుసారం బ్రహ్మావరప్రభావాన్ని పాలించుటకు, బ్రహ్మను పూజించుటకు అట్లు బద్ధుడయ్యాడు.

## నలభైయైదవ సర్గము

రాముడపుడు ఇంద్రజిత్తును కనిపెట్టుటకు నీలుడు మొదలగు పదిమందిని ఆదేశించగా వారు వృక్షాదులు ధరించి ఆకాశానికి ఎగసి పది దిక్కులలోనూ వెదకారు. ఇంద్రజిత్తు మహావేగంతో బ్రహ్మాస్త్రాభిమన్త్రిత బాణాలతో వారిని నిరోధించాడు. క్షతగాత్రులగువారు అదృశ్యుడగు ఆతనిని చూడజాలకపోయారు. ఇంద్రజిత్తు రామలక్ష్మణులనే లక్ష్యంగా చేసుకొని శరముల ప్రయోగించాడు. బాణాలుగా భాసించే నాగాస్త్రాలు ఇంద్రజిత్ప్రయుక్తములై సూది మొన అవకాశం కూడా లేని విధంగా వారి శరీరాలలో ప్రవేశించాయి. ఆ గాయాల నుండి చాల రక్తం కారింది. అపుడు వారిరువురు పుష్పించిన మోదుగు వృక్షాల వలె ప్రకాశించారు.

**గో.వి.** పరమాత్మ యొక్క ఈ దేహం పాంచభౌతికం కాదు. అప్రాకృతం. మాంసమేదోస్థి సంభవంకాదు అని స్మృతి కలదు కదా? అప్రాకృతమైన పరమాత్మ దేహం నుండి రక్తం కారడం ఏమిటి? అను శంకకు సమాధానం. రామలక్ష్మణుల దేహాలలో యథార్థంగా రక్తం లేకున్నా మనుష్యులుగా కనుపిస్తున్నారు. కావున తదనుగుణంగా నటులవలె రక్తమును ప్రదర్శించారు. ఇట్లు మనుష్యుని వలె నటించుటలో ప్రయోజనమేమన సర్వాత్మనా మనుష్య భావం కనిపించనిచో సామాన్యజనులిట్లు అనుకొంటారు. 'ఇతడు మానవుడు కాడు. దేవుడు. అందువల్ల ఆయన వలె మనం ధర్మానుష్ఠానం చేయలేము' అని. అట్లు కాక మానవునిగా గుర్తించినచో గొప్పవారనుష్ఠించినట్లు మనం కూడా అనుష్ఠించవలెనని తలుస్తారు. రావణుడు మనుష్యైకవధ్యుడగుట వలన ఆ భావం కలుగడానికి కూడా ఇట్లు నటించాడు. నాగపాశబద్ధులుగా ఉండుటలో తాత్పర్యం ధర్మనిరతులు కూడా. ఒకానొకప్పుడు ఆపదలందినా త్వరలో ఆపన్ముక్తులగుదురు అని లోకులకు ప్రదర్శించుటకు. ఇట్లే మోహం కలిగే సందర్భంలో కూడా తెలుసుకోవాలి.

అంతర్ధానగతుడైన ఇంద్రజిత్తు ఇట్లన్నాడు. 'అంతర్ధానం పొంది యుద్ధం చేసే నన్ను ఇంద్రుడు కూడా చూడడానికిగాని, సమీపించడానికిగాని, శక్తుడు కాడు, ఇక మీరెంత? మీరిద్దరూ బాణాలతో కప్పబడిఉన్నారు కద? నేనిపుడు మిమ్ములను యముని కడకు బంపుతున్నాను.'

**మ.వి.** వాస్తవార్థమేమన మీరు బాణాలతో కప్పబడిఉన్నారు కద? ఇక (ఇచట వానర శబ్ద మధ్యాహృతం కావాలి) "నయామి యమసాదనమ్" వానరులను యమపురికి పంపిస్తానని.

ఈటెల వంటివి, అంజలి వంటివి, పిల్లవాని పండ్ల వంటివి, సింహ దంతాగ్రాల వంటివి, మంగలి కత్తి వంటివి అయిన బహువిధ శరములతో అదృశ్యుడై రామలక్ష్మణుల మీద (తానాకాశగతుడగుటచే) అధోముఖంగా ప్రయోగించాడు. ఆ సమయంలో ప్రయోజనరహితమగు తన ధనువును పట్టుకొని ముందు రాముడు పడిపోయాడు. అట్టి రాముని చూచిన లక్ష్మణుడు జీవితమందు ఆశవదిలి మిక్కిలి దుఃఖించాడు. వానరులు దుఃఖించారు. హనుమత్ప్రభృతి వానరవీరులు పాతితులైన రామలక్ష్మణులను పరివేష్టించి మిక్కిలి విషాదం పొందారు.

## నలభైయారవ సర్గము

వర్షించి ఉపశమించిన దేవునివలె ఇంద్రజిత్తు బాణవర్షం కురిపించి విరమించగా అక్కడికి సుగ్రీవ విభీషణులు వచ్చారు. ఆ రామలక్ష్మణులు చేష్టారహితులై మధ్య మధ్య నెమ్మదిగా ఊపిరి పీల్చుతూ, రక్త సిక్త దేహులై,

శరతల్పశాయుల వలె కనిపిస్తూ, పరాక్రమరహితులుగా కొద్దిపాటి కదలికలతో ఉండినారు. విభీషణ సహితంగా సర్వ వానరులు దుఃఖితులైనారు. అంతర్హిత వస్తు దర్శన విద్యకల విభీషణుని మాత్రం ఇంద్రజిత్తు కనుపించాడు.

రాఘవులు శయనించి ఉండడం చూచిన ఇంద్రజిత్తు రాక్షసులను ఉత్సాహపరస్తూ ఇట్లన్నాడు. 'ఖర దూషణ హంతకులగు రామలక్ష్మణులు నా బాణాలచే నాశమందినారు. దేవతలు, ఋషులు అందరు కలసి కూడ ఈ నాగపాశాల నుండి వీరిని విముక్తుల చేయలేరు. వీరి విషయాన్ని చింతిస్తూ నా తండ్రి ఒక ఝాముగూడ నిద్రించుట లేదు. సర్వానర్థకారకులగు వీరు హతులైనారు. సమస్త వానరులయొక్క సేతు నిర్మాణాది పరాక్రమం వ్యర్థమయింది.' పిమ్మట ఇంద్రజిత్తు హనుమదంగదాది సర్వ వానర వీరులను ప్రత్యేకంగా బాణాలతో వ్యథ పెట్టి సింహనాదం చేశాడు. రాక్షసులందరు 'రాముడు చంపబడెన'ని గొప్ప సింహనాదాలు చేసి ఇంద్రజిత్తును పూజించారు. చలన– శ్వాసలు లేని రామలక్ష్మణులను చూచిన ఇంద్రజిత్తు వారు మరణించారని తలచాడు. సేనాపరివృతుడై లంక కేగాడు.

సమస్తాంగాలలో బాణాలు గుచ్చుకొనిఉన్న రాఘవులను చూచిన సుగ్రీవునికి భయం కలిగింది. కన్నీరు కార్చుతున్న సుగ్రీవునితో విభీషణుడిట్లన్నాడు. 'భయపడకు. యుద్ధాలు ఇలాగే ఉంటాయి. జయమొకరి యందే స్థిరంగా ఉండదు. ఈ మహాత్ములు మూర్ఛనుండి తేరుకొంటారు. నీవు మనస్సు కుదుటపరచుకో. నాకు గూడ ధైర్యం చెప్పు. సత్యధర్మాలలో అనురక్తులైనవారికి అపమృత్యువులు రాజాలవు.' అని విభీషణుడు జలం స్వీకరించి రాక్షసమాయాదర్శనం కలిగించే మంత్రాన్ని అభిమంత్రణం చేసి సుగ్రీవుని నేత్రాలను ఆజలంతో తుడిచి ఇట్లన్నాడు. 'కపిరాజా! అధైర్యమందుటకిది సమయం కాదు. అతిస్నేహం కూడా ఇట్టి సమయంలో మరణకారణం అవుతుంది. అందువల్ల అధైర్యం విడిచి రామశరణ్యులమైన మనందరిని గురించి ఆలోచించు. మూర్ఛనుండి తేరుకొనువరకు వీరిని రక్షించుకోవాలి. పిమ్మట వీరు మన భయాన్ని పోగొడతారు. ఈ నాగపాశబంధనం రాముని ఏమీ చేయలేదు. రాముడు మరణించడు. మరణించిన వారి కిట్టి తేజముండునా? సైనికులకు ధైర్యంను కలుగజేయి. నన్ను జూచి ఇంద్రజిత్తని భ్రమించిన వీరు భయపడి 'పారిపోవుదమ'ని చెప్పుకొంటున్నారు.' ఇట్లు సుగ్రీవుని ఓదార్చి 'నేనింద్రజిత్తును కాను. విభీషణుడను' అని పలికి సేనకు ధైర్యం కలుగజేశాడు.

ఇంద్రజిత్తు లంక కేగి రావణుని చూచి నమస్కరించి రామలక్ష్మణులు చంపబడిరనే ప్రియవాక్యాలు బలికాడు. ఆసనం నుండి లేచిన రావణుడు కుమారుని ఆలింగనం చేసుకొని వివరింపగోరాడు. ఇంద్రజిత్తు జరిగినదంతయూ యథాతథంగా చెప్పాడు. రాముని వలన ఉద్భవించిన జ్వరాన్ని వదలిన రావణుడు సంతుష్టుడై ఇంద్రజిత్తును పొగిడాడు.

**మ.వి.** పాడ్యమి రాత్రి మొదటి రోజు యుద్ధం పూర్తి అయింది.

**గో.వి** పాడ్యమి రాత్రి గతించినదని, నాడు ప్రథమదిన యుద్ధమని అంటారు.

## నలభైయేడవ సర్గము

రావణుడు కుమారుని వదలి సీతారక్షకురాండ్రగు రాక్షసస్త్రీలను పిలిపించాడు. త్రిజట మొదలగు వారితో సంతోషంగా రావణుడు ఇలా అన్నాడు. ఇంద్రజిత్తుచే రామలక్ష్మణులు సంహరింపబడినట్లు సీతతో చెప్పండి. సీతను పుష్పక విమాన మెక్కించి యుద్ధంలో చనిపోయినవారిని చూపండి. సీత ఎవరిని చూచుకొని గర్వితురాలై ఉన్నదో ఆ రాముడు సోదరసహితంగా యుద్ధంలో అస్తమించాడు. మరణించిన రామలక్ష్మణులను చూచి ఇక ఆమె నిర్వ్విచారగా, శోకరహితగా, రాముడు రాగలడనే ఆశను వదలుకొని గత్యంతరం లేక రాముని నుండి నివర్తించిన భావం కలదియై స్వయంగా నన్ను పొందగలదు.

**మ.వి.** వాస్తవార్థమేమన - సీత రామలక్ష్మణవృత్తాంతము రాక్షసస్త్రీల నడుగగ మీరిట్లు చెప్పుడని ఆ రాక్షసస్త్రీలను రావణుడు నియోగించాడు. "హతా వింద్రజితా ఖ్యాత వైదేహ్యా రామలక్ష్మణౌ, పుష్పకం చ సమారోప్య దర్శయధ్వం హతౌ రణే" "రామలక్ష్మణులు (47-7) ఇంద్రజిత్తుతో యుద్ధం చేయడానికి (అధ్యాహృతం) హతౌ" (హననహింసాగత్యోః అను ధాతువు వల్ల) ఆగతౌ - వచ్చిరి. సీతకు చెప్పండి. ఆమెకు చూడాలనే కోరిక ఉంటే పుష్పకవిమానం ఎక్కించి 'హతౌ' చచ్చినట్టి వారిని చూపండి. పతి దర్శనమెందులకనగా. "యదాశ్రయాదవష్టబ్ధానేయం మాముపతిష్ఠతి, సోఽస్యా భర్తా సహ భ్రాతా నిరస్తో రణమూర్ధని" (47-8) హే "అవష్టబ్ధాః" గర్వితలగు రాక్షస స్త్రీలారా! రామాశ్రయకారణంగా "మాం" లక్ష్మిని మదీయ సంపత్తిని "నోపతిష్ఠతి" అనుభవించడం లేదు. ఈమె భర్త సోదరునితో యుద్ధభూమి యందు "నిహతః" ఆగతః-వచ్చినాడు కద? ఆయనను చూచి "నిర్విశంకా నిరుద్విగ్నా నిరపేక్షా చ మైథిలీ, మాముపస్థాస్యతే సీతా సర్వాభరణభూషితా, అద్య కాలవశం ప్రాప్తం రణే రామం స లక్ష్మణం, అవేక్ష్య వినివృత్తాశా నాన్యాం గతిమపశ్యతీ-నిరపేక్షా విశాలాక్షీ మాముపస్థాస్య తే స్వయం" (47-9,10) ఇకముందు నిర్విశంకా నిరుద్విగ్నా శంక లేక ఉద్వేగమును విడచి ఇంతవరకుపేక్షించినను ఇపుడు "నిరుపేక్షాపి" ఉపేక్షింపక సర్వాభరణభూషితురాలై "మాం" లక్ష్మిని నాచే నివేదితమగు సంపత్తిని "ఉపస్థాస్యతే" అనుభవించగలదు. "కాలవశం" ఎవనికి కాలం వశమైఉండునో లక్ష్మణసహితుడు "రణే ప్రాప్తం" రణభూమికి వచ్చిన ఆ రాముని చూచి "నాన్యాం గతిమపశ్యంతీం" రామునికంటే పొందదగిన వస్త్వంతరము లేనిదైన పరమపతివ్రతియగు ఆమె "నిరపేక్షా" ఇతరములయందాశలేనిదైనప్పటికి "మాం" నాచే సమర్పితమగు లక్ష్మిని "ఉపస్థాస్యతే" పొందగలదు.

రాక్షసస్త్రీలు రావణాజ్ఞానుసారం పుష్పకవిమానం తీసుకొని అశోకవనానికి వెళ్లారు. త్రిజటతో కూడా సీతను ఆ పుష్పకవిమానంలో ఎక్కించారు.

**గో.వి.** ఇద్దరిని మాత్రమే పుష్పకం ఎక్కించుటకు ఆజ్ఞ ఇవ్వబడుట, విభీషణ పుత్రిక కావున రావణునికి పుత్రిక అగుట, నిపుణురాలగుటవల్ల సీతతో త్రిజటను విమానం ఎక్కించారు.

సీతకు యుద్ధభూమిలోని రామలక్ష్మణులను చూపడానికి తీసుకొని వెళ్లారు. రావణుడు లంకను అలంకరింప జేసి ఇంద్రజిత్తుచే రామలక్ష్మణులు హతులైనట్లు చాటించాడు. సీత విమానం నుండి స్పృహ లేక శరతల్పం మీద శయనించి బాణపీడితులై కవచములు పగిలి నారి లేని ధనుస్సులు కలిగి బాణచ్ఛేదిత సర్వాంగయుక్తులై బాణాల

పొదలవలె ఉన్న రామలక్ష్మణులను, దుఃఖితులై తత్పార్శ్వవర్తులై ఉన్న వానరులను, సంతుష్టులగు రాక్షసులను చూచింది. రామలక్ష్మణులు నేలమీద దుమ్ములో పొర్లి ఉండుటను చూచి ఆమె రోదించింది. వారి మరణాన్ని వితర్కిస్తూ దుఃఖంతో ఇట్లన్నది.

## నలబైయెనిమిదవ సర్గము

**మ.వి.** సీతా దుఃఖప్రలాపానికి వాస్తవార్థమేమన సర్వేశ్వరి, సర్వజ్ఞ అయిన సీతాదేవి రాఘవులకు ఏ హానీ లేదని తెలిసి, రాక్షసవంచనార్థ మీ విధంగా విలపించింది.

'సాముద్రిక లక్షణాలు తెలిసినట్టి జ్ఞానులు నన్ను చూచి' ఈమె పుత్రవతి, అవిధవ అగునని చెప్పి ఉండిరి. రాముడిపుడు మరణించడంతో వారందరు అసత్యవాదులయినారు.

**గో.వి.** సాముద్రిక గ్రంథాలలో ఆడువారి కరువదిఆరు సాముద్రికలక్షణాలు ఉంటాయని చెపుతూ 'హృదయమందు రోమములుండకుండుట' వలన వైధవ్యం లేకుండుటేగాక ప్రియుని ప్రేమను పొందునని, పొడవైన వేళ్ళు, దీర్ఘకేశాలు ఉండుట వలన దీర్ఘాయువుగా ఉండి పుత్రవతి అగునని చెప్పబడింది.

అశ్వమేధాది యాగాలు చేయువానికి, అనేక సంవత్సరాలు అనేకమందిచే నిర్వహింపబడు సత్రయాగం చేయువానికి మహిషినగుదునని చెప్పి జ్ఞానులందరూ ఇపుడు అబద్ధమాడినవారైనారు. జ్యౌతిషికులు నన్ను నిత్యమంగళగ చెప్పారు. (మంచి నవ్వు, మంచిచూపు, చిన్న రంధ్రాలు కలిగి సమమగు నాసిక కల స్త్రీని నిత్యమంగళగా లాక్షణికులు చెప్పారు) మరియు వీరపత్నివగుదువని చెప్పారు. ఆ మాటల్లో మృషలైనాయి. నాపాదాలయందు పద్మచిహ్నాలు ఉన్నాయి. అట్టి స్త్రీలు భర్తలతో రాజ్యాభిషిక్తలగుదురు కద! ఈ చిహ్నాలు ఎందువల్ల నిష్ఫల ములయినాయి? ఏ దౌర్భాగ్య లక్షణాలుంటే వైధవ్యం సంభవిస్తుందో పరిశీలించి చూచినా నా యందు అవి కనుపించడం లేదు. కావున ఫలితమివ్వని లక్షణాలు కలదాననయ్యాను.

**గో.వి.** లాక్షణికులు ఇలా చెప్పారు. పాదాలు వేళ్ళు ఒక వేలు మీద ఒక వేలు ఎక్కినట్లుండుట, కాలి చిటికెన వ్రేలు నడచునపుడు నేలకు తాకకుండుట, వైధవ్య హేతువులు. నాపిక్కలు వెంద్రుకలు లేక గుండ్రంగా ఉన్నాయి. నా దంతాలు సందు లేక పరస్పరం కలిసిఉన్నాయి.

**గో.వి.** స్కాందపురాణంలో ఇలా ఉంది. రోమాలు లేక గుండ్రంగా స్నిగ్ధంగా ఉన్న పిక్కలు గల స్త్రీ రాజ పత్ని కాగలదు.

నా లలాట పార్శ్వభాగాలు, నేత్రాలు, చేతులు, కాళ్ళు, తొడలు, చీలమడమలు, ఎత్తుగా ఉన్నాయి. హస్త పాదాంగుళులు గుండ్రని గోళ్ళతో స్నిగ్ధంగా సమంగా ఉన్నాయి. (స్కాందమందు ఉన్నతములు, గుండ్రనివైనట్టి గోళ్ళు శుభప్రదములు అని ఉంది) నా స్తనాలు సందు లేక పీనములై కొద్దిగా పల్లంగా ఉండే చివరలు కలిగినవియై ఉన్నాయి. నాబొడ్డు బాగా లోతుగా, ఉన్నతమైన ప్రక్క భాగం కలదియై ఉన్నది. నా వక్షోభాగాలు ఉన్నతములై ఉన్నాయి. నా శరీరచ్ఛాయ మణిచ్ఛాయవలె స్నిగ్ధంగా ఉంది. అంగాలు మృదులములుగా ఉన్నాయి. పది పాదాంగుళు

లు, అరికాళ్ళు సంపూర్ణంగా నేలను తాకుతూ ఉన్నాయి. ఇట్టి లక్షణాలను చూచినవారు 'శుభలక్షణ' గా చెప్పారు. సమగ్రమగు యవాకారం కలిగి వరసికొనియున్న అంగుళులు కల నాపాణి పాదాలు అరుణవర్ణంతో ఉన్నాయి. కన్యాలక్షణజ్ఞులు నన్ను నిత్యం మందస్మితనుగా వచించారు. భర్తతో రాజ్యాభిషిక్తురాలనగుదునని జ్యౌతిషికులు వచించారు. నందివర్ధనపుష్పం వలె హస్తమందు ప్రదక్షిణరేఖలు కల నా వంటివారు రాజ్యాభిషిక్తలు కాగలరని శాస్త్రాలు చెపుతున్నాయి. అవన్నీ వ్యర్థములైనాయి. పరిశోధించి నాజాడ తెలిసికొని దాటవీలుకాని సముద్రాన్ని దాటిన ఈ అన్నదమ్ములు ఇంద్రజిన్మాయచే హతులయినారు. రాఘవులు ఆగ్నేయాది సర్వాస్త్రాలు పొందినవారు కద? అట్టి వారు అదృశ్యుడగు ఇంద్రజిత్తుచే చంపబడిరి. నేననాథనయితిని.

ఇట్లు దుఃఖిస్తున్న సీతను చూచి త్రిజట ఇలా అన్నది. నీవు దుఃఖించవద్దు. నీ భర్త బ్రతికి ఉన్నాడు. వీరిద్దరూ మృతులు కాలేదనుటకు కారణాలు చెబుతాను. వీరు మృతులయినచో ఈ యోధుల ముఖాలలో హర్షయుక్తమగు ఉత్సాహం కనుపించునా? దివ్యమగు ఈ పుష్పకవిమానం వీరు మరణించినచో (విధవ వగు) నిన్ను వహింపదు కద? నాయకుడు చనిపోయినచో యుద్ధసమయాలలో నిరుత్సాహులు, నిరుద్యోగులు అగు సైనికులు నావికుడు లేని పడవవలె భ్రమిస్తూ ఉంటారు. కాని ఈ వానరసేన సంభ్రమోద్వేగ రహితమై ప్రీతితో సజీవులుగా స్పష్టపడుతున్న రామలక్ష్మణులను రక్షిస్తూ ఉన్నది. కాన ఈ చిహ్నములచే రాఘవులు చనిపోలేదని తెలిసికొని స్థిమితంగా నుండు. నీ యందలి స్నేహంతో ఇలా చెబుతున్నాను. నీయొక్క మంచి శీలసంపద వలన నామనస్సులో ప్రవేశించావు. వీరు దేవాసురలకు అజేయులు. సంజ్ఞారహితులైనను వీరి ముఖకళ తగ్గలేదు. చనిపోయినవారి ముఖంమీద వికృతమగు కళ ఉంటుంది. జానకీ! దుఃఖమోహాలను విడిచిపెట్టు. రాఘవులు తప్పక జీవిస్తారు. త్రిజట మాటలను సీత అంగీకరించింది. వారు తిరిగి అశోకవనప్రవేశం చేశారు. రామలక్ష్మణులను తలచి సీత విషాదం పొందింది.

## నలభైతొమ్మిదవ సర్గము

ఇంతలో రాముడు బలవంతుడు, ధీరుడు అగుట వలన నాగపాశబద్ధుడైనప్పటికి మూర్ఛనుండి తేరుకొన్నాడు. పిమ్మట లక్ష్మణుని చూచి ఇలా విలపించాడు. 'ఇట్టి స్థితిలో ఉన్న లక్ష్మణుని చూచిన పిమ్మట సీతతో నా జీవితంతో ఏమి పని కలదు? వెతుకగా సీతతో సరియగు స్త్రీ దొరకుతుంది. యుద్ధంలో సాధువగు లక్ష్మణసముడగు సోదరుడు ఎక్కడా దొరకడు. లక్ష్మణుడొకవేళ మరణించిఉంటే ఈ వానరులందరూ చూస్తూ ఉండగా నాప్రాణాలను వదులుకొంటాను. లక్ష్మణుడు తోడు లేక అయోధ్య కేగి కౌసల్యకు, కైకేయికి, భరతశత్రుఘ్నులకు, పుత్ర దర్శన లాలసయై నీతో వనానికి వచ్చిన లక్ష్మణుడేడని దుఃఖిస్తూ అడిగెడి సుమిత్రకు ఏమని చెప్పి ఓదార్చగలను? లక్ష్మణుని వనవాసానికి తీసుకొనిరావడమే పొరపాటు. ఇపుడీతడు శరతల్పం మీద చనిపోయినవానివలె శయనించి ఉన్నాడు. నా కొరకే ఇట్టి స్థితిని పొందినాడు. ఛీ! ఈ దేహాన్ని ఇపుడే విడిచిపెడతాను. లక్ష్మణా! దుఃఖిస్తూ ఉండే నన్ను నీవు ఓదార్చుతు ఉండేవాడవు. నీవు చనిపోయిన పిదప నన్ను ఓదార్చలేవు కద? మర్మస్థానాలలో బాణాలు నాటుకొని ఉండుటచే మాట్లాడలేకున్నాడు. ఇతని చూపువలననే ఇతని బాధ సూచింపబడుతున్నది. వనవాసానికి

ఇతడు తల్లిని, భార్యను వీడి నన్ననుసరించి వచ్చినాడు. నేను గూడ ఇపుడు ఇతనిని అనుసరించి తల్లిని, భార్యను వీడి యమస్థానానికి వెళతాను. నన్ను నిత్యం అనుసరించే ఇతడు దుష్టుడనగు నావలన ఇట్టి అవస్థ పొందాడు. తన కెంత ఆగ్రహం కలిగినా నా ఎదుట ఇతడెపుడూ అహితం పలుకలేదు. వేయి చేతులు కల కార్తవీర్యార్జునుడు ఒకే ప్రయత్నంలోనే ఎంత సమయంలో అయిదువందల బాణాలు విడుచునో ద్విబాహుడగు లక్ష్మణుడు అంతే సమయంలో అంతకంటే అధికంగా బాణాలను విడుచును. ఇంద్రుని అస్త్రాలనుకూడా అస్త్రాలచే నిర్వీర్యం చేయగల ఇతడు ఈ యుద్ధభూమిలో శయనించినాడు. విభీషణుని రాజుగా చేతునని చేసిన అనృత ప్రతిజ్ఞ నన్ను దహిస్తూ ఉంది. సుగ్రీవా! ఈ క్షణమందే కిష్కింధకు తిరిగి వెళ్ళు. నేను లేని నిన్ను బలవంతుడగు రావణుడు తరుమగలడు. అంగదాదులను సైన్యాన్ని వెంట బెట్టుకొని సముద్రం దాటి వెళ్ళు. ఇతరులు చేయజాలని పనులను హనుమానుడు చేసినాడు. జాంబవదాదులు నా కొరకు ప్రాణాలను విడుచుటకు సిద్ధపడి యుద్ధం చేశారు.కాని దైవాన్ని అతిక్రమించలేము కద? సుగ్రీవా! నీవు స్నేహితుడవు. మంచి హృదయము కలవాడవు. అధర్మభీరుడవు. నీ కర్తవ్య మంతటిని నిర్వహించావు. వానరులారా! మిత్రకార్యం నెరవేర్చినారు. నేననుజ్ఞ ఇస్తున్నాను. మీ ఇష్టం వచ్చిన చోటుకు పొండు' ఆ వానరులందరూ శ్రీరాముని విలాపవచనాలను విని కన్నీరు కార్చారు. ఇంతలో సేనా నివేశనమొనర్చిన విభీషణుడు అక్కడికి వచ్చాడు. నల్లని కాటుక వంటి దేహచ్ఛాయ కలిగిన ఆతడిని చూచి వానరులు ఇంద్రజిత్తని భ్రమించి పరువెత్త సాగారు.

## యాభైయవ సర్గము

సుగ్రీవాదేశానుసారం వచ్చినవాడు విభీషణుడని తెలిపి జాంబవంతుడు సేనను నిలువరించాడు. రామ లక్ష్మణులను చూచిన విభీషణుడు ఇలా దుఃఖించాడు. 'తల్లి కడుపున చెడబుట్టిన దుర్మార్గుడు కపట యుద్ధం చేసే సోదర పుత్రుడు ఇంద్రజిత్తు కపటరహితులగు వీరిని వంచించినాడు. నిండుగా బాణాలు గుచ్చుకుని ఉండడంతో వీరు ముళ్ళపందులవలె గోచరిస్తున్నారు. ఎవరి పరాక్రమాన్ని ఆశ్రయించి ప్రతిష్ఠను పొందతలచితినో వారు మరుణోన్ముఖులై నిద్రిస్తున్నారు. బ్రతికిఉండీ చచ్చిన వాడినైనాను. నా మనోరథాలు భగ్నములైనాయి. రావణుని కోరిక సిద్ధించింది' ఇలా దుఃఖిస్తున్న విభీషణుని ఆలింగనం చేసుకొని సుగ్రీవుడిట్లన్నాడు.

'విభీషణా! నీవు లంకారాజ్యం పొందగలవు. రావణుడు తన కోరికను తీర్చుకొనలేడు. ఈ రామలక్ష్మణులు పడు బాధ మరణకారకం కాదు. మూర్ఛదేరి సైన్యయుతుడగు రావణుని వధించగలరు. ఇట్లాశ్వాసించి మామగారగు సుషేణునితో ఇట్లన్నాడు.' ఈ రామలక్ష్మణులను సైన్యపరివృతుడవై కిష్కింధకు తీసికొని వెళ్ళు. నేను రావణసంహారం చేసి సీతను తీసికొని వస్తాను. సుషేణుడిట్లన్నాడు. 'వెనుక దేవాసురయుద్ధంలో బాణ ప్రయోగనిపుణులైన దానవులచే దేవతలు గాయపడి స్పృహ కోల్పోయిన సందర్భంలో బృహస్పతి మృతసంజీవిన్యాది విద్యలచేత మంత్రయుక్తములగు ఓషధుల చేత వారికి చికిత్స చేయడం నాకు తెలుసు. ఆ ఓషధులను తేవడానికి సంపాతి పనస ప్రముఖ వానర వీరులు పాలసముద్రమునకు ఏగుదురుగాక. పర్వతాలలో ఉండే సంజీవకరణి, విశల్యకరణి వారికి తెలుసు. పాలసముద్రం అమృతం కోసం మథించిన ప్రాంతంలో చంద్ర, ద్రోణ పర్వతాలున్నాయి. వాటియందు ఈ ఓషధులు దేవతలచే ఉంచబడినాయి. వాటిని తేవడానికి ఈ హనుమానుడు అచటికి వెళ్ళుగాక.

**గో.వి.** ఇతర ఓషధులు తేవడానికి పనసాదులు వెళ్ళుదురుగాక. సంజీవకరణి, విశల్యకరణి తేవడానికి ఆంజనేయుడు వెళ్ళుగాక.

ఇంతలో విద్యుత్తుతో కూడిన మేఘాలను, సముద్రజలాలను, అన్నివైపుల వెదజల్లుతూ భూమిని కంపింపజేస్తూ గొప్ప వాయువు వీచింది. గరుత్మంతుని రెక్కల వల్ల పుట్టిన ఆ గాలి వలన ఆ ద్వీపంలోని గొప్ప గొప్ప వృక్షాలన్నీ సమూలంగా పెకలింపబడి సముద్రంలో పడినాయి. ఆ ద్వీపంలో కల సర్పాలు, జలజంతువులు భయంతో సముద్రంలో మునిగినాయి. పిమ్మట జ్వలించు అగ్నివలె ఉన్న గరుత్మంతుని వానరులందరూ చూచారు. ఆ గరుత్మంతుని చూచి మహాబలులగు రామలక్ష్మణులను బంధించిన బాణాలుగా భాసించే సర్పాలు పరువెత్తి పారిపోయాయి. రాఘవులచే అభినందింపబడిన గరుత్మంతుడు తన చేతులతో చంద్రబింబాలవంటి వారి ముఖాలను తడిమాడు. వారి గాయాలన్నీ ఆతని కరస్పర్శచే కనుపించకుండా మానిపోయాయి. వేగంగా శరీరాలు వన్నెకు వచ్చినాయి. నేవళంగా తయారైనాయి. తేజస్సు, బలం, ఉత్సాహం, బుద్ధి, స్మృతి ఇట్టివన్నీ రాఘవులకు వెనుకటి కంటే ఇబ్బడి అయినాయి.

**వ్యా.వి.** 'తేజః' ఎదుటి వారిని పరిభవించే సామర్థ్యం లేక ఎదుటి వారి దెబ్బను సహించే శక్తి. 'వీర్యం' పరాక్రమం. 'ఓజః' కాంతి. 'ఉత్సాహః' లోకోత్తరములగు పనులలో స్థిరమగు ప్రయత్నం. 'దర్శనం' సూక్ష్మార్థ పరిజ్ఞానం. 'బుద్ధిః' వివేకం. 'స్మృతిః' అనుభవించిన విషయాలను మరువకుండుట. ఇవన్నీ, గరుడస్పర్శ వలన ద్విగుణీకృతములయినాయి.

రామలక్ష్మణులు లేచి సంతోషంతో గరుత్మంతుని ఆలింగనం చేసుకొన్న పిమ్మట గరుడునితో శ్రీరాముడిట్లన్నాడు. 'ఇంద్రజిత్తు వలన కలిగిన గొప్పదగు ఈ యాపద నీయనుగ్రహంతో పోయింది. వెనుకటివలె బలవంతులమైనాము. మా తండ్రి దశరథుని, పితామహుడైన అజుని చూచినట్లు మిమ్ములను చూస్తుంటే మా మనస్సు సంతసిస్తూ ఉన్నది. దివ్యాభరణ వస్త్రభూషితుడవగు నీవెవరవు?' అని రాముడు అడిగాడు. పక్షిరాజగు గరుడుడు హర్షయుక్తుడై ఇట్లనుచున్నాడు. 'నేను నీకు స్నేహితుడను. (వాహనంగా నుండుటవలన సహకారిని) మీరిద్దరికి సహాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. సురాసుర గంధర్వాదులు దేవేంద్రుని వెంట నిడుకుని కూడా క్రూరకర్ముడగు ఇంద్రజిత్తుచే నిర్మింపబడిన ఈ నాగపాశాలను వదిలించడానికి సమర్థులు కారు. ఇవి కద్రూ సంతానం. విషయుక్త తీక్ష్ణ దంష్ట్రాలు గల సర్పాలు. ఇంద్రజిన్మాయచే బాణాలుగా తయారై మిమ్ములను ఆశ్రయించాయి. ఈ విషయం తెలిసిన నేను త్వరపడి ఇక్కడికి వచ్చాను. ఈ నాగబాణాలనుండి మీరు విముక్తులైనారు. అస్త్రాలకు నివారకాస్త్రప్రయోగవిషయంలో జాగరూకులై ఉండండి. రాక్షసులు కపటయుద్ధం చేస్తారు. శూరులు నిర్మలమనస్కులగు మీకు నిష్కాపట్యమే బలమవుతుంది. కాన రాక్షసులను ఏమాత్రం విశ్వసించకూడదు. ఇదే దృష్టాంతం' మిత్రుడా! నేను వెళ్ళుట కనుజ్ఞ నిమ్ము. నేను నీకెట్లు మిత్రుడనని ఆలోచించవద్దు. యుద్ధానంతరం తెలుసుకోగలవు. రావణుని సంహరించి సీతను పొందగలవు. ఇట్లు చెప్పి సుపర్ణుడు వానరమధ్యంలో రాఘవులకు ప్రదక్షిణమొనర్చి ఆకాశానికి ఎగిరాడు. బాధారహితులగు రాఘవులను చూచిన వానరులు సింహనాదాలు చేసి తోకలను నేలకు కొట్టినారు.

**గో.వి.** మరి 'పృథివిలోని సమస్త రాక్షసులను తలచుకొంటే వేలిచివరతో సంహరించ గలన'నిన అపరిమితశక్తి యుక్తుడు, సర్వజ్ఞుడు అగు రాముడు ఇలా అశక్తునివలె ఇంద్రజిద్బాణబద్ధుడై మట్టిలో పొరలాడడం ఏమిటి? అనే శంకకు సమాధానం. లోకంలో సదాచార ప్రవర్తనకోసం రాముడు అలా ఉన్నాడు. ఇంద్రజిత్తుచే బంధింపబడడం వలన ఈ అర్థం తోస్తున్నది. శుద్ధస్వభావులు, ఋజువర్తనులు అగు వారికి ఆపదలు సంభవించినప్పటికి వినాశం కలుగదు. పాపిష్టులకు కరతలగతమయిన కార్యసిద్ధి కూడా చెడిపోతుంది. అందువలన శుద్ధ స్వభావంతో నిష్కాపట్యాది సద్గుణాలతో మానవులు మెలగాలని సత్పురుషులకు ధర్మనిశ్చయం కలుగుతుంది. ఇచట మరొక సందేహం. 'రావణవధ కొరకు దైవప్రార్థనతో మహావిష్ణువు రాముడుగా అవతరించినాడు కద? ఆయన కర్తవ్యమంత మాత్రమే కద?' నిజమే. దుర్మార్గులను సంహరించుటే కాక ధర్మసంస్థాపనం కూడా అవతారప్రయోజనమే. రావణవధ మాత్రమే రామావతారప్రయోజనమయినచో ఇంతటి ప్రయాస వ్యర్థమవుతుంది. అందువల్లనే "చాతుర్వర్ణ్యం చ లోకేఽస్మిన్ స్వేస్వే ధర్మే నియోక్ష్యతి" 'నాలుగు వర్ణాల వారిని ఆ యా ధర్మాల యందు నియోగించ గలడ'ని చెప్పబడింది. ఊరక ధర్మోపన్యాసాలు చేసినంతమాత్రాన ధర్మం సిద్ధించదు. ఆ ఉపదేశాలు శృతి స్మృతులే చేస్తున్నాయి కదా? తాను ఆచరించడం ద్వారా ఇతరులచేత ఆచరింపజేయుటకు మనుష్యభావం పొందినాడు. అందువల్ల తాను ఆచరించుట ద్వారా శ్రీరాముడు ధర్మప్రవర్తకుడయినాడు.

పిమ్మట వానరులు భేరులను వాయించి శంఖాలను ఊది సింహనాదాలతో రాక్షసులను భయపెడుతూ యుద్ధం చేయతలచి లంకాద్వారం వద్దకు వెళ్లారు.

## యాభైయొకటవ సర్గము

వానరుల గర్జనలను రావణుడు గూడ విన్నాడు. మంత్రులతో ఇట్లన్నాడు. రామలక్ష్మణులు శరబద్ధులై యుండినారు. వానరుల సింహనాదాలు వినిపిస్తున్నాయి. వారు ఆ బంధనంనుండి విముక్తులైనారను సందేహం కలుగుతున్నది. రావణాజ్ఞానుసారం సంభ్రాంతులగు రాక్షసులు ప్రాకారమధిరోహించి నాగపాశముక్తులైన రామలక్ష్మణులను, యుద్ధసన్నద్ధులైన వానరసేనను చూచి భయపడి ప్రాకారందిగి దీనవదనులై రావణునితో ఇట్లన్నారు. 'ఇంద్రజిత్తుచే నాగబాణబంధితులైన సోదరులు కట్లను తెంపుకున్న ఏనుగులవలె బంధవిముక్తులైనారు' ఈ మాట విన్న రావణుడు శోకావిష్టుడై 'ఘోరములు, అమోఘములు అగు నాగపాశబాణాలతో బంధింపబడినా నా శత్రువులు విముక్తులైనచో నా బలమంతా ప్రాణసంశయం పొందింది' అని పలికి క్రోధావిష్టుడై సర్పంవలె బుసలు కొడుతూ ధూమ్రాక్షుడను సేనానాయకునితో ఇలా చెప్పాడు. 'నీవు గొప్పసైన్యంతో వెళ్లి వానరసహితంగా రాముని వధించు.'

**వ్యా.వి.** "త్వం వధాయాభినిర్యాహి" నీవు వధించడానికి వెళ్ళు. బలంతో కూడుకున్నవాడవై "రామస్య సహ వానరైః" రామ సంబంధి వానరులచేత వధింపబడుట కొరకు వెళ్ళుమనే అమంగళార్థం ఇందులో స్ఫురించు చున్నది.

రావణాజ్ఞానుసారం వివిధాయుధాలు ధరించిన రాక్షససేనతో కూడిన ధూమ్రాక్షుడు యుద్ధానికి బయలు దేరాడు.

**గో.వి.** ఆయుధ విశేషాలు గద, పట్టసం–అడ్డకత్తి. (మొట్టైత్తలై త్తడీ), పరిఘః ఇనుపకట్లగుదియ (ఒలైత్తడీ), భిండిపాలః హస్త ప్రమాణమగు గుదియ (కత్తి పాయిత్తడి) భల్లః ఇనుప బాణం. ప్రాసః ఈటె (ఏరియాట్టీ) పరశ్వధః గండ్రగొడ్డలి. అతడి కనేక దుశ్శకునాలు కనిపించాయి. వాటిని చూచిన సైనికులు భయపడినారు. ధూమ్రాక్షుడు గూడ వ్యథితుడయ్యాడు. సేనావృతుడై పశ్చిమద్వారం నుండి బయల్వెడలిన ధూమ్రాక్షుడు అపారమైన వానరసేనను చూశాడు.

## యాభైరెండవ సర్గము

ఆ వానర రాక్షస వీరులు వివిధాయుధాలతో సంకులసమరం సాగించారు. వానరసేనాసంహారం చేస్తున్న ధూమ్రాక్షుడు నారి ధ్వనులే మధుర ధ్వనులను వెలయించే వీణానాదాలుగా, గొంతుల నుండి వెలువడే దగ్గులే తాళాలుగా, ఆయాసంతో నెమ్మదినెమ్మదిగా వస్తున్న మాటలే సంగీతంగా, యుద్ధగాంధర్వాన్ని విన్నాడు. ధూమ్రాక్షునకు భయపడి పారిపోవు స్వీయసైన్యాన్ని చూచి ఆగ్రహించిన ఆంజనేయుడు ఆతడితో భీకరయుద్ధంచేసి పర్వతశిఖరంపై ధూమ్రాక్షుని శిరస్సును పడవేయగా ధూమ్రాక్షుడు మరణించాడు. హతశేష రాక్షసులు లంకకు పరుగెత్తారు. విజయుడగు వాయుసుతుని వానరులు పూజించారు. (ఇది విదియ నాటి యుద్ధం).

## యాభైమూడవ సర్గము

ధూమ్రాక్షవధా శ్రవణంతో క్రోధాక్రాంతుడైన రావణుడు వజ్రదంష్ట్రుడనే సేనానాయకుని శత్రుసంహారం చేయమని ఆజ్ఞాపించాడు. సైన్యసమేతుడగు వజ్రదంష్ట్రుడు అపశకునాలను లెక్కించకుండా దక్షిణద్వారం నుండి యుద్ధభూమికి వెళ్లాడు. వానరరాక్షసయుద్ధంలో ఆయుధధ్వని, రథనేమిధ్వని, శంఖభేర్యాది ధ్వనులన్నీ ఏకీకృతములై గుండెలవిసే మహాధ్వనిగా వినిపించినది. వానరసంహారాన్ని గుర్తించిన అంగదుడు ఆ రాక్షసులను మహావృక్షంతో సంహరించాడు. వాయువేగంతో కంపించిన మేఘాలవలె అంగదుని వేగానికి రాక్షసబలం కంపించిపోయింది.

## యాభైనాల్గవ సర్గము

స్వీయబలం క్షీణించి అంగదుడు జయం పొందుచుండగా వజ్రదంష్ట్రుడు ధనుష్పాణియై ఒక్కొక్క బాణంతో ఐదుగురిని, ఏడుగురిని, తొమ్మండుగురిని, సంహరింప సాగాడు. అపుడు వానరులందరు రక్షకుడగు అంగదుని వద్దకు పరుగెత్తారు. అంగదుడు వజ్రదంష్ట్రునితో ద్వంద్వయుద్ధం ఆరంభించాడు. అంగదుడొక మహాశిలను రథంమీద పడవేయగా గదాధారియైన వజ్రదంష్ట్రుడు రథం నుండి కిందకు దూకాడు. అంగద ప్రయుక్తమగు ఆ శిల అశ్వసహితంగా రథాన్ని చూర్ణం చేశాడు. అంగదుడు మహా వృక్షంతో, వజ్రదంష్ట్రుడు ఖడ్గంతో జయకాంక్షులై ద్వంద్వయుద్ధం చేశారు. రక్త సిక్త దేహులై, పరస్పర తాడితులై కొద్దిసేపు మోకాళ్ళ మీద బోర్లపడి లేచారు. క్షణ కాలంలో దెబ్బతిన్న పాములవలె లేచిన అంగదుడు మహాఖడ్గంతో వజ్రదంష్ట్రుని శిరస్సు ఖండించాడు. హతశేషులగు రాక్షసులు వానరతాడితులై దైన్యంతో లంకకు పరుగెత్తారు. (ఇది తదియ నాటి యుద్ధం).

## యాభైయైదవ సర్గము

పిమ్మట రావణుడు ప్రహస్తుని సమక్షంలో సమర్థుడగు 'అకంపను' డనే సేనానాయకుని యుద్ధానికి పంపాడు. యుద్ధంలో దేవతలకైనను చలించనివాడు కావున అకంపనుడనే పేరు అతనికి వచ్చింది. సర్వసన్నద్ధులగు రాక్షస వీరులతో యుద్ధానికి ఆతడు బయలుదేరగా మార్గంలో అనేక దుశ్శకునాలు కనుపించినాయి. వాటిని లెక్కించకుండా యుద్ధానికి వెళ్లాడు. రావణుని కొరకు రాక్షసులు, రాముని కొరకు వానరులు జీవితమందు ఆశలేనివారై మహాయుద్ధం కావించారు. ఇంతలో కుముదుడు, నళుడు, మైందుడు, ద్వివిదుడు ఈ నలువురు మహావీరులు మహావేగంతో లీలగా రాక్షసులను సంహరించారు.

## యాభైయారవ సర్గము

కుముదాదులు రాక్షసులను వధించడం చూచిన అకంపనుడు అక్కడికి వెళ్లి తీవ్రమగు బాణాలతో వాళ్లను ప్రహరించాడు. అకంపనునిచేత చిక్కి మరణిస్తూ ఉన్న తనవారిని రక్షించుటకు హనుమానుడు అక్కడికి వచ్చాడు. మహాపర్వతంవలె ఎదుట నిలచిన హనుమంతునిపై అకంపనుడు బాణవర్షం కురిపించాడు. అపుడాంజనేయుడొక అశ్వకర్ణవృక్షాన్ని పెకలించి దానితో రాక్షసులను సంహరింపసాగాడు. అకంపన ప్రయుక్త బాణాలు గుచ్చుకొని ఉండుటచే ఆంజనేయుడు వృక్షయుక్త పర్వతంవలె భాసించాడు. అపుడాంజనేయుడు మహావృక్షంతో కంపనుని శిరస్సును ప్రహరించి అతనిని సంహరించాడు. హతశేషులగు రాక్షసులు భయసమ్మూఢులై తమలో తామే కొట్టుకొంటూ లంకకు పరువెత్తారు. విజయుడగు హనుమానుని రామలక్ష్మణసుగ్రీవవిభీషణులు, వానరులు అభినందించారు. (చవితినాడు అకంపనవధ జరిగింది.)

## యాభైయేడవ సర్గము

అకంపనవధను వినిన రావణుడు కొద్దిగ దైన్యం పొంది ముహూర్తకాలం ఆలోచించి ఆ పూర్వాహ్ణ సమయంలో లంకయందలి సేనానివేశనాలనన్నిటిని చూశాడు. లంక ముట్టడింపబడి ఉండుట గమనించి సహింప లేనివాడై యుద్ధప్రవీణుడు, ముఖ్యసేనాని అయిన ప్రహస్తునితో ఇట్లన్నాడు. వేగంగా ముట్టడింపబడిన లంకను విముక్తం చేయడానికి ఇతరులెవరూ సమర్థులు కనుపించడం లేదు. నేనుగాని, కుంభకర్ణుడుగాని, నీవుగాని, ఇంద్రజిత్తుగాని, నికుంభుడుగాని, ఇట్టి భారాన్ని వహింప సమర్థులం. కాన సైన్యసమేతుడవై విజయం కొరకు యుద్ధం చేయడానికి వెళ్ళు. నీవు వెళ్ళగా చపలులగు వానరులు సింహగర్జనం విన్న ఏనుగులవలె సహింపజాలక పరువెత్తుతారు. అపుడే సహాయులగు రామలక్ష్మణులు నీకు వశమవుతారు.

**వ్యా.వి.** ఇట్లు చెప్పిన రావణుడు ప్రహస్తుడు ప్రత్యుత్తర మివ్వకుండుట వల్ల యుద్ధానికి సిద్ధపడ లేదని భావించి "యత్రాయుద్ధే ధ్రువో మృత్యుర్యుద్ధే జీవితసంశయః, తమేవ కాలం యుద్ధస్య ప్రవదంతి మనీషిణః" యుద్ధం చేయకుంటే మరణం ఎట్లునూ తప్పదు. చేసినచో విజయమో? మరణమో? ఏది సంభవించునో సందిగ్ధం, అట్టి సమయంలో యుద్ధమే శ్రేయస్కరమని బుద్ధిమంతులు చెబుతారు. అనే నీతిని అనుసరించి రావణుడు ఇపుడు యుద్ధమే శ్రేయస్కరమని తలచి ఇట్లంటున్నాడు.

యుద్ధంలో జయాపజయములు నిశ్చితములు కావున జయం పొందుటకుగూడ అవకాశం ఉంది. యుద్ధం చేయకున్నా శత్రువుచే మరణము నిశ్చితం. కావున యుద్ధమందే మరణం శ్రేయస్కరం. ఇది నా అభిమతం. నీ అభిప్రాయం చెప్పు. నా భావాలకు వ్యతిరేకంగా కాని, అనుకూలంగా కాని, నీకేది హితంగా తోస్తుందో చెప్పు. లేక నీకు ఇతరం ఏదయినా తోచినా దానినయినా చెప్పు. అదే మాకునూ హితం రావణుడిట్లడుగగా

ప్రహస్తుడిట్లన్నాడు. 'రాజా! వెనుక విభీషణాది కుశలులగు మంత్రులతో ఆలోచించవలదే కద? అపుడు భిన్నమతులగు మంత్రుల ఆలోచన వలన ఏకాభిప్రాయులం కాజాలక నాకు కొందరితో వివాదం కూడా జరిగింది కదా! అందువలననే విభీషణుడు గూడ వెళ్ళిపోయాడు కద? సీతాప్రదానం శ్రేయస్కరమనీ, సీత నివ్వకుండుట యుద్ధకారణమగుననీ నా నిశ్చితాభిప్రాయం. ఎట్లయితే నిశ్చయించితినో అట్లే కనుపిస్తున్నది కద? ఇది నా భావం. కాని నీ అభిప్రాయాన్ని అనుసరించి యుద్ధం చేస్తాను. నేను నీ వలన ఎన్నో దానాలను పొందాను. నీయభినందన వాక్యాలచే పూజింపబడినాను. ఆపత్కాలంలో నీకు ప్రియం చేయుటకు నా ప్రాణాలనైనా విడిచిపెడతాను. నా జీవితాన్ని గాని, దారాపుత్రాదులను గాని, ధనమును గాని, రక్షించుకొన నక్కర లేదు. నీ కొరకు యుద్ధాగ్నియందు నా జీవితమనే హవిస్సును హుతము చేయుదునని.' ఇట్లు చెప్పి సేనానులతో సేనను తీసుకొని రండని ఆజ్ఞాపించాడు. ప్రహస్తాజ్ఞానుసారం సేనాబలాలు సన్నద్ధములయినాయి. సైనికులు విజయార్థమై అభిమంత్రితములగు పుష్ప మాలికలను ధరించారు. ప్రహస్తుడు రావణాజ్ఞను పొంది సమస్తాయుధపూర్ణము, స్వలంకృతము అగు రథము నధిరోహించాడు. నరాంతక, కుంభహను, మహానాద, సమున్నతులను నలువురు మంత్రులు, సైనికులు వెంటరాగా ప్రళయ కాలయమతుల్యుడగు ప్రహస్తుడు తూర్పు ద్వారం నుండి వెడలాడు. అనేక దుశ్శకునాలు కనిపించాయి. బయలుదేరునపుడు వసువులకు కూడా లేనట్టి శోభ ప్రహస్తునకు ఉంది. కాని ఈ దుశ్శకున దర్శనానంతరం ముహూర్తకాలంలో ఆ శోభ నశించింది. ప్రహస్తుని చూచిన వానరులు ఆయుధాలతో యుద్ధసన్నద్ధులై నిలచారు.

## యాభైయెనిమిదవ సర్గము

శత్రుహంతయగు ప్రహస్తుని జూచిన శ్రీరాముడు 'మహాసైన్యయుతుడగు ఈతడెవడు'? అని విభీషణు నడిగాడు. విభీషణుడు ప్రత్యుత్తరం చెపుతున్నాడు.

**గో.వి.** పూర్వద్వారం నుండి బయటకు వచ్చిన ప్రహస్తుడు కొన్ని ఆమడల దూరంలో ఉత్తరద్వార సమీపస్థియగు రామునికి ఎలా కనుపించాడు? ఆ ప్రశ్నకు సమాధానం. విశ్వసనీయులు 'ఒక మహాకాయుడు యుద్ధానికి వస్తున్నాడ'ని చెప్పగా ఆ వచ్చు వాడెవడని రాముడు అడిగాడు.

'అతని ముఖ్యసేనాధిపతియగు ప్రహస్తుడితడు. రావణసైన్యంలో మూడవ వంతు అతని అధీనంలో ఉన్నది. యుద్ధమందు వెనుకకు తిరగనివాడు' అని విభీషణుడన్నాడు. వివిధాయుధధారులగు రాక్షసులకు, వృక్ష శిలాధారులగు వానరులకు సంకులసమరం జరిగింది. నలువురు పలువురు వానరులను సంహరింపసాగారు. అపుడు ద్వివిదుడు నరాంతకుని, దుర్ముఖుడు సమున్నతుని, జాంబవంతుడు మహానాదుని, తారుడు కుంభహనుని సంహరించారు. నలువురు మంత్రులిట్లు హతులగుట వలన ప్రహస్తుడు కోపయుక్తుడై బాణవర్షంతో వానరులను

వధింపసాగాడు. (ఈ యుద్ధభూమిని వర్ణిస్తూ యుద్ధభూమిని ఉపమేయంగాను, మహానదిని ఉపమానంగాను, చెపుతూ వాల్మీకిమహర్షి సావయవరూపకాలంకారాన్ని ప్రదర్శిస్తున్నాడు.) 'ఆ యుద్ధభూమిలో మృతవానర రాక్షసవీరుల భగ్నాయుధాలు సమీపవృక్షాలు; రక్తమే జలం; మృతుల శరీరభాగాలైన యకృత్ప్లీహాలే బురద; ప్రేవులే నాచు; భిన్నములైన శిరస్సులు- మొండెములును మత్స్యములు; హస్తపాదాంగుళులే పచ్చగడ్డి; డేగలే హంసలు; కొవ్వే నురుగు; క్షతగాత్రుల దుఃఖధ్వనులే నదీధ్వని; ఇట్టి యుద్ధభూమి అనే మహానది యముడనే సాగరం చేరుచుండగా పిరికివారు దాటనలవి కాని ఆ యుద్ధనదిని వానర రాక్షసులు ప్రవర్తింపచేశారు.' రథస్థుడగు ప్రహస్తుడు వానర సేనానాయకుడగు నీలుని మీద ప్రయోగించిన శరాలు నీలుని భేదించి సర్పాల వలె భూమిని పొందినాయి. అపుడు నీలుడు వృక్షంతో ప్రహస్తుని రథాశ్వాలను సంహరించి ఆతడి ధనుస్సును విరిచి సింహనాదం చేశాడు. రథం నుండి దూకిన ప్రహస్తుడు రోకలితో ద్వంద్వయుద్ధం చేశాడు. అపుడు నీలుడు ఒక గండశిలతో ప్రహస్తుని శిరస్సును పగులగొట్టి ఆతనిని సంహరించాడు. ప్రహస్తుడు మరణించగా ఆనకట్టగండినుండి నీటిప్రవాహం వలె రాక్షసులందరు లంక కేగినారు. విజయుడగు నీలుని రామాదులు అభినందించారు. (పంచమినాడు ప్రహస్త వధ జరిగింది)

## యాభైతొమ్మిదవ సర్గము

అగ్నిపుత్రుడగు నీలునిచే ప్రహస్తుడు హతుడైనట్లు రావణుడు వినినాడు. ఇది స్వప్నంలో కూడా ఆతడు ఊహింపనిది. అయిననూ తాను క్షీణబలుడగుట వలన సంధి చేసుకుందామనే నీతిని విసర్జించి కాలచోదితుడగుట వలన స్వయంగా యుద్ధం చేయ నిశ్చయించి ముఖ్యయోద్ధలతో ఇట్లన్నాడు. 'శత్రువగు రాముని విషయంలోకాని, ప్రహస్తసంహర్తలగు వానరుల విషయంలో కాని వీరేమి చేస్తారనే దృష్టితో ఉపేక్ష పనికిరాదు. విజయంకోసం యుద్ధభూమికి నేనే బయలుదేరుతాను. శత్రువులను బాణాలతో దహిస్తాను' అలా చెప్పి రక్తాక్షులగు రాక్షససైనికులతో భూతపరివృతుడగు రుద్రునివలె బయలుదేరాడు.

**గో.వి.** 'రుద్ర ఇవాసురేశః' రాక్షసప్రభువగు రుద్రునివలె అని రావణుని రుద్రునితో పోల్చినారు. రుద్రుడు రాక్షస ప్రభువగుట ఎట్లనగా రుద్రుడు తామసప్రకృతిగా మైత్రాయణీయోపనిషత్తులో 'తామసోంశస్సోఽసౌ రుద్రః' అని చెప్పబడి ఉండుట వలన తామసులగు రాక్షసులకు ప్రభుడని వాల్మీకి వర్ణించారు.

శ్రీరాముడు విభీషణునితో 'రథగజపదాతియుక్త మగు ఈ గొప్ప సేన ఎవరిది?' అని అడుగగా విభీషణుడు ఇలా సమాధానం చెపుతున్నాడు. 'గజాధిష్ఠితు'డగు అకంపనుడు రావణపుత్రుడు ఈ ఇంద్రజిత్తు బ్రహ్మదత్తమగు అంతర్ధానవిద్య కలవాడు. గజసదృశుడగు ఇతడు ధనుష్టంకారం చేస్తున్నాడు.

**గో.వి.** ధనుష్టంకారం చేస్తున్నాడనుటచే భుజబలం, గజసదృశుడనుటచే శరీరబలం ఇంద్రజిత్తునకు సూచితములయినాయి.

'వేయి గుర్రాలు కట్టిన రథం అధిరోహించి మాయాబలం లేకున్నా ఇంద్రజిత్తు కంటే బలవంతుడు అతికాయుడు. గజమును అధిరోహించిన ఇతడు మహోదరుడు. ఈటెను ధరించి అశ్వము అధిరోహించిన

ఇతడు పిశాచుడు. శూలం ధరించి వృషభాన్ని అధిరోహించిన ఇతడు త్రిశిరసుడు. రథికుడగు ఇతడు కుంభుడు. ఇనుపకట్లగుదియను ధరించిన రాక్షసముఖ్యుడగు నికుంభుడితడు. ఇతడు నరాంతకుడు. శ్వేతచ్ఛత్రధారి, రథస్థుడు, మహాకాయుడు అగు ఈ రావణుడు సమస్త దేవతలను జయించి సూర్యునివలె ప్రకాశిస్తున్నాడు.'

రాముడు ఇలా అంటున్నాడు. 'ఈ రావణుడు గొప్ప పరాక్రమశాలి. సూర్యునివలె దుర్నిరీక్ష్యుడు. ఇతని తేజస్సు దేవదానవులలో ఎవరికీ లేదు. ఇతని సైనికులు కూడా తత్సదృశులే. వీరితో కూడిన ఈతడు భూతపరివృతుడగు యమునివలె గోచరిస్తున్నాడు. దైవయోగంవల్ల ఈ పాపాత్ముడు నాకు కనుపించినాడు. సీతనపహరించిన పగను ఇపుడు తీర్చుకొందును' ఇట్లని లక్ష్మణయుతుడగు రాముడు యుద్ధసన్నద్ధుడై ఉండెను.

రావణుడింద్రజిదాది యోధులతో ఇట్లన్నాడు. 'మీరందరూ సైన్యయుతులై వెనుకకు మరలండి. పట్టణ మందెవ్వరు లేనిచో శత్రువులు పట్టణప్రవేశం చేసి ధ్వంసం చేస్తారు. కాన నగరరక్షణ చేయండి అని వాళ్లను లంకకు పంపి తాను సుగ్రీవునితో యుద్ధం చేశాడు. రావణబాణపీడితుడైన సుగ్రీవుడు భూమిపై పడినాడు. సుగ్రీవపతనం చూచిన గవయ, గవాక్షసుదంష్ట్ర ఋషభాది వానరవీరులు దేహాలను పెంచి పెద్ద పెద్ద రాళ్ళతో రావణుని ప్రహరించారు. రావణుడా శిలలను శరాలతో ఖండించి వాళ్లను బాణాలతో నొప్పించి పడవేశాడు. రావణబాణవ్యధితులగు వానరులు శరణ్యుడగు రాముని ఆశ్రయించారు.

**గో.వి.** రావణబాధితులగు ఆ వానరులు అల్పులు కారు, ప్రసిద్ధులు. శరములచే హింసితులై కిందపడి ఆక్రందనలు చేస్తూ భయం అనే శల్యంతో కొట్టబడి వనచరులగుటవలన ఇతఃపూర్వం ఇట్టి భయం తెలియని వారగుటచే ఆర్తులై సర్వలోకశరణ్యుడగు శ్రీరాముని శరణు పొందారు. ఇందువలన శరణాగతినందుటకు ఆర్తి మాత్రమే చాలు. దేశం, కాలం, అధికారి, ఫలం, ఇట్టి నియమాలు అక్కరలేదని సూచితమైంది. (59-45).

ఇక్కడ ఆర్తశరణాగతి కావున దానికి సద్యః ఫలముండాలి. శరణాగతి తారతమ్యం తెలిసిన రాముడు అతఃపూర్వమే లక్ష్మణుడు యుద్ధానుజ్ఞ కోరియున్ననూ ఆశ్రితులను రక్షించు త్వర కలవాడై ముందుగా తానే యుద్ధం చేయడానికి బయలుదేరాడు. రామకైంకర్యప్రధానుడగు లక్ష్మణుడు రాముని ఇట్లు ప్రార్థించాడు. ఇట్లు చెప్పుట వలన రాముడు లక్ష్మణుని చూడనివాని వలె యుద్ధానికి బయలుదేరినట్లు తెలుస్తున్నది.

అపుడు లక్ష్మణుడిట్లన్నాడు. పరదారాపహర్తయగు ఈదుర్బుద్ధిని చంప నీవు సమర్థుడవే. కాని ఇట్టి నీచుడు నీతో యుద్ధానికి అనర్హుడు. కావున ఈ రావణుని నేను వధిస్తాను. నీ అనుజ్ఞ లేక నేను వెళ్ళలేను కద? కాన అనుజ్ఞనిమ్ము' రాముడిట్లన్నాడు. 'లక్ష్మణా! రావణుడు నీచుడు కాన తగిన ప్రయత్నంతో ఉండు. ఏమన ఈతడొక అస్త్రం ప్రయోగించునట్లు కనుపించి మరొక అస్త్రాన్ని సంధించి వేరొక అస్త్రాన్ని విడుచునట్టి మహాపరాక్రమశాలి. అతని లోపాలను గుర్తించు. నీ లోపాలను సవరించుకో. నీ ధనువుతో నిన్ను రక్షించుకో.' ఇలా చెప్పగా రాముని ఆలింగనం చేసుకొని ప్రదక్షిణ నమస్కారాలు చేసి లక్ష్మణుడు యుద్ధానికి బయలుదేరాడు. ఇంతలో వానరులను సంహరిస్తూ ఉన్న రావణుని బాణవర్షం లెక్కించక ఆంజనేయుడు రావణుని మీదకు పరువెత్తాడు. రావణుని భయపెడుతూ కుడిచేతి నెత్తి ఇట్లన్నాడు. 'నీకు దేవ గంధర్వ రాక్షస యక్షాదుల వల్ల మరణం లేదు. కానీ ఇక్కడ

వానరులవల్ల భయం ఉంది. నా దృఢమగు ఈ పిడికిలి నీ శరీరంనుండి జీవాత్మను బయటకు పంపగలదు' హనుమానుని మాటలకు ఆగ్రహించిన రావణుడు రక్తనేత్రుడై ఇట్లన్నాడు. 'వెంటనే ప్రహరించు. 'రావణుని ఒక కోతి కొట్టినద'ను స్థిరమగు కీర్తిని పొందు. నీ పరాక్రమాన్ని తెలుసుకుని నిన్ను సంహరిస్తాను' హనుమానుడిట్లు ప్రత్యుత్తరించాడు. 'నాచే హతుడయిన నీ కుమారుడు అక్షుని స్మరించుకో. నా విక్రమం గుర్తుకు వస్తుంది,' ఇట్లు మర్మోద్ఘాటన చేసిన హనుమానుని రొమ్మున రావణుడు అరచేతిలో ప్రహరించగా ఆతడు మిక్కిలి చలనం పొందికూడా తేజస్వియగుటచే క్షణకాలంలో స్థైర్యం పొంది రావణుని తన అరచేత ప్రహరించాడు. భూకంప సమయాన పర్వతంవలె రావణుడు కంపించాడు. రావణుడట్లు ఆంజనేయునిచే దెబ్బ తినడం చూచిన దేవతలు, గంధర్వులు ఋషులు, వానరులు సంతోషంతో సింహనాదం చేశారు. 'నీవు శత్రువయిననూ నీ పరాక్రమం పొగడ తగింది.' రావణుడిట్లనగా ఆంజనేయుడిట్లు సమాధానం చెప్పాడు.'నాచే ప్రహరింపబడి గూడ నీవు జీవించి ఉంటివే! అట్టి నా పరాక్రమం నశించు గాక. నిన్ను నీవే పొగడుకొంటున్నావు. ఇపుడు తిరిగి నన్నొక దెబ్బ కొట్టు, పిమ్మట నా పిడికిలి నిన్ను యముని వద్దకు పంపగలదు'. ఆంజనేయుని మాటలు విన్న రావణుడు కోపంతో మండి పడుతూ కుడిచేతి పిడికిటిని దృఢపరచి మహావేగంగా హనుమానుని రొమ్మున ప్రహరింప ఆతడు మిక్కిలి చలన మందెను. విహ్వలుడగు ఆంజనేయుని జూచి రావణుడు వేగంగా నీలునిమీదికి వెళ్లాడు. ఆంజనేయుడు స్వస్థుడైన పిమ్మట యుద్ధం చేయతలచి చూడగా నీలునితో యుద్ధం చేస్తున్న రావణుడు కనుపించాడు. అపుడాంజనేయుడు 'ఇతరులతోడ యుద్ధం చేసే నీతో నేను యుద్ధం చేయుట ప్రశస్తం కాద'ని అన్నాడు. రావణుడు నీలుని మీద బాణవర్షం కురిపించగా ఆతడిపై నీలుడు అనేక వృక్షాలను ప్రయోగిస్తూ తన శరీరాన్ని సూక్ష్మపరచి రావణుని రథాగ్రంపై వాలినాడు. తన ధ్వజాగ్రంమీద నివసించి సింహనాదం చేస్తున్న నీలుని చూచి రావణుడు మండిపడినాడు. ధ్వజాగ్రంమీద, ధనురగ్రంమీద, రావణకిరీటాగ్రంమీద సంచరిస్తున్న నీలుని లాఘవాన్ని చూచిన రామ లక్ష్మణ హనుమదాదులు విస్మయం పొందారు. రావణుడు కూడా విస్మయమంది ఆగ్నేయాస్త్రాన్ని సంధించాడు. నీలలాఘవ సంభ్రాతుడగు రావణుని చూచిన వానరులు సింహనాదాలు చేయగా రావణుడు కొంతసేపు కర్తవ్యమూఢుడయ్యాడు. రథధ్వజంయొక్క టెక్కెమందున్న నీలుని చూచి రావణుడిట్లన్నాడు. 'వానరా! నీవు లాఘవం, మాయ కలవాడవు. నీవు నీవంటి అనేక రూపాలు సృజించుచున్న వానిగా కనుపిస్తున్నావు. నీకు చేతనయిన యెడల ఈయాగ్నేయాస్త్రం నుండి నిన్ను నీవు రక్షించుకో' ఇట్లని నీలునిపై ఆగ్నేయాస్త్రం ప్రయోగించగా ఆ నీలుడు అస్త్రదగ్ధుడై నేలపై పడినాడు. ఆ నీలుడు తన తేజస్సువలన, మోకాటి మీద బోర్లపడెను గాని ప్రాణాలను విడువలేదు. రథస్థుడగు రావణుడు లక్ష్మణుని మీదకు రథాన్ని తోలాడు. లక్ష్మణుడు 'రావణా! ఈ స్వల్ప వానరులతో నీవు యుద్ధం చేయడం తగదు. నా వద్దకు రమ్మ'నగా రావణుడు 'లక్ష్మణా! నీవు చావును కోరుకొనుచున్నందున నా కంటబడినావు. అస్మద్బాణపీడితుడవై యముని ఒద్దకు వెళ్ళగలవు' అని అనగా లక్ష్మణుడు 'నిన్ను నీవే పొగడుకొంటున్నావు. గొప్ప ప్రభావం కలవారు ఇలా గర్జించరు. నీబలపరాక్రమాదులన్నీ నేనెరుగుదును. నిష్ఫలమగు ఆత్మశ్లాఘంవల్ల ప్రయోజనం లేదు?' అని పలికాడు. అందుకు కుపితుడైన రావణుడు.

**గో.వి.** విజన ప్రదేశంలో యతివేషం ధరించి సీతాపహరణం చేయడంలోనే నీపరాక్రమాదులు తెలిసినవని లక్ష్మణుడు హేళనగా మాట్లాడినాడు.

**మ.వి.** రావణుడు కుపితునివలె కనుపించెనని భావం. ఉత్తరత్ర ఇట్టి స్థలాలలో ఇట్లే సమన్వయం. లక్ష్మణుని మీద బాణవర్షం కురిపించాడు. లక్ష్మణుడు తన ధనువును అర్ధచంద్రాకారంగా వంచి మంగలి కత్తి వంటి, అర్ధచంద్రాకారం కలిగినట్టి, రెండు వేపుల పదును కలిగినట్టి బాణాలచే రావణ శరముల నన్నిటిని ఖండించి తాను ఏమాత్రం కలతనొందలేదు. రావణుడు తన బాణాలు వ్యర్థం కావడం చూచి లక్ష్మణుని చాకచక్యానికి విస్మితుడయ్యాడు. బ్రహ్మదత్తం, కాలాగ్ని సదృశం అయిన బాణాన్ని ప్రయోగించి లక్ష్మణుని మూర్ఛితుని చేశాడు. కొద్ది సమయంలో స్వస్థతనందిన లక్ష్మణుడు రావణధనువును ఛేదించి తీక్ష్ణ శరాలతో రావణుని మూర్ఛితుని కావించాడు. స్పృహపొందిన రావణుడు బ్రహ్మదత్తశక్త్యాయుధాన్ని లక్ష్మణునిపై ప్రయోగించాడు. అమోఘమగు ఆ శక్తి లక్ష్మణుని విశాలవక్షంలో ప్రవేశించింది. మహాబలవంతుడైనా శక్తిబాణప్రవేశంతో జ్వలించి లక్ష్మణుడు వికలుడయ్యాడు. క్రింద పడిన లక్ష్మణుని రావణుడు తన ఇరువది భుజాలతో ఎత్తుటకు ప్రయత్నించి విఫలుడయ్యాడు, హిమవంతుని, మందరమును, మేరువును, మూడు లోకాలను అయిన భుజములతో ఎత్త వచ్చును కాని లక్ష్మణుని ఎత్తడం సాధ్యపడదు. బాణతాడితు డగు లక్ష్మణుడు విష్ణ్వంశగా తనను స్మరించుకొన్నాడు.

**మ.వి**. లోగడ రాఘవులు నాగపాశాల నుండి విముక్తులై ఉత్థితులగుటను స్మృతికి తెచ్చుకొనిన రావణుడు లక్ష్మణుడిపుడు పునరుజ్జీవితుడు కాగలడనే భయంతో ఇతనిని సముద్రంలో పడవేసిన యెడల అసహాయుడగు రాముడు నశింపకలడను భావంతో లక్ష్మణుని చేతులతో ఎత్త ప్రయత్నం చేశాడు. హిమవత్పర్వతాదులనుద్ధరింప సాధ్యమవుతుంది. కాని లక్ష్మణుని ఎత్తడం సాధ్యంకాదు. కారణమేమన బ్రహ్మదత్తశక్తిబాణతాడనానంతరం తనను సర్వవ్యాపకుడు, అచింత్యుడు అగు విష్ణువుయొక్క భాగంగా భావించింది. ఆ విపత్తును పోగొట్టుకొనుటకు తనకు మూలకారణమగు విష్ణువును స్మరించాడు. అట్లు కాక ఎల్లపుడూ తాను విష్ణువు యొక్క భాగమనే విషయాన్ని స్మరిస్తూ ఉంటే తన మనుష్యభావన బాధింపబడుతుంది. అట్లు మనుష్యభావం బాధింపబడితే మానవునిచే చావతగిన రావణాదివధ అశక్యమవుతుంది. భగవదంశగా తనను స్మరించుకొనుట వలన తన శరీరానికి అపరిమితమైన బరువు ఏర్పడింది. అందువల్ల రావణుడు బాహువులతో లేపుటకు గాని, కదల్చుటకు గాని అశక్తుడయ్యాడు.

**గో.వి.** లక్ష్మణుని ఎత్త విఫల ప్రయత్న మొనర్చిన రావణుని వాల్మీకి పరిహసిస్తున్నాడు. "హిమవాన్ మందరో మేరుస్త్రైలోక్యం వా సహామరైః, శక్యం భుజాభ్యాముద్ధర్తుం న సంఖ్యే భరతానుజః, ...., విష్ణోరచింత్యం స్వం భాగమాత్మానం ప్రత్యనుస్మరన్" ఒకప్పుడు కైలాసాన్ని రావణుడు చలింపజేసినాడు. హిమవంతునయినా భుజాలతో ఉద్ధరింప సమర్థుడు, పాలసముద్రం చిలికిన మందరపర్వతాన్ని ఎత్తుటకు కూడా రావణుడు సమర్థుడే ఎట్లన తనచే జయింపబడిన దేవతలచే శిథిలమైనది కావున. మేరువును చలింపజేయ రావణుడు సమర్థుడే. మేరుశిఖర మందలి లంకను వాయువు సముద్రమధ్యంలో పడవేయగా రావణునకు లెక్క ఏమి? త్రిలోకాలను చలింపజేయ గలడు. ఇతడు తన పూర్వజన్మంలో హిరణ్యాక్షుడై భూమిని చాపవలె చుట్టి చంకనపెట్టుకొన్నాడు కద? త్రిలోకాధి పతులను తన పుత్రుడింద్రజిత్తు నిగ్రహించినందున వారిని చలింపజేయుట సుసాధ్యమే. కాని రామ చతుర్భాగమగు లక్ష్మణుని కదలింపజాలని రావణుడు రామునితో ఎలా యుద్ధం చేయగలడు? 'భుజాభ్యాం' హిమవత్పర్వతాదులను రెండు చేతులతో ఎత్త గలిగిన ఇతడు ఇరువది భుజాలతో లంగోటి బిగించి అతి ప్రయత్నం చేసి కూడా

కదలించలేకపోయాడు. అయిననూ తరువాత లక్ష్మణుని హనుమానుడు ఎత్తుకుని తీసుకుని వెళ్లాడు కద? అనే సందేహం ఉంది. 'సంఖ్యే' యుద్ధమందు శత్రువులచే ఎత్తడం సాధ్యపడదని భావం. అందువలననే ఆంజనేయుడు స్నేహితుడగుట వలన అతనికి సాధ్యపడిందని ముందు చెప్పబడుతుంది.(59-111). ఎందువల్ల లక్ష్మణునికి ఇంతటి గొప్పతనం (బరువు) కలిగింది? శక్తిబాణతాడితుడైన లక్ష్మణుడు "విష్ణోరచింత్యం స్వం భాగమాత్మానం ప్రత్యనుస్మరన్" విష్ణ్వంశగా ఇట్టివాడు, ఇంతటి వాడని మనసుచే ఊహింప సాధ్యపడని 'స్వాత్మానం' స్వస్వరూపుని 'ప్రత్యనుస్మరన్' స్మరించినవాడు. తన నిజస్వరూపస్మరణం కంటే భిన్నమైన వ్యాపారం లేనివాడు. కావున ఇతనికి కల బరువు సహజమైనదే. (ఇచట మహేశ్వరతీర్థాభిప్రాయఖండన చూపబడుతున్నది) 'మరి తన యొక్క విష్ణ్వంశస్మరణ కారణంగా లక్ష్మణుని శరీరానికి గొప్పతనం రావడానికి కారణాలు కనిపించుట లేదు. కావున ఆ ఆపదను తొలగింపచేయుటకు తనకు మూలకారకుడగు విష్ణువును స్మరించాడు' అనడం సరికాదు. తానే విష్ణుస్వరూపుడు కావున తనకాపద వచ్చుట గాని, తీర్చుటకు మరొక విష్ణువుండుట గాని సంభవించదు కద? తాను మనుష్యుడుగా భావింపబడవలసిన సమయంలో తానే విష్ణుదనని మనసులో భావించిన విషయం లోకదృష్టికి తెలిసేది కాదు. కావున లోకదృష్ట్యా మనుష్యుడుగా భావింపబడడానికి విరోధం లేదు. అందువలననే అభక్తులకు బరువుగను, భక్తులకు తేలికగను ఉండడం. కావుననే 'అచింత్యం' అను విశేషణం.(59-112), సహజంగా భక్తసులభుడు, అభక్త దుర్లభుడగుట వలన అభక్తుడగు రావణుడు లక్ష్మణుని ఎత్తలేకపోయాడు. లక్ష్మణుడు అంశసంభవుడగుట ఎట్లు? పరమాత్మ (పరబ్రహ్మం) అవయవాలు లేనివాడు కద? అనడం నిజమే! శుద్ధపరమాత్మ స్వరూపానికి అంశ కలదని చెప్పుట లేదు. కాని సృష్టిస్థితిలయాలను ఒనర్చుటకు ఆ పరమాత్మే గుణభేదానుసారం అగణిత మహామంగళగుణయుక్తుడు, సాకారుడు అవుతున్నారు. కాన సాకారుడగు పరమాత్మకు అంశముండుటలో విప్రతిపత్తి లేదు. రాఘవులకు కల మనుష్యత్వం మనుష్యులవంటి ఆకారం కలిగి ఉండుట మాత్రమే (59-113).

అపుడాంజనేయుడు కోపించి వజ్రతుల్యమగు పిడికిటితో రావణుని ప్రహరింప ఆతడారథమందే మోకాటి మీద బోరగిలబడి నోటినుండి, చెవుల నుండి, నేత్రముల నుండి, చాలా రక్తమును కక్కుకొన్నాడు. అటు ఇటు ఊగిపోయాడు. కొంతతడవు నిశ్చేష్టుడయ్యాడు. కొంతసేపు కూర్చుండి పిమ్మట సంజ్ఞాశూన్యుడై మూర్ఛితుడయ్యాడు. కొంతసేపటికి స్పృహలోకి వచ్చి కూడా సహజస్థితిని పొందలేదు. అట్లు ఆంజనేయునిచే రావణుడు మూర్ఛితుడు కావడం చూచిన ఋషులు, దేవతలు, వానరులు కోలాహలం చేశారు. పరాక్రమశాలియగు హనుమానుడు శక్తితాడితుడగు లక్ష్మణుని చేతులతో ఎత్తుకుని రాముని సమీపానికి తీసుకుని వెళ్లాడు. హనుమానుడు భక్తుడు, హితుడు అగుట వలన శత్రువులకు ఎత్తనలవి కానివాడయినా లక్ష్మణుడు ఆంజనేయునకు తేలిక అయినాడు.

**వ్యా.వి.** రావణుడు కదిలించలేని లక్ష్మణుడు హనుమానునకు ఎలా తేలిక అయినాడు? హనుమానుడు 'సుహృత్' అనుకూలహృదయుడు, ఇంతేకాక గొప్ప భక్తి కలవాడగుట వలన రావణుడు, అతడి అనుచరులు కూడా లక్ష్మణుని పైకెత్తుటకు ప్రయత్నించిరని ఈ 'శత్రూణాం' అన్న బహువచనం సూచిస్తున్నది. వారికి కదిలింపకాని వాడైనప్పటికి 'కపేః' ఒక్క ఆంజనేయునకు తేలిక అయినాడు. ఇందువలన ఇట్లు తేలికగుట బుద్ధిపూర్వకమని చెప్పినట్లైనది. శత్రువులకు గురువుగను, భక్తులకు లఘువుగను ఉండుట సహజం. మూర్ఛితుడగు లక్ష్మణుడు

భక్తుడు తనను ఎత్తుకొన గోరుచున్నట్లు గ్రహించడం అనునది నిత్యజ్ఞానయుక్తుడగు పరమేశ్వరలక్షణం. రాఘవులకు అపుడపుడు చూపబడెడి అజ్ఞానం- అశక్తత, మానుషవేషనిర్వహణకోసం మాత్రమే.

యుద్ధంలో అజేయుడగు లక్ష్మణుని హృదయమందలి ఆ శక్త్యాయుధం ఆతడిని విడచి రావణుని రథంలోని తన స్వస్థానానికి తిరిగి చేరింది. ఏ ప్రయత్నం లేకయే ఆ శక్త్యాయుధం తిరోగమించుటకు, లక్ష్మణుడు బాధా రహితుడగుటకు కారణం అచింత్యుడగు పరమాత్మయొక్క అంశం తానని స్మరించుకొనుటయే. ఇతర సాధనానుష్ఠానాలు అతడు నిర్వర్తించలేదు.

స్పృహ పొందిన రావణుడు తన శరవర్షంతో వానరులను పారద్రోలాడు. యుద్ధసన్నద్ధుడైన రామునితో ఆంజనేయుడు విష్ణువు గరుడునధిరోహించినటుల నన్నధిరోహించి యుద్ధం చేయమన్నాడు. హనుమానునధిష్ఠించిన రాముడు రథస్థుడగు రావణుని జూచి క్రోధయుక్తుడై అతనితో గంభీరంగా ఇట్లన్నాడు. రావణా! సీతనపహరించుట, లక్ష్మణుని ప్రహరించుట అను ఇట్టి అపకారాలు చేసిన నీవు ఎక్కడికి వెళ్లగలవు? బ్రహ్మాదిదేవతల నాశ్రయించినా, దశ దిక్కులలో ఎచటి కేగినా నా నుండి నీకు మోక్షం లేదు. నీ శక్త్యాయుధముతో బాధింపబడిన లక్ష్మణుడు నీ భార్యాపుత్రాదులకు మృత్యురూపుడై అతివేగంగా రాగలడు.

**గో.వి.** తమ ఇరువురికి అభేదమును మనమందుంచుకుని 'ఎవడైతే శక్తి చేత కొట్టబడినాడో ఆతడే నేను. ప్రహరించితినని గర్వమందకుము. ఈనాచేత పదునాలుగువేల రాక్షసులు జనస్థానమందు హతులైరి'.

రామవాక్యశ్రవణానంతరం రావణుడు రాముని వహించుచున్న ఆంజనేయుని మీద ప్రళయాగ్ని తుల్యములైన బాణాలు ప్రయోగించాడు. స్వతస్సిద్ధ తేజస్వియగు హనుమానుడు బాణతాడితుడగుటచే ఇతోధిక తేజస్విగా భాసించాడు. క్షతగాత్రుడైన ఆంజనేయుని చూచిన రాముడు క్రోధంతో రావణుని రథాన్ని, అశ్వాలను, ధ్వజాన్ని, సారథిని, ఛత్రాన్ని, సమస్తాయుధాలను బాణాలచే భేదించాడు. వజ్రసదృశ బాణాలతో రావణవక్షాన్ని భేదించాడు. వజ్రాయుధం, పిడుగు, వీటి ప్రహారాలకు కూడా చలించని రావణుడు రామబాణతాడితుడై ఆర్తుడై మిక్కిలి చలించి వీరుడై కూడా ధనువును విడిచిపెట్టాడు. దయాళువగు రాముడట్లు మూర్ఛితుడైన రావణుని కిరీటాన్ని మాత్రం ఛేదించాడు.

**గో.వి.** రావణుడు తనను తాను రక్షించుకోజాలని విషయాన్ని ధనువును వదలుట ద్వారా వెల్లడించాడు. రాముడే రక్షకుడని గూడ సూచించినాడు. తనను తప్ప మరొక రక్షకుని పొందజాలని మూర్ఛితుడగు రావణుని చూచిన దయాళువగు రామచంద్రుడు ప్రాణాలను హరించక కిరీటభంగం చేయడం ద్వారా మానభంగ మొనర్చినాడు.

ధనువును వదలిన, అందువలననే విషరహిత సర్పతుల్యుడును, నిస్తేజుడు అయి శాంతించిన కిరణములు కల సూర్యుని వంటివాడై, ఛేదింపబడిన కిరీట సముదాయం కలిగిన, రావణునితో రాముడిట్లన్నాడు.

'నీవు ఇతరులు చేయలేని గొప్ప యుద్ధం చేసి లక్ష్మణాది మహా వీరులను పడగొట్టినావు. నీవు యుద్ధ శ్రమతో ఉన్నావని భావించి నిన్ను చంపలేదు. 'యుద్ధశ్రాంతుని సంహరించె' నన్న అపవాదం నాకు రాకూడదనే

భావంతో నిన్ను వదలుతున్నాను. నేననుజ్ఞ ఇస్తున్నాను. కనుక వెళ్ళు. కపటయుద్ధ విశారదా! విశ్రమించి రథివై ధనుర్ధరుడవై రమ్ము .అపుడు నా బలమును చూడగలవు'.

రాముడిట్లు పలుకగా రావణుడు గర్వసంతోషాలు లేనివాడై కిరీటభంగంవల్ల లజ్జితుడై వేగంగా లంకలో ప్రవేశించాడు. పిమ్మట రాముడు లక్ష్మణునకు వానరులకు అయిన గాయాలకు చికిత్స చేయించాడు. రావణ పరాజయానికి భూమ్యాకాశస్థ సమస్తజీవులు సంతసించారు. (షష్ఠి నాడు రావణ కిరీటభంగం జరిగింది).

## అరవైయవ సర్గము

గర్వం వీడి లంకలో ప్రవేశించిన రావణునకు అపుడు గూడ రాముని బాణాలు తనపై పడుచున్నటుల భయం కలిగి శోకమనస్కుడయ్యాడు. సింహం వలన ఏనుగు, గరుత్మంతుని వలన సర్పాలవలె బలవంతుడగు రామునిచే రావణుడు పరాభవింపబడినాడు. రావణుడు బ్రహ్మదండ తుల్యమైన, మెరుపు వంటి వర్చస్సు కలిగిన రామబాణాలను స్మరించుకొని వ్యథ పొందాడు. రాక్షసులను జూచి ఇట్లన్నాడు.

**వ్యా.వి.** 'బ్రహ్మదండః' 1. బ్రహ్మశాపము, 2. విశ్వామిత్ర ప్రయుక్త సకలాస్త్ర నివారక వసిష్ఠయోగదండం. 3. బ్రహ్మాస్త్రం 4. యుగాంత కాలమందుద్భవించు ధూమకేతువు

నేను చేసిన తపం నిష్ఫలమయింది. మనుష్యమాత్రునిచే పరాజితుడనైనాను. మనుష్యునివల్ల నీకు భయము కలదని బ్రహ్మ చెప్పిన మాట రిత్తపోవునా? నేను మనుష్యులనుండి చావులేకుండా కోరియుండలేదు. ఐక్ష్వాకువగు అరణ్యుడు 'నిన్ను సమూలంగా నాశనం చేయువాడు నా వంశంలో పుట్టగలడ'నినాడు. అతడే ఈ రాముడని అనిపిస్తున్నది. వెనుక నాచే బలాత్కరించబడిన వేదవతి నన్ను శపించింది. ఆమె జానకిగా జన్మించి ఇంతటి ఉపద్రవానికి మూలమైంది. పార్వతి, నంది, రంభ, పుంజికస్థల తపఃప్రభావయుక్తలగు వీరి మాటలు యథార్థము లయినాయి. ఋషుల మాటలు రిత్తపోవవు కదా?

**మ.వి.** కైలాసాన్ని రావణుడు కదలించిన సమయంలో పార్వతీదేవి 'నీకు స్త్రీనిమిత్తంగా చావు సంభవించు' నన్నది. నందీశ్వరుడు వానరరూపుడుగా ఉన్నపుడు రావణుడు పరిహసింప ఏ వానరరూపం చూచి నీవు పరిహసించితివో నీ వధ కొరకు నాతో సమానమగు పరాక్రమం కల వానరులు పుట్టగలరన్నాడు. (ఉ. కా. 16.15) రంభాపరిభవకుపితుడగు నలకూబరుడు 'నిన్ను కామించని స్త్రీని నీవెపుడు బలాత్కారమున పొందుదువో అపుడే నీశిరస్సు వ్రయ్యలగును' (ఉ.కా. 26-4) అన్నాడు.

మీరందరు అప్రమత్తులై ఉండండి. కుంభకర్ణుడు బ్రహ్మశాపంవల్ల నిద్రిస్తున్నాడు. అతనిని మేలు అతడు తొమ్మిది, ఆరు, ఏడు, ఎనిమిది మాసములు నిద్రపోవుచుండును "నవ షట్సప్త చాష్టౌచ మాసాన్ స్వపితి రాక్షసః మంత్రయిత్వా ప్రసుప్తోఽ యమితస్తు నవమే ఽ హని" (60.17).

**మ.వి.** లంకను ముట్టడించడానికి తొమ్మిది రోజులు ముందు కుంభకర్ణుడు నిద్రించాడు. బ్రహ్మ శాపాను సారం ఒక్క రోజు మాత్రమే మేలుకొనియుండుననే నియమమే కాని నిద్రించుట తొమ్మిది, ఆరు, ఏడు, ఎనిమిది మాసాలు నియమం లేకుండా నిద్రిస్తూ ఉంటాడు. రావణుడు విభీషణాదులతో మంత్రణ చేయునపుడు అందు

పాల్గొని ఆ మరునాడు నిద్రించుట ప్రారంభించాడు. విభీషణుడు శ్రీరాముని వద్దకు వచ్చుట, శరణుపొందుట, మంత్రణ దిన మందే జరిగింది. పిమ్మట మూడు రోజులు రాముడు దర్భశయన మందుండి సముద్రుని ప్రార్థించాడు. (ని శాస్తి స్రోవ్యచక్రుముః) పిమ్మట ఐదు రోజులు సేతుబంధనం, ఐదవ రోజు సాయంత్రం సముద్రతరణం మరునాడు సువేలపర్వతారోహణం. ఆ రాత్రి ఆ పర్వతమందు వసించుట, మరునాడు సుగ్రీవునిచే రావణ కిరీట భంగం. అంగదరాయబారం. ఈ విధంగా యుద్ధప్రారంభానికి ముందు తొమ్మిది రోజులు గడచినాయి.

**గో.వి.** రావణుడు 'నేనిలా వ్యసనం పొందిఉండగా కుంభకర్ణుడు సుఖంగా నిద్రిస్తున్నాడు. ఇట్లే 9,6,7,8, మాసాలు నియమరహితంగా నిద్రిస్తాడు' కుంభకర్ణుడు బ్రహ్మను ఓ దేవా! అనేక సంవత్సరాలు నిద్రించుట నాకోరిక (ఉ.కా 10-46) అని అడిగాడు. 'ఈతడారు మాసములు నిద్రించి ఒక్క దినము మెలకువతో నుండున'ని విభీషణుడు మున్ముందు చెప్పబోతున్నాడు. అయితే 9,7,8, మాసాలలో ఆరుమాసాలు అంతర్గతములవుతాయి. కావున రావణోక్తికి విరుద్ధం కాదు. మరొక పాఠాంతరం 'నవ, సప్త, దశాష్టౌ చ మాసాన్' అని ఉంది. 'నవ-సప్త 16.లో దశాష్టౌ (అష్టిరశనం-నాశః) పదిమాసాలు తగ్గగ ఆరుమాసాలవుతాయి. మరొక పక్షం. "షడహైర్మాసా" న్సంపాద్యాహరు' ధ్సృజన్తి..... పౌర్ణమాస్యా హి మాసాన్సంపశ్యన్తి (తై. స.7 5. 15) అని మాసవిషయంలో వేదమనేక వికల్పాలను ప్రదర్శించింది. అందు పదిహేను రోజులు, ఆరు రోజులను కూడా మాసమన వచ్చును గాన మూలంలో నవ 9+ షట్ 6+ సప్త7+ అష్టః 30x 6 = 180 రోజులు అవుతుంది. కావున ఆరుమాసాలు నిద్రించి నట్లవుతుంది. కాన విరోధం లేదు. పై శ్రుత్యర్థ మేమనగా - ఒక సత్రయాగానికి ప్రకృతియగు 'గవామయన' యాగం ఉన్నది. అది పన్నెండు మాసములనుష్ఠించతగిన సోమయాగం. ప్రతిమాసంలోనూ ముప్పది రోజులనుష్ఠింప తగియున్నందున ఒక్కరోజు గూడ వదల వీలు లేకుండెను. దానికి వికృతి యగు ప్రకృత సత్రయాగ మందు ప్రతిమాసాంతంలో ఒక దినాన యాగపరిత్యాగాన్ని శ్రుతి విధించింది. "అమావాస్య యా........ రుథ్సృ జన్త్యమావాస్యయా హి మాసాన్సంపశ్యన్తి" (తై.సం.7.5.15) పక్షా వై మాసాః అమావాస్యతో మాసం పూర్తి అవుతుంది. కావున ఆ మరునాడు యాగాన్ని త్యజించాలి. అట్లే పౌర్ణమాసితో మాసం పూర్తి అవుతుంది. కావున ఆనాటితో యాగాన్ని పూర్తి చేసి మరునాడు యాగాన్ని త్యజించాలని శ్రుత్యర్థం. ఈ శ్రుత్యర్థ విషయంలో శంకా సమాధానాలు ఉన్నాయి. 'షడహైః' అన్నచోట బహు వచనముంది. పంచభిషడహైః అయిదు ఆరు రోజులు మాసమనబడుతుంది. (5X6 =30 రోజులు) అని వ్యాఖ్యానం చేయవచ్చుననగా అట్లు వ్యాఖ్యానించిన 'అర్ధమాసైః' అన్న చోట గూడ బహువచనముంది. కావున మూడర్ధమాసాలు (45 రోజులు) మాసమనవలసి వస్తుంది. అది అసంగతం. కావున 'పక్షా వై మాసాః' అను న్యాయానుసారం పదిహేను రోజులను మాసమనునటుల ఆరు రోజులను గూడ మాసమన వచ్చునని శ్రుత్యర్థం. ఆరు రోజులను మాసంగా పరిగణించి నవ షట్ సప్త చాష్టౌచ మాసాన్ స్వపితి 9+ 6 +7+ 8= 30X6=180 రోజులగును. కావున ఆరు మాసాలు నిద్రించుననుటలో విరోధ మీ రావణవాక్యానికి లేదు. (60.16 1/2) నిద్రానంతరం కుంభకర్ణుడు ఒక్క రోజు మాత్రమే మేల్కొని ఉంటాడు కావున మంత్రణం చేసిన మరుదినం నుండి నేటికి తొమ్మిది దినాల క్రితం నిద్రించుట ప్రారంభించెనని రావణుడనుకొన్నాడు. కొందరిట్లు సమన్వయపరుస్తున్నారు. మంత్రణ దినం మరునాటినుండి కుంభకర్ణుడు నిద్రిస్తున్నాడు. మంత్రణ దినముననే విభీషణుడు రామశరణాగతిని

పొందాడు. పిమ్మట 3 రోజులు సముద్రశరణాగతి, 5 రోజులు సేతుబంధనం. నాటి సాయంకాలం సముద్రం దాటుట, నాటి సాయంకాలం సువేలారోహణం. ఆ రాత్రి సుగ్రీవ రావణ ద్వంద్వ యుద్ధం మరునాడు తుముల యుద్ధం ఆ రాత్రి నాగపాశబంధనం, తద్విముక్తి, ధూమ్రాక్ష, వజ్రదంష్ట్ర, అకంపన వధ, మరునాడు ప్రహస్తవధ రావణకిరీటభంగం. ఇట్లయిన 9 రోజులు సరిపోవునన్నారు.

అట్లయిన సువేలపర్వతారోహణ సందర్భంలో పూర్ణచంద్రుడు వర్ణితుడైనాడు. కనుక యుద్ధప్రారంభం పాడ్యమినాడు కావాలి. విదియ రావణకిరీటభంగం జరిగినచో రావణుడమావాస్యనాడు సంహరింపబడుట సర్వాంగీకృతం కాబట్టి మధ్య ఇన్ని దినాల యుద్ధం ఎలా పొసగుతుంది?

వాస్తవంగా "ఇతస్తు నవమేఽహని" యుద్ధం మొదలగుటకు పూర్వం తొమ్మిది దినములని అర్థం. పూర్ణమి సువేలారోహణమనుకొంటే పాడ్యమి యుద్ధారంభం. అతఃపూర్వం తొమ్మిది రోజులనగా శుద్ధసప్తమి కుంభకర్ణుడు నిద్రించుట, శ్రీరాముని దర్భశయనం సంభవించవలె. అనగ షష్ఠినాడు మంత్రణం, విభీషణ నిర్గమనం జరిగి ఉండాలి. సీతాపహరణానికి ముందు 13 సం॥లు వెళ్ళినాయి. 14 సం॥రారంభంలో సీతాపహరణం. పంపాతీర మందు వసంతఋతువు వర్ణితమయినది కద ఆషాఢమందు వాలివధ. పిమ్మట వర్షఋతువర్ణన చేయబడినాయి. ఆశ్వయుజంలో సీతాన్వేషణ కొరకు వానరప్రేషణం, స్వయంప్రభాగుహలో బహు కాలనివాసం, ఫాల్గుణ శుద్ధ త్రయోదశియందు హనుమానుని లంకాప్రవేశం, వృక్షాలు పుష్పితాగ్రాలుగా వర్ణింపబడుట వల్ల ఫాల్గుణ మాసత్వ సిద్ధి, తీక్ష్ణశృంగ చంద్రుడు వర్ణింపబడుటచే త్రయోదశియు సిద్ధింపబడుతున్నాయి. చతుర్దశి ఉదయం లంకాదాహం జరిగింది. పిమ్మట ఆంజనేయుడు వెంటనే బయలుదేరి రామసన్నిధికి చేరడం జరిగింది. హనుమద్వాక్యశ్రవణా నంతరం చతుర్దశీయుక్త పూర్ణిమలో అభిజిన్ముహూర్తాన యుద్ధయాత్ర ప్రారంభించి ఎక్కడా ఆగకుండా రేయిం బవళ్లు నడచి మరునాడు సముద్రతీరంలో సేనానివేశం ఏర్పాటైంది.

ఇక శుక్లత్రయోదశి హనుమద్గమనానంతరం ప్రథమపర్యాయం రావణుడు మంత్రులతో కొద్దిగా మాట్లాడి అంతఃపురానికి వెళ్లి మరునాడుదయం మంత్రణం, విభీషణనిర్గమనం. శ్రీరామశరణాగతి, ఇవన్నీ ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ (మిగులు పూర్ణిమ) న జరిగినాయి. నాటి సంధ్యాసమయంలో చంద్రోదయం వర్ణితమగుట ఇందులకుపబృంహకమయినది. పాడ్యమినాడు దర్భశయనారంభం. నాడే కుంభకర్ణనిద్రప్రారంభం. అష్టమివరకు మూడు రోజులు దర్భశయనం. అయిదు రోజులు సేతుబంధనం అష్టమిరాత్రి సువేలపర్వతారోహణం. అయితే సువేలమందు "పూర్ణచంద్ర ప్రదీపా చ నివాసమభివర్తతే" పూర్ణచంద్రుడను దీపం కల నివాసముండెనని కలదు కద? అను శంకకు సమాధానమేమనగా పూర్ణచంద్రుని వంటి దీపాలు ఏ రాత్రి యందు కలవో అని అర్థం. సుగ్రీవసేనలో భేర్యాదులతో పాటు దీపాదులు గూడ కలవని గ్రహించాలి. నవమి ఉదయం లంకముట్టడి, నాటి రాత్రి నాగాస్త్రబంధనం తద్విముక్తి, నాటి రాత్రే ధూమ్రాక్ష, వజ్రదంష్ట్రవధ, ద్వితీయ దివస (దశమి) ప్రాతః కాలంలోనే అకంపనవధ, పిమ్మట ప్రహస్త యుద్ధం మరణం సంభవించినాయి. ఇచట పరస్పరం వ్యతిరేకించు గ్రహాలు ప్రకాశించలేదని వర్ణితమగుటచే గ్రహాలు రాత్రియందే ప్రకాశింప వీలుండును. కావున ప్రహస్తయుద్ధం రాత్రి జరిగినదను శంకకు సమాధానం. ఇట్లే ముందు రావణయుద్ధమందు పగలు చూడ వీలుపడని విషయం–

'రోహిణీ నక్షత్రం ఆక్రమించి బుధుడు కలడ'ని చెప్పుట జరిగింది. కావున అది వస్తు కథనమే కాని తత్కాలిక దర్శనయోగ్యత అక్కర లేదని సిద్ధాంతం. ఆ రెండవ రోజు యుద్ధమందే రావణపరాభవం, కుంభకర్ణుని నిద్రలేపుట, తద్యుద్ధం. పిమ్మట అవిచ్ఛిన్నయుద్ధంలో "అహ్నః పంచమ శేషేణ" అని వాల్మీకి అనుటవలన నాటి సాయంకాలాన ఇంద్రజిత్తుచే అరువది ఏడు కోట్ల వానరులు హతులైనారు. ఆ (రెండవ రోజు) రాత్రే సంజీవినీ ప్రభావంతో పునర్జీవితులైన వానరులు లంకను దహింపగా కుంభాది మకరాక్షపర్యంత రాక్షసవధ జరిగింది. అప్పటికి మూల బలం, రావణుడు, ఇంద్రజిత్తు మిగిలినారు. 3,4,5, రోజులలో "అహోరాత్రై స్త్రిభిః" అని మూడు రోజుల యుద్ధంలో లక్ష్మణునిచే ఇంద్రజిత్తు సంహరింపబడినాడు. ఆరవ రోజున మూలబలాన్ని రాముడు సంహరించినాడు. నాటి సాయంకాలం నుండి ప్రారంభింపబడి ఏడవ రోజు పూర్తిగా నడచిన రామరావణయుద్ధం పుచ్ఛామావాస్య యందు ఎనిమిదవ రోజున రావణవధతో ముగిసింది. కాన 'రామరావణయుద్ధం ఏడు దినములు జరిగింది' అను పాఠం కూడా సేనాయుక్త రావణ యుద్ధం 7రోజులు నడచినదని తెలియజేస్తున్నది "ఇతస్తు నవమేఽహని" 'ఇతః' కిరీటపతనదినం నుండి (ఈ దినము కాక) తొమ్మిది రోజుల ముందు మంత్రణం చేసి నిద్రించాడు అని అర్థం.

మరి హనుమానుడు వినుచుండగా రావణుడు సీతతో 'రెండు మాసములు మాత్రమే నీకు గడు విచ్చుచున్నాన'ను టచే, సీత కూడ 'పదిమాసములు గడచినవి. రెండు మాసాలు మిగిలినవి' అన్నది. కావున మరొక మాసం మిగిలి ఉండగనే రావణసంహారం వెంటనే పదునాలుగు సంవత్సరాలు నిండకనే అయోధ్యా ప్రవేశమెట్లు? అనగా రెండు మాసాల గడువు రావణాభిప్రాయానుసారం చెప్పబడింది. రావణుడు సీతాదేవిని సాంత్వనపరచడానికి అలా గడువు చెప్పినాడు. ఒక్క మాసమే సమయం కలదని సీత "ఊర్ధ్వం మాసాన్న జీవేయం" మాసానికి మించి తాను జీవించనని చెప్పింది. జరుగుతున్న ఫాల్గుణమాసంతో 14 సంవత్సరాల వనవాసదీక్ష పూర్తి అవుతుందనే విషయం దృష్టియందుంచుకుని 'మాసాదూర్ధ్వం న జీవిష్యే' మాసం కంటే ఎక్కువ కాలం జీవించనని చెప్పింది కావున అంతయూ సమంజసం అవిరుద్ధం.

'ఆ కుంభకర్ణుడు నా వలె శాపగ్రస్తుడు కాదు. నిద్రించువానిని లేపుట అనుచితమయినా ఈ దారుణ సమయంలో ఆతనిని నిద్ర లేపాలి' ఇలా రావణుడు అనగా ఆ రాక్షసులు గంధపుష్పమాలికాదులను, భక్ష్యములను తీసుకొని ఎటుచూచినా ఆమడ వైశాల్యంకల కుంభకర్ణశయనగృహంలో ప్రవేశించారు. అతని ఉచ్ఛ్వాసనిశ్వాసవేగానికి వెనుకకు, ముందుకు లాగబడుచూ అతిప్రయత్నంతో ప్రవేశించారు. భయంకరములగు ముక్కులు, పాతాళము వంటి నోరు కలిగి స్వర్ణాద్యాభరణాలంకృతుడై నిద్రాకాళిక వికృతరూపుడునైన కుంభకర్ణుని చూచారు. వివిధజంతుమాంసాలను ప్రత్యేకంగా పర్వతసదృశములగు రాశులుగా ఆతడి ముందుంచారు. అన్నరాశిని, రక్తమద్యపూర్ణకలశాలను ఎదురుగా ఉంచారు. పుష్పగంధం పూశారు. స్తుతించారు. లేవకుండుటచే గర్జించారు. శంఖాలు పూరించారు. పెద్దగా శబ్దం చేశారు. కొట్టారు. రాక్షసులు చేసిన శబ్దాలు విని పక్షులు నలుదిక్కుల పారి భయంతో నేలమీద పడినాయి. నిద్ర లేపుటకు వాళ్లు వివిధాయుధాలచే ఆ కుంభకర్ణుని ప్రహరించారు. పదివేల మంది రాక్షసులు ఒకే పర్యాయం మృదంగాది వాయిద్యాలను మ్రోగించి కూడా మేల్కొల్పజాలక గుర్రాలను,

ఒంటెలను, గాడిదలను, ఏనుగులను అతడి మీదకు తోలారు. శాపవశమున సుప్తుడగు ఆతడీ ప్రయత్నంవల్ల మేల్కొనలేదు. అనేక ప్రయత్నాలు సఫలం కానందున చివరకు వేయి ఏనుగులను ఒకే పర్యాయం త్రొక్కించగా ఆ స్పర్శకు ఒక పురుగు మీద ప్రాకిన అనుభూతినంది కుంభకర్ణుడు మేల్కొన్నాడు. ఆ విషయం గుర్తించని రాక్షసులింకనూ గదాద్యాయుధములతో ప్రహరిస్తూ ఉండగా అకాలంలో నిద్రలేపుటకు కారణం తెలియక నిద్రాభయపీడితుడై పెద్దగా ఆవులించాడు. అపుడాతడు ఎదుట నున్న మాంసరాశులను భక్షించి ఆకలి తీర్చుకొని, రక్తము త్రావి దప్పిక తీర్చుకుని మద్యముతో వితృప్తుడాయెను. అంతవరకతడి ఎదుటకు భయపడి దాగియున్న రాక్షసులు ఎదుటపడి నమస్కరించి చుట్టూ పరివేష్టించారు. తనను నిద్ర లేపుటకు విస్మయ మంది ఆ రాక్షసులతో ఇట్లన్నాడు. 'అకాలమున మీరు నన్ను నిద్రలేపితిరి. రావణుడు కుశలియే కద? ఏమీ భయములేదు కద? ఎవరి వల్లనో గొప్ప భయం ప్రాప్తించింది. లేనిచో ఇట్లు వేగంగా నన్ను నిదురలేపరు. ఇపుడు రాక్షసరాజు భయాన్ని తొలగిస్తాను. కావున యథార్థం నాకు తెలుపండి.' యూపాక్షుడను మంత్రి దోసిలి యొగ్గి కుంభకర్ణునితో ఇట్లన్నాడు.

దేవతల వల్ల ఎపుడూ భయంలేదు. మనుష్యుని వల్ల భయం బాధిస్తున్నది. పర్వతాకారులగు వానరులచే లంక ముట్టడింపబడింది. సీతాపహరణకుపితుడగు రాముని వలన భయం ఏర్పడింది. లోగా ఒకే వానరుడు ఇటకు వచ్చి అక్షాదుల సంహరించి లంకను తగుల బెట్టినాడు కద? ఇపుడు దేవశత్రువగు రావణుడు యుద్ధంలో మృతకల్పుడై సూర్యవర్చస్వియగు రామునిచే విడువబడినాడు. ఇట్టి స్థితి దేవతల వల్ల రావణునకు సంభవించలేదు. ఇట్లు యూపాక్షుడు చెప్పగా కనులు త్రిప్పుచూ కుంభకర్ణుడిట్లన్నాడు. 'సమస్త వానర సైన్యాన్ని, రామలక్ష్మణులను, యుద్ధంలో సంహరించి పిమ్మట అన్నగారిని చూచెద. వానరుల రక్తమాంసములచే రాక్షసులను తృప్తిపరుస్తాను.'

**మ.వి.** యథార్థంగా రామలక్ష్మణ సంబంధియగు వానరసైన్యాన్ని సంహరించి పిమ్మట రావణుని చూచెదనని భావం.

ఇట్లు క్రోధగర్వితుడై దోషయుక్తంగా మాటలాడు కుంభకర్ణుని చూచి మహోదరుడిట్లన్నాడు. 'రావణుని మాటలు విని పిమ్మట శత్రువుల జయించగలవు' పిమ్మట బలవృద్ధికరమగు రెండు వేల మద్యభాండముల మద్యం త్రాగి రావణాజ్ఞానుసారం రావణుని వద్దకు బయలుదేరాడు. రావణగృహమున కేగు మహాకాయుడగు కుంభకర్ణుని ప్రాకారం వెలుపల ఉండిన వానరులు చూచి భయంతో పరువెత్త సాగారు. మరి కొందరు రాముని ఆశ్రయించిరి.

## అరవైయొకటవ సర్గము

స్వర్ణభూషణాలంకృతుడు, త్రివిక్రముడగు నారాయణుని వలె ఆకాశాన్ని ఆవరించిన మహోన్నతుడగు కుంభకర్ణుని చూచి భయంతో పరువెత్తుచున్న వానరసేనను చూచిన రాముడు విస్మయమంది విభీషణునితో ఇట్లన్నాడు. 'లంక యందు పర్వతంవలె అత్యున్నతుడు, కపిలనేత్రుడు, మెరుపులతో కూడిన మేఘంవంటి ఇతడు భూమి మీద అత్యున్నతుడుగా కనుపిస్తున్నాడు. ఇతనిని చూచి వానరులందరూ భయంతో పరుగెత్తుతున్నారు. ఇతడెవడు?' విభీషణుడిట్లు సమాధానం చెపుతున్నాడు.

ఇతడు విశ్రవసుని కుమారుడు కుంభకర్ణుడు. ఇతనితో సరియగు ఆకారం కల మరియొక రాక్షసుడు లేడు. ఇతడు స్వతస్సిద్ధమగు పరాక్రమం కలవాడు. రావణాదులవలె వరబలయుక్తుడు కాడు. దేవ దానవ గంధర్వాదులను స్వీయ పరాక్రమంతోనే జయించినాడు. ఇంద్రునితో యుద్ధంలో వజ్రాయుధంతో కొట్టబడి క్రోధయుక్తుడై ఐరావతదంతాన్ని పెరికి దానితో ఇంద్రుని ప్రహరింపగా విషాదమందిన ఇంద్రాదులు బ్రహ్మ సమీపానికి వెళ్లి ప్రజలను భక్షించుట, ఋష్యాశ్రమ ధ్వంసనం, పరదారాహరణాదిరూప కుంభకర్ణుని అకృత్యాలను విన్నవించి 'ఈవిధంగా కుంభకర్ణుడు ప్రజలను భక్షింపసాగిన కొద్దిరోజులలో లోకం శూన్యమగు'నని చెప్పినారు. అపుడు బ్రహ్మ రాక్షసులను పిలిపించి కుంభకర్ణుని చూచి తాను భయమంది తిరిగి నెమ్మది మాటలతో ఇట్లన్నాడు. 'నిన్ను విశ్రవసుడు లోకవినాశం కొరకు పుట్టించినాడు. అందువల్ల నేటినుండి చచ్చినవానివలె పడి నిద్రించుచుండు' మన్నాడు. బ్రహ్మశాపంవల్ల కుంభకర్ణుడు ఆయన ముందే శయనించి నిద్రించసాగాడు. అపుడు రావణప్రార్థన మన్నించిన బ్రహ్మ 'ఆరుమాసాలు నిద్రించి ఒక్కరోజు మాత్రం మెలకువతో ఉంటాడు' అన్నాడు.

**వ్యా.వి.** ముందుగా కుంభకర్ణుడు రావణాదులవలె బ్రహ్మనుగూర్చి తపమాచరించి వరదాన సమయ మందు మాయకులోబడి 'దేవా! అనేక సంవత్సరాలు నిద్రించుటను కోరుకొనుచున్నా'నని కోరుటయూ, బ్రహ్మ అంగీకరించుటయూ జరిగింది. మెలకువగా ఉండిన సమయంలో ఈపైన చెప్పబడిన చరిత్ర జరిగింది. అట్లు కాదేని బ్రహ్మశాపానుసారం చచ్చినవానివలె నిద్రించువానికి తపస్సు చేయుట అసాధ్యం కదా! కాన ఆరుమాసాల నిద్ర పిమ్మట ఒక్క రోజు మాత్రమే మెలకువతో నుండుట ఈ శాపఫలమే.

ఆరు మాసాల నిద్రానంతరం మేల్కొని ఆకలి కలవాడై లోకాలను భక్షిస్తూ ఉంటాడు. ప్రస్తుతం నీచే పరాజయం పొందిన రావణుడు నిద్రించు కుంభకర్ణుని నిద్రలేపాడు. ఇపుడాతడు యుద్ధమందు వానరులను భక్షిస్తూ పరుగెత్తగలడు. ఇతని దర్శనమాత్రముననే భయపడి పరుగెత్తు ఈ వానరులు క్రుద్ధుడై యుద్ధం చేయు కుంభకర్ణుని ఎలా నివారించగలరు? కావున 'ఇదొక యంత్రం ఎత్తబడింది' అని ప్రకటించి వానరులను నిలువరించవలెనని విభీషణుడు శ్రీరామునితో చెప్పాడు. పిమ్మట రామాజ్ఞానుసారం సేనాపతి నీలుడు ఆవిధంగా ప్రకటించి సేనను నిలువరించాడు.

## అరవైరెండవ సర్గము

కుంభకర్ణుడు కొద్దిగా మత్తుడై రాజమార్గమందు పౌరులు పుష్పవర్షం కురిపించగా అన్నగారి సన్నిధి కేగి నమస్కరించి ఇట్లన్నాడు. 'నన్ను నిద్ర లేపిన కారణమేమి? నీకెవరి వలన భయం కలిగింది? ఎవడు చావబోతున్నాడు'? రావణుడు అంతవరకు జరిగిన యుద్ధవిశేషాలను వివరించి 'లంకయందు స్త్రీ బాల వృద్ధులు మాత్రమే మిగిలి ఉన్నారు. నీవు రక్షించాలి. నాకొరకు అనితరసాధ్యమగు శత్రుసంహారం చేయాలి. దేవాసురయుద్ధాలలో శత్రువుల జయించి ఉన్నావు. యుద్ధప్రియుడవగు నీవు ఈ శత్రుసైన్యాన్ని నశింపజేయి' అని చెప్పాడు.

## అరవైమూడవ సర్గము

రావణుని దీనవచనాలను వినిన కుంభకర్ణుడు నవ్వి ఇట్లన్నాడు. వెనుక మంత్రణసమయంలో హిత వాక్యాలను స్వీకరింపని నీకు శత్రువులవలన ఎట్టి ఆపద రాగలదని నిశ్చయించుకుంటిమో అట్టి సీతాపహరణ

రూప పాపఫలం ఇపుడు ప్రాప్తించింది. 'అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫలమశ్నుతే' తీవ్రములగు పాప పుణ్య కర్మల ఫలితం ఈజన్మలోనే ప్రాప్తమవుతుంది. ఎట్లనగా మహాపాతకులగు పురుషులు నరకమందు నియతంగా పడవేయబడుదురు కదా! ఓ రాజా! బలవంతుడనను అహంకారంవల్ల సీతాపహరణమునకు పూర్వం ఇది మంచిదా? కాదా? అని నీవు విచారించలేదు. అందువలన కలుగబోవు దోషం కూడా విచారించలేదు. ఐశ్వర్యవంతుడగు వాడు మంత్రణం ముందు చేయకుండా మంత్రణానంతరం చేయవలసిన పనులను ముందే చేయునో ఆతడు నీతిజ్ఞుడుకాడు. అనుకూలకర్మలయిననూ తగినదేశకాలములు లేక చేసినచో విరుద్ధఫలముల నిచ్చును. అపాత్రులకు (వేదాధ్యయనరహితులకు) పురోడాశాదిహవిస్సులను ఇచ్చినట్లు నిష్ఫలమగును.

"త్రయాణాం పంచధా యోగం కర్మణాం యః ప్రపశ్యతి, సచివై స్స సమయం కృత్వా స సభ్యే వర్తతే పథి" (63-7)

వ్యా.వి. దేశకాలాలకు విరుద్ధంకాని కర్మాచరణ సత్ఫలిత జనకమగునని చెపుతున్నాడు.

మంత్రులతో సహ నిశ్చయించు మూడు రకాలగు కర్మలను వివరిస్తున్నాడు.

1. తానధికుడుగా నుండి శత్రువు బలహీనుడుగా ఉన్నపుడు దండరూప ఉత్తమకర్మను

2. తాను-శత్రువు సములుగా ఉన్నపుడు సంధిరూప మధ్యమకర్మను

3. శత్రువు తన కంటే బలవంతుడుగా ఉన్నపుడు దానపూర్వక (ఆశ్రయణరూప) అధమకర్మను, ఈత్రివిధ కర్మలకు అయిదు విధాలైన సంబంధాలను అనగా 1. కర్మలనారంభించు ఉపాయం, 2. పురుష ద్రవ్య సంపదలు, 3.దేశకాల విభాగం, 4. విపత్ప్రతీకారం, 5. కార్యసిద్ధి. ఈఅయిదింటితో ఉత్తమమధ్యమాధమ కర్మలకు సంబంధాన్ని ఎవడు చూడగలడో ఆతడు సన్మార్గగామియై సత్ఫలం పొందుతాడు.

పక్షాంతరం. 'పంచధాయోగం' దేశ, కాల ,ఆత్మ, ద్రవ్య, ప్రయోజనరూప పంచవిధ సంబంధాలతో కూడిన కర్మత్రయం అని కూడా చెప్పకోవచ్చును.

ఎవడు నీతిశాస్త్రాన్ని అతిక్రమించకుండా మంత్రులతోను, మిత్రులతోను ఆలోచించి కార్యనిర్ణయం చేస్తాడో ఆతడు సన్మార్గగామియై సత్ఫలితం పొందుతాడు.

పురుషార్థములగు ధర్మార్థకామములననుసరించుటకు సమయాసమయములు ఉన్నాయి. ధర్మానికి ప్రాతఃకాలం, అర్థానికి మధ్యాహ్నం, కామానికి సాయం(రాత్రి) సమయం యోగ్యములు. ప్రాతఃకాలమున ధర్మం మాత్రమే అనుష్ఠేయం. మధ్యాహ్నకాలమున అర్థంతో పాటు ధర్మమునూ అనుష్ఠింపవచ్చును. సాయంసమయంలో (రాత్రి) కామంతోపాటు ధర్మార్థములు గూడ ఆచరింపతగినవే. అనగా ధర్మాచరణానికి యోగ్యముకాని కాలంలేదు. కామం సాయం (రాత్రి) సమయములందు తప్ప ప్రాతర్మధ్యాహ్న సమయాలలో వర్జనీయం. కాని ఎవడు త్రికాలాలలోనూ కామమునే ప్రధానంగా ఆచరిస్తాడో వాడు పురుషాధముడని గ్రహించాలి. (ఇచట సాయంకాలపదం జహల్లక్షణచే రాత్రి సమయాన్ని బోధిస్తున్నది)

కాలత్రయంలో సేవింపతగిన శ్రేష్ఠమగు ధర్మాన్ని ఏ రాజుగాని, రాజసదృశుడుగాని ఆచరింపనిచో ఆతని శాస్త్రశ్రవణం వ్యర్థం. శాస్త్రప్రయోజనం అనుష్ఠానమే కదా!

**గో.వి.** పైవిధంగా చెప్పుట వలన ధర్మార్థకామరూపత్రివర్గములతో ఉత్కృష్టమగు ధర్మాన్ని విడచి హీనమగు కామమునాశ్రయించిన నీ శాస్త్రశ్రవణం సముద్రఘోషశ్రవణంవలె నిష్ఫలమని కుంభకర్ణుని భావం. (63-10)

సామదానభేదదండోపాయములను, ధర్మార్థకామములను, తగిన కాలంలో మంత్రులతో ఆలోచించి వశీకృతమనస్కుడై ఆచరించువాడు విపత్తులను పొందడు.

కొందరు నీతిశాస్త్రజ్ఞానరహితులై భ్రాంతుడగు రాజుచేత మంత్రణమునకు పిలువబడి ఆలోచన లేకున్ననూ గద్దరితనముతో మాట్లాడుతూ ఉంటారు. అర్థశాస్త్రజ్ఞానరహితులగు అట్టి మంత్రుల మాటలను శ్రేయస్కామియగు రాజు పాటించకూడదు. అహితములగు మాటలను హితవాక్యములవలె పలుకు అట్టి వారిని మంత్రణసమయంలో బహిష్కరించాలి. శత్రుప్రేరితులగు దుష్టసచివులు విపరీతఫలితాలనిచ్చే పనులను రాజుచేత చేయిస్తారు. అట్టి వారి నడువడి వారిమాటల ద్వారా తెలుసుకోవాలి. దుర్మంత్రులు ప్రేరేపించిన కార్యాలను అవిచారితంగా చేసే రాజుయొక్క ఛిద్రములను శత్రువులు ప్రవేశిస్తారు. దానాదులచే శత్రువులకు వశులగు దుష్టమంత్రులు ఏదో ఒక చెడ్డ కార్యమందు రాజును ప్రవేశపెట్టి ఆఛిద్రమందు శత్రువును ప్రవేశింపజేస్తారు. ఇట్టి కపటమంత్రులను గుర్తించక వారిని పరిత్యజించుట ద్వారా తనను రక్షించుకొనని రాజు రాజ్యభ్రష్టుడవుతాడు. నామాటల సారాంశమేమనగా నీకామవ్యసనంవల్ల, దుష్టమంత్రణంవల్ల, ఈ ఆపద సంభవించింది. మన సోదరుడగు విభీషణుడు ఇంతకుముందు చెప్పినట్లు చేయుము. అదే మనకు హితమైనది. కానిచో నీ ఇచ్ఛానుసారం చేయుము.

కుంభకర్ణుని హితవాక్యాలు రుచింపని రావణుడు క్రోధంతో ఇట్లన్నాడు. గురువు వలె నన్ను శాసించు చున్నావేమి? ఇట్లు మాట్లాడుట వలన నీనోటికి శ్రమ కలుగుట తప్ప ప్రయోజనం లేదు. నీతివాక్యశ్రవణం చేయ దగిన కాలం గడచిపోయింది. ప్రకృతోపయుక్తంగా పరాక్రమం చూపుము. నీ వన్నదంతయూ యథార్థమే. నీతిని గుర్తెరుంగక అజ్ఞానంతో బలపరాక్రమాలను నమ్మి గర్వంతో సీతాసమర్పణ చేయకుండుటను గూర్చి మాటి మాటికి మాటలాడుకొనుట ఇపుడు వ్యర్థం. ఇపుడుచేయతగిన దానిని చేయాలి. "గతం తు గత మేవ హి" (63-25) గడచినది తిరిగి రాదు కదా! నా యందు స్నేహమున్నచో, నీ పరాక్రమం నీకు గుర్తున్నచో, నాకు సంభవించిన పరాజయమును నీ పరాక్రమముతో జయ మందుట ద్వారా సరిచేయుము. సర్వ ప్రయోజనాలూ నశించి దీనుడగు వానిని దగ్గరకు తీయువాడే స్నేహితుడు. నీతి తప్పిన వానికి సహాయం చేయువాడే బంధువు.

ఇట్లు నిష్ఠురంగా పలుకు రావణుని కోపాన్ని గుర్తించిన కుంభకర్ణుడు ఇలా సాంత్వనవాక్యాలను పలికాడు. ఓ రాజా! నీవు సంతాపింపవలదు. రోషము వీడి స్వస్థుడవు కమ్ము. నీ వెందులకు పరితపించుచుంటివో దానిని నేను నాశన మొనర్తును. నేను జీవించి ఉండగా నీవేమీ మనస్సున పెట్టుకొనవలదు.

**గో.వి.** ఇచట అర్థాంతరం ఉంది. నీవు నా విషయంలో 'ఇతడు సుఖంగా జీవిస్తూ నాపనిని చేయడం లేదు కదా!' అని పరితపిస్తున్నావు. నేను జీవించి ఉండగా అలా పరితపించవలదు. యుద్ధంలో రామునిచే మరణించ గలను. అపుడు నీకీ పరితాపముండదు కద?(63-31)

నీవు బంధుడవు, అన్నవు అగుటచే హితమైన మాటలు చెప్పితిని. స్నేహయుక్తుడగు బంధువు ఆపత్కాలంలో చేయతగిన శత్రువులతో యుద్ధం చేస్తాను. నాచే యుద్ధంలో సానుజుడగు రాముడు మరణించగా పారిపోవు శత్రుసైనికులను చూడు. యుద్ధభూమి నుండి నాచే తేబడిన రామశిరస్సును చూసి నీవు సుఖంగా ఉండుము. సీత దుఃఖించుగాక. యుద్ధమందు చనిపోయిన బంధువులు కలిగిన లంకావాసులగు రాక్షసులు గొప్ప సంతోషంతో రాముని చావును చూతురు గాక!

**గో.వి.** అర్థాంతరం. నాతోసహా నీవు యుద్ధంలో హతుడవు కాగా రామనిమిత్తంగా "ద్రవంతీం" వచ్చుచున్న శత్రుసేనను చూడు. (63-34 1/2) రామునివల్ల ఛేదింపబడి "ఆనీతం" దూరంగా ఉంచబడిన నాశిరస్సును చూచి సుఖంగా ఉండుము. అపుడిక నా మీద కోపముండదు కదా! సీతాదేవి జగన్మాత కావున దుఃఖించిన దుఃఖించు గాక. (63-35 1/2) "అద్య రామస్య పశ్యంతు" రామస్య అన్నచోట కర్తరి షష్ఠ్యర్థం స్వీకరించి రామకర్తృకమగు నా చావును మృతబంధురాక్షసులు చూతురు గాక. (63.36 1/2) శత్రునాశన మొనర్చుట ద్వారా మృతబంధురాక్షసుల కన్నీరు తుడిచెద. నేను వధింపబడిన పిమ్మటనే రాముడు నిన్ను వధింపగలడు.

**గో.వి.** అర్థాంతరం. నాచావుని గూర్చి నాకు విచారం లేదు. అయితే నామరణానంతరం రాముడు నిన్ను సంహరించునని మాత్రమే విచారిస్తున్నాను.

నాకు యుద్ధమునకాజ్ఞనిమ్ము. అష్టదిక్పాలకులతోడనయినా యుద్ధం చేస్తాను. మహాకాయుడను, శూలహస్తుడను నగు నేను యుద్ధంలో నర్తిస్తూ ఉంటే ఇంద్రాదులు భయపడతారు. రాముడు ముందు నా పిడికిటి దెబ్బను సహించిన పిమ్మటనే అతని బాణాలు నా రక్తం త్రాగగలవు. నేను యుద్ధానికి వెళతాను. రమింపుము, మద్యము త్రావుము. నాచే రాముడు సంహరింపబడిన చాలాకాలానికి సీత నీకు వశ్యురాలవుతుంది.

**మ.వి.** శ్రీరామునుద్దేశించి కుంభకర్ణుడు పలికిన కటువైన మాటలకు సామాన్యార్థం స్పష్టం. కుంభకర్ణుడు రావణప్రీతికొరకు గాని, సహజంగా గాని మాటలాడిన మాటలలో మరొక వ్యంగ్యార్థం స్ఫురిస్తున్నది. ఈ నాలుగు (63-341/2 నుండి) శ్లోకాలలోని క్రియాపదాలకు 'వీప్స' (రెండు పర్యాయములనుటను) స్వీకరించాలి. ఎట్లన- 'రాముడు చంపబడగ పరువెత్తు వానరసేనను చూడుము- చూడుము.' (ఇదే వీప్స ఇది జరిగేపని కాదని కుంభ కర్ణుని భావం. ముందు గూడ ఇట్లే అన్వయించుకోవాలి) 'రాముడు నా పిడికిటి పోటును సహించగలడు. పిమ్మట ఆతని బాణాలు నా రక్తం త్రాగగలవు' నేను యుద్ధానికి వెళ్లి రామలక్ష్మణులను సంహరించుట అసాధ్యము కాన వానరుల సంహరించి భక్షిస్తాను. వానరసంహారజనితసుఖమును నీకు సంపాదించి పెడతాను.

"మయాஉద్య రామే గమితే యమక్షయం చిరాయ సీతా వశగా భవిష్యతి" (ఈశ్లోక వ్యాఖ్య 12. సర్గాంత మందు (24.పేజీలో) చేయబడింది) (63-57).

## అరవైనాల్గవ సర్గము

కుంభకర్ణుని మాటలలో మంత్రులు దూషింపబడుటను విని సహించలేని మహోదరుడు రావణకృత్యాలను సమర్థిస్తూ ధర్మాదులు నియతఫలజనకాలుగా కనుపించుట లేదు కావున పరిగ్రాహ్యములు కావని, పరదారాప

హరణాదులు సుఖసాధకములుగ కనిపించుచున్నందున త్యాజ్యములు కావని హేత్వాభాసములతో కుంభకర్ణ వాక్యాలను ఖండించి రావణునితో ఇట్లన్నాడు. కుంభకర్ణునితో మేము యుద్ధానికి వెళతాము. మేము రాముని జయిస్తే మంచిదే. జయించకపోయినా నీవు 'సైన్యంతో రామలక్ష్మణులు హతులైర'ని లంకలో చాటించి సైనికులకు బహుమతుల నందజేసి ఏకాంతమందు సీతాదుఃఖమును మంచి మాటలచే పోగొట్టి రత్నాద్యాభరణప్రదానం చేసి వశ్యురాలగునట్లు చేసుకొనుము. రంజింపచేయతగిన భర్త చనిపోయినట్లు తెలుసుకుని నిరాశచెంది స్త్రీచాపల్యంతో నీకు వశ్యురాలవుతుంది. ఆమె లోగడ రాజభోగాలను అనుభవించి సుఖింపతగినట్టిదైననూ దుఃఖము ననుభవిస్తున్నది. నీ అధీనమందుండుట సుఖమును కలిగించునని గుర్తెరిగి నీకు వశ్యురాలవుతుంది'.

**గో.వి.** ఇచట మహోదరుని మాటలకు అర్థాంతరం ధ్వనిస్తున్నది."నష్టనాథా గమిష్యతి" (64-32) 'నష్ట-న-అథ – ఆగమిష్యతి' అని పదచ్ఛేద మొనర్చిన ఓ నష్టరావణా! అకామ విష్ణుకామ అయిన సీత కపటోపాయంతో మోసగింపబడినప్పటికీ నీకు వశ్యురాలు కాదు.'సా' పతివ్రతగా ప్రసిద్ధురాలగు ఆ సీత భర్త చనిపోయినట్లు విన్నప్పటికి, నిరాశచెందినప్పటికి, స్త్రీసహజచాపల్యయుక్త అయినప్పటికీ నీకు వశమగునా? (వశ్యురాలు కాదని భావం). (64-33).

'నాకిట్లు తోచింది. రాముని నీవు చూచిన అనర్థం కలుగుతుంది. ఇట్లు చేస్తే యుద్ధం లేకుండానే నీకు సుఖం కలుగుతుంది. సీత నీకు వశ్యురాలైనట్లు గుర్తించిన రాముడు నిరాశతో మరణిస్తాడు' అని మహోదరుడు చెప్పినాడు.

## అరవైయెదవ సర్గము

అట్లు మాట్లాడిన మహోదరుని బెదరించి కుంభకర్ణుడు రావణునితో ఇట్లన్నాడు. నేను రామాదుల వధించి నీ భయమును తుడిచి వేస్తాను. శూరులు వృథాగా గర్జించరు. శత్రువు చేసిన అవమానాన్ని సహించరు. ఆత్మ, స్తుతి చేసికొనకుండా దుష్కరకర్మలు చేస్తారు. మహోదరా! భయపడు. నీవంటి వారు రాజుహితమును గుర్తించక రాజచిత్తానుసారం నడుస్తూ ఈ యుద్ధానికి కారణమగు సీతాపహరణమునకు కారణభూతులైనారు. స్నేహితులుగా ఉండు అమిత్రులగు మీ వలన ఈ లంక యందు రాజు మాత్రమే మిగిలినాడు, ధనాగారం, సైన్యం, నశించినాయి. మంచిమాట చెప్పగలిగినవాడే స్నేహితుడు. అట్లు చెప్పజాలక రాజుననుసరించుట మిత్రులు చేయతగిన పని కాదు. మీరొనర్చిన పనిని సరిజేయడానికి శత్రువును జయించడానికి ఇపుడే యుద్ధానికి వెళుతున్నాను. ఇట్లు మాట్లాడిన కుంభకర్ణుని చూచి రావణుడు నవ్వుతూ ఇట్లన్నాడు.

'ఈ మహోదరుడు రాముని వలన భయపడినాడు. యుద్ధానికి ఇష్టపడుటలేదు. బలంలో, స్నేహంలో నీవంటివాడు నాకు మరెవ్వడూ లేడు. అందువలననే నిన్ను నిదురలేపినాను. శత్రువులను వధించుటకు శూలహస్తుడవై బయలుదేరు. ఇట్టి నిన్ను చూచుటతోడనే వానరులు పరుగెత్తుతారు. రామలక్ష్మణుల గుండెలు పగులుతాయి'. ఇట్లు పలికిన రావణుడు తనను పునర్జీవితునిగ తలచాడు.

మహాబలుడగు కుంభకర్ణుడు శత్రురక్తరంజితమై తీక్ష్ణమగు శూలాన్ని ధరించి 'నాసేన ఇచటనే ఉండ నిమ్ము. నేనొక్కడనే వెళ్ళి వానరుల భక్షిస్తాను' అనగా రావణుడందులకంగీకరింపక 'అట్లు కాదు. బుద్ధిమంతులగు

వానరులు ఏకాకిని, అజాగ్రతతో ఉన్న వానిని కొరికి చంపుతారు. కావున ఆయుధధారులగు సైనికులతో వెళ్లు' అని పలికి సింహాసనం నుండి లేచి కుంభకర్ణునకు హారాది సమస్తాభరణాలను స్వయంగా అలంకరించాడు. నడుమునకు కట్టబడిన ఇంద్రనీలమణులు పొదగబడినట్టి బంగారుమొలతాటి వలన సముద్రమథన సమయంలో వాసుకిచే చుట్టబడిన మందరపర్వతంవలె కుంభకర్ణుడు భాసించినాడు. రావణునకు ప్రదక్షిణనమస్కారాలు చేసిన కుంభకర్ణుడు యుద్ధానికి బయలుదేరాడు. ఆతనిని ఆశీస్సులతో రావణుడు సాగనంపాడు. వెంట సైనికులు బయలుదేరారు. నూరు ధనువుల వెడల్పు, ఆరువందల ధనువుల ఎత్తుకలిగి, రథచక్రాలవంటి కనులు కలిగి, మహాపర్వతతుల్యుడగు కుంభకర్ణుడు రాక్షసులతో నవ్వుతూ ఇట్లన్నాడు. 'ఇపుడు అగ్ని మిడుతలనువలె వానరులను దహిస్తాను. యథార్థంగా వానరులు నాకే అపకారమూ చేయలేదు. మా వంటి వారికి ఉద్యానవన భూషణాలుగ వారలుంటారు. యుద్ధానికి మూలభూతులగు రామలక్ష్మణులను సంహరిస్తాను' రాక్షసులపుడు భయంకరంగా సింహనాదాలు చేశారు. కుంభకర్ణుడు బయలుదేరినపుడు ఘోరములైన అపశకునాలు కనుపించాయి. అతని ఎడమచేయి, కన్ను కంపించినాయి. ఇత్యాది దుశ్శకునములను గుర్తించినా మృత్యుచోదితుడై యుద్ధానికి వెళ్లాడు. ఆతడు కోట గోడను దూకి మేఘంవలె అంతటనూ ఆవరించియున్న వానరసైనికులను చూచాడు. కుంభకర్ణ దర్శనమాత్రాన మహా భయం పొందిన వానరులు దశదిశల పరుగెత్తారు. గొప్ప పరిఘను ధరించిన ఆతడు ప్రళయకాలమందు దండధారియగు యమునివలె వానరులకు భయాన్ని కలిగించాడు.

## అరవైయారవ సర్గము

పరుగెత్తే వానరులను అంగదుడు ప్రోత్సాహక వచనాలచే అతికష్టంగా మరల్చినాడు. వానరులా కుంభ కర్ణుని శిలావృక్షాదులతో ప్రహరించారు. అతనికి తగిలిన పర్వతములు చూర్ణీకృతములైనాయి. వృక్షములు విరిగినాయి. అతనికే మాత్రం బాధ కలుగలేదు. క్రోధయుక్తుడగు ఆతడు దావాగ్ని అడవిని దహించినట్లు వానరుల దహించాడు. అపుడు వానరులు మహా భీతితో పరుగెత్తసాగారు. అపుడంగదుడు వానరులతో 'యుద్ధంలో వెనుతిరగ వలదని, అట్లు వెళ్ళిన భార్యలే హేళన చేయుదురని, పరాక్రమశాలురగు మీ కిట్టి పిరికితనం కూడదని, ఒక వేళ యుద్ధమరణం సంభవించినా బ్రహ్మలోకం ప్రాప్తించునని, రాముని కంటపడిన కుంభకర్ణుడు బ్రతికి తిరిగి వెళ్ళజాలడని, కాన యుద్ధోన్ముఖులు కండ' ని, సామవాక్యాలతో వానరులను యుద్ధోన్ముఖులను చేశాడు.

## అరవైయేడవ సర్గము

అంగదవాక్యశ్రవణానంతరం మరణించుటకు కూడా సంసిద్ధులైన వానరులు యుద్ధసన్నద్ధులై గొప్పశిలలను, వృక్షాలను ధరించి కుంభకర్ణుని పైకి వెళ్లారు. కాని ఆ వానరులను ఆతడు భక్షింపసాగాడు. అంతట ద్వివిదుడొక మహాశిలను కుంభకర్ణుని మీద వేయగా ఆ శిల ఆతడి మీద పడక రాక్షససైన్యంపైపడి అనేక గుర్రాలను, రథాలను, ఏనుగులను, పదాతులను సంహరించింది. రాక్షస వానరసేనకు దొమ్మియుద్ధం జరిగింది. ఆంజనేయుడు ఆకాశం నుండి అనేక శిలావృక్షాదులను వర్షింపగా వాటిని ఆ కుంభకర్ణుడు శూలంతో భేదించాడు. తిరిగి ఆంజనేయుడు

మహాశిలను ప్రహరించాడు. కుంభకర్ణుడా ప్రహారమునకు దెబ్బ తిని రక్తం కారగా మిక్కిలి క్షోభించాడు. అపుడు క్రోధంతో శూలాన్ని గిరగిర త్రిప్పి హనుమానుని వక్షమున ప్రహరింపగా ఆంజనేయుడు నోటినుండి రక్తం కక్కుకొంటూ బిగ్గరగా అరచి మూర్ఛ పొందాడు. రాక్షసులు సంతుష్టులైనారు. వానరులు దుఃఖించి భయంతో పరుగెత్తారు. నీలుడు వారిని నిలువరించి పర్వతాగ్రమును కుంభకర్ణునిపై వేశాడు. మీద పడనున్న ఆ శిఖరమును ఆతడు పిడికిటితో చూర్ణం చేశాడు. ఋషభ, శరభ, నీల, గంధమాదన, గవాక్షులు శిలావృక్షాదుల ప్రహరించి పిడికిట పొడిచారు. కుంభకర్ణునకివి అన్నీ ఏమాత్రం బాధను కలిగించలేదు. కుంభకర్ణుడు ఋషభుని కౌగలించుకొని శరభుని పిడికిట పొడిచి, నీలుని మోకాలితో కుమ్మి, గవాక్షుని అరచేతితో ప్రహరించి, గంధమాదనుని తన్నినాడు. ఈ దెబ్బలకు నెత్తురు క్రక్కిన వానర వీరులు మూర్ఛితులై నేల పడినారు. పిమ్మట అనేకవేల వానరులా కుంభకర్ణుని తరిమారు. ఆతడినధిరోహించి కొరికినారు. గోళ్ళతో గిచ్చి మోకాళ్ళతో పొడిచినారు. వానరాధిష్ఠితుడగు ఆతడు వృక్షయుక్త మహాపర్వతంవలె కనిపించాడు. కోపించిన ఆతడు వారిని భక్షింపసాగాడు. నోట ప్రవేశించిన వానరులు చెవులనుండి ముక్కులనుండి బయటికి వచ్చారు. అది చూచిన ఆతడు వారిని విరిచి భక్షింపసాగాడు. వానరులు భయంతో రాముని శరణు పొందినారు. అపుడు అంగదుడు గొప్ప పర్వతశిఖరమును కుంభకర్ణునిపై వేయగా అందుకు కోపమందిన కుంభకర్ణుడు సింహనాదం చేసి అంగదుని మీదకు శూలంతో విసిరాడు. మీదకు వచ్చు శూలంనుండి లాఘవంగా తప్పుకున్న అంగదుడు ఎగిరి మహావేగంతో అరచేత కుంభకర్ణుని రొమ్మున ప్రహరించాడు. ఆ దెబ్బకు మోహం పొంది తిరిగి లబ్ధసంజ్ఞుడైన కుంభకర్ణుడు పిడికిట అంగదుని ప్రహరింపగా ఆతడు మూర్ఛితుడై పడిపోయాడు. వానరులను హింసిస్తున్న కుంభకర్ణుని ఎదుర్కొన్న సుగ్రీవుడు 'నీవు అనేక వానర వీరులను పడవేశావు. ఈ అల్పులతో నీకేమి పని? నాచేతి ఈ పర్వత శిఖరపు దెబ్బను సహింపుము' అనగా కుంభకర్ణుడిట్లన్నాడు. నీవు బ్రహ్మపౌత్రుడవు, ఋక్షరజుని పుత్రుడవు, శాస్త్ర పౌరుషములు కలవాడవు. నాకు తెలియును. ఎందుకు వృథా గర్జిస్తావు?

**గో.వి.** ఇక్కడ ఒక చరిత్ర ఉంది. వెనుక బ్రహ్మ ఆవులింపగా నోటినుండి 'ఋక్షరజు' దను వానరుడు పుట్టినాడు. ఆతడు బ్రహ్మలోకమున పర్యటిస్తూ అప్సరోరూప జనకమగు సరస్సున తెలియక స్నానం చేసి అప్సరో రూపం పొందాడు. ఆ సమయంలో అచటికి వచ్చిన ఇంద్రాదిత్యులిరువురూ ఆమెను కామించి ఒకే పర్యాయం కరగ్రహణం చేశారు. అంతలో వారికి కామ తీవ్రతతో ఆ యువతి వాలస్థానమందు ఇంద్రుని యొక్క కంఠభాగంలో ఆదిత్యునియొక్క రేతస్సులు స్ఖలించి పతనమయినాయి. వాలస్థానంనుండి వాలి, కంఠస్థానంనుండి సుగ్రీవుడు పుట్టినారు. వారిని చూచి నవ్విన బ్రహ్మ పూర్వరూప ప్రాప్తికొరకు మరొక సరస్సున స్నానమాచరింప ఆదేశించాడు. ఋక్షరజసుడట్లు చేసి అచ్చరరూపమును విడచి యథాపూర్వరూపాన్ని పొందాడు. అందువలన బ్రహ్మకు వాలిసుగ్రీవులు పౌత్రులు. కొందరు కశ్యపప్రజాపతి కుమారుడాదిత్యుడు, తత్పుత్రుడు సుగ్రీవుడందురు.

పిమ్మట కుంభకర్ణ సుగ్రీవులకు జరిగిన యుద్ధంలో సుగ్రీవ ప్రహారకుపితుడగు కుంభకర్ణుడు వేయిబారువుల బరువు కలిగి కాంచనాలంకృతమగు శూలాన్ని గిరగిర త్రిప్పి సుగ్రీవ సంహారం కొరకు విసరాడు. శూలం సుగ్రీవుని తాకక ముందే హనుమానుడు దూకి ఆ శూలాన్ని ఆపి రెండుచేతులతో పట్టుకొని మోకాటికి ఆనించి

విరిచి వేశాడు. అదిచూచిన వానరులు సింహనాదం చేశారు. ఆంజనేయుని పూజించారు. తన ప్రయత్నం నిష్ఫలగుటవల్ల కోపం పొందిన కుంభకర్ణుడు లంకలోని మలయపర్వత శిఖరాన్ని పెకలించి దానిచే సుగ్రీవుని ప్రహరింపగా ఆతడు మూర్ఛితుడై క్రిందపడినాడు. 'ఈ సుగ్రీవునపహరించినచో రామ సహితమగు సర్వసైన్యాన్ని అపహరించినట్లే' అని భావించిన కుంభకర్ణుడు సుగ్రీవుని ఎత్తుకొని లంకకు వెళ్లాడు. అపుడాంజనేయుడు ఇలా ఆలోచించాడు. 'నేను ఇపుడు పర్వతాకారుడనై కుంభకర్ణుని సంహరించి సుగ్రీవుని విడిపింతునా?, అలా చేస్తే సుగ్రీవుని పరాక్రమానికి శాశ్వతమగు అపకీర్తి సంభవిస్తుంది. సుగ్రీవుడు మూర్ఛతేరి తనను తాను రక్షించుకో గలడు. కావున భయపడిన సేనను నిలువరించి ఇక్కడనే ఉంటాను.' అని ఆలోచించి నిశ్చయించుకొన్నాడు.

అట్లు కుంభకర్ణాపహృతుడగు సుగ్రీవుడు రాజమార్గంలో కుంభకర్ణుని మీద పురజనులు చల్లు పుష్పాదుల వలన, చల్లని గాలివలన మూర్ఛతేరి బాగా ఆలోచించి హటాత్తుగా గోళ్ళతో అతని చెవులను తెంపి, పండ్లతో ముక్కును కొరికి, కాళ్ళతో పార్శ్వాదిభాగములను తన్నినాడు. ముక్కు చెవులు తెగిన కుంభకర్ణుడు మహాకోపంతో సుగ్రీవుని నేలమీద పడవేసి పిసికివేశాడు. అట్లు పిసకబడిన సుగ్రీవుడు లెక్కించక ఆకసానికి ఎగసి రామసన్నిధికి చేరాడు. ముక్కులు, చెవులు, తెగిపోయి రక్తము ధారలుగా కారు కుంభకర్ణుడు యుద్ధభూమికి వచ్చాడు. తానాయుధ రహితుడనని గుర్తించి గొప్ప ముద్గరమును (ఇనుపగుడియను), ఇతరాయుధములను ధరించి మహాకోపంతో తనవారు – ఎదుటి వారను గుర్తు గూడ లేక వానరులతో పాటు రాక్షసులను గూడ భక్షిస్తూ పరువెత్త సాగాడు. లక్ష్మణాదులను లెక్కింపక రాముని మీదకు పరుగెత్తాడు. రామబాణతాడితుడగు ఆతని చేతినుండి గదాద్యాయుధాలు జారిపడినాయి. ముఖంనుండి అగ్నిజ్వాలలు బయలువెడలినాయి. నిరాయుధుడైనా బాహువులతో, పిడికిళ్ళతో, కాళ్ళతో గొప్ప యుద్ధం చేశాడు. స్వపరజ్ఞానం లేక సంచరించుచున్న కుంభకర్ణుని అధిరోహించమని లక్ష్మణుడు సూచించగా వానరులట్లు చేశారు. వారిని మదించిన ఏనుగు మావటి వారలను విదలించినట్లు కుంభకర్ణుడు విదలించాడు. వానరులను వెదకి భక్షిస్తూ నెత్తురును నాలుకతో చప్పరిస్తూ రక్తనేత్రుడై కాలాంతక సముడగు కుంభకర్ణుని జూచి రాముడిలా అన్నాడు.

'కుంభకర్ణా! నేను రాముడను. ధనుర్ధారినై ఉన్నాను. నన్నెదుర్కొను. విషాదం పొందకు. ముహూర్త కాలంలో ప్రాణముల విడువగలవు' ఆతడే రాముడని గ్రహించి బిగ్గరగా నవ్విన కుంభకర్ణుడు 'నేను విరాధుడను కాను, కబంధుడను కాను, మారీచుడను కాను, ఖరుడనుకాను, కుంభకర్ణుడను. నాహస్త మందలి ఈ ముద్గరమును చూడు. దీనిచే దేవత లందరును పరాజితులైనారు. నాకు ముక్కు, చెవులు లేవని చులకనగా చూడకు. అందువల్ల నాకు స్వల్ప బాధ కూడా లేదు. ఇక్ష్వాకువంశంలో పుట్టిన నీ పరాక్రమాన్ని ప్రదర్శించు. నీ పరాక్రమం చూచిన పిమ్మట నిన్ను భక్షిస్తాను' అని పలికాడు. అపుడు రాముడాతని మీద బాణవర్షం కురిపించాడు. అందులకా కుంభకర్ణుడు వ్యథచెంద లేదు. మానసికక్షోభనందలేదు. ఏ బాణం సప్తసాలములను భేదించెనో, ఏ బాణం వాలిని సంహరించినదో, అట్టి బాణాలు కూడా కుంభకర్ణుని ఏమీ వ్యథ పెట్టజాలక పోయాయి. రాముడపుడు వాయవ్యాస్త్రముతో కుంభకర్ణుని బాహువును ఛేదించగా ఆతడు బిగ్గరగా అరచాడు. పర్వతశిఖరం వంటి ఆ బాహువు క్రింద నలిగి అనేక వానర రాక్షసులు చనిపోయారు. మిగిలిన వానరులు భయంకరమగు ఆ రామ

కుంభకర్ణ ద్వంద్వయుద్ధమును వీక్షించసాగారు. ఒక చేయితెగిన కుంభకర్ణుడు రెండవ చేత మహావృక్షాన్ని పెకలించి దానితో రాముని ప్రహరింప ప్రయత్నించాడు. ఆతని రెండవ చేతిని రాముడు ఐంద్రాస్త్రంతో ఛేదించాడు. ఛేదింపబడిన ఆ హస్తం మీదపడగా అనేకమంది వానరరాక్షసులు హతులైనారు. రెండు చేతులూ ఛేదింపబడినప్పటికి భయంకరంగా గర్జిస్తూ మీదకు వస్తున్న కుంభకర్ణుని రెండు పాదాలను రెండర్ధ బాణాలతో రాముడు ఛేదించాడు. ఆ పాదాలు దిక్కులను విదిక్కులను పర్వతములను, గుహలను, సముద్రమును, లంకను, పతన ధ్వనివలన ప్రతిధ్వనింప జేస్తూ పడిపోయాయి. ఛేదింపబడిన బాహువులు, పాదములు కల కుంభకర్ణుడు పిరుదుల మీద ప్రాకుచూ భయంకరంగా నోరు తెరచుకొని ఆకాశంలో చంద్రుని మ్రింగటానికి వచ్చు రాహువు వలె రాముని మీదకు వచ్చాడు. తెరువబడిననోటిని రాముడు బాణాలతో పూరించాడు. అందువల్ల ఆ కుంభకర్ణుడు మాట్లాడలేక చాల కష్టం మీద శబ్దం చేసి మూర్ఛితుడయ్యాడు. అంతట బ్రహ్మదండ తుల్యం, ఇంద్రదేవతాకమైన అస్త్రాన్ని రాముడు ప్రయోగించగా ఆ బాణవేగానికి ఛేదింపబడి ఆకాశానికి ఎగసిన కుండలాలంకృతంబగు కుంభకర్ణుని శిరము చంద్రునివలె ప్రకాశించినది.

**కుంభకర్ణ శిరో భాతి కుండలాలంకృతం మహత్ ।**
**ఆదిత్యేఽ భ్యుదితే రాత్రౌ మధ్యస్థ ఇవ చంద్రమాః ॥ (67-157 1/2)**

**గో.వి.** బాణవేగంతో ఆకాశానికి ఎగసిన కుండలాల మధ్య కల కుంభకర్ణుని శిరము రాత్రి యందు 'ఆదిత్యే' అదితి దేవతాకం నక్షత్రద్వయాత్మకమగు పునర్వసు నక్షత్రం మధ్యలోగల చంద్రునివలె భాసించింది.

**మ.వి.** (పై విశేషాలనే కాక) కుండలాలకంటె భిన్నమగు చెవిభాగం సుగ్రీవునిచే ఛేదింపబడుటవల్ల శిరస్సునకే కుండలములు అతికినట్లు భాసించినాయి. అర్థాంతరం. గొప్పదగు కుంభకర్ణుని శిరస్సు 'కుండలాలంకృతం' కుండలాలచే 'అలం- కృతం' కుండలాలచే రహితంగా ప్రకాశించింది. ఇక్కడ దృష్టాంతం ఆదిత్యేఽభ్యుదితే సూర్యుడుదయించగా (అరాత్రౌ అని పదచ్ఛేదం చేసుకోగా) పగటియందు ఆకాశమధ్యగతుడైన చంద్రునివలె (శోభాహీనుడై) భాసించింది.

ఆకాశంనుండి పడిన ఆ శిరస్సు ఎత్తుగానున్న ప్రాకారాన్ని, గృహాలను, గోపురాలను, భటులు నివసించే చర్యాస్థానాలను పడగొట్టింది. కుంభకర్ణుని బాహుపాద శిరోరహితకబంధభాగం అనేక మంది వానరులు చెల్లా చెదరుకాగా నేల మీద పడి అట నుండి సముద్రంలో మునిగి సముద్రస్థం మీనాది జీవులను మర్దించింది. దేవ శత్రువగు అతడు మరణించగా భూమి పర్వతసహితంగా కంపించింది. దేవగంధర్వాదులు రామ పరాక్రమ సంతుష్టులైనారు. రాక్షసులు పూర్వం విష్ణువుని చూచి భయమందినట్లు రాముని చూచి భయం పొందారు. వానరులందరూ రాముని పూజించారు. (సప్తమి కుంభకర్ణవధ అని మ.తీ వ్యాఖ్యానం)

## అరవైయెనిమిదవ సర్గము

**గో.వి.** ఈ అధ్యాయ ప్రథమ శ్లోక మందలి "రావణాయ" అన్నచోట యకారం గాయత్రీ మంత్ర మందలి 18.వ అక్షరం. ఇంత వరకు 17000/- పదిహేడు వేల శ్లోకాలు అయినాయి.

రామునిచే కుంభకర్ణుడు మరణించిన విషయాన్ని రావణునికి సైనికులు విన్నవించారు. అతడి కబంధం సముద్రంలో పడింది. శిరస్సు లంకాద్వారాన్ని అడ్డగించిందని వివరించారు. శోకోద్వేగంతో రావణుడు మూర్ఛపొందాడు. కొంతకాలానికి స్పృహలోకి వచ్చిన రావణుడు అనేక విధాలుగా శోకించాడు. 'నాకుడి చేయి పడిపోయింది. కుంభకర్ణుడు లేని ఈ రాజ్యంతో నాకేమి పని? సీత వల్ల ప్రయోజనమేమి? నాజీవిత మందే నాకు ప్రీతిలేదు. నా సోదరుని చంపిన రాముని చంపలేకపోతే నాకు మరణమే శ్రేయస్కరం. నాసోదరుడున్న చోటికే వెళతాను. అతనిని వదలి క్షణమయినా జీవించలేను. విభీషణు డపుడు వచించిన మంచి మాటలిపుడు అనుభవంలోనికి వచ్చినాయి. అజ్ఞానంలో ఆ మాటల నేను అంగీకరించలేదు. ప్రహస్త కుంభకర్ణాది మరణాలు సంభవించినప్పటినుండి విభీషణుని మాటలు నన్ను సిగ్గుపరుస్తూ ఉన్నాయి. పరమధార్మికుడగు విభీషణుడు నాచే వెడల గొట్టబడినాడు. దాని ఫలితమే ఈ నా శోకం. ఈవిధంగా కుంభకర్ణుడు చిత్రవధనందినట్లు తెలుసుకొని రావణుడు ఇలా దుఃఖించాడు.

## అరవైతొమ్మిదవ సర్గము

దుఃఖిస్తున్న రావణునితో త్రిశిరుడిట్లన్నాడు. నీవనినట్లే మా పినతండ్రి కుంభకర్ణుడు దైవమువల్ల మరణించినాడు. కాని నీవంటివాడిట్లు దుఃఖింపతగదు. నీకు వరబలం, ఆయుధవాహనబలాలు ఉన్నాయి. తప్పక రాముని జయిస్తావు. నీ వట్లుండు. ఇంద్రునిచే శంబరుడు, విష్ణువుచే నరకుడు సంహరింపబడినట్లు నాచే రాముడు సంహరించబడతాడు.

**వ్యా.వి.** ఇక్కడ చెప్పబడిన నరకుడు సింహిక యందు విప్రచిత్తి వల్ల కలిగిన వాతాపి, ఇల్వల, నముచి, సృమర, అంధక, నరక, కాలనాభులలో ఒకడైన నరకుడు. విష్ణుపురాణంలో ఈ విషయం ఉంది. రామావతారానంతరం కృష్ణునిచే సంహరింబడిన నరకుడు ఇతడుకాడు.

తన పుత్రుడైన త్రిశిరసుని మాటలు విన్న రావణుడు తాను పునర్జన్మ నెత్తినట్లు తలచినాడు. రావణ పుత్రులు దేవాంతక, నరాంతక, అతికాయులు యుద్ధోత్సాహంతో యుద్ధానికి బయలుదేరారు. తన నలువురు పుత్రులకు రక్షణార్థం యుద్ధోన్మత్త ప్రమత్తులను నామాంతరాలు కల మహోదర మహాపార్శ్వులను సోదరులను యుద్ధానికి పంపాడు. వీరందరు యుద్ధభూమికి సైన్యసమేతులై వచ్చి వానరుల సంహరింప సాగారు. అశ్వారూఢుడగు నరాంతకుడు 'ఈటె' ధరించి అతివేగంగా వానరసంహారం చేస్తుండగా సుగ్రీవాజ్ఞానుసారం అంగదుడాతని నెదుర్కొన్నాడు. అంగదనరాంతకులు ద్వంద్వయుద్ధం చేస్తుండగా అంగదుడు దృఢ ముష్టితో నరాంతకుని ప్రహరింప నరాంతకుడు మరణించాడు. అంగదుడు రామశ్లాఘాపాత్రుడై తిరిగి యుద్ధసన్నద్ధుడయ్యాడు.

## డెబ్బైయవ సర్గము

దేవాంతకుడు, త్రిశిరసుడు, మహోదరుడు అంగదుని చుట్టుముట్టినారు. అపుడంగదునకు హనుమంతుడు, నీలుడు తోడ్పడ్డారు. ఆంజనేయుడు ముష్టిఘాతంతో దేవాంతకుని సంహరించాడు. నీలుడు గొప్పశిలతో మహోదరుని సంహరించాడు. రథికుడగు త్రిశిరసునితో ఆంజనేయుడు భీకర సమరం సాగించాడు. ఆతడి రథాశ్వాలను గోళ్ళతో చీల్చి చంపాడు. త్రిశిరసుని అరచేతితో ప్రహరింపగా అతడి చేతిలోని సమస్తాయుధాలు జారి క్రింద

పడినాయి. వాటిలోని మహాఖడ్గాన్ని గ్రహించిన ఆంజనేయుడు కిరీటయుక్తములైన ఆతడి మూడు శిరస్సులను విశ్వరూపుని మూడు శిరస్సులను ఇంద్రుడు వజ్రాయుధంతో ఖండించినట్లు ఖండించాడు.

**గో.వి.**“విశ్వరూపో వై త్వాష్ట్రః పురోహితో...... తస్య వజ్రమాదయ శిరీషాణ్యచ్ఛినత్” (తై.సం.2-5.1) అను మంత్రంలో ఈ విశ్వరూపవధ చెప్పబడింది.

త్రిశిరసుని వధానంతరం మత్తుడను నామాంతరం గల మహాపార్శ్వుడు మహాగదను ధరించి వానరుల దునుమాడుచుండగా పర్వతాకారుడైన ఋషభుడు ఆతడితో ద్వంద్వయుద్ధం చేసి ఆతడి చేతిలోని గదను పెరికి దానితోనే ఆ మహాపార్శ్వుని సంహరించాడు. యుద్ధానికి తరలివచ్చిన ఆరుగురు మహాయోధులలో ఐదుగురు మరణించడంవల్ల ప్రాణభయంతో రాక్షససైనికులు పారిపోయారు.

## డెబ్బైయొకటవ సర్గము

ముమ్వురు సోదరులు, ఇరువురు పినతండ్రులు హతులగుటను, స్వీయసైనికులు కాందిశీకులగుటను చూచిన అతికాయుడు రథస్థుడై స్వీయనామం ప్రకటిస్తూ వానరులకు భయం కలిగించాడు. ఆతడు కుంభకర్ణుడని భ్రమించిన వానరులు భయపడి రాముని ఆశ్రయించారు. దూరస్థుడగు అతికాయుని చూచిన రాముడు ‘ఈ మహాకాయుడెవర’ని విభీషణుని ప్రశ్నించగా, ‘ఇతడు రావణునకు ధాన్యమాలి యందు కలిగిన కుమారుడు - అతికాయుడు. సర్వ శాస్త్రాలను అధ్యయనం చేసి, తపమాచరించి దేవదానవులవల్ల అవధ్యుడుగా బ్రహ్మవలన వరం పొందినాడు. అభేద్యకవచాన్ని, రథాన్ని పొందినాడు. ఈతని బాహుబలంతో లంక సురక్షితంగా ఉన్నది. ఇతని బాణంవల్ల ఇంద్రుని వజ్రాయుధం స్తంభించింది. ఇతనిని గూర్చి గట్టి ప్రయత్నం చేయాలి’ అని విభీషణుడు చెప్పాడు. యుద్ధంలో వానరసేనానులు మైందుడు, ద్వివిదుడు, కుముదుడు, నీలుడు, శరభుడు, ఒక్కపెట్టు శిలావృక్షవర్షంతో అతికాయునిపై కురిపించికూడా ఆతని బాణవర్షానికి ప్రతిక్రియ చేయలేకపోయారు. రథస్థుడగు అతికాయుడు రాముని సమీపానికి వచ్చి సగర్వంగా ‘క్షుద్రులతో నేను యుద్ధం చేయను. ఉత్సాహం కల వీరు డెవడయినా నాతో యుద్ధానికి రావలె’ నని పలుకగా ఆ మాట వినిన లక్ష్మణుడు సహించక చిరునగవుతో ధనువు గ్రహించి జ్యానాదంతో రాక్షసులను భయపెడుతూ శస్త్రప్రయోగం ఆరంభించాడు. భయంకరమగు ఆ నారి త్రాటి శబ్దం విని అతికాయుడు విస్మయం పొందాడు. ‘సౌమిత్రీ! నీవు బాలుడవు. పరాక్రమవిషయం నీకు తెలియదు. వెళ్ళు. యమునివంటి నాతో యుద్ధం వలదు. నీవు అట్లే నిలచినచో ప్రాణాల పోగొట్టుకొందువు’ అని అతికాయుడనగా లక్ష్మణుడిలా ప్రత్యుత్తరం ఇచ్చాడు. ‘ఆత్మస్తుతి వలన సత్పురుషులు కాలేరు. పౌరుషం కలవాడే శూరుడు. రథస్థుడవైన నీవు శస్త్రాస్త్రములతో నీపరాక్రమాన్ని చూపుము. పిమ్మట నీశిరస్సు ఖండిస్తాను. నేను బాలుడనైననేమి? నన్ను మృత్యువుగా గుర్తించు’ పిమ్మట అతికాయ, లక్ష్మణుల యుద్ధం చూచుటకు మహర్షులు, దేవగంధర్వయక్షులు వచ్చారు. మహాపరాక్రమశాలురైన వాళ్లిద్దరు ఆశ్చర్యకరంగా యుద్ధం చేశారు. ఆ ద్వంద్వయుద్ధంలో అతికాయుడు సౌరాస్త్రాన్ని, ఐషికాస్త్రాన్ని, యామ్యాస్త్రాన్ని ఉపయోగించగా వాటిని లక్ష్మణుడు ఆగ్నేయ, ఐంద్ర, వాయవ్యాస్త్రాలతో నివారించాడు. లక్ష్మణప్రయుక్త బాణములన్నీ అభేద్యమగు అతికాయుని కవచాన్ని తాకి నిష్ఫలములైనాయి. అపుడు వాయుదేవుడు సౌమిత్రితో ఈతడు బ్రహ్మాస్త్రంతో వధింపబడగలడు. ఇతర శస్త్రాస్త్రములీ బ్రహ్మప్రసాదితకవచాన్ని

భేదించలేవు. అని చెప్పాడు. అపుడు లక్ష్మణుడు శరసంధానం చేసి బ్రహ్మాస్త్రంతో అభిమంత్రించగా సూర్యచంద్రాది గ్రహాలు భయపడినాయి. భూమి కంపించింది. అమోఘమగు ఆ బ్రహ్మాస్త్రాన్ని అతికాయుని మీద ప్రయోగించాడు. అతికాయుడు తన్నివారణార్థం శరప్రయోగం చేసినా ప్రయోజనం కలుగలేదు. బ్రహ్మాస్త్రాభిమంత్రితశరం అతికాయుని శిరస్సును ఖండించింది. మరణించిన అతికాయుని చూచి మిక్కిలి దుఃఖించిన రాక్షసులు లంకకు పరుగెత్తారు. వానరులు విజేతయగు లక్ష్మణుని పూజించారు.

## డెబ్బైరెండవ సర్గము

అతికాయుడు చనిపోయిన విషయం విన్న రావణుడు ఉద్వేగంతో ఇట్లు పలికాడు. ధూమ్రాక్ష ప్రహస్త కుంభకర్ణాది మహావీరులందరూ రామునిచే మరణించారు. ఇంద్రజిత్తుచే నాగపాశబద్ధులైన రామలక్ష్మణులు స్వీయ ప్రభావముననో మాయచేతనో, వాటినుండి విముక్తులైనారు. నా ఆజ్ఞచే యుద్ధానికి వెళ్లిన రాక్షస వీరులందరూ వానరులచే మరణించారు. ఏమి ఆ రాముని అస్త్రబలం! ఎవని పరాక్రమం వల్ల రాక్షసులందరూ సంహరింపబడిరో ఆ రాముడు సాక్షాన్నారాయణుడని భావిస్తున్నాను. సైనికులారా! మీరప్రమత్తులై లంకను రక్షిస్తూ ఉండండి. నాయాజ్ఞలేనిదే సీత ఉన్న అశోకవనానికి గమనాగమనములను అంగీకరించవలదు. ముఖ్యప్రదేశాలను జాగరూకులై రక్షించండి. శత్రువులను తేలికగా భావించక నిరంతరం గమనిస్తూ ఉండండి. ఇట్లు సైనికులను ఆజ్ఞాపించి దుఃఖభారంతో దీనుడై అంతఃపురానికి వెళ్లాడు.

## డెబ్బైమూడవ సర్గము

శోకసముద్రంలో మునిగి ఉన్న రావణునితో ఇంద్రజిత్తు ఇట్లన్నాడు. తండ్రీ! నేను బ్రతికి ఉండగా నీవిట్లు దుఃఖించుట తగదు. నాబాణాలు సమస్తావయవముల గ్రుచ్చుకొనగా మరణించి నేల పడియున్న రామలక్ష్మణులను చూడండి.

**పశ్యాద్య రామం సహ లక్ష్మణేన మద్బాణనిర్భిన్న వికీర్ణదేహమ్ ।**
**గతాయుషం భూమితలే శయానం శితైశ్శరైరాచిత సర్వగాత్రమ్ ॥ (73-5)**

**మ.వి.** వాస్తవార్థమేమనగా మహాపరాక్రమశాలియగు రాముని సంహరించుటకు నాకు సామర్థ్యం లేదు. కాని బాణవికీర్ణదేహునిగా చేయగలను. 'గతాయుషం' ప్రాప్తించిన ఆయుష్యము కలవానిగా చూడు.

ఇపుడు నాపరాక్రమాన్ని సమస్త దేవతలు చూచెదరు కాక! ఇలా పలికిన ఇంద్రజిత్తు శ్రేష్ఠములైన గాడిదలు కట్టిన సూర్యరథతుల్యమగు రథాన్ని ఆరోహించి యుద్ధానికి బయలుదేరాడు. చతురంగబలములాలు అతనిని అనుసరించాయి. శంఖభేర్యాది నినాదాలతో యుద్ధభూమికేగి రథం చుట్టూ సైనికుల నుంచి విజయార్థమై యథావిధిగా హోమమాచరించాడు. తాను ఎఱ్ఱని వస్త్రాలను ధరించాడు. రెల్లు (దర్భ) బదులు పరిస్తరణములుగా బాణాలను ఉంచుకొన్నాడు. తాండ్ర సమిత్తులను, ఇనుపస్రువమును, అగ్నిని ప్రతిష్ఠించి చిల్లకోలతో(తోమరము)తో కూడిన రెల్లుపరచి నల్లని మేక పిల్లను హవన మొనర్చినాడు.

**గో.వి.** శత్రుసంహారార్థం చేసే హెూమం అభిచారికమనబడుతుంది. ఇంద్రజిత్తు చేసే ఈ అభిచారిక మందు "శరమయం బర్హిస్తృణాతి" (తై.సం.2-1-8) అభిచారికమందు దర్భలబదులు రెల్లు పరిస్తరణంగా వాడవలెనని శ్రుతిచెప్పచుండ ఇతడు విశేషమగు అభిచారిక మొనర్చుచుండుటచే రెల్లు బదులు బాణాలను పరిస్తరణాలుగ వాడినాడు. 'కలి' కి ఆశ్రయభూతమగు "వైభీతక ఇధ్మః" (తై. సం. 2.1.8.) అను శ్రుతి బోధితమగు తాండ్రసమిత్తును, ఇనుపస్రువమును ఉంచుకొన్నాడు.

ఒక్క పర్యాయం జ్వాలచేయగనే ధూమరహితంగా అగ్ని జ్వలించుటే కాక ప్రదక్షిణంగా సుడి తిరిగి విజయాన్ని సూచించింది. స్వర్ణాభరణధారియగు అగ్నిహెూత్రుడు ఆవిర్భవించి స్వయంగా హవిస్సును స్వీకరించాడు. బ్రాహ్మమంత్రముచే తన ధనువును, అమ్ముల పొదిని, రథమును, అన్నిటిని అభిమంత్రించాడు. బ్రహ్మాస్త్రము నాతడాహ్వానం చేయగా ఆకాశమందలి గ్రహనక్షత్రములన్నీ భీతిల్లాయి. సర్వాయుధములతో, సూతసహితమైన రథముతో తత్క్షణమే ఇంద్రజిత్తు ఆకాశమందదృశ్యుడయ్యాడు. అదృశ్యుడగు ఆతడు అనేకాయుధాలతో వానరులను సంహరింపసాగాడు. వృక్షశిలాధారులగు వానరులు ఉమ్మడిగా ఆతని మీదకు వెళ్ళినారు. అదృశ్యుడగు ఆతడు క్రుద్ధుడై ఒక్కొక్క బాణంతో అనేకమందిని సంహరింపసాగాడు. ఆతడి బాణగతి ననుసరించి శిలావృక్షాదులను వానరులతనిమీద వర్షించారు. వాటి నాతడు బాణాలతో నివారించి నీలాది ముఖ్య వానర వీరులను బాణాలతో నొప్పించాడు. ఇంద్రజిద్బాణములచే వానరసేనంతా కల్లోలితమయింది. వానరులాతడి తీక్ష్ణములగు బాణాలనే చూడగలిగారుగాని అదృశ్యుడగు అతనిని కనిపెట్టలేకపోయారు. బాణాభిహతులగు వానరులు వికృతంగా అరుస్తూ పడిపోయారు. ఆతని కనిపెట్టుటకాకసమువంక చూచిన కొందరి కనులయందు బాణవర్షం కురిసింది. సుగ్రీవ హనుమదంగదాదులను అనేకాయుధాలను ప్రయోగించి అధఃపతితులను కావించాడు. పిమ్మట ఇంద్రజిత్తు తీక్ష్ణ బాణాలతో రామలక్ష్మణులను ప్రహరించాడు. ఎడతెరపిలేని బాణవర్షంలో మునిగి కూడా రాముడు పరమాద్భుతశక్తి యుక్తుడగుటచే బాణవ్యథను లెక్కచేయకుండా లక్ష్మణుని చూచి ఇట్లు అన్నాడు. 'లక్ష్మణా! బ్రహ్మాస్త్రప్రభావంతో అదృశ్యుడగు ఇంద్రజిత్తు బాణాలతో పీడిస్తున్నాడు. అచింత్య ప్రభావుడగు బ్రహ్మదేవుడు ఈ అస్త్రమునకు ఉత్పత్తి కారకుడు కద? కావున నీవు దృఢమనస్కుడవై నాతో సహ బాణపాతాన్ని సహించు. మనమిరువురము మూర్ఛనందగా (తాత్కాలిక విజయమంది) ఇంద్రజిత్తు లంకకేగ గలడు'. పిమ్మట ఇంద్రజిద్బాణపీడితులగు రామలక్ష్మణులు పడిపోవుటను చూచి ఇంద్రజిత్తు సింహనాదం చేస్తూ లంకకు వెళ్లాడు.

## డెబ్బైనాల్గవ సర్గము

ఆ యుద్ధంలో సుగ్రీవ నీలాంగదజాంబవంతులు మిక్కిలి ప్రహరింపబడి మూఢులైనారు. దుఃఖమందిన వానరసైన్యాన్ని విభీషణుడు ఆశ్వాసింప ప్రయత్నించాడు. 'మీరు భయపడవద్దు. ఇది విషాదం పొందతగిన కాలంకాదు. ఆర్యపుత్రులు బ్రహ్మవాక్యాలను గౌరవించి ఇంద్రజిద్బాణాలవల్ల మూర్ఛపొందారు!' అంతవరకు బ్రహ్మాస్త్రమును గౌరవించిన మారుతి ముహూర్తకాలం నిశ్చలుడై ఉండి విభీషణునితో 'ఈ వానరసేనయందు ఎవరెవరు ప్రాణాలు ధరించి ఉన్నారో వారిని ఆశ్వాసింత' మని చెప్పి కాగడాలు ధరించి యుద్ధభూమిలో విభీషణ సహితుడై చరించాడు. తోకలు, కాళ్ళు, చేతులు, తలలు, తెగిన పర్వతాకారులగు వానరులతో యుద్ధభూమి

నిండిఉన్నది సుగ్రీవాంగద నీలాదులను హతప్రాయులుగ చూచారు. అరువది ఏడు కోట్లమంది వానరులను ఇంద్రజిత్తు సాయంకాలమారు గడియల సమయములో వధించాడు, జాంబవంతుని హనుమద్విభీషణులు వెదక సాగారు. ముదుసలియై నూరు బాణాలతో కొట్టబడి బూడిదకాబోవు అగ్నివలెనున్న బ్రహ్మపుత్రుడగు జాంబవంతుని జూచి విభీషణుడు 'ఆర్యా! ఈ తీక్ష్ణబాణాలు మీప్రాణములను హరించలేదు కదా?' అన్నాడు. ఆ మాటలు విన్న జాంబవంతుడతికష్టంతో ఇట్లు పలికాడు. 'విభీషణా! నీగొంతు గుర్తించినాను, బాణపీడతుడనగుటవల్ల చూడ జాలకున్నాను. అంజనాదేవి, వాయుదేవుడు ఏ పుత్రుని కన్నందున సత్సంతాన మందిన వారైనారో ఆ ఆంజనేయుడు బ్రతికి ఉన్నాడు కదా?' అపుడు విభీషణుడు 'రామలక్ష్మణులను, సుగ్రీవాంగదులను గూడ అతిక్రమించి ఆంజనేయుని క్షేమమడిగితి వేమి?' అని ప్రశ్నించాడు. 'విభీషణా! అతడొక్కడు జీవించియుండెనేని చనిపోయిన ఈసేన అంతా బ్రతికినట్లే. ఆతడు మరణిస్తే మన మందరం జీవించి ఉన్ననూ మరణించినట్లే! ఆంజనేయుడు అగ్నివాయుస దృశుడు. ఆతడు జీవించి ఉంటే జీవితాశ కలుగుతుంది' అని జాంబవంతుడన్నాడు. అపుడాంజనేయుడు శాస్త్రోక్త విధానానుసారం జాంబవంతునకభివాదనం చేశాడు. అపుడు జాంబవంతుడిట్లన్నాడు. 'ఆంజనేయా! నీవు వానరులను రక్షించాలి. ఇది అనన్యసాధ్యం. వీరందరిని బ్రతికించి సంతోషపెట్టు. నీవు హిమవత్పర్వతం దగ్గరికి వెళ్లు. అచట ప్రకాశించే ఓషధి పర్వతం ఉంది. అందు ప్రకాశించే 'మృత సంజీవని' 'విశల్యకరణి' 'సావర్ణ్యకరణి' 'సంధాన కరణి' అను నాలుగు మహౌషధాలు ఉన్నాయి. వాటిని తీసుకుని వేగంగా ఇటకు రావాలి. ఈ వానరులను బ్రతికించాలి.

**గో.వి.** 1.మృతసంజీవని చచ్చిన వానిని బ్రతికించునది 2.విశల్యకరణి బ్రతికిన పిమ్మట సంచార యోగ్యతను కలిగించుటకు శల్యములను తొలగించునది. 3.సంధానకరణి శల్యములు తీయబడిన పిమ్మట చర్మము కరుచు కొనునట్లు చేయునది 4.సావర్ణ్యకరణి చర్మమతుకుకొనిన పిమ్మట మిగిలిన భాగములతో సమానమగు రంగును కలిగించునది.

జాంబవంతుని మాటలను వినిన ఆంజనేయుడు బలప్రపూర్ణుడై త్రికూటపర్వతాగ్రమున రెండవ పర్వతమువలె భాసించాడు. ఆతడి పాదఘట్టనంవల్ల కంపించిన యుద్ధభూమిలోని వానరులు నిలున జాలకపోయారు. లంకానగరం తీవ్రంగా కంపించుటవల్ల అచటి అనేక గృహాలు, గోపురాలు భగ్నములైనాయి. ఆంజనేయుడచటి నుండి లంకామలయ పర్వతమునధిరోహించి గమనార్థమై శరీరాన్ని పెంచి అశ్వముఖుడై నోరు తెరచి రాక్షసులను భయపెట్టడానికి భయంకరంగా సింహనాదం చేశాడు. ఆ భయంకరనాదం వినిన లంకానగరస్థ రాక్షసులు కదులుటకు గూడ భయపడినారు.

**వ్యా.వి.** తాను ఓషధులను తీసుకుని వచ్చు పర్యంతం రాక్షసులు యుద్ధభూమికి రాకుండుటకై వారిని భయపెట్టుటకు సింహనాదం చేశాడు.

తాను తలచిన పని నిర్విఘ్నంగా నెరవేరుటకు అభీష్టదేవతయగు శ్రీరామునకు నమస్కరించి తోక పైకెత్తి, వీపువంచి, చెవులను వంచి, నోరు తెరచి మహావేగంతో ఆకసానికి ఎగిరాడు.

**గో.వి.** తోక ఎత్తుటవల్ల ఉత్సాహాతిరేకమున్నూ, వీపు వంచుటవలన ఆకసమందు ప్రయాణించుటకు అనుకూలమయిన ప్రాణవాయునిరోధం, చెవులను వంచుటవలన బలోద్దీపనం, నోరుతెరచుటవలన అభినివేశం చెప్పబడినాయి.

మారుతియొక్క ఆ వేగానికి వృక్షాలు, శిలలు, స్థానికవానరులు, ఆకసానికి ఆకర్షితులై కొంత దూరమాతడి ననుసరించి వాటి వేగం తగ్గుటచే సముద్రమందు పడుట జరిగింది. పాముపడగవంటి బాహువులను చాపి మేరుపర్వతాభిముఖంగా వెళ్లాడు.

**వ్యా.వి.** "మేరుం" 1.హిమవత్పర్వతాంతర్వర్తియగు మరొక మేరుపర్వతం ఉంది. అటు వెళ్లాడు. 2. లేక మేరుపర్వతమున్నట్టి ఉత్తరదిశ కేగాడు. 3. లేక మేరుపర్వతమును లక్ష్యంగా చేసుకుని ఉత్తరదిక్కునకేగాడు.

అనేక పట్టణాలను, నదులను, పర్వతాలను, చూస్తూ వాయువేగంతో జాంబవంతుని మాటలను స్మరిస్తూ హిమవత్పర్వతానికి వెళ్లాడు. అక్కడ అనేకములగు పుణ్యాశ్రమాలను ఆంజనేయుడు చూశాడు.

**గో.వి.** ఆశ్రమనామ విశేషాలు వివరింపబడుతున్నాయి. 'బ్రహ్మకోశం' బ్రహ్మయొక్క గృహం, 'రజతాలయం' కైలాసం, 'శక్రాలయం' ఇంద్రుని ఆశ్రమం, 'రుద్ర శర ప్రమోక్షం' శివుడు లీలతో బాణముల విడుచు స్థలం, 'హయాననం' హయగ్రీవారాధనస్థానం, 'బ్రహ్మ శిరః' రుద్ర ఖండిత బ్రహ్మశిరం పడిన ప్రదేశం 'వజ్రాలయం' ఇంద్రుని కొరకు బ్రహ్మ వజ్రాయుధమిచ్చిన చోటు, 'సూర్యప్రభం' కుబేరగృహం, 'సూర్యనిబంధనం' ఛాయాదేవి ప్రీతి కొరకు విశ్వకర్మ సూర్యుని ఆకురాయిమీద ఉంచిన ప్రదేశం, 'బ్రహ్మాసనం' దేవసందర్శనార్థం చేయబడిన బ్రహ్మసింహాసనం, – లేక బ్రహ్మపదమున ఋషులు చెప్పబడుదురు కావున ఋషిస్థానం, 'శంకర కార్ముకం' శంకరుని ధనువు ఉంచిన చోటు, 'నాభిం' పాతాళ ప్రవేశరంధ్రం. వీటిని మారుతి దర్శించాడు.

కైలాస పర్వతం పక్కనున్న హిమవచ్ఛిలను, ఋషభమనే ఓషధిపర్వతాన్ని, కాంచనశైలాన్ని, ప్రకాశించు సమస్త ఓషధులుకల ఓషధిపర్వతమును చూచిన ఆంజనేయుడు విస్మితుడయ్యాడు. రాత్రులలో జ్వలిస్తున్న ఓషధులు గల ఆ పర్వతమందు హనుమానుడు అంతదూరం ప్రయాణించినా అలసట లేనివాడై ఓషధులనన్వేషిస్తూ తిరిగాడు. ఆ మహౌషధులు తమను ఆంజనేయుడు తీసుకుని వెళ్లడానికి వచ్చినట్లు గుర్తించి అదృశ్యమైనాయి. అందుకు కోపించిన ఆంజనేయుడు బిగ్గరగా గర్జించి రక్తనేత్రుడై ఇట్లన్నాడు. 'ఓపర్వతోత్తమా! రాముని విషయంలో కూడా నీవు సానుభూతిలేక ఇలా ఓషధులు కనుపించకుండా చేయుటకు నిశ్చయించుకుంటే నీవు పగుల గొట్టబడుదువని తెలుసుకో.' ఇలా పలికి ఏనుగులతో కూడిన సమస్తౌషధీ సహితమగు ఆ పర్వతశిఖరాన్ని పెకలించి ఆకాసానికి ఎగిరి రెండవ సూర్యునివలె ప్రకాశించాడు. అగ్నిజ్వాలలతో కూడిన సుదర్శనచక్రం ధరించిన విష్ణువువలె పర్వతధారియగు మారుతి ప్రకాశించాడు. దూరంనుండే అతనిని చూచిన వానరులు హర్షధ్వానాల చేశారు. హనుమానుడు ప్రతినాదమొనరించాడు.

**వ్యా.వి.** ఓషధీగంధమును వాసనచూచినంతనే వానరులు పునర్జీవితులైరని సూచితమైనది.

వీరి గర్జనలకు ప్రతిగా లంకలోగల రాక్షసులు మరింతగా నాదం చేశారు. మారుతి వానరసేనా మధ్యంలో ఆ పర్వతాన్ని ఉంచి పెద్దలగు వారికి నమస్కరించాడు. ఓషధీ గంధ సమాఘ్రాణ మాత్రంతో రామలక్ష్మణులతో పాటు యుద్ధారంభంనుండి మరణించిన వానరులందరూ బాధారహితులై నిద్రనుండి లేచినట్లు లేచారు.

**మ.వి.** వానరులవలె రాక్షసులు కూడా ఓషధీ గంధాఘ్రాణం వలన జీవించాలి కదా? అనే సందేహానికి సమాధానం – యుద్ధారంభంనుండి మరణించిన రాక్షసులను సంఖ్య తెలియకుండుటకు "ఇందరు చనిపోయినార"ని స్వీయసైనికులు భయం పొందకుండా ఎప్పటి కప్పుడు చనిపోయిన రాక్షసులను రావణుడు సముద్రంలో పడవేయించుటచే రాక్షసపునర్జీవనం జరుగలేదు.

యుద్ధంలో మృతులైనవారు పునర్జీవితులైన పిమ్మట ఆంజనేయుడా ఓషధి పర్వతమునతి వేగంగా యథాస్థానమునకు చేర్చాడు.

## డెబ్బైయైదవ సర్గము

అపుడు సుగ్రీవుడు హనుమానునితో ఇలా అన్నాడు. 'ఇట్టి స్థితిలో రావణుడు తానుగా యుద్ధానికి రాడు. మహాబలులు, లాఘవయుక్తులగు వానరులు దీవిటీలను ధరించి లంకాప్రాకారమును దూకి వెళ్లాలి.' సూర్యుడస్తంగతుడు కాగా మొదటి జామున దీవిటీలు ధరించి వానరులు బయలుదేరారు.

**వ్యా.వి.** వెనుకటి సర్గలో ఆంజనేయవిభీషణులు దీవిటీలు ధరించి చరించారని చెప్పబడింది. ఇపుడు సూర్యాస్తమయానంతరమని ఇక్కడ చెప్పబడింది. వీటికి సమన్వయమెట్లనగా సూర్యాస్తమయానంతరమతి వేగంగా ఆంజనేయుడు ఓషధిపర్వతాన్ని తెచ్చి తిరిగి తీసుకుని వెళ్ళుట జరిగింది. ఇచట "తతోఽస్తంగత ఆదిత్యే" అనడం ఆ సమయాన అంధకారం కలదని సూచించుటకు మాత్రమే చెప్పబడింది. అంతేకాక ఆంజనేయుని గమనాగమనాలు అత్యంత వేగంగా నడచినవని కూడా సూచితమయింది.

వానరులు లంకాప్రాకారాన్ని దూకి లంకలో ప్రవేశించగా గుల్మ గోపుర చర్యాదులయందున్నట్టి కావలిగా ఉండిన రాక్షసులు వీరిని చూచి పరుగెత్తారు. వానరులు అంతటా చరించి గొప్ప గృహాలకు నిప్పుపెట్టినారు. వివిధ గృహాలు దహింపబడినాయి. హఠాత్తుగా దహనకాండ సంభవించుటతో మద్యపానాదులు చేయువారు, రతిలోలురు, భుజించువారు, యుద్ధసన్నద్ధులు, నిద్రాపరవశులు అగు శత సహస్ర సంఖ్యాక రాక్షసులు దహింపబడినారు. ఉన్నతభవనాలు పడిపోయాయి. విమానాలలో నిద్రించు స్త్రీలు దహింపబడుతూ సమస్తాభరణాలను వదలి హాహాకారం చేశారు. లంకానగరం కాలుచుండగా దాని ప్రతిబింబం సముద్రమున ప్రతిబింబితమై నీళ్లు ఎర్రగా శోభించాయి. స్త్రీలరోదనలు పదియోజనాల వరకు వినిపించాయి. వానర– రాక్షసఘోష దశదిశల వినిపించింది.

రామలక్ష్మణులు యుద్ధోత్సాహంతో ధనుర్ధరులైనారు. రాముని జ్యానాదం ఈ వానర రాక్షసఘోషను అతి క్రమించి వినిపించింది. యుద్ధభూమినుండి వదలబడిన రామధనుర్ముక్తములగు బాణాలు లంకయందలి గోపురాన్ని భగ్నము చేశాయి. వానరులు రావణాంతఃపురాన్ని దీవిటీలతో దహింప బ్రయత్నించారు. వారిని చూచిన రావణుడు మహాకోపం పొందాడు. అపుడు యూపాక్ష, శోణితాక్ష, ప్రజంఘాఽకంపన సహితులగు కుంభకర్ణ పుత్రులైన

కుంభనికుంభులను రావణుడు యుద్ధానికి పంపాడు. యుద్ధభూమియందు చంద్రప్రకాశం, రాక్షసులు ధరించిన భూషణ ప్రభ, దగ్ధమగు లంక యొక్క వెలుగు, ఈమూడూ వానరరాక్షస సైనికులను ప్రకాశింపజేశాయి. రాక్షస చతురంగ బలాన్ని చూచిన వానరులు సింహనాదం చేశారు. వానర రాక్షసులకు మహారౌద్రమగు తుములయుద్ధం జరిగింది.

## డెబ్బైయారవ సర్గము

యుద్ధోత్సాహియగు అంగదుడు కంపనుని సంహరింప శోణితాక్ష, ప్రజంఘయూపాక్షులు అంగదుని ముట్టడింప మైందద్వివిదులంగదునకు తోడ్పడినారు. అంగదుడు ప్రజంఘుని, ద్వివిదుడు శోణితాక్షుని, మైందుడు యూపాక్షుని సంహరించారు. భీతిల్లిన రాక్షససేన కుంభునాశ్రయించింది. కుంభుడు తీవ్రబాణాలతో మైంద ద్వివిదులను మూర్ఛితులగావించాడు. తనపై శిలా వృక్షాదులను వర్షిస్తున్న అంగదుని నేత్రములపై కుంభుడు బాణాలను ప్రయోగించాడు. కన్నుల రక్తముకారుతుండగా వ్యథితుడైన అంగదుడు అరచి మూర్ఛ పొందాడు. రామప్రేరితులై వచ్చిన జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి, వీరిని కుంభుడు బాణాలతో నడ్డగించాడు. అపుడు సుగ్రీవుడు అంగదుని రక్షించుకొంటూ, కుంభప్రయుక్త బాణాలను సహిస్తూ, కుంభుని ధనువును విరిచి ఆతని రథమున కూర్చుండి ఇట్లన్నాడు. 'నీవు కుంభకర్ణరావణేంద్రజిత్తులతో సముడవు. చాల అలసితివి. విశ్రాంతినంది తిరిగి యుద్ధమునకు రమ్మన్నాడు'. సుగ్రీవుని మాటలకు ఆగ్రహించిన కుంభుడు సుగ్రీవునితో బాహుయుద్ధమారంభించి సుగ్రీవుని ముష్టిఘాతంతో మరణించాడు.

## డెబ్బైయేడవ సర్గము

అన్నగారగు కుంభుడు హతుడగుటను చూచిన నికుంభుడు ఆభరణాలంకృతుడగు నికుంభుడు గర్జిస్తూ రత్నస్థగితమగు పరిఘను గిరగిర త్రిప్పసాగారు. అపుడా నికుంభుడు ఇంద్రధనస్సుతోను, ఉరుములు– మెరుపుల తోను, కూడిన మేఘము వలె భాసించాడు.

**గో.వి.** ఇంద్రధనుస్సువలె త్రిప్పబడుచున్న పరిఘయు, మెరపులవలె ఆభరణాలు, ఉరుములవలె గర్జనలు, మేఘమువలె నికుంభుడు అని సంపూర్ణోపమాలంకారం చెప్పబడింది. పరిఘను త్రిప్పు కుంభుని ఎదుటికి వచ్చిన ఆంజనేయుడు రొమ్ముచూపగా నికుంభుడా పరిఘనాంజనేయుని వక్షంపై ప్రయోగించగా ఆపరిఘ నూరుముక్కలై నేలమీద పడింది. వారుభయులకు జరిగిన బాహుయుద్ధంలో అరుస్తున్న నికుంభుని కంఠాన్ని ఆంజనేయుడు రెండుచేతులతో పట్టి గిరగిర తిప్పి విరచి ఆతనిని సంహరించాడు.

**మ.వి.** నవమి రాత్రి యందు కుంభాదుల వధ జరిగింది.

## డెబ్బైయెనిమిదవ సర్గము

కుంభనికుంభులు హతులైనట్లు వినిన రావణుడు క్రోధ శోక మూర్ఛితుడై ఖరపుత్రుడగు మకరాక్షుని యుద్ధానికి పంపాడు.

**గో.వి.** కాల నిర్ణయం మొదటి పక్షంలో మకరాక్షయుద్ధం దశమి ఉదయ మందని రెండవ పక్షంలో దశమి ఉదయం అకంపనవధ నుండి కుంభకర్ణ వధ వరకున్నూ, అపరాహ్ణమందు బ్రహ్మాస్త్రబంధం, దశమి రాత్రి తన్మోక్షణ లంకాదాహ కుంభాది మకరాక్ష పర్యంత రాక్షసవధ జరిగినదని రావణాజ్ఞప్తుడగు మకరాక్షుడు సైన్యపరివృతుడై యుద్ధానికి వెళుతుండగా మకరాక్షసారథి చేతినుండి చెర్నకోల క్రిందపడింది. ధ్వజం విరిగి పడింది. అశుభ సూచకములగు ఇట్టివనేకము కనుపించాయి. వీటిని లెక్కించని రాక్షసవీరులు'అహమహమికతో' యుద్ధభూమికి వెళ్లారు.

## డెబ్బైతొమ్మిదవ సర్గము

మకరాక్షసేన వానరులతో యుద్ధమారంభించింది. రాక్షసబాధితులగు వానరులు పారిపోతూ ఉండగ రాక్షసులను నివారిస్తూ రాముడు శరవర్షం కురిపించాడు. క్రోధావిష్టుడగు మకరాక్షుడు రామునితో ఇట్లన్నాడు. ఓరామా! నాతో ద్వంద్వయుద్ధం చేయుము. నీప్రాణాలు తీస్తాను. నాతండ్రిని దండకారణ్యమందు చంపినావు. మిక్కిలి అకృత్యములను ఆచరించిన నీవు నాఎదుట కనుపించగా రోషం వృద్ధి చెందుతున్నది. దురాత్మా! దండకారణ్య యుద్ధకాలమందు నాకు నీవు కనిపించలేదు. దైవయోగమున ఇపుడు నా కంటపడితివి నీచే ముందు సంహరింపబడిన వారిని కలుసుకొనగలవు. అస్త్రములతోగాని, బాహువులతోగాని, గదతోగాని నీ కలవాటుకల యుద్ధమునే చేద్దాము.

**వ.వి.** మకరాక్షుని మాటలలో అర్థాంతరాలు భాసిస్తున్నాయి. "త్యాజయిష్యామి తే ప్రాణాన్, ధనుర్ముక్తైశ్శితైశ్శరైః" తే ధనుర్ముక్తైశ్శితైశ్శరైః ప్రాణాన్ త్యాజయిష్యామి. ఓ రామా! నీ ధనుర్ముక్తబాణాలవల్ల ప్రాణములను వదలగలను. నాతో ద్వంద్వయుద్ధం చేయుము.

**యత్తదా దండకారణ్యే పితరం హతవాన్మమ ।**
**మదగ్రత స్వకర్మస్థం దృష్ట్వా రోషోఽభివర్ధతే ॥**

**దహ్యంతే భృశమంగాని దురాత్మన్ మమ రాఘవ ।**
**యన్మయాసి న దృష్టస్త్వం తస్మిన్ కాలే మహావనే ॥**

హే దురాత్మా! దుష్టులయందు గూడ దయాంతఃకరణం కలిగిన రాఘవా! యత్ ఎందువలన మదగ్రతః నా కంటే పూర్వం (నా వధకు పూర్వమే) స్వకర్మస్థం మిక్కిలి దుష్టకర్మలను చేయు మా తండ్రిని చూచి చంపినావు. అందువల్ల అప్పుడు నేను నిన్ను చూడలేదు (నీచేత నాకపుడే చావురానందుకు) అందువలన నా దేహం దహింపబడుతున్నది. రోషం పెరుగుతున్నది.

**దిష్ట్యాఽసి దర్శనం రామ! మమ త్వం ప్రాప్తవానిహ! ।**
**కాంక్షితోఽసి క్షుధార్తస్య సింహస్యేవేతరో మృగః ॥**

ఆకలితో ఆర్తమగు సింహంవలె ఉన్న నాకు నీదర్శనం కొరకు ఆర్తుడనై ఉన్న నాకు మృగః మృగ్యతే బ్రహ్మాదిభిరితి మృగః-బ్రహ్మాదులచే వెతుకబడినవాడవు కావున 'మృగః' సర్వేశ్వరుడు. అందువలననే ఇతరః

లోకాతీతుడు అందువలననే 'కాంక్షితః' బ్రహ్మాదిదేవతలచే కోరబడినవాడు. అట్టి నీవు నాభాగ్యవశమున కంటబడినావు. అట్టినా భాగ్యమునేమని వర్ణింతును?

**అద్య మద్బాణవేగేన ప్రేతరాడ్విషయం గతః ।**
**యే త్వయా నిహతా వీరాస్సహ తైశ్చ సమేష్యసి ॥**

అందువలన మత్ నా నుండి యే ఏ సుగ్రీవాదులు 'అ'నిహతాః చంపబడనివారు కలరో వారితో కలసి ఉండగలవు.

బహుప్రలాపియగు మకరాక్షుని మాటలు వినిన రాముడు నవ్వుతూ ఇట్లన్నాడు. 'రాక్షసా! నీకసాధ్య విషయాలను చాల మాటలాడినావు. యుద్ధం చేసి జయించాలి గాని మాటలతో జయం అసాధ్యం. నీ తండ్రి మొదలగు పదునాలుగు వేల రాక్షసులు నాచే నిహతులైనారు. కొద్ది సమయంలో నీ మాంసమును నక్కలు, గ్రద్దలు, భక్షింపగలవు' పిమ్మట రామమకరాక్ష ద్వంద్వయుద్ధంలో రాముడు మకరాక్షుని ధనువును, సారథిని, గుర్రాలను బాణములచే ఛేదించెను. నేలకురికిన మకరాక్షుడు మహాశూలమును గిరగిర ద్రిప్పి రాముని పైకి విసరెను. ఆకాశమందే బాణాలతో దానిని రాముడు ఛేదింపగా ఆ శూలం మూడుముక్కలై మూడుకొరువులవలె నేలపడింది. పిడికిటితో రాముని మీదకు వస్తున్న మకరాక్షుని ఆగ్నేయాస్త్రంతో రాముడు సంహరించాడు.

## యెనబ్బైయవ సర్గము

మకరాక్షునివధ వినిన రావణుడు మహాక్రోధంతో పండ్లు పట పటలాడించాడు. ఆలోచించి ఇంద్రజిత్తుతో ఇట్లన్నాడు. 'నీవు కనుపించి యుద్ధం చేసినా, లేక అదృశ్యుడవై యుద్ధం చేసినా నీవు బలాధికుడవు. ఇంద్రుని జయించిన నీవు మనుష్యమాత్రులగు రామలక్ష్మణులను వధించలేవా ఏమి?' ఇట్లు యుద్ధానికి తండ్రిచే ఆజ్ఞప్తుడైన ఇంద్రజిత్తు యజ్ఞభూమికేగి యథాపూర్వంగా (73 సర్గలో ఆచరించిన విధంగా) అగ్నియందు హోమమాచరించాడు. అపుడు ఋత్విక్కులు ధరించుటకు ఎర్రని తలపాగాలను స్త్రీలు తెచ్చి సమర్పించారు. పరిస్తరణములుగా తోమరయుక్త బాణాలను, ఇనుపస్రువమును, ధరించుటకు ఎర్రని వస్త్రాలను హోమార్థమై నల్లనిమేక పిల్లను, ఉపయోగించి అగ్నిని తృప్తుని చేసి తర్పణమొనర్చి అంతర్ధానశక్తియుక్తమగు రథమును ఆరోహించాడు.

**గో.వి.** "లోహితోష్ణీషా ఋత్విజః ప్రచరంతి" అను శ్రుత్యుక్త విధిననుసరించి ఋత్విక్కులకు ఎర్రని తలపాగాలను ఇచ్చాడు.

**మ.వి.** 'నీవింద్రుని చూచి జయించావు. మనుష్యులగు రామలక్ష్మణులను వధింపగలవా ఏమి! వధింప జాలవని భావం.' 'తౌ జహి' వారలు అసాధ్యులు, కాన వారలను జయించు ఆశను వదలుకొనుమని రావణుని మాటలకు అర్థాంతరం. శరహోమంతో విజయం సంభవించును కాని ఇచట జీవించి తిరిగి వచ్చుటే జయమని తెలిసికోవాలి.

సమస్తాయుధములచే స్వలంకృతమగు ఆ రథం శోభించింది. నిర్ఋతి దేవతాకమంత్రములతో హోమమా చరించి లంకనుండి బడల్వెడలిన ఇంద్రజిత్తు అదృశ్యుడై ఇట్లు పలికాడు. 'ఇపుడు భూమియందు వానరులు

లేకుండునట్లు చేస్తాను. రామలక్ష్మణులను సంహరించి నా తండ్రికి సంతసం కలిగిస్తాను' ఇట్లు పలికి శరవర్షం కురిపిస్తున్న రామలక్ష్మణులను చూచాడు. ఉన్నత భుజద్వయం, శిరస్సులతో వారు మూడుతలలు కలిగిన మహా సర్పాలవలె భాసించారు. వారిపై ఎడతెరపిలేని బాణవర్షం ఇంద్రజిత్తు కురిపించాడు. రామలక్ష్మణులా బాణాలను సహిస్తూ బాణసంధానం చేస్తూ ఆతని ఉనికిని కనుపెట్ట ప్రయత్నించారు. ధూమాంధకారములను సృజించి ఇంద్రజిత్తు దిక్కులు కనుపించకుండా చేశాడు. ఇంద్రజిత్తు రూపమే కాక నారి ధ్వని, రథ ధ్వని ఏవీ వినిపించలేదు. అదృశ్యుడగు ఆతని బాణవర్షమును పర్వతాలు వర్షమును సహించినట్లు సహిస్తూ పతితబాణానుసారం బంగారు ములుకులుకల బాణాలను ప్రయోగించారు. ఆకాశమందు పక్షులవలె వేగంగా చరించిన ఆ బాణాలు ఇంద్రజిత్తును గాయపరచి నేలబడినాయి. ఇంద్రజిద్బాణములను ఖండించసాగారు. ఇంద్రజిత్తు ఆకాశమందన్ని దిక్కులా చరిస్తూ బాణప్రయోగం చేశాడు. అదృశ్యుడగు ఇంద్రజిద్గమనాదులను వారు గుర్తించలేక పోయారు. మిక్కిలి కోపించిన లక్ష్మణుడు అన్నగారిని చూచి ఇట్లు పలికాడు. "సమస్త రాక్షసులను వధించుటకు బ్రహ్మాస్త్రమును ప్రయోగిస్తాను" అట్లు చేయుట తగదనియూ ఒకని కొరకు సమస్త రాక్షసులను వధించుట అనుచితమనియూ, యుద్ధం చేయనివానిని, శరణాగతుని, పారిపోవువానిని, ప్రమత్తుని సంహరింప కూడదని రాముడని 'ఇతడు స్వర్గమర్త్య పాతాళముల కెచటి కేగినా మదీయాస్త్రదగ్ధుడై క్రింద పడగలడ'ని పలికి ఇంద్రజిత్తును వధించుటకు ప్రతీక్షించసాగాడు.

## యెనబ్బైయొకటవ సర్గము

రాముని ఆలోచనను గుర్తెరిగి ఇంద్రజిత్తు యుద్ధం నుండి మరలి లంకాపురానికి వెళ్లాడు. కుంభకర్ణాది రాక్షసవధను తలచి క్రోధంతో తిరిగి యుద్ధానికి పోయాడు.

**గో.వి.** ప్రథమశ్లోక మందలి"విజ్ఞాయ" అన్నచోట కల యకారం గాయత్రీ మంత్రం యొక్క 19.వ అక్షరం. పదునెనిమిదివేల శ్లోకాలు పూర్తి అయినాయి. ఇంద్రజిత్తు నికుంభిలయందు (ఆభిచారిక హోమస్థాన మందు) దుర్జయమగు అస్త్రబలం పొందటానికి హోమం చేయతలచాడు. రామలక్ష్మణుల ప్రయత్నాలు మందగించుటకు మాయచే మోసగింపతలచి వారు దురాసదులగుటవలన తత్సమీపానికి పోకుండా ఇతర వానరులు సీతను గుర్తించలేరు. కావున గుర్తుపట్ట కలిగిన ఆంజనేయునకు మాయాసీతావధ చూపుటకు పశ్చిమద్వారంనుండి యుద్ధానికి వెళ్లాడు.

ఇంద్రజిత్తు మాయాసీతను తన రథమందుంచుకుని గొప్పసైన్యంతో పశ్చిమద్వారంనుండి బయలుదేరినాడు. వారినెదుర్కొనుటకు గొప్ప పర్వతశిఖరాన్ని చేత ధరించిన ఆంజనేయుడు ముందు బయలుదేరగా వానరులు అనుసరించారు. ఇంద్రజిద్రథమందు ఉపవాసకృశయు, ఒకే జడగలిగి దీనురాలై మలినమగు ఒక్క వస్త్రమును ధరించినట్టి సీతను చూచిన ఆంజనేయుడు కొద్దిరోజుల ముందు చూచి ఉన్నందున ఆమె జానకి అని నిశ్చయించుకొన్నాడు. ఆమెను చూచి దుఃఖంతో బాష్పములు స్రవింప 'రథ మందుంచి సీతనిటకు తెచ్చుటలో వీని అభిమత మేమ'ని ఆలోచిస్తూ వానరులతో ఇంద్రజిత్తు మీదకు పరుగెత్తాడు. వానరబలం చూచి మహా కోపంతో ఇంద్రజిత్తు మాయాసీతను జుట్టు పట్టి 'రామ రామ' అని విలపిస్తుండగా ఆమెను కొట్టాడు. ఇంద్రజిత్తామె జుట్టుపట్టుకొని ఉండడం చూచి దుఃఖమున కన్నీరుకారగా తుడుచుకొంటూ ఆంజనేయుడు క్రోధావిష్టుడై పరుషంగా ఇలా పలికాడు.

'దురాత్మా! ఆత్మవినాశనం కొరకు సీతాదేవి జుట్టు పట్టుకున్నావు. నీవు బ్రహ్మవంశమందుద్భవించినా రాక్షసుడవగుటచే పాపిష్టుడవగు నీకిట్టి బుద్ధి పుట్టింది. నిర్దయ! అసజ్జన! దురాచార! క్షుద్రబుద్ధీ! అధర్మపరాక్రమ! ఇట్టి జుగుప్సిత కార్యం అనార్యుడే చేస్తాడు. ఇట్టి పని చేయుటకు నీకు జుగప్స కూడా లేదు కద? ఈజానకి నీకేమపకారం చేసినదని చంప తలచావు? సీతను చంపి చిరకాలం జీవించలేవు. వధార్హమగు ఇట్టి పనిచేసి నాచేత బడినావు. ఓ లోకవధ్యుడా! ఈపదునాలుగు లోకములయందు స్త్రీహత్య చేసిన వారలకు ప్రాప్తించే హీనలోకాలను మరణానంతరం పొందుతావు' ఇట్లు పలికిన హనుమానుడు మహా క్రోధంతో సేనాయుతుడై ఇంద్రజిత్తు మీదకు పరుగెత్తాడు. వారి నాతడు అనేక బాణాలతో చికాకు పరచి ఆంజనేయునితో ఇట్లన్నాడు. 'సుగ్రీవుడు, నీవు, రాముడు, ఎవరినిమిత్తమై ఇటకు వచ్చిరో మీరు చూస్తుండగా ఆ సీతను సంహరిస్తాను. పిమ్మట మిమ్మందరను సంహరిస్తాను, స్త్రీలను చంపగూడదంటివి, శత్రువులకు బాధ కలుగు ఏపని అయిననూ చేయవచ్చు' ఇట్లు పలికి దుఃఖిస్తున్న మాయాసీతను ఏటవాలు (ఉపవీత సదృశముగ) ఖడ్గముతో ఖండించాడు. ఆంజనేయునితో మీ పరిశ్రమ వ్యర్థమయింది అన్నాడు. ఇంద్రజిత్తు సంతసమున రథమునధిరోహించి సింహనాదం చేశాడు. వానరులు దుఃఖంతో పరువెత్త సాగారు.

## యెనబ్బైరెండవ సర్గము

ఆంజనేయుని అనునయవాక్యములవల్ల వెనుకకు మరలి యుద్ధసన్నద్ధులైన వానరులతో కలసి హనుమానుడు అగ్నిహోత్రునివలె శత్రువుల దహింప సాగాడు. ప్రళయకాలమందలి యమునివలె మహా యుద్ధముచేయు ఆంజనేయుడు మహాకోపంతో ఒక మహాశిలను ఇంద్రజిద్రథముపై పడవేయగా మీదకు వచ్చుచున్న ఆమహాశిలను చూచిన సారథి ఇంద్రజిద్రథమును చాల దూరము ప్రక్కకు తీసుకొని పోయాడు. ఆ శిల వ్యర్థంగా నేలను పగులగొట్టుకొని పాతాళంలో ప్రవేశించింది. ఆ శిలక్రింద చాల మంది రాక్షసులు నలిగి మరణించారు. యుద్ధం నడస్తుండగా ఆంజనేయుడు వానర వీరులతో ఇట్లన్నాడు. 'రామునికి ప్రియం చేకూర్చుటకు ప్రాణాలను లెక్కింపక ఎందులకు యుద్ధము చేస్తున్నామో ఆ సీత చంపబడింది. మనకీరాక్షససంహారం ప్రయోజనం కాదు. జానకి చంపబడిన విషయాన్ని రామ సుగ్రీవులకు వినిపించి వారలెట్టి ప్రతిక్రియ చేయమందురో ఆ విధంగా చేయుదము' అని పలికిన హనుమానుడు శత్రువులనుండి భయము లేని వాడగుటచే సైన్యసమేతుడై నెమ్మదిగా వెనుకకు మరలాడు.

పిమ్మట ఇంద్రజిత్తు చైత్యమందలి నికుంభిలాదేవాలయమున కేగి పండితులతో కలసి రక్తమాంసాదులతో హోమమొనర్ప అగ్ని జ్వలించింది.

## యెనబ్బైమూడవ సర్గము

పశ్చిమద్వారమందలి యుద్ధఘోష వినిన రాముడు ఆంజనేయునకు తోడ్పడవలసిందిగా జాంబవంతు నాజ్ఞాపించాడు. స్వీయ భల్లూకసైన్యయుక్తుడైన జాంబవంతుడు వెళ్ళుతుండగా మరలి వచ్చుచున్న ఆంజనేయుడెదురు పడినాడు. అందరూ వెనుకకు మరలినారు. దుఃఖిస్తూ హనుమానుడు రామునితో 'యుద్ధం చేస్తూ ఉండిన మేము

చూస్తూండగా దుఃఖించు సీతాదేవిని ఇంద్రజిత్తు సంహరించెను' అని చెప్పాడు. ఈ మాట వినగనే మొదలు నరుకబడిన చెట్టువలె రాముడు క్రిందపడిపోయాడు. సుగంధయుక్తములగు జలాన్ని రామునిపై వానరులు చల్లినారు. మిక్కిలి దుఃఖించు లక్ష్మణుడు బాహువులతో అన్నగారినాలింగనం చేసుకొని స్వస్థుడుగ లేని రామునితో యుక్తి యుక్తములైన ఈ మాటలను పలికాడు.

**మ.వి.** అధర్మిష్టుడగు రావణుని వినాశం కనుపించలేదు. చేతి కందిన రాజ్యాన్ని వదలుకొని పితృవాక్య పరిపాలనా రూప ధర్మముననుష్ఠించిన రామునకు పుణ్యకర్మఫలసుఖము చేకూరలేదు. మీదు మిక్కిలి ఇపుడు సీత వధింపబడింది. ఇట్టి మహాదుఃఖము ప్రాప్తించుటను చూచిన లక్ష్మణుడు కలుషితమనస్కుడై ధర్మమే లేదని చెప్పబోతున్నాడు. లేక ధర్మాధర్మములు హితాహితములకు సాధనములని తెలిసినప్పటికి సీత చంపబడిన విషయం వినుటవలన కలిగిన దుఃఖంతో లక్ష్మణుడు వెనుక (80–సర్గ 39శ్లో) 'యుద్ధంచేయని వారిపై బ్రహ్మాస్త్ర ప్రయోగం అధర్మమ'ని రాముడు తన్ను వారించుట ఈ అనర్థానికి కారణమైనదని తలచి క్రోధావిష్టుడై ధర్మాధర్మములు అర్థానర్థములకు హేతువులను నియమాన్ని నిరాకరిస్తూ "శుభే వర్త్మని" ఇత్యాదిగా పలుకుతున్నాడు.

నీవు పితృ వాక్య పరిపాలనా రూపమగు ధర్మమార్గాన నడుస్తూ హస్త ప్రాప్త రాజ్య పరిత్యాగ కారకులగు కైకేయి దశరథుల యందు మనఃకాలుష్యమందని జితేంద్రియుడవు "నాహమర్థపరో దేవి...... విద్ధి మామృషిభిస్తుల్యం" (2–19–20) అని చెప్పియున్న కేవలధర్మమార్గవర్తివగు నిన్ను ఈ ధర్మం అనర్థాల నుండి ఏమి రక్షించింది? ఇందువలన 'ధర్మమభ్యుదయఫలకారక' మని అనుమానప్రమాణమున నిర్ణయింప వీలు లేకపోతున్నది. కాన ధర్మం నిరర్థకం లేక నిష్ప్రమాణకం గాని కావాలి. (83.14)

**గో.వి.** సీతా హనన వార్తా శ్రవణం వలన నిరవధికమగు అధైర్యం పొందిన రాముని లక్ష్మణుడు ఒడిలో ఉంచుకుని ధర్మాధర్మస్వరూపాన్ని వాదం ద్వారా ఖండిస్తూ నీతిశాస్త్రానుసారం బలమునే ప్రధానంగా అవలంబించమని 'శుభే వర్త్మని' ఇత్యాదిగా చెపుతున్నాడు.

మంచి మార్గమందున్నట్టి విజితేంద్రియుడవగు నిన్ను అనర్థంనుండి రక్షించలేని ధర్మం కుందేటి కొమ్ము వలె వస్తుతః లేనిదే. కాన పితృవాక్యపరిపాలనం కూడా వ్యర్థమే అని మొదటనే నేను నీకు చెప్పియుంటిని. అట్లే అధర్మం గూడ నిరర్థకమే. రావణాచరితమగు అధర్మం అతనికి సంపదలు లేకుండా చేయలేకపోతున్నది కద? పంచభూతాలు, వృక్షపర్వతాదులు, మానవులు, ఎట్లు ప్రత్యక్షంగా కనుపిస్తున్నారో ధర్మమట్లు కనుపించుట లేదు కావున లేనిదని భావం.

**గో.వి.** ధర్మాధర్మములు ప్రమాణములు కావని క్రమశః వివరిస్తున్నాడు. ధర్మాధర్మములు కలవనుటలో 1. ప్రత్యక్ష ప్రమాణం, 2. అనుమాన ప్రమాణం, 3. శబ్దప్రమాణం వీటిలో ఏది సాధకం? ప్రత్యక్షం కాదు. చరా చరములగు భూత పదార్థములు కనుపించుచున్నట్లు ధర్మాధర్మములు కనుపించుట లేదు కద? కనుపించుట లేదు కావున ధర్మాధర్మములు లేవని నాభావం.

**మ.వి.** ధర్మం స్వీకార్యమనుటలో ప్రమాణమేమి? అనుమానమా? లేక ప్రత్యక్షమా? అని రెండుగా వికల్పించి 'ధర్మం ఉన్నది. ఫలం కనుపిస్తున్నది కావున' అని అనుమానహేతువుచే సాధించుదమన్న ధర్మానుష్ఠానమునకు ఫలం కనిపించకపోవుటను పూర్వ శ్లోకంలో (83-14) నిరాకరించి ఇపుడు ప్రత్యక్ష ప్రమాణసిద్ధం కూడా కాదని నిరూపిస్తున్నాడు. పర్వతవృక్షమనుష్యాత్మక ప్రపంచమెట్లు ప్రత్యక్షంగా కనుపిస్తున్నదో అట్లు ధర్మం కనుపించుటలేదు కావున ధర్మం లేదని నా భావం.

ఎట్లు స్థావరాలు (పర్వత వృక్షాదులు) జంగమాలు (చరించు వృక్షాదులు) వ్యక్తంగా మనకు కనిపిస్తున్నాయో అలా ధర్మాధర్మరూపపదార్థాలు కనుపించుట లేదు. ప్రత్యక్షంగా ఉన్నచో నీ వంటివాడు విపత్తును పొందడు కద?(83-16)

**గో.వి.** లోగడ చెప్పిన విషయాన్నే హేతువులతో దృఢీకరిస్తున్నాడు. పర్వతవృక్షాదులు వ్యక్తంగా కనునిస్తు న్నాయి. అట్లే మనుష్యాది చరప్రాణులు ప్రత్యక్షంగా కనిపిస్తున్నారు. ఈ ధర్మాధర్మరూప పదార్థములట్లు ప్రత్యక్షములు కావు కద? ఒక వేళ ధర్మంగాని, అధర్మంగాని, ప్రత్యక్షంగా కనుపించే యెడలగాగాని, స్థావరములుగాగాని కనిపించాలి. అట్లు కనిపించుటలేదు. కావున ఇది ప్రత్యక్షములు కావు. ధర్మం ప్రత్యక్షంగా ఉన్నచో నీవంటి ధార్మికుడు విపత్తిని పొందడు. రావణుడు సంపత్తిని పొందడని గూడ తెలియాలి.

**మ.వి.** ధర్మాధర్మములు ప్రత్యక్షంగా కనుపించనంత మాత్రమున లేవనుట కుదరదు. అతీంద్రియములగు ఇంద్రియములచే గ్రహింపబడనట్టి వస్తువులు కలవు కద? అను శంకను తర్కంతో నిరాకరిస్తున్నాడు. ఆతీంద్రియమగు ధర్మమున్నయడల నీ వంటి వాడు విపత్తిని పొందడు. విపత్తిని ధార్మికుడు పొందుతూనే ఉన్నాడు. కావున ధర్మం లేదు.

అ ధర్మమున్నట్లయిన రావణుడు వ్యసనమును పొందవలసి ఉండును. ధర్మయుక్తుడవగు నీవు ఇట్టి వ్యసనమును పొందకుండ ఉండవలసి ఉండును.(83-17).

**గో.వి.** అనుమాన ప్రమాణంతో కూడా ధర్మాధర్మములు సిద్ధింపబడవు. అధర్మమున్నట్లైన అపుడ ధర్మ యుక్తుడగు రావణుడు వ్యసనమును పొంది ఉండవలసింది. ధర్మమున్నట్లైన ధర్మయుక్తుడవగు నీవు కూడా ఇట్టి వ్యసనములను పొందకుండ ఉండవలసింది. వ్యసనా౽ వ్యసన (దుఃఖ-సుఖ) రూప కార్యములవలన తత్కారణము లగు ధర్మాధర్మములూహింపబడినవి. (అనుమేయింపబడినవి). అట్లు సంభవించుటలేదు. ధార్మికుడుగా చెప్పబడు నీ యందు దుఃఖములు కనుపించుటవలననూ, అధార్మికుడుగా చెప్పబడు రావణునియందు దుఃఖములు కనుపించక పోవుటవలననూ (తర్క శాస్త్ర పరిభాషానుసారము) పక్షస్థానీయులగు మీ (రామ-రావణులు) ఇరువురియందు సాధ్యరూపములగు ధర్మాధర్మములున్ననూ హేతువులగు సుఖదుఃఖములు (రామునకు సుఖము-రావణునకు దుఃఖము) లేకుండుట వలన ఈ హేతువులు స్వరూపాసిద్ధ దోషదూషితములు.

**మ.వి.** పూర్వ శ్లోకంలో (83-16) ధర్మమున్నందులకు ప్రమాణం లేదని నిరూపించి ఇపుడు ధర్మా ధర్మములు రెండింటియొక్క సత్తను నిరాకరిస్తున్నాడు. ధార్మికుడగు రామునకు సుఖములూ, అధార్మికుడగు

రావణునకు దుఃఖములూ లేకుండుట వలన వ్యాప్తి (యత్సత్త్వే యత్సత్త్వం యదభావే యదభావః) అనగా ధర్మం వల్ల సుఖం కలుగును. అధర్మంవల్ల దుఃఖము కలుగును అను వ్యాప్తి ఇక్కడ లేనందున ధర్మాధర్మములు లేవు.(83-17)

**గో.వి.** అధార్మికుడగు రావణుడు సుఖములనందుటవలన, ధర్మిష్ఠుడవగు నీవు దుఃఖమును పొందుచుండుట వలన ధర్మము అధర్మమగుచున్నది. అనగ అధర్మఫలప్రదమగుచున్నది. అధర్మము గూడ ధర్మమవుతున్నది అనగా ధర్మఫలప్రదమవుతున్నది. విరుద్ధఫలజనకములవుతున్నాయి.

**మ.వి.** నియతమగు ఫలముల నిచ్చుట లేదు కావున ధర్మాధర్మములు లేవని చెప్పి ఇపుడు విపరీత ఫల ప్రదములగుటవలన కూడా అవి లేవని చెప్తున్నాడు. విరుద్ధ ఫలప్రదములగుట వలన శాస్త్ర విహిత స్వభావమునకు విరుద్ధ స్వభావములు కలవనుట వలన ధర్మాధర్మములు నియత కార్య జనకములు కాక పరస్పర విరుద్ధములుగా ఉన్నాయి. (83-18).

శాస్త్రములయందు ధర్మలక్షణము సుఖఫలజనకంగా చెప్పబడింది. అట్టి లక్షణం ధర్మమునందు కనిపించుట లేదు. అట్లే అధర్మమునకు దుఃఖఫల జనకమను లక్షణం చెప్పబడినది. ఆ లక్షణం అధర్మమునందు కనిపించుట లేదు కావున కార్య కారణములు పరస్పర విరోధములు కలవైనాయి.

**వ్యా.వి.** ధర్మానుష్ఠానమున ధర్మఫలసుఖాలు లభించునని, అధర్మానుష్ఠానమున అధర్మఫలరూప దుఃఖము లభించునని తలచితివా ఏమి? ఎవరధర్మానుష్ఠానం చేసిరో వారు అధర్మఫలమును పొందియుండినచో ధర్మాసక్తులుగా ఉండెడివారు. కాని అట్లు కనుపించుట లేదు. ఎవరధర్మపరులో వారికి సంపదలు పెరుగుతున్నాయి. ధర్మపరులు క్లేశములను పొందుతున్నారు. అవ్యవస్థిత ఫలకములగుటవలన ధర్మాధర్మములు నిరర్థకాలు. అందువలన హితము-అహితమునగు సుఖదుఃఖరూపకార్యములు దేని వలన కలుగునను వ్యాప్తి నియతముగా లేనందున వాటివలన ధర్మాధర్మములను అనుమేయించుట సాధ్యం కాదు (83-19,20,21)

**వ్యా.వి.** ఓ రాఘవా! ధర్మాధర్మములు కర్మ రూపములా? లేక కర్మవల్ల జనించిన ఏదో ఒక విశేషరూపములా? కర్మరూపములు మాత్రము కావు. ఏమన ఒక దుర్మార్గుడు ఒక హననము జరిపినాడు. హత్యారూపకర్మే అధర్మమయితే 'శబ్ద బుద్ధి కర్మణాం ద్విక్షణావస్థాయిత్వం' శబ్దంగాని, బుద్ధిగాని, కర్మంగాని రెండు క్షణాలు మాత్రమే ఉండు స్వభావము కలవి. కావున కర్మము మూడుక్షణాలు మాత్రముండి పిమ్మట నశిస్తుంది. కావున తానే నశించిన ఆ పాపకర్మము ఆ దుర్మార్గుడగు ఘాతుకునకు కాలాంతరమందు ప్రాప్తించెడి దుష్ఫలితాన్ని ఎలా ఇవ్వగలదు? ఇవ్వజాలదు. ఐతే దుష్కర్మలకు దుష్ఫలితములు వచ్చునని వేదము చెప్పచున్నదందువేమో! అది'గ్రావాణః ప్లవన్తి' రాళ్లు తేలుచున్నవి అన్నట్లు అర్థవాదవాక్యమే 'అట్లు కాదు. కర్మము మూడు క్షణాలు మాత్రమే ఉండెడిదైననూ ఆ కర్మచే ఆరాధింపబడు దైవం ధర్మాధర్మకర్మములకు ఫలమునిచ్చు' నని నచో ధర్మాధర్మ రూపకర్మలకు ప్రేరకుడగు భగవంతుడే ఆ ఫలితములను అనుభవించవలసి ఉండును కాని ప్రేరితునకు ఆ ఫలితము లెట్లు చెందగలవు? యజమానునకేగాని-తదాజ్ఞానుసారం పని చేయువానికి ఆ పనివలన కలిగిన లాభనష్టములతో సంబంధముండదు కదా? (83-22,23).

**గో.వి.** మరి స్వతంత్రుడగు రాజు ఒక విధాన మేర్పరచి దానిననుసరించిన వారిని అనుగ్రహించుట, దానిని వ్యతిరేకించిన వారిని లేక విపరీతానుసారులను నిగ్రహించుట ఎట్లు జరుగునో అట్లే పరమేశ్వరుడు కూడా తన ఆజ్ఞారూప శ్రుతి స్మృతి ప్రతిపాదిత సత్కర్మానుష్ఠతను అనుగ్రహిస్తాడు. సత్కర్మానుష్ఠానం చేయనివానిని విపరీతానుష్ఠాతను శిక్షిస్తారు. అని అనవచ్చును కదా? అనే శంకకు వికల్పించి సమాధానం చెపుతున్నాడు. ఐనచో ఆ పరమేశ్వరుడు తన్ననుగ్రహించుకొనునా? లేక ఇతరులననుగ్రహించునా? అందరి కోరికలు తీర్చు భగవంతుడు తన్నను గ్రహించుకొనుట ఉండదు కద? ఇతరులకొరకే సుఖదుఃఖాదులనిచ్చుచున్నాడనుకునే యెడల ఒకని ఉన్నతునిగ, మరొకని అధమునిగ చేయుటలో ఆయనకు పక్షపాతం ఆపాదింప వలసి వచ్చును. కనుక రెండు విధాల ఫలదాతృత్వం కుదురుటలేదు అట్లు కాదు ఎవరి కర్మానుసారం వారికి ఫలితం వస్తుంది. కాన పక్షపాత ప్రసక్తి లేదందువా? అయినచో అందరినీ మంచి మార్గంలోనే నడచునట్లు చూడడం సర్వజ్ఞుడగు ఆ పరమేశ్వరుని కర్తవ్యంకాదా? 'అట్లు కాదు. జీవుడనాది. ఆతడి కర్మప్రవాహం కూడా అనాదిగనే ఉండును పూర్వజన్మములలోని మంచి, చెడుకర్మలు మానవుని మంచిచెడుకర్మలయందు ప్రవర్తింపజేయును' అనిన ఒక మానవునకు నియమమగు దుఃఖమూ, ఒకనికి నియతంగా సుఖము కలగాలి. అట్లు కలుగుట లేదు కదా! కావున కర్మజన్యమయిన ఒక అదృష్టం ఫలప్రదమగు ధర్మం అని చెప్పవలసి ఉంటుంది. కర్మజన్యమగు ఆ అదృష్టం కనుపించేది కాదు, ఫలము కూడా ప్రత్యక్షంగా కనుపించనిదే. అనుమాన ప్రమాణంతో సాధింప వీలు కానిది. అసద్భూతమగు అపూర్వ మనబడు ధర్మం శ్రేయస్సుకు కారణము కాలేదు. (83.24).

సత్పురుషశ్రేష్ఠా! ధర్మమే ఉన్నయెడల ధార్మికుడవైన నీకు కొద్దిగా కూడా అనిష్టం కలుగకూడదు. మరి ఎందువలన ఇట్టి దుర్భరదుఃఖం పొందినావు? అందువలననే ధర్మమనేది లేనిదే అవుతున్నది. సత్కర్మానుష్ఠాతవగు నీకు సుఖఫలరూపకార్యం కలుగుట లేదు, కావున ధర్మమను పేరు కల అపూర్వమును కల్పించుకొనుట వ్యర్థమవు తున్నది.(83.25).

'సత్ఫలితం కనుపించనంత మాత్రాన కారణమగు ధర్మం లేదన వీలు లేదు. పురుషకారసహిత ధర్మం ఫలితమిచ్చున' న్నచో పౌరుషాన్ని ఆశ్రయించియే ఫలము నిచ్చు ధర్మం దుర్బలం. అనగా స్వతంత్రంగా ఫలమును ఇవ్వజాలనిది. స్వతంత్రం కాక పౌరుషమునాశ్రయించు ధర్మాన్ని ప్రధానంగా ఆశ్రయించుట కన్న పౌరుషమునే ఆశ్రయించుట మంచిదని నా భావం. (83-26).

కార్యసాధనలో బలాన్ని (పౌరుషము) ఆశ్రయించియే ధర్మం ఫలితాన్ని ఇచ్చుచున్నపుడు ఇంతవరకు నీవు ధర్మమునందాసక్తిచూపినట్లు దానినుపేక్షించి పౌరుషప్రాధాన్యాన్ని గుర్తించి పరాక్రమాన్ని ఆశ్రయించు. మరొక విషయం సత్యవాక్పాలనం ధర్మమే కదా! అట్లయినచో 'నిన్ను పట్టాభిషిక్తుని చేసెద'నని మొదట పలికి అట్లు చేయక సత్యరహితుడై సద్గుణఖనివి, జ్యేష్ఠుడవు అగు నిన్ను దయలేక అడవికి బంపిన తండ్రి దశరథుని, సత్యరూపధర్మమును తప్పిన వానిని, నీవెందువలన బంధించలేదు? మొదట రాజ్యమును పాలింపు మని చెప్పి అట్టి మాటను విడిచి పిమ్మట అడవి కేగమన్న తండ్రి మాటలననుసరించిన నీవు సత్యవచనరూపధర్మమును పాలించలేదు. (83-27,28).

ధర్మాధర్మములున్నప్పటికి రాజు ధర్మాన్నిగాని, అధర్మాన్నిగాని ఏ ఒక్క దానిని మాత్రమే ఆచరించ నక్కర లేదు. ఏ కాలమున కేది ప్రయోజనకారియో ఆధర్మమును, లేక అధర్మమును అనుసరించాలి. కావున ధర్మాధర్మములు రెండూ అనుష్ఠింపతగినవే చూడు! క్షత్రధర్మం ఆశ్రయించిన ఇంద్రుడు కేవలధర్మమునే ఆశ్రయించవలసియున్నచో విశ్వరూపుని సంహరించడు కద! అట్లే కేవల అధర్మమునే ఆశ్రయించువాడైనచో పిమ్మట యజ్ఞమును అనుష్ఠింపడు కద! కనుక క్షత్రియునికి ధర్మాధర్మములుభయము అనుష్ఠేయమే. కావున కేవల ధర్మం, కేవలాధర్మం గాని అనుష్ఠింపబడునేని కర్తనాశనమవుతుంది. కావున కాలోచితంగా ధర్మాధర్మాలను అనుష్ఠించాలి.(83-29,30)

తండ్రీ! ఇదే నా అభిమతం. ప్రయోజనం కలుగకున్ననూ ధర్మమునే అనుష్ఠించవలెనని భావించే నీచే ఆనాడు రాజ్యము విడిచి పెట్టబడింది. అన్ని ధర్మాలకు ఆధారమగు అర్థం (సంపత్తి) విడువబడుటచే ధర్మ మూలమే ఛేదింపబడింది. ప్రజాపాలనార్థమై ప్రజలచే సమర్పితమగు (తమ ఆదాయమందలి) ఆరవభాగం పన్నుగా వసూలు కాబడుటచే పర్వతములనుండి వెడలు సెలయేళ్లు క్రమాభివృద్ధి చెందినట్లు వృద్ధి చెందినట్టి సంపదలచే సమస్తధర్మ కార్యాలు నిర్వహింపబడుతున్నాయి.

**గో.వి.** మూలధనం వ్యయపరచక ఆదాయంనుండి మాత్రమే దానధర్మాదికాలను నిర్వర్తించాలని సూచితమైంది.

వేసవిలో చిన్ననదులెండి పోవునట్లు తనకు ప్రాప్తించిన ఐశ్వర్యాన్ని వదలుకొనిన అల్పతేజస్కునకు కర్మలు అన్నీ నాశనమవుతాయి. అర్థపరిత్యాగం చేసినందువలన ధర్మం చేయలేకపోవుట మాత్రమే కాదు దోషం కూడా సంభవిస్తుంది. మొదటినుండి సుఖపడిన ఈతడు (అర్థ పరిత్యాగి) చేతి కందిన ధనాన్ని వదులు కొని సుఖపడతలచి అర్థార్జన కొరకు చౌర్యాది పాపాచరణకు పూనుకొనును. దానివలన దోషి కాగలడు. ఎవరికి ధనం ఉందో వారికే మిత్రులు, బంధువులు ఉంటారు. వారే సమస్తగుణోపేతులుగా చెప్పబడతారు. ధనహీనులు సద్గుణయుక్తులయినా గుణరహితులుగా లెక్కింపబడతారు. అర్థత్యాగంవలన కలిగిన దోషాలను చెప్పినాను. రాజ్యం వదలుకొనుటలో నీ బుద్ధి ప్రవర్తించినందున పూర్వం నేను చెప్పిన దోషాలన్నీ సంభవించాయి. ఎవనికి సంపత్తి కలదో అతనికి ధర్మార్థకామపురుషార్థాలు సిద్ధిస్తాయి. ధనరహితునకు వీటిని సాధించుట సాధ్యపడదు. సంతోషం, కామం, దర్పం, ధర్మం, క్రోధం, శమదమాలు, ఇవన్నీ సంపత్తి కలవానియందే శోభిస్తాయి. ధనరహితునకు శమదమాదులుండవు. ధనం పరలోక శ్రేయస్సును కలిగిస్తుంది. ధర్మానికి మాత్రమే కాక ఇహలోక సుఖాలన్నిటికీ ధనమే మూలం. సంపత్తిని అనాదరపరచి కేవల ధర్మాచరణ చేయువానికి ఇహలోకసుఖాలుండవు. సుఖసాధన భూతములగు సంపత్తులు నీ యందు కనుపించుట లేదు. నీవు తండ్రిగారి మాట విని వనవాసానికి రాగా ప్రాణాధికయగు ప్రియురాలు రాక్షసాపహృత అయింది. అంతకు మించిన దుఃఖమిపుడు ఇంద్రజిత్తువల్ల కలిగింది. నీకర్మవల్ల కలిగిన దుఃఖమును నా పరాక్రమంతో పోగొట్టెద. లెమ్ము. మహాత్ముడవగు నీ నిజస్వరూపాన్ని నీవే పరమాత్మవను విషయాన్ని స్మరించుకొనవేమి?

**గో.వి.** అందువల్ల శోక కారణంలేదని భావం.

నీ సంతోషం కొరకే నేను పుట్టినాను. సీతాదేవి చంపబడుటను చూచి ఆగ్రహించిన నేను ధర్మాధర్మములను ఖండిస్తూ మాట్లాడాను. ప్రతీకారచర్యగా గజతురగరథసహితులగు రాక్షసులు కల లంకను బాణములచే పడగొడతాను. ఈప్రతీకారచర్య ద్వారా నీ దుఃఖం పోగొట్టెద.

## యెనబ్బైనాల్గవ సర్గము

ఈ విధంగా లక్ష్మణుడు రాముని ఓదార్చుసమయంలో సేనానివేశమొనర్చిన విభీషణుడు అనుచరయుక్తుడై అక్కడికి వచ్చి దుఃఖవ్యాపృతుడగు లక్ష్మణుని, కన్నీరుకార్చుచున్న వానరులను, మోహమంది లక్ష్మణుని తొడ మీద శయనించి యున్న రాముని చూచాడు.

**గో.వి.** "రామమాశ్వాసయానే తు లక్ష్మణే భ్రాతృవత్సలే" అనుట వలన సోదరవాత్సల్యంతో లక్ష్మణుడు రాముని ఊరడించుట కిట్టి వాదనలు చేసెను గాని అవి యథార్థాలు కావని సూచించబడింది. వాటిని ఖండింప నక్కరలేదు. ఉపేక్షించుటే కర్తవ్యం.

దుఃఖపీడితుడగు రాముని చూచిన విభీషణుడు దుఃఖమును బిగపట్టుకుని 'ఏమిది' అని ప్రశ్నింపగా 'ఇంద్రజిత్తుచే సీత సంహరింపబడినట్లు హనుమానుని వలన వినిన రాముడు ఇలా మోహమందె' నని లక్ష్మణుడు చెప్పాడు. అన్ని విషయాలు తెలుసుకొనియున్న విభీషణుడిట్లన్నాడు. హనుమానుడు చెప్పిన విషయం యథార్థం కాదు. సీతాదేవివిషయంలో రావణాభిప్రాయం నాకు తెలుసు. 'సీతను రామున కిమ్మని' నేననేక పర్యాయాలు చెప్పినా అంగీకరించని రావణుడు ఇలా ఆమెను సంహరింపజేయడు. చతురుపాయాలను ప్రయోగించినా ఆమెను చూచుటకే వీలుండదు. ఇంద్రజిత్తు తాను కాక యుద్ధం చేయతగ్గ యోధులు లంకలో లేకుండుటవలన తాను నికుంభిలా హోమమాచరించాడు. ఆ సమయంలో వానరులు తనను ఇబ్బంది పెడితే యజ్ఞం భగ్నమై బ్రహ్మవరాను సారం (7-30.22) తనకు మరణము సంభవిస్తుంది. కావున వానరులు యుద్ధవిముఖులు, దుఃఖితులు అగునట్లు మాయాసీతాసంహారం ద్వారా మోసపుచ్చినాడు. నిర్విఘ్నంగా యజ్ఞమును పూర్తి చేసినచో ఆ ఇంద్రజిత్తు ఎవ్వనికీ వధ్యుడు కాదు. రామా! అనవసరదుఃఖం వదిలిపెట్టు. నీవు దుఃఖిస్తూ ఉంటే సైన్యమంతా దుఃఖిస్తున్నది. నీవు స్వస్థహృదయుడవై ఇంద్రజిత్తును సంహరించుటకు లక్ష్మణుని ఆదేశించు. సైన్యసమేతుడగు లక్ష్మణుడు హోమ కర్మనుండి ఇంద్రజిత్తును నివర్తింపజేయగలడు. అందువల్ల ఇంద్రజిత్తు లక్ష్మణవధ్యుడగును. ఇపుడాలసించుట క్షమార్హం కాదు. శత్రుసంహారంకొరకాజ్ఞ నిమ్ము. యజ్ఞం సమాప్తమైనచో అదృశ్యుడగు అతడు అమరులకు కూడా ప్రాణసంశయాన్ని కలిగించగలడు.

## యెనబ్బైయైదవ సర్గము

శోకావిష్టుడగు రామునకు విస్పష్టంగా తెలియుటకు వెనుక తాను చెప్పిన విషయాలను మరొక పర్యాయం చెప్పి నీవు అకారణంగా దుఃఖిస్తున్నావు. అందువల్ల మాకును దుఃఖం కలుగుతూ ఉంది. దుఃఖం పెట్టుకోవద్దు. సీతను పొందాలనుకొంటే ఉత్సాహంగా ఉండాలి. గొప్పసైన్యంతో లక్ష్మణుడు నికుంభిలకేగి ఇంద్రజిత్తును

సంహరించాలి. అతనికి బ్రహ్మ ఇట్లు వరమిచ్చి ఉన్నాడు. 'హోమం సమాప్తం కాక పూర్వమే నికుంభిల అను మట్టిచెట్టు మూలానికి నీవు చేరక ముందే ఆయుధధారివగు నిన్ను ఏ శత్రువు హింసిస్తాడో ఆతడే నీకు మారకుడు' అని. కాన ఆతడిని వధించమని ఆజ్ఞాపించు. ఆతడు వధింపబడిన రావణాదిసర్వశత్రువులూ వధింపబడినట్లే అని విభీషణుడు రామునికి చెప్పాడు.

**గో.వి.** బ్రహ్మమాటలు ఆపాతతః చూస్తే శాపవచనాలవలె గోచరిస్తాయి. యథార్థంగా హోమ సమాప్తి, నికుంభిలాప్రాప్తి విఘ్నరహితంగా జరిగితే నీవవధ్యుడవగుదువని వరమునే ఇచ్చాడు.

వాస్తవమేమన ఇంద్రజిత్తు తన కోరికలను దెలుపుతూ చివరలో "తస్మిన్ యద్యసమాప్తే చ జప్యహోమే విభావసౌ, యుధ్యేయం దేవసంగ్రామే తదా మే స్యాద్వినాశనమ్" (7-30-22) 'జపహోమాదులు పూర్తి చేయకుండా యుద్ధానికి వెళ్లునపుడు నాకు మరణం సంభవింప నిమ్ము' అని కోరగా "ఏవమస్తు" అట్లే అగు గాక అని బ్రహ్మ అంగీకరించాడు. కావున ఇందు శాప ప్రసక్తియే లేదు.

రాముడు విభీషణునితో 'నీవు నిజం చెప్పావు. బ్రహ్మాస్త్రజ్ఞుడగు ఆతడదృశ్యుడై చరిస్తూ ఉండగా ఆతని గతిని ఎవరూ గుర్తించలేరు' అని లక్ష్మణుని చూచి 'లక్ష్మణా! సమస్త సైన్యంతో హనుమత్ప్రభృతి వీరులతో, వెళ్ళి మాయావియగు ఇంద్రజిత్తును సంహరించు. నికుంభిలా ప్రదేశాన్ని బాగుగా గుర్తించగల ఈ విభీషణుడు సానుచరుడై నీ వెంటరాగలడు' రామాజ్ఞానుసారం లక్ష్మణుడు కవచం ధరించి ధనుర్ధారియై శ్రీరామపాదాలను స్పృశించి సంతుష్టుడై ఇట్లన్నాడు. 'నా బాణాలు ఇంద్రజిత్తును భేదించి లంకయందు పడగలవు.' అని చెప్పి రామాశీస్సులనంది వేగంగా ఇంద్రజిద్రక్షితమగు నికుంభిలా ప్రదేశానికి విభీషణ, సైన్యపరివృతుడై వెళ్లాడు.

## యెనబ్బైయారవ సర్గము

విభీషణుడపుడు లక్ష్మణునితో నల్లని మేఘంవలె పరివేష్టించి ఉన్న రాక్షససైన్యంతో వానరులు యుద్ధం చేయాలి. వీరిని భేదించిన ఇంద్రజిత్తు కనుపిస్తాడు. హోమకర్మ సమాప్తం కాకుండానే అధార్మికుడు, మాయావి అయిన ఆతనిని సంహరించుమన్నాడు. నఖదంతములే ఆయుధాలుగాకల వానరులు శిలా వృక్షాదులతో రాక్షసులను సంహరింపసాగారు. స్వీయ సేనాపరాజయం విని యజ్ఞసమాప్తి కాకుండానే హోమస్థానం చుట్టూ అంధకారం కలిగించు దట్టమగు వృక్షసమూహంనుండి బయలువెడలిన ఇంద్రజిత్తు రథమును అధిరోహించి యుద్ధసన్నద్ధుడయ్యాడు. పర్వతాకారుడగు హనుమానుడు వృక్షాలతో రాక్షససేనను నాశనం చేస్తుండగా ఇంద్రజిత్తు ఆంజనేయుని మీద సమస్తాయుధాలను వర్షించాడు. వాటిని నిష్ప్రయోజకాలుగా చేసి హనుమానుడు రోషంతో ఇట్లన్నాడు. 'రావణాత్మజా! నీవే శూరుడవైతే నాతో బాహుయుద్ధం చేసి నా వేగాన్ని సహించగలిగితే నీవు రాక్షసశ్రేష్ఠుడవే!' ఇంతలో లక్ష్మణాదులతో విభీషణుడు 'ఇంద్రజిత్తు ఆంజనేయుని సంహరింపబోతున్నాడు కాన ఇంద్రజిత్తును సంహరించు' అని పలికాడు.

## యెనబ్బైయేడవ సర్గము

విభీషణుడు ధనుష్పాణియగు లక్ష్మణుని వెంటనిడుకుని కొద్దిదూరంలో ఉన్న వనమందలి హోమస్థానాన్ని, నల్లని మేఘంవలె ఉన్నట్టి మట్టివృక్షాన్ని లక్ష్మణునికి చూపాడు. 'ఇచట ఇంద్రజిత్తు భూతబలులు ఇచ్చి

ఈ మఱ్ఱివృక్షంవద్దకు వచ్చి అదృశ్యుడై యుద్ధం చేయగలడు. కావున ఈ మఱ్ఱివృక్షం వద్దకు ఆతడు రాకముందే ఆతనిని సంహరించ' మని విభీషణుడు సూచించాడు. అట్లేనని ధనుష్టంకారం చేస్తూ లక్ష్మణుడు నిలువగా కవచధారి, ధనుర్ధరుడు, రథస్థుడగు ఇంద్రజిత్తు కనిపించాడు. 'నిన్ను నేను యుద్ధానికి ఆహ్వానిస్తున్నా' నని లక్ష్మణుడు పలుకగా అచట కనుపించిన విభీషణుని చూచిన ఇంద్రజిత్తు పరుషంగా ఇలా అన్నాడు. 'నీవు నాకు పినతండ్రివి, ఇచట పుట్టి పెరిగితివి. పుత్రతుల్యుడనగు నాకెట్లు ద్రోహమొనర్చితివి? సాధువులచే నిందింప తగిన దుర్బుద్ధి కలవాడవు. నీవారిని వీడి శత్రువులకు భృత్యుడవైతివి. శత్రువు గుణవంతుడైనను, స్వీయుడు గుణరహితుడైననూ స్వీయుడే ఆశ్రయింపతగినవాడు పరుడు ఇతరుడే కద! పరపక్షాశ్రయణం చేసినవాడు కాలాంతరంలో వారిచే సంహరింప బడతాడు. నీవు దయారహితుడవై ఈ మఱ్ఱిచెట్టువద్దకు లక్ష్మణుని తీసుకుని వచ్చావు. స్వజనవిషయంలో అనుచిత కృత్య మొనర్చినావు' ఇంద్రజిత్తుతో విభీషణుడు ఇట్లన్నాడు.

నీవు నాస్వభావం తెలియని వానివలె మాట్లాడుతున్నావు. దుర్మార్గుడా! పరుషంగా మాట్లాడవద్దు. నేను రాక్షసకులోత్పన్నుడనయిననూ నా గుణములట్టివి కావు. పరపీడాకరములైన దారుణకర్మలు నాకసమ్మతాలు. అట్లు కానిచో వ్యతిరేక స్వభావుడగు సోదరుని ఎందులకు పరిత్యజిస్తాను? చేతిలో ఉన్న పామును విసర్జించినట్లు పాపి ధర్మచ్యుతుడు అగు వానిని విసర్జించిన వాడు సుఖం పొందగలడు. ఇతరుల సొత్తును అపహరించుట, ఇతర స్త్రీలను అపహరించుట, స్నేహితుల విషయంలో సందేహం కలిగియుండుట, ఈ మూడూ నాశకరములగు దోషాలు. మహర్షులవధించుట, దేవతలతో వైరం, గర్వం, పరశ్రేయస్సును ద్వేషించుట ఇవి మాఅన్నకు జీవితాన్ని, ఐశ్వర్యాన్ని, నాశనం చేసే దోషాలు. ఇవే అతనికి కల సద్గుణాలను కూడా కప్పిపెట్టినాయి.

**మ.వి.** రావణునికి సద్గుణాలు విషమిశ్రితాన్నంవలె స్వీకరింపవీలుకానివి.

ఈ దోషాలు కలిగియుండుటవలననే నేనాతనిని విడిచిపెట్టాను. ఇక ఈ లంక, నీవు, నీతండ్రి ఎవరూ ఉండరు. ఇక నీవు మఱ్ఱిచెట్టును ప్రవేశించలేవు. లక్ష్మణునిచే హతుడవై యమదూతలకు పరిచారకుడవు కాగలవు. ఇపుడు నీ బలం చూపు. అన్ని ఆయుధాలను వ్యయపరచు. నీవుగాని, నీ సైనికులుగాని లక్ష్మణబాణ లక్ష్యభూతులై తిరిగి వెళ్ళలేరు.

## యెనభైఎనిమిదవ సర్గము

విభీషణవాక్యశ్రవణజనిత క్రోధపరవశుడై స్వలంకృతం, కృష్ణాశ్వయుక్తం అగు రథమందాసీనుడై ప్రళయ కాలయమునివలె ఉన్న ఇంద్రజిత్తు ధనుర్ధారియై బాణాలను తడుముతూ –ఉదయపర్వతస్థితుడగు సూర్యునివలె ఆంజనేయునధిరోహించిన లక్షణుని చూచి ఇట్లన్నాడు.

**గో.వి.** లక్ష్మణుని తన భుజస్కంధములపై వహించిన ఆంజనేయుడు బంగారు రంగుతోను, అధిరోహించిన లక్ష్మణుడు సూర్యునివలె ఎరుపురంగుతోను భాసించారు. 'ఇపుడు నా పరాక్రమం చూడగలరు. మిమ్మందరిని యమునొద్దకంపుతాను. వెనుక రాత్రి యుద్ధంలో వజ్రతుల్యబాణాలచే మూర్ఛితులై యుద్ధభూమియందు శయనించిన విషయం గుర్తు లేదా? లేక నీకు మరణకాలం ఆసన్నమయింది? నాతో యుద్ధం చేయడానికి వచ్చావు' అన్నాడు

ఇంద్రజిత్తు. అపుడు నిర్భయుడగు లక్ష్మణుడిట్లు సమాధానం చెప్పాడు. నీవు నన్ను యముని వద్దకు బంపెదనని దుర్లభములయిన మాటలను మాత్రం పలికినావు. వ్యర్థప్రసంగంవల్ల ప్రయోజనమేమి? అసాధ్యమగు శత్రు విజయాన్ని గురించి మాట్లాడి కృతకృత్యునిగా భావించుకొని తృప్తిపడుతున్నావు. ఆ యుద్ధంలో అదృశ్యుడవై చరించావు. అది దొంగలు అనుసరించతగిన మార్గమే కాని వీరులనుసరింప తగినదికాదు. ఇపుడు నీ బాణాలకు అందుబాటులో ఉన్నాను. నీ పరాక్రమం ఇపుడు చూపు! వ్యర్థంగా నిన్ను నీవు పొగడుకొంటున్నావు. లక్ష్మణుని మాటలు విన్న ఇంద్రజిత్తు తీక్ష్ణబాణప్రయోగం చేయగా గాయపడిన లక్ష్మణుడు పొగలేని అగ్నివలె ప్రకాశించాడు. ఇంద్రజిత్తు సింహనాద మొనర్చి ఇట్లన్నాడు. 'ఇపుడు నా బాణాలు నీ ప్రాణం తీయగలవు. గ్రద్దలకు, నక్కలకు నీవు ఆహారం అవుతావు. అట్టి నిన్ను రాముడు చూడగలడు.'

**మ.వి.** వాస్తవార్థమేమన నా ధనువునుండి వెలువడే 'అశరాః' అప్రయోజకపు బాణాలు నిన్నేమీ చేయలేవు. 'తే శితధారాః పత్రిణః' నీయొక్క తీవ్రబాణాలు నా నుండి ప్రాణాలను స్వీకరింపగలవు. లంకైశ్వర్యసహితంగా గతించిన నన్ను నక్కలు గ్రద్దలు, ఆహారంగా చేసుకోగలవు. "క్షత్ర బంధుం సదానార్యం రామః పరమ దుర్మతిః భక్తం భ్రాతర మద్యైవ త్వా ద్రక్ష్యతి మయా హతం" 'సదా న ఆర్యం' దానశీలియు, క్షత్రియుడునగు రామునకు సోదరుడవు బంధుడవునగు 'మయా–అహతం' నాచే చంపబడని నిన్ను 'పరమ దుర్మతిః' మహా దుష్టుల విషయమున కూడా అనుగ్రహం కల రాముడు చూడగలడు.

ఇట్లు పరుషంగా మాట్లాడగా లక్ష్మణుడు సమాధానమిస్తున్నాడు. వ్యర్థపుమాటలు వద్దు. చెప్పిన పనిని చేసి చూపు. నీ వలె నేను పరుషంగా మాట్లాడను. నన్ను పొగడుకోను. నిన్ను వధిస్తాను. ఇట్లు పలికి లక్ష్మణుడు తీవ్రశర ప్రయోగం చేశాడు. మహాపరాక్రమశాలులగు ఆలక్ష్మణేంద్రజిత్తులకు అద్భుతమైన ద్వంద్వయుద్ధం ఇంద్రశంబరులకు వలె జరిగింది.

## యెనభైతొమ్మిదవ సర్గము

యుద్ధంలో లక్ష్మణుని 'జ్యా' నాదం భయంకరంగా వినిపించింది. దానినాకర్ణించిన ఇంద్రజిత్తు ముఖం వెలవెల పోయింది. ఇంద్రజిత్తు వివర్ణముఖుడగుట, లక్ష్మణుడే కాగ్రదృష్టితో యుద్ధం చేయుటను గమనించిన విభీషణుడు లక్ష్మణునితో ఇట్లన్నాడు. 'ఇంద్రజిన్ముఖవైవర్ణ్యాది లక్షణాలను చూశాను. ఇతడు భంగపడతాడు. కావున వేగంగా సంహరించు' లక్ష్మణుడు ప్రయోగించిన బాణాలవల్ల ఇంద్రజిత్తు సమస్తేంద్రియాలు క్షోభించాయి. కొంత సమయమేమీ తెలియక మూఢుడై ప్రజ్ఞనొంది ఎదుట ధనుర్ధారియగు లక్ష్మణుడు కనుపించగా క్రోధంతో ఇట్లన్నాడు. 'ఆనాడు నాచే మూర్ఛితులైన విషయం మరచితివా? లేక యమునొద్దకు వెళ్ళ నిచ్చ కలదా? నా పరాక్రమమపుడు బాగుగ చూడలేదు. ఇపుడు చూచెదవు.' పిమ్మట ఇంద్రజిత్తు ఏడుబాణాలు లక్ష్మణుని పైన, పది బాణాలు హనుమంతునిపైన, నూరుబాణాలను విభీషణునిపైన ప్రయోగించాడు. అపుడు లక్ష్మణుడు నవ్వుతూ 'ఈ శరములు ప్రయోజనరహితాలు, శూరులగువారు యుద్ధ మందిట్టి స్వల్పములు, బలహీనములగు బాణాలతో శత్రువును ప్రహరింపరు. ఈ బాణాలు పుష్పములవలె సుఖస్పర్శ నిస్తున్నవి' అని పలికి తీవ్రశరప్రయోగమొనర్చగా

ఇంద్రజిత్తుయొక్క బంగారుకవచం భగ్నమై రథమందు పడింది. కవచరహితుడగు ఆతడు ప్రణితుడయ్యాడు. వృక్షములతో కూడిన పర్వతమువలె నిశ్చలుడయ్యాడు. పిమ్మటాతడు వేల బాణాలతో లక్ష్మణుని కవచాన్ని భేదించాడు. ఇట్లు పరస్పరం ప్రతికృతి నొనర్చుచుండిరి. బహుకాలయుద్ధం చేసినా వారిద్దరికి శ్రమ కలుగలేదు. రక్తం కారుతున్న దేహాలతో వారుభయులు జ్వలించే అగ్నులవలె కనిపించారు.

## తొంబైయవ సర్గము

లక్ష్మణేంద్రజిద్యుద్ధ కౌశల్యం చూస్తున్న విభీషణుడు అనుచరయుక్తుడై యుద్ధసన్నద్ధుడయ్యాడు. ఆతడు రాక్షసులపై బాణప్రయోగం చేశాడు.

**గో.వి.** ముందుగా తాను యుద్ధం చేయనభిలషించిన విభీషణుడు ఇంద్రజిల్లక్ష్మణుల బలాధిక్యాన్ని చూడగోరి ఊరకుండి వారిద్దరూ సమానబలులుగా గుర్తించి యుద్ధరూపంతో రామసేవ చేయతలచి యుద్ధసన్నద్ధుడయ్యాడు.

వానరులతో ఇట్లన్నాడు. 'రావణునకీ ఇంద్రజిత్తు ఒక్కడే దిక్కు. మీరూరకుందు రేమి? ఇతడు హతుడైనచో రావణుడు తప్ప అందరు హతులైనట్లే. కుంభకర్ణప్రహస్తాది సమస్తరాక్షసవీరులూ నిహతులైనారు. ఇందరు బలవంతులను సంహరించిన మీరు సముద్రాన్ని బాహువులతో ఈదినారు. అట్టి మీకీ ఇంద్రజిద్వధ ఆవుగిట్టవల్ల కల్గిన గుంటలోని నీటిని దాటుటవంటిది. ఇంద్రజిత్తు నాకు పుత్రతుల్యుడగుటచే నేనే వీనిని వధించుట అయుక్తం, వీనిని చంపతలచినపుడు నా కంటనీరు నిండుతున్నది. వీనిని లక్ష్మణుడు సంహరించనీయండి. వీనికి సమీపవర్తులగు అనుచరులను మీరు సంహరించండి'. విభీషణప్రేరితులగు వానర-భల్లూకములు రాక్షసులను సంహరింప సాగారు. లక్ష్మణుని విశ్రమార్థం దింపిన ఆంజనేయుడు తాలవృక్షంతో రాక్షసులను ప్రహరించాడు. సంకులయుద్ధమట్లు జరుగుచుండగా ఇంద్రజిల్లక్ష్మణులు ద్వంద్వయుద్ధమొనర్చుచుండిరి. వారి హస్తలాఘవం వల్ల వారమ్ములపొదనుండి బాణాలను తీయుటగాని, వింట సంధించుటగాని, ఆకర్ణాంతము లాగుటగాని, వదలుటగాని, వారి ఉనికిగాని, ఏవీ కనుపించుట లేదు. ప్రయోగించబడిన బాణాలు ఆకాశము నావరించగా బాణాలు తప్ప వస్త్వంతరం కనుపించుట లేదు. వారి ద్వంద్వయుద్ధంలో ఎవరి నెవరు ప్రహరించుచున్నది తెలియక అవ్యవస్థ ఏర్పడింది. జయపరాజయాలు ఒకరియందే నిశ్చితంగా ఉండక అవ్యవస్థ ఏర్పడింది. ఆకాశమంతా బాణములావరించుటచే అంధకారం వ్యాపించింది. నెత్తుటి నదులు పారినాయి. ఆకాశగతులగు మహర్షులు "లోకములకు శుభం కలుగు గాక" అని పలికారు. ఇంద్రజిద్రథాశ్వములను, బాణములతో నొప్పించిన లక్ష్మణుడు సారథిశిరమును ఖండించాడు. అపుడా మండోదరీ పుత్రుడు తానే సారథ్యం చేసుకొంటూ యుద్ధమొనర్ప సాగాడు. అతని ఆకృత్యం అద్భుతంగా కనిపించింది. గుఱ్ఱములను తోలు ఛిద్రమరసి లక్ష్మణుడు ఇంద్రజిత్తు మీద, ఆతడు బాణముల సంధించునపుడు అశ్వముల మీద శరప్రయోగం చేసి చీకాకు పరచాడు. అపుడింద్రజిత్తు తనకు కల యుద్ధగర్వాన్ని వదిలి విషాదం పొందాడు. వానరులు లక్ష్మణుని పూజించారు. అపుడు పర్వతాకారులగు ప్రమాథి, శరభుడు, గంధమాదనుడు, రభసుడు, ఈ నలువురు వానరవీరులు ఇంద్రజిద్రథాశ్వములమీద ఎగిరిపడగా అవి మరణించాయి. వారింద్రజిద్రథమును విరుగ గొట్టినారు. విరథుడైన ఇంద్రజిత్తు భూమిపై లంఘించి యుద్ధం చేయసాగాడు.

## తొంబైయొకటవ సర్గము

వానరరాక్షసులకు తుములయుద్ధం జరుగుతుండగా ఇంద్రజిత్తు రాక్షసులతో ఇట్లన్నాడు. 'ఇపుడు చీకటి ఆవరించి ఉన్నది. ఇట్టి స్థితిలో స్వపర జ్ఞానం కలుగదు. మీరు నేనున్నట్లే వానరులను భ్రమింపజేస్తూ యుద్ధం చేయండి. నేను లంక కేగి రథయుక్తుడనై తిరిగి వస్తాను' అని పలికి లంకకేగి రథాంతర మధిరోహించి యుద్ధ భూమికి వచ్చాడు. విభీషణాదులాతడి లాఘవమునకు విస్మయమందారు. ఇంద్రజిత్తు ధనువును మండలాకారంగా వంచి వానరసేనపై బాణవర్షం కురిపించాడు. వారిని రక్షించుటకు సౌమిత్రి ఇంద్రజిత్తు ధనువును ఛేదించాడు. లక్ష్మణప్రయుక్తబాణాలు ఇంద్రజిత్తును భేదించాయి. ఇంద్రజిత్తు దృఢమగు మరొక ధనువును గ్రహించి లక్ష్మణునిపై బాణాలను వర్షించినా వాటిని తొట్రుపాటు లేక లక్ష్మణుడు వారించి ఇంద్రజిద్రథసారథి శిరమును ఖండించాడు. సారథి లేకున్నా సుశిక్షితములగు ఆ గుర్రాలు వ్యాకులపాటులేక యుద్ధానుకూలంగా తిరుగసాగాయి. లక్ష్మణుడు శరములచే రథాశ్వాలను ప్రహరించి వాటిని భయపరచాడు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణములన్నీ లక్ష్మణుని అభేద్యకవచాన్ని తాకి వ్యర్థములైనాయి. ఇంద్రజిద్బాణపీడితుడైన విభీషణుడు క్రుద్ధుడై గదచే అతడిరథాశ్వాలను నేలగూల్చాడు. అపుడు రథమునుండి నేలకురికిన ఇంద్రజిత్తు పినతండ్రిపై రథశక్తిని ప్రయోగింప లక్ష్మణుడు దానిని దశధా ఖండించాడు.

అపుడింద్రజిత్తు పినతండ్రిపై యమదత్తమగు ఘోరాస్త్రాన్ని ప్రయోగించాడు. లక్ష్మణుడు కుబేరదత్తమగు దుర్జయాస్త్రంతో దానినెదుర్కొన్నాడు. ఆ రెండూ ఢీకొని భస్మమైనాయి. పిమ్మట ఇంద్రజిత్తు వరుసగా రౌద్ర, ఆగ్నేయ, ఆసురాస్త్రాలను బ్రయోగింప లక్ష్మణుడు క్రమంగా వారుణ,సౌర, మాహేశ్వరాస్త్రాలతో వాటిని నివారించాడు. యుద్ధసందర్శనేచ్ఛతో వచ్చిన ఋషులు, పితరులు, గంధర్వాదులు, లక్ష్మణునకు జయమని పలికారు. అపుడు భయంకరం, సునిశితం, సర్పతుల్యం అగు శరమును సంధించి ఐంద్రాస్త్రంతో అభిమంత్రించి లక్ష్మణుడిట్లు పలికాడు.

**ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది ।**
**పౌరుషే చాప్రతిద్వంద్వశ్శరైనం జహి రావణిమ్ ॥**

శ్రీ రాముడు ధర్మాత్ముడు, సత్యసంధుడు, పౌరుషమందు సాటిలేనివాడు అయితే ఓ బాణమా! ఇంద్రజిత్తును చంపు. లక్ష్మణప్రయుక్తమైన ఐంద్రాస్త్రం శిరస్త్రాణసహితం, కుండలాద్యలంకృతమునగు ఇంద్రజిచ్ఛిరమును ఖండించి మొండెమునుండి వేరుపరచింది. విభీషణసహితులగు వానరులు మహానందమందారు. హతశేషులు లంకకు పారిపోయారు. దేవతలు దుందుభులు మ్రోగించి పుష్పవర్షం కురిపించారు. విభీషణాదులు లక్ష్మణుని పూజించారు. వానరులు మహోత్సాహంగా తోకలతో శిలలను పగులగొడుతూ "లక్ష్మణో జయతి" అని బిగ్గరగా పలికారు. ఇంద్రజిద్వధ అసాధ్యం కాన నమ్మజాలని దేవతలు యుద్ధభూమియందు ప్రత్యక్షంగా చూచి విస్మయమందారు.

**మ.వి.** ఇంద్రజిద్యుద్ధం ఫాల్గుణ బహుళ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, మూడు రోజులు నడచింది. ఉత్తరత్ర "అహోరాత్రైః స్త్రిభిః......." అని చెప్పబోతున్నారు.

## తొంబైరెండవ సర్గము

రక్త సిక్త గాత్రుడు, ఇంద్రజిద్ధంతయునగు లక్ష్మణుడు హనుమదాదివీరులతో కూడుకొని యుద్ధపారవశ్యంతో హనుమజ్జాంబవంతులనవలంబించి రామసన్నిధికి వచ్చి ప్రదక్షిణ నమస్కారం చేసి ఇంద్రసమీపాన బృహస్పతివలె అవ్యక్తాక్షరాలతో 'ఇంద్రజిత్తు-వధింపబడెను' అన్నాడు.

**వ్యా.వి.** ఇంద్ర బృహస్పతి దృష్టాంతం రామప్రాధాన్యాన్ని, లక్ష్మణ పారతంత్ర్యాన్ని మాత్రమే సూచిస్తున్నది.

**మ.వి.** తన పరాక్రమం గురించి చెప్పుటకు సిగ్గుపడిన లక్ష్మణుడు తాను జరిపిన ఇంద్రజిత్సంహారాన్ని అందరూ కలసిచేసినట్లు తలపించి చేయుటచే విభీషణుడిట్లు అంటున్నాడు.

విభీషణుడపుడు 'లక్ష్మణునిచే ఇంద్రజిచ్ఛిరము ఛేదింపబడినద'ని వివరంగా కథన మొనర్చాడు. ఈమాట విన్న రాముడు నిరవధికానందమంది లక్ష్మణునితో 'మంచి గొప్ప పని చేసినావు. సంతుష్టుడనైనాను. ఇంద్రజిత్తు సంహరింపబడుటచే అంతయూ జయింపబడినట్లే' అని పలికి సిగ్గుతో దూరంగా ఉన్న లక్ష్మణుని తొడమీద గూర్చుండ బెట్టుకొని, ఆలింగనమొనర్చి, శిరమునాఘ్రాణించి వాత్సల్యంతో మాటిమాటికి చూచి బాణపీడితుడగుటను గుర్తించి ఇట్లన్నాడు. 'లక్ష్మణా! కుమారుడు మరణించగా రావణుడు హతుడైనట్లేనని అనుకొంటున్నాను. అతడి కుడి చేయిపడిపోయినది. రావణునకాలంబన మీతడే. విభీషణ, హనుమంతులు గొప్ప యుద్ధం చేశారు. ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, మూడు రోజులు రేయింబవళ్లు యుద్ధం చేసి ఇంద్రజిత్తును సంహరించారు. నాకు శత్రువులేకుండ చేసినావు. కుమారుని మరణవార్త విని గొప్పసైన్యంతో వచ్చెడి రావణుని నేను సంహరిస్తాను' ఇట్లు పలికిన రాముడు సుషేణునితో 'లక్ష్మణుని, విభీషణుని, శరజనిత వ్రణబాధనుండి విముక్తుల చేసి, యుద్ధంలో వ్రణితులైన వానరులకు చికిత్స జరిపి బాధోపశమనం కలిగించ' మని ఆజ్ఞాపించాడు. సుషేణుడు లక్ష్మణునకు ఒక ఓషధిని వాసనజూపగా ఆతడు బాణజన్యవ్రణబాధనుండి విముక్తుడయ్యాడు. సుషేణుడు విభీషణునకు, ఇతర వానర వీరులకు, చికిత్స జరిపి బాధావిముక్తుల చేశాడు.

## తొంబైమూడవ సర్గము

రావణాస్థాన మంత్రులు నికుంభిలాయాగం సమాప్తం కాకుండుటచే రావణివధనూహించియూ, పిమ్మట ఇంద్రజిద్వధను విని ప్రత్యక్షంగా చూచి వ్యథితులై రావణునితో 'మహారాజా! నీసుతుడు మేము చూస్తుండగనే విభీషణసహాయంకల లక్ష్మణునిచే సంహరింపబడెను' అని చెప్పారు. దారుణం, ఘోరం, భయంకరం అయిన ఇంద్రజిద్వధను విన్న రావణుడు మూర్ఛనంది చాలాకాలానికి మేల్కొని పుత్రశోకవ్యథతో ఇట్లు విలపించాడు. హా కుమారా! నీవు మహారథుడవు, ఇంద్రుని జయించినవాడవు. నీవు కోపించిన కాలుని, అంతకుని, మందర పర్వతశిఖరమును, భేదించగలవే! లక్ష్మణుడెంత?

**మ.వి.** కాలాంతకపదాలు రెండూ యముని గురించి చెబుతున్నా అర్థభేదమిట వివక్షితం. కాలుడు సర్వ సంహారకుడు, అంతకుడు కాలాభిమానియగు పురుషుడు.

వీరపురుషులకు యుద్ధమరణం కోరుకొనునదే కావున అందులకు నేను విచారపడుట లేదు. ప్రభువు కొరకు మరణించినవాడు స్వర్గం పొందుతాడు. కావున ఆ విషయమందూ విచారం లేదు. ఇపుడు దేవతలు, లోకపాలురు, మహర్షులు, నీవు సంహరింపబడుటను విని నిర్భయులై సుఖంగా ఉంటారు. నీవొక్కడవు లేని నాకు ఈ భూమండలమంతా శూన్యంగా కనిపిస్తున్నది. అంతఃపురమందు రాక్షసకన్యల శోకస్వరం వినిపిస్తున్నది. యౌవరాజ్యమును, లంకను, తల్లిని, భార్యను, ఈ రాక్షసులను మమ్ములను అందరను విడచి నీవెక్కడి కేగితివి? నేను మరణించగా నాకు నీవు ప్రేతకర్మ చేయవలసివాడవు. నా మనోవేదనను తొలగించక మమ్ము వదలి ఎటకేగితివి?' ఇట్లు విలపించిన రావణునకు పుత్రవ్యసనమువల్ల మహాకోపం కలిగింది. సీతను సంహరింప దలచాడు. సహజ తీక్ష్ణ కిరణుడగు సూర్యుని కిరణములు వేసవి కాలమందు అతి తీవ్రములైనట్లు సహజ కోపిష్టియగు రావణునకు పుత్రవ్యసనం మరింత క్రోధహేతువైంది. కనుబొమలు ముడిచిన ఆతని ముఖమునుండి పొగతోకూడిన అగ్ని జ్వాలలు వెలువడినాయి. రక్తనేత్రుడగు రావణుని నేత్రాలు క్రోధాగ్నిచే మరింత జ్వలించాయి. క్రోధమూర్ఛితుడగు ఆతని ముఖం క్రుద్ధుడగు రుద్రునివలె భాసించింది. దీపజ్వాలల నుండి తైలముకారినట్లు ఆతని రక్త నేత్రాల నుండి దుఃఖాశ్రువులు స్రవించాయి. ఆతడు ఏ యే దిక్కుల చూచిన అచటి రాక్షసులు భయంతో స్తంభాదులచాటున నక్కి నిలచారు. అపుడు రావణుడు యుద్ధభీతులగు రాక్షసులను యుద్ధోన్ముఖుల చేయతలచి ఇట్లన్నాడు.

'నేను కొన్ని వేల సంవత్సరాలు తపంబొనరించి సంతుష్టుడైన బ్రహ్మవలన అనేకవరాలు పొందాను. దేవాసురాదులవల్ల నాకు మరణము లేదు. అభేద్యకవచధారినగు నన్ను యుద్ధంలో దేవేంద్రుడు కూడా ఎదురించలేడు. బ్రహ్మదత్తం, శరయుక్తం, భయంకరం అగు నా ధనువును మేళతాళాలతో తీసుకొని రండు. రామలక్ష్మణ సంహారార్థం ఉపయోగించాలి' ఇట్లు పలికి క్రోధయుక్తుడై సీతను చంప నిశ్చయించుకొన్నాడు.

**గో.వి.** ఇతఃపూర్వం ఈధనువీ యుద్ధంలో ఉపయోగింపబడలేదని సూచితమగుతున్నది.

**మ.వి.** వాస్తవార్థమేమన రామలక్ష్మణసంబంధి వానరసంహారార్థం ధనువును తెండని. "సపుత్ర వధ సంతప్త శ్శూరః క్రోధవశంగతః, సమీక్ష్య రావణో బుధ్యా వైదేహ్యారోచయద్వధం" పుత్రశోకతప్తుడగు ఆతడు క్రోధవశుడై సీతను చంప దలచాడు. ఇది సామాన్యార్థం. యథార్థమేమన వైదేహి కారణంగా స్వీయవధను గుర్తించి (అనగ-రామునిచే తన మరణం ఖాయమని) నిశ్చయించుకొన్నాడు. మరియూ రావణుని క్రోధావేశం సీతను చంప ప్రయత్నించుట. వీటి అభిప్రాయమేమన – తనకు రామునిచే చావు కావలెనని కోరిక. తదనుగుణంగా సకలరాక్షసవధ తప్పదు. ఈ విషయమితరులకు తెలియకుండుటకై క్రోధప్రదర్శన చేశాడు. ఘోరదృష్టితో చూచి రాక్షసులతో రావణుడిట్లన్నాడు–'వానరులను వంచించుటకు నాకుమారునిచే మాయాసీత వధింపబడింది. క్షత్రబంధువునందను రక్తయగు ఆమె నిపుడు నిజంగా సంహరిస్తాను'

**మ.వి.** ఇచట

**తదిదం తథ్యమేవాహం కరిష్యే ప్రియమాత్మనః ।**
**వైదేహీం నాశయిష్యామి క్షత్రబంధుమనువ్రతామ్ ॥**

వాస్తవార్థమేమన బాలుడైన ఇంద్రజిత్తునిచే వానరవంచనార్థమై మాయాసీతాహననం ప్రదర్శితమైంది. క్షత్రియులకు పరమాప్తుడగు రాముని అనుసరించు వైదేహిని యథార్థంగా నాశనం చేస్తే అది నాకు అప్రియమే కాగలదు. కాని ఇతర రాక్షససంతుష్ట్యర్థం ఆమెకు కొద్ది దుఃఖమును కలుగ జేస్తాను.

ఈ విధంగా మంత్రులతో వచించి స్వచ్ఛమగు ఖడ్గం ధరించి మంత్రులతో, భార్యలతో కూడినవాడై స్నేహితులు వారిస్తున్నా వినిపించుకొనక ఆకాశమందంగారకుడు రోహిణి మీదకు వెళ్ళినట్లు వేగంగా సీత మీదకు వెళ్లాడు.

ఖడ్గహస్తుడై మీదకు వచ్చుచున్న రావణుని చూచిన సీత అనేక విధాల కారణాలను ఊహించి దుఃఖించి ఇలా అన్నది. దుర్మతియగు ఈతడు నన్ను కామించి నిరాకృతుడై సనాథనగు నన్ననాథవలె చంపాలని చూస్తున్నాడు. లేక రామలక్ష్మణులనీతడు సంహరించెనా? లేక పుత్రశోకంతో రామలక్ష్మణులను సంహరించలేక నన్ను వధింప తలచెనా? ఆనాడు హనుమానుడు చెప్పినట్లు విని ఆతని వీపుపై కూర్చుండి వెళ్ళి ఉంటే భర్తయొక్క అంకమందుండెడి దానను. ఈనాడిలా దుఃఖించే అవసరముండదు కదా? రాముడు యుద్ధమందు మరణించిన విషయం వినినచో ఏకపుత్రయగు కౌసల్య గుండె పగిలి మరణిస్తుంది. దుర్మార్గురాలగు మంథరవల్ల ఇన్ని కష్టాలు సంభవిస్తున్నాయి. ఇట్లు సీత దుఃఖిస్తుండగా రావణునితో మంత్రులలో మేధావి, బుద్ధిమంతుడగు సుపార్శ్వుడిట్లు అన్నాడు. 'సాక్షాత్కుబేరానుజుడవు. వేదవేత్తవు, స్వకర్మనిరతుడవగు నీవు ధర్మం వదలి స్త్రీయగు సీతను వధించుట కెట్లు సిద్ధపడినావు? కాలాంతరమందు సీత నీకు వశ్యురాలు కాగలదు. కావున నిరీక్షించు. ఈ కోపం మాతో సహ రామునిమీద చూపు. నేడు కృష్ణపక్ష చతుర్దశి, అమావాస్యనాడు విజయ మందుటకు సైన్యయుక్తుడవై నేడే యుద్ధ ప్రస్థానం చేయండి.

**గో.వి.** చతుర్దశియందు యుద్ధప్రస్థానమగుటచే ఇంతకు ముందు 13యుద్ధదివసములు గడిచాయని తెలుస్తున్నది. పూర్ణిమ నాడు సువేలారోహణం, కృష్ణపక్షపాడ్యమినాడు యుద్ధారంభం, ఆరాత్రి నాగపాశ బంధనం, తద్విమోక్షణం, విదియనాడు ధూమ్రాక్ష వధ, తదియనాడు వజ్రదంష్ట్ర వధ, చతుర్థినాడు అకంపన వధ, పంచమినాడు ప్రహస్త వధ, షష్ఠినాడు రావణమకుటభంగం, సప్తమినాడు కుంభకర్ణవధ, నవమినాడు అతికాయాదులవధ, ఆనాడే తిరిగి ఇంద్రజిద్యుద్ధం, ఆ రాత్రే నికుంభాదివధ, దశమినాడు మకరాక్ష వధ, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి దినాలలో ఇంద్రజిద్యుద్ధం. (ఇది మహేశ్వర తీర్థుల అభిప్రాయం) వాస్తవంగా నవమి యుద్ధారంభం. నవమి–దశమి– రెండు రోజులు రావణేంద్రజిత్తుల మూలబలం కాక సమస్త రాక్షసవధ, ఏకాదశి ద్వాదశి త్రయోదశిదినాలలో ఇంద్రజిద్వధ..

**మ.వి**. "హత్వా దాశరథిం రామం భవాన్ ప్రాప్స్యతి మైథిలీం" దాశరథిని సంహరించి నీవు సీతను పొందగలవు. వాస్తవార్థమేమన 'దాశరథిం' రాముని వద్ద కేగి 'దాశరథిం–మైథిలీం–భవాన్ ప్రాప్స్యతి' రాముని సీతను నీవు యుద్ధంలో మరణించి వాళ్ల సమీపంలో జయ విజయ అన్యతర స్వరూపం పొంది ఉండ గలవు–అని.

సర్వాయుధధారివి, శూరుడవు అగు నీవు రాముని సంహరించి సీతను పొందగలవు 'సుపార్శ్వుని మాటను మన్నించిన రావణుడు మరలి సభాభవనానికి వెళ్లాడు.

## తొంబైనాల్గవ సర్గము

రావణుడు సేనాపతులతో 'మీరు గజాశ్వరథయుతులై సమస్తాయుధధారులై యుద్ధానికి వెళ్లి రాము నొక్కని ముట్టడించి సంహరించండి. మీరు రాముని సంహరించలేక పోయినా మీచే గాయపడినట్టి అతనిని నేను సులభంగా సంహరిస్తాను.' రావణాజ్ఞపొందిన రాక్షసులందరూ (మూలబలం) వివిధాయుధధారులై యుద్ధానికి వెళ్లారు. వానర రాక్షసులకు దొమ్మి యుద్ధం జరిగింది. ఫలించిన వృక్షములపై పక్షులు వ్రాలినట్లు పర్వతాకారుడగు ఒక్కొక్క రాక్షసునిపై అనేక మంది వానరులధిరోహించి బాధించారు. అంతట మహాకాయులగు రాక్షసులు వివిధాయుధాలతో వానరులను సంహరిస్తుండగా వానరులు రాముని శరణు పొందారు. పరాక్రమశాలియగు రాముడు ధనుర్ధారియై రాక్షసులపై బాణవర్షం కురిపించాడు. రాక్షసుల నాతడు బాణాగ్నిచే దహిస్తుండగా తీక్ష్ణకిరణుడగు సూర్యుని మేఘాలు సమీపించలేనట్లు రాక్షసులా రాముని సమీపింపజాలక పోయారు. కష్ట సాధ్యములు, అతివేగములగు రాముని చర్యలు జరిగిన పిమ్మట మాత్రమే ఆ రాక్షసులు చూడగలిగారు. కాని ఏమి చేయ తలచినది, లేక చేయుచున్నదానిని చూడజాలక పోయారు.

**వ్యా.వి.** రామహస్తలాఘవాతిశయంతో ఆతని కార్యములను చూడకుండుట కాదు. యుద్ధ కర్మ నొనర్చు రాముని గూడ చూడలేకపోయారు. అరణ్యంలోని వృక్షశాఖాపత్రముల కదలికచే 'గాలిచే చెట్లూగుచున్నవి' అని కనుపించని గాలిని తత్కార్యమగు వృక్షచలనముచే ఎట్లూహింతుమో అట్లే రథపదాతినాశనాన్ని, ఛేదింపబడి, చీల్చబడి, ఖండములుగ చేయబడిన సేనను చూచి తత్కర్త యగు రాముని ఊహించిరే కాని ప్రత్యక్షంగా చూడలేకపోయారు. "ప్రహరంతం శరీరేషు న తే పశ్యన్తి రాఘవం, ఇంద్రియార్థేషు తిష్ఠంతం భూతాత్మానమివ ప్రజాః".

**గో.వి.** చక్షురాది ఇంద్రియాల ద్వారా రూపాదివిషయములను అనుభవించుట ద్వారా ఊహింపబడుచున్న పాంచభౌతికశరీరాధిష్ఠాతయగు జీవాత్మను ప్రజలు ఇంద్రియాలద్వారా ఎలా చూడలేరో అట్లే తాము ప్రహరింప బడుటచే ప్రహరణ కర్త రాముడని ఊహించిరే కాని కంటితో చూడలేకపోయారు. లేక గంధాది గుణాలు ప్రత్యక్షంగా అనుభవింపబడుచున్నప్పటికి తదాశ్రయభూతాలైన పృథివ్యాదులపుడు (వాసన చూచు సమయంలో) కనిపించనప్పటికి వాటి ఉనికిని ఎలా ఊహింతుమో అట్లే కార్యములచే రాముని ఊహించారు.

**మ.వి.** "ఇంద్రియార్థేషు తిష్ఠంతం" ఇంద్రియాలకు, విషయాలకు ప్రేరకుడుగా శరీరమందున్నట్టి 'భూతాత్మానం' పరమాత్మను ప్రజలు ఎలా గుర్తించలేకపోయారో! అట్లు ఆ రాక్షసులు తమ శరీరములయందొకే పర్యాయం బాణాలతో ప్రహరించే రాముని చూడలేకపోయారు. లేక ఇంద్రియార్థములననుభవిస్తూ ఈ అనుభవమువలననే ఊహింప తగిన 'భూతాత్మానం' జీవాత్మను ప్రజలెట్లు చూడలేకుండిరో అట్లు, లేక పరమాత్మ సర్వవ్యాపి కావున శబ్దాది విషయాలకు అధిష్ఠానభూతుడగు ఆ పరమాత్మను విషయోపభుక్తులగు ప్రజలెట్లు విషయాధిష్ఠాతగా పరమాత్మనెట్లు తెలుసుకొన జాలకుండిరో అట్లు. 'వీడు ఏనుగుల సంహరిస్తున్నాడు, వీడు రథికుల సంహరిస్తున్నాడు, వీడు గుఱ్ఱములను, కాల్బంట్లను సంహరిస్తున్నాడ'ని పలుకే రాక్షసులు రామసాదృశ్యభ్రమచే పరస్పరం సంహరించుకొంటూ. శత్రుసైన్యాలను దహించే రాముని చూడలేకపోయారు. మహాభీతిచే 'వేల' రాములను

యుద్ధంలో చూశారు. తిరిగి ఒకే రాముని దర్శించారు. వెనుక మారీచుడు రావణునితో ఇలా అని ఉన్నాడు. "అపి రామసహస్రాణి భీతః పశ్యామి రావణ" 'భయపడిన నేను వేల రాములను చూస్తూ ఉన్నాను'. ఆ యుద్ధసమయమందు రాముడు వేగంగాను, గుండ్రంగాను తిరుగుతుండడంవల్ల స్వర్ణమయమగు ఆతని ధనువును చివరను వేగంగా, గుండ్రంగా తిరుగుతున్న కొరవినివలె రాక్షసులు (ఆ ధనువు చివరను) చూచిరే కాని రాముని చూడలేకపోయారు.

**శరీరనాభి సత్త్వార్చిశ్శరారం నేమికార్ముకమ్ ।**
**జ్యాఘోష తల నిర్ఘోషం తేజో బుద్ధిం గుణప్రభమ్ ॥**

**దివ్యాస్త్ర గుణపర్యంతం నిఘ్నంతం యుధి రాక్షసాన్ ।**
**దదృశూ రామచక్రం తత్కాలచక్రమివ ప్రజాః ॥ (94-29,30).**

**వ్యా.వి.** మండలంగా చేయబడిన ధనుర్మధ్యవర్తియగు రాముని సకలశత్రునిషూదినియగు సుదర్శన చక్రంగా రూపకాలంకారంతో వాల్మీకి వర్ణిస్తున్నాడు. చక్రానికి ఆరు అంగములుండును.వరుసగా చెపుతున్నాడు 'శరీరనాభిః' మండలాకారచక్రతుల్యధనువు మధ్య ఉండుట, దృఢంగా ఉండుట వలన రాముని శరీరమే ఉన్నతమగు చక్ర మధ్యస్థ ప్రదేశనాభి (చక్ర మధ్యస్థ నాభిని 'కుండ' అందురు). 'సత్త్వార్చిః' రామునియొక్క బలమే జ్వాల. 'శరారం' బాణములే చక్ర మధ్యస్థమగు శకలాలు. చక్రమధ్యకుండనుండి చుట్టూ ఉండు వాటిని 'ఆకు' లందురు. సుదర్శన చక్రం సహస్రారమని చెప్పబడును ఇట వేయి బాణాలు ఒకే పర్యాయం రామ ప్రయుక్తములైనట్లు వ్యంజితమవు తున్నది. 'నేమి కార్ముకం' (నేమి అనగ భూభ్రమణ సమయాన చక్రం బిగువుగ ఉండుటకు ఏర్పరుపబడిన ఇనుపకట్టు) నేమిగా మారిన ధనువు కలది. మండలాకారంగా చేయబడిన రామధనువే చక్ర 'నేమి' అనే ధనువు కలిగినట్టి, 'జ్యాఘోష తలనిర్ఘోషం' వింటినారిశబ్దమే సుదర్శన చక్రఘోషం. సుదర్శనచక్రం జ్వాలాయుక్తమగుటచే నిరంతరఘోషను వెలువరిస్తూ ఉంటుంది. ఇచట గూడ నారిత్రాటిశబ్దమున్నూ, ముంచేతి చర్మంయొక్క రాపిడివల్ల కలుగుతున్న శబ్దమున్నూ, ఏకమై వెలువడుగొప్ప శబ్దం వెలువడును. 'తేజో బుద్ధి గుణ ప్రభం' రాముని శరీర కాంతి, జ్ఞానం అను గుణాలు ప్రభగా కలిగినది. 'దివ్యాస్త్రగుణపర్యంతం' దివ్యాస్త్రశక్తి అను పదునైన అంచు కలిగినది, రాక్షసులను సంహరించుచున్నట్టి రామచక్రమును కాలచక్రం వలె ప్రజలు చూశారు.

**గో.వి.** మరి మోహనాస్త్రంతో రాముడు రాక్షసులను సంహరిస్తే అదృశ్యుడై మాయాయుద్ధం చేసిన ఇంద్రజిత్తునకు, రామునకు తేడా ఏమి ఉంటుంది? అను శంకకు సమాధానం – ఇచట గాంధర్వాస్త్ర ప్రయోగం వలన రాక్షసులకు మోహం కలుగలేదు. అతివేగచారియగు శ్రీరాముని వేగంవల్ల మోహితులై పరస్పరం చంపుకొన్నారు. రాక్షసులు రాముని చూచి బాణప్రయోగం చేసినపుడు శీఘ్రగామియగు రాముడట లేడు, ఆప్రదేశమందున్న రాక్షసుడాబాణ హతుడగుట జరిగింది. ఇట్లే రామవేగాతిశయంవల్ల అన్ని దిక్కులు చూచుట అన్ని చోట్ల రాముడు కనిపించుట జరిగింది. అందువల్లనే 'శీఘ్రకారియగు రాముని చూడజాలకపోయారు' అనుట జరిగింది. రామః పరిభ్రమణ వేగకారణంగా రామధనువుయొక్క అగ్రం కూడా వేగంగా పరిభ్రమించుటచే ఆధనురగ్రం

చక్రంగా త్రిప్పబడిన కొరవివలె భాసించింది. అందువల్ల రామునకు సుదర్శనచక్రత్వరూపణం చూపబడింది. అందువలననే సుగ్రీవాదులీ అస్త్రబలమును మాయాబలంగా శంకింతురని తలచి ఈ అస్త్ర బలము నాకూ శివునకు మాత్రమే కలద'ని చెప్పాడు. "న తే దదృశిరే........"అను (94-26) శ్లోక తాత్పర్యం గాంధర్వాస్త్రం రాక్షసులు మోహితులగుటకు కారణం కాదు. వారిని దహించుటలో మాత్రమే కారణం. రాక్షసులు మోహితులగుటకు మాత్రం రామగతివేగం కారణం.

**వ్యా.వి.** 10మంది సైనికులు 'పత్తి', మూడుపత్తులు 'సేనాముఖం', మూడుసేనాముఖాలు 'గుల్మం', మూడు గుల్మములు గణం, మూడు గణాలు 'వాహిని', మూడువాహినులు 'పృతన', మూడు పృతనలు 'చమువు' దీనినే అనీకమని పిలుస్తారు. (7290. సైనికులు) పదివేల అనీకముల (ఏడు కోట్ల ఇరవై తొమ్మిది లక్షల) రథాలు, పదమూడుకోట్ల పన్నెండు లక్షల ఇరువదిఏడువేల ఏనుగులు, పదికోట్ల ఇరవైలక్షల అరవైవేల గుఱ్ఱములు, 145కోట్ల సైనికులు, దినాష్టమభాగమందు అనగ 3.3/4 గడియలలో (90.నిముషముల సమయములో) ఒక్క రామునిచే సంహరింపబడినారు.

హతశేషులగు రాక్షసులు లంకలో ప్రవేశించారు. ఆ యుద్ధభూమి అతిబీభత్సంగా క్రుద్ధుడగు రుద్రుని క్రీడాస్థలమగు శ్మశానంవలె కనిపించింది. దేవగంధర్వసిద్ధమహర్షులు అనన్యసాధ్యమగు రామకార్యమును చూచి 'బాగు బాగ' ని పూజించారు. పిమ్మట రాముడు సుగ్రీవ విభీషణాదులతో 'ఈ అస్త్ర బలం నాకు, శివునకు మాత్రమే కల' దని వచించాడు. సంతసించిన దేవతలచే రాముడు పూజింపబడినాడు.

## తొంబైయైదవ సర్గము

రావణుడు పంపిన మూలబలం స్వల్పకాలంలోనే రామునిచే వధింపబడగా ఆ విషయాలు వినిన - భర్తలు, కుమారులు మరణించిన రాక్షస స్త్రీలు దుఃఖోద్వేగంతో పరస్పరమాలింగన మొనర్చి ఇట్లు విలపించారు.

మన్మథాకారుడు, పరాక్రమశాలియగు రాముని చూచి వికృతరూపి, గుణహీనయునగు శూర్పణఖ ఎట్లు కామించింది? హాస్యాస్పదం, అననురూపం అగు రాముని యందలి మోహంతో ఇంతటి విపత్తుకు కారణమైంది. ఆమెచే ప్రేరితుడైన రావణుడు ఆత్మవినాశనంకొరకు సీతనపహరించి బలవద్విరోధం తెచ్చుకొన్నాడు. రాముడే జయమందు ననుటకనేక నిదర్శనాలున్నాయి. సీతను కోరిన విరాధుని సంహారం, పదునాలుగు వేల రాక్షసులు ఖరదూషణసహితంగా రామునొక్కనిచే వధింపబడుట, దీర్ఘబాహువగు కబంధుని వధ, ఇంద్రపుత్రుడగు వాలివధ, దీనుడగు సుగ్రీవునకు రామానుగ్రహంతో రాజ్యప్రాప్తి, మొదలగునవి. అపుడు విభీషణుని మాటలను రావణుడు వినిఉంటే ఈ లంక శ్మశానతుల్యం కాకపోయేది. రామునిచే కుంభకర్ణుడు, లక్ష్మణునిచే అతికాయేంద్రజిత్తులు మరణించినా రావణుడు గుర్తించుట లేదు. నాభర్త,నా కుమారుడు, నా సోదరుడు యుద్ధంలో హతులైనారనే శబ్దం ప్రతిగృహమందూ వినిపిస్తున్నది. ఇంద్రుడో, విష్ణువో, రుద్రుడో, యముడో రామరూపంలో మమ్ముల సంహరించాడు. వరబలగర్వితుడగు రావణుడీ ఘోరవిపత్తును గుర్తించుట లేదు. బ్రహ్మనుండి మనుష్యులచే అవధ్యత్వమును రావణుడు యాచించలేదు. రావణునకు, రాక్షసులకు, ప్రాణాంతకభయం మానవునివలన కలిగింది. దేవతలు శివుని ప్రార్థింప 'రాక్షస నాశనం కొరకు ఒక స్త్రీ జన్మింపగలదు.' అని పరమేశ్వరుడు వచించాడు. దేవప్రేరితయగు

ఈసీత రావణసహితంగా మమ్ము భక్షింపగలదు. ప్రళయకాలంలో మహాకాలగ్రసితులవలె రామగ్రసితులమగు మమ్మెవరు రక్షింపగలరు? తగిన సమయాన స్పందించి విభీషణుడా రామునే శరణు పొందాడు. ఈ విధంగా రాక్షస్త్ర స్త్రీలందరూ దారుణంగా ఉచ్చైస్స్వరంతో దుఃఖించారు.

**గో.వి.** ఇచట బ్రహ్మ–శివ వరప్రదాన వృత్తాంత మీ రాక్షస స్త్రీలు మండోదరినుండి వినిరని తెలియనగును. మండోదరి 'జ్ఞానవృద్ధ' అని ముందు చెప్పబడుతుంది.

## తొంబైయారవ సర్గము

లంకయందలి ప్రతిగృహమందూ దుఃఖరవం విని రావణుడు క్రోధంతో మండిపడి భయంతో అవ్యక్తాక్షరాలను పలుకుతూ మహోదర, మహాపార్శ్వ, విరూపాక్షులతో 'వేగంగా మన సైన్యాన్ని బయలుదేర దీయుడు'అని చెప్పాడు.

**గో.వి.** ఇతఃపూర్వం యుద్ధంలో మరణించిన మహోదరమహాపార్శ్వులు రావణసోదరులు. ఇచటి వారు కేవల సచివులు.

ఆజ్ఞప్త సైనికులు రణోత్సాహరహితులైనా రావణసన్నిధిలో నిలచారు. వారితో రావణుడిట్లన్నాడు. 'ఖర,కుంభకర్ణ, ప్రహస్తేంద్రజిద్వధకు ప్రతీకారం చేస్తాను. ఒక్కొక్క బాణంతో శతసంఖ్యాకవానరులను సంహరిస్తాను. దుఃఖితులగు రాక్షసస్త్రీల కన్నీరు తుడుస్తాను. రథం అలంకరించి తీసుకొని రండి. హత శిష్ట రాక్షసులు నన్ననుసరించండి' అపుడు సేనానీతమైన, ఎనిమిది గుఱ్ఱములపూన్చిన రథం అధిరోహించిన రావణుడు కాలాంతకయమునివలె సైన్యపరివృతుడై రామలక్ష్మణులున్న ఉత్తరద్వారమునుండి యుద్ధభూమికి వెడలాడు.

అపుడు అమంగళకరములగు అనేక దుశ్శకునాలు కనుపించాయి. రావణుని ఎడమ కన్ను, బాహువు అదరినాయి. అనేకములగు ఇట్టి దుశ్శకునాలు రావణుని మరణమును సూచిస్తున్నాయి. వీటిని గుర్తించి కూడా కాలచోదితుడైన రావణుడు మరణం కొరకు యుద్ధానికి వెళ్లాడు. వానరరాక్షససంకులసమరంలో రావణుడు గొప్పగా యుద్ధమొనర్చినాడు. అతడి బాణాలచే వానరుల వివిధశరీరభాగాలు ఖండింపబడినాయి. రథికుడగు రావణుడు క్రోధాక్షుడై ఎటు వెళ్ళిన అచటి వానరులాతడి శరవేగాన్ని సహింపచాలని వారైరి.

## తొంబైయేడవ సర్గము

అపుడు సుగ్రీవుడు యుద్ధ సన్నద్ధుడయ్యాడు, విరూపాక్షుడు సుగ్రీవునిపై బాణవర్షం కురిపించాడు. వారు భయుల ద్వంద్వయుద్ధంలో సుగ్రీవుడు కఠినమైన పిడికిట విరూపాక్షుని ప్రహరింప విరూపాక్షుడు నెత్తురు గ్రక్కుతూ మరణించాడు.

## తొంబైయెనిమిదవ సర్గము

అపుడు రావణచోదితుడగు మహోదరుడు సుగ్రీవునితో ద్వంద్వయుద్ధం చేశాడు. సుగ్రీవుడు పరిఘతో మహోదరుని రథాశ్వాలను సంహరింప విరథుడగు ఆతడు గదతో సుగ్రీవు నెదుర్కొన్నాడు. ఆయుధములు భగ్నముకాగా ఖడ్గయుద్ధం చేశాడు. సుగ్రీవుడు మహోదరుని శిరమును ఖడ్గముతో ఖండించి సంహరించాడు.

## తొంబైతొమ్మిదవ సర్గము

పిమ్మట మహాపార్శ్వుడు వానరసేనను నురుమాడుచుండగా అంగదుడు పరిఘాయుధం ఆతనిపై వేశాడు. ఆదెబ్బకాతడు మూర్ఛిల్లాడు. భల్లూకాధిపతియగు గవాక్షుడాతడి రథాశ్వాలను మహాశిలతో సంహరించాడు, రథాన్ని ధ్వంసమొనర్చాడు. ద్వంద్వయుద్ధంలో అంగదుడు పిడికిట పొడిచాడు. తత్ప్రహారంతో మహాపార్శ్వుడు మరణించాడు.

## నూరవ సర్గము

విరూపాక్షమహోదరమహాపార్శ్వులు హతులు కాగా క్రోధావిష్టుడగు రావణుడు సూతునితో ఇట్లన్నాడు. 'ఏ రామవృక్షమునకు సీత పుష్పమో, సుగ్రీవాది వానరులు కొమ్మలో, ఫలప్రదమగు ఆ రామవృక్షాన్ని యుద్ధ మందు సంహరించి మృతుల, బంధువుల దుఃఖాన్ని పోగొడతాను'.

**మ.వి.** వాస్తవార్థమేమన "రామలక్ష్మణౌ హత్వా" 'హత్వా గత్వా' రామలక్ష్మణులను ఉద్దేశించి వెళ్ళి శత్రు సంహర్త, సీత అనే పుష్పం కలిగి ఫలప్రదుడగు రాముని వద్ద కేగి శాఖారూపులగు సుగ్రీవాది వానరుల సంహరించి మృత బంధువుల దుఃఖాన్ని తొలగిస్తాను.

రావణరథగమనంతో దిక్కులు, విదిక్కులు, శబ్దిస్తుండగా రావణుడు తామసాస్త్రమును వానరులపై ప్రయోగించాడు. వారస్త్రక్షతులై క్రిందపడినారు. బ్రహ్మనిర్మితమగు ఆ తామసాస్త్రమును వానరులు సహించలేక పోయారు. భగ్నమగుచున్న వానరసేనను చూచిన రాముడు యుద్ధసన్నద్ధుడయ్యాడు. సమున్నతుడు, ఉన్నత ధనుర్ధరుడు, దీర్ఘనేత్రుడు, దీర్ఘబాహువు, శత్రుసంహర్త, అపరాజితుడు, సౌందర్యరాశి, లక్ష్మణయుతుడు అగు రాముని రావణుడు చూచాడు.

**గో.వి.** ఇచట పరాజయమెరుగని సౌందర్యరాశియగు రామునితో వైరం వదిలిపెట్టి నిరంతరధ్యానం చేయలేని రావణదుర్బుద్ధిని గూర్చి, శ్రీరామదేహలావణ్యం అనే అమృతమున మునగనట్టి ఆ రావణదౌర్భాగ్యాన్ని గూర్చి చెప్పబడింది.

లక్ష్మణసహితుడగు రాముడు చిరకాలానికి శత్రువు కంటబడినందుకు సంతుష్టుడై ధనుర్ధరుడై నారిత్రాటిని మ్రోగింపసాగాడు. రావణప్రయుక్త బాణశబ్దం, భయంకరమగు రాముని నారిత్రాటి ధ్వని, వీటిని వినిన అనేక రాక్షసులు క్రిందపడినారు. రామలక్ష్మణసమీపానికి వచ్చిన రావణుడు అమావాస్యయందు సూర్యచంద్రుల సన్నిధియందున్న రాహుగ్రహంవలె భాసించినాడు. రావణునితో ముందుగా యుద్ధం చేయతలపెట్టిన లక్ష్మణుడు రావణునిపై శరప్రయోగం చేశాడు. బాణాలతో వాటిని నివారించిన రావణుడు లక్ష్మణుని దాటి రామునిమీదకు వెళ్లి బాణవర్షం కురిపించాడు. సర్పతుల్యములగు ఆ శరాలను రాముడు ఖండించాడు. రామరావణులు పరస్పరం బాణవర్షం కురిపించుకొంటూ, చిత్రగతులపరిభ్రమిస్తూ, పరస్పర ప్రయుక్తబాణాలను నివారించుకొంటూ, రుద్రయములవలె భయంకర యుద్ధమొనర్చుచుండగా సమస్త భూతాలు భయమందినాయి. ఆకాశంపై బాణాలు పూర్తిగా ఆవరించుటవల్ల అంధకారం వ్యాపించింది. వారుభయులు ఏప్రాంతాన యుద్ధమొనర్చుచుండిరో

ఆప్రాంతంలో వాయువుచే ఉవ్వెత్తుగా లేచిన సముద్రతరంగాలవలె బాణములువ్వెత్తుగా లేచాయి. రావణప్రయుక్త బాణాలు రాముని బాధింపలేకపోయాయి. రామప్రయుక్తరౌద్రాస్త్రం అభేద్యమగు రావణకవచాన్ని తాకి అతనికేమాత్రం బాధను కలుగజేయకయే క్రిందపడింది.

**గో.వి.** ఇచట "పునరేవాథ........(100-38 1/2)" శ్లోకం తరువాత "తే భిత్వా" అను శ్లోకానికి ముందు మూలంలో కొంతభాగం లుప్తమైనట్లు భాసిస్తున్నది.

**వ్యా.వి.** ప్రశస్తములగు రామబాణాలు రావణనివారితములైనప్పటికీ రావణకవచాన్ని భేదించకుండానే బుసకొట్టు ఐదుతలలసర్పాలవలె భూమిని పొందినాయి.

రావణుడు క్రోధంతో ఆసురాస్త్రం ప్రయోగించాడు. తత్ప్రభావంతో సింహ వ్యాఘ్రాది క్రూరమృగరూపాలు శరాలు రాముని మీదకు వచ్చాయి. అపుడు రాముడాగ్నేయాస్త్రం ప్రయోగింప అగ్ని, సూర్య, గ్రహ, నక్షత్రరూప బాణాలు రావణుని పైకి వెళ్లినాయి. ఆ అస్త్రద్వయం పరస్పర సంఘర్షణచే సహస్రధా భిన్నములైనాయి. ఆసురాస్త్రం ఆగ్నేయాస్త్రంతో నివారింపబడుటచే సుగ్రీవప్రముఖులు సంతుష్టులై రాముని పరివేష్టించారు.

## నూటయొకటవ సర్గము

తన ప్రయత్నం నిష్ఫలమగుటచే ద్విగుణీకృతక్రోధంతో రావణుడు రుద్ర దేవతాకం, మయనిర్మితం అగు అస్త్రాన్ని ప్రయోగించాడు. అది ముసలాలను, గదలను, శూలాలను, పిడుగులను, బాణాలను, రామునిపై వర్షించింది. రాముడు గాంధర్వాస్త్ర ప్రయోగంతో దానిని నివారించాడు. రావణుడు సౌరాస్త్రప్రయోగమొనర్పగా ప్రకాశయుక్తము లైన చక్రాలు వెడలినాయి. వాటిచే సూర్యాదిగ్రహాలవలె ఆకాశం దీప్తివంతమైంది. ఆ చక్రాలను శరాలతో రాముడు ఛేదించాడు. శరములచే రావణుని ప్రహరించాడు. ఇంతలో లక్ష్మణుడు రావణరథధ్వజాన్ని ఛేదించి సారథిశిరచ్ఛేదనం చేశాడు. రావణ ధనువును గూడ ఖండించాడు. విభీషణుడు దూకి వచ్చి నల్లని మహోన్నతములగు రావణ రథాశ్వాలను గదచే సంహరించాడు. మహావేగంతో రావణుడు రథంనుండి దూకి మహాకోపంతో జ్వలించే శక్తిని విభీషణునిపై ప్రయోగించాడు. ఆ శక్తి విభీషణునిపై పడక మునుపే లక్ష్మణుడు దానిని మూడు బాణాలతో ఛేదించాడు. మూడుగా ఛేదింపబడి బంగారంతో స్వలంకృతమగు ఆ శక్తి నిప్పురవ్వలతోకూడినదై ఆకాశంనుండి నేలకూలింది.

**గో.వి.** రాముడు రావణాస్త్రాల నివారించి రావణుని శరముల ప్రహరించి క్షణకాలం విశ్రమింప ముందు తాను యుద్ధప్రవృత్తుడైయున్న లక్ష్మణుడు అవకాశం కోసం చూస్తూ, ఆ సమయంలో రావణునితో తలపడినాడు. అట్లు కానిచో రామునితో రావణుడు యుద్ధమొనర్చుసమయంలో తానును యుద్ధం చేసిన దోషాన్ని పొందును కదా?

రావణుడు ముందు ప్రయోగించిన శక్త్యాయుధం కంటె ఘోరమగు శక్త్యాయుధాన్ని గిరగిరత్రిప్పి విభీషణునిపై ప్రయోగింపబోవునంతలో విభీషణరక్షణార్థం అడ్డుపడిన లక్ష్మణుడు రావణుడు శక్త్యాయుధాన్ని ప్రయోగింప వీలుకాకుండునట్లు అతనిపై శరప్రయోగం చేశాడు. అపుడు రావణుడు లక్ష్మణాభిముఖుడై 'బలగర్వితా! విభీషణుని రక్షించావు. ఇపుడీశక్తి నీహృదయాన్ని భేదించగలదు' ఇట్లు పలికి ఎనిమిది గంటలతో భయంకరనాదం చేసే ఆమహాశక్తిని లక్ష్మణునిపై ప్రయోగించి సింహనాదం చేశాడు. లక్ష్మణుని మీదకు వస్తున్న ఆ శక్తిని చూచిన రాముడు

'లక్ష్మణునకు మంగళమగు గాక' 'ఈ శక్తి వ్యర్థమగు గాక' అని ఆశించాడు. క్షణాలలో భస్మమొనర్చగల ఆశక్తి రామవాక్యప్రభావంతో లక్ష్మణుని చంపజాలక సర్పజిహ్వవలె లక్ష్మణ హృదయాన్ని భేదించి ఆతనిని నేలపై పడునట్లు చేశాడు. అది చూచి దుఃఖించిన రాముడు ముహూర్త కాలమాలోచించి 'ఇపుడు దుఃఖించతగిన కాలంకాదు'. అని తలచి రక్తసిక్తాంగుడై మహాసర్పంతో కూడిన పర్వతంవలె శక్త్యాయుధ భిన్నహృదయుడైయున్న లక్ష్మణునిచూచి రాముడు అన్ని ప్రయత్నాలతో రావణసంహారం చేయాలని నిశ్చయించుకొన్నాడు.

**గో.వి.** రావణునితో తీవ్ర యుద్ధ మొనర్చుటకు కేవలసీతాపహరణకారణముననే కాదు. ఆ స్థితిలో లక్ష్మణుని చూచుట వలన గూడ అని "సన్నిరీక్ష్య చ" అనుచోటకల 'చ' కారం చెపుతున్నది. లక్ష్మణుని చూచుట రావణవధకెట్లు కారణమగుననగా అపుడా దీనస్థితియందు రక్తసిక్తుడై భూశాయియగు లక్ష్మణదర్శనం రావణసంహారనిశ్చయ కారకమయింది.

రావణుడు వానరులపై బాణముల వర్షిస్తుండగా వారు లక్ష్మణుని పీడించిన ఆ శక్తిని ఎంత ప్రయత్నించినా కదల్ప లేకపోయారు. రావణప్రయుక్త బాణాలను లెక్కించక బలవంతుడగు శ్రీరాముడు ఆ భయంకరశక్తిని బాహువులచే లక్ష్మణుని హృదయమునుండి పెకలించి విరచి వేశాడు. హనుమత్సుగ్రీవప్రభృతులతో ఇట్లన్నాడు. లక్ష్మణుని చుట్టూ మీరుండండి. గ్రీష్మానంతరం చాతకపక్షికి మేఘంవలె చాలాకాలంనుండి ఎదురుచూస్తున్న నాకు పరాక్రమింపదగిన కాలం ప్రాప్తించింది. పాపాత్ముడగు రావణుడు వధింపబడాలి. యథార్థం చెపుతున్నాను. రావణుడు లేకుండుటనుగాని, లేక రాముడు లేకుండుటను గాని ప్రజలు చూడగలరు. రాజ్యనాశం, వనవాసం, సీతాపహరణం, రాక్షసయుద్ధం, లక్ష్మణపతనం ఈ నరక తుల్య క్లేశాలనన్నింటిని యుద్ధమందు రావణసంహారం కావించి వదలి పెడతాను. వాలిసంహారం, సుగ్రీవాభిషేచనం, వానరసేనాగమనం, సాగరబంధనం ఇవన్నీ దేనికొరకు చేయబడినాయో అట్టి రావణుడిపుడు పాము కంట మానవుడు పడినట్లు నా కంటపడినాడు.

**గో.వి.** కంటిలో విషముంచుకొని సర్పాలు చూపులతో మనుష్యులను చంపుతాయనే ప్రసిద్ధి ఉంది.

నా కంటపడిన పాపియగు ఇతడు జీవింపతగడు, మీరందరూ పర్వతములపై ఉండి, నాకును, రావణునకును, జరుగబోయే యుద్ధం స్వస్థులై చూడండి. త్రిలోకవాసులు ఇపుడు 'ఈ రాముని రామత్వము'ను ఈ యుద్ధమందు చూతురుగాక.'

**గో.వి.** రాముని జగదేకవీరత్వమును చూతురు గాక!, లేక రామావతార ప్రయోజనమగు రావణవధను చూతురు గాక!, నేడు దేవతలతో కూడిన జనులు ఒక చోటచేరి ఇపుడు ఎలా యుద్ధం జరిగిందో ఈ భూమి ఉన్నంతవరకు ఎల్లప్పుడూ చెప్పుకొనునట్లు యుద్ధం చేస్తాను.

**మ.వి.** రమింపచేయువాడు రాముడు కావున పరాక్రమంతో కూడా రమింపజేయువాడు రాముడని చూతురుగాక.

ఇట్లు పలికి రావణునిపై తీవ్రశరప్రయోగం చేశాడు. రామరావణబాణాలు పరస్పరసంయోగం వల్ల శిథిలములైనాయి. బాణసంఘర్షణవల్ల గొప్ప ధ్వనికలిగింది. వారి నారిత్రాటిధ్వని సమస్తభూతాలకు భయం కలిగించింది. రామబాణపీడితుడైన రావణుడు వాయువుచే పారత్రోలబడిన మేఘంవలె పరుగెత్తాడు.

## నూటరెండవ సర్గము

రావణపలాయనానంతరం సుషేణునితో రాముడు ఇలా అన్నాడు. 'ప్రాణాధికుడగు లక్ష్మణుడు రక్తసిక్తుడై ఉండగా నాకు యుద్ధం చేసే శక్తి ఎక్కడిది? ఈతడే మరణించిన నాకు ప్రాణాలతో ఏమి పని? నా పరాక్రమం సిగ్గుపడుతున్నది. కంటనీరు కమ్ముతున్నది. నాకు యుద్ధంతోగాని, ప్రాణాలతోగాని, సీతతోగాని ఏమి పని? ఏ దేశమందయినా భార్యలు, బంధువులు, దొరుకుతారు. కాని తోడ బుట్టిన వాడు దొరకు ప్రదేశం లేదు.' ఇట్లు దుఃఖిస్తున్న రాముని ఓదార్చుతూ సుషేణుడిట్లు పలికాడు. ఈ లక్ష్మణుడు మరణించలేదు. ఇతని ముఖమందు ప్రేతకళ లేదు. ప్రభతగ్గలేదు. ముఖము ప్రసన్నంగా ఉంది. 'ఉచ్ఛ్వాసనిశ్వాసముల వల్ల బ్రతికి ఉన్న విషయం స్ఫుటమవుతున్నది.' ఇట్లు పలికి హనుమంతుని త్వరపెడుతూ 'వెనుక జాంబవంతుడు చెప్పినట్టి ఓషధి పర్వతమందలి విశల్యకరణి, సావర్ణ్యకరణి, సంజీవిని సంధానకరణి అను ఓషధులను త్వరితంగా లక్ష్మణుని బ్రతికించుకొనుటకు తీసుకుని రమ్ము' అని చెప్పినాడు. అప్పుడగు హనుమానుడు ఓషధిపర్వతానికి వెళ్లి ఓషధులను గుర్తించలేక ఓషధీసహితమగు పర్వతశిఖరాన్ని పెకలించి (ఓషధులను వెతకుటలో ఆలస్యము జరిగిన కార్యభంగం జరుగునను భావంతో) తీసుకుని యుద్ధభూమికి వచ్చి కొద్దిసేపు విశ్రమించి సుషేణునితో ఇలా అన్నాడు. ఓషధులను గుర్తింపజాలక శిఖరమును తెచ్చితిని. ఇలా చెప్పిన ఆంజనేయుని ప్రశంసించి సుషేణుడు ఓషధిని స్వీకరించి లక్ష్మణుని ముక్కునందు పిండినాడు. బాణపీడితుడగు లక్ష్మణుడు ఓషధులనాఘ్రాణించి బాధారహితుడై నేలనుండి లేచాడు. అపుడు వానరులు సంతసించి సుషేణుని పూజించారు. 'లక్ష్మణా! రమ్మ'ని పిలచిన రాముడు కంటనీరు కారుచుండగా ఆలింగనమొనర్చి 'లక్ష్మణా! నీవు మరణించి ఉంటే నాకు ఈ విజయం ఎందుకు? నా జీవితంతోగాని, సీతతోగాని పని ఏమి? దైవానుగ్రహంతో నీవు బ్రతికినావు' అని శ్రీరాముడనగా ఖిన్నుడైన లక్ష్మణుడిట్లు పలికాడు. 'నీవు "రావణుని చంపి విభీషణుని పట్టాభిషిక్తుని చేతు" నని ప్రతిజ్ఞచేసి ఇట్లు మాట్లాడకూడదు. ప్రతిజ్ఞాపాలనం చేయుము. ఈదురాత్ముని సూర్యుడస్తమించులోపు వధింపుము'

## నూటమూడవ సర్గము

రావణుడు మరొక రథం అధిరోహించి రాహువు సూర్యుని మీదకు వచ్చినట్లు రామునిమీదికి వచ్చి బాణప్రయోగం చేశాడు. నేలపై నిలచిన రాముడు రావణుని బాణవర్షంతో ముంచెత్తాడు. భూమిమీద నిలచిన రామునకు, రథస్థుడగు రావణునకు యుద్ధం సరికాదని దేవగంధర్వదానవులు భావించారు. అపుడింద్ర ప్రేరితుడగు మాతలి స్వర్ణాలంకారయుక్తమగు రథం తీసుకొని వచ్చి రథంపై నుండి రామునితో ఇలా వచించాడు. 'నీ విజయం కొరకింద్రునిచే ఈ రథం పంపబడింది. ఇంద్రధనువు, అగ్నితుల్యకవచం, సూర్య తుల్యశరాలు, తీక్ష్ణశక్తి నీకివ్వ బడినాయి. నా సారథ్యంకల ఈ రథం అధిరోహించి రావణుని సంహరించు.' శ్రీరాముడపుడు రథానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి చంద్రప్రభవంటి తన కాంతిచే సర్వలోకములనూ ప్రకాశింపజేస్తూ రథం అధిరోహించాడు. అపుడు రామరావణులకు అద్భుతమగు యుద్ధం ఒడలుగగుర్పొడుచు విధంగా జరిగింది.

రావణ ప్రయుక్త గాంధర్వాస్త్రాన్ని గాంధర్వాస్త్రంతోను, దైవాస్త్రాన్ని దైవాస్త్రం తోను రాముడు శమింపజేశాడు. రావణుడు ప్రయోగించిన రాక్షసాస్త్రంవల్ల శరరూపములగు సర్పాలు విషం కక్కుతూ రాముని మీదికి వచ్చాయి.

దిక్కులు, విదిక్కులు సర్పమయం కాగా రామప్రయుక్త గారుడాస్త్రప్రభావంతో గరుత్మంతులు బాణరూపమంది సర్పరూపబాణాలను సంహరించాయి. అపుడు రావణుడు రామునిపై బాణవర్షం కురిపిస్తూ మాతలిని గూడ బాణాలతో నొప్పించాడు. రథధ్వజాన్ని ఛేదించి అశ్వాలను నొప్పించాడు. రావణుడను రాహువుచే పీడితుడై ఆర్తుడగు రామచంద్రుని చూచిన దేవగంధర్వాదులు విషాదం పొందారు. ప్రజాపతి దేవతాకమగు రోహిణీ నక్షత్రాన్ని ఆక్రమించి బుధుడుండినాడు. ఇది ప్రజలకశుభదాయకం. క్రుద్ధుడగు ఆ రావణుడు ధూమసహితంగా జ్వలించే అగ్నితోకూడి సముద్రంవలె సూర్యమండలపర్యంతమావరించినట్లు కనిపించాడు. శ్యామవర్ణుడగు సూర్యుడు మందతేజస్కుడై ధూమకేతువుతోకూడి క్రూరంగా కనిపించాడు. ఇక్ష్వాకుకుల నక్షత్రం ఇంద్రాగ్ని దైవత్యమగు విశాఖా నక్షత్రాన్ని అంగారకుడాక్రమించాడు. పది తలలతో, ఇరువది బాహువులతో ధనుర్ధారియగు రావణుడు మైనాకపర్వతంవలె భాసించాడు. రాముడపుడు బాణం సంధించుటకే అశక్తుడయ్యాడు. కనుబొమలుముడిచి నేత్రములెఱ్ఱపడ్డ చూపుతో కాల్చువాడువలె శ్రీరాముడు మహాక్రోధం పొందాడు.

## నూటనాల్గవ సర్గము

క్రుద్ధుడగు రాముని ముఖం చూచిన సమస్తభూతాలు భయం పొందినాయి. భూమి కంపించింది. వృక్ష-మృగయుక్తపర్వతాలు చలించినాయి. సముద్రం క్షోభించింది. అమంగళధ్వనులు చేస్తూ పక్షులాకాశంపై పరిభ్రమించాయి. రావణుడు గూడ భయపడినాడు. ప్రళయంవలె ప్రాప్తమైన రామరావణ యుద్ధం చూచుటకు వచ్చిన దేవగంధర్వాదులు రామునకు; దానవులు అసురులు రావణునకు 'జయ' మని పలికి రామ-రావణ పక్షపాతంతో వారు పరస్పరం కలహించారు. అపుడు రావణుడు మహాశూలం ధరించి పరుషంగా రామునితో ఇట్లన్నాడు. వజ్రతుల్యమగు ఈ శూలం నాచే ప్రయోగింపబడి సోదరసహాయుడవగు నీప్రాణాలను తీయగలదు. ఇతఃపూర్వం మరణించిన రాక్షసుల కడకు చేర్చి తత్తుల్యునిగ చేస్తాను. ఇట్లు పలికి రామునిపై ఆ మహాశూలాన్ని విసరివేశాడు.

**మ.వి.** రావణుని మాటలలోని వాస్తవార్థం. "భ్రాతృ సహాయస్య" లక్ష్మణునకు సహాయులుగా వచ్చినట్టి వానర సమూహంయొక్క ప్రాణాలను ఈ శూలం తీయగలదు. "త్వాం నిహత్య......కాఙ్క్షేతిదానీం నిహన్మి త్వాం" ఈ నేను నిన్ను చంపను, కాన నీవు నిలువుము. అయితే నిన్ను 'నిహత్య' (హనన హింసాగత్యోః అని ధాతురూపమున) సమీపించి వానరులను సంహరించి మరణించిన రాక్షసులతో సములుగా చేస్తాను. మృతరాక్షసుల ప్రతీకారార్థం వానరులను వధిస్తాను. రావణునిచే బలంగా విసరివేయబడిన ఆ మహాశూలం మెరుస్తూ గొప్ప నాదం కలిగి ఎనిమిది గంటలతో కూడినదై ఆకాశాన శోభించింది. రామప్రయుక్త బాణాలు ఆ శూలములు తాకి భస్మములైనాయి. తన బాణాలు వ్యర్థములగుటచే కోపపడి రాముడు మాతలి తెచ్చిన ఇంద్రనిర్మితశక్తిని చేపట్టి బలంగా త్రిప్పినాడు. గంటలతో కూడి గొప్ప శబ్దం చేస్తున్న ఆ శక్తి ఆకాశాన జ్వాలాహితమగు ప్రళయాగ్నివలె భాసించింది. ఆ శక్తి మహాశూలాన్ని దాకి దానిని ధ్వంసం చేయగా భగ్నమగు శూలం ప్రభావరహితమై నేలపడింది. రాముడు రావణరథాశ్వాలను ప్రహరించి రావణసర్వాంగాలను శరములతో నొప్పింప రావణుడు నెత్తుటిముద్ద అయ్యాడు.

## నూటయైదవ సర్గము

రామబాణబాధితుడగు రావణుడు రోషక్రోధాలతో రాముని బాణాలతో నింపాడు. బాణాలచే దిక్కులు నిండి అంధకారం వ్యాపించగా రామరావణులు పరస్పరం గుర్తింపలేకపోయారు. ఆ ద్వంద్వయుద్ధంలో రాముడు పరుషంగా ఇలా అన్నాడు. 'రాక్షసాధమా! నేను లేని సమయంలో జనస్థానంనుండి వివశయగు నా భార్యను అపహరించావు. అది పరాక్రమం కాదు. సిగ్గు, మర్యాద, సచ్చరిత్ర లేనివాడవు. భర్త సన్నిహితుడు కాని సమయంలో స్త్రీలయందు పరాక్రమించు నీవు శూరుడనని భావిస్తున్నావు. కుబేరుని తమ్ముడవు, గొప్ప శూరుడవు, పదిమంది పొగడునట్టి యశస్సును కలిగించు గొప్ప పని చేసితివి కదా? (ఇది పరిహాసోక్తి) గర్వంతో నీవొనర్చిన నింద్యకర్మకు ఇపుడు ఫలితం పొందు. నేను సన్నిహితుడనై ఉండగా బలాత్కారంగా సీతనపహరించి ఉందువేని అపుడు మద్బాణహతుడవై నీ సోదరుడు ఖరుని చూచి ఉండెడివాడవు. దైవయోగంవల్ల నేడు నా కంటబడినావు. దురాత్మా! ఇపుడే నిన్ను సంహరిస్తాను. కుండల యుక్తమగు నీశిరం ఛేదింపబడి దుమ్మున పొరలుచుండగా జంతువులు దానిని లాగుకొనిపోగలవు. నీ శరీరమందలి బాణకృతరంధ్రములనుండి స్రవించే రక్తమును పక్షులు పానం చేయగలవు.'

**గో.వి.** ఇందువలన దశాననుడు అంత్యసమయంలో ఏకశిరస్కుడగునని సూచింపబడింది.

ఇట్లు పలికిన రాముడు సన్నిహితుడగు రావణునిపై బాణవర్షం కురిపించాడు. రామునకు బలపరాక్రమం, ఉత్సాహం, అస్త్రబలవిషయస్మరణం ద్విగుణీకృతములైనాయి. రాముడు తనలోని శుభలక్షణాలను గుర్తించి ఉత్సాహాతిరేకంగా శరములచే రావణుని ప్రహరించాడు. వానరప్రయుక్తశిలావర్షంవల్ల, రామప్రయుక్త బాణవర్షం చేత, ప్రహరింపబడుచున్న రావణుడు భ్రాంతహృదయుడయ్యాడు. అపుడు రావణుడు బాణప్రయోగం చేయలేక పోయాడు. ధనువును వికర్షింప లేకపోయాడు. వివశమనస్కుడగుటచే స్వపరబలాన్ని గుర్తించలేకపోయాడు.

**గో.వి.** 'తేన' రావణప్రయుక్తబాణాలు కూడా ఛేదన-భేదనాది ప్రయోజనాలను కలిగించలేకపోయాయి.

**మ.వి.** 'తేన' రామునిచే రావణవధ కొరకు, పరాజయం కొరకు వేయబడిన బాణాలు ప్రవర్తిస్తుండగా అపుడు మృత్యుకాలసన్నిహితుడగు ఆ రావణుని అవస్థను గుర్తించిన రథసారథి నెమ్మదిగా కంగారుపడకుండా రథాన్ని ప్రక్కకు తొలగదీశాడు.

వివశమనస్కుడగు రావణప్రయుక్త బాణాలు ఛేదన భేదనాది క్రియలను నిర్వహించలేకున్నవని గోవింద రాజులు సమన్వయపరచారు. రావణవధార్థమై రామప్రయుక్తబాణములు ప్రవర్తించుచుండగ మృత్యుకాల సన్నిహితుడగు రావణుని సారథి తప్పించెనని మహేశ్వర తీర్థాభిప్రాయం. ఉభయవ్యాఖ్యలు పరస్పర విరుద్ధాలు కావు. విషయైక్యం ఉంది.

## నూటయారవ సర్గము

అపుడు అవివేకజనిత క్రోధయుక్తుడగు రావణుడు రక్తాక్షుడై సూతునితో ఇట్లన్నాడు. 'తేజో బలోత్సాహ మాయాస్త్రరహితునివలె నన్ను చులకన చేసి నీ ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నావు. నీవు మా అభిప్రాయాన్ని గుర్తించక

శత్రుసమక్షంనుండి నన్ను ప్రక్కకు తప్పించావు. 'రావణుడు యుద్ధంనుండి పారిపోవ' డను చిరకాలార్జిత కీర్తిని నాశనం చేశావు. ప్రఖ్యాత బలపరాక్రమాలు కల శత్రువు చూస్తుండగా కుత్సిత పురుషుడుగా చేయబడినాను. ఆలోచింపగా నీవు శత్రువులవల్ల సత్కృతుడవైనట్లు అనిపిస్తున్నది. హితులు ఇట్లు చేయకూడదు. శత్రువు చేసే పని చేశావు. నాపూర్వోపకారాలు గుర్తున్నచో శత్రువు నన్నన్వేషింపక ముందే రథాన్ని మరల్పుము. ఇట్లు పరుషంగా మాట్లాడిన బుద్ధిహీనుడగు రావణునితో హితబుద్ధి యగు సారథి అనునయపూర్వకంగా ఇట్లు పలికాడు. 'మహారాజా! నేను నీవు తలచినట్టివాడని కాను. నీహితం కోరి నీయశస్సును రక్షింప తలచి, స్నేహార్ద్రహృదయంతో నీకు ప్రియమొనర్చినాను. అది నీకప్రియమైంది. దుష్టబుద్ధినివలె, అల్పునివలె నన్ను భావింపతగదు. కారణము చెపుతాను. చాలాకాలం యుద్ధముచేయుటవలన నీవు శ్రమించి ఉన్నావు. యుద్ధం చేయుటలో సుముఖత్వం, హర్షం, నీలో కనిపించడం లేదు. ఈ రథాశ్వాలు చమటతో తడసి దీనములై ఉన్నాయి. కనిపించిన నిమిత్తాలు వ్యతిరేకాలుగా ఉన్నాయి. శుభాశుభనిమిత్తాలను, రథికుని ముఖభావాలను, ఖేద హర్ష దైన్యాదులను, బలాబలాలను భూమి యొక్క ఎత్తు పల్లములను గమనించి శత్రు సమీపానికి ఏగుట, లేక ప్రక్కకేగుట, ఎదట నిలుచుట, రథచోదకుడగు సారథి తెలుసుకొని చేయాలి. నీ గుఱ్ఱములయొక్క శ్రమను తొలగించుటకు యుద్ధభూమినుండి ప్రక్కకు తీయుట జరిగినదేకాన స్వేచ్ఛాబుద్ధితో విశృంఖలంగా ప్రక్కకు తొలగించలేదు. ఏలికవగు నీయందలి స్నేహముతోనే ఇట్లు చేశాను. నీ విపుడెట్లా జ్ఞాపించిన దానిననుసరిస్తాను.' సారథివాక్యాలతో సంతుష్టుడైన యుద్ధప్రియుడగు రావణుడు సారథిని ప్రశంసించి 'సూతా! శత్రువుల సంహరింపక రావణుడు వెనుకకురాడు. కావున రామునికభిముఖంగా రథమును ఉంచు.' ఇట్లు పలికి రావణుడు సారథికి హస్తాభరణం బహూకరించాడు. సారథి క్షణములలో రాముని ఎదురుగ రథము నుంచాడు.

## ఆదిత్య హృదయం
## నూటయేడవ సర్గము

యుద్ధశ్రమనొంది ఎదుట సన్నద్ధుడగు రావణుని చూచి 'నా పరతత్త్వమును ప్రకటింపకయే ఈ రావణుని ఎట్లు జయించాలి?' అని ఆలోచించు రాముని యుద్ధం చూడడానికి దేవతలతో వచ్చియున్న అగస్త్య భగవానుడు ఇట్లన్నాడు. మహాబాహూ! రామా! రామా! వేదతుల్యం, రహస్యం, శత్రువినాశకం, జయావహమగు 'ఆదిత్య హృదయం' విను. దీనివలన సమస్తశత్రువులను జయించగలవు. సమస్తపాపాలను, దుఃఖాలను పోగొట్టే ఈ ఆదిత్యహృదయమును నిత్యం జపించువానికి ఆయుఃప్రమాణం పెరుగుతుంది.

**మ.వి.** వెంటనే యుద్ధం చేయుటకు సంసిద్ధుడగు రావణుని చూచి రావణవధోపాయం ఆలోచిస్తూ ఉన్న రామునితో అగస్త్యభగవానుడు ఇట్లు చెప్పాడు. రావణుని నేడే జయిస్తావు. చింతపొందకు. నీపరాక్రమానికి బలం చేకూర్చుటకు 'ఆదిత్యహృదయ' మనే ఈ స్తోత్రంతో సూర్యుని స్తుతింపుమని చెప్పాడు. ఆ స్తోత్ర మందభిలాష కలుగుటకు తన్మాహాత్మ్యమును వర్ణించుచున్నాడు. ఏ స్తోత్రమున సమస్త శత్రువులను జయింపగలవో, రహస్యం, సర్వశత్రువినాశకమగు జపింపతగిన ఆదిత్యహృదయమనే ఈ స్తోత్రాన్ని విను. సూర్యమండల మధ్యవర్తియగు

పరమపురుషుని ప్రతిపాదిస్తుంది కావున ఈ స్తోత్రానికి ఆదిత్యహృదయమని పేరు. లేక ఆదిత్య హృద్గతాన్తర్యామి"య ఆదిత్యే తిష్ఠన్" (బృహ.ఉ.5.7.9) 'ఎవడు ఆదిత్యునియందు ఉంటూ ఆదిత్యుని నియమించుచున్నాడో' "అంతరాదిత్యే మనసా చరంతం" (తైత్తి ఆ. 3 - 11-6) 'ఆదిత్యమండలమధ్యయందు సంకల్పమాత్రమున చరించువాడు' అను శృతులచే ప్రతిపాదింపబడే పరమాత్మ ప్రతిపాదకమీస్తోత్రం.

**గో.వి.** రాముడు చింతావిష్టుడగుటవలన, అగస్త్యునకు రామునియందు కల వాత్సల్యం వలన, కార్య త్వర వలన, 'రామ!రామ!' అని ద్విరుక్తి చెప్పబడింది. 'మహాబాహూ' అని సంబోధించుట ద్వారా రాముని తొల్లిటి పరాక్రమం ప్రకటింపబడింది. వేదమువలె నిత్యం, రహస్యం, ఆదిత్యమనఃప్రసాదకం పఠించు వారి పుణ్యమును వృద్ధిచేయునట్టిది, స్వసైన్యరక్షకం, పరసైన్యవినాశకం, జయకారకం, అక్షయఫలకం, పరమపావనం, అన్ని మంగళములకు మంగళం (సర్వ శ్రేయస్సాధనం) పూర్వసంచితపాపనివారకం ఆధివ్యాధి నివారకం, ఆయుర్వృద్ధి కరం, జపింపతగిన వానిలో శ్రేష్ఠమైనట్టిది అగు ఈ ఆదిత్య హృదయస్తోత్ర జపము వలన పుణ్యాభివృద్ధి జరుగుతుంది. ఇక దేవతా స్వరూపం చెప్పబడుతున్నది. "రశ్మిమంతం" బంగారు రంగుకల ప్రశస్త కిరణాలు కలిగినట్టి, "సముద్యంతం" సంపూర్ణోదయం కలిగినట్టి. ఇది ధ్యానింపబడు సూర్య విశేషణం. అంతేకాని అది సూర్యోదయకాలం కాదు. ఈ ఉపదేశకాలమపరాహ్ణకాలం కావున తత్కాలమందు సూర్యుడుదయించడు కదా? లక్ష్మణుడితఃపూర్వం 'సూర్యుడస్తంగతుడు కాకముందే ఈ దుర్మార్గుని వధింపు' మని కోరి ఉన్నాడు. "వివస్వాన్" తన ప్రభచే సర్వమును కప్పువాడు."భాస్కరః" కాంతిని కలుగజేయువాడు, "భువనేశ్వరః" భువనములను నియమించువాడు. వర్షం, ఎండ వీటిచే సమస్త భువనాలను నియమించువాడు. అతనిని ఈ ఆదిత్యహృదయాన తుష్టుని చెయ్యి.

**మ.వి.** "రశ్మిమంతం" కిరణాల మధ్య ప్రకాశించు వాని "రశ్మిగ్ రశ్మీనాం మధ్యే తపన్తం" (తై త్తి.ఆ.3.11) కిరణాల మధ్య నివసిస్తూ తపింపజేయువాడని శ్రుతి చెపుతున్నది. "సముద్యంతం" "యః పూర్వ్యాయ వేధసే నవీయసే" (తై.త్తి .బ్రా. 2-4-3) ఆవిష్ణువు సృష్టికి పూర్వమే ఉన్నవాడును, నూతనంగా రామ కృష్ణాద్యవతార రూపాన భాసించువాడును, నిత్యనూతనంగా ఉదయించిన వానివలె ఉన్న వాని. "దేవాసుర నమస్కృతం" దేవదానవోపాస్యుని "వివస్వంతం" "నిరతిశయప్రకాశయుక్తుని" అథ యదతః పరో దివో జ్యోతిర్దీప్యతే....... (ఛాన్దో.ఉ. 3-13-7) అను శ్రుతిలో సర్వవ్యాపకజ్యోతిష్ట్వం చెప్పబడింది. "భాస్కరం" సూర్యచంద్రాగ్నులకు గూడ ప్రభాసంపాదకుని "న తత్ర సూర్యో భాతి..... తస్య భాసా సర్వమిదం విభాతి" (ముణ్డ.ఉ.2-2-10) ఏ పరబ్రహ్మను సూర్యచంద్రనక్షత్రవిద్యుదగ్నులు ప్రకాశింపచేయుటకు సమర్థములు కావో ఆ పరబ్రహ్మప్రకాశముననే సమస్తమూ ప్రకాశితమవుతూ ఉన్నాయి. "భువనేశ్వరం" చరాచరప్రపంచాధీశ్వరుడగు ఆ పరమేశ్వరుని ఈ స్తోత్రంతో స్తుతించు. (107-6) ఈ స్తోత్ర ప్రతిపాద్యుడు సర్వదేవాత్మకుడగు ఆదిత్యుడు. కావున ఈ స్తోత్రమునకింతటి మాహాత్మ్యం కలిగింది. "సర్వదేవాత్మకః" సర్వదేవ శరీరుడు"యస్సర్వేషు దేవేషు తిష్ఠన్" (బృహ.ఉ.3.7-15) ఏ బ్రహ్మం సర్వదేవస్వరూపాన నిండియుండినట్టివాడు. "తేజస్వీ" పరాభిభవనసామర్థ్యం కలవాడు. "రశ్మిభావనః" నిత్యముక్తుల యొక్క సత్తను నిర్వహించువాడు-నిత్యముక్తులు భగవానుని నిత్యేచ్ఛాధీనసత్తకలవారు కదా? ఈ ఆదిత్యుడు

దేవాసురాదులను, లోకాలను. తన కిరణాలతో రక్షిస్తున్నాడు. "అగ్నౌ ప్రాస్తాహుతిస్సమ్యగా దిత్యముపతిష్ఠతే, ఆదిత్యాజ్జాయతే వృష్టి, స్తస్మాదన్నం తతఃప్రజాః" అగ్ని యందుంచబడిన ఆజ్యాదికం ఆదిత్యుని పొందుతుంది. ఆదిత్యునివల్ల వర్షం. వర్షంవల్ల అన్నం, అన్నంవల్ల ప్రజలు కలుగుదురని శ్రుత్యర్థం. "దేవాన్ భావయతాఽనేన తే దేవా భావయంతు వః" (భ.గీ. 3-11)పురోడాశాదులద్వారా దేవతలను తృప్తిపరచినవారు వృష్ట్యాదులద్వారా మనలను తృప్తిపరుస్తారు. మరియూ "యాభిరాదిత్యస్తపతి రశ్మిభిః స్తాభి పర్జన్యో వర్షతి" (తై.తి.ఆ. 10-. 101) ఏ సూర్యుడు కిరణాల ద్వారా గ్రీష్మాన్ని తపింపజేస్తాడో వాడి ద్వారా (పర్జన్యుని ద్వారా) వర్షిస్తున్నాడు. కావున కిరణాలద్వారా లోకాలను రక్షిస్తున్నాడు.

**గో.వి.** సూర్యునికి సమస్తదేవతాత్మకత్వం చెప్పబడుతున్నది. "ఏష బ్రహ్మా" ఈతడే బ్రహ్మాది సమస్త దేవతా శరీరి. "ప్రజాపతిః"నవ ప్రజాపతులు, చెప్పబడుచున్నారు. "కాలః"- మృత్యువు "మరుతః" - ఆవహాది వాయువులు,- "వాయుః" శరీరాంతస్థుడగు వాయువు, "ఋతుకర్తా" వసంతాది ఋతుకర్త.

**మ.వి.** "య ఏషోఽంతరాదిత్యో హిరణ్మయో దృశ్యతే" అను శ్రుతివలన ఆదిత్యమండలాంతర్గత బ్రహ్మయే చతుర్ముఖశరీరి కాన "ఏష బ్రహ్మా" 'నీ యందు, నా యందు, అందరి యందు ఆత్మగా భాసించు చిత్పదార్థం ఒక్కటియే' అని శివునితో బ్రహ్మ చెప్పి ఉన్నాడు. "విష్ణుః" ఉపేంద్రావతారుడు "స బ్రహ్మా స శివస్స హరిస్సేంద్రః" (తై.తి.ఆ.10.) శివవిష్ణురూపులుగా ఉన్నది ఆ పరబ్రహ్మమేనని శ్రుతి చెపుతున్నది. కావున "శివః" శివశరీరి. "స్కందః" శత్రువులను శోషింపచేయువాడు కావున స్కందుడు లేక షణ్ముఖుడు."ప్రజాపతిః" "ప్రజాపతిశ్చరతి గర్భే అంతః" (తై.తి.ఆ.3-13) 'బ్రహ్మాండ గర్భమధ్యయందు ప్రజాపతి చరించుచున్నాడు.' అని చెప్పబడినవాడు "మహేంద్రః" ఐశ్వర్యములోను, స్వరూపములోను, నిరవధికుడు. "ఇంద్రం నిచిక్యుః పరమే వ్యో మన్" (తై.తి.ఆ 3-11-9) ఉత్కృష్టమగు హృదయాకాశమందు పరమైశ్వర్యయుక్తుడు, సప్తహోతృ దేవుడగు ఆదిత్యుడని చెప్ప బడింది. అట్లే "ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే" (ఋక్.సం 6-47-18) (ఇంద్రుడు) పరమాత్మ మాయను స్వీకరించి బహురూపాలను ధరించాడు. "ధనదః" సకల ఫలప్రదుడు. "అన్నాదో వసుదానః" అన్నమును, సంపత్తిని ఇచ్చువాడు. "కాలః" జగత్సంహారకుడు. 'కాలాయ మహాగ్రాసాయ వై నమః' (శ్రుతి) ఆత్తా చరాచర గ్రహణాత్, (బ్ర.సూ. 1-1) అనుశ్రుతి స్మృతుల వలన చరాచరాలను గ్రసించువాడు. పరాశరస్మృతిలో 'అనాదిర్భగవాన్ కాలః' అని చెప్పుట వలన భగవానుడే కాలుడని చెప్పబడినాడు. "యమః" శిక్షించువాడు లేక మనుస్మృతి యందు 'యమో వైవస్వతో రాజా యస్తవైష హృది స్థితః' హృదయమందు నిత్యసన్నిహితమగు చైతన్యమే యముడన బడుతున్నాడు. "సోమః" అమృతం స్రవించువాడు. "సోమః పవతే జనితా మతీనాం జనితా దివః" (తైత్తి.సం. 1-8-12) అన్నిటికీ కారకుడు సోముడని చెప్పబడింది. "అపాం పతిః" ఉదకములకు పతి 'ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః తా యదస్యాయనం పూర్వం తేన నారాయణః' స్మృతః. ఉదకములే 'నార'ములని చెప్పబడును. ఉదకములే నివాసస్థానములుగా కలవాడు కాన 'నారాయణుడు' అని చెప్పబడిన ఆ భగవానుడే 'ఆప ఏవ ససర్జాదౌ' మొదట ఉదకములను సృజించెను కావున ఉదకములకధిపతి. "పితరః" అగ్నిష్వాత్తాది దేవతాస్వరూపుడు. "వసవః" "సదా-వసంతీతి వసవః" ఎల్లప్పుడూ వసించువారు. 'ధృవో, ధర, స్తథా సోమ, ఆపో, వైశ్వానరోఽనిలః, ప్రత్యూషశ్చ

ప్రభావశ్చ వోసవోష్టౌ ప్రకీర్తితాః' అని అష్టవసువులు పేర్కొనబడినారు. తత్స్వరూపుడు. లేక అగ్నిశ్చ పృథివీ చ వాయుశ్చాంతరిక్షం చ, ఆదిత్యశ్చ ద్యౌశ్చ చంద్రమాశ్చ నక్షత్రాణి వై తే వై వసవః అను శ్రుతిలో ఉదహరింపబడిన వారు వసువులు-తత్స్వరూపుడు. "సాధ్యాః" సిద్ధి కలవారు సాధ్యులు. వారు పండ్రెండుగురు. వాయుపురాణంలో ఇలా ఉంది. 'బ్రహ్మ ముఖంనుండి సృజింపబడిన మంత్రశరీరులగు సాధ్యులు పన్నెండుమంది ధర్మపుత్రులు. ప్రతిమన్వంతరంలోనూ ఉంటారు' అని. వారి నామాలు 'మనువు, మంత్రుడు, ప్రాణదుడు, చేతయానుడు, వీర్యవంతుడు, విత్తి, జయుడు, నయుడు, హంసుడు, నారాయణుడు, ప్రభవుడు, విధువు, ఈ పన్నెండు మంది సాధ్యులు. తత్స్వరూపుడు. "అశ్వినౌ" అశ్వ రూపం ధరించి ఆదిత్యదంపతులకు కలిగిన సంతానం అశ్వినీ దేవతలు. "మరుతః" ఎపుడూ మరణించని వారు కావున మరుత్తులు. వాయుపురాణంలో చెప్పిన విధంగా వారు. (7 x 7= 49) శుక్రజ్యోతిమొదలగు నలువది తొమ్మిది మంది. "మనుః" మననముచే మనువు "వాయుః" ప్రసరించి సుగంధం వెదజల్లునది వాయువు. "సర్వ కర్మా" సర్వ కర్మ స్వరూపుడు. "సర్వ కామస్సర్వగంధస్సర్వ రసః" (ఛాన్దో. ఉ.3.14.2) ఆయన చేతనే సమస్త విశ్వం సృజింపబడింది కావున సర్వ కర్మా. "వహ్నిః" హవ్యాదుల వహించునది వహ్ని, "ఇష్టాపూర్తం బహుధా....విశ్వం బిభర్తి....చంద్రమా" (తైత్తి.ఆ.10.1) యజ్ఞయాగాదులు, వాపీ కూపతటాకాదులు, పుట్టినవి, పుట్టబోయెడివి, సర్వప్రపంచమూ బ్రహ్మాధిష్ఠితమే. సూర్యచంద్రాదులు, భూతాలు, అమృతాదులు, పరబ్రహ్మ స్వరూపాలే. "ప్రజా ప్రాణః" ప్రజలకు ప్రాణన హేతువు "కో హ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనందో న స్యాత్" (తై.త్తి. ఆ.8-8) హృత్పుండరీకస్థితుడు, ఆనందస్వరూపుడగు పరబ్రహ్మలేనిచో ఉచ్ఛ్వాసాది కారకమగు ప్రాణమెక్కడిది? కాన ప్రాణపదమున బ్రహ్మమే చెప్పబడింది. "ఋతుః" కాలస్వరూపుడు. "కర్తా" ఆ పరమాత్మ లేక గడ్డి చివర గూడ కదలదు. సర్వభూతాంతఃప్రవిష్టుడగు ఆతడు సకలకర్మ కర్త. "అంతఃప్రవిష్టం కర్తారమేతం" (తై.త్తి.ఆ.3.11.2) జీవరూపాన శరీరాలలో నివసించి ఉన్నట్టి కర్త. "అథ రథాన్ రథయోగాన్ పథస్సృజతే......స హి కర్తా" (బృ.హఉ.4.3.10)స్వప్నంలో సమస్త ప్రపంచాన్ని సృష్టించుట మనకనుభవసిద్ధమే కదా? కావున పరమాత్మ సర్వకర్మకర్త. "ప్రభాకరః" ప్రభను సృజించువాడు. 'దదామి బుద్ధిసంయోగం యేన మాముపయాంతి తే' (భ.గీ.10-10) సద్భక్తులకు సద్బుద్ధిని ప్రసాదించువాడు.

**ఆదిత్యస్సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్ ।**
**సువర్ణసదృశో భానుర్హిరణ్యరేతా దివాకరః ॥ (107-10)**

ఇక ఆదిత్యహృదయస్తోత్రం వ్యాఖ్యానింపబడుతున్నది. ఈ స్తోత్రమందు సర్వత్ర ('ఆదిత్యః' నీవాదిత్యుడవు. ఇత్యాదిగ) 'నీవ'ని అధ్యాహారం చేసుకోవాలి.

"ఆదిత్యః" మొదలు- "లోకసాక్షిణే" వరకు ప్రతి పదానికి 'త్వం' (నీవు) అని చేర్చుకోవాలి.

**గో.వి.** 1. ఆదిత్యః అదితి కుమారుడు కావున ఆదిత్యుడు. లేక అఖండింతమగు భూమికి పతి కావున ఆదిత్యుడు.

**మ.వి.** "యస్మాత్సర్వమాదత్తే తస్మాదాదిత్యః" అను ఉపనిషద్వాక్యానుసారం సమస్తవిషయభోక్త ఆదిత్యుడు.

2. సవితా **గో.వి.** జగత్తును ప్రసవించువాడు.

**మ.వి.** జగత్తును లేక జగత్తును ప్రేరేపించువాడు సవిత.

3. సూర్యః **గో.వి.** జనులను కర్మాచరణానికి ప్రేరేపించువాడు. కావున సూర్యుడు.

**మ.వి.** జనులను లేక బాగును (నిరుపాధికముగ) ప్రేరేపించు పరమాత్మగా “అంతఃప్రవిష్టశ్శాస్తా జనానాగ్ సర్వాత్మా”(తై.త్తి.ఆ.3.11.2). సమస్తజీవులకంతరాత్మగా ఉండి ప్రేరేపించు పరమాత్మ సూర్యుడని పిలువబడుతున్నాడు. ‘యస్సర్వాణి భూతాన్యంతరో యమయతి’ (బ్ర.సూ.3.2.27. ఉదాహృత) శ్రుతి గూడ ఇదే విషయం చెపుతున్నది.

4. ఖగః **గో.వి.** లోకోపకారార్థం ఆకాశమందు చరిస్తాడు కావున ఖగుడు.

**మ.వి.** ‘ఖం’ ఆకాశమును ‘గః’ వ్యాపించి ఉన్నట్టి వాడు. ‘యో అసాధ్యక్షః పరమే వ్యోమన్’ అనే శ్రుతి ఈచరాచర ప్రపంచాధిష్ఠానస్వరూపుడు ఆకాశమందు వ్యాపించి ఉన్నాడని చెపుతున్నది.

5. పూషా **గో.వి.** వర్షముచే జగత్తును పోషించువాడు కావున పూషా.

**మ.వి.** పోషణ చేయు స్థితికర్త.

6. గభస్తిమాన్

**గో.వి.** కిరణములు కలవాడు.

**మ.వి.** సర్వవ్యాపిని అయిన లక్ష్మితో కూడినవాడు. లక్ష్మితో నిత్యయుక్తుడు.

7. సువర్ణ సదృశః

**గో.వి.** బంగారు రంగువంటి రంగు కలిగినవాడు. “హిరణ్య శ్మశృహిరణ్య కేశ ఆప్రణ ఖాత్ సర్వ ఏవ సువర్ణః” (ఛాం.1-6-6) పరిదృశ్యమానుడగు సూర్యభగవానుడు బంగారుమయమగు వెండ్రుకలు, నఖశిఖపర్యంతం అంతా స్వర్ణమయంగా భాసించువాడు.

**మ.వి.** అంతా స్వర్ణమయంగా భాసించువాడు.

8. సుపర్ణః **మ.వి.** (పాఠాంతర వ్యాఖ్య) శోభనమునగు రెక్కలు కలవాడు. పరమాత్మ “ద్వా సుపర్ణా సయుజా సఖాయో సమాను” (ముం.ఉ. 3.1.1). అను శ్రుతి జీవేశ్వరులను సుపర్ణములుగా వర్ణించింది.

9. తపనః **మ.వి.** (పాఠాంతర వ్యాఖ్య) తపింప చేయువాడు. ఇక ‘సువర్ణ సదృశః’ అను దానిని వీరు పాఠాంతరంగా స్వీకరించి.

**గో.వి.**లనే చెప్పారు.

10. భానుః **గో.వి.** ప్రకాశించువాడు

**మ.వి.** ప్రకాశించువాడు "తమేవ భాన్త మనుభాతి సర్వం" (ము.ఉ. 2-2-11). ఆపరమాత్మ యొక్క ప్రకాశంతో సమస్త జగజ్జాలం ప్రకాశిస్తున్నది.

11. హిరణ్యరేతాః **గో.వి.** బంగారుమయమగు బ్రహ్మాండాన్ని సృష్టించువాడు.

**మ.వి.** స్వర్ణమయ రేతస్సు కలవాడు. 'ఆప ఏవ ససర్జాదౌ తాసు వీర్యమపాసృజత్, తదండమభవద్ధైమం సహస్రాంశుసమప్రభం' (మనుస్మృతి) ప్రారంభంలో పరమాత్మ ఉదకముల సృజించి వాటి యందు స్వవీర్యాన్ని ప్రసరింపజేయగా అది బంగారు మయమగు బ్రహ్మాండమయింది.

12. దివాకరః **గో.వి.** పగటి పూట ప్రాణులకు చలనం కలిగించువాడు కావున దివాకరుడు.

**మ.వి.** అజ్ఞాననివర్తన ద్వారా దివా-ద్యుతిని. జ్ఞానం కలిగించువాడు.

13. హరిదశ్వః **గో.వి.** ఆకుపచ్చని గుర్రాలు కలిగినవాడు.

**మ.వి.** మనస్సును హరించునది కాన హరిత్. మనోహరమగు అశ్వః వాహనము అనగా గరుడుడు వాహనంగా కలిగినవాడు కాన హరిదశ్వుడు.

14. సహస్రార్చిః **గో.వి.** సహస్రకిరణాలు కలవాడు.

**మ.వి.** అర్చిశ్శబ్దం మంగళగుణవాచకం. అనంత కళ్యాణ గుణవంతుడు.

15. సప్త సప్తిః **గో.వి.** "ఏకో అశ్వో వహతి సప్త నామా" (తై.తి.ఆ.3.11-9) 'సప్త' అను పేరు కల అశ్వం కలవాడు.

**మ.వి.** "ఈ నామం కల్క్యవతారాన్ని సూచిస్తున్నది."

16. మరీచిమాన్. **గో.వి.** కిరణాలు కలవాడు.

**మ.వి.** దీనిచే శత్రువులు మరణిస్తారు కాన 'మరీచిః' చక్రం. అది కలవాడు. ఇది ఉపలక్షణం. శంఖచక్రగదాద్యాయుధాలు కలిగినవాడని అర్థం.

17. తిమిరోన్మథనః **గో.వి.** చీకటిని మథించువాడు.

**మ.వి.** అజ్ఞానాన్ని నివర్తించువాడు. 'హృద్యంతస్థో హ్యభద్రాణి విధునోతి సుహృత్సతాం' అని స్మృతి. సత్పురుషులయొక్క హృదయాంతర్వర్తి యగు పరమాత్మ అమంగళాలను తొలగిస్తాడు.

18. శంభుః **గో.వి.** ఈయన వలన సుఖం కలుగుతుంది కావున శంభువు.

**మ.వి.** 'శం' సుఖం ఇతడి వల్ల కలుగుతుంది కావున శంభువు. 'విశ్వాక్షం విశ్వశంభువం' (తై.తి.ఆ.10.13). చరాచర ప్రపంచానికి 'శం' సుఖ మీతడి వలన కలుగును కావున 'విశ్వ శంభువు'

19. త్వష్టా **గో.వి.** అన్ని రూపాలను చిన్నవిగా చేస్తాడు కావున త్వష్ట సర్వసంహారకుదు.

**మ.వి.** 7X3 = 21. పర్యాయాలు క్షత్రియసహితమగు భూమిని చెక్కినవాడు కావున త్వష్ట. దీనిచే పరశురామావతారం చెప్పబడింది.

20. మార్తాండః **గో.వి.** ప్రళయకాలంలో అన్నీ నశించగా పునస్సృష్టి కొరకుద్భవించినవాడు.

**మ.వి.** మృతం. అచేతనమగు బ్రహ్మాండాన్ని జీవింపచేసినవాడు 'జీవా జీవమజీవయన్' అను భాగవతోక్తి వలన -మార్తాండుడు.

21. అంశుమాన్. **గో.వి.** కిరణాలు కలిగినవాడు.

**మ.వి.**అంతర్బహిస్సులలో వ్యాప్తి కలవాడు. (అంశుః వ్యాప్తిః అస్యాస్తీతి అంశుమాన్ "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః" (తై.తి.ఆ.10.12) లోపల, వెలుపల సర్వవ్యాపకుడుగా నారాయణుడున్నాడని శ్రుతి చెపుతున్నది.

22. హిరణ్యగర్భః **గో.వి.** బంగారుమయమగు ఖగోళమధ్యవర్తి. లేక 'హిరణ్య' హితరమణీయమగు 'గర్భం' అంతఃకరణం కలవాడు.

**మ.వి.** హిరణ్యమనగా జగత్తును పుట్టించు సమష్టిజీవజాతం గర్భమందు కలవాడు. హిరణ్యగర్భుడు. 'హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే' (తై.తి.సం. 4.2.8.)

23. శిశిరః **గో.వి.** తాపత్రయయుక్తులకు విశ్రమస్థానభూతుడు.

**మ.వి.** తాపత్రయ యుక్తులకు విశ్రమస్థానభూతుడు.

24. తపనః **గో.వి.** తపింపచేయువాడు కావున తపనుడు.

**మ.వి.** తననాశ్రయించిన వారి విరోధులకు తాపం కలుగజేయువాడు.

25. భాస్కరః **గో.వి.** ప్రకాశం కలుగజేయువాడు.

**మ.వి.** సర్వవస్తు సాక్షాత్కార హేతువు. లోకాలను సృష్టించువాడు.

26. రవిః **గో.వి.** అందరిచే స్తుతింపబడువాడు కావున రవి.

**మ.వి.** 'రూయతే-స్తూయతే సర్వైరితి రవిః' లేక 'రౌతి- ఉపదిశతి వేదానితి రవిః' వేదాలను ఉపదేశించువాడు. "యో వై వేదాగ్ంశ్చ ప్రహిణోతి తస్మై" (శ్వే. ఉ. 6.18) ఏ పరమాత్మ వేదాలను చతుర్ముఖ బ్రహ్మకిచ్చెనో- ఆతడు రవి.

27. అగ్ని గర్భః **గో.వి.** "ఉద్యంతం వావాదిత్యమగ్నిరను సమరోహతి" (తై.తి.బ్రా. 2.1.2-10) ఉదయించుచున్న ఆదిత్యునకు అగ్ని ఔత్కృష్ట్యమును కలుగజేస్తున్నాడు. కావున అగ్నిగర్భుడు.

**మ.వి.** అగ్నిః కాలాగ్నిరుద్రుడు ఎవరి గర్భమందు కలడో ఆతడగ్నిగర్భుడు. ఈ విషయాన్ని 'నారాయణాద్రుద్రో జాయతే, (నారాయణోపనిషత్)' చెప్పింది.

28. అదితేః పుత్రః **గో.వి.** అదితి పుత్రుడుగ అవతరించినవాడు.

**మ.వి.** అదితి యొక్క 'పుం' సంతానమగు ఇంద్రుని 'త్రాయతే' రక్షించువాడు.

29. శంఖః **గో.వి.** స్వయంగా సాయంకాలం శమించువాడు కావున శంఖుడు.

**మ.వి.** హృదయాకాశమందు సుఖము కలవాడు. నిరవధికానందం కలవాడు.

30. శిశిరనాశనః **గో.వి.** మంచును నాశనం చేయువాడు.

**మ.వి.** మంచును నాశనం చేయువాడు.

31. వ్యోమనాథః **గో.వి.** ఆకాశానికి ప్రభువు.

**మ.వి.** ఆకాశకర్త. "ఆత్మన ఆకాశస్సంభూతః" (తై.త్తి.ఆ. 8.1) పరమాత్మవలన ఆకాశం సృజింపబడింది.

32. తమోభేదీ **గో.వి.** రాహువును భేదించు స్వభావం కలవాడు.

**మ.వి.** భక్తుల తమోగుణాన్ని భేదించువాడు.

33. ఋగ్యజుస్సామపారగః

**గో.వి.** "ఋగ్భిః"పూర్వాహ్ణే దివి దేవః ఈయతే యజుర్వేదే తిష్ఠతి మధ్యే అహ్నః సామవేదేనాస్తమయే మహీయతే వేదైరశూన్యః స్త్రిభిరేతి సూర్యః (తై.త్తి.బ్రా. 3.12-9.1) ఆకాశగతుడగు ఆదిత్యుడు పూర్వాహ్ణమందు ఋగభిమాని దేవతలతో కలసి చరిస్తాడు. మధ్యాహ్నమందు యజుర్వేదాభిమాని దేవతా సన్నిధిలో వసిస్తాడు. అస్తమయకాలమందు సామవేదాభిమాని దేవతచే పూజింపబడుతున్నాడు. కాన వేదాభిమాని దేవతాయుక్తుడై చరించేవాడు.

**మ.వి.** సకల వేద పర్యవసానస్థానం. 'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః' (భ.గీ.) సమస్త వేదాలచే నేనే తెలియతగినవాడను. యే చ వేదవిదో విప్రా యేచాధ్యాత్మవిదో జనాః, తే వదంతి మహాత్మానం కృష్ణం ధర్మం సనాతనం వేదవేత్తలు, ఆత్మజ్ఞులు, కృష్ణుని ధర్మ స్వరూపునిగా సనాతనునిగా పలుకుతున్నారు. కావున సమస్తవేదవేద్యుడు.

34. ఘన వృష్టిః **గో.వి.** ఈయన వల్ల గొప్పవర్షం కలుగుతుంది. "అగ్నౌ ప్రాస్తాహుతిస్సమ్యగా దిత్య ముపతిష్ఠతే, ఆదిత్యాజ్జాయతే వృష్టిః" విధ్యనుసారం అగ్ని ప్రక్షిప్తపురోడాశాదులాదిత్యుని పొందుతాయి. ఆదిత్యునివల్ల వర్షాలు కలుగుతాయి. కాన ఘనవృష్టి.

**మ.వి.** సకలకర్మఫలమును అధిక వర్షమెవరివలన కలుగునో ఆతడు. 'అహం హి సర్వ యజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ' (భ.గీ.9.24) నేను యజ్ఞభోక్తను. అధిపతిని అని గీతావాక్యం. ఫలమత ఉపపత్తేః, (బ్ర.సూ.3.2.38) ఫలప్రదాత పరమేశ్వరుడని వ్యాసులు ఈసూత్రమందు వచించారు. సర్వఫలప్రదుడు.

35. అపాం మిత్రః **గో.వి.** ఉదకములకు స్నేహితుడు. (వృష్టికారకుడగుట వలన).

**మ.వి.** మహాసముద్రమందు శయనించినవాడు. "యమంతస్సముద్రే వయో వయంతి యదక్షరే పరమే ప్రజాః" (తై.త్తి. ఆ.10-1-) తత్త్వజ్ఞులు (సముద్రం ఉపలక్షణంగా చెప్పబడిన) సమస్త జగత్తునందు గుడ్డయందు తంతువులవలె ఆధారభూతుడై ప్రజలనుత్పాదన చేస్తున్నాడు.

36. వింధ్య వీథీ **గో.వి.** దక్షిణాయనాన వింధ్యపర్వతమే మార్గంగా కలవాడు.

37. ప్లవంగమః **గో.వి.** పడవవలె నడచువాడు.

38 వింధ్యవీథీప్లవంగమః

**మ.వి.** వింధ్యపర్వతమార్గంవలె కష్టసాధ్యమగు సుషుమ్న మార్గమందు త్వరగా ప్రయాణింప చేయువాడు. "స ఏనాన్ బ్రహ్మ గమయతి". (ఛాన్దో.ఉ.4.156). అహంగ్రహోపాసకులను బ్రహ్మలోకానికి చేర్చుతున్నాడు.

39. ఆతపీ **గో.వి.** వేడి కలిగినవాడు.

**మ.వి.** జగన్నిర్మాణసంకల్పవ్యాప్తుడు. "య స జ్ఞానమయం తపః"

40. మండలీ **గో.వి.** వృత్తాకారమగు బింబం కలవాడు.

**మ.వి.** కౌస్తుభాదిమణులు కలవాడు.

41. మృత్యుః **గో.వి.** విరోధుల నివర్తింపజేయువాడు.

**మ.వి.** 'యస్య మృత్యుశ్శరీరః' అను శ్రుత్యనుసారం మృత్యువే శరీరంగా కలవాడు.

42. పింగళః **గో.వి.** ఉదయసమయంలో పింగళవర్ణంతో ఉండువాడు.

**మ.వి.** మహాత్ములకు మూఢులతో దృఢస్నేహం సౌశీల్యమనబడుతుంది. అట్టిసౌశీల్యం కలవాడు.

43. సర్వతాపనః **గో.వి.** అందరినీ మధ్యాహ్నసమయంలో తపింపచేయువాడు.

**మ.వి.** ఒకే పర్యాయం సర్వసంహారకత్వం కలవాడు.

44. కవిః **గో.వి.** వ్యాకరణాది సర్వశాస్త్రప్రవర్తకుడగు పండితుడు.

**మ.వి.** తెలియదగిన సమస్తం తెలిసినవాడు. 'యస్సర్వజ్ఞస్సర్వవిత్' అను శ్రుతి ఈవిషయం చెప్పింది.

45. విశ్వః **గో.వి.** విశ్వనిర్వాహకుడు.

**మ.వి.** విశ్వమే శరీరంగా కలవాడు. "విశ్వమేవేదం పురుషః"(తై.త్తి.ఆ.10.11). అజ్ఞానంవల్ల ప్రపంచంగా భాసించుచున్నదంతా పరమాత్మస్వరూపమే.

46. మహాతేజాః **గో.వి.** గొప్పతేజస్సులు కలిగినవాడు.

**మ.వి.** శత్రువులను పరిభవించు నిరవధికతేజస్సు కలవాడు.

47. రక్తః **గో.వి.** అందరియందనురక్తి కలవాడు.

**మ.వి.** సర్వరంజకుడు.

48. సర్వభవోద్భవః **గో.వి.** సర్వసంసారోత్పత్తికారకుడు.

**మ.వి.** సర్వసంసారోత్పత్తికారకుడు.

49. నక్షత్రగ్రహతారాణామధిపః

**గో.వి.** గ్రహాదులకధిపుడు.

**మ.వి.** నక్షత్రగ్రహతారలకంతర్యామి. 'యశ్చంద్ర తారక మంతరో యమయతి' గ్రహ నక్షత్రాదుల కంతర్యామియై వాటిని నియమించువాడు.

50. విశ్వ భావనః **గో.వి.** ప్రపంచమును స్థాపించువాడు.

**మ.వి.** విశ్వస్థితికి కారకుడు. 'సమస్త ప్రపంచం వాసుదేవుని వీర్యంతో ధరింపబడి ఉన్నది' అని విష్ణుసహస్రనామపీఠికలో చెప్పబడింది.

51. తేజసామపి తేజస్వీ

**గో.వి.** ప్రశస్తతేజస్కుడు.

**మ.వి.** ప్రసిద్ధమయిన తేజస్సు కలవాడు. "యేన సూర్యస్తపతి తేజసేద్ధః" (తై త్తి.బ్రా.3.12.9) ఏ పరమాత్మవల్ల సూర్యుడు తేజోయుక్తుడై తపింపజేస్తున్నాడో ఆతడు సూర్యునకు కూడా సూర్యుడని చెప్పబడింది. 'సూర్యస్యాపి భవేత్సూర్యః'

52. ద్వాదశాత్మా **గో.వి.** 'ఇంద్రః,ధాతా,భగః,పూషా,మిత్రః,వరుణః,అర్యమా,అర్చిః,వివస్వాన్,త్వష్టా, సవితా,విష్ణుః,' అను పన్నెండు స్వరూపాలు కలవాడు. అట్టి వానికి సమస్కారం.

**మ.వి.** పన్నెండుమండలములకంత్వర్తివగు నీకు నమస్కారం.

53. పూర్వాయ గిరయే నమః

**గో.వి.** పూర్వదిక్కులోని పర్వతంద్వారా చూడబడు నీకు నమస్కారం.

**మ.వి.** విష్ణుపురాణం వచించినట్లు ఆయా పర్వతములకంతర్యామియగు పరమాత్మకు నమస్కారం.

54. పశ్చిమే గిరయే నమః

**గో.వి.**పశ్చిమదిక్కులోని పర్వతముద్వారా చూడబడు నీకు నమస్కారం.

55. జోతిర్గణానాం పతయె.

**మ.వి.** ముక్తులకు ప్రభువు. సూర్యపర్యాయనామాలన్నీ తదంతర్వర్తియగు పరమాత్మయందు పర్యవసన్నములగునని తలచిన వాల్మీకి మహర్షి (లేక అగస్త్యుడు) ఇట్లు స్తుతిస్తున్నాడు.

56. దినాధిపతయే. దినమునకు అధిపతియైన

57. జయాయ **గో.వి.** ఉపాసకులకు జయకరుడు.

**మ.వి.** అప్రతిహతపరాక్రముడు. లేక సద్భక్తులు ఈతని వలన సంసారమును జయిస్తారు కాన 'జయః' అని చెప్పబడుతుంది.

58. జయ భద్రాయ **గో.వి.** జయమును, భద్రమును ఇచ్చువాడు.

**మ.వి.**ఉపాసకులకు రోగపాపజయమును, శుభమును ఇచ్చువాడు.

59. హర్యశ్వాయ. **గో.వి.** పచ్చటి గుర్రము కలవాడు. ఆదరాతిశయంవల్ల 'నమో నమః'అని ద్విరుక్తి చేయబడింది.

**మ.వి.** హరియగు ఆంజనేయుడు వాహనంగా కలవాడు. ఇందు రామావతారం సూచింపబడింది.

60. సహస్రాంశో. **మ.వి.** వేల మంది జీవులు కలవాడు. 'మమైవాంశో జీవలోకే జీవభూతః' (భ.గీ)

61. ఆదిత్యాయ. సూర్యుడు

62. ఉగ్రాయ **గో.వి.** ఉపాసకులు కాని వారికి ఉగ్రుడు.

**మ.వి.** ఉపాసకులు కాని వారికి ఉగ్రుడు.

63. వీరాయ. **గో.వి.** అనేకులను ప్రేరేపించువాడు కావున వీరుడు.

**మ.వి.** వివిధ ప్రాణులను ప్రేరేపించువాడు.

64. సారంగాయ. **గో.వి.** శీఘ్రంగా ప్రయాణించువాడు. 11/2 నిమేషసమయంలో రెండువేల యోజనాలు. (16000,మైళ్ళు) ప్రయాణించునని పురాణ ప్రసిద్ధి కలదు.
**మ.వి.** శీఘ్రగమనం కలవాడు. లేక సారగ్రాహి, లేక హంసావతారుడు. లేక ప్రణవ ప్రతిపాద్యుడు కాన 'సారంగః'

65. పద్మ ప్రబోధాయ. పద్మములను వికసింపజేయువాడు

66. మార్తాండాయ. సూర్యుడు

67. బ్రహ్మేశానాచ్యుతేశాయ.

**గో.వి.** సృష్టిస్థితిసంహారకర్తలకు గూడ ఈశ్వరుడు. అనగా బ్రహ్మస్వరూపుడు. "అసావాదిత్యో బ్రహ్మ" (తై.త్తి.ఆ.2.2) ఆదిత్యుడుగా కనిపించే ఈతడే పరబ్రహ్మం–లేక బ్రహ్మకు, ఈశ్వరునకు, చ్యుతిలేని పరిపాలకుడు. వేదాలను అపహరించుట మొదలగు లోక పీడా కారులగు రాక్షసుల నశింపచేయుట ద్వారా లోకపీడను తొలగించిన ఫలప్రదాత– "బ్రహ్మేశాయాచ్యుతేశాయ" అను పాఠాంతరానికి కూడా ఇదే సమన్వయం.

**మ.వి.** త్రిమూర్తులకు కూడా స్వామి. 'సృష్టి స్థిత్యంతకరణీం బ్రహ్మవిష్ణుశివాత్మికాం, సంజ్ఞాం స యాతి భగవానేక ఏవ జనార్దనః' అను స్మృతి ఈ విషయం చెప్పింది.

68. సూర్యాయ. సూర్యుడు

69. ఆదిత్య వర్చసే. **గో.వి.** ఆదిత్యదీప్తికలవాడు.

70. భాస్వతే – **గో.వి.** ప్రకాశం కలవాడు.

71. సర్వభక్షాయ. **గో.వి.** అందరిని సంహరించువాడు

**మ.వి.** సర్వ యజ్ఞ భోక్త. లేక సర్వలయకారకుడు "యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః" (కఠ.ఉ. 2–25).

72. రౌద్రాయ వపుషే **గో.వి.** లయసమయంలో రుద్రుని రూపం ధరించినవాడు.

73. తమోఘ్నాయ **గో.వి.** అంధకారం తొలగించువాడు.

74. హిమఘ్నాయ. మంచును తొలగించువాడు

75. శత్రుఘ్నాయ **గో.వి.** ఆశ్రితుల శత్రువులను చంపువాడు.

**మ.వి.** శత్రుసంహర్త, లేక నిగ్రహింపబడిన ఇంద్రియములు కలవాడు.

76. అమితాత్మనే. **గో.వి.** అపరిచ్ఛిన్న స్వరూపం కలవాడు.

**మ.వి.** అపరిమితమహిమాన్వితుడు.

77. కృతఘ్నఘ్నాయ **గో.వి.** ఉపకారం మరచు వానిని నాశనమొనర్చువాడు.

**మ.వి.** ఉపకారం మరచువానిని నాశనమొనర్చువాడు.

78. దేవాయ. **గో.వి.** ప్రకాశించువాడు.

79. జ్యోతిషాంపతయే. **మ.వి.** స్వయంప్రకాశంకలవాడు.

80. తప్తచామీకరాభాయ. **గో.వి.** హిరణ్యశరీరుడు.

**మ.వి.** హిరణ్యశరీరుడు.

81. వహ్నయే **గో.వి.** అగ్నిస్వరూపుడగు హవ్యవాహనుడు.

**మ.వి.** పవిత్రతను కలిగించువాడు. 'హరయే' పాఠాంతరం. అజ్ఞానం హరించువాడు.

82. విశ్వ కర్మణే **గో.వి.** జగత్సృష్టి కర్తవ్యంగా కలవాడు.

**మ.వి.** జగత్సృష్టి "సర్వకర్మా సర్వకామః" (ఛాన్దో.ఉ. 3.14.2) సమస్తసృష్టియే కర్మగా కలవాడు.

83. తమోఽభినిఘ్నాయ. చీకటిని తొలగించువాడు

84. రుచయే. **మ.వి.** ప్రకాశించువాడు. "ఘృణయే" పాఠాంతరం. స్వయంప్రకాశమానుడు.

85. లోకసాక్షిణే. **గో.వి.** జనులకంతర్యామిగా వర్తిస్తూ వారనుష్ఠించు సుకృతదుష్కృతములకు సాక్షిగా ఉన్నవాడు. ఇట్లాదిత్యహృదయమునుపదేశించి ఆ ఆదిత్యుని తిరిగి స్తుతిస్తున్నాడు.

**మ.వి.** సర్వసాక్షీ. 'సర్వ దేవాత్మకోఽహ్యేషః' మొదలు (ఆదిత్యః నుండి. 'లోక సాక్షిణే' వరకు కల 82 నామాలు కాక. ప్రారంభంలో కల'సర్వదేవాత్మకః' 'తేజస్వీ' 'రశ్మిభావనః' 'ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభిః', 'ఏష బ్రహ్మా', 'విష్ణుః', 'శివః', 'స్కందః', 'ప్రజాపతిః' 'మహేంద్రః', 'ధనదః', 'కాలః', 'యమః', 'సోమః', 'అపాంపతిః', 'పితరః', 'వసవః', 'సాధ్యాః', 'అశ్వినౌ', 'మరుతః', 'మనుః', 'వాయుః', 'వహ్నిః', 'ప్రజాప్రాణః', 'ఋతు కర్తా', 'ప్రభాకరః' అను 26. నామాలు కలుపుకొని) ఇంత వరకు 108 నామమంత్రాలుగా తెలుసుకోవాలి.

మహాప్రళయమందీ ఆదిత్యుడే జగత్తును నాశనం చేస్తున్నాడు, అతడే తిరిగి సృజిస్తున్నాడు, పరిపాలిస్తున్నాడు. ఇతడే శోషింపజేస్తున్నాడు. తపింపజేస్తున్నాడు. కిరణాలద్వారా వర్షిస్తున్నాడు. గాఢనిద్రా (సుషుప్తి) కాలమందు అంతర్యామిగా జాగరూకుడై ఉంటున్నాడు. యజ్ఞాద్యనుష్ఠాతలకు ఇతడే అగ్ని, కర్మ జన్య ఫల స్వరూపుడితడే.

ఇతడే వేదస్వరూపుడు, క్రతుస్వరూపుడు. ఫలస్వరూపుడు లౌకిక కర్మల యొక్క ఫలముల నిచ్చువాడీతడే. సర్వాత్మకుడగు రవియే నియంత.

ఓ రామా! ఈ విధంగా కష్టాలలోను, దుర్గమప్రదేశాలలోను, భయకారణాలు సంభవించినపుడు ఎవరయిననూ ఆదిత్య భగవానుని స్తుతించిన ఆతడు నాశమందదు. దేవదేవుడు, జగత్పతి యగు ఈతనిని పూజించు. మూడు పర్యాయాలు ఈ ఆదిత్యహృదయాన్ని జపించి విజయమందగలవు. రావణుని వధింపగలవు. అని చెప్పి అగస్త్యుడు వెళ్లాడు.

అపుడు శ్రీరాముడాచమించి ఆదిత్యుని చూచి ఆదిత్యహృదయం జపించి దైన్యం వదలి ధనుర్ధారియై రావణుని చూచి సర్వప్రయత్నాలతో ఆతనిని వధింప నిశ్చయించుకుని యుద్ధం కొరకు బయలుదేరాడు. అపుడు ఆదిత్యమండలంనుండి యుద్ధసందర్శనార్థం వచ్చి ఆకాశగతుడగు సూర్యనారాయణుడు శ్రీరామునిచే పఠింపబడిన ఆదిత్యహృదయస్తోత్రం విని పులకించి రాక్షసరాజమరణసమయమిది యని గుర్తించి శ్రీరాముని చూచి 'రావణుని త్వరగా వధింపు'మని పలికాడు.

**గో.వి.** మరి రావణవధానంతరం బ్రహ్మరుద్రాదులందరూ ఏకవాక్యంగా 'భవాన్నారాయణో దేవః' ఇత్యాదిగ విష్ణువును గొప్ప దైవమని ప్రతిపాదింపబోతున్నారు కదా? ఇట సూర్యునికే సర్వోత్తమత్వం ఎట్లు ప్రతిపాదింపబడింది? ఈ రెండూ పరస్పరవిరుద్ధాలు కావా? సమన్వయమెట్లన (ఛాన్దో.ఉ. 3-1-11) మధువిద్యాప్రసంగంలో ఆదిత్యుడు పరమాత్మగా ప్రతిపాదింపబడినా బాదరాయణులవారు 'మధ్వాదిష్వసంభవాద నధికారం జైమినిః' (బ్ర.సూ. 1.3.31) అను సూత్రంలో ఆదిత్యమండలాంతర్వర్తి యగు పరమాత్మయే చెప్పబడినట్లు చెప్పారు. కనుక ఇటగూడ ఆదిత్యమండలాంతర్వర్తియగు పరమాత్మనే ప్రతిపాదించుట జరిగింది. ఈ స్తోత్రం సంపూర్ణంగా నారాయణపరమని నిరూపించాము. త్రిమూర్తులకతీతుడగు పరమాత్మనే ప్రతిపాదించుట జరిగింది. అయితే ఈ సర్గ కొన్ని గ్రంథాలలో కానుపించుట లేదు. 'ఉదారి' వ్యాఖ్యానించి యుండలేదు. రామాయణ ప్రారంభమునుండి గ్రంథమంతా నారాయణపరంగా ఉంటుండగా కాండ మందు 130.సర్గలు మాత్రమే లెక్కింపబడినాయి. ఆతడీసర్గను కూడా ప్రమాణంగా భావించినచో 131 సర్గలుగ లెక్కించెడివాడు.

ఈ ఆదిత్యహృదయస్తోత్రానికి మహేశ్వరతీర్థులతోపాటు గోవిందరాజులు గూడ వ్యాఖ్యానించారు. కాన వారి దృష్టిలో కూడా ఆదిత్యహృదయం రామాయణాంతర్గతమే. 'ఉదారి' అను వ్యాఖ్యాత ఇది ప్రక్షిప్తమని తలచుట శిష్టజనులకు అనభీష్ట విషయమగుట చేతను, ఆ సేతు సీతాచల పర్యంతం రామభక్తపరిగృహీతమగుటచే 'ఉదారి' భావమప్రమాణికమని తోస్తున్నది.

## నూటయెనిమిదవ సర్గము

వర్షించే మేఘంవలె బాణాలను వర్షిస్తున్న రావణరథం రావడం చూచిన రాముడు బాలచంద్రాకారంగా ధనువును వంచి భయంకరధ్వనికలుగునట్లు ధనుష్టంకారం చేశాడు. మాతలితో ఇట్లన్నాడు. 'ఈ రావణుడు మహావేగంగా అపసవ్యంగా తనచావు కొరకు వస్తున్నాడు. (అపసవ్యంగా వచ్చుట వినాశహేతువు) కాన నీవు సవ్య

మార్గంలో అసంభ్రాంతుడవై సావధానంగా భయరహితుడవై రథాన్ని వేగంగా నడుపు. ఇంద్ర సారథివగు నీకీవిధంగా ఉపదేశించుట తగదు. నేనేకాగ్రదృష్టితో యుద్ధం చేయతలచి నీకీ విషయాలను గుర్తు చేస్తున్నాననే కాని ఉపదేశించుట లేదు.' ఇట్టి రామవాక్యాలు వినిన మాతలి సంతోషం పొంది రావణరథం ఎడమ వైపు వచ్చునట్లుగా తన రథాన్ని ప్రదక్షిణంగా తోలుచూ రథచక్రోత్థితమగు దుమ్ముతో రావణుని చలింప జేశాడు. అభిముఖుడగు రామునిపై రావణుడు బాణప్రయోగం చేశాడు. ఇంద్రధనువును, సూర్యకిరణతుల్యబాణాలను రాముడు గ్రహించాడు. పరస్పరవధకాంక్షులు, పరస్పరాభిముఖులగు వారుభయులకు గొప్ప యుద్ధం నడచింది. దేవగంధర్వసిద్ధులు రావణవధ నాకాంక్షిస్తూ ఆకాశమందు నిలచి చూస్తూ ఉన్నారు. రావణుని వినాశం సూచించే ఉత్పాతాలు పుట్టినాయి. రావణరథంపై రక్తం వర్షించింది. సుడిగాలు అపసవ్యంగా తిరిగినాయి. రావణుని రథం ఎటు చరించినా అటు గ్రద్దలగుంపు ఆకాశంలో తిరుగసాగింది. (శకునార్ణవంలో, మృత్యువాసన్నమైనచోట శిరస్సుపై, గృహముపై గ్రద్దలు చరించును అని చెప్పబడింది.) లంకానగరమంతా రక్తసంధ్యావృతమైంది. లంకానగరోపాంత భూమి రాత్రి యందు మంటలతో జ్వలించినట్లు పగలు కూడా ఎఱ్ఱబారింది. రావణప్రతికూలంగా ఉల్కలు ఆకాశంనుండి పడినాయి. రావణుడున్న చోట భూమి కంపించింది. వీటిని చూచి విషాద మందిన సైనికుల బాహువులు బంధింప బడినట్లు కదలలేదు. నక్కలు, గ్రద్దలతో కలసి రావణునికి ఎదురుగా అమంగళకరంగా అరచాయి. ఉరుములు లేకయే పిడుగులు, ఉల్కలు రాక్షససైన్యంపై పడినాయి.

**గో.వి.** మిహిరుడిట్లు ఉల్కాలక్షణాలు చెప్పినాడు. 'ఉల్కయొక్క శిరస్సు విశాలంగా ఉండి చివర సన్నగా ఉండి క్రిందపడే సమయాన వృద్ధి పొందుతుంది. పిడుగువలె గొప్పశబ్దంతో గజ మానవ అశ్వ వృక్ష పశువులమీద పడి భూమిని చీల్చుకొని పోతుంది'.

దిక్కులలో చీకట్లు క్రమ్మినాయి. దుమ్మువల్ల ఆకాశ మందేమీ కనిపించ లేదు. రావణరథాశ్వాలు వెనుక భాగంనుండి నిప్పులను, నేత్రములనుండి నీరును వదలినాయి. ఇట్టి భయంకరోత్పాతాలను చూచిన రాముడు రావణుడు హతుడైనట్లు తలచి హర్షపులకితుడయ్యాడు.

## నూటతొమ్మిదవ సర్గము

పిమ్మట సమస్తలోకభయావహమగు యుద్ధం ప్రారంభింపబడింది. ఆయుధధారులైన వానర-రాక్షస సైనికులు మహావిస్మయంతో రామరావణయుద్ధాన్ని చూస్తూ పరస్పరం యుద్ధం చేయకుండినారు. దుశ్శకునాలను గుర్తించిన రావణుడు మరణమును, శుభశకునాలను గుర్తించిన రాముడు జయమును నిశ్చయించుకొని తమకు కల యుద్ధ ప్రావీణ్యాన్ని అపుడు ప్రదర్శించారు.

రావణుడు రాముని రథధ్వజమును ఛేదింపప్రయత్నించి అశక్తుడయ్యాడు. రావణధ్వజమును రాముడు ఛేదించాడు. రావణుడు రామరథాశ్వాలపై శరప్రయోగం చేసినా వాటిని బాధించ లేకపోయాడు. రావణుడు గదా పరిఘ శూలాద్యాయుధాలను రామునిపై ప్రయోగింప అవి సఫలాలు కాక రాముని వదలి పార్శ్వస్థ సైనికులపై పడినాయి. నిరుత్సాహపడకుండా రావణుడు లక్ష్యరహితంగా ఆకాశంలో సందులేనట్లు బాణప్రయోగం చేశాడు.

రాముడనాయాసంగా శతసహస్రములుగా బాణాలను రావణునిపై ప్రయోగించాడు. పరస్పర ప్రయుక్త బాణము లొండొంటిని దాకి క్రిందబడినాయి. వారు పరస్పరం రథాశ్వాలను ప్రహరించుకొన్నారు.

## నూటపదవ సర్గము

రామరావణయుద్ధాన్ని సర్వభూతాలు విస్మయంతో వీక్షించాయి. మహారథికులగు వారి రథాలు విచిత్ర గమనాలతో పరస్పరం పీడించుకొంటూ మండలాకారంగా పరిభ్రమిస్తూ సారథుల చాకచక్యం వల్ల ఘోరరూపం పొందినాయి. బాణవర్షం కురిపించే ఆ రామరావణులు జలధారలను విడిచే మేఘాల వలె కనిపించారు. తన రథమునకడ్డుగా ఉన్న రావణరథాశ్వాలను రాముడు బాణంతో నొప్పించి వాటిని మార్గంనుండి తొలగజేశాడు. అందులకాగ్రహించిన రావణుడు రామునిపై, మాతలిపై, ఇంద్రరథాశ్వాలపై బాణాలు ప్రయోగించికూడా వారిని నొప్పించలేక పోయాడు. మాతలిపై బాణప్రయోగంచేసినందుకు ఆగ్రహించిన రాఘవుడు శరపాతంతో రావణుని యుద్ధవిముఖుని చేశాడు. రథస్థుడగు రావణుడు గదాముసలాలను రామునిపై ప్రయోగించాడు. ఆయుధ ప్రయోగజన్యమగు మహాధ్వనివలన సముద్రాలు క్షోభించాయి. భూమి కంపించింది. వాయువు స్తంభించింది. సూర్యుడు తేజోహీనుడయ్యాడు. అపుడు దేవగంధర్వసిద్ధాదులు బాధపడి 'గోబ్రాహ్మణులకు మంచిజరుగుగాక, లోకాలు శాశ్వతంగా ఉండుగాక, శ్రీరాముడు జయించుగాక' అని జపించారు. రోమాంచం కలిగించే సాటిలేని రామరామణయుద్ధాన్ని వీక్షిస్తున్న గంధర్వులు, అప్సరసలు "ఆకాశం ఆకాశం వంటిదే, సముద్రం సముద్రం వంటిదే, రామరావణయుద్ధం రామరావణయుద్ధం వంటిదే" నని పలికారు.

**వ్యా.వి.** ఆకాశానికి, సముద్రానికి ఉపమానాలు లేనందున వాడిన వాటితో ఎట్లు పోల్చుకుంటామో! అట్లే రామ రావణ యుద్ధానికి కూడా పోల్చదగిన యుద్ధాంతరం లేనందున రామరావణయుద్ధమే ఉపమానం, ఉపమేయం కూడా అయినాయి. కావున ఇది అనన్వయాలంకారం.

అపుడు మహాక్రోధమందిన రాముడు మంగలికత్తివంటిములికికలిగిన తీవ్రబాణంతో రావణశిరమును ఖండించాడు. ఛేదింపబడి నేలపడిన రావణశిరమును మూడు లోకాలూ చూచినాయి. అట్టిదే మరొక శిరము రావణునకు ఉద్భవించింది. రాముడు దానిని కూడా ఖండించాడు. తిరిగి మరొక శిరముద్భవించింది. ఈ విధంగా 101 శిరములు ఖండింపబడినా రావణుడు మరణించలేదు.

**గో.వి.** ఇచట 'అచ్ఛినత్' అని ఏక వచనం ప్రయోగింపబడినందున ఒకే శిరస్సు కల రావణుడు యుద్ధం చేసెనని తెలుస్తున్నది. అందువల్లనే ముందు "దీర్ఘౌ నిశ్చేష్టౌ భుజావంగదభూషితౌ" అని చెప్పబోవుతున్నారు. కావున ద్వివచనస్వారస్యంతో రెండు భుజములున్నట్లు వర్ణితమగుటచే ఒకే శిరస్సు కలిగినట్లు చెప్పుకోవాలి.

**మ.వి.** ఇట మూలంలో "శిరః" అనుటను జాత్యేకవచనంగా భావించి శిరములను ఖండించెనని అర్థము చెప్పుకోవాలి. లోగా రావణవర్ణనలో 'పది తలలు ఇరువది చేతులతో ధనువును, బాణాలను ధరించిన రావణుడు మైనాకపర్వతంవలె ఉండె' నని వర్ణించుటచే అట్టి రావణుడే యుద్ధం చేస్తున్నాడు. గాన 'శిరః' అన్న చోట్ల శిరములు–అని అర్థం. లేక ప్రధానశిరమని గాని అర్థం చెప్పుకోవచ్చు.

అపుడు సమస్తాస్త్రాలను ఎరిగిన మహావీరుడగు రాముడిట్లు చింతించాడు. 'మారీచుడు, ఖరదూషణులు, విరాధకబంధులు ఏ బాణంతో వధింపబడినారో! యుద్ధంలో విశ్వసింపతగిన ఆ బాణం ఈ రావణుని విషయంలో శక్తిహీనులగుటకు కారణమేమి?' ఇట్లాలోచిస్తూ రావణునితో అంతరిక్షంలో, భూమిపైన, త్రికూటశిఖరమందు, అతి తీవ్రమగు యుద్ధం చేశాడు. ఇట్లు యుద్ధప్రారంభం నుండి 7 రోజులు రేయింబవళ్లు యుద్ధం జరిగింది. పగలు, రాత్రి విరామం లేకుండా రామరావణయుద్ధం జరిగింది. రామునకు యుద్ధమందు జయం కలుగకుండుటను గుర్తించిన ఇంద్రసారథియగు మాతలి రామునితో ఇట్లన్నాడు.

## నూటపదకొండవ సర్గము

ఏమీ తెలియని వానివలె ఈ రావణునిపై శస్త్రాస్త్రప్రయోగం చేస్తున్నావేమి? దేవతలు చెప్పిన రావణ సంహారకాలం ఆసన్నమైంది. కావున వీనిని సంహరించుటకు బ్రహ్మాస్త్ర ప్రయోగం చేయుమని మాతలి రామునకు గుర్తు చేశాడు. అపుడు మాతలివాక్యప్రేరితుడైన రాముడు ప్రథమంగా బ్రహ్మచే ఇంద్రున కివ్వబడినట్టిది, అగస్త్యభగవానునిచే తన కివ్వబడినట్టిది, అమోఘమైనట్టిది, యమతుల్యమగునట్టిది, సమస్తవానరసంతోషకారకమై నట్టిది, రాక్షసవినాశకరమైనట్టిది అగు గొప్పబాణాన్ని వేదవిధిననుసరించి బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించి ధనువున సంధించి ఆకర్ణాంతం నారి త్రాటిని గుంజి రావణుని వక్షంపై ప్రయోగించాడు. ఆ బ్రహ్మాస్త్రం రావణుని హృదయాన్ని చీల్చి ఆతని ప్రాణాలను అపహరించి రక్తసిక్తమగు ఆ బాణం వినయవంతుని వలె తిరిగి రాముని అమ్ములపొదిలో చేరింది. మృతుడైన రావణుని హస్తంనుండి ధనువు క్రింద పడింది. వజ్రహతుడగు వృత్రునివలె మహాతేజస్వియగు రావణుడు రథమునుండి క్రిందపడినాడు. హతశేషులగు రాక్షసులు దిక్కుల పోయారు. వానరులుత్సాహంతో సింహనాదం చేస్తూ రాక్షసులను తరిమారు. నిరాశ్రయులు, అనాథలగు రాక్షసులు కనులవెంటనీరుకార భయంతో లంక కేగారు. శ్రీరామవిజయాన్ని, రావణవధను, వానరులు బిగ్గరగా చాటినారు. దేవతలు దుందుభులు మ్రోగించారు. సుగంధపరిమిళితవాయువు వీచింది. ఆకసంనుండి పుష్పవృష్టి కురిసింది. సర్వలోకభయంకరుడగు రావణుడు నిహతుడు కాగా దేవతలు సాధువాదమొనర్చినారు. దిక్కులు ప్రసన్నములయ్యాయి. ఆకాశం నిర్మలంగా భాసించింది. సూర్యుడు మంచి వెలుగుతో ప్రకాశించాడు. లక్ష్మణసుగ్రీవ విభీషణాదులు విజయోత్సాహంతో రాముని పూజించారు. శత్రుసంహార మొనర్చి ప్రతిజ్ఞను నెరవేర్చుకొనిన రాముడు దేవతలమధ్య ఇంద్రునివలె సుగ్రీవాదుల మధ్య ప్రకాశించాడు.

**వ్యా.వి.** ఫాల్గుణామావాస్యయందు లేక ప్రతిపద్యుక్తామావాస్య యందు రావణవధ జరిగింది.

## నూటపన్నెండవ సర్గము

రామునిచే హతుడై క్రిందపడియున్న అన్నయగు రావణుని చూచిన విభీషణుడు శోకావృతుడై ఇట్లన్నాడు.

**గో.వి.** అన్నగారు హతుడగుటను చూచుటవలన హఠాత్తుగ వచ్చినట్టి ప్రాకృతశోకాన్ని సహించలేని విభీషణుడు దుఃఖిస్తున్నాడు.

ఓ వీరా! విఖ్యాత పరాక్రముడవు, విద్యాసుశిక్షితుడవు, మహాతల్పములమీద శయనింపతగిన నీవు ఇపుడు అంగదములతో అలంకృతములు, చలనరహితములు, దీర్ఘములు అగు రెండు బాహువులుచాచి సూర్యప్రకాశం కల కిరీటం రథపతనకారణంగా స్థానభ్రంశమంది ఉండగా మరణించి నేలపై శయనించితివేమి?

**గో.వి.** 'భుజౌ' అను ద్వివచనస్వారస్యముననుసరించి అంతిమయుద్ధంలో రావణుడు ద్విభుజుడుగా ఉండెనని తెలుస్తున్నది.

నేను ముందు చెప్పినదే ప్రాప్తించింది. కామవశుండవగుటవల్ల నామాట నీకు రుచించలేదు. గర్వంతో ఇంద్రజిదాదులతో నీవు లెక్క చేయక చేసిన సీతాపహరణరూపపాపకర్మకు ఫలితమిపుడు వచ్చింది. సమస్తనీతిజ్ఞుడు గతించాడు. అధర్మస్వరూపుడు గతించాడు. ధర్మస్వరూపుడు గతించాడు.

**వ్యా.వి.** ఇతడాహితాగ్ని, మహాతపస్వి అని చెప్పబడినందున 'గతో ధర్మస్య విగ్రహః' అన్నచో ఉభయార్థముల కవకాశం ఉంది. బలాధికుడు, స్తుతింపదగినవాడు లేడు. ఆయుధధారులలో శ్రేష్ఠుడగు రావణుడు పడిపోగా సూర్యుడు క్రిందపడినట్లు, చంద్రుడు చీకటిలో మునిగినట్లు, అగ్ని చల్లారినట్లు అయింది. ఉత్సాహశక్తికి ఆశ్రయం లేకుండా పోయింది. ఇతడిలా దుమ్మునపడి నిద్రబోవుచున్నట్లుండగా లోకమంతా శూన్యమయినట్లయింది. ధైర్యమే చిగురుటాకులుగా, సాహసమే పుష్పంగా, తపమే బలంగా, శౌర్యమే వేరుగా గల రావణుడను మహావృక్షం రాముడను పెనుగాలిచే మర్దింపబడింది. పరాక్రమమే దంతాలుగా, పితృపితామహవంశమే వీపుగా కలిగి కోపమే శిరోవ్యతిరిక్తదేహంగా ఈవియే తొండంగా కలిగి రాముడను సింహంచేత గ్రహింపబడిన శరీరం కల రావణుడను మదగజం భూమిమీద నిద్రిస్తున్నది. పరాక్రమోత్సాహాలనే జ్వాలలు కలిగి నిశ్వాసమనే ధూమం కలిగి, తన బలం అనే వేడి కలిగిన రాక్షసాగ్ని యుద్ధంలో రాముడనే మేఘంచే చల్లార్చబడింది. రాక్షసులనెడి తోకలు, మూపురాలు, కొమ్ములు కలిగి విషయలౌల్యమనెడి నేత్రాలు, చెవులు కలిగిన శత్రుసంహారి, గర్వమున మత్త గజతుల్యుడును అగు రావణుడను ఆబోతు రాముడను పెద్ద పులిచే వధింపబడింది ఇట్లు యుక్తి యుక్తములు, యథార్థములు అగు విభీషణవిలాపవాక్యాలను వినిన రాముడాతనిని ఇట్లాశ్వాసించాడు.

ఈతడు పరాక్రమింపక వ్యర్థంగా మరణించలేదు. యుద్ధమందీతడు భయంకరపరాక్రముడు, మహోత్సాహిగా యుద్ధంలో మరణించాడు. ఇట్లు పరాక్రమించినట్టి వీరస్వర్గాభిలాషులు వీరమరణం అందినపుడు వారినిగూర్చి శోకింపకూడదు. ఇతడి వలన ఇంద్రాది దేవతలు, త్రిలోకాలు, యుద్ధంలో భయమందినారు. అట్టివాడు కాలగతుడయినపుడు విచారించకూడదు. జయమందినపుడు వలె పరాజయసమయంలో కూడా విచారించకూడదు. విజయమెపుడూ ఒకనినే ఆశ్రయించి ఉండదు.

ఇతఃపూర్వమెపుడూ అట్లు జరుగలేదు. వీరుడు యుద్ధంలో ఇతరులను సంహరిస్తాడు. లేక తానే సంహరింపబడతాడు. ఇది శూరమార్గం కావున శోకింపవలదు. పుట్టిన వాడు గిట్టక తప్పదు, కావున యథార్థాన్ని గుర్తించి శోకం విడచి అనంతరకర్తవ్యాన్ని ఆలోచించు.

అపుడు శోకతప్తుడగు విభీషణుడు రామునితో ఇట్లన్నాడు. 'ఇతఃపూర్వమెపుడూ యుద్ధపరాజయ మందని ఇతడు నీచే భంగపడినాడు. ఇతడనేక దానాలు చేసినాడు. గురుదైవములను పూజించినాడు, భోగముల ననుభవించినాడు. భృత్యుల పోషించినాడు, మిత్రులను ధనంతో సమ్మానించినాడు. శత్రువులను రూపుమాపినాడు. ఇతడాహితాగ్ని, గొప్పతపస్వి, వేదాంతజ్ఞుడు కర్మశూరుడు. రామా! నీయాజ్ఞ అయినచో ఇతనికి ప్రేతకార్యం చేయాలనుకొంటున్నాను' ఈ విధంగా దుఃఖాతిశయంతో విభీషణుడు పలుకగా రావణునకు స్వర్గప్రాప్తికరమగు అంత్యేష్టి నొనర్పుమని శ్రీరాముడన్నాడు. 'శత్రుత్వమునకు చావే అవధి. మన ప్రయోజనం నెరవేరింది. ఈతడు నీకెట్లో నాకునూ అట్లే. ఇతనికి అపరసంస్కారాలను నిర్వహించు'

**గో.వి.** శత్రుత్వముండుటవలన రావణునకు అపరసంస్కార విషయం తనకనభీష్టమని భావింపకుండుటకు ఇట్లంటున్నాడు. మరణానంతర వైరం వల్ల ప్రయోజనముండదు. సీత లభించినది కావున మన ప్రయోజనం నెరవేరింది. ఆహితాగ్నియగు ఇతనికనుగుణమగు అపరసంస్కారం నిర్వర్తించు. నాకు సోదరతుల్యుడవగు నీకు ఇతడు సోదరుడు కావున నాకునూ సోదరుడే. ఇతనికి కల దోషాలను దృష్టి యందుంచుకుని నీవు ఇతనికి సంస్కారాలు చేయనిచో నేనయినా చేస్తాను. ఇచట ఆచార్యుల వారిట్లు వ్యాఖ్యానించారు. 'మరణాంతాని వైరాణి' సీతాపహరణ జటాయువధాదికాలు ఇంక ఇతడు చేయజాలడు కద? 'నివృత్తం నః ప్రయోజనం' 'రావణుడే స్వయంగా వచ్చి శరణువేడినా ఆతనికి గూడ అభయమిత్తున' నిన రాముడు రావణుని విషయంలో కొద్ది మంచినయినా చేయాలని తలచినాడు. కాని రావణుడు 'నేను రెండు భాగాలుగా ఖండింపబడినా సీతను విడువన'ని పలికి రామునికి ఆ ఆలోచనకు కూడా అవకాశమివ్వలేదు. రావణునకేదోవిధంగా శుభమొనర్ప తలచిన రామున కిపుడు అవకాశం కలిగి 'ఇతనికి సంస్కారం చేయు'మని చెప్పాడు. ఇకముందు ఏది చేయతగినదో దానిని చేయాలి. ఈతడు నీకు సోదరుడగుట నాకు గూడ అట్టివాడే, కావున నీవు అపరసంస్కారం చేయనిచో నేనయినా చేతునని రాముని భావం.

## నూటపదమూడవ సర్గము

రావణుని భార్యలు నివారించినా నిలువక దుఃఖిస్తూ యుద్ధభూమికి వచ్చి వెదకి గుర్తించి కుప్పకూలి ఆతని మీదపడి దుఃఖించారు. అక్షరరహితంగా కొలదిసేపు దుఃఖించి పిమ్మట కింది మాటలు పలుకుతూ ఇలా విలపించిరి.

'అష్ట దిక్పాలకులను భయపరచిన ఇతడు పదాతియగు రామునిచే చంపబడినాడు' మరల ఇలా విలపించారు. నీ హితం కోరువారి మాటవినక నీ మరణం కొరకు సీతను తెచ్చితివి. అందరం ఒకే పర్యాయం చంపబడినాము. విభీషణుడు చెప్పిన హితమును విని సీతనానాడు రామునకు ప్రత్యర్పణ చేసి ఉంటే సర్వనాశకమగు ఇట్టి వ్యసనం సంభవించెడిది కాదు. రామవిభీషణులు మిత్రులై ఉండడం, మేము విధవలం కావడం, దేవతలు సఫలమనోరథులు కావడం సంభవించెడివి కావు.

**వ్యా.వి.** ఇంతవరకు రావణుడు స్వేచ్ఛాచారియగుట వలన ఇంతటి యనర్థం సంభవించిందని చెప్పి దానిని ఖండిస్తూ దైవమే అన్నిటికీ కారణమంటున్నారు.

అయితే నీ విట్లు స్వేచ్ఛగా ప్రవర్తించుటలో నీకు స్వేచ్ఛ లేదు. ఇందుకు గూడ దైవమే కారణం. దైవముచే చంపబడిన వానినే ఇతరుడు చంపగలడు. వానర, రాక్షసులు, నీవు, యుద్ధమరణం పొందడం దైవ సంకల్పాను సారంగా జరిగింది. దైవసంకల్పవ్యతిరేకంగా అర్థ పరాక్రమాలు, రాజాజ్ఞ ఇవి ఏవీ పని చేయవు. ఈ విధంగా ఆడుక్రౌంచపక్షులవలె దీనలగు రావణస్త్రీలు దుఃఖించారు.

## నూటపద్నాల్గవ సర్గము

రావణుని భార్యలలో జ్యేష్ఠురాలు, అత్యంతప్రియురాలగు మండోదరి ఇట్లు విలపించింది.

**గో.వి.** శ్రేష్ఠమగు ఉదరం కలది కావున మండోదరి. సుందరమైన సన్నమగు ఉదర భాగం కలది. సామాన్యంగా వీరపత్ని శ్లాఘ్యమగు యుద్ధమరణమందిన భర్తను గూర్చి విచారించకూడదు. కాని తనకు సరిజోడి కాని మనుష్యమాత్రునిచే మరణం లజ్జాకారణమని విలపిస్తున్నది.

మహాభాగా! నీవు సమస్త దేవతలను జయించి ఉండి మనుష్యమాత్రుడగు రామునిచే జయింపబడినందులకు సిగ్గుచెందుటలేదేమి! మానవులు ప్రవేశింపలేని చోట కామరూపుడవగు నిన్ను రాముడు చంపుట నమ్మ వీలు కావడం లేదు. ఖరాదులే కాకియగు రామునిచే సంహరింపబడుట, రామదూత హనుమానుడు లంకలో ప్రవేశించుట, వానరులు సేతునిర్మాణం చేయుట, ఇవన్నీ రాముడు మానవుడు కాదు, దేవుడని భావించాను. లేక యముడే రామరూపంతో అత్యంత సుందరియగు సీతను తయారుచేసి వచ్చెనా? లేక ఇంద్రుడే రామరూపాన మహాబలుడవగు నిన్ను సంహరించి ఉండును. అది సరి కాదు. దేవేంద్రునికి యుద్ధంలో నిన్ను చూచు శక్తి ఎక్కడిది?

**వ్యక్తమేష మహాయోగీ పరమాత్మా సనాతనః ।**
**అనాదిమధ్యనిధనో మహతః పరమో మహాన్ ॥**

**తమసః పరమో ధాతా శంఖచక్రగదాధరః ।**
**శ్రీవత్సవక్షా నిత్యశ్రీరజయ్యశ్శాశ్వతో ధ్రువః ॥**

**గో.వి.** ఇంతవరకు రాముడు దేవుడని సామాన్యంగా వచించి ఇపుడు మహాయోగిత్వాదిగుణవిశిష్టుడగు విష్ణువే రాముడని ఒకస్త్రీ వచనరూపంలో విష్ణువునకు సర్వదేవతాస్వరూపాన్ని వాల్మీకిభగవానుడు స్థాపిస్తున్నాడు. 'మహాయోగీ' లోకరక్షణోపాయచింతకలిగినట్టివాడు. 'పరమాత్మా' షడ్భావవికార రహితుడగుట వలన సమస్తజీవాత్మల కంటె ఉత్కృష్టుడు. 'సనాతనః' ఎల్లప్పుడూ ఉండెడివాడు. 'అనాది మధ్యనిధనః' జన్మ వృద్ధి వినాశరహితుడు. 'శాశ్వతః' అపక్షయరహితుడు 'ధ్రువః' పరిణామరహితుడు. ఈ విశేషణాలవల్ల జీవునికి కల షడ్భావవికారాలు పరమాత్మకు లేవని చెప్పుట జరిగింది. పరమాత్మశబ్దార్థాన్ని వివరిస్తున్నాడు. 'మహతః పరమో మహాన్' ఇంద్రాదుల కంటే గొప్పవాడు. బ్రహ్మాదుల కంటే గొప్పవాడు. నివాసస్థానం కూడా అతీతమయినదని చెపుతున్నాడు. 'తమసః పరమః' ప్రాకృత మండలం కంటే ఉన్నతమయినట్టి అప్రాకృత విష్ణులోకంలో ఉన్నవాడు. "ఆదిత్య వర్ణం తమసస్తు పారే"(తై.త్తి.ఆ.3.11) సర్వ వ్యాపకుడగు వానికి వైకుంఠమందుండుట ఎట్లు సంభవించుననగా విగ్రహరూపుడుగా ఉండుటచే 'శంఖచక్రగదాధరః' శంఖచక్రగదలను ఎల్లప్పుడూ ధరించి ఉండువాడు. ఎల్లపుడూ ఈ ఆయుధాలను

ధరించిఉండడం ఎందుకంటే – 'ధాతా' పోషకుడు కావున సర్వదా శిష్టరక్షణార్థమై ఆయుధాలను ధరించి ఉన్నాడు. తెలిసిన వారిట్లన్నారు. ఆశ్రయించిన వారిని వ్యవధానం లేకుండా రక్షించుట కొరకు నిరంతరంగా ఆయుధధారణ చేయువాడు. 'శ్రీరంగ నాయకులు' అని. అతడు సర్వేశ్వరుడనే లక్షణం ప్రదర్శించుటకై 'శ్రీవత్సవక్షాః' ఎరుపు వర్ణం కలిగిన మధ్యచిహ్నం హృదయదక్షిణభాగంలో కలవాడు. 'నిత్యశ్రీః' అపాయరహితశ్రీయుక్తుడు. అందువలననే 'అజయ్యః' జయింప వీలు కానివాడు. అతడే ఈ రాముడని స్పష్టపడింది.

**మ.వి.** 'మహాయోగీ' సహజ విజ్ఞాన సిద్ధుడు. "పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ" (శ్వే.తా.ఉ. 6.8) గొప్పదగు ఇతని శక్తి వివిధాలుగా వినిపిస్తున్నది. ఇతడు స్వసన్నిధిమాత్రంతో అందరినీ వశీకరించుకొని నియమించగలడు. 'పరమాత్మా' సర్వాంతర్యామి. "య ఆత్మని తిష్ఠన్నాంతరో యమాత్మా న వేద యస్యాత్మా శరీరం, య ఆత్మానమంతరో యమయతి" (బృ.హ.ఉ.3.7.3.) అను శ్రుతి స్పష్టపరుస్తున్నది. 'సనాతనః' ఎల్లపుడూ ఉండెడివాడు. 'అనాదిమధ్యనిధనః' జన్మవృద్ధిక్షయరహితుడు, 'శాశ్వతః' అపక్షయ రహితుడు. 'ధ్రువః' పరిణామ శూన్యుడు. ఇట్లు చెప్పుటచే షడ్భావవికార రహితుడని నిరూపించబడింది. విష్ణుపురాణంలో 'అపక్షయ, వినాశ, పరిణామ, వృద్ధి, జన్మలు లేనివాడు కేవల సన్మాత్రుడు' అని చెప్పబడింది. 'మహతః పరమః' గొప్పవారలకంటే గొప్పవాడు.(లేక 'మహత్' కంటే పరుడు) 'ధాతా' సృజించువాడు. "యతో వా ఇమాని భూతాని జాయంతే" (తై.త్తి.ఆ.9.1) ఏ పరమాత్మ వలన సమస్తభూతాలు సృజింపబడుతున్నాయో,–ఇంతవరకు పరమాత్మస్వరూపం చెప్పి ఇపుడు విగ్రహగుణాలను చెపుతున్నాడు. 'శంఖచక్రగదాధరుడు' అని, 'నిత్యశ్రీః' నిత్యానపాయిని అగు శ్రీయుక్తుడు. 'అజయ్యః' జయింపవీలుకాని వాడు, మహాయోగిత్వాదివిశేషణ విశిష్టుడగు మహావిష్ణువే రఘునాథుడు.

సర్వలోకనియంతయగు మహావిష్ణువు వానరదేహధారులగు సమస్తదేవతలతో కూడి మనుష్యశరీరాన్ని గ్రహించి అవ్యవధానంగా లోకాలకు మంచి చేయుటకు సర్వలోకవిరోధివగు నిన్ను చంపినాడు. నీవు ఇంతకుముందు ఇంద్రియముల బడసి త్రిభువనాలను జయించినావు. ఇంద్రియాలు ఆ వైరమును స్మరించుకొని నిన్ను జయించినాయి. లోగడ 'రామునితో విరోధం వలద'ని నేను చెప్పిన మాట వినకుండుటచే ఇట్టి దుష్ఫలం కలిగింది. నిర్హేతుకంగా సీతను కామించావు. స్వజనుల యొక్క, నీయొక్క, ఐశ్వర్యంయొక్క వినాశం దానికి ఫలం. దుర్మతీ! అరుంధతి, రోహిణి, వీరి కంటే ఉన్నతురాలగు సీతను బాధపెట్టి తగనిపని చేశావు. నిన్నభిలషించని సర్వసద్గుణ సంపన్నయగు సీతను మోసపుచ్చి తీసుకుని వచ్చినావు. నీ కోరికా తీరలేదు. పతివ్రతయగు ఆమెయొక్క తపస్సుచే దహింపబడినావు. ప్రభూ! నీ భార్యలను కించపరచినావు. ఇదంతా నా దౌర్భాగ్యం. నీవు సీతను స్పృశించిన సమయంలోనే దహింపబడక పోవడం చూచిన ఇంద్రాది దేవతలు నీప్రభావానికి భయపడినారు. భయపడిన దేవతలు ఆ పాపానికి ఫలమును నీకెట్లివ్వగలరు? పాపకర్మఫలమనుభవింపక తప్పదు. మంచి చేసినవాడు సుఖాన్ని, పాపం చేసినవాడు దుఃఖాన్ని పొందుతారు. విభీషణుడు సుఖమును పొందాడు. నీవిట్టి దుఃఖం పొందావు. కులరూపవిద్యాసామర్థ్యములలో సీత నాకంటే అధికురాలు కాదు. సమానురాలూ కాదు. మోహంతో నీవా విషయం గుర్తించలేదు. మృత్యువేదో ఒక కారణంగా సమస్తభూతాలకు వస్తుంది. నీకు మాత్రం సీతాపహరణనిమిత్తం సంభవించింది. నీవు సీతారూప మృత్యువును దూరంనుండి తెచ్చుకున్నావు. శోకరహితయగు సీత రామునితో

విహరింపగలదు. స్వల్పపుణ్యనగు నేను శోకసముద్రంలో మునిగాను. నీతో మహాభోగాలను అనుభవించిన నేను నీ వధవలన వాటి నుండి భ్రష్టురాలనైనాను. రాజుల సంపత్తులు చంచలములైనవి కదా?

**వ్యా.వి.** ఈ విధంగా రావణుని బుద్ధిని, సంపత్తిని నిందించి భర్తయొక్క సౌందర్యవైపరీత్యాన్ని గూర్చి శోకిస్తున్నది.

ఓ రాజా! సర్వాంగసుందరమగు నీశరీరం పానస్థానమందు మదముచే చంచలనేత్రాలు కలదియై పుష్పమాలాలంకృతమై సుందరమందహాసయుక్తమై ప్రకాశించింది. అదే నీముఖం రామబాణభిన్నమై నెత్తురు కారుచుండ మేదస్సు, మస్తిష్కం వికీర్ణం కాగా రథోద్ధతమగు దుమ్ముచే కప్పబడి ప్రకాశింపకున్నది. నీవు మరణించుటవలన నేను విధవనైనాను. ఇట్టి దశ నాకు సంప్రాప్తమగునని మందబుద్ధినగు నేను ఏనాడూ తలచ లేదు. 'నా తండ్రి దానవరాజు మయుడు, నా భర్త రాక్షసేశ్వరుడు, నా కుమారుడింద్రుని జయించిన వాడు' అని గర్విస్తూ ఉండేదానను. ఇట్టి ప్రభావంగల నీకు మానవుని వలన భయం ఎలా సంభవించింది? యుద్ధభూమియందు దీప్తం, విహారప్రదేశాలలో రమణీయం, ఆలింగనయోగ్యం అగు నీ శరీరమిపుడు బాణాలు నిండుగా గుచ్చుకొనుటచే ముళ్ళపందివలె ఉండి ఇపుడు ఆలింగన అయోగ్యమై వజ్రాయుధంచేత కొట్టబడి శిథిలమైన పర్వతం వలె ఉన్నది. హా! ఇది స్వప్నమా? కాదు. సత్యమే. నీవు మృత్యువునకే మృత్యువవు. అట్టి నీవు రామునిచే ఎట్లు మరణించావు? త్రిలోకసంపదలను అనుభవించినవాడవు, ముల్లోకాలకు ఉద్వేగం కలిగించినవాడవు, కైలాసాన్ని చలింపచేయుట ద్వారా శంకరుని కదలించినవాడవు నీనాదంతో సమస్త భూతాలను ఏడ్పించినవాడవు. మాయాయుద్ధవిశారదుడవు, దేవాసుర రాజకన్యాపహర్తవు, స్వీయశిరస్సులను ఆహుతి చేసిన భయంకర కర్ముడవు. ఇట్టి ప్రభావం గల భర్త చనిపోయి పడి ఉండగా చూచి కూడా ఈ దేహం ధరించిఉన్నాను. నా కుమారుడింద్రజిత్తు లక్ష్మణహతుడైనపుడే తీవ్రముగ క్షోభించిన నేను ఇపుడు చావబోతున్నాను. నీవు కష్టసాధ్యమగు వీరస్వర్గం అలంకరించావు. నీవు లేని నేను జీవించలేను. కావున దుఃఖితురాలనగు నన్ను కూడా తోడ్కొని పొమ్ము. ఇట్టి దీనురాలనగు నాతో మాట్లాడవేమి? మేలిముసుగు లేక కాలినడకన ఇక్కడకు వచ్చిన నన్ను, ఇతర భార్యలను చూచి కోపింపవేమి? ఇతఃపూర్వం నీచే విధవలు కాబడినట్టి పతివ్రతలగు స్త్రీల శాపంవల్ల నీవిట్లు శత్రువుల వశుడవైనావు.

పతివ్రతల కన్నీరు అకస్మాత్తుగ నేలరాలితే అనర్థం జరుగుననే జనవాక్యం యథార్థమైంది. యుద్ధాలలో ఎపుడూ భయపడని నీవు సీతాహరణకై మాయామృగం సాయంగా గ్రహించినపుడే నీ భయం వ్యక్తమయింది. అది వినాశసూచకం. మహానుభావుడగు నామరది విభీషణుడు ఆ సమయంలో ఆలోచించి చెప్పిన హితం నీవు పాటించకపోవుట వలన రాక్షసకులం అనాథ అయింది. నిజంగా ప్రఖ్యాతబలపౌరుషాలు కల నిన్ను గూర్చి విచారించకూడదు. నీ వియోగంతో దుఃఖిస్తున్న నేను నన్ను గూర్చియే విచారిస్తున్నాను. నాకు సమాధానం చెప్పవేమి? నీవు లెమ్ము. పరిభవం ప్రాప్తమయింది. ఇపుడు నిర్భయంగా సూర్యకిరణాలు లంకలో ప్రవేశిస్తున్నాయి. నీపరిఘాయుధం రామబాణములచే వేయి వ్రక్కలైంది. ప్రియురాలినివలె భూమిని కౌగలించుకొని శయనించి నాతో మాట్లాడుటకు ఇష్టపడుట లేదేమి? ఇట్లు కంటనీరుకార్చుతూ అనేక విధాలుగా విలపిస్తూ మందోదరి

మూర్ఛపోయింది. రక్తంతో తడుపబడిన నీలవర్ణుడగు రావణవక్షం మీద పడిపోయిన మండోదరి సంధ్యాకాంతిచే ఎఱ్ఱబారిన మేఘామధ్య విద్యుల్లతవలె భాసించింది. సపత్నులు రోదిస్తూ ఆతృతతో ఆమెను లేపి కూర్చుండబెట్టి ఇట్లన్నారు. 'దేవీ! నీకు తెలియనిది లేదు. రాజుల దశలు మారినపుడు సంపదలు చంచలాలుగా ఉంటాయి. ఊరడిల్లుమ'ని ఓదార్చారు.

ఇంతలో రాముడు విభీషణునితో 'రావణున కపరసంస్కారం నిర్వర్తించు. స్త్రీలను లంకకు బంపు' అని చెప్పాడు. అపుడు వినీతుడగు విభీషణుడు ఇలా ఆలోచించాడు. రామాభీష్టానుసారం చేస్తాను. అపరక్రియాకరణం రామునకనభీష్టమయితే మానెదనని తలచి ఇట్లన్నాడు.

ఈ రావణుడు నాకన్నగారగుట వలన గురువనే గౌరవమున్నా ధర్మం వదలి క్రూరుడై పరకాంతాసక్త చిత్తుడై అనృతవాదియై సోదరరూపియగు శత్రువై ఉన్నాడు. కాన ఇతడు పూజార్హుడు కాదు. 'అన్నగారికపర సంస్కారాలు చేయని దుర్మార్గుడ'ని లోకులు ప్రథమంగా నన్ను నిందించినప్పటికి రావణదోషాలను గుర్తించి 'విభీషణుడు రావణునకు అపరక్రియలొనర్పకుండుట న్యాయమే' అంటారు ఇట్లు పలికిన విభీషణునితో పరమ ప్రీతుడగు రాముడు-లేక ఆమాటలకప్రీతుడైన రాముడు విభీషణా! నీప్రభావంతో విజయమందినావు, కావున నీకు మంచి చెప్పాలి.

**గో.వి.** రావణునిలో దోషాలున్నా గుణాధిక్యముండుటచే ఈతడు సంస్కారయోగ్యుడని భావించి రాముడిట్లంటున్నాడు. నాకు ప్రియమైనది, నీకు హితమైనది అగు ఈ రావణసంస్కారం నిర్వర్తించు.

అధర్మం, అబద్ధం కల ఈ రావణుడు యుద్ధంలో తేజస్వి, బలవంతుడు, శూరుడు, ఇంద్రాదులచే పరాజితుడు కాలేదని విన్నాను. ఇట్టి వాడు సంస్కారార్హుడే. ఎట్లయినా శత్రువే కదా? అంటే శత్రుత్వం మరణపర్యంతమే-మన ప్రయోజనం నెరవేరింది. కాన నీకు ఇతడెట్లో నాకూ అట్లే కాగలడు. కావున అపరసంస్కారాలు చేయి. నీచే ఈతడు సంస్కరింపదగినవాడు. అట్టి సంస్కారమొనర్చుటవలన పాపియగు సోదరునకు ఔర్ధ్వదైహిక సంస్కార మొనర్చెనని నీకు యశస్సు కలుగుతుంది. రామవాక్యశ్రవణానంతరం విభీషణుడు రావణునకు-రాజునకు, సోమయాజికి, ఋషికి, అనురూపములైన సంస్కారాలు చేశాడు.

చందనకాష్ఠాదులచే చితి పేర్చబడింది. వేదోక్త ప్రక్రియానుసారం ఋత్విజులు 'రాంకవాస్తరణం'ను (తెల్ల ఇఱ్ఱి అను మృగం యొక్క వెండ్రుకలతో చేయబడిన కంబళమును) పరచారు. యథాశాస్త్రంగా రావణునకు పితృమేధసంస్కారమొనర్చినారు. చితికాగ్నేయదిక్కులో వేదికలను ఏర్పరచి అందు పడమర గార్హపత్యాగ్నిని, తూర్పున ఆహవనీయాగ్నిని, దక్షిణాన దక్షిణాగ్నిని ఇలా త్రేతాగ్నులను స్థాపించారు. దధిమిశ్రితాజ్యం కలిగిన స్రువమును చితియందుంచారు. రావణుడు సోమయాజి అగుటచే సోమలతను యజ్ఞార్థమై తెచ్చిన బండిని చితియందలి రావణుని పాదాలమీద, యజ్ఞీయములైన వ్రీహ్యాదులను, దంపురోకలిని అతని తొడల మీద, అరణులను, రోకలి మొదలగు యజ్ఞీయదారుపాత్రలన్నిటిని నిర్దేశిత స్థానములలో ఉంచారు. వేదవిహితంగా చితియొక్క సమీపాన పవిత్ర పశువును చంపి దానిచర్మాన్ని నెయ్యిలో తడిపి దానిని రావణునకు కప్పినారు. విభీషణసహాయులగు

రాక్షసులు దీనులై రావణుని పుష్పహారాదులతో వివిధములగు వస్త్రాలతో అలంకరించారు. కన్నీటితో పేలాలు చల్లినారు. విభీషణుడు మంత్రయుక్తంగా చితికి నిప్పుపెట్టినాడు. తాను స్నానమొనర్చి తడిగుడ్డలతో గరికతో కూడిన తిలలను ప్రేతావాహన కొరకు భూమియందుంచి అచట రావణునకు ఉదకతర్పణం చేసి శిరస్సుతో నమస్కరించి మంచి మాటలతో అంతఃపురస్త్రీలను అనునయించి పట్టణానికి బంపాడు. అంతఃపుర స్త్రీలు లంకకేగిన పిమ్మట వినయయుక్తుడగు విభీషణుడు రామపార్శ్వంలో నిలచాడు.

**గో.వి.** రావణుడు యుద్ధంలో చనిపోయినందున విభీషణుడు అశౌచరహితుడగుట వలన రామసన్నిధికి వచ్చాడు. అందువలననే మరునాడు రాజ్యాభిషేకం, అయోధ్యాగమనం జరిగినాయి. చైత్రశుద్ధపాద్యమినాడు రావణునకు అపరకర్మ జరిగింది.

## నూటపదిహేనవ సర్గము

రావణవధను చూచిన దేవగంధర్వదానవాదులు వారి వారి విమానాలలో సమగ్రమైన యుద్ధవృత్తాంతాన్ని చెప్పుకొంటూ స్వస్థానములకు వెళ్లారు. రాముని అనుజ్ఞపొందిన మాతలి రథసహితుడై స్వర్గానికి వెళ్లాడు. రాముడపుడు లక్ష్మణునితో ఇట్లన్నాడు. 'లక్ష్మణా! ఉపకారి, అనురక్తుడు, భక్తుడు అగు ఈ విభీషణుని లంకకు పట్టాభిషిక్తుని చేయి. దీనిని చూచుట నాకు ముఖ్యమగు కోరిక'.

**గో.వి.** లోగడ సముద్రోత్తరతీరమందు విభీషణునకు రాజ్యాభిషేకం జరిగి ఉన్నప్పటికీ తిరిగి చేయుట రావణసింహాసనం మీద అభిషేకించుట కొరకు. ఇతడు అనురక్తుడనుటచే మిత్రకృత్యమొనర్చినాడని, భక్తుడనుట వలన దాసకృత్యమొనర్చినాడని చెప్పుట జరిగింది. విభీషణపట్టాభిషేకమే తనకు ముఖ్యమగు కోరిక అని రాముడనుట వల్ల శరణాగతవిభీషణాభిమతపరిపూరణమే రావణవిజయప్రధానప్రయోజనమని తేలుతున్నది.

సరేయని లక్ష్మణుడు బంగారు పాత్రములను వానరులకిచ్చి సముద్రోదకం తెప్పించి లంకానగరంలో సింహాసనంపై పరిశుద్ధమనస్కుడగు విభీషణుని ఆసీనుని చేసి సమస్తరాక్షసుల, ఇష్టులమధ్య వేదవిహిత విధానాను సారం లక్ష్మణుడు సువర్ణకలశానీతజలాలతో పట్టాభిషేకమొనర్చినాడు. విభీషణమంత్రులు, తద్భక్తులు సంతసించారు. రామునివలన గొప్పరాజ్యం పొందిన విభీషణుడు మంత్రులు మొదలగు వారల పుత్రమిత్ర మరణజనితశోకాన్ని అనునయవాక్యాలచే తొలగించాడు. పౌరులచే సమర్పితములైన మంగళ ద్రవ్యాలను స్వీకరించి వాటిని శ్రీరామునకు, లక్ష్మణునకు సమర్పించాడు.

**గో.వి.** ఇట విభీషణునకు 'శుద్ధాత్మానం' అను విశేషణం ఉంది. ఇందువలన రామాజ్ఞానుసారం విభీషణుడు పట్టాభిషిక్తుడైనాడే కాని రామకైంకర్యమందు మాత్రమే ఆతడికాసక్తి కలదని తెలుస్తున్నది.

విభీషణతృప్తికొరకు రాముడు వాటిని స్వీకరించాడు. పిమ్మట ఆంజనేయునితో రాముడు 'నీవు విభీషణాను మతమున రావణగృహమునకేగి విజయవార్తా శ్రవణంతో సీతను సంతసపరచి సుగ్రీవలక్ష్మణయుతుడనైన నేను కుశలినై ఉన్నట్లు, రావణుడు నాచే సంహరింపబడినట్లు చెప్పి సీతయొక్క వాచికసందేశాన్ని నాకు తెలుపుమ'ని వచించాడు.

## నూటపదహారవసర్గము

ఆంజనేయుడు రామాజ్ఞానుసారం లంకాప్రవేశం చేసి రాక్షసులు మార్గంచూపగా శరీరసంస్కార రహిత, సంతోషరహిత, రాక్షస పరివృత అగు సీతను చూచి తన పేరు చెప్పి నమస్కరించి వినయంతో కుంచిత శరీరుడై నిలచాడు. సీత హనుమంతుని సామాన్యంగా చూచి ఉపేక్షించి ఆంజనేయుడని గుర్తుతెచ్చుకుని ఆనందించింది. "తూష్ణీమాస్త తదా దృష్ట్వాఽ స్మృత్వా ప్రముదితాభవత్"

**గో.వి.** ఆతనిని మొదట గుర్తించక ఊరకుండి తిరిగి చూచి గుర్తించి ఆనందమందింది. లేక సామాన్యంగా చూచి గుర్తించక పరిశీలించి చూచి గుర్తించి ఆనందముపొందింది. లేక ఆతనిని చూచి గుర్తు తెచ్చుకుని ఆనందించింది.

తనను చూచి గుర్తించి సంతోషంతో విప్పారిన ముఖం కలిగిన సీతను చూచిన ఆంజనేయుడిట్లన్నాడు. రాముడు నీకిట్లు సందేశమంపినాడు. 'దేవీ! నీకు ప్రియమయిన విషయాలు చెపుతున్నాను. నీవు పాతివ్రత్య ధర్మజ్ఞవు. దైవయోగంతో జీవించావు. మనకు విజయం ప్రాప్తించింది. రావణుడు హతుడైనాడు. నీవు స్వాస్థ్యం పొందు. లంక మన స్వాధీనంలో ఉంది. నిన్ను విడిపించుటకు నిద్రలేక దృఢప్రయత్నంతో సేతువు నిర్మించి రావణుని సంహరిస్తానని ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాను. రావణగృహంలో ఉండినందుకు తొట్రుపాటు పడనక్కర లేదు. ఇపుడు లంక విభీషణాధీనమై ఉన్నది. కావున నీవు స్వగృహమందున్నటుల విశ్రాంతి పొందు. ఇదుగో నిన్ను చూడ విభీషణుడిపుడు రాగలడు.' ఈమాటలు వినిన వెంటనే హర్షమున లేచిన సీత సంతోషంతో ఏమి మాట్లాడలేక పోయింది. హనుమానుడు మౌనం వహించిన సీతను చూచి 'దేవీ! ఏమాలోచిస్తున్నావు? నాతో మాటలాడవేమ'ని అన్నాడు.

అపుడు హర్షంతో బొంగురు పోయిన గొంతుతో సీత ఇట్లు పలికింది. 'నా భర్త యొక్క విజయం విని సంతోషపరవశనై క్షణకాలం మాట్లాడలేకపోయాను. నేను మాట్లాడకపోవుటలో కారణం ఉంది. ఇట్టి ప్రియమైన వార్తను చెప్పిన నిన్నభినందింపతగిన మాటలు నాకు దొరక లేదు. నీకు తగిన బహుమతులనిచ్చుటకు మూడు లోకాలలో తగిన వస్తువు కనుపించలేదు. వెండిగాని, బంగారంకాని, వివిధరత్నంకాని, త్రిలోక రాజ్యంకాని నీవు చెప్పిన సంతోషవార్తకు తగినవని చెప్ప వీలు లేదు'. ఇట్లు సీత పలుకగా ఎదుట నిలచి అంజలి బంధమొనర్చిన ఆంజనేయుడిట్లన్నాడు. 'దేవీ! స్నేహయుక్తమగు ఇట్టి మాటలు పలుకుటకు నీవే తగిన దానవు. నాకు గొప్పప్రియ వచనాలతో సమాధానం చెప్పినావు. 'నీకు తగిన బహుమాన వస్తువులేద'ంటివి. 'నిన్నభినందించుటకు తగిన మాట దొరకులేద'ని నీవనుటే-రత్నములు, బంగారము, దేవ రాజ్యము. వీటి కంటే విలువైన బహుమానం. శత్రువిజేతయగు రాముని చూశాను. అది త్రిలోకాధిపత్యప్రాప్తితో తుల్యం. ఇట్లు పలికిన ఆంజనేయునితో సీత మరల ఇట్లన్నది.

**వ్యా.వి.** లోగా ఆంజనేయునితో ప్రథమసంభాషణ జరుపుసందర్భాన రాముడాంజనేయుని ప్రశంసించినట్లు సీత ఇపుడు ప్రశంసిస్తున్నది "అతిలక్షణసంపన్నం" ఆకాంక్ష, యోగ్యత, సన్నిధి, కలిగిన పదయుక్తవాక్యం కలిగినట్టి,

సాధుశబ్దయుక్తం, "మాధుర్య గుణ భూషితం" 'సంశ్రవే మధురం వాక్యం' (సుం.కాం.31-1) అని చెప్పబడినట్లు శబ్దశ్రవణసమకాలంలో మధురరసానుభూతిని కలిగించే మాధుర్యగుణాలంకృతమగుమాట, "అష్టాంగయా" "బుధ్యా" గ్రహణ, ధారణ, స్మరణ, ప్రతిపాదన ఊహ, అపోహ, అర్థవిజ్ఞాన, తత్వజ్ఞానరూపాలైన ఎనిమిది గుణాలతో కూడిన బుద్ధిపూర్వకమగు ఇట్టి మాటలు పలుకుటకు నీవే తగుదువు. గుణముచే గూడ నీవు పొగడతగిన వాడవు. వాయువునకు కీర్తింపతగిన సుతుడవు. పరమధార్మికుడవు. ప్రయాసను సహించు బలశాలివి. యుద్ధోత్సాహివి. శాస్త్రజ్ఞుడవు. సారవచ్ఛరీరుడవు. పరాక్రమం, సామర్థ్యం, పరాభిభవసామర్థ్యం అపరాధముల సహించుగుణం కలవాడవు. దయాద్యుత్తమ గుణాలు నిన్నాశ్రయించుట వలన శోభించాయి. సంశయం లేదు. నీయందు లేని గుణాలను ఆరోపించి నేను స్తుతించుట లేదు. అని సీత అన్నది.

సీతతో ఆంజనేయుడిట్లన్నాడు. నీవు నాకు పారితోషికమిత్తునంటివి. ఈ నాకోరికను మన్నించు. ఏమన భర్తృవియోగఖేదమనుభవించే పతివ్రతవగు నిన్ను మాటలచే భయపెట్టిన వికృతాకారులగు ఈ భయంకర రాక్షసస్త్రీలను సంహరించుటకనుమతి ఇమ్ము. ఇదియే నాకు వరం. వీరిని పిడికిళ్ళతో, అరచేత, కాళ్ళచేత, పండ్లచేత, మోకాళ్ళ చేత వివిధ విధాలుగా హింసించి ముక్కులు చెవులు భక్షించి జుట్టుపీకి, చంపవలెనని నాకు కోరిక. నీకపకారమొనర్చిన వీరు శిక్షార్హులు కదా? హనుమద్వాక్యాలను విని సీత ధర్మయుక్తంగా ఇలా పలికింది. వీరు రాజసేవకులు. రాజాజ్ఞాను సారం వర్తిస్తారు. అట్లు చేయకున్నచో దండార్హులగుదురు. అట్టి దాసస్త్రీలవిషయంలో ఎవరు కోపపడతారు?

నాకపుడు వెనుకటిజన్మలలో చేసిన పాపఫలం అనుభవించుకాలం. అందరూ తమ తమ సుకృత దుష్కృత ఫలములననుభవించాలి కదా? అందువల్ల ఈ రాక్షసస్త్రీతర్జన భర్త్సనాదికం ప్రాప్తించింది. దుర్బలను కావున ఆ బాధలను సహించాను. రావణాజ్ఞానుసారం వీరపుడు నన్ను బాధించారు. రావణసంహారానంతరం అలా చేయడంలేదు కదా?

**వ్యా.వి.** పై విషయానికి ఉపష్టంభకంగా సీత ఒక చరిత్రచెపుతున్నది. వెనుక ఒకప్పుడు పెద్ద పులి తరుమగా చెట్టెక్కిన కిరాతుని గూర్చి ఆ చెట్టుపై నివసించిన ఎలుగుబంటితో క్రింద నున్న పెద్దపులి ఈ కిరాతుడు మనమృగాలన్నిటికీ శత్రువు. కావున ఇతనిని క్రిందకు పడత్రోయుమ'ని చెప్పగా ఎలుగుబంటు 'నా నివాస స్థానానికి వచ్చిన వీనిని క్రిందపడవేయను. అట్లు చేయుట అధర్మం అని బదులు పలికి నిద్రించింది. ఆ కిరాతునితో వ్యాఘ్రం నిన్ను రక్షింతును. ఎలుగును క్రింద పడవేయుమ'ని చెప్పింది. ఆ కిరాతుడు భల్లూకాన్ని క్రిందకు పడవేశాడు. చెట్ల మీద నివసించుట బాగుగా అలవాటయినందున క్రిందపడక ఆ ఎలుగుబంటు మరొక కొమ్మపట్టుకొన్నది. 'చూచితివి కద? ద్రోహియగు వీనిని క్రింద పడవేయుమ'ని పెద్ద పులి వచించినా అనేక పర్యాయాలు తనకపకారమొనర్చిన ఆ కిరాతుని 'క్రింద పడ వేయన'ని చెప్పి వానిని రక్షించింది. ఇది పురాణగాథ. అపుడు భల్లూకం పలికిన పలుకులను సీత చెపుతున్నది. సుగ్రీవునకు విభీషణశరణాగతి సందర్భంలో రాముడు కపోతోపాఖ్యానం వినిపించినట్లు సీతాదేవి భల్లూకగీతం వినిపిస్తున్నది.

ఆంజనేయా! విను. ఎదుటివారికి చెడుచేయువారివిషయాన ప్రాజ్ఞులు ప్రత్యపకారం చేయరు. అపకారికి కూడా అపకారం చేయతగదను ఆచారం రక్షింపతగినదే – సత్పురుషులకు తమ సచ్చరితమే అలంకారం కద? "పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ, కార్యం కరుణమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి" (116–44)

**వ్యా.వి.** సీతాదేవి అభయప్రదానం చేస్తున్నది. ఈ రాక్షస స్త్రీలు నీదృష్టిలో పాపులు. నా దృష్టిలో మంచివారు. ఎట్లయినా మహాత్ములు వధార్హులయిన వారి విషయంలో దయతో మెలగాలి. లోగా రాముడు 'దోషో యద్యపి తస్య స్యాత్' (యు. కాం. 18–3) అన్నట్లు దేవి ఇచట (116–44) పలికింది. మాలిన్యం కలవానికే కద స్నానాపేక్ష! అట్లే వారు పాపులగుటచేతనే మనం వారి విషయంలో దయచూపాలి. పుణ్యాత్ములకు మనం చేయవలసినదేముంది? వారి పుణ్యమే వారిని రక్షిస్తుంది కద? అయితే 'పాపులను శిక్షించాలి' అను ధర్మశాస్త్రం సీతాదేవిచే నిరాకృతమైనట్లే అని శంకించి 'దుష్టుడయినా శరణాగతుడు రక్షింపతగినవాడ'ను విశేషశాస్త్రానుసారం సీతాదేవి చెపుతున్నది. కావున శాస్త్రవిరోధంలేదు.

ఓ ఆంజనేయా! వధార్హులవిషయంలో కూడా దయతో మెలగాలి. అనగా మంచివారినివలె పాపులను కూడా వారు వధింపబడబోవుసమయంలో రక్షించాలి. 'అపరాధులను దండింపనిచో అతిప్రసంగ మొనర్చినట్లగు'నను దానికి సమాధానం "న కశ్చిదపరాధ్యతి?" ఎవడపరాధ మొనర్చుట లేదు? అందరూ అపరాధం చేసినవారే. అందువల్ల అందరూ వధ్యులే కాన దయాశాలియగువాడు ఊరకుండుటమేలని సీతాదేవి భావం. (116–44) మరియూ రాక్షసులకు జాతి ప్రయుక్త (సహజ) పరహింస దోషావహం కాదు. కావున దండప్రసక్తి లేదు.

ఈ విధంగా సీతాదేవి చెప్పగా ఆంజనేయుడు దేవీ! నీవు రామునకు అనుగుణమగు ధర్మపత్నివి. ప్రతి సందేశమిమ్ము. రామునొద్ద కేగెద ననగా 'నా భర్తను చూడగోరుచున్నాన'ని సీత పలికింది. ఆమెకు సంతోషం కలుగునట్లు 'రాముని చూడ గలవ'ని పలికిన ఆంజనేయుడు రామసన్నిధికి వెళ్లాడు.

## నూటపదిహేడవ సర్గము

ఏ సీతానిమిత్తంగా సేతుబంధనాదులను చేసి రావణవిజయరూపఫలం పొందినామో దుఃఖతప్తయగు ఆ సీతను చూడు. దుఃఖితురాలగు ఆమె నీ విజయవార్త విని ఆనందించింది. లోగడ పరిచయంతో నన్ను విశ్వసించి 'లక్ష్మణసహితుడగు నాభర్తను చూడగోరుచున్నా'నని నాతో పలికింది. ఆంజనేయుడు రామునితో ఇలా చెప్పగా రాముడు కొద్దిగా కంటివెంటనీరుకార కొద్దిసేపాలోచించి దీర్ఘంగా వేడి నిట్టూర్పులను వదలి నేలను చూస్తూ విభీషణునితో ఇట్లన్నాడు.

**వ్యా. వి.** కంటనీరుకార్చి కొద్దిసేపాలోచించాడు. చిరకాలం రావణగృహమందున్న సీతను స్వీకరించిన లోకాపవాదం కలుగుతుంది. నిర్దోషియగు ఆమెను పరిత్యజిస్తే గొప్ప దోషం సంభవిస్తుంది. ఏమి చేయాలని ఆలోచించాడు. దీర్ఘంగా నిశ్వసించుట దీర్ఘాలోచనను సూచిస్తున్నది. వేడిగ నిట్టూర్చుట ఇప్పటికే దుఃఖితురాలగు ఆమెనింకనూ దుఃఖింపజేయబోవుచున్నాననే అంతస్తాపమును బహిరంగంగా సూచించింది. నేలను చూచుచుండుట చింతాపరవశుడగుటను తెలుపుతున్నది.

విభీషణునితో రాముడు 'సీతను మంగళస్నాతనుచేసి దివ్యాభరణాదులతోనలంకృతను చేసి వేగంగా ఇటకు తీసుకుని రమ్ము'అన్నాడు.

**మ.వి.** ఇట సీతను శోధింపక నేను స్వీకరించిచో అపుడు జనులు దివ్యసుందరియగు ఆమెను చూచి రావణుడు ఊరకుండెనా? అని అనేక విధాల అపవాదకళంకశంకితులై నిష్కళంక, జగజ్జనని అగు ఆమెను శంకిస్తారు. అని భావించి జగత్తుయొక్క మర్యాదను స్థాపించుటకు అవతరించిన శ్రీ రాముడు శ్రేష్ఠుడగు వాడేది ఆచరిస్తే ఇతరులు గూడ దానినే ఆచరిస్తారను గీతావచనాన్ని అనుసరించి దేవి నిష్కల్మషయని తనకు తెలసినా లోకాపవాదం తప్పించుటకు ఆమెయందు కోపమున్నట్లు పరుషోక్తులను పలికి ఆమెను అగ్నిప్రవేశం చేయించి బ్రహ్మేంద్రాది దేవతలచే స్తుతింపబడి నిత్యశుద్ధయగు దేవిని స్వీకరింపబోతున్నాడు.

**గో.వి.** సీతనలంకరించి తీసుకుని రమ్మనుటలో భవిష్యత్తులో పరుషసంభాషణలను తట్టుకొను శక్తి నామెకు కలిగించుట కొరకు. ప్రకృతదీనస్థితిలో ఆమె తోడ పరుషభాషణం సమంజసం కాదు. మరియూ ఆ పరుషభాషణము ఆమెను పరిత్యజించుటకు కాదు. చతుర్ముఖాదుల ద్వారా ఆమె పాతివ్రత్యఖ్యాపనచేయుట కొరకు.

విభీషణుడు తన స్త్రీలచే ఆమెకు 'అమ్మా! నీవు మంగళస్నాతవై దివ్యసుగంధ ద్రవ్యములు, సమస్త భూషణములు, ధరించి పల్లకి నెక్కి బయలుదేరు. నీ భర్త నిన్ను చూడగోరుచున్నా'డని చెప్పి పంపాడు. అపుడు సీత స్నానముచేయకయే నాభర్తను చూడగోరుచున్నాననగా విభీషణుడు నీ భర్త చెప్పినట్లు నీవు చేయుట మంచిదని చెప్పగా పతివ్రతయగు సీత భర్త అభిమతమునంగీకరించింది. అభ్యంగనమాచరించి సర్వాభరణభూషితురాలైన సీతను పల్లకినెక్కించి పలువురు రక్కసులు పరివేష్టించి రాగా విభీషణుడు రాముని సమక్షానికి తీసుకుని వచ్చాడు. విభీషణుడు వచ్చిన విషయం గుర్తించినా, చింతాపరవశుడగుటవల్ల మౌనంగా ఉన్న రామునితో సంతోషంగా నమస్కరించిన విభీషణుడు సీతను తీసుకుని వచ్చిన విషయాన్ని నివేదించాడు. చాలకాలం రావణుని ఇంట ఉండి వచ్చినట్టి సీతరాకను విని సీతాగమనానికి హర్షాన్ని, చాలకాలం రావణుని ఇంట ఉండుట వలన దైన్యాన్ని, తెచ్చి పెట్టుకున్న రోషాన్ని, ఈ మూటిని రాముడు పొందాడు. సంతోషరహితంగా విభీషణునితో సీతనిటకు దోడ్కొని రమ్మని అన్నాడు. అపుడు విభీషణప్రేరితభటులు బెత్తములు ధరించి అచటి వానర భల్లూక రాక్షసులను దూరంగా బంప ప్రయత్నించారు. ఆకోలాహలం వల్ల గొప్పశబ్దం వినిపించింది. దూరంగా తొలగుటలో వానరభల్లూక రాక్షసులు శ్రమ పడడం చూచిన రాముడు దయకలవాడై 'వలదని' నివారించాడు. అపుడు రాముడు విభీషణుని దహించువానివలె చూస్తూ తిరస్కారపురస్సరంగా ఇట్లన్నాడు. వీరందరూ నాస్వజనం. నీవు నన్ను గూడ లెక్కించక వీరిని బాధిస్తున్నావేమి? వీరిని దూరంగా పంపకు.

**గో.వి.** లోగా కండ్లతో త్రాగుచున్న వానివలె రాముడు విభీషణుని చూచినట్లు (యు.కాం.19-61) వర్ణింపబడింది. ఇపుడదే విభీషణుని దహించువానివలె చూచినాడు ఎందువలన? స్వజనులగు వానరభల్లూ కాదుల బాధను సహింపజాలకపోవుటవలన. లేక సీతయందారోపింపబడిన రోషమువలనగాని.

స్త్రీకి సద్వర్తనమే ఆవరణం గాని గృహములు గాని, వస్త్రాలు గాని, ప్రాకారాలు గాని, ఇట్టి రాచమర్యాదలు గాని ఆవరణలు కాజాలవు. ఇష్టజనవియోగమందు, రాజ్యవిప్లవములందు, యుద్ధములందు, స్వయంవరమందు,

యజ్ఞాదులయందు, వివాహమందు, స్త్రీలనందరూ చూచుట దోషజనకం కాదు. ఈ సీత ఇపుడు యుద్ధభూమికి వచ్చి ఉన్నది. ఆపదయందున్నది. అట్టి ఈమెనందరూ చూడవచ్చు. కాక నా సమీపంలో ఉన్న ఆమెను చూచుటలో దోషమేముంది? త్వరగా ఆమెను నావద్దకు తీసుకుని రమ్ము. స్నేహితులతో కూడిన నన్ను చూడగలదు. ఇట్లు రాముడు చెప్పగా రాముని మాటలలో 'కృచ్ఛ్రే చ మహతి స్థితా' గొప్ప ఆపద యందున్నట్టి- అను మాటను విమర్శించుకొంటూ శంకతోకూడినవాడై విభీషణుడు రామసన్నిధికి సీతను తీసుకుని వచ్చాడు. రాముని మాటలలో, చేష్టలలో భార్యయందనురాగం లేకుండుటను గుర్తించిన లక్ష్మణసుగ్రీవాంజనేయాదులు వ్యథితులైనారు. సిగ్గుచే ముడుచుకుని భర్తవద్దకు సీత వచ్చింది. ఆమె మేలిముసుగు కప్పుకుని జనమధ్యంలో ఉండుటచే లజ్జించుచున్నదై రోదిస్తూ భర్తృసమీపానికి వచ్చి 'ఆర్యపుత్రా' అని పిలచింది.

**గో.వి.** పతినే దైవంగా భావించు సీత రాముని తిరిగి తాను చూడగలనను నమ్మకం చెడిఉన్నది. కావున రాముని చూచుట వలన విస్మయాన్ని, ప్రియదర్శనంవల్ల కలిగిన హర్షాన్ని, స్వాభావికస్నేహాన్ని పొంది నెమ్మదిగా రాముని ముఖం చూచి ఉదయించిన పూర్ణచంద్రునివంటి ముఖం కలిగిన రాముని అనుటచే కోపంతో ఎర్రపడిన ముఖం కలవాడని చెప్పబడింది. స్వచ్ఛమగు చంద్రుని ముఖంవంటి ముఖం కల సీత చూచెననుటచే కొద్ది సమయంలో కలుగబోవు అవమానం సూచింపబడింది. రాముని ముఖం చాల కాలానికి చూచిన సీత దుఃఖం విడచి సంతసించింది.

## నూటపద్దెనిమిదవ సర్గము

సిగ్గుచే ఒదిగి తన ప్రక్క కూర్చొనిఉన్న సీతనుచూచిన రాముడు హృదయంలోని క్రోధాన్ని మాటలద్వారా బయటపెట్టుటకుపక్రమించాడు. సీతా! శత్రువును జయించి నిన్ను సాధించాను. పౌరుషం వలన చేయతగినదానిని చేశాను. కోపఫలమందినాను. అవమానాన్ని, శత్రువును ఒకే పర్యాయం తొలగించుకొన్నాను. నా శ్రమ ఫలించింది. నేను స్వతంత్రుడనైనాను. చపలచిత్తరాక్షసునిచే నీవపహరింపబడుట అను దైవకృతమైన అవమానం మనుష్యుడనైన నాచే కడుగబడింది. దైవకృతం పురుషకారంచే నిరాకరింపబడింది. వచ్చిన అవమానాన్ని స్వసామర్థ్యంతో నివారించలేని అల్పతేజస్కునకు పురుషార్థమే లేదు. ఆంజనేయుని ఆనాటి సముద్రతరణ లంకాదాహాదులీనాటికి ఫలించాయి. సేనాపరివృతుడగు సుగ్రీవుని శ్రమ ఇపుడు సఫలమయింది. అన్నను వదలి నన్నాశ్రయించిన విభీషణుని శ్రమ ఇపుడు ఫలించింది. ఇట్లు నిరాశతో పలుకు రాముని మాటలను విని ఆడు లేడివలె విప్పారిన నేత్రాలతో చూస్తున్న సీత కంటివెంట నీరుకారింది. ఆమె కన్నీరుచూచిన రామునకు క్రోధం వృద్ధిచెందింది. కనుబొమలు ముడిచి ఎదుటి సీతను చూచి సహించలేక ప్రక్క చూపులు చూస్తూ రాముడు సీతను పరుషంగా ఇలా అన్నాడు. సీతా! అవమానాన్ని తుడిచివేయుటకు మానవుడు చేయతగిన సమస్తమూ చేశాను. రావణ హస్తాలనుండి నిన్ను సాధించాను. స్నేహితుల పరాక్రమమువల్ల జరుపబడిన యుద్ధపరిశ్రమ నీకొరకు కాదు. సదాచారాన్ని రక్షించుటకు, ప్రఖ్యాతమయిన మావంశానికి వచ్చిన అపయశం నివారించుటకు యుద్ధపరిశ్రమచేశాను. రావణగృహచిరనివాసం వల్ల సంభవించిన సందేహచరిత్ర కల నీవు నేత్రవ్యాధి కలవానికి దీపంవలె నాకు ప్రతికూలంగా ఉన్నావు.

**గో.వి.** రాముడిట్లు పలుకుట వల్ల దీపతుల్యయగు సీతకు సహజంగా దోషం లేదనీ, నేత్రవ్యాధి వంటి స్వీయసందేహంతో సీతను ప్రతికూలురాలుగా చేసితిననే భావం వ్యంజితమయింది.

కాన సీతా! నీతో నాకు ప్రయోజనం లేదు. దశదిశల ఎచటికయినా నీవు వెళ్ళు. నీ కనుజ్ఞ నిస్తున్నాను. సత్కులప్రసూతుడగు ఏ పురుషుడు పరగృహమందు నివసించిన స్త్రీని ఆతురతతో తిరిగి స్వీకరిస్తాడు?

రావణుని వడినుండి జారి అతని దుష్టదృష్టిదష్టవైన నిన్ను గొప్పవంశంలో జన్మించినా నేనెట్లు స్వీకరించ గలను? శత్రువుచే అపహరింపబడిన భార్యను తిరిగి తెచ్చెనను కీర్తికొరకే ఈ యుద్ధం చేశాను. నీయందు నాకెట్టి ఆసక్తీ లేదు. ఇటనుండి నీఇష్టమున్న చోటికే వెళ్లు. నీజీవనం కొరకు (పుత్ర సదృశ) లక్ష్మణ భరత, సుగ్రీవ, విభీషణాదులలో ఎవరి వద్దకయినా వెళ్ళి నీ మనస్సును కుదుటపరచుకుని సుఖంగా వసించు. తన ఇంట చాలకాలం చరిస్తూ దివ్యసుందరరూపం కలిగిన నిన్ను చూస్తూ రావణుడు సహించి ఊరకుండెనా?

**గో.వి.** ఇచట లక్ష్మణాదులయందు మనసు నుంచుమనిన అనాథ రక్షకులుగా వారి గృహాలలో నివసించుట భర్తృపరిత్యక్తయగు స్త్రీకర్తవ్యం కాన 'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనే న్యాయాన్ని అనుసరించి చెప్పినాడు. బంధుగృహాలలో వుండాలి. కావున అట్లు చెప్పుట జరిగింది. ఇంకొక విధంగా అర్థమును గ్రహింపకూడని మహాపురుషులు చెడు మాటలు పలుకరు కద?

పిమ్మట ప్రియునివలన ప్రియవాక్యాలు వినతగిన సీత ఇట్టి పరుషవాక్యాలు విని ఏనుగుతొండముచే కొట్టబడిన సల్లకీలత (ఏనుగు భక్షించెడి ఒక తీగె) పాలుకార్చినట్లు కంపిస్తూ కన్నీరు కార్చింది.

## నూటపంతొమ్మిదవ సర్గము

ఇతఃపూర్వ మిట్టి పరుషవాక్యాలు విని ఉండని సీత మహాజన మధ్యంలో రాముని మాటలచే వ్యథితురాలై సిగ్గుపడి మరియూ కుంచించుకునిపోయి కన్నీటిని తుడుచుకొంటూ గొంతు కంపింపగా నెమ్మదిగా భర్తతో ఇట్లు పలికింది. వినుటకు, నేను పడుటకు తగినట్టి కటువైన మాటలను మోటువాడు ప్రాకృతస్త్రీని అనినట్లు నాకు వినిపించావు. రామా! నీవనుకున్నట్లు నేను దుష్టరాలనుకాను, నాసచ్చరిత్రమీద ప్రమాణంచేసి చెపుతున్నాను. నన్ను విశ్వసించు. అందరు స్త్రీలవలె నన్ను చూడతగదు. కొందరు దుష్టస్త్రీలనడవడిక వల్ల స్త్రీ జాతినంతటిని శంకిస్తున్నావు. నా స్వభావం నీకు తెలిసినదైతే అట్టి శంకను విడిచిపెట్టు. 'నీసత్స్వభావ విషయంలో సందేహములేకున్నా రావణుని అంగస్పర్శ కలుగును అను దోషం నీ పరిత్యాగకారణమందువేమో!' రావణ శరీరస్పర్శ నేను వివశురాలనైనపుడు జరిగినదే కాని నా ఇష్టానుసారం జరిగింది కాదు. ఆ అపరాధానికి దైవమే కారణం కాని నేను కాదు. ఇతరులు గ్రహింపవీలుకాని నా స్వాధీనమందు హృదయం ఆ సమయానకూడా నీయందే సంగతమై ఉన్నది. ఇతరులు గ్రహింపవీలయినట్టి శరీరవిషయంలో అస్వతంత్రురాలనగు నేనేమి చేయగలను? ఇంతకాలం నీతో సహజీవనమొనర్చిన నేను నీకర్థం కాకుంటే శాశ్వతంగా నేను నీచే హతురాలనైనట్లే. లంకలో నేనున్నపుడు నన్ను చూచుట కాంజనేయుడు నీచే పంపబడినపుడే నన్నెందువలన విసర్జించలేదు? నీవు నన్ను విసర్జించినట్లు నేనపుడే విని ఉంటే ఇంతకాలం నీ వియోగదుఃఖం నాకు ఉండెడిదికాదు. నీకు నీ మిత్రులగు సుగ్రీవాదులకు,

ప్రాణాపాయకరమగు ఈ యుద్ధప్రయాస లేకపోయెడిది. నీ మిత్రులపరిశ్రమ నిష్ఫలం కాకుండెడిది. నీవు క్రోధ వశుడవగుటచే నన్ను స్త్రీగా మాత్రమే చూశావు. కాని నాశీలాన్ని చూడవైతివి. అయోనిజనై భూమినుండి పుట్టుటను గాని, బాల్య ప్రభృతి నా సుచరితనుగాని నీవు విచారించలేదు. నా బాల్యంలో బాలుడవగు నీచే చేయబడిన పాణిగ్రహణంగాని, నాభక్తిగాని, శీలంగాని, వెనుకకు నెట్టినావు. ఇట్లు గద్గదస్వరంతో కన్నీరు కార్చుతూ మాటలాడిన సీత దీనుడై ఆలోచిస్తూ కూర్చొన్న లక్ష్మణుని చూచి ఇట్లన్నది. 'సౌమిత్రీ! అసత్యాపవాదం పొందిన నేను జీవింపను. చితినేర్పరచు. ఈ దుఃఖమునకదే మందు. మహాజనమధ్యమందు నా సుగుణాలలో ప్రీతిలేనిభర్తచే పరిత్యజింపబడిన నాకు అగ్నిప్రవేశం కంటె గత్యంతరం లేదు.' ఈ విధంగా సీత చెప్పగా దైన్యవశుడగు లక్ష్మణుడు రామునివైపు చూచి రాముని కనుబొమలకదలికలను గుర్తించి ఆతని నిశ్చయాన్ని తెలుసుకుని చితినేర్పరిచాడు. అధోముఖుడై కూర్చున్న రాముని చుట్టూ ప్రదక్షిణాలు చేసిన సీత వెలుగుతున్న అగ్నిహోత్రుని వద్దకు వచ్చింది. దేవ బ్రాహ్మణులకు నమస్కరించి ఇట్లన్నది. 'నా హృదయం ఎల్లపుడూ రామునినుండి విడివడనిదైనచో లోకసాక్షియగు ఈఅగ్ని నన్ను రక్షించుగాక. దుష్టచరిత్రకలిగినట్లు శంకింపబడిన నన్ను శుద్ధచరితగా గుర్తించినచో ఈ అగ్ని అంతటనూ నన్ను రక్షించుగాక! సర్వధర్మజ్ఞుడగు రాఘవుని మనసా, వాచా, కర్మణా, అతిక్రమింపదానినయినచో ఈ అగ్ని రక్షించు గాక! ఆదిత్యుడు, చంద్రుడు, వాయువు, పగలు, రాత్రి, ఉభయసంధ్యలు, భూమి, ఇంకా ఇతర దేవతలు సచ్చరిత్రనుగా గుర్తించిన ఈ అగ్ని నన్ను రక్షించు గాక'. ఇట్లు పలికి అగ్నిహోత్రునకు ప్రదక్షిణం చేసి జాజ్వల్యమానంగా వెలుగుతున్న అగ్నియందు శరీరమందభిలాషలేనిదై ప్రవేశించింది. అచటి మహాజనం భయాకులితమై సీతయొక్క అగ్నిప్రవేశాన్ని చూచింది. బంగారు ఆభరణాలు ధరించి బంగారుఛాయకలిగిన సీతపుణ్య ప్రదమగు ఆజ్యాహుతివలె అగ్నిప్రవేశం చేయడం త్రిలోకవాసులు చూశారు. అధ్వర్యునిచే 'వసోర్ధారా' మన్త్రసంస్కృతమై నిరంతరం స్రవించే ఆజ్యాహుతివలె అగ్ని ప్రవేశమొనర్చిన సీతను చూచిన స్త్రీలందరూ బిగ్గరగా రోదించారు. శపింపబడి స్వర్గమునుండి నరకమున పడుచున్న దేవతనువలె అగ్నిప్రవేశమొనర్చు సీతను త్రిలోకవాసులు చూశారు. సీతాగ్నిప్రవేశసమయంలో గొప్ప హాహాకారం వానరరాక్షసులనుండి వెలువడింది.

**గో.వి.** రావణుడు సీతనపహరింపవచ్చిన దగ్గరనుండి ఇంతవరకు సీత పొందిన దుఃఖం పరమ భాగవతు డగు లక్ష్మణునుద్దేశించి ఆమె రామరక్షణార్థం అతడు వెళ్ళనందులకు పలికిన నిందా(అ.కాం.45.) వాక్య రూపాపచారానికి ఫలం యథార్థంలో రావణుడు వచ్చుసమయాన సీత అగ్నియందు ప్రవేశించుట, మాయాసీత రావణాపహృతయగుట జరిగింది. నిజసీత అగ్నినుండి బయటకు వచ్చుటకు మాయాసీత అగ్నిప్రవేశం చేసిందని అంటారు.

## నూటఇరవైయవ సర్గము

ధర్మాత్ముడగు రాముడు జనుల హాహాకారాలను వింటూ దుఃఖంతో కంటనీరునిండ కొంతసేపు చింతించినాడు. పిమ్మట కుబేరయమమహేంద్రవరుణత్రినేత్రబ్రహ్మాదిదేవతలు విమానారూఢులై రాముని వద్దకు వచ్చారు. తమ ఎదుట అంజలి బంధమొనర్చి నిలచిన రాముని స్వాలంకృతములైన తమదీర్ఘ బాహువులను ఎత్తి ఇలా పలికారు. సమస్తలోకకర్తవు, జ్ఞానులలో శ్రేష్ఠుడవు, నీవు సీత అగ్ని ప్రవేశం చేస్తుండగా ఎట్లుపేక్షించినావు? దేవగణ శ్రేష్ఠుడవగు నిన్ను నీవు గుర్తించుట లేదేమి?

**మ.వి.** ఆత్మస్వరూపాన్ని వివరిస్తున్నాడు. పూర్వకల్పమందు–లేక సృష్టికి పూర్వం వసువుల మధ్యలో 'ఋతధామా' అను వసువవు. త్రిలోకాలకు ద్వారకర్తవు. స్వయంప్రభుడవు. రుద్రులలో 8వ రుద్రుడవు. 'మహాదేవు'డవు. పండ్రెండుగురు సాధ్యులలో 5వ వాడగు 'వీర్యవంతు'డవు. ఇక రాముని విరాడ్రూపునిగా వర్ణిస్తున్నారు. అశ్వినీదేవతలు నీకు చెవులు, సూర్యచంద్రులు నీకు చక్షువులు, లోకాల ఆద్యంతాలలో నీవు కనుపిస్తావు. ఇట్టి నీవు ప్రాకృతమనుష్యుని వలె సీత అగ్నిప్రవేశం చేస్తుండగా ఉపేక్షించితి వేమి?

బ్రహ్మాదిదేవతలిట్లడుగగా బ్రహ్మముఖమున తనస్వరూపగుణవిభూతిని తన వారి ఎదుట ప్రకటింప జేయుటకు ఇట్లు చెపుతున్నాడు. నేను దశరథపుత్రుడను రాముడనని, మనుష్యుడనని అనుకొంటున్నాను. నా స్వరూప మెట్టిది? ఎవరివాడను? ఎందులకు పుట్టితిని?

**గో.వి.** రావణసంహారం జరిగినందున ఇపుడు నిజస్వరూపం బహిర్గతమయినా నష్టముండదు. కావున నిజస్వరూపప్రకటనకు అనుమతించాడు.

ఇట్లు పలికిన రామునితో బ్రహ్మ "భవాన్నారాయణో దేవః శ్రీమాన్ చక్రాయుధో విభుః, ఏకశృంగో వరాహస్త్వం భూతభవ్యసపత్నజిత్" (120. 131/2).

**గో.వి.** 'యోఽహం?' నా స్వరూప మెట్టిదను రాముని ప్రశ్నకు బ్రహ్మ చెపుతున్నాడు – ఉదకములే స్థానంగా కలవాడవు. సముద్రశయనుడవగు నారాయణుడవు. పొందబడిన సమస్తకామములు కలవాడగు ఆ నారాయణునకు జగద్వ్యాపారం కుదరదు కదా? అనగా 'దేవః' క్రీడించువాడు కావున దేవుడు. పరిపూర్ణుడైనా లీలయే వ్యాపార ప్రయోజనం. 'శ్రీమాన్' నిత్యశ్రీయుక్తుడు 'చక్రాయుధః' అసాధారణ చక్రాయుధం కలవాడు. స్వరూపవైలక్షణ్యాన్ని చెపుతున్నాడు. 'విభు'ః వ్యాపకుడు. రక్షకత్వం తెలుపుతున్నాడు 'ఏకశృంగో వరాహస్త్వం' ప్రళయసమయాన భూమి సముద్రంలో మునుగగా వరాహరూపం ధరించి భూమిని ఉద్ధరించినవాడు. "ఉద్ధృతాసి వరాహేణ....."(తై.తై.ఆ.10.1) అని వేదం చెపుతున్నది. అనిష్టనివర్తకత్వాన్ని చెపుతున్నాడు. 'భూత భవ్య సపత్నజిత్' వెనుకటి శత్రువులు మధుకైటభాదులు, ఉత్తరకాలిక శత్రువులు శిశుపాలాదులు వారిని జయించువాడు.

**మ.వి.** స్వరూపప్రశ్నకు సమాధానం చెపుతున్నాడు. 'నారాయణః' నరుల సమూహం నారం. వారు పొంద దగినవాడు నారాయణుడు. 'దేవః' స్వయంప్రకాశకుడు 'ఏకశృంగో వరాహః' ఆది వరాహం ఒకే కొమ్ము కలిగి ఉండుట స్కాందపురాణమందు చెప్పబడింది. 'ఒకే పంటితో పర్వతాలను చలింప చేయుటచే ఒకే దంతంయొక్క సిద్ధి కొరకు దేవతలు స్తుతించగా ఒకే శృంగం కలిగిన వరాహంగా మాధవుడాయె'నని 'భూతభవ్యః' భూత భవిష్యత్కాలాత్మకుడు. "అక్షరం బహ్మ సత్యం చ మధ్యే చాఽంతే చ రాఘవ. లోకానాం త్వం పరో ధర్మో విష్వక్సేన శ్చతుర్భుజః" (యు.కాం.120.141/2).

**గో.వి.** ఇపుడు సర్వవిద్యాస్వరూపునిగా చెపుతున్నాడు. నీవే 'అక్షరం' నాశం లేనిది కావున అక్షరం. వ్యాపించునది కావున అక్షరం. ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదంతి. (బృ.హ.ఉ.5.8.8.) 'బ్రహ్మ' వృద్ధి నొందింప

చేయువాడు. 'సత్యం' అస్తి (ఉన్నది), జాయతే (పుట్టినది), పరిణమతే (పరిణమించు చున్నది), వివర్ధతే (వృద్ధినందు చున్నది), అపక్షీయతే (క్షీణదశనందుచున్నది), వినశ్యతి (నశించుచున్నది) ఇవి ఆరు షడ్భావవికారాలని చెప్పబడు శరీరధర్మాలు. అవి లేనివాడు. 'మధ్యే చాఽంతే చ' ఇచట చకారమాదిపదసూచకం ఆది మధ్యావసానముల యందుండువాడు అనగా నిత్యుడు. 'లోకానాం పరో ధర్మః' సమస్త లోకములకు శ్రేయస్సును సాధించుట కాధారభూతుడు. 'విష్వక్సేనః' సర్వగతసేన కలిగినవాడు సర్వస్వామి. 'చతుర్భుజః' ఒకే పర్యాయం నాలుగు పురుషార్థాలను ఇచ్చువాడు.

**మ.వి.** 'అక్షరం' నాశరహితమగు పరబ్రహ్మ 'తదక్షరం యస్య యోనిం పరిపశ్యన్తి ధీరాః' సర్వ జగత్కారణ మయినదే అక్షరమని శ్రుతి వచించింది. 'సత్యం' తత్వభూతం త్రికాలాబాధ్యం 'మధ్యే చాంతే చ' ఆది మధ్యావసానములలో ఉండునది. 'పరో ధర్మః' శమదమాదులు గొప్పధర్మాలు ఎట్లన శమదమాదులు కలవానికే భగవత్ప్రాప్తి కావున ధర్మస్వరూపుడు. 'విష్వక్సేనః' అన్నిచోట్ల వ్యాపించి ఉన్న సేనకలవాడు. 'చతుర్భుజః' శత్రునిరసన సమర్థములగు నాలుగు బాహువులు కలవాడు.

"శార్ఙ్గధన్వా హృషీకేశః పురుషః పురుషోత్తమః, అజితః ఖడ్గధృద్విష్ణుః కృష్ణశ్చైవ బృహద్బలః"(120. 16)

**గో.వి.** శార్ఙ్గధన్వా శార్ఙ్గమను ధనువు కలిగినవాడనుటవలన రక్షణ చేయుటకాయుధం కలిగి ఉండుట చెప్పబడింది. 'హృషీకేశః' ఇంద్రియాలకు నియంత, సర్వేంద్రియాలను ఆకర్షించు దివ్యవిగ్రహుడు. 'పురుషః' అనేకం ఇచ్చువాడు. లేక హృదయమగు గుహయందు శయనించినవాడు, లేక పురాతనుడు. కావున పురుషుడు. "పూర్వమేవాహమిహాసమితి తత్పురుషస్య పురుషత్వం. (తై.త్తి.ఆ.1.23-4) నేను సర్వగత నిత్య స్వరూపుడనై పూర్వంనుండి ఇచటనే ఉంటిని" ఇట్లు పలుకుట వలననే పరమాత్మకు పురుషుడను పేరు వచ్చింది. 'పురుషోత్తమః' "యస్మాత్క్షరమతీతోఽ హమక్షరాదపి చోత్తమః, అతోఽ స్మిన్ లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః" (భ.గీ. 15-18) సంసారవృక్షరూపక్షరంకంటే, సంసారవృక్ష బీజరూపాక్షరంకంటె ఉత్తముడు కావున పురుషోత్తముడు. లేక పురుషులలో ఉత్తముడు. 'అజితః' ఎవరి చేతను జయింపబడనివాడు. ఆశ్రయించు వారిని రక్షించుటలో ఎపుడు భంగపడని వాడు. 'ఖడ్గ ధృతీ' నందకమను ఖడ్గం ధరించువాడు. 'విష్ణుః' సర్వ వ్యాపకుడు. కనుక ఎవడు ఎచట తన పదములను ఆశ్రయించునో వానినచటనే ఉండి రక్షించువాడు. 'కృష్ణః' కృషిర్భూవాచక శ్శబ్దో ణశ్చ నిర్వృతివాచకః, తథా చ తత్పరం బ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే కృష్ణపదం సచ్చిదానంద స్వరూపుడని చెపుతున్నది. 'బృహద్బలః' గొప్పధారణసామర్థ్యం కలవాడు.

**మ.వి.** 'శార్ఙ్గధన్వా' కాలస్వరూపమైన శార్ఙ్గమను ధనువు కలవాడు. 'హృషీకేశః' ఇంద్రియాలకు అధీశ్వరుడు. 'పురుషః' గొప్ప ఫలముల నిచ్చువాడు. లేక హృత్పుండరీకమందు శయనించువాడు, లేక పూర్ణుడగుటచే పురుషుడు."తేనేదం పూర్ణం పురుషేణ సర్వం" (తై.త్తి.ఆ.10.12) ఆపురుషునిచే ఇదంతా నిండిఉన్నదని శ్రుతి చెపుతున్నది. 'పురుషోత్తమః' నశించు, నశించని పురుషున కంటే ఉత్తముడు. (భ.గీ. 15.18. శ్లోక వ్యాఖ్యానం గో.వి.లో చూపబడింది) 'అజితః' గుణమున గాని, ఐశ్వర్యమున గాని, ఎవరి చేత కూడా జయంపబడని వాడు.

'ఖడ్గధృత్' విద్యామయమైన నందకమను పేరు కల ఖడ్గం ధరించువాడు. 'విష్ణుః' వ్యాపకుడు. 'కృష్ణః' "కృషి......బ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే" సచ్చిదానందరూప బ్రహ్మ స్వరూపుడు. 'బృహద్బలః' గొప్పవగు వానరబలము కలవాడు.

"సేనానీర్గ్రామణీశ్చ త్వం బుద్ధిస్సత్వం క్షమా దమః, ప్రభవశ్చాప్యయశ్చ త్వముపేంద్రో మధుసూదనః"

**గో.వి.** 'సేనానీః' దేవసేనానిర్వాహకుడు, 'గ్రామణీః' దివ్యజనపదాలను పాలించువాడు. 'బుద్ధిస్సత్వం క్షమా దమః' బుద్ధి మొదలగు వాటికి ప్రేరకుడు. 'న దేవా యష్టిమాదాయ రక్షంతి పశుపాలవత్, యం హి రక్షితు మిచ్ఛంతి బుధ్యా సంయోజయంతి తం' రక్షకులగు దేవతలు పశుపాలకులవలె బెత్తం ధరించి వ్యవహరింపరు. ఎవరిని రక్షింపతలచిరో వారి బుద్ధికి ప్రేరకులౌదురు. 'సత్వమును ప్రవర్తింపచేయువాడీ గొప్పవాడగు మహా పురుష'డని శ్రుతి బోధిస్తున్నది. 'ప్రభవః' జగత్తు ఎవని నుండి ఉత్పన్న మగుచున్నదో ఆతడు. సర్వోపాదాన స్వరూపుడు. 'అప్యయః' సమస్త జగల్లయస్థానం. 'కృష్ణ ఏవ హి భూతానాముత్పత్తిరపి చాప్యయః' అను శ్రుత్యర్థానుసారం ఉత్పత్తిలయస్థానమాతడే. 'ఉపేంద్రః' ఇంద్రుని సోదరుడుగా మొదట అవతరించినవాడు. 'మధుసూదనః' వేదాపహర్తయగు మధురాక్షససంహర్త.

"ఇంద్రకర్మా మహేంద్రస్త్వం పద్మనాభో రణాంతకృత్, శరణ్యం శరణం చ త్వామాహుర్దివ్యా మహర్షయః"

**గో.వి.** 'ఇంద్రకర్మ' ఇంద్రుని కర్మ వంటి కర్మకలవాడు. 'మహేంద్రః' నిరతిశయైశ్వర్యం కలవాడు. 'పద్మనాభః' పద్మం నాభియందు కలవాడు నాకు (బ్రహ్మకు) కూడా తండ్రి. 'రణాంతకృత్' యుద్ధంలో శత్రువులను నాశనం చేయువాడు. 'శరణ్యం' శరణం ఇచ్చువాడు. శరణం ఇవ్వడానికి తగిన జ్ఞానదయాశక్తులు కలిగినవాడు. 'శరణం' రక్షకుడు. నీవే శరణ్యుడవు,రక్షకుడవని సనకాదిదివ్యఋషులు చెపుతారు. "యత్ర ఋషయః ప్రథమజా యే పురాణాః" (తై.త్తి.బ్రా.3.7.62) సనాతనులగు వసిష్ఠాది ఋషులు శరణ్యుడవగు నిన్ను పొందుటకు కర్మమార్గము నందు వర్తిస్తున్నారు.

**మ.వి.** 'ఇంద్రకర్మా' ఈశ్వరుని సంపత్తి కలవాడు. 'మహేంద్ర'ః గొప్పవారికి ఈశ్వరుడు. సకల జగత్కారణుడు. 'పద్మనాభః' నాభికమలుడు. 'రణాంతకృత్' యుద్ధమందు శత్రువులను నాశనమొనర్చువాడు. 'శరణ్యం' ఆశ్రయింప తగినవాడు. 'శరణం' ఉపాయభూతుడు.

"సహస్రశృంగో వేదాత్మా శతజిహ్వో మహర్షభః, త్వం త్రయాణాం హి లోకానామాదికర్తా స్వయంప్రభుః సిద్ధానామపి సాధ్యానామాశ్రయశ్చాపి పూర్వజః" (120.20).

**గో.వి.** 'సహస్రశృంగః' సహస్ర వేదశాఖా రూపాలైన కొమ్ములు కలవాడు. వేదస్వరూపుడు. 'శతజిహ్వః' అనేకములగు విధివాక్యాలనే నాలుకలు కలవాడు. (వేదస్వరూపుడు) 'మహర్షభః' కర్మలను గూర్చి ఆలోచించు గొప్పవాడు 'ఆదికర్తా' సమష్టికర్తవు. (ఇట్లు బ్రహ్మ పలుకుట వలన వ్యష్టిసృష్టి కర్తయగు తనకా విశేషణం వర్తించక పోయెను) 'స్వయంప్రభుః' ఇతరులచే ప్రేరేపింపబడనివాడు. "న తస్యేశే కశ్చన" (తై.ఆ.10.1.1) ఆ పరమాత్మ కెవడూ ప్రభువు లేడు. 'సిద్ధానామపి సాధ్యానామాశ్రయః' సిద్ధులనగా ముక్తులు, సాధ్యులనగా యత్ర పూర్వే సాధ్యాస్సన్తి దేవాః (తై.ఆ.3.12.7.) విరాట్పురుషుని పొందుటకు తగినట్టి స్వర్గంలో ఉండే పురాతనులైన

విరాడుపాసకులు 'సాధ్యులు'. అట్టి సిద్ధ సాధ్యులకు సముచిత భోగప్రదుడు. 'పూర్వజః' ఆశ్రితులకొరకు వారిని రక్షించుటకు తత్పూర్వమే అవతరించినవాడు.

**మ.వి.** 'సహస్రశృంగో వేదాత్మా' సహస్ర శాఖాకవేదస్వరూపుడు. 'సహస్రవర్మా సామవేదః' సహస్ర శాఖలు కలిగినట్టి సామవేదస్వరూపుడు. 'వేదానాం సామవేదోస్మి' (భ.గీ. 10.22) తాను సామవేదస్వరూపుడనని భగవానుడు తెలిపినాడు. 'శతజిహ్వః' నిత్యనైమిత్తిక కామ్యకర్మలను చోదనచేయు వేదస్వరూపుడు. 'మహర్షః' మిక్కిలి శ్రేష్ఠుడు. 'ఆదికర్తా' బ్రహ్మాదులను గూడ సృజించినవాడు. 'స్వయంప్రభుః' ఇతరులచే ప్రేరేపింపబడనివాడు ఆరాధకులగు సాధ్యులకు, ముక్తులగు సిద్ధులకు గూడ ఆశ్రయభూతుడు. లేక పొందదగినవాడు 'పూర్వజః' సృష్టికి పూర్వమందున్న వాడు.

"త్వం యజ్ఞస్త్వం వషట్కారస్త్వమోంకారః పరంతపః, ప్రభవం నిధనం వా తే న విదుః కో భవానితి"

**గో.వి.** సర్వకర్మారాధ్యత్వమును చెపుతున్నాడు. "త్వం యజ్ఞః" నీవు యజ్ఞస్వరూపుడవు. యజ్ఞో వై విష్ణుః (తై.బ్రా. 3.1.63). యజ్ఞం విష్ణుస్వరూపం. యజ్ఞనిర్వాహకములగు పశువు, హవిస్సు, ఆజ్యం, సృక్స్రువాదులే శరీరం కలవాడు. యజ్ఞమందు ఆరాధింపబడు ఇంద్రాదిశరీరాంతర్వర్తియగువాడు. అందువలననే గీత యందు 'బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం' (భ.గీ. 4.24.) బ్రహ్మవేత్త యగు వాడు చేయు కర్మ అకర్మయే. అర్పణక్రియ, హవిస్సు, అగ్ని, కర్త, ప్రయోజనం ఈ ఐదూ బ్రహ్మ స్వరూపాలే అని భగవానుడు చెప్పాడు. 'త్వం వషట్కారః' ఇచట వషట్కార పదం ఉపలక్షణం "ఆశ్రావయేతి చతురక్షర మస్తు, శ్రౌషడితి చతురక్షరం య జేతి ద్వ్యక్షరం యేయజామహ ఇతి పంచాక్షరం, ద్వ్యక్షరో వషట్కారః" (తై.సం. 1.6.11) ఈ మంత్రంలోని పదపంచక ప్రతిపాద్యార్థస్వరూపుడు. పైశ్రుతి యందు ప్రతిపాదించిన విధం 4.4.2.5.2 17. అక్షరాలతో ఆరాధింపబడువాడు. ఇదే విషయాన్ని 'చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవ చ, హూయతే చ పునర్ద్వాభ్యాం స నో విష్ణుః ప్రసీదతు', అను స్మృతి వివరించింది. 'ఓంకారః' ప్రణవవాచ్యుడు. "ఓమిత్యేకాక్షరంబ్రహ్మ" (తై.ఆ. 10.) 'ఓం' అను అక్షరం బ్రహ్మం. అదియే సమస్తజగదుత్పత్తిస్థితిలయకారకం. 'పరంతపః' గొప్ప తపస్సుచే ఆరాధింపతగిన వాడు. నీ ఉత్పత్తిలయములు కాని, నీవెవరవను విషయంకాని తెలిసినవాడు లేడు.

"దృశ్యసే సర్వభూతేషు బ్రాహ్మణేషు చ గోషు చ, దిక్షు సర్వాసు గగనే పర్వతేషు వనేషు చ" (120.22)

"సహస్రచరణశ్శ్రీమాన్ శతశీర్షస్సహస్రకృత్, త్వం ధారయ సి భూతాని వసుధాం చ సపర్వతామ్". (120.22)

**మ.వి.** సర్వ భూతాలలో, బ్రాహ్మణులలో, గోవులలో, అంతర్యామిగా భాసిస్తున్నావు. గోబ్రాహ్మణులు సర్వభూతాలలో చేరినవారైనా విడిగా చెప్పుట విశిష్టమయిన వారి ఆవిర్భావస్థానగౌరవ కారణంగా. ఈవిధంగా సర్వజంగమాంతర్వర్తిగా నిరూపించి ఇపుడు స్థావరములయందు అంతర్యామిగా ఉన్నవాడవు నీవే నంటున్నాడు. సమస్తదిక్కులయందు, పర్వతములయందు, వనములయందు యోగులకు నీవే కనుపిస్తున్నావు. పురుషసూక్తాదులీ విధంగా నిన్నే ప్రతిపాదిస్తున్నాయి. సహస్రపాదాలు, సహస్రశిరాలు, సహస్రనేత్రాలు కలవాడవు నీవే. ఇపుడాది

కూర్మరూపునిగా స్తుతిస్తున్నాడు. పర్వతాలతో కూడిన భూమిని-సమస్త భూతాలను, నీవే వహిస్తూ ఉంటివి. ఇపుడు సంకర్షణస్వరూపునిగా స్తుతిస్తున్నాడు. ప్రళయకాలమందు సముద్రంలో మహాసర్పంగా నీవే భాసిస్తున్నావు.

**గో.వి.** ఇచట పురుషసూక్తార్థం చెప్పబడుతున్నది. సహస్రశీర్షా పురుషః...(తై.ఆ.3.12-1) వేయి శిరస్సులు, నేత్రాలు, పాదాలు కలవాడవు. 'శత శీర్షః' ఇచట శతశబ్దం సహస్రవాచకం. 'శ్రీమాన్' భూపతివి. హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ (తై.ఆ 3.13.2) లజ్జాసంపదభిమానిదేవతలు నీకు పత్నులు. భూవ్యతిరిక్త మహాభూతాలను, పర్వత సహిత భూమిని ధరించిన వాడవు. ఈ పృథివీ వినాశ సమయాన సమస్తజగమును గర్భమందు ధరించి శేషశాయివై మార్కండేయాదులచే చూడబడినావు.'అంగాన్యన్యా దేవతాః' (తై.ఆ.7.5.1.) పూర్వోక్త దేవతలీ విరాట్పురుషున కంగాలు. దానినిట వివరించుచున్నాడు. చతుర్ముఖుడనైన నేను నీ వక్షాన్ని, నీ నాలుక సరస్వతి, సమస్తదేవతలూ పరబ్రహ్మవగు నీ రోమాలు, నీవు కనుతెరచిన పగలు, కనుమూసిన రాత్రి.

**వ్యా.వి.** 'సంస్కారాః' వేదాలు లోకాలను సంస్కరించునవి. బోధకాలు కాన వేదాలు. ప్రవృత్తి వ్యవస్థాపకాలు అవి నీ నిట్టూర్పులు. "తస్య హ వా ఏతస్య మహతో భూతస్య నిశ్వసితమేతద్యదృగ్వేదః" (బృ. ఉ. 4.4.10.) అను శ్రుతి పరమాత్మనిట్టూర్పులే వేదాలని (వేదములు పరమాత్మనుండి వెలువడినవని) చెపుతున్నది. అవి ఇవి అననేల చిదచిదాత్మకమగు సమస్తజగత్తు నీస్వరూపమే.

**గో.వి.** 'సర్వం ఖల్విదం బ్రహ్మ' (ఛాం.ఉ.3.14.1.) 'తత్త్వమసి' (ఛాం.ఉ.6.13) జీవాత్మపరమాత్మలు ఒకటియే అనే శ్రుత్యర్థం చెపుతున్నాడు. సమస్తజగత్తు నీ శరీరం. అనగా నీచే భరింపబడవలసినది. నీవు జగచ్ఛరీరుడవు. కనుక శరీరగతగుణాలు నీవే అవుతాయి. నీ స్థిరస్థితే భూమి. అగ్నిలోని తాపమే నీ కోపం, చంద్రునిలోని ప్రసాదగుణం నీయొక్క ప్రసాదగుణం.

పూర్వకాలాన నీ పెరుగుదలవలన భూలోకం, భువర్లోకం, సువర్లోకం మూడులోకాలూ ఆక్రమింపబడినాయి. బలిచక్రవర్తిని బంధించి మహేంద్రుని త్రిలోకాలకు ప్రభువుగా చేశావు. తానెందుకవతరించితి నన్న ప్రశ్నకు బ్రహ్మ సమాధానమిస్తున్నాడు. సీతయే లక్ష్మి, నీవే విష్ణుడవు, దేవుడవు. రావణవధకొరకు మనుష్యదేహంలో ప్రవేశించావు. నీవే కృష్ణుడవు (భవిష్యదవతార కథనం చేయబడింది) 'దేవః' ప్రకాశకుడవు. కృష్ణవర్ణం కలవాడవు. ప్రజాపతి స్వరూపుడవు. దేవతలమగు మాయొక్క రావణవధరూపప్రయోజనాన్ని పూర్తిచేశావు. రావణుడు హతుడైనాడు. సంతోషంగా స్వల్పకాలం రాజ్యం పాలించి స్వర్గాన్ని ఆక్రమించు. నీ బలవీర్య పరాక్రమాలు వ్యర్థం కానివి. నీ దర్శనం ప్రయోజనకారి. ఈ నీ స్తవం సకల మనోభీష్టాలను నెరవేరుస్తుంది.

**గో.వి.** నీ యందు భక్తికలవారు సద్యఃఫలాన్ని, ఇహపరలోకాభిమతాలను అందగలరు. అందువలన ఇతరములగు కర్మోపాసనలకన్న రామభక్తియే పరమధర్మమని చెప్పబడింది. మరణించువరకు ఇహలోకభోగాలను పొంది పరలోకంలో సమస్తకామాలను ఇస్తుంది. మరియూ ఆర్షం వేదోక్తం పురాతనం అగు ఈ స్తోత్రాన్ని కీర్తించు వారికి తిరిగి జన్మం ఉండదు.

**మ.వి.** స్తోత్రపఠనఫలం చెపుతున్నాడు. ఈ స్తోత్రం ఆర్షం ఋషిపదం వేదవాచకం. వేదోక్తసగుణ నిర్గుణ బ్రహ్మవిద్య ఈ స్తోత్రమందు ప్రతిపాదింపబడింది. కావున 'ఆర్షం'. అందువలననే దివ్యం, పురాతనమగు ఇతిహాసాన్ని బ్రహ్మవిద్యాస్తవాన్ని ఎవరు కీర్తిస్తారో వారికి ఇహలోకంలో శత్రుపరాభవం ఉండదు.

## నూటఇరవైయొకటవ సర్గము

బ్రహ్మదేవుడు పలికిన శుభవాక్యాలను రాముడు వినిన పిమ్మట తనవడియందుంచుకొనిన సీతను తోడ్కొని అగ్నిహోత్రుడు చితినుండి బయలువెడలాడు.

**మ.వి.** చతుర్ముఖుడు పలికిన పరమశోభనమగు నిజబ్రహ్మస్వరూపాన్ని ప్రతిపాదించిన వాక్యాలను విని ప్రసన్నుడై శ్రీరాముడుండుసమయాన 'రయిం చ పుత్రాగ్‌శ్చాஉ దాదగ్నిర్మహ్యం' (తై.మం. 1.3.) 'అగ్నిదేవుడు సహధర్మచారిణిని, సంపత్తిని, పుత్రులను నాకిచ్చెను' అని శ్రుతి వచించిన విషయాన్ని ప్రత్యక్షంగా చూపుటకువలె సీతను వడియందుంచుకుని అగ్ని బయలువెడలాడు.

ఆ అగ్నిదేవుడు సృక్స్రువాది చిహ్నాచిహ్నితుడై నిజస్వరూపంతో బయలువెడలి అగ్నిప్రవేశం చేసిన సమయంలో పట్టువస్త్రాలు ధరించి విభూషితయై సుగంధపరిమిళితయై వాడని పుష్పహారశోభితయై యథాపూర్వంగా ఉన్న సీతాదేవితో వెడలి ఆమెను రామునకు సమర్పించాడు. పరమపవిత్రుడు, సర్వజనుల మనోవాక్కాయములతో చేయబడిన పాపపుణ్యాలకు సాక్షాద్ద్రష్ట సర్వదేహాంతర్యామి, వైశ్వానరాగ్నిగా నిత్యప్రతిష్ఠితుడు అగు అగ్నిదేవుడు రామునితో ఇట్లు పలికాడు.

"ఏషా తే రామ వైదేహీ పాపమస్యా న విద్యతే" (121-5)

**వ్యా.వి.** రావణహరణకాలంలో నాలో ప్రవేశించిన ఆమే ఈమె. మాయాసీత అగ్నిలో ప్రవేశించింది యథార్థసీత అగ్నిచే రామునకివ్వబడింది. ఈ విషయం కూర్మపురాణంలో వివరింపబడింది. రావణస్పర్శరూపపాపం మాయా సీతకు సంబంధించినది కావున ఈమెకు లేదు. నీకత్యంతాభిమతయగు సీత నిర్దుష్టయని తెలసికూడా వృత్తరక్షణకొరకు సీతనగ్నిప్రవేశముచేయించిన నీవు వృత్తశౌండీరుడవు. మంచి నడవడిలో పరాక్రమం కలవాడవై నావు.

వైదేహియగు సీత త్రికరణశుద్ధితో మంచినడవడికలదై నిన్నెపుడూ అతిక్రమించి ఉండలేదు. నీవు లేని నిర్జన ప్రదేశమందు పరాక్రమగర్వితుడగు రావణునిచే వివశురాలగు ఈమె నిర్బంధంగా కొనిపోబడి రావణాంతః పురంలో రాక్షసీసంఘంమధ్య రక్షింపబడుతున్నప్పటికీ నీయందే చిత్తముంచినదై నీవే గతియని తలంచింది. నీయందు వ్యాపించిన అంతరాత్మ కలది అగుటచే రావణుని లెక్కించలేదు. పరిశుద్ధురాలగు ఈమెను స్వీకరించు. నేనాజ్ఞాపిస్తున్నాను. ప్రతికూలంగా ఏమీ పలుకవద్దు. అగ్నిదేవుని మాటలు విన్న రాముడు కన్నీటితో ముహూర్తకాలం ఏమి చెప్పాలని, అకారణంగా సీత త్యజింపబడింది కదా? అని విచారించాడు.

**మ.వి.** ఇట అగ్ని దేవుడు 'ఆజ్ఞాపయామి' అన్నాడు. ఇట్లనుట రాముడు తననిజస్వరూపం తెలియనివాని వలె నటిస్తూ ఉన్నందున దానిననుసరించి భగవానుడగు రుద్రుడు, అగ్నిదేవుడు పలికిరని తెలిసికోవాలి.

ధర్మాత్ములలో శ్రేష్ఠుడగు శ్రీరాముడు ఇట్లన్నాడు. రావణాంతఃపురంలో దీర్ఘకాలం ఉండిన సీత పరిశుద్ధురాలు, పాపరహిత అయినప్పటికి, 'రాముడామెను పరిశోధింపకయే స్వీకరించాడు. రాముడు బాలిశుడు, కాముకుడని' మూడులోకాలలో సత్పురుషులు నన్ను గురించి మాట్లాడుకొనేవారు. నాయందే ఆసక్తమైన మనస్సుకలిగి భక్తురాలైన జనకపుత్రికను లోకవిశ్వాసంకొరకు సత్యమునాశ్రయించిన నేను అగ్నిప్రవేశం చేస్తుండగా ఉపేక్షించాను. తన తేజస్సుచే రక్షితురాలగు అగ్నిశిఖవలె జ్వలించు ఈమెను దుర్మార్గుడగు రావణుడు మనసున కూడా స్పృశింపలేడు. నాకంటే భిన్నురాలు కాని ఈమె రావణైశ్వర్యమును స్వీకరిస్తుందా? మూడులోకములలోనూ పరిశుద్ధురాలగు ఈమెను బుద్ధిమంతుడు స్వకీర్తిని విడువజాలనట్లు నేను విడువజాలను. లోకపూజ్యులగు మీయొక్క హితవాక్యాలను నేను తప్పక స్వీకరించాలి. ఇట్లు పలికి ప్రియురాలిని కూడినవాడై సుఖం పొందాడు.

## నూటఇరవైరెండవ సర్గము

ఈ మాటలు వినిన పరమేశ్వరుడు ఇలా అన్నాడు. 'పుష్కరాక్షా!' కమలనేత్రుడా!

**గో.వి.** 'తస్య యథా కప్యాసం పుండరీకమేవమక్షిణీ' (ఛాం.ఉ.1-66-8) అను శ్రుతిలో 'పురుషః పుండరీకాక్షః' అను స్మృతివాక్యాలు పరబ్రహ్మ వాచకంగా ప్రయోగింపబడినాయి. ఈ పుండరీకాక్షపదాన్ని రుద్రుడు ప్రయోగించుటవల్ల రాముడుగా అవతరించిన విష్ణువే వేదాంతవేద్యుడగు పరబ్రహ్మమని చెప్పుట జరిగింది. సమస్తలోకాల అదృష్టం వల్ల నీచే రావణసంహారం జరిగింది. నీవు దీనుడగు భరతుని ఓదార్చి మీతల్లులను చూచి అయోధ్యయందు రాజ్యమును పొంది మిత్రులను సంతోషపరచి, పుత్రపౌత్రాదిరూపవంశాన్ని స్థాపించి, అశ్వమేధాది మహా యాగానుష్ఠానాదులవలన గొప్పయశం పొంది, బ్రాహ్మణులకు ధనం దానం చేసి, నీవు పదివేల పదివందల సంవత్సరాలు మానవలోకంలో వసింతునని ప్రతిజ్ఞ చేసిన విధంగా రాజ్యం పాలించి స్వర్గానికి వెళ్లు. ఇదుగో నీ తండ్రి దశరథుడు విమానారూఢుడై ఉన్నాడు. ఈ లోకంలో నీకు గురువు. నీ వలన తరింపబడి ఇంద్రలోకానికి ఏగినాడు. లక్ష్మణసహితుడవై ఇతనికి నమస్కరించు.

**గో.వి.** మనుష్యలోకాన గురువనుటను "పితా పుత్రేణ పితృమాన్ యోని యోనౌ" (తై.బ్రా.3.12.9) ఈశ్వరప్రకాశంపొందిన తండ్రి ఆయా జన్మల పుత్రునితో కూడును. పుత్రుడట్టి తండ్రికలవాడవుతాడు.

రుద్రవచనాలను వినిన రాముడు ప్రకాశిస్తూ శుద్ధవస్త్రధారియై ఉన్న తండ్రికి లక్ష్మణసహితుడై నమస్కరించాడు. విమానస్థుడై ఉన్నతాసనమందున్న దశరథుడు మహాసంతోషంతో ప్రాణాధికప్రియపుత్రుని ఆలింగన చేసుకొని వడిలో కూర్చుండబెట్టుకుని ఇట్లు అన్నాడు. 'రామా! నీవు లేని ఆ స్వర్గంగాని, దేవర్షి సమ్మానంగాని, నాకిష్టములు కావు. నిజం చెపుతున్నాను. శత్రువిజేతవు, వనవాసదీక్షపూర్తి చేసుకొనినవాడవు అగు నిన్ను చూడగా మిక్కిలి ప్రీతి కలుగుతున్నది. నీవు వనవాసానికి వెళ్లడానికి కారణమైన కైకేయి మాటలు నాహృదయాన్ని బాధిస్తున్నాయి. ఇట్లు చెపుతూ లక్ష్మణుని ఆలింగనం చేసుకొని ఇట్టి నిన్ను చూచి ఇపుడు దుఃఖంనుండి విముక్తుడనైనాను. సుపుత్రుడవగు నీవలన తరించాను. ఓ పురుషోత్తమా! రావణవధార్థమై దేవతలచే పట్టాభిషేకవిఘ్నం చేయబడినట్లు ఇపుడే తెలుసుకున్నాను.

**గో.వి.** పురుషోత్తమా! అనే సంబోధనవలన విష్ణువే రామరూపంలో మానవుడుగ అవతరించిన విషయం దశరథునకు తెలిసినట్లు సూచింపబడింది.

ఇంటికి తిరిగి వచ్చిన నిన్ను చూచి కౌసల్య మహానందం పొందుతుంది. ఆమె కృతార్థురాలు. అయోధ్యా నగరవాసులు పట్టాభిషిక్తుడవగు నిన్ను చూడగలరు. వారు కృతార్థులు దశథునికి రాముడు నమస్కరించి ఇట్లు పలికాడు. 'కైకేయిభరతులవిషయంలో ధర్మజ్ఞుడవగు నీవు అనుగ్రహం చూపించు. ఘోరమగు నీశాపం కైకేయిని, ఆమె పుత్రుని పొందకుండు గాక'. రాముని కోరిక మన్నించిన దశరథుడు లక్ష్మణునితో ఇట్లన్నాడు. సీతాసహితుడగు రామునకు శుశ్రూష చేస్తూ ఉండు. అట్లయిన నాకు గొప్పప్రీతికలుగుతుంది. రాముడు ప్రీతుడయిన నీవు యశస్సును, స్వర్గాన్ని పొందగలవు. ఈ ఇంద్రాదిదేవతలు, సిద్ధులు, ఋషులు పురుషోత్తముడగు రాముని పూజిస్తారు. ఇట్లు లక్ష్మణునితో పలికి "ఏతత్తదుక్తమవ్యక్తమక్షరం బ్రహ్మనిర్మితం, దేవానాం హృదయం సౌమ్య గుహ్యం రామః పరంతపః" (122-32).

**గో.వి.** ఈతడు సర్వదేవహృదయాన్తర్యామి. 'వేదానాం' అను పాఠాంతరానికి వేదతాత్పర్యభూతుడు. ఉభయపాఠాలలో కూడా సర్వదేవరూపుడగుటచే సర్వకర్మ సమారాధ్యుడు. 'గుహ్యం' ఉపనిషత్తులచే తెలియ దగినవాడు. 'అవ్యక్తం' భక్తిశూన్యులకు తెలియబడనివాడు. 'అక్షరం' షడ్భావవికారశూన్యుడు అగు పరబ్రహ్మమే రాముడుగా అంతరించాడు. ఈ విషయం బ్రహ్మాదులచే చెప్పబడింది.

సీతతో దశరథుడు ఇట్లంటున్నాడు. రామునిపై కోపం వద్దు. నీ హితంకోరి నీ విశుద్ధిని ప్రకటించుటకు రాముడిలా చేశాడు. భర్తృశుశ్రూషచేయుమని ఆ విషయంలో సహజప్రవృత్తికల నిన్ను ప్రార్థనాపూర్వకంగా నియోగింప నక్కరలేదు. కాని పెద్దవాడనగుటచే చెప్పవలసివచ్చింది. నీకీతడే దైవం. ఇట్లు కుమారునితోను, సీతతోను, పలికిన దశరథుడు విమానారూఢుడై స్వర్గాని కేగాడు.

## నూటఇరవైమూడవ సర్గము

ప్రాంజలియగు రామునితో ఇంద్రుడిట్లు పలికాడు. దశరథుడొనర్చిన పుత్రకామేష్టియాగకాలంలో మేము నిన్ను (విష్ణుదేవుని) దర్శించుట రావణవధతో సఫలమైంది. దానివల్ల ప్రీతులమైన మావలన కాదగు ప్రత్యుపకారం నీవేమికోరెదవో చెప్పు. అప్పుడు రాముడిట్లన్నాడు. 'నా వలన యుద్ధంలో మరణించిన వానరాదులందరూ తిరిగి జీవింతురు గాక, నాకారణంగా మృత్యువును గూడ లెక్కింపక దారాపుత్రులతో విడివడిన వారలందరూ నీ యనుగ్రహంతో తిరిగి కలిసి ఉందురుగాక. ఈ వరం నేను కోరుతున్నాను. వ్రణాదిబాధలనుండి వీరందరూ విముక్తులుకావాలి. ఈ వానరులెచట నివసింతురో అచట అకాలంలో కూడా ఫలములు ఫలించుగాక, నదులు ప్రవహించుగాక' మహేంద్రు డిట్లు సమాధానం చెప్పాడు. నీవు కోరిన వరం చాలగొప్పది. అయినా నేను మాట తప్పను. కావున

**గో.వి.** ఇచట, అచట, విడివిడిగా పడియున్న కాళ్ళు, చేతులు, తోకలు, వీటిని యథాస్థానంలో చేర్చుట, లోకాంతరానికి ఏగిన వారలను తీసుకుని వచ్చుట, ఇట్టి అసంభావితవిషయకమగు నీవు కోరిన వరం గొప్పది.

నీవు కోరినట్లే జరుగును అని ఇంద్రుడనగానే నిద్రనుండిలేచినట్లు యుద్ధమృతులులేచి మరణించిన తమ పునర్జీవనం గురించి విస్మయం పొందారు. వారందరూ రామునకు నమస్కరించారు. వరం సఫలంకాగా సంతుష్టుడగు రాముని స్తుతించిన దేవతలు 'నీవయోధ్య కేగి సోదరులను, తల్లులను కలసి పట్టాభిషిక్తుడవై పౌరులను సంతోషపెట్టు'మని పలికి స్వర్గానికి వెళ్లారు.

**వ్యా.వి.** చైత్రశుద్ధవిదియ విభీషణపట్టాభిషేకం, సీతాప్రాప్తి, దేవతలు వచ్చుట జరిగింది.

## నూటఇరవైనాల్గవ సర్గము

ఆ యుద్ధభూమిలో ఆ రాత్రి సుఖంగా నిద్రించి లేచిన రామునికి ప్రాంజలియగు విభీషణుడు జయమని పలికి నన్నునుగ్రహించి సుస్నాతుడవై ఈ అలంకారాదుల ధరించు. ఈ దాసస్త్రీలు ఉపచారపూర్వకంగా నీకు స్నానం చేయించగలరు. సుగంధద్రవ్యాలు స్వీకరించు అనగా రాముడిట్లన్నాడు. 'సుగ్రీవప్రముఖ వానరులను స్నానంకొరకు పిలువు. ధర్మాత్ముడగు భరతుడు నానిమిత్తమై తపిస్తున్నాడు. ఆతడు సత్యప్రతిజ్ఞుడు. ఆతడు లేక నేనొక్కడనే స్నానం చేయడం, వస్త్రాభరణాలను ధరించడం, వద్దు. ఇక్కడ నుండియే అయోధ్యకేగెద'.

**గో.వి.** 'సత్యసంశ్రవః' సత్యవచనుడగు భరతుడు లోగా 'పదునాలుగవ సంవత్సరం నిండిననాడు నిన్ను నేను చూడనిచో అగ్నిలో ప్రవేశిస్తాను'. అని ప్రతిజ్ఞ చేసిఉన్నాడు. ఆ భరతుడు నేను లేనట్టి రాజ్యాన్ని నిర్వహించువాడు. నేను లేనందున ఆతడు గూడ వనవాసవ్రతానుష్ఠానం నిర్వర్తిస్తున్నాడు. ఆతడుట్లుండగా నేను ఈవ్రతం వదలి స్నానమెలా చేస్తాను? అలంకారాదులెట్లు ధరిస్తాను?

ఇట్లు పలికిన రామునితో విభీషణుడిట్లన్నాడు. అతిదూరస్థమగు అయోధ్యకు ఒక్క పగటికాలమందే నిన్ను చేర్చగలను. కుబేరునియొక్క ఈ విమానం రావణాపహృతమై ఇటనే ఉన్నది. నీ కొరకే ఇట ఉంచితిని. దీని నధిరోహించి శ్రమలేక అయోధ్యకేగగలవు.

**గో.వి.** ఈ విమానం అపహరింపబడినది కాదు. కుబేరుని జయించి తెచ్చినది. కుబేరుడితఃపూర్వం ఇటకు వచ్చినప్పటికీ నీ కొరకు ఉపయోగపడును కావున అతడికివ్వబడలేదు. ఇది మేఘంవలె మహావేగంగా పయనింప గలదు.

నా గుణాలు నీవు స్మరించినట్లయితే నన్నునుగ్రహించి సీతాలక్ష్మణసైన్యసమేతుడవై రెండుమూడు దినాలు ఇట నివసించి నాచే పూజింపబడి పిమ్మట అయోధ్యకేగ గలవు. విభీషణుడిట్లు పలుకగా రాముడు నీసహాయం వలన, పౌరుషం వలన, అన్ని విధాల పూజింపబడినాను. నీమాటను అంగీకరించలేను. చిత్రకూటపర్వతానికి వచ్చి నన్ను అయోధ్యకు తీసుకుని పోగోరిన భరతుని, తల్లులను, ప్రజలను చూడాలని నామనస్సు తొందర పడుతున్నది. పదునాలుగు సంవత్సరాల వనవాసప్రయోజనం నెరవేరిన పిమ్మట ఈ లంకలో నివసించుట ఏ విధంగా కూడా సమ్మతం కాదు. కాబట్టి నీవు అనుమతించు. నీచే పూజితుడనైనాను, కోపపడకు. వేగంగా మమ్ము అనుమతించు. రాముని మాటలు విన్న విభీషణుడు పుష్పకవిమానం తోడ్కొని వచ్చాడు. ఆ విమానం

మంటపాలతో అవాంతరగృహాలతో, ధ్వజాలతో స్వర్ణ రజత ఆభరణాలతో భూషితమై ఉన్నది. విమానం తెచ్చి ఆ విషయం రామునికి విభీషణుడు నివేదించాడు.

## నూటఇరవైయైదవ సర్గము

పిమ్మట విభీషణుడు గౌరవంగా ఏమి చేసెదనని రాముని అడిగాడు. రాముడిట్లన్నాడు. 'విభీషణా! భూషణాల చేత, రత్నాలచేత, ద్రవ్యాలచేత వనచరులను పూజించు. దేవతలకుగూడ జయింపసాధ్యపడని ఈ లంక యుద్ధమందు వెనుకకు మరలని ప్రాణభయరహితులగు వీరివల్ల జయింపబడింది. కార్యం నిర్వర్తించిన వీరిని సన్మానించు. కృతజ్ఞుడవగు నీచే సమ్మానితులగు వీరు సుఖం పొందగలరు. ధనప్రదానం ద్వారా మిత్రులను సంపాదించు నిన్ను దయామయుడని, త్యాగి యని గుర్తిస్తారు. అందువల్ల నీకిట్లు బోధిస్తున్నాను. సైనికులు ఔదార్యాది గుణరహితుడు, హింసాపరుడు, ప్రసాదగుణం లేక నిరంతరక్రోధయుక్తుడు అగు రాజును యుద్ధసమయాలలో విసిగి త్యజిస్తారు.' ఇట్లు రాముడు చెప్పగా ఎవరికి తగినట్లు వారికి విభీషణుడు సన్మానం చేశాడు. వానరసన్మానానంతరం విమానముపై సీతను ఎక్కించడానికి మరొక స్త్రీ అచట అపుడు లేనందున ఆమె సిగ్గు పడుతూ ఉండగా ఆమెను వడియందుంచుకొని రాముడు పుష్పకం అధిరోహించాడు. రాముని ధనుస్సును ధరించిన లక్ష్మణుడు కూడా విమానమధిరోహించాడు. విమానంనుండి సుగ్రీవవిభీషణాదులతో రాముడిట్లు పలికాడు. 'వానరోత్తములారా! మిత్రకార్యం నిర్వహించారు. మీకనుజ్ఞనిస్తున్నాను యథేచ్ఛగా వెళ్లండి.

"సుగ్రీవా! ధర్మానికి కట్టుబడి స్నేహితుడు చేయతగిన సమస్తమూ చేశావు. సైన్యసమేతుడవై కిష్కింధ కేగు. విభీషణా! నీ రాజ్యంలో నివసించు. నిన్ను జయించుటకింద్రాదులు గూడ శక్తులు కారు. అయోధ్యకు వెళతాము. మీరందరూ అనుమతించండి," రాముని మాటలు విని విభీషణుడు, వానరులు ఇట్లన్నారు. అయోధ్యకు మేము కూడా వస్తాము. జనపదపీడ కలుగకుండా జాగరూకులమై ఉంటాము. నీపట్టాభిషేకం వీక్షించి స్వస్థానాలకు వెళతాము. రాముడిట్లన్నాడు. నాకు సీత ప్రాప్తించుట ప్రియం, భరతదర్శనం ప్రియతరం, మీతో కలసి అయోధ్యాప్రవేశం ప్రియతమం. సుగ్రీవా! మీరందరూ వేగంగా విమానమధిరోహించండి. విభీషణా! నీ మంత్రులతో విమానమధిరోహించు' వాళ్లందరూ విమానమధిరోహించిన పిదప కౌబేరపుష్పకవిమానం రామాజ్ఞచే ఆకాశానికి ఎగిరింది. ఇందరధిరోహించినా అందరూ సావకాశంగా కూర్చున్నారు. దివ్యమగు పుష్పకవిమానానికి వలసినంత వైశాల్యం ఇచ్చే సామర్థ్యం ఉంది.

## నూటఇరవైయారవ సర్గము

విమానంనుండి అన్నివైపుల చూస్తూ మైథిలికి రాముడిట్లు యుద్ధభూమిని వర్ణించి చూపాడు. సీతా! కైలాస శిఖరంవంటి త్రికూటశిఖరంపై విశ్వకర్మచే నిర్మితమైన లంకను చూడు. రక్తమాంసాలతో బురదగా చేయబడిన ఈ యుద్ధభూమిని చూడు. నీ కారణంగా నాచే రావణుడిట సంహరింపబడినాడు. ఇచట కుంభకర్ణుడు, ఇచట ప్రహస్తుడు, ఇచట లక్ష్మణునిచే ఇంద్రజిత్తు సంహరింపబడినారు. ఇది నలనిర్మితసేతువు. ఈ సముద్రమధ్యంలో

హిరణ్యనాభుడను పేరు కలిగిన మైనాకపర్వతముంది చూడు. సేతువుయొక్క ఉత్తరదిక్కున కల ఈతీర్థం సేతుబంధమూలప్రదేశమగుటచే 'సేతుబంధ' మను పేర మూడు లోకాలలో పూజింపబడునదై మహాపాతకాలను నశింపజేస్తుంది. "అత్ర పూర్వం మహాదేవః ప్రసాదమకరోత్ప్రభుః" (127-16).

**మ.వి.** 'మహాదేవః' మహత్తర జలం తద్రూపదేవుడనగా సముద్రుడు. లేక పరమేశ్వరుడష్టమూర్తికాన ఆ ఎనిమిది రూపాలలో జలరూపం ఉంది. కావున మహాదేవపదం సముద్రుని చెపుతుంది. సేతుబంధనకు పూర్వం 'ప్రసాదమకరోత్' సన్నిధానంలో ఉండినది. 'దర్శయామాస చాత్మానం సముద్రస్సరితాం పతిః' (బా.కాం. 1-) నీటికధిపతియగు సముద్రుడు రామునకు దర్శనమిచ్చాడు.

**గో.వి.** ఇంత వరకు లంకనుండి సేతుబంధ పర్యంతం చెప్పి పిమ్మట దర్భశయనస్థానం చూపుతున్నాడు. ఇచట 'మహాదేవ' పదం ఔచిత్యానుసారం సముద్రరాజును చెపుతున్నది. ప్రభువనగా సముద్రజలములకు అధిష్ఠాతృదేవత. దర్శనమివ్వని కారణంగా 'సాగరమునెండ బెట్టెద'నని కోపించిన నాకు 'ప్రసాదమకరోత్', ప్రసన్నుడయ్యాడు. ఇచట మహాదేవుడన రుద్రుడే యని చెపితే రామునికి రుద్రుడెపుడూ ప్రసన్నుడయిన విషయం ఇంతకుముందు చెప్పబడలేదు కావున అట్లనుట సమంజసం కాదు. ఇట జరిగిన విషయాలనే రాముడనువదించి చెపుతున్నాడు కద? అని-ఇచట మరొక సందేహం. 'యుద్ధసమయాన వర్ణితం కాని అంగదకృత 'వికట' వధను ఇట రాముడు వర్ణించాడు. కావున వెనుక చెప్పబడకపోయినా రుద్రప్రసాదం రామునకు సంభవించి ఉండు'నని-అట్లు వీలులేదు. ఎందుకంటే వికటవధా కథాకథనంవలన కథావిరోధంలేదు. కాని ఇట కథా విరోధం సంభవిస్తుంది. ఎట్లన రుద్రానుగ్రహం (ప్రసాదము) (1)సేతునిర్మాణకాలంలో జరిగిందా లేక (2) తిరిగి వచ్చునపుడు సంభవించిందా? మొదటిది కుదరదు. రుద్రప్రసాదం రావణవధ కొరకు కాదు కద? అపుడు సముద్రం దాటుటే విషయం. సముద్రుని అనుగ్రహంతో సేతుబంధనం జరుపబడ బోవుతున్నది. మహాదేవపదం సముద్రుని చెపుతున్నందున సముద్రానుగ్రహం అక్కడ చెప్పబడియుండుట వలన – అపుడు రుద్రప్రసాదకల్పన అక్కరలేదు. ఇక రెండవ పక్షం. తిరిగివచ్చునపుడు అనునది కూడ కుదరదు. మూలమందు "అత్ర పూర్వం" అని ఉంది. పూర్వమే జరిగి ఉండాలి? పూర్వమనగా పూర్వకల్పంలో అనడం కూడా కుదరదు. ఇతఃపూర్వం బ్రహ్మాదిదేవతల వద్ద నన్ను నేను మనుష్యునిగ భావిస్తూ ఉన్నానని చెప్పిన రాముడు పూర్వకల్పంలోని సేతుబంధనసమయాన్ని గూర్చి ప్రసంగించుట అనుచితం. కాక పూర్వ కల్పనిర్మిత సేతువు నిలచిఉంటే తిరిగి సేతుబంధనం చేయనవసరమే లేదు కద? కాన పూర్వకల్పమని చెప్పడం వీలుకాదు. అంతే కాక ఇచట 'అత్ర' అని ఉండుటవలన పూర్వం పేర్కొనబడిన నళసేతువు ఈపదంతో పరామర్శితమవుతుంది. కావున పూర్వకల్పసేతుప్రసక్తి అనుచితం. ఇచట మరొక సందేహముంది. కూర్మ పురాణానుసారం ఇచట రుద్రుడనే అర్థం స్వీకరించాలి. సేతువు మధ్యలో మహాదేవ లింగప్రతిష్ఠ చేసిన శ్రీరాముడు ఆ లింగాన్ని పూజించాడు. అపుడు పార్వతీసహితుడగు మహాదేవుడు ప్రత్యక్షమై ఇట్లు వరమిచ్చాడు. 'నీచే ప్రతిష్ఠింపబడిన ఈ లింగదర్శనం చేసినవారికి మహాపాతకాలు నశిస్తాయి. ఇతర పాపాలు మహోదధి సమీపంలోని లింగమును దర్శిస్తే నశిస్తాయి. ఈ సేతువున్నంత కాలం అదృశ్యుడనై నేనిచటనే నివసిస్తాను. ఇచట జరిపిన స్నాన, దాన, జపాదులు అనంత ఫలాలనిస్తాయి. ఈ లింగాన్ని స్మరించిన మాత్రాన ఆ రోజు చేసిన పాపాలు నశిస్తాయి. ఇట్లు పలికిన మహాదేవుడు రాముని ఆలింగనం చేసుకొని అచటనే అంతర్ధానమయ్యాడు. అట్లే

పద్మపురాణంలో కూడా 'రాముడు పుష్పకం దిగి మహాదేవుని ప్రతిష్ఠించాడు. రుద్రుడు రామునికి ప్రసన్నుడయ్యాడు' అని ఉంది. ఇట్టి పురాణవచనాలు ఈ శ్లోకంలో లింగప్రతిష్ఠను బోధిస్తున్నాయి. అట్లు కాదు ఈ రామాయణం 'వేదః ప్రాచేతసాదాసీత్' అని వేదమయంగా చెప్పబడుటవలన, పురాణాపేక్షయా ఇతిహాసరూప రామాయణం గొప్పదగుట వలన, బ్రహ్మవరమందినదగుటవలన, పురాణాదులకంటే రామాయణం ప్రబలం. కాన రామాయణంతో విరోధించిన తామసపురాణవచనాలు ప్రమాణాలు కావు. అయితే పురాణం సృష్టిస్థితి విషయాలను ప్రతిపాదించే అన్యవిషయకం. జరిగిన దానిని చెప్పుటలో ఇతిహాసం వంటిది కాదు. మరొక పక్షాంతరం. ఉదారి ప్రభృతులు ఈ సర్గలోని శ్లోకాలు వెనుక-ముందు పఠింపబడినట్లు చెప్పినారు. అట్లయితే 'అత్ర మండోదరీ' అనే శ్లోకానికి పూర్వమీ 'అత్ర పూర్వం మహాదేవః' అనుశ్లోకం పఠించాలి. అచట మహాదేవప్రసాదమనగా స్వపితృదర్శనమే. అందువలననే భరతుని కడకు హనుమంతుని బంపునపుడు మహా దేవానుగ్రహంవల్ల తండ్రితో నాకు సమాగమం కలిగింది. అని రాముడు అన్నాడు. పురాణవచనాలు మాహాత్మ్య ప్రతిపాదకాలని తెలియాలి- (126-16).

కావున 'మహాదేవ ప్రసాద' పదం రామప్రతిష్ఠిత శివలింగాన్ని, అప్పటి రుద్రానుగ్రహాన్ని చెప్పుట లేదని గోవిందరాజాభిమతం.

ఇచట విభీషణశరణాగతి జరిగింది. అక్కడ కనిపించే పట్టణం సుందరోద్యానయుక్తమైన సుగ్రీవుని కిష్కింధ. ఇచట నాచే వాలి హతుడాయ్యాడు. అపుడు సీత ప్రణయభయం కలదై రామునితో 'సుగ్రీవు భార్యలు తారాదులు, ఇతర వానర భార్యలతో కలసి నీతో కూడినదాననై అయోధ్య కేగనభిలషిస్తున్నాను' అన్నది.

**వ్యా.వి.** సుగ్రీవాదిపరపురుషసన్నిధిలో ఆమె మొదటిసారిగా మాట్లాడడంవలన 'ప్రణయ సాధ్వసా' ప్రేమభయవినయాలతో కూడినదయింది. 'ప్రణతసాధ్వసా'అని పాఠాంతరానికి 'భయం పోగొట్టుకొనుచున్నదై పలికెను' అని అర్థం.

దానికి అంగీకరించి రాముడు కిష్కింధలో విమానం నిలిపి సుగ్రీవునితో ఇట్లన్నాడు. సుగ్రీవా! వానరులందరూ భార్యాయుతులై అయోధ్యకు వత్తురు గాక. అట్లే నీవు గూడ నీభార్యల దోడ్కొని రా. ఆలస్యం చేయకు. సుగ్రీవాజ్ఞను సారం తారాప్రభృతి వానరస్త్రీలందరూ అలంకరించుకుని సీతను చూడవలెననెడి ఔత్సుక్యం కలవారై ప్రదక్షిణంగా విమానం అధిరోహించారు.

**గో.వి.** వానర స్త్రీలు అలంకరించుకొని పరస్పరమాహ్వానించుకొని రావడంలో ఒకదినం గతించినదని అంటారు. విమానం చాల పెద్దది కాన ప్రదక్షిణ చేయడం దుస్సాధ్యం. కావున సవ్యంగా ప్రవేశించిరని మాత్రమే వివక్షితార్థం. విమానం బయలు దేరిన పిమ్మట సీతకు రాముడు మరల ఇలా చెపుతున్నాడు. ఈ ఋష్యమూకపర్వతం మీద సుగ్రీవునితో కలిశాను, వాలిని సంహరిస్తానని ప్రతిజ్ఞ చేశాను. ఇదే పంపాసరస్సు. ఇట నీవిరహకారణంగా విలపించాను. ఇచట శబరి కనిపించింది. ఇచట విస్తృతబాహువగు కబంధుడు నాచే సంహరింపబడినాడు. ఇచట జనస్థానమందు మఱ్ఱిచెట్టు కనుపిస్తున్నది కదా? ఇచటనే నీకారణంగా రావణజటాయుయుద్ధం జరిగింది. ఇచట ఖరాదులు నాచే హతులైనారు. ఇది మన ఆశ్రమం. ఇది సుతీక్ష్ణుని ఆశ్రమం. ఇది శరభంగాశ్రమం. ఇచటికే దేవేంద్రుడపుడు వచ్చాడు. ఇక్కడ విరాధుడు సంహరింపబడినాడు. మనం పదిసంవత్సరాలు ఎక్కడ నివసించామో

ఆ ఋష్యాశ్రమాలు ఇవే. ఇది కులపతి అత్రిమహర్షి ఆశ్రమం. ఇచటనే తాపసియగు అనసూయను నీవు చూశావు. ఇది చిత్రకూటపర్వతం. ఇచటికే నన్ను దోడ్కొని వెళ్ళుటకు భరతుడు వచ్చాడు. ఇచట యమున దూరంగా గోచరిస్తున్నది. ఇదే భరద్వాజాశ్రమం సన్నిహితంగా కనుపిస్తున్నది. ఇది మూడులోకాలలో చరించే గంగ. ఈశృంగిబేరపురంలో గుహుడు కలసినాడు. ఇక్ష్వాకురాజులు యాగానంతరం కీర్తి కొరకు నిర్మించిన యూపస్తంభాలు మాలగా కలిగిన సరయూనది ఇదిగో- ఇదుగో మా తండ్రిగారి రాజధానియగు అయోధ్య. తిరిగి వచ్చుచున్న నీవు ఈ అయోధ్యకు నమస్కరింపుచు. రాముడట్లు చెప్పగా విభీషణుడు, వానరులు గొప్పమేడలతో విశాలవీథులతో ప్రకాశించే అమరావతివంటి అయోధ్యను ఎగిరెగిరి చూచారు.

## నూటఇరవైయేడవ సర్గము

"పూర్ణే చతుర్దశే వర్షే పంచమ్యాం లక్ష్మణాగ్రజః భరద్వాజాశ్రమం ప్రాప్య వవందే నియతో మునిమ్"(127-1)

**మ.వి.** పదునాలుగు సంవత్సరాలు పూర్తి కాగా పంచమినాడు భరద్వాజాశ్రమం చేరినారు. అన్నపుడు ఇలా ప్రతిపాదింపబడుతున్నది. ఫాల్గుణ పూర్ణిమనాడు సువేలారోహణం 'పూర్ణచంద్రుడే దీపంగాకల రాత్రి నడచి'నదనుట వలన, ఫాల్గుణ బహుళ పాడ్యమినాడు యుద్ధప్రారంభం. నాటి రాత్రే నాగపాశబంధం, మోక్షం. విదియనాడు ధూమ్రాక్షవధ, తదియ వజ్రదంష్ట్రవధ, చవితి మకరాక్షవధ (చవితి అకంపనవధ-అని ఉండాలి. ఇది అచ్చు తప్పుకావచ్చు) యథార్థంగా దశమిరోజే కుంభనికుంభీ మకరాక్షవధ. ఏకాదశినుండి లక్ష్మణేంద్రజిద్యుద్ధం. త్రయోదశి ఇంద్రజిద్వధ. 'మూడు అహోరాత్రాలు యుద్ధం చేసి ఇంద్రజిత్తు సంహరింపబడినాడు' అని చెప్పబడింది. చైత్రశుద్ధపాడ్యమినాడు రావణసంస్కారం, విదియనాడు విభీషణపట్టాభిషేకం. తదియనాడు సీతాసమాగమం. 'ఆరాత్రి అట గడిపెన'నుటవలన చవితినాడు ప్రయాణం. కిష్కింధ కేగుట, పంచమినాడు భరద్వాజాశ్రమప్రాప్తి. ఈ పంచమితో 14సంవత్సరాలు పూర్తి అయినాయి. షష్ఠినాడు నందిగ్రామానికేగి జటావిసర్జనం చేసి అయోధ్య కేగుట, సప్తమినాడు పుష్యమీనక్షత్రమందు శ్రీరామపట్టాభిషేకం అని వరుసగా తెలుసుకోవాలి.

**గో.వి.** చైత్ర శుద్ధ పంచమినాడు అయోధ్యనుండి బయలుదేరారు. అది మొదలు 14 సంవత్సరాలు. చైత్ర శుద్ధ పంచమి రాత్రి తమసాతీరంలో, షష్ఠినాడు శృంగిబేరపురంలో, సప్తమినాడు మఱ్ఱి చెట్టు క్రింద, అష్టమినాడు భరద్వాజాశ్రమంలో, నవమినాడు యమునాతీరంలో గడిపిన రాముడు దశమినాడు చిత్రకూటానికి వెళ్లగలరని తెలిసికొని సుమంత్రుడు దశమినాటి సాయంకాలం అయోధ్యకేగాడు. నాటిరాత్రి దశరథమరణం. ఏకాదశినాడు రాజును తైలపాత్రలో ఉంచి ద్వాదశినాడు భరతుని కొరకు దూతలను బంపుట, వారు పూర్ణిమ రాత్రికి కేకయనగరం చేరుట, పాడ్యమినాడు భరతసహితంగా బయలుదేరి నవమి సూర్యోదయసమయాన అయోధ్యలో ప్రవేశించారు. వైశాఖశుద్ధపంచమి వరకు అపరకర్మాచరణం, షష్ఠియందు దహనదేశశోధనం, సప్తమి నుండి దశమివరకు మార్గశోధనం, ఏకాదశినాడు రాముని వద్దకు బయలుదేరుట, ద్వాదశినాడు భరద్వాజాశ్రమనివాసం, త్రయోదశినాడు రామసమాగమం, చతుర్దశీ పూర్ణిమ ప్రతిపత్తులయందు చిత్రకూటనివాసం, వైశాఖబహుళచతుర్థినాడు భరతుడయోధ్య ప్రవేశం ఈవిధంగా మాసాలు గడవగా వైశాఖబహుళపంచమినాడు రాముడు చిత్రకూటంనుండి బయలు దేరుట, అత్రి ఆశ్రమప్రవేశం ఈ విధంగా ఆశ్రమాలలో 10 సంవత్సరముల 11/2 మాసాలు గతించగా, మిగిలిన

కాలంలో పంచవటిలో వసించుచుండగా 13 సంవత్సరాలు గతించాయి. పిమ్మట పదునాల్గవసంవత్సరం చైత్ర మందు సీతాహరణం, వైశాఖమందు సుగ్రీవదర్శనం, ఆషాఢమందు వాలివధ, ఆశ్వయుజమందు సైన్య ప్రయత్నం, ఫాల్గుణమందు వానరప్రాయోపవేశం, ఫాల్గుణ శుద్ధ చతుర్దశి యందు లంకాదాహం, ఫాల్గుణామావాస్య యందు రావణవధ, పాడ్యమినాడు రావణసంస్కారాదులు, విదియనాడు విభీషణాభిషేకం, సీతాప్రాప్తి, దేవతల గమనా గమనాలు, తదియనాడు లంకనుండి బయలు వెడలుట, చవితినాడు కిష్కింధ యందుండుట, పంచమినాడు భరద్వాజాశ్రమవాసం, ఈ కాలనిర్ణయ విషయంలో చెప్పతగిన ఉపపత్తులను ఆయా సందర్భాలలో చెప్పుట జరిగింది. హనుమానుడు వినుచుండగా రావణుడు సీతతో '2' మాసాలు గడువిచ్చుచున్నాననుట ఆమె సాంత్వన కొరకు మాత్రమే. 'మాసం దాటిన నే బ్రతుక' నని సీత అనుట యథార్థంగా సంఘటితమవుతున్నది. మాసమనగా గడచుచున్న ఫాల్గుణమాసమని అర్థం. రావణుడు 10 మాసాలు గడచినవి, ఇక 2 మాసాలు మిగిలినవి అనుట మధుమత్తుడై, అవివేకంతో పలికిన పలుకులు. 'నియతః' నియమింపబడిన కరణత్రయం కలవాడై రాముడు భరద్వాజమహర్షికి నమస్కరించాడు. (127-1).

భరద్వాజమహర్షికి నమస్కరించిన రాముడు భరద్వాజ మహర్షినిట్లడుగుతున్నాడు. అయోధ్యానగరం సుభిక్షంగా, బాధారహితంగా ఉన్నది కద? భరతుడు ప్రజాపాలనమందు సంతుష్టుడై ఉన్నాడు కద? మా తల్లులు సుఖంగా ఉన్నారు కద? ఇట్లు రాముడు ప్రశ్నింప 'సర్వజ్ఞుడైనా తెలియనివానివలె అడుగుచున్నాడ'ని నవ్వుతూ భరద్వాజుడిట్లు తెలిపాడు. మీ ఇంట అందరూ కుశలులై ఉన్నారు. (స్నానం చేయకుండుటచే) మురికి పట్టిన భరతుడు జడలు ధరించి నీరాకను నిరీక్షిస్తున్నాడు.

**గో.వి.** స్నానం చేయకుండుటచే మట్టిపట్టిఉండుట జరిగింది. స్నానం చేయకున్నా నిత్యానుష్ఠానం దీక్షితునివలె గౌణస్నానమాచరించి చేస్తాడు. జడలు ధరించిన వారికి వారుణస్నానం నిషిద్ధం 'ఎట్లో అపరరాత్రములయందు సరయూనదిలో స్నాన మొనర్చును' అనుటవలన అపుడపుడు అట్టి స్నాన మొనర్చెనని సమన్వయపరచుకోవాలి. లేక ఎల్లపుడూ నేల మీద ఆస్తరణములు కూడా లేకుండా శయనించుట వలన కూడ మట్టి పట్టి ఉండుట సంభవిస్తుంది. ఇట్టి భరతుడు నీ పాదుకలను రాజ్యసింహాసనమందుంచి నీ ఆగమనమును ప్రతీక్షిస్తున్నాడు.

రామా! పిత్రాజ్ఞాపాలనచేయుటకు లక్ష్మణసీతాయుతుడవై రాజ్యచ్యుతుడవై నారవస్త్రాలధరించి ధర్మమునే కోరి సమస్తభోగాలను వదలి పదాతివై అరణ్యమున కేగిన నిన్నిపుడు చూచిన నాకు అపుడు దుఃఖం కలిగింది. ఇపుడు దేవకార్యనిర్వాహకుడవై, శత్రువిజేతవై, మిత్రబంధుయుతుడవైన నిన్ను చూచిన నాకు అధికప్రీతి కలుగుతున్నది. పంచవటీవాససమయంలో సుఖమును, సీతాపహరణసమయంలో దుఃఖమును అనుభవించిన నీకు సుఖదుఃఖాలు రెండూ అనుభూతాలే. ఋషిరక్షణార్థం ఖరాదులను నీవు వధించుట వలన నీ భార్యను రావణుడపహరించుట, సుగ్రీవుని సఖ్యం, వాలివధ, హనుమత్ప్రయత్నం, సేతునిర్మాణం, సమిత్రబాంధవంగా రావణవధ, దేవతలు నీకు వరమొసంగుట, ఇవన్నీ తపోబలంతో నేను తెలుసుకొన్నాను. నేను కూడా నీకు వరం ఇస్తాను. ఈ ఆశ్రమాన పూజగ్రహించి, రేపు అయోధ్యకు వెళ్లు. భరద్వాజమహర్షి మాటలను శిరమున గ్రహించిన రాముడు భరద్వాజుని ఈ విధంగా వరం నడిగాడు. 'అయోధ్యకు వెళ్ళు మార్గంలో అకాలమందు కూడా ఫలించు

వృక్షాలు తేనెలు్రస్రవించే ఫలాలు, ఉండుగాక' అని రాముడు కోరగా భరద్వాజుడంగీకరించాడు. అపుడు స్వర్గవృక్షతుల్యములైన వృక్షాలు అపుడు పుష్పించి ఫలించాయి. సంతుష్టులగు వానరులు యథేచ్ఛగా వేలకొలది ఫలాలను భుజించి స్వర్గాన్ని జయించిన వారివలె సంతసించారు.

## నూటఇరవైయెనిమిదవ సర్గము

రాముడాంజనేయునితో ఇట్లన్నాడు. అయోధ్యలో అంతఃపురాన మా తల్లుల క్షేమవార్త తెలిసికో. శృంగిబేరపురమందు గుహునకు నా క్షేమాదికాన్ని తెలుపు. ఆత్మతుల్యుడగు ఆ మిత్రుడు సంతోషం పొందుతాడు. భరతునితో సీతాలక్ష్మణయుతుడనై కుశలినై యున్నట్లు చెప్పు. సీతాహరణంనుండి రావణవధాంతచరిత్రను, మహాదేవప్రసాదాన పితృసమాగమం, వానరవీరులతో, విభీషణునితో కలసి వస్తున్న విషయం చెప్పు. లేనిచో 14సంవత్సరాలు నిండినాయి కాన భరతుడగ్నిప్రవేశం చేయవచ్చు. నీవు నెమ్మదిగా ఈ విషయాలు చెప్పు. ఈ వార్తలు వినునప్పటి భరతుని ఆకార చేష్టలను నీవు తెలుసుకోగలవు. నీవే రాజ్యం పాలించమని నేనన్నచో భరతుడంగీకరించునా? లేదా? తెలుసుకో. ఆతని ఆలోచనలను ముఖచేష్టలద్వారా గుర్తించు. రాజ్యానుభవం ఎవరి మనసును ఆకర్షించదు?

"సంగత్యా భరతశ్శ్రీమాన్ రాజ్యార్థీ చ స్వయం భవేత్"(128-15) ఆతడు చిరకాల పరిచయంవలన రాజ్యమును కోరితే రాజగుగాక. సమస్తభూమినాతడే అనుభవించుగాక.

**గో.వి.** ఇట్లు భరతుని అభిప్రాయం తెలుసుకుని ఏమి చేయుదువనగా. వెనుక సర్వాత్మనా రాజ్యపాలన మంగీకరింపనివాడు అయినప్పటికీ 14సంవత్సరాలు నన్ను విడిచిఉండి ఇపుడు చూచిన సంతోషంతో 'నీవే పట్టాభిషిక్తుడవు కమ్మ'ని నేనినిన అంగీకరించునా? అని రాముని భావం. భరతుడు నా ప్రీతి కొరకు రాజ్యభారం అంగీకరించినాడుకద! 'శ్రీమంతుడు' స్వాభావిక పారతంత్ర్యసంపత్తి కలవాడుగా అగుగాక! సమస్త భూమిని పాలించు గాక! మా తండ్రి నా పట్టాభిషేకం చూడలేక పోయాడు. నేను భరతాభిషేకమహోత్సవం చూచి ఆనందిస్తాను. అందువలననే అయోధ్యాకాండయందు 'శనైర్జగామ సాపేక్షః'.........(అ.కా.) అనిచెప్పబడింది. రాముడు భరతాభిషేకదర్శనాపేక్ష కలవాడు. సమస్తభూమండలాన్ని పాలించుటకు 'రఘువంశసంభవు' డగుటచే సమర్థుడే అగును.

భరతుడు నా సమక్షంలో ఎట్లో రాజ్యము నంగీకరించునా? సర్వాత్మనా ఒప్పుకొనడా? అను విషయం నిశ్చయంగా తెలుసుకొని రాజ్యాభిలాషి అయినచో మేము దూరం రాకముందే నీవు మావద్దకు రాగలవు. ఈ విధంగా రాముడాజ్ఞాపింప ఆంజనేయుడు మనుష్యరూపం ధరించి అయోధ్యకు త్వరితంగా వెళ్లాడు.

**గో.వి.** కొందరిట్లందురు. భరతుని భావం రామునకు తెలిసిననూ రాముడు 'అనురక్తుడగు వానిని గూడ రాజు పరీక్షించాలి' అనే రాజనీతిని లోకాన ప్రవర్తింపజేయుటకు ఇట్లు అతిశంకావచనం పలికాడు. యథార్థంగా తాను హఠాత్తుగా వెళ్ళిన భరతుడు హర్షోన్మత్తకుడగును కాన భరతుని స్థైర్యము కొరకు ముందుగా హనుమానుని బంపాడు. రామాశయాన్ని గుర్తించిన ఆంజనేయుడు రాముడు వచ్చిన విషయం తెలిపి భరతసహితుడై ఎదురు వచ్చాడు.

ఆకాశమార్గంలో చరించు ఆంజనేయుడు ప్రయాగక్షేత్రం దాటి శృంగిబేరపురానికి వెళ్లి గుహునితో రాముని కుశలవార్త చెప్పి సమస్త లోకానికి ఆనందదాయకమగు రామాగమనాన్ని గూర్చి తాను భరతాదులకు చెప్పునవకాశం సంభవించినందులకానందించుచున్న ఆంజనేయుడు చాలా దూరమేగి అయోధ్యకు క్రోసు దూరంలో (రెండు గడియలలో నడువ తగిన దూరంలో) ఆశ్రమమందు రామదర్శనంకాకుండుటచే దీనుడైయున్నట్టి, బహిరింద్రియ నిగ్రహశాలియై జడలు, నారచీరలు, కృష్ణాజినం ధరించి, వాఙ్నియమంతో ధ్యానం చేయుచున్నట్టి, రామపాదుకలను సింహాసనమందుంచుకుని రాజ్యం శాసించుచున్నట్టి, చాతుర్వర్ణ్యప్రజారక్షకుడైనట్టి, కాషాయవస్త్రాలు ధరించినట్టి అమాత్యప్రభృతులతో కూడియున్నట్టి, భరతుని ఆంజనేయుడు చూచాడు.

**వ్యా.వి.** అమాత్యప్రభృతులు కూడా కాషాయవస్త్రాలు ధరించడానికి కారణమేమనగా అట్టి భరతుని చూచిన పౌరులందరూ వస్త్రభూషణాదులను ధరించుటకిష్టపడుటలేదు. భరతుని చూచి నిరాశచెందుతున్నారు. 'నేడు రాముడు రానిచో భరతుడు మనకు దక్కడు. రామవిరహమును సహించలేక మరణించిన దశరథపుత్రుడు కదా ఇతడు?'ఈ విషయాన్ని 'రాజపుత్రం' అను మాట సూచిస్తున్నది. ధర్మం కోసం ఆత్మత్యాగం చేయుటలో తండ్రితో పోలినవాడనే భావాన్ని 'ధర్మవత్సల' అనుమాట సూచిస్తున్నది. రామదర్శనం కానందున ప్రాణత్యాగం చేయనిశ్చయించుకొనిన భరతుని చూచు పౌరుల దుఃఖం (128-33) ఈ శ్లోకంలో సూచింపబడుతున్నది.

రెండవ ధర్మదేవతవలె ఉన్న ధర్మజ్ఞుడగు భరతునితో దోసిలియొగ్గి హనుమానుడిట్లు రామవృత్తాంతం చెప్పాడు. 'నీవు ప్రతీక్షించు రాముడు తాను కుశలియై ఉన్నటుల చెప్పుమన్నాడు. మీఅన్న యగు రాముని కలుసుకోగలవు. రావణుని సంహరించి సీతను పొంది సంపూర్ణ మనోరథుడై మహాబలులగు మిత్రులతో కూడి సీతాలక్ష్మణయుతుడై వస్తున్నాడు' ఇట్లు ఆంజనేయుడు చెప్పగా సోదరవాత్సల్యంకల భరతుడు సంతోషంతో మూర్ఛపొంది క్రిందపడినాడు.

**గో.వి.** హర్షాన్మోహం జగామ 'హ' సంతోషంతో భరతుడు మూర్ఛ పొందాడు. రాముడు వచ్చినాడను వార్త వినినంతనే ఇట్లు మూర్ఛపొందిన భరతుడు రాముడు హఠాత్తుగ వచ్చినపుడేమగును? అని వాల్మీకి'హ' అని విస్మయమందాడు.

కొద్ది సమయానికి మూర్ఛదేరిన భరతుడు ప్రియవాదియగు ఆంజనేయుని ప్రీతియుక్తబాష్పాలతో తడుపుతూ ఇట్లన్నాడు. (మనుష్య రూపం ధరించి ఉన్నా మహాతేజస్సు కలిగిన ఆంజనేయుని చూచి సందేహంతో) 'నీవు దేవుడవా? మనుష్యుడవా? దయతో ఇచటికి వచ్చి ప్రియవిషయకథనం చేసినందులకు పారితోషికంగా పదివేల గోవులను, నూరుగ్రామాలను, సుందరులు సత్కులప్రసూతలగు పదునలుగురు కన్యలను ఇస్తున్నాను'

## నూటఇరవైతొమ్మిదవ సర్గము

'నాకు ప్రభువగు రాముడు అనేక సంవత్సరాలకు పూర్వం వనవాసానికి వెళుతుండగా రాముడు వస్తున్నాడను సంతోషవార్తను విన్నాను. ఇందువలననే 'జీవించి ఉండిన మానవుడు నూరు సంవత్సరాలకయినా ఆనందంపొందు' నని లౌకికోక్తి నాకు యథార్థంగా కానుపిస్తున్నది. రామునకు- వానరులకు కలయిక ఏదేశమందెందుల కెట్లు జరిగింది? వివరంగా చెప్పు'మని భరతుడు పలికాడు.

**గో.వి.** భరతుడిట్లు ప్రశ్నించుటవలన సామాన్యంగా వానరసేనాసన్నాహాన్ని గూర్చి వినియుండెనని తెలుస్తున్నది.

**మ.వి.** ఇట్లడుగుటవలన ముందు నీవు దేవుడవా? లేక మనుష్యుడవా? అని ఆంజనేయునడిగినపుడు తాను సుగ్రీవసచివుడనని సమాధానం చెప్పినట్లు తెలుసుకోవాలి.

ఆంజనేయుని దర్భాసనం మీద కూర్చుండబెట్టి భరతుడిట్లడుగగా ఆతడు రామచరిత్రను పూర్తిగ చెప్పాడు. చెప్పబోయే వృత్తాంతం మీద నమ్మకం కలుగుటకుగాను పూర్వవృత్తాంతాన్ని సంగ్రహంగా అనువదిస్తున్నాడు. నీ తల్లికారణంగా రాముడు నారచీరలు ధరించి వనవాసానికి వెళ్లినది మొదలు రామపాదుకలను నీవు గ్రహించి తిరిగి వచ్చినంతవరకు నీకు తెలిసిన విషయమే. పిమ్మట రాముడు దండకారణ్యానికి వెళ్లి విరాధుని సంహరించి ఋషులకు నమస్కరించి జనస్థానానికి చేరుకొన్నాడు. అచట రాముని కామించిన శూర్పణఖ ముక్కు చెవులను రాముని అనుజ్ఞతో లక్ష్మణుడు ఛేదించాడు. పిదప పదునాలుగువేల రాక్షసులు అక్కడ ఒక్క రామునితో యుద్ధం చేసి మరణించారు.

**వ్యా.వి.** ఇచట జాము(3.గంటల) కాలంలో మరణించారని ఉంది.

మూర్ఛురాలగు శూర్పణఖ రావణునివద్ద కేగింది. మారీచుడు రత్నమయమగు లేడిరూపం ధరించి సీతను ప్రలోభపెట్టాడు. దానిని సీత కిచ్చుటకు దాని వెంట పరువెత్తిన రాముడు బాణంతో దానిని సంహరించాడు. రామలక్ష్మణులు దూరంగా వెళ్ళగా రావణుడు బలాత్కారంగా సీతనపహరించాడు. అడ్డువచ్చిన జటాయువును సంహరించాడు.

**గో.వి.** లక్ష్మణుడు ఎందువలన బయటకు వెళ్ళినది ఆంజనేయుడు చెప్పలేదు. తత్కారణం క్రూరంగా ఉంటుంది. కావున అశ్రావ్యమైన కటువైన విషయాలు చెప్పకూడదు కావున చెప్పలేదు.

సీతనపహరించి కొనిపోతున్న రావణుని పర్వతప్రాంతపు వానరులు విస్మయంగా వీక్షించారు. అంతః పురంలో ప్రవేశపెట్టబడిన సీత రావణవాక్యాలను తృణప్రాయంగా తలచి అశోకవనంలో ఉండింది. రాముడు తిరిగి వచ్చి పర్ణశాలయందు సీతలేకపోగా అగ్నిసంస్కారం చేశాడు. లక్ష్మణయుక్తుడైన రాముడు గోదావరీనదీ తీరస్థ పుష్పిత వృక్షవనమంతా సీతనన్వేషించాడు.

**గో.వి.** పుష్పితవృక్షాలుగల వనమందు సీతను వెతకెననుటచే పుష్పాల మీదగల ఆసక్తిచే సీత అక్కడికి వెళ్ళినదేమోనని రామునకు తోచినదని వ్యంజితమయింది.

ఇది ఉచిత వ్యాఖ్యగా కనిపించుట లేదు. అంతకుపూర్వమే జటాయువు ద్వారా సీత రావణాపహృత అయినదనే విషయం రాముడు వినిఉన్నాడు కద? ఆ మహారణ్యమందు రామలక్ష్మణులు కబంధుని చూచారు. ఆతడి వాక్యానుసారం ఋష్యమూకపర్వతమున సుగ్రీవుని కలిశారు. వారు కలుసుకొనుటకు ముందే వారుభయులకు మానససమాగమం జరిగింది. మనసున పరస్పరస్నేహాన్ని కాంక్షిస్తూ ఉండిరి. క్రుద్ధుడగు సోదరుడు వాలిచే వెడలగొట్టబడిన సుగ్రీవుడు రాముడు పరస్పర ప్రయోజనాలను మాట్లాడుకొన్నారు. వాలిని యుద్ధంలో సంహరించి

సుగ్రీవుని వానరరాజ్యంలో రాముడు స్థాపించాడు. సీతను వెదకింతునని సుగ్రీవుడు ప్రతిజ్ఞ చేశాడు. సీతను వెదకుటకు 10వేల కోట్ల వానరులు అన్నిదిక్కులకు పంపబడినారు. కారణాంతరంగా కాలవిళంబం జరుగుటచే దుఃఖితులమగు మాకు గృధ్రరాజగు సంపాతి సీత రావణాలయమందున్నదని చెప్పాడు. నేను సోదరవానరులదుఃఖం పోగొట్టుటకు నూరుయోజనాల సముద్రం లంఘించి సీతను చూచి ఆమె నుండి గుర్తు కొరకు మణినిగ్రహించి తిరిగి వచ్చి రామునకామణిని సమర్పించాను. సీతావృత్తాంతశ్రవణంతో రామునికి జీవితాశ కలిగింది. నలునిచే సేతువు నిర్మింపబడింది. వానరులు సముద్రం దాటారు. ప్రహస్తుని నీలుడు, రావణకుంభకర్ణులను రాముడు, ఇంద్రజిత్తును లక్ష్మణుడు వధించారు. బ్రహ్మాదిదేవతల వలన, దశరథుని వలన వరములనంది పుష్పక విమానం మీద వానరులతోకూడి భరద్వాజమునిసన్నిధిలో రాముని రేపు నిర్విఘ్నంగా చూడగలవు. ఆంజనేయుని మాటలను విని సంతసించిన భరతుడు 'చాలాకాలానికి నామనోరథం తీరింది' అని అన్నాడు.

## నూటముప్పైయవ సర్గము

భరతుడు శత్రుఘ్నుని ఇట్లాజ్ఞాపించాడు. నగరంలోని మంటపాలను, దేవాలయాలను సుగంధ పుష్పహారాలతో అలంకరించి మంగళవాద్యాలతో పౌరులు అర్చింతురు గాక, సూతులు, వైతాళికులు, వాద్యకుశలులు, వేశ్యలు వీరందరూ రాముని చూచుటకు బయలుదేరుదురు గాక. అపుడు శత్రుఘ్నుడు వేతనమాశింపని అనేక వేల మందిని పనులలో వినియోగించాడు. 'మీరు నందిగ్రామంనుండి అయోధ్యవరకు మిట్టపల్లములను చదునుచేయండి. కొందరు చల్లని నీటితో తడపండి. పిమ్మట పేలాలను పుష్పాలను, అంతటా చల్లండి. పట్టణంలోని గృహాలు సూర్యోదయానికి పూర్వమే అలంకరింతురు గాక, పుష్పమాలికలతో, వెదజల్లబడిన పుష్పాలతో, పంచరంగుల ముగ్గులతో నగరాన్ని అలంకరించండి'.

మరునాడు ప్రాతఃకాలంలో రామభక్త్యతిశయంతో అందరూ బయలువెడలుట చూపబడుతున్నది. దశరథ పత్నులు, మంత్రులు, సైనికులు, వీరి భార్యలు, బ్రాహ్మణులు బయలువెడలారు. మంత్రులగు దృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధికుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడూ, వీరు స్వర్ణాలంకృతగజముల నధిరోహించి సైనికపరివృతులగు వీరులు బయలుదేరారు. అపుడు దశరథుని భార్యలు వాహనములనధిరోహించి కౌసల్యాసుమిత్రలను ముందుంచుకుని బయలుదేరారు. కైకేయితో కూడి నందిగ్రామానికి వెళ్లారు. సంపూర్ణ అయోధ్య నందిగ్రామానికి వెళ్లింది.

**గో.వి.** భరతుడాహ్వానించక పోవడంవల్ల ముందు బయలుదేరని కైకేయి చిట్టచివర బయలుదేరి నంది గ్రామంలో కలుసుకొన్నది. సంపూర్ణాయోధ్యానగరం వచ్చినదనగా నగరప్రజలు వచ్చిరని భావం.

భరతుడు ద్విజముఖ్యులు, వైశ్యముఖ్యులు, పుష్పమాలలు, బూరెలు హస్తమున ధరించినవారు, మంత్రులు, చుట్టూ నడువగా మంగళవాద్యాలు, భేరీనినాదాలు, వందిమాగధుల స్తోత్రపాఠాలు వింటూ, తెల్ల పూలమాలతో అలంకృతమగు పాండురచ్ఛత్రమును, తెల్లని వింజామరలను తీసుకుని ఉపవాసములచే సన్నబడి దీనుడై కృష్ణాజినాంబరధారియై రామపాదుకలను తలమీద ధరించి రామాగమన వార్తాశ్రవణసంతుష్టుడై మంత్రియుతుడై రామునెదుర్కొన బోయాడు. చుట్టూ చూచిన భరతుడు ఆంజనేయునితో ఇట్లన్నాడు. నీవు వానర జాతి సంబంధమగు

చపలచిత్తమును పొందలేదు కదా? రాముడెచటా కనిపించుటలేదు. కామరూపులగు వానరులు ఎచటా కనిపించుట లేదేమి? భరతునకాంజనేయుడిట్లు సమాధానం చెపుతున్నాడు.

**గో.వి.** రాముడు దూరమందుండినా ఆకాశగాములగు వానరులు కానుపించాలి కదా? వారు కామ రూపులగుటచే వానర రూపంలో కనిపించినప్పటికీ రూపాంతరాలలోనయినా కనుపించాలి కద! అది గూడ లేదేమి?

**మ.వి.** ముందు రాముడు భరతుని ఇంగితం తెలుసుకుని మేము కొద్ది దూరంలో ఉండగా మా వద్దకు రావలసినదని చెప్పి ఉండినాడు. ఆంజనేయుడు భరతునకు రామచరితం వినిపించాడు. తిరిగి రాముని వద్దకు వచ్చి రామునకు భరతవృత్తాంతం చెప్పి రామాజ్ఞానుసారం తిరిగి నందిగ్రామానికి వచ్చాడు. అట్టి ఆంజనేయుని వానర సహజచాంచల్యం పొందలేదు కద? అబద్ధం చెప్పలేదు కదా? ఇత్యాదిగా అడిగాడు.

'భరద్వాజానుగ్రహం మూలంగా ఎల్లప్పుడూ, పూలతోను తేనెలొలుకే ఫలాలతోను నిండిన వృక్షాలవలన వానరులు సంతసిస్తున్నారు. అకాలంలో కూడా వానరనివాసస్థానాలలో వృక్షాలు ఫలించునట్లు ఇంద్రునిచే రాముడు వరం పొందాడు. ఆతిథ్యమిచ్చిన భరద్వాజుడు తేనెలు స్రవించే పండ్లు అన్నికాలాలలో ఉండునట్లు వరం ఇచ్చాడు. వానరసేన 'గోమతీ' నదిని, 'వాలుకి' నదిని, దాటి సాలవనంలో ప్రవేశించి ఆ చెట్లను ఊపుతున్నారు. దూరంగా శుద్ధం, దివ్యం అగు కుబేరుని పుష్పకవిమానం కనుపిస్తున్నది. దీనిలో సీతారామలక్ష్మణవిభీషణాదులున్నారు' అని ఆంజనేయుడన్నాడు.

అపుడు స్త్రీ, బాలయువవృద్ధులు 'ఇదుగో' రాముడు వచ్చినాడని బిగ్గరగా కోలాహలం చేశారు. ఆ శబ్దం ఆకాశంలో వ్యాపించింది. అపుడందరూ వాహనాలనుండి దిగి విమానమందున్న రాముని చూచారు. ప్రాంజలియగు భరతుడు సంతుష్టుడై పదునాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని తప్పక వత్తునని చేసిన ప్రతిజ్ఞను యథార్థం చేసిన రాముని కభిముఖుడై పూజించాడు. మేరుపర్వతమందలి సూర్యునివలె విమానమందు ప్రకాశించే అన్న గారికి నమస్కరించాడు. అపుడు రామాజ్ఞానుసారం ఆ పుష్పకం క్రిందకు దిగింది. విమానమెక్కింపబడిన భరతుడు తిరిగి రామునికి నమస్కరించాడు. "తతో లక్ష్మణమాసాద్య వైదేహీం చాభ్యవాదయత్" (130ర-401/2)

**గో.వి.** బహుకాలానంతరం కంటబడిన భరతుని సంతోషంతో రాముడాలింగనం చేసుకొన్నాడు. పిమ్మట లక్ష్మణుడు నమస్కరింపగా ఆతనిని కౌగిలిచే సంతోషపరచి (ఇచట భరతుడు రామసన్నిధియందు లక్ష్మణుడు చేయతలచిన నమస్కారం నిషేధించెనని కొందరందురు) సీతకు గూడ నమస్కరించాడు. 'వైదేహీం చ' అన్నచోట చకారంవలన రామనమస్కారావ్యవహితంగా సీతానమస్కారం చేసినట్లు తెలుస్తున్నది. ఇచట లోగడ 'సీతామాదాయ గచ్ఛత్వమగ్రతో భరతాగ్రజ' (అ.కాం. 55.27) అనుచోట భరతుడే అన్నగా కలిగినవాడని బహువ్రీహ్యర్థం చెప్పబడింది. ఇచట వైపరీత్యం లేదు. బాలకాండలో 'పుష్యమియందు భరతుడు, ఆశ్లేష యందు లక్ష్మణుడు జనించె' నని ఉన్నది. పాయసప్రదానమందు, వివాహమందు లక్ష్మణునకు ప్రాధాన్యం, ఉత్పత్తి విషయంలో పరిహరింపబడింది. లక్ష్మణసంభావనానంతరం సీతానమస్కారం చెప్పబడుటచే సీత రామునకు కొద్దిదూరంలో తారాప్రభృతిస్త్రీలతో కలసి ఉన్నదని తెలుస్తున్నది.

**మ.వి.** లక్ష్మణుని వద్ద కేగి నమస్కరించిన ఆతడిని కౌగిలితో సంభావించి సీతకు నమస్కరించాడు. పిమ్మట మనుష్యరూపధారులగు సుగ్రీవాదులను భరతుడాలింగము చేసుకోగా వారు భరతుని కుశలమడిగారు. అపుడు సుగ్రీవునితో భరతుడిట్లన్నాడు. 'మా నలువురుసోదరులకు నీవు ఐదవ సోదరుడవు. స్నేహపూర్వక ఉపకారంవల్ల మిత్రుడవుతాడు. అపకారం చేయుటవలన శత్రువవుతాడు'. 'నీ సహాయం వల్ల దుష్కరమైన కార్యం జరిగింది.' పిమ్మట శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు, సీతకు వినయంగా అభివాదం చేశాడు. పిమ్మట దుఃఖంతో కృశించిన కౌసల్యకు నమస్కరించిన రాముడు 'వెనుక నీ మాట వినక వనవాసం వెళ్లానని మనస్తాపం చెందవద్ద'ని పలికి ఆమెను ప్రసన్నురాలుగా చేశాడు. సుమిత్రకు, యశస్వినియగు కైకేయికి నమస్కరించాడు. తల్లులతో కూడుకొని అందరూ పురోహితుడగు వసిష్ఠునికి నమస్కరించారు. నగర ప్రజలందరూ 'రామా! నీకు స్వాగత'మన్నారు. భరతుడు రామపాదుకలను స్వయంగా రామపాదాలకు తొడిగి దోసిలియొగ్గి ఇట్లన్నాడు. 'రాజా! ఈ రాజ్యం నాచే రక్షింపబడి నీకు నివేదింపబడింది. నేడు నాజన్మ చరితార్థమైంది. అయోధ్యకు తిరిగి వచ్చిన నిన్ను చూచుటచే నా మనోరథం తీరింది. ధనాగారం, ధాన్యాగారం, నీతేజమున నీవు బయలుదేరు సమయమున కంటే పదిరెట్లు పెరిగింది చూడండి. ఇట్లు చెపుతున్న సోదరవాత్సల్యపూరితుడగు భరతుని చూచిన వానరులు తమ జాతియందిట్టి సోదరచరిత్ర లేదుకదా? అను భావం కలవారై ఆనందబాష్పాలు విడచారు. ఇట్టి సోదరులు కూడా ఉందురా! అను ఆనందంతో, తన విషయంలో విపరీతం జరిగినందులకు కలిగిన శోకంతో, విభీషణుడు కన్నీరు కార్చాడు. పిమ్మట రాముడు హర్షంతో భరతుని దగ్గరకు తీసుకుని సైన్యసహితుడై అదే విమానం మీద భరతాశ్రమానికి (నందిగ్రామమునకు) వెళ్ళి అచట విమానమునుండి దిగినాడు. పుష్పకవిమానంతో రాముడిట్లన్నాడు. 'నీకు అనుజ్ఞనిస్తున్నాను. స్వస్థానానికి వెళ్లు'. రాముని అనుజ్ఞపొందిన ఆ విమానం ఉత్తరదిక్కుగా కుబేరస్థానానికి వెళ్లింది. అనురూపుడగు పురోహితునికి నమస్కరించి వేరు ఆసనం మీద ఆతనితో కూడ ఏకకాలంలో రాముడు కూర్చుండినాడు.

## నూటముప్పైయొకటవ సర్గము

**గో.వి.** వసిష్ఠునితో కలసి రాముడు 'భరతుడనుజ్ఞ నివ్వనిది అయోధ్య వెళ్లకూడదని భావించి' నంది గ్రామంలో కూర్చొనిఉండగా పౌరులు, తల్లులు సన్నిహితులైయుండగా ఇంగితజ్ఞుడగు భరతుడు తన హృదయాన్ని అన్నగారికిట్లు నివేదిస్తున్నాడు. రాముడు రాజ్యం పరిగ్రహించుటకు అపరిహార్య హేతువును చూపుతూ భరతుడిట్లన్నాడు.

మా తల్లి పూజింపబడింది. నాకు రాజ్య మివ్వబడింది. నీవు నాకిచ్చినట్లు నేను నీకిస్తున్నాను.

**మ.వి.** నీవు రాజ్యం త్యజించి వనవాసం అంగీకరించుటవల్ల మాతల్లి సంతోషించి పూజింపబడింది. పిమ్మట చిత్రకూటమందు ఈ రాజ్యం నీవు నాకిచ్చినావు. నీవేవిధంగా నాకిచ్చితివో అదే విధంగా నీకిస్తున్నాను. తాత్కాలికంగా నాయందుంచబడిన ఈ రాజ్యం అందుకు భంగం లేకుండా నీకు తిరిగి ఇస్తున్నాను. 'అయోధ్య యందు రాజ్యభోగాలను అనుభవిస్తాను. యథాపూర్వంగా నీవే పాలించ' మనగా ఇట్లు సమాధానం చెపుతున్నాడు.

ఇతర సహాయం అపేక్షింపని బలీయవృషభం మోయతగిన బరువును దూడ మోయజాలనట్లు నేనీరాజ్య భారం వహించలేను. ఇంతకాలమెట్లు మోసితివనగా జలవేగంతో గండ్లు పడిన కరకట్టవలె ఉన్న రాజ్యఛిద్రములను

బంధించుటకు నాకు సామర్థ్యం కలదా? గండ్లుపడిన కరకట్ట గడ్డి, కొమ్మలు, లేక పూడ్చుట సాధ్యపడనట్లు అనేక ఛిద్రములుకల రాజ్యం కూడా మంత్రాంగాన్ని రహస్యంగా ఉంచుట మొదలగు రాజగుణములనెడి ఆవరణంలేక పాలించుట సాధ్యంకాదు. నీవలె నేనందులకు సమర్థుడను కాను. గుఱ్ఱంవలె గాడిద చరించగలదా? హంసగమనం కాకికబ్బునా? 'నా సాయంతో నీవే పరిపాలించు' మందువేమో! అది ఉచితం కాదు.

**వ్యా.వి.** ఇంటిలో ఒకడు చెట్టును నాటగా అది శోఖోపశాఖలుగా విస్తరించి పుష్పించి కూడా ఫలించకయే నశిస్తే చెట్టు నాటిన వ్యక్తి ఏ ఫలాభిలాషతో చెట్టును నాటెనో ఆ ఫలాలను అనుభవించని విధంగా వంశపరం పరాప్రాప్త రాజ్యపరిపాలనార్థమై తండ్రిగారికి జనించి సంవర్ధితుడవై సకల గుణాభిరాముడవైనా పట్టాభిషేక పూర్వక ప్రజాపరిపాలనారూపమగు ఫలం చూపక భక్తులను, భృత్యులను పాలింపవేని ఆ ఫలవృక్షంవంటి వాడవగుదువు– ఇచట వృక్షానికి రామునికి, చెట్టునాటినవానికి దశరథునికి, ఉపమానోపమేయభావం. చెట్టును నాటుటకు పుత్రకామేష్టి తోను, మహాస్కంధమునకు సోదరయుక్తుడగు రామునితోను, కొమ్మలకు సుగ్రీవాది మిత్రగణంతోను, పుష్పాలకు కల్యాణగుణాలతోను, రాజ్యం చేయకుండుటను ఫలాలు లేకుండుటతోను సామ్యం చెప్పబడింది.

**మ.వి.** ఒక గృహయజమానుడు కుటుంబం కొరకు పెంచబడిన వృక్షం పూతపూసి కూడా ఫలింపనిచో అపుడా వృక్షంవల్ల ప్రయోజనం ఉండదు. ఈ విధంగా తండ్రివలన జన్మించి సర్వగుణసంపన్నుడవైన నీవు లోకాన్ని రక్షింపనిచో లోకానికి నీ వలన ఏమి ప్రయోజనం?

ఇపుడభిషిక్తుడవగు నిన్ను మధ్యాహ్నసూర్యుని వలె జగములు చూచుగాక. జ్యోతిశ్చక్రం ఎంతకాలం పరిభ్రమిస్తుందో, ఎంతవరకీభూమి నిలచిఉంటుందో అంతవరకు సమస్తరాజ్యాన్ని పాలించు రాముడపుడు భరతుని ప్రార్థనను అంగీకరించాడు. క్షురకర్మానంతరం భరత, లక్ష్మణ, సుగ్రీవవిభీషణులు సుస్నాతులైన పిమ్మట శ్రీరాముడు కూడా సుస్నాతుడై జటలు శోధింపబడి సాఫు చేయబడగా చిత్రములగు మాలలను ధరించి, సుగంధ వస్తువులచే అనులిప్తుడై, పీతాంబరధారియై శోభాయుక్తుడై ఆసనమలంకరించాడు.

**గో.వి.** 'భరతుని వదలి నేను స్నానమొనర్చ'నని లోగడచెప్పిన రాముడు మొదట భరతునికి, కిష్కింధ నుండి బయలుదేరినప్పటినుండి స్నానరహితుడగుటచే సుగ్రీవునికి, అట్లే లంకనుండి బయలుదేరినప్పటి నుండి స్నానరహితుడగు విభీషణునికి, స్నానాలు జరిపించాడు. ఏతత్కర్మ నిర్వాహకుడు కావున, పూర్వం భరతునివలె వ్రతం స్వీకరించినట్లు చెప్పబడకపోవుటవల్ల శత్రుఘ్నస్నానం చెప్పబడలేదు. సంక్షేప రామాయణంలో 'నందిగ్రామే జటాం హిత్వా భ్రాతృభిస్సహితోఽనఘః' అని చెప్పబడిఉన్నందున శత్రుఘ్నస్నానమర్థాత్సిద్ధం. జటావిశోధన మనగా కేశాలను శుద్ధపరచుట అనేక వర్ణపుష్పయుక్తమాలయగుటచే 'చిత్రమాల్యత్వం' కుంకుమాకర్పూరకస్తూర్యాది సుగంధవస్తు భేదంవలన చిత్రానులేపనత్వం, 'తత్ర' అనుటచే సింహాసనస్థితీ చెప్పబడింది.

పిమ్మట శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు హారాద్యలంకరణ చేయించాడు. సీతకు దశరథపత్నులు స్వయంగా హారాదులనలంకరించారు. పిమ్మట వానరపత్నులందరినీ పుత్రప్రేమకలిగిన కౌసల్య ప్రయత్నపూర్వకంగా నలంకరించింది. పిమ్మట శత్రుఘ్నవచనానుసారం సుమంత్రుడను సారథి సమలంకృతమగు రథం తోలుకొని రాగా ప్రకాశమానమైన ఆ రథాన్ని రాముడధిరోహించాడు. సుస్నాతులు, స్వలంకృతులగు సుగ్రీవాంజనేయులు

అయోధ్యకు బయలుదేరారు. సుగ్రీవపత్నులు, సీతా, అలంకరింపబడినవారై అయోధ్యను చూడడానికి వెళ్లారు. అయోధ్య కేగిన మంత్రులు అశోకుడు, విజయుడు, సుమంత్రుడు, వసిష్ఠునితో రామునకెదురు వచ్చారు. పచ్చటి గుర్రాలు కట్టబడిన ఇంద్రరథంవంటి రథమునధిరోహించిన రాముడు అయోధ్యకు బయలుదేరాడు. భరతుడు పగ్గములు బట్టి సారథ్యం చేశాడు. శత్రుఘ్నుడు గొడుగు పట్టాడు. ముందున్న లక్ష్మణుడు విసనకర్రతో విసరుతూ తెల్లని వింజామర పట్టాడు. విభీషణుడు చంద్రతుల్యమగు మరొక వింజామర ధరించాడు. ఆకాశమందు దేవతలు, ఋషులు, మరుద్గణాలు, రాముని స్తుతిస్తుండగా మధురంగా వినిపించింది. శత్రుంజయమను ఏనుగును సుగ్రీవుడు అధిరోహించాడు. మనుష్యరూపధారులగు వానరులు తొమ్మిదివేల ఏనుగులనధిరోహించి వెళ్లారు. శంఖభేరీనాదాలతో రాముడు అయోధ్యకు వెళ్లాడు. రథికుడగు రాముని సుమంత్రాదులు చూచారు. మహాత్ముడగు రాముని జయశబ్దంతో ఆశీర్వదించి రామునిచే అభినందితులై అనుసరించారు. అమాత్య, సోదర, బ్రాహ్మణ పరివృతుడగు రాముడు నక్షత్రాలతో కూడిన చంద్రునివలె శోభించాడు. మంగళవాద్యాలను, పచ్చని అక్షతలను, మోదకాలను తెస్తున్న సేవకులు, గోవులు, కన్యలు, బ్రాహ్మణులు ముందునడువగా రాముడు తనకు, సుగ్రీవునకు మైత్రి, ఆంజనేయ ప్రభావం, వానరులయుద్ధం, రాక్షసబలం, విభీషణాగమనం వీటిని మంత్రులకు వివరించాడు. ఆ చరిత్ర వినిన అయోధ్యావాసులు విస్మయమందారు. అయోధ్యను ప్రవేశించిన రాముడు తండ్రిగారి గృహానికి వెళ్లి కౌసల్యకు, సుమిత్రకు, కైకేయికి, నమస్కరించి భరతునితో ఇట్లన్నాడు. 'అంతఃపురోద్యానసహితమగు నా గృహాన్ని సుగ్రీవున కిమ్ము' అనగా భరతుడట్లొనర్చాడు. భరతుడు సుగ్రీవునితో 'అభిషేకం కొరకు సముద్రోదకాలు దెచ్చుటకు దూతల నాజ్ఞాపింపు'మని కోరాడు. సుగ్రీవుడపుడు రత్న భూషితములగు సువర్ణ ఘటములను నలువురు వానరులకిచ్చి 'రేపు తెల్లవారు ఝామున నాలుగు సముద్రాల నీళ్లతో మా కొరకు నిరీక్షిస్తూ ఉండాల'ని ఆదేశించాడు. వెంటనే గజసదృశులగు ఆ వానరులు మహావేగంతో ఆకాశమునకుద్గమించి వెళ్లారు. జాంబవంతుడు, హనుమంతుడు, వేగదర్శి, ఋషభుడు, 500నదులనుండి కలశాలతో పవిత్ర జలం తెచ్చారు. సుషేణుడు, ఋషభుడు, (ఈ ఋషభుడు మరొకడు) గవయుడు, నలుడు ప్రాగ్దక్షిణపశ్చిమోత్తరసముద్రజలాలను యథాక్రమంగా తెచ్చారు. ఆ జలాలను శత్రుఘ్నుడు మంత్రులతో కలసి పురోహితుడగు వసిష్ఠునకందజేశాడు.

## శ్రీరామపట్టాభిషేకమహోత్సవం

బ్రాహ్మణసహితుడగు వసిష్ఠుడు ప్రయత్నపూర్వకంగా రత్నమయసింహాసనంపై సీతాసహితుడగు రాముని ఆసీనుని చేశాడు. వసిష్ఠ, వామదేవ, జాబాలి, కాశ్యప, కాత్యాయన, సుయజ్ఞ, గౌతమ, విజయులు,–నిర్మలములు– సకలవేదమంత్రాలతో అభిమంత్రితములగుటవలన అతిపవిత్రములు, సుగంధ యుక్తములు అగు నదీ సముద్రోదకాలతో అష్టవసువులు ఇంద్రుని అభిషేకించినట్లు అభిషేకించారు. పిమ్మట ఋత్విగ్బ్రాహ్మణులచేతను, కన్యలచేతను, మంత్రులచేతను, యోధులచేతను, వణిజులచేతను, అభిషేకింప జేశారు. వసిష్ఠాదులచే పిలువబడిన ఆకాశస్థితులగు నలువురు లోకపాలకులు సమస్తదేవగణాలతో కూడినవారై సర్వౌషధిరసాలతో అభిషేకించారు. శత్రుఘ్నుడపుడు రామునికి శ్వేతచ్ఛత్రం పట్టాడు. సుగ్రీవవిభీషణులు తెల్లనివింజామరలతో వీవసాగారు. ఇంద్ర ప్రేరితుడగు వాయుదేవుడు నూరుకమలాలతో కల ప్రకాశించే బంగారు హారాన్ని, సర్వరత్నాలుకలిగి అత్యున్నత

నాయకమణివిరాజితమైన ముత్యాలహారాన్ని రామునికి సమర్పించాడు. ఆ రామపట్టాభిషేక మహోత్సవంలో దేవ గంధర్వులు పాడారు. అచ్చరలు నృత్యం చేశారు.

**గో.వి.** పూర్వం రాముడు లేనపుడు 'అపి వృక్షాః పరిమ్లానాః' (అయో.కాం 59-9) వృక్షాలు వాడిపోయిన వని చెప్పబడిన స్థితినుండి ఇపుడు రామసంయోగంవల్ల సంతోషం చెందినవని వర్ణిస్తున్నారు. రామపట్టాభిషేక సమయాన భూమిపైర్లతో, వృక్షాలు ఫలాలతో, పుష్పాలు సుగంధంతో కూడి ఉన్నాయి. లక్షగుర్రాలను, నూతనవత్సలతో కూడిన లక్షగోవులను, నూరు వృషభాలను, మూడుకోట్ల బంగారుకాసులను, అనేకాభరణవస్త్రాలను బ్రాహ్మణులకు రాముడు దానం చేశాడు. మణులకూర్చబడి సూర్యప్రకాశం కలిగిన స్వర్ణహారం సుగ్రీవునకిచ్చాడు. వైడూర్య రత్నాలంకృతమైన ముంజేతి ఆభరణాలను అంగదున కిచ్చాడు. మణులతో కూడిన ముత్యాలహారం సీతకిచ్చాడు. నిర్మలమైన వస్త్రాలను, ఆభరణాలను రాముడు సీతకివ్వగా రాముని చూస్తున్న సీత వాటిని ఆంజనేయున కిచ్చింది. తన కంఠంనుండి రామదత్తమగు ముత్యాలహారం తీసి 'నాకు రాముడు ఈ సభలో హారము నిచ్చుట ఎవరికో పారితోషికంగా నాచే ఇప్పించుటకు'అని నిశ్చయించుకొన్న సీత ఈ హారం వీరిలో ఎవరికివ్వాలి? అని ఆలోచిస్తూ వానరులను – రాముని మాటిమాటికి చూచింది. సీతాదేవి అభిప్రాయం గ్రహించిన రాముడిలా అన్నాడు. 'పౌరుషం, పరాక్రమం, బుద్ధి,ఎవనియందు కలవో! ఎవరి విషయంలో నీవు సంతుష్టిచెందినా, వారికీ హారమిమ్ము' అని రాముడనగా సీత ఆంజనేయునకాహారం ఇచ్చింది.

**గో.వి.** సముద్రం దాటుటచే బలపౌరుషాలు, లంకను తగులబెట్టుటచే పరాక్రమం, అశోకవన ప్రవేశంతో బుద్ధి, అన్నివిధాల ఎవనిలో కలవో, నీవెవని విషయాన సంతుష్టురాలవైనావో ఆతనికిమ్మని రాముడు చెప్పాడు. అట్లు కానిచో ఇతరులయొక్క నిందలు సంభవిస్తాయి.

పిమ్మట మైందద్వివిదులకు, నీలునకు, గుణాధిక్యాన్ని గుర్తించి ఆభరణాదులనొసంగాడు. ఇంకనూ వానర వృద్ధులకు, విభీషణ హనుమజ్జాంబవదాదివీరులకు, వారికి యోగ్యమైన వస్త్రాభరణాదులనొసంగాడు. సంతుష్టులగు వారందరూ రామునకు నమస్కరించి యథాస్థానాలకు వెళ్లారు.

"లబ్ధ్వా కులధనం రాజా లంకాం ప్రాయా ద్విభీషణః" (131-84 1/2)

**గో.వి.** కులధనమనగా ఇక్ష్వాకుకులధనమగు శ్రీరంగవిమానమని సంప్రదాయం.

**మ.వి.** ఇచట కులధనశబ్దంచేత పూర్వమే రామానుజ్ఞాతమయిన రాక్షసకులధనమగు లంకను పొంది అని వాల్మీకిమహర్షి గడచిన విషయాన్నే అనువదించారు. కొందరు 'లబ్ధ్వా కులధనం' అనగా ఇక్ష్వాకుకులదైవతమగు రంగవిమానమని వర్ణిస్తున్నారు. అది కుదరదు. ఏమన కులధనమని మాత్రమే మూలంలో ఉంది. కాని 'ఇక్ష్వాకు కులధన'మని లేనందున, రామావతారసమాప్తి సమయంలో విభీషణునికి ఇక్ష్వాకు కులదైవతమగు రంగవిమానాన్ని గూర్చి ఉత్తరరామాయణంలో 'కించాన్యద్వక్తుమిచ్ఛామి రాక్షసేంద్ర మహాబల, ఆరాధయ జగన్నాథమిక్ష్వాకుకుల దైవతమ్' (ఉ.కాం 108.31) అని చెప్పబోతున్నాడు కనుక, పద్మపురాణంలో "ప్రదదౌ తస్మై స్వవిశ్లేషా సహిష్ణవే, శ్రీ రంగసాయినం స్వార్చ్యమిక్ష్వాకుకులదైవతమ్" అని అవతారసమాప్తికాలంలో శ్రీరంగవిమానమిచ్చినట్లు చెప్ప బడింది. కాన ఇచట కులధనమనగా లంకారాజ్యమే చెప్పబడింది.

పిమ్మట దుష్టశిక్షణ చేస్తూ పరమోదారుడగు రాముడు రాజ్యం పాలించాడు. లక్ష్మణునితో ధర్మజ్ఞుడగు రాముడు 'యువరాజపట్టాభిషిక్తుడవై రాజ్యభారం వహింపు' మని నియమించియూ, అనునయించియూ, చెప్పినప్పటికీ ఆతడంగీకరింపనందున భరతుని యువరాజుగా అభిషేకించాడు.

**గో.వి.** 'లక్ష్మణుడా! ఈ రాజ్యం నాతో సహా నీవు పాలింపు' మని లోగడ (అయో.కా.5-43) భరతుడు సమీపాన లేని సమయంలో తాను చెప్పిఉన్నందున 'రామో ద్విర్నాభిభాషతే' (అయో.18.30) రాముడు రెండుమాటలు పలుకువాడు కాదు (ఒకే మాటపై నిలుచువాడు) అను స్వీయప్రతిజ్ఞానుసారం లక్ష్మణుని యౌవ రాజ్యమందు నియోగించాడు. పూర్వరాజులైన మన్వాదులచే అధిష్ఠింపబడి, తండ్రి తాతలచే వహింపబడిన ఈ రాజ్యభారం నాతో సమంగా వహింపుమన్నాడు.

**మ.వి.** తనతోసహ వనవాసదుఃఖాలను అనుభవించినవాడు కాన రాజ్యంలో కూడా తనతో సహ సుఖాల నను భవించుటకు లక్ష్మణుని 'యువరాజపట్టాభిషిక్తుడవు కమ్మ'ని రాముడు కోరాడు. అనునయించి చెప్పినప్పటికి జ్యేష్ఠుడగు భరతుడుండగా నేననర్హుడనని లక్ష్మణుడు నిషేధించినా పునఃపునః రాముడనునయించాడు.

పిమ్మట రాముడగ్న్యాధానపూర్వకంగా క్రతువులనొనర్చి వాజపేయ, పౌండరీక, అశ్వమేధాది మహా క్రతువులను అనేక పర్యాయాలు అనుష్ఠించాడు. పదివేలసంవత్సరాలు రాజ్యపాలన చేసి గొప్పదక్షిణలిచ్చి నూరశ్వమేధ యాగాలు చేశాడు. రాముడు రాజ్యం పాలించినపుడు స్త్రీలకు వైధవ్యం లేదు. సర్ప, వ్యాధి, చోరభయాలు లేవు. అనర్థమెవరినీ స్పృశింపలేదు. వృద్ధులెవరూ పిన్నవారలకు ప్రేతకర్మ చేయలేదు. అంతటా సంతోషం నిండింది. అందరూ ధర్మపరులైనారు. పరస్పరం నిర్మూలించుకోదగిన వైరములున్నప్పటికి శ్రీరామముఖపద్మం వాడిపోవునను భావం కలవారై పరస్పరం హింసించుకోకుండా మెలిగారు. పదకొండువేల సంవత్సరాలు సోదరసహితుడగు రాముడు రాజ్యం పాలించాడు.

"ఆదికావ్యమిదం త్వార్షం పురా వాల్మీకినా కృతమ్" (131-102)

**గో.వి.** రామాయణ పఠనఫలం చెపుతున్నాడు. 'ఆర్షం' ఋషి అనగా వేదం. తత్సంబంధి అనగా వేదవిషయ ప్రతిపాదకం. 'పురా' అవతారాత్పూర్వం. లేక 'రామోత్తరతాపనీయోపనిష'న్మూలకం, లేక పురాతనం- మరొక పక్షం. 'పురా' సర్వకవులకూ పూర్వం అని. రామావతారానికి ముందని అర్థంకాదు. "ప్రాప్త రాజ్యస్య రామస్య వాల్మీకిర్భగవానృషిః, చకార చరితం కృత్స్నం" అని రాముడు రాజ్యం పొందిన పిదప రచించెనని ప్రారంభించుటవలన, 'రామస్సీతామనుప్రాప్య రాజ్యం పునరవాప్తవాన్' (బా.కాం.1-90) అని రాజ్యప్రాప్తిపర్యంతం జరిగినట్లు చెప్పి పిమ్మట 'బ్రహ్మలోకం ప్రయాస్యతి' (బా.కాం.1.97) బ్రహ్మలోకానికి వెళ్లగలడని భవిష్యద్వృత్తాంతాన్ని నిర్దేశించుట వలన, 'కో న్వస్మిన్ సాంప్రతం లోకే' (బా.కాం.1.2) ఇపుడు లోకమందెవడు.........? అని వర్తమాన నిర్దేశం చేయుటచే రామరాజ్యసమకాలమందే వాల్మీకిచే రచింపబడినదని సిద్ధాంతం.

ఈ రామాయణపఠనం ధన్యతను, యశస్సును, ఆయుర్వృద్ధిని, రాజులకు విజయాన్ని కలిగిస్తుంది. పఠించువాడు, వినువాడు సర్వపాపాలనుండి ముక్తుడవుతాడు. రామపట్టాభిషేకవిషయాన్ని వినువాడు పుత్రకాముడు

పుత్రులను, ధనకాముడు ధనమును పొందుతాడు. శత్రువుల జయిస్తారు, భూమిని జయిస్తారు, స్త్రీలు పుత్రపౌత్ర సమన్వితలు అవుతారు. వాల్మీకి రామాయణం వినువారు ఇహలోకమందు రామానుగ్రహంతో కోరికలనన్నిటిని తీర్చుకుంటారు. స్త్రీలు రజస్వలా చతుర్థదినప్రభృతి 16 రోజులలోపు వినిన పుత్రులను పొందుతారు. క్షత్రియులు బ్రాహ్మణముఖంగా వినాలి. సంపూర్ణంగా రామాయణం వినువారికి, పఠించువారికి సనాతనుడైన విష్ణుస్వరూపుడగు రాముడు ప్రీతుడవుతాడు. రామాయణశ్రవణం, అర్థగ్రహణం చేయుటవలన దేవతలు సంతసిస్తారు. పితరులు తృప్తి పడతారు. ఆర్షం, సంహితారూపం అగు ఈ రామాయణమును లిఖించువారు, వినువారు, బ్రహ్మలోకంలో వసిస్తారు. "శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పదమేవ వా, స యాతి బ్రహ్మణః స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా" ఎవరు భక్తితో రామాయణశ్లోకపాదం వినినా బ్రహ్మలోకం వారు పొందుట మాత్రమే కాక బ్రహ్మచే పూజింప బడతారు.

**మ.వి.** ఇచట ఫలశ్రుతి శ్లోకాలు 'కతక' వ్యాఖ్యానంలో కనిపించుట లేదు.

**శ్లో. శ్రీవాల్మీకి మహామునీశ్వరకృతే రామాయణస్యోత్తమే**
**గోవిందార్య మహేశతీర్థరచితే వ్యాఖ్యాద్వయే యః స్థితః ।**
**తస్యార్థస్య మయా కృతం వివరణం హ్యేతత్సదార్థం బుధా**
**స్త్యక్త్వా దోషజలం సదా గుణపయో గృహ్ణంతు హంసా ఇవ ॥**

**శ్లో. ఆర్షగ్రంథ పునఃప్రచార పరమోత్కృష్టాశయేనానిశం**
**సమ్యగ్యత్నవతాం సతాం తిరుమల శ్రీవేంకటేశప్రభోః ।**
**దేవస్థానపదాధిరూఢవిదుషా మాదేశ తస్సాదరం**
**కాండోఽయం రచితో మయా బుధజనప్రీత్యై సదా కల్పతామ్ ॥**

## ఉత్తరకాండ సారాంశం

**డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ**

రావణ సంహారానంతరం ఋషులందరూ శ్రీరాముని అభినందించడానికి వచ్చారు. అభినందన అంటే స్తుతి అని మహేశ్వరతీర్థీయం వచిస్తుంది. వసిష్ఠుడు కూడ వచ్చాడని ఇక్కడ ఉన్నది. అందువల్ల అయోధ్యలో ఉండే వసిష్ఠుడు వేరని, నక్షత్రమండలంలో ఉండే వసిష్ఠుడువేరని, అతడే అగస్త్యునివలె జ్యోతిర్మండలం నుండి వచ్చాడని, వసిష్ఠుడు వేరొక రూపాన్ని ధరించి ఇక్ష్వాకులకు పౌరోహిత్యం నిర్వహించాడని గోవిందరాజీయం వచించింది. "ప్రాప్తరాజ్యస్య రామస్య" అని ప్రారంభించడం వల్ల గాయత్రీమంత్రాక్షరంతో ఇది ఆరంభింపబడిందని, రాఘవుని అభినందించడానికి వచ్చారని చెప్పడం రామలక్ష్మణులకు ఇరువురికి కూడ ఈ స్తుతి వర్తిస్తుందని గోవిందరాజీయం విశేషం.

రావణాసురుని చంపడం పెద్దవిశేషమేమీకాదని, ఇంద్రజిత్తును వధించడమే గొప్పపనియని, అనేక రాక్షసులను వధించడం మహత్తరకార్యమని వారు వచించారు. ఇంద్రజిత్తును వధించడమే విశేషమని మీరు అనడంలోని ఆంతర్యమేమిటని రాముడు వారిని ప్రశ్నిస్తాడు. సర్వతీర్థీయ వ్యాఖ్యలో "దిష్ట్యా" అనే పదానికి అదృష్టవిశేషంచే అని మాత్రమే అర్థం వ్రాయకుండా "ఆ దిష్ట్యా" నీ ఆదేశంచే సర్వం సంపూర్ణమయ్యిందనే అర్థాన్ని కూడ ఉటంకించడం జరిగింది.

సమాధానంగా అగస్త్యుడు పులస్త్య, విశ్రవసుల జన్మవృత్తాంతాన్ని శ్రీరామునికి వివరించాడు. శ్రీరాముడు అప్పుడు ఒక ప్రశ్న వేసాడు. రాక్షసులందరూ లంకలోకి కుబేరుని తరువాత ప్రవేశించినట్లు వినియున్నానని, మీరు ఆతనికి ముందే లంకలో రాక్షసులున్నారని చెప్పడానికి గల కారణమేమని ప్రశ్నిస్తాడు. అగస్త్యుడు సృష్టి ఎలా ప్రారంభమయ్యిందో సమాధానంగా అక్కడ నుండి చెప్పనారంభించాడు.

**"ప్రజాపతిః పురా సృష్ట్వా హ్యపః సలిలసంభవః ।**
**తాసాం గోపాయనే సత్త్వాన్ అసృజత్ పద్మసంభవః" ॥**

ఇక్కడ బ్రహ్మకు "సలిల సంభవః పద్మసంభవః" అని రెండు విశేషణాలు వాడబడినాయి. కాబట్టి నీటిలోనున్న కమలం నుండి బ్రహ్మ జన్మించాడని గోవిందరాజీయ వ్యాఖ్యావిశేషం. అగస్త్యుడు రాక్షసవంశోత్పత్తిని క్రమంగా వివరించసాగాడు. అందుహేతి యముని సోదరియైన భయను పెండ్లాడి విద్యుత్కేశుడనే కుమారుని పొందాడు. అతడు నీటి మధ్యనున్న పద్మంవలె భాసిల్లి సూర్యకాంతులతో వెలుగొందాడు. ఇక్కడ గోవిందరాజీయంలో ఒక వైజ్ఞానిక విశేషం వ్యక్తమయ్యింది. అతడు నీటిని త్రాగి తనలో ఉంచుకొని, అవసరమైనప్పుడు బయటకు వెళ్ళగ్రక్కే విద్యుచ్ఛక్తి వంటివాడని చెప్పబడినాడు.

రాక్షసులు లోకాలను గడగడలాడిస్తూ భయోత్పాతాలను కలిగించగా, దేవతలు, ఋషులు శివుని శరణ మర్థించారు. శివుడు ఆ రాక్షసులను వధింపగలవాడు విష్ణువని సూచిస్తాడు. అపుడు వారు విష్ణువును శరణు కోరారు.

**"లంకా నామ పురీ దుర్గా త్రికూటశిఖరే స్థితా! ।**
**తత్ర స్థితాః ప్రబాధంతే సర్వాన్ నః క్షణదాచరాః" ॥ (ఉ.కా.6-15)**

ఆ రాక్షసులు అప్పుడు త్రికూటశిఖరంపై లంకానగరాన్ని నివాసం చేసుకొని దేవతలను, ఋషులను బాధించారు. విష్ణువు గరుడవాహనారూఢుడై వచ్చి రాక్షసులను ఎదుర్కొన్నాడు. మాలి, సుమాలి అన్నవారు ఘోరయుద్ధం చేసారు. అందు మాలికి తాత్కాలిక విజయం కూడ సిద్ధించింది. చివరకు మాలి మరణించగా సుమాలి, మాల్యవంతుడు లంకవైపు పారిపోయారు. కాని మాల్యవంతుడు శక్తి అనే ఆయుధాన్ని విష్ణువు యొక్క వక్షఃస్థలంపై ప్రయోగించాడు. విష్ణువు శక్తిధరుడైన కుమారస్వామికి ప్రియుడు కాన, అదే శక్తి ఆయుధాన్ని ఉపాసించి ప్రయోగించగా మాల్యవంతుడు మూర్ఛిల్లాడు. ఇచ్చట మహేశ్వరుని కుమారుడైన సుబ్రహ్మణ్యుని విష్ణువు ఆరాధించడం చింతింపదగినదని గోవిందరాజీయ వ్యాఖ్యావిశేషం. అంత సుమాలి, మాల్యవంతులు రాక్షసులతో కలిసి పాతాలానికి పారిపోయారు. అప్పుడు కుబేరుడు తనతండ్రి ఆనతిననుసరించి లంకలోనికి ప్రవేశించాడు. అని ఈ కథనంతను అగస్త్యుడు శ్రీరామునికి విన్నవించాడు.

కొంతకాలానికి సుమాలి తన కూతురు కైకసిని వెంట బెట్టుకొని భూలోకానికి వచ్చి. తపోధనుడైన విశ్రవుని ఆశ్రయించమని హితబోధ చేసాడు. ఒకనాటి సంధ్యా సమయంలో ఆమె ఆయనను తన మనోభిప్రాయాన్ని గ్రహించమని వేడుకోంది. కానిసమయంలో నీవుకోరావని, అందువల్ల భయంకరాకారులైన పుత్రులు కలుగుతారని ఆ ముగ్గురిలో చివరివాడు తన స్వభావంతో జన్మిస్తాడని వచించాడు. వారే రావణ కుంభకర్ణ విభీషణులు. వారు తపస్సులు కావించి బ్రహ్మవల్ల అనేక వరాలు పొందారు.

వారి తపస్సు లేవిధంగా కొనసాగాయని రాముడడుగగా, అగస్త్యుడు ఇలా వచించాడు. విభీషణుడు సాత్వికంగా 10 వేల ఏండ్లు, కుంభకర్ణుడు వీరాసనంపై 10 వేల ఏండ్లు తపస్సు చేసారు. రావణుడు ఘోరతపస్సు చేసి వేయి సంవత్సరాలకొక తలను అగ్నిలో ఆహుతి చేసి, పదో తలను సమర్పించబోతే బ్రహ్మ ప్రత్యక్షమైనాడు. రావణుడు అమరత్వాన్ని కోరగా, బ్రహ్మ అది సాధ్యం కానిదని మరొక వరం కోరుకొమ్మనగా మనుష్యులు వానరులు వంటి అల్ప ప్రాణులు తనను ఏమీ చేయలేరని, మిగిలిన వారి వల్ల చావులేనట్లు చేయమని కోరాడు. బ్రహ్మ అంగీకరించి వ్రేల్చిన తలలన్నీ వచ్చేటట్లు అనుగ్రహించాడు.

దేవతల కోరికపై సరస్వతి కుంభకర్ణుని నోటిలో ప్రవేశించింది. అప్పుడాతడు "స్వప్తుం వర్షాణ్యనేకాని దేవదేవ మమేప్సితమ్" అని పెక్కు సంవత్సరాలపాటు నిద్రించేటట్లు వరం కోరాడు. అతడు శ్లేష్మాతక వనం చేరి నిద్రించాడు. శ్లేష్మమెక్కువగా ఉండే తండ్రి గారి ఉపవనమది యని గోవిందరాజవ్యాఖ్య. దీనికి అనుబంధంగా రావణుడు బ్రహ్మను కోరగా 6 నెలల కొకసారి ఆతడు నిద్రలేస్తాడని, ఏడాదిలో మిగిలిన ఆరునెలలలో స్వేచ్ఛగా జాగ్రన్నిద్రావస్థలలో ఉండవచ్చని వరాన్ని మార్చినట్లు యుద్ధకాండలో చెప్పబడింది.

దశకంఠుడు లంకను ఆక్రమించుటకు సిద్ధపడి కుబేరుని వద్దకు ప్రహస్తుని దూతగా పంపాడు. తండ్రి ఆదేశానుసారం కుబేరుడు లంకను వీడి కైలాసానికి వెళ్లిపోయాడు. పిమ్మట రావణుడు లంకలో ప్రవేశించి రాజయ్యాడు. అట్లు పిమ్మట రావణుడు తన సోదరి శూర్పణఖను కాలక పుత్రుడైన విద్యుజ్జిహ్వున కిచ్చి వివాహం

చేసాడు. మయుడు మంచి స్వభావంకల తన కూతురును గోవిందరాజీయ వ్యాఖ్యానుసారం కులప్రాధాన్యాన్ని చేకొని రావణుని కిచ్చి వివాహం చేసాడు. కుంభకర్ణుడు వజ్రజ్వాలను, విభీషణుడు సరమను వివాహమాడారు. సరమను ఆమె తల్లి మానససరోవర తీరంలో కన్నది. ప్రసవకాలంలో మానససరోవరాన్ని పొంగవద్దని "సరోమా" అని కోరింది కాన ఆమె సరమ అయ్యింది. మండోదరీ రావణులకు మేఘనాదుడు (ఇంద్రజిత్తు) జన్మించాడు.

రావణుడు మునుల ఆశ్రమాలను ధ్వంసం చేయసాగాడు. అది అధర్మమని కుబేరుడు దూతను పంపగా రావణుడు ఆ దూతను చంపివేసాడు. యక్షరాక్షసులకు జరిగిన యుద్ధంలో పెక్కుమంది యక్షులు మరణించారు. రావణుడు కుబేరుని స్పృహ కోల్పోయేటట్లు కొట్టి, అతని పుష్పకవిమానాన్ని లాగుకొన్నాడు. అటు పిమ్మట అతడు కైలాసం వెళ్లాడు. నందీశ్వరుడు రావణుని అడ్డుకొన్నాడు. రావణుడు నందిని గేలిచేయగా, ఆతడు నావంటి వారే నీ వంశాన్ని రూపుమాపుతారని శపించాడు. రావణుడు ఒక వేయి సంవత్సరముల కాలం శంకరుని స్తుతించగా, కైలాసాన్ని ఎత్తునపుడు నలిగిపోయిన ఆతని భుజాలను యథాపూర్వం కావించి చంద్రహాసమనే పేరుగల ఖడ్గాన్ని అనుగ్రహించాడు. అంతేకాక ఎంత ఆయుష్షు ఆతనికి గడిచిందో, దానిని మరల పూరించాడు శంకరుడు. ఖడ్గాయుధాన్ని ఎల్లప్పుడూ పూజిస్తూ ఉండాలని, లేనినాడు తిరిగి తన వద్దకే చేరుతుందని కూడా వచించాడు.

తపోదీక్షలో నున్న వేదవతిని చూచి రావణుడు కామాతురుడయ్యాడు. ఆమె పూర్వజన్మలో పద్మాక్షియని, విష్ణువుకు తన మనస్సు అర్పించిందని ఆనందరామాయణం వచించింది. వేదవతి రావణుని శపించి అగ్నికి ఆహుతి అయ్యింది. ఆమెయే అయోనిజగా లభించింది.

జనక మహారాజుకు వేదవతి ఒక బాలికగా పద్మమునందు ఉద్భవించగా, రావణుడు ఆమెను లంకకు కొనిపోగా మంత్రి చెప్పిన మాటలపై తిరిగి సముద్రంలో పడవేసాడు. కావున సీత అయ్యింది. రావణుడు తనదిగ్విజయయాత్రలో మరుత్తభూపతిని యుద్ధానికి ఆహ్వానించాడు. అపుడు ఇంద్రాది దేవతలు పక్ష్యాది రూపాలను పొందారు. ఇంద్రుడు నెమలిగా, యముడు కాకిగా, కుబేరుడు తొండగా, వరుణుడు హంసగా మారారు. ఇంద్రుడు పాములవల్ల మీకు భయం ఉండదని నెమలికి, యముడు కాకికి నిన్ను తృప్తిపరచినచో పితృదేవతల క్షుత్పిపాసలు తీరునని, వరుణుడు తొండకు బంగారు వన్నెను ప్రసాదిస్తారు. రాజు యజ్ఞదీక్షలో ఉన్న కారణంగా యుద్ధానికి సిద్ధపడకపోయిన కారణంచే రావణుడు తన విజయాన్ని ప్రకటించుకొని వెళ్లిపోయాడు.

అయోధ్యాపతియైన అనరణ్యుడు తన సహజ మరణానికి అతడు కారకుడయ్యాడని భావించి, తన వంశస్థునిచే రావణునికి మరణం తప్పదని శపిస్తాడు. నారదుని సూచనపై రావణుడు యమలోకంపై దండెత్తాడు. వారి యుద్ధదృశ్యాలను చూడాలని నారదుడు యమపురికి పయనమయ్యాడు. రావణుని దెబ్బకు యమకింకరులు నుగ్గు నుగ్గయిపోయారు. యముడు రావణుని చంపుటకై కాలదండాన్ని చేబూనాడు. కాని బ్రహ్మదేవుని సూచనపై దాన్ని ఉపసంహరించుకొని యముడు అదృశ్యుడయ్యాడు. అక్కడ "ఏష తస్మాత్ ప్రణశ్యామి దర్శనాదస్య రక్షసః" అని వాల్మీకి వ్రాయడం జరిగింది. 'ణశ' ధాతువుకు నశించుట, కనబడకుండుట అనే రెండు అర్థాలు ఉన్నాయి. ఇక్కడ కనబడకుండుట అని అర్థమని గోవిందరాజీయ విశేషం.

అనంతరం రావణుడు తాను యముని జయించినట్లు ప్రకటించుకొని రసాతలంచేరి నాగజాతివారిని వశపరచుకొని మణిపురం వెళ్లాడు. అచ్చట నివాతకవచులతో యుద్ధం చేసి అగ్నిసాక్షికంగా వారితో మైత్రి కుదుర్చు కొన్నాడు. శూర్పణఖ భర్త అయిన విద్యుజ్జిహ్వుని వధించడం జరిగింది. అటు పిమ్మట అతడు వరుణ పుత్రులను దెబ్బతీసి లంకా నగరానికి బయలుదేరాడు.

ఇక్కడ 5 సర్గలు అధికంగా ఉన్నాయి. ఈ అధిక సర్గలకు వ్యాఖ్యాతలు విశేషాలేమీ వ్రాయలేదు. రావణునికి దారిలో అశ్మనగరం కనబడుతుంది. అక్కడ బలిచక్రవర్తి తారసిల్లాడు. బ్రహ్మఇచ్చిన వరానుసారంగా విష్ణువు రావణునికి గోచరుడుకాడు. రావణుడు అదే విజయంగా భావించి వరుణాలయం ద్వారా బయటికి వస్తాడు. అలాగే పుష్పకంపై సూర్యలోకానికి వెళతాడు. సూర్యుడు అతనితో యుద్ధం చేయడానికి తనకు తీరిక లేదనగా రావణుడు సూర్యుని గెలిచినట్లు భావిస్తాడు. అలాగే సోమలోకానికి వెడతాడు. అక్కడ నుండి మాంధాత ఉన్న చోటికి వెడతాడు. మాంధాత పాశుపతాస్త్రాన్ని ప్రయోగించి రావణుని చంపబోగా బ్రహ్మవరాన్ని స్మరించి పులస్త్యగాలవ మహర్షులు వారించారు. చంద్రమండలానికి వెళ్లగా అక్కడ చల్లదనానికి తట్టుకోలేక రాక్షససేన భయకంపితం కాగా, రావణుడు శీతల స్థితిని నివారింపబోగా బ్రహ్మ వారిస్తాడు. అలాగే పశ్చిమ సముద్ర ప్రాంతంలో ఇద్దరు మహాపురుషులు అతనికి కనిపిస్తారు. వారే కపిలుడు అనంతుడు, తరువాతి కథ చెప్పమని కోరగా అగస్త్యుడు ఇలా వచించాడు.

రావణుడు అనేక కన్యలను స్త్రీలను అపహరించి బంధించాడు. వారందరూ శాపాలు ఈయగా దేవతలు పుష్పవృష్టి కురిపిస్తారు. భర్తను చంపించినందులకు శూర్పణఖ నిందించగా, ఆమెకు జనస్థానాన్ని ఇచ్చి ఖరుని రక్షకునిగా రావణుడు నియమిస్తాడు. మేఘనాదుడు మహేశ్వర యాగంచేసి ఆకాశసంచారం చేసే విమానాన్ని, తామసి అనే మాయావిద్యను వరంగా శివుని వల్ల పొందుతాడు. రావణుడు మాత్రం కుమారుని ఈ యాగం ద్వారా ఇంద్రాదిదేవతలను పూజించడం నాకు నచ్చలేదంటాడు. మధువనే రాక్షసుడు సోదరియైన కుంభీనసను అపహరించడంతో రావణుడు ఆతనిని చంపడానికి వెళ్లాడు. ఆ సమయంలో రంభను జూచి అత్యాచారానికి పాల్పడగా, నలకూబరుడు ఆతనిని శపించాడు. ఇంద్రాదులతో జరిగిన యుద్ధంలో మేఘనాదుడు ఇంద్రుణ్ణి జయించి, ఆతనిని బంధించి లంకకు తీసుకొనిపోగా బ్రహ్మ వచ్చి విడిపించాడు. అందువల్ల మేఘనాదుడు ఇంద్రజిత్తు అయ్యాడు. నీయందు కోరికలేని ఏ స్త్రీనయినా బలాత్కరిస్తే, నీతల ఏడుముక్కలై పగిలిపోతుందని నలకూబరుడు శపించడం వల్ల, సీత అత్యంత పరిశుద్ధురాలనే విషయం వ్యక్తమవుతుందని గోవిందరాజీయవ్యాఖ్య. ఇంద్రుడు తన పరాభవానికి చింతాపరీతాత్ముడుకాగా, నీపాపకృత్యాలే నీకు అవమానం కారణాలయ్యాయని బ్రహ్మ వచిస్తాడు. బ్రహ్మ ఆతనిచే వైష్ణవయజ్ఞాన్ని ఆచరింపజేసి, మరల ఆతనిని స్వర్గాధిపతిని కావిస్తాడు. శ్రీరామా! వింటివికదా! రావణాదుల బలం కన్న ఇంద్రజిత్తుబలం గొప్పదని నేను వచించాను అంటాడు. అంత శ్రీరాముడు స్వామీ! ఆ కాలములో రావణుని ఎదిరించిన మనుష్యులెవ్వరును లేరా? అని ప్రశ్నింపగా అగస్త్యుడు మళ్లీ ఇలా చెప్పసాగాడు.

శ్రీరామా! మాహిష్మతీ నగరాన్ని కార్తవీర్యార్జునుడు పాలించేవాడు, అతడు నిత్యాగ్నిహోత్రి. శక్తిశాలి రావణుడొకనాడు అచ్చోటకు వచ్చి ఏడి ఆ అర్జునుడు? అతనితో యుద్ధం చేయాలి. అన్నాడు. అప్పుడా అర్జునుడు తన స్త్రీలతో నర్మదానదిలో విహరించడానికి వెళ్లాడు. రావణుడు తన వెంట తెచ్చుకొనే బంగారు శివలింగాన్ని

నర్మదానది ఇసుకతిన్నెలలో నుంచి పూజింపసాగాడు. దానికి క్రింది భాగంలో అర్జునుడు తన వేయి చేతులతో నర్మదాప్రవాహాన్ని అడ్డుకొని క్రీడించసాగాడు. అందువల్ల పైనున్న ప్రవాహం పెరిగి రావణుని పూజాద్రవ్యాలు కొట్టుకొని పోయాయి. తన్నిమిత్తం యుద్ధం జరుగగా ఆతడు రావణుని బంధించి మాహిష్మతిలో ప్రవేశించగా దేవతలు పుష్పవర్షం కురిపించారు. అక్కడ మహర్షి "సాధ్వీతి వాదినఃపుష్పైః కిరంత్యర్జునమూర్ధని" అని వ్రాయడం జరిగింది. ఇక్కడ "సాధ్వీ" అన పదానికి "సాధ్వీక్రియా" అని గోవిందరాజీయం వ్యాఖ్యానించింది. పులస్త్యమహర్షి ఆదేశంతో కార్తవీర్యుడు బంధవిముక్తిని కావించాడు. పిమ్మట వారిరువురికి మైత్రి ఏర్పడింది. బలవంతులకు మించిన బలవంతులు అన్ని కాలాలలోను ఉంటారనేది సత్యం. సృష్టి చాలా విచిత్రమైనది, శ్రేయస్సు కోరేవాడు మరొకరిని అవమానించరాదని తిలకవ్యాఖ్యావిశేషము.

ఇంకొకసారి రావణుడు కిష్కింధకుచేరి వాలి ఎక్కడ? అని అడుగుతాడు. మంత్రులు అతడు నాలుగు సముద్రజలాలతో సంధ్యోపాసన కావించి శీఘ్రంగా తిరిగి రాగలడని, అంతవరకు వేచియుండవలసిందని వచించారు. రావణుణ్ణి వారి మాటల నుల్లంఘించి దక్షిణసముద్రానికి వెళ్లాడు. వాలి గరుత్మంతుడు సర్పమును పట్టుకొన్నట్లుగా రావణుని పట్టుకొని రివ్వన ఆకాశానికి ఎగిరాడు. నాల్గుచోట్ల సంధ్యావిధిలేదు కదా. అనే ప్రశ్నకు దక్షిణాన సంధ్యాంగశౌచం పశ్చిమంలో సంధ్యాంగ మంత్రస్నానం, ఉత్తరం ప్రోక్షణ, తూర్పున అర్ఘ్య ప్రదానం చేసెనని సమాధానంగా గోవిందరాజీయం వచించింది. అంతవఱకు వాలిచంకలో ఇరుక్కున్న రావణుడు, వాలియొక్క సంధ్యావందనంపూర్తి అయి, వాలి కిష్కింధచేరాక, వాలిబాహుమూలంనుంచి క్రిందపడ్డాడు. వాలి అప్పుడు ఎక్కడనుండి ఊడిపడ్డావయ్యా! అని రావణుని గేలిచేసాడు. తరువాత వారిరువురికి మైత్రి కుదిరింది. "అటువంటి వాలిని నీవు సంహరించావయ్యా అని అగస్త్యుడు శ్రీరాముని అభినందించడం జరిగింది.

తదనంతరం శ్రీరాముడు అగస్త్యుని ఇలా అడుగుతాడు.

**"అపృచ్ఛత తదా రామో దక్షిణాశాశ్రయం మునిమ్ ।**
**ప్రాంజలిర్వినయోపేత ఇదమాహ వచోఽర్థవత్" ॥**

ఇక్కడ "ఇదమ్ + ఆహ" అని మాత్రమే కాక, "ఇదమ + ఆహ" అని కూడ విడదీయవచ్చని, అప్పుడు "మన్మథుని నిగ్రహించినవాడా!" అనే విశేషార్థం స్ఫురిస్తుందని సర్వతీర్థీయవ్యాఖ్య వివరించింది. అగస్త్యుడు రామునికి హనుమద్వృత్తాంతాన్ని చెప్పనారంభించాడు. మారుతి శైశవమునందే సూర్యుని పండుగా భ్రమించి ఆక్రమించుబోగా రాహువు కోరికపై ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించగా, మారుతి మూర్ఛితుడయ్యాడు. వాయువు ప్రసరించడం మానగా సమస్తప్రాణులు ఇబ్బందులు పాలయ్యాయి. బ్రహ్మదేవుడు ఆతనిని ప్రసన్నం చేయడానికై సమస్త దేవతలతో పాటు వస్తాడు. బ్రహ్మదేవుని కరస్పర్శతో హనుమంతుడు పునర్జీవితుడయ్యాడు. అందరూ ఆయనకు వరాలను ప్రసాదించడం జరిగింది. మహర్షుల శాపం వల్ల ఆంజనేయుడు తన బలాన్ని మరచి పోతాడు. పిమ్మట సూర్యుని వల్ల సమస్త శాస్త్రాలు అభ్యసిస్తాడు. అగస్త్యుడు మున్నగువారు ఇలా చెప్పి వెళ్ళబోతూ ఉండగా, శ్రీరాముడు మీ సాన్నిధ్యంలో వివిధ యాగాలను నెరవేర్చదలచుకొన్నానని విన్నవించగా ఆ సమయానికి రాగలమని చెప్పివారు వెళ్లిపోయారు. సంధ్యోపాసన గావించి శ్రీరాముడు ఆ రాత్రిని ప్రశాంతంగా గడిపాడు. ప్రతిరోజు తెల్లవారుతూ

ఉండగా వంది మాగధులు వచ్చి శ్రీరాముని మేల్కొలుపుతారు. శ్రీరాముడు స్నానాదికాలు ముగించుకొని అగ్నికార్యము, దైవపూజ నిర్వహించేవాడు. పౌరాణికులు పురాణగాథలు వినిపించేవారు. ఇది రాముని దినచర్య.

ఇక్కడ మళ్లీ 5 అధ్యాయాలు అధికంగా గోచరిస్తాయి. ఇందు వాలి సుగ్రీవుల జన్మవృత్తాంతం, అందరూ ఎవరిని ధ్యానిస్తారని రావణుడడుగగా సనత్కుమారుడు మహావిష్ణువునే ధ్యానిస్తారని చెప్పడం, మహావిష్ణువులక్షణాలను వివరించడం, నారాయణుని సేవించేవారు శ్వేతద్వీపం చేరుతారని చెప్పడం, దివ్యదృష్టి ఉంటే తప్ప ఆయన దృగ్గోచరుడుకాడని చెప్పడం ఈ అధ్యాయాలలో వివరింపబడినాయి.

అనంతరం రాముడు తన పట్టాభిషేకానికి విచ్చేసిన జనకమహారాజును, యుధాజిత్తును, కాశీరాజును యథోచితంగా సత్కరించి వీడ్కొలుపుతాడు. పిమ్మట అక్షౌహిణుల సంఖ్యలో నున్న సైనికులందరు రాముని వద్దకు వచ్చి భరతుని ఆజ్ఞపై రావణునితో యుద్ధం చేయడానికై వచ్చామని, కాని మేము వచ్చు సరికే యుద్ధం ముగిసిందని విన్నవించుకొని తమ తమ రాజ్యాలకు వెళ్ళిపోయారు. శ్రీరాముడు వానర భల్లూకరాక్షసులకు కూడ కానుకలిచ్చి బహూకరించాడు. వానరులు రాముని సేవిస్తూ కొంతకాలం అయోధ్యలోనే ఉన్నారు.

**"ఏవం తేషాం వివసతాం మాసః సాగ్రో యయౌ తదా ।**
**ఏవం తేషాం యయౌ మాసో ద్వితీయః శైశిరః సుఖమ్" ॥**

వారు ఒక నెలపైన ఐదారురోజులు అయోధ్యయందే ఉన్నారని, ఒక్కొక్క మాసం ఇలా గడుపుతూ ఒక సంవత్సరకాలం ఉన్నారని, రామునికి వసంతఋతువులో చైత్రమాసంలో పుష్యమీ నక్షత్రంలోకాని, చిత్రానక్షత్రమున్న పూర్ణిమనాడు కాని, పట్టాభిషేకం జరిగిందికాన, మళ్లీ శిశిర ఋతువు పూర్తి అయ్యేవరకు ఒక ఏడు అక్కడే ఉన్నారని గోవిందరాజీయ వ్యాఖ్య, సత్యతీర్థులవారు రాజులందరూ వెళ్ళిన తరువాత మాసమనగా సంవత్సరమనే అర్థం ఉందని, అంత కాలం అక్కడే ఉన్నారని వివరించారు. తిలకవ్యాఖ్య ఈ రెండు వ్యాఖ్యలకు భిన్నంగా ఉంది. శ్రీరాముడు ఆశ్వయుజ కృష్ణపక్షమున (ఉత్తర దేశ సంప్రదాయానుసారంగా భాద్రపదకృష్ణపక్షమున) అమావాస్యనాడు రావణుని వధించాడని, ఆ తరువాత అధికమాసం వచ్చిందని, నిజాశ్వయుజ శుక్లవిజయదశమి నాడు ధనిష్ఠా నక్షత్రం మిత్రతార కాన, లేదా ఆశ్వయుజ శుక్లపూర్ణిమనాడు అశ్విని నక్షత్రంలో పట్టాభిషేకం జరిగిందని అక్కడ నుండి అయిదారు నెలలపాటు వానరులక్కడ ఉన్నారని "సాగ్రాః పంచషడధికా మాసా గతాః" అనే వాక్యాన్ని ప్రమాణంగా సూచించింది.

అనంతరం రాముడు సుగ్రీవాదులను వీడ్కొలిపాడు. హనుమంతుని హృదయానికి హత్తుకొని. తన కంఠహారంతో ఆయన గళసీమనలంకరించి నా కథ ఉన్నంతవరకూ, నీ కీర్తి, నీ శరీరంలో ప్రాణాలు నిలిచి ఉంటాయని (చిరంజీవిత్వం) వచించాడు. శ్రీరాముడు పుష్పకవిమానాన్ని పూజించి కుబేరుని వద్దకు పంపివేస్తాడు. పిమ్మట భరతుడు రామరాజ్యపరిపాలనలోని విశిష్టతను తెలియజేస్తాడు.

అటు పిమ్మట సీతారాములు పదివేల సంవత్సరాలపాటు అయోధ్యలో సంతోషంగా కాలం గడిపారు. సీతాదేవి గర్భవతి అయ్యింది. ఆమె తపోవనాలను దర్శించే అభిలాషను వ్యక్తం చేయగా శ్రీరాముడు అంగీకరించాడు.

భద్రుడు వచ్చి సీతాదేవి విషయంలో వచ్చిన జనాపవాదాన్ని వివరించాడు. ఆ అపనిందకు వెఱచి సీతాదేవిని వనాలలో వాల్మీకిమహర్షి ఆశ్రమసమీపంలో విడిచి రమ్మని రాముడు లక్ష్మణుని ఆజ్ఞాపించాడు. లక్ష్మణుడు విలవిలలాడిపోయి సీతను అరణ్యాలలో విడిచి రామాజ్ఞను విన్నవించాడు. లోకాపవాదంవల్ల వచ్చిన అపనిందను నేనే రూపుమాపుకొందునని రామునికి సందేశం పంపింది సీత. వాల్మీకి వచ్చి ఆమెను ఓదార్చి తన ఆశ్రమంలో ఆమెకు వసతి కల్పించి, ఆమెను సేవింపుమని మునిపత్నులను ఆదేశిస్తాడు. ఇచట వాల్మీకి

**"తవ చైవ మహాభాగే విదితం మమ తత్త్వతః ।**
**సర్వం చ విదితం మహ్యం త్రైలోక్యే యది వర్తతే" ॥**

అని వాక్రుచ్చాడు. నీవు ఇక్కడికి వస్తున్నట్లు ధర్మసమాధి (దివ్యదృష్టి) ద్వారా గ్రహించానని, నీ వృత్తాంతం సర్వం నాకు తెలుసునని అంటాడు. రథసారథియైన సుమంత్రుడు దుఃఖిస్తున్న లక్ష్మణుని, దుర్వాసుని వల్ల విన్న భృగుమహర్షి శాపాన్ని వివరించి ఓదారుస్తాడు. మీ నాన్నగారికి కూడ ఈ విషయం తెలుసునని, నన్ను ఎవ్వరితోను చెప్పవద్దని కూడా చెప్పారని వివరించాడు. రాముడు లక్ష్మణునితో నృగమహారాజు చరిత్రను తెలిపి, గోదాన విషయంలో జరిగిన అపరాధానికి తొండగామారాడని, ధర్మపాలనమెంతో కష్టమని వచించాడు. అలాగే పురూరవ చక్రవర్తి కథను, వసిష్ఠుడు మైత్రావరుణిగా జన్మించడం కూడ తెలియజేసాడు.

ఇక్కడ మళ్లీ మూడధ్యాయాల అధికపాఠం ఉంది. అందు శునకోపాఖ్యానం వివరింపబడింది. యయాతి భోగేచ్ఛను వదలలేక పెద్దకుమారుడైన యదువును తన ముసలితనాన్ని తీసుకొని యౌవనాన్ని ఇమ్మంటాడు. అతడు నిరాకరించడంతో "ప్రజార్థే విఫలో భవ, దుర్మతేస్తే వంశో న స్థాస్యతి" అని వచిస్తాడు. అనగా నీకు రాజ్యాదులపై అధికారం ఉండదని, రెండో మాటకు నీ వంశం సూర్యవంశంలో ప్రవేశిస్తుందని గోవింద రాజీయ వ్యాఖ్య తెలియజేసింది. శ్రీరాముడు తన వద్దకు వచ్చిన చ్యవనాది మహర్షులను ఆదరించి వారికి సహాయపడుతానని మాట ఇస్తాడు. లవణాసురుని వధించమని రాముడు శత్రుఘ్నునికి ఆజ్ఞాపిస్తాడు. అన్నగారిని విడిచి ఉండలేకపోయినా, రామాజ్ఞకు ఎదురాడలేకపోయాడు. శత్రుఘ్నుడు మధుపురికి వెడతాడు. దారిలో వాల్మీకిని సందర్శించాడు. ఆమహర్షి ఆ ప్రాంతాన్ని కల్మాషపాదుని యాగస్థలిగా తెలియజేస్తాడు. ఏ రోజురాత్రి శత్రుఘ్నుడు వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఉన్నాడో, ఆరాత్రే సీతాదేవి ఇద్దరు కవలపిల్లలను కన్నది. శత్రుఘ్నుడు లవణాసురుని వధించి 12 ఏండ్లు గడిచిన పిమ్మట అయోధ్యకు తిరిగి బయలుదేరాడు. మార్గమధ్యంలో తిరిగి వాల్మీకి ఆశ్రమానికి వచ్చి అక్కడ రామాయణ గానం విన్నాడు. ఎవరు గానం చేసారో అడగమని రాజభటులు కోరినా, శత్రుఘ్నుడు ఇక్కడ ఎవ్వరినీ ఏమీ అడుగరాదని ముందుకు సాగిపోయాడు. అయోధ్యకేగి రామాజ్ఞపై మళ్లీ మధుపురికి వెళ్లడం జరిగింది.

ఒక బ్రాహ్మణుడు మృతుడైన తనకుమారుని, చేకొని శ్రీరాముని భవనద్వారం కడకుచేరి శ్రీరాముని పరిపాలనను తప్పుపట్టాడు. నారదుడు వచ్చి చతుర్యుగ ధర్మాలను వివరిస్తాడు. ఆ మృతబాలుని కళేబరాన్ని రక్షించమని లక్ష్మణునితో చెప్పి, పుష్పకాన్ని రమ్మనమని మనస్సులో తలచుకొని, దానిపై అధర్మానికి పాల్పడిన వారిని అన్వేషించసాగాడు. శంబుకుడనేవాడు శరీరంతో దివ్యత్వాన్ని పొందాలని తపస్సుచేస్తున్నాడు. అది అధర్మం. మరణాంతంలో చేకూర వలసిందది. అంతేకాదు త్రేతాయుగధర్మానికి అది విరుద్ధం. అందువల్ల రాముడు అతని శిరస్సును ఖండించాడు.

దేవతలు ప్రసన్నులై వరముకోరుకొమ్మనగా రాముడు విప్రబాలుని బ్రతికించమని కోరుతాడు. ఈ శంబుకవధ వృత్తాంతం ప్రక్షిప్తమని కొందరి అభిప్రాయం. ఇది రామునికి కళంకం ఆపాదించే లక్ష్యంతో వ్రాసినది అని అంటారు కొందరు.

అగస్త్యుడు ఒక దివ్యాభరణాన్ని రామునికిచ్చి దాని వృత్తాంతాన్ని ఇలా వచించాడు. అప్పుడు రాముడు

**"ప్రతిగ్రహోఽయం భగవన్ బ్రాహ్మణస్యాఽవిగర్హితః ।**
**గృహ్ణీయాం క్షత్రియోఽహం వై కథం బ్రాహ్మణపుంగవ" ॥**

అని అంటూ దానం పుచ్చుకోవడానికి బ్రాహ్మణుడే తగినవాడని, క్షత్రియుడనైన తాను దానినెట్లు స్వీకరించడం సమంజసం? అని అడిగాడు. అప్పుడు అగస్త్యుడు "రామా! ఇది రాజులవద్ద ఉండవలసిన ఆభరణం. ఒక దివ్యపురుషుని ద్వారా నాకిది సంక్రమించింది. నేను ఒకమారు తపస్సుకు యోగ్యమైన ప్రదేశం గురించి వెదకు చుండగా, ఒక సరోవరతీరంలో శవాన్ని చూచాను. రాత్రి సమయంలో హంసల వాహనంలో ఒక దివ్య పురుషుడు వచ్చి ఆ శవాన్ని భక్షించసాగాడు. దీనికి కారణమేమని నేనడుగగా నేను శ్వేతుడను. నేనెప్పుడూ ఎవరికీ ఏదీ దానంచేయలేదు. అందువల్ల నాకీ అవస్థ వచ్చిందని బ్రహ్మయే చెప్పాడని అన్నాడు. నా దర్శనం వల్ల ఆతడు పాపవిముక్తుడయ్యాడు. అప్పుడు ఆ రాజు నాకు దీనిని ఈయడం జరిగింది" అని అన్నాడు. ఈ వనం పశుపక్షి మృగాది శూన్యమైయుండుటకు కారణమేమని రాముడడుగగా, భార్గవుని కన్యయైన అరజను దండుడు బలాత్కరించాడని, ఆతని శాపానికి గురియై అతడు మరణించాడని దానివల్ల ఇది దండకారణ్యమయ్యిందని వివరించాడు.

రామునికి రాజసూయయాగంచేసే సంకల్పం కలగగా, శాంతికాముకుడవైన నీవు యాగం చేయవద్దని భరతుడు వచించాడు. లక్ష్మణుడు వృత్రాసురవధను వివరించి, బ్రహ్మహత్యాది పాపాలను పోగొట్టే అశ్వమేధయాగ నిర్వహణగురించి అన్నగారికి వివరించాడు. అనంతరం రాముడు లక్ష్మణునకు ఇల మహారాజు కథను చెప్పి ఆ యాగాన్ని ఆచరించడానికి సంకల్పంచేసాడు. లక్ష్మణునితో గోమతీతీరమునందు గల నైమిశారణ్యంలో యజ్ఞవాటికను ఏర్పాటు చేయించమని, సర్వసంభారాలు చేకూర్చమని రాముడు ఆజ్ఞాపించడం జరిగింది. వాల్మీకి మహర్షి కూడ శిష్యసమేతంగా యాగానికి వచ్చాడు. వాల్మీకి లవకుశులతో ఋషివాటికలలో, బ్రాహ్మణగృహాలలో, ఋత్విజుల సమక్షంలో, శ్రీరాముని భవనద్వారంలో రామాయణం గానం చేయండని, ఎవరైనా అడిగితే వాల్మీకి శిష్యులమని మాత్రమే చెప్పండని వచించాడు.

వారు రోజుకు 20 సర్గలు చొప్పున రామసభలో రామాయణం గానం చేసారు. వారికి 18 వేల బంగారు నాణెములను కానుకలుగా ఈయవలసిందిగా రాముడు భరతుని ఆజ్ఞాపిస్తాడు. వారు గురువు ఆనతిపై వాటిని ముట్టుకొనలేదు. శ్రీరాముడు వారి కంఠస్వరాన్ని బట్టి లవకుశలు సీతాదేవి కుమారులైయుండవచ్చని ఊహించాడు. రాముడు వెంటనే దూతలను సీత తనకు వచ్చిన అపవాదం తొలగించుకొనుటకై ప్రమాణం చేయవలసియున్నదని వాల్మీకి వద్దకు పంపాడు. అంతసీత

**"యథాఽహం రాఘవాదన్యం మనసాఽపి న చింతయే ।**
**తథా మే మాధవీ దేవి వివరం దాతు మర్హసి" ॥**

అని సభామధ్యంలో శపథం చేసి, భూదేవి రత్నసింహాసనంపై కూర్చుండి రాగా, దానిపై అధిరోహించి రసాతలానికి చేరింది.

శ్రీరాముడు సీతావియోగంతో ఎంతో దుఃఖించాడు. బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చి ఆయనను ఊరడించాడు. సీత పరంధామంలో నిన్ను చేరగలదని కూడా వచించాడు. సీత అంతర్ధానం చెందిన పిమ్మట రఘురాముడు మరల వివాహమాడలేదు. అన్ని యజ్ఞాలలోను జానకీదేవి ప్రతినిధిగా బంగారు సీతను నిలుపుకొన్నాడు. ఈ విధంగా మొత్తంపై దశవర్ష సహస్రాలు యాగాలు చేశాడు. 13 వేల సంవత్సరాలు రాజ్యపాలనచేశాడని సత్యతీర్థుల వారి వ్యాఖ్య. యుధాజిత్తు పంపిన సందేశంపై శ్రీరాముని ఆజ్ఞమేరకు భరతుడు గంధర్వదేశాన్ని ఆక్రమించుటకై బయలుదేరాడు. భరతుడు గంధర్వులను వధించి, అక్కడ తక్షశిల, పుష్కలావతము అనే రెండు నగరాలను నిర్మించి తన కుమారులైన తక్షుని, పుష్కలుని వాటికి పరిపాలకులుగా చేశాడు. అలాగే రామాజ్ఞపై లక్ష్మణ కుమారులైన అంగదుని, చంద్రకేతువును కారుపథదేశంలో వేర్వేరు రాజ్యాలకు అభిషిక్తులను కావించాడు.

బ్రహ్మదేవుడు పంపగా కాలపురుషుడు శ్రీరాముని వద్దకు వచ్చాడు. రాముడు లక్ష్మణుని ద్వారము వద్దనుంచి ఎవ్వరినీ లోనికి రావద్దని శాసించాడు కాలపురుషుడు రామునితో. నీ అవతారలక్ష్యం పూర్తి అయ్యింది, వెంటనే వైకుంఠానికి విచ్చేయుమని కోరాడు. ఈ లోపులో దుర్వాసుడు అక్కడకు విచ్చేశాడు. ఆయన శాపానికి భయపడి లక్ష్మణుడు మునిరాకను రామునికి తెలియజేశాడు. నియమోల్లంఘన చేసిన కారణం చేత లక్ష్మణుడు వధార్హుడయ్యాడు. వసిష్ఠుని సూచనపై రాముడు లక్ష్మణుని పరిత్యజించాడు. లక్ష్మణుడు సరయూనదికేగి, ఆచమించి, ప్రాణవాయువును నిరోధించి అదృశ్యుడయ్యాడు. ఇంద్రుడు స్వయంగా వచ్చి లక్ష్మణుని త్రిదివానికి తీసుకువెళ్ళాడు. దేవతలందరూ సంతుష్టులయ్యారు. శ్రీరాముడు తన ఇద్దరు కుమారులలో దక్షిణ కోసలకు కుశుని, ఉత్తరకోసలకు లవుని ప్రభువులను కావించాడు. రామాజ్ఞపై శత్రుఘ్నుడు తన కుమారులైన సుబాహువుకు, శత్రుఘాతికి మగధరాజ్యాన్ని, విదిశారాజ్యాన్ని ఇచ్చి అయోధ్యచేరుకొన్నాడు.

ఇక్కడ ఒక్క విషయం పర్యాలోచన చేయవలసియున్నది. నారదుడు వాల్మీకితో "అశ్వమేధశతైరిష్ట్వా తథా బహుసువర్ణకైః" అని నూరు అశ్వమేధయాగాలు చేసినట్లు వచించాడు. యుద్ధకాండచివరి సర్గలో "శతాశ్వమేధాన్ ఆజహ్రే సదశ్వాన్ భూరిదక్షిణాన్" అని నూరు అశ్వమేధాలు చేసినట్లే చెప్పబడింది. సమాసంలో మొదటి పదం అంకె అయితే అది సంఖ్యావాచకమవుతుంది. ఉత్తరపదం అంకె అయితే బాహుల్యాన్ని సూచిస్తుంది. ఉత్తరకాండ చివరిలో (99-9) "దశవర్షసహస్రాణి వాజిమేధాన్ అథాకరోత్, వాజపేయాన్ దశగుణాన్ తథా బహు సువర్ణకాన్" అనే ఈ శ్లోకానికి పదివేల అశ్వమేధాలు, లక్ష వాజపేయాలు చేశాడని వ్రాశాడు. ఉత్తరపదంగా ఉన్న సంఖ్యావాచకానికి బాహుల్యార్థం వచిస్తే విరోధ ఉండదు. లేదా పదివేల సంవత్సరాలపాటు అశ్వమేధాలు చేశాడని చెప్పినా విరోధం ఉండదు అని గమనించవలసియున్నది. అలాగే శేషుడు లక్ష్మణుడని, సుపర్ణుడు భరతుడని, విష్వక్సేనుడు శత్రుఘ్నుడని, రాముడు విష్ణువని అందువల్ల లక్ష్మణుడు చతుర్థాంశమని వేరే పురాణం వచించింది.

శ్రీరాముడు సోదరులతో కలిసి పరంధామానికి వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాడు. సుగ్రీవుడు అంగదుని అభిషిక్తుని కావించి రాముని అనుసరించాడు. విభీషణునికి ఇక్ష్వాకుకులదైవతమైన జగన్నాథుని ఆరాధించమని

వచించాడు. ఆంజనేయుడు రామచరిత్రగానం చేయబడుతున్నంతకాలం ఇక్కడే ఉంటానన్నాడు. జాంబవంతుని, మైందుని, ద్వివిదుని, హనుమద్విభీషణులను కలి సంప్రాప్తించేవరకు ఇక్కడే ఉండమన్నాడు. అయోధ్యానగరవాసులు, స్థావర జంగమాలు, సర్వప్రాణులు రాముని వెంట పయనమయ్యారు. ఒక్క సూక్ష్మ ప్రాణి కూడ అయోధ్యలో మిగలలేదు. బ్రహ్మవారికందరినీ సాంతానికలోకాలకు చేర్చాడు. వానరులు తమ తమ దేవతలలో విలీనమయ్యారు. రాముడు పరంధామం చేరుకొన్నాడు.

ఆఖ్యానాన్ని బ్రహ్మస్వయంగా గౌరవించాడు. వాల్మీకి వ్రాసి ధన్యుడయ్యాడు. "ఈ రామాయణాన్ని శ్రాద్ధకాలాలలో కూడ వినిపించవచ్చు. ఈ రామాయణ పఠన శ్రవణాదులవల్ల సంతానం, ధనం లభిస్తాయి. గోవిందరాజీయ వ్యాఖ్యాప్రకారం పట్టాభిషేకానంతర కథ ఉత్తరం. సీత భూప్రవేశానంతర కథ భవిష్యము. రామాయణంలోని ఒక్క శ్లోకపాదం పఠించినా పాపాలు హరిస్తాయి. ఇది గాయత్రీస్వరూపం. దీనిని పఠించేవాడు సర్వపాపాలను పోగొట్టుకొని దీర్ఘాయుష్మంతుడవుతాడు ఇది చతుర్విధపురుషార్థసాధకం" "బలం విష్ణోః ప్రవర్ధతామ్" అని సంభావించి ప్రగాఢభక్తితో పఠించాలి.

ఈ రామాయణానికి ఎందరో ఎన్నో వ్యాఖ్యలు వ్రాసారు. ప్రసిద్ధములైన విషయాలు మాత్రమే ఇందు ప్రస్తావించబడినాయి. విజ్ఞులు సహృదయతలో దీనిని గ్రహించెదరుగాక!

"శ్రీరామ జయరామ జయజయ రామ"

# శ్రీమద్వాల్మీకి రామాయణం - ఉత్తరకాండ సమీక్ష

**వ్యాఖ్యాత - డా॥ దోర్బల ప్రభాకరశర్మ**

శ్రీరామచంద్రమూర్తి రాజ్యాన్ని పొందినందువల్లా, లోకానికి అపకారమొనర్చి అవ్యవస్థను కలిగించిన రాక్షసుల నందరిని వధించినందువల్లా ఆయనను అభినందించుటకు ఋషులు వస్తారు. బ్రహ్మదేవుని అనుగ్రహము వలన, బలవైభవం వలన రావణుడు మున్నగు రాక్షసులు ఎంత పరాక్రమం చూపినా చివరకు భగవంతుడైన శ్రీరామచంద్రుడే విజయం పొందినాడు. "శ్రీరామా! భగవంతుడా! నీవే ఎవరికైనా బలము నిచ్చినవాడవు. ఆ బలాన్ని ఉపసంహరించినవాడవు కూడా నీవే, నీ మహిమ అపారము" అని భగవంతుని శ్రీరామచంద్రమూర్తిని అభినందించడానికి ఋషులు వచ్చినారు. అభినందించడమంటే స్తుతించడమే అని శ్రీమహేశ్వర తీర్థ కృత తత్త్వదీపికలో వివరించబడినది. (ఆ తరువాత మహేశ్వరతీర్థకృత తత్త్వదీపికావ్యాఖ్యానము లభించుట లేదు) వచ్చిన ఋషులు రావణుని బలము కంటే ఇంద్రజిత్తుకు గల బలము గొప్పదని చెప్తారని భూషణవ్యాఖ్యలో శ్రీగోవిందరాజాచార్యులవారు సూచించారు. రాముని అభినందించడం కొఱకు కాక లక్ష్మణుని అభినందించడానికి అని, రాఘవ అనే శబ్దానికి లక్ష్మణుడు అనే అర్థం అని వ్రాయడం గోవిందరాజీయంలో విశేషం. 'ప్రాప్త రాజ్యస్య రామస్య' అనే ఉత్తరకాండారంభశ్లోకమున గల "ప్ర" అనే అక్షరము గాయత్రీమంత్రములోని ప్ర అనే అక్షరముగా కూడా భావించడం విశేషం.

ఋషుల పేర్లను నిర్వచిస్తూ "స్వస్త్యాత్రేయః" అనుచోట స్వస్తి అనగా స్వస్తికర శుభమును కలిగించేవాడు ఆత్రేయుడు అని దత్తాత్రేయుని సూచించినారు గోవిందరాజీయంలో వ్యాఖ్యాత. అలాగే వసిష్ఠుడు కూడా ఇతర ఋషులతో కలిసి ఉత్తరమువైపు నుండి వచ్చినట్లు మూలమున చెప్పబడింది. దీనిని వ్యాఖ్యానిస్తూ నక్షత్రమండలములో ఉండే వసిష్ఠుడు వేరని, అయోధ్యలో ఉండే వసిష్ఠుడు వేరని. ఆతడు వీరితో రాలేదని, వచ్చిన వసిష్ఠుడు అగస్త్యుని వలె జ్యోతిర్మండలము నుండి వచ్చినవాడే అని, వేరొక శరీరమును ధరించి అగస్త్యుడు తపస్సు చేయుటకు భూమిపైకివచ్చినట్లు చెప్పి వసిష్ఠుడు కూడా వేరొక శరీరమును ధరించి ఇక్ష్వాకులకు పౌరోహిత్యమును నిర్వహించు చున్నాడని ఇందు సూచించినారు వ్యాఖ్యాత. కౌశికుడనగా విశ్వామిత్రుని కన్న వేరైన మరొక ఋషి అని విశ్వామిత్రుడు ముందే సూచింపబడినాడని కూడా ఇందు వ్యాఖ్యాత గుర్తు చేసినారు.

మొత్తము మీద శ్రీరామచంద్రుని మందిరానికి కౌశికుడు, యవక్రీతుడు, గార్గ్యుడు మొదలైన 18మంది ఋషులు, వసిష్ఠుడు, కశ్యపుడు మొదలగు సప్తర్షులు మొత్తము 25 మంది ఋషులు సశిష్య పరివారముగా విచ్చేసినారు. శ్రీరామునకు తాము వచ్చినట్లు చెప్పవలసినదిగా ద్వారపాలకునికి సూచించినారు. ద్వారపాలకుడు లోనికి వెళ్ళి శ్రీరామునికి నివేదించినాడు. శ్రీరాముడు వెంటనే ప్రవేశింపజేసి అందఱికి పాద్యార్ఘ్యాది యోగ్యాతిథ్య క్రియను నిర్వర్తించినాడు. వారు రావణాసురుని చంపుట ఒక పెద్ద పనికాదని అతనితో పాటు అనేకమంది రాక్షసులను సంహరించుటే గాక ద్వంద్వయుద్ధమున ఇంద్రజిత్తును వధించుటే గొప్ప కార్యమని ప్రశంసించినారు.

ఇంతమందిని వధించగా ఇంద్రజిత్తును వధించడమే విశేషమని చెప్పుటలో మీ ఆంతర్యమేమని శ్రీరామచంద్రుడు ప్రశ్నించినాడు.

సత్యతీర్థీయవ్యాఖ్యయందు రావణాసురునికంటే ఇంద్రుని జయించిన ఇంద్రజిత్తు సామాన్యుడు గాడు. లక్ష్మణునిద్వారా ఆ ఇంద్రజిత్తును నీవే చంపించినావు. లక్ష్మణుడు ఇంద్రజిత్తునుండి తప్పించుకోగలిగాడు. ఆ కారణముగా నీవు విజయము గాంచినావు. ఇది నీ ముఖ్య విజయమని విశేషించి చెప్పబడినది. దిష్ట్యా అను శబ్దమునకు అదృష్టవిశేషము చేత అను అర్థముండగా సత్యతీర్థులవారు ఆదిష్ట్యా ఆదేశము చేత ఆజ్ఞచేత అని అర్థము వ్రాయుట కూడా విశేషము. శ్రీరామా! నీ ఆదేశము చేతనే లక్ష్మణుడు విజయం పొందినాడు అని తాత్పర్యం. "ముక్తః సురరిపోర్వీర ప్రాప్తశ్చ విజయస్త్వయా" అను 29వ శ్లోకభాగమున గల "ముక్త" అను పదమునకు "త్యక్తః" వదలబడినాడు (నది) అను అర్థము కాక త్యాజితః వదలింప జేయబడినది, ప్రాణము సురరిపువైన ఇంద్రజిత్తు ప్రాణము వదిలింపజేయబడినది లక్ష్మణునిచేత అను ణ్యంతార్థము ప్రేరణార్థము చెప్పుట విశేషము. అట్లే "వీరప్రాప్తః" అని విభాగము చేసి "ఓ వీరా! రామా! ప్రాప్తమైనది నీకు విజయము" అని అర్థము చెప్పక 'వీరప్రాప్తః' అని సమాసపదముగా శబ్దమును గ్రహించి "ఈర" అనే శబ్దము ప్రాణమును బోధించునని "వీరః" అనగా ప్రాణములను పోగొట్టుకొనినవారు అని వారిని పొందినవాడు ప్రాణాలను కోల్పోయిన వారి సమూహములో ఇంద్రజిత్తు కూడా చేరినాడు అని అర్థము వ్రాయుట శ్రీసత్యతీర్థవ్యాఖ్యానములోని విశేషము.

శ్రీరామచంద్రుని మాటలలోని "యది గుహ్యం న చేత్ వక్తుం శ్రోతుమిచ్ఛామి కథ్యతామ్" అను మాటకు నేను మిమ్ములను చెప్పవలసినదని ఆదేశించను. ఇంద్రజిద్వధ రావణునివధకన్న ఎట్లు శ్రేష్ఠమో అను ఈవిషయము రహస్యము కానిచో మీరు చెప్పుటకు నేను వినుటకు అర్హమైనచో చెప్పవచ్చును అను వినయ ప్రధానమైన భావము గోవిందరాజీయమున కనపడుచున్నది. ఈసర్గలోని మొదటి శ్లోకమున గల "రాఘవమ్" అను శబ్దమును శ్రీరామచంద్రుని అని కాక లక్ష్మణుని అను అర్థమును కూడా స్వీకరింపవలెనని సత్యతీర్థుల వ్యాఖ్యానములోని విశేషము. శ్రీరాముని స్తుతించుటకే కాక లక్ష్మణుని కూడా స్తుతించుటకు ఋషులు వచ్చినారని భావము.

## రెండవ సర్గము

శ్రీరామచంద్రుని ప్రశ్నను విన్న అగస్త్యుడు ఇంద్రజిత్తు యొక్క విశిష్టతను చెప్పబోతూ ముందు ఇంద్రజిత్తు రావణుడు మున్నగువారు ఏ పులస్త్య వంశమున పుట్టిరో ఆ వంశమును గూర్చి వర్ణించి చెప్పనారంభించినాడు. పూర్వము కృతయుగమున బ్రహ్మదేవుని శరీరాంశములనుండి అనేకులగు ప్రజాపతులు పుట్టినారు. అందునుండి పులస్త్య ప్రజాపతి కలిగినాడు. అతడు బ్రహ్మతో సమానుడే. బ్రహ్మపుత్రుడు మాత్రమే కాదు "ధర్మతః" "శీలతః" బ్రహ్మవలె బ్రహ్మనుండి పుట్టినాడు. ఆతని గుణగణాలు అనిర్వర్ణనీయములు. అతడు తపస్సు చేయుటకై ధర్మసాధనకై తృణబిందుమహర్షి ఆశ్రమమునకు మేరుపర్వతప్రాంతమున గల ఒక చక్కని స్థానమునకు చేరుకొనినాడు. తపము నారంభించినాడు. ఒక ఆటగా విలాసముగా అతని తపమును భగ్నమొనర్చుటకై దేవతా స్త్రీలు (అప్సరసలు) నాగకన్యలు, తృణబిందు రాజర్షి పుత్రికలు, పరిచారికలు, సఖురాండ్రు వచ్చి నృత్య గీత వాద్యములతో విఘ్నము

చేయసాగినారు. పులస్త్య ప్రజాపతి ఆ విఘ్నమును లెక్క చేయలేదు. ఎవరు నాతపమునకు భంగము కలిగించుటకై ఈ ప్రదేశమునకు చేరుదురో, నా వేదధ్వనిని విందురో వారు గర్భవతులగుదురని శపించినాడు. అది విని ఆ ప్రదేశమును కన్యకలందరు విడచినారు. రాజర్షి అగు తృణబిందుని కూతురు ఆ మాటను వినలేదు. ఆమెకీ విషయము తెలియదు. ఆశ్రమమును ప్రవేశించి పులస్త్య ప్రజాపతి ఉచ్చరించిన వేదధ్వనిని వినుటతోడనే గర్భవతి అయినది. ఇచ్చట గర్భవతిని సూచించుటకు "పాండు దేహా" అను శబ్దము వాడబడినదని, గర్భవతిగా నున్నప్పుడు శరీరము పాలిపోవునని గోవిందరాజీయము సూచించినది. ఇదేమిటని తండ్రినడిగినది. తండ్రి తృణబిందువు యోగశక్తితో విషయమును గ్రహించి తనకూతురును భిక్షగా స్వీకరింపుమని పులస్త్య ప్రజాపతిని కోరినాడు. ప్రజాపతి అంగీకరించినాడు. "ఉద్యతామ్ ఆహృతాం భిక్షాం పురస్తాద ప్రవేదితామ్. భోజ్యాం మేనే ప్రజానాథో హ్యపి దుష్కృత కర్మణః" అని – ధర్మశాస్త్రమున ఉండుట వలన అసంకల్పితముగా ఈయబడిన భిక్ష స్వీకరింపవలసినదే తప్ప అది దుర్మార్గుని భిక్ష అని కూడా నిరాకరింపరాదని ఆలోచించి పులస్త్య బ్రహ్మ ఆ అమ్మాయిని భిక్షగా స్వీకరించినాడని గోవిందరాజీయ సమన్వయము. ఆ విధముగా ఆ అమ్మాయిని స్వీకరించి "అమ్మాయీ! నేను నీవలన సంతోషము నొందినాను. మీవంశమునకు మావంశమునకు ప్రతిష్ఠాకరుడైన మగబిడ్డ మనకు కలుగునని చెప్పి నాకు కుమారుడగుట వలన పౌలస్త్యుడు అను పేరుతో, వేదమును వినినవాడగుటవలన విశ్రవుడు అనుపేరుతో అలరారు" నని పులస్త్యుడనినాడు. ఈ విధముగా కలిగిన విశ్రవుడు తండ్రితో సమానమైన శక్తి, తపోనిష్ఠ, ధర్మశ్రద్ధ కలవాడైనాడు.

## మూడవ సర్గము

విశ్రవుడు తండ్రిలాగా సత్యశీలస్వాధ్యాయసంపన్నుడని గ్రహించి భరద్వాజ మహర్షి తన కూతురు "దేవ వర్ణిని"ని ఇచ్చి వివాహము చేసినాడు. విశ్రవుని గుణాలలో "సర్వభోగేష్వసంసక్తః" అను మాటకు సర్వభోగ–ఇ–ఇషు అసంసక్తః అను విభాగము చేసి సర్వభోగములందును, మన్మథ బాణముల యందును, సంగము సంబంధము లేని వాడని సర్వభోగములున్నను మన్మథుని బాణాలకు గురి కాలేదని అర్థము చెప్పుట ఇచ్చట సత్యతీర్థవ్యాఖ్యా విశేషము. "దేవవర్ణిని" అను శబ్దమునకు దేవవర్ణిని అని పేరు గలది భరద్వాజుని పుత్రిక అనే అర్థము కాక దేవతలతో సమానమైన రూపము కలది అని గోవిందరాజీయవ్యాఖ్యాన విశేషము. విశ్రవునికి వివాహానంతరమే ధర్మ ప్రజాసంపత్త్యర్థం అని సంకల్పము చేసినందువలన తన భార్య ద్వారా సంతానమును పొందవలెనని సంకల్పము కలిగినది. ఆసంకల్పముచే అతడు దేవవర్ణినియందు కుమారుని పొందినాడు. ఆ కుమారుడు విశ్రవసుని (విశ్రవణుని) కుమారుడగుటచే వైశ్రవణుడను పేరు పొందినాడు. చతుర్ముఖ బ్రహ్మ అతని జన్మలగ్నాదులను విచారించి ధనాధ్యక్షుడౌతాడని చెప్పి అందరిని ఆనందపరుస్తాడు. వైశ్రవణుడే కుబేరుడు. అతడు బ్రహ్మకొఱకు ధర్మార్థియై తపమొనరించి బ్రహ్మ ప్రసన్నుడు కాగా ధనరక్షణకార్యప్రధానమైన లోకపాలకత్వమును కోరాడు. బ్రహ్మ చాలా ఆనందించి నేనే నాల్గవ లోకపాలుని సృజింప సంకల్పించియుంటిని. నీవే ఆ లోకపాలత్వము నడిగితివి కనుక సర్వధనాధిపతిత్వముతో విరాజిల్లే లోకపాలత్వమును ఇంద్ర యమ వరుణులతో పాటు స్వీకరింపుము, మిక్కిలి ప్రకాశిస్తూ సూర్యమండలం వలె మెఱయుచున్న ఈపుష్పక విమానమును కూడా స్వీకరింపుమని వరము నిచ్చాడు. వరమును బడసిన కుబేరుడు తన తండ్రి విశ్రవుని చేరుకొని "నాన్నా! నేను పితామహుని వలన వరమును

బడసితిని. బ్రహ్మ ఆదేశానుసారము నేను ఋషి వలె ఎచటనో ఉండరాదు, అయితే ఎచట ఉండవలెనో బ్రహ్మ నాకు నిర్ణయించి చెప్పలేదు మీరే చెప్పుడు నేనెచట నుండవలెను?" అని అడిగాడు. నేనుండు చోట ఏ ప్రాణికి అపకారము హాని కలుగకూడదన్నాడు. దానికి విశ్రవసుడు "నాయనా! దక్షిణ సముద్రపుటొడ్డున త్రికూటమను పర్వతము కలదు. ఆ పర్వతము పైన విశ్వకర్మ లంక అను పేరుగల చక్కని నగరమును, దేవతలకు అమరావతిని నిర్మించినట్లు, రాక్షసులకై నిర్మించాడు. యంత్రరూపమున శస్త్రములు గల ఆ నగరము చాలా సుందరమైనది. ప్రస్తుతము ఆ నగరమును విష్ణు భయాతురులైన రాక్షసులు వదలి రసాతలమునకు పారిపోయినారు. నిర్జనముగా నున్న ఆ లంకానగరమున ప్రస్తుతము నీవు నివసింపుమని చెప్పాడు. తండ్రి మాటలు విని కుబేరుడాలంకానగరమున వసించాడు. మధ్య మధ్య తల్లిదండ్రులను సేవించుటకై విశ్రవుని ఆశ్రమమునకు వస్తూ వుండినాడు" అని అగస్త్యుడు కథను చెప్పసాగెను.

## నాలుగవ సర్గము

శ్రీరామచంద్రు డాశ్చర్యముతో వింటూ అగస్త్యుని ఇట్లు ప్రశ్నించాడు. మహర్షీ! రాక్షసులందరు లంకలో కుబేరుని తరువాత ప్రవేశించినట్లు వింటిని. కుబేరునికి ముందే రాక్షసులు లంకలో నున్నట్లు చెప్పుచున్నారు. ఇది ఎట్లు సాధ్యము! రావణ కుంభకర్ణాదుల కన్న ఆ రాక్షసులు బలవత్తరులా! విష్ణువు వారినేవిధముగ పారద్రోలినాడు? వివరింపుడని కోరగా అగస్త్యుడు ప్రశ్నకు సంతోషించి రామునితో నిట్లన్నాడు. ఇచ్చట "సలిలసంభవః పద్మసంభవః" అని బ్రహ్మకున్న రెండు విశేషణములను కలిపి నీటిలో కమలమున బ్రహ్మ జన్మించాడు కనుక సలిలసంభవుడు పద్మసంభవుడు బ్రహ్మ అని చెప్పుట అని గోవిందరాజీయ వ్యాఖ్యావిశేషము. అగస్త్యుడిట్లన్నాడు. రామా! సలిల సంభవుడు పద్మసంభవుడైన బ్రహ్మ, ఒకనాటి పగటి పూట ఆ పగలు గడచిపోతున్న చివర సమయమున భూమికి క్రింద సముద్రరూపముగా నీటిని సృజించినాడు. ఆ రాత్రి ఎలాగో గడచినది. ఆ నీటిని రక్షించుటకై తెల్లవారు జామున వివిధ ప్రాణులను పుట్టించినాడు. ఆ తరువాత ఓ ప్రాణులారా! ఈ నీటిని రక్షిస్తామన్నవన్నీ రాక్షస రూపముగా కొన్ని మేము భక్షిస్తామన్నవన్నీ యక్షరూపముగా మారిపోయాయి. ఆకలిగల ప్రాణులు భక్షిస్తామని పరిహాసముగా అని యక్షరూపము నొందాయి. ఆకలి లేని ప్రాణులు రక్షిస్తామని రాక్షసరూపము నొందినవని గోవిందరాజీయ వ్యాఖ్యావిశేషము.

ఆ రాక్షసులలో హేతి ప్రహేతులను వారు ముఖ్యులు. ప్రహేతి ధార్మికుడు. హేతిమాత్రము కాలుడైన యముని సోదరి భయ అను దానిని పెండ్లి చేసికొని భయంకరుడైన విద్యుత్కేశుడను వానిని కొడుకుగా పొందినాడు. విద్యుత్కేశుడు నీరు మధ్య గలవాడు అనగా నీటిని త్రాగి తనలోన నుంచుకొని అవసరమై నప్పుడల్లా ఉక్కలించి పైకి గ్రక్కుతూ ఉండే విద్యుచ్ఛక్తియే ఆ విద్యుత్కేశుడనే రాక్షసరాజు అని అర్థముతో రామాయణములోని వైజ్ఞానికాంశమును గోవిందరాజీయము స్పష్టము చేసినది. హేతి తన కుమారునకు యోగ్యురాలైన కన్య ఎవరిని ఆలోచించి సంధ్యాదేవి యొక్క కూతురైన సాలంకటకట అను ఆమెతో పెండ్లి చేసి గృహస్థుని చేసినాడు. విద్యుత్కేశుని ద్వారా సాలంకటకట గర్భవతి ఐనది. గంగ శివుని తేజమైన కుమారస్వామి గర్భమును రెల్లులో

వదలినట్లుగా, సాలంకటకట కూడా మందరపర్వతమున ప్రసవమొంది ఆ గర్భశిశువును ఒక పిడుగులాగా చూచి అచ్చటనే వదలి భర్త విద్యుత్కేశునిపై ఆసక్తితో వెళ్ళిపోయినది. కొంతసేపటికి మేఘగర్జనము చేసినట్లుగా పెడబొబ్బలు పెట్టుతున్న ఆ కుమారుని అనుకోకుండా ఆవైపు నుంచి వెళ్ళుతున్న పార్వతీ పరమేశ్వరులు చూస్తారు. పార్వతి కోర్కెప్రకారము పరమేశ్వరుడు ఆ పిల్లవానిని పెంచుతాడు. ఆ పిల్లవానికి తల్లికున్న వయస్సు వెంటనే వస్తుంది. అతనిని అమరుని (దేవతగా) చేసి శివుడు ఆకాశములో సంచరించే పుష్పకవిమానమును కూడా ప్రసాదిస్తాడు. ఇచ్చట అగ్నిజమను శబ్దమునకు మహేశ్వర తేజమైన కుమారస్వామి అను అర్థము గలదని, ఘన గర్భము అను శబ్దమునకు పిడుగు అని అర్థము కలదని, వ్యాఖ్యానము గోవిందరాజీయవిశేషము. పార్వతి కూడా రాక్షసులందరికీ కూడా వెంటనే గర్భమును పొందుట వెంటనే ప్రసవించుట, వెంటనే యౌవనవతులగుట అను వరముల నిచ్చినది. సాలంకటకటకు విద్యుత్కేశునికి కలిగిన కుమారుడే సుకేశుడైనాడు. ఈ ప్రకరణమున సద్యోపలబ్ధి అను శబ్దమునకు సద్యఃఉపలబ్ధి అను విభాగము చేసిన సద్యోపలబ్ధి అను గుణసంధి సాధ్యము కాదు. కనుక సద్య అను అకారాంత, శబ్దము పథ–ఉదకమ్ ఉపస్కురుతే అన్నట్లు చేయవలెనను సమన్వయము సత్యతీర్థవ్యాఖ్యాన విశేషము. సద్యః ఉపలబ్ధిః అనే పదవిభాగము చేయవలెను. సద్యోపలబ్ధిః అను రూపము ఆర్షప్రయోగముగా మాత్రమే స్వీకరింపవలెనని గోవిందరాజీయము. రాక్షసస్త్రీలు రతి కొఱకే భర్తృసాంగత్యమును చేస్తారుకాని సంతానార్థము కాదు కనుక వారికి సద్యో గర్భ– సద్యఃప్రసూతి – సద్యోవృద్ధి అను వరమిచ్చినది పార్వతి అని సత్యతీర్థవ్యాఖ్య.

## అయిదవ సర్గము

సుకేశుడు ధర్మజ్ఞుడని తెలిసి గ్రామణి అను గంధర్వుడు తన కూతురు దేవవతిని త్రిలోకసుందరిని ధర్మప్రవృత్తితో నిచ్చి వివాహం చేశాడు. వారిదాంపత్యము అంజన దిగ్గజము కుమారుడైన గజ రాజకుమారునికి అతని భార్య కరేణువు (ఆడ ఏనుగు) తో ఏర్పడిన దాంపత్యము వలె నుండెనను గోవిందరాజీయ వ్యాఖ్య వివరణ. సుకేశునకు దేవవతి యందు ముగ్గురు కుమారులు కలిగారు. వారు మాల్యవంతుడు, సుమాలి, మాలి అనువారు. వారు ముగ్గురు ఆ దంపతులకు మూడు కన్నులవంటివారు, ముల్లోకములవలె వ్యగ్రత లేనివారు. త్రేతాగ్నుల వలె చైతన్యము గలవారు. ఉత్సాహ ప్రభుమంత్ర శక్తుల వలె మిక్కిలి ఉగ్రులు లేదా మూడు వేదాల వలె సులభగ్రాహ్యులు కానివారు. వాతపిత్త శ్లేష్మముల వలె అతిభయంకర ప్రభావము గలవారు. గమనింపబడని వ్యాధుల వలె పెరిగినారు అని ఇచ్చట గోవిందరాజీయ వ్యాఖ్యకాగా, వ్యాధయః అపేక్షితాః అని కూడా విడదీయవచ్చును. అప ఈక్షితాః వ్యాధయః అని అర్థము చెప్పవచ్చును. కోరబడిన వ్యాధులు అనిగాక గమనింపబడిన వ్యాధులవలె వారు పెరిగిరని చెప్పవచ్చును. కనుక వ్యాధయః అపేక్షితాః వ్యాధయో పేక్షితాః అను సంధిని కూడా ఆదరించవచ్చని ఇచట సత్య తీర్థుల వ్యాఖ్య. మొత్తము మీద వారు చాల తేజశ్శాలురైనారు. తండ్రిలాగా బ్రహ్మగూర్చి తప మొనర్చి బ్రహ్మప్రత్యక్షము కాగా ఎవరివలనను గెలవబడుకుండుటను (అజేయత్వమును) శత్రువులను చంపగలుగుటను (శత్రుహంతృత్వమును) చిరకాలము జీవించగల్గుటను (చిరంజీవిత్వమను) వరముగా పొందినారు. వరబలముచే వారు దేవతలను ఋషులను, పీడింపసాగినారు. మాకు ప్రత్యేకముగా వసతి కావలెను నిర్మింపుమని విశ్వకర్మను కోరినారు. అంతకు ముందే

ఇంద్రుని ఆజ్ఞచే నిర్మింపబడిన లంకానగరము త్రికూట పర్వతమునకు దగ్గరనే సువేలపర్వతముపై నిర్మింపబడి యున్నది. 30 యోజనాల వెడల్పు 100 యోజనాల పొడుగు బంగారు ప్రాకారము గల ఆ లంకలో మీరు నివసించుడనినాడు విశ్వకర్మ. ఇక ఆ రాక్షసులు అమరావతిని మాత్రమే కాక లంకను కూడా ఆక్రమించి అందు నివసింపసాగినారు. ఇచ్చట "అమరావతీం సమాసాద్య" అని ఒక పాదానికి ఉండవలసిన 8అక్షరములకన్న ఒకఅక్షరము (9వ అక్షరము) ఎక్కువగా ఉండుట వారి మదాధిక్యమును (ఎక్కువ మదమును) సూచించుచున్నదని గోవిందరాజీయవ్యాఖ్య. ఒక గంధర్వ స్త్రీ "నర్మద" అను ఆమె, ధీశ్రీకీర్తులతో సమాన కాంతిగల తన పుత్రికలను సుందరి, కేతుమతి, వసుధ అనే ఉత్తర ఫల్గుని నక్షత్రాధిదేవతలైన దేవతా స్వభావము గల తన కూతుళ్ళను ఇచ్చివివాహము చేసినది. మాల్యవంతునికి సుందరి యందు వజ్రముష్టి, విరూపాక్షుడు, దుర్ముఖుడు, సుప్తఘ్నుడు యజ్ఞకోపుడు, మత్తుడు, ఉన్మత్తుడు అను కుమారులును, అనల అనే అమ్మాయి కూడా కలిగారు. సుమాలికి కేతుమతి యందు ప్రహస్తుడు, అకంపనుడు, వికటుడు, కాలకార్ముకుడు, ధూమ్రాక్షుడు, దండుడు, సుపార్శ్వుడు, సంహ్రాది. ప్రఘసుడు, భాసకర్ణుడు అను కుమారులు, రాక, పుష్పోత్కట, కైకసి, కుంభీనసి అను నలుగురు కూతుళ్ళను కలిగారు. మాలికి వసుధయందు అనిలుడు, అనలుడు, హరుడు సంపాతి అను విభీషణుని మంత్రులు కుమారులుగా కలిగారు. వీరందరితో ఆ ముగ్గురు రాక్షసులు లోకాలను గడగడలాడిస్తూ తిరుగుతూ అంతటా భయోత్పాతాలను కలిగింపసాగారు.

## ఆరవ సర్గము

ఆ రాక్షసులచే పీడింపబడిన దేవతలు ఋషులు శివుని శరణ మొందారు. శివుడు కూడా సృష్టికర్తలలో ఒకడు కనుక ప్రజాపతి అనియు, అవిష్ణువునుండి పుట్టుట వలన అజుడు అనియు, తాను అనుగ్రహిస్తే తప్ప ఎవరికి దర్శనమీయనివాడు కనుక అవ్యక్తరూపుడనియు, పూజ్యుడు కనుక ఆరాధ్యుడనియు, హితమును పదేశించువాడు కనుక పరమగురువనియు సత్యతీర్థవ్యాఖ్యానము. సుకేశుడు తనకు భక్తుడైనందున వారి పుత్రులను వధింపజాలనని (గోవింద రాజీయము) విష్ణువే ఆ రాక్షసులను వధింపగలడని శివుడు సూచించాడు. ఈ విషయము దేవతలకు రాక్షసులకు ముందే తెలిసినను శివుని దోషమును (వరము నిచ్చుటను) శివునికి గుర్తు చేయవలెనని, ముందు శివుని చూచుటయని గోవిందరాజీయవ్యాఖ్య. ఉపాయము చెప్పినందుకు శివునికి జయ కారమొనర్చి దేవ, ఋషులు విష్ణువు నర్థించి ఆ రాక్షసులను చక్రముతో చంపి యమలోకమున కంపుమని కోరారు. నేనా పనిని నెరవేర్తునని భగవానుడు విష్ణువు చెప్పగా దేవతలు స్వస్వస్థానములను చేరుకొన్నారు. మాల్యవంతుడు సోదరులకీ విషయం చెప్పాడు. ఇచ్చట శివుడు తలను, చేతిని విదిలించుటలో రాక్షసులు తనకు భక్తులగుట వలన వారిపై దయ, దేవతల పట్ల అసహనము అని గోవిందరాజీయ వ్యాఖ్య. నారాయణుని వలన పూర్వము రాక్షసులు వధింపబడిరి. ఇప్పుడు కూడా దేవతలు తిరిగి బలమును సంపాదించుచున్నారు. మనకెప్పటికైనా దేవతలవల్ల ముప్పు తప్పదు అని సోదరునిలో గల భయభావమును గమనించు మాలిసుమాలులు దేవతలు మనలనేమీ చేయలేరు. నారాయణరుద్రులు, ఇంద్రాదులు కూడా మనను చూస్తే భయపడుతారు. మనపై ద్వేషం పెంచుకోవడానికి విష్ణువుకేమీకారణం లేదు. దేవతలే విష్ణువు మనస్సును వికలపఱచి ఉందురు. ముందుగానే మనం యుద్ధానికి

వెళ్ళడం సబబుగా ఉంటుంది అని చెప్పి యుద్ధానికి సిద్ధమౌతారు. తోటి రాక్షసులను సిద్ధపరుస్తారు. లంకలో జరిగిన కోలాహలాన్ని, రాక్షసుల యుద్ధసన్నాహాన్ని విని దేవతలు భయకంపితులై దేవలోకాన్ని విడిచి వెళ్తారు. అట్టహాసంచేస్తూ సర్వప్రాణులను భయపెడ్తూ రాక్షసులు దేవలోకాన్ని చేరుకొంటారు. దేవదూత ద్వారా ఈ విషయాన్ని విని గరుడవాహనారూఢుడై మహావిష్ణువు దేవ, ఋషి, మునులు స్తుతించుచుండగా రాక్షసుల నెదుర్కొనుటకై యుద్ధరంగానికి చేరుకొంటాడు.

## ఏడవ సర్గము

నారాయణుడు పర్వతమువలె స్థిరుడై యుండగా రాక్షసులు మేఘములలాగా శస్త్రాస్త్ర వర్షమును కురిపించారు. అనేక విధాలుగా యుద్ధాన్ని చేశారు కాని శ్రీమన్నారాయణుని కంపింపజేయ లేకపోయారు. రాక్షసులు కొద్దిసేపు ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడా లేకుండా చేశారు. అయితే అదే ప్రాణాయామముగా మారి విష్ణువుకు శక్తిని పెంచింది. శ్రీమహావిష్ణువు ఒక్క ఉదుటన విజృంభించి ప్రాణసారంతో శంఖమును పాంచజన్యమును పూరించాడు. రాక్షసులు ఆ నాదాన్ని వినే విష్ణువు ముందు నిలువలేక పారిపోయినారు. శార్ఙ్గచాపము నుంచి విముక్తములైన బాణములచే రాక్షసులు వినాశన మొందినారు. లంకవైపు తిరుగు ప్రయాణం ప్రారంభించినారు. సుమాలి వారి నుద్బోధించి తిరిగి యుద్ధము చేయుటకుత్సాహపఱచినాడు. నారాయణుని ఎదిరించి బాణాలతో కప్పివేసినాడు. రాక్షసులు మరల ధైర్యము పొందినారు. సుమాలి భయంకరంగా యుద్ధం చేసి నారాయణునితో కొట్టబడి తిరుగుతూనే ఉండిపోయినాడు. ఆ తరువాత మాలి నారాయణునితో యుద్ధమొనర్చినాడు. మాలి బాణములు మిక్కిలి సారవంతములు, మధ్యలో దేనిని లెక్కచేయకుండా లక్ష్యమును భేదించేవి అని గోవిందరాజీయవ్యాఖ్య. ఒకసారి మాలి గరుడుని తీవ్రముగా గదతో కొట్టగా గరుడుడు కూడా వేదనతో స్వామి విష్ణువుతో పాటు పరాఙ్ముఖుడైనాడు. ఒకసారి శ్వేతారణ్యమున మార్కండేయ మునిని, ఒక మహారాజును రక్షించడానికి ప్రత్యక్షమైన శివునికి యమునితో యుద్ధం జరిగింది. ఆ యుద్ధమున ఒకసారి అంతకుడు (యముడు) శివుని తలపై కొట్టినాడు "ఈశానమివ చాంతకః" అని మూలములో ఉన్నమాటకు పైకథను అను సంధించాలి. "వజ్రేణేంద్రో యథాచలమ్" అనే ఉపమానము. ఇది మాలికి తాత్కాలిక విజయమే అనే సూచించుచున్నదని సత్యతీర్థవ్యాఖ్య. ఆ వెంటనే హరి గరుడుని ఉత్సాహపఱచి తనచక్రమును ప్రయోగించగా అది సూర్యమండలము వలె భాసించుచు మాలి పట్ల కాలచక్రమై మాలితలను ఛేదించింది. ఇచట "సూర్యమండలాభాసం స్వభాసా" అను పదములకు సూర్యమండలము వలె భాసించేది, సూర్యమండలపు కాంతితో భాసించేది, సూర్యమండలము కాంతి కంటెను మంచి కాంతితో భాసించేది చక్రము అని వ్యాకరణ సమాసముల చేత మూడు విధాలుగా చేసిన సత్యతీర్థవ్యాఖ్య విశిష్టముగానున్నది. మాలి హతుడు కాగానే సుమాలి మాల్యవంతులు లంకవైపు పారిపోయినారు. వారు పారిపోవుటకు సేద తీరిన గరుడుడు కూడా యుద్ధం చేసి కారణమైనాడు, వారు లంకను చేరేదాకా విష్ణువు వెంబడించుచునే ఉన్నాడు. ఆ యుద్ధంలో రాక్షసులకు తమ బలమును తాము మఱచినట్లైనది అని "ఉన్మత్తతరం" అను శబ్దమునకు గోవిందరాజీయవ్యాఖ్య మణిముకుటము విశిష్టముగానున్నది.

## ఎనిమిదవ సర్గము

మాల్యవంతుడు కొంచెము వెనుతిరిగి "విష్ణూ! నీవు అధర్మయుద్ధము చేయుచున్నావు. మేము పారి పోతుండగా మమ్ము పీడించుట మాపై శస్త్రాస్త్రముల ప్రయోగించుట ధర్మవిరుద్ధమ"నినాడు. దేవతలకు నేను అభయమిచ్చినాను, ప్రతిజ్ఞ యొనర్చినాను కనుక పరాఙ్ముఖవధ పాపమేమి కాదు యుద్ధవీరులకు, అని చెప్పి విష్ణువు మరల యుద్ధము నారంభించినాడు. అపుడు మాల్యవంతుడు తీవ్రముగా యుద్ధము చేస్తూ తన వద్దగల శక్తి అనే ఆయుధమును విష్ణువు వక్షఃస్థలమున ప్రయోగించినాడు. విష్ణువు శక్తిధరుడైన కుమారస్వామికి ప్రియుడు కనుక అదే శక్తి ఆయుధమును ఉపాసించి ప్రయోగించగా మాల్యవంతుడు మూర్ఛిల్లినాడు. ఇచ్చట మహేశ్వరుని కుమారుడైన సుబ్రహ్మణ్యుని విష్ణువారాధించుట చింతింపదగినదని గోవిందరాజీయ వ్యాఖ్యావిశేషము. మరల యుద్ధము జరిగినది. రణరక్తుడను రాక్షసుడు విష్ణువును పిడికిలితో గ్రుద్దాడు. గరుడుడు వెంటనే విజృంభించి రెక్కల గాలితో రాక్షస సైన్యమునతలాకుతలము చేశాడు. ఎండుటాకులలాగా సుమాలి మాల్యవంతులు కూడా లంకను చేరుకొని అచ్చట కూడా ప్రమాదమేనని భావించి తమ పత్నీపుత్రాదులతో పాటు, విద్యుత్కేశ పత్ని సాలంకటకట వంశమున పుట్టిన రాక్షసులందరును (అని గోవిందరాజీయ వ్యాఖ్య) పాతాళమునకు పారిపోయినారు. కావున! ఓరామా! ఈ కథంతా విన్నావు కదా నీచే వధింపబడిన రావణాదులందరికంటె ఆ సుమాలి, మాల్యవంతుడు, ఆ వంశమున పుట్టిన రాక్షసులందరు ఎన్నో రెట్లు మిక్కిలి బలవంతులు. నీవు కూడా ఆ నారాయణుడవే కనుక రావణాదులను చంపగలిగినావు. ఆ విధముగా రాక్షసులు లేని లంకలో కుబేరుడు తన తండ్రి విశ్రవసునిచే సూచింపబడి సుఖముగా ప్రవేశించినాడు.

## తొమ్మిదవ సర్గము

కొంత కాలమునకు సుమాలి తన కూతురు కైకసిని తోడ్కొని రసాతలమునుండి భూలోకానికి వచ్చినాడు. కుబేరుడు తన వైభవముతో తండ్రిని నమస్కరించుటకై అప్పుడే లంక నుండి బయల్దేరినాడు. సుమాలికి నశించిన ఐశ్వర్యము మళ్ళీ ఎట్లు కలుగుతుందనే తపన మొదలైనది. తనకూతురుకు యోగ్యుడైన వరుడు లభించనిచో ఎవరో రాక్షసులు వచ్చి వివాహమాడుదురని, వివాహమైన తరువాత కూడా కూతురు సంసారము ఎలా ఉంటుందో (గోవిందరాజీయ వ్యాఖ్య) అనే చింత ఉండనే ఉంటుంది కనుక నీవు తపోధనుడైన విశ్రవుని ఈ సమయములో ఆశ్రయించడం మంచిదని కూతురుకు హితబోధ చేస్తాడు. నాన్నగారు సూచించినట్లు వెంటనే బయల్దేరి విశ్రవసుడు సాయంకాలాగ్నినుపాసించుచున్న సమయానికి చేరుకొని అతని వద్దకు వెళ్ళి ఏదో కోరికతో నున్నట్లు బొటనవ్రేలుతో భూమిని రాస్తూ కూర్చున్నది. కుబేరుని కూడా చూపించి ఇలాంటి కుమారులు లంకాధిపత్యము నొనరించు కుమారులు నీకు కలుగుతారని తండ్రి చెప్పినాడు. కనుక ఆ ఉద్దేశాన్ని ప్రకటిస్తూ కూర్చొన్నది. విశ్రవుడు ఆ అమ్మాయిని ఆమె మనోభావాన్ని గమనించి కన్యా! నీవెవరవు? ఈ సమయంలో ఏల వచ్చితివి? అని అడుగగా నా మనోభిప్రాయమును తామే గ్రహించుగలుగుదురని యుక్తిగా అన్నది. ఆ మాటలను విని సరే కాని నీవు వచ్చిన సమయము సంధ్యా సమయము. ఈ సమయమున నీకు కలిగే కుమారులు చాలా భయంకరులౌతారు మరి అన్నాడు విశ్రవసుడు. నాకు క్రూరసంతానము రాక్షససంతానము వద్దన్నది కైకసి.

ఈ సంధ్యాసమయానుసారము నీకు ఇద్దరు రాక్షసులు తప్పక కలుగుతారు. చివరివాడు మాత్రము నా స్వభావముతో జన్మిస్తాడు అని విశ్రవసుని మాటలను విని కొంచెము తృప్తి పొంది కైకసి గర్భవతియై కొంత కాలమునకు భయంకరాకారుడైన రావణుని, కొలతకుమించిన అపరిమితమైన శరీరముగల కుంభకర్ణుని, చివరగా విభీషణుని కన్నది. మరల ఒకనాడు కుబేరుడు తండ్రిని దర్శింపరాగా అతనిని చూపించి చూడు మీ అన్న (కుబేరుడు) ఎలా ఉన్నాడో! నీవు (దరిద్రుడవు) ఎలా ఉన్నావు! నీవు అలా (సంపన్నుడవుగా) కావాలి అని అన్నది రావణునితో కైకసి. ఆ మాటలను విన్న రావణుడు తమ్ములతో కూడి బ్రహ్మగూర్చి తపస్సు చేయగా బ్రహ్మ వారికి వరముల నిచ్చాడు.

## పదవ సర్గము

వారి తపస్సేవిధముగా సాగినది? అనే శ్రీరాముని ప్రశ్నకు అగస్త్యుడు ఈ విధముగా చెప్పసాగినాడు– ముందుగా కుంభకర్ణుడు వీరాసనము పైనుండి అన్ని కాలాలలోను కష్టమైన తపస్సును పదివేల సంవత్సరాలు చేసినాడు. విభీషణుడు కూడా సాత్త్వికముగా ఐదువేలు సంవత్సరాలు తీవ్ర తపస్సునొనర్చినాడు. రావణుడు కూడా ఘోరముగా తపస్సు చేసి ప్రతివేయి సంవత్సరముల కొకతల చొప్పున అగ్నియందు ఆహుతిచేసి పదవ తలను కూడా సమర్పింపబోగా బ్రహ్మ ప్రసన్నుడైనాడు. రావణుడు అమరత్వమును కోరగా బ్రహ్మసాధ్యము కాదు మరొక కోరికను కోరుమనగా దేవతలతో అవధ్యత్వమును కోరి మనుష్యులు వానరుల వంటి అల్పప్రాణులు తన నేమి చేయలేరని ఉపేక్షించినాడు. బ్రహ్మ అంగీకరించి వ్రేల్చిన తలలన్ని మరల వస్తాయని కూడా అనుగ్రహించినాడు.

ఇచ్చట మూలమున బ్రహ్మణా లోకకర్తృణా అని ఉండుటచేత చతుర్ముఖ బ్రహ్మ కాడేమో, నపుంసకలింగ బ్రహ్మ శబ్దమునకు పరమాత్మ అనే అర్థమున్నదను సందేహమునకు సత్యతీర్థులవారు బ్రహ్మ మనగా కార్యబ్రహ్మము అంటే చతుర్ముఖ బ్రహ్మయే, ధ్యాయం ధ్యాయం పరంబ్రహ్మ – తస్మాదేతద్ బ్రహ్మ నామ రూపం చ అను ప్రమాణములను చూపినారు వ్యాఖ్యలో. విభీషణుడు కష్టాలలో కూడా నేను ధర్మమును వదలకుందునుగాక, ఉపదేశింపబడకున్నను నాకు బ్రహ్మాస్త్రమంత్రము స్వాధీనమగు గాక అని కోరుకొనెను. కుంభకర్ణునికి మాత్రము వరమీయవద్దని బ్రహ్మను ముందుగానే కోరినారు దేవతలు, వరము లభించక పూర్వమే లోకభక్షణకార్యము నొనర్చినాడు. వరము లభించినచో ఇతనిని ఎవరూ ఆపలేరు. కావున ఇతనికి మోహమును, తానెవరో తెలియకుండా ఉండే అజ్ఞానమును నిద్రను (గోవిందరాజీయ వ్యాఖ్య) ఇమ్మని దేవతలు కోరగా సరేనని సరస్వతిని పిలిచి దేవతలు కోరినట్లుగా కుంభకర్ణుని వాక్కును (వరమడుగునపుడు) మార్చుమని కోరగా సరస్వతి అట్లే చేసినది. కుంభకర్ణుడు బ్రహ్మను నిద్ర కావలెనని కోరినాడు. ఇదేమి కోరిక? నా బుద్ధిని దేవతలు పాడు చేసినారేమోనని ఆగని నిద్రలో శ్లేష్మాతక వనమును (శ్లేష్మమెక్కువగా ఉండే తండ్రి గారి ఉపవనమును అని గోవిందరాజీయ వ్యాఖ్య) చేరుకొని హాయిగా నిదురించాడు.

## పదకొండవ సర్గము

సుమాలి వరము నొందిన తన మనుమలను గమనించి మారీచుడు, ప్రహస్తుడు, విరూపాక్షుడు, మహోదరుడనే తన సచివులతో రావణుని చేరుకొని, చూడు నాయనా! నీవు వరమును పొంది బలవంతుడవైతివి.

పూర్వ మీలంక మనది. విష్ణువు మనను పారద్రోలినాడు. మరల స్వాధీనం చేసికోవడము మనకర్తవ్యమని తెలుపగా అతడు కుబేరుడు మా అన్న, అలా అనవద్దు అని సుమాలితో చెప్పాడు. మరల కొంతకాలమునకు ప్రహస్తుడు వచ్చి "దశగ్రీవా! నీవు అన్న అని కుబేరుని ఉపేక్షింపరాదు. కశ్యపునికి దితి వల్ల దైత్యులు, అదితి వల్ల దేవతలు కలిగినారు. దేవతలు దైత్యులను రాక్షసులను పీడించుటయే పనిగా పెట్టుకొన్నారు. ఈభువనమంతా నిజానికి మనది, వారాక్రమించుకొని మనను పాతాళమునకు నెట్టినారు అని చెప్పగానే దశగ్రీవుడు వనమునకు (శ్లేష్మాతక వనమునకని గోవిందరాజీయము) చేరుకొని, అచటినుంచి త్రికూటపర్వతమును చేరుకొని, లంకాపురి అంతా మాదే నీవు వదలి పెట్టడము మంచిదని ప్రహస్తుని ద్వారా కుబేరునికి కబురు చేస్తాడు. ప్రహస్తుని మాటలను విని కుబేరుడు సరే అని చెప్పి నాన్నగారి నడుగుతాడు. నాన్నగారైన విశ్రవసుడు కూడా కుబేరా! ఇప్పుడు వాడు వరబలదర్పితుడై ఉన్నాడు. నీవు వాడు చెప్పినట్లుగా చేయడమే మంచిది. మూడు నాల్గుసార్లు నేను చెప్పినా వాడు వినలేదు. నేను తిట్టాను కూడా. వానితో విరోధము మంచిది కాదు అని చెప్పి, నీకు నివాసానికి ఉత్తరదిశతో హిమాలయమున్నది. మందాకిని (దేవగంగ) అచట ప్రవహిస్తుంటుంది. అలకా అనే నగరము కూడా అచట ఉన్నది. నీవు, యక్షులు అచట ఉండండి" అని విశ్రవసుడు చెప్పగానే కుబేరుడు లంకను వదలినాడు. రావణుడు ప్రహస్తుడు మిగతా రాక్షససైన్యముతో లంకను ప్రవేశించినాడు. రాక్షసాధిపతిగా రాక్షసులతో అభిషేకింపబడినాడు. కుబేరుడు 'అలక'లో కైలాసగిరి సమీపమున నివసింపసాగినాడు.

## పన్నెండవ సర్గము

రావణుడు అభిషిక్తుడై తన సోదరి శూర్పణఖను, కాలక పుత్రుడైన విద్యుజ్జిహ్వునికిచ్చి వివాహమును చేస్తాడు. కొంతకాలమునకు దశగ్రీవుడు వేటకై వెడలినాడు. త్రోవలో ఒకతోటలో కూతురుతో వచ్చిన మయుని చూచినాడు. "నా భార్య హేమ, ఆ హేమ కూతురే ఈ మందోదరి (మండోదరి) మా అమ్మాయి. నాకు మాయావి, దుందుభి అనే కుమారులు కూడా ఉన్నారు. ఈ అమ్మాయి వివాహమునకై వరాన్వేషణ చేయుచున్నాను" అని మయుడు రావణునితో అంటాడు. తాను రావణుడనని తనకా అమ్మాయిని ఇవ్వమని రావణుడు కోరగా, నీ కంటే నాకెవరు యోగ్యులు లభిస్తారని మయుడు తన కూతురు మండోదరిని రావణునికి ఇచ్చి పెండ్లి చేస్తాడు. ఇచ్చట మయుడు మంచి స్వభావము, పాతివ్రత్యము కల తన కూతురును రావణున కేల ఇచ్చెనను ప్రశ్నకు కులమునే ప్రధానముగా నెంచెనని గోవిందరాజీయవ్యాఖ్య. విజనమున రావణునిచే చూడబడిన తన కూతురును మండోదరిని ఎంత క్రూరస్వభావుడైనా వదలి పెట్టడు. ఈయక పోతే ఎప్పుడైనా అపహరిస్తాడు కాబట్టి ముందుగానే ఇవ్వడము మంచిదని భావించినాడని సత్యతీర్థవ్యాఖ్య. కుంభకర్ణునికి వైరోచనుని దౌహిత్రిని వజ్రజ్వాల అనే అమ్మాయి తగుతుందని తానే పెళ్ళికి ఏర్పాట్లు చేస్తాడు రావణుడు. ఇక విభీషణునికి భార్య "సరమ" అయింది. ఈ సరమను ఆమె తల్లి మానస సరోవరతీరంలో కన్నది. వర్షాకాలంలో మానస సరోవరం పొంగకుండా తన ప్రసవ కాలంలో "సరో–మా" అని కోరింది కనుక తన కూతురుకు "సరమా" అని పేరు పెట్టింది తల్లి. ఆతరువాత మందోదరి రావణుని వల్ల ఇంద్రజిత్ అనే కుమారుని మేఘనాదుని కన్నది. మేఘములు గర్జించినట్లు పుట్టగానే గర్జించడం వలన ఆ పేరు అతనికి వచ్చినది. ఆ విధముగా మేఘనాదుని వృద్ధి రావణమందోదరుల ఆలనపాలనలలో లంకలో సాగింది.

## పదమూడవ సర్గము

ఒకసారి నిద్రావశుడైన కుంభకర్ణుడు కోరగా కుంభకర్ణుని కనుకూలముగా నుండ చక్కని భవనమును గుహవలె పొడుగుగా ఉండి అతనికి సుఖాన్ని కలిగించే భవనమును మంచి శిల్పులచే నిర్మింప జేయిస్తాడు రావణుడు. అందు వేంచేసి కుంభకర్ణుడు హాయిగా పడుకొంటాడు. లేచినప్పుడు గంధర్వ యక్ష దేవ ఋషులను నమలి మ్రింగుతుంటాడు. కుంభకర్ణునితో కలిసి రావణుడు దేవతోద్యానవనాలను భవనాలను చెట్లను ధ్వంసం చేస్తూ నదులలో ఏనుగులాగా ప్రవాహమునాపి కూర్చొని నదీమార్గాల నడ్డుకొంటాడు. ఇలాంటి పనులు చేసి అపకీర్తిని తెచ్చుకోవద్దని ఒకసారి కుబేరుడు దూత ద్వారా రావణునికి కబురు పంపుతాడు. ఆ దూతతో ఇంకా ఇలా అంటాడు కుబేరుడు. దశాననా! నేనొకసారి కేదారేశ్వరవ్రతాన్ని చేసి హిమాలయానికి వెళ్ళాను. పరమేశ్వరుని చూచాను, అచట పార్వతిని కూడా చూచాను. పార్వతి అని తెలుసుకోలేక ఎవరీ సుందరీ! అన్న భావముతో చూచాను. వెంటనే నాకన్నొక్కటి పచ్చబడి కాయ కాసినది. తరువాత శివుని ప్రార్థించగా నీవు మంచి తపస్సు వ్రతము చేశావు కనుక నామైత్రిని ప్రసాదిస్తున్నాను అని శివుడు నన్ను అనుగ్రహించాడు. అయినా నాకన్ను అలాగే ఉందిలే! నేను వ్రతము పూర్తి చేసికొని ఇంటికి చేరుకొనే సరికి నీ దుడుకుతనమంతా తెలిసికొని ఇదిగో ఈ అధర్మకార్యమును ఇకపైన చేయకు, మానుమన్నాడు. దూత చెప్పిన మాటలను విని దశాననుడు క్రోధోద్రిక్తుడై, ఒక సామాన్యుడివి, ధనాన్ని కాపాడేవాడవు (గోవిందరాజ వ్యాఖ్య) హితాన్ని చెప్తావా! నేను మహేశ్వరుని భక్తుడనని మహేశ్వరుని వైభవమంతా చెప్పి భయపెడ్తావా ఇది నాకేం హితం కాదు నేను సహించలేనని లోన అనుకొంటూ కుబేరునే కాదు. ఆ నలుగురు లోకపాలకులను నశింపజేస్తాను. "అన్న గురువు" కుబేరుడు అని అనుకొనేవాణ్ణి. ఇప్పుడీ కుబేరుని మాటలను విన్నాక ఊరుకోరాదని తెలిసింది అని ఒక్క ఉఱుము ఉఱిమి ఆ దూతను కూడా చంపివేసి రాక్షసులను ఆ శరీరమును తినుమని చెప్పి కుబేరుడుండే దిక్కుకు బయల్దేరుతాడు రావణుడు.

## పద్నాల్గవ సర్గము

మహోదరుడు, ప్రహస్తుడు, మారీచుడు, శుకసారణులతో రావణుడు అలకవైపు బయల్దేర్తాడు కుబేరునితో తలపడడానికి. ఆ సంగతి విని యక్షులు కుబేరునికి దశాననుని రాకను సూచించి అతని యుద్ధోన్ముఖతను వ్యక్త పరుస్తారు. కుబేరుడు ఆ వచ్చిన యక్షులను ఎదుర్కొమ్మంటాడు. ఒక్కొక రాక్షసునికి ఒకొక్క యక్షుడు ఎదురుపడి భయంకరమైన యుద్ధం చేస్తారు. ఆ దృశ్యాన్ని చూడడానికి దేవ ఋషులకు ఆకాశము,క్రింద పడి మరణించిన యక్షులకు భూమి (గోవిందరాజీయము) చాల లేదు. కొందరు యక్షులు రావణునిచే హతులైతే, మరల కొంతమంది యక్షులను పంపుతాడు కుబేరుడు. మారీచుడు సంయోధ కంటకుడనే యక్షుని చంపుతాడు. రావణుడదే విధముగా దూసుకొని కుబేరుని భవనమున ప్రవేశింపబోగా ద్వారపాలుడు సూర్యభానుడనువాడు అడ్డుపెడ్తాడు. రావణుడు ఆ భవనద్వారతోరణమునే పడగొట్టి ఆ యక్షుని చంపి లోపలికి ప్రవేశిస్తాడు.

## పదిహేనవ సర్గము

కుబేరుడు మణిభద్రుడనే మహాయక్షుని యుద్ధమునకు ప్రేరేపించినాడు. మణిభద్రుడు దుర్జయుడు. భయంకరమైన చిత్రమైన యుద్ధము చేసి రాక్షసులను పారద్రోలినాడు. వారు విజృంభించి మరల యక్షులను

సంహరించినారు. ధూమ్రాక్షుని మణిభద్రుడు కొట్టగా ఆతడు పడిపోయినాడు. అది గమనించి కుబేరుడు స్వయముగా గదాధారియై యుద్ధమునకు దిగినాడు. "దశాననా! నేను వారించినా నీవు వినుట లేదు నీ కర్మకు ఫలమునను భవింతువు. మీ అమ్మకోరిక నిన్నుగన్న సమయాన్ని బట్టి నీకు రాక్షసబుద్ధే తప్ప వేరొక బుద్ధి రావడంలేదు. ఇప్పటికైనా ఆలోచించు. మన వంశానికి అపఖ్యాతి తేకు, దేవతలు నిన్ను నిందిసున్నారు. శరీరము నశ్వరము కనుక దాని ద్వారా స్థిరమైన తపస్సు చేయాలి. అదే సంపద. పెద్దలసేవ చేయకుండా ఎవరికీ శుభమతి కలుగదు" (గోవిందరాజీయము) అని ఈ విధముగా చాలా ఉపదేశించినాడు. ఆ ఉపదేశాన్ని విని మారీచాదులు వెనుదిరిగినారు. దశాననుడు మాత్రము గదతో కుబేరుని కొట్టినాడు. చిలికి చిలికి యుద్ధము గాలివానగా భయంకరముగా సాగినది. రావణుడు కుబేరుని ఓడించి కుబేరుని సంపదను పుష్పకవిమానమును ఆక్రమించినాడు. నిధులన్ని కుబేరుని ఆవరించి కుబేరుని సాంత్వన పరచాయి. దశాననుడు అనేక విధములుగా శస్త్రములను వర్షముగా కురిపించినాడు. కాని రావణుడు కనబడలేదు అని 'అదృశ్యత' శబ్దానికి గోవిందరాజీయవ్యాఖ్య. మాయా వ్యాఘ్రాదులే కనిపించినవి కాని దశాననుడు కనిపించలేదని తిలక వ్యాఖ్య. ఆ పుష్పకవిమానము యజమానుని ఆజ్ఞానుసారమునడిచే విశిష్టమైన శక్తి గలదని సత్యతీర్థవ్యాఖ్యానము. అనేక మార్గాలతో విచిత్రముగా సాగుతుందని కూడా భక్తి చిత్ర అను శబ్దమునకు వారి వ్యాఖ్య. ఈ విధముగా దశాననుడు విమానమును, నిధులను అపహరించినాడు, కైలాసము నుండి పుష్పకమునుండి కుబేరుడు దింపివేయబడినాడు.

## పదహారవ సర్గము

దశాననుడు పుష్పకవిమానమునధిరోహించి కుమారస్వామి జన్మస్థానమైన శరవణ ప్రదేశము వఱకు వచ్చినాడు. అచ్చట విమానమాగినది. ఎవరీ పని చేసినారని ఆగ్రహించగా మారీచుడు చెప్పినాడు ఇది కుబేరుని వాహనము కనుక కుబేరుని ఆజ్ఞలేనిదే ముందుకు సాగదని ఇచట మూలమున "ధనదాన్నాన్య వాహనమ్" అని పదముల కారణముగా క్రియాపదము లేక వాక్యము సరిపోలేదని, ధనదుని కన్న వేరొకరికి వాహనము కాదని"న" అని విడగొట్టి అర్థము చెప్పాలి. అట్లు కానిచో ధనదునితో కూడి అతనము (గమనము) చేయునది కనుక ధనదాత్. కుబేరుని మాత్రమే నడిపించునది అని అతధాతువును ణిజంతము చేసి కృత్ప్రత్యయము చేయవలెనని వివరించుట సత్యతీర్థవ్యాఖ్య విశేషము. ఈలోపున కరాళుడు నలుపు పసుపు వర్ణము గలవాడు పొట్టివాడు ముండితుడు వంగిన భుజాలు గలవాడు. అగు నంది వచ్చి ఓయి దశాననా! వెనుతిరిగి వెళ్ళు, శివుని విహారము వేళ ఎవరును ఇచట సంచరించరాదన్నాడు. ఆ మాటలు విని గర్వోత్సిక్తుడైన దశాననుడు ఎవరురా శంకరుడు అని ఎదిరించి పరిహాసము చేసినాడు. ఆ పరిహాసముతో కోతి ముఖమా! అన్నట్లు గమనించి శివుని మరొక రూపమైన నంది క్రోధోద్రిక్తుడై "ఓరీ! నన్ను కోతి రూపము గలవాడవని వెక్కిరించినావు కనుక నిన్ను ఆ కోతి మూకలే గోళ్ళు దంతాలు ఆయుధాలు గలవై నిన్ను మట్టుబెడతా"యని శపిస్తాడు. మూడు రాక్షస జన్మలలో మిమ్ము వధిస్తాను అని జయవిజయులకిచ్చిన శ్రీమహావిష్ణువు వరాన్ని స్మరించి (సత్య తీర్థవ్యాఖ్య) నీ కర్మలతో పూర్వమే నీవు మరణించితివి. కాన వేరుగా నిన్ను నేను ఏమి చేయనన్నాడు నంది. దశాననుడు నంది మాటలను లెక్కచేయక ఏ ప్రభావముచేత మీ శివుడిక్కడ విహరిస్తున్నాడో చూస్తానని కైలాసము క్రిందికి వెళ్ళి పర్వతాన్నే కంపింపజేస్తాడు. పార్వతిశంకరులు

చలిస్తారు. పార్వతి పరమేశ్వరుని కౌగలించుకొంటుంది. ఆ శివాలింగనాన్ని ప్రసాదించడం వల్ల శివుడు లోన ఆనందించి తన పాదాంగుష్ఠముతో పర్వతాన్ని క్రిందికే నెట్టుతాడు. దశాననుని 20 భుజాలు నుజ్జు నుజ్జయి గట్టిగా ఆక్రందన చేస్తాడు. ఆ ఆక్రందనము వల్లనే దశాననునికి రావణుడు అనే పేరు వస్తుంది. రావణుని మంత్రులు వచ్చి ఫరవాలేదు శంకరుని స్తుతించుమంటే స్తుతిస్తాడు రావణుడు. శివుడు ప్రసన్నుడై నీ పరాక్రమానికి సంతసించాను రావణా! అని వదిలేస్తే రావణుడు స్వామి నాకు దీర్ఘాయుర్దాయమిమ్మని కోరుతాడు అయితే నరవానరులను లెక్క చేయనని అంటాడు. శివుడు చంద్రహాసమనే ఖడ్గాన్ని ప్రసాదిస్తాడు. బ్రహ్మ ఇచ్చిన ఆయుష్షులో ఏ ఆయుర్భాగము తగ్గినదో దాన్ని మరల పూరిస్తాడు శివుడు. ఈ ఖడ్గాయుధాన్ని ప్రతిరోజు పూజించాలని కూడా (గోవిందరాజీయము) శివుడు వరము నిస్తాడు.

## పదిహేడవ సర్గము

రావణుడు హిమవత్పర్వత ప్రాంతమున సంచరించుచు తపో వేషధారిణియైన ఒక సుందరాంగిని చూచాడు. ఆమె రూపము అతి మనోహరము. రావణుడు 'అబ్బ' దొరికింది (గోవిందరాజీయము) అన్నట్లుగా నవ్వి, ఎవరు నీవు ఎందుకీ లేత వయసులో తపస్సు? అని అనేక ప్రశ్నలను వేశాడు. నేను బృహస్పతి మనుమరాలిని. మానాన్న కుశధ్వజుడు అతని బుద్ధికి, జ్ఞానానికి, వేదాభ్యాసానికి అనురూపముగా నేను వాఙ్మయమూర్తినై కూతురునైతిని. నన్ను వేదవతి అని అంటారు. నా గుణాలను రూపాన్ని మోహించి చాలమంది నన్ను కామించినారు. ఇమ్మని కోరినారు. కాని మానాన్న గారికి విష్ణువే అల్లుడు కావాలని కోరిక. ఇంక ఎవరికీ నన్ను ఇవ్వాలని అనుకోలేదు. అప్పుడు దంభుడనే రాక్షసునికి మా నాన్నగారిపై కోపము కలిగి (వచ్చి) ఒక రాత్రి అతడు మా నాన్నగారిని చంపినాడు. మా అమ్మకూడా మా నాన్నపై పడి ప్రాణాలను విడిచింది. మా నాన్నగారి సంకల్పము నెఱవేర్చడానికి ఆ విష్ణువునే భర్తగా పొందుటకై నేను తపస్సు చేయుచున్నాను అని చెప్పినది వేదవతి. ఆ మాటలను విని రావణుడు చాలా కోపించి కామపీడితుడై "నీకెంత గర్వమే ఈ వయస్సులో తపస్సేమిటి? నేను లంకాధిపతిని, నన్ను పెండ్లి చేసుకో, భోగాలను అనుభవించు" అంటాడు. అలా కాదని అన్నది వేదవతి. రావణుడు ఆ మాటకు ఆమె పట్టుదలకు కుపితుడైనాడు. జుట్టు పట్టుకొని లాగుకొని పుష్పకవిమానంలో కూర్చోబెట్టుకొనబోయినాడు. ఎంత వఱకు జుట్టు పట్టుకొన్నాడో ఆ భాగాన్ని ఆమె చేయి ఖడ్గముగా మారి (అంత వఱకున్న కేశపాశాన్ని) ఖండించింది. ఓరీ పాపాత్మా! నీవు నన్ను స్పృశించినావు ఈ శరీరమిక నా కక్కరలేదు. దాని నగ్ని కాహుతిగా నొనర్చుచున్నాను. మరల తొందరలో అయోనిజయైన జన్మను స్వీకరించి భగవదర్పిత జీవితమును గడుపుటయేగాక, నిన్ను వధించుటకు కూడా ఆ జీవనమునుపయోగింతును. అని చెప్పి ఆమె అగ్నియందు శరీరమును సమర్పించినది. ఆ వేదవతి ఒక పద్మమున పద్మగర్భసమానమైన స్వచ్ఛ శరీరమును ధరించి మరల ఆవిర్భవించగా చక్కని కన్య లభించినదని రావణుడు తనయింటికి తీసికొనివచ్చాడు. ప్రహస్తునికి ఈవిషయమును చెప్పగా అతడు "నాయనా! ఈమె పరమ సాధ్వి, భగవంతుడైన విష్ణువునకు సమర్పించుకొనినది కనుక గృహస్థురాలే. స్పృశిస్తే నిన్ను వధిస్తుంది జాగ్రత్త" అని చెప్పినాడు. మంత్రి మాటలను విని రావణుడు ఆ అమ్మాయిని సముద్రమున పడవేసినాడు ఆ వేదవతియే మరొకసారి జనకుని యజ్ఞభూమి యందు నాగేటి చాలులో లభించి "సీత" ఐనది. రామా! నిన్ను భర్తగా పొంది

సీత పూర్వ వైరమును నెపముగా పెట్టుకొని తాను ప్రతిజ్ఞ చేసినట్లుగా పర్వతము వంటి రావణుని నీబలముతో చంపినది. పుట్టబోవును అను అర్థము గల ఉత్పత్స్యతే అను పదమునకు పుట్టెను అని అర్థము స్మరణ సందర్భమున ఈ విధమైన ప్రయోగముండును అని గోవిందరాజీయ వివరణము.

## పద్దెనిమిదవ సర్గము

వేదవతి అగ్నిలో శరీరము నర్పించిన తరువాత రావణుడు పుష్పకము నారోహించి భూమి యందంతటా సంచరించసాగాడు. ఉశీర బీజమను ఒక ప్రదేశమున మరుత్తుడను చక్రవర్తి యాగము చేస్తుండగా ఆప్రదేశమును చేరుకొన్నాడు. సాక్షాత్తు బృహస్పతి సోదరుడు సంవర్తుడు ఆ యాగమును చేయిస్తూ వున్నాడు. రావణుడు వచ్చినట్లు గమనించి ఇంద్రుడు ప్రక్కన ఉన్న నెమలిగా మారాడు. యమధర్మరాజు కాకిగా, కుబేరుడు తొండగా, వరుణుడు హంసగా మారారు. రావణుడు నాతో యుద్ధం చేయుమని దీక్షితుడైన మరుత్తునితో పరిహాస పూర్వకముగా అడిగాడు. నీ వెవరని మరుత్తుడడుగగా కుబేరుని తమ్ముణ్ణి రావణుణ్ణి నన్ను గుర్తు పట్టలేదా! అన్నను గెలిచిన నన్ను గమనించలేదా! నా కున్న బలము ఎవరికైనా ఉందా? అని అడుగగా మరుత్తుడు ఓరీ! బ్రహ్మను ఆశ్రయించి బలాన్ని పొందడము నాకు తెలియదా! నేను అన్నను గెలిచితినని అధర్మమును గొప్పగా చెప్పుకొనుచున్నావు. (గోవిందరాజీయము) నీ వింక బ్రతుకవు. నిన్ను ఇప్పుడే యమలోకానికి పంపెదను అని యుద్ధానికి తలపడుచుండగా, పురోహితుడు, యాజకుడైన సంవర్తుడు నాయనా! దీక్షలో ఉన్నప్పుడు క్రోధము చూపరాదు. యుద్ధమును చేయరాదు. అవి నిషిద్ధములు. ఈ మూర్ఖునితో గెలవడమో ఓడడమో నిర్ణయంగా చెప్పలేము కూడా అని మరుత్తుని వారించెను. ఇదే విజయమని రావణుని మంత్రి శుకుడు యజ్ఞవేదికపై ప్రకటించినాడు. ఋషులను కొందఱిని భక్షించి రావణుడు అచటి నుండి వెడలి పోయినాడు. ఆ తరువాత సాధారణముగా యజ్ఞము పూర్తయ్యింది. రావణుడు వెళ్ళిపోయిన తరువాత ఇంద్రుడు తన పూర్వ రూపమును పొంది, నెమలికి పాముల భయము లేకుండా వరమునిచ్చెను. నల్లగానున్న ఈకలకు అప్పటి నుండి తన సహస్ర నేత్రముల వంటి కన్నులను కల్పించెను. యముడు కాకికి అందరిని బాధించే రోగాలు ఏవీ ఉండవని వరమిచ్చెను. యముని వలన (నా వలన ) భయము లేదని, (జాతస్య హి ధ్రువో మృత్యుః అని గోవిందరాజీయము గుర్తు చేసినది) మనుష్యులు చంపేదాకా స్వయముగా మాత్రము చావవు అని కూడా వరమొసగినాడు. వరుణుడు హంసకు అంతకు ముందు ఉండే నీల వర్ణము, ఒడితో( రెక్కల క్రింద అని గోవిందరాజీయము) లేతగడ్డివంటి ఆకు పచ్చదనము, రెక్కలలో కూడా లేత నల్లదనము మున్నగు అనేక వర్ణాలు లేకుండా స్వచ్ఛమైన తెలుపు రంగే సర్వత్ర ఉండునట్లు అనుగ్రహించెను. కుబేరుడు తొండకు దాని తల బంగారముగా మెఱయుచుండు నట్లు వరము నిచ్చాడు. ఆ తరువాత వారు మరుత్తునితో సహ స్వర్గమునకు (గోవిందరాజీయము) వెళ్ళారు.

## పంతొమ్మిదవ సర్గము

మరుత్తుని గెలిచిన తరువాత రావణుడు దుష్యంత, సురథగాధి, గయ, పురూరవప్రభృతి రాజులనందరిని యుద్ధమైనా చేయండి ఓడిపోయామనైనా అంగీకరించనైనా అంగీకరించండి అనగా వారంతా ఓడితిమన్నారు.

అయోధ్యాధిపతి మాత్రము తన సైన్యము నసంఖ్యాకముగా పంపి తాను కూడా చేతనైనంతవఱకు యుద్ధము చేసినాడు. సైన్యమంతా రావణుని సైన్యము చేతిలో అగ్నిలో మిడుతలదండులాగా పడి నశించినది. మహారాజు అనరణ్యుడు కూడా చావ సిద్ధమైనాడు. పరిహసిస్తూ రావణుడేమి సాధించితివని అడిగినాడు. అనరణ్యుడు నేను చాలా సాధించినాను. "నీకు ఓడితిని" అని నేను అనలేదు (గోవిందరాజీయము) నీవు నిమిత్తమాత్రుడవై నా సహజ మరణానికి కారణమైనావు అంతే అని ధైర్యమును దర్శించినాడు. నేనేదైనా మంచి పని చేస్తే, ప్రజలను రక్షించితే దానము చేస్తే హెూమము చేస్తే, ఆ ఫలముగా నామాటలు సత్యము కావలెను. నా వంశములో శ్రీరాముడు అవతరించి నిన్ను సంహరించాలి, అని అంటూ ప్రాణాలను విడిచాడు. అనరణ్యుని ఆ మాటలకు సంతసించి దేవతలు పుష్పవర్షాన్ని కురిపించారు.

## ఇరవైయవ సర్గము

ఈ విధముగా మానవులనందరను బాధిస్తూండగా ఒకనాడు ఆకాశమున మేఘముల మాటున నారదుని చూచినాడు పుష్పకమున నున్న రావణుడు. రాకకు కారణమేమని అడుగగా నారదుడు నీ పరాక్రమాలకు చాలా సంతోషించినాను. విను, ఒక క్షణముండు మర్త్యులంటేనే మరణించే ధర్మము గలవారు. ఆ చచ్చినవారినే చంపుట నీకు కీర్తి కారణము కాదు. వీరు అమాయకులు ఒకసారి ఏడుస్తారు. ఒకసారి నవ్వుతారు ఒకప్పుడు మోహపరవశు లౌతారు. మాతాపితృసుతానురాగవలయములో పడి కొట్టుకొంటారు. వీరు భార్యా బంధు మనోరములు భార్య బంధువుల యందే ఎక్కువ ప్రీతిగలవారు (పితృ బంధువుల కంటే) అని గోవిందరాజీయ వ్యాఖ్య. అట్టి మానవులను మర్త్యులను చంపుట వలన లాభమేమి? కనుక ఈ పనిని ఆపుము. నీవు వెళ్ళగలిగితే యమభవనానికి వెళ్ళాలి. యమునితో యుద్ధము చేయాలి అది గొప్ప అని నారదుడంటాడు. వెంటనే లంకేశుడు అయితే ఇప్పుడే పాతాళానికి వెళ్తాను. అచ్చట నాగులను దేవతలను గెలుస్తాను అమృతాన్ని సముద్రాన్ని మథించి సాధించి తెస్తాను అని అంటే వెంటనే నారదుడు నవ్వి ఇదేమి దారి నాయనా! అని పరిహాసము చేస్తాడు, రావణుడు మరల ఆలోచించి అయితే ఇప్పుడే యమలోకానికి వెళ్తానని బయలుదేరుతాడు. నారదుడు ఎలావెళ్ళుతాడా అని ఆలోచిస్తూ వినోదముగా చూస్తుంటాడు. ఆ రావణుడు యముణ్ణి ఏ విధంగా గెలుస్తాడు అంతా కాలాధీనము కదా! ధాత విధాతలు కర్మాను సారము కదా సర్వమును వ్యవస్థీకరిస్తారు. వీడు కాలాతిరిక్తమైన ఏ సాధనతో కాలుని జయిస్తాడనే కుతూహలముతో నారదుడు యమలోకానికి వెళ్ళాలని సంకల్పిస్తాడు (ఈవ్యాఖ్య గోవిందరాజీయానుసృతము)

## ఇరవైఒకటవ సర్గము

నారదుడు వేగముగా యమలోకానికి వెళ్ళి అగ్ని పురస్సరముగా (అగ్నిని సాక్షిగా చేసికొని అని గోవిందరాజీయము) యముని చేత స్వాగతింపబడి రావణుని రాకను తెలియబరుస్తాడు. అపుడు రావణుడు రానే వస్తాడు. యమలోకములో వివిధ రీతుల దండింపబడుచున్న పాపులను చూస్తాడు. ధార్మికులను కూడా చూస్తాడు, ఆ పాపులనందరిని బంధముల నుండి విడిపించుతూంటాడు. ధర్మవ్యవస్థకు లోపము వస్తుందని యమధర్మ రాజు అతని భటులు అడ్డుకొంటారు. యుద్ధమారంభమై భయంకరంగా సాగుతుంటుంది. మంత్రులను పంపినా వారినుల్లంఘించి యమభటులు రావణునిపైనే విరుచుకుపడ్డారు. రావణుని శరీరము పుష్పకములో వికసించిన

ఎట్టి అశోక వృక్షములాగా మారుతుంది. పుష్పకాన్ని వదలి కిందికి రావలసి వస్తుంది. రావణుడు మూర్ఛిల్లి, తేరుకొని పాశుపతాస్త్రాన్ని ధరించి మరల యుద్ధాన్ని ఆరంభించాడు. రాక్షసులు కూడా తేరుకొని రావణునితో కలిసి విజృంభిస్తారు.

## ఇరవైరెండవ సర్గము

విజయనాదాన్ని విని యముడు యుద్ధానికి సిద్ధుడైనాడు. రథాన్ని తెప్పించినాడు. ఆయుధాలు ముఖ్యంగా కాలదండం ఆకారాన్ని ధరించి దగ్గరే ఉంది. ఇద్దరు ధైర్యపూర్ణంగా యుద్ధం చేశారు. ఏడురోజులు భయంకరంగా సాగింది యుద్ధం. మృత్యుకాల దేవతలతో కూడా రావణుడు యుద్ధం చేసినాడు. యముడు మృత్యువునాపి కాల దండాన్ని చేతపట్టుకొని అటు ఇటు త్రిప్పి విసరబోయాడు రాక్షసులు క్షణం సేపు భయకంపితులైనారు. హఠాత్తుగా బ్రహ్మదేవుడు వచ్చి, నాయనా! నేను రావణునికి వరము నిచ్చినాను. అతనిపై కాలదండాన్ని ప్రయోగించకు కాలదండము అమోఘమైంది. అది వ్యర్థం కారాదు. వెంటనే దశగ్రీవుడు మరణించరాదు. ఒక సమయములో వానిని నేనే స్వయముగా చంపిస్తాను. విష్ణువే మనకు శరణము అని అన్నాడు. బ్రహ్మ ఆజ్ఞను పాటించి యముడు ఇపుడేమి చేయవలెను అని ఆలోచించి అంతర్హితుడైనాడు. ఇచ్చట ప్రణశ్యామి అను శబ్దమునకు నశించువాడును అని కాక కనబడకుందును అని అర్థము వ్రాయుట గోవిందరాజీయ విశేషము (ణశధాతువు కనపడుకుండుటను తెలియపఱచును) ఈ సంఘటన నంతాచూచి నారదుడు చాలా సంతోషించినాడు.

## ఇరవైమూడవ సర్గము

రావణుడు అచటి నుండి పాతాళలోకమునకు బయలుదేరాడు. నాగములకు నివాసమైన భోగవతిని ఆశ్రయించి కాలకేయ రాక్షసులతో నివాతకవచులనెడు దానవులతో యుద్ధము చేయనారంభించాడు. రాక్షసులను తినుచున్న తన బావను శూర్పణఖ పతిని విద్యుజ్జిహ్వుని సంహరించాడు. బ్రహ్మ వచ్చి నివాత కవచులతో యుద్ధము రాక్షసులైన మీకు పనికి రాదు. మీరు గెలువరు.వారు గెలువరు. సంవత్సరమైంది ఎవరు గెలువలేదు కదా! అని అనెను. బ్రహ్మమాట విని వారు అగ్నిసాక్షికముగా సఖ్యమును చేసికొనిరి. కాలకేయులను మాత్రము రావణుడు సంహరించాడు. ఆ తరువాత వరుణలోకమునకు జైత్రయాత్రకై బయల్దేరినాడు రావణుడు. త్రోవలో కామధేనువు సురభిని చూచి ప్రదక్షిణ నమస్కారముల నొనర్చినాడు. ఇచ్చట "గోవృషేంద్రవరారణిమ్" అన్న పదానికి ధర్మదేవత యొక్క తల్లి అని కాక శివుని వాహనమైన నందికి సాక్షాత్తు తల్లి అని చెప్పుట, సురభిక్షీరమే పాలసముద్రము అందు చంద్రుడు ఉత్పన్నమగుట అని స్పష్టము చేయుట గోవిందరాజీయ విశేషము. ఆ విధముగా సురభిని చూచి రావణుడు వరుణలోకమునకు చేరుకొని వరుణ గృహమునకు చేరుకొని నేను (రావణుడను)వచ్చాను. ఓడాను అని అంగీకరించుమను మీ మహారాజును లేదా యుద్ధము చేయుమనుము అని సేవకుల చేత కబురు చేస్తాడు. ఆ మాటలను సహించక వరుణసేవకులే రావణునితో యుద్ధము చేయనారంభించినారు. వరుణసేన వరుణుని కుమారులు ఆకాశంలో పుష్పకములోని రావణునితో యుద్ధం చేస్తారు. మహోదరుడు వారినందరిని ఓడిస్తాడు. దేవతాత్వము చేత (గోవిందరాజీయము) వారు ఏ బాధను పొందకుండా మరల మరల యుద్ధము చేస్తారు.

వరుణుని కుమారులు బురదలో ఇరుక్కొన్న ఏనుగుల వలె యుద్ధమున కూలుతారు. పరివార జనము వారిని ఇంటిలోనికి తీసికొని వెళ్తారు. రావణుడు విజయ గర్వముతో అట్టహాసము చేస్తూ మీ రాజు వరుణుని పిలవండి అని ఆదేశిస్తాడు. స్వామీ! మీరు కోరుకొంటున్న వరుణుడు బ్రహ్మలోకమున గంధర్వవిద్య సంగీతము నేర్చుకొనుటకు వెళ్ళినాడు. ఇంకెక్కడ వరుణుడు! ప్రహస్తుడు అని పరిహాసము చేస్తాడు. రావణుడు నవ్వుకొనుచుండగా రాక్షస భటులు జయనినాదాలు చేస్తుండగా విజయము ప్రకటింపబడుతుంది. రావణుడు అచటి నుండి లంకకు బయల్దేరి వెళ్తాడు.

## ఇరవైనాల్గవ సర్గము

ఇచ్చటి 5సర్గలు అధిక పాఠముగా వ్యాఖ్యాతలు నిర్ణయించినారు. బహుశః అందుకే వ్యాఖ్య చేయలేదు. లేక వ్యాఖ్యాతలకీ భాగము లభించలేదు చేయలేదు, అయినా సంగ్రహ కథాసారము.

### 1

రావణునికి లంకకు వెళ్ళే త్రోవలో అశ్మనగరము కనపడుతుంది. ఇది ఎవరిదో తెలిసికొమ్మంటాడు. ప్రహస్తుడు ఏడు వాకిళ్ళు దాటి లోపల జ్వాలల వలయమును చూస్తాడు. ఆ విషయమును తెలిసి రావణుడు లోనికి ప్రవేశిస్తాడు. ఆ యా ద్వారములతో ప్రకాశించుచున్న ఆ భవన మధ్యమున జ్వాలల మధ్యన ధ్యానముద్రలో నున్న వ్యక్తిని చూస్తాడు. ఇంతలో ఒక వ్యక్తి (రాక్షసుడు) వచ్చి ఏమీ! ఏమి కావలెను! నాతో యుద్ధమును చేసెదవా! బలితో యుద్ధము చేస్తావా అని అడుగుతాడా రాక్షసుడు. రావణుడు క్షణము నిశ్చేష్టుడవుతాడు. అతడెవరు అని మరల అడిగితే అతడు సకలసుగుణాభి రాముడు, మహాదాని, వదాన్యోత్తముడు బలి చక్రవర్తి అని చెప్పుతాడు. రావణుడు లోనికి వెళ్ళగానే "రా నాయనా! ఏమి కావాలి" అని బలి అడిగితే "రావణుడు నిన్ను పూర్వము విష్ణువు బంధించాడు. ఆ బంధనాలను విడిపించడానికి వచ్చా"నంటాడు. అప్పుడు బలి విష్ణువు యొక్క గొప్పతనాన్ని చెప్పి హిరణ్యకశిపుని చరిత్ర, ప్రహ్లాదుని చరిత్రను చెప్పి అతడు బంధించేవాడు, ముక్తి నిచ్చేవాడు కూడా అతడే. నీకు మొదట ద్వారము దగ్గర కనపడినవాడు. సర్వలోక పూజ్యుడు అని చెప్పగానే రావణుడు కోపంతో ద్వారపాలకుడుగా ఉన్న విష్ణువు దగ్గఱకు రాబోతాడు. బ్రహ్మ ఇచ్చిన వరాన్ని మనసులో నిలుపుకొని విష్ణువు రావణునికి కనిపించకుండా అంతర్ధానము చెందుతాడు. రావణుడు అదే విజయమని భావించి అచటి నుంచి వరుణాలయము ద్వారా బయటికి వస్తాడు.

### 2

ఆ తరువాత రావణుడు పుష్పక విమానము నధిరోహించి సూర్యలోకానికి వెళ్తాడు. సూర్యునితో యుద్ధాన్ని చేయడానికి వచ్చాడు రావణుడని ప్రహస్తుడు లోనికి వెళ్ళి చెప్తాడు. అతని మాటలను వింటారా ద్వారపాలకులు పింగళుడు, దండి. దండి లోనికి వెళ్ళి విషయమును వివరిస్తాడు. సూర్యుడు నాకు యుద్ధము చేసే తీరికలేదు. నీవే ఏదైనా చెప్పు. చేయాలని ఉంటే యుద్ధము చేయి, లేదా సూర్యుడు ఓడాడని చెప్పు, నీయిష్ట మని సూర్యుడూర కొన్నాడు. సూర్యుని మాటల సారాంశమును గ్రహించి దండి సూర్యుని మాటలను చెప్పినాడు. రావణుడు సూర్యుని గెలిచినట్లుగా ఘోషించుకొని బయటికి వచ్చినాడు.

## 3

రావణుడు సోమలోకానికి వెళ్తాడు. మధ్యలో మేరుశిఖరమున విశ్రమిస్తాడు. కొద్దిసేపటికి అచటినుండి ఒక దివ్య వస్త్రధారి అప్సరలచే సేవింపబడుతూ పైకి పోతుంటాడు. రావణుడాతనిని చూచి ప్రక్కనే ఉన్న పర్వత మహర్షి నడుగుతాడు ఇతడు ఎవరని! పర్వతుడు అతడొక మహాయోగి సర్వలోకాలను జయించినాడు. ఇప్పుడు మోక్షము చేరే మార్గములో నున్నాడని చెప్పుతాడు. వారి పట్ల కోపపడవద్దని కూడా చెప్పుతాడు. మరొక మహారాజు అదే విధముగా దివ్యలోకమునకు వెళ్ళుతుంటాడు. ఎవరని అడిగితే మళ్ళీ పర్వత మహర్షి చెప్తాడు అతడు సువర్ణద మహారాజు, మహాపుణ్యాత్ముడు, ఇప్పుడు స్వర్గానికి వెళ్తున్నాడు ఇంద్రునికి అతిథి ఔతాడు అని. నీతో యుద్ధమును చేయడని కూడా చెప్పుతాడు పర్వతుడు. అదే విధముగా ఇంకా కొంతమంది పైకి వెళ్ళుతుంటారు. రావణుడు వారి గురించి కూడా అడుగుతాడు. పర్వతుడు మళ్ళీ అదే విధముగా చెప్తాడు. వీళ్ళంతా మహాపుణ్యాత్ములు నీతో యుద్ధము చేయరు. నీవు యుద్ధము చేయాలని అనుకొంటె ఒక పేరు చెప్పుతాను వెళ్ళు అతడే మాంధాత చక్రవర్తి. చాలా గొప్ప శక్తిమంతుడు, దానపరుడు, అయోధ్యాధిపతి, అని చెప్తాడు. రావణుడు మాంధాత వద్దకు వెళ్ళి యుద్ధము చేయడానికి రమ్మని ఆహ్వానిస్తాడు. నీకు బ్రతుకు మీద ఇష్టము లేకపోతే రమ్మని మాంధాత కబురు చేస్తాడు. రావణుడు నేనెవరికి భయపడలేదు నీకు భయపడ్తానా అని అంటూ యుద్ధ మారంభిస్తాడు. ఆ యుద్ధము మాంధాతకు రావణునికి అన్యోన్యముగా భయంకరముగా సాగుతుంది. ఒక్కొక్క సారి ఒక్కొక్కరు మూర్ఛిల్లుతారు మరల తేరుకొని యుద్ధము చేస్తారు. మాంధాత చివరగా పాశుపతాస్త్రాన్ని ప్రయోగించి రావణుని చంపబోగా పులస్త్యగాలవ మహర్షులు వచ్చి రావణునికి ఉన్న వరాన్ని గుర్తు చేసి ప్రయోగించవద్దని అంటారు. మాంధాత గురువుల ఆజ్ఞను పాటిస్తాడు. శిష్యుడు మాట విన్నందుకు వారు సంతోషిస్తారు.

## 4

రావణుడు జయఘోష చేస్తూ పుష్పక విమానముతో ఊర్ధ్వలోకాలను దాటవలెనని ప్రయాణమారంభిస్తాడు. మొదటి వాయుమండలమున సన్న్యసించిన యోగులను, రెండవ వాయుమండలమున త్రివిధ మేఘ మండలములను, మూడవ వాయుమండలమున సిద్ధచారణులను, నాలుగవ వాయుమండలమున భూత వినాయకాది విఘ్నకర దేవతలను, ఐదవ వాయుమండలమున గంగను, కుముదాది దేవతలను, ఆరవ వాయు మండలమున గరుడజాతి పక్షులను, ఏడవ వాయుమండలమున సప్తర్షులను, ఎనిమిదవ వాయుమండలమున ఆకాశగంగను చూస్తూ తొమ్మిదవ వాయుమండలమున గల చంద్రలోకమును ప్రవేశిస్తాడు. ఉష్ణకరములైన బాణములను ప్రయోగించి చంద్రమండల చంద్రుని చల్లదనానికి తట్టుకోలేక రాక్షససేన భయకంపితమౌతుంది. ఆ శీతలస్థితిని చూచి రావణుడు ఉష్ణమునే నశింపజేయ బోవుచుండగా బ్రహ్మ పరుగెత్తుకొని వచ్చి "నాయనా! చంద్రుడు లోకరక్షకుడు, సర్వాహ్లాదకరుడు. ఏమి చేయవద్దని, నీకు ఎవరివల్లా భయము లేకుండుటకు అందరిని నీవే భయపెట్టడానికి వీలుగా మంత్రోపదేశము చేస్తా"నని చెప్పి చంద్రుని వదలుమని కోరి రుద్రాష్టోత్తర శతనామ స్తోత్రమునుపదేశించి దీనిని రోజు జపింపకుండా ఉండవద్దని సూచిస్తాడు. రావణుడు చాలా సంతోషించి ఆ స్థానమును వదలి రాజర్షి దేవ గంధర్వ అప్సరకన్యకలనవమానిస్తూ పరిహసిస్తూ హరిస్తూ తిరుగుతుంటాడు.

**5**

ఒకసారి రావణుడు పశ్చిమ సముద్ర ప్రాంతమునకు వెళ్ళాడు. అచట ఒక ద్వీపమున ఒక మహాపురుషుని చూచాడు. కుతూహలముతో దగ్గఱకు వెళ్ళి అతని అత్యంతవైభవమును పరిశీలించి నాతో యుద్ధానికి రమ్మన్నాడు. ఆ మాట విని యుద్ధము అనే మాట అన్నావో, ఏమి జరుగునో చూడుము అని మహాపురుషుడు కంపించకుండా అనెను. అది రావణుని ధైర్యానికి వేయిరెట్లు ధైర్యము. రావణుడు ఆ మహాపురుషుని సర్వావయవములను దర్శించినాడు. వాటి యందు గ్రహాలు, లోకాలు నిండియుండెను. వేదశాస్త్రాలు, దేవతలు, పితరులు అతని శరీరమంతా వ్యాపించి ఉండిరి. భూమి అంతా అతని వక్షమున నుండెను. రావణుడు ఆశ్చర్యముతో చూచాడు. ఆమహాపురుషుడు విలాసముగా తన పిడికిలితో చిన్నగా రావణుని తాకెను. రావణుని శరీరము భూమిపై పడి పోయినది. ఆ విధముగా లీలను ప్రదర్శించి పాతాళములోనికి వెళ్ళిన రావణుడు అతడెవరని అడిగెను. ఎవరూ ఏమీ చెప్పలేక పోయారు. రావణుడు నిర్భయముగా లోనికి వెళ్ళాడు. అచట అనేక మంది ఆమహాపురుషుని వంటి వారిని చూచెను. వారంతా హాయిగా విహరించుచుండిరి. వారిని చూచి లోపలి భయమును బయటికి కనిపించనీయ కుండా మెల్లగా బయటికి వచ్చుసరికి అచట మఱొక మహాపురుషుని చూచెను. ఆదిశేషుని పడగపై శయనించు చుండగా ప్రక్కన లక్ష్మీదేవి వింజామరతో వీచుచుండగా ఆమహాపురుషుని రావణుడు ఆశ్చర్యముతో చూస్తాడు. లక్ష్మిని చూడగానే రావణునికి మన్మథభావము పైకుబికి అపహరించవలెననిపించినది. ముందుకు వెళ్ళబోయాడు చేయిపట్టుకోబోయాడు. ఈ లోపున ముసుగు తొలగించుకొని ఆమహాపురుషుడు వికటాట్టహాసము చేసినాడు. ఆమహాపురుషుని తేజమును చూచుట తోడనే రావణుడు వణికి పోయి స్థానభ్రష్టుడై తన మంత్రులున్న చోట పడ్డాడు. ఓరీ! నీకిప్పుడు కాదు చావు, ముందుంది అనే మాటలను విని రావణుడు కంపితుడైనాడు. మారు మాటాడకుండా ఉండి పోయినాడు. కొంచెం ధైర్యం తెచ్చుకొని ఎవరు నీవు అని అడిగితే "బ్రహ్మమాట కారణంగా ఇంకా నీవు బ్రతికి ఉన్నావు, నిన్ను చంపేవాడు ఇంకా పుట్టలేదు. తప్పక పుడ్తాడు తొందరలోనే" అనే మాటలు రావణునికి వినిపిస్తాయి. ఆమహాపురుషునిలో గ్రహాలు, నక్షత్రాలు దేవతలు లోకాలు కనపడతాయి రావణునికి. ఈ కథనంతా వింటున్న శ్రీరాముడు ఆ యిద్దరు మహాపురుషు లెవరు అని అగస్త్య మహర్షిని అడుగుతాడు. అగస్త్యుడు శ్రీరాముడడిగిన ప్రశ్నకు లోపల ఆనందించుచు చిఱునవ్వు చిందించుచు (నీకు తెలియదా అన్నట్లు భావించుచు) ఆ ద్వీపము నందున్న వ్యక్తి మహాపురుషుడు కపిలుడు. అతనిలాంటి మిగతా వారు మహాతపస్వులు ఋషులు దేవతలు ఆ శేషతల్పశాయి. శ్రీమన్నారాయణుడు అతడే ధాతవిధాత కపిలుడు అని అగస్త్యుడు చెప్పినాడు రావణుడు ఆ నారాయణునిచే ధర్షితుడై లంకకు వెడలినాడు అనే మాటలను వింటున్న శ్రీరాముడు, ప్రక్కన కూర్చొని వింటున్న విభీషణుడు, వానరులు, రాక్షసులు అందరు ఆశ్చర్యము ఆశ్చర్యము అనుచు ఉండిపోయారు. ఇక వెళ్ళివస్తాము అని అగస్త్యుడు ఋషులు అనబోతుండగా శ్రీరాముడు తరువాతి కథ చెప్పండి అని అడిగినాడు.

## ఇరవైయైదవ సర్గము

రావణుడు అచటి నుండి బయల్దేరి త్రోవలో ఎవరైనా అందమైన అమ్మాయి కాని వివాహిత స్త్రీకాని, కనపడితేచాలు, వారి బంధువులను చంపి, నిరోధించి ఆ కన్యనో ఆ స్త్రీనో తన పుష్పక విమానమున ఎక్కించుకొని

తీసికొనిపోయి బలాత్కరించేవాడు. ఆ మానినులు లోలోన కుమిలి పోయేవారు. అప్పుడా విమానము మండుతున్నఅగ్ని కుండము వలె ప్రకాశించుచుండెడిది (శ్రీ మణిముకుట గోవిందరాజీయ వ్యాఖ్య) ఆ స్త్రీలను వర్ణించుచు వాల్మీకి అన్న “వజ్రవేది సమప్రభాః” అను పదమునకు వజ్రవేది అనగా వజ్రపుటుంగరము “వేదిరంగులిముద్రాయామ్” అను విశ్వకోశము దీనికి ప్రమాణము. దానివలె సమానమైన సూక్ష్మకటి ప్రదేశము (నడుమ)కలవారా స్త్రీలు అని వ్రాయుట శ్రీసత్యతీర్థుల విశేషవ్యాఖ్య. ఆ స్త్రీలంతా మాకీ దుఃస్థితి ఏల కలిగినది? మేమేమి పాప మొనర్చితిమి? మా కర్మ ఇది! మా భర్తలకు, అన్నలకు నాన్నలకు బలములేదు. వీడేమో దురాత్ముడు, మేమేమి చేయగలము అని అనుకొంటూ తమ పాతివ్రత్య ప్రభావము చేత ఈ రావణుడు తొందరగా చావాలి! మరణించాలి ఏ పతివ్రతైనా మాకంటే గొప్పది వచ్చి శపించాలి అని రోదించారు. వారి శాపనార్థాలను విని దేవతలు పుష్పవృష్టిని కురిపించారు. వారి ఏడ్పుల రాగాలచే లంక నిండిపోయేది. ఒక రోజు అనుకోకుండా రావణుని సోదరి శూర్పణఖ ఎక్కడి నుంచో ఊడిపడి ఏమి అన్నా! ఏమి పని చేసినావు. నీ బావగారినే చంపి వేసినావు! ఎంత ఘోరము చేసితివి. నాకింక ఎవరు దిక్కు! నేను విధవనైతినని ఏడ్వసాగెను. రావణుడు ఆమెనోదార్చుచు అమ్మా! యుద్ధమున తన వారెవరో శత్రువు లెవరో గమనింపలేకపోయితిని (కొంచెం వ్యంగ్యముగా అని మణిముకుటము) సరే జరిగిన దానికేమి చేస్తాము. ప్రస్తుతానికి నీవు పిన్ని కొడుకు ఖరునితో కలిసి ఉండుమని వాడు దండకవనాన్ని రక్షిస్తున్నాడు. నీవు కూడా అచ్చటికే వెళ్ళు. దూషణుడు వాని తమ్ముడు కూడా అక్కడనే ఉ ంటాడు. పదునాలుగువేల రాక్షసులతో నీ ఖరదూషణులు అచట నుంటారు. నీయాజ్ఞను వీరందరు పాటిస్తారు. (నీకు మర్యాదలు చేయుటకు నాకవకాశము లేదని వ్యంగ్యమని గోవిందరాజీయము) అని చెప్పి రావణుడు దండకారణ్యమునకు ఖరదూషణులను శూర్పణఖను అధిపతులనుగా నియమించినాడు.

## ఇరవైయారవ సర్గము

రావణుడు లంకలోని ఒక అడవికి వెళ్ళాడు. అది పశ్చిమ ద్వారమువైపున్న అడవి. దానిపేరు నికుంభిల. రావణుడు అచటికి చేరుకొనే సరికి అచట రావణుని కుమారుడు మేఘనాదుడు యజ్ఞమును చేస్తుంటాడు. ఇదేమిటని అడుగగా యజ్ఞపురోహితుడైన శుక్రాచార్యుడు “ఇది మహేశ్వరయాగము. దీనికి ముందు అగ్నిష్టోమ, అశ్వమేధ, రాజసూయ, గోమేధ, వైష్ణవయాగములనొనర్చినాడు. ఇప్పుడు విధి విధానముగా మాహేశ్వరయాగము కూడా పూర్తి అయినది. దీనివలన నీ కుమారునికి కామగమనము తామసీమాయ, అక్షయతూణీరము (ఎప్పుడు నిండి ఉండే అమ్ముల పొది) లభించాయి. శివుడు ప్రసన్నుడైనాడు. వరముల నిచ్చినాడు. అవభృథ సమయమున మిమ్ము దర్శించవలెనని అనుకొనుచుండగా నీవు (రావణుడు) వచ్చితివి”. అని చెప్పాడు. శుక్రుని మాటలను విని రావణుడు అసమ్మతితో “ఇదేమి బాగులేదు. ఇంద్రాదులను పూజించుట మనకు గౌరవము కాదు. సరే చాలు ఇటు రమ్ము అని తాను తీసికొని వచ్చిన యువతులను సుందరాంగనలను విమానము నుండి దింపించి కుమారునకు చూపించెను. అది చూచి మేఘనాదుడు, నాన్నా! నీవు చేసిన పని ఏమి? ఇది అసలే బాగులేదు. వీరి బంధువుల నందరిని చంపి అనాథలను చేసి నీభోగము కొఱకై వీరిని వాడుకోవాలని అనుకొనుట నీకయుక్తము. నీవు గమనించ లేదు కాని మధువు(రాక్షసుడు) కుంభీనసిని అపహరించాడు. నీవు చేసిన పనికి ప్రతిఫలమును గమనించితివా!

అని రావణునితో అనెను. ఇచ్చట రావణుని “ఏహి”అనే పదానికి ఆ ఇహి-త్యజ వదలుము నీవు నీపుణ్యమును వదలుము అని అర్థము. ఈ అనే ధాతువొకటి ప్రశ్లిష్టముగానున్నది. దానికి అనుమతించుట తిరస్కరించుట అను రెండు అర్థములున్నాయి. ఇచట ఏహి అని రావణుని పదానికి నిరసించుట అనేదే అర్థము అని సత్యతీర్థ వ్యాఖ్య ఇచట విశిష్టముగా నున్నది. రావణునికి వ్యామోహపు మైకమున కుంభీనసి ఎవరో అర్థము కాలేదు. అప్పుడు విభీషణుడు వివరించినాడు. అన్నా! మన వంశమున మాల్యవంతుడనే వాడు ఉన్నాడు. అతడు సుమాలి అన్న, మనకు తల్లి తండ్రి సుమాలి. మన అమ్మ కైకసికి అక్క ఒకామె ఉన్నది ఆమె పుష్పోత్కట. ఆమెకాక మరొక అక్క ఉన్నది ఆమె అనల. అనల కూతురే కుంభీనసి, అంటే మన తల్లి పెదనాన్నగారి కూతురు. కనుక మనకు చెల్లెలితో సమానురాలు కుంభీనసి. దానిని మధువు అపహరించినాడు (ఈ వివరణ గోవిందరాజీయమున చాల స్పష్టముగ నున్నది) మీ అబ్బాయి మేఘనాదుడు ఇంటిని మఱచి యజ్ఞము నిర్వహించుటకు వెళ్ళినాడు. నేను నాతపస్సును నిర్వహించుకోవడానికి నీటిలో ఉండిపోయినాను. కుంభకర్ణునిదేమో మహానిద్ర. నీవేమో అమ్మాయిల (స్త్రీల) వేటలో పడ్డావు. దానికి ప్రతిఫలముగా ఇది జరిగినది. మధువు చేసిన పాపము సంకల్ప పూర్వకముగా కన్యకి పిత ఈయకుండనే కుంభీనసిని లేపుకొని తీసికొనిపోవుట. ఈ అంశమున శ్రీ సత్యతీర్థుల వివరణ ఇంక కొంచెము స్పష్టముగ నున్నది. లంకానగరమునకు గల ప్రాకారములను గమనించినచో అవి దుర్భేద్యములు. ఒక నీతిరహితుడు వానిని అసలే అతిక్రమించలేడు. మఱి మధువు కుంభీనసి హరించుకొనిపోవుట ఎట్లు సాధ్యమైనదన్నచో, నీవు పరస్త్రీలను బలవంతముగా వారి తల్లిదండ్రులు మున్నగువారు సమర్పింపకుండా తీసికొని వచ్చుట వలన. ఇచ్చట కూడా మన లంకకీ దుర్గతి నీక్రియకు ప్రతిక్రియ జరిగినది అని విభీషణుడు అనగానే, అయితే సరే! నేనిప్పుడే ఆ మధు (గాడిని) చంపి ఆ తరువాత ఇంద్రలోకాన్ని దేవలోకాన్ని జయించి వస్తాను. నాతో అందరు బయల్దేరండి. విభీషణా! నీవు లంకను కాపాడు అని చెప్పి కుంభకర్ణుని లేపుకొని మేఘనాదుణ్ణి సేనకు అగ్రభాగమున నుంచి సర్వరాక్షస సమేతుడై బయల్దేరినాడు. కుంభకర్ణుడు సేనకు వెనుక, మధ్యన రావణుడు. వారు మధుపురానికి చేరుకొనినారు. మధురాక్షస గృహమునకు చేరుకొనినాడు రావణుడు. మధువు కనిపించలేదు. సోదరి కనిపించినది ప్రార్థించి భర్తకు ఏమీ అపాయమును చేయవద్దని వైధవ్యము స్త్రీకి భరింపరాని బాధ అని విజ్ఞప్తి చేసినది. రావణుడు ఆమెకు అభయమునిచ్చి, దేవతలతో పోరాడడానికి సహాయుడుగా రమ్మని సోదరితో చెప్పుతాడు. ఆమె దాచి ఉంచిన భర్తను చేరి లేపి స్వాగతము చెప్పుమని చెప్పుతుంది. రావణునికి మధువు స్వాగతాతిథ్యమును నిర్వర్తిస్తాడు. ఆ రాత్రి సోదరి కుంభీనసి యింటనే వారి ఆతిథ్యము విశ్రాంతి.

## ఇరవైయేడవ సర్గము

అర్ధరాత్రి పూట రావణునికి మెలకువ వచ్చింది. అప్పటికి తాను కైలాసమున నున్నాడు (గోవిందరాజీయము) అచటి వాతావరణము నిర్మలముగా నున్నది, చంద్రుడు చక్కగా ప్రకాశిస్తున్నాడు. వృక్షములు లతలు, వనాలు, జలాశయాలు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. మధు మాధవములు (చైత్ర వైశాఖ మాసములు గోవిందరాజీయము) అన్ని వృక్షలతలకు తమ కాలపు సంస్కారమును కలిగిస్తున్నాయి. చంద్రపాదపములు చంద్రుడు వృక్షాలు, కర్పూర వృక్షాలు నీరుచెట్లు (సత్యతీర్థవ్యాఖ్య) చక్కగా ఆహ్లాదపరుస్తున్నాయి. రావణునికి కామము నుద్దీపింపజేస్తున్నాయి. అతడు ఇటు నటు తిరుగసాగినాడు. దైవికముగా అచ్చటి నుండి రంభ వెళ్ళడాన్ని గమనించాడు. తన పాటల చేత

పర్వతవృక్షాలను పుష్పింపజేస్తున్నది రంభ. (సత్యతీర్థ వ్యాఖ్యానుసారము) ఎంతో అందమైన వేషము,రూపము, తెల్లని ఆకారముతో, చంద్రుని వంటి స్వచ్ఛ వస్త్ర ధారిణియై నల్లనిముసుగును ధరించి ముసుగులోనే దరహాసములను ఒలికించుచు వయ్యారముగా సాగుతున్న రంభను చూచి మెల్లగా తాకి నీవెవరవు! శ్రీ కాంతి ద్యుతి, మతి, హ్రీలను దేవతాస్త్రీలను పోలియున్నావు. అభిసారిక వలె నీలవస్త్రావృతవై యున్నావు అని అడిగినాడు. ఆమె అవయవముల నన్నిటిని వర్ణించుచు అమృతరససమానమైన నిన్ను ఎవరు అనుభవించనున్నారు? (గోవిందరాజీయము) స్వర్గ మంటేనే దుఃఖరహితమైన సంపూర్ణసుఖము. అట్టి సుఖమును (సత్యతీర్థ వ్యాఖ్య) ఎవరు నీ జఘనమున అనుభవింపనున్నారు. అని వివిధముగా వ్యామోహముతో కోరికతో రావణుడు ఇచ్చట నావంటి శూరులు ఐశ్వర్య సంపన్నులు ఎవరున్నారు? ఇంద్రాదు లెవరును నాసాటి కారు, రా, నన్ను చేరు అనినాడు. రావణుని మాటలను విని చేతులు జోడించి వణుకుతూ “మీరు నన్ను ఈ విధముగా పలకరించరాదు. నాకు మీరు తండ్రివంటివారు. నేను మీకు కోడలిని. మీ అబ్బాయి నలకూబరుని వలచి వెళ్ళుతున్నాను. నేను అతనికి వాగ్దానము చేసి వెళ్ళుతున్నాను. అందుచే నాకితరుల మీద భావమే కలుగదు. (గోవిందరాజీయము) అతడు నాకై ఎదురు చూస్తూ వుంటాడు. విఘ్నము కలిగించ వద్ద”ని కోరింది రంభ. రావణుడు ఆ మాటలను విని ఓసీ! నీవు అప్సరవు, కులటవు, ఒకడే భర్త అనే నిర్ణయము నీకు లేదు. నాకైతే అసలు నియమములేదు నేను కాముకుడను (నాగోజీ భట్టు దేవతలకు కూడా ఏకస్త్రీ పరిగ్రహమను నియమము లేదని వ్యాఖ్యానించుట అసందర్భముగా నున్నదని, వారు ఇచట సందర్భమును సరిగా గుర్తించలేదని సత్యతీర్థ వ్యాఖ్యా విమర్శ) అని చెప్పి రావణుడు ఆమెను బలాత్కరించెను (ఇచట రక్షః అని శబ్దమునుపయోగించుట వలన రావణునికి రాక్షస భావమే తప్ప పురుషత్వమును చూపుట సాధ్యము కాలేదని, ఒకవేళ పురుషత్వము కల్పించినను అవి శాపమునకు కారణమయ్యే పుంస్త్వము కనుక పుంస్త్వమున్నను లేనట్లేనని సత్యతీర్థ వ్యాఖ్య) ఈ విధముగా రంభ రావణుని బల ప్రయోగముచే వివశ అయినది. ఆమె అవయవములు, అలంకారములు, మందారపుష్పదామములు, వస్త్రములు అన్ని వాడినవి. అదే పరిస్థితిలో ఉండి మెల్లగా నడిచి నలకూబరుని పాదములపై పడి రోదించింది. నలకూబరుడడుగగా విషయమును వివరించి చెప్పలేక తన తప్పును మన్నింపుమని ప్రార్థించింది. నలకూబరుడు ఆమె చెప్పిన విషయముల నర్థము చేసికొని ధ్యానస్థితిలో నుండి రావణుని చేష్టలను తెలిసికొని నిన్ను ఇచ్ఛ లేకుండా బలాత్కరిస్తాడా. ఇకపైన ఇచ్ఛలేకుండా ఏ స్త్రీనైనా బలాత్కరించలేడు. ఇప్పటి నుంచి వానికీ శాపము వర్తించును! అని అన్నాడు రంభతో నలకూబరుడు. రంభా! చింతించకు రావణుడు ఇచ్ఛలేకుండా ఏ స్త్రీనైనా బలాత్కరిస్తే వెంటనే వాని తల ఏడు ముక్కలై పగిలి పోతుందని కూడా మరల నలకూబరుడన్నాడు. (సీత శుద్ధురాలే అను భావమును రామునికి కలిగించుటకే ఈ స్పష్టీకరణ అని గోవిందరాజీయము) నలకూబరుని మాటలను విని దేవతలు పుష్పవృష్టిని కురిపించి దుందుభులను మ్రోగించారు. రావణుడు అప్పటి నుంచి (ఈ విషయము తెలిసినప్పటి నుంచి) పరస్త్రీలను ఇచ్ఛలేకుండా కోరేవాడు కాదు. రావణునిచే చెరపెట్టబడిన స్త్రీలంతా ఈ విషయమును విని సంతోషించారు.

అచటినుండి రావణుడు ఇంద్రలోకమును చేరుకొన్నాడు. ఇంద్రుడు దేవతలను యుద్ధసిద్ధులను చేశాడు. ఇంద్రుడు విష్ణువును కూడి ఏదైనా ఉపాయమాలోచింపుమన్నాడు. విష్ణువు ఇంద్రునితో ప్రస్తుతము సమయము

కాదు. ఇప్పుడు జరుగవలసినది జరుగుతుంది. నేనే కాలాంతరమున సంహరిస్తాను అని అంటాడు. కర్తవ్యముగా యుద్ధం సాగుతుంది దేవదానవులకు. ఒకసారి యుద్ధమున సుమాలి సంహరింపబడుతాడు సావిత్రుడను వసువుచేత.

## ఇరవైయెనిమిదవ సర్గము

సుమాలి హతుడైనట్లు విని మేఘనాదుడు దేవతలపై విరుచుకు పడతాడు. ఇంద్రుని కుమారుడు జయంతుడు రావణకుమారునితో (మేఘనాదునితో) తలపడుతాడు. చాలా భయంకరముగా యుద్ధము సాగుతుంది. కొంత సేపటికి పులోముడను రాక్షసుడు,ఇంద్రకుమారుని దూరముగా తీసికొని వెళ్తాడు. దేవతలకు నాథుడు లేని స్థితి ఏర్పడగా ఇంద్రుడే స్వయముగా యుద్ధరంగమునకు వస్తాడు. తన మనుమనికి యుద్ధములో పరాజయము కలుగ కూడదని శచీదేవి తండ్రి, జయంతుని మాతామహుడు (తల్లి తండ్రి) తాత ఐన పులోముడు జయంతుని చాలా దూరముగా తీసికొని వెళ్ళి సముద్రము లోనికి (రక్షకై) తీసికొని వెళ్తాడు. ఇంద్రుడు యుద్ధరంగమున ప్రవేశించే సరికి దేవతలు మరల పుంజుకొంటారు. మరల యుద్ధము ఆరంభమౌతుంది. కుమారుని వారించి రావణుడే యుద్ధానికి దిగుతాడు. కుంభకర్ణుడు నిద్రామదమత్తుడై ఎవరితోనూ యుద్ధము చేయలేదు (అంటే అందరితో దొరికిన వారితో యుద్ధము చేసినాడని అర్థమని గోవిందరాజీయము) దోమలను త్రోలినట్లుగా దగ్గఱకు వచ్చిన వారిని కొట్టినాడు. దేవతల ప్రహారములచే కుంభకర్ణుని శరీరము నుండి రక్తము స్రవించ నారంభించినది. అది చూచి రాక్షసులు భయపడి యుద్ధరంగమునుంచి పారిపోసాగినారు. ఇది గమనించి రావణుడు అందరిని మరల ప్రోత్సహించి స్వయముగా ముందుకు వచ్చినాడు. మరల ఇంద్రునితో యుద్ధము మొదలైనది.

## ఇరవైతొమ్మిదవ సర్గము

రావణుని బలము పదవ వంతు మిగిలినది. అది గమనించి ఇంక ఇంద్రుడు లేకుండా చేద్దాం, దేవతలనందరిని స్వర్గభ్రష్టులను చేద్దాం రండి అని మరల ఉత్సాహపఱచినాడు. ఇంద్రుడు కూడా రావణుని చంపలేము కనుక అందఱము కలిసి బంధిద్దాము రండి ఇక్కడి నుంచి ఉదయపర్వతము దాకా మనదే సైన్యము అని ప్రోత్సహించి యుద్ధమును ఆరంభించినాడు. మరల రావణేంద్రులకు యుద్ధం జరిగింది. రావణుని పరిస్థితిని గమనించి కుమారుడు మేఘనాదుడు యుద్ధానికి దిగుతాడు. కుమారుని (జయంతుని) జాడ కానరాక తానే యుద్ధము చేస్తాడు. ఇంద్రుడు మేఘనాదునితో, మేఘనాదుని పోరులో తమో యుద్ధము జరుగుతుంది. ఎవరు ఎవరిని చంపుతున్నారో తెలియదు. ఆ తరువాత మాయా యుద్ధమును కూడా చేయనారంభించాడు మేఘనాదుడు. ఇంద్రుడు తన రథమును వదలి ఐరావతముపైనెక్కి మేఘనాదుని వెదకడమారంభించినాడు. ఆ వెదకులాటలో దేవతలతో ఇంద్రునికి సంబంధము తెగినది. దేవతలు భయభ్రాంతిగ్రస్తులైనారు. ఇది చూస్తున్న మేఘనాదుడు నాన్నా! ఇక యుద్ధమాపండి. ఇంద్రుడు నాకు వశమైనాడు. దేవతల స్థానముల నాక్రమించండి. ఇప్పుడు యుద్ధము చేయనక్కఱలేదని అదృశ్యరూపముతోడనే ఘోషించినాడు. రావణుడు జయకారముతో మహేంద్రభవనమున ప్రవేశించినాడు. రాక్షసులను వదలినాడు (తమ తమ చోట్లకు వెళ్ళవచ్చునని రావణుడనుమతినిచ్చినాడని గోవిందరాజీయము)

## ముప్పైయవ సర్గము

రావణుడు విజయము పొందినట్లు ప్రకటింపబడగానే బ్రహ్మ రావణుని వద్దకు వచ్చి నీ కుమారుని బలంతో దిక్పాలురను గెలువవలెనను నీ పూర్వప్రతిజ్ఞ (గోవిందరాజీయము) నెఱవేరింది. నీకుమారుడిప్పటి నుండి "ఇంద్రజిత్" అను పేరును పొందాడు, దేవతలను వశమందుంచుకొన్నాడు. కావున ఇప్పుడు ఇంద్రుని కూడా వదలిపెట్టుట ఉచితము. మీ అబ్బాయికి ఏమి అవసరమో అది దేవతలు వరముగా నిచ్చెదరు అని అన్నాడు. వెంటనే ఇంద్రజిత్తు నాకు అమరత్వము నీయవలెను అని కోరాడు. దానికి మరల బ్రహ్మ ఏ ప్రాణికి అమరత్వము లేదు కనుక ఏదో ఒక పరిహారము అవసరమన్నాడు. అది విని ఇంద్రజిత్తు "నేను నిరంతరము యజ్ఞము చేస్తుండాలి. నేను యజ్ఞముచేసి శత్రువధకై దివ్యరథమును పొందాలి. ఆ దివ్యరథమును అధిరోహించితే మాత్రము నన్నెవరు గెలువకూడదు! నాయజ్ఞము పూర్తి అయ్యేలోపున ఒకవేళ యుద్ధము సంభవిస్తేనే నేను మరణించాలి. (గోవిందరాజీయ వివరణ కూడా) కావున నాకు అమరత్వము సిద్ధించినట్లే అని అన్నాడు. బ్రహ్మ సరేనని ఒప్పుకోగానే రాక్షసులు ఇంద్రజిత్తు జయజయ నినాదాలను చేసుకొంటూ లంకకు చేరుకొనినారు. దేవతలు స్వర్గమును చేరుకొన్నారు. కొంతసేపటికి ఇంద్రుడు చింతాక్రాంతుడై మెల్లగా దిగాడు. బ్రహ్మ ముందు ఇలా ఎందుకు జరిగిందని రోదించాడు. ఇలా ఎందుకు జరిగిందని దానికి బ్రహ్మ ఇంద్రునితో నీకు నీవు పూర్వము చేసిన తప్పు గుర్తుకు రాలేదా. (గోవిందరాజీయము) అయితే చెప్పెదను వినుమని బ్రహ్మ ఇలా చెప్పనారంభించాడు – నాయనా! ఇంద్రా! నేను పూర్వము ఏక రూప ఏక కాంతి ఏకస్వరములతో (గోవిందరాజీయము) ప్రాణులందరిని సృజించాను. సమాభాషాః అనగా ఒకే విధమైన సంస్కృతమునే సరళముగా మాటాడు వారిని (నా వ్యాఖ్య) సృజించాను. వారిలో వారికి భేదము కలుగుటకై ఆలోచించి ఒక స్త్రీని సృష్టించాను. (భేదమనగా అంగవైకల్యము పరస్పర విలక్షణత్వము అని గోవిందరాజీయము) ఆ అమ్మాయి పేరు అహల్య. హలము అనగా వైరూప్యము, వికారము, దాని వలన ఏర్పడిన శరీరము హల్యము. వికారము వలన ఏర్పడిన శరీరమేమాత్రము లేనిది కనుక అహల్య. ఆ అహల్యను ఎవరికి ఇస్తే బాగుంటుందని ఆలోచించాను కాని ఎవరూ లేకపోవుట వలన (గోవిందరాజీయము) గౌతముని వద్ద న్యాసముగా (మరల తీసికొని వెళ్ళుదునని కొద్దికాలము ఉంచిన వస్తువుగా) ఉంచాను. నేనే త్రిలోకాధిపతినను భావముతో నీవు నన్నడగకుండానే (గోవిందరాజీయము) ఆమెను పత్నిగా మనసున భావించావు. కొన్నాళ్ళకు నేను గౌతముని మనఃస్థిరత్వమును గమనించి భార్యగా అతనికే ఒసంగాను. ఆ అహల్య అతనితో చక్కగా కాపురము చేస్తుండగా ఆ అమ్మాయిని గౌతముని వేషముతో ఆమెపై కామభావముతో గౌతమునిపై క్రోధభావముతో మోసగించావు. గౌతముడు నిన్నాశ్రమమున చూచాడు. 'ఓరీ! నన్నే మోసగించావా!' అని సాత్త్విక భావవిపరీత భావమును పొంది (గోవిందరాజీయము) నాపత్నిని మోసగించిన కారణముగా నీవు పదవి యందు స్థిరముగా నుండవు, నిన్ను కూడా రాక్షసులు పరాభవిస్తారు రాజుగా ఈ జారభావమును నీవు చేసినందున ప్రజలు కూడా అట్లే చేస్తారు. వారు చేసిన దోషము పాపము వారికే గాక నీకు కూడా సగము అంటుతుంది. (గోవిందరాజీయ వివరణ) వంద సార్లు యజ్ఞమును అశ్వమేధమును చేసినా బుద్ధి మారక నీవు నా భార్యను మోసగించితివి కనుక భగవదనుగ్రహము లేకుండా ఏ కర్మ కూడా ఫలించదు (సత్యతీర్థ వ్యాఖ్య). అలాగే నీస్థానములో వచ్చి కూర్చొనినవారు కూడా

అశ్వమేధయాగాలు వంద చేసి నీ పీఠముపై కూర్చొన్నా వారికి ఈ స్థానము స్థిరముగా నుండదు" అని శపించాడు. ఆతరువాత గౌతముడు తన భార్య అహల్యను కూడా శపించాడు. ఓసీ! ధూర్తురాలా! నా ఆశ్రమము దగ్గర ఉండజాలవు, ఉండకూడదు. రూపయౌవన ప్రభావము చేత ఈస్థితిని పొందావు కనుక ఇదే సౌందర్యమును నీవలె అందరును పొందుతారు అన్నాడు. అప్పటి నుండి అందరు స్త్రీలును రూపవతులైరి (నీవు ఒక్కదానివి రూపవతి వగుట వలన ఇంద్రునికి ఈ మోహము కామవికారము కలిగింది. అని నాగోజి భట్టు గారి వ్యాఖ్యలో గౌతముడు తన పత్నిని శపించునప్పుడు అందరికి ఈ స్థితి కలుగవలెనని కోరుకొనుట అసందర్భమని గమనించవలెనని సత్యతీర్థుల విమర్శ) అహల్య గౌతమమునితో "స్వామీ క్షమింపుడు. మీవేషముతో వచ్చుట వలన తప్ప బుద్ధిపూర్వకముగా కాదు. దోషము జరిగినది క్షమింపుడు" అని అన్నది. బాలకాండలో "దేవరాజ కుతూహలాత్" అని ఉన్నది, దాని ప్రకారము అహల్యకు ఇంద్రునిపై కోరిక ఉన్నట్లు తెలుస్తున్నది. ఇచట దానికి విరుద్ధముగా నున్నదేమి? అను ప్రశ్నకు అహల్య మనసుతో (కామిని కనుక) అంగీకరించినది కాని బయటికి అంగీకరించలేదు. శారీరకముగా అని అర్థము లేదా! ఏ స్త్రీ కూడా ఈవిధముగా శాపమునకు గుఱి అయ్యే విధముగా ప్రవర్తించదు, ప్రవర్తించకూడదు అను ఉద్దేశముతో నేను కోరలేదని అహల్య అన్నదని కూడా ఇచ్చట వివరించవచ్చునని సత్యతీర్థుల చర్చ. పరలోకమున నరకప్రాప్తివంటి దూర పరలోక ఫలములు అహల్యకు లేకున్నా ఐహికఫలము తప్పలేదు. కావున మానసవికారము కూడా ఐహికదోషఫలమును కలిగించునని గమనింపవలెననియు ఇచ్చట సత్యతీర్థుల వివరణ గమనార్హము. అహల్య అభిప్రాయమును గమనించి గౌతముడు "సరే ఇక్ష్వాకు వంశమున శ్రీరాముడు ఉద్భవిస్తాడు. ఆ రాముని దర్శించుట తోడనే నీ పాపం ఉపశమింపబడుతుంది. శ్రీరాముని కాతిథ్యము నిచ్చి మళ్ళీ నన్ను నీవు పొందెదవు. శ్రీ మహావిష్ణువే మనకై ఋషుల రక్షణార్థమై శ్రీరాముడుగా అవతరిస్తాడు" అని అహల్యనోదార్చాడు. ఆ చోటును వదలి తన ఆశ్రమమునకు వెడలినాడు గౌతముడు. అహల్య అచటనే ఉండి తపమొనర్చెను. ఇంద్రా! ఆ గౌతముని శాపకారణముగనే నీకీ స్థితి సంభవించింది అర్థమైనదా అని బ్రహ్మ ఇంద్రునితో చెప్పాడు. ఇంద్రా! నీవు వెంటనే వైష్ణవయాగ మొనర్చుము. మరల స్వర్గమును పొందుతావు. నీకుమారుడు కూడా మాతామహునిచే సముద్రలోకమున రక్షింపబడుతున్నాడు. వస్తాడులే అని చెప్పగానే ఇంద్రుడు వైష్ణవయాగము చేసి పుత్రుని పొంది పత్నీ పుత్ర పరివారముతో మరల స్వర్గమును చేరాడు? శ్రీరామా! వింటివా! కాబట్టి రావణాదుల బలము కన్న ఇంద్రజిత్తుని బలము గొప్పదని నేనంటిని అని అగస్త్యుడనగానే రామలక్ష్మణు లాశ్చర్యము నొందారు. విభీషణుడైతే రామా! ఈ విషయమును నేను ప్రత్యక్షంగా చూచాను. అగస్త్యుని మాటల వలన మరల గుర్తు చేసికొన్నాను. (గోవిందరాజీయము) అని అన్నాడు.

## ముప్పైయొకటవ సర్గము

ఈ మాటలను విన్న శ్రీ రామచంద్రుడు మరల అగస్త్యుని ప్రశ్నించాడు. "స్వామీ! రావణుడు ఆ కాలములో మనుష్యుల నెవరిని ఎదిరించినట్లు తాము తెల్పలేదు. రావణునికి వారంతా దాస్య మొనర్చినారా! అప్పుడే క్షత్రియులు గాని అక్షత్రియులుగాని లేరా!" అని. శ్రీ రాముని ప్రశ్నకు అబ్బా రామునికి రావణుని మీద ఇంకా కోపమున్నదా అన్నట్లు భావించి, ప్రస్తుతము అలాంటి రావణుడు మరణించాడు కదా అని కూడా భావించి (గోవిందరాజీయము)

చిరునవ్వు చిందించి అగస్త్యుడు ఇట్లు సమాధానించాడు. “శ్రీరామా! మాహిష్మతి అనే పట్టణమున అర్జునుడనే మహారాజు ఉండేవాడు, అతడు కృతవీర్యుని కుమారుడు హైహయ దేశాధిపతి. ఆ నగరాన్ని అగ్నియే ప్రాకారముగా నుండి రక్షించేవాడు. అతడు నిత్యాగ్నిహోత్రి. శక్తిశాలి. ఒకసారి రావణుడు ఆ నగరానికి వచ్చి ఏడీ అర్జునుడు, నేను యుద్ధము చేయాలి” అన్నాడు. అర్జునుడు స్త్రీలతో పాటు నర్మదలో విహరించడానికి వెళ్ళి యున్నాడు. రావణుడు త్రోవలో అత్యున్నతమైన శిఖరాలతో, జలపాతాలతో, అనేక ప్రవాహాలతో ఉన్న వింధ్యపర్వతాన్ని వేయిపడగలతో ఉన్న ఆదిశేషుని వలె ఉన్నట్లు భావిస్తూ ఆ పర్వత సానువుల నుండి ప్రవహిస్తున్న నర్మదను చూచాడు. ఆ నర్మదలో ఒకవైపు జలజంతువులు మరొక వైపు అరణ్య జంతువులు, మరొక చోట వివిధ పక్షులు’ మరొక చోట వివిధ జలపుష్పములు ఉన్నాయి. రావణుడు ఆ మధ్యాహ్నసమయమున సూర్యుని చంద్రునిగా వాయువును శీతల వాయువుగా మార్చుకొని ఆనందించుచుండినాడు. నర్మద కూడ గంగానది వలె ప్రసన్న గంభీరముగా ఉన్నది అని అనుకొనుచు ఆ నర్మద నన్ను చూచి భయపడింది కనుకనే సన్నని ప్రవాహముతో ఉన్నదని భావించి నర్మద ఇసుకతిన్నెపై మంత్రులతో కూర్చొని ఉండినాడు. మీరు వెళ్ళి స్నానము చేసి పూలు తీసికొని రండని మంత్రులను పంపగా వారు సరేనని వెళ్ళి స్నానము చేసి పూలగుట్టలనే సిద్ధపఱచారు. రావణుడు కూడా సంతసించి నదిలో స్నానము చేసి తన వద్ద కైలాస పర్వతము క్రింద భుజాలు నలిగినప్పటి నుండి (గోవిందరాజీయము) నిత్యము పూజింపబడుచున్న బంగారు శివలింగమునకు అభిషేక మొనర్చి పుష్పపూజ చేయుచుండెను. రావణునితో ఆ మంత్రులు నడచుచున్నప్పుడు ప్రాణాలతో పర్వతాలు నడుస్తున్నట్లనిపించింది. రావణుడు వెళ్ళు చోటికల్లా ఈ శివలింగము తేబడుతూ ఉండేది. నర్మద ఇసుకతిన్నెలలో రావణుడు చక్కగా శివలింగమును పూజించి సంతోషముతో తాండవ మొనర్చాడు. ఇరువది భుజాలను చాపి శివునికి నమస్కరించాడు.

## ముప్పైరెండవ సర్గము

రావణుడు శివారాధన పుష్పాంజలి చేయుచోటికి కొంచెము క్రింది భాగమున కార్తవీర్యుడు తన విలాసవతులతో సహస్ర బాహువులతో జలక్రీడ యొనర్చుచుండినాడు. తన బాహుబలమును పరీక్షించుటకై నర్మదా ప్రవాహము నాపివేశాడు. వెంటనే ప్రవాహము వెనుదిరిగి మీనమకరాదులతో మరలి ఎత్తుప్రదేశములను తిన్నెలను ముంచుచుండినది. రావణుని పూజ పూర్తికాక ముందే ప్రవాహం అతని పూజను భగ్నమొనర్చింది. రావణునికి కోపము కలిగి అప్రియము చేసిన అమాయకపు భార్యను చూచినట్లుగా నర్మదను కోపముతో రావణుడు చూచాడు. నియమ సమయమున మాటాడరాదు కావున ఎడమ చేతి వ్రేళ్ళతో శబ్ద మొనర్చి శుక సారణులను చూచి రమ్మని సంజ్ఞచేశాడు. వారు ప్రవాహపు క్రింది భాగమునకు వెడలి ఆడఏనుగులతో విహరిస్తున్న దిగ్గజమువలె మదించిన వేయి చేతులతో నదిని ఆడిస్తూ కార్తవీర్యుడు ఆ విలాసినులను కూడా ఆనందింపజేయుచుండినాడు. ఆ విషయమును రావణునికి శుకసారణులు చెప్పారు. వెంటనే రావణుడు వారితో కలిసి ఆ ప్రదేశమును, వారు చెప్పిన విధముగా అర్జునుని జలక్రీడను చూచాడు. రావణుడు పంపగా మంత్రులు, “రావణుడు వచ్చినాడు యుద్ధము చేయు”మని చెప్పుమని అర్జునునికి మంత్రుల ద్వారా కబురుచేయబోగా ఆ మంత్రులే ఏమి రావణా వేళా పాళా లేదు, యుద్ధము కావాలంటే ఈ రోజు ఆగు. రేపు యుద్ధము చేయవచ్చు. ఇప్పుడే కావాలంటే ముందు

మాతో యుద్ధము తరువాత అర్జునునితో యుద్ధము అని పలికారు. రావణుని మంత్రులు ఆ మాటలను లెక్కచేయక ఆ మంత్రుల నెదిరించారు. ఉభయ మంత్రులకు యుద్ధము జరిగింది. ద్వారపాలకులు అర్జునునికి ఈ విషయమును నివేదించగా ఆ విలాసినులను భయపడవద్దని చెప్పి నదిలో నుంచి లేచి గదపట్టుకొని వచ్చి ఒకవేటు వేయు సరికి ప్రహస్తుడెదుర్కొని అర్జునునితో యుద్ధ మొనర్చాడు. కొంత సేపు ఎదిరించి పడిపోయాడు. ఆ వార్త తెలిసి రావణుడే స్వయముగా యుద్ధము నారంభించాడు. రావణార్జునులకు భయంకరంగా యుద్ధము సాగింది. చాలసార్లు గదను ప్రయోగించెను కాని వరదానము వలన రావణుని వక్షస్థలమునేమియు చేయలేక పోయినాడర్జునుడు. రావణుడు ఒకడే మిగిలి అర్జునునితో యుద్ధము చేయుటకు ధనుస్సు పట్టుకొని ముందుకు వచ్చాడు. కొంచెము సేపు యుద్ధము జరిగిన తరువాత రావణుని తన సహస్ర బాహువులలో ఇరికించి అర్జునుడు బంధించాడు. వెనుక నుండి రావణామాత్యులు ఏమి అన్నను వినకుండా వారు ప్రయోగించిన ఆయుధాలను తన చేతులతో వారించి వారిపైనే ప్రయోగించి అర్జునుడు రావణుని పట్టుకొని మాహిష్మతి నగరమున ప్రవేశించగా దేవతలు పుష్పవర్షమును కురిపించారు. పౌరులు మంగళ వాద్యములతో పుష్పాక్షతలతో స్వాగతించారు. ఇచ్చట సాధ్వీ అన్న పదమునకు సాధ్వీక్రియా అని దేవతలు అర్జునుని మెచ్చుకొనిరని గోవిందరాజీయము.

## ముప్పైమూడవ సర్గము

రావణుని బంధించినట్లు తెలియగనే పులస్త్యప్రజాపతి చలించి (పౌత్ర స్నేహము వలన, మహా ధైర్యవంతుడైనను చలించెనని గోవిందరాజీయము) మాహిష్మతి పట్టణమునకు వచ్చాడు. కార్తవీర్యార్జునుడీ విషయము తెలిసి మహర్షిని సదాచారముతో ఎదురేగి పూజించి వినయముతో కర్తవ్యమునాదేశించుమని కోరగా మా మనుమని రావణుని వదలుమని చెప్పుటకే వచ్చితినన్నాడు. అర్జునుడు మారుమాటాడక తమ ఆజ్ఞ అని రావణుని వదలాడు. రావణుడు సిగ్గుతో తల ఎత్తుకోలేక మారుమాటాడక తాతగారితో బయటికి వచ్చాడు. పులస్త్యుడు కూడా మనుమని ఏమి అనకనే వదలి పెట్టాడు. ఇచ్చట పులస్త్యోవాచ అనే శబ్దమునకు పులస్త్యుడు పలికెను అనే కాక పులస్త్యుడు వక్తగా కలది పులస్త్య అనగా పులస్త్యుని నాలుక అని అర్థము చెప్పుట సత్యతీర్థుల వ్యాఖ్య. ఆ విధముగా అర్జునునిచే వదలబడినాడు రావణుడు. ఈ విధముగా ఆకాశమున చాలమంది బలశాలురు భూలోకమున కూడా ఉండిరి అని శ్రీరాముని ప్రశ్నకు అగస్త్యుడు బదులు చెప్పి, ఆ తరువాత రావణుడు అర్జునునితో మైత్రి చేసి ఇతర రాజులతో కూడా యుద్ధము చేసి వారినోడించెనని చెప్పాడు. ఇచ్చట బలవంతులకు అంతకన్న ఎక్కువ బలవంతులు అన్ని కాలాలలో ఉంటారు, సృష్టి చాలా విచిత్రమైనది కదా! కాబట్టి శ్రేయస్సును కోరువాడు మరొకని అవమానించ వద్దని సారమని తిలక వ్యాఖ్యావిశేషము.

## ముప్పైనాల్గవ సర్గము

రావణుడు ఈ విధముగా లోకములో ఎవరు బలవంతులని తెలిసినా వారితో యుద్ధమొనర్చేవాడు. ఒకసారి వాలి కూడా మహాబలశాలి అని తెలిసి రావణుడు కిష్కింధకు చేరెను. అచటి తారుడు, తారతండ్రి సుషేణుడు, సుగ్రీవుడు వాలి బలమును చెప్పి కొంచెమాగు నాలుగు సముద్రాలలో సంధ్యావందన మొనర్చి వాలి వచ్చును. అప్పుడు యుద్ధము చేయవచ్చుననిరి. కాని అతడు వినలేదు ఇప్పుడే వాలిని చూడవలెననెను. రావణుని

మాటను విని వారు అచ్చటి ఎముకలగుట్టను చూపి వీరంతా వాలిచే హతులైనవారే అని భయపెట్టి కొంచె మాగుమనిరి. తిరిగి రావణుని తొందరను చూచి అయితే దక్షిణ సముద్రమునకు వెళ్ళుమనగా రావణుడు సంధ్యనుపాసించుచున్న వాలిని చూచెను. రావణుడు నిశ్శబ్దముగా వెనుక నుంచి వచ్చి వాలిని పట్టు కొనదలచెను. వాలికూడా దైవికముగా గమనించి చంకన రావణుని ఇరికించుకొననలెనని నిశ్శబ్దముగా నుండెను. ఇచట వాలిని పాపాభిప్రాయవాన్ అని అనుటకు బంధించవలెనను అభిప్రాయము కలవాడని అర్థమని గోవిందరాజీయము. రావణుడు దగ్గఱకు చేరుకొనే సరికి సిద్ధముగా ఉన్న వాలి గరుడుడు పామును పట్టుకొన్నట్లుగా పరాఙ్ముఖుడైన రావణుని చంకనిరికించుకొని మౌనముగా ఇతర సముద్రముల వైపు ఎగిరెను. రావణుని అమాత్యులు ఆక్రోశించుచు కొంతదూరము వెంబడించి ఊరుకొన్నారు. వాలి ఆకాశమున వెళ్ళుతుండగా పర్వతాలు కూడా తప్పుకొన్నవి. పక్షులు కూడా సంచరించలేని దారిగుండా వాలి ఆకాశమున సాగాడు. ఆ విధముగా సాగి నాల్గు చోట్ల నాల్గు సముద్ర తీరాలలో సంధ్యావందనం చేశాడు. నాల్గుచోట్ల నాల్గుసార్లు సంధ్యావిధి లేదు. కదా! అన్న ప్రశ్నకు దక్షిణ సముద్రము వద్ద సంధ్యాంగశౌచమును (అపోహిష్ఠాది మంత్రాలతో) చేసెననియు,(హిరణ్యవర్ణాః అను మంత్రములతో) చేసెననియు, పశ్చిమ సముద్రమున సంధ్యాంగమంత్రస్నానమును ఉత్తరమున ప్రోక్షణ మొనర్చెననియు, తూర్పున అర్ఘ్యప్రదాన మొనర్చెననియు అర్థమని గోవిందరాజీయ వ్యాఖ్య. ఈ విధముగా సంధ్యావందనమును నెఱవేర్చుకొని "ఓయి! నీవెక్కడి నుంచి ఊడిపడ్డా"వని ఎగతాళిచేస్తూ కిష్కింధలో రావణుని చంకనుంచి ఊడదీసెను, ఒక పురుగును తీసివేసినట్టుగా కొంచెము స్వస్థపడి రావణుడన్నాడు వాలీ! నీతో యుద్ధము చేయవలెనని సంకల్పించి వచ్చాను, కాని నీచంకలో ఇరికి లోకాలన్ని సముద్రాలన్ని నీతో కలిసి చుట్టి రావలసిన స్థితి ఏర్పడినది. నీ బలము వేగము చాల గొప్పది వాయుగరుడాదులతో సమానమైన వేగము గలవాడవు. నీతో యుద్ధమైతే చేయలేను కాని మన ఇద్దరము మిత్రులవలె ఉండెదము. భార్యా పుత్రులు, పురము, రాజ్యాధికారము, భోగము, తిండి, కప్పుకొనుట (కంచము మంచము) అన్ని మన ఇద్దరికి సమానమనెను,వాలి రావణుని మాటలను విని అంగీకరించి అగ్నిసాక్షిగా స్నేహ మొనర్చెను. ఆ తరువాత నెలనాళ్ళు రావణుడు మంత్రులు అచటనే ఉండిరి. చూడు రామా! అలాంటి వాలిని కూడా నీవు మిడతను అగ్ని వలె సంహరించితివని అగస్త్యుడు రామునితో అన్నాడు.

## ముప్పైయైదవ సర్గము

ఆ తరువాత మరల శ్రీరాముడు దక్షిణ దిక్కు నాశ్రయించిన ఋషి అనగా అగస్త్య మహామునిని గూర్చి ఇట్లడిగాడు. ఇచట అగస్త్యుని ఇదమ అని అనవచ్చునని అనగా మన్మథుని నియమించిన (నిగ్రహించిన) వాడని అర్థమని విశేషార్థమును సత్యతీర్థీయవ్యాఖ్య చెప్పింది. ఓమునీ! ఇదమా (ఇ దమ)నాకు వాలి రావణుల కన్న హనుమంతుడు ఇంకా ఎక్కువ బలశాలి అని అనిపిస్తున్నది. ఏలననగా అతడు చాలా సాహసం చూపి సముద్రము నుల్లంఘించినాడు, సీతజాడ తెలిసికొన్నాడు. అశోకవనమును ధ్వస్త మొనర్చి రావణుని దగ్గఱకు వెళ్లి నా సందేశం వినిపించినాడు. హనుమంతునితో సమానమైన వారు ఎవరూ లేరు. కాలుడు (కాలము), ఇంద్రుడు, విష్ణువు, కుబేరుడు కూడా హనుమంతునితో సమానమైన బలవంతులు కారు. ఇచట యముడు ఇంద్రుడు, కుబేరులను మాత్రము చెప్పవలెను, విష్ణువు యొక్క అనుగ్రహమువలననే ఆంజనేయుడు మిగతావారిని మించినవాడని అర్థము

చెప్పవలెనని సత్యతీర్థవ్యాఖ్య. అట్టి హనుమంతుడు ఏల వాలిని చంపలేదు? బహుశః తన బలము ఆంజనేయునికి తెలియదేమో అనగానే అగస్త్యుడు నిజమే రామా! హనుమంతునికి తన బలము తనకు తెలియదు, అలా శాపగ్రస్తుడైనాడు. ఋషులు ఆంజనేయునికి తన బలము తెలియకుండునట్లు శాపము నిచ్చినారు. చిన్నప్పుడే ఆంజనేయుడేమిపని చేసినాడో అది కూడా వర్ణించుటకు వీలుకానిదే! రామా! విను! సూర్యునిచే వరము నొంది బంగారుమయముగా మారిన మేరు పర్వతమున 'కేసరి', ఈ హనుమంతుని తండ్రి నివసించెడివాడు. అంజన అతని భార్య. ఆమెయందు వాయువు, దేవతల సంకల్పానుసారము గర్భమునుంచాడు. అంజన మొదట వరిగింజ ముల్లు కాంతి వంటి కాంతి గల బంగారు మేని ఛాయగల చిన్న పిల్లవానిగా హనుమంతుని ప్రసవించింది. ఒకసారి పండ్లనేరి తెచ్చుటకు అంజన బయటికి వెళ్ళింది. తల్లి కనపడక పోవుట వలన, ఆకలి అగుట వలన పిల్లవాడు బయటికి పొరలినాడు. ఏడ్చుచు సూర్యుడుదయించుటను చూచి ఫలమనుకొని భ్రమపడి ఎగిరినాడు. మరొక బాల సూర్యునిగా ప్రకాశిస్తున్న శిశు హనుమంతుని చూచి అందరు ఆశ్చర్యపడినారు. శైశవదశలోనే ఇంత బలముంటే ఇంకా యౌవనవంతుడైతే చెప్పేదేముందని వారు ఆశ్చర్యపడినారు.

పిల్లవాడు సూర్యుని తెలియక తాకుతాడేమోనని వాయువు హనుమంతుని లాలించినాడు. సూర్యుడు కూడా పిల్లవాడు కదా అని చల్లబడినాడు. అప్పుడే రాహువు సూర్యుని పట్టుకొనుటకు వచ్చినాడు. ఈ లోపున హనుమంతుడు సూర్యుని కబళించబోయాడు.

రాహువు హనుమంతుని చూచి మరొక రాహువనుకొని భయపడి వెనుదిరిగివచ్చి ఇంద్రునితో, ఏమి! ఇంద్రా! నీవు పర్వకాలమున సూర్యచంద్రులను ఆహారముగా నిర్ణయించి మరొకరికి నా ఆహారము నిచ్చుట ఏమి న్యాయము అని అడిగాడు. ఒకరికి అన్నము పెట్టి వారు తినక ముందే వారి అన్నమును మరొకరికి పెట్టుట అన్యాయము (తిలక వ్యాఖ్య) అని అన్నాడు. ఇంద్రుడు దిగ్భ్రాంతుడై ఏమి జరిగినదో తెలిసికొనుటకై ఐరావతస్థుడై సూర్యునివైపువచ్చాడు. రాహువు కూడా ఇంద్రుని వదలి మరల సూర్యునివైపు రాగా హనుమంతుడు సూర్యుని వదలి రాహువునే ఫలమనుకొని పట్టుకొన్నాడు. రాహువు భయపడి ఇంద్రా! ఇంద్రా! అని అఱచాడు. ఇంద్రుడు భయపడవద్దని ఐరావతమును హనుమంతునివైపు నడిపించాడు. ఐరావతం కూడా ఒక ఫలమేమోనని భావించి హనుమంతుడు ఐరావతం వద్దకు వచ్చుసరికి ఐరావతం వెనుకకు పారిపోబోయి ఇంద్రుని ప్రేరణతో నిలిచి హనుమంతునినుండి తనను విడిపించుకొనుటకై పెనుగులాడింది. హనుమదైరావతములకు ఇంద్రాగ్నులకు జరిగినట్లు భయంకరమైన యుద్ధం జరిగింది. గంతులువేస్తున్న హనుమంతునిపై కోపముతో ఇంద్రుడు వజ్రా యుధమును ప్రయోగింపగా అది హనుమంతుని దవడకు తగిలి దవడ పెద్దదయింది. (వాచింది) అది గమనించి వాయువు తన కుమారుని తీసికొని ఒక గుహలోనికి దూరి అచటి నుంచి కదలకుండిపోయాడు. వాయువు స్తంభించాడు. ప్రాణులన్నిటికి మలమూత్ర నిరోధమేర్పడింది. చైతన్యము లేనివై ప్రాణులన్నియు, ప్రజలందఱును బాధపడ్డారు. త్రైలోక్యం వాయుకోపప్రకోపమునకు గుఱి అయింది. వెంటనే ప్రజలందఱు ప్రజాపతి నాశ్రయించి తమ బాధను చెప్పుకొన్నారు. ఈ సందర్భముగా "మహోదరనిభోదరాః" అను పదమునకు జలోదర (కడుపుబ్బడము) (మహోదర) వ్యాధి కలిగిన వాళ్ళమైతిమి అని గోవిందరాజీయానుసారి వ్యాఖ్య. ప్రజాపతి, కారణమునఱసి మనమంతా వాయువును ప్రార్థింతము, వాయువే అందరకు ప్రాణము అని చెప్పాడు. అందఱూ కలిసి కుమారుని

లాలించుచు గుహను చేరుకొన్న వాయుగుహను చేరి వాయువును ప్రార్థింపసాగారు. వాయువు లోనుంచి బయటికి రాగానే చతుర్ముఖుడు, ప్రజలు తుష్టినొందారు.

## ముప్పైయారవ సర్గము

స్తబ్ధుడైన కుమారుని ముందిడుకొని వాయువు బ్రహ్మముందు కూర్చొన్నాడు. బ్రహ్మ కరుణించాడు. శిశువు కాదు, శిశువులాగా తనను చూపెట్టుచుండినాడు హనుమంతుడని సత్యతీర్థవ్యాఖ్య. నిశ్చేష్టుడైన ఆంజనేయుని, బ్రహ్మ నిఖిలవేదవేదాంతశాస్త్రములే ఆభరణములుగా గల తన బాహువులచే నిమిరాడు. బాలుడు ప్రాణవంతుడయ్యాడు. వాయువు సంతోషించాడు. వాయువు ప్రభావముచే ప్రజలంతా ప్రాణవంతులు సచేతనులయ్యారు. బ్రహ్మ ఇంద్రాది దేవతలతో వాయుప్రీత్యర్థమై మనమంతా ఈ పిల్లవానికి వరముల నీయవలెనన్నాడు. అపుడు ఇంద్రుడు తన మెడలోని కమలాల మాలను (వైజయంతీమాలను) తీసి యిచ్చి నా వజ్రము తాకుట వలన ఇతని దవడ పెద్దదయినందున నేటినుంచి ఇతడు హనువు (దవడ) కలవాడు కనుక హనుమంతుడని పిలువబడునన్నాడు. నా వజ్రాయుధము కూడా ఇతనినేమీ చేయజాలదని వరమిచ్చాడు. సూర్యుడు తన శతాంశ కలను (దానినే కొంత మంది సువర్చల అను అమ్మాయి అని అందురు) ఇచ్చి (వర్చస్సు నిచ్చి) కాలాంతరమున తనవద్ద శాస్త్రమును (ఐంద్ర వ్యాకరణ శాస్త్రమునని గోవిందరాజీయము) వేదమును నేర్చుకొనవచ్చునన్నాడు. గొప్ప వాగ్మి కాగలడనియు వరమిచ్చాడు. వరుణుడు తన పాశము వలనగాని, నీటి వలనగాని ఇతనికేమి ఇబ్బంది జరుగదన్నాడు. యముడు స్వచ్ఛంద మరణమును, గద వలన ఏ భయము లేకపోవుటను, అనారోగ్యములేకపోవుటను కూడా అనుగ్రహించాడు. యుద్ధమున మూర్ఛిల్లక పోవడమును ఎంత యుద్ధము చేసినా శ్రమలేకపోవుటను అనుగ్రహించాడు. శివుడు, బ్రహ్మ తమ ఆయుధముల చేత ఏ బాధలేకుండునట్లు అనుగ్రహించారు. శిల్పాచార్యుడు విశ్వకర్మ అన్ని శస్త్ర శాస్త్ర విద్యలు, దివ్యాస్త్ర విద్యలు ఇతనికి సంప్రాప్తములగును, ఇతడు చిరంజీవి అగునని వరము నిచ్చాడు. మరల బ్రహ్మ వాయువుతో నిట్లన్నాడు. మీ అబ్బాయి భవిష్యత్ కాలమున శ్రీరామకార్యార్థియై రావణోత్సాదమునకు చేయవలసిన పనులనన్నిటిని నెఱవేర్చును. ఏ ఆయుధము హనుమంతుని చేరి బాధపెట్టేవి కావు, అసలు చేరవు అని సత్యతీర్థ వ్యాఖ్య, స్వచ్ఛందముగానే ఏ ఆయుధమునైనా అతడు స్వీకరించవచ్చునని భావము. ఈ విధముగ వరము నిచ్చి దేవతలతో కలిసి బ్రహ్మ స్వస్థానమునకు చేరుకొన్నాడు.

ఆ తరువాత వాయువు ఆ కుమారుని అంజనాకేసరుల కప్పగించెను. వారు ముద్దుగా పెంచుచుండిరి. వాయువు కూడా పిల్లవానిని అనేక ఆశ్రమములకు త్రిప్పినాడు. చిన్నతనమున తెలియక ఋషుల స్రుక్ స్రువములను పాత్రలను వల్కలములను నష్టపఱచాడు. వారిని చూచి పరిహాసమొనర్చాడు. అది చూచి భృగు అంగిరా మున్నగు మహర్షులు నీ బలము నీకు తెలియకుండునుగాక! అవసరసమయముననే ఎవరైనా గుర్తు చేస్తేనే నీ బలము నీకు గుర్తుకు వచ్చునని శపించారు. ఆ కారణముగా ఆంజనేయునకు తన బలము గుర్తురాదు. సుగ్రీవాదులకు కూడా ఆంజనేయుని కింత బలమున్నదని తెలియదు. కనుక వారును గుర్తు చేయలేదు. ఇచ్చట గోవిందరాజీయము సత్యతీర్థ వ్యాఖ్య సమముగనే వివరించాయి. తరువాత ఆంజనేయుడు ఉదయగిరి అస్తగిరి యందు అడుగులు వేయుచు సూర్యుని ద్వారా వ్యాకరణం నేర్చుకొన్నాడు. అగస్త్యుడు మున్నగు ఋషులిట్లు చెప్పి వెళ్ళబోవుచుండగా

శ్రీరాముడు వారినుండమని కోరి, వారి సాన్నిధ్యమున వివిధయాగములను, క్రతువులను నెఱవేర్చదలచాడు. వారు అంగీకరించి సమయమునకు రాగలమని చెప్పి వెళ్ళారు. శ్రీరామచంద్రుడు ఆ రాత్రిని ప్రశాంతముగా గడపాడు.

ఇచ్చట ఆంజనేయస్వామి భాస్కరుని వద్ద “స సూత్ర వృత్త్యర్థపదం మహార్థం, ససంగ్రహం సాధ్యతి వై కపీంద్రః” అను శ్లోకపాదములకు సూత్రము అనగా అష్టాధ్యాయి అని, వృత్తి అనగా సామాన్య సూత్రార్థమని, అర్థపదం అనగా వరరుచి వార్తికమని, మహార్థమ్ అనగా పతంజలి మహాభాష్యమని, సంగ్రహమనగా ఆయా ప్రకరణములని శ్రీ గోవిందరాజీయవ్యాఖ్య. నాగోజిభట్టు కూడా ఈ మాటలకు ఇదే అర్థమును వ్రాసి సంగ్రహమను శబ్దమునకు వ్యాడికృత సంగ్రహ గ్రంథము అని వ్రాసెను. దానిని సత్యతీర్థులవారు ఖండించినారు. వారి వ్యాఖ్యను అంగీకరించినచో పాణిని కంటే తరువాతి వాడు ఆంజనేయస్వామి అని చెప్పవలసివచ్చును. కనుక సూత్రమను శబ్దమును శివుని డమరు నాదములనుంచి వచ్చిన చతుర్దశ సూత్రములన్న అర్థమునే స్వీకరించవలెనని సత్యతీర్థుల వ్యాఖ్య.

## ముప్పైయేడవ సర్గము

శ్రీరాముడు పట్టాభిషిక్తుడైన రోజుననే మహర్షులతో శ్రీరామునికి పై సంభాషణమంతా జరిగినది. ఆ విధముగా శ్రీరాముడు విశ్రాంతి తీసికొనినాడు. తెల్లవారు జాముననే వందిమాగధులు వచ్చి శ్రీరామచంద్రుని సాక్షాద్ విష్ణువుగా భావించి మేల్కొల్పినారు. “నావిష్ణుః పృథివీపతిః” అనే నానుడి ప్రకారము విష్ణువు కానివాడు మహారాజు చక్రవర్తి కాడు కనుక శ్రీరాముడు వారు చేయుస్తుతిని మౌనముగా అంగీకరించినాడు. నీవు మేల్కొనినచో జగత్తు మేల్కొనును, నీవు నిద్రించినచో జగత్తు నిద్రించును. ‘యథా రాజా తథా ప్రజాః’ అనే సూక్తిననుసరించి ప్రజాపతివి అని గోవిందరాజీయము. ఆవిధముగా ఎంతోసేపు వారు స్తుతి చేసినారు. వారి స్తుతులతో మేల్కొని కాలకృత్యములను, స్నానాదులను ముగించుకొని శ్రీరాముడు దేవతామందిరమున ఆనువంశికముగా ఆరాధించ వలసిన దేవతామూర్తుల నారాధించాడు. అనేక దేశప్రాంతములనుండి వచ్చిన మహారాజులను, సోదరులను, సుగ్రీవుని, విభీషణుని, ఇదే విధముగా వానరులను వారివారికి అవసరమైన విషయములను వారితో చర్చించి నిర్ణయించి అవసరమైన చర్యలను గైకొన్నాడు. అందరి పనులను చక్కబెట్టి రాత్రి విశ్రాంతి తీసికొనేవాడు. ఇదే విధంగా ప్రతిరోజు శ్రీరాముని దినచర్య సాగేది. సాయంకాలం పురాణశ్రవణాదులను చేయువాడు.

## ముప్పైయెనిమిదవ సర్గము

ఇక్కడ మరల ఐదు అధ్యాయములు ప్రక్షిప్తముగా అధిక పాఠముగా భావింపబడుచున్నవి. వీటికి ప్రామాణిక వ్యాఖ్య లేదు.

### 1

వాలి సుగ్రీవుల తండ్రి ఋక్షరజుడు, మఱి తల్లి ఎవరు? అని శ్రీరాముడు, అగస్త్యుని అడిగినాడు. అగస్త్యుడు ఈవిషయమును నారదుని వల్ల వినియుంటిని, నారదుడు చెప్పిన విషయమునే చెప్పుచున్నానని ఈ విధముగా వివరించాడు.

మేరుపర్వతశృంగమున బ్రహ్మయొక్క దివ్యసభ ఉన్నది. అందు యోగాభ్యాసం చేసే బ్రహ్మనేత్రాలనుండి జలబిందువొకటి రాలినది. దానిని చేత నుంచుకొని ఆయన మెల్లగా భూమియందుంచాడు. వెంటనే ఆ బిందువు ఒక వానరుడుగా మారింది. బ్రహ్మ ఆ వానరునితో నాయనా! నీవీ మేరు శైలముననే ఫలమూల కందములనా స్వాదిస్తూ నుండు అని చెప్పగా, ఆ వానరుడు ప్రతిరోజు విహరిస్తూ కావలసిన ఫలముల నాస్వాదించుచు తేనెల గ్రోలుతూ పుష్పములను కోసి బ్రహ్మపాదముల చెంతనుంచుతూ భక్తితో సేవించుచుండినాడు. ఒకరోజు ఋక్షరాట్ (ఎలుగు బంటుల నాయకుడు) అను పేరుగల ఈవానరుడే దప్పిక తీర్చుకొనుటకై ఒకసరః ప్రదేశం చేరాడు. అచట సరస్సున పులకాంకితమైన శరీరమును, ముఖప్రతిబింబమును చూచి ఎవరో నాశత్రువు అని భావించి దూకి నీట మునిగాడు. మరల లేచి చూచేసరికి అతని శరీరమే స్త్రీరూపముగా మారింది. చాలా సుందరమైన ఆరూపం చూచి అచటికి అమాయకంగా విహరించుటకు వచ్చిన ఇంద్రసూర్యులు వ్యామోహితులయ్యారు. ఇంద్రుడు తన వీర్యము నాపుకొనలేక ఆమె తలవెంద్రుకలపై వదలాడు. బాలములు వాలములు అనగా వెంట్రుకలు అందుపడిన ఆ వీర్యమే “వాలి” గా మారింది. ఇక సూర్యుడు కూడా తన రేతస్సునాపుకొనలేక ఆమె మెడపై విసర్జించెను. ఆ రేతస్సే (వీర్యమే) సుగ్రీవుడుగా మారింది. వారు తమ తమ కుమారులుగా ఆ అమ్మాయికి అప్పగించి వెళ్ళారు. ఆరోజు గడచేసరికి ఋక్షరజుడు (ఆ అమ్మాయి) తన పూర్వవానర రూపం పొందాడు. తన ఇద్దరు కుమారులను తీసికొని బ్రహ్మకు విన్నవించాడు. బ్రహ్మ ఋక్షరజులనోదార్చి నాయనా! కిష్కింధానగరము చాల సుందరముగా తీర్చి రచింపబడి ఉన్నది. నీవు అచ్చట నీ ఇద్దరుకుమారులతో వసింపుము. వానరలోకము అంతా నీకు సేవ చేస్తుంది. నీవు వానరాధిపతివగుదువని చెప్పాడు. ఆ నగరం విశ్వకర్మచే నిర్మితమైనది. అత్యాధునిక వ్యవస్థలు, బజారులువీథులు, ఉన్నత గృహములు, కావలసిన ఆహారములు అందరికి అన్ని అచట లభించేవి. ఆ నగరము నధివసించినాడు ఋక్షరజుడు. రామా! గమనించితివా? ఈ విధముగా వాలి సుగ్రీవులకు ఋక్షరజుడే తండ్రి తల్లి కూడా అని అగస్త్యుడు చెప్పెను. ఈకథను విన్నవారికి అన్ని కార్యములు సిద్ధించునని ఫలశ్రుతి ఇచట చెప్పబడింది.

2

రాముడు వాలి సుగ్రీవుల జన్మవృత్తాంతాన్ని విని చాలా సంతోషించినాడు. అపుడు అగస్త్యుడు ఇంకొక విశేషమును కూడా చెప్తాను విను రామా! రావణుడు సీతను అపహరించుటకు కారణమేమో చెబుతాను వినుము. పూర్వం కృతయుగమున సనత్కుమారమహర్షిని ప్రశాంతంగా ఉన్నప్పుడు వినయముతో చేరి, రావణుడడిగినాడు. స్వామీ! యోగులంతా ఎవరిని ధ్యానిస్తారు? అని. సనత్కుమారుడు శ్రీమహావిష్ణువునే ధ్యానింతురని, అతడే యోగీశ్వరేశ్వరుడని చెప్పాడు. మరల రావణుడు దైత్యులు, దానవులు, రాక్షసులు మరణించి ఎవరిని పొందుతారు? అని అడిగాడు. సనత్కుమారుడు స్మితవదనుడై ఇంకెవరిని? ఆ మహావిష్ణువునే పొందుతారు అనెను. రావణుడు ఆ సమాధానం విని చాలా సంతోషించాడు.

3

రావణుడు మరల ఆ మహావిష్ణువు లక్షణమేమి? అని అడిగాడు. సనత్కుమారుడు శ్రీమహావిష్ణువు సర్వలోకాల యందు చరాచరములయందు, పంచభూతములయందు, అంతట నిండియుండు పరమాత్మ అని,

అన్ని కాలములనతడే నియమించునని కూడా చెప్పాడు. దిక్పాలకులు బ్రహ్మ రుద్రులు అతడే నని చెప్పాడు. సృష్టి స్థితిలయ కర్త అతడే, అతడు విలాసమైన స్వరూపముతో అతిసుందరభవ్యస్వభావముతో ఉండునని సమాధానము చెప్పి రావణుని ముఖములోని భావాన్ని అర్థము చేసుకొని సనత్కుమారుడు రావణా! ఆ స్వామిని ఎలా చూడగలనని అనుకొంటున్నావా! సాధారణంగా ఆ మహావిష్ణువు ఎవరికీ దృష్టిగోచరుడు కాడు.కాని ఒక ఉపాయమున్నది. ఈ కృతయుగము గడవగానే త్రేతాయుగము వచ్చును. అప్పుడు శ్రీరాముడుగా, దశరథుని కుమారుడుగా అవతరించును. దండకవనమున తండ్రి ఆజ్ఞచే వసించును. అతని భార్య మహాలక్ష్మి సీతగా, జనకసుతగా అవతరించును. అప్పుడు దర్శించవచ్చునన్నాడు. అది విని రావణుడు చాల ఆనందించాడు.

4

రామా! సనత్కుమారుని వల్ల మహావిష్ణువును గురించి తెలిసికొని, భగవదనుగ్రహం పొందుటకే సీతను అపహరించినాడు రావణుడు. ఆ విషయం వివరంగా తెలుపుతాను వినుము. విన్నచో వినిపించినచో కూడా సర్వపాపహరమగును, స్వర్గప్రాప్తి కలుగునని అగస్త్యుడు శ్రీరామునితో చెప్పాడు.

5

రామా! రావణుడు విశ్వంలో ఎవరికి బలమున్నదని తెలిస్తే వారితో యుద్ధము చేయవలెనని, విజయము పొందవలెనని అనుకొనేవాడు. ఒకసారి ఆకాశమున సంచరించుచున్న నారదమహర్షిని వెంబడించి రావణుడు ఈ విశ్వమున బలవంతులైన వారెవరో తెలుపండి, యుద్ధము చేస్తానన్నాడు. ముఖ్యముగా మానవులే ద్వీపమున బలవత్తరులో ఆ లోకమును గూర్చి చెప్పుడనగానే నారదుడు రావణునితో శ్వేతద్వీపమున నేను చాలా బలవంతులైన మనుష్యులను చూచాను. వారు చాలా బలము గలవారు. మంచి కాంతిగలవారు అని చెప్పగా వారు ఆ ద్వీపమున కెట్లు చేరుకొనగలిగిరని మరల ప్రశ్నను వేయగా రావణాసురునితో నారదుడు ఎవరు శ్రీమన్నారాయణుని భక్తితో తచ్చిత్తముతో సేవిస్తారో వారు శ్వేతద్వీపమును చేరుతారు. ఎవరు శ్రీమహావిష్ణువు యొక్క శార్ఙ్గధనుస్సుచే హతులగుదురో వారును శ్వేతద్వీపమును చేరుకొంటారు. తపోయజ్ఞ దానాదుల కంటె కూడా భగవద్ద్వేషముతో భగవంతునితో యుద్ధమొనర్చి హతులైనవారికి శీఘ్రముగా భగవద్దర్శనము, శ్వేతద్వీపనివాసము లభిస్తుంది అని చెప్పాడు.

నారదుని మాటలను విని అయితే నేనా నారాయణునితో యుద్ధము చేస్తానని పలికి రావణుడు శ్వేతద్వీపానికి బయల్దేరాడు. నారదుడు కూడా ఏమి జరుగునో చూతమని శ్వేతద్వీపం చేరాడు. రావణుడు శ్వేతద్వీపమునకు చేరి, ఎవరైనా నాతో యుద్ధము చేయుటకు రండని సింహగర్జన చేయసాగాడు. ఆ శ్వేతద్వీపపు తేజమునకు జడిసి రాక్షసులు వెనుదిరిగారు. పుష్పక విమానము అచటి గాలికి తట్టుకొనలేక నీటిలో గాలితో నావ శిథిలమైనట్లు ఇటునటు పడిపోసాగింది. రాక్షస మంత్రులు మేమిచ్చట ఉండలేమని బాధపడ్డారు. రావణుడు వారి ఆర్తనాదాలను వినలేక వెళ్ళిపొండని పుష్పకమును వదలి తానొక్కడే ఆద్వీపమున దిగాడు. కొంతమంది స్త్రీల దృష్టిలో పడిన రావణుని ఒక స్త్రీ అడిగినది 'ఎవరు నీవు?' అని. రావణుడు "నేనే తెలియనా? విశ్రవసుని పుత్రుడను రావణుడను, యుద్ధము చేయుటకై వచ్చాను". కాని నాకు ఎవరూ కనిపించడం లేదు! అన్నాడు.

ఆ అమ్మాయి రావణుని చేతితో పట్టుకొని చూడవే నాకు ఒక పురుగు దొరికింది. ఇది యుద్ధము చేస్తుందట! ఇరువది భుజాలు, పది తలలున్నాయి దీనికి అన్నది. అని అంటూనే రావణుని గిరగిరా త్రిప్పినది. రావణుడు చేసేదేమి లేక ఆమె చేతిని కఱచినాడు. ఆ అమ్మాయి మరొక అమ్మాయికిచ్చింది రావణుణ్ణి. రావణుడు ఆ అమ్మాయిని కూడా గిల్లినాడు. చేతులతో ఆ అమ్మాయి పురుగును తీసి పారేసినట్టు రావణుని విసిరి వేసినది. రావణుడు సముద్రములో పడ్డాడు. ఈ విధముగా శ్వేతద్వీపములోని స్త్రీలంతా రావణునితో ఆడుకొన్నారు. రావణునికి భయమైంది. ద్వీపములో ఒక ఒడ్డుకు చేరి వీరు చాలా బలవంతులుగా ఉన్నారు. వీరితో సంధి చేసికొనడము మంచిదని నిర్ణయించుకొని ఎవరైనా మరల కనబడుతారేమోనని పరిశీలించుచుండగా ఆ ద్వీపానికి దక్షిణ తీరమున సనత్కుమారమహర్షి కనిపించినాడు. రావణునికి ఆ మహర్షి నాశ్రయించి ఈ ద్వీపమెవరిది? వారెట్టివారు? మీరెవరిని ధ్యానిస్తున్నారు? అని వినయంగా రావణుడు ప్రశ్నించినాడు. అతడు చిరునవ్వుతో నాయనా! ఈ సృష్టి అంతా ఎవరిదో, ఎవరి శ్వాసనుండి వచ్చిన స్త్రీలతో నీవు పరాభవింపబడితివో, ఎవరి కొఱకై యోగులు ధ్యానింతురో, ఆ నారాయణునిదీ ద్వీపమని చాలా విశదముగా వివరించినాడు. రావణుడు ఆసక్తితో ఆ స్వామిని ఏ విధముగా పొందుటకు వీలవుతుంది అని అడిగినాడు. అప్పుడు సనత్కుమారుడు, నాయనా! ఆయన సామాన్యముగా అందరికీ కనిపించడు. దివ్యదృష్టి ఉన్నచో మాత్రమే ఆ స్వామిసందర్శనము జరుగుతుంది. దేవతలందరు ఆ స్వామి స్వరూపులే, గ్రహనక్షత్ర తారకాదులన్నియు ఆ స్వామి స్వరూపమే. 28వ మహాయుగమున ఆ స్వామి భూలోకమున అవతరించినప్పుడు నీకు కనపడతాడులే. ఇంతకు మించి నేను చెప్పగూడదు, నీవు వినకూడదని చెప్పగానే రావణుడు సరేనని అంగీకరించి నమస్కరించి వెనుదిరిగి వెళ్ళినాడు.

నారదుడీ విషయాన్ని అవలోకించి సంతోషించినాడు. ఆ తరువాత బ్రహ్మలోకమునకు వెళ్ళి ఈ విషయమునంతా వివరించినాడు. బ్రహ్మ నారదునికి రావణుని పూర్వజన్మను చెప్పినాడు. ప్రహ్లాదుని రక్షకై అవతరించిన ప్రభువు శ్రీమన్నృసింహస్వామిచే నిహతుడైన హిరణ్యకశిపుడు ప్రస్తుతము రావణుడుగా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు అని బ్రహ్మ నారదునితో అన్నాడు. ఆ నారదుడు బ్రహ్మఅనుజ్ఞనొంది మేరుపర్వత ప్రాంతములలో సంచరిస్తూ మా ఆశ్రమమునకు రాగా నేను అడిగిన ప్రశ్నకు నారదుడు నాకీ విషయమునంతయు చెప్పినాడు. సనత్కుమారుడు కూడా ఒకసారి ఈ విషయమును నాకు చెప్పినాడు. రామా! నీకు గుర్తు రావడము లేదా? నీవే ఆ శ్వేతద్వీపపతివి, నారాయణుడవు. రావణాసురునితో అతి భయంకరంగా యుద్ధం చేసి చివరకు సంహరించితివి. నీ పరాక్రమాదులు అపరిమేయములు అని అగస్త్యుడు అంటూండంగా శ్రీ రాముడు అమాయకముగా మహర్షివైపు చూచుచుండెను. లక్ష్మణ భరత శత్రుఘ్నాదులు, విభీషణ, సుగ్రీవాదులును ఆశ్చర్యపడినారు. ఇంక మేము వెళ్ళి వచ్చెదమని అగస్త్యుడనగానే సరేనని శ్రీరాముడు వారికి తగిన ఆతిథ్యము నీయగా అగస్త్యుడు, ఇతర ఋషులు రాముని ఆశీర్వదించి వెడలారు.

## ముప్పైతొమ్మిదవ సర్గము

కాలము గడుస్తుండగా ప్రజలను చక్కగా పాలించుటకు అన్ని వ్యవస్థలను శ్రీరామచంద్రుడు ఏర్పాటు చేశాడు. ప్రజలు సుఖశాంతులలో తేరుకొన్నారు. ఒక రోజు శ్రీరాముడు జనక మహారాజుతో మేము ఇంతవఱకు

చక్కగా (కన్యాప్రదానము చేత అని గోవిందరాజీయము) మీచే పరిపాలింపబడ్డాము, ధన్యవాదములు. మీకు పనులుంటాయి. మీకు మాకు అనుబంధము శాశ్వతమైనది. మీరు మీ రత్నాలతో బయలుదేరండి. మాభరతుడు సపరివారంగా మిమ్మల్ని దిగబెట్టుతాడు అని అనగానే జనకుడు ఈ రత్నాలు (మేము ఈయదగిన వస్తువులన్ని అని గోవిందరాజీయము) అమ్మాయి కోసమే అని చెప్పి వాటిని సీతమ్మకు పంపించి భరతునితో జనకుడు బయలు దేరుతాడు. ఆ తరువాత రాముడు మేనమామ యుధాజిత్తుతో కూడా మామయ్యా! మీరు సైన్యమును తీసికొని వచ్చి (గోవిందరాజీయ వ్యాఖ్య) యుద్ధమున సహకరించి విజయానికి కారణమైనారు. ధన్యవాదాలు! తాతయ్యగారు (కేకయ మహారాజుగారు) ఎదురు చూస్తూంటారు. భరతుడు, శత్రుఘ్నుడు, లక్ష్మణుడు నేను అంతా మీ అధీనంలో ఉంటాము. లక్ష్మణుడు మీవెంట వస్తాడు. ఇక బయలుదేరవచ్చుననినాడు. వారిని పంపించిన తరువాత శ్రీరామ చంద్రుడు కాశీమహారాజు ప్రతర్దనుని వద్దకు వచ్చి తాము యుద్ధమున సాహాయమొనర్చి చాలా సహకరించినారు (గోవిందరాజీయానుసారము) భరతునితో కలిసి చక్కని ప్రయత్నము చేసినారు. ధన్యవాదములు. ఇంక తాము కూడా బయలుదేరవచ్చును అనినాడు. ఆతనిని కౌగలించుకొని పంపివేసినాడు. ఆ తరువాత శ్రీరాముడు మూడు వందల మంది సామంతరాజులను రప్పించి నాయనలారా! మీరంతా మా మామ జనకమహారాజుగారి ప్రేరణతో వచ్చి ఈ ప్రదేశానికి ప్రజలకు ఏమీ ఉపద్రవము జరగకుండా భరతునికి సహకరించినారు (గోవిందరాజీయాను సారము) మీకు ఎప్పుడు కృతజ్ఞుడను. పాపము చాలా రోజులయినది. సీతను రావణుడు అపహరించినట్లు తెలిసినప్పటి నుండి ఇంతవఱకు ఇక్కడనే ఉండిపోయినారు. చాలాశ్రమపడినారు అని పలికినాడు. దానికి సమాధానముగా వారు స్వామీ! రామా! ఈ విజయానికి కారణమైన నీవే మాకాధారము, ప్రశంసార్హుడవు కాని ఈ విధముగా ప్రశంసచేసే పద్ధతిని (తిలకవ్యాఖ్యానుసారము) మేమెఱుగము. ఈ విధముగా మాట్లాడుట మీకే సాధ్యము. మీ దయ మాపై ఎప్పుడు ఉండాలి. మీరు మా హృదయములో ఎప్పుడు ఉన్నారని చెప్పి అనుజ్ఞ తీసికొని తమ తమ ప్రాంతాలకు వెళ్ళినారు.

## నలభైయవ సర్గము

రాజులంతా వెళ్ళిపోయిన తరువాత అక్షౌహిణి సైనికులందరు శ్రీరామదర్శనార్థమై ఎదురు చూచు చుండినారు. వారందరు భరతుని ఆజ్ఞమేరకు యుద్ధమున శ్రీరాముని పక్షమున రావణునితో యుద్ధం చేయ సంకల్పించియుండినారు. ఆ సైనికులలోని క్షత్రియులందఱు శ్రీరామా! మేమంతా భరతునిచే యుద్ధమునకై రప్పించబడితిమి. కాని మేము వచ్చుసరికి యుద్ధం ముగిసింది. మేము వచ్చుట వ్యర్థమైనదని భావిస్తున్నాము. యుద్ధరంగమున మా ఎదుట రావణుని చూడలేకపోయితిమి. నీకు శ్రమలేకయే ఆ రావణుని మేము వధించియుండెడివారము. వాడు నిన్నెంత కష్టపెట్టినాడు! మాకు విధి అనుకూలముగా లేకుండెను. మేము ఆలస్యముగా రప్పింపబడితిమని వారు వాపోయిరి. ఇచ్చట 'రామ రావణమ్' అను శబ్దమునకు రామునితో హతుడు కావలసిన రావణుని అని ఒకఅర్థము, రామం రావణమ్ అను పాఠానుసారము యుద్ధరంగమున యుద్ధము చేయు రాముని, రావణుని అని అర్థమని శ్రీ గోవిందరాజీయవ్యాఖ్య కాగా, సత్యతీర్థుల వారు రామ రావణమ్ అను శబ్దమునకు ఒకసారి! హా సీతా!హా లక్ష్మణా! అని ఏడిపించిన రావణుని అను అర్థమును చెప్పి, అట్టి రావణుని మాఎదుట చూడలేకపోయితిమి, చూచినచో మేమే వానిని మట్టుపెట్టి యుండెడివారము అను

సైనికుల వచనంగా వ్యాఖ్యానించారు. ఆ విధముగా శ్రీ రామచంద్రుని ముందు తమ బాధను వ్యక్తీకరించి శ్రీరామునికై తెచ్చిన రత్నములను, వివిధ వస్తువులను శ్రీరాముని కర్పించారు. భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు వారితో వెళ్ళి శ్రీరాముని కర్పించిన నగరములను, గ్రామములను, వివిధ వస్తువులను పరిశీలించి స్వాధీనపఱచుకొని వచ్చిరి. వాటి నన్నింటిని కనిపెట్టి యుంచవలసినదని శ్రీరాముడు సుగ్రీవున కప్పగించెను. అదే విధముగా ఇతర వానరులకు, భక్త రాక్షసులకును వానిపై అధికారమునుంచాడు. శ్రీరాముడిచ్చిన కానుకలనా కపి రాక్షసులు శిరసా స్వీకరించి ఆనందించారు. ఆ తరువాత శ్రీరామచంద్రుడు హనుమంతుని, అంగదుని అక్కున చేర్చుకొని సుగ్రీవుని కప్పగించి 'సుగ్రీవా! వీరిద్దరు నీకు, నాకు అన్ని విధాలా కావలసినవారువీరిని ప్రేమతో ఆదరించు'మని చెప్పి వారికి కూడా దివ్యభూషణాదులనర్పించాడు. స్వయంగా వారికి తనచేతులతోనే వాటిని కట్టి, ధరింపజేశాడు. ఆ తరువాత నలనీల సుషేణాది వానరపుంగవుల నందరిని శ్రీరాముడు యథోచితముగా సత్కరించాడు. మీరందరు నాకు సోదరులే, మీవంటి సౌహార్ద పూర్ణ మిత్రుల సాహాయ్యమున నేను విజయము నొందానని శ్రీ రాముడు వారినభినందించాడు. శ్రీరాముడు స్వయంగా వారికాభరణాదుల నలంకరింపజేశాడు. వారు చాలా ఆనందించి మధువుల నాస్వాదిస్తూ వివిధ స్వేష్టాహారముల భుజిస్తూ ఒక మాసము కాలమును హాయిగా సర్వ భోగముల ననుభవిస్తూ గలిపారు. వారికది అంతా ఒక ముహూర్తముగా గడచిపోయింది. ఆ విధంగా ఒక్కొక్క మాసమును గడపుచు సంవత్సరము కాలమచటనే యుండిరని శ్రీరామునికి వసంతఋతువున చైత్రమాసమున, (పుష్యమి నక్షత్రమున గాని సంపత్తార కనుక చిత్రానక్షత్రమున్న పూర్ణిమ రోజునగాని మిత్రతార కనుక) పట్టాభిషేకము జరిగినది కనుక మరల శిశిరఋతువు పూర్తియగు వఱకు అనగా సంవత్సరకాలము వారందరు అయోధ్యలోనే గడిపిరని శ్రీగోవిందరాజీయ వ్యాఖ్య. సత్యతీర్థులవారు మాసము అనగా ఇచ్చట పట్టాభిషేకానంతరము మాసము అని అర్థము కాదు. అందరు రాజులు వెళ్ళిన తరువాత మాసమని అర్థము. కనుక ఒక సంవత్సరమనిమ స్కాందపురాణమున సంవత్సరకాలమని యున్నదని ప్రమాణ పురస్సరముగా వివరించారు. తిలకవ్యాఖ్య కొంచెమీరెండు వ్యాఖ్యలకు భిన్నంగా నున్నది. తీర్థాదులు చెప్పిన వ్యాఖ్యను ఖండించి వారు శ్రీరామునికి ఆశ్వయుజ కృష్ణపక్షమున (ఇది ఉత్తరదేశ సంప్రదాయానుసారము అనగా భాద్రపద కృష్ణ పక్షమున) రావణునితో యుద్ధము జరిగి అమావాస్యనాడు రావణుడు మరణించినాడు. ఆ తరువాత అధికమాసము వచ్చినది. నిజఆశ్వయుజ శుక్ల విజయదశమినాడు (శ్రవణధనిష్ఠలున్న రోజున శ్రీరామునికి మిత్ర తార కనుక నాభావము) గాని అశ్విని నక్షత్రముతో కూడిన ఆశ్వయుజ శుక్ల పూర్ణిమ (శ్రీరామునికి క్షేమ తార అగు రోజున నాభావము) నాడు గాని పట్టాభిషేకము జరిగినది. ఆ తరువాత కార్తిక మార్గశీర్ష పుష్య మాఘ ఫాల్గున మాసములు అయిదారు నెలలు మాత్రమే వారుండిరి. శైశిర ద్వితీయమాసమనగా ఫాల్గునమాసమని తమ అభిప్రాయమును నిరూపించినారు. దీనికి ప్రమాణముగా "సాగ్రాః పంచషడధికా, మాసా గతాః" అని వాక్యమున్నదని సూచించినారు.

## నలబైయొకటవ సర్గము

ఆ తరువాత శ్రీరామచంద్రుడు సుగ్రీవుని పిలిచి హనుమ దంగద సుషేణ నలనీలాది వానరపుంగవుల నప్పగించి చక్కగా వారిని పరిపాలించుచు వారి సేవల ద్వారా రాజ్యపాలనము సేయుమని చెప్పి పంపాడు.

విభీషణుని కూడా పిలిచి కుబేరాది సోదరుల సహకారముతో, సుగ్రీవాది మిత్రులసౌజన్యముతో తనకు సదా సహకరించుచుండుమని తనను తలచుకొనుచుండవలెనని చెప్పి పంపాడు. వారు శ్రీరాముని సాధువాదములచే మెచ్చుకొంటూ శ్రీరామునికి జయకారములను చేస్తూ బయలుదేరారు. ఇంతలో హనుమంతుడు శ్రీరాముని సన్నిధికి వచ్చి స్వామీ! మీయందు నాకు అస్ఖలితమైన భక్తి ఉండాలని, మీ నామము భూమిమీద వినిపించునంత వఱకు నాప్రాణము లుండవలెనని కోరుకొనుచున్నాననగా శ్రీరాముడు కూడా హనుమంతునిపై ప్రేమాతిశయముచే లేచివచ్చి కౌగలించుకొని, నిజము హనుమంతా! నాకథ ఉన్నంత వఱకు నీకీర్తి కూడా ఉంటుంది. లోకములో నీవు చేసిన ఉపకారాలకు ఒక్కొక్కదానికి నాప్రాణముల నీయవలసినదే. మనము ఒకరికొకరు ఋణగ్రస్తులము, నాఅవయవాలలో కూడా నీ ఉపకార భావములు నిండిపోవాలి. ఆపదలు కలిగినప్పుడే మనిషికి ఉపకారము చేయుటకు ఒక సదవకాశము సత్పాత్రత్వము (యోగ్యత) ఏర్పడుతుంది అని చెప్పి ఒక వైదూర్యహారాన్ని చంద్రహారాన్ని తన మెడలో నుంచి తీసి హనుమంతునికి అలంకరించాడు. ఆ ఘటనను చూచి సుగ్రీవ విభీషణాదులందరును చాల ఆనందించారు. ఆ వానరులు రాక్షసులు శ్రీరామచంద్రునే తలచుకొంటూ కన్నీరు నింపుకొంటూ వియోగబాధను దిగమ్రింగు కొంటూ కదలినారు. ఈ విధంగా రాక్షసవానరులను శ్రీ రాముడు పంపివేశాడు. పట్టాభిషేకం కాగానే కపిరాక్షసుల నందరిని పంపివేసి యుండెనని చెప్పి మరల సంవత్సరం కాలమున కిప్పుడు పంపివేసెనని చెప్పుట ఎట్లు సబబు? వారు మరల అయోధ్యకు వచ్చినట్లు చెప్పలేదు కదా! అను ప్రశ్నకు సమాధానముగా మణిముకుటమున (గోవిందరాజీయమున) పట్టాభిషేకానంతరము అని అంటే ఈ సంవత్సరకాలానంతరమే కాని వేరొక అర్థము కాదని చెప్పబడింది.

## నలబైరెండవ సర్గము

పట్టాభిషేకమయిన కొద్దిరోజులకు ఒకనాడు ఆకాశమునుంచి పుష్పక విమానము వచ్చి. స్వామీ! నేను కుబేరునిచే పంపబడితిని. రావణుని సంహరించి లోకమునకుపకార మొనర్చితివి,మా స్వామి కుబేరుడు ఇకపైన శ్రీరాముని వహింపుము. (అతనికి వాహనముగా) అతని అదుపు ఆజ్ఞలలో నుండుమని ఆదేశించాడు. నన్ను అనుగ్రహింపుమని కోరింది. శ్రీరాముడు కుబేరుని కృప ఉన్నచో కావలసినదేమి,ధన్యుడను అవసరమైనపుడు పయోగపడుమన్నాడు. ఈ విషయం పట్టాభిషేకమైన తరువాత నెలన్నరకే జరిగినది. (కాని సంవత్సర కాలానంతరము వానర రాక్షసులు వెడలిపోయిన తరువాత వాల్మీకిచే ఇప్పుడు ప్రస్తావింపబడినదని గోవిందరాజీయము)

ఆ తరువాత ప్రజలకు ఆయుష్షు పెరిగినదని అందఱు ఆరోగ్యముగా ఉన్నారని ఎవరి వలన కూడా ఎవరికి కూడా కష్టనష్ట బాధలుండుట లేదని ప్రజలు అనుకొనుచున్నారని భరతుడు పర్యవేక్షించి వచ్చి (సంవత్సరానంతరము రాక్షసవానరులు వెడలిపోయిన తరువాత కొంతకాలమునకు) శ్రీరామునితో చెప్పాడు. అది విని శ్రీరాముడు కూడా చాలా ఆనందించాడు.

## నలబైమూడవ సర్గము

శ్రీరాముడు కొన్నాళ్ళకు పుష్పక విమానమును కూడా లంకకు పంపించినాడు. అయోధ్యలోనే లంకలోని సుందరమైన అశోకవనానికి గుర్తుగా ఒక అశోకవనికను సిద్ధపఱచినాడు (గోవిందరాజీయాను సారము) అచట

అనేకములైన దివ్యమానవవృక్షాలను పెంపింపజేసినాడు. చిన్నచిన్న సరస్సులు, పక్షులు, లతలు, మృగాలు ఆ అశోకవనికను చూడముచ్చటగా చేయుచుండినవి. పచ్చిక బయళ్ళు, చక్కని పాలరాతి వేదికలు, శయనతలాలు ఆసనాలు కూడా అచట అలంకరింపబడినాయి. ఆ అశోకవనికలో సీతతో పాటు రోజు శ్రీరాముడు విహరించేవాడు. సీతతో పాటు ఒకవిధమైన ఆసవమును, మైరేయకమును త్రాగుచుండెడివాడు. వైజయంతీకోశము ననుసరించి మైరేయకమనగా ఉసిరి బెల్లములతో సిద్ధపఅచిన పానీయమని గోవిందరాజీయము. అట్లే వివిధ ఆహారపానీయములు సీతారాములకు ఆ వనికలోనే అమర్చబడుచుండేవి. ఆ చల్లని శిశిరఋతువు కూడా హాయిగా గడిచింది. శ్రీరాముని పట్టాభిషేకానంతరము వానరులతో, రాక్షసులతో కలిసి ఒక సంవత్సరము గడచినది. పుష్పక విమానమును పంపిన తరువాత సీతారాములవిహారముతో ఒక సంవత్సరము గడచినదని గోవిందరాజీయము. శ్రీసీతారాములు ఉదయము ధర్మకార్యములను నిర్వహించుచుండెడివారు. అనగా శ్రీరాముడు దేవకార్యములను పూజా యజ్ఞాదికములను ప్రజాసేవాకార్యములను నిర్వహించుచుండెడివాడు. సీత భర్తతో పాటు పూజాయజ్ఞములను నిర్వహించుచునే ముగ్గురత్తలను కూడా సేవిస్తూండేది. ఒకరోజు సీత శుభలక్షణములను వేవిళ్ళను గమనించి శ్రీరాముడు సీతా! మనకు సంతానయోగము సంభవిస్తున్నది (నీవు గర్భవతివి) సుఖముగా సంతోషముగా ఉండాలి. ఇప్పుడు నీవేమి కోరుకొంటున్నావో ఏమి కావాలను కొంటున్నావో? చెప్పు తప్పక తీరుస్తానన్నాడు. సంకోచింప వద్దన్నాడు. సీత చాలా ఆనందించి చిఱునవ్వుతో స్వామీ! మీరంగీకరిస్తే ఒకరోజైనా మునుల ఆశ్రమాలలో కందమూలా ద్యాహారాలను వారితో పాటు తీసికొంటూ కాలం గడపాలని ఉందనినది. దేవీ! తప్పక నీకోరిక నెఱవేరుతుంది. రేపే నీప్రయాణానికి ఏర్పాట్లు చేస్తానన్నాడు. ఆ తరువాత మిత్రులతో కలిసి బయటికి వెళ్ళినాడు శ్రీరాముడు.

## నలబైనాల్గవ సర్గము

ఒకరోజు శ్రీరాముడు మిత్రులు, పరిహాసకులు, వేగులు, గూఢచరులు అందరితో సమావిష్టుడై వారిని అడిగినాడు "ప్రజలేమనుకొంటున్నారు? వారు మంచి అనుకొంటే ఆ పనులను పెంచవచ్చు, చెడు అనుకొంటే వాటిని మానవచ్చును!" అని. శ్రీరాముని మాటలను విని అందఱు ముక్తకంఠంగా బాగానే అనుకొంటున్నారని అన్నారు. రాముడు మరల స్పష్టీకరించి మంచి మాత్రమే కాదు చెడు కూడా చెప్పాలి. నన్ను గుఱించిగాని. లక్ష్మణుని గుఱించిగాని, సీతను గుఱించిగాని ఎవరిని గుఱించి అని సంకోచించవద్దు. స్పష్టంగా చెప్పండి అని అంటూ ఏమి భద్రా! చెప్పు నీవు అని భద్రుని అడిగినాడు. అప్పుడు భద్రుడనువాడు అన్నాడు "స్వామీ? అంతా బాగానే చెప్పుకొంటున్నారు! రాముడు రావణుని సంహరించినాడు మన రామునికి, వానరులు, రాక్షసులు, ఎలుగుబంట్లు అందరు స్వాధీనమైనారు అని కొందరన్నారు. కొందఱు మాత్రము రావణుని ఇంటిలో సంవత్సర కాలము పాటు ఉన్న సీతను రాముడు ఏమాత్రము సంకోచించకుండా తెచ్చుకొన్నాడు? మనము కూడా పరగృహములో ఉన్న మనభార్యలను కూడా ఏమాత్రము అనుమానించకుండా తీసికొనిరావాలా? ఎందుకు రాముడు సీతను శంకించకుండా తోడితెచ్చుకొన్నాడు అని కూడా కొందఱన్నారు" అన్నాడు. భద్రుని మాటలను విని శ్రీరాముడు కొంచెం ఖంగుతిని నిజమేనా! ఇలా అనుకొంటున్నారా! అని అడుగగా నిజమేనన్నారు వారు. భద్రుని మాత్రముంచి మిగతావారిని పంపివేసినాడు రాముడు (గోవిందరాజీయానుసారము)

## నలభైయైదవ సర్గము

అందఱు వెళ్ళిన తరువాత శ్రీరాముడు ద్వారపాలకుని పిలిచి సోదరులను రమ్మని కబురు చేసినాడు. ఆ ద్వారపాలకుడు వెళ్ళి ముందు లక్ష్మణుని ఆ తరువాత భరత శత్రుఘ్నులను పిలిచుకొనివచ్చినాడు. శ్రీరాముడు హఠాత్తుగా పిలుచుటకు కారణమేమో తెలియక సోదరులంతా కంగారు పడుతున్నారు. ద్వారపాలకుడు సోదరులు వచ్చినట్లు చెప్పగానే వీరే నాకు ప్రాణాలు, వీరి మీదనే నాజీవనమాధారపడి ఉన్నదని పలికి దుఃఖాన్ని దిగమ్రింగుకొంటూ లోనికి రమ్మని చెప్పుమన్నాడు. శ్రీరాముని మాటలను విని వారిని లోనికి రావించినాడు ద్వారపాలకుడు. వారు బద్ధాంజలులై లోనికి వచ్చి గంభీరమై రాహుగ్రస్తమైన చంద్రునివలె, సాయం సంధ్యాసమయపు సూర్యునివలె ఉన్న రాముని చూచినారు. వారిని చూడగానే శ్రీరాముని నేత్రములనుండి బాష్పాలు జాలు వారినవి. ఇదేమిటని అడుగబోతుండగానే వారిని కౌగలించుకొని "కూర్చొండి! మీరే నాకు ప్రాణాలు. మీరు ఏర్పాటు చేసిన రాజ్యాన్ని పాలిస్తున్నాను. మీరు అన్ని శస్త్రాస్త్రాలు తెలిసినవారు. నాకోసము నాపనిని సాధించిపెట్టాలి". అని ఏవేవో అసంబద్ధముగా శ్రీరాముడు ఏడుస్తూ మాటలాడసాగాడు. ఆ సోదరులకు లక్ష్మణభరతశత్రుఘ్నులకు అన్న ఏమంటున్నాడో తెలియలేదు, ఏమి చెబుతాడో కూడా తెలియలేదు.

## నలభైయారవ సర్గము

కొద్దిసేపటికి శ్రీరాముడు వారితో ఈ విధముగా అన్నాడు. నాయనలారా! జాగ్రత్తగా వినండి. నానిర్ణయాన్ని కూడా జాగ్రత్తగా విచారించండి. నాసంకల్పానికి విరుద్ధంగా ఆలోచించకండి! సీత విషయంలో ప్రజల అభిప్రాయాన్ని వినండి. ప్రజలు, జానపదులు సీత విషయంలో వేరుగా ఆలోచిస్తున్నారు. మీకు తెలుసుకదా! నేనెట్లా ప్రవర్తిస్తున్నానో ప్రవర్తిస్తానో, సీతకూడా ఉత్తమవంశంలో పుట్టింది. మహాత్ములైన జనకుల ఇంట మంచి సంప్రదాయంలో పెరిగింది. ఆమె మీద వచ్చి పడిన అపవాదము వినేసరికి నామనస్సులో చెప్పరాని బాధ, తట్టుకోలేకపోతున్నాను. లక్ష్మణా! మిగతావారికి తెలియదు కాని నీకు తెలుసుకదా! ముగ్గురు ఏకాంతంగా ఉన్నప్పటికి లక్ష్మణునికే అన్ని విషయములు ప్రత్యక్షంగా తెలుసునని లక్ష్మణుని సంబోధించడమని సత్యతీర్థుల వ్యాఖ్య. దండకారణ్యంలో మనమున్నప్పుడు రావణుడు అపహరించాడు సీతను, మనను మోసగించాడు. రావణసంహారానంతరము నాకనిపించింది. రావణుని ఇంటిలో ఉన్న సీతను జనము ఏమనుకొంటారో! వారికి సీత స్వచ్ఛత తెలియదు కదా! అందుకే నా వెంటరావడానికి నిరాకరించాను. ఇంతలో సీత తన సతీత్వాన్ని, పరపురుష సాంగత్యరాహిత్యాన్ని అగ్నిలో ప్రవేశించి నిరూపించుకొంది. అగ్నిదేవుడు, వాయువు సీతను పాపరహితనుగా పరపురుషసంగరహితనుగా నిర్ధారించినారు అని అంటూ రాముడు రోదిస్తూనే మాటలాడసాగాడు. "లక్ష్మణా! అప్పుడు నీకు తెలుసు. దేవతలందఱు సీత పవిత్రచరిత్రను తెలిపినారు. దేవగంధర్వ సన్నిధిలో ఇంద్రుడు స్వయముగా శుద్ధురాలని సీతను నాచేతిలో మరల ఉంచి తీసికొని వెళ్ళుమన్నారు. సీత విషయంలో నేనింకా ఏమి చేయాలి? ఆమె శుద్ధతను ఎలా ప్రకటించాలి? ఈ అమాయక ప్రజలకు ఆమె స్వచ్ఛత తెలియదు. అపకీర్తిని సీతకు కలిగిస్తూ నేను అపకీర్తిని పొందుతూ ఎన్నాళ్ళు ఉండగలుగుతాను? ఎలా ప్రజలతో సర్దుకోగలుగుతాను? అపకీర్తి ఎంత కాలం భూమి మీద ఉంటుందో అంతకాలము మనిషి పతితుడౌతాడు. దేవతలు కూడా ఆ మనిషిని నిందిస్తారు. ఏమి జరుగనున్నదో అది జరుగుతుంది. అపవాదభయానికే నేను

భయపడుతున్నాను. ప్రాణాలనైనా నాజీవితాన్నైనా మిమ్మల్నైనా వదలేస్తాను. అపవాదభయం కారణంగా, ఇక జనకాత్మజ సీతను వదలడం నాకు కష్టంకాదు.” ఆ మాటలు విన్న సోదరులేమో చెప్పబోయారు. వెంటనే ధైర్యాన్ని తెచ్చుకొని రాముడు అన్నాడు. ఇచ్చట సత్యతీర్థులవారి వ్యాఖ్యానము. మీరు పురుషర్షభులు, పురుషశ్రేష్ఠులు ప్రజల అభిమతమునకై సర్వమును వదలగల్గుతారు. ఇచ్చట ‘అపవాద భయాద్ భీతః’ అని అంటే నేను అపవాదము వచ్చిందని భయపడుతానని అర్థముకాదు. అపవాదభయమును వ్యాప్తి చేసే వారివలన భయపడుతున్నాను, నేనెంత చెప్పినా ప్రజలు అపవాదమును వ్యాప్తి చేస్తూనే ఉంటారు. క్షత్రియులకు శపథము చేసేటప్పుడు ఒట్టు పెట్టుకొనేటప్పుడు ఆయుధములు చేతులలో ఉండాలి. అయితే శ్రీరామచంద్రుడు విల్లు బాణములను ధరించుటకు చేతులు అవసరము కనుక చేతులనే ఆయుధముగా భావించి మరల అన్నాడు. “నాయనలారా! దయచేసి నామాటకు వ్యతిరేకము పలుకవద్దు. లక్ష్మణా! సీతను మన కోసలరాజ్యపుసరిహద్దు దాటించి అంటే గంగానది ఆవలి ఒడ్డున వాల్మీకి ఆశ్రమము వద్ద ఎవరూ చూడకుండా వదలి రావాలి. అందరికి ముందే తెలియవద్దు. తెలిస్తే విశ్వసించేవారికి, విశ్వసించనివారికి విరోధము ఏర్పడుతుంది. అశాంతి ఏర్పడుతుంది. దేశంలో కలతలేర్పడతాయి. అనుభవించవలసిన కష్టాన్ని, దీనికి కారణమైన సీత, నేను అనుభవిస్తాము. దయచేసి ఎదురు మాట్లాడవద్దు. నేను బాగానే ఆలోచించి నిర్ణయాన్ని తీసికొన్నాను. ప్రజారంజనకు మరొక మార్గము లేదు. వారు అమాయకులు సీతస్వచ్ఛతను తెలిసికోలేరు. దానికి ప్రాయశ్చిత్తమును సీత, నేను వియోగాన్ని భరిస్తూ చేసుకోవాలి. సీతకు కూడా ఈ విషయం అపవాద విషయం చెప్పవద్దు. సీత గర్భవతి. వనములో ఋషుల సాంగత్యాన్ని, సాన్నిధ్యాన్ని కోరింది. గర్భవతిగా ఆమె దుఃఖాన్ని అనుభవించరాదు. వాల్మీకి ఆశ్రమ ప్రాంగణములో ఆమెకు ఏమీ కష్టము రాదని నాకు విశ్వాసము. ఆమె కష్టాన్ని గమనించి ప్రజలు వాస్తవాన్ని తెలిసికొంటారు. వారిలో బుద్ధిభేదం రానీయకూడదు. వారు ఏమనుకొంటే దానిననుసరించాలి ప్రజానాయకుడు. నామాటను ఎదిరిస్తే నాకు మీకు చాలా ఇబ్బంది, అప్రీతి కలుగుతుంది”. అని గంభీరంగా శాసించి ఇంక మాటలాడలేక రోదిస్తూ వారిని వదలి తనభవనం లోనికి వెళ్ళాడు శ్రీరాముడు.

## నలభైయేడవ సర్గము

రాత్రి ఎలాగో గడచింది. లక్ష్మణుడు తెల్లవారగానే ప్రయాణానికి సిద్ధమైనాడు. ‘సుమంత్రా! రథాన్ని సిద్ధపఱచు, సీతమ్మగారిని ఋషుల ఆశ్రమాలకు తీసికొని వెళ్ళాలి’ అన్నాడు. లోలోపల బాధను దిగమ్రింగుకొంటూనే – సీతమ్మ భవనానికి చేరుకొని ‘అమ్మా వదినా! అన్నగారు నిన్ను ఆశ్రమాలను, గంగను చూడడానికై ఏర్పాటు చేసినారు. వెంటనే బయల్దేరాలి’ అన్నాడు. ఆనందపారవశ్యంలో సీత అంగీకరించి ధనాలను, వస్త్రాలను, మణులను తీసికొని వెళ్తాను. ఋషులకు అర్పిస్తాను అన్నది. లక్ష్మణుడు సరేనని అన్నాడు. సీత ఆభరణాలు, వస్త్రాలు, మణులు దొంతరులుగా పేర్చుకొని అన్ని సిద్ధం చేసుకొని రథాన్ని ఆరోహించింది. ఆ తొందరలో రామునితో గాని, అత్తగార్లతో గాని చెప్పాలని స్ఫురించలేదు. రథమెక్కింది. ఏదో లోటు జరిగినట్లు అశుభశకునాలు స్ఫురించాయి. లక్ష్మణా! ఇవేమి? అని అడిగింది. అంతా శివమే శుభమే అన్నాడు. రథం సాగింది. గోమతీనదీతీరంలో ఉన్న ఆశ్రమసమీపానికి చేరుకొన్నారు. త్రోవలో లక్ష్మణునికి ఏడుపు ఆగలేదు.ఇదేమిటని సీత అడిగింది. ఏమీమాటలాడక పోయాడు. ఏం నాయనా! నేను చాలారోజులనుండి కోరుకొంటున్న కోరికనే శ్రీరాముడు తీర్చుతున్నాడు. దుఃఖపడకు. నేను మాత్రముంటానా రాముని విడిచి? ఒకటి రెండు రోజులుండి వస్తాను అని సీత ఓదార్చింది. అమ్మా! భాగీరథీ

వచ్చింది. ఈ నీటిని శివుడు కూడా ధరిస్తాడు. నీళ్ళు చల్లుకొంటాను. గుఱ్ఱాలు కూడా కొంత విశ్రాంతి తీసికొంటాయి అని అన్నాడు. అలాగే చేసి కొద్దికాలం విశ్రాంతి అయిన పిమ్మట గంగను దాటించి సీతను వదలాలి. లక్ష్మణుడు దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. వదినా! నేను ఏమిచేస్తున్నానో తెలియడంలేదు. ఇది రామాజ్ఞ అంటూ మళ్ళీ ఏడవడం ప్రారంభించాడు. సీత మళ్ళీ లక్ష్మణుని ఓదార్చింది. నాకు కూడా ఎక్కువ కాలం ఇక్కడ ఉండాలని లేదు తొందరగానే వస్తాము కదా అన్నది అమాయకంగా. లక్ష్మణుడు గంగదాటాలి కదమ్మా అన్నాడు. నావికులు నావలను సిద్ధపఱచారు. సీతమ్మ నావనెక్కింది. ఆభరణమణివస్త్రాదులను ఎక్కించారు నావికులు. లక్ష్మణుడు కూడా నావనెక్కినాడు గంగను దాటారు.

## నలభైయెనిమిదవ సర్గము

సీతను నావతో దాటించి నావికులను వెళ్ళి రమ్మని చెప్పి సుమంత్రుని ఆగుమని చెప్పి లక్ష్మణుడు కొంచెము దూరము లోనికి తీసికెళ్ళాడు, దుఃఖాన్ని ఆపుకొనలేక భోరున ఏడవడం ప్రారంభించాడు. అమ్మా వైదేహి! వదినా! నేను శ్రీరాముని ఆజ్ఞను ఎలా పాటించాలో నాకర్థము కావటంలేదు, నేనీ పనిని చేసి ఇంతటి దుష్కార్యమును చేసినాడు అనే మాటను పడుటకంటే మరణించడం మేలు, నిజానికి ఇలాంటి ఆజ్ఞను రాముడు నాకీయకూడదని, రాముడు కూడా ఇలాంటి నిందను పడకూడదని అప్రయత్నంగా ఏడవసాగాడు. సీతకు విషయమేమీ స్పష్టముగా తెలియదు. ఇదేమి లక్ష్మణా! నాకేమీ తెలియడంలేదు. నీమనస్సు ఏమి బాగులేదు, నీవు ఏమి అంటున్నావో స్పష్టముగా చెప్పు అన్నది. లక్ష్మణుడు ఏమీ చెప్పలేక వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించాడు. లక్ష్మణా! ఆజ్ఞాపిస్తున్నాను. చెప్పు, లేకపోతే నామీద ఒట్టే అని అన్నది సీత. సీతచే ఆజ్ఞాపింపబడిన లక్ష్మణుడు శ్రీరాముని చేతనే ఆజ్ఞాపింపబడి నట్లుగా ఒట్టు పెట్టుకొనినట్లుగా (గోవిందరాజీయము) భావించి. అమ్మా గూఢచారుల సభలో శ్రీరాముడు నీపట్ల ప్రజలకు కలిగిన భావాన్ని, నీమీద వచ్చిపడిన అపనిందను విన్నాడు, ఏమి విన్నాడో ప్రజలేమన్నారో మాకు రాముడు స్పష్టముగా చెప్పలేదు, లోపల కుమిలిపోయి నిర్దోషి అయిన నిన్ను మునుల ఆశ్రమాలలో వదలి రమ్మన్నాడు. (ఆశ్రమాలలో అని అనుట ఒకచోటు ఉండరాదని సూచించుచున్నదని సత్యతీర్థుల వ్యాఖ్య.) నీవు గర్భవతివి, నీ ఎదురుగుండా చెప్పకూడని ఎన్నో విషయాలను చెప్పలేనని (గోవిందరాజీయము) లక్ష్మణుడు చెప్పుతూ. అమ్మా నీవు ఏమాత్రము చింతించకు, కాలమే అన్నిటిని పరిష్కరిస్తుంది. మునుల ఆశ్రమాలలో నీవు జాగ్రత్తగా ఉంటావు. నీవు ఏ అఘాయిత్యము తలపెట్టరాదు. ఇది రామాజ్ఞ. ఈ ప్రదేశము చాలా రమణీయముగా ఉన్నది. ఇది వాల్మీకి మహర్షి ఆశ్రమము. మానాన్నగారికి వారు చాలాఇష్టమైన వారు, మానాన్నగారి స్వభావమునకు అనుకూలమైన స్వభావము గలవారు, (నా వ్యాఖ్య) సఖులు, పరమదయాస్వభావులు (గోవిందరాజీయము) దశరథుని దయకు పాత్రులైనవారు (సత్యతీర్థులవ్యాఖ్య) రాజు గనుక మానాన్నగారు ఆ విధముగా వాల్మీకిని చూచేవారు. నీవు ఇచట ఉండు. నీవు జనకాత్మజవు. చెప్పవలసిన అవసరమేమీ లేదు. నీవు జ్ఞానవతివి, పతివ్రతాధర్మాన్ని, గర్భిణీధర్మాన్ని ఆశ్రయించి ప్రస్తుతము శ్రీరాముని గుఱించిగాని, రాజధర్మాన్ని గుఱించి గాని ఆలోచించుకొంటూ దుఃఖపడవద్దు. గర్భవతివి కనుక లోపల ఉన్న సంతానము పట్ల శ్రద్ధ వహించాలి. అన్ని కష్టాలను దిగమ్రింగుకోవాలి. ప్రశాంతంగా ఉండు. నీకు మేలు కలుగుతుంది అని ఓదార్చాడు లక్ష్మణుడు సీతను.

## నలభైతొమ్మిదవ సర్గము

లక్ష్మణుని పలికిన మాటలు విని సీత కొద్దిసేపు మూర్ఛిల్లింది. మెలకువ వచ్చిన తరువాత కన్నీటితో నిండిన కళ్ళతో అన్నది. లక్ష్మణా! ఈ నాశరీరం కష్టాల కోసమే పుట్టింది. బ్రహ్మదేవుడు అందుకోసమే సృష్టించాడు. నేను ఏమి పాపము చేసికొన్నానో తెలియదు. నేను, నాభర్త శ్రీరాముడు పరస్పరము వియోగాన్ని, పొందవలసి వస్తోంది. నేను శుద్ధురాలనని తెలిసినా శ్రీరాముడు నన్ను వదలవలసి వస్తోంది. ఏమి చేయుదును? అయితే ఎందుకు వచ్చావు అడవికి ఒక్కతెవి అని అడిగితే ఏమి చెప్పాలి? సత్యతీర్థుల వ్యాఖ్య. నేను విజనీకృతురాలనైనాను. ఎంతోమంది ఇష్టజనులున్నా లేనిదానినైనాను (గోవిందరాజీయము) రక్షకులు, సంరక్షకులు, భర్త దగ్గరలేని దానినైనాను (సత్యతీర్థ వ్యాఖ్య) నేనిప్పుడే ఈ శరీరాన్ని వదలను, ఎందుకంటే నాకారణముగా రాజవంశము లేనిదౌతుంది, శ్రీరామునికి మాత్రమే దుఃఖము మిగులుతుంది, రామునికి స్త్రీహత్య, భ్రూణహత్య పాపము వస్తుంది. ప్రసవానంతరము ఎప్పుడో ఈ శరీరత్యాగము నిశ్చితమే (గోవిందరాజీయము) అయితే ప్రభో! నేనేమి పాపము చేసితిని, శ్రీరామా! ఎందుకీ పని చేశావు! (సత్యతీర్థుల వ్యాఖ్య) సరే లక్ష్మణా! నీవు ఆజ్ఞను అనుష్ఠించావు. జాగ్రత్తగా వెళ్ళు. నేను క్షేమంగానే ఉన్నానని చెప్పు. అత్తగార్లందరికి ప్రణామాంజలి. ధర్మకార్యతత్పరుడైన మీ అన్నతో చెప్పు లక్ష్మణా! నేను ఎలాంటిదాననో ఆయనకు తెలుసు, ఆయనపట్ల భక్తి కలదాననై ఆయనహితాన్నే కోరుకొంటూంటాను. ఆయనకు అపవాదము రాకుండడాన్నే నేను కోరుతున్నాను. యథాశక్తిగా ఆయనకు కళంకము రాకుండా నన్ను నేను కాపాడుకొంటాను. ఆయన ధర్మమును నేను రక్షించాలి. ధర్మము కంటే ఎక్కువగా ఆయన కీర్తిని నేను కాపాడాలి. నాశరీరము ఏమైనా ఫరవాలేదు. పరాపవాదం లేకుండా బ్రతుకుటయే నాజీవితానికి పరమార్థం. నాకు పతికంటె వేఱు దేవత, బంధువు గురువు ఎవరు లేరు. నామాటగా శ్రీరాముని జాగ్రత్తగా ఉండుమని చెప్పింది, సీతాదేవి. చివరగా అన్నది 'లక్ష్మణా! గర్భవతిని వదలి వెళ్తావా?' అని. లక్ష్మణుడు వెంటనే అన్నాడు తల్లీ! నీవు నాస్వభావము నెఱుగవా! నీ పాదములను తప్ప నీరూపమును నేనెఱుగను. ఎవరు లేకుండా, అన్న లేకుండా నేను నీతో ఎలా ఉండగలను! భగవంతుడే నీకు రక్ష అని పాదాలకు నమస్కరించి లక్ష్మణుడు బయల్దేరినాడు. గంగను దాటి రథము ఎక్కేవఱకు మాటిమాటికి సీతను చూస్తూనే ఉన్నాడు. సీతకూడా మఱదిని ధర్మదయార్ద్ర దృష్టితో చూస్తూ ఉండిపోయింది. లక్ష్మణుడు కనపడకపోయేసరికి ఆ వాల్మీక్యాశ్రమములో ఒంటరిదై దుఃఖము పొంగిరాగా భోరున ఏడవడ మారంభించింది.

## యాభైయవ సర్గము

సీత విలాపాన్ని విని, కొంతమంది మునిబాలకులు ఆమెను చూచి వాల్మీకి మహర్షి వద్దకు పరుగెత్తుకొని వెళ్ళి విషయాన్ని వివరించారు. వాల్మీకి ఉగ్రధీః అంటే తపస్సున తీవ్రమైన నిష్ఠగలవాడు (సత్యతీర్థుల వ్యాఖ్య) అని అర్థము. తాము చూచింది యథార్థమా కాదా? అను విషయము వాల్మీకికి నివేదిస్తే అసత్యత్వభ్రమదోషాలు తొలగుతాయని (సత్యతీర్థుల వ్యాఖ్య) వారలా నివేదించారు. స్వామీ భగవన్ సర్వజ్ఞా! గంగానది ఒడ్డున ఎవరో ఒక అమ్మగారు విలపిస్తున్నారు. ఆమె సాక్షాత్తు లక్ష్మీ అమ్మవారిలా ఉన్నారు. ఆకాశము నుంచి పడిన దేవతేమో అని

అనిపిస్తోంది. ఏడుస్తోంది, ఏమి కారణమో తెలియదు. ఈ ఆశ్రమాన్ని శరణువేడుకొంటున్నదో ఏమో! మీరే రక్షించాలి అని. ఆ మాటలను వినగానే వాల్మీకి మహర్షి ధర్మజ్ఞుడు కనుక అర్ఘ్యపాద్యాదులను తీసికొని పరుగెత్తాడు, మహర్షి వెంట శిష్యులూ బయల్దేరి జాహ్నవీతీరానికి చేరుకొన్నారు. మహర్షి ఆమెను సేదతీర్చి తల్లీ! నీవెవరో నాకు తెలుసు. దశరథుని కోడలివి. శ్రీరామపత్నివి. జనకపుత్రివి. తెలుసునమ్మా రా. భయపడకు, నీవెందుకు వచ్చావో కారణము తెలుసు (గోవిందరాజీయము) నీవు శుద్ధురాలవు, అపాపవు, పరపురుష సంగరహితవని నాకు తెలుసును. నేను దివ్యదృష్టితో అంతా తెలుసుకొన్నాను. మా ఆశ్రమంలో ఎలా ఉండడమని సందేహించకు. ఇప్పటికే ఒక అపవాదము వచ్చిందని శోకించకు (సత్యతీర్థుల వ్యాఖ్య), ఆశ్రమానికి దగ్గఱలోనే కొంతమంది తాపస స్త్రీలు ఉన్నారు. వారు నిన్ను కన్నబిడ్డను చూచినట్టుగా చూస్తారు. బెంగపెట్టుకోకు. స్వంత ఇల్లని భావించు, నీకిక్కడ ఏమి ఇబ్బందులుండవని మహర్షి పలికిన మాటలు విని సీత చాలా శాంతించింది. సరేనని ఒప్పుకొని ఆయన పాదాలకు నమస్కరించింది. మహర్షి వెన్నంటి బయల్దేరింది. మహర్షి వస్తున్నట్లు విని తాపస స్త్రీలు ఎదురువచ్చి స్వాగతం చెప్పారు. మీకోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. సీతను ఓదార్చడం కొంచెము ఆలస్యానికి కారణమని (గోవిందరాజీయము) వారు గ్రహించారు. మీరేమి ఆజ్ఞాపిస్తే మేము చేయడానికి సిద్ధంగా ఉన్నామని. వారి మాటలను విన్న వాల్మీకి “ఈమె సీత శ్రీరామపత్ని, దశరథ మహారాజుగారి కోడలు, జనకమహారాజు కూతురు. ఏ దోషము చేయకుండానే అపవాదాన్ని పొందింది. అపవాదము కారణముగా భర్తచే వదలబడింది. కాబట్టి మీరు ఈ అమ్మాయిని ప్రేమతో చూచుకొండి. ఈమెకు ఏమాత్రము ఇబ్బంది జరుగకుండా నామీద నామాటమీద గౌరవముతో వ్యవహరించండి” అని ఆ తాపసస్త్రీలతో వాల్మీకి చెప్పి ఆమెను వారి చేతిలో పెట్టి తన ఆశ్రమానికి శిష్యులతో కలిసి వెళ్ళి పోయాడు.

## యాభైయొకటవ సర్గము

సీతను ఆశ్రమమున వదలి గంగను దాటి సుమంత్రుని చేరుకొని రథమున కూర్చొనిన లక్ష్మణునికి సుమంత్రుని చూచిన తరువాత దుఃఖమాగలేదు. సారథీ సుమంత్రా! శ్రీరామునికి ఎంత కష్టము వచ్చి పడినది! సీత శుద్ధురాలని తెలిసికూడా అడవిలో వదలవలసి వచ్చినది. నిజంగా ఇది జన్మాంతరదోషమై ఉంటుంది. (గోవిందరాజీయ వ్యాఖ్య) దుర్దైవాన్ని అనుభవించవలసిందే తప్ప నిరాకరించుటకు వీలు కాదు కదా! ఎంతమందినో రాక్షసులను సంహరించిన రామునికి కూడా ఈ కష్టము అనివార్యమై పోయినది. ముందేమో 14 సంవత్సరాలు అరణ్యవాసము చేయవలసి వచ్చింది. ఇప్పుడేమో సీతను వదలవలసిరావడము. రామునికి ఇది ఎంత నృశంసము (క్రూరకృత్యము అని గోవిందరాజీయవ్యాఖ్య) ధర్మాధారమైన ఒకవ్యక్తి జనాపవాదము కారణముగా ఇంతటి ఘోరమును అపకీర్తికరమైన ధర్మపత్నీ త్యాగరూప కార్యమును చేయదగునా! అని విలపించసాగాడు. సుమంత్రుడు లక్ష్మణునోదార్చి, ఇట్లన్నాడు నాయనా! ఈ విషయము శాస్త్రదృష్టమే. శ్రీరామునికి ప్రియజనముతో వియోగము సంభవించునని, రాముడు ఎప్పుడు కష్టములనే అనుభవిస్తాడని, భరతశత్రుఘ్నులను నిన్ను సీతను కూడా వదిలేస్తాడని ముందే మీనాన్నగారి వద్ద పెద్దలు మాట్లాడుకొన్నారు. మహాజనుల సన్నిధిలో (అంటే వసిష్ఠమహర్షి సన్నిధిలో గోవిందరాజీయము) దుర్వాస మహర్షి మీనాన్నగారితో పిల్లల భవిష్యత్తును ఆలోచించి చెప్పిన మాటలవి. మీనాన్నగారు

నాతో చెప్పారు చెప్పవద్దని కూడా అన్నారు. మరి నేనెందుకు చెప్తున్నానంటే ఇది కూడా భవితవ్యమే. నీవు శ్రీరామచంద్రుని పట్ల ఇంత దుఃఖపడుతుండడం వల్ల నీలోని శ్రద్ధను (గోవిందరాజీయము) గమనించి నీకు చెప్తున్నాను. నీవు భరతశత్రుఘ్నులకు కూడా చెప్పరాదు. భరతశత్రుఘ్నులతో వియోగము వనవాసములో సీతతో వియోగము గర్భిణిగా ఉన్న ఈ సమయములో, లక్ష్మణునితో వియోగము దుర్వాసమహాముని రామునితో ఒక్కడుగా ఉన్నప్పుడే మాట్లాడాలని లక్ష్మణుని కూడా నిషేధించినప్పుడు అని వివరణ చేయాలి తప్ప నాగోజీభట్టు గారు వ్యాఖ్యానించినట్టుగా భరతుని గంధర్వరాజ్యాన్ని చూడడానికి వెళ్ళుమన్నప్పుడు, శత్రుఘ్నుని మథుర రాజ్యాన్ని చూడడానికి వెళ్ళుమన్నప్పుడు అని వివరించకూడదు. ఆ వియోగము సుఖకారణమే కాని దుఃఖకారణము కాదు. దుఃఖకారణమైన వియోగాన్ని రాముడు అనుభవిస్తాడని దుర్వాసుడు చెప్పిన విషయంలోని ప్రధానాంశమని సత్యతీర్థుల వ్యాఖ్య. ఆ విధముగా సుమంత్రుడు పలుకగానే లక్ష్మణుడు సరే ఎవరికి చెప్పను జరిగినది విపులముగా చెప్పవలసినదని అడుగగానే సుమంత్రు డీవిధముగా వివరించాడు.

## యాభైరెండవ సర్గము

లక్ష్మణుని ప్రశ్నకి బదులుగా తాను చెప్పిన విషయాన్ని సుమంత్రు డీవిధముగా వివరించాడు. లక్ష్మణా! ఒకసారి వసిష్ఠమహర్షి ఆశ్రమానికి దుర్వాసమహాముని వచ్చి చాతుర్మాస్యవ్రతాన్ని నిర్వహించాడు. ఆ సందర్భములోనే మీనాన్నగారు వసిష్ఠ మహర్షిని దర్శించడానికి వచ్చారు. మునులకిద్దరికి ప్రణమిల్లి చాల సేపు చాల విషయాలు ముచ్చటించుకొన్నారు. మధ్యలో మీనాన్నగారు మాపిల్లల భవిష్యత్తు, మావంశం భవిష్యత్తు ఎలా ఉంటుంది చెప్పండి? శ్రీరాముడు ఎన్నినాళ్ళు రాజ్యాన్ని పరిపాలిస్తాడు? వాని పిల్లలు ఎప్పటి దాకా రాజ్యాన్ని పాలిస్తారు? అని అడిగారు. ఆయన భవిష్యత్తును జాగ్రత్తగా పరిశీలించి సకారణంగా కొన్ని మాటలను చెప్పాడు. దశరథా! పూర్వం దైత్యులు దేవతలచే పీడింపబడి భృగుమహర్షిపత్నిని శరణు పొందగా ఆమె వారికి శరణమిచ్చింది. అధర్మవర్తనులైన రాక్షసులకు శరణమిచ్చినదని క్రుద్ధుడైన సురేశ్వరుడు శ్రీమహావిష్ణువు అదితి కుమారుడుగా విష్ణువుగా, ఉపేంద్రునిగా ఉన్న వేళ ఆ భృగుపత్నిని సంహరించాడు. ఆ దృశ్యాన్ని చూచిన భృగువు కోపోద్రిక్తుడై నాపత్నిని సంహరించినందున నీవు కూడా మనిషివై పుట్టి భార్యావియోగమును పొందుతావు అని శపించాడు. ఇట్లు శపించి భృగుమహర్షి మిక్కిలి బాధపడ్డాడు. 'భృగుః శాపేన పీడితః' అను మాటకు మూలమున శాపము నిచ్చి బాధపడినాడని అర్థము. ఇది ఎట్లు పొసగునని గోవిందరాజీయము స్పష్టము చేసింది. భృగువు శపించినాకూడా ఈ శాపము నిచ్చాను కదా విష్ణునికి, విష్ణువు నాశాపముననుభవించవలసి వచ్చుచున్నది కదా! అని బాధపడినాడని అర్థము. ఆ భృగువు విష్ణువు ప్రతిశాపమిచ్చునేమోనని కూడా బాధపడి విష్ణువును శాంతింపజేసి ఎలాగైనా మనుష్యజన్మ పొంది రావణాదివధ రూపకార్యము నొనరింపవలసినదిని అనునయించాడు. ఆ విధముగా విష్ణువు భృగుశాపము నంగీకరించి ఈ జన్మమున దశరథపుత్రుడైనాడు. దీర్ఘకాలము సీతావియోగముననుభవించి 11వేల సంవత్సరములు రాజ్యపాలన మొనర్చి బ్రహ్మలోకం చేరాడు. ఇచ్చట విష్ణువు బ్రహ్మలోకమును చేరుననుట ఎట్లు సమంజసమని ఆలోచించి శ్రీ సత్యతీర్థులవారు బ్రహ్మ–లోకము అని విభాగము చేసి బ్రహ్మ (పరమాత్మ) స్వరూపుడైన తాను తనలోకమును చేరును అని గాని, కార్యమును నెఱవేర్చితినని చెప్పుటకై బ్రహ్మసభలో జరుగు సమావేశమున చెప్పుటకై వెళ్ళును

అని గాని, బ్రహ్మస్వరూపమైన తన లోకమునకే వెళ్ళునని గాని వ్యాఖ్యానించవలెనని నారు. అట్టి శ్రీరామచంద్రునకిద్దరు పుత్రులు కలుగుదురు. అయోధ్యలో కాదు వనముననే. ఆ పిల్లలకు తరువాత శ్రీరాముడు పట్టాభిషేకమును చేస్తాడు. అని గడచిన కథను రాబోవు వృత్తాంతమునంతటిని దశరథునకు దుర్వాసుడు చెప్పి సీత విషయమున గాని శ్రీరాముని విషయమునగాని దుఃఖపడరాదని చెప్పాడు. ఈవిషయమును లక్ష్మణునికి సుమంత్రుడు దారిలో వివరించగా లక్ష్మణుడు శాంతించాడు. సూర్యదస్తమించగా ఆ రోజు వారు కేశినిపురమున ఉండిపోయారు.

## యాభైమూడవ సర్గము

సుమంత్ర లక్ష్మణులు ఆ రీతిగా కేశిని నగరమున నుండి, మరునాడే అయోధ్యకు పయనమయ్యారు. అయోధ్యను చేరి శ్రీరామునితో ఏమి మాట్లాడాలో తోచక లక్ష్మణుడు చాలాసేపు దుఃఖించాడు. దూరముగానే దుఃఖార్తుడైన అన్నను చూచి సమీపించలేక మిక్కిలి కష్టముగా చేరుకొని పాదాలమీద పడి ఆదేశించిన పనిని నెరవేర్చాను. గంగానదీ తీరమున సీతను విసర్జించినానన్నాడు. శ్రీరామునికి పొంగి వచ్చుచున్న దుఃఖమును ఆపుటకు అన్నయ్యా! దుఃఖించకు, ఈ లోకమింతే, ఇపుడు ఆరోపిస్తుంది. మరల ఒకసారి బాధపడుతుంది. లోక సేవకులమైన మనకు ఇది తప్పదు. ఈ లోకానుసరణము తప్పదు అని ఓదారుస్తాడు. శ్రీరాముడు కూడా లక్ష్మణుడు కార్యమును నెఱవేర్చినందుకు సంతోషమని దుఃఖమును దిగమ్రింగుకొని అంటాడు. ఇచట "సోఽపవాదః పురే రాజన్ భవిష్యతి న సంశయః" అను లక్ష్మణుని వచనానికి గోవిందరాజీయమున ఇప్పుడు సీతను నిన్ను నిందించిన లోకాపవాదపు మాటకు మరల అపవాదము వచ్చును అని అర్థం వ్రాయబడింది. అనగా ఈలోకము అయ్యో! సీతను ఎందుకు వదలిపెట్టాలి? ఆమె తప్పు లేదు. శ్రీరామునిది తప్పుకాదు అని తన పూర్వాభిప్రాయమును మార్చుకొంటుంది అని గోవిందరాజీయము లక్ష్మణుని మాటను వ్యాఖ్యానించింది. శ్రీరామచంద్రుడు లక్ష్మణుని అభినందించి నాయనా! ఈ దుఃఖభారంతో నేనే ప్రజాకార్యమును నిర్వహించుట లేదు, ఎంత మంది కార్యార్థులున్నారో తెలియదు. నీవు వచ్చావు కనుక ఇక కార్యములను నిర్వహిస్తాము. నావలన ఎంతమందికి ఎన్ని అవసరములున్నవో వాటిని తీర్చవలసియుంది. అవసరమున మనము ప్రజలకు సహకరింపనిచో అనర్థాలు వస్తాయి. పూర్వము నృగుడనే మహారాజు చక్రవర్తి ఉండెడివాడు. అతడు పర్వదినములలో కావలసిన వారందరికి ఎన్నో దానములు చేస్తూండేవాడు. ఒకసారి ఒక గోవును ఒక పేద బ్రాహ్మణునికిచ్చాడు. కొన్నాళ్ళకా ఆవు అతని ఇంట కనిపించలేదు. ఆవు కొఱకు చాలా చోట్ల చాలకాలము వెదికాడు. చివరికి మరొక బ్రాహ్మణుని యింట లభించింది. ఇది నాదన్నాడు. కాదు నాదే నాకు మహారాజిచ్చినాడని ఆ మరొక బ్రాహ్మణుడన్నాడు. నాకిచ్చిన దానిని మహారాజు మరొకరికి ఇచ్చునా? అని మొదటి బ్రాహ్మణుడు అడిగాడు. వారికి వివాదం పెరిగింది. తేల్చుకొనుటకు ఇద్దఱు మహారాజుగారి దగ్గఱకు వచ్చారు. కాని మహారాజు ఎంత కాలమునకు దర్శనమీయక పోయేసరికి వారికి కోపము వచ్చింది. మేమెంతకాలము వేచిచూచినా మాచిన్న పనిని కూడా నెఱవేర్చుటకు రాని నీవు ఈ బావిలో తొండగా పడి పోవుదువుగాక అని శపించారు. భగవానుడు ద్వాపర యుగమున శ్రీకృష్ణావతారమును పొందినపుడు నిన్ను తాకితే తప్ప నీకు శాపమోక్షములేదని చెప్పి ఆ గోవును ఇద్దఱు కలిసి మఱొక పేద బ్రాహ్మణున కిచ్చారు (మఱొక అనేది గోవిందరాజీయ వివరణ) కావున లక్ష్మణా! మనము కార్యార్థులగు పురుషులనుగాని, స్త్రీలనుగాని వృథాగా

తిరస్కరించరాదు. వెంటనే మంత్రులను రప్పించి వారి పనిని నెఱవేర్చాలి. లేనిచో చేసిన పుణ్యానికి కూడా ఫలము రాదనినాడు శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో.

## యాభైనాల్గవ సర్గము

అట్లు శ్రీరాముడు పలికిన మాటలను విని లక్ష్మణుడు మరల ప్రశ్నించాడు. "అన్నా! అప్పుడు ఆ నృగ మహారాజు ఏమన్నాడు? అని. రాముడు మరల యిలా చెప్పాడు. ఆ నృగమహారాజు వారిని తనను పరీక్షించుటకు వచ్చిన పర్వత నారదమహర్షులనుగా (గోవిందరాజీయానుసారము) కని పెట్టి మంత్రులను రావించి పర్వతనారదు లిద్దఱు వచ్చి నాదానములోని లోపములను పరిశీలించి నాకు గుణపాఠమును చెప్పుటకై శపించారు. కావున నేను తొండగా జన్మించవలసి వస్తుంది. నాకు సుఖముగా ఉండడానికి చక్కని బావులను తవ్వించండి. చలి కాలములోను వర్షాకాలములోను, ఎండకాలములోను నేను హాయిగా ఉండడానికి తగినట్లుగా బావులను ఏర్పాటు చేయండి. ఆ బావుల చుట్టూ చక్కని పూలతోటల నేర్పాటు చేయండి. మాఅబ్బాయి వసువునకు రాజ్యపట్టాభిషేకము చేయడానికి ఏర్పాట్లు చేయండి అని చెప్పి తన కుమారుని వసువును పిలిచి నాయనా! చూశావు కదా! కార్యార్థులను అనవసరముగా నిలబెట్టకూడదు. ముందు వారిపనులను చక్కబెట్టి తరువాత మన పనులను చేసుకోవాలి. అర్థమైందా, బాధపడకు. మనము పొందవలసిన వానిని పొందుతాము. సుఖాలనైనా దుఃఖాలనైనా" అని ఊరడించి పర్వతనారదులిచ్చిన శాపమును అనుభవించుటకు ఏర్పాట్లు చేసికొన్నాడు అని శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో చెప్పాడు.

## యాభైయైదవ సర్గము

ఏమి లక్ష్మణా! వినాలని ఉంటే ఇలాంటివి చాలా కథలున్నాయి అన్నాడు శ్రీరామచంద్రమూర్తి. అయితే వినాలనే ఉంది అన్నాడు లక్ష్మణుడు. సరే విను అని శ్రీరామచంద్రుడింకొక కథను చెప్పనారంభించాడు. పూర్వం నిమి అను పేరుగల చక్రవర్తి ఉండేవాడు. వైవస్వతమనువుకు గల ఇక్ష్వాకువు ఆదిగా గల పన్నెండు మంది సంతతిలో పన్నెండవవాడు నిమి. అతడు గౌతమాశ్రమ సమీపాన తనకు యోగ్యమైన నగరాన్ని నిర్మించుకొన్నాడు. అందు తనకు ప్రత్యేకముగా ఇంద్రభవనము వంటి చక్కని భవనాన్ని కూడా నిర్మించుకొన్నాడు. దానికి ఆ కారణముగా వైజయన్తమని పేరు (గోవిందరాజీయాను సారము). ఒకసారి అతనికి యాగమొకటి చేయాలని అనిపించి నాన్నగారైన ఇక్ష్వాకువును అంగీకరింపజేసి (భాగవతానుసారము ఇక్ష్వాకువు సోదరుడు నిమి) యాగమును చేయించడానికి వసిష్ఠుని పురోహితునిగా కోరగా, వసిష్ఠుడు నేను ఇంద్రుని యాగమునకు వెళ్ళవలసియున్నది. ఇంద్రునిచే నిమంత్రింపబడ్డాను నిమి తరువాత నీయాగము అన్నాడు. అయితే నిమి ఎదురుచూడకుండా గౌతమమహర్షి ద్వారా తనయాగమును పూర్తి చేయించుకొన్నాడు. ఇంద్రయాగమును పూర్తి చేసికొని వసిష్ఠుడు వచ్చుసరికి ఇచట నిమి యాగము కూడా పూర్తి కాబోవుచుండెను (గోవిందరాజీయానుసారము) నిమి పడుకొని యుండెను. అది గమనించి వసిష్ఠుడు నీవు నన్నవమానించావు, కావున ఇట్లే చేతనలేని కాంతితో నీశరీరము పడిపోవునని శపించాడు. నిమి కూడా క్రుద్ధుడై నేను నిదుర పోయి ఉండగా ఈ శాపము నిచ్చావు కనుక నీవును చేతనలేని శరీరముతో పడియుందువని వసిష్ఠుని శపించాడు. ఇద్దరు పడిపోయారు.

## యాభైయారవ సర్గము

ఆ తరువాత ఏమి జరిగిందని లక్ష్మణుడడుగగా శ్రీరామచంద్రుడిలా చెప్పాడు. వసిష్ఠుడు దేహము లేనివాడై పడిపోయిన దేహమును వాయురూపమున చూచి దేహము లేకుండా ఉండడము సాధ్యము కాదని బ్రహ్మ (తండ్రి) సమీపమును చేరి తన విషయమును ప్రస్తావించగా బ్రహ్మ "నాయనా! చింతింపకుము, నీవు మిత్రావరుణులకు కుమారుడవుగా జన్మించి మరల యిదే దేహమును పొందెద"వనెను. ఇచట రెండవసారి జన్మించడము స్త్రీ శరీరమునందు కాదని, అయోనిజుడవు అయ్యెదవని బ్రహ్మ అనెను. ఇదెట్లు సంభవమను ప్రశ్నకు గోవిందరాజీయమున మిత్రావరుణుల రేతస్సు వలన సంభవించినను స్త్రీశరీరమున ప్రవేశించకుండుటయే కారణమని వివరణ కలదు. సత్యతీర్థులవారు అట్లుకాక అ అనగా నారాయణుడు యోని అనగా కారణము అయోని అనగా నారాయణుడు కారణముగా గల నేను (బ్రహ్మ) నావలన పుట్టినవాడవై అయోనిజుడ వగుదువని వ్యాఖ్యానించారు. అట్లు బ్రహ్మచే అనుగ్రహింపబడ్డాడు. ఇదిట్లుండగా ఒకనాడు మిత్రుడు వరుణత్వమును పొందియుండగా పాలసముద్రము చెంతకు ఆతనికోసమై ఊర్వశి వచ్చింది. ఇచట మిత్రుడు వరుణత్వమును పొందుటను గోవిందరాజాచార్యులవారు మిత్రుడు ఒకమాసమున వరుణుని ఆవేశించియుండునని వ్యాఖ్యానించగా సత్యతీర్థులవారు వరుణునితో ఒకచోట కలిసియుండగా అని వ్యాఖ్యానించి వరుణుడు మరియు మిత్రుడు అని వ్యాఖ్యానించిన నాగోజీభట్టుల వారి వ్యాఖ్యను ఖండించారు. అట్లు వచ్చిన ఊర్వశిని వరుణుడు చూచి పరవశించి తనతో సంగమింపగోరాడు. నేను పూర్వము మిత్రునిచే కోరబడితిని కావున రాజాలనని ఆమె అన్నది. వరుణుడు ఆగలేక తన వీర్యమును దేవనిర్మితమైన పాత్రయందుంచుదునన్నాడు. ఆమె అంగీకరించి నాభావమంతా నీపైనే కలదు అన్నది. అట్లని మిత్రుని చేర మిత్రుడు (సూర్యుడు ) కోపించి ముందు నన్ను కామించి తరువాత వరుణుని కామింతువా కావున దేవలోకమున ఉండుట కర్హురాలవు కాజాలవని, బుధుని కుమారుడు కాశీరాజు పురూరవునికి పత్నిగా భూమిలో జన్మించి యుండెదవని శపించాడు. ఆ శాపదోషముచే ఆమె అట్లే ఉండి ఆయువనే కుమారుని ప్రసాదించి తిరిగి స్వర్గం చేరింది. ఆ ఆయువుకుమారుడే నహుషుడు. ఆతడు ఇంద్రునికి వృత్రాసురవధ వలన కలిగిన బ్రహ్మహత్యాపాపకారణముగా రాజ్యభ్రంశమేర్పడగా ఆ స్థానమున లక్షసంవత్సరములు నహుషుడు ఇంద్రపదము నధిష్ఠించాడు. ఊర్వశియు శాపావసానమున తిరిగి దేవలోకం చేరింది. ఇచ్చుట ఊర్వశి మిత్రునితో "సుసంక్రమ్య" బాగా కౌగలించుకొని అనగా మిత్రునితో భావములేనిదై అని గోవిందరాజీయ వ్యాఖ్యా విశేషము. అప్సరా శబ్దము ఆకారాంతముగనే స్వీకరించవలెను, లేనిచో అప్సరసః అని బహువచనమునే వ్యాకరణ కోశముల ప్రమాణము ననుసరించి వాడవలసి యుండవలసివచ్చెడిది అనియు,మిత్రావరుణు లిద్దఱు దైవికముగా వసిష్ఠుడున్న చోటికి వచ్చిరనియు శ్రీసత్యతీర్థవ్యాఖ్యావిశేషము.

## యాభైయేడవ సర్గము

ఇంతకీ ఏమైందని లక్ష్మణుడడుగగా శ్రీరాముడిట్లన్నాడు. మిత్రావరుణుల తేజస్సుతో నిండిన ఆ కుంభము నుండి ముందుగా అగస్త్యుడు పైకి వచ్చాడు. అతనిని మిత్రుడు (సూర్యుడు) తన కుమారునిగా భావించి తీసికొని

ముద్దాడబోగా నేను నీ కుమారుడను కానని నిరాకరించి వెడలిపోయినాడగస్త్యుడు. ఈ నిరాకరణకు కారణ మేమిటను ప్రశ్నకు మణిముకుటమున ఇట్లు వివరణమీయబడింది. కుంభమున ముందు మిత్రుని వీర్యముంచబడింది. తరువాత వరుణుని వీర్యముంచబడింది. కావున నీకు కుమారుడను కానని సమాధానము. లేదా పూర్వము మిత్రుడు ఊర్వశిని సంభోగించబోవుకాలమున అనుకొనకుండా ఊర్వశీ సఖీజనమురాగా ఆ వీర్యం అనివార్యముగా కుంభమున ఉంచబడినది. దానిపైన మఱల వరుణుడు తన వీర్యము నుంచినాడు. కావున నేను మిత్రా వరుణులిద్దఱికి కలిగినవాడనని అగస్త్యుని నిరాకరణమని సమాధానము. లేదా నేను కేవలము కుంభమున పుట్టిన వాడనని అందఱు అంటున్నారు కనుక నీకుమారుడను కానని అగస్త్యుని నిరాకరణమని సమాధానము. అయితే అగస్త్యునికి మైత్రావరుణి అనే పేరు కూడా ఉన్నది. వసిష్ఠునికైతే మైత్రావరుణి మిత్రావరుణుల కుమారుడని స్పష్టముగా వివరణ ఉన్నది. అగస్త్యుడు జన్మించిన తరువాత చాలా కాలమునకు వసిష్ఠుడు కలిగినాడు. ఇట్లు వశిష్ఠునికి మరల జన్మ కలిగింది.

ఇక నిమి ఏ విధముగా మరల జీవమును పొందాడో విను లక్ష్మణా అని శ్రీరాముడిట్లనినాడు. నిమి శరీరాన్ని రక్షిస్తూ వాయురూపముగా ఉన్న నిమి కోరినచోట జన్మనొందుటకు వీలుగా ఒక యాగమును చేయించినారు. యాగదీక్ష పూర్తికాగానే భృగుమహర్షి నిమితో అన్నాడు. నిమీ! దేవతలు సంతోషించారు. నీవు ఎచ్చట ఉండగోరుతున్నావు? అని. అప్పుడు నిమి ఒక దేహముననే ఉండుటకిష్టపడక అన్ని ప్రాణులు కళ్ళు తెఱచి ఉంటాయి. వాటికి విశ్రాంతినిచ్చుటకు వాటి కనుమూతలలో ఉంటాను అన్నాడు. భృగుమహర్షి అట్లే అని అనుమతించాడు. కావున కనురెప్పలు మూయునపుడు వాయురూపమున నిమి ఉండునని అర్థము. నాగకూర్మ కృకరదేవదత్త ధనంజయులను ఉపవాయురూపమున నిమి ఉంటాడు. (గోవిందరాజీ) నిమియొక్క శరీరమును మథించగా మిథి అను కుమారుడు కలిగాడు. మథనము వలన అతడు మిథి అయినాడు. శరీరము నుండి పుట్టుట వలన జనకుడు అయినాడు. దేహము వీడిన నిమికి కుమారుడయినందున విదేహరాజయినాడు. ఇది మిథికి అన్ని పేర్లు రావడానికి కారణము. మిథియే మైథిలుడైనాడు. ఇది కథ అని శ్రీరాముడు లక్ష్మణునికి కథను చెప్పి పూర్తి చేసినాడు.

## యాభైయెనిమిదవ సర్గము

ఇట్లనిన శ్రీరాముని లక్ష్మణుడు అడిగినాడు. "అన్నా! నిమి ధర్మాత్ముడు కదా! క్షత్రియధర్మము తెలిసినవాడు కదా! వసిష్ఠుడు శపించగనే మఱల ఆ వసిష్ఠుని శపించాడెందులకని"? ఇట్లడిగిన లక్ష్మణునితో శ్రీరాముడు ఇట్లు అనినాడు. నాయనా! అందఱకు ఓపిక ఉండదు. ఈ ఓపిక అనేది కొందఱికి మాత్రమే ఉంటుంది. దీనికి ఒక కథ చెప్తాను అని యయాతి కథను చెప్పినాడు. నిమిదోషమును గుఱించి అడిగితే రాముడు యయాతి గుణమును గుఱించి చెప్పుట న్యాయమా అని ప్రశ్నించి గోవిందరాజాచార్యులు ఇట్లు వివరించినారు. ఉత్తముల గుణకీర్తనము చేయుట ఎంత మాత్రము దోషముకాదు. అది శ్రీరాముని గుణగ్రహణపారీణత అని నేను భావిస్తున్నాను. శ్రీరాముడిట్లనినాడు. లక్ష్మణా! అందఱు ఆ విధముగా సహనమును చూపించలేరు, యయాతి మాత్రము చాలా సహనమును చూపినాడు. నహుషుని కుమారుడు యయాతి. అతనికి ఇద్దఱు భార్యలు. రాక్షసరాజు వృషపర్వ

మహారాజు కూతురైన శర్మిష్ఠ ఒకతె, శుక్రాచార్యులవారి కూతురైన దేవయాని ఇంకొకతె. దేవయాని యయాతి కంత ప్రీతిపాత్రురాలు కాలేకపోయినది. శర్మిష్ఠకు పూరువు, దేవయానికి యదువు (మిగతావారు వంశకర్తలు కాదు కనుక వారు గణింపబడ లేదు సత్యతీర్థానుసారము) వంశకర్తలు. పూరువు కూడా తల్లిని అనుసరించి తండ్రికి ప్రీతిపాత్రుడైనాడు. పెద్దకొడుకైన యదువు ఈ విషయమును భరించలేకపోయినాడు. తల్లితో మనకీ అవమానమేల భరించవలసియున్నది? మనమిద్దఱము ఆత్మహత్య చేసికొనెదమని అన్నాడు. దేవయాని బాధతో ఆగ్రహముతో తండ్రి శుక్రాచార్యుల వారిని స్మరించినది. కూతురు కష్టములను గ్రహించి శుక్రాచార్యుల వారు వచ్చి ఏమి కష్టమని అడిగినారు. తనను భర్త గౌరవించడములేదని విషమునైనా తింటాను. అగ్నిలోనైనా పడుతాను మీ అల్లుడు నన్నవమానిస్తున్నాడు. ఇక నాకు బ్రతుకెందుకన్నది. శుక్రాచార్యులవారు వెంటనే ఆగ్రహించి నాకూతురును, నీ భార్యను నీవవమానించుచున్నావు కావున ముసలివాడవౌదువుగాక! అని శపించినాడు అట్లు శపించి కూతురు నూరడించినాడు.

## యాభైతొమ్మిదవ సర్గము

తనను శపించినట్లు తెలిసికొని యదువు వద్దకు వెళ్ళి నాయనా! యదూ!నేనింకా భోగేచ్ఛను వదల లేకపోతున్నాను. నీవు నా ముసలి తనమును తీసికొనుము. నీయౌవనము నిమ్ము అని అన్నాడు. యదువు ఆమాటను విని నీకు ఆ పూరువే ఇష్టముకదా! వాని దగ్గఱనే ఎక్కువ ప్రీతితో ఉంటావు కదా! పూరువునే అడుగుమన్నాడు. యయాతి పూరువు నడుగగా వెంటనే సంతోషముతో తండ్రిసేవకన్న భాగ్యమేమున్నదన్న భావముతో అంగీకరించి యోగబలమున తండ్రిముదుసలితనమును స్వీకరించాడు. తండ్రి యయాతి కుమారుని యౌవనమును యోగబలమున స్వీకరించి యజ్ఞయాగాదులనెన్నిటినో చేసి రాజ్యము నేలినాడు. కొద్ది కాలమునకు భోగములపై మొగము మొత్తగా పూరును పిలిచి చాలు నాకింక భోగములు, నీవే రాజ్యమేలుమని తన ముదుసలితనమును తానే తీసికొనినాడు. ఇచట సహః అను శబ్దమునకు సత్యతీర్థులు అన్నమని అర్థము చెప్పినారు. యయాతి తన కుమారుడు పూరునకు రాజ్యాభిషేకమును కూడా చేసినాడు. యదువునకు తన మాట వినని కారణముగా రాక్షసులే ఉద్భవింతురని శాపమునిచ్చినాడు. ఇచ్చట 'ప్రజార్థే విఫలో భవ' అను మాటకు రాజ్యాదులపై నీకు అధికారముండదని గోవిందరాజాచార్యుల వివేచన 'దుర్మతేస్తే వంశో న స్థాస్యతి' అనే మాటకు నీ వంశము సూర్యవంశమున ప్రవేశించునని అర్థము. ఇందులకు ప్రమాణముగా హరివంశమున యయాతివంశము యదువంశమున ప్రవేశించునని, యదువంశము నాలుగువిధాల ముక్కలగునని, యదులు మధువునకు, మధువుసాత్త్వతునకు రాజ్యమిత్తురని, వికద్రుక సంవాదమున చెప్పబడినది. కావున నాగోజి భట్టుగారు వ్రాసినట్లుగా రాక్షసులు కాకపోయినా నీవంశమున క్షత్రియులు మాత్రమే కాని సోమవంశీయులు కాజాలరను వ్యాఖ్యసముచితము కాదని సత్యతీర్థుల వివరణ. ఈ విధముగా యయాతి శుక్రాచార్యులకు ప్రతిశాప మీయకున్నను, నిమి కోపము నిగ్రహించుకొనలేక ప్రతిశాపము నిచ్చెనని అర్థము. కాబట్టి లక్ష్మణా! నృగమహారాజుగారి యందు వలె మన పట్ల ప్రజలకు ఆచార్యులకు కోపము రాకుండునట్లు ప్రవర్తించుదమని శ్రీరాముడు లక్ష్మణునితో ననెను.

## అరవైయవ సర్గము

## అధికపాఠము

## మొదటి సర్గము 1

ఆవిధముగా శ్రీరామలక్ష్మణు లాలోచించుకొనినారు. మరునాడు శ్రీరాముడు రాజధర్మములను నిత్యక్రియలను నిర్వర్తించుకొని వసిష్ఠుల వారిని మంత్రులను సంప్రదించి వారిసూచనలను పాలించుచుండినాడు. లక్ష్మణుడు రాగానే లక్ష్మణా! ఎవరైనా కార్యార్థులై ఉన్నారా! బయట! చూచి రమ్మనగా సరేనని లక్ష్మణుడు వెడలి వచ్చి ఎవరును లేరని చెప్పాడు. మరల చూడుమనగా అచట ఒక కుక్క న్యాయార్థినియై నిలబడెను. లక్ష్మణుడు లోనికి రమ్మనగా దేవ,రాజ, బ్రాహ్మణ గృహములలోనికి మేము రాకూడదు. అచట వహ్ని, ఇంద్రుడు, సూర్యుడు, వాయువు ఉందురన్నది అనుమతి కావలెనన్నది. మరల లక్ష్మణుడు లోనికి వెళ్ళి శ్రీరాముని అనుమతిని పొంది శునకమును లోనికి కొనిపోయాడు.

## అధికపాఠము 2

పగిలిన తలతో కుక్క లక్ష్మణుని వెంట లోనికి వచ్చి రాజే సర్వప్రాణులకు రక్షకుడు, అతడు సరిగా పాలించనిచో ప్రజలు, ప్రాణులు నశింతురని అనేక ధర్మాలను చెప్పింది. వచ్చిన పని ఏమి? అని రాముడడుగగా, సర్వార్థ సిద్ధుడనే ఒక సన్న్యాసి నన్ను కొట్టినాడని చెప్పింది. శ్రీరాముడు ద్వారపాలకుని పంపి సన్న్యాసిని రప్పించాడు ఏల కుక్కను కొట్టితివని అడిగాడు. కోపము వహించుట చాల పాపము, ఎందుకిట్లు కోపించితివని అడిగాడు. ఆ సన్న్యాసి ఇట్లన్నాడు. శ్రీరామా! ఈకుక్క నేను వెళ్ళిన చోటికల్లా వెళ్ళి నాకడ్డు వచ్చినది. ఆకలికి తట్టుకొనలేక కొట్టితినన్నాడు. నన్ను దండించుడనగా శ్రీరాముడు మంత్రులతో ఆలోచించి బ్రాహ్మణునికి శరీరదండము శాస్త్ర నిషిద్ధము కనుక, ఇతనికి దేవమందిరాధ్యక్షతనీయుడని ఆదేశించాడు. సభాసదులు ఇదేమి శిక్ష, ఇది వరము కదా అన్నారు. అప్పుడు శ్రీరామచంద్రుడు దీనికి కారణము శునకమునకు తెలియునన్నాడు. నీవే చెప్పుమని శ్రీరాముడనగా ఆకుక్క ఇట్లన్నది. నేను పూర్వజన్మమున కులపతిగా (దేవమందిరాధ్యక్షునిగా) ఉంటిని. అప్పుడు అనివార్యముగా జరిగిన దోషములకన్నిటికి ఫలముగా ఈ కుక్క జన్మ నొందితిననెను. కనుక కోపమున కెవరును గుఱి కారాదు. దేవమందిరాధ్యక్షతవలన అనివార్యముగా కొన్ని దోషములు జరుగును. బ్రాహ్మణ, దేవ, స్త్రీ ధనముల నపహరింపరాదని, అట్టి వారు అవీచిమత్ అను నరకమును పొందుదురను మాటలను విని శ్రీరాముడు అచ్చటి శ్రోతలు ఆనందించారు. కుక్క న్యాయం పొంది అచటి నుండి వెడలిపోయింది. ఆ భిక్షుకుడు దేవమందిర రక్ష కుడాయెను. కుక్క తన జాతిని స్మరిస్తూ వారాణసిలో శేషజీవితం గడపింది.

## అధికపాఠము 3

అయోధ్యా నగరపు పరిసరారణ్యమున సరయూ నదీతీరమున ఒక భయంకరమైన వనమున్నది. అందు ఒక గుడ్లగూబ నివసించేది. దానియింటి నాక్రమించి ఇది నాదని ఒక గ్రద్ద వాదించింది. ఆ రెంటికి పెద్ద కలహమే అయింది. అవి రెండూ ధర్మాత్ముడైన శ్రీరాముని వద్ద న్యాయనిర్ణయము చేయుమని అర్థించాయి. శ్రీరామచంద్రుని

వద్దకు వచ్చి రామా! నీవు ధర్మాత్ముడవు. అడవిలో నాకు ఇల్లుంది, చాలా రోజులనుంచి హాయిగా ఉన్నాను. గుడ్లగూబ దీనిని నాదనుచున్నదని గ్రద్ద పలికింది. రామా నీవు సత్యవంతుడవు, అది నాయిల్లే. నేను చాలా రోజులనుంచి ఉంటున్నాను ఈ గ్రద్ద దానిని ఆక్రమించుచున్నదని గుడ్లగూబ పలికినది. బలహీనురాలనైన నాకు నీవే గతివని ప్రార్థించింది. శ్రీరామచంద్రుడు జయంతుడు, ధృష్టి మొదలైన మంత్రులను రావించి వారితో ఈవిషయముపై చర్చచేసినాడు. ఓగ్రద్దా !ఎన్ని రోజులనుంచి ఆ ఇల్లు నీది అని అడిగినాడు శ్రీరాముడు. ఈ భూమి మీద మనుష్యులున్నప్పటి నుంచి నాదే అన్నది గ్రద్ద ఇంటిని. ఆ తరువాత శ్రీరాముడు గుడ్లగూబ నడిగినాడు ఈ భూమి మీద చెట్లున్నప్పటినుంచి నేనీ ఇంటిలో ఉంటున్నాను అన్నది గుడ్లగూబ. అప్పుడు శ్రీరామచంద్రుడు చక్కగా పరిశీలించి వృద్ధులుండే చోటే సభ. సత్యమునకే విజయము కలుగవలయునని చెప్పినాడు. అది విని సభ్యులంతా గుడ్లగూబ వైపు సాదరముగా చూచి మహారాజా! మీరే నిర్ణయించాలనినారు. అదివిని శ్రీరాముడు ఈభూమి అంతా ప్రళయానంతరము ముందు చెట్లతో నిండిపోయినది తరువాత అనేక ప్రాణులు ఇతర జంతువులు ఏర్పడినవి. మధుకైటభులను రాక్షసులు బ్రహ్మను పీడించుచుండగా భగవానుడు వారిని సంహరించాడు. వారి కొవ్వుతో ఈభూమి మేదిని అయింది. దానిని ముందు వృక్షములతో పూరించాడు. కనుక ఆ వృక్షములు పుట్టినప్పటి నుండి ఈగుడ్లగూబ ఉన్నది కనుక ఆయిల్లు గుడ్లగూబదే కాని గ్రద్దది కాదు. అసత్యమాడుచున్న ఈగ్రద్ద దండింపదగినదని శ్రీరాముడన్నాడు. ఈ లోపున ఆకాశమునుంచి అశరీరవాణి వినిపించినది. శ్రీరామా! ఈగ్రద్ద పూర్వమే తపస్సుచే దగ్ధమైనది కావున ఇప్పుడు దండింప పనిలేదు. ఇతడు పూర్వము బ్రహ్మదత్తుడను రాజు. ఈతని ఇంటికి గౌతముడు భోజనమునకై వచ్చాడు. వందసంవత్సరములకు పైగా భోజనము కోరియుండినాడు. అందులకై అంగీకరించి బ్రహ్మదత్తుడు అర్ఘ్యపాద్యముల నిచ్చాడు. అయితే భోజనమున మాంసం వడ్డింపజేశాడు. అది గమనించిన గౌతముడు బ్రహ్మదత్తుని గ్రద్దగా కమ్మని శపించాడు. పాచకుల అపరాధమని మన్నించుమని కోరగా శ్రీరాముని కాలములో న్యాయనిర్ణయము జరిగిన వెంటనే నీకు శాపవిముక్తి కలుగునని గౌతముడను గ్రహించాడు. వస్తుతః ఇతడు బ్రహ్మదత్తుడు గ్రద్దరూపమును పొందినాడు. ఇతనికి నీదర్శనము వలన శాపవిమోచనము జరిగినదనగా శ్రీరాముడు సంతోషించాడు. బ్రహ్మదత్తుడు గ్రద్దరూపమును విడిచి రామా! నీ అనుగ్రహమున నరకమునుండి విడివడితిని. నాకు శాపవిమోచనమైనది ధన్యుడనని శ్రీరాముని వీడ్కొన్నాడు.

శ్రీరామలక్ష్మణులు ఈవిధముగా సంప్రదించుకొంటూ అనేక లోకహిత కార్యముల నాచరించుచుండేవారు. ఒకసారి శ్రీరామచంద్రుని ద్వారము వద్దకు వచ్చిన భార్గవచ్యవనాది మహర్షులను తెలిసికొని శ్రీరాముడు వారికి అపూర్వ స్వాగత క్రియలొనర్చి ఆసనములపై కూర్చొన్న వారిని వారి రాకకు కారణమేమని మరల అడిగినాడు. వారు సంతోషించి తప్పక మాకార్యము నెఱవేరును. నీరక్షణ మాకు కావలయునననినారు. (ఇచట భార్గవచ్యవనం అను పదమునకు భృగువంశభవుడైన చ్యవనుని అని గోవిందరాజీయార్థము)

## అరవైయొకటవ సర్గము

మా భయానికి కారణము తెలిపెదమనుచు చ్యవన మహర్షి ఈవిధముగా చెప్పాడు. శ్రీరామా! కృతయుగమున లోలాపుత్రుడైన మధువను రాక్షసుడు మహాభక్తి సంపన్నుడై ఉండినాడు. శివుని గూర్చి తపమాచరించగా శివుడతనికి

తన శూలమునుంచి మరొక శూలమును సృష్టించి (గోవిందరాజీయము) యిచ్చాడు. ఈ శూలము నీకు సర్వత్ర విజయ ప్రదము. కాని విప్రులతో, దేవతలతో ద్వేషించనంత వఱకే. ఆ ద్వేషమారంభమైనప్పుడు అది మఱల నన్ను చేరును అని చెప్పాడు. మధువు మఱల ఈ శూలము నా సంతానమునకు కూడా పని చేయవలయుననినాడు. శివుడు అట్లు కాదు, కాని నీ ఒక కుమారునికి మాత్రముపయోగించుననినాడు. మధువు యొక్క భార్య కుంభీనసి, విశ్వావసుని కూతురు. పూర్వము మధువుచే అపహరింపబడి చేపట్టబడినది (గోవిందరాజీయము) మధువునకు కుంభీనసియందు కలిగిన కుమారుడు లవణాసురుడు. దుష్ప్రవృత్తి కలవాడని మధువు, విరక్తుడై శూలమును అనివార్యముగా వానికిచ్చి వరుణలోకము నాశ్రయించి ప్రశాంతముగా కాలము గడపుచుండినాడు. ఆ లవణాసురుడు మాత్రము శూలప్రభావముచే మఱింత గర్వితుడై ఋషులను పీడించుచున్నాడు కావున శ్రీరామచంద్రా! ఆ లవణాసురుని బారినుండి మమ్ము కాపాడవలసిందని శూలవృత్తాంతమును మరల ఒకసారి గుర్తు చేసినారు (గోవిందరాజీయము). అసాధారణ పరాక్రమా! శ్రీరామా! నీవే మారక్షకుడవన్నారు.

## అరవైరెండవ సర్గము

శ్రీరాముడు ఋషుల వలన లవణాసురుని ఆహారము పశుపక్షిమృగవ్యాఘ్రసింహాలు, ఋషులే అని ఆచరణ దౌర్జన్యము మధువన విహారమే అని గమనించాడు. ఆ లవణాసురుని చంపెదనన్నాడు. రాముని మాటలను విని భరతుడు లేచి ఈపని నిర్వర్తించే (బాధ్యత) కర్తవ్యము నాదే (గోవిందరాజీయము) అని స్వయంగా స్వీకరింపదలచాడు. కాని శత్రుఘ్నుడు తన స్వర్ణసింహాసనము నుండి లేచి, కాదు నీవు చాలా కష్టపడినావు రాముని కోసము 14సంవత్సరాలు కూడా పరోక్షముగా శ్రీరామునిసేవ చేసినావు. నేను మాత్రమే ప్రత్యేకముగా శ్రీరామునికి ఏసేవ చేయలేకపోయినాను. కనుక లవణాసురవధ నావంతే అనినాడు. ఆ మాటలను విని శ్రీరాముడు నాయనా శత్రుఘ్నా! అయితే నీకు ఇక్కడే ఇప్పుడే ప్రత్యేక భవనాదులను నిర్మించి (గోవిందరాజీయము) మధువన స్థానమునకు ఆ ప్రాంతమునకు అధికారిగా పట్టాభిషేకం చేస్తాను. నీవు లవణాసురుని వధించి ఆ ప్రాంతమునకు అధిపతివగుము. మారుమాట్లాడకుము. ఇచ్చటనే నీవద్దనే ఉందునని అనకుము (గోవిందరాజీయము) అన్నాడు. నీవు బాలుడవు, పెద్దల మాటను పాటింపవలెననెను. మంత్రవిధానానుసారము పట్టాభిషేక మొనర్తును (గోవిందరాజీయము) అంగీకరింపవలెనన్నాడు.

## అరవైమూడవ సర్గము

శ్రీరాముని మాటలను విని శత్రుఘ్నుడు మిక్కిలి బాధపడినాడు. అన్నగారిని ఎదిరించి నీకు బదులు నేనే శ్రీరాముని సేవ చేయుదునని (గోవిందరాజీయము) భరతుని ఉల్లంఘించినందులకు తపించిపోయినాడు. మరల ఎదిరించినట్లు కావద్దని పెద్దలకు ఎదురు పలుకరాదని మరొక దోషంచేసి మరొక శిక్షకు గుఱికావద్దని (గోవిందరాజీయము) పెద్దలకిద్దఱికి పట్టాభిషేకము లేకుండా తనకు పట్టాభిషేకము చేయుట అను దోషమును మనసులో పెట్టుకొని (సత్యతీర్థులు) ఒకవైపు ఈ పట్టాభిషేకము, మఱొకవైపు అన్నగారి ఆజ్ఞాధిక్కారము అను రెండువైపుల ముడిపడిన తాడును ఏవిధముగా వదిలించుకొనవలెనో తెలియనివాడై (సత్యతీర్థులు) చాలా బాధపడినాడు శత్రుఘ్నుడు. ఇచ్చట త్వత్తో మయా అను శబ్దములకు త్వత్తః అమయా అజ్ఞానేన అను వివరణము సత్యతీర్థుల

పాండిత్యమునకు అనేక నిదర్శనములలోని ఒక నిదర్శనము. కనుక మఱల సమాధానము చెప్పకూడదని నిర్ణయించుకొని పట్టాభిషేకము నకంగీకరించినాడు. అధర్మమును రాకుండా చేయుమనినాడు. శ్రీరాముడు సంతోషించి లక్ష్మణ భరతుల ద్వారా అభిషేక ద్రవ్య సంభారాలు తెప్పించి కుమారస్వామిని దేవతలభిషేకించినట్లు శత్రుఘ్నుని పట్టాభిషిక్తుని చేసినాడు. పౌరులు, తల్లులు, ఋషులు చాలా సంతోషించినారు. శత్రుఘ్నుని ఆశీర్వదించినారు. లవణుడు సంహరింబడినట్లేనని భావించినారు. అభిషిక్తుడైన శత్రుఘ్నునకు శ్రీరాముడు ఒకబాణమునిచ్చి, శత్రుఘ్నా! ఈ బాణముతో నీవు లవణాసురుని చంపగలవు. వాడు రావణాసురుని కంటే బలవంతుడు కనుక (గోవిందరాజీయము) ఈ బాణమును నేను పూర్వము వుపయోగించలేదు. వాని దగ్గఱ శివుడు ప్రసాదించిన శూలమున్నది. అది వాని దగ్గఱ లేనప్పుడే (గోవిందరాజీయము) వానిని చంపగలవు. కావున లవణుడు విహారమునకై ఆయుధము లేకుండా బయటికి వెళ్లినప్పుడు పురములోనికి ప్రవేశించి, ద్వారము దగ్గఱ నిరీక్షించి అతడు ద్వారములోనికి ప్రవేశించక ముందే యుద్ధానికి పిలవాలి. ఆ శూలము అతని చేతికందక ముందే ఆహ్వానించి యుద్ధము చేయాలని అన్నాడు శ్రీరాముడు. కొందఱిచట శివుని కృత్యము అను మాటకు విష్ణువు కంటే శివుడు గొప్పవాడని భావిస్తారు కాని అది వాస్తవము కాదు. ఇది శ్రీమన్నారాయణుని అవతారము కనుక అవతారమర్యాదతో శ్రీరాముడు ఆవిధముగ అనుట అని భావించాలి. నిజానికి విష్ణువగు శ్రీరాముని కన్న శివుడు గొప్పవాడని అర్థము కాదు. లేదా గొప్పదురతిక్రమ కృత్యమే శివునిది. భగవానుడే అంగీకరించినాడు కనుక అని గోవిందరాజీయమున విశేషవ్యాఖ్య ఈయబడినది.

## అరవైనాల్గవ సర్గము

శ్రీరాముడు శత్రుఘ్నునితో మరల ఇట్లనినాడు "నాయనా! ఇది వసంతఋతువు. నీవు ముందుగా కొంతమంది బ్రాహ్మణులను, గజాశ్వసేనలను, పణ్యవీథులను, నటనర్తకులను పంపించు. నీవు ముందు వెళ్ళవద్దు. నీవే మార్గము ననుసరించి వెళ్ళాలో ఆమార్గమున ఏపదార్థాలు ఆహారాలు నిత్యావశ్యక పదార్థాలు ఏవీ లభించవు. అందువలన అవి ముందు వెళ్ళవలయును (గోవిందరాజీయము) నీవు వెళ్ళుచున్నట్లు యుద్ధార్థమై యత్నము చేయుచున్నట్లు లవణునికీ, అచటి వారికెవరికీ తెలియరాదు. గ్రీష్మర్తువులోపున మనసేన కొంచెము కొంచెము అచటికి చేరుకొనవలెను. ఆతరువాత వర్షకాలారంభమున అతడు ఎవరు శత్రువులుండరు రారు అని శూలము చేత పట్టుకొనకుండగనే తిరుగుతుంటాడు. ఆవిధముగా నమ్మించి వానిని మనము చంపాలి. కనుక నీవు ఒకనెల రోజులిచటనే ఉండి అన్ని విషయములనధ్యయనము చేసి వెళ్ళవలసియున్నది". ఆ మాటలు విన్న శత్రుఘ్నుడు సరేనని అన్నకు ప్రదక్షిణ మొనర్చి కౌసల్యా సుమిత్రా కైకేయులకు ప్రణమిల్లి బయల్దేరాడు. ముందుగా శ్రీరాముడు చెప్పిన మజిలీలలో ఎచ్చటెచ్చట ఆగవలెనో ఏ రోజు బయల్దేరవలెనో, గ్రహించినాడు శత్రుఘ్నుడు. ఒకనెల రోజుల తరువాత గంగ ఆవలిఒడ్డు నుండి గుప్తచరులై సేనలు నడచిన దారిని అనుసరించి బయల్దేరినాడు.

## అరవైయైదవ సర్గము

సైన్యమును ముందు పంపి అయోధ్యలో మాసము కాలము గడపి (గోవిందరాజీయము– సత్యతీర్థీయము) త్రోవలో రెండురోజులు గడిపి (సత్యతీర్థీయము) వాల్మీకి మహర్షి ఆశ్రమప్రాంతానికి ఒకసాయంకాలానికి శత్రుఘ్నుడు చేరినాడు. వాల్మీకి మహర్షిని ఆ రోజురాత్రి ఉందునని కోరగా ఆయన ఈ ఆశ్రమమంతా మీదేనయ్యా హాయిగా ఉండవచ్చునని చిఱునవ్వుతో అనుమతించాడు. పాద్యార్ఘ్య ఫలమూలాదికమును సేవించిన తరువాత మీ ఆశ్రమము వద్ద జరుగుచున్న ఈ యజ్ఞవిభూతికి యజమాను లెవరు? (గోవిందరాజీయము) అని అడుగగా వాల్మీకి ఇట్లనెను. శత్రుఘ్నా! ఇచ్చట పూర్వము మీవంశపూర్వపురుషుడు సుదాసుడను వాడుండేవాడు. అతని కుమారుడు వీరసహుడనువాడు అత్యంత ధర్మపరాయణుడు. చిన్నతనములో సౌదాసుడు (వీరసహుడు) ఒకసారి వేటకు వెళ్ళినాడు. అచట మాటిమాటికి ఇటునటు సంచరించుచున్న ఇద్దఱు రాక్షసులను వ్యాఘ్రరూపమున చూచాడు. వారు ఆ అడవిలోని జంతువులను తిని అవి లేకుండా అడవిని పాడుచేసినారు. అందు ఒకనిని కనిపెట్టి చంపినాడు సౌదాసుడు. తన సహాయ రాక్షసుని చంపినందులకు మరొకడు కోపించి తగిన ప్రతీకారం నెఱవేర్చుటకై అక్కడ వీరసహునకు కనిపించకుండా అదృశ్యుడై పోయాడు. చాలకాలమునకు వివిధ కర్మలతో ఈ విషయమును మఱచిన కొన్ని రోజులకు (గోవిందరాజీయము) పూర్వవైరమును ఆ పులులలో ఒక పులిని చంపిన తనస్నేహితుడైన మరొక రాక్షసుని చంపిన వైరమును (సత్యతీర్థుల వ్యాఖ్య) స్మరించుకొని ఆ రెండవ రాక్షసుడు సౌదాసుడు మా ఆశ్రమ సమీపంలో యజ్ఞము నొకదానిని చేసేటప్పుడు ఆ యజ్ఞం పూర్తి అగుచుండగా ఒకరోజు వసిష్ఠుని ఆకారముతో వచ్చి మహారాజా! నాకు ఆకలిగా ఉన్నది మాంసాహారం కోరుతున్నానన్నాడు. ఏమీ సంశయించవలదన్నాడు. మహారాజు వెంటనే మంచి సంస్కార సంపన్నుడైన వంటవానిని పిలిచి గురువు గారికి సంతోషము కలుగులాగున చక్కని మాంసభోజనమును, హవిస్సును సిద్ధపఱచుమన్నాడు. ఆ వంట మనిషి ఆశ్చర్యపడుచుండగా ఈ లోపున వంటవాని రూపం ధరించి ఆ రాక్షసుడే మాంసభోజనం సిద్ధపఱచాడు. (గోవిందరాజీయ– సత్యతీర్థోభయాను సారము) మహారాజు సంతోషముతో వసిష్ఠులను, వసిష్ఠపత్నిని సగౌరవముగా ఆహ్వానించి మీకై మీరు కోరిన ఆహారమును సిద్ధపఱచితినని మాంసభోజనమును వడ్డింప జేసెను. ఆ ఆహారమును చూడగనే వసిష్ఠునికి క్రోధం కలిగింది. నీవు నాకీ ఆహారమును ఇచ్చినావు కనుక నీవు కూడా మాంసాశివైన రాక్షసుడవగుమని వసిష్ఠుడు శపించాడు. తానే మాంసభోజనమును సిద్ధపఱచుమనిచెప్పి తానే నిరాకరించి శపించినందువలన ఇది రాక్షసుని మాయ అని తెలియని మిత్రసహుడు (సౌదాసుడు) వసిష్ఠుని తిరిగి శపింప వేడుకొనెను.ఈలోపున రాజపత్ని మదయన్తి భర్తను వారించి గురువులను దూషించవలదు శపింపకూడదని నివారించాడు. మహారాజు ఆ శాపోదకమును ఏమి చేయవలెనో తోచక చివరకు తనపాదములపైననే చల్లుకొన్నాడు. ఆ విధముగా అతడు కల్మాషపాదుడాయెను. కల్మాషపాదుడనగా కోపముతో శాపజలమును కాళ్ళ మీద చల్లుకొనుట వలన కలిగిన నల్లని కాళ్ళు గలవాడు. (గోవిందరాజీయము) ఆ తరువాత వసిష్ఠుడు శాంతించి కోపముతో ఏదో అన్నాను 12సంవత్సరములు మాత్రమే ఈ రాక్షసత్వము నీకు, ఆ తరువాత రాక్షసత్వముండదు (అప్పటి విషయములు, రాజత్వదశలోను రాజవిషయములు రాక్షసత్వములోను నీకు గుర్తుకు రావు. భారతములోని "శక్తి" ఇచ్చిన శాపకథను,

బ్రాహ్మణుని శాపకథను ఇచ్చుట అను సంధానించు కొనవలెను అని సత్యతీర్థుల వివరణ) ఆ కల్మాషపాదుని యాగస్థలి ఇది అని వాల్మీకి చెప్పెను (కల్మాషపాదునికి ఒకేసారి అనేక శాపములను సత్యతీర్థుల వారు వివరించిరి) శత్రుఘ్నుడు కథను విని నిదురించాడు.

## అరవైయారవ సర్గము

ఏ రోజు రాత్రి శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమమున ఉండినాడో ఆరోజు రాత్రే సీతాదేవి ఇద్దఱు కవల పిల్లలను కన్నది. ప్రసూతా అని అంటే ప్రసూతవతీ అని అర్థము తీసికోవలెనని గోవిందరాజీయము. రామపత్ని ప్రసవించింది కవలలనని వినగానే మహర్షి ఆనందించి ఆ ప్రసవశాలవద్దకు చేరి దర్భల ముష్టిని (పిడికిలిలో ఉన్న దర్భలను పైకి అగ్రములుండునట్లు ఉంచి చూపించి) అగ్రములతో పెద్దవాడిని క్రిందివైపు మూలమును కోసి మిగిలిన భాగముతో క్రిందివైపు మూలమును లవములతో చిన్నవానిని (గోవిందరాజీయానుసారము) నేను బయట మంత్రములను చదువుచుండగా వృద్ధ స్త్రీలు లోపల మార్జన చేయవలెనని చెప్పినాడు. ఆ వృద్ధ స్త్రీలట్లే చేసినారు. ఆ సమయమున జాతకర్మను మాత్రము చేయవలెను. అయినను వాల్మీకి వారికి భవిష్యత్తులో కుశుడు (పెద్దవాడు) లవుడు (చిన్నవాడు) అనుపేర్లు కలుగునని సూచించుచు మార్జనము చేయవలెనని చెప్పెను (గోవిందరాజీయాను సారము) అర్ధరాత్రి గడచిన తరువాత శత్రుఘ్నునికి కూడా ఈ విషయము తెలిసి ఆనందము కలిగింది. అంతవఱకు శ్రీరామలక్ష్మణసుమంత్రులకు తప్ప సీత వాల్మీకి ఆశ్రమములో నున్నటుల తెలియదని గోవిందరాజీయ వివరణ. ఆ విధముగా ఒక శ్రావణ మాసపు రాత్రి శత్రుఘ్నున కానందముగా గడపింది. తెల్లవారగనే వాల్మీకి మహర్షి అనుమతిని పొంది పశ్చిమమువైపు ప్రయాణించి అతడు రాత్రుళ్ళలో ముని ఆశ్రమములలో ఉంటూ 7రోజులలో యమునాతీరమునుచేరి తనసేనను కలిసికొన్నాడు.

## అరవైయేడవ సర్గము

యమునా తీరము మధువనమునకు చేరి శత్రుఘ్నుడు అచట పూర్వమే చేరుకొన్న చ్యవనాది మహర్షులను చూచి లవణాసురుని బలాబలములను మఱల తెలిసికొన్నాడు. చ్యవన మహర్షి లవణాసురుని అసంఖ్యాకములైన పరాక్రమములను వివరించెను. ఒక ఉదాహరణమును విశేషముగా వినుమని ఇలా చెప్పాడు. మీ పూర్వులలో యువనాశ్వ మహారాజొకడు. అతని కుమారుడు యౌవనాశ్వుడు, మాంధాత అని కూడా అతనికి పేరు, అతడు (మాంధాత) భూలోకమునంతా స్వాధీనపఱచుకొని దేవలోకము నాక్రమించుటకు ఇంద్రుని దగ్గఱకు చేరగా "మాంధాతా సోదరా? ముందు భూమినంతా గెలిచి నావద్దకు రావాలి కదా! మనుష్య లోకమునే పూర్తిగా గెలిచి నీవు రాజువు కాలేకపోయితివి (గోవిందరాజీయము) నాసింహాసనార్ధమును కోరుట ఏవిధముగా భావ్యము" అని అనెను. మాంధాత ఆశ్చర్యపోయి భూలోకమున ఇంకెవరున్నారు! అని అడుగగా ఇంద్రుడు మధువనమున లవణాసురుడున్నాడు కదా? అనగానే విని సరేనని మఱల భూలోకమున కేగి లొంగిపొమ్మని లవణునికి సందేశమంపగా ఆ దూతను శూలముతో అచటనే భస్మ మొనరించినాడు లవణాసురుడు. దూత ఆలస్యము చేయుచున్నాడని గమనించి స్వయంగా పరివారముతో యుద్ధమునకై వెడలిన మాంధాతతో తలపడి మాంధాతను కూడా తన శూలమునకు బలి

యొనర్చినాడు. అట్టి లవణాసురుని శూలము ధరించకుండా ఉన్న సమయములో ఆపి ఎదుర్కొని యుద్ధమొనర్చి సంహరించెదవని చ్యవనుడు శత్రుఘ్ను నాశీర్వదించినాడు. తెల్లవారినది. లవణుడు భోజన పదార్థములను, వివిధ జంతువులను వేటాడుటకై శూలమునింటి వద్దనే ఉంచి వెళ్ళినాడు. ఇదే సమయము అని శత్రుఘ్నుడు లవణునిరాకకై ఎదురుచూచాడు. ఈలోపున అనేక ప్రాణుల కళేబరాలను చేతబట్టుకొని లవణుడు ద్వారదేశానికి రాగా సాయుధుడైన శత్రుఘ్నుడు కనిపించాడు. ఎవరి కోసమేమిటీ ఆయుధం కథ? ఇదంతా నాఆహారము. నీవీచిన్న ఆయుధంతో బాణంతో నన్నేం చేస్తావని మాటిమాటికి పరిహసించసాగాడు. అట్లు మాట్లాడుచుండగనే లవణాసురుని శరీరము నుండి ఆవేశముతో కన్నీరు రాసాగింది. (కోపముతో ఉన్నప్పుడు కూడా కన్నీరు వచ్చునని గోవిందరాజీయము) (కళ్ళ నుండి వచ్చినవి కాంతులు, మరీచ్యః అనగా కిరణాలు అకోపముగా ఉన్నప్పుడు కన్నుల నుండి వచ్చిన చూపులు భయంకరమైన కిరణములుగా ఇచట వర్ణింపబడినవి. సర్వ శరీరము నుండి ప్రసరించిన కాంతులవి అని సత్యతీర్థీయము) అట్లు క్రోధావేశపూర్ణుడైన లవణాసురునితో శత్రుఘ్నుడు యుద్ధము చేయుటకు వచ్చాను, రమ్మన్నాడు. లవణుడు అది విని మా పినతల్లి భర్త రావణుడు సీతనిమిత్తముగా రామునిచే హతమార్చబడ్డాడు. కులక్షయము కాకుండుటకై నేను దానిని పట్టించుకోలేదు. నీవు ఆ రాముని తమ్ముడవు. నన్ను రెచ్చగొట్టుతున్నావన్నమాట. నేను లోగడ ఈపరాభవమును గడ్డిపఱకగా భావించాను. నీవు ఊరుకోవడము లేదు. అయితే క్షణమాగు నాఆయుధము శూలమును తెచ్చుకొంటానన్నాడు. అప్పుడు శత్రుఘ్నుడు శత్రువును దొరికినప్పుడు వదిలేస్తాననుకొన్నావా నిన్ను లోనికే పోనిచ్చేది లేదు, నిలబడుమని అన్నాడు.

## అరవైయెనిమిదవ సర్గము

ఆ మాటలు విని లవణాసురుడు పళ్ళు పటపటకొరుకుతూ చేతిని చేతితో రాపిడి చేస్తూ రారమ్మని శత్రుఘ్నుని యుద్ధానికి పిలిచినాడు. ఆ మాటలను విని శత్రుఘ్నుడు నీకు తటస్థపడిన ఇతరుల వంటివాడను నేను కాను, నీకు మాంధాత మొదలైన వారు శత్రువులైనప్పుడు నేను పుట్టనే పుట్టలేదు అందువలన బ్రతికిపోయావు. వారందరికంటే నేను వేరైన వాడను (సత్యతీర్థుల వ్యాఖ్య) ఈనాడు నావద్ద ఉన్న బాణము వజ్రనిభాననము, అనగా వజ్రముతో సమానమైన ములికి (అగ్రము) కలది. సూర్యుని అంశము కిరణము వలె (తిలక వ్యాఖ్య) నీ హృదయకమలము భేదించును జాగ్రత్త. ఋషులంతా నీచావును చూడబోతున్నారు అని పలుకుచుండగనే లవణుడు క్రోధోద్రిక్తుడై ఒక మహావృక్షము నెత్తి శత్రుఘ్నునిపై వైచాడు అది ముక్కలైపోయింది. ఈ విధముగా కొంతసేపు వేసిన వృక్షముల నన్నిటిని శత్రుఘ్నుడు బాణములతో ఛేదించాడు. లవణుడు సహనము కోల్పోయి. ఒక మహావృక్షము నెత్తి శత్రుఘ్నుని తలపై కొట్టాడు. ఆ దెబ్బకు తాళలేక శత్రుఘ్నుడు మూర్ఛిల్లినాడు. లవణుడు శత్రుఘ్నుడు చచ్చినట్లు భావించి శూలమునకై లోనికి వెళ్ళలేదు. ఇంతలో లేచి ఇంక ఉపేక్షించరాదని తలచి శ్రీరాముడు ప్రసాదించిన శరం చేత బూని సంధించి, రక్తమను చందనముతో పూయబడిన, దానవేంద్రులను పర్వతేంద్రులకు వజ్రాయుధము వంటి శరమును ప్రయోగించగా చూస్తున్న బ్రహ్మ ఇతరదేవతలతోను, ఋషులతోను ఇది అపూర్వమైన శరమనెను. ఆ శరము తేజమును చూచి దేవతలంతా మిఱుమిట్లు గొల్పగా దిగ్భ్రమచెంది కొద్దిసేపు తోచని వారైరి (సత్యతీర్థవ్యాఖ్య) ఇంకను బ్రహ్మ ఇట్లన్నాడు ఇది విష్ణుని శరము. ఇది మధుకైటభులకై సృష్టింపబడినది ఇది విష్ణుని శరీరభాగము,

ప్రాచీవిష్ణు స్వరూపము (గోవిందరాజీయము) ఏష పూర్వస్య అనుచోట ఏష అపూర్వస్య అని వీడదీయవలెను అని నాగోజి భట్టు వ్యాఖ్య యుక్తము కాదు. ఏషోఽపూర్వస్య అనియే వాస్తవమైన పాఠము, నాగోజిభట్టువ్యాఖ్యనాశ్రయించిన అశ్రవణీయార్థముపలభ్యమగును. కనుక సరికాదు అని సత్యతీర్థుల వివరణ. రాముడు తెలిసే ఈ శరీరమును శత్రుఘ్నున కిచ్చాడు అని తెలుపుటకు ఏషా ఏవ తనుః విష్ణోః అని చెప్పబడినది. ఇచట ఏషైవ అని సంధి లేక పోవుట ఆర్షమగుట వలన ఉపేక్షించాలి. ఇది విష్ణుని తనువు కనుక ఎవరికైన ఏపనికైనా ఎప్పుడైనా ఇచ్చుటకు రామునికి అధికారము కలదు. అంతేకాక శత్రుఘ్నుడు కూడా విష్ణువు (రాముని) ఆవేశ స్వరూపమే. నిజమునకు బాణము కూడా రాముని అవతారమే కాబట్టి శత్రుఘ్నుడు శరముతో లవణుని సంహరింపగలుగునని సూచించ బడినది. ఆ విధముగా ఆ బాణమును శత్రుఘ్నుడు ధనుస్సుకు సంధించి ఆకర్ణాంతము లాగి లవణునిపై ప్రయోగించగా అది అందఱు చూచుచుండగనే లవణుని సంహరించి. రసాతలమునకు చేరి తనతో లవణుని తలను కూడ తీసికొని వెళ్ళినది. లవణుడు ప్రాణములను విడిచినాడు. శూలము కూడా శివుని శూలములో ఐక్యమొందినది. శత్రుఘ్నుడు ఒక్కబాణ ప్రయోగము చేతనే లవణుని చంపి చీకటిని తొలగించి వెలుగు సూర్యునివలె ప్రకాశించినాడు.

## అరవైతొమ్మిదవ సర్గము

సాక్షాద్విష్ణుతేజోరూపమైన ఆ దివ్యశరముచే లవణుడు సంహరింపబడినాడు. అప్పుడు అగ్నిపురస్సరులై (సత్యతీర్థీయము) దేవతలు విచ్చేసి శత్రుఘ్నుని అదృష్టమును, విజయమును అభినందించి మేము వరము నీయదలచాము, ఏమి కావలెనని అడిగారు. శత్రుఘ్నుడు వినయోపేతుడై ఈ మధువనము మధురాపురముగా కావలెనని, శూరసేన దేశీయులకు మరొక ఆశ్రయం కావలెనని మరల శూరసేనీయులిచ్చటికి నిర్భయంగా రావలెనని కోరగా వారట్లే అని అనుగ్రహించారు. శత్రుఘ్నుడు 12 సంవత్సరములు రాజ్యమును పునర్వ్యవస్థీకరించి శ్రీరామపాదములను సేవింపదలచి ఇది దోషము కాదు అని భావించాడు. రాముని మాటను ఎదిరించినట్లు కూడా కాదనుకొన్నాడు. (గోవిందరాజీయము)

## డెబ్బైయవ సర్గము

12 సంవత్సరములు గడువగనే శత్రుఘ్నుడు అయోధ్యకు పయనమైనాడు. నిర్ణీత స్థలములలో సైనికులతో, మంత్రులతో, రథగజతురగములతో బసచేస్తూ వాల్మీకి ఆశ్రమమునకు రాగా వాల్మీకి శత్రుఘ్నుని మిక్కిలి అభినందించి నీవిజయమును దేవలోకమునుండి చూచి చాలా ఆనందించాను. లోకమున కెంతో ఉపకారం చేశావు. దేవతలు చాల సంతోషించినారు రా నాయనా! నిన్ను ముద్దాడ బుద్ధి కలుగుతున్నదని చెప్పి శత్రుఘ్నుని శిరస్సున మూర్కొన్నాడు. తలపై ఆఘ్రాణించాడు. ఆ తరువాత సపరివారుడైన శత్రుఘ్నునకు ఆతిథ్యమొసగాడు. కొద్దిసేపటికి మధురముగా తాల లయ బద్ధముగా సుసంస్కృతముగా నున్న శ్రీరామచరితమును గానరూపముగా ఎవరో వినిపించుచున్నట్లు శ్రావ్యముగా తృప్తికరముగా అనుభూతి చెందాడు. అట్లు వినుటతోడనే మైమఱచిపోయాడు. ఆనంద దుఃఖ బాష్పములతో నిండిపోయాడు. శత్రుఘ్నుని అనుయాయులును అదే అనుభూతిని పొందారు. ఇది స్వప్నమా

మనమెక్కడున్నామని వారందరును అనుకొన్నారు. మేము ఆ పాడేవారిని చూడలేకపోతిమని వారు సిగ్గుపడ్డారు. (గోవిందరాజీయము) శత్రుఘ్ననితో వాల్మీకి నడుగుమని కోరారు. కాని శత్రుఘ్నుడు. మనము ఇచ్చట ఎవరినీ ఏమీ అడుగురాదు. అనేక ఆశ్చర్యములలో ఇది ఒక ఆశ్చర్యము. ఏమిటిది అని వెదకుటకై అడుగుటకై (గోవిందరాజీయము) మనము సరిపోము. యోగ్యమైతే వారే తెలియజేయుదురని ఓదార్చి మహర్షి అనుమతిని బడసి వారక్కడ నుండి విశ్రామస్థలమునకు కదలారు.

## డెబ్బైయొకటవ సర్గము

శత్రుఘ్ననికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఆ మధురగానమునే తలచుకొనుచుండినాడు. తెల్లవారగనే లేచి ఆహ్నికములను నెఱవేర్చుకొని మునిసమీపమునకు చేరి రాముని దర్శింపబోతున్నాను. అనుమతి నిమ్మన్నాడు. వాల్మీకి మహర్షి అనుమతిపొంది, అయోధ్యకు చేరుకొని శ్రీరాముని, సోదరులను, తల్లులను కలిసికొని ఆనందించాడు. అన్నా! నీ ఆజ్ఞమేఱ లవణాసురుని చంపాను. 12సంవత్సరములు పూర్తయినవి. ఇంక నిన్ను వదలి ఉండలేను. అన్నాడు. శ్రీరాముడు శత్రుఘ్నని చూచి నాన్నా! క్షత్రియుల పని (ఆలోచన) ఈ రీతిగా ఉండరాదు. (గోవిందరాజీయము) వియోగకాలములలో దేశాంతరములలో నివసించునపుడు ధైర్యము నవలంబించాలి. మనము ప్రజలను పాలించవలసిన కర్తవ్యము గలవారము, కావున తనవారి పట్ల వ్యామోహము, మోహము వదలి ప్రజల అవసరములను మాత్రమే తీర్చు. మనం రఘువంశీయులము అన్నాడు. తేలు కుట్టునేమో అనే భయమున పారిపోవు వానికి పాముకఱచునేమో అనుభయము పట్టుకొన్నదన్నసామెతవలె నేను 12 సంవత్సరములే భరించనైతిని, నీ వియోగమును శాశ్వతముగా ఎట్ల భరింతునని అందువా శత్రుఘ్నా! బాధపడకు, మధ్యమధ్యన ఇచ్చటికి రావచ్చు, చూడవచ్చు మాట్లాడవచ్చు, సలహాలు తీసికొనవచ్చునని శ్రీరాముడు శత్రుఘ్నని ఊరడించాడు. (సత్యతీర్థుల వివరణ) ఈ రీతిగా శత్రుఘ్నుడు శ్రీరామునిచే ఉపదేశింపబడి దీనముగా సరేనని అంగీకరించి ఏడురోజులుండి ఆ తరువాత మరల మధురకు చేరుకొన్నాడు.

## డెబ్బైరెండవ సర్గము

శత్రుఘ్నని పంపించిన పిదప శ్రీరాముడు కొన్నాళ్ళు రాజ్యమును సుఖముగా పాలించుచుండెను. ఒకరోజు ఒక గ్రామీణబ్రాహ్మణుడు మరణించిన తనకుమారుని తీసికొనివచ్చి రాజద్వారమున పడుకోబెట్టి రోదించసాగినాడు. నాయనా! నీవు మరణించితివా నేను ఏ జన్మలో ఏమి పాపము చేసితినో, నీవు మరణించితివి. ఇంకా వయస్సేరాలేదు నీకు. అకాలమున కాలవశుడవైతివి. నేను మీ అమ్మా ఎలా బ్రదుక గలుగుదుము. నేనేనాడు ఒక అసత్యమును కూడా పలుకలేదు. ఏ ప్రాణికీ అపకారము కూడా చేయలేదు. ఏమి పాపముచేత నాకు ప్రేతకార్యము చేయదగిన ఈ పిల్లవాడు నాకంటే ముందు మరణించినాడు. శ్రీరాముని రాజ్యములో ఇటువంటి దుస్థితి ఎవరికి కలుగలేదు నాకు ఈ దుఃఖము కలుగుటకు కారణమేమి? కావున శ్రీరామునిదే ఏదైనా దోషమేమో! ఇట్లు జరుగుటకు రామునికి ఎంత తెలిస్తే ఏం ప్రయోజనము! జరిగింది (సత్యతీర్థానుసారము) శ్రీరామా! రాజా! ఇక నీవే ఈ పిల్లవానిని బ్రతికించాలి? నేను కూడా ఈ రాజద్వారమున నాభార్యతో పాటు మరణిస్తాను. పది మంది పిల్లలకు వీడొక్కడు

మిగిలినాడు. రామా! బ్రహ్మహత్యను చేసి సుఖముగా ఉండుము. నీవు, సోదరులు సుఖముగా ఉండండి. పిల్లలను చంపే రాజును మేము పొందినాము. రాజుల దోషము వలననే ఇట్లు జరుగుతుంది. అనుచిత కృత్యమును వారించకపోతే నీపాలన ఎందుకు! (గోవిందరాజీయానుసారము) ఇలాంటి మాటలనెన్నిటినో అనుచు ఏడ్వసాగాడు.

## డెబ్బైమూడవ సర్గము

దయనీయమైన ద్విజ పరిదేవనమును విని అతనికి దుఃఖము, వినువారికి శోకము (సత్యతీర్థానుసారము) కలిగించు అతని మాటలచే పీడితుడై సంతాపము చెంది శ్రీరామచంద్రుడు ఋత్విజులను, ధర్మజ్ఞులను, సోదరులను మంత్రులను పిలిపించి కర్తవ్యమేమని తెలిసికొనుటకు ఒక సభనేర్పఱచెను. (ఈక్రింది భాగమంతయు గోవిందరాజీయానుసారము) అందఱు కూర్చొనిన తరువాత శ్రీరాముడు ద్విజుని పుత్రశోకమునకు కారణమును ఆలోచింపుడనగా నారదుడు ఈ విధంగా చెప్పాడు. అకాలమున బాలునికి విపత్తి కారణమేమో చెప్పుచున్నాను వినుము. త్రేతాయుగమున శూద్రునకు తపస్సు చేయుటకధికారము లేదు. కావున ఈ బాలునికి మరణము జరిగినది. బహుశః ఎచటనో ఒక శూద్రుడు తప మాచరించుచుండ వచ్చును పరిశీలించుము. కృతయుగమున బ్రాహ్మణులు మాత్రమే శరీర క్లేశము నొనర్చి తపస్సు చేయుటకు అర్హులు. ఆ యుగము బ్రాహ్మణప్రధానము అజ్ఞానావరణము లేనిది. అప్పుడు అపమృత్యువులు, అకాలమృత్యువులుండవు. అప్పుడు బ్రాహ్మణులు సర్వజ్ఞులగుదురు. కృతయుగము చివర మనువంశప్రభువులైన క్షత్త్రియులు అధికబలవంతులగుదురు. క్షత్త్రియులు కూడా త్రేతాయుగమున తపము జేయుటకు అర్హులే అయినను కృతయుగపు బ్రాహ్మణులతో సమానులు కాలేరు. త్రేతాయుగము నందలి బ్రాహ్మణులతో త్రేతాయుగపు క్షత్త్రియులు సమానులే. ప్రజలు ఆ యుగమున బ్రాహ్మణ క్షత్త్రియులను సమముగా చూచెదరు. కాని వారికి ఆచారములో కొంచెము మాత్రమే భేదముండును, పూర్తి స్వచ్ఛమైన బ్రహ్మజ్ఞాన ముండదు కనుక త్రేతాయుగమున ఒకపాదం ధర్మము వచ్చిచేరుతుంది. కాబట్టే త్రేతాయుగమున జనులపై కొంచెము ధర్మప్రభావము క్షీణిస్తుంది. అట్లు క్షీణించుట చేతనే వ్యవసాయాది కృషి కార్యము నిర్వర్తించిననే జీవనము జరుగు స్థితి ఏర్పడింది. కావుననే త్రేతాయుగమున మలమువలె విసర్జించబడిన మాంసమే ఆహారముగా కృషియే (అనృతమే) జీవనాధారముగా సాగినది. ఆయుఃక్షీణత కూడా దానివలన నేర్పడినది. కావుననే త్రేతాయుగపు ప్రజలు భయముతో ధర్మాచరణ మొనర్చుటకు సిద్ధపడినారు. వైశ్యశూద్రులు బ్రహ్మక్షత్రియుల పరిచర్య చేయ నారంభించినారు. పూజాపద్ధతి ప్రారంభమైనది. వైశ్యులు కూడా కృషిచేయ నారంభించినారు. శూద్రులు శుశ్రూషనే (చెప్పిన మాటను ఇచ్ఛతో విని ఆచరించుటనే ) ప్రధానముగా భావించినారు. ఇప్పుడు త్రేతాయుగమునకు అవసాన కాలమేర్పడినది. ఇప్పుడు అధర్మమున అధర్మకార్యమున ఆయుఃక్షయమున, కృష్యాది (అనృత) ఉపాయముల పట్ల ప్రవృత్తి ఏర్పడినది. ఆ తరువాత ద్వాపరమేర్పడుతుంది. ద్వాపరమున అధర్మము, అనృతము పెరుగుతాయి. వైశ్యులు అధికారులవుతారు. త్రేతాయుగపురుషులకంటే ఆయుష్షు తగ్గును. అనృత శీలమును, కృషి (వ్యవసాయ) గోరక్షణ వ్యాపారములకు ప్రాధాన్యమేర్పడుతుంది. అయినను ద్వాపరమున కూడా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సమత్వముంటుంది. వైశ్యులు కూడా తపమాచరింప వచ్చును కాని శూద్రులు తపమాచరించరాదు.

ప్రకృతము త్రేతాయుగమే కనుక శూద్రులసలే తపస్సు చేయరాదు. శూద్రులు కలియుగమున మాత్రమే తపము చేయనర్హులగుదురు. ప్రజలు చేసిన అన్ని సుకృత దుష్కృత కర్మల ఫలము కూడా ఆరవ వంతు రాజునకు వచ్చి చేరును. పాపమాచరించు రాజు ప్రజాపాలన చేయజాలడు, కావున నీవు దేశము నందంతటా సంచరించి ఎచ్చట అధర్మము జరుగుతున్నదో తెలిసికొంటే అధర్మము జరిగిన చోట అధర్మమాచరించు వారికి దండనం విధిస్తే ధర్మవృద్ధి ఆయుర్ వృద్ధి జరుగుతుంది. ఈ బాలునికి ప్రాణప్రాప్తి కూడా జరుగుతుందన్నాడు.

## డెబ్బైనాల్గవ సర్గము

నారదుని మాటలను విని శ్రీరామచంద్రుడు లక్ష్మణుని పిలిచి నాయనా! ముందా బ్రాహ్మణ బాలకుని శరీర రక్షణకేర్పాట్లు చేయుము. తైలముల చేతను, చందనాదుల చేతను శరీరముగా బాలుని అవయవముల నన్నిటిని రక్షింపప్రయత్న మొనర్చుము అని ఆదేశించాడు. శ్రీరాముని ఆదేశమును అనుసరించి లక్ష్మణుడా పనిలో నిమగ్నుడైనాడు. ఆ తరువాత పుష్పక విమానమును ధ్యానింపగా అది వచ్చి ఏమి చేయవలయునో ఆదేశించుమన్నది. శ్రీరాముడు మహర్షులకభివాదనమొనర్చి పుష్పకము నారోహించాడు. ధనుర్బాణములను, ఖడ్గమును చేబూనాడు ముందుగా పశ్చిమపు దిక్కుకు వెళ్ళి పరిశీలించాడు. తరువాత ఉత్తరమునకు వెళ్ళిచూచాడు. ఆ తరువాత తూర్పు వైపునకు వెళ్ళి పరిశీలించాడు ఎచ్చట అధర్మం కనిపించలేదు. దక్షిణమువైపున శైవలమను వింధ్యపాద పర్వతమున కుత్తరమువైపున ఒకసరస్సు ఆ సరస్సున తల క్రిందివైపు, పాదములను పైకి ఉంచి తపము చేయుచున్న ఒక తాపసుని చూచెను. సమీపించి “నాయనా! నీవెవరవు? నీకేమి అభిలాష కలదు? ఎందులకై తప మొనర్చుచున్నావు? బ్రాహ్మణుడవైతే నీకు శుభమే! క్షత్రియుడవైతే నీవు దుర్జయుడవౌతావు! వైశ్యుడవు, శూద్రుడవు అయితే నీవు సత్యమునే చెప్పుమ”నినాడు. శ్రీరాముని మాటవిని అతడు ఇట్లు చెప్పదొడగినాడు.

## డెబ్బైయైదవ సర్గము

“శ్రీరామా! నేను శమ్బుకుడనను ఒక శూద్రుడను. శరీరముతో పాటు దేవత్వమును పొందవలెనని కోరుకొని ఈ తపస్సు చేయుచున్నాను. దేవలోకమును గెలువవలెనను కోరికతో నేను అసత్యమాడుట లేద”నినాడు. ఆ మాట చెప్పగానే ధర్మప్రాధాన్యముతో శ్రీరాముని చేతిలోని ఖడ్గము శమ్బుకుని కంఠాన్ని ఛేదించింది. శ్రీరాముడు శంబుకుని కంఠమును ఛేదించే సరికి దేవతలు పుష్ప వృష్టిని కురిపించారు. నాయనా రామా! దేవతల కార్యమును నెఱవేర్చితివి. ఈ శూద్రుడు తపమున కర్హుడు కాడు నీకేమి కావలయునో కోరుమనినారు. శ్రీరాముడు బ్రాహ్మణ కుమారుడు బ్రతకవలెనని కోరినాడు. శూద్ర తాపసుని శిరస్సు ఛేదింపబడే సరికే బ్రాహ్మణబాలకుడు జీవించినాడు. బంధువుల వద్దకు చేరుకొనినాడు అని దేవతలు నీవు కోరక ముందే నీ కోరిక తీరినదని (గోవిందరాజీయము) చెప్పినారు. అగస్త్య మహర్షి తన ఆశ్రమమున 12 సంవత్సరముల నుండి జలశయన తపస్సును దీక్షను ముగించ నున్నాడు. మేమచ్చటికి వెళ్ళుతున్నాము నీవు కూడా మాతో రావలసినదని చెప్పగానే శ్రీరాముడు కూడా దేవతలతో కలిసి అగస్త్యుల వారి ఆశ్రమమునకు చేరుకొన్నాడు. అగస్త్యుడు తన దీక్షావసానమున వచ్చిన దేవతలను సమానముగా సత్కరించాడు. వారు అగస్త్యుని పూజనందుకొని వెడలిపోయారు. వారు వెడలి పోయిన తరువాత శ్రీరాముడు

పుష్పకము నుండి దిగి అగస్త్యుని ఆదరించి నమస్కరించాడు. ఆతిథ్యమును స్వీకరించి ఆసీనుడైనాడు. అగస్త్యుడపుడు రామునితో నిట్లనెను. "శ్రీరామా! నా అదృష్టవశమున నీవిచటికి వచ్చావు. మేము అతిథిని పూజించాలి. దేవతలు తపస్వి శూద్రుని చంపితివని బ్రాహ్మణ బాలకుని జీవింపజేసితివని చెప్పినారు. ఈరోజు రాత్రి ఇచటనే ఉండుము. రేపు ఉదయమే వెళ్ళవచ్చును. నీవు సాక్షాత్ శ్రీమన్నారాయణుడవు. నీవు సనాతనపురుషుడవు. సర్వభూత ప్రభువువు. ఇదిగో ఈ ఆభరణమును విశ్వకర్మ దివ్యశరీరధారియై నిర్మించి నాకిచ్చినాడు. దీనిని నేను నీకిచ్చుచున్నాను స్వీకరింపుము. పారితోషికముగా ఇచ్చిన దానిని తాననుభవించక మరొకరి కిచ్చినచో (గోవిందరాజీయము) మరింత పుణ్యము, నీవు యోగ్యుడవు. దీనిని భరింప ధరింప గలవాడవు స్వీకరింపుమన్నాడు. శ్రీరాముడా మాటను విని స్వామీ! మీరన్న మాట సబబేగాని దీనిని నేనెట్లు తీసికోదగుదును క్షత్రియులకు ఇచ్చుటయే గాని పుచ్చుకొనుట ధర్మము కాదు కదా" అనెను. అగస్త్యుల వారా మాటవిని "నాయనా! పూర్వము కృతయుగమున అందఱు బ్రహ్మత్వముతో నున్న సమయమున ప్రజలు ప్రజానాథునికై శ్రీబ్రహ్మను కోరారు. దేవతలకు ఇంద్రుని వలె మాప్రజలకు ఒక రాజు కావలెననిరి. బ్రహ్మ వారికై లోకపాలకులనందరిని పిలిచి వారి తేజోంశములను ఒక రాశిగా పోసి ఆరాశి నుండి రాజును సృష్టించాడు. అందులోని ఇంద్రభాగముతో రాజు పరిపాలించును. వరుణ భాగముతో పోషించును. కుబేర భాగముతో ఇచ్చును. యమ భాగముతో శాసించును, దండించును. నీవు కూడా రాజువే. ఇంద్రభాగముతో స్వీకరించుటకు, పరిపాలించుటకును అర్హుడవు" అని అనగానే మహర్షి వచనాను సారము శ్రీరాముడు ఆ ఆభరణమును స్వీకరించి ఆ ఆభరణము రాక గుఱించి అడిగెను. అత్యద్భుతమైన ఈ ఆభరణము ఎవరి నుండి లభించినది? చాలా విశేషమైన శక్తి కలది కదా కుతూహలముతో అడుగుతున్నాననెను. ఇట్లు పలికిన శ్రీరామునితో అగస్త్యుడు ఇట్లనెను. నాయనా! ఇదే త్రేతాయుగమున చాలా కాలమునకు ముందు ఒక సంఘటన ఇక్కడే జరిగినది. నేను చూచిన ఆ సంఘటనను వివరించెదనని చెప్పసాగాడు.

## డెబ్బైయారవ సర్గము

శ్రీరామా! నేను త్రేతాయుగారంభమున ఒక నిర్మానుష్యారణ్యమున తపస్సునకై యోగ్యమైన స్థలమునకై అన్వేషించుచుంటిని (ఆక్రమితుమ్ అనగా అన్ని విధాలా పర్యటించి సమగ్రముగ తెలిసికొనుటకు బయల్దేరితిని) (గోవిందరాజీయము) అట్లు సంచరిస్తుండగా నాకీ సరోవరం కనిపించింది. ఎవరూ లేని ఆ ప్రదేశమున ఆ రాత్రి గడపాను. అచట అంతా బంగారుమయమైన అడవిమయమైన ప్రదేశమని (సత్యతీర్థీయము) తెల్లవారగనే ఆ సరస్సు దగ్గఱకు వచ్చి చేరాను. ఆ సరస్సున ఒక పుష్టిమంతమైన శవాన్ని చూచాను. ఆ శవము చాలా కాంతి యుతంగా నుండింది. ఏమిటా అని ఆశ్చర్యముతో చూస్తూ ఉన్నాను. అటు నేను చూస్తుండగనే ఆకాశము నుంచి హంసల విమానంతో ఒక దివ్యపురుషుడు వచ్చాడు. అతని సేవకై ఎందరో అప్సరసలు వెంబడించి యుండినారు. వారు దివ్యగానములను పాడుచుండగా కొంతమంది నృత్య మొనర్చుచుండిరి. ఒక కొందఱు పరిహసించు కొనుచుండిరి. కొందఱు విసన కఱ్ఱలతో వింజామరలతో అతనికి వీచుచుండినారు. ఇంతలో విమానము నుంచి దిగిన ఆ దివ్యపురుషుడు ఆ శవమును భక్షించసాగాడు. భక్షించి ముఖము కడుగుకొని మరల విమానము

నెక్కబోగా నాకు కుతూహల మాగలేదు. "స్వామీ! మీరెవరు? ఈ ఆహారమేమిటి? ఇంత దివ్య శరీరము గల మీరీ శవభక్షణము చేయుటేమి? ఇది మీకు తగునా? అంతా ఆశ్చర్యముగా నున్నది, చెప్పెదరా?" అని అడుగగా సరే చెప్పెదనని ఇట్లు చెప్పనారంభించాడు.

## డెబ్బైయేడవ సర్గము

నేను విదర్భ దేశమునకు చెందిన సుదేవమహారాజునకు కుమారుడను. నేనాయన పెద్ద భార్యకు కుమారుడను శ్వేతుడని నాపేరు. చిన్న భార్యకు కుమారుడు మాతమ్ముడు సురథుడు. మానాన్నగారి తరువాత నేను రాజ్యాధికారము నొంది చక్కగా రాజ్యపాలన మొనర్చాను. నాకు సాముద్రికశాస్త్రం ప్రకారము ప్రాణోత్క్రమణ సమయం సమీపించిందని తెలిసింది. కాకులు దూరని ఈ కారడవిని చేరాను. ఇచటనే తపస్సు నారంభించాను. బయలుదేరుటకు ముందే మాతమ్మునికి సురథునికి రాజ్య మొప్పగించాను. మూడువేల సంవత్సరాలు తప మొనర్చాను. తత్ప్రభావమున బ్రహ్మలోకం చేరుకొన్నాను. అచటికి వెళ్ళినా నాకు ఆకలి దప్పుల బాధ తగ్గలేదు. బ్రహ్మదేవునే స్వయముగా అడిగాను. అప్పుడు బ్రహ్మ ఇట్లన్నాడు. నాయనా! నీవు తపస్సు చేసి శరీరమును వృద్ధి చేసికొని నావు కాని ఎవరికి కూడా ఇంత దానము చేయలేదు. ఒక సన్యాసికి గాని యాచకునికి గాని ఏమీ ఈయలేదు. దేవతా పితరులకైగాని, బ్రాహ్మణులకైగాని (గోవిందరాజీయము) తృప్తికరముగా ఆహారమును పెట్టలేదు. కేవలము దృఢ సమాధి కొఱకే తప మొనర్చావు. కనుక ఈ దోషం తొలగుటకు నీవు నీశరీరమునే ఆహారముగా భక్షించుము ఈ సరస్సులోని నీరు త్రాగుము. అగస్త్యమహర్షి ఇచటకు వచ్చే అంతవఱకు ఈ పనినే రోజూ నీవు చేయవలసి ఉంటుంది. ఆ అగస్త్య దర్శనముచే నీవు పాపవిముక్తుడవవుతానన్నాడు. కావున నేను ఈ శవాహారమును తింటూ నీకై ఎదురు చూస్తున్నానని ఆ దివ్యపురుషుడు నాతో అని, దయచేసి నన్ను తరింపజేయుము. నీకీ ఆభరణము నిస్తానని నన్ను ప్రలోభ పెట్టినాడు. ఇది భక్ష్య భోజ్యములను, వస్త్రాభరణములను, కావలసిన అన్ని పదార్థములను ఇచ్చు ఆభరణమని కూడా నాతో చెప్పినాడు. నేను ఆ దివ్యపురుషుని కోర్కెమీర ఈ ఆభరణమును తీసికొన్నాను. ఆ రాజర్షి శరీరము అంతటితో నశించింది. అతడు తృప్తిచెంది స్వర్గమునధివసించినాడు. ఆ ఆభరణమునే నేను నీకిచ్చితిని అని అగస్త్యుడు శ్రీరామచంద్రునితో అన్నాడు.

## డెబ్బైయెనిమిదవ సర్గము

శ్రీరాముడు అగస్త్యుని ఈ వనము పశుపక్షి మృగాలు లేనిదెట్లైనదని మరల ప్రశ్నించాడు. అగస్త్యుడిట్లు చెప్పాడు. పూర్వము మను చక్రవర్తికి ఇక్ష్వాకువను కుమారుడుండినాడు. అతనిరాజ్యమునందభిషేకించి తండ్రీ! నీవు అనేక రాజవంశములను స్థాపించుమన్నాడు. సరేనని ఇక్ష్వాకు వంగీకరించాడు. తండ్రి మరల సంతోషించి నాయనా! దండమును తప్పక పాటించవలెను. తప్పుచేసిన వారిని దండింపకపోయినా, చేయని వారిని దండించినా మహాపాపము. దాని వలన ధర్మము సిద్ధిస్తుంది. దండించుటకు తప్పక సిద్ధపడవలెను. లేనిచో నరకము, దండించిననే స్వర్గమని చెప్పాడు. అట్లు చెప్పి మనువు స్వర్గమునకు వెళ్ళాడు. దండము పరపీడాకరము కదా అని ఇక్ష్వాకువు ఆలోచించాడు. (గోవిందరాజీయము) ఆ తరువాత తనకు సంతాన మెట్లు కలుగునా అని ఆలోచించసాగాడు.

దైవికముగా సంతానము కలిగింది. అతనికి నూరుగురు కుమారులు కలిగినారు. అందఱి కంటే చిన్నవాడు మూర్ఖుడు, వినే స్వభావము లేనివాడు. వానికి దండుడని పేరు పెట్టాడు. వీనికి తప్పక దండము (శిక్ష) పడునని తండ్రి భావించాడు. వానికి నివాసముగా వింధ్య శైవల పర్వతాల మధ్యప్రదేశము నిచ్చాడు. దండకుడు ఆ ప్రదేశమున చక్కని నగరమును నిర్మింపజేశాడు. దానికి మధుమంతమని పేరు పెట్టాడు. శుక్రుని పురోహితు నొనర్చాడు. దేవరాజు బృహస్పతి మంత్రిగా స్వర్గమును పాలించినట్లు దండుడు శుక్రుని మంత్రిగా చేసుకొని మధుమంతమును పాలించుచుండేవాడు.

## డెబ్బైతొమ్మిదవ సర్గము

ఆ దండుడొకసారి భార్గవమహర్షి ఆశ్రమ ప్రాంతమున గల వనంలో విహరిస్తూ వుండినాడు. భార్గవుని కన్య అరజ అనునది దండకుని కంటపడెను. ఎవరు నీవు అని అడుగగా నేను భార్గవుని కూతురును, అరజ అని నన్నందురు అని ఆమె చెప్పింది. నేను మాతండ్రి అధీనములోనున్న దానిని, దయ చేసి నన్ను తాకవద్దని దండుని అభిప్రాయమును గమనించి అరజ ముందే సూచించింది. కాని దండుడు గమనింపక ఆమెను పదేపదే కోరసాగాడు. దయచేసి మానాన్న నడుగు ఆయన అంగీకరిస్తారు లేనిచో నీకు నాకు శిక్షపడుతుందని ఎంత అనునయించినా వినక అరజను దండుడు బలాత్కరించి ముందు నీవు నాకు కావాలి తరువాత నాకేమైతే నేమి అని నిర్లక్ష్యముగా అరజను ఆలింగించి మైథున మాచరించాడు. ఆ తరువాత మధుమంతమున కేగాడు. అరజ తండ్రి కోసమేదుస్తూ నిరీక్షించాడు.

## యెనబ్బైయవ సర్గము

దేవర్షి భార్గవు డొక ముహూర్త కాలమునకే అచటికి చేరి శిష్యుల వలన వృత్తాంతమును తెలిసికొని ఈ దండునికి సమయ మాసన్నమైనదని తీక్ష్ణముగా చూస్తూ ఈ ప్రదేశమంతా ఇప్పుడు రజోదూషితమౌతుంది. ధూళి వర్షము చేత ఈ దేశమంతా పశుపక్షి మృగాదులు లేని దౌతుంది అని శపించాడు. భార్గవుడట్లనుచుండగానే పెద్దగా దుమ్ము వర్షము కురిసింది. 7రోజులు దుమ్ము వర్షించునని తెలిసి ముందుగనే భార్గవుని సూచనాను సారము ఆ ప్రదేశమును విడిచి వనాంతమునకు ప్రజలు చేరినారు. దండకుడు ఆ ధూళి వర్షముచే హతుడై మరణించినాడు. భార్గవుడు తన కూతురును అరజను అచటనే ఆ సరోవరము ప్రక్కనే ఉండి తపస్సు అనుష్ఠానమును చేసి కొమ్మన్నాడు. దుర్మేధే అను శబ్దమునకు పుంలింగ మేధ శబ్దమును తీసికొని దానికి యజ్ఞమను అర్థమును చెప్పి యజ్ఞాదులు (కష్టమైనవి) ఉండుచోటున అని చెప్పుట సత్యతీర్థులప్రతిభానిదర్శనము. ఇది నీవడిగిన ప్రశ్నకు సమాధానము. అప్పటి నుండి మధుమంతమను నగరము, దండకుడు అందఱు వినాశము నొందారు. అప్పటి నుండి ఈఅరణ్యము దండక వనమైనది. సంధ్యా సమయమైనది. విశ్రాంతి తీసికొందమని అగస్త్యుడు ఆ కథను పూర్తి చేసి సంధ్యోపాసన కుపక్రమించాడు.

## యెనబ్బైయొకటవ సర్గము

అగస్త్య మహర్షి వచనానుసారము శ్రీరామచంద్రుడు అచటి వారితో కలిసి సాయం సంధ్యోపాసన చేశాడు. ఆ రాత్రి శ్రీరామచంద్రునికి ఋషులకు, కందములను, సస్యమూలములను, మూలములను, భూమిలోని పొడుగు కాడలను, వేరుశనగ వంటి బీజములను, ఔషధములను, ఆరోగ్యప్రదములైన అమృత వల్ల్యాదులను, శాల్యాదులను పప్పు, బియ్యము మొదలగు పదార్థములను అనేక విధములుగా (ఇది సత్యతీర్థానుసారము గోవిందరాజీయాను సారము కందమూలములు ఒకే విధములు నాగోజీ భట్టు అను సారము కందమూలములోకే రూపము కాని సత్యతీర్థ ఖండితము) ఆహారములను ఏర్పాటు చేయగా ప్రీతితో ఇచ్చిన వాటినన్నిటిని స్వీకరించి ఋషికి అభివాదన మొనర్చి తన ఆశ్రమమునకు (సీతా వియోగము వలన శ్రీరామునికి తన ఇల్లు కూడా ఆశ్రమమే అని సత్యతీర్థులు నిజానికి గృహస్థత్వము కూడా ఆశ్రమమే) బయలుదేరననుజ్ఞనొందాడు. మరల మరల నన్ను పవిత్రుని చేసికొనుటకు (గోవింద రాజీయము) లోకదృష్ట్యా నన్ను తత్త్వదృష్ట్యా నిన్ను కూడా పవిత్రుని చేయుటకు (సత్యతీర్థానుసారము) ఆశ్రమమునకు వచ్చెదనని శ్రీరామచంద్రుడనగా ధర్మనేత్రుడు, జ్ఞానసాధనము గల (గోవిందరాజీయము) శ్రీరామునితో అగస్త్యుడు. “నీవే సర్వ భూతపావనుడవు. నిన్ను చూస్తే అందఱు పవిత్రులగుదురు నిన్ను క్రూరముగా చూచినవారు నరకము నొందుదురు. వెళ్ళుము రాజ్యమును ధార్మికముగా పరిపాలించుము” అని చెప్పగా మరల ఒకసారి వినయావనతుడై శ్రీరాముడు అభివాదన మొనర్చి అచటి నుండి బయల్దేరాడు. పుష్పకము నెక్కి మేఘము వద్ద నున్న చంద్రునివలె ప్రకాశించి, శ్రీరాముడు మధ్యాహ్నమునకు అయోధ్యానగరికి చేరుకొన్నాడు. పుష్పకమును పంపివేసి భరత లక్ష్మణులకు తన రాకను తెలుపుమన్నాడు.

## యెనబ్బైరెండవ సర్గము

శ్రీరాముని వచనానుసారము ద్వారపాలకుడు భరత లక్ష్మణులను తీసికొని వచ్చాడు. వారితో శ్రీరాముడు నాయనలారా! బ్రాహ్మణ కార్యమును సాధించితిని. ఇతఃపరము ధర్మమార్గమును సాధించవలసియున్నది. ధర్మసాధనమే ప్రజానాయకులకు, రాజులకు ముఖ్యకర్తవ్యము. ఆ ధర్మము యజ్ఞముల ద్వారా సిద్ధిస్తుంది. కనుక రాజసూయ యాగము చేయదలచితిని అన్నాడు. భరతుడా మాటలను విని. “అన్నా! నిజమే నీవే ధర్మస్వరూపుడవు నిన్ను ప్రజలందఱు అనుసరిస్తున్నారు. మహారాజులు సామంతులు కూడా. అందరికి గతివి పతివి ప్రభువువు. కావున నిన్ననుసరించుటయే ప్రజలకు క్షేమము. కాని రాజసూయము చేసి రాజులందరిని చంపుట యుక్తము కాదు” అన్నాడు. భరతుని మాటలను విని శ్రీరాముడు సరేనని పలికి నాయనా! ఇతర రాజులందఱు ఈ అభిప్రాయమునకు రావలయునను దృష్టితోనే నిట్లు పలికితిని. కావున లోకపీడాకరమైన పనిని మనము చేయరాదు .‘బాలాదపి సుభాషితమ్’ అనుమాటను నేను కూడా పాటింతునన్నాడు.

## యెనబ్బైమూడవ సర్గము

శ్రీరామ భరతుల సంవాదమును విని, లక్ష్మణుడు ఒక మాట అనెను. అన్నా! రాజసూయమున కన్న అశ్వమేధ యాగము మిన్నకదా! అశ్వమేధము చేసినవారు సర్వదోష విముక్తులగుదురని వేదము చెబుతున్నది పూర్వము వృత్రాసురుడను ఒక రాక్షసుడుండేవాడు. వాని ఎత్తు మూడువందల యోజనాలు, వెడల్పు వందయోజనాలు

ధర్మబద్ధముగా బుద్ధితో పరిపాలించు అతనికి తపస్సు చేయలెనను బుద్ధి పుట్టింది. లోకములను లోకాంతరములను ఆక్రమింపవలెనని భావించాడు. లోకముల నన్నింటిని తపశ్శక్తితో ఆక్రమింపసాగాడు. అతని స్థితిని, శక్తిని గమనించి విష్ణువును శరణ మొంది, ఇంద్రుడు వృత్రాసురుని శక్తినంతా తెలిపాడు. నీవు కోపిస్తే తప్ప వృత్రాసురుడు నిలువ లేడు. కాబట్టి విష్ణో! నీవు వృత్రాసురుని చంపవలెనని దేవతలు, ప్రజలందఱు భావిస్తున్నారని ఇంద్రుడు విష్ణువును ప్రార్థించాడు.

## యెనబ్బైనాల్గవ సర్గము

లక్ష్మణుని మాటలను విని శ్రీరామచంద్రుడు వివరముగా చెప్పుమన్నాడు. బాల్యచాపలముచేత నేను అన్నకు వృత్రవధ వృత్తాంతము చెప్పవలయునా! అన్నకు తెలియదా! అని మధ్యలో విరమించిన లక్ష్మణుని ప్రేమ భావముతో ప్రోత్సహించినాడని సత్యతీర్థులవివరణముత్తమముగా నున్నది. ప్రకృతోపయోగి అగుట వలన దివ్యమగు ఆ కథను వ్రతబద్ధుడైన లక్ష్మణుడు ఈ విధముగా చెప్పనారంభించాడు. అప్పుడు ఇంద్రుని మాటలను శ్రీమహావిష్ణువు దేవతలతో నిట్లన్నాడు. మీరంతా కోరడము వలన మీభక్తికి (గోవిందరాజీయము) సౌహృదమునకు ప్రేమకు (సత్యతీర్థీయులు) బద్ధుడనై ఒక విషయమును చెప్పుతున్నాను. నేను స్వయముగా వృత్రాసురుని చంపరాదు. కాని మీకు సుఖాన్ని కలిగించే ఒక పనిని చేస్తాను. నేను 3 భాగాలుగా నన్ను విభజించుకొని ఒక భాగము ఇంద్రునికి, మరొక భాగము వజ్రము (ఆయుధము) నకు, మూడవభాగము భూమికి సమర్పించుకొని వృత్రవధకు సహకరిస్తాను. మీకు పరాజయము కలుగకుండా ఉండుటకై ఎట్లు చంపవలయునో ఉపాయమును చెప్పుచున్నాను అని ఒక అంశము ఇంద్రునిలో ప్రవేశించుట, ఒక అంశము వజ్రాయుధములో ప్రవేశించుట బాగుగనే ఉన్నది కాని భూమి యందు ప్రవేశించుట ఎందులకు? అను ప్రశ్నకు గోవిందరాజీయమున పడిపోయిన వృత్రుని దేహమును ధరించే శక్తి భూమికి కలుగుటకును, వృత్రుని సంహరించుట వలన ఇంద్రునికి బ్రహ్మహత్యా దోషము వస్తే ఆ పాపనివృత్తి జరిగేంత వఱకు ఈ భూమిని రక్షించుటకును, భూమియందు భగవదంశ ప్రవేశమని విశేషము చెప్పబడినది. అట్లు భగవంతుని ఆదేశమును గైకొని దేవతలు వృత్రునితో తలపడుటకు సిద్ధమైనారు. అది గమనించి వృత్రాసురుడు మహాభయంకరమైన తన శరీరముతో గర్జనచేయుచు, లోకాలను త్రాగివేస్తున్నట్లుగా నుండినాడు. అందఱు హాహాకారమును చేయుచుండిరి. ఆ సమయమున భగవానుని హస్తముతో కలిసిన ఇంద్రుని హస్తముతో కావుననే పాణిభ్యాం అని ద్వివచనమని సత్యతీర్థులవ్యాఖ్య. ఆ విధముగా కుడి రెండు చేతులతో వజ్రాయుధము నెత్తి వృత్రాసురు నెత్తిపై కొట్టాడు. వృత్రుని శిరస్సు భూమిపై పడేసరికి లోకాలకు కలకలము కలిగెను. వృత్రాసురుని హత్య బ్రహ్మహత్యయే కనుక పాపము మాత్రము అమాయకుడైన ఇంద్రు నాశ్రయించి వెంట పడి సాగెను. ఇంద్రుడు లోకాలోక పర్వతాలను కూడా దాటి ఎలాగో ఆ బ్రహ్మహత్య అంటకుండా పారిపోయాడు. అయినను అది విడవకుండా (త్వష్ట ప్రజాపతిచే నిర్మింపబడిన దగుట వలన) ఇంద్రుని ఆవేశించింది. ఏమి చేయవలెనో పాలుపోని దేవతలకు భగవానుడే అశ్వమేధయాగము చేసి పాపమును పోగొట్టుకొనవలసినదిగా సూచించాడు.

## యెనబ్బైయైదవ సర్గము

ఈ విధముగా వృత్రవధ వృత్తాంతమును చెప్పి మిగిలిన కథ నీవిధముగా చెప్పనారంభించినాడు లక్ష్మణుడు. బ్రహ్మహత్యాదోషగ్రస్థుడైన ఇంద్రుడు ఎవరికి తెలియకుండా పారిపోయేసరికి త్రైలోక్యాధిపతి లేకపోవుటచే (ఇంద్రుని పాలన లేకపోవుట చేత) భూమియందు స్నిగ్ధత్వము తగ్గి, అనావృష్టి ఏర్పడి, నదులు, చెఱువులు, బావులలో నీరు తగ్గి పెద్ద సంక్షోభ మేర్పడింది. అప్పుడు శ్రీమహావిష్ణువు చెప్పిన అశ్వమేధయాగం చేయుటకు, దాని వలన ఇంద్రుని దోషమును వారించుటకు దేవతలు సంకల్పించినారు. ఇంద్రుడెచ్చట నున్నాడో అక్కడికి వెళ్ళి ఇంద్రునిచే సంకల్పము చేయించి యాగమును పూర్తిచేసినారు. యాగము పూర్తికాగానే బ్రహ్మహత్య ఇంద్రుని నుంచి వేరై నేను తొలగిపోతాను కాని చోట్లను చెప్పుమన్నది. ఆ చోట్లలో మాత్రముండెదనన్నది. మహేంద్రునిలోను, మహేంద్రుని వదలి వేరొక చోటను ఉండజాలని దాయెను. (గోవిందరాజీయము) కనుక దేవతలు దానిని 4 భాగాలుగా విడిపోయి నాలుగు చోట్ల ఉండుమన్నారు. అప్పుడు బ్రహ్మహత్య అట్లే అని అంగీకరించి ఒక భాగముతో ప్రవాహముతో నిండిన రోజులలో నదులలో నాల్గు నెలలు ( ఇచట నెల పక్షవాచకము నాల్గు పక్షములు సింహ కర్కటక మాసములు) (గోవిందరాజీయము) నదులను రజస్వలనుగా చేసి బ్రహ్మహత్య ప్రవేశించెను అనగా ఆ రెండు నెలలలో ప్రవాహము నిండుగా ఉన్నప్పుడు నీరు నురగగా ఉన్నప్పుడు నదులను రజస్వలలనుగా బ్రహ్మహత్యా దోష యుక్తలునుగా భావించాలని అర్థము. ఇచ్చట దర్పఘ్నీ అనగా పాపాత్ములకు గర్వమును పోగొట్టు దానననీ, కామవారిణీ అనగా పుణ్యాత్ములకు, స్నానమును కోరువారికి కోరికలను పోగొట్టుదానననీ బ్రహ్మహత్య చెప్పినదని గోవిందరాజీయ విశేషము. ఇక భూమి యందు చవిటి నేలలలో ఉందునని రెండవ అంశమును చెప్పెను. ఇక మూడవ అంశమును యౌవనవతులైన స్త్రీలలో మూడు రాత్రుళ్ళు వారి దర్పమును గర్వమును తగ్గించుచు వారిని నియమిస్తూ వారిలో రజోరూపమున నుందునని ఆ సమయములో ఆ స్త్రీలు పురుష సంభోగ సుఖము నొందకుండ ఉండవలెనని బ్రహ్మహత్య చెప్పింది. ఇక నాలుగవ భాగముతో బ్రాహ్మణులను, బ్రహ్మజ్ఞానులను సంహరించువారిలో జ్ఞానమును వేదవిజ్ఞానమును భ్రష్టు పట్టించువారిలో, వేదాలకు దురర్థములను చెప్పువారిలో నుందునని చెప్పింది. ఆ విధంగా బ్రహ్మహత్యా దోషము తొలగి అశ్వమేధయాగప్రభావమున ఇంద్రుడు శుద్ధుడయ్యాడు. నీవు కూడా అశ్వమేధ యాగ మొనర్పవలెనని లక్ష్మణుడనగా శ్రీరాముడు సంతోషించాడు.

## యెనబ్బైయారవ సర్గము

లక్ష్మణుడు చెప్పిన కథను విన్న శ్రీరామచంద్రుడు తనకు కూడా అశ్వమేధవైభవము తెలుసునన్నట్లుగా (గోవిందరాజీయము) చిరునవ్వు నవ్వి. లక్ష్మణా! నీవన్నది నిజమే అని, తనకు తెలిసిన కథను చెప్పనారంభించినాడు. పూర్వము కర్దమ ప్రజాపతికి బాహ్లీశ్వరుడు అగు ఇలుడను పేరు గల కుమారుడుండినాడు. అతడు రాజుగా సర్వభూమిని చక్కగా పరిపాలించాడు. పృథివినంతటిని జయించి ప్రజలను కన్నబిడ్డలనువలె పాలించాడు. భయములేని వాడు, పరాక్రమము కలవాడు, పరమ–ఉదారుడు. ఒకసారి ఆతడు వేటకై సైన్యముతో పరిజనముతో వెళ్ళాడు. ఉత్తరమున హిమాలయమున ఆ సమయమున పార్వతితో పరమేశ్వరుడు విలాసంగా సుఖంగా గడపుటకై స్త్రీ రూపం ధరించాడు. అంతేకాక ఆ ప్రదేశమున పురుషులని భావించువారందరిని స్త్రీలను చేశాడు. పుంలింగ

నపుంసక లింగ శబ్దములు గల పదార్థములను కూడా స్త్రీలింగ శబ్దములుగల వానిగా చేశాడు. ఈ ఇలుడు అతని సైనికులు పరివారము కూడా అందఱు ఆ కుమారవనమును ప్రవేశించుట తోడనే స్త్రీలై పోయారు. కర్దమ కుమారుడు (ఇలుడు) సంగతినర్థము చేసికొని పరమేశ్వరుని శరణుపొందాడు. మరొక వరమును కోరుకొమ్మనగా ఇలుడు నిరాకరించి మరల పుంస్త్వమునే ఇమ్మన్నాడు. అప్పుడు స్వయంగా పరమేశ్వరుడు పార్వతిని భక్తుని కోరికను దీర్చుమన్నాడు. పార్వతి తన ఇచ్చను భంగపఱచుటకిష్టము లేక ఒక మాసము స్త్రీగా, ఒక మాసము పురుషుడుగా నుండుటకు అనుమతించింది. అనగా శివుడు సగము వరము నిచ్చును, నేను సగము వరము నిత్తునని పార్వతి అన్నదని అర్థము. (గోవింద రాజీయము) ఒక మాసము స్త్రీగా ఉన్నప్పుడు పురుష భావములోని విషయములనుగాని పురుషుడుగా ఉన్న మాసమున స్త్రీ భావములోని విషయములను గాని స్మరించలేవని కూడా పార్వతి వివరించెను. ఈ విధముగా ఆతడు "ఇల" గా ఇలుడుగాను ఉండెను. ఈవిషయము శ్రీమద్భాగవతములో మరొక విధముగా నున్నది. మనుకుమారుడు ఇలుడు (సుద్యుమ్నుడు) శ్రాద్ధదేవుని భార్య స్త్రీ సంతానము కావలెనని కోరి హెూమము చేయు హెూతతో స్త్రీసంతాన సంకల్పమును చేయగా స్త్రీగా మారినదని మరల విష్ణు అనుగ్రహము వలన పురుషుడుగా మారినాడని. (అంతకు ముందు మునులు ప్రవేశించుట వలన తమ సుఖమునకంతరాయము కలుగకుండుటకై ఉమాదేవి సంతోషమునకై కుమారవనమున ప్రవేశించినవారు స్త్రీలగుదురను శాపముండుట వలన) కుమారవన ప్రవేశము వలన స్త్రీగా మారెనని, తరువాత శివుని గుఱించి తీవ్రముగా తపము చేయుట వలన గురు అనుగ్రహము వలన పురుషుడుగా మారెనని కథ వివరింపబడినది. హరివంశమున మనువునకు మిత్రావరుణుల అంశచే స్త్రీ సంతానము కలిగినదని, నాకు స్త్రీ సంతానమక్కర లేదనగా మరల మిత్రావరుణుల దగ్గఱికి అమ్మాయి వచ్చినదని మాకక్కర లేదని వారు వైవస్వతమనువు వద్దకు పంపగా అతడు మరల కూడా నాకక్కర లేదనినాడని చివరకు అమ్మాయి! నీవు మాపుత్రికవే అని మిత్రావరుణులు తీసికొనినారని, మనువుకు మగసంతానము కావలెను కనుక నీవే మనువుకు సుద్యుమ్నుడవను కుమారుడవని వేరొక విధముగా కథ కలదు, బాలభారతమున బుధుడు కర్దమ పుత్రికను ఇలను స్వీకరించెనని కథ ఉన్నది. ఈ భేదములన్నియు కల్పభేదము చేతనే అని భావించవలెనని సత్యతీర్థుల విశేష వివరణము కలదు.

## యెనబ్బైయేడవ సర్గము

ఇలుడు ఇల ఐన వృత్తాంతమును విని తరువాత ఏమైనదని లక్ష్మణ భరతులు కుతూహలపడగా శ్రీరాముడు ఈ విధముగా చెప్పాడు. అమ్మవారి అనుగ్రహముతో స్త్రీగా మారిన ఇల (ఇలుడు) త్రిలోక సుందరియై తన చెలికత్తెలు సేనానాయికలతో (చెలికాండ్రు సైనికులతో) ఆ అడవిని దాటి మరొక అడవిలో విహరించుచుండినారు. అచట ఒక సరస్సు సమీపమున. చంద్రుని కుమారుడు సర్వజన మనోహరుడైన బుధుడు తపస్సు చేస్తుండినాడు. ఆ జలాశయమున ఆడుకొనుచున్న వీరిని చూచి బుధుడు మీరు కింపురుష స్త్రీలగుదురు, వనమున కుటీరములను ఏర్పఱచుకొని ఉండుడు. మిమ్ము మంచి కింపురుషులు పెండ్లిచేసికొనెదరు అని అన్నాడని చెప్పి మార్పువచ్చే ఆవర్తినీవిద్యను ఉపాసించినాడు బుధుడు. బుధుని మాటను విని వారు కింపురుష స్త్రీలై ఆ పర్వతమునందే నివసించారు.

## యెనబ్బైయెనిమిదవ సర్గము

ఆ తరువాత బుధుని మాటకు కట్టుబడి ఉన్నా ఒకరు ఒకరుగా ఆ ప్రదేశమునుండి వెళ్ళిపోయారు. ఇల మాత్రము అదే విధముగా బుధునిపై ఆసక్తి కలదై బుధునికి వశమయింది. బుధుడు ఆమెకు కావలసిన సకల సుఖములను ఏర్పరచి తనను పెండ్లి చేసికొను మనగా నేను స్వేచ్ఛ గలదానినే మీయిష్టమని ఇష్టపడెను, వారిద్దరు సుఖముగ నుండి కాలక్షేపము చేస్తుండగా పార్వతి శాపమును మఱచిపోయి ఉండగా (గోవిందరాజీయము) ఒక రోజు బుధుని ప్రక్కలో పడుకొనిన ఇల మాసము గడచేసరికి తెల్లవారే సరికి ఇలునిగా మగవాడుగా మారింది. తన విషయము నంతటిని చెప్పగా బుధుడు ఓదార్చాడు. ఈ వికారముతో నేను రాజ్యమేల లేననగా సరే నీవిచటనే ఉండు మని బుధుడే అతనికి సర్వవ్యవస్థల నొనర్చి స్త్రీగా మారినప్పుడు ఇలగా ఉన్న ఆమెతో సుఖముల ననుభవిస్తూ ఉండినాడు. క్రమముగా ఇల గర్భవతియై నవమాసముల అనంతరము చక్కని కుమారుని కన్నది. ఆ కుమారునికి చక్కని ధర్మములను చెప్పింది.

## యెనబ్బైతొమ్మిదవ సర్గము

ఒక సంవత్సరము పూర్తిగా స్త్రీగా ఉండి 9నెలలు పూర్తికాగానే ఇల కుమారుని ప్రసవించింది. అంతవఱకు బుధుని తపః ప్రభావము వలన స్త్రీరూపముగనే ఉండినది. కుమారుడు కలిగిన వెంటనే పురుషుడుగా మారిన ఇలుని ఉద్ధరించుటకై సంవర్తుని చ్యవనుని అరిష్టనేమిని ఇతర మహర్షులను దుర్వాసాదులను రావించి బుధుడు ఇలునికి పూర్ణ పురుషత్వమును కలిగించడానికి ఉపాయమునాలోచించుడనగా వారు విష్ణ్వారాధనమునకన్న మరొక మార్గమేమున్నది (గోవిందరాజీయానుసారము) కనుక అశ్వమేధయాగము విష్ణువుయొక్క ఆరాధనమే అని వారు నిర్ణయించారు. పూర్వము సంవర్త మహారాజు కుమారుడు మరుత్తు అశ్వమేధయాగము చేసి రుద్రుని సంతోష పఱచినాడు. అట్లే మనము అశ్వమేధయాగమొనర్చి శివుని సంతోషపఱచుదమని వారు నిర్ణయించారు. ఇచ్చట అశ్వమేధయాగము రుద్రప్రీతికరమా, విష్ణుప్రీతికరమా అను చర్చనారంభించి చాలాసార్లు రుద్రప్రీతికరమని మూలములోనుండుటను గమనించి గోవిందరాజాచార్యులవారు యజ్ఞము విష్ణుప్రీతికరమే, విష్ణుప్రీతికరమైన యజ్ఞము వలన రుద్రుడు కూడా ప్రీతుడగునని మాత్రమే అర్థము చెప్పవలెనని నిర్ధారించినారు. శ్రీ సత్యతీర్థులవారు రుద్రశబ్దమునకు హరిహిరణ్యగర్భరుద్రులని మూడు అర్థములు వచ్చునని ముగ్గురికి ప్రీతికరము అశ్వమేధ యాగమని నిరూపించినారు. ఆ విధముగా వారు ఇలునిచే అశ్వమేధ యాగమును చేయించగా శివుడు సంతసించి బ్రాహ్మణుల కోరిక మేరకు ఇలకు పురుషత్వము నిచ్చి అంతర్ధానమొందినాడు. అప్పుడు ఇలుడు బాహ్లినగరమును విడచి ప్రతిష్ఠానపురమున తన రాజ్యనిర్వహణవ్యవస్థ నొనర్చినాడు. ఆ ఇలుని కుమారుడు ఐలుడు పురూరవుడు. ప్రతిష్ఠాన పురాధీశుడైనాడు. ఈ విధంగా అశ్వమేధయాగం వలన స్త్రీగా ఉన్న ఇల పురుషరూపం పొందినదని శ్రీరాముడు తన సోదరులకు చెప్పినాడు.

## తొంబైయవ సర్గము

తన ఇద్దఱు సోదరులకు అశ్వమేధయాగము యొక్క కర్తవ్యత్వమునుపదేశించి శ్రీరాముడు మఱల ఇట్లనినాడు. నాయనలారా! మీరు సంకల్పించినట్లు నేను అశ్వమేధయాగమును చేస్తాను. వసిష్ఠుని, వామదేవుని, జాబాలిని,

కాశ్యపుని ఇతర ద్విజులను అశ్వమేధయాగమునకు ముందుగా చేయవలసిన కర్తవ్యములకై సూచనల నిమ్మని చెప్పండి! సులక్షణ, సమ్పన్నమైన గుఱ్ఱమును శాస్త్రీయపద్ధతిననుసరించి దేశప్రదక్షిణమునకై దిగ్విజయమునకై పంపవలసియున్నది అని అనగానే లక్ష్మణుడు బ్రాహ్మణులను, పురోహితులను రావించినాడు. వారిని సగౌరవముగా సభాంగణమునకు తోడ్కొని వచ్చి శ్రీరాముడు పాదాభివందనము చేసినాడు. శ్రీరాముని వారు ఆశీర్వచనములచే అభినందించినారు. చేతులు జోడించి వారితో శ్రీరాముడిట్లనినాడు. "ఋషులారా! మీ ఆదేశము ననుసరించి నేను అశ్వమేధయాగమును చేయదలచినాను. కర్తవ్యము నుపదేశించుడు" అని. శ్రీరామునిమాట వినినంతనే వారు వృషధ్వజుడగు శివునికి నమస్కరించి అశ్వమేధయాగమునకు అధిష్ఠానదేవత కనుక శివునికి నమస్కారము. అట్లు నమస్కరించి అశ్వమేధయాగమునకు కావలసిన సంభారములనొనర్చినారు. ఇచ్చటి గోవిందరాజీయ మీ విధముగానున్నది. వృషము ఎద్దు ధ్వజముగా గల శివునికి నమస్కరించుట అనునది ఎత్తి పొడుపు, మాట అనగా ఇలునివలె రుద్రుని ఆరాధించడం అనే పనిని చేయకుండగనే అని అర్థము చెప్పాలి. కర్దముడు చేసిన యాగమునకు వలె ఇచటఈ యాగమునకు రుద్రుని వలన ఏమీ ప్రయోజనము లేదు. కనుక పరదేవతనుద్దేశించి మాత్రమే యాగము చేయ నిశ్చయింపబడినదని అర్థము. రుద్రుడు ఏ యజ్ఞమునకు అర్హుడు కాడు. కేవలము శూద్రులకు మాత్రము ఆరాధ్యుడు. యజ్ఞములో ఎచ్చట రుద్రప్రసక్తి వచ్చినా నీరు ముట్టుకొనవలయునని ప్రాయశ్చిత్తము చెప్పబడింది. ఇమం పశుం పశుపతే తే అద్య బధ్నామి అని గుఱ్ఱమును కట్టివేయునప్పుడు చెప్పబడే మంత్రమున పశుపతే అను శబ్దమునకు శివుడు అని కాక అగ్ని అను అర్థమే సబబుగా నుంటుంది. కర్దముడు చేసిన యాగమునను రుద్రుడు యజ్ఞమున ఆరాధ్యుడు కాదు, కాని తనకు అభీష్టుడైన విష్ణువు నారాధించుటచే రుద్రుడు కూడా ప్రసన్ను డయ్యాడని అర్థము. "యజ్ఞో వై విష్ణుః" అని యజ్ఞము విష్ణుస్వరూపముగనే ఆరాధింపదగినదని సమర్థించాలి. లేదా విష్ణువుచే వరమీయబడినవాడు కనుక రుద్రునికి పూజ. నిజమునకు విష్ణువునకే పూజ.

శ్రీరాముడైతే అశ్వమేధమును విధిపూర్వకముగనే నిర్వర్తించినాడు. ఋషుల సూచనలననుసరించి శ్రీరాముడు లక్ష్మణునితో ముందు దూతలను పంపి యాగమునకై అందరిని ఆహ్వానింపవలెనన్నాడు. ముందుగా సుగ్రీవునికి వానర పరివారముతో రావలసినదిగా హనుమదంగదాదులతో యజ్ఞమునునుభవింపవలసినదిగా చూడవలసినదిగా అందులకై రావలయునని కబురు పంపినాడు. అట్లే విభీషణుడు అతని రాక్షసపరివారముతో రావలయునని శ్రీరాముడు కబురంపినాడు. ఇట్లే దేశ దేశాంతరాలలో నున్న ద్విజులను ఋషులను, తపోధనులను శ్రీరాముడాహ్వానించినాడు. నటులు నర్తకులు కూడా ఆహ్వానింపబడినారు.

గోమతీ నదీతీరమున నైమిశారణ్యమున యజ్ఞవేదిక నిర్మింపబడినది. అది పుణ్యప్రదేశమని పేర్కొనబడినది. అంతట శాంతిక్రియలు జరగాలి. వందలకొద్ది ధర్మశాస్త్రజ్ఞులు ఈ యజ్ఞమునకు రావాలి అని శ్రీరాముడు లక్ష్మణున కాదేశముల నిచ్చినాడు. నైమిశమున జరిగే ఈ యజ్ఞమునకు ప్రజలందఱు వచ్చి చూచి ప్రసాదమును స్వీకరించి తృప్తి పడి వెళ్ళుదురని శ్రీరాముని సూచన. లక్ష ఎద్లు, ఎద్లు బండ్ల మీద బియ్యము, నువ్వులు, పెసలు, శనగలు, మినుములు, బొబ్బర్లు, ఉప్పు, నూనె, ధనియాలు మొదలైన సుగంధ ద్రవ్యములు, బంగారు ముద్రలు వెండి

వస్తువులు, వీటినన్నిటిని భరతుడు ముందుగా నైమిశారణ్యమునకు చేర్చాలి. అమ్మవలసిన పదార్థములను వ్యాపారులు తీసికొని వెళ్ళవలయును. వేదవేత్తలైన పెద్దలు, పిన్నలు, నటులు, నర్తకులు, వంటవారు, యువకులు, యువతులు, సైనికులు వీరంతా ముందే భరతునితో బయలుదేరాలి. పని వాళ్ళు, మంగళ్ళు స్తుతిపాఠకులు, వడ్రంగులు, శాలా నిర్మాపకులు కోశాధ్యక్షులు కోశము కూడా సాగాలి. మా అమ్మలు, మా మరదళ్ళు, నాబంగారు సీత కూడా యజ్ఞదీక్షకై రావలసిందే అన్నాడు శ్రీరాముడు. మేనాలు, పల్లకీలు కూడా ఎక్కి పెద్దవాళ్ళు కూడా రావాలి. భరతుడు ఈ వ్యవస్థ అంతా చేయాలని అన్నాడు శ్రీరాముడు. "స్వర్ణసీత" అంటే నిజమునకు సీతయే, ఆమె రామునికి మాత్రము కనపడుతూ ప్రక్కనే ఉంటుంది. మిగతావారికి కనిపించదు. దేవతల మాట ప్రకారము రామునికి దగ్గరగనే ఉంటుంది. పామరులకు దూరముగా ఉంటుంది. కనుక స్వర్ణసీతను బంగారుసీతను దగ్గఱ ఉంచవలయునని శ్రీరాముని అభిప్రాయమని సత్యతీర్థులవ్యాఖ్య.

## తొంబైయొకటవ సర్గము

ఒక శుభముహూర్తమున శ్రీరాముడు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాడు. మంచి లక్షణసంపన్నమైన దృఢకాయము గలిగిన, బాగా మోయగలిగిన, యుద్ధ తంత్రములను తెలిసిన, ఎక్కువ భాగము నలుపుగాను (గోవిందరాజీయము) చెవిలో ఒకవైపు నలుపు రంగు కలిగిన చాలా దూరము తిరుగుటచే నల్లబడిన (సత్యతీర్థము) చక్కని గుఱ్ఱమును విడిచాడు. దాని వెంట లక్ష్మణుడు ఋత్విక్కులతో భూప్రదక్షిణ మొనర్చి వచ్చుటకై ఏర్పాట్లు జరిగాయి. శ్రీరాముడు సైన్య పురస్సరుడై యజ్ఞశాలలో ప్రవేశించాడు. ఆ ఏర్పాట్లను చూచి చాలా ఆనందించాడు. అశ్వమేధయాగాశ్వాన్ని నాల్గువందల మంది రక్షిస్తూ వెంబడించవలెనని, వందమంది రాజపుత్రులు అధ్వర్యుడు అనుసరించవలెనని శ్రుతిప్రమాణమును గోవిందరాజీయము చూపింది. శ్రీరాముడు నైమిశారణ్యమునకు చేరుసరికి వివిధ ప్రాంతముల నుండి వచ్చిన సామంతరాజులు శ్రీరామునికి యజ్ఞసంభారములుగా వివిధములైన కానుకలనందించారు. పెద్ద మేనాలు పల్లకీలు వచ్చాయి. అందు ఎందరో వృద్ధులు, పెద్దలు వచ్చినారు. అన్నపానీయములు అవసరమునకు అనుగుణముగా ఏర్పఱచబడినవి. కావలసిన వారికి కావలసిన రీతిలో భరతుడు శత్రుఘ్నుడు మర్యాదల నొనర్చినారు రాజులు పూజింపబడినారు. ఋత్విజులు గౌరవింపబడినారు. రాజులను భరతశత్రుఘ్నులు, విప్రులను సుగ్రీవుడు, వానరులు, బ్రహ్మర్షులను, విభీషణుడు సద్రాక్షస గణము పూజించినారని (గోవిందరాజీయము)తాత్పర్యము. గుఱ్ఱము బయల్దేరినది.

మొదలు సంవత్సరము వఱకు అన్ని ఏర్పాట్లు అందఱికి చాలా బాగా జరిగినవి. లక్ష్మణుడు గుఱ్ఱము ననుసరించి యుండెను. ఇవ్వండి, పెట్టండి, తినండి, తీసికోండి అనే శబ్దాలే తప్ప మరొక శబ్దము ఎవరినోటినుండి రావడం లేదు. అందఱు సహజ ఔదార్యముతో యాగమున సేవలొనర్చినారు. గుడ పదార్థాలు, ఖండశర్కర పదార్థాలు, నోటినుంచి ఉచ్చరించబడక ముందే చేతికందేవి. అందఱు పవిత్రముగా ప్రవర్తించారు. అట్టి యజ్ఞము పూర్వము జరిగినట్లు ఎవరికి అనుభవములో లేదు. ఎవరికి ఏది ఆవశ్యకమో అది మరుక్షణముననే సమకూర్చబడేది. ఇది గొప్ప యజ్ఞమనే తప్ప మరొక మాట ఎవరి నోటినుండి వచ్చుట లేదు. ఇతర యజ్ఞములను నిందించుట కూడా జరుగుటలేదు. నీవెందుకిచ్చావు. రామునికి కోపం వస్తుంది అనే మాటలు ఎవరి నోటా లేవు. ఎవరైనా ఎన్ని

దానములు చేసినా ఏ దానములోను దోషము లేదు. అయోగ్యుల కిచ్చుట, అసమయములో నిచ్చుట, అసత్కారముతో నిచ్చుట అనే దోషములు లేకుండెనని సత్యతీర్థుల వ్యాఖ్య. సువర్ణములైన మంచి రంగు కలిగిన హిరణ్యములు అనగా వెండిపదార్థములని కూడా(సత్యతీర్థుల వ్యాఖ్య) ఇచట భావించవలయును. ఎవరు దేనిని కోరినా దానిని పొందుచుండిరని తాత్పర్యము. ఎంత ఇచ్చినా బంగారు, వెండి, రత్నముల రాసులు తగ్గలేదు. ఇంద్రుడుగాని, కుబేరుడుగాని, యముడుగాని, వరుణుడుగాని ఇట్టి యాగమును చేసియుండలేదని అచటికి వచ్చిన తపోధనులు విస్మయ మందారు.

## తొంబైరెండవ సర్గము

అట్టి యజ్ఞము చాల వైభవముగా జరుగుచుండగా తన శిష్యులందఱితో కూడి పలు ఎడ్లబండ్లలో వివిధ ఫలమూలములను నింపుకొని ఆ యజ్ఞమును ఆ అద్భుత ప్రయోగమును దర్శించుటకై వాల్మీకి మహర్షిగూడా వచ్చాడు. ఒకచోట కొంచెం దూరంగా ఋషి వాటములకు కొంచెం దగ్గఱగా ఒక ప్రత్యేక వాటము నేర్పఱచుకొని (వాటము అనగా ఒక గుడారముల (పాకల) సమూహము) తన అనుష్ఠానము సాగుతుండగనే మధ్యమధ్యన యాగవైభవమును గమనించాలని వాల్మీకి హృదయము. శ్రీరాముడు, వసిష్ఠాది ఋషులు వచ్చి వాల్మీకి మహర్షికి స్వాగత సత్కారముల నొనర్చారు. ఆరంభవ్యవహారములు పూర్తయిన తరువాత వాల్మీకి తన శిష్యులతో ఈ విధంగా చెప్పాడు. నాయనలారా! నేనుపదేశించిన శ్రీమద్రామాయణ మహాకావ్యమును ఈ యాగములో అందరికీ వినిపిస్తే చాల సబబుగా నుంటుంది. కాబట్టి ఈ ఋషివాటములలోను, బ్రాహ్మణుల వీధులలోను, రాజ మార్గాలలోను, మహారాజుల విడిదులలోను, తల్లులు వసించే అంతఃపురములలోను శ్రీమద్రామాయణాన్ని గానము చేయండి. రాముడు నివసించే ప్రధానభవనములోపల యాగము జరిగేచోట ఇక్కడ అక్కడ అనేది లేకుండా అంతటా శ్రీమద్రామాయణాన్ని గానం చేయండి. ఈ ఫలాలు చాలా రుచికరములైనవి. మరియు మీగొంతును రక్షించేవి. వీటిని బాగా తిని చక్కగా పాడండి. వీటిని తిని పాడితే మీకు శ్రమ ఉండదు. కందమూలాలను కూడా భక్షించండి. కాని నాగరికులలో కలిసిపోవద్దు. శ్రీరామచంద్రుడొక వేళ పిలిచి పాడుమంటే ఆ ఋత్విక్కులు ఋషుల మధ్యన కూర్చొని హాయిగా పాడండి. ప్రతిరోజు 20సర్గలు తప్పక పాడండి. అలా పాడి ఈ యజ్ఞం పూర్తయ్యేసరికి మీ రామాయణం పూర్తి కావాలి. అర్థమైందా ఆ అన్నట్టు నేను పూర్వము చెప్పినట్లు శ్రుతిలయలు తప్పకుండా అపశబ్దాలు లేకుండా చక్కగా పాడాలి. ఎవరైనా ఏదైనా ఇస్తే బాగుండును, మమ్మల్ని మెచ్చుకోవాలి అని అనుకొని పాడవద్దు. మన కర్తవ్యము అశ్వమేధయాగములో శ్రీమద్రామాయణమును వినిపించాలి అనే సద్భావనతో వినిపించండి. అర్థమైందా? ఇదిగో ఈ వీణతంత్రులు చక్కగా మీటుతూ శ్రుతిపక్వముగా పాడండి. బెంగ పెట్టుకోవద్దు, మనస్సు వేరొక విషయము మీద పెట్టుకోవద్దు. చక్కగా రాగం తీస్తూ పాడాలి (గోవిందరాజీయాను సారము) మీపాటను విని మీరెవరు అని అడిగితే మాత్రం వాల్మీకి శిష్యులమని మాత్రమే చెప్పాలి. సీత కొడుకులమని ఇతరవిషయాలనుగాని ఏమీ చెప్పవద్దు. "తపస్స్వాధ్యాయనిరతం" "సర్వా పూర్వమియం కృత్స్నా" అని గాని ప్రారంభించి. చక్కగా పాడండి. మహారాజుగారడిగితే మొదటి నుంచి చక్కగా వినిపించండి. ఆయన మనకు తండ్రి. చాలా సంతోషంగా ఉండి పాడాలి. పాడేప్పుడు, రేపు ప్రొద్దున మంచిరోజు మంచి సమయము ప్రారంభించండి

అని వివిధ రీతుల వాల్మీకి లవకుశుల నుద్బోధించినాడు. మహర్షి చెప్పిన మాటలను విని చక్కగా అవగాహన చేసికొని సరేనని ఋషివాణిని నెమరు వేసికొని (మరునాడు) అశ్వినీదేవతలు భార్గవనీతిని నేర్పినట్లు వారు చక్కగా కావ్యగానం చేశారు.

## తొంబైమూడవ సర్గము

తెల్లవారింది. పెందల కడనే లేచి స్నానాదులను ముగించుకొని అగ్నికార్యమును నిర్వర్తించుకొని వాల్మీకి చెప్పినట్లుగా శ్రీమద్రామాయణగేయమును చక్కగా పాడినారు. ఆ పాటను విని అందలి అపూర్వవిషయాలను పాఠయోగ్యతను గానయోగ్యతను పరిగణించినాడు శ్రీరాముడు. శ్రుతిలయబద్ధంగా పారవశ్యకరంగా వీణ తీగెల సవ్వడితో మధురంగా ఉన్న ఆ గీతాన్ని చక్కగా విని కుతూహలం పెరిగి ఆనందం పట్టలేక తానొక్కడే వినకూడదని గమనించి యాగకర్మ విశ్రాంతిసమయమున వినుపించుడని కోరినాడు. శ్రీరాముని కోర్కెమేఱ భరత శత్రుఘ్నులు శ్రీమద్రామాయణగానం వినడానికి అందఱినీ పిలిచారు. అందులో పౌరాణికులు, శాబ్దికులు, వైదికులు, సంగీతజ్ఞులు, ఉత్సాహవంతులు, గంధర్వశాస్త్రజ్ఞులు, ఛందశ్శాస్త్రజ్ఞులు, క్రియాకల్పములను తెలిసిన పురోహితులు సర్వభాషా వేత్తలు, భావజ్ఞులు, వ్యాపారులు, కర్షకులు, హేతువాదులు, నైయాయికులు, వైయాకరణులు చిత్రసూత్ర గాననృత్య కుశీలురు, బంధకవితా రసికులు, శాస్త్రజ్ఞులు అందరూ ఉన్నారు. వారందఱు వింటూండగా వీరందఱికి అన్ని విధాల ఆనందం కలిగించు రూపముగా పాడినారు. కుశలవులు రామాయణాన్ని తపస్స్వాధ్యాయ అని మొదలు పెట్టి 20సర్గల వఱకు పాడి ఆపినారు.

శ్రీరామచంద్రుడు చాల ఆనందించి మైమఱచి 18 వేల సువర్ణముద్రికల నీయబోగా మేము అడవిలో ఉండేవారము, ఈ సువర్ణ ద్రవ్యములతో మాకేమిపని? దయచేసి ఈయవద్దని పుచ్చుకొనలేదు. ఈ సందర్భమును పురస్కరించుకొని వారు మఱింత ఆనందించినారు. ఈ కావ్యకర్త ఎవరు మీరెవరు? ఎన్ని సర్గలు? ఎన్ని శ్లోకాలు? అను మొదలైన ప్రశ్నలను వేసినాడు శ్రీరామచంద్రుడు. 24వేల శ్లోకాలని వాల్మీకి రచించినాడని ఆరుకాండములని చకారముతో ఉత్తరకాండము (నాభావము) మొత్తము ఏడుకాండములని, 500 సర్గలని 100 ఉపకథలని, మాగురువులు భృగు వంశోత్పన్నులు ప్రాచేతసులు అయిన వాల్మీకి మహర్షిగారు వ్రాసిరనియు వారు చెప్పినారు. ఇలాగే యాగకర్మవిశ్రాంతి సమయమున వినుడు అని లవకుశులు సమాధానమిడినారు. మీరు, సోదరులు, పౌరులు, అందఱు వింటే తరిస్తారన్నారు లవకుశులు. సరేనని శ్రీరామచంద్రుడనినాడు. వారిని వారిఋషి వాటమునకు పంపించినాడు. వారు వెళ్ళిన తరువాత శ్రీరాముడు ఆ రామాయణగానమునే నెమరు వేసికొను చుండినాడు.

## తొంబైనాల్గవ సర్గము

చాలరోజులు యాగము పూర్తిఅగువఱకు ఇదే విధముగా శ్రీమద్రామాయణగానము, శ్రవణము జరిగింది. ఆ గానములోనే సీతకు లవకుశులు కుమారులు కలిగినారని కూడా విని ఆ సభలోనే శుద్ధ స్వభావులగు వార్తా హరులను రావించి మీరు వాల్మీకి మహర్షి వద్దకు వెళ్ళి మహాముని అనుమతిని తీసికొని సీత ఈసభలోకి వచ్చి

తాను శుద్ధురాలనని ప్రకటించుకొనవచ్చునన్నాడు. గీతమువలననే సంతానవతి కుశలవులకు తల్లి అయినదని లోకమునకు తెలిసినది కనుక, మహర్షి వద్దకు వెళ్ళతగిన యోగ్యులైన దూతలు వెళ్ళి మహర్షి వాల్మీకితో చెప్పి నిజమునకు సీత శుద్ధురాలే అయినను పరగృహమున వసించినంత మాత్రమున కలిగిన దోషమును పాపమును మహర్షి సన్నిధిలో తపస్సు చేయడంవల్ల ఆ దోషమును ఆ పాపమును కూడా పోగొట్టుకొనినది కనుక తాను నిష్కల్మషురాలనని తెలుపుటకీ యాగస్థానమే యోగ్యస్థానము. నామనసులో గల ఏమి చేయాలో తోచని స్థితికి తెఱ తీసి నన్ను నిశ్చింతుని చేయుటకు కూడా ఇదే సమయమని శ్రీరాముడు పలికెనని సత్యతీర్థుల వ్యాఖ్య. వాల్మీకి వారి అభిప్రాయానుసారము సీతయొక్క మనోభిప్రాయమును తెలిసికొని నాకు వెంటనే తెలుపుడు అని శ్రీరాముడు అన్నాడు. ఆలస్యమెందులకు రేపే సభలో సీత విశుద్ధతను ప్రకటించవలె నన్నాడు. ఆ మాటలకు అందఱు సంతోషించినారు. దూతలు వాల్మీకి మహర్షులవారి విడిదికి చేరి మహర్షితో విన్నవించగా వారు సీత అలాగే చేస్తుంది. స్త్రీకి పతియే దైవతము కదా అన్నారు. నిజమునకు దోషమేమాత్రము లేనిది సీత బ్రహ్మాదులు వినుచుండగా అశరీరవాక్కు సీత సాధ్వి అని పలికినది. అయినను వేరుగా వ్యాఖ్యానించు దుర్జనులకు బుద్ధివచ్చును. ఆమె సౌందర్యమును ఆశించి కళంకమునాపాదించిన వారి కోసమైనా సీత శపథము చేస్తుంది. నామనస్సు కుదుట పడుటకు కూడా రేపు సభలో సీత శపథము చేస్తుంది (సత్యతీర్థవ్యాఖ్యానానుసారము) అన్నాడు శ్రీరామచంద్రుడు, ఎవడు సీతను పాపబుద్ధితో నిందకు గురి చేస్తాడో వానికి కూడా బుద్ధి వస్తుందని గోవిందరాజీయము. శ్రీరాముని ఆ మాటలను విని అందఱు సంతోషించినారు. ఇది నీకే చెల్లుతుంది అని అన్నారు. ఇక నిర్ణయము రేపు ప్రొద్దున అని శ్రీరామచంద్రుడు మరొకసారి ప్రకటించి ఆ సభను చాలించి అంతఃపురములోనికి వెళ్ళినాడు. అందఱు శ్రీరాముడు మహాత్ముడనుకొన్నారు.

## తొంబైయైదవ సర్గము

ఆ రోజు గడచే సరికి శ్రీరామచంద్రుడు అశ్వమేధయాగసభామండపము వద్దకు వచ్చినాడు. ఋషులనందఱి పిలువనంపగా వసిష్ఠ వామదేవ జాబాలి కాశ్యప విశ్వామిత్ర దీర్ఘతపో దుర్వాసః, పులస్త్య, శక్తి, మార్కండేయాది మహర్షులు పర్వత నారద గౌతమ గర్గ చ్యవనాదులు, కాత్యాయన సుయజ్ఞాదులెందరో ఋషులు విచ్చేసినారు. జ్ఞాన కర్మయోగనిష్ఠులు, సామాన్య పౌరులు, బ్రాహ్మణ క్షత్త్రియ వైశ్యశూద్రులు, సర్వవర్ణాశ్రమధర్మపరాయణులు అమాయకులు అందఱు కిటకిటలాడుతున్నారు. సభలో అందరు కొద్దిసేపటికి రాళ్ళలాగా నిశ్శబ్దమును వహించి నారు. సభ సిద్ధమై ఉందని తెలియగానే వాల్మీకి మహర్షి సీతను తోడ్కొని సభలోనికి వచ్చినాడు. శ్రీరామునే మనసులో భావిస్తూ సీత బాష్ప పూర్ణ నేత్రయై తలను సిగ్గుతో వంచుకొనినదై బ్రహ్మను అనుసరించి వచ్చు శ్రుతిమాతవలె వాల్మీకిని అనుసరించి సభలో అడుగిడింది. లోపల ప్రజలందరికి శ్రీరాముని చూచినా చూస్తూన్నా, సీతమ్మను చూస్తూన్నా చాలా గర్వముగా ఆనందంగా ఉన్నది. వారు శ్రీరామునికీ సీతకూ జయకారాలు చేయ నారంభించినారు.

మరల నిశ్శబ్దతను కలుగజేస్తూ వాల్మీకి గంభీరముగా అన్నాడు. శ్రీరామా! ఇదిగో నీభార్య సీత, నీకు ధర్మ పత్నియై లోకాపవాదం లేకుండా చేసి భయపడుతున్న నీకు నమ్మకాన్ని కలిగిస్తున్నది. వీరిద్దఱు ధర్మాత్ముడవైన నీ

కుమారులు లవకుశులు. మా ఆశ్రమమున జన్మించినారు. నేను మానాన్న ప్రచేతసునికి పదవ కుమారుడనైనట్లు (గోవిందరాజీయము) వీరు నీకు అనుగుణమైన సంతానము ('క్షుబ్ధ చిత్తానాం' అని నాగోజీ భట్టు వ్యాఖ్య వ్రాస్తే అచట క్షుభితచిత్తానామ్ అనే ఉండాలని సత్యతీర్థుల శబ్దవైదుష్యము ప్రకటితము) ఉద్వేగముతో వాల్మీకి మరల అన్నాడు శ్రీరామా! సీత అధర్మచారిణియైనచో నేను వేలసంవత్సరాలు చేసిన తపస్సులకు ఫలాన్ని అనుభవించకుండా ఉండాలి. సీత ధర్మచారిణి అయితేనే మనోవాక్కాయములతో చేసిన పుణ్యాన్ని నేననుభవిస్తాను. జ్ఞాన కర్మేంద్రియములతో, ఆరవ ఇంద్రియమైన మనస్సుతోను, సీత శుద్ధురాలు గనుకనే మా ఆశ్రమములోనికి తీసికొని రాబడినది, ఉండగలిగినది. ఇదిగో పతివ్రత శుద్ధ మనస్కయైన సీత. నీకు నమ్మకాన్ని కలిగిస్తుంది. లోకాపవాదముచే కలుషమైన చిత్తముతో త్యజించిన నీముందు శుద్ధ భావముతో నిలబడింది. ధర్మాత్మురాలు నీకు ప్రియురాలగు సీత నీ ఎదురుగుండా ఉంది అన్నాడు.

## తొంబైయారవ సర్గము

వాల్మీకి మహర్షి ఆ విధముగా పలికేసరికి శ్రీరాముడిట్లనినాడు. "మహర్షీ! మీరన్న మాట నాకు ప్రమాణమే. సీత పట్ల నాకు ఏనాడో విశ్వాసమున్నది. దేవతల సన్నిధానముననే మరల రెండవసారి విశ్వాసమును కలిగించినది. కాని ఈ సాధారణజనానికి కూడా సీతపై నమ్మకము కలుగవలెననే దృష్టితో నేను సీతను వదిలితిని అందుకు తాము క్షమించుడు. ఇప్పుడు కుమారులైన లవకుశులతో, మీవంటి పెద్దల మాటలతో మూడవసారి సామాన్య ప్రజలకు కూడా విశ్వాసాన్ని కలుగజేసినది సీత. అట్టి సీతపట్ల నాకున్న అపారమైన ప్రీతి ఇంకా పెరగాలి", అని శ్రీరాముడు మాట్లాడుతుండగనే దేవతలు వసురుద్రాదిత్య గణాలతో, ఇంద్రాది దిక్పాలకులు సిద్ధసాధ్య కిన్నర గంధర్వులు, అప్సర స్త్రీలు, సీత శపథము చేయనున్నదని తొందర తొందరగా విచ్చేసినారు. సీత మాటలను వినాలని అందఱు కుతూహలంగా ఉన్నారు. నిశ్శబ్దంతో పాటు చల్లని పవిత్రమైన గాలి వీచింది. అందఱి మనస్సులు ప్రసన్నములుగా ఉన్నాయి. కృతయుగములో వలె ధర్మ స్వభావులైన మనుష్యులు అచట నిండిపోయారు.

అందఱిని చూచి కాషాయ వస్త్రధారిణియైన సీత చేతులు జోడించి ఇట్లన్నది. భూమికి అభిముఖంగా గంభీరమైన వాక్కు సీత నోటి నుండి జాలువారింది. "నేను శ్రీరాముని కన్న వేఱెవరినైనా మనస్సులోనైనా చింతించని దానినైతే ఈ నాతల్లి భూదేవి మాధవి నాకు దారినీయాలి. మనోవాక్కాయ కర్మతో నేను శ్రీరామునే ఆరాధించు దాననైతే మాధవీదేవి నాతల్లి భూమాత నాకొఱకై తెఱచుకోవాలి. నాకు శ్రీరాముడు తప్ప పతిగా గతిగా ఏమీ తెలియనట్లైతే ఇది సత్యమైతే మాతల్లి భూమి తనలో నాకు చోటు ఇవ్వాలి" అని ముమ్మారు సీత శపథము చేసింది.

ఇంతలో అచ్చటి భూమి పగలగా స్వయంగా భూదేవి రత్న సింహాసనాన్ని పైకి తీసికొని వచ్చింది. ఆ సింహాసనమును నాగములు మోయుచుండినవి. ధరణీదేవి సీతాదేవిని ఆ సింహాసనముపై సాదరంగా కూర్చొనబెట్టుకొన్నది. అందఱు చూచుచుండగనే ఆ సింహాసనముపై సీత భూదేవితో తనలోనికి కొనిపోబడినది. అందఱు గంభీరముద్రవహించారు. పుష్పవృష్టి కురిసింది. మునులు ఋషులు దేవతలు మనుష్యులు స్థావరజంగమ ప్రాణులు అందఱు ప్రసన్నులైనారు. వారి మనస్సులు సీతపట్ల శుద్ధభావముతో నిమీలితములయ్యాయి. కొంతమంది

రాముని చూస్తున్నారు. కొందరు లోననే ప్రశంసిస్తునారు. కొందఱు విసంజ్ఞులైనారు. జయకారములు దేవదుందుభులు మార్మోగాయి. క్షణకాలము సీతాదేవి భూప్రవేశమును చూచి జగత్తంతా సమ్మోహితమైంది. సీతాప్రవేశమును చూచి అచటి మునులందఱు హర్షాతిరేకముతో కలిసి నిష్పందానందము నొందినారు. వారి సమాగమమును సీతాప్రవేశమును చూచి జగత్తు సమ్మోహితమైంది.

ఇంత ప్రయత్నం చేసి సీతను కలుసుకొనకపోతే శ్రీరాముడు చేసిన ఈ ప్రయత్నమంతా వ్యర్థమే కదా? అంటే. కాదు, సీతకు వచ్చిన అపవాదును తొలగించుటయే శ్రీరాముని లక్ష్యమని, తాను తనలోకానికి వెళ్లకముందే ముందుగా సీత స్వధామానికి చేరవలయుననే లీలయే ప్రధానమని, సమాధానము అని సత్యతీర్థుల వివరణ.

## తొంబైయేడవ సర్గము

సీతాదేవి రసాతలంలోకి భూగర్భంలోకి ప్రవేశించేసరికి వానరులంతా రోదించనారంభించారు, మునులంతా అయ్యో పతివ్రతా! సీతా! అని అంటూ శ్రీరాముని సన్నిధిలోనే విలపించసాగారు. శ్రీరాముడు రాజదండమనే కఱ్ఱను పట్టుకొని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా తలవంచి దైన్యంతో లోలోపల బాధపడసాగినాడు. నన్ను కూడా నిరాకరించి నేను చూస్తుండగనే నాకు అపూర్వమైన శోకాన్ని వడిగట్టింది సీత. ఆ రూపాన్ని ధరించిన లక్ష్మి నన్ను వదలి వెళ్ళినది. నామనస్సుకు శోకాన్నే ప్రసాదించింది సీత. సముద్రానికి ఆవల లంకలో ఉన్నప్పుడే తీసికొని వచ్చాను కదా! ఇప్పుడు కనిపించకుండా భూమిలోకి వెళ్ళితే తీసికొని రాలేనా! ఓ భూమీ! వరాహావతారంలో నా బలాన్ని చూచావు కదా (సత్యతీర్థుల వ్యాఖ్య)! వెంటనే నాసీతను నాకు తిరిగి ఇచ్చేయ్. మళ్ళీ నాకోపం ఒకసారి చూపించనా? ఇంతకు పూర్వము సీత భూమిలో పుట్టినది భూజాత అనే లోకప్రసిద్ధి ఉండనే ఉంది. నీవు అందఱి సమక్షంలో మఱల నా సీతను నాకు తెచ్చి ఇస్తే నీవు నాకు అత్తగారివని అందఱి సమక్షంలో నిర్ణయం జరుగుతుంది. అప్పుడు జనకుని యజ్ఞభూమిలో నాగేటి చాలులో జనకునికి కూతురుగా ఇచ్చి జనకుని ద్వారా నాకు పత్నిగా ఇచ్చినావు. ఇప్పుడు అత్తగా స్వయముగా నా సీతను నాకిమ్ము. ఓ భూదేవీ! సీతనైనా నాకివ్వు లేదా! నాకు కూడా నీ గర్భంలో చేరడానికి మార్గాన్ని చూపు. ఆ సీతతో నేను ఈ భూగర్భంలో పాతాళంలోనో, స్వర్గం వెనుకనో హాయిగా ఉంటాను. ఆ సీతను తెచ్చి ఇమ్ము "న మే దాస్యసి చేత్" నీవు నాకు నాసీత నీయకపోతే నీవు నాకు దాసివి, భార్యవు కనుక, నేను చెప్పినట్లు వినాలి చేయాలి. నీవు దాసివి కాను అని అంటే (సత్యతీర్థుల వ్యాఖ్య) నేనూరుకొనేది లేదు. పర్వత వనాలతో విశాలంగా ప్రశాంతంగా స్థిరంగా ఉన్న నిన్ను నామరూపాలు లేకుండా ధ్వంసం చేస్తాను. అంతటా నీళ్ళు నిన్ను ముంచేస్తాయి, జాగ్రత్త! అని శ్రీ రాముడు శోకావేశంతో మాట్లాడుతుంటే క్రోధంతో మండిపడుతుంటే బ్రహ్మ దేవతలతో సహా శ్రీరాముని దగ్గఱకు వచ్చి "రామా రామా! నీవెవరో స్మరించు. నీ విష్ణుతత్త్వాన్ని ఆలోచించుకో! అవతరించుము, రావణుని సంహరింపుము అని దేవతలు కోరిన విషయమును గుర్తు తెచ్చుకో! (గోవిందరాజీయాను సారము) సర్వజ్ఞుడవు కనుక నీకు నేను గుర్తు చేయవలసిన అవసరము లేదు. సీత ఎవరో తెలుసునా! నీపూర్వ భావమైన విష్ణుతత్త్వపరాయణురాలు (గోవిందరాజీయము) ప్రస్తుతము రసాతలమున నాగలోకమున సుఖముగా నున్నది. నీతపోబలముచే మరల నీకు స్వర్గమున దుఃఖ రహితమైన

వైకుంఠమున కలుస్తుంది. ధైర్యముతో ఉండుము. దిగులుపడకుము. వాల్మీకి మహర్షి నీ పూర్వకథ వ్రాసినట్లుగా ఉత్తరకథను కూడా వ్రాసినాడు. దానిని కూడా శ్రద్ధగా వినుము. ఆ గాథను నీవు శ్రద్ధగా విని నీవే ప్రకాశింపజేయాలి కనుక శోకపరాయణుడవు కావలదు. శ్రీరాముడు తప్ప వాల్మీకి కృత రామాయణమును వ్యాప్తి చేయువారెవరుంటారు? కనుక నీవు వెంటనే తేరుకొని కథాశ్రవణమును పూర్తి చేయుము (గోవిందరాజీయాను సారము) ఈ ఋషులంతా ఉత్తరగాథను కూడ వినగోరుచున్నారు!" ఆ మాటలను విని శ్రీరామచంద్రుడు ధైర్యమును తెచ్చుకొని మహర్షీ! ఉత్తరకథను వినిపించండి అని చెప్పగానే వాల్మీకి ఆదేశానుసారము కుశలవులు తరువాతి గాథను చెప్పబోగా యజ్ఞదీక్ష పూర్తి ఐనది కనుక అశ్వమేధావభృథాంతముననే సీత భూమిలో అంతర్ధానము చెందినది కనుక (గోవిందరాజీయానుసారము) దీక్షలేకుండగనే పర్ణశాలలోనే ప్రశాంతముగా విందామని లవకుశులతోపాటు పర్ణశాలలోకి రాముడు ప్రవేశించినాడు. ఆరాత్రి సీతస్మరణతోనే కాలము గడచింది, శ్రీరామునికి నిదురపట్ట లేదు.

## తొంబైయెనిమిదవ సర్గము

అశ్వమేధయాగము ముందే పూర్తయి ఋత్విక్కులకీయవలసిన దక్షిణలనన్నిటిని శ్రీరాముడు ముందే ఇచ్చి వేసినాడు కనుక సీతావియోగానంతరము చేయవలసిన కర్తవ్యమేమీ లేదు. ఆ పర్ణశాలలో ఉత్తరకథను కూడా విని పరిజనులనందరిని వీడ్కొల్పి సీతనే హృదయమున నిలుపుకొని కుశలవులను వెంట నిడుకొని అయోధ్యానగరం బలవంతముగా చేరుకొనినాడు. శ్రీరాముడు సీతను కాకుండా మరొక స్త్రీని ఎవరినీ ధర్మమునకైగాని, పరిచర్యలకైగాని వరించలేదు ఇష్టపడలేదు. ఆ తరువాత కూడా సంగ్రహాశ్వమేధములను నిర్వహించినా ప్రతియాగానికి సువర్ణ సీతయే శ్రీరాముని ప్రక్కన నిలిచింది. హృదయ సీత కూడా. అట్లే అనేక యాగములను, గోదానములను నిర్వహించి నాడు శ్రీరాముడు. మనుష్యులేకాక రాక్షసులు, భల్లూకాలు, వానరాలు కూడా శ్రీరాముని అనుశాసనాన్ని పాటించాయి, సమయానికి వర్షాలు కురవడం సిరిసంపదలతో ప్రతివారు కలకలలాడడం శ్రీరాముని వరమే. ఆధివ్యాధులు, అనర్థాలు శ్రీరామరాజ్యమున మృగ్యాలు. కొంతకాలమునకు కౌసల్య, ఆమెననుసరించి సుమిత్ర కైకేయిలు కూడా క్రమంగా కాలధర్మం చెంది దివంగతులైనారు. శ్రీరాముడు వారందరికి చేయవలసిన విధులను నిర్వర్తించినాడు. వారి పేరున దానధర్మములొనర్చినాడు. పితృకర్మలనన్నిటిని శ్రద్ధాసక్తిపూర్వకముగా సోదరులు తాను కలిసి నిర్వర్తించినాడు. ఈ విధముగా పదివేల సంవత్సరాలు (13 వేల సంవత్సరాలని సత్యతీర్థుల వారు) వైభవంగా రాజ్యమును నిర్వర్తించినాడు.

## తొంబైతొమ్మిదవ సర్గము

కొన్నాళ్ళకు యుధాజిత్తు (భరతుని మేనమామ) తన గురువును గర్గాచార్యుల వారిని పదివేల గుఱ్ఱముల నిచ్చి పంపి సింధునదికి రెండు వైపుల ఉన్న ప్రదేశాలను గంధర్వులు ఆక్రమించుచున్నారని, వారు శైలూషులని నృత్య గీతవాద్య కళాప్రియులని, యుద్ధవిశారదులని వారిని జయించాలని ఆ దేశాలను స్వాధీనము చేయించాలని వార్తను కూడా పంపాడు. శ్రీరాముడు భరతుని కుమారుల నిద్దరిని తక్షపుష్కలులను వారిని ఆ గురువుగారు

గార్గ్యుల వారి వెంట పంపించి, ఆ నదికి రెండు వైపుల వీరిద్దరు గంధర్వులను విభజించి ఓడించి రాజ్యపరిపాలన చేస్తారని కబురు చేస్తాడు. భరతుని కూడా వారివెంట పంపిస్తాడు. ముందు శుభశకునములు సాగుతుండగా భరతుడు అతని కుమారులు వారి సైన్యము పశ్చిమదేశాలకు కేకయదేశానికి ముఖ్యంగా సాగిపోయారు.

## నూరవ సర్గము

కేకయ దేశాధిపతి యుధాజిత్తు భరతుడే స్వయముగా సేనాపతిగా గార్గుల వారితో, మనుమలతో రావడాన్ని తెలిసికొని చాలా సంతోషించినాడు. యుధాజిత్తు భరతుడు కలిసి తమ సైన్యాలతో, కామరూపులైన గంధర్వులపై విరుచుకుపడినారు. ఏడురోజులు చాలా భయంకరంగా పోరుసాగింది. భరతుడు కాలపాశము, సంవర్తము అను పేర్లు గల అస్త్రములను ప్రయోగించినాడు. క్షణకాలములో మూడుకోట్ల సేన కలిగిన శత్రుసేన ధ్వస్తమైనది, స్వాధీనమైనది. ఆ తరువాత సింధునదికి పశ్చిమముగా ఉన్న ప్రాంతములో తక్షశిలా నగరాన్ని నిర్మించి తక్షుణ్ణి, తూర్పుగా ఉన్న ప్రాంతములో పుష్కలావతమను పట్టణాన్ని నిర్మించి పుష్కలుణ్ణి (పుష్కరుణ్ణి) తన కుమారుల పేర్లతో ఏర్పడిన నగరాలలో పట్టాభిషిక్తులను చేశాడు భరతుడు. ఐదు సంవత్సరములు ప్రయత్నించి వైశ్యశూద్రుల సాహాయ్యముతో వ్యవసాయముతో వ్యాపారముతో ఆ ప్రదేశములను వృద్ధిపఱచాడు భరతుడు. చక్కని దేవాలయాలు, తోటలు అచ్చట వెల్లివిరిశాయి.

## నూటఒకటవ సర్గము

ఈ విషయమును విని శ్రీరామచంద్రుడు చాలా సంతోషించినాడు. ఆ తరువాత లక్ష్మణుని పిలిచి నాయనా! నీకుమారులు అంగద చంద్రకేతువులకు కూడా పట్టాభిషేకం చేస్తే బాగుంటుంది. మంచి ప్రదేశములను ఏర్పాటు చేయుమనగా భరతుడు కారుపథమనే పురము, చంద్రకాంతమనే పురము అని రెండుపురములున్నాయి అన్నాడు. చంద్రకాంత దేశము మల్లురకు ప్రసిద్ధి. అది గాంధార దేశమున ఉత్తరమువైపున నున్నది. దానికి మల్లశ్రేష్ఠుడైన చంద్రకేతువును ప్రభువుగా చేసినాడు భరతుడు. ఆ గాంధార దేశమునకు పశ్చిమముగా నున్న కారుపథమునే అంగదీ నగరముగా ఏర్పాటు చేసి అచట అంగదుని ప్రభునిగా చేసినాడు భరతుడు శ్రీరాముని ఆజ్ఞచే. భరతుడు కొంతకాలము చంద్రకేతువు వద్ద, లక్ష్మణుడు కొంతకాలము అంగదుని వద్ద ఉండి ఏ సంకటం రాకుండా ఆ నగరములనభివృద్ధి పఱచి చాలకాలమునకు అయోధ్య చేరుకొనినారు. ఈ విధముగా మొత్తము మీద శ్రీరామ భరతలక్ష్మణులు పదివేలసంవత్సరాలు ధర్మపరముగా రాజ్యాలను నిలిపి కాపాడినారు. ఈ ముగ్గురు మూడు అగ్నులవలె ప్రకాశిస్తూ ప్రజాపరిపాలనం చేశారు.

## నూటరెండవ సర్గము

కొంత కాలమునకు శ్రీరాముడు ధర్మమార్గమున రాజ్యపాలన మొనర్చుచుండగా కాలుడే తాపసరూపముతో వచ్చి లక్ష్మణునితో నేను మహర్షి దూతను (బ్రహ్మదూతను- గోవిందరాజీయము). శ్రీరామునితో రహస్యంగా మాట్లాడాలి అనగానే లక్ష్మణుడు శ్రీరామునికి నివేదిస్తాడు. జయస్వ రామా! దూత నీతో మాట్లాడదలచుకొన్నాడు అన్నాడు. ప్రవేశ్యతామ్ అని అనగానే లక్ష్మణుడా మునిని ప్రవేశపెట్టినాడు. లోపలికి వచ్చిన ఆ ఋషి మధుర

స్వరంతో శ్రీరాముని ఆతిథ్య స్వీకారానంతరం కుశల ప్రశ్నానంతరం అన్నాడు. "రామా! ఈ మాటలను మనమిద్దఱమే మాటాడుకోవాలి. ఆ ముని మాటలను నీవు వినాలంటే మూడవవారు ఎవరూ వినకూడదు, చూడకూడదు. ఆ ఇద్దరు మంతనాలు కూడా చేయరాదు. ఎవరైనా ఆ పని చేస్తే ఎవరైనా వారు వధింపబడాలి" అన్నాడు ఆ దూత, శ్రీరాముడు సరేనని లక్ష్మణుని పిలిచి, నాయనా! మేమిద్దఱమే మాట్లాడుకోవాలి ఎవరినీ రానీయరాదు. అందరికి ద్వారపాలకుని ద్వారా కబురు చేయి ఎవరూ వినరాదు చూడరాదు అని. అని శ్రీరాముడు చెప్పగానే లక్ష్మణుడు సరేనని అన్నాడు. ఆ విధముగా లక్ష్మణుని ద్వారము వద్ద ఉంచి శ్రీరాముడు ఈ విధముగా కాలపురుషుని అడిగాడు. "తాపసీ! నీ అంతరంగమేమి? ఎవరు పంపగా వచ్చావు, సందేహించకు వివరించు"మన్నాడు.

## నూటమూడవ సర్గము

మహారాజా! శ్రీరామా! నేను బ్రహ్మ పంపగా వచ్చాను. నేను కేవలము బ్రహ్మదూతనే కాదు. నీకు కుమారుడను కూడా. (త్రిపురాసుర సంహారమునకై కాలరుద్ర రూపముగా యమునికి ముందు కూడా ఉండాలి కాబట్టి మాయతో సృష్టింపబడినవాడను గోవిందరాజీయము) కుమారుడనంటే లక్ష్మియందు పుట్టిన బ్రహ్మవలె కాక ఆబ్రహ్మశరీరము నందు (పరపురమునందు) పుట్టిన వాడనగుటచే నీకు మనుమడను రుద్రుడను, (సత్యతీర్థీయము) సర్వ సమాహరుడను, కాలుడని నాపేరు, నీఇచ్ఛతో పుట్టిన బ్రహ్మ యొక్క అహంకార రూపముగా కార్యోన్ముఖత్వమునకై శివరూపముగా ఉద్భవించాను, నీకు పౌత్రుడనైనా పుత్రుని వంటి వాడనేనని తాత్పర్యము (సత్యతీర్థీయము). లోకాల నన్నిటిని సంక్షేపించి, లయింపజేసి, మరల మాయచేత సృజించి రక్షించుట నీకర్తవ్యము. కావున పాలసముద్రమున నిరామయముగా నుండు నీవు లోకులను విచిత్రశక్తితో సృజిస్తావు. అట్లే నన్ను సృజించావు. (ఉభయాను సారము) ఆ తరువాత సత్త్వములను (2 ప్రాణులను) సృజించావు. ఇచ్చట సత్త్వౌ అను శబ్దమునకు మధుకైటభులను ఇద్దరు గొప్ప శరీరము గలవారలను సృజించితివని గోవిందరాజీయ వివరణ. సః త్వౌ అని విడదీసి సః అట్టి నీవు త్వౌ ఇతరులను, సురలనుకాక అసురులను, రాక్షసులను మధుకైటభులను సృజించితివని సత్యతీర్థీయము, త్వ శబ్దమునకు అన్యపర్యాయత్వము వ్యాకరణశాస్త్ర ప్రసిద్ధమే. అట్టి మధుకైటభులను సంహరించి వారి కొవ్వుతో మృదు పదార్థములను, వృక్షలతా తృణాదులను, కఠినమైన ఎముకలతో పర్వతాలను సృజించావు. (సత్యతీర్థీయము)

మధువు నీటితో పుట్టిన మకరాదులతో సమానమైన వాడు, కైటభుడు తాబేలు ముత్తెపుచిప్పవంటి కఠిన శరీర ప్రధానుడు. ఆవిధముగా రెండు విధముల స్వభావము గల జీవజాలమును సృజించావు. (గోవిందరాజీయాను సారము) ఆ తరువాత నన్ను, నాభికమలమునుండి బ్రహ్మను సృజించావు. నాకు ప్రజాపతిత్వమును కూడి ఇచ్చావు. గొప్ప, పడగలు గల అనంతుని కూడా సృజించావు. ఈ విధముగా నాకు కూడా సృష్టిస్థితిలయకారిత్వము ననుగ్రహించావు. (గోవిందరాజీయము). సాక్షాత్తు లక్ష్మీ దేవియందు నన్ను (బ్రహ్మను) సృజించి నాకు ప్రాజాపత్యము నిచ్చావు (సత్యతీర్థీయము) నిజానికి నీవే ప్రజాపతివి. కావున నీ యందు భారముంచుతున్నాను. నీవే నన్ను, నేను సృజించు పదార్థములను, ప్రాణులను రక్షించాలి. కాబట్టి నీయందే భారము నర్పించుచున్నాను. అట్టి నీవు ప్రజారక్షణకై చాలా సార్లు పరవాసుదేవరూపముతో జగద్రక్షణార్థ మవతరించావు. బ్రహ్మరుద్రులలో ఆదివిష్ణువు నీవే, తరువాత

ఉపేంద్రుడవు అదితికశ్యపులకు కుమారుడవుగా అవతరించి లోకసంరక్షణ మొనర్చావు. ఇప్పుడు లోకములను పీడించు రాక్షసులను, వారి నాయకుడై లోక కంటకుడైన రావణాసురుని సంహరించుటకై శ్రీరాముడవుగా అవతరించావు. (గోవిందరాజీయానుసారము) పదకొండు వేలసంవత్సరములు మనుష్య రూపముగా ఉండవలెనని ప్రతిజ్ఞ చేసి వచ్చినావు. స్వయం సంకల్ప స్వరూపుడవైన ఓ స్వామీ! ఆ సమయమాసన్నమైనది. కావున ఓ శ్రీరామా! నేను నిన్ను సేవించదలచుకొన్నాను. నీకొఱకు ఎదురుచూస్తున్నాను. నీ ఇష్టమేదో అది జరుగు గాక! ఉండదలిస్తే ఉండు స్వామీ! నీ ఇష్టము. నీకు గుర్తు చేయుట మాధర్మము అని బ్రహ్మదేవుడు పంపిన సందేశము. బ్రహ్మదేవుడు ఇంకా అన్నాడు ఓ స్వామీ! నీవు మాహృదయములో ఉండి అన్నికార్యములను నెఱవేర్చుచుందువు. ఇంతే సంగతులు. ఈ విషయాన్ని చెప్పడానికే వచ్చితినని కాలతాపసుడు పలికాడు. దీనిని బట్టి బ్రహ్మ సృష్టి చేసినంత మాత్రమున పరతత్త్వస్వరూపుడు. కాదని తెలుస్తున్నదని గోవిందరాజీయము.

## నూటనాల్గవ సర్గము

శ్రీరామ కాలతాపసులు ఇలా మాట్లాడు కొంటున్నప్పుడే దుర్వాసుల వారు రామదర్శనార్థియై విచ్చేశారు. లక్ష్మణుడు కనిపించగానే 'లక్ష్మణా! నాకు వెంటనే రామదర్శనము చేయించు'మనినాడు మహర్షి. "మహర్షీ! తామేమి కోరి వచ్చినారు, మీకు నేను ఏమి సాహాయ్యము చేయగలను. శ్రీరామచంద్రుడు అత్యావశ్యకమైన పనిలో ఉన్నారు కొంచెము సేపుండండి. ఈ లోపున నాతో చెప్పితే మీపనిని నేనే నెఱవేర్చెదను" అను మొదలైన లక్ష్మణుని మాటల పప్పులు స్వభావకోపి అయిన దుర్వాస మహర్షి వద్ద ఉడకలేదు. (సత్యతీర్థీయము) "లక్ష్మణా! నాతో పరిహాసమా! నేను ఆవశ్యకమైన పనిలేనిచో వచ్చెదనా? ఏ మాత్రము ఆలసించకు, వెంటనే వెళ్ళి చెప్పు. నీవు రామునికి నేను వచ్చినట్లు చెప్పకపోతే ఈ క్షణంలో మిమ్మల్ని, మీభూమిని, మీరాజ్యాన్ని శపించి నశింపజేయగలను తెలుసునా?" అని అన్నాడు దుర్వాసమహాముని. కోపము వస్తే ఆగలేనన్న మహర్షి పలుకులు విని లక్ష్మణుడు ఇంతమందికి మరణము వచ్చుట కంటే నాఒక్కనికి మరణము వచ్చినా ఫరవాలేదని భావించి శ్రీరామునికి నివేదించాడు. లక్ష్మణుని పలుకులు విని కాలతాపసుని పంపించివేసి శ్రీరామచంద్రుడు అత్రిపుత్రుడైన దుర్వాసుని ప్రవేశపెట్టుమన్నాడు. ఇచ్చుట సత్యతీర్థీయమున శ్రీరాముని లక్ష్మణుడు కలిసికొని విజ్ఞాపన చేయబోవునప్పుడే కాలతాపసుడు అంతర్ధానము చెందినట్లు పద్మపురాణమున నున్నది. శ్రీ ఆచార్యుల వారైతే ఆ విధముగా తన ఒక్కని మరణము శ్రేయస్కరమని లక్ష్మణుడు దుర్వాసమునికి మార్గమిచ్చెననినారు. ఇచ్చుట మార్గమనగా రామదర్శనోపాయమని అర్థము. అట్లు కానిచో దుర్వాసులవారిని చంపించిన పాపము లక్ష్మణునికి వచ్చేది. కల్పాంతరమున లక్ష్మణుని రాక ఈ కల్పమున కాదనైనా చెప్పవచ్చును అని వివరణ కలదు. శ్రీరాముడు దుర్వాస మహామునిని కూర్చొనబెట్టి పని ఏమిటో అడిగెను. దుర్వాసుడు చాలా సంతోషించి నేటితో వేయిసంవత్సరాల తపస్సు పూర్తి అయింది. ఆకలిగా ఉంది. వెంటనే భోజనము పెట్టించుమన్నాడు. శ్రీరాముడు చాలా సంతోషించి చక్కనిభోజనము నేర్పాటు చేశాడు. అమృత సమానమైన ఆ ఆహారమును సేవించి రామునికి శుభాశీస్సుల నిచ్చి సాధు రామ-అంటూ వెళ్ళిపోయాడు దుర్వాసుడు. మహర్షి వెళ్ళిపోయిన తరువాత కాలుని మాటలను తలచుకొని- సత్యతీర్థీయ ప్రకారము అత్యుత్కట పరిస్థితిలో సోదరుడు వస్తే కూడా చంపాలి అను అర్థమును కాకుండా చంపకుండా ఉండకపోవడమే విధింపబడినదికాని

చంపడం విధింపబడలేదని చాలా కష్టంగా చాలా ఆలోచించి తెలిసికొని లేదా! కాలుని మాటలు నేను పరలోకమును చేరవలయునను దానిని ముఖ్యముగా తెలుపుతున్నాయి కనుక నేనే శరీరమును వదలి పెట్టవలసి యుండగా లక్ష్మణాదుల గుఱించి విచారించ నేల? అని ఆలస్యముగా అర్థము చేసికొని ముందు సోదరుని మరణమును చూడవలసివస్తున్నదని బాధపడినాడు.

## నూటయైదవ సర్గము

తలవంచుకొని దీనంగా మౌనంగా ఉన్న శ్రీరామచంద్రుని చూచి లక్ష్మణుడు "అన్నా! బాధపడు వద్దు. అన్ని పూర్వమే నిర్ణీతములైన విషయాలు కదా! ఇప్పుడు దుఃఖపడవలసిన పని ఏమున్నది? కావున నన్ను వదలు కొ"మ్మన్నాడు. ప్రతిజ్ఞను నిలుపుకొననివారు నరకమును పొందుదురను మాటను విని, ధర్మమునవలంబించుమని సోదరుడు చెప్పిన మాటల విషయమున నిర్ణయము గైకొనుటకు మంత్రుల పురోహితుల సమావేశమేర్పాటు చేసినాడు శ్రీరాముడు. ఆ సభలో వసిష్ఠుడు ఇది కర్తవ్యమే, తమ్ముని వదలుకొమ్మని లేనిచో ధర్మానికి సత్యానికి లోపము అవ్యవస్థ కలుగుననగానే సభలోనే శ్రీరాముడు లక్ష్మణునితో "నాయనా! నిన్ను వదలు కొంటున్నా"నన్నాడు. ఆ రాముడా విధముగా అనగానే నన్ను ధర్మపరాయణుని చేయుమని (సత్యతీర్థీయము) భావించి లక్ష్మణుడు సరయూనదికి వెళ్ళి స్నానమాచరించి సర్వమార్గములను సర్వేంద్రియములను (గోవిందరాజీయము) నిరోధించి మరల శ్వాస తీసికొనకుండెను. లక్ష్మణుని ఉత్క్రమణమును గమనించి ఇంద్రుడు ఆ శరీరమును స్వయముగా స్వర్గమునకు తీసికొని వెళ్ళాడు. మహా విష్ణువు చతుర్థ భాగము తన వద్దకు చేరినదని దేవతలు స్వాగతించి జయనాదాలతో హర్షాతిరేకముతో పొంగిపోయారు. శేషుడు, గరుడుడు, విష్వక్సేనుడు, విష్ణువు, అని నాలుగు విష్ణు భాగములు. అందు శేషుడు లక్ష్మణుడు, సుపర్ణుడు భరతుడు, విష్వక్సేనుడు శత్రుఘ్నుడు, విష్ణువు శ్రీరాముడు. నాలుగవ భాగమని కొన్ని పురాణములలో కలదు. కనుక శేషావతారము అనంత గరుడ విష్వక్సేన విష్ణు రూపముతో ఒకే భగవానుడు నాలుగు వ్యూహములుగా ఉండునని మరొక పురాణము. ఏదైనా లక్ష్మణుడు శేష (అనంత) రూపుడే అని గోవిందరాజీయ వివరణము.

## నూటయారవ సర్గము

లక్ష్మణుడు సరయూనదిలో శరీరమును వదలెనని గమనించి మంత్రులను రావించి. శ్రీరాముడు మంత్రులారా! వెంటనే సంభారములనేర్పాటు చేయండి. భరతునికి పట్టము కట్టి నేను లక్ష్మణుని దారిలో పయనించెదనని అన్నాడు. ఆ మాటలను విని ప్రకృతులు, మంత్రులు, ప్రజలు "శ్రీరామా! నీవు లేకుండా మేమెవరము ఉండజాలము, నీవే మాప్రాణము, ఇదిగో నీవెంటనే వచ్చెదము, మమ్ము కూడా నీతో పాటే తీసికొని వెళ్ళు"మని కోరినారు. భరతుడు కూడా అన్నా! నీవు లేకుండానా అని మూర్ఛిల్లాడు. తేరుకొని నాకు రాజ్యము వద్దు, స్వర్గము వద్దు, సుఖమువద్దు నీవే సర్వము, నీవు లేకుండా ఏమీ వద్దన్నాడు. లవకుశులను పట్టాభిషిక్తుల నొనర్చుమన్నాడు. శత్రుఘ్నునికి కబురు చేసి అందఱము మహాప్రస్థాన మొనర్చుదమన్నాడు భరతుడు. పౌరులను, భరతుని, మంత్రులను గమనించి శ్రీరాముడు కర్తవ్యమేమని వసిష్ఠులనడుగగా, ప్రజల మాటల నాలకించినాడు వసిష్ఠుడు. చివరకు

శ్రీరాముడే నిర్ణయించుకొని లవకుశులకు కోసలరాజ్యమును రెండుగా విభజించి ఇద్దఱికి పట్టాభిషేక మొనర్చినాడు. అనేక అశ్వరథ పదాతి గజాది సేనల నిద్దఱికి సమానముగా నిచ్చినాడు. శత్రుఘ్నునికి కబురు చేసినాడు.

## నూటయేడవ సర్గము

శ్రీరాముడు, వింధ్యపర్వత చరియలలో గల కుశావతి అను పట్టణమున కుశునికి నగరము నేర్పాటు చేసినాడు. లవునికి శ్రావస్తి అను నగరమున నివాసమున కేర్పాటు చేసినాడు. శ్రీరాముడు పంపిన దూతలు శత్రుఘ్నునికి మహాప్రస్థానవిషయమును వివరించినారు. అది విని వెంటనే తన కుమారుడు సుబాహువుకు మధురా నగర రాజ్యమును, శత్రుఘాతికి విదిశానగరరాజ్యమును వేరువేరుగా ఇచ్చి పట్టాభిషిక్తుల నొనర్చి అచటి నుంచి శత్రుఘ్నుడు అయోధ్యకు బయలుదేరినాడు. అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి సూక్ష్మపట్టు వస్త్రములను ధరించి ప్రస్థానసిద్ధుడై ఉన్నాడు. శత్రుఘ్నుడు చేరుకొని అన్నా! నేనూ నిన్ననుసరిస్తాను మారుమాటాడ వద్దని కోరాడు. రాముడు సరే నన్నాడు. వానరులు, రాక్షసులు, భల్లూకేశ్వరులు, అందఱు ఒకేసారి ఆ ప్రదేశము చేరు కొన్నారు. వార్త తెలిసి. అలాగే ఋషిపుత్రులు, దేవపుత్రులు, గంధర్వపుత్రులు, యువకులు కూడా శ్రీరాముని అనుసరించుటకు సిద్ధమైనారు. వానర రాక్షసులు కూడా నిన్ను విడచి ఉండజాలము. రామా మా మీద యమదండము పడినట్లే ఔతుంది నీవులేకపోతే అని అన్నారు. శ్రీరాముడు నవ్వుతూ సరే నన్నాడు. ఈ లోపున సుగ్రీవుడు వచ్చి స్వామీ! అంగదుని పట్టాభిషిక్తుని చేసి వస్తున్నాను. నీవు లేకుండా ఉండజాలను నీతో నన్ను కూడా అనుగమింప ననుమతి నిమ్మనినాడు. శ్రీరాముడు సుగ్రీవుని మైత్రీ సహకారములను స్మరిస్తూ సుగ్రీవా! నీవు లేకుండా నేను కూడా దేవలోకము కాని పరమపదమును గాని అనుభవించనన్నాడు. విభీషణుడు కూడా సన్నద్ధుడు కాబోతుంటే రాముడు నాయనా సోదరా విభీషణా! నాచరితమున్నంత వఱకు నీవు లంకలోనే స్థిరముగా నుండుము, ప్రజలను రక్షించుము. నీరాజ్యము సూర్యచంద్రులున్నంత వఱకు ఉండును అన్నాడు. దయచేసి ఎదురు చెప్పవద్దన్నాడు. ఇక్ష్వాకుల కులదేవత ఐన జగన్నాథుని (రంగనాథ స్వామిని) ఆరాధించుమనినాడు. విభీషణుడు సరే నననినాడు. హనుమంతుని కూడా చూచి శ్రీరాముడు నాయనా? బ్రహ్మచేత చిరంజీవిత్వమును పొందితివి. కనుక నీవు కూడా శ్రీరామచరితమున్నంతవఱకు వచన పాలన చేయుము అన్నాడు. హనుమంతుడు సరేనని అంగీకరించి శ్రీరామనామ మున్నంత వఱకు లోకమున నుంటానన్నాడు. ఆ తరువాత జాంబవంతుని, మైందుని, ద్వివిదుని కూడా జాగ్రత్తగా ఉండుడని తొందరపడకుడని శ్రీరాముడన్నాడు.

## నూటయెనిమిదవ సర్గము

తెల్లవారిన తరువాత నిత్యక్రియలు పూర్తి చేసికొని శ్రీరామచంద్రుడు వసిష్ఠుల వారితో అగ్నిహోత్రమును సాగనీయండి అని అన్నాడు. ఆ మాటవిని యథావిధిగా అగ్ని సపర్యనొనరింపజేసి ఆ అగ్నిని వెంట తీసికొని వెళ్ళే ఏర్పాట్లను చేసినాడు వసిష్ఠుడు. సూక్ష్మాంబరధారియై కుశలను చేత ధరించి శ్రీరామచంద్రుడు సాగుతూ ఉంటే శ్రీరామునికి కుడివైపున శ్రీదేవి సాక్షాదయోధ్యాపుర లక్ష్మి సీతాదేవిలాగా శ్రీరాముని వెన్నంటింది. ఎడమవైపున హ్రీదేవత వెన్నంటింది. ఆయుధాలు ధనుర్బాణాలు కూడా ఆకారాన్ని ధరించి వెంటరాసాగాయి. వేదాలు గాయత్రీ

బ్రాహ్మణ రూపముతో అనుసరించాయి. ఓంకారము వషట్కారము సత్క్రియాకలాపములు అన్నీ రామునితో సాగినాయి. ఋషులు మహాత్ములు అందఱు శ్రీరాముని అనుసరించారు. పాదుకలు లేకుండా మౌనవ్రతము నవలంబించి శ్రీరాముడు సాగుతుంటే అంతఃపురజనము, స్త్రీలు, వృద్ధులు, బాలురు, దాసీజనము, దాసజనము, పరిజనులు నపుంసకులు, విలాసులు వారు వీరు అనక అందఱు శ్రీరాముని అనుసరించినారు. భరతశత్రుఘ్నులు, మంత్రులు పౌరులు, పుత్రపౌత్ర పరివారసమేతులై అగ్నిహోత్ర పురస్సరులై శ్రీరాముని వెంట బయల్దేరినారు. స్త్రీలు, పురుషులు, పశువులు, పక్షులు, చీమలు, దోమలు వంటి అల్పప్రాణ, మహాప్రాణ, సర్వప్రాణులు శ్రీరాముడు లేకుండా అయోధ్యలో ఉండదలచుకొనలేదు. స్వర్గమును అయోధ్యగా మార్చవలెనను భావముతో అనగా శ్రీరాముని సాన్నిధ్యము మాకుండవలెనను భావముతో శ్రీరామునితో బయల్దేరినారు, సంతోషంగా.

## నూటతొమ్మిదవ సర్గము

యోజన దూరము సరయూనదీతీరమునకు నడచి నదికి తూర్పువైపున నిలిచి పశ్చిమాభిముఖము గలవాడై శ్రీరాముడు ప్రజాసమేతుడై స్నానమునకు సిద్ధముగా నుండినాడు. ఆ క్షణమున అచటికి బ్రహ్మ దేవతలతో, ఋషులతో కలిసి చేరుకొన్నాడు. ఆకాశమంతా దివ్యతేజస్సుతో వ్యాప్తమయింది. స్వర్గవాసుల వివిధ తేజములు అంతటా నిండిపోయాయి. ఆ సమయమున చక్కని పవిత్రమైన వాయువులు నిండాయి. పుష్పవృష్టి కురిసింది. మంగళవాద్యములు అనంతంగా మ్రోగాయి. గంధర్వులు, అప్సరసలు శ్రీరామునికి దారి చూపారు. జయకారము చేశారు. "శ్రీరామ జయరామ జయ జయరామ" నాదము మిన్ను ముట్టింది.

ఆ శుభసమయమున శ్రీరాముడు సరయూనది నీటిలోనికి దిగి లోపలికి అలాగే సాగిపోయాడు. శ్రీరాముడు సరయులో మునిగేసరికి ఆకాశమునుంచి బ్రహ్మ శ్రీరామునికి స్వాగతవాణిని వినిపించినాడు. ప్రభూ! శ్రీరామా! విష్ణూ! స్వాగతము మీకు. మీరు మీ సోదరులు మీ స్వశరీరమును స్వీకరించండి. 'ఋచో అక్షరే పరమే వ్యోమన్' అని చెప్పిన శ్రుతివాక్యానుసారము విష్ణ్వవతారస్థానమును వైకుంఠమును చేర రండి. నీవే అన్ని లోకాలకు అన్నిప్రాణులకు గతివి. నీ లక్ష్మిని నీతో నిత్యానపాయిని అయిన లక్ష్మిని (గోవిందరాజీయానుసారము) చేపట్టండి. మీ పూర్వశోభను, వైభవమును పొందండి. బ్రహ్మదేవుని మాటను విని శ్రీరాముడు సరే నని తన విష్ణుశరీరమును పొంది విష్ణువైనాడు. శ్రీరాముడు విష్ణురూపమును ధరించగనే సాధ్యులు, దేవతలు, ఇంద్రాది దిక్పాలకులు సుపర్ణ నాగయక్షులు, దైత్యదానవ రాక్షసులు అందఱు భక్తితో ఆహ్వానించినారు. చాలా సంతోషించినారు. సాధు సాధు అని దేవలోకమంతా మార్మోగింది. జయ శ్రీమన్నారాయణ! జయ శ్రీవిష్ణుదేవ! జయశ్రీరామచంద్రనాదాలు నిండాయి. అప్పుడు భగవానుడు బ్రహ్మతో అన్నాడు. "బ్రహ్మ! నాతో పాటు ఈ అయోధ్యా ప్రజలు, మంత్రులు, నాభక్తులు అచటి సకల ప్రాణులు ఈ లోకమున ఉండదలచినారు. భక్తులు కదా వీరిని సేవింపవలసియున్నది. కనుక వీరికి వసతి నేర్పఱచాలి" మఱి అన్నాడు. అప్పుడు సరేనని బ్రహ్మ స్వామీ! నీమీద భక్తితో ఎవరు వచ్చినా ఈసంతాన లోకమున సాంతానికములను లోకములలో వారికి వసతి ఏర్పాటు చేస్తాను. అందఱికి స్వాగతమన్నాడు. అది బ్రహ్మలోకమునకు కొంచెముపైన ఉంటుంది. అచటికి చేరినవారు శ్రీరామస్మరణసుఖాన్ని సర్వదా అనుభవిస్తుంటారు

అన్నాడు. బ్రహ్మ ఆజ్ఞచే అయోధ్యావాసులు సర్వులు తమ తమ వాసములను చేరుకొన్నారు. శ్రీరాముని సేవకై భూలోకమునకు వచ్చిన దేవతలు, ఋషులు మరల తమతమ పూర్వ శరీరములను పొందినారు. అందరికి దివ్యమైన తేజస్సు కాంతి కలిగింది. భల్లూక వానర రాక్షసప్రముఖ భక్తులు కూడా శ్రీరామ సాంతానికములను చేరుకొనినారు. సర్వ సుఖమయమైన వైకుంఠధామము భక్తుల కోలాహలముతో వెల్లి విరిసింది. సత్యతీర్థుల వారు పద్మపురాణానుసారము శ్రీరాముడు ముందే శంఖచక్రగదాధారియై అభయముద్రను ధరించి వైకుంఠమును అధిరోహించి అనంతుడు ఫణచ్ఛత్రమును ధరించగా, దేవకన్యలు చామరలు వీచుచుండగా, విష్వక్సేనుడు ద్వారదేశమున ప్రతీహారుడై యుండగా, శ్రీదేవితో పాటు భక్తుల జయధ్వానములను వింటూ తన అనుయాయుల నందఱిని గరుడునిపై ఎక్కించి తీసికొని వెళ్ళినాడను విశేషమును వ్రాసి పూర్తిచేశారు.

## నూటపదవ సర్గము

ఈ విధముగా ఉత్తరకథ జరిగినది. ఈ కథను స్వయముగా బ్రహ్మ గౌరవించినాడు. వాల్మీకి వ్రాసి ధన్యుడైనాడు. స్వర్గమును అనగా వైకుంఠమును చేరిన విష్ణువు యథాపూర్వముగా స్వస్థానమున సుఖమునసుభవిస్తూ, భక్తులననుగ్రహించాడు. దేవగంధర్వులు, సిద్ధులు, పరమర్షులు కూడా ఈ రామాయణము నెప్పుడు వింటుంటారు. ఇది సౌభాగ్యాయుష్కరము సర్వపాప ప్రణాశనము, వేదసమము అగు శ్రీమద్రామాయణమును శ్రాద్ధకాలమున కూడా వినిపించవచ్చును. శ్రీమద్రామాయణ పఠనశ్రవణముల వలన సంతానధనాదులు లభించును. సర్వపాపములు తొలగును. ఒక శ్లోకమునైనా రోజూ రామాయణమును పఠించి వివరించిన వారికి వస్త్రములను, ధేనువులను, సువర్ణముల నిచ్చినచో దేవతలు కూడా సంతోషిస్తారు. రామాయణమును పఠించినవారు సపుత్రపౌత్ర గణముగా ఈ లోకమున, పరలోకమున కూడ గౌరవము పొందుతారు. అయోధ్యా నగరము కూడా చాలా కాలముండి ఋషభ మహారాజు పాలించు వఱకు వైభవముగా ప్రకాశించి భగవత్సన్నిధిని చేరుతుంది. పట్టాభిషేకానంతర కథ ఉత్తరము. సీతాభూప్రవేశానంతరకథ భవిష్యము. (గోవిందరాజీయానుసారము) అట్టి ఉత్తర భవిష్య కథతో పాటు మొత్తము శ్రీమద్రామాయణమును పఠించువారు అశ్వమేధాదియాగపుణ్యఫలం పొందుతారు. ప్రయాగాది తీర్థ స్నానఫలము, నైమిశారణ్యాదులలో నివాసఫలమును, కురుక్షేత్రమున గ్రహణానుష్ఠానఫలమును సర్వపాప ప్రణాశనమును కూడా పొందుతారు. గాయత్రీ స్వరూప రామాయణమును వినుటవలన సంపద్వృద్ధి, సంతానవృద్ధి, పాపహరణము కలుగును. పఠన శ్రవణములలో ఫలభేదము లేదు. భక్తితో బ్రాహ్మణుల సన్నిధిని రామాయణ పఠనశ్రవణాదులు చేసిన తమ పూర్వపురుషులు ఐదుగురు, తాను తరువాతి వారు కూడా తరిస్తారు. పాదము పాదభాగమును చదివినా బ్రహ్మకూడా సంతోషిస్తాడు. ఈవిధముగా జరిగిన ఈ శ్రీమద్రామచంద్రచరితమును చెప్పుట వినుట సకల భద్రప్రదము. కావున అందఱు శ్రీరామచంద్రచరిత్రశ్రవణపఠనకారణముగా సాక్షాత్ శ్రీరామచంద్రుడైన శ్రీమహావిష్ణువు బలముతో వృద్ధి చెందవలయునని భావించి, జయ శ్రీమన్నారాయణ! జయశ్రీరామ! జయశ్రీరామ! జయశ్రీరామ! జయశ్రీమహావిష్ణూ! అని అనాలి.

దాని వలన మహావిష్ణువు అంశలమైన మనము కూడా సర్వతోముఖముగా విజయమును పొందెదము గాక! జయశ్రీరామ జయశ్రీరామ జయశ్రీరామ.